సద్గురు తారా విశాల్

మార్గదర్శి

నవీన యుగ మత రహిత ఆధ్యాత్మిక & ధ్యానయోగ
విజ్ఞాన శాస్త్ర గ్రంథం
నవీన యుగ ఆత్మ ప్రజ్ఞాన గ్రంథం

Wisdom of Non-religious New Age Spiritual Science (Cosmic Science) and the Science of Meditation

By

సద్గురు తారా విశాల్

SADHGURU TARA VISHAL

TARA VISHAL MARGADARSHI - RELEASED IN 2012

1424 PAGES [A4 SIZE PAPERS]

SADHGURU TARA VISHAL MARGADARSHI

(UPGRADED VERSION OF TARA VISHAL MARGADARSHI)

RELEASED IN 2021 - 1446 PAGES [A4 SIZE PAPERS]

గ్రంథ రచయిత : **సద్గురు తారా విశాల్**
గ్రంథం పేరు : **సద్గురు తారా విశాల్ మార్గదర్శి**
అసిస్టెన్స్ : ఆల్ MAB మెంబర్స్
First Edition : July, 2012
Current Edition : July, 2021

సర్వ జన శ్రేయస్కరమై M A B వారిచే పబ్లిష్ చేయడమైనది

Published by
MAB
Mission Aham Brahmasmi

© సర్వ హక్కులను M A B వారు కలిగి ఉన్నారు.
© All Rights Reserved with M A B

Website : www.missionahambrahmasmi.org

e-mail : mabmtv@gmail.com

mobile no : +91 800 800 3570

Facebook : www.facebook.com/missionahambrahmasmi

YouTube :
Mission Aham Brahmasmi -
www.youtube.com/c/MissionAhamBrahmasmi

©All Rights Reserved with

MAB - Mission Aham Brahmasmi

All rights reserved. No part of this book [publication] may be reproduced, by any mechanical, photographic, or electronic process, or in the form of a phonographic recording, nor may it be stored in a retrieval system, transmitted, or otherwise be copied for public or private use without permission of the organization other than for fair use as brief quotation embodied in articles reviews.

- MAB

ముందుమాట

మానవ రూపంలో ఉన్న దైవాలందరికి నా దైవత్వం లో నుండి నమస్కరిస్తున్నాను... !

"మిషన్ తారా విశాల్" (MISSION TARA VISHAL- MTV) సంస్థను సద్గురు తారా విశాల్ గారు 2003 లో స్థాపించారు. అప్పటి నుండి ఈ సంస్థ ద్వారా అన్ని కార్యక్రమాలను గురువు గారు ఉచితంగా చేశారు. "సేత్ విజ్ఞానం" 2000 పుస్తకాలు, "తారా విశాల్ ధ్యాన యోగం" 4000 పుస్తకాలు మరియు "తారా విశాల్ సేవా సాధన" 5000 పుస్తకాలు ఉచితంగా పంచారు. మహాద్భుత దివ్య గ్రంథమైన "తారా విశాల్ మార్గదర్శి" 6000 గ్రంథాలను ప్రతిఫలాపేక్ష లేకుండా ఉచితంగా పంచారు. ఈ గ్రంథం అందరికి అందాలి అనే ఉద్దేశంతో వెబ్సైటు లోనుండి ఉచితంగా డౌన్లోడ్ చేసుకునే వీలుని కల్పించడంతో లక్షకు పైగా (e - books) ని డౌన్లోడ్ చేసుకున్నారు. "తారా విశాల్ సత్యమార్గం" 5000 పుస్తకాలని పంచారు, వెబ్సైటు నుండి డౌన్లోడ్ చేసుకునే వీలుని కల్పించారు. అకర్మ వీగనిజమ్ (అకర్మ శాఖాహారం) ప్రచారం, అన్నదానాలు, పశుపక్షులకు ప్రేమ, ఆదరణ, ఆహారం మరియు నీడ కల్పించడము మొదలైన సేవ కార్యక్రమాలు చేశారు.

4 జులై 2017 రోజున గురువు గారు స్వీయ సంకల్పం తో, పూర్తి ఎరుక తో నిర్ణయించుకుని తన భౌతిక దేహాన్ని వదిలేశారు. దేహాన్ని వదిలేసినప్పటికీ గురువు గారు నన్ను మరియు తన శిష్యులందరిని కనిపెట్టుకునియే ఉన్నారు, అందరితో టచ్ లో ఉన్నారు.

సద్గురు తారా విశాల్ గారు తన మిషన్ బాధ్యతలను నాకు అప్పగించారు. నేను మార్చ్ 2019 వరకు సాధన లో ఉన్నాను. 18 ఏప్రిల్ 2019 రోజున నేను గురువు గారి ఆజ్ఞ మరియు ఆశీర్వాదం తో "మిషన్ అహం బ్రహ్మాస్మి " (MISSION AHAM BRAHMASMI - MAB) సంస్థను స్థాపించాను. ఇక పై అన్ని కార్యక్రమాలు "మిషన్ అహం బ్రహ్మాస్మి" ద్వారా నిర్వహించబడతాయి.

"సద్గురు తారా విశాల్ మార్గదర్శి" అనే ఈ మహా దివ్య గ్రంథం, 2012 లో ఉచితంగా పంచబడిన "తారా విశాల్ మార్గదర్శి" అనే దివ్య గ్రంథం యొక్క అప్‌గ్రేడెడ్ వర్షన్. ఈ దివ్య గ్రంథం లోని ఆత్మ విజ్ఞానం వెలకట్టలేనిది. ఎందరెందరో ఈ గ్రంథంలోని ఆత్మ విజ్ఞానాన్ని అర్థం చేసుకుని, ఆచరించి తమని తాము ఉద్ధరించుకున్నారు. ఇంకెందరో ఈ గ్రంథాన్ని నవీన యుగ భగవద్గీత గా పేర్కొన్నారు. ఈ గ్రంథం ఖచ్చితంగా మానవులందరికీ మోక్ష మార్గదర్శి (It is a Manual to Mankind).

ఈ " సద్గురు తారా విశాల్ మార్గదర్శి" గ్రంథం ఆడియో బుక్ గా కూడా మీకు ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ఈ గ్రంథాన్ని వీలైనన్ని భాషల్లోకి అనువదించి, వీలైనన్ని రకాలుగా ప్రపంచ ప్రజలందరికి అందుబాటులోకి తేవడానికి నా వంతు కృషి నేను పూర్తి బాధ్యత మరియు

ఆనందం తో చేస్తాను.

ఈ "సద్గురు తారా విశాల్ మార్గదర్శి" గ్రంథాన్ని గురువు గారి ఆశయం, కోరిక మరియు ఆజ్ఞ మేరకు భూమి ఉన్నంత కాలం ఈ మహా దివ్య గ్రంథరాజం 100% ఉచితంగా పంచబడుతుంది. ఈ మహా దివ్య గ్రంథం మానవ జాతికి గురువు గారి యొక్క ఆశీర్వాదం. మీకు లభించిన ఈ సద్గురు దివ్య ఆశీర్వాదాన్ని సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

నన్ను నమ్మి తన మిషన్ బాధ్యతను నాకు అప్పగించి, నన్ను "సద్గురు దేవి/ సద్గురు మాత" గా ప్రకటించి, ఆశీర్వదించి... ఒక సద్గురువుగా నా బాధ్యతను నిర్వహించి, లోక కళ్యాణానికై పని చేయమని ఆజ్ఞాపించారు. నా గురుదేవుని ఆజ్ఞను నా బాధ్యతగా స్వీకరించాను. శక్తివంచన లేకుండా నా ఆత్మ పూర్వకంగా నిర్వహిస్తాను.

అందరికి సరైన మతరహిత అత్యున్నత ఆధ్యాత్మిక శాస్త్ర అవగాహన వస్తే ఆటోమాటిక్ గా లోక కళ్యాణం మరియు సృష్టి కళ్యాణం జరుగుతుంది అనే ఉద్దేశంతో గురువు గారు ఈ గ్రంథాన్ని ప్రతీ ఒక్కరికి ఉచితంగా అందించాలి అని నిర్ణయించారు. కాబట్టి ప్రపంచమంతా అకర్మ వీగనిజమ్ (అకర్మ శాఖాహారం) + ధ్యానం + నవీన యుగ మతరహిత అత్యున్నత ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని "మిషన్ అహం బ్రహ్మాస్మి" ద్వారా ప్రచారం చేస్తాను. దీనికి మీరందరు తోడవుతారని ఆశిస్తున్నాను.

లోక కళ్యాణం జరుగుగాక...!

సృష్టి కళ్యాణం జరుగుగాక...!

అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద

సౌభాగ్య మోక్షాలు ప్రాప్తించుగాక!!

- సద్గురు దేవి సహస్రా తారా విశాల్

విషయ సూచిక

విషయం పేజ్ నం.

ముందుమాట 5

Pre Part & Index 7

పార్ట్ – 1

దైవత్వం మన జన్మ హక్కు...! 31

పార్ట్ – 2

దైవం వ్యక్తి కాదు, శక్తి ! 43

పార్ట్ – 3

నేను కాస్మిక్ సైంటిస్ట్‌ను ఎలా అయ్యాను ? 49

పార్ట్ – 4

గ్లోబల్ గవర్నమెంట్ 61

పార్ట్ – 5

మీ సంతానాన్ని పరమాత్ములుగా తయారు చేయండి..... 65

పార్ట్ – 6

ఆధ్యాత్మికం వేరే ! మతం వేరే !

1. నిర్లక్ష్యం 79
2. ఓపెన్ మైండెడ్‌గా ఉండాలి 82
3. ఆధ్యాత్మికం వేరే ! మతం వేరే ! 85

విషయ సూచిక

విషయం పేజ్ నం.

పార్ట్ – 7

All Is One ! అంతా ఒక్కటే ! 107

పార్ట్ – 8

వాస్తవానికి కర్మ సిద్ధాంతం అనేది ఉంది. లేదు 117

పార్ట్ – 9

ఏ గురువు అవసరం లేదా ?!

ఎవరినీ అనుసరించ వద్దా !? 121

పార్ట్ – 10

సరైన అవగాహన

1. మహా ఆశ్చర్యం 127
2. మీ లైఫ్ లైన్లు అయిపోయాయేమో చెక్ చేసుకోండి 133
3. భూమి ఒక హోటల్ లాంటిది, మీరు బిల్ చెల్లించాల్సిందే 143
4. మీ స్వయం పైననే మీరు ఆధార పడాలి 147
5. అకర్మ శాకాహార + ధ్యాన + ఆత్మ విజ్ఞాన ప్రచారం చేస్తున్న వారు తెలుసుకోవాల్సిన అత్యంత ముఖ్య విషయాలు 151
6. ఇప్పుడు గడిస్తే చాలని అనుకోకండి 155
7. ప్రతి ఒక్కరూ సహజంగానే ఐశ్వర్యాన్ని కలిగి ఉంటారు 157
8. మహా మూల చైతన్యం అంటే ఏమిటి ? 159
9. భౌతిక శరీరాన్ని ధరించిన మూల చైతన్య స్వరూపమే(దైవమే) మానవుడు 161
10. ఎల్లప్పుడూ 100% పాజిటివ్‌గా మాత్రమే ఆలోచించాలి 163
11. ఎల్లప్పుడూ ఆనందంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండండి – అకారణంగా 167
12. ఆత్మ పరిణామ క్రమం క్లుప్తంగా 173
13. రోగాల, జబ్బుల, వ్యాధుల గురించి అంటే మొత్తం సర్వ అనారోగ్యాల గురించి ఆధ్యాత్మిక శాస్త్రం ఏం చెబుతుందో తెలుసుకుందాం 175

విషయ సూచిక

పార్ట్ - 10 - సరైన అవగాహన

విషయం **పేజ్ నం.**

14. మేము ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలం, పరిశోధకులం !
సన్యాసులం, స్వామీజీలం, బాబాలం కాదు !! 185
15. తనను తాను సమర్పించుకుంది సృష్టి బేషరతుగా 187
16. అనుమానం / సందేహం అంటే ఏమిటి ?
విశ్వాసం / నమ్మకం అంటే ఏమిటి ? 196
17. విశ్వాసమే విశ్వశక్తి 200
18. అనారోగ్య దారిద్ర్యాలు ఎందుకు వస్తాయి ?
ఆరోగ్య ఐశ్వర్యాలు ఎలా వస్తాయి ? 202
19. ఏదైనా సులభమే, సరళమే, సాధ్యమే ! 238
20. ఎల్లప్పుడూ విజయంతో విజేతలుగా విరాజిల్లుదాం 240
21. మహదాలోచనలు చేయండి, వాటిని ఆచరించండి 241
22. బ్రతికితే చాలనుకునే ధోరణిని తక్షణమే వదిలేయాలి 246
23. వేదాలు చెబుతున్నాయి మనమే మూల చైతన్య స్వరూపులమని(దేవుళ్ళమని) 248
24. శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఇదే చెప్పాడు 252
25. పూజ, స్తోత్రం, జపం, ధ్యానం(యోగం) అంటే వాస్తవంగా ఏమిటి ? 267
26. జీసస్ క్రైస్ట్ కూడా ఇదే చెప్పాడు !
జీసస్ క్రైస్ట్ ఏం చెప్పాడు, క్రిష్టియన్లు ఏం చేస్తున్నారు ? 281
27. బ్రహ్మ జ్ఞానం కలిగిన వాడే బ్రాహ్మణుడు 294
28. ద్విజుడు అంటే 295
29. ఉపనయనం - ఉపనయనోపదేశం - ఉపనయన మహోత్సవం 296
30. బ్రహ్మచారి - అస్ఖలిత బ్రహ్మచారి - బ్రహ్మచర్యం - బ్రహ్మచర్య దీక్ష 298
31. శూద్ర యోని యందు పుట్టడం అంటే ! 300
32. శూద్రుడు - దివ్యుడు 302
33. పున్నామ నరకం కాదు, పునః నామ నరకం 304
34. ఏడు శరీరాలు & కలలు 306
35. చక్రాలు 309
36. మూడో కన్ను - దివ్య నేత్రం 315
37. శక్తులు లేక సిద్ధులు 316
38. ఎప్పుడైనా సరే, ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే, ఇలా అనకూడదు 319
39. జడ్జ్‌మెంట్ - తీర్పు 321

విషయ సూచిక - పార్ట్ - 10 - సరైన అవగాహన

విషయం **పేజ్ నం.**

40. అభినందించండి 332
41. మీరు ఎలా ఉండాలని అనుకుంటున్నారో సరిగ్గా అలానే ఉంటున్నారు 335
42. నా రాతలో ఏం రాసి ఉందో, అదే జరుగుతుంది అని అనకూడదు 338
43. మనసు, బుద్ధి, చిత్తం, అహం ! 341
44. అంతా మంచే, అందరూ మంచి వాళ్ళే !
మంచి చేస్తే మంచే జరుగుతుంది 345
45. మన శరీరంలోని సమస్యలే జీవితంలోని సమస్యలు 354
46. మంచి పని చేయడమే సులభం 359
47. వర్తమానంలోనే ఎందుకు ఉండాలి ? 361
48. కర్మ 363
49. భూమికి మంచి చేయడం అంటే మనకు మనం మంచి చేసుకోవడమే 373
50. మానవ చైతన్యమే మూల చైతన్యం 375
51. మనం అనంత దివ్య శక్తి స్వరూపులం 381
52. మీరు కష్టాల్లో ఉన్నారా ?
అయితే వాటిని వదిలించుకోవడం సులభమే 382
53. కలలే సత్యాలు ! ఊహలే వాస్తవాలు !
పగటి కలలే పచ్చి నిజాలు ! ఆలోచనలే పరిస్థితులు ! 386
54. ఏవైనా మనకు ఎందుకు ఉండవంటే ? 392
55. ఏవైనా మనకు ఎందుకు ఉంటాయంటే ? 398
56. ఉత్తమ జీవిత భాగస్వామిని పొందాలంటే ఏం చేయాలి ?
& ఉత్తమ సంతాన ప్రాప్తికి ఏం చేయాలి ? 400
57. మీ పాజిటివ్ నిర్ణయాల పట్ల మీరు
నిజాయితీని & నిబద్ధతను కలిగి ఉండాలి 405
58. లక్ష్యం పైన మాత్రమే దృష్టి కేంద్రీకృతమై ఉండాలి –
అణువంత కూడా పక్కకు పోకూడదు 408
59. లోక సేవకు అంకితమైతే అందరూ అభినందిస్తారు 410
60. మార్పు చాలా సులభం & సరళం 414
61. ఆచరణ 416
62. దేనినైతే పొందాలి, అవి కావాలి, రావాలి,
అని అనుకుంటున్నారో అది చేయడం మొదలు పెట్టండి 418
63. బాత్ రూంలకు ప్రాధాన్యతను ఇవ్వండి.
అవి బాత్ రూంలు, టాయిలెట్లు కాదు, అవి ఫ్రెష్ రూంలు ! 420
64. సత్య సూత్రాలు 423

విషయ సూచిక

విషయం | పార్ట్ – 11 | పేజ్ నం.

MAB చిల్డ్రెన్ ప్రాజెక్ట్ 443

పార్ట్ – 12

ఐశ్వర్యం జై హో

1. ఐశ్వర్యం పట్ల ఉన్న భ్రమలు, అపోహలు 491
2. ఐశ్వర్యం జై హో 495
3. ఆరోగ్య ఐశ్వర్య ఆనందాలతో శాశ్వతంగా
విరాజిల్లాలంటే ఏం చేయాలి ? 499
4. జీవితంలో ఐశ్వర్యం లేకపోవడానికి గల కొన్ని కారణాలు 501
5. ఐశ్వర్య సాధనకు సంబంధించిన విషయాలు 510
6. ఐశ్వర్య సాధన 515

పార్ట్ – 13

డబ్బు - లక్ష్య సాధన 539

పార్ట్ – 14

నవ రత్నాలు

నవ రత్నాలు 575
1. MAB నవ రత్నాలలో మొదటిది గురు స్మృతి 577
2. MAB నవ రత్నాలలో రెండవది నిస్వార్థ సేవా సాధన 632
3. MAB మూడవ రత్నం వీగనిజమ్ 709
4. MAB నాలుగవ రత్నం స్వాధ్యాయం 737
5. MAB అయిదవ రత్నం ధ్యాన సాధన 745
6. MAB ఆరవ రత్నం సత్సంగం 749
7. MAB ఏడవ రత్నం ఆచరణ 751
8. MAB ఎనిమిదవ రత్నం పరిశోధన 753
9. MAB తొమ్మిదవ రత్నం సత్య ప్రచారం 755

విషయ సూచిక

విషయం పేజ్ నం.

పార్ట్ – 15

సాధకుల ప్రశ్నలు - నా సమాధానాలు 769

పార్ట్ – 16

జన్మలు, పునర్జన్మలు అనేవి
నిజ సత్య వాస్తవాలు..... 899

పార్ట్ – 17

మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్ 909

పార్ట్ – 18

స్త్రీ 913

పార్ట్ – 19

ప్రేమే సర్వస్వం 917

పార్ట్ – 20

లవ్ & లవ్ మ్యారేజ్ 927

పార్ట్ – 21

దివ్య కామం 961

పార్ట్ – 22

ధ్యానం ద్వారా ఆరోగ్యం ఎలా వస్తుంది అనే విషయానికి
సంబంధించిన సైంటిఫిక్ రీసెర్చ్ రిపోర్ట్స్ యొక్క వివరాలు

1. ధ్యానంతో ఎయిడ్స్‌కు చెక్ 1001
2. రోజూ ఓ గంట ధ్యానం చేయండి 1003
3. హృదయ శాంతి 1005

విషయ సూచిక

విషయం **పేజ్ నం.**

4 ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన హృదయం,
డా॥ అబ్దుల్ కలాం, మాజీ రాష్ట్రపతి 1009

5. మేల్కొంటేనే నిశ్చింత 1011

పార్ట్ – 23

ధ్యాన లాభాలు

1. క్రమం తప్పకుండా ధ్యాన సాధన చేస్తే కలిగే లాభాలు కొన్ని ! 1017
2. నా జీవితంలో నేను చూసిన,
నాకు తెలియజేయబడిన కొన్ని ధ్యాన లాభాలు 1021

పార్ట్ – 24

సాధారణ సందేహాలు

1. సాధారణ సందేహాలు 1026
2. ధ్యానం మొదలు పెట్టిన కొన్ని రోజుల తర్వాత 1032
3. ధ్యానంలో కూర్చోగానే ఇలా జరుగుతుంది 1036
4. ధ్యానం ఒక్కోసారి కుదురుతుంది, ఒక్కోసారి కుదరనట్టు అనిపిస్తుంది 1038
5. ధ్యాన అనుభవాలు అర్థం అయితే అవుతాయి, లేకపోతే లేదు 1040
6. ధ్యానంలో అనుభవాలు వస్తే వస్తాయి, లేకపోతే లేదు 1042
7. ధ్యాన సాధన ఎందుకు భారంగా, కష్టంగా, విసుగుగా అనిపిస్తుంది ?..... 1044

పార్ట్ – 25

డైనమిక్స్ 1049

పార్ట్ – 26

ధ్యాన సాధనలు

జీవన వృక్షానికి పచ్చ రంగు 1082
24 గంటల్లో కనీసం 2 గంటలు మీతో మీరుండాలి 1084
1. **M A B** వేగం సాధన 1086
2. **M A B** దైవత్వ సాధన – అహం బ్రహ్మాస్మి సాధన 1090
3. **M A B** ప్రేమ ధ్యానం (**M A B** అమర విద్య) 1123

విషయ సూచిక

విషయం పార్ట్ – 26 - ధ్యాన సాధనలు పేజ్ నం.

4. 18 పాయింట్ల సాధన 1131
5. పాజిటివ్ సాధన 1145
6. ధ్యాన సాధన – 5 విధానం 1147
7. ధ్యాన సాధన (భయం) 1149
8. ధ్యాన సాధన – ప్రేమ ఎరుక సాక్షి ధ్యానం 1155
9. ధ్యాన సాధన 1165
10. ధ్యాన సాధన 1167
11. ధ్యాన సాధన 1169
12. దర్పణ సాధన 1171
13. రిలీజింగ్ మెడిటేషన్ 1181
14. కాంతి ప్రేమ అనందం సాధన 1183
15. దివ్య నేత్ర ఉత్తేజిత సాధన 1185
16. స్వేచ్ఛా సాధన 1193
17. ధైర్య సాధన 1194
18. తొలి ప్రాధాన్యత సాధన 1197
19. పరమోన్నత అవగాహన సాధన 1199
20. ఇష్టం సాధన 1201
21. న్యూ బిలీఫ్ సిస్టమ్ 1203
22. ధన్యవాద సాధన లేక అష్టలక్ష్మి సాధన 1217
23. అద్భుత సాధన 1225
24. దివ్య అద్భుత సాధన 1227
25. దివ్య శక్తుల సాధన 1229
26. స్వతంత్ర సాధన 1233
27. మంచి సాధన 1234

నేను వివరించిన సాధనలు అన్నీ ఒకటే 1238

మహా ముఖ్య విషయం 1239

పార్ట్ – 27

కుండలినీ జాగరణ 1243

విషయ సూచిక

విషయం పేజ్ నం.

పార్ట్ – 28

దైవత్వ ప్రాప్తి యొక్క
కీలక రహస్యం 1259

పార్ట్ – 29

10% మినహాయింపు ద్వారా
పూర్తి మినహాయింపు దొరుకుతుంది 1269

పార్ట్ – 30

ఆనందమయ జీవితం కోసం...

1. ఆనందమయ జీవితం కోసం... నిత్య జీవితంలో
తప్పని సరిగా చేయవలసినవి 1275
2. ఆనందమయ జీవితం కోసం అసలు
ఏ మాత్రమూ చేయకూడనివి 1277

పార్ట్ – 31

ఎక్స్ట్రా & స్పెషల్ ఇన్ఫర్మేషన్

1. పరమ సత్యం 1281
2. అకర్మ శాకాహారం ఎందుకు తీసుకోవాలంటే 1299
3. మీ విస్మృతియే మీ దైవత్వానికి సాక్ష్యం 1303
4. పూర్తి విశ్వాసంతో & మహా ఎరుకతో ఉండాలి 1305
5. మరి కొన్ని సాధనలు 1309
6. ఏదైనా పని చేసే ముందు 1313
7. గతాన్ని పూర్తిగా వదిలేయాలి 1315
8. అవగాహన 1321

విషయ సూచిక

విషయం	పేజ్ నం.
9. దివ్య శక్తులు	1324
10. మీరు చేయ వలసినవి చేస్తే, మీకు రావలిసినవి వస్తాయి	1326
11. సత్య ప్రచార మహిమ	1329

పార్ట్ – 32

ఆనాపానసతి గురించి ఓషో ఏం చెప్పాడు ? 1337

పార్ట్ – 33

కొన్ని ముఖ్య విషయాలు 1353

1. కొన్ని సత్యాలు 1359
2. కొన్ని సందేహాలు 1379

పార్ట్ – 34

సూచనలు 1417

సద్గురు ఆశీర్వాదం 1446

అసలు విషయం

రామ్తా, సేత్.... మొదలైన న్యూ ఏజ్ మాస్టర్స్ అందరూ మనమే సాక్షాత్తు దైవాలం అని చెప్తారు, నేను కూడా చెప్తాను. ఇది పరమ సత్యం. అయితే మనం నిజంగా దైవాలమే అయినప్పుడు, మనం అనంత శక్తి స్వరూపులం అయినప్పుడు... మరి ఎందుకు సమస్యల్లో, బాధల్లో ఉన్నాము !?! ఇది తప్పని సరిగా తెలుసుకోవాల్సిన విషయం !

ఇప్పుడు ఇది కల్యాణ యుగం, న్యూ ఎనర్జి యుగం, ఇది అమర యుగం. ఈ నూతన నవీన దివ్య కాంతి అమర యుగంలో కావాల్సినన్ని ఎనర్జీలు ఉన్నాయి. ఎనర్జీలకు కొరత లేనే లేదు. ఇప్పుడు మనుషులకు కావాల్సింది "అవగాహన". మనిషి తన "సిస్టమ్" పట్ల మరియు "సృష్టి న్యాయాల(Cosmic Laws)" పట్ల ఎరుకను + అవగాహనను ఉద్భవింప చేసుకోవాలి, అంటే ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకోవాలి, ఆచరించి అనుభవంలోకి తెచ్చుకోవాలి. అప్పుడు తెలుస్తుంది అన్ని ఎనర్జీలు తనలోనే ఉన్నాయి అని !

చాలా మంది శక్తి(ఎనర్జి) కోసం ధ్యానం చేయాలి అని అనుకుంటారు, కానీ ఇది నిజం కాదు. ఒక వేళ మీకు అలాంటి భావనలు ఉంటే, ఈ క్షణమే పూర్తిగా తీసివేసుకోండి. మనం శక్తి లేక బాధ పడటం లేదు. మనకు శక్తి లేనందుకు బాధల్లో లేము. ఈ సత్యాన్ని గ్రహించండి. మనకు అనంతమైన శక్తి ఉంది. లేనిదల్లా ఆ యొక్క "అనంత శక్తి"ని ఎలా వాడుకోవాలో తెలియక పోవటమే ! కావాల్సింది జ్ఞానం, కావాల్సింది అవగాహన, కావాల్సింది టెక్నిక్ ! శక్తి మనకు అనంతంగా ఉంది, శక్తి లేదు అనుకుని, శక్తి కోసం ధ్యానం చేయడం కాదు. ధ్యానం చేయాల్సింది మన "దైవత్వం" కోసం !! ధ్యానం అంటేనే "మన దైవత్వం పట్ల మనకు సరైన పూర్తి అవగాహన" అని అర్థం. మనకు కావాల్సింది శక్తి కాదు, శక్తి మనకు అనంతంగా ఉంది. మనకు కావాల్సింది "అవగాహన" ! అవగాహన వస్తే అన్నీ వస్తాయి. అవగాహన ద్వారా మనం మన యొక్క దైవత్వ శక్తిని మనకు కావాల్సిన విధంగా ఉపయోగించుకో గలుగుతాము. ***లోక కల్యాణానికి కారకులం కాగలుగుతాము ! పరమార్థాన్ని పొందుతాము. సంపూర్ణత్వాన్ని సాధిస్తాము.***

మనకు శక్తి కొరత లేదు, మన శక్తి అనంతం. ఉదాహరణకు, ఏరోప్లేన్(విమానం) ఉంది. దాన్ని నడపడానికి, ఒక పేద్ద పహిల్వాన్ అంత బలం ఉండాల్సిన అవసరం లేదు కదా ! మామూలు బలం ఉంటే సరి పోతుంది. ఏరోప్లేన్(విమానం) నడపడానికి కావాల్సింది, దానికి సంబంధించిన జ్ఞానం. ఏది నొక్కితే ఏమవుతుంది ? ఏది తిప్పితే ఏమవుతుంది ? ఎలా దీన్ని కంట్రోల్ చేయాలి ? అనే జ్ఞానం మీకు వస్తే చాలు. అప్పుడు ఏరోప్లేన్(విమానం) పూర్తిగా మీ అధీనంలో ఉంటుంది. అలాగే ఆత్మ విజ్ఞానం తెలుసుకుంటే, మీ దైవత్వాన్ని ఎలా ఉపయోగించుకోవాలో మీకు తెలుస్తుంది. అప్పుడు మీ దైవత్వం యొక్క అనంతమైన దివ్య శక్తులను ఉపయోగించుకుంటూ మీరు అనంత దివ్య శక్తి స్వరూపులుగా శాశ్వతంగా విరాజిల్లుతూ ఉండవచ్చు. ఈ మహా గ్రంథ విజ్ఞాన అవగాహన ద్వారా మీ దైవత్వం మీకు పునః ప్రాప్తమవుతుంది. మీ దైవత్వ శక్తులను ఎలా ఉపయోగించుకోవాలో మీకు పూర్తిగా తెలుస్తుంది.

నవీన యుగ ఆధ్యాత్మిక శాస్త్ర సత్యాలతో, నియమాలతో, ధర్మాలతో, మహాత్యద్భుతమైన విశేషాలతో, రహస్యాలతో, ధ్యానయోగ సాధనలతో మరియు సైంటిఫిక్ రీసెర్చ్ రిపోర్ట్స్ యొక్క వివరాలతో కూడుకుని ఉన్న దివ్యమైన మహా గ్రంథం **''సద్గురు తారా విశాల్ మార్గదర్శి''** ! ఈ గ్రంథ విజ్ఞాన ***అవగాహన*** మరియు ***సంపూర్ణ విశ్వాసంతో కూడిన మీ యొక్క స్వయం బాధ్యతా పూర్వక, సురక్షా పూర్వక ఆచరణ,*** ఖచ్చితంగా మీ యొక్క సర్వ – సర్వ, సకల – సకల, సమస్త సమస్యలను పరిష్కరించడంలో మహా అత్యద్భుతమైన, అపూర్వమైన, ఘనమైన పాత్రను పోషిస్తుంది. **ఇది పాజిటివ్ దృక్పథ ఎంకరేజ్‌మెంట్ మాత్రమే, కృషి చేయాల్సింది మీరే. జయాపజయాలు కేవలం మీ మీదనే ఆధారపడి ఉంటాయి.**

మీకు, నిజంగా ఈ క్షణమే ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలు ప్రాప్తించుగాక !

– మీ MAB

ఆధ్యాత్మిక శాస్త్రం మరియు ధ్యానం సార్వజనీనమైనవి ! విశ్వజనీనమైనవి !!

ఆధ్యాత్మిక శాస్త్రం మరియు ధ్యానం సార్వజనీనమైనవి ! విశ్వజనీనమైనవి !! ఇవి అందరివి ! మనిషి అనబడే ప్రతి ఒక్కరికి సంబంధించినవి !

ఆధ్యాత్మిక శాస్త్రానికి మరియు ధ్యానానికి ముందు, మీరు పాజిటివ్‌గా ఉండండి. ఇక ఇప్పుడు ఆధ్యాత్మిక శాస్త్రాన్ని తెలుసుకోవడం ప్రారంభించండి, ధ్యాన సాధన మొదలు పెట్టండి. ఇప్పుడు మాత్రమే సత్యం బహిర్గతం అవుతుంది. ఇది చేసి తెలుసుకోవాలి.

ఎలాంటి కఠినమైన నియమ నిబంధనలు లేని ఆధ్యాత్మిక శాస్త్రీయమైన, సరళమైన, సహజమైన, సంపూర్ణమైన, సమగ్రమైన, మహా శక్తివంతమైన, అత్యంత లాభదాయకమైన, సురక్షితమైన మరియు తక్షణమే, ఫలితాలనిచ్చే మహా సాధనలను, విషయాలను, విశేషాలను, రహస్యాలను ఈ దివ్య గ్రంథంలో తెలియజేసాను.

స్త్రీ, పురుష, జాతి, మత, కుల, వయోభేదం లేకుండా అందరూ సులభంగా ఆచరించి అనేకమైన లాభాలను పొందవచ్చు. ఆధ్యాత్మిక శాస్త్ర అభ్యాసం మరియు క్రమం తప్పని ధ్యాన సాధన వలన ఎన్నెన్నో లాభాలు, ఒక్కొక్కరికి ఒక్కో రకంగా ! కొన్ని వేల సంవత్సరాల నుండి నేటి వరకు సాధకుల చరిత్రను పరిశీలించి, పరిశోధించి, వారు పొందిన అనంతమైన అనుభవాలలో, ఫలితాలలో కొన్నింటిని గనుక మనం తీసుకుంటే ఈ గ్రంథంలో నేను తెలియజేసిన విధంగా ఉంటాయి. అన్నీ సత్యాలే ! అన్నీ లాభాలే !

ఆధ్యాత్మిక శాస్త్రాన్ని అభ్యసిస్తూ మరియు క్రమం తప్పని ధ్యాన సాధన చేస్తూ ఉంటే... ఎవరెవరికి ఏ, ఏ సమస్యలు ఉన్నాయో అవన్నీ పూర్తిగా, శాశ్వతంగా పరిష్కరించ బడతాయి.

ఈ గ్రంథం నవీన యుగ ఆధ్యాత్మిక శాస్త్రం ! ఇది ఏ కుల గోత్రాలకు, ఏ జాతి మతాలకు, ఏ సాంప్రదాయ సంస్కృతులకు, ఏ ఆచార వ్యవహారాలకు, ఏ ఒక్క వర్గానికి సంబంధించినది కాదు. ఈ శాస్త్రం సర్వ మానవులకు సంబంధించినది. ఇది సార్వజనీనమైనది. ఇది విశ్వజనీనమైనది. ఇది సృష్టి శాస్త్రం ! ఇది ప్రాక్టికల్ సైన్స్ ! ఇది టెక్నికల్ సైన్స్ !

మానవుడికి సృష్టికి గల సంబంధం ఏమిటి ?

మానవుడి జీవితం యొక్క పరమార్థం ఏమిటి ?

మానవ జీవితంలో అనారోగ్యాలు మరియు కష్టనష్టాలు ఎందుకు వస్తాయి ? అవి రాకుండా ఉండాలంటే ఏం చేయాలి ?

మానవులు, ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను ప్రాప్తించుకోవాలంటే ఏం చేయాలి ?

....ఇంకా అనేకానేక ప్రశ్నలకు సరియైన సమాధానాలను ఇస్తుంది ఈ మహా దివ్య గ్రంథం !

ఈ గ్రంథం చదవక ముందు మీరు ఒకలాగా ఉంటారు. చదివి సరిగా అర్థం చేసుకున్న తర్వాత మీరు పూర్తిగా మారిపోతారు. మీ జీవితంలో+శరీరంలో వచ్చిన దివ్యమైన మరియు అద్భుతమైన మార్పుల గురించి... ఎవరో మీకు చెప్పాల్సిన అవసరం ఉండదు. మీకే చాలా స్పష్టంగా తెలిసి పోతుంది.

మీకు సర్వదా.... సదా శుభాలు+లాభాలు జరుగుతూనే ఉండు గాక !

ఇట్లు

ప్రేమ & దివ్య కాంతులతో
సద్గురు తారా విశాల్

ప్రియమైన సృష్టికి ప్రేమతో అంకితం

హృదయ పూర్వక ప్రేమానందమ్ ధన్యవాదాలు

అల్ట్రా కాన్షియస్‌నెస్‌కు, MAB గైడింగ్ గ్రాండ్ మాస్టర్స్ అందరికీ మరియు ఇంకా ఇతర మహా గ్రాండ్ మాస్టర్స్ అందరికీ మరియు నా ఈ మహా దివ్య ప్రస్థానంలో సహాయ సహకార సమన్వయాలు అందచేసిన వారందరికీ పేరు పేరునా... నా యొక్క హృదయ పూర్వక ప్రేమానందమ్ ధన్యవాదాలు.

నా భార్య + నా శిష్యురాలు **సహస్రా తారా విశాల్‌కు &** MAB మెంబర్స్ అందరికీ, ఇంకా అంతటికీ + అందరికీ కూడా నా యొక్క హృదయ పూర్వక ప్రేమను, ఆనందాన్ని, ధన్యవాదాలను, అభినందనలను మరియు ఆశీర్వాదాలను ప్రకటిస్తున్నాను.

– సద్గురు తారా విశాల్

గ్రంథ రచయిత పరిచయం

సద్గురు తారా విశాల్

పేరు : సద్గురు తారా విశాల్ (కాస్మిక్ సైంటిస్ట్ / స్పిరిచ్యువల్ సైంటిస్ట్), న్యూ ఏజ్ స్పిరిచ్యువల్ మాస్టర్, న్యూ ఏజ్ స్పిరిచ్యువల్ లీడర్.

జననం : 03-05-1970

వాక్డ్-ఇన్ : 14-03-2003

వాక్డ్-ఔట్ : 04-07-2017

వృత్తి : అకర్మ శాకాహార[Akarma veganism] + ధ్యాన + ఆధ్యాత్మిక విజ్ఞాన బోధన, శిక్షణ మరియు ప్రచారం ! 1996 నుండి ఇదే వీరి వృత్తి, ఉద్యోగం, వ్యాపారం మరియు జీవితం కూడా !

రచించిన పుస్తకాలు : 11 (ఈ పుస్తకంతో కలిపి)

100% ఉచితంగా పంచిన పుస్తకాలు : 21,000 మాత్రమే !

Soft copies బహుశా... కనీసం లక్షకు పైగానే పంచి ఉంటారు.

లక్ష్యం : లోక కల్యాణం & సృష్టి కల్యాణం ! అందరికీ సరైన మతరహిత అత్యున్నత ఆధ్యాత్మిక శాస్త్ర అవగాహన వస్తే ఆటొమెటిక్‌గా లోక కల్యాణం & సృష్టి కల్యాణం జరిగిపోతుంది. కాబట్టే... ప్రపంచమంతా అకర్మ శాకాహార / అకర్మ వీగన్ + ధ్యాన + ఆధ్యాత్మిక విజ్ఞాన బోధన, శిక్షణ మరియు ప్రచారం.

.....గ్రంథ రచయిత పరిచయం

సద్గురు తారా విశాల్ గారు "వాకిన్ మాస్టర్" ! సహజ జ్ఞానోదయం కలిగిన ఒక నవీన యుగ ఆధ్యాత్మిక సద్గురువు, జగద్గురువు ! ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టర్ ! ఒక న్యూ ఏజ్ స్పిరిచ్యువల్ మాస్టర్! న్యూ ఏజ్ స్పిరిచ్యువల్ లీడర్ ! ఎన్నో లక్షల సంవత్సరాలుగా ఈ భూమండలం పైన మానవులు కొన్ని సంకట పరిస్థితుల్లో చిక్కుకుని ఉన్నారు. ఈ చిక్కులను విడదీయడానికి ఈ భూమి పైన ఎందరో గ్రాండ్ మాస్టర్స్ అవతరించి తమ బోధనలతో మానవులకు ఎంతో శ్రేయస్కరాన్ని కలిగించారు. ఒక్కో మాస్టర్ ఒక్కో ప్రణాళికతో అవతరించారు, వారి వారి కార్యాలను చేసుకున్నారు, వెళ్ళి పోయారు. ఈ విధంగానే తారా విశాల్ గారు అవతరించారు. వారి ''మిషన్''ను ఎగ్జిక్యూట్ చేస్తున్నారు.

ప్రపంచంలో ఎన్నో ఆధ్యాత్మిక సంస్థలున్నాయి. అయితే వాటిలో సరైన ఆత్మ విజ్ఞానాన్ని అందించేవి కొన్నే ఉన్నాయి. ఈ ఆధ్యాత్మిక ప్రపంచంలో ఉన్న చిక్కేమిటంటే, ప్రతీ వారు తమదే గొప్ప అని అనుకుంటారు. తమ కాన్సెప్టే కరెక్ట్ అని అనుకుంటారు. ఇక్కడే వారు తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకుంటున్నారు. బావిలోని కప్ప లాగా ! సద్గురు తారా విశాల్ గారు కేవలం తన బోధనల గురించి మాత్రమే కాకుండా, ఇంకా ఎంతో మంది ఇతర మాస్టర్స్ గురించి ప్రస్తావిస్తారు, పరిచయం చేస్తారు.

ప్రస్తుత కాలానికి మరియు వేలాది సంవత్సరాల భవిష్యత్తు తరాలకు సరిపోయే, పనికివచ్చే, పనిచేసే విజ్ఞానాన్ని + బోధనలను + సాధనలను ఈ మహా దివ్య గ్రంథంలో అందించారు. ఆధ్యాత్మిక శాస్త్ర విజ్ఞానాన్ని ఇన్ని కోణాలలో, ఇన్ని రకాల అవగాహనలతో ఇంతకు ముందు ఎవరూ, ఏ మాస్టర్ కూడా పరిచయం చేయలేదు. ఇది ఒక అద్భుత అపూర్వ ఆధ్యాత్మిక గ్రంథరాజం. ఇది ఒక ఉద్గ్రంథం. ఇది ఒక సద్గ్రంథం. మహోన్నత తలాల నుండి వచ్చిన సందేశం ప్రకారం ఈ దివ్య దైవ గ్రంథం "ఒక ఆధ్యాత్మిక ప్రళయం" పాజిటివ్ మ్యానర్‌లో !

ఇక్కడ మేము చెప్పిన విషయాలే కాకుండా, మేము ప్రత్యక్షంగా ఇంకా ఎన్నెన్నో సత్యాలను తెలుసుకున్నాము. వాటన్నింటినీ బహిరంగంగా తెలియజేసే సమయం వచ్చినప్పుడు తప్పక ప్రకటిస్తాము. మీకు అంతా మంచే జరుగు గాక ! ధన్యవాదములు ! ఇంత గొప్ప గురు పరమాత్ముని గురించి, ఇంత మహిమాన్వితుడైన గురు పరబ్రహ్మ గురించి ఇంత గొప్ప మహా దివ్య గ్రంథంలో పరిచయ వాక్యాలు వ్రాయడంతో మేమంతా ధన్యులమయ్యాము.

.....గ్రంథ రచయిత పరిచయం

కొన్ని ముఖ్య విషయాలను స్పష్టం చేయదలుచుకున్నాం....

....అవి ఏమిటంటే... ఆధ్యాత్మిక గురువు అంటే కాషాయ వస్త్రాలు, బొట్లు, నామాలు, రంగు రంగుల పూసల దండలు, రుద్రాక్ష మాలలు, పొడుగాటి కర్రలకు రంగు వస్త్రాలు కట్టి వాటిని పట్టుకుని, తలకు గుడ్డ చుట్టుకుని, చెక్క పాదుకలు... మొదలైనవి ధరించి ఉండాలి కదా ! మరి ఈయనేమో టి షర్టులు, జీన్స్, కూలింగ్ గ్లాసెస్‌లు ధరించి ఉంటాడేం...!!!???!!! ఆధ్యాత్మిక గురువు ఇలా ఉంటాడా ?! అని కొంత మందికి సందేహం వస్తూ ఉంటుంది. ఇలా సందేహాలు రావడంలో తప్పేమీ లేదు. ఎందుకంటే ఆధ్యాత్మిక గురువులంటే జనాల్లో అలాంటి అభిప్రాయాలున్నాయి మరి ! కాషాయ వస్త్రాలకు, బొట్లకు, నామాలకు, రకరకాల పూసల దండలకు మొదలైన వాటికి ఆధ్మాత్మిక శాస్త్రానికి ఎలాంటి సంబంధమూ లేదు. ఆధ్యాత్మిక గురువు అంటే కాషాయ వస్త్రాలతో, బొట్లతో, నామాలతో, పూసల దండలతో ఉండాలి అని అనుకోవడం కంటే హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉండదేమో ! ఆధ్యాత్మిక గురువు ఎలాంటి డెకరేషన్‌లో ఉన్నాడో అని కాదు చూడడం... ఆయన ఎలాంటి సబ్జెక్ట్‌ను కలిగి ఉన్నాడో చూడాలి ! **డెకరేషన్‌కేం ? ఓ మేకప్ మ్యాన్‌ను తెచ్చుకుంటే, రెండు గంటలలో గుండెల్లో గుబులు పుట్టించే గురువు అనిపించేలా తయారు కావచ్చు. మరి అనుభవ పూర్వక ఆత్మ విజ్ఞానం ఉండద్దూ....?! అసలు గురువు అంటే ఇలా ఉండాలి అని అనుకోవడమే ఒక పెద్ద అజ్ఞానం ! ఇలా ఇంకా అనేకానేకమైన తప్పుడు అభిప్రాయాలు జనాలలో చాలా చాలా ఉన్నాయి. ఇలాంటి సరికాని అభిప్రాయాలను సరిచేయడానికి ఉద్యుక్తమైన వారిలో సద్గురు తారా విశాల్ గారూ ఒకరు !**

తప్పు నీది కాదు, నీ రాత రాసిన దేవుడిదే తప్పు, కాబట్టి నీ రాతను తప్పుగా రాసిన దేవుడికి తన తప్పు దిద్దుకునే అవకాశాన్ని ఇవ్వు ! నీలో ఏ దోషమూ లేదు, ఏ సాధనలు అవసరం లేదు ఇది కలియుగం కదా... సంకీర్తన లేక దైవనామ స్మరణ చాలు, రోజు మొత్తంలో నీకు వీలైనప్పుడు ఒక సారి నీకు నచ్చిన దేవుని పేరు తలుచుకో చాలు ! ఇక నీ ఇష్టం వచ్చినట్టు నీవు చేయి. అని చెప్పే గురువులంటే కొంత మంది జనాలకు ఎంత ఇష్టమో ! ఇలా చెప్పేవారు అడుగులో అడుగు వేసుకుంటూ నిదానంగా నడుస్తారు. నిరంతరం చిరునవ్వుతో ఉంటూ ఉంటారు. అందరినీ కూల్‌గా చూస్తూ ఆశీర్వదిస్తూ ఉంటారు. అన్నింటికీ ఆ భగవంతుడే ఉన్నాడు అంటూ ఉంటారు. ఈ బోధనలు చాలా హాయిగా, సమ్మగా ఉంటాయి. ఎందుకంటే ఈ బోధనలు... నీ దోషమేమీ లేదు, అంతా నీ రాతదే తప్పు అని చెబుతూ ఉంటాయి ! ఇంకా, ఇది కలియుగం కాబట్టి రోజు మొత్తంలో ఒక సారి భగవంతా... అని అనుకుంటే సరి... ఇక ఏ సాధన అవసరం లేదు అని చెప్తాయి.

.....గ్రంథ రచయిత పరిచయం

అందుకే ఇలాంటి బోధనలు చేసే గురువులంటే కొంత మందికి ప్రీతి. సద్గురు తారా విశాల్ గారేమో నీ వాస్తవాలకు నీవే సృష్టికర్తవు, నీ మంచికి నీవే కారణం ! నీ చెడుకు నీవే కారణం ! కలియుగమైనా ఏ యుగమైనా అకర్మ శాకాహారము, ధ్యానం, ఆత్మ విజ్ఞాన అభ్యాసం మరియు సేవ ద్వారా మాత్రమే మోక్షం వస్తుంది, కాబట్టి అనవసరమైన నాటకాలన్నీ మానివేసి సాధన మొదలు పెట్టండి అని ఉన్న సత్యం చెప్పేస్తారు. మరి ఇది కొంచెం ఇబ్బంది కదా ! **నా లోపాలకు నేనే కారణమా...?!** ఈ సత్యం జీర్ణం కావడానికి కాస్త అవస్థ తప్పదు కదా ! నిజానికి అవస్థ పడాల్సిన పనే లేదు, ఎరుకతో ఆలోచిస్తే అసలు సిసలు వాస్తవ బోధనలను చాలా ఈజీగా గుర్తు పట్టవచ్చు, అయితే... ఇలా గుర్తు పడితే.... నీ స్వయానికి నీవే బాధ్యత వహించాల్సి ఉంటుంది. నీ కష్టాలకు నీవే కారణం అనే సత్యాన్ని అంగీకరించాలంటే... చాలా ధైర్యం కావాలి. చాలా గొప్ప అవగాహన కావాలి. ఇక్కడ రాత అంటూ దేవుడి మీద నింద వేయడానికి లేదు. శ్రీ తారా విశాల్ గురూజీ కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేస్తారు... నీ వాస్తవాలకు నీవే కారణం అని ! ఈయన అడుగులో అడుగు వేసుకుంటూ, చిరునవ్వుతో అందరినీ ఆశీర్వదిస్తూ , నిరాడంబర వస్త్రాలు ధరించి నిదానంగా, చాలా బ్యాలెన్స్‌డ్‌గా ఆచి తూచి వ్యవహరించే నాటకాలు వేయరు. తమ సహజత్వంతో తాముగా ప్రవర్తిస్తారు.

గురువు యొక్క డెకరేషన్‌లు చూడటం మాని, గురువు యొక్క దక్షతను తెలుసుకుంటే, విశ్వసిస్తే ఆధ్యాత్మిక అభివృద్ధి కలుగుతుంది. నిజమైన గురువును ఆశ్రయించాలనుకునే కొంత మంది శిష్యులకు అనుమానాలు, అవరోధాలు కలుగుతాయి. ఇవన్నీ తమ లోపలి లోపాలేనని గ్రహించి, వాటన్నింటినీ జయించి వస్తే అప్పుడు వారు మోక్ష పథంలో నడవ గలుగుతారు. సత్య గురువును గుర్తించడం అనేది మీ ఆత్మ పరిణామ క్రమంలో ఒక మహా మహా మహా అభివృద్ధి దశ యొక్క ద్వారాన్ని చేరుకోవడం. గురువును ఒప్పుకుని ఆయనకు తన్ మన్ ధన్...లతో సంపూర్ణంగా సమగ్రంగా సరెండర్ కావడం అనేది ఆత్మాభివృద్ధిలోకి ప్రవేశం. గురువు వద్ద శాశ్వత రీతిలో స్థిరం కావడం అంటే, మీ దైవత్వాన్ని స్థిరం చేసుకున్నట్టే ! శాశ్వత రీతిలో మీరు అభివృద్ధి పథంలో స్థిరం అయినట్టే ! అందరికీ తక్షణ శాశ్వత గురుస్మృతి ప్రాప్తిరస్తు !

సదా... మీకు మంచి జరుగు గాక ! ధన్యవాదములు !

- సీనియర్ **MAB** మెంబర్స్

సరైన ఆధ్యాత్మిక అవగాహన ద్వారా లోక కల్యాణం & సృష్టి కల్యాణం ఎలా జరుగుతుంది ?!

సరైన ఆధ్యాత్మిక అవగాహన వలన....

1. దైవం అనేది అందరికీ ఒకటేనని తెలుస్తుంది. ఆ దైవం బయట లేదు, లోపలే ఉంది అని తెలుస్తుంది. నేనే దైవం అని అర్థం అవుతుంది. జాతి, మత, కుల, వర్గాలు అనేవి నిజానికి లేనే లేవు అనే సత్యం తెలుస్తుంది.

2. మనం ఏం చేస్తే అదే మనకు తిరిగి వస్తుందనే పరమ సత్యాన్ని తెలుసుకుంటారు. ఈ పరమ సత్యాన్ని తెలుసుకున్న మానవులు, చెడు చేయమన్నా చేయరు. కేవలం మంచి మాత్రమే చేస్తారు. ఎందుకంటే నీవు చేసిన చెడు ఎన్ని జన్మలకైనా నీకే తప్పని సరిగా తిరిగి వస్తుందనే సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్న వారు మంచి తప్ప మరొకటి చేయలేరు.

3. ఇవ్వడమే పొందడం, పంచబడింది పెంచబడుతుంది, మీరేమిస్తే అదే మీకు వేయిరెట్లుగా తిరిగి వస్తుంది అనే సృష్టి న్యాయాలను అర్థం చేసుకుని, ఉన్నవాళ్ళందరూ లేని వాళ్ళకు పంచుతూ ఉంటారు.

4. స్త్రీ పురుషులే కాదు, అంతా, అందరూ సమానమేనని గ్రహించి, పురుషులందరూ స్త్రీలను సమానంగా గౌరవిస్తూ ఉంటారు. అంతా... ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ ఉంటారు.

5. నీతి, నిజాయితి, నిబద్ధత, పరోపకారం మొదలైన మంచి గుణాలు ఎంత అవసరమో తెలుసుకుని, వాటిని అలవర్చుకుని జీవిస్తూ ఉంటారు.

6. దేశాల మధ్య సరిహద్దు సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకుంటారు. సామరస్యంతో యుద్ధాలను శాశ్వతంగా నిలిపి వేస్తారు. అప్పుడు ఈ భూమి పైన యుద్ధం అనే పదం చరిత్ర పుటల్లో ఉండి పోతుంది. బయట ఎక్కడా ఉండదు.

....సరైన ఆధ్యాత్మిక అవగాహన ద్వారా లోక కల్యాణం & సృష్టి కల్యాణం ఎలా జరుగుతుంది ?!

7. దేశ, ప్రాంతీయ, భాషా భేదాలు, పంతాలు, పట్టింపులు ఏవీ ఉండవు.

8. ఉగ్రవాదులు, తీవ్రవాదులు, వేర్పాటు విప్లవాలు, హింస మొదలైనవి లేని మానవ సమాజం ఏర్పడుతుంది.

9. మానవులు తమ శక్తి, శ్రమ, మేదస్సు మరియు వనరులను మొదలైన వాటిని... మానవులకు హాని చేయడానికి కాకుండా... ఆయుధాల తయారీకి, విధ్వంసాల కోసం కాకుండా... కేవలం శాంతి ఆనందాల కోసం, మానవ జాతి యొక్క అభివృద్ధి కోసం, శ్రేయస్కరం కోసం మరియు సృష్టి కల్యాణం కోసం మాత్రమే ఉపయోగిస్తూ ఉంటారు.

10. నేరస్థులు, రోగులు ఉండరు.

11. నిరుద్యోగి అనే పదానికి అర్థం తెలియ కుండా పోతుంది.

12. కాలుష్యం అనేది ఉండదు.

13. ప్రజలు ఒకరి కోసం ఒకరు, ఒకరి కోసం అందరు, అందరి కోసం ఒకరు అనే సత్యాలను అర్థం చేసుకుని ఆచరిస్తూ జీవిస్తూ ఉంటారు.

14. మానవులు తమను తాము, గ్లోబల్ సిటిజెన్‌గా ఆ తర్వాత యూనివర్సల్ సిటిజెన్‌గా ఆ తర్వాత కాస్మిక్ సిటిజెన్‌గా గుర్తిస్తారు. ఈ విధమైన అవగాహనతో జీవిస్తూ ఉంటారు.

పైన చెప్పినవన్నీ జరిగితే, జరుగుతూ ఉంటే... దానినే సృష్టి కల్యాణం అని అంటారు.

ఇవన్నీ సాధ్యమా ?! అని అనుమానించకండి. ఇది డెఫినెట్‌గా సాధ్యం. మీరు ఈ గ్రంథాన్ని చదివి సరిగా అర్థం చేసుకుంటే మీకే అర్థం అయిపోతుంది, ఖచ్చితంగా సాధ్యమవుతుందని !

లోక కల్యాణం & సృష్టి కల్యాణం జరుగు గాక !

❖ ❖ ❖

BE INDEPENDENT !

BE A GOD !

BE A GOD UNTO YOURSELF !

- SADHGURU TARA VISHAL

MEDITATION

MEANS

AWARENESS !

NOTHING

ELSE...

పార్ట్ - 1

దైవత్వం మన జన్మ హక్కు !

ఈ భూమి పైన మానవ రూపంలో ఉన్న
దైవాలందరికీ, ఒకే ఒక్క లక్ష్యం... అది వారి లోని దైవత్వాన్ని
వారు అనుభవ పూర్వకంగా తెలుసుకోవడం మరియు
ఇతర దైవాలకు, తమ దైవత్వాన్ని తెలుసుకోవడంలో
ప్రేమగా సహాయం చేయడం.

దైవత్వం మన జన్మ హక్కు !

అవును ! దైవత్వం మన జన్మ హక్కు ! దైవత్వం మన అధికారం ! దైవత్వం మన వారసత్వం ! దైవత్వం మన సహజ స్వరూపం+స్వభావం ! దైవత్వమే మన నిజతత్వం ! దైవత్వమే మన ఒరిజినాలిటి !

ఈ భూమి, ఆకాశం, గ్రహాలు, నక్షత్రాలు, విశ్వాలు(గెలాక్సీలు), అంతరిక్షం మొదలైనవి అన్నీ కలిపితే సృష్టి ! ఈ సృష్టియే దైవం ! దైవమే సృష్టి ! సృష్టికర్తయే సృష్టిగా మారాడు. సృష్టి అంతా కూడా సృష్టికర్తయే ! సృష్టికర్త లేక దైవం ప్రత్యేకంగా ఎక్కడో లేడు. సృష్టి యొక్క ప్రతి అణువులోనూ, ప్రతీ పరమాణువులోనూ ఉన్నాడు. ప్రతీ కణంలోనూ ఉన్నాడు. ప్రత్యేకంగా ఓ రూపం అంటూ ఏమీ లేదు. ప్రత్యేకంగా ఓ పేరంటూ ఏమీ లేదు. అన్ని రూపాలు దైవానివే, అన్ని పేర్లు దైవానివే ! మనకు కనపడేదంతా దైవమే, మనకు కనపడకుండా ఉంటుంది కూడా దైవమే !

నేనూ దైవాన్నే, మీరందరూ దైవాలే !

ప్రస్తుతం ఈ భూమి పైనున్న ప్రతీ ఒక్కరూ, ఇంతకు ముందు ఉన్న వాళ్ళూ, రాబోతున్న వాళ్ళూ అందరూ దైవాలే !!

దైవం ప్రత్యేకంగా ఏ గుడిలోనో లేక చర్చిలోనో లేక మరేదైనా కట్టడంలోనో లేక మరేదైనా విగ్రహంలోనో లేక మరోదానిలోనో లేక ఆకాశంలోనో లేడు, ఉండడు. దైవం అంతటా, అన్నింటిలోనూ ఉంది.

దైవాన్ని... ఒక ఫోటోకో లేక ఒక విగ్రహానికో లేక ఒక పుస్తకానికో లేక మరోదానికో పరిమితం చేయడం అనేది అజ్ఞానమే !

సర్వమైన, సకలమైన, సమస్తమైన దైవాన్ని... ఒక మతానికి, ఒక భాషకు, ఒక ప్రాంతానికి, ఒక దేశానికి, ఒక రూపానికి, ఒక ప్రత్యేకమైన సాంప్రదాయానికి సంస్కృతికి పరిమితం చేయడం నికార్సైన అజ్ఞానం. ఇంత కంటే హాస్యాస్పదం మరొకటి లేదు.

నేనూ దైవమే, మీరూ దైవమే, అంతా.. అందరూ దైవమే !

అనే పరమసత్యాన్ని గుర్తించండి. అందరికీ తెలియజేయండి.

దైవమైన మనం, మానవ శరీరాన్ని ధరించి, రకరకాల అనుభవ విజ్ఞానం కోసం ఈ భూమి పైకి వచ్చాం.

అన్ని అనుభవాలలో నాస్తికత్వం కూడా ఒక అనుభవమే ! దైవం లేడు, లేడు అనే నాస్తికులు కూడా దైవాలే ! దైవం ఎక్కడున్నాడు ? ఉంటే చూపించండి అని అంటే, చూపించడానికి ''దైవం'' ఏమైనా సినిమానా ?! దైవాన్ని చూపించడానికి వీలుకాదు. దైవం అనుభవమవుతుంది. సరైన ఆధ్యాత్మిక శాస్త్రాన్ని అభ్యసించి, అకర్మ శాకాహారులై, నిరంతర ధ్యాన సాధన చేస్తూ, సత్య ప్రచారం చేస్తూ ఉంటే... దైవం అంటే ఏమిటో అనుభవం అవుతుంది. ఇవి చేయకుండా దైవం ఎక్కడ ? ఉంటే చూపించండి ? చూపిస్తే, నిరూపిస్తే ఇంత ధనం ఇస్తాము అని ప్రకటనలు చేస్తూ కూర్చుంటే.. ఎన్ని జన్మలకైనా దైవం అంటే ఏమిటో ఎలా అర్థం అవుతుంది !?

ఫిజిక్స్ అంటే ఏమిటో తెలుసుకోవాలంటే, ఫిజిక్స్ నేర్చుకోవాలి. కెమిస్ట్రి అంటే ఏమిటో తెలుసుకోవాలంటే, కెమిస్ట్రి నేర్చుకోవాలి. ఫిజిక్స్ నేర్చుకోకుండా నాకు ఫిజిక్స్ అర్థం కావాలి అని అనడం పిల్లకాయ తనం. కెమిస్ట్రి నేర్చుకోకుండా నాకు కెమిస్ట్రి అర్థం కావాలి అని అనడం పసితనం. నీళ్ళలోకి దిగకుండా నాకు ఈత అంటే ఏమిటో అర్థం చేయించండి అని మొండికేయడం వెర్రితనం. ఆత్మ పిందె దశలో ఉన్నప్పుడు ఇలా ఉంటుంది. పిందెకు ఏం అర్థం అవుతుంది ? దైవం ఉంటే ఎక్కడున్నాడో చూపించండి అని ప్రశ్నించడం... తెలివి అని అనుకుంటారు నాస్తికులు. కాని అసలు విషయం ఏమిటంటే, ఈ నాస్తికులే కాబోయే ఆస్తికులు ! ఇది సృష్టి ధర్మం ! ఈ జన్మలోనో వచ్చే జన్మలలోనో ఈ నాస్తికులంతా తమ నాస్తికత్వాన్ని(తెలియనితనాన్ని) పోగొట్టుకుని ఆస్తికతలోకి మారుతారు.

గుర్తుంచుకోండి, దైవం ఏక్కడున్నాడు ? ఉంటే చూపించండి ? అని ఎవరు ఏ విధంగా ప్రశ్నించినా... అంటే నిజమైన జిజ్ఞాసతో ప్రశ్నించినా సరే లేక నాస్తికత్వంతో ప్రశ్నించినా సరే లేక ఉబుసుపోక, టైమ్‌పాస్‌కాక పల్లీలు తింటూ ప్రశ్నించినా సరే... వీరి ప్రశ్నకు సమాధానం ఖచ్చితంగా ఇవ్వబడుతుంది. సృష్టి, వీరి ప్రశ్నకు అనుభవపూర్వక సమాధానం ఇస్తుంది. దైవం

గురించి మీరు వేస్తున్న ప్రతీ ప్రశ్నకు దైవం సమాధానం ఇస్తుంది. దైవం యొక్క ప్రతీ సమాధానం అనుభవపూర్వకంగా ఉంటుంది. అంటే, మీ ముందు కిరీటం, నగలు వగైరాలు ధరించిన ఒక వ్యక్తిలాగానో లేక ఒక పేద్ద జ్యోతిలాంటిదో ప్రత్యక్షమై మీకు సమాధానం చెప్పదు (ఒక్కో సారి ఇలా కూడా జరుగుతుంది). దైవం యొక్క సమాధానం ఎలా ఉంటుందంటే... మీకు ఒక సంఘటన జరుగుతుంది, అందులో నుండి మీకు ఒక అనుభవం అవుతుంది, ఆ అనుభవం ద్వారా మీకు ఇది దైవం ఇచ్చిన సమాధానమే అని అర్థం అవుతుంది. ***చాలా క్లియర్‌గా, full క్లారిటీతో అర్థం అవుతుంది.*** ఏ మాత్రం సందేహించడానికి వీలు లేకుండా, ఎంతో సుస్పష్టంగా, చాలా బలంగా మీకు రూఢి అవుతుంది. ఋజువు అవుతుంది. అప్పుడు ఏ హేతువాదం చెప్పినా, ఏ భౌతికవాదం చెప్పినా, మరే వాదం చెప్పినా, ఏ ఇజం చెప్పినా, ఇంకేది చెప్పినా, ఇంకెవరు చెప్పినా సరే... అవన్నీ అసత్యాలేనని మీకు స్పష్టంగా తెలుస్తుంది. అప్పుడు వారిని చూసి మీరు ఇలా అనుకుంటారు... నేనూ ఒకప్పుడు మీలాగే... సరిగ్గా ఇలాగే వాదించాను, ఏమేమో చేసాను, నాకిప్పుడు తెలిసి వచ్చింది, నేడో రేపో మీకూ తెలిసి వస్తుంది.. మీకు అసలు సత్యం తెలియు గాక ! అని ఆశీర్వదిస్తారు.

నాస్తికత ఎక్కడ అంతమవుతుందో అక్కడి నుండి ఆస్తికత ప్రారంభమవుతుంది. దైవం లేడు, లేడు, ఎక్కడ ఉన్నాడు ? ఉంటే చూపించండి... అని సవాల్ చేసే నాస్తికత, ఒక జన్మకో లేక కొన్ని జన్మలకో పరాకాష్ఠకు చేరుతుంది. ఆ తర్వాత నాస్తికత అంతం అవుతుంది. అప్పుడు ఆస్తికత ప్రారంభం అవుతుంది. అప్పుడప్పుడే ఆస్తికతలోకి అడుగు పెట్టిన పిల్ల ఆత్మలు, దైవం ఉన్నాడని అంగీకరిస్తాయి. దైవం తన నుండి వేరుగా... ఫోటోలోనో, విగ్రహంలోనో, గుడిలోనో, చర్చిలోనో, పుస్తకంలోనో లేక ఆకాశంలోనో ఉన్నాడని తలచి... మొక్కుతూ ఉంటాయి, పూజలు, అర్చనలు, ఆరాధనలు, భజనలు, కీర్తనలు, సంకీర్తనలు, ప్రార్థనలు చేస్తూ ఉంటాయి. ఇవన్నీ ఆస్తిక పసి ఆత్మలు. ఇలా చేస్తూ చేస్తూ ఈ ఆస్తిక పసి ఆత్మలు ఏదో ఒక నాటికి పండుతాయి.

దైవం వేరు, నేను వేరు అనేది ప్రాథమిక భావన. నేనే దైవం అనేది, పరమోన్నత వాస్తవ భావన. దైవం మీ నుండి, వేరుగా ఉన్నాడని తలుస్తున్నారని అంటే, మీకు ఇంకా అభివృద్ధి అసలైన రీతిలో ప్రారంభం కాలేదని అర్థం.

మతాధికారులు దైవం వేరే, నీవు వేరే అని చెప్తారు. ఇది చాలా పెద్ద బూటకం. నమ్మకండి. మీరే దైవాలు. అవును. సాక్షాత్తు మీరే దైవాలు !

ప్రతీ మతానికి ఒక దేవుడు లేక దేవుళ్ళు ఉండరు. మతాధికారులు అజ్ఞానంతో తమ మతం యొక్క దేవుడే నిజమైన దేవుడు అని అనుకుంటూ భ్రాంతిలో ఉంటారు. ఆ భ్రాంతినే ప్రజలకు అంటిస్తారు. నేను వేరే, దైవం వేరే అనేది భ్రాంతి ! నేనే దైవం అనేది క్రాంతి ! తెలుసుకోండి, ప్రియ దేవుళ్ళారా...! మీరే దైవాలు !

ప్రతీ ఒక్కరూ తమ యొక్క దివ్యత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. ఇది సృష్టి నియమం. దీనికి అతీతంగా ఎవరూ పోలేరు. మా మత పెద్దలు ఇలా చెప్పలేదు కదా... మా మత గ్రంథాలలో ఇలా లేదు కదా... అని పొరపాటు పడకండి. అన్ని గ్రంథాల్లోనూ అన్ని విషయాలు ఉన్నాయి. అయితే, ప్రతీ మత గ్రంథంలో ఎన్నో అసలు సత్యాలు పోయి, సరికాని విషయాలు ఎన్నో వచ్చి చేరాయి. కొందరు స్వార్థపూరితమైన మతాధికారులు ఈ పని చేశారు.

తెలుసుకోండి - జాతి, మతం, కులం, వర్గం ఇవి ఏవీ లేవు. ఇవి అన్నీ మనిషి కల్పించుకున్నవి. ఇవి అజ్ఞానపూరితమైనవి. సృష్టి నియమాలు, ధర్మాలు మానవులందరికీ ఒకే రకంగా పని చేస్తాయి. మానవులంతా ఒక్కటే ! అందరూ ఒక్కటే ! హెచ్చు తగ్గులు లేవు. ఉచ్చనీచాలు లేవు. కేవలం భిన్నత్వం ఉంది అంతే !

మానవులంతా ఒక్కటే !

మానవులంతా దైవాలే !

ఈ భూమి పైనున్న ప్రతీ ఒక్కరూ మానవ శరీరంలో ఉండి, తమ దివ్యత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకుందామనే ఈ భూమి పైకి వచ్చారు.

ప్రియ మిత్రులారా....

దైవత్వం మన జన్మ హక్కు ! మిమ్మల్ని మీరు దైవాలు అని తెలుసుకుని, మీ దైవత్వాన్ని మీరు ఒప్పుకోండి. ''నేను నా దైవత్వాన్ని ఒప్పుకున్నాను'' అని ఒప్పుకోండి. అంతే.. దైవం మీలో ప్రకటం కావడం ప్రారంభం అవుతుంది. మీరు వీలైనంత సేపు ''నేనే దైవం'' అనే దివ్య భావనలో ఉంటుంటే, దైవత్వం మీలో ప్రకటం కావడానికి ఏ ఏ అడ్డంకులైతే ఉన్నాయో అవన్నీ వాటంతట అవే తొలగిపోతుంటాయి.

మీరు ఈ సృష్టిలో ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. ఏ శక్తి ముందైనా సరే తల దించుకోవాల్సిన పని లేదు. ఏ దేవ దేవతలకూ మోకరిల్లాల్సిన అవసరం లేదు. సర్వ సృష్టిని ఏ శక్తి అయితే సృష్టించిందో ఆ శక్తే మీరు ! మీ గురించి మీకు తెలియక ఇలా ఉన్నారంతే !

జాగో.. జాగో.. జాగృతమ్ ! మేలుకోండి మిత్రులారా ! మీ దైవత్వంలో దైవంలా మేలుకోండి !

అనేకానేక జన్మల నుండి మీరు ఎప్పుడు పిలుస్తారా.. అని ఎదురు చూస్తూ మీ అనుమతి కోసం నిరంతరం మీలోనే ఉండి మీ దైవత్వం ఎదురు చూస్తూ ఉంది. ఒక్క సారి ప్రేమగా పిలవండి. ''ఓ నా దైవత్వమా... నేను నిన్ను అనుమతిస్తున్నాను... నీవు నేను ఒక్కటేననే ఏకత్వాన్ని అనుమతిస్తున్నాను'' అని ఇష్టంగా పిలవండి. మనం మన దైవత్వాన్ని పొంది తీరాలి. మనం సార్వభౌములం. మన సార్వభౌమత్వాన్ని పొంది మనం మన దివ్య వైభవాన్ని ప్రభవింప చేసుకునియే

తీరాలి. దైవత్వం మనకు వారసత్వంగా వచ్చింది. దైవత్వం పైన మనకు పూర్తి అధికారం ఉంది. ఆజ్ఞాపించండి మీ దైవత్వాన్ని ''ఓ నా దైవత్వమా... రా... అనుమతించాను...'' అని ! అంతే మీ ఆజ్ఞ శిరసావహించి మీ దైవత్వం మీలో ప్రకటమవుతుంది.

దైవ సామ్రాజ్యాన్ని లోపలే ఉంచుకుని, ఎక్కడెక్కడో వెతుకుతున్నారు. మత పెద్దలు చెప్పినవన్నీ నమ్మి వారి చేతుల్లో కీలు బొమ్మలై ఉన్నారు. వారు చేయమన్నట్టల్లా చేస్తున్నారు. మతాధికారులు చెప్తున్న వాటి వలన ఏమీ ప్రయోజనం లేదు. వారు చేయించే అజ్ఞానపు తంతు తతంగాలు మరియు కర్మకాండల వలన అంతకన్నా ప్రయోజనం లేదు.

మీలోనే ఉన్న సృష్టికర్తను మీరు బయట వెతుకుతూ నిర్లక్ష్యం చేస్తున్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు కుండ బద్దలు కొట్టినట్టు చెప్పాడు కదా ! "....తస్మాత్ యోగీభవ అర్జునా'' - గీత - 6 : 46 ! అని అన్నాడు. అంటే అన్నీ వదిలేయి, యోగం(ధ్యానం) చేయి ''అర్జునా నీవు యోగివి కా'' ! అని ఆదేశించాడు. ఆధ్యాత్మికతలో ప్రాథమిక స్థాయి కార్యక్రమాలైన పూజ, అర్చనలు, స్తోత్రం, జపం, భజన, సంకీర్తనలు, పుణ్య కథా శ్రవణాలు, హోమం, యాగం, యజ్ఞం మొదలైనవన్నీ చేస్తూ అనవసర కాలయాపన చేస్తున్నారు.. ఇవన్నీ పనికిరావు, వీటి వలన ప్రయోజనం లేదు, ఇవి చాలా చిన్నవి అని శ్రీకృష్ణ పరమాత్ముడు ఉత్తరగీతలో ఇంకా స్పష్టంగా చెప్పాడు. పూజ, అర్చనలు, స్తోత్రం, జపం, భజన, సంకీర్తనలు, పుణ్య కథా శ్రవణాలు, హోమం, యాగం, యజ్ఞం మొదలైనవి ఎంత అప్రయోజనమో, ఎంత చిన్నవో, ధ్యానయోగం ఎంత గొప్పదో.. ధ్యానం(యోగం) యొక్క ప్రాధాన్యత, ఆవశ్యకత మరియు విశిష్టతల గురించి ఉత్తరగీతలో చాలా చాలా స్పష్టంగా చెప్పాడు కదా !

జీసస్ క్రైస్ట్ కూడా స్పష్ట పరిచాడు.. ''దైవ సామ్రాజ్యం లోపల ఉంది'' అని ! చర్చిలోనో, గ్రంథంలోనో కాదు, ''దైవ సామ్రాజ్యం లోపల ఉంది'' అని చెప్పాడు కదా ఏసు ప్రభువు ! దైవం కోసం లోపల వెతకాలి. అంటే అంతర్ముఖం కావాలి. మీరే దైవాలు అని జీసస్ క్రైస్ట్ ఎంతో స్పష్టంగా చెప్పాడు, ఈ సత్యం బైబిల్‌లో

ఉంది. మీ లోపల ఉన్న దైవ సామ్రాజ్యం కోసం వెతకండి, దానిని పొందండి అని ఆదేశించాడు.

దైవత్వం మన జన్మహక్కు ! మీ దైవత్వం కోసం ఏ మతాధికారులను ప్రాధేయ పడవలసిన అవసరం లేదు. ఏ మత పెద్ద మీకు మోక్షం అందించలేడు. ఏ దేవుడూ మీకు మోక్షం ఇవ్వడు. ఇది సత్యం. మీ మోక్షాన్ని మీకు మీరే సాధించుకోవాలి. మోక్షం అంటే ఏ దేవుడో ఇచ్చేది కాదు. మోక్షం అంటే ఎవరికి వారు ఇచ్చుకునేది. మీలో ఉన్న దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకోవడమే మోక్షం ! ఇదే పరమ సత్యం !

దైవత్వం, మోక్షం, నిర్వాణం, తావో, సమాధి, జ్ఞానోదయం ఇంకా ఎన్నెన్నో రకాలుగా పిలుస్తారు. అన్నీ ఒక్కటే ! మీరు మతాధికారులను ఆశ్రయించి ఉంటున్నంత కాలం మీకు మోక్షం రాదు గాక రానే రాదు. ఇది పరమ సత్యం. మీ మోక్షం మీ చేతుల్లోనే ఉంది. ఇది గ్రహించండి. **మీకు మీ దైవత్వం పునఃప్రాప్తమవు గాక !**

మీ దైవత్వానికే మీరు తొలి ప్రాధాన్యతను ఇవ్వాలి. ఆ తర్వాతే మిగతావి ఏవైనా సరే ! ఇలా చేసినప్పుడు, మీలో ఉన్న సరి కానివి అన్నీ వాటంతట అవే, పూర్తిగా శాశ్వతంగా, సురక్షితంగా తొలగి పోతాయి. "నా దైవత్వానికే నేను నా తొలి ప్రాధాన్యతను ఇస్తున్నాను, నేను దైవాన్ని... నేను దైవాన్ని... నేను దైవాన్ని... " అని అనుకుంటూ ఉండాలి. - రామ్‌తా

❖ ❖ ❖ ❖ ❖ ❖ ❖ ❖ ❖

దైవాన్ని అంతరంలో అంటే - తన లోపల కాకుండా బయట వెతికే వాడు దుష్టుడు, పాపి అని.. తనలో ఉన్న దైవాన్ని గుర్తించి, తనకు దైవానికి ఉన్న భేదాన్ని తొలగించడానికి సాధన చేసేవాడు మహా పుణ్యాత్ముడు దివ్యాత్ముడు అని ఉత్తర గీతలో దేవాధిదేవుడు శ్రీకృష్ణ పరమాత్ముడు ప్రకటించాడు.

కాబట్టి సాక్షాత్తు శ్రీ మహా విష్ణువు అయిన శ్రీకృష్ణ పరమాత్ముడు తెలియచేసిన విధంగా దైవాన్ని బయట వెతికి పాపం మూట కట్టుకుంటారో లేక మీలో ఉన్న దైవాన్ని గుర్తించి ఏకత్వం కోసం సాధన చేసి దివ్యాత్ములవుతారో... మీ ఇష్టం !

❖ ❖ ❖ ❖ ❖ ❖ ❖ ❖ ❖

❖ ❖ ❖ ❖ ❖ ❖❖ ❖ ❖

దైవం తనలో కాకుండా బయట ఉన్నాడు అని అనుకోవడమే మహా పాపం. దైవం కోసం బయట వెతకడం అనేది మహా అజ్ఞానం & మహా పాపం. ఈ మహా పాపాలు అష్టకష్టాలను, అన్ని దరిద్రాలను ఆకర్షించి పెద్ద నరకాన్ని సృష్టిస్తాయి.

దైవం కోసం బయట వెతికే వాడికి ఏ నాటికీ ముక్తి దొరకనే దొరకదు గాక దొరకదు.

❖ ❖ ❖❖ ❖ ❖❖ ❖ ❖

"అహం బ్రహ్మాస్మి" అనే పరమ సత్యం తెలియని వాళ్ళు, తెలిసినా దాన్ని ఆచరణలో పెట్టని వాళ్ళు చీకటి శక్తుల చేతుల్లో కీలు బొమ్మలుగా మారి, చీకటి శక్తులకు ఊడిగం చేస్తారు. కొన్ని పదుల లేదా కొన్ని వందల లేదా కొన్ని వేల లేదా కొన్ని లక్షల లేదా కొన్ని కోట్ల జన్మలు చీకటి శక్తులకు బానిసత్వం+చాకిరి చేయాల్సి వస్తుంది !

ఎవరూ ఎవరినీ డిస్టర్బ్ చేయకూడదు - ప్రధాన సృష్టి నియమం

మనుషులు, అన్ని రకాల జంతువులు, చలనం ఉన్నవి, చలనం లేనివి అన్నీ కూడా... ప్రతీ ఒక్కటి కూడా... ఆత్మలే లేక ఆత్మయే !

ప్రతీ ఆత్మ తనకంటూ ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వమూ మరియు సంపూర్ణమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కలిగి ఉంటుంది.

ఎవరూ ఎవరినీ డిస్టర్బ్ చేయకూడదు, ఎవరూ ఎవరి విషయాల్లో జోక్యం చేసుకోకూడదు, ఎవరూ ఎవరినీ విమర్శించ కూడదు, ఎవరూ ఎవరినీ తప్పు పట్టకూడదు - అనేది మొట్ట మొదటి సృష్టి నియమం. ఈ సృష్టి నియమాన్ని ఎంత పెద్ద పరమాత్ములైనా సరే పాటించి తీరాల్సిందే ! ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే తగిన గుణపాఠం నేర్పిస్తుంది సృష్టి ! ఈ ఒక్క నియమాన్ని గనుక మీరు సరిగా పాటిస్తే మీ శరీరం + జీవితం ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆనందంగా, ఎడతెగని ఉత్సవంలా సాగిపోతూ ఉంటుంది. వాళ్ళు వీళ్ళు, నా వాళ్ళు, నీ వాళ్ళు, భార్య, భర్త, పిల్లలు, అన్నదమ్ములు, అక్కచెల్లెల్లు, ఒకే కుటుంబం వారు, బంధువులు, మిత్రులు, ఇతరులు, లోకులు ఇలా ఎవరూ కూడా ఎవరినీ డిస్టర్బ్ చేయకూడదు, ఎవరూ ఎవరి విషయాల్లో జోక్యం చేసుకోకూడదు, ఎవరూ ఎవరినీ విమర్శించ కూడదు, ఎవరూ ఎవరినీ తప్పు పట్టకూడదు. నా వాళ్ళు కదా, నా పిల్లలు కదా అని మీరు అనుకుంటే, అది మీ అజ్ఞానం. ఎవరికి వారే స్వతంత్రులు. అన్నీ మరియు అందరూ స్వతంత్ర ఆత్మలే ! మిమ్మల్ని సృష్టించిన మీ యొక్క పూర్ణాత్మయే మీ విషయంలో జోక్యం చేసుకోదు అనే సత్యాన్ని తెలుసుకోండి. మీ సృష్టికర్తయే మీకు స్వేచ్ఛను ఇచ్చినప్పుడు, మిమ్మల్ని విమర్శించనప్పుడు, మిమ్మల్ని తప్పుపట్టనప్పుడు... మీరు ఎవరు ? ఇతరులను విమర్శించడానికి మరియు తప్పు పట్టడానికి ?!

ఇలాగైతే ఎలా మరి ? అని కంగారు పడకండి. అందరినీ సృష్టి సరిగ్గా చూసుకుంటుంది. మీరు, ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోడానికి కొన్ని హద్దులు ఉంటాయి. వాటిని తెలుసుకుని మసలుకుంటే సరి పోతుంది. ఆత్మ విజ్ఞానం తెలుసుకుంటూ ధ్యానం చేస్తూ ఉంటే అన్ని హద్దులు తెలుస్తాయి.

ముఖ్యంగా వివాహ విషయంలో మరియు జీవితాన్ని జీవించే విధానంలో ఎవరూ ఎవరిని అడ్డుకోకూడదు. ఇది చాలా ఖచ్చితమైన నియమం. దీన్ని ఉల్లంఘించిన వారికి తగిన గుణపాఠం నేర్పించ బడుతుంది. సమాజం యొక్క నియమాలు "సృష్టి నియమాల" ముందు చెల్లుబాటు కావు... అనే పరమ సత్యాన్ని దయచేసి తెలుసుకోండి.

పార్ట్ - 2

దైవం వ్యక్తి కాదు,

శక్తి !

ఈ భూమి ఒక లోకం. ఇలాంటివి కోటాను కోట్ల లోకాలు కలిపితే ఒక విశ్వం. లెక్క లేనన్ని విశ్వాలు ఈ అనంత సృష్టిలో ఉన్నాయి. ఈ సృష్టి సర్వస్వాన్ని పాలిస్తూ, పోషిస్తూ ఉన్న సృష్టి మూల చైతన్యం... అంటే దైవం "మనలో మనం"గా ఉంది. సాక్షాత్తు సృష్టి మూల చైతన్యాన్ని కలిగి ఉన్న మనం ఏదైనా చేయగలం. మన మూల చైతన్య శక్తి మనకు పూర్తిగా అనుకూలంగా ఉంది, మనకు మొత్తం వశమై ఉంది. మనం చెప్పింది చేయడమే మన మూల చైతన్యానికి ఆనందం. సృష్టి మూల చైతన్యాన్ని కలిగి ఉన్న మనం సాక్షాత్తు మూల చైతన్య స్వరూపులమే ! కాబట్టి మన మూల చైతన్య శక్తి పట్ల మనం విశ్వాసం, ప్రేమ, ఎరుకలను కలిగి ఉంటే చాలు. ఈ సృష్టి సర్వస్వమూ మీకు, సంపూర్ణంగా, సమగ్రంగా అనుకూలంగా, అండగా ఉంటుంది. ఇక్కడ మనం గ్రహించాల్సిన అత్యంత ప్రధానమైన విషయం ఏమిటంటే - విస్మృతిలో, మనం, మనకు తెలియకుండా, అజ్ఞానంతో మనలో ఎంత పెద్ద మొత్తంలో నెగెటివిటీని కలిగి ఉన్నా మన మూల చైతన్యం దాన్ని మనలో నుండి సులభంగా, సరళంగా, పూర్తిగా, శాశ్వతంగా, సురక్షితంగా, క్షణంలో తీసివేస్తుంది.

మన మూల చైతన్యం మనల్ని సదా రక్షిస్తూనే ఉంటుంది, అనే పరమ సత్యాన్ని మనం ఎల్లప్పుడూ స్మరణలో ఉంచుకోవాలి. మనల్ని సదా కాపాడుతూ, మనకు అన్ని ఆనందాలను క్షణంలో ప్రసాదించే

మన మూల చైతన్య శక్తి సదా వర్ధిల్లాలి !

దైవం వ్యక్తి కాదు, శక్తి !

అందరూ దైవాన్ని ఒక వ్యక్తి అని అనుకుంటూ ఉంటారు. తమ మతంలో చెప్పిన రూపాన్ని ఊహించుకుంటూ ఉంటారు. కొంత మంది దైవానికి రూపం లేదు అని విగ్రహారాధన చేయకపోయినా, రూపంలో ఊహించకపోయినా, దైవాన్ని ఒక వ్యక్తి లాగే ఊహించుకుంటూ ఉంటారు. ప్రతీ ఒక్క మతం వారు దైవానికి ఇచ్చే నిర్వచనాలు వేరు, వేరుగా ఉంటాయి.

ఎవరికి వారు తమదే కరెక్ట్, తమ దేవుడే నిజం దేవుడు అనే భ్రమలో ఉంటారు. ఇది ఎంత మూర్ఖత్వం ?! ఎంత అజ్ఞానం ?!

యావత్ సృష్టి అంతా దైవమే, అంతటిలోనూ, అన్నింటిలోనూ, అందరిలోనూ ఆ దైవమే ఉంది. ప్రతీ ఒక్కరూ దైవమే అయినప్పుడు మరి జనాలు ఎందుకు కొట్టుకు చస్తున్నారు ?!? అనే సందేహం ఉదయించక మానదు కదా ! అందరిలోనూ దైవం ఉన్నా ''అహం''(అహం అంటే, దైవం నుండి నేను వేరు అనే భావన) చేత కప్పబడి ఉన్నారు. అందరూ అహంలోనే పుడుతూ చస్తూ, మళ్లీ పుడుతూ ఉన్నారు. అహంలోనే జన్మలన్నీ గడుస్తున్నాయి. ఈ అహాన్ని దాటి తమలోని ''అసలు నేను''ను తెలుసుకుంటే కానీ ఆ వ్యక్తి దైవం కాలేడు. ''అసలు నేను'' అని అంటే దైవం అని అర్థం. మనలో చాలా ''నేను''లు ఉంటాయి. నేను ఫలానా మతం వాడిని, నేను ఫలానా కులం వాడిని, నేను ఫలానా ఆఫీసర్‌ను, నేను ఫలానా గాడిని, నేను ఫలానా... ఇలా మనలో చాలా ఫలానాలు ఉంటాయి. కొన్ని వందల, వేల నకిలీ ''నేను''లు ఉంటాయి. ఇవన్నీ నకిలీ నేనులే ! ''అసలు నేను అని అంటే దైవమే'' ! మనలోనే దైవం ఉంది, ఆ దైవత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకుని, దైవంగా పరిణమించాలి, నీకంటే వేరుగా దైవం లేదు, నీవే దైవం, నీ దైవత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్ననాడే నీకు సార్థకత ! లేదా ఇలా కర్మ చక్రంలో మరియు జన్మ చక్రంలో పడి తిరుగుతూ ఉండవలసిందే ! అష్టకష్టాలు పడుతూ ఉండవలసిందే !

"తానొకటి తలిస్తే దైవం వేరొకటి తలుస్తాడు" అనే భావన అజ్ఞాన పూరితమైనది. నీవు వేరే, దైవం వేరే అనే ''వేరు భావనతో'' ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది. నిన్ను నీవు దైవం నుండి వేరుగా భావిస్తూ ఉన్నావు కాబట్టి, నీవు తలచినది మరియు దైవం తలచినది వేరు వేరుగా అవుతూ ఉంది. నేనే దైవం అని దైవంతో ఏకమై ఉంటూ, నిన్ను నీవు నిజంగా దైవంగా భావిస్తూ తలచినప్పుడు, అది ఏదైనా సరే సంభవం అవుతుంది. అప్పుడు నీవు మరియు దైవం వేరుగా లేరు కాబట్టి, నీవు తలచినదే దైవమూ తలుస్తుంది. మనుషులు తమను తాము దైవం నుండి వేరుగా భావిస్తూ ఉంటారు. ఈ వేరు భావనయే అన్ని సమస్యలకు మూలకారణం. మీరు మీ దైవత్వాన్ని ప్రేమించండి. అప్పుడు మీరు దైవంగానే పరిణమిస్తారు.

మన లోపలే ఉన్న దైవం ఒక వ్యక్తి కాదు, శక్తి ! ఈ సృష్టి సర్వస్వాన్ని పోషిస్తూ, పరిపాలిస్తూ ఉన్న అనంత శక్తియే దైవం ! ఈ దైవం భూమి పైనున్న మానవుల పట్ల కొన్ని నియమాలకు అనుగుణంగా ప్రవర్తిస్తూ ఉంటుంది. ఆ నియమాలన్నింటిలోకెల్లా ఆదిమమైనదీ, ప్రప్రథమమైనది, అత్యంత ప్రధానమైనది, అత్యంత ముఖ్యమైనది మరియు అత్యంత మౌలికమైనది ఏమిటంటే - **యద్భావం తద్భవతి !** అంటే నీ భావం ఎలా ఉంటే, నీ భవం(పరిస్థితి) అలానే ఉంటుందన్న మాట ! ఆలోచన, ఊహ, కల, భావన, భావం మైదలైనవన్నీ ఒకటే ! నీవు నీ గురించి ఎలా ఆలోచిస్తూ ఉంటావో, సరిగ్గా అలాగే నీకు జరుగుతూ ఉంటుందని అర్థం ! దీనినే సులువుగా చెప్పాలంటే... **''నీ ఆలోచనలే నీ వాస్తవాలు''** అని చెప్పవచ్చు. మన లోపల ఉన్న దైవం లేక దైవత్వం లేక దైవశక్తి కేవలం మన కోసమే ఉన్నది. మనం ఏమి కోరితే అది నెరవేర్చడం తప్ప మరొక పని లేదు మన దైవత్వానికి ! నిరంతరం మన ఆజ్ఞ కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఏమిటీ...?! దైవాన్ని మనం ఆజ్ఞాపించడమా...?!? అని ఆశ్చర్యపోకండి. మనం దైవాన్ని ఆజ్ఞాపించినప్పుడు దైవం మరింతగా ఆనందిస్తుంది. అవును.. మన ఆజ్ఞలను నెరవేర్చడం అంటే దైవానికి ఎంత ఇష్టమో, ఎంత ఆనందమో మీకు గనక తెలుస్తే మీరు ఆశ్చర్యపోతారు..! ఎందుకు మన కోరికలను నెరవేర్చడంలో దైవానికి అంత ఆనందం అని అంటే.. మన ఆనందమే దైవం యొక్క ఆనందం కాబట్టి..! మనమూ మన దైవత్వం వేరు కానే కాదు కాబట్టి... అంత ఆనందం !!

దైవాన్ని ఆజ్ఞాపించడం అని అంటే ''ఆలోచించడమే'' ! మీరు తీసుకునే నిర్ణయాలే, మీరు మీ దైవానికిచ్చే ఆజ్ఞలు ! మీరు బాధ పడుతూ ఆలోచించినా, నిరాశా నిస్పృహలతో ఆలోచించినా, మీరే విధంగా ఆలోచించినా సరే... అవన్నీ కూడా ఆజ్ఞలే...! మీ ఆలోచనలే

ఆజ్ఞలు ! ఆలోచించడం అని అంటే ఆజ్ఞాపించడమే !! చాలా దృఢంగా గుర్తుంచుకోండి, ఆలోచించడమే ఆజ్ఞాపించడం - ఆలోచించడం వేరే ఆజ్ఞాపించడం వేరే కాదు ! కాబట్టి చాలా ఎరుకను కలిగి ఉండాలి మీ ఆలోచనల పట్ల ! మీరేది ఆలోచిస్తే దానినే మీ వాస్తవంగా మలుస్తుంది మీ దైవత్వం ! అందుకే మీ ఆలోచనలే మీ వాస్తవాలు అని అన్నారు. అయితే మీరు అత్యంత స్పష్టంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, మీరు మీ దైవత్వం వేరు కాదు.. విషయాన్ని అర్థం చేయించడానికి అలా చెప్పాల్సి వస్తుంది అంతే ! మీరు, మీ దైవత్వం(దైవం) ఒకటే ! మీరే దైవం !!

మీరు మీ దైవత్వాన్ని చూడలేరు. చూడడానికి సినిమా కాదు దైవత్వం అంటే ! దైవత్వాన్ని అనుభవం చెందగలరు. అప్పుడు ప్రకటించగలుగుతారు... నేనే దైవం అని ! అప్పుడు తెలుసుకోగలుగుతారు మీరు వ్యక్తి కాదు, మహా దివ్య శక్తి అని ! యావత్ సృష్టి అంతా వ్యాపించి ఉన్న అనంత దివ్య శక్తి మీరేనని స్వయంగా అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. దైవం గురించి లేక దైవత్వం గురించి తెలుసుకున్నది చాలు. ఇక సాధన ప్రారంభించి అనుభవం పొందడం అనేది ముఖ్యమే కాకుండా అత్యంత ఆవశ్యకం. ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మొత్తం చదివి, బాగా అవగాహన చేసుకోండి. ఆ తర్వాత సాధన చేసి మీ సహజత్వమైన దైవత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోండి. మీ దైవత్వాన్ని అందరికీ పంచండి...!!!

దైవాన్ని లేక దైవత్వాన్ని వ్యక్తిగా భావించి అజ్ఞానంలో పడి కొట్టుకుపోకండి. దైవం అనే శక్తి ఆత్మ విజ్ఞాన సూత్రాలకు అనుగుణంగా నడుచుకుంటుంది, కాబట్టే ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకోమని మేము చెప్తుంటాం. ఆత్మ విజ్ఞానం తెలుసుకుంటే దైవం లేక దైవత్వం అందుబాటులోకి వస్తుంది. సాక్షాత్తు దైవమే అందుబాటులోకి వస్తే ఇక చెప్పేదేముంది ?! అంతా దివ్యానందమే కదా !!! ఆల్ ద వెరి బెస్ట్.....!!!

మీరేం చేస్తూ ఉన్నా, మీరు ఎలా ఉన్నా... దైవం మిమ్మల్నిఎల్లప్పుడూ
ప్రేమిస్తూనే ఉంటుంది. మీలోనే ఉంటుంది.
మిమ్మల్ని కాపాడుతూనే ఉంటుంది. ఓ దైవమా నన్ను క్షమించు
అని అనాల్సిన అవసరం లేదు. మిమ్మల్ని మీరు క్షమించుకోండి చాలు.
దైవం మిమ్మల్ని క్షమించదు, ఎందుకంటే క్షమించాలి అని అంటే
ముందు కోపం రావాలి కదా... మీ మీద దైవానికి ఏ నాడు
కోపం రాదు గాక రానే రాదు.
మీరు ఎన్ని ఘోర దారుణాలు చేసినా సరే మీ దైవం మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటుంది,
ఆశీర్వదిస్తూనే ఉంటుంది, అనుగ్రహిస్తూనే ఉంటుంది,
కరుణిస్తూనే ఉంటుంది, కటాక్షిస్తూనే ఉంటుంది, వరాల వర్షం కురిపిస్తూనే ఉంటుంది,
సర్వదా మిమ్మల్ని రక్షిస్తూనే ఉంటుంది.
ఈ పరమ సత్యాన్ని మీరు సదా జ్ఞాపకం ఉంచుకోవాలి.

పార్ట్ - 3

నేను కాస్మిక్ సైంటిస్ట్‌ను ఎలా అయ్యాను ?

"అహం బ్రహ్మాస్మి" - ఆధ్యాత్మికతలో ప్రయాణం చేసేవాళ్ళందరికీ ఆల్‌మోస్ట్ ఈ పరమ సత్యం గురించి తెలుసు. అహం బ్రహ్మాస్మి అంటే "నేను దైవాన్ని" అని అర్థం. అందరిలో ఉండే "నేను" అనబడేదే దైవం అని అర్థం. అందరిలో రెండు "నేను"లు ఉంటాయి. ఒకటి దైవం, రెండవది దైవం నుండి వేరైన భౌతిక స్పృహ కలిగినది. ఈ రెండవ "నేను" అనేది భౌతిక దేహమే తాను అనే భౌతిక స్పృహను కలిగి ఉంటుంది. మొదటి "నేను" లోపల ఉన్న మహామూల చైతన్య స్మృతితో ఉంటుంది. ఇదే అసలైన నేను. ఇదే దైవం ! దీనినే అంతరంగం అని అంటారు. అంతర్ ప్రపంచం, అంతశ్చైతన్యం, అంతరాత్మ, ఆత్మ, అల్ట్రా కాన్షియస్‌నెస్, దైవత్వం, దైవం అని చాలా రకాలుగా పిలుస్తారు. మీరు చేసే ప్రతీ ఆలోచన, మీరు మాట్లాడే ప్రతీ మాట, మీరు చేసే ప్రతీ చేష్ట యొక్క ప్రభావం మీ అంతరంగం పైన పడుతుంది. మీరు మంచి ఆలోచనలు, మంచి మాటలు, మంచి పనులు చేస్తే మీ అంతరంగం పైన మంచి ప్రభావం పడి ప్రతిఫలంగా మీ అంతరంగం అంతా మంచినే ఆకర్షిస్తుంది. చెడు ఆలోచనలు, చెడు మాటలు, చెడు పనులు చేస్తే మీ అంతరంగం పైన చెడు ప్రభావం పడి మీ దైవత్వంతో మీకు దూరం పెరిగి పోతుంది. ఈ చెడు ఎక్కువైతే మీ దైవత్వానికి మీకు కనెక్షన్ జామ్ అయిపోతుంది. దానితో మీకు ఎలాంటి మంచి జరగని పరిస్థితి వచ్చి అష్ట దరిద్రాలు చుట్టుముడతాయి. అప్పుడు నరకం అంటే ఏమిటో క్లియర్‌గా తెలుస్తుంది. కాబట్టి మాంసాహారం, డేరి ప్రొడక్ట్స్, లెదర్ వస్తువులు, కుల మత జాతి భావనలు, ప్రాంతీయ భావనలు, మోసం, దగా, వంచన, కుట్ర, కృతజ్ఞత లేకపోవడం, నమ్మక ద్రోహం మొదలైనవి చేయకూడదు. నరకాన్ని ఖాయం చేసుకోకూడదు. ఇవి చదువుతారు. వింటారు మళ్ళీ దరిద్రాన్ని కంట్రోల్ చేసుకోలేక చెడు చేసేస్తుంటారు. నేను భయపెట్టడం లేదు. సత్యం చెబుతున్నాను. మీ ఇష్టం. జాగ్రత్త !

3. నేను కాస్మిక్ సైంటిస్ట్‌ను ఎలా అయ్యాను ?

కాస్మిక్ సైన్స్ అంటే ఆధ్యాత్మిక శాస్త్రం అని అర్థం. ఆధ్యాత్మిక శాస్త్రాన్ని ఇంగ్లీష్‌లో స్పిరిచ్యువల్ సైన్స్ అని అంటారు. అయితే నేను కాస్మిక్ సైన్స్ అని కూడా వాడుతాను. కాస్మిక్ సైన్స్‌ను ఔపోసన పడుతూ, జీవితాన్ని మరియు ప్రాణాన్ని పణంగా పెట్టి ప్రయోగాలు, పరిశోధనలు చేస్తూ ఆధ్యాత్మిక శాస్త్రంలోని కొత్త కోణాలను వెలికి తీస్తూ ఆధ్యాత్మిక శాస్త్రం యొక్క విస్తీర్ణతను విశాలం చేసేవారిని మరియు తమ యొక్క కాస్మిక్ కాన్షియస్‌నెస్‌ను(దైవత్వాన్ని) అనుభవపూర్వకంగా తెలుసుకున్న వారిని ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలు అని అంటారు. ఆధ్యాత్మిక శాస్త్రవేత్తను ఇంగ్లీష్‌లో కాస్మిక్ సైంటిస్ట్ అని అంటారు. కాస్మిక్ సైంటిస్ట్ అని అంటే తెలుగులో గురువు లేక సద్గురువు లేక సిద్ధగురువు లేక గురు పరమాత్మ లేక జగద్గురువు అనే అర్థాలు వర్తిస్తాయి. నేను జన్మించింది కేవలం సత్య ప్రచారం చేయడం కోసమే ! ఈ సత్య ప్రచారంలో చాలా అంశాలు ఇమిడి ఉన్నాయి. అకర్మ శాకాహార + ధ్యాన + ఆధ్యాత్మిక విజ్ఞాన ప్రచారాన్ని సత్య ప్రచారం అని అంటారు. ఆధ్యాత్మిక శాస్త్రాన్ని సత్య శాస్త్రం అని కూడా అంటారు.

ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలు, ఆత్మ విజ్ఞాన సూత్రాలను ఆచరిస్తూ వాటిని నిజ జీవితంలో ప్రయోగాత్మకంగా, పరిశోధనాత్మకంగా ఆచరిస్తూ వాటి యొక్క అద్భుతమైన ప్రభావం ద్వారా మరియు వాటి యొక్క మహిమ ద్వారా జీవిస్తూ ఉంటారు.

సృష్టి యొక్క నియమాలను అర్థం చేసుకుని, వాటికి అనుగుణంగా జీవిస్తూ ఉండడమే ఆత్మ విజ్ఞాన సూత్రాలను ఆచరించడం అని అంటే ! ఆత్మ విజ్ఞాన సూత్రాలు నిజంగా ఎంతో రక్షణను, పోషణను, అభివృద్ధిని మరియు అన్ని ఆనందాలను అందిస్తూ ఉంటాయి.

నా లాంటి వారు, అంటే కేవలం సత్య ప్రచారం కోసం మాత్రమే జన్మ తీసుకున్న వారు లేక సత్య ప్రచారం కోసమే భూమి పైకి వచ్చిన వారు కేవలం సత్య ప్రచారం మాత్రమే చేస్తారు. ఇతర ఏ వృత్తి ఉద్యోగ వ్యాపారాలు చేయకుండా పూర్తిగా సత్య ప్రచారానికి మాత్రమే అంకితమై జీవిస్తూ ఉంటారు. సత్య ప్రచారమే వీరి వృత్తి మరియు ఉద్యోగం. అయితే ఇప్పుడు మీకు ఒక సందేహం వస్తుంది. పూర్తిగా సత్య ప్రచారానికే అంకితం అయితే మరి, జీవించేది ఎలా ? అని ! శ్రద్ధగా ఈ క్రింది విషయాలను చదివి అర్థం చేసుకుంటే మీ సందేహాలన్నీ తీరిపోతాయి.

సత్య ప్రచారానికి పూర్తిగా అంకితం అయితే మరి జీవించేదెలా ?!

సత్య ప్రచారం కేవలం ఎన్‌లైటెన్‌డ్ మాస్టర్స్ మాత్రమే చేయాలి. ఎవరు పడితే వారు చేస్తే లాభం సంగతేమో కానీ నరకం మాత్రం గ్యారంటి !

సత్యమే జీవం. సత్యమే జీవ శక్తి. సత్యమే ప్రాణ శక్తి. ప్రచారం అని అంటే నీవు దేనినైతే "ఆలోచనలలో కలిగి ఉన్నావో, దేనినైతే మాట్లాడుతూ ఉన్నావో, దేనినైతే నిజ జీవితంలో ఆచరిస్తున్నావో దానిని అందరికీ తెలియ జేయడం". త్రికరణ శుద్ధిగా ఆచరిస్తూ ఉన్న దానిని అందరికీ తెలియ జేయడమే "ప్రచారం" !

ఆచరించేది "ఆచారం", దానిని అందరికీ తెలియ జేసినప్పుడు అది "ప్రచారం" అవుతుంది. నీవు సత్యాన్ని ఆచరిస్తూ, దానిని అందరికీ తెలియ జేసినప్పుడు అది "సత్య ప్రచారం" అవుతుంది.

సత్యం అంటే ఏమిటి ? అని అంటే - సత్యం అంటే "ఉన్న విషయం" ! "ఉన్నదేదో అది" ! "ఏదైతే ఉందో అది" ! ఈ సృష్టి ఉంది ఇది సత్యం ! మీరు ఉన్నారు ఇది ఒక సత్యం ! ఇప్పుడు మీరు ఇది చదువుతున్నారు ఇదీ ఒక సత్యమే ! ఈ విధంగా సత్యాలు ఎన్నో ఉంటాయి. అయితే అంతిమ సత్యం మాత్రం ఒకటే ఉంటుంది. ఆ అంతిమ సత్యాన్నే - పరమ సత్యం అని అంటారు.

పరమ సత్యం అంటే ఏమిటి ?

నేనే దైవం..... నీవే దైవం..... అంతా దైవమే.... అందరూ దైవమే !....

.....అనేదే "పరమ సత్యం" !

సత్య ప్రచారానికి పూర్తిగా అంకితం అవడం అని అంటే సత్యాన్ని నీవు త్రికరణ శుద్ధిగా ఆచరిస్తూ ఉన్నావన్నమాట ! ఎప్పుడైతే త్రికరణ శుద్ధిగా నీవు సత్యాన్ని ఆచరిస్తూ ఉన్నావో, అప్పుడు జీవించడం ఎలా ? అనే ప్రశ్నయే పుట్టదు. ఎందుకంటే సత్యాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించడం అని అంటే నీవు పుష్కలంగా జీవాన్ని కలిగి ఉన్నావని అర్థం. ఎందుకంటే సత్యమే జీవ శక్తి కాబట్టి. జీవ శక్తిని ప్రచారం చేసే వ్యక్తికి జీవించడం ఎలా ? అనే సందేహం ఎలా వస్తుంది ?! మీరు నిజంగా, సత్య ప్రచారానికి అంకితం అయిన తక్షణం మీ జీవితం సుస్థిరం అవుతుంది. సత్య ప్రచారం చేస్తూ ఉన్నా కూడా మీ జీవితం ఇంకా సుస్థిరం కాలేదు అని అంటే దాని అర్థం - "మీరింకా సత్య ప్రచారానికి సంపూర్ణంగా అంకితం కాలేదనేది సుస్పష్టం " !

అనాదిగా పరమ గురువులు ఈ భూమిపైన సత్య ప్రచారం చేస్తూ వస్తూ ఉన్నారు, మరి వాళ్ళెలా జీవించారు ?!

పరమ గురువుల చరిత్రలు చదివి అవగాహన చేసుకుంటే ఈ విషయం అర్థం అవుతుంది. ఎంతో ప్రాచీన కాలం నుండి, ఎందరెందరో మహాత్ములు తమ జీవితాలను పూర్తిగా సత్య ప్రచారానికి అంకితం చేసుకున్నారు. వాళ్ళు జీవించడమే కాకుండా తమ దివ్య బోధనలతో ఎన్నెన్నో జీవితాలను ఉద్ధరించారు, ఉద్ధరిస్తూనే ఉన్నారు. సత్య ప్రచారం చేయడానికి తనను తాను, నిజంగా, 100% అంకితం చేసుకున్న వ్యక్తికి ఈ ప్రశ్నయే పుట్టదు. జీవించడం ఎలా అన్న సందేహమే రాదు. పూర్తి శాతంలో నుండి నిర్ణయం జరగనప్పుడే ఈ ప్రశ్న పుడుతుంది.

ఒక ప్రధానమైన సృష్టి సూత్రం ఇలా ప్రకటిస్తోంది....

"ఎవరైతే సత్య ప్రచారానికి పూర్తిగా తమను తాము అంకితం చేసుకుంటారో వారికి కావలిసినవన్నీ సృష్టినుండి, వాటంతట అవే, వారికి అందుతాయి" ! ఈ సూత్రాన్ని 100%గా ఒప్పుకుని(విశ్వసించి) రంగంలోకి డైరెక్ట్‌గా దిగాల్సిందే. ఈ సూత్రాన్ని ఒప్పుకోని వారికే ప్రశ్న పుడుతుంది.

ఈ ప్రశ్నను జయించ గలిగినపుడే సత్య ప్రచారానికి అంకితం కాగలుగుతారు.

తమ జీవితం గురించి ఆందోళన చెందేవారు దైవత్వాన్ని ఎలా పొందగలుగుతారు ?! దైవత్వం పొందడం అంటే ఏమనుకుంటున్నారు ?!

స్వతంత్రంగా జీవించలేని మీరు మృత్యువును జయించి, సృష్టి కేంద్రంతో అనుసంధానం చెంది బ్రహ్మానుభవాన్ని(దైవత్వం) ఎలా పొందగలుగుతారు ?! ఇతరులనెలా ఉద్ధరించ గలుగుతారు ?!

తమ జీవితం పట్ల అభద్రతా భావాన్ని పూర్తిగా తొలగించుకున్నప్పుడే, ఆ వ్యక్తి సత్య ప్రచారానికి పూర్తిగా అంకితం కాగలుగుతాడు. కేవలం పైన తెలిపిన సూత్రాన్ని 100% ఒప్పుకుని రంగంలోకి దిగాల్సిందే ! వేరే దారి లేదు ! ఇంతకన్నా గ్యారంటి ఎవరిస్తారు ?! మీకు మీరే గ్యారంటి కావాలి, అలా అయినప్పుడే ఇది సాధ్యం ! స్వయంగా ఆచరించి చూస్తేనే తెలుస్తుంది. స్వయం బాధ్యతతో, సురక్షితంగా ఆచరించి చూడాలి మరి ! లేకపోతే లేదు.

ఒక వ్యక్తి 100% తనను తాను సత్య ప్రచారానికి అంకితం చేసుకున్నప్పుడు ఆ మొత్తం వంశమే ఉద్ధరించబడుతుంది. ఎంతో పుణ్యం చేసుకున్న వంశానికో, కుటుంబానికో ఈ మహా భాగ్యం దక్కుతుంది.

ఒక వ్యక్తి 100% తనను తాను సత్య ప్రచారానికి అంకితం చేసుకోవడం అంటే మాటలు కాదు. ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రత్యేకంగా ఎన్నుకోబడిన ఉన్నత ఆత్మలకే ఇది సాధ్యం. అయితే

తలుచుకుంటే ఎవరైనా చేయగలుగుతారు, కానీ తలుచుకుని ఆచరణలోకి దిగడంలోనే ఉంది అసలు వ్యవహారం. అయితే సత్య ప్రచారం చేస్తున్న వారు అహంభావంతో ఉండరాదు. సేవా భావంతో ఉండాలి, లేకపోతే చుక్కలు కనబడతాయి. అన్ని పనులు గొప్పవే. ఈ భూమి పైకి రక రకాల కారణాలతో, రక రకాల ఆత్మలు వస్తాయి. తమ తమ కార్యక్రమాలను తాము చేసుకుంటూ ఉంటాయి. అయితే ఎవరైనా, తమ జన్మ పరంపరను వేగంగా పూర్తి చేసుకుని, అన్ని కష్టాల్లో నుండి బయటపడి త్వరగా పరిపూర్ణతను సిద్ధించుకోవాలనుకున్న వారు, ప్రస్తుతం ఈ భూమి పైన ఉన్న వారిలో ఎవరినైనా ఒక గురువును ఆశ్రయించి వారి మార్గదర్శకత్వంలో సత్య ప్రచారానికి పూర్తిగా అంకితం అయితే, వారు ఈ జన్మనే చివరి జన్మగా చేసుకుని విముక్తిని పొందవచ్చు. మళ్ళీ మళ్ళీ జన్మించే ప్రయాసను తప్పించుకుని, దివ్యత్వాన్ని పొంది దివ్య లోకాలకు దివ్యులుగా వెళ్ళాలి అనుకునే వారు, 100% సత్య ప్రచారానికి అంకితం కావాల్సివస్తుంది, తప్పని సరి !

లేదా ఎన్ని జన్మలైనా సరే, అది వారి వారి ఇష్టం. అయితే ఎప్పటికైనా, ఎన్ని జన్మలకైనా ఈ నిర్ణయానికి మాత్రం వచ్చి తీరాల్సిందే, సత్య ప్రచారం చేసి సత్యాన్ని పొందాల్సిందే ! సత్య ప్రచారం చేయడమంటే మీరు క్లాసులు చెప్పడం కాదు, ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టర్‌కు అసిస్టెంట్లుగా ఉండడం. ఆయన పనిలో నిజాయితీగా, అంకిత భావంతో పనిచేయడం.

సత్యాన్ని పొందడానికి చేసే సాధనలో సత్య ప్రచారం

ప్రధానమైనది ! అనివార్యమైనది !!

సత్య ప్రచారం చేయకుండా ఉంటే దైవత్వం ఏనాటికి పొందలేరు!

మీరు సాధన చేస్తూ ఇతరులకు ఈ సాధనను తెలియజేస్తూ ఉండాలి. అత్యంత శీఘ్రంగా, ఊహలకందనంత మెరుపు వేగంతో మీరు బాగుపడాలంటే ప్రచారం తప్పని సరి ! మీరు ఒంటరిగా సాధన చేస్తే, మీ అభివృద్ధి చాలా, చాలా, చాలా మెల్లగా సాగుతుంది. సాధన + ప్రచారం చేస్తేనే మెరుపు వేగంతో ఫలితాలు వస్తాయి. ప్రచారం చేయకుండా మూలకు కూర్చుని ఒంటరిగా సాధన చేస్తుంటే దైవత్వం రావడం అనేది చాలా, చాలా, చాలా కష్టం ! మీరు ఇతరులకు చెప్పలేక పోతే ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శి అయినా ఇవ్వాలి. ఇలా ఇవ్వడం కూడా ప్రచారమే !

సత్యం అంటేనే సురక్ష ! సత్య ప్రచారానికి అంకితం అయిన వారికి సాక్షాత్తు ఆ సత్యమే రక్షగా ఉంటుంది. అయితే ఈ విషయాన్ని నమ్మి(ఒప్పుకుని) సత్య ప్రచారానికి అంకితం కావడంలోనే ఉంది అసలు వ్యవహారమంతా !

మీరు మీ దైవత్వాన్ని కోరుకుంటే అన్నీ వస్తాయి. మీకు ఏమేం కావాలో అన్నీ వస్తాయి. ఆరోగ్యం, అందం, ఐశ్వర్యం, శాంతి, సంతృప్తి, ఆనందాలు శాశ్వతంగా మీ స్వంతం అవుతాయి.

ఇదే విషయాన్ని పరమ గురువు శ్రీ జీసస్ క్రైస్ట్ చెప్తాడు.

Seek ye the kingdom of God and his rightiousness first, and then all else will be added unto you - (The Holy Bible, Matthew 6 : 31-34) అని అంటే "మొట్ట మొదట మీ లోపల ఉన్న దైవ సామ్రాజ్యాన్ని + దేవుడి యొక్క దివ్య ధర్మాన్ని కోరుకుని వాటిని పొందడానికి పూర్ణంగా కృషి చేయండి, అప్పుడు మీకు కావలిసినవన్నీ, వాటంతట అవే మీకు అందుతాయి" అని అర్థం !

– పవిత్ర గ్రంథము బైబిల్ – మత్తయి – 6 : 31 – 34

క్రీస్తు పరమాత్ముడు చెప్పిన ఈ సృష్టి సూత్రం యొక్క వివరణ ఏమిటంటే...

"ఈ భూమి పైన మానవులు మొట్ట మొదట కోరుకోదగినదీ, పొందదగినదీ ఏదైనా ఉందంటే అది కేవలం తమ లోపల ఉన్న దైవ సామ్రాజ్యం + ఆ దేవుడి యొక్క దివ్య ధర్మం మాత్రమే ! దీనిని 100% కోరుకుని, దీనిని పొందడానికి, 100% తమను తాము అంకితం చేసుకోవడాన్నే సత్య మార్గానికి అంకితం కావడం అని అంటారు. ఈ సత్య మార్గానికి అంకితమైన వారినే సత్య సాధకులు అని అంటారు.

ఈ విధంగా సత్య సాధన చేస్తూ, సత్య ప్రచారానికి 100% అంకితం అయిన వారికి ఏమేం కావాలో - అంటే ఆరోగ్యం, ఆయుష్షు, ఐశ్వర్యం, విజయం, శాంతి, సంతృప్తి, ఆనందం, ఉత్సవం మరియు మోక్షం మొదలైనవన్నీ కూడా వాటంతట అవే వచ్చి సత్య మార్గంలో ఉన్న వారికి అందుతాయి".

గ్రహించండి ! "వాటంతట అవే వచ్చి వారికి అందుతాయి", మీరేమీ చేయనక్కరలేదు. కేవలం, సత్య సాధనకు + సత్య ప్రచారానికి 100% అంకితం కావడమే మీరు చేయాల్సింది. ఎవరైతే ఈ విధంగా చేయగలుగుతారో వారు ఖచ్చితంగా పైన తెలిపినవన్నీ పొందుతారు.

అనాదిగా వస్తున్న సృష్టి నియమం ఇది. ఈ సృష్టి నియమాన్నే జీసస్ చెప్పాడు, ఇంకా అనేకానేక మాస్టర్స్ అందరూ, ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఈ విషయాన్ని స్పష్ట పరిచారు.

గతి తప్పని విశ్వ నియమం ఇది ! పరమ సత్యం ఇది ! అనాదిగా జరుగుతూ వస్తూ ఉంది ! ఇప్పుడు జరుగుతూనే ఉంది ! ఎప్పటికీ జరుగుతూనే ఉంటుంది ! పరమ గురువు జీసస్ క్రైస్ట్ చెప్పిన సూత్రం కదా !

స్వయంగా జీసస్ పరమాత్ముడే తన బోధనల గురించి ఇలా ప్రకటించాడు :

"ఆకాశం(స్వర్గం) మరియు భూమి అంతరించిపోయినా, నా వాక్కులు మాత్రం అంతరించిపోవు" ! - పవిత్ర గ్రంథము బైబిల్ - మత్తయి - 24 : 35

విషయాన్ని గ్రహించండి, అన్నీ అంతరించిపోయినా సరే, నా వాక్కులు మాత్రం అంతరించిపోకుండా శాశ్వతంగా అలానే ఉంటాయి. ఎవరైతే నా వాక్కుల యొక్క పరమార్థాన్ని గ్రహించి వాటిని నిజ జీవితంలో యథాతథంగా ఆచరిస్తారో వారికి నేను ప్రకటించినవన్నీ అంది తీరుతాయి అని ఎంతో స్పష్టంగా చెప్పాడు కదా, జీసస్ క్రైస్ట్ ! ఇంతకన్నా గ్యారంటి ఏం ఉంటుంది చెప్పండి ?!

ఈ విధంగా క్రీస్తు పరమాత్ముడు హామీ ఇచ్చినట్టే ఈ కింది విధంగా భగవద్గీతలో శ్రీ కృష్ణ పరమాత్ముడు కూడా అభయమిచ్చాడు ఎప్పుడో !

శ్లో॥ అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్

- భగవద్గీత - 9 : 22

వివరణ : ఎవరైతే కేవలం నన్ను మాత్రమే అంటే పరమ సత్యాన్ని మాత్రమే ధ్యానించుచూ, నన్ను(పరమ సత్యాన్ని) పొందడానికి సంపూర్ణంగా, సమగ్రంగా తమను తాము అంకితం చేసుకుంటారో వారి యొక్క పూర్తి బాధ్యతను నేను వహిస్తాను. వారి యోగక్షేమాలన్నీ నేను చూసుకుంటాను. వారికి కావలిసినవన్నీ స్వయంగా నేనే సమకూరుస్తాను. అయితే ఈ వాగ్దానం కేవలం 100% నన్ను(పరమ సత్యాన్ని) మాత్రమే పొందడానికి అంకితం అయి ఉన్నారో, ఎవరైతే సత్య ప్రచారానికి, సత్య సేవకు అంకితం అయి ఉన్నారో వారికి మాత్రమే వర్తిస్తుంది.

ఇతర ఏ పనులు చేయకుండా, అనుక్షణం, నిరంతరం, నన్ను(పరమ సత్యం) మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారో వారికి మాత్రమే నా ఈ వాగ్దానం వర్తిస్తుంది. ఇతర ఏ భౌతిక లక్ష్యాలు లేకుండా, ఇతర ఏ ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలు మొదలైన ఏ భౌతిక కార్యకలాపాలు చేయకుండా, కేవలం నన్ను(పరమ సత్యాన్ని) మాత్రమే పొందడానికి సాధన చేస్తున్నారో, కేవలం నా(పరమ సత్య) ప్రచారానికి మాత్రమే అంకితం అయ్యారో వారి కోరికలన్నింటినీ నేను నెరవేరుస్తాను. వారి అవసరాలన్నీ నేను ఖచ్చితంగా తీరుస్తాను అని శ్రీ కృష్ణ పరమాత్ముడు 100% గ్యారంటి ఇస్తున్నాడు. ఎంతటి కరుణ !!!

అయితే మరి, అందరూ ఈ విధంగా 100% సత్య మార్గానికి అంకితం కాలేరు కదా ! మరి వారి మాటేమిటి ? ఆ యొక్క పరమాత్ముడు వారిని పట్టించుకోడా ? అనే సందేహాలు కలిగే

అవకాశం ఉంది. కంగారుపడాల్సిన అవసరం లేదు. ఆ దైవం అందరినీ పట్టించుకుంటుంది. ఎవరు ఏ పని చేసినా, చేస్తున్నా "లోపల" లక్ష్యం మాత్రం పరమ సత్యమై ఉండాలి. మీరేపనైనా చేయండి. చదువు, ఉద్యోగం, వృత్తి, వ్యాపారం, గృహిణిగా బాధ్యతలు నిర్వహించడం మొదలైనవి ఏవైనా చేయండి మీ లోపల లక్ష్యం కేవలం, పరమ సత్యమే అయి ఉన్నప్పుడు ఈ "వాగ్దానం" తప్పని సరిగా వర్తిస్తుంది.

అయితే పూర్తిగా, 100% సత్య సాధనకు + సత్య ప్రచారానికి అంకితం అయిన వారికి ఇంకా, ఇంకా, ఎక్కువగా, అనంతంగా వర్తిస్తుంది.

చూశారా ! సత్యమార్గం మనకు ఏమేం కావాలో వాటన్నింటినీ అందిస్తుంది. మీరు స్టూడెంట్ అయితే మీ చదువును మీరు కొనసాగిస్తూనే దైవత్వాన్ని కోరుకుంటూ ఉండాలి, మీరు ఉద్యోగి లేక వ్యాపారస్తుడైతే మీ పనులు మీరు చక్కబెట్టుకుంటూనే దైవత్వం మీద దృష్టి పెట్టాలి, మీరు గృహిణి అయితే మీ బాధ్యతలు మీరు నిర్వర్తించుకుంటూ దైవత్వమే మీ లక్ష్యంగా ఉండాలి. మీరు ఎవరైనా సరే మీ బాధ్యతలు మీరు నిర్వహిస్తూ దైవత్వమే మీ ఏకైక లక్ష్యంగా ఉండాలి.

దైవత్వం మీ లక్ష్యంగా పెట్టుకుని ఉన్నప్పుడు మీరు చేసే పనులు "సరి" అవుతాయి. దైవత్వం మీ లక్ష్యం కానప్పుడు మీరు చేసే మంచి పనులైనా సరే కర్మ శేషాన్ని అంటగడతాయి. అంతకు అంతా చెల్లించాల్సి వస్తుంది.

✪ ✪ దైవత్వమే మన లక్ష్యం అయినప్పుడు సృష్టి యొక్క ఆశీర్వాద అనుగ్రహాలు ఎల్లప్పుడూ మన పైన వర్షిస్తూనే ఉంటాయి. ఎవరి గురించి వాళ్ళు తెలుసుకోవడం, ఎవరి నిజ తత్వాన్ని వాళ్ళు అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలనుకోవడం అనేది సృష్టి యొక్క ప్రాథమిక మరియు ప్రధానమైన నియమం. ఎప్పుడైతే మనం ఈ నియమాన్ని అనుసరిస్తామో మనకు కావాల్సినవన్నీ మనల్ని అనుసరించి వస్తాయి. ✪ ✪

దైవత్వమే మన లక్ష్యం అయినపుడు మనకు కావాల్సిన వాటికి, మనం కోరుకుంటున్న వాటికి మనం లక్ష్యం అవుతాము.

లక్ష్యానికి మనం ప్రాధాన్యతనిస్తే, లక్ష్యం మనకు ప్రాధాన్యతనిస్తుంది. లక్ష్యాన్ని మనం లక్ష్యపెడితే, లక్ష్యం మనల్ని లక్ష్య పెడుతుంది. లక్ష్యాన్ని సిద్ధించుకోడానికి మనం ప్రయత్నిస్తుంటే, లక్ష్యం మనకు సిద్ధించడానికి ప్రయత్నిస్తుంది.

కోరుకున్న లక్ష్యాన్ని సిద్ధించుకోవడానికి

సులభ సాధనమేమిటంటే, ఆ లక్ష్యానికి

100% అంకితం కావడమే !

"సత్య ప్రచారానికి అంకితమైతే మీకు కావలిసినవన్నీ వాటంతట అవే అందుతాయి".. అనే సూత్రాన్ని నేను పూర్తిగా ఒప్పుకున్నాను కాబట్టే నాకు అన్నీ వాటంతట అవే సమకూరుతూ ఉంటాయి. ఇది పరమ సత్యం.

శ్రీకృష్ణ పరమాత్ముడు, జీసస్ క్రైస్ట్ ఇంకా ఇతర అనేకానేక మాస్టర్స్ ప్రకటించిన ఆత్మ విజ్ఞాన సూత్రాలను మరియు నేను స్వయంగా కనుక్కున్న ఆత్మ విజ్ఞాన సూత్రాలను, యథాతథంగా ఆచరిస్తూ జీవిస్తున్నాను మరియు సత్య ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను కాబట్టే నేను కాస్మిక్ సైంటిస్ట్‌ను అయ్యాను. అనుకుంటే మీరూ కావచ్చు.

ఇది చదవడం, చెప్పడం సులభమే - ఆచరించి సాధించడమే కష్టం. ఆచరణలోకి దిగినప్పుడు, మీ అసలు రంగు బయట పడుతుంది. మేరు పర్వతం కూడా చిన్న బోయేంత లెవెల్‌లో మాటలు మాట్లాడిన వారు కూడా సత్య మార్గానికి 100% అంకితం అనే విషయం దగ్గరికి వచ్చే సరికి అడ్రస్ లేకుండా పోతారు. మాటలు కోటలు దాటుతాయి కానీ, కాళ్ళు మాత్రం గడపలు దాటవు ! నేను చాలా మందిని చూసాను. ఆత్మ తగినంతగా వికాసం చెందనిదే, పరిపక్వత చెందనిదే, పరిణితి పొందనిదే సత్య మార్గానికి 100% అంకితం కాలేరు. పిండెలు, కాయలు తమను తాము పండ్లుగా అనుకుంటూ ఉంటాయి. కేవలం పండిన ఎదిగిన ఉన్నత ఆత్మలు మాత్రమే సత్య మార్గానికి 100% అంకితం కాగలుగుతాయి. పిండెలు, కాయలు సత్యమార్గం చుట్టూ తిరుగుతూ, పైపైనే తచ్చట్లాడుతూ తృప్తి పడిపోతూ ఉంటాయి. చదవడం వచ్చు కదా అని దొరికిన పుస్తకాలను చదువుతూ వాటి మీద లెక్చర్లు దంచి కొడుతూ ఉంటాయి. మీటింగులు, చర్చలతో టైమ్ పాస్ చేస్తూ ఉంటాయి. అనుభవ జ్ఞానం అణువంత కూడా ఉండదు. అంతా చదివిన, విన్న జ్ఞానమే ! స్వంత స్వానుభవ జ్ఞానం అణువంత కూడా ఉండదు. ఇలాంటి వాళ్ళంతా తమను తాము ఓ వివేకానంద స్వామి లాగా, ఓ రమణ మహర్షిలాగా ఫీలయిపోతూ ఉంటారు. ఇప్పుడు ఇది చదువుతున్న మీరు కూడా నిజాయితీగా ఆత్మ విమర్శ చేసుకోండి - మీరు ఏ స్థాయిలో, ఎలా ఉన్నారోనని ! థియరీలు కాదు ప్రాక్టికల్స్ కావాలి. అప్పుడే అభివృద్ధి !

మహా ముఖ్య గమనిక 1

మీరు దైవత్వం/జ్ఞానోదయం పొంది ఉంటేనే సత్య ప్రచారం చేయాలి. ఎవరో ఒక సన్నాసి చెప్పాడని మీరు వెనకా ముందు చూసుకోకుండా ప్రచారానికి దిగితే మీ గతి అధోగతే ! దుర్గతే ! మీకు సద్గురు స్థితి రానిదే మీరు బోధించడానికి, క్లాసులు చెప్పడానికి పూనుకోకూడదు... చాలా ప్రమాదం.

అకర్మ శాకాహారాన్ని (అకర్మ వీగనిజం) ప్రచారం ఎవరైనా చేయవచ్చు. చీకటి గురువులు మాత్రమే ప్రచారం చేయమని చెప్తారు. మీరు ఆధ్యాత్మికత గురించి చెప్పండి, మీ అనుభవాల గురించి చెప్పండి, అంతే కానీ సబ్జెక్ట్ చెప్పకూడదు, చెప్పారో... మీకు నరకమే !

మహా ముఖ్య గమనిక 2

మీరు దైవత్వం/జ్ఞానోదయం పొంది ఉంటేనే సత్య ప్రచారం చేయాలి. ఎవరో ఒక సన్నాసి చెప్పాడని మీరు వెనకా ముందు చూసుకోకుండా ప్రచారానికి దిగితే మీ గతి అధోగతే ! దుర్గతే ! మీకు సద్గురు స్థితి రానిదే మీరు బోధించడానికి, క్లాసులు చెప్పడానికి పూనుకోకూడదు... చాలా ప్రమాదం. మీకు జ్ఞానోదయం కానిదే, ధ్యాన కేంద్రాలు ఓపెన్ చేయకూడదు, నిర్వహించకూడదు. చాలా ప్రమాదం, చాలా నష్టపోతారు. దొంగ గురువులు అలా చేయమని చెప్తారు. వాళ్ళను పూర్తిగా, శాశ్వతంగా వదిలేయండి.... తక్షణమే !

అకర్మ శాకాహారాన్ని (అకర్మ వీగనిజం) ప్రచారం ఎవరైనా చేయవచ్చు. చీకటి గురువులు మాత్రమే ప్రచారం చేయమని చెప్తారు. మీరు ఆధ్యాత్మికత గురించి చెప్పండి, మీ అనుభవాల గురించి చెప్పండి, అంతే కానీ సబ్జెక్ట్ చెప్పకూడదు, చెప్పారో... మీకు నరకమే !

పార్ట్ - 4

గ్లోబల్ గవర్నమెంట్

ఈ భూమి పైన ఉన్న ఏ మనిషికైనా ఒకే విధమైన దేహధర్మాలు ఉంటాయి. అంటే, అందరూ ముక్కుతోనే గాలి పీలుస్తారు, మరి గాలి పీలిస్తేనే బ్రతుకుతారు. అందరూ నోటితోనే ఆహారం తీసుకుంటారు. అందరికీ నీళ్ళు తాగితేనే దాహం తీరుతుంది. అందరూ కళ్ళతోనే చూస్తారు. అందరూ చెవులతోనే వింటారు. అందరూ స్త్రీ పురుషుల కలయిక వల్లనే పుట్టారు, పుడతారు. ఈ విధంగా ఈ భూమి పైనున్న ప్రతీ మనిషికీ ఒక్కటే దేహధర్మాలు ఉంటాయి. దేహం ఉంటేనే ఈ భూమి పైన జీవించ గలుగుతారు. దేహం లేకపోతే ఈ భూమి పైన జీవితమే ఉండదు. అంటే, దేహమే జీవితం ! దేహం, దీపం అయితే, జీవితం వెలుగు ! ఏ విధంగానైతే దీపం మరియు వెలుగు వేరు వేరు కాదో, అదే విధంగా దేహం మరియు జీవితం వేరే వేరే కాదు. దీపం యొక్క విస్తరణ వెలుగైతే, దేహం యొక్క విస్తరణ జీవితం. దేహం యొక్క అనుభవ సేకరణా యాత్రయే జీవితం అని అంటే ! దేహమే జీవితం అయినప్పుడు, దేహధర్మాలు ఏ విధంగానైతే ఒకే రీతిలో ఉంటాయో అదే విధంగా జీవిత ధర్మాలు కూడా ఒకే విధంగా ఉంటాయి. ఈ పరమ సత్యాన్ని అందరూ అర్థం చేసుకుని తీరాలి. దేహధర్మాలు ఒక్కటి అయినప్పుడు, జీవిత ధర్మాలు కూడా ఒక్కటే అవుతాయి అని అందరూ గ్రహించి తీరాలి. జాతి మత కుల వర్గ భేదాలు అనేవి మానవుల అజ్ఞానంలో నుండి పుట్టాయి. మాది ఈ సంప్రదాయం, మాది ఈ సంస్కృతి అని మనలో మనం కొట్టుకు చావడం అనేది అజ్ఞానమే తప్ప మరొకటి కాదు అనే విషయాన్ని అందరూ గ్రహించి, సర్వ మానవులకు శ్రేయస్కరమైన దివ్య జీవన ధర్మాలను పాటించాలి. అప్పుడే మానవ జాతి అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తుంది. ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకుంటే దివ్య జీవన ధర్మాలు అనేవి అర్థం అవుతాయి. ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని శ్రద్ధగా చదవండి మీకు అన్నీ చాలా క్లియర్‌గా అర్థం అవుతాయి.

గ్లోబల్ గవర్నమెంట్

ప్రపంచాన్ని కుదిపి వేస్తున్న ప్రధానమైన సమస్యలలో ఆర్థిక సమస్య అనేది అత్యంత ప్రధానమైనది. అయితే మనం గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే - ప్రపంచంలో డబ్బులు ఇంకా ఇతర వనరులు లేక ఇబ్బందులు కలగటం లేదు. ప్రపంచ ప్రజలందరికీ కావాల్సినన్ని డబ్బులు మరియు ఇతర వనరులు అన్నీ కూడా పుష్కలంగా ఉన్నాయి. అయితే అవి కొంత మంది గుప్పిట్లో ఉన్నాయి. ఒకరు అవసరాలు తీరక ఇబ్బందులు పడుతుంటే, మరొకరు అవసరాలకు మించి ఎన్నో రెట్లు కలిగి ఉన్నారు. కలిగిన వారు లేని వారిని ఆదుకుంటే ప్రపంచంలో ఆర్థిక సమస్యలే ఉత్పన్నం కావు. ఇది సత్యం. కొంత మంది మమ్మల్ని అడుగుతూ ఉంటారు.. సత్య ప్రచారం వలన ఏం లాభం జరుగుతుంది ? అని.. ఎవరైతే ఆత్మ విజ్ఞానాన్ని సరిగా అర్థం చేసుకుంటారో వారు ఇతరులను ఆదుకోకుండా ఉండలేరు. ముఖ్యంగా ధనవంతులు ఆత్మ విజ్ఞానాన్ని అర్థం చేసుకుంటే వారు ఖచ్చితంగా ఇతరులను ఆదుకుంటారు, అప్పుడు ప్రపంచ ప్రజల సమస్యలు అన్నీ ఆటొమెటిక్‌గా తీరిపోతాయి.

ఇక మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ప్రపంచంలోని దేశాలన్నీ తమ దేశం యొక్క సైన్యం కోసం ఖర్చు చేస్తున్న అపారమైన డబ్బుతో ప్రపంచ ప్రజలందరి సమస్యలను సులువుగా తీర్చవచ్చు. ప్రపంచ ప్రజలందరూ పరస్పర ప్రేమ, అవగాహనలతో వ్యవహరిస్తే, ప్రపంచాన్నంతా ఒకే దేశంగా భావిస్తే మరియు ప్రపంచానికంతా ఒకే ఒక ప్రభుత్వం ఉంటే ఎంత బాగుంటుంది ? భూమి అంతా వసుధైక కుటుంబంగా మారిపోతే ఎంత బాగుంటుంది ? ఇది సాధ్యం. అందరికీ ఆత్మ విజ్ఞాన అవగాహన వస్తే ప్రపంచం అంతా ఒకే దేశంగా మారిపోతుంది. అందరూ ప్రేమ, అవగాహనలతో పరస్పరం కలిసిపోతారు. అప్పుడు జరిగేది లోక కల్యాణమే ! ఇది ఆత్మ విజ్ఞాన అవగాహనతో ఖచ్చితంగా సాధ్యం అవుతుంది. త్వరలోనే దేశాల సరిహద్దులు చెరిగిపోయి ప్రపంచం అంతా ఒకే దేశంగా మారిపోతుంది. అప్పుడు గ్లోబల్ గవర్నమెంట్ యొక్క ఆధ్వర్యంలో ప్రపంచ ప్రజలందరూ హాయిగా ఆనందంగా జీవిస్తారు. ఇది పరమ సత్యం.

ప్రపంచ దేశాల మధ్యన ఉన్న సరిహద్దు గోడవలను కాదు
రూపుమాపాల్సింది... అసలు సరిహద్దులనే మాయం చేయాలి.
ఈ భూమి అంతా ఒకటే దేశం కావాలి. మానవులంతా
ఒక్కటే అనే ఏకత్వ సత్యాన్ని ప్రకటించి ఆచరించాలి.
అందరం కలిసి ఉంటే ఎంత బాగుంటుందోనని
ఊహించుకుంటేనే ఒళ్ళంతా పులకరించి పోతుంది.
భౌగోళిక నైసర్గిక పరిసర ప్రాంతాలకు అనుగుణంగా
రంగులో, రూపులో తేడాలుంటాయే కాని అందరి
శరీర ధర్మాలు ఒక్కటే !
అందరం ఒక్కటే అని గ్రహించి అందరం
అందరి కోసం జీవించాలి.
ఇది జరిగే పనేనా అని అనుకోకండి. అత్యంత త్వరలోనే
ఇది ఈ భూమి పైన జరిగి తీరుతుంది. గతి తప్పని ప్రాప్తి ఇది.

పార్ట్ - 5

మీ సంతానాన్ని పరమాత్ములుగా తయారు చేయండి

ఈ భూమి పైన జన్మించగానే జన్మ కారణాన్ని మరచిపోతారు. మాయ ఆవరిస్తుంది. ఈ మాయ ఎన్ని జన్మలెత్తినా వదలదు. మనకై మనమే దీన్ని వదిలించుకోవాలి. మాయను చాలా సులభంగా సురక్షితంగా శీఘ్రంగా వదిలించుకోవచ్చు. ముందు మీరు అకర్మ శాఖాహారిగా అనగా అకర్మ వీగన్‌గా మారిపోవాలి. నిత్య ధ్యాన సాధన చేస్తూ ఉండాలి. ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకుంటూ సేవ చేస్తూ ఉంటే మీకు మాయ తొలగిపోతుంది. దైవాతే అయి ఉన్న మీరు, మళ్ళీ మీ దైవత్వాన్ని మీరు తిరిగి పొందుతారు. నామ స్మరణల వలన, సంకీర్తనల వలన, భజనల వలన, పూజల వలన, స్తోత్రాల వలన, జపాల వలన, యజ్ఞ యాగాల వలన, హోమాల వలన, ప్రార్థనల వలన, తీర్థ యాత్రల వలన, పుణ్య క్షేత్ర సందర్శనల వలన, ఇంకా ఇతర కర్మ కాండల వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. **ఈ సత్యాలను శ్రీకృష్ణ పరమాత్ముడే స్వయంగా భగవద్గీతలోనూ మరియు ఉత్తరగీతలోనూ చాలా స్పష్టంగా ప్రకటించాడు కదా !**

ఈ భూమి పై జన్మించిన ప్రతీ ఒక్కరికీ ఒకే ఒక పరమ లక్ష్యం ఉంటుంది... అది వారి దైవత్వాన్ని వారు తెలుసుకోవడం ! వారి దైవత్వాన్ని వారు తెలుసుకునే దిశలో వారి జీవితం సాగటం లేదు అని అంటే, ఆ జీవితం వృథా అని అర్థం చేసుకోండి. మీరే దైవం. ఈ సత్యాన్ని మీరు అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి. ఈ పని చేయకుండా మీరు ఏం చేసినా మీ జన్మలను మీరు వృథా చేస్తున్నారు అనే సత్యాన్ని మీరు తెలుసుకోవాలి. మాయలో నుండి బయట పడండి.

మీ సంతానాన్ని పరమాత్ములుగా తయారు చేయండి

మనమందరం దివ్యులం. దివ్యులమైన మనం, దివ్యమైన లక్ష్యాలనే కలిగి ఉండాలి. మహా దివ్య లక్ష్యాలను మాత్రమే మనం పెట్టుకోవాలి. సాధారణంగా, తల్లిదండ్రులందరూ తమ పిల్లలను డాక్టర్లుగానో లేక ఇంజనీర్లు గానో లేక మరేదోగానో తయారు చేయాలనుకుంటారు. లేదా తాము కాలేకపోయిన దాన్ని పిల్లల మీద రుద్దుతారు. ''***నేను ఎలాగూ కాలేక పోయాను బాబూ... కనీసం నీవైనా అయి, నా ఆశయం నెరవేర్చు***'' **అంటూ కాలం చెల్లిన, ఔట్ డేటెడ్ ఆశయాలను తమ సంతానం మీద రుద్ది పారేస్తారు.** పిల్లలు నిస్సహాయులు కదా.. ఏమీ చేయలేక అంగీకరిస్తారు. ఒకవేళ ఎవరైనా తెలివైన పిల్లలు అంగీకరించకపోతే.. వారిని సెంటిమెంట్‌తో కొడతారు. ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్ చేస్తారు. ప్రస్తుతం ఈ భూమి పైన ఉన్న 95% పిల్లలందరికీ ఉన్నవి తమ తల్లిదండ్రులు రుద్దిన కాలం చెల్లిన లక్ష్యాలే ! ఔట్ డేటెడ్ ఆశయాలే ! ఎవరో కొంత మంది మహానుభావులు, తమ తల్లిదండ్రుల పనికిరాని ఆశయాలను తోసిపారేసి, కొత్తగా ఆలోచించి, సాధారణ లైఫ్ డిజైన్‌ను బ్రేక్ చేసి సరికొత్తవైన మరియు ప్రయోజనాత్మకమైన ఆవిష్కరణలు చేసారు. ఇలాంటి వారి వల్లనే ప్రపంచం ఇంత అభివృద్ధి చెందింది. డిఫరెంట్‌గా ఆలోచించి, మూస సమాజాన్ని ధిక్కరించి, తమ దారిలో తాము ముందుకు సాగిన వారి వల్లనే నవీనమైన మరియు ప్రయోజనకరమైన ఆవిష్కరణలు జరుగుతాయి. ఇలాంటి మహాత్ములే ఈ ప్రపంచానికి దారి చూపే ''లైట్ హౌస్''లు !

సరైన ఆత్మ విజ్ఞానం లేని తల్లిదండ్రుల వల్లనే ఈ కాలం చెల్లిన ఆశయాలు, కాలం కాని కాలంలో కూడా కొనసాగుతూ ఉంటాయి.

మనం కేవలం మన కోసమే కాకుండా లోకం కోసం కూడా జీవించాలి. మనం, మన కోసం + లోకం కోసం జీవించినప్పుడే అది సరియైన జీవితం.

మనమందరం తప్పని సరిగా మన కోసం మాత్రమే కాకుండా, లోకం కోసం కూడా ఆలోచించాలి. వాస్తవానికి మీరు లోకం కోసం ఆలోచిస్తే మీ కోసం మీరు ఆలోచించినట్టే! లోకానికి మీరు చేసేదంతా మీకే చెందుతుంది. మీరెంతో అభివృద్ధిని పొందుతారు.

బాబూ నీవు అది కా.. నీవు ఇది కా.. అంటూ ఏవేవో సాధారణ లక్ష్యాలను పిల్లలకు నిర్ణయించవద్దు. ఎంత సేపూ.. పరిమితుల్లో ఉండి ఆలోచించడమేనా.. సంకుచిత పరిధుల్లో నుండి బయటికి వచ్చి సువిశాల దృక్పథంతో ఆలోచించ కూడదా....?! ఏం అలా గొప్పగా ఆలోచిస్తే ఏం జరుగుతుంది ? బాగుపడిపోతామని భయమా ? గొప్ప వాళ్ళమైపోతామో ఏమో ? అనే బాధనా ?

ప్రియ మిత్రులారా.... సంకుచిత ధోరణితో పరిమితుల్లో నుండి ఆలోచించడం ఇక చాలు ! అజ్ఞానపు సరిహద్దులను దాటాల్సిన సమయం వచ్చేసింది. మీ పిల్లలకు, మహా దివ్య లక్ష్యాలను ఇవ్వండి.

బాబూ.. శ్రీరాముడిలా కావాలి. నీవు ఒక శ్రీకృష్ణుడిలా కావాలి. ఒక జీసస్ క్రైస్ట్‌లా కావాలి. నీవు ఒక జొరాస్టర్‌లా కావాలి. నీవు ఒక మహావీరుడిలా కావాలి. నీవు శ్రీమహా లక్ష్మిలా కావాలి. నీవు జీసస్‌కు జన్మనిచ్చిన మదర్ మేరీలా కావాలి. బాబూ నీవు పరమాత్ముడివి కావాలి... అమ్మా... నీవు పరమాత్మురాలువి కావాలి. అని మీ పిల్లలకు మహా దివ్య లక్ష్యాన్ని అందివ్వండి. వాళ్ళను సత్య మార్గానికి అంకితం చేయండి. వాళ్ళను పరమాత్ములుగా తయారయ్యేందుకు ప్రేరణను అందించండి. ఉత్సాహపరచండి. సహాయ సహకార సమన్వయాలను అందించండి. ***దైవత్వ సాధనను నేర్పే గురువును వెతికి పట్టుకుని, ఆ గురువు దగ్గర చేర్పించండి. వారికి అన్ని విధాల సౌకర్యాలను సమకూరుస్తూ, వారిని చక్కగా మెయింటేన్ చేయండి. మీరు సృష్టికి అందించే అత్యంత గొప్పదైన, పరమోత్తమమైన మరియు పరమోన్నతమైన బహుమతి ఇదే !*** సృష్టికి మీ సంతానాన్ని పరమాత్ములుగా చేసి అందివ్వండి. మీ సంతానాన్ని పరమాత్ములుగా తయారుచేయడం ఎలా ? అని తెలుసుకోవాలనుకుంటే, మీరు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మొత్తం చదవండి. మీకే అర్థం అవుతుంది. మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు అని ఎవరైనా అడిగితే.. డాక్టరు లేక ఇంజనీరు కాబోతున్నాడు అనేది సాధారణ విషయం. ***మా అబ్బాయి పరమాత్ముడు కాబోతున్నాడు అనేది ఎంత గొప్ప విషయం ?! మా అమ్మాయి పరమాత్మురాలు అవుతుంది, అని చెప్పడం ఎంత ఉన్నతమైనదో... ఒకసారి ఆలోచించండి.***

మీ సంతానాన్ని పరమాత్ములుగా తయారు చేయండి

ప్రతీ మనిషిలోనూ పరమాత్మ తత్వం(దైవత్వం) ఉంది. ఆ విషయం తెలియక అందరూ మాయలోనే బతుకుతూ చస్తూ మళ్ళీ పుడుతూ ఉన్నారు. ఈ జన్మ చక్రంలో పడి అలా తిరుగుతూనే ఉండాలి. దీనికి అంతం లేదు. కొన్ని వేల జన్మలైనా లేక కొన్ని లక్షల జన్మలైనా ఇలా పుడుతూ చస్తూ మళ్ళీ పుడుతూ ఉండవలసిందే ! ఎప్పటి వరకైతే మీరు మీ యొక్క దైవత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోరో అప్పటి వరకు మీరు ఇలా జన్మచక్రంలో బందీలుగా ఉండవలసిందే ! అష్టకష్టాలు పడుతూ ఉండవలసిందే ! మీరు మీ నిజతత్వమైన దైవత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్నప్పుడు

జన్మచక్రంలో నుండి విడుదల అవుతారు. మోక్షాన్ని పొందుతారు. అప్పుడు మీరు మళ్ళీ జన్మించనక్కరలేదు. ఆఁ... ఏమిటి మళ్ళీ జన్మించకపోతే ఎక్కడికి పోతాము ?! అని కంగారు పడకండి. మీరు మానవులుగా జన్మించి చాలా కాలం అయ్యే సరికి, అసలు విషయాన్ని మరిచిపోయారు కాబట్టి అలా అనుకుంటున్నారు. దివ్య లోకాలలోని దివ్యానందభరితమైన దివ్య జీవన కాలాన్ని మరిచిపోయారు. ఆ జ్ఞాపకాలన్నీ మీ అంతరంగంలో పదిలంగా ఉన్నాయి, ధ్యానం ద్వారా అవన్నీ మీకు గుర్తుకు వస్తాయి. ఈ భూమి తప్ప మరో లోకం లేదు అనే అజ్ఞానం భయపెడుతుంది. ఈ భూమి కంటే మహోన్నతమైన జీవితాన్ని అందించే దివ్య లోకాలు ఎన్నెన్నో ఉన్నాయి. ఈ భూమి పైకి మనమంతా మన ఆత్మ అనుభవ విజ్ఞానాన్ని విస్తరించుకోడానికి వచ్చాం. ఇక్కడ మన పని అయిపోగానే, అంటే మోక్షం పొందగానే, దివ్య స్వర్గలోకాలకు తరలి వెళ్లిపోతాం. అక్కడ జీవితం పరమానందభరితంగా ఉంటుంది. మీ ఊహలకు కూడా అందనంత గొప్పగా, దివ్యంగా ఉంటుంది. చాలా కలర్‌ఫుల్‌గా ఉంటుంది. ఈ రకమైన ఎంజాయ్‌మెంట్లు కూడా ఉంటాయా ?!?! అని ఆశ్చర్యపోయే విధంగా ఆ దివ్య స్వర్గలోకాలు ఉంటాయి. భూమి పైన ఉన్న గ్రంథాల్లో ఆ యొక్క దివ్య స్వర్గలోకాల గురించి చాలా చాలా స్వల్ప పరిమాణంలో ప్రస్తావనలు ఉన్నాయి. అందుకే వాటి గురించి చాలా మందికి తెలియదు. మతాధికారులకు అసలే తెలియదు. ఆత్మ విజ్ఞాన అభ్యాసం మరియు నిత్య ధ్యాన సాధన చేసే వారికి ఆ యొక్క దివ్య స్వర్గ లోకాలు దర్శనమిస్తుంటాయి. ధ్యానంలో ఆస్ట్రల్ బాడీలతో స్వయంగా అక్కడికి వెళ్లి చూసి రావచ్చు కూడా ! నా దగ్గర ఆత్మ విజ్ఞాన అభ్యాసం మరియు ధ్యానం నేర్చుకునే వాళ్లు ఎంతో మందికి ఈ దివ్య స్వర్గలోకాల అనుభవాలు వచ్చాయి. వారు ఆశ్చర్యపోయి, ఆనందంతో నాకు ఆ విశేషాలను వివరిస్తూ ఉంటారు. మరణం అంటే కేవలం శరీరాన్ని విడిచి పెట్టడం మరియు ''తలం'' (Plane or Dimension) మారడం అని అనుభవపూర్వకంగా తెలుసుకుంటూ ఉంటారు.

ఈ భూమి పైన జీవితం కేవలం మోక్ష సాధన కోసం మాత్రమే ఉంది. మోక్షం రావాలంటే ముందు - ధర్మం అర్థం కామం అనే ఈ మూడు పురుషార్థాలను సాధించాలి. ధర్మం అంటే ఆత్మ విజ్ఞానం. మరి, ఆత్మ విజ్ఞానం ద్వారానే అర్థం (ఐశ్వర్యం) వస్తుంది. ధర్మం మరియు అర్థం(ఐశ్వర్యం) ఉన్నపుడు, ఆటొమెటిక్‌గా ఆరోగ్యం ఉంటుంది. ఇక తర్వాత కామాన్ని అనుభవించి తెలుసుకుంటూ ఉండాలి. కామాన్ని తనివి తీరా ఆనందిస్తూ మోక్ష మార్గంలో ప్రయాణం మొదలు పెట్టాలి. నిరంతర ఆత్మ విజ్ఞాన అభ్యాసం మరియు క్రమం తప్పని ధ్యాన సాధన చేస్తూ ఉంటే, ఏదో ఒక నాటికి మోక్షం ప్రాప్తిస్తుంది.

గుర్తుంచుకోండి, ధర్మార్థ కామమోక్షాలు అనే నాలుగు పురుషార్థాలు కేవలం నిరంతర ఆత్మ విజ్ఞాన అభ్యాసం వలన మరియు క్రమం తప్పని ధ్యాన సాధన వలన మాత్రమే సంప్రాప్తిస్తాయి కానీ... ఈ స్కూల్, కాలేజ్ చదువుల వలన కాదు.

మీ సంతానాన్ని మోక్ష మార్గంలోకి ప్రవేశ పెట్టండి. సత్య మార్గానికి అంకితం చేయండి. వారిని పరమాత్ములుగా తయారయ్యేందుకు మీ వంతు బాధ్యతను మీరు నెరవేర్చండి. మీ సంతానం పరమాత్ములుగా మారితే మీదెంత సౌభాగ్యమో ఆలోచించండి.

ఇంతకు ముందు ఎందరో మహాత్ములు చెప్పారు, ఇప్పుడు నేను చెప్తున్నాను. ఈ పుస్తకం నేను 10 సంవత్సరాలు కష్టపడి వ్రాసి 5,000+ కాపీలను మరియు కొన్ని లక్షల ఈ-బుక్స్ 100 % ఉచితంగా 2012 నుండి పంచుతూ వచ్చాను. ఇప్పటివరకు కొన్ని వేల మంది నన్ను కలిసారు కానీ నా టీమ్ తప్ప, బయటి వారు ఒక్కరు కూడా ఈ విషయం గురించి మాట్లాడలేదు, ఎంత సేపు మా పిల్లలకు పెళ్ళిళ్ళు కాలేదే, పెళ్ళిళ్ళు అయితే పిల్లలు కాలేదు అనే సోది తప్ప ఒక్కరు కూడా ఈ పార్ట్ యొక్క విషయం గురించి టాపిక్ తీసిన పాపాన పోలేదు. ఇప్పుడు ఇది చదువుతున్న మీరు కూడా భారంగా... ఓ నిట్టూర్పు విడిచి.. సింపుల్‌గా పక్క పేజిలోకి వెళ్ళిపోతారు నాకు తెలుసు, గురువుగా చెప్పడం నా ధర్మం. ఈ విషయం గురించి ఇక మళ్ళీ జీవితంలో ఆలోచించరని కూడా తెలుసు ! తిప్పండి పేజి, ఇలాంటి విషయాలు చిరాకు కలిగిస్తాయి కదా !

మీరు చిన్నగా ఉన్నప్పుడు మీరు, మీ తల్లిదండ్రుల మాట వినరు కానీ మీ పిల్లలు మాత్రం మీ మాట విని తీరాలి. ఇది ఎంత అన్యాయం ?!

❖ ❖ ❖

పిల్లలను తమ ఆస్తులుగా పరిగణించినంత కాలం సమాజం వికాసం చెందదు. పిల్లలకు వారి స్వంత మనసు ఉంది, వారికి తమవైన ఆశయాలు ఉంటాయి అని గౌరవించి వారికి నిజమైన స్వేచ్ఛనిచ్చినప్పుడే సమాజమైనా, దేశమైనా, లోకమైనా బాగుపడుతుంది.

పిల్లలు బాగా తింటేనే పెరుగుతారు అనుకుని
పిల్లలకు కుక్కి కుక్కి పెడుతుంటారు ఇది అజ్ఞానం.
పిల్లలు తమ లైఫ్ డిజైన్ ప్రకారం పెరుగుతారు.
అంతే కాని మీరు కుక్కి కుక్కి పీకల దాకా
తినిపిస్తే అజీర్తి చేస్తుంది. వేరే ఏవైనా ఇబ్బందులు వచ్చినా రావచ్చు.

పిల్లలకు తగినంత అకర్మ శాకాహారం(అకర్మ వీగన్ ఆహారం) ఇస్తే చాలు.
మీ పిల్లలు బాగా పెరగాలంటే, వారికి అకర్మ శాకాహారం(అకర్మ వీగన్ ఆహారం)
ఇస్తూ రోజూ ధ్యానం చేయించండి. వారికి ఆధ్యాత్మిక సత్యాలను అర్థం చేయిస్తూ,
వారి చేత ఆ సూత్రాలను ఆచరింప చేయండి.
అప్పుడు మీ పిల్లలు కేవలం శారీరకంగానే కాకుండా
ఆత్మ పరంగా కూడా ఎదుగుతారు. కేవలం శారీరకంగా
ఎదగడం సరైన ఎదగడం అనిపించుకోదు.
అడవిలో చెట్లు కూడా ఎదుగుతాయి కదా !
అర్థం అయిందనుకుంటాను !!

మీ కింద ఉన్న వారి పైన చాలా ఎరుకతో మీ యొక్క అధికారాన్ని మరియు హక్కును ఉపయోగించండి.

కొంత మంది తల్లిదండ్రులు.... తమ పిల్లల జీవితాలను కబ్జా చేస్తారు. వారిలోని కబ్జా గుణానికి ప్రేమ అనే పేరు పెడతారు. తమ పిల్లలను తమ ఇష్టం వచ్చినట్టుగా జీవించనివ్వకుండా అడ్డం పడే తల్లిదండ్రులకు సరైన గుణపాఠం చెప్పబడుతుంది. తమ పిల్లలు ఎలా జీవించాలనుకుంటున్నారో... అలా జీవించనివ్వండి. ఎవరిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారో వారినే పెళ్ళి చేసుకోనివ్వండి. వారి నిర్ణయం ఎంత విచిత్రంగా, ఎంత వింతగా ఉన్నా సరే ! జీవితాన్ని జీవించే విషయంలో మరియు వివాహ విషయంలో ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేక ఆశయం ఉంటుంది. ఈ ఆశయం వారి ఆత్మ పరిణామ క్రమంలోని ప్రణాళిక ప్రకారంగా ఉంటుంది. జీవితాన్ని ఎలా జీవించాలి ? ఎవరిని, ఎలా వివాహం చేసుకోవాలి ? అనేది వారి ఆత్మ వికాస యాత్రలో భాగంగా నిర్ణయించుకోవడం జరుగుతుంది.

ప్రతీ జన్మ, ఆత్మకు ఒక ప్రయోగమే ! ఈ ఆత్మ ప్రయోగాన్ని తల్లిదండ్రులు అడ్డుకుంటే, తల్లిదండ్రులకు సరైన గుణపాఠం నేర్పించ బడుతుంది. ఆ సమయంలో తల్లిదండ్రులకు చుక్కలు కనపడతాయి. కాబట్టి మీ పిల్లలకు పూర్తి స్వేచ్ఛనివ్వండి. వారి ఇష్ట ప్రకారం వారిని జీవించనివ్వండి. వారి ఇష్టం వచ్చిన వారిని పెళ్ళి చేసుకోనివ్వండి. వారి జీవితం వారి ఇష్టం. ఇలా చేయలేదో మీరు మీ జీవితాలను కోల్పోవాల్సి వస్తుంది. అప్పుడు చాలా బాధగా ఉంటుంది. సమాజం ఏం అనుకుంటుంది ? అందరూ ఏం అనుకుంటారు ? అని ఆలోచించకండి. మీ వంతు వచ్చినప్పుడు తెలుస్తుంది, సమాజం మరియు అందరూ ఏమీ అనుకోరు అని !

పిల్లలను నిజంగా ప్రేమించి పూర్తి స్వేచ్ఛనిచ్చే తల్లిదండ్రులు కూడా ఉంటారు. నేను ఇక్కడ కబ్జాదారుల గురించి మాట్లాడుతున్నాను.

ప్రేమ అంటే ఏమిటో తెలియని వారికి
దైవం అంటే కూడా ఏమిటో తెలియదు.
ఎవరైతే ప్రేమించలేరో వారికి మోక్షం ఏ నాటికీ రాదు.

చిన్న పిల్లలు, చిన్న పిల్లలు కారు అనే సత్యాన్ని తెలుసుకోండి.
వారికి అన్నీ అర్థం అవుతాయి. వారి శరీరం మాత్రమే చిన్నది.
ఆ శరీరంలో ఉన్న ఆత్మ మాత్రం పెద్దది అని తెలుసుకోండి.

మీరు పిల్లలతో ప్రవర్తించేటప్పుడు
చాలా జాగ్రత్త వహించండి.
లేదా వారు పెద్దయ్యాక మీకు తగిన గుణపాఠం చెప్తారు.

పార్ట్ - 6

ఆధ్యాత్మికం వేరే !

మతం వేరే !

ఇప్పుడున్న మతాలేవీ లేనప్పుడు
కూడా భూమి పైన నాగరికత ఉంది.
మనుషులు జీవించారు. కొంత కాలంలోనే ఇప్పుడున్న
మతాలన్నీ శాశ్వతంగా మాయమై పోతాయి. మానవులంతా
ఒక్కటవుతారు. ఈ భూమి పైన స్వర్గం ఆవిష్కరించ బడుతుంది.
మతంలో ఉన్నంత కాలం ఆత్మాభివృద్ధి ఆగిపోతుంది. మతంలో నుండి
బయట పడితే కానీ ఆత్మ పరిణామ క్రమం సజావుగా సాగదు. జనాలు
భయపడుతున్నారు కాబట్టి, మతాధికారులు భయపెడుతున్నారు. తప్పు ఎవరిది
కాదు. సరైన ఆత్మ విజ్ఞానం లేకపోవడమే అసలైన తప్పు. సరైన ఆత్మ విజ్ఞానాన్ని
తెలుసుకోవాలి. అప్పుడే జీవితంలో అన్ని ఆనందాలు వెల్లి విరుస్తాయి. మతాధికారులు
చెప్పే విషయాలను ఆచరిస్తూ ఉంటే మీరు ఇంకా అంధాకారంలోనే ఉంటారు.
మతబోధనలు అన్నీ కూడా మిమ్మల్ని వెలుగులోనికి రానీయకుండా చేస్తాయి.

ఈ భూమి పైనున్న మతాలను మాయం చేస్తే అత్యధిక శాతం కల్లోలాలు,
యుద్ధాలు ఆగిపోతాయి. ప్రపంచ ప్రజా జీవితంలో శాంతి ఆనందాలు
ఉత్సవాలు చోటు చేసుకుంటాయి.

అత్యంత త్వరలోనే ఈ భూమి పైన ఉన్న మతాలన్నీ శాశ్వతంగా
మాయం అయిపోతాయి. మళ్ళీ ఈ భూమి పైన మతం అనేది పుట్టదు.
మానవులంతా ఏకమవుతారు. అంతా కలిసి హాయిగా జీవిస్తారు.
మానవులంతా ఆత్మ పరిణామ క్రమంలో ముందుకు
సాగిపోతూ ఉంటారు. ఇది పరమ సత్యం.

ఆధ్యాత్మిక శాస్త్ర పరంగా, మానవుడి అన్ని మానసిక + శారీరక + జీవిత సమస్యలకు ఏకైక మూల కారణం సరైన ఉన్నతమైన ఆత్మ విజ్ఞానం బాగా లేక పోవడం !

According to the Spiritual Science,
the only root cause for all the
psychological + health (physical) +
life problems of humans is Lack of right &
higher Self Wisdom !

I. నిర్లక్ష్యం

ఆధ్యాత్మిక శాస్త్ర పరంగా మానవుడి అన్ని మానసిక + శారీరక + జీవిత సమస్యలకు ఏకైక మూల కారణం సరైన, ఉన్నతమైన ఆత్మ విజ్ఞానం లేక పోవడం !

According to the Spiritual Science, the only root cause for all the psychological + health(physical) + life problems of humans, is Lack of right & higher Self Wisdom !

మన "నిజ తత్వం" పట్ల "సరి" అయిన అవగాహన లేక, మన నిజ తత్వాన్ని స్వయంగా, అనుభవపూర్వకంగా తెలుసుకోకుండా ఉండడమే మన శరీరం + జీవితంలోని అన్ని రకాల సమస్యలకు ఉన్న ఏకైక మూలకారణం. మరే ఇతర కారణాలు లేవు గాక, లేనే లేవు. ఉండవు, ఉండలేవు కూడా !

మనకు లోకంలో ఉన్న విషయాల గురించి ఎంతో కొంత తెలుసు. ఏ పని చేసినా, ముందు దాని గురించి తెలుసుకుని తర్వాత ఆ పనిని చేస్తాం. తెలుసుకోనిదే ఏ పని చేయం. చివరికి బాత్ రూంలోకి వేసుకునే స్లిప్పర్స్ కొనే ముందు కూడా వాటి గురించి తెలుసుకుని మరీ కొంటాం. ఏదైనా చేసే ముందు తెలుసుకుని చేయాలి అని ఉచిత సలహాలు కూడా ఇస్తూ ఉంటాం. అన్ని విషయాల్లో చూపెట్టిన ఈ "విజ్ఞత" మన "ఉనికి" పట్ల మనం చూపెట్టుకోం , ఆశ్చర్యం !!

అన్నింటి గురించి తెలుసుకుంటూ,

మన "ఉనికి" గురించి మాత్రం

తెలుసుకోకుండా బ్రతికేస్తున్నాం !

మనం ఎవరం ? ఎందుకు పుట్టాం ? పుట్టక ముందు ఎక్కడ ఉన్నాం ? ఎందుకు చస్తాం ? చచ్చిన తర్వాత ఎక్కడికి వెళ్తాం ? అసలు మన శరీరంలోకి, జీవితంలోకి సమస్యలు ఎందుకు వస్తాయి ? వీటి మూల కారణాలు ఏమిటి ? అవి ఎక్కడ ఉన్నాయి ? అని ప్రశ్నించుకోము, తెలుసుకోము ! ఇదే, ఈ **"నిర్లక్ష్యమే"** మన శరీరంలోకి, జీవితంలోకి సమస్యలు రావడానికి కారణం అవుతుంది.

ఈ ప్రశ్నలు వేదాంత ప్రశ్నలు కావు ! అత్యంత ప్రాథమిక ప్రశ్నలు ! ప్రతి ఒక్కరు వేసుకుని తీరవలసిన ప్రశ్నలు ! శరీరాన్ని + జీవితాన్ని కలిగి ఉన్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అనుభవపూర్వక సమాధానం పొంది తీరవలసిన ప్రశ్నలు.

అబ్బో ఇదంతా ఏదోలా ఉంది...! నాకు టైమ్ లేదు, అని చాలా మంది అంటుంటారు. కారులో దూర ప్రయాణానికి బయలుదేరుతూ కారు గురించి పట్టించుకోకుండా, అది ఎలా ఉంది ? దాని కండీషన్ ఏమిటి ? ఇలాంటివి ఏమీ తెలుసుకోకుండా, పైగా నాకు పెట్రోల్ పోయించుకోడానికి టైమ్ లేదు అని అనడం... విచిత్రం ! సీరియస్‌గా కంప్యూటర్‌లో పని చేస్తూ, "బ్యాకప్" తీసుకోడానికి "టైమ్" లేదు అని అంటే ఎలా ఉంటుంది ? ఏదైనా జరిగి మీరు చేసిన పని అంతా పోతే ఎలా ఉంటుంది పరిస్థితి ?!.....**జీవితం సాఫీగా సాగిపోతుంటే ఏమీ అర్థం కాదు మిత్రులారా !**

ఒక "**జర్క్**", ఒక "**కుదుపు**", ఒక "**మలుపు**", ఒక "**పాయింట్**" వస్తుంది. తప్పక వస్తుంది. అందరికీ వస్తుంది. ఇక అప్పుడు ఏమీ చేయలేరు. ఎటూ దారి ఉండదు. అన్ని దారులు మూసుకుపోతాయి. ఇక అప్పుడు మీ గురించి మీరు తెలుసుకోవడం తప్ప మరి ఇంకొక దారి మిగలని "పరిస్థితి" వస్తుంది. అది ఎప్పుడు వస్తుందో తెలియదు. కానీ వస్తుంది. తప్పకుండా అందరికీ వస్తుంది.

ఇక అప్పుడు "కొన్ని జన్మల పర్యంతంగా ఉంటుంది అన్వేషణ,

మార్గం కోసం... **మార్గదర్శి** కోసం" !

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం మంచిది. ఆ "పరిస్థితి" ఎదురుకాక ముందే "అన్వేషణ" మొదలు పెడితే బాగుంటుంది. తక్షణమే మార్గదర్శి ప్రాప్తిరస్తు !

❖ ❖ ❖

బంధాలు, అనుబంధాలు అవి కుటుంబ బంధాలైనా లేక మరే ఇతర బంధాలైనా, సంబంధాలైనా సరే కేవలం కర్మ పూరిత బంధాలు Learnings మాత్రమే అని బలంగా గుర్తుంచుకోవాలి.. కర్మ పూరిత బంధాలు కేవలం భౌతిక పరమైన సహాయాలు మాత్రమే చేస్తాయి. ఆత్మాభివృద్ధికి అడ్డంకులవుతాయి అనే సత్యాన్ని సదా సర్వదా స్మృతిలో ఉంచుకోవాలి. భౌతిక ప్రపంచంలో భౌతిక జీవితంలో ఉంటున్నాము కాబట్టి భౌతిక సంబంధాలు మెయింటేన్ చేయాలి కానీ కేవలం అవసరాల మేరకు మాత్రమే ఆ బంధాలను ఉంచుకోవాలి. ఆ బంధాలతో జీవితాన్ని బంధించుకోకూడదు. అత్యవసరమైతే భౌతిక బంధాలను వదులుకోవాలి కానీ ఆధ్యాత్మిక సంబంధాలను మాత్రం వదులుకోకూడదు. మీకు శాశ్వత శ్రేయస్కరం కలిగించేవి ఆధ్యాత్మిక సంబంధాలు మాత్రమే !

2. ఓపెన్ మైండెడ్‌గా ఉండాలి

మూర్ఖంగా, మొండిగా, మనసు మూసుకుపోయిన వారి లాగా ఉండకూడదు. ఎల్లప్పుడూ ఓపెన్ మైండెడ్‌గా ఉండాలి. ఏ విషయాన్నైనా సరే వినీ వినగానే కొట్టి పారేయవద్దు. స్వానుభవం లేనిదే ఏ విషయం పైనా స్టేట్‌మెంట్స్ ఇవ్వరాదు. చాలా మంది చదువుకున్న వాళ్ళు, "అంతా" తమకు తెలుసునని విర్ర వీగుతుంటారు. వాళ్ళు చదివింది పాఠ్య పుస్తకాలను మాత్రమే ప్రపంచాన్ని, జీవితాన్ని కాదు.

స్కూల్లో, కాలేజ్‌లో, యూనివర్సిటిలో పుస్తకాలు చదివి, అందులోని విషయాలు బట్టీ పట్టి పరీక్షలు పాస్ అయితే డిగ్రీ మాత్రమే వస్తుంది. ఈ చదవడం వేరే, ప్రపంచాన్ని, జీవితాన్ని చదవడం వేరే !

మనకు తెలిసింది బిందువంత, తెలియనిది సాగరమంత ! ఈ విషయాన్ని సదా గుర్తుంచుకుని ఎరుకతో ప్రవర్తించడమే "ఓపెన్ మైండెడ్‌గా" ఉండడమంటే. మనం ఎప్పుడు కూడా పరిశోధనాత్మకతను కలిగి ఉండాలి. సైంటిఫిక్ అప్రోచ్‌తో విషయాలను దర్శించాలి. ఒక విషయం విన్నప్పుడు, అది మన జ్ఞాన పరిధికి అవతల ఉన్నప్పుడు దాన్ని తీసిపారేయకూడదు, ఖండించకూడదు. ఆ విషయం మనకు అవసరం అని అనుకుంటే దానిని పరిశోధించి స్వయంగా అనుభవించి తెలుసుకోవాలి. ఒక వేళ అవసరం లేదని అనుకుంటే మౌనంగా దాని పట్ల ఎలాంటి ప్రకటనలు చేయకుండా ఆ విషయాన్ని వదిలేయాలి. ఇదే ఓపెన్ మైండెడ్‌గా ఉండడమంటే ! స్వానుభవం లేకున్నా ప్రతీ విషయాన్ని ఖండించడమే రిజిడ్ మెంటాలిటి. **రిజిడ్ అంటే జడం. జడ పదార్థం లాగా ఎదుగుదల లేని దరిద్రపుతనంతో ఉండటమే రిజిడ్ మెంటాలిటి.** ఒక్కోసారి మనకు తెలిసి ఉన్న విషయం కూడా ఇంకో కొత్త విశేషాన్ని తెలియజేస్తుంది. మనకు స్వానుభవం ఉన్న విషయాలు కూడా మనకు తెలియని కొత్త కోణాలను పరిచయం చేస్తాయి. కాబట్టి ఎప్పుడు కూడా ఓపెన్ మైండెడ్‌గానే ఉండాలి. ఇది ఒక చక్కటి సంస్కారం, ఒక మెరుగైన, ఉన్నతమైన సంస్కృతికి ప్రతీక.

ఓపెన్ మైండెడ్‌గా ఉన్నప్పుడు అభివృద్ధి ఎంతో వేగంగా జరుగుతుంది. మొండిగా, రిజిడ్‌గా ఉన్నప్పుడు అభివృద్ధికి అందనంత దూరంలో ఉంటాం. ఓపెన్ మైండెడ్‌గా ఉన్న వాళ్ళే ప్రపంచ చరిత్రను మలుపు తిప్పారు, తిప్పగలుగుతారు. రిజిడ్‌గా ఉన్నవాళ్ళు తమ చరిత్రను కూడా తాము నిర్మించుకోలేరు. అసలు వాళ్ళ చరిత్రే ప్రారంభం కాదు.

ఓపెన్ మైండెడ్‌గా ఉన్నప్పుడు సర్వదా శ్రేయస్కరమే జరుగుతుంది. ఓపెన్ మైండెడ్‌గా ఉన్న వాళ్ళకే గొప్ప గొప్ప ఆలోచనలు వస్తాయి. ఓపెన్ మైండెడ్‌గా ఉన్న వాళ్ళే గొప్ప గొప్ప పనులు చేయగలుగుతారు. ప్రస్తుతం ప్రపంచంలో చెలామణిలో ఉన్న గొప్ప గొప్ప ఆవిష్కరణలన్నీ ఓపెన్ మైండెడ్ మహాత్ములే చేసారు. అభివృద్ధి, శ్రేయస్కరం ఎప్పుడూ మన వెంట పడుతూనే ఉంటాయి. రిజిడ్ మెంటాలిటీతో మనమే వాటిని తిరస్కరిస్తూ ఉంటాం.

ఓపెన్ మైండెడ్‌గా ఉండటమంటే అభివృద్ధిని,

శ్రేయస్కరాన్ని అనుమతించడమే !

రిజిడ్ మెంటాలిటితో ఉండటమంటే దరిద్రాన్ని

అంటిపెట్టుకుని ఉండటమే ! కాబట్టి...

Be Open Minded Always... !

మతం అనేది ఎంత గమ్మత్తు అయిన మత్తు అంటే సత్యం నుండి మనిషిని సులభంగా దూరం చేస్తుంది, ఏనాటికీ ఏకం కానీయకుండా అడ్డం పడుతూ ఉంటుంది. ప్రపంచంలో అన్నింటికంటే పవర్‌ఫుల్ డ్రగ్ మతమే ! హిరాయిన్, కొకైన్‌ల కంటే చాలా చాలా చాలా శక్తివంతమైనది. కొయ్యగుర్రం లాగా విపరీతంగా ఊగుతూనే ఉంటుంది, ప్రయాణం చేయిస్తూనే ఉంటుంది కానీ గమ్యం ఏ నాటికీ చేర్చదు ! నేడు అంతరిక్షంలో అడుగు పెట్టాడు మానవుడు, చంద్రుని మీద అడుగు పెట్టాడు మానవుడు, రేపు ఇంకేం సాధిస్తాడో... కానీ మతంలో నుండి మాత్రం అడుగు బయట వేయలేకపోతున్నాడు ! మతాలన్నింటినీ వదిలేసి శ్రీకృష్ణ దేవుడు, ఏసు ప్రభువు, మహమ్మద్ ప్రవక్త గారు, గురునానక్, గౌతమ బుద్ధుడు, మహా వీర జైనుడు, లావోట్సు, చువాంగ్‌ట్సు మొదలైన వారంతా ఒకే సత్యం గురించి వేరు వేరు కాలాలలో, వేరు వేరు భాషలలో చెప్పారు అన్న సత్యాన్ని గ్రహిస్తూ "మత రహిత ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని" అభ్యసిస్తూ ఉంటే సత్యమైన అభివృద్ధి జరుగుతుంది. మీరు మతం అనే అంధాకారంలో ఎన్ని జన్మలున్నా సత్యం దరిదాపులలోకి కూడా పోలేరు !

3. ఆధ్యాత్మికం వేరే !

మతం వేరే !

ప్రియ మిత్రులారా !

ఆధ్యాత్మికత, ధ్యానం అనగానే కొంత మంది జనాల్లో ఒక రకమైన తప్పుడు అభిప్రాయం ఏర్పడిపోయి ఉంది.

ఆధ్యాత్మికత, ధ్యానం అనగానే "మతం", "మతం యొక్క కార్యకలాపాలు" అనే పూర్తి స్థాయి తప్పుడు అర్థం పాతుకుపోయి ఉంది. ఈ క్రింది విధంగా....

1. ఆధ్యాత్మికత = మతం

2. ఆధ్యాత్మిక కార్యకలాపాలు = మతం యొక్క కార్యకలాపాలు

3. ఆధ్యాత్మిక జ్ఞానం = మతానికి సంబంధించిన జ్ఞానం

1. SPIRITUALITY = RELIGION

2. SPIRITUAL ACTIVITIES = RELIGIOUS ACTIVITIES

3. SPIRITUAL KNOWLEDGE = RELIGIOUS KNOWLEDGE

పైన తెలిపిన ఈ 3 అభిప్రాయాలు 100% తప్పు !

100% WRONG !!

ఆధ్యాత్మికం అంటే మతం కానే కాదు, కాదు గాక, కానే కాదు ! ఆధ్యాత్మికంలో, మతం ఓ చిన్న భాగం మాత్రమే. ఎలా అయితే కోటాను కోట్ల విశ్వాలు, లోకాలు ఉన్న ఈ అనంత సృష్టిలో "భూమి" అనేది "ఎలా" ఓ చిన్న భాగమో, అదే విధంగా "మతం" అనేది "ఆధ్యాత్మికంలో" ఒక అత్యంత చిన్న తాత్కాలిక భాగం మాత్రమే ! ఆధ్యాత్మికం అనే సాగరంలో మతం అనేది జస్ట్ ఒక అల మాత్రమే !

ఆధ్యాత్మికం సాగరం ! మతం ఒక చిన్న తాత్కాలిక అల ! సాగరంలో నిత్యం ఎన్నో అలలు పుడుతుంటాయి అంతరిస్తుంటాయి, కానీ సాగరం శాశ్వతంగా ఉంటుంది !

ఆధ్యాత్మికం అంటే సర్వస్వం !

ఆధ్యాత్మికం అంటే మూలం !

ఆధ్యాత్మికం అంటే సృష్టి !

ఆధ్యాత్మికం అంటే అంతటా ప్రకటం అవుతున్న ఉనికి !

ఆధ్యాత్మికం అంటే సత్యం ! సత్యం అంటే ఉన్న విషయం !

ఆధ్యాత్మికం అంటే నిత్యం ! నిత్యం అంటే నశించనిదే, శాశ్వతమైనదే !

ఆధ్యాత్మికం అంటే స్వయం !

ఆధ్యాత్మికం అంటే ఏకత్వం !

భూమి ఒక చిన్న "లోకం". ఇలాంటి కొన్ని కోట్ల లోకాలు కలిపితే ఒక "విశ్వం". ఇలాంటి విశ్వాలు ఎన్నో ఉన్నాయి ఈ అనంత సృష్టిలో ! ఈ యొక్క అనంతమైన సృష్టి గురించి, దాని యొక్క మూలం గురించి తెలియజేసేదే "ఆధ్యాత్మిక శాస్త్రం" (Spiritual Science / Cosmic Science).

సర్వ - సర్వ, సకల - సకల, సమస్త శాస్త్రాలకు తల్లి ఆధ్యాత్మిక శాస్త్రం. Spiritual Science(Cosmic Science) is the mother science of all sciences. అది ఏ శాస్త్రమైనా సరే, అన్నీ దీనిలో భాగాలే !

ఏ పని చేసినా ముందు దాని గురించి తెలుసుకొని మరీ చేయాలి కదా !

మనకు అన్ని విషయాల గురించి ఎంతో కొంత తెలుసు. ఏ పని చేసినా దాని గురించి తెలుసుకుని చేస్తాం. ఒక ఊరికి వెళ్తున్నా, ముందు ఆ ఊరి గురించి తెలుసుకుని మరీ వెళ్తాం. చివరికి డస్ట్ బిన్ కొనాలన్నా దాని గురించి "ఆరా" తీసి, తెలుసుకుని మరీ కొంటాం.

ఏ పని అయినా తెలియనిదే చేయవద్దు !

ఏ పని చేసినా ముందు దాని గురించి తెలుసుకుని మరీ చేయాలి ! అనే సూత్రాలను పాటిస్తాము. ఇతరులకు చెప్తాము కూడా !

"మరి ఏ పని చేసినా తెలుసుకుని చేయాలన్నప్పుడు, మరి మన గురించి మనం తెలుసుకున్నాకే జీవించాలి కదా" !

"తెలియని పని చేయకూడదు, తెలుసుకున్న తర్వాతే చేయాలి".

"ముందు తెలుసుకోవాలి, ఆ తర్వాతే చేయాలి" ! ఇన్ని సూత్రాలు తెలుసు కదా !

"మరి ఎందుకు మన గురించి, మన జీవితం గురించి ఏ మాత్రమూ తెలుసుకోకుండా బ్రతికేస్తున్నాము" ?!

"మన గురించే మనకు తెలియనపుడు మరి మనం ఎందుకు బ్రతుకుతున్నట్టు" ?!

ప్రియ మిత్రులారా !

"ముందు మన గురించి మనం తెలుసుకోవాలి ఆ తర్వాతే ఏదైనా" !

"నీవు ఎవరివో నీకు తెలియనంత వరకు నీ జన్మ వృథా" !

ముందు నీ గురించి నీవు తెలుసుకో... అని అంటుంది ఆధ్యాత్మిక శాస్త్రం !

మొట్ట మొదట, కేవలం, "నీ" గురించే బోధన మొదలవుతుంది. నీ "స్వయం" గురించి బోధన మొదలవుతుంది. నీవు ఎవరివి ? నీ జీవితం ఏమిటి ? నీవు ఎందుకు పుట్టావు ? నీవు ఎందుకు చావాలి ? పుట్టక ముందు ఎక్కడ ఉన్నావు ? చచ్చిన తర్వాత ఎక్కడికి వెళ్తావు ? నీ జీవితంలోని అన్ని పరిస్థితులు ఏ విధంగా జరుగుతున్నాయి ? ఎందుకు జరుగుతున్నాయి ? నీ జీవితంలో కష్టాలు ఎందుకున్నాయి ? అవి ఎందుకు వచ్చాయి ? అవి ఎలా పోతాయి ?..... ఇలా కేవలం "నీ" గురించి, "నీకు" సంబంధించిన వాటి మీద బోధన ప్రారంభం అవుతుంది.

☸ ఇలా మన గురించి మొదలు పెట్టి, సృష్టి మూలం వరకు బోధన అంతా కొనసాగుతుంది. ఇలాంటి సృష్టి శాస్త్రానికి "మతం రంగు" వేయడం ఎంత అజ్ఞానం ?!!? ఎంతటి మూర్ఖత్వం !??!

ఆధ్యాత్మిక శాస్త్రాన్ని ఈ క్రింది విధంగా కూడా పిలుస్తారు.

నవీన యుగ ఆధ్యాత్మిక శాస్త్రం, ఆత్మ శాస్త్రం, సత్య శాస్త్రం,
పరమ సత్య శాస్త్రం, అంతిమ సత్య శాస్త్రం,
ఏకత్వ శాస్త్రం, అభిన్న శాస్త్రం, అభేద శాస్త్రం,
సృష్టి శాస్త్రం, స్వయం శాస్త్రం
పవిత్ర శాస్త్రం, దివ్య శాస్త్రం.... ఇలా ఎన్నో పేర్లు.....

Spiritual Science

New Age Spiritual Science

Cosmic Science

The Science of Creation

The Science of Soul

The Science of Self

The Divine Science

The Holy Science

Mother Science ....ఇలా, చాలా పేర్లున్నాయి.

మన గురించి, మనం మర్చిపోయి ఉన్నాము. "మనం ఎవరిమో" మనకు తెలియజేస్తుంది ఆధ్యాత్మిక శాస్త్రం. ఒక్కసారి మనం ఎవరిమో మనకు అనుభవ పూర్వకంగా తెలిస్తేనే కాని మన "సమస్యలు" శాశ్వతంగా పరిష్కారం కావు.

మన జీవితంలో నెలకొని ఉన్న సమస్యలన్నీ మనమెవరమో తెలియకే ! తెలియనందు వల్లనే అన్ని సమస్యలు. తెలిస్తే ఏ సమస్యా ఉండదు. ఎందుకంటే "తెలుసుకోవడంతోనే పరిష్కారం" జరుగుతుంది కాబట్టి. "తెలుసుకోవడం అంటే పరిష్కారమే" !

"సమస్య యొక్క మూలం తెలియడం మాత్రం చేతనే సమస్య పరిష్కారం అవుతుంది" - ఇది ఒక విశ్వ సూత్రం !

"మూలం తెలుసుకోవడమే పరిష్కారం" ! "అనుభవ పూర్వకంగా తెలుసుకోవడమే పరిష్కారం" !

మనం ఎవరమో తెలియజేయడానికి "సృష్టి" ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది. మనమే పట్టించుకోం !

"పావలా కోసం సృష్టి రహస్యాన్ని పక్కన పెట్టేస్తాం" ! పొద్దున లేచిన దగ్గర్నుండీ మన సోది మనదే ! ఎవరికి తగ్గ "వ్యవహారాలు" వారికి ఉంటాయి.

"కొందరి వ్యవహారాలు ఓపెన్‌గా ఉంటే, మరి కొందరివి "మ్యీటిలో" ఉంటాయి" !

సరే... ఏది ఏమైనా... మన గురించి మనం తెలుసుకుని తీరాలి కదా ! మనం, మన గురించి, మన చుట్టుపక్కల జరుగుతున్న విషయాల గురించి, సమాజంలో జరుగుతున్న విషయాల గురించి,

లోకం గురించి తెలుసుకుని తీరాలి. ఇక్కడ "విషయం" అని అంటే ప్రతీది అని కాదు... **ప్రధానమైనది** అని అర్థం. లోకంలో అన్నింటి కన్నా అత్యంత ప్రధానమైనది, తెలుసుకుని తీరాల్సినది, ఆధ్యాత్మిక శాస్త్రం. దీన్ని తెలుసుకుంటే అన్ని తెలుస్తాయి. ఆశ్చర్యకరంగా విషయాలన్నీ అర్థం అయిపోతాయి. లోకంలో ఉన్న అవకతవకలకు మూలం ఏమిటో అర్థం అయిపోతుంది. అప్పుడు ఆ యొక్క మూలాన్ని సరిచేసుకుంటే అన్నీ సరి అయిపోతాయి. అప్పుడు అందరం హాయిగా జీవించవచ్చు. జీవితాన్ని కలర్ ఫుల్‌గా ఎంజాయ్ చేయవచ్చు. ప్రతీ ఒక్కరు తెలుసుకుని, అందరికీ తెలియ చేయాల్సిన విషయం "ఆధ్యాత్మిక శాస్త్రం" !

1. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం ఒకటే ఉంది, ఒక్కటే ఉంటుంది.

1. మతం: మతాలు ఎన్నో ఉన్నాయి, ఇంకా ఎన్నైనా పుట్టుకు రావచ్చు.

---

2. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం అంటే మొత్తం సృష్టికి సంబంధించిన శాస్త్రం. తన, పర భేదం అనేది లేకుండా సృష్టి గురించి దాని లోని విశ్వాల గురించి, విశ్వాలలో ఉన్న లోకాల గురించి, సృష్టిలో ఉన్న సర్వ - సర్వ, సకల - సకల సమస్తానికి సంబంధించిన శాస్త్రం.

2. మతం: మతం ఒక ప్రత్యేకమైన, ఒక పర్టిక్యులర్ "దేవుడి" లేక "కొంత మంది దేవుళ్ళ" గురించి మాత్రమే చెప్తుంది. దీనికి తన, పర భేదాలు చాలా, చాలా ఉన్నాయి.

---

3. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం అందరికీ సంబంధించినది. "అన్నీ", "అందరూ", "అంతా" దీని పరిధిలోకి వస్తాయి.

3. మతం: మతం కేవలం తన యొక్క అంశాలను మాత్రమే తన పరిధిలోకి తీసుకుంటుంది.

---

4. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం సువిశాలమైనది. అనంతమైనది. శాశ్వతమైనది. ఇది సర్వాన్ని సర్వులను ఆదరిస్తుంది.

4. మతం: మతం ఎంతో సంకుచితమైనది. అశాశ్వతమైనది. ఇది ఎట్టి పరిస్థితులలోనూ వేరే వాటిని లేక వేరే మతం వారిని, ఆ యొక్క విషయాలను గానీ అస్సలు అనుమతించదు.

5. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం "అన్నింటిలో" కలిసి పోతుంది. "అంతటిలో" కలిసి పోతుంది. "అందరిలో" కలిసి పోతుంది. "అందరినీ" కలుపుకుంటుంది.

5. మతం : మతం దేనిలోనూ కలవదు. తన దగ్గరకి ఎవ్వరినీ రానివ్వదు. "కేవలం" తనకు సంబంధించిన వారిని మాత్రమే కలవనిస్తుంది.

---

6. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం ప్రేమ పూర్వకంగా, మైత్రీ పూర్వకంగా, స్వేచ్ఛాయుతంగా బోధిస్తుంది. సర్వ విజ్ఞానాన్ని అందిస్తుంది. అయితే "ఎంచుకునే స్వేచ్ఛను" ఇస్తుంది.

6. మతం : మతం తన గురించి మాత్రమే బోధిస్తుంది. తనలో చేరమని ప్రేరేపిస్తుంది. బలవంతం చేస్తుంది. చేర్చుకునే ప్రయత్నం చేస్తుంది. ఇలా చేయడం, చేర్చుకోవడం ద్వారానే మతం తన ఉనికిని కాపాడుకుంటుంది. మతంలో "ఎంచుకునే" స్వేచ్ఛ ఉండదు. "నిర్బంధం" ఉంటుంది.

---

7. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం సార్వజనీనమైనది. విశ్వజనీనమైనది.

7. మతం : మతం సార్వజనీనమైనది కాదు. విశ్వజనీనమైనది కాదు.

---

8. ఆధ్యాత్మిక శాస్త్రం : సృష్టి మూలానికి సంబంధించిన సిద్ధాంతం, concept ఆధ్యాత్మిక శాస్త్రానికి ఒకటే ఉంటుంది. ఎందుకంటే ఉండేది, ఉన్నది, ఉంటున్నది, ఉండబోయేది ఒకటే సృష్టి కదా !

8. మతం : సృష్టి గురించి ప్రతి మతానికి ఒక ప్రత్యేకమైన సిద్ధాంతం ఉంటుంది. సృష్టి మూలానికి సంబంధించి, ప్రతీ మతం తనదైన conceptను కలిగి ఉంటుంది. ప్రతీ మతం తనదే "సరి", "సత్యం" అని అంటుంది. మిగతావి అన్నీ తప్పు అంటుంది. మిగతావి అసత్యం అని బోధిస్తుంది. ఇలా దేనికదే సత్యమని అనుకుంటూ ఉంటుంది. ఆశ్చర్యం ! "ఒకే సత్యం" గురించి ఇన్ని సిద్ధాంతాలు, ఇన్ని విభిన్నమైనవి ఒకదానికొకటి ఏ మాత్రం పొంతన లేనివి, పూర్తి వ్యతిరేకమైనవి ! ఎంతో చదువుకున్న వారు ఉంటారు. ఎంతో విజ్ఞులం అని అనుకుంటూ ఉంటారు. ఈ ఒక్క విషయం మాత్రం అస్సలు ఆలోచించరు. ఇన్ని విభిన్న వాదనల్లో "అసలు విషయం" ఏమైనా ఉందా ? అని ఎవరూ పరిశోధించరు. గుడ్డిగా పేర్ల పక్కన డిగ్రీలు పెట్టుకుని చక్కగా "మూసలో" మూసుకుని ఉంటారు.

9. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం "ఉన్న విషయం" వివరిస్తుంది. "ఉన్నది ఏదో దాని గురించి మాత్రమే" తెలియజేస్తుంది. ఒప్పుకోవడం అనే విషయంలో దీనికి ఎలాంటి పట్టింపులు లేవు. కేవలం "విషయం" వివరిస్తుంది. ఒప్పించడం, భయపెట్టడం లాంటివి ఏవీ చేయదు.

9. మతం: మతం తన గురించి మాత్రమే చెప్తుంది. తన మాటే నెగ్గాలి అని పంతం పడుతుంది. బలవంతంగా ఒప్పించడానికి ప్రయత్నం చేస్తుంది. రక రకాలుగా భయపెట్టి ఒప్పిస్తుంది.

---

10. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రంలో గుడ్డి నమ్మకం, అంధ విశ్వాసం అనే వాటికి స్థానం లేదు.

10. మతం: మతం పూర్తిగా గుడ్డి నమ్మకం, అంధ విశ్వాసాల మీదనే ఆధారపడి ఉంటుంది.

---

11. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం కేవలం "పరిశోధనను", "స్వానుభవాన్ని" మాత్రమే అనుమతిస్తుంది. గుడ్డిగా నమ్మవద్దు. అంధ విశ్వాసం పనికిరాదు. పరిశోధించండి. పరిశోధించి నిజా నిజాలు నిగ్గు తేల్చుకోండి. అంతా మీ యొక్క "స్వానుభవం" మీదనే విషయం ఆధారపడి ఉంది. గుడ్డిగా నమ్మవద్దు, విశ్వసించవద్దు. పరిశోధించి, అనుభవించి సత్యం తెలుసుకోండి, అని బోధిస్తుంది.

11. మతం: మతం పరిశోధనను అంగీకరించదు. గుడ్డిగా నమ్మాలి, విశ్వసించాలి అంతే ! నమ్మకం, విశ్వాసం ఉండాలి. కానీ గుడ్డి నమ్మకం, అంధ విశ్వాసం ప్రమాదం కదా !

---

12. ఆధ్యాత్మిక శాస్త్రం : "సర్వం సమానమే", "అందరిదీ ఒక్కటే", "అంతా ఒక్కటే" అని తెలియజేస్తుంది. విషయాలు ఇక్కడ తెలియజేయబడతాయి. వాదన ఉండదు.

12. మతం: మతం తన గొప్పతనాన్ని గురించి వివరిస్తుంది. ఏ విధంగా ఇతర మతాలకన్నా పవిత్రమైనదో, ప్రాచీనమైనదో తెలుపుతూ వాదిస్తుంది. ఇక్కడ మొండి వాదన ఉంటుంది.

---

13. ఆధ్యాత్మిక శాస్త్రం: ఆధ్యాత్మిక శాస్త్రంలో తనను తాను సమర్థించు కోవడం అనేది ఉండదు. కేవలం ఇక్కడ "సర్వ సమర్థన" ఉంటుంది.

13. మతం: మతంలో పూర్తిగా "స్వయం సమర్థన" మాత్రమే ఉంటుంది.

14. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రంలో "ఆచరణ" ఉంటుంది. స్వయంగా పరిశోధించి పొందిన "అనుభవ జ్ఞానానికే" స్థానం ఉంటుంది.

14. మతం: ఇక్కడ పరిశోధనలు అనుమతించబడవు. ఎప్పుడో ఎవరో చెప్పిన దానిని కేవలం "వల్లె వేస్తూ", "వల్లె వేయిస్తూ" ఉండాలి అంతే ! ఆచరణ ఉండదు.

---

15. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మికం అంటేనే పరిశోధన, ఆచరణ. కేవలం రెండే రెండు పదాలను తీసివేయడం ద్వారా "మొత్తం" ఆధ్యాత్మిక శాస్త్రాన్ని తారుమారు చేసి చూపవచ్చు. పూర్తిగా తలక్రిందులుగా చేయవచ్చు. అసలు అర్థం కాకుండా చేయవచ్చు. మళ్ళీ జీవితంలో ఆధ్యాత్మిక శాస్త్రం వైపు కన్నెత్తి చూడకుండా, దాని గురించి ఆలోచించకుండా చేయవచ్చు. ఇంతకీ ఆ రెండు పదాలు ఏవి అంటే 1. పరిశోధన 2. ఆచరణ / స్వానుభవం.

15. మతం: మతం అంటే గుడ్డి నమ్మకం / అంధ విశ్వాసం మరియు అంధ అనుసరణ. మతాన్ని కూడా కేవలం రెండే రెండు పదాలను తీసివేయడం ద్వారా మొత్తం మతాన్నే మాయం చేయవచ్చు. ఆ రెండు పదాలు : 1. గుడ్డి నమ్మకం 2. అంధ అనుసరణ. గుడ్డిగా నమ్ముతూ ఉంటే, అంధత్వంతో అనుసరిస్తూ ఉంటే "అసలు విషయానికి" ఎప్పుడూ దూరంగానే ఉంటారు. గుడ్డి నమ్మకం, అంధ అనుసరణ పనికిరాదు. తెలుసుకోవాలి. తెలుసుకుని మసలుకోవాలి.

---

16. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం "నీవే దైవం", "అందరూ దైవాలే", "అంతా దైవమే" అని బోధిస్తుంది. ఇక్కడ దైవానికి మనిషికి ఏకత్వం ఉంటుంది, భిన్నత్వం ఉండదు. అభేదం ఉంటుంది, భేదం ఉండదు. దైవం మనిషి ఒక్కటే అనే భావన ఉంటుంది. దైవం, మనిషి వేరే అనే భావన ఉండదు. "సాధారణ మనిషిగా" ఉన్న "దివ్య మానవుడిని", తన దివ్యత్వంతో ఏకం చేసి "దైవంగా" మారుస్తుంది.

16. మతం: మతంలో భగవంతుడు వేరే, భక్తుడు వేరే అనే భావన ఉంటుంది. ఏకత్వం ఉండదు, భిన్నత్వం ఉంటుంది. దైవానికి, మనిషికి భేదం ఉంటుంది. దైవం వేరు, మనిషి వేరు అనే భావన ఉంటుంది. దైవమే అయి ఉన్న "దివ్య మానవుడిని" తన దివ్యత్వం నుండి వేరు చేసి ఎప్పటికీ "సాధారణ మనిషిగానే" ఉంచేస్తుంది మతం !

---

17. ఆధ్యాత్మిక శాస్త్రం : ఇక్కడ "జీవితానికి" విలువ, ప్రాధాన్యత, గౌరవం, స్వేచ్ఛ ఉంటాయి.

17. మతం: ఇక్కడ "పద్ధతికి" అంటే మూసకి మాత్రమే ప్రాధాన్యత ఉంటుంది. కేవలం "మూసనే" గౌరవిస్తారు. జీవితానికి, విలువ, గౌరవం, స్వేచ్ఛ ఉండదు. ఎందుకంటే మతం అంటేనే "మూస" కదా !

18. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం అందరూ ఒకటే అని బోధిస్తుంది. మొత్తానికి మొత్తం, సారాంశం గనక తీస్తే ఆధ్యాత్మిక శాస్త్రం "సృష్టి యొక్క ఏకత్వాన్ని" గురించి మాత్రమే బోధిస్తుంది.

18. మతం: కేవలం తమ మతం వారే గొప్ప, మిగతా అంతా తక్కువ అని బోధిస్తుంది. ఇక్కడ "ఏకత్వం" ఉండదు. సమానత్వం ఉండదు. మానవులంతా ఒక్కటే అనే విషయం ఎంత మాత్రమూ ఉండదు. కేవలం తమ మతం, తమ మతానికి సంబంధించిన విషయాలే గొప్పవి, పవిత్రమైనవి. మిగతావి అన్ని అపవిత్రం, అసత్యం, అర్థం లేనివే !

---

19. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం జీవితాన్ని జీవించమని చెప్తుంది. జీవితమే ఉత్సవం అని బోధిస్తుంది. అన్ని రకాలుగా చక్కగా ఆనందించమని చెప్తుంది.

19. మతం: అన్నీ త్యజించమని చెప్తుంది. త్యజించడంలోనే ఆనందం ఉందని చెప్తుంది. "స్వయం హింసలు" ఇక్కడ "గొప్పగా" చూడబడతాయి.

---

20. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం "అంతా దైవమేనని, అందరూ దేవుళ్ళేనని" ప్రకటిస్తుంది. దేవుళ్ళుగా ఎలా మారాలో బోధిస్తుంది. దైవత్వ బోధనలో భాగంగా అందరి గురించి బోధిస్తుంది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, మహా వీరుడు, మహమ్మద్, జీసస్ క్రైస్ట్, జొరాస్టర్, గురునానక్... ఇలా ప్రపంచంలో ఉన్న "మాస్టర్స్" అందరి గురించి బోధిస్తుంది. అందరినీ ఆదరిస్తుంది. ఆ మహాత్ముల బోధనలను "యథాతథంగా" ఆచరించమని చెప్తుంది. పరిశోధించి స్వానుభవం పొందండి అని చెప్తుంది. అందరి "మూలం" ఒక్కటేనని, ఆ యొక్క "మూలాన్ని" అనుభవపూర్వకంగా తెలుసుకోమని చెప్తుంది. అన్ని "మతాలు" కేవలం "మార్గాలేనని" అవి అన్నీ "ఒకే చోటికి" తీసుకెళ్తాయి అని చెప్తుంది. అన్ని మతాలను గౌరవించమని చెప్తుంది.

20. మతం: మతం కేవలం తమ దేవుడి గురించి మాత్రమే చెప్తుంది. దేవుడు వేరే, మనుషులు వేరే అని బోధిస్తుంది. ఇతర మతాలను పూర్తిగా తిరస్కరిస్తూ, వాటి పట్ల "ద్వేషాన్ని" ప్రకటిస్తుంది. ఎప్పుడూ అన్ని మతాలకు యుద్ధ వాతావరణం నెలకొని ఉంటుంది. దేని గొప్పతనాన్ని అది నిరూపించుకోవడానికి తాపత్రయ పడుతూ ఉంటాయి. మతం ఆదిపత్యం కోసం అల్లాడుతూ ఉంటుంది. ఆదిపత్యం లేనిదే మతం బతకలేదేమో అనేంతగా అల్లల్లాడి పోతూ ఉంటుంది.

21. ఆధ్యాత్మిక శాస్త్రం : అన్ని మతాలలోని "మూల సత్యాన్ని" గ్రహించమని, సహృదయంతో అర్థం చేసుకోమని చెప్తుంది. "సర్వ శాస్త్రాలు కలిపితేనే ఆధ్యాత్మిక శాస్త్రం" అవుతుంది. ఇది మొత్తం సృష్టికి సంబంధించినది.

21. మతం: వేరే మతం వైపు కన్నెత్తి కూడా చూడొద్దనీ, కనీసం ఆలోచన కూడా చేయవద్దని శాసిస్తుంది. నిర్బంధిస్తుంది. కేవలం తమ దేవుళ్ళ గురించి చెప్పడమే ఆధ్యాత్మికత అనే భావన ఇక్కడ ఉంటుంది.

---

22. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం, స్త్రీ పురుషులే కాదు మానవులంతా సమానమేననీ, ఒకటేనని అవగాహనతో ఐకమత్యంగా ఉంటూ ఆనందంగా జీవించమని బోధిస్తుంది. ప్రతి ఒక్కరు పరస్పర సహాయ సహకార సమన్వయాలను అందించుకుంటూ, జీవితాన్ని ఉత్సవంగా జీవిస్తూ, ఎంజాయ్ చేయమని చెబుతుంది. అన్ని మతాల పట్ల ప్రేమను, మైత్రిని ప్రకటిస్తుంది. ఇదీ క్లుప్తంగా ఆధ్యాత్మిక శాస్త్రం(Cosmic Science) అంటే !

22 . మతం: స్త్రీని మతం అణిచివేసినంతగా, అణిచివేస్తున్నంతగా మరేదీ కూడా అణచలేదు, అణచబోదు ! ప్రతీ మతం మిగతా మతం పట్ల "ద్వేషం", "దాడి" మొదలైనవి ప్రకటిస్తూ ఉంటుంది. ఇప్పటి వరకు ప్రపంచంలో "మతం" పేరిట జరిగిన, జరుగుతున్న అల్లకల్లోలాలే పెద్దవి. ప్రపంచ శాంతికి, మతం కలిగిస్తున్న విఘాతం చాలా పెద్దది. ఇది జగమెరిగిన సత్యమే అయినా... తెలియచేస్తున్నాను. స్త్రీ జాతికి సంపూర్ణ సమగ్ర స్వేచ్ఛ కావాలంటే మతం అనేది ఉండ కూడదు. మతం ఏ కొంచెం ఉన్నా, ఏ రూపంలో ఉన్నా స్త్రీని అణిచి పెట్టి, తొక్కి ఉంచుతుంది. మీకు తెలియదు మతం ఎన్నెన్ని యుగాలుగా స్త్రీని దారుణంగా, ఘోరంగా, నీఛంగా, హేయంగా, క్రూరంగా, రాక్షసంగా నరకయాతనలు పెడుతుందో మీ ఊహలకు కూడా అందదు. స్త్రీలకు నరకం అనేది ప్రత్యేకంగా ఎక్కడో లేదు. మతమే స్త్రీలకు నరకం ! అది ఏ మతమైనా కానీయండి మతమే స్త్రీలకు నరకం ! మత రహిత ఆధ్యాత్మికత మాత్రమే స్త్రీలకు నిజమైన సంపూర్ణ సమగ్ర శాశ్వత స్వేచ్ఛను ఇవ్వగలుగుతుంది. మతరహిత ఆధ్యాత్మికత ఒక్కటే స్త్రీ స్వేచ్ఛకు రాచ మార్గం ! నాస్తికమైనా, కమ్యూనిజమైనా, సోషలిజమైనా ఏదో రకంగా స్త్రీని బంధిస్తాయి, అణిచి పెడతాయి. నేటి వరకు ఈ భూమి పైన స్త్రీ స్వేచ్ఛగా జీవించిన దాఖలాలు లేవు. గత 3 లక్షల సంవత్సరాల చరిత్రను మీరు తోడినా మీకు స్వేచ్ఛగా జీవించిన స్త్రీ కనపడదు. కేవలం అవతార మూర్తులు & ఆధ్యాత్మిక వేత్తలు తప్ప ! మహారాణులైనా సరే బంగారు పంజరంలో బంధింప బడ్డారు. మతం & మరణం అనేదానిలో దేన్నో ఒకదాన్ని ఎంచుకునే పరిస్థితి వస్తే మరణాన్ని ఎంచుకోవడమే బెటర్ !

23. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మికతలో ఎట్టి పరిస్థితులలోనూ హింస, దాడి అనేవి ఉండవు గాక ఉండవు. ఆరు నూరైనా, నూరు ఆరైనా హింస, దాడి అనేవి ఉండనే ఉండవు. కేవలం స్వయం రక్షణ మాత్రం అజేయంగా, అమరంగా, అద్భుతంగా, అపూర్వంగా, అద్వీతీయంగా ఉంటుంది.

23. మతం: భూమి చరిత్రలో మతం పేరిట జరిగిన మారణ హోమాలు, యుద్ధాలే ఎక్కువ. ఇతర కారణాలతో రక్తపాతం జరిగింది అతి తక్కువ ! ప్రస్తుతం ఒక పసి మతం ప్రపంచంలో మతం పేరుతో, దేవుడి పేరుతో ఎంత దారుణ మారణహోమాలను సృష్టిస్తుందో అందరికీ తెలుసు. చాలా మతాలు యుద్ధాలు, రక్తపాతాలు, మారణహోమాలు చేసాయి కానీ రెండు పసి మతాలు మాత్రం అత్యంత ఎక్కువ చేసాయి. అవి పసి పిందెలు ! ఆ పిందెలకు సృష్టి రచన అర్థం కాక అల్లకల్లోలాలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా ఒక అతి పసికందైన పిందె మతం మరీ దారుణం ! అసలు ఆ మతం పసి కందు కూడా కాదు, ఇంకా పుట్టని పిండం !

---

24. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం ప్రోగ్రెసివ్‌గా, ఓపెన్ మైండెడ్‌నెస్‌తో, పరమాద్భుతమైన, అజేయమైన, అమరమైన మహా దివ్య పాజిటివ్‌నెస్‌తో ఉరకలేస్తూ ఉత్సాహంగా, ఉత్తేజంగా ధగ ధగమంటూ, భగ భగమంటూ ప్రజ్వలించిపోతూ ఉంటుంది !

24. మతం: నిస్సారంగా, నిరుత్సాహంగా, నిరాశా పూరితంగా నిస్తేజంగా జీవచ్ఛవంలాగా ఉంటుంది.

---

25. ఆధ్యాత్మిక శాస్త్రం : ఆధ్యాత్మిక శాస్త్రం సంపదలను, అష్ట ఐశ్వర్యాలను, సర్వ ఆనందాలను, సకల వైభవాలను, సమస్త విజయాలను ఎంజాయ్ చేయమని ప్రోత్సహిస్తుంది. అత్యున్నత పరిణామం, వేగవంతమైన అభివృద్ధి, నిత్య నూతన నవీన మార్పులు, శాంతి, ఉత్సవం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ అనేవి అపరిమితంగా, నిరంతరంగా ఆధ్యాత్మికంలో ఉంటాయి.

25. మతం: స్వయం హింస, పేదరికం, దుఃఖం, బాధలను ప్రోత్సహిస్తుంది. అశాంతి, బంధనాలు, బానిసత్వం, జడం[Rigidness] అనేవి అపరిమితంగా, నిరంతరంగా రాజ్యమేలుతుంటాయి. అభివృద్ధి, పరిణామం అనేవి అణువంత కూడా ఉండవు. నిరంతర ఏడ్పులు, పెడబొబ్బలే తప్ప మరేవీ ఉండవు.

---

26. ఆధ్యాత్మిక శాస్త్రం : నిరంతరం లోకకల్యాణాన్ని మాత్రమే ఆకాంక్షిస్తుంది. అందరై అంకిత భావంతో కృషి చేస్తుంది.

26. మతం: కేవలం తన ఉనికిని కాపాడుకోవడానికి మాత్రమే పనిచేస్తుంది. లోకం ఏమైనా మతానికి పట్టిలేదు.

27. ఆధ్యాత్మిక శాస్త్రం : ప్రతీ వ్యక్తి తనలో ఉన్న దైవత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలని చెప్తుంది, ప్రోత్సహిస్తుంది.

27. మతం: లేని దేవుడిని లేక దేవుళ్ళను నమ్మమని అంతకు మించి మరేమీ లేదని బోధిస్తుంది. నమ్మకపోతే దారుణంగా చిత్రహింసలు పెట్టి చంపేస్తుంది.

---

28. ఆధ్యాత్మిక శాస్త్రం : తనను విశ్వసించినా, విశ్వసించకపోయినా, తెలుసుకున్నా, తెలుసుకోకపోయినా ఏమీ అనదు. మౌనంగా, సహనంతో తెలుసుకుని విశ్వసించేంత వరకు ఎదురు చూస్తుంది.

28. మతం: నమ్మకపోతే నరకమే, హింసయే, మరణమే !

---

29. ఆధ్యాత్మిక శాస్త్రం :ఆధ్యాత్మిక శాస్త్రం దైవానికి, సర్వసృష్టికర్తయొక్క అథెంటికేటెడ్ అడ్రస్ !

29. మతం: సృష్టిలో సైతాన్ ఏదైనా ఉందీ అని అంటే ఆ సైతాన్ కేవలం మతం వల్ల మాత్రమే బతుకుతుంది. మతం లేనప్పుడు సైతాన్ కూడా ఉండదు. మతమే సైతాన్ యొక్క ఉనికి !

---

30. ఆధ్యాత్మిక శాస్త్రం :ఆధ్యాత్మిక శాస్త్రం దైవానికి, సర్వసృష్టికర్తయొక్క అథెంటికేటెడ్ & ఆథరైజ్డ్ కనెక్షన్ !

30. మతం: మతం ఏ నాటికీ సత్యంతో ఏకం కానివ్వదు. సత్యాన్ని శాశ్వతంగా వేరు చేసి ఉంచేదే మతం !

మతం అంటే మార్గం లేక విధానం లేక పథం... మొదలైనవి. అన్నీ కూడా ఒకే చోటికి తీసుకెళ్తాయి. ఒక్కోటి ఒక్కో రకంగా ! ఏ ప్రవక్త కూడా ఏ మతాన్నీ స్థాపించలేదు. ఆ మహా ప్రవక్తలు వెళ్ళి పోయాక కొంత మంది కలిసి వారి పేరు మీద మతాలను స్థాపించారు. ప్రవక్తల బోధనలను తమకనుకూలంగా మార్పులు చేసుకుని మత సామ్రాజ్యాలను స్థాపించి పరిపాలించడం మొదలు పెట్టారు. వారి తర్వాత వారి వారసులు... ఇలా లక్షల సంవత్సరాల నుండీ కొనసాగుతూ వస్తూ ఉంది. దివ్యాత్మలు రావడం సరైన బోధనలు చేసి వెళ్ళడం... వారు వెళ్ళగానే వారి పేరు మీద మతాన్ని స్థాపించడం అనేది పరిపాటి అయిపోయింది. అయితే ఇప్పుడు ఈ భూలోకం పరిణితి చెందింది. ఇక ఈ భూలోకం ఆధ్యాత్మిక లోకంగా మారనుంది. ఇక మీదట ఈ భూలోకంలో ఏ మతాలు, కులాలు ఉండవు. కేవలం ఒకే ఒక ఆధ్యాత్మిక మార్గం ఉంటుంది అంతే !

ఇప్పుడు ఈ భూమి మీద ఉన్న మతాధికారులు చేస్తున్న పనులు, చేయిస్తున్న పనులను ఏ దివ్యాత్ముడు కూడా హర్షించడు. శివుడు, విష్ణువు, వీరు చాలా ప్రాచీనమైన వారు. వీరి తర్వాత వచ్చిన జైనులు, జొరాస్టర్, గౌతమ బుద్ధుడు, జీసస్ క్రైస్ట్, మహమ్మద్ ప్రవక్త, గురు నానక్ మొదలైన ఏ దివ్య మహాత్ములు కూడా ఈ మతాధికారులు చేస్తున్న, చేయిస్తున్న పనులను హర్షించరు. ఎందుకంటే వారు చెప్పింది ఒకటి, వీరు చేసేది ఒకటి కాబట్టి !

ఆధ్యాత్మికత విషయంలో ఈ భూలోకంలో ఏ దేశానికీ లేని ప్రత్యేకత భారత దేశానికి ఉంది. ఎంతో అమూల్యమైన, విస్తారమైన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని లక్షలాది సంవత్సరాలుగా భారత దేశం కాపాడుతూ వస్తూ ఉంది. ప్రాచీన కాలంలో ఏ మతాలూ లేవు. ఎవరు దేన్ని నమ్మితే దాన్ని పూజించేవారు. జైన మతానికి కొంచెం ప్రాచీన చరిత్ర ఉన్నా ఆ మతం కూడా వయసులో చిన్నదే ! ఇక మిగిలిన బౌద్ధ, ముస్లిం, క్రైస్తవ మతాలు చాలా చాలా చిన్నవి వయసులో...! కనీసం 3,000 సంవత్సరాల చరిత్ర కూడా లేదు వాటికి. కానీ భారతీయ ఆధ్యాత్మికతకు మాత్రం అంచనాలకు అందనంత చరిత్ర ఉంది, బహుశా కొన్ని లక్షల లేక కొన్ని కోట్ల సంవత్సరాల చరిత్ర ఉంది. భారతీయం లేక భారత ఆధ్యాత్మికత తప్పనిసరి పరిస్థితులలో "హిందూ" మతానికి జన్మనివ్వాల్సి వచ్చింది. అన్య మతాలన్నీ వచ్చి భారత దేశంలో అల్లకల్లోలాలు సృష్టిస్తూ ఉంటే తప్పని సరై భారత దేశం హిందూ మతాన్ని ఆవిష్కరించింది. నిన్న మొన్న పుట్టిన పసికందులైన మతాల హడావుడి అంతా ఇంతా కాదు.

హైందవం సహనానికి ప్రతిరూపం !

హిందూ ధర్మానికి ఉన్న శాంత స్వభావాన్ని ఆసరాగా తీసుకుని అన్యమతాలు విపరీతాలు చేస్తున్నాయి, దానితో కొంత మంది హిందువులు కూడా తిరగబడటం మొదలు పెట్టారు. భారత దేశం హిందూ దేశం అయినా సెక్యులర్ కంట్రీగా మారి తన ఔన్నత్యాన్ని ప్రదర్శించింది. భారత దేశ సార్వభౌమత్వం సదా విరాజిల్లు గాక !

ప్రపంచంలోని స్త్రీలందరి యొక్క స్వేచ్ఛకు ఆధ్యాత్మిక శాస్త్రం ఒక్కటే శరణ్యం. ఎందుకంటే స్వేచ్ఛ అనేది "ఎవరో ఎవరికో ఇచ్చేది కాదు", "స్వేచ్ఛ అంటే ఎవరికై వారు తీసుకోవలసినది" ! ఆధ్యాత్మిక శాస్త్రం మిమ్మల్ని అజ్ఞానపు బంధనాల్లో నుండి విడుదల చేస్తుంది. ఆధ్యాత్మిక విజ్ఞానం కలిగి ఉన్న ఏ స్త్రీనైనా సరే స్వేచ్ఛను పొందకుండా ఎంతటి శక్తివంతమైన మగాడైనా సరే ఆపలేడు. ఏ మతమూ ఆపలేదు. ఏ దేశమూ ఆపలేదు. ఏ సమాజమూ ఆపలేదు. సంప్రదాయ సంస్కారాలనే, ఆచారాలనే, సంస్కృతి అనే గొలుసులు ఇక ఏ మాత్రమూ ఆధ్యాత్మిక విజ్ఞానం కలిగి ఉన్న స్త్రీని ఆపలేవు. మతం చక్కగా స్త్రీని బంధించగలుగుతుంది. అయితే ఇప్పుడు కాలం మారింది. విషయాలు అన్నీ అందరికీ అర్థమయ్యాయి. ఇప్పుడు ఏదీ ఎవరినీ బంధించ లేదు. ఇప్పుడు, ఇది సేచ్ఛా యుగం. ఇప్పుడు అందరికీ తెలుసు స్త్రీ పురుషులు సమానమేనని ! స్త్రీ యొక్క ఔన్నత్యాన్ని గుర్తించి, గౌరవించనందుకే భూమి పైన అస్తవ్యస్తమైన వ్యవస్థ ఏర్పడింది. ఇప్పుడు స్త్రీ యొక్క ఔన్నత్యాన్ని ప్రతీ పురుషుడు గుర్తించి గౌరవించాల్సిన సమయం ఇది. తప్పదు. అయితే నిజానికి, స్త్రీ గొప్ప కాదు, పురుషుడు గొప్ప కాదు, ఎవరైతే అనుభవపూర్వక ఆత్మ విజ్ఞానం కలిగి ఉండి సరైన ఉన్నతమైన అవగాహనతో విరాజిల్లుతూ ఉంటారో వారే నిశ్చయంగా గొప్పవారు. వారు స్త్రీలైతే స్త్రీలు ! పురుషులైతే పురుషులు ! ఎవరైతే ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అభ్యసించడం ప్రారంభిస్తారో అప్పుడు వారు ఆత్మ పరంగా, మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా స్వేచ్ఛను పొందియే తీరుతారు. ఆధ్యాత్మిక విజ్ఞానం మీకు కలిగితే అప్పుడు మిమ్మల్ని స్వేచ్ఛను పొందకుండా సృష్టిలోని ఏ శక్తీ ఆపలేదు.

వేలాది సంవత్సరాల మానవ జాతి చరిత్రలో ఎన్నెన్నో భయంకరమైన యుద్ధాలు జరిగాయి. ఇలా జరిగిన యుద్ధాలు - జరిగాయి, ఆగిపోయాయి. ఆగకుండా ఆరకుండా, రగులుతూ వస్తున్న యుద్ధం ఒకే ఒక్కటి - అది మతాల యుద్ధం ! క్యాన్సర్, ఎయిడ్స్ కంటే కొన్ని కోట్ల రెట్లు భయంకరమైనది ఈ "మతం అనే రోగం" ! అణు బాంబుల గురించి ఆందోళనలు చేసే వారు, వాటి కంటే ఎంతో ప్రమాదకరమైన "మతం బాంబుల" గురించి కూడా ఆలోచిస్తే బాగుంటుందని మనవి చేస్తున్నాను.

హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులు పడిన తర్వాత కూడా ఆ నగరాలు పునరుజ్జీవనాన్ని సంతరించుకున్నాయి. కానీ "మతం బాంబుల" దాడికి గురైన మానవాళి మాత్రం ఎప్పటికీ కోలుకోలేదు. దేనితోనైనా జరిగే నష్టాన్ని కవర్ చేసుకోవచ్చు. "మతం బాంబుల" వలన జరిగిన నష్టాలను ఏనాటికీ కవర్ చేసుకోలేం.

మతం యొక్క "దుష్ప్రభావం" మానవ జాతి మీద ఎంత బలంగా పడుతుందో తెలుసుకోవాలంటే ఆత్మ విజ్ఞానం ఒక్కటే శరణ్యం. సరైన ఉన్నత ఆత్మ విజ్ఞానం ద్వారా తప్ప, మీరు మరే రకంగా అధ్యయనం చేసినా అది లోపభూయిష్ఠంగానే ఉంటుంది. ఆత్మ విజ్ఞానం ఒక్కటే సమస్య యొక్క అసలు సిసలు మూలాన్ని సూటిగా, పూర్తిగా చూపించ గలుగుతుంది, పరిష్కరించగలుగుతుంది.

✵ ఎప్పటి వరకైతే ఈ "మతం" అనే "సైతాన్" భూమిపై నశించిపోదో అప్పటి వరకు శాంతిని ఆశించడం అత్యాశ & అజ్ఞానమే అవుతుంది. జాతి మత రహిత, కుల రహిత మానవ సమాజ స్థాపన కోసం మనమందరం తక్షణమే కంకణం కట్టుకుని, అవిశ్రాంత పరిశ్రమ చేయవల్సిన అత్యవసర పరిస్థితులు ప్రస్తుతం నెలకొని ఉన్నాయని గుర్తు చేస్తున్నాను. **అత్యంత త్వరలోనే జాతి మత రహిత, కులరహిత, స్త్రీ పురుషులు సరి సమానం అనే దివ్య మానవ సమాజం ఉద్భవించి తీరుతుందని నాకు తెలుసు !**

✵ మతాలను చీకటి శక్తులు సృష్టించాయి. మతాలు మనుషులను విడదీస్తాయి. ప్రపంచ శాంతిని భంగ పరుస్తాయి. అన్ని మతాల సారం ఒక్కటేనని గ్రహించి మానవులంతా మానవత్వంతో ఏకం కావాలి. ఇది సరైన ఉన్నత ఆత్మ విజ్ఞానం వలన సులభం, సరళం !

జాతి, మత, కుల, వర్గ భేదాలు మీలో ఉన్నాయి
అని అంటే, మీకు ఆధ్యాత్మికతలోకి ప్రవేశం దొరకదు.

జాతి, మత, కుల, వర్గ భేదాలను మీరు పూర్తిగా
విడిచినప్పుడు మాత్రమే మీరు ఆధ్యాత్మికతలోకి ప్రవేశించ గలరు.

మతపరమైన గ్రంథాలను చదవడం మరియు మతపరమైన
కార్యక్రమాలను చేయడం ద్వారా మీరు పుణ్యకార్యాలు
చేస్తున్నాము అని అనుకుంటే అది మీ యొక్క అజ్ఞానమే !
వాటి వలన ఏ ప్రయోజనం ఉండదు.

దేవుడు మానవ ఆకారంలో ఉంటాడు అని
అనుకోవడం అజ్ఞానం ! దైవానికి ఒక ఆకారం
అంటూ లేదు. అన్ని ఆకారాలు దైవానివే !
ఈ విధంగా దైవం ఆకారం లేనిది మరియు
ఆకారం కలదిగా అయింది !

సృష్టి మొత్తం సర్వకాల సర్వావస్థలలోనూ,
మీ ఆధ్యాత్మిక అభివృద్ధికి సిద్ధంగా ఉంటూనే ఉన్నది.
ఏవో దుష్టశక్తులు, మిమ్మల్ని అడ్డుకుంటాయని,
ఇతర గ్రహాంతర వాసులు మిమ్మల్ని ఆటంకపరుస్తారని,
ఎవరైనా దేవుళ్ళూ దేవతలు మిమ్మల్ని నియంత్రిస్తూ ఉంటారు
అనేవి పూర్తిగా భ్రమలు. వీటిని ఈ క్షణమే వదిలేయండి.
''నేను ఈ భ్రమలను వదిలేసాను''... అని పదే పదే అనుకుంటే
వెంటనే, ఈ భ్రమలు పూర్తిగా తొలగిపోతాయి.

మీ యొక్క ఆత్మాభివృద్ధిని ఆటంకపరిచే శక్తులు
ఈ సృష్టిలోనే ఎక్కడా ఉండవు.
మీ యొక్క అజ్ఞానంలో నుండే, మీ విస్మృతిలో నుండే దుష్టశక్తులు
అనేవి పుడుతున్నాయి. మీకు జ్ఞానం రాగానే
అవన్నీ అంతరించిపోతాయి.

ప్రతీ మతం వారు తమ దైవమే నిజమైన దైవం,
తమ దేశమే పవిత్ర దేశం, తమ భాషయే దైవీ భాష,
తమ సంప్రదాయాలే మంచివి,
తమ సంస్కృతియే గొప్పది
అని అనుకుంటూ ఉంటారు. ఎవరిది వారు మంచిది
అని అనుకోవడంలో తప్పేమీ లేదు....
కానీ ఇతరులది మంచిది కాదు అని అనడమే అజ్ఞానం !
మతపరమైన స్పర్ధలు మూర్ఖత్వం వలన వస్తాయి !
మతపరమైన గొడవలు, యుద్ధాలు అజ్ఞానం పరాకాష్ఠకి
చేరినప్పుడు జరుగుతాయి !

పార్ట్ - 7

All Is One !

అంతా ఒక్కటే !

ఈ భూమి ఒక లోకం. ఇలాంటివి
కోటాను కోట్ల లోకాలను కలిపితే ఒక విశ్వం.
ఈ అనంత సృష్టిలో లెక్క లేనన్ని విశ్వాలు ఉన్నాయి.
ప్రతీ విశ్వంలోని, అత్యధిక శాతం లోకాలలో జీవులున్నారు.
జీవితం ఉంది. వ్యవస్థ ఉంది. ఈ భూమి కంటే చాలా చాలా
చాలా అడ్వాన్స్‌డ్ లోకాలు ఎన్నో ఉన్నాయి.

ప్రస్తుతం ఈ భూమి పైన ఉన్న శాస్త్ర విజ్ఞానం అంతా అడ్వాన్స్‌డ్
లోకాల నుండి దిగుమతి చేసుకున్నదే. అడ్వాన్స్‌డ్ లోకాల నుండి కొంత
మంది మాస్టర్స్ ఈ భూమి పైన మానవులుగా జన్మ తీసుకుని, అక్కడి
విజ్ఞానాన్ని ఇక్కడ స్థాపించి వెళ్ళిపోయారు. ఇది ఇలా జరుగుతూనే
ఉంటుంది. త్వరలోనే ఇతర లోకాల యొక్క ఉనికి తెలుస్తుంది.
ఈ భూలోక వాసులకు మరియు ఇతర లోకాల వారికి మైత్రి
సంబంధాలు ఏర్పడతాయి. అప్పుడు ఈ మానవ జాతి
ఎంతో అభివృద్ధి చెందుతుంది.

అప్పుడు తెలుస్తుంది
అంతా ఒక్కటేనని !

All Is One ! అంతా ఒక్కటే !

చంద్రుని మీద మనిషి అడుగు పెట్టాడు, అయినా మతంలో నుండి అడుగు బయట పెట్టలేక పోతున్నాడు !

పెద్ద పెద్ద చదువులు చదివిన వారికి తెలుసు.. అయినా మతంలో నుండి బయట పడాలంటే ధైర్యం చాలదు. ఒక్క సారి మహాత్ముల బోధనలను జాగ్రత్తగా చదవండి. అందులో అన్ని ప్రశాంత పూర్వకమైన సత్యాలే ఉంటాయి.

ఏ మతం యొక్క స్థాపకుడైనా చెప్పింది ఒకే ఒక్క విషయాన్ని - మోక్షం పొందమని. ఈ మోక్షానికి చాలా పేర్లున్నాయి. ఒక్కో మాస్టర్ ఒక్కో రకంగా చెప్పాడు. కాని అందరూ చెప్పింది ఒకే సత్యాన్ని ! ఎందుకంటే ఉన్నది, ఉంటున్నది మరియు ఉండబోయేది ఒకే సత్యం కదా !

మతాన్ని మూఢంగా నమ్ముతూ ఉండడంతో... లోకంలో ఎన్నెన్నో వినాశనాలు జరుగుతున్నాయి. మతాధికారులకు, మత గ్రంథాలలో ఉన్న సత్యాలపైన సరి అయిన అవగాహన లేకపోవడం చేత, వారి యొక్క సంకుచిత దృష్టితో విషయాలను అర్థం చేసుకుని, ప్రజలకు బోధిస్తున్నారు. ప్రతీ మతం వారు తమదే కరెక్ట్ అని బలంగా, మూఢంగా, మూర్ఖంగా నమ్ముతూ ఉండడంతో... ప్రపంచమంతా భయంకరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి, లోకాన్ని ఉద్ధరించాలని ఉద్యుక్తమైన సంస్కరణ వాదులు, గుర్తించాల్సింది ముఖ్యంగా ఈ విషయాన్నే ! ప్రతీ మతం యొక్క పెద్దలు తమ మతమే సరి అయినది అని, తమ మతాన్ని కాపాడుకోవాలని, తీవ్ర ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు. వారికి నిజంగా అసలు సత్యం తెలియదు. కాబట్టే వారు ఈ విధంగా చేస్తున్నారు.

ఏ మతం యొక్క మూల పురుషుడూ... తన బోధనలలో ఇతర మతాల వారిని చంపండి, వారిని నాశనం చేయండి అని చెప్పలేదు. కేవలం నన్ను మాత్రమే అనుసరించండి అని చెప్పాడు. నేను చెప్పేది మాత్రమే సరి అయినది అని చెప్పాడు.

ఇది సరిగా అర్థం చేసుకోవాల్సిన విషయం.

ప్రతీ మహాత్ముడు అంటే, శ్రీకృష్ణుడు, జీసస్ క్రైస్ట్, మహమ్మద్ ప్రవక్త... ఇంకా ఇతర మహాత్ములందరూ.. ప్రతీ ఒక్కరూ..

కేవలం నన్ను మాత్రమే అనుసరించండి అని చెప్పారు.

నేను చెప్పేది మాత్రమే సరి అయినది అని చెప్పారు.

ప్రతీ ఒక్కరిదీ సత్యమే!

ఇది సరిగా అర్థం చేసుకోవాల్సిన విషయం.

నేనే అంతా.. అంతా నేనే.. నేనే దైవాన్ని అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అన్నింటినీ విడిచి పెట్టు.. నన్ను శరణు వేడు.. నేనే దైవం, నేను మాత్రమే మోక్షాన్ని ఇస్తాను అని చెప్పాడు.

నేనే మార్గం, నేనే ద్వారం నేను దేవుడి కుమారుడిని, నన్ను స్వయంగా ఆ దేవుడే పంపాడు, నేను చెప్పేది విశ్వసించండి. మీరు నా ద్వారా తప్ప మరొక విధంగా దైవాన్ని చేరుకోలేరు అని జీసస్ క్రైస్ట్ చెప్పాడు.

నేను భగవంతుడి యొక్క నిజమైన సందేశహరుడిని నేను చెప్పేది మాత్రమే సత్యం. స్వయంగా అల్లా నాతో చెప్పిన విషయాలను మరియు దేవదూతలు చెప్పిన విషయాలనే.. నేను మీకు చెబుతున్నాను కాబట్టి, నేను చెప్పే వాటిని మాత్రమే విశ్వసించండి. కేవలం నన్ను మాత్రమే అనుసరించండి అని మహమ్మద్ ప్రవక్త చెప్పాడు.

ప్రతీ ఒక్కరూ కేవలం నన్ను మాత్రమే అనుసరించండి అని చెబుతున్నారు. కాబట్టే వారిని అనుసరించే వాళ్ళు కేవలం వారిని మాత్రమే అనుసరిస్తున్నారు. ఇక్కడ సమస్య లేదు. సమస్య ఎక్కడ వస్తుందంటే... మా మార్గమే ఒప్పు, మిగతా మార్గాలన్నీ తప్పు అని అనడంతోనే సమస్య ఉత్పన్నమవుతూ ఉంది. కేవలం అనడంతో మాత్రమే సరి పెట్టుకుంటే బాగుండేది కాని, వ్యతిరేకించడం, ఘర్షణలకు దిగడం, ఒకరినొకరు చంపుకునే దాకా వచ్చే సరికి సమస్య తీవ్ర రూపం దాల్చింది. దేవుడి పేరుతో ఒకరినొకరు చంపుకోవడం అనేది ఎంత మూర్ఖత్వం అంటే... దానిని ఏమనాలో నాకు మాటలు దొరకడం లేదు.

ఏ మాస్టర్ అయినా కేవలం నన్ను మాత్రమే అనుసరించండి అని చెబుతాడు. ఎందుకు అలా చెబుతాడంటే...

సత్యాన్ని(దైవాన్ని) పొందడానికి అనంతమైన మార్గాలున్నాయి. ప్రతీ మాస్టర్ తనదైన శైలిలో లేక అంతకు ముందే ఏర్పరచి ఉన్న ఏదో మార్గంలో సత్యాన్ని పొందుతాడు. అతడు ఏ మార్గంలో అయితే సత్యాన్ని పొందాడో ఆ మార్గాన్నే అతడు బోధిస్తాడు. ఏదో ఒకదానిలో ప్రయాణిస్తే మంచిదనే ఉద్దేశంతో కేవలం నన్ను మాత్రమే అనుసరించండి అని చెబుతాడు. అంతే ! ఇందులో ఇంతకు మించిన నిగూఢ రహస్యం ఏమీ లేదు. మీకు మరో కోణంలో వివరిస్తాను.. మీరు నీళ్ళ కోసం బావి త్రవ్వాలనుకుంటున్నారు అని అనుకోండి, మీరు ఒకే దగ్గర త్రవ్వితే నీళ్ళు పడతాయి(దొరుకుతాయి). మీరు ఒక దగ్గర కొంచెం, మరొక దగ్గర కొంచెం, ఇంకో దగ్గర కొంచెం ఇలా అక్కడక్కడా కొంచెం, కొంచెం త్రవ్వుకుంటూ పోతూఉంటే.. ఎక్కడ కూడా నీళ్ళు పడవు. ఇలా అక్కడక్కడా త్రవ్వడమనేది

అనవసరమైన శ్రమయే కాక, సమయం వృథా చేయడమే అవుతుంది. అదే మీరు, ఒకే దగ్గర త్రవ్వితే గ్యారంటీగా నీళ్ళు పడతాయి(దొరుకుతాయి) కదా ! మనుషులు చపల చిత్తులు కాబట్టి అటూ ఇటూ పరిగెత్తి సమయాన్ని మరియు శక్తిని వృథా చేసుకుంటారనే ఉద్దేశంతో ఆ మాస్టర్స్ కేవలం నన్ను మాత్రమే అనుసరించండి అని చెప్పారు. మామూలుగా చెబితే కొంత మందికి అర్థం కాదని, దృఢంగా చెప్పారు. దానితో జనాలు అటూ ఇటూ చెదిరిపోరని, సరిగా ఒకే మార్గంలో ప్రయాణిస్తారనీ అలా చెప్పారు. అంతే ! ఈ విషయాలను కొందరు మూర్ఖ ఛాందసులు తమ మూఢత్వంతో పూర్తిగా తప్పు స్థాయిలో అర్థం చేసుకుని అల్లకల్లోలాలు సృష్టిస్తున్నారు. ఈ మూర్ఖ ఛాందసవాదులు మతాలలో పెద్ద పెద్ద స్థానాల్లో ఉండే సరికి, వారి ఆటలు సాగుతున్నాయి. దేవుడు మరియు మోక్షం అనే రెండు విషయాలను అడ్డం పెట్టుకుని వారు ఎన్నో అరాచకాలను చేస్తూ వాటిని దైవ కార్యాలుగా సమర్థించుకుంటున్నారు. ప్రజలు మేలుకోవాలి. విశాలమైన దృక్పథంతో ఆలోచించాలి. ఈ మధ్య కొత్తగా ఒక టెక్నిక్ మొదలైంది.. మతాన్ని ధర్మం అని అంటున్నారు. అంతర్జాతీయంగా ప్రజలలో చైతన్యం వచ్చి మతాలను + మతాధికారులను వ్యతిరేకిస్తూ ఉండడంతో, మతాలకు ధర్మం అనే టెక్నికల్ ముసుగు వేసిపారేశారు. నిజానికి ధర్మం వేరే ! మతం వేరే !

ధర్మం అంటే - నిష్కలహం, విధి(డ్యూటి), స్వభావం, సమత్వం, నీతి, నిజాయితి, నిబద్ధత, న్యాయం మొదలైన అర్థాలు వస్తాయి.

ఇందులో మొదటిది - **నిష్కలహం :** కలహించనిది, విభేదించనిది, వ్యతిరేకించనిది, వైరం లేనిది & ఉండనిది, శత్రుత్వం చేసుకోనిది మరియు తన పని తాను చేసుకుపోయేది అని అర్థం. నిష్కలహం అంటే, భేదాలను పట్టించుకోనిది, చీలికలు చేయనిది, తేడాలు చూపనిది, ఏ రకంగానూ వాదన చేయనిది.

రెండవది - **విధి(డ్యూటి) :** తప్పని సరిగా చేసి తీరాల్సినది. ఇతరులపై మోపడానికి లేనిది. తప్పించుకోలేనిది.

మూడవది - **స్వభావం లేక గుణం :** ధర్మం, స్వభావం మరియు గుణం ఈ మూడు కూడా ఈ కోణంలో ఒకే అర్థాన్నిస్తాయి. సూర్యుడి యొక్క స్వభావం మండడం, వేడిమి, శక్తిని మరియు ప్రకాశాన్ని ఇవ్వడం. మంచు యొక్క గుణం చల్లదనం. అగ్గిపుల్ల యొక్క స్వభావం మండడం. ప్రతీ ఒక్క దానికి తనదైన ఒక స్వభావం(ధర్మం) ఉంటుంది. దేనికైతే ఎలాంటి ధర్మం(స్వభావం) ఉంటుందో అది అలానే తప్ప మరొక రకంగా చేయదు లేక ఉండదు అని అర్థం.

నాలుగు - **సమత్వం :** అంతటిని.. దేని మానాన దానిని ఒప్పుకుంటూ, అందరిని.. ఎవరి మానాన వారిని ఒప్పుకుంటూ, తన మానాన తాను ఉండేది. మంకు పట్టు పట్టనిది, మొండి వాదన చేయనిది, ఉచ్చనీచాల తేడాలను చూపుతూ ఘర్షణ పడనిది. సకారణంగానైనా, అకారణంగానైనా,

ఏ రకంగానైనా కోపం, క్రోధం, కసి, పగ, ప్రతీకారం మొదలైన భావాలను ప్రకటించనిది మరియు ఆచరించనిది. అంతా సరి, అందరూ సరి, నేనూ సరి అని అనుకుంటూ, తనేమిటో శాంతియుత మార్గాన తెలియజేస్తూ, తన మార్గాన తాను ముందుకు సాగుతూ ఉండేది.

అయిదు - **నీతి** : సారం అని అర్థం. నీతి అని అంటే మంచి గుణం అనే అర్థంగా కూడా వాడుతారు.

ఆరు - **నిజాయితి** : ఉన్నది ఉన్నట్టుగా ఉండడం. సరిగా ఉండడం. మోసం మరియు బలవంతం(దౌర్జన్యం) లేకుండా ఉండడం.

ఏడు - **నిబద్ధత** : అనుకున్న దానికి, స్వీకరించిన దానికి కట్టుబడి ఉండడం. నెరవేర్చే గుణం. పూర్తి అయ్యే వరకు మధ్యలో ఉపసంహారం చెందకుండా ఉండడం.

ఎనిమిది - **న్యాయం** : సహజంగా, సమయ సందర్భానుసారంగా ఎవరికి చెందవలసినది వారికి, దేనికి చెంద వలసినది దానికి చెందాలి అనే భావన. (న్యాయానికి ఇంకా వేరే అర్థాలున్నాయి)

ధర్మం అంటే ఇంత విస్తృతమైన అర్థం ఉంది. ఇప్పుడు ఆలోచించండి, ప్రస్తుతం ఈ భూమి పైన ఉన్న ఏ మతానికి అయినా ఇన్ని శుభ లక్షణాలున్నాయా ?!

ఉన్నాయి ! ప్రతీ మతానికీ ఉన్నాయి ! చాలా మంది మత పెద్దలకు లేవు ! ఇన్ని శుభ లక్షణాలలో సగమైనా ఉంటే, ప్రపంచంలో మతం పేరున ఇన్ని ఘోరాలు జరగవు. మత పెద్దలు తమ యొక్క సంకుచిత ధోరణిని ప్రజలకు అంటగడుతున్నారు. ఎందుకొచ్చిన చావు.. అని ప్రజలు భయపడుతూ వారు చెప్పినట్టల్లా వినాల్సి వస్తుంది. లేకపోతే మీకు అది జరుగుతుంది, ఇది జరుగుతుంది అని భయ పెడతారు కదా !

మతం అంటే అభిప్రాయం లేక మార్గం అని అర్థం. ఒక మహాత్ముడు తాను సత్యాన్ని పొందిన విధానాలను, విశేషాలను తనదైన రీతిలో తెలియజేస్తాడు. ఆ మహాత్ముడు ఏ కాలానికి చెందిన వాడో, ఏ ప్రాంతానికి చెందిన వాడో గమనించాలి. మహాత్ముల బోధనలు కాలానికి అనుగుణంగా, ప్రాంతానికి అనుగుణంగా ఉంటాయి. ఏ మహాత్ముడైనా ఒకే సత్యం చెప్తాడు. అయితే, కాలానికి మరియు ప్రాంతానికి అనుగుణంగా తనదైన శైలిలో చెప్తాడు. ఈ విషయాన్ని బాగా గుర్తుంచుకోవాలి. అప్పుడు అక్కడి ప్రాంత ప్రజల యొక్క స్థితిని బట్టి వారికి ఎలా చెబితే అర్థం అవుతుందో అలా చెప్తాడు. ప్రతీ మాస్టర్‌దీ ఒక ప్రత్యేకమైన మార్గం. కాబట్టి తన బోధనలకు అనుగుణమైన నియమ నిబంధనలను విధిస్తాడు. ఈ నియమ నిబంధనలలో సగం ఆ కాలానికి సరిపోయేవి కాగా, మిగతా సగం ఎల్లప్పటికీ పనికి వచ్చే విధంగా ఉంటాయి. ఇవి గుర్తించాలి. గుర్తించాలంటే ఓపెన్ మైండ్ ఉండాలి. **తాను మునిగేదే గంగ, తాను వలచిందే రంభ** అంటూ

మొండిగా వాదించకూడదు. విశాల దృక్పథంతో ఆలోచించాలి. ఏ ఏ మాస్టర్ ఏమేం, ఎలా చెబుతున్నాడు ? అని పరిశీలిస్తే అందరూ ఒకటే చెబుతున్నారని చాలా సులభంగా అర్థమైపోతుంది. ఏ మతానికి చెందిన వారు ఆ మత మూల పురుషుడిని గౌరవించి ఆయన చూపించిన మార్గంలో నడవడం మంచిదే కాని, ఇతర మార్గాలన్నీ తప్పు కాబట్టి అన్నింటినీ నాశనం చేసి మా మార్గాన్ని మాత్రమే వ్యాపింపచేస్తాము అని అనడం మహా మూర్ఖత్వం ! ప్రియ మిత్రులారా... ఆలోచించండి... మేలుకోండి, మత పెద్దలు రెచ్చగొడితే రెచ్చిపోకండి... సత్యం ఏమిటో తెలుసుకోండి. మతాధికారులకు భయపడకండి. దేవుడికి వారేమీ ఆథరైజ్‌డ్ ఏజెంట్లు కాదు. దేవుడికి మీరెంతో, వారూ అంతే..! దైవం తనను తాను ఒక మాస్టర్ ద్వారా ప్రకటం చేసుకుంటుంది. ఆ మాస్టర్ ద్వారా తనను ఎలా చేరుకోవాలో తెలియజేస్తుంది. అన్ని దారులు ఒక వైపుకే తీసుకెళ్తాయి. దారులు భిన్నంగా ఉండవచ్చు, కాని గమ్యం ఒకటే ! గమనం వేరే అయినా గమ్యం ఒకటే ! ఇది తెలుసుకోండి. సత్య ప్రచారానికై ఎప్పుడూ ఈ భూమి పైకి మాస్టర్లు వస్తూనే ఉంటారు. ఎవరూ చివరి వారు కాదు. ప్రస్తుతం ఈ భూమి పైన సశరీరంగా సత్యాన్ని(దైవాన్ని) అనుభవ పూర్వకంగా తెలుసుకుని ఉన్న మాస్టర్లు చాలా మంది ఉన్నారు. ప్రతీ మాస్టర్ తన కార్యక్రమాలను తాను చేసుకుపోతున్నాడు.

ఏ మాస్టర్ అయినా కేవలం నన్ను మాత్రమే అనుసరించండి, అని చెప్తాడు. నేను స్వయంగా జ్ఞానోదయాన్ని పొందాను, నాకు దైవం అంటే ఏమిటో తెలుసు, మోక్షం అంటే ఏమిటో తెలుసు. నన్ను అనుసరిస్తేనే ఖచ్చితంగా మోక్షం వస్తుంది అని కుండ బద్దలు కొట్టినట్టు చెప్తాడు. ఇలా చెప్పాలి కూడా ! ఎందుకంటే, మాస్టరే.. నిశ్చితంగా, నిర్ధారించి ప్రకటించకపోతే, ప్రజలకు విశ్వాసం ఎలా కలుగుతుంది ?!

కొంతమంది అంటారు.. జ్ఞానోదయాన్ని పొందిన వాడు, నేను జ్ఞానోదయం పొందాను అని చెప్పడని ! ఎవరైనా జ్ఞానోదయం పొంది కూడా చెప్పకుండా ఉన్నారేమో.. ఆ సంగతి నాకు తెలియదు. కాని నేను మాత్రం నా విషయాన్ని సుస్పష్టంగా ప్రకటిస్తాను. నేను జ్ఞానోదయం పొందాను అనే సత్యాన్ని ప్రకటించియే తీరుతాను. అసలు నేను ఈ భూమి పైకి వచ్చిందే సత్య ప్రచారం చేయడానికి. *సత్య ప్రచారం చేసే వ్యక్తి తన యోగ్యతను తాను చెప్పుకోక పోతే ఎలా ?! సత్యాన్ని నేను అనుభవం చెందాను అని నా అనుభవం గురించి, నేను చెప్పకపోతే ఎలా ?! నేను ఏ మార్గంలో సత్యాన్ని పొందానో ఆ మార్గాన్ని మీకు తెలియచేస్తున్నాను అని రూఢీ చేయకపోతే ఎలా ?!*

తన గురించిన సత్యాలను తాను తెలియచేసుకోవడానికి మరియు స్వోత్కర్షకీ ఒక చిన్న తేడా ఉంది. దాన్ని గమనించాలి.

ఏమో నేను జ్ఞానోదయాన్ని పొందానో లేదో నాకే తెలియదు, పొందితే, పొంది ఉంటాను. లేకపోతే లేదు. అది మీకెందుకు, కాని నేను చెప్పేవి వినండి,

వాటిని ఆచరించండి, మీకు తప్పకుండా మోక్షం వస్తుంది... అంటూ ఉంటే మీకు ఎలా అనిపిస్తుంది ? ఈ వ్యక్తికే అంతా అయోమయంగా ఉంది. ఇక ఈయన మాటలేం వింటాం.. అని అనుకుంటారు కదా ! జ్ఞానోదయం పొందినవాడు చెప్పడు, మాట్లాడడు అని రకరకాల కాన్సెప్ట్‌లున్నాయి. ఎన్‌లైటెన్డ్ మాస్టర్ తనకు ఎన్‌లైటెన్‌మెంట్ అయిందని 100% గ్యారంటీగా ప్రకటిస్తాడు. ఎన్‌లైటెన్‌మెంట్ గురించి ఏమీ చెప్పడు. ఎందుకంటే దాన్ని ఏ భాష కూడా వర్ణించలేదు. అందుకే ఎన్‌లైటెన్‌మెంట్ గురించి ఏమీ మాట్లాడకుండా, ఎన్‌లైటెన్‌మెంట్ ఎలా పొందాలో బోధిస్తాడు. ఎన్‌లైటెన్‌మెంట్ ఎలా పొందాలో తెలియ చేయడమే గురువు పని.

అందుకే మాస్టర్స్ ఖచ్చితంగా విషయాలను నిశ్చయించి, నిర్ధారించి ప్రకటిస్తారు.

నేను చెప్పేది ఒక్కటే సరైన ధర్మం అని మహమ్మద్ ప్రవక్త ఎలుగెత్తి చాటాడు.

నేనే మార్గం అని జీసస్ క్రైస్ట్ తేల్చి చెప్పేశాడు.

ఇక్కడ "నేనే" మార్గం అని అంటే, అందరిలో ఉండే "నేను" అనబడేది అని అర్థం ఇక్కడే యావత్ క్రిస్టియన్స్ పొరపడుతున్నారు.

అందరిలో ఉండే - "నేను", "నాది", "నా", "నాకు", "నన్ను" అనబడేవి "దైవం" !!

అంతా నాడేది నకిలీ నేనులను - అసలు నేను లోపల నిగూఢంగా ఉంటుంది అదే దైవం !!

నేనే అంతా... అంతా నేనే.. అని శ్రీకృష్ణుడు స్పష్ట పరిచాడు.

వీళ్ళంతా ఉన్న ఒకే ఒక సత్యాన్ని గురించి చెబుతున్నారన్న విషయాన్ని గ్రహించాలి. ఇందులో ఏ ఒక్కరూ తప్పు చెప్పటం లేదు. అందరూ సరిగానే చెబుతున్నారు. ఈ ముగ్గురు మాస్టర్సే కాకుండా ఇంకా ఎంతో మంది మాస్టర్స్ తమ తమ మార్గాలను స్పష్ట పరిచారు. వీటిని సరైన విధంగా అర్థం చేసుకోవాలి. కేవలం ఉపరి తలంలో నుండి విషయాలను గ్రహిస్తే అన్నీ తప్పుగా అర్థం అవుతాయి. రిజిడ్‌గా ఉండకుండా, ఓపెన్ మైండ్‌తో విషయాలను అవగాహన చేసుకుని, సర్వ మతాల సారం ఒకటేనని, ఉన్నది ''ఒక్కటేననీ.. ఏకత్వమే'' అని గ్రహించి శాంతి సామరస్యాలను సాధించాలి.

ఇది ఈ భూమి పైన ఉన్న ప్రతీ ఒక్కరి ప్రథమ మరియు అత్యవసర బాధ్యత !

అంతా ఒక్కటే ! *All Is One !*

ఒక మహా వృక్షం ఉంది. దానికి అనేకానేక శాఖలు ఉన్నాయి. ఎన్నెన్నో కొమ్మలు ఉన్నాయి. మరెన్నో ఆకులు ఉన్నాయి. ప్రతీ కొమ్మ, ప్రతీ ఆకు చూడటానికి వేరు వేరుగా కనపడినా అవన్నీ ఒక్కటే ! ప్రతీ కొమ్మనీ, ప్రతీ ఆకుని అన్నింటినీ కలిపితేనే దానిని వృక్షం అని అంటారు. నిజానికి ఏ కొమ్మ కూడా, ఏ ఆకు కూడా వృక్షం నుండి వేరుగా ఉండదు. ఉపరి తలంలో నుండి చూస్తే అన్నీ వేరు వేరుగా కనపడతాయి. లోతుగా పరిశీలిస్తే అన్నీ ఒక్కటేనని అర్థం అవుతాయి. మాది ఫలానా కొమ్మ, మా కొమ్మ వేరు కాబట్టి, మా కొమ్మకున్న ఆకులమైన మేము వేరు అని ఆ వృక్షానికి ఉన్న ఆకులన్నీ అనుకుంటుంటే ఎలా ఉంటుందో ఒక సారి ఆలోచించండి. కొమ్మ కొమ్మకో సంఘం. ప్రతీ దానికో సంప్రదాయం. ప్రతీ దానికో సంస్కృతి. మేమంతా వేరు వేరు అని ఆ కొమ్మలు, ఆ ఆకులు అనుకుంటూ ఉంటే ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో ఒక సారి ఆలోచించండి.

జాతి మత కుల వర్గాల పేరుతో మానవులు చేస్తున్నది ఇదే.....!

జాతి మత కుల వర్గ భేదాలను ఏర్పర్చుకుని మానవులు, ఏకంగా ఉన్న తమను తాము చీల్చుకున్నారు. ఈ జాతి మత కుల వర్గాలు అనేవి అజ్ఞానంలో నుండి పుట్టినవే ! వీటిని శాశ్వతంగా ఈ భూమి పై నుండి మాయం చేయాలి. ఈ చీలికలను తొలగించినప్పుడే మానవులంతా ఏకం కాగలుగుతారు. ఈ చీలికలన్నీ అత్యంత త్వరలోనే పూర్తిగా శాశ్వతంగా తొలగిపోతాయి.

ఇది సత్యం.

మతంలో ఉంటూ, మతాచారాలను పాటిస్తూ, మతానికి కట్టుబడి
ఉన్న వారెవ్వటికీ మోక్షం పొందలేరు. సర్వ సృష్టికర్త ఒక్కరే !
దైవం ఒక్కరే !
మనుషులు ప్రాంతానికో రకంగా, భాషకోరకంగా దైవాన్ని పిలుస్తారు.
భౌగోళిక, నైసర్గిక పరిసర ప్రాంతాలను బట్టి ఆచార వ్యవహారాలుంటాయే
కానీ అన్నీ ఒకే ఒక దైవానికి సంబంధించినవి. వాస్తవానికి
ఈ భూలోకం పైన ఉన్నది ఒకే ఒకసముద్రం. మీరు ఏ దేశంలోకి
వెళ్ళి తాకినా మీరు తాకుతున్నది ఒకే సాగరాన్ని ! అదే విధంగా
మీరు ఏ పేరుతో పిలిచినా, కొలిచినాఒకే దైవాన్ని !
ఈ పరమ సత్యాన్ని గుర్తించకుండా ఐకమత్యంగా ఉండకుండా
మనుషులు ఒకరినొకరు దైవం పేరుతో చంపుకోవడం కన్నా దారుణం లేదు !
ఏకత్వాన్ని, వ్యాప్తి చేయాలి. ఏకత్వాన్ని స్థాపించాలి !
ఈ పని ప్రప్రథమంగా మతాధికారులు ప్రారంభించాలి !
అన్ని మతాల మతాధికారులు తలుచుకుంటే ఏకత్వ స్థాపన చాలా సులభం !
మీరు ఇంకా మతాన్ని పట్టుకుని, మతంలో బంధీ అయిపోయి ఉన్నారంటే...
మీరు ఆధ్యాత్మికంగా నర్సరిలో ఉన్నట్టు !
మతాన్ని అధిగమించి ఉన్నత ఆధ్యాత్మిక విజ్ఞానం స్వీకరించినప్పుడే,
అభ్యసించినప్పుడే, ఆచరణలో పెట్టినప్పుడే మీ ప్రగతి
ప్రారంభమవుతుంది.
అంతకు ముందు ఎన్ని కోట్ల జన్మలైనా సరే ఒక్క అడుగు
కూడా ముందుకు పడదు.

❖ ❖ ❖

పార్ట్ - 8

వాస్తవానికి కర్మ సిద్ధాంతం అనేది ఉంది. లేదు.

వాస్తవానికి కర్మ సిద్ధాంతం అనేది ఉంది. లేదు. ఎవరైతే వేరే ఎవరినీ ఆటంక పరచకుండా జీవిస్తారో వారికి ఈ కర్మ సిద్ధాంతం వర్తించదు. ఎవరైతే ఇతరుల జీవితాలను ఆటంక పరుస్తారో వారికి కర్మ సిద్ధాంతం వర్తిస్తుంది. ఉదాహరణకు, మీరు తండ్రిగా ఉన్నారు అని అనుకోండి. అప్పుడు మీరు మీ భార్యను మరియు మీ పిల్లలను శాసిస్తూ ఉంటే, వారి స్వేచ్ఛను అడ్డుకుంటూ ఉంటే, వారికి నచ్చిన విధంగా వారిని జీవించనివ్వకపోతే అప్పుడు మీకు కర్మ చుట్టుకుంటుంది. మీరు వచ్చే జన్మలో మీరు ఒకరికి భార్యగా జన్మించి, జీవితంలో స్వేచ్ఛ లేకపోతే ఎంత బాధగా ఉంటుంది అనేది అనుభవించి తెలుసుకుంటారు. మరొక జన్మలో మీరు సంతానంగా జన్మించి స్వేచ్ఛ యొక్క విలువను తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇది చదివి నవ్వకండి. ఇది సత్యం. పెద్దరికం ఉంది కదా, అధికారం ఉంది కదా అని మీ కింద ఉన్న వారి జీవితాలను అడ్డుకుంటే మీకు తగిన గుణపాఠం చెప్పబడుతుంది. నా భార్యే కదా, నా సంతానమే కదా... నాకు ఆ మాత్రం హక్కు అధికారం ఉండదా ? అని ప్రశ్నించడానికి వీలు లేదు. మీ భార్య పైన మరియు మీ సంతానం పైన మీకు కొన్ని హక్కులు ఉంటాయి. అయితే అవి వారి జీవితాన్ని మీకు నచ్చినట్టుగా జీవించమని శాసించేంతగా ఉండవు. ఇది తెలుసుకోవాలి. మీ సంతానం తమ జీవితానికి సంబంధించి ఎంత విచిత్రమైన, ఎంత వింతైన నిర్ణయం తీసుకున్నా సరే మీరు ఒప్పుకుని తీరాల్సిందే ! సమాజం ఏమనుకుంటుంది, లోకులు ఏమనుకుంటారు అనేది మీ స్వంత సమస్య. దాన్ని మీరే ఎదుర్కోవాలి. ఎవరో ఏదో అనుకుంటారని మీరు మీ సంతానం యొక్క జీవిత విధానాన్ని వ్యతిరేకిస్తే మీకు తగిన గుణపాఠం నేర్పించ బడుతుంది. గుర్తుంచుకోండి, ఆత్మలైన మీరు మళ్ళీ ఏ జన్మలోనూ ఎవరి స్వేచ్ఛనూ అడ్డుకోని విధంగా మీకు గుణపాఠం నేర్పించ బడుతుంది. దానికి ఎన్ని జన్మలు పట్టినా సరే ! అన్ని జన్మల నరక యాతన తప్పించుకోవాలంటే, "ఎవరి ఇష్టం వారిదే, అందరూ దైవాలే" అనుకుని మౌనంగా ఉండండి. అప్పుడు మిమ్మల్ని మీరు రక్షించుకున్నట్టే ! లేదా.....

బాగా గుర్తుంచుకోండి, మీ కింద ఉన్న వారి జీవితాలను మీరు శాసిస్తే మీరు మీ జీవితాలను కోల్పోవాల్సి వస్తుంది.

పెద్దరికం మరియు అధికారం అనే వాటిని చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి. లేదా తగినంత గుణపాఠం నేర్పించ బడుతుంది.

ముఖ్యంగా తల్లిదండ్రులు, తమకు నచ్చినట్టుగా జీవించమని పిల్లల మీద ఒత్తిడి తెస్తుంటారు. ఇలాంటి తల్లిదండ్రులకు తగిన గుణపాఠం నేర్పించ బడుతుంది.

అత్యధిక శాతం తల్లిదండ్రులు తమ సంతానం యొక్క వివాహ విషయంలో స్వేచ్ఛనివ్వరు. మిమ్మల్ని కన్నాము. పెంచాం. సమాజంలో మా పరువు ఏం కావాలి ? అంటూ పిల్లలను కట్టడి చేస్తారు. మీరు మా మాట వినకపోతే మేము ఆత్మహత్య చేసుకుంటాం అని బెదిరిస్తారు. ఇలాంటి తల్లిదండ్రులందరికీ తగిన గుణపాఠం నేర్పించ బడుతుంది.

ఎవరి జీవితం వారిదే. ఎవరి ఇష్టం వారిదే. ఎవరు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మీరు మౌనంగా ఉండాలి. వారి ఇష్ట ప్రకారం వారిని జీవించ నివ్వాలి. ఇతరుల స్వేచ్ఛను, ఆనందాన్ని అడ్డుకున్న వారందరికీ తగిన గుణపాఠం నేర్పించ బడుతుంది.

ఇప్పుడు ఈ జన్మలో మీరు ఏ విధంగా మీ పిల్లలను అడ్డుకున్నారో, అదే విధంగా వచ్చే జన్మలో మిమ్మల్ని మీ తల్లిదండ్రులు అడ్డుకుంటారు. అప్పుడు మీ పిల్లలు అనుభవించిన నరక యాతననే మీరు అనుభవిస్తారు. ఈ జన్మలో మీ పిల్లలను మీరు అడిగిన ప్రశ్నలనే ఆ జన్మలో మీ తల్లిదండ్రులు మిమ్మల్ని అడుగుతారు. అప్పుడు మీకు స్వేచ్ఛ యొక్క విలువ తెలిసి వస్తుంది. సమాజం యొక్క కట్టుబాట్లు అత్యధిక శాతం ఎంత పనికిరానివో అప్పుడు అర్థం అవుతుంది.

పార్ట్ – 9

ఏ గురువు అవసరం లేదా ?!

ఎవరినీ అనుసరించ వద్దా !?

గురువు లేనిదే ఏమీ జరగదు.
గురువును కోల్పోతే సర్వస్వాన్ని కోల్పోయినట్టే !
గురువు సమక్షంలో ఉంటే, సర్వస్వాన్ని కలిగి ఉన్నట్టే !

గురువు అవసరం లేదు అని నీవు అనుకుంటున్నావు అని అంటే, నీవు నీ యొక్క అహంకారంలో బాగా కూరుకుపోయి ఉన్నావు అని అర్థం. నీకు ఎంత అహంకారం ఉంటే అంతగా గురువును తిరస్కరిస్తావు. ఎన్ని కారణాలైనా చూపిస్తుంది నీ అహంకారం. చాలా టెక్నికల్‌గా నిన్ను బోల్తా కొట్టిస్తుంది.

ఆధ్యాత్మిక పరమైన కారణాలను చూపించి... కాబట్టి... గురువు అవసరం లేదు అని చెబుతుంది నీ అహంకారం. జాగ్రత్త ! గురువు లేనిదే మోక్షం రాదు. మోక్షానికి 100 మెట్లు ఉంటే, 99 మెట్ల వరకు గురువు అవసరం. చివరి మెట్టులో గురువు అవసరం ఉండదు. కాని 99 మెట్లు గురువు లేనిదే నీవు ఎక్కలేవు. గురు మార్గదర్శకత్వం లేనిదే నీవు చివరి మెట్టు పైకి చేరుకోలేవు.

గురువు అవసరం లేదు అని అనడం అంటే, తెలివైన, అందమైన ఆధ్యాత్మిక ఆత్మ వంచన అని అర్థం చేసుకోండి.

ఏ గురువు అవసరం లేదా ?!

ఎవరినీ అనుసరించ వద్దా !?

ఏ గురువు అవసరం లేదని, ఎవరినీ అనుసరించాల్సిన అవసరం లేదని కొంత మంది చెబుతుంటారు. ఇది నిజమే. అయితే ఇది చివరి మెట్టులో ఉన్న సాధకులకు మాత్రమే వర్తిస్తుంది. ఇక ఒక మెట్టు దాటితే దైవత్వాన్ని ప్రాప్తించుకోబోయే సాధకులకు మాత్రమే వర్తిస్తుంది కానీ అందరికీ కాదు.

గురువు అంటే తెలిసిన వాడు. మీరు ఏది నేర్చుకోవాలన్నా నేర్పేవారు ఒకరు ఉండాలి. వారినే గురువు అని అంటారు. ఉదాహరణకు మీరు కారు నేర్చుకోవాలని అనుకుంటున్నారు... ఎవరో ఒకరు నేర్పనిదే మీకు కారు నడపటం ఎలా వస్తుంది ?! ఏ గురువు అవసరం లేదు అని మీకై మీరే స్వంత పెత్తనం చేసి కారు నేర్చుకోబోతే, మీరు ప్రమాదంలో పడటమే కాకుండా ఇతరులను కూడా ప్రమాదానికి గురి చేసే అవకాశం ఉంది కదా. ''నేను ఎవరినీ అనుసరించను'' అని మీరు... అందరూ కారును ఆపడానికి బ్రేక్ నొక్కితే నేను ఆక్సిలరేటర్ తొక్కుతాను అని, అలా చేసారనుకోండి అప్పుడు ఏమవుతుంది ??????

మామూలు భౌతిక విషయాలకే గురువు అవసరం అని అంటే, ఇక ఆధ్యాత్మిక విద్యకు గురువు ఎంత అవసరమో ఆలోచించండి. ఎక్కడ తనను అనుసరించాలో, ఎక్కడ తనను అనుసరించకూడదో గురువు చెప్తాడు. మిమ్మల్ని మీరుగా తెలుసుకునేందుకు సహాయం చేస్తాడు. గురువు లేనిదే ఏమీ జరగదు అని తెలుసుకోండి. ఏ గురువు అవసరం లేదు, ఎవరినీ అనుసరించ వద్దు అని అజ్ఞానంలో పడి కొట్టుకుపోకండి. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే 14వ పార్ట్ అయిన నవరత్నాలలో గురువు గురించి వివరించాను. బాగా చదివి అర్థం చేసుకోండి.

All The Very Best !

గురువును నీవు ఎప్పటి వరకైతే నీవు నిజంగా ఆత్మపూర్వకంగా
ఒప్పుకోవో అప్పటి వరకు నీ యొక్క ఆధ్యాత్మిక
ప్రయాణం ప్రారంభం కాదు.
గురువు లేనిదే నీ ఆధ్యాత్మిక అభివృద్ధి జరగదు.
గురువు లేనిదే ఆధ్యాత్మిక ప్రపంచంలో నీకు ప్రవేశమే జరగదు.
గురువు యొక్క మార్గదర్శకత్వం లేని ఆధ్యాత్మిక ప్రయాణం, అంధ ప్రయాణం.
గురు మార్గదర్శకత్వం లేని సాధన అభివృద్ధి చెందదు.
గురువు అవసరం లేదు అని అనుకోవడం
చాలా పెద్ద అజ్ఞానం.
ఎన్‌లైటెన్‌మెంట్‌కు 100 మెట్లు ఉంటే 99 మెట్ల వరకు గురువు అవసరం ఉంటుంది. చివరి 100వ మెట్టు మాత్రం సాధకుడే ఎక్కాలి !
చివరి మెట్టులో అవసరం లేదు కదా అని మొదటి మెట్టు నుండే గురువు అవసరం లేదనడం ఎలా ఉంటుందంటే - పుట్టిన వాడు చావక తప్పదని పుట్టగానే చంపినట్టు/చచ్చినట్టుగా ఉంటుంది.
కాకపోతే సరైన సత్యగురువును ఎంపిక చేసుకోవాలి !

మీ చేత అర్థం లేని పనులు, మత కర్మకాండలు, ప్రచారాలు చేయించే వారు సరైన వారు కాదు. ఎవరైతే నీతో ఆత్మ విజ్ఞాన సూత్రాలు ఆచరణ చేయిస్తారో, ప్రచారం చేయించకుండా కేవలం ఆచారం మాత్రమే చేయిస్తారో, ఎవరైతే సూటిగా ఒకే సారి నీవే దైవానివి, నీ దైవత్వాన్ని నీవు అనుభవ పూర్వకంగా తెలుసుకో అంటూ దైవత్వ సాధన చేయిస్తారో వారే సరైన సత్య గురువులు. సత్యగురువును/సద్గురువును ఆశ్రయించినప్పుడే మీరు మోక్షం పొందగలుగుతారు లేదా అనేక వేల జన్మలు దారి తప్పి పోవడం ఖాయం !

పార్ట్ - 10

సరైన అవగాహన

ఈ సృష్టిలో కోరుకో దగినది
ఏదైనా ఉంది అని అంటే అది సరైన
అవగాహనయే అని మిఖాయిల్ నైమి అనే
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త చెప్తాడు.

మనమందరం ఈ భూమి పైన జన్మించింది అవగాహన కోసమే !

మన శరీరంలోని మరియు జీవితంలోని ప్రతీ సమస్యా
మనకు ఏదో ఒకటి నేర్పించడానికే వస్తుంది. అంటే మన
అవగాహనను పెంచడానికే వస్తుంది. మనం మన అవగాహనను
పెంచుకోవడానికే సమస్యలను ఎన్నుకుని జన్మిస్తాం. జన్మించిన తర్వాత
మనం పెట్టుకుని వచ్చిన సమస్యలలో నుండి, ఒకదాని తర్వాత ఒకటిగా
సమస్యలను ఆకర్షిస్తూ మన అవగాహనా పరిధిని విస్తారం చేసుకుంటూ
ఆత్మ పరిణామ క్రమంలో ముందుకు సాగిపోతూ ఉంటాం.
మీ సమస్యల పట్ల మీకు సరైన అవగాహన వచ్చిందంటే, ఆ సమస్య
తక్షణమే తొలగిపోతుంది... అది శరీరంలోనిదైనా సరే
లేక జీవితంలోనిదైనా సరే !

తెలుసుకోండి, సమస్య యొక్క పరిష్కారం
అవగాహన వల్లనే జరుగుతుంది.

పరిష్కారమే అవగాహన !
అవగాహనయే పరిష్కారం !

I. మహా ఆశ్చర్యం !!!

డ్రైవర్ కావాలనుకునే వారు డ్రైవింగ్ నేర్చుకుంటారు.
మెకానిక్ కావాలనుకునే వారు మెకానిజం నేర్చుకుంటారు.
డాక్టర్ కావాలనుకునే వారు MBBS చేస్తారు.
ఇంజనీర్ కావాలనుకునే వారు ఇంజనీరింగ్ చేస్తారు.
కంప్యూటర్ ఫీల్డ్‌లో బ్రతకాలనుకునే వారు కంప్యూటర్ కోర్సులు చేస్తారు.
అకౌంటెంట్ కావాలనుకునే వారు అకౌంట్స్ నేర్చుకుంటారు.
చిత్రకారులుగా మారడానికి చిత్రాలు వేయడం నేర్చుకుంటారు.
సంగీతకారులుగా తయారవడానికి సంగీతం నేర్చుకుంటారు.
నాట్యకారులుగా తయారవడానికి నాట్యం నేర్చుకుంటారు.
లాయర్‌గా తయారవడానికి "లా" చదువుతారు.
క్రీడాకారులుగా తయారవడానికి క్రీడలు నేర్చుకుంటారు.
కుక్‌గా తయారవడానికి వంటలు నేర్చుకుంటారు.
వ్యాపార వేత్తలుగా తయారుకావడానికి వ్యాపారం నేర్చుకుంటారు.
టైపిస్ట్ కావాలనుకునే వారు టైప్ నేర్చుకుంటారు.

ఇలా, ఎవరు ఏం కావాలనుకుంటున్నారో అది నేర్చుకుంటున్నారు. ఎవరైనా "ఏదో" ఎందుకు అవ్వాలనుకుంటున్నారు ? హాయిగా జీవించడానికే కదా ! మరి హాయిగా జీవించాలనుకుంటే, ముందు "జీవితం" గురించి తెలుసుకోవాలి కదా ! "జీవిత శాస్త్రాన్ని - Life Science ను" నేర్చుకోవాలి కదా ! జీవించడానికి అందరూ అన్నీ నేర్చుకుంటున్నారు ఒక్క జీవిత శాస్త్రాన్ని తప్ప !

ఇదే మహా ఆశ్చర్యం !!

మీరు ఒక డాక్టరో, ఇంజనీరో, ఉద్యోగియో, వ్యాపారవేత్తనో అయినంత మాత్రాన జీవితాన్ని జీవించలేరు. జీవితాన్ని జీవించాలంటే ముందు "జీవితం" గురించి తెలుసుకోవాలి, ఆ తర్వాతే ఏదైనా ! మీరు ఏదో ఒకటి కావాలనుకుంటున్నారు, అది నేర్చుకుంటున్నారు. బాగానే ఉంది. కానీ మీరు "ఏదో ఒకటి" అయి ఏం చేస్తారు ? జీవిస్తారు కదా ! మీరు "ఏదో ఒకటి" అయ్యేది ఎందుకు ? జీవించడానికే కదా ! మరి జీవించాలనుకునేవారు "జీవితం" గురించి తెలుసుకోవాల్సిన అవసరం లేదా ?

జీవి ఎవరు ? జీవితం అంటే ఏమిటి ? జీవితంలో సమస్యలు ఎందుకు ఉంటున్నాయి ? అవి ఎలా పోతాయి ? జీవితం యొక్క మూలం ఏమిటి ? జీవితం యొక్క అసలు సిసలు పరమ లక్ష్యం ఏమిటి ? జీవితం సార్థకం కావాలంటే ఏం చేయాలి ?

జీవించాలనుకునే వారు పై ప్రశ్నలకు తప్పని సరిగా సమాధానాలు తెలుసుకోవాల్సిన అవసరం లేదా ?! ప్రపంచంలో ఎంతో మంది తాము "ఏం" కావాలనుకుంటున్నారో "అది" నేర్చుకుని, "అలా" తయారవుతున్నారు. అంతే ! జీవితం గురించి తెలుసుకోవాలి అని మాత్రం అనుకోవటం లేదు. మీరు ఒక డాక్టరో, ఇంజనీరో, ఉద్యోగియో, వ్యాపారవేత్తనో అయి తిండి - బట్ట - నీడ సంపాదించుకుంటారు. ఇలా బ్రతుకుతూ, ఎప్పుడో ఒకప్పుడు "శరీరాన్ని" వదిలేస్తారు. ఆ తర్వాత ఏం జరుగుతుంది ? ఇక, జీవితం అంతటితో ముగిసిపోయినట్టేనా ?! ఇంత మాత్రంతో జీవితం ముగిసిపోదు మిత్రులారా ! ఎల్లప్పుడూ "జీవాన్ని" కలిగి ఉండేదే "జీవితం" ! జీవితం ఏనాటికి అంతమైపోదు ! మీరు మళ్ళీ పుడతారు ! ప్రతి ఒక్కరూ పుట్టి తీరుతారు ! మీరు ఎప్పటి వరకైతే "జీవితం యొక్క పరమ లక్ష్యాన్ని, పరమార్థాన్ని తెలుసుకోరో" అప్పటి వరకు పుడుతూనే ఉంటారు. అష్ట కష్టాలు పడుతూనే ఉంటారు.

ప్రస్తుతం మీరు అనుభవించే బాధలకు మూలాలు ఈ జన్మలో లేవు. జీవితం గురించి తెలుసుకోకుండా అజ్ఞానంతో నిర్లక్ష్యంగా వ్యవహరించి వృథా చేసిన మీ గత జన్మలే ఇప్పుడు, ఇక్కడ, ఈ వర్తమానంలో సమస్యలుగా ప్రకటమై "మీ లోపల'' ఉన్నాయి !

ఇప్పుడు గడిచి పోతుంది కదా అని గడిపేయకండి. తర్వాత అంతకు అంతా "తగిన మూల్యం" చెల్లించుకోవాల్సి వస్తుంది. ప్రతి ఒక్కరికి "సృష్టి", తన గురించి తాను తెలుసుకోడానికి తగినన్ని "లైఫ్ లైన్లు" ఇస్తుంది. ఈ "లైఫ్ లైన్లు" అయిపోనంత వరకు మీకు ఎన్నో జన్మలు బాగానే గడిచిపోతాయి. ఎప్పుడైతే మీ "లైఫ్ లైన్లు" అయిపోతాయో అప్పుడు తెలుస్తుంది, "జీవితం" అంటే ఏమిటో ? ఒక పిల్లవాడు చిన్నప్పుడు తన తల్లిదండ్రుల మాట వినకుండా, ఏమీ చదువుకోకుండా, ఏమీ నేర్చుకోకుండా, అజ్ఞానంతో నిర్లక్ష్యంగా వ్యవహరించి, పాతిక లేక ముప్పై సంవత్సరాలు గడిపేసాడనుకోండి, అప్పుడు ఆ పిల్లవాడి భవిష్యత్తు ఎలా ఉంటుంది ? వయసు ఖర్చు అయిపోతుంది. ఇక ఆ పిల్లవాడు తనను తాను సరి చేసుకోవాలంటే ఎంత కష్టమో ఆలోచించండి. ఈ విధంగా జీవితాన్ని నిర్లక్ష్యంగా వృథా చేసుకున్న పిల్లవాడు ఎన్ని కష్టాలు పడతాడో అంతకు "లక్ష" రెట్లు కష్టాలు పడతారు "లైఫ్ లైన్లు" అయిపోయిన వారు.

తల్లిదండ్రులు పిల్లలకు తగిన వయసు వచ్చే వరకు ఏమీ అనరు. ఏం చేసినా సహిస్తారు. పిల్లలు ఎలా, ఎలా పెరిగి పెద్దగా అవుతుంటే అలా, అలా బోధించడం మొదలు పెడతారు. ఇక, వయసు ఇరవై దాటగానే నీ కాళ్ళ మీద నీవు నిలబడు అని ఒత్తిడి చేయడం మొదలు పెడతారు. వయసు ముప్పై

దాటగానే ఒత్తిడి పూర్ణం అవుతుంది. ఇక అప్పుడు తల్లిదండ్రులు ఇంకా అతని సంబంధీకులు ఏం చేస్తారు ? సరిగ్గా విశ్వం కూడా అలానే చేస్తుంది మనందరి పట్ల ! ప్రతి ఒక్కరికి తగినన్ని "లైఫ్ లైన్లు" ఇస్తుంది. ఎవరైనా సరే, ఈ "లైఫ్ లైన్లు" అయిపోక ముందే "తన గురించి, తన జీవితం గురించి" తెలుసుకోవడం ప్రారంభించాలి. ఇలా "తన మూలం గురించి తెలుసుకోవడం" ప్రారంభించిన వ్యక్తి తనను తాను సంరక్షించుకున్న వాడౌతాడు. ఎవరైతే "తన మూలం" గురించి తెలుసుకోకుండా నిర్లక్ష్యం చేస్తారో వారికి నరకయాతన తప్పదు.

లక్షలాది సంవత్సరాల క్రితం నుండి ఇప్పటి ఈ జన్మ వరకు మీరు నిర్లక్ష్యంగా వృథా చేసిన జన్మలనే, ఇప్పుడు ఈ వర్తమానంలో బాధలుగా అనుభవిస్తున్నారు. ఇవి అంతకంతా పెరుగుతాయే కానీ తరగవు. "మీ మూలం గురించి మీరు తెలుసుకునే వరకు ఇవి అంతరించిపోవు" ! మీరేం చేసినా పోవు, పైగా పెరుగుతాయి. ఏ దేవుడో వచ్చి రక్షిస్తాడని అనుకుంటుంటే - మీరు పెద్ద భ్రమలో ఉన్నారని తెలుసుకోండి.

దయచేసి మేలుకోండి, మీ గురించి మీరు తెలుసుకోకపోతే ఎలా ? మీ జీవితం గురించి మీరే తెలుసుకోకపోతే ఎలా ? దేని కోసం జీవిస్తున్నారు మీరు ?

మీ "మూలం" గురించి తెలుసుకోవాలంటే ఆధ్యాత్మిక మార్గంలోకి రావాల్సిందే ! ధ్యానం చేయాల్సిందే ! మా మతంలో ఇలా లేదు, మా పెద్దలు ఇలా చెప్పలేదు ! మా మత గ్రంథాల్లో ఇలా లేదు అని పొరపడకండి. చెప్పే వాళ్ళు అన్నీ చెప్పారు. కొన్ని విషయాలు సూటిగా ఉంటే, కొన్ని విషయాలు నిగూఢంగా ఉన్నాయి. అన్ని శాస్త్రాల్లో అన్నీ ఉన్నాయి. అన్నీ దేవుడే చూసుకుంటాడు, అనే భ్రమలో నుండి తక్షణమే బయట పడండి. గాలిలో దీపం పెట్టి కూర్చుంటే మిమ్మల్ని ఏ దేవుడూ పట్టించుకోడు. కృష్ణుడు, జీసస్, మొదలైన పరమాత్మ స్వరూపుల ఫోటోలకు దండేసి దండం పెడుతూ కూర్చుంటే వాళ్ళొచ్చి ఏదో చేస్తారని అనుకుంటున్నారా ? వాళ్ళు రారు ! వాళ్ళకు పట్టి లేదు ! ఏదో తీరిక దొరికినప్పుడు వాళ్ళను గుర్తు చేసుకుని "ఏవో కొన్ని నామాలను లేదా వాక్యాలను" వల్లె వేసినంత మాత్రాన వాళ్ళు వచ్చి మీకు "మోక్షం" ఇస్తారని అనుకోవడం పెద్ద భ్రమ ! అసలు వాళ్ళ బోధనలను మీరు సరిగ్గా అర్థం చేసుకున్నారా ? వారి బోధనలను సరిగ్గా అర్థం చేసుకున్న ఏ వ్యక్తి అయినా "తన మూలం" గురించి తాను తెలుసుకునే పనిలో పడతాడు. మరి మీరేం చేస్తున్నారు ?

వాళ్ళు "మీ గురించి మీరు తెలుసుకోండి" అని బోధించారు. మరి మీ గురించి మీరు తెలుసుకుంటున్నారా ?

మీ గురించి మీరు తెలుసుకునే సాధన మొదలు పెడితే, అప్పుడు, ఈ సృష్టి మొత్తం మిమ్మల్ని పట్టించుకుంటుంది. ప్రతీ మాస్టర్ మిమ్మల్ని పట్టించుకుంటాడు. అంతటి నుండి మరియు అందరి నుండి మీకు సహాయ సహకార సమన్వయాలు అందుతాయి. సరైన మార్గదర్శకత్వం మరియు రక్షణ ఎల్లప్పుడూ మీకు ఉంటాయి.

భూమి పైన అవతరించిన పరమాత్ములందరూ ఒకే విషయాన్ని నొక్కి వక్కాణించారు. "మీరెవరో తెలుసుకోండి, మీ గురించి మీరు తెలుసుకోండి, దైవ సామ్రాజ్యం కోసం పరితపించండి, ఆ దైవమే మీరు ! ఈ విషయాలను సాధన చేసి తెలుసుకోండి" అని బోధించారు.

మరి మనం వాళ్ళు చెప్పినట్టే చేస్తున్నామా ?! మన మూలం గురించి మనం శ్రద్ధ కనబరుస్తున్నామా ?! పుట్టాం కాబట్టి పెరుగుతున్నాం ! పెరిగాం కాబట్టి పెళ్ళి ! పెళ్ళి అయింది కాబట్టి పిల్లలు ! ఆ తర్వాత వాళ్ళ పెళ్ళిల్లు, ఈ మధ్యలో ఆస్తులు అంతస్తులు !

చివరికి చావడం !

ఇంతేనా జీవితం అంటే !

ఇంతకు మించి మరేం లేదా ?!

అసలు ఈ భూమి పైన ఏం జరుగుతుంది ? ఈ భూమి పైకి మనం ఎందుకు వచ్చాం ? ఎంతగానో అభివృద్ధి చెందుతున్న "సైన్సు" ఇప్పటి వరకు మనిషి చచ్చిన తర్వాత ఏం జరుగుతుంది అనే విషయాన్ని ఎందుకు కనిపెట్టలేక పోతుంది ? ఈ భూమి ఎలా పుట్టింది ? ఈ భూమి పైన మనం ఎలా పుట్టాం ? ఎందుకు పుట్టాం ? ఎందుకు చస్తాం ? చచ్చిన తర్వాత ఏం జరుగుతుంది ? ఇవన్నీ మనిషి అనబడే ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన విషయాలు కావా ?!

ఆలోచించండి మిత్రులారా ! అబ్బో ఈ విషయాలు అన్నీ మన కోసం కాదు అని దాటవేయకండి. మీరు ఎందుకు జీవిస్తున్నారు ? అసలు మీరు మీ కోసమే జీవిస్తున్నారా ?! మీ జీవితంలో స్వేచ్ఛ ఉందా ? నిజమైన స్వేచ్ఛ అంటే ఏమిటో తెలుసా మీకు ?

మీరున్నది జైలులో అని గుర్తించండి !

మీరు ఒక విస్తారమైన జైలులో బందీలుగా ఉన్నారు. జైలు చిన్నగా ఉంటే దానిని జైలు అని గుర్తించవచ్చు. కానీ జైలు గోడలు మీకు కనిపించనంత దూరంలో ఉంటే, జైలు విశాలంగా ఉంటే మీరు అప్పుడు దానిని గుర్తించలేరు. చాలా చాకచక్యంగా మిమ్మల్ని బంధించి ఉంచారు. పెద్ద రాళ్ళతో కట్టిన

గోడలైతే మీకు కనపడేవి కానీ, మిమ్మల్ని బంధించిన వారు చాలా తెలివైన వారు. కనిపించని గోడలలో మిమ్మల్ని బంధించారు. మీరు చూడలేని గొలుసులతో మిమ్మల్ని కట్టివేసారు.

మీకు తెలియనే తెలియదు మీరు బంధింపబడి ఉన్నారన్న సంగతి ! మా లాంటి వాళ్ళు ఎవరైనా చెప్పినప్పుడు మీకు నవ్వొస్తుంది. మీకు విసుగొస్తుంది. మీరు బంధింపబడి ఉన్నారని మీరొప్పుకోరు. పైగా మాకే క్లాసులు పీకుతారు. ఎందుకంటే మిమ్మల్ని బంధించిన వాళ్ళు చాలా తెలివైన వారు. చాలా టెక్నికల్‌గా బంధించి ఉంచారు మీకు తెలియకుండా ! వాళ్ళ ప్రయోజనాల కోసం మిమ్మల్ని బలి పశువులుగా చేసి వాడుకుంటున్నారు ఎన్నో జన్మలుగా ! "మీరు బ్యాటరీలుగా వాడబడుతున్నారు" ! ఇంతకంటే ఏం వివరించగలం ?!

మీకెంతో తెలుసునని మీరు అనుకుంటారు. సైన్స్ బాగా డెవలప్ అయిందని, మీరు బాగా చదువుకున్న వారని అనుకుంటూ ఉంటారు. సూటిగా చెప్పాలంటే మీకేం తెలియదు.

కేవలం ఈ విషయాలను స్మరించండి !

ఈ విషయాలతో కూడిన ప్రశ్నలను మీ లోపల మీరు వేసుకోండి ! ధ్యానం చేయండి మీకే తెలుస్తుంది. స్వయంగా మీకే అనుభవం అయినప్పుడు వేరే ఎవరూ మీకు నచ్చజెప్పాల్సిన అవసరం లేదు. మీరు బంధింపబడి ఉన్నారన్న సంగతి స్వయంగా మీరు గ్రహించినప్పుడు ఆటొమెటిక్‌గా ఆ బంధనాలను మీరు తొలగించుకోగలుగుతారు. సమస్య అంతా మీకు తెలియక పోవడం వల్లనే ! మీకు అసలు విషయం తెలిస్తే చాలు !

కేవలం బ్రతికితే చాలనే ధోరణితో మీరుంటున్నారు. సంపాదన లేనప్పుడు సంపాదన కోసం తపిస్తారు. సంపాదన మొదలు కాగానే పనికిరాని పనులతో బిజీ అయిపోతారు. సంపాదన లేని వారికి ఈ విషయాలు చెబితే ఎక్కువు. సంపాదన ఉన్న వారికి సమయం ఉండదు. ఆరోగ్యం బాగా లేనివారు ఈ విషయాలు అర్థం చేసుకోలేక బాధల్లో మునిగి ఉంటారు. ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉన్నవారు ఈ విషయాలను వినరు. ఇప్పుడు గడిస్తే చాలని మీరు అనుకుంటున్నారు. ఇప్పుడు బాగానే ఉన్నాం కదా అని మీరనుకుంటున్నారు. మీరు ఎవరో మీకే తెలియదు.

మీరెవరో మీకు తెలుసనే భ్రమలో మీరున్నారు ! నిజానికి మిమ్మల్ని మీరు "ఎవరని" అనుకుంటున్నారో "వారు" మీరు కారు ! ఆశ్చర్యకరమైన, దిగ్భ్రాంతికరమైన ఈ సత్యాన్ని మీరు గ్రహించి తీరాలి.

మీ ఆరోగ్యం ఎవరి కోసం ? మీ జీవితం ఎవరి కోసం ?

మీ సంపాదన దేని కోసం ?

అసలు దేని కోసం జీవిస్తున్నారు మీరు ?

సరైన ఉన్నతమైన ధ్యానం చేయండి, అన్ని సమాధానాలు లభిస్తాయి. బిందు దర్శన ధ్యానం, జ్యోతి దర్శన ధ్యానం, ఆనాపానాసతి ఇవి చేయనే చేయకూడదు. వీటి వల్ల ఏవో చిన్న చిన్న తాత్కాలిక ఉపయోగాలు తప్ప ఎన్‌లైటెన్‌మెంట్‌కు ఇవి పనికి రావు. ఓషో మెడిటేషన్స్, సేత్ టెక్నిక్స్, రామ్‌తా టెక్నిక్స్ లేదా నేను చెప్పినవి పరమోన్నత ధ్యాన పద్ధతులు వీటిలో ఏదో ఒక దాన్ని ఎంచుకుని సాధన చేయండి అన్ని బంధనాల్లోంచి బయట పడతారు. ముక్తులవుతారు. అయితే ముందు మీరు సంపూర్ణంగా, శాశ్వతంగా అకర్మ వీగన్లుగా మారితేనే మీకు నిజమైన, వాస్తవమైన, సత్యమైన ఆధ్యాత్మికత లోకి ప్రవేశం లభిస్తుంది. మీరు అకర్మ వీగన్లుగా మారనంత వరకు మీరేం చేసినా వృథాయే !

౭. మీ లైఫ్ లైన్లో అయిపోయాయేమో చెక్ చేసుకోండి

భూమి మీద పుట్టిన ప్రతి ఒక్కరూ కూడా విధిగా తమ "నిజ తత్వాన్ని" అనుభవ పూర్వకంగా తెలుసుకుని తీరాలి. అజ్ఞానం వలన మా మార్గంలో ఇలా ఉండదు, మా శాస్త్రాల్లో ఇలా లేదు, మా పెద్దలు ఇలా చెప్పలేదు అని ఎవరికి వారు అనుకుంటూ ఉంటారు. మరీ విచిత్రం ఏమిటంటే బాగా చదువుకున్న వారు కూడా ఇలా ఆలోచిస్తూ ఉంటారు.

విజ్ఞతతో ఒక సారి ఆలోచించండి !

సృష్టి ఒకటే ఉంది, ఒకటే ఉంటుంది కదా ! ఈ యొక్క అనంత సృష్టిలో భూమి అనబడే గ్రహం ఒకానొక అతి చిన్న భాగం కదా ! ఈ భూమి మీద ఎన్నో మతాలు ఉన్నాయి. ప్రతీ ఒక్క మతం సృష్టి గురించి తనదైన ప్రత్యేకమైన సిద్ధాంతాన్ని కలిగి ఉంది. అన్నీ పరస్పర విరుద్ధంగా ఉంటాయి. ప్రతీ మతం వారు తమదే కరెక్ట్ అని అనుకుంటూ ఉంటారు. **ఒకే ఒక సృష్టి గురించి ఇన్ని సిద్ధాంతాలు ఎలా కరెక్ట్ అవుతాయి ?!?!?!?!?!?!** ఏదో ఒక్కటే సత్యం ఉంటుంది కదా ! మరి ఏది అసలు సత్యం ? అన్ని మతాలకు భిన్నంగా శాస్త్రవేత్తల వాదన ఉంటుంది, ఇంతకు ఏది నిజం ? అందరూ మనుషులే, అందరి చైతన్యం ఒక్కటే, అందరి సిస్టమ్ ఒక్కటే ! మరి ఇన్ని మతాలు ఎక్కడి నుండి పుట్టుకొచ్చాయి ? సృష్టి వయసును అలా పక్కకు పెట్టి, భూమి వయసు దగ్గరికి వద్దాం. భూమి వయసు కోటాను కోట్ల సంవత్సరాలు. మరి భూమి మీద చెలామణి అవుతున్న మతాల వయసు ఎంత ఉంది ? మరి, నిన్న గాక మొన్న పుట్టిన రక రకాల మతాలు సృష్టి గురించి రక రకాల సిద్ధాంతాలను ఎలా ప్రతిపాదిస్తున్నాయి ? ఎవరికి వారు మేమే కరెక్ట్ అని అంటున్నారు. ఇన్ని "కరెక్ట్" అయిన విషయాలు ఎలా ఉంటాయి ? ఏదో ఒకటి మాత్రమే కరెక్ట్ అయి ఉంటుంది కదా ! వాస్తవంగా చూస్తే అన్ని మతాల

మూల సారాంశం ఒక్కటే ఉంది. అయితే "మత ఛాందసులు" ఉపరితలంలో నుండి విషయాలను గ్రహించి సరి కాని అవగాహనతో ఆందోళనలు సృష్టిస్తున్నారు.

దయచేసి మేలుకోండి, సత్యాలను గ్రహించండి. మీ గురించి మీరు తెలుసుకోకపోతే ఎలా ? ఇది మొత్తం మీ ఆత్మ పరిణామ క్రమానికి సంబంధించిన విషయం.

ప్రతి ఒక్కరికి భౌతిక దశ, ఆధ్యాత్మిక దశ అని రెండు దశలు ఉంటాయి.

మనుషులు అన్నవారు ఎవరైనా సరే భౌతిక దశ, ఆధ్యాత్మిక దశ అనే రెండు దశలను కలిగి ఉంటారు.

భౌతిక దశ : అన్ని రకాల జన్మలెత్తి రాజుగా, పేదగా, స్త్రీగా, పురుషుడిగా ఇలా ఎన్నెన్నో, రక, రకాల జన్మలు ఎత్తి ఎంతో అనుభవ జ్ఞానాన్ని గడిస్తారు. భౌతిక దశను పూర్తి చేసుకుంటారు.

ఆధ్యాత్మిక దశ : అన్ని రకాల జన్మలు ఎత్తడం అయిపోయిన తర్వాత, అంటే భౌతిక దశ అయిపోయిన తర్వాత మొదలయ్యేదే ఆధ్యాత్మిక దశ. ఇక ఈ దశలో మనిషి తన "మూలం" గురించి తప్పని సరిగా తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఎవ్వరికీ మినహాయింపు ఉండదు.

ఈ ఆధ్యాత్మిక దశలో మనిషి సత్యాన్వేషణ కోసం మాత్రమే జన్మలు ఎత్తాల్సి ఉంటుంది. వృత్తి, ఉద్యోగం, వ్యాపారం ఇలాంటివి ఏవీ ఈ ఆధ్యాత్మిక దశలోని జన్మ ప్రణాళికలలో ఉండవు. ఈ ఆధ్యాత్మిక దశలోని జన్మ ప్రణాళికలన్నీ "ఉనికి మూలం" వైపు దారి తీసేవిగా ఉంటాయి. తప్పని సరిగా తన "ఉనికి మూలాన్ని" తెలుసుకుని తీరాల్సిందే. మరొక మార్గం ఉండదు గాక ఉండదు.

ఈ ఆధ్యాత్మిక దశలో ఉన్న వారు ఏం చేసినా, ఎంత చేసినా, తలక్రిందులుగా తపస్సులు చేసినా వృత్తి, ఉద్యోగం, వ్యాపారం మొదలైనవి కొనసాగించలేరు. మొదట ఏదో ఒక వృత్తిలోనో, ఉద్యోగంలోనో, వ్యాపారంలోనో ఉన్నా మెల్ల మెల్లగా అందులో నుండి ఆటొమెటిక్‌గా బయట పడతారు.

భౌతిక దశ పూర్తయినా వారు, ఏమీ చేయలేరు. ఉద్యోగం, వ్యాపారం ఏదీ కూడా చేయలేరు. వీరి దరిద్రం ఏ లెవెల్లో ఉంటుందంటే - వీరికి ఎవరైనా సహాయం చేస్తూ ఉంటే వారితో గొడవ పడి అందే సహాయాలను కూడా పూర్తిగా, శాశ్వతంగా దూరం చేసుకుంటారు. కృతజ్ఞత లోపిస్తుంది వీరికి. కాబట్టి, వీరికి ఎక్కడి నుండి ఏదీ అందదు, ఎవరూ ఏమీ ఇవ్వరు, ఇచ్చినా ఇచ్చే వారితో గొడవ పెట్టుకుని కూర్చున్న కొమ్మనే నరుక్కుంటారు. ధన్యవాద భావం అస్సలు ఉండదు వీరికి. ఎప్పుడైతే భౌతిక దశ పూర్తవుతుందో అప్పుడే ధన్యవాద భావం పూర్తిగా అంతరించిపోతుంది. ధన్యవాద భావం లేని వాళ్ళకు ఎక్కడి నుండి ఏమీ లభించదు. నరకం తప్ప !

మీ భౌతిక దశ పూర్తవడం అంటే మీ లైఫ్ లైన్లు అయిపోయాయని అర్థం. ఈ క్రింది లక్షణాలు మీకు సూట్ అవుతాయేమో చూసుకోండి.

స్త్రీ పురుషులు ఇరువురికీ వర్తిస్తాయి

1. మీరు ఎంతో టాలెంట్‌ను కలిగి ఉంటారు, అయినా మీకు ఏదీ కలిసి రాదు.
2. మీ దగ్గర సలహాలు తీసుకున్న వారు ఏదో ఒక దానిలో సెటిల్ అయిపోతారు, కానీ మీకు మాత్రం ఏ సెటిల్‌మెంటూ ఉండదు.
3. ఎన్నో క్రియేటివ్ ఐడియాలు ఉంటాయి కానీ ఏవీ వర్క్‌వుట్ కావు.
4. ఒక రకంగా చెప్పాలంటే బంగారాన్ని గనక మీరు ముట్టుకుంటే అది బొగ్గు అవుతుంది అన్నమాట.
5. మీరు ఉద్యోగం చేసే వారైతే, మీరు ఉద్యోగంలో కొనసాగలేని పరిస్థితులు మిమ్మల్ని చుట్టుముడుతాయి. అసలు కొంత మందికి ఉద్యోగమే రాదు.
6. మీరు ఏదో ఒక వృత్తిలో కొనసాగుతున్న వారైతే అది మానుకోవాల్సిన పరిస్థితులు వచ్చేస్తాయి. కొంత మంది ఏ వృత్తిని ప్రారంభించలేరు.
7. మీరు వ్యాపారస్థులైతే మీ వ్యాపారం సరిగా సాగదు. ఊహించని కోణాలలో నష్ట పోతుంటారు. కొంత మందైతే ఏ వ్యాపారమూ మొదలు పెట్ట లేరు.
8. డబ్బు సహాయం + ఆశ్రయం తప్ప మిగతా అన్ని రకాల సహాయాలు దొరుకుతుంటాయి మీకు. దరిద్రం తాండవం చేస్తూ ఉంటుంది మీ మీద, మీరు అడుగు పెడితే జీవనది ఎండిపోతుంది. మీరు తాకితే పచ్చని చెట్టు కూడా మోడువారి పోతుంది.
9. అందరి పనులకు మీరు ఉపయోగపడుతుంటారు. కాని మీ పనులకు మాత్రం ఎవరూ రారు. మీతో పని చేయించుకుని మిమ్మల్నే విమర్శిస్తుంటారు.
10. అందరూ బాగానే బ్రతుకుతున్నారు, నాకే ఎందుకు జరగటం లేదని మీరు వాపోతుంటారు. కొంత మందికి అన్నీ బాగానే ఉన్నా ఏదీ కలిసి రాదు.
11. వీడెందుకూ పనికి రాడు అనే ముద్ర మీ మీద పడటం ప్రారంభం అవుతుంది.
12. వీడికి తిని కూర్చోవడం బాగా అలవాటయింది అని అందరూ అనడం మొదలు పెడతారు.

13 బంధు మిత్రులు, తెలిసిన వాళ్ళందరూ మిమ్మల్ని బహిష్కరిస్తారు. పెళ్ళి అయిన మగాళ్ళ కైతే భార్యలు క్లాసులు పీకడం, వార్నింగులు ఇవ్వడం మొదలు పెడతారు.

14 కనపడ్డ ప్రతీ వారు మిమ్మల్ని క్లాస్ పీకుతూ ఉంటారు - "ఏదైనా చేయచ్చు కదా" అని !

15 మీరు కసిగా ఏదో చేద్దామని ప్రయత్నిస్తూ ఉంటారు, కానీ ఏమీ జరగదు.

16 ఏదో సాధించి అందరికి మీ సత్తా చూపెడదాం అనే ఆలోచనలలో మీరు నిరంతరం నిమగ్నమై ఉంటారు. కానీ ఏమీ చేయలేక అందరినీ తప్పించుకుని తిరుగుతుంటారు.

17 నాకూ ఒక రోజు రాక పోతుందా అని ఎదురు చూస్తూ ఉంటారు. కానీ మీకు ఆ రోజు ఎన్నటికీ రాదని తెలుసుకోండి.

18 ఒక వేళ మీకు ఆర్థికంగా ఏ ప్రాబ్లం లేదనుకోండి, జీవితంలో ఒక పెద్ద దెబ్బ తగులుతుంది లేదా ఒక పెద్ద ఘర్షణ మొదలవుతుంది.

19 ఏదైనా పెద్ద అనారోగ్యం మిమ్మల్ని వేధిస్తూ ఉంటుంది. ఏ హాస్పిటల్స్‌లో చూపించుకొన్నా ఏమీ ఫలితం లేక బాధపడుతూ ఉంటారు.

20 తీవ్రమైన మానసిక అశాంతి, ఏదో అసంతృప్తి మిమ్మల్ని వేధిస్తూ ఉంటుంది.

21 అన్నీ ఉంటాయి. కానీ లైఫ్ పూర్తిగా డ్రైగా ఉంటుంది. కారణం తెలియదు.

22 ఎవరికీ చెప్పుకోలేని సమస్యలు మిమ్మల్ని కుదిపి వేస్తుంటాయి.

** మీరు ఆల్ రెడి అష్ట దరిద్రాలతో బాధపడుతుంటారు. మీకు కొత్తగా తొమ్మిదో దరిద్రం కూడా తోడవుతుంది. అదేమిటంటే - మీరు మీ యావత్ జీవితంలో ఏదీ చేయరు, చేయలేరు. కానీ మీకంటే ఎవరెస్ట్ అంత ఎత్తున్న వాళ్ళను, వారు చేసే అత్యున్నత కార్యాలను విమర్శిస్తూ తప్పు పడుతూ ఉంటారు. ఎప్పుడూ ఏదీ చేయని వాడు ఎన్నింటినో చేస్తూ ఉన్న వాళ్ళను తప్పు పట్టడం, విమర్శించడం వలన జడ్జిమెంట్ అనే కర్మ తోడయి ఇంకా దరిద్రులవుతారు.

ఉదాహరణకు మీకు రెండు యథార్థ సంఘటనలు తెలియ జేస్తాను.

1. ఇది ఒక అబ్బాయి కథ. ఒక చక్కని కుటుంబంలో జన్మించాడు. శారీరకంగా, మానసికంగా ఏ లోపాలు లేవు. డిగ్రీ వరకు చదువుకున్నాడు. తెలివి గల వాడు. ఒక పెద్ద మల్టి నేషనల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. బాగానే ఉద్యోగం చేసుకుంటున్నాడు. జీతం బాగానే ఉంది. స్థిరంగా అదే కంపెనీలో కొనసాగితే ఎంతో భవిష్యత్తు ఉంది. స్థాయి పెరుగుతుంది, జీతం పెరుగుతుంది. భౌతికంగా ఏ ప్రాబ్లమ్స్

లేవు. కానీ ప్రతీ రోజు ఉద్యోగానికి వెళ్తుంటే ఏదో తెలియని బాధ ! గుండెను ఎవరో పట్టి పిసికినట్టుగా అనిపించి మైకం కమ్మడం, కళ్ళు తిరిగి కూలబడిపోవడం జరిగేదంట ! ఇలా చాలా రోజులుగా రెగ్యులర్‌గా జరుగుతూ ఉండే సరికి, డాక్టర్లకు చూపించుకున్నాడు. అన్ని టెస్టులు చేసారు. రిపోర్ట్స్ అన్నీ బాగానే ఉన్నాయి. ఏ లోపమూ లేదు. మరి ఎందుకిలా జరుగుతుంది ?! డాక్టర్లకు ఏమీ అర్థం కాక సైకాలజిస్టులకు, సైకియాట్రిస్టులకు చూపించుకోమన్నారు. వారికి కూడా ఏమీ అర్థం కాలేదు, గంపెడు మందులు వ్రాసి అవి మింగుతూ, తాగుతూ ఉండమన్నారు. అప్పుడప్పుడూ వచ్చి కలుస్తూ ఉండమన్నారు. ఏ అనారోగ్యం లేదు, ఆకలి బాగానే అవతుంది, బాగానే తింటున్నాడు. బాగానే నిద్ర పోతున్నాడు. నెలకు పెద్ద జీతం వస్తుంది. కుటుంబ సమస్యలు లేవు. మరి ఏం జరుగుతోంది ?! ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదు. అయితే ఆ అబ్బాయికి కొంత ఆధ్యాత్మిక పరిచయం ఉంది. రెగ్యులర్‌గా ధ్యానం చేస్తూ ఉండేవాడు. ఒకరోజు ధ్యానంలో సమస్యకు పరిష్కారం భౌతికంగా లేదు, కేవలం ఆధ్యాత్మిక చికిత్స ద్వారానే జరుగుతుంది అని స్ఫురించిందట ! నా అపాయింట్‌మెంట్ తీసుకుని నా దగ్గరికి వచ్చాడు. కొద్దిరోజులు ఉన్నాడు. నేను చెప్పే క్లాసులు విన్నాడు. చాలా పుస్తకాలు చదివాడు. నా సాంగత్యంలో కొత్త జీవితాన్ని అనుభవించాడు, అతడికి ఎంతో ప్రశాంతత, ఎంతో హాయి, ఆనందం కలిగాయి. నేను ఉద్యోగం వదిలేసి మీతో పాటు మీ మిషన్‌లో లోక కల్యాణం కోసం పని చేస్తాను సార్.. అని అడిగాడు. బాగా ఒకటికి 100 సార్లు ఆలోచించుకో సత్య మార్గంలో నిలదొక్కుకోవడం చాలా కష్టం, జనాలు అడ్డమైన వాగుడు వాగుతారు. చాలా బాధకలుగుతుంది ఆ మాటలు వింటుంటే అని... నేను చెప్పాను. అతడు కొద్ది రోజులు బాగా ఆలోచించుకున్నాడు. జాబ్ రిజైన్ చేసి నా దగ్గర ఉంటూ సత్య మార్గం పనులు చేస్తూ ఉన్నాడు. పెళ్ళి చేసుకున్నాడు, భార్యా భర్తలిద్దరూ కలిసి నా దగ్గరే ఉంటూ అంకిత భావంతో పని చేస్తూ పది సంత్సరాలకు పైగా ఆనందంగా ఉన్నారు. ఈ విధంగా ఆ అబ్బాయి భౌతిక దశ పూర్తయిన తర్వాత ఉద్యోగం దొరికినా చేయలేని పరిస్థితిలో విజ్ఞతతో, వివేకంతో పరిస్థితిని అర్థం చేసుకుని సత్య మార్గానికి పది సంత్సరాలకు పైగా అంకితం అయ్యాడు. జీవితాంతం 100% గ్యారంటీగా వాళ్లిద్దరూ నాతో పాటే కొనసాగుతారు అని అందరూ అనుకున్నారు. ఎందుకంటే, వాళ్ళు నా దగ్గర ఎలాంటి పరిస్థితులను ఫేస్ చేసారంటే, వాటిని అధిగమించిన వారికి ఇక తిరుగులేదు, ఎదురు లేదు అని అందరూ అనుకున్నారు, నేనూ అనుకున్నాను. కానీ ఎంత పైకి ఎక్కినా, క్రింద పడే ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుందని, ఎంత పై నుండి పడితే అంత ఎక్కువ నష్టం జరుగుతుంది అనేది ఈ భార్య భర్తల విషయంలో నిరూపితమైంది. 10 సంత్సరాలకు పైగా సత్య మార్గంలో ఉన్నప్పటికినూ కొన్ని భయాలు జయించలేక భౌతిక వెంపర్లాటను జయించలేక, భౌతిక కోరికలు తీర్చుకోవడానికై నా దగ్గర నుండి వెళ్లిపోయారు. ఇన్ని సంత్సరాలు సత్య మార్గంలో ఉండి సేవ చేసుకున్నందుకు, సాధన చేసుకున్నందుకు వారి ఎన్నో కర్మలు క్లియర్ అయి కొన్ని లైఫ్ లైన్లు పెరగడంతో వారికి వారి భౌతిక జీవితంలో జీవనోపాధి లభించింది. చూడాలి... వారు పెంచుకున్న లైఫ్ లైన్లు ఎంత కాలం వారికీ జీవనోపాధిని ఇవ్వగలుగుతాయో

కాబట్టి జాగ్రత్త మీరు ఎంత కాలం సత్య మార్గంలో ఉన్నా ఎన్లైటెన్మెంట్ పొందనంత వరకు మీరు ఏ క్షణంలో అయినా క్రింద పడే అవకాశం ఉంది. జాగ్రత్త... దైవత్వమే నా తొలి ప్రాధాన్యత అనే పూర్తి ఎరుకతో ఉండండి.

2. ఇది ఒక అమ్మాయి కథ. కోటీశ్వరులకు కూతురుగా జన్మించింది. చక్కగా ఉంటుంది. శారీరకంగా, మానసికంగా ఏ లోపమూ లేదు. బాగానే చదువుకుంది. కోట్ల ఆస్తి ఉంది. ఆరోగ్యం ఉంది. అందం ఉంది. అన్నీ ఉన్నాయి. పెళ్ళి కావటం లేదు. చిత్రమైన పరిస్థితి. ఏ సంబంధమూ కుదరటం లేదు. ఈ విధంగా చాలా సంవత్సరాలు ప్రయత్నించిన తర్వాత ఒక సంబంధం కుదిరింది. అబ్బాయి ఫారిన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. భారీ కట్న కానుకలు ఇచ్చి పెళ్ళి చేశారు. శోభనం రోజు తెలిసింది అబ్బాయికి "పురుషత్వం" లేదని. అయినా తొందర పడకూడదని నిదానించి, కొన్ని రోజులు పరిశీలించి నిజాన్ని నిర్ధారించుకుంది. అతడిని నిలదీసింది. అతడు అదీ ఇదీ చెప్పి మాట దాటవేసి ఫారిన్ వెళ్ళి పోయాడు. అత్త గారింట్లో అందరూ కలిసి ఈ అమ్మాయినే క్లాస్ పీకారు. పెళ్ళి అంటే సెక్స్ తప్ప మరేం కాదా ? సర్దుకుపో అని తిట్టారు. మనది పవిత్ర భారత దేశం, మన సంస్కృతీ, సాంప్రదాయాలు తెలుసా నీకు ? సెక్స్ అనేది కేవలం పిల్లల కోసమే, పిల్లలు కావాలనుకున్నప్పుడు కృత్రిమ పద్ధతుల ద్వారా గర్భం ధరించవచ్చు. నీకు త్వరలో వీసా వస్తుంది. నీవు అబ్బాయి దగ్గరికి వెళ్ళిన తర్వాత ఈ విషయమై గొడవ చేయకూడదు. ఆ సెక్స్ విషయాన్ని వదిలేయి. అక్కడికి వెళ్ళి ఉద్యోగం చేసుకో, మనసు స్వాధీనంలో ఉండడానికి పూజలు, వ్రతాలు చేయి. బుద్ధిగా బ్రతుకు అని హిత బోధ చేశారు. ఈ విషయాలన్నీ ఆ పిల్ల తన ఇంట్లో చెప్పింది. అప్పుడు ఆ అమ్మాయి తండ్రి 'చూడు ఎంతో కష్టపడి నీకు పెళ్ళి చేశాను, ఇప్పుడు ఆ అబ్బాయికి మగతనం లేకపోవడం అనేది నీ సమస్య కాబట్టి దాన్ని నీవే అనుభవించు, పెళ్ళి అయినా అమ్మాయిని భర్త దగ్గరికి పంపకుండా ఇంకా ఇంట్లోనే ఉంచుకున్నాడు అనే అపవాదు నేను భరించలేను, సమాజంలో నా పరువు తీయకు, వెళ్ళు నీ కర్మ నీవు అనుభవించు' అని అన్నాడు. ఇక ఆ అమ్మాయి అన్ననేమో 'పెళ్ళయినా నీ చెల్లెలు కాపురానికి పోలేదంటే ఏంటి విషయం ? నీ కుటుంబం మంచిది కాదా అని నాకు పిల్లను ఇవ్వరేమో ? కాబట్టి నా పెళ్ళి కావాలంటే నీవు వెళ్ళ వలసిందే' అని అన్నాడు. ఆ పిల్ల తల్లి మాత్రం ఆ అమ్మాయికి సపోర్ట్ చేసింది. కాని వాళ్ళ మాటలు ఎవరూ పట్టించుకోలేదు. ఆ అమ్మాయికి జీవితం మీద విరక్తి పుట్టింది. నా తండ్రి, నా అన్న ఇంత ఘోరంగా ఉన్నారేంటి అని ఆశ్చర్య పోయింది. ఏడ్చింది. చివరికి చచ్చిపోదామని డిసైడ్ అయింది. కాని ఏదో మూల ఒక ఆశ ఉంది... నాకు మంచి జీవితం ఉంది అని ! ఆ ఆశే ఆ అమ్మాయిని నా దగ్గరికి చేర్చింది. నేను ఆ అమ్మాయిని కొన్ని రోజులు పరీక్షించాను. తల్లికీ, అమ్మాయికి సబ్జెక్ట్ వివరించాను. ఆ తర్వాత ఆ అమ్మాయికి అసలు విషయాన్ని చెప్పాను. "నీవు ఈ జన్మలో పూర్తిగా సత్య మార్గాన్ని డిజైన్ చేసుకున్నావు. నీకు ఈ జన్మలో పెళ్ళి లేదు. అయినా నీవు బలవంతంగా పెళ్ళి

చేసుకున్నావు. కాబట్టే అలాంటి అబ్బాయి దొరికాడు. నీవు విషయాన్ని అర్థం చేసుకుని సత్య మార్గంలోకి వస్తే తప్ప నీ సమస్యలు పరిష్కారం కావు. నీకు సత్య మార్గంలో అన్నీ లభిస్తాయి. మంచి పార్ట్‌నర్ కూడా దొరుకుతాడు అని చెప్పాను. ఆ అమ్మాయి, తల్లి విషయాన్ని అర్థం చేసుకున్నారు. చాలా రోజులు నా దగ్గర గైడెన్స్ తీసుకున్నారు. సాధన చేసారు. జీవిత సత్యాన్ని అర్థం చేసుకున్నారు. ధైర్యం చేసి ఇంట్లో వాళ్ళకు చెప్పారు, వారిని ఒప్పించారు. ఆ అమ్మాయి చాలా ధైర్యంగా, అవగాహనతో వ్యవహరించింది. పెద్దల అండతో విడాకుల కోసం కోర్టులో కేసు వేసింది. ఆ అమ్మాయిని వాళ్ళ తల్లిదండ్రులు నా దగ్గర వదిలి వెళ్ళారు. ఇక ఆ అమ్మాయి నా దగ్గర ఉండి ఆధ్యాత్మిక శాస్త్రం నేర్చుకుంటూ, ధ్యాన సాధన చేస్తూ, సత్య ప్రచారంలో పాల్గొంటూ ఉన్నది. ఒక పక్క కోర్టులో కేసు నడుస్తూనే ఉంది. ఆ అబ్బాయి వాళ్ళు మరి ఇంకా కొంత మంది కలిసి విడాకుల కేసు ఉపసంహరించుకోమని ఈ అమ్మాయి పైన చాలా వత్తిడి తెచ్చారు. బాబాలతో, స్వామీజీలతో, ఇంకా రక రకాల వారితో సంప్రదాయాల గురించి, ఆచార వ్యవహారాల గురించి చెప్పించారు. ఎంత మంది ఎంత వత్తిడి తెచ్చినా ఈ అమ్మాయి లొంగలేదు. అందరినీ ఎదిరించింది. ధీరోదాత్తంగా వ్యవహరించింది. చివరకు విడాకులు తీసుకుంది. ఈ పెళ్ళి వలన, విడాకుల వలన కొంత ఆర్థిక నష్టం జరిగింది. కాకపోతే ఆ అమ్మాయి జీవితం తిరిగి ఆమెకు దక్కింది. ఆ తర్వాత, అంతా క్లియర్ చేసుకుని ఆ అమ్మాయి సత్య సాధన చేసుకుంటూ, సత్య ప్రచారంలో పాల్గొంటూ ఆనందంగా ఉంది. కొంత కాలానికి ఆ అమ్మాయికి ఒక పార్ట్‌నర్ లభించాడు. అయితే అప్పుడు నేను ఆమెను హెచ్చరించాను, కేవలం సత్య మార్గంలో ఉన్న అబ్బాయినే చూసుకోమ్మా అని, నా మాట వినకుండా సత్య మార్గంలో లేని అబ్బాయిని పెళ్ళి చేసుకుంది. ఒక సంవత్సరం తర్వాత అతనితో, కొన్ని కారణాల వలన విడిపోయింది. చాలా బాధ పడింది. ఇలా ఎందుకు జరిగింది సార్ అని ఏడుస్తూ నన్ను ప్రశ్నించింది. నేను చెప్పాను కదమ్మా ముందే... నీవు పూర్తిగా సత్య మార్గానికి అంకితం అయిన వ్యక్తిని మాత్రమే పెళ్ళి చేసుకోవాలి అని అన్నాను. ఈ సత్యం ఆ అమ్మాయికి బోధపడ లేదు. మళ్ళీ సత్య మార్గంలో లేని ఇంకొక అబ్బాయిని పెళ్ళి చేసుకుంది, పెళ్ళైన కొంత కాలానికి అతడికి ఈమె కాక ఇంకా ఇద్దరు భార్యలు, వాళ్ళకు పిల్లలు ఉన్నారనీ తెలిసింది. కేవలం ఈ అమ్మాయిని డబ్బు కోసమే పెళ్ళి చేసుకున్నాడనే విషయం బయట పడింది. నానా తంటాలు పడి అతడిని వదిలించుకుంది. చావు తప్పి కన్ను లొట్ట పోయినట్టు అయి కొంత కాలం మౌనంగా ఉంది. ఆ తర్వాత మరొక అబ్బాయి కలిసాడు, ఇతడు పూర్తిగా సత్య మార్గానికి అంకితమైన వాడే ! గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పెళ్ళి చేసుకోకుండా అతనితో కలిసి జీవించ సాగింది. ముందే ఒప్పందం చేసుకుంది అతడితో... మన ఇద్దరిలో ఎవరికి ఇష్టం లేకపోయినా విడిపోదాం, నేను నీ స్వేచ్ఛను అడ్డుకోను, నీవు నా స్వేచ్ఛకు అడ్డు రాకు అని క్లియర్‌గా చెప్పింది, అతడు కూడా ఒప్పుకున్నాడు. అవగాహనతో కలిసి ఉంటూ సత్య ప్రచారంలో పాల్గొంటున్నారు. అంతా బాగానే ఉంది అనుకుంటున్న తరుణంలో ఆ అమ్మాయి మళ్ళీ ఖర్మకు లొంగిపోయింది. ఆ అమ్మాయి మనసు మళ్ళీ భౌతిక జీవితం మీదకు

పోయింది. సత్య మార్గం నుండి తప్పుకుని, నా దగ్గర నుండి వెళ్ళిపోయి, ఏదో భౌతిక జీవితం మొదలు పెట్టింది, ఆమె భౌతికంలోకి మారే సరికి ఆ అబ్బాయి ఆ మెను వదిలేసి తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఎప్పుడైతే సత్య మార్గం నుండి తొలగిందో అప్పుడే మళ్ళీ ఆ అమ్మాయి జీవితం దెబ్బ తిన్నది. బహుశా ఇప్పుడు పుట్టింట్లో ఉంటున్నట్టుంది. ఇంత జరిగినా ఆ అమ్మాయికి బుద్ధి రాలేదు, కొన్ని బతుకులు అంతే, మళ్ళీ ఎన్నో జన్మలు నరకం అనుభవించి కర్మ క్లియర్ చేసుకుంటే కానీ ఆ పిల్లకు బుద్ధి రాదు. ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. అయితే వాటిలో చెప్పుకో దగ్గ కేసు ఒకటి ఉంది. సేమ్ టు సేమ్.... ఈ అమ్మాయికి కూడా చాలా కష్టంగా పెళ్ళి జరిగింది. అబ్బాయికి పురుషత్వం లేదు. ఒక సంవత్సరం పాటు గుళ్ళు, గోపురాలు, చర్చీలు, దర్గాలు మొదలైనవన్నీ తిరిగింది ఎందుకంటే ఆ అబ్బాయి డాక్టర్ల దగ్గరికి రానంటున్నాడు. డాక్టర్ల దగ్గరికి ఎందుకు రానంటున్నాడు అనే విషయం పైన పరిశోధన చేసింది. ఆ పరిశోధనలో తేలిందేమిటంటే.... ఆ అబ్బాయి ఆల్‌రెడి ఎంతో మంది డాక్టర్లకు చూపించుకున్నాడనీ, ఈ విషయమై ఫారిన్ కూడా వెళ్ళి వచ్చాడనీ ఎక్కడా ఫలితం రాలేదనీ అందుకే విసిగిపోయి ఊరుకున్నాడనీ తెలిసింది. ఈ అమ్మాయికి ఏం చేయాలో పాలు పోలేదు. చాలా సాంప్రదాయ బద్ధమైన కుటుంబం. అయినా తప్పని సరై విడాకులు తీసుకుంది. జీవితం పైన విరక్తి కలిగి నిరాశలో కుంగిపోయి ఉండగా, నా గురించి తెలిసి, తల్లిదండ్రులతో కలిసి నా దగ్గరికి వచ్చింది. వాళ్ళకు విషయాలన్నీ వివరించాను. ధ్యానం చేస్తే లైఫ్ డిజైన్ తెలుస్తుందనీ చెప్పాను. ఇది ఒక జీవిత పాఠం మాత్రమే అయితే, కంగారు పడవలసిన అవసరం ఏమీ లేదు, మళ్ళీ పెళ్ళి అవుతుందనీ, ఒక వేళ లైఫ్ డిజైన్‌లో ఈ పెళ్ళి అనే అంశం గనక లేకపోతే జరగదనీ చెప్పాను. ధ్యానం నేర్పించాను. శ్రద్ధగా సాధన చేసుకుంటే త్వరలోనే నీ లైఫ్ డిజైన్ ఏమిటో నీకు చాలా క్లియర్‌గా తెలుస్తుంది అని చెప్పాను. నా మార్గదర్శకత్వంలో సాధన ప్రారంభించింది. బాగా సీరియస్‌గా సాధన చేసింది. చాలా త్వరగా తన లైఫ్ డిజైన్ ఏమిటో తాను స్పష్టంగా తెలుసుకుని నాకు చెప్పింది. ఆమె లైఫ్ డిజైన్ ప్రకారం ఆమె ఈ జన్మలో సత్య మార్గానికి అంకితం కావాలి, అందుకే పెళ్ళి ఫెయిల్ అయింది. ఇప్పుడు మేము ఏం చేయాలో చెప్పమని అడిగారు తల్లి, తండ్రి మరియు ఆ అమ్మాయి. నేను మిమ్మల్ని ఒక అమ్మాయితో కలిపిస్తాను. ఆమె కథ వినండి. అప్పుడు మీకేం చేయాలనిపిస్తే అది చేయండి, అని ఆ మొదటి అమ్మాయితో పరిచయం చేయించాను. ఆమె తన విషయాలన్నీ పూర్తిగా చెప్పింది. వీళ్ళు ఒక వారం రోజులు ఆలోచించుకున్నారు. ఆ తర్వాత నా దగ్గరికి వచ్చి... సార్ జీవిత సత్యాన్ని అంగీకరిస్తున్నాము... అంగీకరించకపోతే ఏం జరుగుతుందో చక్కగా తెలుసుకున్నాం. మమ్మల్ని సత్య మార్గంలో నడిపించి రక్షించండి అని ప్రార్థించారు. సరే మీ ఇష్టం అని వారిని శిష్యులుగా స్వీకరించాను. ఇప్పుడు వాళ్ళు చాలా ఆనందంగా ఉన్నారు. ఆ అమ్మాయికి ఒక పార్ట్‌నర్ దొరికాడు. పెళ్ళి చేసుకోకుండా కలిసి హాయిగా ఉంటూ, సత్య ప్రచారం చేసుకుంటున్నారు. ఇలాంటి కేసే మరొకటి ఉంది. అయితే ఆ అమ్మాయి చాలా అదృష్టవంతురాలు & వివేకవంతురాలు. ఎందుకంటే.... చెప్తున్నా వినకుండా దెబ్బ తినే వాళ్ళు మూర్ఖులు. దెబ్బ తిని కూడా పాఠం నేర్చుకోని వారు మహా మూర్ఖులు. ఒక సారి దెబ్బ తినగానే నేర్చుకునే

వాళ్ళు తెలివైన వాళ్ళు. దెబ్బ తినకుండా ఇతరులను చూసి నేర్చుకునే వాళ్ళు వివేకవంతులు. ఈ మూడవ అమ్మాయి ఇంతకు ముందు ప్రస్తావించిన ఇద్దరమ్మాయిల విషయం విన్నది. ఈ మూడవ అమ్మాయి M. Tech పూర్తి చేసింది. విదేశాల్లో సెటిల్ అవుదామని ప్రయత్నం చేస్తుంటే కావటం లేదు. ఈ విషయమై నన్ను కలవడానికి వచ్చింది. అప్పుడు ఈ ఇద్దరమ్మాయిల స్టోరి విన్నది. ఆమెకు ఒక డౌటు వచ్చింది. కొంపదీసి నాది ఇలాంటి కేసేనా ఏమిటి ? అని. వెంటనే నన్ను అడిగింది, సార్ లైఫ్ డిజైన్ తెలుసుకోవాలంటే ఏం చేయాలి సార్ ? అని అడిగింది. చెప్పాను. ధ్యానం చేసింది, తెలుసుకుంది. ఈ అమ్మాయిది కూడా సత్య మార్గం డిజైనే ! ఇంతకు ముందు అమ్మాయిలు చేసినట్టు చేయకుండా, వెంటనే జీవిత సత్యాన్ని అంగీకరించింది. అన్నీ వదిలేసింది. స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగు పెట్టింది. ఇప్పుడు ఆ అమ్మాయి హాయిగా సాధన చేసుకుంటూ, సత్య ప్రచారానికి అంకితమై, జీవితంలోని ప్రతి కోణాన్ని ఎంజాయ్ చేస్తూ హ్యాపీగా, జాలీగా... ఉంది. ఇతరులను చూసి నేర్చుకుంది కాబట్టే వివేకవంతురాలు. ఈ అమ్మాయి స్నేహితురాలు ఒకామె ఉంది. ఆ పిల్ల ఈమెను చూసి నాది కూడా సత్య మార్గమేమో అని తెలుసుకోవడానికి ధ్యానం చేసింది. కాని ఆమెది సత్య మార్గ లైఫ్ డిజైన్ కాదు. ఆమెకు పెళ్ళి అయింది. హాయిగా కాపురం చేసుకుంటుంది. కళ్ళు మూసుకుని, నా లైఫ్ డిజైన్ ఏమిటి ? అని అదే పనిగా ప్రశ్నించుకుంటూ ఉండాలి. కాసేపటి తర్వాత మౌనంగా అలాగే ఉండాలి. అప్పుడు తెలుస్తుంది లైఫ్ డిజైన్. తెలిసేదాక సాధన చేయాలి. ఏదో ఒక రోజు తెలుస్తుంది.

ఇలా ఉంటాయి విషయాలు. కాబట్టి మీ లైఫ్ లైన్లు ఉన్నాయా... లేవా.... అని తెలుసుకుని మీ లైఫ్ డిజైన్ ప్రకారం సాగిపోతే, అప్పుడు మీ జీవితం పూర్తిగా మీ చేతుల్లోకి వస్తుంది.

అందరికీ ఇలా ఉండదు. కాబట్టి కంగారు పడకండి. నేను ఇక్కడ కేవలం ప్రత్యేకమైన కేసుల గురించి మాత్రమే ప్రస్తావిస్తున్నాను.

✪ కొంత మంది "లైఫ్ లైన్లు" అయిపోకముందే స్వయంగా, వారికై వారే ఆనందంగా, బాధ్యతగా ఆధ్యాత్మిక దశలోకి వచ్చి మహా సౌభాగ్యాన్ని పొందుతారు. ఇలా రావడం చాలా, చాలా అదృష్టం !

ఒక సారి చెక్ చేసుకోండి. నేను పైన చెప్పిన వాటిల్లో ఏవైనా మీకు సూట్ అవుతున్నాయేమో చూసుకోండి. ఒకవేళ, ఒకటో లేక అంత కంటే ఎక్కువ పాయింట్లతో మీరు చాలా కాలం నుండి బాధ పడుతున్నారంటే ఎవరైనా మాస్టర్ అనగా గురువు దగ్గరికి వెళ్ళి కౌన్సిలింగ్ తీసుకోండి, బాగా ధ్యానం చేయండి. అవి సాధారణ కర్మలైతే తొలగి పోతాయి. ఒక వేళ మీ లైఫ్ లైన్లు గనక అయిపోతే ఆ పరిస్థితులు ఇంకా తీవ్రం అవుతాయి. ఇక అప్పుడు తప్పని సరిగా "సత్య మార్గంలోకి" పోవాల్సిందే ! అప్పుడే మీ అన్ని సమస్యలు శీఘ్రంగా, శాశ్వతంగా తీరిపోతాయి.

సత్య మార్గంలోకి వస్తే బ్రతకడం ఎలా ? అని మీరు భయపడుతూ ఉంటారు. భయపడకండి, హాయిగా, ఆనందంగా జీవించవచ్చు. ఈ "సద్గురు తారా విశాల్ మార్గదర్శి"ని పూర్తిగా చదవండి మీకే అర్థం అవుతుంది. సత్య మార్గంలో ఉన్న వారిదే అసలు సిసలు జీవితం అంటే !

మరొకసారి మీకు తెలియజేస్తున్నాను - మీరు అనుభవిస్తున్నవి సాధారణ కర్మలైతే ధ్యానం చేస్తే పోతాయి. ఎంత చేసినా మీ సమస్యలు పరిష్కారం కావటం లేదని అంటే మీ భౌతిక దశ పూర్తి అయింది, మీ లైఫ్ లైన్లు అయిపోయాయని తెలుసుకుని బుద్ధిగా సత్య మార్గంలోకి రావాలి లేదంటే రప్పించబడతారు. మాది ఎంతో విస్తారమైన, విశేషమైన ప్రాక్టికల్ అనుభవం !

కొంత మంది మగవాళ్ళు తమకు మగతనం లేకపోయినా పెళ్ళి ఎందుకు చేసుకుంటారంటే - వారు ఈ జన్మలో అలా జీవించడం నేర్చుకోవడానికి ఎంచుకున్నారు అని అర్థం చేసుకోవాలి. సమాజం, వారిని చిన్న చూపు చూడకుండా అలా పెళ్ళి చేసుకుంటారు. ఒక సారి పెళ్ళి అయిపోయిన తర్వాత విడిపోతే దానికి కారణాలు వేరే ఏవైనా చెప్పవచ్చు. ఒక వేళ మళ్ళీ పెళ్ళి చేసుకోమని ఎవరైనా అడిగితే, జరిగింది చాలు, మళ్ళీ పెళ్ళా ? అంటూ తప్పించుకునే అవకాశం ఉంది. కానీ, అసలు పెళ్ళే చేసుకోకుండా ఉంటే, ఏమని జవాబు చెప్పాలి ? ఏది చెప్పినా అతకదేమోనని, సమాజం కోసం వారు పెళ్ళి చేసుకుంటారు. ఇలాంటి వారికి, మోసపోవడం లేక ఇతర అంశాలను నేర్చుకునే అమ్మాయిలే ఆకర్షితులు అవుతారు. కాబట్టి ఇలాంటి మగవారిని ''జడ్జ్''(నిందించ కుండా & తప్పు పట్టకుండా) చేయకుండా వారి నుండి మౌనంగా విడిపోయి, కొత్త, సరైన భాగస్వామిని ఎంచుకోవాలి. బాగా గుర్తుంచుకోండి, ఇలా చేసిన వారి పైన ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేయవద్దు. కర్మ వశాత్ ఇలా జరిగిందని అవగాహన చేసుకుని, మౌనంగా విడిపోవాలి. అంతే కాని, వారిని దూషించడం, నిందించడం, తప్పు పట్టడం ఇంకా ఇతరాలు ఏవీ చేయవద్దు. ''జడ్జ్'' చేస్తే, ఆ పరిస్థితి మీకు వచ్చే అవకాశం ఉంది. ''జడ్జ్‌మెంట్'' గురించి ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే వివరించాను, చదివి అర్థం చేసుకోండి. జాగ్రత్త ''జడ్జ్'' చేయకండి.

3. భూమి ఒక హోటల్ లాంటిది, మీరే బిల్లు చెల్లించాల్సిందే !

ఈ భూమి పైకి మీరు అనుభవ జ్ఞానం కోసం వచ్చారు. వేలాది జన్మలు ఎత్తి అనుభవాన్ని గడించిన మీరు తిరిగి వెళ్ళేటప్పుడు అంతకు అంతా చెల్లించాల్సిందే ! వేలాది జన్మలలో మీరు, భూమి నుండి లెక్కలేనన్ని సౌకర్యాలను పొందారు, వాడుకున్నారు, పరిణామ క్రమంలో అభివృద్ధి చెందారు. ఎంతో లాభ పడ్డారు. ఇప్పుడు మీ వంతుగా, మీ కాంట్రిబ్యూషన్‌గా మీ ద్వారా చెల్లింపులు జరిగితేనే మీకు భూమి క్లియరెన్స్ ఇస్తుంది. లేదా పట్ట పగలే, టెలిస్కోప్ లేకుండా చుక్కలే కాదు మొత్తం బ్రహ్మాండం అంతా ఫ్రీగా దర్శనం అవుతుంది.

ఇలా చెల్లింపులతోనే మీ సత్య మార్గం ప్రారంభం అవుతుంది. ఎంతో మంది తమ జీవితాలను ధారపోసి కనుక్కుని అందించిన వాటిని వేలాది జన్మలలో అనుభవించారు. పంచభూతాలు అంటే భూమి, అగ్ని, నీరు, వాయువు, ఆకాశం వీటి సహాయ సహకార సమన్వయాలతో ఆత్మ పరిణామ క్రమంలో చివరి దశకు వచ్చారు. ఇక ఇప్పుడు మీరు పొందింది అంతా పంచి పెట్టి తీరాలి. ఇలా పంచి పెట్టే మార్గమే సత్య మార్గం. పొందింది పంచుతూ మిమ్మల్ని మీరు పెంచుకోవడమే సత్య మార్గం !

సత్య మార్గం అంటే...

మీ "ఉనికి మూలాన్ని" తెలుసుకునే సాధన చేస్తూ, ఆ విషయాలను అందరికీ అందించే జీవన విధానమే సత్య మార్గం. మీ "నిజ తత్వమైన దైవత్వాన్ని" తిరిగి పొందేందుకు సాధన చేస్తూ ఆ సాధనా విశేషాలను అందరికీ తెలియ చేస్తూ జీవించడమే సత్య మార్గం అంటే ! బోధనలు, క్లాసులు చెప్పకూడదు. కేవలం ఎన్‌లైటెన్డ్ మాస్టర్ మాత్రమే క్లాసులు చెప్పాలి.

సత్య మార్గానికి అంకితం అంటే...

ఏ వృత్తి, ఉద్యోగం, వ్యాపారం లేకుండా పూర్తిగా 100% సాధనకు అంకితమై మరియు అకర్మ వీగనిజం + ఉన్నత ధ్యాన + ఉన్నత ఆత్మ విజ్ఞాన ప్రచారం చేస్తున్న ఒక సత్య గురువు దగ్గర నిజాయితీగా, విశ్వాసంగా, నిస్వార్థంగా అధికారం పదవులకోసం ప్రాకులాడకుండా నిబద్ధతతో పని చేయడం ! సత్య మార్గానికి పూర్తిగా మిమ్మల్ని మీరు సమర్పించుకుని జీవించడమే సత్య మార్గానికి అంకితం కావడం అంటే ! ఇది అందరి వల్ల కాదు ! ఎవరో బాగా పరిణితి చెందిన ఉన్నత ఆత్మలకు మాత్రమే సాధ్యమవుతుంది. నేను కేవలం విషయం తెలియ చేస్తున్నాను.

అందరూ సత్య మార్గానికి అంకితం కాలేరు!
తాందరపాటు నిర్ణయాలు తీసుకుని
ప్రయోగాలు చేయకూడదు.
జీవితం తలక్రిందులైపోతుంది.
ఈత రాకుండా సముద్రంలోకి దిగితే ఎలా
అవుతుందో అలా అవుతుంది. జాగ్రత్త !

మీరు ఈ భూమి మీద పొందింది పంచి తీరాల్సిందే. మరి అందరూ అలా లేరు కదండీ అని అంటే వాళ్ళ సమయం ఇంకా రాలేదని అర్థం. ఎవరికైతే ఫిజికల్ లైఫ్ లైన్లు అయిపోయాయో వారి గురించి మాత్రమే చెప్తున్నాను. అందరికీ ఈ దశ వచ్చి తీరుతుంది. పిందె కాయ కాక మానుతుందా, కాయ పండు కాకపోతుందా ? పిందెలు ఉంటాయి, కాయలు ఉంటాయి, పండ్లు ఉంటాయి. నేను పండ్ల గురించి మాట్లాడుతున్నాను.

ఇక్కడ మీరు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే చాలా కాలం కాయ, కాయగా ఉండీ, ఉండీ పండుగా మారింది. తాను పండుగా మారానన్న సంగతి ఆ కాయకు ఇంకా తెలియదు. కాయగా ఉన్నప్పుడు గట్టిగా ఉంటుంది. కాబట్టి పరిస్థితులను తట్టుకోగలిగింది. ఇప్పుడు పండుగా అయి మెత్తబడింది. పరిస్థితులు ఒత్తుతూ ఉంటే అప్పుడు మెల్లి మెల్లిగా విషయం అర్థమవుతూ ఉంటుంది. అప్పుడు ఆ పండు ఇలా అనుకుంటుంది "ఈ ఒత్తిళ్ళు నాకే ఎందుకు" ?! "మిగతా వాటికి ఎందుకు కలగటం లేదు" ?! "నన్నే ఎందుకు వత్తుతున్నారు" ?! "నేనే ఎందుకు ఒత్తబడుతున్నాను" ?! అని ఆశ్చర్యపోతూ ఆందోళన చెందుతూ ఉంటుంది. ఈ ప్రశ్నలన్నింటికి ఒకే ఒక సమాధానం - "నీవు పండువు కాబట్టి" ! పండునే ఒత్తుతారు, పండే ఒత్తబడుతుంది కదా ! కాయలను ఒత్తరు కదా ! ఒక వృక్షంలోంచి పిందెగా ఉద్భవించిన మీరు కాయగా మారి పండు అయ్యారు. ఇప్పుడు మీరు వృక్షంగా మారాలి. ఇది సృష్టి పరిణామ క్రమం. ప్రతీ పిల్లవాడు తండ్రి అవుతూ ఉన్నట్టే, ప్రతీ పిల్ల తల్లి అవుతున్నట్టే - ప్రతీ పిందె కాయగా, పండుగా మారి వృక్షం కావాల్సిందే !

పిందెలుగా, కాయలుగా ఉన్న వారు భౌతిక దశల్లో ఉన్నారని అర్థం. వీరు భౌతిక దశలో ఉన్నారు కాబట్టి వీరికి లైఫ్ లైన్లు ఉంటాయి. ఇంకా వీరికి లైఫ్ లైన్లు ఉండటం మూలాన వీరి వృత్తియో, ఉద్యోగమో, వ్యాపారమో ఎదో ఒకటి కొనసాగుతూ ఉంటుంది. ఎంతో కొంత సంపాదన రెగ్యులర్‌గా అందుతూ ఉంటుంది కాబట్టి సహజంగానే ఇలాంటి వారిలో అధిక శాతం **"మదం"** కలిగి ఉంటారు. వీరికి మేము మదంతో ఉన్నామని తెలియదు. రెగ్యులర్‌గా సంపాదన మరియు ఆరోగ్యం అనేవి వీరికి ఉంటాయి, కాబట్టి వీరికి విషయాలు జరిగి పోతూ ఉంటాయి. మరి విషయాలు సాఫీగా జరిగిపోతూ ఉన్నప్పుడు ఇతరుల పరిస్థితులు ఏమర్థమవుతాయి ? ఇలాంటి వారు "సత్య మార్గంలో" ఉన్న మాలాంటి వారిని చూసి...

ఏం ?! ఏమైనా చేయవచ్చు కదా ?!
ధ్యానం అంటూ, ఆధ్యాత్మికం అంటూ పనికి రాని విషయాల వెంట
పడకుండా, ఏదైనా పనికి వచ్చే పని చేయవచ్చు కదా !
ఏంటో ఈ సోది !...

...అంటూ సత్య మార్గంలో ఉన్న వారిని చూసి విసుక్కుంటుంటారు. మేము ఎందుకు ధ్యానం, ఆధ్యాత్మికం, మోక్షం అంటూ వాటి గురించే మాట్లాడుతూ, వాటికి సంబంధించిన సాధనలు ఎందుకు చేస్తున్నామో, వేరే ఇతర వృత్తి, ఉద్యోగ వ్యాపారాలు ఎందుకు చేయటం లేదో ఈ "కాయలకు" ఎలా అర్థం అవుతుంది ? ఈ కాయలూ పండ్లు అయినప్పుడు, ఈ విషయాలన్నీ ఆటొమెటిక్‌గా, చక్కగా అర్థం అయిపోతాయి.

4. మీ స్వయం పైననే మీరు ఆధారపడాలి

ఫిజికల్ లైఫ్ లైన్లు అయిపోయిన వారు సత్య మార్గంలోకి ప్రవేశించి వారి "స్వయం" పైననే వారు ఆధారపడి జీవించాలి. మీరు వేలాది లేక లక్షలాది జన్మలు ఇతరుల పైన ఆధారపడి బ్రతుకుతూ వచ్చారు. మీరు ఏ వృత్తి చేసినా, ఏ వ్యాపారం చేసినా, ఏ ఉద్యోగం చేసినా అది ఇతరుల మీద ఆధారపడి బ్రతకడమే అవుతుంది. మీరు ఒకరు లేకపోతే ఇంకొకరు బ్రతకలేరు. సత్య మార్గంలో ఉన్న వారు పూర్తిగా తమ స్వయం పైననే ఆధారపడి, తమ కాళ్ళ మీద తాము నిలదొక్కుకుని జీవిస్తూ ఉంటారు. తమ స్వయం శక్తితో పరిస్థితులను సృష్టించుకుని జీవిస్తూ ఉంటారు. తమ దివ్యకర్మల ఫలితం చేత జీవిస్తూ ఉంటారు. ఆధ్యాత్మిక సూత్రాలను ఆచరించడం ద్వారా తమకు కావల్సినవి తమ వద్దకు ఆకర్షించుకుని, వాటిని పొంది జీవిస్తూ ఉంటారు.

ఎవరు ఉన్నా, లేక పోయినా తమ జీవితాన్ని తాము, తమ ఆత్మ శక్తి వల్ల ముందుకు కొనసాగిస్తూ, జీవిస్తూ ఉంటారు.

భౌతిక దశలలో ఉన్న వాళ్ళు బాహ్య విషయాల పైన ఆధారపడి బ్రతుకుతూ ఉంటారు. తనకు ఏ శక్తి సామర్థ్యాలైతే ఉన్నాయో వాటన్నింటినీ మనలో పొందు పరిచి మనల్ని సృష్టించింది "మూల చైతన్యం". మనలో ఉన్న మన స్వంత శక్తి సామర్థ్యాలను వెలికి తీసుకుని జీవించమని చెప్పింది. అయితే ప్రారంభంలో కొంత ట్రైనింగ్ అవసరం కాబట్టి వేలాది భౌతిక జన్మలు అనే లైఫ్ లైన్లు ఇచ్చింది. ఈ లైఫ్ లైన్లు అయిపోక ముందే మేలుకుంటే సరి లేదా విధిగా మేలుకుని తీరాల్సిందే !

ఒక వ్యక్తి అన్ని వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు ఇంకా ఇతర భౌతిక కార్యకలాపాలు మానివేసి పూర్తిగా తనను తాను తెలుసుకోవడంలో నిమగ్నమై "తన నిజ తత్వంలో తాను మేలుకోవడం" అనేది సృష్టిలో అన్నింటి కన్నా అత్యున్నతమైన, అత్యుత్తమమైన, మహా ఘనకార్యం అవుతుంది. ఇది మహా సృష్టి సేవగా పరిగణించ బడుతుంది. ఎదిగి వచ్చిన సంతానం తల్లిదండ్రులకు అండగా నిలిచినప్పుడు ఆ తల్లిదండ్రులు ఎంతగా ఆనందిస్తారో, అదే విధంగా ఒక వ్యక్తి సత్య మార్గంలోకి రాగానే సృష్టి కేంద్రమైన మూల చైతన్యం కూడా ఆనందిస్తుంది.

భౌతిక దశలలో ఉన్నవారు తమ "స్వయం" పైన కాకుండా బాహ్యంలోని వ్యక్తుల పైనా, విషయాల పైనా ఆధారపడి జీవిస్తూ ఉంటారు. మీరు ఉద్యోగం చేస్తున్న కంపెని మూత పడితే మీరు బ్రతకలేరు. మీరు చేస్తున్న వ్యాపారం సరిగా సాగకపోతే మీరు బ్రతకలేరు. మీ వృత్తికి తగిన ఆదరణ లభించకపోతే మీరు బ్రతకలేరు. మీ బ్రతుకు అంతా బాహ్యంలోని వాటిపైన ఆధారపడి ఉంటుంది. మీవి కాని వాటి పైన ఆధారపడి మీరు బ్రతుకుతూ ఉంటారు. ఏది, ఎక్కడ తేడా వచ్చినా మీ బ్రతుకు తల్లకిందులై పోతుంది.

ఒక యోగి - సత్య మార్గంలో ఉన్న వ్యక్తి కేవలం తన అంతరంలో ఉన్న తన "స్వయం" పైన ఆధారపడి జీవిస్తూ ఉంటాడు. అతడు తనకు కావాల్సిన వాటిని తాను స్వయంగా సృష్టించుకుని లేదా ఆకర్షించుకుని జీవిస్తూ ఉంటాడు. ఘోరారణ్యంలో, జనారణ్యంలో, హిమాలయాల్లో ఎక్కడైనా ఆనందంగా జీవిస్తాడు.

✵ ఏ వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు మొదలైన ఏ భౌతిక కార్యకలాపాలు లేకుండా ఆనందంగా జీవించడం అనేది మామూలు విషయం కాదు. అజ్ఞానపు భౌతిక దృష్టితో చూస్తే భౌతికంగా ఏ వృత్తి, ఉద్యోగం, వ్యాపారం చేయని వారు కూర్చుని తింటున్నారని అనిపిస్తుంది. కాని వాస్తవం ఏమిటంటే భౌతిక దశలలో ఉన్న వారే భూమికి భారం. తమ నిజ తత్వం గురించి తెలియక బ్రతికే మానవులు, భూమికే కాదు సృష్టికే భారం. సత్యాన్ని పొందిన సత్య స్వరూపుల వల్లనే "భౌతిక జీవుల" మనుగడ కొనసాగుతుంటే అని అంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి విషయాలు లోతైన అవగాహన లేని బుర్రలకు కొరుకుడు పడని విషయాలు. ఎంతో అత్యున్నతమైన స్థాయికి సంబంధించిన విషయాలు.

సత్య మార్గదర్శులు లేకపోతే ఈ భూమి పైన ఒక్కరు కూడా సాఫల్యాన్ని పొందలేరు. సత్య మార్గంలో ఉన్న వారు భౌతిక దశలలో ఉన్నవారికి సేవ చేసే అవకాశాన్ని ఇవ్వడం ద్వారా వారికి "ముక్తి మార్గాన్ని" అందిస్తూ ఉంటారు. వారు ముక్తి పొందే ద్వారాలు తెరుచుకునేలా చేస్తుంటారు.

❖ ❖ ❖

5. అకర్మ శాకాహార + ధ్యాన + ఆత్మ విజ్ఞాన ప్రచారం చేస్తున్న వారు తెలుసుకోవాల్సిన అత్యంత ముఖ్య విషయాలు

అకర్మ శాకాహార + ధ్యాన + ఆత్మ విజ్ఞానాల ఆవశ్యకతలను తెలుసుకునే మార్గాన్నే "సత్య మార్గం" అని అంటారు.

అకర్మ శాకాహార + ధ్యాన + ఆత్మ విజ్ఞానాల ఆవశ్యకతలను తెలుసుకుని, వాటిని ప్రచారం చేయాడాన్నే "సత్య ప్రచారం" అని అంటారు.

ఈ సత్య ప్రచారకులు నాలుగు రకాలుగా ఉంటారు :

సత్య మార్గంలో విశేషమైన, విస్తారమైన పరిశోధనలు చేసి ఆ యొక్క పరిశోధనా ఫలితాలను అందరికీ "పంచి" తమను తాము "పెంచుకునేందుకు" జన్మిస్తారు కొంత మంది. ప్రారంభంలో ఏ వృత్తిలోనో, ఉద్యోగంలోనో, వ్యాపారంలోనో కొనసాగుతూ ఉన్నా, వారి లైఫ్ డిజైన్ ప్రకారం తగిన సమయం రాగానే అన్నింటిలోంచి పూర్తిగా బయటపడి 100%గా సత్య శోధనకు, సత్య ప్రచారానికి అంకితమైపోతారు. ఇంకొంత మంది నాలాగా "వాకిన్ మాస్టర్స్" ఉంటారు. తగిన సమయం రాగానే ఆక్టివేట్ అయి 100% సత్య ప్రచారానికి అంకితం అయిపోతారు. మరికొంత మంది చిన్నప్పటి నుండే జన్మ కారణం పట్ల ఎరుకను కలిగి ఉంటూ సత్య శోధన + సత్య ప్రచారానికి అంకితం అయిపోతారు. ఇలా ఏదో ఒక రకంగా 100%గా సత్య శోధన + సత్య ప్రచారానికి అంకితమై జీవించే వారి జీవితంలో

"సత్య శోధన + సత్య ప్రచారానికి" తప్ప మరోదానికి చోటుండదు. వీరు భౌతిక పరమైన ఏ వృత్తి ఉద్యోగ వ్యాపారాలు చేయకుండా సంపూర్ణంగా, కేవలం సత్య శోధనకు + సత్య ప్రచారానికి అంకితమై జీవితంలో "జీవిస్తూ" ఉంటారు. అందరికీ జీవితంలో "జీవించడానికి" బలమైన ప్రేరణను ఇస్తూ, అందుకు అవసరమైన విషయాలను నేర్పిస్తూ ఉంటారు. సత్య శోధన + సత్య ప్రచారమే వీరి వృత్తి, ఉద్యోగం మరియు జీవితం !

ఆధ్యాత్మిక విజ్ఞానం లేని భౌతిక జీవులకు వీరు ఎలాగూ అర్థం కారు, కానీ సత్య మార్గంలో ఉన్న వారు కూడా వీరిని చూసి "అయ్యో" ఏం చేయట్లేదా ?! కేవలం సత్య ప్రచారమేనా ?! అని అడుగుతూ ఉంటారు. విపరీతమైన విస్మయానికి గురవుతూ ఉంటారు. "ఏమీ చేయకుండా పూర్తిగా సత్య శోధనకు + సత్య ప్రచారానికి అంకితమైపోతే ఎలా ? ఇది ఎంత వరకు సమంజసం ?! అని ఆశ్చర్యపోతుంటారు". సత్య మార్గంలోనే ఉన్నా "విషయాల పట్ల పూర్తి స్థాయి అవగాహన" లేక పోవడం చేత ఇలా ఆశ్చర్యపోతుంటారు, విస్మయానికి గురవుతూ ఉంటారు. వాళ్ళ గురువులు కూడా చెప్పరు. ఎందుకంటే వారికీ కూడా తెలియదు కదా ! ఒక ధ్యాన ప్రచార సంస్థలోని సభ్యులు ఇలాగే "తారా విశాల్ ఏమీ చేయడా ? కేవలం సత్య ప్రచారం మాత్రమే చేస్తాడా ? అని నా పట్ల చాలా ఆశ్చర్యపోయారు, విస్మయం చెందారు". ఇలాంటి ఆశ్చర్యానందుల కోసమే ఈ విషయాలను తెలియజేస్తున్నాను.

సత్య శోధన + సత్య ప్రచారానికి పూర్తిగా అంకితం కావడం అనేది సృష్టిలో అన్నింటి కన్నా అత్యున్నతమైన, అత్యుత్తమమైన, పరమోత్తమమైన సేవగా, కార్యంగా పరిగణించబడుతుంది. ఈ పరమ సత్యాన్ని తెలుసుకుని, మీరు చేయలేని మహోన్నత కార్యాన్ని ఇతరులు చేస్తున్నందుకు వారిని హృదయపూర్వకంగా అభినందించి వారి బాటలో నడిచే ప్రయత్నం చేయాలి కానీ, అజ్ఞానంతో ఆశ్చర్యపోకూడదు.

కొంత మంది ఏదో ఒక వృత్తిలోనో, ఉద్యోగంలోనో, వ్యాపారంలోనో కొనసాగుతూ సత్య శోధనకు + సత్య ప్రచారానికి పూర్తిగా అంకితమైన వారికి విశేషంగా, విస్తారంగా ఆర్థిక + ఇతర అవసరమైన సహాయ సహకార సమన్వయాలను అందిస్తూ పరోక్షంగా సత్య ప్రచారం చేస్తుంటారు. ఈ విధంగా చేస్తున్న వారికి, చేసిన వారికి, "పంచబడింది పెంచబడుతుంది అనే విశ్వ వితరణ నియమం" ప్రకారం, వారు చేసింది "లక్షలాది రెట్లుగా" పరిణమించి వారికి సులభంగా, శీఘ్రంగా సత్యప్రాప్తిని కలిగిస్తుంది.

కొంత మంది ఏదో ఒక వృత్తిలోనో, ఉద్యోగంలోనో, వ్యాపారంలోనో కొనసాగుతూ, సత్య ప్రచారంలో కూడా కొనసాగుతూ ఉంటారు. 50% - 50% లైఫ్ డిజైన్ వీరిది.

మరి కొంత మంది ఏదో ఒక వృత్తిలోనో, ఉద్యోగంలోనో, వ్యాపారంలోనో కొనసాగుతూ తమకు వీలైనప్పుడు, అప్పుడప్పుడు సత్య ప్రచారంలో పాల్గొంటుంటారు.

ప్రాపంచిక జీవితం మరియు ఆధ్యాత్మిక జీవితం రెండూ జోడు గుఱ్ఱాల లాంటివి కాదు - ఒక్కటే ! ఈ రెండింటినీ వేరు చేయడానికి లేదు, వేరు చేయలేం కూడా ! మీరు ఏ పని చేస్తూ ఉన్నా "ఆధ్యాత్మిక స్పృహతో" ఉండాలి, లేకపోతే మీరు చేసే పని ఎంత గొప్పదైనా అది సరి కానిదే అవుతుంది. మీరు ఈ భూమి పైన జన్మ తీసుకున్నది ఆత్మ పరిణామ క్రమంలో అభివృద్ధి చెందడానికే తప్ప మరొక విషయం కోసం కాదన్న సత్యాన్ని ఎల్లప్పుడూ స్మృతిలో ఉంచుకోవాలి.

✪ ప్రాపంచికం ద్వారా ఆధ్యాత్మికం, ఆధ్యాత్మికం ద్వారా ప్రాపంచికం !

✪ ప్రాపంచికం ద్వారా ఆధ్యాత్మికాన్ని అర్థం చేసుకుంటాం.

✪ ఆధ్యాత్మికం ద్వారా ప్రాపంచికాన్ని సరి చేసుకుంటాం.

కాబట్టి "ప్రాపంచిక జీవితం మరియు ఆధ్యాత్మిక జీవితం రెండూ, జోడు గుఱ్ఱాల లాంటివి" అని అందరి వెంటా పడి నస పెట్టి చంపద్దు. ఎవరి లైఫ్ డిజైన్ ప్రకారం వారు జీవిస్తూ ఉంటారు.

రక రకాల లైఫ్ డిజైన్లు ఉంటాయి. ఎవరి లైఫ్ డిజైన్ ప్రకారం వారు చేస్తుంటారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎలా అంటే అలా లైఫ్ డిజైన్ మార్చుకోవచ్చు.

కాబట్టి 100% సత్య శోధనకు + సత్య ప్రచారానికి అంకితమైపోయిన వారిని చూసి అజ్ఞానంతో ఆశ్చర్యపోకండి. అవగాహనతో, ఆనందంతో ఆశ్చర్యపోండి !

ఆధ్యాత్మికత అనుకుంటూ గుళ్ళు, గోపురాలు, క్షేత్రాలు, తీర్థాలకు తిరగడం మత గ్రంథాలను పదే పదే పారాయణం చేయడం వలన ఆత్మ చైతన్య వికాసం జరగదు. ఇతర మతాల వారి సంగతి నాకు తెలియదు కానీ, హిందువులు, ఫారిన్ క్రిస్టియన్లు, బౌద్ధ మతం వారు ఆధ్యాత్మిక మార్గంలో రకరకాల పద్ధతులలో ప్రయాణం చేస్తూ ఉంటారు.

చాలా మంది మతంలో ఉంటూ, మత సాంప్రదాయాలను కొనసాగిస్తూ మేము ఆధ్యాత్మికతలో ఎదుగుతున్నాము అని అనుకుంటూ ఉంటారు. మత గురువులను ఫాలో అవుతూ ఉంటారు. ఎప్పుడైతే మతంలో నుండి పూర్తిగా బయటకు వస్తారో అప్పుడు మాత్రమే నిజమైన ఆధ్యాత్మికతలోకి ప్రవేశం జరుగుతుంది. చాలా మంది నా పుస్తకాలను చదివి ప్రేరణ పొంది నన్ను ఫాలో అవుదామని చూస్తూ ఉంటారు కానీ మతంలో నుండి బయటకు రారు. మతంలో ఉంటూ మతగురువులను ఫాలో అవుతూ పనిలో పనిగా నన్ను కూడా ఫాలో అవుదామని ట్రై చేస్తూ ఉంటారు. ఇలాంటి వారిని చాలా సింపుల్‌గా వీలైనంత దూరం పెడుతూ ఉంటాను. నా సబ్జెక్ట్ చదివిన తర్వాత కూడా మతంలోనే ఉంటూ మతగురువులను ఫాలో అవుతే ఎలా ? కేవలం నా పుస్తకాలు చదివారు కానీ వారికి విషయం సరిగా ఎక్కలేదు అని అర్థం. ఇలాంటి వారిని నేను మర్యాదగా పక్కన పెట్టేస్తూ ఉంటాను.

6. ఇప్పుడు గడిస్తే చాలని అనుకోకండి

ఇప్పుడు బాగానే గడిచి పోతుంది కదా అని అనుకోకండి. ఏ క్షణంలోనైనా దెబ్బ పడుతుంది. చేతులు కాలిన తర్వాత కాకుండా, చేతులు కాలక ముందే ఆకులు పట్టుకుంటే మంచిది. ఇప్పుడు ఆరోగ్యం, సంపాదన, జీవితం బాగానే ఉన్నాయి. ఇప్పుడు హాయిగా గడిచిపోతుంది కదా అని దయచేసి అనుకోకండి. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోండి. మీ "ఉనికి మూలం" గురించి తెలుసుకునే ప్రయత్నం మొదలు పెట్టండి. పరిస్థితులు బాగున్నప్పుడే మీ "నిజ తత్వం" గురించి తెలుసుకోవడం ప్రారంభించండి. మీ పనులు మీరు చేసుకుంటూనే, హాయిగా సత్య మార్గంలోకి ప్రవేశించవచ్చు. పరిస్థితులు బాగున్నప్పుడు సత్య మార్గంలోకి వస్తే ఎన్నో దెబ్బలను తప్పించుకోవచ్చు.

ఈ జన్మను వృథా చేసుకుంటే, మళ్ళీ జన్మిస్తారు. అప్పుడు అంతకు అంతా అనుభవించాల్సి ఉంటుంది. జీవితం సాఫీగా సాగి పోతున్నప్పుడు విషయాలు అర్థం కావు. సృష్టి, మీ పెండింగ్ ఫైల్స్ ఒక్కొక్కటి బయటికి తీస్తున్నప్పుడు ఆటొమెటిక్‌గా ఈ విషయాలు అర్థం అయిపోతాయి. అనుభవించిన వాళ్ళం కాబట్టి ముందు జాగ్రత్తగా చెబుతున్నాం.

ఈ రోజు గడిస్తే చాలు, ఈ జన్మ గడిస్తే చాలు అని అనుకుంటే తర్వాత ఏం జరుగుతుందని అనుకుంటున్నారు ? ఆ తర్వాత, మీరు లేకుండా పోతామని అనుకుంటున్నారా ? ఎన్నటికీ నశించని శాశ్వతులే మీరు ! ఎవరూ ఎక్కడికీ పోలేరు, ఎక్కడో పడుకుని ఉంటే దేవుడు మిమ్మల్ని పిలిచి ఒడిలో కూర్చోబెట్టుకుంటాడని పొరపడకండి. ఏ దేవుడు మిమ్మల్ని పిలవడు. మీరే ఆయనను పిలవాలి, మీరే స్వయం పూనికతో ఆయనను వెతకాలి, మీరే స్వయంగా ఆయనను దర్శించి తీరాలి. అప్పుడు తెలుస్తుంది - మీరు ఆ దేవుడు వేరు కాదనీ, ఒకటేనని ! ఇలా తెలుసుకునే వరకు మీకు కష్టాలు తప్పవు.

మీ నిజతత్వమైన మీ దైవత్వాన్ని అనుభవపూర్వకంగా పొందేందుకే మీరు ఈ భూమి పైన జన్మనెత్తారు. ప్రతి మనిషి కూడా ఇందుకే పుట్టాడు. ఎవరి జన్మ అయినా సార్థకం కావాలంటే వారు, వారి నిజ తత్వాన్ని వారు పొంది తీరాల్సిందే. అప్పుడే సార్థకం, సాఫల్యం. లేదా అప్పటి వరకు నరక యాతన తప్పదు.

ప్రస్తుతం మీ జీవితంలో చెప్పుకోదగ్గ ఏ కష్టమూ లేకపోవచ్చు. మీ వృత్తియో, ఉద్యోగమో, వ్యాపారమో బాగానే సాగుతూ ఉండవచ్చు. ఒక మోస్తరు ఆరోగ్యం కూడా ఉండి ఉండవచ్చు. ఇలా ఉన్న మీరు, ఇప్పుడు గడిచిపోతుంది కదా అని బాగానే గడిపేస్తారు. చేతులు కాలాక ఆకుల కోసం వెతుకుతుంటారు. రోగాలకు, కష్ట నష్టాలకు, ప్రమాదాలకు గురైన వారిని ఒక సారి నిశితంగా పరిశీలించండి. వాళ్ళూ మీ లాగే "ఇప్పుడు గడుస్తుంది కదా అని గడిపిన వాళ్ళే" ! వాళ్ళకు తెలియనే తెలియదు. కొద్ది రోజుల్లో మేము ఒక రోగానికి, ఒక కష్టానికి, ఒక నష్టానికి, ఒక ప్రమాదానికి గురి కాబోతున్నామని వారికి తెలియదు. అది జరుగుతుంది. అప్పుడు లబోదిబోమంటూ ఏడుస్తూ, తమను తాము నిందించుకుంటూ, అందరినీ నిందిస్తూ బాధపడుతూ ఉంటారు.

ఏం ?! ఏదైనా జరిగితేనే మేలుకోవాలా ?

చేతులు కాలిన తర్వాతే ఆకులు పట్టుకోవాలా ? అంతకు ముందు పట్టుకోవడానికి ఏం మాయరోగం ?!

7. ప్రతి ఒక్కరూ సహజంగానే ఐశ్వర్యాన్ని కలిగి ఉంటారు

మీరేది చేయదలుచుకుంటే అది ఎప్పుడైనా పూర్తి చేసే "శక్తినే" / స్వేచ్ఛనే ఐశ్వర్యం అని అంటారు. ఇది అంతరానికి సంబంధించింది. ఇది ఒక భావన. ఇది ఒక మానసిక స్థితి. ఇది ఒక ఆధ్యాత్మిక శక్తి. ఇది అందరూ సహజంగానే కలిగి ఉంటారు. దీనిని ప్రతి ఒక్కరు వాడుకోవాలి. అందరూ ఐశ్వర్యవంతులే !

భౌతిక పరంగా చూస్తే అపారమైన, విస్తారమైన ధనం(సంపద), ఆస్తులు, బంగారం, నగలు, వజ్రాలు, రత్నాలు, బ్యాంక్ బాలెన్స్‌లు, డిపాజిట్లు, కార్లు, బంగ్లాలు, భూములు, పలుకుబడి, కీర్తి, ప్రతిష్ఠలు మొదలైనవి అన్నీ కలిగి ఉండడం ఐశ్వర్యం ! ప్రతీ ఒక్కరూ తమ అంతరంలోని ఐశ్వర్యాన్ని వాడుకుని, బాహ్యంలో తప్పని సరిగా , పై విధంగా ఐశ్వర్యాన్ని కలిగి ఉండాలి.

ఐశ్వర్యాన్ని కలిగి ఉంటే జీవితాన్ని ఎంజాయ్ చేయవచ్చు. ఐశ్వర్యానికి తోడుగా ఆత్మ విజ్ఞానం కూడా కలిగి ఉంటే ఇంకా బాగా, శ్రేయస్కరంగా ఎంజాయ్ చేయవచ్చు. బలంగా గుర్తుంచుకోండి - సరైన ఉన్నత ఆత్మ విజ్ఞానం లేని జీవితంలో ఐశ్వర్యం ఉంటే నరకం 100% గ్యారంటీగా వస్తుంది. సరైన ఉన్నత ఆత్మ విజ్ఞానంతో కూడిన ఐశ్వర్యం ఉంటే 100% గ్యారంటీగా, కన్‌ఫర్మ్‌గా స్వర్గాన్ని అనుభవిస్తారు.

❖ ❖ ❖

ఐశ్వర్యం అనేది అత్యంత అవసరం అయితే ఐశ్వర్యమే సమస్తం కాదు. సరైన మతరహిత అత్యున్నత ఆత్మ విజ్ఞానమే సర్వస్వం !

ఐశ్వర్యాన్ని కోరుకోవాలి కానీ ఆత్మ విజ్ఞానమే ప్రధానం అనే విషయాన్ని సదా సర్వదా స్మృతిలో ఉంచుకోవాలి.

8. మహామూల చైతన్యం అంటే ఏమిటి ?

సృష్టి సర్వస్వాన్ని పోషిస్తూ, పాలిస్తూ ఉన్న, అన్ని మూలాలకు మూలమైన, పరమాత్మలకే పరమాత్మ అయిన సర్వాత్మను "మహా మూల చైతన్యం" అని అంటారు. సృష్టి వేరు, సృష్టి కర్త వేరు కాదు. సృష్టి కర్తయే సృష్టిగా మారాడు. సృష్టిని, సృష్టి కర్తను కూడా "మహా మూల చైతన్యం" అని అంటారు.

అనంత సర్వ సృష్టి యొక్క కేంద్రాన్ని "మహా మూల చైతన్యం" అని అంటారు.

అనంతమైన దివ్య మహాప్రజ్ఞనే "మహా మూల చైతన్యం" అని అంటారు.
దీనినే ఇంగ్లీష్‌లో ULTRA CONSCIOUSNESS అని అంటారు.

మూల చైతన్యం అంటే సర్వస్వం అని అర్థం.

మూల చైతన్య తత్వాన్ని దైవత్వం అని అంటారు.

మూల చైతన్యం అని అంటే దైవం అని కూడా అర్థం.

సర్వాకార, నిరాకార, సగుణ, సర్వగుణ,

నిర్గుణ పరబ్రహ్మమే మూల చైతన్యం.

మూల చైతన్యం అంటే బ్రహ్మానందం, మహోత్సవం.

మూల చైతన్యం అంటే శూన్యం.

మూల చైతన్యం అంటే శాంతి.

అనంత శాశ్వత తత్వమే మహా మూల చైతన్యం.

మహా మూల చైతన్యం అని అంటే అనంతమైన ఎరుక అని అర్థం.

మహా మూల చైతన్యం అని అంటే ఉనికి అని అర్థం.

మహా మూల చైతన్యం అని అంటే సమతుల్యత అని అర్థం.

మహా మూల చైతన్యం అని అంటే ఏకత్వం అని అర్థం.

మహా మూల చైతన్యం అని అంటే అనంతమైన ఆత్మ విజ్ఞానం అని అర్థం.

మహా మూల చైతన్యం అని అంటే పరమ సత్యం అని అర్థం.

మహా మూల చైతన్యం అని అంటే అనంతమైన అవగాహన అని అర్థం.

మహా మూల చైతన్యమంటే అనంతమైన ప్రేమ.

మహామూల చైతన్యమే మన నిజతత్వం!

మహామూల చైతన్యమే మనం!

మనమే మహా మూల చైతన్యం!

ఇది నిజ సత్య వాస్తవం!

౨. భౌతిక శరీరాన్ని ధరించిన మహా మూల చైతన్య స్వరూపమే (దైవమే) మానవుడు !

✪ మనం "ఏకాకులం" కాదు, సమై"క్యులం"
అని తెలిపేదే - కులం !

✪ అందరికీ స"మ్మతం" అయినదే - మతం !

మనది మానవ కులం ! మనది మానవ మతం !
మన జాతి మానవ జాతి. అంతే !
భూమి అంతా ఒకటే కుటుంబం !
అంతా ఒక్కటే ! అందరి మూలం ఒక్కటే !
సర్వం సమానమే !
నిజానికి మనమందరం కూడా భౌతిక శరీరాలు
ధరించిన మూల చైతన్య స్వరూపులమే !
మనమంతా దివ్య స్వరూపులమే !
మానవత్వమే దివ్యత్వం !
అందరం, అందరి ఆరోగ్యం + ఐశ్వర్యం + దివ్యత్వం
కోసం పాటుపడదాం !

❖ ❖ ❖

నాకు చాలా క్లియర్‌గా తెలుసు, నేను కొన్ని వేల మందిని చూసాను. ఆధ్యాత్మిక మార్గంలో ఉంటూ మాస్టర్లుగా చెలామణి అవుతూ మత సంప్రదాయాలను పాటిస్తూ ఉంటారు. కులం, మతంలో నుండి బయట పడరు. ఇలాంటి వారిని చూస్తే జాలేస్తుంది. మతం, కులం అనే భావనలోనుండి బయట పడని వారికి ఆధ్యాత్మికతలోకి ఏ నాటికీ ప్రవేశం దొరకదు ! ముందు కులంలో నుండి, మతంలో నుండి పూర్తిగా, శాశ్వతంగా బయట పడండి. అప్పుడు ఆధ్యాత్మికత గురించి ఆలోచించండి.

10. ఎల్లప్పుడూ 100% పాజిటివ్‌గా మాత్రమే ఆలోచించాలి

అయిదు సృష్టి కీలక సిద్ధాంతాలు :

❶ "యద్భావం తద్భవతి" అంటే నీ భావం ఎలా ఉంటే, సరిగ్గా నీ భవం(పరిస్థితి) అలానే ఉంటుంది అని అర్థం. భావం లేక ఆలోచన లేక ఊహ, ఈ మూడు సాంకేతిక పరంగా లోతుగా పరిశీలిస్తే కొంచెం వేరు వేరుగా అనిపించినా ప్రాథమికంగా ఒకే అర్థాన్నిస్తాయి. "యద్భావం తద్భవతి" అనేది సృష్టి కీలక సిద్ధాంతాల్లో ప్రధానమైనది.

❷ "యామతిఃసా గతిర్భవేత్" అంటే మన మతి ఎలా ఉంటే, మన గతి అలా ఉంటుంది అని అర్థం.

❸ "మన ఆలోచనలే మన వాస్తవాలు". ఆలోచన అనేది పరిస్థితి యొక్క అభౌతిక(భౌతికం కానిది, సూక్ష్మ రూపం) రూపం. మన ఆలోచనా కేంద్రం అనేది వాస్తవానికి సృష్టి కేంద్రం. ఇది మన నుదిటి భాగంలో కొంచెం లోపల ఉంటుంది. మన ఆలోచనను అక్కడ కేంద్రీకరిస్తే, ఆలోచన శక్తిని పొంది, సూక్ష్మ ప్రకంపనాలు భౌతిక ప్రకంపనాలుగా మారి పరిస్థితిగా ప్రకటం అవుతుంది. ఇప్పటి వరకు మన జీవితంలో సంభవిస్తున్న పరిస్థితులన్నీ మన ఆలోచనల ఫలితాలే ! ఏ ఆలోచననైతే మనం స్వీకరించి, ఎంతెంతగా దానిని ఆలోచిస్తామో, అది అంతంతగా శక్తిని పుంజుకుంటుంది. తగిన శక్తి దానికి లభించిన తర్వాత ఆ ఆలోచన భౌతిక రూపం ధరించి పరిస్థితిగా ప్రకటం అవుతుంది.

నిజానికి ఆలోచిస్తున్నాం అని అంటే

సృష్టిస్తున్నాం అన్నట్టే !

ఆలోచించడం అని అంటే సృష్టించడమే !

❹ మనం ఆలోచనకు నెగెటివిటిని జోడిస్తే నెగెటివ్ ఫలితాలు వస్తాయి. పాజిటివ్‌నెస్‌ను జోడిస్తే పాజిటివ్ ఫలితాలు వస్తాయి.

❺జీసస్ కూడా ఇదే చెప్పాడు -

"నీవు విశ్వసించిన ప్రకారం నీకు అవుగాక" !

- మత్తయి - 8. 13

కాబట్టి మై డియర్ ఫ్రెండ్స్, ఎల్లప్పుడూ పాజిటివ్‌గా మాత్రమే ఆలోచించండి. 365 రోజులు, 24 గంటలు కేవలం పాజిటివ్‌గా మాత్రమే ఆలోచించండి, 100% పాజిటివ్‌గా !

మీరు ఇంట్రెస్ట్ పెట్టాలే గానీ, ఇదేమంత పెద్ద విషయం కాదు. అసలు సత్యం ఏమిటంటే పాజిటివ్‌గా ఆలోచించడానికి తక్కువ శక్తి అవసరం అవుతుంది. తక్కువ శ్రమ ఉంటుంది. నెగెటివ్‌గా ఆలోచించడానికి చాలా ఎక్కువ శక్తి అవసరం, శ్రమ చాలా ఎక్కువగా ఉంటుంది. ఆశ్చర్యంగా ఉందా ?! సత్యాలు ఆశ్చర్యాలను కలిగిస్తాయి మరి !

ఈ క్షణం నుండే 100% పాజిటివ్‌గా ఆలోచించడం మొదలు పెట్టండి. మీ ఆలోచనల పట్ల పూర్తి ఎరుకతో ఉంటూ, సదా, సర్వదా పాజిటివ్ ధోరణినే కలిగి ఉండండి. మీరు 100% పాజిటివ్ ధోరణితో గనక ఉంటే అసాధ్యాలను సుసాధ్యాలుగా, అసంభవాలను సుసంభవాలుగా మార్చగలుగుతారు. అనితర సాధ్యమైన కార్యాలను మీరు అవలీలగా సాధిస్తారు.

పాజిటివ్ నేచర్‌తో ఉండడం అంటే అపారమైన శక్తితో కూడి ఉండడమే ! పాజిటివ్‌నెస్ అనేది ఒక అనంతమైన మహా దివ్యశక్తి ! దీనిని మనం సహజంగా ఇప్పుడే కలిగి ఉన్నాం. కేవలం మనం 100% పాజిటివ్‌గా ఉండడం ద్వారా ఈ శక్తిని అందుబాటులోకి తెచ్చుకుంటాం అంతే ! ఎంతటి మహా, మహా కార్యాలనైనా మీరు సులభంగా, సరళంగా, శీఘ్రంగా విజయవంతంగా పూర్తి చేయగలుగుతారు.

Be 100% Positive Always !

మీలోని మీ దైవత్వాన్ని మీరు
పూర్తిగా విశ్వసించండి. నా దైవత్వమే
నాకు రక్ష అని అనుకుంటూ ఉండండి. నేను దైవాన్ని...
నేను దైవాన్ని... నేను దైవాన్ని... నేను దైవాన్ని... నేను దైవాన్ని...
అని పదే పదే అనుకుంటూ ఉండండి. అప్పుడు మీరు నిజంగా పూర్తిగా
సురక్షా వలయంలోనే ఉంటారు. మీకు ఏదైనా హాని జరగబోతుందని
తెలిసినా సరే, మీరు విశ్వాసంతో మీ దైవత్వాన్ని స్మరిస్తే అది ఎంత పెద్దదైనా
సరే తక్షణమే పూర్తిగా శాశ్వతంగా తొలగిపోతుంది.

గుర్తుంచుకోండి, ఏ ప్రమాదాన్ని అయినా సరే మీరు తప్పని సరిగా అనుభవించాల్సిన రూల్
ఏమీ లేదు అని తెలుసుకోండి. తెలియక ఏదో ఒక ప్రమాదాన్ని మీరు ఆకర్షించినా... దాన్ని
మీరు తిరస్కరిస్తే అది వెళ్ళిపోతుంది.
మీ దైవత్వానికి ఉన్న శక్తిని దాటి ఏ శక్తి కూడా మిమ్మల్ని ఏమీ చేయలేదు. సృష్టిలోని ఏ శక్తి
కూడా మిమ్మల్ని ఏమీ చేయలేదు.

కాబట్టి మీరు భయపడకుండా మీ దైవత్వాన్ని నమ్ముకుని
ధైర్యంగా ఆనందంగా జీవించండి.

సంసార భారాలను వదిలి వేసి ఆధ్యాత్మికతలోకి ప్రవేశించమని అనాదిగా గురువులంతా చెప్తూ వస్తున్నారు. వెనకటికి, ఇప్పుడు కూడా కొన్ని ప్రాచీన సంస్థలలో ఇల్లు, కుటుంబం, బంధు మిత్రులు, ఆస్తులు, అంతస్తులు అన్నింటినీ పూర్తిగా శాశ్వతంగా వదిలేసి వస్తేనే సన్యాస దీక్ష ఇస్తారు. అది కూడా 12 సంవత్సరాలు నిజాయితీగా ఉంటూ వారిని ఒప్పించాలి అప్పుడు మాత్రమే దీక్ష ఇస్తారు. ఆత్మ విజ్ఞానం సంసారాన్ని త్యజించమని చెప్తుంది. కానీ ఇప్పుడేం జరుగుతుందంటే - ఆత్మ విజ్ఞానాన్ని ఉపయోగించుకుని సంసారాలను చక్క దిద్దుకునే పనులు జరుగుతున్నాయి. ఆత్మ విజ్ఞానం సంసారాన్ని వదిలిస్తుంది కానీ సంసారాన్ని బలపరచదు. బంధాలలో నుండి బయట పడండిరా నాయనా అంటే బంధాలను బలపరచుకోవడానికి ధ్యానం చేస్తానంటే ఎలా ?! సంసారం లో ఉన్నా కూడా తామరాకు పై నీటి బిందువు లాగా ఉండాలి. బంధాలలో ఇరుక్కోకూడదు.

II. ఎల్లప్పుడూ ఆనందంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండండి - అకారణంగా !

ఆనందంగా ఉండండి అని అంటే చాలా మంది ఏమంటారంటే.... కారణం ఏంటి ? అని అడుగుతారు.

నాకేమైనా లాటరి తగిలిందా ?!

నాకేమైనా స్వంత ఇల్లు ఉందా ?!

నాకేదైనా పెద్ద ఉద్యోగం వచ్చిందా ?!

నాకేమైనా "అది" వచ్చిందా ?!

నాకేమైనా "ఇది" జరిగిందా ?!

నాకేమైనా "అది" వస్తే, నాకేదైనా జరిగితే అప్పుడు ఆనందంగా ఉంటాను కానీ ఏమీ జరగకుండా ఆనందంగా ఎలా ఉండాలి ?! అని ప్రశ్నిస్తారు.

ఇది చాలా శోచనీయమైన పరిస్థితి. దయనీయమైన పరిస్థితి. ఆనందంగా ఉండడానికి ప్రత్యేకమైన కారణం ఏమైనా కావాలా ?! మీరు జీవించి ఉన్నారు అనే విషయం సరిపోదా ?! ఆనందంగా ఉండడానికి ! జీవించి ఉన్న మీరు దేనినైనా పొందవచ్చు కదా !

ఏదైనా వచ్చిన తర్వాత ఆనందంగా ఉండడం అంటే మీ ఆనందం దేని పైనో ఆధారపడి ఉందన్న మాట ! ప్రియ మిత్రులారా, ఆనందం అనేది దేని పైనో ఆధారపడి ఉండదు, ఆనందం అనేది దేనితోనో కూడుకుని రాదు, ఆనందం అనేది ఎల్లప్పుడూ ప్రకటమయ్యే ఉంటుంది. ఆనందం సర్వతంత్ర స్వతంత్రంగా ఉంటుంది. ఆనందం కారణంతో ముడిపడి ఉండదు. ఆనందం అకారణంగా వస్తుంది. ఇలా అకారణంగా వచ్చిన ఆనందమే శాశ్వతంగా ఉంటుంది. దేనితోనో కూడి వచ్చిన ఆనందం కొద్దిసేపే ఉంటుంది.

మీరు ఏదైనా ఒక వస్తువు కొంటారు, కొన్ని రోజులకే ఆ మురిపెం పోతుంది. స్వంత ఇల్లు కట్టుకుంటారు, కొద్ది రోజులకే అది పాతబడి పోతుంది. మీరు పెళ్ళి చేసుకుంటారు, పిల్లల్ని కంటారు, కొద్ది రోజులే ఆనందం మళ్ళీ మామూలే. మిమ్మల్ని మీరు నిశితంగా పరిశీలించుకోండి. మీ జీవితం మొత్తంలో అక్కడక్కడా ఆనందం ఉంటుంది. బాధామయ జీవితంలో అక్కడక్కడా ఆనంద క్షణాలు ఉంటాయి.

మన ఆనందం దేని పైనా ఆధారపడి ఉండకూడదు. మన ఆనందం ఎల్లప్పుడూ మన పైనే ఆధారపడి ఉండాలి. ఎందుకంటే మనకు మనం ఎప్పుడూ దూరం కాలేము. మిగతావి ఏవైనా గ్యారంటి లేవు, ఏది ఎప్పుడైనా దూరం కావచ్చు. ఎంతో ఇష్టపడి కొనుక్కున్న లేక కట్టుకున్న స్వంత ఇల్లు అమ్మేసే పరిస్థితి రావచ్చు. ఎంతో ఇష్టమైన కారుకు ఏదైనా కావచ్చు. అభిప్రాయ భేదాలొస్తే కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు దూరం కావచ్చు. ఇలా ఏదైనా, ఎప్పుడైనా దూరం కావచ్చు. కానీ ఎప్పుడూ, శాశ్వతంగా మీరు మాత్రం మీతోనే ఉంటారు. మీ భౌతిక దేహం కూడా ఎల్లకాలం మీతో ఉండదు. ఒకానొక సమయంలో దానిని కూడా వదిలేయాల్సి ఉంటుంది. సూక్ష్మ శరీరాన్ని, కారణ శరీరాన్ని వదిలేయాల్సి ఉంటుంది. ఇలా అన్నీ వదిలేసిన తర్వాత "మీతో ఉండేది మీరు మాత్రమే" ! కాబట్టి "మీతో మీరు ఆనందంగా ఉండడం తక్షణమే ప్రారంభించండి". మీతో మీరు ఆనందంగా ఉన్నప్పుడు మీరు దేనితోనైనా, ఎక్కడైనా, ఎవరితోనైనా ఆనందంగా ఉండగలుగుతారు. లేక పోతే లేదు. మీతో మీరు ఆనందంగా ఉండలేనప్పుడు దేనితోనూ, ఎక్కడైనా, ఎవరితోనైనా సరే మీరు ఆనందంగా ఉండలేరు.

మీరు కోరుకున్నవి పొందితే ఆనందం.

మీరు ఆరోగ్యంగా ఉంటే ఆనందం.

మీరు ఐశ్వర్యంతో విరాజిల్లుతూ ఉంటే ఆనందం. కానీ ఇవేవి లేకుండా ఆనందంగా ఉండడమెలాగో అర్థం కావట్లేదని మీరు అంటే - ఇది కరక్టే ! నేను ఒప్పుకుంటాను. అయితే ఇక్కడ ఒక ప్రధానమైన విశ్వ సూత్రాన్ని మనం గుర్తు చేసుకోవాల్సి ఉంది. ఇది తప్పని సరి !

"పరస్పరం సారూప్యం కలవి ఆకర్షించబడతాయి" ! - రిచర్డ్ బాక్

"Like Attracts Like" ! - Richard Bach

మీరు ఇప్పుడున్న పరిస్థితుల్లో తక్షణమే ఆనందంగా ఉండడం ప్రారంభించండి. అప్పుడు అన్ని ఆనందకర పరిస్థితులు మీ వైపు ఆకర్షించబడతాయి. మీరు ఆనందంగా ఉండడం అలాగే కొనసాగిస్తూ ఉంటే మీ ఆనందాలు ప్రవృద్ధమౌతూ ఉంటాయి. ఆనందంగా ఉండడం ప్రారంభించినప్పుడే మీ జీవితంలోకి ఆనందం ప్రవేశిస్తుంది. ఆనందంగా ఉంటూ ఉన్నప్పుడు మాత్రమే మీ జీవితంలో ఆనందాలు ఉత్పత్తి అవుతాయి, పెరుగుతూ పోతూ ఉంటాయి. మీరు ఆనందంగా ఉండడం మొదలు పెడితే ఏం జరుగుతుందంటే...

... మీరు ఆనందంగా ఉండాలంటే మీరు అనుకున్నవి అనుకున్నట్టుగా జరిగినప్పుడు ఆనందంగా ఉంటారు కాబట్టి మీరు అనుకున్నవి అనుకున్నట్టుగా జరగడం ప్రారంభం అవుతుంది. మిమ్మల్ని అనారోగ్యాలు బాధిస్తూ ఉంటే ఆనందంగా ఉండలేరు కాబట్టి మీ అనారోగ్యాలు అన్నీ తొలగిపోయి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. ప్రస్తుతం భూమి పైన డబ్బు అనేది మానవ జీవితంలోని చాలా ఆనందాలకు కారణమై ఉంది. జీవితం ఐశ్వర్యవంతంగా లేకపోతే ఆనందంగా ఉండలేరు కాబట్టి మీ జీవితం ఐశ్వర్యవంతంగా మారిపోతుంది. ఆనందం అనేది నిజానికి ప్రతి ఒక్కరి మూల స్వభావం, ప్రతి ఒక్కరి సహజ స్వభావం. కాబట్టి మనం పెద్దగా శ్రమ పడాల్సిన అవసరం లేదు. ఆనందంగా ఉండడం అనేది సాధన చేస్తూ ఉంటే త్వరలోనే ఆటొమెటిక్‌గా, అకారణంగా ఆనందంగా ఉండే స్థితిలోకి మీరు సులభంగా వచ్చేస్తారు. ఆనందంగా ఉంటూ ఉన్న మీరు అన్ని ఆనందాలను పొంది చివరగా "బ్రహ్మానందాన్ని అంటే మోక్షాన్ని" తప్పని సరిగా పొందుతారు. చాలా సింపుల్‌గా అనిపిస్తుందా ? నిజానికి ఆనందంగా ఉండడమే అన్నింటి కన్నా సింపులండీ ! బ్రహ్మానందాన్ని పొందడం మరీ సింపుల్ ! ఎందుకంటే సృష్టి సహజ స్వభావమే బ్రహ్మానందం. బ్రహ్మానంద భరితమైన సృష్టిలో ఆనందంగా ఉండడం అనేది ప్రవాహంతో హాయిగా కొట్టుకు పోవడం లాంటిది. బాధపడటం, దుఃఖంగా ఉండడమంటే ప్రవాహానికి ఎదురీదడం లాంటిది. మరి ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రపంచంలో సుమారుగా అందరూ బాధల్లోనే ఉన్నారు. అంటే ప్రవాహానికి ఎదురీదుతున్నారు. ఒక్కసారి ఆలోచించండి, ప్రవాహానికి ఎదురీదాలంటే ఎంత శక్తి, నైపుణ్యం, పట్టుదల, ధైర్యం అవసరమో ! మనం శక్తి సామర్థ్యాలు లేక బాధలు పడటం లేదు. కేవలం "అసలు విషయాలు" తెలియక బాధ పడుతున్నాం. అంతే !

"పరస్పరం సారుప్యం కలవి ఒకదానినొకటి ఆకర్షించుకుంటాయి" !

ఇది అత్యంత ప్రధానమైన విశ్వ సూత్రం. మీరు ఒకసారి పరిశీలించి చూడండి -

ఒకే ఫ్రీక్వెన్సీ గల వాళ్ళు ఒక గ్రూప్‌గా ఏర్పడతారు.

పేకాట రాయుళ్ళకు ఇంటి ప్రక్కనే ఉన్న ధ్యాన కేంద్రం కనబడదు కానీ ఊరవతల ఉన్న క్లబ్ మాత్రం చాలా స్పష్టంగా కనబడుతూ ఉంటుంది.

ఛాందసులకు ఛాందసులే దొరుకుతారు.

ఓపెన్ మైండ్ ఉన్న వాళ్ళు ఓపెన్ మైండెడ్ వాళ్ళతోనే కలిసి ఉంటారు.

రేసులు ఆడేవాళ్ళకు ప్రపంచంలో రేస్ క్లబ్ తప్ప మరొకటి కనబడదు.

హేతువాదులు హేతువాదులనే కలుస్తుంటారు.

సమాజ సేవకులు సేవా దృక్పథం ఉన్న వారినే కలుసుకుంటారు.

ధ్యానులకు ధ్యానులే కలుస్తారు.

సత్య మార్గంలో ఉన్న వారికి సత్య మార్గంలో ఉన్న వారే కలుస్తారు.

ఇది సహజం. సృష్టిసిద్ధాంతం. మీరు ఎక్కడైనా ఉండండి, మీరు ఎక్కడికైనా వెళ్ళండి మీ వైబ్రేషన్స్‌కు తగ్గట్టుగా, మీ ఫ్రీక్వెన్సీకి సూట్ అయ్యే వారినే మీరు కలవడానికి ఇష్టపడతారు. కలుస్తారు కూడా !

ఇదే విధంగా - మనం బాధ పడుతూ ఉంటే బాధాకరమైన పరిస్థితులే మన వైపు ఆకర్షించబడతాయి. ఆనందంగా ఉండడం ప్రారంభిస్తే అప్పుడు ఆటోమెటిక్‌గా ఆనందకరమైన పరిస్థితులే మనవైపు ఆకర్షించబడతాయి. ప్రారంభంలో ఏదైనా కాస్త కష్టమే ! ఆనందంగా ఉండడం అనేది ఎన్నో జన్మలుగా మీరు మర్చిపోయి ఉన్నారు. ఆనందం మీ సహజ మూల స్వభావం అని గుర్తు చేసుకుని ఆనందంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. ఆనందంగా ఉండడానికి శక్తి అవసరం లేదు అని గ్రహించండి. **ఆనందమే ఒక మహా జీవ శక్తి** అని తెలుసుకోండి. ఆనందంగా ఉండడమంటే శక్తి వంతులుగా తయారవడమేనని తెలుసుకోండి. ఆనందానికి ఒక కారణం అంటూ ఏమీ ఉండదని తెలుసుకోండి.

బాధ పడటానికి ఒక కారణం కావాలి కానీ,

ఆనందించడానికి అవసరం లేదని గ్రహించండి.

మీరు మీ అంతరంలో బాధ పడాలని డిసైడ్ అయి ఉన్నారని గ్రహించండి. అందుకే మీకు అనారోగ్యాలు, సమస్యలు ఉన్నాయని తెలుసుకోండి. మీరు మీ లోపల బాధ పడాలని అనుకుంటున్నారు కాబట్టే మీకు బాధలు కలుగుతున్నాయి. అంతకు మించి మరే కారణమూ లేదు !

మీరు మీ లోపల ఉన్న మీ "బాధలను ఇష్టపడే గుణాన్ని" గుర్తించి తీసి వేయండి. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే రిలీజింగ్ మెడిటేషన్ ద్వారా ఎలా క్లియర్ చేసుకోవాలో వివరించాను. అది చదివి సాధన చెయ్యండి. క్లియర్ చేసుకోండి.

మీరు "బాధలను ఇష్టపడే గుణాన్ని" కలిగి ఉన్నారని గ్రహించిన మరుక్షణం ఆ గుణం అంతరించి పోతుంది. ఇది మీకై మీరు స్వయంగా గ్రహించాల్సిన విషయం. మీరు కలిగి ఉన్న లోపాన్ని స్వయంగా మీరే గుర్తించాలి. మీ లోపాన్ని మీరు గుర్తించిన మరుక్షణం ఆ యొక్క "గుర్తించడం అనే ఎరుక" కలిగిన మరుక్షణం ఆ లోపం అంతరించి పోతుంది. మీలో ఉన్న లోపాలన్నీ గుర్తించాలని మీరు కోరుకుంటే వాటిని గుర్తించి తక్షణమే, శాశ్వతంగా తీసివేసే ఎరుక + అవగాహన మీ మూల చైతన్యం నుండి మీకు వెంటనే, అపారంగా ప్రసారం అవుతాయి.

" మీ లోపల లోపం ఎందుకు ఉంటుందంటే దాని పట్ల మీకు ఎరుక లేనందుకే ! మీ లోపాన్ని మీరు గుర్తించిన మరుక్షణం ఆ ప్రజ్ఞానాగ్నిలో ఆ లోపం శాశ్వతంగా భస్మం అయిపోతుంది". - విశ్వ సూత్రం

మరో సారి నన్ను చెప్పనివ్వండి - మీరు ఆనందంగా ఉండటం ప్రారంభించిన మరుక్షణమే మీ జీవితంలోకి ఆనందం ప్రవేశిస్తుంది. ఆనందంగా ఉండటం ప్రారంభించడమంటే ఆనందానికి జన్మనివ్వటమేనని తెలుసుకోండి. ముందు ఆనందానికి జన్మనివ్వాలి, ఆ తర్వాత ఆనందాన్ని పెంచి పోషించాలి. ఎలా అంటే, అకారణంగా ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటూ ఉండడమే ఆనందానికి జన్మనిచ్చి పెంచి పోషించడం అవుతుంది. ఆనందం ఆనందానికే జన్మనిస్తుంది. ఆనందం ఆనందానికి శక్తినిస్తుంది. ఆనందిస్తూ ఉంటే ఆనందం పెరిగి పెద్దదవుతూ ఉంటుంది. మీరెంతెంత ఆనందంగా ఉంటుంటే అంతంతగా మీ ఆనందం విస్తరిస్తూ ఉంటుంది. మీరు ఆనందంగా ఉంటూ ఇతరుల ఆనందానికి కారణం అవుతూ ఉంటే మీ ఆనందం ఎన్నో రెట్లుగా అభివృద్ధి చెందుతూ ఉంటుంది.

అందరూ ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాల కోసం వెతుకుతూ ఉంటారు. మీరు గనక ఆనందంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండడం ప్రారంభిస్తే మధ్యలో ఉపసంహారం చేయకుండా మీ ఆనందాన్ని, ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అలాగే కొనసాగిస్తూ ఉంటే - ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలు మిమ్మల్ని వెతుకుతూ మీ లోపలికి వచ్చి స్థిర పడిపోతాయి.

ఏం జరిగినా దిగులు పడకండి. నిరాశ చెందకండి. జరిగిన దాన్ని మళ్ళీ సరి చేసుకోవచ్చని తెలుసుకోండి. ఆగిపోయిన దాన్ని మళ్ళీ నూతనంగా, ప్రారంభించవచ్చని తెలుసుకోండి. ముందుకు కొనసాగడానికి, అభివృద్ధి చెందడానికి, చెడిన దాన్ని సరి చేసుకోడానికి, ఆగిపోయిన దాన్ని మళ్ళీ ప్రారంభించడానికి, విజయాన్ని సాధించడానికి సృష్టిలో అవకాశాలు ఎల్లప్పుడూ ఉంటాయి. మనం ఆగిపోతే సృష్టి ఏమీ అనదు కానీ, మీరు ముందుకు సాగుతామంటే మాత్రం తక్షణమే సహాయ సహకార సమన్వయాలను అందిస్తుంది. శక్తి సామర్థ్యాలను ఉత్తేజితం చేసి ముందుకు దూకిస్తుంది.

గుర్తుంచుకోండి - మీరు జీవించి ఉన్నారు ఇది చాలు, ఏదైనా సాధించడానికి. జీవించి ఉండడమంటే దేనినైనా సాధించగలరని అర్థం. దేనినైనా సాధించగల సత్తా ఉన్న వాళ్ళే జీవించి ఉండగలుగుతారు. దేనినైనా సాధించగల శక్తి సామర్థ్యాలు కలిగిన వాళ్ళే అందరూ. మీరు జీవించి ఉన్నారనే ఒకే ఒక్క విషయం ఎంత మహత్తరమైనదో ఒక్కసారి ఆలోచించండి !

ఎంత నష్టమైనా తిరిగి పూడ్చుకోవచ్చు. నిజానికి నష్టం అనేది లేదని తెలుసుకోండి. నష్టం, అపజయం అనేవి అపారమైన అనుభవ జ్ఞానాన్ని అందించి ముందుకు తీసుకెళ్ళే శక్తులు అని గ్రహించండి. అడ్డంకులు ఆపేందుకు రావు, అధిగమింపజేసి ముందుకు నెట్టడానికి వస్తాయని తెలుసుకోండి. ఏం జరిగినా, ఎలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం మీరున్నా ప్రశాంతంగా ఉండండి. ధీమాగా ఉండండి. ఆనందంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండండి. ఇలా ఉంటున్న మీరు పొందలేనిదీ, సాధించలేనిదీ ఏదీ ఈ సృష్టిలోనే లేదని తెలుసుకోండి.

ప్రియ మిత్రులారా ! ప్రశాంతంగా, ధీమాగా, ఆనందంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండండి - అకారణంగా ! ఈ విధంగా ఉంటూ, ఇక అప్పుడు చూడండి మీ జీవితంలో సంభవించే అద్భుతాలను !!

12. ఆత్మ పరిణామ క్రమం క్లుప్తంగా

మూల చైతన్యం నుండి లేదా ఒక ప్రజ్ఞాత్మ నుండి ఒక అంశాత్మ సృష్టించబడుతుంది. అలా సృష్టించబడిన అంశాత్మ పరిణతి చెంది ప్రజ్ఞాత్మగా మారడానికి భూమి అనబడే పాఠశాలకు వస్తుంది. మొట్ట మొదట ఖనిజ ప్రపంచంలోకి(Mineral Kingdom) ప్రవేశిస్తుంది. రెండవ దశలో వృక్ష ప్రపంచంలోకి(Plant Kingdom) ప్రవేశిస్తుంది. మూడవ దశలో జంతు ప్రపంచంలోకి(Animal Kingdom) ప్రవేశిస్తుంది. ఇక చివరిదైన నాలుగవ దశలో ఆత్మ, మనుష్య ప్రపంచంలో(Human Kingdom) జన్మ తీసుకుంటుంది. ఆ తర్వాత దైవ సామ్రాజ్యంలోకి(Divine Kingdom) ప్రవేశిస్తుంది.

అంశాత్మ భూమిపైకి వచ్చింది "అనుభవ జ్ఞానం" కోసం. రక, రకాల జన్మలను ఎత్తుతూ అనుభవాన్ని గడిస్తూ జన్మ పరంపరలో కొనసాగుతుంది. ఆత్మ అన్ని రకాల జన్మలను ఎత్తుతుంది. ఒక్కో జన్మలో ఒక్కో రకంగా ! ఒక జన్మలో దొంగగా, ఒక జన్మలో దొరగా, ఒక జన్మలో రాజుగా, ఒక జన్మలో పేదగా, ఒక జన్మలో స్త్రీగా, ఒక జన్మలో పురుషుడిగా ఇలా వైవిధ్య భరితమైన జన్మలను ఎత్తి విశేషమైన అనుభవ జ్ఞానాన్ని పొంది పండి పోతుంది. ఇక అప్పుడు సత్య మార్గంలోకి ప్రవేశిస్తుంది.

తన మూలాన్ని తాను తెలుసుకునే దిశలో జన్మలను తీసుకోవటం ప్రారంభిస్తుంది. ఈ విధంగా "తనను తాను తెలుసుకునే క్రమం" ఎప్పుడో ఒకప్పుడు పూర్తవుతుంది. ఇలా తెలుసుకోవడాన్నే మోక్షం లేక నిర్వాణం లేక జన్మ రాహిత్యం లేక దైవత్వం లేక ఏకత్వం లేక బ్రహ్మానుభవం లేక తావో ఇలా దీనికి ఎన్నెన్నో పేర్లున్నాయి. అన్నీ ఒకటే ! ప్రతీ ఆత్మ తన నిజ తత్వాన్ని పొంది తీరవలసిందే ! అంటే ప్రతీ మనిషి తన ఆత్మ మూలాన్ని తెలుసుకుని తీరాలి, అప్పటి వరకు కష్టాలు తప్పవు !

ఈ పరిణామ క్రమం భూమి పైన ఉన్న ప్రతీ ఒక్క మానవుడికీ ఒక్కటే ! మా మార్గంలో ఇవి లేవు, మా పుస్తకాలలో ఈ విషయాలు లేవు, మా పెద్దలు ఇవి చెప్పలేదు, మాది వేరే అని కొంత మంది పొరపడుతుంటారు. వారు ఏ మార్గంలోని వారైనా, ఎవరైనా ఉన్న సత్యం ఇదొక్కటే ! ఈ సత్యమే అందరికీ వర్తిస్తుంది.

1. A Souls Journey - Peter Rechielu. 2. You Forever - Dr. T. Lobsang Rampa.

3. Out of Body Journeys ఇంకా మరెన్నో ఉన్నాయి. మహా యోగీశ్వరులు వ్రాసిన ఇలాంటి ఉత్తమ గ్రంథాలు చదివితే, ఇందాక నేను చెప్పినటువంటి విషయాలు చక్కగా అర్థమవుతాయి. ఈ ఇంగ్లీష్ పుస్తకాలు బుక్ షాపుల్లో లభిస్తాయి.

13. రోగాల, జబ్బుల, వ్యాధుల గురించి అంటే మొత్తం సర్వ అనారోగ్యాల గురించి ఆధ్యాత్మిక శాస్త్రం ఏం చెబుతుందో తెలుసుకుందాం

❀ జీవితం పట్ల అయిష్టత ఏర్పడినప్పుడు, జీవేచ్ఛ అంటే జీవించాలనే ఇచ్ఛ(కోరిక) లేనప్పుడు, నిరాశ, నిస్పృహ, నిరాసక్తతలు లోపల ఏర్పడినపుడు, ఇవన్నీ రోగాలుగా, జబ్బులుగా, వ్యాధులుగా శరీరంలో ప్రకటం అవుతాయి. తెలుసుకోండి, మీ పట్ల మీరు కలిగి ఉన్న నిరసన భావనలు, నిందా భావనలు, ద్వేష భావనలు, పట్టలేని కోపం, క్రోధం, దురావేశం, ఉన్మాదం మరియు ఇందాక పైన చెప్పిన భావనలు మీలో ఏర్పడినప్పుడు - ఇవన్నియే సర్వ, సకల, సమస్త అనారోగ్యాలకు మూల కారణాలు. ముఖ్యంగా మరణ వాంఛ & చావక తప్పదు అనే భావన ఎన్నెన్నో అనారోగ్యాలను సృష్టిస్తుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే నెగెటివ్ భావాలే సర్వ సకల సమస్త అనారోగ్యాలకు మూల కారణాలు.

మీరు ఏ వైరస్‌ల వల్లనో, ఏ ఇన్‌ఫెక్షన్ వల్లనో లేక మరేదో కారణం వల్లనో అనారోగ్యాలు వస్తాయని అనుకుంటూ ఉంటారు. మీ వైద్య శాస్త్రం - Medical Science కూడా ఇదే చెబుతుంది. ఈ వైరస్‌లు, ఇన్‌ఫెక్షన్‌లు, మరేవైనా కారణాలు అన్నీ కూడా ఇందాక నేను పైన చెప్పినటువంటి "నెగెటివ్ భావనల" వలన ఏర్పడతాయి లేదా ఆకర్షించబడతాయి. ప్రస్తుతం చెలామణిలో ఉన్న వైద్య శాస్త్రం - Medical Science కేవలం భౌతిక శరీరం పైన మాత్రమే పరిశోధనలు చేస్తూ, శరీరాన్ని ధరించిన ఆత్మను పట్టించుకోవటం లేదు. అందుకే అసలు సత్యాలు మీకు తెలియటం లేదు. మీ విస్మృతి & మీ అజ్ఞానమే మీ అన్ని అనారోగ్యాలకు మూల కారణం !

"శారీరక రుగ్మతలన్నీ మానసిక జనిత రుగ్మతలే" అని శాస్త్రవేత్తలు ఎప్పుడో తేల్చి చెప్పారు. శరీరంలో సంభవించే అన్ని అనారోగ్యాలకు 80% మూలాలు "లోపల" అంటే "సైక్"లో ఉన్నాయి అని తేల్చి చెప్పారు. మిగతా ఇరవై శాతానికి వేరే కారణాలు ఏవైనా ఉండి ఉండవచ్చని పరిశోధనలు చేస్తున్నారు. నిజానికి నూటికి నూరు శాతం అన్ని కారణాలు లోపలే ఉంటాయి. ఈ విషయం ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలు కొన్ని వేల సంవత్సరాల క్రిందే ప్రకటించారు. సమీప భవిష్యత్తులో ఆధ్యాత్మిక శాస్త్రంలో ఉన్న సత్యాలను ఒక్కొక్కటిగా ఈ శాస్త్రవేత్తలు కనుక్కుంటారు.

ప్రాచీన భారతదేశ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలు ప్రకటించిన ప్రధానమైన రెండు సత్య సూత్రాలను తీసుకుంటే, విషయం స్పష్టంగా, Crystal Clear గా అర్థం అవుతుంది.

మొదటిది : "యద్భావం తద్భవతి" !

భావం = మనసు లేక ఆలోచన లేక గుణం

భవం = పరిస్థితి(జీవితం) మరియు శరీరం

"యద్భావం తద్భవతి" అంటే "నీ భావాన్ని బట్టి నీ భవం". దీని అర్థం ఏమిటి అంటే నీ భావం ఎలా ఉంటే నీ శరీరం + జీవితం అలా ఉంటుందని అర్థం.

రెండవది : "యామతిః సా గతిర్భవేత్" !

అంటే

"మతి ఎలా ఉంటే గతి అలా ఉంటుందని అర్థం" !

మన మతి(మనసు) యొక్క భౌతిక వ్యక్తీకరణయే మన భౌతిక శరీరం మరియు జీవితం.

"మనసు ఎలా ఉంటే మన జీవితం మరియు శరీరం అలా ఉంటాయి" !

"మన మనసు యొక్క ప్రతిబింబమే మన జీవితం మరియు శరీరం" !

"Our body and life are nothing but the
reflection of our psyche" !
or
"Our body and life are nothing but the
outer expression of our psyche" !

మన శరీరం మరియు జీవితం గతి తప్పాయి అంటే "మతి" గతి తప్పిందని అర్థం.

"మనసు అనారోగ్యంగా ఉంటే, యథాతథంగా, as it isగా శరీరం కూడా అనారోగ్యంగా ఉంటుంది".

"మనసు అనారోగ్యంగా ఉండడం అంటే, ఆత్మ విజ్ఞానం లోపించడం అని అర్థం". ఆత్మ విజ్ఞానం లోపిస్తే, మనసు అనారోగ్యం పాలవుతుంది. మనసుకు ఉన్న అనారోగ్యాలే శారీరక అనారోగ్యాలు. మనో వికారాలే శారీరక వికారాలు. ఎందుకంటే మనసు మరియు శరీరం వేరు కాదు. శరీరానికి మనసు కేంద్రం. మనసు యొక్క భౌతిక వ్యక్తీకరణయే శరీరం. మన్ అనే సంస్కృత పదం నుండి మనసు మరియు మనిషి అనే పదాలు పుట్టాయి. మనసు కేంద్రం అయితే మనిషి శరీరం అయింది. వాస్తవానికి మనసు అంటేనే మనిషి. మనసే మనిషి. మనసు వేరే, మనిషి వేరే కాదు. అందరూ వేరు వేరుగా మాట్లాడుతుంటారు. నా మనసుకి ఇలా తోచింది. నా మనసులో ఏదో అయింది అని ! తెలుసుకోండి, మీ శరీరం యొక్క కేంద్రం మనసు. మనసును దాటి వెళ్తే అక్కడ ఆత్మ ఉంటుంది. ఈ ఆత్మయే మనం ! ఈ ఆత్మ కేంద్రంలో మనం "మూల చైతన్యంగా" ఉంటాం.

మనసు మరియు శరీరం వేరు కాదు ఒకటే ! మనసు, శరీరం అనేవి ఒకే దాని రెండు చివరలు. మనసు యొక్క యథాతథ ప్రతిబింబమే శరీరం.

నిజానికి మూల చైతన్యం ఆత్మగా, ఆత్మ మనసుగా, మనసు శరీరంగా ప్రకటం అవుతూ ఉంటుంది. ఇదంతా ఒకటే !

ఈ విషయాలు తెలియని వారు రక రకాలుగా చెప్తూ ఉంటారు, పుస్తకాల్లో వ్రాస్తూ ఉంటారు. కాబట్టి సరి అయిన పుస్తకాలు మాత్రమే చదవండి. సరి అయిన పుస్తకాలు ఎంత మేలు చేస్తాయో, సరి కాని పుస్తకాలు అంత కీడు చేస్తాయి.

శరీరం పిందె అయితే, మనసు కాయ లాంటిది. ఆత్మ పండు. ఇక మహా మూల చైతన్యం వృక్షం లాంటిది !

శరీరం = పిందె

మనసు = కాయ

ఆత్మ = పండు

మహా మూల చైతన్యం = అనంత జీవ వృక్షం

పిందె దశలో ఉన్న మనం కాయ అనే దశను దాటి పండుగా మారితే సరిపోతుంది. పండుగా మారినప్పుడు ఆటోమెటిక్‌గా మనం కూడా వృక్షంతో పూర్ణమైన అనుసంధానాన్ని కలిగి ఉంటాం. అంటే మనము కూడా వృక్షంగా మారినట్టే !

Self Wisdom - ఆత్మ విజ్ఞానం చేత మాత్రమే "మనసు" యొక్క "అజ్ఞానం అనే అనారోగ్యం" తొలగిపోతుంది.

"జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం" (గీత : 4 - 19) అని అన్నాడు కదా గీతలో శ్రీకృష్ణుడు ! అంటే జ్ఞానం అనే అగ్ని చేత మాత్రమే కర్మలు(అజ్ఞానం) శాశ్వతంగా తొలగి పోతాయి, వేరే మార్గం లేదు అని అర్థం.

శారీరక పరమైన జబ్బులకు "మూలం లోపల" ఉంటుంది. జబ్బుల యొక్క వేర్లు "లోపల" ఉంటాయి. మనం ఏం చేస్తున్నాం ? పైన చికిత్స చేస్తున్నాం. కేవలం శరీరాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని చికిత్స చేస్తున్నాం. అంటే కొమ్మలు నరికి వేస్తున్నాం, "వేర్లను" పట్టించుకోకుండా ! అప్పుడు ఏం జరుగుతుంది ? మళ్ళీ కొమ్మలు వస్తాయి. "నరికిన" దగ్గర అవకాశం లేక పోతే ఇంకొక దగ్గరి నుండి ప్రకటం అవుతాయి, అయి తీరుతాయి !

మనసు సమస్యల మయం అయినపుడు, మనసు అశాంతి మయం అయినప్పుడు, శరీరం మరియు జీవితం సమస్యల మయంగా, అశాంతిగా ఉంటుంది.

మనం మన శరీరంలోని, జీవితంలోని సమస్యల పరిష్కారం కోసం బయట వెతుకుతున్నాం. ఇది ఎంత మాత్రము "సరి కాదు". ఈ మూర్ఖత్వంలో నుండి తక్షణమే బయట పడాలి.

మన శరీరం మరియు జీవితం బాగుపడాలంటే మనసుకు చికిత్స చేయాలి.
మనసుకు చికిత్స ఎలా చేస్తాం ? "మనసు" కనపడదు భౌతిక కళ్ళతో ! పోనీ లేదు అని అందామా అంటే దాని "ఉనికి" తెలుస్తూనే ఉంది. ఘనంగా దాని ఉనికి ప్రకటం అవుతూనే ఉంది కదా ! చూద్దాం అంటే కనపడదు, పట్టుకుందాం అంటే దొరకదు !

ఇక్కడే ! సరిగ్గా ఇప్పుడే ! ఈ పాయింట్ దగ్గరే తర్కాన్ని(Logic) వదిలేయాలి.
అప్పుడు మాత్రమే విషయం అవగాహనలోకి వస్తుంది.

❀ కనపడే దాన్ని మాత్రమే నమ్మేటట్టు అయితే మనిషి యొక్క "ప్రాణం" కనపడుతుందా ? "ప్రాణాన్ని" ఇప్పటి వరకు ఏ భౌతికవాది అయినా చూశాడా ? మరి కనపడని "ఆ ప్రాణం" మూలంగానే వారు బ్రతికి ఉన్నారు కదా !

*ఇక్కడ మనసు అంటే "లోపలి భావాలు" లేదా అంతరంగం అని అర్థం చేసుకోవాలి.

"ప్రాణం" పోతే "శరీరం కాస్తా శవం" అవుతుంది ! ఏ శక్తి తొలగిపోయినంత మాత్రాన "శరీరం, శవంగా మారుతుంది" ?

ఏ "శక్తి" మూలంగా ఆ యొక్క "శరీరం" ఇన్ని సంవత్సరాలు బ్రతికింది, చదివింది, ఆడింది, పాడింది, ఉద్యోగమో, వృత్తియో, వ్యాపారమో లేక ఏదో ఒకటి చేసింది. పెళ్ళి చేసుకుంది, సెక్స్‌లో పాల్గొన్నది, పిల్లల్ని కన్నది. ఎన్నెన్నో చేసింది. మరి సడన్‌గా ఏమైంది ? ఎందుకలా కదలకుండా, మెదలకుండా పడిపోయింది. ఏం జరిగింది ?!

"ఏం" విడిపోయినంత మాత్రాన శరీరం కాస్తా శవంగా మారింది. శరీరాన్ని నడిపించే ఆ "శక్తిని" ఇప్పటి వరకు ఏ హేతువాది అయినా చూశాడా ? "కంటికి కనపడ్డ దాన్నే నమ్ముతాము" అని అజ్ఞానంలో పాతుకుపోయి ఉన్నారు. ఓపెన్ మైండెడ్‌గా ఉండాలి. మూసుకుని రిజిడ్‌గా ఉండకూడదు. తమకు తెలిసిందే సత్యమని, మిగతా అందరూ అజ్ఞానులనీ భావించడం సరి కాదు. సైంటిఫిక్ దృక్పథంతో ఉండాలి. పూర్ణ స్వానుభవం లేనిదే ఏ విషయం పట్లా ఒక "స్థిర నిర్ణయానికి" రాకూడదు.

కంటికి కనపడటం లేదు నిజమే ! కాని ఏదో ఒక "శక్తి" లేక "ప్రాణం" లేక "ఆత్మ" ఏదో ఒకటి అందాం ! అది కంటికి అయితే కనపడటం లేదు కానీ దాని "ఉనికి" ప్రస్ఫుటంగా తెలుస్తూనే ఉంది కదా ! "ఉనికి" యొక్క వ్యక్తీకరణ జరుగుతూనే ఉంది కదా !

ఇలా కంటికి కనపడ్డ దాన్ని మాత్రమే నమ్ముతాము అనే వాళ్ళలో అగ్రగణ్యుడు ఒకప్పటి సోవియట్ రష్యా అధినేత "స్టాలిన్". ఇలాంటి స్టాలిన్‌కే కాదు మొత్తం ప్రపంచానికే దిమ్మ తిరిగిపోయేలా చేశాడు గొప్ప ఆధ్యాత్మిక శాస్త్రవేత్త(Cosmic Scientist) అయిన "ఉల్ఫ్ మెస్సింగ్" ! ఒక్క "ఉల్ఫ్ మెస్సింగే" కాదు, చాలా మంది చాలా సార్లు నిరూపించారు, నిరూపిస్తూనే ఉంటారు కూడా ! ఎన్నో సత్యాలు, ఎన్నో సార్లు తిరుగులేని విధంగా నిరూపించబడ్డాయి.

"యద్భావం తద్భవతి" ! "మన భావం ఎలా ఉంటే మన భవం(పరిస్థితి) అలా ఉంటుంది" ! "యామతిః సా గతిర్భవేత్" ! "మన మతిని బట్టి మన గతి" !

మరి కంటికి కనపడని "మనసును" చేతికి చిక్కని మనసును ఎలా పట్టుకుంటారు ? దానికి చికిత్స ఎలా చేస్తారు ? దానికి ఏ ఆయింటుమెంటు పూయలేమే ! దానికి ఏ ఇంజక్షను ఇవ్వలేమే ! దానికి ఏ ఆపరేషను చేయలేమే ! మరి ఎలా ?!

సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మొదలైన వారికి పూర్తిగా తెలియదు. సిగ్మండ్ ఫ్రాయిడ్‌కైనా మరియు కార్ల్ జంగ్‌కైనా సరే... వారికి పూర్తిగా తెలియదు. ఎందుకంటే వారు

పూర్తి స్థాయి భౌతిక దృష్టికోణం కలవారు. వారికి ఆత్మ గురించి ఏమీ తెలియదు. ఆత్మ గురించి ఏమీ తెలియకుండా వ్యక్తి యొక్క మనస్తత్వం గురించి చెప్పడం అనేది, బావి లోని కప్ప యొక్క స్టేట్‌మెంట్ లాంటిదే అవుతుంది. సైకాలజిస్టులకు మరియు సైకియాట్రిస్టులకు కూడా సమస్యలు ఉంటాయి. అయితే, వారి సమస్యలు వారికి తెలియవు. ఒక వేళ తెలిసినా వారు బయటికి చెప్పరు. మానసిక చికిత్స అనేది ఆధ్యాత్మిక విజ్ఞానం మరియు ధ్యానం ద్వారానే జరగాలి.

భౌతిక పరమైన ఏ చికిత్సలు కూడా "మనసుకు" సంపూర్ణమైన, సమగ్రమైన ఆరోగ్యాన్ని ఇవ్వలేవు. ఈ భౌతిక చికిత్సలు ఒక స్థాయి వరకు వచ్చి ఆగిపోతాయి. ఎక్కడ అయితే ఈ భౌతికం ఆగిపోతుందో అక్కడి నుండి ఆధ్యాత్మికం ఆరంభం అవుతుంది.

"మనసుకు సంపూర్ణంగా, సమగ్రంగా మరియు శాశ్వతంగా స్వస్థతను అందిస్తుంది ఆధ్యాత్మిక విజ్ఞానం + ధ్యానం" ! అప్పుడు "మనసు", "సరిగా" అవుతుంది కాబట్టి శరీరం మరియు జీవితం కూడా "సరి" అవుతాయి.

ఎందుకంటే మనసు యొక్క యథాతథ ప్రతిబింబమే
మన శరీరం మరియు జీవితం.

మన శరీరం మరియు జీవితం యొక్క సమస్యల "మూలాలు", "లోపల" ఉన్నాయని గుర్తించి వాటిని నివారించడానికి "కొమ్మలకు" చికిత్స చేయకుండా, నేరుగా డైరెక్ట్‌గా "వేర్లను" కట్ చేస్తే, అప్పుడు మాత్రమే శాశ్వత నివారణ సాధ్యం అవుతుంది.

ఎలా అంటే మన ముఖానికి "మసి" అంటింది. అది అద్దంలో చూసుకున్నప్పుడు కనపడింది. ఎందుకంటే, మన ముఖానికి ఉన్న "మసి" డైరెక్ట్‌గా మనకు కనపడదు. ఎవరైనా చెప్పాలి లేదా అద్దంలోనైనా చూసుకోవాలి, అప్పుడు మాత్రమే కనపడుతుంది.

"కనపడింది మాత్రమే నమ్ముతాము" అని అనేవాళ్ళు "మసి" పోగొట్టడానికి అద్దం పైన రుద్దుతూ కూర్చుంటారు. ఎందుకంటే వాళ్ళు "కనపడేదాన్ని మాత్రమే నమ్ముతారు కదా" !

అరే ! అద్దాన్ని రుద్దకయ్యా బాబు ! "మసి" ఉన్నది ముఖం పైన, అని అంటే - లేదు మేము "వాస్తవిక వాదులం, కేవలం కనపడిన దాన్నే నమ్ముతాం" మాకు "మసి" కేవలం అద్దంలోనే కనపడుతుంది కాబట్టి దాన్ని మాత్రమే నమ్ముతాం. కనపడని ముఖాన్ని, దాని పైన ఉన్న "మసిని" అసలు నమ్మం.

మీరు కనపడని దాని గురించి మాట్లాడే వాళ్ళు. మేము "చదువుకున్న వాళ్ళము, మీ జిమ్మిక్కులు

మా దగ్గర సాగవు". "మాకు ఇంత స్పష్టంగా, ఇంత crystal clear గా అద్దంలో "మసి" కనపడుతుంటే అక్కడ శుభ్రం చేయకుండా, కనపడని ముఖాన్ని, దాని పైన ఉన్న "మసిని" శుభ్రం చేయమంటారు ఏమిటి ?!? ఆహా.... మీ పప్పులు మా దగ్గర ఉడకవు" అని అంటూ అదే పనిగా రుద్దుతూ ఉంటారు. ఆ విధంగా రుద్దీ, రుద్దీ ఒక రోజు అద్దం పగిలి ప్రతిబింబం అదృశ్యం అయిపోయి "ముఖానికి ఉన్న మసి" అలానే ఉండి, పైగా చేయి తెగి రక్తం కారుతుంటే గానీ అర్థం కాదు !

"కంటికి కనపడే దాన్ని మాత్రమే నమ్మండి" ఎవరు వద్దంటున్నారు ?! అయితే ఒక విషయం తెలుసుకుని నమ్మితే బాగుంటుంది.

మన "కళ్ళు" అనేవి చూడవు. కళ్ళు కేవలం కిటికీలు. "కళ్ళ ద్వారా చూసేవారు లోపల ఉన్నారు" ! వారు "కళ్ళ" ద్వారా చూస్తారు.

మన భూమి మరియు భూమి పైన ఉన్న ప్రతీది కూడా "మూడు పరిధులకు" సంబంధించినది. అలాగే మన కళ్ళు కూడా !

మన కళ్ళు "మూడు పరిధులకు(Three Dimensions)" సంబంధించినవి కాబట్టి కళ్ళు కేవలం "మూడు పరిధుల వాస్తవాలను - Three Dimensional Realities ను" మాత్రమే చూడగలుగుతాయి. 3D ఫ్రీక్వెన్సీ కంటే ఎక్కువ "ఫ్రీక్వెన్సీ" ఉన్న వాటిని భౌతిక కళ్ళ ద్వారా చూడలేము.

ఉదాహరణకు మనం రోజూ వాడే "సీలింగ్ ఫ్యాన్‌నే" తీసుకుందాం. దానికి రెక్కలు ఉంటాయి. అవి మనకు కనపడతాయి. ఇతరులకు కూడా చూపించగలుగుతాం అవిగో రెక్కలు అని ! ఫ్యాన్ స్విచ్ వేయగానే రెక్కలు మాయం అవుతాయి. కేవలం మధ్యలో ఉన్న గుండ్రని ఫ్యాన్ యొక్క మధ్య భాగము, పైన ఉన్న ఇతర భాగాలు మాత్రమే కనిపిస్తుంటాయి ఇప్పుడు !

మరి "కంటికి కనపడే దాన్ని మాత్రమే" నమ్మాలి కదా ! ఫ్యాన్ రెక్కలు కనపడటం లేదు కదా ! తల దూర్చండి మరి ! మీ నమ్మకాన్ని అనుసరించి అందులో తల దూర్చండి !

అందులో తల దూరిస్తే గానీ రెక్కలు ఉన్నాయో లేవో తెలియదు. అదే విధంగా ఆధ్యాత్మిక సూత్రాల ఆచరణ + ధ్యానం చేస్తేనే గానీ "ఆత్మ ప్రపంచం" బోధ పడదు, కనపడదు, అనుభవ పూర్వకంగా తెలిసి రాదు ! నిరంతర ధ్యాన సాధన చేస్తేనే, ఆధ్యాత్మిక సూత్రాలు ఆచరిస్తేనే గానీ "సత్యం" బోధ పడదు, ఆధ్యాత్మిక శాస్త్రం అర్థం కాదు.

అయితే ఈ హేతువాదులను ఒక కోణంలో ఎంతైనా అభినందించ వలసిందే. వారు ఉండబట్టే "నకిలీ బాబాల", "నకిలీ స్వాముల" భాగోతాలు బయట పడుతున్నాయి. గాల్లోంచి అదీ, ఇదీ సృష్టించి, ఏవో అద్భుతాలు చేస్తాం అనే వాళ్ళ "నకిలీలలు" ఈ హేతువాదుల కృషి వల్లనే బయట పడుతున్నాయి. వారు ఎంతగానో శ్రమించి, నిజాయితీగా పరిశోధన చేసి అమాయక ప్రజలు మోసపోకుండా తమ

వంతు కృషి తాము చేస్తున్నారు. వారికి నేను హృదయపూర్వక అభినందనలను తెలియచేస్తున్నాను.

హేతువాదుల నిబద్ధత నాకు తెలుసు. వాళ్ళు చాలా నిజాయితీగా ఉంటారు. కాకపోతే కేవలం భౌతిక తత్వానికే పరిమితం అయి ఉంటారు.

"ఏదైనా గానీ పూర్తిగా తెలిస్తేనే దాని గురించి మాట్లాడాలి" !

"ఏదైనా సరే వినగానే కొట్టి పారెయ్యవద్దు" ! ఇది మూర్ఖత్వానికి నిదర్శనం. ఎందుకంటే...

..."తెలిసింది బిందువంత, తెలుసుకోవలసింది సాగరమంత" ! నాకు తెలిసిందే గొప్ప, అని అనుకుంటూ ఉంటారు కొందరు. ఇది సరి అయిన విధానం కానే కాదు.

"తనకు తెలియనంత మాత్రాన తప్పు అనడం" మూఢత్వం ! తెలిస్తే తెలుసు అని చెప్పాలి. లేకపోతే ఇది నిజమో కాదో నాకు తెలియదు, నాకైతే నమ్మశక్యంగా లేదు అని చెప్పాలి. అంతే కానీ విషయాన్ని పూర్తిగా తెలిసిన వారి లాగా, స్వానుభవం ఉన్న వారి లాగా తేల్చి చెప్పకూడదు. ఏ విషయాన్ని అయినా పరిశోధించి తెలుసుకోవాలి. స్వంత అనుభవ జ్ఞానం సంపాదించి అప్పుడు మాట్లాడాలి.

కొందరు ఉంటారు "బావిలో కప్పల్లాగా" ! తమ బావి మాత్రమే ప్రపంచం అని, మిగతా ఏమీ లేదని, అందులోనే హాయిగా ఉంటుంటారు. పూర్తిగా స్వానుభవం లేనిదే ఏమీ మాట్లాడకూడదు. ఇష్టం లేకపోతే వదిలేయాలి.

ఏ విషయాన్ని అయినా "పరిశోదన" చేయాలి, అంటే ఎలాంటి పరిశోధన ?!?!

ఆస్తికులు ఉంటారు. ముందుగా వీరు దేవుడిని నమ్మేస్తారు. వీరు ప్రత్యక్షంగా దేవుడిని చూడలేదు. వీరికి స్వంత అనుభవ జ్ఞానం ఉండదు, అయినా నమ్మేస్తారు. దేవుడు ఉన్నాడని వీరు పరిశోధన ప్రారంభిస్తారు. ఆల్‌రెడీ దేవుడు ఉన్నాడని పరిశోధనకు ముందే బలంగా నమ్ముతూ ఉన్నారు కాబట్టి, డిసైడ్ అయిపోయారు కాబట్టి ఆటోమెటిక్‌గా "దేవుడు ఉన్నాడు" అనే ఆధారాలు సంపాదిస్తారు. ఎవరివో అనుభవాలను తీసుకుని "ఆధారాలను పోగు చేస్తారు" ! మరి దీనిని పరిశోధన అని అనరు ! ఆధారాల సేకరణ అని అంటారు.

నాస్తికులు ఉంటారు. వీరి గురించి నాకు బాగా తెలుసు. దేవుడు లేడు అని బలంగా ముద్ర వేసుకుని ఉంటారు. దేవుడు లేడని నిరూపించే ఆధారాలను వెతికి "పోగు చేస్తారు". మరి ఇది కూడా పరిశోధన కాదు కదా !

అసలు సిసలు పరిశోధన అంటే ఏమిటీ అంటే :

✪ "ఆచరించి, అనుభవించి ఏదైతే ఉందో దానిని యథాతథంగా తెలుసుకోవడం" ! దీనినే పరిశోధన - Research అని అంటారు.

✪ పరిశోధన చేసే వ్యక్తి న్యూట్రల్‌గా, ప్లెయిన్‌గా ఉండాలి. పరిశోధన చేయబోయే అంశం ఏదైతే ఉందో దాని పట్ల ముందు గానే ఎలాంటి నమ్మకాలను, అభిప్రాయాలను కలిగి ఉండకూడదు. పరిశోధనకు ముందే ఒక నిర్ణయానికి రాకూడదు. "రవ్వంత తీసివేయకూడదు, రవ్వంత కలపకూడదు", ఎలా ఉందో అలా, యథాతథంగా "విషయాన్ని" దర్శించాలి.

✪ "కేవలం ఏది ఉందో అది, దాన్ని మాత్రమే తెలుసుకోవాలి" ! దీనిని మాత్రమే పరిశోధన అని అంటారు,

✪ Research అంటే "Nothing to be added,
nothing to be deleted" !

✪ Research అంటే "Knowing as it is" !

ఈ విధంగా పరిశోధించి, స్వానుభవంతో మాట్లాడితే అప్పుడు సమంజసంగా ఉంటుంది.

☸ సరి కాని గుణాలు లేక సరి కాని ఆలోచనా విధానం లేక నెగెటివ్ ఆలోచనల యొక్క పర్యవసానాలే అన్ని అనారోగ్యాలు. తలనొప్పి నుండి క్యాన్సర్, ఎయిడ్స్ వరకు అన్ని అనారోగ్యాలకు ఇదే మూల కారణం.

ప్రతీ ఒక్కరిలో ఆత్మ ద్వేషం - Self Hatred మరియు ఆత్మ అయిష్టత - Self Dislike అనేవి తిష్ఠ వేసుకుని ఉంటాయి. "విషయం" మనకు తెలియక పోవడం చేత రక రకాల నిరసన భావనలు, నెగెటివ్ భావనలు కలిగి ఉంటాం. వీటన్నింటి యొక్క ఫలితాలే అన్ని అనారోగ్యాలు.

☸ ఆధ్యాత్మిక శాస్త్ర పరంగా ప్రతీ ఒక్కరూ ఏ రోగాన్నైనా తలనొప్పి నుండి క్యాన్సర్(Cancer), ఎయిడ్స్(AIDS) వరకు సులభంగా, శీఘ్రంగా, పూర్తిగా, శాశ్వతంగా తగ్గించుకునే శక్తి సామర్థ్యాలను కలిగి ఉంటారు - సేత్

❖ ❖ ❖

చాలా మంది మేము మెంబర్స్ కావాలంటే ఏం చేయాలి అని అడుగుతూ ఉంటారు. జనరల్‌గా నా పుస్తకాలను చదువుతూ ఉన్నవారు, నన్ను గురువుగా ఒప్పుకుని నా సబ్జెక్ట్‌ను అనుసరిస్తున్న వారు నా ఫాలోవర్స్ !

కేవలం నన్ను మాత్రమే గురువుగా ఒప్పుకుని నన్ను,

నా సబ్జెక్ట్‌ను ఆచరిస్తున్న వారు నా శిష్యులు !

కేవలం నన్ను మాత్రమే గురువుగా ఆత్మపూర్వకంగా ఒప్పుకుని, కేవలం నా మార్గానికే సంపూర్ణంగా, సమగ్రంగా, శాశ్వతంగా అంకితమై ఇతర ఏ లక్ష్యాలు లేకుండా కేవలం నా లక్ష్యాల కోసం నిస్వార్థంగా పనిచేసేవారు మెంబర్స్ !

14. మేము ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలం, పరిశోధకులం ! సన్యాసులం, స్వామీజీలం, బాబాలం కాదు !!

సత్య సాధన చేసే వారి పైన మరియు సత్య ప్రచారం చేసే వారి పైన కొంత మందికి సరి కాని అభిప్రాయాలు ఉన్నాయి.

సత్య సాధన చేస్తే స్వామీజీలు అయిపోతారనీ, బాబాలుగా మారుతారనీ, సన్యాసం పుచ్చుకోవాలనీ, అన్నీ వదిలేసి బ్రతకాలేమోనని ఏమేమో అనుకుంటూ ఉంటారు. ఇలా, చాలా తప్పుగా ఊహించుకుంటూ ఉంటారు. ఇది ఎంత మాత్రమూ సరి కాని విషయం.

అసలు సిసలు జీవితాన్ని జీవించే వారే సత్య మార్గంలో ఉన్న వారు. Colourful life lead చేస్తూ జీవితాన్ని ఉత్సవంలా జీవిస్తూ ఉంటారు. ఎంజాయ్‌మెంట్ ఎన్ని రకాలుగా ఉంటుందో అన్ని రకాలుగా ఎంజాయ్ చేస్తూ, కొత్తగా ఎంజాయ్ చేయడానికి కొత్త, కొత్త మార్గాలను అన్వేషిస్తూ ఉంటారు.

సత్య సాధకులు మరియు సత్య ప్రచారకులు నిత్యానందంతో ఉంటారు. చదువులు, వృత్తి, ఉద్యోగ వ్యాపారాలు చేసుకుంటూ ఈ సాధన + ప్రచారం చేస్తూ ఉంటారు. పెళ్ళిళ్ళు చేసుకుంటారు. పిల్లల్ని కంటారు, జీవితాన్ని జీవిస్తూ ఉంటారు, ఈడ్చకుండా !

చదువుకున్న వాళ్ళు కూడా సాధకుల పట్ల మరియు ప్రచారకుల పట్ల ఇలాంటి భావాలను కలిగి ఉండడం శోచనీయం !

మీరు సినిమాలు చూస్తారా ? మీరు పిక్నిక్‌లకు వెళ్తారా ? మీరు ప్యాంటు, షర్ట్ వేస్తారా ? అని

చాలా వింత వింత ప్రశ్నలు మమ్మల్ని అడుగుతూ ఉంటారు. సత్య సాధన + ప్రచారం అంటే కొంత మందికి ఇలాంటి అభిప్రాయాలు ఉన్నాయి మరి ! కానీ అసలు సిసలు జీవితం ఆత్మ విజ్ఞానులదే ! ఆత్మ విజ్ఞానాన్ని పొందేదే ఎంజాయ్ చేయడానికి. అన్నీ వదిలేసి ఎటో పోవడానికి కాదు. ఆత్మ విజ్ఞానం, జీవితాన్ని ఈడ్చకుండా, జీవితాన్ని ఎలా జీవించాలో నేర్పిస్తుంది. శాశ్వతమైన ఆరోగ్య ఐశ్వర్యాలతో ఉత్సవాలు జరుపుకునేలా చేస్తుంది.

✪ *Meditation for living, not for leaving !* ✪

అసలు విషయాన్ని అర్థం చేసుకోండి. మేము ఆధ్యాత్మిక శాస్త్రంలో పరిశోధన చేస్తున్న వాళ్ళమండి. ప్రజల్లో ఆధ్యాత్మిక శాస్త్రం పైన ఉన్న అపోహలను పోగొట్టి, అందరికీ ఆధ్యాత్మిక శాస్త్ర విజ్ఞానాన్ని అందించాలనేదే మా లక్ష్యం.

15. తనను తాను సమర్పించుకుంది సృష్టి చేపడుతుగా !

మనిషి పుట్టినప్పటి నుండి మొదలవుతుంది జీవన పోరాటం. నడవటం వచ్చీ రాకముందే స్కూల్లో వేసేస్తారు. పిల్లవాడి బరువుకు రెండింతలు, మూడింతలు బరువున్న బస్తాలను వాడి మీద వేసి గొడ్డు చాకిరి చేయించడం మొదలు పెడతారు. ఇదీ ఒక రకంగా మంచిదే లెండి, పెద్దయ్యాక ఏ పని దొరక్కపోతే కనీసం మూటలు మోసుకునైనా బ్రతకవచ్చు. గొడ్డు కన్నా దారుణంగా చాకిరి చేయిస్తారు, "చదువు" అనే నెపంతో పిల్లలను రాచి రంపాన పెట్టి రాత్రింబవళ్ళు చదివిస్తారు. ఎందుకంటే బాగా చదివితే ర్యాంకు వస్తుంది. మంచి ర్యాంకు వస్తే మంచి ఉద్యోగం దొరుకుతుంది. మంచి ఉద్యోగం దొరికితే "మంచి జీతం" వస్తుంది. మంచి జీతంతో హాయిగా బతకవచ్చు అని అనుకుంటూ ఉంటారు. ఇది సత్యం కాదు. జీతంతో జీవితాన్ని ఈడ్చవచ్చు కానీ, జీతంతో జీవితాన్ని జీవించలేం. ఎందుకంటే జీవితంలో జీతం ఉంటుంది కానీ జీతంలో జీవితం ఉండదు. మంచి జీతం ఉన్న వాళ్ళ జీవితాలు పరిశీలించి, పరిశోధించి చూడండి. బాగా డబ్బులున్న వాళ్ళ జీవితాలను నిశితంగా పరిశీలించండి మీకే తెలుస్తుంది. జీతం ఉన్న వాళ్ళు ప్రపంచంలో ఎంతో మంది ఉన్నారు. వాళ్ళు అందరూ శాంతి, సంతృప్తి, ఆనందాలతో జీవిస్తున్నారా ? జీతంతో గనుక ఆనందం వస్తే ఈపాటికి "ఆనందాన్ని" అమ్మే "ఆనంద దుకాణాలు" ఎన్నో వెలిసి ఉండేవి. ఆనందం జీతంతో అంటే డబ్బుతో రాదు.

ఆనందం దేనితోనూ కూడి రాదు. ఆనందం అనేది సర్వతంత్ర స్వతంత్రంగా వస్తుంది. ఆనందం ఏ కారణంతోనూ ముడి పడకుండా వస్తుంది. ఆనందం అకారణంగా వస్తుంది. అకారణంగా వచ్చే దానినే ఆనందం అని అంటారు. అసలు సిసలు ఆనందం అంటే అకారణంగా వచ్చేదే ! ఇదే శాశ్వతంగా ఉంటుంది.

చదువు అయిపోయే దాకా, చదువు అయిపోతే ఇక ఆనందమే అని స్టూడెంట్స్ అనుకుంటూ ఉంటారు. తీరా చదువు అయిపోయాక ఉద్యోగాల వేటలో లేదా ఏదైనా సెటిల్‌మెంట్ విషయంలో

టెన్షన్ మొదలవుతుంది. ఆ సమయంలో అనుకుంటారు, ఉద్యోగం దొరికితే ఇక అంతా ఆనందమే అని ! తీరా ఉద్యోగం దొరికాక పెద్ద కంపెనీ కాదనో లేక జీతం ఎక్కువగా లేదనో అసంతృప్తి మొదలవుతుంది. ఏదో ఒకటి ఉద్యోగం వచ్చింది కదా ఇక పెళ్ళి టెన్షన్ మొదలవుతుంది. పెళ్ళి అయిపోతే ఇక బాధలే ఉండవు అని భ్రమలో ఉంటారు. ఇక పెళ్ళి అయ్యాక "భాగస్వామి" అనుకున్నట్టుగా దొరకలేదని బాధ మొదలవుతుంది. తన భాగస్వామి తప్ప మిగతా వారందరూ బాగానే కనపడుతుంటారు. ఇక ఏమీ చేయలేం. "ఇండియా" కదా ! వెస్టర్న్ కంట్రీస్‌లా కాదు కాబట్టి అడ్జస్ట్ అయిపోతారు. ఉద్యోగం వచ్చింది, పెళ్ళి అయిపోయింది ఇక ఇల్లు ఉంటే బాగుంటుంది అని అనుకుంటూ ఉంటారు. ఒక ఇల్లు కట్టుకుంటేనో లేక ఇల్లు కొనుక్కుంటేనో ఇక అంతా ఆనందమే అనుకుంటూ ఉంటారు. ఇల్లు స్వంతం అయ్యాక ఆ ఆనందం కొద్ది రోజులే ఉంటుంది. ఇక పిల్లల టెన్షన్ మొదలవుతుంది. పిల్లలు పుట్టాక ఆనందం అని అనుకుంటూ ఉంటారు. పిల్లలు పుట్టాక ఉరుకులు పరుగులు మొదలవుతాయి. మళ్ళీ వాళ్ళ చదువు, ఉద్యోగం, పెళ్ళి, ఇల్లు, పిల్లలు ఇలా తిరిగి చూసే సరికి రిటైర్‌మెంట్ వయసు వచ్చి రిటైర్ అయిపోతారు. రిటైర్ అయ్యాక నిజాయితీగా చూసుకుంటే జీవితం మొత్తం అయిపోయి చివరికి వచ్చిన తర్వాత కూడా శాంతి, సంతృప్తి, ఆనందాల జాడే ఉండదు.

ఎందుకంటే చదువుతోనో, ఉద్యోగంతోనో, పెళ్ళితోనో, పిల్లలతోనో, ఆస్తులతోనో శాంతి, సంతృప్తి, ఆనందం వస్తాయి అని అనుకుంటారు. అలా వచ్చేవి కొంత కాలం మాత్రమే ఉంటాయి. వీటిలోని వేటితోనూ శాంతి, సంతృప్తి, ఆనందాలు శాశ్వతంగా రావు. వీటికి శాశ్వత శాంతి, సంతృప్తి, ఆనందాలకు ఏ మాత్రం సంబంధం లేదు. డబ్బు అంటే నోట్ల కట్టలకు శాశ్వత ఆనందానికి ఏ మాత్రం సంబంధం లేదు అని తెలియ జేస్తున్నాను.

24 గంటలు నేను ఆనందంగా ఎందుకు ఉండలేక పోతున్నాను ?

ఒక సారి మీరు ప్రశాంతంగా కూర్చోండి. మీ పట్ల మీరు నిజాయితీగా వ్యవహరించండి. ఒక పెన్ను, పేపరు తీసుకుని మీరు ఆనందంగా ఎందుకు ఉండలేక పోతున్నారో ఆలోచించండి. ఎల్లప్పుడూ, 24 గంటలు నేను ఆనందంగా ఎందుకు ఉండలేక పోతున్నాను అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. వెంటనే కారణాలు ప్రకటితం కావడం మొదలు పెడతాయి. అవి అన్నింటినీ పేపరు పైన వ్రాసుకోండి.

బహుశా అవి ఇలా ఉంటాయి...

1. నేను నల్లగా ఉన్నాను.

2. నేను సన్నగా ఉన్నాను.

3. నేను లావుగా ఉన్నాను.

4. నేను పొట్టిగా ఉన్నాను.

5. నేను అందంగా లేను.

6. నాకు ఉద్యోగం లేదు.

7. నాకు Girl friend **లేదు.**

8. నాకు Boy friend **లేదు.**

9. నాకు స్వంత ఇల్లు లేదు.

10. నా భర్త అందంగా లేడు.

11. నా భార్య అందంగా లేదు.

12. నేను గొప్ప అందగాడిని, నాది "కళ" గల్ల ముఖం, నాకు ప్రపంచంలో అందరి కంటే ఎక్కువ తెలివి ఉంది అయినా నాకు ఒక్క అమ్మాయి కూడా పడటం లేదు.

13. నాకు ఆస్తులు లేవు.

14. నాకు టాలెంట్ ఉంది కానీ దానికి సరైన గుర్తింపు రావటం లేదు.

15. నాకు పిల్లలు లేరు.

16. నా పిల్లల కంటే వాళ్ళ పిల్లలు బాగున్నారు.

17. నాకు వెంట్రుకలు సరిగా లేవు.

18. నాకు సరైన ఫిజిక్ లేదు.

19. నాకింకా పెళ్ళి కాలేదు.

20. నా పిల్లలకు ఇంకా ఉద్యోగాలు దొరకలేదు, వాళ్ళకు పెళ్ళిళ్ళు కాలేదు.

21. నా కళ్ళు బాగుండవు.

22. నా ముక్కు, పెదవులు బాగుండవు.

23. నాకు అన్నీ ఉన్నాయి కానీ ఏదో తెలియని అసంతృప్తి.

24. అసలు నాకేం కావాలో నాకే అర్థం కావటం లేదు.

25. అప్పుడు నేను "అలా" చేసి ఉండాల్సింది కాదు, "అది" ఇలా జరిగి ఉంటే బాగుండు, "ఇది" ఇలా జరగకుండా ఉంటే బాగుండేది.

26. ఇక నా బ్రతుకు ఇంతేనా ? ....ఇలా రక, రకాలుగా ఇంకా ఎన్నో రకాల కారణాలు ఉంటాయి. ఇప్పుడు మనం ఒక విషయాన్ని ప్రాక్టికల్‌గా తెలుసుకుందాం.

ప్రాక్టికల్‌గా తెలుసుకుందాం

ఉదాహరణకు మీరు నల్లగా ఉన్నారు అని బాధ పడుతూ ఉన్నారంటే "తెల్లగా" ఉండటంలో ఆనందం ఉంది అని అర్థం. అంటే తెల్లగా ఉన్న వారు ఆనందంగా ఉండాలన్న మాట. మరి, ఒక సారి తెల్లగా ఉన్న వాళ్ళను జాగ్రత్తగా గమనించండి. వారి జీవితాలను పరిశీలించండి, పరిశోధించండి. వారు ఎల్లప్పుడూ, 24 గంటలు ఆనందంగా ఉండాలి. మరి వారు ఉంటున్నారా ? ఇది తేల్చాల్సిన విషయం. తెల్లగా ఉన్న వాళ్ళను వెళ్ళి అడిగితే వాళ్ళు వేరే సమస్యల గురించి బాధ పడుతున్నట్టు చెప్తారు. అసలు మేము తెల్లగా ఉన్నాము. ఇది ఒక ఆనంద కారకము అనే స్పృహే ఉండదు వారిలో ! వారు వేరే సమస్యలతో బాధ పడుతూ ఉంటారు.

ఇంకొక ఉదాహరణ తీసుకుంటే మీకు డబ్బు లేనందువలన ఇబ్బందులు పడుతూ ఉంటే డబ్బులు వస్తే ఇక నా జీవితానికి ఎలాంటి "సమస్యా" లేదు అని అనుకుంటూ ఉంటారు. ఇప్పుడు మీ దృష్టిలో డబ్బులు ఉన్నవారు ఆనందంగా ఉంటారు అని అర్థం. మరి డబ్బులున్న వాళ్ళు ఎల్లప్పుడూ హాయిగా ఉంటున్నారా ? లేదా ? అనేది తేల్చుకోవాల్సిన విషయం. వాళ్ళ జీవితాలను నిశితంగా పరిశీలిస్తే, వాళ్ళు వేరే సమస్యలతో సతమతం అవుతూ ఉంటారు. డబ్బుదేముందండి, డబ్బు ఎప్పుడంటే అప్పుడు సంపాదించుకోవచ్చు. అది అసలు ప్రాబ్లమే కాదు ! మేం పడుతున్న బాధ ఎవరికి చెప్పుకోవాలి ? అని ఎదురు ప్రశ్నిస్తారు.

మీకు ఏవి లేక పోతే అవి ఉన్న వారిని గమనించండి. ఎవ్వరూ ఎల్లప్పుడూ, 24 గంటలు ఆనందంగా ఉండరు. ఏవో కారణాలు ఉంటాయి. ప్రతి ఒక్కరు ఏవో సమస్యలతో బాధ పడుతూనే ఉంటారు. నర్సరి పిల్లల దగ్గరి నుండి దేశాధినేతల వరకు అందరికీ సమస్యలు. ఎంత చెట్టుకు అంత గాలి. ఎవరి గోల వారిది. ఒక్క ఆత్మ విజ్ఞానులు మాత్రమే 24 గంటలు ఆనందంగా ఉండగలుగుతారు. ఎందుకంటే ఆత్మ విజ్ఞానం ద్వారా జనించే ఆనందమే నిజమైన ఆనందం ! ఈ ఆనందమే శాశ్వతంగా ఉంటుంది.

ఏం చేసినా అసంతృప్తి - జీవన విధానంలో లోపం

ఏం చేసినా, ఎన్ని కోరికలు తీరినా అసంతృప్తిగానే ఉంటారు. రిటైర్ అయిన వాళ్ళను గమనించండి. జీవితం చివరి దశలోకి వచ్చి ఉంటారు. ఇంకా వెతుకుతూనే ఉంటారు. జీవితాంతం శాంతి, ఆనందం, సంతృప్తి కోసం... అలా వెదుకుతూనే చనిపోతారు. మంచి చదువులు చదువుతారు, మంచి ఉద్యోగాలు / వ్యాపారాలు చేస్తారు. పెళ్ళిళ్ళు చేసుకుంటారు. పిల్లల్ని కంటారు, స్వంత ఇళ్ళు, కార్లు ఉంటాయి. జీవితం అయిపోయింది. చివరిలోకి వచ్చేశారు. అయినా అసలు సిసలు ఆనందం, శాంతి, సంతృప్తి పొందారా అంటే... జవాబు రాదు ! అంటే జీవితం.... 50 / 60 / 70 సంవత్సరాల జీవితం మరి దేని కోసం జీవించినట్టు ?! 50 / 60 / 70 సంవత్సరాలు జీవించి శాంతి, ఆనందం, సంతృప్తి పొందలేదు అని అంటే జీవన విధానంలో లోపం ఉన్నట్టే కదా !

సత్య ప్రకటన

ఒక సారి మీరు ఏకాంతంగా కూర్చోండి..... ఇప్పుడు మీ హృదయం పైన చెయ్యి వేసుకుని, నిజాయితీగా మీకు మీరు ఇలా సత్య ప్రకటన చేసుకోగలుగుతారా !

1. నేను నా బాల్యం పట్ల ఆనందంగా ఉన్నాను, సంతృప్తిగా ఉన్నాను.

2. నేను నా చదువుల పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

3. నేను నా యవ్వనం పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

4. నేను నా ఉద్యోగ / వ్యాపార విషయంలో ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

5. నేను నా పెళ్ళి పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

6. నేను నా పిల్లల పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

7. నేను నా ఆదాయం పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

8. నేను నా కుటుంబం పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

9. నేను నా ప్రేమ పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

10. నేను నా నగల పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

11. నేను నా ఆస్తుల పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

12. నేను నా బ్యాంక్ బ్యాలెన్స్ పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

13. నేను నా గడిచిన జీవితం పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

14. నేను నా ప్రస్తుత జీవితం పట్ల ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను.

15. చివరిగా... నేను నా పట్ల శాంతిగా, ఆనందంగా, సంతృప్తిగా ఉన్నాను. చక్కటి జీవితమే జీవించాను నేను. ఆహా... మధురమైన జీవితమే నాది. నేను నా పట్ల, నేను గడిపిన జీవితం పట్ల హృదయపూర్వకంగా శాంతిని, ఆనందాన్ని, సంతృప్తిని ప్రకటిస్తున్నాను. ఇది సత్యం. అని మీకు మీరు 100% నిజాయితీగా సత్య ప్రకటన చేసుకోగలుగుతారా ! ఒక వేళ చేసుకోగలిగితే అదే మోక్షం ! ఇక మాట్లాడేది ఏమీ లేదు ! ఒక వేళ చేసుకోలేక పోతున్నారు అని అంటే... ఎక్కడో ఏదో లోపం జరిగి ఉంటుందనేగా అర్థం !

జీవితంలో ఎప్పుడూ లోపం ఉండదు.

జీవితాన్ని జీవించే విధానంలోనే లోపం ఉంటుంది !

ఒక సారి అంచనా వేయండి భూమి పైన ఎంత మంది ఈ విధంగా 100% నిజాయితీగా సత్య ప్రకటన చేయగలుగుతారు. 99% చేయలేరు. మరి ఎక్కడ జరుగుతుంది పొరపాటు ? అయితే ఇలాంటి సత్య ప్రకటన చేసే వాళ్ళు ఉన్నారు. వాళ్ళే "ఆత్మ విజ్ఞానులు" ! ఆత్మ విజ్ఞానులు ఇలాంటి సత్య ప్రకటన చేయడమే కాదు, అందరూ సత్య ప్రకటన చేయడానికి కారణ భూతులవుతారు. నా పట్ల నేను ఈ సత్య ప్రకటన చేసుకున్నాను. అందరూ సత్య ప్రకటన చేయడానికి కృషి చేస్తున్నాను.

ఆధ్యాత్మికత అంటే ఎన్నో అర్థాలున్నాయి అందులో ఒకటి జీవితం ! జీవితం, మనకు సృష్టి ఇచ్చిన అమూల్య వరం. సృష్టి మనకు జీవితాన్ని ఇవ్వడంతో పాటు, ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని, సంపూర్ణమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కూడా ఇచ్చింది. ఈ రెండు వరాలను శాశ్వతంగా మనకు ప్రసాదించింది. సృష్టి తనకు ఉన్న శక్తులను అన్నింటిని అనుసంధానం చేసి వీటిని వాడుకోమని చెప్పింది. హాయిగా జీవించమని చెప్పింది.

ఒక రకంగా చెప్పాలంటే తనను తాను సమర్పించుకుంది సృష్టి, భేషరతుగా ! మనల్ని, అంతటిని సృష్టించి, కావలసినవన్నీ, అందుకోగలిగినవన్నీ అందుబాటులో ఉంచి, తీసుకోగలిగినవన్నీ తీసుకో అని చెప్పి సర్వ సమర్పణం చేసుకుంది సృష్టి మనకు.

✪ ఎలాంటి షరతులు పెట్టలేదు. ఎలాంటి నియమ నిబంధనలు, కట్టుబాట్లు విధించలేదు. కానీ ఒకే ఒక షరతును మాత్రం విధించింది. అది ఏమిటంటే... ...."ఆనందంగా ఉండండి... ఆనందాన్ని పంచుకోండి..." ! అని, ఈ ఒక్క షరతునే పెట్టింది. ఇంకా ఏమీ కోరలేదు సృష్టి, మానవుల నుండి.

భూమి పైన మానవుడు ఆనందంగా తప్ప అన్ని రకాలుగా, ఎన్నెన్నో రక రకాలుగా ఉంటున్నాడు. కానీ ఆనందంగా మాత్రం ఉండటం లేదు. ఆనందాన్ని మాత్రం పంచు కోవటం లేదు. మిగతావి అన్నీ చక్కగా, భేషుగ్గా పంచుకుంటున్నాడు, అంటే క్రోధం, ద్వేషం మొదలైన నెగెటివ్ విషయాలన్నింటిని బాధ్యతతో, శ్రద్ధతో పంచుకుంటున్నాడు. అజ్ఞానంతో, నిరంతరం అభద్రతా భావంతో ఉంటూ అల్లకల్లోలాలను పంచుకుంటూ ఉన్నాడు, పెంచుతూ ఉన్నాడు.

జీవితం అంటే మస్తీ !

జీవితం అంటే మజా !

జీవితం అంటే ధూమ్ !

ప్రియ మిత్రులారా !

జీవితానికి ఏ అర్థం ఉండదు. అది ఊరికే అలా ఉంటుంది. అంతే ! దానికి మనమే ఏదో ఒక అర్థాన్ని కల్పించుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే జీవితం జీవితమే ! జీవితం తెల్ల కాగితంలా ఉంటుంది. దాని పైన ఎలాంటి చిత్రం వేస్తావో అది నీ ఇష్టం.

జీవితానికి నిర్వచనం అంటూ ఏమీ ఉండదు. ఎలా దాన్ని నీవు నిర్వచించ దలుచుకున్నావో అది నీ ఇష్టం.

జీవితానికి ఏ అర్థాన్ని ఇచ్చినా, ఏ నిర్వచనాన్ని ఇచ్చినా, జీవితం నీకు సహకరిస్తూనే ఉంటుంది. అనుక్షణం మన జీవితం మన చేతుల్లోనే ఉంటుంది. దాన్ని ఎప్పుడు అంటే అప్పుడు, ఎలా అంటే అలా, మలుచుకునే అవకాశం మన చేతుల్లోనే ఉంది. మన జీవితాలకు బాధ్యత పూర్తిగా మనదే ! వేరే ఎవరిదీ కాదు !

☸ జీవితం అంటే రంగులమయం. అన్ని రంగులు సమృద్ధిగా ఉండాలి జీవితంలో ! జీవితం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలి. జీవితం ఎప్పుడూ సుసంపన్నంగా ఉండాలి. జీవితం

బలంగా ఉండాలి. జీవితం మహా శక్తిమయంగా ఉండాలి. జీవితం రక్తిమయంగా ఉండాలి. జీవితం యుక్తి, భుక్తి, ముక్తిమయంగా ఉండాలి. జీవితం స్వేచ్ఛగా ఉండాలి. జీవితం ఐశ్వర్యవంతంగా, ఉత్సవ భరితంగా, ఉత్సాహంగా ఉండాలి. జీవితం ఆనందంగా, శాంతంగా, సంతృప్తికరంగా ఉండాలి. జీవితం మనం కోరుకున్న విధంగానే ఉండాలి. జీవితం మనం అనుకున్న రీతిలోనే సాగి తీరాలి. అన్ని కోరికలు తీర్చుకుంటూ, అన్ని రకాలుగా ఎంజాయ్ చేస్తూ జీవితంలో "జీవించాలి". బలంగా, శక్తివంతంగా జీవించాలి.

జీవితంలో రాజీ పడకూడదు. నీవు కోరుకున్న విధంగా జీవించడానికి అన్ని రకాల సహాయాలను చేస్తుంది జీవితం. నీవు ఎలా మలుచుకుంటే అలా అవుతుంది జీవితం.

Life is very flexible... shape it - According to your will and wish !

జీవితం అంటే మస్తీ !

జీవితం అంటే మజా !

జీవితం అంటే ధూమ్ !

Yes ! జీవితం అంటే ధూమ్ ! దుమ్ము లేపాలి ! పంబ రేగాలి !

జీవితం అంటే ఆడాలి, పాడాలి, చిందెయ్యాలి !

మనం ఆనందంగా ఉండకుండా ఏం చేయాలో అవి అన్ని చక్కగా, శ్రద్ధగా, నేర్పుగా చేసి పారేశారు మన "పెద్దలు" ఎప్పుడో ! ఎన్ని రకాలుగా మార్గాలు మూయాలో అన్ని రకాలుగా మూసి పారేశారు. చావగొట్టి చక్కగా చెవులు మూసేశారు. స్వేచ్ఛాపూరితమైన జీవితాలను అర్థం లేని శాసనాలతో బంధించేశారు. ఏ నిర్వచనానికి అందనిది, అనిర్వచనీయమైన ఆనందానికి ఏవో రక, రకాల "నిర్వచనాలు" ఇచ్చి వాటిల్లో ఆనందాన్ని వెతుక్కోమని చెప్పారు. అసలు సిసలు "ఆనందం" అంటే ఏమిటో తెలియకుండా, అసలు ఆ ఆలోచనే రాకుండా చేసి పారేశారు. ఆనందం అంటే ఇది, ఇలా మాత్రమే ఆనందించండి అని నిర్బంధించారు. ఆనందించండి కానీ ఇలా, అంటూ దారి చూపారు. అది ఎలా ఉందంటే, నీళ్ళు అడిగిన వాడికి "ఏడారి" అడ్రస్ ఇచ్చినట్టుగా ఉంది.

ఏ నిర్వచనానికి అందనిది, భౌతిక పరమైన అర్థానికి అతీతమైనది అయిన జీవితానికి ఒక ఫ్రేమ్ fix చేసి పారేశారు. ఒక definitionలో ఇరికించేశారు.

సాధారణ లైఫ్ డెఫినిషన్‌ను బ్రేక్ చేయాలి. ఇలా చేసిన వాళ్ళే భూమి చరిత్రను మలుపు తిప్పారు, లోకానికి ఎంతో శ్రేయస్కరాన్ని కలిగించారు. పుట్టడం, పుట్టాము కాబట్టి ఎలాగూ పెరుగుతాం. చదవడం, సంపాదన, పెళ్ళి, పిల్లలు, రిటైర్‌మెంట్ - ఇంతేనా జీవితం అంటే ?!

We have to break the general life definition - my dear friends !

కొత్తగా జీవించాలి ! స్వేచ్ఛగా జీవించాలి ! జీవించే విధానంలో కొత్త కోణాలను ఆవిష్కరించాలి ! కేవలం మనం జీవించడమే కాకుండా, సృష్టి కల్యాణానికి పాటుపడాలి !

జీవితం పూర్తిగా 100% మనదే ! జీవితం సృష్టి ఇచ్చిన అమూల్య వరం. మనం ఆనందంగా జీవించాలి. మనం పొందుతున్న ఆనందాన్ని అందరికీ పంచాలి, అంటే వీలైనంత మంది ఆనందానికి కారణం అవ్వాలి అన్నమాట !

✪ *"Lead a Vibrant and Serviceful Life.... my dear friends" !*

16. అనుమానం/సందేహం అంటే ఏమిటి ?

విశ్వాసం/నమ్మకం అంటే ఏమిటి ?

మన నిత్య జీవితంలో ఉపయోగించే కొన్ని పదాల అర్థం మనం తెలుసుకుని తీరాలి. ఎందుకంటే ఆ పదాల అర్థం తెలిసిన తర్వాత వచ్చిన అవగాహనతో మన జీవితం మారిపోతుంది. అభివృద్ధి చెందుతుంది. ఈ పదాల అర్థాలు తెలుసుకోవడం సాధకులకు అయితే అత్యవసరం ! తప్పనిసరి ! ఆధ్యాత్మిక శాస్త్రం సంపూర్ణ సమగ్ర సాంకేతిక శాస్త్రం. ఇందులోని సూత్రాలు గణిత శాస్త్రీయంగా పని చేస్తాయి. ఇందులో "అటలు" ఉండవు. ఖచ్చితత్వం ఉంటుంది. ఆధ్యాత్మిక సూత్రాలు గణిత శాస్త్రీయంగా పని చేస్తాయి. ఇది సత్యమే మరి !

ఇప్పుడు అనుమానం అంటే ఏమిటో సవివరంగా తెలుసుకుందాం :

అనుమానం అనే పదానికి కొన్ని పర్యాయ పదాలు ఉన్నాయి. అవి : **1.** సందేహం **2.** సంశయం **3.** అపనమ్మకం **4.** అవిశ్వాసం - ఇవన్నీ ఒకటే.

ప్రతీ దానికి ఒక సూత్రం, ఒక విధానం ఉంటాయి. ఉదాహరణకు భోజనం చేయాలి అని అంటే, భోజనాన్ని తయారు చేసుకోవాలి. అంతే తప్ప భోజనం అనేది డైరెక్ట్‌గా ఉండదు. రక రకాల పదార్థాల యొక్క మిశ్రమ పర్యవసానమే భోజనం.

ఇదే విధంగా అనుమానం కూడా డైరెక్ట్‌గా ఉండదు. అలా ఒకే సారిగా అనుమానం అనేది పుట్టుకుని రాదు ! అనుమానం అనేది అసమ్మతి యొక్క పర్యవసానం. అనుమానం యొక్క మూలం అసమ్మతి. అసమ్మతి యొక్క మూలం "అనవసరం" !

ఏదైనా "ఒక విషయాన్ని" మనం అంగీకరించకుండా ఉన్నప్పుడు, ఒప్పుకోకుండా తిరస్కరించినపుడు "అనుమానం" పుడుతుంది. మరి ఎందుకు అంగీకరించం అని అంటే అప్పుడు అది మనకు "అవసరంగా" అనిపించక పోవటమే. ఒప్పుకోవడానికి మన అసమ్మతిని తెలియజేసినపుడు అది అప్పుడు అనుమానంగా ప్రకటం అవుతుంది. **అనవసరం అసమ్మతిగా, అసమ్మతి అనుమానంగా ప్రకటం అవుతుంది.**

ఒక విషయం ఒప్పుకోవడం "అప్పుడు అనవసరం" అయితే ఆటోమెటిక్‌గా అసమ్మతి, ఆ వెంటనే అసమ్మతి అనుమానంగా తయారయి ప్రకటం అవుతుంది. ఇది ఎంత వేగంగా జరుగుతుందంటే దీని గురించి తెలియని వారు ఏ మాత్రం గుర్తించలేరు.

✪ ఒక విషయం → అనవసరం → అసమ్మతి = అనుమానం

ఉదాహరణకు నా నిజ జీవితంలో స్వయంగా నాకే జరిగిన ఒక సంఘటనను వివరిస్తాను. ఒక సారి నేను ఒక పని మీద గుంటూరు వెళ్ళే అవసరం పడింది. అదే సమయంలో నా స్నేహితుడొకడు సెకండ్ హ్యాండ్ మారుతి కారు కొన్నాడు. నా దగ్గరకి చూపించడానికి తీసుకొచ్చాడు. నాకు కారును చూపిస్తూ, దాని గురించి వివరిస్తూ "చిన్న, చిన్న ట్రబుల్స్ ఉన్నాయి, అంతా బాగానే ఉంది ఓ సారి సర్వీసింగ్ చేయించి కొన్ని పార్టులు కొత్తవి వేసుకుంటే సరిపోతుంది" అని అన్నాడు. ఆ తర్వాత ఆ మాట, ఈ మాట మాట్లాడుకుంటుంటే నా గుంటూరు ప్రయాణం ప్రస్తావనకు వచ్చింది. అప్పుడు వాడు వెంటనే నా కారులో పోదాం పద అని అన్నాడు. అప్పుడు నేనన్నాను, వద్దురా బాబు ఏవో చిన్న, చిన్న ట్రబుల్స్ ఉన్నాయంటున్నావు, మధ్యలో ఏదైనా జరిగితే ప్రాబ్లం అవుతుంది. అసలే నేను చాలా ముఖ్యమైన పని మీద వెళ్తున్నాను. నేను రిస్క్ తీసుకోలేనురా అని అన్నాను. అప్పుడు వాడేమన్నాడంటే, అది కాదురా నేను కూడా విజయవాడ వెళ్ళాలి, అక్కడ నాకు పని ఉంది. ఎలాగూ కారు ఉంది కదా,

ఒకసారి దీన్ని పరీక్షించినట్టు అవుతుంది అని అన్నాడు. నేనేమో, ఎందుకురా హాయిగా బస్‌లో వెళ్ళి వద్దాం. సగం నీవు, సగం నేను డ్రైవింగ్ చేసి అలసిపోతాం. అయినా అసలు విషయం ఏమిటంటే నాకు ఈ కారు పైన "అనుమానం" పుడుతోంది. ఇది మధ్యలో ఏమైనా కొంప ముంచుతుందేమోనని అని తెగేసి చెప్పాను. వాడు నాకు నచ్చచెప్పి చూసాడు. నేను కాదనే సరికి వెళ్ళిపోయాడు. నేను మరునాడు ఉదయాన ప్రయాణానికి తయారవుతుంటే సడన్‌గా ఏదో బంద్ డిక్లేర్ అయి బస్సులు నడవటం లేదు. పోనీ ట్రెయిన్‌లో వెళ్దాం అని అంటే స్టేషన్‌లో విపరీతమైన హడావుడి, భయంకరమైన రష్, రైల్వే స్టేషన్ అంతా గందరగోళంగా ఉంది. నేను అర్జంటుగా వెళ్ళాలి. ఏం చేయాలో అర్థం కాలేదు. సడన్‌గా మా ఫ్రెండ్ గుర్తొచ్చాడు. వాడికి ఫోన్ చేసి, వాడి దగ్గరకి వెళ్ళి వాడికి సారి చెప్పి, కారులో బయలుదేరాం. ఈసారి నాకు "అత్యవసరం" ఉంది కదా, కారు మీద ఎలాంటి "అనుమానం" రాలేదు. ఏదైనా జరిగితే అప్పుడు చూసుకుందాంలే, ఇప్పుడైతే బాగానే ఉంది కదా అనే ధీమాతో బయలుదేరాం. హాయిగా వెళ్ళాం, వచ్చాం, ఏం ప్రాబ్లం లేకుండా ! చూశారా ! నాకు "అనవసరం" అయినప్పుడు "అనుమానాన్ని" జయించలేక పోయాను. ఎన్నో ఫోజులు కొట్టాను. అదే, నాకు అవసరం అయినప్పుడు అనుమానమే లేదు.

ప్రియ మిత్రులారా ! మనకు ఏదైతే అనవసరమో దానిని ఒప్పుకుంటే ఒప్పుకుంటాం లేకపోతే లేదు. ఒప్పుకోకపోతే వచ్చే నష్టం ఏమీ ఉండదు కదా ! అందుకే ఎన్ని నాటకాలైనా ఆడే అవకాశం ఉంటుంది. ఎంత చర్చకు, ఎంతటి వాదానికైనా దిగవచ్చు. మన అనవసరమే మన అసమ్మతి, మన అసమ్మతే మన అనుమానం. అవసరం అయినప్పుడు ఒప్పుకుంటాం అప్పుడు అనుమానం పోతుంది. "అవసరం" అనేది అన్ని "అనుమానాలను" తీసివేస్తుంది, అన్నింటిని సరి చేసి అనుసంధానం చేస్తుంది. లోపల అవసరాన్ని సృష్టించుకుంటే, బయట అన్ని పనులు ఆటోమెటిక్‌గా జరిగిపోతాయి.

ఇప్పుడు విశ్వాసం గురించి తెలుసుకుందాం :

విశ్వాసం అనే పదానికి నమ్మకం అనే పర్యాయ పదం ఉంది.

మన అవసరమే సమ్మతి, మన సమ్మతే మన విశ్వాసం ! "ఒక విషయం" మనకు అవసరం అయితే సమ్మతిస్తాం, ఆ యొక్క సమ్మతే విశ్వాసంగా ప్రకటం అవుతుంది. ఒక విషయాన్ని ఒప్పుకోవడమే విశ్వాసం.

✪ విశ్వాసం, అవిశ్వాసం అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు ! అంతా మన "అవసరం", మన "అనవసరం" పైన ఆధారపడి ఉంటుంది.

✪ అనుమానం అంటే అనవసరం ! విశ్వాసం అంటే అవసరం !

✪ అనుమానం అంటే ఒప్పుకోకపోవడం (అసమ్మతి) ! విశ్వాసం అంటే ఒప్పుకోవడం(సమ్మతి) !

కాబట్టి మై డియర్ ఫ్రెండ్స్, "ఏదైనా ఒక విషయం గురించి ఇది నిజమా ! నేను నమ్మలేకుండా ఉన్నాను" అని దయచేసి ఎప్పుడు కూడా అనకూడదు. నేను ఒప్పుకోవటం లేదు ఎందుకంటే ప్రస్తుతం నాకిది అనవసరం అని చెప్పాలి.

ఈ ఆధ్యాత్మిక శాస్త్రంలోని విషయాల పట్ల మీకు ఏవైనా "అనుమానాలు వస్తే, దయచేసి గ్రహించండి", మీకు ప్రస్తుతం ఈ "విషయాలు అనవసరం" అని ! ఎప్పుడో ఒక సందర్భం వస్తుంది, అప్పుడు అవసరం అనేది మిమ్మల్ని ఆటొమెటిక్‌గా ఒప్పిస్తుంది. "అవసరం" అనేది మహా శక్తివంతం, అది దేనినైనా, ఎవరినైనా వంచుతుంది. సరి చేస్తుంది. గుర్తుంచుకోండి, అది ఏ విషయమైనా సరే "అనుమానం అంటే అనవసరం" అని, "అవసరం అయితే అదే విశ్వాసం" అని !

మన ఆలోచనలే మన వాస్తవాలను సృష్టిస్తాయి - విశ్వ సూత్రం. ఇది విశ్వాసం యొక్క రెండవ కోణం. విశ్వ సూత్రాన్ని అనుసరించి మన నమ్మకం అనే ఆలోచన మనల్ని రక్షిస్తుంది, మనకు విజయాన్ని అందిస్తుంది. నమ్మకం(విశ్వాసం), అపనమ్మకం(అవిశ్వాసం) అనేవి కూడా ఆలోచనలే. ప్రతీ ఆలోచనా పరిస్థితి యొక్క సూక్ష్మ రూపం అంటే బీజం అన్నమాట. ప్రతీ ఆలోచనా ఒక విశ్వ శక్తే ! అయితే అవి బీజంగా ఉంటాయి. వాటిని మనం స్వీకరించినప్పుడే, అవి ఉత్తేజితం అయి పరిస్థితులుగా మారుతాయి. లేకపోతే లేదు.

మీరు ఒక విషయం గురించి ఆలోచించేటప్పుడు నమ్మకం, అపనమ్మకం అనే రెండు ఆలోచనా ధోరణులలో దేనిని ఎంచుకుంటారో దాని ప్రకారంగానే పరిస్థితులు సంభవిస్తాయి.

నమ్మకం - అపనమ్మకం, విశ్వాసం - అవిశ్వాసం అనే వాటికి ఇంకా "ఒక కోణం" ఉంది. రాబోయే టాపిక్‌లో దాని గురించి వివరించాను.

17. విశ్వాసమే విశ్వశక్తి

ఇది విశ్వాసం యొక్క మూడవ కోణం. విశ్వాసంతో ఉండడమంటే "విశ్వంతో" ఉండడమే ! విశ్వాసంలో విశ్వం ఉంది. విశ్వాసాన్ని కలిగి ఉండడమంటే, "యావత్ విశ్వాన్నీ" కలిగి ఉన్నట్టే !

విశ్వాసం అనేది విశ్వశక్తి ! మనం ఈ భూమి పైకి "అనుభవ జ్ఞానం" కోసం వచ్చాం. మన ఆత్మ శక్తిని రక రకాలుగా వ్యక్తీకరించి, అనుభవించి అవగాహనను పెంచుకోవడానికి వచ్చాం. రక రకాల పరిస్థితులను అనుభవించి పరిపూర్ణం చెందడానికి వచ్చాం. ఈ "ఆత్మ పరిణామ క్రమం" అనే కార్యక్రమం సజావుగా, శీఘ్రంగా సఫలం కావడానికి మనం అనంతమైన శక్తి సామర్థ్యాలను కలిగి, ఈ భూమి పైకి వచ్చాం. మనం సహజంగా కలిగి ఉన్న శక్తులలో "విశ్వాసం" అనే శక్తి మహాద్భుతమైనది. ఇది ఏ రకంగా, ఏ ఏ పరిస్థితులలో మనకు ఉపయోగపడుతుందో సూటిగా తెలుసుకుందాం.

మనకు వ్యతిరేకమైన పరిస్థితులు ఎదురైనప్పుడు వాటిని తక్షణమే సంపూర్ణంగా మనకు అనుకూలంగా మలుచుకోవడానికి ఈ "విశ్వాసం" అనే మహాశక్తి ఉపయోగపడుతుంది.

సాధారణంగా చాలా మంది ఏం చేస్తారంటే, పనులు సజావుగా సాగిపోతున్నప్పుడు విశ్వాసంతో ఉంటారు. ఏ చిన్న ఆటంకం వచ్చినా విశ్వాసాన్ని కోల్పోతారు. ఇక్కడే జరుగుతూ ఉంది చాలా పెద్ద పొరపాటు. దీన్ని మనం గుర్తించి తీరాలి.

ఉదాహరణకు టార్చ్ లైట్ ఉంది. దీనిని మనం ఎప్పుడు ఉపయోగించాలి ? వెలుతురు ఉన్నప్పుడు కాదు కదా ! ఏ మాత్రం వెలుతురు లేనప్పుడు, పూర్తిగా అంధాకారం కమ్ముకుని ఉన్నప్పుడు మనం టార్చ్ లైట్‌ను ఉపయోగించాలి. అప్పుడు మాత్రమే టార్చ్ లైట్ యొక్క శక్తి మనకు తెలుస్తుంది. చీకటిని తక్షణమే తొలగించి మార్గాన్ని వెలుగుతో నింపి మనల్ని సరైన దారిలో నడిపించి సురక్షితంగా గమ్యానికి చేరుస్తుంది. ఒక వేళ మీరు టార్చ్ లైట్‌ను వెలుతురు ఉన్నప్పుడు ఉపయోగిస్తే ఏం జరుగుతుంది ? దాని శక్తి ఏ మాత్రమూ తెలియదు పైగా వృథా కూడా !

విశ్వాసం అనేది ఒక టార్చ్ లైట్ అని భావిస్తే, దీనిని మనం ఎప్పుడు ఉపయోగించాలి ? పనులు సజావుగా సాగిపోతున్నప్పుడు అవసరమే లేదు. వెలుగు ఉన్నప్పుడు ఎందుకు ? పరిస్థితులు పూర్తి వ్యతిరేకంగా మారినప్పుడు, తర్క సమ్మతంగా ఉండనప్పుడు, ఇక ఏ మాత్రం ముందుకు పోలేం అని అనిపించినప్పుడు, ఏ రకంగా ఆలోచించినా పరిష్కార మార్గం కనిపించనప్పుడు, పూర్తిగా అంధాకారం కమ్ముకున్నప్పుడు - సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే "విశ్వాసాన్ని" ఉపయోగించాలి. ఇలాంటి అంధాకారంలోనే టార్చ్ లైట్ ఉపయోగించాలి. విశ్వాసం అనే శక్తి ఇలాంటి పరిస్థితులను తక్షణమే క్లియర్ చేసి పూర్తి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఏ విధంగానైతే టార్చ్ లైట్ ఆన్ చేసిన తక్షణమే మార్గంలో ఉన్న అంధాకారం అంతా తొలగిపోతుందో అలాగ !

✪ విశ్వాసాన్ని ప్రకటించడం అంటే వ్యతిరేకంగా ఉన్న పరిస్థితులను అనుకూలంగా మారడానికి సమ్మతించడమే ! విశ్వాసాన్ని కలిగి ఉండడం అంటే పరిస్థితులను ఎల్లప్పుడూ మనకు అనుకూలంగా, మన అదుపులో ఉంచుకోవడమే ! మీరు ఎంతెంతగా విశ్వాసాన్ని కలిగి ఉంటారో అంతంతగా మీ పరిస్థితులు మీ అధీనంలోకి వస్తూ ఉంటాయి. మీరు చెక్కు చెదరని విశ్వాసాన్ని, ఎప్పుడు కూడా ఉపసంహారం చేయని విశ్వాసాన్ని అంటే ఎల్లప్పుడూ 100% విశ్వాసాన్ని కలిగి ఉన్నప్పుడు ఈ సృష్టిలో మీరు సాధించలేనిది ఏదీ ఉండదు.

మీరు చేస్తున్న పనిపట్ల విశ్వాసాన్ని కలిగి ఉండడమంటే,
మీ పని సఫలం కావడానికి మీరు సమ్మతించడమే !

విశ్వాసమే విశ్వశక్తి. దీనిని అందరూ అనంతంగా రెడిమేడ్‌గా కలిగియే ఉన్నారు. మీ విశ్వాసం అనే విశ్వశక్తిని ఉపయోగించి మీరు కావాలనుకున్న విధంగా, మీరు కోరుకుంటున్నవి అన్నీ సులభంగా, శీఘ్రంగా, సురక్షితంగా పొందండి !

All The Very Best !

❖ ❖ ❖

18. అనారోగ్య దారిద్ర్యాలు ఎందుకు వస్తాయి ? ఆరోగ్య ఐశ్వర్యాలు ఎలా వస్తాయి ?

యామతిః సా గతిర్భవేత్

"యామతిః సా గతిర్భవేత్" అని అంటే మన మతి ఎలా ఉంటే మన గతి(పరిస్థితి) అలా ఉంటుంది అని అర్థం. మన శరీరం + జీవితం, మన అంతరంగం యొక్క యథాతథ ప్రతిబింబం.

Our body + life is nothing but the reflection of our psyche. Reflection... As it is !

మూలం లోపల ఉంటుంది : మన శరీరంలోని, జీవితంలోని సమస్యలకు మూలం "లోపల" ఉంటుంది. లోపల సరి చేస్తే బయట సరి అవుతుంది. "లోపల" అంటే కళ్ళు మూసుకుని ఉన్నప్పుడు ఏదైతే ప్రకటమై ఉంటుందో అదే "లోపల" అన్నమాట ! "బయట" అంటే కళ్ళు తెరిచినప్పుడు భౌతికంగా కనపడే వాటిని మరియు పరిస్థితులను "బయట" అని అంటారు. "లోపల" అని అంటే "అంతరంగం" అని అర్థం.

తెలుసుకోవడం → పరివర్తనం → పరిష్కారం

సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి అంటే దాని "మూలం" తెలుసుకోవాలి. అప్పుడు ఆటోమెటిక్‌గా సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. ఎలా అంటే, తెలుసుకోవడమే పరివర్తనంగా మారుతుంది. ఆ "పరివర్తనమే పరిష్కారంగా మారుతుంది". ధ్యానం చేస్తే మూలం సులభంగా తెలుస్తుంది.

కాని 99% మంది "వేర్లను" పట్టించుకోకుండా "కొమ్మల" పైన మాత్రమే పని చేస్తున్నారు. ఈ విధానంలో సమస్య తాత్కాలికంగా పరిష్కారం అయినట్టు కనిపించినా, కొంత కాలానికి మరో కోణంలో నుండి తిరిగి వస్తుంది. ఎప్పటి వరకైతే వేర్లతో సహా సమస్య పెకిలించి వేయబడదో అప్పటి వరకు ఆ సమస్య తిరిగి వస్తూనే ఉంటుంది. కాబట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి అంటే, సమస్య యొక్క "మూలం" గురించి తెలుసుకోవాలి. మరి మూలం తెలుసుకోవాలంటే ఆత్మ విజ్ఞానం మరియు ధ్యాన సాధన మాత్రమే శరణ్యం ! వేరే ఇతర మార్గమేమి లేనే లేదు.

అద్దంలో మసి.....

ఉదాహరణకు మన ముఖం పైన "మసి" ఉంది అని అనుకుందాం. మన ముఖం పైనే "మసి" ఉన్నా, ఆ విషయం ఇతరులు చెప్పే వరకు మనకు తెలియదు. తెలిసిన తర్వాత అద్దంలో చూసుకుంటాం. అద్దంలో "మసి" కనపడుతుంది. "మసి" పోగొట్టడానికి ముఖాన్ని తుడవండి అని అంటే, కనపడని దాన్ని మేము నమ్మం ! కనపడే దానిని మాత్రమే మేము నమ్ముతాం ! మాకు "అద్దంలో మసి" కనపడుతుంది కాబట్టి మేము అద్దంలోనే తుడుస్తాం. అద్దాన్ని మాత్రమే తుడుస్తాం అని "ముఖం పైన ఉన్న మసిని" పోగొట్టడానికి అద్దాన్ని తుడుచుకుంటూ కూర్చుంటే, ఎంత రాసినా "ముఖం పైన ఉన్న మసి" పోదు, పైగా అద్దం పగిలి చాలా ముక్కలైంది అనుకోండి, అప్పుడేం జరుగుతుంది ? అద్దం పగిలి ఎన్ని ముక్కలైందో, అన్ని ముక్కలలో ఒక్కో ముఖం + మచ్చ కనపడతాయి. అప్పుడు ఇంకా కన్‌ఫ్యూజన్‌కు గురయ్యే అవకాశం ఉంది. ఒక్క ముఖం పైన ఉన్న ఒక్క మచ్చతోనే వేగలేక చస్తుంటే ఇన్ని ముఖాలు, ఇన్ని మచ్చలు ఎక్కడి నుండి వచ్చాయిరా నాయనా అని ?! మూలం ఎక్కడ ఉందో అక్కడ పని చేయకుండా వేరే చోట సరి చేయడానికి పూనుకుంటే ఇలాగే ఉంటుంది మరి !

ఏం చేసినా అసంతృప్తి -

జీవన విధానంలో లోపం

50 / 60 / 70 / 80 సంవత్సరాలు జీవించి... శాంతి, ఆనందం, సంతృప్తి పొందలేదు అని అంటే జీవన విధానంలో లోపం ఉన్నట్టే కదా !

జీవితంలో ఎప్పుడూ లోపం ఉండదు.

జీవితాన్ని జీవించే విధానంలోనే లోపం ఉంటుంది !

ఒకసారి అంచనా వేయండి భూమి పైన ఎంత మంది నేను నా జీవితంలో శాంతిని, ఆనందాన్ని, సంతృప్తిని పొందాను అని హృదయం పైన చేయి వేసుకుని 100% నిజాయితీగా సత్య ప్రకటన చేయగలుగుతారు ? 99% చేయలేరు. మరి ఎక్కడ జరుగుతుంది పొరపాటు ?

మన గురించి మనం పూర్తిగా తెలుసుకోకుండా ఉంటున్నందుకే "పొరపాటు" జరుగుతూ ఉంది. మన గురించి మనం అనుభవ పూర్వకంగా తెలుసుకున్నప్పుడు, మన శరీరం + జీవితం పూర్తిగా మన స్వాధీనంలోకి వస్తాయి. అప్పుడు వాటిని మనకు కావాల్సిన విధంగా, కోరుకున్నవి కోరుకున్నట్టుగా రూపొందించుకుని హాయిగా, తనివితీరా ఎంజాయ్ చేయవచ్చు. మన శరీరాన్ని + జీవితాన్ని 100% మన స్వాధీనంలోకి తెచ్చుకునే మార్గమే, ఈ ఆత్మ విజ్ఞాన మార్గం.

మన వాస్తవాలకు మనమే సృష్టికర్తలం

నా తలరాత ఇలా ఉంది. నా జాతకం ఇలా తగలపడింది. అసలు దేవుడికే నా మీద కరుణ లేదు. నా తల్లిదండ్రుల వల్లనే నా బ్రతుకిలా ఏడ్చింది. ఈ సమాజం, ఈ దేశం, ఈ ప్రపంచం, ఈ సృష్టే... తన పరిస్థితులకు, బాధలకు కారణం అని అనుకుంటూ ఉంటారు. గుర్తుంచుకోండి, మీ వాస్తవాలకు మీరే బాధ్యులు. You are the only creator of your life. తల రాతలు, జాతకాలు అంటూ ఏమీ ఉండవు. "కర్మ" అంటూ ఏమీ ఉండదు. అసలు కర్మకు ఓ ఉనికే లేదు. కర్మ అంటే అజ్ఞానం.

కర్మ అంటే అవగాహన లేక పోవడం. కర్మ అంటే ఆత్మ విజ్ఞానం లేక పోవటం అంతే ! కర్మ అంటే నేర్చుకోవాల్సిన పాఠాలు. పెండింగ్ లెసన్స్.

అసలు సిసలు పరమ సత్యం ఇదే ! ఏ దేవుడో పైన కూర్చుని ఒక పెన్ను తీసుకుని, మన పుర్రెలను పట్టుకుని మన నుదిటి వ్రాత వ్రాస్తాడు అనేది అన్నింటికన్నా పెద్ద అబద్ధం. పరిశుద్ధమైన అజ్ఞానం. ఒక సారి ఆలోచించండి మీకు పిల్లలు ఉంటే, మీ పిల్లల జీవితాలను నిర్ణయించే అధికారం + శక్తి మీకుంటే, ఒక పిల్లవాడికి ఎయిడ్స్ రోగం, ఇంకొక పిల్లవాడికి సూపర్ స్టార్ జాతకం లాంటి రాత రాయ గలుగుతారా ? ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలు అందరూ బాగుండాలని అనుకుంటారు. సాధారణ మనుషులే ఇలా ఆలోచించినపుడు దేవుడు ఎంత గొప్పగా ఆలోచిస్తాడో, ఆలోచించండి !

దేవుడు శాడిస్ట్ కాడు. దేవుడు అంతా, అందరిని సమానంగా సృష్టించాడు. ప్రతీ ఆత్మ తను సృష్టించబడగానే దైవం నుండి, శాశ్వతంగా రెండు వరాలను పొందుతుంది. ❶ సంపూర్ణమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన "స్వేచ్ఛా ఇచ్ఛ" - FREE WILL ❷ ప్రత్యేకమైన వ్యక్తిత్వం - UNIQUE PERSONALITY ఈ రెండు శక్తులను ప్రతీ ఒక్కరు సహజంగా కలిగి ఉంటారు. ఈ రెండు శక్తులను(వరాలను) దైవం తిరిగి ఎన్నటికీ తీసుకోదు. మనుషులు తమకున్న స్వేచ్ఛ వలన తమకు ఇష్టమైన రక రకాల పనులు చేస్తూ, వాటి యొక్క పర్యవసానాలను అనుభవిస్తూ ఉన్నారు. అంతే !

ఎవరు సృష్టించుకున్న జీవితాన్ని వారే అనుభవిస్తున్నారు. "ఎవరు ఎలా ఉండాలి అని అనుకుంటున్నారో సరిగ్గా అలానే ఉంటున్నారు". ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు. ఎవరి బాధ్యత వారిదే ! ఎవరి బాధ్యత వారే తీసుకోవాలి ! మీ జీవితపు బాధ్యతను ఎవరి మీదకో నెట్టెయ్యడం మానండి ! ఆ బాధ్యతను స్వయంగా మీరే తీసుకోవాలి. మీ బాధ్యత మీరు తీసుకోకపోతే, మరెవరు తీసుకుంటారు ?!

ఆత్మ విజ్ఞానం లేని వాళ్ళు మన వాస్తవాలను ఎవరో సృష్టిస్తున్నారనీ, మన చేతిలో ఏమీ లేదని అనుకుంటూ ఉంటారు. తమ తలరాత దేవుడు వ్రాస్తుంటాడనీ, విధి అనేది ముందే నిర్ణయించబడి ఉంటుందనీ నమ్ముతూ ఉంటారు. ఇలా నమ్మే వారిలో, మారుమూలలో ఉన్న పల్లెటూరి వారి నుండి అమెరికాలోని నాసా(NASA) లెవెల్‌లో పని చేస్తున్న సైంటిస్ట్ వరకు ఉంటారు. మరి ఇది ఎంత మాత్రము సరికాని విషయం. నూటికి నూరు శాతం అసత్యమైన విషయం.

నిజమేమంటే, ఎవరి తలరాతను వాళ్ళే వ్రాసుకుంటూ ఉంటారు. ఎవరి విధిని(జాతకాన్ని) వాళ్ళే నిర్ణయించుకుంటూ ఉంటారు. తమ నమ్మకాల ద్వారా, తమ అభిప్రాయాల ద్వారా, తమ ఆలోచనా

విధానం ద్వారా, తమ మాటల ద్వారా, తమ చేష్టల ద్వారా ఎప్పటికప్పుడు తమ తలరాతను తాము వ్రాసుకుంటూనే ఉంటారు.

జాతకాలను, విధి వ్రాతలను నమ్మేవాళ్ళకు ఇది మింగుడు పడని విషయమైనా ఇది మాత్రం సత్యం. గతం అంటే గతించి పోయినది. ఇప్పుడు లేనిదే గతం. భవిష్యత్తు అంటే ఇంకా పుట్టనిది. అనేకానేక సంభావ్యతలను పొందు పరుచుకుని ఉన్నదే భవిష్యత్తు. ఇంకా పూర్తిగా రూపుదిద్దుకోకుండా ఉండి, ఏ విధంగానైనా వర్తమానంలో ప్రకటం అయ్యే అవకాశం ఉన్న దానినే భవిష్యత్తు అని అంటారు. వర్తమానంలో ప్రకటం కాక ముందు ఏ విధంగానైనా మలుచుకునే వీలున్న దానినే భవిష్యత్తు అని అంటారు. కాబట్టి అనవసరమైన అపోహలకు జీవితాలను బలి చేసుకోకుండా నిర్మాణాత్మక ధోరణితో జీవితాన్ని అభివృద్ధి చేసుకోవాలి. జీవితం ఎప్పుడూ మన చేతుల్లోనే ఉంటుంది, ఎక్కడో ఆకాశంలో ఉన్న గ్రహ, నక్షత్ర, రాశుల, అదృశ్య శక్తుల చేతుల్లో కాదు. 100 % మన జీవితం మన చేతుల్లోనే ఉంటుంది. దీన్ని మీరు ఎప్పుడు ఎలా కావాలంటే అలా మలుచుకోవచ్చు.

ప్రాక్టికల్‌గా అసలు

విషయం తెలుసుకుందాం

ఒక పెన్ను , పేపర్ తీసుకుని ఏకాంతంలో ప్రశాంతంగా కూర్చోండి. పూర్తిగా రిలాక్స్ అవ్వండి. ఇప్పుడు మీ ఆలోచనలను గమనించడం మొదలు పెట్టండి. జాగ్రత్త !! ఆలోచించమని చెప్పడం లేదు. వాటంతట అవే సహజంగా వస్తున్న ఆలోచనలను ఎరుకతో, సాక్షిగా గమనించమని చెప్తున్నాను. అవి ఎలాంటి ఆలోచనలు వచ్చినా సరే అసహ్యకరమైనవి, ఆనందకరమైనవి, గొప్పవి అనే తేడాలు చూడకుండా దేనిని తిరస్కరించకుండా, తప్పు పట్టకుండా ఏం వస్తే అవి వ్రాస్తూ పోండి. 100% నిజాయితీగా ఏం వస్తే అది వ్రాస్తూ ఉండాలి. ఇలా ఒక 15 నిమిషాలు వ్రాసిన తర్వాత వాటిని చదవండి. అప్పుడు తెలుస్తుంది అసలు విషయం. మీరు ఎలాంటి ఆలోచనలను కలిగి ఉన్నారో ! ఎంతటి క్రమం లేని ఆలోచనా వ్యవస్థను కలిగి ఉన్నారో ! కేవలం 15 నిమిషాలకే పరిస్థితి ఇలా ఉంటే, ఒక గంట సేపు మీ ఆలోచనలను పరిశీలిస్తే ఎలా ఉంటుంది ?! ఈ విధంగా "లోపలికి" వెళ్తూ ఉంటే ఎలా ఉంటుంది ?! ఆశ్చర్య పోతారు మీరు. నివ్వెర పోతారు. మీ గురించి మీకు తెలియని సత్యాలు లోపల దర్శనం ఇచ్చే సరికి దిగ్భ్రాంతికి గురి అవుతారు. చాలా వింతగా అనిపిస్తుంది. మీ శరీరంలోని, మీ జీవితంలోని సమస్యలకు గల "మూలాలను" ప్రత్యక్షంగా చూసే సరికి విస్మయానికి లోనవుతారు. ఎందుకంటే మీకు తెలిసింది వేరే, "లోపల" విషయం వేరే ! పూర్తిగా వేరే !!

మన ఆలోచనలే(గుణాలే లేక స్వభావాలే) మన వాస్తవాలు. మన ఆలోచనల(గుణాల లేక స్వభావాల) మీద అదుపు వచ్చినప్పుడే మన శరీరం + జీవితం పైన అదుపు వస్తుంది. నిరంతర ధ్యాన సాధన ద్వారా మనం మన ఆలోచనలపై(గుణాల) పూర్తిగా, సహజమైన నియంత్రణ పొందవచ్చు. ఒక కోణంలో ఆలోచన, భావన, ఊహ, గుణం, స్వభావం అనేవి ప్రాథమికంగా ఒకే అర్థాన్నిస్తాయి, ఇవన్నీ ఒకటే !

యద్భావం తద్భవతి - యద్ చేష్టా తద్భవతి కాదు

యద్భావం తద్భవతి అంటే నీ భావం ఎలా ఉందో నీ భవం(పరిస్థితి) అలానే ఉంటుంది అని అర్థం. అందరూ చేష్టలకే విలువనిస్తుంటారు కానీ వాస్తవానికి, మూలాన్ని అంటే - భావాన్ని పట్టించుకోవాలి. నీవు ఎలాంటి ఆలోచనలు చేస్తూ ఉంటావో అలాంటి గుణాలు నీలో ఉద్భవిస్తాయి. నీ గుణాలకు అనుగుణమైన భావాలు నీలో ఏర్పడతాయి, అప్పుడు నీ భావాలకు తగిన పరిస్థితులనే నీ శరీరంలో & జీవితంలో నీవు అనుభవిస్తూ ఉంటావు. ఇదే "యద్భావం తద్భవతి" అంటే అసలు సిసలు అర్థం ! నీ ఆలోచనలే నీ వాస్తవాలు అంటే ఇదే ! నీ ఆలోచనలే నీ వాస్తవాలను సృష్టిస్తాయి. మంచి ఉన్నతమైన, ఉత్తేజ కరమైన, ఉత్సాహకరమైన, ఉల్లాసభరితమైన, పూర్తి పాజిటివ్‌నెస్‌తో కూడిన నిర్మాణాత్మకమైన, అద్భుతమైన ఆలోచనలను అదే పనిగా చేస్తూ ఉంటే లోపల ఉన్న సరికాని నెగెటివ్ గుణాలు వాటంతటే అవే ఆటొమెటిక్‌గా అంతరించిపోతూ ఉంటాయి. వాటి స్థానంలో దివ్య గుణాలు ఎస్టాబ్లిష్ అవుతూ ఉంటాయి. ఇదొక అద్భుతమైన సాధన !

"యద్భావం తద్భవతి" అంటే నీ భావం(గుణం) ఎలా ఉంటే నీ భవం(పరిస్థితి) అలా ఉంటుందని అర్థం. నీవు ఎలాంటి భావాలను(గుణాలను) కలిగి ఉన్నావో సరిగ్గా అలాంటి పరిస్థితులనే నీ శరీరం + జీవితంలో అనుభవిస్తూ ఉంటావు అని అర్థం.

మనం ఏ గుణాలను(స్వభావాలను లేక భావాలను) కలిగి ఉంటామో సరిగ్గా వాటినే అనుభవిస్తూ ఉంటాం. మనిషికి సంబంధించిన అత్యంత కీలక సిద్ధాంతం ఇది. విశ్వ సూత్రాలలో అగ్ర శ్రేణికి చెందిన సూత్రం ఇది. మన చైతన్యం గురించి మనకు పూర్తిగా తెలియకపోవటం వలన మన శరీరంలో మరియు మన జీవితంలో ఏం జరుగుతుందో అర్థం కాదు.

✪ తొలి మానవ జన్మ ఎత్తినప్పటి నుండి మానవుడు "విస్మృతి"లోనే ఉంటాడు. ఇప్పుడు ఇది చదువుతున్న మీరు కూడా విస్మృతిలోనే ఉన్నారు. ఆశ్చర్యంగా ఉందా ?! మేమేమి నిద్ర పోవటం లేదే ?! మెలుకువగా ఉండి ఈ పుస్తకం చదువుతున్నామే ! మరి ఈయన ఏంటి ఇలా అంటాడు అని మీకు అనిపిస్తూ ఉందా ?

విస్మృతి అంటే భౌతిక శరీరంతో నిద్రపోతూ ఉండడం అని కాదిక్కడ అర్థం. మీరు విస్మృతిలో ఉన్నారు అని అంటే మీ "సిస్టమ్" పట్ల లేక మీ "చైతన్యం" పట్ల ఎరుక లేకుండా ఉన్నారని అర్థం.

విస్మృతి, అపస్మారకం, స్పృహ లేకపోవటం - ఇవన్నీ ఒకటే !

ఎరుక, జాగృతి, మెలుకువ, చైతన్యం, స్పృహ, స్మృతి - ఇవన్నీ ఒకటే !

మీరు విస్మృతిలో ఉన్నారంటే మీ చైతన్యం గురించి తెలుసుకోకుండా ఉన్నారని అర్థం. నా శరీరంలో + జీవితంలో సమస్యలు ఎందుకు వస్తున్నాయి ? ఈ సమస్యలకు మూల కారణాలు ఏమిటి ? ఇవి ఎలా పోతాయి ? అనే విషయాలను సత్య పూరితంగా తెలుసుకోకుండా ఉండడమే విస్మృతి అంటే ! ఆత్మ విజ్ఞానం లేక పోవడమే విస్మృతి అని అంటే ! మహా మూల చైతన్యం - Ultra Consciousness కు ఎన్ని శక్తి సామర్థ్యాలున్నాయో అవి అన్నీ మీరు కూడా కలిగి ఉన్నారు. మీ శక్తి సామర్థ్యాల గురించి మీకు తెలియకపోవడమే విస్మృతి అంటే. మీ వాస్తవాలను అనుక్షణం మీరే సృష్టించుకుంటున్నారు, మీ శరీరంలోని + జీవితంలోని పరిస్థితులన్నింటికీ మీరు మాత్రమే సృష్టికర్త అనే పరమ సత్యం మీకు తెలియక పోవడమే విస్మృతిలో ఉండడమంటే. నా సమస్యలను, రోగాలను, ఇబ్బందులను నేనే సృష్టించుకున్నాను, వీటిని నేను తక్షణమే శాశ్వతంగా తీసేసుకోగలిగే శక్తి సామర్థ్యాలు నాకున్నాయి అనే విషయాలు తెలియక పోవడమే విస్మృతి అని అంటే. మీరెవరో, మీ మూలమేమిటో తెలుసుకోకుండా ఉండడమే విస్మృతి అంటే. మీ నిజతత్వం పట్ల ఎరుకను కలిగి లేకపోవడమే విస్మృతిలో ఉండడమంటే.

మానవులు గ్రహించాల్సిన
అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటి
అంటే, ఈ భూమి పైన దేనినైనా
సరే అనుభవించ వచ్చు అని !

మీరు కేవలం ఆనందాలే ఆనందాలు అనే విధంగా
మీ జీవితాన్ని ఆనందించవచ్చు. ఇక్కడ తప్పని సరిగా
కష్టాలు అనుభవించి తీరాల్సిన రూల్ ఏమీ లేదు. అసలు
కష్టాలను అనుభవించాల్సిన అవసరమే లేదు. అజ్ఞానం వలన
ఆనందాలను ఎలా అనుభవించాలో తెలియక మానవులు
కష్టాలను అనుభవిస్తూ ఉంటారు.

మీరు ఆత్మ విజ్ఞాన అవగాహనతో మీ జీవితాన్ని మీరు
తక్షణమే మీకు నచ్చిన విధంగా మార్చుకోవచ్చు. ముందు
ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మొత్తం చదవండి.
ఇందులో చెప్పిన వాటిలో
మీకు నచ్చిన సాధనలు చేయండి. అప్పుడు మీకు కావాల్సిన
విధంగా మీ శరీరం మరియు జీవితం మారిపోతాయి.
అప్పుడు మీరు బాగా ఎంజాయ్ చేయవచ్చు.

మీ ఆలోచనలే మీ వాస్తవాలను సృష్టిస్తున్నాయి. అనుక్షణం మీ ఆలోచనల ద్వారా మీ పరిస్థితులను మీరే సృష్టించుకుంటున్నారు అనే విషయం తెలియక పోవడమే విస్మృతి అని అంటే.

మీ గుణాలే(స్వభావాలే) మీ వాస్తవాలను సృష్టిస్తున్నాయి. మీ అంతరంలోని నిశ్శబ్దం లోంచి ఆలోచనలు పుడతాయి. తదేకంగా చేసిన ఆలోచనయే ఒక గుణంగా లేక స్వభావంగా మారుతుంది. ఈ విధంగా రూపొందిన గుణానికి(స్వభావానికి) అనుగుణంగానే మీ ఆలోచనా విధానం కొనసాగుతూ ఉంటుంది. మీ ఆలోచనల యొక్క ఉత్పత్తి స్థానమైన గుణం(స్వభావం) ఏ రకంగా ఉంటుందో సరిగ్గా అదే రకమైన పరిస్థితులు మీ శరీరంలో + జీవితంలో సృష్టించ బడతాయి. వాటిని మీరు అనుభవిస్తూ ఉంటారు.

సరి అయిన ఆత్మ విజ్ఞానం లేక పోవటం వలన సరి కాని గుణాలతో(స్వభావాలతో) ఉన్న మీరు ఎన్నో రక, రకాల "సరి కాని నమ్మకాలను" ఏర్పరచుకుంటారు. వాస్తవానికి "విజ్ఞానం" అని అంటేనే "సరి" అని అర్థం, అయితే మీరు "అజ్ఞానాన్ని" "విజ్ఞానంగా" భావిస్తూ ఉండటంతో అప్పుడు ఆ యొక్క "విజ్ఞానం" కాస్తా "సరి" కానిది అవుతుంది. అంతే కానీ "సరి కాని విజ్ఞానం", "సరి అయిన విజ్ఞానం" అంటూ ప్రత్యేకంగా ఏవీ ఉండవు. "విజ్ఞానం" అంటే "సరి" ! "అజ్ఞానం" అంటే "సరి కానిది" ! విషయాలను మీకు మీ రూటులోనే అర్థం చేయించడానికి అప్పుడప్పుడు మేము ఇలా చెప్పాల్సి వస్తుంది. ఈ విధంగా ఏర్పరచుకున్న మీ సరి కాని నమ్మకాలే, మీ శరీరంలో + జీవితంలో సమస్యలను సృష్టిస్తూ ఉంటాయి. వాటిని మీరు అనుభవిస్తూ ఉంటారు.

మీ ఆలోచనలే మీ వాస్తవాలను సృష్టిస్తున్నాయి !
మీ ఆలోచనలకు అనుగుణంగా గుణాలు ఏర్పడుతున్నాయి.
మీ గుణాలకు తగిన విధంగా భావాలు ఏర్పడుతున్నాయి.
భావాలకు అనుగుణంగా నమ్మకాలు ఏర్పడుతున్నాయి.
మీ నమ్మకాలే మీ పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

మీ ఆత్మ విజ్ఞానం ఏ స్థాయిలో ఉంటే ఆ రకమైన ఆలోచనలు మీకు వస్తూ ఉంటాయి, ఆ రకమైన ఆలోచనలనే మీరు చేస్తూ ఉంటారు. మీ ఆలోచనలకు అనుగుణమైన గుణాలే మీలో ఉద్భవిస్తాయి. మీ గుణాలకు అనుగుణమైన భావాలే మీలో ఏర్పడతాయి. మీ భావాలకు తగిన నమ్మకాలే మీలో ఏర్పడతాయి. ఒక కోణంలో చూస్తే గుణం అన్నా, భావం అన్నా, నమ్మకం అన్నా ఒక్కటే ! ఈ 3 ఒక్కటే ! ఈ మూడింటికీ మూలం "ఆలోచన" !

అప్పుడు మీ భావాలకు & మీ నమ్మకాలకు అనుగుణమైన పరిస్థితులే మీ శరీరంలో & మీ జీవితంలో మీరు అనుభవిస్తూ ఉంటారు.

1) మీ సరి కాని ఆలోచనల ద్వారా సరి కాని వాస్తవాలను సృష్టించుకున్న మీరు, మీ సరి అయిన ఆలోచనల ద్వారానే సరి అయిన వాస్తవాలను కూడా సృష్టించుకో గలుగుతారని తెలుసుకోండి. 2) మీ సరి కాని గుణాల(స్వభావాల) ద్వారా సరి కాని పరిస్థితులను సృష్టించుకొని బాధపడుతున్న మీరు, మీ సరి కాని గుణాలను(స్వభావాలను), మీ సరి అయిన ఆలోచనల ద్వారా సరి చేసుకుని ఆనందోత్సవాలను సృష్టించుకుని అనుభవించవచ్చని తెలుసుకోండి. 3) మీ సరి కాని నమ్మకాల ద్వారా కష్టాలను, బాధలను, అపజయాలను, అనారోగ్యాలను, ఆర్థిక ఇబ్బందులను సృష్టించుకొని ఎంతో బాధ పడుతున్న మీరు, మీ సరి కాని నమ్మకాలను, మీ సరి అయిన నమ్మకాల ద్వారా సరి చేసుకున్నంత మాత్రాన ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, ఆనందాలను, మహా సంచలన విజయాలను, ఉత్సవాలను, శ్రేయస్కరాలను కూడా సృష్టించుకుని ఎంజాయ్ చేయవచ్చని తెలుసుకోండి.

ఈ మూడు పరమ సత్యాలను గనక మీరు సంపూర్ణంగా, సమగ్రంగా అర్థం చేసుకున్న మరుక్షణం మీరు విముక్తులైనట్టే ! మీరు పాజిటివ్‌గా ఉండడం మొదలు పెడితే, మీ లోపలున్న మొత్తం నెగెటివ్స్ అన్నీ పూర్తిగా శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి. ఆలోచనలను, గుణాలను(స్వభావాలను), నమ్మకాలను ఎలా సరి చేసుకోవచ్చో ముందు రాబోయే పేజీలలోని సాధనా పద్ధతులలో వివరించాను.

అనేక జన్మల నుండి కొనసాగుతూ వస్తూ ఉన్న అనేకానేక రకాలైన గుణాలు(స్వభావాలు), సరి కాని నమ్మకాలు మీ "లోపల" పోగై ఉంటాయి. వీటన్నింటి యొక్క ప్రభావం మీ శరీరంలో మరియు జీవితంలో పడుతూ ఉంటుంది. సడన్‌గా ఒక నష్టం జరుగుతుంది. అనుకోకుండా ఒక లాభం జరుగుతుంది. ఏది ఎప్పుడు ఎందుకు జరుగుతుందో అర్థం కాక అయోమయంలో పడతాము. ఒక్కొక్కప్పుడు హుషారుగా ఉంటాం, మళ్ళీ సడన్‌గా మూడ్ మారిపోతుంది. ప్రత్యేకమైన కారణం ఏమీ కనిపించదు అయినా డల్‌గా, భారంగా ఉంటుంది. ఇలా సవాలక్ష రకాలుగా పరిస్థితులను అనుభవిస్తూ ఉంటాం. మన చైతన్యం పూర్తిగా మన ఎరుకలో లేకుండా ఉన్నందువల్లనే ఇవన్నీ జరుగుతూ ఉంటాయి.

యద్భావం తద్భవతి - యద్‌చేష్టా తద్భవతి కాదు. లోకంలో 99% మంది ఇదే పొరపాటు చేస్తున్నారు. "నీ భావం" ఎలా ఉంటే నీ భవం(పరిస్థితి) అలా ఉంటుందనేదే సృష్టి మూల సిద్ధాంతాల్లో ముఖ్యమైనది. అత్యంత కీలకమైన రహస్య విశ్వ సూత్రం ఇది. 99% మంది ఏం చేస్తున్నారూ అంటే, లోపల భావం ఒకటి ఉంటుంది, బయట "వాక్కు , చేష్ట" వేరుగా ఉంటాయి. ఉదాహరణకు మీరు ఏదో ఒక పని చేయాలి అని అనుకుంటారు. అయితే మీరు చేయబోయే ఆ పని పట్ల, మీరు ముందుగానే ఒక స్థిర భావానికి వచ్చేసి ఉంటారు. మీరు చేయబోయే పని జరగదని డిసైడ్ అయిపోతారు. చివరికి ఆ పని చేస్తారు. మీ భావం ప్రకారం ఆ పని జరగదు. అప్పుడు మీరు, "నేను అనుకున్నా, నేను ముందే అనుకున్నా, నాకు తెలుసు ఇది ఇలా జరుగుతుందని, మన పనులన్నీ రింగు రివర్సులే" అని అనుకుంటూ మిమ్మల్ని మీరు సముదాయించుకుంటారు. మరి ముందే జరగదని తెలిసినపుడు ఆ పని ఎందుకు

చేశావు అని ఎవరైనా అడిగితే, ఏదో ఒకటి చేయాలి కదా అని చేశా, అంటూ జవాబు చెప్పి తప్పించుకుంటారు.

99% మంది చేష్టా క్షేత్రానికే ప్రాధాన్యతను ఇస్తున్నారు. కేవలం ప్రవర్తన పైన మాత్రమే దృష్టి పెడుతున్నారు తప్ప అసలు సిసలు మూలమైన "భావం" పైన దృష్టి పెట్టడం లేదు. లోపల పీక పిసికి చంపాలన్నంత కోపం ఉంటుంది. కానీ బయటికి మాత్రం "రా బావ..రా" అంటూ ఆప్యాయంగా పిలుస్తారు. చెప్పా పెట్టకుండా వచ్చి డిస్టర్బ్ చేసినందుకు తనివి తీరా తన్నాలని ఉన్నా బయటికి మాత్రం "ఏంటి బావా మరీనూ... మమ్మల్ని మరిచి పోయావా ? ఇప్పటికైనా గుర్తుకొచ్చినందుకు సంతోషం" అంటూ "ఆస్కార్" లెవెల్లో నటించేస్తారు. ఇది సరి కాదు. శరీరం + జీవితం ఇబ్బందుల పాలు కావడానికి గల కారణాల్లో ఈ నటన ప్రధానమైనది. అందరి పట్ల ప్రేమగా ఉండండి. భావంలో, వాక్కులో, చేష్టలో ! యద్భావం తద్భవతి, యద్చేష్టా తద్భవతి కాదు !!

లోపల ఉన్న భావమే(గుణమే) బయటికి పరిస్థితిగా ప్రకటం అవుతుంది. మీరు ఒక పని చేస్తున్నప్పుడు కేవలం శారీరకంగా, యాంత్రికంగా చేయకుండా, చేస్తున్న పనికి సంబంధించిన భావాన్ని లోపల మనసులో కలిగి ఉండాలి. అంటే ఏ పని చేసినా "ఫీలింగ్‌తో చేయాలి" ! మనం చేసే పనికి మనలో ఉన్న భావానికి మ్యాచింగ్ కుదరాలి. అప్పుడే అది సరిగ్గా అవుతుంది. ఎలా తెలుసుకోవడం అని అంటే, పని జరిగితే మ్యాచింగ్ కుదిరినట్టు, జరగకపోతే కుదరనట్టు ! చేస్తే కానీ ఈ సంగతి తెలియదు. ప్రయత్నం చేయాలి జరిగిందా సరే.. లేదా.. సాధన ద్వారా ఇన్నర్‌ను క్లియర్ చేసుకుని మళ్ళీ అటెంప్ట్ చేయాలి. ఇలా పని జరిగే వరకు చేయాలి. వదలకుండా చేస్తూ ఉంటే ఎప్పుడో ఒకప్పుడు అయితీరుతుంది.

మన చేతిలో మనం మోసపోయేది ఇక్కడే

మన ఆలోచనలే మనల్ని మోసం చేస్తాయి. ఒక ఆలోచన వస్తుంది. దానిని అమలు చేస్తాం ఫలితం రివర్స్‌గా వస్తుంది, మనం ఆశ్చర్యపోతాం ఇది ఎలా జరిగిందా అని ! ఎవరికో మంచి చేద్దాం అని అనుకుంటాం, చేస్తాం, మనకు ఫలితం రివర్స్‌గా వస్తుంది. అప్పుడు బాధ పడతాం "పుణ్యానికి పోతే పాపం ఎదురైంది" అని. ఇలా ఆలోచనలు ఒక రకంగా ఫలితాలు ఒక రకంగా ఎందుకు ?! ఆలోచనలు ఎలా ఉంటే పరిస్థితులు అలా ఉండాలి నిజానికి. ఒక ప్రధానమైన విశ్వ సూత్రం కూడా ఇదే చెప్తుంది "మన ఆలోచనలే మన వాస్తవాలు" అని, మరి ఎందుకు జరగడం లేదు ?! "మన

ఆలోచనలే మన వాస్తవాలు" అనే సూత్రాన్ని సంపూర్ణంగా సమగ్రంగా అర్థం చేసుకోనందువలన అంతా రివర్స్‌గా జరుగుతూ ఉన్నట్టు అనిపిస్తూ ఉంటుంది. నిజానికి ఈ సూత్రం "మన ఆలోచనలే మన వాస్తవాలు" అని చెప్తుంది, అంటే, "మన గుణాలే(స్వభావాలే) మన వాస్తవాలు" అని మనం అర్థం చేసుకోవాలి. మన ఆలోచనల ద్వారా ఏర్పడిన మన గుణాలకు(స్వభావాలకు) మరియు నమ్మకాలకు అనుగుణంగా మన ఆలోచనలు కొనసాగుతూ ఉంటాయి. అయితే మన ఆలోచనల ద్వారానే మన గుణాలు లేక భావాలు లేక నమ్మకాలు నిర్మించబడతాయి. ఆలోచన ద్వారా భావాలు నిర్మించబడతాయి కాబట్టి, మన గుణాలకు(స్వభావాలకు), నమ్మకాలకు అనుగుణంగానే పరిస్థితులు సృష్టించ బడుతూ ఉంటాయి. అని అంటే సులభంగా అందరికీ అర్థం అవుతుంది.

1) మొట్ట మొదట - మనకు, మన ఆత్మ విజ్ఞాన అవగాహనా స్థాయిని బట్టి మనకు ఆలోచనలు వస్తూ ఉంటాయి. మనకు ఎలాంటి ఆత్మ విజ్ఞానం యొక్క అనుభవ పూర్వక అవగాహన ఏ స్థాయిలో ఉంటే ఆ రకమైన ఆలోచనలు వస్తూ ఉంటాయి.
2) మన స్థాయికి తగిన ఆలోచనలు మనకు వస్తూ ఉంటే మనం వాటినే ఆలోచిస్తూ... వాటినే కొనసాగిస్తూ ఉంటాం.
3) మనం చేస్తూ ఉన్న ఆలోచనలకు తగిన గుణాలు/భావాలు/నమ్మకాలు మనలో ఉద్భవిస్తాయి.
4) మనలో ఏర్పడిన గుణాలకు/భావాలకు/నమ్మకాలకు అనుగుణమైన పరిస్థితులే మన శరీరంలో మరియు మన జీవితంలో సంభవిస్తూ ఉంటాయి.
5) మన దేహంలోని మరియు మన జీవితంలోని పరిస్థితులను ఓ సారి బాగా పరిశీలిస్తే మనలో ఎలాంటి గుణాలు/భావాలు/నమ్మకాలు ఉన్నాయో అర్థమై పోతుంది. ఈ విషయం అందరికీ వర్తిస్తుంది.
6) అయితే ఇది "ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలకు" మరియు "వాకిన్ మాస్టర్స్"కు వర్తించదు. ఎందుకంటే వారు ఏదో ఒక ప్రత్యేకమైన మిషన్ మీద భూమి పైకి వస్తారు. వారికి ఈ నియమాలు కాకుండా వేరే ఉన్నతమైన నియమాలు వర్తిస్తాయి.

మన గుణాల/స్వభావాల/నమ్మకాల ప్రభావాలనే మనం మన శరీరంలో + జీవితంలో అనుభవిస్తూ ఉంటాం. మన గుణాల, నమ్మకాల, భావాల యొక్క యథాతథ ప్రతిబింబమే మన శరీరం + జీవితం.

మన లోపల గుణాలు(స్వభావాలు), నమ్మకాలు ఒక రకంగా ఉంటాయి వాటికి సంబంధించిన ఆలోచనలు మరో రకంగా వస్తాయి. ఏ మాత్రం ఒకదానికొకటి పోలిక లేకుండా ఉంటాయి. ఆలోచనను బట్టి దాని మూల స్థానాన్ని గుర్తు పట్టాలంటే చాలా అనుభవ జ్ఞానం ఉండాలి, సాధారణ జ్ఞానం సరిపోదు. ఎందుకంటే సృష్టి ధర్మమే ఆ రకంగా ఉంటుంది, ఉత్పత్తి స్థానం ఒక రకంగా, ప్రకటం అయ్యే ఫలితం మరో రకంగా ! విత్తనం ఒక రకంగా ఉంటుంది, ఫలం మరో రకంగా ఉంటుంది. లోపల భయపడే గుణం(స్వభావం) ఉంటుంది. ఏదైనా పని చేసే ముందు వెంటనే ఇది భయపడటం మొదలు పెడుతుంది. తన అభ్యంతర తరంగాలను ఆలోచనల రూపంలో పంపిస్తుంది. భయపడే గుణం నుండి బయలుదేరిన ఆలోచనలు లోపల యథాతథ రూపంతోనే ప్రయాణం చేస్తాయి. తీరా, చివరికి మన ఎరుకలోకి రాగానే తమ రూపాన్ని మార్చుకుంటాయి. "భయం" అనే గుణం(స్వభావం) పైన "జాగ్రత్త" అనే "లేబుల్" వేసుకుంటాయి. ఎందుకంటే మనం సరి కాని ఆలోచనలను అనుమతించం. సరి కాని ఆలోచనకు ఏదో ఒక ముసుగేసి అప్పుడు OK అంటాం. పైగా మనకు ముసుగులు వేసుకోవడం ఎప్పుడో అలవాటై పోయింది. ప్రతి పనిలో, ప్రతి విషయంలో, అవసరం ఉన్నా లేకున్నా "కవరింగ్‌లు" వేస్తూ, వేస్తూ చివరికి "కవరింగ్‌లు" లేకుంటే బతకలేని స్థితికి వచ్చాము.

చూడండి ! లోపల భయం ఉంటుంది, బయట లేబుల్ మాత్రం జాగ్రత్త అని ఉంటుంది. లోపల మోసం చేసే గుణాలు(స్వభావాలు) ఉంటాయి, బయటికి మాత్రం లౌక్యం, టాలెంట్, తెలివి తేటలు అనే లేబుల్స్ వేసుకుని వస్తాయి. అక్కడికక్కడే ఆ అమ్మాయిని అనుభవించాలని ఉంటుంది, బయటికి మాత్రం ఐ లైక్ యు అనే లేబుల్ ఉంటుంది. కొన్ని ఆలోచనల మూల స్థానాలు మనకు తెలుస్తాయి. తెలిసిన వాటిని సరి చేసుకోవచ్చు. తెలియని వాటితోనే అసలు సమస్య.

మీ ఆలోచనల, కోరికల, లక్ష్యాల,
అభిప్రాయాల, నమ్మకాల, అభిరుచుల,
నిర్ణయాల యొక్క మూలాలను కనుక్కోండి.
ఆ మూలాల్లోనే ఉంది అసలు రహస్యమంతా !

మనం కలిగి ఉన్న గుణాలనే
మనం అనుభవిస్తూ ఉంటాం. మన లోపల మనం
ఏ ఏ గుణాలను అయితే కలిగి ఉన్నామో వాటి యొక్క
ప్రభావాలనే మనం మన శరీరంలో మరియు మన
జీవితంలో అనుభవిస్తూ ఉంటాం. మంచి గుణాల ప్రభావాలను
ఆనందాలుగా అనుభవిస్తాం. చెడు గుణాల ప్రభావాలను
కష్టాలుగా అనుభవిస్తాం.

మన లోపల ఉన్న చెడు గుణాలు యాంత్రికంగా కష్టాలను ఆకర్షిస్తూనే ఉంటాయి. కాబట్టి మనం చాలా ఎరుకతో ఉండాలి. నిరంతరం సాధన చేస్తూనే ఉండాలి. ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శి మొత్తం శ్రద్ధగా చదివి అర్థం చేసుకోండి. అప్పుడు మీకే అర్థం అయిపోతుంది. ఏ సాధనలు ఎప్పుడెప్పుడు చేయాలో...

బాగా సాధన చేసి అంతరంగాన్ని స్వచ్ఛం చేసుకోవాలి. ఏదో కొద్ది సేపు లేక కొన్ని రోజులు చేసి చాలేమో అని అనుకోడానికి లేదు. మొత్తం క్లియర్ అయ్యే వరకు చేస్తూనే ఉండాలి. ఎవరి కోసం ? మన కోసమే కదా ....!

ఉదాహరణకు ఒక వ్యక్తి "ఒక, చాలా పెద్దదైన ఉచిత ధ్యాన కేంద్రం" నిర్మించాలని అనుకుంటున్నాడు. ఇది అతని కోరిక లేక లక్ష్యం.

పైన ఉపరి తలంలో నుండి చూసినప్పుడు అతని కోరిక బాగానే ఉంది. కాని ఆ కోరిక యొక్క మూలం ఈ కింది రకాలుగా ఉండే అవకాశం ఉంది.

1. కొన్ని వేల మందికి ఉచితంగా ధ్యాన సాధన చేసుకునే వీలు కల్పిస్తేనే కానీ నా కర్మలు తీరవు. అంటే తన కర్మలను పోగొట్టుకోడానికి ఎంతో పెద్ద దివ్య కర్మలు చేయాల్సి వస్తుందని భావిస్తున్నాడు. కర్మలను తొలగించుకోవాలంటే ఎంతో కష్టం, అది ఎంతో పెద్ద కార్యక్రమం అని తలుస్తున్నాడు.

2. అందరికీ మేలు జరుగుతుంది అని భావించవచ్చు.

3. అందరికీ మేలు చేయడం నా బాధ్యత అని భావించవచ్చు.

4. అహంభావంతో, గొప్ప తనాన్ని ప్రదర్శించుకుని పేరు ప్రఖ్యాతుల కోసం కావచ్చు.

5. ఏవైనా స్వార్థ ప్రయోజనాల కోసం కావచ్చు.

6. సర్వ శ్రేయస్కరం కోసం ఆనందంగా, నిస్వార్థంగా కావచ్చు.

ఇలా ఇంకెన్నో రకాలుగా ఆ కోరిక యొక్క ఉత్పత్తి స్థానం ఉండే అవకాశం ఉంది. కోరిక లేక లక్ష్యం లేక ఆలోచన యొక్క ఉపరి తలం వేరేగా ఉంటుంది. దాని మూలమైన ఉత్పత్తి స్థానం వేరేగా ఉంటుంది.

✪ అయితే చాలా మంది ఆలోచన యొక్క ఉత్పత్తి స్థానాన్ని గుర్తించలేరు కదా, మరి అప్పుడెలా ? అని అంటే, మీరు ఏ ఆలోచన లేక కోరిక లేక లక్ష్యాన్ని పెట్టుకున్నా ఈ విధంగా చేయాలి - మీ కోరికకు చివర్లో "సర్వ శ్రేయస్కరం" + "మోక్షం"లను చేర్చాలి. ఉదాహరణకు - " నేను ఒక చాలా పెద్దదైన ఉచిత ధ్యాన కేంద్రం నిర్మించాలను కుంటున్నాను. దీని వలన సర్వులకు శ్రేయస్కరం జరగాలి మరియు మోక్షం ప్రాప్తించాలి" అని కోరుకోవాలి. కోరికకు చివరలో "సర్వ శ్రేయస్కరాన్ని + మోక్షాన్ని" జోడించడం వలన మీ కోరిక యొక్క ఉత్పత్తి స్థానం సవ్యమైనదీ, దివ్యమైనదీ అయిపోతుంది. దీని వలన మీకూ + ఇతరులకు శుభం, లాభం, విజయం, శ్రేయస్కరాలు జరిగి తీరుతాయి.

✪ మన కాన్షియస్ మైండే అల్ట్రా కాన్షియస్ మైండ్ ! ఎరుకతో, విశ్వాసంతో, నేను అల్ట్రా కాన్షియస్ మైండ్ నుండి ఈ కోరిక కోరుతున్నాను అని అనుకోవాలి. అల్ట్రా కాన్షియస్ అన్నా మహా మూల చైతన్యం అన్నా ఒక్కటే !

✪ ఉదాహరణకు, మీరు ఒక వ్యాపారాన్ని ప్రారంభించారు. ఇప్పుడు మీ వ్యాపారం బాగా, త్వరగా అభివృద్ధి చెందాలంటే మీరు ఈ విధంగా అనుకోవాలి - "నా మూల చైతన్యంలో నుండి కోరుకుంటున్నాను, నా వ్యాపారం చాలా గొప్పగా, అత్యంత త్వరగా అభివృద్ధి చెందాలి, దీని వలన నాకూ + సర్వులకు శ్రేయస్కరం జరగాలి, నాకు మోక్షం సిద్ధించాలి" - అని కోరుకోవాలి.

✪ ఈ విధంగా మనం చేసినప్పుడు మన కాన్షియస్ మైండ్ నుండి ఒక కొత్త ఆలోచన లేక కోరిక లేక లక్ష్యాన్ని నిర్ణయించుకుని, దాని మూలమైన ఉత్పత్తి స్థానాన్ని కూడా నిర్ణయించినట్టు అవుతుంది. అప్పుడు ఉత్పత్తి స్థానానికి అనుగుణంగానే ఫలితాలు వచ్చి తీరుతాయి.

✪ గుర్తుంచుకోండి, ఒక ఆలోచన చేసేటప్పుడు లేక కోరికను కోరుకునేటప్పుడు లేక లక్ష్యాన్ని ఏర్పరచుకునే ముందు దాని యొక్క ఉత్పత్తి స్థానాన్ని సవ్యంగా, దివ్యంగా మార్చడం అనేది తప్పని సరి ! ఇప్పుడు మీకు అర్థమైంది అని అనుకుంటున్నాను.

✪ ఇది తప్పని సరిగా మీరు చేసి తీరాల్సిన పని. ఆలోచనలు ఉపరితలానికి సంబంధించినవి, ఆలోచనలతో మనకు సంబంధం లేదు. ఆలోచన యొక్క ఉత్పత్తి స్థానం ఏమిటి ? దాని మూలం ఏమిటి ? అన్న విషయమే అత్యంత ప్రధానం. మూలంలో ఏదైతే ఉందో అదే ఫలితం వస్తుంది. కార్యాన్ని బట్టి ఫలితం ఉండదు, మూలాన్ని బట్టి మాత్రమే ఫలితం ఉంటుంది. విశ్వ సూత్రం "యద్భావం తద్భవతి" ! "యద్ చేష్టా తద్భవతి" కాదు. భావం(గుణం) ప్రధానం, ఆ తర్వాతే చేష్ట(కార్యం) !

అయితే మీ లోపల సరి కాని గుణాలు(స్వభావాలు), సరి కాని నమ్మకాలు ఉన్నాయని గుర్తించి వాటిని సరి అయిన ఆలోచనల ద్వారా, సరి అయిన చేష్టల ద్వారా సరి చేసుకోవచ్చు. మీ లోపల ఉన్న సరి కాని గుణాలు(స్వభావాలు), సరి కాని నమ్మకాలను గుర్తించడం ఎలా అని అంటే - మీ శరీరం + జీవితంలోని సమస్యల లిస్ట్ ఒకటి తయారు చేయండి. ఎన్ని సమస్యలు ఉంటే అన్ని సరి కాని గుణాలు(స్వభావాలు), అన్ని సరి కాని నమ్మకాలు ఉన్నట్టు లెక్క ! ఈ విధంగా గుర్తించిన తర్వాత వాటిని సులభంగా, శీఘ్రంగా సరి చేసుకోవచ్చు.

మీరు ఏ పని చేస్తూ ఉన్నా భావం అనేది ప్రధానం అని గుర్తుంచుకోండి. ఎందుకంటే చేష్టలో ఏమీ ఉండదు. ఉదాహరణకు మీరు ఎవరినైనా ఒక సహాయం అడగాలి అని అనుకుంటారు. లోపల అబ్బా, వాడిని సహాయం అడగాలా, చేస్తాడో చెయ్యడో, నా కర్మ ఇలా తగలపడింది అంటూ పలు రకాలుగా నెగెటివ్‌గా ఆలోచించి చివరికి ఓ రాయి వేసి చూద్దాం అని డిసైడ్ అయి వారిని సహాయం అడుగుతారు. అడిగేటప్పుడు ఎంత జాగ్రత్తగా, మర్యాదగా, పొలైట్‌గా అడుగుతారంటే ఇక చెప్పడానికేం లేదు అంత సూపర్‌గా అడుగుతారు. లోపల భావం మాత్రం అల్లకల్లోలంగా ఉంటుంది. తీరా వారు మీకు సహాయం చేయడానికి వీలు కాదని ఏదో ఒక అందమైన సాకును మీకు లాగే

అందంగా చెప్పి తప్పించుకుంటారు. అప్పుడు మీరు, నేను అనుకున్నా, నాకు ముందే తెలుసు, ఈ పని జరగదని ఓ పెద్ద థర్డ్ ఐ మాస్టర్‌లా మీకు మీరే ఓ స్టేట్‌మెంట్ ఇచ్చుకుంటారు. ఏదైనా ఒక పని జరగాలంటే త్రికరణశుద్ధిగా ఉండాలి. త్రికరణశుద్ధి అంటే భావంలో(గుణంలో), వాక్కులో, చేష్టలో ఒకే రకంగా ఉన్నప్పుడే పని జరుగుతుంది. ఫలితం వస్తుంది.

త్రికరణ శుద్ధి

జీవితంలో ఎల్లప్పుడూ త్రికరణశుద్ధిగా ఉండాలి. భావంలో, మాటలో, చేష్టలో ఒకే విధంగా ఉండాలి. ఈ విధంగా ఉండడాన్నే త్రికరణశుద్ధిగా ఉండడం అని అంటారు. అయితే మనకు ఎవరి పైన అయినా కోపం ఉందనుకోండి. మరి ఇలాంటప్పుడు ఎలా ప్రవర్తించాలి అనేది సమస్య. అందుకే అందరి పట్లా ప్రేమ భావాన్ని కలిగి ఉండండి. వారు ఎవరైనా కాని, మీకు గతంలో హాని చేసిన వారైనా సరే, ఈ ప్రస్తుత వర్తమానంలో బాధ పెడుతున్న వారైనా సరే ! మీరు మాత్రం అందరి పట్లా ప్రేమ భావం కలిగి ఉండండి. భావం, గుణం, స్వభావం, మనసు, ఆలోచన, ఊహ ప్రాథమికంగా ఇవన్నీ ఒకటే. భావంలోనూ, మాటలోను, చేష్టలోనూ ప్రేమను జోడించండి. అద్భుతాలు జరుగుతాయి మీ జీవితంలో ! అనంతమైన ప్రేమ కలిగి ఉన్నందుకే దేవుడు, దేవుడిగా ఉన్నాడు. ప్రేమ శక్తి అనంతం.

ప్రేమతో ఉండాలి అంటే ఏ ప్రేమ ?! సినిమాల్లో, కథల్లో, నవలల్లో, జనాల్లో, సమాజంలో మరియు న్యూస్ పేపర్‌లలో వాడే, ఉండే ప్రేమ కాదు. అది వేరే !

అది ప్రేమ అని పిలువబడుతున్న, వ్యవహరింపబడుతున్న "వ్యామోహ ఉన్మాదం" ! ''అమ్మాయి పైన ఆసిడ్ పోసిన ప్రేమోన్మాది'' అని పేపర్లో రాస్తుంటారు. పెద్ద పెద్ద మేధావులుగా పరిగణించబడుతున్న వారు కూడా ఈ విషయం పైన వ్యాసాలు రాసి ఆందోళనలకు దిగుతుంటారు.

ప్రేమ వేరే ! ఉన్మాదం వేరే ! ప్రేమిస్తే ఉన్మాదం ఉండదు. శాశ్వతంగా పోతుంది. వ్యామోహంలో నుండి పుడుతుంది ఉన్మాదం. ఏదైనా ఒక దాని పైన అపసవ్యంగా ఇష్టాన్ని పెంచుకోవడం ప్రారంభిస్తే అది వ్యామోహం అవుతుంది. వ్యామోహం ముదిరితే ఉన్మాదం అవుతుంది. కాబట్టి ప్రేమోన్మాది అని అనకుండా "వ్యామోహ ఉన్మాది" అని అనాలి. ఇది సరి.

అసలు సిసలు ప్రేమ అంటే....

మూల చైతన్యం, అవగాహన, శాంతి,
ప్రతిఫలాన్ని ఆశించక పోవటం, ఇవ్వడం,
ఆశీర్వాదం, అనుగ్రహం, శృతి, లయ,
ప్రసన్నం, కటాక్షం, శక్తి, దివ్యం,
అమృతం, సద్భావన, చైతన్యం,
జీవ శక్తి, సృష్టికి మూలాధారం,
పరమానందం, షరతులు లేనిది, హద్దులు లేనిది,
శ్రేయస్కరం, విజ్ఞానం, విశ్వాసం, విజయం,
సర్వ ప్రయోజన భావం, సత్యం,
అనంతం, అమరత్వం, ఏకత్వం !

మనం కలిగి ఉన్న వాటినే అనుభవిస్తూ ఉంటాం

మనం ఎలాంటి గుణాలను(స్వభావాలను), నమ్మకాలను కలిగి ఉన్నామో సరిగ్గా అలాంటి పరిస్థితులనే మన శరీరంలోకి + జీవితంలోకి ఆకర్షించి అనుభవిస్తూ ఉంటాం.

బయట పరిస్థితులను బట్టి లోపలి గుణాలను(స్వభావాలను), నమ్మకాలను సులువుగా అంచనా వేయవచ్చు. ఒకసారి మీ శరీరంలోని మరియు జీవితంలోని పరిస్థితులను నిశితంగా పరిశీలించండి. ఉదాహరణకు మీరు శారీరకంగా మరియు జీవితంలో హింసను అనుభవిస్తూ ఉన్నారంటే మీరు హింసా గుణాన్ని కలిగి ఉన్నారని అర్థం.

✪ మీకు గనుక వేధించే గుణం ఉంటే, మీ శరీరంలో + జీవితంలో వేధింపులతో బాధపడుతూ ఉంటారు.

✪ మీకు స్వేచ్ఛ లేదంటే, మీకు స్వేచ్ఛను హరించే గుణం ఉందని అర్థం.

✪ మీకు అణచివేసే గుణం ఉన్నప్పుడే, మీరు అణచివేయబడుతూ ఉంటారు.

✪ మీకు పెత్తనం చెలాయించే గుణం ఉంటేనే, మీ పైన పెత్తనం చెలాయించబడుతుంది.

✪ మీకు అజమాయిషి చేసే గుణం ఉన్నప్పుడే, మిమ్మల్ని ఎవరో అజమాయిషి చేస్తూ ఉంటారు.

✪ మీకు నిందలు వేసే గుణం ఉన్నప్పుడే, అకారణంగా మీరు నిందలకు గురయ్యి బాధపడుతూ ఉంటారు.

✪ ఒక వేళ మీకు నిందలు వేసే గుణం లేకున్నా ఒక్కోసారి అకారణంగా మీపై నిందలు పడతాయి. ఇలా మీరు నిందించబడినపుడు మీరు బాధకు గురికారు. ప్రశాంతంగా ఉంటారు. నిందించే గుణం ఉంటేనే, నిందకు గురి అయినపుడు బాధపడతారు. లేకపోతే లేదు.

✪ మీకు అవమానించే గుణం ఉన్నప్పుడే, మీకు అవమానాలు జరుగుతాయి, అప్పుడు మీరు బాధ పడతారు. మీకు అవమానించే గుణం లేక పోయినా, మిమ్మల్ని ఎవరైనా అవమానించినప్పుడు మీకు బాధ కలగదు.

✪ మీకు అనుమానించే గుణం ఉంటే, మీరు కూడా ఇతరుల అనుమానాలకు గురి అయ్యి క్షోభను అనుభవిస్తారు. మీకు అనుమానించే గుణం లేకున్నా, మీరు అనుమానాలకు గురయ్యే అవకాశం ఉంది. అయితే అప్పుడు మీరు క్షోభకు గురి కారు.

✪ మీకు అడ్డం పడే గుణం ఉంటే, మీ పనులకు అడ్డంకులు ఎదురవుతూ ఉంటాయి.

✪ మీకు హాని చేసే గుణం ఉన్నప్పుడే, మీకు హాని జరుగుతుంది.

✪ మీకు మోసం చేసే గుణం ఉన్నప్పుడే, మీరు మోసానికి గురి అవుతారు.

✪ మీకు ద్రోహ గుణం ఉన్నప్పుడే, మీరు ద్రోహానికి గురవుతారు.

✪ ఇతరులను మీ స్వార్థానికి వాడుకోవాలనుకునే గుణం ఉన్నప్పుడే, మీరు ఇతరుల స్వార్థాలకు బలవుతుంటారు.

✪ మీకు సహాయం చేసే గుణం లేకపోతే, మీకు సహాయం లభించదు.

✪ మీకు నష్టం కలిగించే గుణం ఉన్నప్పుడే, మీకు నష్టం జరుగుతుంది.

✪ మీకు వృథా చేసే గుణం ఉంటే, మీ శ్రమ + ధనం వృథా అవుతూ ఉంటాయి.

✪ మీకు ఇచ్చే గుణం లేకపోతే, మీరు ఏమీ పొందలేరు.

✪ ఇచ్చే గుణమే పొందే గుణం. ఇవ్వడమే పొందడం !

✪ ఇతరులకు ఇష్టం లేకున్నా వారిని ఇబ్బంది పెట్టి, కష్టపెట్టి వారి ద్వారా మీరు ఆనందం పొందే గుణం మీకున్నప్పుడే, ఇతరులు మిమ్మల్ని ఇబ్బంది పెట్టి, కష్ట పెట్టి వారు ఆనంద పడుతూ ఉంటారు.

✪ **మన గుణాలనే(స్వభావాలనే), నమ్మకాలనే మనం, శరీరంలో మరియు జీవితంలో అనుభవిస్తూ ఉంటాం.**

✪ మీకు బలవంతం చేసే గుణం ఉంటే, మీరు బలవంతానికి గురవుతూ ఉంటారు.

✪ మీ శరీరం + జీవితం క్రూరత్వానికి బలవుతూ ఉందంటే, మీరు క్రూర గుణం కలిగి ఉన్నారని అర్థం.

✪ అందరి మీదా మీకు దురభిప్రాయాలుంటే, వాటినే మీరు ఎదుర్కొని బాధ పడాల్సి వస్తుంది.

✪ అందరి మీద మీకు దురభిప్రాయాలు లేకుండా సదభిప్రాయాలున్నా, మీ పైన ఇతరులు దురభిప్రాయాలు ఏర్పరుచుకునే అవకాశం ఉంది. ఇలాంటప్పుడు ఆ విషయం తెలిసినా మీరు బాధపడరు. వాటి ప్రభావం మీ మీద పడదు.

✪ ఇతరుల పట్ల మీకు దురుద్దేశాలు ఉన్నప్పుడే, ఇతరుల దురుద్దేశాలకు మీరు ఎర అవుతారు.

✪ మీకు ఇతరులను అర్థం చేసుకునే గుణం లేకపోతే, మిమ్మల్ని ఎవరూ అర్థం చేసుకోవట్లేదని బాధ పడుతూ ఉంటారు. మీకు అందరినీ అర్థం చేసుకునే గుణం ఉన్నా, ఎవరైనా మిమ్మల్ని అర్థం చేసుకోకుంటే మీరు బాధ పడరు.

✪ మీకు అపార్థం చేసుకునే గుణం ఉంటే, మీరు తరచూ ఇతరుల చేత అపార్థానికి గురయ్యి బాధ పడుతూ ఉంటారు. మీకు అపార్థం చేసుకునే గుణం లేకపోయినా, ఇతరులు మిమ్మల్ని అపార్థం చేసుకుంటే, ఆ ప్రభావం మీ పైన పడదు.

✪ మీకు ఇతరులది ఆశించి స్వాధీనం చేసుకోవాలనే గుణం ఉంటే, మీవి ఇతరులచే ఆశించబడి స్వాధీనం చేసుకోబడతాయి.

✪ మీరు దారిద్ర్యం లేక పేదరికం లేక ఆర్థిక ఇబ్బందులను కలిగి ఉన్నారంటే వీటికి మాత్రం చాలా రకాల కారణాలు ఉంటాయి. ఎందుకంటే ఆర్థిక సమస్యలు వాస్తవానికి ఆర్థిక సమస్యలు కావు. అవి జీవన సమస్యలు. స్వేచ్ఛకు, సాధికారతకు సంబంధించిన సమస్యలు. అయితే వేరే కారణాలు ఎన్ని ఉన్నప్పటికీ ప్రధానంగా దురాశ + మదం అనే గుణాల పర్యవసానమే దారిద్ర్యం. అంతరంలో ఉన్న దురాశ మరియు మదం అనే గుణాల వల్లనే దారిద్ర్యం సృష్టించబడుతుంది. దారిద్ర్యానికి మూలం దురాశ మరియు మదం. వీటి ప్రభావాన్నే దారిద్ర్యం అని అంటారు. దారిద్ర్యాన్ని మీరు ఏమీ చేయలేరు, ఎంత పోరాడినా వృథాయే అవుతుంది. ఎందుకంటే దారిద్ర్యం అనేది కేవలం పర్యవసానం. దాని మూలాలు వేరేగా ఉంటాయి, దాని మూలాలను తీసివేసినపుడే దారిద్ర్యం శాశ్వతంగా తొలగిపోతుంది. దురాశ అంటే ఎవరికీ దక్కనీయకుండా అందినంత వరకూ అంతా తానే అనుభవించాలనుకునే గుణం. ఎవరికీ దక్కనీయకుండా దాచుకోవాలనుకునే ఈ గుణమే తనకు ఏమీ దక్కనీయకుండా చేసి దారిద్ర్యంలో ఉంచుతుంది.

✪ లోపల వినాశకర ధోరణి ఉన్నప్పుడే శరీరంలో + జీవితంలో వినాశనం తాండవిస్తూ ఉంటుంది. బీభత్స గుణాలను కలిగి ఉన్నప్పుడే శరీరంలో + జీవితంలో బీభత్స పరిస్థితులు సంభవిస్తూ ఉంటాయి. భయంకర గుణాలున్నప్పుడే భయంకర పరిస్థితులను అనుభవించాల్సి వస్తుంది.

✪ మీరు ఏ పని చేసినా విఫలం అవుతుంది అని అంటే మీరు "నేను ఏ పని చేసినా విఫలమే" అనే నమ్మకాన్ని కలిగి ఉన్నారని అర్థం.

✪ "నేను ఐశ్వర్యవంతుడిని కాదు, కాలేను" అనే నమ్మకం మీ లోపల ఉన్నప్పుడే మీరు పేదరికంతో బాధ పడుతుంటారు.

✪ "నేను బాగా లేను" అనే నమ్మకం వలన మీకు శారీరకంగా, జీవితంలో ఎన్నో సమస్యలు సృష్టించ బడతాయి.

✪ "కష్టాలు మనుషులకు కాకపోతే మానులకు వస్తాయా" అనే నమ్మకం మీ లోపల ఉంటే మీకు ఎల్లప్పుడూ కష్టాలు వస్తూనే ఉంటాయి.

✪ "నాకు శక్తి లేదు, ఏం చేసినా రాదు" అనే నమ్మకం కలిగి ఉన్నప్పుడే మీరు శక్తి హీనంగా, నిస్సత్తువతో, నిస్సహాయంగా తయారవుతారు.

✪ "నాకెవరూ సహాయం చేయరు" అనే నమ్మకం మీ లోపల ఉంటే మీకు ఎవరు కూడా సహాయం చేయరు.

✪ "మనిషి అని అన్నాక అనారోగ్యాలు తప్పవు" అనే నమ్మకం కలిగి ఉన్నందుకే మానవులకు అనారోగ్యాలు వస్తున్నాయి.

ఏదైనా సరే ప్రతీ ఒక్కటి కూడా మనం ఎలాంటి గుణాలను(స్వభావాలను), నమ్మకాలను కలిగి ఉన్నామో అలాంటి పరిస్థితులనే శరీరంలో మరియు జీవితంలో అనుభవిస్తూ ఉంటాం. గుర్తుంచుకోండి, మీ శరీరంలో + జీవితంలో జరుగుతున్న ప్రతీ దానికి మీరు ఒక్కరే కారణం. మీరు మాత్రమే సృష్టికర్త. మంచి జరిగినా, చెడు జరిగినా అది కేవలం మీ సృష్టే ! మీకు ఎదురవుతున్న ప్రతీ సంఘటన, మీ పట్ల ఇతరుల ప్రతీ ప్రవర్తన మీ అంతరంగం యొక్క ప్రతిబింబమేనని గుర్తుంచుకోండి. ఇందులో ఇతరులు పాల్గొనవచ్చు లేదా ఏవైనా పరిస్థితుల ప్రభావం అని అన్పించవచ్చు కానీ అసలు సిసలు పరమ సత్యం ఏమిటంటే మీరు మాత్రమే మీ వాస్తవాలకు సృష్టికర్తలు. మీ బాధ్యత పూర్తిగా మీదే. మీపై అధికారం పూర్తిగా మీదే. మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోవాలి. మిమ్మల్ని బాగుచేసుకోడానికి మీరే స్వయంగా పూనుకోవాలి. ఎవరికీ పట్టిలేదు. ఎవరూ రారు. ఎవరిని వారే పట్టించుకోవాలి. ఎవరో వస్తారని, ఏ దేవుడో వచ్చి రక్షిస్తాడని ఎదురుచూడటం అజ్ఞానం.

శ్రీకృష్ణ పరమాత్ముడు గీతలో స్పష్టంగా కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పాడు "ఉద్ధరేదాత్మనాత్మానం" (6 : 5) అని, అంటే ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి అని అర్థం. మిమ్మల్ని ఎవరూ ఉద్ధరించలేరు. గురువులు మిమ్మల్ని మీరు ఉద్ధరించుకునే మార్గం బోధిస్తారు, వీరినే "ఉద్ధారకులు" అని అంటారు.

అయితే మీకు ఎదురవుతున్న పరిస్థితులు, మీ గుణాల(స్వభావాల) యొక్క ప్రతి బింబం అని అన్నప్పుడు - ఇక్కడ కొంచెం లోతుగా అర్థం చేసుకోవాలి.

✪ ఉదాహరణకు, మీకు ఎవరిని కూడా అపార్థం చేసుకునే గుణం(స్వభావం) లేదనుకోండి, అయినా మిమ్మల్ని ఎవరో అపార్థం చేసుకున్నారు అనుకోండి, మరి ఇప్పుడెలా తెలుసుకోవడం ? మీకు అపార్థం చేసుకునే గుణం(స్వభావం) ఉన్నట్టా ? లేనట్టా ? అని అంటే, ఇతరులు మిమ్మల్ని అపార్థం చేసుకున్నారనీ, చేసుకుంటున్నారనీ తెలిసినపుడు మీకు బాధ కలిగితే మీకు "అపార్థం చేసుకునే గుణం(స్వభావం)" ఉన్నట్టు, ఒక వేళ మీకు బాధ కలగకపోతే, మీరు మామూలుగానే ఉంటే మీకు "అపార్థం చేసుకునే గుణం(స్వభావం)" లేనట్టు అని అర్థం.

మనకు ఎదురవుతున్న పరిస్థితులు మనల్ని బాధకు గురి చేస్తే వాటి మూలాలు మనలోనే ఉన్నాయని అర్థం. పరిస్థితుల యొక్క మూలాలు మనలో ఉంటేనే మనకు బాధ కలుగుతుంది. మన పైన ప్రభావం పడుతుంది, లేకపోతె లేదు.

మీకు మీరు చేసుకోవడం అని అంటే
సృష్టికి చేయడమేనని తెలుసుకోండి !

మీరు ఇతరులకు చేసేవన్నీ
మీకు మీరే చేసుకుంటున్నారని గ్రహించండి !!

మీరే మీ సృష్టికి కేంద్రం. మీలోనే సృష్టి అంతా ఇమిడి ఉంది. ప్రతి ఒక్కరూ సృష్టికి ప్రతిరూపాలే. ప్రతి ఒక్కరూ తమ అంతరంలో సృష్టి కేంద్రానికి అనుసంధానింపబడి ఉన్నారు. మీకు మీరు ఏం చేసుకుంటున్నా "సాక్షాత్ సృష్టికే" చేస్తున్నారు అనే సత్యాన్ని తెలుసుకోండి. కాబట్టి మీ పట్ల మీరు ఎంతో ఎరుకతో, ఎంతో బాధ్యతతో వ్యవహరించాల్సి ఉంటుంది. సృష్టిలో ప్రతి ఒకటి ఇంకొక దానితో అనుసంధానింపబడి ఉంటుంది. మీకు మీరు చేసుకునే ప్రతీ కార్యం యొక్క ప్రభావం యావత్ సృష్టి పైనా పడుతుంది.

మీరు ఇతరులకు ఏం చేస్తున్నారో అవి అన్నీ కూడా మీకు మీరే చేసుకుంటున్నారనే సత్యాన్ని మీరు గ్రహించాలి. ఇతరులకు చేయడం అంటే మీకు మీరు చేసుకోవడమే !

మన గుణం లేక స్వభావం మన పట్ల, ఇతరుల పట్ల ఒకేలాగా పనిచేస్తుంది. ఎలాగైతే మన కళ్ళతో మనల్ని మనం చూసుకుంటామో అవే కళ్ళతో ఇతరులను కూడా చూస్తాము. మనల్ని మనం చూసుకోడానికి, ఇతరులను చూడడానికి ఒకే "కళ్ళు" ఎలా ఉపయోగపడుతున్నాయో సరిగ్గా ఇలాగే మనకున్న మన గుణం(స్వభావం), నమ్మకం మన పట్ల, ఇతరుల పట్ల ఒకే లాగా పనిచేస్తుంది. ఉదాహరణకు "అందరూ ఎందుకూ పనికి రాని వెధవలు" అనే అభిప్రాయం లేక గుణం(స్వభావం) లేక నమ్మకాన్ని మీరు కలిగి ఉన్నారనుకోండి, అప్పుడు అది మీ పట్ల కూడా వర్తించి(అప్లై అయి) మీరు కూడా "ఎందుకూ పనికి రాని వెధవగా" తయారవుతారు.

మన గుణాలు(స్వభావాలు), నమ్మకాలు ఎలా ఉన్నాయో వాటికి అనుగుణంగానే మన ఆలోచనలు, లక్ష్యాలు, కోరికలు, మాటలు మరియు చేష్టలు ఉంటాయి.

"యద్భావం తద్భవతి" అనేది అత్యంత ప్రధానమైన ఒక విశ్వ సూత్రం. అంటే మన భావం(గుణం) ఎలా ఉంటుందో సరిగ్గా అలానే మన శరీరం + జీవితం కూడా ఉంటుంది అని అర్థం. భావం అంటే గుణం లేక ఆలోచన లేక ఊహ అని అర్థం. భవం అంటే భౌతికం లేక పరిస్థితి అని అర్థం.

మీరు ఒకరికి ఏదైనా చేయాలంటే మీ గుణం(స్వభావం) ఎలా ఉంటే అలా చేస్తారు. మీరు ఏ గుణంతో(స్వభావం) అయితే "ఏదైనా ఒకటి చేసినప్పుడు, ఆ గుణం(స్వభావం) అనేది బలపడి పెరుగుతుంది. గుణానికి(స్వభావానికి) పని కల్పించడం అనేది, దానిని పోషించి పెద్ద చేయడం" అని తెలుసుకోండి. మీరు ఏ ఏ గుణాలను(స్వభావాలను) ఎక్కువగా వాడి, వాటిని ఉపయోగించి పని చేస్తున్నారో అవి అంతకంతకూ బలపడి పెరుగుతూ ఉంటాయి. మీరు ఏ గుణాన్ని(స్వభావాన్ని) అయితే ఉపయోగించి ఇతరులకు ఏదైనా చేస్తారో - అదే గుణం(స్వభావం)తో "సరిగ్గా అలాంటి పరిస్థితులనే" మీరు ఆకర్షించి అనుభవిస్తారు.

ఉదాహరణకు....

మీరు ఎవరికైనా ఒకరికి ప్రతిఫలాన్ని ఆశిస్తూ మంచి సహాయం చేసారనుకోండి - మీకు కూడా ఎవరైనా మంచి సహాయం చేసినప్పుడు వారు కూడా ప్రతిఫలం ఆశించి చేస్తారు.

మీరు ఒకరికి ఏ ప్రతిఫలాన్ని ఆశించకుండా మంచి సహాయం చేసారు అయితే మీ గొప్ప తనాన్ని వారు గుర్తించి మీకు విధేయులుగా ఉండాలని భావిస్తూ చేసారు అప్పుడు - ఇతరులు కూడా మీకు, సరిగ్గా మీలాగే ఏ ప్రతిఫలం ఆశించకుండా మంచి సహాయం చేసి, మీరు వారికి విధేయులుగా ఉండాలని భావిస్తారు.

మీరు ఇతరులకు ఏ ప్రతిఫలం ఆశించకుండా మంచి సహాయం చేసారు. అయితే ఆ విషయం అందరికి చెప్పుకుంటూ మీ గొప్పతనాన్ని ప్రదర్శిస్తున్నారనుకోండి - సరిగ్గా మీకు కూడా ఎవరో ఒకరు ఏ ప్రతిఫలం ఆశించకుండా మంచి సహాయం చేసి అది ఊరందరికీ చెప్పుకుని తిరుగుతూ ఉంటారు.

మీరు ఇతరులకు ఏ ప్రతిఫలం ఆశించకుండా ప్రేమగా వారి శ్రేయస్కరాన్ని కోరుతూ, వారికి మంచి సహాయం ఆనందిస్తూ చేసి, తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయి మౌనంగా మీ పని మీరు చేసుకుంటున్నారని అనుకోండి - అప్పుడు మీకు మంచి సహాయం చేసిన వారు కూడా మీ లాగే ఆనందంగా, ప్రేమగా, మీ శ్రేయస్కరాన్ని కోరుతూ మీకు చక్కటి సహాయం చేసి తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయి మౌనంగా వారి పని వారు చేసుకుంటుంటారు.

✪ మీరు ఇతరులను మోసగిస్తే మీరు మోసపోతారు.

✪ మీరు ఇతరులను అవమానిస్తే మీరు అవమానాల పాలవుతారు.

✪ మీరు ఇతరులను వేధిస్తే మీరు వేధింపులకు గురవుతారు.

✪ మీరు ఇతరులవి దొంగిలిస్తే మీవి ఇతరులు దొంగిలిస్తారు.

✪ మీరు ఇతరులపై పెత్తనం చెలాయిస్తే ఇతరులు మీపై పెత్తనం చెలాయిస్తారు.

✪ మీరు ఇతరులపై అనవసరమైన అనుమానాలను ప్రకటించి వారిని బాధకు గురిచేస్తే, మీరు ఇతరుల అనవసర అనుమానాలకు గురయ్యి బాధపడతారు.

✪ మీరు ఇతరుల స్వేచ్ఛను హరిస్తే మీ స్వేచ్ఛ హరించుకు పోతుంది.

✪ మీరు ఇతరులకు ఏది దూరం చేస్తే అది మీకు దూరమౌతుంది.

✪ మీరు ఇతరులకు చెడు చేస్తే మీకు చెడు జరుగుతుంది.

✪ మీరు ఇతరులవి వృథా చేస్తే మీవి ఇతరులు వృథా చేస్తారు.

✪ సాధారణంగా ఉద్యోగుల్లో కొంత మంది "ఆఫీసువే కదా" అని ఫోన్లు, వాహనాలు, స్టేషనరి ఇంకా ఇతర సౌకర్యాలను "ఫ్రీగా" వస్తున్నాయని భావించి అవసరం ఉన్నా లేకపోయినా వాడుతూ దుర్వినియోగం చేస్తుంటారు. వీరికి ఇతరుల వస్తువులను "వృథా చేయడం మరియు దుర్వినియోగం చేయడం" అనే గుణాలు ఉన్నందువలన అలా చేస్తుంటారు. ఇలా చేసే వారికి ఆరోగ్య పరంగానో లేక ఇతర కారణాల వల్లనో వీరి యొక్క "శక్తి + ధనం" వృథా అవుతాయి. ఆఫీసువే కదా, అని ఎంత వృథా చేస్తారో అంతకంతా వేరే రూపంలో వీరికి నష్టం జరుగుతుంది.

✪ మీరు ఇతరులను ఇబ్బంది పెడితే మిమ్మల్ని ఇతరులు ఇబ్బంది పెడతారు.

✪ మీరు ఇతరుల అభివృద్ధికి అడ్డం పడుతుంటే, మీ అభివృద్ధికి ఇతరులు అడ్డం పడుతుంటారు.

As you sow, so shall you reap !

- The Holy Bible - Galatians 6 : 7

మీరు ఏ విత్తనం నాటితే, దాని పంటనే కోస్తారు(అనుభవిస్తారు) !

- పరిశుద్ధ గ్రంథం బైబిల్ - గలతీయులు 6 : 7

మీరు ఇతరులకు ఏం చేస్తుంటారో అవే మీకూ జరుగుతాయి. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న సమస్యలన్నీ ఇతరులకు మీరు గతంలో చేసినవే ! ఇదే పరమ సత్యం ! మీరు అనుభవిస్తున్న శారీరక + జీవిత సమస్యలన్నీ కూడా మీరు ఒకప్పుడు ఇతరులకు కలుగజేసినవే ! మీరు వేసిన పంటనే ప్రస్తుతం మీరు తింటున్నారు. "ఎవరు చేసిన కర్మలను వారే అనుభవిస్తారు" అని అంటే అర్థం ఇదే !

నీ సమస్యలకు నీవే కారణం అని నీవు గ్రహించాలి !

ప్రస్తుతం నీవు అనుభవిస్తున్న సమస్యలకు మూల కారణం నీవే ! ఇదే అసలు సత్యం ! సాధారణంగా చాలా మంది తమ సమస్యలకు తాము కారణం కాదని అనుకుంటూ ఉంటారు. ఆత్మ విజ్ఞానం లేని వారికి ఈ సత్యం జీర్ణం కాదు. కాని ఉన్న సత్యం ఇదొక్కటే ఎవరికైనా ! భూమి మీద ఉన్న ఏ మనిషైనా తను అనుభవిస్తున్న సమస్యలను ఒకానొకప్పుడు గతంలో ఇతరులకు చేసినవే ఇప్పుడు తన ప్రస్తుతంలో అనుభవిస్తూ ఉంటాడు. గతంలో చేసినవి అని అంటే "కర్మ ఫలితం లేక పరిహారాలు చెల్లించడం" అని కాదు అర్థం. అతడు ఏ ఏ గుణాలతో(స్వభావాలతో) అయితే ఇతరులకు ఆయా సమస్యలను కలుగజేసాడో అవే గుణాల(స్వభావాల) ద్వారా వాటిని ఆకర్షించి అతడు అనుభవిస్తూ ఉంటాడు. భూమి మీద ఉన్న ప్రతి మనిషికి ఇదే సత్యం వర్తిస్తుంది.

ఎవరి వాస్తవాలకు వారే సృష్టికర్తలు !

ఎవరి సమస్యలకు వారే సృష్టికర్తలు !

ఎవరి బాధలకు వారే సృష్టికర్తలు !

ఎవరి ఆనందాలకు వారే సృష్టికర్తలు !

ఇవే పరమ సత్యాలు. మనిషి అనబడే ప్రతీ ఒక్కరికి వర్తించే విశ్వ సూత్రాలు !

ఎప్పుడైతే మీరు - "నా సమస్యలకు నేనే కారణం" అని లోపల, అంతరంగంలో 100%గా తెలుసుకుంటారో, గ్రహిస్తారో అదే క్షణంలో వాటి నుండి మీకు శాశ్వతంగా విముక్తి లభిస్తుంది. "మీ అన్ని సమస్యలకు తక్షణం పరిష్కారం, వాటికి మీరే మూల కారణమని గ్రహించడమే" - ఒకానొక విశ్వ సూత్రం.

ధ్యానంలో కూర్చుంటే మీ అన్ని సమస్యలకు మీరే మూల కారణం అని స్పష్టంగా తెలుస్తుంది. దాంతో సమస్యల నుండి మీకు తక్షణ శాశ్వత విముక్తి లభిస్తుంది.

ధ్యానం అంటే అవగాహన !

ధ్యానం అంటే విడుదల ! ధ్యానం అంటే విముక్తి !

ఆరోగ్యం - ఐశ్వర్యం

సాధారణంగా ప్రతీ ఒక్కరు ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని పొందాలని రక రకాల ప్రయత్నాలను చేస్తూ ఉంటారు. మరి వీటిని పొందాలంటే వీటి గురించి సరిగ్గా తెలుసుకోవాలి. నిజానికి ఆరోగ్యం, ఐశ్వర్యం అనేవి ఉండవు. మీకు ఎక్కడ వెతికినా దొరకవు గాక దొరకవు, ఎందుకంటే అవి నిజానికి కేవలం పర్యవసానాలు. మన "సద్గుణాల" యొక్క పర్యవసానమే ఆరోగ్యం + ఐశ్వర్యం.

ఉదాహరణకు దీపం యొక్క పర్యవసానమే కాంతి. మీకు డైరెక్ట్‌గా కాంతి ఎక్కడా దొరకదు. అది అసంభవం. మీకు కాంతి కావాలంటే దీపాన్ని వెలిగించాల్సిందే ! అప్పుడు మాత్రమే మీకు కాంతి లభిస్తుంది.

కాంతికి మూలం దీపం. దీపం యొక్క విస్తరణయే కాంతి. దీపం యొక్క ప్రభావమే కాంతి.

దీపం యొక్క ఉనికియే కాంతి. దీపమే కాంతి.

ఇదే విధంగా ఆరోగ్యానికి + ఐశ్వర్యానికి మూలం సద్గుణాలు.

సద్గుణాల యొక్క విస్తరణయే ఆరోగ్యం + ఐశ్వర్యం.

సద్గుణాల యొక్క ప్రభావమే ఆరోగ్యం + ఐశ్వర్యం.

సద్గుణాల ఉనికియే ఆరోగ్యం + ఐశ్వర్యం.

సద్గుణాలే ఆరోగ్య ఐశ్వర్యాలు !

సద్గుణాలంటే అనుభవ పూర్వక ఆత్మ విజ్ఞానాన్ని కలిగి ఉండటం.

సద్గుణాలంటే ప్రేమ, కరుణ, మైత్రి, నిర్మాణాత్మక ధోరణి, సదభిప్రాయం, సదుద్దేశం, సహృదయం, నిస్వార్థ సేవా భావం, సర్వ ప్రయోజన భావం, శాంతి, ఇతరుల పరిస్థితులను అర్థం చేసుకునే గుణం, సహాయ సహకార సమన్వయాలు అందించే గుణం, వినయం, విధేయత, వినమ్రత, నీతి, నిజాయితీ, నిబద్ధత, అణుకువ, ఒద్దిక, పొందిక మొదలైనవి. ఈ సద్గుణాల పర్యవసానమే ఆరోగ్యం + ఐశ్వర్యం. వీటిని పొందడమంటే ఆరోగ్యాన్ని + ఐశ్వర్యాన్ని పొందినట్టే. వీటిని కలిగి ఉండటమంటే ఆరోగ్య ఐశ్వర్యాన్ని కలిగి ఉన్నట్టే. మీరు ఈ సద్గుణాలను పొందండి 100% గ్యారంటీగా ఆరోగ్య ఐశ్వర్యాలను పొందుతారు. కాబట్టి సద్గుణాలను పెంపొందించుకోండి. సద్గుణాలు పెంపొందాలంటే ఆత్మ విజ్ఞాన అభ్యాసం తప్పని సరి ! ఈ విషయాలు ఇతరులకు పంచండి. "పంచబడింది పెంచబడుతుంది". ఇది అత్యవసరం. తప్పనిసరి.

మన సద్గుణాల పర్యవసానమే ఆరోగ్యం + ఐశ్వర్యం !

మన దుర్గుణాల పర్యవసానమే అనారోగ్యం + దారిద్ర్యం !

ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు.....

మన అంతరంగంలోని సరి కాని గుణాలే మన అన్ని అనారోగ్యాలకు కారణం. అయితే ఇక్కడ ఇంకొక విషయం కూడా ఉన్నది. అనారోగ్యాలను కలిగి ఉన్న వారందరూ సరి కాని గుణాలతో ఉన్నట్టు అని కాదు ఇక్కడ అర్థం. ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు, చూడ చూడ రుచుల జాడ వేరన్నట్టు, సరి కాని గుణాలను కలిగి ఉన్న వారు అనారోగ్యంతో + దారిద్ర్యంతో బాధ పడుతూ ఉంటారు. అనారోగ్య దారిద్ర్యాలను రీసెర్చ్ సబ్జెక్ట్‌లుగా ఎన్నుకుని వాటిని అనుభవిస్తూ వాటి ముక్తికి సూత్రాలను కనుక్కునే పరిశోధన చేస్తున్న వారు కూడా "అనారోగ్య దారిద్ర్యాలతో" బాధ పడుతుంటారు. ఆధ్యాత్మిక శాస్త్రం పట్ల లోతైన అవగాహన ఉన్నప్పుడు ఇలాంటి విషయాలు అర్థం అవుతాయి.

కొంత మంది ప్రత్యేకంగా ఆ యొక్క రోగాలను అధ్యయనం చేసి వాటికి నివారణోపాయాన్ని కనుక్కోడానికి వాటిని పెట్టుకుని జన్మ తీసుకుంటారు. మరి కొంత మంది తమ వైబ్రేషన్స్‌ను ఒక ప్రత్యేకమైన కోణంలో డెవలప్ చేసుకోడానికి కొన్ని ప్రత్యేకమైన రోగాలను పెట్టుకుని జన్మ తీసుకుని వాటిని అనుభవిస్తూ ఉంటారు. ఇంకొంత మంది అజ్ఞానంతో సరి కాని గుణాల చేత రోగాలను అనుభవిస్తూ ఉంటారు. ఎవరు, ఎవరు ? అనేది ఎవరికి వారు స్వయంగా సాధన చేసి తెల్సుకోవాల్సిన విషయం. ఎవరు ఎవరైనా, ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ధ్యానం ద్వారా వారి లక్ష్యం నెరవేరుతుంది. పరిశోధన ఫలిస్తుంది. ఒక వేళ సరి కాని గుణాలైతే, క్లియర్ అయిపోతాయి.

మన లోపల ఉన్న సరి కాని గుణాలు ఏదో రకంగా మన శరీరంలో ప్రకటం అవుతూ ఉంటాయి. శరీరం కేవలం అద్దం లాంటిది. ఆత్మ స్వరూపులైన మీకు ఉన్న సరి కాని గుణాలు(అజ్ఞానం) శరీరంలో ఇబ్బందులుగా, రోగాలుగా ప్రతిబింబిస్తూ ఉంటాయి. అంతే కాని శరీరంలో అనారోగ్యాలకు సంబంధించిన విషయాలేవీ ఉండవు. శరీరం దివ్యమైనది. ఉన్నదున్నట్టుగా శరీరాన్ని అలా వదిలేస్తే అది ఎంతో దివ్య తేజస్సును కలిగి, మహా పటిష్ఠమైన ఆరోగ్యంతో విరాజిల్లుతుంది.

మన గుణాలలో నుండే ఇతరులను అంచనా వేస్తుంటాం

మన అంతరంగం యొక్క యథాతథ ప్రతిబింబమే మన జీవితం.

- విశ్వ సూత్రం

మన లోపల ఎలాంటి భావాలు(గుణాలు) ఉన్నాయో వాటికి అనుగుణంగానే మన శరీరం + జీవితం ఉంటుంది. మనం కలిగి ఉన్న గుణాల యొక్క ప్రభావం చేత ఆకర్షించబడిన పరిస్థితులనే మనం, మన శరీరంలో + జీవితంలో అనుభవిస్తూ ఉంటాం.

మన గుణాలను బట్టి మన ఆలోచనలు. మనం ఎలాంటి గుణాలనైతే కలిగి ఉన్నామో ఆ గుణాలకు అనుగుణంగానే ఇతరులను అంచనా వేస్తుంటాం. అయితే ఇక్కడే పొరపాటు జరుగుతుంది.

అది ఏమిటంటే మన నెగెటివ్ గుణాలతో ఇతరులను చూస్తాం, మన పాజిటివ్ గుణాలతో మనల్ని మనం చూసుకుంటాం. ఇదే చాలా పెద్ద పొరపాటు. ఇది సరి కాదు. ఇతరులను మరియు మనల్ని కూడా మనం పాజిటివ్‌గానే చూడాలి.

పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనపడ్డట్టు...

✪ మనకు అహం ఉన్నప్పుడే ఇతరులు మనకు అహంభావులుగా కనిపిస్తుంటారు.

✪ మనకు అవినీతి గుణం ఉన్నప్పుడే ఇతరులు అవినీతిపరులేమోనని మనకు అనిపిస్తుంది.

✪ మనకు నేర స్వభావం ఉన్నప్పుడే ఇతరులు నేరస్తులేమోనని అనిపిస్తుంది.

✪ మనకు దుష్ట స్వభావం ఉన్నప్పుడే ఇతరులు దుష్టులుగా కనపడుతుంటారు.

✪ మనకు మోసపు గుణం ఉన్నప్పుడే ఇతరులు మోసగాళ్ళుగా కనపడుతుంటారు.

✪ మనకు మంచి గుణాలుంటే ఇతరులు మనకు మంచి వాళ్ళుగా కనపడుతుంటారు.

✪ మనకు ఎంత నెగెటివ్ గుణం ఉంటే అంత నెగెటివ్‌గా, మనకెంత పాజిటివ్ గుణం ఉంటే అంత పాజిటివ్‌గా ఇతరులు కనపడుతుంటారు.

✪ ఇతరులను పాజిటివ్‌గా చూడమన్నాను కదా అని అందరినీ గుడ్డిగా నమ్మేయకూడదు. ఎరుకతో, పూర్తి జాగ్రత్తగా ఉండాలి, కాకపోతే పాజిటివ్‌నెస్‌ను కలిగి ఉండాలి. ఎరుకతో ఉండాలి, ఒకవేళ మీ అంచనా తప్పై అవతలి వారు నెగెటివ్ వ్యక్తులైతే మీరు ఇరుక్కుని నష్టపోకుండా ఎరుకతో ఉండాలి.

✪ అయితే చాలా మంది తెలియక చేసే పెద్ద పొరపాటు ఏమిటంటే వీళ్ళకు ఉన్న నెగెటివ్ గుణాలలో నుండి ఇతరులను చూసి తమ నెగెటివ్ గుణాలకు విశ్లేషణ, ముందు జాగ్రత్త అనే ముసుగు వేసుకుంటారు. ఇది తెలుసుకోకపోతే వారికి చాలా నష్టం జరుగుతుంది.

గుర్తుంచుకోండి - సాధారణంగా అత్యధిక శాతం మనుషుల్లో పాజిటివ్, నెగెటివ్ గుణాలు రెండూ ఉంటాయి. పాజిటివ్ గుణాలలో నుండి తనను తాను చూసుకుంటాడు. తనకున్న నెగెటివ్ గుణాలతో మాత్రం ఇతరులను చూస్తాడు. దానికి విశ్లేషణ, లౌక్యం, తెలివి, ముందు జాగ్రత్త అనే చక్కని ముసుగులు వేస్తాడు. దీని వలన ఇతరులకు ఏమీ నష్టం జరగదు కానీ, ఈ విధంగా నెగెటివ్‌గా ఆలోచించడం వలన ఇతడికే నష్టం జరుగుతుంది. ఇతడిలో ఉన్న నెగెటివ్ గుణాలు ఇతడి శరీరంలోకి + జీవితంలోకి నెగెటివ్ పరిస్థితులను ఆకర్షిస్తూనే ఉంటాయి.

నెగెటివ్ గుణాలను కలిగి ఉండడం అంటే, నెగెటివ్‌గా ఆలోచించడం అంటే శరీరంలోకి రోగాలను, జీవితంలోకి సమస్యలను ఆహ్వానించడమే.

మీలో ఉన్న నెగెటివ్ గుణాలను ఒప్పుకోలేక, వాటిని గుర్తించలేక ఇతరులు నెగెటివ్ అని మీరు అనుకుంటూ ఉంటారు.

ఒక ఉదాహరణ క్రింద ఇస్తున్నాను చదవండి :

ఒకసారి నా క్లాస్ అయిపోయిన తర్వాత నా దగ్గరికి ఒక వ్యక్తి వచ్చాడు. సార్ మీతో పర్సనల్‌గా అయిదు నిమిషాలు మాట్లాడాలి అని అన్నాడు. నేను సరే అని అతనితో పర్సనల్‌గా మాట్లాడాను. అప్పుడు ఆయన తన సమస్యను నాకు వివరించాడు.

ఆయన ఒక క్రీడకు కోచ్. అతడికి డిగ్రీ చదివే కూతురు ఉంది. ఆ అమ్మాయికి సంగీతం అంటే ఇష్టం. తన కూతురికి సంగీతం నేర్పించాలనేది ఇతడి కోరిక. అయితే సంగీతం నేర్చుకోడానికి అమ్మాయిని పంపిస్తే అక్కడ గురువులు అమ్మాయిని ఏమైనా చేస్తారేమోనని ఇతని భయం. కాబట్టి నాకు తెలిసిన మంచి మహిళా సంగీత గురువులు ఎవరైనా ఉంటే చెప్పమని నన్ను అడిగాడు. పురుష సంగీత గురువుల పైన ఇతడికి నమ్మకం లేదు. ఇదీ ఇతని సమస్య.

అంతా విన్న తర్వాత నేనన్నాను సమస్య సంగీత గురువుల్లో కాదు, మీలోనే ఉంది అని సూటిగా చెప్పేశాను. అతను ఒక్క సారిగా షాకయ్యాడు. తనను తాను తమాయించుకొని, ఎలాగో వివరించమని అడిగాడు. అప్పుడు నేను అడిగిన ప్రశ్నలకు నిజమైన జవాబులు చెబితేనే నిరూపించగలుగుతాను అని అన్నాను. అతడు సరే అన్నాడు. ఇక నేను ప్రశ్నలు మొదలు పెట్టాను. మీరు కోచ్ కదా, మీ దగ్గరికి నేర్చుకోడానికి అమ్మాయిలు, అబ్బాయిలు వస్తుంటారా అని అడిగాను. అవును అని అతను జవాబిచ్చాడు. సరే, అబ్బాయిల సంగతి వదిలేయండి, అమ్మాయిల విషయానికి వద్దాం. మీకెప్పుడైనా మీ దగ్గరికి నేర్చుకోడానికి వచ్చిన అమ్మాయిలతో సెక్స్ చేయాలనిపించిందా నిజాయితీగా

చెప్పమని అడిగాను. అతను అవును అన్నాడు. అప్పుడు నేను, మీరు ఎవరితోనైనా సెక్స్ చేశారా అని అడిగాను. అతను ఇంత వరకైతే చేయలేదని అన్నాడు. ఎందుకు చేయలేదని అడిగాను. చేయాలని ఉన్నా, ఎవరికైనా తెలిస్తే పరువు పోతుందని చేయటం లేదని చెప్పాడు. అప్పుడు నేను సేఫ్‌గా ఛాన్స్ వస్తే చేస్తారు కదా అని అడిగాను. అతను చేస్తాను అని చెప్పాడు.

అప్పుడు నేను అతనికి వివరించాను. మీరు ఇలాంటి గుణాలను కలిగి ఉన్నారు కాబట్టే ఇతరులను కూడా మీ కోణంలో నుండే చూస్తున్నారు. సమస్య మీది, ఈ విషయాన్ని గ్రహించండి అని చెప్పాను. విషయాలను వివరించాను. అతను విషయాలను అర్థం చేసుకుని, చాలా నిజాయితీగా విషయాన్ని ఒప్పుకుని తన లోపాలను గుర్తించి ధ్యాన సాధన ద్వారా వాటిని అధిగమించాడు. మొదట్లో మామూలుగా ఉన్నా, ఇప్పుడు నా పైన హృదయపూర్వక గౌరవ భావం కలిగి ఉన్నానని చెప్పాడు.

ఇవీ విషయాలు మిత్రులారా !

గుర్తుంచుకోండి, మనకున్న నెగెటివ్ కోణాలలో నుండి ఇతరులను చూడటం తక్షణమే మానివేయాలి. మీకు ఉన్న గుణాలలో నుండే మీరు ఇతరులను చూస్తారు. అది పాజిటివ్ అయినా, నెగెటివ్ అయినా ! ఇతరులను నెగెటివ్‌గా చూడకండి కానీ పూర్తి స్థాయి ఎరుకతో ఉండాలి. ఎవరు ఎలాంటి వారో చెప్పలేం.. పాజిటివ్ చూడడం అనేది మనల్ని మనం రక్షించుకోవడానికే కానీ నష్టపోవడానికి కానే కాదు ! ఎరుకతో ఉండాలి. అవతలి వారి పట్ల పూర్తి ఎరుకతో ఉంటూ వారి నుండి పాజిటివ్‌నెస్‌ను ఎక్స్‌పెక్ట్ చేస్తూ ఉండాలి. ఎరుక + పాజిటివ్‌నెస్‌ను ఏక కాలంలో కలిగి ఉండాలి.

అయితే ఒక ముఖ్య విషయం :

"ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు" అన్నట్టు ఈ గుణాలు లేని వారు కూడా ఇలా ఆలోచిస్తారు. అయితే వారిది పాజిటివ్ ధోరణి. వారిది అవగాహనతో కూడిన ధోరణి. కాబట్టి మీరు ఇతరుల పట్ల ఏవైనా సందేహాలు, అనుమానాలు ప్రకటించే ముందు మిమ్మల్ని మీరు చెక్ చేసుకోండి. మీ నెగెటివ్ గుణాలలో నుండి అవతల వారిని అనుమానిస్తున్నారా ? లేక పూర్తి ఎరుకతో కూడి ఉన్న పాజిటివ్‌నెస్‌తో, అవగాహనతో, ముందు జాగ్రత్త చర్యగా ఇలా ఆలోచిస్తున్నారా ? అనేది మీరు తెలుసుకుని తేల్చుకోవాల్సిన విషయం. క్రమం తప్పని ధ్యాన సాధన ద్వారా ఈ విషయం తేలిపోతుంది.

వాస్తవానికి "పాజిటివ్" అనే పదం యొక్క అసలైన అర్థం ఏమిటంటే - మీ పరిస్థితులు బాగున్నప్పుడు మీరు పాజిటివ్‌గా ఉండడం కాదు. మీ పరిస్థితులు బాగా ఉన్నప్పుడు మీరు పాజిటివ్‌నెస్‌ను మెయింటేన్ చేస్తే అది నిజమైన పాజిటివ్‌నెస్ కాదు. ఏ ఎండకా గొడుగు పట్టడం అది. మీ పరిస్థితులు నెగెటివ్‌గా ఉన్నప్పుడే మీరు పాజిటివ్‌గా ఉండాలి, ఇదే నిజమైన పాజిటివ్‌నెస్ అంటే ! మీ పరిస్థితులు నెగెటివ్‌గా ఉన్నప్పుడు మీరు పాజిటివ్‌గా ఉంటే అప్పుడు తక్షణమే మీ పరిస్థితులు మీకు అనుకూలంగా మారిపోతాయి. ఇది పరమ సత్యం !

పాజిటివ్‌నెస్ అనేది మహా దివ్య శక్తి. దీన్ని మీరు దేని మీద ప్రయోగిస్తే దాని మీద పని చేస్తుంది. దాన్ని మీకు పూర్తి అనుకూలంగా మారుస్తుంది. మీరు ఆశించిన ఫలితాలను ఇస్తుంది. ఏదైనా విషయంలో మీరు పాజిటివ్‌గా ఉంటున్నారు అని అంటే ఆ పనిలో మీరు గ్యారంటీగా సక్సెస్ అవుతారనే అర్థం. ఒక వేళ మీరు విఫలం అయ్యారంటే సరిపోయినంత పాజిటివ్‌నెస్‌ను జోడించలేదని అర్థం లేదా ఇంకా ఎన్నో కారణాలు ఉంటాయి.

చాలా మందికి పాజిటివ్‌నెస్ యొక్క శక్తి తెలియదు. అది ఒక ఊత పదమేమో అని అనుకుంటూ ఉంటారు. పాజిటివ్‌నెస్ గురించి మీకు సరిగ్గా అర్థం అయితే, ఎగిరి గంతేస్తారు. పాజిటివ్‌నెస్‌ను సరిగా అర్థం చేసుకున్న వ్యక్తి ఏదైనా సాధించ గలడు. పాజిటివ్‌గా ఉండడం అని అంటే అన్ని విజయాలను, అన్ని ఆనందాలను అనుభవించ బోతున్నారని అర్థం. అన్ని కోరికలను తీర్చుకోబోతున్నారు అని అర్థం.

ప్రతీ విషయంలోనూ పాజిటివ్‌గా ఉండడం ఈ క్షణం నుండే ప్రారంభించండి. అనుక్షణం ఎరుకతో ఉండండి. మీ ఆలోచనలను కేవలం పాజిటివ్‌గా మాత్రమే ఉండేలా చూసుకోండి.

కొన్ని ఫలితాలు నెగెటివ్‌గా వచ్చినా సరే, మీరు నిరాశ చెందవద్దు. ఆ ఫలితాలు మీ పాత నెగెటివ్ ఆలోచనా ధోరణి వలన వచ్చినవి. అవి పాతవి. మీరు మాత్రం పాజిటివ్‌గా ఉండండి. అలా మీరు పాజిటివ్‌గా ఉంటూ ఉంటే కొన్ని రోజులకు మీ నెగెటివ్‌లు అన్నీ క్లియర్ అయిపోతాయి. ఇక రావు. ఎందుకంటే మీరు పాజిటివ్‌నెస్‌లో స్థిరం అయిపోయి ఉంటారు కదా ! పాజిటివ్‌నెస్‌లో స్థిరం అయిపోయి ఉన్న వారికి ఇక ఏ నెగెటివ్‌లు ఎదురు కావు. కాబట్టి పాజిటివ్‌గా ఉండడం ప్రాక్టీస్ చేయండి.

వయసు పెరుగుతున్న కొద్దీ అనారోగ్యాలు వస్తాయి. శక్తి తక్కువ అవుతుంది. జుట్టు తెల్లగా అవుతుంది. బట్టతల వస్తుంది. కళ్ళద్దాలు వస్తాయి. సెక్స్ సామర్థ్యం తగ్గిపోతుంది. సెక్స్ కోరికలు తగ్గిపోతాయి. శరీరం ముడుతలు పడుతుంది మొదలైనవన్నీ నిజాలు కావు.

ఇవన్నీ కేవలం నమ్మకాలు మాత్రమే అని తెలుసుకోండి.

మీరు, నేను నిత్య యవ్వనంగా ఉండాలి అని సంకల్పించుకుంటే, 100 సంవత్సరాల వయసులో కూడా 25 ఏళ్ళ పడుచు వారిలా జోరుగా హుషారుగా ఉండవచ్చు. వయసుతో పనిలేదు. యవ్వనం అనేది మీరు ఉంచుకున్నంత కాలం ఉంటుంది. మీరు ఈ భూమి పైన ఉన్నంత కాలం నిత్య యవ్వనంగా ఉండాలి అని అనుకుంటే ఉండగలరు. మీరు ఇప్పుడు కలిగి ఉన్న మీ దేహం కొన్ని వేల సంవత్సరాల వరకు ఎలాంటి పోషణ లేకుండా నిత్య యవ్వనంతో విరాజిల్లేంత శక్తి సామర్థ్యాలను పొందు పర్చుకునే ఉంది. మీ దేహం గురించి మీకు తెలియక మీరు ఏమేమో అనుకుంటున్నారు. మీరు 100 సంవత్సరాల వయసులో 25 ఏళ్ళ వారిలా శక్తివంతంగా ఉండవచ్చు. ఇంకా చెప్పాలంటే వారి కంటే ఎక్కువ సామర్థ్యంతో సెక్స్‌ను చేయవచ్చు మరియు అనుభవించవచ్చు.

ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శి మెత్తం బాగా శ్రద్ధగా చదివి అర్థం చేసుకుని సాధన ప్రారంభించండి. నిత్య యవ్వనంతో శోభిల్లండి. మీరు కోరుకున్నంత కాలం ఆనందంగా జీవించండి. - **రామ్‌తా & సేత్**

మానవత్వానికి చాలా అర్థాలున్నాయి. అందులో ఒకటి....
..."నేను పడుతున్న లేక పడిన బాధ నా పగవాడికి కూడా రాకూడదు"...
అని అనుకుని, అందు కోసం కృషి చేయడమే మానవత్వం.
ఈ విధంగా చేసిన వారు మాత్రమే ''మనుషులు'' అని అనబడతారు.
ఇలాంటి వారే మానవత్వంలో నుండి దైవత్వంలోకి
ప్రవేశించి దైవంగా పరిణమిస్తారు.

ప్రస్తుతం సమాజంలో చెలామణిలో
ఉన్న కట్టుబాట్లు అనేవి వికాస పరంగా చూస్తే సరైనవి కావు.
వాటిలో అత్యధిక శాతం అజ్ఞాన పూరితమైనవే ! వీటిని గుడ్డిగా
అనుసరిస్తూ ఉండడం వలన కూడా కష్టాలు వస్తూ ఉంటాయి. ఎందుకంటే, అజ్ఞాన
పూరితమైన కట్టుబాట్లను నీవు ఒప్పుకున్నావు అని అంటే ఏమిటి దాని
అర్థం ? నీకు అజ్ఞానం ఉంది అనేకదా దాని అర్థం. అజ్ఞానం ఎక్కడ ఉంటే
అక్కడ కష్టాలు ఉంటాయి. ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శి మొత్తం బాగా
శ్రద్ధగా చదివి అర్థం చేసుకుంటే, ఏ ఏ కట్టుబాట్లను తిరస్కరించాలో, వేటిని
అనుమతించాలో మీకు చక్కగా అర్థం అయిపోతుంది.

19. ఏదైనా సులభమే, సరళమే, సాధ్యమే !

సాధ్యం అంటే అది నాకు ప్రాప్తం ఉందని ఒప్పుకోవడం !

సాధన అంటే అది నాదే అని ఒప్పుకుని దాన్ని ప్రాప్తించుకోవడానికి పూనుకోవడం, అనుమతించడం ! అసాధ్యం అని అనడం అంటే దాని మీద నాకు ఇంట్రెస్ట్ లేదు, అది నా ప్రాప్తంలో లేదు అని తిరస్కరించడం ! సాధ్యం - అసాధ్యం లేక సంభవం - అసంభవం అనేవి పూర్తిగా మన మీదనే ఆధారపడి ఉంటాయి. మనం ఒప్పుకుంటే సాధ్యం(సంభవం), మనం తిరస్కరిస్తే అసాధ్యం(అసంభవం) !

మనకు 100% ఇంట్రెస్ట్ ఉండాలే గానీ, దేనినైనా పొందవచ్చు. అన్నీ సులభమే, సరళమే అని భావించండి, అప్పుడు అన్నీ సులభం, సరళం అయి తీరుతాయి.

యద్భావం తద్భవతి కదా !

మీ నమ్మకాలే మీ వాస్తవాలు !

మీరు దేన్ని ఎలా నమ్మితారో అది అలానే జరుగుతుంది. ఎండలో తిరిగితే వడ దెబ్బ కొడుతుంది. వర్షంలో తడిస్తే జలుబు చేస్తుంది. కనీసం 8 గంటల నిద్ర లేకపోతే ఆరోగ్యం పాడవుతుంది. పరిపూర్ణమైన ఆరోగ్యం అనేది అసంభవం. ఎప్పుడూ ఏదో ఒక రోగమో జబ్బో నొప్పో వ్యాధో మనుషులకు వస్తూనే ఉంటాయి.

మన చేతిలో ఏమీ లేదు.

మనం ఏం చేయగలం ? కొన్ని అనారోగ్యాలకు చికిత్స లేదు...

...మొదలైనవన్నీ నమ్మకాలు మాత్రమే. సత్యాలు కావు. కేవలం నమ్మకాలు. అంతే. ఆత్మ విజ్ఞాన అవగాహన లోపించిన సరికాని నమ్మకాలు. వీటిని వదిలించుకోవాలి. అప్పుడు కానీ బాగుపడలేం... వదిలించుకోవడం ఎలా ? అని అంటే...

ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శి మొత్తం బాగా శ్రద్ధగా

చదివి అర్థం చేసుకోండి. మీకే అర్థం అవుతుంది.

౭౦. ఎల్లప్పుడు విజయంతో విజేతలుగా విరాజిల్లుదాం

విజయం : మీరు చేయాలనుకున్న పనిని అనుకున్నది అనుకున్నట్టుగా చేయడమే విజయం.

అపజయం : మీరు చేయాలనుకున్న పనిని అనుకున్నది అనుకున్నట్టుగా చేయకపోవడమే అపజయం.

విజయం : ఒక పనిని మొదలు పెట్టి, మధ్యలో ఉపసంహారం చేయకుండా దానిని పూర్తి చేయడమే విజయం.

అపజయం : ఒక పనిని మొదలు పెట్టి, దానిని పూర్తి కాకుండానే, విరమించుకోవడమే అపజయం.

విజయం అనేది ఒక పని పూర్తి అయిన స్థితి ! అపజయం అనేది పూర్తి కాని స్థితి, అంతే ! జయాపజయాలు పూర్తిగా మన మీదనే ఆధారపడి ఉంటాయి. అనుకున్న పనిని పూర్తి చేసిన తర్వాతనే విజయం అనేది ప్రకటం అవుతుంది, అంతకు ముందు కాదు. విజయం అనేది ఎక్కడి నుండో ఊడిపడదు. పని పూర్తి అయిన తర్వాత - పూర్తి అయిన పనే విజయంగా మారుతుంది.

అనుకున్నది అనుకున్నట్టుగా జరగడానికి, మీరనుకున్న దాన్ని మీరే అనుమతించాలి. అప్పుడే అది సక్సెస్ అవుతుంది.

ఎప్పుడూ ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండే వారిని విజయం ఏరి కోరి వరించడమే కాకుండా వెన్నంటి ఉంటుంది. ఈ ఉత్సాహ, ఉల్లాసాలు ఆత్మ విజ్ఞాన అభ్యాసం ద్వారా మరియు క్రమం తప్పని ధ్యాన సాధన ద్వారా అత్యంత సులభంగా, సరళంగా వచ్చేస్తాయి. శ్రమ ఎక్కడ ఉంటే అక్కడ విజయం ఉంటుంది. ఆ శ్రమకు ఆత్మ విజ్ఞానం తోడైతే ఎదురు లేని, తిరుగు లేని, శాశ్వతమైన మహా విజయం, అత్యంత సులభంగా, సరళంగా, సహజంగా ప్రాప్తిస్తుంది. గతి తప్పని ప్రాప్తి ఇది. ఆత్మ విజ్ఞానం + ధ్యానం ద్వారా సాధించలేనిది అంటూ ఈ భూమి పైన ఏదీ లేదు ! ఏదైనా, ఏదైనా..... ఏదైనా..... సాధించవచ్చు ! గురు మార్గదర్శకత్వంలో ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ధ్యాన సాధన చేసి శాశ్వత విజేతలుగా విరాజిల్లండి !

❖ ❖ ❖

21. మహాదాలోచనలు చేయండి, వాటిని ఆచరించండి !

Think Big !

Do Big !

Get Big !

గొప్ప, గొప్ప ఆలోచనలు చేయాలి. మహోన్నతమైన ఆలోచనలు చేయాలి. మహదాలోచనలు చేయాలి, వాటిని సంపూర్ణంగా ఆచరించాలి.

మీరు ఎలా ఆలోచిస్తే అలాంటి వారే అవుతారు !

As he thinketh in his heart, so is he !

- The Holy Bible - Proverbs 23 : 6

మీ గురించి మీరెంత అనుకుంటుంటే, మీరంత వారవుతారు. మీ ఆలోచనలను బట్టి మీరేమిటో చెప్పేయవచ్చు.

మీరు వందల్లో ఆలోచిస్తే వందల్లోనే ఉంటారు.

మీరు వేలల్లో ఆలోచిస్తే వేలల్లోనే ఉంటారు.

మీరు లక్షల్లో ఆలోచిస్తే లక్షల్లోనే ఉంటారు.

మీరు కోట్లల్లో ఆలోచిస్తే కోట్లల్లో ఉంటారు.

మీరు ఏం ఆలోచించి, దాన్ని ఆచరిస్తే దాని గానే పరిణమిస్తారు.

Think Abundance ! Do Abundance ! Get Abundance !

Think Great ! Do Great & Become Great !

Think Ultimate ! Do Ultimate & Become Ultimate !

చేస్తే గొప్ప, గొప్ప ఆలోచనలే చేయాలి, వాటినే ఆచరించాలి. అనంత శక్తి సామర్థ్యాలను కలిగి ఉన్న మనం మహోన్నతమైన ఆలోచనలు చేసి మహా కార్యాలు సాధించాలి.

చాలా మంది ఆలోచించడానికే భయపడతారు. సిగ్గుపడతారు. గొప్ప ఆలోచనలు చేసి భంగపడటం ఎందుకు అని సంకుచిత ధోరణితో జీవిస్తూ ఉంటారు. ఎవరైనా, ఏదైనా గొప్ప ఆలోచన చేసినప్పుడు కనీసం దానిని అభినందించరు, పైగా వారిని "చాలు, చాల్లేవోయి, పెద్ద పోటుగాడి లాగా బయలుదేరాడండి మొనగాడు" అంటూ నిరుత్సాహ పరుస్తారు. మరి కొంత మంది ఉత్సాహ పరుస్తారు, సహాయం చేస్తారు. నిరుత్సాహ పరిచే వారికి పూర్తిగా వేరై, దూరంగా ఉండాలి. ఉత్సాహ పరిచి, సహాయం చేసేవారితో కలిసి ఉండాలి.

నా విషయంలో ఇదే జరిగింది. చిన్నప్పటి నుండి నాకు ఏవో గొప్ప, గొప్ప కార్యాలు చేయాలని ఉండేది. నేను ఎల్లప్పుడూ వాటి గురించే ఆలోచించే వాడిని. (నేను వాకిన్ మాస్టర్‌నని నాకు 2013లో తెలిసింది) అందరూ నన్ను ఏదో ఒక ఉద్యోగమో, వ్యాపారమో చేసుకోమనే వారు. నాకు అస్సలు ఇంట్రెస్ట్ ఉండేది కాదు. సాధారణంగా జీవించాలంటే నా వల్ల కాక పోయేది. నాకు తెలిసిన నా బంధు మిత్రులు ఎవ్వరూ కూడా నా ఆలోచనలను అర్థం చేసుకోలేదు. పైగా నన్ను ఘోరమైన రీతిలో అవమానించారు. దాంతో ఇక లాభం లేదు అనుకుని అందరికీ దూరమై ప్రశాంతంగా నాపై నేను రీసెర్చ్ చేసుకున్నాను. నాకు నేను ఒక మహా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాను. అంతే ! 100% డిసైడ్ అయిపోయాను. నా లక్ష్య సాధనకు పూర్తిగా నన్ను నేను అంకితం చేసుకున్నాను.

నా లక్ష్యం గురించి విన్న వారికి మతి పోయింది. ఇక చూడండి నన్నూ, నా ప్రాజెక్ట్‌ను ఎంత ఘోరంగా విమర్శించారంటే, ఆ దెబ్బకు మామూలు వాళ్ళైతే అంతా వదిలేసే వాళ్ళు. కానీ నేను వాళ్ళ కువిమర్శలను, నిందలను, తిట్లను ప్రోత్సాహకాలుగా తీసుకున్నాను. ఇవన్నీ జరిగే పనులు కావని అనవసరంగా జీవితాన్ని వృథా చేసుకోకుండా ఏదో ఒక పని చేసుకుంటూ బ్రతకమని నాకెంతో మంది ఉచిత సలహాలు ఇచ్చారు, ఇలా ఉచిత సలహాలు ఇచ్చిన వారెవరని అనుకున్నారు - "ఆత్మ విజ్ఞానం + ధ్యానం ద్వారా ఏదైనా సాధించవచ్చు" అని ప్రచారం చేసే వాళ్ళే. ఒకానొక ధ్యాన ప్రచార సంస్థలోని సభ్యులు. కేవలం ఊరికే అలా చెప్పాలట, అంతే ! ఆచరించ వద్దట. నన్ను చాలా రకాలుగా నిరుత్సాహ పరిచారు, కేవలం ప్రచారం మాత్రమే చేయి, ఇవన్నీ అయ్యే పనులు కావని. దానితో అలాంటి వారందరికి శాశ్వతంగా దూరం అయ్యాను. నేనెందుకు భూమి మీదకు వచ్చానో అదే నేను చేస్తాను. అనుకుంటే, ఇంకా ఎక్కువే చేస్తానని నాకు తెలుసు.

I came to this planet Earth

for a "Supreme Divine Cause" !

I am a Super Supreme Master !

I came here to lead, but not to follow !

ఎవరేమైనా అనుకోనీగాక, నేను ఇది సాధించియే తీరుతానని ఖచ్చితంగా నాకు తెలుసు ! అని భావించాను, పని మొదలు పెట్టాను.

నా ఈ లక్ష్య సాధనలో నా భార్య 100% సహకరించింది. ఇంకా నా శిష్యులు పూర్తి అంకిత భావంతో పని చేస్తున్నారు.

మనిషి తలుచుకుంటే ఏదైనా సాధించగలడు. అనంతమైన శక్తి సామర్థ్యాలను కలిగి ఉన్న మనం దేనినైనా అవలీలగా సాధించగలం మిత్రులారా ! మహా, మహుల చరిత్రలు చదవండి. విషయాలను గ్రహించండి. ప్రతీ ఒక్కరు కూడా అనంత శక్తి స్వరూపులే ! కానీ ఏం జరుగుతూ ఉంది ? ఎవరి సమస్యలలో వారు ఇరుక్కుపోయి సతమతమవుతూ, బ్రతికి ఉంటే చాలుననే ధోరణితో జీవిస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందంటే ఎవరి శక్తి, సామర్థ్యాలు వారికి తెలియకనే.

మనము సాక్షాత్తు దైవాలమే మిత్రులారా ! అనంత శక్తి సామర్థ్యాలను కలిగి ఉన్న మనం, కేవలం మన కుటుంబానికే కాదు, తలుచుకుంటే మొత్తం లోకానికే శ్రేయస్కరంగా పరిణమించవచ్చు. నేను పరిణమించానని ఖచ్చితంగా నాకు తెలుసు. తలుచుకుంటే, అంకితమైతే ఎవరైనా పరిణమించగలుగుతారు.

మీరు కూడా ఏవైనా గొప్ప గొప్ప లక్ష్యాలు పెట్టుకోండి. ఇప్పుడు మీ పరిస్థితి ఎలాంటిదైనా కానివ్వండి. మహా శక్తి స్వరూపులైన మీరు శీఘ్రంగా వాటిని అధిగమించి మీ లక్ష్యాలను సాధించగలుగుతారు. నేను చాలా దీనమైన, దయనీయమైన, దుర్భర పరిస్థితులలో ఉన్నప్పుడు నా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాను. పూర్తిగా నా లక్ష్యానికే అంకితం అయ్యాను. రాత్రింబవళ్ళు పని చేశాను. ఎంతో కఠినమైన పరీక్షలు ఎదుర్కొన్నాను. ఎన్నో ఘోర అవమానాల పాలయ్యాను. ఎందెందరి చేతనో నిందింప బడ్డాను. ఎన్నెన్నో సార్లు విఫలమయ్యాను. నా రీసెర్చ్‌లలో భాగంగా 2005 చివరిలో 100 రోజులు మృత్యువుతో పోరాడాను. సూటిగా చెప్పాలంటే చచ్చి బతికాను. మృత్యువును పొందినంత పనిచేసి తిరిగి జీవించాను. కేవలం 21 రోజుల్లో పూర్తిగా కోలుకున్నాను. నా అంతశ్చైతన్యం యొక్క ప్రేరణతో, శక్తితో అన్నింటినీ అధిగమించాను.

ఒకప్పుడు కఠినమైన పరిస్థితులలో ఉన్న నేను ఇప్పుడు... పరమోన్నత స్థితిలో ఉన్నాను. ఇంకా ఎన్నో పరమోత్తమమైన అందలాలను అధిరోహిస్తానని నాకు తెలుసు.

భారతదేశం అంతటా తిరిగాను. పూర్తి ఉచితంగా క్లాస్‌లు నిర్వహించాను, కొన్ని లక్షల మంది ఆనందానికి, విజయాలకు కారణం అయ్యాను. త్వరలోనే కోట్లాది మంది సాఫల్యానికి కారణం అయితీరుతానని నాకు తెలుసు. ఇదంతా కేవలం నా ఆత్మ అభివృద్ధి కోసం మరియు ఇంకా యావత్ భూమండలం పట్ల నా కనీస బాధ్యతగా భావిస్తూ చేస్తున్నానంతే !

ప్రియ మిత్రులారా ! ఈ భూమి పైనే కాదు, అనంత సృష్టిలో ఆత్మ విజ్ఞానం ద్వారా ఏదైనా సాధించవచ్చు. ఒకప్పుడు కఠినమైన పరిస్థితులలో ఉన్నవాడే నేడు మంచి స్థితిలో ఉండగలిగాడు అని అంటే, మహోన్నతులైన మీరు కూడా గొప్ప గొప్ప కార్యాలను సంభవం చేయగలుగుతారు. దయచేసి, మీ గురించి మీరు తెలుసుకోండి.

మహా, మహదాలోచనలను చేయండి, వాటిని తక్షణమే ఆచరించండి. మీకు సర్వ సృష్టి సహాయ సహకార సమన్వయాలను అందిస్తుంది. సర్వులు మీకు పూర్తిగా, అన్ని రకాలుగా సహాయ సహకార సమన్వయాలను అందిస్తారు.

✪ మీరు దైవమేనని తెలుసుకోండి. మిమ్మల్ని ఆపే ఏ శక్తి ఈ సృష్టిలోనే లేదని తెలుసుకోండి. మీరు ఈ సృష్టిలోని ఏ శక్తి ముందు, దీనంగా మోకరిల్లి పడి ఉండాల్సిన అవసరం లేదని తెలుసుకోండి.

✪ మీరు ఎవరి చేతా శాసించబడటం లేదని తెలుసుకోండి. మిమ్మల్ని ఎవరూ శాసించలేరు, ఏ శక్తీ ఎన్నటికీ శాసించదు అన్న సత్యాన్ని గ్రహించండి.

✪ అనంతమైన శక్తి సామర్థ్యాలను కలిగి ఉన్న మీరు ఈ సృష్టిలో ఏదైనా సాధించగలరని తెలుసుకోండి. సృష్టి యొక్క అత్యంత ప్రధానమైన భాగమే మీరని తెలుసుకోండి. యావత్ సృష్టి చైతన్యం అంతా మీకు అండగా మీ లోపలే ఉందని తెలుసుకోండి.

All The Very Best !

22. బ్రతికితే చాలనుకునే ధోరణిని తక్షణమే వదిలేయాలి

అనంత శక్తి సామర్థ్యాలు కలిగిన పరమాత్మ స్వరూపులమైన మనం "కేవలం బ్రతికితే చాలు" అనుకునే ధోరణి నుండి తక్షణమే పూర్తిగా, శాశ్వతంగా బయటపడాలి. బ్రతకడం కాదు, జీవితాన్ని జీవించాలి. అందరు కూడా తమ తమ జీవితాలలో జీవించేందుకు బలమైన ప్రేరణనివ్వాలి. అందుకు తగిన సహాయ సహకార సమన్వయాలను అందించాలి.

ఈ భూమి మీద ఉన్న ప్రతీ మానవుడు సాక్షాత్తు పరమాత్మయే ! అయితే తన "నిజ తత్వం" గురించి తెలియక అలా ఉన్నాడంతే !

జీవితంలోని ఆటు పోట్లు ఉత్సాహాన్ని నీరుగార్చేస్తాయి. దెబ్బ మీద దెబ్బ పడుతుంటే ఏం చేయాలో పాలుపోక "ఏదో అలా బ్రతికితే చాలులే" అనే స్థితి రావడం సహజమే ! కానీ ప్రియ మిత్రులారా, ప్రస్తుతం మీ పరిస్థితి ఎటువంటిదైనా కానివ్వండి, దానిని క్షణంలో మలుపు త్రిప్పగల శక్తి సామర్థ్యాలు మీకున్నాయి. మీ నిరాశపూరిత ధోరణిని తక్షణమే విసర్జించండి. పూర్తి ఆశావహ దృక్పథంతో, "ఏదైనా సాధ్యమే" అనే ధోరణితో ఆలోచించడం మొదలు పెట్టండి. మనం కేవలం మన కోసమే కాదు, మన కుటుంబం కోసం కూడా ఉన్నామని గుర్తు చేసుకోవాలి. మనం కేవలం మన కుటుంబ సభ్యుల కోసమే కాదు, మన బంధు మిత్రుల కోసం కూడా ఉన్నామని గుర్తు చేసుకోవాలి. మనం కేవలం మన కోసం, మన కుటుంబం కోసం, మన బంధు మిత్రుల కోసమే కాదు యావత్ భూమండలం కోసం ఉన్నామని గ్రహించాలి.

ప్రస్తుతం భూమి పైన ఉన్న ప్రతీ వ్యక్తి కేవలం తనను తాను బాగు చేసుకోవడమే కాకుండా ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపగలడు. మహాశక్తి సంపన్నుడైన ప్రతీ మనిషి తన నిజ శక్తిని గుర్తిస్తే, ఎంతో మంది విజయానందాలకు కారణం కాగలడు. నిరంతర అత్యున్నతమైన ఆత్మ విజ్ఞాన అభ్యాసం + క్రమం తప్పని ఉన్నత ధ్యాన సాధన ద్వారా మనిషి ఏదైనా సులభంగా చేయగలడు.

బ్రతికితే చాలనుకునే ధోరణిని తక్షణమే వదిలేయాలి ! తాను జీవిస్తూ, అందరినీ జీవింప చేయాలనే ఆలోచనను ప్రారంభించి, తక్షణమే దానిని ఆచరించాలి ! ఎందుకంటే "బ్రతికితే చాలు" అని అనుకుంటుంటే అలాంటి పరిస్థితుల్లోనే మీరు బ్రతకాల్సి వస్తుంది. మీ దగ్గర ఎంత టాలెంట్ ఉన్నా "బ్రతికితే చాలు అనే భావన" వల్ల అది ఎప్పుడు కూడా ఉపయోగపడకుండా, ఎందుకూ పనికిరాకుండా పోతుంది. మీకు ఎన్ని "అవకాశాలు" వచ్చినా వాటిని ఈ భావన వల్లే వినియోగించు కోలేక పోతుంటారు. ఈ భావన ఉన్న వాళ్ళకు ఎప్పుడూ, ఏదీ కలిసి రాదు. ఈ భావన నుండి వారు బయట పడేంత వరకు వారి జీవితంలో ఆనందాలు అనేవి ఉండవు.

కాబట్టి "బ్రతికితే చాలనుకునే ధోరణిని" తక్షణమే వదిలేసి, గొప్పగా జీవించాలి అని మీరు కోరుకున్నప్పుడే గొప్ప జీవితం మీదవుతుంది. గొప్ప పరిస్థితులు వచ్చాక గొప్పగా జీవించడం అంటూ ఉండదు. గొప్పగా జీవించాలని కోరుకున్న తర్వాతే గొప్పగా జీవించే పరిస్థితులు వస్తాయి. ప్రస్తుతం మీరు చాలీ చాలని విధంగా బ్రతుకుతున్నారంటే అందుకు ఒకే ఒక కారణం "బ్రతికితే చాలు" అని మీరు భావించడమే.

కాబట్టి దయచేసి "బ్రతికితే చాలనుకునే ధోరణిని" తక్షణమే వదిలేయండి. గొప్పగా, ఉన్నతంగా జీవించాలని అనుకోండి. అప్పుడు గొప్ప వాళ్ళుగా, ఉన్నతులుగానే మీరు పరిణమిస్తారు.

౭౩. వేదాలు చెబుతున్నాయి మనమే మహామూల చైతన్య స్వరూపులమని (దేవుళ్ళమని) !

మనమే దేవుళ్ళం - అంతా దైవమే - అందరూ దేవుళ్ళే !

అసలు దైవం అంటే ఏమిటి ?

అంతా దైవమే ! అందరూ దేవుళ్ళే ! దైవం కానిది ఏదీ లేదు !

దైవం అంటే చైతన్యం ! దైవం అంటే సర్వస్వం ! దైవం అంటే ప్రేమ !

దైవం అంటే మైత్రి ! దైవం అంటే కరుణ ! దైవం అంటే స్వేచ్ఛ !

దైవం అంటే బ్రహ్మానందం ! దైవం అంటే ఉత్సవం !

దైవం అంటే ప్రజ్ఞ !

దైవం అంటే శాంతి ! దైవం అంటే శక్తి ! దైవం అంటే జీవితం !

దైవం అంటే జీవ శక్తి ! దైవం అంటే అన్ని మూలాలకు మూల చైతన్యం !

దైవం అంటే శాశ్వతం ! దైవం అంటే అనంతం !

దైవం అంటే స్వయం సాక్షాత్ మీరే !

ఈ విషయాన్నే ఈ క్రింది వేద వాక్యాలు ప్రకటిస్తున్నాయి.

నాలుగు మహా వేద వాక్యాలు

1. "ప్రజ్ఞానం బ్రహ్మ" - ఋగ్వేదం, ఐతరేయ ఉపనిషత్, 3.3
2. "అహం బ్రహ్మాస్మి" - యజుర్వేదం, బృహదారణ్యకోపనిషత్, 1.4.10
3. "తత్వ మసి" - సామ వేదం, ఛాందోగ్యోపనిషత్, 6.8
4. "అయమాత్మా బ్రహ్మ" - అథర్వ వేదం, మండూకోపనిషత్, 1.2

1. ఋగ్వేద మహా వాక్యమైన "ప్రజ్ఞానం బ్రహ్మ"

ఏం తెలియజేస్తుంది అంటే....

చైతన్యం = ప్రజ్ఞానం ! చైతన్యం అంటే ఆత్మ ! ఆత్మ అంటే ఇప్పుడు ఇది చదువుతున్న మీరే ! చైతన్యాన్ని ప్రజ్ఞానం అని అంటారు. ప్రజ్ఞానం బ్రహ్మ అని చెప్తోంది ఋగ్వేద మహా వాక్యం. ఇక్కడ బ్రహ్మ అని అంటే హిందువులు అనుకునే నాలుగు ముఖాల దేవుడు కాదు. ఇక్కడ బ్రహ్మ అంటే బ్రహ్మం అని అర్థం - అంటే దైవం ! త్రిమూర్తులు, త్రిమాతలు, ఆది శక్తి, పరాశక్తి ఇంకా మొదలైన దివ్యశక్తులకన్నింటికీ మూలమైన "మహా మూల చైతన్యాన్ని" దైవం అని అంటారు. ప్రజ్ఞానమే(చైతన్యమే) అంటే ఆత్మయే దైవం అని కన్‌ఫర్మ్ చేస్తోంది ఈ ఋగ్వేద మహా వాక్యం ! ఆత్మయే దైవం అంటే మీరే దైవం అని కదా అర్థం ! కాబట్టి దైవం కోసం బయట వెతకకుండా అంతరంలోనే దైవం ఉందని గ్రహించి దైవంతో ఏకత్వం పొందాలి. దైవంగా మీ నిజ స్థితిని తిరిగి మీరు పొందాలి.

జ్ఞానం యొక్క విశేష స్థితిని కూడా ప్రజ్ఞానం అని అంటారు. పుస్తక జ్ఞానం, విన్న జ్ఞానం సంపూర్ణంగా "అనుభవ జ్ఞానంగా" మారితే ఆ యొక్క విశేష స్థితిని, "ఆ విశేష అనుభవ జ్ఞానాన్ని" "ప్రజ్ఞానం" అని అంటారు. సరే ! ఇంతకు, దేనికి సంబంధించిన జ్ఞానం అంటే, "స్వయానికి" లేక "ఆత్మకు" సంబంధించిన జ్ఞానం. అనగా "ఆత్మ విజ్ఞానం" అన్నమాట.

"బ్రహ్మ" అనగా నాలుగు ముఖాల బ్రహ్మ అని కాదు ఇక్కడ అర్థం. "బ్రహ్మము" అని అర్థం. దైవం అని అర్థం. సర్వత్రా వ్యాపించి ఉన్న, సర్వోన్నతమైన, సర్వస్వంలో సర్వం అయిన, "అన్ని" మూలాలకు "మూలం" అయినటువంటి ఆ యొక్క "మూల చైతన్యం" - "Ultra Consciousness" అని అర్థం.

ఆ యొక్క సర్వాకార, నిరాకార, నిర్గుణ, సర్వగుణ పరబ్రహ్మను, ఆ "ఉనికిని", "బ్రహ్మ" అని ఇక్కడ, ఈ ఋగ్వేద మహా వాక్యమైన "ప్రజ్ఞానం బ్రహ్మ"లో అంటున్నారు.

"ప్రజ్ఞానం" అనగా ఆత్మ విజ్ఞానం, బ్రహ్మ అంటే దైవం అని ఈ మహా వాక్యం ప్రకటిస్తోంది. అనగా "ఆత్మ విజ్ఞానమే దైవము" అని స్పష్టంగా ప్రకటన చేస్తోంది ఈ మహా వాక్యము. "ప్రజ్ఞానం బ్రహ్మ" అంటే "ఆత్మ విజ్ఞానమే దైవము" అని అర్థం.

మరి, ఆత్మ విజ్ఞానం దైవం అయినపుడు, దానిని పొందిన వారు కూడా "దైవమే" అవుతారని గూఢార్థం ! అంటే ఎవరైనా సరే "ఆత్మ విజ్ఞానాన్ని" పొందితే వారు సాక్షాత్తు దైవమే అని చక్కగా, స్పష్టంగా తేలి పోయింది ఈ మహా వాక్యంలో !

✪ "ఆత్మ విజ్ఞానం కలిగిన వాడు దైవం" అని ఋగ్వేద మహా వాక్యమైన "ప్రజ్ఞానం బ్రహ్మ" ప్రకటిస్తోంది.

2. యజుర్వేదం యొక్క మహా వాక్యం "అహం బ్రహ్మాస్మి"...

...అంటే "నేనే దైవము" ! "నేను" అంటే ఇక్కడ "ఆత్మ" అని అర్థం, శరీరం కాదు. ✪ "అహం బ్రహ్మాస్మి" అంటే "**నేనే దైవం**" అని కుండ బద్దలు కొట్టినట్టుగా ప్రకటిస్తోంది ఈ యజుర్వేద మహా వాక్యం ! "నేను" అని అంటే అందరిలో ఉండే "నేను", "నా", "నాకు", "నాది" అనేవి "దైవం", అందరిలో ఎన్నెన్నో నకిలీ "నేనులు" ఉంటాయి. అంతరంలో ఒక అసలు సిసలు "నేను" అనేది ఉంటుంది. ఆ అసలు సిసలు "నేనుయే దైవం" !

3. సామ వేద మహా వాక్యం "తత్వమసి" !

అంటే "అదే నువ్వు" ! "అదే" అనగా ఏదైతే సర్వ సృష్టికి మూలమో "అది" ! "తత్వ మసి అనగా అదే నువ్వు" అంటే ✪ "**ఆ దైవమే నువ్వు**" అని సుస్పష్టం చేసింది సామ వేద మహా వాక్యము.

4. అథర్వ వేద మహా వాక్యం "అయమాత్మా బ్రహ్మ" !

అంటే "ఈ ఆత్మ బ్రహ్మ" అని అర్థం. మనం శరీరాలము కాము, ఆత్మలము అని వేదాలు, శాస్త్రాలు అన్నీ చెప్తూనే ఉన్నాయి. "అయమాత్మా బ్రహ్మ" అంటే "ఈ ఆత్మయే దైవం అనగా.....

✪ ఆత్మ స్వరూపులమైన మనమే దైవము" అని అర్థం.

✪ ఈ నాలుగు మహా వేద వాక్యాలు ఒక్కోటి ఒక్కో కోణంలో "నేనే దైవం" అన్న ఒకే పరమ సత్యాన్ని ప్రకటిస్తున్నాయి. "మనమే దైవాలం" అని వేదాలు చెబుతున్నాయి కదా ! మరి మనం దైవం కోసం ఎక్కడెక్కడో వెతుకుతున్నాం - దైవం లోపల ఉంటుంది. బయట కాదు ! దైవం అంటే మీరే, మరెవరో కాదు ! మీలో ఉన్న దైవత్వాన్ని గ్రహించండి. ఈ విషయాలు అందరికీ చెప్పండి.

✪ నాలుగు వేదాలలోని సారమైన ఈ నాలుగు వేద మహా వాక్యాల యొక్క పరమార్థం "నేనే దైవం"! ఈ పరమార్థాన్ని గ్రహించని వాడు, ఎలాంటి వాడో ఈ కింది శ్లోకాల్లో శ్రీకృష్ణ పరమాత్ముడు తెలియజేసాడు.

శ్లో॥ చతుర్వేదధరోవిప్ర స్సూక్ష్మబ్రహ్మ నవిందతి ।
వేదశాస్త్రభరాక్రాంత స్సవై బ్రాహ్మణగార్దభః ॥

- ఉత్తర గీత - 2 : 50

అర్థం: నాలుగు వేదాలలోని సారమైన "నేనే దైవం" అనే పరమార్థాన్ని గ్రహించకుండా, ఊరికే నాలుగు వేదములను కంఠస్థం చేసిన వాడు, వేదశాస్త్రములు అనే భారాన్ని మోసే గాడిద వంటి వాడని ఈ శ్లోకంలో శ్రీకృష్ణ భగవానుడు తెలియజేస్తున్నాడు.

శ్లో॥ యథాఖర్చశ్చందన భారవాహో సారస్యవాహో న తుచందనస్య ।
ఏవంహి శాస్త్రాణిబహూన్యధీత్య సారంనజానన్ ఖరవద్వ హేత్సః ॥

- ఉత్తర గీత - 2 : 51

అర్థం: చందనపు కట్టెలను మోస్తున్న గాడిద, చందన సుగంధాన్ని తెలుసుకొనని విధంగా, అనేక శాస్త్రాలను చదివి కూడా వాటి సారమును గ్రహించని వాడు గాడిదతో సమానం అని శ్రీకృష్ణ దేవుడు ఈ శ్లోకంలో తెలియజేస్తున్నాడు.

✵ కాబట్టి సంస్కృతం మరియు ఇతర ఏవైనా కొన్ని భాషలు నేర్చుకొని వేద శాస్త్రాలన్నీ బట్టీ పట్టి, వాటి సారమైన "నేనే దైవం, అంతా దైవమే, అందరూ దైవాలే" అనే భావనను గ్రహించకుండా తమను తాము పండితులని భావించే వాళ్ళు మనుషుల రూపంలో ఉన్న గాడిదలు అని అర్థం చేసుకోవాలి. వేద శాస్త్రాలన్నీ చదవాలి, అయితే కేవలం వ్యాకరణం మరియు కంఠస్థం చేయడం పైన మాత్రమే దృష్టి పెట్టకుండా వాటి సారాన్ని గ్రహించి, ఆచరించాలి. అంటే నేనే దైవమని తెలుసుకుని తన దివ్యత్వాన్ని పొందడానికి సాధన చేయాలి. పొందాలి.

✪ ఆది శంకరాచార్యుల వారు చెప్పారు కదా "వ్యాకరణ సూత్రాలు నిన్ను రక్షించవురా మూఢుడా" అని ! వ్యాకరణం, కంఠస్థం కాదు ముఖ్యం. సారాన్ని గ్రహించడం, దాన్ని యథాతథంగా ఆచరించడం అనేదే ముఖ్యం. వ్యాకరణం వెంట పడడం అతి మూర్ఖత్వం+మూఢత్వం ! వ్యాకరణ వాతానికి, పాండిత్య పైత్యానికి ధ్యానయోగ సాధనయే చికిత్స ! సద్గురువే సరైన వైద్యుడు.

❖ ❖ ❖

24. శ్రీ కృష్ణ పరమాత్మ కూడా ఇదే చెప్పాడు

లోపల ఉన్న దైవాన్ని పొందడానికి, మర్చి పోయిన దైవత్వాన్ని తిరిగి గుర్తు తెచ్చుకోవడానికి ఒకే ఒక మార్గాన్ని బోధించారు భూమి పైన అవతరించిన "మాస్టర్లందరూ" ! ఆ మార్గాన్ని మూడు రకాలుగా పిలుస్తారు. అవి :

1. అంతర్ముఖం 2. ధ్యానం 3. భక్తి - ఈ మూడు ఒక్కటే !

❶ అంతర్ముఖం అంటే, బయటి "విషయాల" పైన కాకుండా, పూర్తిగా లోపలి విషయాలను గమనించడం.

❷ ధ్యానం అంటే ఎరుకను కలిగి ఉండటం. మీ నిజ తత్వం(దైవత్వం) పట్ల ఎరుకను కలిగి ఉండటం అంటే అంతర్ముఖం అవడం.

❸ భక్తి అంటే "స్వస్వరూపానుసంధానమే భక్తి" అని చెప్పబడింది ! స్వస్వరూపం అంటే ఆత్మ ! ఆత్మతో అనుసంధానం చెందడం, అంటే అంతర్ముఖం కావడం అన్నమాట, ఇదే భక్తి అంటే ! భక్తి అంటే ఏకత్వం ! నేను, దైవము ఒకటే అని భావించడమే భక్తి ! నేనే దైవం అని భావించడమే భక్తి ! భక్తుడు అంటే దైవత్వంతో ఏకత్వాన్ని కోరుతూ, అందుకై సాధన చేసేవాడు అని అర్థం !

ఈ ప్రకారంగా ఈ మూడూ ఒక్కటే !

మూఢ భక్తి : భక్తిపై చాలా, చాలా తప్పుడు అభిప్రాయాలు ఉన్నాయి. చాలా మంది "భక్తి" అంటే రెండు చేతులెత్తి దండం పెట్టి ఓ దేవుడా మాకిది చేయి, మాకది చేయి దానికి ప్రతిగా మేము ఇది చేస్తాం, మేము అది చేస్తాం అని మొత్తుకోవడం భక్తి అని అనుకుంటున్నారు. "భక్తి అంటే వాలి పోవడం అని అనుకుంటున్నారు" !

"మనం చక్కగా ఏమైనా చేసుకోవచ్చు", ఎప్పుడైనా టైమ్ చూసుకుని ఓ సారి గుడికి పోయి దండం పెట్టుకుంటే సరి ! ఇహ... అంతా దేవుడే చూసుకుంటాడు, అని అనుకుంటూ ఉంటారు. దీనిని "వాలి పోవడం" లేక "మూఢ భక్తి" అని అంటారు. దీని వలన ప్రయోజనం నూటికి నూరు శాతం శూన్యం.

ఆత్మ పరిణామ క్రమంలో ప్రప్రథమ దశలో ఉన్న ఆత్మలు అంటే పసి ఆత్మలు, అనగా పిల్ల ఆత్మలు ఈ విధమైన మూఢ భక్తిని కలిగి ఉంటాయి.

దైవత్వాన్ని పొందే మార్గంలోని దశల గురించి ఎంతో సుస్పష్టంగా "శ్రీకృష్ణ పరమాత్ముడు ఉత్తర గీతలో" వివరించాడు.

శ్లో ॥ పూజాకోటి సమంస్తోత్రం స్తోత్రకోటి సమంజపం ।
జపకోటి సమంధ్యానం ధ్యానకోటి సమోలయః ॥

- ఉత్తర గీత - 4 : 55

కోటి పూజలు చేస్తే వచ్చే ఫలితం ఒక్క సారి స్తోత్రం చదివితే వస్తుంది. శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్తున్నాడు.... (కానీ మీరు ఈ విషయాలను పట్టించుకోకుండా పూజలే చేస్తారని నాకు తెలుసు. శ్రీకృష్ణుడికేం ఆయన చెప్పాడు, ఈయన వ్రాస్తున్నాడు అనుకుని ఈ పుస్తకానికి కూడా పూజలు చేసే ఘనాపాటిలు మీరు !)

కోటి పూజలు = ఒక స్తోత్రం

ఏ ఆటంకాలు లేకుండా మనిషి కోటి సార్లు పూజలు చేయాలంటే.... ....కొన్ని వేల జన్మలు పడుతుంది.

మరి ఇక్కడ శ్రీకృష్ణ పరమాత్ముడు ఏం చెప్తున్నాడు అంటే ఆత్మ పరిణామ క్రమంలో మొట్టమొదటి దశలో ఉన్న ఆత్మలు, అంటే పిల్ల ఆత్మలు "పూజ" అనే మార్గాన్ని ఎంచుకుంటాయి. ఎందుకంటే అవి ఆరంభంలో ఉన్న పసి ఆత్మలు కాబట్టి అవి పూజ చేసే మార్గాన్నే ఎంచుకుంటాయి అని చెప్పాడు. ఇది ఎంతో ప్రయాసతో కూడిన మార్గం, అతి తక్కువ ఫలితాన్ని ఇచ్చే మార్గం అని చెప్పాడు.

మరి ఎవరు ఎలాంటి దశలో ఉన్నారో తెలుసుకోవడం ఎలా అంటే, "ఉన్న ఈ నాలుగు దశలలో అంటే పూజ, స్తోత్రం, జపం, ధ్యానాలలో" నీవు దేనికి ఆకర్షితుడవు అయితే నీది ఆ దశ అని స్పష్ట పరిచాడు, శ్రీకృష్ణుడు !

"పూజాకోటి సమంస్తోత్రం" అంటే "కోటి పూజలు = ఒక స్తోత్రం" !

అంటే ఒక్కసారి స్తోత్రం చదివితే, కొన్ని వేల జన్మలు ఎత్తి కోటి సార్లు పూజలు చేసిన ఫలితం వస్తుందన్న మాట !

ఎంత దగ్గర దారి, ఎంత షార్ట్ కట్ !

ఒక్క స్తోత్రం = కోటి పూజల ఫలితం !

తర్వాత ఏం చెప్పాడంటే శ్రీకృష్ణ పరమాత్ముడు....

"స్తోత్రకోటి సమంజపం" అంటే కోటి స్తోత్రాలు = ఒక జపం !

కోటి స్తోత్రాలు చదివితే వచ్చే ఫలితం ఒక సారి జపం చేస్తే వస్తుంది.

కోటి స్తోత్రాలు పూర్తి చేయాలంటే కొన్ని వందల జన్మలు పడుతుంది.

పట్టనీయండి.... వందల జన్మలు పట్టనీయండి ! మీకేం ?!

మీరు మాత్రం... మీ సోదిలో మీరు ఉండండి.

కృష్ణుడికేం ఎన్నైనా చెప్తాడు !

పునరపి జననం - పునరపి మరణం !

మరి, తర్వాత ఈ విధంగా చెప్పాడు శ్రీకృష్ణ పరమాత్మ !

"జపకోటి సమంధ్యానం" అంటే కోటి జపాలు = ఒక ధ్యానం !

అంటే కోటి సార్లు జపం చేస్తే ఎంత ఫలితం వస్తుందో
ఒక్కసారి ధ్యానం చేస్తే అంత ఫలితం వస్తుంది.

ఏ ఆటంకాలు కలగకపోతే ఒక వంద జన్మలలో కోటి జపాలు
చేయవచ్చేమో !

వంద జన్మలు జపం చేస్తే వచ్చే ఫలితం కేవలం ఒక్క గంట ధ్యానం చేస్తే
వస్తుంది.

అంటే కొన్ని వేల జన్మలు పూజ చేస్తే ఎంత ఫలితం వస్తుందో, కొన్ని వందల జన్మలు స్తోత్రాలు చదివితే ఎంత ఫలితం వస్తుందో, ఒక వంద జన్మలు కష్టపడి జపం చేస్తే ఎంత ఫలితం ఉంటుందో, అదంతా కేవలం కొంత సేపు చేసిన "ధ్యాన యోగం" వలన వస్తుంది !

కోటి పూజలు = ఒక స్తోత్రం

కోటి స్తోత్రాలు = ఒక జపం

కోటి జపాలు = ఒక ధ్యానం

ఇక ఇంత కంటే షార్ట్ కట్, దగ్గర దారి మరేది లేదు గాక లేనే లేదు !

వేలాది సంవత్సరాలుగా కోట్లాది మంది ఈ శ్లోకాన్ని చదువుతూనే ఉన్నారు. ఎంత మంది పట్టించుకున్నారని ఇప్పుడు మీరు పట్టించుకుంటారు ?!

కాబట్టి శ్రీకృష్ణుడు పరమాత్ముడైతే అయి ఉండవచ్చు.. ఆయనకేం ఏమైనా చెప్తాడు... మనకు నచ్చిందే మనం చేద్దాం ! పొరపాటున కూడా మనం శ్రీకృష్ణుడు చెప్పింది పట్టించుకుని ఆచరించామా ? కొంపదీసి మోక్షం వచ్చేస్తే ఎలా ?! మన ఊరు, మన వ్యాపారం, మన కుటుంబం, మన బంధువులు, మన ఆస్తులు, మన కులం ఏమై పోవాలి ?! మన వంశం ఏమైపోవాలి ?! హాయిగా వైకుంఠంలో పడుకుని లక్ష్మీ దేవి కాళ్ళు వత్తుతుంటే రిలాక్స్ అవకుండా పనిగట్టుకుని భూమి మీదకి వచ్చి మోక్షం పొందండి అని ఏమేమో చెప్తాడేంటి ఈయన ?! బంధాలను వదిలేయమంటాడు.. రక్త సంబంధాలంటే ఏంటో తెలుసా ఆయనకు ?! అందరినీ వదిలేసి మోక్షం పొందమంటే ఎలా ?! మోక్షమా.. టెంకాయనా... మీ సోదిలో మీరుండండి !

హిందువులలో 99% పూజలు చేసేవారుంటే... కేవలం ఒక్క శాతం కంటే కూడా తక్కువ ధ్యాన యోగులు ఉండి ఉంటారు !

ఇక చివరిగా చెప్పాడు శ్రీకృష్ణ పరమాత్ముడు...

"ధ్యానకోటి సమోలయః" !

కోటి సార్లు ధ్యానం = 1 సారి లయం అంటే "మోక్షం" అనగా దైవత్వాన్ని పొందడం. కానీ మోక్షం పొందాలంటే ధ్యానం చేయాలి. ధ్యానమే మోక్షాన్ని పొందేలా చేస్తుంది అని అర్థం. సంపూర్ణమైన శ్రద్ధ, సమర్పణ, అంకితం, ప్రేమ భావాలతో కొన్ని వందల సార్లు మాత్రమే చేసిన ధ్యానం, కోటి ధ్యానాలుగా పరివర్తితం అవుతుందని ఒక ప్రధానమైన విశ్వ సూత్రం ప్రకటిస్తోంది. కాబట్టి దృఢంగా నిర్ణయించుకుంటే ఒకే ఒక జన్మలో హాయిగా, సులభంగా, సురక్షితంగా, శీఘ్రంగా మన నిజ తత్వమైన దైవత్వాన్ని మనం తిరిగి పొందవచ్చు.

దేవాధి దేవుడైన శ్రీకృష్ణుడు ఈ నాలుగు దశలు వివరించాడు.

మొదటి(పసి) దశ - పూజ

రెండవ(బాల) దశ - స్తోత్రం

మూడవ(యువ) దశ - జపం

నాలుగవ(ముక్తి) దశ - ధ్యానం

పిల్ల ఆత్మలు, పసి ఆత్మలు పూజా మార్గాన్ని ఇష్టపడతాయి. ఎంత చెప్పినా వీరికి అర్థం కాదు కాబట్టి వీరిని పిల్ల ఆత్మలుగా, పసి ఆత్మలుగా గుర్తించి వారి మానాన వారిని వదిలేయాలి. కొన్ని వేల జన్మల తర్వాత అవగాహన వస్తుంది. అప్పుడు చెప్తే అర్థం అవుతుంది. కాబట్టి పూజలు చేసుకునే వారిని సహృదయంతో అర్థం చేసుకుని గౌరవించాలి.

ఈ పిల్ల ఆత్మలు, ఈ పసి ఆత్మలు కొన్ని వేల జన్మలు పూజలు చేసి, కాస్త "అవగాహన" పెంచుకుని "పసి దశను" దాటి "బాల్య దశలోకి" వస్తాయి. ఇలాంటి వారు స్తోత్రాలకు ప్రాధాన్యత ఇస్తారు. స్తోత్రాలు చదువుతూ ఉంటారు. వీరిని "బాల్య దశలో" ఉన్న "బాల ఆత్మలుగా" గుర్తించి, వీరిని గౌరవించాలి. ఎందుకంటే వీరు కూడా వినరు. ఎన్ని చెప్పినా స్తోత్రాలే ఇష్టపడతారు, వీరికి అర్థం కాదు ఎందుకంటే "బాలాత్మలు కదా" ! వీరిని కూడా గౌరవించాలి.

కొన్ని వందల జన్మల పాటు స్తోత్రాలు చదివీ, చదివీ చక్కటి పరిణతిని సాధించి మూడవ దశలోకి అంటే "జపం" చేసే దశలోకి వస్తాయి ఈ "బాలాత్మలు" ! జప దశలోకి వచ్చిన

వాటిని "యువ ఆత్మలు" అని అంటారు. వీరు జపాలను బాగా ఇష్టపడతారు. ఏం చేసినా, ఎన్ని చెప్పినా, అన్నీ విన్నట్టే వింటూ "మౌనంగా జపం" చేస్తూనే ఉంటారు, వేగంగా జపమాలలు తిప్పుతూనే ఉంటారు. ఇలా జపాలు చేసే వారిని "యువ ఆత్మలుగా" గుర్తించి, వారిని గౌరవించాలి. ఈ యువ ఆత్మలే యజ్ఞ యాగాలు, హోమాలు, నోములు, వ్రతాలు, కీర్తనలు, సంకీర్తనలు, భజనలు తదితరాలైనటువంటివి చేస్తూ ఉంటాయి. ఇందులో పసి ఆత్మలు, బాల ఆత్మలు పాల్గొంటూ ఉంటాయి.

ఓ వంద జన్మలు జపాలు చేసి, చేసి పక్వానికి వస్తాయి ఈ యువ ఆత్మలు, అప్పుడు పండి పోతాయి ఈ ఆత్మలు, ఈ పండిన ఆత్మలు మాత్రమే ధ్యానం చేస్తాయి. ఎన్నెన్నో జన్మలలో, అన్నీ చేసి, చేసి ఉంటారు. పూర్తిగా పక్వానికి వచ్చి పండిపోయి ఉంటారు. ఎంతో అవగాహన పొంది ఉంటారు. వీరు ఎట్టి పరిస్థితుల్లోనూ పూజా స్తోత్ర జపాలకు ఎంత మాత్రమూ ఆకర్షించబడరు. వీరు గుళ్ళకు, గోపురాలకు, తీర్థయాత్రలకు, క్షేత్ర సందర్శనలకు మరియు పుణ్య యాత్రలకు వెళ్ళరు. ఎందుకంటే, ఇవన్నీ వృథా అని వీరికి చాలా స్పష్టంగా తెలుసు గనుక ! భౌతిక కార్యకలాపాల పైన పెద్దగా ఇంట్రెస్ట్ ఉండదు వీరికి. అన్ని వ్యామోహాలతో సహజంగా విసిగి పోయి ఉంటారు. ఇక వీరి లక్ష్యం కేవలం దైవత్వం పొందడమే. ఇలాంటి ఆత్మలు, పండిపోయిన పండితాత్మలు మాత్రమే ధ్యానం చేయగలుగుతాయి. సత్య ప్రచారం చేయగలుగుతాయి.

✪✪✪ ఇప్పుడు మనం పూజ, స్తోత్రం, జపం, నోము, వ్రతం, హోమం, యజ్ఞం, యాగం మరియు తపస్సు మొదలైన వాటన్నిటి కంటే గొప్పదైన, ఉన్నతమైన, ఉత్తమమైన, శక్తివంతమైన మరియు పరమ పవిత్రమైన ధ్యానయోగం యొక్క కొన్ని మహత్తులను, విశిష్టతలను తెలుసుకుందాం.

శ్లో ॥ నాస్తి ధ్యానసమం తీర్థం నాస్తి ధ్యానసమం తపః ।
నాస్తి ధ్యానసమో యజ్ఞ స్తస్మాద్ధ్యానం సమాచరేత్ ॥

- శ్రీ గురు గీతా, (పేజ్ నం.209) శ్రీ వ్యాసాశ్రమము, ఏర్పేడు.

వివరణ : ధ్యానంతో సమానమైన తీర్థము, తపము, యజ్ఞము లేదు, కాబట్టి అన్నింటి కన్నా గొప్పదైన ధ్యాన సాధన మాత్రమే చేయవలెను. తీర్థాలనీ, యజ్ఞాలనీ, అవి ఇవీ అంటూ అటూ ఇటూ తిరుగుతూ అనవసరంగా వృథా ప్రయాస పడకుండా ధ్యాన యోగ సాధన చేయాలి.

✪ ఎన్ని వివరణలిచ్చినా, ఎన్ని ఆధారాలు చూపెట్టినా ధ్యానం వైపు కన్నెత్తి చూడరు కొంత మంది.

కొంత మందికి తీర్థయాత్రలు, క్షేత్ర సందర్శనలు చేసి సమయం, శక్తి, డబ్బు వృథా చేసుకుంటే గానీ తృప్తి కలుగదు. ఇలాంటి వారికి తక్షణమే అవగాహన కలుగు గాక !

✪ ఆత్మ పరిణామ క్రమంలో చివరి దశలో, ఎంతో అవగాహనను, ఎంతో పరిణతిని, ఎంతో అనుభవాన్ని గడించిన సీనియర్ ఆత్మలు - Matured Souls/ Evolved Souls మాత్రమే ధ్యానాన్ని ఇష్టపడతాయి. సత్య సాక్షాత్కారం కోసం ధ్యానం చేస్తాయి.

ఇలాంటి "ఆత్మల" కోసమే ఈ "ఆత్మ విజ్ఞానం" !

పూజ, స్తోత్రం, జప ధ్యానాల గురించి **శ్రీకృష్ణ పరమాత్ముడు** చెప్పిన దశల క్రమాన్ని మన ప్రస్తుత కాలమానానుసారంగా చెప్తే

ఈ క్రింది విధంగా ఉంటుంది :

పూజ	=	LKG దశ	- పసి దశ
స్తోత్రం	=	హై స్కూలు దశ	- బాల్య దశ
జపం	=	కాలేజ్ దశ	- యువ దశ
ధ్యానం	=	యూనివర్సిటీ దశ	- ముక్తి దశ

ఎవరు ఏ దశలో ఉంటే ఆటోమెటిక్‌గా ఆ దశకు ఆకర్షితం అవుతారు.

✪ "పరస్పరం సారూప్యం గలవి ఆకర్షింపబడతాయి" ! ✪

- విశ్వ సూత్రం - రిచర్డ్ బాక్

✪ *"Like Attracts Like"!* ✪

- Cosmic Law - Richard Bach

✪ అయితే ఏ దశలో ఉన్నా త్వరగా పరిణతి చెందాలి, తమ దశను పెంచుకోవాలి అని అనుకుంటే వారు **direct**గా, నేరుగా "ధ్యానం" చేయవచ్చు. ఏ దశలో ఉన్న ఆత్మ అయినా సరే, ధ్యానం ద్వారా అన్ని దశల యొక్క పరిణతిని, ఫలితాన్ని ఒకేసారి సులువుగా, సులభంగా, శీఘ్రంగా పొందుతుంది.

ఫలితాలు అత్యంత త్వరగా కావాలి అంటే ధ్యానమే శరణ్యం !

ధ్యానం(యోగం) కంటే గొప్ప మార్గం లేనే లేదు !

ఈ విషయాన్ని కూడా శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో ప్రకటించాడు.

శ్లో ॥ తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధిక ।
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥

- భగవద్గీత - 6 : 46

అర్థం : తపోనిష్ఠుల కంటే శ్రేష్ఠుడు, శాస్త్రజ్ఞులగు పండితుల కంటే అధికుడు, అగ్నిహోత్రాది యజ్ఞ పరాయణులగు కర్మలు చేసే వారి కన్నా ఉత్తముడు యోగి. కాబట్టి అర్జునా నీవు యోగివి(ధ్యానివి) కా ! (ధ్యానం అన్నా యోగం అన్నా ఒకటే). శ్రీకృష్ణ పరమాత్మ చెప్తున్నాడు కదా, అన్నింటి కంటే ధ్యానయోగమే గొప్పదని, కాబట్టి ధ్యానయోగమే చేయాలి.

శ్లో ॥ తపేద్వర్ష సహస్రాణి ఏకపాదస్థితోనరః ।
ఏకస్య ధ్యానయోగస్య కళాం నార్హతిషోడశీమ్ ॥

- ఉత్తర గీత - 2 : 47

అర్థం : మానవుడు ఒంటి కాలి మీద నిలబడి తపస్సు చేసినప్పటికీ, ఆ తపస్సు యొక్క ఫలితం, ధ్యానయోగ ఫలితం యొక్క పదహారవ భాగాని కంటే కూడా తక్కువదనీ అంటే ధ్యానయోగమే గొప్పది కాబట్టి ధ్యానయోగ సాధన మాత్రమే చేయవలెనని అర్థం.

శ్లో ॥ బ్రహ్మహత్యా సహస్రాణి వీరహత్యా శతాని చ ।
ఏకేన ధ్యానయోగేన దహత్యగ్నిరివేంధనమ్ ॥

- ఉత్తర గీత - 2 : 48

అర్థం : ధ్యానయోగి, తన ధ్యానయోగ సాధనాగ్నిలో అనేక వేల బ్రహ్మ హత్యలను, అనేక వందల వీర హత్యలను చేసిన కర్మలను అన్నింటిని కూడా అగ్ని కట్టెలను దహించివేసే విధంగా దహించి వేస్తూ భస్మం చేసేస్తున్నాడు అని అర్థం.

వేలాది బ్రహ్మ, వందలాది వీర హత్యల కర్మలు అంటే చాలా పెద్దవి, అంత పెద్ద కర్మలను కూడా ధ్యానయోగం సులభంగా తీసివేస్తుంది అని అర్థం.

శ్లో ॥ నిమిషం నిమిషార్థం వా యత్రతిష్ఠతి యోగినః ।
తత్రతత్ర కురుక్షేత్రం ప్రయాగో నైమిశంవనమ్ ॥

- ఉత్తర గీత - 3 : 19

అర్థం : నిమిషం* సేపైనను, అరనిమిషం* సేపైనను యోగులు ఉన్న స్థలం కురుక్షేత్రం, ప్రయాగ, నైమిశారణ్యం అనే పుణ్య క్షేత్రముల లాగా మారిపోతుందని అర్థం.

* నిమిషం అని అంటే మూడు రకాల అర్థాలు ఉన్నాయి. వాటిలో మొదటిది కను రెప్ప వేసినంత కాలం. రెండవది క్షణ కాలం. మూడవది అరవై సెకన్ల(క్షణాల) కాలం. ఈ మూడు అర్థాలు మూడు రకాలుగా ఉన్నా అన్నీ కూడాను "అత్యంత స్వల్పమైన కాలాన్నే" సూచిస్తున్నాయి. కాబట్టి మీరు ఏ అర్థాన్ని తీసుకున్నా సరే !

✪ ధ్యానయోగ సాధన చేసే వారినెవరినైనా సరే, ధ్యానులు లేక ధ్యానయోగులు లేక యోగులు అని అంటారు. ఒక వేళ మీరు స్త్రీ అయినా పురుషుడైనా, మీరు వివాహితులైనా సరే, మీరు గృహస్థులైనా సరే, ఏ కులం వారైనా సరే, ఏ మతం వారైనా సరే, ఏ వయసు వారైనా సరే, మీరెవరైనా సరే "నేనే దైవం" అని తెలుసుకుని మీ దైవత్వాన్ని మీరు తిరిగి పొందాలని దైవత్వ సాధన క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉంటే మీరు "యోగులు" అనబడతారు.

✪ కురుక్షేత్రం, ప్రయాగ, నైమిశారణ్యం అనే మూడు ప్రదేశాలు భూమి పైన అత్యంత ప్రధానమైన పుణ్యక్షేత్రాలలో ముఖ్యమైనవి. ఎంతో పరమ పవిత్రమైనవిగా పురాణేతిహాసాల్లో కొనియాడబడే ఈ పావన క్షేత్రాలు యుగ యుగాలుగా, ఎంతో మంది "యోగీశ్వరుల యొక్క యోగ సాధనతో పునీతమై విరాజిల్లుతూ ఉన్నవి". ఈ మూడు పుణ్యక్షేత్రాలకు ఎంతో దివ్య చరిత్ర ఉంది. ఎవరైనా క్రమం తప్పని ధ్యానయోగ సాధన చేసేవారు క్షణం సేపైనను ఎక్కడైతే ఉంటారో ఆ స్థలం కురుక్షేత్రం, ప్రయాగ,

నైమిశారణ్యం అనే మహా పుణ్యక్షేత్రాలతో సమానమైనదిగా మారిపోతుంది అని అంటే..... ప్రతి రోజు సాధన చేసే స్థలం ఇంకెంత మహత్తుతో నిండిపోతుందో, విరాజిల్లుతుందో, శోభిల్లుతుందో ఆలోచించండి. మీరు గనక ప్రతి రోజు మీ ఇంట్లో ధ్యానయోగ సాధన చేస్తే మీ ఇల్లు కురుక్షేత్రం, ప్రయాగ, నైమిశారణ్యాలతో సమానమైన పుణ్యక్షేత్రంగా మారిపోతుందని అర్థం. మీరు చేసిన సాధన వల్ల ఒక మామూలు స్థలం ఒక మహా పుణ్యక్షేత్రంగా మారిపోతుందంటే మరి, ఆ సాధన చేస్తున్న మీరు ఎంత గొప్ప పుణ్యాత్ములవుతారో ఒక్కసారి ఆలోచించండి !

శ్లో ॥ ధ్యానాఖ్యయోగారణిదీపితేన పంచాత్మకం ధర్మగుణేంధనేన

యోగాగ్నినా వాయు సమన్వితేన దగ్ధంయుగాంతే-ఖిలకర్మబంధమ్ ॥

- ఉత్తర గీత - 3 : 25

అర్థం : ధ్యానమనే పేరు గల యోగారణి* యందు ప్రజ్వలింప జేయబడినదైన, పంచభూతాత్మకమై ధర్మగుణమనే కట్టెలతో, వాయువులతో కూడిన ధ్యానయోగాగ్నిలో సర్వ, సకల, సమస్త కర్మ బంధములు దహించి వేయబడును. అంటే ధ్యానయోగం అనే మహాగ్ని అన్ని కర్మలను సులభంగా, శాశ్వతంగా దగ్ధం చేసేస్తుంది అని అర్థం.

* యోగ + అరణి = యోగారణి, అంటే యోగం అనబడే అరణి అని అర్థం.

* అరణి = (యజ్ఞంలో) రాచి నిప్పు పుట్టించే (జమ్మి) కొయ్య

శ్లో ॥ యథా రవిస్సర్వ రసాన్ప్రభుంక్తే హుతాశనశ్చాపి హి సర్వభక్షః ।

తథైవ యోగీ విషయాన్ప్రభుంక్తే న లిప్యతేకర్మ శుభాశుభాభ్యామ్ ॥

- ఉత్తర గీత - 3 : 27

✪✪✪ **అర్థం :** సూర్యుడు సర్వ రసములను భుజించినప్పటికిని, అగ్ని సర్వ భక్షకుడైనప్పటికిని ఏ విధంగానైతే పవిత్రంగా ఉంటారో అదే విధంగా ధ్యానయోగి సర్వ విషయ సుఖాలను అనుభవించినా, అనుభవిస్తున్నా దేనికీ లొంగని వాడై , శుభాశుభ కర్మముల చేత బంధింపబడని వాడై ఎల్లప్పుడూ స్వేచ్ఛగా, పవిత్రంగా విరాజిల్లుతూ ఉంటాడని అర్థం.

✪✪✪ వివరణ : ఇది ఎంతో ఉన్నతమైన అవగాహనకు సంబంధించిన విషయం. దయచేసి అపార్థం చేసుకోకుండా అర్థం చేసుకోమని మనవి చేస్తున్నాను. కొంత మంది ఆత్మ విజ్ఞానులు అంటే ఆధ్యాత్మిక గురువులు జనాలకు అస్సలు అర్థం కాని పనులను చేస్తుంటారు. అయితే జనాలకు అర్థం కాక పోయినా వీరు చేసే ప్రతీ పని సృష్టి కల్యాణం కోసమే అయి ఉంటుంది. మరి కొంత మంది సుఖాలను స్వర్గంలో దేవతల్లాగా అనుభవిస్తూ వైభోగంగా జీవిస్తూ ఉంటారు. ఇలాంటి

ఆత్మ విజ్ఞానులు ఏమీ చేస్తున్నా, అన్నింటినీ అనుభవిస్తున్నా వేటికీ లోబడని వారై, శుభాశుభ కర్మముల చేత బంధింపబడని వారై స్వేచ్ఛగా, పవిత్రంగా ఉంటారు. ఆత్మ విజ్ఞాని అయిన ఒక ధ్యానయోగి ఏం చేసినా దేనికీ అంటుకోడని, దేని చేతా బంధించబడడని, అతడెల్లప్పుడూ స్వేచ్ఛగానే, పవిత్రంగానే ఉంటాడని అర్థం. ✪✪✪ ఆత్మ విజ్ఞాని అయిన ఒక ధ్యానయోగికి అన్నీ తెలుసు కాబట్టి అతడు ఏమైనా, ఏదైనా చేయవచ్చని అర్థం.

ఆత్మ విజ్ఞానులలో చాలా రకాలైన వారుంటారు. కొంత మంది సాంప్రదాయ బద్ధంగా ఉంటారు. మరి కొంత మంది సాంప్రదాయ సంస్కారాలకు పూర్తి విరుద్ధంగా ఉంటారు. అసలు వీరు ఆత్మ విజ్ఞానులైన ఆధ్యాత్మిక గురువులేనా ? అన్న విధంగా ఉంటారు. ఏ ఆత్మ విజ్ఞాని ఎలా ఉంటాడో చెప్పలేం. సాధారణంగా ప్రజలకు సాంప్రదాయ బద్ధంగా ఉండే గురువులే తెలుసు. చిత్ర విచిత్రమైన గురువుల గురించి తెలియదు. వీరి జీవన విధానం ఎంత గమ్మత్తుగా, అర్థం కాకుండా ఉంటుందంటే అవగాహన లేని వాళ్ళయితే అపార్థం చేసుకొనియే తీరుతారు. కానీ కొన్ని రోజులు వారికి దగ్గరగా ఉండి పరిశీలిస్తే వాళ్ళెంత గొప్పవాళ్ళో అర్థం అవుతుంది. కాబట్టి, ఎవరైనా ఆత్మ విజ్ఞానులు భోగాలను అనుభవిస్తూ ఉన్నప్పుడూ మరియు మీకు అర్థం కాని పనులను ఏమి చేస్తున్నా వారిని చూసి ఆశ్చర్యపోకుండా, విమర్శించకుండా, నిందించకుండా, మౌనంగా, గౌరవ భావంతో ఉండాలి. దత్తాత్రేయుడు ఇంకా కొంత మంది ప్రత్యేకమైన గురువులు ఇలాగే శిష్యులను, జనాలను పరీక్షిస్తూ ఉంటారు. సద్గురువుల చరిత్రలన్నీ చదివితే ఇలాంటి విషయాలు అర్థం అవుతాయి. వారికి అన్ని విషయాలు తెలుసు అనే అవగాహనతో ఉండాలి. ఎందుకంటే ఆ విధంగా ఆనందోత్సవాలను అనుభవిస్తూ వారు, "స్వయం యొక్క ఆనందోత్సవ శక్తులను ఉత్తేజితం చేసుకుంటూ, సర్వులకు ప్రేరణనిస్తూ ఉంటారు". ఇది ఉన్నతోన్నతమైన అవగాహనకు సంబంధించిన విషయం. సాధారణ వ్యక్తులు ఇలాంటి విషయాలు అర్థం చేసుకోకుండా ఎవరైనా ఆత్మ విజ్ఞానిని(ఆధ్యాత్మిక గురువుని) నిందించి జీవితాలను నాశనం చేసుకోకుండా, అపారమైన కరుణచే సాధారణ ప్రజలను కాపాడేందుకు మరియు ఉన్నతమైన అవగాహనను పెంపొందించేందుకు శ్రీకృష్ణ పరమాత్ముడు నిగూఢంగా ఈ విషయాలను, ఈ శ్లోకంలో, ఈ విధంగా తెలియజేసాడు. సాధారణ జనాలకు అర్థం కాని విధంగా ఆత్మ విజ్ఞాన వేత్తల ప్రవర్తనలు ఇంకా ఈ కింది విధంగా ఉంటాయని శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పాడు.

ఎవరో కొంత మంది దొంగ గురువులు తప్పుగా ప్రవర్తించారని గురువులందరినీ తప్పు పట్టడం మహా పాపం ! ప్రభుత్వం, సినిమాలు, వ్యాపారాలు, స్పోర్ట్స్, కుటుంబంలో తల్లి, తండ్రి, అన్నా మొత్తం కుటుంబంలో, బంధువులలో, స్నేహితులలో... ఇలా ప్రతీ దాంట్లో చెడ్డవారున్నారు అలాగే మంచి వారు కూడా ఉన్నారు. దొంగ గురువుల గురించి మాత్రమే అందరికీ తెలుస్తుంది కానీ, దొంగ శిష్యుల గురించి మాత్రం ఎవరికీ తెలియదు. దొంగ గురువులకు కొన్ని హద్దులుంటాయి. కానీ దొంగ శిష్యులకు హద్దులు ఉండవు, దొంగ శిష్యులలో ఆడ, మగ, చిన్నా, పెద్ద అందరూ ఉంటారు. దొంగ శిష్యులే డేంజర్ !

శ్లో ॥ హన్యాత్స్వయమరీ న్సర్వా న్సర్వాశీ సర్వవిక్రయీ ।
సర్వంనిషేధం కృత్వాపి కర్మభిర్న సబధ్యతే ॥ - ఉత్తర గీత - 3 : 16

✪✪✪ అర్థం : ఎవరైతే "తానే దైవం" అంటే " నేనే దైవం" అని తెలుసుకుని ఉన్నాడో, అటువంటి ఆత్మ విజ్ఞాని(గురువు) సహజంగా భౌతిక పరమైన వాటన్నింటిని అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే వాటిని జయించి ఉంటాడు. కాబట్టి వీరికి ఎలాంటి నియమ, నిషేధాలూ ఉండవు. వీరు సర్వమూ భుజించినా, సర్వ పదార్థములను విక్రయించినా, సకల నిషిద్ధ కార్యములను చేసినా సరే కర్మఫలముల చేత బంధింప బడక స్వేచ్ఛగా, పరమ పవిత్రంగానే ఉంటారని అర్థం.

✪✪✪ వివరణ : ఆత్మ విజ్ఞానులకు(గురువులకు) " నేనే దైవం" అనే స్మృతి ఉంటుంది. సర్వోన్నతమైన, పరమోన్నతమైన అవగాహనలో వారు ఎల్లప్పుడూ ఉంటారు. ఒక ఆత్మ విజ్ఞాని(గురువు) చేసే పని మరొక ఆత్మ విజ్ఞానికే(గురువుకే) అర్థం అవుతుంది. సాధారణ జనాలకు వీరి పనులు ఏవీ అర్థం కావు. వీరు ఏ ఆహారమునైనా భుజించవచ్చు, ఏమైననూ సేవించవచ్చు. వీరు ఆత్మ విజ్ఞాన గ్రంథాలను అమ్మనూ వచ్చు, ఉచితంగా ఇవ్వనూ వచ్చు. వీరు ఆత్మ విజ్ఞాన + ధ్యాన సాధనా బోధనలు ఉచితంగా చేయవచ్చు లేదా డబ్బులు తీసుకుని చెప్పవచ్చు. వీరు ఏ వ్యాపారమైనా చేయవచ్చు. వీరు ఏ వస్తువులనైనా అమ్మవచ్చు. సూటిగా చెప్పాలంటే వీరు ఏమైననూ చేయవచ్చు. వీరికి ఏ విధి, నిషేధాలతో పని లేదు. వీరికి ఏ నియమాలు వర్తించవు. వీరు ఏం చేసినా వేటితోనూ అంటుకోకుండా, వేటి చేత బంధింపబడకుండా స్వేచ్ఛగా, పరమ పవిత్రంగానే విరాజిల్లుతూ ఉంటారు. కాబట్టి వీరి మాటలను, వీరి చేష్టలను, వీరి పనులను, వీరి జీవన విధానాన్ని , వీరి అలవాట్లను విమర్శించకుండా మౌనంగా, సాక్షిగా, గౌరవ భావంతో ఉండాలి. ఏ మాత్రం వీరిని విమర్శించినా, నిందించినా ఘోరమైన రీతిలో అంతకు అంతా అనుభవించాల్సి వస్తుంది. కాబట్టి దయచేసి ఏ ఒక్క ఆత్మ విజ్ఞానిని(గురువును) అయినా సరే విమర్శించకండి, నిందించకండి. మిడి మిడి జ్ఞానంతో, మదంతో విమర్శిస్తే జీవితం నాశనం అవుతుంది. ఒకరిని విమర్శించే ముందు మనం ఎంత చక్కదనాల చుక్కమ్మలమో, చుక్కయ్యలమో ఆలోచించు కోవాలి.

✪✪✪ ఆత్మ విజ్ఞానులు(గురువులు) ఏం చేసినా అది సర్వ శ్రేయస్కరానికి, లోక కల్యాణానికి సంబంధించినదై ఉంటుంది. వారి ప్రతి చేష్టా, ప్రతి మాట ఏదో ఒక నిగూఢమైన అర్థాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి సాక్షిగా, గౌరవ భావంతో ఉండండి. సత్యగురువులు చేసే పనులు కొన్ని సాధారణ జనానికి విపరీతంగా, వింతగా అనిపిస్తాయి. తగినంత వికాసం లేక అలా అనిపిస్తుంది. శ్రీకృష్ణుడి కాలంలో శ్రీకృష్ణుడిని తూలనాడినవారు, తిట్టిన వారు, నిందించిన వారు, హేళన చేసిన వారు, తప్పు పట్టిన వారు, ఆయనను చంపాలని చూసిన వారు ఎంతో మంది ! ఇప్పుడు శ్రీకృష్ణుడికి మందిరాలు కట్టి పూజలు చేస్తున్నారు. ఆయన కాలంలో ఆయనకు పిల్లను కూడా ఇవ్వలేదు. రుక్మిణీ దేవిని ఎత్తుకు పోయి, యుద్ధం చేసి వివాహం చేసుకోవాల్సి వచ్చింది పరమాత్ముడికి !

శ్లో ॥ ఆసీనోవా శయనోవా గచ్ఛన్తిష్ఠన్సదాశుచిః ।
తస్మా త్సర్వప్రయత్నేన యోగయుక్తో భవార్జున ॥

- ఉత్తర గీత - 4 : 47

అర్థం : అర్జునా ! కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు, ఎటైనా పోవుచూ ఉన్నప్పుడు, నిలుచున్నప్పుడు, పరిశుద్ధంగా ఉన్నప్పుడు, అపరిశుద్ధంగా ఉన్నప్పుడు అంటే సర్వకాల, సర్వావస్థల యందు, సర్వవేళల యందు, సర్వ విధముల చేత, సదా సర్వదా ధ్యానయోగంలోనే ఉండవలెనని అర్థం. అంటే "నేనే దైవం" అనే స్మృతిలో ఉండాలి.

శ్లో ॥ అంతస్సంగం బహిస్సంగ మాత్మసంగం పరిత్యజేత్ ।
సర్వసంగనివృత్తాత్మా పశ్యేదాత్మానమాత్మని ॥

- ఉత్తర గీత - 4 : 48

అర్థం : లోపల, బయట, మానసిక, భౌతిక మొదలైన సర్వ బంధములన్నింటిని త్యజించి, తనను పరమాత్మలో దర్శించవలెను అంటే తనకూ పరమాత్మకు భేదం లేదని తెలుసుకోవాలని అర్థం.

ఎంతో స్పష్టంగా, కుండ బద్దలు కొట్టినట్టు ప్రకటించాడు, శ్రీకృష్ణుడు.

యోగమే(ధ్యానం) గొప్పది, అందరి కంటే అధికుడు యోగి(ధ్యాని) ! కాబట్టి యోగం(ధ్యానం) చెయ్యండి, యోగులు(ధ్యానులు) కండి అని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు.

మరి మనం ఏం చేస్తున్నాం ?! వేదాలు చెప్తున్నాయి "నువ్వే దైవమని", యోగం(ధ్యానం) చేసి దైవత్వాన్ని పొందమని శ్రీకృష్ణ పరమాత్మ ఆదేశిస్తున్నాడు.

మరి హిందువులలో ఎంత మంది వీటిని ఆచరిస్తున్నారో ఆ కృష్ణ పరమాత్మకే తెలియాలి ! వేదాలు గొప్పవి అంటారు. వేద మహా వాక్యాలను ఆచరించరు ! కృష్ణుడు దేవుడని అంటారు. ఆయన చెప్పింది మాత్రం చేయరు ! ఎంత మంది గురువులు ఈ మహా వాక్యాల సారాంశాన్ని బోధించి, వారి శిష్యుల చేత దైవత్వ సాధన చేయిస్తున్నారు ?! చేసే వారికి ఆత్మ పూర్వక అభినందనలు ! నేను, ఇక్కడ చేయని వారి గురించి ప్రస్తావిస్తున్నాను.

❖ ❖ ❖

25. పూజ, స్తోత్రం, జపం, ధ్యానం(యోగం) అంటే వాస్తవంగా ఏమిటి ??!?

పూజ !

పూజ అంటే అర్థం - గౌరవం, ఆరాధన, సద్భావన, ప్రేమ. పూజించడమంటే గౌరవించడం, ఆరాధించడం, సద్భావనలను, ప్రేమను ప్రకటించడం.

సుమారుగా అందరూ పూజ అని అంటే ఏదో అనుకుని ఏమేమో చేస్తున్నారు. పూజ యొక్క అసలు ఉద్దేశం దైవానికి గౌరవ, ఆరాధన, సద్భావన, ప్రేమ భావాలను ప్రకటించడం. ప్రస్తుతం పూజల్లో ఇవి లోపించాయి. ఫోటోకో, విగ్రహానికో దండలు వేయడం, బొట్లు పెట్టడం, ఇంకా ఏమేమో డెకరేషన్‌లు చేసి, కాసేపు "నేను చేసిన తప్పులేవైనా ఉంటే క్షమించమని అడిగి, ఆ తర్వాత కోరికల లిస్ట్ చదివి, వాటిని తీర్చమని చెప్పి ఓ దండం పెట్టి, గంట కొడుతూ ఆరతి ఇచ్చి దైవం పేరిట పెట్టిన ప్రసాదాలను సుష్టుగా భుజించడం". ఇది కానే కాదు పూజ అంటే ! దండలు, బొట్లు, నామాలు, డెకరేషన్‌లు ఏమీ అవసరం లేదు భగవంతుడికి. స్వచ్ఛమైన ప్రేమ ఒక్కటి చాలు !

అసలు దైవం అంటే ఎవరనుకుంటున్నారు మీరు ?! స్వయంగా మీరే దైవం ! ఈ విషయాన్ని ఎంతో స్పష్టంగా శ్రీకృష్ణ పరమాత్ముడు ఉత్తర గీతలో 4వ అధ్యాయంలోని 27వ శ్లోకంలో ఈ కింది విధంగా ఎప్పుడో చెప్పేశాడు కదా !

శ్లో ॥ దేహోదేవాలయః ప్రోక్తో జీవోదేవ స్సనాతనః ।
త్యజేదజ్ఞాన నిర్మాల్యం సో-హం భావేన పూజయేత్ ॥
- ఉత్తర గీత - 4 : 27

వివరణ : దేహమే దేవాలయము, జీవుడే దేవుడు. ఆ జీవుడే నీవు. కాబట్టి మూర్ఖత్వాన్ని వదిలి జ్ఞానంతో "నేనే దైవం" అనే భావనతో పూజించ వలెను. పూజ అంటే గౌరవించడం, ఆరాధించడం, ప్రేమను ప్రకటించడం అని అర్థం. అంటే దైవమే నీవు అని తెలుసుకుని నిన్ను నీవు గౌరవించుకోవాలి, ఆరాధించుకోవాలి, ప్రేమించుకోవాలి అప్పుడే అందరి పట్ల, సర్వం పట్ల నీవు గౌరవ, ఆరాధన, ప్రేమ భావాలను ప్రకటించి నీవు ఆనందంగా ఉండగలగడమే కాకుండా అందరి ఆనందానికీ కారణం అవుతావు అని గూఢార్థం.

మరి మీరేం చేస్తున్నారు ? శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పినట్టే మిమ్మల్ని మీరు దైవాలుగా భావించి మీ పట్ల మీరు గౌరవ, ఆరాధన, సద్భావన, ప్రేమ భావనలను కలిగి ఉన్నారా ? పూజలు చేసే ప్రతి ఒక్కరూ నిజాయితీగా ఎవరికి వారు సమాధానం చెప్పుకోవాల్సిన ప్రశ్న ఇది.

సాక్షాత్తు ఆ దైవమే నీవు అని అంటే పిల్ల ఆత్మలకు అర్థం కాదు కాబట్టి ఒక ఫోటోనో, విగ్రహాన్నో చూపించి ఇదిగో దైవం ! దండేసి దండం పెట్టు అని చెప్తారు. ఆత్మ పరిణామ క్రమంలో ప్రాథమిక దశలో ఉన్న పసి ఆత్మలకు, మెల్లి మెల్లిగా గౌరవ, ఆరాధన, సద్భావన, ప్రేమ, శ్రద్ధ, సమర్పణ, అంకిత భావాలను కలిగి ఉండే విధంగా శిక్షణ ఇచ్చే కార్యక్రమమే పూజ అని అంటే ! అందుకే పసి ఆత్మలు పూజలనే ఇష్ట పడతాయి, పూజలే చేస్తాయి. పసి ఆత్మలు పూజలు కాక మరేం చేస్తాయి ? అని అడిగితే ఇక్కడ అందరూ తెలుసుకోవాల్సిన భయంకర రహస్యం ఒకటి ఉంది. అది ఏమిటంటే - కొన్ని లక్షల సంవత్సరాల నుండి ఆత్మలను అభివృద్ధి చెందనీయ కుండా ఆ యొక్క "పసి దశలోనే" అణిచి పెట్టి ఉంచి ఎదగ కుండా చేస్తున్నారు రహస్యం తెలిసిన మతాధికారులు. అసలు నిజాలు ప్రజలకు తెలియనీయకుండా చేస్తూ, తమ గుప్పిట్లో బంధించి ఉంచారు. రహస్యం తెలియని మతాధికారులు తమకు తెలిసినవి చెప్పి పబ్బం గడుపు కుంటున్నారు. వేదాల్లో, శాస్త్రాల్లో, పురాణాల్లో అంతా దైవమే, అందరూ దైవాలే అని ఉంది కదా ! తమలోని దైవత్వాన్ని పొందడానికి ఆత్మ విజ్ఞాన అభ్యాసం మరియు

ధ్యానం అవసరం కదా ! భగవద్గీతలో, ఉత్తర గీతలో శ్రీకృష్ణ భగవానుడు ఈ విషయాలనే చెప్పి సాధన చేయమని ఆదేశించాడు కదా ! మరి మీరు ఇవి తప్ప మిగతావన్నీ చెప్తున్నారేమిటి ఎందుకు ?? అని వారిని ఎవరైనా నిలదీయడం సంగతి పక్కన పెడితే అసలు ఆ ఆలోచనలే రాకుండా చేసి పారేశారు, మతాధికారులు.

దయచేసి మేలుకోండి - అన్ని వేదాల్లో, శాస్త్రాల్లో, భగవద్గీతలో, ఉత్తర గీతలో, ఇంకా అన్నింటిలోని సారాంశం ఒక్కటే - మీరే దైవం ! అంతటా, అందరిలో ఉన్న దైవమే మీలో మీరై మీరుగా ఉంది. మీ దైవత్వాన్ని మీరు మరిచి పోయారు. మీ దైవత్వాన్ని మీరు తెలుసుకోవాలంటే పూజలు, స్తోత్రాలు, జపాలు, భజనలు, సంకీర్తనలు, కీర్తనలు, నోములు, వ్రతాలు, హోమాలు, యజ్ఞ యాగాలు చేయమని చెప్పలేదు శ్రీకృష్ణ పరమాత్ముడు ! అవి చాలా చాలా చిన్న, చిన్నవి. వాటి వలన ఫలితాలు చాలా చాలా చాలా తక్కువగా వస్తాయి. అన్నింటి కన్నా ఉత్తమమైనది, ఉన్నతమైనది యోగం(ధ్యానం) కాబట్టి "తస్మాత్ యోగీ భవ" అంటూ యోగమే(ధ్యానం) చేయమని ఆదేశించాడు. మరి ఈ మత గురువులు ఏం చేస్తున్నారు ? మీకు పనికి రాని విషయాలను బోధిస్తూ మిమ్మల్ని నాశనం చేస్తున్నారు. నిజానికి వాళ్ళకు కూడా తెలియవు అసలు సత్యాలు. ఎవరైనా సరే తమకు ఏం తెలుసో అదే చెప్ప గలుగుతారు కదా ! మత గురువులను, మీరు ఈ సత్యాల గురించి ప్రశ్నించి చూడండి. ప్రజలకు వారి దైవత్వం గురించి ఎందుకు బోధించటం లేదు ? అని అడిగి చూడండి ఏం జరుగుతుందో ! గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయి మింగలేక, కక్కలేక ఏదో ఒకటి చెప్పి తప్పించు కుంటారు. లక్షల సంవత్సరాలుగా, వేలాది జన్మలుగా మీ ఆత్మ పరిణామ క్రమం అభివృద్ధి చెంద కుండా చేస్తున్నారు ఈ మత గురువులు ! సాక్షాత్ మీరే దైవాలు ! దైవం లేక దేవుడు బయట ఎక్కడో ఉంటాడు అనే బోధనలను విసిరి కొట్టండి. వీరి ఉచ్చులోంచి తక్షణమే బయట పడండి.

సరే ఇక విషయంలోకి వస్తే....

ఒక దేవుడి విగ్రహానికో, ఫోటోకో మీరు పూజ చేస్తున్నప్పుడు శ్రద్ధ, సమర్పణ, అంకిత భావం మొదలైనవి మీకు అలవడతాయి. జీవితం బాగుపడాలంటే, ఈ భావనలు చాలా చాలా అవసరం. అనివార్యం !

నిజానికి అసలు సిసలు దైవం మీరే ! అయితే మీ గురించి మీకు తెలియదు కాబట్టి, మీ ప్రతిరూపాలైన విగ్రహాలను, ఫోటోలను పూజించమని చెప్తారు. దేవుడి విగ్రహం లేదా ఫోటో అనగానే మీరు అలర్ట్ అయిపోతారు. గౌరవిస్తారు, సద్భావనలను, ప్రేమను ప్రకటిస్తారు. శ్రద్ధ సమర్పణ అంకిత భావాలతో అలంకరిస్తారు. తీర్థం, నైవేద్యం, హారతి లాంటివి సమర్పిస్తారు. దీపం, అగరు వత్తి లాంటివి వెలిగిస్తారు. ఇలా పూజా కార్యక్రమం మొత్తానికి మొత్తం చక్కగా సాగుతుంటుంది. కళ్ళు మూసుకుని మీ కోరికలను నివేదించుకుంటారు. మీ వలన జరిగిన తప్పులేవైనా ఉంటే మన్నించమని వేడుకుంటారు. మళ్ళీ ఇక తప్పులు చేయనని ప్రతిజ్ఞ చేస్తారు. వాస్తవానికి ఇవన్నీ మీకే చెందుతాయి. సాధారణంగా మీ పైన మీకు గౌరవ భావన ఉండదు, సద్భావన, ప్రేమ భావనలు పూర్తి స్థాయిలో ఉండవు. మీ పట్ల మీకు పూర్ణమైన శ్రద్ధ, సమర్పణ, అంకిత భావాలు ఉండవు. ఈ విధంగా ఉండడం వలన మీ జీవితం అల్లకల్లోలంగా ఉంటుంది. ఎందుకంటే యద్భావం తద్భవతి ! ఇదే సృష్టి మూల సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి మీరు బయట ఒక దేవుడికి ప్రకటిస్తున్న గౌరవ, సద్భావన, ప్రేమ, శ్రద్ధ, సమర్పణ, అంకిత భావనలు మీ అంతరంలోకి దిగుతాయి. ఈ దివ్య భావనలను మెల్లి మెల్లిగా మీ అంతరంలో ప్రతిష్ఠించేందుకే పూజ అనే ఒక విధానాన్ని డిజైన్ చేసారు. ఈ భావనలు మీ లోపల సుప్రతిష్ఠితమైనపుడు మాత్రమే మీ జీవితం ఆయురారోగ్య ఐశర్య విజయానంద సౌభాగ్యాలతో విలసిల్ల గలుగుతుంది. అయితే పూజ అనేది ప్రాథమిక దశలో ఉన్న పసి ఆత్మలకే అని చెప్పాడు శ్రీకృష్ణ భగవానుడు. **పూజ, ఎంతో ప్రయాసతో కూడిన మార్గం, ఫలితాలు రావడం చాలా చాలా చాలా కష్టం వచ్చినా చాలా చాలా చాలా అత్యంత సూక్ష్మంగా వస్తాయి అని తెలియజేసాడు.**

ఎందుకంటే ఇక్కడ ఎన్నెన్నో అవాంతరాలు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మీ కోరికలను నెరవేర్చేది భగవంతుడు, ఆయన దయ మీదనే మొత్తం ఆధారపడి ఉంది అనే భావన అత్యంత ప్రధానమైన అడ్డంకి. దేవుడికి కరుణ కలిగితే తీరుస్తాడు, లేకపోతే లేదు, అనేది చాలా తప్పుడు భావన. దేవుడికి కరుణ లేకపోవటం ఏమిటండీ ?! దేవుడికి కరుణ ఎల్లప్పుడూ ఉంటుంది. ముందు మీ పట్ల మీకు కరుణ ఉండాలి. ఇంకొక తప్పుడు భావన ఏమిటంటే, నేను చేసిన పూజతో దేవుడు సంతృప్తి చెందాడో లేదోననే భావన. దేవుడేమైనా అసంతృప్తితో ఉంటాడా ?! దేవుడు ఎల్లప్పుడూ సంతృప్తిగానే ఉంటాడు. ముందు, మీరు చేసిన పూజ పట్ల మీరే సంతృప్తిగా ఉండాలి. ఈ తప్పుడు భావనలకు తోడుగా పూజా కార్యక్రమాల్లో ఎన్నెన్నో మూఢనమ్మకాలు వచ్చి చేరాయి. పూజారులు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. పూజ ద్వారా మీకందే ఫలితమే ఎంతో తక్కువ కాగా, ఇవన్నీ కలిసి పూజ వలన మీకు కలిగే ఆ మాత్రం లాభాలను కూడా అందకుండా చేస్తాయి.

❂❂❂ పూజ అనేది ఆత్మ పరిణామ క్రమంలో ప్రాథమిక దశలో ఉన్న పసి ఆత్మలు ఆడుకునే బొమ్మలాట. ఇదే విషయాన్ని శ్రీకృష్ణ పరమాత్ముడు ఉత్తర గీతలోని 3వ అధ్యాయంలోని 8వ శ్లోకంలో స్పష్టంగా ప్రకటించాడు.

శ్లో ॥ అగ్నిర్దేవో ద్విజాతీనాం మునీనాం హృదిదైవతం ।
ప్రతిమా స్వల్పబుద్ధీనాం సర్వత్ర విదితాత్మనామ్ ॥

- ఉత్తర గీత - 3 : 8

వివరణ : బ్రాహ్మణులకు(క్షత్రియ, వైశ్యులకు కూడా) అగ్నియే దేవుడు. మునులకు హృదయంలో దేవుడు ఉంటాడు. అజ్ఞానులైన, స్వల్ప బుద్ధిగల, మంద బుద్ధిగల మానవులకు అంటే పిల్ల ఆత్మలకు విగ్రహమే దైవం. వీరు విగ్రహాలను, ఫోటోలను మాత్రమే పూజిస్తారు. బ్రహ్మ జ్ఞానులకు, "నేనే దైవం, మీరూ దైవమే, అంతా... అందరూ దైవమే" అనే సత్య అవగాహన ఉంటుంది కాబట్టి వారు తమలో, ఇతరులలో, అందరిలో, అంతటిలో దైవాన్ని దర్శిస్తారు. వీరికి నేనే దైవం అనే ఏకత్వ భావన ఉంటుంది అని ఈ శ్లోకంలో ఎంతో స్పష్టంగా తెలియజేసాడు శ్రీకృష్ణ పరమాత్ముడు, దైవం గురించి అక్కడా ఇక్కడా వెతకకుండా, సర్వస్వంలో దైవాన్ని దర్శించమని ! ప్రతి ఒక్కరిలో, ప్రతి ప్రాణిలో, అన్నింటిలో దైవాన్ని దర్శించండి, ఎందుకంటే అంతా దైవమే, అందరూ దైవాలే అని చెప్పాడు శ్రీకృష్ణ భగవానుడు.

శ్రీకృష్ణ భగవానుడు ఏది చెప్పాడో అది చేయకుండా అజ్ఞానంతో ప్రవర్తిస్తే అధోగతి పాలవుతారు. వారు బాగు పడటం అనేది అసంభవం. తమ ఇష్టానుసారంగా ప్రవర్తించే మూర్ఖులను సాక్షాత్ ఆ భగవంతుడు కూడా ఏమీ చేయలేడు. పరమాత్ముడు చెప్పిన విషయాలను గ్రహించకుండా అజ్ఞానంలో మూఢత్వంలో కూరుకుపోయిన మూర్ఖులు అంతటా, అందరిలో ప్రకటం అవుతూ ఉన్న భగవంతుడిని చూడలేరు అని ఈ కింది శ్లోకంలో శ్రీకృష్ణ దేవుడు తెలియజేస్తున్నాడు.

శ్లో ॥ సర్వత్రావస్థితం శాంతం న ప్రపశ్యే జ్జనార్దనం ।
జ్ఞానచక్షు ర్విహీనత్వా దంధస్సూర్య మివోదితమ్ ॥

- ఉత్తర గీత - 3 : 9

అర్థం : గుడ్డివాడు ఏ విధంగానైతే సూర్యుడిని చూడలేడో అదే విధంగా భౌతికమైన రెండు కళ్ళు ఉన్నా జ్ఞానము అనే నేత్రము లేని అంధుడు తన లోనూ, అంతటా, అందరిలో ప్రకటమై ఉన్న భగవంతుడిని చూడలేడు.

ఇంకా ఈ విధంగా చెప్పాడు శ్రీకృష్ణ పరమాత్ముడు...

శ్లో ॥ బహిర్భ్రామ్యతియఃకశ్చి త్త్యక్త్వాదేహస్థ మీశ్వరమ్ ।
స్వగృహే పాయసంత్యక్త్వా భిక్షా మటతిదుర్మతిః ॥

- ఉత్తర గీత - 4 : 28

✪ దేహంలో ఉన్న పరమాత్మను వదిలి వేసి, పట్టించుకోకుండా బయట దేవుడున్నాడని భ్రమించి, దేవుడి కోసం బయట వెతికే వారు స్వంత ఇంటిలో ఉన్న పాయసాన్ని వదిలిపెట్టి, బయట భిక్షాన్నం కొరకు తిరిగే భిక్షగాళ్ళలాంటి వారు, అని అర్థం.

వివరణ : శరీరంలో మరియు జీవితంలో ఉన్న బాధలను పోగొట్టుకోడానికి అజ్ఞానులు ఏమేమో చేస్తుంటారు. నిజానికి, స్వయం సాక్షాత్ పరమాత్మ స్వరూపులే వారు, నేనే పరమాత్మ అని తెలుసుకోకుండా, దేవుడి కోసం బయట వెతకడం అనేది మహా మూర్ఖత్వం. ఇలాంటి వారిని ఎవరూ బాగుపర్చలేరు.

స్వంత ఇంటిలో ఉన్న పాయసాన్ని వదిలేసి అని అంటే ఇక్కడ "పాయసం" అని కాదు అర్థం - శరీరంలో మరియు జీవితంలో ఉన్న సర్వ - సర్వ, సకల - సకల, సమస్త సమస్యలకు పరిష్కారం అని అర్థం ! తన లోపలే అన్ని పరిష్కారాలను ఉంచుకుని, వాటిని వదిలేసి సమస్యల పరిష్కారం కోసం గుళ్ళు గోపురాలు, తీర్థయాత్రలు, పూజలు, అర్చనలు, నోములు, వ్రతాలు, స్తోత్రాలు, జపాలు, యంత్ర తంత్రాలు, యజ్ఞ యాగాలు, హోమాలు, రంగు రాళ్ళ ఉంగరాలు ధరించడం, తాయెత్తులు ధరించడం, శాంతులు చేయించడం మొదలైన వాటన్నింటిని చేయడం అనేది మూర్ఖత్వం. ఇలా చేయడం అనేది స్వంత ఇంటిలోని పాయసాన్ని వదిలేసి బయట భిక్షమెత్తడం లాంటిదని శ్రీకృష్ణ భగవంతుడు తెలియజేస్తున్నాడు.

పూజ నుండి ఫలితాలు రాబట్టడం చాలా చాలా చాలా కష్టం. ఈ విషయాన్నే శ్రీకృష్ణ పరమాత్ముడు ఉత్తరగీతలో ఈ కింది విధంగా ఎంతో స్పష్టంగా తెలియజేసాడు.

శ్లో ॥ పూజాకోటి సమంస్తోత్రం స్తోత్రకోటి సమంజపం ।
జపకోటి సమంధ్యానం ధ్యానకోటి సమోలయః ॥

- ఉత్తర గీత - 4 : 55

"పూజాకోటి సమంస్తోత్రం" అన్నాడు !

అంటే

కోటి పూజలు చేస్తే వచ్చే ఫలితం

ఒక స్తోత్రంతో వస్తుందని అర్థం.

కోటి సార్లు పూజలు చేయాలంటే కొన్ని వేల జన్మలు పడుతుంది. ఒక సారి ఆలోచించండి వేల జన్మలు ఎత్తి కోటి సార్లు పూజలు చేయడం అనేది ఎంత కష్టమైనదో, ఒక సారి యథార్థంగా ఆలోచించండి. వేలాది జన్మలు ! అత్యంత ప్రయాసతో కూడిన మార్గం మరియు అత్యంత తక్కువ ఫలితాలను ఇచ్చే మార్గం పూజ !

స్తోత్రం !

భగవంతుడి గుణ గణాలను, శక్తి సామర్థ్యాలను, కరుణా కటాక్షాలను మొదలైన వాటిని చదవడాన్నే స్తోత్రం అని అంటారు. ఇది పూజ కంటే చాలా మెరుగైనది. ఎందుకంటే కోటి పూజల ఫలితాన్ని ఒకేసారి ఇస్తుంది కాబట్టి స్తోత్రం అనేది పూజ కంటే ఎంతో గొప్పది. పూజలు చేసేది పిల్ల ఆత్మలైతే, స్తోత్రాలు చదివేది బాలాత్మలు. పసి దశను దాటి బాల్య దశలోకి వస్తాయి. ఇలాంటి బాలాత్మలు స్తోత్రాలు చదువుతూ ఉంటాయి.

స్తోత్రాలు చదవడంలోని అసలు ఉద్దేశం ఏమిటంటే, భగవంతుడు ఏ ఉత్తమ గుణ గణాలను, శక్తి సామర్థ్యాలను, కరుణా కటాక్షాలను, దివ్య శక్తులను కలిగి ఉన్నాడో అవి నీవు కూడా కలిగి ఉన్నావు. ఎందుకంటే నీవే భగవత్ స్వరూపుడివి కాబట్టి. నీ శక్తి సామర్థ్యాలను, నీ దివ్య శక్తులను నీకు గుర్తుచేసి, వాటిని ఉత్తేజపరిచి నీకు అందుబాటులోకి తెచ్చేందుకే ఈ స్తోత్రాలు అనేవి వ్రాయబడ్డాయి. ఇది కూడా ప్రయాసతో కూడుకుని ఉన్నదే ! ఎందుకంటే ఇక్కడ కూడా భగవంతుడి దయ ప్రకారమే

జరుగుతుంది అనే తప్పుడు భావన ఉన్నది. నేను చదివిన స్తోత్రాలు దేవుడిని ప్రసన్నం చేస్తాయో లేదో, ఆయన ప్రసన్నం అయితే కానీ నాకు ఫలితం దక్కదు అనే పూర్తి స్థాయి తప్పుడు భావన ఇక్కడ నెలకొని ఉన్నది. దేవుడు ప్రసన్నంగా లేకపోవటం ఏమిటండీ ?! దేవుడు సర్వదా ప్రసన్నంగానే ఉంటాడు. ప్రసన్నంగా ఉండాల్సింది మీరు ! ముందు మీరే మీ పట్ల ప్రసన్నంగా ఉండాలి. మీ పట్ల మీరు ప్రసన్నంగా ఉండకుండా ఏవో నాలుగు స్తోత్రాలు చదివితే దేవుడు ఉబ్బిపోయి మీకేదో చేస్తాడా ? స్తోత్రాలు చదవడం అనేది మీ లోని దివ్య శక్తులను ఉత్తేజితం చేసేందుకే కానీ, దేవుడికి మస్కా కొట్టడానికి కాదు. దివ్య భావనలను మీ అంతరంలో ప్రతిష్ఠించడానికే స్తోత్రాలు ఉద్దేశించబడ్డాయి. మరి, ఈ స్తోత్ర మార్గం కూడా ఎంతో ప్రయాసతో కూడుకున్నదే. ఫలితం కూడా తక్కువే !

స్తోత్రకోటి సమంజపం అన్నాడు శ్రీకృష్ణ పరమాత్ముడు.

అంటే

కోటి స్తోత్రాలు చదివితే వచ్చే ఫలితం ఒక్కసారి జపం చేస్తే వస్తుంది అని అర్థం. కోటి స్తోత్రాలు చదవాలంటే కొన్ని వందల జన్మలు పడుతుంది. వందల జన్మలు ఎంతో కష్టపడి స్తోత్రాలు చదివితే వచ్చే ఫలితాన్ని కేవలం ఒకే ఒక జపం ఇస్తుంది.

జపం !

జపం అంటే ఏదైనా ఒక దైవ నామాన్ని స్మరించడం. వాస్తవానికి అన్నీ దైవ నామాలే ! అయితే పర్టిక్యులర్‌గా మనం కొన్ని పేర్లకు ప్రత్యేకతను, పవిత్రతను ఆపాదించి పెట్టుకున్నాం. ఉదాహరణకు రామ, కృష్ణ, దత్త, నారాయణ, శివ, శంకర, లక్ష్మి , సరస్వతి, పార్వతి మొదలైనవి.

జపం అంటే పూర్తి శ్రద్ధతో 108 సార్లు దైవ నామాన్ని స్మరించడం. దైవ నామ స్మరణ యొక్క అసలు అర్థం ఏమిటంటే, కేవలం కృష్ణ అనే నామాన్ని మాత్రమే ఉచ్ఛరించడం కాదు, కృష్ణ అనే పదం ఎవరిని గుర్తుకు తెస్తుందో ఆయన యొక్క గుణ గణాలను, దివ్య శక్తులను, ఆయన యొక్క అనంత తత్వాన్ని ఎరుకతో స్మరించడం. ఈ విధంగా శ్రద్ధతో స్మరించడం వలన మన లోపల ఉన్న మన దైవత్వానికి అడ్డంకులుగా ఉన్న మన అజ్ఞానపు పొరలు తొలగిపోయి, క్రమ క్రమంగా మన దివ్యత్వానికి దగ్గరయ్యే అవకాశం ఉంది, కానీ పొందే అవకాశం లేదు. ఎందుకంటే ఇందులో కూడా "నేను, దైవమూ ఒక్కటే అన్న ఏకత్వ భావన లేదు" అందుకే ఈ జప మార్గం కూడా ప్రయాసతో కూడుకుని ఉన్నదేనని, అపరిపక్వమైనదనీ శ్రీకృష్ణ భగవానుడు తెలియజేసాడు.

జపకోటి సమంధ్యానం అన్నాడు కృష్ణ పరమాత్మ !

అంటే

కోటి జపాలు చేస్తే వచ్చే ఫలితం కేవలం ఒక్క సారి "నేను దైవాన్ని" అని అనుకుంటే వచ్చేస్తుంది అని అర్థం. ఒక జపం అంటే 108 సార్లు దైవ నామాన్ని స్మరించడం. ఈ విధంగా కోటి జపాలు ఒక వంద జన్మలలో పూర్తి చేయవచ్చేమో ! వంద జన్మలు అంటే మాటలు కాదు. మరి, ఎంతో శ్రమకోర్చి వంద జన్మలు ఎత్తి కోటి జపాలు చేస్తే వచ్చే ఫలితం, కేవలం ఒకే ఒక్క సారి "నేను దైవాన్ని" అని అనుకోవడంతో రావడం ఎంత సులభమో కదా !

ధ్యానం లేక యోగం !

మీ నిజ తత్వం పట్ల ఎరుకను కలిగి ఉండడమే ధ్యానం. మరి మీ నిజ తత్వమంటే ఏమిటి ? దైవత్వమే మీ నిజ తత్వం. స్వయం సాక్షాత్ దైవ స్వరూపమే మీరు. మరిచిపోయిన మీ నిజ తత్వాన్ని సులభంగా, అత్యంత శీఘ్రంగా మళ్ళీ అందించేదే ధ్యానం. నేను దైవము ఒక్కటే అనే ఏకత్వ భావనయే ధ్యానం.

ప్రాణాయామం అన్నా , యోగా అన్నా, ధ్యానం అన్నా, యోగం అన్నా ఒక కోణంలో ఒకే అర్థాన్నిస్తాయి. ఇవన్నీ ఒక్కటే ! ఈ ప్రస్తుత కాలంలో యోగా అనే పదాన్ని యోగాసనాలకు వాడుతున్నారు. ఇప్పుడు జనాలకు యోగా అంటే కేవలం ఎక్సర్‌సైజులు, ఆసనాలు మాత్రమే !

✪ కొన్ని వేల జన్మలు పూజ చేస్తే ఎంత ఫలితం వస్తుందో, కొన్ని వందల జన్మలు స్తోత్రాలు చదివితే ఎంత ఫలితం వస్తుందో, ఒక వంద జన్మలు కష్టపడి జపం చేస్తే ఎంత ఫలితం ఉంటుందో, అదంతా కేవలం ఒకే ఒక్క సారి "నేను దైవాన్ని" అని అనుకుంటే వస్తుంది.

✪ పూజ, స్తోత్రం, జపం, నోము, వ్రతం, హోమం, యజ్ఞం, యాగం మరియు తపస్సు మొదలైన వాటన్నింటి కంటే ఎంతో గొప్పదైన, ఉన్నతమైన, ఉత్తమమైన, శక్తివంతమైన మరియు పరమ పవిత్రమైన ధ్యానం(యోగం) యొక్క విశిష్టతను గురించి ఉత్తర గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు ఈ కింది విధంగా తెలియ జేసాడు.

శ్లో ॥ నిమిషం నిమిషార్ధం వా జ్ఞానినో - ధ్యాత్మచింతయా ।
క్రతుకోటిసహస్రాణాం ధ్యానమేకం విశిష్యతే ॥ - ఉత్తర గీత - 3 : 17

అర్థం : అనేక వేల కోట్ల యజ్ఞాలను చేస్తే ఎంత ఫలితం అయితే వస్తుందో అదంతా కూడానూ కేవలం ఒక నిమిషంలో* / క్షణంలో* లేక అర నిమిషంలో* / అర క్షణంలో* ఆత్మధ్యానం అనగా నేనే దైవం అనే దైవత్వ సాధన చేస్తే వచ్చేస్తుంది.

* నిమిషం అని అంటే మూడు రకాల అర్థాలు ఉన్నాయి. వాటిలో మొదటిది కను రెప్ప వేసినంత కాలం. రెండవది క్షణ కాలం. మూడవది అరవై సెకన్ల(క్షణాల) కాలం. ఈ మూడు అర్థాలు మూడు రకాలుగా ఉన్నా అన్నీ కూడా "అత్యంత స్వల్పమైన కాలాన్నే" సూచిస్తున్నాయి. కాబట్టి మీరు ఏ అర్థాన్ని తీసుకున్నా సరే !

వివరణ : అనేక వేల కోట్ల యజ్ఞాలను పూర్తి చేయడమంటే మాటలు కాదు. అత్యంత కష్టమైన పని.

అనేక వేల కోట్ల యజ్ఞాల ఫలితం = అర నిమిషం ధ్యాన సాధన !

ఊహలకు అందనంత షార్ట్ కట్ !

మెరుపు వేగంతో, అపారమైన, విస్తారమైన, ఎంతెంతో శ్రేయస్కరం అయిన, మహా దివ్యమైన, శాశ్వతమైన ఫలితాలను కేవలం ఆత్మధ్యానం అనగా "నేనే దైవం" అనే దైవత్వ సాధన మాత్రమే ఇస్తుంది కాబట్టి ధ్యానమే(యోగమే) గొప్పది. మిగతావన్నింటిని అవగాహన చేత వదిలివేసి కేవలం ధ్యాన సాధన మాత్రమే చేయాలి.

శ్లో ॥ అశ్వమేధ సహస్రాణి వాజపేయ శతాని చ ।
ఏకస్య ధ్యానయోగస్య కళాంనార్హతిషోడశీమ్ ॥

- ఉత్తర గీత - 2 : 49

అర్థం : అనేక వేల అశ్వమేధ యాగములు చేసినా, అనేక వందల వాజపేయ యాగములు చేసినా సరే, వీటి ఫలితం అంతా కూడా, ధ్యానయోగం ద్వారా వచ్చే ఫలితంలో పదహారవ భాగాని కంటే తక్కువే !

ఏ యజ్ఞమైనా, యాగమైనా, హోమమైనా సరే ధ్యానయోగం ముందు ఎందుకూ పనికి రావు. కాబట్టి యజ్ఞం, యాగం, హోమం అంటూ చిన్న చిన్న పనులు చేయకుండా, అన్నింటికంటే మహా శక్తి వంతమైనదీ, పరమోత్తమమైనది, దివ్యమైనది అయిన ధ్యానయోగ సాధన మాత్రమే చేయవలెను.

నేనే దైవం అనే దైవత్వ సాధన యొక్క మహత్యం గురించి ఇంకా ఇలా చెప్పాడు శ్రీకృష్ణ భగవానుడు.

శ్లో ॥ అహంబ్రహ్మేతియోధ్యాయే దేకాగ్రమనసా సకృత్ ॥

సర్వంతరతి పాప్మానం కల్పకోటిశతైః కృతమ్ ॥

- ఉత్తర గీత - 2 : 41

అర్థం : శ్రద్ధగా, ఎవరైతే అహం బ్రహ్మాస్మి అనగా "నేనే దైవం" అనే దైవత్వ సాధన చేస్తారో, వారు అనేక వందల కోట్ల కల్పములలో(కోట్ల కోట్ల యుగాలలో) చేసిన పాపాలన్నీ సులభంగా, సురక్షితంగా, శీఘ్రంగా, శాశ్వతంగా తొలగి పోతాయి.

ఇంత గొప్పదైనటువంటి దైవత్వ సాధన చేయకుండా ఉన్నవారు ఎన్నటికీ ముక్తిని పొందరని ఈ క్రింది శ్లోకంలో వివరించాడు శ్రీకృష్ణ పరమాత్మ.

శ్లో ॥ హన్యాన్ముష్టి భిరాకాశం క్షుధార్తః ఖండయేత్త్వహం ।

నాహం బ్రహ్మేతి జానాతి తస్యముక్తి ర్నజాయతే ॥

- ఉత్తర గీత - 2 : 55

అర్థం : ఆకలిచే బాధపడువాడు ఆకాశాన్ని పిడికిళ్ళ చేత గుద్దితే ఏ ప్రయోజనం ఉండనట్లే, తన లోపల ఉన్న పరమాత్మను నేనే అని తెలుసుకోకుండా అనగా "నేనే పరమాత్మను" అని గ్రహించకుండా ఉన్న వారికి ఏ నాటికి ముక్తి కలుగదు. వారి కష్టాలెన్నటికీ తీరవు.

వివరణ : ఆకలిచే బాధపడటం అని అంటే కేవలం తిండి కోసం అని కాదు ఇక్కడ అర్థం. శరీరంలోని + జీవితంలోని సర్వ - సర్వ, సకల - సకల, సమస్త సమస్యలతో బాధపడటం అని అర్థం. తనలో ఉన్న పరమాత్మను తానే అని గ్రహించకుండా అంటే నేనే పరమాత్మను అని తెలుసుకోకుండా సర్వ సమస్యలచే బాధపడుతున్న వ్యక్తి వాటి నుండి ముక్తి కోరుతూ చేసే పనులన్నీ కూడా అంటే - పూజ, స్తోత్రం, జపం, నోములు, వ్రతాలు, యజ్ఞ యాగాలు, హోమాలు, తపస్సు, యంత్ర తంత్రాలు, మంత్ర జపాలు, ఉంగరాలు ధరించడం, తాయెత్తులు ధరించడం, భజనలు చేయడం, సంకీర్తనలు చేయడం, ఉపవాసాలు ఉండటం, ఇంకా అనేకానేకమైన రకరకాల కార్యక్రమాలను చేస్తూ ఉండటం ఎలా ఉంటుందంటే ఆకలిచేత బాధపడేవాడు ఆకాశాన్ని పిడికిళ్ళతో గుద్దినట్టుగా ఉంటుంది అని అర్థం. అంటే వీటివల్ల ఏ ప్రయోజనం కలుగక పోగా సమయం + శక్తి వృథా అవుతాయి అని అర్థం. ఇది పరమ సత్యం !

"అహం బ్రహ్మాస్మి" అంటే "నేనే దైవం" అని తెలుసుకోకుండా మీరేం చేసినా మీ శరీరం + జీవితంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదు గాక లభించదు. ఇక మోక్షం అనేది అయితే ఏనాటికీ లభించదు. కాబట్టి వ్యర్థమైన పనులన్నింటిని తక్షణమే వదిలిపెట్టి "దైవత్వ సాధన" మొదలు పెట్టాలి. "నేనే దైవం" అని తెలుసుకోవాలి.

శ్రీకృష్ణ పరమాత్ముడే స్వయంగా చెప్తున్నాడు కదా ! దైవమే మీరు అని !
నిజంగా మీరే దైవం !

మరి మనం ఏం చేస్తున్నాం ?!

వేదాలు చెప్తున్నాయి "నువ్వే దైవమని" ! యోగం(ధ్యానం) చేసి దైవత్వాన్ని పొందమని శ్రీకృష్ణ పరమాత్మ ఆదేశిస్తున్నాడు.

మరి హిందువులలో ఎంత మంది వీటిని ఆచరిస్తున్నారో ఆ కృష్ణ పరమాత్మకే తెలియాలి. వేదాలు గొప్పవి అంటారు. వేద మహా వాక్యాలను ఆచరించరు !

కృష్ణుడిని దేవుడని అంటారు.

ఆయన చెప్పింది మాత్రం చేయరు!

❂✪❂ ఎంత మంది గురువులు ఈ మహా విషయాల సారాంశాన్ని బోధించి, వారి శిష్యుల చేత దైవత్వ సాధన చేయిస్తున్నారు ?! చేసే వారికి ఆత్మ పూర్వక అభినందనలు ! నేను, ఇక్కడ చేయని వారి గురించి ప్రస్తావిస్తున్నాను.

కృష్ణా కృష్ణా కృష్ణా కృష్ణా కృష్ణా కృష్ణా .... అని అంటూ
ఉంటారు. నిజంగా కృష్ణుడు వచ్చి ఫలానాది చేయండి
అని చెప్పితే మీరు చేయరు అన్న సంగతి, మీకు తెలుసా ?
కృష్ణుడు కనపడనంత వరకే, మాట్లాడనంత వరకే... ఆయనకు విలువ.
ఆయన కనపడి మాట్లాడితే అతన్ని మీరు లక్ష్య పెట్టరు
అన్న విషయం మీకు తెలుసా ?

ఎందుకంటే ఆయన చెప్పిన భగవద్గీతలోని మరియు ఉత్తరగీతలోని
సత్యాలను ఎంత వరకు ఆచరిస్తున్నారో ఒక సారి
మిమ్మల్ని మీరు నిజాయితీగా పరిశీలించుకోండి.

౨౬. జీసస్ క్రైస్ట్ కూడా ఇదే చెప్పాడు !

జీసస్ క్రైస్ట్ ఏం చెప్పాడు, క్రిస్టియన్లు ఏం చేస్తున్నారు ?!

క్రీస్తును అనుసరించే వారిని క్రైస్తవులు అని అంటారు. క్రీస్తుని అనుసరించడం అంటే, "ఆయన బోధనలను ఆచరించడం" ! ఎవరైతే జీసస్ క్రైస్ట్ బోధనలు ఆచరిస్తున్నారో వారే క్రైస్తవులు. పరమాత్ముడు జీసస్ క్రైస్ట్ కూడా ఎన్నో ప్రకటనలు చేశాడు. ఆయన ఎన్నో బోధించాడు. అందులో అత్యంత ప్రధానమైనవి కొన్ని :

✪ The Kingdom of God is within you.

- The Holy Bible - Luke 17 : 21

✪ I am the Son of God ;

I and my father are one ;

I and you are one.

- The Holy Bible - John 14 : 20

"The Kingdom of God is within you"

- The Holy Bible - Luke 17 : 21

అంటే "దేవుని రాజ్యం నీ లోపల ఉంది" అని అర్థం. మరి, దేవుని రాజ్యం నీ లోపల ఉంటే, దేవుడు కూడా లోపలే ఉంటాడు కదా ! "దేవుడు నీ లోపలే ఉన్నాడు" అని ఒకే ఒక్క వాక్యంలో ఎంత చక్కగా సత్యాన్ని చెప్పేశాడో ఏసు ప్రభువు ! "దేవుని రాజ్యం నీ లోపల ఉంది, దేవుడు నీ లోపల ఉన్నాడు" అని జీసస్ క్రైస్ట్ చెప్పాడు కదా !

I am the Son of God

నేను దేవుని కుమారుడిని !

I and my father are one

నేను నా తండ్రి ఒకటే !

I and you are one

నేను నీవు ఒకటే !

- The Holy Bible - John 14 : 20

నేను దైవ కుమారుడిని అని అంటే దేవుని కుమారుడు దేవుడు కాక మరేం అవుతాడు ? మళ్ళీ వెంటనే చెప్తున్నాడు. "నేను నా తండ్రి ఒకటే" అని అంటే, నేనే దైవం అని అర్థం. తర్వాత చెప్తున్నాడు "నీవు నేను ఒక్కటే" అని, అంటే నేను దైవమే, నీవు కూడా దైవమే అని చెప్తున్నాడు.

ఈ క్రింది వాక్యంలో సూటిగా ప్రకటించేశాడు "అందరూ దైవాలేనని" !

> **"అందుకు ఏసు - మీరు దైవములని నేనంటినని మీ ధర్మ శాస్త్రములో వ్రాయబడి ఉండలేదా ? లేఖనము నిరర్థకము కానేరదు కదా ..."**
>
> **- యోహాను - 10 : 34 & 35**

స్వయంగా జీసస్ క్రైస్టే చెప్తున్నాడు, "మీరు దైవాలని" ! అంటే అందరూ దైవాలేనని అర్థం ! జెరూసలెంలో ఆలయ ప్రతిష్ఠ పండుగ శీతాకాలంలో జరుగుతున్నప్పుడు, ఏసు దేవాలయంలోని సాలమన్ మంటపంలో తిరుగుతూ ఉండగా, యూదులు ఆయన చుట్టూ పోగై, ఎంత కాలం మమ్మల్ని సందేహంలో ఉంచుతావు ? నీవే క్రీస్తువైతే స్పష్టంగా చెప్పమని అడిగారు. అప్పుడు ఏసు నేను ఇంతకు ముందు చెప్పాను, మీరు నమ్మలేదు మళ్ళీ అడుగుతున్నారు, నేను ఆ భగవంతుడి పేరున చేసే కార్యములే నాకు సాక్షి... అంటూ వాళ్ళకు విషయాలను వివరిస్తూ... "నేనును తండ్రియు ఏకమై ఉన్నాము"(యోహాను - 10 : 30) అని చెప్పాడు. అప్పుడు యూదులు ఏసును కొట్టడానికి రాళ్ళను చేతిలోకి తీసుకున్నారు. మీరు నన్నెందుకు కొట్టాలని అనుకుంటున్నారు ? అని ఏసు వారిని అడిగాడు. అందుకు వారు - నీవు మనిషివై ఉండి "నిన్ను నీవు దైవమని" చెప్పుకొనుచున్నావు, "నేనే దైవమని" నీవు దైవ దూషణ చేసినందుకే కొట్ట దలచాము కాని నీ మంచి కార్యముల గురించి కాదు అని వారు చెప్పారు. అప్పుడు ఏసు - "నేనే కాదు మీరు కూడా దైవములే" అని వారికి తెలియజేస్తూ ఇంకా ఎన్నో విషయాలను చెప్పాడు. అయినా అప్పుడు వారు వినలేదు..... ....కానీ ఇప్పుడు మనం విందాము. జీసస్ పరమాత్ముడు స్వయంగా చెప్పిన వాటిని అంగీకరించి ఆచరించకపోతే అధోగతి పాలవుతాము. "మీరు దైవాలే" అని చెప్పినపుడు ఆ విషయం సత్యమే కదా ! వాస్తవానికి జీసస్ క్రైస్ట్ చెప్పదలుచుకున్నది, నిగూఢంగా చెప్పింది ఉన్న ఏకైక సత్యం గురించే ! అంతా దైవమే, అందరూ దైవాలే, సర్వమూ సమానమే, అందరి మూలం ఒక్కటే అంటూ సృష్టి ఏకత్వాన్ని గురించియే బోధించాడు ఆ పరమాత్ముడు.

అయితే అప్పుడు ఆ కాలంలో ఉన్నవారు పెద్దగా వికాసం కలిగిన వారు కాదు. అందుకే వారికి అర్థం అయ్యే విధంగా రక రకాలుగా చెప్పాడు. చివరి దశకు కొద్ది కాలానికి ముందు ఏసు ఇలా అన్నాడు.....

"నేను మీతో చెప్ప వలసినవి ఇంకా అనేక విషయాలున్నాయి కానీ ఇప్పుడు మీరు వాటిని సహింపలేరు" - యోహాను - 16 : 12

"ఈ సంగతులు గూఢార్థముగా మీతో చెప్పితిని..."

- యోహాను - 16 : 25

కాబట్టి మనం జీసస్ పరమాత్ముడు చెప్పిన విషయాల యొక్క "గూఢార్థాన్ని" అవగాహన చేసుకోవాలి. శబ్దార్థాన్ని తీసుకోవద్దు !

మానవ జాతి జాగృతికి ఆ మహనీయుడు చేసిన దివ్య కార్యాలు, దివ్య బోధనలు శాశ్వతంగా నిలిచి ఉంటాయి.

ఇంకా జీసస్ క్రైస్ట్ ఇలా అన్నాడు...

✪ "నీవు విశ్వసించిన ప్రకారం నీకు అవునుగాక" !

- మత్తయి - 8 : 13

✪ "మీకు ఆవగింజంత విశ్వాసం ఉండిన యెడల ఈ కొండను చూచి - ఇక్కడ నుండి అక్కడికి పొమ్మనగానే అది పోవును; మీకు అసాధ్యమైనది ఏదియు లేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" !

- మత్తయి - 17 : 21

✪ "నేను తండ్రి వద్దకు వెళ్ళుచున్నాను గనుక నేను చేయు క్రియలు నా యందు విశ్వాసం ఉంచు వాడును చేయును, వాటి కంటే మరి గొప్పవి అతడు చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" !

- యోహాను - 14 : 12

జీసస్ క్రైస్ట్ యొక్క బోధనలను ఆచరించ కుండా కేవలం వల్లె వేసినంత మాత్రాన ఏమీ ఒరగదు, ఏమీ జరగదు. చాలా మంది క్రమం తప్పకుండా బైబిల్‌ని చదువుతూనే ఉంటారు. అందులో ఉన్న సత్యాలను మాత్రం విశ్వసించరు. ఇలాంటి క్రైస్తవులను చూసినపుడు నాకు చాలా ఆశ్చర్యం కలుగుతుంది. వీరు క్రమం తప్పకుండా చర్చీలకు వెళ్తుంటారు. బైబిల్‌లోని వాక్యాలను వల్లె వేస్తుంటారు. వాటిని నిజ జీవితంలో యథాతథంగా ఆచరించమంటే మాత్రం వెనకడుగు వేస్తారు. ఇలాంటి వారు ఇదే విధంగా ఉంటే దైవసామ్రాజ్యాన్ని ఏనాటికీ పొందరు. అయితే జీసస్ క్రైస్ట్ బోధనలను ఆచరించే క్రైస్తవులు చాలా మంది ఉన్నారు. వారికి నా ఆత్మ పూర్వక అభినందనలు. నేను ఇక్కడ ఆచరించని వారి గురించి ప్రస్తావిస్తున్నాను.

జీసస్ "నేనే మార్గం" "నా" ద్వారా మాత్రమే దైవ సామ్రాజ్యానికి, స్వర్గానికి వెళ్తారు అని అనగానే అందరూ జీసస్ ఒక్కడి ద్వారా మాత్రమే అనుకుని 2000 సంవత్సరాలుగా అపోహ పడుతూనే ఉన్నారు. జీసస్ క్రైస్ట్ చెప్పింది, అన్నది, ప్రకటించింది వేరే - ఇక్కడ "నేను" అని అంటే - అందరిలో ఉండే "నేను" అనబడేది అని అర్థం. అంతే కానీ జీసస్ క్రైస్ట్ ఒక్కడే అని కాదు. అందరిలో ఉండే "నేను", "నా", "నాది", "నాకు", నన్ను" అనేవి "దైవం" ! అందరిలో అసలు సిసలు "నేను"లు ఉంటాయి, ఎన్నెన్నో నకిలీ నేనులు ఉంటాయి. అంతరంగంలో నిజమైన, వాస్తవమైన, సత్యమైన "నేను" అనేది ఉంటుంది అదే , ఆ "నేనే" దైవం ! "నేను దైవాన్ని" ....అని తమను తాము "దైవంగా" నమ్మితే వారు దైవంగా పరిణమించియే తీరుతారు(ఇక్కడ నమ్మడం అని అంటే ఒప్పుకోవడం, తమ దైవత్వాన్ని తాము అంగీకరించడం). ఎందుకంటే జీసస్ క్రైస్ట్ "నమ్ముువానికి సమస్తమును సాధ్యమేనని(మార్కు - 9 : 23)" చెప్పాడు. ఆయన ఇంకా తన బోధనల గురించి ఇలా చెప్పాడు "ఆకాశం(స్వర్గం) మరియు భూమి అంతరించి పోయినా, నా వాక్కులు మాత్రం అంతరించిపోవు (మత్తయి - 24 : 35)" అని ఇంత ఘనంగా గ్యారంటీ ఇచ్చినప్పుడు, నేను నిజంగా నమ్మినప్పుడు, ఇది జరిగియే తీరుతుంది కదా ! జీసస్ క్రైస్ట్ వాక్కులను యథాతథంగా నమ్మి ఆచరించినప్పుడు, అవి ఫలించియే తీరుతాయి కదా ! - అని మీరు ఈ విధంగా నమ్మి ఆచరిస్తే, సులభంగా, శీఘ్రంగా, మీ శరీరంలోని + జీవితంలోని సమస్యలన్నీ తొలగిపోయి దైవత్వం ప్రాప్తిస్తుంది.

ఇంకా జీసస్ క్రైస్ట్ ఒక పరమ సత్యాన్ని ఈ క్రింది విధంగా ప్రకటించాడు.

When ye know the truth,
It shall set you free !

The Holy Bible - John - 8 : 32

సత్యాన్ని మీరు గ్రహించినట్లైతే,
మిమ్మల్ని అది విముక్తుల్ని చేసేస్తుంది !

- పరిశుద్ధ గ్రంథము బైబిల్ - జాన్ (యోహాను) - 8 : 32

మీ వాస్తవాలకు మీరే సృష్టికర్తలు అంటే మీ కష్ట నష్టాలన్నింటికీ మీరే సృష్టికర్తలు ! ఇదే సత్యం ! ఈ సత్యాన్ని మీరు నిజంగా, 100%గా మీ అంతరంలో గ్రహిస్తే చాలు, ఇక మీరేమీ చేయనక్కరలేదు. మీరు గ్రహించిన సత్యమే మిమ్మల్ని విముక్తులను చేసేస్తుంది. నా కష్ట నష్టాలన్నింటికీ నేనే సృష్టికర్తను అనే సత్యాన్ని మీరు నిజంగా ఒప్పుకుంటూ ఉంటే, మీ ఒప్పుకోలు పూర్ణమైనప్పుడు, అది "సత్యాన్ని గ్రహించడం అవుతుంది". అప్పుడు ఇక మీరేమీ చేయనక్కరలేదు, మీరు గ్రహించిన సత్యమే మిమ్మల్ని మీ కష్ట నష్టాలన్నింటి నుండి తక్షణమే, శాశ్వతంగా విముక్తం చేసేస్తుంది. మరో రకంగా చెప్పాలంటే ఎప్పుడైతే మీరు " నా వాస్తవాలకు నేనే కారణం" అని గ్రహించిన తక్షణమే, మీ అంతరంగంలోకి మీ ఎరుక ప్రసరిస్తుంది. మీకు ఎరుక సిద్ధించిన మరుక్షణం మిమ్మల్ని మీరు బాధించుకోవడం ఆటొమెటిక్‌గా మానివేస్తారు. ఇంత కాలం మీరే మీ బాధలకు కారణం అనే ఎరుక లేనందు వల్లనే విస్మృతిలో మిమ్మల్ని మీరు బాధించుకుంటున్నారు. మీ అన్ని మంచి చెడులకు మీరే సృష్టికర్త అని తెలియగానే, అప్పుడు ఇక కేవలం మీ మంచిని మాత్రమే మీరు సృష్టించుకుంటారు. మీరు స్వతంత్రులవుతారు. ఇది సహజంగా జరిగే సృష్టి విధి విధానం. అంతే ! జీసస్ క్రైస్ట్ బోధనలలో కేవలం రెండింటిని లేక మూడింటిని ఆచరిస్తే చాలు జీవితం "ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలతో విరాజిల్లుతుంది".

కాబట్టి జీసస్ బోధనలను అంగీకరించి, వాటిని యథాతథంగా ఆచరిస్తూ సాధన చేస్తే మనం మహా, మహా కార్యాలను చేసి యావత్ భూమండలానికి ఎంతో శ్రేయస్కరం కలిగించవచ్చు.

దైవసామ్రాజ్యం కోసం పరితపించమని, దానిని పొందమని జీసస్ చెప్పాడు. ఈ విషయమై ఇంకా ఈ కింది విధంగా ప్రకటించాడు :

" మీకు రాజ్యము అనుగ్రహించుటకు

మీ తండ్రికి ఇష్టమైయున్నది" ! - లూకా - 12 : 32

ఇక్కడ రాజ్యం అని అంటే "దైవ సామ్రాజ్యం" అని అర్థం.

నేను దైవమే, నీవు దైవమే, అందరూ దైవాలే అని జీసస్ చెప్పాడు కదా ! ఆ దైవత్వం నీ లోపల ఉంది అని చెప్పాడు కదా ! ఆ యొక్క దివ్యత్వాన్ని అనుగ్రహించడానికి ఆ దైవం సిద్ధంగా ఉందని కూడా చెప్పాడు కదా ! దైవమే నీవు కాబట్టి నీ దైవత్వాన్ని నీవు తెలుసుకో అని ఎంత మంది ఫాదర్‌లు, ఈ విషయాన్ని చెప్పి క్రైస్తవుల చేత ఈ దైవత్వ సాధన చేయిస్తున్నారు ? చేయించే వారికి అభినందనలు. నేనిక్కడ చేయించని వారి గురించి ప్రస్తావిస్తున్నాను.

మరి, ఎంత మంది క్రైస్తవులు "లోపల" వెతుకుతున్నారు ? "లోపల" అని అంటే "అంతర్ముఖం" అని అర్థం. ఎంత మంది క్రైస్తవులు "అంతర్ముఖులు" అవుతున్నారు. ఎంత మంది దైవత్వ సాధన చేస్తున్నారు ? చేసే వారికి అభినందనలు. నేనిక్కడ చేయని వారి గురించి ప్రస్తావిస్తున్నాను.

"దేవుని రాజ్యం లోపల ఉంది" అని జీసస్ క్రైస్ట్ చెప్పాడు. ఆ రాజ్యాన్ని స్వంతం చేసుకోండి. ఆ రాజ్యానికి మీరే వారసులు. దగ్గరలోనే ఉంది, చూడండి, వారసత్వంగా సంక్రమించిన దేవుని రాజ్యాన్ని తెలుసుకోండి, పొందండి అని బోధించాడు.

లోపల ఉన్న దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా పొందే సాధన చేసేవాడే నిజమైన క్రైస్తవుడు, జీసస్ క్రైస్ట్ చెప్పినట్టుగా !

దేవుడి రాజ్యాన్ని పొందిన వాళ్ళూ దేవుళ్ళే అవుతారు ! మన దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుని మనం దైవాలం కావాలి ! అందరినీ ప్రోత్సహించాలి ! ఇదే జీసస్ క్రైస్ట్ చేసింది, చేయమని చెప్పింది. మరి మనం జీసస్ క్రైస్ట్ చెప్పినట్టే చేస్తున్నామా ?!

"The Kingdom of God is within you" - The Holy Bible - Luke 17 : 21

అంటే "దేవుని రాజ్యం నీ లోపల ఉంది" అని అర్థం. మరి, దేవుని రాజ్యం నీ లోపల ఉంటే, దేవుడు కూడా లోపలే ఉంటాడు కదా ! "దేవుడు నీ లోపలే ఉన్నాడు" అని ఒకే ఒక్క వాక్యంలో ఎంత చక్కగా సత్యాన్ని చెప్పేశాడో ఏసు ప్రభువు ! "దేవుని రాజ్యం నీ లోపల ఉంది, దేవుడు నీ లోపల ఉన్నాడు" అని జీసస్ క్రైస్ట్ చెప్పాడు కదా !

I am the Son of God

నేను దేవుని కుమారుడిని !

I and my father are one

నేను నా తండ్రి ఒకటే !

I and you are one

నేను నీవు ఒకటే ! (అంటే, అందరూ దైవాలే అని గూఢార్థం)

- The Holy Bible - John 14 : 20

ఉన్నత దివ్య కాంతి లోకాల నుండి ఒక దివ్యాత్మను ఈ భూలోక కల్యాణార్థమై కొంత మంది అంతర్విశ్వ సమాఖ్య సభ్యులు తీసుకు వచ్చారు. ఆయన ఒక భౌతిక దేహాన్ని ధరించి ఈ భూమి పైన ఉన్నప్పుడు ఆయనకు ఒరిజినల్‌గా ఉన్న పేరు "ఇమ్మాన్యుయెల్" (Jmmanuel) ! ఆయన భారత దేశానికి వచ్చాడు. ఇక్కడ భారత హిమాలయాలలో యోగ సాధన చేసాడు మళ్ళీ తన దేశానికి వెళ్ళాడు. కానీ అక్కడి వాళ్ళు ఆయనను తీవ్రంగా, ఘోరంగా, దారుణంగా వేధించారు... చంపబోయారు. అందుకే ఆయన అక్కడి నుండి మళ్ళీ భారత దేశానికి వచ్చి కశ్మీర్‌లో చాలా కాలం నివసించి తర్వాత ఈ లోకం నుండి వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళి పోయిన సుమారు 300 సంత్సరాల తర్వాత కాన్‌స్టాంటినోపుల్ (ఇస్తాంబుల్) అనే నగర రాజైన కానస్టంటైన్ కొంత మంది మతాధికారులను ఒక కూటమిగా తయారు చేసి ఇమ్మాన్యుయెల్ బోధనలను సేకరించి ఒక కొత్త మతం తయారు చేయించాడు. ఇమ్మాన్యుయెల్ జీవిత వివరాలను సేకరించి ఆయన చరిత్రను తమకు అనుగుణంగా, ఆయన బోధనలను తమకు అనుగుణంగా వ్రాయించాడు. ఒక కొత్త మతానికి ఒక ప్రవక్తగా "మాస్టర్ ఇమ్మాన్యుయెల్"ను ఎంపిక చేసుకున్నాడు. ఇమ్మాన్యుయెల్(Jmmanuel) మాస్టర్ ఒక దివ్య పరమాత్మ స్వరూపుడు, లోక కల్యాణార్థమై దివ్య కాంతి లోకాల నుండి ఈ భూమి పైకి వచ్చి తన పని తాను చేసి వెళ్ళి పోయాడు. ఆయన ఏ మతాన్ని స్థాపించలేదు. కేవలం సత్య ప్రచారం చేసాడు. సత్యాలను తెలియ చేసాడు. రాజు ఆధ్వర్యంలో మతాధికారులంతా ఎన్నో తర్జన భర్జనలు పడి చివరకు మాస్టర్ ఇమ్మాన్యుయెల్‌కు "జీసస్ క్రైస్ట్" అనే పేరు పెట్టారు. డిసెంబర్ 25 ఆయన పుట్టిన తేది అని నిర్ణయించారు. నిజానికి ఉన్నత లోకాలలో ఆయనను "సనంద" అనే పేరుతో పిలుస్తారు. ఆయన భూమి మీద ఉన్నప్పుడు ఇమ్మాన్యుయెల్‌గా చెలామణి అయ్యాడు. ఆ తర్వాత ఆయనకు జీసస్ క్రైస్ట్ అనే పేరు పెట్టి క్రిస్టియన్ మతాన్ని మొదలు పెట్టారు. ఆ తర్వాత ఆ మతం సుమారుగా ప్రపంచంమంతా వ్యాప్తి చెందింది. ఇమ్మాన్యుయెల్ అని అంటే పరిశోధకులకు తప్ప సామాన్యులకు ఎవరికీ తెలియదు, కానీ వాస్తవాలు ఇవి !

కృష్ణుడు మరియు జీసస్ చెప్పిన సత్యాలు చాలా తక్కువ ప్రచారంలో ఉన్నాయి. వారు చెప్పనివి, మతాధికారులు కల్పించినవి ఎక్కువ ప్రచారంలో ఉన్నాయి.

నేడు రాముని పేరు మీద, కృష్ణుడి పేరు మీద మరియు జీసస్ పేరు మీద చెలామణి అవుతున్న విషయాలలో అత్యధిక శాతం వారికి సంబంధం లేనివే ఉన్నాయి. అత్యంత ఆశ్చర్యకరమైన సత్యాలు ఏమిటంటే - రాముడు కానీ కృష్ణుడు కానీ మేము హిందువులం అని ప్రకటించలేదు. మాది హిందూ మతం అని ఏ నాడూ ఎవరికీ చెప్పలేదు. అసలు వారికి హిందూ మతం అనేది ఒకటి ఉందని కూడా తెలియకపోవచ్చు. వారు హిందువులు కాదు. రాముడు కృష్ణుడు అందరికీ సంబంధించిన వారు. వారు, అందరి వారు. నిజానికి వారు బోధించి ఆచరించి తెలియజేసినది... అందరికీ ఒక్కడే అయిన పరమాత్మ గురించి మాత్రమే ! ఇస్లాం మరియు క్రిస్టియన్ మతాల బలవంతకరమైన మత ప్రచారం మరియు మత మార్పిడిల వలన భారత దేశంలో హిందూ వాదం మొదలు పెట్టాల్సి వచ్చింది. లేకపోతే ఈ పవిత్ర భారత దేశంలో ఆది కాలం నుండీ స్వచ్ఛమైన ఆధ్యాత్మికత మాత్రమే విరాజిల్లుతూ ఉండేది ! జీసస్‌కు క్రిస్టియానిటి గురించి తెలియదు. చర్చిల గురించి కూడా తెలియదు. జీసస్, క్రిస్టియానిటి అనే మతం గురించి కానీ, చర్చి గురించి కానీ ఏనాడూ బోధించలేదు. అసలు జీసస్‌కు క్రిస్టియానిటి అనే మతం గురించి తెలియదు. ఈ క్రిస్టియానిటి అనే మతం, ఆయన ఈ భూమి నుండి వెళ్ళిపోయాక సుమారు 300 సంవత్సరాల తర్వాత పుట్టింది.

జీసస్ బోధించింది ఏకైక సత్యం గురించే ! అందరికీ చెందిన ఒకే ఒక దైవం గురించే !

ఏకత్వం గురించే !!

శ్రీకృష్ణుడు మరియు జీసస్ క్రైస్ట్ ఉన్న ఒకే ఒక పరమ సత్యాన్ని
మాత్రమే బోధించారు. శ్రీకృష్ణుడు సంస్కృతంలో బోధిస్తే...
జీసస్ క్రైస్ట్ అరమాయిక్ భాషలో చెప్పాడు.
శ్రీకృష్ణుడు ఒక రీతిలో చెబితే... జీసస్ క్రైస్ట్ తనదైన శైలిలో చెప్పాడు.
కానీ ఇద్దరూ ఒకే సత్యాన్ని చెప్పారు...
కాకపోతే వేరు వేరు కాలాలలో... వేరు వేరు ప్రాంతాలలో....
వేరు వేరు భాషలలో చెప్పారు... కానీ భావం మాత్రం ఒక్కటే !
ఈ సత్యాలను ప్రతీ మనిషి అవగాహన చేసుకునియే తీరాలి !

రాముడు, కృష్ణుడు హిందువులు కాదు.

జీసస్, క్రిస్టియన్ కానే కాదు.

వీరు పరమాత్ములు.

వీరు అందరి వారు.

దయచేసి వీరిని ఒక మతానికి

పరిమితం చేయకండి.

27. బ్రహ్మజ్ఞానం కలిగిన వాడే బ్రాహ్మణుడు

సర్వ సృష్టి మూలమైన పరబ్రహ్మను అనుభవపూర్వకంగా తెలుసుకుని అంటే బ్రహ్మానుభవం లేక బ్రహ్మానుభూతి పొంది స్వయంగా తానే పరబ్రహ్మ అని తెలుసుకున్న వాడే బ్రాహ్మణుడు. అంతే కానీ "బ్రాహ్మణం" అంటే జాతి కానీ, మతం కానీ, కులం కానీ, కానే కాదు గాక కాదు ! బ్రాహ్మణం అంటే బ్రహ్మానుభవం అని పరమార్థం, జాతి మత కులం కాదు. అనుభవపూర్వక పరమాత్మ విజ్ఞానాన్ని బట్టి వర్ణం(వర్గం) ! అంతే కానీ, పుట్టుకను, కుటుంబాన్ని, కులాన్ని, మతాన్నీ, జాతిని బట్టి కాదు !

గుణాలను బట్టి వర్ణం(వర్గం) ! అంతే కానీ పుట్టుకను బట్టి కాదు.

సుపరిపాలనా దక్షత కలిగిన వీరాధి వీరుడు, ధీరుడు, అసహాయ శూరుడే క్షత్రియుడు. అంతే కాని పేరు ప్రక్కన రాజు అనేదాన్ని జోడించుకున్న వాడు, కత్తి పట్టుకున్న ప్రతీ వాడు కాదు. శ్రీ రాముడు, అర్జునుడు, విక్రమార్క చక్రవర్తి, శ్రీకృష్ణ దేవరాయలు మొదలైన వారు క్షత్రియులు.

విశేషమైన వ్యాపార నైపుణ్యాలు కలిగి సమాజ శ్రేయస్కరానికై, అభివృద్ధికై పాటు పడే వాడే వైశ్యుడు. అంతే కానీ కుటిల నీతితో, స్వార్థ బుద్ధితో జనాలను మోసం చేసే వాడు కాదు. కూడబెట్టుకునే వాడు అంతకన్నా కాదు.

జ్ఞానం అస్సలు లేని వ్యక్తి, వికాసం లేని వ్యక్తి , కేవలం శారీరక శ్రమ చేయగలిగిన వాడే శూద్రుడు. రాజులలో, ధనవంతులలో శూద్ర లక్షణాలు కలిగి ఉన్న వారు చరిత్రలో బోలెడు మంది ఉన్నారు. శూద్రులైన తల్లిదండ్రులకు కిరాతకుడిగా జన్మించి బ్రహ్మర్షిగా పరిణామం చెందిన వారు కూడా ఉన్నారు - ఉదాహరణకు "వాల్మీకి" !

❖ ❖ ❖

28. ద్విజుడు అంటే

ద్విజుడు అంటే రెండు సార్లు పుట్టిన వాడని అర్థం. తాను ప్రస్తుతం కలిగి ఉన్న భౌతిక దేహంలోనే "నేను అనబడే అహంగా" మరణించి, "నేను దైవాన్ని" అని అనుభవ పూర్వకంగా తెలుసుకుని దైవంగా పరిణమించడమే మళ్ళీ పుట్టడం. ఈ విధంగా పుట్టిన వాడే, ఈ విధంగా ఒకే భౌతిక శరీరంలో పునర్జన్మను(దైవంగా పరిణమించడం) పొందిన వాడే "ద్విజుడు".

ద్విజత్వం అనేది శారీరకమైనది కాదు, బాహ్యంలోని విషయాలకు సంబంధించినది కాదు. ఇది పూర్తిగా అంతరానికి సంబంధించిన విషయం.

ఆత్మ విజ్ఞానం లేని వ్యక్తి "భౌతిక దేహమే నేను" అనే భావనలో ఉంటాడు. ఒక సద్గురు మార్గదర్శకత్వంలో విశేషమైన ఆత్మ విజ్ఞాన అభ్యాసం + క్రమం తప్పని ధ్యాన సాధన చేసి, "భౌతిక దేహమే నేను" అనే అజ్ఞానపు భావనను నశింపజేసుకుని, "నేను దైవాన్ని" అనే "స్మృతి"లోకి రావడమే - ఉన్న శరీరంలో మరణించి మళ్ళీ పుట్టడమంటే ! ఇలా పుట్టడమే "ద్విజత్వం" అంటే ! ఈ విధంగా పుట్టిన వాడే "ద్విజుడు" ! అంతే కానీ మరేమిటో అనుకోకండి ! ద్విజత్వం అనేది మూఢ కర్మకాండల వల్ల రాదు. సద్గురు మార్గదర్శకత్వంలో పరమోన్నత ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసించి, ఆచరించి, పరమోన్నత ధ్యానయోగ సాధన చేస్తే మాత్రమే అసలైన "ద్విజత్వం" సిద్ధిస్తుంది, అంతే కానీ పనికి మాలిన కర్మకాండల వలన కానే కాదు గాక కాదు !

❖ ❖ ❖

౭౨. ఉపనయనం - ఉపనయనోపదేశం - ఉపనయన మహోత్సవం

భూమి మీద ఉన్న ప్రతీ వ్యక్తి రెండు చర్మ చక్షువులను అంటే భౌతిక కళ్ళను, ఒక **దివ్య నేత్రాన్ని** అంటే మూడో కన్నును కలిగి ఉంటాడు. తలలో, బయటికి కనబడే రెండు కళ్ళు, భౌతిక పరమైన విషయాలను చూడడానికి ఉన్నాయి. బయటికి కనపడకుండా లోపల ఉన్న **దివ్య నేత్రం** దివ్య విశేషాలను మరియు సమస్తాన్ని దర్శించడానికి ఉంది.

మూడో కన్ను, దివ్య నేత్రం, దివ్య చక్షువు, దివ్య దృష్టి, దివ్య కేంద్రం, జ్ఞాన దృష్టి, జ్ఞాన నేత్రం, జ్ఞాన చక్షువు, అంతర్ నేత్రం, అంతర్ చక్షువు, అంతర్ దృష్టి, మనో నేత్రం, మనో చక్షువు, మనో దృష్టి, లో నేత్రం, లో చక్షువు, లో దృష్టి, త్రినేత్రం, థర్డ్ ఐ, డివైన్ ఐ, క్లైయర్‌వాయన్స్, పిట్యూటరి గ్రంథి(గ్లాండ్) - **ఇవన్నీ ఒక్కటే !**

ఉపనయనం !

ఉప అంటే అదనం, అధికం అని ఇక్కడ అర్థం ! నయనం అంటే కన్ను అని అర్థం ! ఉపనయనం అంటే అదనంగా ఉన్న కన్ను అని అర్థం. అంటే మూడో కన్ను అన్నమాట !

ఉపనయనోపదేశం !

ఒక సద్గురువు తన శిష్యులకు మూడో కన్నును ఎలా ఉత్తేజితం చేసుకోవాలో చేసే ఉపదేశమే, బోధనయే "ఉపనయనోపదేశం" !

ఉపనయన మహోత్సవం !

ఒక వ్యక్తి మూడో కన్నును ఉత్తేజితం చేసుకునే విద్యను, మార్గాన్ని , సాధనను సద్గురువు ద్వారా తెలుసుకున్నప్పుడు, అతడి కుటుంబం, బంధు మిత్రులు, సహ సాధకులు అందరూ కలిసి ఆనందంగా పండగ చేసుకోవడమే "ఉపనయన మహోత్సవం" ! ఆహా... దివ్య నేత్రాన్ని ఉత్తేజితం చేసుకునే సాధనను తెలుసుకున్నాడు. ఇక సాధన చేసి ఉపనయనాన్ని - మూడో కన్నును ఉత్తేజితం చేసుకుని దివ్య జ్ఞానాన్ని పొంది, దివ్యత్వాన్ని పొందుతాడు, మోక్షాన్ని పొందుతాడు అని ఆనందించే దివ్య సందర్భమే "ఉపనయన మహోత్సవం" !

ఉపనయనోపదేశాన్ని పొందిన వ్యక్తిని, అతని సంబంధీకులందరూ కలిసి "నీ సాధన నిర్విఘ్నంగా జరుగు గాక, నీ సాధన ఫలించి నీ నిజ తత్వమైన దివ్యత్వాన్ని పొందెదవు గాక" అని ఆశీర్వదించి, అభినందించి, ఆనందంతో ఉత్సవం జరుపుకునే విశేష విషయమే "ఉపనయన మహోత్సవం" !

ఇది పనికి మాలిన తంతు తతంగాలకు, వ్యర్థ కర్మ కాండలకు సంబంధించినది కానే కాదు. ఇది బ్రహ్మజ్ఞానానికి సంబంధించిన విషయం ! తంతు, మొక్కుబడి, ఆచారం, సంప్రాయం మొదలైనవి కానే కావు. ఇది పరబ్రహ్మానికి చెందిన విషయం !

౩౦. బ్రహ్మచారి - అస్ఖలిత బ్రహ్మచారి - బ్రహ్మచర్యం - బ్రహ్మచర్య దీక్ష

సర్వ సృష్టి మూలమూ, సర్వ వ్యాపితమూ, సర్వాంతర్యామియైన పరబ్రహ్మనే "బ్రహ్మం" అని అంటారు. సర్వస్వంలో సర్వమైన, సర్వాకార, నిరాకార, సగుణ, సర్వగుణ, నిర్గుణ పరబ్రహ్మనే "బ్రహ్మం" అని అంటారు.

స్ఖలనం అంటే విడివడడం లేక బయటకు రావడం అని అర్థం. పాండిత్య వ్యాకరణ ప్రకారం వేరే అర్థాలు ఉండవచ్చు. నేను చెప్పేది ఆధ్యాత్మిక కోణంలో నుండి.

బ్రహ్మచారి!

బ్రహ్మమే తానని అనుభవ పూర్వకంగా తెలుసుకుని, బ్రహ్మంలో, బ్రహ్మంగా చరించే(జీవించే) వ్యక్తిని బ్రహ్మచారి అని అంటారు. అంతే కానీ "శరీరంతో సంభోగ కార్యం" చేయని వ్యక్తిని కాదు.

అస్ఖలిత బ్రహ్మచారి!

బ్రహ్మమే తానని తెలుసుకుని అనుక్షణం, నిరంతరం ఒక్క క్షణం కూడా బ్రహ్మ భావన నుండి విడివడని అంటే చలించని(స్ఖలించని) వ్యక్తిని అస్ఖలిత బ్రహ్మచారి అని అంటారు. ఇక్కడ స్ఖలనం అంటే విడివడడం లేక చలించడం అని అర్థం. అంతే కానీ స్వయం తృప్తి లేక హస్త ప్రయోగం ద్వారానో లేక సంభోగ చర్య ద్వారానో లేక స్వప్నంలో భావావేశానికి గురై "వీర్యాన్ని" స్ఖలించడం అని కాదు ఇక్కడ అర్థం !

సదా, సర్వదా ఒక్క క్షణం కూడా బ్రహ్మమే నేననే భావన నుండి చలించని(స్ఖలించని) వ్యక్తిని "అస్ఖలిత బ్రహ్మచారి" అని అంటారు.

బ్రహ్మచర్యం !

అనుక్షణం, నిరంతరంగా, ఎల్లప్పుడూ బ్రహ్మంతో అనుసంధానాన్ని కలిగి ఉండడమే "బ్రహ్మచర్యం" !

బ్రహ్మచర్య దీక్ష !

దీక్ష అంటే ఒక కార్యానికి సంపూర్ణంగా, సమగ్రంగా తనను తాను సమర్పించుకుని అంకితం కావడాన్నే "దీక్ష" అని అంటారు.

నేను దేహాన్ని కాదు. "నేను బ్రహ్మాన్ని" (నేనే దైవం) అని తెలుసుకుని, బ్రహ్మంతో అనుసంధానం చెందే బ్రహ్మవిద్యను, బ్రహ్మర్షుల ద్వారా నేర్చుకుని, ఇక ఆ సాధనకు 100% అంకితమవడాన్నే బ్రహ్మదీక్ష లేక బ్రహ్మచర్య దీక్ష అని అంటారు.

వెనకటికి ఇలాంటి సాధన చేసే వారిలో కొంత మంది పెళ్ళి చేసుకోకుండా ఉండేవారు. స్త్రీలైతే పురుష సాంగత్యం లేకుండా ఉండేవారు, పురుషులైతే స్త్రీ సాంగత్యం లేకుండా ఉండేవారు. అదేమీ నియమం అని కాదు. గత జన్మలలో అన్నీ పూర్తి చేసుకుని, ఆ జన్మలో అలా పూర్తిగా సాధనకు అంకితమై పోయేవారు. వీరిని చూసి మామూలు భౌతిక జీవితంలో పెళ్ళి చేసుకోని వారిని కూడా బ్రహ్మచారులు అని అనడం మొదలు పెట్టారు. సంభోగం చేయక పోవడాన్ని బ్రహ్మచర్యం అనడం ప్రారంభించారు. కానీ వాస్తవాలు ఇవి !

31. శూద్ర యోని యందు పుట్టడం అంటే !

శూద్రం అని అంటే ఇక్కడ అజ్ఞానం అని అర్థం ! శూద్రుడు అని అంటే అజ్ఞాని అని అర్థం !

యోని అని అంటే మార్గం అని ఇక్కడ అర్థం ! అంతే కాని స్త్రీ యొక్క మర్మావయవం లేక జననాంగం అని కాదు. శూద్ర యోనియందు అని అంటే అజ్ఞాన మార్గమున అని అర్థం ! శూద్ర యోని యందు పుట్టడం అంటే అజ్ఞాన మార్గమున పుట్టడమని అర్థం !

శూద్ర యోని యందు పుట్టడం అంటే అజ్ఞానంతో పుట్టడం అని అర్థం !

అంతే కానీ ఒక శూద్రురాలైన స్త్రీ యోని ద్వారా పుట్టడం అని కాదు !

గత జన్మలలో పాపాచరణ చేసిన వారు శూద్ర యోని యందు పుడతారని అంటారు. అంటే పాపాచరణ చేసిన ఫలితంగా, కర్మను అనుభవించే నిమిత్తం, అజ్ఞానంతో పుట్టి కర్మను అనుభవించి, అవగాహన పొంది కర్మను తొలిగించుకోవడానికి పుట్టడం - శూద్ర యోని యందు పుట్టడం అంటే !

శూద్రత్వం అంటే అజ్ఞానం. శూద్రత్వం(అజ్ఞానం) అనేది భావనా పరమైనది. ఇది పూర్తిగా అంతరంగానికి సంబంధించినది. శారీరక పరమైనది కాదు. ఆత్మ విజ్ఞానం లేకపోవడమే శూద్రత్వమంటే, ఆత్మ విజ్ఞానం కలిగి ఉండటమే దివ్యత్వం అంటే ! ఆత్మ విజ్ఞానం లేని వారే శూద్రులు, ఆత్మ విజ్ఞానం ఉన్న వారే దివ్యులు ! శూద్రుడు అంటే పిందె, దివ్యుడు అంటే పండు. పిందె పండుగా మారినట్టే, శూద్రుడు ఆత్మ విజ్ఞానం ద్వారా దివ్యుడౌతాడు.

ఎంతటి పాపాత్ములైనా, ఎంతటి అజ్ఞానులైనా సద్గురు మార్గదర్శకత్వంలో విశేషమైన ఆత్మ విజ్ఞాన అభ్యాసం + క్రమం తప్పని ధ్యాన సాధన ద్వారా ఒక జన్మలోనే దివ్యత్వాన్ని పొందవచ్చని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు తెలియజేసాడు కదా !

సమాజంలో అతి తక్కువ కులాలుగా, జాతులుగా చూడబడే వాటిలో ఎంతో మంది మహాత్ములు జన్మించి దైవత్వ సాధనకు జాతి, మత, కుల భేదాలనేవి అడ్డు కాదని, రావనీ నిరూపించారు.

కాబట్టి, ఎలా పుట్టాం ? ఎక్కడ పుట్టాం ? ఏ యోని యందు జన్మించాం ? అనేవి కాదు విషయాలు. ఎలా, ఎక్కడ, ఏ యోని యందు జన్మించినా అందరికీ దైవత్వం పొందే అధికారం + హక్కు + శక్తి + సామర్థ్యం సహజంగా ఉన్నాయని తెలుసుకుని తమ నిజ తత్వమైన దివ్యత్వాన్ని పొందాలి. ఇతరులకు తెలియ జేయాలి.

32. శూద్రుడు - దివ్యుడు

శూద్రుడు అని అంటే ...

1. ఆత్మ విజ్ఞానం లేని వాడు.
2. ఆత్మ విజ్ఞానానికి సంబంధం లేని జీవితాన్ని జీవించే వాడు.
3. కేవలం శారీరక శ్రమ మాత్రమే చేయగలిగి, జ్ఞానం బొత్తిగా లేని వాడు.
4. "నేనే దైవం " అని తెలియని వాడు.

శూద్రత్వం అనేది పుట్టుకను బట్టి కాదు. గుణాలను బట్టి నిర్ణయించ బడుతుంది. అనుభవపూర్వక ఆత్మ విజ్ఞానాన్ని బట్టి శూద్రత్వం అనేది నిర్ణయించబడుతుంది.

శూద్రత్వం అనేది జీవన విధానాన్ని బట్టి నిర్ణయించ బడుతుందే కాని, పుట్టుకను బట్టి కాని, కులాన్ని బట్టి కాని, వంశాన్ని బట్టి కాని, గోత్రాన్ని బట్టి కాని, మతాన్ని బట్టి కాని నిర్ణయించ బడదు.

సమాజపరంగా ఎంత పెద్ద కులంలో పుట్టినా, అతడికి లేక ఆమెకు ఆత్మ విజ్ఞానం లేనట్టయితే... వారు నిఖార్సైన శూద్రులే !

సమాజ పరంగా ఎంత చిన్న కులంలో పుట్టినా, ఆమెకు లేక అతడికి ఆత్మ విజ్ఞానం ఉంటే వారు దివ్యులే !

ఓ సారి మీరు చెక్ చేసుకోండి, మీరు శూద్రులా లేక దివ్యులా ?

శూద్రం = అజ్ఞానం !

5. శూద్రులకే జాతి కుల మతాల పట్టింపులు ఉంటాయి. ఎందుకంటే నిజానికి ఏ జాతులు, ఏ కులాలు, ఏ మతాలు లేనే లేవు. ఈ విషయం బ్రహ్మ జ్ఞానులకు చక్కగా, స్థిరంగా తెలుస్తుంది. ఇంకా జాతి, కులం, మతం అని పట్టుకుని పాకులాడుతూ ఉన్నారూ అని అంటే, ఏమిటి మరి అర్థం ?! వారికి ఆత్మ విజ్ఞానం లేక బ్రహ్మ జ్ఞానం లేదన్న మాటేగా ...! మరి బ్రహ్మ జ్ఞానం లేని వారినే శూద్రులు అని అంటారు.

శూద్రులు అని అంటే అజ్ఞానులు - అంటే ఆత్మ విజ్ఞానం లేని వారన్న మాట. అంతే కాని మరేమిటో కాదు.

6. మాంసాహారం దివ్య లక్షణమైతే కానే కాదు. మాంసాహారం నిఖార్సైన శూద్ర లక్షణం !

7. దేవుడి కోసం ఇంకా "బయటే" వెతుకుతూ ఉండడం. అలాంటి విషయాలనే బోధిస్తూ గురువులుగా, స్వాములుగా, బాబాలుగా, ప్రవాచకులుగా చెలామణి అవుతూ ఉండడం అనేవి శూద్ర లక్షణాలు.

8. పూర్తి స్థాయి శాకాహార, ధ్యాన, ఆత్మ విజ్ఞాన ఆవశ్యకత గురించి ఏ మాత్రమూ అవగాహన లేక పోవడం.

9. వ్యర్థమైన కర్మ కాండలను బోధిస్తున్న వారు కూడా శూద్రులే ! ఇలా ఇంకా చాలా ఉన్నాయి....

33. పున్నామ నరకం కాదు, పునః నామ నరకం !

పునః నామ నరకం అంటే మళ్ళీ మళ్ళీ జన్మించడం. జన్మ రాహిత్య పదవిని పొందలేక అజ్ఞానంతో మళ్ళీ మళ్ళీ ఇక్కడే, ఈ భూమి మీదే జన్మించి, ఈ భౌతిక దేహంతోనే నరక యాతనను అనుభవించడాన్నే "పునః నామ నరకం" అని అంటారు.

ఈ "పునః నామ నరకం" నుండి పుత్రుడు తప్పిస్తాడు. పుత్రుడు అంటే ఏ పుత్రుడు ? రెండు శరీరాల కలయిక ద్వారా పుట్టిన వాడు కాదు. అందరూ ఇక్కడే పొరపాటు పడుతుంటారు. పుత్రుడు అంటే ఇక్కడ వారసుడు లేక శిష్యుడు అని అర్థం.

మీరు సంపాదించిన విశేషమైన ఆత్మ విజ్ఞానాన్ని ఎవరైనా ఇతరులకు నేర్పించాలి. ఇక్కడ ఇతరులు అని అంటే మీ భార్య, మీ సంతానమూ, మీ కుటుంబ సభ్యులు, మీ బంధు మిత్రులు ఇంకా వేరే వాళ్ళు అని అర్థం. ఇతరులు అంటే మీరు కాక మరెవరైనా అని అర్థం. మీరు పొందింది పంచాలి, అప్పుడే మీకు ముక్తి. అప్పుడే మీకు మోక్షం. ఈ విధంగా మీ ద్వారా ఆత్మ విజ్ఞానాన్ని స్వీకరించిన మీ ఆధ్యాత్మిక పుత్రుడే లేక వారసుడే లేక శిష్యుడే మిమ్మల్ని "పునః నామ నరకం" నుండి తప్పిస్తాడు. ఎలా ? అని అంటే " మీరేం ఇస్తే అది వేయింతలై తిరిగి మీకు చేరుతుంది" - ఒక విశ్వ సూత్రం. ఈ సూత్రం ప్రకారం మీరు ఇతరులకు "ముక్తి మార్గం" ఉపదేశించినప్పుడు అంటే సత్య ప్రచారం చేసినందువలన మీకు విశేషమైన దివ్యకర్మ ఫలం సంప్రాప్తించి దాని ద్వారా మీరు ముక్తులవుతారు.

అంతే కానీ సంభోగం ద్వారా పుట్టిన పుత్రుడు, చచ్చాక తల కొరివి పెడితే మీకు మోక్షం వస్తుందని భావించడం చక్కటి, నికార్సయిన పొరపాటు.

❖ ❖ ❖

సరైన ఆధ్యాత్మిక జీవిత భాగస్వామి దొరకడం, సరైన ఆధ్యాత్మిక సంతానం కలగడం అనేది ఆత్మ పరిణితిని బట్టి, లైఫ్ డిజైన్‌ను బట్టి ఉంటుంది. అలా కుదరడం అనేది మహా సౌభాగ్యవంతమైన విషయం. మామూలు సంతానం అనేది కర్మ వల్ల కలుగుతుంది. మామూలు సంతానం పట్ల వ్యామోహం అనేది జీవితాన్ని చిందర వందర చేస్తుంది. సంసార బంధాలు ఏవైనా జీవితాన్ని కుళ్ళబొడుస్తాయి. నరకప్రాయమైన సంసార బంధాలను వదిలించుకుని సత్య మార్గానికి అంకితమవడమే మహా దివ్య సౌభాగ్యవంతమైన విషయం. అయితే ఇది అందరి వల్లా కాదు. బాగా వికాసం చెంది ఎదిగి ఉన్న ఆత్మలకు మాత్రమే సాధ్య పడుతుంది. నిరంతరం సరైన సత్య గురువు అన్వేషణలో ఉండండి. ఆయన లేక ఆమె దొరకగానే క్రమ క్రమంగా అన్ని భౌతిక బంధాలను, బాధ్యతలను పూర్తిగా, శాశ్వతంగా క్లియర్ చేసుకుని సత్య మార్గానికి సంపూర్ణంగా, సమగ్రంగా, శాశ్వతంగా, అజేయంగా అంకితమై జీవిత పరమార్థాన్ని సాధించండి.

34. ఏడు శరీరాలు & కలలు

ఆత్మ స్వరూపులమైన మనం మొత్తం 7 శరీరాలను ధరించి ఉంటాం. అవి :

1. భౌతిక దేహం - Physical Body

2. ప్రాణమయ కోశం లేదా నాడీమండల శరీరం - Etheric Body or Energy Body

3. సూక్ష్మ శరీరం - Astral Body

4. కారణ శరీరం - Causal Body

5. మహా కారణ శరీరం - Supra Causal Body

6. విశ్వమయ కోశం - Universal Body

7. దివ్య కోశం - Cosmic Body or Divine Body

కలలు చాలా రకాలుగా ఉంటాయి. అవి :

❶ ప్రతీ మనిషి పడుకున్నప్పుడు అతని భౌతిక శరీరం నుండి సూక్ష్మ శరీరం బయటికి వస్తుంది. ఇలా బయటికి వచ్చిన సూక్ష్మ శరీరం జ్ఞాన సముపార్జన కోసం రక రకాల ప్రదేశాలను, రక రకాల లోకాలను సందర్శిస్తుంది. ఇలా సూక్ష్మ శరీరం యొక్క ప్రయాణాల [Astral Travelling] ను కలలు అని అంటారు. కొంత మందికి ఇవి గుర్తుంటాయి, కొంత మందికి గుర్తుండవు.

ఈ విషయాలను వివరంగా తెలుసుకోవాలంటే -

1. A SOUL'S JOURNEY By : PETER RICHELIEU.

2. YOU FOREVER By : Dr. T. LOBSANG RAMPA **3.** JOURNEYS OUT OF THE BODY **4.** FAR JOURNEYS By : ROBERT A. MONROE అనే పుస్తకాలు ఇంకా ఈ సబ్జెక్ట్ మీద మహాత్ములు వ్రాసిన ఎన్నెన్నో పుస్తకాలు చాలా ఉన్నాయి. ఇవి చదివితే చాలా, చాలా విషయాలు తెలుస్తాయి. ఈ పుస్తకాలు బుక్ షాపుల్లో లభిస్తాయి.

❷ ఒక్కోసారి పూర్వ జన్మలు కనబడుతుంటాయి.

❸ ఒక్కోసారి భవిష్యత్‌లో జరిగే సంఘటనలు కనబడుతుంటాయి.

❹ మన విస్మృతిలో ఉన్న చైతన్యం చేసే ఆలోచనలు చిత్రాల రూపంలో కనపడతాయి.

❺ మన విస్మృతిలో ఉన్న చైతన్యంలో గల చెల్లా చెదురు జ్ఞాపకాలు చిందర వందరగా కనిపిస్తుంటాయి.

❻ మన నిర్ణయాలు, మన సంకల్పాలు, మన లక్ష్యాలు, మన కోరికలు చిత్రాల రూపంలో కనపడుతుంటాయి.

❼ మన గైడింగ్ మాస్టర్స్ మనకు రక రకాల దృశ్యాలు చూపించడం ద్వారా మనకు అభివృద్ధి చెందే సూచనలు ఇస్తూ ఉంటారు.

❽ పరమ గురువులు మనలోని లోపాలను సరి చేస్తుంటారు. ఇది ఎలా జరుగుతుందీ అని అంటే - మాస్టర్స్ మనలోని ఏ సరి కాని గుణాలను సరి చేయాలనుకుంటున్నారో వాటికి సంబంధించిన దృశ్యాలను మనకు చూపించి, నిగూఢంగా సూచనలను ఇస్తూ మనకై మనం విషయాన్ని గ్రహించేలా చేసి, మన సరి కాని గుణాలను లేక లోపాలను మనం తీసివేసుకోవడంలో మనకు ఎంతో సహాయం చేస్తారు.

❾ పై లోకాలలోని మాస్టర్స్ మనకు కొన్ని దృశ్యాలు చూపించి వాటి ద్వారా మనల్ని పరీక్షిస్తుంటారు.

❿ సూక్ష్మ శరీరంతో ఉన్న మనకు కొన్ని ప్రత్యేక శిక్షణలు, బోధనలు జరుగుతూ ఉంటాయి. ఎంతో ప్రక్షాళన, అభివృద్ధి జరుగుతూనే ఉంటుంది.

⓫ మన గైడింగ్ మాస్టర్స్ మనకు రక రకాల దృశ్యాలను చూపించి మన ప్రతి స్పందనలను గమనించి మన పరిణతిని తెలుసుకుంటుంటారు.

⓬ దివ్య లోకాలలోని గ్రాండ్ మాస్టర్స్ "సర్వ శాంతి, ప్రయోజనాల కోసం సమావేశమయ్యే" దృశ్యాలను అప్పుడప్పుడూ చూపెడుతూ ఉంటారు. తద్వారా మనకు ఎంతో ప్రేరణను, ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కలిగించి జాగృతి పథంలో కొనసాగేలా చేస్తారు.

⓭ ఒక్కోసారి సాక్షాత్తు మూల చైతన్యమే (Ultra Consciousness) మనతో మాట్లాడుతుంది. నాకైతే ఇలా జరుగుతూ ఉంటుంది. ఎంతెంతో అభివృద్ధి జరుగుతూ ఉంటుంది.

⓮ కలల రూపంలో మనకు దివ్య సందేశాలు అందుతూ ఉంటాయి. కలలో కానీ లేక ధ్యానంలో కానీ కనపడే దృశ్యాలు, మన లక్ష్యాలు(కోరికలు లేక సంకల్పాలు) ఏ స్థాయిలో ఉన్నాయో తెలుపుతాయి. అవి నెరవేరడానికి ఉన్న అడ్డంకులు కొన్ని కనపడి క్లియర్ అయిపోతాయి. మరి కొన్ని దృశ్యాలు అడ్డంకులను ఎలా క్లియర్ చేసుకోవాలో చూపిస్తాయి.

15 భూమి మీద భౌతికంగా తీరని కోరికలను కొంత మంది భావనామయ ప్రపంచంలో తీర్చుకుంటుంటారు. ఇవి కలల రూపంలో కనిపిస్తాయి.

16 చాలా సార్లు మాస్టర్స్, మనం భౌతికంగా అనుభవించాల్సిన కర్మలను, సూక్ష్మ శరీరంతో అనుభవించేలా చేసి వాటిని తీసివేస్తారు.

17 మనం భూమి పైకి వచ్చిన ముఖ్య కారణాన్ని కలల రూపంలో మాస్టర్స్ గుర్తు చేస్తారు.

18 భయపెట్టే దృశ్యాలు, అయోమయానికి గురి చేసే దృశ్యాలు, పీడ కలలు అనబడేవి అప్పుడప్పుడు వస్తుంటాయి. వాస్తవానికి అవి పీడ కలలు కాదు. ప్రక్షాళన సమయంలో ఇలాంటివి వస్తూ ఉంటాయి. ఇలా జరిగినప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వాటిని అలా వదిలేసి ప్రశాంతంగా ధ్యానం చేసుకుంటే సరి పోతుంది.

బాగా గుర్తుంచుకోండి - ఏ కలకైనా, ఎలాంటి కలలకైనా భయపడకూడదు. అంతా మన చేతిలోనే ఉంటుందనే సత్యాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. మీ కలలపై మీరే స్వంత విశ్లేషణలు చేసుకోకుండా ఎవరైనా ఆత్మ విజ్ఞానులను సంప్రదించి సందేహ నివృత్తి చేసుకోవాలి. అంతా శ్రేయస్కరంగానే జరుగుతుంది, అనే భావనే మిమ్మల్ని రక్షిస్తుందని గుర్తుంచుకోండి. ఇలా కలలు అనేవి ఎన్నో రకాలుగా ఉంటాయి.

అవి సాధారణ"కలలు"కావు, "ఆత్మ కళలను" పెంపొందించే
"ఆత్మ కళా శిక్షణా కార్యక్రమాలు".

35. చక్రాలు

మన ఏడు శరీరాల్లోని రెండవ శరీరమైన ప్రాణమయ కోశంలో 72,000 నాడులు ఉంటాయి. అందుకే దీనిని నాడీ మండల శరీరం అని కూడా అంటారు. ఈ ప్రాణమయ కోశం ద్వారానే మన భౌతిక శరీరానికి కావలసిన విశ్వశక్తి సరఫరా అవుతుంది. ఈ ప్రాణమయ శరీరం ఉన్నదే మనకు శక్తిని సరఫరా చేయడానికి. మనం నిద్ర పోయినప్పుడు ఈ ప్రాణమయ శరీరం విశ్వశక్తిని గ్రహిస్తూ ఉంటుంది. అందుకే మనం నిద్ర నుండి లేవగానే ఫ్రెష్‌గా ఫీలవుతుంటాం. ఎంతగా అలసిపోయినా సరే, ప్రశాంతంగా పడుకుని లేస్తే రిలాక్స్‌గా అయిపోతాము. దీనికి కారణం మనం నిద్రపోయే సమయంలో, మన ప్రాణమయ శరీరం విశ్వశక్తిని గ్రహించడమే ! అయితే నిద్రలో గ్రహించే విశ్వశక్తి చాలా పరిమితంగా ఉంటుంది. ధ్యానంలో అయితే అనంతంగా పొందవచ్చు. అందుకే ధ్యానం చేయాలి. ధ్యానం అంటే ఎరుక - ఎరుక అంటే అనంతమైన విశ్వశక్తిని పొందడమే !

ఈ ప్రాణమయ కోశం సన్నని నాడుల రూపంలో మొత్తం భౌతిక శరీరమంతా వ్యాపించి ఉంటుంది. మన విస్మృతిలో ఉన్న చైతన్యంలో గల సరి కాని గుణాల(స్వభావాల), సరి కాని నమ్మకాల ప్రభావం చేత ఈ ప్రాణమయ కోశంలోని నాడుల్లో అక్కడక్కడా "బ్లాక్స్" ఏర్పడతాయి. ఈ "బ్లాక్స్" ప్రాణశక్తి ప్రవాహాన్ని అడ్డుకుంటాయి. ఈ "బ్లాక్స్" వల్లనే మనకు భౌతిక శరీరంలో రోగాలు మరియు జీవితంలో సమస్యలు సంభవిస్తూ ఉంటాయి. ఈ ప్రాణమయ కోశం మన భౌతిక కళ్ళకు కనపడదు. ఎందుకంటే ఇది భౌతిక పదార్థంతో తయారైనది కాదు. అత్యంత సూక్ష్మ ప్రకంపనలను కలిగి ఉన్న ఈ ప్రాణమయ శరీరాన్ని మనం కేవలం మూడవ కన్ను - Third Eye ద్వారా మాత్రమే చూడగలుగుతాం. విశేషమైన ఆత్మ విజ్ఞాన సూత్రాల ఆచరణ ద్వారా కలిగిన పరివర్తన చేత మరియు క్రమం తప్పని ధ్యాన సాధన ద్వారా మాత్రమే ఈ "బ్లాక్స్" తొలగి పోతాయి.

ప్రతీ నగరానికి కొన్ని ప్రధానమైన కూడళ్ళు లేక సెంటర్స్ లేక చౌరస్తాలు లేక జంక్షన్‌లు ఉన్నట్టే, ఈ ప్రాణమయ శరీరంలో ఉన్న 72,000 నాడులు కొన్ని ప్రత్యేకమైన ముఖ్య ప్రదేశాలలో అనుసంధానమై ఉంటాయి. ఈ జంక్షన్‌లనే "చక్రాలు" అని అంటారు. చక్రం అంటే విష్ణు చక్రం లాగా లేక దీపావళి భూ చక్రం లాగానో ఉండదు. అక్కడ రంగు రంగుల పుష్పాలు, దేవుళ్ళు, దేవతలు, బీజాక్షరాలు వగైరాలు ఏవీ ఉండవు. ఇలాంటి వాటి గురించి శాస్త్రాల్లో అక్కడక్కడా వివరించబడి ఉన్నా అవి విషయాన్ని కవితాత్మకంగా వివరించే నిగూఢ వర్ణణలు అని తెలుసుకోవాలి. అక్కడ కేవలం "ప్రాణమయ

నాడులు అనుసంధానం" అయి ఉంటాయి అంతే !

ఈ చక్రాలన్నీ గుదస్థానం మొదలుకొని తల వరకు, వెన్నెముకకు సమాంతరంగా ప్రాణమయ కోశంలో ఉంటాయి, వెన్నెముకలో ఉండవు.

చక్రాలు మొత్తం ఆరు. అవి :

1. మూలాధార
2. స్వాధిష్ఠాన
3. మణిపూరక
4. అనాహత
5. విశుద్ధ
6. ఆజ్ఞ
7. సహస్రారం - దీన్ని కూడా చక్రం అని అంటారు, స్థితి అని కూడా అంటారు.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు సహస్రార మాస్టర్స్ !

అందరూ కూడా "సహస్రార స్థితి" పొంది తీరాలి ! జన్మ తీసుకున్నదే ఇందుకు మరి !

రామ్‌తా ప్రకారం ఏడు చక్రాలు ఉంటాయి. సహస్రారాన్ని రామ్‌తా, సప్తమ చక్రంగా వర్ణిస్తాడు.

నిరంతర ఆత్మ విజ్ఞాన అభ్యాసం + క్రమం తప్పని ధ్యాన సాధన జరుగుతున్నప్పుడు విశ్వశక్తి నాడీ మండల శరీరంలోకి ప్రవేశించి, అక్కడ ఉన్న "బ్లాక్స్" క్లియర్ చేయడం మొదలు పెడుతుంది. ఇలాంటప్పుడు ఎక్కడైతే ఆ "బ్లాక్స్" ఉన్నాయో, భౌతిక శరీరంలోని ఆ ప్రాంతంలో నెప్పులు వస్తాయి. ఇది సహజం. వీటికి మాత్రం ఏ మందులు వాడకూడదు. "బ్లాక్స్" క్లియర్ కాగానే ఈ నెప్పులు పోతాయి. మొత్తం నాడీ మండల శరీరం ప్రక్షాళన జరిగితే అదే మోక్షం లేక దివ్యత్వం ! మీరు నిరంతర ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసిస్తూ, క్రమం తప్పని సాధన మరియు సత్య ప్రచారం చేస్తూ పోతూ ఉంటే ఆటొమెటిక్‌గా "బ్లాక్స్" క్లియర్ అవుతూ, ఒక్కో చక్రం ఉత్తేజితమవుతూ వస్తుంది. నాడీ మండల శరీర ప్రక్షాళన, చక్రాల ఉత్తేజితం అనే విషయాలు మీ "ఆత్మ విజ్ఞాన అవగాహన" పైన ఆధారపడి ఉంటాయి. మీరు ఎంతెంత ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసిస్తూ, ధ్యాన సాధన మరియు సత్య ప్రచారం చేస్తుంటారో అంతంతగా మీ "అవగాహన" పెరుగుతూ ఉంటుంది. ఎంతెంత "అవగాహన" పెరుగుతూ ఉంటుందో అంతంతగా ప్రక్షాళన జరిగి చక్రాలు ఉత్తేజితం అవుతూ ఉంటాయి. అన్ని

నాడుల యొక్క శుద్ధి జరిగి, చక్రాలన్నీ ఉత్తేజితమైతే సహస్రార స్థితి వస్తుంది. మరి ఈ స్థితే "అనంత అవగాహనా స్థితి" ! ఈ అవగాహన లేనందుకే మనం భూమి పైకి వచ్చాం. ఈ అవగాహన పొందగానే వెళ్ళి పోతాం. అంతే !

PLEIADIES అనేది, మన సౌరకుటుంబం ఉన్న పాలపుంత గెలాక్సీకి చాలా దూరంలో ఉన్న ఒకానొక నక్షత్ర రాశి - Star Cluster. ఇందులో నివసించే వాళ్ళనే **PLEIADIANS** అని అంటారు. వీరు భూమిపైన ఉన్న మానవుల కంటే ఎంతో అడ్వాన్స్‌డ్ లెవెల్‌లో ఉన్న వారు. వీరు ప్రస్తుతం మానవులకు మోక్ష మార్గంలో ఎంతో సహాయం చేస్తున్నారు. వీరు ప్రస్తుత మానవుల కంటే సుమారు 25,000 సంవత్సరాలకు పైగా అడ్వాన్స్‌డ్‌గా ఉన్నారని సమాచారం !

PLEIADIAN అనే ఈ ఇంగ్లీష్ పదం యొక్క ఉచ్చారణ ఇంటర్‌నెట్‌లో ప్లిఏడియన్స్ మరియు ప్లెఆడియన్స్ అని ఉంటుంది. ప్లెఆడియన్స్ అనేది ప్లఆడియన్స్ గాను మరియు ప్లైఆడియన్స్‌గాను వినపడుతుంది. ఇంకా ఈ పదాన్ని ప్లీడియన్స్ గాను మరియు ప్లైడియన్స్ గాను కూడా పలుకుతూ ఉంటారు. ఎవరికి వారు తమదే కరెక్ట్ అని అనుకుంటూ ఉంటారు. మార్గదర్శి పాఠకులైన మీరు మాత్రం అలా అనుకోకుండా, అన్నీ కరెక్ట్ గానే భావించి మీకు నచ్చిన విధంగా ఉచ్ఛరించండి.

ప్లిఏడియన్స్ ప్రకారం 12 చక్రాలు ఉంటాయి

6 చక్రాలు ఉన్నాయన్న మాట నిజమే !

రామ్తా ప్రకారం 7 చక్రాలు ఉన్నాయన్న మాట నిజమే !

ప్లిఏడియన్స్ ప్రకారం 12 చక్రాలు ఉన్నాయన్న మాటా నిజమే !

బాగా లోతైన ఆధ్యాత్మిక అవగాహన ఏర్పడినప్పుడు

ఈ విషయాలన్నీ మీకు అర్థం అవుతాయి.

7 చక్రాలు శరీరంలో ఉంటాయి ! మిగిలిన అయిదూ శరీరం పైన ఉంటాయి ! సూర్య కుటుంబంలోని నవగ్రహాలకూ మొదటి తొమ్మిది చక్రాలు అనుసంధానం అయి ఉంటాయి. పదవ చక్రం సూర్యకుటుంబం మొత్తంతోనూ, పదకొండవ చక్రం పాలపుంత విశ్వంతోనూ, పన్నెండవ చక్రం సృష్టిలోని మిగతా అన్ని విశ్వాలతోనూ అనుసంధానం అయి ఉంటాయి, అని ప్లిఏడియన్స్ చెప్తారు.

ప్లిఏడియన్స్ గురించి వివరంగా తెలుసుకొవాలనుకుంటే BRINGERS OF THE DAWN - Teachings from the Pleiadians By : BARBARA MARCINIAK , edited by : TERA THOMAS - అనే పుస్తకం చదవండి. ఈ పుస్తకం ప్రధానమైన బుక్ స్టోర్స్‌లో దొరుకుతుంది. ఇంటర్నెట్‌లో ఆర్డర్ చేసికూడా తెప్పించుకోవచ్చు.

ప్లిఏడియన్స్‌కు సంబంధించిన పుస్తకాలలో ఎంతో ఆధ్యాత్మిక విజ్ఞానం ఉంది. దయచేసి చదవండి, అందరి చేత చదివించండి. www.pleiadians.com అనే వెబ్ సైట్ సందర్శిస్తే మీకు ప్లెఆడియన్స్ గురించి ఎన్నో వివరాలు తెలుస్తాయి లేదా Pleiadians అని ఇంటర్నెట్‌లో టైప్ చేసినా చాలు ప్లెఆడియన్స్‌కు సంబంధించిన ఎన్నో వెబ్ సైట్‌లు ఉంటాయి. ఈ క్రింద ప్లెఆడియన్స్‌కు సంబంధించిన పుస్తకాలు ప్రధానమైన బుక్ స్టోర్స్‌లో లభించే అవకాశం ఉంది. ఇంటర్నెట్‌లో ఆర్డర్ చేసికూడా తెప్పించుకోవచ్చు.

1. THE PLEIADIAN MISSION - A Time of Awareness
   ISBN 1-885757-07-7
   By : RANDOLPH WINTERS
   Published by : The Pleiades Project, P. O. Box 406, Yorba Linda, Ca. 92686-0406,
2. Family of Light - Pleiadian Tales and lessons in living
   ISBN 1-879181-47-9
   By : BARBARA MARCINIAK
3. Earth - Pleiadian Keys to the Living Library
   ISBN 1-879181-21-5
   By : BARBARA MARCINIAK
4. The Pleiadian Agenda - A New Cosmology for the Age of Light
   ISBN 1-879181-30-4
   By : BARBARA HAND CLOW - Introduced by Brian Swimme
5. Heart of the Christos - Starseeding from the Pleiades
   ISBN 1-879181-59-9
   By : BARBARA HAND CLOW
6. The Pleiadian Workbook - Awakening Your Divine KA
   ISBN 1-879181-31-2
   By : AMORAH QUAN YIN
7. Pleiadian Perspectives on Human Evolution
   ISBN 1-879181-33-9
   By : AMORAH QUAN YIN
8. The Pleiadian Tantric Workbook - Awakening
   Your Divine BA
   ISBN 1-879181-45-2 By : AMORAH QUAN YIN
9. Sunshine before dawn by Judy Satori

అసలేం ఏం జరుగుతూ ఉంది నా పట్ల...?

అని అప్పుడప్పుడు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

ఇలాగే ప్రశ్నించుకుంటూ ఉండండి.

ఇలా ప్రశ్నించుకుంటూ ధ్యానంలో ఉండండి.

ఇలా చేస్తే.... మీకు అంతు పట్టకుండా మిమ్మల్ని వేధిస్తున్న

చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా

చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా

చాలా పెద్ద పెద్ద విషయాలు తక్షణమే శాశ్వతంగా

సురక్షితంగా క్లియర్ అయిపోతాయి.

జాగ్రత్త !!!

ఏదైనా గొడవ జరుగుతూ ఉన్నప్పుడు లేదా ఏదైనా నష్టం జరుగుతూ ఉన్నప్పుడు లేదా ఏదైనా హాని జరగబోతున్నప్పుడు....

మీరు ఇలా చేయండి....

...."నేనే దీన్ని ఆకర్షిస్తున్నాను... నేను దీన్ని ఎందుకు ఆకర్షిస్తున్నాను ? ఇది నాకు అవసరం లేదు. నేను దీన్ని క్యాన్సల్ చేస్తున్నాను" అని అనుకోండి. ఇలా మీ లోపల మీరు అనుకుంటూ ఉండండి. ఆశ్చర్యకరంగా అది తక్షణమే సురక్షితంగా క్లియర్ అయిపోతుంది. ఏ గొడవ, ఏ నష్టం, ఏ హాని జరగకపోతే ఫర్వాలేదు. కానీ ఈ సూత్రాన్ని పరీక్షించాలని గొడవలను, నష్టాలను, హానిని కోరుకోకండి. ఈ సూత్రమే కాదు ఏ ఆత్మ విజ్ఞాన సూత్రాలైనా సరే, అవి నిజంగా పనిచేస్తాయా లేదా... ఇవి అవుతాయా ? అని మీరు అనుమానంతో ఉంటే... అప్పుడు మీకు సృష్టి సమస్యలను సృష్టిస్తుంది. అప్పుడు మీరు ఈ సూత్రాలను ఆచరించి మీ సమస్యలను క్లియర్ చేసుకుని... నిజమే ఆత్మ విజ్ఞాన సూత్రాలు పని చేస్తాయి అని తెలుసుకునే వరకు మిమ్మల్ని సృష్టి వదిలి పెట్టదు. కాబట్టి ఆత్మ విజ్ఞాన సూత్రాల పైన అనుమానాలను వ్యక్తం చేయకండి. మీకు అవసరం లేక పోతే వదిలేయండి. అంతే కానీ, ఆఁ.... ఇవన్నీ అవుతాయా ? అని ప్రశ్నించారో మీకు సమాధానం వచ్చి తీరుతుంది. జాగ్రత్త !!!

36. మూడో కన్ను - దివ్య నేత్రం

మూడో కన్ను, దివ్య నేత్రం, దివ్య చక్షువు, దివ్య దృష్టి, దివ్య కేంద్రం, జ్ఞాన దృష్టి, జ్ఞాన నేత్రం, జ్ఞాన చక్షువు, అంతర్ నేత్రం, అంతర్ చక్షువు, అంతర్ దృష్టి, మనో నేత్రం, మనో చక్షువు, మనో దృష్టి, లో నేత్రం, లో చక్షువు, లో దృష్టి, త్రినేత్రం, థర్డ్ ఐ, డివైన్ ఐ, క్లైయర్‌వాయన్స్, పిట్యూటరి గ్లాండ్ కొంత మంది పీనియల్ గ్లాండ్ అని అంటారు - **ఇవన్నీ ఒక్కటే !**

మనిషి అన్న ప్రతి వాడికి ఇది ఉంటుంది. విశేషమైన అత్యున్నతమైన ఆత్మ విజ్ఞాన అభ్యాసం + నిరంతర ఉన్నత ధ్యాన సాధన ద్వారా ఈ మూడో కన్నును ఎవరైనా ఉత్తేజితం చేసుకోవచ్చు. మన భౌతిక కళ్ళకు కనపడని సర్వ విషయాలు దీనితో మనం దర్శించవచ్చు. మూడో కన్నుతో మనం సృష్టిలోని అన్ని విషయాలను తెలుసుకోవచ్చు.

వీర బ్రహ్మేంద్ర స్వామి, నోస్ట్రడామస్, కీరో మొదలైన మహా యోగీశ్వరులు అందరూ ఈ మూడో కన్ను ద్వారానే భవిష్యత్తును దర్శించి, మానవాళికి కాలజ్ఞానాన్ని అందజేసారు. థర్డ్ ఐ మాస్టర్స్ ఎంతో మంది ఉన్నారు.

చిన్న పిల్లలకు సహజంగానే ఈ మూడో కన్ను ఉత్తేజితమై ఉంటుంది. నాలుగు సంవత్సరాల వయసు నుండి మెల్లి మెల్లిగా మూసుకుపోతూ ఏడవ సంవత్సరానికల్లా ఆల్‌మోస్ట్ మూసుకుపోతుంది. తర్వాత ఎప్పుడైనా ఓపెన్ చేసుకోవచ్చు, అది వేరే విషయం. అలా కాకుండా చిన్నప్పటి నుండే మనం, చిన్న పిల్లలకు ఆత్మ విజ్ఞానం నేర్పిస్తూ, వారిచే ధ్యాన సాధన చేయిస్తూ ఉంటే ఆ దివ్య నేత్రం చక్కగా ఉత్తేజితమై వికసిస్తుంది. అప్పుడు వారు గ్రేట్ గ్రాండ్ మాస్టర్స్‌గా తయారై తమకు, తమ కుటుంబానికి మరియు లోకానికి ఎంతో శ్రేయస్కరంగా పరిణమిస్తారు.

37. శక్తులు లేక సిద్ధులు

విశేషమైన ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ధ్యాన సాధన చేస్తూ ఉంటే రక, రకాల శక్తులు మనకు వస్తుంటాయి. అయితే ఈ శక్తులన్నీ ఎక్కడి నుండో కొత్తగా పుట్టుకు రావడం అంటూ ఏమీ ఉండదు. ఈ శక్తులను లేక సిద్ధులను సహజంగానే మనం కలిగి ఉంటాం. మీరు సాధనలో అభివృద్ధి చెందుతూ ఉంటే ఆటొమెటిక్‌గా ఇవి వస్తాయి. సహజంగా శక్తులు అనగానే ఒక రకమైన కుతూహలం, ఉత్సాహం జనించడం సాధారణమే. వీటి పట్ల ఇంట్రెస్ట్ కలిగి ఉండాలి. అయితే ముందు "అవగాహన" చాలా, చాలా ముఖ్యం. మన లక్ష్యమైన మన నిజతత్వ ప్రాప్తి మనకు ముఖ్యం. కాబట్టి మన సాధన కొనసాగిస్తూనే ఉండాలి. శక్తులు వస్తుంటాయి. వాటిని మన ఆత్మాభివృద్ధికి ఉపయోగించుకుంటూ అలా కొనసాగిపోతూనే ఉండాలి. శక్తులు లేక సిద్ధులు చాలా రకాలుంటాయి, అందులో కొన్ని :

1. గాలిలో తేలడం లేక ప్రయాణించడం.

2. దూరంగా ఉన్న వస్తువులను మనో శక్తితో కదిలించడం.

3. ఘన పదార్థాల నుండి భౌతిక శరీరంతో వెళ్ళడం.

4. సూక్ష్మ శరీర ప్రయాణం పూర్తిగా ఎరుకలో, అదుపులో ఉండడం.

5. టెలిపతి - Telepathy

6. టెలిపోర్టేషన్ - Teleportation

7. క్లైయిర్‌ఆడియన్స్ – Clairaudience

8. క్లైయిర్‌వాయన్స్ - Clairvoyance

9. హీలింగ్ పవర్ - Healing Power

10. ఆకాశిక్ రికార్డులు చూడటం - Seeing Akashic Records

11. ఆరా చూడగలగడం - Aura Vision

12. Super Sight - దివ్య చక్షువు [Third Eye] ద్వారా మాత్రమే చూడగలిగే వాటిని భౌతిక కళ్ళతో చూడగలగడం. నాకు ఈ విధంగా జరుగుతూ ఉంటుంది.

13. టైమ్ ట్రావెలింగ్ - Time Travelling

14. అష్ట సిద్ధులు అని ఎనిమిది ఉంటాయి. .... ఇలా ఇంకా ఎన్నెన్నో ఉంటాయి !

టెలిపతి – Telepathy

భాష, వ్రాత, సైగలు మొదలైనవి ఏవీ లేకుండా మన ఆలోచనలను ఇంకొకరికి పంపడం, ఇతరుల ఆలోచనలను స్వీకరించడం. ఈ రకమైన సంభాషణనే టెలిపతి అని అంటారు. పరస్పర భావ ప్రసారమే టెలిపతి.

ఇది అందరికీ, ముఖ్యంగా ఆత్మీయుల మధ్య ఎక్కువగా జరుగుతూనే ఉంటుంది, కానీ వారు గుర్తించలేక పోతారు. యోగులకు ఇది సామాన్యమైన విషయం. పైన కొన్ని లోకాలలో ఈ రకమైన సంభాషణయే సాధారణంగా ఉపయోగిస్తారు. సాధన ద్వారా ఇది ఎవరైనా సాధించవచ్చు.

టెలిపోర్టేషన్ – Teleportation

మనోశక్తి ద్వారా ఎక్కడో ఉన్న వస్తువును మన దగ్గరికి తెప్పించుకోవడం లేదా వస్తువులను తాకకుండా కేవలం మనోశక్తి ద్వారా ఒక చోటి నుండి మరొక చోటికి మార్చడం - దీనినే టెలిపోర్టేషన్ అని అంటారు.

క్లైయిర్ఆడియన్స్– Clairaudience

టెలిపతికి దీనికి వ్యత్యాసం ఉంది. టెలిపతిలో కేవలం ఆలోచనలు లేదా భావ ప్రసారం మాత్రమే జరుగుతుంది. ఈ క్లైయిర్ఆడియన్స్‌లో భావాలే కాకుండా, శబ్దాలు, మాటలు కూడా మనం రిసీవ్ చేసుకోగలుగుతాం. దీనినే "అశరీరవాణి" లేదా "ఆకాశవాణి" అని కూడా అంటారు.

క్లైయిర్వాయన్స్– Clairvoyance

క్లైయిర్వాయన్స్‌ను దివ్య దృష్టి అని అనవచ్చు. భౌతిక కళ్ళతో చూడలేని విషయాలను దివ్య చక్షువు ద్వారా చూడగలగడమే "క్లైయిర్వాయన్స్".

హీలింగ్ పవర్ – Healing Power

ఎంతో అద్భుతమైన, మహా పటిష్ఠమైన హీలింగ్ పవర్‌ను మనం సహజంగానే కలిగి ఉంటాం. ఎలాంటి రోగాన్నైనా, ఎంత పెద్ద వ్యాధినైనా మనకి మనం తగ్గించుకోగలుగుతాం ఇతరులకు కూడా నయం చేయగలుగుతాం. అయితే ఎవరికి వారు హీల్ చేసుకునే విధంగా ఉండడమే శ్రేయస్కరం. ఎప్పుడో అవసరమైన పరిస్థితుల్లో తప్ప ఇతరులకు హీల్ చేయకూడదు.

ఆకాషిక్ రికార్డులు చూడటం-

Seeing Akashic Records

ఆకాషిక్ రికార్డులలో అన్ని విషయాలు పొందు పరచబడి ఉంటాయి. జరిగినవి, జరుగుతున్నవి ఇంకా జరగబోయే ప్రాబబిలిటీస్(సంభావ్యతలు) అన్నీ అందులో ఉంటాయి. దేశాల వాస్తవ చరిత్రల గురించి, వ్యక్తుల వాస్తవ చరిత్రల గురించీ, మన స్వంత జన్మ పరంపరల వాస్తవాలు అన్నీ ఇందులో ఉంటాయి. ఆకాషిక్ రికార్డులలో అసలు సిసలు వాస్తవాలు ఉంటాయి. మనకు ఈ భూమి పైన లభించే పుస్తకాలలోని సమాచారంలో చాలా వరకు వాస్తవాలు మరుగు పరచ బడ్డాయి. ఆకాషిక్ రికార్డుల్లో అన్ని సత్యాలు దర్శనమిస్తాయి. థర్డ్ ఐ ద్వారా ఎవరైనా సరే ఆకాషిక్ రికార్డ్స్ అధ్యయనం చేసి ఆత్మాభివృద్ధిని గావించుకోవచ్చు.

టైమ్ ట్రావెలింగ్ - Time Travelling

టైమ్ ట్రావెలింగ్ అనగా భూతకాలంలోకి అంటే గతంలోకి మరియు భవిష్యత్తులోని సంభావ్యతలలోకి సశరీరంగా భౌతిక శరీరంతో వెళ్ళి తిరిగి వర్తమానంలోకి రావడం. ఈ టైమ్ ట్రావెలింగ్ ద్వారా అనుకున్న సమయాలలోకి వెళ్ళి రావచ్చు. నేను చేస్తున్న పరిశోధనాంశాల్లో ఈ టైమ్ ట్రావెలింగ్ ఒకటి.

38. ఎప్పుడైనా సరే, ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే, ఇలా అనకూడదు !

శరీరం + జీవితం అశాంతి మయమైనపుడు, వరుస అపజయాలతో కృంగి పోయినపుడు, నిరాశతో, నిస్పృహతో ఒక విధమైన నెగెటివ్ స్థితిలోకి వస్తాం. ఈ స్థితిలో ఉన్నవారు సహజంగా ఇలా అంటారు.....

"ఇంకా ఏం మిగిలి ఉంది ? కానీ, నాశనమై పోనీ, వెధవ బతుకు, ఈ కష్టాలలో ఇలాగే పడి ఛస్తాను. రానీ ఎన్ని కష్టాలొస్తాయో రానీ..."

తీవ్రమైన నిరాశపూరితమైన క్రోధంతో ఇలా అంటారు. దెబ్బ మీద దెబ్బ పడుతున్నప్పుడు ఏం చేయాలో పాలుపోక ఇలా అనడం సహజమే ! అయితే ఇలా అనడం వలన మరిన్ని కష్టాలను ఆహ్వానించినట్టవుతుంది. కష్టాలను ఇంకా పెంచుకోవడమే అవుతుంది. మంచిని కోరుకోమంటే తగిన తీవ్రత రాదు కానీ, చెడును కోరుకునేప్పుడు మాత్రం చాలా తీవ్రాతి తీవ్రంగా కోరుకుంటారు. ఎంత తీవ్రత ఉంటుందంటే కష్టాలు తక్షణమే భౌతిక రూపం తీసుకునేంత !

"మనం తీవ్రాతి తీవ్రంగా దేనినైతే కోరుకుంటామో అది తక్షణమే మన జీవితంలోనికి ప్రవేశిస్తుంది". - ఒకానొక విశ్వ సూత్రం

కాబట్టి ఎప్పుడు కూడా నాశనాన్ని కోరుకోవద్దు, కష్టాలను రానీ, జరగనీ అని అనవద్దు. అలా అంటే ఏం జరుగుతుందో తెలియక అలా అంటారు. దయచేసి అలా అనకండి. ఎరుకతో ఉండండి. క్రమం తప్పని సాధన చేయండి. ఎలాంటి పరిస్థితులనైనా సరే మనం వాటిని మన స్వాధీనంలోకి తెచ్చుకుని మనకు అనుకూలంగా మార్చుకోవచ్చు.

అన్ని దారులు ఎన్నటికీ మూసుకుపోవు ! ఎల్లప్పుడు చాలా ద్వారాలు తెరిచియే ఉంటాయి. సదా ఎన్నో మార్గాలు ఉంటూనే ఉంటాయి. సర్వదా ఎన్నో అవకాశాలు మనల్ని ఆదుకోవడానికి సిద్ధంగా ఉంటాయి.

- ఒక విశ్వ సూత్రం

మనం తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, ప్రాణాపాయ పరిస్థితిలో కూడా మనం నిశ్చలంగా, స్థిరత్వంతో ఉండ గలిగితే పరిస్థితులు వెంటనే మనకు అనుకూలంగా మారిపోతాయి అని ! అన్ని దారులు ఎన్నటికీ మూసుకుపోవు, మార్గాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ప్రశాంతంగా, ధీమాగా ఉన్నప్పుడు మాత్రమే ఆ మార్గాలు మనకు కనబడుతాయి. ఆదికి ముందే మనం విపరీతమైన టెన్షన్ పడితే తెరిచి ఉన్న "పరిష్కార మార్గాలు" మనకు కనబడవు. అవి అక్కడే ఉంటాయి. కాని టెన్షన్ అనేది ఆ పరిష్కార మార్గాలను కనబడనీయదు. ప్రశాంతంగా, స్థిరంగా, ప్రేమగా ఆలోచిస్తే ఆ పరిష్కార మార్గం తక్షణమే మన ముందు ప్రత్యక్షమవుతుంది. నిరంతర ఆత్మ విజ్ఞాన అభ్యాసం ద్వారా మరియు క్రమం తప్పని ధ్యాన సాధన ద్వారా మనం ఈ మహోన్నతమైన స్థిత ప్రజ్ఞత్వాన్ని సులభంగా, శీఘ్రంగా, శాశ్వతంగా అందుకోవచ్చు.

మనయందే దైవం ఉన్నాడు. ఇంకా సూటిగా చెప్పాలంటే సాక్షాత్తు దైవమే మనం. రామ్‌తా పరమాత్ముడు ఇలా అంటాడు... "మీరే దైవం మాస్టర్ ! ఈ సర్వస్వాన్ని సృష్టించింది ఎవరనుకుంటున్నారు...? మీరే ! మిమ్మల్ని అదుపులో ఉంచగల దానిని మీరు సృష్టించనే లేదు" అని !

✪ పరిస్థితులు మీ వలన సృష్టించబడుతున్నాయి కానీ, మీరు పరిస్థితుల వలన కాదు అన్న పరమ సత్యాన్ని గ్రహించండి.

ఎప్పుడు కూడా ఓటమిని అంగీకరించకూడదు. సృష్టి మొత్తానికి ఆధారమైన, అన్ని మూలాలకు మూలమైన "మూల చైతన్యమే" మనం ! "నేనే మూల చైతన్యం" అనే భావనాత్మకమైన ఎరుకను సదా మనం కలిగి ఉన్నప్పుడు ఎలాంటి పరిస్థితినైనా మనం తక్షణమే అదుపులోనికి తీసుకుని, మనకు పూర్తి అనుకూలంగా మార్చుకోవచ్చు.

39. జడ్జిమెంట్ - తీర్పు

"Judge ye not" అని అంటే ఎవరినీ తప్పు పట్టకండి, ఎవరి పట్లా జడ్జ్‌మెంట్(తీర్పు) చెప్పకండని అర్థం. జడ్జ్ చేయడం అంటే తప్పు పట్టడం, విమర్శించడం, హేళన చేయడం, నిందించడం.

"ఎవరినీ తప్పు పట్టకండి, ఎవరి పట్లా తీర్పులు చెప్పకండి", సరి చేసే అధికారం మీకెక్కడిది ? సరి చేసే సాధికారత కేవలం సద్గురువుకు మాత్రమే ఉంటుంది, అనే ఆధ్యాత్మిక ప్రాచీన సూక్తి ఉండనే ఉంది.

పరమ గురువు జీసస్ క్రైస్ట్ కూడా ఈ సత్యాన్నే చెప్పాడు,

"Judge ye not" అని !

- The Holy Bible - Matthew 7:1

"తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరనే" సూక్తి ఉంది, "ఒక వేలెత్తి మనం అవతల వారిని చూపినపుడు మిగతా వేళ్ళు మనల్ని చూపుతాయి" అనే సూక్తి కూడా ఉంది, ఇలా సూక్తులెన్నో సూచిస్తూనే ఉన్నాయి. ఈ సూక్తులను సుమారుగా అందరూ వల్లె వేస్తూనే ఉంటారు. చెప్తూనే ఉంటారు కూడా, కానీ ఆచరించరు.

"కనపడేదంతా సృష్టియే, సృష్టిలోని ప్రతీ భాగమూ సృష్టియే" - ఒక సృష్టి సూత్రం ! "ఆధ్యాత్మిక శాస్త్ర మూల సూత్రం ఇలా చెప్తుంది". సర్వ - సర్వ, సకల - సకల, సమస్త సృష్టిని అంతా కూడాను ఒకే ఒక కేంద్రం అంతటికి జవ జీవాలనందిస్తూ నడిపిస్తూ ఉంటుంది, అంతా "అదే" అయి ఉంటుంది, దానినే "మహా మూల చైతన్యం - Ultra Consciousness" అని అంటారు. దీనికే సవాలక్ష పేర్లున్నాయి. "Judge ye not" సూత్రానికి ఈ పారాగ్రాఫ్‌లో పేర్కొన్న రెండు సూత్రాలకీ లింకు ఉంది. అది ఎలాగో సవివరంగా తెలుసుకుందాం.

మొదటి సూత్రం, "Judge ye not" - తీర్పులు చెయ్యకండి. రెండవ సూత్రం, కనపడేదంతా సృష్టియే, సృష్టిలోని ప్రతీ భాగమూ సృష్టియే. మూడవ సూత్రం అంతటికి మూల చైతన్యం పోషణను, పాలనను అందిస్తూ ఉంటుంది.

వాస్తవానికి సృష్టిలో ఉన్నది ఏకత్వమే. అందరి మూలం ఒక్కటే. అందరిలోనూ, అంతా ఆ యొక్క మూల చైతన్యమే వ్యాపించి ఉంది. బాహ్యంగా వేరు వేరుగా కనిపించినా "అంతరంలో" ప్రతి ఒక్కరు "అంతటితో" కనెక్ట్ అయి ఉంటారు. అందరి కేంద్రం ఒక్కటే. అంతా ఒక్కటే. ఎలాగైతే ఒక వృక్షం ఉంది, దాని కొమ్మలు, ఆకులు అన్ని విడి విడిగా కనిపిస్తాయి కానీ అన్నింటి మూలం ఒక్కటే.

"జడ్జ్ చెయ్యకండి" - ఒక వ్యక్తిని కానీ, ఒక సంఘటనను కానీ తప్పు పట్టినప్పుడు యథాతథంగా - As it isగా అదే పరిస్థితిని మీరు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎందుకంటే మీరు తప్పు పట్టిన వ్యక్తి ఈ విశ్వంలో ఒక భాగం అంటే, విశ్వమే. ఈ విధంగా మీరు విశ్వాన్ని తప్పు పట్టినట్టవుతుంది. విశ్వాన్ని పోషించే, పాలించే మూల చైతన్యాన్ని తప్పు పట్టినట్టవుతుంది. మూల చైతన్యం యొక్క అడ్మినిస్ట్రేషన్‌ను మీరు తప్పు పడుతున్నారూ అంటే ఎంతటి సాహసమో... ఆలోచించాలి ! మీరు తప్పు పట్టిన వ్యక్తి ఎందుకలా ప్రవర్తిస్తున్నాడో మీకేం తెలుసు ? అహంకారంతో ఆ వ్యక్తిని విమర్శించి, అతని చర్యల పట్ల తీర్పులు చెప్పడం అంటే ఏం అని అనుకున్నారు ?!? "అదే పరిస్థితుల్లో నేనైతే అలా ప్రవర్తించను", అనే అహంభావం అన్నమాట. ఈ అహంభావమే మీ చేత అలా "జడ్జ్" చేయిస్తుంది. నేనైతే అలా చేయను, నేనైతే ఇలా జరగనివ్వను అని అంటూ అందరిని జడ్జ్ చేయిస్తుంది. జడ్జ్ చేయడం అంటే ఛాలెంజ్ చేయడం, ఆ పరిస్థితిని ఆహ్వానించడం, ఆ పరిస్థితిని తన జీవితంలో జరిగేలా ఖాయం చేసుకోవడం. మీరు జడ్జ్ చేస్తారు. మరిచిపోతారు. ఆ పరిస్థితి వచ్చి మీ జీవితంలోకి కలిసిపోతుంది దాన్ని మీరు గుర్తు పట్టలేరు. ఎందుకంటే అది ఒక జీవిత అవసరంగా వస్తుంది. మీరు ఎన్ని రకాలుగానైనా సమర్థించుకునే పరిస్థితులలో వస్తుంది. దాంతో మీకు అది "జడ్జ్‌మెంట్" అని తెలియదు. దానిని అనుభవిస్తూ ఉంటారు. దాన్ని గురించిన పూర్తి అవగాహన వచ్చే వరకు ఆ పరిస్థితి మిమ్మల్ని వదిలి పోదు. ఎందుకంటే ఆ పరిస్థితి గురించిన "సరైన అవగాహన" లేకనే మీరు జడ్జ్ చేసారు. ఏ "అవగాహన" లేక జడ్జ్ చేసారో ఆ "అవగాహనను" ఇవ్వడానికే మీకు ఆ జడ్జ్ చేసిన పరిస్థితి వస్తుంది.

✪✪✪ మీరు జడ్జ్‌మెంట్ మానసికంగా చేసినా సరే, వాక్కు రూపంలో చేసినా సరే, ప్రవర్తనా రూపంలో చేసినా సరే అది జడ్జ్‌మెంట్ అవుతుంది, మీ జీవితంలో సంభవిస్తుంది. ఒక సారి మీరు అనుభవిస్తున్న పరిస్థితులను నిశితంగా పరిశీలించండి, అందులో చాలా మటుకు జడ్జ్‌మెంట్లే అయి ఉంటాయి. అందుకే నేను "మానవ జీవితం జడ్జ్‌మెంట్ల మయం" అని అంటాను. ✪✪✪

మీరు ఎలాంటి పరిస్థితిని జడ్జ్ చేస్తారో సరిగ్గా అలాంటి పరిస్థితే మీకూ వస్తుంది. Pin to pin, as it is, same to same , సరిగ్గా అలాంటి పరిస్థితే మీకూ వస్తుంది. ఎంత ఆశ్చర్యంగా, ఎంత విచిత్రంగా జరుగుతుందంటే... దాని గురించి ఇక ఏమి చెప్పలేం, అంతే !

ఉదాహరణకు నిజంగా జరిగిన ఒక సంఘటన గురించి వివరిస్తాను. ఒక వ్యాపారస్థుడు ఉండే వాడు. మంచి వ్యక్తి , మంచి కుటుంబం. అతని భార్య అతనికి అన్ని పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటూ సంసారాన్ని నడిపించటంలో విశేషమైన సహాయం చేస్తూ ఉండేది. ఇద్దరూ కలిసి సంసారాన్ని చక్కగా నడిపించుకుంటున్నారు. ఇంతలో వీళ్ళ పెద్దమ్మాయి వేరే కులం అబ్బాయితో ప్రేమలో పడింది. ఆ విషయం బయట పడింది. ఇద్దరి పెద్దలు ఘర్షణ పడకుండా చర్చించుకుని ఎవరి పిల్లల్ని వాళ్ళు కంట్రోల్ చేసుకుందామని నిర్ణయించుకుని జాగ్రత్తగా ఉండసాగారు. అమ్మాయి తల్లిదండ్రులు పెళ్ళి సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. తీరా పెళ్ళి నిర్ణయం అయి, ఇక పెళ్ళి జరుగుతుందీ అనగా, ప్రేమించుకున్న ఆ అమ్మాయి + అబ్బాయి రహస్యంగా పారిపోయి చట్ట ప్రకారంగా పెళ్ళి చేసుకున్నారు. ఇరు వర్గాల వారు ఏమి చేయలేక మౌనంగా ఉన్నారు. కథ సుఖాంతం అయింది. అయితే ఇక్కడే ఒక ట్విస్ట్ పడింది, అది ఏమిటంటే ఈ అమ్మాయి తండ్రి యొక్క బావ గారు, అంటే ఈ అమ్మాయి తండ్రి యొక్క చెల్లెలి భర్త - ఈ అమ్మాయి తండ్రిని బాగా తిట్టాడు. ఏం పెంపకం ఇది, వాడెవడితోనో నీ కూతురు లేచి పోయింది. ఇంట్లో ఎదిగిన ఆడ పిల్లలున్నారనే ఇంగిత జ్ఞానం లేదా ? ఏం చేస్తున్నావు ? తీరా పెళ్ళి ఫిక్స్ అయ్యాక అది వాడితో లేచి పోయింది. ఇది ఎలా జరిగింది ? ఈ మాత్రం కంట్రోల్‌లో పెట్టుకోలేని వాడివి అసలు నీవు పిల్లలను ఎందుకు కన్నావు ? అంటూ నానా రకాలుగా తిట్టి , చివరికి "ఛీ" బంధు వర్గంలో, సమాజంలో తలెత్తుకోకుండా చేశావు అని అతని మొఖాన్ని చూస్తూ మొఖం మీద ఉమ్ముతున్నట్లుగా ఖాండ్రించి నేల మీద ఉమ్మేసాడు ! ఇంత మాత్రంతో సరి పెట్టుకోకుండా ఆ అబ్బాయి వాళ్ళింటికి, ఆ అబ్బాయి స్నేహితుల ఇంటికి వెళ్ళి నానా తిట్లు తిడుతూ, ఎంతో గొడవ చేశాడు. పోలీస్

కేసని, అదని, ఇదనీ నానా హంగామా చేశాడు. ఈ అమ్మాయి తల్లిదండ్రులు + ఆ అబ్బాయి ఇంట్లో వాళ్ళు + ఆ అబ్బాయి స్నేహితులు ఏం చేయగలుగుతారు, మౌనంగా అన్ని మాటలను పడి ఎలాగో నానా తిప్పలు పడి ఆ పరిస్థితులను మ్యానేజ్ చేసి బయట పడ్డారు.

ఇది జరిగిన కొన్నాళ్ళకు ప్రేమించి పెళ్ళి చేసుకున్న అమ్మాయి తల్లిదండ్రులను తిట్టిన వ్యక్తి యొక్క కూతురు వేరే "మతం" అబ్బాయిని ప్రేమించి అతడిని పెళ్ళి చేసుకుంది. Same to same పారిపోయి పెళ్ళి చేసుకుంది. అప్పుడు ఆయనను అందరూ ఇవే మాటలు అడిగారు. అప్పుడు ఆయనకు తెలిసి వచ్చింది. మౌనం వహించాడు. ఇదీ జరిగిన విషయం. ఇది యథార్థ సంఘటన.

"తన దాకా వస్తే కానీ తెలీదు" !

కాబట్టి మిత్రులారా ! ఎట్టి పరిస్థితులలోనూ ఎవరినీ జడ్జ్ చేయకండి. వాళ్ళట్లా, వీళ్ళిట్లా, అంటూ మీ జీవితాలను కష్టాలపాలు చేసుకోకండి. గుర్తుంచుకోండి ఏ పరిస్థితులను అయితే మీరు నిందిస్తూ ఉన్నారో సరిగ్గా అవే పరిస్థితులను మీరు కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. జాగ్రత్త !!!

ఎవరు ఏం చేస్తూ ఉన్నా, ఎవరు ఎంత విచిత్రంగా ఉన్నా, మీకు జీర్ణం కాని మింగుడు పడని పనులు చేస్తున్నా సరే, వాళ్ళను చూసి - వాళ్ళు అది నేర్చుకుంటున్నారు అనే అవగాహనతో సాక్షిగా చూడండి. "ఎవరు ఎందుకు ఎలా ప్రవర్తిస్తున్నారో, వారు అందుకు అలా ప్రవర్తిస్తున్నారు" అనే అవగాహనతో ఉండండి. ఉచిత సలహాలు ఇవ్వకండి. మీరు ఏ సలహాలనైతే ఇస్తారో వాటిని మీరు ఎదుర్కోవాల్సి వస్తుంది. మీరు ఆచరించలేని నీతులను చెప్పకండి. ఒక వేళ చెబితే, అవగాహనతో మృదువుగా అవతల వారి పరిస్థితిని అర్థం చేసుకుని చెప్పండి.

ఏరా ఎందుకిలా ఉంటావు ? ఏదైనా చేయచ్చు కదా ! అలా ఉండచ్చు కదా ! ఇలా ఉండచ్చు కదా ! పెద్ద ఆరిందాలా బుద్ధులు చెప్పకండి. ఛీ వాడా, ఛీ వీడా అంటూ అహంకారంతో ఉండకండి. మీరూ వారిలాగే తయారవ్వాల్సి వస్తుంది మరి. ఒళ్ళు దగ్గర పెట్టుకుని ప్రవర్తించాలి. లేకపోతే మదం అంతా మరిగి, ఆవిరి అయిపోతుంది.

ఎందుకంటే ఎవరినైతే అసహ్యించుకుంటారో వారినే ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తుంది. నవలల్లోని పాత్రలనూ, సినిమాల్లోని పాత్రలను, చివరికి పల్లీలు కొనుక్కుంటే, ఆ పల్లీలతో వచ్చిన కాగితంలోని విషయం పట్ల కూడా సాక్షిగా, మౌనంగా ఉండండి. ఇవి కూడా జడ్జ్‌మెంట్లు అవుతాయి.

మీకు సంబంధించిన విషయాలను మాత్రమే పట్టించుకోండి, వాటికి మాత్రమే స్పందించండి. మీకు సంబంధం లేని విషయాల్లో మౌనంగా ఉండండి, సాక్షిగా ఉండండి. ఒకే ఒక్క జడ్జ్‌మెంట్ మీ జీవితాన్ని మార్చేస్తుంది, ఒక ఐడియా జీవితాన్ని మార్చినట్టు ! ఇప్పుడు మీరు అనుభవిస్తున్న వాటిలో అధిక శాతం జడ్జ్‌మెంట్లే !

మీరు ఇతరులను ఎవరిని జడ్జ్ చేసినా ఆ జడ్జ్‌మెంట్‌ను అనుభవించాల్సి ఉంటుంది. ఇతరులు అంటే మీరు కాక ఎవరైనా సరే, భర్తను భార్య జడ్జ్ చేసినా, భార్యను భర్త జడ్జ్ చేసినా, తల్లిదండ్రులు పిల్లలను జడ్జ్ చేసినా, పిల్లలు తల్లిదండ్రులను జడ్జ్ చేసినా, అన్న దమ్ములు, అక్కా చెళ్ళెళ్ళు, మిత్రులు, బంధువులు, పరాయి వాళ్ళు, వాళ్ళూ వీళ్ళూ అనే తేడానే లేదు. మీరు ఎవరిని జడ్జ్ చేసినా ఆ పరిస్థితిని గ్యారంటీగా ఎదుర్కోవాల్సి వస్తుంది. చివరికి జంతువులను జడ్జ్ చేసినా సరే ! మీరూ జంతువుల్లాగే ప్రవర్తించాల్సి వస్తుంది.

ఈ విశ్వ నియమం ఎందుకిలా ఉందంటే, అనవసరంగా ఎవరూ కూడా ఇంకొకరి విషయాల్లో తలదూర్చ కూడదు, అహంకారంతో ప్రవర్తించకూడదు. అందరిని, అన్ని పరిస్థితులను అర్థం చేసుకుని ప్రశాంత జీవనం గడపాలనే ఉద్దేశంతో కూడి ఉన్నదే ఈ విశ్వ నియమం.

✪ తెలియక చేసాం, ఇప్పుడెలా, అంటే మీరు అవగాహన తెచ్చుకుంటే ఆ జడ్జ్‌మెంట్ పోతుంది. మీరు అనుభవిస్తున్న పరిస్థితి యొక్క మూల కారణాన్ని గుర్తించిన మరుక్షణం, మీ లోపం మీ ఎరుకలోకి వచ్చిన మరుక్షణం, మీ జడ్జ్‌మెంట్ మీకు గుర్తుకు వచ్చిన మరుక్షణం, గుర్తుకు వచ్చి అవగాహనకు వచ్చిన మరుక్షణం అది పోతుంది. ఆ జడ్జ్‌మెంట్ నుండి మీకు విముక్తి కలుగుతుంది.

✪ జడ్జ్‌మెంట్ అన్నది మీకు అవగాహన కల్పించడానికే వస్తుంది. దాన్ని తప్పనిసరిగా మీరు అనుభవించాల్సిన రూల్ ఏమీ లేదు. జడ్జ్ చేసిన తర్వాత రియలైజ్ అయి అవగాహన తెచ్చుకుంటే ఇక అప్పుడు ఆ జడ్జ్‌మెంట్‌ను మీరు అనుభవించాల్సిన పని లేదు. అయితే అది "నిజమైన అవగాహన" అయి ఉండాలి. అది నిజమైన అవగాహనో కాదో తెలుసుకోవడం ఎలా, అని అంటే ఆ పరిస్థితి నుండి మీకు విముక్తి కలిగితే అది నిజమైనది, లేదంటే కాదు.

✪ ఏ జడ్జ్‌మెంట్లయినా ఎవరూ అనుభవించాల్సిన అవసరమే లేదు. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న మరియు అనుభవించబోతున్న అంటే రాబోతున్న జడ్జ్‌మెంట్లను సులభంగా, వెంటనే, పూర్తిగా, శాశ్వతంగా తీసివేసుకోవాలంటే ఒక దివ్యమైన విధానం ఉంది.

✪ ధ్యానంలో కూర్చుని "నేను ఏ జడ్జ్‌మెంట్లను అనుభవించాల్సిన అవసరం లేదు, నేను ప్రస్తుతం అనుభవిస్తున్న, రాబోతున్న జడ్జ్‌మెంట్ల యొక్క ఎరుక + అవగాహన నా మూల చైతన్యంలో రెడిమేడ్‌గా ఉంది. ఆ యొక్క రెడిమేడ్ ఎరుకను + అవగాహనను ఈ క్షణమే ఆనందంగా, సంపూర్ణంగా అనుమతించాను" అని అనుకుని, నిజంగా అనుమతించండి. అంతే ! అనంత మహా మూల చైతన్యం నుండి, "అనంతమైన ఎరుక + అవగాహన" మీలోకి ప్రవహించి, తక్షణమే మీకు అన్ని జడ్జ్‌మెంట్ల నుండి శాశ్వతంగా విముక్తిని ప్రసాదిస్తుంది.

✪ వాస్తవానికి ఎవరు కూడా ఏ బాధలు అనుభవించాల్సిన అవసరమే లేదు. అందరూ అనంతమైన ఎరుకను + అవగాహనను "రెడిమేడ్‌గా" కలిగియే ఉన్నారు. సృష్టిలో అన్ని రెడిమేడ్‌గా సృష్టింపబడే ఉన్నాయి. సృష్టి అంతా కూడాను రెడిమేడే ! రెడిమేడ్‌గా సృష్టించబడి ఉన్న వాటిని మనం కేవలం అనుమతించాలి అంతే !

✪ అహం రెడిమేడ్‌ను అనుమతించదు. స్వంతంగా ఏదో చేయాలని అనుకుంటుంది. సొంత పెత్తనాలు చేసి, భంగపడి, ఓడి పోయి, అలసి పోయి, అహం ఆవిరి అయిపోతుంది. అప్పుడు రెడిమేడ్ యొక్క విలువ తెలిసి వస్తుంది. అప్పుడు సృష్టిలో ఆల్‌రెడి సృష్టించబడి రెడిమేడ్‌గా ఉన్న అన్ని ఆనందాలను అనుమతిస్తూ, హాయిగా అనుభవించి ఎంజాయ్ చేయవచ్చు.

✪✪✪ భావంలోనూ, వాక్కులోనూ, ప్రవర్తనలోనూ మీరు ఏ రకంగా చేసినా జడ్జ్‌మెంటే అవుతుంది. ఎంత తీవ్రంగా చేస్తే అంతగా అది వస్తుంది.

మీరు మనసులో చేసినా అది జడ్జ్‌మెంట్ అవుతుంది.

పోల్చి చూసుకోవటం కూడా జడ్జ్‌మెంట్ అవుతుంది. ఆయనకేం హాయిగా పెళ్ళాం సంపాదిస్తుంటే తిని కూర్చుంటున్నాడు. పనా పాటనా అంటూ పోల్చుకున్నారనుకోండి, అప్పుడేం జరుగుతుందంటే - ఆయన ఏ కారణంతో అలా ఉన్నాడో, ఏం జబ్బు ఉందో, ఏం దరిద్రం ఉందో, ఏ డిస్‌ఎబిలిటీ ఉందో, దేని చేత పీడించబడి అలా ఏమీ చేయకుండా అలా ఉన్నాడో ఆ మూల కారణం ఏమిటో "అది" మీకు ట్రాన్స్‌ఫర్ అయిపోతుంది. అప్పుడు మీరు కూడా ఆయన లాగే చక్కగా పెళ్ళాం సంపాదిస్తుంటే తిని కూర్చోవచ్చు. అందుకే పోల్చుకోకూడదు. పోల్చుకోవడం కూడా జడ్జ్‌మెంటే !

సాధకులలో కూడా పోల్చుకోవడాలు ఉంటాయి. గురువు గారు, వాడికి పెద్దగా ఏ పనులు చెప్పరు. అన్ని పనులు మనం చేస్తుంటే వాడేమో హాయిగా ఉంటాడు అని పోల్చుకుంటూ ఉంటారు. గురువు వాడికి ఎందుకు చెప్పటం లేదో మీకేం తెలుసు ? వాడు త్వరలో చస్తాడేమో, పోయే ముందు వాడిని కాస్త రిలాక్స్‌గా ఉంచుదామని ఏ పని చెప్పటం లేదేమో ! వాడి చావు మీకూ కావాలంటే పోల్చుకోండి మరి ! మీ పనేదో మీరు చేసుకోక వారిని, వీరిని పోల్చుకుంటే బతుకు బస్టాండ్ అవడం ఖాయం.

పాజిటివ్‌గా పోల్చుకోండి ! వాడు పది మందికి సహాయం చేస్తే, నేను ఇరవై మందికి చేస్తాను. వాడు అది సాధిస్తే, నేను కూడా ఎదో ఒక ప్రయోజనకరమైనది ఎందుకు సాధించలేను ? అని ఈ విధంగా స్పోర్టివ్‌గా పోల్చుకోండి. అంతే కాని ఈర్ష్య, ద్వేషం, అహంకారాలతో ఎప్పుడూ పోల్చుకోవద్దు.

దాని మొగుడిలా, వీడి పెళ్ళాం అలా, వాళ్ళ పిల్లలు అలా, వాళ్ళు ముద్దులాడుకుంటున్నారు, వీళ్ళు గుద్దులాడుకుంటున్నారు, ఆ అమ్మాయి ఎవడితోనో తిరుగుతోంది, ఆ అమ్మాయి లేచి పోయింది, ఆమె భర్తకు తెలీకుండా అక్రమ సంబంధం కొనసాగిస్తుంది. ఇలా నానా రకాల పనికి మాలిన విషయాల మీద చర్చలు జరిపి శక్తిని వృథా పరుచుకోకుండా, అదే శక్తిని మనపై మనం ఫోకస్ చేసుకుంటే ఎంతో వేగంగా అభివృద్ధిని సాధించవచ్చు.

జడ్జ్‌మెంట్ జీవితాన్ని తలక్రిందులుగా చేస్తుంది. ఎవరు ఎలా ప్రవర్తిస్తే మీకు ఎందుకు ? మీ పైనా, మీ జీవితం పైనా ఏదైనా ప్రభావం పడుతుందంటేనే స్పందించండి, అది కూడా ఎంత మేరకు ప్రభావం పడితే అంత మేరకు మాత్రమే ప్రతి స్పందించండి.

ఎవరో నగ్నంగా నాట్యమాడతారు, ఇంకెవరో పది మందితో కులుకుతారు, వాళ్ళు ప్రేమించుకుంటారు, వీళ్ళు పెళ్ళి చేసుకుంటారు, ఎవరో విడిపోతారు, జీవితంలో ఏవేవో సవాలక్ష రకాలుగా సంఘటనలు జరుగుతూ ఉంటాయి. అనవసరంగా అహంకారంతో ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకుని వారిని వేధిస్తే అంతకు అంతా అనుభవిస్తారు. చేస్తే ఎవరికైనా సహాయం చేయండి లేకపోతే లేదు. ఏ భావమూ లేకుండ సాక్షిగా ఉండండి. అందరి పట్లా ప్రేమను, గౌరవాన్ని కలిగి ఉండండి.

సమాజంలో జరుగుతున్న కొన్ని ఇష్యూస్‌ని తీసుకొని కొంత మంది వాటిని విమర్శిస్తూ వాటిని సరి చేయడానికి పూనుకుంటారు. ఇష్యూస్ పట్ల అవగాహన కలిగి వాటిపైన పని చేస్తుంటారు. ఇది వేరే విషయం. ఇవి జడ్జ్‌మెంట్ల కిందికి రావు. ఇది సమాజ సేవ, ఇది అభినందించదగిన విషయం.

తిన్నది అరగక, బలుపుతో, ఏ మాత్రమూ సంబంధం లేని సంఘటనలను, వ్యక్తులను రక రకాలుగా విమర్శిస్తూ కూర్చుంటే అప్పుడు అది జడ్జ్‌మెంట్ అవుతుంది. అహంకారంతో విమర్శిస్తే, మదంతో ప్రవర్తిస్తే అప్పుడు అది జడ్జ్‌మెంట్ అవుతుంది.

✪ వాడు బేకార్ గాడు, బేవార్స్ గాడు, ఎందుకు పనికి రాని వాడు అని అహంకారంతో ప్రవర్తించ కూడదు. ప్రపంచంలో ఏ వ్యక్తి కూడా బేవార్స్ కాదు. అతడు ఆ విధంగా ఉండటానికి తగిన కారణాలు ఉంటాయి. ఎదుటి వారిని అర్థం చేసుకోకుండా వారి వెంటపడి వేధిస్తే మీరు కూడా అవే పరిస్థితుల్లోకి వస్తారు. అంతకు అంతా అనుభవిస్తారు.

✪ ఇప్పుడు మీ పరిస్థితి బాగానే ఉండొచ్చు. ఆర్థికంగా, శారీరకంగా బాగా ఉన్నప్పుడే మనిషికి మదం వస్తుంది. తను కలిగి ఉన్న ఆర్థిక + శారీరక శక్తిని తన కోసం, పది మంది మంచి కోసం వాడుకోకుండా, నేను చూడు ఇలా ఉన్నాను. మరి నీవు ఎందుకిలా ? ఏదైనా చేయచ్చు కదా అని అంటూ అవతల వ్యక్తిని టార్చర్ చేయకూడదు. ఎంత టార్చర్ చేస్తారో అంత టార్చర్ మీరూ అనుభవిస్తారు.

కాబట్టి మిత్రులారా ! అందరి పట్లా ప్రేమను, మైత్రిని, గౌరవ భావాలను కలిగి ఉండండి. అవగాహనతో ప్రవర్తించండి. మానవ శరీరం ధరించినందుకు మానవుడిలా ప్రవర్తించడం మన ప్రాథమిక మరియు కనీస ధర్మం.

పిల్లలు, తల్లిదండ్రులను జడ్జ్ చేస్తూ ఉంటారు. మా కోరికలను తీర్చే శక్తి లేనప్పుడు ఎందుకు కన్నారు అని. ఇలా తల్లిదండ్రులను జడ్జ్ చేసిన పిల్లలు, వారికి పెళ్ళై పిల్లలు పుట్టినప్పుడు వారూ అవే పరిస్థితులను ఎదుర్కొంటారు. తల్లిదండ్రులు, పిల్లలను జడ్జ్ చేస్తూ ఉంటారు. వాళ్ళ పిల్లలు చూడు, వారు "అది" సాధించారు, వీరు "ఇది" సాధించారు, వాళ్ళు సంపాదిస్తున్నారు అని రాచి రంపాన పెడతారు. ఇలా పిల్లలను జడ్జ్ చేసిన తల్లిదండ్రులు తమ వృద్ధాప్యంలో, పిల్లల ఆదరణ కోల్పోయి, తమ పిల్లల కంటే ఇతరులే మంచి వాళ్ళు అని జడ్జ్ చేసిన

ఫలితంగా, ఇతరుల మీద ఆధారపడో లేక ఓల్డ్ ఏజ్ హోమ్‌లనో ఆశ్రయించి బ్రతకాల్సి వస్తుంది.

✪ ప్రతీ వ్యక్తి యొక్క తన ప్రవర్తనకు, పరిస్థితులకు తనదైన, ప్రత్యేకమైన కారణాలను కలిగి ఉంటాడు. ఒక్క సద్గురువు తప్ప, మరెవరూ ఇతరులను "సరి" చేయడానికి "సరి కారు", "సరి పోరు" !

ఒక వ్యక్తిని జడ్జ్ చేయడమంటే, ఆ వ్యక్తి యొక్క పరిస్థితులను మీరు మీ జీవితంలోకి ఆహ్వానించడమేనని గుర్తుంచుకుని ఎరుకతో, సాక్షిగా గౌరవంతో ఉండాలి. లేదా..... ఉండే పరిస్థితి ఆటొమెటిక్‌గా వచ్చేస్తుంది.

Judge ye not !

ఎవ్వరినీ తీర్పు చెయ్యకండి !
మీ సంక్షేమం కోసమే !!

జడ్జ్‌మెంట్ ఫ్రీ మెడిటేషన్ - 1

అందరి లోపల జడ్జ్‌మెంట్ చేసే గుణం ఉంటుంది. అది మీకు ఏ మాత్రం అనుమానం రాని విధమైన రీతిలో దాగి ఉంటుంది. ఆ గుణం యొక్క పనే జడ్జ్ చేయడం. నేను చెబుతున్న విషయాన్ని సరిగా అర్థం చేసుకోండి. మీ లోపల ఉన్న గుణం మీ చేత జడ్జ్ చేయిస్తుంది. ఆ తర్వాత ఆ పరిస్థితులు వస్తాయి. మీరు అనుభవిస్తూ చావ లేక బ్రతుకుతూ ఉంటారు. దీన్ని మీ నుండి రిలీజ్ చేసేస్తే తప్ప మీకు దాన్నుండి విముక్తి దొరకదు.

ముందు మీరు మీ యొక్క జడ్జ్‌మెంట్ గుణాన్ని నిందించడం మానాలి. ఎలాంటి అభిప్రాయం కాని, బాధ కాని వ్యక్తం చేయకుండా మౌనంగా ఉండండి.

ఇప్పుడు.... ధ్యానంలో కూర్చోండి....

కళ్ళు రెండూ మూసుకుని ప్రశాంతంగా కూర్చుని ఉన్న మీరు, లోపల ఈ విధంగా అనుకోండి - "నేను నాలోని జడ్జ్ చేసే గుణాన్ని పూర్తిగా రిలీజ్ చేసాను" అని అనుకోండి. "నేను నాలోని జడ్జ్ చేసే గుణాన్ని పూర్తిగా రిలీజ్ చేసాను" అని అలా అనుకుంటూనే ఉండండి. ఎరుకతో ఉంటూ అనుకుంటూనే ఉండండి. ఇలా సాధన చేస్తున్నప్పుడు, ఆటొమెటిక్‌గా, అది ఎప్పుడో ఒకప్పుడు పూర్తిగా, శాశ్వతంగా మీ నుండి తొలగి పోతుంది.

అయితే ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని ఒక సారి పూర్తిగా చదివిన తర్వాత ఈ సాధన చేస్తే ఫలితం త్వరగా వస్తుంది. బాగా వస్తుంది.

జడ్జ్‌మెంట్ ఫ్రీ మెడిటేషన్ - 2

మహా మూల చైతన్యం తనలో నుండి మనల్ని సృష్టించి, మనకు 3 వరాలు శాశ్వతంగా తిరిగి తీసుకోలేని విధంగా ఇచ్చింది. అవి :

1. మహా మూల చైతన్యంలో ఉన్నవన్నీ మనలో ఉన్నాయి.

2. సంపూర్ణమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు - Free Will.

3. ప్రత్యేకమైన వ్యక్తిత్వం - Unique Personality.

సాక్షాత్తు మహా మూల చైతన్యమే "ఎవరి ఇష్టం వారిదే" అని వదిలేసినప్పుడు, మిమ్మల్ని సృష్టించిన సృష్టికర్తయే మీ ఇష్టానికి మిమ్మల్ని వదిలేసినప్పుడు, మీరు ఎవరు ??? ఇతరుల ఇష్టాలను అయిష్టాలను అడ్డుకోడానికి ??? మీరు గతంలో మీకున్న పెద్దరికాన్ని మరియు అధికారాన్ని ఉపయోగించి ఎంతో మంది ఇష్టాలను అయిష్టాలను నిర్ణయించారు. వారి స్వేచ్ఛను హరించారు. లోకులు, సమాజం, కట్టుబాట్లు అంటూ మీరు ఇతరుల స్వేచ్ఛను హరించివేసినందుకే... ప్రస్తుతం మీరు స్వేచ్ఛను కలిగిలేరు. ఈ సత్యాన్ని ఒప్పుకుని ఈ కింది విధంగా సాధన చేస్తే, మీకు తక్షణమే స్వేచ్ఛ లభిస్తుంది. మీ ఇష్టాలను మీరు పొంది హాయిగా ఆనందంగా వాటిని తనివి తీరా అనుభవించ వచ్చు.

''ఎవరి ఇష్టం వారిదే, అందరూ దైవాలే''

ఈ సూత్రాన్ని బాగా సాధన చేయండి. ఎవరి ఇష్టం వారిదే, అందరూ దైవాలే అని మీరు భావించినప్పుడు, మీరు ఇక వేరే వారికి అడ్డం పడనని ప్రతిజ్ఞ చేస్తున్నారు. ఎప్పుడైతే ఇతరులకు అడ్డం పడనని ప్రతిజ్ఞ మీలో జరిగిందో అప్పుడే, మీలో ఉన్న జడ్జ్‌మెంట్‌లన్నీ మరియు నెగెటివ్‌లన్నీ తక్షణమే, పూర్తిగా, శాశ్వతంగా మరియు సురక్షితంగా క్లియర్ అయిపోతాయి. అప్పుడు మీరు కోరుకున్నవి మీకు దుక్కుతాయి. మీరు కోరుకుంటున్న వారు మీకు దక్కుతారు.

40. అభినందించండి

ఇంతకు ముందే Judge ye not అనే విశ్వ నియమం గురించి తెలుసుకున్నాం. ఇతరులలోని లోపాలను వెతికి వాటిని విమర్శిస్తూ, నిందిస్తూ, హేళన చేస్తూ ఉంటే ఆ లోపాలు మనకు సంక్రమించి, వాటిని మనం అనుభవించాల్సి ఉంటుంది.

అందుకే ఎవరినీ విమర్శించవద్దు. ఎవరినీ నిందించవద్దు. ఎవరినీ హేళన చేయవద్దు. ప్రతీ వ్యక్తిలో ఎన్నో కొన్ని పాజిటివ్ అంశాలు ఉంటాయి. కాబట్టి మనం ఇతరులలోని నెగెటివ్ అంశాలను వదిలేసి, కేవలం పాజిటివ్ అంశాలను మాత్రమే గుర్తించాలి. ఇతరుల లోపాలను, బలహీనతలను వదిలేసి కేవలం వారి శక్తి సామర్థ్యాలను మాత్రమే గుర్తించి, వాటిని హృదయపూర్వకంగా అభినందించాలి. అప్పుడు ఆ శక్తి సామర్థ్యాలు మీలోకి ట్రాన్స్‌ఫర్ అవుతాయి.

అభినందించడం అని అంటే అవగాహనతో, ప్రేమగా ఏకీభవించడం, ఔన్నత్యాన్ని ఒప్పుకోవడం.

అహంకారులు అభినందించలేరు. అహంకారం ఉన్న వాళ్ళు ఇతరుల ఔన్నత్యాన్ని అస్సలు ఒప్పుకోలేరు. ఈ విధంగా ఇతరుల ఔన్నత్యాన్ని ఒప్పుకోలేని అహంకారం వలన, ఈ అహంకారులు తమ ఔన్నత్యాన్ని కూడా ఒప్పుకోలేక ఎల్లప్పటికి అధములుగానే ఉండి పోతారు. మీరు ఇతరుల ఔన్నత్యాన్ని ఒప్పుకోవడం అంటే మీ స్వయం యొక్క ఔన్నత్యాన్ని ఒప్పుకోవడమే!

మీ కంటే గొప్ప వారిని, మీ కంటే బలవంతులను, మీ కంటే ధనవంతులను, మీ కంటే అందమైన వారిని, మీ కంటే ప్రతిభావంతులను, మీ కంటే ఉన్నత స్థాయిలో ఉన్న వారిని, మీ కంటే ఎక్కువగా శక్తి సామర్థ్యాలు ఉన్న వారిని చూసి ఈర్ష్య పడకూడదు. అసూయ చెందకూడదు. ఇంత బాగా ఎలా అయ్యారా నాయనా... అని కుళ్ళుకోవద్దు. పిసుక్కుని చావద్దు. వాళ్ళు అలా కావాలనుకున్నారు కాబట్టి అలా అయ్యారు, దానికి తగిన విజ్ఞానాన్ని పొంది, దానికి తగిన శ్రమ చేసి ఆ గొప్ప స్థితిని సాధించారు. నేను కూడా అనుకుంటే వారిలా కాగలుగుతాను. నా కంటే ముందు వారు ఉన్నత స్థితిలో ఉన్నారు కాబట్టి నిస్సందేహంగా వారు అభినందనీయులే అని వారిని హృదయపూర్వకంగా

అభినందించాలి. అసూయ చెందితే నష్టపోయేది మీరే ! ఈర్ష్య లేక జెలసి లేక అసూయ ఇవన్నీ ఒక్కటే ! మీకంటే గొప్పవారిని చూసి మీకు అసూయ కలుగుతూ ఉందంటే దానర్థం ఏమిటో తెలుసా మీకు ? అసూయ యొక్క మూలం "చేతకాని తనం" అంటే అశక్తత అని అర్థం. అనంతమైన శక్తి సామర్థ్యాలు కలిగిన మీరు చేతకాని వారు కావటం ఏమిటి ? చేతకాని తనం అనేది ఒక నెగెటివ్ భావన ! చేతకాని తనంలో నుండే ఈర్ష్య లేక జెలసి లేక అసూయ పుడుతుంది. మీకు ఏ విషయంలోనైనా, ఎవరి పట్లనైనా సరే అసూయ కలిగితే అది మీ చేతకాని తనంలో నుండే పుడుతుందని తెలుసుకుని మీ చేతకాని తనాన్ని అంటే మీ అశక్తతను "శక్తిగా" మార్చుకోవాలి అంతే కాని కుళ్ళుకోవద్దు, కుళ్ళుకుంటే మీరే కుళ్ళిపోతారు.

"మీరు ఇతరుల లోపాలను విమర్శిస్తే ఆ లోపాలు మీకు సంక్రమిస్తాయి. మీరు ఇతరుల శక్తి సామర్థ్యాలను అభినందిస్తే ఆ శక్తి సామర్థ్యాలు మీకు సంక్రమిస్తాయి. కాబట్టి మీరు విమర్శిస్తారో లేక అభినందిస్తారో అది మీ ఇష్టం ! మీకేం కావాలనుకుంటున్నారో అది చేయండి ! అదే మీలోకి వస్తుంది". - విశ్వ సూత్రం

సులభంగా, శీఘ్రంగా శక్తి సామర్థ్యాలను పొందే అద్భుత పద్ధతి ఇది. ఇతరుల శక్తి సామర్థ్యాలను గుర్తించి వాటిని హృదయపూర్వకంగా అభినందించండి. అప్పుడు ఆ శక్తి సామర్థ్యాలు మీలోనూ ఉద్భవిస్తాయి.

జీసస్ క్రైస్ట్ గురించి ఆలోచించండి, ఆయన చేసిన మహా దివ్య కార్యక్రమాల గురించి ఆలోచించి ఆనందంతో, తన్మయత్వంతో ఆశ్చర్యపోండి. ఎలా చేసాడా ? అని ! ఆహా జీసస్ ఎంతటి మహాత్ముడు అని ఆయన మహత్యం గురించి ఆలోచించండి. ఆయన శక్తి సామర్థ్యాలను హృదయపూర్వకంగా అభినందించండి. అప్పుడు ఆ శక్తి సామర్థ్యాలు మీలోనూ ఉదయిస్తాయి. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు చేసిన అద్భుత కార్యాలను తలచుకోండి. వారు ఎంత సాధన చేసారు, వారెంతటి శక్తి సామర్థ్యాలను కలిగి ఉన్నారు అనే విషయాల గురించి ఆలోచించి, ఆనందంతో వారిని హృదయపూర్వకంగా అభినందించండి. అప్పుడు ఆ శక్తి సామర్థ్యాలు మీకూ సంక్రమిస్తాయి.
సేత్, రామ్తా, డాన్ జువాన్, కార్లోస్ కాస్టనెడా, రిచర్డ్ బాక్, లిండా గుడ్‌మ్యాన్‌ల గురించి ఆలోచించండి. వారెంతటి ఉన్నత స్థితిలో ఉన్నారో ఆలోచించండి. వారు అంతటి ఉన్నత అందలాలను ఎలా అధిరోహించారో కదా, అని ఆలోచించండి. వారి మహత్తు గురించి ఆలోచించండి. వారి శక్తి సామర్థ్యాలను గుర్తించి వారిని హృదయపూర్వకంగా అభినందించండి. అప్పుడు ఆ శక్తి సామర్థ్యాలు మీలోనూ ఉద్భవిస్తాయి.

ఆహా ! హిమాలయ యోగులు కొన్ని వేల సంవత్సరాల నుండి తమ భౌతిక శరీరాలతో చిరంజీవులుగా ఉంటున్నారా !? కొన్ని వేల సంవత్సరాల నుండీ ఒకే భౌతిక శరీరాన్ని కలిగి ఉన్నా

ఇప్పటికీ పాతికేళ్ళ కుర్రాళ్ళలా యవ్వనంగా ఉంటారా ! ఆహా ఎంత దివ్యశక్తి సంపన్నులు ! వారు, అవసరమైనప్పుడు మరణించిన వారిని తిరిగి బ్రతికించగలుగుతారా ! ఆహా ఎంతటి మహా శక్తి కలిగి ఉన్నవారు ! వాళ్ళు ఎక్కడికంటే అక్కడికి క్షణంలో వెళ్తారా, ఏ రూపం అంటే ఆ రూపం ధరించ గలుగుతారా ! ఇంతటి శక్తి సామర్థ్యాలను కలిగి ఉన్న ఆ యోగులు ఎంతటి మహనీయులో కదా ! అని హిమాలయ యోగుల దివ్య శక్తిసామర్థ్యాల గురించి ఆలోచించండి. ఆనందంతో హృదయపూర్వకంగా ఆ మహాత్ములను అభినందించండి. అప్పుడు ఆ మహత్తర దివ్య శక్తులు, ఆ సామర్థ్యాలూ మీలోకి ప్రవహిస్తాయి.

మీరు ఏ రంగంలో ఉన్నారో, మీరు ఏ రంగంలో అభివృద్ధి చెందాలనుకుంటున్నారో - ఆ రంగంలో ఉన్న మహాత్ముల శక్తి సామర్థ్యాలను గుర్తించి వారిని హృదయపూర్వకంగా అభినందించండి. అప్పుడు మీలోకి ఆ శక్తి సామర్థ్యాలు ప్రసారం అవుతాయి.

మీ దేహాన్ని అభినందించండి. మీ రూపు, రంగు, ఎత్తు, బరువు, ఆకారం మొదలైన వాటిని అభినందించండి. మీ జీవితాన్ని అభినందించండి. మీ జీవితంలో ఎదురవుతున్న ప్రతీ సంఘటనను అభినందించండి. కొన్ని మంచి వాటిని అభినందించగలుగుతాం కానీ బాధాకరమైన సంఘటనలను ఎలా అభినందించగలుగుతాం ? అని అనిపిస్తుంది. కానీ అసలు విషయం ఏమిటంటే..... మీకు ఎదురైన బాధాకరమైన సంఘటనలను "ఈ సంఘటన ద్వారా నేనెంతో నేర్చుకున్నాను, శ్రేయస్కరమే జరిగింది నాకు" అని హృదయపూర్వకంగా అభినందించడం ద్వారా ఆ యొక్క బాధాకరమైన సంఘటనల యొక్క పర్యవసానం, ఫలితం, ప్రభావం శ్రేయస్కరంగా మారిపోతుంది.

మీ దేహాన్ని, జీవితాన్ని, నిజ తత్వాన్నీ, పరిస్థితులను మీరు అభినందిస్తూ ఉంటే, ఈ విధంగా పాజిటివ్‌గా ఉంటూ ఉంటే అప్పుడు మీ జీవితంలోకి చికాకును + ఇబ్బందులను కలుగజేసే పరిస్థితులు కానీ, సమస్యలు కానీ రావని తెలుసుకోండి. కాబట్టి అన్ని పరిస్థితులను గౌరవించండి, అభినందించండి. భూమిని, ప్రకృతిని, సృష్టిని అభినందించండి. అంటే ప్రతీ కష్టాన్ని, బాధను, నష్టాన్ని, చెడును కాదు. నెగెటివ్ పరిస్థితులలో ఇది నా క్రియేషనే అనే ఎరుకతో ఉండండి. సర్వస్వాన్ని ఆరాధిస్తూ అభినందించండి.

✪ అల్ట్రా కాన్షియస్‌నెస్ గురించి ఆలోచించండి. అల్ట్రా కాన్షియస్‌నెస్‌కు ప్రేమను ప్రకటించండి. అల్ట్రాకాన్షియస్‌నెస్ యొక్క అనంత అమర అజేయ శక్తి సామర్థ్యాల గురించి ఆలోచిస్తూ, ఆనంద తన్మయత్వాలతో హృదయపూర్వకంగా అల్ట్రా కాన్షియస్‌నెస్‌ను అభినందించండి. అప్పుడు మీరు అల్ట్రా కాన్షియస్‌నెస్‌గానే పరిణమిస్తారు.

హెచ్చరిక : మీకు కావాల్సిన దాన్నే అభినందించండి. లేదా "సరే మంచి విషయం" అని మౌనంగా ఉండిపోండి. మీరు అభినందించినది, మీరు విమర్శించినది మీ జీవితంలోకి వస్తుంది. కాబట్టి మీకు అవసరం లేని విషయాలను "సరే మంచిది" అని మౌనంగా ఉండండి. మీకు ఏది కావాలో దాన్నే విమర్శించండి లేదా అభినందించండి.

❖ ❖ ❖

41. మీరు ఎలా ఉండాలని అనుకుంటున్నారో సరిగ్గా అలానే ఉంటున్నారు

"మనం తీసుకునే నిర్ణయమే మన జీవితాన్ని నిర్ణయిస్తుంది", అని గ్యారి జుకవ్ అనే మహాత్ముడు తెలియజేస్తాడు.

ప్రస్తుతం మీరు ఇప్పుడున్న పరిస్థితికి 100% మీ నిర్ణయమే కారణం ! మీరు ఎలా ఉండాలని అనుకుంటున్నారో యథాతథంగా అలానే ఉంటున్నారు. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న కష్టాలు, అనారోగ్యాలు, సమస్యలు అన్నీ కూడా మీ ఆలోచనలలో(నిర్ణయాలలో) నుండి పుట్టినవే.

చాలా మంది కష్టాలను, అనారోగ్యాలను, సమస్యలను అనుభవిస్తూ, వాటిచేత బాధ పడుతూ ఉంటారు. వాటి నుండి బయట పడాలి అని అనుకోరు. బాధపడటం వేరే ! వాటి నుండి బయట పడాలి అని నిర్ణయించుకోవడం వేరే ! మీరు గనక మీ కష్టాల్లో నుండి, మీ అనారోగ్యాల నుండి, మీ సమస్యల్లోనుండి, మీ పేదరికం నుండి "నిజంగా" బయట పడాలి అని నిర్ణయించుకుంటే, వెంటనే మీ నిర్ణయానికి అనుగుణమైన పరిస్థితులు మీకు ఎదురవుతాయి. వాటి గుండా ముందుకు సాగితే సులభంగా మీరు మీ యొక్క అన్ని సమస్యల్లో నుండి శాశ్వతంగా బయట పడగలుగుతారు.

మీరు పూర్తి స్పృహతో, నిజంగా 100% నిర్ణయించుకోండి. బలమైన నిర్ణయం తీసుకోవాలి. ఇది చదవగానే మీకేం అనిపిస్తుందంటే నిజంగా ఇలా జరుగుతుందా ? అని అనుమానం వస్తుంది. గుర్తుంచుకోండి, మీరు మొత్తం శాతంలో నుండి నిర్ణయం తీసుకోలేనప్పుడే అనుమానం అనేది పుడుతుంది. మీకు లోపల వాస్తవానికి "సమస్యల్లో నుండి బయట పడాలని ఉండదు", ఇది చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. ఎవరైనా అలా అనుకుంటారా ?! అని మీరు ఆశ్చర్యపోతారు. కాని ఇది నిజం.

మీ లోపల ఉన్న నిర్ణయాలు మీకు తెలియవు. ఒక సారి ధ్యానంలో కూర్చుని చూడండి. అప్పుడు తెలుస్తుంది. ఒక అరగంట పాటు మీ నిర్ణయాలను తెలుసుకునే ప్రయత్నం చేయండి.

అసలు విషయం ఏమిటంటే - "మీ కష్టాల్లో నుండి, మీ అనారోగ్యాల్లో నుండి, మీ సమస్యల్లో నుండి, మీ పేదరికంలో నుండి బయట పడడం ఇప్పుడే అనవసరం" - అని మీ లోపల ఉంటుంది. అనవసరం అని లోపల ఉన్నప్పుడే అనుమానం అనేది పుడుతుంది. మీరు పూర్ణంగా, మొత్తం శాతంలో నుండి అవసరం అని అనుకోరు కాబట్టే వాదన మొదలవుతుంది. ఇది ఎలా జరుగుతుంది ? చూడండి ఎన్ని అడ్డంకులు ఉన్నాయో ? వీటన్నింటిని ఎలా పరిష్కరించగలం ? ఇలా చేసి ఎవరైనా బాగు పడ్డారా ? ఋజువులు చూపించండి అంటూ ఎంత వాదనకైనా దిగే అవకాశం ఉంది.

విశ్వ సూత్రాల ప్రకారం "ఒక వ్యక్తి నిజంగా, 100% ఒక విషయాన్ని అవసరం అని అనుకుంటే, అప్పుడు ఆ వ్యక్తికి అనుమానం అనేది రానే రాదు, అడ్డంకులనేవి కనపడనే కనపడవు. కేవలం పూర్తి శాతంలో నుండి నిర్ణయం జరగనప్పుడే, అనుమానం అనేది పుడుతుంది, 100% అవసరం అని అనిపించనప్పుడే అడ్డంకులు అనేవి కనపడతాయి. నిజానికి అడ్డంకులంటే, ఎంత శాతం అయితే మీరు సమ్మతించకుండా వదిలేసారో, ఎంత శాతం అయితే అనవసరం అని అనుకుంటున్నారో అంత శాతం అనుమానం, అన్ని అడ్డంకులు ప్రకటం అవుతాయి".

ఎంత అవసరం అని అనుకుంటే అంత క్లియరెన్స్ అవతుంది. అత్యవసరం అని అనుకుంటే తక్షణ ఫలితాలు సంపూర్ణంగా, సమగ్రంగా, సులభంగా, సరళంగా, శ్రేయస్కరంగా, దివ్యంగా, అమరంగా, అజేయంగా, అమోఘంగా, అద్వితీయంగా, అద్భుతంగా, అపూర్వంగా ఉంటాయి. కానీ మీరు మీలో "అత్యవసరాన్ని" సృష్టించుకోగలగాలి.

మీకేది కావాలో అది నాకు అత్యవసరం అని పదే పదే స్మరిస్తూ ఉంటే మీలో అత్యవసరం సృష్టింపబడుతుంది.

❖ ❖ ❖

మీ యొక్క ఈ జీవితం ఒక మహా గొప్ప వరం....
...అనే భావనలోనే మీరు ఎల్లప్పుడూ ఉండాలి.
ఈ భావన యొక్క అద్భుతమైన శక్తి వలన,
మీ జీవితం, మీ మీద వరాల వర్షం కురిపిస్తుంది,
మీరేం కోరితే అది అందిస్తుంది. ఇది నిజం.

నేను ఆధ్యాత్మికంగా అభివృద్ధి సాధిస్తున్నాను,
నా జీవితానికి పరమార్థం ఉంది... అనే భావన,
మీలో ఎల్లప్పుడూ ఉండాలి.
ఈ భావన వలన మీ యొక్క సర్వ బంధనాలన్నీ
తొలగిపోతాయి. మీకు కావాల్సినవి మీకు అందుతాయి
మరియు మీరు కోరుకుంటున్నవారు మీకు దక్కుతారు.
ఈ భావన యొక్క అమోఘమైన శక్తి వలన
మీరెంతో అభివృద్ధిని అన్ని రకాలుగా పొందుతారు.

42. నా రాతలో ఏం రాసి ఉందో, అదే జరుగుతుంది అని అనకూడదు

సాధారణంగా చాలా మంది "నా రాతలో ఏం రాసి ఉందో, అదే జరుగుతుంది" అని అంటూ ఉంటారు. ఇలా అనకూడదు. రాత అంటూ ప్రత్యేకంగా ఏదీ ఉండదు. గత జన్మలలో నుండి మనం తెచ్చుకున్న సరికాని గుణాలు(స్వభావాలు) + నమ్మకాలు కష్టాలను ఆకర్షిస్తాయి, సరి అయిన గుణాలు(స్వభావాలు) + నమ్మకాలు సౌభాగ్యాలను ఆకర్షిస్తాయి. మన అంతరంలో ఉన్న సరికాని గుణాలనే(స్వభావాలనే), నమ్మకాలనే ఒక కోణంలో "రాత" అని అనవచ్చు. అయితే ఆ యొక్క సరికాని గుణాలను(స్వభావాలను), నమ్మకాలను ఆత్మ విజ్ఞానం ద్వారా + ధ్యాన సాధన ద్వారా మార్చుకుని, తద్వారా ఆ సరికాని గుణాల(స్వభావాల), నమ్మకాల వలన అనుభవించబోయే పరిస్థితుల నుండి ముందు గానే శాశ్వతంగా తప్పించుకోవచ్చు.

సరికాని గుణాలు కేవలం అవగాహన + ఎరుక లేనందు వలన మన లోపల ఉంటాయి. వాటిని అనుభవించాల్సిన అవసరం ఏ మాత్రమూ లేదు.

"నా రాతలో ఏం రాసి ఉందో, అదే జరుగుతుంది" అని అనడం ద్వారా మనం కష్ట నష్టాలను అనుమతించినట్లవుతుంది.

ఇలా ఎప్పుడు కూడా అనకూడదు. ఎందుకంటే ఏ జీవికి, ఏ మనిషికైనా సరే ముందే "రాత" అనేది రాసి ఉండదు, భవిష్యత్తు అనేది ముందే నిర్ణయించబడి ఉండదు. కాకపోతే జన్మ తీసుకునే ముందు, ఆ జన్మలో ఏమేం నేర్చుకోవాలో, ఏమేం క్లియర్ చేసుకోవాలో లైఫ్ డిజైన్‌లో నిక్షిప్తం అయి ఉంటాయి. దీనినే మనం "రాత లేక జాతకం లేక విధి" అనవచ్చు. ఈ లైఫ్ డిజైన్ అనేది గత జన్మలలో తాను పొందిన ఆత్మ విజ్ఞాన అవగాహనను బట్టి అతడిలో గుణాలు, భావాలు, నమ్మకాలు ఉంటాయి.

వీటికి అనుగుణంగా అతడి/ఆమె లైఫ్ డిజైన్ డిసైడ్ అవుతుంది. ఈ లైఫ్ డిజైన్‌లో ఎన్ని కష్టాలున్నాయో, ఎన్ని దారుణాలున్నాయో, ఎన్ని ఘోరాలున్నాయో బయటకు తెలియదు. అయితే వాటన్నింటినీ అనుభవించాల్సిన అవసరం ఉండదు. సరైన అత్యున్నత ఆత్మ విజ్ఞాన అభ్యాసం ద్వారా, క్రమం తప్పని అత్యున్నత ధ్యాన సాధన ద్వారా అవి రాకుండానే సురక్షితంగా, సింపుల్‌గా పూర్తిగా, శాశ్వతంగా క్లియర్ చేసుకోవచ్చు. కాబట్టి నా రాతలో ఏం ఉందో అదే జరగనీ అని అనడం ద్వారా మీకు మీ లైఫ్ డిజైన్‌లో ఉన్న కష్టాలను క్లియర్ చేసుకునే ఉద్దేశం లేదని సృష్టికి చెప్తున్నట్టవుతుంది. ఆ కష్టాలను నేను అనుమతిస్తున్నాను అని ఒప్పుకున్నట్టవుతుంది. కాబట్టే అలా అనకూడదు. ఎల్లప్పుడూ 100% పాజిటివ్ స్టేట్‌మెంట్లే ఇవ్వాలి. మన వర్తమానంలో మనం తీసుకునే నిర్ణయాలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. మన వర్తమానంలో మనం చేస్తున్న పనులే మన భవిష్యత్తును తయారు చేస్తాయి. వర్తమానం ఎప్పుడూ మన చేతుల్లోనే ఉంటుంది.

మనం గతం చేతిలో బందీలుగా ఉండనవసరం లేదు. అసలు గతం అనేది మన వర్తమానాన్ని ఏ విధంగానూ నియంత్రించ లేదు. గతం అనేది మన వర్తమానాన్ని ఏ రకంగానూ శాసించలేదు. గతం అనేది మనల్ని ఏ కోణంలోనూ బంధించలేదు, అది అసంభవం.

మనం ఎల్లప్పుడూ విముక్తాత్మ తేజాలమే ! మనమే దైవాలం ! మనల్ని అడ్డుకునే శక్తి ఈ సృష్టిలోనే లేదు ! మనల్ని అడ్డుకునే శక్తి ఏదైనా ఉందీ అంటే అది మనమే !

మనకు మనమే దైవం ! మనకు మనమే దయ్యం !

కాబట్టి ఎప్పుడు కూడా, "నా రాతలో ఏం రాసి ఉందో, అదే జరుగుతుంది" అని అనకూడదు. మీ లోపల మీరే అయి ఉన్న "మహా మూల చైతన్యం" మీ నిర్ణయాన్ని ప్రేమగా గౌరవిస్తుంది, ఆదరిస్తుంది, అనుసరిస్తుంది. తుది నిర్ణయం మీదే ! మీరేం నిర్ణయించుకుంటారో దానిని తక్షణమే నెరవేరుస్తుంది. మీ నిర్ణయమే దైవ నిర్ణయం !

"తానొకటి తలిస్తే దైవం మరొకటి తలుస్తుంది" అని అనేది అజ్ఞానపు మాట. నేను వేరే, దైవం వేరే అనే భావన కలిగి ఉన్నప్పుడే ఇలా జరుగుతుంది. మీరే దైవమైనప్పుడు - మీరొకటి తలిస్తే దైవం మరొకటి ఎలా తలుస్తుంది ?!

✪ "నేను దివ్యుడిని, నా కంతా దివ్యమే జరుగుతుంది" అని అనాలి. నాకంతా శ్రేయస్కరమే జరుగుతుంది అని అనాలి. నాకంతా అనుకూలంగానే జరుగుతుందని అనాలి. నాకెప్పుడూ విజయమే లభిస్తుంది అని అనాలి. నా అదృష్టం చాలా గొప్పది అని అనాలి. నేను చాలా సౌభాగ్యవంతుడిని అని అనాలి. ఎల్లప్పుడూ ఈ విధంగా అనాలి. ఈ విధంగా అన్న మాటలే మన రాతలై ఫలిస్తాయి. ఈ విధంగా ఎల్లప్పుడూ భావిస్తూ, అంటూ ఉంటే మన లోపల ఉన్న "సరి కానివి" క్లియర్ అయిపోయి మన మాటలే ఫలించి తీరుతాయి.

ఒక విశ్వ సూత్రం ఇలా ప్రకటిస్తూ ఉంది : 100% అలా జరగాలని భావిస్తూ, జరుగుతుందనే విషయాన్ని 100% ఒప్పుకుంటూ, పూర్తి చైతన్య స్పృహతో(ఎరుకతో) అన్న మాటలు జరిగి తీరుతాయి. ఖచ్చితంగా సంభవించియే తీరుతాయి.

43. మనసు, బుద్ధి, చిత్తం, అహం !

ఆత్మ మనసుగా - మనసు ఒక స్థితిలో బుద్ధిగా, ఇంకొక స్థితిలో చిత్తంగా, మరొక స్థితిలో అహంగా ప్రకటం అవుతూ ఉంటుంది.

మనసు అంటే భావనా క్షేత్రం లేక భావనా కేంద్రం లేక ఆలోచనా కేంద్రం. మనసు యొక్క భౌతిక వ్యక్తీకరణయే శరీరం. శరీరం యొక్క సూక్ష్మ రూపమే లేక కేంద్రమే మనసు.

ఆత్మ (మహా మూల చైతన్యం - Ultra Consciousness) మనసుగా, మనసు శరీరంగా ప్రకటం అవుతూ ఉంటుంది. ఆత్మయే మనసు, మనసే శరీరం ! ఈ మూడు ఒక్కటే ! నిజానికి సృష్టి అంతా ఒక్కటే ! ఆ యొక్క మూల చైతన్యమే వివిధ రూపాలలో ప్రకటం అవుతూ ఉంటుంది. అజ్ఞానంతో, విస్మృతిలో ఉన్న వాళ్ళకు అంతా వేరు వేరుగా కనబడుతూ ఉంటుంది.

మనసే బుద్ధిగా, చిత్తంగా, అహంగా ప్రకటం అవుతూ ఉంటుంది. ఎలాగైతే ఒకే వ్యక్తి తన తల్లికి కొడుకుగా, తన భార్యకు భర్తగా, తన పిల్లలకు తండ్రిగా, తన తాతకు మనవడిగా, తన మనవళ్ళకు తాతగా, స్నేహితులకు స్నేహితుడిగా, ప్రయాణించేటప్పుడు ప్రయాణీకుడిగా, షాపులో కొనుగోలుదారుడిగా, వ్యాపారం చేస్తున్నప్పుడు వ్యాపారిగా, ఉద్యోగం చేస్తునప్పుడు ఉద్యోగిగా, రోగం వచ్చినప్పుడు రోగిగా, దేశంలో పౌరుడిగా ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో... ఇలా ఎన్నో పాత్రల్లో ఒకే మనిషి ప్రకటం అవుతూ ఉన్నట్టే - మనసే బుద్ధిగా, చిత్తంగా, అహంగా ప్రకటం అవుతూ ఉంటుంది.

బుద్ధి : మనసు ఒక విషయాన్ని విచారణ చేస్తున్నప్పుడు, విశ్లేషిస్తూ ఉన్నప్పుడు, ఈ పని దేనిలో నుండైతే చేయగలుగుతున్నామో దాన్నే "బుద్ధి" అంటారు. మనసు జ్ఞాన పథంలో కొనసాగుతూ ఉన్నప్పుడు సుబుద్ధిగా మారుతుంది. బుద్ధి అంటే విచక్షణా జ్ఞానం, తెలివి, వివేకం అనే అర్థాలు వస్తాయి. అందుకే ఎవరైనా ఏదైనా తప్పు చేసినప్పుడు "బుద్ధుందా నీకు" ? అని అంటారు. మనసు దుష్ట విషయాలను స్వీకరించినప్పుడు దుష్ట బుద్ధిగా, సరి కాని విషయాలతో కూడుకొని ఉన్నప్పుడు సరి కాని బుద్ధిగా, మంచి విషయాలతో కూడుకొని ఉన్నప్పుడు మంచి బుద్ధిగా మారుతూ ఉంటుంది.

చిత్తం : మనసు అస్థిరంగా ఉన్నప్పుడు, చంచలంగా ఉన్నప్పుడు చిత్తం అనబడుతుంది. ఒక ఆలోచన తర్వాత మరొక ఆలోచన, ఒక దానికొకటి పొంతన లేని ఆలోచన, పనికి రాని ఆలోచనలు, నెగెటివ్ ఆలోచనలు, గందరగోల ఆలోచనలు, ఆందోళన పూరిత ఆలోచనలు ఇలా నిలకడ లేకుండా చంచలంగా మనసు ఉండే స్థితినే "చిత్తం" అని అంటారు. మనసు యొక్క ఈ చిత్తం అనే కోణాన్ని మాయం చేసే విధానాన్నే యోగం(ధ్యానం) అని అంటారు. అందుకే పతంజలి "యోగః చిత్త వృత్తి నిరోధః" అని ప్రకటించాడు. చిత్త వృత్తులు అంటే ఇందాక మనం చెప్పుకున్న పనికి రాని రక రకాల ఆలోచనలు. వీటిని శాశ్వతంగా అరికట్టడమే యోగం(ధ్యానం).

అహం : మనసు భిన్నత్వ భావనలోకి ప్రవేశించినపుడు అహంగా మారుతుంది. ఈ భిన్నత్వంలో నుండే స్వార్థం జనిస్తుంది. స్వార్థంలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి - నేను బాగుంటే చాలు ఇతరులు ఏమైపోయినా ఫర్వాలేదు అని భావించే తత్వం. రెండు - "స్వ + అర్థం = స్వార్థం", ఈ రెండవ రకమైనది నేను బాగుండాలి, నాతో పాటు అందరూ బాగుండాలి అని భావించే తత్వం. ఈ రెండవ రకమైన స్వార్థాన్నే మనం స్వీకరించి నిలుపుకోవాలి. మొదటి రకమైన స్వార్థం సరి కాదు. రెండవ రకమైన స్వార్థం వలన బాగుపడతాం.

అహం అంటే :

1. నేను వేరే, దైవం వేరే అనే భావనయే అహం.

2. అహం అంటే అజ్ఞానం.

3. అహం అంటే అవగాహన లేని స్థితి.

4. అహం అంటే విస్మృతి, అపస్మారకం, మాయ, భ్రాంతి, భ్రమ, ఎరుక లేకుండా ఉండటం.

5. అహం అంటే గర్వం అని కూడా అర్థం. అహంభావి అని అంటే గర్విష్టి అని అర్థం.

6. అహం అంటే జ్ఞాపకాల సముదాయం. ఆత్మ తన పరిణామ క్రమంలో వేలాది జన్మలు తీసుకుంటుంది. ఒక్కో జన్మ ఎత్తుతూ ఆ జన్మ వలన వచ్చే అనుభవసారాన్ని గ్రహిస్తూ ముందుకు సాగుతూ ఉంటుంది. అయితే ఇక్కడ ఒక ముఖ్య విషయం ఉంది - ఒక జన్మలోని అనుభవసారాన్ని గ్రహించిన తర్వాత ఆ జన్మకు సంబంధించిన అనవసర జ్ఞాపకాలు పోగవుతూ ఉంటాయి. వాస్తవానికి వీటిని ఏ జన్మలోనివి ఆ జన్మలోనే క్లియర్ చేసుకోవాలి. అజ్ఞానం వలన అలా వదిలేస్తాం. ఈ అనవసరమైన జ్ఞాపకాలు కుప్పలు కుప్పలుగా పేరుకు పోతుంటాయి. ఎలాగైతే మనం వంట సామాగ్రిని తెచ్చుకుని వంట

చేసుకున్నాం, తిన్నాం. వంట యొక్క సారాన్ని గ్రహించేసాం. మరి ఇప్పుడు వంట చేసిన తర్వాత, తిన్న తర్వాత మిగిలిన వ్యర్థ పదార్థాలను అవతల పారవేసి శుభ్రం చేసుకోకుండా ఉంటే ఎలా ఉంటుంది పరిస్థితి ? ఒక సారి యథార్థంగా ఆలోచించండి ! ఆ చెత్త పేరుకు పోయి, కుళ్ళి పోయి ఎన్నో సమస్యలను సృష్టిస్తుంది. తిన్న తిండిని వంటికి పట్టకుండా చేస్తుంది. ఇదే విధంగా ఏ జన్మలోని చెత్తను ఆ జన్మలోనే క్లియర్ చేసుకోకుండా అజ్ఞానంతో వదిలేసినందుకే, అదంతా పేరుకుపోయి మనకు అనేకానేక సమస్యలను సృష్టిస్తూ ఉంటుంది. ఆత్మాభివృద్ధిని అడ్డుకుంటూ ఉంటుంది. అనేక జన్మల నుండి పేరుకు పోయి ఉన్న అనవసరపు జ్ఞాపకాల సముదాయమే అహం.

7. సంస్కృతంలో అహం అంటే నేను అని అర్థం.

8. అహం అంటే కాన్షియస్ మైండ్ యొక్క ఉప ఉత్పత్తి అని సేత్ చెప్తాడు.

అహం యొక్క లక్షణాలు

1. అహం అంటేనే అసంతృప్తి. ఇది ఎల్లప్పుడూ అసంతృప్తితో రగిలి పోతూనే ఉంటుంది. దీనిని తృప్తి పరచడం అనేది జరగని పని.

2. అహం ఎప్పుడు తిరస్కార ధోరణితో ఉంటుంది. ప్రతి దానికి నెగెటివ్‌గా స్పందిస్తూ ఉంటుంది.

3. అహం ఎట్టి పరిస్థితిలోనూ మార్పును అంటే అభివృద్ధిని అంగీకరించదు.

4. అహం అనేది అశాశ్వతమైనది అందుకే ఇది ఎల్లప్పుడూ ప్రాణ భయంతో అల్లాడుతూ ఉంటుంది. అన్ని కోరికలు తీరితే ఈ భూమి పై నుండి వెళ్ళి పోవాలేమో అంటే చచ్చిపోవాలేమోనని భయపడుతూ మనల్ని కమ్ముకుని మన కోరికలు తీరకుండా అడ్డు పడుతూ ఉంటుంది.

ఆత్మ విజ్ఞాన పుస్తకాలను చదవనివ్వదు, ధ్యానం చేయనివ్వదు. ఎందుకంటే ఆత్మ విజ్ఞానం వస్తే కర్మలు తీరిపోతాయి, అప్పుడు ఈ భూమి పై నుండి వెళ్ళి పోవాలి, అంటే చచ్చి పోవాలి అని భయపడుతూ మన కర్మలను తీరకుండా చేయడమే కాక వాటిని రిపీట్ చేస్తుంది.

5. ఎల్లప్పుడూ అనుమానంతో, అసహనంతో ఉంటుంది.

6. బాగుపడటం అనేది అహానికి అస్సలు ఇష్టం ఉండదు.

7. విషయాన్ని ఒప్పుకోనివ్వదు, ఎందుకంటే ఒప్పుకోలు అనేది అహానికి మరణాన్ని కలుగజేస్తుంది. అందుకే ఎవరి లోపాలు వాళ్ళు ఒప్పుకోవాలంటే చాలా కష్టం. అహం మనల్ని కమ్ముకుని మన లోపాన్ని అస్సలు ఒప్పుకోనివ్వదు. అహం కమ్ముకున్న వాళ్ళు చావనైనా చస్తారు కానీ తమ లోపాన్ని ఒప్పుకోరు.

8. అహానికి వ్యామోహం, ద్వేషం అనేవి పుష్కలంగా ఉంటాయి.

9. అహానికి అత్యాశ, దురాశ ఉంటాయి.

10. శాడిజం, కబ్జా తత్వం కలిగి ఉంటుంది అహం.

11. క్రూరత్వం, ప్రతీకారం, దాడి మొదలైనవి కలిగి ఉంటుంది అహం.

12. అహం యొక్క ప్రధాన లక్షణం సోమరి తనం.

13. విచక్షణా జ్ఞానం ఉండదు అహానికి.

14. పూర్తి కమర్షియల్ మరియు మెకానికల్ తత్వాన్ని కలిగి ఉంటుంది.

15. అహానికి తర్కం ఉంటుంది.

16. అన్నింటికన్నా అహానికున్న ముఖ్య లక్షణం బాధపడటం. బాధ వలన కలిగే ప్రకంపనాల వలన అహం తన మనుగడను కొనసాగిస్తూ ఉంటుంది. నిజానికి మనం ఆత్మ స్వరూపులం, బాధ అనేది మనకు ఉండదు. అహం మనల్ని కమ్ముకుని ఉంటుంది కాబట్టి మనవి కాని బాధలను మనం అనుభవిస్తూ ఉంటాం. బాధలు పడటం, కష్టాలు పడటం అంటే అహానికి చాలా ఇష్టం. ఎందుకంటే "బాధలు - కష్టాలు" దానికి "ఆహారం - పోషణ" కాబట్టి ! అందుకే అన్ని రకాల బాధలను, కష్టాలను ఆకర్షిస్తూ ఉంటుంది.

17. అన్ని రకాల దుర్గుణాలకు అహం ఆశ్రయంగా మారి కేంద్రంగా ఉంటుంది.

18. ఇవి కాక ఇంకా వేరే ఏవైనా ఉండి ఉండవచ్చు.

ఈ అహం అనేది మనల్ని పూర్తి స్థాయిలో ఆవహించి ఉంటుంది. పైన తెలిపిన లక్షణాలు మీలో తలెత్తినప్పుడు ఎరుకతో వాటిని అహం యొక్క లక్షణాలని గుర్తించి, వాటిని ప్రేమగా, ఎరుకతో సాక్షిగా గమనిస్తే అవి అంతరించి పోతాయి. నేను సాక్షాత్తు మూల చైతన్యాన్ని అని మీరు మూల చైతన్య భావనలోకి మారి పోగానే అహం నశించి పోతుంది. ఎల్లప్పుడు మీరు "నేనే మూల చైతన్యం" అనే భావనలోనే ఉండాలి, ఇలా ఉన్నప్పుడు మీ పైన అహం యొక్క ప్రభావం పడదు, పైగా అది త్వరలోనే శాశ్వతంగా అంతరించి పోతుంది.

క్రమం తప్పని ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ధ్యాన సాధన ద్వారా అహాన్ని పూర్తిగా, శాశ్వతంగా, సులభంగా, శీఘ్రంగా తీసివేసి మన నిజ తత్వమైన దైవత్వాన్ని మనం పొందవచ్చు.

❖ ❖ ❖

44. అంతా మంచే, అందరూ మంచి వాళ్ళే! మంచి చేస్తే కేవలం మంచి మాత్రమే జరుగుతుంది!

ఇది కలియుగం, మంచికి రోజులు లేవు, మోసం లేకపోతే జీవించలేం... అనే ఇలాంటి అభిప్రాయాలు, ఈ మధ్య కాలంలో చాలా మందిలో నెలకొని ఉన్నాయి. ఇది కలియుగం, మోసం లేకపోతే జీవించలేం... ఎత్తుకు పై ఎత్తులు వేసి జిత్తులు ప్రదర్శిస్తూ, జిమ్మిక్కులు చేస్తూ నానా రకాల గేమ్‌లు ఆడుతూ, ముదనష్టపు టాలెంట్‌తో ట్రిక్కులు చేస్తూ ఉంటే కాని జీవించలేం అని ఈ మధ్య అనడం ఒక ఫ్యాషన్ అయిపోయింది. ఈ విధంగా అనడమే కాదు, ఇదే సత్యం అంటూ ప్రవర్తిస్తున్నారు. మరీ దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ రకమైన విషయాలను బోధిస్తూ ఈ రకంగా పెంచుతున్నారు.

✪ ఇది కలియుగం మోసం లేకపోతే జీవించలేం, ఎవడి నెత్తి మీదనో కాలు పెట్టి గాని పైకి రాలేం అనే భావనలు పూర్తిగా అజ్ఞాన పూరితమైనవి. ఇవన్నీ తమలోని మోసపు గుణానికి, నేర స్వభావానికి సమర్థనలు. వాస్తవానికి ఇది కలియుగం కాదు కల్యాణ యుగం.

కలియుగమైనా, ఏ యుగమైనా ధర్మం ఎల్లప్పుడూ ఉంటుంది. ధర్మం ఒంటి కాలి మీద నడవడం లేదు. ధర్మాన్ని మనమే ఒంటి కాలి మీద నడిచేలా చేస్తున్నాం అనే విషయాన్ని గుర్తించాలి. ధర్మమే ఆచరణీయం. ఎల్లప్పుడూ ధర్మమే బోధించాలి, ధర్మాన్నే ఆచరించాలి. ఏ యుగంలోనైనా, ఏ కాలంలోనైనా, "ధర్మమే - సత్యమే" ఎల్లప్పుడు జయిస్తూ ఉంటుంది. సర్వదా సత్యాన్నే విజయం వరిస్తూ ఉంటుంది. నిజం చెప్పాలంటే సత్యపూరితంగా ఉండడం వల్ల జయం రాదు. సత్యాన్ని పాటిస్తూ ఉండటం వలన అభివృద్ధి, శ్రేయస్కరం జరగడం అంటూ ఉండదు, సత్యాన్ని ఆచరిస్తున్నందు వలన శుభం కలగడం, లాభం రావడం అంటూ ఉండదు. ఇక్కడే మనం విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. సత్యం వలన ఇవన్నీ రావడం లేదు...

..... సత్యమే ఇవన్నీ !

సత్యం వలన విజయం కాదు, సత్యమే విజయం !
సత్యం వలన అభివృద్ధి కాదు, సత్యమే అభివృద్ధి !
సత్యం వలన శ్రేయస్కరం కాదు,
సత్యమే శ్రేయస్కరం !
సత్యం వలన విజయం కాదు, సత్యమే విజయం !
సత్యం వలన ఐశ్వర్యం కాదు, సత్యమే అనంత
ఐశ్వర్యం !
సత్యం వలన రక్షణ కాదు, సత్యమే రక్షణ !
సత్యం వలన శుభం కాదు, సత్యమే శుభం !
సత్యం వలన లాభం కాదు, సత్యమే లాభం !
సత్యమే సర్వస్వం !

లోపల మనసులోనూ, వాక్కులోనూ, చేష్టలోనూ ఎల్లప్పుడు సత్యాన్నే కలిగి ఉండాలి. మరి "సత్యం" అంటే ఏమిటి ? అని అంటే...

సత్యం అంటే ఉన్న విషయం !

ఉన్నదేదో అది - సత్యమంటే !

సత్యం అంటే మీరే, మీరే సత్యం !

"ఆత్మ విజ్ఞానమే సత్యం" !

ఏదైతే ఉనికిలో ఉందో అదే సత్యం !

ఉనికియే సత్యం ! సత్యమే ఉనికి !

ఈ సర్వస్వానికి మూలం ఏదైతే ఉందో అదే సత్యం !

ప్రేమయే సత్యం !

అందరి పట్ల ప్రేమ భావనను కలిగి ఉండాలి. మనసులోనూ, వాక్కులోనూ, చేష్టలోనూ ప్రేమనే కలిగి ఉండాలి. ఎందుకంటే ఉనికిలో ఉన్నది ప్రేమయే ! ప్రేమే అంతా వ్యాపించి ఉంది. సృష్టి అంతా ప్రేమమయమే !

✪ సృష్టి మొత్తంలో ఎక్కడా నెగెటివ్ అనేది లేదు. ఉండదు. ఉండలేదు. మీ యొక్క అజ్ఞానమే సృష్టిలో నెగెటివ్‌లు కనపడేలా చేస్తుంది.

✪ మనం ఎలా అనుకుంటే సృష్టి అలా దర్శనమై అనుభవం అవుతుంది. యద్భావం తద్భవతి కదా !

✪ సృష్టి వేరే, సృష్టికర్త వేరే కాదు. సృష్టికర్తయే సృష్టిగా మారాడు. సృష్టికర్తయే సృష్టి ! సృష్టియే సృష్టికర్త ! సృష్టి లేక సృష్టికర్త అని అంటే మహా మూల చైతన్యం - Ultra Consciousness ఆ యొక్క మహా మూల చైతన్యమే మనం ! సాక్షాత్తు మనమే మహా మూల చైతన్యం !

సృష్టి అంతా ప్రేమమయమే !	సృష్టి అంతా కరుణామయమే !
సృష్టి అంతా మైత్రీమయమే !	సృష్టి అంతా సులభమే, సరళమే !
సృష్టి అంతా ఆనందమే !	సృష్టి అంతా సహాయమే !
సృష్టి అంతా సహకారమే !	సృష్టి అంతా సమన్వయమే !
సృష్టి అంతా శృతిమయమే !	సృష్టి అంతా శక్తిమయమే !
సృష్టి అంతా ప్రసన్నమే !	సృష్టి అంతా కటాక్షమే !

సృష్టి అంతా సౌభాగ్యమే ! సృష్టి అంతా శాంతిమయమే !
సృష్టి అంతా స్వేచ్ఛామయమే ! సృష్టి అంతా అందమే !
సృష్టి అంతా సురక్షామయమే ! సృష్టి అంతా సుభిక్షమే !
సృష్టి అంతా సస్యశ్యామలమే ! సృష్టి అంతా ఉత్సవమే !
సృష్టి అంతా ఉత్సాహమే ! సృష్టి అంతా ఉల్లాసమే !
సృష్టి అంతా మహోత్తేజమే ! సృష్టి అంతా సర్వోత్తేజమే !
సృష్టి అంతా పరమానందమే ! సృష్టి అంతా బ్రహ్మానందమే !
సృష్టి అంతా సానుకూలమే ! సృష్టి అంతా ఆమోదమే !
సృష్టి అంతా అభయమే ! సృష్టి అంతా ఐశ్వర్యమే !
సృష్టి అంతా సఫలమే ! సృష్టి అంతా శ్రేయస్కరమే !
సృష్టి అంతా మహోన్నతమే ! సృష్టి అంతా ప్రియత్వమే !
సృష్టి అంతా నిత్య నూతనమే ! సృష్టి అంతా నిత్య యవ్వనమే !
సృష్టి అంతా సంక్షేమమే ! సృష్టి అంతా రంజకమే !
సృష్టి అంతా పరమ పవిత్రమే ! సృష్టి అంతా స్వచ్ఛమే !
సృష్టి అంతా నిర్మలమే ! సృష్టి అంతా శాశ్వతమే !

సృష్టి అంతా అమరమే ! అనంతమే !! దివ్యమే !!!

✪ సృష్టి అంతా మన భావాన్ని బట్టి మనకు దర్శనమిస్తూ, అనుభవం అవుతూ ఉంటుంది.

✪ యద్భావం తద్భవతి అంటే అర్థం ఇదే ! నీవెలా అనుకుంటే అలా !

మనం ఏవేవో సరి కాని అభిప్రాయాలను, నమ్మకాలను కలిగి ఉంటే అదే విధమైన అనుభవాలు ఎదురవుతూ ఉంటాయి. చాలా మంది మగవాళ్ళు "అమ్మో... ఆడవాళ్ళు డేంజర్... అందుకే వాళ్ళను ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టాలి" అని భావిస్తూ ఉంటారు. చాలా మంది ఆడవాళ్ళు "ఈ మగవాళ్ళను నమ్మవద్దు నిలువునా ముంచుతారు" అని భావిస్తూ ఉంటారు. వీళ్ళ అభిప్రాయాలకు, వీళ్ళ నమ్మకాలకు అనుగుణమైన వ్యక్తులే వీరికి తారస పడుతుంటారు. దానితో "చూశారా నేను అనుకున్నట్టే అయ్యింది" అని తమ "సరి కాని అభిప్రాయాలను, నమ్మకాలను" ఇంకా బల పరుచుకుంటూ ఉంటారు. వాస్తవానికి అసలు విషయం ఏమిటంటే వీరి అభిప్రాయాల ప్రకారం, వీరి నమ్మకాల ప్రకారమే అలా జరుగుతుంది అని వీరికి తెలియదు.

ఒక్క సారి మీ అభిప్రాయలను, నమ్మకాలను, మీ ఆలోచనా విధానాన్ని మార్చుకుని చూడండి. సృష్టిలో మంచితనం ఉంది. సృష్టిలో ధర్మం, న్యాయం అన్ని సరిగానే ఉన్నాయి.

"సృష్టి ఎప్పుడూ సరిగ్గానే ఉంటుంది", మన దృష్టి "సరిగా" ఉండదు. కాబట్టి సరి చేయాల్సింది సృష్టిని కాదు, మన దృష్టిని !

అసలు సిసలు సత్యం ఏమిటంటే మన అభిప్రాయాల ప్రకారం, మన నమ్మకాల ప్రకారం, మన ఆలోచనా విధానం ప్రకారమే మన ఆరోగ్యం, మన జీవితం, మన జీవితంలోని పరిస్థితులు, మన పట్ల మనకు సంబంధించిన వ్యక్తుల ప్రవర్తన, మన పట్ల మనకు తారస పడే వ్యక్తుల ప్రవర్తన మొదలైనవన్నీ ఆధారపడి ఉంటాయి.

కాబట్టి అసలు విషయాన్ని తెలుసుకుని మన అభిప్రాయాలను, మన నమ్మకాలను, మన ఆలోచనా విధానాన్ని సరి అయిన విధంగా మార్చుకుంటే మన జీవితం ఆరోగ్య ఐశ్వర్య ఆనందోత్సవాలతో విరాజిల్లుతుంది.

కొంత మందికి ఏ పని చేయాలన్నా చాలా కష్టంగా ఉంటుంది. ఎంతో కష్ట పడితే కానీ వాళ్ళకు పని జరగదు. ఇలా జరుగుతున్న వాళ్ళు అందరూ ఏం దురదృష్టమో ఇది అని అనుకుంటూ ఉంటారు. భాధ పడుతూ ఉంటారు. నిజానికి ఇందులో మర్మం ఏమి లేదు. దురదృష్టం అసలే కాదు. నిజమేమంటే వాళ్ళ అంతరంలో "ఎంతో కష్టపడితే కాని పనులు జరగవు" అనే అభిప్రాయం, నమ్మకం కలిగి ఉంటారు. అందుకే వాళ్ళకు ఎంత చిన్న పని అయినా ఎంతో కష్టాన్ని కలుగజేస్తుంది. లోపల ఈ భావాన్ని మార్చుకోకుండా వాళ్ళు గుళ్ళు, గోపురాలు, తీర్థ యాత్రలు, నోములు, వ్రతాలు, యజ్ఞ యాగాలు, హోమాలు ఏమీ చేసినా ఏమీ కాదు. ఉంగరాలు, తాయెత్తులు, ప్రార్థనలు ఎన్ని చేసినా ఏమీ ఫలితం ఉండదు. ఎన్ని పూజలు, స్తోత్రాలు, జపాలు చేసినా ఏమీ ఒరగదు. శ్రీకృష్ణ పరమాత్ముడు ఈ విషయాన్ని భగవద్గీతలో కుండ బద్దలు కొట్టినట్టుగా ప్రకటించినాడు. "జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం **(4.19)**" అంటే జ్ఞానము అనే అగ్ని చేతనే "కర్మలు" పోతాయి, మరే విధంగాను పోవు అని అర్థం. ఆత్మ విజ్ఞానం ద్వారా అసలు విషయాన్ని తెలుసుకుని ఈ కింది విధంగా సాధన చేస్తే పైన పేర్కొన్న సమస్యల నుండి సురక్షితంగా, శీఘ్రంగా, శాశ్వతంగా బయటపడవచ్చు.

ధ్యానంలో రిలాక్స్‌గా కూర్చుని, రెండు కళ్ళు మూసుకుని "**100%** చైతన్య స్పృహతో" "సులభం, సరళం, తక్షణం" అని అనుకుంటూ ఉండాలి. ఆ విధంగా భావిస్తూ, అనుకుంటూ ఉండాలి. మీ అంతరంగం అంతా "సులభం, సరళం, తక్షణం" అనే భావనలతో నిండి పోవాలి. ఈ విధంగా చేస్తూనే పోవాలి. రోజు ఒక పది నిమిషాలైనా చేసి తీరాలి. ఎక్కువ చేస్తే ఇంకా మంచిది. త్వరగా ఫలితాలు వస్తాయి.

మన అంతరంగం అంతా "సులభం, సరళం, తక్షణం" అనే భావాలు నిండినప్పుడు మన అన్ని కార్యాలు సులభంగా, సరళంగా అనుకున్న వెంటనే ఏ ఆటంకాలు లేకుండా జరిగిపోతూ ఉంటాయి.

తల్లిదండ్రులు చిన్న పిల్లలకు ఈ విజ్ఞానాన్ని అందించాలి. సృష్టి ఎప్పుడూ సరిగానే ఉంటుంది. మనం ఎలా భావిస్తూ ఉంటే అలా దర్శనమిస్తూ అనుభవం అవుతూ ఉంటుంది. మంచి చేస్తే మంచే జరుగుతుంది. మంచి వాళ్ళకు ఎప్పుడూ మంచే జరుగుతుంది. ఎల్లప్పుడూ సత్యాన్ని మాత్రమే ఆచరిస్తూ ఉండాలి. త్రికరణ శుద్ధిగా సత్యాన్ని మాత్రమే ఆచరించాలి. సత్యాన్ని ఆచరిస్తూ ఉంటే చాలు అన్ని పనులు సజావుగా సాగి పోతాయి. అన్ని కష్టాలు పోతాయి. సినిమాల్లో, కథల్లో, నవలల్లో ఉండేవి అబద్ధాలు. వాళ్ళు వ్యాపారస్తులు. వాళ్ళ వ్యాపారం బాగా నడవడానికి బమ్మిని తిమ్మి చేస్తుంటారు. చాలా, చాలా శాతం సినిమాల్లో మంచి వాళ్ళను విలన్లు చంపేస్తారు. ఈ విలన్లను హీరో చంపి జైలుకు వెళ్తాడు. మధ్యలో ఒక విలన్ కూతురు హీరోతో లవ్వులో పడి ఒక అయిదారు పాటలు పాడుతుంది. చివర్లో హీరోకు సహాయం చేస్తుంది. ఇదంతా కేవలం సినిమా అని గుర్తుంచుకోవాలి. సినిమా అనేది తెలియకుండా చాలా బలమైన ప్రభావం చూపెడుతుంది.

మంచి వాళ్ళకే కష్టాలు వస్తాయి అనేది అబద్ధం. సినిమాల్లో అలా చూపిస్తూ ఉంటారు. కథల్లో అలా వ్రాస్తూ ఉంటారు. రావు, మంచి వాళ్ళకు ఎప్పుడూ కష్టాలు రావు. రావు గాక రానే రావు. మంచి అంటే ఆనందం అని అర్థం. మంచి అనేది పునాది ఆనందానికి. మంచి అనేది ఆనందానికి ఉత్పత్తి స్థానం. మంచే మూలం ఆనందానికి. మంచి విత్తనం అయితే ఆనందం పండు. మంచి, ఆనందం అనేవి ఒకే దాని రెండు చివరలు. మంచి నుండి ప్రయాణం మొదలవుతుంది, ఆనందం అనే గమ్యాన్ని చేరుకుంటుంది.

మంచి వాళ్ళకే కష్టాలు వస్తాయి అనేది పరమ మూర్ఖత్వపు అవగాహన. ముదనష్టపు ఆలోచనా విధానానికి పరాకాష్ఠ. మూఢత్వానికి ప్రతీక, నిదర్శనం !

ఎందుకంటే మంచి యొక్క పర్యవసానమే ఆనందం. సూర్యుని యొక్క పర్యవసానం వెలుగు. సూర్యుడు వస్తే చీకటి వస్తుంది అనేది ఎంత దరిద్రపుగొట్టు అవగాహనో, మంచి వాళ్ళకే కష్టాలు వస్తాయి అనేది కూడా అంతే ! చంద్రుని పర్యవసానం వెన్నెల, దీపం పర్యవసానం కాంతి, మంచి పర్యవసానం విజయం + ఆనందం.

ఇది కలియుగం మోసం లేకపోతే జీవించలేం, లోకమంతా పాడై పోయింది, మంచికి రోజులు లేవు అనే అజ్ఞానపు ఆలోచనా విధానం నుండి తక్షణమే బయట పడాలి.

ఆత్మ పరిణామ క్రమంలో భాగంగా "చెడును - మంచిని", ఈ రెండింటినీ అనుభవించి తెలుసుకోవాల్సి ఉంటుంది. ముందు చెడు నుండి మొదలై మంచి దగ్గర ముగుస్తుంది. జన్మ తీసుకునే ముందు ప్రతీ ఒక్కరు - ఇప్పుడు తీసుకోబోయే జన్మలో, తనలో ఉన్న కొన్ని సరి కాని గుణాలను(స్వభావాలను) సరి చేసుకోవాలని, వాటిని ఎంచుకుని, వాటికి పూర్తి వ్యతిరేకమైన మంచి గుణాలను(స్వభావాలను) పెట్టుకుని జన్మిస్తారు. జన్మ తీసుకోగానే మాయకు గురై ఈ విషయాన్ని మర్చిపోతారు. అప్పుడు వాళ్ళకు కేవలం తమ ఎరుకలో ఉన్న మంచి గుణాలు(స్వభావాలు) మాత్రమే తెలిసి ఉంటాయి. లోపల విస్మృతిలో ఉన్న చెడు గుణాలు(స్వభావాలు) తెలియవు. ఇక్కడే సంఘర్షణ మొదలవుతుంది. లోపల ఉన్న చెడు గుణాలు(స్వభావాలు) కష్టాలను, బాధలను, ఇబ్బందులను, ప్రమాదాలను, అనారోగ్యాలను ఆకర్షిస్తూ ఉంటాయి. మేము మంచి వాళ్ళమే కదా మరి మాకిలా ఎందుకు జరుగుతుంది ? అని, అసలు విషయం అర్థం కాక నలిగి పోతుంటారు. మంచి వాళ్ళకే కష్టాలొస్తాయి అని వీరు అనుకోవడం మొదలు పెడతారు. వీరిని చూసిన వారు కూడా ఇది నిజమే అని అనుకుంటారు. కానీ అసలు నిజం ఇది. ఆత్మ విజ్ఞానం లేని వారందరూ దాదాపుగా ఇక్కడే చాలా అయోమయానికి గురవుతుంటారు.

గుర్తుంచుకోండి - మన లోపల ఉన్న సరి కాని గుణాలే(స్వభావాలే), సరి కాని పరిస్థితులను ఆకర్షిస్తూ ఉంటాయి. మనకు వచ్చే కష్టాలు, సమస్యలు మనకు ఏదో ఒకటి నేర్పించడానికే వస్తాయి. అది నేర్చుకోగానే ఆ సమస్య పోతుంది. ఉదాహరణకు - మీ కంటే పెద్ద వాళ్ళు మిమ్మల్ని అనవసరంగా

వేధిస్తున్నారని అనుకోండి, దీని వలన మీరేం నేర్చుకోవాలంటే, "మీ కంటే క్రింది స్థాయిలో ఉన్న వాళ్ళ మీద మీరు అనవసర పెత్తనం చెలాయించకూడదని" మీరు గ్రహించాలి. ఇది మీకు అర్థం కాగానే మీ పై వాళ్ళు మిమ్మల్ని వేధించడం ఆటొమెటిక్‌గా ఆగిపోతుంది.

నీవు ఈ జన్మలో మంచి వాడిగా ఉండి ఉండవచ్చు, కానీ గత జన్మలలో పోగు చేసుకున్న సరి కాని గుణాలు(స్వభావాలు), నమ్మకాలు విస్మృతిలో ఉంటాయి. అవే కష్టాలను ఆకర్షిస్తూ ఉంటాయి. దానితో మేం మంచి వాళ్ళమే అయినా మాకెందుకు ఈ కష్టాలు అని అనుకుంటూ ఉంటారు.

మనది కానిదేదీ మన దగ్గరకు రాదు. మన మీద
ఒక రాయి పడ్డా అది మనదే, ఒక పువ్వు పడ్డా అదీ మనదే !

✪ మనం కలిగి ఉన్న గుణాలనే(స్వభావాలనే) మనం అనుభవిస్తూ ఉంటాం. లోపల ఎన్నో జన్మల నుండి పోగై ఉన్న అనేకానేక సరి కాని గుణాలెన్నో (స్వభావాలెన్నో) ఉంటాయి. ఈ సరి కాని గుణాలను(స్వభావాలను) మార్చుకోడానికి మంచి గుణాలను(స్వభావాలను) పెట్టుకుని జన్మిస్తాం. ఎరుకలో ఉన్న మంచి గుణాలకు(స్వభావాలకు), ఎరుకలో లేని సరి కాని గుణాలకు(స్వభావాలకు) సంఘర్షణ జరుగుతుంది. విస్మృతిలో ఉన్న సరి కాని గుణాలను(స్వభావాలను) మొత్తం మార్చాలంటే ఒకే ఒక మార్గం "ఎరుక" ! మీ ఎరుక అనేది అక్కడ లేనందుకే అందులో సరి కాని గుణాలు(స్వభావాలు) ఉన్నాయి. కేవలం మీ ఎరుక ప్రసరించినంత మాత్రాన అంతా సరి చేయబడుతుంది. అంతా స్వచ్ఛం అవుతుంది.

మన విస్మృతిలో ఉన్న సరి కాని గుణాలు(స్వభావాలు), నమ్మకాలు ఆకర్షించే వాటిని దురదృష్టాలు అని అంటారు.

మన విస్మృతిలో ఉన్న సరి అయిన గుణాలు(స్వభావాలు), నమ్మకాలు ఆకర్షించే వాటిని అదృష్టాలు అని అంటారు.

లోపల ఉన్నది ఆకర్షిస్తుంది. అది మనకు తెలియదు. సడన్‌గా మన జీవితంలోకి ప్రవేశిస్తుంది. అది చెడు అయితే దురదృష్టం అని, మంచి అయితే అదృష్టం అని అంటారు. దురదృష్టాన్ని మన చెడు గుణం(స్వభావం) ఆకర్షిస్తుంది. మంచి గుణం అదృష్టాన్ని ఆకర్షిస్తుంది. మీ లోపల చెడు గుణం(స్వభావం) లేకపోతే మీకు దురదృష్టం అనేది రాదుగాక రాదు. మంచి గుణాలు(స్వభావాలు) పూర్తిగా ఉంటే దురదృష్టం అనేది అణువంత కూడా ఉండదు. మంచి అనే సూర్యుడి వెలుగులో దురదృష్టం అనే చీకటి ఉండలేదు, రాలేదు.

మంచి గుణాలంటే సద్గుణాలు. ఇవి ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ఆచరణ ద్వారా మాత్రమే వస్తాయి.

ప్రియ మిత్రులారా !

మంచి వాళ్ళకెప్పుడూ మంచే జరుగుతుంది.
ఏ యుగమైనా సత్యమే జయిస్తుంది.
ధర్మమే రక్షిస్తుంది.

ఈ సత్యాలను తెలుసుకుని, మన సరి కాని గుణాలను(స్వభావాలను), నమ్మకాలను, అభిప్రాయాలను, ఆలోచనా విధానాన్ని మార్చుకుని, సరి చేసుకుని ఆనందంగా జీవితాన్ని ఎంజాయ్ చేద్దాం. అందరికీ ఈ విషయాలను తెలియజేసి వారి ఆనందానికి కారణం అవుదాం !

45. మన శరీరంలోని సమస్యలే జీవితంలోని సమస్యలు!

సాధారణంగా చాలా మంది ఏం అనుకుంటూ ఉంటారంటే శరీరంలోని అనారోగ్యాలు వేరే, జీవితంలోని సమస్యలు వేరే అని అనుకుంటూ ఉంటారు.

కాదు

మన శరీరంలోని సమస్యలు, మన జీవితంలోని సమస్యలు వేరు వేరు కాదు ఒక్కటే !

మన శరీరంలోని సమస్యలే మన జీవితంలోని సమస్యలు

మన శరీరంలోని ఇబ్బందులే జీవితంలోని ఇబ్బందులు

మన శరీరంలోని అనారోగ్యాలే మన జీవితంలోని అనారోగ్యాలు

మన శరీరంలోని లోపాలే మన జీవితంలోని లోపాలు

మన శరీరంలోని బలహీనతలే మన జీవితంలోని బలహీనతలు

మన శరీరంలోని అసౌకర్యాలే మన జీవితంలోని అసౌకర్యాలు

మనం శరీరాలం కాదు ఆత్మలం !

మనం శరీరాన్ని ధరించిన వాళ్ళం. అంతే కానీ శరీరాలం కానే కాదు. "నేను" అనబడేది శరీరం కాదు. ఎవరైనా సరే నా శరీరం, నా చెయ్యి, నా కాలు, నా తల, నా బాధ, నా ఆనందం అని అంటూ ఉంటారు కదా ! మరి ఈ నా, నా - అనేది ఎవరు ? ఈ "నా" అనేది ఎక్కడ ఉంది ?

ఈ **"నా"** యే మనం !

దానినే ఆత్మ అని అంటారు. దానిని ఎన్ని రకాలుగానైనా పిలుచుకునే అవకాశం ఉంది. రక రకాలుగా పిలుస్తూ ఉంటారు కూడా !

ఆత్మ స్వరూపులమైన మనం ఈ భూమి మీదకు అనుభవ జ్ఞానం కోసం వస్తాము. అంశాత్మగా ప్రవేశించి అన్ని రకాల జన్మలనెత్తి పరిపూర్ణం చెందిన తర్వాత ఈ భూమి అనే పాఠశాలను వదిలి పై లోకాలకు వెళ్ళి పోతాము. ఇలాంటి విషయాలు "భగవద్గీతలో" శ్రీకృష్ణుడు వివరిస్తాడు. ఇంకా అనేకానేక ఆధ్యాత్మిక శాస్త్రాలలో ఇలాంటి విషయాలు ఉంటాయి వాటిని చదివితే చాలా వివరాలు తెలుస్తాయి.

మనం శరీరాలం కాదు ఆత్మలం. ఆత్మ తన జన్మ పరిణామ క్రమంలో రక రకాల జన్మలను తీసుకుంటూ అనుభవ జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉంటుంది. ఈ క్రమంలో మంచి - చెడులను రెండింటిని అనుభవించి తెలుసుకుంటుంది. అయితే ముందు చెడు(అజ్ఞానం) ఎక్కువగా ఉంటుంది. క్రమ క్రమంగా తనలోని చెడును(అజ్ఞానాన్ని) తగ్గించుకుంటూ మంచిని(జ్ఞానాన్ని) పెంచుకుంటూ వస్తుంది. చెడు గుణాలను పెట్టుకుని, చెడు పనులు చేస్తూ ఆ పనుల యొక్క ఫలితాలను, తన చెడు గుణాలతో ఆకర్షిస్తూ అనుభవిస్తూ ఉంటుంది. ఈ విధంగా ద్వంద్వాలను అంటే మంచి - చెడులను అనుభవిస్తేనే గానీ ఆత్మకు పరిపూర్ణత సిద్ధించదు.

ఆత్మ నిజానికి పరిపూర్ణతను సిద్ధించుకునియే ఉంటుంది. మీరెప్పుడు నేను పరిపూర్ణుడనయ్యాను, నేనే దైవం అని భావిస్తారో, అనుభవిస్తారో అప్పుడే, అదే క్షణంలో మీకు దైవత్వం ప్రాప్తిస్తుంది.

జన్మలన్నీ అనుభవ జ్ఞానం కోసమే, పరిపూర్ణం చెందడం కోసమే ! అంతే కానీ వాస్తవానికి మంచి - చెడు అంటూ ఏమీ ఉండవు. ఉన్నదంతా దివ్యమే అని రక రకాల మార్గాలకు సంబంధించిన మాస్టర్స్ చెప్తారు. భగవద్గీతలోని 12వ అధ్యాయంలోని 17వ శ్లోకంలో శ్రీకృష్ణ పరమాత్ముడు కూడా ఇదే విషయాన్ని ప్రకటిస్తాడు "శుభాశుభపరిత్యాగీ" అని ! అంటే శుభం లేదు అశుభం లేదు, అంతా వదిలేయి, ఉన్నదంతా దివ్యమే అని అర్థం. అయితే శుభం లేదు, అశుభం లేదు అని తెలుసుకోడానికి ఈ శుభాశుభాలను రెండింటిని అనుభవించాలి అప్పుడే అవి రెండు ఒకే దాని రెండు చివరలనీ, రెండూ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉంటాయనీ అర్థం అవుతుంది. అప్పుడు ద్వంద్వాలైన శుభాశుభాలను దాటి అంతా దివ్యమే అనే స్థితిలోకి వస్తాం.

ఈ విధమైన ఆత్మ పరిణామ క్రమంలో ఆత్మ, తాను పరిపూర్ణత సాధించే దివ్య కార్యక్రమంలో భాగంగా, తాను స్వయంగా అనుభవించి తెలుసుకోవాలి అని పెట్టుకున్న దుర్గుణాలే శరీరంలో అనారోగ్యాలుగా, జీవితంలో సమస్యలుగా ప్రతిబింబిస్తూ ఉంటాయి.

ఆత్మ స్వరూపులమైన మనకు ఉన్న దుర్గుణాలే(అజ్ఞానం లేదా అవగాహన లేకపోవటం) మన శరీరంలో అనారోగ్యాలుగా, జీవితంలో సమస్యలుగా ప్రకటం అవుతూ ఉంటాయి. ఒకటే దుర్గుణం శరీరంలో ఒక అనారోగ్యంగా ఉంటుంది. అదే దుర్గుణం(సరికాని భావం) జీవితంలో ఒక రకమైన సమస్యగా ప్రకటమవుతూ మనల్ని ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

పిసినారి గుణం అనేది జీవితంలో ఇబ్బంది పెడుతుంది. అదే పిసినారి గుణం శరీరంలో "మలబద్ధకంగా" మారి ఇబ్బంది పెడుతుంది. ఈ విధంగా గుణం ఒకటే ఉంటుంది. అది శరీరంలో ఒక రకంగా, జీవితంలో ఒక రకంగా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. ఈ ప్రకారంగా శరీరంలో ఎన్ని సమస్యలు ఉంటే జీవితంలో అన్ని సమస్యలు ఉంటాయి. ఆత్మ తను కలిగి ఉన్న దుర్గుణాలను శరీరంలో రోగాలుగా, జీవితంలో సమస్యలుగా అనుభవిస్తూ వాటిని అర్థం చేసుకుని అవగాహనతో వాటిని తొలగించుకుంటూ అభివృద్ధి పథంలో సాగిపోతుంది.

శరీరంలో బట్టతలను కలుగజేసే గుణం, జీవితంలో వేరే రకంగా ఇబ్బంది పెడుతుంది. ఊబకాయం, మరీ సన్నగా ఉండడం, షుగర్, కీళ్ళ నొప్పులు, అల్సర్ ఈ విధంగా మన శరీరంలో ప్రకటం అయ్యే రోగాలు ఒక్కోటి ఒక్కో రకంగా జీవితంలోని సమస్యలుగా ప్రకటం అవుతూ ఉంటాయి. ఆత్మ విజ్ఞాన సూత్రాల ఆచరణతో + ధ్యాన సాధనతో మన అనారోగ్యాల మూలాలను సులభంగా కనుక్కుని వేగంగా, శాశ్వతంగా తీసి వేయవచ్చు.

మీరు బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే - మీకు ఉన్న సమస్య ఎలాంటిదైనా సరే, అది ఎంత పెద్దదైనా సరే, దాన్ని తక్షణమే చాలా సులభంగా, సురక్షితంగా, శాశ్వతంగా తీసివేసే సంపూర్ణమైన సమగ్రమైన శక్తి సామర్థ్యాలను మీరు ఇప్పుడు, ఈ క్షణంలో కలిగి ఉన్నారు అనేది పరమ సత్యం. దయచేసి మీరు, ఈ పరమ సత్యాన్ని విశ్వసించండి. ధైర్యంగా, ధీమాగా ఉండండి. మీ విశ్వాసమే, మీ ధైర్యమే, మీ ధీమాయే మిమ్మల్ని రక్షిస్తుంది.

ఏ భావనతో(గుణంతో) ఏ అనారోగ్యం వస్తుంది అనే విషయాలు తెలుసుకోవాలంటే Louise L. Hay గారి You Can Heal Your Body అనే పుస్తకం చదవండి. అన్ని ప్రధాన బుక్ షాపుల్లో లభిస్తుంది. వీలైతే You Can Heal Your Life కూడా చదవండి. పూర్తి వివరాల కోసం www.hayhouse.co.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ఉదాహరణకు మలబద్ధకంతో బాధపడే వారు, తమ పిసినారి గుణాన్ని స్వయంగా గుర్తించి, దాన గుణాన్ని అలవర్చుకుంటే వారి సమస్య పోతుంది. అయితే జాగ్రత్త ! పిసినారి గుణాన్ని గుర్తించడం చాలా కష్టం ఎందుకంటే అది "పొదుపు" అనే ముసుగు ధరించి ఉంటుంది. ఎంతో నిశితంగా పరిశీలనతో గానీ మీ గుణాన్ని మీరు గుర్తు పట్ట లేరు. ఇలా గుణాలను గుర్తు పట్టడం ఇబ్బంది అవుతుంది కనుకనే అవి శరీరంలో ప్రకటం అయ్యేలా చేసింది సృష్టి. మన గుణాలు కొన్ని సరిగా లేవు అనడానికి మన శరీరంలోని అనారోగ్యాలే నిదర్శనాలు. కాబట్టి మీరు మలబద్ధకంతో బాధ పడుతున్నారూ అని అంటే మీకు పిసినారి గుణం ఉన్నట్టే ! కాబట్టి "ఏమీ ఆశించకుండా ఇతరులకు ఏవైనా పనికి వచ్చే వస్తువులను ఇవ్వడం గానీ ఏవైనా పనికి వచ్చే సహాయాలు గానీ చేస్తూ పోతూ ఉంటే అప్పుడు దాన గుణం అలవడుతుంది. దానితో పిసినారి గుణం పోతుంది, ఈ పిసినారి గుణంతో పాటే మలబద్ధకం కూడా శాశ్వతంగా తొలగి పోతుంది. దాన గుణం కలిగి ఉన్నప్పుడే ఆరోగ్య ఐశ్వర్యాలు మరియు సర్వ శ్రేయస్కరాలు మీ జీవితంలోకి వస్తాయి.

అయితే ఇక్కడ చాలా మంది పొరపాటు చేస్తుంటారు. అది ఏమిటంటే - దాన గుణం అలవర్చుకోడానికి ఏవైనా ఇవ్వండి లేదా ఏవైనా సహాయాలు చేయండి అని అంటే, ఇంట్లో ఏరి, ఏరి తమకు ఎందుకూ, ఎప్పుడూ పనికి రావని నిర్ధారణ చేసుకున్నాక ఆ పనికిమాలిన వస్తువులను ఎవరికో ఒకరికి అంటగడతారు లేదా ఎలాంటి సహాయం చేయడానికి ముందుకు వస్తారంటే దాని వలన ఇతరులకు ఏమీ ప్రయోజనం ఉండదు. వీళ్ళు ఇబ్బంది పడకుండా, వీళ్ళ సమయం వృథా కాకుండా, వీరికి ఏ మాత్రం నష్టం కలుగకుండా, వీళ్ళ బట్టల ఇస్త్రీ నలగకుండా, క్రాఫ్ చెదరకుండా, మేకప్ పాడవకుండా చూసుకుంటూ ఏదో దిక్కు మాలిన సహాయం చేయడానికి ముందుకు వస్తారు. వాళ్ళింట్లో అడ్డం పడుతున్న వాటిని ఎవరికైనా ఇచ్చి వదిలించుకుంటారు. ఇలా చేసే వాళ్ళకు ఫలితం ఏ మాత్రం దక్కదు. ఇలా చేయకూడదు.

కొంత మంది దుర్మార్గులు డొనేషన్ పేరుతో పెట్టుబడి - ఇన్వెస్ట్‌మెంట్ చేస్తారు. ఇచ్చి ఏదో ఆశిస్తూ ఉంటారు. వారు ఆశించినది దక్కకపోతే తిరిగి ఇచ్చేయమని గొడవ పడతారు. ఇలాంటి దుష్టులు కోటి శాతం దారుణ ఘోర నరకం అనుభవించి తీరుతారు. ఇది మహా దుర్మార్గం, మహా పాపం, నేరం. ఇలా చేయకూడదు.

✪✪✪ ఇప్పుడు మనం అసలు విషయంలోకి వద్దాం - మన శరీరంలోని సమస్యలే జీవితంలోని సమస్యలు. వీటికి మూలాలు మన "సరి కాని గుణాలు (భావనలు)". మనం నేర్చుకోవాల్సిన అంశాలు పరిస్థితుల రూపంలో మనకు ఎదురవుతాయి. వీటిని మనం తిరస్కరించినపుడు "శరీరంలో రోగాలుగా ఏర్పడతాయి". బాహ్యంలో పరిస్థితుల నుండి తప్పించుకోగలం కానీ శరీరంలో రోగాలుగా ఏర్పడిన తర్వాత ఎలా తప్పించు కోగలుగుతాం ? ఆత్మ విజ్ఞానం ద్వారా, ధ్యాన సాధన ద్వారా సులభంగా, సరళంగా, వేగంగా, శాశ్వతంగా వీటన్నింటిని మనం తీసివేసుకోవచ్చు.

❖ ❖ ❖

46. మంచి పని చేయడమే సులభం

ఈ విషయం మనం అర్థం చేసుకోవాలంటే ముందు మనం "కష్టం" అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. ఇష్టం లేనిదే కష్టం. ఒక విషయం మీకు ఎప్పుడైతే ఇష్టం ఉండదో అది కష్టంగా మారుతుంది. మరి ఎందుకు ఇష్టం ఉండదు, అని అంటే ఆ విషయం మీకు అనవసరం అని అనిపించటమే. ఉదాహరణకు పేకాట ఆడేవాళ్ళను గమనించండి, రాత్రింబవళ్ళు కూర్చుని ఎంతో దీక్షతో ఆడుతుంటారు. కరెంటు పోతే క్యాండిల్ వెలుగులో అలా, అలుపు సొలుపు లేకుండా ఆడుతూనే ఉంటారు. వారి మధ్యలో పేకాట ఆడే అలవాటు లేని వారిని తీసుకొచ్చి కూర్చో పెట్టండి. పట్టుమని పది నిమిషాలు కూడా కూర్చోలేరు. ఈ పేకాట ఆడేవాళ్ళను ధ్యానంలో కూర్చోమనండి ఒక అర గంట ! అయిదు నిమిషాలకే ఊపిరాడనట్టు గిలా గిలా కొట్టుకుంటారు. కూర్చోలేరు.

ఒక విషయం మనకు అనవసరం అయినప్పుడు అది కష్టంగా మారుతుంది. ఒక విషయం మనకు ఇష్టం అయినప్పుడు అది ఏ మాత్రమూ కష్టంగా తోచదు.

ఇష్టానికి వ్యతిరేకం కష్టం. కష్టం అంటే ఇష్టం లేనిదే ! ఇష్టమైనది కష్టంగా ఉండనే ఉండదు. ఉండలేదు అది అసంభవం !

✪ **దేని పట్లనైతే నీవు అయిష్టాన్ని, తిరస్కారాన్ని ప్రకటిస్తావో అది కష్టంగా, భారంగా మరియు సుదీర్ఘంగా తయారవుతుంది. మంచి పని చేస్తే మంచి జరుగుతుంది. మరి మంచి జరిగితే బాగుపడిపోతాం. అందుకే బాగుపడటం ఇష్టం లేని గుణం మంచి పనులు చేయనివ్వదు.**

ఇష్టపడనప్పుడే అది కష్టంగా మారుతుంది. ఇష్టం అంటే స్వీకారం. ఒప్పుకోవడం. సమ్మతించడం. అనుమతించడం. మరి, ఇవన్నీ ఎప్పుడు జరుగుతాయి అని అంటే - "ఆ విషయం" మనకు అవసరమైనపుడు !

అది ఏదైనా సరే మనకు అవసరం అని అనుకుంటే అది మన ఇష్టంగా మారుతుంది. ఇష్టం అన్ని అడ్డంకులను అధిగమిస్తుంది. శ్రమను ఆనందంగా మారుస్తుంది. ఒత్తిడిని విశ్రాంతిగా మారుస్తుంది. జాప్యాన్ని శీఘ్రంగా మారుస్తుంది. అపజయాలను నిచ్చెనలుగా మారుస్తుంది. అవమానాలను ప్రోత్సాహకాలుగా మారుస్తుంది. విమర్శలను సూచనలుగా మారుస్తుంది. తిట్లను దీవెనలుగా మారుస్తుంది. హేళనలను ఉత్సాహాలుగా మారుస్తుంది. కఠినాలను, జఠిలాలను సులభాలుగా, సరళాలుగా మారుస్తుంది. సాఫల్యాన్ని అందిస్తుంది.

అవసరమయితే ఇష్టం అవుతుంది !

ఇష్టం అయితే సఫలం అవుతుంది !

అనవసరమయితే కష్టం అవుతుంది !

కష్టం అయితే విఫలం అవుతుంది !

మంచి పనులు చేయాలనుకుంటే కష్టాలేవి రావు. వస్తాయని అనుకోవడం ఒక భ్రమ. మంచి చేయడానికి ఇష్టం లేక చెప్పే ఒక సాకు. మంచి చేసే ఉద్దేశం లేక తప్పించుకునే ఒక నెపం. అంతే కాని ప్రపంచంలో మంచి చేయడమే చాలా సులభం, సరళం, శీఘ్రం. మంచి పనికి విశ్వంలోని శక్తులన్ని కలసికట్టుగా సహాయం చేస్తాయి. మంచి పని చేయడానికి పూనుకున్న వారికి సాక్షాత్ సృష్టియే అండగా నిలుస్తుంది. సర్వ - సర్వ, సకల - సకల, సమస్త ఆశీర్వాద అనుగ్రహాలను వారి మీద కురిపిస్తుంది.

విశ్వ శక్తి సూత్రాల ప్రకారం - భూమి పైన మంచి పనులు చాలా తక్కువ శక్తితో చేయవచ్చు, చెడు పనులకు చాలా ఎనర్జి కావాలి. కాబట్టి మంచి పనులే సులభం !

47. వర్తమానంలోనే ఎందుకు ఉండాలి ?

ఉన్నది వర్తమానమే కాబట్టి ! ఒక సారి నిశితంగా పరిశీలించి, విశ్లేషించి చూడండి. గతం అనేది గతించిపోయింది, ఇప్పుడు లేదు. చచ్చిపోయింది. భవిష్యత్తు ఇంకా పుట్టనే లేదు. ఒకటి మృతమైనది, ఇంకొకటి ఇంకా జీవం పోసుకోలేదు. ఈ రెండూ ప్రస్తుతం లేవు. ఉన్నది, ఉంటున్నది, ఉండబోయేది కేవలం వర్తమానమే. ఉనికిలో ఉండేది వర్తమానం మాత్రమే. ఉనికిలో ఏదైతే ఉంటున్నదో అదే సత్యం. వర్తమానమే సత్యం.

సృష్టి ఎప్పుడూ వర్తమానంలోనే ఉంటుంది. మనం ఎప్పుడూ గతంలోనో, భవిష్యత్తులోనో ఉంటూ ఉంటాం. ఒక్క సారి మీ ఆలోచనలను పరిశీలించి చూడండి, మీకే తెలుస్తుంది. అసలు మానవులకు అన్ని కష్ట నష్టాలు రావడానికి మూల కారణం వర్తమానంలో ఉండకపోవడమే. వర్తమానంలో ఉండడమంటే ఎరుకలో ఉండడమే. వర్తమానమే దైవత్వం. ✪ వర్తమానంలో ఉండడం అంటే సృష్టి కేంద్రంతో అనుసంధానమై ఉండడం. అంటే సృష్టితో సృష్టిగా ఉండడం.

మనుషులు వర్తమానంలో ఉండలేక పోవడానికి కారణం విస్మృతి మరియు అసంతృప్తి. ఎల్లప్పుడూ అసంతృప్తితో ఉండడం మూలాన గతాన్ని తలుచుకుని బాధపడుతూ ఆ గతాన్ని తీసుకెళ్ళి భవిష్యత్తులో రిపేర్ చేస్తూ ఉంటారు. ఈ విధంగా గతంతో కలిసి ఉండడం వలన సృష్టి నుండి అందాల్సినవి అందకుండా పోతాయి. ఎందుకంటే సృష్టి యొక్క ఉనికి ఎప్పుడూ వర్తమానంలోనే ఉంటుంది కాబట్టి. కేవలం వర్తమానంలో అలా ముందుకు సాగిపోతూ ఉంటుంది, అనంతంగా ! అనవసరంగా గతాన్ని తలుచుకోవడం, అనవసరంగా భవిష్యత్తులో ఉండడం అనేది చాలా నష్టాన్ని కలిగిస్తుంది. గతాన్ని ఒక అనుభవంగా, ఒక వివేకంగా మాత్రమే మనం ఉపయోగించాలి, భవిష్యత్ గురించి అవసరమైనప్పుడు, అవసరమైనంత మాత్రమే పాజిటివ్‌గా ఆలోచించాలి. ఎల్లప్పుడు సదా, సర్వదా వర్తమానంలోనే ఉండాలి. వర్తమానంలో ఉంటే అన్ని కార్యాలు విజయవంతమవుతాయి. వర్తమానం మహా శక్తివంతమైనది.

వర్తమానం గురించి, దాని శక్తి గురించి వివరంగా తెలుసుకోవాలంటే, Eckhart Tolle గారు వ్రాసిన THE POWER OF NOW అనే పుస్తకం చదివితే తెలుస్తుంది. అన్ని ప్రధానమైన బుక్ షాపుల్లో ఈ పుస్తకం దొరుకుతుంది. మహా అద్భుతమైన పుస్తకం ఇది.

48. కర్మ

కర్మ అంటే చాలా రకాల అర్థాలున్నాయి, వాటి లో కొన్ని :

1. కర్మ అంటే అపరాధ భావన(Guilty) అంతే కానీ పరిహారాలు లేక చెల్లింపులు కాదు.

2. కర్మ అంటే తప్పని సరిగా కష్టాలు అనుభవించాలి అనే భావన.

3. కర్మ అంటే ప్రణాళిక(Plan).

4. కర్మ అంటే కార్యం(Deed).

5. కర్మ అంటే నేర్చుకోవాల్సిన పాఠాలు లేదా పెండింగ్ లెసన్స్.

6. కర్మ అంటే ఏదైనా ఒక కార్యం యొక్క ఫలితం(Result).

7. కర్మ అంటే అజ్ఞానం.

❶ కర్మ అంటే అపరాధ భావన(Guilty)అంతే కానీ పరిహారాలు లేక చెల్లింపులు కాదు : మీరు ఏ పనైనా చేయండి. అది ఎంత నికృష్టమైనదైనా లేక ఎంత గొప్పదైనా సరే దేనికీ మీరు పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదు. మీరు చేయాలనుకుంటున్న పని చేసారు, ఆ పని చేస్తూన్నప్పుడు, చేసిన తర్వాత దాని అనుభవాన్ని పొందారు. అంతే ! ఇక మీరు దానికి సంబంధించిన ఎలాంటి ఫలితం అనుభవించాల్సిన అవసరం లేదు. పరిహారం కానీ లేక చెల్లింపులు కానీ చెల్లించాల్సిన అవసరం లేనే లేదు. మీరు చేయాలనుకున్న పనిని చేయడం ద్వారా దానికి తగిన అనుభవం పొందారు. అంతే !

అయితే మీరు ఇక్కడ ఒక అత్యంత ముఖ్యమైన విషయం తెలుసుకోవాలి

✪ మానవులకు జరిగిన తప్పుడు బోధనల వలన కర్మ అనేది ఒక "పెద్ద ఖర్మ"గా తయారై కూర్చుంది. ఎవరు కూడా ఏ కర్మలూ అనుభవించాల్సిన అవసరం లేదుగాక లేనే లేదు.

✪ మీరు ఒక పని చేస్తున్నప్పుడు మీలో ఉన్న అజ్ఞానం వలన అపరాధ భావం జనించినప్పుడు, మీ అపరాధ భావనయే ఆ కర్మ ఫలితాన్ని ఆకర్షించి మీ చేత అనుభవించేలా చేస్తుంది. "కర్మ సిద్ధాంతం" అనేది, దాన్ని నమ్మిన వారికే వర్తిస్తుంది. కర్మలు లేవు అని భావించిన వాళ్ళకు కర్మలు ఉండవు. సంకుచిత భావాలతో రిజిడ్‌గా ఉండి నాకు కర్మలు లేవు అని నమ్మితే కర్మలు ఉండవేమో కానీ నేర్చుకునే "పాఠాలు" బోలెడు ఉంటాయి. కర్మలు లేవు అని అనుకునేప్పుడు వికాసం కూడా కర్మలను తిరస్కరించదగిన స్థాయిలో ఉండాలి.

ఇలా అయితే ఎవరైనా, ఏదైనా చేసేస్తారు కదా !

మీరు చేసే పని ఎంత దుర్మార్గమైనదైనా, మంచిది అయినా దానికి పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదుగాక, లేనే లేదు అని అనగానే - "ఇలా అయితే ఎవరైనా, ఏదైనా చేసేస్తారు కదా" !? అనే ఆశ్చర్యార్థకమైన ప్రశ్న మీకు ఉదయించలేదు అనుకోండి ఈ విషయం ఇక్కడితో పూర్తయిపోతుంది. ఒక వేళ మీకు ఈ ప్రశ్న పుట్టిందే అనుకోండి అప్పుడు మనం ఈ ప్రశ్న యొక్క సమాధానాన్ని తెలుసుకోవాల్సిందే ! అయితే సమాధానం తెలుసుకునే ముందు ప్రశ్న యొక్క మూలాన్ని తెలుసుకోవాలి.

"ఎవరైనా, ఏదైనా చేసేస్తారు కదా" అనే ప్రశ్న యొక్క అర్థం ఏమిటి ? చేసిన పనికి ఫలితం అనుభవించాల్సిన అవసరం లేదు అని అంటే అందరూ ఇక దుర్మార్గపు పనులు చేస్తారనే కదా ఈ ప్రశ్నలోని ఉద్దేశం. అంటే మానవులందరూ కేవలం ఈ "కర్మ ఫలితం" అనే భయం వల్ల ఏమీ చేయకుండా ఉన్నారు. ఈ భయం లేకపోతే దుష్ట కార్యాలన్నీ చేసేస్తారు అని అర్థం. అంటే అందరూ తమ లోపల దుష్ట భావాలను ఈ "కర్మ ఫలితం" అనే దానికి భయపడి అణిచి పెట్టుకుని సమయం కోసం ఎదురు చూస్తున్నారు. ఎవరూ "ఏ కర్మ ఫలితం" అనుభవించాల్సిన అవసరం లేదనగానే ఇక విజృంభిస్తారు అనే కదా అర్థం. అంటే మానవులు దుష్టులు, దుర్మార్గపు వాళ్ళు కాబట్టి వారిని భయపెట్టి అణిచి పెట్టి ఉంచడానికి ఏవో శాసనాలు ఉండి తీరాలి అని ఈ ప్రశ్న యొక్క "మూల భావం". ఇలాంటి భావం సరి అయినది కాదు. మానవులపై ఇలాంటి భావం మీరు కలిగి ఉన్నారంటే, మీపై మీరు కూడా ఇదే భావం కలిగి ఉన్నారనే అర్థం.

కాబట్టి ముందు మిమ్మల్ని మీరు సరి చేసుకుంటే మంచిది. **మానవులు మంచి వాళ్ళే, "యద్భావం తద్భవతి" !**

❷ **కర్మ అంటే తప్పని సరిగా కష్టాలు అనుభవించాలి అనే భావన :** నిజానికి ఎవరూ ఏ కష్టాలు అనుభవించాల్సిన అవసరం లేనే లేదు. అంతా మీ ఎంపిక పైన ఆధారపడి ఉంటుంది. కష్టాలను ఎంచుకుంటారా ? ఆనందాలను ఎంచుకుంటారా ? అది మీ ఇష్టం. ఆత్మ విజ్ఞానం లేనప్పుడు మీరెంత ప్రయత్నం చేసినా ఆనందాలను ఎంచుకోలేరు, అనుభవించలేరు ! ఆత్మ విజ్ఞానం ఉన్నప్పుడు కష్టాలను ఎంచుకోలేరు, అనుభవించలేరు ! అంతే !

❸ **కర్మ అంటే జన్మ ప్రణాళిక :** ప్రతీ ఆత్మ తాను జన్మ తీసుకునే ముందు ఏ ఏ పాఠాలు నేర్చుకోవాలి, అందు కోసం భూమి పైన ఎంత కాలం నివసించాలి, స్త్రీగా పుట్టాలా, పురుషుడిగా పుట్టాలా, రూపు రంగు ఎత్తు బరువు మొదలైనవి ఎలా ఉండాలి, ఏ దేశంలో పుట్టాలి, ఏ ప్రాంతంలో పుట్టాలి, ఏ జాతిలో పుట్టాలి, ఏ మతంలో పుట్టాలి, ఏ కులంలో పుట్టాలి, ఏ కుటుంబంలో పుట్టాలి, కుటుంబంలో ఎన్నో సంతానంగా పుట్టాలి, ఎలాంటి వాతావరణంలో పుట్టాలి, ఎలాంటి అనుభవాలు పొందాలి, ఏ ఏ నష్టాలు పొందాలి, ఎలాంటి ప్రమాదాలను ఎదుర్కోవాలి, ఎలాంటి మోసాలు అనుభవించాలి, ఎలాంటి కష్టాలు పడాలి, ఏ ఏ కోరికలను తీర్చుకోవాలి మొదలైన వాటన్నింటినీ కలిపి "జన్మ ప్రణాళిక" అని అంటారు. ఈ జన్మ ప్రణాళికనే "కర్మ" అని కూడా అంటారు.

ఆత్మ విజ్ఞానం + ధ్యాన సాధన ద్వారా మన జన్మ ప్రణాళికను మనం మార్చుకోవచ్చు.

❹ **కర్మ అంటే కార్యం :** ఏదైనా ఒక పనిని కర్మ అని అంటారు. మంచి పనులను సత్కర్మలు అని, చెడు పనులను దుష్కర్మలు అని అంటారు. కేవలం తన కోసం మాత్రమే చేసే కర్మలను స్వార్థ కర్మలు అని అంటారు. ఈ స్వార్థ కర్మలు కూడా దుష్కర్మల కిందికే వస్తాయి. ఎందుకూ పనికిరాని పనులు ఉంటాయి. ఇతరుల కోసం కాదు, తన కోసం కూడా పనికి రావు. ఇలాంటి వాటిని వ్యర్థ కర్మలు అని అంటారు. ఇవి కూడా దుష్కర్మల కిందికే వస్తాయి. లోక కల్యాణానికై చేసే కర్మలను దివ్య కర్మలు అని అంటారు. శాకాహార + ధ్యాన + ఆత్మ విజ్ఞాన ప్రచారానికి సంబంధించిన కార్యక్రమాలను మాత్రమే దివ్య కర్మలు అని అంటారు. భౌతికమైన మంచి పనులను సత్‌కర్మలు అని అంటారు. అప్పుడప్పుడు దివ్య కర్మలను కూడా సత్‌కర్మలు అని అంటుంటారు. ఎందుకంటే సత్యంతో కూడుకుని ఉన్న కర్మలు కదా !

✪ కర్మ అంటే కార్యం. కార్యం అంటే నీ కోరిక అని అర్థం. నీవు దేనినైతే కోరుకుంటున్నావో దానిని సృష్టికి వ్యక్త పరచడమే కార్యం. సృష్టి ఒక ఓపెన్ సూపర్ మార్కెట్ లాంటిది. "నీకేం కావాలో అది నేను ఇస్తాను" అని అంటుంది సృష్టి. నీకేం కావాలో దానికి సంబంధించిన పని చేయి ఆ ఫలితం నీకు ఆటోమెటిక్‌గా అందుతుంది, అని నిర్ణయించింది సృష్టి.

✪ ఆలోచనా రూపంలో ఉన్న నీ కోరికను వ్యక్త పరిచి, దానిని పొందేందుకు మార్గాన్ని సుగమం చేయడాన్నే కార్యం అని అంటారు. మీరు కలిగి ఉన్న కోరికలకు అనుగుణంగానే మీ కార్యాలు (పనులు) ఉంటాయి. ఏ ఏ పనులు మీరు చేస్తూ ఉంటారో అలాంటి ఫలితాలను మీరు పొంది తీరుతారు. "మీకేం కావాలో అది

చేయండి, దానినే పొందుతారు" ఇది ఒక విశ్వ సూత్రం. "చేయవలసిన దానిని పూర్తిగా చేసినప్పుడే, పొందవలసిన దానిని పూర్తిగా పొందుతారు" అనేది ఇంకొక విశ్వ సూత్రం. "ఎంత చేస్తే అంత, ఏం చేస్తే అది పొందుతారు" అనేది కూడా ఒక విశ్వ సూత్రం.

ఎలాంటి కర్మలు చేస్తే అలాంటి ఫలితాలు వస్తాయి.

దుష్కర్మలు చేస్తే దుష్ఫలితాలు వస్తాయి.

వ్యర్థ కర్మలు చేస్తే వ్యర్థ ఫలితాలు వస్తాయి.

స్వార్థ కర్మలు చేస్తే స్వార్థ ఫలితాలు వస్తాయి.

సత్కర్మలు చేస్తే సత్ ఫలితాలు వస్తాయి.

దివ్య కర్మలు చేస్తే దివ్య ఫలితాలు వస్తాయి.

అయితే ఇక్కడ కేవలం కార్యం కాదు, భావమే ముఖ్యం,
లోపల భావాన్ని బట్టి ఫలితాలు వస్తాయి.

✪ ఒక మనిషి ఎంతటి దీనమైన, దరిద్రమైన, హీనమైన, ప్రమాదకరమైన పరిస్థితిలోనైనా ఉండనీ గాక, దివ్య కర్మలు చేస్తే తక్షణమే రక్షించబడతాడు. అయితే అతడి పరిస్థితులకు సరిపోయేంత దివ్య కర్మలు చేయాలి, అప్పుడు ఖచ్చితంగా, శాశ్వతంగా రక్షించబడతాడు.

సదా, సర్వదా దివ్య భావనలతో దివ్య కర్మలనే చేయాలి, చేయించాలి !

❺ **కర్మ అంటే నేర్చుకోవాల్సిన పాఠాలు :** ఆత్మ, ప్రతి జన్మలో ఒక ప్రణాళిక వేసుకుంటుంది. ఉదాహరణకు ఒక ఆత్మ ప్రణాళిక ప్రకారం, ఒక జన్మలో 100 పాఠాలు నేర్చుకోవాలని నిర్ణయించుకుని, జన్మ తీసుకున్న తర్వాత మాయకు లోనై కేవలం 40 పాఠాలు మాత్రమే నేర్చుకుని జన్మ చాలించిందనుకోండి, అప్పుడు మిగిలిన 60 పాఠాలను కర్మ అని అంటారు. ఈ మిగిలిన పాఠాలను మిగతా జన్మలలో నేర్చుకోవాలి. ఇలా ప్రతి జన్మలో సగానికి సగం పెండింగ్ పడుతూ ఉంటాయి. చివరికి ఒక పరిస్థితి ఎలా వస్తుందంటే, పెండింగ్ పాఠాలు పూర్తి అయితే కానీ ముందుకు కదలలేని పరిస్థితులు వస్తాయి. అప్పుడు విధిగా సత్య మార్గంలోకే వచ్చి తీరాలి. కేవలం సత్య మార్గం ఒక్కటే శరణ్యం !

❻ **కర్మ అంటే ఏదైనా ఒక కార్యం యొక్క ఫలితం :** మనం ఏ భావనతో ఏ పని చేస్తున్నాము అనే దానిని బట్టి ఫలితం ఆధారపడి ఉంటుంది.

చాలా, చాలా మంది ఇక్కడే దెబ్బతింటుంటారు. లోపల భావం సరిగా ఉండదు. అహంభావంతో, విసుగుతో లేదా స్వార్థంతో దాన ధర్మాలు చేస్తారు. వీళ్ళ భావాలకు తగ్గట్టే ఫలితాలు వస్తాయి.

✪ అహంభావంతో కోటి రూపాయలు దానం చేసినా వృథాయే !

✪ దివ్య భావనతో ఒక రుపాయి ఇచ్చినా సరే, కోటి రూపాయల ఫలితం వస్తుంది !!

✪ గుర్తుంచుకోండి - భావన విత్తనం, ఫలితం పండు. విత్తనాన్ని బట్టే పండు తయారవుతుంది. భావమే మూలం.

✪ భావమే ఫలితంగా మారుతుంది.

✪ కార్యాన్ని బట్టి ఫలితం ఉండదు.

✪ మీరు ఎంత చేస్తున్నారు అనేది ముఖ్యం కాదు.

✪ మీరు ఏ భావంతో చేస్తున్నారు అనేదే ప్రధానం, అదే ఫలితాన్ని నిర్ణయిస్తుంది.

✪ ప్రేమ, గౌరవం, శ్రద్ధ, సమర్పణ, అంకిత, ధన్యవాదం మొదలైన దివ్య భావనలతో పని చేయాలి, అప్పుడు మాత్రమే దివ్య ఫలితాలు వస్తాయి. కార్యంలో ఏమీ లేదు, అంతా భావంలోనే ఉంది.

❼ **కర్మ అంటే అజ్ఞానం :** అజ్ఞానం అంటే తెలియని స్థితి . విజ్ఞానానికి అంతే లేదు. "తెలిసింది బిందువంత, తెలుసుకోవాల్సింది సాగరమంత" ! ఇక్కడ అజ్ఞానం అంటే ఆత్మ విజ్ఞానం లేదని అర్థం, అంతే కాని జనరల్ నాలెడ్జ్ కాదు.

అంశాత్మగా అంటే తెలియని స్థితిలో ఉన్న ఆత్మగా భూమి పైకి వస్తారు. తర్వాత ఎన్నో రకాలైన జన్మలెత్తి పరిపూర్ణత సాధించి ఉన్నత లోకాలకు వెళ్ళి పోతారు. ఈ భూమి ఒక పాఠశాల, దీని పైకి అనుభవ జ్ఞానం కోసమే వస్తారు, అవగాహన పెంచుకోడానికే వస్తారు. ఏదైనా ఒక విషయం అనుభవపూర్వకంగా తెలియనపుడు దాని పట్ల మనకు సరైన అవగాహన ఉండదు. ఎప్పుడైతే దానిని అనుభవిస్తారో అప్పుడు దానికి సంబంధించిన అవగాహన వస్తుంది.

నీకెంతో కర్మ ఉంది, అని అంటే నీవు ఎంతో తెలుసుకోవాల్సి ఉంది అని అర్థం, నీవు ఎంతో అవగాహన పొందాల్సి ఉంది అని అర్థం. ఒక కర్మ పోయిందీ అంటే, కొంచెం అజ్ఞానం తొలగిపోయి అవగాహన కాస్త పెరిగింది అని అర్థం.

నీవు ఇంకా కర్మను అనుభవించాలి అని అంటే నీవు ఇంకా అనుభవ జ్ఞానం గడించి అవగాహన పెంపొందించుకోవాలి అని అర్థం.

ఈ కర్మకు సంబంధించి తెలుసుకోవాల్సిన విషయాలు ఇంకా కొన్ని....

కర్మ అంటే ఏదైనా ఒక పని యొక్క ఫలితం. ఏ గుణాలతో అయితే ఆ పని చేశామో అవే గుణాలతో ఆ ఫలితాలను ఆకర్షించి అనుభవిస్తాము. గుణాలు మార్చుకుంటే అనుభవించాల్సిన అవసరం లేదు. గుణాలు మార్చుకోక పోతే మారేదాకా లేక మార్చుకునే వరకు అనుభవించాల్సి ఉంటుంది. ఇక్కడ గ్రహించాల్సిన ముఖ్య విషయం "మార్పు". పరివర్తన చెందడమే ముఖ్యం. మానవులు తెలియక, అజ్ఞానంతో కొన్ని అనవసర కర్మలలో ఇరుక్కుంటూ ఉంటారు. అవి :

1. జాతి కర్మ
2. మత కర్మ
3. కుల కర్మ
4. కుటుంబ కర్మ
5. ప్రాంతీయ కర్మ
6. దేశీయ కర్మ

వాస్తవానికి పైన తెలిపిన వాటినేవి కూడా మానవులు అనుభవించాల్సిన పని లేదు. ఎవరి వ్యక్తిగత కర్మలు వారికి ఉంటాయి, వాటితోనే చుక్కలు కనబడతాయి. అయినా అజ్ఞానంతో అనవసరమైన పై వాటిలో ఇరుక్కుంటూ ఉంటారు.

1. జాతి కర్మ : దీనిలో మూడు ఉప భాగాలు ఉంటాయి. అవి :

1. మాది ప్రత్యేకమైన జాతి అనే కర్మ
2. పురుష జాతి కర్మ
3. స్త్రీ జాతి కర్మ

మాది ప్రత్యేకమైన జాతి అనే కర్మ : వాస్తవానికి జాతి అంటే మానవ జాతి ఒక్కటే ! అయితే భౌగోళిక నైసర్గిక పరిసర ప్రాంతాలనూ, పరిస్థితులను బట్టి రూపంలోనూ, రంగులోనూ, ఎత్తులోనూ శారీరకంగా కొన్ని భేదాలు ఉంటాయి. అవి అన్నీ కూడా విభిన్న కోణాల్లో అనుభవ జ్ఞానం సంపాదించడానికేనని గుర్తుంచుకోవాలి. అందరూ అన్ని జాతుల్లోనూ జన్మ తీసుకుంటారు.

మాది ప్రత్యేకమైన జాతి అనే కర్మ ఏమిటంటే - ఈ రకమైన భావనలలో ఉండే వాళ్ళు వేరే జాతుల వారికి ఏదైనా హాని కలిగించి ఉంటే "ఆ హాని ఫలితం ఆ జాతి మొత్తం అనుభవించాల్సి ఉంటుంది". ఆ జాతి అని అంటే ఎవరైతే "మాది ప్రత్యేకమైన జాతి అని తమ జాతి పట్ల దురభిమానం" కలిగి ఉంటారో వాళ్ళు మాత్రమే. కాబట్టి తమ జాతి పట్ల అనవసరమైన అహంభావాన్ని, దురభిమానాన్ని తక్షణమే వదిలేయాలి లేకపోతే మీరు ప్రత్యక్షంగా(చేష్టా క్షేత్రంలో) ఆ కార్యక్రమాలలో పాల్గొనక పోయినా

భావనా పరంగా వాటిని సమర్థిస్తున్నందుకు, వాటి యొక్క కర్మను ఆకర్షించి అనుభవించాల్సి ఉంటుంది.

కాబట్టి అన్ని జాతులు గొప్పవేనని అందరి పట్ల గౌరవ, ప్రేమ భావాలతో ఉండాలి. నేను ఈ జన్మలో ఈ జాతిలో పుట్టాను, రేపు వేరొక జాతిలో పుడతాను, తర్వాత మరొక జాతిలో జన్మ తీసుకుంటాను, వాస్తవానికి నేను శరీరాన్ని కాను ఆత్మను, అని ఎల్లప్పుడు ఆత్మ భావనతో ఉండాలి. అందరూ ఆత్మలే, అందరూ దివ్యులేనన్న భావనతో ఉన్నప్పుడు జాతి కర్మ నుండి బయట పడతారు.

మాది పురుష జాతి అని, మాది స్త్రీ జాతి అని ఎటెటో పోవద్దు, ఏమేమో ఆలోచించరాదు. ఆత్మ న్యూట్రల్‌గా ఉంటుంది. శరీరానికే లింగం ఉంటుంది. స్త్రీ శరీరమని, పురుష శరీరమని. అన్ని ఆత్మలు విధిగా కొన్ని జన్మలు స్త్రీగా, కొన్ని జన్మలు పురుషునిగా జన్మ తీసుకుంటాయి. అనవసరమైన జాతి భావనలను వదిలేసి అందరి పట్ల సమ భావనతో ఉండాలి.

స్త్రీ గొప్ప కాదు, పురుషుడు గొప్ప కాదు.

మాతృస్వామ్య వ్యవస్థ వద్దు, పితృస్వామ్య వ్యవస్థ వద్దు.

అందరూ అంతా సమానమేననే ప్రేమ వ్యవస్థ కావాలి.

భౌతిక శరీరానికి వయస్సు ఉన్నందున పెద్దలు కాదు.

ధనిక కుటుంబాలలో పుట్టినందున గొప్పవారు కాదు.

స్త్రీ గొప్ప కాదు, పురుషుడు గొప్ప కాదు. ఎవరూ గొప్ప కాదు.

ఎవరైతే ఆత్మ విజ్ఞానం కలిగి అవగాహనతో ఉంటారో వారే గొప్ప వారు.

మనం గొప్ప వాళ్ళం కావాలి. అందరూ అయ్యేందుకు కృషి చేయాలి.

ఎవరైతే...

మాది ప్రత్యేకమైన జాతి

మాది ఫలానా మతం

మాది ఫలానా కులం

మాది ఫలానా గోత్రం

మాది ఫలానా వంశం

మాది ఫలానా కుటుంబం

మాది ఫలానా ప్రాంతం

మాది ఫలానా దేశం...(దేశ భక్తి ఉండాలి కానీ సవ్యంగా ఉండాలి)

....అని దురభిమానాన్ని, దురహంకారాన్ని కలిగి ఉంటారో వాళ్ళు అంతా ఆయా కర్మను అనుభవించాల్సి ఉంటుంది. వారు భౌతికంగా పాల్గొనక పోయినా సరే భావనా పరంగా ఆ కార్యాల్లో పాల్గొంటారు లేదా సమర్థిస్తారు కాబట్టి వాటి యొక్క కర్మలను అనుభవించాల్సి ఉంటుంది. ఏ గుణంతో అయితే సమర్థిస్తారో అదే గుణంతో ఆ కర్మలను ఆకర్షించి అనుభవిస్తారు.

ఉదాహరణకు ఒక మతం వాళ్ళు ఇంకొక మతం వాళ్ళకు హాని చేశారు అని అనుకుందాం. మీరు భౌతికంగా అందులో పాల్గొనలేదు అసలు ఆ విషయమే మీకు తెలియదు. ఆ హాని చేసిన వారికి మీకు ఏ సంబంధమూ లేదు. మీరు తెల్లవారిన తర్వాత న్యూస్ పేపర్లో ఈ విషయం చదివారు. హాని చేసిన వారు మీ మతం వారు. ఆ చర్యను సమర్థించినప్పుడు, ఆ కర్మను మీరు ఆకర్షిస్తారు. అది వచ్చి మీ జీవితంలో కలిసిపోతుంది. మీకు తెలియనే తెలియదు. దాన్ని మీరు అనుభవిస్తూ ఉంటారు. దుష్ట కాండను సమర్థించడమంటే ఏమిటి ? అది ఎలాంటి గుణమో ఆలోచించండి. విశ్లేషించండి ! ఇదే విధంగా మీరు జాతి, మత, కుల, గోత్ర, వంశం, కుటుంబం, ప్రాంతం, దేశం అని దురభిమానాన్ని, దురహంకారాన్ని కలిగి ఉంటే, మీ వాళ్ళు చేసిన "అకృత్యాలకు" మీరు కూడా ఫలితం అనుభవించాల్సి ఉంటుంది.

భూమి పైన ఉన్న అన్ని జాతులు, మతాలు, కులాలు, గోత్రాలు, కుటుంబాలు, వంశాలు, ప్రాంతాలు, దేశాలు అన్నీ గొప్పవే ! గౌరవించదగినవే !

సృష్టిలో ఉన్నతత్వం, నీచత్వం అనేవి ఉండవు. కేవలం భిన్నత్వం ఉంటుంది. అందరూ గొప్ప వాళ్ళే, అందరూ పవిత్రులే ! అందరూ అందరిని గౌరవించాలి, అందరూ అందరి పట్ల సమభావం కలిగి ఉండాలి.

మీరు మీ జాతి పట్ల, మతం పట్ల, కులం పట్ల, గోత్రం పట్ల, కుటుంబం పట్ల, వంశం పట్ల, ప్రాంతం పట్ల, దేశం పట్ల చివరికి మీ పట్ల కూడా మీరు సదభిప్రాయం, సదవగాహన, గౌరవం, ప్రేమ, పవిత్ర భావనలు కలిగి ఉండడంతో పాటు అందరి పట్ల కూడా ఈ భావాలనే కలిగి ఉండాలి.

మనమంతా ఒక్కటే ! మనమందరం మానవులం ! మనం ఉంటున్నది ఒకే భూమి ! పీలుస్తున్నది ఒకే గాలి ! అందరికీ ఒకే ఆకాశం ! అందరూ వాడేది ఒకే అగ్ని ! అందరికీ ఒకే జలం ! అందరికీ ఒకే శరీర ధర్మం ! ఎవరికైనా దాహం వేస్తే నీళ్ళు తాగితే దాహం తీరుతుంది ! అలాగే అన్నీ !

✪ ఒక సారి ఆలోచించండి ! ఏ దేశం వారో ఏదో ఒకటి కనుక్కుంటే దాని ప్రయోజనాలు మిగతా మానవులు అందరూ పొందటం లేదా ?? వాటిని అనుభవించటం లేదా ??

భూమి అంతా ఒకే దేశం ! మానవులంతా ఒకటే కుటుంబం ! అయితే కొంత మంది అజ్ఞానులు చేస్తున్న పనులకు మొత్తం మానవులలో చీలికలు, తేడాలు వస్తున్నాయి. ఈ చీలికలను, తేడాలను తక్షణమే శాశ్వతంగా భూమి పై నుండి మాయం చేయాలి. ఇందుకు మనమందరం కలసి కట్టుగా కృషి చేయాలి. ఇదే మన తక్షణ కర్తవ్యం !

నేను దైవాన్ని,

మీరూ దైవాలే,

అంతా దైవమే, అందరూ దైవాలే !

అనే భావనతోనే ఎల్లప్పుడూ ఉండాలి.

ఇతరుల వినాశనాన్ని కోరమని ఏ దేవుడూ చెప్పడు. అన్ని మతాలు పవిత్రమైనవే ! అయితే కొందరి అజ్ఞానం వలన మత కల్లోలాలు జరుగుతున్నాయి. కొందరి అజ్ఞానం వలన మొత్తం మతానికే చెడ్డ పేరు వస్తుంది.

కొందరు అజ్ఞానులు చేసే దుశ్చర్యలు మొత్తం మానవ జాతికే ప్రమాదంగా పరిణమిస్తున్నాయి. అంతా ఒక్కటే, అందరూ ఒక్కటే అనే ఏకత్వ భావనతోనే ప్రపంచ శాంతి సుసాధ్యమవుతుంది.

ఇతరుల నాశనాన్ని కోరుతూ చేసే ప్రార్థన, ప్రార్థన కాదు. ఇలాంటి ప్రార్థనలు ఎన్నటికీ ఫలించవు పైగా అలా ప్రార్థించే వారే నాశనం అవుతారు. ఇతరుల చెడు కోరుతూ చేసే కార్య కలాపాలు అవి చేసే వారికే హాని కలిగిస్తాయి.

వాస్తవానికి దైవం ఒక్కటే ! ఆ దైవాన్ని చేరుకునే రక రకాల మార్గాలే మతాలు. అన్నీ ఒక్కచోటికే దారి తీస్తాయి, కాక పోతే భిన్న మార్గాలు.

అంతా ఒక్కటే, అందరూ ఒక్కటే !

ఏకత్వ భావనలో ఉందాం, ఏకత్వాన్ని వ్యాపింప చేద్దాం !

ఏకత్వాన్ని స్థాపిద్దాం !

49. భూమికి మంచి చేయడమంటే మనకు మనం మంచి చేసుకోవడమే

ప్రధానంగా చెట్ల పెంపకం ద్వారా భూమికి ఎంతో మంచి చేయవచ్చు. ఇది జగమెరిగిన సత్యమే !

ఇది మన దివ్య భూమి, దీనిని భద్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిది.

✪ ఎన్నో జన్మల నుండి మనం ఇక్కడే ఉంటున్నాం. ఇంకా ఎన్నో జన్మలు ఇక్కడ ఉండాలి. కేవలం ఈ ఒక్క జన్మ గడిస్తేనే చాలనుకోకండి. మీకు అనుభవం కాకపోయినంత మాత్రాన జన్మలు లేవని అనుకోకండి. కొంత మంది "మా" ప్రకారం జన్మలు లేవు, ఉండవు అని అనుకుంటుంటారు. మనిషి అన్న ప్రతి వారికి జన్మలు ఉంటాయి. జన్మలుంటాయా అని ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఏమీ లేదు ఇందులో, ఇది ఒక సాధారణ, సహజ సత్యం అంతే ! ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తే దాని ఫలితం అనుభవించ బోయేది మనమే.

ఇప్పుడు లక్ష్య పెట్టి భూమిని కాపాడుకుంటే ఎంజాయ్ చేసేది మనమే. చెట్లను పెంచడం అంటే పెద్ద విషయం ఏమీ కాదు. కేవలం నాటడం అంతే ! మిగతా పని అంతా భూమే చూసుకుంటుంది కదా ! పెద్ద ఖర్చులతో కూడుకున్న వ్యవహారం కూడా కాదు. చేద్దాం అని అనుకుంటూ ఉంటారు, కాలం గడిచి పోతుంది. ఎప్పుడో మేలుకుని చేయాల్సిన పని ఇది. చెట్ల పెంపకం మన కోసమే అని గ్రహించాలి.

దయచేసి మొక్కలు నాటండి ! పచ్చదనాన్ని పెంచండి !

భూమి సస్యశ్యామలం అవుతే మన జీవితాలు కూడా సస్యశ్యామలమై సుభిక్షంగా ఉంటాయి. మన భూమి జై హో !

మన భూమి చాలా అందమైనది. మన భూమియే స్వర్గం.

మన భూమి శాంతి, కాంతి, ప్రేమ, ఉల్లాస
ఉత్సాహాలతో, ఉత్సవాలతో సదా శోభిల్లాలి !

మన భూమి పైన అందరూ ఆయురారోగ్య
ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలతో...
....సర్వదా విరాజిల్లాలి !

50. మానవ చైతన్యమే మూల చైతన్యం

✪✪✪ ఆధ్యాత్మిక శాస్త్ర పరంగా, నిరంతర ఆత్మ విజ్ఞాన అభ్యాసం + క్రమం తప్పని ధ్యాన సాధన ద్వారా సాధించలేనిది అంటూ ఏదీ ఉండదు. తలనొప్పి నుండి షుగర్, క్యాన్సర్(CANCER), ఎయిడ్స్(AIDS) వరకు ఏ రోగాన్నైనా తగ్గించుకోవచ్చు. ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చునని రామ్‌తా, సేత్, లూయి ఎల్. హే & ఇతర మాస్టర్లందరూ చెప్తారు.

✪✪✪ ఆత్మ విజ్ఞానం లేనందు వల్లనే శరీరంలో + జీవితంలో అన్ని అనారోగ్యాలు మరియు అన్ని కష్ట నష్టాలు వస్తాయి, ఉంటాయి. ఆత్మ విజ్ఞానం లోపించడం వలన మనం సరి కాని నమ్మకాలను, సరి కాని గుణాలను(స్వభావాలను) కలిగి ఉంటాము. ఈ సరి కాని వాటి నుండే అన్ని సమస్యలు పుడతాయి. ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలకు సంబంధించిన అనారోగ్యాలకు & కష్టాలకు వేరే కారణాలు ఉంటాయి. నేను ఇక్కడ మీకు ఇప్పుడు చెప్పినా అవి మీకిప్పుడే అర్థం కావు. తగిన పరిణితి లేనిదే చెప్పకూడదు.

✪✪✪ దయచేసి మరోసారి నన్ను చెప్పనివ్వండి - తలనొప్పి నుండి బి.పి., షుగర్, క్యాన్సర్ (CANCER), ఎయిడ్స్(AIDS) వరకు గల సర్వ సకల సమస్త అనారోగ్యాలకు, జబ్బులకు, రోగాలకు, వ్యాధులకు ఒకే ఒక్క కారణం - "ఆత్మ విజ్ఞానం లేక పోవటమే" ! మరే ఇతర కారణాలు లేవు, ఉండవు, ఉండలేవు. (కొన్ని ప్రత్యేకమైన కారణాలు ఉంటాయి, అయితే అవి అత్యున్నత ఆత్మ విజ్ఞాన స్థాయికి సంబంధించిన విషయాలు) ప్రస్తుతం భూమి పైన చెలామణిలో ఉన్న వైద్య శాస్త్రం - Medical Science కేవలం శరీరం పైన మాత్రమే పరిశోధనలు చేస్తూ ఉంది. వాస్తవానికి శరీరంలో ప్రకటం అవుతూ ఉన్న అన్ని అనారోగ్యాలకు "మూలాలు" శరీరంలో లేనే లేవు. శరీరంలో ఉన్న అనారోగ్యాలు కేవలం కొమ్మలు మాత్రమే ! అసలు వేర్లు "లోపల - అంతరంలో" ఉంటాయి. మూలాలైన వేర్లను శాశ్వతంగా పీకివేస్తే తప్ప మానవులకు శాశ్వతమైన, సంపూర్ణమైన, సమగ్రమైన, పటిష్ఠమైన ఆరోగ్యం సిద్ధించదు.

✪✪✪ నిరంతర ఆత్మ విజ్ఞాన అభ్యాసం + క్రమం తప్పని ధ్యాన సాధన వలన మనం ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను సులభంగా, శీఘ్రంగా పొందవచ్చు.

సింపుల్‌గా మీకర్థం అయ్యే విధంగా చెప్పాలంటే మనం రెండు రకాల చైతన్యాలను కలిగి ఉంటాం. ఒకటి మానవ చైతన్యం రెండు దివ్య చైతన్యం దీనినే మూల చైతన్యం అని కూడా అంటారు. మానవ చైతన్యాన్ని చేతనం లేక కాన్షియస్ మైండ్ అని అంటారు. నిజానికి రెండు విడిగా ఉండవు. మూల చైతన్యం యొక్క ఉపరితల భాగాన్నే మానవ చైతన్యం అని అంటారు. ఈ కాన్షియస్ మైండ్‌లో ఎన్నెన్నో జన్మల నుండి పోగైన సరి కాని గుణాలు(స్వభావాలు), సరి కాని నమ్మకాలు ఎన్నో ఉంటాయి. వీటి ప్రకారంగానే లోపల ఉన్న మూల చైతన్యం శరీరంలో + జీవితంలో పరిస్థితులను సృష్టిస్తూ ఉంటుంది. మనం మన కాన్షియస్ మైండ్‌లో ఎలాంటి గుణాలను(స్వభావాలను), నమ్మకాలను కలిగి ఉంటామో సరిగ్గా అదే విధంగా మన శరీరం + జీవితం ఉంటుంది.

మనం మన కాన్షియస్ మైండ్ పట్ల పూర్తి ఎరుకను కలిగి ఉండం. మన కాన్షియస్ మైండ్‌లో ఎలాంటి గుణాలు(స్వభావాలు), నమ్మకాలు ఉన్నాయో పూర్తిగా మనకు తెలియనే తెలియదు. మన శరీరంలోని + జీవితంలోని పరిస్థితులను మనం నిశితంగా పరిశీలిస్తే మనం మన లోపల ఎలాంటి గుణాలను(స్వభావాలను), నమ్మకాలను కలిగి ఉన్నామో గుర్తించవచ్చు.

మన అన్ని ఆనందాలకు, అన్ని సమస్యలకు మనం ఏర్పరుచుకున్న గుణాలే(స్వభావాలే), నమ్మకాలే కారణం. సరి అయిన గుణాలు(స్వభావాలు), నమ్మకాలు ఆనందాలను కలుగజేస్తే, సరి కాని గుణాలు(స్వభావాలు), నమ్మకాలు కష్టాలను సృష్టిస్తూ ఉంటాయి.

మన లోపల ఉన్న మూల చైతన్యాన్ని అంతర్ ప్రపంచం లేక అంతశ్చైతన్యం లేక దివ్య చైతన్యం అని అంటారు. మన అంతర్ ప్రపంచం యొక్క శక్తి అవధులు లేనిది. అనంతమైన దివ్య శక్తులను కలిగి ఉంటుంది. అంతర్ ప్రపంచానికి అసాధ్యం అనేది లేనే లేదు. మీరు మీ కాన్షియస్ మైండ్ ద్వారా ఎలాంటి సూచనలిస్తే అలాంటి పరిస్థితులను సృష్టించి మీకు అందజేస్తుంది అంతర్ ప్రపంచం. మీరు ఏం కోరుకుంటున్నారో అది నెరవేర్చడానికి అంతర్ ప్రపంచం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అంతర్ ప్రపంచం ఉన్నదే మన సేవ కోసం ! మనం ఏం చెబితే అది చేయడానికే అంతర్ ప్రపంచం ఉంది. అంతర్ ప్రపంచాన్నే భారతీయ వేదాల్లో, శాస్త్రాల్లో "అంతరాత్మ" లేక "అంతర్యామి" అని అంటారు. జీసస్ క్రైస్ట్ ఈ అంతర్ ప్రపంచాన్ని "దైవ సామ్రాజ్యం" అని అన్నాడు, కొంత మంది దీనిని "సబ్ కాన్షియస్ మైండ్‌గా వ్యవహరిస్తే మరి కొంత మంది దీనిని "డివైన్ కాన్షియస్" అని అంటారు. ఇంకొంత మంది "అల్ట్రా కాన్షియస్" అని కూడా అంటారు, ఇవన్నీ ఒకటే ! ఈ అంతర్ ప్రపంచంలో నుండి వచ్చే సూచనలనే "అంతర్వాణి" అని అంటారు.

ప్రధానంగా మనం చేయాల్సిన అత్యంత ముఖ్యమైన పని ఏమిటంటే మన కాన్షియస్ మైండ్‌లో ఉన్న సరి కాని గుణాలను(స్వభావాలను), నమ్మకాలను గుర్తించడం. ఎలా అని అంటే మీ శరీరంలో + జీవితంలో ఉన్న సమస్యల లిస్ట్ ఒకటి తయారు చేసుకోండి ఆ లిస్ట్‌లో ఎన్ని సమస్యలు, ఎన్ని భయాలు, ఎన్ని అనుమానాలు, ఎన్ని అభద్రతా భావాలు, ఎన్ని అయోమయాలు ఉంటే అన్ని సరి కాని గుణాలను(స్వభావాలను), నమ్మకాలను మీరు కలిగి ఉన్నట్టు లెక్క ! ఈ విధంగా చేయడంతో మీ యొక్క సరి కాని గుణాల(స్వభావాల), నమ్మకాల పునాదులు కూలి పోతాయి. క్రమం తప్పని సాధన ద్వారా త్వరగానే అన్నింటిని పూర్తిగా తీసివేయవచ్చు.

న్యూ ఏజ్ ఆత్మ విజ్ఞాన పుస్తకాలు బాగా శ్రద్ధగా చదవండి. ఆ తర్వాత ధ్యానంలో కూర్చుని మీరు చదివిన ఆ పుస్తకాలలో ఉన్న ఆత్మ విజ్ఞానాన్ని ఒక సారి గుర్తు చేసుకోండి. ఇప్పుడు..... "నేను చదివిన ఫలానా పుస్తకంలోని ఆత్మ విజ్ఞానాన్ని 100%గా అనుమతించాను" అని గాఢంగా అనుకోండి. ఉదాహరణకు మీరు సేత్ పుస్తకం చదివితే - సేత్ విజ్ఞానంలోని ఆత్మ విజ్ఞానాన్ని 100%గా అనుమతించాను అని గాఢంగా అనుకుని మీకు వీలైనంత సేపు ధ్యానంలో కూర్చోండి. అప్పుడు మీ లోపల ఉన్న మూల చైతన్యం, ఈ సరి కాని వాటన్నింటినీ తీసివేస్తుంది. ✪ మీ లోపల ఉన్న సరి కాని గుణాలను(స్వభావాలను), నమ్మకాలను సులభంగా, శీఘ్రంగా మార్చివేయడానికి ఇది ఒక చక్కని, అద్భుతమైన పద్ధతి !

నిజ జీవితంలో ఆత్మ విజ్ఞాన సూత్రాలను యథాతథంగా ఆచరిస్తూ ఉండాలి. రక రకాల అడ్డంకులు ఎదురవుతూ ఉంటాయి. పట్టుదలతో ఆత్మ విజ్ఞాన సూత్రాలను 100%గా విశ్వసిస్తూ ఉండాలి. ఈ విధంగా మీరు ఎల్లప్పుడూ ఏం జరిగినా, ఆత్మ విజ్ఞాన సూత్రాలను విశ్వసిస్తూ ఉంటే చాలు, ఆటొమెటిక్‌గా మీ లోపల ఉన్న సరి కాని గుణాలు(స్వభావాలు), సరి కాని నమ్మకాల వ్యవస్థ అంతా సరి చేయబడుతుంది. క్లియర్ అయ్యేవి క్లియర్ అయిపోతాయి.

మీ లోపల ఉన్న సరి కాని గుణాలు(స్వభావాలు), నమ్మకాలు కొత్తగా మీరు ఏర్పరుచుకుంటున్న సరి అయిన విశ్వాసాలకు అడ్డం పడుతూ ఉంటాయి. మీరు సరి కాని వాటి పట్ల ఎరుకను కలిగి ఉంటూ "సరి అయిన విశ్వాసాలకే" 100% ప్రాధాన్యం ఇవ్వాలి. ఆత్మ విజ్ఞాన సూత్రాలు 100%గా జరిగి తీరుతాయి, అని పూర్ణ విశ్వాసాన్ని కలిగి ఉండాలి. ప్రారంభంలో అవాంతరాలు ఎదురవుతుంటాయి. కొత్త "సరి అయిన విశ్వాసాలకు" తగిన ఎనర్జి చేకూరే దాక కొంచెం ప్రయాస తప్పదు. మనం పట్టుదలతో "సరి అయిన విశ్వాసాలకు" బలాన్ని అందిస్తూ ఉండాలి. వాటిని నమ్ముతూ ఉంటేనే బలపడతాయి. లోపల ఉన్న సరి కాని గుణాలు, నమ్మకాలు సమస్యలను యాంత్రికంగా సృష్టిస్తూనే ఉంటాయి. మనం 24 గంటలూ ఆత్మ విజ్ఞాన సూత్రాలను గుర్తు చేసుకుంటూ, విశ్వాసాన్ని కలిగి ఉంటే త్వరలోనే మనం సఫలం అవుతాము.

న్యూ ఏజ్ ఆత్మ విజ్ఞాన గ్రంథాలలోని విషయాలు మిమ్మల్ని ఆశ్చర్యానందాలకు గురి చేస్తుంటాయి. మళ్ళీ అదే సమయంలో మీ లోపలి నుండి అనుమానాలు, అభ్యంతరాలు ప్రకటం అవుతూ ఉంటాయి. సరి అయిన వాటికి, సరి కాని వాటికి ఘర్షణ ప్రారంభం అవుతుంది. మీరు ఏ పక్షాన నిలబడితే ఆ పక్షమే గెలుస్తుందని గుర్తుంచుకోండి. గుణాలు(స్వభావాలు), నమ్మకాలు అనేవి నిర్జీవాలు అని తెలుసుకోండి. మీరు ఆశ్రయం ఇచ్చినందుకే అవి మీ లోపల ఉంటూ మీ శక్తిని గ్రహించి బలపడి మిమ్మల్నే ఆటాడిస్తున్నాయని తెలుసుకోండి. మీరు మీ సరి కాని గుణాలను(స్వభావాలను), నమ్మకాలను గుర్తించి ఇక ఇవి నాకు అవసరం లేదు అని గట్టిగా, 100%గా అనుకుంటే తక్షణమే అవి పూర్తిగా తొలగిపోతాయని తెలుసుకోండి. అవి కేవలం మీ ఎరుక లేనందుకే ఉండగలుగుతున్నాయి, మీరు ఎరుకతో వాటిని గుర్తించిన మరుక్షణం మీ ఎరుక అనే ప్రజ్ఞాగ్నిలో అవి తక్షణమే పూర్తిగా భస్మం అయిపోతాయని తెలుసుకోండి.

మీరు న్యూ ఏజ్ ఆత్మ విజ్ఞాన గ్రంథాలలోని సత్యాలను 100% ఆచరిస్తూ ఉండాలి. ఆత్మ పూర్వకంగా విశ్వసిస్తూ ఉండాలి. ఎట్టి పరిస్థితులలోనూ చలించ కూడదు. ఎల్లప్పుడూ పాజిటివ్‌గా మాత్రమే ఉండాలి. విశ్వాసాన్ని ఎప్పుడు కూడా కోల్పోవద్దు. పరిస్థితుల ప్రభావం వలన మధ్యలో అప్పుడప్పుడు కృంగిపోయినా మళ్ళీ వెంటనే కోలుకోవాలి.

మీ వల్లనే మీ పరిస్థితులు కానీ, పరిస్థితుల వల్ల మీరు కాదనే సత్యాన్ని గుర్తు తెచ్చుకోవాలి.

ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోని "నవ రత్నాలను" ఆచరిస్తే మీరు సులభంగా, శీఘ్రంగా సఫలం అవుతారు.

మనం, మూడు పరిధులు(Three Dimensions) కలిగి ఉన్న ఈ భూమి పైన జన్మించడానికి కారణం ఏమిటంటే - భౌతిక పదార్థాన్ని, పరిస్థితులను, సంఘటనలను, వాస్తవాలను, మానవ చైతన్య వికాసాన్ని అధ్యయనం చేసి ఆత్మ పరిణామ క్రమంలో అభివృద్ధి చెందడానికి వచ్చాం.

ప్రతీ ఒక్కరూ ఆత్మ చైతన్య పరిణామాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోగలిగే శక్తి సామర్థ్యాలను అన్నింటిని లోపల పొందు పరుచుకుని జన్మించడం జరుగుతుంది. మీ లోపల అపారమైన శక్తి సామర్థ్యాలు, ఐశ్వర్యం, ఆనందాలు ఎన్నో మీ వినియోగానికి సిద్ధంగా ఉన్నాయి. మీ లోపల ఉన్నవి ఎన్నటికి తరిగిపోయేవి కావు, అవి అనంతం ! మీ లోపల ఉన్న మూల చైతన్యం మీరు కోరుకున్నదాని కంటే ఎక్కువే ఇస్తుంది కాని తక్కువైతే కాదు. మీ జీవితాలలో ఏది కావాలంటే అది సమకూర్చుకోగలిగే సర్వ, సకల, సమస్త శక్తి సామర్థ్యాలు మీరు మీ మూల చైతన్య రూపంలో కలిగి ఉన్నారు. ఈ

సృష్టిలో ఏ శక్తికీ మీరు తల వంచాల్సిన పని లేదు. ఏ శక్తి యొక్క దయాదాక్షిణ్యాల పైన ఆధారపడి జీవించాల్సిన అవసరం లేదు. మీకేం కావాలంటే దాన్ని సృష్టించి ఇవ్వగల మూల చైతన్యమే సాక్షాత్తు మీ లోపల ఉంది. మీకు కావాల్సినవి అందించడానికి సృష్టి సర్వస్వం సిద్ధంగా ఉంది. మీ లోపల ఉన్న మూల చైతన్య శక్తికి అసాధ్యం అనేది లేనే లేదు. మీరు ఎంత పెద్ద లక్ష్యం పెట్టుకున్నా సరే దానిని సులభంగా, శీఘ్రంగా, సురక్షితంగా నెరవేర్చే అనంతమైన శక్తి సామర్థ్యాలు మీ మూల చైతన్యం కలిగి ఉంది. మీరు ఒక కొత్త లోకం కావాలన్నా దానిని సృష్టించి ఇస్తుంది. ప్రస్తుతం మీరు ఎలాంటి పరిస్థితులలో ఉన్నా సరే, పూర్తిగా మీ పరిస్థితులను ఒక్కసారిగా అదుపులోకి తెచ్చుకుని మీకు అనుగుణంగా మార్చుకునే శక్తి సామర్థ్యాలను మీరు ఇప్పుడే కలిగి ఉన్నారు. మీ మూల చైతన్య శక్తి మీ రూపు, రంగు, ఎత్తు, బరువు, ఆకారం, వయసు, లింగం పైన ఆధారపడి ఉండదు. మీరు ఎవరైనా, ఎక్కడ పుట్టినా, ఏ దేశానికి చెందిన వారైనా, ఏ ప్రాంతం వారైనా, ఏ మతం వారైనా, ఏ కులం వారైనా, స్త్రీ అయినా, పురుషుడైనా, అటూ ఇటూ కాని వారైనా, ఎవరైనా సరే, అందరూ అనంతమైన మూల చైతన్య శక్తిని కలిగి ఉన్నారు.

గుర్తుంచుకోండి ఈ సృష్టి సర్వస్వాన్ని సృష్టించిన మూల చైతన్య శక్తి ఏదైతే ఉందో, ఆ మూల చైతన్య శక్తిలోని ప్రధానమైన భాగాలే మీరు. సాక్షాత్తు ఆ మూల చైతన్య శక్తి మీ లోపలే ఉంది. మిమ్మల్ని సేవించడానికి, రక్షించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

మీ లోపల ఉన్న మీ మూల చైతన్య శక్తి గురించి తెలియక మీరు ఉన్నారు. మీరు మీ అపోహలను తొలగించుకుని మీ మూల చైతన్య శక్తిని వినియోగించుకోవడం నేర్చుకోండి. సాధన చెయ్యండి. ఆత్మ విజ్ఞాన పుస్తకాలను బాగా చదవండి.

అజ్ఞానంతో అశక్తులమని భావిస్తూ ఉన్నారు కాబట్టే మీరు నిస్సహాయంగా దీనంగా, మీ పరిస్థితుల ముందు మోకరిల్లి ఉన్నారు. మానవులుగా ఉన్న మీరు సాక్షాత్తు దైవాలే మిత్రులారా ! లేవండి ! మేలుకోండి ! నడిచే మూల చైతన్య స్వరూపాలే మీరు ! ఓ నా మూల చైతన్యమా అని పిలిచినంత మాత్రాన మిమ్మల్ని రక్షించడానికి సిద్ధంగా ఉంది మీ మూల చైతన్యం. ఎప్పటికైనా, ఎన్ని జన్మలకైనా, ఏ నాటికో ఒక నాటికి నన్ను పిలవక పోతారా అని ఎదురు చూస్తూ మీ లోపలే మూల చైతన్యం సిద్ధంగా ఉంది.

మీ గురించి మీరేం అనుకున్నా, తన గురించి ఏం అనుకుంటున్నా వాటన్నింటినీ పట్టించుకోకుండా మీ పిలుపుకై ఎంతో ప్రేమగా, సహనంగా ఎదురు చూస్తూ ఉంది మీ మూల చైతన్యం. అజ్ఞానంలో కూరుకు పోయి అనవసరమైన బాధలను కొని తెచ్చుకుంటూ నరకయాతనలను అనుభవిస్తూ ఉంటే నిగూఢంగా సూచనలనిస్తూ మిమల్ని బాగు చేస్తూనే ఉంది మీ మూల చైతన్యం.

✪ మీ శరీరంలో తలనొప్పి నుండి క్యాన్సర్, ఎయిడ్స్ వరకు వచ్చే రోగాలు ఏ వైరస్‌ల వల్లనో రావటం లేదు. కేవలం మీ సరి కాని గుణాల(స్వభావాల) వలన, మీ సరి కాని నమ్మకాల వలన వస్తున్నాయి. అజ్ఞానంతో రక రకాల చెత్తనంతా పోగు చేసుకున్నందు వలన రోగాలు, సమస్యలు వస్తున్నాయి.

మానవ చైతన్యం పట్ల సరి అయిన అవగాహన లేక పోవటం వలన రోగాలు, సమస్యలు వస్తున్నాయి. ఎంత పెద్ద రోగాన్నైనా, ఎంత పెద్ద సమస్యను అయినా ఆత్మ విజ్ఞానం + ధ్యానం ద్వారా సులభంగా, శీఘ్రంగా తీసివేయవచ్చని తెలుసుకోండి.

51. మనం అనంత దివ్య శక్తి స్వరూపులం

మానవ శరీరాన్ని ధరించిన మూల చైతన్యమే మనం !

మూల చైతన్యానికి ఎన్ని అనంత దివ్య శక్తులు ఉంటాయో అవన్నీ మనం కలిగి ఉంటాం, అని అనేది నిజమే అయినా ఇది పూర్ణ సత్యం కాదు. సాక్షాత్ మూల చైతన్యమే మనం అయినప్పుడు, ఇలా అనడం ద్వారా మూల చైతన్యానికి మనకు భేదం ఏర్పడుతుంది.

కాబట్టి మనమే మూల చైతన్యం ! మనకు అనంత దివ్య శక్తులున్నాయి ! ఇదే పరమ సత్యం !

మరి ప్రస్తుతం మనం ఎందుకు కలిగి లేము అని అంటే, అవి ఉన్నాయని తెలియక పోవడం ఒక కారణమైతే, అవి అవసరం అని అనుకోక పోవడం రెండవ కారణం !

❖ ❖ ❖

52. మీరు కష్టాల్లో ఉన్నారా ? అయితే వాటిని వదిలించుకోవడం సులభమే !

కష్టాలను సులభంగా వదిలించుకోగలుగుతామా ?! అని ఆశ్చర్యపోకండి, సావధానంగా ఉండి చదవండి, మీకే అర్థం అవుతుంది.

శరీరంలో + జీవితంలో ఉన్న కష్టాలు ఎన్నెన్నో ? వాటి లిస్ట్ తయారు చేయాలంటే ఓ పెద్ద గ్రంథమే తయారవుతుంది. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న కష్టాలు మీకెలా వచ్చాయి ? ఇది అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుని ఉన్న ప్రశ్న !

ప్రస్తుతం మీ శరీరంలో + జీవితంలో ఉన్న కష్టాలు ఎలా వచ్చాయి ?

ఇప్పుడు మీరు అనుభవిస్తున్న కష్టాల కోసం మీరు ప్రత్యేకంగా ఏమైనా సాధన చేసారా ??

రాత్రింబవళ్ళు అర్జునుడు విలు విద్యను సాధన చేసినట్టు ఏమైనా మీరు కూడా చేసారా ?

కష్టాలు ఎలా తెచ్చుకోవాలో ఎక్కడైనా అడిగి తెలుసుకుని మరీ కష్టాలను కొని తెచ్చుకున్నారా ? కోచింగ్ ఏమైనా తీసుకున్నారా ? ఫీజులు ఏమైనా కట్టారా ?

ఒక్క సారి ఆలోచించండి ! ఎలా వచ్చాయి మీ శరీరంలోకి + జీవితంలోకి ఇన్ని కష్టాలు ? కేవలం మీరు ఆలోచించినంత మాత్రాన పటాపంచలై "పోతాయి" !

కేవలం మీరు "ఎంచుకున్నంత" మాత్రాన ఈ కష్టాలు వచ్చాయి. కష్టాలను అధ్యయనం చేసేందుకు పూనికతో మీరు తీసుకున్న నిర్ణయాల వల్ల ఈ కష్టాలు

వచ్చాయి. మీరు మీ "ఎంపికలను" క్షణంలో మార్చుకోవచ్చు. నిజంగా నిజం మిత్రులారా ! కేవలం ఒకే ఒక క్షణంలో మీ "ఎంపికలను" మార్చుకోవచ్చు. నేను అనుభవిస్తున్న, నా శరీరంలోని + జీవితంలోని కష్టాలను నేనే ఎంచుకున్నాను, ఇప్పుడు ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను ఎంచుకున్నాను అనే ఒకే ఒక్క "ఎంపిక" ద్వారా, ఒకే ఒక "నిర్ణయం" ద్వారా మీ శరీరంలోకి + జీవితంలోకి, ఆరోగ్య ఐశ్వర్య ఆనందాలు వెల్లువలా వచ్చి పడతాయి. కేవలం మీరు ఎంచుకున్నంత మాత్రాన కష్టాలు మిమ్మల్ని వెతుక్కుంటూ రాలేదా ? అదే విధంగా సౌభాగ్యాలు కూడా మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి. సృష్టిలో ఈ రెండింటికీ ఒకే నియమం ఉంటుంది. కష్టాలు అప్రయత్నంగా, ఏ సాధన చేయకుండానే మీకు వచ్చినప్పుడు, సరిగ్గా అదే విధంగా ఆనందాలు కూడా సాధన చేయకుండానే మీ శరీరంలో + జీవితంలో ఉద్భవిస్తాయి.

ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొందాలంటే ఎంతో సాధన చేయాలి అని మీలో ఒక నమ్మకం ఉంది. అందుకే మీరు సౌభాగ్యాలను సులభంగా, వెంటనే పొందలేక పోతున్నారు. సౌభాగ్యాలు అంత సులభంగా రావు అనే మీ నమ్మకమే వాటిని అడ్డుకుంటూ ఉంది. ఈ నిజాన్ని మీరు గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సౌభాగ్యాలను వెంటనే పొందాలంటే మామూలు విషయం కాదు అనే మీ నమ్మకమే మీకు అన్ని సౌభాగ్యాలను దూరం చేస్తూ ఉంది.

ప్రియ మిత్రులారా ! ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొందడం చాలా కష్టం అనే మీ యొక్క "నమ్మకాన్ని", వీటిని అనుకున్న వెంటనే పొందడం "చాలా సులభం" అని మార్చుకోవడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. ఎలా నమ్మకాన్ని మార్చుకోవడం అని అంటే - ఈ విషయాలను మీరు 100% ఒప్పుకుంటే సరి పోతుంది. "చాలా సులభం" అనే సత్యాన్ని మీరు నమ్మడం మొదలు పెడితే సరి పోతుంది.

మీలో ఉన్న "చాలా కష్టం" అనే నమ్మకం, ఈ విషయాలపై ఎన్నో అభ్యంతరాలను లేవ దీస్తుంది. ఎన్నో ప్రశ్నలను సంధిస్తుంది. ఎన్నో రుజువులను అడుగుతుంది. మీలో ఉన్న "చాలా కష్టం" అనే నమ్మకం నుండి పుట్టే అనుమానాలను ఏ మాత్రం పట్టించుకోకండి. దానిలో నుండి వచ్చే ఏ ప్రశ్నకైనా జవాబు వెతికే ప్రయత్నం చేయకండి. మీలో ఉన్న "చాలా కష్టం" అనే నమ్మకం మీరు ఎర్పరచుకున్నదేనని తెలుసుకోండి. దాన్ని సృష్టించిన సృష్టికర్త మీరేనని గ్రహించండి. సృష్టించిన సృష్టికర్తకు దాన్ని క్షణంలో తీసివేసే శక్తి సామర్థ్యాలు + అధికారం సంపూర్ణంగా ఉన్నాయని తెలుసుకోండి.

"చాలా సులభం" అనే నమ్మకాన్ని నమ్మడం మొదలు పెట్టండి. 24 గంటలు "చాలా సులభం, సరళం, తక్షణం" అనే నమ్మకాన్ని స్మరిస్తూ ఉండండి. నేను ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొందడం "చాలా సులభం, సరళం, తక్షణం" అని నమ్మడం మొదలు పెట్టండి. కేవలం కొద్ది రోజుల్లోనే ఇది సాధ్యమై సంభవిస్తుంది. ఇది సత్యం ! పరమ సత్యం !!

కేవలం ఈ విషయాలను గురించి ఆలోచించండి, 100%గా విశ్వసించండి. మీలో ఉన్న "చాలా కష్టం", "అసాధ్యం" అనే నమ్మకాల వల్లనే మీ శరీరంలో + జీవితంలో కష్టాలు ఉన్నాయనే సత్యాన్ని మీరు అర్థం చేసుకుని తీరాలి. పైనున్న ఏ అదృశ్య శక్తులో, గ్రహ నక్షత్ర రాశులో, దయ్యాలో, భూతాలో కాదు మీకు కష్టాలు తెచ్చి పెట్టేది. మీలో ఉన్న సరి కాని నమ్మకాలే మీకు కష్టాలను తెచ్చి పెడుతున్నాయని దయచేసి తెలుసుకోండి.

మీ లోపల ఉన్న మూల చైతన్యం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తూ ఉంది. ఎన్నో జన్మలుగా, ఎంతో సహనంగా ఎదురు చూస్తూ ఉంది. మీరు "నేను ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొందడం చాలా సులభం, సరళం, తక్షణం" అని నమ్మడం మొదలు పెట్టండి. అంతే ! మీ నమ్మకాన్ని సంపూర్ణంగా, సమగ్రంగా, అత్యంత శక్తివంతంగా తయారు చేసే బాధ్యత మూల చైతన్యం చూసుకుంటుంది.

వెంటనే, మీరు ఈ క్షణం నుండే నమ్మడం ప్రారంభించండి. ఒక అయిదు నిమిషాలు ఈ పుస్తకాన్ని పక్కన పెట్టి కళ్ళు మూసుకుని ఈ నమ్మకాన్ని ఒక్కసారి తలుచుకుని, ఓ నా మూల చైతన్యమా నా ఈ కొత్త సరి అయిన నమ్మకాన్ని తక్షణమే పూర్ణంగా వికసించేలా చేయి అని ఒకే ఒక సారి చెప్పండి చాలు ! మీరు ఎరుకతో, కేవలం ఒక్కసారి చెప్పినంత మాత్రాన, ఇక మిగిలిన పనంతా మీ మూల చైతన్యమే చూసుకుంటుంది.

మీరు ఈ నిర్ణయానికి ఎప్పుడొస్తారా ? ఎప్పుడెప్పుడు మీకు ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను అందిద్దామా అని ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్న మీ మూల చైతన్యానికి అవకాశం ఇవ్వండి. 100% మీరు నమ్మడం మొదలు పెట్టడం ప్రారంభించిన మరుక్షణమే మీ లోపల అన్ని మార్పులు జరిగి పోతాయి. అన్ని రకాల సెటింగ్స్, క్లియరెన్స్‌లు అయిపోతాయి.

నేను ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొందడం చాలా సులభం, సరళం, తక్షణం - అని నమ్మడం మొదలు పెట్టండి, ఇక అప్పుడు చూడండి మీ శరీరంలో + జీవితంలో జరిగే ఆనందాద్భుతాలను విస్మయంతో !

All The Very Best !

53. కలలే సత్యాలు !

ఊహలే వాస్తవాలు !

పగటి కలలే పచ్చి నిజాలు !

ఆలోచనలే పరిస్థితులు !

కల అంటే ఆషామాషీ పదం కాదు. కల అని అంటే సృష్టించడం అని అర్థం. కలలు కనడం అంటే సృష్టించడం అని అర్థం. కలలే సత్యాలు అవుతాయి. ఊహ అంటే ఊపిరి పోయడం అని అర్థం. మరి ఊహలే వాస్తవాలవుతాయి. పగటి కలలు అంటే ఎరుకతో సృష్టించడం అని అర్థం. పగటి కలలే పచ్చి నిజాలవుతాయి. ఆలోచించడం అని అంటే పరిస్థితికి ప్రాణం పోయడం అని అర్థం. ఆలోచనయే పరిస్థితిగా మారుతుంది మరి ! ఈ పరమ సత్యాలు మానవులకు తెలియకుండా జాగ్రత్త పడ్డారు కొంత మంది ! సృష్టి కీలక సిద్ధాంతాలను మానవులకు అనుమానం రాకుండా "కల, ఊహ, ఆలోచన, భావన" అనే పరమ సత్యాలను "ఒట్టి లొల్లాయి పదాలుగా" మార్చివేసారు. దివ్య మానవులను, సాధారణ మానవులుగా చేసి పారేశారు.

అనంత సృష్టిని సృష్టించిన మూల చైతన్యపు సాక్షాత్ స్వరూపాలే మానవులు. అంతటా, అందరిలోనూ ఆ మూల చైతన్యమే విరాజిల్లుతూ ఉంది. ప్రతీ మానవుడూ సృష్టి కర్తయే !

మీ శరీరంలోని + జీవితంలోని సరి అయిన పరిస్థితులు, సరి కాని పరిస్థితులు ఎలా సృష్టించబడ్డాయి అని అనుకుంటున్నారు ? మీ కలల వల్లనే, మీ ఊహాల వల్లనే, మీ భావనల వల్లనే, మీ ఆలోచనల వల్లనే ! అలా సృష్టించుకుంది స్వయంగా మీరే !

ఆత్మ విజ్ఞానం లేకపోవడం వలన సరి కాని పరిస్థితులను సృష్టించుకున్నారు. ఇప్పుడు ఈ సత్యాలను తెలుసుకుని సరి అయిన పరిస్థితులను సృష్టించుకోండి. ఇది చాలా సులభం సరళం మరి తక్షణమే సంభవం !

మీ అన్ని సమస్యల లిస్ట్ ఒకటి తయారు చేసుకోండి. ఒక్కొక్క దాన్ని ఎంచుకుని అది క్లియర్ అయిపోయినట్టుగా కలలు కనండి, ఊహించండి. అంతే ! అవి వెంటనే క్లియర్ అయిపోతాయి. ఆశ్చర్యంగా ఉందా ? పరమ సత్యం ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది మరి !

ఉదాహరణకు మీరు ఒక పెద్ద అనారోగ్యంతో బాధ పడుతున్నారనుకోండి, అప్పుడు మీరు తక్షణమే సంపూర్ణమైన, సమగ్రమైన, పటిష్ఠమైన ఆరోగ్యాన్ని పొందినట్టు, బలంగా, దృఢంగా, శక్తివంతంగా తయారైపోయినట్టు కలలు కనండి. ఊహించండి. అంతే ! అది జరిగి తీరుతుంది.

మీరు డబ్బుల సమస్యతో బాధ పడుతూ ఉంటే, మీరు ఐశ్వర్యంతో తులతూగుతున్నట్టు కలలు కనండి. విస్తారంగా మీకు డబ్బు అందుతున్నట్టు ఊహించండి. ఈ విశ్వంలో అనంతమైన ఐశ్వర్యం మీరు అనుభవించి ఎంజాయ్ చేయడానికి సిద్ధంగా ఉంది. అది ఎన్నటికీ తరగని, కరగని ఐశ్వర్యం అని తెలుసుకోండి. విశ్వంలోని అనంత ఐశ్వర్యంలోని ఒక్క బిందువుకు భౌతిక రూపం ఇస్తే ప్రపంచంలోని ప్రతీ వ్యక్తీ "బిల్ గేట్స్" అంత ధనవంతుడవుతాడని తెలుసుకోండి. మీ ఆలోచనల్లో, మీ ఊహల్లో ఐశ్వర్యాన్ని అనుమతించక పోయినందు వల్లనే మీరు ఐశ్వర్యాన్ని కలిగి లేరన్న నిజాన్ని గ్రహించండి. ఈ సృష్టిలో ఎవరైనా సరే అతని ఆలోచనల్లో దేనినైనా అనుమతించినప్పుడే అది అతని జీవితంలో సంభవిస్తుందన్న సత్యాన్ని తెలుసుకోండి.

నిజానికి మీరు ప్రత్యేకంగా దేనినీ సృష్టించాల్సిన అవసరమే లేదు. సృష్టిలో మీరు ఊహించగలిగిన ప్రతీది సృష్టించబడి సిద్ధంగా ఉన్నాయనే పరమసత్యాన్ని ఈ క్షణమే నమ్మండి. అన్నీ ఆల్‌రెడి సృష్టించబడి ఉన్నాయి కాబట్టే దీనిని "సృష్టి" అని అంటున్నారని తెలుసుకోండి.

✪✪✪ కేవలం మీరు చేయాల్సింది సృష్టించబడి సిద్ధంగా ఉన్న వాటిల్లోంచి మీ ఆలోచనల ద్వారా ఎంచుకుని ఊహించడమే ! సరదాగా, ఆహ్లాదకరంగా మీరు ఊహించినంత మాత్రాన మీ ఊహలు ఊపిరి పోసుకుని వాస్తవాలుగా మారిపోతాయి. ఇదే పరమ సత్యం ! గుర్తుంచుకోండి, గంభీరంగా, సీరియస్‌గా, భారంగా, టెన్షన్‌తో ఉండకూడదు. తేలికగా, చాలా కూల్‌గా, ఆనందంగా ఉంటూ, ఉత్సాహంగా, ఉల్లాసంగా, సరదాగా ఊహించాలి. హాయిగా, ధీమాగా, ప్రశాంతంగా ఊహించడం

అన్నది చాలా కీలకమైన పాయింట్. ఇది మీరు గుర్తుంచుకొని తీరాలి. మీరు కోరుకుంటున్నది రిలాక్స్‌గా ఊహించండి. ఊహల్లో పూర్తి స్థాయి ఫీలింగ్స్‌తో అనుభవించండి. ఇతర ఏ ఆలోచన లేకుండా, 100% పాజిటివ్‌గా, అవి ఏవైనా సరే, ఎలాంటి కోరికలైనా సరే, ఈ కోరిక సరి, ఈ కోరిక సరి కాదు అని ఏమీ లేదు. మీరు దివ్యులు, మీ కోరికలన్నీ దివ్యాలేనని గుర్తుంచుకోండి. సమాజం మీకు అంటగట్టిన "తప్పు ఒప్పులను" పూర్తిగా పక్కకు పెట్టండి. మీ కోరిక, మీ అవసరం, మీ ఇష్టం అంతే ! మీరు ఎలా ఊహించినా మీ ఊహలను ఎంతో ఆదరంగా, ప్రేమగా, ఉత్సుకతతో, ఆనందంగా మీ లోపల ఉన్న మూల చైతన్యం వాటిని వాస్తవాలుగా మలుస్తుంది.

✪✪✪ అత్యున్నతమైన దైవ న్యాయంలో తప్పు ఒప్పులు ఏవీ ఉండవని, ఈ తప్పు ఒప్పులనేవి మానవ కల్పితాలేననీ వీటితో "మూల చైతన్యానికి" ఏమీ సంబంధం లేదని మీరు తెలుసుకొని తీరాలి. సృష్టి సర్వస్వంలో వ్యాపించి ఉన్న మూల చైతన్యానికి సంబంధించినంత వరకు మీరు ఎంతో ప్రాముఖ్యత కలవారు. మీరు ఎలాంటి గుణాలను కలిగి ఉన్నా, మీరు ఎలాంటి ఆలోచనలను చేస్తూ ఉన్నా ఆ మూల చైతన్యం సదా మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటుంది. సర్వదా మిమ్మల్ని రక్షిస్తూ మీ లోపలే మీరుగా విరాజిల్లుతూ ఉంటుంది. "ఇది మంచి, ఇది చెడు" అనే భేదాలు మీరు సృష్టించుకున్నవేనని తెలుసుకోండి.

✪✪✪ సరి కాని ఊహలతో ప్రమాదాలలో చిక్కుకున్న మీరు, సరి అయిన ఊహలతో క్షణంలో మళ్ళీ ఆ ప్రమాదాలలో నుండి సురక్షితంగా బయట పడవచ్చునని తెలుసుకోండి. "మీకేం కావాలో మీకు స్పష్టంగా తెలిసి ఉండాలి" ! ఇది ప్రధానమైన అంశం. విశ్వం ఏం చేస్తుందో చేయనీ అని ఎప్పుడూ అనకూడదు. ఎందుకంటే విశ్వం ఎప్పుడూ ఏమీ చేయదు, ఒక వేళ ఏమైనా చేస్తే శ్రేయస్కరంగానే చేస్తుంది, హాని మాత్రం చేయదు. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఉంది అదేమిటంటే, "విశ్వానికి వదిలేసాను అని మీరు అన్నప్పుడు అది నిజంగా, 100%గా వదిలేస్తే శ్రేయస్కరంగానే జరుగుతుంది ఖచ్చితంగా" ! కాని మీరు విశ్వానికి వదిలేసాను అన్నది కేవలం ఉపరితలంలో మాత్రమే అయితే అప్పుడు, మీ లోపల ఉన్న ఆలోచనల ప్రకారం ఫలితాలు వస్తాయి. సరి అయిన భావాలు ఉంటే సరి అయిన ఫలితాలు, సరి కాని భావాలు ఉంటే సరి కాని ఫలితాలు వస్తాయి. మీ లోపల ఉన్న సరి కాని భావాల గురించి తెలియని మీరు "అరె... ఇదెలా జరిగిందబ్బా ! నేను విశ్వానికి వదిలేసాను కదా, అయినా ఇలా ఎలా జరిగింది" ? అని మీరు ఆశ్చర్యపోతూ, తప్పు మీలో ఉంచుకొని విశ్వాన్ని నిందిస్తారు. అయితే మరి మా లోపలి గురించి మాకు తెలియదు కదా, మా లోపల ఉన్న భావాలను మేమెలా గుర్తించేది ? అని అంటే, మీ లోపల ఏమైనా ఉండనీగాక వాటిని అలా పక్కకు పెట్టి, మీరు ఈ విధంగా అనుకోవాలి - "నేను నా కాన్షియస్ మైండ్ నుండి ఆదేశిస్తున్నాను, ఈ నా కోరికకు వ్యతిరేకమైనవి నా లోపల ఏమైనా గనక ఉంటే అవి తక్షణమే నా

కోరికకు అనుకూలంగా మారి పోవాలి లేదా తొలగి పోవాలి" అని అనుకున్న తర్వాత మీ కోరికను కోరుకోవాలి. మీరు ఇలా చేసినప్పుడు మీ కోరికను మీరు సంపూర్ణంగా, సమగ్రంగా అనుమతించినట్టవుతుంది. మరి, అప్పుడు అది నెరవేరియే తీరుతుంది.

✪✪✪ మీరు వేటి చేతిలోనూ బందీలు కారు. ఉన్న పలాన, ఇప్పుడు, ఈ ప్రస్తుతంలో ఉన్నది ఉన్నట్టుగానే మీరు అత్యంత శక్తివంతులు. మీ లోపల, మీకు తెలియకుండా ఎన్ని సరి కాని గుణాలు(స్వభావాలు), నమ్మకాలు, అభిప్రాయాలు ఉన్నా సరే, వాటి చేతిలో మీరు కీలు బొమ్మలు కారు. ఈ సత్యం తెలియక పోతే మీరు మీ భావాల చేతిలో కీలు బొమ్మలు, ఈ సత్యం తెలిస్తే కాదు. మీ "కాన్షియస్ మైండ్" ద్వారా మొత్తం మీ చైతన్య సర్వస్వాన్ని మీ అదుపులో ఉంచుకుని, మీ చైతన్యాన్ని మీ ఇష్టం వచ్చినట్టుగా వాడుకోవచ్చు. గుర్తుంచుకోండి, మీ "కాన్షియస్ మైండే" కంట్రోలింగ్ స్టేషన్ ! మీ "కాన్షియస్ మైండ్" అత్యంత శక్తివంతమైనది. మీ "కాన్షియస్ మైండ్" మీ లోపల ఉన్న మూల చైతన్యంతో పూర్ణమైన అనుసంధానాన్ని కలిగి ఉంటుంది. మీ "కాన్షియస్ మైండ్"లో మీరేం అనుకుంటే అది మీ "మూల చైతన్యంలో అనుకున్నట్టే" ! నిజానికి మీ "కాన్షియస్ మైండ్" మరియు మీ "సూపర్ కాన్షియస్ మైండ్(మూల చైతన్యం)" వేరు వేరు కాదు. మీ సూపర్ కాన్షియస్ మైండ్ యొక్క ఉపరితల భాగమే మీ "కాన్షియస్ మైండ్" ! మీ "కాన్షియస్ మైండ్"ను సరి అయిన విధంగా వినియోగించుకోవడం నేర్చుకోండి. సేత్ విజ్ఞానం చదివితే మీకింకా చాలా వివరాలు తెలుస్తాయి. మీ "కాన్షియస్ మైండ్" ద్వారా మీరెలాంటి ఆదేశాలను (సందేశాలను / కోరికలను / లక్ష్యాలను) ఇస్తే మీ లోపల ఉన్న మూల చైతన్యం ఆ విధంగానే పరిస్థితులను సృష్టిస్తుంది.

✪✪✪ గుర్తుంచుకోండి, మీ కాన్షియస్ మైండే - మీ అల్ట్రా కాన్షియస్ మైండ్ !

✪✪✪ గుర్తుంచుకోండి "కేవలం మీ ఊహలను(కలలను / భావనలను / ఆలోచనలను) యథాతథంగా వాస్తవాలుగా మలచడం అనేది మూల చైతన్యానికి అత్యంత అవసరమే కాక అది బాధ్యత కూడానని తెలుసుకోండి. మీ ఊహలను వాస్తవాలుగా మలిచి మీ కోరికలను నెరవేరిస్తే మూల చైతన్యానికి ఏం ఒరుగుతుంది ? అనే ప్రశ్న మీలో ఉద్భవించే అవకాశం ఉంది. మీ గురించి మీకు తెలియక ఇలా అనుకుంటున్నారంతే ! వాస్తవానికి మీరు, ప్రతి ఒక్కరు ఆ యొక్క మూల చైతన్యంలోని ప్రధానమైన భాగాలని తెలుసుకోండి. మీ ఊహలను నెరవేర్చడం ద్వారా మూల చైతన్యం తనను తాను విస్తరించుకుంటుంది అనే సర్వోన్నతమైన సత్యాన్ని మీరు గ్రహించి తీరాలి. మీరు ఊహించే ప్రతి ఊహ(కోరుకునే ప్రతి కోరిక / చేసే ప్రతి పని) వాస్తవ రూపం ధరించడం ద్వారా యావత్ సృష్టి పైనా తనదైన ప్రభావాన్ని కలిగించి, సృష్టి యొక్క విస్తరణకు తోడ్పడుతుంది అనే నిజాన్ని మీరు తెలుసుకుని తీరాలి. అవి ఎలాంటివైనా సరే మీ కోరికలను ఊహల్లో నిస్సంకోచంగా, నిస్సందేహంగా అనుభవించండి. మీ కోరికలను, మీ ఊహల్లో ఫీలింగ్స్‌తో సహా అనుభవించండి.

✪✪✪ కల, ఊహ, భావన, ఆలోచన అనేవి బీజాలు. ఈ బీజాల్లోంచే వాస్తవాలు, పరిస్థితులు ఉద్భవిస్తాయి అనే సత్యాన్ని అవగాహన చేసుకోవాలి. బీజం లేనిదే ఫలం ఏ విధంగానైతే రాదో, అదే విధంగా మీరు కల కననిదే, ఊహించనిదే, ఆలోచించనిదే వాస్తవం లేక పరిస్థితి అనేది తయారు కాదు. పిండి అనేది ఊహ(కల / భావన / ఆలోచన) అయితే, రొట్టె అనేది వాస్తవం లేక పరిస్థితి అని అర్థం చేసుకోండి. పిండి లేనిదే రొట్టె ఎలా తయారు కాదో, అదే విధంగా ఊహ(కల / భావన / ఆలోచన) లేనిదే వాస్తవం లేక పరిస్థితి అనేది తయారు కాలేదు. ఇక్కడ పిండి వేరే, రొట్టె వేరే కాదు. పిండియే రొట్టెగా మారింది. సరిగ్గా ఇదే మాదిరిగా ఊహ(కల / భావన / ఆలోచన) వేరే, వాస్తవం(పరిస్థితి) వేరే కాదు. ఊహయే(కలయే / భావనయే / ఆలోచనయే) వాస్తవంగా(పరిస్థితిగా) మారుతుంది.

✪✪✪ మీ ఊహల(కల / భావన / ఆలోచన) పట్ల ఎరుకతో ఉండండి. మీ ఊహలే(కల / భావన / ఆలోచన) వాస్తవాలుగా(పరిస్థితులుగా) మారుతాయి అనే సత్యాన్ని మీరు సర్వదా స్మృతిలో ఉంచుకోవాలి. మీ ఊహల(కల / భావన / ఆలోచన) పట్ల సదా ఎరుకతో ఉంటూ ఎల్లప్పుడూ 100% పాజిటివ్ ధోరణినే కలిగి ఉండాలి. ఈ విధంగా చేయనందుకే ప్రస్తుతం మీరు మీ శరీరంలో + జీవితంలో కష్టాలను అనుభవిస్తున్నారు. ఈ విషయాన్ని దయచేసి సర్వదా గుర్తుంచుకోండి.

ఇప్పుడు మీరు అనుభవిస్తున్న జీవితం ఆ విధంగానే మీరు స్వయంగా సృష్టించుకున్నదేనని తెలుసుకోండి. నెగెటివ్ పరిస్థితులను సృష్టించడానికే ఎక్కువ శక్తి కావాల్సి వస్తుంది. ఆనందాలే తేలికగా ఉద్భవిస్తాయి.

✪✪✪ మీ రూపు, రంగు, ఎత్తు, బరువు, ఆకారం దేనినైనా కేవలం
మీరు ఊహించినంత మాత్రాన మీ ఊహలకు అనుగుణంగా
మారిపోతాయని తెలుసుకోండి.

✪✪✪ కలలు కనండి ! ఊహించండి ! మీకేం కావాలో అలా ఊహించుకోండి,
అవి సంభవించియే తీరుతాయి.

యద్భావం తద్భవతి అనే పరమ సత్యాన్ని మీరెప్పుడూ వినలేదా ?!

యామతిఃసా గతిర్భవేత్ అనే పరమ సత్యాన్ని మీరెప్పుడూ చదవలేదా ?!

మీరు ఇప్పుడు కలిగి ఉన్న శరీరం + జీవితం ఒకప్పుడు మీరు ఊహించిన దాని ఫలితమేనని తెలుసుకోండి. ఇప్పుడు ఉన్న పలాన, ఒక్కసారిగా, ఒకే ఒక క్షణంలో మీ శరీరాన్ని + జీవితాన్ని మీకు నచ్చిన విధంగా, మీకు కావాల్సిన విధంగా సృష్టించుకోగలిగే శక్తి సామర్థ్యాలను మీరు ఇప్పుడే రెడిమేడ్‌గా కలిగి ఉన్నారని తెలుసుకోండి.

తర్కాన్ని వదిలి పెట్టండి. ఇది ఎలా సంభవం ? అనే ప్రశ్నలను పూర్తిగా త్యజించండి. కేవలం ఈ సత్యాలను మీ అంతరంలోకి అనుమతించండి. ఈ సత్యాలను విశ్వసించండి. పూర్తిగా 100% నమ్మండి.

నిజంగా ఇది జరుగుతుందో లేదోననే అనుమానం కూడా ఒక ఆలోచనే అని తెలుసుకోండి. మీ అనుమానం, మీ అపనమ్మకం అనే ఆలోచన ప్రకారమే అది జరగకుండా పోతుందని గ్రహించండి. ఇందులో ఇంతకు మించిన మర్మం ఏదీ లేదని తెలుసుకోండి.

అనుమానాలు, అపనమ్మకాలు, సంశయాలు, సందేహాలు అనేవి కూడా ఆలోచనలే ! సృష్టి సిద్ధాంతం ఏమిటనుకున్నారు - "మన ఆలోచనలే మన వాస్తవాలు" !

✪✪✪ మీరు అనుమానిస్తూ ఉన్నారంటే అది జరగడానికి సమ్మతించటం లేదని అర్థం ! ఇది ఎలా సాధ్యం ? ఇలా ఎక్కడైనా జరిగిందా ? సాక్ష్యాలు ఏవి ? రుజువులు ఏవి ? అనే ప్రశ్నలు వేయడం ద్వారా మీరు తెలివి తేటలు ప్రదర్శిస్తున్నారని అనుకుంటున్నారా ?! అవి తెలివి తేటలు కావు, మంచిని అనుమతించని దరిద్రపు గుణాలని తెలుసుకోండి. మంచిగా ఊహించండి. అని శాస్త్రాలు చెబుతున్నాయి, మరి మంచి విషయాలను నమ్మడానికేం మాయరోగం అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

చర్చలు, వాదనలు అన్నీ కూడా మీలో ఉన్న "మంచిని, ఆనందాలను వ్యతిరేకిస్తున్న గుణాల్లోంచే" పుడుతున్నాయని తెలుసుకోండి. రీజనింగ్, లాజిక్ అనేవి స్పోర్టివ్‌గా, పాజిటివ్‌గా ఉండాలి కానీ, నెగెటివ్‌గా ఉండకూడదని గ్రహించండి. భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి, "మీరెలా భావిస్తే అలా జరుగుతుందని" ! జీసస్ క్రైస్ట్ చెప్పాడు, "నమ్మువానికి సమస్తమూ సాధ్యమేనని" ! ఇంకా ఎందరో మాస్టర్స్ చెప్పారు ఈ విషయాల గురించి. మరి వాటిని యథాతథంగా ఆచరిస్తే పోయేదేముంది దరిద్రం తప్ప ! వచ్చేదేముంది సౌభాగ్యం + ఆనందం + విజయం తప్ప !

ఊహించడం మరియు భావించడం అని అంటే, ఆలోచించడమే ! మీరు అదే పనిగా ఆలోచిస్తూ ఉంటే, ఆ ఆలోచనే ఊహగా, భావంగా మారి సంభవం అవుతుంది.

ఆలోచన ఊహ భావం భావన.... ఇవన్నీ ఒక్కటే !

ఆలోచించడం ఊహించడం భావించడం... ఇవన్నీ ఒక్కటే !

మీరు, మీ కోరిక నెరవేరినట్టుగా ఆలోచిస్తూ ఉండండి, అంతే ! మిగతా పని అంతా మీ అల్టా కాన్షియస్‌నెస్ చూసుకుంటుంది. మీరు కేవలం ఆనందంగా ఆలోచిస్తూ ఉండండి. మీ కోరిక సులభంగా, సరళంగా, సురక్షితంగా నెరవేరినట్టు ఆలోచిస్తూ ఉండండి. అంతే ! మీ కోరికను మీరు ఆలోచిస్తూ ఉన్నారు అని అంటే దాన్ని భౌతికంగా అనుభవించేందుకు సిద్ధం అయ్యారని అర్థం. దాన్ని భౌతికంగా సంభవం చేసే పని మొత్తం మీ అల్టా కాన్షియస్‌నెస్ చూసుకుంటుంది.

❖ ❖ ❖

54. ఏవైనా మనకు ఎందుకు ఉండవంటే ?

ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయం, లాభం, ఆనందం మొదలైనవి మీకు లేవు అని అంటే - ఇందుకు గల కారణాలు 13. అవి :

1. ఏవైతే మీకు లేవో వాటిని "అవసరం" అని మీరు "లోపల" భావించక పోవడం.

2. ఏవైతే మీకు లేవో వాటి యొక్క విలువ తెలియక పోవడం. వాటి వలన కలిగే ఆనందం, ప్రయోజనాలు, శ్రేయస్కరాలు, విజయాలు, లాభాలు తెలియక పోవడం.

3. ఏవైతే మీకు లేవో వాటి పట్ల దురభిప్రాయాన్ని(దురవగాహనను) కలిగి ఉండడం.

4. ఏవైతే మీకు లేవో వాటిని గతంలో ఇతరులకు దూరం చేయడం.

5. ఏవైతే మీకు లేవో వాటిని గతంలో మీరు నిందించడం లేక హేళన చేయడం లేక విమర్శించడం అంటే జడ్జ్‌మెంట్ చేయడం.

6. ఏవైతే మీకు లేవో వాటిని హరించి వేసే గుణం(స్వభావం) కలిగి ఉండడం.

7. ఏవైతే మీకు లేవో వాటిని ద్వేషించడం, వ్యతిరేకించడం.

8. ఇది అత్యంత ముఖ్యమైన కీలకమైన కారణం : ఏవైతే మీకు లేవో వాటిని మీరు "లోపల" అనవసరం అని భావిస్తున్నారని మీకే తెలియక పోవడం. వాటి విలువ మీకు తెలియదని మీకే తెలియక పోయినా "నాకు తెలుసు" అనే భ్రమలో మీరున్నారని మీరు తెలుసుకోక పోవడం. వాటి వలన కలిగే ఆనందం, ప్రయోజనాలు, శ్రేయస్కరాలు, విజయాలు, లాభాలు మొదలైన వాటి గురించి మీకు అవగాహన లేక పోయినా "నాకు అవగాహన ఉంది" అనే భ్రమలో మీరు ఉన్నారని మీకే

తెలియక పోవడం. వాటి పట్ల మీరు దురభిప్రాయాన్ని(దురవగాహనను) కలిగి ఉన్నా ఆ విషయం పట్ల మీకు ఎరుక లేక పోవడం. ఏవైతే మీకు లేవో వాటిని గతంలో ఇతరులకు మీరు దూరం చేసిన విషయాన్ని మీరు తెలుసుకోక పోవటం. ఏవైతే మీకు లేవో వాటిని గతంలో మీరు నిందించారని, హేళన చేసారని, విమర్శించారని, జడ్జ్‌మెంట్ చేసారని మీకు తెలియక పోవడం. ఏవైతే మీకు లేవో వాటిని హరించి వేసే గుణం(స్వభావం) మీకు ఉందని మీకే తెలియక పోవటం. ఏవైతే మీకు లేవో వాటిని మీరు ద్వేషిస్తున్నారని, వాటికి పూర్తి వ్యతిరేకంగా ఉన్నారని మీకే తెలియక పోవడం.

9. ఇది మరో ప్రధానమైన అత్యంత కీలకమైన కారణం : ఏవైతే మీకు లేవో వాటిని అనవసరంగా భావిస్తున్నామని - నిజానికి "అవసరంగా" భావించకుండా మిమ్మల్ని మీరే మోసం చేసుకోవటం.

10. మీకు బాగుపడి ఆనందించే గుణం(స్వభావం) లేక పోవటం.

11. మీరు నెగెటివ్ గుణాలు(స్వభావాలు) కలిగి ఉన్నారని మీరు గుర్తించక పోవటం.

12. ఏవైతే మీకు లేవో వాటి కోసం నిజంగా, 100% శ్రమించక పోవటం. మీరు శ్రమించకుండా ఉంటూ - నేను ఎందుకు శ్రమించటం లేదంటే... అంటూ ఏవో కొన్ని పనికిమాలిన కారణాలు చూపించుకుంటూ మిమ్మల్ని మీరు సమర్థించు కోవడం.

13. నా లాంటి గురువులు ఎవరైనా ఈ విషయాలను మీకు చెప్పినప్పుడు, మీరు ఒప్పుకోక పోవడం.

వివరణలు

1. ఏవైతే మీకు లేవో వాటిని "అవసరం" అని మీరు "లోపల" భావించక పోవడం.

1. వివరణ : "దేనినైనా సరే "అవసరం" అని భావించినప్పుడే అది మీకు శీఘ్రంగా అందుతుంది". మీరు ఎప్పుడైతే "అనవసరం" అని భావిస్తారో అప్పుడు అది మీకు అందకుండానే ఉంటుంది. మీకు ఏదైనా లేదని అంటే దాన్ని మీరు "అవసరం" అని భావించటం లేదనేదే సత్యం ! ఈ సత్యాన్ని మీరు ఒప్పుకున్నప్పుడు, మీ యొక్క ఒప్పుకోలు పూర్ణమై "నేను ఫలానా దానిని అవసరం అని భావించటం లేదు" అనే సత్యాన్ని గ్రహిస్తారు. ఇలా మీరు సత్యాన్ని గ్రహించిన మరుక్షణం, మీరు దాన్నుండి విముక్తం అయిపోతారు. దేనినైతే అనవసరం అని భావిస్తూ దూరం చేసుకున్నారో, అప్పుడు దాన్ని అవసరంగా భావించి పొందుతారు. ఇదంతా ఆటొమెటిక్‌గా జరిగి పోతుంది. మీరు సత్యాన్ని గ్రహించడంతోనే ఇది ఇలా జరిగి పోతుంది. ఇది సిస్టమ్. అంతే !

2. ఏవైతే మీకు లేవో వాటి యొక్క విలువ తెలియక పోవడం. వాటి వలన కలిగే ఆనందం, ప్రయోజనాలు, శ్రేయస్కరాలు, విజయాలు, లాభాలు తెలియక పోవటం.

2. వివరణ : ఏవైతే మీకు లేవో వాటి యొక్క విలువ మీకు తెలియ జేయడానికే అవి లేకుండా పోతాయి. అవి లేనందు వలన కలిగే ఇబ్బందులను గుర్తించి, వాటి విలువను గ్రహిస్తే అవి మీకు అందుతాయి. ఏవైతే మీకు లేవో వాటి వలన కలిగే ఆనందాన్ని, ప్రయోజనాలను, శ్రేయస్కరాలను, విజయాలను, లాభాలను గుర్తించినంత మాత్రాన అవి మీ స్వంతం అయిపోతాయి. ఏవైతే మీకు లేవో వాటి వలన కలిగే సమస్యలను గుర్తిస్తే, అవగాహన చేసుకుంటే సరి పోతుంది. అవి మీకు అందుతాయి.

3. ఏవైతే మీకు లేవో వాటి పట్ల దురభిప్రాయాన్ని(దురవగాహనను) కలిగి ఉండడం.

3. వివరణ : మీరు వేటి పట్లనైతే దురభిప్రాయాన్ని(దురవగాహనను) కలిగి ఉంటారో అవి మీకు ఉండవు. నాకు ఆరోగ్యం, ఐశ్వర్యం లేదు, ఎవరైనా ఆరోగ్యం + ఐశ్వర్యం పట్ల దురభిప్రాయాన్ని కలిగి ఉండి వాటిని దూరం చేసుకుంటారా ?! అని అంటే - మీకు ఆరోగ్యం + ఐశ్వర్యం లేనప్పుడు, మీరు వాటి పట్ల దురభిప్రాయాన్ని కలిగి ఉన్నారనే అర్థం. అజ్ఞానంతో ఆరోగ్యం + ఐశ్వర్యం పట్ల దురభిప్రాయాన్ని కలిగి ఉండడం అనేది సహజంగా జరుగుతుంది. విస్మృతిలో ఉన్నప్పుడు మీరేం చేస్తున్నారో మీకే తెలియదు. మీరు మంచిని కోరుకుంటున్నారో లేక మంచి పట్ల దురభిప్రాయాన్ని ప్రకటిస్తూ మంచికి దూరం అవుతున్నారో మీకే తెలియదు. విస్మృతిలో ఉన్నప్పుడు ఇది సహజం. తెలియనితనంలో అది అలా జరుగుతుంది. మీకు ఏవైతే లేవో వాటి పట్ల మీరు దురభిప్రాయాన్ని కలిగి ఉన్నారని గ్రహిస్తే చాలు, మీ గ్రహింపుతోనే ఆ దురభిప్రాయం సదభిప్రాయంగా మారిపోతుంది. అప్పుడు మీకు అవి అందుతాయి.

4. ఏవైతే మీకు లేవో వాటిని గతంలో ఇతరులకు దూరం చేయడం.

4. వివరణ : అజ్ఞానంతో, ఎరుక లేకపోవడం చేత మనం ఇతరులకు వేటినైతే దూరం చేస్తామో, అవి మనకు కూడా దూరం అవుతాయి. ఎందుకంటే "మీరు ఇతరులకేదైతే చేస్తున్నారో అది మీకు మీరే చేసుకోవడం" అవుతుంది అనే విశ్వ సూత్ర ప్రకారం అది అలా జరుగుతుంది. కాబట్టి తెలియక చేసిన దానిని గుర్తిస్తే చాలు అది క్లియర్ అయిపోతుంది. ధ్యానంలో కూర్చుని "నేను ఫలానా దాన్ని కలిగి లేను, గతంలో ఎవరికైనా దూరం చేశానా" ? అని ప్రశ్నించుకుని అలాగే ధ్యానంలో ఉండండి. లోపల ఏం ఉంటే అవి బయట పడి క్లియర్ అయిపోతాయి. రాబోయే పేజీలలో ధ్యాన సాధనలు వివరించాను, అవి చదివి సాధన చేయండి.

5. ఏవైతే మీకు లేవో వాటిని గతంలో మీరు నిందించడం లేక హేళన చేయడం లేక విమర్శించడం అంటే జడ్జ్‌మెంట్ చేయడం.

5. వివరణ : వేటినైతే ప్రస్తుతం మీరు కలిగి లేరో వాటిని మీరు గతంలో నిందించి ఉంటారు. ఏం అవి లేకపోతే బ్రతకలేమా ?! అని హేళన చేస్తూ విమర్శించి ఉంటారు. వాటి కోసం అనవసరంగా ప్రాకులాడుతారెందుకు ? అంటూ ఎవరినైనా జడ్జ్ చేసి ఉంటారు. ఇలా చేసినందు వలన "అవి" ప్రస్తుతం మీ అవసరాలై, ఒకప్పుడు వాటి కోసం ఇతరులు ఎందుకు ప్రాకులాడారో అర్థం అవుతుంది. ధ్యానంలో కూర్చుంటే జడ్జ్‌మెంట్లు అన్నీ బయటపడి క్లియర్ అయిపోతాయి. ఈ మార్గదర్శిలోనే "జడ్జ్‌మెంట్" గురించి వివరించాను చదవండి.

6. ఏవైతే మీకు లేవో వాటిని హరించి వేసే గుణం(స్వభావం) కలిగి ఉండడం.

6. వివరణ : మనకు వేటినైతే హరించి వేసే గుణం ఉంటుందో అవి మనకు ఉండవు. ఎంత హరించి వేసే గుణం ఉంటే అంత ఉండవు. ఈ విషయం మన లోపల ఉందని తెలుసుకోకుండా మనం బయట ఏం చేసినా ఏమి ప్రయోజనం ఉండదు. మీకు కావల్సిన వాటి కోసం మీరెంత ప్రయత్నిస్తూ ఉన్న వాటిని పొందలేక పోతున్నారంటే మీకు వాటిని హరించి వేసే గుణం(స్వభావం) ఉందనేది స్పష్టం. ధ్యానం చేస్తే మన గుణాలు బయటపడి క్లియర్ అయిపోతాయి.

7. ఏవైతే మీకు లేవో వాటిని ద్వేషించడం, వ్యతిరేకించడం

7. వివరణ : ఏవైతే మీకు లేవో వాటిని తెలియనితనంతో ద్వేషిస్తాం, వ్యతిరేకిస్తాం. అజ్ఞానంతో ఇలా చేస్తాం. దేనినైనా మనం ద్వేషిస్తూ, వ్యతిరేకిస్తున్నప్పుడు అది మనకు ఉండదు కదా ! ధ్యానం చేస్తే మన లోపల ఉన్న అన్ని ద్వేషాలు, వ్యతిరేకతలు బయటపడి క్లియర్ అయిపోతాయి.

8. ఏవైతే మీకు లేవో వాటి పట్ల మీరు ఎలాంటి భావాలను, అభిప్రాయాలను, నమ్మకాలను కలిగి ఉన్నారో మీకే తెలియక పోవటం.

8. వివరణ : ఏవైతే మీకు లేవో వాటి పట్ల మీరు ఎలాంటి భావాలను, అభిప్రాయాలను, నమ్మకాలను కలిగి ఉన్నారో మీకే తెలియక పోవటం. మీకు అవసరమైనవి, మీరు కోరుకుంటున్నవి ఎందుకు మీకు దక్కటం లేదో అనే విషయాలు మీకు తెలియక పోవడం వలన మీరు వాటి కోసం చేసే ప్రయత్నాలన్నీ వృథా అవుతూ ఉంటాయి. విషయాలను తెలుసుకుని ప్రయత్నిస్తే అవి శీఘ్రంగా మీ స్వంతం అవుతాయి.

9. ఏవైతే మీకు లేవో వాటిని అవసరంగా భావిస్తున్నామని - నిజానికి "అవసరంగా" భావించకుండా మిమ్మల్ని మీరే మోసం చేసుకోవడం.

9. వివరణ : ఏవైతే మీకు లేవో వాటిని మీరు నిజంగా అవసరం అని అనుకుంటున్నారా అని ధ్యానంలో కూర్చుని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మీ లోపల నిజమైన సమాధానాలు ఉంటాయి. మీరు ఇలా ప్రశ్నించి సహనంతో వేచి ఉండండి. అప్పుడు అన్ని సమాధానాలు వస్తాయి. మన లోపల ఏమేం కలిగి ఉన్నామో మనం ధ్యానం చేసినప్పుడు తెలుస్తుంది. అప్పుడు ఆశ్చర్యపోవాల్సి వస్తుంది లోపలి విషయాలను చూసి ! లోపల అనవసరం అని భావిస్తూ, బయట అవసరం అని మనల్ని మనం మోసం చేసుకుంటుంటాం. మనల్ని మనమే ఎందుకు మోసం చేసుకుంటామంటే - అజ్ఞానం వలన ! ధ్యానం చేస్తే మనలో ఉన్న మోసం చేసే గుణం బయటపడి క్లియర్ అయిపోతుంది.

10. మీకు బాగుపడి ఆనందించే గుణం(స్వభావం) లేక పోవటం.

10. వివరణ : మీ శరీరంలోని + జీవితంలోని పరిస్థితులను ఒకసారి పరిశీలించి చూసుకోండి. సమస్యలు, కష్టాలు ఎక్కువగా ఉన్నాయంటే మీకు బాగుపడి ఆనందించే గుణం లేనట్టే అని అర్థం. మనం ఆనందాలను వ్యతిరేకిస్తున్నప్పుడే మనకు సమస్యలు, కష్టాలు వస్తాయి. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలో "ఆనందంగా ఉండండి అకారణంగా... " అనే అధ్యాయంలో దీనికి సంబంధించిన విషయాలను వివరించాను చదవండి.

11. మీరు నెగెటివ్ గుణాలు(స్వభావాలు) కలిగి ఉన్నారని మీరు గుర్తించక పోవటం.

11. వివరణ : మీ శరీరంలో + జీవితంలో సమస్యలు ఎన్ని ఉంటే అన్ని నెగెటివ్ గుణాలను మీరు కలిగి ఉన్నారని అర్థం. మన నెగెటివ్ గుణాలే మన శరీరంలో + జీవితంలో సమస్యలుగా ప్రకటం అవుతాయి. ధ్యానం చేస్తే మన లోపల ఉన్న అన్ని నెగెటివ్ గుణాలు బయటపడి క్లియర్ అయిపోతాయి.

12. ఏవైతే మీకు లేవో వాటి కోసం నిజంగా, 100% శ్రమించక పోవటం. మీరు శ్రమించకుండా ఉంటూ - నేను ఎందుకు శ్రమించటం లేదంటే... అంటూ ఏవో కొన్ని పనికిమాలిన కారణాలు చూపించుకుంటూ మిమ్మల్ని మీరు సమర్థించుకోవడం.

12. వివరణ : ఒక సారి ప్రశాంతంగా ధ్యానంలో కూర్చుని నిజాయితీగా మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి - మీరు కోరుకునే వాటి కోసం మీరు నిజంగా, 100%గా పరిశ్రమిస్తున్నారా ? లేదా ? అని. సమాధానం స్పష్టంగా మీకే తెలిసిపోతుంది.

13. నా లాంటి గురువులు ఎవరైనా ఈ విషయాలను మీకు చెప్పినప్పుడు, మీరు ఒప్పుకోక పోవడం.

13. వివరణ : ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలో, ఈ విషయాలనే కాక ఇంకా ఎన్నో విషయాలను వివరించాను. వీటిని మీరు ఒప్పుకుంటున్నారా ? ఒప్పుకుంటే సమస్యల్లో నుండి బయట పడిపోతారు లేదా ఎప్పుడు ఒప్పుకుంటే అప్పుడు బయట పడతారు. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోని విషయాలను అనే కాదు ఆత్మ విజ్ఞాన సత్యాలను అవి ఏ పుస్తకంలోనివైనా సరే, ఆ సత్యాలను ఒప్పుకుని మీరు గ్రహించినప్పుడే మీరు సమస్యల్లో నుండి బయట పడతారు.

55. ఏవైనా మనకు ఎందుకు ఉంటాయంటే ?

ఏవైనా మనకు ఎందుకు ఉంటాయంటే వాటిని మనం ఇష్టపడినప్పుడు, అవసరం అని అనుకున్నప్పుడు "అవి" మన దగ్గర ఉంటాయి. "వాటిని" మనం కోరుకుంటున్నప్పుడు, "అవి" ఉండాలని మనం అనుకుంటున్నప్పుడు "వాటిని" మనం కలిగి ఉంటాం.

మీరు ఏమేం కలిగి ఉన్నారో, ఒక లిస్ట్ తయారు చేసుకోండి. అనారోగ్యాలు, అపజయాలు, అవమానాలు, బాధలు, కష్ట నష్టాలు మొదలైన వాటన్నింటి యొక్క లిస్ట్ తయారు చేయండి. పాజిటివ్ విషయాలను పక్కన పెట్టండి. నెగెటివ్ విషయాల యొక్క లిస్ట్ తయారు చేయండి. మీ లిస్ట్‌లో ఏమేం అయితే ఉన్నాయో వాటిని మీరు ఇష్టపడుతున్నట్టు అని అర్థం. మీకు ఆశ్చర్యం కలగవచ్చు, ఎవరైనా నెగెటివ్ విషయాలను ఇష్టపడతారా ?! కోరుకుంటారా ?! అని - కానీ ఉన్న సత్యం ఇదే !

మన అంతరంగంలో ఉన్న నమ్మకాల, గుణాల(స్వభావాల), అభిప్రాయాల మరియు మన ఆలోచనా విధానం యొక్క యథాతథ ప్రతి బింబమే మన శరీరం + జీవితం.

అందరిలో, అంతటా ప్రకటం అవుతూ ఉన్న "మూల చైతన్యం" మీ నమ్మకాలను, గుణాలను(స్వభావాలను), అభిప్రాయాలను మరియు మీ ఆలోచనా విధానాన్ని అనుసరించి మీ శరీరంగా, మీ శరీరంలోని స్థితి గతులుగా మరియు మీ జీవితంలోని పరిస్థితులుగా ప్రకటం అవుతూ ఉంటుంది. ఎలాంటి నమ్మకాలను, గుణాలను(స్వభావాలను), అభిప్రాయాలను, ఆలోచనా విధానాన్ని కలిగి ఉంటారో అదే విధంగా మీ శరీరం + జీవితం ఉంటుంది.

మీ అంతరంగం యొక్క యథాతథ ప్రతిబింబమే మీ శరీరం + జీవితం !

- విశ్వ సూత్రం

మీ శరీరంలో + జీవితంలో నెగెటివ్ పరిస్థితులు ఉన్నాయంటే మీ అంతరంగంలో మీరు నెగెటివ్ విషయాలను కలిగి ఉన్నారనేది స్పష్టం ! మీకు, ఇతరుల వలన లేదా ఏవైనా బాహ్య కారణాల వలన మీ శరీరంలో + జీవితంలో నెగెటివ్ విషయాలు ఉన్నాయని అనిపించవచ్చు. కానీ

మీ "లోపల" ఉన్న నెగెటివ్ విషయాలకు అనుగుణంగానే ఇతరులు మీ పట్ల ప్రవర్తిస్తూ ఉంటారు. మీ "లోపల" ఉన్న నెగెటివ్ విషయాల మూలంగానే మీ శరీరంలోని + జీవితంలోని స్థితి గతులు, పరిస్థితులు సృష్టించబడుతూ ఉంటాయి అనేదే పరమ సత్యం !

పచ్చి నిజం ! అసలు సిసలైన వాస్తవం !

మీరు ఎప్పటి వరకైతే మీ కష్ట నష్టాలన్నింటికీ నేనే మూల కారణం, నా వాస్తవాలన్నింటికి నేనే సృష్టికర్తను అనే సత్యాన్ని గ్రహించరో అప్పటి వరకు మీ శరీరంలోని + జీవితంలోని కష్టనష్టాలు తొలగిపోవు గాక, తొలగిపోనే పోవు !

స్వయం పూనికతో, మీకై మీరే లోపాలను గుర్తించే వరకు మీ లోపాలు అంతరించిపోవు. మీరు మీ లోపాలను గుర్తించినప్పుడు, మీ గుర్తించడం అనే ఎరుక మీ లోపాలపై ప్రసరించినప్పుడు, ఆ యొక్క ఎరుక అనే ప్రజ్ఞానాగ్నిలో మీ లోపాలు దగ్ధం అయిపోతాయి. - ఇది ఒక విశ్వ సూత్రం.

కాబట్టి మీ శరీరంలో + జీవితంలో ఉన్న లోపాల లిస్ట్ ఒకటి తయారు చేసి వాటిని నేను ఇష్టపడుతున్నాను, వాటిని నేను నా లోపల ఉండాలని కోరుకుంటున్నాను కాబట్టే అవి ఉండగలుగుతున్నాయి అని అవగాహన చేసుకుని వాటన్నింటినీ పూర్తిగా రిలీజ్ చేసాను, రిలీజ్ రిలీజ్ అని సాధన చేయండి. మీరు క్రమం తప్పని సాధన చేస్తే కేవలం కొద్ది రోజుల్లోనే మీ శరీరం + జీవితం ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలతో విరాజిల్లుతుంది. శోభిల్లుతుంది.

56. ఉత్తమ జీవిత భాగస్వామిని పొందాలంటే ఏం చేయాలి ?

&

ఉత్తమ సంతాన ప్రాప్తికి ఏం చేయాలి ?

ఉత్తమ జీవిత భాగస్వామిని పొందడానికి, ఏం చేయాలంటే....

ఉత్తమ జీవిత భాగస్వామిని పొందాలనే కోరిక సహజంగా ప్రతీ ఒక్కరికీ ఉంటుంది, కాని కొంత మందే పొందగలుగుతారు. చాలా మంది ఈ విషయంలో నిరాశకు గురవుతారు. ఎందుకంటే అందరూ "నాకు ఉత్తమ భాగస్వామి కావాలి " అని కోరుకోవడమే తప్ప "నేను ఉత్తమంగా ఉన్నానా లేదా " అనే విషయాన్ని పట్టించుకోరు, ఈ కారణంగానే చాలా మంది నిరాశకు గురవుతారు. మీరు ఉత్తమ భాగస్వామిని కోరుకునే ముందు, మీరు ఉత్తమంగా ఉండి తీరాలి. మీరు నిజంగా ఎంత ఉత్తములు అనే దాని పైనే విషయం అంతా ఆధారపడి ఉన్నది. అధిక శాతం తమకు తాము ఉత్తమోత్తములమనే సర్టిఫికేట్ ఇచ్చేసుకుంటారు. బాంబులను పెట్టి సాధారణ ప్రజలను చంపే రాక్షసులు కూడా తమకు తాము చాలా ఉత్తములమనే సర్టిఫికేట్ ఇచ్చేసుకుంటారు. ఎవరి లోపాలను వారు గుర్తించలేరు. ప్రస్తుతం సమాజంలో నెలకొని ఉన్న అవకతవకలకు ఇది కూడా ఒక ప్రధాన కారణం.

1. సాధారణంగా అందరూ మంచి జీవిత భాగస్వామి దొరకాలని, వాళ్ళు అందంగా ఉండాలని, వాళ్ళు బాగా అవగాహనా పరులయి ఉండాలని, బాగా ధనవంతులై ఉండాలని, సుగుణాల రాశులై ఉండాలని, తెలివి తేటలు కలిగి ఉండాలనీ, తమకు అణిగి మణిగి ఉండాలనీ... ఈ విధంగా లిస్ట్

చాలా పెద్దగా ఉంటుంది. తాము కోరుకునే భాగస్వామికి ఇంత పెద్ద లిస్ట్ తయారు చేసినప్పుడు, మరి... వీటిలో మేము ఎన్ని క్వాలిటీలను కలిగి ఉన్నాము అనేది మాత్రం చూసుకోరు, అమ్మాయిలైనా, అబ్బాయిలైనా ! ఇక్కడే దెబ్బ పడుతుంది. Like Attracts Like అంటే "పరస్పరం సారూప్యం కలిగినవి ఒక దానిని ఒకటి ఆకర్షించుకుంటాయి" అనేది సృష్టి సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం ఎలాంటి వాళ్ళు అలాంటి వాళ్ళనే ఆకర్షిస్తారు. ఉత్తములు, ఉత్తములనే ఆకర్షిస్తారు. అధములు, అధములనే ఆకర్షిస్తారు. తాము ఉత్తమంగా ఉండకుండా, తమ లోపాలను గుర్తించి సవరించుకోకుండా, తమ భాగస్వామి మాత్రం ఉత్తమంగా ఉండాలని కోరుకునే వారికి, Same to Same, As It Is, Pin to Pin, అచ్చం అలాంటి వారే దొరుకుతారు, అప్పుడు తీవ్రమైన భంగపాటుకు గురవుతారు. జీవితాన్ని అస్తవ్యస్తం చేసుకుంటారు.

2. ఇక రెండవ పొరపాటు ఏమిటంటే... తాము కోరుకునే భాగస్వామి నన్ను బాగా ప్రేమించాలి, నన్ను బాగా చూసుకోవాలి, నాకు అది ఇవ్వాలి, నాకు ఇది ఇవ్వాలి అని మరో చాంతాడంత లిస్ట్ రెడి చేసుకుంటారు. సృష్టి సిద్ధాంతం ప్రకారం మీరు ఏమైతే కోరుకుంటున్నారో, ముందు దానిని ఇవ్వడం ప్రారంభించాలి, అప్పుడు మాత్రమే మీకు పొందే అర్హత వస్తుంది. ఈ ఇవ్వడం ⇆ పొందడం గురించి ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే నవరత్నాలు అనే పార్ట్‌లో "సేవా సాధన" అనే టాపిక్‌లో చాలా విపులంగా వివరించాను. చదవండి. మీరు కేవలం పొందడం గురించి మాత్రమే ఆలోచిస్తూ ఉంటే, పొందలేరు. మీరు మీ భాగస్వామికి ఇవ్వడం గురించి ఆలోచిస్తూ, ఇవ్వడానికి సిద్ధంగా ఉండండి, అప్పుడు మీకు ఆటొమెటిక్‌గా మీకు ఇచ్చే భాగస్వామియే దొరుకుతారు. ఎంత సేపు నాకది కావాలి, నాకిది కావాలి అనే ధోరణిని విడవండి. నేనేమి ఇవ్వ గలుగుతాను అని ఆలోచించండి. వచ్చే భాగస్వామి నుండి నేను ఏమేం సౌకర్యాలు పొందుతాను అని కాకుండా, నేను నా కాబోయే భాగస్వామికి ఎన్ని సౌకర్యాలను ఇవ్వగలను అని ఆలోచించండి, అందుకు సిద్ధం కండి. నిజంగా సిద్ధం కావాలి. ఏదో ఊరికే పైపైన అనుకుంటే సరిపోదు.

3. మీరు మీ లోపాలను గుర్తించి వాటిని శాశ్వతంగా తొలగించడం ఎలా ? అని అంటే... ఇది కేవలం ఆత్మ విజ్ఞాన అవగాహన ద్వారా, ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో యథాతథంగా ఆచరించడం వలన మరియు క్రమం తప్పని ధ్యాన సాధన ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. ముందు ఈ మార్గదర్శిని మొత్తం బాగా చదివి జీర్ణం చేసుకోండి. ఇందులోని సూత్రాలను ఆచరించండి. క్రమం తప్పని ధ్యాన సాధన చేయండి. అప్పుడు మీకు ఉత్తమ జీవిత భాగస్వామి లభించియే తీరుతారు.

ఉత్తమ సంతాన ప్రాప్తికి ఏం చేయాలంటే....

1. ఉత్తమ సంతానాన్ని కోరుకునే తల్లిదండ్రులు ముందు తాము ఉత్తమంగా తయారు కావాలి.

2. ఆత్మ విజ్ఞాన అవగాహన బాగా కలిగి ఉండాలి.

3. ఎలాంటి సంతానం కావాలో స్పష్టంగా ఆలోచించుకోండి.

4. తల్లిదండ్రులు ఇద్దరూ పూర్తిగా అకర్మ శాకాహారులై(Akarma Vegan) పోవాలి. ఎందుకంటే అకర్మ శాకాహార గర్భాల వైపు ఉత్తమ ఆత్మలు త్వరగా ఆకర్షించ బడతాయి.

5. స్త్రీ పురుషులు ఇరువురూ ఒకరి పట్ల ఒకరు పూర్తి ఇష్టం, ప్రేమలతో మరియు తపనతో, తమకంతో, "పూర్తి కోరికతో సంయోగం చెందాలి".

6. ఉన్నత ఆత్మ విజ్ఞాన అవగాహన కలిగి ఉండి, క్రమం తప్పని ఉన్నత ధ్యాన సాధకులై ఉండి అకర్మ శాకాహారులైన(Akarma Vegan) వారికి, వారు కోరుకున్న విధంగా ఉత్తమ సంతాన ప్రాప్తి కలిగి తీరుతుంది. గతి తప్పని ప్రాప్తి ఇది. నిజ సత్య వాస్తవం ఇది.

7. అత్యున్నత ఆత్మ విజ్ఞాన అవగాహన కలిగి ఉండి, క్రమం తప్పని మహోన్నత ధ్యాన సాధకులై, అకర్మ శాకాహారులై (Akarma Vegan), సత్య ప్రచారానికి పూర్తిగా అంకితమైన వారికి, మహా ఆధ్యాత్మిక లక్ష్యాలు పెట్టుకున్న వారికి, వారి లక్ష్య సాధనకే పూర్తిగా జీవితాన్ని అంకితం చేసుకున్న వారికి, వారు కోరుకున్న విధంగా పరమోత్తమ సంతాన ప్రాప్తి కలిగి తీరుతుంది. గతి తప్పని ప్రాప్తి ఇది. నిజ సత్య వాస్తవం ఇది. పరమోత్తమ సంతాన ప్రాప్తి అని అంటే ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్ పుడతారని అర్థం. పూర్ణ కుండలిని జాగృత మాస్టర్స్ అని అర్థం.

ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మొత్తం బాగా చదివి జీర్ణం చేసుకోండి. ఇందులోని సూత్రాలను ఆచరించండి. క్రమం తప్పని ధ్యాన సాధన చేయండి. అప్పుడు మీకు మీరు కోరుకున్న విధంగా ఉత్తమ జీవిత భాగస్వామి మరియు మీరు కోరుకుంటున్న సంతానాన్ని పొందియే తీరుతారు. మీ కోరికలు నెరవేరు గాక !

❖ ❖ ❖

చాలా మంది స్త్రీ పురుషులు బయటికి చాలా హుందాగా కనపడుతూ ఉంటారు. గొప్ప గొప్ప ఆదర్శాలను వల్లిస్తూ ఉంటారు. ఆధ్యాత్మిక కేంద్రాల యొక్క కార్యక్రమాలలో విరివిగా పాల్గొంటూ ఉంటారు. అయితే వీరిలో కొంత మంది సెక్స్ పార్ట్‌నర్స్‌ను వెతుక్కోవడానికి ఇలాంటివన్నీ చేస్తూ ఉంటారు. ఇలాంటి వారిని, నేను చాలా చాలా మందిని చూసాను. వాళ్ళకు వివాహం అయి ఉంటుంది. పెళ్ళీడుకొచ్చిన పిల్లలు కూడా ఉంటారు. అయినా సరే సెక్స్ సుఖాన్ని అందించే పార్ట్‌నర్ కోసం రహస్యంగా వెతుకుతూ ఉంటారు. అస్సలు బయట పడరు. ఇది ఎంత మాత్రమూ సరి కాదు. ఇలాంటి వారు ఆధ్యాత్మికంగా ఎదిగే అవకాశం అస్సలు లేదు.

యువతీ యువకులను చాలా మంది తప్పు పడుతూ ఉంటారు కానీ, సెక్స్ సుఖం కోసం అర్రులు చాచేది వయసు పై బడిన పెద్దవాళ్ళే ! పెద్దవాళ్ళనే... నేను చాలా మందిని చూసాను. కొంత మంది తాత, అమ్మమ్మ, నానమ్మ వయసులో ఉన్న వాళ్ళు పడే తిప్పలు అన్నీ ఇన్నీ కావు. కానీ బయటికి మాత్రం పెద్దరికంగా నీతులు చెప్తూ ఉంటారు. చెప్పేది శ్రీరంగనీతులు దూరేది సాని గుడిసెలు అన్నట్టు ఉంటుంది వీళ్ళ వ్యవహారం ! ఇలాంటి వాళ్ళు ఆధ్యాత్మికంగా ఎదగడం అనేది అసంభవం !

57. మీ పాజిటివ్ నిర్ణయాల పట్ల మీరే నిజాయితీని & నిబద్ధతను కలిగి ఉండాలి

సాధారణంగా అందరూ ఎప్పుడో ఒకప్పుడు చక్కటి పాజిటివ్ నిర్ణయాలు తీసుకుంటారు. అయితే... తీసుకున్న ఆ యొక్క పాజిటివ్ నిర్ణయాలను అలా గాలికి వదిలేస్తారు. వాటిని పట్టించుకోరు, అలా చేస్తే బాగానే ఉంటుంది కానీ.... అంటూ దీర్ఘాలు తీస్తారు. ఎవేవో కుంటి సాకులు చెప్తారు. మీరు చెప్పేవన్నీ అబద్ధాలు అన్న సంగతి మీకు తెలుసు, అయినా మిమ్మల్ని మీరు ఆత్మ వంచన చేసుకుంటూ బొంకుతారు. ఇది ఎంత మాత్రమూ సరి కాని పని. ఇలా చేయకూడదు.

మీ పట్ల మీరే నిజాయితీగా, నిబద్ధతతో ఉండకపోతే ఎలా ?!

మీరు మీ పట్ల నిజాయితీగా, నిబద్ధతతో ఎందుకు ఉండలేరు అని అంటే... మీకు ఇచ్చిన మాట మీద నిలబడే గుణం లేనందు వలన. ఇతరులకు మాట ఇచ్చే ముందు ఒకటికి పది సార్లు ఆలోచించుకోండి, ఆ తర్వాతే మాట ఇవ్వండి. మాట ఇస్తే తప్పని సరిగా నెరవేర్చండి. ఇతరులకు ఇచ్చిన మాట నెరవేర్చలేని మీరు, మీ కోరికలను కూడా నెరవేర్చుకోలేరు. ఏ గుణంతో అయితే ఇతరులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక పోయారో... అదే గుణం చేత మీ పట్ల మీరు ఇచ్చుకున్న మాటను నెరవేర్చుకోలేరు, తీసుకున్న నిర్ణయాన్ని అమలు పరచలేరు.

ఈ ఒక్క గుణం చాలు మీ జీవితం అల్లకల్లోలం కావడానికి. అప్పుడప్పుడు బాగు పడాలని, అభివృద్ధి చెందాలని, ఫలానాది పొందాలని, ఫలానాది కావాలని, వాటి కోసం "నేను ఇక నుండి కృషి చేస్తానని" నిర్ణయం తీసేసుకుంటారు. ఆచరణ దగ్గరికి వచ్చేసరికి రేపు, ఎల్లుండి అంటూ వాయిదాలు

వేసేస్తారు. తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయనందుకు, మీ లోపలున్న అంతరాత్మ మిమ్మల్ని నిలదీస్తే, వినిపించుకోకుండా మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటారు. ఏదో పనికిరాని పనిలో మిమ్మల్ని మీరు బిజీ చేసేసుకుంటారు

బాగా ఉన్నవాళ్ళు, గొప్ప విజయాలను సాధించిన వాళ్ళు, మహానుభావులు, మహాత్ములకు ఉండే ప్రధాన లక్షణం "తమ పాజిటివ్ నిర్ణయాలకు కట్టుబడి ఉండడం, నిలబడడం, వాటి పట్ల నిజాయితీగా ఉండడం, నిబద్ధతతో ఉండడం" !

మీరు ఆశ్చర్య పోయే ఒక సత్యం చెప్పనా..... "మీరు, మీ పాజిటివ్ నిర్ణయాలకు కట్టుబడి ఉండడం, నిలబడడం, వాటి పట్ల నిజాయితీగా ఉండడం, నిబద్ధతతో ఉండడం" అనే దివ్య లక్షణాన్ని గనక మీరు ఏర్పరచుకుంటే... అప్పుడు మిమ్మల్ని మహా ఐశ్వర్యవంతులుగా, సంపూర్ణమైన ఆరోగ్యవంతులుగా, మహానుభావులుగా, మహాత్ములుగా, విజేతలుగా, గొప్ప నాయకులుగా, మార్గదర్శకులుగా మారకుండా ఈ సృష్టిలో ఏదీ కూడా మిమ్మల్ని ఆపలేదు.

ముందు మీరు ఈ దివ్య లక్షణాన్ని అలవరచుకోండి. అప్పుడు మీరు కోరుకుంటున్నవి ఏవైనా సరే వాటిని పొందియే తీరుతారు. ఇది సత్యం.

మీరు తీసుకున్న పాజిటివ్ నిర్ణయాల పట్ల మీరు ఖచ్చితత్వంతో ఉండండి. నిజాయితీగా ఉండండి. నిబద్ధతను పాటించండి. అప్పుడు అవి, మీరు ఆశ్చర్యపోయే విధంగా సాకారమై మీ ముందు నిలుస్తాయి, మీ అనుభవం కోసం !

మీరు తీసుకున్న పాజిటివ్ నిర్ణయాలకు ప్రప్రథమ ప్రాధాన్యం ఇవ్వండి. దాన్ని ఆటంక పరిచే, మరే దేనిని కూడా పట్టించుకోకండి. మీ పాజిటివ్ నిర్ణయాలను ఆటంక పరిచేది అది ఎంత దగ్గరిదైనా, ఎంత విలువైనదైనా సరే దాన్ని అలా.... వదిలేయండి. ఉదాహరణకు - మీరు మీ జీవితాన్ని ఒక్క సారిగా అభివృద్ధి చేసేసే ఒక అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. ఒక చక్కటి అవకాశం వచ్చింది. మీరు ఆ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం అని అనుకునే లోపల మీకు అత్యంత దగ్గరి వాళ్ళ నుండి ఫంక్షన్‌కు రమ్మని ఇన్విటేషన్ వచ్చింది. ఇప్పుడు మీకు డైలమా.... ఏం చేయాలి అని ?! అటు చూస్తే అద్భుతమైన అవకాశం, ఇటు చూస్తే ముఖ్యమైన వారి ఫంక్షన్ ! మీరు ఒకటే చేయగలరు. ఒక దాన్ని కావాలనుకుంటే రెండో దాన్ని వదలాల్సిందే ! రెండు కుదరవు. ఇలాంటి

సమయంలో మీరు తెలుసుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే జీవితం ఏ విధంగా అభివృద్ధి చెందుతుంది అనే విషయం తెలుసుకోవాలి, తేల్చుకోవాలి. ఫంక్షన్‌కు వెళ్తే జీవితం అభివృద్ధి చెందుతుందా ? లేక వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితం బాగు పడుతుందా ? అనే విషయాన్ని నిర్ధారించు కోవాలి.

ఇప్పుడు మీకు ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో చెప్తాను. ఆల్‌రెడి మీరు అభివృద్ధి పథంలో కొనసాగుతున్నారు అని అంటే మీరు ఫంక్షన్‌కు ఇంపార్టెన్స్ ఇవ్వచ్చు. అయితే గుర్తుంచుకోండి మీరు ఫంక్షన్‌కు అటెండ్ అయితే మీ అభివృద్ధి దెబ్బ తింటుంది అని అనిపిస్తే నిస్సందేహంగా ఫంక్షన్‌ను క్యాన్సల్ చేసేయండి. ఒక వేళ మీరు ఇప్పుడిప్పుడే అభివృద్ధిలోకి వస్తున్నారు అని అంటే మరో ఆలోచన లేకుండా, నిర్మొహమాటంగా, ఖచ్చితంగా ఫంక్షన్‌ను క్యాన్సల్ చేసేయండి. ఎందుకంటే మీరు ఫంక్షన్‌కు వెళ్ళనందుకు, మీకు ఇన్విటేషన్ ఇచ్చిన వాళ్ళు బాధపడితే వారికి సర్ది చెప్పవచ్చు, కానీ అంది వచ్చిన అవకాశానికి సర్ది చెప్పడం అనేది ఉండదు. మిమ్మల్ని ఫంక్షన్‌కు పిలిచిన వాళ్ళు, నిజంగా మీ బాగు కోరే వారే గనక అయితే, ఫంక్షన్‌కు రానందుకు వాళ్ళేమీ బాధ పడరు. పైగా మీరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు మిమ్మల్ని అభినందిస్తారు. ఒక వేళ అలా కాకుండా మీరు ఫంక్షన్‌కు రానందుకు అలిగి మిమ్మల్నీ, మీ పరిస్థితిని అర్థం చేసుకోకుండా మీతో గొడవ పెట్టుకున్నారనుకోండి, ఇలాంటి వాళ్ళతో గొడవ జరిగి విడిపోవడమే మంచిది. మీ జీవితాభివృద్ధిని అడ్డుకునే సంబంధాలు మీకు అవసరమే లేదు.

ఒక విషయం గుర్తుంచుకోండి, మీరు అభివృద్ధి పథంలో ఉన్నప్పుడే ఫంక్షన్‌లైనా, పార్టీలైనా ! ఫంక్షన్‌కు వెళ్ళక పోతే కొంత మంది అలుగుతారు, కొన్ని రోజులు మాత్రమే ఇబ్బంది ఉంటుంది. కానీ మీ జీవితం అభివృద్ధి పథంలో లేకపోతే అయిన వాళ్ళు, కాని వాళ్ళు మొత్తం సమాజమే మిమ్మల్ని చిన్న చూపు చూస్తుంది. జీవితమే మీ చేతుల్లోంచి జారి పోతుంది. మానవ సంబంధాలు అవసరమే, కానీ జీవితాభివృద్ధిని అడ్డుకునే సంబంధాలు ఏ రకంగానూ మంచివి కానే కావు. చరిత్రలో గొప్ప విజయాలు సాధించిన వాళ్ళందరూ, తమ లక్ష్య సాధనలో భాగంగా అన్నింటినీ వదిలేసారు. కాబట్టే వాళ్ళు మహానుభావులయ్యారు.

గొప్ప నిర్ణయాల పట్ల, లక్ష్యాల పట్ల నిజాయితీని, నిబద్ధతను కలిగి ఉండి వాటి ఆచరణకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చి, అడ్డుపడే వాటిని వదిలేయడమే "సీక్రెట్ ఆఫ్ సక్సెస్" !

❖ ❖ ❖

58. లక్ష్యం పైన మాత్రమే దృష్టి కేంద్రీకృతమై ఉండాలి - అణువంత కూడా పక్కకు పోకూడదు

సాధారణంగా అందరూ లక్ష్యాలనైతే పెట్టుకుంటారు కానీ, దాని పైన దృష్టిని సంపూర్ణంగా కేంద్రీకరించరు. ఇలా జరగడం వలన లక్ష్య సాధనలో ఆలస్యం అవడమే కాకుండా, ఒక్కోసారి విఫలం అయ్యే అవకాశం కూడా ఉంది.

సృష్టి సర్వస్వంలో, సర్వదా "సృష్టి యొక్క శక్తి" ధారాళంగా కురుస్తూనే ఉంటుంది. మన భూ గ్రహంపైన నివసించే మనుషుల విషయానికి వస్తే, వీరిలో ఆలోచనల ద్వారా శక్తి ప్రవహిస్తూ ఉంటుంది. మీరు ఆలోచిస్తున్నారు అని అంటే... సృష్టిస్తున్నారు అని అర్థం. మీ మదిలో ఏ ఆలోచననైతే స్వీకరించి, దాని గురించే ఆలోచిస్తూ ఉంటారో అది పరిస్థితిగా మారుతుంది. మీ ఆలోచనే పరిస్థితిగా మారుతుంది, మరొకటి కాదు అని మీరు చాలా స్పష్టంగా గుర్తుంచుకోండి. మీ శరీరంలో + జీవితంలో జరిగినవి, జరుగుతున్నవి అన్నీ మీ ఆలోచనలే !

మీ ఆలోచనలే మీ వాస్తవాలు !

దీనినే సంస్కృతంలో **యద్భావం తద్భవతి** అని అంటారు.

మీరు ఒక దాని గురించి ఒక విధంగా ఆలోచించడం అని అంటే దానిని ఆ విధంగా పరిస్థితిగా మారుస్తున్నారని అర్థం.

మీరు ఏదైనా లక్ష్యం పెట్టుకున్నప్పుడు మీ ఆలోచనలన్నీ మీ లక్ష్యం యొక్క సాఫల్యం గురించే ఉండాలి. మీ లక్ష్యం సులభంగా, సరళంగా నెరవేరుతున్నట్టుగానే ఆలోచించాలి. లక్ష్య సాఫల్యం తప్ప మరో దాని గురించి ఆలోచించ కూడదు. ఎందుకంటే మీరు దేని పైనైతే దృష్టిని కేంద్రీకరిస్తారో అదే జరుగుతుంది కనుక ! చాలా మంది లక్ష్య సాధనలో విఫలం అయ్యేది ఇందుకే ! మీ ఆలోచనలు కేవలం లక్ష్యం పైన మాత్రమే కేంద్రీకృతమై ఉండాలి. అప్పుడు ఆటొమెటిక్‌గా లక్ష్యం నెరవేరుతుంది.

గుర్తుంచుకోండి.... మీ దృష్టి అంతా, మీ ఆలోచనలన్నీ కేవలం లక్ష్యం యొక్క సులభ సాఫల్యం పైన మాత్రమే కేంద్రీకృతమై ఉండాలి. అప్పుడు మీ లక్ష్యం ఏదైనా సరే అది సఫలం అయి తీరుతుంది. ఇది పరమ సత్యం.

నేను మారాలి అని మీరు దృఢంగా నిర్ణయించు కుంటే చాలు,
మిమ్మల్ని మార్చే పని మీ దైవత్వమే చూసుకుంటుంది.
క్షణ క్షణానికి మిమ్మల్ని పూర్తిగా మార్చేస్తుంది.
ఇక్కడ మార్పు అంటే ప్రక్షాళన మరియు
అభివృద్ధి అని అర్థం చేసుకోండి.

59. లోక సేవకు అంకితమైతే అందరూ అభినందిస్తారు

నిస్వార్థంగా, లోకానికి ఏదైనా శ్రేయస్కరాన్ని చేకూరుద్దామని ఎవరైనా అన్నీ వదిలేసి లోక సేవకు అంకితమైతే, వారిని అందరూ అభినందిస్తారు. కొంత మంది సమర్థించక పోవచ్చు. ఇలాంటి వారిని పట్టించుకోకుండా ముందుకు సాగాలి.

లోక సేవకు అంకితం కావడం అనేది చాలా చాలా మంచి విషయం మరియు గొప్ప విషయం కదా ?! మరి, కొందరు ఎందుకు సమర్థించరు ?! అనే సందేహం వస్తే మీరు చరిత్రను పరిశోధిస్తే మీకు చాలా మంది మహాత్ముల విషయంలో ఇది ఇలా జరిగింది అని తెలుతుంది. ఇలా ఎందుకు ? అని అంటే... అహం వలన. తమకు తెలిసిన వారు తమను మించి పోయారు అనే విషయాన్ని జీర్ణించుకోవడానికి చాలా గొప్ప అవగాహన ఉండాలి. జీర్ణించుకుని ఆనందించి, అభినందించడానికి ఇంకా గొప్ప అవగాహన ఉండాలి. తమలో ఒకడిగా ఉంటూ, తమ కళ్ళ ముందే, సడన్‌గా తాము చేయలేని కార్యాన్ని చేస్తూ తమ చేతకాని తనాన్ని ఎత్తి చూపే సరికి, ఒక్క సారిగా అహం దెబ్బ తిని విల విల లాడుతారు. నిజానికి మహాత్ములు అవతలి వారి చేతకాని తనాన్ని ఎత్తి చూపరు. వారు తమ పనేదో తాము చేసుకుంటూ పోతుంటారు. అవతలి వాళ్ళ చేతకాని తనం ఆటొమెటిక్‌గా బయట పడిపోతుంది. మహాత్ములు ఎవరినీ చిన్న చూపు చూడరు. కేవలం వారు ఎదుగుతారు అంతే ! వారి ఎదుగుదల ముందు పక్కనున్న వారి చిన్న తనం ఆటొమెటిక్‌గా బయట పడిపోతుంది.

సాధారణంగా అందరూ, లోక సేవకు అంకితమైన మహానుభావులను చాలా గొప్పగా ప్రశంసిస్తారు, వారి బాటలో నడుస్తారు.

మొదట్లో కొంత మందికి ఒకటే చర్చ.... తారా విశాల్ ఇన్ని సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు... ఎలా చేస్తున్నాడు ?! ఆధ్యాత్మిక సత్యాలు తెలియక పోవడంతో వాళ్ళకు నేను కార్యక్రమాలన్నీ ఎలా చేస్తున్నానో అర్థం కాకపోయేది. తర్వాత అసలు సత్యాలు తెలుసుకుని, అర్థం చేసుకున్నారు. ఏ ప్రతి ఫలం ఆశించకుండా విరాళాలుగా ఇచ్చేవారు ఉంటారని తెలుసుకున్నారు. తమ పిల్లలకే ఉదారంగా

ఖర్చు పెట్టని తల్లిదండ్రులు అక్కడక్కడా ఉంటారు. భార్యా భర్తలు సైతం నీ జీతం ఇంత... నా జీతం ఇంత... అంటూ లెక్కలు వేసుకుని బతుకుతున్న వారు కూడా ఉంటారు. ఇలాంటి పరిస్థితులలో నేను.... నీ, నా... అనే తేడా లేకుండా... ధారాళంగా.... ఉచితంగా మా సంస్థ తరపున సేవా కార్యక్రమాలు చేస్తూంటే, మొదట్లో ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు విషయాలు తెలుసుకుని వారు అభివృద్ధి చెందారు.

ఇంతకీ నేను అన్ని సేవా కార్యక్రమాలు ఎలా చేస్తున్నాను అని అంటే :

నా క్లాసులు విని, నేను రాసిన పుస్తకాలు చదివి అర్థం చేసుకుని, ప్రేరణ పొందిన వారెందరో నాకు హృదయ పూర్వకంగా ధన్యవాదాలను అర్పించి, ఏవైనా సేవా కార్యక్రమాలు చేయండి సార్ అంటూ... డబ్బులు ఇచ్చి వెళ్తుంటారు. కొంత మంది నాకు అవసరమయ్యే వాటిని సమకూరుస్తారు. ఇలా రక రకాలుగా ఇస్తూ ఉంటారు. ఎంతో మంది, ఎక్కడెక్కడి వాళ్ళో వచ్చి డబ్బులు మొదలైనవి ఇచ్చి వెళ్తూ ఉంటారు. మేము చేయలేని పని మీరు చేస్తున్నారు సార్... అంటూ ప్రేమగా ప్రశంసించి వెళ్తారు.

తమ బతుకు తప్ప, పక్క వారి గురించి, సమాజం గురించి, లోకం గురించి పట్టించుకోని కొంత మంది మూఢ స్వార్థ జీవులకు ఇలాంటి విషయాలు అర్థం కావు కదా !

కారణ జన్ములైన మహాత్ములు తమ కుటుంబాలను, మిగతా అన్నింటినీ వదిలేసి లోకాన్ని ఉద్ధరిస్తే అభినందించటం మానేసి తన కుటుంబాన్ని పట్టించుకోని వాడు లోకోద్ధారకుడెలా అవుతాడు ? అని కొంత మంది ప్రశ్నిస్తారు. ఇలా ప్రశ్నించే వారికి అవగాహన లేక అలా ప్రశ్నిస్తారు. కాబట్టి వారిని అపార్థం చేసుకోకుండా, అర్థం చేసుకుని వారి పట్ల ప్రేమను ప్రకటించాలి. ఇలాంటి ప్రశ్నలు వేసే వారు తమను తాము చాలా తెలివైన వారిమని, మేధావులమనీ అనుకుంటూ ఉంటారు, కానీ నిజానికి వీరికేమీ తెలియదు. తెలిస్తే ఇలాంటి ప్రశ్నలు వేయరు. ఇలాంటి ప్రశ్నలు వేసే వారు తెలుసుకోవాల్సిన అత్యంత ముఖ్య విషయం ఏమిటంటే - మహాత్ములు తమ కుటుంబాన్ని కానీ తమ వాళ్ళను కానీ వదిలేయడం అంటూ ఉండదు. ఇక్కడే విషయాన్ని సరిగా అర్థం చేసుకోవాలి. మహాత్ములు కుటుంబాలను వదిలేసారు, అని అనే ముందు, వారి దృష్టిలో కుటుంబం అంటే ఏమిటో తెలుసుకోవాలి. మహాత్ముల దృష్టిలో లోకమంతా ఒకటే కుటుంబం, లోకమే వారి కుటుంబం ! సమస్త లోకాన్నంతా మహాత్ములు తమ కుటుంబంగా భావిస్తారు. కాబట్టే లోక శ్రేయస్కరం అంటూ లోక సేవకే పూర్తిగా అంకితం అవుతారు. ఈ క్రమంలో వీరిని అనుసరించిన వారు మాత్రమే బాగు పడతారు. అనుసరించని వారు అలాగే ఉండి పోతారు, వారు రక్త సంబంధీకులైనా లేక మరెవరైనా సరే ! మహాత్ములు రక్త సంబంధాలను మెయింటేన్ చేయరు, వారు ఆత్మ సంబంధాలను మెయింటేన్ చేస్తారు. ఆత్మ సంబంధాలలో రక్త సంబంధీకులు ఉండచ్చు, ఉండక పోవచ్చు.

వాస్తవానికి, లోక శ్రేయస్కరం గురించి ప్రతీ ఒక్కరూ ఆలోచించాలి. లోకం అంటే ఏమిటి? లోకం అంటే మన నివాసం. మన జీవితానికి అవసరమయ్యే సర్వస్వాన్ని అందించేదే లోకం ! లోకం అంటే కేవలం భూ గ్రహం ఒక్కటే కాదు, దాని పైన ఉండే మనుషులు మరియు ఇతర ప్రాణికోటి అంతా... అనే అర్థం. లోకం బాగుంటేనే మనం బాగుంటాం. లోకానికి మనకు ఆత్మ సంబంధం ఉంది. లోకోద్ధారణకై ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పాటు పడాలి. లోక సేవ ప్రతీ మనిషి యొక్క ప్రాథమిక ధర్మం. లోకాన్ని సేవిస్తేనే మీకు విముక్తి లేక మోక్షం. ఈ జన్మలో కాకపోతే ఏ జన్మకైనా లోక సేవ తప్పదు గాక తప్పదు. మీరు ఏ మతం వారైనా, మీరు ఏ కులం వారైనా సరే ! మా మత గ్రంథాలు ఇవి చెప్పటం లేదు, మా కుల పెద్దలు ఇవి నిజం కాదంటున్నారు అని అజ్ఞానంలో కూరుకు పోవద్దు. అన్ని మత గ్రంథాల్లో నిజాలు ఉన్నాయి. అయితే అజ్ఞాన మత గురువులు లేక మత పెద్దలు ఆ యొక్క నిజాలను కొన్నింటిని మాయం చేసేశారు, మరి కొన్నింటినేమో ప్రాధాన్యత లేని వాటిగా కొట్టి పారేసి వాటినో మూలకు పడేసారు. అమాయక ప్రజలు గుడ్డిగా మతాధికారులు చెప్పేది నమ్మి అంధాకారంలో ఉన్నారు. మతం పేరుతో, దైవం పేరుతో మతాధికారులు ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తూ తమ చెప్పు చేతల్లో పెట్టుకున్నారు. పనికి రాని విషయాలను బోధిస్తూ తమ "మత దుకాణాలను" కాపాడు కుంటున్నారు. భక్తులంటే వీరికి "గిరాకి" ! భక్తులంటే వీరికి ''కస్టమర్లు'' ! రక రకాల కర్మ కాండల బంపర్ ఆఫర్లు ఇస్తూ ప్రజలను తమ దుకాణాలకు ఆకర్షిస్తూ ఉంటారు. మతాధికారులు చెప్పేవన్నీ నిజమని నమ్మి ప్రజలు ఆ యొక్క ఆఫర్లకు ఆకర్షితులై వెళ్తుంటారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ఇలా మతాధికారుల ఆఫర్లకు ఆకర్షితులై వెళ్ళే వారిలో పెద్ద పెద్ద చదువులు చదివిన వాళ్ళుంటారు. చాలా మంది ఫారిన్ రిటర్న్డ్ వాళ్ళు కూడా ఉంటారు.

ప్రియ మిత్రులారా !

ఆలోచించండి..... ప్రతీ ఒక్కరూ ఎవరికి వారు, లోకాన్ని పట్టించుకోకుండా తమ బతుకు తాము బతుకుతూ ఉండడం సరి కాదు. ఈ విధమైన జీవన విధానం వలన ఆత్మాభివృద్ధి ఏ నాటికి జరగదు. ఇప్పుడు గడిచి పోతుంది కదా అని అనుకుంటే, మీరు ఊహించని కోణంలో దెబ్బ పడుతుంది. ఆ..... నాకేం పట్టిందిలే..... అని అనుకుంటే ఆత్మ అంధాకారంలో కూరుకు పోతుంది. దయచేసి అర్థం చేసుకోండి. ఆ తర్వాత మీరు పడే బాధలు వర్ణనాతీతం ! మేలుకోండి ! ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసిస్తూ , ఆత్మ విజ్ఞాన ప్రచారం చేయండి, అందరికీ మోక్ష మార్గాన్ని అందించండి. మీరు ఒంటరిగా చేయలేక పోతే ఏదైనా మీకు నచ్చిన సత్య మార్గ సంస్థలో సభ్యులుగా చేరండి.

సద్గురు మార్గదర్శకత్వంలో సత్య ప్రచారం చేస్తూ మీ జన్మలు సార్థకం చేసుకోండి. పక్క వారి గురించి పట్టించుకోకుండా, లోకం గురించి ఆలోచించకుండా, కేవలం తమ బతుకు తాము బతికేవి పశువులు. పశువులు మాత్రమే తమ బతుకు తాము బతుకుతాయి. మనిషి అయితే జీవిస్తాడు. తన

కోసం మరియు సర్వుల కోసం జీవిస్తాడు.

ప్రచారం చేయమన్నాను కదా అని టోపీలు పెట్టుకుని, మైకులు పట్టుకుని ఊరి మీద పడకండి. ఎవరైనా ఒక ఎన్‌లైటెన్‌డ్ మాస్టర్‌కు అసిస్టెంట్లుగా ఉండండి. బోధనలు చేయడాలు, క్లాసులు చెప్పడాలు మొదలైన తింగరి పనులు చేసి నాశనం కొని తెచ్చుకోవద్దు. కేవలం ఒక మాస్టర్‌కు అసిస్టెంట్లుగా ఉండాలి. సందుకో ధ్యాన కేంద్రం ఓపెన్ చేసి నిర్వహించడం చేయకూడదు. అత్యున్నత ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసిస్తూ, ఉన్నత ధ్యాన సాధన క్రమం తప్పకుండా చేస్తూ మాస్టర్ చెప్పిన పనులు చేస్తూ ఉండండి.

మనది పశు బతుకా... ? లేక మనిషి జీవితమా ? అని నిర్ణయించుకుని, ఆ దిశగా సాగిపోయే అవకాశం మన చేతుల్లోనే ఉందని గుర్తు చేస్తున్నాను.

60. మార్పు చాలా సులభం & సరళం

సాధారణంగా అందరూ....

అనారోగ్యం నుండి ఆరోగ్యానికి,
పేదరికం నుండి ఐశ్వర్యానికి,
బంధనాల నుండి స్వేచ్ఛకు,
బాధల నుండి ఆనందానికి,
నిరాశ, నిస్పృహల నుండి ఉల్లాస ఉత్సాహాలకు,
భయం నుండి అభయానికి,
అశక్తత నుండి శక్తతకు,
ఏడుపుల నుండి హర్షాతిరేకాలకు,
అపజయాల నుండి విజయాలకు,
దుఃఖాల నుండి ఉత్సవాలకు,
ఫలానా నుండి ఫలానాకు.....

మారాలనైతే అనుకుంటారు కానీ, మారగలమో లేదోనని ఆదిలోనే ఆగిపోతారు. ప్రయత్నించి నవ్వుల పాలవుతామేమోనని ప్రయత్నం మొదలు పెట్టకుండానే ఆగిపోతారు.

మై డియర్ ఫ్రెండ్స్ ! ముందు ఈ సత్యాన్ని తెలుసుకోండి.

ప్రయత్నమేమీ చేయకుండా ఉన్న చవట కన్నా, ప్రయత్నించి విఫలుడైన వాడే గొప్పవాడు. ప్రయత్నం చేయకుండా, బండ రాళ్ళ లాగా అలాగే ఉండే శుంఠల కంటే ప్రయత్నించి విఫలుడైన వాడే వివేకి మరియు విజేత.

వాళ్ళు ఏ పని చేయరు, చేస్తున్న వాళ్ళను చూసి హేళన చేసే మూర్ఖులను ఏ నాడు పట్టించుకోకూడదు. మారాలి అని అనుకునే ముందు "మార్పు" గురించి తెలుసుకోవాలి కదా ! మార్పు అనేది సృష్టి యొక్క ప్రాథమిక ధర్మం. సృష్టి అనుక్షణం మారుతూనే ఉంటుంది. ప్రతీ క్షణం పరివర్తన జరుగుతూనే ఉంటుంది. "మార్పు" అనేది సృష్టి యొక్క సహజ లక్షణం కాబట్టి, మీరు మారాలనుకుంటే సృష్టి మొత్తం మీకు సహకరిస్తుంది. మార్పు అనేది చాలా సులభం మరియు సరళం. మారడం అని అంటే ప్రవాహంతో పాటు ప్రవహించడం లాంటిది. మార్పు అంటే అభివృద్ధి. మార్పు అంటే శ్రేయస్కరం. మార్పు కల్యాణకరం. మార్పు సంక్షేమకరం. మార్పు సురక్షితం. మీరు మారాలని గట్టిగా నిర్ణయించుకుంటే, మిమ్మల్ని మారకుండా ఏ శక్తీ ఆపలేదు. ఎవరూ ఆపలేరు. ఎందుకంటే ఎవరైతే మారాలని అనుకుంటారో వారికి యావత్ సృష్టి యొక్క అనుగ్రహం, ఆశీర్వాదం, సహాయ సహకార సమన్వయాలు, మార్గదర్శకత్వం మరియు అండ దండలు లభిస్తాయి. సాక్షాత్ సృష్టియే వారికి రక్షగా ఉంటుంది, మారాలని అనుకునే వారిని ముందుండి నడిపిస్తుంది, ముందుకు దూకిస్తుంది. మారాలని నిర్ణయించుకుని, మారే ప్రయత్నం చేస్తూంటే, మార్పును అంగీకరిస్తుంటే... మీరెలా మారాలనుకుంటున్నారో అలా మిమ్మల్ని సృష్టి మార్చేస్తుంది. కాబట్టి మై డియర్ ఫ్రెండ్స్ మీరెలా మారాలనుకుంటున్నారో అలా మారిపోండి.

All The Very Best !

61. ఆచరణ

మీకు ఎంత ఆత్మ విజ్ఞానం ఉన్నా ఆచరణ లేనిదే అది ఎందుకూ పనికి రాదు. చాలా మంది ఎన్నో పుస్తకాలు చదువుతారు, ఎన్నెన్నో క్లాసులకు వెళ్తుంటారు, ఇంటర్‌నెట్‌లో ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన విషయాలను ఎన్నింటినో తెలుసుకుంటారు, ఆత్మ విజ్ఞాన చర్చలలో పాల్గొంటూ ఉంటారు, సందు దొరికినప్పుడల్లా ఆత్మ విజ్ఞాన లెక్చర్లు దంచుతారు, ఆత్మ విజ్ఞాన ప్రచారం చేస్తారు, ఆత్మ విజ్ఞాన ఆవశ్యకతను విశేషంగా తెలియ చేస్తుంటారు, ఆత్మ విజ్ఞాన మాస్టర్లుగా చెలామణి అవుతూ ఉంటారు, ఇంకా చాలా చాలా చేస్తూ ఉంటారు..... కానీ ఆత్మ విజ్ఞానాన్ని అణువంత కూడా ఆచరించరు. ఇలాంటి వాళ్ళంతా పాయసాన్ని పంచే గరిట లాంటి వాళ్ళు. గరిట పాయసాన్ని అందరికీ పంచుతుంది కానీ, దానికి మాత్రం పాయసం యొక్క రుచి తెలియనే తెలియదు కదా ! పాయసం యొక్క రుచిని గరిట ఆస్వాదించ లేదు. పాయసం తినడం వలన వచ్చే లాభాలను పొందలేదు, కానీ నిత్యం పాయసంతోనే... పాయసంలోనే ఉంటుంది.... ఏం లాభం ?!

ఆచరించని ఆత్మ విజ్ఞానం భారం అవుతుంది తప్ప ఎందుకూ పనికి రాదు. కేవలం ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకుంటూ ఆచరించని వాళ్ళు ఎందుకూ పనికి రాకుండానే పోతారు. కాబట్టి ప్రియ మిత్రులారా ! మీలో ఏవైనా సోది లక్షణాలు ఉంటే వాటిని వెంటనే తీసేసుకుని, తక్షణమే ఆత్మ విజ్ఞాన సూత్రాలను ఆచరించడం ప్రారంభించండి. బాగు పడతారు. విజేతలవుతారు. మీకు శ్రేయస్కరం జరుగుతుంది.

ఆచరించమని అంటున్నారు... ఎలా ఆచరించాలి ? అని అడిగితే -

దుష్టులకు తప్పని సరిగా దూరంగా ఉండాలి, కానీ వారిపై ద్వేషం లేకుండా ఉండాలి. వారి పట్ల పూర్తి ఎరుకతో ఉండాలి.

- ఒక ఆత్మ విజ్ఞాన సూత్రం

ఇప్పుడు ఈ ఆత్మ విజ్ఞాన సూత్రాన్ని ఆచరించే విధానం :

మీకు హాని చేసిన వాళ్ళను మీరు వెంటనే దూరం చేయాలి. ఉన్న పళంగా, ఒక్క సారిగా కనెక్షన్‌ను కట్ చేసి పారేయాలి. అయితే వారి పట్ల ప్రతీకారంతో రగిలి పోవద్దు. వారి పట్ల ద్వేషంతో ఉండ కూడదు. ఎందుకంటే, ప్రతీకారం మరియు ద్వేషం మొదలైనవన్నీ నెగెటివ్ భావాలు. నెగెటివ్ భావాలను కలిగి ఉన్నందుకు మీకే దరిద్రాలు చుట్టుకుంటాయి కానీ వారికి మాత్రం ఏమీ కాదు. మీరు ధ్యానంలో కూర్చుని వారి పట్ల నిజంగా ప్రేమను ప్రకటించాలి. వారిని పూర్తిగా క్షమించాలి. అణువంత అయినా ద్వేషం ఉండకుండ చూసుకోండి. ఎందుకంటే భావం అనేది మీ పట్ల అవతలి వారి పట్ల ఒకే రకంగా పని చేస్తుంది అనే విషయాన్ని మీరు గట్టిగా గుర్తుంచుకోవాలి. మీలోని ద్వేష భావం అవతలి వారికి నష్టం కలిగించే ఆలోచనలు చేస్తుంది. అవకాశం వస్తే నష్టం కలిగిస్తుంది. అయితే గుర్తుంచుకోండి, మీరు అవతలి వారికి నష్టం కలిగిస్తే మీరు వేయి రెట్లు నష్ట పోతారు. మీరేం చేస్తే అది వేయి రెట్లుగా మారి మీకే వస్తుంది. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే ఒక నెగెటివ్ భావాన్ని మీరు ఒకరి పట్ల కలిగి ఉన్నందుకు, వారికేమీ కాదు, మీరేదైనా చర్య చేస్తేనే వారికి నష్టం జరుగుతుందే తప్ప భావం కలిగి ఉన్నంత మాత్రాన వారికేమీ కాదు, కానీ ఆ నెగెటివ్ భావం యొక్క దరిద్రం మీరు అనుభవిస్తూనే ఉంటారు. కాబట్టి మీలో ఉన్న ద్వేష భావనలు ఈ క్షణమే పూర్తిగా తీసేసుకోండి. మీలో ఉన్న నెగెటివ్ భావనలను తీసేసుకోవడం అనేది మిమ్మల్ని మీరు రక్షించుకోవడమే అవుతుంది. అది మీ పట్ల మీరు కరుణ వహించడమే అవుతుంది.

ఇలాంటి సూత్రాలు ఎన్నో ఉంటాయి. వాటిని మీరు నిజ జీవితంలో, నిజంగా ఆచరిస్తూ ఉండాలి. అప్పుడు మీకు ఎన్నెన్నో శ్రేయస్కరాలు జరుగుతాయి.

కేవలం ఆత్మ విజ్ఞాన సూత్రాలను వల్లె వేస్తూ వాటిని ఆచరించని మూర్ఖులు ఏ నాటికీ బాగుపడరు.

62. దేనినైతే పొందాలి, అది కావాలి, రావాలి, అని అనుకుంటున్నారో అది చేయడం మొదలు పెట్టండి

సాధారణంగా అందరికీ ఫలానాది కావాలి, ఫలానాది రావాలి అని ఉంటుంది. కోరిక అయితే ఉంటుంది కానీ దాని కోసం రంగంలోకి మాత్రం దిగరు. ఉదాహరణకు మీకు ఈత రావాలి అని అంటే మీరు నీళ్ళలోకి దిగాల్సిందే ! ఒడ్డుపైన కూర్చుని ఎన్ని ప్రణాళికలు వేసినా, మీరు నీళ్ళలోకి గనక దిగకపోతే, అవన్నీ ఎందుకూ పనికి రావు అని గుర్తుంచుకోండి.

మీకేం కావాలో దాని కోసం పని చేయడం ప్రారంభించండి. అప్పుడే అది మీ స్వంతం అవుతుంది. మీరు స్వంత ఇల్లు కోరుకుంటుంటే అది ఎలా ఉండాలో, ఏ విధంగా ఉండాలో ఆలోచించడం మొదలు పెట్టండి. ఏ ఏరియాలో ఉండాలి, దానిలో ఎన్ని రూమ్‌లు ఉండాలి, ఏ ఏ సౌకర్యాలు ఉండాలి మొదలైనవన్నీ ఆలోచిస్తూ ఉండాలి. పేపర్ పైన ప్లాన్ గీయడం ప్రారంభించాలి. త్వరలో మీరు నివసించబోయే, మీ స్వంత ఇంటిలో పెట్టుకోడానికి ఒక చక్కటి, చిన్నదైన వస్తువును సెలక్ట్ చేసుకుని మీ దగ్గర పెట్టుకోండి. వీలైనప్పుడల్లా ఆ వస్తువుతో చెప్పండి "నిన్ను మన కొత్త ఇంటిలో పెడతాను" అని ! అనుక్షణం ఇంటి గురించే ఆలోచించండి. ఇంటి బయట పెట్టడానికి నేమ్ ప్లేట్ తయారు చేసుకోండి. వీలైనప్పుడల్లా ధ్యానంలో కూర్చుని మీ స్వంత ఇంటిలో నివసిస్తున్నట్టు కలలు కనండి. చేతిలో పైసా లేదు, స్వంత ఇంటి గురించి ఎలా కలలు కనాలండీ ? అనే డౌటు మీకొచ్చే అవకాశం ఉంది... కానీ... కలలు కనడానికి డబ్బులు ఎందుకండీ !?!

ఒక అత్యంత ముఖ్యమైన సృష్టి నియమాన్ని చెప్తాను, బాగా గుర్తుంచుకోండి :

భావమే భవము !

భావం అని అంటే ఆలోచన లేక ఊహ. భవం అంటే పరిస్థితి అని అర్థం. భావమే భవము అని అంటే - మీ భావాలే మీ పరిస్థితులుగా మారుతాయన్న మాట !

భావ స్వాతంత్ర్యం లేనిదే భవ స్వాతంత్ర్యం రాదు. భావంలో మీరు అనుమతించకపోతే, భౌతికంగా మీరు అనుభవించలేరు. కాబట్టి మీకేదైనా కావాలనుకున్నప్పుడు, ముందు దాన్ని ఊహల్లో అనుభవించండి, భౌతికంగా దాని కోసం పని చేయండి, అప్పుడు ఆటొమెటిక్‌గా దాన్ని మీరు భౌతికంగా అనుభవిస్తారు. దీనికి కావాల్సింది డబ్బులు కాదు, అని ఇప్పటికైనా అర్థం అయిందనుకుంటాను.

మీకు డాన్స్ రావాలంటే, ఊరికే ప్లాన్‌లు వేస్తూ కూర్చుంటే అది రానే రాదు. మీరు వెంటనే మీ శరీరం సహకరించినంతగా, మీకు వచ్చినట్టుగా డాన్స్ చేయడం ప్రారంభించాలి. మీకు టైప్ రావాలనుకుంటే, వెంటనే టైపింగ్ ప్రారంభించాలి. మీకు ఇంగ్లీష్ రావాలంటే తక్షణమే ఇంగ్లీష్‌లో ఆలోచించడమూ, మాట్లాడడమూ మొదలు పెట్టాలి.

మీకేది కావాలో దాని కోసం పని చేయడం ప్రారంభించండి.
అప్పుడు గ్యారంటీగా మీరు దాన్ని పొందియే తీరుతారు.

❖ ❖ ❖

63. బాత్ రూంలకు ప్రాధాన్యతను ఇవ్వండి.

అవి బాత్ రూంలు, టాయిలెట్లు కాదు, అవి ఫ్రెష్ రూంలు !

చాలా మంది టాయిలెట్లకు, బాత్ రూంలకు సరైన ప్రాధాన్యతను ఇవ్వరు. స్థలం కలిసి వస్తుందని మెట్ల కిందనో లేక పనికి రాని మూలకో బాత్ రూంలను కట్టుకుంటారు. చిన్న చిన్నగా, సరైన వెంటిలేషన్ లేకుండా లోగ్రేడ్ చీప్ మెటీరియల్‌తో కడతారు. తర్వాత వాటి నిర్వహణ కూడా చాలా ఛండాలంగా ఉంటుంది. అవసరానికి లోపలికి వెళ్ళి రావాలంటే అసహ్యమైన, భయంకరమైన పరిస్థితిని ఎదుర్కోవాల్సిందే !

చాలా మంది చూడడానికి మోడర్న్‌గా ఉంటారు. పెద్ద పెద్ద చదువులు చదువుతారు. ఇంగ్లీష్‌లో వాగుతూ ఉంటారు. చాలా ఖరీదైన బట్టలు ధరిస్తారు, చాలా స్టైల్‌గా తయారవుతారు. కార్లలో తిరుగుతూ ఉంటారు. వాళ్ళ బాత్ రూంలలోకి వెళ్ళి చూస్తే అసహ్యంగా ఉంటాయి. సత్య ప్రచారం చేస్తూ నేను దాదాపుగా భారత దేశం అంతా తిరిగాను. అప్పుడు నన్ను కొంత మంది వాళ్ళ ఇంటికి పిలిచేవారు. అప్పుడు చూశాను. ఆశ్చర్యం వేస్తుంది. వీళ్ళ చదువులు, వీళ్ళకు ఏం నేర్పాయా ? అని. వీళ్ళ బాత్ రూంలు, వ్యక్తిత్వానికి చదువుకు+డబ్బులకు సంబంధం లేదని స్పష్టంగా నిరూపిస్తాయి. మన భారత దేశంలో శుభ్రతకు ప్రాధాన్యత చాలా తక్కువగా ఉంటుంది. కొంత మంది శుభ్రతను పాటించినంత మాత్రాన ఏమీ ఒరగదు కదా ! ప్రతీ ఒక్కరూ తప్పని సరిగా పాటించ వలసిన విషయం ఇది.

శుభ్రతను పాటించని ఆత్మలు పరిణామ క్రమంలో ఎదగలేవు. అది ఒక పెద్ద లోపం. 2003లో నాకు తెలిసిన కోటీశ్వరుడొకడు వాడి వ్యాపారం పని మీద ఇటలీ వెళ్ళాడు. ఓ పది రోజుల తర్వాత తిరిగి ఇండియాకు వచ్చిన కొంత కాలానికి, ఏదో సందర్భంలో వాడిని కలవటం జరిగింది. అప్పుడు అక్కడ వేరే వాళ్ళు కూడా ఉన్నారు. వాడు తన ఇటలీ అనుభవాలు చెప్తున్నాడు. వాడు తీసుకున్న సూట్‌లో మొత్తం నాలుగు రూంలు ఉన్నాయట. వాటిలో బాత్ రూం ఏదో కనుక్కోడానికి, వాడికి కొంచెం టైమ్ పట్టిందట. తీరా కనుక్కున్న తర్వాత కూడా దాన్ని వాడడానికి పది, పదిహేను నిమిషాల టైమ్ తీసుకున్నాడట. ఎందుకంటే ఆ బాత్ రూం ఒక మాస్టర్ బెడ్ రూం అంత పెద్దగా, అత్యంత పరిశుభ్రంగా, అందంగా, చూడ ముచ్చటగా, ఆధునికంగా ఉందట. ఇంకా దాని గురించి చెప్తూ ఇలా అన్నాడు..."మన వాళ్ళైతే ఆ బాత్ రూంలో ఒక సింగిల్ బెడ్ రూం పోర్షన్ వేసేస్తారు" అని ! ఇక్కడ నేను కానీ, ఇటలీ అనుభవాన్ని చెప్పిన వాడు కాని భారత దేశాన్ని లేక భారత దేశ ప్రజలను కానీ అవమాన పరచటం లేదు. దయచేసి విషయాన్ని సరిగా అర్థం చేసుకోండి. నేను మన దేశంలోని అపరిశుభ్రత గురించి మాట్లాడుతున్నాను. మన భారత దేశం ప్రాచీనమైనది, మన సంస్కృతీ సాంప్రదాయాలు గొప్పవంటూ మొత్తుకునే వారు ఈ అపరిశుభ్రత గురించి కూడా పట్టించుకోవాలని మనవి చేస్తున్నాను. ఎందుకంటే మనసులో ఛండాలం ఉంటేనే బయట ఛండాలం ఉంటుంది. మురికి గృహాల్లో ఉంటూ, మురికి వీధుల్లో ముక్కు మూసుకుని నడుస్తూ, అసహ్యాకరమైన వాతావరణంలో బతుకుతూ సంస్కృతీ సాంప్రదాయం అని గోల చేయడం సరికాదు అని మనవి చేసుకుంటున్నాను. ఆడ పిల్లలు టీ షర్ట్‌లు జీన్స్ ప్యాంట్‌లు వేసుకున్నంత మాత్రాన మన సంస్కృతికి సాంప్రదాయానికి వచ్చే ముప్పు కంటే, చెత్త మరియు అపరిశుభ్రత వలన మనకు చాలా ఎక్కువగా హాని జరుగుతుంది. మానవ జాతి అభివృద్ధికి, ఆనందకరమైన జీవితానికి పరిశుభ్రత అత్యంత అవసరం, అనివార్యం ! ఒక ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడాలంటే ప్రజలందరూ పరిశుభ్రతను తప్పని సరి అంశంగా చేసుకోవాల్సిన అవసరం ఏంతో ఉంది.

చాలా మంది తమ ఇంటిలోని ముందు రూం మాత్రం చాలా నీట్‌గా, అందంగా అలంకరించి పెడతారు. ఇక లోపల ఇల్లంతా గందరగోళంగా ఉంటుంది. భవిష్యత్తులో పనికి వస్తాయి అని అనుకునే, పనికి రాని సామానుతో రూంలన్నీ నిండి ఉంటాయి. సుమారుగా 70% పనికి రాని సామానే ఉంటుంది. పాత బట్టలు, పాత దుప్పట్లు, గిన్నెలు, చినిగిపోయి వంకలు తిరిగిన సోఫాలు, విరిగిన కుర్చీలు, ఆల్‌రెడీ విరిగిపోయి ఎన్నో సార్లు రిపేర్లు చేయించి మళ్ళీ విరిగితే, రిపేరింగ్ వాళ్ళు ఈ మంచాలను ఇక మేము బాగు చేయలేమంటూ చేతులెత్తేస్తే, ఏం చేయాలో అర్థం కాక వాటినలా కాపాడుతూ ఉంటారు, ఇంకా ఇవే కాక తాతలు వాడిన చిల్లులు పడిన దోమ తెరలు, విరిగిన పడక కుర్చీలు, పాత ఇత్తడి సామాన్లు మొదలైనవి ఎన్నో ఉంటాయి. అవన్నీ కాలం చెల్లినవే అయి ఉంటాయి. అయినా పడేయడానికి మనసు రాదు. పోనీ ఎవరికైనా ఇద్దాం అని అంటే ఈ రాచరిక సామాన్లను

గ్రహించే అర్హత గల సౌభాగ్యవంతులు దొరకరు. పోనీ అమ్ముదామా అని అంటే ఆశించినంత రేటు రాదాయే ! ఏం చేయాలో అర్థం కాక ఆ చెత్తను అలా తర తరాలుగా భరిస్తూనే ఉంటారు. ఇది ఒక పెద్ద మానసిక జాడ్యం. ఒక రోగం. నిజంగా చారిత్రాత్మకమైనవి, పెద్దల గుర్తుగా దాచి పెట్టుకునే వాటి గురించి నేను ప్రస్తావించటం లేదు. పనికి రాని చెత్త గురించి మాట్లాడుతున్నాను. బయట పరిశుభ్రతను అలవాటు చేసుకుంటే అది లోపల అంతరంగంలోకి కూడా దిగుతుంది. అప్పుడు లోపల కూడా ప్రక్షాళన చేసుకునే అలవాటు వస్తుంది. "బాహ్య కార్యకలాపాలు అంతర్ కార్యకలాపాల పైన ప్రభావం చూపెడతాయి" !

ఇంటిలోని ప్రతీ భాగమూ ముఖ్యమైనదే ! ప్రతీది అందంగా, నీట్‌గా ఉండాలి. మన ఇంటిలోని ముందు రూం మాత్రమే కాకుండా, ప్రతీ రూం నీట్‌గానే ఉండాలి. ఏ అతిథి ఎప్పుడు వచ్చినా, తడుముకోకుండా ఇల్లంతా తిప్పి చూపించ గలగాలి. నిజంగా అవసరమైన సామాన్లు మాత్రమే ఉంచుకోవాలి. అవసరం లేని వాటిని అమ్మేయడమో లేక ఎవరికైనా ఇవ్వడమో లేక పడేయడమో చేయాలి. మానసిక ఆరోగ్యానికి ఇది ఎంతో అనివార్యమైన అలవాటు. ఇది ఒక సద్గుణం.

ఇక బాత్ రూంలు లేక టాయిలెట్లు వీటి యొక్క ప్రాధాన్యతను గుర్తించండి. అవి ఫ్రెష్ రూంలు. ఫ్రెష్ రూంలు అనే పేరు నేను ఎందుకు పెట్టానంటే, అవి మనల్ని ఫ్రెష్ చేస్తాయి, రిఫ్రెష్ చేస్తాయి. వాటిలో నుండి మనం తాజాగా అయ్యి బయటికి వస్తాం. అవసరానికి వాటిలోకి వెళ్ళి వస్తే, మనిషి రిఫ్రెష్ అయి రావాలి అని అంటే అవి ఎంత విశాలంగా, ఎంత పెద్దగా, ఎంత నీట్‌గా ఉండాలి ? ఒక సారి ఆలోచించండి. జీవితంలో జీవించడానికి అవసరమయ్యే రిఫ్రెష్‌మెంట్ ఫీల్‌ను అందించే వాటిలో ప్రధానమైనవి బాత్ రూంలు లేక టాయిలెట్లు. అవి కేవలం మురికి వదిలించుకునే స్థలాలుగా పరిగణిస్తున్నందుకే వాటిని అంతగా అలక్ష్యం చేస్తున్నారు. అవి కేవలం మురికి వదిలించుకునే స్థలాలు మాత్రమే కావు, అవి మనిషిని తాజాగా చేసేందుకు ఉపయోగపడే అత్యంత ముఖ్యమైన గదులు. ఫ్రెష్ రూంలను సాధ్యమైనంత విశాలంగా నిర్మించుకోవాలి. అందంగా అలంకరించుకోవాలి. వాటిలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలి. చాలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటిలోని ప్రతీ మూలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే వ్యక్తులే నిజమైన జీవితాన్ని జీవిస్తూ, జీవితాన్ని ఎంజాయ్ చేయగలుగుతారు.

అయితే అతి పరిశుభ్రత అనేది కూడా ఒక మానసిక రోగం అనేది గుర్తుంచుకోవాలి. అతి అనేది ఎక్కడైనా పనికి రాదు కదా !

64. సత్య సూత్రాలు

Cosmic Laws, సత్య సూత్రాలు, సత్య నియమాలు, సృష్టి నియమాలు, సృష్టి సూత్రాలు, విశ్వ నియమాలు, విశ్వ సూత్రాలు, ఆధ్యాత్మిక సత్యాలు, ఆధ్యాత్మిక సూత్రాలు, ఆత్మ విజ్ఞాన సూత్రాలు - ఇవన్నీ ఒకటే !

1. విశ్వం నుండి మనకు ఏం కావాలో మనం అది పొందుతాం, ఆ పొందే హక్కు, అర్హత, అధికారం, శక్తి సామర్థ్యాలు అన్నీ మనకు స్వతః సిద్ధంగానే, సహజంగానే పుష్కలంగా ఉన్నాయి.

2. అన్నీ నావే, అంతా నాదే, నాది కానిది ఏదీ లేదు అనే భావనతో చరించండి - ఇదే Cosmic Conscious - సృష్టి చైతన్య భావన అంటే ! అప్పుడు విశ్వంలోని సౌకర్యాలన్నీ మీకు లభిస్తాయి.

3. కోరిక అనేది ఏమి చేయదు, కోరుకున్నది నెరవేర్చుకోవాలి అనే నిర్ణయం మాత్రమే ఏదైనా చేస్తుంది. ఎందుకంటే నిర్ణయించుకుంటే ప్రయత్నం మొదలుపెడతాం, ప్రయత్నం మొదలు పెట్టిన తర్వాత వెంటనే సృష్టి మనకు అన్ని విధాల సహకరిస్తూ మనల్ని గమ్యం వైపు ఆటొమెటిక్‌గా తీసుకెళుతుంది. సృష్టి మనపట్ల చాలా సున్నితంగా, అనుకూలంగా వెంటనే స్పందిస్తూ ఉంటుంది.

మన నిర్ణయం ప్రకారమే సృష్టి మారుతూ ఉంటుంది. అంటే మనం ఎలా అనుకుంటే అలా మనకు అనుకూలంగా మారుతూ మనకోసం ఏమి చేయడానికైనా సర్వదా సిద్ధంగా ఉంటుంది.

సంకల్ప శక్తి

4. సంకల్ప శక్తి అంటే మరేమిటో కాదు ప్రత్యేకంగా దాన్ని పొందాల్సిన అవసరం లేదు, ఒక్క క్షణంలో ఒక కొత్త సృష్టిని చేయగల సంకల్ప శక్తి సహజంగానే అందరికీ ఉంటుంది. మీరెంత గట్టిగా నిర్ణయం తీసుకుంటే అంత గట్టిగా మీ సంకల్ప శక్తి ఉంటుంది. సంకల్ప శక్తి అనేది అనంతం, అంతం లేని భాండాగారం. మీరెంత గట్టిగా, పట్టుదలతో ప్రయత్నిస్తూ ఉంటారో అంతంతగా సంకల్ప శక్తి సమకూరుతూ ఉంటుంది. పొందాలి అనే తపన ఎంత తీవ్రంగా ఉంటే అంతంత సంకల్ప శక్తి ప్రవృద్ధమౌతూ ఉంటుంది. దాని కోసం వేరే ప్రయత్నాలేమీ చేయనక్కరలేదు.

5. ఏదైతే మీరు కోరుకుంటున్నారో దాన్ని సాధించాలి, దాన్ని పొందాలి అనే తపన తీవ్రంగా ఉండాలి. ఎంత తీవ్రతతో ఉంటే అంత త్వరగా దాన్ని మీరు పొందుతారు.

6. సంకల్ప శక్తి అంటే మరేమిటో కాదు పొందాలి అన్న తీవ్ర తపన, సాధించాలి అనే పట్టుదల, అనుకున్నది సాధించే వరకు క్షణమైన ఆగలేని ఆవేశంతో కూడుకున్న గట్టి నిర్ణయం.

7. ధ్యానం చేస్తే చాలు అనుకున్నది అనుకున్నదానికంటే తొందరగా నెరవేరుతుంది.

"తపన ప్రయత్నానికి దారి తీస్తుంది". ప్రయత్నం అనుకున్న ఫలితానికి దారి తీస్తుంది. అప్పుడు, అనుకున్నది ఆటొమెటిక్‌గా, సులభంగా పొందుతాము. అన్నింటి కన్నా పెద్ద ప్రయత్నం ధ్యానమే ! నిరంతరం ధ్యానం చేస్తూ, నేను చేసేది ఏదైనా సరే అదే నన్నూ నా గమ్యాన్ని కలుపుతుంది, అనే విశ్వాసంతో అన్ని పనులు చేస్తూ ఉండాలి.

మీరేమి చేస్తున్నారన్నది ముఖ్యం కాదు, మీరు చేసే ప్రతీది మిమ్మల్ని గమ్యం వైపుకు తీసుకు వెళ్తుందనే విశ్వాసం ముఖ్యం. మనం ఏర్పరుచుకున్న విశ్వాసాలే, తీసుకున్న నిర్ణయాలే మన జీవితాన్ని నిర్ణయిస్తూ ఉంటాయి ఎప్పటికప్పుడు.

8. సంకల్ప శక్తి అంటే మరేమిటో కాదు ఆత్మశక్తే ! ఈ ఆత్మశక్తిని ప్రత్యేకంగా ఎక్కడి నుంచో సంపాదించాల్సిన అవసరం లేదు, అపారమైన అనంతమైన ఆత్మశక్తి మనలోనే ఉంది. నిజానికి అవధులులేని ఆత్మశక్తియే మనము.

9. కోరిక కోసం మనల్ని మనం సిద్ధం చేసుకోవడం అంటే మన కోసం కోరికను సిద్ధం చెయ్యటమే.

10. మిమ్మల్ని బట్టే మీ ప్రపంచం ఉంటుంది. మిమ్మల్ని బట్టే మీ విజయం ఉంటుంది.

11. మీ యొక్క మనస్తత్వం ఎలా ఉంటుందో దాన్ని బట్టే అన్ని విషయాలు ఉంటాయి.

12. మీరు ఒకరికి ఒక బహుమతి ఎలా ఇవ్వడానికి ఇష్టపడతారో అదే విధంగా విశ్వం నుండి మీరూ పొందుతారు. మీరు ఇంకొకరికి బహుమతి ఎలా ఇవ్వాలో "నిర్ణయం" తీసుకోండి. ఆ విధంగా ఇస్తూ పోండి అంతే same to same "విశ్వం" నుండి మీరు పొందుతూ ఉంటారు.

13. మీ ప్రవర్తన ఎలా మారాలి అనుకుంటే ఆ విధంగా ప్రవర్తించడం మొదలు పెట్టండి.

14. అత్యంత దృఢమైన "నిర్ణయం" తీసుకోండి, నేను ఇక నుండి ఇలా ప్రవర్తించాలి, ఇలా ఉండాలి అని, ఇక చాలు, మీ దృఢమైన నిర్ణయమే మీ అంతరంలో మార్పును ఆటొమెటిక్‌గా తీసుకు వస్తుంది. అంతరంలో మార్పు వస్తే చాలు మనం బయట అలాగే ప్రవర్తిస్తాం.

15. మిమ్మల్ని బట్టే మీతో విశ్వం ఉంటుంది.

16. మీరు ఎలా ఉండాలనుకుంటున్నారో ఆ విధమైన "నిర్ణయం" తీస్కోండి, వెంటనే అదే విధంగా విశ్వం కూడా మీ పట్ల ప్రవర్తించడం ఆటొమెటిక్‌గా ప్రారంభం అవుతుంది.

17. మీ మనస్తత్వాన్ని బట్టే మీ జీవితం.

18. ఇతరులకు ఇవ్వడం అంటే విశ్వానికి ఇవ్వడమే ! మీరు విశ్వానికి ఏమిస్తారో అది ఎన్నో రెట్లుగా తిరిగి పొందుతారు.

19. విశ్వం పట్ల మీ తీరు ఎలా ఉంటే మీ పట్ల విశ్వం తీరు అలాగే ఉంటుంది.

20. బాహ్యం కాదు ముఖ్యం, అంతరం అనేదే అత్యంత ముఖ్యం. మీ అవసరం అనేది ఎప్పుడైతే అంతరంలో పరిపూర్ణం అవుతుందో అప్పుడు అది ఖచ్చితంగా వెంటనే తీరుతుంది.

21. మీ అవసరం తీరాలి అంటే మీ అవసరం అనేది, అది ఏదైనా సరే 100% సంపూర్ణంగా మారాలి. అప్పుడు అది ఏదైనా సరే వెంటనే మీరు కోరుకున్న స్థాయి కన్నా పై స్థాయిలోనే ఖచ్చితంగా తీరుతుంది.

22. గాఢమైన, బలమైన కోరిక ఆటొమెటిక్‌గా వెంటనే తీరుతుంది. ఇది సత్యం. గతి తప్పని ప్రాప్తి ఇది.

23. ప్రాపంచికం ద్వారా ఆధ్యాత్మికం, ఆధ్యాత్మికం ద్వారా ప్రాపంచికం. ఆధ్యాత్మికం ద్వారా ప్రాపంచికాన్ని సరి చేసుకుంటాం. ప్రాపంచికం ద్వారా ఆధ్యాత్మికాన్ని అర్థం చేసుకుంటాం.

24. కోరిక తీరడానికి మీరెంత ప్రయత్నం చేస్తారో - అంతే లెవెల్లో కోరిక తీరడానికి తను కూడా శ్రమిస్తుంది. కోరిక తీరడానికి కష్టపడనక్కర లేదు. మనం సిద్ధం అయితే చాలు. కోరికకు అనుగుణంగా మనం మారితే మనకు అనుగుణంగా కోరిక మారుతుంది.

25. "విషయ సర్వస్వమంతా ఇప్పటికే నా స్వంతం" అనే భావనలో ఎల్లప్పుడూ ఉండండి ! మనలో ప్రతి ఒక్కరూ సృష్టికి ప్రతీకలు. అంటే ఉదాహరణకు నేను సృష్టికి ప్రతీకను అన్నమాట.

నేనే సృష్టిని, సృష్టి అంతటా ఉంది. విడి విడిగా కనబడుతూ ఉన్న ప్రతి ఒక్కరిలోనూ సృష్టి ఉంది. ప్రతి ఒక్కరూ సృష్టికి యథాతథంగా - xerox copy ! ఈ విషయాన్నే శ్రీకృష్ణ పరమాత్ముడు ఉత్తర గీతలోని 2వ అధ్యాయంలోని 37వ శ్లోకంలో ఈ విధంగా చెప్పేశాడు కదా ఎప్పుడో - "ఏవం బ్రహ్మాండ నిలయం తస్మిన్ దేహే ప్రతిష్ఠతమ్" అంటే ఈ విధంగా బ్రహ్మాండమంతా ఈ దేహం నందు కల్పించబడింది అని అర్థం !

26. మన భౌతిక శరీరంలో సమస్త సృష్టి చరిత్ర దాగి ఉంది. సమస్త సృష్టి ఉంది. నేను సృష్టిని ! నేను సృష్టిని కాబట్టి సృష్టిలో ఉన్నదంతా నాదే ! ఈ విధంగా విషయ సర్వస్వమంతా నా స్వంతం అని మనం గ్రహించ గలుగుతాం అప్పుడు వెంటనే కోరింది పొందుతాం.

27. మనది కానిది మనం కోరం, మనం కోరినది ఏదైనా అది మనది అవుతుంది. కోరిక నుండి మనం తప్పుకోకుండా ఉంటే మన నుండి కోరిక తప్పుకోదు. కోరింది లభించక తప్పదు. మనకు ఇప్పటి దాకా లభించినవన్నీ మనం కోరుకున్నవే.

28. క్షణ క్షణం, అనుక్షణం, అణువణువు ప్రతి అణువులో, ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసలో మొత్తం మన ఉనికే కోరికగా మారిపోవాలి.

29. కోరిక తప్ప ఇంకొకటి లేదు, సర్వ సకల సమస్తంలో కోరికనే దర్శించాలి - బాగా శ్రమించాలి, తీవ్రంగా శ్రమించాలి, దేన్నీ లక్ష్య పెట్ట కూడదు, లక్ష్యమే మన లక్ష్యం కావాలి.

30. లక్ష్యం లేనిదే జీవితం లేదు. లక్ష్యం లేనిదే అసలు శ్వాస తీసుకోకూడదు. ప్రతి ఆలోచన లక్ష్యం పైనే కేంద్రీకృతమవ్వాలి. ప్రతి మాట లక్ష్యం గురించే మాట్లాడాలి. ప్రతీ చేష్టా లక్ష్యం కోసమేనని భావించి చేయాలి. మనకు లేని దాని గురించి ఆలోచనలు వస్తాయి, పొందని దాని పైనే కోరిక ఉంటుంది. ఏవైతే మనకు లేవో అవి మనకు ఎందుకు లేవో అన్న విషయం అవగాహనలోకి తెచ్చుకోవాలి.

31. ఏవైతే మనకు లేవో, అవి లేకపోవడం వల్ల కలిగే కష్ట నష్టాలను గురించి పూర్తిగా తెలుసుకోవాలి.

32. ఏదైనా మనకు ఎందుకు ఉండదు అంటే దాని విలువను, దాని ప్రాధాన్యతను గుర్తించడానికే.

33. ఏవైతే మనకు లేవో వాటి యొక్క విలువను, ప్రాధాన్యతను, అవసరాన్ని గుర్తించి రియలైజ్ అయిన తర్వాత వాటికోసం సిన్సియర్‌గా, నిస్సందేహంగా ప్రయత్నిస్తే వాటిని మనం సులభంగా, వెంటనే పొందుతాము.

34. సాధన వలన మనిషి సిద్ధుడవుతాడు. మహాత్ముడవుతాడు.

35. అసలు మనిషి ఏకకాలంలో ఎన్ని పనులు చేయగలడు ? అతడు ఎన్ని అనుకుంటే అన్ని చేయగలడు.

36. పేపర్ మీద వ్రాయడం అంటే చైతన్యం మీద వ్రాయడం అన్న మాట. వ్రాయడమంటే - చైతన్యానికి ఆదేశాన్నివ్వడమే.

37. నేను చేస్తాను. నేను సృష్టిస్తాను అని మాట్లాడటమంటే, 100% సృష్టించడానికి పూనుకున్నట్టే. సృష్టిస్తున్నట్టే !

38. మనకు ఎదురయ్యే పరిస్థితులు మనలో నిక్షిప్తమై ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీస్తాయి.

చిన్న సంకటం వస్తే - చిన్న శక్తి బయట పడుతుంది.

పెద్ద సంకటం వస్తే - పెద్ద శక్తి బయటకు వస్తుంది.

ఎంతటి సంకటం వస్తే అంత శక్తి ఉద్భవిస్తుంది.

సంకటం అంటే శక్తిని వెలికి తీసే సాధనం.

39. ఆ సంకటం తీవ్రమైనది వస్తే తీవ్రమైన శక్తి బయటకు వస్తుంది. సంకటం అనేది ఎంత తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తుంటే అంత తీవ్రమైన శక్తి సామర్థ్యాలు మీలో పెల్లుబుకుతాయి. ఆ సంకటానికి మీలో ఉన్న శక్తిని తవ్వి తీయటానికి అవకాశాన్ని ఇవ్వండి అంటే సంకటాన్ని(సమస్యను) అర్థం చేసుకోవడం అన్నమాట. ఈ మార్గదర్శిలోనే ధ్యాన సాధన - 3లో సమస్యను ఎలా అర్థం చేసుకోవాలో వివరించాను. చదవండి.

40. తనలో దాగి ఉన్న శక్తిని ఉపయోగించటానికి ఆత్మ భూమిపైకి వస్తుంది. సంకటం ద్వారా శక్తి జనరేట్ అవుతుంది. సంకటాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే - అంతకంటే మిత్రుడే లేడు భూమి మీద - నిత్య జీవితంలో ఎదురయ్యే ప్రతీ పరిస్థితి మనల్ని వికసింపజేయడానికి మరియు శక్తివంతం చెయ్యటానికి వస్తాయి.

41. మీపైన కాక ఇతరుల మీద ఆధారపడటం అనేది మీ యొక్క శక్తి కేంద్రాన్ని స్విచ్ ఆఫ్ చేయడంలాంటిది. మీరు ఎవరి పైనైతే ఆధారపడాలని అనుకుంటున్నారో వారందరు కూడా మీలో మీరే అయి ఉన్నారు. ఈ విషయాన్ని సదా గుర్తుంచుకోండి. సహాయమంతా కూడా లభించేది లోపలే, బయట ఏమీలేదు శూన్యం. మీరు సహాయం లోపల అడిగితే, బయటి నుంచి సహాయం వస్తుంది.

42. నీకై నీవే నిర్ణయం తీసుకోవాలి, సమస్యను అధిగమించడానికి. సమస్యతో అడ్జస్ట్ అయినంత కాలం అది నీలోనే ఉంటుంది. ప్రయత్నం మొదలు పెడితేగానీ అదిపోదు.

43. సోమరితనమే అన్నిటికన్నా పెద్ద దరిద్రం, సోమరితనమే లేకుండా ఉంటే ఎవరు ఐశ్వర్యవంతునిగా, దివ్యునిగా కాకుండా ఉంటారు. సోమరితనం లేని వారిని విజయ లక్ష్మి వరించి ఉంటుంది. శని అనేది ఒక సరి కాని గుణము తప్ప మరేమీ కాదు.

44. ధ్యానం ద్వారా చిత్తం ప్రశాంతమౌతుంది. ప్రశాంతమైన చిత్తంలో నెగెటివ్స్ ఉండవు.

45. ఆలోచన అనేది విత్తనం లాంటిది. ఫలానికి విత్తనం సంక్షిప్త రూపం ఎలాగో అలానే ఆలోచన పరిస్థితికి సంక్షిప్త రూపం.

విత్తనం = ఆలోచన

ఫలం = పరిస్థితులు

A. ఒక గొప్ప ఆలోచన వచ్చింది అంటే మనకు ఆ అర్హత ఉంటేనే వస్తుంది. అది పదే పదే రిపీట్ అవుతూ ఉంటుంది.

B. తరువాత క్రమ క్రమంగా ఒక రోజు, మొత్తం మన మైండ్‌ను ఆక్రమించుకుని ఉంటుంది.

C. మెల్ల మెల్లగా మనకు తెలియకుండా మనం ఇదే ఆలోచన చేస్తూ ఉంటాము.

D. మనము ఈ ఆలోచనలో ఉన్నప్పుడు ఏదైనా అంతరాయం కలిగితే చాలా కోపం, చికాకు వస్తాయి.

E. క్రమ క్రమంగా మిగతా విషయాలకు ప్రాధాన్యత తగ్గుతూ, ఈ ఆలోచనకు ప్రాధాన్యత పెరుగుతూ ఉంటుంది.

F. ఇక ఇప్పుడు ఈ ఆలోచననే మన ప్రధాన అంశంగా రూపొందుతుంది. 24 గంటలు దీని ధ్యాసే - ఇలాంటి ఆలోచనలు సంభవించి తీరుతాయి.

46. పంచ భూతాలు ఎంత నిరహంకారంగా పని చేస్తూ ఉంటాయో, మనం కూడా అంత నిరహంకారంగా పని చేస్తూ పోవాలి.

47. మీరు మాట్లాడిన మాటలు, మీరు ప్రవర్తించిన ప్రవర్తనలు, మీరు చేసిన పనులు, మీరు చేసిన ఆలోచనలు వాటి యొక్క ప్రతిఫలాలే, మీకు జీవితంలో అనుక్షణం ఎదురౌతూ ఉంటాయి.

✪✪✪**48.** గురువు లేక మాస్టర్ చేసే కార్యక్రమాలను, పనులను, మాటలను, ప్రవర్తనను ఎప్పుడూ కూడా మీ కోణం నుంచి చూడకూడదు. ఎందుకంటే మీ లెవెల్‌ని బట్టి ఎందుకిలా చేశాడు లేదా ఎందుకిలా మాట్లాడాడు అనిపిస్తుంది. అది అర్థమైతే పర్వాలేదు, అర్థం కాకపోతే మౌనం వహించండి.

గురువు మాట్లాడే మాటలు, చేసే పనులు మీకు అర్థం అయితే OK! అర్థం కాక పోతే ఆ మాటల్లో, చేతల్లో మీకు అర్థం కాని పరమార్థం ఏదో ఉందనుకుని ఎరుకతో, సాక్షిగా ఉండాలి. గురువు మాటలను, చేతలను అజ్ఞానంతో విమర్శిస్తే సృష్టి తగిన గుణపాఠం నేర్పిస్తుంది.

49. "ధైర్యే సాహసే లక్ష్మి" అంటే ధైర్యంతో సాహసం చేస్తే లక్ష్మి మాత్రమే లభించును. అంతే కాని మరొకటి కాదు అని అర్థం.

50. విశ్వాసం, ధైర్యం ఉంటే దగ్గరికి మృత్యువు వచ్చినా కూడా ఏమీ చేయలేదు.

51. ఏ విధంగానైతే ధ్యానం ద్వారా అంతరంలోని చెత్త తొలగి పోతుందో అదే విధంగా ఎరుకతో, ఏకాగ్రతతో ఉచ్ఛరించిన పాజిటివ్ మాటల ద్వారా కూడా క్లీన్ అవుతుంది. మీ ఊహకు అందని డెవలప్‌మెంట్ జరుగుతుంది. అందుకే ఎల్లప్పుడూ పాజిటివ్‌గానే మాట్లాడాలి.

52. ఏదైతే మీరు కారో దానినే మీరుగా భావిస్తూ అదే మీరు అయిపోయి దాని గానే చెలామణి అవుతూ ఉన్నారు. అదే అహం !

53. విశ్వాసం అంటే - పనులు సులువుగా సాగి పోతున్నప్పుడు విశ్వాసం, శ్రద్ధ కలగడం సాధారణ విషయమే కానీ, పనులు కష్టంగా సాగి పోతున్నప్పుడు, ప్రయాసతో కూడి ఉన్నప్పుడు కూడా విశ్వాసం కొనసాగాలి. తర్క సమ్మతంగా ఉండనపుడు కూడా నీవు విశ్వసించాలి. ఆ విశ్వాసమే రూపాంతర శక్తియై పరిణామ వికాసానికి దారి తీస్తుంది, ఆశించిన ఫలితం వస్తుంది.

54. వర్తమానంలో ఎందుకు ఉండలేక పోతున్నాం ?

అసంతృప్తి వలన ! వర్తమానాన్ని మనం ఒప్పుకోం కాబట్టి మనం వర్తమానంలో ఉండము. చింత ఉంటేనే నువ్వు వర్తమానంలో ఉండవు. ఎందుకు మనం వర్తమానాన్ని ఒప్పుకోం ? భయం, దడ, నీ మీద నీకు సరి అయిన విశ్వాసం లేకపోవడం, తగినంత జ్ఞానం లేకపోవడం, ఉన్న జ్ఞానాన్ని ఆచరించి అనుభవంలోకి తెచ్చుకోక పోవడం.

55. అన్ని భయాలు, సంశయాలు, దరిద్రాలు, బాధలు మొదలైనవన్నీ కూడా నీ ఆత్మతో నీవు ఏకత్వంలో లేకుండా ఉన్నందుకే ఉండగలుగుతున్నాయి. మీరు మీతో వేరుగా ఉంటున్నారు కాబట్టే భయం. ఎప్పుడైతే సంపూర్ణంగా మీతో మీరు మిళితమైతారో అప్పుడు ఇంకెక్కడి భయం ? అంతా అభయమే !

56. బాధలకు మూల కారణం, నీ దైవత్వాన్ని నీవు తెలుసుకోక పోవడమే !

57. ప్రతి వ్యక్తి ఈ లోకానికి ఒక ప్రత్యేక గమ్యంతోనే వస్తాడు. అతడు పూర్తి చెయ్యవలసిన పని ఒకటి ఉంటుంది. ప్రతి ఒక్కరి పుట్టుక వెనుక ఒక ఉద్దేశం ఉంటుంది. ఈ సృష్టి నీ ద్వారా ఏదో చేయాలనుకుంటుంది, అందుకే నీవు ఇప్పుడు ఇది చదువుతున్నావు. ధ్యానంలో కూర్చుంటే అది ఏమిటో తెలిసి పోతుంది.

58. జ్ఞాపకాల నుండి మధురత్వమే రావాలి.

59. బాధపెట్టే జ్ఞాపకం ఒక్కటి కూడా ఉండకూడదు. మధురమైనవే అయి ఉండాలి. నీ జ్ఞాపకాలు అలా కాకపోతే నీవు పరిపక్వం కాలేదు అనే అర్థం. "నేను చేసిందంతా దివ్యమే, నాకు జరిగిందంతా దివ్యమే" అని భావిస్తూ సాధన చేస్తూ ఉంటే అన్ని కర్మల నుండి విముక్తమై, మీ జ్ఞాపకాలన్నీ స్వచ్ఛమై మధురం అయిపోతాయి.

60. నీ లోపల ఉన్న సత్యాన్ని ఎదుర్కోలేక నీవు ఎస్కేప్ అవుతావు, ఎస్కేప్ కావటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తావు. ఎస్కేప్ అనే ఇసుక సముద్రంలో ఈదనూ లేవు, మునగనూ లేవు, బయట పడనూ లేవు. కాబట్టి సమస్య నుండి ఎప్పుడూ ఎస్కేప్ కాకూడదు. సమస్య నుండి ఎస్కేప్ అవడం అంటే సమస్యను పెంచుకోవడమే అని తెలుసుకో.

61. ఆత్మ విజ్ఞానం ఒక గొప్ప వెలుగు. ఆ వెలుగు వలన మన లోపల ఉన్న చీకట్లు అనే దరిద్రాలు తొలగి పోతాయి.

62. ప్రతీక్ష అంటే ఎదురుచూపు అని అర్థం. దీని గురించి మిఖైల్ నైమీ అనే మహాత్ముడు ఇలా చెప్తాడు - ఎదురు చూసే కాలం ఎక్కువ అని నీకు అనిపిస్తే అది ఇంకా ఎక్కువ అవుతుంది. అది తక్కువ అనిపిస్తే ఇంకా తక్కువ అవుతుంది. విశ్వాసంతో ఉండు, సహనంతో ఉండు ఫలితం తప్పక ప్రాప్తిస్తుంది. ప్రతీక్షను జయించండి - మిఖైల్ నైమీ.

63. మీరు ఏదైనా సమస్యకు పరిష్కారాన్ని కోరుకుంటే శాశ్వతమైన పరిష్కారాన్ని మాత్రమే కోరుకోండి. దయచేసి సులువుగా వస్తుంది కదా అని తాత్కాలిక పరిష్కారంతో సంతృప్తి చెందకండి.

64. శాశ్వత పరిష్కారం మిమ్మల్ని తాత్కాలికంగా ఇబ్బందులకు గురి చేసినా దాని వల్ల ప్రాప్తించే విజయం శాశ్వతంగా ఉండిపోతుంది. తాత్కాలిక పరిష్కారం అందంగా, ఆకర్షణీయంగా కనిపించినా దాని వల్ల మీరేదైతే పొందుతారో అది మీ దగ్గర నుండి త్వరగా వెళ్ళి పోతుంది. మళ్ళీ మీకు **అదే గతి ! అధోగతి !!**

65. లోకం మాటలు పట్టించుకుంటే నీవు ఎప్పటికి ఎదగలేవు, ఎవరో ఒకరు, ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకటి అంటూనే ఉంటారు. ఇది సర్వ సాధారణమైన విషయం. ప్రతీ దానికి స్పందించి జవాబు ఇవ్వటానికి ప్రయత్నించకు. లోకులను సమాధాన పరచటానికి జీవించకూడదు. అలా జీవిస్తే, అది పిరికి వెధవలు చేసే పని. స్వతంత్రంగా జీవించటానికి ఎవ్వరినీ పట్టించుకోవద్దు. ధైర్యవంతులే స్వతంత్రంగా జీవించ గలుగుతారు.

66. నీవు ఎంచుకున్న మార్గాన్ని తప్పు పడుతూ నిన్ను నిరుత్సాహ పరచటానికి జెలసీతో లోకం అంటున్న మాటలను పట్టించుకోకూడదు.

67. బంధాలు అశాశ్వతమైనవే అయినా, బంధాలకు విలువనిస్తూ అవి అశాశ్వతమైనవి అనే ఎరుకతో ఉండాలి. మనకు హాని చేసే బంధాలు దగ్గరివి అయినా సరే, వాటిని తక్షణమే త్యజించాలి.

68. పిల్లలను మాత్రమే కనగలం కానీ వాళ్ళ జీవితాలను, జాతకాలను కనలేం. అయితే ఆత్మ విజ్ఞానం ఉంటే కోరుకున్న ఉత్తమ సంతానాన్ని పొందవచ్చు.

69. ఇవ్వడానికే మీ చేతులు ఉన్నాయని గుర్తుపెట్టుకోండి, అడుక్కోడానికి కాదు. Commercial గుణం ఉండకూడదు. జీవితానికి విలువ నివ్వాలి. ప్రతి దానికీ విలువ కట్టొద్దు. దాని ద్వారా జీవితానికి ఎంత ఆనందం వస్తుంది అనేది ముఖ్యం.

70. ఏ ఒక్క వ్యక్తినైనా సరే మీరు శత్రువుగా పరిగణించినంత కాలం మీకు మిత్రులు లేనట్టే. ద్వేషానికి ఆశ్రయం ఇచ్చిన గుండె మైత్రికి నిలయం కాగలదా ? దేనినైనా, ఎవరినైనా ప్రేమించడం అంటే నిజానికి మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడమే, అలాగే దేనినైనా ఎవరినైనా ద్వేషించడం అంటే మిమ్మల్ని మీరు ద్వేషించు కోవడమే. కాబట్టి మీ పట్ల, అందరి పట్లా ఎల్లప్పుడూ ప్రేమను కలిగి ఉండండి.

71. అనవసరంగా, బలుపుతో తిట్టడం అని అంటే, తిట్టే వాడు తన యొక్క తిట్ల ద్వారా అవతలి వాని దురదృష్టాన్ని తీసుకుని తన అదృష్టాన్ని ఇవ్వడం అన్నమాట. హృదయపూర్వకంగా ప్రశంసించడమంటే మీకూ + ఇతరులకు శక్తి సామర్థ్యాలను వృద్ధి చేయడం అన్నమాట.

72. సహనమే శక్తి ! నీవు ఎంతెంత సహనంతో ఉంటుంటావో, అంతంత శక్తిని నీవు సమీకరించుకుంటుంటావు.

73. ఓపిక అనేది ఎక్కడనుంచో రాదు అది లోపల సహజంగానే స్థితమై ఉంటుంది. మీరు ఎక్కడ ప్రదర్శించదలచుకుంటే అక్కడ ప్రదర్శిస్తూనే ఉంటారు. అవసరం అనిపించని చోట ప్రదర్శించరు.

74. ప్రశ్న మనదే ! ఘర్షణ మనదే ! సమాధానమూ మనదే !

75. దేనినైనా సాధించడానికి ఏమైనా చెయ్యాల్సి వస్తుందేమో కానీ, సంప్రజ్ఞత్వం కోసం మాత్రం ఏమీ చెయ్యక్కర్లేదు, చివరికి ప్రయత్నం కూడా !

76. అంతా ఇచ్చిన వాడికి అంతా వస్తుంది.

77. ఎంత ఇస్తావో అంతే వస్తుంది.

78. దేనికైతే మనం సిద్ధంగా లేమో దానికి మనం సిద్ధం చేయబడతాం.

79. అన్నింటికి సిద్ధంగా ఉంటే మీకు ఎన్నుకునే అవకాశం వస్తుంది.

80. Be Divine to get Divinity. దివ్యత్వం కావాలంటే దివ్యంగా ప్రవర్తించడం మొదలు పెట్టండి. దివ్యంగా ప్రవర్తించడం అంటే మీ పట్ల మీరు, మరియు అందరితో ప్రేమగా ఉండడమే ! పైపైన కాదు, నిజంగా, హృదయపూర్వకంగా ప్రేమను కలిగి ఉండాలి.

81. ఎవరు ఎప్పుడు ఏం సాధిస్తారో ఎవ్వరికీ తెలియదు. కాబట్టి ఎవరినీ తక్కువగా అంచనా వేయకండి.

82. భౌతికం శూన్యం అయినప్పుడే, ఆధ్యాత్మికం మొదలవుతుంది. భౌతికంగా ఎంత పనికి రాకుండా పోతే ఆధ్యాత్మికంగా అంత ఉన్నతంగా తయారవుతావు.

83. "ఎలా" అనే ప్రశ్న అంతరించి పోవాలి శాశ్వతంగా ! ఎలా అనే ప్రశ్న సమస్త జీవన వికాసానికి సంబంధించి ఉంది. ఈ "ఎలా" అనే ప్రశ్నను తీసేస్తే అన్ని జరిగిపోతూనే ఉంటాయి. మీరు చేయడానికి పూర్తిగా సిద్ధంగా లేనప్పుడే ఈ "ఎలా" అనే ప్రశ్న పుడుతుంది. మీ లోపల ఉన్న తిరస్కారమే, బయట "ఎలా" అనే ప్రశ్నగా ప్రకటం అవుతుంది. నేను ఎలా బాగుపడతాను ? అనే ప్రశ్న యొక్క అసలు మూలం ఏమిటంటే - నేను బాగుపడదల్చుకోలేదు అని ! మీరు నిజంగా బాగుపడాలి అని అనుకుంటే అసలు "ఎలా" అనే ప్రశ్నయే పుట్టదు.

ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ధ్యాన సాధన ద్వారా మీకు ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలు వస్తాయి అని అంటే - చాలా మంది వెంటనే "ఎలా" అని అడుగుతారు. ముందు మీరు ఈ సత్యాన్ని ఒప్పుకుంటే అవి మీకు వస్తాయి, అప్పుడే తెలుస్తుంది. దాహం తీరాలంటే మంచి నీళ్ళు తాగాలి అని అంటే, "ఎలా" అని ప్రశ్నించకుండా ముందు మంచి నీళ్ళు తాగితే కదా తెలిసేది !

మీరేం చేయాలనుకుంటున్నారో అది చేయండి. సృష్టి మీకు అన్ని సహాయ సహకార సమన్వయాలను అందిస్తుంది. "ఎలా" జరుగుతుంది ? అని అజ్ఞానంలో ఉండకండి. విశ్వాసంతో, ధైర్యంగా అడుగు ముందుకు వేయండి అప్పుడు అన్ని ద్వారాలు తెరుచుకుంటాయి. వాస్తవానికి ద్వారాలన్నీ తెరుచుకునే ఉంటాయి. ధైర్యంగా, విశ్వాసంతో మీరు ముందుకు సాగినప్పుడు అవి కనపడతాయి. అంతే !

84. ఎలా అనే ప్రశ్న ఏ ఒక్క దానికో పరిమితం అయి ఉండటం లేదు. కానీ మీరుంటున్నారు భ్రమలో ! ఈ ఒక్కసారి ఈ "ఎలా"ను దాటేస్తే సరిపోతుంది అనుకుంటూ ఉన్నారు. దయచేసి ఆ భ్రమలో నుండి బయటికి రండి. ఈ ఎలా అనేది సమస్త జీవన వికాసానికి సంబంధించి ఉన్నది, మీ అన్ని విజయాలు, అన్ని అదృష్టాలు, మీ వైభవాలు, మీ ఆనందాలు, మీ ఉత్సవాలు, మీ ఫలితాలు, మీకు సంబంధించిన అన్ని అనుగ్రహ ఆశీర్వాదాలు ఈ "ఎలా" అనే ముసుగు కింద కప్పబడి ఉన్నాయి. ఈ "ఎలా"ని తీసేస్తే తప్ప అవి అన్నీ మీకు అందవు. ఈ ఎలా అనేది ఎంతెంతగా, అంతరించి పోతూ ఉంటుందో, మీకు అంతంతగా ఫలితాలు రావడం ప్రారంభం అవుతాయి.

85. ఎలా అన్న ప్రశ్న లేని వానికి సృష్టి యొక్క ఆశీర్వాదం లభిస్తుంది. అన్ని విజయాలు లభిస్తాయి.

86. ఎలా అనే ప్రశ్న లేకపోతే ఏది అనుకుంటే అది అవుతారు. విజయానికి ఎలా అనే ప్రశ్న అడ్డంకి. ఎలా అనే భయం అహానికి ఉంటుంది. కూర్చుంటే మార్గం ఎన్నటికీ కనబడదు. దూసుకు పోతూనే ఉండాలి.

87. ఎలా అని ఆలోచిస్తూ కూర్చోకుండా చేస్తూ పోతూ ఉంటే అన్ని మార్గాలు తెరుచుకుని ఉన్నాయని తెలుస్తుంది

88. ప్రయాణం చేస్తేనే మార్గం తెలుస్తుంది. ఆ మార్గాన ప్రయాణిస్తేనే గమ్యం చేరుకుంటావు. ఎలా అనే ప్రశ్న ఉద్భవించకూడదు.

89. చేయాలనుకుంటే మార్గాలు అన్నీ తెరుచుకుంటాయి. "ఎలా" అని అంటే గనక, అన్ని మూసుకుపోతాయి.

90. మీరే సృష్టి ! మిమ్మల్ని మీరు సంపూర్ణంగా అర్థం చేసుకుంటే యావత్ సృష్టిని అర్థం చేసుకున్నట్టే.

91. సమయం, వ్యక్తులు, పరిస్థితులు లేక ఏ ఇతరమైన, ఏదైనా సరే ప్రతికూలంగా ఉన్నప్పుడు సహనంతో తగిన సమయం కోసం ఎదురు చూడాలి. సహనంతో ఎదురు చూడడం వలన మాత్రమే ప్రతికూలం అనుకూలంగా మారుతుంది. సహనం అనే శక్తి "వ్యతిరేకతను" "అనుకూలతగా" మారుస్తుంది.

92. ఏ ప్రయత్నం కూడా, ఏ పని కూడా వృథా అనేది కాదు. మీకు వృథా అయిపోయాయి అని అనిపించినవన్నీ సరైన సమయంలో సద్వినియోగాలై మిమ్మల్ని ఆశ్చర్య పరుస్తాయి. మీరు వృథా అయింది అని అనకూడదు. శ్రేయస్కరంగానే జరిగింది అనాలి. అప్పుడది శ్రేయస్కరంగానే పరిణమిస్తుంది.

93. నీవు ఎవరికీ బానిసగా ఉండకు, ఎవరినీ నీ బానిసగా చేసుకోకూడదు. No centiments - No attachments ! ఎప్పుడూ స్వేచ్ఛనే పరివ్యాప్తం చేయాలి. నీవు ఎవరి మీదా వాలిపోకు, నీ మీద ఎవరినీ వాల్చుకోకు.

94. మీ చెత్త మీరు తీసివేసుకోడానికి ఎలాంటి శక్తి సామర్థ్యాలు అవసరం లేదు కేవలం దృఢ సంకల్పం చాలు.

95. ఏ పనిలో నీవు విజయం సాధించాలనుకుంటున్నావో ఆ పని అంటే నీకు చచ్చేంత ఇష్టం ఉండాలి. దాని కోసం నీవు దేనికైనా సిద్ధపడి ఉండాలి. నీకు ఆ పని మీద ఎంత ఇష్టం ఉంటే అంత విజయం వస్తుంది. ఇష్టం అనేది ఒక మహా శక్తి ! ఇష్టం అంటే విజయం !

96. అవగాహనను మించింది సృష్టిలో ఏదీ లేదని మిఖాయిల్ నైమీ అనే మాస్టర్ చెప్తాడు.

97. అంతా ఆత్మ పదార్థమే, అన్నీ వివిధ ప్రకంపనల యొక్క ఆత్మ రూపాలే.

98. అడ్డంకులు అధిగమించడానికే వస్తాయి. ఆగిపోవడానికి కాదు.

99. వారసత్వంగా వచ్చిన ఆస్తి గాని, ఇంకా ఇతర ఏదైనా మార్గంలో వచ్చిన ఆస్తిగాని, ఆస్తి పరుల అండదండలు గాని, స్థిర చరాస్తులు గాని, నీవు చదివిన చదువు గాని, నీ వృత్తి గాని ఇంకా ఇలాంటివి ఏవైనా సరే బ్రతకడానికి ఏ మాత్రము ఉపయోగపడవు. నీ యొక్క ధర్మమే నీకు జీవితాన్నిస్తుంది. నీ యొక్క ఆత్మ విజ్ఞానమే నీకు అన్ని ఆనందాలను ఇస్తుంది.

100. ఆత్మోన్నతి అనే పరిణామ క్రమంలో కొన్ని లక్షల స్థాయిలుంటాయి. అంతిమ సత్యాన్ని చేరుకునే వరకు సాధకుడు ఏ క్షణంలోనైనా పడిపోవచ్చు. ఏ క్షణంలోనైనా తిరిగి పైకి ఎక్కనూవచ్చు.

101. గుర్తుంచుకోండి, చాలా సావధానంగా అర్థం చేసుకోండి, సాధకుడు పడిపోవడానికి, తిరిగి ఉన్నత శిఖరాన్ని అధిరోహించడానికి ఎల్లప్పుడూ అవకాశాలు ఉంటూనే ఉంటాయి. వాటిని ఎలా వాడుకుంటారు అనేది మీ ఇష్టం.

102. నీ బయట, నీ చుట్టు ప్రక్కల పరిస్థితుల్లో మరియు నీ చుట్టు ప్రక్కల వారిలో, నిన్ను ప్రేమించే వాళ్ళు, నీవు ఇష్టపడే వాళ్ళను మాత్రమే కాకుండా నిన్ను ద్వేషించే వాళ్ళలో కూడా ఆ దైవమే ఉంది. ఈ విధంగా అన్నింటిలో, అందరిలో నీవు దైవాన్ని దర్శించినపుడు నీలోని దైవం నీకు దర్శనం ఇస్తుంది. అప్పుడు ఆ దైవము నీవు ఒకటేనని తెలుసుకుంటావు.

103. ఆచరణ లేని సూత్రాలు వ్యర్థం.

104. మిమ్మల్ని ఎవరూ శాసించటం లేదు.

105. మిమ్మల్ని మీరే శాసించుకుంటున్నారు.

106. నీకు సహాయం చేయడానికి సృష్టి యావత్తు సిద్ధంగా ఉంది.

107. నీ నమ్మకాలు, అభిప్రాయాలు ఆ సహాయాలను అడ్డుకుంటున్నాయి.

108. కార్యానికి కారణం ఉంటుంది. కారణానికి కారణం ఉండదు.

109. నువ్వు కోరింది ఇవ్వడానికి సృష్టి సిద్ధంగా ఉంటుంది. నువ్వు సిద్ధంగా ఉండవు.

110. సిద్ధం కావడానికే సాధన.

111. సాధన అంటే సిద్ధమవటమే. సిద్ధం కావడమంటే పొందటమే !

112. పరిస్థితులను మార్చుకోవడం చాలా కష్టం అనే భావనలో నుండి బయట పడండి. ఆ భావనను సంపూర్ణంగా తీసివేయండి. ఈ క్షణమే.

113. పరిస్థితులను మార్చుకోవడం అంటే డ్రెస్ మార్చుకున్నంత సులభం - అవి ఎలాంటి పరిస్థితులైనా సరే.

114. నా కుటుంబం వారు నా ఆధ్యాత్మిక మార్గానికి అడ్డుపడతారు అనే భావన తొలగించి, వారు నాకు సహకరిస్తారు అనే భావన కలిగి ఉండండి. ఇంకా వారే నా మార్గంలోకి వస్తారు అనే భావన కలిగి ఉండండి. అప్పుడు అలానే జరుగుతుంది. ఒక వేళ అలా జరగకపోయినా మీకు ఆటంకాలు మాత్రం రావు.

115. బాధపడరాదు, బాధలో నుండి ఎలా బయటపడాలి అనుకోవాలి.

116. ఉత్సాహంగా ఉంటూ ఉంటేనే జీవితం ఉత్సవం అవుతుంది.

117. జరిగిన మేలు మళ్ళీ జరగదేమో అనే సంశయమే మీకు జరిగే మేలును అడ్డుకుంటుంది. జరిగిన మేలు మళ్ళీ జరుగుతుంది అని విశ్వసించండి. మేలు మేలుకే జన్మనిస్తుందని తెలుసుకోండి.

118. సృష్టియే అయి ఉన్న మీరు సృష్టితో పాటుగానే ఉద్భవించారు. అన్నీ ఉద్భవించబడ్డాయి. అలాగే సృష్టి ఉన్నంత కాలం మీరు ఉంటారు. అంటే మీరు శాశ్వతులు. అనంతులు.

119. నీ చేత తిరస్కరించబడిన మరియు తప్పని సరిగా నువ్వు నేర్చుకోవాల్సిన నీ యొక్క అంశాలు ఏవైతే ఉన్నాయో అవి అన్నీ కూడా నీ చుట్టు ప్రక్కల ఉన్న వ్యక్తుల్లో, పరిస్థితుల్లో ప్రతిఫలిస్తూ ఉంటాయి.

120. మీ లోపం మీకు మెడిటేషన్ ఎక్స్‌పీరియన్స్‌లో కాని, కలలో తెలిసినప్పుడు కాని లేక ఎవరైనా చెప్పినపుడు కాని మీరు భయపడి బాధపడుతూ కూర్చోకుండా ఆనందాన్ని ప్రకటించాలి. ఎందుకంటే మీరు భయపడితే, మీ లోపానికి పోషణను అందించినట్టు అవుతుంది. మీ భయం, మీ బాధ అనేవి మీ లోపానికి ఆహారం. మీరు భయపడినపుడు, మీరు బాధపడినపుడు మీ లోపం శక్తిని పుంజుకుని తనను మీరు మరిచిపోయేలా చేస్తుంది. మళ్ళీ మిమ్మల్ని తన ఆధీనంలోకి తెచ్చుకుని మిమ్మల్ని ఆడిస్తుంటుంది.

121. లోపం బయట పడినప్పుడు దాన్ని తీసేసుకోవాలి కానీ బాధపడకూడదు. భయపడకూడదు.

122. మీరు నిస్సహాయ స్థితిలో ఉన్నపుడు మీకు ప్రతీ సారి సహాయం అందింది. ఇప్పటి ఈ వర్తమానంలో కూడా అందుతూనే ఉంది. భవిష్యత్తులో కూడా ఎప్పటికి శాశ్వతంగా అందుతూనే ఉంటుంది.

123. నిస్సహాయ స్థితిలో ఉన్న వారెవరికైనా ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాంటి పరిస్థితులలోనైనా సరే, పీకల దాకా ముంచుకొచ్చినప్పుడైనా సరే సహాయం తప్పక అంది తీరుతుంది.

124. సహాయం పొందడానికి ప్రత్యేకమైన అర్హత అవసరంలేదు. మీ నిస్సహాయ స్థితియే మీ అర్హత. ఇది సృష్టి నియమం. నిశ్చింతగా ఉండండి.

125. ఆత్మకు శక్తి, ఆత్మ విజ్ఞానమే !

126. దిగులు పడకు, బాధ పడకు. ఎందుకంటే దిగులు, బాధలో ఉన్నప్పుడు మీ పగ్గాలు వేరొకరు తీసుకుంటారు, మిమ్మల్ని ఆక్రమించుకుంటారు. మీ జీవశక్తి లాగేయబడుతుంది.

127. పరిస్థితులు పరిస్థితులు కావు, శరీరం శరీరం కాదు. పరిస్థితి అంటే భావం, శరీరం అంటే కాంతి.

128. శరీరం అంటే మాంసంతో కూడింది కాదు, శరీరం కాంతితో నిండి ఉంది. శరీరమే కాంతి. కాంతియే శరీరం.

129. కాంతి శరీరమే మీది, కాంతి శరీర ధారులే మీరు. కాంతి స్వరూపులే మీరు. ఇంకా అందరూ !

130. మూర్ఖత్వం, అజ్ఞానం, పేదరికం, అశక్తత, సమస్యలు, దరిద్రాలు, బలహీనతలు, వ్యామోహాలు మొదలైనవి అన్నీ కూడా నిర్జీవాలు. వాటికి జీవం పోసేది మీరే, అవి మిమ్మల్ని పట్టుకోలేవు, అవి మిమ్మల్ని బంధించలేవు. ఎందుకంటే వాటికి ప్రాణం ఉండదు కనుక ! మీరు వదిలేయాలి అనుకున్న మరుక్షణం వాటిని వదిలి పెట్టగలుగుతారు. ఎందుకంటే పట్టి ఉంచింది మీరే కాబట్టి. పట్టుకున్న వారే వదిలేయాలి కదా. వ్యామోహాలు మిమ్మల్ని బంధించి లేవు, మీరే వాటిని పట్టుకొని ఉన్నారు. మూర్ఖత్వం, పేదరికం, అజ్ఞానం, అశక్తత, సమస్యలు, దరిద్రాలు, బలహీనతలు మిమ్మల్ని పట్టి లేవు మీరే వాటిని మీ అజ్ఞానం చేత పట్టుకుని ఉన్నారు. మరి వాటిని వదిలేయడం ఎలా ? అని అంటే ముందు మీరు వాటిని పట్టుకొని ఉన్నారనే సత్యాన్ని గుర్తించాలి. ఆ తర్వాత ఆ సత్యమే మిమ్మల్ని వాటన్నింటి నుండి విముక్తం చేస్తుంది. ఎవరైనా కష్టాలను పట్టుకుని ఉంటారా ? అని ఆశ్చర్యపోకండి, ఎవరూ పట్టుకోనిదే, ఆకర్షించనిదే ఎవరికీ ఏ కష్టం రాదు. ఇది విశ్వ నియమం ! మంచో చెడో ఏదో ఒకటి ఆకర్షిస్తేనే వస్తుంది ఆకర్షించిన దాని నుండి నేర్చుకోవాల్సిన పాఠం నేర్చుకోగానే అది ఆటొమెటిక్‌గా వెళ్ళిపోతుంది. ఉన్నతమైన మత రహిత ఆత్మ విజ్ఞానం యొక్క అనుభవ పూర్వక అవగాహన ఉన్నప్పుడే మనుషులు తమ అంతరంలోని కష్టాలను వదిలేయ గలుగుతారు. సరైన పూర్తి అవగాహన లేనప్పుడు ఎంత ప్రయత్నించినా వదలలేరు. ఏదో ఆక్టివేషన్ జరగాలి అంతరంలో అది జరిగినప్పుడే విముక్తి లభిస్తుంది. ఇది మతరహితమైన అత్యున్నతమైన ఆత్మ విజ్ఞానం వలన మరియు ఉన్నత ధ్యాన సాధన వల్ల మాత్రమే సాధ్యం !

131. అవసరం లేని పనులు చేసినపుడు దాని యొక్క పరిణామం ఎప్పుడో ఒకప్పుడు బాధ పెడుతుంది.

132. అవసరం లేని పనులు చేయడం అనవసరం.

133. అవసరం లేకున్నా ఒక పని మీకు చేయాలనిపించినపుడు దాన్ని మీ అవసరంగా మార్చుకోండి. అప్పుడు దాని పరిణామం మిమ్మల్ని బాధ పెట్టదు. ఎందుకంటే పరిణామం ప్రశ్నగా మారి ప్రశ్నించినపుడు అవసరమే సమాధానం అవుతుంది.

134. కారణం ఉంటేనే → అవసరం పుడుతుంది → అవసరమే → కార్యంగా మారుతుంది. ఫలిస్తుంది. కారణాన్ని మీకై మీరే సృష్టించుకోవచ్చు. మీ ఇష్టం + అవసరమే కారణం అవుతుంది. కారణం మీదే, కార్యం మీదే, అనుభవం కూడా మీదే !

135. పైకి కనపడినంత మంచిగా అందరూ ఉండరు. ఎవ్వరినీ నమ్మకూడదు. ఎల్లప్పుడూ మీ జాగ్రత్తలో మీరుండాలి. మహా ఎరుకతో ఉండాలి. ఎంతో, ఎంతో పరీక్షించిన తర్వాత కానీ చనువు ఇవ్వకూడదు. చనువును దుర్వినియోగం చేసి మీ పైనే పెత్తనం చేస్తారు.

136. ఎవరు ఏ సహాయం చేసినా చాలా ఎరుకతో మహా జాగ్రత్తతో ఉండండి. ఏమీ ఎక్స్‌పెక్టేషన్స్ లేకుండా చేస్తున్నారా లేక ఏదో ఆశించి మీకు సహాయంచేస్తున్నారా ? అనేది నిర్ధారించుకోవాలి లేదా ఒక్కోసారి చచ్చే పరిస్థితులు కూడా వస్తాయి.

137. మీ పర్సనల్ విషయాలు ఎట్టి పరిస్థితులలోనూ ఎంత దగ్గరైనా సరే చెప్పకూడదు. కొన్ని రహస్యాలు అలాగే శాశ్వతంగా రహస్యంగానే ఉండాలి.

138. ఎవ్వరి బాధ్యతను అనవసరంగా పైన వేసుకోకూడదు. అభయాలు ఇవ్వకూడదు. తనకు మాలిన ధర్మం పనికి రాదు. ఎల్లప్పుడూ మీ జాగ్రత్తలో మీరుండాలి.

139. ప్రతి ప్రశ్నకు సమాధానం వెతకకండి. ప్రశ్నను మాయం చేయండి.

140. ప్రతి సమస్యకు పరిష్కారాన్ని వెతకకండి, సమస్యనే శాశ్వతంగా మాయం చేయండి.

కడపకు ఇవతల ఉండి ఏమీ ఇవ్వకూడదు.
ఒక వేళ ఇస్తే కడపకు పూర్తిగా ఇటైనా ఉండాలి
లేదా అటైనా ఉండాలి అంతే కాని కడపకు ఇవతల
వైపు ఒక కాలు, అవతల వైపు ఒక కాలు పెట్టి ఏమీ
ఇవ్వకూడదు, ఏమీ తీసుకోకూడదు.

కడపకు ఇవతల వైపు ఒకరు, అవతల వైపు
ఒకరు ఉండి ఏమీ ఇచ్చి పుచ్చుకోకూడదు.
కడప పైన తుమ్మకూడదు. ఒక వేళ తుమ్మితే ఎవరైనా
నీళ్ళు తెచ్చి నెత్తి పైన చల్లే వరకు కడప పైనుండి కదల కూడదు.

శుక్రవారం డబ్బులు ఇవ్వకూడదు.
ఏదో వారం గోళ్ళు తీసుకోకూడదు. ఇంకేదో వారం హెయిర్ కటింగ్
చేయించుకోకూడదు. పిల్లి అడ్డం వస్తే ఏదో జరుగుతుంది.
గ్రహణాల సమయంలో ఏవో చేయాలి. స్త్రీలు పీరియడ్స్ టైమ్‌లో ఏవో
నియమాలు పాటించాలి.... మొదలైనవన్నీ.....

....మూఢ నమ్మకాలు !

జీవితానికి పరమార్థం ఉంది అని మీరు భావిస్తే
మీకు పరిపూర్ణమైన ఆరోగ్యం ప్రాప్తిస్తుంది.
ఎందుకంటే దేహం వేరే జీవితం వేరే కాదు కనుక !
జీవితానికి పరమార్థం ఉన్నప్పుడు, ఆటొమెటిక్‌గా దేహానికి
కూడా ఆ భావం వర్తిస్తుంది, అప్పుడు మీ దేహం
శాశ్వత రీతిలో చెక్కు చెదరని సంపూర్ణమైన సమగ్రమైన ఆరోగ్యాన్ని
సంతరించుకుంటుంది. జీవితానికి పరమార్థం ఉంది
అని భావించే వారికి సృష్టి నుండి, సర్వ సకల సమస్త
సహాయ సహకార సమన్వయాలు అందుతాయి.
ఇది పరమ సత్యం.

మీరు మీ గురించి, మీ కుటుంబం గురించి
మాత్రమే కాకుండా... లోకం గురించి కూడా ఆలోచించాలి.

మీరు మీ గురించి, మీ కుటుంబం గురించి
మాత్రమే కాకుండా... లోకం గురించి కూడా శ్రమించాలి.

సృష్టిలో సహాయ సహకార సమన్వయ
న్యాయం అనేది ఎల్లప్పుడూ అందరి చేతా
ఆచరింప బడుతూ ఉండాలి. ఇది సృష్టి యొక్క
ఖచ్చితమైన నియమం మరియు ధర్మం.
ఎప్పుడైతే ఈ న్యాయం మనుషుల చేత
ఉల్లంఘించ బడుతుందో అప్పుడు
మానవుల జీవితాలలో కష్టాలు ప్రవేశిస్తాయి.

అందరూ అందరికీ సహాయం సహకారం
మరియు సమన్వయం చేసుకుంటూ ఉండాలి.

నాకేం పట్టింది.... అని మీరు కేవలం మీ గురించి
మరియు మీ కుటుంబం గురించి మాత్రమే
జీవించారనుకోండి.... తర్వాత వచ్చే జన్మలలో
మీరు పూర్తిగా లోకసేవకు అంకితం కావాల్సి వస్తుంది.

ఈ విషయంలో సృష్టి ఎవరినీ వదిలి పెట్టదు.

దొంగ గురువుల చేతిలో మోస పోయిన వాళ్ళు అని అంటూ ఉంటారు కానీ... దొంగ గురువుల చేతిలో మోసపోయిన వాళ్ళు కూడా అమాయకులేమీ కాదు. వాళ్ళ అత్యాశయే వాళ్ళను మోసపోయేలా చేస్తుంది. అత్యాశ, దురాశ లేకుండా ఉంటే మోసం చేయడం చాలా కష్టం !

పార్ట్ – 11

MAB చిల్డ్రెన్ ప్రాజెక్ట్

ఈ భూమి పైన జన్మించే ప్రతీ ఆత్మకు ఒక ప్రత్యేకమైన లక్ష్యం ఉంటుంది. మీకు జన్మించే పిల్లలు వారి కోసం వారు జన్మిస్తున్నారు కానీ, మీ కోసం కాదు అనే సత్యాన్ని బాగా గుర్తుంచుకోండి.
మీ ద్వారా వారు ఈ భూమి పైకి వస్తున్నారే తప్ప మీకోసం కానే కాదు. మీరు కాకపోతే వారికి కోటాను కోట్ల మంది ఉంటారు. వారు ఎవరి ద్వారానైనా ఈ భూమి పైకి వచ్చే అవకాశం ఉంది.

తల్లిదండ్రులంటే నిజమైన అర్థం ఏమిటంటే....

మీకు పుట్టిన వారిని మీరు ప్రేమగా పెంచి పెద్దచేయాలి అంతే. వారికి పూర్తి స్వేచ్ఛనివ్వాలి. వారి జీవితం వారికి ఇష్టం వచ్చినట్టుగా జీవించనివ్వాలి. వారికి ఇష్టం వచ్చిన వారిని పెళ్ళి చేసుకోనివ్వాలి. ఈ వివాహ విషయంలో వారు ఎంత విచిత్రమైన నిర్ణయం తీసుకున్నా సరే ! వారి వివాహ విషయం మీకు ఎంత మింగుడు పడనిది అయినా సరే ! మీరు ఒప్పుకుని తీరాలి ! ఒక వేళ వారు వివాహం చేసుకోను అని అంటే బలవంతం చేయవద్దు. గుర్తుంచుకోండి, వారికి పూర్తి స్వేచ్ఛనివ్వాలి. అప్పుడే వారి జన్మ సఫలం అవుతుంది. లేదా వారి ఆత్మ ప్రయోగమైన జన్మ వృథా అవుతుంది. ఒకరి జన్మ వృథా అయ్యేలా చేసినందుకు మీకు తగిన గుణపాఠం నేర్పించ బడుతుంది. ఈ గుణపాఠం నేర్పించ బడేటప్పుడు చాలా బాధగా ఉంటుంది. తెలిసిన వాడిని కాబట్టి మీ పట్ల కరుణతో చెబుతున్నాను. అర్థం చేసుకోండి.

మీకు పుట్టారు కదా అని మీ ఇష్టం వచ్చినట్టుగా పెంచితే, మీ జీవితాలు కోల్పోవాల్సి వస్తుంది అనే సత్యాన్ని బాగా గుర్తుంచుకోండి.

M A B చిల్డ్రెన్ ప్రాజెక్ట్

ప్రశ్న: సార్ ! మీరెప్పుడూ "మన M A B చిల్డ్రెన్ ప్రాజెక్ట్" అని అంటూ ఉంటారు కదా ! దాని గురించి చాలా మంది అడుగుతున్నారు. ముఖ్యంగా మన M A B మెంబర్సే అడుగుతున్నారు. దాని గురించి చెప్పండి. - సీనియర్ M A B మెంబర్స్

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : అల్ట్రా కాన్షియస్ నుండి నాకందిన బాధ్యతయే మన M A B చిల్డ్రెన్ ప్రాజెక్ట్ !

"జాతి" అంటే మానవ జాతి. అంతే ! ఎన్ని రకాలుగా ఉన్నా ప్రాథమికంగా మానవ జాతి, మానవ జాతే ! శరీరంలో ఎన్ని భాగాలు, ఎన్ని అవయవాలు ఉన్నా శరీరం, శరీరమే ! అన్ని కలిస్తేనే, అన్నీ కలిపితేనే శరీరం !

"మతం" అంటే అందరికి

"సమ్మతమై"నదే మతం. అంతే !

అది ఒక మార్గం, సత్యానికి. అంతే !

అన్ని మార్గాలు ఒకే దగ్గరకి తీసుకెళ్తాయి.

"కులం" అంటే మనం ఏకా "కులం" కాదు,

"సమైక్యులం" అని తెలిపేదే కులం అంటే. అంతే !

మత, కుల, వర్గ పిచ్చి కుదిరితేనే కానీ అన్ని జాడ్యాలు వదలవు. సృష్టి ఇచ్చేటపుడు జీవితాన్ని కేవలం జీవితంగా మాత్రమే ఇచ్చింది. ఎలాంటి లేబుల్స్ వేయలేదు. చూడండి, Practicalగా చేసి చూడండి ! అప్పుడే పుట్టిన పిల్లవాడికి ఏ జాతి, మత, కుల, వర్గ లేబుల్ అతికించకుండా, ఎలాంటి స్టాంపులు వేయకుండా పెంచండి. అన్ని రకాల విద్యా బోధనలు చేస్తూ కేవలం పెంచండి. వాడికి మాటలు వచ్చాక అడగండి నీవు ఎవరు అని ? వాడు కేవలం తన పేరు మాత్రమే చెప్తాడు. తను ఒక student అని మాత్రమే చెప్తాడు. అంతే ! అంతే ! అంత కంటే ఇంకా ఏ లేబుల్స్ పేర్లను చెప్పడు. తను ఒక బాలుడిని అని మాత్రమే అంటాడు. నేను ఒక మనిషిని, అందరమూ మనుషులమే కదా అని ఆశ్చర్యంగా అడుగుతాడు.

స్వచ్ఛమైన జీవితాన్ని, తెల్ల కాగితం లాంటి జీవితాన్ని ఇచ్చింది మనకు సృష్టి. నిజంగా పుట్టేటపుడే మనిషి ఏదో ఒక మతానికో, కులానికో, వర్గానికో చెంది ఉంటే పెద్దయ్యాక ఆ లక్షణాలు బయట పడతాయి. పుట్టుకతో మనిషి ఏ మత, కుల, వర్గానికి చెందిన వాడు కాదు. పుట్టుకతో అతడు కేవలం మనిషి. స్వచ్ఛమైన మనిషి అంతే ! (నా లాంటి వాళ్ళు ఇలా చెప్తూనే ఉంటారు, మీరు ఇది చదివి వెంటనే మర్చిపోతారు, మీ కులం యొక్క అభిమానంలో మీరుంటారని నాకు తెలుసు)

ఉదాహరణకు ఒక పులి పిల్లను, ఒక నక్క పిల్లను, ఒక కుందేలు పిల్లను, ఒక జింక పిల్లను, ఒక పక్షి పిల్లను, ఒక మనిషిని అంటే పిల్లవాడిని ఒకే చోట పెట్టండి ఏమీ కాదు. అందరూ చిన్నగా ఉన్నారు. కేవలం బీజంగా మాత్రమే ఉన్నారు. అందరూ వేరు, వేరు జాతులకు చెందిన వారు. అయినా ఒకే దగ్గర హాయిగా ఆడుకుంటూ ఉంటారు. కలిసి ఉంటారు. ఎందుకంటే "బీజాలు ఎన్ని రకాలవి ఉన్నా అవి కేవలం బీజాలే" ! ఎప్పుడైతే బీజం మొలకెత్తుతుందో, ఎప్పుడైతే వృక్షంగా మారడం మొదలు పెడుతుందో అప్పుడు మాత్రమే దాని లక్షణాలు బయట పడటం మొదలుపెడతాయి. పులి పిల్ల పెద్దగా కాగానే జింకను వేటాడుతుంది. నక్క కుందేలు వెంట పడుతుంది. పక్షి ఎగిరిపోతుంది. మనిషి తన దారిన తను పోతాడు. ఇక అప్పుడు కలిసి ఉండటం అసాధ్యం. ఇప్పుడు వారు బీజాలు కాదు. పుట్టుకతో వారు ఎవరో, ఏ జాతికి చెందిన వారో ఆ లక్షణాలు తమంతట తామే ప్రకటం అవుతాయి. ఎవ్వరూ నేర్పించక పోయినా సరే ! ఆటోమెటిక్‌గా అవి సహజంగా జరుగుతాయి అంతే ! వాటి యొక్క సృష్టి ఆ విధంగా జరిగింది. పులికి ఎవ్వరూ నేర్పాల్సిన అవసరం లేదు జింక నీ ఆహారం, దానిని నీవు వేటాడు అని. నక్కకు చెప్పాల్సిన అవసరం లేదు కుందేలు పైన దాడి చేయమని, పక్షికి బోధించనక్కర లేదు, నువ్వు "ఎగిరి పో" అని, మనిషికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఏమీ లేదు, తన దారిన తనను పొమ్మని. ఇవన్నీ ప్రకృతి పరంగా, సహజంగా అలా, జరిగిపోతాయి.

ఎందుకంటే అవి అన్నీ కూడా పుట్టుకతో వేరు, వేరు ! "సృష్టి" వాటిని "వేరుగా" సృష్టించింది. కాబట్టి సహజంగా "వేరు" అవుతాయి. కానీ మనిషి విషయంలో అలా జరగటం లేదు. మనుషులు ప్రకృతి పరంగా, సృష్టి పరంగా, సహజంగా వేరు పడటం లేదు. వారిని బలవంతంగా వేరు చేస్తున్నారు. భయంకరంగా పీడించి వేరు చేస్తున్నారు. వేరుగా ఉండేలా నిర్బంధిస్తున్నారు. భయపెడుతున్నారు. పెద్ద పెద్ద చదువులు చదువుతారు. అయినా మతం, కులం అంటూ చస్తూ ఉంటారు. చదువులు మనిషికి వికాసం కలిగించాలి, కానీ మూసలో ఇరికించకూడదు.

ఇప్పుడు ఉన్న ఈ వ్యవస్థ మొత్తం క్రూకటి వేళ్ళతో సహా పెకిలించి వేయ బడుతుంది, అతి త్వరలోనే ! మత రహిత, కుల రహిత నవీన సమ సమాజం త్వరలోనే ఆవిర్భవిస్తుంది. అప్పుడు మనుషులంతా తిరిగి ఒక్కటవుతారు. నవీన కాంతి యుగంలో అందరూ ఆనందంగా ఉంటారు.

పుట్టుకతో మనుషులంతా ఒక్కటే ! ఇందాక మనం రక, రకాల జాతులతో చేసిన ప్రయోగం ఇక్కడ, ఇప్పుడు మనుషులతో చేస్తే....

ప్రపంచం నలుమూలల నుండి కొంత మంది పిల్లలను తెచ్చి స్వచ్ఛంగా, ఏ లేబుల్స్ అతికించకుండా, ఏ స్టాంపులు వేయకుండా కేవలం వారిని సహజంగా ఉండనిస్తే, అలా ప్రకృతి ఒడిలో పెరగనిస్తే, పెద్దయ్యాక వారు మామూలుగానే ఉంటారు. పుట్టుకతో వారు ఒక మతానికో, కులానికో, వర్గానికో చెందిన వారైతే మరి ఆ మత, కుల, వర్గ లక్షణాలు బయటపడాలి కదా ! పడవు ! ఎందుకంటే వారు పుట్టుకతో ఏ మత, కుల, వర్గానికి చెందిన వారు కాదు. కాబట్టి ఏ లక్షణాలు ప్రకటం కావు. పుట్టుకతో వారు ఎవరో ఆ యొక్క లక్షణాలే బయట పడతాయి. సృష్టి పరంగా వచ్చిన సహజ లక్షణాలే ప్రకటం అవుతాయి. సృష్టి పరంగా నిర్మాణంలో లేని లక్షణాలు ఎక్కడి నుండి వస్తాయి ?! వాటిని బలవంతంగా అతికించుకోవాల్సి వస్తుంది.

ఏ లేబుల్స్ లేకుండా, ఏ స్టాంపులు లేకుండా పిల్లలను సహజంగా పెరగనిస్తే, పెద్దయ్యాక వారిలో కేవలం మానవ లక్షణాలు మాత్రమే ప్రకటం అవుతాయి. సంపూర్ణమైన, సమగ్రమైన మానవత్వం ప్రకటం అవుతుంది. సహజ మానవత్వానికి పరాకాష్ఠయే దైవత్వం. మానవత్వమే దైవత్వం. మానవుడే దేవుడు. మానవుడు, మానవుడిగా మారితేనే దేవుడిగా మారగలుగుతాడు. "దేహమే దేవాలయం, జీవుడే దేవుడు" అని అన్నాడు కదా శ్రీకృష్ణ పరమాత్ముడు ఉత్తర గీతలో ఎప్పుడో !

మానవుడి జీవితం స్వచ్ఛమైనది, దివ్యమైనది. ఇంత చక్కటి జీవితాన్ని పిల్లలకు దూరం చేయకుండా చూడాల్సిన బాధ్యత మనందరిది !

చిన్న పిల్లలు తెల్ల కాగితాల లాంటి వారు. దానిపై ఏదైనా రాయవచ్చు. ఏదైనా గీయవచ్చు. ఆ రాసేది, గీసేది ఏదైతే ఉందో అదే ఆ పిల్లవాడి జీవితం అయిపోతుంది. చిన్న పిల్లల జీవిత కాగితాల పైన సరైన విషయాలను రాసి, సరైన గీతలు గీసే బాధ్యత అల్ట్రా కాన్షియస్ మనకు కూడా అప్పచెప్పింది.

ప్రస్తుతం లోకంలో చిన్న పిల్లల పెంపకం మరియు విద్య సరి అయిన విధంగా లేవు. పిల్లలను కనడం వేరే ! వారిని పెంచి, విద్యా బోధన చేయడం వేరే ! పిల్లలను ఎవరైనా కనవచ్చు. కాని పెంచడం, విద్యా బోధనలు చేయడం మాత్రం "మాస్టర్స్" చేయాలి. మాస్టర్స్ ఆధ్వర్యంలోనే పెంపకం, బోధనలు జరగాలి.

ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా విధానం సరి అయినది కాదు. ఎందుకంటే అందులో ఆధ్యాత్మికత లోపించింది. ఆత్మ విజ్ఞానం లేని విద్య విద్యనే కాదు. విద్య అంటే తెలియనిది తెలుసుకోవడం. విద్య అంటే వికాసం. విద్య అంటే ప్రకాశం. విద్య అంటే "అంతరంలో" దాగి ఉన్న "ప్రజ్ఞను" వెలికి తీయడం. ప్రస్తుతం లోకంలో అమలు చేస్తున్న విద్యా విధానమంతా భౌతిక జీవులచే రూప కల్పన చేయబడి భౌతిక జీవులచే నడిపించ బడుతోంది. వీరికి "అంతరంగం" అనేది ఒకటి ఉన్నదని, దానిలో ఈ సర్వ సృష్టిని సృష్టించిన "మహా ప్రజ్ఞ" ఉందనీ తెలియనే తెలియదు.

ప్రతీ ఆత్మ ఈ భూమి పైకి కొన్ని నిర్దిష్ట అంశాలను ఎంచుకుని వాటిలో పరిణతి సాధించాలని వస్తుంది. ఆత్మ పరిణామ క్రమంలో ఆత్మ అనుభవ జ్ఞానం గడించేందుకు ఎన్నో జన్మలను తీసుకుంటుంది. ఒక్కో జన్మలో కొన్ని, కొన్ని అంశాలను ఎంచు కుంటుంది. రాజుగా, పేదగా, స్త్రీగా, పురుషుడిగా ఎన్నో రకాలైన విభిన్న జన్మలను తీసుకుని తనను తాను విస్తరించుకుంటూ పోతుంది. ఒక జన్మలో, ఒక ఆత్మ చిత్రకారుడిగా జన్మించి చిత్రకళను అభ్యసించి, చిత్రకళను ఆస్వాదించే అనుభవ జ్ఞానం కోసం జన్మ తీసుకుంది అని అనుకోండి. అప్పుడు ఆ ఆత్మ యొక్క "జన్మ ప్రణాళిక" చిత్రకళను కేంద్రంగా, ఆధారంగా తీసుకుని వేసుకోవడం జరుగుతుంది. ఇలా పుట్టిన ఆత్మను తన "జీవిత లక్ష్యం" నెరవేర్చుకోకుండా ఆత్మ విజ్ఞానం లేని తల్లిదండ్రులు + ఇతరులూ కలిసి బలవంతంగా ఆ ఆత్మ యొక్క జన్మ ప్రణాళికను విజయవంతంగా ధ్వంసం చేస్తారు. తనది కాని జీవన విధానాన్ని జీవించలేక ఆ ఆత్మ పడే క్షోభ వర్ణాణాతీతం ! జన్మ ప్రణాళిక ధ్వంసం అయిన ఆత్మ సహజంగానే భంగ పడుతుంది. భంగ పడిన ఆత్మ తనకు తాను మరియు లోకానికి చేటుగానే పరిణమిస్తుంది. ప్రస్తుతం భూమి పైన నెలకొని ఉన్న భయంకర పరిస్థితులకు ఇది ఒక ముఖ్య కారణం.

తానెందుకు జన్మించిందో ఆ కారణం కోసం ఆ విధంగానే జీవించాలి. అప్పుడే ఆ జన్మ సార్థకం అవుతుంది. క్రీడాకారుడిగా, నాట్యగత్తెగా, గణిత శాస్త్రజ్ఞుడిగా, గాయకుడిగా, నాయకురాలిగా, గృహిణిగా, కవిగా, యాత్రికుడిగా ఇలా ఎందుకు జన్మ తీసుకున్నారో అందుకై జీవించినప్పుడు జీవితం అర్థవంతం అవుతుంది. ఆత్మ పరిణామ క్రమం సఫలం అవుతుంది.

ఎవరు ఎందుకు జన్మించారో తెలుసుకుని అందు కోసం వారిని వారిలా జీవించనివ్వాలి. ప్రస్తుతం ప్రపంచంలో అధిక శాతం ఏదో అవ్వాలనుకుని ఏదో అవుతున్న వారే ! తల్లిదండ్రులకు భయపడి, సమాజానికి భయపడి తమది కాని జీవితాన్ని జీవిస్తూ అసంతృప్తితో జీవితాలను భంగపాటుతో ఈడుస్తున్న వారే ఎక్కువ శాతం ఉన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను తమ ఆస్తులుగా పరిగణించడం మానివేయాలి. తమ కాలం చెల్లిన ఆశయాలను, తమ తీరని కోరికలను, తమ పంతాలను, పట్టింపులను పిల్లల మీద రుద్దవద్దు. ప్రతి పిల్లకి, పిల్లవాడికి తనదైన ఒక ప్రత్యేకత ఉంటుంది. తనది మాత్రమే అయిన జన్మ కారణం ఉంటుంది. అది తెలుసుకుని ఆ దిశలో వారిని ప్రోత్సహించాలి.

చిన్న పిల్లలు అసహాయులు. వారి నిస్సహాయతను ఆసరాగా చేసుకుని వారి జీవితాలను ధ్వంసం చేయవద్దు. ఏడు సంవత్సరాల వరకూ పిల్లలను పూర్తి స్వేచ్ఛా పూరితమైన వాతావరణంలో పెంచాలి. పిల్లలు పడుకుని ఉన్నప్పుడు లేపవద్దు. హుశారుగా ఆడుకుంటున్న వారిని టైమయ్యింది పడుకో అని బలవంతంగా నిద్ర పుచ్చవద్దు. పిల్లలను పూర్తి సహజ వాతవరణంలో పెరగ నివ్వాలి. ఆత్మ విజ్ఞాన సూత్రాలను ఆటలో భాగంగా వారికి నేర్పిస్తూ వారి సృజనాత్మకత వికసితం అయ్యేందుకు దోహదం చెయ్యాలి. నీలో దైవం ఉంది. నీవు సర్వ శక్తిమంతుడవు / శక్తిమంతురాలివి. నీవు ఏది అనుకుంటే అది చేయగలవు. అందరూ సమానులే. అందరి పట్లా ప్రేమగా ఉండాలి. అందరికీ సహాయం చేయాలి. నీవు ఆనందంగా ఉండాలి. అందరికీ ఆనందాన్ని పంచుతూ ఉండాలి... లాంటి సత్యాలను పిల్లలకు బోధిస్తూ, వారి చేత ఆచరింప చేస్తూ వారిని ఎదగనివ్వాలి. గుర్తుంచుకోండి - 7 సంవత్సరాల వయసు వరకు వారు నేర్చుకున్న, గ్రహించిన విషయాలే వారి రాబోయే 70 సంవత్సరాల జీవితాన్ని నిర్ణయిస్తాయి. నియంత్రిస్తాయి. 7 సంవత్సరాల వయసు వరకు వారికి బోధింప బడిన విషయాల పైనే రాబోయే వారి జీవితం సమస్తం ఆధారపడి ఉంటుంది. అందుకే ఆత్మ విజ్ఞాన సత్యాలను చిన్నగా ఉన్నప్పుడే వారి హృదయాలలో నాటాలి.

చిన్న పిల్లలకు ముఖ్యంగా జీవిత శాస్త్రాన్ని బోధించాలి. జీవి ఎవరు ?

జీవితం అంటే ఏమిటి ?

జీవితంలోని పరిస్థితులు ఏ విధంగా సృష్టించ బడతాయి ?

ఆ పరిస్థితులను ఏ విధంగా మార్చుకోవచ్చు ?

శరీరంలో + జీవితంలో సమస్యలు ఎందుకు వస్తాయి ?

వాటిని ఎలా తీసివేసుకోవచ్చు ?

సర్వకాల సర్వావస్థలలోనూ నీకు నీవే ఆధారం ఎలా కావచ్చు ?

స్వతంత్ర జీవనాన్ని జీవిస్తూ జీవితాన్ని ఉత్సవంగా ఎలా చేసుకోవాలి ?

అనే విషయాలతో కూడిన జీవిత శాస్త్రాన్ని బోధించాలి. ఆ తర్వాత ఏవైనా అవసరమైన 3 భాషలు నేర్పించాలి. ఆ తర్వాత జీవితానికి అవసరం అయ్యే లెక్కలు మరియు ఇతర అంశాలను నేర్పించాలి. ఇవన్నీ పిల్లలు ఆడుతూ పాడుతూ నేర్చుకుంటారు.

చిన్నపిల్లలు, చిన్న పిల్లలు కారు. ఈ సత్యాన్ని

పెద్దలుగా వ్యవహరించే పిల్లలు తెలుసుకుంటే మంచిది.

వారికి వీలైనప్పుడల్లా చెప్తుండాలి. నీవు ఎందుకు జన్మించావో తెలుసుకో, నీ అంతరంలో నీ జన్మ ప్రణాళిక ఉంది. అది నీవే డిజైన్ చేసుకుని వచ్చావు. అది ఏమిటో తెలుసుకో. ధ్యానం చేయి అది ఏమిటో నీకు స్పష్టంగా తెలిసి పోతుంది. అంటూ వారిని అప్పుడప్పుడూ ప్రేరేపిస్తూ ఉండాలి.

ప్రతి వ్యక్తిలో అనంతమైన శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. వాటిని అందుబాటులోకి తెచ్చుకునే విషయాలను నేర్పిస్తూ పెంచాలి. ఇలాంటి సహజ వాతావరణంలో, ఆత్మ విజ్ఞాన పూర్వక వాతావరణంలో పిల్లలు పెరుగుతూ ఉన్నప్పుడు త్వరలోనే వారి జన్మ ప్రణాళికను వారు తెలుసుకుంటారు. అప్పుడు ఆత్మ విజ్ఞాన వేత్తలు ఆ జన్మ ప్రణాళికను పరిశీలించి దానికి మరిన్ని మెరుగులు ఎలా దిద్దుకోవాలో, దాన్ని మరింత అభివృద్ధికరంగా ఎలా మార్చుకోవాలో, దాన్ని మరింత వికాసపూరితంగా, సుసంపన్నంగా ఎలా చేసుకోవాలో వారికి శిక్షణను ఇస్తారు. ఆ విధంగా శిక్షణ పొందిన పిల్లలు శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా "ఎదిగి" నిజమైన పెద్దలుగా తయారవుతారు. ఇలాంటి వారు తమకు తాము మరియు లోకానికి శ్రేయస్కరంగానే పరిణమిస్తారు. ప్రస్తుతం లోకంలో "పెద్దలుగా" చెలామణి అవుతున్న చాలా మంది "పెద్దలు", శారీరకంగానే పెద్దలు తప్ప మానసిక వికాసపరంగా "పెద్దలు" కాదు. అలా అయి ఉంటే భూమిపై నేడు ఇన్ని భయంకర సమస్యలు ఉండి ఉండేవే కావు.

చదువు మనిషిని ఒకరి మీద ఆధారపడేలా చేయవద్దు. చదువు మనిషిని స్వతంత్రుడిగా చేయాలి. తన జీవితాన్ని తను నియంత్రించగలిగే స్థితిలో ఉంచాలి చదువు. ప్రస్తుతం చదువులు

చదువుతున్న వారందరూ వారి చదువులు పూర్తయ్యాక జీవనోపాధి కోసం అల్లాడుతున్నారు. ప్రపంచంలో జీవనోపాధి సమస్యకు ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా విధానం ఒక అత్యంత బలమైన, ప్రధానమైన కారణం. విద్యా విధానం మారనంత వరకు నిరుద్యోగ సమస్య తొలగిపోదు. **విద్య వేరే - జీవనోపాధి వేరే కాదు ! విద్యయే జీవనోపాధి !** విద్య పూర్తయిన తర్వాత జీవనోపాధి వెతుక్కోవడం ఏమిటి ? చోద్యం కాకపోతే ! జీవిని స్వేచ్ఛా పూరితం చేయని విద్య, విద్యయే కాదు. జీవికి స్వతంత్ర జీవనాన్ని ఎల్లవేళలా అందించని విద్య, విద్య కానే కాదు.

విద్యయే జీవనోపాధి !

విద్య అంటే మానవుడిని ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా సర్వకాల సర్వావస్థల్లోనూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో విరాజిల్లేలా చేసేదే విద్య !

జన్మను సార్థకం చేసేదే విద్య !

జన్మకు పరమార్థాన్ని ప్రాప్తింప చేసేదే విద్య !

ఇలా జన్మకు పరమార్థం ప్రాప్తింప చేసే విద్యను బోధించేందుకు నేడు భూమి పైన కొన్ని ఆధ్యాత్మిక సంస్థలు కృషి చేస్తున్నాయి. నేనూ చేయాలని సంకల్పించాను, కానీ స్కూల్ అని అనకుండా కాస్మిక్ సెంటర్ అనే పేరు ఎందుకు పెట్టానంటే, స్కూల్ అనే పదం, ఆ యొక్క శబ్దం, దాని అర్థం పూర్తిగా మారిపోయింది. స్కూల్ అనే శబ్దం పిల్లలను తీవ్రమైన భయభ్రాంతులకు గురి చేస్తుంది. వారి చిన్ని హృదయాలలో పెద్ద నెగెటివ్ అలజడిని సృష్టిస్తుంది. ఆ పదం+శబ్దం పిల్లలను అతలాకుతలం చేస్తూ ఉంది, కాబట్టే నేను ఆ పదాన్ని వాడదలచుకోలేదు. మరో కారణం ఏమిటంటే, పిల్లలకు తమ నిజ తత్వమైన కాస్మిక్ కాన్షియస్‌నెస్‌ను అనుభవ పూర్వకంగా తెలుసుకునేలా చేయడానికి.

ప్రతీ ఒక్కరు ఒక్కో ప్రణాళికతో జన్మిస్తారు. వారి ప్రణాళిక ఏమిటో వారే తెలుసుకునేలా చేసి ఆ రంగంలో వారికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వటం. దానితో పాటు అతని జన్మ ప్రణాళికకు సహాయపడే 3 భాషలు, కంప్యూటర్ సైన్స్, లెక్కలు, సైన్స్, సోషల్ మరియు ఇతర అవసరమైన అంశాలను బోధించడం జరుగుతుంది. అయితే ప్రధానంగా వారు తన జన్మ ప్రణాళిక ప్రకారం దేనినైతే ప్రధానాంశంగా పెట్టుకుని వచ్చారో

దాని పైనే ఫోకస్ చేయడం జరుగుతుంది. మిగతా అవసరమైన వాటిని అవసరమైనంత మేరకు మాత్రమే వారు నేర్చుకుంటారు. M A B లర్నింగ్ స్పేస్‌లో Ultra modern Hitech Digital Class roomలు ఉంటాయి.

ఒక వ్యక్తి తన జన్మ ప్రణాళికలో "గాయకుడు" కావాలనే అంశాన్ని పెట్టుకుని వచ్చినప్పుడు అతనికి మిగతా "అనవసరమైన సోది" అంతా చదివే అవసరం ఉండదు. దీనితో ఎంతో విలువైన సమయం వృథా కాకుండా రక్షించబడి సద్వినియోగం అవుతుంది. దానితో అతడు మహా గొప్ప గాయకుడిగా తయారయి తన జన్మ లక్ష్యాన్ని నెరవేర్చుకుంటాడు.

ఎవరు ఏ అంశం తమ జన్మ ప్రణాళికలో పెట్టుకుని వచ్చినా వారికి ఆ "అంశంతో" పాటు ఆత్మ విజ్ఞానం కూడా బోధించ బడుతుంది కాబట్టి వారు తమ జీవనోపాధిని తామే స్వయంగా సృష్టించుకో గలుగుతారు. ఆత్మ విజ్ఞానం కలిగి ఉన్న ఏ వ్యక్తికి అయినా వారి జీవనోపాధి అనేది వారి వెన్నంటే ఉంటుంది సర్వ వేళలా !

ఆత్మ విజ్ఞానం కలిగిన వ్యక్తి తనే పది మందికి సహాయం చేసే స్థితిలో ఉంటాడు. అతడి జీవితంలో చింత ఉండదు. సదా ఉత్సవమే ఉంటుంది. ఈ విధంగా తన "జన్మ ప్రణాళికను" విజయవంతంగా నెరవేర్చుకుంటూ తన "నిజ మూలాన్ని" తెలుసుకుంటూ ఉంటాడు. **MAB** లర్నింగ్ స్పేస్ స్టూడెంట్ జాతి, మత, కుల, ప్రాంత, దేశీయ భేద భావాలు లేకుండా ఒక Global Citizenగా తయారు అవుతారు. ఆ తర్వాత ఈ సృష్టి ఏమిటి ? దీని మూలం ఏమిటి ? ఈ సృష్టిలో నేనెవరిని ? అనే విషయాలు తెలుసుకుంటూ తన ఆత్మ పరిణామ క్రమాన్ని ఎంతో అభివృద్ధి చేసుకుంటూ ఉంటారు. ఈ సృష్టిలో కోటాను కోట్ల విశ్వాలు ఉన్నాయి. ఒక్కో విశ్వంలో కోటాను కోట్ల లోకాలు ఉన్నాయి. ఈ భూమి పైన ఉన్న ఇసుక రేణువులెన్నైతే ఉన్నాయో అన్నింటికన్నా ఎక్కువ లోకాలలో ప్రాణులున్నాయి. జీవనం ఉంది. నేను ఇది వరకు ఏ ఏ లోకాలలో, ఎక్కడెక్కడ,

ఎప్పుడెప్పుడు ఎలాంటి జన్మలు తీసుకున్నాను ? ఆ క్రమంలో ఎలా ? ఏ విధంగా భూమి పైకి వచ్చాను ? అనే విషయాలను తెలుసుకుంటూ వారు ఒక Cosmic Citizenగా పరిణమిస్తారు. పరమార్థాన్ని సాధిస్తారు. కులం అనేది దేశం దాటితే ఉండదని, మతం అనేది ఈ భూ లోకం దాటితే ఎక్కడా ఉండదనీ గుర్తిస్తారు, అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. ఇక్కడ ఈ భూలోకంలో మాదే గొప్ప మతం, మా దేవుడే అసలైన దేవుడు అంటూ ఏ మతానికి ఆ మతం సొంత డబ్బా కొట్టుకుంటూ ఉంటాయి. ఈ పాల పుంత అనే చిన్న విశ్వంలో పది లక్షల కోట్ల సూర్యుళ్ళు ఉన్నారని రామ్‌తా పరమాత్ముడు చెప్తాడు. ఒక్కో సూర్యుడికి ఒక్కో సౌర కుటుంబం ఉంటే ఒక్కో సౌరకుటుంబంలో కనీసం 10 నుండి 15 లోకాలు ఉంటే అందులో అత్యధిక శాతం లోకాలలో జీవితం ఉందని చెప్తాడు రామ్‌తా ! ఈ సమస్త విశ్వాన్నీ మా దేవుడే సృష్టించాడని అనుకునే వాళ్ళ దేవుడు ఎవరో ఇతర లోకాల వారికి తెలియదు. ఎంతో మంది గ్రహాంతర వాసులు, విశ్వాంతర వాసులు తమ తమ వాహనాల పైన ఈ భూలోకానికి వచ్చి వెళ్తున్నారు, ఎంతో సమాచారం ఇస్తున్నారు. వారెవరు కూడా ఇక్కడి దేవుళ్ళ ప్రస్తావన తేవడం లేదు. పైగా ఈ భూమ్మీద ఉన్న ఏ మత గ్రంథంలోనూ ఆ లోకాల ప్రస్తావన కానీ ఆ లోకుల యొక్క వివరాలు కానీ లేవు. సమస్త సృష్టిని సృష్టించింది ఫలానా మతం దేవుడైతే, వేరే లోకాల వారికి ఈ మతం గురించి, ఈ మత దేవుడి గురించి ఎందుకు తెలియడం లేదు ?! వారిని, వారి లోకాలను ఎవరు సృష్టించారు ?!

ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా విధానంలో ఉన్న ప్రధానమైన, అతి పెద్ద లోపాలు నాలుగు, అవి :

1. సరైన వ్యక్తిత్వ నిర్మాణ బోధన మరియు శిక్షణ ఎంత అనివార్యమైనదో గ్రహించక పోవటం.

2. సుమారు 15 నుండి 22 సంవత్సరాలు నేర్చుకున్న విద్య, ఉపాధిని కల్పించలేక పోవటం.

3. మనిషి తన యొక్క నిజ మూలాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకునే విద్య - ఎంత తప్పనిసరైనదో గ్రహించక పోవటం.

4. జన్మ కారణాన్ని సాఫల్యం చెందించే దిశలో మార్గదర్శకత్వం వహించక పోవడం మరియు ఆ విషయంలో ప్రేరణను + జాగృతిని కలిగించక పోవటం.

1. సరైన వ్యక్తిత్వ నిర్మాణం ఎంత అనివార్యమైనదో గ్రహించక పోవటం.

ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక శాతం(నిజానికి మొత్తం అని అనాలి) కేవలం మార్కులను మరియు డిగ్రీలనే చూస్తున్నారు తప్ప, మార్కులను మరియు డిగ్రీలను కలిగి ఉన్న ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వం ఏమిటి ? అనే విషయం ఎవరూ పట్టించుకోవటం లేదు. సిలబస్‌లో ఉన్న విషయాలను **బట్టీ** పట్టి పరీక్షల్లో రాస్తే చాలు ! ర్యాంక్ వస్తే చాలు. ఇంకేమీ అవసరం లేదు. కేవలం పుస్తకాల్లో ఉన్న విషయాలను బట్టీ పట్టి రాసేసి డిగ్రీలను సంపాదించిన వాళ్ళందరూ మంచి వాళ్ళైతే ప్రపంచంలో పరిస్థితులు ఇలా ఎందుకు అఘోరిస్తాయి ?!? పక్క వాడు ఏమై పోతున్నా పట్టని పచ్చి స్వార్థం, మోసం, కుట్ర, నేరాలు, హత్యలు, రేపులు, లంచం, అవినీతి ఇంకా చాలా..... మొదలైనవన్నీ చేసే వాళ్ళందరూ చదువుకున్న వాళ్ళే ! ఎవరో కొంత మంది తప్పించి !! నిజానికి ఒక వ్యక్తి చదువు రాని వాడైతే ఆ వ్యక్తి చేత చాలా చిన్న నష్టం జరుగుతుంది. చదువు రాని వ్యక్తి యొక్క పరిధి చాలా చిన్నగా ఉంటుంది. ఆ చిన్న పరిధిలో అతను చేసే నష్టం రికవర్ చేసుకోగలం. అదే... ఆ వ్యక్తి చదువుకున్న వాడైతే... ఆ వ్యక్తి పరిధి చాలా పెద్దగా ఉంటుంది. ఎంత చదువుకుంటే అంతగా పరిధి విశాలమౌతుంది. అప్పుడు అతను చేసే హాని, తర తరాలకు కూడా పూడ్చలేని విధంగా ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి బాగా చదువుకుని ఇంజనీరో లేక డాక్టరో లేక పెద్ద ఆఫీసరో లేక నాయకుడో అయ్యాడు అని అనుకోండి, అప్పుడు అతడు సరైన వ్యక్తిత్వం కలిగి ఉండకపోతే, అతడు ఎంత హాని అయినా చేయవచ్చు. డిగ్రీలు ఉండి, సరైన వ్యక్తిత్వం లేని వాళ్ళు పరిపాలకులైతే దేశాన్ని విజ్ఞానయుతంగా నాశనం చేయవచ్చు. చక్కగా, తిరిగి కోలుకోలేని విధంగా దెబ్బ కొట్టవచ్చు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జరిగేది అదే కదా ! ప్రపంచ దేశాల నాయకులందరూ ఎందుకు ఏకం కారు ???!!!??? అనే ప్రశ్న మీలో ఎప్పుడైనా ఉదయించిందా ? ప్రతీ దేశం తమ సైన్యం మీద మరియు దేశ రక్షణ మీద ఎంతైతే ఖర్చు పెడుతుందో దానిలో కొంతైనా ప్రపంచ ప్రజల అభివృద్ధి కోసం ఖర్చు పెడితే ఆకలి చావులు మరియు నిరుద్యోగం అనేవి ఉండవు అన్న సంగతి తెలుసా మీకు ?! ఎందుకు మరి నాయకులు ఏకం కారు ?! ఏకమై ప్రపంచ ప్రజల కష్టాలు తీర్చవచ్చు కదా ! నాయకులు అలా చేయరు, ఎందుకంటే అలా చేస్తే అందరూ హ్యాపీగా ఉంటే, నాయకులకు ఉనికి లేకుండా పోతుంది. రాజకీయ నాయకుల యొక్క ఉనికి, సమస్యలే ! సమస్యలే లేని నాడు రాజకీయ నాయకులూ ఉండరు. అందుకే వాళ్ళు సమస్యలను పరిష్కరించరు. ఇంకా జఠిలం చేస్తారు. ఒక సమస్య పరిష్కారం దిశగా వెళ్తూ ఉందంటే, అది నేడో రేపో పరిష్కారం అయిపోతుందంటే... దాని క్రెడిట్ తనకు లేదా తమ వర్గానికి దక్కాలి... లేదా ఏదో ఒక మెలిక సృష్టించి ఆ సమస్యను పరిష్కారం కానివ్వరు.

అవసరాన్ని సృష్టించు లేదా కనుగొను, దాన్ని తీర్చు అనేది వ్యాపార సూత్రం ! సమస్యను సృష్టించు దాని పరిష్కారం కోసం పోరాటం చేస్తూ ఉండు కానీ పరిష్కరించకు ఇది రాజకీయ సూత్రం !

కొంత మంది రాజకీయ నాయకులు ఎంత తెలివైన వారంటే, వారిని సామాన్య జనం గుర్తించ లేరు. మేధావులుగా చెలామణి అయ్యే వారు కూడా గుర్తించలేరు. ఎవరు రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా ఉంటే వారికి సంబంధించిన ఒక సమస్యను సృష్టించి వారి ధ్యాసను దాని పైకి మళ్ళిస్తారు. అది మతమైనా కావచ్చు, కులమైనా కావచ్చు, భాష కావచ్చు, ప్రాంతం కావచ్చు, ఏదైనా... ఏదైనా... కావచ్చు, కాదేదీ సమస్య కనర్హం అన్న రీతిలో దేన్నో ఓ దాన్ని పుట్టించి వెలుగులోకి తెస్తారు, ఇక దాన్ని ప్రజలే పెంచి పోషిస్తూ ఉంటారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నడుస్తున్న ఉద్యమాల్లో అధిక శాతం ఇలాంటివే ! ఆత్మ విజ్ఞాన కోణంలో నుండి కాకుండా మీరు ఏ రకంగా చూసినా గుర్తించలేరు. ఆత్మ విజ్ఞాన అవగాహనతో మాత్రమే గుర్తించడానికి వీలవుతుంది, ఇది ప్రజల కోసం జరిగే ఉద్యమమా ? లేక రాజకీయ నాయకుల కోసం జరిగే ఉద్యమమా ? అని ! ప్రజలు అనుకుంటారు ఈ ఉద్యమం మా కోసమేనని ! ఉద్యమ లక్ష్యం సాధిస్తే ఇక మాకు అంతా మంచే జరుగుతుందనే భ్రమలో ఉంటారు. ఉద్యమానికి ముందు, ఉద్యమ సమయంలో మరియు ఉద్యమం తర్వాత నష్ట పోయేది ప్రజలే !

కొంత మంది రాజకీయ నాయకులు ఎలా ఉంటారు అనడానికి ఓ ఉదాహరణ... ఒక దగ్గర సమారు 30 మందికి పైగా ఆత్మ విజ్ఞానం ఉన్న స్త్రీలు ఉన్నారు. వారంతా కలిసి ఏదో ఉత్సవం చేసుకుంటున్నారు. అందరూ ఆనందంగా ఉన్నారు. ఆ దారి నుండి ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన మహిళా సంఘ నాయకురాలు వెళుతూ వీరిని చూసింది, ఆశ్చర్య పోయింది. ఏమిటీ... వీరి ఆనందం అని ! ఆమె తన కుతూహలాన్ని ఆపుకోలేక వారి దగ్గరికి వెళ్ళి, తనను తాను పరిచయం చేసుకుని, ఏమిటీ విశేషం ? అని అడిగింది. దానికి వారు ఏమీ లేదు, ఊరికే ఎంజాయ్ చేసుకుంటున్నాం అని అన్నారు. ఊరికే ఉత్సవం చేసుకోవడం ఏమిటి !? ఆమెకు అర్థం కాలేదు. అలా ఎలా అవుతుంది ?! ఏదో ఒక సమస్య పైన విజయం సాధించినప్పుడు మాత్రమే ఉత్సవం చేసుకోవాలి, ఇలా ఎప్పుడు పడితే అప్పుడు ఉత్సవం చేసుకోకూడదు అని చెప్పింది. దానికి ఆ స్త్రీలు మాకు సమస్యలేం లేవు అని అన్నారు. మీకు సమస్యలు లేక పోతే మిగతా స్త్రీలకు ఉన్నాయి కదా, ప్రపంచంలో ఎంతో

మంది స్త్రీలు సమస్యలతో సతమతం అవుతూ ఉంటే మీరు హాయిగా ఎలా ఉండగలుగుతున్నారు !? అని తీవ్రంగా ప్రశ్నించింది. అప్పుడు వారు, మా చుట్టు ప్రక్కల ప్రాంతాల్లోని మహిళా సమస్యలన్నింటినీ మేమే టేకప్ చేస్తూ ఉంటాం, అవసరంలో ఉన్న వాళ్ళకు, మేము వీలైనన్నీ రకాల సహాయాలే కాకుండా, చేతనైనంత ధన సహాయాన్ని కూడా చేస్తాం అని చెప్పారు. దానికి ఆ మహిళా నాయకురాలు ఆశ్చర్యపోయి, మీదేం మహిళా సంఘం, నాకెప్పుడూ తగల్లేదే... నేను నిత్యం ఎన్నో "ఆందోళనల్లో" పాల్గొంటూ ఉంటాను, మీరు నాకెప్పుడూ తారస పడలేదే అని అన్నది. దానికి వారు, మేము నిజంగా అవసరమైనప్పుడు మాత్రమే ఆందోళన చేస్తాం లేకపోతే లేదు. సాధ్యమైనంత వరకు సమస్యలను మేము సామరస్య పూర్వకంగానే పరిష్కరించుకుంటాం అని చెప్పారు. ఈ సమాధానానికి ఆ మహిళా నాయకురాలు మరింత ఆశ్చర్యపోయి అదెలా... ? కాస్త వివరంగా చెప్పండి అని అన్నది. అప్పుడు వారు సామరస్య పూర్వకంగా పరిష్కరించుకున్న ఒక సమస్యను ఈ విధంగా తెలియ జేసారు. ఒకప్పుడు, మేము ఉత్సవం చేసుకుంటున్న ఈ ఖాళీ ప్రదేశంలో ప్రతీ రోజూ చీకటి పడిందంటే చాలు జులాయి గాళ్ళు, రౌడీలు మరియు తాగుబోతులతో ఈ ప్రాంతమంతా నిండి పోయేది. సుమారు 12 కాలనీలకు ఇదే మెయిన్ రోడ్. తాగుబోతులు ఈ దారిన వచ్చి పోయే వాళ్ళను రకరకాలుగా ఇబ్బంది పెట్టే వాళ్ళు. ఆడ వాళ్ళకైతే ఈ సమస్య మరీ ఇబ్బంది కరంగా మారింది. కొంత కాలానికి ఆడ వాళ్ళు ఎవరూ మగతోడు లేకుండా నడవలేని పరిస్థితి వచ్చేసింది. మేమంతా ఈ ప్రాంతానికి చెందిన వాళ్ళమే. మేము ఈ సమస్యతో బాధ పడ్డ వాళ్ళమే. ఎవరూ పట్టించుకోవటం లేదు, ఏ నాయకుడూ రాలేదు, పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తే ఒకటి రెండు రోజులు అక్కడికి వాళ్ళు రారు, ఆ తర్వాత మళ్ళీ మామూలే ! అప్పుడు మేమంతా చాలా కోణాల్లోంచి ఆలోచించి ఒక పరిష్కారాన్ని కనుక్కున్నాము. మేము సేవింగ్ చేసుకున్న డబ్బులను పోగు చేసుకుని, ఓ రోజు ఉదయమే వచ్చి ఈ ప్రాంతమంతా శుభ్రం చేయించాం. ఆ తర్వాత లావు పాటి కర్రలు పాతి వాటికి ట్యూబ్‌లైట్లు అమర్చాం. అందమైన పూలకుండీలతో ఈ ప్రాంతమంతా నింపేసాం. ముగ్గురు ఆడవాళ్ళను, ముగ్గురు మగ వాళ్ళను మొత్తం ఆరు మందిని ఈ ప్రాంత వాచ్‌మన్‌ల లాగా నియమించాం. మేము చేస్తున్న పని గురించి తెలుసుకుని ఈ ప్రాంత ప్రజలందరూ మాకు అండగా నిలబడ్డారు, తమకు వీలైనంత సహాయ సహకార సమన్వయాలను అందించారు. ఈ విషయం తెలుసుకుని ప్రభుత్వ అధికారులు వచ్చి అభినందించి, మాకు అండగా నిలిచారు, ఇంతలో ఈ విషయాలను విన్న పోలీసులు వచ్చి మాకు రక్షణను అందించారు. సాయంత్రానికల్లా ఈ ప్రాంతాన్ని గుర్తు పట్టలేని విధంగా మార్చేసాం. టెంట్‌లు, కార్పెట్‌లు, కుర్చీలు వేసి ధ్యానం క్లాసులు పెట్టాం. రోజూ చీకటి పడగానే యథావిధిగా తాగుబోతులు వచ్చి అదంతా చూసి వెళ్ళి పోయే వారు. ఆ తాగుబోతులంతా ఏం అనుకున్నారంటే, ఈ ప్రోగ్రాంలు మహా అంటే రెండు, మూడు రోజులు జరుగుతాయిలే అని అనుకున్నారు. కానీ మేము ప్రతీ రోజు ధ్యానం క్లాసుతో పాటు ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహించే వాళ్ళం. ఏమీ లేక పోతే అందరం కలిసి భోజనం చేసే వాళ్ళం. ఇలా ప్రతీ

రోజు చీకటి పడక ముందే సుమారు 200 మందికి పైగా పోగయ్యే వాళ్ళం, తెల్లవారిందాకా ఉండి, ఉదయాన్నే ఇళ్ళకు వెళ్ళే వాళ్ళం. దీనితో మా ప్రాంత ప్రజలందరూ (కొన్ని వేల మంది), ఒకరికి ఒకరు పరిచయమయ్యారు. ఒక ఐక్యత ఏర్పడింది. ప్రేమ పూర్వకమైన సంబంధాలు ఏర్పడి, బలపడ్డాయి. అందరికీ, కొద్ది రోజుల్లోనే రాత్రి ఒక్క సారైనా ఇక్కడికి వచ్చి వెళ్ళక పోతే ఏమీ తోచని పరిస్థితి ఏర్పడింది. ఒకసారి కావాలనే, మేము కొద్ది రోజులు ఇక్కడికి రాకుండా ఉండి గమనించాం, ఏ తాగుబోతులు రాలేదు. ఏమై పోయారో తెలియదు. తాగుబోతుల బెడద వదిలి పోయినా, మాకు మాత్రం ఈ ప్రదేశంలో ఏదో ఒక ఉత్సవం జరుపుకోవటం అలవాటై పోయింది. మేము నిత్యం ఉత్సవం జరుపుకోకుండా ఉండలేము. ఇక్కడ, ఈ విధంగా నిత్య కల్యాణం పచ్చ తోరణం అన్న రీతిలో గత రెండు సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది అంటూ ఆ స్త్రీలు ముగించారు. అప్పుడు ఆ మహిళా సంఘ నాయకురాలు విపరీతమైన ఆశ్చర్యానికి గురవుతూ .....ఏమిటీ ఒక్క ధర్నా అయినా చేయకుండానే, పేపర్ వాళ్ళు రాకుండానే, బంద్‌లు, రాస్తా రోకోలు చేయకుండానే మీ సమస్య పరిష్కారం అయిందా.....!!?? అని అడిగింది. అవును అని సమాధానం ఇచ్చారు అక్కడున్న స్త్రీలందరూ. ఆ మహిళా నాయకురాలు ఆ జవాబులతో సమాధాన పడలేక పోయింది. మీలో మీరు సమస్యను పరిష్కరించుకుంటే ఎలా ? మేమెందుకు ఉన్నాం ? మాకు మాట మాత్రమైనా చెప్పకుండా మీరు సమస్యను ఎలా డీల్ చేసారు ? ఇది పద్ధతి కాదు అంటూ మండి పడింది. ఏ గొడవా, ఏ హడావుడి లేకుండా సమస్య సింపుల్‌గా పరిష్కారం అయింది అనే నిజాన్ని ఆమె జీర్ణించుకోలేక పోయింది. ఇక్కడి స్త్రీలను వేరే పార్టీ వాళ్ళు కలుసుకోక ముందే ఇక్కడ తమ పార్టీ జెండా పాతెయ్యాలని ఆ మహిళా నాయకురాలు అనేక రకాలుగా ప్రయత్నించింది, కానీ వారు ఏ ప్రలోభాలకు లొంగలేదు. ఎందుకంటే వారు ఆత్మ విజ్ఞానం ఉన్న స్త్రీలు మరి ! రాజకీయ నాయకులకు సమస్య ఎంత కఠినంగా ఉంటే వారికి అంత హాయిగా ఉంటుంది, ఎందుకంటే వీళ్ళే కదా సమస్యల **హడావుడిలో హైలైట్ పర్సన్‌లు !** నాయకులు చిన్న వాళ్ళైనా, పెద్ద వాళ్ళైనా ఒకటే రీతి. ప్రపంచ దేశాల నాయకులు రాజకీయాలు వదిలేసి ఐక్యం కాగలరు, కానీ ఆ తర్వాత వాళ్ళేం చేయాలి ?!? భూమి మీద రాజకీయం అనేది అంతరించిన నాడు ఐక్యతా వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుంది. నిజంగా రాజకీయం అనేది మంచిదే అయి ఉండవచ్చు, కానీ ప్రపంచ రాజకీయ నాయకులంతా కలిసి(కొందరు తప్పించి)దాన్ని హీనమైన దశకు దిగజార్చారు. సరైన వ్యక్తిత్వం లేని నాయకులు ఉన్నప్పుడు సమస్యలనేవి అలా ఉంటూనే ఉంటాయి. ***అయితే, రాజకీయ నాయకులంతా చెడ్డవారు కాదు. వీరిలో చాలా మంచి వారు కూడా ఉండేవారు, ఇప్పుడు ఉన్నారు, ఇకపై ఉంటారు కూడా !***

కేవలం చదువుకున్నంత మాత్రాన సరైన వ్యక్తిత్వం రాదు. అది చిన్నప్పటి నుండి ప్రత్యేకమైన శిక్షణ ఇస్తేనే వస్తుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పిల్లలకు పనికి రాని విషయాలనే చెప్తూ ఉన్నారు. "ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ " లాంటి రైమ్స్ పిల్లలకు పెద్దైన తర్వాత ఎందుకూ ఉపయోగ

పడవు. 7 సంవత్సరాల వరకు పిల్లలు ఏవైతే నేర్చుకుంటారో వారి మిగతా 70 సంవత్సరాలు ఆ ఏడు సంవత్సరాల్లో నేర్చుకున్న దాని పైనే ఆధారపడి ఉంటుంది. చిన్నప్పుడు పిల్లలకు **"మంచి వాళ్ళకు ఎల్లప్పుడూ మంచే జరుగుతుంది, కాబట్టి ఎల్లప్పుడూ మంచిగా ఉండండి, ఎవరినీ మోసం చేయకూడదు"**... మొదలైన ఆత్మ విజ్ఞాన సూత్రాలను నేర్పిస్తే, వారి చేత ఆచరింప చేస్తే..... ఇవి జన్మ అంతా పనికి వస్తాయి. ఒక్క ఈ జన్మయే కాదు, జన్మ జన్మలకూ పనికి వస్తాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా విధానం ద్వారా మనిషిలో కేవలం ఫిజికల్ & టెక్నికల్ డెవలప్‌మెంట్ మాత్రమే జరుగుతుంది. వ్యక్తిత్వ పరంగా మనిషి ఏ మాత్రమూ ఎదగడు. ఎదగని మనిషికి, వికాసం లేని మనిషికి, అవగాహన లేని మనిషికి నాలెడ్జ్ ఉంటే చాలా ప్రమాదం జరుగుతుంది. ప్రపంచంలో ప్రతీ రోజూ ఏదో ఓ చోట బాంబు పేలుతూనే ఉంది, తుపాకులు గర్జిస్తూనే ఉన్నాయి, ఎన్నో ప్రాణాలు పోతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రపంచ యుద్ధమే గనక వస్తే కొద్ది గంటల్లోనే భూమి పైన మానవజాతి తుడిచి పెట్టుకు పోతుంది. భూ గ్రహం పేలి పోతుంది. ప్రతీ దేశం ఎంతో భయంకరమైన ఆయుధ సంపదను పోగు చేసుకుంటుంది. ఎవడు ఎప్పుడు మొదలు పెడతాడో తెలియదు. ఒక్క మూర్ఖ నాయకుడి, ఒకే ఒక్క మూర్ఖ నిర్ణయం చాలు ప్రపంచ యుద్ధం రావడానికి. ఎందుకిలా ?!? ఇంత ఘోరమైన సెన్సిటివ్ పరిస్థితి ఎందుకు ??? అందరూ కలిసి మాట్లాడుకుని, ఒక శాంతి పూర్వకమైన ఒప్పందానికి రావడానికి ఏమిటి అడ్డంకి ? ఎవరి మీదా ఎవరికీ నమ్మకం లేదు, ఎందుకిలా ??? కేవలం "సరి అయిన వ్యక్తిత్వం" లేనందుకే ఇలా....! నాయకులందరికీ సరి అయిన వ్యక్తిత్వం ఉంటే, ప్రపంచ శాంతి అనేది పెద్ద విషయం కానే కాదు. నాయకులు సరిగా లేనందువల్లనే, వారి వ్యక్తిత్వాలు స్వార్థం, కుట్ర, కుతంత్రాలతో నిండి ఉన్నందు వల్లనే ఎవడికీ ఎవడి మీదా నమ్మకం లేదు. సరిహద్దులలో రాత్రింబవళ్ళు ఆయుధాలతో కాపాలాలు ఎందుకు ? నీ ఇంట్లోకి నీ అనుమతి లేనిదే నేను రాను, నా ఇంట్లోకి, నా అనుమతి లేనిదే నీవు రాకు అని ఒప్పందం చేసుకుని హాయిగా ఉండవచ్చు కదా ! సుమారుగా అందరూ దేవుడిని నమ్మే వాళ్ళే, ఏదో ఓ దేవుడిని ఆరాధించే వాళ్ళే ! వాళ్ళ దేవుడు ఇదే చెప్తాడా ? పక్క వాడి దేశంలోకి చొరబడు, వాళ్ళను చంపు, ఆ దేశాన్ని ఆక్రమించుకో, అక్కడ నా మతాన్ని వ్యాపింప చేయి, అడ్డు వచ్చిన వాళ్ళను అడ్డంగా నరికేయి, నీకు స్వర్గంలో సీటు గ్యారంటీ అని చెప్తాడా ? అలా చెబితే వాడు దేవుడు అని అనబడతాడా ? దేవుడు అనే వాడు మంచే కదా చెప్తాడు. దేవుడు చెప్పిన మంచి విషయాలు ప్రతీ మత గ్రంథంలో ఉన్నాయి కదా ! వాటిని యథాతథంగా ఎందుకు ఆచరించటం లేదు. ప్రతీ మతంలో ఎన్నో చక్కటి విషయాలున్నాయి. వాటిని నిజంగా ఆచరిస్తే ప్రపంచం అంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లుతుంది కదా ! మరి ఎందుకు జనాలు ఆచరించటం లేదు ?!? ఎందుకంటే వాళ్ళకు చిన్నప్పటి నుండీ తప్పుడు బోధనలతో, తప్పుడు వ్యక్తిత్వ నిర్మాణం జరిగింది. వ్యక్తిత్వం ఎలా ఉంటే వ్యక్తి అలా ప్రవర్తిస్తాడు. తప్పుడు వ్యక్తిత్వం

కలిగి ఉన్న వ్యక్తి తప్పుగానే ప్రవర్తిస్తాడు. ప్రపంచం మొత్తం వ్యక్తిత్వ నిర్మాణాన్ని విస్మరించింది. వ్యక్తికి ఒక వ్యక్తిత్వం ఉంటుంది, అదే అతడిని నడిపిస్తుంది అనే విషయాన్ని ఇప్పటికీ గ్రహించ లేక పోతోంది. వ్యక్తిత్వంలో నుండే వ్యక్తి జనిస్తాడు అనే అత్యంత కీలకమైన విషయాన్ని తెలుసుకోలేక పోతోంది.

అసలు ఈ వ్యక్తిత్వం అనేది ఎలా ఏర్పడుతుంది ?

చిన్నప్పటి నుండి నీకు ఎలాంటి విషయాలు నేర్పించ బడతాయో వాటి ఆధారంగా నీ యొక్క వ్యక్తిత్వం ఏర్పడుతుంది.

ఉదాహరణకు - మన మతమే గొప్పది. మిగతావన్నీ నీచమైనవి, తప్పుడివి. లోకమంతా మోసం, దగాలతో నిండి ఉంది. నీవు కుట్ర కుతంత్రాలతో వ్యవహరించకపోతే బతక లేవు..... మొదలైన విషయాలను నేర్పిస్తే చండాలమైన వ్యక్తిత్వం ఏర్పడుతుంది. చండాలమైన వ్యక్తిత్వం కలిగి ఉన్న వ్యక్తి చండాలుడే అవుతాడు కదా ! ఇక ఈ చండాలుడు తన ప్రవర్తనతో అల్లకల్లోలాలను సృష్టిస్తూ ఉంటాడు.

జాతి, మత, కులాలు లేనే లేవు. మానవులంతా ఒక్కటే ! అందరూ అందరినీ గౌరవించాలి. లోకం ఎంతో మంచిది. లోకులు చాలా మంచి వాళ్ళు. న్యాయం, ధర్మం అన్నీ సరిగానే ఉన్నాయి. నీవు సత్యంతో ఉండు, నీకు అంతా శ్రేయస్కరమే జరుగుతుంది. అకర్మ శాకాహారమే శ్రేయస్కరం..... లాంటి విషయాలను నేర్పిస్తే, నిజంగా ఆచరింపచేస్తే, అతడికి సరైన వ్యక్తిత్వం ఏర్పడుతుంది. అప్పుడు అతడు సజ్జనుడవుతాడు. సజ్జనుడి ప్రవర్తన ఎంతో శ్రేయస్కరంగా ఉంటుంది కదా !

ఓ సారి గమనించి చూడండి, ప్రపంచంలో జరుగుతూ ఉన్న పెద్ద పెద్ద ఘర్షణల్లో చదువుకున్న వారే ఉంటారు. ప్రపంచ దేశాల ప్రభుత్వాలు నేరాలను, ఘోరాలను ఎందుకు అరికట్టలేక పోతున్నాయి !? "మాఫియా"..... ఈ మూడక్షరాల పదం వెనుక ఎంత చరిత్ర ఉంది ? ఎన్నో రకాల మాఫియాలు..... వీటన్నింటినీ ఎందుకు రూపుమాపలేక పోతున్నారు. ప్రజలు, ప్రభుత్వం మరియు ప్రభుత్వ అధికారులు కలిస్తే దేనినైనా రూపుమాపడం పెద్ద పనేమీ కాదు. మరి ఎందుకు

అందరూ కలవలేక పోతున్నారు !? ఎందుకంటే ప్రజల్లో కొంత మంది, ప్రభుత్వంలో కొంత మంది, ప్రభుత్వ అధికారుల్లో కొంత మంది నేరస్తులను రక్షిస్తున్నారు. ఇలా నేరస్తులను రక్షిస్తున్న వారందరూ 99% బాగా చదువుకున్న వారే అయి ఉంటారు. మరి చదువుకున్న వారు ఎందుకు ఇలా తప్పు చేస్తున్నారు ?!?! మీకు తెలుసా ? చదువుకోని వాడు తప్పు చేస్తే అది బండగా ఉంటుంది, దొరికే అవకాశం ఉంటుంది. అదే..... చదువుకున్న "ఎడ్యుకేటెడ్స్" తప్పు చేస్తే చాలా క్లాస్‌గా ఉంటుంది, దొరికే అవకాశం చాలా, చాలా తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అమలులో ఉన్న విద్యావిధానం ద్వారా మనుషులు "చదువుకున్న వారవుతున్నారు" కానీ "వికాసం" చెందటం లేదు. ఈ రకమైన విద్యా విధానం ద్వారా అది అసంభవం కూడా !

ప్రపంచంలోని ప్రతీ దేశంలో, ప్రతీ చోట అవినీతి ఉంది. అక్షరాస్యత ఎక్కువగా ఉన్న దేశాలలో కూడా అవినీతి ఎక్కువగానే ఉంది కదా ! అక్షరాస్యత అవినీతిని అంతమొందించాలి కాని, అది అవినీతిని పెంపొందిస్తుంది ఎందుకు !!!!!!!???????

చదువు లేక విద్య పదం ఏమైతే ఏం ? రెండూ ఒకటే !

విద్య అనేది మనిషిని భౌతికంగా, మానసికంగా మరియు ఆత్మ పరంగా మార్చాలి. అలా మూడు క్షేత్రాల్లోనూ మనిషిని మార్చ గలిగేదే విద్య అని అనబడుతుంది.

విద్య మనిషిని దైవంగా మార్చాలి. అదే నిజమైన విద్య.

విద్య మనిషిని దైవంగా మార్చాలి అని అనడంలోని నా ఉద్దేశం ఏమిటంటే - విద్య మనిషిని స్వతంత్రుడిగా, ప్రేమ మయుడిగా, కరుణామూర్తిగా, దయామయుడిగా, నిర్భయుడిగా, సాహస వంతుడిగా, బలవంతుడిగా, స్నేహ శీలిగా, నిజాయితీ పరుడిగా, నిబద్ధత కలవాడిగా, ఆనంద స్వభావుడిగా మరియు విజ్ఞానిగా మార్చాలి. అంతే కానీ కేవలం అక్షరాలను చదివి గుర్తు పెట్టుకుని వ్రాయించడం అనేది విద్య కాదు. ముద్రించి ఉన్న అక్షరాలను బట్టీ పట్టి వాటిని యథాతథంగా తిరిగి అప్పచెప్పడమే లేక వ్రాయడమే చదువు అని అనుకుంటున్నారు అందరూ ! అందుకే పరిస్థితులు ఇలా ఉన్నాయి.

మనిషిగా పుట్టిన మనిషిని ముందు నిజమైన మనిషిగా తయారు చేయాలి, అంటే సరైన వ్యక్తిత్వం కలిగిన వాడిగా తయారు చేయాలి. ఆ తర్వాతే మిగిలిన విద్యా బోధన.

సరైన వ్యక్తిత్వం కోసం ఏం బోధించాలంటే..... ఈ మార్గదర్శిని మరియు ఇందులో తెలియజేసిన మహాత్ముల రచనలను బోధిస్తే సరైన వ్యక్తిత్వమే కాకుండా, అంత కంటే గొప్పదైన, మహత్వపూర్ణమైన దివ్య వ్యక్తిత్వం ఏర్పడుతుంది. అప్పుడు ఆ వ్యక్తి సృష్టి కల్యాణానికి కారకుడై ఆ కల్యాణంలో మహా విశేషమైన పాత్రను పోషిస్తాడు.

M A B లర్నింగ్ స్పేస్‌లో పిల్లలకు ముందు సరైన వ్యక్తిత్వం, ఆ తర్వాత జన్మ కారణానికి సంబంధించిన బోధనలు, ఆ తర్వాత అవసరమైన 3 భాషలు, అవసరమైనంత వరకు లెక్కలు, సైన్స్, సోషల్ మొదలైనవి బోధించబడుతాయి. కాస్మిక్ సెంటర్‌లో పిల్లల పైన మార్కుల ఒత్తిడి, ర్యాంకుల భారం & భయం ఏవీ ఉండవు.

M A B లర్నింగ్ స్పేస్‌లో పిల్లలు సర్వ తంత్ర స్వతంత్రంగా, స్వేచ్ఛగా, ఆనందంగా ఉంటారు. వారు ఏం కావడానికి జన్మించారో అదే అవుతారు. ఇప్పుడు కొంత మందికి ఈ కింది విధమైన సందేహాలు వచ్చే అవకాశం ఉంది.

1. భయంకరమైన హంతకుడు కావాలని ఆ పిల్లవాడు జన్మిస్తే, మీరు వాడి జన్మ కారణాన్ని అనుసరించి వాడిని భయంకర హంతకుడిగా మారుస్తారా ?

2. ఒక పెద్ద నియంతగా అవడానికో లేక ఒక పెద్ద గూండాగానో లేక ఒక పెద్ద బందిపోటుగానో లేక మోసగాడిగానో లేక మానవ జాతిని నాశనం చేయడానికో లేక ఏవో నెగెటివ్ అంశాలను పెట్టుకుని జన్మిస్తే వాటిని అలాగే పెంపొందిస్తారా ? లాంటి అనేకానేక సందేహాలు వచ్చే అవకాశం ఉంది.

మీలో గనుక ఇలాంటి సందేహాలు తలెత్తితే..... కాస్త సంయమనం పాటించి, సావధానంగా ఈ కింది విషయాలను చదవండి :

ఎవరు కూడా నెగెటివ్‌గా జన్మించరు. అయితే, ఆత్మ యొక్క పరిణామ క్రమంలో, ఆత్మ ప్రతీ జన్మకు కొంత అనుభవాన్ని + అవగాహనను పొందుతూ ముందుకు సాగుతూ ఉంటుంది. ఈ క్రమంలో అనుభవాన్ని + అవగాహనను ఎంత కలిగి ఉంటే అంత పాజిటివ్ గుణాలు ఉన్నట్టు అర్థం. ఎంతైతే అనుభవం + అవగాహన లేదో అంత నెగెటివ్ లేక అజ్ఞానం ఉన్నదనే విషయం స్పష్టం. మనిషిగా జన్మ తీసుకున్న ఆత్మ తన అనుభవాన్ని + అవగాహనను బట్టి తన జన్మ ప్రణాళికను వేసుకుంటుంది. ఆత్మ వేసుకున్న జన్మ ప్రణాళికను ఏమీ చేయకుండా మేము, ఆత్మ విజ్ఞాన బోధన

మరియు ధ్యాన సాధన చేయిస్తాం. వీటి వలన ఆత్మలో అనుభవం + అవగాహనలతో కూడిన ఎరుక జనిస్తుంది. దానితో సహజంగా లోపల ఉన్న నెగెటివ్(అజ్ఞానం) పాజిటివ్‌గా మారుతుంది. అప్పుడు ఆటొమెటిక్‌గా జన్మ ప్రణాళికలో ఉన్న నెగెటివ్‌లు, పాజిటివ్‌లుగా మారిపోతాయి.

ఒక సరి అయిన వ్యక్తిత్వం యొక్క నిర్మాణం మాటల వలన, చదవటం వలన లేదా మరే రకంగానూ సాధ్యం కాదు. కేవలం ఆత్మ విజ్ఞాన బోధన, ఆత్మ విజ్ఞాన సూత్రాల ఆచరణ మరియు ధ్యాన సాధనల ద్వారా మాత్రమే ఒక సరి అయిన వ్యక్తిత్వాన్ని నిర్మించ గలుగుతాం.

ఎలాంటి వారైనా, ఎంతటి వారైనా సరే, ఆత్మ విజ్ఞాన సూత్రాల ఆచరణ ద్వారా మరియు ధ్యాన సాధన ద్వారా దివ్యులుగా మారుతారు. ఇది పరమ సత్యం.

❖ ❖ ❖

2. సుమారు 15 నుండి 22 సంవత్సరాలు నేర్చుకున్న విద్య, ఉపాధిని కల్పించలేక పోవటం.

ప్రస్తుతం ప్రపంచమంతా అమలులో ఉన్న విద్యా విధానం అనేకానేక లోపాలతో నిండి ఉంది.

చదివిన చదువుకు ఏ మాత్రం సంబంధం లేని ఉద్యోగాలు చేస్తూ ఉంటారు. ఇది ఎంతో అసమంజసమైన విషయమో కదా !

ఏదో ఒక డిగ్రి కలిగి ఉండటం అనేది ఒక స్టేటస్‌గా మారింది. ఒక వ్యాపారస్తుడు ఉంటాడు, అతడు తన కొడుకు యొక్క సామర్థ్యాలను గమనించి, తన వ్యాపారాన్ని, తన కొడుకుకు అప్పచెప్పేందుకు నిర్ణయించుకుంటాడు. అతడి కొడుకుకు కూడా వ్యాపార బాధ్యతలు స్వీకరించడం ఎంతో ఇష్టంగా ఉంటుంది. వాళ్ళ కుటుంబ సభ్యులకు కూడా ఈ నిర్ణయం నచ్చుతుంది. ఇది డిసైడ్ అయిన తర్వాత కూడా ఆ అబ్బాయి పనికి రాని చదువులు ఎన్నో చదవాల్సి ఉంటుంది. ఈ

చదువుల వలన వ్యాపార దక్షతలు పెరుగుతాయి అని అనుకుంటారు, కానీ అది నిజం కాదు. ఇలాంటి చదువుల వలన దక్షతలు పెరగవు. అవి సహజంగా పుట్టుకతో వస్తాయి. చరిత్రను పరిశీలిస్తే, ఏ చదువులు చదవకుండానే పెద్ద పెద్ద వ్యాపార సామ్రాజ్యాలను స్థాపించిన వారెందరో కనిపిస్తారు. **ప్రాక్టికల్‌గా ఉపయోగపడేదే చదువు. ప్రాక్టికల్‌గా ఉపయోగపడని చదువు, చదువు కాదు. ప్రస్తుతం చదువుల్లో ప్రాక్టికాలిటి లోపించింది.** ప్రాక్టికల్‌గా ఉపయోగపడని థియరీలను సంవత్సరాల తరబడి చదివిస్తారు. ఆ తర్వాత ప్రాక్టికల్ శిక్షణ అంటూ మరికొన్ని సంవత్సరాలను మింగేస్తారు. 4 లేక 5 సంవత్సరాల కోర్సులు ఎంతో ఖర్చు పెట్టి, కష్టపడి చదువుతారు. కోర్సు పూర్తయిన తర్వాత వారికి ఏ పనీ రాదు. మళ్ళీ వాళ్ళు ఒక సీనియర్ దగ్గర పని చేయాలి లేదా ట్రెయినింగ్ తీసుకోవాలి. ఎన్నో సంవత్సరాలు ఎవరి దగ్గరనో పని చేస్తే తప్ప వారికి విషయాలను స్వంతంగా డీల్ చేసే కెపాసిటి రాదు అని అంటే ఇది ఎంత ఆశ్చర్యకరమైన విషయం ?! ఆ 4 లేక 5 సంవత్సరాలు వాళ్ళు చదివినది ప్రాక్టికల్‌గా పనికి రానప్పుడు ఆ చదువులు ఎందుకు ?! గోల్డ్ మెడల్ పొందిన వారు కూడా పని చేయాలంటే మళ్ళీ ప్రత్యేకమైన శిక్షణను పొందాల్సి ఉంటుంది. ఒక చదువు సంవత్సరాల తరబడి చదివిన తర్వాత కూడా మళ్ళీ ప్రత్యేకమైన శిక్షణ ఏమిటి ?! నాలుగు సంవత్సరాలు రాత్రింబవళ్ళు కష్టపడి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వాళ్ళకు ప్రాక్టికల్ పనులు చాలా వరకు రావు. మళ్ళీ లక్షలు పోసి ప్రత్యేకంగా కోర్సులు చేయాలి. మరి ఈ నాలుగు సంవత్సరాలు వాళ్ళు ఏం చేసినట్టు ?! నాలుగేళ్ళ ఇంజనీరింగ్ డిగ్రీలో అవసరమైన ఈ విషయాలను ఎందుకు నేర్పరు ? దేశంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన యూనివర్సిటీ నుండి పట్టా పొందిన ఒక ఇంజనీరు కంటే, తన పేరు కూడా సరిగా రాయలేని ఒక మామూలు మెకానిక్‌కు/ టెక్నీషియన్‌కు ఎంతో ప్రాక్టికల్ పరిజ్ఞానం ఉంటుంది. నేను మనవి చేసుకునేది ఏమిటంటే.... చదువులు మనిషి యొక్క అభివృద్ధిని వేగవంతం చేయాలి కానీ, వేగాన్ని తగ్గించ కూడదు కదా ! ఒక కోర్సు పూర్తి చేసిన తర్వాత మళ్ళీ దానికి సంబంధించి ఇంకో కోర్సు చేయాల్సిన అవసరం రాకూడదు అని నేను చెప్తున్నాను. సంవత్సరాల తరబడి డిగ్రీలు చదివించి, మళ్ళీ ఎన్నో సంవత్సరాలు ప్రత్యేకమైన కోర్సులు చేసి ఆ తర్వాత ఎక్స్‌పీరియన్స్ కోసం మళ్ళీ ఓ తతంగం..... ఇన్ని సంవత్సరాలు వీళ్ళ ఖర్చులు భరించలేక తల్లిదండ్రులు చస్తున్నారు.

ప్రస్తుతపు చదువుల్లో ప్రాక్టికాలిటి లోపించింది.
ప్రాక్టికాలిటి లోపించిన ఏ విద్య అయినా సరి కానిదే !

అసలు ప్రపంచంలో నిరుద్యోగ సమస్య ఎందుకు వస్తుందో

తెలుసా ? నిరుద్యోగం అని అంటే ఉద్యోగం లేక పోవడం, అంటే ఉపాధి(ఆదాయం) లేక పోవడం. విద్యావంతులకు ఉపాధి లేక పోవడం ఏమిటండీ ?! చోద్యం కాకపోతే....! ఎందుకంటే విద్య వేరే, ఉపాధి వేరే కాదు. విద్యయే ఉపాధి ! ఒక వేళ విద్య ఉపాధి కలిగించలేక పోతుంది అని అంటే అది అసలు విద్య కాదన్న మాటే ! ఉపాధిని కల్పించేదే విద్య అని అనబడుతుంది. ఒక కోణంలో విద్య విత్తనం అయితే, ఉపాధి ఫలం.

విద్య అనేది మనిషిని స్వతంత్రుడిగా చేయాలి, తన కాళ్ళ మీద తాను నిలబడేలా చేయాలి. కాని ప్రస్తుతం జరుగుతున్నది ఏమిటి ? విద్యావంతులెవరూ(కొంత మంది తప్పించి) స్వతంత్రంగా జీవించటం లేదు. ప్రస్తుతపు విద్యావంతులకు స్వతంత్రంగా జీవించగలమన్న విశ్వాసం+ధైర్యం లేదు. ఎవరో ఒకరు వీరిని పనిలో పెట్టుకుని నెలకు ఇంత జీతం ఇస్తే కానీ బతక లేని స్థితి. ఇలా ఎవరైనా ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చి నెల నెలకు జీతాలు ఇస్తూ కూర్చుంటారు ?! ఎవరో ఒకరు వీరికి పని ఇవ్వక పోతే, వీరికి ఉపాధే లేదా ?! వీరు తమకు తాము ఉపాధి కల్పించుకోలేరా ? ఒక వేళ వీరు తమకు తాము ఉపాధి కల్పించుకోలేక పోతే, మరి వీళ్ళు సుమారు 15 నుండి 22 సంవత్సరాలుగా నేర్చుకున్నది ఏమి విద్య ? సాధారణంగా ఒక వ్యక్తి జీవితంలో సుమారు 15 నుండి 22 సంవత్సరాల విద్యా శిక్షణ ఉంటుంది.

L. K. G.	1 year
U. K. G.	1 year
1st to 10th Class	10 years
Intermediate	2 years
Degree	3 or 4 years
P. G.	2 years
Other Extra Courses	2 years

Total 21 or 22 years

ఒక వ్యక్తి 15 నుండి 22 సంవత్సరాల విద్యా శిక్షణ తీసుకున్న తర్వాత కూడా అతడికి ఉపాధి లభించటం లేదని అంటే ఇంత కంటే ఆశ్చర్యం మరొకటి లేదేమో ! 15 నుండి 22 సంవత్సరాలు తీసుకున్న విద్య శిక్షణ, ఉపాధి కల్పించటం లేదని అంటే ఆ యొక్క విద్యలో లోపం ఉందనేది స్పష్టం అవుతూనే ఉంది కదా ! ఒక వ్యక్తి యొక్క అత్యంత కీలకమైన సమయం ఈ 15 నుండి 22 సంవత్సరాలు. ఈ మహా కీలకమైన సమయం పనికి రాని చదువులతో, హుందాగా, గౌరవంగా వృథా అయిపోతూ ఉంది. కేవలం సమయమే కాక డబ్బులు కూడా నష్టం. ఎందుకిలా ?! అని అంటే, దానికి ఒకే ఒక సమాధానం - విద్యా విధానంలో లోపం ! చిన్నప్పటి నుండే విద్యార్థికి స్వతంత్రంగా జీవించే ఆలోచనలను కల్పించాలి. స్వేచ్ఛా భావనలను ఏర్పరచాలి. ఎవరో ఒకరు పని ఇస్తేనే నీవు బతక గలుగుతావు అనే పనికిరాని బోధనలను చేయకూడదు. నీకై నీవు స్వతంత్రంగా, జీవించ గలవు అనే విశ్వాసాన్ని వారిలో మేల్కొలపాలి. సృష్టిలో ప్రతి ఒక్కరికీ ఉపాధి అనేది తప్పక ఉంటుంది

అనే పరమ సత్యాన్ని వారిలో బలంగా నాటాలి. నా ఫ్రెండ్స్‌ను కలవడానికి 1996లో ఒక సారి నేను గుజరాత్‌లో ఉన్న సూరత్‌కు వెళ్ళాను. అక్కడ పెద్ద పెద్ద హోర్డింగుల పైన హిందీలో ఇలా రాసి ఉంది. "నౌకరీ ఛోడో, వ్యాపార్ కరో" అని. దాని అర్థం ఏమిటంటే ఒకరి పైన ఆధారపడి బతకడం మానివేయి, అంటే ఉద్యోగం వదిలేయి, నీకై నీవు స్వతంత్రంగా ఉపాధిని కల్పించుకో అంటే వ్యాపారం చేయి అని అర్థం. అది చదివిన నేను చాలా ఆశ్చర్యానికి గురయ్యాను. యువకుల్లో స్వతంత్రంగా జీవించే భావనను మేల్కొలిపే చక్కటి ప్రయత్నం. ఎవరో నీకు పని ఇచ్చేదేమిటి ? నీకై నీవే ఉపాధిని సృష్టించుకో అని ఎంత చక్కగా చెప్తున్నారో !

సుమారుగా అందరూ పిల్లలకు చిన్నప్పటి నుండే అభద్రతా భావాన్ని పెంపొందిస్తారు. బాగా చదువుకోండి, లేక పోతే ఉద్యోగం రాదని బెంబేలెత్తిస్తారు. ఉద్యోగం రాక పోతే మీరు బతక లేరు, అని చిన్నప్పటి నుండే వారి హృదయాల్లో బలంగా నాటుతారు. పెరిగి పెద్దైన తర్వాత వాళ్ళకి ఎవరో ఒకరు ఉద్యోగం ఇవ్వనిదే బతకలేని పరిస్థితి ఏర్పడుతుంది. వాళ్ళు స్వతంత్రంగా, సృజనాత్మకంగా ఆలోచించలేరు. ఎవరో ఒకరు పని ఇచ్చి ఇది చేయి, మీకు నెలకు ఇంత ఇస్తాను, అని అంటే కాని బతకలేరు.

ఎవరైనా ఎంత మందికని ఉద్యోగాలు ఇస్తారు ? తెలుసుకోండి, మన లోపల ఎలాంటి విషయాలైతే నాటుకుంటాయో జీవితం ఆ విధంగానే ఉంటుంది. సృష్టి సమృద్ధమైనది. జీవితం కూడా సమృద్ధమైనదే ! సృష్టిలో ప్రతి ఒక్కరికీ ఉపాధి అనేది తప్పని సరిగా ఉంటుంది. ఇది ప్రాథమిక సృష్టి నియమం. ముందు ఉపాధిని కల్పించిన తర్వాతే ఆత్మలను సృష్టిస్తుంది, ఈ సృష్టి ! స్వతంత్రంగా, సృజనాత్మకంగా ఆలోచిస్తే ఏదో ఒక ఉపాధి గ్యారంటీగా దొరుకుతుంది. అయితే ఇలా స్వతంత్రంగా, సృజనాత్మకంగా ఆలోచించడానికి ఆ వ్యక్తికి సరి అయిన విద్యా బోధన అత్యంత ఆవశ్యకం. "బాబా బాబా బ్లాక్ షీప్..." లాంటి పనికి రాని లొల్లాయి రైమ్స్‌ను బోధించకుండా, పనికి వచ్చే పరమ సత్యాలను బోధించాలి. నిజంగా ఒక సారి ఆలోచించండి.... "బాబా బాబా బ్లాక్ షీప్...." అనే రైమ్ అతడికి పెద్దైన తర్వాత ఎందుకు పనికి వస్తుంది ? ఈ బాబా బాబా బ్లాక్ షీప్.... స్థానంలో "సృష్టి ఎంతో సమృద్ధమైనది, ఈ సువిశాలమైన, ఐశ్వర్య వంతమైన సృష్టిలో ప్రతి ఒక్కరికి కావాల్సినంత ఉంటుంది. ప్రతి ఒక్కరికీ ఉపాధి తప్పని సరిగా ఉంటుంది." అనే పరమ సత్యాన్ని బోధిస్తే, పిల్లల హృదయాల్లో బలంగా నాటితే అప్పుడు ఆ పిల్లలు పెరిగి పెద్దైన తర్వాత 100% గ్యారంటీగా వాళ్ళు తమకు తాము చక్కటి ఉపాధిని సృష్టించుకో గలుగుతారు.

ఒక వ్యక్తి యొక్క జీవితంలోని అమూల్యమైన కాలం ఈ పనికి రాని చదువుల పేరుతో వృథా అయిపోతుంది. 25 లేక 30 సంవత్సరాల వరకు చదువులు ఏమిటండీ ?! మళ్ళీ ఆ తర్వాత జాబ్ ప్రయత్నాలు, ఎప్పటికో జాబ్ దొరకడం, సెటిల్ కావడం పూర్తయ్యే సరికి 40 ఏళ్ళు వస్తాయి. ఎంతో అమూల్యమైన సమయం అవసరం లేని చదువు కోసం వృథా అయిపోతుంది. చాలా మంది సినీ నటుల కొడుకుల/కూతుళ్ళ విషయంలో కూడా ఇది ఇలా జరుగుతూనే ఉంటుంది. చిన్నప్పుడే డిసైడ్ అయిపోతారు, తమ పిల్లలను కూడా సినీ రంగంలోకి తీసుకు రావాలని, కానీ తీసుకురారు. ఇరవై ఏళ్ళు పనికి రాని చదువులు చదివించి ఆ తర్వాత సినిమాల్లోకి తెస్తారు. ఎందుకంటే డిగ్రి కలిగి ఉండటం అనేది ఒక స్టేటస్‌గా మారింది కదా ! ఇలా పనికి రాని చదువులు చదివించకుండా, కేవలం పనికి వచ్చే చదువులు మాత్రమే చదివిస్తూ, చిన్నప్పటినుండే ఆ పిల్లలకు సినిమాలకు

అవసరమైన శిక్షణలను ఇస్తే వాళ్ళు అద్భుతాలు చేస్తారు. మొన్నీ మధ్య రిలీజ్ అయిన ఆమీర్ ఖాన్ సినిమా "త్రీ ఇడియట్స్" లో ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా విధానంలోని లోపాలను దర్శకుడు "రాజ్ కుమార్ హీరాని" చాలా చక్కగా చూపించారు. నిర్మాత కూడా చాలా ధైర్యం చేసి సినిమా తీసాడు. ఆమీర్ ఖాన్‌కు, దర్శకుడికి, నిర్మాతకు మరియు వారి యూనిట్ మొత్తానికి నా యొక్క హృదయపూర్వక ప్రేమ, ధన్యవాదాలు మరియు అభినందనలను ప్రకటిస్తున్నాను. నిరుద్యోగ సమస్య తొలగాలంటే ముందు విద్యా విధానంలో మార్పు రావాలి, ఆ తర్వాత మనుషుల ఆలోచనా విధానంలో కూడా మార్పు రావాలి. పనికిరాని పాత విధానాలను వదిలేసి, నవీన యుగ ఆలోచనా విధానాలను స్వీకరించాలి. నిజానికి అసలు సత్యం ఏమిటంటే పనికి వచ్చే వాటిని స్వీకరించాలి, అవి పాతవైనా, కొత్తవైనా ! పనికిరాని వాటిని వదిలేయాలి అవి పాతవైనా, కొత్తవైనా ! ఆశ్చర్యకరమైన ఒక సత్యాన్ని మీకు అర్థం చేయిస్తాను. అర్థం చేసుకోండి. మీరు, మానవ జాతి చరిత్రను మలుపు తిప్పిన మహాత్ముల వివరాలను అధ్యయనం చేయండి. వాళ్ళందరూ సాంప్రదాయ విధానాలను పక్కకు పెట్టి సృజనాత్మకంగా, కొత్తగా ఆలోచించిన వాళ్ళే ! ఈ భూ గ్రహానికి వెలుగునిచ్చిన థామస్ అల్వా ఎడిసన్, ఏ చదువులు చదివాడు, ఏ కోర్సులు చేశాడు ? ఆయన కేవలం "బల్బ్" మాత్రమే కాకుండా, ఇంకా చాలా ఆవిష్కరణలు చేశాడు. అవన్నీ ఆయనకు ఎవరూ నేర్పలేదు. అవన్నీ కూడా ఆయన యొక్క సృజనాత్మకతలో నుండే ఉద్భవించాయి. ఐన్‌స్టైన్ చిన్నప్పుడు స్కూల్‌లో మొద్దబ్బాయిగా పేరు తెచ్చుకున్నాడని చరిత్ర చెబుతోంది. అయితే ఆ విషయాలను గ్రంథస్థం చేసిన వారికి ఆత్మ విజ్ఞాన అవగాహన లేదు. ఆ మహాత్ముడు చిన్నప్పుడు మొద్దబ్బాయి కాదు. ఆయన మేదస్సు చాలా గొప్పది. ఎంతో విశాలమైన, సృజనాత్మకమైన, నవీనమైన మేదస్సును కలిగి ఉన్న ఆయనను పనికిరాని పాఠాలు నేర్పే స్కూల్‌లో వేసినందుకు, ఆయన ఆ స్కూల్‌లో నేర్పే విషయాలను గత జన్మలలోనే దాటేసినందుకు, ఆయనకు ఆ స్కూల్‌లో నేర్పే విషయాల పట్ల ఆసక్తి లేనందుకు, ఆయనలోని మేదస్సు బయటకు ప్రకటం అయ్యేందుకు సమాయత్తం అవుతున్నందుకు, ఆయనకు ప్రపంచంలోని విషయాలు చిన్నగా కనపడినందుకు, ఆయన భౌతికంగా చిన్న వయసులో ఉండి పెద్దల మీద ఆధారపడి ఉన్నందుకు.... ఆయన అలా నిరాసక్తంగా ఉన్నాడు. దీన్ని ఆత్మ విజ్ఞాన అవగాహన లేని భౌతికపు మనుషులు, తమను తాము మేధావులుగా అనుకునే వాళ్ళు ఆల్బర్ట్ ఐన్‌స్టైన్ చిన్నప్పుడు మొద్దబ్బాయి అని తేల్చి పారేసారు. ప్రపంచం దృష్టిలో తెలివిగల పిల్ల వాడిగా పేరు తెచ్చుకోవాలంటే... ఏం చేయాలి ? ఎ ఫర్ ఆపిల్, బి ఫర్ బాల్ అంటూ బట్టీ పట్టి అప్పచెప్పాలి, అంతే కాని ఆపిల్ చెట్టుపై నుండి కిందకే ఎందుకు పడుతుంది ?! అని ఆలోచించకూడదు. కేవలం బట్టీ పట్టి అప్పచెప్పాలి. రెండెక్కం రెండు, రెండు రెళ్ళ నాలుగు.... అంటూ ఎక్కాలన్నీ బట్టీ పట్టి గుక్కతిప్పుకోకుండా అప్పచెప్పాలి కాని, ఏ సూత్రం ఆధారంగా ఈ ఎక్కాలను నిర్మించారు అని ఆలోచించకూడదు. "రింగా రింగా రోజస్....." లాంటి పనికిరాని సొల్లు రైమ్స్‌ను పాడి వినిపించాలి, కాని ఈ రైమ్స్ అంటే నాకిష్టం లేదు, నేను ప్రకృతిని ఎంజాయ్ చేస్తాను, నన్ను ఊరవతలికి తీసుకెళ్ళండి అని

అనకూడదు. స్కూల్‌లో చెప్పే పనికిరాని పాఠాలను బట్టీ పట్టి తిరిగి అప్పచెప్పే టేప్‌రికార్డర్లను ఈ ప్రపంచంలో తెలివిగలవారు అని అంటారు. ఐన్‌స్టైన్‌కు ఎవరూ నేర్పలేదు, ఫలానా వాటిని కనుగొనమని, ఆయన తన నవీన దృక్పథంతో, తన సృజనాత్మకతలో నుండి ఊహించి, వాటిని యథార్థం చేసాడు. యావత్ భూమండలంలోనే అత్యంత మేధావిగా తయారైన ఐన్‌స్టైన్, సాంప్రదాయ వాదుల దృష్టిలో మొద్దబ్బాయి. ఎందుకంటే మరి ఆయన బట్టీ పట్టి ఎక్కాలను, రైమ్స్‌ను మరి ఇంకా వేటినో అప్పచెప్పలేదు కదా ! అందుకే ఐన్‌స్టైన్ మంచి స్టూడెంట్ కాదు ఆయన చరిత్రను గ్రంథస్థం చేసిన వారి దృష్టిలో !

భౌతిక శాస్త్రంలో PhD చేసి, జీవ శాస్త్రంలో పరిశోధనలు చేసి, రసాయన శాస్త్రంలో, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ బహుమతిని పొందిన మేధావి శ్రీ వెంకట్‌రామన్ రామక్రిష్ణన్ గారు విద్యా వ్యవస్థ గురించి చెప్పిన వాస్తవాలు.

భారత దేశంలో విద్యా వ్యవస్థ గురించి తల్చుకుంటే బాధగా ఉంటుంది. పిల్లలకు ఎంత సేపూ చదువే లోకం. బళ్ళో, ఇంట్లో, ట్యూషన్లో... చదువు, చదువు, చదువు. ఇక వాళ్ళకు ఆడుకోవడానికీ సృజనాత్మక శక్తిని పెంచుకోవడానికీ సమయం ఎక్కడిది ! పాఠ్య పుస్తకాలు కాకుండా నాలుగు మంచి పుస్తకాలు చదివే అలవాటు, ఒళ్ళలిసిపోయేలా మైదానంలో ఆడుకోవడం... ఇవేవీ ఇప్పటి పిల్లలకు తెలియకుండా పోతున్నాయి. బట్టీ పట్టి చదివే చదువులతో సైన్స్‌లో మనకు ప్రపంచస్థాయి పురస్కారాలెక్కణ్ణుంచి వస్తాయి ! నా ఉద్దేశం ప్రకారం పిల్లలకు ఎంత తక్కువ హోమ్‌వర్క్ ఇస్తే అంత మంచిది. ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్య సేన్ అయితే పిల్లలకు అసలు హోమ్‌వర్కే ఇవ్వకూడదంటారు. బాల్యాన్ని హరించే కోచింగ్ సెంటర్లను పూర్తిగా నిషేధించాలంటారు. ప్రతీదాన్నీ ప్రశ్నించి తెలుసుకునే మనస్తత్వం, ఆటా పాటా... పిల్లల్లో సృజనాత్మకతను పెంచుతాయని చెబుతారాయన. స్కూల్లో టీచర్లు చక్కగా అర్థమయ్యేలా చెప్పగలిగితే, మనం కూడా శ్రద్ధగా మనసు పెట్టి పాఠాలు వింటే కోచింగ్ సెంటర్ల అవసరమే ఉండదు.

- ఈనాడు, ఆదివారం బుక్, పేజ్ నం. 15, 7వ పేరా,

తేది : 7 మార్చ్ 2010.... సౌజన్యంతో

చదువు మనిషిని ప్రయోజకుడిగా చేయాలి కానీ, అప్రయోజకుడిగా చేయకూడదు కదా ! నేటి చదువులు మనుషులను అప్రయోజకులుగా తయారు చేస్తున్నాయి. ఈ విషయమై ఎన్నో ఉదంతాలు. ఉదాహరణకు నేను ఒక్కటి మాత్రం చెప్తాను. 1990 ప్రాంతంలో మా ఇంటి దగ్గర్లో ఒక మెకానిక్ ఉండేవాడు. అతని దగ్గర నలుగురు పిల్లలు పనిచేసే వారు. వారిలో అందరి కంటే చిన్న వాడు కృష్ణ. వీడు పొట్టిగా, నల్లగా, కాస్త బొద్దుగా, వెరైటీ క్రాఫ్‌తో ఉండేవాడు. బహుశా అప్పుడు వాడికి ఆరో, ఏడో సంవత్సరాల కంటే ఎక్కువ వయసుండదు. మా కాలనీకే కాకుండా ఇంకా చాలా కాలనీలకు మెయిన్ రోడ్ జంక్షన్‌లో ఉండేది వాడు పని చేసే షాపు. నేను నా స్కూటర్ రిపేరింగ్ కోసమో లేదా మా ఫ్రెండ్స్ వెహికిల్స్ రిపేరింగ్ కోసమో లేదా కుడి పక్కన ఉన్న హోటల్‌లో చాయ్ తాగడానికో లేదా ఎడమ వైపున్న ఎస్‌టిడి ఫోన్ బూత్‌లో ఫోన్ చేసుకోడానికో వెళ్ళినప్పుడల్లా వాడిని గమనించేవాడిని. ఎందుకు గమనించేవాడినో తెలియదు కాని, గమనించేవాడిని. కృష్ణ మాసిపోయిన నల్లటి బట్టలు వేసుకుని, ఆయిల్ అంటిన చేతులతో, ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ పని చేసేవాడు. వాడి షాపు ముందు నుండి రోజూ పొద్దున్నే రకరకాల రంగుల డ్రెస్సులు వేసుకుని, మెడలో టై, కాళ్ళకు బూట్లు, నడుముకు బెల్టు పెట్టుకుని, నీట్‌గా తయారై చాలా మంది పిల్లలు స్కూళ్ళకు వెళ్తూండేవారు. వాడు మాత్రం స్కూల్‌కు వెళ్ళే పిల్లలను పట్టించుకోనట్టే కనపడేవాడు. నాకు ఎందుకో వాడి మీద అప్పుడప్పుడు కాస్తంత జాలి వేసేది. అరె... పాపం... వాడి ఈడు పిల్లలందరూ వాడి కళ్ళ ముందే హాయిగా స్కూళ్ళకు వెళ్తూంటే, వీడు మాత్రం వెట్టి చాకిరి చేస్తున్నాడు, అని అనుకునే వాడిని. బహుశా వాడిని చూసిన వాళ్ళందరూ ఎప్పుడో ఒకప్పుడు నాలా అనుకునే ఉంటారు. నాకు మా కాలనీ పిల్లలే కాక, చుట్టు పక్కల కాలనీల పిల్లలు కూడా తెలుసు. నేను కృష్ణను, స్కూల్‌కు వెళ్ళే పిల్లలను గమనించేవాడిని. ఈ విధంగా చాలా సంవత్సరాలు గడిచి పోయాయి. స్కూల్‌కు వెళ్ళే పిల్లలు కాలేజ్‌లకు వెళ్ళడం ప్రారంభించారు. వీరితో పాటే కృష్ణకు కూడా వయసు వచ్చింది కాని, పెద్దగా పొడుగు ఏమీ పెరగలేదు. ఇంకా కొన్నాళ్ళకు నాకు తెలిసిన కొంత మంది పిల్లల డిగ్రీలు కూడా పూర్తయి పోయాయి. వాళ్ళు ఉద్యోగాల వేటలో పడ్డారు. ఇటువైపు కృష్ణ పనిచేసే షాపు ఓనర్, షాపు తీసేసి ఎటో వెళ్ళి పోయాడు. దగ్గర్లో ఉన్న మెకానిక్ షాపు మూత పడేసరికి మాకు కాస్త ఇబ్బంది అయింది. తప్పక, కాస్త దూరంలోనే పెద్ద చౌరస్తా(సెంటర్)లో ఇంకో మెకానిక్ షాపుకు వెళ్ళే వాళ్ళం. ఎందుకో ఓ రోజు సడన్‌గా నాకు కృష్ణ గుర్తుకొచ్చాడు. షాపు తీసేసిన తర్వాత వాడెక్కడికి వెళ్ళుంటాడబ్బా... అని ఆలోచించాను. తర్వాత కొన్నాళ్ళకు ఓ రోజు పొద్దున్నే కృష్ణ కనిపించాడు. వాడు ఇంతకు ముందు పనిచేసిన షాపుకు కాస్త దూరంలో ఉన్న ఓ చెట్టు కింద కనిపించాడు. వాడి చుట్టూ దాదాపు అయిదారు టూ వీలర్ వెహికిల్స్ ఉన్నాయి. చెట్టు మొదలుకు ఆనించి ఉన్న ఒక ఇనుప పెట్టె, దానిలో వాడి సామాన్లు. వాడు ఒక బండి తర్వాత ఒక బండి రిపేరింగ్ చేస్తున్నాడు. పోయే కస్టమర్లు పోతూ ఉన్నారు, వచ్చే కస్టమర్లు వస్తూనే ఉన్నారు. నేను గమనించి అంచనా వేసిన ప్రకారం వాడు అప్పుడు నెలకు సుమారు పది వేలకు పైనే సంపాదించే వాడు. కొన్నాళ్ళలోనే డెవలప్

అయి, చెట్టు కింద నుండి షిఫ్ట్ అయిపోయి ఎక్కడో షాపు పెట్టుకున్నాడు. వీడి ముందు టిప్ టాప్‌గా తయారై స్కూళ్ళకు, కాలేజ్‌లకు పోయి డిగ్రీలు చేసిన ఎడ్యుకేటెడ్స్ మూడు వేల జీతం కోసం ముప్పతిప్పలు పడుతూ మూడు చెరువుల నీళ్ళు తాగుతూ ఉండడం నేను చూశాను. నాకు తెలిసి కృష్ణ, వాడి పేరు కూడా వాడు రాయలేడనుకుంటా. కాని, వాడు స్వతంత్రంగా జీవిస్తున్నాడు. సంవత్సరాల తరబడి లక్షల రూపాయలు ఖర్చు చేసి చదివించిన పిల్లలు తల్లిదండ్రులకు భారమైతే, ఏ చదువు, ఏ డిగ్రీ లేని కృష్ణ స్వతంత్రంగా జీవిస్తున్నాడు. చదువు రాని వాడికి జీవితమే లేదు అనుకునే ఈ రోజుల్లో..... డిగ్రీలు చేసిన వారు నిరుద్యోగులై తల్లిదండ్రులకు భారమై ఉంటే.... చదువు లేనివాడు నెలకు పదివేలకు పైగా సంపాదిస్తున్నాడంటే.... ఏమి ఈ వింత ! చిన్న పిల్లలను బాల కార్మికులని, బలవంతంగా పని మాన్పించి స్కూళ్ళకు పంపడం మంచిదే కానీ, ఆ విధానంలో చాలా లోపాలున్నాయి అని గుర్తించాను. గ్రహించాను. **భారత దేశంలో కృష్ణ లాంటి ఉదంతాలు కోకొల్లలు. లెక్క లేనన్ని. పని చేసుకునే పిల్లలను, పని మాన్పించి స్కూళ్ళకు పంపితే, వాళ్ళకు తప్పని సరిగా ఉపాధిని అందించే విద్యా బోధనయే చేయాలి. లేకపోతే వారిని పని మాన్పించి, స్కూళ్ళకు పంపించి ఏం లాభం ?!**

నేటి బాలలే రేపటి పౌరులు ఎలాగో....
అలాగే.....నేటి విద్యార్థులే రేపటి నిరుద్యోగులు !
అని అనడంలో వింతేమీ లేదు.

భారత దేశంలో నాణ్యత కలిగిన స్కూల్స్ కొన్నే ఉండి ఉంటాయి. అత్యధిక శాతం మామూలు స్కూళ్ళే ! బొటాబొటి మార్కులతో పాసై ఏ ఉద్యోగమూ దొరక్కపోతే, కొన్ని డబ్బులను సమకూర్చుకుని స్కూల్ పెట్టేస్తున్నారు. 10వ తరగతి లేదా ఇంటర్ పాసైన వాళ్ళనో, ఫెయిల్ అయిన వాళ్ళనో టీచర్లుగా అపాయింట్ చేసేసుకుంటున్నారు. స్కూల్ అనేది ఒక వ్యాపారం అయిపోయింది. ఒక బతుకుదెరువు అయిపోయింది. ఇక కార్పోరేట్ స్కూళ్ళ విషయానికొస్తే.... వినూత్నమైన విధానాలను రూపొందించి పేరెంట్స్‌ను మెప్పించి బాగా సంపాదిస్తున్నారు. డబ్బులున్న పేరెంట్స్‌కు ఎంత ఎక్కువ ఫీజులుంటే అంత గొప్ప స్కూల్ కింద లెక్క ! ప్రస్తుతం ప్రపంచానికి "త్రీ ఇడియట్స్" సినిమాలోని "చతుర్ రామలింగం" లాంటి వాళ్ళే కావాలి. సృజనాత్మకత కలిగి ఉండి, అందరి శ్రేయస్సును ఆకాంక్షిస్తూ, శరవేగంగా అభివృద్ధి చెందడంలో కొత్త మార్గాలను కనుక్కుంటూ, స్వేచ్ఛకు ప్రాధాన్యతనిస్తూ, ఊరికే అలా బతక కూడదు... జీవితంలో జీవించాలి, ఆనందంగా మరియు అర్థవంతంగా జీవించాలి

అంటూ, అన్నవన్నీ ఆచరించి చూపిస్తూ ఉన్న "ర్యాంచో"లు అవసరం లేదేమోనన్న అనుమానం వస్తుంది, ప్రస్తుత విద్యా విధానాలను గమనిస్తే ! సమాజంలోని కొంత మందిని, మిడిల్ క్లాస్, అప్పర్ మిడిల్ క్లాస్, హైయర్ మిడిల్ క్లాస్ అని రకరకాలుగా వ్యవహరిస్తుంటారు. వీళ్ళందరికీ(కొంత మందిని తప్పించి) ఒక వెరైటీ అహంకారం ఉంటుంది. వీళ్ళు చూస్తూ, చూస్తూ కిందకి జారలేరు, అలా అని పైకి రిచ్ క్లాస్‌లోకి ఎదగలేరు. అటూ కిందకి వెళ్ళ లేక, పైకి పోలేక వీళ్ళు పడే బాధలు వర్ణనాతీతం. వీళ్ళు ఫాల్స్ ప్రిస్టేజ్ బాగా మెయింటేన్ చేస్తారు. ఏదైనా పనిమీద వీళ్ళింటికి వచ్చే మెకానిక్‌లను, కార్పెంటర్‌లను, ప్లంబర్‌లను, ఎలక్ట్రీషియన్‌లను, ఫ్లోరింగ్ వేసే వాళ్ళను....ఇంకా ఇలాంటి వాళ్ళను చాలా తక్కువ చేసి చూస్తుంటారు. వాడా ఆఫ్ట్రాల్ మెకానిక్... వాడొక మామూలు ఎలక్ట్రీషియన్... ఇలా చాలా తక్కువ చేసి మాట్లాడతారు, చూస్తారు. అయితే ఈ మిడిల్ క్లాస్ ఉద్యోగులకు తెలియని విషయం ఏమిటంటే, ఈ మెకానిక్‌లు.... మొదలైన వారెవరైతే ఉన్నారో, వాళ్ళు...., వీళ్ళ కంటే చిన్న వయసు నుండే సంపాదిస్తారనీ, ఈ ఉద్యోగులు రిటైర్ అయపోయిన తర్వాత కూడా వాళ్ళు సంపాదిస్తూనే ఉంటారనీ, మొత్తానికి ఈ మిడిల్ క్లాస్ వారి కంటే ఎక్కువే సంపాదిస్తారనీ, ఈ ఉద్యోగుల కంటే జీవితాన్ని వాళ్ళే హాయిగా గడుపుతారన్న సంగతి ఈ మిడిల్ క్లాస్ జీవులకు తెలియదు. ఈ మెకానిక్‌లను మొదలైన వాళ్ళను తక్కువగా చూడటం ఎందుకంటే వాళ్ళు పెద్దగా చదువుకోలేదని.

కాని నేను ఏమంటానంటే... చదువుకున్నా, చదువుకోక పోయినా స్వతంత్రంగా తన కాళ్ళ మీద తాను నిలబడి, తనదైన జీవితాన్ని తాను స్వేచ్ఛగా జీవిస్తున్నవాడే గొప్ప ! స్వతంత్రంగా జీవించలేని వాడు చదువుకుంటే ఎం ?! చదువుకోక పోతే ఎం ?!

చదువు మనిషికి అవసరం, అత్యంత అవసరం ! అయితే ఆ చదువు ఎలా ఉండాలి అనేదే అసలు సిసలు ప్రశ్న.

చదువు, మనిషిని... భౌతిక క్షేత్రంలో, మానసిక క్షేత్రంలో మరియు ఆత్మ క్షేత్రంలో.... ఈ మూడు క్షేత్రాలలో సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో, సాధికారతలతో విరాజిల్లేలా చేయాలి, రక్షణను అందించ గలగాలి మరియు భద్రతను కల్పించ గలగాలి అప్పుడే అది నిజమైన చదువు లేక విద్య.

ప్రస్తుతం అమలులో ఉన్న చదువులు మనుషులను ఎంత మేరకు స్వేచ్ఛా జీవులుగా మారుస్తున్నాయి ? ఎలాంటి రక్షణను అందించ గలుగుతున్నాయి ? ఏ విధమైన భద్రతను అందించ గలుగుతున్నాయి ?

మీరు గమనించి చూడండి, నిజంగా పరిశీలించండి, చదువుకున్న వాళ్ళలో ఉన్నంతగా అయోమయం, అభద్రత, భయం, దిగులు మొదలైనవి చదువు లేని వాళ్ళలో ఉండవు. ఇదేమి విపరీతం ?!

లోకంలో చదివిన చదువుకు సంబంధంలేని ఉద్యోగాలలో లేక వ్యాపారాలలో లేక ఇతర రంగాలలో స్థిర పడిన వారే ఎక్కువ శాతం కనిపిస్తారు ఎందుకని ?

అవసరం లేని చదువుల వలన కొన్ని కోట్ల మంది యొక్క సృజనాత్మకత, శక్తి సామర్థ్యాలు, ప్రతిభా పాటవాలు, తెలివి తేటలు, వివేకం, విజ్ఞానం వెలుగు చూడటం లేదు, అంతేకాక వారి యొక్క ఆవిష్కరణలు జరగకుండానే ఆగిపోతున్నాయి. వారి జన్మలు వృథా అయిపోతున్నాయి. ఉదాహరణకు... మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ను వాళ్ళింట్లో వాళ్ళు ఏ ఇంజనీరింగ్ వైపో లేక మరో వైపో మళ్ళించి, ముందు చదువు ఆ తర్వాతే క్రికెట్ అని నిర్బంధించి ఉంటే క్రీడా ప్రపంచం ఒక మహా, మహా గొప్ప ఆటగాడిని కోల్పోయి ఉండేది కదా ! రిలయన్స్ సంస్థల వ్యవస్థాపకులు ధీరు భాయ్ అంబానీ గారికి ఎన్ని డిగ్రీలున్నాయి ? ఆ..... అందరూ సచిన్‌లు, అంబానీలు కాలేరు కదా... అంటూ దీర్ఘాలు తీయవద్దు, నేనూ అదే అంటున్నాను, ఎవరూ సచిన్‌లు, అంబానీలు కాలేరు, ఎవరు ఎవరో, వారు అది అయి తీరుతారు అని మనవి చేస్తున్నాను. ఏం ? సచిన్‌లాగా వన్డేలో డబుల్ సెంచరీ చేస్తేనే అద్భుతమా ? ఒక వ్యక్తి బట్టలు ఇస్త్రీ చేయడంలో కొత్త విధానం కనుక్కోవచ్చు లేదా పాడైపోయిన పాత చెప్పులను తిరిగి రిపేరింగ్ చేయడంలో ఏదో కొత్త పద్ధతిని ఆవిష్కరించవచ్చు, ఏదో ఒకటి ప్రతీ ఒక్కరూ ఆవిష్కరిస్తూనే ఉంటారు. ప్రతీ ఒక్కరి ఆవిష్కరణ గొప్పదే, మహత్వపూర్ణమైనదే ! ఏదీ ఎక్కువ కాదు, ఏదీ తక్కువ కాదు ! దేనికదే సాటి ! దేని గొప్పతనం దానిదే ! ఎవరు ఎందుకు జన్మించారో తెలుసుకుని ఆ రంగంలో ప్రోత్సహిస్తే వాళ్ళు ఎన్నో అద్భుతాలను చేస్తారు. నిజానికి ఈ సృష్టియే ఒక మహా అద్భుతం కదా ! భౌతిక ప్రపంచపు మాయలో పడి కొట్టుమిట్టాడుతున్న అజ్ఞానులకు అద్భుతాలేం కనపడతాయి ?! ప్రొడక్టివ్, నాన్‌ప్రొడక్టివ్ అంటూ మూర్ఖత్వంతో జీవితాన్ని విభజించి అంధాకారంలో అల్లాడుతున్నారు. ఆత్మ అనుభవం + అవగాహన కోసం అనేకానేక జన్మలను తీసుకుంటుంది. ఒక జన్మలో మూర్ఖుడిగా, ఒక జన్మలో తెలివి గలవాడిగా, మరొక జన్మలో పేదవాడిగా, ఇంకో జన్మలో ఐశ్వర్యవంతుడిగా, రాజుగా, బానిసగా, స్త్రీగా, పురుషుడిగా, రోగిగా.... ఇలా రకరకాల పాత్రలను ఎంచుకుని ఆ లక్షణాలను అనుభవించి అవగాహనను పెంచుకుంటూ ముందుకు

సాగుతుంది. ఒక జన్మలో ఊరికే అలా తిరిగే వాడిగా, దేశ దిమ్మరిగా జీవించాలని జన్మించిన ఆత్మను ఊరికే అలా వదిలేయాల్సిందే ! ఏం ? ఊరికే అలా తిరిగితే తప్పేంటి ? లైఫ్ డిజైన్‌లో దేశ దిమ్మరిగా తిరగాలని వచ్చిన వాళ్ళు మాత్రమే అలా ఊరికే తిరగగలుగుతారు. లైఫ్ డిజైన్‌లో ఆ అంశం లేని వాళ్ళు చచ్చినా తిరగలేరు. ఏ పని లేకుండా ఊరికే అలా ఉండటం అంటే మాటలు కాదు. అంతగా అనుమానం ఉంటే మీరు కొద్ది రోజులు ఉండి చూడండి మీకే తెలుస్తుంది. పట్ట పగలే, టెలిస్కోప్ లేకుండానే చుక్కలు కనపడతాయి. ప్రపంచంలో అన్నింటి కంటే కష్టమైన పనుల్లో "ఏ పని చేయకుండా, ఊరికే అలా ఉండటం" అనేది ఒకటి ! మరి, వాడు పనీ పాటా లేకుండా అలా దేశాలు పట్టుకుని తిరుగుతూ ఉంటే వాడినెవరు పోషిస్తారు ? అనే సందేహం మీకు వస్తే..... ఎవరు ఏం చేసినా, చేయక పోయినా అందరినీ పోషించేది సృష్టియే ! ఈ పరమ సత్యాన్ని తెలుసుకుని గాభరా పడకుండా మౌనంగా మీ పని మీరు చేసుకోండి. ఆత్మ విజ్ఞాన పుస్తకాలు చదివితే ఇలాంటి విషయాలు తెలుస్తాయి. అప్పుడు అనవసరంగా కంగారు పడరు. కాబట్టి ఆత్మ విజ్ఞాన అవగాహనను పెంచుకోండి. ఒక వ్యక్తి చిత్రకారుడిగా అవ్వాలనుకుంటే అతడిని ఆ యొక్క చిత్రకళకే అంకితం కానివ్వాలి. ఒక వ్యక్తికి ఏది ఇష్టమో అది చేయనివ్వాలి అని అంటే వాడు ఇతరులను చంపుతాను, మోసం చేస్తాను, ఇతరుల జీవితాలతో ఆడుకోవడం నాకిష్టం అని అంటే అతడికి ఇష్టం కాబట్టి, సరే చేసుకొమ్మని వదిలేయడం కాదు, మీరు సరిగా విషయాన్ని గ్రహించండి, అతడు ఎంచుకున్న రంగం నెగెటివ్ అయితే అతడిని తప్పక నిరోధించాలి. ప్రతీ ఒక్కరూ ప్రత్యేకమైన వారే ! ప్రతీ ఒక్కరికీ తమవైన ఆలోచనలు ఉంటాయి, లక్ష్యాలు ఉంటాయి. అవి ఏవైనా కావచ్చు. ఉదాహరణకు... క్లర్క్ ఉద్యోగం లేదా మేనేజర్ ఉద్యోగం లేదా జనరల్ మేనేజర్ లేదా ఓ పెద్ద సంస్థకు చైర్మన్ లేదా సింగర్ లేదా డ్యాన్సర్ లేదా చిత్రకళ లేదా వ్యాపారం లేదా ఇతర ఏవైనా కావచ్చు.

ఎవరికి ఎందులో నిజమైన పూర్తి ఇంట్రస్ట్ ఉందో వారిని ఆ వైపే ప్రోత్సహించాలి, అని నేను అనగానే... మీరు వెంటనే ప్రోత్సహిస్తాం సరే, దాని ద్వారా ఉపాధి దొరుకుతుందా ? అని అడిగేస్తారు. "దేని ద్వారానైనా ఉపాధి దొరుకుతుంది" అనేదే నా సమాధానం. ప్రపంచంలో ఎంతో మంది, ఎవరి ఊహలకు అందని మార్గాలలో సంపాదిస్తూ జీవిస్తున్నారు.. లీగల్‌గానే !

కేవలం చదువుకుంటేనే డబ్బులు సంపాదించ గలుగుతారు అనేది ఓ..... పేద్ద.... భ్రమ ! చదువుకుంటేనే డబ్బులు గ్యారంటీగా సంపాదించడమే నిజమైతే, ప్రపంచంలో ఇంత మంది నిరుద్యోగులు ఎందుకుంటారు ?!

తెలివి తేటలు ఉంటే సంపాదించగలరని అనుకుంటే అది కూడా ఓ భ్రమే ! ఎన్నో తెలివి తేటలు ఉన్న వాళ్ళు ఆదాయం లేక అల్లాడుతున్నారు. ప్రతిభ ఉంటే సంపాదించగలరని అంటే, తమ ప్రతిభ వెలుగుకు నోచుకోవటం లేదని బాధపడే వారెందరో ఉన్నారు. చదువు, తెలివి తేటలు, ప్రతిభ మొదలైనవి 100% గ్యారంటీగా ఉపాధిని కల్పించలేక పోతున్నప్పుడు, మరేది 100% గ్యారంటీగా ఉపాధిని కల్పించగలదు ? అనేది చాలా ముఖ్యమైన ప్రశ్న.

100% గ్యారంటీగా ఉపాధిని కలిగించేది ఆత్మ విజ్ఞానం మాత్రమే ! ఆత్మ విజ్ఞానం ద్వారా నిజమైన మరియు పూర్ణమైన ఆత్మ విశ్వాసం, ధైర్యం, ధీమా, పట్టుదల, సాహసం, అంకిత భావం, పరివర్తనను అంగీకరించే గుణం మరియు సృజనాత్మకతలు ఉద్భవిస్తాయి మరియు పెరుగుతూ ఉంటాయి.

నాకు నేను ఉపాధిని కల్పించుకోవడమే కాదు, ఇంకా ఇతరులకు కూడా నేను ఉపాధిని కల్పించగలను అన్న దృఢమైన ఆత్మ విశ్వాసం వలన, 100% గ్యారంటీగా శాశ్వత ఉపాధి లభిస్తుంది.

నేను అనుకున్నది సాధించ గలను అన్న ధైర్యంతో ధీమాగా ఉండటం, ప్రవర్తించటం ద్వారా ఉపాధి మీ వెన్నంటే ఉంటుంది.

సృజనాత్మకంగా ఆలోచించి, ఆ యొక్క ఆలోచనలను ఆచరణలో పెట్టే సాహసాన్ని కలిగి ఉండటం మరియు ఎలాంటి పరిస్థితులు ఎదురైనా, వాటిని సరి చేసుకుంటూ, పట్టిన పట్టు విడవకుండా, లక్ష్యాన్ని సాధించే వరకు సడలని, చెక్కు చెదరని పట్టుదలను కలిగి ఉండటం ద్వారా మీరు శాశ్వత ఉపాధిని పొంది ఉండటమే కాకుండా, ఉపాధి కోసం ప్రయత్నించే ఎంతో మందికి బలమైన ప్రేరణ కలిగించి, వారిలో చైతన్య స్ఫూర్తిని రగిలించి, ఆత్మ విశ్వాసాన్ని మేల్కొలిపి, ధైర్యాన్ని ఉత్తేజితం చేసి..... వారికి మీరు మార్గదర్శకులవుతారు.

ఈ లక్షణాలు ఉన్న వ్యక్తి తనకు తాను ఉపాధి కల్పించుకోవడమే కాకుండా ఎంతో మందికి ఉపాధిని కల్పిస్తాడు. పిల్లలకు ముందు, ఈ లక్షణాలను ఎలా ఏర్పరచుకోవాలి, వాటిని ఎలా పెంపొందించుకోవాలి అనే విషయాలను ప్రాక్టికల్‌గా నేర్పించాలి. తరగతి గదుల్లో బంధించి కాదు. సృష్టిలో అనంతమైన ఐశ్వర్యం ఉంది, ప్రతీ ఒక్కరికీ ఎంత కావాలంటే

అంత ఉంది. అనంతమైన అవకాశాలున్నాయి. నాకు ఈ సృష్టి సదా, బేషరతుగా, సంపూర్ణంగా, సమగ్రంగా సహాయ సహకార సమన్వయాలను మరియు మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. అనే పరమ సత్యాలను పిల్లల హృదయాల్లో బలంగా నాటాలి. ఇక చాలు ! అప్పుడు ఈ భూమి పైన నిరుద్యోగం అనేది ఉండదు గాక ఉండనే ఉండదు. ఇది సత్యం ! ఆశ్చర్యంగా ఉందా ! అలా ఎలా అవుతుంది ? ఇది ఎలా సాధ్యం ? అనే ప్రశ్నలు మీలో పుట్టాయంటే మీకు ఆత్మ విజ్ఞానం లేదన్న విషయం స్పష్టం. కాబట్టే అందరికీ ఆత్మ విజ్ఞాన అభ్యాసం మరియు ధ్యాన సాధన తప్పని సరి.

ఆత్మ విజ్ఞానం, ధ్యానం అనగానే కొందరికీ అది వైరాగ్యానికి దారి తీస్తుంది అనే భావన ఉంది. ఇలాంటి తప్పుడు భావనలకు కారకులు మతపరమైన బాబాలు మరియు స్వామీజీలు.

ఆత్మ విజ్ఞానానికి మరియు ధ్యానానికి - మతానికి ఏ సంబంధమూ లేనే లేదు. ఆధ్యాత్మిక విజ్ఞానం మరియు ధ్యానం జీవితాన్ని జీవించమని చెప్తాయే తప్ప వదులుకోమని చెప్పవు.

ఆత్మ విజ్ఞానం ఉన్న వారే జీవితాన్ని నిజంగా ఎంజాయ్ చేయగలుగుతారు, ఎందుకంటే వారికి అన్ని విషయాలు తెలుసు కాబట్టి !

ప్రియ మిత్రులారా ! ఇప్పటికైనా మేల్కోండి !! మీ పిల్లలను సరైన మార్గంలో ప్రవేశ పెట్టండి. వారికి ఆత్మ విజ్ఞానం బోధించండి. వారి చేత నిత్య ధ్యాన సాధన చేయించండి. మొక్కై వంగనిది మానై వంగదు అనే సూత్రాన్ని గుర్తుంచుకోండి. చిన్నప్పుడు మనం వాళ్ళలో ఏం ఫీడ్ చేస్తామో అదే వారి జీవితంగా మారుతుందనే పరమ సత్యాన్ని మరువకండి. ప్రస్తుతం చెలామణిలో ఉన్న విద్యా విధానం వలన ప్రయోజనం లేదు, ఏవో కొన్ని భౌతిక పరమైనవి తప్ప ! ప్రస్తుతం చదువులలో నెలకొని

ఉన్న భౌతికత స్థానంలో ఆధ్యాత్మికత రావాలి. మత రహిత అత్యున్నత ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని బోధించాలి. సరైన ఉన్నత ధ్యాన సాధన చేయించాలి. ఆ తర్వాత అవసరమైన 3 భాషలు, అవసరమైనంత మేరకు లెక్కలు, సైన్స్ మరియు సోషల్ బోధిస్తే చాలు. పిల్లలు పరమోత్తమ ప్రపంచ పౌరులుగా రూపొందుతారు. ప్రతీ ఒక్కరు వెలుగులు విరజిమ్మే సూర్యుళ్ళు అవుతారు. వారి దివ్య వెలుగులతో ఈ భూమి బ్రహ్మానందంగా ప్రకాశింస్తుందని నాకు తెలుసు ! ఇది సత్యం !! ఇది తథ్యం !!!

దయచేసి గ్రహించండి, ఆత్మ మనిషిగా ఈ భూమి పైన జన్మించింది అనుభవ విజ్ఞానం కోసం. అవగాహన కోసం. ఆత్మ పరిణామం కోసం !

ఆత్మకు అనుభవాలే సంపద !

ఆత్మకు అనుభవాలే పరువు, ప్రతిష్ఠ !

ఆత్మకు అనుభవాలే హోదా, గౌరవం !

ఆత్మకు అనుభవాలే శక్తి సామర్థ్యాలు !

ఆత్మకు అనుభవాలే అభివృద్ధి !

ఆత్మకు అనుభవాలే ఐశ్వర్యం !

ఆత్మకు అనుభవాలే అందం, ఆనందం !

ఆత్మకు అనుభవమే విజ్ఞానం !

ఆత్మకు ఆత్మ విజ్ఞానమే సర్వ భుక్తి, యుక్తి, శక్తి,

రక్తి మరియు ముక్తి దాయకం !

ఆత్మకు అనుభవం + అవగాహనయే సాఫల్యం !

మనిషి అనబడే భౌతిక శరీరంలో ఉన్న ఆత్మలం మనం. మనం అభివృద్ధి చెందేది ఆత్మ విజ్ఞానం వల్లనే తప్ప మరో రకంగా కానే కాదు. అతడు/ఆమె ఎవరైనా సరే తప్పని సరిగా ఆత్మ విజ్ఞానం కలిగి ఉండాలి. అప్పుడే నిజమైన అభివృద్ధి జరుగుతుంది. ఆత్మ విజ్ఞానం లేని అభివృద్ధి సరి అయినది కాదు. అది పతనానికి దారి తీస్తుంది. ఉదాహరణకు... ప్రస్తుతం ప్రపంచంలో టెక్నాలజి ఎంతగానో అభివృద్ధి చెందింది. అయితే ఏం లాభం ? ప్రపంచం అంతా ఆందోళనలు, యుద్ధాలు, సమ్మెలు, సంఘర్షణలు, ఉద్యమాలు, విప్లవాలు మొదలైన వాటితో అట్టుడికి పోతూ ఉంది కదా ! భౌతిక పరమైన టెక్నాలజీ పరంగా ఎంతైతే అభివృద్ధి చెందిందో అంతే అభివృద్ధి ఆత్మ విజ్ఞాన పరంగా జరిగి ఉంటే.... ఈ ప్రపంచం అంతా ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలతో విరాజిల్లేది. ఈ సత్యాలను అవగాహన చేసుకోండి.

3. మనిషి తన యొక్క నిజ మూలాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకునే విద్య - ఎంత తప్పనిసరైనదో గ్రహించక పోవటం.

ప్రపంచ చరిత్రను మీరు ఆత్మ విజ్ఞాన కోణంలో నుండి పరిశీలిస్తే ఆరని మంటలకు, ఆగని యుద్ధాలకు, అభివృద్ధికి ఆటంకం కలిగించేది, అస్థిరతకు, అన్ని అరిష్టాలకు, సర్వ సమస్యలకు మూలకారణం ఒకే ఒక్కటి, అదే మతం అని మీరు తేలిగ్గానే గుర్తిస్తారు. ప్రస్తుతం ఈ భూమి మీద చాలా మతాలున్నాయి, అయితే ఈ మతాలు మనుషుల అజ్ఞానంలో నుండి పుట్టాయి. స్వార్థ మూఢ మూర్ఖ మనుషులు ఈ మతాలను సృష్టించారు. మీరు, ఈ భూమి పైన ఉద్భవించిన పరమాత్మ స్వరూపుల బోధనలను శ్రద్ధగా చదవండి. వాటిలో ఎక్కడా ఇతర మతాలను కించ పరిచే బోధనలు ఉండవు. అసలు పరమత ప్రసక్తే ఉండదు. స్వమత ప్రసక్తి కూడా ఉండదు. కల్పిత బోధనల్లో ఉంటాయి. ఉదాహరణకు భగవద్గీతను తీసుకుంటే అందులో ఎక్కడా ఏ మత ప్రసక్తి ఉండదు. జీసస్ క్రైస్ట్, మహమ్మద్ ప్రవక్తల యొక్క నిజమైన బోధనల్లో ఎక్కడా మత ప్రసక్తే ఉండదు. ఆ పరమాత్మ స్వరూపులు దైవం అంటే ఏమిటి ? ఆ దైవ సామ్రాజ్యంలోకి వెళ్ళాలంటే ఏం చేయాలి ? ఆ దైవ సామ్రాజ్యాన్ని ఎలా పొందాలి ? మొదలైన విషయాలనే, తమదైన శైలిలో బోధించారు. క్రైస్ట్‌కు ముందు క్రిస్టియానిటి లేదు, క్రిస్టియానిటిలోని శాఖలూ లేవు. మహమ్మద్ ప్రవక్త గారు దైవాన్ని చేరుకునేందుకు ఒక చక్కటి, పవిత్రమైన మార్గాన్ని రూపొందించారు. ముస్లిములు, క్రిస్టియన్లు ఇంకా ఇతర మతాల వాళ్ళు వచ్చి భారత దేశంలో మత ప్రచారం చేస్తూ, బలవంతంగా మత మార్పిళ్ళు చేస్తూ ఉంటే అప్పుడు రైజ్ అయింది హైందవ వాదం. ఎవరికి వారు తమ మతం యొక్క ఉనికిని కాపాడుకోడానికి ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి అన్ని మతాలు ఒకే చోటికి తీసుకెళ్తాయి. అన్ని మతాల గమ్యం ఒక్కటే, గమనమే వేరు ! ఇది గ్రహించాలి. అందరి మూలం ఒక్కటే ! నిజంగా నిజం ! అందరి మూలం ఒక్కటే ! వాస్తవంలో ఏ మతాలు లేవు. ఏ కులాలు లేవు. అందరూ ఒక్కటే ! సర్వమూ సమానమే ! ఇది పరమ సత్యం ! నిజ సత్య వాస్తవం ! ఈ నిజాన్ని ఆత్మ విజ్ఞాన అవగాహన ద్వారా మరియు ధ్యాన సాధన ద్వారా అనుభవ పూర్వకంగా తెలుసుకోవచ్చు. ప్రతీ ఒక్కరూ "అందరి మూలం ఒక్కటే, మనమంతా ఒక్కటేనన్న" పరమ సత్యాన్ని గ్రహిస్తే, అప్పుడు ఆటొమెటిక్‌గా ప్రపంచం అంతా శాంతి, ఆనందం, సౌభాగ్యం, ఉల్లాసం, ఉత్సాహం మరియు నిత్య ఉత్సవాలతో విరాజిల్లుతుంది. ఈ కారణంగానే ప్రతీ ఒక్కరూ తమ నిజ మూలం ఏమిటి ? అనే విషయాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుని తీరాలి. ఆత్మ విజ్ఞాన అవగాహన మరియు ధ్యాన సాధన ద్వారా మాత్రమే మనుషులు తమ నిజ మూలాన్ని స్పష్టంగా, అనుభవ పూర్వకంగా తెలుసుకోగలుగుతారు.

కాబట్టే అందరికీ ఆత్మ విజ్ఞాన బోధన మరియు ధ్యాన సాధన తప్పని సరి.

4. జన్మ కారణాన్ని సాఫల్యం చెందించే దిశలో మార్గదర్శకత్వం వహించక పోవడం మరియు ఆ విషయంలో ప్రేరణను జ్ఞాగృతిని కలిగించక పోవటం.

ప్రతీ ఆత్మ తను ఎందుకు జన్మించిందో దాన్ని పొందాలి అప్పుడే సాఫల్యం. తన జన్మ కారణాన్ని సాఫల్యం చెందించుకోలేని ఆత్మ భంగపడుతుంది. ఈ విధంగా భంగపడిన ఆత్మ మరే రకంగానూ అభివృద్ధి చెందదు. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక శాతం భంగపడిన ఆత్మలే ఉన్నాయి. అందుకే అంతటా ఇంత ఉద్రిక్తత, అశాంతి, అస్థిరత మరియు అభద్రత ! ఒక్క జన్మ కారణాన్నే కాదు ఎన్ని జన్మల కారణాలైనా ఆత్మ విజ్ఞాన అభ్యాసం, ఆత్మ విజ్ఞాన సూత్రాల ఆచరణ మరియు ధ్యాన సాధనల ద్వారా ఏక కాలంలో సాఫల్యం చెందించవచ్చు. ఈ రకంగా తప్ప, జన్మ కారణ సాఫల్యం మరే రకంగానూ సాధ్యం కాదు. కాబట్టే అందరికీ, ప్రతీ ఒక్కరికీ ఆత్మ విజ్ఞాన బోధన మరియు ధ్యాన సాధన అత్యంత ఆవశ్యకం. తప్పని సరి.

నేను MAB లర్నింగ్ స్పేస్‌ను స్థాపించాలని అనుకుంటున్నాను. నా కాన్సెప్ట్‌ను అర్థం చేసుకున్న తల్లిదండ్రులు వారి పిల్లలను లర్నింగ్ స్పేస్‌లో చేర్పిస్తారు. అప్పుడు నేను, నా శిష్యులు మరియు తల్లిదండ్రులు కలిసి పిల్లలను సరైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతాం. అనాథలు, పేద పిల్లలు, వీధి బాలల కోసం ఒక ప్రత్యేకమైన లర్నింగ్ స్పేస్‌ను నిర్మించి వారికి 100% ఉచితంగా శిక్షణ అందించాలనేది మా అందరి సంకల్పం.

MAB లర్నింగ్ స్పేస్‌లో పిల్లలకు పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన ఆనందకరమైన వాతావరణంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. విద్యలో కొన్ని విషయాలు గుర్తుంచుకునేవి ఉంటాయి, మరి కొన్ని అవగాహన చేసుకునేవి ఉంటాయి. ఏవి ఏవో వాటిని అలాగే బోధిస్తాం. నిజంగా MAB లర్నింగ్ స్పేస్ చాలా మంది పరమోత్తమ పౌరులను ఈ ప్రపంచానికి అందించి తీరుతుంది. ఇది సత్యం ! తథ్యం !!

పిల్లల సిలబస్‌లో ప్రప్రథమంగా, అత్యంత ప్రధానంగా ఉండి తీరవలసిన విషయాలు మరియు పిల్లలకు సరిగ్గా, నిజంగా అర్థం చేయించి తీరవలసిన విషయాలు మరియు ప్రాక్టికల్‌గా నేర్పించి తీరవలసిన విషయాలు:

1. పిల్లలను స్మృతి పూర్వకంగా, అవగాహనా పూర్వకంగా అకర్మ శాకాహారులుగా అనగా అకర్మ వీగన్‌లుగా మార్చాలి. అకర్మ వీగనిజమ్ యొక్క విలువలను, ఔన్నత్యాన్ని మరియు లాభాలను బోధించాలి.

2. ఆత్మ విజ్ఞాన శాస్త్రాన్ని బోధిస్తూ, అందులోని సూత్రాలను నిజ జీవితంలో అవగాహనా పూర్వకంగా ఆచరింప జేస్తూ, నిత్య ధ్యాన సాధన చేయిస్తూ ఉండాలి.

3. పిల్లల పైన పెద్దల యొక్క కాలం చెల్లిన మరియు పనికిమాలిన "ఆశయాలను" బలవంతంగా రుద్ద కూడదు. వారికి నచ్చిన రంగంలోనే వారిని ప్రోత్సహించాలి. కన్నంత మాత్రాన వారి జీవితాలను తమ స్వంతం అని భావించ కూడదు.

4. పిల్లలను ఎప్పుడూ కించ పరచకూడదు. క్రమశిక్షణ అవసరమే కాని, క్రమశిక్షణ పేరుతో గొడ్లను బాదినట్టు బాదరాదు. అనవసరమైన ఆంక్షలు విధించి ఖైదీలుగా చేయరాదు. చదువు పేరుతో, ర్యాంకుల పేరుతో చిత్రవధ చేయకూడదు.

5. పిల్లలకు ఐక్యత గురించి చాలా బలంగా, చాలా వివరంగా, చాలా స్పష్టంగా, ప్రాక్టికల్‌గా అర్థం చేయించాలి. వారి చేత అవగాహన పూర్వకంగా ఆచరింప చేయాలి. జాతి, మత, కుల, వర్గాలనేవి మానవులను చీల్చి, వారిని వేరు చేసి, వారిలో వారికి ఆరని మంటలను చెలరేగేలా చేస్తూ... సమస్త మానవ జాతిని ఎలా అతలాకుతలం చేస్తున్నాయో వివరించాలి. మానవుల ఐక్యతను దెబ్బ తీసే ఈ "జాతి మత కుల వర్గ విభేదాలను" సంపూర్ణంగా, శాశ్వతంగా రూపుమాపాల్సిన అవసరం ఎంత ఉందో చాలా స్పష్టంగా, బలంగా వివరించాలి. జాతి, మత, కుల, వర్గ భేదాల వలన ఎన్ని మారణహోమాలు జరిగాయో, జరుగుతున్నాయో, ఎన్ని కష్ట నష్టాలొస్తాయో బాగా వివరించాలి. సరిగా అర్థం చేయించాలి. ఆత్మ విజ్ఞాన శాస్త్ర పరంగా మనుషులంతా ఒకటేనని, భౌగోళిక నైసర్గిక పరిసర ప్రాంతాలను అనుసరించి శారీరకంగా, మానసికంగా కొన్ని తేడాలు ఉంటాయే కాని మానవులంతా ఒక్కటే అని స్పష్టంగా అర్థం చేయించాలి. అంతా, అందరూ సమానమేనని చాలా స్పష్టంగా, బలంగా తెలియజేయాలి. అందరూ అందరి పట్లా గౌరవ మర్యాదలను ఇచ్చి పుచ్చుకోవాలని తెలియజేయడమే కాకుండా, వారి చేత నిజంగానే ఆచరింప చేయాలి. అయితే ఈ ఆచరణ అనేది గుడ్డిగా కాకుండా, స్మృతి పూర్వకంగా మరియు అవగాహనా పూర్వకంగా ఉండేలా చూడాలి.

6. జాతి, మత, కుల, ప్రాంతీయ, దేశీయ అనే భేదాలు లేకుండా.... ప్రతీ మనిషి సహజంగానే,

నిజంగా పుట్టుకతోనే ఎంతో శక్తివంతుడు. ఎన్నో శక్తి సామర్థ్యాలను కలిగి ఉంటాడు, ఎన్నో తెలివి తేటలను మరియు ఎంతో వివేకాన్ని కలిగి ఉంటాడు. ఎంతో మేదస్సును కలిగి ఉంటాడు. ఎన్నో ప్రతిభలను, పాటవాలను కలిగి ఉంటాడు. ఎంతో ధైర్య సాహసాలను కలిగి ఉంటాడు. ఎంతో సృజనాత్మకతను, నైపుణ్యాన్ని మరియు తేజోవంతమైన, ప్రయోజనాత్మకమైన కళలను కలిగి ఉంటాడు. అనే సత్యాలను బాగా నూరి పోయాలి. అంతరాంతరాల్లోకి దించాలి. హృదయాల్లో బలంగా నాటాలి.

7. స్త్రీ పురుషులు ఇరువురూ సమానమేనని చాలా స్పష్టంగా అర్థం చేయించాలి. ఒకరికొకరు సరి సమాన గౌరవ మర్యాదలను ఇచ్చి పుచ్చుకోవాలని తెలియజేసి, వారి చేత నిజంగా ఆచరింప చేయాలి. ఈ ఆచరణ అనేది ఒక గుడ్డి ఆచారంగా కాకుండా స్మృతి పూర్వకంగా, అవగాహనా పూర్వకంగా మరియు ప్రేమగా ఉండేలా శిక్షణ ఇవ్వాలి.

8. స్త్రీలపైన దౌర్జన్యాలకు, హింసకు, అత్యాచారాలకు పాల్పడరాదని చాలా స్పష్టంగా, బలంగా అర్థం చేయించాలి.

9. స్త్రీలను చులకన చేయకూడదని చాలా క్లియర్‌గా వివరించాలి.

10. వర కట్నాలను తీసుకోవడం ఎంత సరి కాని పనో చాలా, చాలా స్పష్టంగా మరియు బలంగా తెలియజేయాలి. కన్యాశుల్కం కూడా సరికానిదేనని వివరంగా తెలియజేయాలి. పెళ్ళి చేసుకునే వారు కట్నాలు లేకుండా పెళ్ళి చేసుకుని పిల్లలకు ఆదర్శంగా నిలవాలి.

11. తల్లిదండ్రులు ఇంట్లో ఆడ పిల్లలకు, మగ పిల్లలకు వ్యత్యాసం చూపకుండా, సమానంగా పెంచాలి. సమానత్వం వారికి నేర్పించాలి, వారిచేత ఆచరింప చేయాలి.

12. "మనం ఇతరులకు ఏం చేస్తే అది వేయి రెట్లుగా మనకు తిరిగి వస్తుంది" అనే సృష్టి సూత్రాన్ని చాలా క్లియర్‌గా వివరించాలి. ఈ ఒక్క సత్యాన్ని కనుక చక్కగా అర్థం అయ్యేలా వివరించ గలిగితే, పిల్లలకు బాగా అర్థం అయితే... అప్పుడు వారు తప్పుగా ప్రవర్తించ లేరు. అది అసంభవం.

13. "ఇవ్వడం అంటే పొందడమే" అనే సృష్టి సూత్రాన్ని స్పష్టంగా వివరించి, నిజంగా ఆచరింప చేయాలి. ఈ సూత్రాన్ని కనుక మనుషులంతా అర్థం చేసుకుంటే... భూమి పైన నిత్యం ఉత్సవాలే జరుగుతాయి. ఇది సత్యం.

ప్రపంచంలో కొంత మంది దగ్గర వారి అవసరాలకు మించి, వారి విలాసాలకు మించి అత్యధికంగా ఐశ్వర్యం ఉంది. వారి అవసరాలకే కాకుండా, విలాసాలకు కూడా సరిపడా ఉంచుకుని మిగతాది పంచివేస్తే ఎంత బాగుంటుందో ఒక సారి ఆలోచించండి.

"ఇవ్వడం అంటే పొందడమే" అనే సత్య సూత్రం ఎలా పని చేస్తుంది మరియు దాని యొక్క ప్రభావ ఫలితాల గురించి ఈ మార్గదర్శిలోనే "నవ రత్నాలు" అనే పేరు గల 14వ పార్ట్‌లోని రెండవది అయిన "సేవా సాధన" అనే టాపిక్‌లో చాలా క్లియర్‌గా వివరించాను.

14. "సత్యమే ఎల్లప్పుడూ జయిస్తుంది" అనే సత్య సూత్రాన్ని వివరిస్తూ, దానిని నిజంగా ఆచరింప చేయిస్తూ ఉండాలి.

15. వ్యక్తిగత శుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రతల యొక్క ఆవశ్యకతలను చాలా స్పష్టంగా, బలంగా అర్థం చేయించాలి.

16. నిస్వార్థ సమాజ సేవ ఎంత గొప్పదో బాగా అర్థం చేయించాలి.

17. ప్రజా స్వామ్యం యొక్క గొప్పతనాన్ని బాగా అర్థం చేయించాలి.

18. "పొలిటికల్" అవేర్‌నెస్‌ను కలిగించాలి. దీని వలన ఎవరిని ఎన్నుకోవాలి, ఎలాంటి వారిని ఎన్నుకోకూడదు అనే అవగాహన వచ్చి సరైన వారిని ఎన్నుకుంటారు.

19. మీరు గొప్పవారు అవుతారు మరియు మహా ఐశ్వర్యవంతులు అవగలుగుతారు అని నిరంతరం చెబుతూ, ఈ విషయాలను పిల్లల హృదయాల్లో బలంగా నాటాలి.

20. "మంచి చేసే వారికి ఎల్లప్పుడూ మంచే జరుగుతుంది" కాబట్టి ఎల్లప్పుడూ మంచే చేయాలి అని నిరంతరం బోధిస్తూ ఉండాలి. వారిచేత వీలైనన్ని రకాలుగా మంచి పనులు చేయిస్తూ ఉండాలి. "సత్యమేవ జయతే" కాబట్టి పిల్లలచేత సత్యాచరణ చేయిస్తూ ఉండాలి.

21. మీరు స్వతంత్రంగా జీవించ గలుగుతారు, కేవలం మీరు జీవించడమే కాకుండా ఎంతో మందికి ఆసరాను ఇవ్వగలిగే శక్తి సామర్థ్యాలు మీకు సహజంగానే ఉన్నాయి, అని బలంగా చెబుతూ ఉండాలి. వారిలో ఈ విషయాన్ని బాగా నాటుకుపోయేలా చేయాలి. అప్పుడు పెద్దైన తర్వాత వారికి ఉద్యోగం దొరికితే దొరుకుతుంది లేకపోతే వారు తమకు తాముగా ఒక స్వయం ఉపాధిని సృష్టించుకుని, స్వతంత్రంగా జీవించ గలుగుతారు.

"నేను స్వతంత్రంగా జీవించ గలుగుతాను" అని ఆలోచించలేక పోవటమే - నిరుద్యోగ సమస్యకు మూలం. ప్రస్తుతం ప్రపంచంలో నిరుద్యోగ సమస్య ఉండడానికి ప్రధాన కారణం ఇదే ! చిన్నప్పటి నుండి పిల్లలలో ఉద్యోగం, ఉద్యోగం, ఉద్యోగం అని ఎంత బలంగా నాటేస్తారంటే.... ఇక వారు పెరిగి పెద్దైన తర్వాత ఎవరో ఒకరు ఉద్యోగం ఇస్తే కాని బతకలేనంతగా ! ఉద్యోగం తప్ప మరేదీ చేయలేనంతగా !! ఎవరో ఒకరు పని ఇవ్వకపోతే ఎలా జీవించ గలుగుతాము ? అనే ప్రశ్న యొక్క భ్రాంతి నుండి బయట పడాలి. ఆ భ్రాంతి తొలగిపోవాలంటే, ఆత్మ విజ్ఞాన క్రాంతి కావాలి. ఒక ఆత్మ విజ్ఞానికి నేను ఎలా జీవించ గలుగుతాను ? అనే ప్రశ్నే ఉదయించదు. ఎందుకంటే అతడికి తెలుసు సృష్టిలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి అనేది ఉంటుంది అని !

22. నీ గురించి + నీ కుటుంబం గురించి + నీ దేశం గురించి + నీ లోకం గురించి ఆలోచించు, అందుకై జీవించు. కేవలం నీ కుటుంబం గురించి మాత్రమే బతికితే అది స్వార్థపూరిత జీవితం అవుతుంది. కేవలం నీ గురించి మాత్రమే బతికితే అది పచ్చి స్వార్థపూరిత మూర్ఖ జీవితం అవుతుంది. నీ గురించి మరియు నీ లోకం గురించి జీవించు అని బోధిస్తూ ఉండాలి....

....ఇలాంటి ఆత్మ విజ్ఞాన సత్యాలను వారికి నేర్పిస్తూ, వారిచేత నిజంగా ఆచరింప చేస్తూ వారికి మిగతా అవసరమైన విద్యాబోధన చేస్తే ఖచ్చితంగా పిల్లలు ప్రపంచ పౌరులుగా మారడమే కాకుండా కాస్మిక్ సిటిజెన్‌లుగా పరిణమిస్తారు.

"నేను స్వతంత్రంగా జీవించ గలుగుతాను" అని ఆలోచించలేక పోవటమే - నిరుద్యోగ సమస్యకు మూలం.

ప్రస్తుతం మీరు, మీ యొక్క శరీరంలో మరియు
జీవితంలో అనుభవిస్తున్న బాధలు అన్నీ కూడా
మీకై మీరు పెట్టుకున్నవే... వాటిని ఎప్పుడంటే అప్పుడు, పూర్తిగా
క్లియర్ చేసుకోగల శక్తి మీరు సంపాదించుకున్న
తర్వాతనే... సమస్యలను పెట్టుకున్నారు.
మీ శరీరంలోని మరియు జీవితంలోని సమస్యలు
ఎంత పెద్దవైనా సరే, మీరు సులభంగా కచ్చితంగా క్లియర్
చేయగలరు. నమ్మండి, ఇది నిజం.

"నేను స్వతంత్రంగా జీవించ గలుగుతాను" అని ఆలోచించలేక పోవటమే - నిరుద్యోగ సమస్యకు మూలం. ప్రస్తుతం ప్రపంచంలో నిరుద్యోగ సమస్య ఉండడానికి ప్రధాన కారణం ఇదే ! చిన్నప్పటి నుండి పిల్లలలో ఉద్యోగం, ఉద్యోగం, ఉద్యోగం అని ఎంత బలంగా నాటేస్తారంటే.... ఇక వారు పెరిగి పెద్దైన తర్వాత ఎవరో ఒకరు ఉద్యోగం ఇస్తే కాని బతకలేనంతగా ! ఉద్యోగం తప్ప మరేదీ చేయలేనంతగా !! ఎవరో ఒకరు పని ఇవ్వకపోతే ఎలా జీవించ గలుగుతాము ? అనే ప్రశ్న యొక్క భ్రాంతి నుండి బయట పడాలి. ఆ భ్రాంతి తొలగిపోవాలంటే, ఆత్మ విజ్ఞాన క్రాంతి కావాలి. ఒక ఆత్మ విజ్ఞానికి ఏం చేయాలి ? నేను ఎలా జీవించ గలుగుతాను ? అనే ప్రశ్నే ఉదయించదు. ఎందుకంటే అతడికి తెలుసు సృష్టిలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి అనేది ఉంటుంది అని !

పార్ట్ - 12

ఐశ్వర్యం జై హో

ఆధ్యాత్మికతకూ ఐశ్వర్యానికి ఎలాంటి వ్యతిరేకత లేదు.
నిజానికి ఐశ్వర్యం అనేది ఒకానొక ఆధ్యాత్మిక శక్తి!
ఐశ్వర్యం వలన జీవితం వికసిస్తుంది.
ఎన్నెన్నో ఆనందాలను అనుభవించవచ్చు.
ఐశ్వర్యం అనేది మనకు అత్యవసరమైనది.
ఐశ్వర్యం చాలా శ్రేయస్కరమైనది.
ఐశ్వర్యం చాలా మంచిది.
ఐశ్వర్యం చాలా గొప్పది.
ఐశ్వర్యం చాలా దివ్యమైనది.

I. ఐశ్వర్యం పట్ల ఉన్న భ్రమలు, అపోహలు !

ఐశ్వర్యవంతులుగా కావాలంటే లేదా డబ్బు బాగా సంపాదించాలంటే ఏం చేయాలి ? అని అనగానే... సాధారణ ప్రజలు, మేధావులు, ఇతరులు ఈ కింది విషయాలను చెప్తారు.

1. బాగా చదువుకోవాలి.

2. బాగా కష్టపడాలి.

3. బాగా తెలివితేటలు ఉండాలి.

4. బాగా ప్రతిభ ఉండాలి.

5. భౌతికంగా బాగా మేదస్సు ఉండాలి.

మేదస్సు రెండు రకాలుగా ఉంటుంది.

1. ఆధ్యాత్మిక పరమైనది **2.** భౌతిక పరమైనది.

6. బాగా సంపాదనకు ఆస్కారం ఉన్న రంగాన్ని ఎంచుకోవాలి.

7. వేరే ఇతర ఏవైనా.....

ఇప్పుడు మనం, పైన చెప్పినవి నిజమైనవేనా, కాదా... అన్న విషయాన్ని పరిశీలిద్దాం.

1. బాగా చదువుకోవాలి : బాగా చదువుకుంటే, బాగా సంపాదించవచ్చు అనేది నిజమైతే ప్రపంచంలో ఇంత నిరుద్యోగం ఉండకూడదు. అక్షరాస్యులు బాగా సంపాదిస్తూ ఉండాలి. నిరక్షరాస్యులు సంపాదన లేని వారిగా ఉండాలి. కానీ పరిస్థితి అలా లేదు కదా ! సంపాదించే వాళ్ళలో

అక్షరాస్యులు ఉన్నారు, నిరక్షరాస్యులూ ఉన్నారు. పెద్దగా ఏమీ చదువుకోని వాళ్ళెంతో మంది కోటీశ్వరులుగా ఉన్నారు. బాగా చదువుకున్న సరస్వతీ దేవి పుత్రులు మరియు పుత్రికలు సంపాదన లేక అల్లాడుతూ ఉన్నారు.

ఈ విషయాలన్నింటినీ పరిశీలిస్తే.... చివరికి తేలే నిప్పు లాంటి నిజం ఒక్కటే... చదువుకుంటే 100% గ్యారంటీగా సంపాదించవచ్చన్న షూరిటి ఎవరూ ఇవ్వలేరు, ఎందుకంటే చదువే గనక 100% గ్యారంటీగా సంపాదనను ఇస్తే..... ప్రపంచంలో ఇంత మంది చదువుకున్న నిరుద్యోగులు ఉండనే ఉండరు కదా ! ఈ విషయం ఇంతటితో తేలిపోయింది. చదువు సంపాదనను 100% గ్యారంటీగా, అందరికీ ఇవ్వలేదు.

సంపాదనను 100% గ్యారంటీగా ఇవ్వలేని చదువుల కోసం ప్రపంచం అంతా..... ఎంత పనికిరాని ప్రాధాన్యతనిస్తున్నారో !

2. బాగా కష్టపడాలి : బాగా కష్టపడితే, సంపాదించవచ్చు అనేది కూడా భ్రమే ! ఎందుకంటే, అందరికంటే ఎక్కువ కష్టపడేది కూలీలు మొదలైన వారు. రోజంతా చెమటోడ్చి శ్రమిస్తారు, కానీ వారు ఎంత సంపాదించ గలుగుతున్నారు ? బాగా కష్టపడితే, బాగా సంపాదించవచ్చన్న విషయమే గనక నిజమైతే, కూలీలు మొదలైన శ్రామిక వర్గం ధనవంతులుగా ఉండాలి, మరి వాళ్ళే పేద వాళ్ళుగా ఉన్నారు కదా ! రోజంతా గొడ్డు చాకిరి చేసే వాళ్ళు, రెక్కాడితే కాని డొక్కాడని స్థితుల్లో ఏ రోజుకారోజు గంజి, మెతుకులతో బతుకులీడుస్తున్నారు. కేవలం శారీరకంగానే కాదు, మానసికంగా కూడా కష్టపడాలి అని అంటే, మానసికంగా కష్టపడే వాళ్ళకు ప్రపంచంలో కొదవే లేదు కదా ! ఈ పరిశీలన వలన తేలిందేమిటంటే... బాగా కష్టపడినా కూడా 100% గ్యారంటీగా, బాగా సంపాదించలేరు.

3. బాగా తెలివితేటలు ఉండాలి : మా అమ్మాయికి లేక మా అబ్బాయికి చాలా తెలివితేటలున్నాయి, అయినా ఏ సంపాదన లేకుండా ఉన్నారు అని బాధపడే తల్లిదండ్రులెంతో మంది ఉన్నారు. లోకంలో తెలివితేటలున్న వాళ్ళు 100% గ్యారంటీగా సంపాదించ గలుగుతారు అని అంటే, ప్రపంచంలో ఇంత ఆర్థిక మాంద్యం ఉండదు. లోకంలో కొట్లాది మంది, మా తెలివితేటలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి అని వాపోతూ ఉన్నారు. తెలివి తేటలు కూడా 100% గ్యారంటీగా సంపాదనను ఇవ్వలేక పోతున్నాయి అనే విషయం ఋజువై పోయింది.

4. బాగా ప్రతిభ ఉండాలి : బాగా ప్రతిభ ఉంటే సంపాదించవచ్చన్నది కూడా ఒక భ్రమే, ఎందుకంటే మా ప్రతిభకు తగిన గుర్తింపు ఇక రాదని, నిరాశతో ఆత్మహత్యలు చేసుకున్న ప్రతిభావంతులు ఎంతో మంది....! బతికున్న వాళ్ళు మాకు ప్రతిభ ఉంది, మాకు టాలెంట్ ఉంది, ఒక్క చాన్స్.... కేవలం ఒకే ఒక్క చాన్స్ వస్తే మేం ఏమిటో నిరూపిస్తాం.... కానీ మా టాలెంట్‌కు సరైన అవకాశాలు రావటం లేదని కుమిలి పోతున్న ప్రతిభావంతులు, టాలెంట్ టైకూన్స్ ఎంతో మంది ఉన్నారు. దీని వలన అర్థం అయిన విషయం ఏమిటంటే.... ప్రతిభ కూడా 100% గ్యారంటీగా సంపాదనను ఇవ్వలేదు అన్న విషయం రూఢీ అయిపోయింది కదా !

5. భౌతికంగా బాగా మేదస్సు ఉండాలి : బాగా సంపాదించడానికి బాగా మేదస్సు ఉండాలనేది కూడా భ్రమే ! ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన వాళ్ళలో ఎంత మంది ఐశ్వర్యవంతులున్నారు ? ఆర్థిక శాస్త్రాన్ని మామూలు వ్యవహార భాషలో, ఒక కోణంలో "పైసల శాస్త్రం" లేదా "సంపద శాస్త్రం" అని అనవచ్చు. డబ్బులకు సంబంధించిన శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన వాళ్ళే ఐశ్వర్యవంతులుగా లేరంటే... ఎంత విచిత్రం ! ప్రపంచంలో ఎంతో మంది మేధావులున్నారు కదా ! వాళ్ళలో ఎంత మంది ఐశ్వర్యవంతులున్నారు ? లెక్చరర్లు, ప్రొఫెసర్లు ఇంకా ఇతర రంగాలలో ఎంతో మంది మేధావులున్నారు, కానీ వాళ్ళంతా ఐశ్వర్యవంతులు కారే...!

మేధావులుగా ఉన్నవాళ్ళలో అత్యధిక శాతం నెల జీతానికి పని చేసే వాళ్ళే ! గొప్ప గొప్ప మేధావులుగా పేరుగాంచిన వాళ్ళు కూడా ఐశ్వర్యవంతులుగా లేరంటే... ఏమిటీ విచిత్రం ?!

6. బాగా సంపాదనకు ఆస్కారం ఉన్న రంగాన్ని ఎంచుకోవడం :

ఫలానా రంగాన్ని ఎంచుకుంటే 100% గ్యారంటీగా ఐశ్వర్యవంతులవుతారన్న షూరిటీ ఎవరూ ఇవ్వలేరు. ఎందుకంటే, దాదాపుగా ప్రతీ రంగంలో ఐశ్వర్యవంతులున్నారు మామూలు వాళ్ళు కూడా ఉన్నారు. ఉదాహరణకు... పాలిటిక్స్, సినిమాలు, బిజినెస్, కళాకారులు ఈ విధంగా సుమారుగా అన్ని రంగాలలో ఐశ్వర్యవంతులున్నారు, మామూలు వాళ్ళు కూడా ఉన్నారు. ఫలానా రంగం అనేది ఏదీ కూడా 100% గ్యారంటీగా ఐశ్వర్యవంతులను చేయటం లేదంటే..... మరి ఏది ఐశ్వర్యవంతులుగా చేస్తుంది ??????????????????

ఐశ్వర్యవంతులు, ఐశ్యర్యవంతులుగా ఎలా అయ్యారు ?!

ప్రస్తుత వర్తమానంలో, మన కళ్ళ ముందే కొంత మంది
ఐశ్వర్యవంతులుగా అవుతున్నారు, ఎలా ?!

మరి, మనం కూడా ఐశ్వర్యవంతులుగా అవ్వాలంటే ఏం చేయాలి ???

బాగా చదువుకోవాలి, బాగా కష్టపడాలి, బాగా తెలివితేటలు ఉండాలి, బాగా ప్రతిభ ఉండాలి, భౌతికంగా బాగా మేధస్సు ఉండాలి, బాగా సంపాదనకు ఆస్కారం ఉన్న రంగాన్ని ఎంచుకోవాలి అనే భ్రమల్లో నుండి బయట పడండి, మేలుకోండి. ఇవేవి అవసరం లేదు. ఎవరైనా సరే, నేను ఐశ్వర్యవంతుడిని లేక ఐశ్వర్యవంతురాలిని అని పూర్తిగా, నిజంగా భావిస్తూ, గొప్ప గొప్ప లక్ష్యాలను పెట్టుకుంటే ఐశ్వర్యవంతులైపోతారు. ఆశ్చర్యంగా ఉందా ?! కానీ ఇదే సత్యం. సాధారణ జీవితాన్ని ప్రారంభించి, ఐశ్వర్యవంతులైన వాళ్ళలో కొంత మంది... "నేను అనుకోలేదు ఇంత స్థాయికి వస్తానని" అని అనవచ్చు, కానీ వారి అచేతనంలో, వాళ్ళని వాళ్ళు ఐశ్వర్యవంతులుగా భావిస్తూ, గొప్ప గొప్ప లక్ష్యాలను కలిగియే ఉంటారు. ఇది వారికి క్లియర్‌గా తెలిసినా, తెలియక పోయినా, అసలు సత్యం ఇదే ! నేనూ ఇలాగే అయ్యాను. నాకు తెలిసిన మార్గాన్నే, మీకు నేర్పిస్తున్నాను.

ఈ విషయాల యొక్క వాస్తవాలను క్లియర్‌గా తెలుసుకోవాలంటే, ముందు పేజీల్లో వివరించాను చదవండి. సరిగా అర్థం చేసుకుంటే, అవగాహనతో నిజంగా ఆచరిస్తే 100% గ్యారంటీగా ఐశ్వర్యవంతులై తీరుతారు మీరు !

All The Very Best !

2. ఐశ్వర్యం జై హో

మీరేది చేయదలుచుకుంటే అది , మీరు అనుకున్న దానిని అనుకున్నట్టుగా ఎప్పుడైనా పూర్తి చేసే "శక్తినే, స్వేచ్ఛనే, సాధికారతనే, హక్కునే" ఐశ్వర్యం అని అంటారు. ఇది అంతరానికి సంబంధించింది. ఇది ఒక భావన. ఇది ఒక మానసిక స్థితి. ఇది ఆత్మ యొక్క , ఒకానొక మహా దివ్య శక్తి. ఇది అందరూ సహజంగానే కలిగి ఉంటారు. దీనిని ప్రతి ఒక్కరు వాడుకోవాలి.

భౌతిక పరంగా చూస్తే విజయాలు, అపారమైన విస్తారమైన ధనం(సంపద), ఆస్తులు, బంగారం, నగలు, వజ్రాలు, రత్నాలు, బ్యాంక్ బాలెన్స్‌లు, డిపాజిట్లు, కార్లు, బంగ్లాలు, భూములు, పలుకుబడి, కీర్తి, ప్రతిష్ఠలు మొదలైనవి అన్నీ కలిగి ఉండడమే ఐశ్వర్యం ! ప్రతీ ఒక్కరూ కూడా తప్పని సరిగా ఐశ్వర్యాన్ని కలిగి ఉండాలి.

ఐశ్వర్యాన్ని కలిగి ఉంటే జీవితాన్ని ఎంజాయ్ చేయవచ్చు. ఐశ్వర్యానికి తోడుగా ఆత్మ విజ్ఞానం కూడా కలిగి ఉంటే ఇంకా బాగా శ్రేయస్కరంగా ఎంజాయ్ చేయవచ్చు. ఆత్మ విజ్ఞానం లేని ఐశ్వర్యం ప్రమాదం !

ఐశ్వర్యం చాలా సులభంగా
మన జీవితాలలోకి ప్రవేశిస్తుంది.
నిజానికి మనం సహజంగా
ఐశ్వర్యవంతులమే ! మనలో ఉన్న ఐశ్వర్యాన్ని
కేవలం మనం అనుమతించినంత
మాత్రాన... మనం నిజంగా
ఐశ్వర్యవంతులం అయిపోతాం.
ఇది పరమ సత్యం. నమ్మండి.

ప్రియ మిత్రులారా !

జీవితం "లోపల", "బయట" ఐశ్వర్యవంతంగా ఉండాలి.

"లోపల" ఐశ్వర్యం అంటే "ఆత్మ విజ్ఞానం" అపారంగా, విస్తృతంగా కలిగి ఉండాలన్న మాట. "బయట" ఐశ్వర్యం అంటే భౌతిక జీవితం ధన, సంపదలతో విరాజిల్లుతూ ఉండాలన్నమాట.

మనిషికి కావాల్సింది ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, సంతృప్తి, ఆనందం. దైవత్వంలో ఇవే కాక ఇంకా అనంతమైన విషయాలు ఉంటాయి.

ఇవి అన్నీ కలిగి ఉన్న మనిషిని ఊహించుకుంటేనే ఒళ్ళు పులకరిస్తుంది.

ఒక విధమైన ఆహ్లాదకరమైన భావం ముంచెత్తుతుంది.

మరి వీటిని పొందడం ఎలా ?

ఎలా అంటే... ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, సంతృప్తి, ఆనందం లేదా వీటన్నింటినీ కలిగి ఉన్న దైవత్వం రావాలంటే ఒకే ఒక మార్గం ఉంది... అదే ఆత్మ విజ్ఞాన మార్గం !

కేవలం ఆత్మ విజ్ఞానం ద్వారా మాత్రమే మనిషికి ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, సంతృప్తి, ఆనందాలు మరియు దైవత్వం సులభంగా, సరళంగా, శాశ్వతంగా స్వంతం అవుతాయి.

నిజం చెప్పాలంటే వాటిని ప్రత్యేకంగా పొందాల్సిన అవసరం లేదు.

వాటిని అందరూ సహజంగానే కలిగి ఉన్నారు.

"ఆత్మ విజ్ఞానం" ద్వారా మీకు తెలుస్తుంది అంతే !

ఓహో... ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, సంతృప్తి, ఆనందం, దైవత్వం

నా దగ్గర ఎప్పటి నుండో ఉన్నాయి ! అనంతంగా ఉన్నాయి ... అని !

✪ ఇప్పటికే ఇవి నా స్వంతం ! సహజంగానే ఇవి "నావి" ! అని తెలుస్తుంది. ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, సంతృప్తి, ఆనందం, దైవత్వం ఇప్పటికే నా స్వంతం అని మీరు తెలుసుకోగానే, అవి మీ అందుబాటులోకి వచ్చి మీరు వాడుకోవడానికి సిద్ధంగా ఉంటాయి.

మీదే ఆలస్యం ! "ఆత్మ విజ్ఞానం" ద్వారా వాటిని వాడుకునే విధానాన్ని వివరించాను. ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో ఆచరించడం ద్వారా మరియు నిరంతర ధ్యాన సాధన ద్వారా వాటిని మీరు సులభంగా, సరళంగా, సహజంగా, అధికారికంగా, అనంతంగా వాడుకోగలుగుతారు.

ధ్యాన సాధన చేసే ముందు ఈ పుస్తకంలో వివరించిన "సత్యాలను" పూర్తిగా ఒంట బట్టించుకోండి, ఆ తర్వాతే ధ్యాన సాధన !

✪ రాబోయే పేజీలలో "ఐశర్య సాధనను" వివరించాను. ముందు ఈ విషయాలన్నీ చదివి బాగా అవగాహన చేసుకున్న తర్వాత "ఐశ్వర్య సాధనను ప్రారంభించండి".

✪ ధ్యానం ఒక వాహనం అయితే

ఆత్మ విజ్ఞానం ఇంధనం లాంటిది....

.....ఈ విషయాన్ని మీరు సదా గుర్తుంచుకోండి.

ఆత్మ విజ్ఞాన సత్యాలు మీ అణువణువులో ఇంకి పోవాలి. ఆ సత్యాలే మీరై పోవాలి. ఇక అప్పుడు అంతా మీదే... మీరే అంతా ! ఆత్మ స్వరూపులైన మీకు అసాధ్యం అనేదే లేదు ! మీ ఇష్టం వచ్చినట్టుగా జీవించండి !

మీరు ప్రపంచంలో ప్రతీ ఒక్కరిని బిల్ గేట్స్ అంత ధనవంతుడిని చేసినా తరగని సంపద మీరు ఇప్పటికే కలిగి ఉన్నారు. సూర్యుడికి ఎంత శక్తి ఉందో అంత కంటే ఎక్కువ శక్తిని మీరు ఇప్పటికే కలిగి ఉన్నారు. నిజం చెప్పాలంటే " మహా మూల చైతన్యం" యొక్క శక్తి యావత్తు మీ స్వంతమే ! ఇప్పుడే మీరు అది కలిగి ఉన్నారు ! సూటిగా చెప్పాలంటే...

... " మహా మూల చైతన్యమే" మీరు ! మీరే "మహా మూల చైతన్యం" !

❖ ❖ ❖

3. ఆరోగ్య ఐశ్వర్య ఆనందాలతో శాశ్వతంగా విరాజిల్లాలంటే ఏం చేయాలి ?

ప్రస్తుతం మీరు ఐశ్వర్యవంతులు కాదు అని అంటే, ప్రస్తుతం మీ జీవితంలో ఐశ్వర్యం లేదు అని అంటే - మీరు మీ లోపల ఐశ్వర్యాన్ని వ్యతిరేకిస్తున్నారని అర్థం. ఆనందానికి వ్యతిరేకంగా ఉన్నారని అర్థం. ఎందుకంటే ఐశ్వర్యంతో ఎన్నెన్నో ఆనందాలను పొందవచ్చు.

మనం దేనినైతే వ్యతిరేకిస్తున్నామో దాన్ని మనం కలిగి ఉండం. – ఇది ఒక విశ్వ సూత్రం

ఎవరైనా ఐశ్వర్యాన్ని, ఆనందాన్ని వ్యతిరేకిస్తారా అని ఆశ్చర్యపోవాల్సిన అవసరమే లేదు ! మీరు ప్రస్తుతం ఐశ్వర్యాన్ని కలిగి లేరు అని అంటే - మీరు ఐశ్వర్యాన్ని వ్యతిరేకిస్తున్నారు అనే సత్యానికి ఇక మరే నిరూపణ అవసరం లేదు. మీ జీవితంలో

ఐశ్వర్యం లేకపోవడం అనేదే మహా బలమైన, సజీవమైన ప్రత్యక్ష సాక్ష్యం ! కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పే ఋజువు ! నగ్న సత్యం !

ప్రస్తుతం ప్రపంచంలో ఐశ్వర్యం లేని వారందరూ వారి "లోపల" ఐశ్వర్యాన్ని వ్యతిరేకిస్తూ ఉన్నారు. అందుకే వారు ఐశ్వర్యాన్ని కలిగి లేరు.

ముందు ఈ సత్యాన్ని తెలుసుకుని, సాధన చేసి లోపల ఉన్న "ఐశ్వర్య వ్యతిరేకతలను" మొత్తం తీసివేసినప్పుడే మీరు ఐశ్వర్యవంతులుగా మారుతారు.

ఆరోగ్య ఐశ్వర్య ఆనందాలు కావాలంటే వాటిని 100%గా కోరుకుని, వాటి కోసం తనను తాను 100%గా అంకితం చేసుకోవాలి !

Just 100% is enough !

not more than that !

only 100% !

❖ ❖ ❖

4. జీవితంలో ఐశ్వర్యం లేకపోవడానికి గల కొన్ని కారణాలు

మీ జీవితంలో ఐశ్వర్యం లేక పోవడానికి ప్రధాన కారణం మీరు మీ లోపల ఐశ్వర్యానికి వ్యతిరేకంగా ఉన్నారు. ఐశ్వర్యాన్ని ఇష్టపడటం లేదు. అందుకే మీరు ఐశ్వర్యం అవసరం అని భావించటం లేదు. అందుకే మీరు ప్రస్తుతం ఐశ్వర్యాన్ని కలిగిలేరన్న సత్యాన్ని గ్రహించండి. ఈ ఒకే ఒక్క కారణం ఈ కింది కారణాలను సృష్టిస్తుంది.

❶ డబ్బు సమస్యతో బాధ పడుతున్న వ్యక్తి, తన అంతరంలో "నేను డబ్బు సమస్యతో బాధ పడుతున్నాను" అని గుర్తించక పోవడం. తనకు డబ్బు సమస్య ఉంది అని స్వయంగా అవగాహన చెందక పోవటం. డబ్బు సమస్యతో బాధ పడడం వేరే, నాకు డబ్బు సమస్య ఉంది అని గుర్తించడం వేరే ! ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోండి.

❷ నాకు డబ్బు సమస్య ఉంది అని గుర్తించి, దానిలో నుండి బయటపడాలి అనే నిర్ణయం తీసుకోక పోవడం. డబ్బు సమస్యల్లో నుండి బయట పడాలని ఎవరికి ఉండదండీ ?! కానీ ఎలా..... అనేదే సమస్య అని అంటూ ఉంటారు. ఇదెంత మాత్రమూ సరి కాని మాట ! ఎందుకంటే మీరు మనసులో నిజంగా సిద్ధపడకపోతేనే "ఎలా" అనే ప్రశ్న పుట్టుకొస్తుంది. నిజంగా సిద్ధపడితే "ఎలా" అనే ప్రశ్న ఉద్భవించదు. మీరు పూర్తిగా సిద్ధపడనప్పుడే "ఎలా" అనే ప్రశ్న పుట్టుకొస్తుంది. నిజంగా 100% తలుచుకోవాలే కానీ మార్గాలెన్నో ఉంటాయి. మీరు 100% ఎందుకు సిద్ధపడరంటే, మీకు

అవసరం అని అనిపించదు కాబట్టి ! ఎప్పుడైతే అనవసరమో అప్పుడే "ఎలా" అనే ప్రశ్న పుడుతుంది. "ఎలా" అనే అనుమానం, అనవసరం అని అనుకున్నప్పుడే పుడుతుంది.

ఈ మార్గదర్శిలోనే "అవసరం - అనవసరం - విశ్వాసం - అపనమ్మకం - అనుమానం" గురించి వివరించాను, ఒక సారి చదవండి. మనసుంటే మార్గం ఉంటుంది. మనసే మార్గం.

❸ ఐశ్వర్యం అనేది అందరికీ ఉండదు అనే భావన.

❹ ఐశ్వర్యం నాకు లేకపోయినా ఫరవాలేదు అనే భావన.

❺ ఐశ్వర్యం నాకు లేదు అనే భావన.

❻ ఐశ్వర్యం నాకు రాదు అనే భావన.

❼ ఐశ్వర్యం పొందడానికి నాకు తగిన అర్హత లేదేమో అనే భావన.

❽ ఐశ్వర్యం పొందాలంటే మామూలు విషయం కాదు. ఐశ్వర్యాన్ని పొందాలంటే చాలా చాలా కష్టం, దాని కోసం ఏమేమో చేయాలి అనే భావన.

❾ ఐశ్వర్యాన్ని పొందాలంటే ఏ దైవం అనుమతో తీసుకోవాలి అనే భావన.

❿ ఐశ్వర్యాన్ని పొందడానికి నాకు తగిన శక్తి, సామర్థ్యాలు లేవు అనే భావన.

⓫ ఐశ్వర్యం పొందడం అనేది అదృష్టం, అది నాకు లేదు అనే భావన.

⓬ ఐశ్వర్యం వస్తే దానితో పాటు సమస్యలు కూడా వస్తాయనే భావన.

⓭ ఐశ్వర్యం వస్తే నేను మెయింటేన్ చెయ్యలేనేమోననే భావన.

⓮ ఐశ్వర్యం వస్తే అందరూ నన్ను అడుగుతారేమోననే భావన.

⓯ కర్మ వశాత్ నా జీవితంలో ఐశ్వర్యం లేదేమోననే భావన.

⓰ నా జాతకంలో ఐశ్వర్యం లేదేమోననే భావన.

⓱ ఐశ్వర్యం గురించి ఆలోచించే సాహసం చేయలేక పోవడం.

⓲ ఐశ్వర్యం పట్ల దురభిప్రాయం కలిగి ఉండటం.

⓳ ఇక నా బతుకు ఇంతే ! అని ఫిక్స్ అయిపోవడం.

⓴ జీవితం పట్ల నిరాసక్తత, అయిష్టత, నిరసన, ద్వేషం, అపరాధ భావనలు మొదలైనవి కలిగి ఉండడం.

21 అక్రమంగా తప్ప, సక్రమంగా ఐశ్వర్యాన్ని పొందలేమేమోననే భావన కలిగి ఉండడం.

22 త్రికరణశుద్ధిగా అంటే భావంలోనూ, వాక్కులోనూ, చేష్టలోనూ ఐశ్వర్యం అవసరం అని అనుకోక పోవడం. అంటే ఐశ్వర్యం గురించి ఆలోచించి కోరుకోక పోవటం, ఐశ్వర్యం గురించి ఎక్కడా అడిగి తెలుసుకోక పోవడం, ఐశ్వర్యం కోసం శ్రమించక పోవడం.

23 ఐశ్వర్యం విషయంలో ఎవరినైనా జడ్జ్ చేసి ఉండడం. ఈ మార్గదర్శిలోనే జడ్జ్‌మెంట్ గురించి ఉంది. చదవండి.

✪ **24** ఆధ్యాత్మిక మార్గంలో లేదా సత్య మార్గంలో ఉన్నవారు ఐశ్వర్యాన్ని కలిగి ఉండకూడదు అనే తప్పుడు భావన కలిగి ఉండటం.

వాస్తవానికి ఆధ్యాత్మిక అభివృద్ధికి ఐశ్వర్యం ఏ మాత్రమూ అడ్డం కాదు. అసలు ఆధ్యాత్మిక విజ్ఞానం ఉన్న వారే ఐశ్వర్యాన్ని కలిగి ఉండాలి. ఆధ్యాత్మిక విజ్ఞానం కలిగి ఉన్న వ్యక్తి దగ్గర ఉన్న ఐశ్వర్యం లోక శ్రేయస్సు కోసం వినియోగించబడుతుంది.

ఆధ్యాత్మిక మార్గంలో ఐశ్వర్యం అడ్డంకి కాదు, నాకు ఐశ్వర్యం ఉంది అనే మదం అడ్డం పడుతుంది. కొంత మంది సంపన్నులు, ఐశ్వర్యవంతులు తమకు ఐశ్వర్యం ఉందన్న మదంతో కన్ను మిన్ను కానకుండా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇలాంటి వారిని చూసి అలా అంటారు. ఐశ్వర్యాన్ని కలిగి ప్రేమ గుణాలతో కూడా హాయిగా ఉండవచ్చు. ఎంతో మందికి శ్రేయస్కరాన్ని కలిగించవచ్చు.

25 ఐశ్వర్యం లేకుండా నిరాడంబరంగా జీవించడం, ఒక గొప్ప విషయం అనే భావన. నిజానికి నిరాడంబరత అనేది గొప్ప విషయం కానే కాదు. అది ఒక "ఎంపిక" మాత్రమే ! ఎవరి ఇష్టం వారిది. నిరాడంబరత అనేది ఆధ్యాత్మిక లక్షణం అని అనుకోవడం అజ్ఞానం.

26 ఏమీ ఆశించకుండా ఇచ్చే గుణం లేకపోవడం.

27 ఇతరులను అర్థం చేసుకునే గుణం లేకపోవడం.

28 అణుకువ లేక పోవడం.

29 ఒద్దిక, పొందిక, పొదుపు లేకపోవడం.

30 ఐశ్వర్యం విలువ తెలియక పోవడం.

31 నీతి, నిజాయితి, నైతికత, నిబద్ధత లేకపోవడం.

✪✪✪ 32 మీ పట్ల మీకు బాధ్యత లేక పోవడం.

ఈ బాధ్యత గురించి చాలా మందికి తప్పుడు అభిప్రాయం ఉంది. మేము ఫలనా బాధ్యత తీసుకోవాలనుకుంటున్నాం కానీ మాకు ఆ శక్తి, సామర్థ్యాలు లేవు అని అంటుంటారు. ఇది తప్పు.

బాధ్యత అంటేనే శక్తి సామర్థ్యాలు. బాధ్యత తీసుకుంటేనే దానికి సంబంధించిన శక్తి సామర్థ్యాలు వస్తాయి. ఆహారం తీసుకున్న తర్వాతే శక్తి వస్తుంది. మంచి నీళ్ళు తాగిన తర్వాతే దాహం తీరుతుంది. బాధ్యత తీసుకుంటేనే దానికి సంబంధించిన శక్తి, సామర్థ్యాలు వస్తాయి. లోపల బాధ్యత తీసుకోవడం ఇష్టం లేనప్పుడే, నాకు శక్తి, సామర్థ్యాలు లేవు అనే మాట వస్తుంది.

ముందు మీరు 100% పూర్తి చైతన్య స్పృహతో, నిజంగా బాధ్యత తీసుకోండి. అప్పుడు సృష్టి నుండి దానికి తగిన శక్తి, సామర్థ్యాలు ఆటోమెటిక్‌గా మీకు వస్తాయి.

33 వినాశకర ధోరణి, తన బాగు పట్ల తనకు ఇష్టం లేకపోవడం.

34 పాజిటివ్ ఆలోచనలు చేసే గుణం లేకపోవడం.

35 సహాయ, సహకార, సమన్వయాలు చేసే గుణం లేకపోవడం.

36 కలిసి మెలిసి ఉండే గుణం లేకపోవడం.

37 ఇతరుల శ్రేయస్కరం గురించి ఆలోచించే గుణం లేకపోవడం.

38 స్వార్థాన్ని కలిగి ఉండడం. స్వార్థ పరులకు ఈ సాధన ఫలించదు.

39 కమర్షియల్ గుణం కలిగి ఉండడం. కమర్షియల్ గుణాలున్న వారికి కూడా ఈ సాధన పని చేయదు.

40 ఐశ్వర్యం గురించి అయోమయంగా ఉండటం.

ఈ 40 కారణాల్లో ఏదైనా ఒకటి కానీ రెండు కానీ అంతకంటే ఎక్కువ కానీ ఉండే అవకాశం ఉంటుంది. ఇవే కాక ఇంకా ఏవైనా ఇతర కారణాలు ఉండే అవకాశం ఉంది. కానీ 99% ఈ 40 కారణాల్లోనే ఉంటాయి.

ఇదంతా చదివినప్పుడు మీకేం అనిపిస్తుందంటే, మాలో ఈ గుణాలు ఏవీ లేవు. ఇప్పుడు లోకంలో ఐశ్వర్యాన్ని కలిగి ఉన్న వారు అంత పవిత్రంగా ఉన్నారా ?! అనే ప్రశ్న ఉద్భవించే అవకాశం ఉంది. వాళ్ళు పవిత్రంగా ఉన్నారో లేదోననే విషయం ప్రక్కన పెడితే వాళ్ళు "లోపల" ఐశ్వర్యానికి వ్యతిరేకంగా లేరు. వాళ్ళు ఐశ్వర్యానికి అనుకూలంగా ఉన్నారు కాబట్టే వాళ్ళు ఐశ్వర్యవంతులయ్యారు. మిగతా కోణాల్లో వాళ్ళకు లోపాలు ఉండవచ్చు, కానీ ఐశ్వర్యం విషయంలో వాళ్ళు కరెక్ట్‌గా ఉన్నారు.

ఆత్మ తాను పరిపూర్ణం చెందడానికి రక రకాల జన్మలలో, రక రకాల పాత్రలను ఎంచుకుంటుంది. ఎన్నెన్నో జన్మలలో, ఎన్నెన్నో రకాల గుణాలను పెట్టుకుని జన్మించి వాటిని అనుభవించి విజ్ఞానాన్ని పొందుతుంది. ద్వంద్వాలను అంటే మంచి - చెడులను రెండింటినీ అనుభవిస్తుంది. అప్పుడే పరిపూర్ణత

పొందుతుంది. వాస్తవానికి అంతా, అందరూ పరిపూర్ణులే ! నేను పరిపూర్ణుడినే అని అనుకుని పరిపూర్ణత పొందాలి అనే భ్రమలో నుండి మీరు బయటపడిన తక్షణం మీ నిజతత్వాన్ని మీరు అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. ఈ పరిపూర్ణత అనేది అనంతంగా విస్తరిస్తూ పోతూనే ఉంటుంది. ఇది అనంతం ! ఈ క్రమంలో ముందు నెగెటివ్ గుణాలను అనుభవిస్తుంది. ఎందుకంటే ఆత్మ, జంతు ప్రపంచంలో నుండి మానవ ప్రపంచంలో జన్మ తీసుకుంటుంది కాబట్టి చాలా జన్మల వరకు అజ్ఞానంతో ఉంటుంది. ఆత్మ, అజ్ఞానాన్ని కలిగి ఉండి దాన్ని అనుభవిస్తూ, అజ్ఞానాన్ని వదిలించుకుంటూ వస్తుంది. ఈ విధమైన క్రమంలో చాలా చాలా జన్మలు ఎత్తి పండిపోయిన తర్వాత ఇక తన మూలం గురించి, సృష్టి మూలం గురించి తెలుసుకోవాలనే ఆలోచనలు చేయడం ప్రారంభిస్తుంది. ఈ విధంగా సత్య మార్గం(ఆధ్యాత్మిక మార్గం)లోకి ప్రవేశించి కొన్ని జన్మలు తీసుకుని అనుభవ జ్ఞానంతో కొన్ని మంచి గుణాలను అలవర్చుకుంటుంది. సత్య మార్గంలో కొన్ని జన్మల అనుభవం పొంది చివరికి ఒక నిర్ణయం తీసుకుంటుంది, ఇక పూర్తిగా నన్ను నేను తెలుసుకుని "నా నిజ తత్వాన్ని" పొందాలి అని !

ఇలాంటి నిర్ణయంతో జన్మ తీసుకునేటప్పుడు తన లోపల ఉన్న "సరికాని గుణాలకు" అంటే అజ్ఞానానికి పూర్తి వ్యతిరేకమైన "సరి అయిన గుణాలను" పెట్టుకుని జన్మ తీసుకుంటుంది. జన్మ తీసుకున్న తర్వాత, లోతైన ఆధ్యాత్మిక అవగాహన లేకపోవడంతో, ఈ విషయాలేవీ తెలియకపోవడంతో అయోమయానికి గురవుతుంది. ఎందుకంటే తన "ఎరుక"లో అన్ని మంచి లక్షణాలే ఉంటాయి. లోపల విస్మృతిలో ఉన్న సరి కాని గుణాల, సరి కాని నమ్మకాల గురించి తెలియదు. ఇక రెండింటికి సంఘర్షణ జరుగుతుంది. పట్టుదలతో పరిశ్రమిస్తే కానీ లోపల ఉన్న గుణాలను తెలుసుకోలేము, వాటిని తొలగించుకోలేం !

ఆత్మ జన్మ పరిణామ క్రమంలో ఇది సహజం. లోపల సరి కాని గుణాలు అందరికీ ఉంటాయి. ఇది సహజం, ప్రకృతి పరంగా జరిగే చాలా సాధారణ విషయం. మంచి లేదు, చెడు లేదు ఉన్నదంతా దివ్యమే ! మంచికి చెడుకి అతీతంగా మనం ఎదగాలి. ఇదంతా ఆత్మ అభివృద్ధి క్రమంలో ఒక భాగం, సహజం ! కాబట్టి లోపల సరి కాని గుణాలు ఉన్నాయని ఆశ్చర్యపోకుండా అవి ఉన్నాయని తెలుసుకుని వాటిని గుర్తించి తీసివేసుకుంటే సరిపోతుంది.

ఈ విస్మృతిలో ఉన్న గుణాలు యథా ప్రకారంగా తమకు అనుగుణమైన పరిస్థితులను ఆకర్షిస్తూ ఉంటాయి. మనకు తెలియదు కాబట్టి మనం ఆశ్చర్యపోతూ ఉంటాం. పై నుండి ఏ దేవుడో, ఏ అదృశ్య శక్తో అలా చేసిందని అనుకుంటాం. ఇక నాస్తికులైతే లాజిక్ ప్రకారం కారణాలు వెతుకుతారు. కానీ అసలు సత్యం ఇది.

మీరు, మీ విస్మృతిలో ఉన్న గుణాలను తెలుసుకోవాలంటే కళ్ళు మూసుకుని కూర్చోండి. రిలాక్స్‌గా కూర్చోండి. ఇప్పుడు మీకు వస్తున్న ఆలోచనలను గమనించండి. జాగ్రత్త ! నేను ఆలోచించమని చెప్పటం లేదు, ఎరుకతో, సాక్షిగా వాటంతట అవే వస్తున్న ఆలోచనలను గమనించమని చెబుతున్నాను. ఆలోచనలతో కొనసాగిపోకుండా, ఆలోచనను + దాని అనేక కోణాలను ఎరుకతో, సాక్షిగా గమనించాలి. ఇలా ఒక అరగంట కూర్చోండి. అప్పుడు తెలుస్తుంది మీకు, మీ లోపల ఎంత అల్లకల్లోలంగా ఉందో !

ఇందాక మనం తెలుసుకున్న 40 గుణాలు కాక, ఐశ్వర్యం మన జీవితాల్లో లేక పోవడానికి ఆధ్యాత్మిక శాస్త్ర పరమైన మరో రెండు ప్రధాన కారణాలు ఉంటాయి అవి :

1. దురాశ

2. మదం

"దురాశ యొక్క పర్యవసానమే దారిద్ర్యం" - ఈ విషయాన్నే ఎన్నో రకాలుగా మాస్టర్స్ అందరూ ధృవీకరిస్తారు. దరిద్రంతో మీరు పోరాడి ప్రయోజనం ఉండదు. దరిద్రాన్ని మీరు ఏమీ చేయలేరు. మీరేం చేసినా దరిద్రం పోదు. దరిద్రాన్ని తీసి వేయాలంటే దాని మూలమైన దురాశను తీసి వేయాలి. ఉదాహరణకు చీకటి ఉంది. చీకటిని తొలగించడానికి మీరేం చేసినా, ఎంత పోరాడినా చీకటిని ఏమీ చేయలేరు. పైగా మీ సమయం, శక్తి రెండూ వృథా అయి పోయి డీలా పడి పోతారు. చీకటిని తొలగించాలంటే సింపుల్‌గా దీపం వెలిగిస్తే సరిపోతుంది. దీపం వెలిగించడంతోనే చీకటి తొలగి పోతుంది. దీపం వెలిగించి చీకటికి నీవు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు, పొమ్మని. దీపం వెలిగించగానే తనంతట తానే, ఆటోమెటిక్‌గా చీకటి తొలగిపోతుంది. ఇదే విధంగా దురాశను తొలగిస్తే ఆటోమెటిక్‌గా దరిద్రం తొలగిపోతుంది. దురాశ తొలగాలి అని అంటే ప్రేమను మీలో ఉద్భవించనీయాలి. మీరు మీ పట్ల మరియు అందరి పట్లా ప్రేమగా ప్రవర్తిస్తూ ఉంటే దురాశ పూర్తిగా, శాశ్వతంగా తొలగి పోతుంది.

దురాశ అంటే "అందినంత మేరకు అంతా తనకే దక్కాలి, తానే అనుభవించాలి" అనే గుణం. "ఎవరికీ దక్కకుండా తన దగ్గరే దాచుకునే" గుణం. పిసినారి గుణం. ఇదే గుణం తన పట్ల కూడా పని చేసి తనకు ఏమీ దక్కకుండా చేసి దరిద్రంలో ఉంచుతుంది.

విశ్వ సూత్రం : "మనం కలిగి ఉన్న గుణాల(స్వభావాల) పర్యవసానాలనే మనం అనుభవిస్తాం" ! దురాశను కలిగి ఉంటే, దాని యొక్క పర్యవసానమైన దరిద్రాన్ని అనుభవించాల్సి వస్తుంది.

✪ మనిషికి ఆశ ఉండాలి. తప్పని సరిగా ఆశ అనేది ఉండాలి. ఆశ లేకుండా ఎప్పుడూ ఉండరాదు. ఆశ అనేదే జీవితానికి మూలం. ఆశయే జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. ఆశయే జీవాన్ని అందిస్తుంది. ఆశ అనేది ఒక మహా శక్తి. ఆశయే ఎన్నో గొప్ప, గొప్ప కార్యాలు జరగడానికి కారణం అవుతుంది.

అయితే ఈ "ఆశ" సరి అయిన విధంగా ఉండాలి. ఆశకు దుష్టమైనది, హానికారకమైనది, కీడు చేసే గుణాన్ని కలపకూడదు. అతిని కలిపి అత్యాశ చేయకూడదు. దుష్టమైనది కలిపితే, స్వార్థం కలిపితే "దురాశ" అవుతుంది. అగడుబోతుతనం, యావ కలిపితే "అత్యాశ" అవుతుంది. ఈ రెండూ ప్రమాదమే !

ఆశకు ప్రేమను, మైత్రిని, నిస్వార్థ సేవా భావాన్ని, సర్వ ప్రయోజన భావాన్ని, సర్వ శ్రేయస్కర భావాన్ని, సర్వానంద భావాన్ని, సదభిప్రాయాన్ని, సదుద్దేశాన్ని, సదవగాహనను కలపాలి. ఇప్పుడు ఇది సరి అయిన "ఆశ" !

లోపల ఉన్న దురాశను తీసి వేయాలంటే పైన చెప్పిన ప్రేమ గుణాలతో నిస్వార్థ సేవ చేయాలి. దరిద్రానికి మరొక కారణం "మదం" ! ఈ మదం అణగడానికే దరిద్రాన్ని అనుభవించాల్సి వస్తుంది.

మీరు దరిద్రం అనుభవిస్తున్నారూ అంటే దురాశ + మదం అనే గుణాలను కలిగి ఉన్నారనే అర్థం. ఇవి ఎంత ఎక్కువగా ఉంటే దరిద్రం అంత ఎక్కువగా ఉంటుంది. ఇవి ఎంత తక్కువగా ఉంటే దరిద్రం అంత తక్కువగా ఉంటుంది.

దరిద్రాన్ని తీసివేయాలి అంటే దురాశ + మదం అనే గుణాలను తీసి వేయాలి. మరి ఈ గుణాలను తీసివేయాలంటే ప్రేమ గుణాలతో, నిస్వార్థంగా సేవ చేయాలి. అవసరం ఉన్న వారికి చేయగలిగినంత సహాయం చేస్తూ ఉండాలి. మీరు ఏం చేస్తే అంతకు వెయ్యి రెట్లు పొందుతారు. మీరేం ఇస్తే దాన్నే మీరు 1,000 రెట్లుగా పొందుతారు అనేది ఒక మహా విశ్వ నియమం, ఒక విశ్వ సూత్రం. అంతే కానీ ఇచ్చే ప్రతీ దానికి లెక్కలు వేసుకుంటూ బేరీజు వేసుకుంటూ ఇస్తూ ఉంటే దాన్ని ఇవ్వడం అని అనరు, అప్పుడు దాన్ని వ్యాపారం అని అంటారు. ఇలా లెక్కలు వేసే వెధవలను ఇద్దరిని చూసాను నా జీవితంలో, డొనేషన్‌ల పేరుతో లెక్కలు వేసుకుని ఇన్వెస్ట్ చేసి ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఆధ్యాత్మికతకు పూర్తిగా, శాశ్వతంగా దూరమై నరకం అనుభవిస్తున్నారు. వీరికి మళ్ళీ సత్యమార్గం యొక్క అవకాశం రావడానికి బహుశా కనీసం ఒక 1,000 జన్మలు ఈజీగా పడుతుంది. ఒకటి ఇస్తే 1,000 వస్తాయని లెక్కలేసి ఇస్తే ఒక్కటి కూడా రాదు. అలా చేయకూడదు.

మీకు దాహం వేసినప్పుడు మంచి నీళ్ళు ఎలా త్రాగుతారు ? మామూలుగా తాగేస్తారు. అంతే కానీ ఈ నీళ్ళతో నా దాహం తీరాలి, ఎన్ని గ్లాసుల నీళ్ళు త్రాగితే దాహం తీరుతుందోనని లెక్కలు వేసి త్రాగుతారా ? మీరేమీ ఆలోచించకుండా, మీ దాహానికి సరి పడా నీళ్ళు త్రాగితే ఆటొమెటిక్‌గా మీ దాహం తీరిపోతుంది. లెక్కలు వేసుకుంటూ ఉంటే మీ ద్యాస అంతా ఫలితం పైనే ఉంటుంది కానీ, మంచి నీళ్ళు మీ గొంతులో నుండి లోపలికి దిగుతూ మీకు కలిగించే సాంత్వనను, హాయిని, ఆనందాన్ని ఆస్వాదించే స్థితి మీకుండదు. మీరు మౌనంగా నీళ్ళు త్రాగండి, దాహం దానంతట అదే తీరుతుంది. సరిగ్గా ఇదే విధంగా మీరు ఏమీ ఆశించకుండా సేవ, దానం చేయండి ఫలితాలు వాటంతట అవే వస్తాయి. మీరు శారీరక సేవ చేస్తారా, బుద్ధి పరమైన సేవ చేస్తారా, లేక డబ్బులు సహాయం చేస్తారా అనేది మీ వీలును బట్టి మీరు చేయండి. ఎంత వీలైతే అంత సహాయం చేయండి. ఏ ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయాలి. ప్రేమతో, సహాయం చేసే సౌభాగ్యం దక్కినందుకు ఆనందిస్తూ చేయాలి.

మన దుర్గుణాల(అజ్ఞానం) పర్యవసానమే అనారోగ్యం + దరిద్రం !
మన సద్గుణాల(ఆత్మ విజ్ఞానం) పర్యవసానమే ఆరోగ్యం + ఐశ్వర్యం !
మన అజ్ఞానమే(దుర్గుణాలు) మన అనారోగ్యం + దరిద్రం !
మన ఆత్మ విజ్ఞానమే(సద్గుణాలు) మన ఆరోగ్యం + ఐశ్వర్యం !

సద్గుణాలు ఆత్మ విజ్ఞాన శాస్త్ర సూత్రాల యొక్క యథాతథ ఆచరణ ద్వారా మాత్రమే అలవడతాయి ! సద్గుణాలను కలిగి ఉండడం అంటే ఆత్మ విజ్ఞాన సూత్రాలను తెలుసుకుని ఆచరించడం. ఆత్మ విజ్ఞానం + ధ్యాన సాధనతో పాటు ప్రేమతో చేసే నిస్వార్థ సేవతో మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం + ఐశ్వర్యాన్ని శాశ్వతంగా పొందగలుగుతాము. సేవ చేస్తే వచ్చే ఫలితాల గురించి, "ఇవ్వడం" గురించి ముందు రాబోయే పేజీలలో వివరించాను. చదవండి. ప్రేమతో, నిస్వార్థ సేవ చేసి సులభంగా, శాశ్వతంగా ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొంది ఉత్సవం జరుపుకోండి.

మన జీవితంలో ఐశ్వర్యం లేకుండా చేస్తున్న ఆ 40 గుణాలను మరియు దురాశ, మదం అనే గుణాలను ఒక్క సారిగా, మొత్తానికి మొత్తం టోటల్‌గా, ఒకే సారి చాలా సులభంగా, సరళంగా, సురక్షితంగా, శీఘ్రంగా, శాశ్వతంగా ఎలా తీసి వేయవచ్చో "ఐశ్వర్య సాధన"లో వివరించాను. ఐశ్వర్య సాధనతో పాటు ప్రేమతో నిస్వార్థంగా సేవ చేస్తే చాలా చాలా ఈజీ !!

All The Very Best !

నిస్వార్థ సేవ & నిస్వార్థ దానం గురించి దరిద్రులకు అర్థం కాదు. భవిష్యత్‌లో దరిద్రాన్ని అనుభవించబోయే వారికి కూడా అర్థం కాదు. ఎవరి భవిష్యత్ అయితే దరిద్రంగా ఉందో వారికి నిస్వార్థ సేవ & నిస్వార్థ దానం గురించి అస్సలు అర్థం కాదు.

ఇలాంటి దరిద్రులు ఈ సూత్రాన్ని చదివి, విని, తెలుసుకుని ఫక్తు కమర్షియల్‌గా లెక్కలు వేసుకుని ఒకటిస్తే వేయి వస్తాయని ఒక్కటిచ్చి 1,000 కోసం ఎదురు చూస్తూ ఉంటారు ఇలాంటి దరిద్రపు వెధవలకు ఏమీ రాదు పైగా ఉన్నది కూడా ఊడ్చుకుపోతుంది.

లెక్కలేసుకుని చేసిన సేవ & దానం ఎలాంటి ఫలితాలనివ్వదు ! చేసి పూర్తిగా, శాశ్వతంగా మర్చిపోవాలి. ఇలా చేయలేని పక్షంలో చేయకూడదు. ఇది వ్యాపారం కాదు ఆధ్యాత్మికత !

5. ఐశ్వర్య సాధనకు సంబంధించిన విషయాలు

జీవితంలో ఐశ్వర్యం లేక పోవడానికి గల కారణాలను మీరు ఇంతకు ముందు అధ్యాయంలో తెలుసుకున్నారు. ఇప్పుడు సూటిగా, అసలు సిసలు విషయాన్ని తెలుసుకుందాం.

జీవితంలో ఐశ్వర్యం లేక పోవడానికి 40 కారణాలను మరియు దురాశ + మదం అంటే మొత్తం 42 కారణాలను మనం తెలుసుకున్నాం. వాస్తవానికి లోతుగా వివరిస్తే కొన్ని వందల కారణాలు ఉంటాయి. మిమ్మల్ని అయోమయానికి గురి చేయద్దని కేవలం 42 కారణాలనే తెలియజేసాను. ఈ 42 కారణాలు కానీ లేక ఇంకా ఇతర వందల కారణాలు కానీ ఎందుకు ఉంటాయంటే, ఒకే ఒక కారణం -

✪ మీ జీవితంలో ఐశ్వర్యం లేక పోవడానికి ప్రధాన కారణం మీరు ఐశ్వర్యానికి వ్యతిరేకంగా ఉన్నారు. ఐశ్వర్యాన్ని ఇష్టపడటం లేదు. అందుకే మీరు ఐశ్వర్యం అవసరం అని భావించటం లేదు. ఎవ్వడైనా ఐశ్వర్యాన్ని వద్దనుకుంటాడా అని ఆశ్చర్యపోకండి. మీలో ఉన్న సరికాని గుణాలు ఐశ్వర్యాన్ని వ్యతిరేకిస్తూ ఉంటాయి, ఆ సంగతి మీకు తెలియదు. మీరు బయట ఐశ్వర్యం కావాలనుకుంటారు, లోపల తిరస్కరిస్తూ ఉంటారు. ఇది ఎలా ఉంటుందంటే ఒక చేత్తో దగ్గరకు లాగడం.. ఇంకో చేత్తో దూరం నెట్టడం లాగా ఉంటుంది. ఈ ఊగులాటలోనే బతుకు ముగింపుకు వచ్చేస్తుంది.

మీ లోపల ఐశ్వర్యం "అవసరం" అని గనక మీరు భావిస్తే ఎన్ని వందల కారణాలైనా ఉండనీ గాక, అవన్నీ తక్షణమే శాశ్వతంగా తొలగి పోయి మీరు మరుక్షణమే ఐశ్వర్యవంతులైపోతారు. ఆశ్చర్యంగా ఉందా ! చాలా సింపుల్‌గా అనిపిస్తుందా ?! ఐశ్వర్యాన్ని అవసరం అని మీరు మీ లోపల భావించాలంటే మీకు ఎంతో అత్యున్నత ఆత్మ విజ్ఞానం యొక్క అనుభవ పూర్వక అవగాహన ఉండాలి & మీరు ఎంతో కొంత ఇచ్చి ఉండాలి. అప్పుడు మాత్రమే మీరు మీ లోపల నిజంగా ఐశ్వర్యం అవసరం అని అనకోగలరు, భావించగలరు. ఐశ్వర్యాన్ని అవసరం అని లోపల భావిస్తే ఐశ్వర్యం వచేస్తుంది... కానీ భావించాలి కదా ! ఇక్కడే ట్విస్ట్ ! కానీ సింపుల్ ! మూల కారణం చాలా గంభీరంగా ఉండాలనుకున్నారా ? అసలు సిసలు పరమ సత్యాలు చాలా సింపుల్‌గానే ఉంటాయండి.

నాకు ఐశ్వర్యం అవసరం అని అనుకోగానే ఐశ్వర్యం వచ్చేస్తుందా ? ఇంత సులభమా ?! అని ఆశ్చర్యపోకండి. సత్యం ఎప్పుడూ సులభంగానే, సరళంగానే, సింపుల్‌గానే ఉంటుంది.

ఏమిటీ ?! కేవలం "అవసరం" అని భావించినంత మాత్రాన ఐశ్వర్యం వచ్చేస్తుందా ?! అని ఆశ్చర్యపోతున్నారా ? "అవసరం" అంటే ఏమిటో మీకు తెలిస్తే ఆశ్చర్యపోరు. గౌరవంతో మౌనంగా ఉంటారు.

✪ అవసరం అనేది అనంత శక్తి !
✪ అత్యవసరం అనేది అనంతానంత శక్తి !!

మీ లోపల అవసరం అనేది గనక మీరు సృష్టించుకుంటే, మీ చేత సృష్టించబడిన ఆ యొక్క "అవసరం అనే అనంత శక్తి" మీకు అవగాహనను ఇచ్చి, మీకు అర్హతను ఇచ్చి, అన్ని సహాయ సహకార సమన్వయాలను ఆకర్షించి మీ కోరికను నెరవేరుస్తుంది. కోరిక అనేది బీజం. అవసరం అనేది ఫలం. కోరిక అవసరంగా మారినప్పుడే అది తీరుతుంది. "అవసరాలు తప్పని సరిగా తీర్చబడతాయి - Needs will be definitely fulfilled" అనే విశ్వ సూత్రం గురించి మీరు వినలేదా ? "అత్యవసరం అనేది అనంతానంత శక్తి" ! "మీరు గనక అత్యవసరాన్ని సృష్టించుకుంటే ఈ క్షణమే దైవత్వాన్ని పొందుతారు" ! అత్యవసరం అని భావించిన మరుక్షణం దైవత్వాన్ని పొందడమంటే అది ఎంత పెద్ద సంభవమో ఒక సారి ఆలోచించండి. అత్యవసరం అనేది ఎంతటి అనంతానంత శక్తియో ఆలోచించండి.✪ కోరుకున్న కోరిక పూర్ణం అవడాన్నే అవసరం అని అంటారు. అవసరం ఒక్క క్షణమైనా ఆగలేనప్పుడు దాన్ని అత్యవసరం అని అంటారు.

✪ అవసరాలు మరుక్షణమే తీర్చబడతాయి !

✪ అత్యవసరాలు తక్షణమే తీర్చబడతాయి !!

మీరు దేనినైతే "అవసరం" అని లోపల 100%గా భావిస్తారో దానికి సంబంధించిన అవగాహన, శక్తి సామర్థ్యాలు, అర్హత మొదలైనవన్నీ మరుక్షణమే మీలో ఉద్భవించి "దాన్ని" తీరేలా చేస్తాయి.

మీరు దేనినైతే "అత్యవసరం" అని లోపల 100%గా భావిస్తారో దానికి సంబంధించిన అవగాహన, శక్తి సామర్థ్యాలు, అర్హత మొదలైనవన్నీ తక్షణమే మీలో ఉద్భవించి "దాన్ని" పొందేలా చేస్తాయి.

ఏదో ఊరికే అవసరం, అత్యవసరం అని అనుకుంటే సరిపోదు. మీ లోపల మీరు 100%గా భావించాలి అప్పుడే అది సంభవిస్తుంది. 100%గా భావించడం ఎలా అని అంటే శ్రద్ధగా రోజూ సాధన చేస్తూ ఉంటే త్వరలోనే 100%గా భావించగలుగుతారు.

ఐశ్వర్యం ఒక్కటే కోరుకుంటే సరి పోదు కదా ! అది అనుభవించి ఎంజాయ్ చేయడానికి మీరు జీవించి ఉండాలి కదా, ఆరోగ్యం కూడా ఉండాలి కదా ! వచ్చిన ఐశ్వర్యం సద్వినియోగం కావాలంటే మీరు చేసే పనులు విజయవంతం అవుతూ ఉండాలి. దానికి జ్ఞానం అవసరం. భౌతిక మాయలోనే చిక్కుబడి పోకుండా మీరు మోక్షాన్ని కూడా పొందాలి కదా ! కాబట్టి ఐశ్వర్యంతో బాటు అన్నీ రావాలి అప్పుడే సార్థకత !

సాధారణంగా అందరూ అనుకునే విషయం ఏమిటంటే, ఐశ్వర్యం పొందడానికి ఏమేమో చేయాలీ అని. ఇది పూర్తిగా అసత్యం. ఐశ్వర్యాన్ని పొందాలంటే ఏమేమో చేయాల్సిన అవసరం లేదు గాక లేనే లేదు ! కేవలం మీరు ఐశ్వర్యాన్ని అవసరంగా భావించాలి అంతే ! మీరు ఐశ్వర్యవంతులై పోతారు.

మీ నమ్మకాలను అనుసరించి మీకు డబ్బు అందుతూ ఉంటుంది. నేను ఏదో ఒక వృత్తియో, ఉద్యోగమో, వ్యాపారమో చేస్తేనే నాకు డబ్బు వస్తుంది అని మీరు నమ్ముతూ ఉంటారు కాబట్టి మీ నమ్మకాన్ని అనుసరించి మీకు డబ్బు అందుతూ ఉంటుంది.

మీరెలా జీవించాలని నిర్ణయించుకుంటారో అలా మీ జీవితంలోకి డబ్బు + ఇతర అవసరమైన సౌకర్యాలు సమకూర్చబడతాయి. మరి, ఏమీ చేయాల్సిన అవసరం లేదా అని అంటే - "జీవిస్తున్నారు కదా మీరు ! జీవించడమే ఒక పెద్ద పని ! జీవించడానికి సృష్టిలో ఏ షరతులూ లేవు. ఎలా జీవించాలని అనుకుంటావో అది నీ ఇష్టం". ఉదాహరణకు నేను ప్రపంచమంతా తిరుగుతూ ఆనందంగా జీవిస్తాను అని నిర్ణయించుకుంటే, మీ నిర్ణయానికి అనుగుణమైన సౌకర్యాలన్నీ సృష్టి ద్వారా సమకూర్చ బడతాయి. నేను ఏదో ఒక వ్యాపారమో లేక ఇంకా ఎదైనా చేస్తేనే కానీ నాకు డబ్బులు రావు అని మీరు నమ్ముతూ ఉంటే అదే ప్రకారంగా జరుగుతుంది.

ఏదో ఒక గొడ్డు చాకిరి చేస్తూ, అర్థం లేని శాసనాలలో ఇరుక్కుని బ్రతకడానికి రాలేదు మనం భూమి మీదకి ! మనలో ఉన్న అనంతమైన ఆత్మశక్తిని వినియోగించుకోవడం ఎలా అని తెలుసుకోడానికి వచ్చాం ! ఆత్మ శక్తిని అనేక రకాలుగా ప్రయోగించి, దాని పని తీరును తెలుసుకోడానికి వచ్చిన ఆత్మ విజ్ఞాన శాస్త్రవేత్తలం - Cosmic Scientists మనం !

మీకు ఏం కావాలో అది కోరుకోండి, అది అందుతుంది. దాన్ని అనుభవించండి అంతే ! ఈ అనుభవ జ్ఞానం కోసమే భూమి మీదకి వచ్చాం.

మీరు కోరుకున్న కోరికకు పూర్తి అనుగుణంగా మీ "నమ్మకాలను" మార్చుకోవాలి. ఇదే అత్యంత కీలకమైన విషయం. మీ కోరికకు అనుగుణంగా మీ "నమ్మకాలు" మారిన వెంటనే మీ కోరిక నెరవేరుతుంది. కోరికకు లేదా లక్ష్యానికి అనుగుణంగా "నమ్మకాలను" మార్చుకోవడం ఎలా అంటే "నా కోరికకు అనుగుణంగా నా "నమ్మకాలు" సంపూర్ణంగా మారడానికి అనుమతించాను" అని గాఢంగా భావించాలి - ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మొత్తం చదివి, ఇందులో తెలియజేసిన విషయాలను బాగా అవగాహన చేసుకోండి. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలో తెలియజేసిన సూత్రాలను ఆచరిస్తూ ఉండండి. ఆ తర్వాత ఈ క్రింద తెలుపబడిన సాధనను క్రమం తప్పకుండా చేయండి. మీకే అర్థం అయిపోతుంది. మీ కోరికలు లేదా లక్ష్యాలు సులభంగా, శీఘ్రంగా నెరవేరిపోతాయి.

ప్రతి ఒక్కరూ అనంతమైన "ఆత్మనిధిని" + "ఆత్మశక్తిని" కలిగి ఉంటారు. మీ కోరికలు లేదా లక్ష్యాలు నెరవేరడానికి అవసరమైన "ఆత్మనిధిని + ఆత్మశక్తిని" రిలీజ్ చేస్తే చాలు వెంటనే మీ కోరికలు లేదా లక్ష్యాలు నెరవేరుతాయి.

✪✪✪ నీ యొక్క "ఆత్మనిధిని" కొంచెం రిలీజ్ చేసినా చాలు, అది కొన్ని వేల కోట్ల రూపాయలుగా పరిణమించి తక్షణమే నీకు అందుతుంది. నీకున్న "ఆత్మశక్తిని" కొంచెం రిలీజ్ చేస్తే అది నీకు మహా ఆరోగ్యంగా, సహాయ సహకార సమన్వయాలుగా, రక్షణగా, నీకు సహాయం చేసే వ్యక్తులుగా + నీ కోరికలను లేదా నీ లక్ష్యాలను సులభంగా,శీఘ్రంగా నెరవేర్చే విధమైన అంతర్ బాహ్య పరిస్థితులుగా + నీ కోరికలను లేదా లక్ష్యాలను సక్సెస్‌ఫుల్‌గా హాండిల్ చేయగలిగే శక్తి సామర్థ్యాలుగా, అవగాహనగా నీకు అందుతుంది !

✪✪✪ మీ కోరికలను లేక లక్ష్యాలను తలుచుకోండి - "నా కోరిక తక్షణమే భౌతికంగా నెరవేరడానికి అవసరం అయ్యే "ఆత్మనిధిని + ఆత్మశక్తిని" సంపూర్ణంగా ఈ క్షణమే రిలీజ్ చేసాను అని అనుకోండి" ! గాఢంగా భావించండి. అంతే ! మీ కోరికలు లేక లక్ష్యాలు నెరవేరి తీరుతాయి.

అయితే ఏదైనా పొందాలంటే, ఏదైనా ఇస్తూ పోవాలి. ఇస్తూ ఉంటేనే పొందగలుగుతాం. ఇవ్వడాలలో అన్నింటి కన్నా ఉన్నతమైనది, శక్తి వంతమైనది ఆత్మ విజ్ఞానం. ఈ మార్గదర్శిలో నేను తెలియజేసిన ఆత్మ విజ్ఞాన పుస్తకాలను కొని ఎవరికైనా ఉచితంగా ఇవ్వండి. మీరు ఇస్తేనే పొందగలుగుతారు. ఇవ్వడం గురించి, దాని ఫలితాల గురించి ఈ మార్గదర్శిలోనే "నవ రత్నాలు" అనే అధ్యాయంలో "సేవా సాధన" అనే టాపిక్‌లో వివరించాను. చదవండి.

❖ ❖ ❖

6. ఐశ్వర్య సాధన

మీ లోపల మీరే, మీ ఐశ్వర్యాన్ని వ్యతిరేకిస్తున్నారనే సత్యాన్ని మీరు ఒప్పుకుని తీరాలి. ప్రస్తుతం మీరు ఐశ్వర్యాన్ని కలిగిలేరు అని అంటే మీరు ఐశ్వర్యాన్ని వ్యతిరేకిస్తున్నారనే దానికి అదే నిరూపణ ! సాక్ష్యం ! ఇంకా వేరే ఋజువులు ఏమీ అవసరం లేదు.

దేనినైనా మనం వ్యతిరేకిస్తూ ఉన్నప్పుడే అది మన దగ్గర ఉండదు. దాన్ని మనం కలిగి ఉండం ! - ఒక విశ్వ సూత్రం

మీ జీవితంలో ఐశ్వర్యం లేక పోవడానికి ప్రధాన కారణం మీరు మీ లోపల ఐశ్వర్యానికి వ్యతిరేకంగా ఉన్నారు. ఐశ్వర్యాన్ని ఇష్టపడటం లేదు. అందుకే మీరు ఐశ్వర్యం అవసరం అని భావించటం లేదు. అందుకే మీరు ప్రస్తుతం ఐశ్వర్యాన్ని కలిగి లేరన్న సత్యాన్ని గ్రహించండి. ఆ తర్వాత...

....ఇప్పుడు మీరు ఈ ఐశ్వర్య సాధన ద్వారా

ఐశ్వర్యాన్ని ఇష్టపడుతూ,

ఐశ్వర్యాన్ని ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తూ,

ఐశ్వర్యాన్ని శాశ్వతంగా పొందబోతున్నారని నిశ్చయించుకోండి.

సాధన చేసే ముందు మీకు వీలైతే.....

1. గదిని పూర్తిగా శుభ్రం చేయండి.

2. శబ్దాలు రాకుండా కిటికీలు, తలుపులు వేసుకోండి.

3. గదిని పూర్తిగా చీకటిగా చేసుకోండి.

4. ధ్యానానికి ప్రత్యేకించి తయారు చేయబడిన సంగీతం పెట్టుకోండి.

5. చక్కటి సువాసనలను ఇచ్చే అగరుబత్తీలను వెలిగించుకోండి.

6. సెల్‌ఫోన్ సైలెంట్‌లో పెట్టుకోండి.

7. ఇంకేవైనా మీకు నచ్చినవి & అవసరమైనవి చేసుకోండి.....

పైన చెప్పినవి మీకు వీలైతేనే చేసుకోండి. లేక పోతే లేదు. పై వాటికి ధ్యాన ఫలితాలకు సంబంధం లేదు. అవి కేవలం సాధన ప్రారంభ దశలో ఉన్నవారి సౌకర్యం కోసం మాత్రమే. అంతే !

క్రింద కానీ, గోడకు ఆనుకుని కానీ, కుర్చీలో కానీ, సోఫాలో కానీ, మంచం పైన కానీ కూర్చోవచ్చు. ఎక్కడ మీకు సౌకర్యంగా ఉంటే అక్కడ, ఎలా మీకు అనుకూలంగా ఉంటే అలా కూర్చోవాలి. సౌకర్యంగా కూర్చోవాలి. మెడ, వెన్నెముక నిఠారుగా పెట్టి, శరీరాన్ని బిగపట్టి కూర్చోకూడదు. మీ శరీరం ఎంత అనుకూలిస్తే అంతగా, ఆ విధంగా కూర్చోండి. క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉంటే, ఆటోమెటిక్‌గా మెడ, వెన్నెముక నిఠారుగా అయిపోతాయి. శరీరాన్ని పూర్తిగా వదిలి వేయండి. రిలాక్స్‌గా శరీరాన్ని వదిలేయాలి. శరీరంలో ఏ భాగం కూడా బిగపట్టి ఉండరాదు. తర్వాత కళ్ళు రెండూ మూసుకుని హాయిగా కూర్చోవాలి. మీరు పూర్తిగా సుఖంగా, సౌకర్యంగా, స్థిరంగా ఎక్కువ సేపు కూర్చునే విధంగా కూర్చోవాలి. మీరు పడుకున్నా ఫరవాలేదు ! పడుకుని కూడా సాధన చేసుకోవచ్చు !

ఏ దేవతా స్వరూపాన్ని ఊహించరాదు. వేరే జపం, స్మరణ ఏదీ కూడా చేయకూడదు. హాయిగా కూర్చుని కళ్ళు మూసుకుని ఉన్న మీరు - మీ నుదుటి మధ్య భాగంలో మీ దృష్టిని నిలిపి వచ్చే పేజీలలో నేను ఇచ్చిన నాలుగు (4) ఐశ్వర్య సాధనా సూత్రాలను ఎరుకతో, అవగాహనతో, విశ్వాసంతో, భావనాత్మకంగా, గాఢంగా అనుకోవాలి. ఫీలవ్వాలి. బయటికి అనుకున్నా పర్వాలేదు, లోపల అనుకున్నా పర్వాలేదు. మీ వీలును బట్టి ఏదో ఒక సమయంలో సాధన చేసుకోండి. కూర్చుని లేదా పడుకుని సాధన చేసుకోవచ్చు.

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

ఐశ్వర్య సాధనా సూత్రాలు

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

1. క్షమ ప్రేమ ఎరుక సరైన పూర్తి అవగాహన

కనీసం 10 రోజులు - రోజుకు ఒక గంట లేదా ఎక్కువ చేయండి.

మీకు వీలైన ఏదో ఒక సమయంలో చేసుకోండి.

వివరణ : అంటే, మిమ్మల్ని మీరు, అందరిని, అంతటిని, అన్నింటినీ - నిజంగా, పూర్తిగా క్షమించారనీ, మీ పట్ల మీరు నిజంగా, సంపూర్ణమైన ప్రేమను, ఎరుకను మరియు సరైన అవగాహనను కలిగి ఉన్నారనీ అర్థం. అయితే మీరు నిజంగానే మిమ్మల్ని మీరు, అందరిని, అంతటిని, అన్నింటినీ పూర్తిగా క్షమించాలి. ఇది తప్పని సరి. ఈ సూత్రాన్ని సాధన చేయడం వలన, మీలో ఉన్న క్షమ ప్రేమ ఎరుక సరైన అవగాహనలు ఉత్తేజితమై, ప్రవృద్ధమై, అలా పెరుగుతూనే ఉంటాయి. దీని వలన మీ పట్ల మీరు విధించుకున్న కట్టడులు,

శాసనాలు, శాపాలు మొదలైనవన్నీ, మీకు తెలిసినవి, మీకు తెలియకుండా గుప్తంగా ఉన్నవి కూడా అన్నీ నిజంగా, పూర్తిగా, సురక్షితంగా, తక్షణమే పూర్తిగా, శాశ్వతంగా తొలగిపోతాయి. మీ పట్ల, మీ దేహం పట్ల మరియు మీ జీవితం పట్ల ఉన్న వ్యతిరేకతలు - మీకు తెలిసినవి, తెలియనివి అన్నీ కూడా నిజంగా, సురక్షితంగా, తక్షణమే శాశ్వతంగా తొలగిపోతాయి. దీని వలన మీలో ఉన్న "ఐశ్వర్యం" రక రకాలుగా భౌతిక రూపం ధరించి మీ ఆనందానుభవంలోకి రావడానికి, మార్గాలన్నీ తెరుచుకుని, శాశ్వత రీతిలో అందుబాటులోకి వచ్చేస్తాయి.

ఇంకా ఈ మొదటి సూత్రం ఏ విధంగా పని చేస్తుంది అని అంటే.... మీరు చదివిన చదువో, మీ ప్రతిభా పాటవాలో, మీ తెలివి తేటలో, మీ టాలెంటో, మీ డిగ్రీలో, మీ పట్టాలో, మీ మెడల్సో, మీ పాండిత్యమో, మీ అవార్డులో, మీ బిరుదులో, మీరు చేసే ఉద్యోగమో, మీ వృత్తియో, మీ వ్యాపారమో, మీ స్థిర చరాస్తులో, మీ జీవిత భాగస్వామియో, మీ తల్లో, మీ తండ్రో, మీ సంతానమో, మీ కుటుంబ సభ్యులో, మీ బంధు మిత్రులో, ఆస్థిపరుల అండదండలో, మీ బ్యాంక్ బ్యాలన్స్‌లో, మీ ఫిక్స్‌డ్ డిపాజిట్లో, మీ పెట్టుబడులో, మీ వంశమో, మీ జాతో, మీ మతమో, మీ కులమో, మీ గోత్రమో, మీ ఆచార వ్యవహారాలో, మీ సంప్రదాయ సంస్కారాలో, మీ సంస్కృతో ఇవేవి కూడా ఇంకా మరేవైనా కూడా ఇతర వేరేవి ఏవీ కూడా మీకు.....

.....జీవితాన్ని ఇవ్వవు ! రక్షణ నివ్వవు !
ఆరోగ్య ఐశ్యర్యాలను ఇవ్వవు !
శ్రేయస్కరాలను మరియు ఆనందాలను ఇవ్వవు !
ఆశ్చర్యం వేస్తుందా !!! నమ్మబుద్ధి కావట్లేదా ??? వింతగా ఉందా !?!

ఈ విషయాలను చదివినప్పుడు మీకెంత నమ్మబుద్ధి కాకపోతే మీకంత ఆత్మ విజ్ఞానం తక్కువగా ఉన్నట్టు ! మీ కెంత ఇబ్బంది కలిగితే మీకంత అవగాహన తక్కువగా ఉన్నట్టు ! మీకెంత కోపం వస్తే అంత అనుభవం లేనట్టు ! మీకెంత ఉబ్బసం, ఆయాసం కలిగితే మీకంత అజ్ఞానం ఉన్నట్టు ! మీకెంత ఆవేశం, భయం కలిగితే మీకంత

మూర్ఖత్వం, జడత్వం ఉన్నట్టు ! ఓ సారి మిమ్మల్ని మీరు చెక్ చేసుకోండి. ఇలా ఏమీ జరగ కుండా... మీరు ఆనందంతో ఆశ్చర్యపోతే మీరు అవగాహనా పరులే ! మీకు అసలు విషయం అర్థం అయినట్టే ! మీరు విజేతలే !!

నిజం అప్పుడప్పుడు నిష్ఠూరంగానే ఉంటుంది మరి !

కాని ఏం చేస్తాం ? సత్యం చెప్పక తప్పదు కదా !

మీకు సర్వ కాల సర్వావస్థలలోనూ, సర్వ వేళలలోనూ సర్వ సకల సమస్త శుభ లాభాలను ఇచ్చేది - ఈ సర్వసృష్టిని పాలించే, పోషించే మీ లోపల ఉన్న ఆ " మహా మూల చైతన్యం - Ultra Consciousness" లేక దైవం - God or All That Is లేక మరేదైనా అనండి "ఆ యొక్క మహా మూల చైతన్యమే" మీకు అన్నీ ఇస్తుంది. అంటే ఆ "మహా మూల చైతన్యం" పట్ల మీరెలాంటి భావాన్ని కలిగి ఉన్నారో అన్న విషయం పైననే మొత్తం అంతా ఆధారపడి ఉంది. ధ్యానం చేసి తెలుసుకోండి.

ఆ "మహా మూల చైతన్యమే" ! ఇంకా మరేమిటో కాదు మరియు వేరెవరో కాదు మీకు జీవితాన్ని ఇచ్చేది, ఆరోగ్య ఐశ్వర్యాలను ఇచ్చేది, శ్రేయస్కరాలను ఆనందాలను ఇచ్చేది, రక్షణనిచ్చేది, సర్వ సకల సమస్త శుభ లాభాలను ఇచ్చేది ! ఈ సర్వసృష్టిని పాలించే, పోషించే ఆ "మహా మూల చైతన్యం" పట్ల మీరెలాంటి భావాన్ని కలిగి ఉన్నారన్న దాని పైన మీ జీవితం, శ్రేయస్కరం, ఆనందం, రక్షణ, సర్వ సకల సమస్త శుభ లాభాలు మొదలైనవన్నీ ఆధారపడి ఉంటాయి.

మీరు "మహా మూల చైతన్యం" పట్ల సరైన అభిప్రాయం లేక సరైన భావం కలిగి ఉంటే అప్పుడు మీరు "మహా మూల చైతన్యంతో" సరైన సంబంధం కలిగి ఉన్నట్టు లెక్క ! మీరు కలిగి ఉన్న ఆ యొక్క "సరైన సంబంధమే" మీకు జీవితాన్ని + ఆరోగ్య ఐశ్వర్యాలను + రక్షణ + సర్వ సకల సమస్త శుభ లాభాలను ఇస్తుంది. మీరు మూల చైతన్యంతో "సరైన సంబంధం" ఎంత కలిగి ఉంటే అంత "మేలు" మీకు జరుగుతుంది. ఎంతైతే "సంబంధం సరిగా లేదో" అంతగా మీకు కష్ట నష్టాలు ఉంటాయి.

మీరు మహా మూల చైతన్యంతో కలిగి ఉన్న "సంబంధం" పైన మీ జన్మ ఆధారపడి ఉంటుంది. మీరు మహా మూల చైతన్యంతో కలిగి ఉన్న "సంబంధం" - మీ జీవిత భాగస్వామి నుండి, మీ తల్లిదండ్రుల నుండి, మీ సంతానం నుండి, మీ కుటుంబ సభ్యుల నుండి, మీ బంధు మిత్రుల నుండి, మీ చదువు పైన, మీ వృత్తి ఉద్యోగ వ్యాపారాల ద్వారా, మరియు మీ సంపాదన పట్ల

మరియు మీ యొక్క ప్రతి దాని పట్లా ప్రతిఫలిస్తూ ఉంటుంది - అది సరిగా ఉంటే సరిగా, చెడుగా ఉంటే చెడుగా !

మూల చైతన్యంతో మీకు ఉన్న సంబంధం మీ ఆత్మ విజ్ఞానం పైన ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే మీకు ఆత్మ విజ్ఞానం లేనప్పుడు అసలు "మహా మూల చైతన్యం" అనేది ఒకటి ఉందని తెలియనే తెలియదు కదా ! ఒక వేళ "మహా మూల చైతన్యం" అనేది ఒకటి ఉందని తెలిసినా అది మీ లోపలే మీరుగా మీరే అయి ఉందని తెలియక పోతే విషయం చాలా ఘోరంగా అఘోరిస్తుంది. ప్రస్తుతం భూమి పైన నెలకొని ఉన్న పరిస్థితులు ఇలా అఘోరించినవే కదా !

మీ లోపల ఉన్న మహా మూల చైతన్యమే మీరు ! మీరే మహా మూల చైతన్యం ! మీ ప్రతీది మహా మూల చైతన్యంతో కలిగి ఉన్న సంబంధం పైన ఆధారపడి ఉంటుంది అని అంటే, మీతో మీరు కలిగి ఉన్న సంబంధం పైన అన్ని విషయాలు ఆధారపడి ఉంటాయని అర్థం ! అంటే మీ పట్ల మీరు ఎలాంటి భావం కలిగి ఉంటే అలాంటి పరిస్థితులు మీ జీవితంలో ఉంటాయి. అంటే "యద్భావం తద్భవతి" అన్నమాట !

మొత్తానికి ఒకే ఒక అసలు విషయం ఏమిటంటే.....

"మీ పట్ల మీరు కలిగి ఉన్న భావాల యొక్క ప్రతిబింబాలే మీ శరీరంలోని మరియు మీ జీవితంలోని పరిస్థితులు" !

కాబట్టి మీరు మీ పట్ల సరైన, మంచి భావాలు కలిగి ఉన్నప్పుడే మీ శరీరం మరియు మీ జీవితంలోని పరిస్థితులు బాగా ఉంటాయి. కాబట్టి మీరు సరైన, మంచి గుణాలను తప్పని సరిగా కలిగి ఉండాలి.

ప్రేమే సర్వస్వం !

ప్రేమే సర్వస్వం అనే కాన్సెప్ట్‌ను గనక మీరు సరిగ్గా, సూటిగా, లోతుగా అర్థం చేసుకుంటే అసలు విషయం మీకు అవగాహనలోకి వచ్చినట్టే !

ఐశ్వర్యం అనేది ఈ భూమి పైన ఉన్న ప్రతీ
మనిషి యొక్క హక్కు ! మీ ఐశ్వర్యం మీ చేతుల్లోనే ఉంటుంది.
ఐశ్వర్యం పట్ల ఉన్న సరి కాని అభిప్రాయాలే
మీకు ఐశ్వర్యం లేకుండా చేస్తున్నాయి అని గ్రహించండి.

ప్రతీ ఒక్కరూ ఐశ్వర్యవంతులుగా విరాజిల్లాలి అనేది సృష్టి ఆశయాలలో ప్రధానమైనది. మనిషి, ఐశ్వర్యం ఈ రెండూ వేరు వేరు కావు. ఒక మనిషి తను ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ఐశ్వర్యవంతుడు కాగలడు.

మీ పట్ల మీకు ఉన్న ప్రేమే మహా ఆరోగ్యంగా, మహా ఐశ్వర్యంగా, శ్రేయస్కరాలుగా, ఆనందాలుగా, విజయాలుగా, శుభ లాభాలుగా ప్రకటమవుతూ ఉంటుంది. ప్రేమే సర్వస్వం ! మీ పట్ల మీకు ఉన్న ప్రేమే అన్ని శుభ లాభాలుగా మీ శరీరంలో + మీ జీవితంలో ప్రకటమవుతూ ఉంది. మీ పట్ల మీకు ఉన్న ద్వేషం మీ శరీరంలో + మీ జీవితంలో అనారోగ్యాలుగా, కష్ట నష్టాలుగా ప్రకటం అవుతూ ఉంది.

కాబట్టి మిమ్మల్ని మీరు ప్రేమించు కోవడం అనేది అత్యంత ఆవశ్యకం ! ఈ సత్యాన్ని మీరు గ్రహించియే తీరాలి ! అవగాహన చేసుకునియే తీరాలి ! మీ పట్ల మీరు ప్రేమను కలిగి ఉండాలంటే మొట్ట మొదట మీరు అకర్మ వీగన్‌లుగా అనగా అకర్మ శాకాహారులుగా మారాలి. అకర్మ వీగన్‌లుగా మారడం అంటే ఏదో గుడ్డిగా శాకాహారులుగా మారడం కాదు. లేక ఏదో ఒక శాకాహార కులంలో పుట్టినందు వలన యాంత్రికంగా శాకాహారులుగా ఉండటం కాదు. అకర్మ వీగన్‌లుగా ఎందుకు ఉండాలో అవగాహన కలిగి ఉండాలి. ఆ తర్వాత మాత్రమే మీ పట్ల మీరు ప్రేమను ప్రకటించుకోగలుగుతారు, అప్పుడు మాత్రమే అది వర్కవుటు అవుతుంది. ఎందుకంటే ప్రేమను కలిగి ఉన్న వారు గుడ్డు కాని, మాంసాహారం కాని జంతువుల నుండి వచ్చిన ఏదైనా కానీ(పాల,పెరుగు, వెన్న, నెయ్యి, జున్ను, మొదలిన పాల ఉత్పత్తులు, తేనె, పట్టు,వూల్, లెదర్ మొదలైనవి) తినలేరు, వాడలేరు. అసంభవం... తమను తాము ప్రేమ మూర్తులుగా చెప్పుకుంటూ వ్యవహరిస్తున్న వారు, ఎంతో మంది మాంసాహారులను చూసినప్పుడు నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. వీరు ఏ రకం మనుషులా అని !!

✪ ✪ అత్యంత ముఖ్య విషయం ✪✪

ప్రేమగా ఉండాలి అని అంటే ఎలాంటి ప్రేమ ? మనల్ని ప్రేమించే వారిని మనం ప్రేమిస్తాం. ఇది సరే ! కాని మనల్ని ద్వేషించే వారిని కూడా మనం ప్రేమతో ఆశీర్వదించ గలగాలి. మనల్ని అకారణంగా నిందించే వారిని కూడా మనం ప్రేమతో ఆశీర్వదించ గలగాలి. మనకు హాని, నష్టం చేసిన వారిని కూడా మనం ప్రేమతో ఆశీర్వదించ గలగాలి. మన గురించి దుష్ప్రచారం చేసిన, చేస్తున్న వారిని కూడా మనం ప్రేమతో ఆశీర్వదించ గలగాలి. ఇక్కడ ఆశీర్వదించడం అంటే వారి దగ్గరికి పోయి, వారి నెత్తి మీద చేయి పెట్టి ఆశీర్వదించమని కాదు, మీ మనసులో వారిని తలుచుకుని కొంచెమైనా కోపం కాని, ద్వేషం కాని తలెత్తకుండా చూసుకుంటూ వారికి మంచి జరగాలి అని

ప్రేమగా ఆశీర్వదించాలి. మనకు కీడు చేసిన వారిని ఒక్క సారి తలుచుకుని వారికి ప్రేమను ప్రకటిస్తే సరిపోతుంది. మనకు సరిపడని వాళ్ళను పదే పదే తలుచుకోనవసరం లేదు. ఎప్పుడైనా సరిపడని వారు గుర్తుకు వచ్చినప్పుడు వారికి ప్రేమ, ప్రేమ అంటూ ప్రేమను ప్రకటించి మన ధ్యాసను వాళ్ళ మీది నుండి మళ్ళించాలి. మన పట్ల ఎవరు ఎలాంటి భావాలు కలిగి ఉన్నా సరే ! మనం మాత్రం అందరి పట్లా ప్రేమను కలిగి ఉండాలి. అప్పుడు మనకంతా మంచే జరుగుతూ ఉంటుంది.

గుర్తుంచుకోండి.....

మన పట్ల సరైన భావం కలిగి లేని వారి పట్ల కూడా మనం ప్రేమను ప్రకటించ కలిగినప్పుడే..... అదే నిజమైన ప్రేమ ! మనకు ఏదో మేలు చేసిన, చేస్తున్న వారి పట్ల మనం చూపించేది ప్రేమ కాదు. దాన్ని "ధన్యవాద భావం" అని అంటారు. ప్రేమ అంటే ఏమీ ఆశించనిదీ, బేషరతుగా ప్రకటించేదీ అయిన మహా దివ్య భావం !

మీకు పడని వారిని, మీకు నచ్చని వారిని, మీకు హాని చేసిన వారిని, మిమ్మల్ని మోసం చేసిన వారిని, మిమ్మల్ని ఏడిపించిన వారిని, మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారిని, మిమ్మల్ని అవమానించిన వారిని, మిమ్మల్ని నిందించిన వారిని, మిమ్మల్ని దూషించిన వారిని, మీకు నష్టం కలిగించిన వారిని, మిమ్మల్ని వాడుకుని మిమ్మల్నే బూతులు తిట్టిన వారిని, మీ మీద జులుం చేసిన వారిని, మీ మీద అధికారం చెలాయించి మిమ్మల్ని బానిసలుగా చేసి మీతో ఆడుకున్న వారిని, మీ నిస్సహాయతను ఆసరగా చేసుకుని మిమ్మల్ని పీడించిన వారిని... ఇలాంటి వారిని ఒక్క సారి గుర్తు చేసుకుని... వారిని పూర్తిగా క్షమించి, మీకు మంచి జరుగు గాక అని వారిని ప్రేమగా ఆశీర్వదించండి. ఇదే నిజమైన ప్రేమ ! ఇలాంటి వారిని మీరు నిజంగా, పూర్తిగా క్షమించి, ప్రేమతో ఆశీర్వదించ గలిగినప్పుడే మీది నిజమైన ప్రేమ అవుతుంది. నేను చెప్పేది ఈ ప్రేమ గురించే !

ఇలా చేసి చూడండి అద్భుతాలు జరిగి తీరుతాయి మీ శరీరంలో మరియు మీ జీవితంలో ! ఆశ్చర్య పోతారు మీరు ఆ యొక్క ఫలితాలను చూసి ! మీకున్న సర్వ, సకల, సమస్త సమస్యలన్నీ కూడా... అవి ఇవీ అని కాకుండా, ఏవైనా సరే అన్ని సమస్యలు విచిత్రంగా పరిష్కారం అవుతాయి. మెరుపులు మెరుస్తాయి మీ శరీరంలో + జీవితంలో ! దివ్య వెలుగులతో నిండి పోతుంది మీ శరీరం + జీవితం !

ఈ విధంగా చేసిన తర్వాత..... ఇప్పుడు.....మాత్రమే మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటే అది ఫలిస్తుంది.

మిమ్మల్ని మీరు గాఢంగా ప్రేమించు కోండి ! అప్పుడు సర్వ శుభాలు మీకు సంప్రాప్తిస్తాయి !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంతగా మీరు ఆరోగ్యంగా, ఐశ్వర్యంగా ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంతగా మీరు గొప్ప వారవుతారు, అంత ఉన్నతంగా మీరు పరిణమిస్తారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత గొప్ప విజేతలవుతారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత అత్యున్నతమైన శ్రేయస్కరాలు మీ స్వంతం అవుతాయి !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత మహాత్ములు అవుతారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంతంతగా మీరు కోరుకున్నవి మీకు దక్కుతూ ఉంటాయి. మరియు మీరు కోరుకున్న వారు మీకు దక్కి తీరుతారు

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత స్వచ్ఛంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత స్వేచ్ఛగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత సాధికారతతో విరాజిల్లుతారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత భుక్తి మయంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత యుక్తి మయంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత శక్తి మయంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత రక్తి మయంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత ముక్తి మయంగా మీరు ఉంటారు !

ఫైనల్‌గా అసలు విషయం ఏమిటంటే....

ప్రేమే సర్వస్వం !

ఈ మొదటి సూత్ర ప్రభావం మిమ్మల్ని మీరు పూర్తిగా క్షమించుకునేలా చేసి, మిమ్మల్ని మీరు గాఢంగా ప్రేమించుకునేలా చేసి మీ పట్ల మీకు పూర్తి ఎరుకను, అవగాహనను కలిగిస్తుంది.

2 వ సూత్రం :

ఆరోగ్య ఐశ్వర్యాలు చాలా మంచివి, దివ్యమైనవి

కనీసం 10 రోజులు - రోజుకు ఒక గంట చేయాలి

వివరణ : మొదటి సూత్రం వలన మీకున్న గండాలు, ఆపదలు తొలగి పోతాయి. అనారోగ్య మూలాలు కూడా తొలగిపోతాయి. ఇంకా చాలా చాలా క్లియర్ అవుతాయి. మీ ఊహలకందని ఎన్నో క్లియరెన్స్‌లు అవుతాయి.

ఆరోగ్యం లేని ఐశ్వర్యం ఎందుకు ? ముందు ఆరోగ్య సౌభాగ్యం ఆ తర్వాతే ఐశ్వర్యం. ఐశ్వర్యం అనుభవించడానికే కానీ దాచి ఉంచుకోవడానికి కాదు కదా, కాబట్టి ఐశ్వర్యంతో పాటు ఆరోగ్యాన్ని కూడా తప్పని సరిగా పొంది తీరాలి. కాబట్టి ఈ రెండవ సూత్రంలో ఐశ్వర్యంతో పాటు ఆరోగ్య సిద్ధి కూడా అవుతుంది. ఈ రెండవ సూత్ర సాధన వలన మీలో ఉన్న ఆరోగ్య వ్యతిరేకతలు, అనారోగ్య

మూలాలు మరియు ఐశ్వర్య వ్యతిరేకతలు అన్నీ పూర్తిగా, శాశ్వతంగా తొలగిపోతాయి. సంపూర్ణ ఆరోగ్యం మరియు మహా ఐశ్వర్యం మీలో ఉద్భవించడానికి ఏమేం కావాలో అవన్నీ మీలో ఆటొమెటిక్‌గా ఏర్పడతాయి.

3 వ సూత్రం :

ఆరోగ్య ఐశ్వర్యాలంటే నాకు పూర్తి ఇష్టం ప్రేమ ఎరుక ఆనందం గౌరవం

కనీసం 10 రోజులు - రోజుకు ఒక గంట చేయాలి

ఈ 3వ సూత్ర సాధన వలన మీలో ఉన్న ఆటంకాలు, అడ్డంకులు, బంధనాలు మొదలైనవన్నీ పూర్తిగా, శాశ్వతంగా క్లియర్ అవుతాయి. మీ ఆత్మ శక్తి రిలీజ్ అయి, మీలో సంపూర్ణ ఆరోగ్యం ఉద్భవించడానికి అవసరమైన మార్పులు జరుగుతాయి - మీకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఏదో తాత్కాలికంగా కాకుండా శాశ్వత రీతిలో ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఈ 3వ సూత్ర సాధన వలన మీకు ఆరోగ్యానికి శాశ్వత, అమర, అజేయ సంబంధం ఏర్పడుతుంది. ఎంతటి పెద్ద, జగ మొండి, దీర్ఘ కాలిక వ్యాధులైన నయమవుతాయని పరమాత్ములు చెప్తారు. చరిత్ర కూడా చెప్తోంది. ఇంకా ఈ 3వ సూత్ర సాధన వలన మీకు ఐశ్వర్యానికి ఒక అమోఘమైన, అద్భుతమైన, శాశ్వతమైన, అమరమైన, అజేయమైన, సుస్థిరమైన, మహా ఘనమైన సుసంబంధం ఏర్పడుతుంది. మీ ఆత్మ శక్తి రిలీజ్ అయి మీకు ఐశ్వర్యం సిద్ధించడానికి అవసరమైన అంతర్ బాహ్య పరిస్థితులు ఏర్పడతాయి. ఆరోగ్యం + ఐశ్వర్యం మీ ఇంటి పేరవుతుంది. మీలో నిరాశలు, నిస్పృహలు, నిస్తేజాలు పూర్తిగా, శాశ్వతంగా తొలగి పోతాయి. మీరు ఎల్లప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఉత్తేజంగా ఉంటారు. ఆర్థిక ఇబ్బంది అనే పదానికి మీ డిక్షనరిలో చోటు ఉండదు. మీ జీవితం సస్యశ్యామలం అవుతుంది !

4 వ సూత్రం :

అబ్బాయిలకు & పురుషులకు

నేను మహా ఆరోగ్యవంతుడిని, నేను మహా ఐశ్వర్యవంతుడిని

అమ్మాయిలకు & మహిళలకు

నేను మహా ఆరోగ్యవంతురాలిని,

నేను మహా ఐశ్వర్యవంతురాలిని !

ఈ 4 వ సూత్రం మీకు మహా ఆరోగ్యం & మహా ఐశ్వర్యం సిద్ధించేవరకు ఒక రోజుకు కనీసం ఒక గంట లేదా ఎక్కువ సేపు చేస్తూనే ఉండాలి. ఏదో ఒక సమయంలో, మీకు వీలైనప్పుడు కూర్చుని లేదా పడుకుని సాధన చేసుకోవచ్చు.

ఈ 4 వ సూత్ర సాధన వలన మీరు మహా ఆరోగ్యవంతులు & మహా ఐశ్వర్య వంతులవుతారు. మీ పరిస్థితి ఎలా ఉన్నా, ఎంత ఘోరంగా ఉన్నా పర్వాలేదు. మీరు మాత్రం, మిమ్మల్ని మీరు మహా ఆరోగ్యవంతులుగా & మహా ఐశ్వర్యవంతులుగానే భావిస్తూనే ఉండాలి. నా పరిస్థితి ఇంత ఘోరంగా ఉంటే నన్ను నేను ఆరోగ్యంగా, ఐశ్వర్య వంతుడిగా ఎలా భావించ గలను ?! అని ఆలోచించవద్దు. తర్కాన్ని పూర్తిగా వదిలి వేసి సంపూర్ణ విశ్వాసంతో సాధన చేయాలి.

మీరు క్రమం తప్పకుండా ఈ సాధన చేస్తూ ఉన్నప్పుడు - మీ లోపల ఉన్న ఐశ్వర్య వ్యతిరేక కారణాలు ఎన్ని ఉన్నాయో అవి అన్నీ వాటంతట అవే బయటపడి క్లియర్ అయిపోతూ ఉంటాయి. అవి వెళ్ళి పోయే ముందు మీకు కనపడడమో, వినపడడమో లేక అర్థం కావడమో జరుగుతుంది. కొన్ని మీకు కనపడకుండా, వినపడకుండా, అర్థం కాకుండా క్లియర్ అయిపోతాయి.

సాధన చేస్తూన్నప్పుడు ఏం వినపడితే దానిని వినాలి, ఏం కనబడితే దాన్ని చూడాలి. అంతర్ ప్రకృతిని ప్రవహించనివ్వాలి. లోపల ఎన్నెన్నో జరుగుతాయి, ఎలాంటి ప్రతి స్పందన చేయకూడదు. శబ్దాలు, మాటలు, నవ్వులు మొదలైనవి వినిపించే అవకాశం ఉంది. దృశ్యాలు ఏవైనా కనపడే అవకాశం ఉంది. ఏమీ కాదు, భయపడాల్సిన పని లేదు. అంతా శ్రేయస్కరంగా జరుగుతుంది. సాధనలో ఇవన్నీ మామూలే, మీరు మాత్రం ఎలాంటి ప్రతి స్పందన చేయకుండా సాక్షిగా ఉండాలి. ప్రేమ ఎరుక సాక్షి అంతే ! ఈ ప్రేమ ఎరుక సాక్షి భావనలే ఆ మూలాన్ని తీసేస్తాయి, సరి చేస్తాయి. ఇది సహజంగా జరిగే సృష్టి విధి విధానం అంతే !

ఈ విధంగా క్రమం తప్పని సాధన మీరు చేస్తూ ఉంటే మీ లోపల ఉన్న ఐశ్వర్య వ్యతిరేకతలన్నీ క్లియర్ అయిపోయి కేవలం కొద్ది రోజుల్లోనే మీ జీవితం ఐశ్వర్యంతో నిండిపోతుంది. మీరు ఐశ్వర్యవంతులై పోతారు. ఎలా అవుతారు అనే ప్రశ్నను పుట్టనివ్వకండి. ఎలాగోలా అయిపోతారు అంతే ! ఎలా ఐశ్వర్యం వస్తుంది ? అనే ప్రశ్న మీలో పుడుతుంది అని అంటే అది ఐశ్వర్య వ్యతిరేక భావనల్లోంచే పుడుతుందనే సత్యాన్ని మీరు గ్రహించాలి. మీరు ఐశ్వర్యాన్ని నిజంగా అనుమతించినప్పుడు "ఎలా" అనే ప్రశ్నలే పుట్టవు అని తెలుసుకోండి.

మీరు ఆరోగ్యవంతులయ్యేంత వరకు, మీ జీవితంలోకి ఐశ్వర్యం ప్రవేశించేంత వరకు అంటే మీరు ఐశ్వర్యవంతులయ్యేంత వరకు ఈ సాధన చేస్తూనే ఉండాలి. లోపల "ఐశ్వర్య వ్యతిరేక భావనలన్నీ తొలగిపోతే తక్షణమే మీ జీవితంలోకి ఎలాగోలా ఐశ్వర్యం ప్రవేశిస్తుంది. ఇంకా ప్రవేశించలేదంటే లోపల మొత్తం క్లియర్ కాలేదనే అర్థం ! కాబట్టి మీరు ఐశ్వర్యవంతులు అయ్యేంత వరకు ఈ సాధన ఆపకుండా చేస్తూనే ఉండాలి. సాధన చేసేటప్పుడు ఏవో కొన్ని క్లియర్ అయిపోయినట్టు కనిపిస్తూ ఉంటాయి. అంత మాత్రాన వెంటనే సాధన ఆపేయకూడదు. ప్రత్యక్షంగా, భౌతికంగా మీరు ఆరోగ్యవంతులుగా & ఐశ్వర్యవంతులుగా మారేంత వరకు ఈ సాధన ఆపకుండా చేస్తూనే ఉండాలి. చాలా మంది ఇక్కడే పొరపాటు చేస్తూ ఉంటారు. ఏవో కొన్ని క్లియర్ అయినట్టుగా కనబడగానే ఇక సాధన ఆపివేస్తారు. క్లియర్ అయిపోయాయి కదా ఇంకా ఐశ్వర్యం రావటం లేదేంటి ?! అని ఆశ్చర్యపోతూ ఆందోళనగా ఎదురుచూస్తూ ఉంటారు.

గుర్తుంచుకోండి - లోపల గనక మొత్తం క్లియర్ అయిపోతే దాని ప్రభావం బయట వెంటనే కనబడుతుంది. కాబట్టి మీకు ఆరోగ్యం & ఐశ్వర్యం సిద్ధించేంత వరకు సాధన ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపకూడదు. ఇది బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం.

మీ లోపల అన్ని రకాల సెట్టింగ్స్ జరగడం మొదలవుతుంది. సరి అయ్యేవి సరి అవుతుంటాయి. క్లియర్ అయ్యేవి క్లియర్ అయిపోతూ ఉంటాయి. కొన్ని మీకు అర్థం అవుతాయి. కొన్ని మీకు అర్థం కావు. మీ సరి కాని గుణాలు(స్వభావాలు) సరి అవుతుంటాయి. తొలగి పోయేవి తొలగి పోతుంటాయి. మీ సరి కాని నమ్మకాలు సరి అవుతుంటాయి. లేదా తొలగి పోతుంటాయి. పునః సమైక్యతలు - Reunionలు జరుగుతూ ఉంటాయి. ఇంకా ఎన్నెన్నో జరిగి పోతూనే ఉంటాయి. మీరు కేవలం ధీమాగా, ఎరుకతో, సాక్షిగా చూస్తూ ఉండాలి. ఏ ప్రతిక్రియ చేయకుండా సాక్షిగా లోపల, "అంతర్ ప్రకృతిని" ప్రవహించనివ్వాలి. అంతా శ్రేయస్కరమే జరుగుతుంది. అంతా దివ్యంగానే జరుగుతుంది. మీరు సురక్షితంగానే ఉంటారు. మీ లక్ష్యం సిద్ధిస్తుంది.

ఇలా క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉండాలి. ఈ సాధన చేసిన తర్వాత మీరు ఇంకొక ముఖ్యమైన పని చేయాలి. అదేమిటంటే మీరు ఏమీ ఆశించకుండా ఏదో ఒక సేవ & ఎంతో కొంత నిస్వార్థ దానం చేస్తూ ఉండాలి. బాగా బలంగా గుర్తుంచుకోండి... ఏమీ ఆశించకుండా చేసి, ఇచ్చి పూర్తిగా, శాశ్వతంగా మర్చిపోవాలి లేదా విశ్వనియమాలు తిరగబడి నిలువునా నాశనం అయిపోతారు.

ఐశ్వర్య సాధన చేస్తూ ఉంటే మీకు చాలా గమ్మత్తైన పరిస్థితులు ఎదురవుతాయి. డబ్బులు విపరీతంగా ఖర్చు చేసే పరిస్థితులు ఎదురవుతుంటాయి. మీ ఆలోచనా ధోరణిలో గొప్ప మార్పు సంభవిస్తుంది. సాధనకు ముందు ఒకే ఒక్క రిస్ట్ వాచ్‌తో జన్మ మొత్తం గడిపేయాలనుకున్న మీరు, డ్రెస్‌కు సూట్ అయ్యే వాచ్‌లను కొనడం ప్రారంభిస్తారు. బూట్లు, చెప్పులు ఇంకా రక రకాలవన్నీ చాలా చాలా కొంటూ ఉంటారు. తక్కువ వాటితో సరి పెట్టుకోలేరు. ఖరీదైనవి కొంటుంటారు. విలాసవంతంగా జీవించడం ప్రారంభిస్తారు.

బాగా గుర్తుంచుకోండి - ఖర్చు పెట్టడం అనేది, ఐశ్వర్య సాధనలో ఒక భాగం. ఎందుకంటే ఐశ్వర్యవంతులే బాగా ఖర్చు పెడతారు. మీరు డబ్బులను ధారాళంగా ఖర్చు పెట్టడం ద్వారా, సృష్టికి ఏం తెలియజేస్తున్నారంటే - నేను మహా ఐశ్వర్యవంతుడిని అని. మీరు డబ్బులను ఖర్చు పెట్టే ప్రతీ సారీ, మీ మనసులో మిమ్మల్ని మీరు, మహా ఐశ్వర్యవంతులుగానే భావించండి. మిమ్మల్ని మీరు

మహా ఐశ్వర్యవంతులుగా భావిస్తూ డబ్బులను ఖర్చు పెట్టండి. నా దగ్గర చాలా చాలా డబ్బులున్నాయి అని భావిస్తూ, డబ్బులను ఖర్చు పెట్టండి. ఇలా చేసినప్పుడు, మీరు ఎంతెంత ఖర్చు పెడుతూ ఉంటే, మీకు అంతకు ఎన్నో రెట్లు డబ్బులు అందుతూనే ఉంటాయి. ఎలా అందుతాయి ?! అనే ప్రశ్నను పుట్టనీయకండి. సృష్టిని విశ్వసించండి. నిజంగా విశ్వసించండి. గ్యారంటీగా మీ అంచనాలకు మించి అందుతాయి. అందకపోతే మీ లోపమే ! సాధన బాగా చేయండి.

డబ్బులు స్వంతానికి ఖర్చు పెట్టుకోవడం అనేది సాధనలో ఒక భాగం. మీ వీలును బట్టి మీ జాగ్రత్తలో మీరు ఉండి ఖర్చు పెట్టుకోండి. ఆ తర్వాత బాధలు పడకండి.

మీరు వాడే వస్తువులన్నీ ఖరీదైనవిగా మార్చుకోండి. ఐశ్వర్యవంతులెప్పుడూ ఖరీదైనవే వాడుతూ ఉంటారు. బట్టలు, బనియన్లు, డ్రాయర్లు, చెప్పులు, బూట్లు మొదలైన ప్రతీ వాటికి ఒక "లైఫ్ స్పాన్" ఉంటుంది. అంటే జీవితకాలం లేక ఆయుష్షు అన్నమాట. అంటే ఉదాహరణకు, బనియన్ లేక డ్రాయర్ తీసుకుంటే దాని క్వాలిటీని బట్టి 3 లేదా 6 నెలలు లేదా 9 నెలలు లేక ఎంతో కొంత ఉంటుంది. ఆ తర్వాత డ్రాయర్లను పారేసి, బనియన్లను ఎవరైనా పేదవారికి ఇచ్చేసి మీరు కొత్త బనియన్లను కొనుక్కోవాలి. కొంత మంది అవి చిల్లులు పడేదాకా వేసుకుంటూ, ఇక అవి వేసుకోలేనంతగా పాడైపోతే తప్ప కొత్తవి కొనుక్కోరు. ఐశ్వర్యవంతులు ఇలా చేయరు. డ్రాయర్లకు చిల్లులు పడి "ఫుల్ ఎయిర్ కండీషన్డ్‌గా" మారినా వాటిని పారేసి కొత్త డ్రాయర్లను కొనని ధనవంతులను ఎంత మందినో చూసాను. పొద్దున స్నానాలు చేసి, చిల్లులు పడిన బనియన్లను, డ్రాయర్లను ఉతికి ఆరేస్తారు. ఫైవ్ స్టార్ హోటల్స్ ముందు రంగు రంగుల జెండాలు ఎగురుతున్నట్టు, అవి గాలికి రెప రెపలాడుతూ ఎగురుతూ ఉంటాయి. వాటికున్న రంధ్రాల్లోంచి కూడా గాలి ధారాళంగా వీస్తూ ఉంటుంది. పాతగా అయిపోయి, వెలిసిపోయి, రంధ్రాలు పడిఉన్న ఆ యొక్క "అంతర్ వస్త్రాలను" చాలా సగర్వంగా, కాస్త చాటుకు కూడా కాదు, ఫుల్ పబ్లిక్ ప్లేస్‌లో ఆరేస్తారు. ఖర్మ కాలి వాటిని చూసిన వాళ్ళకు ఒక చిన్న పాటి షాక్ తప్పదు. వాటి ఓనర్లకు కార్లుంటాయి. వాటిని చూడలేక అప్పుడప్పుడు, నేను అంటుంటాను, "ఏమయ్యా అవి పడేసి కొత్తవి కొనుక్కోవచ్చు కదా" అని ! అప్పుడు వారేమంటారంటే, అవి లోపలే ఉంటాయి కదా సార్, ఎవరికీ కనపడని వాటికి అనవసర ఖర్చు ఎందుకు సార్" అని అంటారు. ఇలాంటి దరిద్రులు ఏ నాటికీ ఐశ్వర్యవంతులు కాలేరు. అసంభవం. ఇలా చేయకూడదు. పొదుపు వేరే ! పిసినారి తనం వేరే ! లోపల పిసినారి తనం పెట్టుకుని, దానికి పొదుపు ముసుగు వేయవద్దు. ఐశ్వర్యం అనుభవించడానికే ఉంది, దాచుకోడానికి కాదు ! ఐశ్వర్యం పంచడానికే ఉంది కానీ దాచి మురగ పెట్టడానికి కాదు. మీ పొదుపు మీరు చేసుకోండి. మీ జాగ్రత్తలలో మీరు ఉండండి. మీ వీలు బట్టి ఖర్చు పెట్టుకోండి.

ఒక్క విషయం బాగా గర్తుంచుకోండి. ఐశ్వర్యం కలిగి ఉండడం వేరే ! ఐశ్వర్యాన్ని కలిగి

ఉంటూ, ఐశ్వర్యాన్ని అనుభవించడం వేరే ! నేను ఏమంటానంటే, "ఐశ్వర్యాన్ని కలిగి ఉంటూ, ఐశ్వర్యాన్ని అనుభవించండీ..." అని !

మీకు ఏ మాత్రం ఇష్టం లేని వాళ్ళకు, ఖర్చు చేయాల్సి రావచ్చు. ప్రేమ పూర్వకంగా ఖర్చు చేయండి. మీకెంతో మేలు జరుగుతుంది. మీకెన్నో మేలులు జరిగి తీరుతాయి.

డబ్బులను ధారాళంగా ఖర్చు పెట్టక పోవడానికి కారణం ఏమిటి ?

ఉన్న డబ్బులను వెనకా ముందూ చూసుకోకుండా, ఖర్చు చేసేస్తే, మళ్ళీ ఎలా ? అనే భయంతోనే, డబ్బులను ఖర్చు చేయడానికి వెనకాడతారు. కానీ ఉన్న అసలు సత్యం ఏమిటంటే..." జరిగిన మేలు మళ్ళీ జరుగుతుంది" అనే సృష్టి సిద్ధాంతాన్ని విశ్వసించండి. ఇది నిజం. ఒక సారి వచ్చిన డబ్బులు మళ్ళీ వస్తాయి, ఒక సారి జరిగిన మేలు మళ్ళీ జరుగుతుంది. మేలు మేలుకే జన్మనిస్తుందని తెలుసుకోండి. ఒక సారి వచ్చిన డబ్బులను, విశ్వాసంతో జీవిత విలాసాలకు ఖర్చు పెడితే, మీరు ఖర్చు పెట్టిన వాటికంటే ఎన్నో రెట్లు ఎక్కువ డబ్బును మీరు పొందుతూనే ఉంటారు. మీరు, మీకు ఖర్చు పెట్టుకున్నా లేక మరెవరికైనా ఖర్చు పెట్టినా లేక దానాలు చేసినా.... నా దగ్గర చాలా డబ్బులున్నాయి అని విశ్వసిస్తూ, ధీమాగా ఖర్చు పెట్టండి. మీకు డబ్బులు అందుతూనే ఉంటాయి. మీ నమ్మకాన్ని సృష్టి ఎప్పుడూ వమ్ము చేయదని గుర్తుంచుకోండి. అందకపోతే అది మీ లోపమే, సాధన బాగా చేయండి.

అయితే ఇక్కడ బాగా అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే - జీవితానందాల కోసం ఖర్చు చేయండి. ఎవరికైనా డబ్బులు ఇవ్వాల్సి వస్తే, "నా ద్వారా వీరికి అందుతున్న ఈ డబ్బు వలన వీరికి శ్రేయస్కరం జరుగు గాక" అని లోపల అనుకుంటూ ఇవ్వాలి. ఒక వేళ ఇచ్చే ముందు అనుకోలేక పోతే, ఇచ్చిన తర్వాత కూడా అనుకోవచ్చు. ఎప్పుడు గుర్తుకు వస్తే అప్పుడు అనుకోవచ్చు. దీని వలన "అపాత్రా దాన దోషం" అంటదు.

విశ్వాసంతో ఉండండి. డబ్బు ఖర్చు పెట్టడం అనేది, ఐశ్వర్య సాధనలో ఒక భాగం అని గట్టిగా గుర్తుంచుకోండి. ఎందుకంటే... నేను సృష్టిని విశ్వసిస్తున్నాను అని మీరు అనుకుంటూ ఉంటే, ఆ యొక్క విశ్వాసాన్ని ఆచరణలో పెట్టడమే "డబ్బులను ధారాళంగా ఖర్చు పెట్టడం". వెనక ముందూ చూడకుండా, బలమైన విశ్వాసం లేకుండా ఖర్చు పెట్టుకుని ఆ తర్వాత బాధ పడవద్దు.

ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని బాగా అర్థం చేసుకోండి. అవగాహన చేసుకోండి. ఆ తర్వాతే ఐశ్వర్య సాధన ప్రారంభించండి. నేను చేప్పేది దయచేసి సరిగా అర్థం చేసుకోండి. ఆత్మ విజ్ఞానమే ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది. ఒక్క ఐశ్వర్యాన్నే కాదు. దేనినంటే దాన్ని ప్రసాదిస్తుంది. ఆత్మ విజ్ఞాన సూత్రాల ఆచరణలను, సాధనలను, బాగా అవగాహన చేసుకుని ఆచరిస్తే ఫలితాలు బ్రహ్మాండంగా ఉంటాయి.

నేనే కాదు ఈ సాధన వలన తక్కువ సమయంలోనే ఎంతో మంది ఐశ్వర్యవంతులయ్యారు. నాకు తెలిసిన మార్గాన్నే నేను మీకు నేర్పిస్తున్నాను. నేను ఆచరించి, సాధించిన మార్గాన్నే మీకు బోధిస్తున్నాను. నిజంగా, పూర్తి విశ్వాసంతో, ప్రేమతో సాధన చేయండి, ఆచరించండి మీరు ఖచ్చితంగా ఐశ్వర్యవంతులై తీరుతారు. గతి తప్పని ప్రాప్తి ఇది. ఇది పరమ సత్యం. నేనిచ్చేది పాజిటివ్ దృక్పథ ఎంకరేజ్‌మెంట్ ! జయాపజయాలు మీ మీదనే ఆధారపడి ఉంటాయి.

అన్ని దానాలలోకెల్లా ఆత్మ విజ్ఞాన దానమే అత్యున్నతమైనది. దీని కంటే మించినది లేదు. "పంచబడింది పెంచబడుతుంది" అనే విశ్వ నియమం ప్రకారం నిజమైన శ్రద్ధాసక్తులు గలవారికి మీరు కొని ఇస్తున్న "ఆత్మ విజ్ఞానం" ద్వారా వారికెంతో శ్రేయస్కరం జరుగుతుంది. "మిమ్మల్ని బట్టి మీతో విశ్వం" - అనే విశ్వ సూత్ర ప్రకారంగా ఇతరులకు మీరు, వారు అడగకుండానే సహాయం చేస్తున్నారు కాబట్టి మీ పట్ల కూడా విశ్వం అలాగే ప్రవర్తిస్తుంది. మీరు అడగకుండానే మీకు సహాయ సహకార సమన్వయాలు అందుతూ ఉంటాయి. ఉచితం అంటే.. నిజమైన శ్రద్ధాసక్తులు కలిగిన వారికి మాత్రమే ఇవ్వండి ఎవరికి పడితే వారికి కాదు.

"మీరు విశ్వానికి ఏమిస్తే అది వేయి రెట్లై మళ్ళీ మిమ్మల్ని చేరుతుంది" - అనే విశ్వ సూత్ర ప్రకారంగా మీరు వ్యక్తులకు చేస్తున్న మహోపకారం, మీకు డబ్బు + సహాయం చేసే వ్యక్తులు + అనుకూల పరిస్థితులు + అవగాహన స్థాయి పెరగడం మొదలైనవిగా రూపాంతరం చెంది మీకు అందుతాయి. ఎందుకంటే వ్యక్తి విశ్వంలో ఒక భాగం, అంటే వ్యక్తి విశ్వం అన్నమాట ! కాబట్టి మీరు వ్యక్తులకు సహాయం చేస్తున్నారంటే సాక్షాత్తు విశ్వానికే సహాయం చేస్తున్నారని అర్థం. ఏమీ ఆశించకుండా "ఇవ్వడం" యొక్క మహత్యం గురించి ముందు పేజీలలో వివరించాను చదవండి.

మీ పిల్లలకు పుట్టినప్పటి నుండే చెప్పడం ప్రారంభించండి.
నీవు ఐశ్వర్యవంతుడివి నాన్నా... నీవు మహా ఐశ్వర్యవంతుడివి కన్నా...
అంటూ రోజూ వారికి చెబుతూ ఉండండి. వారికి 7 సంవత్సరాల
వయసు వచ్చే వరకు అలా చెబుతూనే ఉండండి. ఆ తర్వాత ఇక
అవసరం లేదు. మీ పిల్లలు ఆటోమెటిక్‌గా ఐశ్వర్యవంతులైపోతారు.
7 సంవత్సరాల వరకు మీ పిల్లలకు ఏ విషయాలనైతే పదే పదే చెబుతారో
ఇక వారి జీవితం అంతా అదే అవుతుంది.
7 సంవత్సరాల వరకు పిల్లల హృదయాల్లో
ఏ విషయాలైతే నాటుకుంటాయో అవే వారి జీవితంలోకి ప్రవేశిస్తాయి.
చిన్న పిల్లలకు ఏం అర్థం అవుతుందండీ.... అని అనుకోకండి.
రోజుల వయసు ఉన్న శిశువులు కూడా
ఎంతో అర్థం చేసుకునే శక్తిని కలిగి ఉంటారు.

మీ పిల్లలను సహజంగా ఐశ్వర్యవంతులను చేసే విధానం ఇది.
కేవలం వారికి రోజూ చెప్పండి. చాలా బలంగా చెప్పండి. చిన్నప్పుడే వారి
హృదయాలలో ఐశ్వర్య విత్తనాలు వేయండి.
ఇక ఆ విత్తనాలు చెట్లుగా మారి వారికి
జీవితాంతం ఐశ్వర్య ఫలాలను ఇస్తూనే ఉంటాయి.

ఐశ్వర్య సాధనకు పూనుకున్నప్పుడు.. మీరు చాలా విశ్వాసంతో ఉండాలి. ధైర్యంగా, ధీమాగా ఉండాలి. సాధ్యమైనంతవరకు కేవలం పాజిటివ్ ఆలోచనలు మాత్రమే చేస్తూ ఉండాలి. ఎవరో ఒక వ్యక్తి లేక కొంత మంది వ్యక్తులు లేక ఏదో ఒక కంపెని నుండి కానీ ఎవరినో ఉద్దేశించి కానీ సాధన చేయకండి. ఇది తప్పు. మీరు ఎవరినో దృష్టిలో పెట్టుకుని సాధన చేయకూడదు, చేస్తే రింగు రివర్స్ అయ్యే ప్రమాదం ఉంది. మీకే హాని జరుగుతుంది. మీలో ఉన్న దైవాన్ని దృష్టిలో పెట్టుకుని మీ దైవాన్నే అడగండి. మీ దైవం బాహ్యంగా ఏదో ఒక సురక్షిత మార్గంలో మీకు ఏదో ఒక రకంగా అంద చేస్తుంది. ఏమిటి, ఎలా.. అనే ప్రశ్నలలో మునిగి పోకుండా.. ఏదో ఒక మంచి మార్గంలో వస్తుంది అని విశ్వాసంతో ఉండండి.

ఐశ్వర్య సాధనకు పూనుకున్నప్పుడు.. మీ ఐశ్వర్య సాధన విషయాన్ని ఎవ్వరికీ చెప్పకూడదు. మీకు ఐశ్వర్యం సిద్ధించిన తర్వాత మీకు ఎవరికి చెప్పాలనిపిస్తే వారికి చెప్పండి. ముందు మాత్రం ఎవ్వరికీ చెప్పకుండా రహస్యంగా సాధన చేసుకోండి. పిసినారులతో, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారితో ఎక్కువ సేపు గడపకండి.

ఐశ్వర్య సాధనకు పూనుకున్నప్పుడు.. మీరు సాధన దీక్షగా చేస్తూ ఉన్నప్పుడు, మీ జీవితంలో నుండి కొంత మంది వ్యక్తులు దూరం అవుతారు. మీ జీవితంలోకి కొత్త వారు వస్తారు. ఎవరి వలన అయితే మీకు ఇబ్బందులు వస్తాయో వారితో మీకు ఆటొమెటిక్‌గా కనెక్షన్ కట్ అవుతుంది. కొత్త వారితో కనెక్షన్ స్టార్ట్ అవుతుంది. మీ నివాస ప్రదేశం, మీ నివాస ప్రాంతం మారితే మారవచ్చు. ఇంకా మీ వర్క్ ప్లేస్‌లో కూడా మార్పులు జరగవచ్చు. మీ సర్కిల్‌లో చాలా మార్పులు జరుగుతాయి. మీ జీవితంలో కొత్త మార్పులెన్నో చోటు చేసుకుంటాయి. నెగెటివ్ వ్యక్తులను పూర్తిగా, శాశ్వతంగా కట్ చేసేయండి. వారి వలన మీ సాధనకు ఆటంకాలు వస్తాయి.

మీరు నిజంగా, ఖచ్చితంగా,
రాచ మార్గంలో, తక్షణమే,
శాశ్వతంగా ఐశ్వర్యవంతులై
తీరెదరు గాక !

సద్గురు ఆశీర్వాదం తప్పక ఫలిస్తుంది.
సరిగా, నిజంగా సాధన చేయండి.

- సద్గురు తారా విశాల్

పార్ట్ - 13

డబ్బు - లక్ష్య సాధన

మనల్ని బట్టి మన లక్ష్యం ఉంటుంది.
మనం ఎంత లక్ష్యాన్ని నిర్ణయించుకుంటే అన్ని శక్తి సామర్థ్యాలు మనలో
ఉత్తేజితమౌతాయి. మీరు ఎంత పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుంటే
అంత శక్తి మీలో ఉద్భవిస్తుంది.

శక్తి సామర్థ్యాలు వచ్చాక లక్ష్యం పెట్టుకోవడం కాదు.
లక్ష్యం పెట్టుకుంటేనే శక్తి సామర్థ్యాలు వస్తాయి. శక్తి వచ్చాక
ఆహారం తీసుకోవడం కాదు, ఆహారం తీసుకుంటేనే శక్తి వస్తుంది.

లక్ష్యాన్ని నిర్ణయించుకోవడమే మీరు చేయాల్సిన పని. అంతే.
ఆ తర్వాత లక్ష్యమే తనను తాను నెరవేర్చుకుంటుంది.
మీరు చేయాల్సిందల్లా విశ్వాసం కోల్పోకుండా మరియు లక్ష్యాన్ని మధ్యలో
ఉపసంహారం(డ్రాప్) చేయకుండా ఉండటమే !
ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకున్న తర్వాత, ఆ లక్ష్యాన్ని సాధించడానికి
ప్రత్యేకంగా శక్తి సామర్థ్యాలు పొందాల్సిన అవసరం లేదు. మీరు లక్ష్యాన్ని
పెట్టుకోవడంతోనే, మీలో ఆ లక్ష్యానికి సంబంధించిన
సర్వ శక్తి సామర్థ్యాలు ఉత్తేజితం అవుతాయి.

లక్ష్యమే ఒక మహా శక్తి ! తను నెరవేరడానికి ఏమేం కావాలో
అవన్నీ మీ లక్ష్యమే మీకు సమకూర్చి నెరవేరుతుంది.
మీరు కేవలం విశ్వాసంతో ఉండండి చాలు !

I. డబ్బు - లక్ష్య సాధన

ఏ లక్ష్యాన్ని సాధించాలన్నా, ఏ కోరికను తీర్చుకోవాలన్నా (కొన్నింటిని తప్పించి) డబ్బు అనేది అత్యంత అవసరం. ఇది అందరికీ తెలిసిన విషయమే !

ప్రస్తుతం మానవ జీవితాలను శాసిస్తూ ఉంది డబ్బు. "పైసా మె పరమాత్మ" అని అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

మనిషి చేత సృష్టించబడిన డబ్బుకు ఇంత ప్రాధాన్యత ఎలా వచ్చింది ?!

అందరూ డబ్బు వెనకాలే ఎందుకు పడుతున్నారు ?

డబ్బు కొందరి జీవితాల్లో ఎందుకు ఉంటుంది ?

డబ్బు కొందరి జీవితాల్లో ఎందుకు ఉండదు ?

డబ్బు జీవితంలో అపారంగా ప్రవహించాలంటే ఏం చేయాలి ?

అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలంటే, ముందు డబ్బు అంటే ఏమిటో, డబ్బుకు మానవ జీవితానికి గల సంబంధం ఏమిటో సంపూర్ణంగా సమగ్రంగా తెలుసుకుంటే గానీ పై ప్రశ్నలకు సమాధానం దొరకదు.

డబ్బు సమస్యలకు మూలం డబ్బులో లేదు !

ఆశ్చర్యంగా ఉందా ? నమ్మశక్యంగా లేదా ? డబ్బు సమస్యలకు మూలం డబ్బులో లేదు. డబ్బు సమస్యలకు మూలం డబ్బు కానే కాదు. మీరు అనుభవిస్తున్న డబ్బు సమస్యలకు, డబ్బుకు(నోట్ల కట్టలకు) ఎలాంటి సంబంధమూ లేదు.

ఆర్థిక (డబ్బు) సమస్యలు వాస్తవానికి ఆర్థిక సమస్యలు కావు. నిజానికి అవి జీవన సమస్యలు. స్వేచ్ఛకు, సాధికారతకు సంబంధించిన సమస్యలు. డబ్బు సమస్య అనేది మీ స్వేచ్ఛకూ, మీ స్వాతంత్ర్యానికీ, మీ సాధికారతకూ సంబంధించిన సమస్య !

నాస్తికులు డబ్బు సంపాదించాలంటే టాలెంట్ ఉండాలి అని అనుకుంటూ ఉంటారు. తెలివి తేటలు, ప్రతిభ, చదువు ఉండాలి అని అనుకుంటూ ఉంటారు. జాతకాలని నమ్మేవాళ్ళు, జాతకంలో డబ్బు ఉంటే వస్తుంది లేకపోతే లేదు అని అనుకుంటూ ఉంటారు. అదృష్టం ఉండాలి అని అనుకుంటూ ఉంటారు. దేవుడిని నమ్మేవాళ్ళు దేవుడి దయ ఉండాలి అని అనుకుంటూ ఉంటారు. ఇంకా ఏమేమో అనుకుంటూ ఉంటారు. ఈ అనుకోవడాలు అన్నీ కూడా శుద్ధ తప్పు. పై వాటికి డబ్బుకు ఎలాంటి సంబంధం లేదు. ఆస్తికులు అనుకునేది తప్పే. నాస్తికులు అనుకునేది తప్పే. ఇవి "సరి కాని" భావాలు. పూర్తిగా స్వచ్ఛమైన అసత్యాలు. డబ్బు రావాలంటే ఆత్మ విజ్ఞానం ఉండాలి. మరి, ఇప్పుడు ఉన్న ఐశ్వర్యవంతులంతా ఆత్మ విజ్ఞానం కలిగి ఉన్న వారేనా ? అని అంటే, వాళ్ళు ఐశ్వర్యం అనే కోణానికి సంబంధించిన ఆత్మ విజ్ఞానం కలిగి ఉన్నారు. ఆత్మ విజ్ఞానానికి అనంతమైన కోణాలు ఉంటాయి. అందులో ఒకటి డబ్బు - ఐశ్వర్యం !

ఇప్పుడు పాయింటుకు వద్దాం. ఆర్థిక సమస్యలు వాస్తవానికి ఆర్థిక సమస్యలు కావు. ఆర్థిక సమస్యలు నిజానికి జీవన సమస్యలు. స్వేచ్ఛకు, సాధికారతకు సంబంధించిన సమస్యలు.

డబ్బులు ఉంటే మీకు తిండి దొరుకుతుంది. మరి తింటే గానీ జీవించలేం, కాబట్టి ఆహారం అనేది జీవన్మరణాల సమస్య, జీవితానికి సంబంధించిన జీవన సమస్య. డబ్బు ఉంటే మీకు ఇల్లు అనేది ఒకటి దొరుకుతుంది. ఎక్కువ డబ్బులుంటే స్వంత ఇల్లు, తక్కువ డబ్బులుంటే కిరాయి ఇల్లు మొత్తానికి ఒక ఇల్లు దొరుకుతుంది. మరి ఇల్లు అనేది ఒకటి ఉంటేనే జీవించగలుగుతాం. ఇది కూడా జీవన సమస్యే. డబ్బులుంటే మంచి బట్టలు కొనుక్కుంటాం, మరి సమాజంలో జీవించాలంటే బట్టలు అవసరం కాబట్టి ఇది కూడా జీవన సమస్యే. డబ్బులుంటే మీ జీవితంలోకి వసతి సౌకర్యాలను

సమకూర్చుకుని హాయిగా జీవించగలుగుతారు. లేకపోతే లేదు. డబ్బులుంటే మీరు స్వేచ్ఛగా, స్వతంత్రంగా మీ ఇష్టం వచ్చినట్టుగా జీవించవచ్చు. మీ జీవితంపై మీకు సాధికారత ఉంటుంది. ఇవన్నీ సత్యాలే ! నిజమే !

ఇప్పుడు విషయాన్ని "అసలు కోణంలో" నుండి చూద్దాం ! "అసలు సిసలు విషయాన్ని" గ్రహిద్దాం. ఉదాహరణకు ప్రపంచ ప్రభుత్వాలన్నీ కలిసి మూకుమ్మడిగా డబ్బును అంటే నోట్లను రద్దు చేశాయి అనుకోండి. అప్పుడేం జరుగుతుందో ఒకసారి ఊహించి చూడండి. మళ్ళీ "బార్టర్ సిస్టమ్" అంటే "వస్తు మార్పిడి పద్ధతి" అమలులోకి వచ్చింది అనుకోండి, అప్పుడేం జరుగుతుంది - ఒక సారి విశ్లేషించి చూడండి. నోట్లు మీ జీవన సమస్యలను, అవసరాలను తీరుస్తాయా ?! డబ్బు, డబ్బు, డబ్బు అని ప్రాకులాడే వాళ్ళు అప్పుడు దేనికోసం, వేటి కోసం ప్రాకులాడుతారు ?!?! అప్పుడు జీవన సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి ?!

డబ్బు అనేది మన కోరికలు భౌతిక రూపం ధరించడంలో ఒక మాధ్యమం(మీడియం)గా ఉపయోగపడుతుంది. మీ కోరికలు లేదా ఆలోచనలు లేదా లక్ష్యాలు కార్యరూపం ధరించడానికి డబ్బు ఒక మీడియం అంతే !

మీ కోరికలను భౌతికంగా అనుభవించే అర్హత మీరు పొందినప్పుడు, ఆటోమెటిక్‌గా మీ కోరికలు తీరుతాయి, ఇందుకు డబ్బు అనేది మధ్యలో ఒక పాత్ర పోషిస్తుంది అంతే. ఉదాహరణకు మీరు ఒక కొబ్బరి బోండాం తాగాలని అనుకున్నారు, కొబ్బరి బోండాం తీసుకున్నారు, దాన్ని తాగేందుకు "తెలుపు రంగు స్ట్రా" ఉపయోగించి తాగారు. ఇప్పుడు చెప్పండి మీకు కొబ్బరి బోండాం తాగడానికి "తెలుపు రంగు స్ట్రా" అనేది ఎలా ఉపయోగపడింది ? ఒకవేళ "తెలుపు రంగు స్ట్రా" లేకపోతే మీరు కొబ్బరి బోండాం తాగలేరా ! "తెలుపు రంగు స్ట్రా" ఉంది కాబట్టి దాన్ని ఉపయోగించారు, తెలుపు రంగుది లేకపోతే వేరే రంగు స్ట్రాలు ఉపయోగిస్తారు. గ్లాసులోనో, చెంబులోనో లేదా పాత్రలోనో పోసుకుని తాగుతారు. ఇవేవి లేకపోతే డైరెక్ట్‌గా తాగుతారు. మీరు తాగాలని నిర్ణయించుకోవాలే గానీ ఎన్ని మార్గాలైనా ఉంటాయి. "మనసుంటే మార్గం ఉంటుంది" అనే పరమ సత్యాన్ని మీరెప్పుడూ వినలేదా ! If there is a will, there is a way కదా !

✪✪✪

ఉదాహరణకు ఒక వ్యక్తి ఉన్నాడు. బాగా చదువుకున్నాడు. ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు, ఒక పెద్ద కంపెనీలో ఉద్యోగానికి అప్లై చేశాడు. ఇంటర్వ్యూకు వెళ్ళాడు, ఇంటర్వ్యూ అయిపోయిన తర్వాత కంపెనీ వాళ్ళు ఏ విషయం మీకు తెలియజేస్తాం, ఇక మీరు వెళ్ళండి అని అన్నారు. ఇతను ఇంటికి వచ్చాడు. కొన్ని రోజుల తర్వాత పోస్ట్ ద్వారా అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. మంచి ఉద్యోగం, మంచి జీతం. వెళ్ళి జాయినయ్యాడు. ఇతని తమ్ముడికి ఇదే జరిగింది. ఇతని చెల్లెలికి ఇదే జరిగింది. ఇదంతా వీళ్ళ పక్కింట్లో ఉండే వాడొకడు చూస్తూ ఉన్నాడు. ముగ్గురికి పోస్ట్‌మ్యాన్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ తెచ్చాడు కాబట్టే వాళ్ళకు ఉద్యోగాలు వచ్చాయని భావించి వీడు పోస్ట్ మ్యాన్ వెంట పడసాగాడు. నాకూ ఒక అపాయింట్‌మెంట్ ఆర్డర్ తెమ్మని ! వాళ్ళ ముగ్గురికి తెచ్చి ఇచ్చావు నాకు తేలేవా అని అడిగితే ఎలా ఉంటుందో - ఒక లక్ష్యం నెరవేరడానికి డబ్బుల కోసం ఎదురు చూడడం అలానే ఉంటుంది.

ఆ ముగ్గురు చేసిన శ్రమ యొక్క పర్యవసానమే వారికి అందిన అపాయింట్‌మెంట్ ఆర్డర్ లేక ఉద్యోగం. ముందు చేయాల్సిన పని చేయకుండా ఉంటే అపాయింట్‌మెంట్ ఎలా వస్తుంది ? ఇదే విధంగా మీరు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ఏమీ ఉండనక్కరలేదు. ముందు 100% పూర్తి చైతన్య స్పృహతో డిసైడ్ అవ్వండి. అంతరంలో ఆ లక్ష్యం నెరవేరినట్టుగా ఊహించండి. అప్పుడు ఆ లక్ష్యానికి సంబంధించిన పరిస్థితుల గుండా ముందుకు సాగిపోండి. శ్రమించండి. 100% పూర్తిగా లక్ష్యానికే అంకితం కండి. లక్ష్యం కోసం రాత్రింబవళ్ళు పరిశ్రమిస్తూ "లోపల" లక్ష్యం నెరవేరినట్టుగా ఊహించండి. ముందు మీ మనసు లోపల లక్ష్యం నెరవేరితే అదే బయట కూడా ఆటోమెటిక్‌గా సంభవిస్తుంది. ముందు తీవ్రంగా కోరుకోవాలి. మీ బలమైన కోరికే మీ జీవితంలోకి అది నెరవేరే పరిస్థితులను ఆకర్షిస్తుంది. నేను ఒక పని చేద్దాం అనుకుంటున్నాను దానికి తగిన పరిస్థితులు లేవు అనకండి. మీరు కోరుకుంటేనే దానికి తగిన పరిస్థితులు వస్తాయి. మొట్ట మొదట మీరు తీవ్రంగా కోరుకోవడం అనేది ముఖ్యం. తీవ్రంగా కోరుకోవడం అనేది ముందు చేయాలి, ఆ తర్వాతే ఆ కోరిక తీరే పరిస్థితులు వస్తాయి.

నిజానికి అసలు సత్యమేమంటే "మనసు ఉంటే మార్గం ఉండడం" కాదు "మనసే మార్గం" ! మనసు అంటే ఇక్కడ మీరు కోరుకోవడం, దాన్ని పొందాలని నిశ్చయించు కోవడం, ఇదే "మనసు ఉండడం" అంటే ! దాన్ని నేను పొందియే తీరాలి అనే మీ దృఢమైన నిర్ణయమే మార్గం అవుతుంది. అందరూ ఏం అనుకుంటూ ఉంటారంటే దేనినైనా పొందాలి అని కోరుకున్నప్పుడు ఆ కోరిక ద్వారాలను తెరుస్తుంది అని అనుకుంటారు. నిజానికి అసలు విషయం ఏమిటంటే మీ "కోరికే ద్వారంగా" మారుతుంది. మీ కోరికే ద్వారం, మీ నిర్ణయమే మార్గం ! కాబట్టి మీరు దేనినైనా సరే కోరుకున్నప్పుడు ఆ కోరిక స్థిరంగా ఉండాలి. "స్థిరంగా ఉండడమంటే మధ్యలో దాన్ని ఉపసంహారం(డ్రాప్) చేయకుండా, అనుమానాలు ప్రకటించకుండా ఉండడం. మధ్య మధ్యలో డ్రాప్ అవుతూ మళ్ళీ కోరుకుంటూ,

ఎప్పుడూ అనుమానాలు ప్రకటిస్తూ ఉంటే ఆ కోరిక ఎప్పటికీ నెరవేరదు. ఎప్పుడూ పాజిటివ్ భావన తప్ప మరొకటి దానికి జోడించకూడదు. అలాంటి దాన్ని "స్థిరమైన కోరిక" అని అంటారు.

డబ్బు అనేది ఒక మాధ్యమం. అది కేవలం మనం సృష్టించుకున్న మాధ్యమం. మన కోరికలు తీరడానికి డబ్బుకు ఏ మాత్రం సంబంధం లేదు. ఈ రోజు డబ్బు అనేది ఒకటి ఉంది కాబట్టి డబ్బు, డబ్బు అని అంటున్నాం. డబ్బును మనం పుట్టించాం. డబ్బుకు సృష్టికర్తలం మనమే. డబ్బు అనేది నిన్న - మొన్న పుట్టింది. కానీ మనం ఎప్పటినుండో ఉన్నాం. ఆత్మ స్వరూపులమైన మనకు ఈ సృష్టికి ఉన్నంత చరిత్ర ఉంది. డబ్బు అనేది లేనప్పుడు మనం ఉన్నాం. డబ్బు ఉన్నప్పుడు ఉంటున్నాం. డబ్బు అనేది రేపు ఉండబోదు, మనం అప్పుడు కూడా ఉండబోతున్నాం. డబ్బుకు ప్రత్యామ్నాయాలు వచ్చేస్తున్నాయి. E - Money, Plastic Money అని రక రకాలైన ప్రత్యామ్నాయాలు వచ్చేస్తున్నాయి. రేపు "నోట్లు" మ్యూజియంలోకి వెళ్ళి పోయినా పెద్దగా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

✪✪✪ మన కోరికలు లేదా మన ఆలోచనలు లేదా మన లక్ష్యాలు మనం తీర్చుకోవాలి అని 100% చైతన్య స్పృహతో డిసైడ్ అయినపుడు మన కోరికలు, అవి తీరబోయే ముందు - డబ్బుగా + సౌకర్యాలుగా + అనుకూల పరిస్థితులుగా + సహాయ సహకార సమన్వయాలుగా + సహాయం చేసే వ్యక్తులు మొదలైనవిగా రూపాంతరం చెందుతాయి.

✪✪✪ మన కోరిక తీర్చుకోవడానికి ముందు మనం 100% చైతన్య స్పృహతో సిద్ధపడాలి. మన కోరికను తీర్చుకోడానికి ముందు మనమే సంపూర్ణంగా సమగ్రంగా సమ్మతించాలి. మన పూర్ణ సమ్మతే మన కోరికలను తీర్చే శక్తి ! గుర్తుంచుకోండి, మన సమ్మతే మన శక్తి. అంతే కానీ ప్రత్యేకంగా శక్తి ఉండడం, లేకపోవడం అంటూ ఉండదు. శక్తి అనేది మనం అనంతంగా కలిగియే ఉన్నాం. ఇందుకు ఎందరో మహాత్ములు నిదర్శనాలుగా నిలిచి నిరూపించారు.

✪✪✪ శ్రీ కృష్ణుడు చేయగలిగాడంటే మనమూ చేయగలం ! ఎందుకంటే "అహం బ్రహ్మాస్మి" - నేనే దైవం అంటే మనమే దైవం కదా !

✪✪✪ జీసస్ క్రైస్ట్ చేయగలిగాడంటే మనమూ చేయగలం ! ఇదే విషయాన్ని స్వయంగా జీసస్ క్రైస్ట్ చెప్పాడు కదా !

✪✪✪ "నేను తండ్రి వద్దకు వెళ్ళుచున్నాను గనుక నేను చేయు క్రియలు నా యందు విశ్వాసం ఉంచు వాడును చేయును, (ఇక్కడ "నా యందు" అంటే మీ లోపల మీరే అయి ఉన్న పరమాత్మ యందు అని అర్థం.) వాటి కంటే మరి గొప్పవి అతడు చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" !

- పవిత్ర గ్రంథం బైబిల్ - యోహాను - 14 : 12

✪✪✪ ఒక మాస్టర్ చేయగలిగాడంటే మనమూ చేయగలం !

✪✪✪ వీళ్ళంతా మానవ దేహం ధరించి, మేం చేసాం, మీరు కూడా చేయగలరు అని, ఈ మహాత్ములు నిరూపించారు. ఇదే మానవులంతా వాళ్ళ నుండి తీసుకోవాల్సిన ప్రేరణ !

గుర్తుంచుకోండి, మానవ జాతి మొత్తం చైతన్యం అంతా ఒకే రకంగా ఉంటుంది. సిస్టమ్ ఒకటే, అంతా ఒకటిగానే ఉంటుంది. వాళ్ళు చేయగలిగారంటే మనం కూడా చేయగలుగుతాం. వాళ్ళకూ, మనకూ ఉన్న తేడా ఏమిటంటే "వాళ్ళు గొప్ప గొప్ప మహా ఆలోచనలను స్వీకరించారు, వాటిని వెంటనే పూర్తిగా సమ్మతించారు, వాటిని తక్షణమే ఆచరించారు" అంతే !

మనకూ వస్తాయి పెద్ద పెద్ద ఆలోచనలు కానీ మనమేం చేస్తామంటే ఆలోచించి ఊరుకుంటాం. కొంత మంది అయితే ఆలోచించడానికి కూడా సాహసించరు. వచ్చిన ఆలోచనను అనుమతించి, ఆచరించినప్పుడే అది పరిస్థితిగా మారుతుంది.

తెలుసుకోండి, కోరికలు నెరవేరడం, నెరవేరక పోవడం అంటూ ఏమీ ఉండదు. కోరికలు నెరవేరియే ఉంటాయి. ఆల్‌రెడీ నెరవేరి సిద్ధంగా ఉన్న కోరికలే మనకు ఆలోచనల రూపంలో వస్తాయి. వాటిని అనుమతిస్తే, ఆ కోరికలను మనం సమ్మతిస్తే చాలు సరిపోతుంది. అవి తీరిపోతాయి.

ఒక కోరిక నెరవేరుతుందా లేదా అనేది సమస్య కాదు. మీరు దాన్ని 100%గా సమ్మతిస్తున్నారా లేదా అనేదే అసలు సమస్య. ఒక కోరికను తీర్చుకునే శక్తి సామర్థ్యాలు నాకు ఉన్నాయా లేదా అని తెలుసుకోవడం ఎలా అంటే, ఒక కోరిక మీకు కలిగింది అంటే మీకు ఆ శక్తి సామర్థ్యాలు ఉన్నట్టే అని అర్థం. ఆ కోరిక పదే పదే మిమ్మల్ని వెంటాడుతుందీ అంటే మీకు ఆ శక్తి సామర్థ్యాలు 100% ఉన్నాయనేది స్పష్టం ! మీకు ఆ కోరికను నెరవేర్చుకునే శక్తి సామర్థ్యాలు ఉంటేనే ఆ కోరికను కోరుకోగలుగుతారు. కోరుకోవడం అంటే పొందడమే ! కోరుకోవడమే పొందడం !

కోరుకోవడమే పొందడం !

మీరు కోరుకున్నవి జరగటం లేదు అని అంటే మీ లోపల కోరుకున్నది పొందే ఉద్దేశం లేదనేది సుస్పష్టం ! ముందు కోరుకోవాలి, ఆ తర్వాత ఆ కోరిక తీరడానికి ఎంతో కష్టపడాలి, ఎన్నెన్నో పరిస్థితులు కలిసి రావాలి, ఎందరెందరో సహాయం చేయాలి, మాస్టర్స్ కృప ఉండాలి, విశ్వం అనుమతించాలి అప్పుడు నా కోరిక నెరవేరుతుంది అనే భావన ఉంటుంది. ఈ విధంగా కోరిక వేరే - అది తీరడం వేరే అనే భావన ఉంటుంది. ఇలా ఎందుకు ఉంటుందంటే "కోరుకున్న దాన్ని పొందే ఉద్దేశం లేనందువలన కోరుకోవడం వేరే, పొందడం వేరే అనే భావన ఏర్పడుతుంది". అందుకే మీరు కోరుకున్నవేవి దక్కవు !

కోరుకోవడమే పొందడం !

కోరుకోవడాన్ని పొందడాన్ని కలిపివేయాలి. నిజానికి ఈ రెండూ వేరు, వేరు కాదు. మానవులు అజ్ఞానంతో దీనిని వేరు చేశారు.

కోరుకోవడం + పొందడం = కోరుకోవడమేపొందడం !

కోరుకోవడమేపొందడం !

ధ్యానంలో కూర్చోండి. "కోరుకోవడమేపొందడం" అని మనసులో ఎరుకతో, భావనాత్మకంగా అనుకోవడం ప్రారంభించండి. "కోరుకోవడమేపొందడం" అనే సత్యం పూర్తిగా మీ లోపలికి దిగిపోవాలి. ఇది ఒక్క రోజులో సిద్ధిస్తుందా, ఎన్ని రోజులు పడుతుంది అనేది మీ పైనే ఆధారపడి ఉంది. ఈ సత్యం మీ లోపలికి దిగిందా - ఇక అప్పుడు ఎంతో స్పష్టంగా తెలిసి పోతుంది. మీరు కోరుకున్నవన్నీ తక్షణమే తీరడం ప్రారంభిస్తాయి.

మీలో ఒక కోరిక కలిగిందీ అంటే దానర్థం - మీకు ఆ కోరికను నెరవేర్చుకునే అర్హత, శక్తి, సామర్థ్యాలు పూర్తిగా ఉన్నాయనే !

✪ సృష్టిలో అన్నీ సృష్టించబడి సిద్ధంగా ఉంటాయి. అవి ఏవైనా సరే, ఎంత పెద్ద కోరికలైనా సరే రెడిమేడ్‌గా సృష్టించబడి ఉంటాయి. గుర్తుంచుకోండి, ఆల్‌రెడీ రెడిమేడ్‌గా సృష్టించబడి సిద్ధంగా ఉన్న వాటి గురించే ఆలోచనలు వస్తాయి. మన కోరికలను నెరవేర్చుకోడానికి మనం ప్రత్యేకంగా సృష్టించాల్సిన అవసరం లేదు. రెడిమేడ్‌గా సృష్టించబడి సిద్ధంగా, తయారుగా ఉన్న వాటిని కేవలం కోరుకోవాలి. అంతే ! కోరుకోవడమే పొందడం అని ఇందాక మనం తెలుసుకున్నాం. ఇప్పుడు కోరుకోవడం యొక్క ఇంకొక కోణం తెలుసుకుందాం.

✪ కోరుకోవడమే అనుమతించడం !

✪ మీ కోరిక ఏదైనా అది ఆల్‌రెడి సృష్టించబడి రెడీగా ఉంటుంది. రెడీగా ఉన్నా దానిని కేవలం అనుమతించాలి. అంతే !

✪ అనుమతించడమే పొందడం !

✪ "ఆల్‌రెడి, సృష్టించబడి సిద్ధంగా ఉన్న నా కోరికను నేను అనుమతించాను" అని అనుకోవాలి. అంతే ! అది భౌతికంగా సంభవం అయిపోతుంది.

✪ సృష్టిలో అన్నీ సిద్ధంగానే ఉంటాయి మనమే సిద్ధంగా ఉండం. అన్నీ రెడీగానే ఉంటాయి మనమే రెడీగా ఉండం. రెడీగా ఉన్న మన కోరికలను మనం భౌతికంగా సంభవం చేసుకోవాలంటే మనం వాటిని అనుభవించడానికి "రెడి" అయిపోతే చాలు.

✪ Think ready; is ready ! ✪

26-11-2008 నాడు మధ్యాహ్నం నాకు ధ్యానంలో అల్ట్రా కాన్షియస్ నుండి వచ్చిన సూత్రం(మెసేజ్) ఇది !

✪ Think ready; is ready ! అని అంటే "రెడీగా ఉన్నానని భావించు, నీవు రెడి అయిపోతావు". రెడీగా అయిపోయిన నీవు వెంటనే, రెడిమేడ్‌గా సృష్టించబడి సిద్ధంగా ఉన్న నీ కోరికను సంభవం చేసుకుని అనుభవిస్తావు అని అర్థం.

✪ రెడీగా ఉన్నానని భావించే ముందు "ప్రస్తుతం నీవు రెడీగా లేవని గుర్తించు. ప్రస్తుతం నీవు రెడీగా అంటే సిద్ధంగా లేవనే సత్యాన్ని గుర్తించు", ఆ తర్వాతే రెడీగా ఉన్నానని భావించడం మొదలుపెట్టు ! ఇది తప్పని సరి !

✪ గుర్తుంచుకోండి సృష్టిలో అన్నీ రెడీగా ఉంటాయి. మనమే రెడీగా ఉండం. మనం రెడి అయిన మరుక్షణం దాన్ని పొందుతాము. "నా కోరికను భౌతికంగా అనుభవించడానికి నేను రెడి" అని భావిస్తే చాలు, అప్పుడు తక్షణమే, మీ లోపల జరగాల్సిన సెటింగ్స్ అన్నీ జరిగిపోయి, జరగాల్సిన

క్లియరెన్స్‌లన్నీ జరిగి, కావాల్సిన సర్వ శక్తి సామర్థ్యాలు, అవగాహన ఉత్తేజితమై మీ కోరికను భౌతికంగా సంభవం అయ్యేలా చేస్తాయి. ఇదంతా ఆటొమెటిక్‌గా జరిగి పోతుంది. మీరు నా కోరికను నేను భౌతికంగా అనుభవించడానికి రెడి అని భావించిన మరుక్షణం మీ లోపల ఉన్న మూల చైతన్యం మిమ్మల్ని రెడీగా చేసి మీ కోరిక తీరుస్తుంది.

✪ నా కోరికను భౌతికంగా అనుభవించడానికి నేను రెడి + ఎమర్జెన్సి అని అన్నారనుకోండి అది తక్షణమే తీరుతుంది. మీరు కేవలం రెడి అని భావించినప్పుడు కొన్ని గంటలు పట్టచ్చు, అంత కంటే ఎక్కువ కాదు. అదే మీరు రెడి + ఎమర్జెన్సి అని భావించారనుకోండి అప్పుడు అది నిమిషాలలో తీరిపోతుంది. అంతే !

✪ మీరు మీ కోరికను స్పష్టంగా తలుచుకుని, నేను నా కోరికను భౌతికంగా అనుభవించడానికి రెడి & ఎమర్జెన్సి అని భావించండి. అంతే ! అది వెంటనే సంభవిస్తుంది.

✪ Think ready; is ready ! ✪

✪ కోరిక కోరుకోడానికి ఏ అర్హతా అవసరం లేదు. ఏ శక్తి సామర్థ్యాలూ అవసరం లేదు. గుర్తుంచుకోండి, మీరు ఎంత పెద్ద, మహా కోరికనైనా కోరుకోవచ్చు.

✪ కోరుకోవాలని అనిపించడమే అర్హత ! ✪

✪ కోరిక కలిగిందీ అని అంటే అర్హత ఉన్నట్టే ! ✪

✪ అర్హత ఉన్నప్పుడే కోరిక కలుగుతుంది ! ✪

✪ దానిని పొందడానికి తగిన శక్తి సామర్థ్యాలు, అవగాహన మీకు ఉన్నప్పుడే కోరిక కలుగుతుంది. కలిగిన కోరికను కేవలం మీరు భౌతికంగా అనుభవించడానికి రెడి కావాలి. సిద్ధం కావాలి. అంతే ! అది సంభవం అయి తీరుతుంది. నేను సిద్ధం అని భావించండి అంతే, మీరు సిద్ధం చేయబడతారు, సిద్ధమైన మీరు మీ కోరికను భౌతికంగా అనుభవించి తీరుతారు. ఇది సహజం. సత్యం !

✪ చాలా మంది ఏమనుకుంటారంటే, అమ్మో... అవి కోరుకోడానికి నాకు అర్హత ఉందా ? అని భయపడతారు. మరి కొంత మంది నాకు కోరుకోవాలనుంది కానీ దానిని పొందడానికి కావల్సిన శక్తి సామర్థ్యాలు, అవగాహన లేవు. అవి వచ్చాక కోరుకుంటాను అని అంటారు. ఇది పూర్తిగా, శుద్ధ తప్పు !

✪ మీరు కోరుకున్నప్పుడే మీకు అర్హత వస్తుందని తెలుసుకోండి. మీరు దానిని కోరుకున్నప్పుడే దానిని పొంది అనుభవించడానికి కావాల్సిన శక్తి సామర్థ్యాలు, అవగాహన వస్తాయి. ఆహారం తీసుకున్న

తర్వాతే శక్తి వస్తుంది. నీళ్ళు తాగిన తర్వాతే దాహం తీరుతుంది. సూర్యుడితో పాటే వెలుగు వస్తుంది. సరిగ్గా ఇదే విధంగా కోరుకోవడంతోనే అర్హత + శక్తి సామర్థ్యాలు + అవగాహన వస్తాయి. కోరుకుంటేనే ఇవన్నీ వస్తాయి. కోరుకున్న తర్వాతే ఇవన్నీ వస్తాయి. ఇవన్నీ వచ్చాక కోరుకోవడం ఉండదు, గుర్తుంచుకోండి !

✪ నాకు దాహం తీరిన తర్వాత నీళ్ళు తాగుతాను. నాకు శక్తి వచ్చాక ఆహారం తీసుకుంటాను అని అంటే ఎలా ఉంటుందో ? అర్హత, శక్తి సామర్థ్యాలు, అవగాహన వచ్చినప్పుడే కోరుకుంటాను అనడం అలానే ఉంటుంది !

మీ కోరికలు సవ్యంగా ఉండేలా చూసుకోండి. మీ కోరిక నెరవేరిన తర్వాత దాని పర్యవసానాలు కూడా సవ్యంగానే ఉండాలి. నిజమైన ఎంజాయ్‌మెంట్‌కు అర్థం ఏమిటంటే - మీ కోరిక తీరి మీరు ఎంజాయ్ చేసిన తర్వాత కూడా అది ఎంజాయ్‌మెంట్‌నే ఇవ్వాలి. ముందు ఎంజాయ్‌మెంట్ ఆ తర్వాత బాధలను కలిగించేది ఎంజాయ్‌మెంట్ ఎలా అవుతుంది ?!

✪ మరోసారి నన్ను దయచేసి చెప్పనివ్వండి, మీరు కోరుకున్నప్పుడు, మీ కోరికే మీకు అర్హతను కల్పించి, అది సంభవించడానికి కావాల్సిన శక్తి సామర్థ్యాలను, అవగాహనను, అంతర్ + బాహ్య వాతావరణాన్ని సృష్టించుకుని, తనకు తానే సంభవం అయి, మీ చేత అనుభవింపబడుతుంది ! అన్ని పరిస్థితులను, ఆమోదాలను, అన్నింటిని మీ కోరికే సృష్టించుకుంటుంది. కోరిక తనను తాను సంభవం చేసుకుని భౌతికంగా మీ అనుభవంలోకి వస్తుంది. కేవలం మీరు మీ కోరికను నిస్సందేహంగా, నిస్సంకోచంగా కోరుకుని దాన్ని అనుమతించి, భౌతికంగా అనుభవించడానికి మీరు రెడి(సిద్ధం) అయితే చాలు. కావలిసినవన్నీ వాటికవే సమకూరి అది భౌతికంగా సంభవించి మీ చేత అనుభవింపబడుతుంది.

✪ మీరు మీ కోరికను స్పష్టంగా తలుచుకుని, నేను నా కోరికను భౌతికంగా అనుభవించడానికి రెడి & ఎమర్జెన్సి అని భావించండి. అంతే ! అది భౌతికంగా తనంతట తానే మీరు కోరుకున్న దాని కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా, ఎంతో బాగా సంభవించి మీ చేత ఆనందంగా అనుభవింప బడుతుంది.

✪ మీ కోరికలను భౌతికంగా అనుభవించడానికి మీరెప్పుడు "రెడి" అయితే అప్పుడే అది తీరుతుంది. అన్నీ సిద్ధంగా ఉంటాయి, మీరు సిద్ధం అయితే చాలు, వాటిని పొందవచ్చు, హాయిగా అనుభవించి ఎంజాయ్ చేయవచ్చు !

మన చైతన్య పుస్తకంలో మనం ఏం వ్రాస్తే అది జరిగి తీరుతుంది

మనం తీసుకున్న, తీసుకుంటున్న స్థిర నిర్ణయాలు లేక కోరికలు మన "లోపలి చైతన్యం"లోకి దిగుతాయి. ఇలా మన "లోపలి చైతన్యంలోకి" దిగిన నిర్ణయాలు(కోరికలు) భౌతిక సంఘటనలుగా వెంటనే సంభవిస్తాయి. మన "లోపలి చైతన్యం" అని అంటే సాక్షాత్తు "మహా మూల చైతన్యమే - Ultra Consciousness'' ! ఈ లోపలి చైతన్యాన్ని "అంతశ్చైతన్యం" లేదా "చైతన్య పుస్తకం" అని కూడా అంటారు. మనం ఏమేం నిర్ణయాలు తీసుకున్నామో చూడాలనుకుంటే ధ్యానంలో చక్కగా, ఒక పుస్తకంలో వ్రాయబడి లేదా ముద్రించబడి ఉన్న మన నిర్ణయాలన్నీ కనిపిస్తాయి. మన అంతశ్చైతన్యం ఒక పుస్తక రూపంలో వాటన్నింటినీ మనకు స్పష్టంగా చూపిస్తుంది. ధ్యానంలో వీటన్నింటినీ ఎప్పుడంటే అప్పుడు, ఎలా అంటే అలా మార్చుకోవచ్చు.

మన చైతన్య పుస్తకంలో మనం ఏం రాస్తే అది జరిగి తీరుతుంది. ధ్యానంలో కూర్చుని నేను నా చైతన్య పుస్తకంలో "ఫలానా నిర్ణయాన్ని" వ్రాయాలనుకుంటున్నాను అని అనుకోండి. వెంటనే మీ ముందు "చైతన్య పుస్తకం" ప్రత్యక్షం అవుతుంది. అప్పుడు మీ నిర్ణయాన్ని లేదా సంకల్పాన్ని లేదా కోరికను లేదా లక్ష్యాన్ని వ్రాయండి. అప్పుడు అది ఏదైనా సరే జరిగి తీరుతుంది. ఎంత పెద్ద లక్ష్యమైనా, ఎలాంటి కోరిక అయినా రాసింది రాసినట్టు జరుగుతుంది. మీకు సంపూర్ణ సమగ్ర పటిష్ఠమైన ఆరోగ్యమైనా, ఐశ్వర్యమైనా, మీ రూపు, రంగు, ఎత్తు , శరీర సౌష్ఠవమైనా, ఏదైనా, దైవత్వమైనా మీరేం వ్రాస్తే అది జరుగుతుంది. మీరు ఏదైనా వ్రాసుకోవచ్చు, మీరు ఏం వ్రాస్తారు అన్నది కాదు విషయం. మీరేం వ్రాసినా జరిగి తీరుతుందన్నది వాస్తవం. కాబట్టి బాగా ఆలోచించుకుని దానిని బాగా మననం చేసి ధ్యానంలో కూర్చోండి. మీ చైతన్య పుస్తకంలో వ్రాయండి అంతే, అది సంభవించి తీరుతుంది - ఇది నాకు 16 అక్టోబర్ 2008 నాడు, ధ్యానంలో పొద్దున 5 నుండి 6 గంటల మధ్యలో "అల్ట్రా కాన్షియస్‌నెస్" నుండి వచ్చిన స్పష్టమైన మెసేజ్ !

మన చైతన్య పుస్తకంలో మనం ఏం వ్రాస్తే అది జరిగి తీరుతుంది !

ఏ కోరికనైనా మీరు కోరవచ్చు, అయితే

ఆ కోరిక సవ్యంగా, దివ్యంగా ఉండాలి !

సాధారణంగా సత్య మార్గంలో ఉన్న వారు లేదా ఆధ్యాత్మికత గురించి ఆలోచించే వారు "కోరికలను" జయించడానికి విపరీత ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఇది ఒక కోణంలో అనవసరమైన ప్రయాస. కోరికలను జయించాలనే మాట నిజమే అయినా, వేటిని జయించాలి, వేటిని తీర్చుకోవాలి అనే వివేకం ఉండాలి. ✪ పుడుతున్న ప్రతీ కోరికను తీర్చుకోవాలని తపించకూడదు, అలా అని ఏ కోరిక లేకుండా ఉండరాదు. కోరిక వల్ల దుఃఖం వస్తుందనే మాట సత్యమే ! అయితే కోరికలు తీర్చుకోడానికే, అనుభవ జ్ఞానం పొందడానికే జన్మనెత్తామన్న సత్యాన్నీ విస్మరించరాదు.

ఏ కోరికనైనా మీరు కోరుకోవచ్చు, దాన్ని తీర్చుకోవచ్చు. కర్మ సిద్ధాంతం ప్రకారం మీ ప్రతీ కోరిక తీరుతుంది. సవ్యంగా లేని కోరికల యొక్క పరిణామాలు మీకు దుఃఖాన్ని కలిగిస్తాయి. సవ్యంగా ఉన్న కోరికలు మీకు ఆనందాన్ని కలిగిస్తాయి. మరి మీరు కోరుకునే కోరిక సవ్యంగా ఉందో లేదోననే విషయం మీకు ఎలా తెలుస్తుంది ? మీ యొక్క కోరిక సవ్యమైనదో కాదోననే విషయాన్ని మీరెలా తెలుసుకోవాలి ? ఏం చేస్తే మీ కోరిక సవ్యమౌతుంది ? అని అంటే....

.... కోరికలు సవ్యంగా ఉంటే మీకు ఆనందాన్ని మాత్రమే కలిగిస్తాయి. కోరికను సవ్యంగా చేయడం పెద్ద విషయం కాదు. మనం కేవలం సవ్యమైన కోరికల గురించి కాకుండా వాటికంటే పరమోన్నతమైన "దివ్యమైన కోరికల" గురించి తెలుసుకుందాం. మనం కేవలం కోరికను సవ్యంగా చేయడమే కాదు "దివ్యంగా" చేసుకుందాం. సవ్యమైన కోరికలు ఆనందాన్నిస్తే, దివ్యమైన కోరికలు బ్రహ్మానందానికి దారి తీస్తాయి. మరి మనందరి అసలు సిసలు ఫైనల్ లక్ష్యం బ్రహ్మానందమే కదా ! అంటే మోక్షమే కదా !

✪ మీరు ఏ సవ్యమైన కోరికనైనా కోరుకోండి, అయితే కోరికకు చివర "మోక్షం కావాలి" అనే విషయాన్ని జోడించండి అంతే ! ఆ కోరిక దివ్యంగా మారిపోతుంది.

ఉదాహరణకు....

మీకు ఆరోగ్యం కావాలనుకోండి అప్పుడు - "నాకు ఆరోగ్యం + మోక్షం కావాలి" అని కోరుకోవాలి.

మోక్షం, దివ్యత్వం, దైవత్వం, బుద్ధత్వం, నిర్వాణం, పరి నిర్వాణం, మహా పరి నిర్వాణం, ఏకత్వం, బ్రహ్మానుభూతి, బ్రహ్మానుభవం, ఆత్మ సాక్షాత్కారం, పరమ ప్రాప్తం, పరిపూర్ణత్వం ఇవన్నీ ఒకటే !

మీకు ఐశ్వర్యం కావాలనుకోండి అప్పుడు మీరు - "నాకు ఐశ్వర్యం + మోక్షం కావాలి" అని కోరుకోవాలి.

✪ ఇలా మీరు ఏం కోరుకున్నా, చివరికి ఒక అందమైన భాగస్వామితో మీరు సెక్స్ సుఖం కోరుకుంటున్నా సరే - "నాకు ఫలనా వారితో లేక సరిగ్గా అలాంటి వారితో సెక్స్ ఆనందం + మోక్షం కావాలి" అని కోరుకోవాలి. అక్రమ సంబంధాలలో కాకుండా సక్రమ సంబంధాలలో సెక్స్ సుఖాన్ని కోరుకోండి. అక్రమం అంటే ఏంటో మీకు చెప్పాల్సిన అవసరం లేదు కదా ! దొరికితే అందరూ దొంగలే ! దొరకనంత వరకు దొర ! ఎవరి ఫ్రీ విల్ వారిది. ఎవరినీ ఏమీ అనలేం. కాకపోతే నేను చెప్పేదేమిటంటే - అక్రమం అనేది ప్రస్తుత భూ కాల పరిస్థితులలో అభిలషణీయం కాదు. అక్రమం ముందు సుఖాలను ఇచ్చినా ఫైనల్‌గా... గ్యారంటీగా బాధలనే ఇస్తుంది. అక్రమ సంబంధం అంటే ఏమిటి ? అని అమాయకంగా ప్రశ్నించి, తెలియనట్టు నటించకండి. ఎవరి కర్మ(లర్నింగ్) వారిది. మనం తప్పు పట్టకుండా ఉంటే చాలు. మనం చేయకుండా ఉంటే చాలు. ఈ అక్రమార్కులలో నీతులు చెప్పే వాళ్ళే 90% ఉంటారు. ఆదికి ముందే భుజాలు తడుముకుంటూ ఉంటారు. నేను చెప్పేది నేను చెప్పాను... ఇక మీ ఇష్టం !

మీ కోరిక ఏదైనా సరే దానికి "మోక్షాన్ని" చేర్చండి. అప్పుడు ఆ కోరిక ఆటొమెటిక్‌గా సవ్యంగా + దివ్యంగా మారిపోతుంది.

✪మీ కోరికలు తీర్చుకునే శక్తి మీకుంది అని నేను క్లాస్‌లు చెప్పగానే ఎంతో మంది స్త్రీ పురుషులు నన్ను విడిగా కలిసేవారు. అందరూ నన్ను కేవలం గుప్తంగా, సీక్రెట్‌గా సెక్స్ పార్ట్‌నర్‌ను వెతుక్కోవడం ఎలా ? ఇలా చేయడం ద్వారా ఆధ్యాత్మికంగా ఏమైనా తప్పా ? మొదలైన ప్రశ్నలు వేసే వారు. వారికి వివాహాలై పిల్లలు కూడా ఉంటారు. సమాజంలో బయటకు చాలా హుందాగా ఉంటారు. నేను గుప్త సంబంధాలను ఎంకరేజ్ చేయను, దమ్ముంటే బాహాటంగా చేయండి అని చెప్పే వాడిని. చిత్రాతి విచిత్రం ఏమిటంటే - ఇలా అడిగిన వారిలో ఒక్క అమ్మాయి కానీ ఒక్క అబ్బాయి కానీ లేరు. కేవలం అందరూ వివాహాలై పెద్ద పిల్లలున్న స్త్రీ పురుషులే ! సరే ఇక.... నేను ఈ పుస్తకంలో

మీరు ఏ కోరికలైనా తీర్చుకోవచ్చు అని అంటే అవి సవ్యమైనవి మాత్రమేనని అర్థం చేసుకోండి.

మీ అందరి, అన్ని కోరికలు అత్యంత శీఘ్రంగా, మహాదానందకరంగా నెరవేరుగాక !

కోరిక నెరవేరడం, నెరవేరకపోవడం అంటూ ఏమీ ఉండదు. కోరికను అనుమతించడం, అనుమతించకపోవడం అనేది మాత్రమే ఉంటుంది. ఇదే సత్యం. కోరికను మీరు అనుమతిస్తే తీరుతుంది, అనుమతించకపోతే తీరదు. అంతే !

అది ఏదైనా సరే సృష్టిలో సృష్టించబడియే ఉంటుంది కాబట్టే "సృష్టి" అని అంటారు. సృష్టి అంటేనే సృష్టించబడి ఉన్నాయని అర్థం. ఆల్‌రెడీ సృష్టించబడి సిద్ధంగా ఉన్న వాటినన్నింటినీ కలిపి "సృష్టి" అని అంటారు. అలా సృష్టించబడి సిద్ధంగా ఉన్న వాటికి సంబంధించిన ఆలోచనలు మాత్రమే వస్తాయి. ఒక ఆలోచన వచ్చిందీ అంటే అది అప్పటికే సృష్టించబడి ఉందని అర్థం. మనం ప్రత్యేకంగా సృష్టించాల్సిన అవసరం ఏమీ లేదు. కేవలం మనం "ఎన్నుకోవాలి" తర్వాత దానిని "పూర్ణంగా అనుమతించాలి" అంతే !

ఆలోచన అనేది విత్తనం. మనం స్వీకరించి అనుమతించినప్పుడు అది సఫలంగా మారుతుంది, అంటే పరిస్థితిగా మారుతుంది.

✪ **అత్యంత ముఖ్య విషయం :** ఏదైనా ఒక కార్యం నెరవేరాలి అంటే అది ముందు "లోపల" జరగాలి. మనం చేయాల్సిన పని ముందుగా మన కోరికను "లోపల" ఊహించాలి. ఊహించడం, భావించడం అని అంటే, ఆలోచించడం ! మీకు వీలైనంతగా మీరు, మీ కోరిక నెరవేరినట్టుగా ఆలోచించండి. అంతే. చాలు. ఇక దాన్ని మీ మూల చైతన్యం నెరవేర్చియే తీరుతుంది. దాన్ని మీరు పొందియే తీరుతారు.

✪ ఊహించడం అంటే అనుమతించడం అని అర్థం. అది సంభవించేలా చేయడమని అర్థం.

✪ ఆలోచించడం, ఊహించడం, భావించడం అంటే ఆలోచనా రూపంలో ఉన్న కోరికను భౌతిక పరిస్థితిగా, భౌతిక అనుభవంగా మారేందుకు అనుమతించడమే.

✪ ఆలోచించడం, ఊహించడం, భావించడం, సిద్ధం కావడం, అనుమతించడం ఇవన్నీ ఒక్కటే !

✪ మన కోరిక నెరవేరుతుందని విశ్వసించడమంటే అది నెరవేరడానికి ఒప్పుకోవడమే !

✪ ముందు మానసికంగా ఆ పని జరగాలి.

✪ ముందు మనసులో ఆ కోరికను నెరవేర్చుకోవాలి.

✪ ముందు మనసు లోపల ఆ కోరికను అనుభవించాలి. అంతే ! ఆటోమెటిక్‌గా ఆ కోరిక భౌతికంగా తీరుతుంది.

మీ కోరికను ఊహిస్తూ, ఊహల్లో దాన్ని అనుభవించడమే, దాన్ని భౌతికంగా అనుభవించేందుకు సిద్ధం కావడమే - ఇంతే మనం చేయాల్సిన పని. ఆటోమెటిక్‌గా ఆ కోరిక భౌతికంగా నెరవేరుతుంది.

కోరిక తీరినట్టుగా, కోరిక తీరిపోయిన తర్వాత చివరి పరిస్థితిని ఊహించాలి. ఎలా అంటే ఉదాహరణకు ఒక విద్యార్థి లక్ష్యం గోల్డ్ మెడల్ సాధించడం అని అనుకోండి. అప్పుడు ఆ విద్యార్థి తనకు గోల్డ్ మెడల్ వచ్చిన తర్వాత ఫ్రెండ్స్ అందరికీ గోల్డ్ మెడల్ వచ్చినందుకు పార్టీ ఇస్తున్నట్టు ఊహించుకోవాలి. ఎండింగ్ పరిస్థితిని ఊహించుకోవాలి. మహాత్ముడు రిచర్డ్ బాక్ చెప్తాడు - ''ఏదైనా ఒక కార్యాన్ని సులువుగా మీరు చేయాలనుకుంటే, ముందుగా ఆ పని జరిగిపోయినట్టుగా చూడండి" అని అంటాడు. అంటే ఎండింగ్‌ను ఊహించండి అని చెప్తాడు. సేత్ పరమాత్ముడు కూడా ఇదే విషయాన్ని వివరిస్తాడు. ఎవరైనా ఇదే చెప్తారు ఉన్న సత్యం ఇదే కాబట్టి.

మనం ఒక కోరికను కోరుకుని, దానికి ఒక స్పష్టమైన రూపాన్నిచ్చి, అది తీరిన తర్వాత పరిస్థితిని మాత్రమే ఊహించినప్పుడు, మన "అంతశ్చైతన్యంలో" నుండి దానికి తగిన శక్తి సామర్థ్యాలు ఉత్తేజితమై దానికి సంబంధించిన అనుకూలమైన పరిస్థితులను ఆకర్షించి ఆ కోరికను తీరుస్తాయి.

అయితే అందరూ ముందుగా, "ముందు పరిస్థితులను" ఊహించడం మొదలు పెడతారు. ఇదే తప్పు ! ఇలా జరగడం చాలా కష్టం. స్టార్టింగ్‌ను ఊహించనే కూడదు. స్టార్టింగ్‌ను ఆలోచించనే కూడదు. కేవలం ఎండింగ్‌ను మాత్రమే ఆలోచించాలి. అప్పుడు పరిస్థితులు ఆటోమెటిక్‌గా మిమ్మల్ని చుట్టుముడుతాయి. అప్పుడు ఆ పరిస్థితులను అనుమతిస్తూ, ఆ పరిస్థితులకు సంబంధించిన కార్యాచరణను చేస్తూ మీరు ముందుకు కొనసాగుతూ ఉండాలి. మధ్యలో కోరికను ఉపసంహారం(డ్రాప్) చేయవద్దు. అనుమానాలు ప్రకటించవద్దు. 100% పాజిటివ్‌గా ఉంటూ ముందుకు సాగి పోవాలి.

ఒక్కోసారి పరిస్థితులు ఎలా వస్తాయంటే, ఇక ఏ మాత్రమూ ముందుకు పోలేము అన్నట్టుగా వస్తాయి. అన్ని దారులు మూసుకు పోయినట్టు కనిపిస్తాయి. అంతా అయిపోయింది, ఓడిపోయాము అని అనిపిస్తుంది. గుర్తుంచుకోండి, విజయ రహస్యం ఏమిటంటే "ఓటమిని అంగీకరించకుండా ఉండడమే" ! మనం ఓడిపోయినట్టుగా భావిస్తేనే, ఓడిపోయినట్టు అంగీకరిస్తేనే ఓటమి వస్తుంది.

జరుగుతున్న పరిస్థితులను ఎరుకతో, సాక్షిగా, ధీమాగా చూడాలి అంతే కాని లోపల మాత్రం ఓటమిని ఎప్పుడూ అంగీకరించకూడదు, అనుమతించకూడదు.

అసలు నిజానికి ఓటమి అనేదే లేదు. విజయం ఒక్కటి మాత్రమే ఉంది ఉనికిలో ! ఓటమి అంటే పని పూర్తి కాకుండానే మధ్యలో డ్రాప్ అయిపోవడం. మధ్యలో విరమించుకోవడాన్నే ఓటమి అని అంటారు.

ఓటమి లేక ఫెయిల్యూర్ లేక వైఫల్యం అంటే - అనుభవ జ్ఞానాన్ని పొందడం. వైఫల్యం అనేది విజయానికి సంబంధించిన విజ్ఞానాన్ని అందిస్తుంది. మన లోపాలను ఎత్తి చూపుతుంది. వాటిని సరి చేసుకుని ముందుకు సాగమని చెప్తుంది, దాన్నే వైఫల్యం అని అంటారు.

వైఫల్యం - సఫలం అనేవి ఒకే దాని రెండు చివరలు. వైఫల్యం నుండి ప్రయాణం మొదలై సఫలం దగ్గర ముగుస్తుంది అంతే !

ఫెయిల్యూర్ అనేది ఎరువు, సక్సెస్ అనేది ఫలం !

వైఫల్యాలు మనకు తర్ఫీదును ఇస్తాయి. మనల్ని తీర్చిదిద్దుతాయి. మనల్ని రాటు దేలుస్తాయి. మన లోపాలను సరి చేస్తాయి. మన బలహీనతలను బలాలుగా మార్చుతాయి. మనకు విజయాన్ని అనుభవించే అర్హతను పెంపొందించి, శక్తి సామర్థ్యాలను ఇచ్చి మన చేత విజయాన్ని అనుభవింపజేస్తాయి.

ఆగిపోతే విఫలం, ముందుకు సాగితే సఫలం !

మన కోరికను మనం 100% పూర్తి చైతన్య స్పృహతో అంగీకరించినప్పుడు, మన కోరిక భౌతిక రూపం ధరించబోయే ముందు ధనంగా + సహకరించే వ్యక్తులుగా + అనుకూల పరిస్థితులుగా + సౌకర్యాలుగా + సహాయ సహకార సమన్వయాలుగా రూపాంతరం చెందుతుంది. మన కోరిక ఫిజికల్‌గా తీరే ముందు తీసుకునే ఒకానొక రూపమే "డబ్బు" ! డబ్బు అనేది సపరేట్‌గా ఎక్కడి నుండో రాదు. మీ కోరిక యొక్క రూపాంతరమే డబ్బు. మీ కోరిక యొక్క మరో రూపమే డబ్బు. ప్రస్తుత ఈ వర్తమాన కాలంలో - మీ కోరిక నెరవేరే ముందు డబ్బుగా పరిణమిస్తుంది. ఎందుకంటే ఇప్పుడు డబ్బు అనేది చెలామణిలో ఉంది కాబట్టి. ఒక వేళ డబ్బు చెలామణిలో లేదంటే, "ఏది" చెలామణిలో ఉందో "దానిగా" రూపాంతరం చెందుతుంది.

మీ కోరికయే డబ్బుగా రూపు దాలుస్తుంది. మీ కోరికయే డబ్బు ! డబ్బు అనేది మీ కోరిక యొక్క కార్య రూపమే !

డబ్బు సమస్యలు వాస్తవానికి డబ్బు సమస్యలు కావు. డబ్బు సమస్యలు నిజానికి జీవన సమస్యలు. స్వేచ్ఛకు, సాధికారతకు సంబంధించిన సమస్యలు. మీ కోరికయే డబ్బు. మీ కోరికను మీరు పూర్తిగా తీర్చుకోవాలి అని, 100% చైతన్య స్పృహతో మీరు డిసైడ్ అయినప్పుడు ఆటోమెటిక్‌గా మీ చేతిలోకి డబ్బు వస్తుంది. ముందు 100% డిసైడ్ అయిపోవాలి. బలంగా కోరుకుంటూ ఉండాలి. అప్పుడు ఆటోమెటిక్‌గా మీ కోరిక నెరవేరే పరిస్థితులు మీ జీవితంలోకి ప్రవేశిస్తాయి. కోరిక నెరవేరే పరిస్థితులు వచ్చిన తర్వాత కోరుకోవడం లేక కోరిక తీరడం అంటూ ఉండదు. ముందు మీ కోరికను మీరు నిజంగా 100% తీర్చుకోవడానికి ఉద్యుక్తమైనప్పుడు డబ్బు ఇంకా ఇతర అవసరమైన రూపాలను ధరించి మీ కోరిక మీ జీవితంలోకి ప్రవేశిస్తుంది. అప్పుడు ఆ పరిస్థితులను అర్థం చేసుకుని ఆ పరిస్థితుల గుండా మీరు ముందుకు సాగినప్పుడు, మీ కోరిక నెరవేరుతుంది.

సుమారుగా అందరూ ఏం చేస్తారంటే ఏదో ఒక కోరిక కోరుకుంటారు. డబ్బు వస్తే దాన్ని తీర్చుకుందాం అని అనుకుని డబ్బు కోసం ఎదురు చూస్తూ ఉంటారు. డబ్బు వస్తే కానీ పని జరగదు అని అనుకుని, డబ్బు కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఇది ఎలా ఉంటుందంటే... నీరసంగా ఉన్నవాడు, శక్తి వచ్చాక ఆహారం తీసుకుంటాను అన్నట్టుగా !

మీకు ఆకలి వేస్తూ ఉంది. మీరు నీరసంగా ఉన్నారు. ఇప్పుడు మీరు ఆహారం తీసుకుంటేనే కానీ మీకు శక్తి రాదు. ఎందుకంటే ఆహారమే శక్తి గనుక ! ఆహారం తీసుకుంటే మీరేం చేయనక్కరలేదు. లోపల సిస్టమ్ ఆటోమెటిక్‌గా పని చేస్తుంది. ఆహారాన్ని జీర్ణం చేసి వ్యర్థ పదార్థాన్ని ఒక పక్కకు పంపించి, మిగతా దాన్ని శక్తిగా మార్చి మీకు ఇస్తుంది. నిజానికి ఈ ప్రాసెస్ అంతా మీకు కనపడదు. అసలు ఈ ప్రాసెస్ గురించి మీకేమాత్రం తెలియదు. అయినా జరిగిపోతుంది. ఇదే విధంగా నిజంగా మీరు కోరుకుంటే మీ పనులు అన్నీ ఆటోమెటిక్‌గా జరిగిపోతాయి. ఇక్కడ మీరు తీవ్రంగా కోరుకుని కోరికకు 100% అంకితం కావడమే ప్రధానం.

✪✪✪ మీకు శక్తి కావాలంటే ముందు మీరు ఆహారం తీసుకోవాలి. ఆహారమే శక్తిగా పరిణమిస్తుంది. ఆహారమే శక్తి. ఆహారం తీసుకోవడం యొక్క పర్యవసానమే శక్తి. శక్తి రక రకాల రూపాలలో ఉంటుంది. మీరు నీళ్ళు తాగితే దాహం తీరుతుంది. డైరెక్ట్‌గా దాహం తీరడం అనేది ఎక్కడా ఉండదు. నీళ్ళు తాగడం యొక్క పర్యవసానమే దాహం తీరడం. నీళ్ళు తాగడమే దాహం తీరడం. ఆహారం తీసుకోవడమే శక్తిని పొందడం. ఒక కోరికను కోరుకోవడం అంటే దానిని పొందడానికి కావల్సిన శక్తి సామర్థ్యాలను + అవగాహనను కోరటమే. కోరిక అంటే శక్తి సామర్థ్యాలు + అవగాహనయే. ఒక కోరికను కోరుకోవటం, దానికి సంబంధించిన శక్తి సామర్థ్యాలను + అవగాహనను వేరేగా కోరుకోవటం

అనేది ఉండదు. మీ కోరికను సంభవింపచేసుకోడానికి ప్రత్యేకంగా ఒక రకమైన శక్తి సామర్థ్యాలు, దానిని హాయిగా అనుభవించడానికి కావల్సిన శక్తి సామర్థ్యాలను పొందటానికి వేరేగా, ప్రత్యేకంగా సాధన చేయాల్సిన అవసరం లేదు. ఒక కోరికను కోరుకోవడం అంటే దాన్ని సంభవింపజేసుకోడానికి కావల్సిన మరియు దానిని హాయిగా అనుభవించడానికి కావల్సిన శక్తి సామర్థ్యాలను + అవగాహనను అన్నింటిని కలిపి ఒకే సారి కోరుకున్నట్టే. కోరికను కోరుకోవడం అంటే దాన్ని సంభవింపజేసుకోవడం + అనుభవించడం అనే రెండింటిని కోరుకోవడం అన్నట్టే. ఉదాహరణకు మీరు ఒక స్త్రీని ప్రేమిస్తున్నారు, ఆ స్త్రీని కోరుకున్నప్పుడు, మీకు ఆ స్త్రీ లభించటంతో పాటు, ఆ స్త్రీని తనివి తీరా, హాయిగా, ఆనందంగా, సురక్షితంగా ప్రేమించే, అనుభవించే శక్తి సామర్థ్యాలు + ఆ స్త్రీని ఆనందింపచేసే శక్తి సామర్థ్యాలు కూడా వస్తాయి. ముందు స్త్రీ లభించడం ఆ తర్వాత ఆమెతో ఆనందించేందుకు కావల్సిన శక్తి సామర్థ్యాలను ప్రత్యేకంగా కోరుకోవడం అంటూ ఏమీ ఉండదు. రెండూ ఒకే సారి సంభవిస్తాయి. మీరు ఐశ్వర్యాన్ని కోరుకున్నప్పుడు, ఐశ్వర్యాన్ని పొందేందుకు మరియు అనుభవించేందుకు కావల్సిన శక్తి సామర్థ్యాలు ఒకే సారి వచ్చేస్తాయి. అయితే మీ కోరిక ధర్మ బద్ధంగా ఉండాలి, సవ్యంగా ఉండాలి. హైయర్ స్పిరిచ్యువల్ లెక్చర్‌లు ఇవ్వకండి, హైయర్ లెవెల్ మాస్టర్స్ ఏం చేసినా కరెక్టే కదా అని మీరు కూడా చేయడానికి పూనుకోకండి. పులిని చూసి నక్క వాతలు పెట్టుకుంటే ఏమవుతుందో మీకు బాగానే తెలుసు.

✪✪✪ గుర్తుంచుకోండి, కోరిక సంభవించడానికి + అనుభవించడానికి కావల్సిన శక్తి సామర్థ్యాలు, అవగాహన కోరికను కోరుకోవడంతో పాటే వచ్చేస్తాయి.

✪ ఒక కోరికను ఎంచుకుని కోరుకోవడమే మీరు చేయాల్సింది. కోరుకున్న తర్వాత కోరికయే తనను తాను సంభవింపజేసుకోవడమే కాకుండా తనను మీరు అనుభవించి ఎంజాయ్ చేయడానికి కావల్సిన శక్తి సామర్థ్యాలను + అవగాహనను కూడా కోరికయే మీకు ఇస్తుంది. కోరిక నెరవేరడానికి మీరు ఎవరినో ప్రార్థించనక్కరలేదు. మీరు కోరుకుంటే, మీరు అనుమతిస్తే, మీరు అనుభవించడానికి రెడి(సిద్ధం) అయితే కోరిక తనంతట తానే సంభవించి, మీ చేత అనుభవింప బడుతుంది. ✪

✪ కోరిక అంటేనే శక్తి సామర్థ్యాలు + అవగాహన ✪

✪✪✪ కోరుకోవడం అంటే పొందడం అన్నట్టే. "కోరుకోవటమేపొందటం". కోరికను 100% పూర్తి చైతన్య స్పృహతో "కోరుకోవడమేతీర్చుకోవడం" !

మీకేం కావాలో అది కోరుకోండి, డబ్బు కాదు. ఉదాహరణకు మీకు స్వంత ఇల్లు కావాలనుకోండి, అప్పుడు సాధారణంగా అందరూ ఏం చేస్తారంటే డబ్బుంటేనే కదా ఇల్లు కట్టుకోవడమో లేక

కొనుక్కోవడమో జరిగేది కాబట్టి డబ్బు కావాలని కోరుకుంటారు. ఇక్కడే పొరపాటు జరిగి పోతుంది. ఇలా కోరుకోకూడదు. మీకు స్వంత ఇల్లు కావాలని కోరుకోండి, అప్పుడు దానికి సంబంధించినవన్నీ మీకు సమకూరుతాయి. అంటే డబ్బు, స్థలం, ఇంజనీరు, కాంట్రాక్టర్ ఇలా నిర్మాణానికి అవసరమైన వ్యక్తులు మరియు అనుకూలమైన పరిస్థితులు మీ జీవితంలోకి ప్రవేశిస్తాయి.

మీకు ఆర్థిక స్వాతంత్ర్యం కావాలంటే "స్వతంత్రంగా జీవించాలని కోరుకోండి", అప్పుడు మీకు ఉద్యోగమో లేక వ్యాపారమో మీరు చేయగలిగేది ఏదో ఒకటి మీకు అందుతుంది. మీరు హాయిగా, ఆనందంగా, ఎవరి పైనా ఆధారపడకుండా జీవించాలని బలంగా కోరుకోవాలి. అప్పుడు మీకు గొప్ప ఆర్థిక స్వాతంత్ర్యం వస్తుంది అంటే బాగా డబ్బు మీకు అందుతుంది. సుమారుగా అందరిలో ఒక అభిప్రాయం ఉంటుంది. అదేమిటంటే - హాయిగా జీవించాలని ఎవరికి ఉండదండి ? అలా అందరూ జీవించలేరు. హాయిగా జీవించడానికి ప్రాప్తం ఉండాలి. అయినా అది కోరుకోగానే అయ్యే పని కాదు అని రక రకాల సరి కాని అభిప్రాయాలు + నమ్మకాలు పెట్టుకుని ఉంటారు. వీరి అభిప్రాయాల + నమ్మకాల ప్రకారమే జరుగుతుంది వీరికి.

ముందు మీరు మీ జీవితాన్ని ప్రేమించండి. మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. అప్పుడు మీరు ఆటొమెటిక్‌గా ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో తులతూగుతారు.

జీవితం పట్ల ప్రేమ లేకనే జీవితంలో కష్టాలుంటాయి. మీ మీద మీకు ప్రేమ లేనందుకే మీ శరీరంలో సమస్యలు ఉంటాయి. కేవలం మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం వలన ఆశ్చర్యకరమైన రీతిలో, అనూహ్యంగా ఆరోగ్య ఐశ్వర్యాలను పొందుతారు. మిమ్మల్ని మీరు గాఢంగా ప్రేమించుకోండి, మీ పట్ల మీరు గాఢమైన ప్రేమను ప్రకటించుకోండి అప్పుడు చూడండి అద్భుతాలను !

మీరు కోరుకుంటారు, అది నెరవేరే పరిస్థితులు వస్తాయి. వాటి గుండా మీరు ముందుకు సాగుతారు. అది నెరవేరుతుంది. అంతే !

మీరు ఏదైనా కోరిక కోరుకున్నప్పుడు అది నెరవేరడం లేదంటే, అడ్డంకులు మీ లోపలే ఉన్నాయని గ్రహించండి. అడ్డంకులన్నీ మానసికంగానే ఉంటాయి. భౌతికంగా ఏవీ ఉండవు. మీ లోపల ఉన్న అడ్డంకులే బయట వ్యక్తుల రూపంలో, పరిస్థితుల రూపంలో ఎదురు పడతాయి. "యద్భావం తద్భవతి" అంటే ఇదే ! మీ కోరికకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న వ్యక్తులను, పరిస్థితులను విశ్లేషించుకుంటూ, లోపాలు మీ లోపలే ఉన్నాయని గ్రహిస్తూ "సాధన" ద్వారా వాటి మూలాలను క్లియర్ చేస్తూ ముందుకు సాగాలి.

మీరు కోరుకునే కోరికను మీరే అనుభవించాల్సి వస్తుంది. కాబట్టి "సరి అయిన కోరికలే కోరుకోవాలి". "శ్రేయస్కరమైన కోరికలే కోరుకోవాలి". మీ కోరిక, "మీకు + పది మందికి ఆనందాన్ని

ఇచ్చేదిగా ఉండేలా" కోరాలి. కర్మ(కార్య) సిద్ధాంతం ప్రకారం మీ ప్రతీ కోరిక నెరవేరుతుంది. ఇది సత్యం.

కోరిక స్వచ్ఛంగా ఉండాలి. అందులో ప్రేమ, స్వేచ్ఛ ఉండాలి. ఇతరులకు ప్రయోజనకరం కాకపోయినా ఫరవాలేదు కానీ ఇతరులకు హానికరం కాకూడదు. ఒకరు తమ వశంలో ఉండాలనో లేక ఇతరులది ఆశించడమో లేక ఇతరులకు నష్టం కలగాలనో కోరుకుంటే మీకు హాని జరుగుతుంది. ఇతరులకేమీ కాదు. మీకు మాత్రం హాని జరిగి తీరుతుంది.

ఒక అందమైన అమ్మాయిని కోరుకోవడం కానీ, ఒక అందమైన అబ్బాయిని కోరుకోవడంలో తప్పేమీలేదు. కానీ ఫలానా వారే కావాలి అనడంలో ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే మీరు ఒకరిని ఇష్టపడుతున్నారు, వారిని కోరుకుంటున్నారు. వాళ్ళకు చెప్పి చూశారు. రక రకాలుగా ప్రయత్నించి చూశారు అయినా వాళ్ళు ఒప్పుకోలేదు. అప్పుడు వారిని వదిలేయాలి. వేధించకూడదు. మొండిగా ప్రవర్తించి వాళ్ళను ఇబ్బంది పెడితే అంతకు అంతా మీరు అనుభవిస్తారు. మీకు ఏ మాత్రం ఇష్టంలేని వాళ్ళు మీ వెంట పడతారు. అప్పుడు తెలుస్తుంది ఇబ్బంది ఏమిటో !

వాళ్ళు ఒప్పుకోకపోతే వేరొకరు, మీరు డ్రాప్ కాకుండా ఉంటే మీరు కోరుకుంటున్న విధంగా ఉన్నవారు మీకు దొరికి తీరుతారు. వాళ్ళు మిమ్మల్ని ఇష్టపడతారు. మీ కోరిక తీరుతుంది.

గుర్తుంచుకోండి, ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే మన స్వేచ్ఛకు కూడా భంగం కలుగుతుంది.

పోటీ కోసమో, అహంభావంతోనో, గొప్ప చూపించుకోవడం కోసమో, ఇతరులను అవమానపరచడం కోసమో కోరుకోకూడదు. ఇలాంటి కోరికలు ఏ నాటికీ నెరవేరవు. పైగా మీరే నవ్వుల పాలయ్యే అవకాశం ఉంది.

మీ కోసం కోరుకోండి లేదా మీ కోసం + ఇతరుల కోసం కోరుకోండి అప్పుడు అంతా శుభమే జరుగుతుంది. మీరు ఇతరులకు ఏది జరగాలని కోరుకుంటారో మీకూ అదే జరుగుతుంది. ఇతరులకు మంచి కోరుకుంటే మీకు మంచి, చెడు కోరుకుంటే చెడు జరుగుతుంది. మీరు కోరుకున్న కోరిక నెరవేరడం లేదంటే మీ లోపల ఏదో గుణం లేక గుణాలు, నమ్మకాలు అడ్డం పడుతూ ఉంటాయి.

మిమ్మల్ని మీరు నిశితంగా పరిశీలించుకోండి. ఒక్క సరి కాని గుణం, ఒక్క సరి కాని నమ్మకం ఉన్నా చాలు అడ్డం పడడానికి. ధ్యాన సాధన - 3 చేస్తే అది ఏమిటో బయట పడుతుంది. శాశ్వతంగా క్లియర్ అయిపోతుంది.

అత్యంత ముఖ్య విషయం ఏమిటంటే మీ లోపాన్ని మీరే స్వయంగా పరిశీలించి, పరిశోధించి కనుక్కోవాలి. ఇది చాలా కష్టమైన పని. మనకు ఇతరుల లోపాలు కనపడినంత సులభంగా మన లోపాలు మనకు కనపడవు. నిజానికి కనపడతాయి. కానీ మనమే చూడము. వాటిని లోపాలుగా పరిగణించం, ఒప్పుకోం.

ఒక వ్యక్తి తన లోపాలు తాను ఒప్పుకోవాలంటే చాలా ధైర్యం ఉండాలి. ధైర్యం అంటే సత్యాన్ని అంగీకరించడం. సత్యం అంటే ఉన్న విషయం, ఉన్నదేదో అది. సత్యాన్ని ఒప్పుకోవడమే ధైర్యం. సత్యాన్ని ప్రకటించడమే ధైర్యం. సత్యంతో ఉండడమే ధైర్యం. సత్యంగా ఉండడమే ధైర్యం. చాలా సాహసవంతమైన చర్య ఇది.

పది మందిని కొట్టడం ధైర్యం అనిపించుకోదు. అది క్రూర గుణం. ఏదైనా పెద్ద దొంగతనం చేయడాన్ని సాహసం అనరు, అది నేర స్వభావం.

తన లోపాలు తాను గుర్తించడానికి పూనుకోవడమే సాహసం. గుర్తించిన లోపాన్ని అంగీకరించడమే ధైర్యం. పది మంది శ్రేయస్కరం గురించి ఆలోచించడమే సాహసం. అందుకు ఉద్యమించడమే ధైర్యం.

కోరిక కోరుకున్న తర్వాత...

నిర్ణయించుకున్న తర్వాత...

లక్ష్యం పెట్టుకున్న తర్వాత...

మీరొక కోరిక కోరుకుంటారు, కోరుకోవడమే పొందడం కాబట్టి, పొందుతారు. కోరుకోవడమూ, నిర్ణయించు కోవడమూ, లక్ష్యం పెట్టుకోవడమూ అనేవి అన్నీ ఒకటే ! ఒక కోరిక మీచేత కోరబడిన తర్వాత అది భౌతిక రూపం తీసుకోబోయే ముందు దాని డైనమిక్స్ ఎలా ఉంటాయో, అది ఏ ఏ రూపాలను తీసుకుంటూ, ఎలాంటి పరిస్థితులను సృష్టించుకుంటూ అది సంభవిస్తుందో మీకు తెలియదు. ఈ విషయాలు తెలియక పోవడం వల్లనే చాలా మంది అయోమయానికి గురవుతారు. మీరు కోరుకుంటారు, ఆ తర్వాత అది సంభవించబోయే పరిస్థితులను మీరు ఓ రకంగా ఊహిస్తారు అయితే అది "సరైన ఊహ" అయితే ఫర్వాలేదు కానీ, సరి కానిదైతే అడ్డంకి అయి కూర్చుంటుంది. మీ జ్ఞాన పరిధిలో లేని పరిస్థితులు మిమ్మల్ని చుట్టుముట్టే సరికి తెలియని తనంతో మీరు వాటిని తిరస్కరిస్తారు. అప్పుడు మీ కోరిక సంభవించకుండానే ఆగిపోతుంది.

ఎలా అంటే...

ఒక యువతి ఉంది. ఆమెకు సడన్‌గా సంతానాన్ని పొందాలని కోరిక కలిగింది. అయితే ఆమెకు సంతానం ఎలా కలుగుతుందో, గర్భం ఎలా వస్తుందో, గర్భం వచ్చిన తర్వాత పరిస్థితులు ఏమిటో ఆమెకు తెలియనే తెలియదు. చివరికి, సంతానానికి ఆమెనే జన్మనిస్తుందన్న సంగతి కూడా ఆమెకు తెలియదు. ఇవన్నీ తెలియని ఆమె సంతానం కోరుకుంది. బలంగా, తీవ్రంగా సంతానాన్ని వాంఛిస్తూ ఉంది.

ఇప్పుడేం జరుగుతుందంటే -

ఆమె వైబ్రేషన్స్‌కు సూట్ అయ్యే పురుషులను ఆమెలోని కోరిక, ఆమె వైపు ఆకర్షిస్తూ ఉంటుంది. పురుషులు ఆమెతో సెక్స్ చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఎటు వెళ్ళినా, ఏం చేస్తున్నా ఎవరో ఒక పురుషుడు ఆమెతో సెక్స్ చేసే సందర్భాలే ఆమెకు ఎదురవుతూ ఉంటాయి. ఆమె కంగారు పడుతూ ఉంటుంది. ఇదేంట్రా దేవుడా... నేను సంతానాన్ని కోరితే పురుషులు నా వెంట పడుతున్నారు అని ఆమె ఆందోళన చెందుతూ, వాళ్ళను తప్పించుకుంటూ ఉంటుంది. ఆమె కోరిక ప్రకారమే పురుషులు ఆమె వెంట పడుతున్నారన్న సంగతి ఆమెకు తెలియదు. ఇలాంటి పరిస్థితులను ఆమె బలంగా తిరస్కరిస్తే ఆమె కోరిక నెరవేరదు కదా ! ఒక వేళ ఆమె ఇలాంటి పరిస్థితులలో ఉంటూ కూడా, ఇంకా బలంగా సంతానాన్ని కోరుకుంటూ ఉంటే, చివరికి ఒక రోజు తప్పనిసరి పరిస్థితులు సంభవించి ఆమె ఎవరో ఒక పురుషుడితో సెక్స్ చేయాల్సి వస్తుంది. ఆ తర్వాత ఆమె శరీరంలో మార్పులు జరగడం ప్రారంభిస్తాయి. పురుషుడితో సెక్స్ చేయడం వలన గర్భం వచ్చి స్త్రీకి పీరియడ్స్ ఆగిపోతాయి అన్న సంగతి ఆమెకు తెలియదు. నెలలు నిండుతున్న కొద్దీ ఆమె పొట్ట ఎత్తుగా పెరగడం ప్రారంభం అవుతుంది. శరీరంలో అంతకు

ముందు లేని మార్పులెన్నో జరుగుతూ ఉంటాయి. ఆమెకు విషయాలు ఏవీ తెలియవు... ఆమె కోరికయే సంభవిస్తోంది అని ఆమెకు తెలియదు. విషయాలేవి తెలియని ఆమెకు అన్నీ వ్యతిరేక పరిస్థితుల్లాగే అనిపిస్తూ ఉంటాయి. ఆమె కోరికకు, జరుగుతున్న పరిస్థితులకు ఏ మాత్రం పొంతన కనిపించదు. ఆమె కంగారు పడుతూ ఉంటుంది. వ్యాకులతతో, అయోమయంతో పరిస్థితుల ప్రవాహంలో కొట్టుకు పోతూ ఉంటుంది. ఆమె కోరిక, ఆమెలోనే ప్రాణం పోసుకుని తయారవుతుందన్న సంగతి ఆమెకు తెలియదు.

సృష్టి నియమం ఇలాగే ఉంటుంది. వికాసం ఎప్పుడు కూడా అజ్ఞాతంలోనే, అదృశ్యంగానే జరుగుతూ ఉంటుంది. నేలలో నాటబడిన బీజం పగిలి మొక్క రూపంలో బయటికి వచ్చేంత వరకు జరగాల్సిందంతా భూమిలో కనబడకుండానే జరుగుతుంది. ఒక రోజు సడన్‌గా భూమిని చీల్చుకుని మొక్క మొలకెత్తి పోతుంది. ఒక మొగ్గ ఉండీ, ఉండీ సడన్‌గా ఒక రోజు పువ్వై పోతుంది. ఫలితం తయారయ్యే ప్రాసెస్ ఎప్పుడూ కనపడదు. ఈ విషయాలేవి తెలియని ఆమె నేను సంతానం కోరుకుంటే ఏమేమో జరుగుతూ ఉంది అని అనుకుంటూ ఆశ్చర్యపోతూ ఆందోళన చెందుతూ ఉంటుంది.

చివరికి ఒక రోజు ప్రసవిస్తుంది. ఫలితం ప్రత్యక్షం అయిపోతుంది. ఆమె దిగ్భ్రాంతికి గురవుతుంది. ఆశ్చర్యానందాలతో ఫలాన్ని చూస్తుంది. ఆ తర్వాత మెల్లి మెల్లిగా ఆమెకు విషయాలు అర్థం అవుతాయి. నా కోరిక ప్రకారమే ఇవన్నీ జరిగాయని !

✪✪✪ మీరు ఒక కోరికను కోరుకున్నప్పుడు, అది సంభవించడానికి అవసరమైన పరిస్థితులను మీరు అనుమతించి తీరాలి.

✪✪✪ మీరు ఒక కోరికను కోరుకున్నప్పుడు అది సంభవించడానికి అవసరమైన పరిస్థితులను కూడా అనుమతించినట్టు అవుతుంది.

ఉదాహరణకు, మీరు హైదరాబాద్‌లో ఉన్నారు. మీరు తిరుపతికి వెళ్ళాలని కోరుకున్నారు. అప్పుడు మీరు "హైదరాబాద్ నుండి తిరుపతికి మధ్యలో గల మార్గాన్ని అంతా అనుమతించినట్టు అవుతుంది" కదా ! ఆ మార్గంలోని పరిస్థితులను దాటుకుంటూ, ఆ మార్గాన ప్రయాణం ఆగకుండా చేసినప్పుడే మీరు తిరుపతికి చేరుకోగలుగుతారు. మార్గంలో రాళ్ళు ఉండవచ్చు, ముళ్ళు ఉండవచ్చు, అక్కడక్కడా బురద ఉండవచ్చు,

పూలు ఉండవచ్చు, ఎండ ఉండవచ్చు, నీడ ఉండవచ్చు, వర్షం పడవచ్చు పడకపోవచ్చు, రాత్రి కావచ్చు, పగలు కావచ్చు - ఏమైనా ఉండవచ్చు. మీరు తిరుపతికి వెళ్ళాలని కోరుకుంటే ఆ మార్గంలో ఉన్నవాటిని అన్నింటిని దాటుకుంటూ, ఆ పరిస్థితుల ద్వారా వెళ్ళి తీరాల్సిందే కదా ! కాబట్టి కోరికను కోరుకునేటప్పుడు... "నా కోరిక సులభంగా, సరళంగా, సురక్షితంగా ఈ క్షణమే నెరవేరాలి" అని కోరుకోవాలి. నా కోరిక ఎలాగోలా తీరాలి అని అనుకోకూడదు. నా కోరిక హాయిగా ఆనందంగా సురక్షితంగా నెరవేరాలి అని కోరుకోవాలి. ఈ విషయాన్ని చాలా బాగా గుర్తుంచుకోండి.

కోరుకునే ముందు...

గుర్తుంచుకోండి, ఒక కోరికను కోరటం అంటే అది సంభవించడానికి అవసరం అయ్యే పరిస్థితులను కూడా కోరుకోవడమేనని !

మీరు ఒక నది ఇవతల ఉన్నారు, అవతల వైపుకు వెళ్ళాలని కోరుకుంటే, దానిలో ఈదుకుంటూ వెళ్ళాల్సిన పరిస్థితులను కూడా కోరుకున్నట్టే కదా ! మీరు అవతల ఒడ్డుకు వెళ్ళాల్సిన పరిస్థితులను కూడా కోరుకున్నట్టే కదా ! ఒక వేళ మీరు అవతల ఒడ్డుకు వెళ్ళాలనుకున్నప్పుడు, నదిలోని నీళ్ళలో ఈదడం మీకు రానప్పుడు మీరు ఇలా కోరుకోవాలి - "నేను నదిలోని నీళ్ళలో ఈదకుండానే అవతలి ఒడ్డుకు వెళ్ళాలి" అని కోరుకుంటే అప్పుడు మీ కోరికకు అనుగుణంగా అక్కడ నది పైన ఒక బ్రిడ్జ్ ఏర్పడుతుంది. లేదా హెలికాప్టర్‌లో అవతలి ఒడ్డుకు వెళ్ళిపోతారు సురక్షితంగా ! అందుకే కోరుకునేటప్పుడు జాగ్రత్తగా కోరుకోవాలి. లేక పోతే ఈత నేర్చుకోవాల్సి వస్తుంది. ఈదుకుంటూ పోవాల్సి వస్తుంది. ఈదుకుంటూ వెళ్ళడం మీకు ఇష్టమైతే అది వేరే విషయం.

మీ కోరిక యావత్ సృష్టిని ప్రేరేపిస్తుంది. మీరు కోరుకున్నది భూమి పైన లేనప్పటికీ, మీ కోరికను అనుసరించి అప్పటికప్పుడు సృష్టించబడి మీ ముందుకు వస్తుంది.

మీరు సవ్యమైన రీతిలో కోరుకుంటే సవ్యమైన పరిస్థితులే సంభవిస్తాయి. మీరు సరి కాని విధంగా కోరుకుంటే సరి కాని పరిస్థితులనే మీరు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కోరుకునేటప్పుడు మీ కోరిక సరిగా, సవ్యంగా ఉండేలా చూసుకోండి. కోరుకునేటప్పుడే అది ఎలా తీరాలో కూడా నిర్ణయించుకోండి. "ఎలాగోలా నా కోరిక తీరితే అంతే చాలు" అని కోరుకోకూడదు.

ఉదాహరణకు ఒక వ్యక్తి "ఓదార్పును" కోరుకున్నాడనుకోండి. అప్పుడు ఆ వ్యక్తికి కష్టాలు వచ్చి పడతాయి. ఆ బాధలలో సతమతం అవుతున్నప్పుడు ఇతరులు వచ్చి ఓదారుస్తారు. ఎందుకంటే అతడు "ఓదార్పును" కోరుకుంటున్నాడు కదా ! కష్టాలు వచ్చిన తర్వాతే "ఓదార్పు" అవసరం అవుతుంది. చాలా మంది ఈ సత్యాలు తెలియక, అజ్ఞానంతో "ఓదార్పును", "జాలిని", "సానుభూతి" లేక "Sympathy" మొదలైనవి కోరుకుంటూ ఉంటారు. ఇలా కోరుకుంటున్న వారందరికీ కష్టాలు, నష్టాలు, బాధలు, వస్తూనే ఉంటాయి. కాబట్టి ఎప్పుడు కూడా ఇవి కోరుకోకూడదు.

అనారోగ్యాలతో బాధ పడుతున్న వారు మంచి వైద్యులను, మంచి మందులను కోరుకుంటుంటారు, వీరి చికిత్సకు అవసరం అయ్యే డబ్బును కోరుకుంటుంటారు. వీరు గనక ఇవన్నింటినీ వదిలేసి "నాకు వెంటనే ఆరోగ్యం కావాలి, అని కోరుకుని, నాకు ఆరోగ్యం వచ్చి తీరుతుందని విశ్వసిస్తే" వీరికి ఏ వైద్యులతో, మందులతో, డబ్బుతో, చికిత్సలతో పని లేకుండా సులభంగా, వెంటనే పటిష్ఠమైన ఆరోగ్యం సిద్ధిస్తుంది.

✪ మీరేం కోరుకుంటే అది మీకు అందుతుంది !

మీకు డబ్బు కావాలంటే డబ్బు వస్తుంది. అయితే ఆ డబ్బు ఎలా రావాలో కూడా ముందే నిర్ణయించుకోండి. మీరు నాకు డబ్బు వ్యాపారం ద్వారా రావాలని కోరుకున్నప్పుడు, వ్యాపారానికి కావలిసిన శక్తి సామర్థ్యాలన్నీ మీలో ఉత్తేజితమై, మీ వ్యాపారం బాగా అభివృద్ధి చెంది బాగా డబ్బు వస్తుంది. లేదా నాకు ఊరికే డబ్బు రావాలని కోరుకున్నా మీకు డబ్బు వస్తుంది. అయితే దానికి ముందు మీలో "ఉచితంగా, ఊరికే ఇచ్చే గుణాన్ని" మీలో ఏర్పరచిన తర్వాత డబ్బు వస్తుంది. ఎంత డబ్బు అంటే అంత డబ్బు మీరు కోరుకోవచ్చు, అంత వచ్చి తీరుతుంది.

కోరికను కోరుకున్న తర్వాత అది సంభవం అవడానికి అవసరం అయ్యే పరిస్థితులు మిమ్మల్ని చుట్టుముడతాయి, వాటిని అర్థం చేసుకుని వాటి గుండా ముందుకు సాగాలి. ప్రస్తుతం మీ శరీరంలో + జీవితంలో ఉన్న పరిస్థితులన్నీ మీ కోరికలకు అనుగుణంగానే ఉన్నాయని గ్రహించండి. మీరేం కోరుకున్నారో, ప్రస్తుతం మీరేం కోరుకుంటున్నారో - మీ కోరికలన్నింటి పట్ల ఎరుకను కలిగి ఉండండి. ఒక వ్యక్తి తన భార్య చేత సేవ చేయించుకోవాలని కోరుకుంటున్నాడనుకోండి, "ఎలాగోలా నా భార్య సేవలు నేను పొందాలి" అని గట్టిగా నిర్ణయించుకుని, బలంగా

కోరుకుంటున్నప్పుడు అతనికి ఏదో ఒక జబ్బు చేసో లేక ఏదో ఒక ఆక్సిడెంట్ అయ్యో, మంచాన పడి సేవలు అందుకోవాల్సి వస్తుంది. ఎందుకంటే అతను "ఎలాగోలా సేవలను పొందాలని" నిర్ణయించుకుని, కోరుకున్నాడు కదా ! ఒక వేళ అతను "నేను నా భార్య చేత సేవ చేయించుకోవాలి, నేను ఆనందంగా ఉండాలి, ఆమె కూడా ఆనందంగా ఉండాలి" అని కోరుకుంటే ఒకరినొకరు సేవించుకుని ఎంజాయ్ చేస్తారు.

✪ గుర్తుంచుకోండి, కోరుకునేటప్పుడు, ఎరుకతో, చాలా జాగ్రత్తగా కోరుకోవాలి.

✪ మీరు కోరుకునేవి ఏవైనా ఫలించియే తీరుతాయి !

✪ కాబట్టి ఎరుకతో, అవగాహనతో కోరుకోవాలి !

✪ మీరు ఒక కోరికను కోరుకోగానే అది సంభవించబోయే ముందు అది తీసుకునే రూపాలు, పరిస్థితులు మీకు అర్థం కావచ్చు కాకపోవచ్చు. ఒక్కోసారి మీ కోరికకు, అది సంభవించే పరిస్థితులకు ఏ మాత్రం పొంతన కనపడదు. పూర్తి వ్యతిరేకంగా కనిపిస్తాయి.

ఉదాహరణకు ఒక వ్యక్తి పేకాటకి బానిస అయ్యాడని అనుకుందాం. అప్పుడు ఆ వ్యక్తి తన వ్యసనం వలన కలుగుతున్న నష్టాన్ని గుర్తించి అందులో నుండి బయటపడాలని కోరుకుంటున్నాడనుకోండి - అతడు ఆ నిర్ణయం తీసుకున్న వెంటనే, అలా కోరుకోగానే అతడికి రక రకాలుగా పేకాటకు ఆహ్వానాలు అందుతూ ఉంటాయి. అప్పుడతడు ఇదేంట్రా నాయనా..... నేను పేకాట ఆడవద్దని నిర్ణయించుకుంటే ఇన్ని ఆఫర్లు వస్తున్నాయి ? అని ఆశ్చర్యపోతూ ఇబ్బంది పడుతుంటాడు. పోవాలా ? వద్దా ? అని నలిగి పోతుంటాడు. ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తాయంటే, ఇతని కోరికను తీర్చేందుకే, ఇతని నిర్ణయాన్ని బలపర్చేందుకే వస్తాయి. అతడు పేకాట వ్యసనం నుండి బయటపడాలి అని కోరుకున్నప్పుడు, పేకాట ఆడడానికి వచ్చిన ఆహ్వానాలను తిరస్కరించినప్పుడే అది సంభవిస్తుంది. మీరు సినిమాలు చూడద్దని నిర్ణయించుకుంటే, మీకు సినిమా ఆఫర్లు వస్తూ ఉంటాయి. మీరు తాగుడు మానేయాలని నిర్ణయించుకుంటే మీకు మందు పార్టీల ఆహ్వానాలు వస్తుంటాయి. మీరు ఇతరులతో పోట్లాడకూడదు అని నిర్ణయం తీసుకోగానే మీకు ఇతరులతో పోట్లాడే పరిస్థితి వస్తుంది. ఇలా మీరు ఏం కోరుకుంటే దానికి సంబంధించిన పరిస్థితులే వస్తాయి.

సినిమాలు చూడద్దనే మీ నిర్ణయం ఎప్పుడు నిజం అవుతుంది ? సినిమా ఆఫర్‌ను తిరస్కరించినప్పుడే కదా ! సినిమా ఆఫర్‌ను సునాయసంగా తిరస్కరించే స్థితిలోకి మీరు రావాలి. ఎప్పుడైతే మీరు సినిమా ఆఫర్లను సునాయసంగా తిరస్కరించగలిగే స్థితిలోకి వస్తారో ఇక అప్పుడు "సినిమా ఆఫర్లు" రానే రావు.

మీరు తాగుడు మానేయాలి అని అనుకున్నప్పుడు, మీకు మందు పార్టీల ఆహ్వానాలు వస్తుంటాయి. వాటిని మీరు సునాయసంగా తిరస్కరించగలిగినప్పుడే కదా మీ కోరిక తీరేది. మీ కోరిక తీరేందుకే, మీ నిర్ణయాన్ని బలపర్చేందుకే ఆ పరిస్థితులు వస్తాయి.

మీరు ఇతరులతో పోట్లాడకూడదని నిర్ణయం తీసుకుంటే తరుచుగా మీకు ఇతరులతో పోట్లాడే పరిస్థితులు వస్తాయి. ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు మీరు మీ నిర్ణయాన్ని గుర్తు చేసుకుని పోట్లాడకుండా, మౌనంగా పక్కకు తప్పుకోవడం అలవాటు చేసుకుంటే అప్పుడు కొద్ది కాలంలోనే ఇక మీకు శాశ్వతంగా ఎవరితోనూ పోట్లాడే పరిస్థితులు రావు.

✪ ఇలా జరుగుతున్నవన్నీ మీ కోరికలకు, నిర్ణయాలకు వ్యతిరేకమైనవి కావు, ఇవి, "వర్క్ ప్లేస్‌లు - Work Places'' అని గ్రహించండి.

మీరు ఒక కోరిక కోరుకున్నప్పుడు, పరిస్థితులు పూర్తి వ్యతిరేకంగా అనిపించేవి కొన్ని, అనుకూలమైనవి కొన్ని వస్తాయి. అవగాహనతో వాటిని అర్థం చేసుకుంటూ ముందుకు సాగాలి.

మీరు ఏదో కోరుకుంటారు, ఏదో జరుగుతుంది అని అనిపిస్తుంది. కానీ వాస్తవానికి మీ కోరికలకు, నిర్ణయాలకు, లక్ష్యాలకు అనుగుణమైన పరిస్థితులే మీ జీవితంలోకి ఆకర్షించ బడతుంటాయి.

మీరు అందరినీ ప్రేమించాలి, అందరి చేతా ప్రేమించబడాలని కోరుకున్నప్పుడు, మీకు ఇష్టం లేని వ్యక్తులు తారసపడే అవకాశం ఉంది. మీరు ఇష్టపడే వాళ్ళను మీరు ప్రేమిస్తే అందులో విషయం ఏముంది ?! మీకు ఇష్టం లేని వ్యక్తుల పట్ల మీరు ప్రేమను ప్రకటించ గలిగినప్పుడే అది నిజమైన ప్రేమ ! అప్పుడే ప్రేమ గుణం సంపూర్ణంగా మీలో వికసిస్తుంది.

✪ కాబట్టి గుర్తుంచుకోండి, మీ కోరికలకు వ్యతిరేకమైన పరిస్థితులు రానే రావు ! అన్నీ అనుకూలంగానే వస్తాయి ! అవగాహన లేక పోవటంతో అర్థం కాక వ్యతిరేకంగా అనిపిస్తాయి అంతే !

అవగాహన లేకపోతే వ్యతిరేకం !

అవగాహన ఉంటే సానుకూలం !

మీరు ఏదైనా ఒక కోరికను లేక లక్ష్యాన్ని పొందాలని నిర్ణయించుకున్న తర్వాత అవగాహనతో పరిస్థితులను అర్థం చేసుకుంటూ ముందుకు సాగాలి. 100% మీ కోరిక లేక లక్ష్యం, అది నెరవేరియే తీరుతుంది. మీరు మీ పట్ల విశ్వాసం కలిగి ఉండండి చాలు. అంతే ! అది జరిగి తీరుతుంది.

లక్ష్య సాధనలో ఎలా ఉండాలంటే...

సాధనలో విశ్వాసం, ధైర్యం, ధీమా!

సాధనా జీవనంలో ధైర్యం అన్నింటికంటే గొప్ప మాట. సంకల్పం నాటి ఎంతో ఎదురు చూడాల్సి వస్తుంది. మీరు చేస్తున్న శ్రమ వ్యర్థమైనట్లుగా అనిపిస్తుంది. ఏ ఫలితం వచ్చినట్లు కనపడదు. కాని ఒక రోజు మీ ఎదరు చూపు ప్రాప్తిలోకి మారును. మీ సంకల్పం, మీరు ఎదరు చూస్తున్న పరిస్థితిగా మారుతుంది. కాని గుర్తుంచుకోండి. ఎప్పుడైతే పరిణామము కనపడకుండా ఉండెనో, అప్పుడు కూడా భూమి క్రింద వికాసం జరుగుతూ ఉంది. సరిగా ఇలాగే సాధకుని జీవనంలో జరుగుతుంది. ఎప్పుడైతే ఏమీ కనపడకుండా ఉండిందో అప్పుడు కూడా చాలా జరుగుతూ ఉండె. వాస్తవం ఏమిటంటే జీవన శక్తి యొక్క వికాసం అదృశ్యంలో, అజ్ఞాతంలో జరుగుతుంది. కేవలం పరిణామమే కనపడుతుంది, వికాసం కనపడదు. సిద్ధి చింత వదిలి సాధన చేస్తూ ఉండాలి. సిద్ధి తనంతట తానే సిద్ధిస్తుంది. ఒక రోజు ఆశ్చర్యంతో ఇలా అనుకుంటావు - " హమ్మయ్య అనుకున్నది పొందాను"... అని ! **- ఓషో**

సాధన పూర్తి విశ్వాసంతో, నిశ్చింతంగా చేసినప్పుడే అనుకున్న ఫలితం వస్తుంది

తొందరపడకు. విశ్వాసంతో ధైర్యంగా ఉండు. ధైర్యం సాధనకు ఎరువు లాంటిది. ధ్యానాన్ని కొనసాగించు. ఫలం వస్తుంది, తప్పక వస్తుంది. కాని ఫలం కొరకు చింతించకు. ఎందుకంటే అలాంటి చింతనే ఫలం రావడంలో అడ్డంకి అవుతుంది. అలాంటి చింతనే ధ్యాన సాధనను సరిగా సాగనివ్వదు. సాధనకు పూర్తి స్పృహ అవసరం. సగం, సగం స్పృహ పనికిరాదు. సాధనకు పూర్తి స్థాయి ఎరుక అవసరం. అందుకే ధ్యాన సాధన చేస్తూనే ఉండాలి. అనుకున్న ఫలం తప్పక వస్తుంది. ధ్యానం పూర్తి విశ్వాసంతో, నిశ్చింతగా చేసినప్పుడే అనుకున్న ఫలితం వస్తుంది. **- ఓషో**

మీ పరిస్థితులు, మీకు అనుకూలంగా ఉన్నప్పుడు, మీరు పాజిటివ్‌గా ఉండడం కాదు. మీ పరిస్థితులు మీకు వ్యతిరేకంగా ఉన్నప్పుడే, మీరు 100% పాజిటివ్‌గా ఉండాలి. సరిగా ఆ సమయంలోనే మీరు పాజిటివ్‌గా ఉండాలి. పాజిటివ్‌నెస్ అనేది టార్చ్ లైట్ లాంటిది. పగలు వెలుగు ఉన్నప్పుడు దాని అవసరం ఏం ఉంటుంది ? టార్చ్ లైట్ అనేది వెలుగు లేనప్పుడు, చీకటిలో వాడాలి. అప్పుడే దాని శక్తి మనకు ఉపయోగపడుతుంది. పగలు వాడితే దాని శక్తి మనకు తెలయదు. పైగా వృథా కూడా ! సరిగ్గా ఇలాగే, పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నప్పుడు, మీరు విశ్వాసంతో, పాజిటివ్‌గా ఉండడం అనేది సహజం. పరిస్థితులు మీకు వ్యతిరేకంగా ఉన్నప్పుడే మీరు విశ్వాసంతో ఉండాలి. అంతా మంచే జరుగుతుందనే పాజిటివ్ దృక్పథంతో ఉండాలి. అప్పుడే ఆశిస్తున్న ఫలితాలు వస్తాయి. విశ్వాసం మరియు పాజిటివ్‌నెస్ అనేవి సరికాని పరిస్థితులను, మీకు అనుకులంగా, మీరు అనుకున్నట్టుగా మార్చే దివ్య శక్తులు. ఎలాంటి వాటినైనా, ఎంత పెద్ద పరిస్థితులనైనా ఈ దివ్య శక్తులు మీకు అనుకూలంగా మార్చేస్తాయి. ఇది సత్యం. కాబట్టి ఎల్లప్పుడూ పాజిటివ్‌గా ఉండండి. ముఖ్యంగా మీకు పరిస్థితులు అనుకులంగా లేనప్పుడే, మీరు విశ్వాసంతో పాజిటివ్‌గా ఉండండి. అప్పుడు తప్పని సరిగా మీ పరిస్థితులు మీకు అనుకూలంగా మారుతాయి. ఇది నిజం. గుడ్ లక్ !

మీరు ఒక పని చేద్దాం అని అనుకుని, ఆ పనిని మొదలు పెట్టిన తర్వాత, ఇక ఆ పనిని ఎట్టి పరిస్థితులలోనూ ఆపకుండా ఉంటే అది తప్పకుండా ఫలిస్తుంది. ఒక్కోసారి పని చేయలేని పరిస్థితులు వస్తాయి. ఏం చేయాలో అర్థం కాదు. అలాంటప్పుడు మీ లోపల పట్టుదలను అలాగే ఉంచుకోవాలి. పరిస్థితులు అనుకూలించేంత వరకు సహనంతో ఎదురు చూడాలి. కాని గుర్తుంచుకోండి.. సంకల్పాన్ని మాత్రం డ్రాప్ చేయవద్దు. మీరు సాధన చేసినా చేయకపోయినా మీ లక్ష్యం పైన గురి మాత్రం అలాగే ఉండాలి.

ఒక లక్ష్య సాధనకై పూనుకున్నప్పుడు మధ్యలో కానీ, మరెప్పుడైనా కానీ పని పూర్తయ్యేంత వరకు "ఉపసంహారం చేయకూడదు". మిమ్మల్ని నమ్మకుండా వెళ్ళిపోయే వాళ్ళను వెళ్ళనివ్వండి. మీరు మాత్రం పట్టుదలతో, విశ్వాసంతో ముందుకు సాగిపోండి. జయాపజయాలు మన పైననే ఆధారపడి ఉంటాయి. మీరు మధ్యలో డ్రాప్ కాకుండా పని పూర్తి చేస్తే, అప్పుడు ఆ పూర్తయిన పనియే విజయంగా మారుతుంది. కాబట్టి విజయాన్ని మీరు కాంక్షిస్తే, పని పూర్తయ్యే వరకు మీరు చేయాల్సి ఉంటుంది. లక్ష్య సాధకులందరూ ఈ పరమ సత్యాన్ని గ్రహించి తీరాలి !

All The Very Best !

లక్ష్యాన్ని సాధించడం అంటే ఏమిటి ?
ఒక లక్ష్యాన్ని సాధించడం ఎలా ?

ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని, అది నెరవేరే వరకు మధ్యలో
ఉపసంహారం(డ్రాప్) చేయకుండా పూర్తి విశ్వాసంతో ఉండి,
అది నెరవేరాక దాన్ని హాయిగా అనుభవించడమే
లక్ష్యాన్ని సాధించడం అని అంటే !

నిర్ణయించుకున్న లక్ష్యం నెరవేరేంత వరకు మధ్యలో
ఉపసంహారం(డ్రాప్) చేయకుండా పూర్తి విశ్వాసంతో
ఉంటే ఆ లక్ష్యం కచ్చితంగా నెరవేరుతుంది.

లక్ష్యం నెరవేరేంత వరకు ఉపసంహారం(డ్రాప్)
చేయకుండా పూర్తి విశ్వాసంతో ఉండడాన్నే
లక్ష్య సాధన అని అంటారు.

లక్ష్యాన్ని నిర్ణయించుకోవడమే మీరు చేయాల్సింది.
ఆ తర్వాత లక్ష్యమే తనను తాను నెరవేర్చుకుంటుంది.

పార్ట్ - 14

MAB నవ రత్నాలు

నవ రత్నాలు అని అంటే ఇదేదో రంగు రాళ్ళకు
సంబంధించిన విషయం అని అనుకునేరు. కాదు.
ఇది రంగు రాళ్ళకు సంబంధించినది కానే కాదు.
తొమ్మిది అమూల్యమైన విషయాలు.
తొమ్మిది సత్యాలు. వీటిని అందంగా చెప్పడానికి
"నవ రత్నాలు" అని అన్నాను.
అంతే, తప్ప రంగు రాళ్ళకు
ఈ సబ్జెక్ట్‌కు ఎలాంటి సంబంధం లేదు. రంగు రాళ్ళు
పొదిగిన ఉంగరాలు ధరిస్తే ఏదో మంచి జరుగుతుందనేది
మూఢనమ్మకం. ఫ్యాషన్ కోసమైతే ఫరవా లేదు.

క్రిస్టల్స్‌ను ఎనర్జి కోసం వాడాలి - ఇది సరి !

MAB నవ రత్నాలు

శరీరాన్ని + జీవితాన్ని పూర్తిగా మన స్వాధీనంలోకి తెచ్చుకోడానికి మరియు ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొందడానికి సులభమైన, సరళమైన, సహజమైన, అత్యంత శ్రేష్ఠమైన, మహా వేగవంతమైన, శక్తి వంతమైన, సంపూర్ణమైన, సమగ్రమైన, సురక్షితమైన, సశాస్త్రీయమైన మరియు దివ్యమైన మార్గమే ఈ "MAB నవ రత్నాలు" !

❶ గురు స్మృతి	❷ సేవా సాధన	❸ సరైన ఆహారం
❹ స్వాధ్యాయం	❺ ధ్యాన సాధన	❻ సత్సంగం
❼ ఆచరణ	❽ పరిశోధన	❾ సత్య ప్రచారం

ఆధ్యాత్మిక జీవితం మరియు భౌతిక జీవితం అని వేరు
వేరుగా ఉండవు. జీవితం ఒకటే ఉంటుంది !
ఈ సృష్టి సర్వస్వమూ ఆధ్యాత్మికమే ! మీరు, మీ జీవితం
ఆధ్యాత్మికమే ! మీరు చేసే ప్రతీది, మీ జీవితంలోని ప్రతీది
ఆధ్యాత్మికమే ! మీరేం చేసారో, ప్రస్తుతం మీరేం చేస్తున్నారో,
రేపు ఏమేం చేయబోతున్నారో... ...ఇవన్నీ ఆధ్యాత్మికమే !
మీరు చేసే ప్రతీది కూడా మీ ఆత్మ వికాస యాత్రలో
భాగంగానే జరుగుతుంది. కాబట్టి మీరు చేసే వాటిని
ప్రేమగా గౌరవించండి. మీరేం చేస్తూ ఉన్నా సరే,
అది ఎలాంటిదైనా సరే... దాన్ని గౌరవించండి.
మీరు చేసే ప్రతీ పనిని మీరు కచ్చితంగా గౌరవ భావనతోనే
చేయాలి. గుర్తుంచుకోండి... మీరు చేసేది ఎలాంటిదైనా...
అని అంటే మీరు అర్థం చేసుకోవాలి...
ఎలాంటిదైనా..... అది ఏమైనా.....

1. MAB నవ రత్నాలలో మొదటిది గురు స్మృతి

సాక్షాత్తు నీవే దైవం, అని సూటిగా తెలియజేసి, నీ యొక్క సహజ తత్వము, నీ నిజ తత్వమైన నీ దైవత్వాన్ని పొందే మార్గాన్ని బోధించే వాడే అసలు సిసలు సద్గురువు. ఈ విషయం కాకుండా మరేదైనా చెప్తున్నాడూ అని అంటే "అతనికి" కూడా "అసలు విషయం" తెలియదన్నమాట ! కాబట్టి తెలిసో తెలియకో ఇలాంటి గురువులను మీరు ఆశ్రయించి ఉంటే తక్షణమే వారికో దండం పెట్టి అక్కడి నుండి బయట పడండి. సాక్షాత్ పరమాత్మయే నీవు అని తెలియజేసి నీ పరమాత్మ తత్వాన్ని ఎలా పొందాలో తెలియజేసే సద్గురువును వెతికి పట్టుకుని ఆయనను ఆశ్రయిస్తేనే మీకు సాఫల్యం దక్కుతుంది.

గురువును ప్రేమించండి, గౌరవించండి, 100%గా ఒప్పుకోండి.

సత్య మార్గంలోకి ప్రవేశం కోరుకునే సాధకులు తప్పనిసరిగా గురువుని ప్రేమించాలి, గౌరవించాలి, 100%గా ఒప్పుకోవాలి. లేకపోతే మీ సాధన ఏనాటికీ సాఫల్యం కాదు. కాదు గాక కానే కాదు. గురువును ఆత్మ పూర్వకంగా ఒప్పుకోని వాళ్ళకు ఆధ్యాత్మికతలో ఒక్కటంటే ఒక్క అడుగు కూడా ముందుకు పడదు - అసలు ఆధ్యాత్మికతలోకి ప్రవేశమే దొరకదు !

గురువును ప్రేమించ లేని మీరు, గౌరవించలేని మీరు, 100%గా ఒప్పుకోని మీరు, ఆయన చెప్తున్న సూత్రాలను, సాధనను ఎలా ఒప్పుకోగలుగుతారు !? వాటిని మీ లోపలికి ఎలా అనుమతించగలుగుతారు ? ఎందుకంటే గురువు, గురువు చేప్పే విజ్ఞానం వేరు వేరు కాదు. గురువే విజ్ఞానం. గురువు యొక్క విశేషమైన ఆత్మానుభవ సారమే ఆయన చెప్పే విజ్ఞానం. ఆయనను అనుమతించని మీరు ఆయన సారాన్ని & ప్రజ్ఞను ఎలా అనుమతించ గలుగుతారు ?! అది అసంభవం ! గురువును అనుమతించని సాధకుడికి ఏ గురువు విజ్ఞానమూ పనిచేయదు. గురువు పట్ల సదభిప్రాయం లేకుండా, విశ్వాసం లేకుండా గురువు పట్ల తప్పుగా ప్రవర్తించిన వారికి గురువు విజ్ఞానం అణువంత కూడా పని చేయదు పైగా గురువు అనుమతి లేకుండా ఆయన ఆత్మ విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి అని అనుకోవడం "గురు ద్రోహం & ఆత్మ ద్రోహం" అనే భయంకరమైన కర్మకు బలైపోతారు. శివుడు గురువు గురించి చెప్పిన "శ్రీ గురు గీత" చదవండి. విషయాలు తెలుస్తాయి !

భౌతిక రంగంలో ఉన్న గురువులు వేరు. అక్కడ మీరు పైపైన నటించి పని పూర్తి చేసుకుని బయట పడవచ్చు. కానీ ఇది ఆధ్యాత్మిక మార్గం ! సత్య మార్గం ! ఇక్కడ విషయాలు పైపైన ఉండవు. పూర్తిగా లోపలి విషయాలకు సంబంధించి ఉంటాయి. ఇది మీ ఆత్మకు సంబంధించిన విషయం. గురువుకు ఆత్మపూర్వకంగా మిమ్మల్ని మీరు నిజంగా, పూర్తిగా సమర్పించుకో గలిగితేనే, ఇక్కడ ఏదైనా విషయం మొదలయ్యేది. అంతకు ముందు కాదు.

ఇది పరమ సత్యం !

ఒకవేళ మీరు గురువును ప్రేమించలేని పక్షంలో, గౌరవించి 100%గా ఆయనను ఒప్పుకోలేనప్పుడు, గురువు దగ్గరికి వెళ్ళకండి. మీరెప్పుడు గురువును ప్రేమించ గలుగుతారో, గౌరవించి 100% గా, నిజంగా ఒప్పుకోగలుగుతారో అప్పుడే వెళ్ళండి. ఆధ్యాత్మిక గురువులతో పరాచికాలు ఆడవద్దు ఆషామాషి వ్యవహారం కాదు. మహా నష్టం జరుగుతుంది మీకే !

గురువు మీద విశ్వాసం కలగకపోతే గురువు దగ్గరకు వెళ్ళకండి!

విశ్వాసం కలగని వారి దగ్గరకు వెళ్ళాల్సిన ఖర్మ మీకేమిటి ?!

గురువు దగ్గరికి మీరు వెళ్ళినప్పుడు మీ లోపల ఒక సంఘర్షణ జనించియే తీరుతుంది. ఎందుకంటే వేలాది జన్మలుగా మీరు విస్మృతిలో ఉన్నారు. విస్మృతిలోనే మీరు పుడుతూ ఉన్నారు, పెరుగుతూ ఉన్నారు. పెరగడం, చదవడం, వృత్తి / ఉద్యోగం / వ్యాపారం, పెళ్ళి, సెక్స్, పిల్లలు, ఆస్తులు అంతస్తులు, పోట్లాటలూ, అలకలు, ప్రేమ, కుట్ర కుతంత్రాలు, రిటైర్‌మెంట్, వృద్ధాప్యం, మరణం మొదలైనవన్నీ విస్మృతిలోనే జరుగుతూ ఉంటాయి. వేలాది జన్మలుగా, అత్యంత సుదీర్ఘమైన విస్మృతిని అనుభవిస్తూ, విస్మృతిలోనే పుడుతూ, విస్మృతిలోనే చస్తూ మీరున్నారు. మీకు జాగృతి అంటే ఏమిటో తెలియదు. జాగృతి పొందిన మనుషులను మీరెన్నడూ చూసి ఉండలేదు. సమాజంలో ప్రజల చేత పూజలు అందుకుంటున్న మతపరమైన స్వాములు, బాబాలు, సన్యాసులు మొదలైన వారిని చూసి, చూసి ఉన్న మీకు జాగృతి పొందిన గురువు ఎలా ఉంటాడో మీకు తెలియదు. ఆ మతపరమైన స్వాముల్లాగే ఒక మేల్కొన్న గురువు ఉంటాడని మీరనుకుంటే భయంకరమైన తప్పే మీరు చేస్తున్నారని తెలుసుకోండి.

జాగృతి పొందిన వ్యక్తి యొక్క మాటలు, చేష్టలు, జీవన విధానం మీకు చాలా వింతగా అనిపిస్తాయి. అతనేదో తప్పు మాట్లాడుతున్నట్టు, అతిగా ప్రవర్తిస్తున్నట్టు, మాటల్లో చేష్టల్లో సభ్యత లోపించినట్టు అనిపిస్తుంది. అతడు కరుణాపూరితంగా ఉంటూ అప్పుడే కఠినంగా మారినట్టు మీకు అనిపిస్తుంది. మొత్తం మీద జాగృతి పొందిన వ్యక్తి యొక్క వ్యవహారం అంతా మీకు తలక్రిందులుగా అనిపిస్తుంది. నిజానికి మీరే తలక్రిందులుగా ఉన్నారు. జాగృతి పొందిన వ్యక్తి సరిగానే ఉన్నాడు. తలక్రిందులుగా ఉన్న మీకు సరిగా ఉన్న వ్యక్తి తలక్రిందులుగానే కనిపించి తీరుతాడు. ఎందుకంటే ఇలాంటి వ్యక్తిని మీరెప్పుడూ చూసుండరు !

జాగృతి పొందిన వ్యక్తి దగ్గర అంటే ఒక గురువు దగ్గర మీరున్నప్పుడు మీలో ఎంతో సంఘర్షణ అప్రయత్నంగానే ప్రారంభమవుతుంది. ఆయన సెలక్షన్‌లు, టేస్టులు మొదలైనవన్నీ మీకు చాలా విరుద్ధంగా అనిపిస్తాయి. ఒక్కోసారి ఎంత తీవ్రంగా మీలో సంఘర్షణ చెలరేగుతుందంటే ఇక మీరు ఒక్క క్షణం కూడా గురువు దగ్గర ఉండలేనంత ! ఇలాంటి సమయాల్లోనే, పరిస్థితుల్లోనే మీరు ఎరుకతో ఉండాలి. మీలో ఉన్న సరికానివి అన్నీ సరి అయ్యే పరివర్తనా దశలోనే ఈ సంఘర్షణ జనిస్తుందని మీరు గుర్తించాలి. ఒక గురువు నుండి శిష్యుడికి ఏ శ్రేయస్కరం జరగాలో అది ఈ రూపకంగా జరుగుతూ ఉందని గ్రహించాలి. గురువు వద్ద మీరు ఉన్నందుకు మీకు జరిగే లాభం ఈ సంఘర్షణ వల్లనే జరుగుతుందని తెలుసుకోవాలి. మీ యొక్క ఆత్మ పరిణామ

క్రమం ప్రారంభమైన దగ్గర నుండి సరికానివెన్నో మీలో కుప్పలు కుప్పలుగా పోగై ఉంటాయి. ఆ కుప్పలు జాగృతి పొందిన వ్యక్తి సమక్షంలో తగలబడిపోతూ ఉంటాయి. అవి తగలబడి పోతున్నప్పుడు చెలరేగే మంటలే మీలో సంఘర్షణను సృష్టిస్తాయి. మీరు అప్పుడు అక్కడి నుండి పారిపోతే మీలో ఉన్న చెత్త కుప్పలు మళ్ళీ చల్లారి పోతాయి అందు వలన మహా నష్టం మీకే జరిగిపోతుంది.

ఒక జాగృతి పొందిన వ్యక్తిని గుర్తు చేసుకున్నంత మాత్రాన ఆయన యొక్క జ్ఞాపకం చాలు మీలో ఉన్న చెత్తను దహించివేయడానికి. మీరు జాగృతి పొందిన వ్యక్తిని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఎన్నో సార్లు విఫలం అయ్యే అవకాశం ఉంది. గురువును ఒక్కసారిగా అర్థం చేసుకునేంత సీన్ మీకెక్కడ ఉంటుంది ?! కాబట్టి పట్టుదలతో శ్రమిస్తూ పోవాలి. లేదా వదిలేయాలి !

గురువుతో పని చేయడం కత్తి మీద సాము లాంటిది. మీ అహం ఆ కత్తితో ఎన్నో సార్లు నరకబడుతూ ఉంటుంది. ఆ సమయంలో మీ లోపల ఎంతో అల్లకల్లోలం జరుగుతుంది. ఆయన ఒకటి చెప్తాడు, అది ఫలానా విధంగా చేయమని చెప్తాడు, అది ఏ రకంగా చేస్తే బాగుంటుందోనన్న విషయాన్ని కూడా తెలియజేస్తాడు. ఆయన చెప్పిన వాటిలో చాలా విషయాలు మీకు జీర్ణం కావు. మీరు గురువు చెప్పిన విషయాలను మీ ఫ్రేమ్‌లలో నుండి చూస్తుంటారు. గురువు చెప్పిన విషయాలు మీ ఫ్రేమ్‌లలో ఇమడవు, అవెంతో సువిశాలంగా, సృజనాత్మకంగా, ఏదో ఒక నిగూఢతను, మీకు అర్థం కాని మర్మాన్ని కలిగి ఉంటాయి. మీరేమో అహంతో మూసుకు పోయి ఎంతో సంకుచితమైన ధోరణితో చిన్న చిన్న ఫ్రేమ్‌లను కలిగి ఉంటారు. మీ ఫ్రేమ్‌లను బద్దలు చేసేయడమే గురువు యొక్క పని. మీరేమో మీ ఫ్రేమ్‌లను రక్షించుకుంటూ ఉంటారు. ఆయనేమో వాటి మీదనే కొడుతూ ఉంటాడు పగిలే వరకు ! గురువు సమక్షంలో మీరు ఉన్నప్పుడు ప్రయత్నంగానో, అప్రయత్నంగానో, ఎలాగోలా మీ అహం మీద దెబ్బలు పడుతూనే ఉంటాయి. నిజమైన గురువు ఎప్పుడూ మీ ఫ్రేమ్‌లను తుత్తునియలు చేసి పారేస్తూనే ఉంటాడు. మతపరమైన స్వాములు మీ అహాన్ని, ఫ్రేమ్‌లను టచ్ చేయకుండా వాళ్ళ పబ్బం గడుపుకుంటూ ఉంటారు. అందుకే చాలా మంది ప్రజలకు వారంటే ఇష్టం ! ఉదాహరణకు ఒక వ్యక్తికి తాగుడు అలవాటు ఉండి రోజూ తాగి ఇంటికొచ్చి పెళ్ళాన్ని తన్నే అలవాటు ఉంటే అప్పుడు అతడి పెళ్ళాం, వాళ్ళ తల్లిదండ్రుల సహాయం మరి ఇంకా కొంత మంది సహాయం చేత అతడిని తీసుకుని ఎవరైనా ఒక స్వామి దగ్గరికి తీసుకుపోతే అప్పుడు ఆ స్వామి అతడి చరిత్ర అంతా తెలుసుకుని కాసేపు ఆ పుస్తకాలు ఈ పుస్తకాలు తిరగేసి, ఏవేవో లెక్కలు వేసి చివరికి మీరు అప్పటి వరకు విని ఉండని ఒక దుష్ట భూతం పేరో లేక గ్రహం పేరో చెప్పి అది ఇతడిని పట్టి పీడిస్తూ ఉంది కాబట్టి దానికి ఫలానా యజ్ఞమో, యాగమో, హోమమో చేయాలి దానికింత అవుతుంది అని ఒక రేటు చెప్పేస్తాడు. అప్పుడు ఆ తాగుబోతుకు ఎంతో

హాయి లభిస్తుంది. ఓహో తప్పు నాది కాదు, తప్పంతా ఆ దుష్ట భూతానిదే అంటూ అమాయకంగా మొఖం పెడతాడు. ఆ తాగుబోతు పెళ్ళానికి కూడా సంతోషం వేస్తుంది. నా పతి పరమేశ్వరుడే ! ఈ ముదనష్టపు భూతం పట్టుకున్నందు వల్ల ఇలా తయారయ్యాడు అనుకుంటూ మురిసి పోతుంది. వాళ్ళతో వచ్చిన వాళ్ళు కూడా ఆనందిస్తారు, హమ్మయ్య... మేము తీసుకొచ్చింది మంచి పనే అయింది. లేక పోతే ఆ దుష్ట భూతం ఇతడిని ఏమి చేసేదోనని ?! ఇదే విషయం జాగృతి పొందిన వ్యక్తి దగ్గరికి వెళితే అక్కడ పూర్తిగా వేరేగా జరుగుతుంది. ఆయన సూటిగా మొఖం మీద చెప్పేస్తాడు ఇతడు వ్యసనానికి బానిస అయ్యాడని ! ఏ దుష్ట భూతాలు లేవు అజ్ఞానమే ఈ వ్యక్తి తాగుబోతు తనానికి కారణం, ఇతను స్వయం పూనిక చేత దృఢమైన నిర్ణయం తీసుకుని ధ్యాన సాధన చేసి తనంతట తాను బయట పడాల్సిందే ! ఇతనిని ఇతడే ఉద్ధరించుకోవాలి మరే మార్గమూ లేదు అని కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పేస్తాడు. ఈ విషయం మరి మీకూ, మీ సంబంధీకులకు ఎంతో ఇబ్బందిని కలుగజేస్తుంది. ఎంతో కొంత తీసుకుని బాగు చేస్తే బాగుంటుందని మీరనుకుంటుంటారు, కానీ ఆ జాగృతి పొందిన వ్యక్తి దగ్గర మాత్రం అలాంటివేమీ ఉండవు. సత్యం తెలుసుకోండి అంటూ బోధిస్తాడు. ఆయన చెప్పే సత్యాలు మీకు చెప్పరాని చోట్లో గుచ్చుకుంటూనే ఉంటాయి. మీకు కోపం వస్తుంది, ఆవేశం, ఆయాసం, ఉబ్బసం కలిగి ఊపిరి ఆడని పరిస్థితి ఏర్పడిపోతుంది. దాంతో మీ దరిద్రాలను మీరు జాగ్రత్తగా సంరక్షించుకుంటూ అక్కడి నుండి పారిపోతారు. ఎందుకంటే ఆయన అంటాడు "మీ వాస్తవాలకు మీరే సృష్టికర్తలు", "ఎవరూ ఎవరికీ ఏమీ చేయలేరు", "మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోవాలి" నేను కేవలం మిమ్మల్ని మీరు ఎలా ఉద్ధరించుకోవాలో తెలియజేస్తాను. ఆ ఉద్ధారణా విద్యను మీకు నేర్పిస్తాను. కానీ నేర్చుకోవాల్సింది మీరే, అడుగులేయాల్సింది మీరే ! మీరు అడుగులేయడానికి సిద్ధపడితే అంతిమ సత్యం వరకు అడుగులేయిస్తాను అయితే బాధ్యత అంతా మీరే వహించాల్సి ఉంటుంది. అని ముక్కు సూటిగా సత్యాలు ప్రకటిస్తాడు ! మరి ఈ సత్యాలు మిమ్మల్ని కుళ్ళబొడుస్తాయి. మీరు దిగ్భ్రాంతికి గురి అవుతారు. బాధ పడతారు. మీరు ఎలా ఉన్నా ఆయన మాత్రం సత్యం ప్రకటించియే తీరుతాడు.

జాగృతి పొందిన వ్యక్తి యొక్క సమక్షం అజ్ఞానులకు & అహంభావులకు కత్తి మీద సాము లాంటిది. వికాసం చెంది, అవగాహన ఉన్న శిష్యులకు స్వర్గం లాంటిది.

జాగృతి పొందిన వ్యక్తితో కలిసి మీరు కొనసాగుతూ ఉన్నప్పుడు మీలో ఎన్నెన్నో మార్పులను మీరు చేసుకోవాల్సి వస్తుంది. పాత వాటిని ఎన్నింటినో మీరు వదులుకోవాల్సి వస్తుంది. కొత్త విషయాలను ఎన్నింటినో మీరు అంగీకరించి మీలోకి ఇముడ్చుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఆయనతో కొనసాగడం అసంభవం ! మీరు మీ పాత దరిద్రాలను వదిలిపెట్టి తీరాల్సిందే ! మీరు కలిగి ఉన్న దరిద్రాలన్నీ

చూడటానికి ఎంతో అందంగా ఉంటాయి. సత్య గురువు మీ దరిద్రాలకు, మీరు వేసుకున్న మేకప్ తీసేసి వాటి నిజ స్వరూపాన్ని మీకు చూపెడతాడు. వాటిని వదిలేసుకుంటే తప్ప మీరు నాతో కొనసాగలేరు, దైవత్వాన్ని మీరు పొందలేరు అని నిక్కచ్చిగా చెప్పేస్తాడు. ఈ విషయంలో గురువు ఎలాంటి రాజీకి రాడు. గుర్తుంచుకోండి, ప్రస్తుతం మీరు ఉన్నది ఉన్నట్టుగా ఎన్నో అవకతవకలను కలిగి ఉన్నారు. మీరు విస్మృతిలో ఉన్నారు. కాబట్టి మీ పాత అలవాట్లను, అభిప్రాయాలను, నమ్మకాలను, గుణాలను, అభిరుచులను... సూటిగా చెప్పాలంటే మొత్తానికి మొత్తం మీరే మారిపోతే తప్ప గురువుతో కొనసాగలేరు. ఈ విషయాన్ని మీరెంత దృఢంగా గుర్తుంచుకుంటే అంత మంచిది.

కొంత మంది విరాళాలిచ్చి లేదా ఇతర ఏవైనా పనులు చేసి గురువు ముందు కనపడని అహాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఇలా చేసేవారు చాలా ప్రమాదానికి గురవుతారు. వినాశనానికి గురి అవుతారు. ఎందుకంటే నిజమైన సత్య గురువు మిమ్మల్ని బొట్టు పెట్టి తన దగ్గరికి రమ్మని పిలవడు. నిజమైన అభిలాషతో వెళితే కాదనడు. ప్రతీ గురువుకు సృష్టి కల్యాణార్థం ఎవో కొన్ని లక్ష్యాలు ఉంటాయి. ఈ లక్ష్యాలలో పాలు పంచుకునే దివ్య సౌభాగ్యం ఏ కొద్ది మందికో దక్కుతుంది. అంతటి దివ్య లక్ష్యాలలో పాల్గొనే అవకాశం, సేవ చేసే అవకాశం, విరాళాలిచ్చే అవకాశం, బాధ్యతలు తీసుకునే అవకాశం వచ్చినందుకు హృదయపూర్వక ధన్యవాదాలను గురువుకు అర్పిస్తూ ఆనందించాలి కానీ మేము చేయక పోతే, మేము ఇవ్వక పోతే పని జరిగేది కాదు అని ఫోజు కొట్టవద్దు. గురువులు చేసే పనులకు సాక్షాత్ "మూల చైతన్యం నుండే సర్వ, సకల, సమస్త సహాయ సహకార సమన్వయాలు, రక్షణలు అందుతాయి". మహా మూల చైతన్యం మీరు కాక పోతే మరొకరిని ఎన్నుకుని వారి చేత, వారి ద్వారా సహాయం అందిస్తుంది. కాబట్టి మీరు గురువుకు ఏదైనా ఇచ్చే అవకాశం వచ్చిందీ అంటే ఎన్నో జన్మల సుకృతం, మహా దివ్య సౌభాగ్యం అని గ్రహించాలి.

గురువు దగ్గరికి వెళ్ళేటప్పుడు సంపూర్ణమైన సమర్పణా భావంతో, ప్రేమతో వెళ్ళాలి. పూర్తి స్థాయి పాజిటివ్‌నెస్‌తో వెళ్ళాలి. సత్య మార్గంలోకి వస్తే రండి లేకపోతే లేదు, అంతే కాని అనుమానాలతో, నెగెటివ్ దృక్పథంతో రాకండి.

గురువు సాక్షాత్తు దైవ స్వరూపుడు. నడిచే దైవం గురువు. మీలోని దివ్యత్వాన్ని తిరిగి పొందేలా చేసి మిమ్మల్ని దైవాలుగా మార్చే దేవాధిదేవుడే గురువు.

సద్గురువుల చరిత్రలు ఎన్నో ఉన్నాయి అవన్నీ చదవాలి. గురువు అంటే ఎవరో, శిష్యుడు ఎలా ఉండాలో పూర్తిగా తెలుసుకోవాలి. అన్ని విషయాలను తెలుసుకుని గురువును ఆశ్రయించాలి. వారిని సేవించి వారి కరుణకు పాత్రులవ్వాలి. వారి మార్గదర్శకత్వంలో సాధన చేసి సాఫల్యం పొందాలి.

"గురు సాంగత్యం" ! ఇది పరమాద్భుతమైన, మహా అరుదైన విశేషం. జీవన్ముక్తుడు, జీవించి ఉన్న సద్గురువు, దొరకడం ఎన్నో జన్మల పుణ్య ఫలం !

గురువుకు, భౌతికంగా దగ్గరగా ఉంటూ వారి సేవ చేస్తూ, వారి సమక్షంలో సాధన చేసే వారి భాగ్యమే భాగ్యం. మహా సౌభాగ్యవంతులకు మాత్రమే ఈ అవకాశం లభిస్తుంది.

శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణుర్గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః ॥
- శ్రీ గురు గీతా (1. 58 - పేజ్ నం. 38), శ్రీవ్యాసాశ్రమము, ఏర్పేడు

ఈ శ్లోకం యొక్క గూఢార్థం :

గురువు బ్రహ్మ అంటే సృష్టికర్త.

గురువు విష్ణువు అంటే పోషణను అందిస్తూ పాలించే వాడు. సర్వకాల సర్వావస్థల యందు రక్షణను అందిస్తూ ముక్తి మార్గం వైపు నడిపించే వాడు.

గురువు మహేశ్వరుడు అంటే లయకారుడు అని అర్థం. లయం అంటే ప్రళయం, నాశనం అనే అర్థాలుగా చెప్పుకుంటారు. కానీ ఇక్కడ లయం అంటే మోక్షం అని అర్థం. గురువు నీ అహాన్ని (నేను దైవం నుండి వేరు అనే భావన) లయం చేస్తాడు. అంటే నీ అజ్ఞానాన్ని తీసివేస్తాడు. అహం తొలగి పోగానే ఆటొమెటిక్‌గా మోక్షం ప్రాప్తిస్తుంది.

గురువు సాక్షాత్ పరబ్రహ్మ ! అంటే బ్రహ్మ + విష్ణు + మహేశ్వరులు ముగ్గురు కలిస్తే ఏర్పడే త్రిమూర్తి స్వరూపం. అంటే సర్వాకార, నిరాకార, సగుణ, సర్వగుణ, నిర్గుణ మహా మూల చైతన్యం Ultra Consciousness or GOD or All That Is !

సృష్టి సర్వస్వాన్ని సృష్టించి, సర్వస్వానికి పోషణను, పాలనను అందిస్తూ ఉన్న పరబ్రహ్మమే గురువుగా అవతరిస్తుంది. అన్నింటికి మూలము, అన్ని మూలాలకు మూలమైన "మూల చైతన్య స్వరూపుడైన వాడు గురువు".

త్రిమూర్తి స్వరూపుడవైన ఓ గురుదేవా ! సాక్షాత్ పరబ్రహ్మయైన ఓ గురు పరమాత్మా ! నీకు నమస్కారం. నా నమస్కారాలను దయతో స్వీకరించి, నన్ను అనుగ్రహించి, ఆశీర్వదించి, నా జన్మను సార్థకం చేసి, సాఫల్యం వైపుగా నడిపించు అని ఈ శ్లోకం యొక్క అర్థం.

ఇలాంటి "సత్యమైన గురువు" లభించడం దుర్లభం ! ఎందుకంటే మామూలు గురువులకు, సద్గురువులకు తేడా తెలియదు, "ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు" కదా ! మరి ఎలా "సత్యమైన గురువును" దొరికించుకోవాలంటే, దీనికి ఒక రహస్య సూత్రం ఉంది.

సత్య గురు సంకల్పం

"నాకు సత్యమైన గురువు మాత్రమే కావాలి. ఎవరిని ఆశ్రయిస్తే నేను అంతిమ సత్యాన్ని పొందుతానో, అలాంటి సద్గురువు కావాలి". నేను "అంతిమ సత్యాన్ని" పొంద దలుచుకున్నాను, ఆ యొక్క "అంతిమ సత్యాన్ని" చేరే మార్గం బోధించే "పరమ సత్యమైన గురువు" మాత్రమే నాకు లభించాలి అని గట్టిగా, దృఢంగా నిర్ణయించుకోవాలి. మహా గాఢంగా అనుకోవాలి. "నాకు పరమ సత్యమైన గురువు లభించాలి" అని తీవ్రంగా కోరుకోవాలి. ఇది ఒక మహా రహస్య విశ్వ సూత్రం. - ఇది ఓషో మహాత్ముడు చెప్పిన దివ్య సూత్రం.

ఇలా కోరుకుని మీరు అన్వేషణ చేస్తూ ఉంటే ఆటోమెటిక్‌గా "పరమ సత్యమైన గురువును" కలుసుకుంటారు. "గురువును" కలిసినపుడు మీకు ఎంతో స్పష్టంగా తెలుస్తుంది. ఈయనే "నా గురువు" అని. ఆయనపై చక్కగా గురి కుదురుతుంది. ఏదో తెలియని విశ్వాసం కలుగుతుంది. ఆ "గురువు" పట్ల ఈ విధంగా జరగగానే వెంటనే ఆయనను ఆశ్రయించాలి. ఇక వారి మార్గదర్శకత్వంలో సాధనను కొనసాగించాలి. "సత్యమైన గురువు" దొరికితే "సత్యం" దొరికినట్టే ! ఖచ్చితంగా మోక్షం / నిర్వాణం / బ్రహ్మానుభవం ఏదైనా అనండి ఆ యొక్క "అంతిమ సత్యాన్ని" పొంది తీరుతారు. అయితే గుర్తుంచుకోండి. చాలా మంది ఇక్కడే దారి తప్పి పోతారు.

"నేను సత్యాన్ని పొందాలనుకుంటున్నాను" అని అంటే "ఏ సత్యం" ? ప్రతీ ఒక్కరు "సత్యం" పట్ల ఒక్కో అభిప్రాయాన్ని కలిగి ఉంటారు. "మీరు నమ్మే "సత్యం" ఏదైతే ఉందో దానికి దారి చూపించే "గురువు" దగ్గరకు మాత్రమే మీరు వెళ్తారు".

మహా విశ్వ సూత్రం, *THE GREAT COSMIC LAW,* ఆధ్యాత్మిక సూత్రాలలో అగ్రశ్రేణికి చెందిన సూత్రం - "యద్భావం తద్భవతి" ! నీవు ఏ "భావం" కలిగి ఉంటావో, నీ "భవం" అంటే నీ పరిస్థితి అలా ఉంటుందని అర్థం. నీ అభిప్రాయం ప్రకారం "సత్యం" అని నీవు దేనిని అనుకుంటున్నావో దానికి దారి చూపించే వాడి దగ్గరికే వెళ్తావు. శిష్యులకు తగ్గ గురువులు, గురువులకు తగ్గ శిష్యులు ఎప్పుడూ ఉంటారు. "గంతకు తగ్గ బొంత" ఉంటుంది. కాబట్టి జాగ్రత్త ! అయితే నిజం ఏమిటంటే అన్ని మతాల మూల సారాంశం ఒక్కటే ! అందరు "మాస్టర్లు" చెప్పిన "మూల విషయం ఒక్కటే", "సత్యం" నిర్వచించబడదనీ, ఊహించలేమని, దాని గురించి ఏమీ చెప్పలేమని కేవలం అనుభవం ద్వారా మాత్రమే తెలుసుకోవాలనీ ప్రతీ "మాస్టర్" చెప్పాడు. శ్రీకృష్ణుడు, జీసస్ క్రైస్ట్, మహమ్మద్, మహా వీరుడు, జరాత్రుష్టుడు(జోరాస్టర్) ఇంకా ఎందరెందరో మాస్టర్లు ఒకే విషయాన్ని నొక్కి వక్కాణించారు.

ఏ నిర్వచనానికి, ఏ ఊహకు, ఏ ఆలోచనకు, ఏ తర్కానికి, ఏ అభిప్రాయానికి, ఏ నమ్మకాలకు దేనికీ...దేనికి కూడా అందనిదీ.....అన్నిటికీ అతీతమైనదీ "అంతిమ సత్యం" అని ఎంతో స్పష్టంగా చెప్పారు. అయినా 99% మంది జనాలు "సత్యం" పట్ల ఏదో ఒక అభిప్రాయాన్ని కలిగి ఉంటారు."అంతిమ సత్యాన్ని" పొందడానికి "అంతిమ మరియు ప్రథమ అడ్డంకి, దాని పట్ల మీకు ఉన్న మీ సొంత అభిప్రాయమే" ! ఎప్పటి వరకైతే "సత్యం" పట్ల మీకు ఉన్న అభిప్రాయాలు, నమ్మకాలు తీసివేయరో అప్పటి వరకు సత్య సాక్షాత్కారం కాదు గాక, కానే కాదు. కాబట్టి ప్రియ సత్య శోధకులారా ! "సత్యం" పట్ల మీకు ఉన్న సొంత "అభిప్రాయాలను", "నమ్మకాలను" తీసి వేయండి. "సత్యాన్ని" గురించి ఏమీ ఆలోచించకుండా, దాని పట్ల ఎలాంటి ఊహలు, అభిప్రాయాలు పెట్టుకోకుండా, ఊరికే అలా ఉండాలి ! సత్యం సత్యమే అని అనుకోవాలి. అంతే.

సత్య సంకల్పం యొక్క ప్రభావం వలన చిత్రాతి చిత్రంగా మీరు ఆ యొక్క "పరమ సత్య గురువును" కలుసుకుంటారు. ఆయన ఎక్కడున్నా మీరు ఎక్కడ ఉన్నా "ఆ యొక్క పరమ సత్యం" "మీ ఇద్దరిని" కలుపుతుంది. ఇదే ఆధ్యాత్మిక శాస్త్ర రహస్య సూత్రం. మరి సత్యమైన నిగూఢ విధానం. గురువులను వెతుకుతూ పోండి, లోపల తీవ్రంగా ఆ "సత్య సంకల్పాన్ని" స్మరించుకుంటూ వెళ్ళండి. ఎక్కడో ఒక చోట మీకు గురి కుదురుతుంది. విశ్వాసం కుదురుతుంది. ఆయన దొరికిన తర్వాత కూడా మళ్ళీ ఒక సారి "ఆ సత్య సంకల్పాన్ని" చెప్పుకోండి. నిర్ధారించుకోండి. అయితే, గుర్తుంచుకోండి. ఇక్కడే దారి తప్పుతారు.

సత్య మార్గం చూపెట్టిన ఏ మాస్టర్‌ను కానీ, చూపించబోయే మాస్టర్‌ను కానీ ముందుగానే ఊహించుకోవద్దు. మమ్మల్ని ఊహించుకోమని ఏ "మాస్టర్" చెప్పలేదు. శ్రీకృష్ణుడు, జీసస్ క్రైస్ట్, మహమ్మద్, మహా వీరుడు, జరాత్రుష్టుడు ఇలా సత్య మార్గం బోధించిన వారినెవరినీ ఊహించుకోకండి. వాళ్ళనెలా ఊహిస్తాం ?! వాళ్ళు కేవలం ఆ ఒక్క స్వరూపానికే పరిమితమైన వారు కాదు కదా ! అనేకానేక రూపాలలో ఉంటారు. అనంత స్వరూపులు వాళ్ళు. ఉన్న ఒకే ఒక సత్యం ఎన్నో రూపాలలో ప్రకటం అవుతూ ఉంటుంది. వాళ్ళు మమ్మల్ని ఊహించుకోమని చెప్పలేదు. మేము పొందిన దాన్ని మీరూ పొందండి అని మాత్రమే చెప్పారు. ఆ మార్గం చూపారు. కాబట్టి ఏ ఊహలు లేకుండా, ఏ రూపం లేకుండా, ఏ అభిప్రాయం లేకుండా కేవలం "పరమ సత్యం" అంతే ! ఆ యొక్క పరమ సత్యాన్ని మాత్రమే కోరుకోండి. **పసి ఆత్మలు రూపాన్ని ఊహించుకోకుండా ఉండలేవు. ఒక రూపమంటూ లేకపోతే ఎలా ? అని ప్రశ్నిస్తాయి. దానికి సమాధానం "పరిపక్వతయే" ! పండితే గానీ ఆ విషయం అర్థం కాదు. పండిన ఆత్మలు, పరిణతి చెందిన ఆత్మలు మాత్రమే ఏ రూపం లేకుండా అనంత తత్వాన్ని ధ్యానించ గలుగుతాయి.** ఇలా చేసినప్పుడు ఆ సత్య మార్గదర్శి మీకు దొరుకుతాడు. మీకు ఆటోమెటిక్‌గా తెలుస్తుంది. ~~ఈయనే లేక ఈమెయే~~, నేను వెతుకుతుంది... వీరినే... అనుకుని, ఆయనను / ఆమెను ఒప్పుకోవడం(నమ్మడం) మొదలు పెడతారు. గురి కుదురుతుంది. మీకు గురి కుదిరే వరకు ఆ "సత్య సంకల్పాన్ని" చెప్పుకుంటూ వెతకండి, వెతకాలి మరి ! లేకపోతే వదిలేయండి !

గురువు మీ ఊహలకు భిన్నంగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి గురువు పట్ల ఎలాంటి ఊహలు పెట్టుకోకండి. సరి కాని ఊహలు దారి తప్పిస్తాయి. గురువు మీరు అనుకున్నట్టుగా ఉండచ్చు, ఉండక పోవచ్చు. చాలా మంది... గురువులను చూసి వారి వేష భాషలను, వారి నడవడికను గమనించి, తమ అభిప్రాయాలకు తగ్గట్టుగా ఉంటే మంచి గురువు లేక పోతే కాదు అని తేల్చి పారేస్తుంటారు. ఇది ఎలా సాధ్యం ?!? గురువు కావాలని వెతికే వాడు ఎలా ఉండాలి ?! అసలు నీవు గురువు దగ్గరకి ఎందుకు వెళ్తున్నావు ? తెలియనిది తెలుసుకొనడానికే కదా ! నీకు తెలియని విషయాలను, ఎన్నింటినో తెలుసుకుని ఉన్న గురువు నీకు తెలిసినట్టుగా ఎందుకు ఉంటాడు ?! నీకు తెలిసినట్టుగా, నీకు నచ్చినట్టుగా ఉంటే "ఆయనకు" నీకు "తేడా" ఏముంటుంది ?! మూర్తీభవించిన అహంకారం ఇలా ఆలోచించేలా చేస్తుంది. ఈ "అహంకారం" తోనే చాలా మంది సత్య మార్గంలో నుండి తప్పి పోతూ ఉంటారు. గురువు దగ్గర అహంతో ఉండకూడదు. అహంకార ప్రవర్తన పాతాళానికి పడేస్తుంది. వినమ్రత శిఖరానికి ఎత్తి "సాఫల్యాన్ని" అందిస్తుంది. గురువు ముందు అహంకార ప్రవర్తన ఎంత మాత్రము చేయకూడదు. చాలా ప్రమాదం ! ఆటలు కాదు !

గురువుగా స్వీకరిస్తే స్వీకరించండి లేకపోతే లేదు ! అంతే కాని అహంకార ప్రవర్తన ఎన్నడూ "సరి" కాదు. "సత్య గురువుల" దగ్గర శిష్యరికం చేయాలనుకునే సాధకులకు, ఎన్నో అడ్డంకులు ఎదురవుతూ ఉంటాయి. వాటిని ఎంతో పట్టుదలతో మరియు "విశ్వాసం+ప్రేమ"లతో అధిగమించాలి. సత్య గురువులు, శిష్యులను ఎంచుకోడానికి ఎన్నెన్నో పరీక్షలు పెడతారు. అన్ని పరీక్షలలో నెగ్గితేనే అవకాశం ఇస్తారు. నిజానికి గురువులు ఏమీ చేయరు. కేవలం "అహం" తీసివేస్తారు అంతే ! "అహం" పోగానే "సాక్షాత్కారం" కలుగుతుంది.

"అహం" అంటే నేను సర్వస్వం నుండి "వేరు", "ఏకం" కాదు అనే భావన !

"అహం" అంటే జ్ఞాపకాల సముదాయం. అహం అంటే అజ్ఞానం. ఇదే "సాక్షాత్కారం" పొందకుండా అడ్డుకుంటూ ఉంటుంది.

ఈ "అహం" నశించే వరకు "సాక్షాత్కారం" కలుగదు. ఈ "అహం" వల్లనే అన్ని కర్మలు, దరిద్రాలు, దౌర్భాగ్యాలు, కష్టాలు, నష్టాలు !

ఈ "అహం"ను గురువు తీసివేస్తాడు. ఈ "అహమే" మిమ్మల్ని గురువు నుండి దూరంగా తీసుకుపోతుంది. అహం అన్ని రకాలుగా ప్రయత్నం చేస్తుంది. తనను తాను రక్షించుకోవడానికి.

"గురువు పాదాల దగ్గర తమకు తాముగా, పూర్తిగా హృదయ పూర్వకంగా అర్పితం చేసుకోవాలి". "సర్వం సమర్పించుకోవాలి". గురువు దొరకడం ఎన్నో జన్మల పుణ్య ఫలం. మీరు గురువుకు సమర్పించుకుని, సేవ చేసి ఏదో ఆయనను ఉద్ధరించడం అంటూ ఏమీ ఉండదు. ఆయన మీద ఏదో మెహర్బాని చేస్తున్నట్టు, ఆయనకు ఏదో ఒరగ పెడుతున్నట్టు భావించవద్దు. ✪ నిజానికి గురువు దగ్గర మీరు పొందే దానిలో, మీరు చేసేది సముద్రంలో బిందువంత ! మీరు పొందేది సముద్రమంత !!

గురువుకు ఏ అవసరాలు ఉండవు. అన్ని అవసరాలు తీరితేనే గురువు అవుతాడు. శిష్యుల కోసం లేని అవసరాలను ఎన్నో సృష్టించు కోవాల్సి వస్తుంది గురువుకి. వారికి రక, రకాలుగా బోధించడానికి ఎన్నో వేషాలు వేయాల్సి వస్తుంది. ఇది చూసి "గురువు గారికి" కూడా అవసరాలు ఉన్నాయి, వారికి కూడా అలవాట్లు ఉన్నాయని భావించడం "మూర్ఖత్వం" ! "మూఢత్వానికి పరాకాష్ఠ" !

✪✪✪ గురువులు అంటే సవాలక్ష రకాలుగా ఉంటారు. పొగాకు + మద్యం త్రాగుతూ, అమ్మాయిలతో ఎంజాయ్ చేస్తూ, తమ దగ్గరికి రావాలనుకునే వారికి భయంకరమైన సంఘర్షణను, సవాలక్ష సందేహాలను రేకెత్తిస్తూ ఉంటారు. దత్తాత్రేయుడి గురించి, ఇంకా కొంతమంది ప్రత్యేకమైన గురువుల గురించి తెలుసుకుంటే అప్పుడు ఇలాంటి విషయాలు అర్థం

అవుతాయి. వాళ్ళు ఇలాగే ప్రవర్తిస్తూ శిష్యులను పరీక్షిస్తూ ఉంటారు. కొంత మంది ఉంటారు సీదా సాదాగా, వీరిని చూడగానే గురువులని తెలిసిపోతుంది. వెంటనే ఆ విషయం ఒప్పుకోవాలనిపిస్తుంది. కొంత మంది పైకి చూడటానికి అశుభ్రంగా, ఛండాలంగా, భయంకరంగా, అసహ్యం పుట్టేలా ఉంటారు. ఒక్కొక్కరిది ఒక్కో రకం ! లోకంలో ఎంతోమంది సద్గురువుల చరిత్రలు ఉన్నాయి. వాటిని అన్నింటినీ ఎంత బాగా చదివి అవగాహన చేసుకుంటే అంత మంచిది. ప్రతీ కాలంలోనూ, ఎప్పుడైనా సరే సశరీరంగా సద్గురువులు ఉంటారు. వారిని శరణు పొంది సాధన కొనసాగించవచ్చు. ✪ గుర్తుంచుకోండి, గురువులు ఎల్లప్పుడూ ఉంటారు. వారిని గుర్తించే "కళ" నేర్చుకోవాలి.

✪✪✪ శిష్యరికం అంటే ఏమిటి ? శిష్యుడు అంటే ఏమిటి ? శిష్యుడు గురువు గారి దగ్గర ఎలా ఉండాలి ? గురు శిష్యుల అనుబంధం ఏమిటి ? అనే విషయాలను తెలుసుకోవడమే "గురువులను గుర్తించే కళ" ! గుర్తుంచుకోండి, ముందు శిష్యుడిగా మారితే తప్ప గురువును గుర్తించలేరు.

✪✪✪ సాధారణంగా చాలా మంది ఏం చేస్తారంటే శిష్యరికం గురించి తెలుసుకోకుండా, తమను తాము శిష్యుడిగా మార్చుకోకుండా గురువు కోసం వెతుకుతూ ఉంటారు. ఇది ఎంత మాత్రము సరి కాదు. ముందు ఇది చదివి బాగా అర్థం చేసుకుంటే శిష్యరికం గురించి, శిష్యుడి గురించి, గురువు గురించి, గురు - శిష్యుల అనుబంధం గురించి తెలుస్తుంది.

✪✪✪ దొంగ గురువులు చాలా జాగ్రత్తగా ఉంటారు. వారు సాధారణంగా పట్టుబడరు. ఘరానా దొంగ గురువులు చాలా జాగ్రత్తగా, హుందాగా ఉంటారు. కర్మ వశాత్తు చిన్న చిన్న వాటిలో ఇరుక్కుని దొరికేది చిన్న దొంగలే. అసలు పెద్ద దొంగలను మాటు వేసి పట్టుకోవడం సాధారణ జనాల వలన సాధ్యమయ్యే పని కాదు. ఆకాశ గురువులు పూనుకుంటేనే ఆ పెద్ద ఘరానా దొంగ గురువులకు మూడుతుంది. ఈ దొంగ గురువులు అన్నీ తెలిసి చేస్తారా ? తెలియక చేస్తారా ? అనేది అంతు చిక్కని ప్రశ్న. ఎందుకంటే చాలా గొప్ప గొప్ప ఆధ్యాత్మిక నియమాల గురించి చెప్తారు, వ్రాస్తారు, మరి ఎందుకు చీకటి పనులు చేస్తారు ? వీరికి భయం వేయదా ? తాను తవ్వుకున్న గొయ్యిలో తానే పడతానని ! వీరి శిష్యులకేమీ తెలియదు కాబట్టే.. దొంగ గురువుల దగ్గర ఉంటారు. కాకపోతే వారు చేసిన దానికి గ్యారంటీగా ఫలితం అనుభవిస్తారు. నిప్పును తెలిసి ముట్టుకున్నా, తెలియక ముట్టుకున్నా కాలుతుంది. వీళ్ళలో ఆ దొంగ గుణాలు లేక పోతే దొంగ గురువుల దగ్గరకు ఎందుకు వెళ్తారు ?

ఆధ్యాత్మిక పుస్తకాలను చదివి, విషయాలను అవగాహన చేసుకుంటే అప్పుడు చాలా సులభం అవుతుంది, ఒక సద్గురువును గుర్తించడం. ఎందుకంటే అప్పుడు మీరు శిష్యులుగా మారి ఉంటారు గనుక ! శిష్యుడిగా మారితేనే గురువు దొరుకుతాడు. శిష్యుడు మాత్రమే గురువును గుర్తించ గలుగుతాడు. శిష్యరికం అంటే ఒక కోణంలో గురువును గుర్తించే సామర్థ్యం అని అర్థం.

ఎవరికి వారే మాస్టర్లు(గురువులు), ఎవరూ ఎవరికి శిష్యులుగా ఉండకూడదు అనే కాన్సెప్ట్ ఒకటి ఉంది. చక్కటి కాన్సెప్ట్ ఇది. అయితే దీన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే గోతిలో పడటం ఖాయం ! ఎవరికి వారే గురువు(మాస్టర్) - అయితే, తనకన్నా సీనియర్ దగ్గర నేర్చుకునేప్పుడు మాత్రం విద్యార్థిగా మారాలి. ప్రతీ ఒక్కరు గురువులే, శిష్యులే. తనకన్నా జూనియర్లకు సీనియర్, తనకన్నా సీనియర్లకు శిష్యుడు లేక జూనియర్ లేక విద్యార్థి.

ప్రతీ ఒక్కరూ ఏక కాలంలో గురువులే, శిష్యులే. శిష్యుడు అంటే విత్తనం, గురువు అంటే వృక్షం. విత్తనంలో వృక్షం దాగి ఉంది కాబట్టి విత్తనం ఒక రకంగా వృక్షమే. అయితే అది భవిష్యత్తులో కాబట్టి, ముందు విత్తనం తనను తాను విత్తనంగా గుర్తుంచుకుని సాధన చేస్తే ఆటోమెటిక్‌గా వృక్షంగా అవుతుంది. అంతే కాని విత్తనం తనను తాను విత్తనంగా గుర్తించకుండా, తాను వృక్షమనే భ్రమలో గనక ఉంటే అది ఎప్పుడూ విత్తనంగానే ఉంటుంది. అందరూ, ప్రతి ఒక్కరూ మాస్టర్లే(గురువులే) కాదని ఎవరన్నారు ?! ఎవరికి వారే మాస్టర్లు(గురువులు) ఇదే అసలు సిసలు పరమ సత్యం. అయితే ఈ విషయం తెలుసుకునేందుకు ఇతర సీనియర్లు అవసరం అవుతారు. వారినే మాస్టర్స్ లేక గురువులని అంటారు.

ఎవరికి వారే గురువులు(మాస్టర్లు) అనగానే అందరూ ఆల్‌మోస్ట్ ఒక శ్రీకృష్ణ పరమాత్ముడి లెవెల్లో, ఒక జీసస్ క్రైస్ట్ లెవెల్లో ఫీలవుతూ ఉంటారు. ఇది సరికాదు. ఎవరికి వారే గురువులు(మాస్టర్లు) అనే కాన్సెప్ట్ కేవలం మీ బాధ్యత మీరు పూర్తిగా వహించడానికే తప్ప విర్ర వీగడానికి కాదు. మీ బాధ్యతను గురువు మీదకు నెట్టి వేయకుండా, అంటే గురువు మీద వాలి పోకుండా, మీకు మీరే 100% బాధ్యత వహిస్తూ, గురు మార్గదర్శకత్వంలో సాధన చేస్తూ "సాఫల్యాన్ని" పొందడానికి ఈ కాన్సెప్ట్ ఉంది.

మాస్టర్ అనే పదానికి రెండు అర్థాలున్నాయి.

1. నీ వాస్తవానికి నీవే సృష్టికర్తవు
2. గురువు

"ఎవరికి వారే మాస్టర్, ఎవరూ ఎవరికి శిష్యులుగా ఉండకూడదు" అనే కాన్సెప్ట్‌లోని "మాస్టర్" అనే పదం "నీ వాస్తవానికి నీవే సృష్టికర్తవు" అని సూచిస్తుంది.

నీ వాస్తవానికి నీవే సృష్టికర్తవనే సత్యాన్ని పూర్తిగా ఒప్పుకుంటూ, నీ బాధ్యతను నీవు 100% వహిస్తూ ఉన్నప్పుడు, నిన్ను నీవు తెలుసుకోవడానికి, నీ నిజతత్వమైన "దైవత్వాన్ని" అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి ఒక సీనియర్ అవసరం అవుతాడు. ఆ సీనియర్ అప్పటికే ఆల్‌రెడి దైవత్వాన్ని పొంది ఉంటాడు. ఆ సీనియర్‌నే మాస్టర్ లేక గురువు అని అంటారు. అతడు అప్పటికే ఆ దారిలో నడిచాడు. ఆ దారి అంతా అతనికి తెలుసు. తెలియని దారిలో తెలిసిన వాడి మార్గదర్శకత్వం అనివార్యమైనదే కదా ! అందుకే తెలిసిన వాడిని శరణు పొందాలి. తెలిసిన వాడినే గురువు(మాస్టర్) అని అంటారు. అన్ని దారులు తెలిసి ఉన్న గురువు ఆధ్వర్యంలో సాధన మొదలు పెట్టాలి. అప్పుడే సాఫల్యం పొందగలుగుతారు. లేదా అది అసంభవం !

మీకు మీరే గురువులు(మాస్టర్లు) అని అన్నప్పుడు, మీ వాస్తవానికి మీరే సృష్టికర్తలు అని చెప్పడం అవుతుంది. ఇది మీ పట్ల మీరు మాత్రమే బాధ్యత వహించాలి అని హెచ్చరిస్తుంది. ఇతరుల పైన వాలి పోయి, తన అభివృద్ధిని తానే నాశనం చేసుకోకుండా ఉండడానికి ఈ సూత్రం ఉంది.

"ఎవరికి వారే గురువులు" అనే విషయాన్ని చెప్పింది కూడా ఒక "గురువే" కదా ! దయచేసి గ్రహించండి. ఎవరికి వారే గురువులు(మాస్టర్లు) అంటే, మీ బాధ్యత మీదే అని చెప్పడం. అంతే కానీ ఎవరికి వారే గురువులట, చల్, చల్... అంటూ అహంకారాన్ని పెంచి పోషించడానికి కాదు, మూర్ఖంగా ప్రవర్తిస్తూ సత్య మార్గంలోనే ఉన్నామని భ్రమ పడుతూ, సత్య మార్గానికి దూరం అవడానికి కాదు.

కొంతమంది గురువులనే పరీక్షిస్తూ ఉంటారు. ఇది సరి అయిన పనే ! అయితే ముందు ఎలాంటి గురువులను పరీక్షించాలి. ఎలాంటి వారిని పరీక్షించకూడదో తెలుసుకోవాలి.

✪✪✪ ఉన్నది ఒకే ఒక పరమ సత్యం అది... "నీవే దైవం" ! ఈ సృష్టియే నువ్వు ! ఈ ప్రకృతే నువ్వు ! ఈ సర్వస్వమే నువ్వు ! నీ లోనే సర్వస్వమూ ఉంది, దానిని అనుభవ పూర్వకంగా ఎలా తెలుసుకోవాలో బోధించే వాడే అసలు సిసలు గురువు. ఇది కాకుండా మరేదైనా చెప్తున్నాడూ అంటే... ఇక్కడ ఆలోచించాల్సిన అవసరం ఉంది, మరి పరీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దైవత్వం మనం సహజంగానే కలిగి ఉన్నాము, ఈ విషయాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకోవడం ఎలా ? అనే విషయంపై చాలా పుస్తకాలు ఉన్నాయి. ఇక్కడే చాలా మంది దారి తప్పి పోతూ ఉంటారు. ఆ పుస్తకాలు చదవగానే గురువులకే సలహాలు ఇవ్వడం మొదలు పెడుతుంటారు. ప్రధాన మంత్రి కావడం ఎలా ? అనే పుస్తకం చదవడం వేరే, స్వయంగా ప్రధాన మంత్రి కావడం వేరే. ఇవి రెండు పూర్తిగా వేరు విషయాలు. దైవత్వం పొందడం ఎలా అనే పుస్తకాన్ని చదవడం వేరే ! స్వయంగా దైవత్వాన్ని పొందడం వేరే కదా ! ఒక సారి ఆలోచించండి !

2006లో నా దగ్గర ఉన్న చాలా మంది శిష్యులలో ఒకడు తన సీనియారిటీని ఆసరాగా చేసుకుని జూనియర్లపై అనవసర పెత్తనం చెలాయించే ప్రయత్నం చేస్తున్నాడని నాకు తెలిసింది. నేనేమో నా ప్రాజెక్ట్ పనిలో క్షణం తీరిక లేకుండా ఉన్నాను. ఆ వ్యక్తిని ఏం చేయాలా అని ఆలోచించి, సేత్ మహాశయుని పుస్తకం ఒకటి ఇచ్చాను. దాని పేరు "ద నేచర్ ఆఫ్ పర్సనల్ రియాలిటి". అది చదివి మారుతాడేమోనని ఇచ్చాను. అయితే అతను వేరే రకంగా మారాడు. కొన్ని రోజుల తర్వాత నా దగ్గరకు వచ్చాడు. ఆ పుస్తకం మీరు చదివారా అని అడిగాడు. వెంటనే అందులో సూపర్ జ్ఞానం ఉంది అంటూ అందులోని విషయాలు నాకు కొన్ని వివరించి, నాకు చాలా ఆనందంగా ఉంది సార్ అన్నాడు. నేను ఎందుకు ? అని అడిగాను. దానికి అతను, ఇంత త్వరగా నేను మిమ్మల్ని మించి పోతానని అనుకోలేదు. గురువుని మించిన శిష్యుడిని అయినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది అంటూ నన్ను పట్టించుకోకుండా ఏవేవో చెప్తున్నాడు. కొన్నాళ్ళ తర్వాత నా దగ్గర్నుండి వెళ్ళి పోయాడు. మంచివాడే, కానీ పుస్తకం చదవగానే తనకేదో జరిగినట్టు ఫీలయ్యాడు.

అప్పుడప్పుడు ఇలా జరుగుతుంది. పుస్తకం చదవడం వేరే, అలా కావడం వేరే ! కాబట్టి దయచేసి జాగ్రత్తగా ఉండండి. న్యూ ఏజ్ పుస్తకాలలో సత్యం సూటిగా ఉంటుంది. అందులోని విషయాలు ఏ మర్మమూ లేకుండా చాలా స్పష్టంగా ఉంటాయి, ఈ స్పష్టత అనేది ఎంతో ఉత్తేజాన్ని కలుగజేస్తుంది. ఎన్నో నిగూఢ రహస్యాలు సింపుల్‌గా, డైరెక్ట్‌గా దర్శనమిచ్చే సరికి "పొంగు" వస్తుంది. ఏదో ఆవేశం, ఏదేదో జరుగుతుంది. ఆ సత్యాలు చదివిన క్షణంలో కలిగిన ఉత్తేజం, ఆ ఊపు చాలా గొప్పగా ఉంటాయి. అవి అలానే శాశ్వతంగా ఉంటే ఫర్వాలేదు. కానీ, కొద్ది రోజుల్లోనే ఆనవాలు లేకుండా అదృశ్యం అయిపోతేనే ఇబ్బంది. గురు సమక్షంలో ఉన్నప్పుడు ధైర్యం ఉంటుంది. ఉత్సాహం, ఉత్తేజం పొంగుతూ ఉంటాయి. ఈ పుస్తకాలు చదవగానే ఆ పొంగు కాస్త ఎక్కువ అవుతుంది. ఇక్కడే జాగ్రత్త పడాలి. ఎరుకతో ఉండాలి.

✪✪✪ గురువు ఒక సూర్యుడి లాంటి వాడు, ఆయన దగ్గర ఉన్నప్పుడు ఆయన వెలుగు మీ మీద కూడా ఉంటుంది. ఆయన వెలుగును మీ వెలుగుగా భ్రమించి దూరం పోగానే అప్పుడు తెలుస్తుంది, ఆ వెలుగు మీది కాదు అని.

గురువు దొరకడం కష్టం. కాబట్టి అహంకారాన్ని గురువు పాదాల ముందు సమర్పించుకుని శ్రద్ధతో, సహనంతో, ఎరుకతో ఉంటూ శిష్యరికాన్ని నిలుపుకోవాలి. గురువు నుండి దూరం కావడం అంటే సర్వస్వానికి దూరం అయినట్టే. ఒక గురువు దగ్గర అవకాశం పోయినా ఇంకో గురువునైనా వెతికి పట్టుకోవాలి. అక్కడైనా ఒళ్ళు దగ్గర పెట్టుకుని ఉండాలి. సరైన సత్య గురువు వద్దకే వెళ్ళాలి. గురువును మార్చకూడదు అని అంటూ ఉంటారు. గురువును మార్చవచ్చు కానీ, "గురి" మార్చకూడదు. సత్యం పైన మీ గురి మారకుండా ఉన్నప్పుడు అంతా శ్రేయస్కరంగానే జరుగుతుంది.

గురువును మార్చకూడదు అని ఎందుకు అంటారంటే, ఒక్కో గురువుది ఒక్కో రీతి. ఒక బోధనకీ, సాధనకి అలవాటుపడి మళ్ళా అవి అన్నీ మార్చుకోవాలంటే కొంచెం సమయం పడుతుందని అలా అంటారంతే ! గురువును మార్చుకోవచ్చు అని అంటే నిలకడగా ఎక్కడా ఉండరని అలా అంటారంతే అంతకు మించి మరే మర్మము లేదు.

ఇప్పుడు దివ్య స్వర్ణ కాంతి యుగం & నవీన యుగ ఆరంభ లక్షణాలు మీ అంచనాలకు భిన్నంగా ఉండే అవకాశం ఉంది. గురువులంటే ఎక్కడో అడవుల్లో గుహల్లో, ఉంటారని అనుకుంటారు చాలా మంది. సద్గురువులు అడవుల్లో, గుహల్లోనే కాదు అంతటా ఉంటారు. ప్రస్తుతం జీన్ ప్యాంట్, టీ - షర్ట్ వేసుకుని తిరిగే సద్గురువులు ఈ భూమి మీద ఎంతో మంది ఉన్నారు. గురువు యొక్క వేష ధారణ కాదు మీరు చూడాల్సింది. గురువు యొక్క సబ్జెక్ట్. ఆయన బోధనలు ఏమిటి ? అనే విషయం చూడాలి.

ఆయనతో కొన్నాళ్ళు కలిసి ఉండాలి, అంటే రెగ్యులర్ టచ్‌లో ఉండాలి. వారి మాటలు, వీరి మాటలు నమ్మకూడదు. ప్రత్యక్షంగా మీరే ఆయనతో కొన్నాళ్ళు ఉండి తెలుసుకోవాలి. అప్పుడు ఆయన మీకు సూట్ అయితే సరి, లేకపోతే మీకు సూట్ అయ్యే గురువు కోసం వెతకండి. కాని సద్గురువును పట్టుకుని తీరాలి. అప్పుడే జన్మకు సార్థకత.

మీరే సాక్షాత్తు దేవుళ్ళు. అందరూ దైవమే, అంతా దైవమే. మీదై ఉన్న మీ దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా ఎలా తెలుసుకోవాలో "సూటిగా" నేర్పించే గురువే అసలు సిసలు సద్గురువు, అతడే పరమ సత్య గురువు. ఇలాంటి గురువును వెతికి పట్టుకుని శరణు పొందాలి. వారికి ఆత్మ పూర్వకంగా స్వయం సమర్పణ చేసుకోవాలి. గురువు ఏది చెప్తే అది చేస్తూ పోవాలి.

✪ గురువు చెప్పింది చేయడమే ధ్యానం ! గురువు ఏది చెబితే అది. అయితే మీకు గురువు చెప్పే విషయాలు చాలా మటుకు అర్థ రహితంగా అనిపిస్తాయి. అందులో ఏ విలువా, ఏ విషయమూ లేనట్టే కనపడతాయి. పనికివచ్చేవి పనికిమాలినవిగా అనిపిస్తాయి. పనికిమాలినవి పనికివచ్చేవిగా అనిపిస్తాయి. లోతైన ఆధ్యాత్మిక అవగాహన లేనప్పుడు అలా అనిపించడం సహజం. అనవసర తర్కాన్ని పక్కకు పెట్టి గురువు చెప్పింది చేస్తూ పోతే అంతా శ్రేయస్కరమే జరుగుతుంది.

గురువుకు "సరెండర్" కావడం వేరు. గురువు పైన "డిపెండ్" కావడం వేరు. ఈ రెండింటికి, భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉంది. "సరెండర్" అంటే "అహంకార సమర్పణ", "డిపెండ్" అంటే "వాలి పోవడం". గురువుకు సరెండర్ కావాలి, గురువు పైన డిపెండ్ కాకూడదు.

✪✪✪ గురువుకు సర్వం సమర్పించుకోవాలి, తన్, మన్, ధన్‌సే... అంటే శరీరం + మనస్సు + ధనంతో, సర్వ సమర్పణ హృదయపూర్వకంగా జరగాలి. అలా జరగడం ఎంతో శ్రేయస్కరం ! మహా దివ్యమైన అభివృద్ధి జరుగుతుంది అలా చేస్తే ! వెతకండి, "సత్య సంకల్పాన్ని" చెప్పుకుంటూ వెతకండి. మీకు గురి కుదిరే వరకు వెతకండి. "జీవించి ఉన్న సద్గురువు" దొరకడం కష్టం. వెతకండి. ఆత్మ పూర్వక శ్రద్ధతో వెతికితే దొరికి తీరుతాడు.

చాలా మంది గురువుల దగ్గరకి ఆత్మ విద్య నేర్చుకోవడానికి వచ్చినప్పుడు, మేము వయసులో పెద్ద, మాకు అరవై ఏళ్ళు వచ్చాయి మేము బాగా అనుభవజ్ఞులం అని అనుకుంటూ ఉంటారు. నా దగ్గర, నా శిష్యులు అందరూ దాదాపుగా యువతీ, యువకులే ! ఆ వచ్చిన వాళ్ళు మా వాళ్ళను చూసి అరె, చిన్న పిల్లలు అని అనుకుంటూ ఉంటారు. ఆత్మ విజ్ఞానం లేక పోవడం వలన ఇలా తప్పుగా అనుకుంటూ ఉంటారు. ఇలా అనుకునే వాళ్ళ శరీర వయస్సు పెద్దగానే ఉంటుంది. ఆత్మ మాత్రం పసిగా ఉంటుంది. "పసి ఆత్మలు వీళ్ళు". భౌతిక శరీరానికేం ? 60/70/80/90/100/200 సంవత్సరాల వయసు ఉంటుందేమో, ఇక్కడ భౌతిక శరీరానికి ఎన్నేళ్ళు వచ్చాయన్నది కాదు విషయం - చూడాల్సింది ఎంత ఆత్మ పరిణితి ఉంది అని ! ఆత్మ వికాసాన్ని చూడాలి. స్వామి వివేకానంద యువకుడు, ఆయనకు మించిన వికాసాన్ని ఏ 100 ఏళ్ళ వృద్ధుడైనా చూపిస్తాడా ??? వయసుకేం దానంతట అదే పెరిగి పోతూ ఉంటుంది. పరిపక్వత ఉండొద్దూ ?

జన్మ పరిణామ క్రమంలో పండి పోయిన ఆత్మలే ఆధ్యాత్మిక క్షేత్రంలోకి అడుగు పెడతాయి. ఎంతో అనుభవం ఉన్న ఆత్మలు, అన్ని రకాల భౌతిక జన్మలు ఎత్తి, ఇక ఏ విధమైన భౌతిక పరమైన శేషం ఏమీ మిగలనప్పుడే, భౌతికం అంతం అయినప్పుడే ఆధ్యాత్మికంలోకి అడుగు పెడతాయి.

గుర్తుంచుకోండి ! మీ శరీర వయస్సు ఎంతైతే ఏం ! ఆత్మ విజ్ఞానం ఎంత ఉందో చూసుకోండి. ఆత్మ ఎంత పండిందో చూసుకోండి. శరీరానికి ఉంటాయి 80 లేదా 90 ఏళ్ళు, అయినా చిన్న, చిన్న భౌతిక బంధాలలో నుండి బయట పడకుండా ఉంటారు. ఆత్మ విజ్ఞానం రవ్వంత అయినా తెలియని పిల్ల ఆత్మలు ఎన్నో ముసలి శరీరాల్లో ఉంటాయి. కాబట్టి "శరీరం" యొక్క వయస్సు కాదు ముఖ్యం "ఆత్మ" ఎంత పండిందో, దానికి ఎంత విజ్ఞానం ఉందో అది ముఖ్యం, అది పెద్దది. అంటే ఆత్మ విజ్ఞానం ఉన్న వాళ్ళే పెద్ద వాళ్ళు. శరీరాలు పెద్దగా ఉన్న వాళ్ళు కాదు. శరీరాలకేం పెరుగుతాయి. మూడు పూటలా మేపినా మేపక పోయినా ఏపుగా "హైవే (High way) పక్కకు చెట్లు పెరిగినట్టు" బాగానే పెరుగుతాయి. అనుభవ పూర్వక ఆత్మ విజ్ఞానం ఉండొద్దూ !!

కాబట్టి అడవిలో చెట్లు పెరిగినట్టుగా పెరగడం కాదు, ఎంత సాధన చేసాం, ఎంత అనుభవాన్ని గడించాం అన్న "అనుభవ పూర్వక ఆత్మ విజ్ఞానంతో కూడిన అవగాహనయే అసలు సిసలు వయసు". ఇలా ఆత్మ విజ్ఞానం ఉన్న వారే పెద్ద వారు.

భౌతిక శరీర వయస్సులను బట్టి చూస్తున్నారంటే, మీరు ఆధ్యాత్మిక మార్గంలో ఇంకా ప్రవేశించని కిందే లెక్క. మీకు సత్యం గురించి ఏ మాత్రమూ తెలియదు అనే విషయం ఈ "భౌతిక శరీర వయస్సు" అనేది ఢంకా బజాయించి చెప్తుంది.

మీ మాటలను బట్టి "మీ స్థాయి" ఏమిటో ఆత్మ విజ్ఞానులకు చక్కగా తెలిసి పోతుంది. కాబట్టి వారి ముందు వాగవద్దు, మౌనంగా ఉండాలి, కేవలం వినాలి !

✪ ధ్యాన సాధకులకు, భౌతిక జీవితం గడిపే వారికి అంటే జీవితాన్ని పూర్తిగా ధ్యాన సాధనకు అంకితం చేసిన వారికి వృత్తి, వ్యాపార, ఉద్యోగాలు చేసుకునే వారికి మధ్య కనీసం "వేల జన్మల తేడా" ఉంటుంది. వృత్తి, ఉద్యోగ వ్యాపారాలు చేయడం అని అంటే కర్మ అనుభవిస్తున్నారు అని తెలుసుకోండి. అంతే కానీ ఏదో వెలగబెడుతున్నామనే ఫీలింగ్‌లో ఉండవద్దు. వృత్తి ఉద్యోగ వ్యాపారాలు చేసే వాళ్ళు కొంత మంది, సత్య ప్రచారకులను చులకనగా చూస్తుంటారు. అలాంటి అజ్ఞానులకు ఈ విషయం చెప్తున్నాను.

సత్య ప్రచారకులు అన్ని జన్మలు ఎత్తి, అన్ని అనుభవాలు పొంది, సహజమైన విసుగుతో స్వచ్ఛందంగా భౌతిక జీవితాన్ని, వ్యామోహాలను, బంధాలను, అనవసరమైన ఆశలను, వ్యర్థాలను అన్నింటిని ప్రశాంతంగా వదిలేసి ధ్యాన సాధనకు + సత్య ప్రచారానికి జీవితం అంకితం చేసుకుంటారు. అసలు సిసలు జీవితాన్ని ఎంజాయ్ చేస్తుంటారు. ఎన్ని కోణాలలో ఎంజాయ్‌మెంట్ ఉంటుందో అన్ని కోణాలలో ఎంజాయ్ చేస్తారు. కొత్త, కొత్త మార్గాలు కనుక్కుంటూ ఉంటారు ఎంజాయ్ చేయడానికి. ఈ విధంగా ఉత్సవ భరితంగా జీవిస్తూ, సత్య సాధనలో జీవితాన్ని ధారపోసి, సాధన చేసి సత్య ప్రాప్తిని పొందుతారు. ఈ విషయంలో చిట్ట చివర జన్మలో లేదా చివరి జన్మలలో ఉన్న వాళ్ళే నాలాంటి వారి దగ్గరికి శిష్యరికం చేసేందుకు వస్తారు. కాబట్టి మిత్రులారా ! దయచేసి తెలుసుకోండి, ఒక సారి నా క్లాస్ జరిగిన తర్వాత ఒకాయన వచ్చాడు. నాతో చేయి కలుపుతూ, నాకు 84 ఏళ్ళు అని అన్నాడు. ఎన్ని సంవత్సరాల నుండి మీరు ధ్యానం చేస్తున్నారని నేను అడిగాను. లేదు ఇదే నా మొదటి క్లాసు అని అన్నాడు. అప్పుడు నేను ఒక పదేళ్ళ కుర్రవాడిని చూపించి చెప్పాను అతను మీ కంటే చాలా, చాలా పెద్ద అని !

పదేళ్ళ కుర్రాడు సత్యం తెలుసుకుందామని నా క్లాసుకు వచ్చాడు. తనంతట తానే. తన ఈడు పిల్లలు బయట గ్రౌండ్‌లో ఆడుకుంటుంటే ఇతడు మాత్రం వచ్చాడు. నన్ను ఎన్నో ప్రశ్నలు అడిగి తెలుసుకున్నాడు. క్లాస్‌లో 50/60/70/80 ఏళ్ళ వాళ్ళు చాలా మంది ఉన్నారు. ఎవ్వరూ ఒక్క ప్రశ్న కూడా వేయలేదు. క్లాస్ అయిపోగానే పారిపోడానికి రెడీగా ఉన్నారు. "సత్యం" పట్ల ఎవ్వరికీ శ్రద్ధ లేదు. ఏదో పురాణ కాలక్షేపమో లేక హరికథనో అనుకుని వచ్చారు. తీరా ఇక్కడ విషయం వేరేగా ఉండే సరికి "అదిరిపోయి గుండెలు చిక్కబట్టుకుని" కూర్చున్నారు. ధ్యానం అంటే సాధన కదా ! దిమ్మ తిరిగి పోయి ఉంటుంది పాపం. 50/60/70/80 ఏళ్ళు వచ్చినా పదేళ్ళ కుర్రాడికి ఉన్నంత శ్రద్ధ లేదు వారికి, ఇలాంటి వాళ్ళంతా మేము "పెద్ద వాళ్ళం" అని భావిస్తూ ఉంటారు. ఇలాంటి "హైవే చెట్లతో" చాలా ఇబ్బంది. అతడు పదేళ్ళ కుర్రాడు కాదు, అతడి శరీరం యొక్క వయస్సు పదేళ్ళు ఉండొచ్చు గాక, కానీ అతడు వారందరి కంటే కనీసం "వందల జన్మలు" ముందు ఉన్నాడు, ఆత్మ పరంగా !

గుర్తుంచుకోండి మీ కంటే చిన్న వాళ్ళు, మీ కన్నా పెద్ద వాళ్ళు అయి ఉండొచ్చు. చూడండి, ఆత్మ విజ్ఞానం మీ కంటే ఎక్కువగా ఉంటే వాళ్ళు మీ కన్నా పెద్ద వాళ్ళు. ఇలా చాలా విషయాలు తెలుసుకోవాలి. అన్ని విషయాలు తెలుసుకోవాలి. సరైన న్యూ ఏజ్ పుస్తకాలు చదివితే చక్కగా అన్ని విషయాలు తెలిసి పోతాయి.

ఇంకా ఈ భూమి పైన జీవించి ఉన్న సద్గురువులు ఉన్నారు. వెతకండి, వెతికి పట్టుకుని మీరు కూడా తరించండి. "గురి కుదిరిన వాడే గురువు" కాబట్టి గురి కుదిరే వరకు వెతకండి.

జీసస్ క్రైస్ట్, వివేకానందుడు లాంటి వాళ్ళందరూ చిన్న వయస్సులోనే దైవత్వం పొందారు. నవ యువ శరీరంతోనే తిరుగుతూ ప్రబోధించారు.

భూమి చరిత్రలో ప్రధాన "మాస్టర్స్" యువకులుగా ఉన్నప్పుడే దైవత్వం పొందారు.

కాబట్టి శరీరం యొక్క వయస్సును ఎప్పుడూ పరిగణనలోకి తీసుకోవద్దు. ఆత్మ పరంగా, బుద్ధి పరంగా చూడాలి.

"ఆత్మ విజ్ఞానులే పెద్ద వాళ్ళు" !

"50/60/70/80/90/100 ఏళ్ళ వాళ్ళు కాదు ", వీళ్ళు వృద్ధ పిందెలు !

ఇక్కడ మనం ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తు చేసుకుందాం. చదువు రాని వాడు, జ్ఞానం లేని వాడు విషయాన్ని అపార్థమే చేసుకుంటాడు. తనకున్న అతి చిన్న పరిధిలో తనకు అర్థం అయిన విధంగా అర్థం చేసుకుంటాడు. అయితే వీళ్ళకు ఎవరైనా తెలిసిన వాళ్ళు చెప్తే వీళ్ళు వినే అవకాశం ఉంది. వింటారు. ఎందుకంటే తమకు తెలియదు అనే విషయం వీరికి తెలిసి ఉంటుంది కాబట్టి తెలిసిన వారు చెబితే వింటారు. వినని వారు ఎవరంటే చదువు వచ్చిన వారు, జ్ఞానం ఉన్నవారు, పండితులు. అందరూ కాదు లెండి ! కానీ చాలా వరకు వీరు ఎవరి మాట వినరు. ఎందుకంటే మాకు చదవడం, వ్రాయడం వచ్చు. డిక్షనరీ రిఫర్ చేయడం వచ్చు. ఏ విషయాన్నైనా మేం తెలుసుకోగలం అన్న స్థితిలో ఉంటారు. ఇలాంటి వారు "పదాన్ని" అర్థం చేసుకుంటారు. కేవలం శబ్దార్థాన్ని పట్టుకుని పోతుంటారు. శబ్దాలే కానీ, భావాన్ని పట్టించుకోరు. కేవలం చదవడం వ్రాయడం వచ్చి, పరీక్షలు రాసి పట్టాలు పుచ్చుకున్నంత మాత్రాన భావం బోధపడదు. భావం కేవలం అనుభవ జ్ఞానంలో నుండి మాత్రమే బోధపడుతుంది.

"అక్కడికి వెళ్ళి చావు" ! అనే వాక్యాన్ని శబ్దార్థ ప్రధానంగా తీసుకుంటారు. ఎందుకంటే వీరికి చదవడం, వ్రాయడం వచ్చు గనుక, డిక్షనరీలు రిఫర్ చేయడం వచ్చు గనుక ! ఓహో అక్కడికి వెళ్ళి చావాలన్న మాట అని అర్థం చేసుకుని అక్కడికి వెళ్ళి "చక్కగా ఛస్తారు". ✪ ఈ విధంగానే మహాత్ముల బోధనలన్నీ భూమి పైన అపార్థం చేసుకోబడుతున్నాయి. కేవలం చదవడం, వ్రాయడం వచ్చినంత మాత్రాన తమకెంతో తెలుసునని విర్రవీగుతూ ఉంటారు. మేము బాగా చదువుకున్న వారిమని, పండితులమని ఊగి పోతూ ఉంటారు. ఆ ఊపులో వాళ్ళు ప్రతి

దాన్ని తమ పాండిత్య దృష్టితోనే చూస్తారు. వీళ్ళంతా "చిలుకలు", కేవలం ఎవరో రాసిన సూత్రాలను, పుస్తకాలను, సిద్ధాంతాలను యథాతథంగా వల్లెవేసే "పంచ వన్నెల రామ చిలుకలు" ! As it is గా అప్పచెప్పే చక్కటి tape recorders వీళ్ళు ! వీరికి స్వంత జ్ఞానం ఉండదు. స్వానుభవం ఉండదు. ఎవరెవరి జ్ఞానాన్నో బట్టీ పట్టి గుర్తుంచుకుని అవసరం ఉన్నప్పుడు, లేనప్పుడు ప్రదర్శిస్తూ ఉంటారు. ఎందుకంటే వీళ్ళ పేర్ల పక్కన డిగ్రీలు ఉంటాయి.

వీళ్ళ పేర్ల పక్కన ఎన్ని డిగ్రీలైనా, ఎన్ని డాక్టరేట్‌లైనా ఉండనీ గాక, "లోపలి ప్రపంచంలో", ఆధ్యాత్మిక ప్రపంచంలో ఇవీ ఏవీ పనికి రావు గాక, రానే రావు.

వీళ్ళకు ఎన్ని మెడల్స్ అయినా ఉండనీ గాక, వీళ్ళ పేర్ల పక్కన ఇంజనీరింగ్ డిగ్రీలు లేదా ఏ ఇతర డిగ్రీలు ఎన్నైనా ఉండనీ గాక, వీళ్ళు ఎంత ప్రొఫెసర్‌లైనా అయి ఉండనీ గాక, ఎంత వయసు వారైనా అవుగాక, ఎంత వారైనా, రాజైనా, ఎవరైనా సరే ఈ యొక్క "ఆత్మ ప్రపంచంలో", inner worldలో పసిగుడ్డులే ! Nursery students మాత్రమే ! ఇది ఎంత ఘనంగా, స్థిరంగా గుర్తుంచుకుంటే అంత మంచిది.

ఉదాహరణకు రెండు విషయాలు చెప్తాను - 2007లో తిరువనంతపురంలో ఒక రోటరీ క్లబ్‌లో నా ప్రోగ్రాం జరిగింది. అంతకు ముందు నా క్లాసుకు అటెండ్ అయిన శ్రీ అప్పారావు గారు ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు (శ్రీ అప్పారావు గారు దేహ విరమణ చేసారని తెలిసింది. తమ ఈ జీవితపు చివరి రోజుల్లో మహా సాధన చేసారు. వారికి ప్రేమను + ఆశీర్వాదాన్ని ప్రకటిస్తున్నాం). వీరు "ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ISRO)లో గ్రూప్ డైరెక్టర్‌గా" పని చేసి రిటైరయ్యారు, చక్కటి వ్యక్తి. నా దగ్గరకి వచ్చి "గురూజీ" నేను రోటరీ క్లబ్ మెంబర్ని, మీ క్లాసు, concept నాకు బాగా నచ్చాయి. ఈ మహా విద్యను మా క్లబ్ మెంబర్స్ అందరికీ అందించాలని అనుకుంటున్నాను, please మీరు మా క్లబ్‌లో క్లాస్ చెప్పాల్సిందే అని అడిగారు. నేను OK అన్నాను. ఎందుకంటే నా జీవితమే సత్య ప్రచారానికి అంకితం చేసుకున్నాను. పైగా అప్పారావు గారు సీరియస్ & సిన్సియర్ మెడిటేటర్. తిరువనంతపురంలో ఇంకా ఆత్మ బంధువులు, ధ్యానులు అయిన శ్రీనివాస్ గారి కుటుంబం, అమరేశ్వర్ రావు దంపతులు, బసుమ, మూసద్... ఇలా చాలా మంది ఉన్నారు, చక్కటి వ్యక్తులు.

రోటరీ క్లబ్‌లో క్లాస్ జరిగింది. ఆల్‌మోస్ట్ ఆ క్లబ్ చరిత్రలో మొదటి సారి "శాకాహార భోజన" ఏర్పాటు జరిగిందట, ఆ రోజున ! ఈ ఘనత శ్రీ అప్పారావు దంపతులకు దక్కుతుంది.

క్లాస్ అయిన తర్వాత, ఏవైనా సందేహాలు ఉంటే అడగండి అన్నాను. సుమారు 70 సంవత్సరాలకు పైగా వయసు ఉన్న ఒక వ్యక్తి చాలా చిన్న, చిన్న, ప్రాథమిక, basic సందేహాలు అడిగాడు. ఇంతకీ ఆయన ఎవరంటే, సుమారు 35 సంవత్సరాలకు పైగా వైద్యునిగా పని చేసి రిటైర్ అయ్యారు. ఆయన పేరు పక్కన చాలా డిగ్రీలు ఉన్నాయి. అంత అనుభవం ఉన్న వ్యక్తి ప్రాథమిక సందేహాలు, రెండు మూడు సార్లు అడిగి, అడిగి మరీ తెలుసుకున్నాడు.

ఒకసారి ఒక లేడి ప్రొఫెసర్ వచ్చింది. నార్త్ ఇండియాలోని ఏదో యూనివర్సిటీలో "సోషియాలజీ ప్రొఫెసర్‌గా" పని చేసి రిటైర్ అయ్యింది. ఆవిడ కూడా చాలా చిన్న సందేహాలు అడిగి తెలుసుకుంది. ఈవిడ పేరు ప్రక్కన కూడా చాలా డిగ్రీలు ఉన్నాయి. ఇలా పేర్ల పక్కన "చాలా డిగ్రీలు", "పెద్ద డిగ్రీలు" ఉన్నవారు చాలా మంది నన్ను కలిసారు. ప్రాథమిక, basic సందేహాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రేమ పూర్వకంగా, సహృదయంతో వారి సందేహాలను తీర్చేవాడిని. ఒకటికి రెండు సార్లు వివరించేవాడిని. నేను వీరిని తక్కువ చేయటం లేదు.

✪ దయచేసి విషయం గ్రహించండి. బయట చదువులకు, డిగ్రీలకు, వయస్సుకు ఇక్కడి ఈ "అంతర్ ప్రపంచానికి" సంబంధం లేదు అనే విషయం తెలియజేస్తున్నాను.

ఎందుకంటే మాకు 50/60/70/80/90 సంవత్సరాల వయసు ఉంది. ఎంతో అనుభవం ఉంది అని అనుకుంటూ ఉంటారు. "శరీరం" వయస్సు 100 సంవత్సరాలు ఉండనీ గాక ఇక్కడ మీరు "విద్యార్థి" అన్న విషయం మరువకుండా ఉంటే సాధనలో వేగంగా అభివృద్ధి చెందగలరు. మేము ఇది చదివాం, అది చదివాం కాబట్టి మాకు అంతా తెలుసని రెండు ఇంగ్లీష్ ముక్కలు మాట్లాడి ఫోజు కొడుతూ ఉంటారు. అయ్యా / అమ్మా మీ వయసును, మీ చదువులను మేం గౌరవిస్తాం ! అర్థం చేసుకోండి. ఇక్కడ మీరు "ఆరంభంలో" ఉన్నారన్న విషయాన్ని మరువకండి !

ప్రపంచంలో 99% జనాలు దేని గురించీ మాట్లాడరు. ఏదైనా విషయం గురించి అడిగితే తెలిస్తే చెప్తారు, లేకపోతే లేదు. కానీ "ఆధ్యాత్మికం, ధ్యానం" దగ్గరకి వచ్చే సరికి మాత్రం, ప్రసంగాలు మొదలు పెడతారు. ఏ మాత్రము అనుభవం ఉండదు, అయినా సరే ఉపన్యాసాలు, conceptలు, తమ అభిప్రాయాలను దంచి కొడుతూ ఉంటారు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం ! ఏ మాత్రం తెలియని దాన్ని గురించి అలా, ఎందుకు మాట్లాడుతారంటే ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్స్‌తో, అహంతో అలా మాట్లాడతారు. అతి తెలివితో అలా మాట్లాడతారు. మూర్ఖత్వంతో అలా మాట్లాడతారు. తమకు ఏ మాత్రం తెలియని విషయాన్ని గురించి మాట్లాడి "తమకు తెలియదు" అనే విషయాన్ని కప్పి పుచ్చుకునే ప్రయత్నంలో...."తమకు నిజంగానే తెలియదు అనే విషయాన్ని చక్కగా, స్పష్టంగా తెలియజేస్తారు". ఎంతో వయసు ఉంటుంది. ఎన్నో చదువులు చదివి ఉంటారు. అయినా "తెలిసిందే మాట్లాడాలి, తెలియని దాని గురించి మాట్లాడకూడదు" అనే ఇంగిత జ్ఞానం ఇసుమంతైనా ఉండదు.

✪ "నిజమైన సాధకుడు" ! "సరి" అయిన సాధన, "సరి" అయిన పద్ధతిలో "సాధన" చేసిన వాడు మాట్లాడే విధానమే వేరుగా ఉంటుంది. "అనుభవ సుగంధాలు విరజిమ్ముతూ ఉంటాయి ఆ మాటలలో" ! "అనుభవ సత్య ప్రకాశం" విరాజిల్లుతూ ఉంటుంది ఆ మాటలలో ! శ్రద్ధా పూర్వకమైన సాధకుల సాధనను "వెలుగులతో నింపి, సంరక్షిస్తూ సరైన దారిలో నడిపిస్తాయి ఆ మాటలే వారికి బాటలై" !

బయటి చదువులు బయటవే, బయటి అనుభవం బయటిదే ! చాలా, చాలా మంది బయటి చదువులకు, శరీర వయస్సుకు ఈ "అంతర్ ప్రపంచానికి" ముడి పెడుతూ ఉంటారు. ఆ యొక్క "బాహ్య కోణం"లో నుండే చూస్తూ ఉంటారు. ఇది సరి కాదు. ఎంత మాత్రమూ సరి కాదు.

వీళ్ళకు ఉన్న అభిప్రాయాలు, frames ఎప్పుడైతే తొలగిపోతాయో అప్పుడు మాత్రమే "సాధనలో" ముందుకు వెళ్ళగలుగుతారు. లేకపోతే చాలా, చాలా కష్టం. దయచేసి విషయం గ్రహించండి !

"సుందర్రావు" !

సుందర + రావు = సుందర్రావు - ఇది ఫలానా సంధి

"సుందరమ్మ" !

సుందర + అమ్మ = సుందరమ్మ - ఇది ఇంకో సంధి

అని ఇలా సందుల వెంట, గొందుల వెంటపడి తిరుగుతూనే ఉంటారు అలుపు సొలుపు లేకుండా. అదే విధంగా తిరుగుతూ ఉంటే, వీరు ఏనాటికి high wayకి, రాచ మార్గానికి, thoroughfareకి రాలేరు !

భౌతిక జీవితంలో వ్యాకరణం, పాండిత్యం, తర్కం ప్రధాన పాత్ర వహిస్తాయి. వీటిని పట్టించుకోవాలి. ఇవి లేనిదే భౌతిక జీవితంలో నెగ్గుకు రావడం కష్టం. అయితే "ఆధ్యాత్మిక జీవితంలో" ఈ మూడు ఉంటే నెగ్గుకు రావడం "చాలా కష్టం" ! ఈ మూడింటిపై ఆధారపడి ఉంటే "ఆత్మ సాక్షాత్కారం" విషయం పక్కన పెడితే అసలు ఆధ్యాత్మిక ఎదుగుదలయే ఉండదు.

ఎందుకంటే అసలు సిసలు "ఆధ్యాత్మిక జీవితం" అంగీకారంతో మొదలవుతుంది. అంగీకారం అంటే ఒక కోణంలో "మౌనం", "శూన్యం" ! ఇక్కడ వ్యాకరణానికి, శబ్దార్థానికి ఎక్కువగా ప్రాధాన్యత ఉండదు. విషయం అర్థం అయ్యేలా వివరించగలిగితే చాలు. ఇక "తర్కం"

విషయానికి వస్తే ఇది భౌతిక జీవితానికి ప్రాణం పోస్తుంది, ఆధ్యాత్మిక జీవితం యొక్క ప్రాణం తీస్తుంది. "తర్కం", logic అనేది పూర్తిగా భౌతిక ప్రపంచానికి సంబంధించిన విషయం. ఆత్మ ప్రపంచంలో దీనికి స్థానం లేదు.

వ్యాకరణం, శబ్దార్థం, తర్కం ఈ మూడు ఎక్కడ అంతం అవుతాయో అక్కడ నుండి మాత్రమే ఆత్మ ప్రపంచం మొదలవుతుంది. భౌతికం యొక్క అంతం, ఆధ్యాత్మికం యొక్క ఆరంభం !

మా లాంటి వాళ్ళు సత్యం గురించి, ఆత్మ సాక్షాత్కారం గురించి చెప్పే మాటలు, రాసే రాతలు అన్నీ కూడా కేవలం సూచనలే ! "అసలు విషయాన్ని ఎలా పొందాలో" అనే విషయాన్ని మీరు గ్రహించేలా చేయడానికి మాత్రమే. అన్నీ విని, చదివి మీరు "గ్రహించుకోవాలి" ! మీ "గ్రహింపు" మాత్రమే సాధనలో మీకు పనికి వస్తుంది. "మీ అవగాహన" మాత్రమే మిమ్మల్ని ముందుకు తీసుకెళ్తుంది.

✪ మా మాటలలో, భాషా పరమైన వ్యాకరణ దోషాలను ఎత్తి చూపే ప్రయాస ఆపి, మా మాటలలో, రాతలలో ఉన్న అసలు భావాన్ని అర్థం చేసుకుంటే బాగు పడతారు. మా మాటలు, రాతలు అన్నీ చంద్రుడిని, సూర్యుడిని, నక్షత్రాలను, అంతరిక్షాన్ని చూపే చేతుల లాంటివి. మా చేతులు దేనిని చూపుతున్నాయో దానిని చూడాలి. దానిని గ్రహించాలి. అంతే కానీ ఈ చేయి నల్లగా ఉంది, ఇది అందంగా ఉంది, ఇది బక్కగా ఉంది, ఈ చేయి బలిష్ఠంగా ఉంది, ఆహా, దీని గోళ్ళకు నెయిల్ పాలిష్ ఉంది కానీ ఫ్రెంచ్ పాలిష్ వేస్తే బాగుండు, ఈ చేతి స్ట్రక్చర్ ఇలా ఉంటే బాగుండేది అని అనుకుంటూ చేతుల మీద (సూచికల మీద / వ్రాతల మీద) చేసే పరిశోధన ఆపి వేసి, అవి దేనిని చూపు తున్నాయో "దానిని" గ్రహించి, ఆ "గ్రహింపును" పెంచుకుంటూ పోవాలి. "సాఫల్యం" పొందేవరకు, ఆత్మ సాక్షాత్కారం కలిగే వరకు.

ఆత్మ సాక్షాత్కారం అంటే అంతరిక్షంలోకి వెళ్ళడం లాంటిది. ఒక సారి మిమ్మల్ని మీరు సరి చూసుకోండి. Self check చేసుకోండి. మీ పట్ల మీరు నిజాయితీగా ఉండండి. ఆత్మ వంచన చేసుకోకండి. మీ లక్ష్యం ఆత్మ సాక్షాత్కారం కాక పోయినట్లయితే ఫర్వాలేదు. ఒకవేళ అదే గనుక మీ లక్ష్యం అయితే వ్యాకరణాన్ని, శబ్దార్థాన్ని, తర్కాన్ని పూర్తిగా వదిలి పెట్టవలసి ఉంటుంది. ఎందుకంటే అవి మూడు సైకిల్, స్కూటర్, ఆటో లాంటివి. వాటిని మీరు ఎంతెంత నేర్చుకున్నా, వాటి పైన పరిశోధనలు చేసి పాండిత్యాన్ని సంపాదించి పతకాలు సాధించి, అవార్డులు, రివార్డులు పొందినా సరే, మీరు అంతరిక్షంలోకి వెళ్ళాలంటే "సైకిల్", "స్కూటర్", "ఆటో"లను పూర్తిగా వదలాల్సిందే. పూర్తిగా వదలడం అంటే నా ఉద్దేశం సాధారణ చదువు సరిపోతుంది అని. వాస్తవానికి ఏ చదువులు అవసరం లేదు "దైవత్వం" పొందడానికి, ఎంత "అమాయకంగా" ఉంటే అంత శ్రేయస్కరం. ఎందుకంటే లౌకిక చదువులు, లౌకిక పాండిత్యం అహంకారాన్ని, కన్నంగితనాన్ని పెంపొందిస్తాయి.

ప్రతి మతం వాడు తమ మతం పవిత్రమైనది, గొప్పది అని అనుకుంటూ ఉంటాడు. ఉన్న ఒకే ఒక సృష్టి గురించి ఇన్ని సత్యాలు, ఇన్ని సిద్ధాంతాలు, ఇన్ని conceptలు ఎలా ఉండగలుగుతాయి ?! ప్రతీ భాషకు చెందిన వారు తమ "భాషయే" "దైవీ భాష", తమ భాషయే పవిత్రం, ప్రాచీనం, గొప్పది అని భావిస్తూ ఉంటారు. ఎంత "మహా మూఢత్వం" ?! ఎంత మహా మూర్ఖత్వం ?! ఎంత చీకటి ?!

ప్రాచీన విజ్ఞానం అంతా మా భాషలోనే ఉంది అని గ్రీకులు, అరబిక్ భాషయే గొప్పది అని అరబ్బులు, ఫార్సీ గొప్పది అని ఫార్సీలు, హీబ్రూ గొప్పది అని హీబ్రూ మాట్లాడే వాళ్ళు, జీసస్ మాట్లాడింది "అరమాయిక్" భాష కాబట్టి ఈ భాషే గొప్పది అని క్రైస్తవులు, ఉర్దూ గొప్పదనీ, హిందీ గొప్పదనీ, తెలుగు గొప్పదనీ, "ఛత్" అన్ని భాషలకు సంస్కృతం మూలం, కాబట్టి సంస్కృతమే గొప్పదనీ, ఎవరికి వారు తమ భాష గొప్పదనాన్ని గురించి వాదిస్తూ ఉంటే "కరుణ" కలుగుతుంది వారిని చూసి ! ఈ వైషమ్యాలు అన్ని "అహంలో" నుండి వస్తాయి. అహానికి తల్లి అజ్ఞానం ! అన్ని భాషలు గొప్పవే ! అన్ని భాషలూ పవిత్రమైనవే ! అన్ని భాషలు దైవ భాషలే ! దైవానిది కానిది ఏముంది ఈ సృష్టిలో ! భాషలన్నీ సత్యానికి సూచికలు లేదా వ్యక్తీకరణలు మాత్రమే. "సూచిక ఏదైతే ఏం" ?! "అది సరి అయిన దానిని సూచిస్తుందా లేదా అనేదే అసలు ప్రశ్న" !

"సృష్టిలో కొన్ని కోణాలలో ఉన్నతత్వం - నీచత్వం, ఎక్కువ - తక్కువ, గొప్ప - చిన్న అనే భేదాలు ఉండవు" ! సర్వం సమానమే అని మహా విజ్ఞులు అంటారు. అంతా సమానమే కదా అని - ఎవడైనా, స్వామి వివేకానందుడు మరియు నేను ఒకటే, సేమ్, మేం సమానం అని అనుకోకూడదు. ఇది అహంకార పిచ్చితనం ! ఒకే దైవం నుండి ఉద్భవించాయి కాబట్టి అలా అంటారు. సృష్టిలో అన్నింటికీ తమదైన ప్రత్యేకత, పవిత్రత, సార్థకత ఉంటాయి. కేవలం భిన్నత్వం ఉంటుంది అంతే ! ఒక కోణంలో మాత్రమే "సర్వమూ సమానం", అన్ని రకాలుగా కాదు.

"ఆత్మ సాక్షాత్కారం" లేదా "దైవత్వ" సాధనలో "అమాయకత్వమే" అండగా, ఆసరాగా, ఆధారంగా ఉండి "మాయను" త్వరగా తీసివేయడానికి వీలవుతుంది. "అమాయకత్వం" అంటే, "అ-మాయ" అంటే "మాయ" లేకుండా ఉండటం. ఎప్పుడైతే "మాయ" తొలగిందో, అప్పుడే ఆ క్షణమే "ఆత్మ సాక్షాత్కరిస్తుంది". కాబట్టి చదువులు ఉన్నా, లేకపోయినా ఒకటే. ఒక వేళ చదువులు ఉంటే అవి పుస్తకాలు చదివి అర్థం చేసుకోగలిగినంత చదువు ఉంటే సరిపోతుంది. "ప్రవచనాలు" విని అర్థం చేసుకునే జ్ఞానం ఉంటే సరిపోతుంది. తన అనుభవాన్ని ఇతరులకు రాసి చూపించే "రాత" వచ్చి ఉంటే సరిపోతుంది. అవగాహన లేని పాండిత్యం పర్వతమంతా ఉన్నా సరే, అది వృథా !

అర్థం చేసుకోండి, గ్రహించండి ! శ్రీకృష్ణుడు ఏ universityలో చదివాడు. రామాయణాన్ని వ్రాసిన మహాత్ముడు వాల్మీకి. పరమ కిరాతకుడిగా ఉన్న వాల్మీకి సాధన చేసి పరివర్తన చెంది రామాయణాన్ని వ్రాయలేదా ? మహాత్ముడు కాలేదా ? ఈయనకు ఏం డిగ్రీలు ఉన్నాయి ? పరమ గురువు జీసస్ క్రైస్ట్‌కు ఏం డిగ్రీలు ఉన్నాయి ? రామక్రిష్ణ పరమహంస రెండవ తరగతి దాకా చదివాడట. మహావీరుడికి ఏం డాక్టరేట్‌లు ఉన్నాయి ? గౌతమ బుద్ధుడికి ఏ ఏ డాక్టరేట్‌లు, పట్టాలు ఉన్నాయి ? వీళ్ళందరికీ ఏం ర్యాంకులు, ఏం మెడల్స్ ఉన్నాయి ? వీళ్ళు ఆత్మ సాక్షాత్కారం పొందలేదా ! వీళ్ళు పరమాత్మ స్వరూపులు కాలేదా ! అర్థం చేసుకోండి, గ్రహించండి !

మహా లోతైన, విస్తారమైన పరిశోధనలు చేసాను ఆధ్యాత్మిక శాస్త్రంలో(Cosmic Science) ! స్వయంగా నా జీవితాన్ని పణంగా పెట్టి మహా విశేషమైన సాధన చేసాను. జీవితం పణంగా పెడితేనే కానీ కుదరదు మరి ఈ విషయంలో !

నేను "వాకిన్ మాస్టర్"ను అని తెలియనప్పుడు, సాధనలో ఉన్నప్పుడు కొన్ని రోజులు జనాల మధ్యలో ఉండే వాడిని, కొన్ని సార్లు ఏకాంతంలో ఉండే వాడిని. సాధారణ జీవితానికి చాలా, చాలా వ్యతిరేకంగా ఉండేది నా జీవిత విధానం. ఏం చేస్తున్నావు ? అని అందరూ అడుగుతూ ఉండేవారు. నాకేం చెప్పాలో అర్థం కాకపోయేది. అందరూ నన్ను అపార్థం చేసుకున్నారు. అందులో వాళ్ళ తప్పు ఏమీ లేదు. ఆత్మ విజ్ఞానం లేకపోతే, అపార్థం తప్ప ఇంకొక రకంగా అర్థం చేసుకునే అవకాశమే లేదు నా జీవితాన్ని గమనిస్తే ! నన్ను అడిగే వాళ్ళను తప్పించు కోడానికి ఒక ఉద్యోగమో, వ్యాపారమో చేస్తున్నట్టు నటించే వాడిని. అయితే కొన్ని వ్యాపారాలు నిజంగా చేసాననుకోండి, అయితే నాకు నిజమైన ఇంట్రెస్ట్

ఉండేది కాదు కాబట్టి ఆ వ్యాపారాలను ఆపేయడానికి కావలిసినన్ని ఆటంకాలు వచ్చేవి. దానితో అవి సహజంగా ఆగి పోయేవి. ఈ విధంగా కొన్ని సంవత్సరాలు జరిగాక నాకు విసుగు వచ్చింది. ఎవరో ఏదో అడుగుతారని, వాళ్ళకేదో సమాధానం చెప్పాలని నేను ఎందుకు ప్రయత్నం చేస్తున్నాను అని ఆలోచించాను. అంతే. డిసైడ్ అయిపోయాను. ఆ తర్వాత ఎవరినీ పట్టించుకోకుండా, ఆనందంగా నా జీవితాన్ని నేను, నా పరిశోధనకే పూర్తిగా అంకితం చేసుకున్నాను. ఇప్పుడు, నాకు తెలిసిన వారు, చాలా మంచి పనే చేస్తున్నావు... ఈ విషయం ముందే చెప్పవచ్చు కదా ! అని అంటున్నారు.

మనం ఏది చేయాలనుకుంటున్నామో, దాన్ని హృదయపూర్వకంగా చేస్తే అంతా, అందరూ ఆమోదిస్తారు. సర్వ సహాయాలు చేస్తారు. - సృష్టి సూత్రం. నా పట్ల ఇదే జరిగింది.

✪✪✪ అంతర్గత ప్రపంచానికి, ఆత్మ ప్రపంచానికి చెందిన ఎన్నో సత్యాలను అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను.

✪✪✪ సూక్ష్మ శరీర యానాలు అంటే astral travellingsలో చక్కటి నైపుణ్యాన్ని సాధించాను. మూడవ కన్నును అంటే third eyeని మహా విశేషంగా ఉత్తేజితం చేసుకున్నాను. ధ్యానంలో ఎన్నెన్నో లోకాలను, ఎన్నో విశ్వాలను సందర్శించాను. అనేకానేకమైన మహా దివ్య అనుభవాలను ఎన్నో పొందాను. పొందుతూనే ఉన్నాను, ఉంటాను కూడా !

✪✪✪ ధ్యానంలో ఎందరెందరో గ్రాండ్ మాస్టర్స్‌ను కలిసాను. ఎన్నో బీమ్ షిప్‌లను(Beam Ships) ధ్యానంలో చూసాను. వాటిల్లోకి ఆస్ట్రల్‌గా వెళ్ళాను కూడా ! Mother Shipsలలోకి కూడా వెళ్ళాను. Space Shipలను కూడా చూసాను.

✪✪✪ 2007 జూన్‌లో నేను నా టీమ్‌తో భారతదేశ పాదయాత్ర చేస్తూ కోయంబత్తూర్‌లో ఆగాను. కోయంబత్తూర్ రైల్వే స్టేషన్‌కు 16 కిలోమీటర్ల దూరంలో గల ఒక కొండ మీదికి వెళ్ళాం. ఆ కొండ మీద ఒక రాత్రి ఉన్నాము. 18-06-2007 రోజు రాత్రి అంతా అక్కడ గడిపాము. ఆ రాత్రి మేమున్న ప్రదేశం పైకి ఒక Space Ship వచ్చి ఆగింది. రాత్రంతా అలాగే ఉంది. ఒక సన్నని వెలుతురు రాత్రంతా మా చుట్టూ ఉంది. జన సంచారం లేని అడవిలో కొండపైన చాలా అరుదైన అనుభవాలను ఎన్నో పొందాం. ఈ అనుభవాలన్నీ వ్రాస్తే ఒక చిన్న పుస్తకం అవుతుంది.

✪✪✪ ధ్యానంలోనే కాకుండా భౌతిక కళ్ళతో ఎందరో గ్రాండ్ మాస్టర్స్‌ను ప్రత్యక్షంగా దర్శించాను. చిత్రాతి విచిత్రమైన అనుభవాలను ఎన్నెన్నో పొందాను. పొందుతూనే ఉంటాను కూడా !

✪✪✪ "నా జీవితానికి నేనే సృష్టికర్తను" అన్న విషయాన్ని చక్కగా అవగాహన చేసుకున్నాను. కర్మ ప్రక్షాళన చేసుకున్నాను. పరిశుద్ధుడనయ్యాను. "సర్వం సమానమే", "అందరిదీ ఒక్కటే", "అంతా ఒక్కటే" అనే పరమ సత్యాలు అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. "సృష్టికి నాకు భేదమే లేదు" అన్న పరమ సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను."సృష్టి యొక్క ఏకత్వాన్ని" అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. "సాఫల్యం" పొందాను.

✪✪✪ "ఆత్మ సాక్షాత్కారం పొందాను" ! ✪✪✪

దీనిని ఈ క్రింది విధంగా ఎన్ని రకాలుగానైనా చెప్పవచ్చు.

ఎన్నో రకాలుగా పిలుస్తూ ఉంటారు, అన్నీ ఒకటే ! అంతా ఒకటే !

✪ "దైవత్వాన్ని పొందాను" ! ✪

✪ "దివ్యత్వాన్ని పొందాను" ! ✪

✪ "సత్యాన్ని పొంది సద్గురువును అయ్యాను" ! ✪

✪ "మోక్షాన్ని పొందాను" ! ✪

✪ "అంతిమ సత్యాన్ని పొందాను" ! ✪

✪"నా నిజ తత్వాన్ని తిరిగి పొందాను" ! ✪

✪ "దైవమే అయి ఉన్న నేను దైవంలో దైవంలా మేలుకున్నాను" ! ✪

✪"నేనే దైవం అని తెలుసుకున్నాను" ! ✪

✪ "నేనే మహా మూల చైతన్యం అని తెలుసుకున్నాను" ! ✪

✪ "నేనే అల్ట్రా కాన్షియస్‌నెస్ అని తెలుసుకున్నాను" ! ✪

✪"జీవన్ముక్తుడనయ్యాను" ! ✪

✪ "శూన్యం అని తెలుసుకున్నాను" ! ✪

✪ "బ్రహ్మర్షిని అయ్యాను" & విశ్వ ఋషిని అయ్యాను " ! ✪

✪ "సద్గురువుని అయ్యాను" ! ✪

✪ ఇలా ఎన్నో రకాలుగా చెప్పవచ్చు. ఎవరు ఏమైనా అనుకోండి, అనండి. అందరూ పొందేది "ఒక్క దాన్నే" !

✪ పొందాను అని అనే కంటే, "తిరిగి పొందాను" అని అనడం "సరిగా" ఉంటుంది. నన్ను నేను తెలుసుకున్నాను. "అసలు ఏమీ చెప్పకుండా మౌనంగా ఉండటం సరిగ్గా ఉంటుంది" ! ప్రకటించాలనే నియమం ప్రకారం ప్రకటిస్తున్నాను. అందరూ "దివ్యులే" ! అంతా "దైవమే" ! అందరూ "భగవంతుళ్ళే", కేవలం మరిచిన మన దివ్యత్వం గుర్తుకు వస్తుంది. మేలుకుంటాం. కేవలం "జాగృతం అవుతాం అంతే" ! "దైవమే అయి ఉన్న మనము దైవంలో దైవంలా తిరిగి మేల్కొంటాం అంతే" !

ఇవ్వాళో రేపో మీరూ పొంది తీరుతారు. సందేహమే లేదు ! ఎవ్వరైనా సరే, ఎప్పటికో ఒకప్పుడు తమ "దైవత్వాన్ని" తాము గ్రహించి తీరుతారు. ఇది సహజం ! అయితే కాస్త ముందు, వెనక ! ఈ ముందు, వెనకలలో కాస్త ముందు మేలుకునే ప్రయత్నం చేద్దాం. నేను సాధించాను, నేను పొందాను, అని అంటే ఎవరైనా పొందవచ్చు , పొందుతారని అర్థం. కేవలం ఈ విషయాన్ని మీరు గ్రహించేలా చేసి, మీకు ప్రేరణ, inspiration కలిగించడానికే తెలియజేస్తున్నాను. కాబట్టి వెంటనే ప్రారంభించండి మీలో ఉన్న దైవత్వానికి మార్గం చూపించే గురువు కోసం అన్వేషణ వెంటనే ప్రారంభించండి. తెలియని దారిలో, తెలిసిన వారి మార్గదర్శకత్వం ఎంతైనా అవసరం. పట్టుదలతో వెతుకుతూ ఉంటే సద్గురువు లభిస్తాడు. గురువు దగ్గర స్థానం సంపాదించుకోవాలి. స్థానం అంటే పదవి కాదు.

"గురు సాంగత్యం" అనేది మహా విశేషమైనది. ఎన్నెన్నో జన్మల పుణ్యఫలం చేత మాత్రమే "గురు దర్శనం" కలుగుతుంది. గురు సన్నిధిలో, గురు మార్గదర్శకత్వంలో సాధన చేస్తే, వారిని సేవిస్తే ఎంతటి కర్మలు అయినా భస్మం అయిపోతాయి. ఎంతో ఆత్మ విజ్ఞానం లభిస్తుంది. దివ్యత్వం ప్రాప్తిస్తుంది. "గురు సాంగత్యం" మహా విశేషమైనది, ఎంతో మహత్వ పూర్ణమైనది.

- శ్రీ గురు గీతా

"గురువుగాని, గురు భావనగానీ గొప్ప బలాన్ని, ధైర్యాన్ని ఇస్తుంది. గురు ఆశీర్వాదం ఎల్లప్పుడూ శిష్యుని వెంట ఉంటుంది. - ఓషో

✪✪✪ కాబట్టి "గురువు" దొరికితే వదలకండి ! ఎట్టి పరిస్థితులలోనూ వదలకండి. తిట్టినా, కొట్టినా సరే ! ఎన్నో పరీక్షలు పెడతాడు. తట్టుకోండి. నిలబడండి. లేకపోతే వదిలేసి మీ పని మీరు చూసుకోండి.

గురు పూర్ణిమ సందేశం

"గురు పూర్ణిమ" , దీనినే వ్యాస పూర్ణిమ అని, ఆషాఢ మాసంలో వస్తుంది కాబట్టి ఆషాఢ పూర్ణిమ అని కూడా అంటారు. చంద్రుడికి మానవ జీవితానికి చాలా సంబంధాలు ఉన్నాయి. అందులోని కొన్ని ఆధ్యాత్మిక సంబంధాల గురించి, సంకేతాలను గురించి, ప్రయోజనాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.

అమావాస్య మనలోని అజ్ఞానాన్ని సూచిస్తుంది. అమావాస్య తర్వాత చంద్రుడు ప్రతి రోజు కొంచెం, కొంచెం పెరుగుతూ చివరికి "పూర్ణమవుతాడు". మనకు ఇదేం సూచిస్తుందీ అంటే, అంశాత్మగా ఉన్న మనం "ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసిస్తూ" "పూర్ణాత్మగా" మారాలి, పరిపూర్ణం చెందాలి అని ! పూర్ణ చంద్రుడు ఏ విధంగానైతే తన ఆహ్లాదకరమైన చల్లని వెన్నెలతో భూమిని, భూమిపై ఉన్న ప్రాణికోటిని మరియు మానవులను ఆనందపరుస్తాడో, అదే విధంగా అంశాత్మగా ఉన్న మనం పూర్ణాత్మగా మారి చల్లని వెన్నెల లాంటి స్వచ్ఛమైన "ఆత్మ విజ్ఞానాన్ని" పంచి అందరికీ శ్రేయస్కరం కలిగించాలి అని. పౌర్ణిమ రోజులకు ఉన్న విశిష్టత ఏమిటంటే సాధారణ రోజుల్లో ధ్యాన సాధన చేస్తే వచ్చే శక్తికి ఎన్నో రెట్లు ఎక్కువగా ఈ పౌర్ణమి రోజులలో వస్తుంది. పౌర్ణమి రోజులంటే పౌర్ణమికి ఒక రోజు ముందు, పౌర్ణమి రోజు మరియు పౌర్ణమి తర్వాత రోజు. ఈ మూడు రోజులు పౌర్ణమి రోజుల క్రిందే లెక్క. పౌర్ణమి రోజులు అంటే కేవలం రాత్రిళ్ళు అనే కాదు. పగళ్ళు కూడా లెక్కలోకి వస్తాయి, అంటే 3 పగళ్ళు, 3 రాత్రుళ్ళు అన్నమాట. ఈ రోజుల్లో సాధన ద్వారా మహా విశేషమైన శక్తిని పొందవచ్చు. పౌర్ణమి రోజుల యొక్క మరొక విశిష్టత ఏమిటీ అంటే పై లోకాలలోని పరమ గురువులందరూ ఈ పౌర్ణమి రోజులలో సాధకులకు పూర్తిగా అందుబాటులో ఉంటారు. నిజానికి పై లోకాలలోని పరమ గురువులు ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటారు. కాకపోతే పౌర్ణమి రోజుల్లో కాస్త విశేషంగా అందుబాటులో ఉంటారంతే. పరమ గురువులు అందరూ కలసి ప్రత్యేకంగా భూమికి, భూమి పైన ఉన్న సాధకులకు ప్రత్యేకంగా కేటాయించబడిన రోజులవి. కేవలం పౌర్ణమి రోజుల్లోనే కాకుండా, అమావాస్య, గ్రహణం లాంటి రోజుల్లో కూడా విశేషమైన శక్తిని పొందవచ్చు. సాధారణంగా అమావాస్య, గ్రహణం మొదలైన వాటిపైన చాలా మందికి నెగెటివ్ అభిప్రాయాలు ఉంటాయి. దయచేసి నెగెటివ్ అభిప్రాయాలు తీసివేసుకోండి. ధ్యానులకు అంతా, అన్ని సమయాలు శ్రేయస్కరమైనవే.

ఇక "గురు పూర్ణిమ" అంటే, శిష్యులు అందరూ కలసి గురువుకు ప్రేమతో ధన్యవాదాలు సమర్పించుకుని ఆనందించే రోజు. ఓ గురుదేవా నీవే లేకపోతే, నీ బోధనలే లేకపోతే మా పరిస్థితి ఏమై ఉండేదో కదా ! మమ్మల్ని ముక్తి మార్గం వైపు తీసుకెళ్తున్న ఓ గురు పరమాత్మా ! నీకు మా వందనాలు అంటూ కృతజ్ఞతలు తెలియజేస్తూ గురువును సత్కరించి, సన్మానించి గురువు ఆశీర్వాద అనుగ్రహాలు పొంది ఉత్సవాలు చేసుకోవడమే గురు పూర్ణిమ.

హే గురుదేవా ! నీ పరమ పవిత్ర పాదాల సాక్షిగా ప్రమాణం చేస్తున్నాం, మేము ఈ జన్మలోనే "దైవత్వాన్ని" పొంది తీరుతామని(ఇక్కడ పొందడం అంటే ఆల్‌రెడీ దైవమే అయి ఉన్న మీరు మీ దైవత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవడం), పొందింది పంచి తీరుతామని ప్రతిజ్ఞ చేసే మహా సందర్భమే గురు పూర్ణిమ. రక రకాల ప్రదేశాలలో సాధన చేసుకుంటున్న సాధకులు అందరూ కలసి ఒకరి అనుభవాలు మరొకరు పంచుకుని, ఒకరినొకరు ఉత్తేజితం చేసుకుని, గురు చంద్రుని వెన్నెల విజ్ఞాన వెలుగులో తమ, తమ సందేహాంధకారాలను పోగొట్టుకునే విశేష సందర్భమే గురు పూర్ణిమ. గురు శిష్యుల సమాగమోత్సవమే గురు పూర్ణిమ. అయితే కేవలం జులై నెలలో(ఆషాఢ మాసంలో) వచ్చేది మాత్రమే గురు పూర్ణిమ అని అనుకుంటే పొరపాటే ! అది కేవలం సంకేతం, అంతే ! ప్రతి రోజు "గురు పూర్ణిమ" కావాలి సాధకులకు !!

జులైలో, బయట ఆకాశంలో పౌర్ణమి చంద్రుడు ఉదయిస్తే, ఆ చంద్రుడిని చూసి, ఆ వెన్నెలలో కోలాహలం చేయడం కాదు. అసలు సిసలు "గురు పూర్ణిమ" అంటే మీ హృదయాకాశంలో, గురు బోధనలు మొత్తం వికసించి పూర్ణం కావడమే ! మీ యొక్క అంతరాకాశంలో గురు బోధన అనే విజ్ఞాన చంద్రుడు పూర్ణంగా వికసించడమే అసలు సిసలు గురు పూర్ణిమ ! ఈ విధంగా "లోపల" జరగడానికి, జరుపుకోడానికి సంకేతమే, సూచనయే బయట జరుపుకునే గురు పూర్ణిమ ఉత్సవాలు.

గురు బోధనలు యథాతథంగా ఆచరించిన వారి యొక్క హృదయాకాశంలో మాత్రమే అసలు సిసలు గురు పూర్ణిమ ఉత్సవం జరుగుతుంది. ఇది కేవలం జులై నెలలో మాత్రమే కాదు. 365 రోజులలో ఏ రోజైనా, ఏ క్షణమైనా సంభవించే అవకాశం ఉంది. జులై నెలలో వచ్చే పౌర్ణమి మనకు ఇదంతా గుర్తు చేస్తుంది. సాధకులందరి హృదయాకాశంలో గురు చంద్రుడు ఉదయించు గాక ! అందరి అంతరాకాశంలో గురు పూర్ణిమ మహోత్సవం జరుగుగాక !! ఇందుకు M A B కూడా మహా కారణమై, సహాయ సహకార సమన్వయాలను అందించుగాక !!!

అందరికీ సాఫల్యం ప్రాప్తించుగాక !

❖ ❖ ❖

సత్య మార్గంలోకి రావాలనుకుంటున్న వారికి మరియు సత్య గురువు దగ్గర శిష్యరికం చేద్దామనుకుంటున్న వారికి కొన్ని అత్యంత ముఖ్యమైన నియమాలు

ఈ సూచనలను పాటిస్తూ ఉంటే.... మీకు చాలా చాలా మంచి జరుగుతూనే ఉంటుంది. ఎన్నెన్నో శుభ లాభాలను మీరు పొందుతూనే ఉంటారు. ఎంతో అభివృద్ధి చెందుతూనే ఉంటారు. గురువు వెంటే చివరి వరకు "సరిగా" ఉండ గలిగితే మోక్షం లేక దైవత్వం కూడా ప్రాప్తిస్తుంది.

ఈ సూచనలను పాటించలేక పోతే గురువు దగ్గరికి వెళ్ళకండి. ఆయన దగ్గర ఉండకండి. ఆయనతో సంబంధాలు పూర్తిగా , వెంటనే కట్ చేసుకోండి. ఇక ఆయన గురించి కాని, ఆయన సంస్థ గురించి కాని, ఆ సంస్థ యొక్క సభ్యుల గురించి కాని, ఆ సంస్థ యొక్క కార్యకలాపాల గురించి కాని ఎక్కడైనా సరే, ఒక్క మాట కూడా మాట్లాడకండి. మౌనంగా ఉండి వాళ్ళను పూర్తిగా మర్చిపోండి. ఒకవేళ మాట్లాడితే మంచిగా మాట్లాడండి లేకపోతే మౌనం వహించండి.

లేదా

అన్ని రకాలుగా దెబ్బ తింటారు. చాలా చాలా ఘోరమైన పరిస్థితులను కొన్ని జన్మల పర్యంతం ఎదుర్కోవాల్సి వస్తుంది. సత్య గురువు అంటే ఆషామాషీ కాదు. జన్మలు, జన్మలు..... జన్మల తరబడి అష్టకష్టాల పాలవుతారు. సత్య గురువుతో పరాచికాలు ఆడకండి. చాలా ఇబ్బందుల పాలవుతారు. ఇది సత్యం. ఇది అనుభవ జ్ఞానం మరియు సత్య జ్ఞానం. జాగ్రత్త ! మహా జాగ్రత్త !!

1. ముందు మీరు శిష్యులుగా మారాలి. తెలియనిది తెలుసుకోడానికి వెళ్తున్నారు కాబట్టి.... వినయం, విధేయత, నిజాయితీలతో ఉండాలి. విశ్వాసం పూర్తిగా ఉండాలి. ఏమీ జరగనిదే విశ్వసించడం ఎలా ? అని అంటే.... వాస్తవం ఇలానే ఉంటుంది. మీరు విశ్వసిస్తేనే ఏదైనా జరుగుతుంది. జరిగిన తర్వాత విశ్వసించడం కాదు. నీళ్ళు తాగిన తర్వాతే దాహం తీరుతుంది కదా !

2. గురువు పట్ల నిజమైన భక్తి శ్రద్ధలను కలిగి ఉండాలి.

3. గురువు దగ్గర మీ స్వంత డబ్బా కొట్టకూడదు. సోది పెట్టకూడదు. సొల్లు మాటలు మాట్లాడకూడదు. అవసరమైనంతగా మాత్రమే మాట్లాడాలి.

4. గురువు ముందు మీ గొప్పలు చెప్పుకోకూడదు. మీ ఘనతలను వివరించే ప్రయత్నం చేయకూడదు.

5. గురువు వయసును చూడకూడదు. గురువు యొక్క శారీరక వయసు మీ కంటే చిన్నగా ఉండవచ్చు, కానీ ఆయన, ఆత్మ పరంగా పరమాత్ముడు. శరీర వయసును లెక్క కట్టారంటే, మీ అభివృద్ధి అణువంత కూడా జరగదు.

6. గురువు గారి ఏవైనా అలవాట్లను చూసి ఈయనకు కూడా అలవాట్లు ఉన్నాయా ? అని అనుకోకూడదు.

7. గురువును, ఆయన యొక్క కులగోత్రాలను, జాతి మతాలను, భౌతిక చదువులను బట్టి చూడకూడదు. గురువు సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపుడు. ఆయన ఏ కులంలో నైనా, ఏ మతంలోనైనా, ఏ జాతిలోనైనా పుట్టవచ్చు ! ఇక భౌతిక చదువులు అంటారా.... ఆధ్యాత్మికంగా వాటికి అసలు విలువే లేదు. కాబట్టి కులం గోత్రం జాతి మతం చదువు అంటూ అజ్ఞానంగా, మూర్ఖంగా ప్రవర్తించ వద్దు. అసలు ఈ అజ్ఞానపు పట్టింపులన్నింటినీ వదిలేసిన తర్వాతనే గురువు దగ్గరికి వెళ్ళాలి. లేకపోతే ప్రయోజనం శూన్యం.

8. దైవత్వం లేక మోక్షం కోసం మాత్రమే వెళ్ళడం చాలా శ్రేయస్కరం.

9. ఆధ్యాత్మిక సమస్యల పరిష్కారం కోసం కూడా సందర్శించ వచ్చు, అయితే పూర్ణ విశ్వాసంతో, నిజమైన గౌరవంతో, భక్తి శ్రద్ధలతో సందర్శించాలి.

10. గురువు యొక్క ప్రవర్తనలు, మాటలు మీకు అర్థం అయితే అవుతాయి లేకపోతే లేదు. సాక్షిగా మౌనంగా ఉండాలి. వాటి వెనుక ఏదో మీకర్థం కాని పరమార్థం ఉంటుంది.

11. గురువు చనువు ఇచ్చినా మీ హద్దుల్లో మీరుండాలి.

12. గురువు కొన్ని చెప్పి పరీక్షలు పెడతాడు, కొన్ని చెప్పకుండా పరీక్షలు పెడతాడు. వాటిని విశ్వాసం, ప్రేమలతో జయించాలి.

13. గురువు సమక్షంలో సాక్షాత్తు సృష్టియే పరీక్షలు పెడుతూ ఉంటుంది. ఆ యొక్క పరీక్షల్లో నెగ్గకపోతే మిమ్మల్ని గురువు నుండి చాలా సహజంగా వేరు చేసేస్తుంది... సృష్టి !

14. గురువును నిజంగా ప్రేమించాలి. ప్రేమిస్తూనే ఉండాలి. గురువుతో ప్రేమలో ఉండడం చాలా అద్భుతమైన విషయం.

15. గురువును ఏ విషయాల్లోనూ బలవంతం చేయకూడదు.

16. గురువును మీ స్వార్థానికి వాడుకోవాలని ప్రయత్నించకూడదు.

17. గురువు... కారణం ఉండి తిట్టినా, కారణం లేకుండా తిట్టినా మౌనంగా, గౌరవంగా, ప్రేమగా ఉండాలి.

18. గుర్తుంచుకోండి, గురువు దగ్గర ప్రతీది పరీక్షయే !

19. గురువు గురించి ఎవరైనా తప్పుడు మాటలు చెప్పినప్పుడు వాటిని పట్టించుకోకూడదు. వాటిని అలా వదిలేయాలి. అలాంటి వారితో సంబంధాలను పూర్తిగా, శాశ్వతంగా కట్ చేసేసుకోవాలి. గురువు గారి పట్ల మీ ప్రత్యక్ష అనుభవానికే ప్రాధాన్యతను ఇవ్వాలి. ఎవరో ఏదో చెబితే వినకూడదు.

20. గురువు గురించి ఎవరైనా తప్పుడు మాటలు మాట్లాడితే, వెంటనే ఖండించాలి. వీలైనంతగా ఖండించియే తీరాలి. గురువు యొక్క గొప్పతనం మీరు చెప్పియే తీరాలి. వారు వింటారా వినరా... వారు ఒప్పుకుంటారా లేదా అనే ప్రశ్న లేకుండా ఆ సమయంలో మీ గురువు ఘనతను మీరు చాటియే తీరాలి.

21. గురువును ఎవరైనా అవమానిస్తూ ఉంటే చూస్తూ ఊరుకోకూడదు. "సరియైన" రీతిలో తగిన గుణపాఠం చెప్పాలి.

22. వీలైనప్పుడల్లా గురువును శ్రద్ధతో, విశ్వాసంతో, ప్రేమతో స్మరించుకుంటూ ఉండాలి.

23. గురువుకు, గురువు యొక్క పనులకు ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. గురువుల మీద ఇన్వెస్ట్‌మెంట్ చేయకూడదు, చేసారో నరకమే !

24. గురువు గారిని కలిసినప్పుడల్లా.... ప్రదేశం, సమయం, సందర్భం ఏదైనా సరే, ఎవరున్నా సరే, లేకున్నా సరే, ప్రేమతో విశ్వాసంతో భక్తి శ్రద్ధలతో పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు తీసుకోవాలి. ఇది చాలా మహత్యం కలిగిన చర్య.

25. మీరు చేసారు కదా అని, విశ్వాసం లేని వారిని పాదాభివందనం చేయమని బలవంతం చేయకూడదు.

26. గురువు గారి అనుమతి లేనిదే, ఎవరిని పడితే వారిని పరిచయం చేయించడానికి గురువు దగ్గరికి తీసుకు వెళ్ళవద్దు.

27. ఇతర గురువులను ఎప్పుడూ కించ పరచవద్దు.

28. ఏ ఇతర వృత్తి ఉద్యోగ వ్యాపారాలు చేయకుండా, కేవలం సత్య ప్రచారానికి మాత్రమే అంకితమై ఉన్న గురువులు ఎవరైనా "విరాళాలు" తీసుకుంటారు. వారి కార్యక్రమాలన్నీ విరాళాల ద్వారానే జరుగుతాయి కదా ! కాబట్టి విరాళాలు ఇవ్వాలనుకుంటే మౌనంగా ఇచ్చేయాలి. చిన్న విరాళాలైతే గురువు దగ్గర ఉన్న శిష్యులకు ఇవ్వాలి. పెద్ద విరాళాలు కూడా గురువు గారి దగ్గరి శిష్యులను సంప్రదించి శిష్యులకే ఇవ్వాలి. ఒక వేళ, పెద్ద పెద్ద విరాళాలను గురువు గారికే డైరెక్ట్‌గా ఇవ్వాలనుకుంటే, ముందు శిష్యులను సంప్రదించి, గురువు గారి అనుమతి తీసుకుని, ఆ యొక్క సందర్భం ఏర్పాటు చేసుకుని ఇవ్వాలి. ఏమీ ప్రతిఫలం ఆశించకుండా నిస్వార్థంగా ఇవ్వగలిగితే ఇవ్వాలి లేకపోతే లేదు.

29. విరాళాలు ఇస్తే, నిస్వార్థంగా, ఏ ప్రతిఫలం ఆశించకుండా, ఏ షరతులు లేకుండా ఇవ్వాలి. మేము ఇచ్చాము అని అహంభావం ప్రదర్శించరాదు. మీరు కాకపోతే సృష్టిలో ఎంతో మంది ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు. ఇస్తారు. కాబట్టి విరాళాలిచ్చి ఫోజులు కొట్టవద్దు.

30. బాగా గుర్తుంచుకోండి, మీ విరాళాలను గురువు గారు స్వీకరించడమే మీ సౌభాగ్యం.

31. ఒక్కోసారి కొందరి విరాళాలు అనుమతించ బడవు. స్వచ్ఛత లేనందు వలన ఇలా జరుగుతూ ఉంటుంది.

32. స్థిర చరాస్తులు వేటినైనా విరాళాలుగా ఇవ్వచ్చు. ఏమీ ఆశించకుండా ఇచ్చి పూర్తిగా, శాశ్వతంగా మర్చిపోవాలి. డొనేషన్ పేరుతో ఇన్వెస్ట్‌మెంట్ చేయకూడదు.

33. బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, మీరు విరాళాలిచ్చిన తర్వాత ఆ విషయంలో ఎంత మాత్రమూ, నేను ఇచ్చాను అనే అహంభావాన్ని ఏ మాత్రమూ కలిగి ఉండరాదు. ఏమీ ప్రతిఫలం ఆశించకూడదు. డొనేషన్ పేరుతో పెట్టుబడి పెట్టకూడదు. ప్రాధాన్యత, పదవి, ఇంకా ఇతరాలేవీ ఆశించకూడదు. ఇది చాలా ముఖ్యమైన విషయం.

34. గురువు దగ్గర ఉండి నేర్చుకునే పరిస్థితులు ఉంటాయి. గురువు నుండి దూరంగా ఉండి నేర్చుకునే పరిస్థితులూ ఉంటాయి. మీకేది అవసరమో మీ పట్ల అది జరుగుతుంది. దగ్గర ఉన్నా దూరం ఉన్నా గురువు పట్ల పూర్తి విశ్వాసాన్ని ప్రేమను కలిగి ఉంటే మీకు అభివృద్ధి జరుగుతూనే ఉంటుంది. చాలా మంది ఇక్కడే పొరపాటు చేస్తూ ఉంటారు. ఆత్మ శిక్షణా కార్యక్రమంలో భాగంగా వారు గురువు నుండి వేరు కాగానే, దూరం కాగానే.... వెంటనే నెగెటివ్‌గా ఆలోచించడం మొదలు పెడతారు. నేను ఏం చేసానని ఇలా జరిగింది ? నేను ఎంతో విశ్వాసంతో ఉన్నాను, నేను ఎంతో సేవ చేసాను, నేను ఎన్నో విరాళాలను ఇచ్చాను.... అయినా నాకు ఇలా జరిగింది ఏమిటి ? అని నెగెటివ్‌గా ఆలోచిస్తూ ఎంతో చెడును ఆహ్వానిస్తూ ఉంటారు, ఎంతో నష్టపోతూ ఉంటారు. వీరు తమ యొక్క నెగెటివ్ దృక్పథాన్ని పూర్తిగా వదిలేసి, పూర్తి పాజిటివ్‌గా మారేంత వరకు బాగుపడరు. శిక్షణా కార్యక్రమంలో ఇది ఒక భాగం అనే సత్యాన్ని తెలుసుకుని, గురువు పట్ల విశ్వాసంతో ప్రేమతో ఉంటే జరిగిన నష్టం రికవర్ అయి, మంచి అభివృద్ధిని సాధిస్తారు. లేకపోతే అంతే సంగతి !

Training - శిక్షణ

35. TRAINING - శిక్షణ అనేది ఉంటుంది. ఏ సాధకుడిలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని తనకై తానే గుర్తించి క్లియర్ చేసుకోవడం కోసం, సాధకులను గురువు దూరం పెడతాడు. గురువుకు దూరమైన సాధకులు తమలో ఏ ఏ లోపాలున్నాయో ఆత్మ పరిశీలన చేసుకుంటూ నిరంతర సాధన చేస్తూ ఉంటే ఎప్పుడో ఒకప్పుడు ఆ లోపాలనేవి ఏంటో తెలుస్తాయి. అప్పుడు వాటిని క్లియర్ చేసుకోవాలి. కొన్ని రకాల లోపాలను గురువు చెప్తాడు, మరికొన్ని రకాల లోపాలను గురువు చెప్పడు. ఎవరికై వారే తెలుసుకోవాలి, అలా తన లోపాలను తెలుసుకునేంత జ్ఞానవికాసం లేకపోతే గురువు దగ్గర ఉండకూడదు. గురు సాంగత్య అర్హత కోల్పోతారు. గురువుకు పూర్తిగా, శాశ్వతంగా దూరం కావాల్సి వస్తుంది. సాధకులలో నిజమైన ప్రక్షాళన జరిగి సరైన పరివర్తన కలిగినప్పుడు ఈ విషయం గురువుకు తెలుస్తుంది. అప్పుడు గురువు ఆ పరివర్తన చెందిన సాధకులను మళ్ళీ దగ్గరకు పిలుస్తాడు. అప్పటి వరకు సహనంతో, పూర్తి విశ్వాసంతో, గౌరవంగా ప్రతీక్షించాలి. గురువు మిమ్మల్ని ట్రెయినింగ్‌కు పంపించినప్పుడు మీరు అపార్థం చేసుకుని తప్పుగా మాట్లాడితే, ప్రవర్తిస్తే అప్పుడు మీరు గురువుకు సంపూర్ణంగా, సమగ్రంగా, శాశ్వతంగా దూరమైతీరుతారు. అవసరం లేదనుకుంటే తప్పుగా మాట్లాడండి, ప్రవర్తించండి. కావాలనుకుంటే ఒప్పుగా మాట్లాడండి+ప్రవర్తించండి !

గుర్తుంచుకోండి, ఆత్మ శిక్షణా కార్యక్రమంలో భాగంగా, గురువు నుండి వేరు కాగానే, దూరం కాగానే.... గురువు పట్ల విశ్వాసం కోల్పోకండి. ఈ క్షణమే, ఈ సమయంలోనే మీరు నిజమైన ప్రేమను, విశ్వాసాన్ని నిలుపుకుని ఉండాలి. అప్పుడే మీరు ఈ పరీక్షలో నెగ్గుతారు. లేదా... చాలా చాలా చాలా చాలా చాలా నష్టపోతారు. ఒక్కోసారి, జన్మ జన్మలకు కూడా కోలుకోలేని విధంగా దెబ్బ తినే అవకాశం ఉంది. గురువు నుండి వేరు అయినప్పుడే, దూరం అయినప్పుడే మీరు మీ ప్రేమను మరియు విశ్వాసాన్ని చూపాల్సి ఉంటుంది.

చాలా మంది ఈ విషయంలో బోల్తా పడుతుంటారు. విషయం తెలుసుకున్న మీరు మాత్రం సరిగా వ్యవహరించండి. ఏదో ఒక లోపం మీలో ఉంటేనే అలా జరుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకుని, పాజిటివ్‌గా ఉండండి. నిజం చెప్తున్నాను, గురువు పట్ల నెగెటివ్‌గా ఆలోచిస్తే జరిగే నష్టం ఒక ఊపు ఊపేస్తుంది. చాలా పెద్ద లెవల్లో దెబ్బ తింటారు. జాగ్రత్త !

36. గురు సేవ దొరకడం, మహా భాగ్యం ! మహా మహా సౌభాగ్యం !! మీ భక్తి శ్రద్ధలతో, విశ్వాసం ప్రేమలతో, గురు సేవ చేసే అవకాశాన్ని పొందండి. గురు సేవ చేసి ధన్యులు కండి !

37. గురువు ఏదైనా శిక్ష వేసినా విశ్వాసంతో, ప్రేమతో ఉండడం నేర్చుకోండి. ఇలాంటి శిష్యులే చాలా గొప్ప సాఫల్యం పొందుతారు. ఎన్నో లాభాలను పొందుతారు. గురువు వేసేది శిక్ష కాదు శిక్షణ అని గుర్తుంచుకోండి.

38. గురువు పైన వాలిపోవద్దు. గురువుకు సరెండర్ కావాలి. వాలిపోవడం అని అంటే స్వబాధ్యతను విస్మరించి ఆత్మాభివృద్ధిని అణిచివేసుకోవడం. సరెండర్ అని అంటే, స్వయం బాధ్యతతో ఉంటూ, గురువు పట్ల విశ్వాసాన్ని కలిగి ఉంటూ, గురువు చెప్పిన బోధనలను విశ్వాసంతో ఆచరిస్తూ ఆత్మాభివృద్ధిని పెంపొందించుకోవడం.

39. చాలా మంది గురువుతో "గేమ్" ఆడుతుంటారు. తమకు ఇష్టమైనది తాము చేస్తూ..... గురువు చెప్పారు కాబట్టి అని అంటూ ఉంటారు. గురువు చెప్పినవన్నీ చేయరు. గురువు చెప్పిన వాటిలో తమకు ఇష్టమైన వాటిని ఏరుకుని, వాటిని తమకు అనుగుణంగా మలుచుకుని, ఆ పనులు తమ కోసం చేసుకుంటూ..... ఎవరైనా అడిగితే "గురువు గారు చెప్పారు కదా" అని సమర్థించుకుంటారు. ఇలా చేస్తే పనికిరాకుండా పోతారు. **(1)** ఉదాహరణకు ఓ విషయం చెప్తాను..... నేను ఓ సారి క్లాస్‌లో ఎన్నో విషయాలు చెబుతూ.... జీవితాన్ని వీలైనన్ని రకాలుగా ఎంజాయ్ చేయండి అంటూ చెబుతున్నాను.... ఇంతలో ఒకావిడ లేచి సినిమాలు చూడవచ్చా సార్ ? అని అడిగింది. నేను చూడవచ్చు అని అన్నాను. క్లాస్ అయిపోయింది. ఆ తర్వాత ఇక.... ఆమె ఒక్కతే, లేకపోతే ఏ ఫ్రెండునో వెంటబెట్టుకుని హైదరాబాద్, సికందరాబాద్‌లలోని సినిమా థియేటర్‌లన్నీ సందర్శించడం ప్రారంభించింది. ఈమె కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, షికార్లు కూడా మొదలు పెట్టింది.

ఈవిడ దెబ్బకు వాళ్ళాయన తట్టుకోలేక పోయాడు. ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. ఇలా చాలా గొడవలయ్యాయి. గోరంత విషయం కొండంత అయింది. బంధు మిత్రులకు తెలిసింది పంచాయితీలు జరిగాయి. ఆమె ఎవరి మాటా వినలేదు. "గురువు గారే చెప్పారు" అంటూ నా మీద నింద వేసింది. అప్పుడు వాళ్ళింట్లో వాళ్ళు నేను రాసిన పుస్తకాలు చూపించి, ఇందులో గురువు గారు ఇంకా చాలా విషయాలు చెప్పారు కదా... మరి వాటి సంగతి ఏమిటి అని ప్రశ్నించారు. దాంతో ఆవిడ ఆఁ... ఊఁ.... అంటూ నీళ్ళు నమిలింది. నీ మదంతో నీవు జల్సాలు చేస్తూ.... పెడర్థాలు తీసి, మంచి చెప్తున్న గురువు గారి పైన నిందలు వేస్తావా ? అని అందరూ బాగా తిట్టారు. ఈమె ప్రవర్తనతో విసుగు చెందిన ఈమె భర్త కొంత కాలం మౌనంగా ఉండి అన్నీ పనులను క్లియర్ చేసుకుని సైలెంట్‌గా, తెలివిగా, తన సర్టిఫికెట్లు మొదలైన ముఖ్యమైన వాటన్నింటిని తీసుకుని మాయమయ్యాడు. చాలా రోజుల తర్వాత విదేశాల్లో హాయిగా ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడని తెలిసింది. కరెక్ట్ అడ్రస్ తెలియదు. ఎంత మందితో ఎన్ని రకాలుగా మెసేజ్‌లు పంపించినా ఆయన బదులివ్వలేదు. సుమారు రెండు సం॥లు దాటాయి. ఇక్కడ ఈమె "భర్త వదిలేసిన ఆడదాని" పరిస్థితి ఎలా ఉంటుందో అనుభవిస్తూ ఉంది. ఆధ్యాత్మికతతో మరియు ఆధ్యాత్మిక గురువుతో "గేమ్స్" ఆడితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోండి.

(2)ఒకడు, నేను చెప్పిన బోధనలకు పెడర్థాలు తీసి, వక్రీకరించి తనకిష్టం వచ్చినట్టుగా జల్సా చేస్తున్నాడు. భార్యను, ఇంటినీ పట్టించుకోకుండా, బాధ్యత లేకుండా, తన సరికాని సరదాలను తీర్చుకుంటున్నాడు. ఎన్నెన్నో గొడవలు, పంచాయితీలు జరిగాయి. అతడు మారలేదు. పైగా గురువు గారు ఏం చెబుతారో తెలుసా.... అంటూ నా మీద నిందలు వేయసాగాడు. ఒక రోజు గొడవ తీవ్రస్థాయికి చేరుకుంది, అప్పుడు అతని భార్య "ఇలాంటి అడ్డమైన పనులు చేయమని గురువు గారు ఎందుకు చెబుతార్రా.... అంటూ అందరి ముందు చెప్పుతో కొట్టింది, దాంతో విషయం విడాకుల వరకు వెళ్ళింది. అతడి ప్రవర్తనతో విసిగిపోయిన ఆమె విడాకులకు ఒప్పుకుంది. కొంత కాలానికి విడాకులు అయ్యాయి. ఆమె ఉద్యోగం చేసుకుంటూ వేరే పెళ్ళి చేసుకుంది. హాయిగా ఉంటోంది. ఇక్కడ ఇతడికి ఉద్యోగం పోయింది. బంధు మిత్రులందరూ పూర్తిగా బహిష్కరించారు. రోడ్ల మీద పిచ్చివాడిలా తిరుగుతున్నాడు ఇప్పుడు !

(3) ప్రజ్వలనా వేత్త(మారు పేరు) అనే వాడొకడు ఒకప్పుడు, నా దగ్గర ఉండే వాడు. వాడికి చాలా మంది ఆడవాళ్ళతో అక్రమ సంబంధాలు ఉండేవి, కొంత మంది పెళ్ళి కాని అమ్మాయిలతో కూడా సంబంధాలు ఉండేవి. వాడి పని ఎంత సేపూ లేడీస్‌కు లైన్ వేయడం తప్పితే మరో పని ఉండేది కాదు. మానుకోమని ఎంత చెప్పినా వినలేదు చాలా సార్లు వెళ్ళగొట్టాను. ఓ సంవత్సరం తర్వాత మారాడేమోనని మళ్ళీ పిలవడం వాడు మారక పోవడం ఈ విదంగా చాలా సార్లు జరిగింది. సుమారు 10 సంవత్సరాలు జరిగింది. నేను, వాడికి ఇన్ని సంవత్సరాలలో చాలా సార్లు చెప్పాను, వద్దురా నీవు ఇతరులకు చేసింది నీకు వస్తుంది. నీవు ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నావు. లేడీస్ పిచ్చిని వదిలేయమని చెప్పాను. వాడు వినలేదు మహిళ కనపడితే చాలు, ఆడపిల్ల కనపడితే చాలు అంకిత భావంతో, దీక్షగా లైన్ వేసే వాడు. కొన్ని విఫలం అయ్యేవి, కొన్ని సఫలం అయ్యేవి. ఇలా చాలా కాలం తర్వాత వాడికి పెళ్ళి అయింది. వాడు, వాడి భార్యను తీసుకుని నా దగ్గరకు వచ్చాడు. సరేలే పెళ్ళి అయింది కదా ఇకనైనా బుద్ధిగా ఉంటాడేమోనని మళ్ళీ వాడికి నా దగ్గర ఉండే అవకాశం ఇచ్చాను. ఈ సారి వాడితో మా అందరికీ కొత్త ప్రాబ్లమ్ మొదలయింది. ఎప్పుడూ వాడే అందరికీ లైన్ వేసే వాడు, ఇప్పుడు వాడి పెళ్ళానికి ఎవరు లైన్ వేస్తారోనని విపరీతమైన భయంతో ఆ పిల్లను 24 గంటలు అంటి పెట్టుకుని ఉండేవాడు. కానీ అప్పుడు నా దగ్గరకు చాలా మంది వచ్చిపోయేవారు కాబట్టి ఆ అమ్మాయి ఎంతో మంది మగవాళ్ళతో మాట్లాడవలసి వచ్చేది. ఆ అమ్మాయి చాలా మంచిది. కానీ వాడికి చాలా భయమైంది... ఎందుకంటే వాడు దొంగ కదా ! వాడిలాంటోళ్ళు ఉంటారని వాడికి పక్కాగా తెలుసు. వీడెంతో మందిని నమ్మించి మోసం చేసాడు కదా ! వాడి పెళ్ళాం వాడికి దక్కకుండా పోతుందని ఆలోచించి వాడు, వాడి పెళ్ళాన్ని తీసుకుని నా దగ్గర నుండి పూర్తిగా, శ్వాతంగా వెళ్ళిపోయాడు. నేను ఓ సారి కబురు పంపినా బదులివ్వలేదు. వాడు, వాడి పెళ్ళాన్ని తీసుకుని నా దగ్గర నుండి పూర్తిగా, శాశ్వతంగా వెళ్ళిపోయి కూడా చాలా సంవత్సరాలవుతుంది. ఈ విధంగా వాడు చేసిన అక్రమ చర్యలు వాడిని సత్య మార్గానికి పూర్తిగా, శాశ్వతంగా దూరం చేసాయి. వీడి లాంటోళ్ళ బతుకుల గతి అధోగతే ! గురువును & సత్య మార్గాన్ని అడ్డం పెట్టుకుని తప్పుడు పనులు చేస్తే విశ్వం తగిన గుణ పాఠం చెప్తుంది. గురువులతో గేమ్స్ ఆడితే బతుకు తలకిందులైపోతుంది.

దయచేసి విషయాన్ని సరిగా అర్థం చేసుకోండి. భౌతిక జీవితంలో చూపెట్టిన తెలివి తేటలు ఇక్కడ సత్య మార్గంలో చూపించ వద్దు. ఇది సత్య మార్గం. సత్య గురువులతో, ఆధ్యాత్మికతతో ఆటలాడితే పరిస్థితులు ఇంతకు ముందు చెప్పినట్టే కాకుండా, ఇంకా ఘోరంగా కూడా ఉంటాయి. ఇలాంటి కేసులు, ఇంతకన్నా దారుణమైన కేసులు ఎన్నో ఉన్నాయి. మీరు భయపడతారని చెప్పటం లేదు. చిన్న కేసుల్లో ఓ మూడు మాత్రమే చెప్పాను. అర్థం చేసుకోండి.

ఇంట్లో వాళ్ళకు చెప్తున్నాను...

...మీ భర్తనో, మీ భార్యనో, మీ అబ్బాయో, మీ అమ్మాయో లేక మీ వాళ్ళు ఎవరో ఒకరు ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్ళారనుకోండి. అప్పుడు మీరు చేయాల్సిన పని :

మీ వాళ్ళు ఎవరి దగ్గరికి వెళ్ళారో, ఏ సంస్థకు వెళ్ళారో వారు కారణం కాదు అని మీరు తెలుసుకుని తీరాలి. ఎందుకంటే, మీ వాళ్ళు రాకపోతే రమ్మని బలవంతం వారు చేయలేరు. అంతెందుకు, మీరు ఎందుకు వెళ్ళలేదు ? మీకు ఇష్టం లేకపోతేనే కదా వెళ్ళనిది ! మీకు ఇష్టం లేకుండా మిమ్మల్ని బలవంతం చేస్తే మీరు వెళతారా ? మీ వాళ్ళు మాయలో పడితే, మీరు కూడా మాయలో పడాలి కదా ! కాబట్టి మీరు అసలు విషయం అర్థం చేసుకోండి.

మీ వాళ్ళకు ఇష్టమై ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్ళారు. ఈ గురువు కాకపోతే, వేరే గురువు. మీ వాళ్ళు వెళ్ళాలనుకుంటే లోకంలో ఎంతో మంది గురువులుంటారు కదా !

కాబట్టి మీ వాళ్ళతో విషయాన్ని చర్చించుకోండి. ఇంట్లో పరిష్కరించుకోండి. అనవసరంగా, అర్థం చేసుకోకుండా.... గురువును, సంస్థను నిందిస్తే ఘోరమైన, దారుణమైన కర్మ చుట్టుకుంటుంది. జన్మల తరబడి ఆ కర్మను అనుభవించ లేక చచ్చి బతుకుతూ ఉంటారు. ఇది సత్యం.

మీరు తెలుసుకోవాల్సిన అసలు సిసలు విషయం ఏమిటంటే, ఎవరూ ఎవరిని వశపరుచుకోలేరు. ఎవరైనా ఎవరినైనా కావాలనుకుంటున్నారు, వారికోసం ఏం చేయడానికైనా సిద్ధపడ్డారు అని అంటే అది కేవలం ఇష్టం ప్రేమ మరియు అవసరం తప్ప మాయ కాదు. వశపరుచుకోవడం అంతకన్నా కానే కాదు. వాళ్ళు ఇష్టపడుతున్నారు అనే విషయాన్ని ఒప్పుకోలేక మాయలో ఉన్నారు అని అంటారు. ఇంకో విషయం ఏమిటంటే, ఒకరికి అవసరం అనిపించినది ఇంకొకరికి అవసరం అనిపించదు. తమకు అవసరం లేదు కదా అని అవసరం ఉన్న వారిని అడ్డుకుంటే తగిన గుణపాఠం నేర్పించ బడుతుంది. మళ్ళీ ఇతరులను కలలో కూడా అడ్డుకోనంతగా బుద్ధి చెప్పబడుతుంది.

మీ వాళ్ళు ఎవరైనా.... ఏ గురువు దగ్గరికి వెళ్ళినా లేక ఏ సంస్థలోనైనా చేరినా అది మీ వాళ్ళ ఇష్టం ప్రకారమే జరుగుతుందే తప్ప అందులో గురువు పాత్ర కాని, సంస్థ పాత్ర కాని అసలు ఉండదు. కాబట్టి విషయాన్ని సరిగా అర్థం చేసుకుని. మీ వాళ్ళతో ఇంట్లో కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకోవాలి. ఈ విషయంలో గురువును, సంస్థను నిందించ కూడదు. నిందిస్తే.... అనేకానేక జన్మల తరబడి ఘోరమైన, దారుణమైన, భయంకరమైన కష్టాలను అనుభవిస్తారు. ఇది బెదిరింపు కాదు, మీ పట్ల కరుణతో చెబుతున్న సత్యం ! వాస్తవం !!

40. గురువు మాటను ఎట్టి పరిస్థితుల్లోనూ జవదాటకూడదు. ఎంతో నీతిగా, నిజాయితీగా, నిబద్ధతతో, గౌరవ విశ్వాసాలతో, పాజిటివ్‌గా ఉండాలి.

41. ప్రస్తుతం ఉన్న గురువు దగ్గర మీకు సరిపడక పోతే గురువును మార్చేయండి. సూట్ అయ్యే గురువును ఆశ్రయించండి. అయితే ఎలాంటి గురువును ఆశ్రయించాలో చెప్పాను కదా !

42. ఇంతకు ముందు పేజీల్లో చెప్పినవన్నీ, ఇప్పుడు ఇక్కడ చెప్పినవన్నీ నా దగ్గరికి రావాలనుకునే వారికి కూడా వర్తిస్తాయి. కాబట్టి బాగా అర్థం చేసుకుని, సరిగా అవగాహన చేసుకుని, ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని, అన్నింటికీ సిద్ధపడి, పూర్తి పాజిటివ్‌గా నా దగ్గరికి రావాలి. ఇది తప్పనిసరి !

100% ఇంటి యొక్క ఫెయుల్యూర్ !

ఒక వ్యక్తి ఎవరైనా సరే - ఆడ, మగ ఇంకా అమ్మాయి, అబ్బాయి, చిన్నా, పెద్ద ఎవరైనా సరే..... తనకు ఇంట్లో సరిపడని వాతావరణం ఉన్నప్పుడే మనశ్శాంతి కోసం బయట దారి వెతుక్కుంటారు. అది ఇంటి యొక్క ఫెయుల్యూర్ ! వ్యసన పరులైతే క్లబ్‌లకు, పబ్‌లకు, బార్‌లకు వెళ్ళడం అలవాటు చేసుకుంటారు. తాగుతారు, పేకాట ఆడతారు ఇంకా ఏమేమో చేస్తూ ఆనందిస్తుంటారు. ఏ వ్యసనాలు లేని వారు, గుళ్ళకో, చర్చిలకో, ధ్యాన కేంద్రాలకో, ఏ గురువు దగ్గరకో వెళ్ళడం మొదలు పెడతారు. అక్కడ వీలైనంత సేపు గడిపి మనశ్శాంతిని పొందుతారు. అవకాశం ఉంటే అక్కడి వారు అనుమతిస్తే అక్కడ జరిగే ఏవైనా పనులు చేస్తూ తృప్తిని పొందుతూ ఉంటారు. వాళ్ళకు ఎంతో రిలీఫ్ వస్తుంది. చార్జ్ అవుతారు. రిలాక్స్ అవుతారు. ఇంటికి వెళ్ళడానికి ఇష్ట పడరు. ఇంట్లోని వాతావరణం, మనుషులు వీళ్ళకు సరిపడదు. సరిపడకనే కదా బయటకు వచ్చింది. ఇంట్లో వీళ్ళకు ఊపిరి ఆడనంతగా గిల గిల లాడిపోతారు. చాలా ఇబ్బందికి గురవుతారు. ఎప్పుడెప్పుడు బయట పడదామా ? అని ఎదురు చూస్తూ... వీలు చేసుకుని, అవకాశాన్ని సృష్టించుకుని మరీ బయటకు వెళ్తారు. ఇంట్లో వాళ్ళను కేర్ చేయరు. ఇది గమనిస్తున్న ఇంట్లో వాళ్ళ అహం దెబ్బ తింటుంది. అసూయ పుడుతుంది. హాయిగా బయట ఎక్కడో రిలాక్స్ అయి వస్తున్నారని గ్రహిస్తారు. వాళ్ళు బయట పొందుతున్న రిలీఫ్‌ను చూసి ఈర్ష్యతో, కుళ్ళుతో రగిలిపోయి గొడవకు దిగుతారు. వాళ్ళు వినక పోయే సరికి బయట వాళ్ళ మీద నింద వేస్తారు. మా వాళ్ళను ఏదో మాయ చేసి వశ పరుచుకున్నారని ధ్యానకేంద్రం వాళ్ళనో లేక గురువునో లేక సంస్థనో నిందిస్తారు. వ్యసనపరులను ఆపలేక, మార్చలేక ఇంట్లో వాళ్ళు ఆ వ్యసనపరుల వ్యసనాలను ఏమి చేయలేక భరిస్తారు. అప్పుడప్పుడు తాగితే మంచిదే కానీ రెగ్యులర్‌గా వద్దు అని బతిమాలుకుంటారు. ఆ క్లబ్‌లు , బార్‌లకు వెళ్ళి

వాళ్ళతో గొడవపడరు, కానీ ఒక వ్యక్తి ధ్యాన కేంద్రానికో, గురువు దెగ్గరకో వెళితే మాత్రం ప్రళయం సృష్టిస్తారు. ఇది మెదడు ఉన్న మనుషులు చేసే పని కాదు కదా !

100% ఇంటి యొక్క ఫెయుల్యూర్ !

ఇలాంటి పరిస్థితి 100% ఇంటి యొక్క ఫెయుల్యూర్ ! ఇంట్లో ప్రశాంతత దొరకక పోతే బయట వెతుక్కుంటారు. ఇంట్లో ప్రశాంతత ఉన్న వారు చచ్చినా బయటకు వెళ్ళరు. ఇంట్లో భోజనం దొరకనప్పుడే కదా హోటల్‌కు వెళ్ళాల్సి వస్తుంది ! ఈ సత్యాన్ని అర్థం చేసుకోలేక గొడవ పెద్దగా చేసుకుంటారు. ఇంటిలో తగిన వాతావవరణాన్ని కల్పించుకుని ఇంట్లో వాళ్ళకు ఇంట్లోనే స్వర్గం చూపించండి. అప్పుడు బయటకు ఎందుకు వెళ్తారు ?! బయట దొరికే ప్రశాంతతను ఇంట్లోనే దొరికేలా చేయండి. అప్పుడు ఏ ధ్యాన కేంద్రం, ఏ సంస్థ, ఏ గురువు అవసరం ఉండదు. గేట్లు మూస్తేనే కదా గోడలు దూకేది ! ఆనంద గేట్లు తెరిచి ఉంచండి. అప్పుడు హ్యాపీగా అందరూ ఇంట్లోనే ఎంజాయ్ చేయవచ్చు. ఇంటిని, ఇంట్లోని వాతావరణాన్ని సరిచేసుకోకుండా ఇంట్లో ఇబ్బందికరమైన వాతావరణాన్ని సృష్టిస్తూ... రిలీఫ్ కోసం తప్పని సరిగా బయటకు వెళ్ళాల్సిన పరిస్థితిని కల్పిస్తూ బయటకు వెళ్తే గొడవలు చేయడం ! విచిత్రం ! నీ భర్త అయినా, నీ భార్య అయినా, నీ తల్లి అయినా, నీ తండ్రి అయినా, నీ పిల్లలైనా నిన్ను విడిచి పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నీది. నీ నుండి వాళ్ళు పారిపోతున్నారంటే నీలో ఎంతటి దుష్టత్వం ఉంటే నిన్ను వద్దనుకుని నీ నుండి పారిపోతున్నారు ?! ఇది గ్రహించకుండా బయటి వాళ్ళను నిందించడం మహా మూర్ఖత్వం కాదా ?! ఇళ్ళను బాగు చేసుకోండి. ఇంట్లో సరైన వాతావరణాన్ని సృష్టించండి. అప్పుడు ఎవ్వరు కూడా చచ్చినా బయటకు వెళ్ళరు ! హాయిగా

అందరూ ఇంట్లోనే ఉంటూ హ్యాపీగా ఎంజాయ్ చేయండి. మీ ఇంట్లో వాళ్ళు ఎవరికీ అవసరం ఉండదు. ముందు ఇంటిని బాగు చేసుకోండి !

100% ఇంటి యొక్క ఫెయుల్యూర్ !

ముఖ్యంగా గురువుల దగ్గరకు వచ్చే వాళ్ళలో 90% ఇంట్లో ప్రశాంతత లభించని వాళ్ళే అయి ఉంటారు. డాక్టర్ల దగ్గరకు వెళ్ళేది చికిత్స కోసమే కదా.. సరిగ్గా ఇదే విధంగా గురువుల దగ్గరకు రిలీఫ్ కోసమే వెళ్తారు. కేవలం 10% మాత్రమే ఆత్మ విజ్ఞానం కోసం వెళ్తారు.

ఇంట్లో లభించని ప్రశాంతత, రిలీఫ్ వారికి గురువుల దగ్గర లభిస్తుంది. ఇంట్లో రిలాక్స్ కాలేని వాళ్ళు గురువుల దగ్గర రిలాక్స్ అవుతారు. ఇంట్లో న్యాయం దొరకనప్పుడే కదా న్యాయం కోసం కుటుంబ సభ్యులు కోర్టుకు వెళ్ళేది.. విషయం కోర్టు వరకు వెళ్ళకుండా చూసుకోవాల్సింది పోయి కోర్టులను నిందిస్తే దానికేమైనా అర్థం ఉందా ?! మీరు కోర్టులు పెట్టారు కాబట్టే మా వాళ్ళు కోర్టుకు వచ్చారు అని గొడవ చేస్తే దానికి ఏమైనా అర్థం ఉందా ?!

ఇంట్లో సరైన వాతావరణం కల్పించండి. ఇంట్లో వాళ్ళకు గౌరవం, ప్రేమను ఇవ్వండి. ఇంట్లో వాళ్ళ పట్ల కేర్ తీసుకోండి. ఇంట్లో వాళ్ళ మీద శ్రద్ధను, ఆప్యాయతను చూపించండి. మీరు మంచి రిలీఫ్‌ను ఇంట్లోనే అందిస్తే ఏ గురువు యొక్క అవసరమే ఉండదు. రోగమే లేకపోతే డాక్టర్ అవసరమే ఉండదు కదా, ఇంట్లో ఆరోగ్యకర వాతావరణాన్ని సృష్టించండి అప్పుడు ఏ ధ్యాన కేంద్రాలు, ఏ సంస్థా, ఏ గురువు యొక్క అవసరం ఉండదు. ఇల్లు నరకమైనప్పుడు, స్వర్గం కోసం వెతికి తీరుతారు. ఇల్లే స్వర్గమైతే బయటకు ఎందుకు వెళ్తారు ?!

మీ ఇంట్లో వాళ్ళను గురువుల దగ్గరకు రిలీఫ్ కోసం వెళ్ళకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదే !

100% ఇంటి యొక్క సక్సెస్ !

మీ ఇంట్లో వాళ్ళను గురువుల దగ్గరకి ఆత్మ విజ్ఞానం కోసం మాత్రమే వెళ్ళేలా చేయాల్సిన భాధ్యత మీదే.

మిమ్మల్ని వదిలేసి లేదా మిమ్మలి తప్పించుకొవడం కోసం గురువు దెగ్గరకు వెళ్లాల్సిన పరిస్థితి కలిగింది అని అంటే అది మీ ఫెయిల్యూర్!

ఇలా కాకుండా సకుటుంబ సమేతంగా గురువు దెగ్గరకు వెళ్ళి అందరు ఆత్మ విజ్ఞానం తెలుసుకొని కుటుంబమంతా దివ్యంగా జీవించడం మహా సౌభాగ్యం. వయస్సుతో సంబంధం లేదు. మత రహిత ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని ప్రతి మానవుడు తెలుసుకొని ఆచరింపదగినది.

ఇలా జరిగితే అది 100% ఇంటి యొక్క సక్సెస్.

సినిమాలు, వైన్ షాపులు, క్లబ్బులు, డ్రగ్స్, & ఆధ్యాత్మిక కేంద్రాల వ్యాపారాలు జోరుగా సాగడానికి కారణం ఏమిటంటే - మనుషులకు రిలాక్సేషన్ / ప్రశాంతత కావాలి. ఎవరికి తోచిన దగ్గరకు వాళ్ళు వెళ్తారు. ముఖ్యంగా... కొంచెం సామాజిక స్పృహ ఉన్న వారు చాలా మంది ఆధ్యాత్మిక కేంద్రాలకు వెళ్తారు. ఇంట్లో లభించని ప్రశాంతత వాళ్ళకు అక్కడ లభిస్తుంది. ఒంట్లో, ఇంట్లో సరైన వాతావరణం ఉంటే ఎవరూ ఎక్కడికీ వెళ్ళరు. కాబట్టి మీ వాళ్ళు ఎటైనా వెళ్తూ ఉంటే మీరు పట్టించుకోవాల్సింది మీ ఇంటి వాతావరణాన్ని కానీ మీ ఇంట్లో వాళ్ళు వెళ్ళే క్లబ్బునో, ధ్యాన కేంద్రాన్నో కాదు !

భార్యల బాధ నుండి, భర్తల బాధ నుండి, పిల్లల బాధ నుండి, తల్లిదండ్రుల బాధ నుండి ఇలా ఎవరి నుండో ఉపశమనం పొందడానికి ఎక్కువ శాతం జనాలు గురువులను కలుస్తూ ఉంటారు. ఎక్కడో ఒక దగ్గర ఎవరో ఒక గురువు వీళ్ళకు కనెక్ట్ అవుతాడు, నచ్చుతాడు. అంతే - ఇక ఆ గురువునే వీళ్ళు ఫాలో అవుతూ ఉంటారు. కొంత మంది మామూలుగా, కొంత మంది ఎక్కువగా, కొంత మంది టోటల్‌గా అంకితమై పోతారు. ఆ గురువుకు వీళ్ళ అవసరం ఏమీ ఉండదు. వీళ్ళకే ఆ గురువు అవసరం ఉండి వెళ్తూ ఉంటారు. అడ్డుకుంటే గొడవలు జరుగుతాయి. కుటుంబాలు కూడా చీలిపోయిన సందర్భాలున్నాయి. కాబట్టి మీ సంబంధాలను మంచిగా మెయింటేన్ చేసుకుంటే ఈ పరిస్థితులు రావు కదా !

మరోసారి హెచ్చరిస్తున్నాను, సత్య గురువులతో ఆటలాడ వద్దు ! విషయాలు తెలిసిన వాడిని కాబట్టి చెబుతున్నాను. గురువు దగ్గర ఉంటే ఉండండి లేకపోతే లేదు, అంతే కాని సరికాని విధంగా ప్రవర్తిస్తే... చాలా ఘోరంగా, దారుణంగా, చాలా పెద్ద లెవల్లో దెబ్బ తింటారు. ఇది పరమ సత్యం !

జాగ్రత్త !! మహా జాగ్రత్త !!!

మీకు తక్షణ, శాశ్వత గురు స్మృతి ప్రాప్తిరస్తు !

2. MAB నవ రత్నాలలో

రెండవది - నిస్వార్థ సేవా సాధన

నిస్వార్థ సేవ! ఇది, మెరుపు సాధన!!

"యద్భావం తద్భవతి" అంటే మన భావం ఎలా ఉంటే మన భవం అలా ఉంటుంది అని అర్థం. భవం అని అంటే భౌతిక పరిస్థితి. "భావం" అత్యంత సూక్ష్మ ప్రకంపనాలతో ఉండి మన భౌతిక కళ్ళకు కనపడదు. సూక్ష్మ ప్రకంపనాల స్థాయి తగ్గుతూ త్రీ డైమెన్షనల్ ఫ్రీక్వెన్సీకి సమానమైనప్పుడు "భావం" అనేది "భవం"గా మారుతుంది. భవం అని అంటే మన భౌతిక కళ్ళతో చూడగలిగేది, తాక గలిగేది, భౌతికంగా మన బాహ్య ఇంద్రియాలతో అనుభవించ గలిగేది అని అర్థం.

"యద్భావం తద్భవతి" అనేది సృష్టి మూల సిద్ధాంతం !

మన అంతరంగంలోని భావాల యొక్క యథాతథ ప్రతిబింబాలే మన శరీరంలోని + జీవితంలోని పరిస్థితులు. - ఒకానొక సృష్టి మూల సూత్రం.

ఈ సూత్రం ప్రకారం మన లోపల ఎలాంటి భావాలను కలిగి ఉంటామో సరిగ్గా అలాంటి పరిస్థితులనే మన శరీరంలో + జీవితంలో కలిగి ఉంటాం ! ఉదాహరణకు మీ లోపల హింసా భావం(గుణం) ఉందనుకోండి, అప్పుడు మీ శరీరంలో ఏదైనా మిమ్మల్ని బాగా బాధ పెట్టే రోగమో లేక నొప్పో లేక ఏదో ఒక అనారోగ్య సమస్య ఉంటుంది. దీని వలన మీరు బాధ పడుతూ ఉంటారు. మీ యొక్క హింసా గుణం ఎంత తీవ్రంగా ఉంటే అంత తీవ్రంగా మీరు బాధ పడుతూ ఉంటారు. ఇదే హింసా గుణం వలన జీవితంలో మీరు ఇతరుల చేతిలో హింసకు గురవుతూ ఉంటారు. బాగా దెబ్బలు తినవచ్చు లేదా మానసికంగా చిత్రవధకు గురి కావచ్చు లేదా ఏదైనా ప్రమాదాలకు గురి

కావచ్చు. మొత్తానికి మీరు హింసకు గురి అవుతూ ఉంటారు అది ఏ రకంగానైనా సరే ! ఈ విధంగా మన లోపల ఏం భావాలు లేక గుణాలు ఉన్నాయో మన శరీరంలో + జీవితంలో పరిస్థితులు అలానే ఉంటాయి. మన బయటి పరిస్థితులను గమనిస్తే మన లోపలి భావాలు ఎలాంటివో అంచనా వేయచ్చు. ఆధ్యాత్మిక విజ్ఞానం మరియు ధ్యాన సాధనల వలన మన భావాలలో మార్పు వస్తుంది. హింస కరుణగా మారుతుంది. ద్వేషం ప్రేమగా మారుతుంది. పిసినారి గుణం దాన గుణంగా మారుతుంది. మోసపు గుణం నిజాయితీగా మారుతుంది. ఈ విధంగా అపరిశుద్ధమైన భావాలు, సూటిగా చెప్పాలంటే దుర్గుణాలు అన్నీ కూడా మొత్తానికి మొత్తం సద్గుణాలుగా మారుతాయి.

ప్రపంచంలో ఉన్న ధ్యాన సాధనలన్నింటి యొక్క లక్ష్యం ఒక్కటే - అది అంతరంలో మార్పును తీసుకు రావటం. అంతరంలో మార్పును తీసుకు రావటం అని అంటే భావాలలో మార్పును తీసుకు రావటం. మీ అంతరంలో ఉన్న భావాలలో మార్పు జరిగి అపరిశుద్ధ భావాలు స్వచ్ఛం అయ్యాయి అని అంటే... ఇంకేముంది.. అంతా ఆనందమే... అంతా ఆరోగ్యమే... ...అంతా ఐశ్వర్యమే ! అంతా విజయమే !

అంతరంగంలోని భావాలలో మార్పును, మెరుపు వేగంతో తీసుకు వస్తుంది ఈ నిస్వార్థ సేవా సాధన ! ఇది నిజంగా మెరుపు సాధన ! నిస్వార్థ సేవా సాధనను మించిన సాధన మరొకటి లేదని అంటే అతిశయోక్తి కాదేమోనని అనిపిస్తుంది. నేను ఈ నిస్వార్థ సేవా సాధన ద్వారానే అన్ని విజయాలను సాధించాను. ఇంకెన్నో మహా విజయాలను సాధిస్తాను. నిస్వార్థ సేవ అనే దానిని, నేను ఒక ధ్యాన సాధనగా పరిగణించాను. **నా నిజతత్వం** యొక్క ఆశీర్వాద అనుగ్రహాల వలన నేను, నిస్వార్థ సేవను, **"సేవా ధ్యానంగా, సేవా సాధనగా రూపొందించాను"** !

ఈ నిస్వార్థ సేవా సాధనను, నేను మెరుపు సాధన అని పిలుస్తాను. ఎందుకంటే ఇది మెరుపు వేగంతో ఫలితాలను ఇస్తుంది కాబట్టి.

ఈ నిస్వార్థ సేవా సాధన వలన మీ యొక్క అంతరంగంలోని అపరిశుద్ధ భావాలపైన దివ్య మెరుపులు మెరుస్తాయి. దానితో మీ శరీరం మరియు మీ జీవితం దివ్య వెలుగులతో విరాజిల్లుతుంది !

కాబట్టి నిస్వార్థ సేవ చేసేటప్పుడు.... ఒక ధ్యానం చేసినట్టుగా.... ఒక సాధన చేస్తున్నంత శ్రద్ధ, సమర్పణ, అంకిత భావాలతో, ఎరుకతో చేయాలి. ఏ ప్రతిఫలం ఆశించకుండా చేయాలి. లేకపోతే చేయకూడదు.

నిస్వార్థ సేవా సాధన

సేవల్లో ఆధ్యాత్మిక పరమైన వాటికే మహా విశేషమైన ఫలితాలు వస్తాయి. నేను సేవ చేయమని చెప్తున్నాను అని అంటే అది కేవలం ఆధ్యాత్మిక పరమైన సేవ మాత్రమేనని మీరు గ్రహించి తీరాలి. మత పరమైన సేవ కానే కాదని మీరు తెలుసుకుని తీరాలి. మత పరమైన సేవ అనేది మీకు అత్యున్నతమైన ఆధ్యాత్మిక వికాసాన్ని ఇవ్వలేదు. మీరు ఆత్మ సాక్షాత్కారం పొందాలంటే సర్వ సృష్టికర్త అయిన దైవాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి అని అంటే ముందు మీరు మతంలో నుండి పూర్తిగా, శాశ్వతంగా బయట పడి తీరాలి.

ఏమీ ఆశించకుండా, ఏ ప్రతి ఫలం ఆశించకుండా చేసే పూర్తి నిస్వార్థ సేవ గురించి చెప్తున్నాను. 1 ఇస్తే 1,000 వస్తాయనే వ్యాపారం గురించి కానే కాదు. 1 ఇస్తే 1,000 వస్తాయనే భావంతో చేస్తే ఏమీ రావు పైగా సత్య సూత్రాన్ని దుర్వినియోగం చేసినందుకు ఉన్నది కూడా ఊడ్చుకు పోతుంది. భయంకరమైన కర్మకు బలవుతారు. నరకం అనుభవించి తీరుతారు.

నేను చెప్పేది పూర్తి స్థాయి నిస్వార్థ సేవ గురించి, పెట్టుబడి, ఇన్వెస్ట్‌మెంట్ గురించి కానే కాదు !

ఇతరులకు ఏ కొద్దిపాటి మంచి(నిస్వార్థ సేవ) చేసినా అది మనలోని శక్తిని మేల్కొల్పుతుంది. క్రమంగా అది మన హృదయంలో సింహసదృశమైన బలాన్ని నింపుతుంది.

- స్వామి వివేకానంద

ఇవ్వండి, ఒకటి ఇస్తే వేయి వస్తాయి అని ఒక ప్రధాన ఆధ్యాత్మిక సూత్రం చెప్తుంది. దీన్ని పట్టుకుని వ్యాపారం చేద్దామనుకుంటారు చాలా మంది. ఒకటిచ్చి వేయి కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఇలా చేస్తే ఫలితం రాదు. ఏమీ ప్రతిఫలం ఆశించకుండా, నిస్వార్థంగా ఇచ్చినప్పుడే ఫలం దక్కుతుంది. ఇది అతి తెలివి, దరిద్రపు తెలివి. ఈ నీచపు తెలివి ఆధ్యాత్మికతలో పనికి రాదు.

సద్గురు సమాధానాలు :

✪ ఇవ్వడమే పొందడం ! ఇవ్వడమంటే సంపాదించుకోవడమే ! ✪

సృష్టి అంతా ఒక్కటే ! అందరి మూలం ఒక్కటే !

అంతా మీరే ! మీరే అంతా !

ఎల్లప్పుడూ ఏకత్వ భావనలోనే ఉండాలి. మీరు ఇతరులకు చేస్తున్నారంటే మీకు మీరు చేసుకోవడమేనని తెలుసుకోండి.

అందరూ మీ ప్రతిరూపాలే అయినప్పుడు, అందరూ మీరే అయినప్పుడు, మీకు మీరు సేవ చేసుకోవాలి కదా ! మీరు ఇతరులకు సేవ చేయటం లేదు, మీకు మీరే సేవ చేసుకుంటున్నారని గ్రహించండి.

సాక్షాత్ మీరే మూల చైతన్య స్వరూపులు. మీలో అనంత మూల చైతన్య శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. "అనంతం" అని అంటే ఎన్నటికీ తరగనిది, కరగనిదీ మరియు ఎల్లప్పుడూ అభివృద్ధి చెందేది అని అర్థం. మరి, మీలో ఉన్న అనంతమైన శక్తి సామర్థ్యాలను ఉచితంగా పంచడానికి ఏమిటి అడ్డంకి ?! మీరు పంచుతూ ఉంటేనే మీ శక్తి సామర్థ్యాలు ఉత్తేజితమై, ప్రవృద్ధమై మీకు అందుబాటులోకి వస్తూ ఉంటాయి. మీలో "అనంతమైన శక్తి" ఉంది. ఈ శక్తినే "కుండలినీ శక్తి" అని అంటారు. నిజానికి ఇది మూల చైతన్య శక్తి ! దీనికి రక రకాల పేర్లున్నాయి. ఇది మూలాధార చక్రం దగ్గర ఉంటుంది. ఇది వెన్నెముకకు సమాంతరంగా ఉన్న సూక్ష్మ శరీరపు నాడుల్లోంచి నిట్ట నిలువుగా పైకి ప్రవహిస్తూ, అన్ని చక్రాలను ఉత్తేజితం చేసుకుంటూ సహస్రారాన్ని చేరుకుంటుంది. ఇలా జరగడంతో ఆ వ్యక్తి తన నిజతత్వాన్ని గ్రహిస్తాడు. దివ్యుడై పోతాడు. ఇది నిట్ట నిలువుగా పైకి లేస్తుంది కాబట్టి దీన్ని సర్పమని, వేయి పడగల పాము అని అంటుంటారు. కానీ నిజానికి ఇది సర్పమూ కాదు, వేయి పడగల పాము అంతకన్నా కాదు. ఇది "అనంత మూల చైతన్య శక్తి", అంతే ! భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలో అక్కడక్కడా దీనిని సర్పంగా వర్ణించారు. ఇది చదివి సాధన చేసిన వారికి ఆ మూల చైతన్య శక్తి వారి భావానికి అనుగుణంగా అలా కనపడుతుంది. భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలోని సర్ప వర్ణనలు చదవని వారెందరో ఈ "కుండలిని శక్తిని" జాగృతం చేసుకున్నారు. వారికి కేవలం మూల చైతన్య శక్తి మాత్రమే అనుభూతి అయింది. ఆ శక్తిని వారు అనుభవించారు, పొంది నిలుపుకున్నారు. నేను దీనిని అలలు లేని మహా సముద్రంలా దర్శించాను. తెలుసుకోండి, గ్రహించండి, గుర్తుంచుకోండి, "కుండలిని శక్తి" అనేది వాస్తవానికి "అనంత మహా మూల చైతన్య శక్తి" అని ! అది అనంత ఆత్మ శక్తి. అంతే !

తనలో అనంత మహా మూల చైతన్య శక్తిని కలిగి ఉన్న మానవుడు దేని గురించీ ఆలోచించాల్సిన మరియు దిగులు చెందాల్సిన అవసరమే లేదు కదా !

మీలో ఉన్న "శక్తి మడుగు" వినియోగంలో లేక పోవడంతో నిశ్చలంగా, నిరుపయోగంగా, తటస్థంగా ఉంది. మడుగు ప్రవహించకుండా ఉంటే అది పరిశుద్ధంగా ఉండదు. మడుగులోని నీరు ప్రవహిస్తేనే పరిశుద్ధంగా, స్వచ్ఛంగా ఉంటాయి. ఈ విషయం మీకూ తెలుసు కదా ! మన "శక్తి మడుగును" ప్రవహింప చేయాలి. అప్పుడే అది ఉత్తేజితమై, ప్రవృద్ధమవుతూ ఉంటుంది. మనం దానిని ఎంతెంతగా వినియోగించుకుంటామో అది అంతంతగా అభివృద్ధి చెందుతూ మన అందుబాటులోకి వస్తూ ఉంటుంది.

ఈ కుండలిని శక్తిని జాగృతం చేయడానికి ఎన్నో సాధనలు ఉన్నాయి. వాటిలో అత్యంత సులభమైనదీ, సర్వులు ఆచరించగలిగే సాధనా విధానమే ఆధ్యాత్మిక సేవ ! మీరు ఆత్మ విజ్ఞానాన్ని విస్తారంగా, అపారంగా, విశేషంగా పంచుతూ పోతుంటే "సర్వ అవగాహన" మీకు సులభంగా, శీఘ్రంగా సిద్ధించి ఆటొమెటిక్‌గా మీ కుండలిని శక్తి జాగృతం అయి మీ అందుబాటులోకి వచ్చేస్తుంది. ఇది ఎలా జరుగుతుందంటే, "పంచబడింది పెంచబడుతుంది" అనే సూత్రం ప్రకారం మీరు పంచిన ఆధ్యాత్మిక విజ్ఞానం లక్షల రెట్లై మీలో అవగాహనగా ఉదయిస్తుంది. మీరు ఆ అవగాహనతో సాధన చేస్తూ ఉంటారు. ఆ సమయంలో ఎప్పుడో ఇది జాగృతమై పోతుంది. ఇక్కడ ఇంత కంటే వివరంగా చెప్పలేను ఎందుకంటే, ఇక్కడ ప్రధానమైన టాపిక్ నిస్వార్థ సేవ కదా ! కుండలినీ శక్తి జాగృతానికి సంబంధించిన కఠిన విషయాలను ఎన్నో చదివిన, విని ఉన్న మీకు, ఈ విషయం ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉంటే, అందులో పెద్ద ఆశ్చర్యమేమీ లేదు.

✪✪✪ అనంత మహా మూల చైతన్య శక్తి యొక్క మూల సూత్రం ఒకటి ఇలా ప్రకటిస్తోంది... "శక్తి వినియోగమే, శక్తి యొక్క పాలన, పోషణ మరియు అభివృద్ధి" అని !

✪✪✪ మీరు ఇతరులకు ఉచితంగా ఇవ్వడానికి వెనకాడుతున్నారూ అని అంటే మీ "అనంత శక్తి" పైన మీకు నమ్మకం లేదనే అర్థం. మీ అపనమ్మకమే మిమ్మల్ని "మీ అనంత శక్తి" నుండి వేరు చేస్తుందని తెలుసుకోండి. "ఇలా అందరికీ ఉచితంగా ఇస్తూ పోతే మళ్ళీ నాకెలా వస్తాయి" అనే అజ్ఞానపు ఆలోచనా ధోరణియే మిమ్మల్ని "మీ అనంత శక్తి" నుండి దూరం చేస్తూ ఉందని గ్రహించండి. "ఇతరులకు ఉచితంగా ఇస్తే మరి నాకెలా" అనే భిన్నత్వ భావనయే మిమ్మల్ని "మీ అనంత శక్తితో" ఏకం కాకుండా చేస్తూ ఉందని మీరు తెలుసుకుని తీరాలి. అంతా మీరే అయినప్పుడు "ఇతరులు" అనే పదానికి అసలైన అర్థం, "ఇతరులు మీ యొక్క భాగాలే అంటే ఇతరులు కూడా మీరేనని" మీరు గ్రహించి తీరాలి. మీకు మీరే ఉచితంగా సేవ చేసుకోవడం సముచితమేనని తెలుసుకోండి. కేవలం సముచితమే కాక అది మీ ధర్మము మరి కనీస బాధ్యత అని కూడా తెలుసుకోండి.

అనంత మూల చైతన్య శక్తి స్వరూపుడైన మానవుడు, ఒక సాధారణ మనిషిగా ఉండడానికి గల ఏకైక కారణం "అతడు తన శక్తిని పంచి ఇవ్వక పోవడమేనని" తెలుసుకోండి. "నాకే లేదు నేనెక్కడి నుండి ఇవ్వాలి" అనే మాటకు(భావానికి) అసలు ఉత్పత్తి స్థానం పంచి ఇచ్చే గుణం లేదని అర్థం చేసుకోండి. పంచి ఇచ్చే గుణం లేదని అంటే అది పెంచుకునే గుణం కాదు, అది అభివృద్ధిని, సమృద్ధిని అడ్డుకునే గుణమని కూడా మీరు తెలుసుకోవాలి.

కొంత మంది మేము చాలా కష్టాల్లో ఉన్నాము, వీటిలో నుండి ఎలా బయట పడాలి అని బాధ పడుతూ ఉంటారు. చచ్చిపోయే పరిస్థితుల్లో ఉన్నాము ఇప్పుడు మేము ఏం చేయాలి ? అని ఆందోళన చెందుతూ ఉంటారు.....

.....ఇలాంటి వారికి నేను సూచించేదేమిటంటే.....

మీ దగ్గర ఏం ఉంటే అవి ఎవరికైనా ఇచ్చి ఏ ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయండి. నేను ఇలా చెప్పగానే వెంటనే ఏం అంటారంటే... మా దగ్గర ఏమీ లేవండీ, ఉంటే ఇచ్చే వాళ్ళమే ! అని వాపోతారు. అలా అనేటప్పుడు వాళ్ళ చేతి వేళ్ళకి బంగారు + వజ్రపు ఉంగరాలు, మెడలో లావుపాటి బంగారు గొలుసులు, లాకర్లలో లేక బీరువాల్లో బంగారు నగలు, భూములు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఆస్తులు ఇలా చాలానే ఉంటాయి. అయినా వాళ్ళు మా దగ్గర ఏమీ లేదని చెప్తారు. నిజంగా, వాస్తవంగా ఏమీ లేని పరిస్థితి ఉంటే అది వేరే విషయం. నిజంగా ఏమీ లేని వాళ్ళ గురించి చెప్పటం లేదు నేను. చాలానే ఉన్న వారి గురించి చెప్తున్నాను.

ఉదాహరణకు నిజంగా జరిగిన కొన్ని సంఘటనల సారాంశం చెప్తాను. ఇలాంటివి చాలానే జరిగాయి. అవి ఎలా ఉంటాయో మీకు తెలియజేస్తాను. '' నేను చచ్చే పరిస్థితుల్లో ఉన్నాను... నన్ను ఎలాగైనా రక్షించండి గురు దేవా....'' అంటూ నా దగ్గరికి వచ్చే వారు. అప్పుడు నేను వాళ్ళకు

ఈ సబ్జెక్ట్ అంతా వివరించి వెంటనే ఏదైనా సేవ చేయండి అని చెప్తాను. వాళ్ళు వెంటనే మా దగ్గర ఏమీ లేవండి అని అంటారు. వాస్తవానికి వాళ్ళకు చాలానే ఉంటాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లే కానీయండి లేక బ్యాంక్ బ్యాలన్స్‌లే కానీయండి లేక స్థిరాస్తులే కానీయండి లేక నగలు మొదలైనవి చాలానే ఉంటాయి. వాటిలో ఏదో ఒకటి తీసి వీలైనంత మందికి (సేవ)సహాయం చేయండి అని చెప్తాను. వాళ్ళు వెంటనే అదెలా..... కుదురుతుందండీ ? అని అంటారు. అప్పుడు నేను అంటాను, మీరు చచ్చే పరిస్థితుల్లో ఉన్నారని అంటున్నారు కదండీ... మీ ప్రాణం కంటే ఎక్కువ కాదు కదండి, ఏదో ఒక దాన్ని తీసి సేవ చేయండి అని అంటాను. అప్పుడు వాళ్ళలో కొంత మంది వెంటనే నా దగ్గరి నుండి వెళ్ళిపోతారు, మళ్ళీ కనపడరు. చాలా మంది విషయాన్ని అర్థం చేసుకుని, వెంటనే సేవ చేయడం మొదలు పెడతారు.

ఇలాంటి వారికి నేను చెప్పేది ఏమిటంటే.... దయచేసి గుర్తుంచుకోండి... "మీరు ఇవ్వనిదే ఏమీ పొందలేరు"..... "మీరు ఏమైనా పొందాలంటే, ఖచ్చితంగా మీరు ఇచ్చి తీరవలసిందే" ! దయచేసి ఈ సత్యాన్ని అర్థం చేసుకోండి. ***నేను నా వారందరికీ పదే పదే ఈ విషయాన్నే నొక్కి మరీ చెప్తుంటాను. వారి చేత వీలైనన్ని రకాలుగా సేవ చేయిస్తూ ఉంటాను. నా దగ్గరికి ఎవరు వచ్చినా నేను చెప్పేది ఒకటే ! ముందు ఏదైనా నిస్వార్థ సేవ చేయండి అని.***

శ్లో॥ ఉపార్జితానాం విత్తానాం త్యాగాపవహి రక్షణం
తటాకోదర సంస్థానాం పరీవాహ ఇవామ్బుసామ్ - 169వ శ్లోకం, హితోపదేశం

వివరణ : చెరువు మధ్యలో ఉన్న నీటికి రక్షణ ఆ చెరువుకున్న తూము. దాచిపెట్టబడిన ధనానికి రక్షణ నిస్వార్థ దానం(సేవ). సత్యం ఏమిటంటే - ధనాన్ని బ్యాంకులో దాచుకునే దానికన్నా ఎక్కువ రక్షణ, దానం(సేవ) చేయడం ద్వారా ఉంటుంది. బ్యాంకులో ఉంటే మీరు ఎంత వేసారో అంతే మీరు తీసుకోగలరు. కానీ, దానం(సేవ) చేస్తే మీరు ఇచ్చిన దానికి వేయి రెట్లు మీకు తిరిగి వస్తుంది. పైగా సురక్షితం కూడా ! శ్రేయస్కరం కూడా ! కాబట్టి ధనాన్ని వీలైనంతగా నిస్వార్థ దానం(సేవ) చేయాలి. మొత్తం దాచి పెట్టుకోకూడదు.

మనం దాచుకున్న, సంపాదించుకుంటున్న మరియు సంపాదించుకోబోయే ధనానికి రక్షణ మరియు అభివృద్ధిని కలిగించేదే నిస్వార్థ దానం(సేవ) !

సేవ చేయడం వలన శరీరంలోని సమస్యలు మరియు జీవితంలోని సమస్యలు ఎలా పోతాయి ?! అని అంటే.....

మరోసారి గుర్తు చేసుకుందాం. సృష్టి మూల సిద్ధాంతం ఏమిటంటే.....

యద్భావం తద్భవతి!

అంటే "మన భావం ఎలా ఉంటే మన భవం(పరిస్థితి) అలా ఉంటుంది" అని అర్థం. మన అంతరంగంలో ఎలాంటి భావాలనైతే కలిగి ఉంటామో, మన శరీరంలో మరియు జీవితంలో పరిస్థితులు అలాగే ఉంటాయి. నమ్మకాలు లేక విశ్వాసాలు, అభిప్రాయాలు, గుణాలు మరియు ఆలోచనా విధానాలు వీటన్నింటిని కలిపి "భావాలు" అని అంటారు.

మీరు సేవ చేస్తే చేయండి లేకపోతే లేదు. ఒకవేళ సేవ చేస్తే నిస్వార్థంగా ఏమీ ఆశించకుండా సేవ చేయండి, సేవ చేసి దాని గురించి పూర్తిగా మర్చి పోండి లేదా మీరు చేసింది వృథా ! మీరు చేసిన సేవ మీకు గుర్తుంటే, మీరు దాన్నుండి ఏదైనా ఆశిస్తున్నారంటే మీకు ఏమీ దక్కదు. పైగా కష్టాలు వచ్చే అవకాశం ఉంది. జాగ్రత్త !

ఏమీ ఆశించకుండా సేవ చేసి పూర్తిగా శాశ్వతంగా మర్చిపోతే పుణ్యం గ్యారంటిగా వస్తుంది.

ఒకవేళ మీరు చేస్తే నిస్వార్థంగా ఏమీ ఆశించకుండా చేయండి.

ఒకవేళ మీరు సేవ చేసి తిరిగి అడిగినా, తిరిగి తీసుకున్నా 1000% గ్యారంటీగా మహా నరకం అనుభవిస్తారు. పుణ్యం కాదు మహా పాపం తగులుతుంది.

బాగా బలంగా గుర్తు పెట్టుకోండి. సేవ చేస్తే చేసి పూర్తిగా, శాశ్వతంగా మర్చిపోండి. లేదా కోటి% నరకం గ్యారంటి !

గుర్తుంచుకోండి.....

శరీరంలోని రోగాలు, రోగాలు కావు !

జీవితంలోని సమస్యలు, సమస్యలు కావు !

❂❂❂ ఆత్మ విజ్ఞాన పూరితం కాని భావాలే, అంటే అపరిశుద్ధమైన భావాలే శరీరంలో రోగాలుగా మరియు జీవితంలో సమస్యలుగా ప్రకటం అవుతాయి. ❂❂❂

మీరు ఏ ప్రతి ఫలం ఆశించకుండా, నిస్వార్థంగా ఇతరులకు సేవ(సహాయం) చేసినప్పుడు మీ భావాలు స్వచ్ఛం అవుతాయి. దానితో మీ శరీరంలోని రోగాలు మరియు మీ జీవితంలోని సమస్యలు ఆటోమెటిక్‌గా, శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి.

మీరు ఏ ప్రతిఫలం ఆశించకుండా, నిస్వార్థంగా ఎవరికైనా సేవ చేయాలనుకున్నప్పుడు - మీ లోపల ఉన్న అపరిశుద్ధ భావాలు అడ్డం పడుతూ ఉంటాయి. మీకు సరికాని ఆలోచనలను, ఐడియాలను పంపిస్తూ మిమ్మల్ని సేవ చేయనీయకుండా అడ్డుకుంటూ ఉంటాయి. వాటన్నింటిని జయించి, మీరు సేవ చేయగలిగినప్పుడు, మీరు చేసిన సేవ యొక్క ప్రభావం మీ అంతరంగంలోకి ప్రసరిస్తుంది. ఎంత సేవ చేస్తే, అంత మేరకు ప్రసరిస్తుంది. దానితో మీ భావాలు స్వచ్ఛం అవుతాయి. ఎన్ని భావాలు స్వచ్ఛం అయ్యాయో, అన్ని సమస్యలు మీ శరీరంలో నుండి మరియు జీవితంలో నుండి వెంటనే శాశ్వతంగా తొలగిపోతాయి. గుర్తుంచుకోండి..... మీరు ఒక లక్ష లేక ఒక కోటి లేక కొన్ని కోట్లు పెట్టి సేవ చేసారని అనుకోండి, అయితే ఆ సేవ చేసిన తర్వాత.... అంటే మీరు భౌతికంగా ఆ డబ్బులను ఎవరికో ఇవ్వడమో లేక ఆ డబ్బులను ఖర్చు పెట్టి సేవా కార్యక్రమాలను చేసిన తర్వాత - మీరు పూర్తిగా ఆ డబ్బులను ప్రశాంతంగా మర్చిపోవాలి. హమ్మయ్య....! దివ్యమైన సేవ చేయగలిగాను అని ఆనందపడుతూ ఉండాలి. అంతే కాని అయ్యో అన్ని డబ్బులను ఖర్చు పెట్టాను, అని వాటిని పదే, పదే తలుచుకుని బాధ పడుతుంటే వాటి ఫలితం మీలో ఉద్భవించదు. ఎప్పుడైతే మీరు బాధ పడటం మానేస్తారో, ఎప్పుడైతే మీరు చేసిన సేవ పట్ల మీరు ఆనందంగా ఉండగలుగుతారో అప్పుడు మాత్రమే, మీరు చేసిన సేవ యొక్క ఫలితం మీలో ఉద్భవిస్తుంది.

స్వార్థంతో చేసే సేవలు, డాబు కోసం దర్పంతో చేసిన సేవలు, పేరు ప్రతిష్ఠల కోసం చేసిన సేవలు, ఆధిపత్యం కోసం చేసిన సేవలు, అహంకారంతో చేసిన సేవలు కూడా ఫలితాలను ఇస్తాయి. అయితే ఎలాంటి ఫలితాలను ఇస్తాయంటే వాటి ప్రభావం చేత, వారి అహం, డాబు, దర్పం, గర్వం, మదం అన్నీ అణిగి పోతాయి. ఇది ఒక రకంగా మంచిదే కదా ! ఎందుకంటే అహం, డాబు, దర్పం, గర్వం, మదం మొదలైనవన్నీ దరిద్రాలు. మరి, దరిద్రాలు తొలగి పోవడం మంచిదే కదా !

స్వార్థంతో చేసిన సేవలు, డాబు కోసం దర్పంతో చేసిన సేవలు, పేరు ప్రతిష్ఠల కోసం చేసిన సేవలు, ఆధిపత్యం కోసం చేసిన సేవలు, అహంకారంతో చేసిన సేవలు - ఇలాంటి సేవలు చేసిన వారు ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఎంతో సంఘర్షణకు గురవుతారు. ఈ సంఘర్షణ వీరిలో మార్పు తెస్తుంది.

అయితే ఎల్లప్పుడూ
ఏ ప్రతిఫలం ఆశించకుండా, నిస్వార్థంగా, ప్రేమగా,
దివ్య భావనతో సేవ చేయాలి.

గుర్తుంచుకోండి సేవ అని అంటే, సేవల్లో అధమం, మధ్యమం, ఉత్తమం మరియు పరమోత్తమం అని నాలుగు రకాల సేవలున్నాయి.

1. అధమ సేవ: ఇంట్లో ఏరి, ఏరి తమకిక ఎందుకూ, ఏరకంగానూ, ఏసమయంలోనూ పనికి రావని ఒకటికి పది సార్లు నిర్ధారణ చేసుకున్న తర్వాత, వాటిని ఎవరికైనా ఇస్తూ వాళ్ళనేదో ఉద్ధరిస్తున్నట్టుగా భావిస్తూ చేసే సేవ అధమ స్థాయికి చెందినది. ఏవైనా వస్తువుల యొక్క అవసరం తీరిపోయి అవి భారంగా లేక అడ్డంగా తయారైనప్పుడు ఎవరికైనా ఇచ్చి బరువు దించుకుని, చేతులు దులుపుకోవడం. ఇది అధమ స్థాయి సేవ ! ఈ అధమ స్థాయి సేవ ద్వారా ఫలితాలు వస్తాయి కానీ అధమ రీతిలోనే వస్తాయి. అయితే వీరు ఒక రకంగా అభినందనీయులే, ఎందుకంటే తమకిక జన్మలో పనికి రాని వస్తువులను కూడా ఇవ్వకుండా దాచి ఉంచుకునే పిసినారి వాళ్ళ కంటే వీళ్ళు నయం కదా !

2. మధ్యమ సేవ: సామాజిక సేవలు, భౌతిక పరమైన సేవలు అంటే వాతావరణ పరిరక్షణ, పరిశుభ్రత, పేదలకు ఉచితంగా వైద్యం చేయించడం, పేద పిల్లలకు ఉచిత విద్యా బోధన, ప్రజా సమస్యల పరిష్కారానికై అంకితం కావడం ఇవన్నీ కూడా మధ్యమ సేవలోకి వస్తాయి. ఈ సేవ చేసే వారు నిజంగా అభినందనీయులు. ఈ మధ్యమ సేవలో ఆధ్యాత్మికత ఉండదు, భౌతిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ రకమైన సేవా కార్యక్రమాలు చేస్తారు. ఇవి సమాజానికి ఎంతో అవసరమైన

సేవలు. ఈ రకమైన సేవల్లో ఆధ్యాత్మికత లేకపోయినా సమాజం కోసం, ప్రజల కోసం అంకితమై పని చేస్తారు కాబట్టి ఫలితాలు బాగానే ఉంటాయి.

3. ఉత్తమ సేవ : ప్రజలకు సరి అయిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించడమే ఉత్తమ సేవ. ఒక వ్యక్తి కష్టాల్లో ఉన్నప్పుడు ఆ వ్యక్తికి సహాయం చేయడాన్ని మధ్యమ సేవ అని అంటారు. అయితే ఎంత కాలం అతనికి మీరు సహాయం చేస్తారు ? సహాయం చేయడం మంచిదే కాని మనం చేసే సహాయం వలన అవతలి వ్యక్తులు వికలాంగులు కాకూడదు. ఇక్కడ వికలాంగులు అని అంటే, ఏదో ఒక అవయవ లోపం అని కాదు అర్థం, వారిని సహాయం కోసం అర్థించే వారిగా తయారు చేయటం. మనం చేసే సహాయం పైన ఆధార పడేలా చేయటం. మన పైన వాల్చుకోవటం. ఇది ఎంత మాత్రమూ సరి కాదు కదా !

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రజలకు అందించడం అనేది ఉత్తమ సేవగా ఎందుకు పరిగణించ బడుతుంది అని అంటే, కష్టాల్లో ఉన్న వ్యక్తులకు ఇక్కడ సహాయం చేయడం అనేది ఉండదు. నీ కష్టాలను నీవే సృష్టించుకున్నావు. నీవు సృష్టించుకున్న కష్టాలను నీవే తొలగించుకో గలవు. ఆ శక్తి సామర్థ్యాలు నీ లోపల పుష్కలంగా ఉన్నాయి. వాటిని ఎలా అందుబాటులోకి తెచ్చుకోవాలో తెలియజేసి, ఆ విషయాలను, ఆ సాధనలను నేర్పించడాన్నే ఆధ్యాత్మిక సేవ అని అంటారు. "ఎవరి పరిస్థితులను వారే సృష్టించుకుంటూ ఉంటారు" ! ఆత్మ విజ్ఞానం లేక పోవడంతో సరికాని పరిస్థితులను సృష్టించుకుని బాధ పడుతూ ఉంటారు. ఆత్మ విజ్ఞానం ఉన్నప్పుడు సరి అయిన పరిస్థితులను సృష్టించుకుని ఆనందంగా ఉంటాం.

కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయడం మధ్యమ సేవ. ఎవరి కష్టాలను వారే తీర్చుకునేలా శిక్షణ ఇచ్చి, వారిని శక్తి శాలులుగా మార్చడం ఉత్తమ సేవ.

బలంగా గుర్తుంచుకోండి - ఏమీ ఆశించకుండా చేసే నిస్వార్థ సేవకు మాత్రమే మీకు సత్ఫలితం వస్తుంది. ప్రతిఫలం ఆశించి చేసేది సేవ కాదు. అది వ్యాపారం !

ప్రతి వ్యక్తి అనంత శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్న వాడే ! తన గురించి తనకు తెలియక, తనను తాను శక్తి హీనుడిగా భావిస్తూ తన బాగు కోసం ఇతరుల సహాయ సహకారాల కోసం ఎదురు చూస్తూ, ఇతరుల కరుణా కటాక్షాల కోసం పడిగాపులు గాస్తూ ఉండడం చాలా దయనీయమైన విషయం కదా ! నీవే దైవం ! ఈ సృష్టి సర్వస్వానికి ఆధారభూతమైన శక్తి ఏదైతే ఉందో అది నీవే ! నీలోనే అనంత దివ్య శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. సాధన చేసి వాటిని అందుబాటులోకి తెచ్చుకో ! అని ఆ ప్రకారమైన శిక్షణలను ఇవ్వడమే ఆధ్యాత్మిక సేవ. ఒక వ్యక్తిని శాశ్వతంగా తనకు తాను సహాయం చేసుకునే రకంగా, తనను తాను ఉద్ధరించుకునే విధంగా మార్గదర్శకత్వం వహించడమే ఆధ్యాత్మిక సేవ. అందుకే ఇది ఉత్తమ సేవ !

చాలా మంది ఆధ్యాత్మిక సేవ అనగానే మత పరమైన సేవగా పరిగణిస్తారు. కానీ కాదు. మతం వేరే! ఆధ్యాత్మికం వేరే!

ప్రతి మనిషిలోనూ దైవం ఉంది. ఆ దైవమే మీరు! మీ దైవత్వాన్ని మీరు అనుభవ పూర్వకంగా తెలుసుకోండి అని బోధించేదే ఆధ్యాత్మికత ! మీ గురించి మీరు తెలుసుకోండి అని నినదించేదే ఆధ్యాత్మికత ! అంతే కానీ, కాషాయ వస్త్రాలు, సన్యాసం, మత పరమైన కార్య కలాపాలు మొదలైనవి కానే కాదు.

4. పరమోత్తమ సేవ : ఆధ్యాత్మిక విజ్ఞానంలో మరియు ధ్యాన సాధనలలో రెండు రకాలున్నాయి. ఒకటి ఉత్తమం అయితే, రెండవది పరమోత్తమం ! "పరమ లేక పరమం" అని అంటే సర్వోత్తమమైనది, సర్వోన్నతమైనది, అత్యున్నతమైనది, అత్యుత్తమమైనది తన కంటే ఇక పైన ఏమీ కలిగి లేనిది అని అర్థం.

ప్రాథమిక స్థాయిలోని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని మరియు ప్రాథమిక స్థాయికి చెందిన ధ్యాన సాధనలను తెలియ జేయడం, వాటిని నేర్పించడం అనేది ఉత్తమ సేవ. అత్యున్నతమైన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని సూటిగా, సరళంగా, ఉన్నది ఉన్నట్టుగా, కేవలం ప్రాథమిక స్థాయికే పరిమితం కాకుండా ఉన్నతమైన, అత్యున్నతమైన ఆధ్యాత్మిక విజ్ఞాన విశేషాలను బోధిస్తూ మరియు అత్యున్నతమైన ధ్యాన సాధనలను నేర్పించే విధానమే పరమోత్తమ సేవ.

నేను ఎల్లప్పుడూ పరమోన్నతమైన, పరమోత్తమమైన వాటినే కోరుకుంటాను. కాబట్టి ఎంతో పరిశోధించి, స్వయంగా నా జీవితాన్నే పణంగా పెట్టి ఎన్నో ప్రయోగాలు చేసి, అనుభవ పూర్వకంగా తెలుసుకుని, పరమోత్తమమైన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని మరియు పరమోత్తమమైన ధ్యాన సాధనలను కనుగొన్నాను. ప్రపంచంలో పరమోత్తమ స్థాయికి చెందిన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని కొంత మంది మాస్టర్లు బోధిస్తున్నారు. వారిలో నేనూ ఒకడిని. ప్రపంచంలో పరమోత్తమమైన ధ్యాన సాధనలు చాలానే ఉన్నాయి. పరమోత్తమ ధ్యాన సాధనలను నేను కనుగొన్నాను లేదా ఆ మూల చైతన్యం నా ద్వారా లోకానికి ప్రకటించింది. ఆ పరమోత్తమ ధ్యాన సాధనలనే నేను నేర్పిస్తున్నాను.

Think Ultimate !

Do Ultimate !!

Become Ultimate !!!

Think Abundance !

Give Abundance !!

Get Abundance !!!....

...అనేవే నా సిద్ధాంతాలు ! కాబట్టి నేను ఎల్లప్పుడు పరమోత్తమమైన వాటికే ప్రాధాన్యతను ఇస్తాను.

ఎల్లప్పుడూ పరమోత్తమమైన సేవనే చేయాలి ! సర్వ వేళలా పరమోన్నతమైన సేవనే ప్రోత్సహించాలి !!

❂❂❂ పరమోత్తమ సేవ అని అంటే - ఆత్మ విజ్ఞాన కార్యక్రమాలను చేసే సంస్థలకు డబ్బులను విరాళంగా ఇవ్వడం లేదా ఆయా సంస్థ యొక్క కార్యక్రమాలకు అంకితమై పని చేయడం. డబ్బులు ఇవ్వగలిగిన వాళ్ళు ఎంత వీలైతే అంత ఇవ్వాలి. "నిస్వార్థంగా" ఇవ్వడం వలన చాలా మంచి జరుగుతుంది. ఏమీ ఆశించకుండా ఇవ్వాలి లేకపోతే లేదు !

పంచి ఇచ్చే గుణమే పెంచుకునే గుణమని తెలుసుకోండి. తనను తాను ఒక వ్యక్తి నిజంగా పెంచుకోవాలనుకున్నప్పుడు తనకు తెలియకుండా తానే పంచి ఇవ్వడానికి సిద్ధ పడతాడని తెలుసుకోండి. పంచిన వాడు తనను తాను పెంచుకున్న వాడవుతాడు అని తెలుసుకోండి.

ఒక వ్యక్తికి తనను తాను పెంచుకోవాలనే ఉద్దేశం లేనప్పుడే, తనను తాను అభివృద్ధి చెందించుకోవాలని అనుకోనప్పుడే, బాగు పడాలనే కోరిక లేనప్పుడే పంచడానికి వెనకాడతాడు అని తెలుసుకోండి. తాను పంచకుండా ఉంటున్న వ్యక్తి, పంచే వాళ్ళను చూసి "ఇది ఎంత వరకు సమంజసం ?!" అని ఆశ్చర్యపోతాడనీ తెలుసుకోండి. తమ దివ్యత్వాన్ని తాము పొందే ఉద్దేశం లేని వ్యక్తులే పంచలేరు అని కూడా తెలుసుకోండి.

"అంతా ఇచ్చిన వాడికి అంతా ఉంటుంది" అనే పరమ సత్యాన్ని - మిఖైల్ నైమి అనే పరమాత్ముడు చెప్పాడు. అంతా ఇచ్చిన వాళ్ళే అంతా పొందుతారని తెలుసుకోండి. అంతా ఇచ్చి అంతా పొందడమే పరమాత్మ తత్వము లేక దైవత్వం లేక మోక్షం అని కూడా తెలుసుకోండి.

ఇంకా "మాయ" పొరలోనే చిక్కుకుని ఉన్న సాధారణ మానవుడిలాగే మిమ్మల్ని ఉంచాలనుకుంటున్న "అహం" యొక్క కోరికయే మిమ్మల్ని పంచనీయకుండా అడ్డు పడుతుందని గ్రహించండి. అహం మార్పును ఏ మాత్రమూ అంగీకరించదు, సహించదు. అహం అంటే, ఉన్నది ఉన్నట్టుగానే ఉండడం, అంటే మార్పు లేకుండా ఉండడం, అంటే అభివృద్ధి చెందకుండా ఉండడం అని అర్థం. మార్పు అనేది అహానికి మరణాన్ని కలిగిస్తుంది. మీలో ఎంతెంత పరివర్తన కలుగుతూ ఉంటే అంతంతగా అహం మరణిస్తూ ఉంటుంది.

నిస్వార్థ సేవ అనేది ఒక "పెనుమార్పు" ! ఒక మహా పరివర్తన ! మెరుపు వేగంతో కూడిన అభివృద్ధి !

బాగుపడాలనే తీవ్ర తపనలోంచే పంచే గుణం ఉద్భవిస్తుంది. ఇలా ఉద్భవించిన పంచే గుణం మీ చేత పంచేలా చేసి మిమ్మల్ని పెంచుతుంది. మీ నిజ తత్వమైన మీ దైవత్వాన్ని పొందాలంటే నిస్వార్థ సేవ అత్యవసరం మరియు అనివార్యం !

ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా దానం చేయడం వలన కలిగే లాభం గురించి విష్ణు పురాణంలో ఈ కింది విధంగా ఉంది :

"మానవులు తాము ఆర్జించిన దాన ఫలం వలన దేవతలకు కూడా సాధ్యం కాని మోక్ష పథాన్ని పొందుతారు". - విష్ణు పురాణం (పేజ్ నం. 11) తెలుగు అనువాదం : శ్రీ ఏల్చూరి మురళీధరరావు, ప్రకాశకులు-బాలసరస్వతీ బుక్ డిపో, సోల్ డిస్ట్రిబ్యూటర్స్: టాగూరు పబ్లిషింగ్ హౌస్, ఫోన్ నం. 040 - 2756 8329 / 6636 8330 వారి సౌజన్యంతో.

మీరు ఎంత సేవ చేస్తే అంత సేవను పొందుతారు. సేవ చేయడం అని అంటే "సేవను సంపాదించుకోవడమేనని" తెలుసుకోండి. డబ్బులు నిస్వార్థంగా పంచడమంటే కొన్ని వేల రెట్లుగా సంపాదించడమేనని తెలుసుకోండి. ఏదైనా సరే నిస్వార్థంగా ఇవ్వడం అంటే పొందడమేనని, నిస్వార్థంగా ఇవ్వడం అంటే సంపాదించడమేనని కూడా తెలుసుకోండి.

ఈ భూమి పైన ఉన్న అన్ని సంపాదనా మార్గాల్లో కెల్లా ఉత్తమమైనది, ఎంతో లాభసాటి అయినదీ "నిస్వార్థ దానం" అనే మార్గమేనని తెలుసుకోండి. మీరు ఏదైతే సంపాదించు కోవాలనుకుంటున్నారో అది "పంచి" ఇవ్వడం ద్వారా సులభంగా, శీఘ్రంగా, సురక్షితంగా ఎన్నో లక్షల రెట్లై మీకే తిరిగి వస్తుంది. ఇతర సంపాదనా మార్గాల్లో లాభం - నష్టం రెండూ ఉంటాయి. ఈ "పంచి" ఇవ్వడం అనే మార్గంలో మాత్రం, కేవలం లాభం మాత్రమే ఉంటుంది.

నిస్వార్థ సేవలో 100% గ్యారంటీ ఉంటుంది. శుభం + లాభం తప్ప మరొకటి ఉండనే ఉండని సురక్షితమైన సంపాదనా మార్గం ఈ "పంచి" ఇవ్వడం !

అనంత శక్తి ఉన్న మనం మెరుపు వేగంతో భౌతికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిని సాధించాలంటే సేవ చేయాలి, పంచాలి ! ఈ సత్యాన్ని మీరు గ్రహించి తీరాలి.

"కొంచెం విత్తువాడు కొంచెమే పంటకోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగానే పంటకోయును..."

"...దేవుడు ఉత్సాహముగా ఇచ్చువాడిని ప్రేమించును. మరియు అన్నింటి యందు ఎల్లప్పుడును మీలో మీరు సర్వసమృద్ధిగలవారై ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరింపజేయగలడు"

- పవిత్ర గ్రంథం బైబిల్ - II బైబిల్ - కొరింథీయులకు - 9 : 6 - 9

ఎప్పుడూ ఏమీ ఇవ్వని వ్యక్తి, ఎప్పుడూ ఏమీ పొందలేడని తెలుసుకోండి. "మీరేం ఇస్తే అది వేల రెట్లై మీకే తిరిగి వస్తుందన్న" సృష్టి సిద్ధాంతాన్ని మీరు అర్థం చేసుకుని తీరాలి. మీరు ఒక పూల విత్తనం నాటితే వేలాది పూలను మీరు పొందుతారు. ఒక పండు యొక్క విత్తనాన్ని నాటితే వేలాది పండ్లను మీరు పొందటం లేదా ?! ఇంత కన్నా ఎన్ని ఉదాహరణలు, ఎన్ని నిరూపణలు కావాలి మీకు ?!

అర్థం చేసుకోండి, మీలో ఉన్న "బాగుపడడం ఇష్టం లేని గుణమే" మిమ్మల్ని నిస్వార్థ సేవ చేయనివ్వకుండా, పంచనీయకుండా అడ్డం పడుతూ మిమల్ని అభివృద్ధికి అందనంత దూరంలో ఉంచుతుందని ! ఈ గుణమే మీకు రక రకాల ఆలోచనలను పంపిస్తుంది. రీజనింగ్ + లాజిక్‌తో కూడిన ఆలోచనలను పంపించి వాటికి, తెలివి తేటలు + పరిశోధన అనే ముసుగు వేస్తుంది. మీరు ఆ ముసుగు కింద కప్పబడి పోతారు. అహం వేస్తున్న ఆ ముసుగును మీ అవగాహనాగ్నిలో దగ్ధం చేసేయండి. అనంత శక్తి కలిగి ఉన్నారు మీరు. మీకు ప్రస్తుతం ఉన్న దానిలో నుండి పంచడం ప్రారంభించండి. పంచుతూనే పోండి, అత్యంత త్వరలోనే మీరు సత్యాన్ని గ్రహిస్తారు. మీరు పంచింది మీకు వేలాది రెట్లుగా తిరిగి వస్తుందని, దివ్య భావనతో పంచితే లక్షలాది రెట్లుగా వస్తుందనీ మీరు అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారు. ఒక్క సారి మీకు అనుభవ పూర్వకంగా తెలిసిందంటే, ఇక చాలు ! అప్పుడు మీరు పంచుతూ మిమ్మల్ని మీరు పెంచుకుంటూ పోతారు ! నిస్వార్థ సేవ(పంచండి) చేయండి ! సేవను పొందండి !

ఇప్పుడు మేము బాగానే ఉన్నాము కదా, అనే భ్రమలో ఉండద్దు.

మీ అంతరంలో ఉన్న సరి కాని భావాలు ఎప్పుడు ఏ ప్రమాదాలను ఆకర్షిస్తాయో తెలియదు కదా. కష్ట నష్టాలు, ప్రమాదాలు చెప్పి రావు కదా ! ప్రమాదాలకు గురైన వారిని అడగండి, మీకు ముందే తెలుసా అని. ఒక్క క్షణం ముందు కూడా తెలియదు. అకస్మాత్తుగా, అలా జరిగి పోతుందంతే ! కాబట్టి పరిస్థితులు బాగా ఉన్నప్పుడే నిస్వార్థ సేవ చేసి మీ అంతరంగాన్ని పరిశుద్ధం చేసుకోండి. దుష్కర్మ ప్రభావం ముంచుకొచ్చినప్పుడు చింతించి ప్రయోజనం ఉండదు.

ఈ యొక్క ఆధ్యాత్మిక పరమైన సేవలో(పంచడంలో) ప్రధానంగా 3 రకాలు ఉన్నాయి అవి :

1. శారీరక సేవ 2. బుద్ధి సేవ 3. ఆర్థిక సేవ

1. శారీరక సేవ : అంటే సత్య ప్రచారం చేసే వారికి సహాయం అందించడం. ప్రోగ్రాంలు జరుగుతూ ఉన్నప్పుడు అక్కడ కుర్చీలు వేయడం, కార్పెట్లు వేసి తీయడం, నీళ్ళు అందించడం, వంట పనులలో సహాయం చేయడం, వీలు చిక్కితే "గురు సేవ"లో తరించడం, ఈ విధంగా ఎన్నో రకాలుగా, ఎన్నెన్నో విధాలుగా "సేవలను" చేసుకోవచ్చు. ఆధ్యాత్మిక + ధ్యాన కేంద్రాలలో ఏం సేవ చేసినా ఎంతో ఫలితం ఉంటుంది.

చాలా మంది రక రకాల అనారోగ్యాలతో బాధ పడుతూ ఉంటారు. వేలకు వేలు, లక్షలకు లక్షలు హాస్పిటల్స్‌లో ఖర్చు పెడుతూ ఉంటారు. వారు ఖర్చు పెట్టే దానిలో సగం ఎవరికైనా సహాయం చేసినా వారి అనారోగ్యం శాశ్వతంగా పోతుంది. అయితే ఆధ్యాత్మిక అవగాహనతో, ప్రేమగా సహాయం చేయాలి. ఏ ప్రతిఫలం ఆశించకుండా, నిస్వార్థంగా సహాయం చేయాలి. గంటలు గంటలు, రోజుల తరబడి హాస్పిటల్స్‌లలోని క్యూలలో కూర్చుంటారు. అంత సమయం గనక ఇంట్లో ధ్యాన సాధన చేస్తే సరి పోతుంది. చక్కటి ఆరోగ్యం వస్తుంది. ఎంతగానో బాధ పడుతూ, శ్రమిస్తూ, డబ్బు ఖర్చు పెడుతూ ఉంటారు. మందులు రోగాలను పూర్తిగా, శాశ్వతంగా పోగొట్టవు, రోగాలను మందులు గనక పూర్తిగా, శాశ్వతంగా నయం చేస్తే ప్రపంచంలో పరిస్థితి ఇలా ఎందుకు ఉండేది ?! మందులు కేవలం శరీరం పైన మాత్రమే పని చేస్తాయి మరి రోగాల యొక్క మూలం "లోపల - అంతరంలో" ఉంటుంది. హాస్పిటల్స్‌కు నిజంగా అవసరం అయినప్పుడు మాత్రమే వెళ్ళాలి. తుమ్మినా, దగ్గినా హాస్పిటల్‌కు వెళ్ళే రోగాన్ని ముందు నయం చేసుకోవాలి.

✪✪✪ ఒక్క రోగాలే కాదు, జీవితంలోని ఏ సమస్యలైనా సరే, " నిస్వార్థ సేవ" ద్వారా తొలగి పోతాయి. సర్వ అనారోగ్యాలను, సమస్త సమస్యలను "నిస్వార్థ సేవ" ద్వారా శాశ్వతంగా తీసివేయవచ్చు.

✪ ఎవరికైనా నిస్వార్థంగా సహాయం చేయండి. మంచి పనులు చేయండి. అడగక ముందే వారి అవసరాన్ని కనిపెట్టి, ఏమీ ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయండి. ఏ సహాయం చేయగలుగుతారో అదే చేయండి. మీకు సహాయం చేసే వీలు లేకపోతే కనీసం సహాయం ఎక్కడ దొరుకుతుందో తెలియజేయండి.

✪ ఏ పనీ చెయ్యకపోతే డబ్బులెలా వస్తాయి ? ఏదో ఒక వృత్తియో, ఉద్యోగమో, వ్యాపారమో చేయాలి కదా ! అని మీరు అంటారు. ఇది నిజమే మరి ! నేనూ అదే అంటున్నాను. మీరు ఏమీ పంచకపోతే ఎలా పొందుతారు ? అని !

✪ ఏదైనా పని చేస్తే డబ్బు వస్తుంది. ఇదే సూత్రం అన్నింటికీ వర్తిస్తుంది.

✪ మీరు ఏదైనా సహాయం చేస్తేనే, మీకు సహాయాలు లభిస్తాయి. మీరు ప్రేమను పంచితేనే, ప్రేమింప బడతారు.

✪ మీరు ఇతరులను ఆదుకుంటేనే, ఇతరులు మిమ్మల్ని ఆదుకుంటారు.

✪ మీరు ఇతరుల అభివృద్ధికి కృషి చేస్తే, మీ అభివృద్ధికి ఇతరులు కృషి చేస్తారు.

✪ మీరు ఇతరుల కోసం సమయాన్ని వెచ్చిస్తేనే, మీ కోసం ఇతరులు సమయాన్ని వెచ్చిస్తారు.

✪ మీరు ఇతరులకు శ్రేయస్కరాన్ని కలిగిస్తేనే, మీకు ఇతరులు శ్రేయస్కరాన్ని కలిగిస్తారు.

✪ మీరు ఇతరులకు సహాయ సహకార సమన్వయాలను అందిస్తేనే, మీకు ఇతరులు సహాయ సహకార సమన్వయాలను అందిస్తారు.

✪ మీరు ఇతరులకు ఆత్మ విజ్ఞానాన్ని పంచితే, మీకు సృష్టి ఆత్మ విజ్ఞానం పెంచుతుంది.

✪ మీరు ఇతరుల దైవత్వానికి కృషి చేస్తేనే, మీరు దైవత్వం పొందగలుగుతారు.

✪ మీరు ఇతరులకు ఏమీ పంచి ఇవ్వకుండా, మీ సంపాదన మీరు చూసుకుంటూ, కేవలం మీ బ్రతుకు మీరు బ్రతుకుతూ ఉంటే మీకు ఏదీ లభించదని గుర్తుంచుకోండి.

✪ కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టుకుని ఉండికూడా, వాటిని "పరమోన్నతమైన సేవ" కోసం వినియోగించని వాళ్ళు మూర్ఖులు. చచ్చాక ఒక పైసా కాదు కదా, బతికినంత కాలం నాది, నాది అని అనుకునే శరీరాన్నే వదిలి వెళ్ళవలసి ఉంటుంది. ఏ క్షణంలో చస్తారో తెలియని మనుషులు అజ్ఞానంతో, మూర్ఖత్వంతో డబ్బులను కూడబెట్టుకుంటూ ఉంటారు. డబ్బులు ఉండి వాటిని "పరమోన్నతమైన సేవ" కోసం వాడి జన్మ సార్థకం చేసుకోలేని వాళ్ళు ఎంతో దురదృష్టవంతులు. దౌర్భాగ్యులు. దరిద్రులు.

✪✪✪ **నిజానికి అసలు విషయం ఏమిటంటే - అంతా మీరే ! మీరే అంతా ! మీరెంత మందికి ఆధ్యాత్మిక సేవ చేస్తే, అంటే అత్యున్నతమైన ఆత్మ విజ్ఞానాన్ని పంచి ఇస్తే అంతకు లక్షల రెట్లు మీ అంతరంలో ఉన్న ఆత్మ శక్తి + ఆత్మ నిధి మీకు అందుబాటులోకి వస్తుంది. నిస్వార్థంగా పంచాలి !**

✪ సహాయం చెయ్యాలి అని నిజంగా మీరు నిర్ణయించుకుంటే ఎన్నో రకాలుగా చేయవచ్చు. మనసు ఉంటే మార్గం ఎప్పుడూ ఉంటుంది. మనసే మార్గం !

✪ గుర్తుంచుకోండి, నిస్వార్థ సేవ ద్వారానే అన్ని సమస్యలలో నుండి సులభంగా, శీఘ్రంగా బయటపడవచ్చు శాశ్వతంగా !

✪✪✪ మీరు ఇతరులకు సహాయం చేయకుండా ఉంటున్నందుకే మీ శరీరంలో + మీ జీవితంలో సమస్యలు ఉన్నాయన్న సత్యాన్ని మీరు తెలుసుకుని తీరాలి.

2. బుద్ధి సేవ : పాంప్లెట్స్ తయారు చేయడం, సత్య ప్రచారం చేయడం, పరిచయ క్లాసులు చెప్పడం, కొత్తవారికి శిక్షణ ఇస్తూ ఉండడం, పుస్తకాల తయారీలో లేదా మెటీరియల్ ప్రిపరేషన్‌లో పాల్గొనడం, computer work చేయడం, టైపు చేయడం, వ్రాయడం, అనువాదాలు చేయడం, ఇలా ఇంకా ఎన్నో రకాలుగా చేయవచ్చు "బుద్ధి సేవ" !

3. ఆర్థిక సేవ : సత్య ప్రచారానికి, తమకున్న స్థిర, చరాస్థులలో నుండి ఎంత ఇవ్వగలిగితే అంత ఇస్తూ ఉండడం. మీరు చేసే ఆర్థిక సేవ ద్వారా "సత్యాన్ని" ఎంతో మందికి సులువుగా, వేగంగా చేర వేసే అవకాశం ఉంది. "ఎంత ఇస్తే అంతకు వెయ్యి రెట్లు పొందుతారు"- ఇది విశ్వ సూత్రం ! ఇవ్వండి. మీరు ఎంత ఇస్తే అంతకు ఎన్నో రెట్లు పొందుతారు. ఇచ్చినప్పుడే పొందే అర్హత వస్తుంది. ఇచ్చే గుణమే తీసుకునే గుణాన్ని పుట్టిస్తుంది, పెంపొందిస్తుంది. ఇచ్చినప్పుడు మాత్రమే తీసుకోగలుగుతారు. నేను ఎప్పుడూ ఇస్తూ ఉంటాను, ఇవ్వమని చెప్తూ ఉంటాను. ఎందుకంటే ఇవ్వడమే పొందడం అని నాకు తెలుసు కాబట్టి. సాక్షాత్తు మూల చైతన్యమే మనల్ని ఉచితంగా సృష్టించింది. తనకు ఉన్న సర్వ శక్తులన్నీ మనలోనూ పొందు పరిచింది ఉచితంగా. ఈ విధంగా ఉచితంగా సృష్టించబడిన మనం, ఉచితంగా అనంత మూల చైతన్య శక్తులను పొందిన మనం, వాటిని వినియోగించి ఉచితంగా పంచి ఇవ్వడమే సముచితం మరి ధర్మం కూడా !

పంచబడింది పెంచబడుతుంది అనేదే సృష్టి యొక్క ప్రధాన అభివృద్ధి ధర్మం(సూత్రం / నియమం). సృష్టిలో అన్ని కార్యక్రమాలు ఉచితంగానే జరుగుతూ ఉంటాయి. మానవుడు ఒక్కడే డబ్బు వెనకాల పడ్డాడు. నిజానికి డబ్బు అనే దానికి ఒక ఉనికియే లేదు. డబ్బు

అనేది మన ఆలోచనల యొక్క కార్యరూపం లేక భౌతిక రూపం. అంతే ! మన కోరికలు(లక్ష్యాలు) భౌతిక రూపం ధరించబోయే ముందు తీసుకునే ఒకానొక రూపమే డబ్బు అని అంటే !

సృష్టి ఒక ఓపెన్ సూపర్ మార్కెట్ లాంటిది. సృష్టిలో మీరు ఊహించగలిగినవన్నీ సృష్టించబడి సిద్ధంగా ఉంటాయి, కాబట్టే దీన్ని సృష్టి అని అంటారు. మీరు ఆలోచించ గలిగే ప్రతీది, ఊహించగలిగే ప్రతీది అది ఏదైనా సరే సృష్టించబడి రెడీగా ఉంటుంది. అది ఏదైనా సరే ! సృష్టించబడి సిద్ధంగా ఉన్న వాటి గురించి మాత్రమే ఆలోచనలు, ఊహలు వస్తాయి. లేకపోతే రావు. మీకు ఒక ఆలోచన లేక ఒక ఊహ వచ్చిందీ అని అంటే అది అప్పటికే సృష్టించబడి సిద్ధంగా ఉంది అని అర్థం. మీకు వచ్చిన ఆలోచనను(ఊహను) 100%గా అనుమతించినంత మాత్రాన అది భౌతిక రూపం తీసుకుంటుంది. మీరు ఏ భౌతిక పరిస్థితులను అనుభవించాలనుకుంటున్నారు అనేది ముందు డిసైడ్ చేసుకోవాలి. ఆ తర్వాత మీ ఆలోచనకు(ఊహకు) ఒక స్పష్టమైన రూపాన్ని, క్రమాన్ని ఇవ్వాలి, ఆ తర్వాత దాన్ని 100%గా అనుమతించాలి. అంతే ! మీ యొక్క ఆలోచన(ఊహ) వెంటనే భౌతికంగా ప్రకటం అయి తీరుతుంది. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న పరిస్థితులు తెలసీ, తెలియక అలా సృష్టించుకున్నవే !

ఆలోచనా సర్వస్వం నుండి అనంతమైన రకాలుగా ఉన్న ఆలోచనలు రిలీజ్ అవుతూ ఉంటాయి. ఎవరి స్థాయిని బట్టి వారు ఆ రకమైన ఆలోచనలను స్వీకరిస్తూ ఉంటారు.

మిమ్మల్ని బట్టే మీ ఆలోచనలు ! మీ ఆలోచనలను బట్టే మీరు !

మీ నమ్మకాలను బట్టి, మీ అభిప్రాయాలను బట్టి, మీ స్వభావాలను బట్టి మీరు, మీకు తగిన ఆలోచనలను స్వీకరిస్తూ ఉంటారు. మీరు స్వీకరించి అనుమతించిన ఆలోచనా రూపాలుగానే మీరు పరిణమిస్తారు.

అనంత మహా మూల చైతన్య శక్తి, సృష్టిలో సృష్టిగా మరి ఇంకా అనంత రూపాలుగా ప్రకటం అవుతూ ఉంటుంది. ఆలోచనలు కూడా మూల చైతన్య శక్తులే ! సృష్టిలోని ప్రతీది కూడా మూల చైతన్య శక్తి స్వరూపమే ! భూమి, భూమి మీద ఉన్న మానవులు కూడా మహా మూల చైతన్య స్వరూపాలే !

మీలో ఉన్న అనంత మహా మూల చైతన్య శక్తిని, ఈ మూడు పరిధుల(Three Dimensional) భూగ్రహం పైన మీకు ఇష్టం వచ్చినట్టుగా వ్యక్తీకరించి దానిని అనుభవించి మీ అవగాహనా పరిధిని విస్తృతం చేసుకోవడానికే మీరు భూమి పైన జన్మించారు. ఇలాగే నేను కూడా జన్మించాను. నా ఈ జన్మ యొక్క అత్యంత ప్రధానమైన కారణాల్లో అత్యంత ముఖ్యమైనది "ఉచితంగా ఇవ్వడం మరియు దాని యొక్క పర్యవసానాలను అనుభవించి, అవగాహన చేసుకోవడం, దాని గురించి అందరికి తెలియజేయడం" ! నా లైఫ్ డిజైన్‌లో ఈ అంశం ఉంది కాబట్టి నేను దీన్ని ఆచరించాను. ఎవరి లైఫ్ డిజైన్‌లో అయితే ఈ అంశం ఉండదో, వారికి నేను చేస్తున్న పని అర్థం

కాదు. ఉన్నతోన్నతమైన అవగాహన ఉన్న వారికి మాత్రమే అర్థం అవుతుంది. ఎవరి లైఫ్ డిజైన్ ప్రకారం వారు చేస్తుంటారు. నా లైఫ్ డిజైన్ ప్రకారం నేను చేస్తున్నాను. ఈ విషయం గురించి నన్ను పదే, పదే అడుగుతూ ఉన్నారు కాబట్టి, అందునా ఇది ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన విషయం కాబట్టి తెలియజేస్తున్నాను.

✪ "మిమ్మల్ని బట్టి మీతో సృష్టి" అనేది అత్యంత ప్రధానమైన సృష్టి సిద్ధాంతం ! ఈ సిద్ధాంతం ప్రకారం మీరు ఎలా ఆలోచిస్తున్నారో, ఎలా ప్రవర్తిస్తున్నారో సరిగ్గా, as it isగా, same to same సృష్టి కూడా మీ పట్ల అలాగే ప్రవర్తిస్తుంది. సృష్టి అంతా ఒకటే ! కనపడేది అంతా సృష్టియే, సృష్టిలోని ప్రతి భాగము సృష్టియే ! అన్నింటితో పాటు మానవులు కూడా సృష్టిలోని భాగాలే, అంటే సృష్టియే ! మీరు వ్యక్తులతో ఎలా ప్రవర్తిస్తున్నారో సృష్టి కూడా అలాగే మీ పట్ల ప్రవర్తిస్తూ ఉంటుంది. ఎందుకంటే వ్యక్తులు, జంతువులు, వస్తువులు, చెట్లు, నీళ్ళు, రాళ్ళు, ఇసుక, మట్టి మొదలైనవి ఇంకా శూన్యం ఇవన్నీ కూడా సృష్టిలో భాగాలే ! అంతా, అందరూ, అన్నీ సృష్టిలో భాగాలే !

ఇప్పుడు అసలు విషయంలోకి వద్దాం :

భూమి పైన మానవుడు జీవించడానికి ఏదో ఒక పని తప్పని సరిగా చేయాలి అని సాధారణంగా అందరూ అనుకుంటూ ఉంటారు. పని అంటే ఏదైనా ఒక వృత్తియో, ఉద్యోగమో, వ్యాపారమో తప్పని సరిగా చేయాలి అని అనుకుంటూ ఉంటారు. ఇది నిజమే ! కానీ ఇది కేవలం భౌతిక దశలో ఉన్న మానవులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ భూమి పైకి మీరు ఏదో ఒక పని చేయడానికి రాలేదు, జీవించడానికి వచ్చారు. జీవించడమే మీరు చేసే అత్యంత ప్రధానమైన పని ! ఈ జీవించడం అనేది మీరు ఏ రకంగా నిర్ణయించుకుంటారో ఆ రకమైన పనులు మీరు చేయాల్సి వస్తుంది.

భూమి పైకి వచ్చిన ప్రతీ ఒక్కరూ ఏదో ఒకటి నేర్చుకోవడానికే వస్తారు. ఆ నేర్చుకోవడం ఎలా ? అనేది డిజైన్ చేసుకునే వస్తారు. ఆ డిజైన్ అనేది వారి యొక్క ఆత్మ పరిణితి మీద ఆధారపడి ఉంటుంది. వారి లైఫ్ డిజైన్‌ను ఇక్కడికి, భూమి పైకి వచ్చిన తర్వాత అప్ గ్రేడ్ చేసుకోవచ్చు కానీ డీగ్రేడ్ చేసుకోలేరు. ఎందుకంటే పురోగమించాలి కానీ తిరోగమించకూడదు కదా. ఆత్మ పరిణామ క్రమంలో ప్రగతి ఉంటుంది కానీ వెనుకకు మరలడం ఉండదు, కాకపోతే విషయాలు నేర్చుకోవడానికి డైవర్షన్స్ ఉంటాయి లేదా ఆగిపోవడం అనేది ఉంటుంది. ప్రస్తుతం భూమి మీద ఉన్న మానవుల పరిస్థితి అదే, పరిణామ క్రమంలో స్టక్ అయి ఉన్నారు. పూర్తి భౌతికతలో మునిగి పోయి ఉన్నారు.

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

ఏదైనా ఒక వృత్తియో, ఉద్యోగమో, వ్యాపారమో చేస్తేనే, దాన్ని మాత్రమే పని అని అంటారా ?! "సత్య ప్రచారం చేయడం పని కాదా'' ?! అసలు ''సత్య ప్రచారం'' అని అంటే ఏమనుకుంటున్నారు మీరు ?!

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

భౌతిక దశలలో ఉన్నవారు తమ "స్వయం" పైన కాకుండా బాహ్యంలోని వ్యక్తుల పైనా, విషయాల పైనా ఆధారపడి జీవిస్తూ ఉంటారు. మీరు ఉద్యోగం చేస్తున్న కంపెని మూత పడితే మీరు బ్రతకలేరు. మీరు చేస్తున్న వ్యాపారం సరిగా సాగకపోతే మీరు బ్రతకలేరు. మీ వృత్తికి తగిన ఆదరణ లభించకపోతే మీరు బ్రతకలేరు. మీ బ్రతుకు అంతా బాహ్యంలోని వాటిపైన ఆధారపడి ఉంటుంది. మీవి కాని వాటి పైన ఆధారపడి మీరు బ్రతుకుతూ ఉంటారు. ఏది, ఎక్కడ తేడా వచ్చినా మీ బ్రతుకు తలకిందులై పోతుంది.

ఒక యోగి - సత్య మార్గంలో ఉన్న వ్యక్తి కేవలం తన అంతరంలో ఉన్న తన "స్వయం" పైన ఆధారపడి జీవిస్తూ ఉంటాడు. అతడు తనకు కావాల్సిన వాటిని తాను స్వయంగా సృష్టించుకుని లేదా ఆకర్షించుకుని జీవిస్తూ ఉంటాడు. ఘోరారణ్యంలో, జనారణ్యంలో, హిమాలయాల్లో ఎక్కడైనా ఆనందంగా జీవిస్తాడు.

ఏ వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు మొదలైన ఏ భౌతిక కార్యకలాపాలు లేకుండా ఆనందంగా జీవించడం అనేది మామూలు విషయం కాదు. అజ్ఞానపు భౌతిక దృష్టితో చూస్తే భౌతికంగా ఏ వృత్తి, ఉద్యోగం, వ్యాపారం చేయని వారు కూర్చుని తింటున్నారని అనిపిస్తుంది. కాని వాస్తవం ఏమిటంటే భౌతిక దశలలో ఉన్న వారే భూమికి భారం.

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

తమ నిజ తత్వం గురించి తెలుసుకోకుండా బ్రతికే మానవులు,భూమికే కాదు సృష్టికే భారం. సత్యాన్ని పొందిన సత్య స్వరూపుల వల్లనే "భౌతిక జీవుల" మనుగడ కొనసాగుతుందీ అని అంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి విషయాలు లోతైన అవగాహన లేని బుర్రలకు కొరుకుడు పడని విషయాలు. ఎంతో అత్యున్నతమైన స్థాయికి సంబంధించిన విషయాలు.

సత్య మార్గదర్శులు లేకపోతే ఈ భూమి పైన ఒక్కరు కూడా సాఫల్యాన్ని పొందలేరు. సత్య మార్గంలో ఉన్న వారు భౌతిక దశలలో ఉన్నవారికి సేవ చేసే అవకాశాన్ని ఇవ్వడం ద్వారా వారికి "ముక్తి మార్గాన్ని" అందిస్తూ ఉంటారు. వారు ముక్తి పొందే ద్వారాలు తెరుచుకునేలా చేస్తుంటారు.

మీరు చేసే భౌతిక వృత్తులకు మనుషులు డబ్బులిస్తూ ఉంటారు. మీరు చేసే భౌతిక ఉద్యోగానికి నెలకు మీకు జీతం వస్తూ ఉంటుంది. మీరు వ్యాపారం చేస్తూ ఉంటే మీకు ధనం వస్తూ ఉంటుంది. మీరు చేసే భౌతిక పరమైన వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల ద్వారా కేవలం "డబ్బు" మాత్రమే వస్తుంది. ఇంకా ఏమీ రాదు. దయచేసి గ్రహించండి. "డబ్బు" తప్ప మరేమీ రాదు. మనిషికి డబ్బు ఒక్కటే అవసరమా ?! వేరే ఇంకా ఏమీ అవసరం లేదా ?! అసలు మనిషి భూమి మీద జన్మించడానికి ప్రధాన కారణం డబ్బేనా ?! బ్రతకడానికి డబ్బు అవసరమే కానీ డబ్బుతోనే సర్వస్వం సాధ్యం కాదు కదా ! అసలు మనిషిగా మీరు ఈ భూమి పైన ఎందుకు పుట్టారు ? మీ నిజతత్వమైన దైవత్వాన్ని తెలుసుకోడానికే ఈ భూమి పైకి వచ్చారు అసలు విషయాన్ని వదిలేసి, వచ్చింది ఎందుకో ఆ పని చేయకుండా మిగతా పనికి మాలిన పనులు చేసుకుంటూ బతుకుతూ.... ఎవరైతే భూమి పైకి ఎందుకు వచ్చారో ఆ పని చేసుకుంటూ ఉంటే వారిని తప్పు పట్టడం అనేది అంతు లేని అజ్ఞానం, మూఢత్వం, మూర్ఖత్వం !

భౌతిక చదువు ఆ పైన ఉద్యోమో లేక వ్యాపారమో ఆ వెంటనే పెళ్ళి, తక్షణమే రాత్రింబవళ్ళు చెమటోడ్చి పిల్లలను కనడం ! ఆ పుట్టిన వాళ్ళను చదివించడం, వాళ్ళకు ఉద్యోగాలో, వ్యాపారాలో ఏర్పాటు చేయడం, పెళ్ళిళ్ళు చేయడం, వాళ్ళ చేత కూడా దగ్గరుండి గైడెన్స్ ఇచ్చి మరీ ఆలస్యం కాకుండా పిల్లలను కనిపించడం, ఈ లోపు వృద్ధులవడం, చివరికి చావడం. మళ్ళీ పుట్టడం, మళ్ళీ సేమ్ టు సేమ్ ! "పునరపి జననం పునరపి మరణం" ! ఈ విధంగా లక్షల కోట్ల జన్మలుగా జరుగుతూ ఉన్నా ఏ మార్పూ లేదు ! అదే భౌతిక వెంపర్లాట ! అదే భౌతిక తపన ! పొరపాటున కూడా సత్యం గురించి ఆలోచించలేనంత బిజీ లైఫ్ ! పుట్టక ముందు ఎక్కడ ఉన్నాం ? చచ్చాక ఎక్కడికి వెళ్తాం ? ఏమిటీ చావు పుట్టుకలు ? అనే ఆలోచనలు చేయని బతుకులు ఎలాంటి, ఎంతటి చీకటి బతుకులు ??!!

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

భూమి పైన జన్మ తీసుకున్నారు కదా ! మరి, మీరు మీ నిజతత్వాన్ని గ్రహించాలంటే ఏం చేయాలి ? ఒక భౌతిక పరమైన వృత్తియో, ఉద్యోగమో, వ్యాపారమో చేస్తూ, ఎప్పుడో తీరిక దొరికినప్పుడు కాసేపు ధ్యానం చేసి, ఒకటో రెండో పుస్తకాలు చదివేసి, అడపాదడపా టైమ్‌పాస్ కోసం ఆత్మ విజ్ఞాన కార్యక్రమాల్లో పాల్గొంటుంటే సరి పోతుంది అని అనుకుంటున్నారా ?!

తన నిజతత్వం పట్ల సరైన అవగాహన లేని వ్యక్తులే, అనుభవ పూర్వక ఆత్మ విజ్ఞానం బొత్తిగా లేని వ్యక్తులే "అభద్రతా భావంతో" ఉంటారు. వీరికి ఆత్మ ప్రపంచపు సత్యాలు తెలియవు కాబట్టి ఏదో ఒకటి చేస్తేనే డబ్బు వస్తుంది, మరి అప్పుడే బ్రతక గలుగుతాం అని అనుకుంటారు. "సత్య ప్రచారం" చేస్తే ఏమీ రాదు, "సత్య ప్రచారం" ఏమీ శ్రేయస్కరాలను అందించదు అనే తప్పుడు నమ్మకాలతో ఉంటారు కాబట్టి, 100% సత్య ప్రచారానికి అంకితమైతే బ్రతకలేం అని అనుకుంటూ ఉంటారు.

మీరు ఒక ఉద్యోగం చేస్తే మీకు ఆ రాష్ట్ర లేక దేశ ప్రభుత్వమో జీతం ఇస్తుంది లేదా కంపనీయో జీతం ఇస్తుంది. ప్రస్తుతం ప్రపంచ దేశాల రాజకీయాలు చూస్తే ఏ ప్రభుత్వం ఎంత కాలం ఉంటుందో తెలియని పరిస్థితి. ఏ కంపెని ఎప్పుడు మూత పడుతుందో చెప్పలేని పరిస్థితి. సరే ఏది ఏమైనా ప్రభుత్వమో లేక కంపెనీయో కేవలం జీతం మరియు ఇంకా కొన్ని సౌకర్యాలను మాత్రమే ఇస్తుంది. అంతే !

మీరు 100% సత్య మార్గానికి అంకితమైతే సాక్షాత్తు సృష్టియే మీ పాలనా పోషణ మీ యొక్క సర్వ బాధ్యతలను తీసుకుంటుంది. "100% అంకితం కావడం అనేది అందరి వల్లా కాదు" ! 100% సత్య మార్గానికి అంకితం అయిన వారికి సాక్షాత్తు కాస్మిక్ గవర్నమెంట్‌లో (Cosmic Government) శాశ్వత ఉద్యోగం దొరుకుతుంది. 100% సత్య మార్గానికి అంకితం అయిన వ్యక్తి అంటే, అతను లేక ఆమె ఒక కాస్మిక్ గవర్నమెంట్ ఉద్యోగి - Cosmic Government Employee అని అర్థం !

సత్య ప్రచారం చేసే ఒక సత్య సంస్థ అంటే అది సాక్షాత్తు కాస్మిక్ గవర్నమెంట్ - Cosmic Government యొక్క ఆథరైజ్‌డ్ సంస్థ అని అర్థం !

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

100% సత్య మార్గానికి అంకితం కావడమంటే - ఆధ్యాత్మిక ప్రచారం చేయడం కానే కాదు గాక కాదు ! అంటే ఎవరు దొరికితే వాడిని పట్టుకుని వాయకొట్టడం కానే కాదు. ముందు మీరు పూర్తి స్థాయి అకర్మ శాకాహారిగా మారి - అకర్మ వీగన్‌గా మారి, అత్యున్నతమైన మతరహిత ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అభ్యసిస్తూ, ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో ఆచరిస్తూ, క్రమం తప్పకుండా అత్యున్నత ధ్యాన సాధన చేస్తూ, ఒక జాగృతి పొందిన గురువుకు అసిస్టెంట్లుగా పని చేస్తూ ఉండాలి. ఇదీ 100% సత్య మార్గానికి అంకితం కావడమంటే !

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

సత్య మార్గానికి అంకితం కావడమంటే ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టర్ దగ్గర పని చేయడం, ఆయన ఏ పని చెప్తే ఆ పని చేయడం అంతే ! మీరు బోధనలు చేయడం, క్లాసులు చెప్పడం కాదు. మీరు ఎన్‌లైటెన్‌మెంట్ పొంది ఉంటేనే బోధించాలి. వాస్తవానికి ఎన్‌లైటెన్‌మెంట్ పొందిన తర్వాత కూడా ఎన్నో జన్మలు ఒక సద్గురువు దగ్గర పని చేయాలి. ఎందుకంటే - నేర్చుకోవడం వేరే - నేర్పించడం వేరే ! ఇతరులకు నేర్పించడాన్ని ముందు మీరు నేర్చుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మీకు "సద్గురు స్థితి" ప్రాప్తమవుతుంది. అప్పుడు మాత్రమే మీరు బోధనలకు పూనుకోవాలి, అంతకు ముందు పొరపాటున కూడా క్లాస్ చెప్పకూడదు. సద్గురు స్థితి రాకుండా క్లాసులు చెప్పడం అనేది సత్య విరుద్ధం ! మహా పాపం ! సద్గురు స్థితి రానిదే క్లాసులు చెప్పడం, బోధన మొదలు పెడితే పుణ్యం కాదు నరకం గ్యారంటి, పక్కా ! జ్ఞానోదయం పొందనిదే, సద్గురు స్థితి రానిదే బోధన/క్లాస్ చెప్పడమనేది నరకంలో బెర్త్ కన్‌ఫర్మ్ చేసుకోవడం లాంటిది.

ఆత్మ అని చెప్తూ ఉన్నప్పుడు, ఆత్మను అనుభవించారా లేదా అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవాలి కదా.. కళ్ళు మూసుకుని కూర్చుంటే ఎలాంటి చవటకైనా అనుభవాలు వస్తాయి. కేవలం ఏవో కనపడినంత మాత్రాన ఆత్మ లెవల్స్ ఏవీ పెరిగి పోవు. రాష్ట్రపతి భవన్ ముందు నిలబడితే ప్రెసిడెంట్ బయటకు రావడం, లోపలకు వెళ్ళడం ఎవడైనా చూస్తాడు. అంత మాత్రాన చూసిన వాడు ప్రెసిడింట్ ఫ్రెండ్ అయిపోడు కదా ! ముంబయిలో పనిగట్టుకుని తిరిగితే హిందీ సినిమా స్టార్స్ అందరూ కనపడతారు అంత మాత్రాన చూసిన వాడు కూడా స్టార్ అయిపోడు కదా ! ముంబయిలో ఫుట్‌పాత్ మీద అడుక్కునే వాళ్ళకు కూడా స్టార్స్ కనపడతారు అందులో విశేషం ఏముంది ?!

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

మీరు 100%గా సత్య ప్రచారానికి అంకితమైతే మీకు డబ్బు అందడంతో పాటు, కర్మ ప్రక్షాళన కూడా జరుగుతుంది. సత్యమార్గానికి 100% అంకితమైతే అన్నీ వస్తాయి అని ఆలోచించి అంకితమైనట్టు నటించిన వాడికి ఏమీ రావు. తన పోషణ పట్ల, తన జీవితం పట్ల, తన జరుగుబాటు పట్ల భయం లేని వారికే సహాయ సహకార సమన్వయాలు, అండదండలు అందుతాయి. అంతే కానీ బతుకు దెరువుకోసం సత్యమార్గాన్ని ఆశ్రయించి పబ్బం గడుపుకోవాలని చూస్తే అస్సలు కుదరదు. ఇది ఆత్మ ప్రపంచం ! ఇక్కడ నటనలు సాగవు ! ఇది సత్య మార్గం ! ఇక్కడ సత్యం ఉంటేనే మనుగడలో ఉండగలుగుతారు. లేకపోతే ఘోర బాధలను అనుభవిస్తారు. సత్య మార్గానికి అంకితం కాగానే డబ్బులు రాలేదని కంగారు పడవద్దు. మీ అర్హతను బట్టి వస్తాయి. వచ్చే వరకు వేచి ఉండాలి లేదా సత్యాన్ని వదిలేసి ఎవరి పని వారు చూసుకోవాలి. 100% సత్య మార్గానికి అంకితం అవడం అనేది అందరి వల్లా కాదు. మీ యొక్క మరియు మీపై ఆధారపడి ఉన్న వ్యక్తుల యొక్క బాధ్యతను కూడా స్వయంగా సృష్టియే చూసుకుంటుంది. మిమ్మల్ని మరియు మీ పై ఆధారపడి ఉన్న వాళ్ళందరిని సాక్షాత్ సృష్టి యొక్క సురక్షా చక్రం ఎల్లవేళలా కాపాడుతూ ఉంటుంది. ఒకవేళ సృష్టి నుండి సహాయం అందలేదంటే అది ప్యూర్‌గా మీ లోపమే అని తెలుసుకోండి. మిమ్మల్ని సరైన దారిలో నడిపించి మిమ్మల్ని మీ దైవత్వంలో మేలుకొలుపుతుంది. మీరు దివ్యులై, అనంత దివ్య శక్తి స్వరూపులై సాక్షాత్ మహా మూల చైతన్య స్వరూపులుగానే విరాజిల్లుతారు. మరి భౌతిక పరమైన పనులు మాత్రమే చేస్తున్నప్పుడు ఇవన్నీ జరగవు.

మీరు భౌతిక పరమైన పనులు మాత్రమే చేస్తున్నప్పుడు, కర్మ చక్రంలో మరియు జన్మ చక్రంలో ఇరుక్కుని నరక యాతన పడుతుంటారు. మీరు సంపాదించే డబ్బు, మీ హోదా, మీ పలుకుబడి, మీ ఆస్తులు అంతస్తులు ఇవి ఏవీ కూడా మిమ్మల్ని "కర్మ చక్రం నుండి మరియు జన్మ చక్రం" నుండి బయట పడేయలేవు. ఇది అసంభవం.

సత్య మార్గం మాత్రమే మిమ్మల్ని ఉద్ధరిస్తుంది. రక్షిస్తుంది. మిమ్మల్ని "కర్మ చక్రం మరియు జన్మ చక్రంలో" నుండి సులభంగా, శీఘ్రంగా బయట పడవేసి, మీకు విముక్తిని ప్రసాదిస్తుంది. శ్రీకృష్ణ పరమాత్మ కేవలం ఆత్మ విజ్ఞానం బోధించాడు కానీ, బాగా ధనం సంపాదించండి, ఆస్తులు కూడబెట్టుకోండి, బాగా పిల్లలను కనండి అని చెప్పలేదు. యోగులు కండి అని ఆదేశించాడు. ఆత్మ విజ్ఞానం అభ్యసించి యోగం చేసి "అహం బ్రహ్మాస్మి" స్థితిని అనుభవ పూర్వకంగా తెలుసుకోమని ఆదేశించాడు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు చేస్తూ అదే పనిగా పిల్లలను కంటూ ఉండమని చెప్పలేదు. సత్య మార్గానికి 100% అంకితమై సత్యాన్ని తెలుసుకోమని ఆదేశించాడు.

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

ఆత్మ సాక్షాత్కారం పొందిన ఒక సత్యగురువు సత్య ప్రచారం చేసి ప్రజలను సత్యం వైపు నడిపిస్తాడు. సృష్టిలో అన్నింటి కన్నా మహా గొప్ప దివ్య బాధ్యతయే "సత్య ప్రచారం" ! "సత్య ప్రచారం" అనేది అన్నింటి కన్నా గొప్ప పని. "సత్య ప్రచారం" అనేది సాక్షాత్ మహా మూల చైతన్యం యొక్క బాధ్యత. సత్య ప్రచారం అంటే కాస్మిక్ గవర్నమెంట్ యొక్క కార్యక్రమం అని తెలుసుకోండి.

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

ఒక మనిషి తన నిజతత్వాన్ని గ్రహించడానికి అంకితమై, మిగతా అన్ని భౌతిక పనులను అంటే వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలను, బంధాలను వదిలేసి సాధన చేయడం అని అంటే ఏమని అనుకుంటున్నారు మీరు ?! అన్ని రకాల భౌతిక జన్మలను పూర్తి చేసుకున్న వ్యక్తులే ఇలా చేయగలుగుతారు. తమ యొక్క బలాబలాలు పూర్తిగా తెలుసుకోకుండా ఎవరు పడితే వారు చేయకూడదు. ఇది భూమి పైన అన్నింటికన్నా పెద్ద పని ! గొప్ప పని ! భూమి పైనే కాదు సృష్టిలోనే సర్వోన్నతమైన పని ! ఎవరి నిజతత్వాన్ని వాళ్ళు గ్రహించి తీరాలి అనేదే సృష్టి యొక్క ప్రాథమిక నియమం కదా ! మీరేం చేస్తూ ఉన్నా సృష్టి మీకు సహకరిస్తూనే ఉంటుంది. అయితే మీరు అన్ని భౌతిక వ్యవహారాలకు స్వస్తి చెప్పి, మీ దైవత్వాన్ని గ్రహించేందుకు పూనుకుంటే, 100% అంకితమైతే ఇంకా ఎంతో సహకరిస్తుంది. కేవలం సాధనకు మాత్రమే పరిమితం కాకుండా 100% సత్య గురువుకు అసిస్టెంట్‌గా అంకితమైతే సృష్టి సర్వస్వం మీకు పూర్తిగా, అనంతంగా సహకరిస్తుంది. మీకు దాసోహం అంటుంది. ఎందుకంటే సత్య ప్రచారం అనేది సృష్టి యొక్క కార్యక్రమం కదా ! ఒకవేళ సృష్టి నుండి సహాయాలు అందలేదంటే అది మీ లోపమే అని గ్రహించండి. మీలో లోపాలున్నప్పుడే మీకు సహాయాలు లభించవు ! 100% సత్యమార్గానికి అంకితమైతే, సర్వ సకల సమస్త సౌకర్యాలు అందుతాయి కానీ మీరు నిజంగా 100% కావాలి కదా ! ప్రారంభంలో పెద్ద పెద్ద పరీక్షలు ఎదురవుతాయి, తట్టుకుని నిలబడాలి.

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

మహా మూల చైతన్యం తనలో ఉన్న శక్తి సామర్థ్యాలను అన్నింటిని మీకు అనుసంధానం చేసి, మీలో పొందుపర్చి మిమ్మల్ని సృష్టించింది. నా యొక్క సర్వ శక్తులను నీకు ధారపోసి, నీకు ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని మరియు సంపూర్ణమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇస్తున్నాను. ఇక నీవు "స్వతంత్రంగా నీ అనంత మహా మూల చైతన్య శక్తులను నీ ఇష్టం వచ్చినట్టుగా వినియోగించుకుని జీవించు అని ప్రేమగా ఆశీర్వదించింది". ఆత్మ విజ్ఞానం లేని భౌతిక జీవులు తమ జీవిత అవసరాల కోసం తెలిసి చాలా సార్లు, అపస్మారకంలో తెలియకుండా ఎన్నో సార్లు కోరికలను కోరుతూనే ఉంటారు. మరి ఈ కోరికలన్నీ మూల చైతన్యానికే చేరుతూ ఉంటాయి. నీలోనే అన్ని శక్తులను పొందుపరుచుకుని మళ్ళీ నా మీద ఆధారపడతావెందుకు అని మూల చైతన్యం, స్వయంగా తానే పూనుకుని సత్య ప్రచారం చేయిస్తుంది. ప్రజలు భౌతికంలో మునిగి పోయి ఉన్నారు, వారిని జాగృతం చేసి పరమ సత్యం వైపు నడిపించమని మహా మూల చైతన్యం Ultra Consciousness నుండి సందేశాలు అందుకున్న సత్య గురువులలో నేనూ ఒకడిని - Ultra Consciousness నుండి నాకు సందేశాలు/ఆదేశాలు/సూచనలు అందాయి లోక కల్యాణ కార్య క్రమాలు చేయమని ! సత్య ప్రచారం చేయమని !

MAB మెంబర్స్ అంటే నా సత్య శిష్యులు అని అర్థం.

M A B మెంబర్స్ అందరూ కాస్మిక్ గవర్నమెంట్ ఎంప్లాయిస్.

All M A B Members are Cosmic Government Employees !

ప్రతీ వ్యక్తి అనంత మహా మూల చైతన్య శక్తి స్వరూపుడే ! అయితే తన నిజ తత్వం గురించి తెలుసుకోకుండా భౌతిక విషయాల పైన ఆధారపడి, పరిమితుల్లో అష్ట కష్టాలు పడుతూ, బ్రతుకుతూ స్వల్పమైన విషయాలను కోరుతూ ఉంటే మీ మూల చైతన్యం ఏమీ అనదు కానీ, మీరు అత్యున్నతమైన, మహా గొప్పవైన లక్ష్యాలను పెట్టుకుంటే వాటిని నెరవేర్చి మీకు అందించాలనే తపనతో ఉంటుంది. మీరు ఏ లక్ష్యాలు పెట్టుకున్నా మీరు చిన్నవి పెట్టుకున్నా లేక పెద్దవి పెట్టుకున్నా... మీ లక్ష్యాలను, మీ మహా మూల చైతన్యం నెరవేరుస్తుంది. మహా మూల చైతన్యానికి చిన్నా పెద్ద తేడా లేదు. ఒక చిన్న గులక రాయి కావాలన్నా తెచ్చిస్తుంది. హిమాలయాలు కావాలన్నా తెచ్చిస్తుంది.

✪✪✪ ఎందుకంటే మీలో ఉన్న అనంత శక్తి తనను తాను విస్తరించుకోవాలని చూస్తుంది. శక్తి యొక్క వినియోగమే శక్తికి పోషణ ! వినియోగం లేని శక్తి విస్తృతం కాలేదు, కాబట్టే మహా మూల చైతన్యం తన శక్తులన్ని మనకు ధారపోసింది. ప్రతి వ్యక్తి తను చేసే కార్యక్రమాలతో ఎంతో కొంత శక్తిని వినియోగిస్తూ ఉంటాడు. ఈ విధంగా వినియోగించబడిన శక్తి ప్రవృద్ధమవుతుంది. ఇది మహా మూల చైతన్య విస్తరణకు కారణం అవుతుంది.

ఆత్మ విజ్ఞానం లేని వ్యక్తికి తన నిజ శక్తి పట్ల అవగాహన ఉండదు కాబట్టి తనను తాను అల్పుడుగా భావిస్తూ, చాలా అల్పమైన విషయాలకు లోబడి, పరిమితుల్లో బ్రతుకుతూ ఉంటాడు. తనకు, సృష్టికి ఉన్న అవినాభావ సంబంధం గురించి తెలియక పోవడం వలన అజ్ఞానంతో ఎన్నో దుశ్చర్యలను చేస్తూ తనకూ + సృష్టికి చాలా ఇబ్బందికరంగా మారుతాడు.

తన నిజతత్వం గురించి తెలియని భౌతిక జీవి సృష్టికి భారం. ఆత్మ విజ్ఞానం లేని వ్యక్తుల వలన సృష్టిలో ఎన్నో ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ఈ విషయాలను రాంపా మాస్టర్ HERMIT అనే ఇంగ్లీష్ పుస్తకంలో వివరిస్తాడు. ఈ HERMIT & YOU FOREVER అనే ఇంగ్లీష్ పుస్తకాల కొరకు ఇంకా సుమారు 20 పుస్తకాల కొరకు www.lobsangrampa.org అనే వెబ్ సైట్‌ను సందర్శించండి.

మీ నిజతత్వం గురించి తెలుసుకుని మీ స్వయం శక్తిపై ఆధారపడి మీరు జీవించాలని మూల చైతన్యం కోరుకుంటుంది. మీలో ఉన్న అనంత దివ్య శక్తులను మీరు విస్తారంగా, విశేషంగా, విస్తృతంగా మీకు నచ్చిన విధంగా, మీ అవసరాలకు అనుగుణంగా వినియోగించుకుని "మీరు దివ్యులుగా విరాజిల్లాలి" అని మూల చైతన్యం కోరుకుంటుంది. ఎందుకంటే మీరు, మీ లోపల ఉన్న "అనంత మూల చైతన్య శక్తులను" వినియోగించుకుంటే మీ చైతన్య పరిధి విస్తృతమవుతుంది. మీ చైతన్య పరిధి విస్తృతమైనప్పుడు మూల చైతన్యం యొక్క శక్తి కూడా విస్తృతం అవుతుంది.

✪✪✪ తనను తాను విస్తృత పరుచుకునేందుకే మనకు, తన అన్ని శక్తులను ధార పోసింది మూల చైతన్యం ఉచితంగా ! మనం కూడా మనకున్న దాన్ని ఉచితంగా పంచినప్పుడు, మనం భౌతికంగా, ఆధ్యాత్మికంగా అన్ని కోణాల్లో సమగ్రంగా అభివృద్ధి చెందుతాము. ✪✪✪

ఈ "నిస్వార్థంగా ఇవ్వడం/దానం" అనేది

మహా మూల చైతన్యమే ప్రారంభించిందండీ !

నేను కాదు. నేను కేవలం మహా మూల చైతన్యాన్ని

అనుసరించాను అంతే ! సృష్టిలో ఉన్న

అత్యంత ప్రధాన అభివృద్ధి సూత్రం ఏమిటంటే

"పంచబడింది పెంచబడుతుంది" !

"మిమ్మల్ని బట్టి మీతో సృష్టి"! - ఒక ప్రధాన సృష్టి సూత్రం

ఈ సూత్రం ప్రకారం మీరు వ్యక్తుల పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో, సరిగ్గా అదే విధంగా సృష్టి కూడా మీ పట్ల ప్రవర్తిస్తుంది.

"మీరు ఏం కోరుకుంటున్నారో, ఎలా కోరుకుంటున్నారో అది అలా చెయ్యండి. అప్పుడు అది అలానే మీకు అందుతుంది". - ఒక సృష్టి సూత్రం

ప్రతీ వ్యక్తి మహా మూల చైతన్య స్వరూపమే అయినప్పుడు మరి ఎందుకు ఒక సాధారణ మానవుడిలా ఉంటున్నాడు, అని అంటే మనిషిలో ఉన్న "అహమే" ప్రధాన మరియు ఏకైక కారణం. "అహం అంటే నేను మహా మూల చైతన్యం నుండి వేరు అనే భావన"! మానవులంతా ఈ అహంతో కప్పబడి ఉంటారు. ఇదే మనిషిని మహా మూల చైతన్యంతో ఏకత్వాన్ని పొందకుండా అడ్డుకుంటూ ఉంటుంది. ఈ అహంలో సమాజం మరియు మతాధికారులు రుద్దిన ఎన్నో అజ్ఞాన పూరిత విషయాలు ఉంటాయి. ఆత్మ విజ్ఞానం లేని వ్యక్తి ఈ విషయాలకు లోబడి బ్రతుకుతూ ఉంటాడు. ఈ అహం వల్లనే అన్ని బాధలు, కష్ట నష్టాలు వస్తూ ఉంటాయి.

నేను ఈ అహాన్ని దాటి వేసాను. అందుకే నాకు అభద్రతా భావం లేదు. అభద్రతా భావం వాస్తవానికి అహానికి ఉంటుంది. ఇది ఎల్లప్పుడు సెక్యూరిటి కోసం పరితపిస్తూ అశాంతిగా, భయంతో అల్లాడుతూ ఉంటుంది. దీని నుండి రిలీజ్ అయిన అభద్రతా భావాలతో మీరు ఏకమైపోతారు. అందుకే మూల చైతన్య స్వరూపులై ఉండి కూడా అభద్రతా భావంతో బ్రతుకుతూ ఉంటారు. సాధారణ మానవులుగానే మిగిలి పోతారు. మీరు తలుచుకుంటే అహాన్ని దాటడం పెద్ద విషయమేమి కాదు.

ఈ అహంతో కప్పబడి ఉన్న వ్యక్తులకే అన్ని సందేహాలు వస్తూ ఉంటాయి. అన్నీ ఉచితంగా పంచితే మళ్ళీ ఎలా ? అనే ప్రశ్న యొక్క మూలం ఏమిటి ? మళ్ళీ రావు, అయిపోతాయి, ఇక మరి అప్పుడెలా గడుస్తుంది అనే కదా !

మరి....

....ఒక మహా మూల చైతన్య స్వరూపుడైన వ్యక్తి

ఇలాంటి ప్రశ్న వేయడం సమంజసమేనా ?!....

.....తానే స్వయంగా మూల చైతన్య స్వరూపుడైనప్పుడు, అనంతమైన శక్తి సామర్థ్యాలను + అనంతమైన ఐశ్వర్యాన్ని కలిగి ఉన్న అల్ట్రా కాన్షియస్‌కు ప్రతిరూపమైన వాడు ఇలాంటి ప్రశ్నలు వేసాడని అంటే అర్థం ఏమిటి ? అతడు లోలోపల భయపడుతున్నాడు. మళ్ళీ వస్తాయో రావో అని దిగులు చెందుతున్నాడు. పుస్తకాల్లో తానే దైవం అని చదివి తెలుసుకున్నా, అది అందరికి చెప్తూ ఉన్నా

ఇంకా అతనికి తన నిజతత్వం పట్ల అనుమానంగానే ఉంది. నేను సాక్షాత్ దైవ స్వరూపాన్నే కానీ ఇలా నిస్వార్థంగా దానం చేయడం ఎంత వరకు సమంజసం ? ఇది ఏ రకంగా సక్సెస్ అవుతుందో అని భయపడుతున్నాడు. అనుభవ పూర్వక విజ్ఞానం లేనప్పుడు ఇది సహజమే ! అయితే సృష్టి సూత్రాలను యథాతథంగా ఆచరిస్తూ మెల్ల మెల్లగా భయాన్ని పోగొట్టుకుని సృష్టి సూత్రాలను సాధికారికంగా ప్రకటించే స్థితిలోకి చేరుకోవాలి.

✪✪✪ సాక్షాత్తు మహా మూల చైతన్యమే తనను తాను పెంచుకోడానికి, అందరికీ ఉచితంగా, ఏ అర్హతలు ఎంచకుండా తన సర్వస్వాన్ని పంచింది. ఎందుకంటే "పంచబడింది పెంచబడుతుంది" కాబట్టి !

"మీరేం ఇస్తారో అది వేయింతలై తిరిగి వస్తుంది"

- ఇది ఒక సృష్టి సూత్రం.

ఈ సూత్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి, మీరు ఒక గ్లాసు మంచి నీళ్ళిస్తే మీకు వేయి గ్లాసుల నీళ్ళు వస్తాయి అని కాదు ఇక్కడ అర్థం ! మీరు ఒక గ్లాసు మంచి నీళ్ళు ఇవ్వడం అనేది ఒక సహాయం కిందికి వస్తుంది. మీరు ఒక సహాయం చేసారు కాబట్టి మీకు అవసరమైన రకాలుగా వేయి సహాయాలు అందుతాయని అర్థం.

మీరు ఏ రకమైన సహాయం చేసినా అది మీకు అవసరం అయ్యే రకంగా రూపొంది వేయింతలై తిరిగి వస్తుంది అని అర్థం. అది మీకు డబ్బు రూపేణా రావచ్చు, ఆరోగ్య పరమైన విధంగా రావచ్చు, ఏదైనా మీ సమస్యకు పరిష్కార రూపంలో రావచ్చు, మీకున్న అడ్డంకులు ఏవైనా క్లియర్ కావచ్చు, ఆత్మ విజ్ఞాన అవగాహనా పరంగా కావచ్చు ఏదో విధంగా మీ యొక్క అవసరాలను బట్టి మీరు చేసిన సహాయం వేయింతలై మీకే తిరిగి వస్తుంది. ఒక వేళ మీరు చేసే సహాయం దివ్య భావనతో చేస్తే అది లక్షల రెట్లుగా తిరిగి వస్తుంది. అంతా మీ భావం పైన ఆధార పడి ఉంది.

యద్భావం తద్భవతి కదా !

సృష్టిలో మీరు ఏదైనా పొందాలి అని అనుకుంటే ముందు ఇవ్వడం ప్రారంభించాలి. ఎందుకంటే ఇవ్వడమే పొందడం కాబట్టి. మీరు ఇవ్వడానికి సిద్ధపడి ఇచ్చినప్పుడే పొంద గలిగే శక్తి సామర్థ్యాలు వస్తాయి. ఇవ్వడానికి ఒక వ్యక్తి వెనకా ముందు అవుతున్నాడంటే, పొందడానికి కూడా వెనకా ముందు అవుతూ పొందలేక పోతాడు.

ఇవ్వగలిగిన వారే పొందే ఆలోచనలను చేయగలుగుతారు, పొందుతారు. ఇస్తూ పోతూ ఉన్న వ్యక్తికి పొందడం ఎలా అన్న ఆలోచనే రాదు. ఎందుకంటే మీరెంతెంత ఇస్తూ పోతూ ఉంటే అంతంత

పొందుతూనే ఉంటారు. ఇది సృష్టి నియమం. దీన్ని మీరు అర్థం చేసుకోవాలి.

మూల చైతన్యం నుండి అనంతంగా మీకు శక్తి సామర్థ్యాలు ప్రవహిస్తూనే ఉంటాయి. మీరు ఒక తటస్థమైన నీటిగుంటలా ఉండకుండా ప్రవాహంలా ప్రవహిస్తూ ఉండాలి. మీరు ఎంతెంతగా ప్రవహిస్తూ ఉంటే అంతంతగా మీ ప్రవాహం ప్రవృద్ధం అవుతుంది. మీరు ఇస్తూ పోతూ ఉంటే పొందుతూనే ఉంటారు. మీరు ఇవ్వడం ఆపేసినపుడు పొందడం కూడా ఆగిపోతుంది.

ఐశ్వర్యాన్ని, శక్తి సామర్థ్యాలను, సహాయ సహకార సమన్వయాలు మొదలైన వాటిని సముద్రంతో పోల్చుకుంటే - మీకు కావల్సినన్ని, కావల్సినంత, మీ ఇష్టం వచ్చినంత, మీ ఇష్టం వచ్చినన్ని సార్లు నాలో ఉన్నవన్నీ బేషరతుగా ఇస్తున్నాను తీసుకోండి అని సముద్రం మీతో అంటే - వాటిని తీసుకోవాలని మీరు అనుకుంటే ఏం చేయాలి ? ఏదో ఒక పాత్రలో(ట్యాంక్) తెచ్చుకోవాలి లేదా ఓ పైప్ లైన్ వేసుకోవాలి. మన పాత్ర లేక పైప్ లైన్ ఎంత పెద్దగా ఉంటే అంత ఎక్కువగా పొందగలుగుతాము కదా ! మనం ఇవ్వడం ప్రారంభించినప్పుడే మన పాత్ర లేక పైప్ లైన్ పెద్దది అవుతుంది. మీరెంతెంత ఇస్తూ ఉంటే అంతంతగా పెరిగి పెద్దదవుతూ ఉంటుంది. కాబట్టి మీ పాత్రను(ట్యాంక్) లేక పైప్ లైన్‌ను పెంచుకోవాలంటే ఇవ్వాలి మరి !

ఇవ్వడం అనేది ఒక కార్యం. కార్యం అంటే నీ కోరికను సృష్టికి వ్యక్తపరచడం అని అర్థం. నేను పొందాలి అనే ఆలోచన లేక కోరిక లేక సంకల్పం యొక్క భౌతిక వ్యక్తీకరణయే కార్యం అని అనబడుతుంది.

"మీరేం కోరుకుంటున్నారో దాన్ని ఇవ్వడం మొదలు పెట్టండి, అప్పుడు అది వేయింతలై మీకు తిరిగి వస్తుంది". " మీరేమిస్తే అదే మీకు వేయింతలుగా తిరిగి వస్తుంది. - సృష్టి సూత్రం.

ఈ సూత్రం ప్రకారం మీకు డబ్బులు కావాలంటే ముందు మీరు మీ దగ్గర ఉన్న దాంట్లో నుండి, మీరు ఇవ్వగలిగినంత ఇవ్వడం మొదలు పెట్టండి. కేవలం ఒక వంద రూపాయలతో ప్రారంభించండి. నిస్వార్థ దానం & సేవ ద్వారా ఎంతో మంచి జరుగుతుందని ధర్మ శాస్త్రాలన్నీ ఘంటాపథంగా ప్రకటిస్తూనే ఉన్నాయి కదా !

పైన చెప్పిన సూత్రాన్ని యథాతథంగా డబ్బులకు సంబంధించినదిగా మారిస్తే ఈ కింది విధంగా ఉంటుంది. సృష్టి సూత్రాన్ని కేవలం ఉదాహరణగా చెప్తున్నాంతే !

వంద ఇస్తే మీకు 100 ని 1000 = 1,00,000 అంటే లక్ష రూపాయలు వస్తాయి. ఆ లక్షలో నుండి పది వేలు ఎవరికైనా ఇచ్చివేయండి, అప్పుడు ఆ పది వేలు మీకు వేయింతలై 10,000 ని 1,000 = 1,00,00,000 అంటే కోటి రూపాయలు వస్తాయి. అప్పుడు ఆ కోటి రూపాయల్లోంచి ఒక లక్ష ఇచ్చివేయండి అప్పుడు మీకు 1,00,000 ని 1,000 = 10,00,00,000 అంటే పది కోట్ల రూపాయలు వస్తాయి. అప్పుడు ఆ పది కోట్లలో నుండి కోటి రూపాయలు ఎవరికైనా ఇవ్వండి, అప్పుడు మీకు 1,00,00,000 ని 1,000 = 10,00,00,00,000 అంటే వెయ్యి కోట్లు మీకు వస్తాయి. కేవలం ఒక వంద రూపాయలతో మొదలు పెట్టి అత్యంత తక్కువ కాలంలో మీరు వేయి కోట్ల రూపాయలకు అధిపతులు కావచ్చు. మీరు 100%గా ఈ సూత్రాన్ని విశ్వసించి, దివ్య భావనతో ఈ కార్యక్రమం మొదలు పెడితే మీరు నెల తిరగకుండానే వేయి కోట్లకు అధిపతులు కావచ్చు. నెల అని నేను ఎక్కువ రోజులు చెబుతున్నాను, నిజానికి ఒక్క రోజులో కూడా ఇది సంభవమే ! ఇది సత్యం ! సాక్షాత్ మూల చైతన్య స్వరూపుడైన మానవునికి ఇది ఒక లెక్కా ! ఒకవేళ మీరు ఇలా చేసిన తర్వాత డబ్బులు రాకపోతే అది మీ లోపమేనని తెలుసుకుని క్లియర్ చేసుకోవాలి లేదా ఈ పని వదిలేయాలి.

ఇదంతా చదవగానే మీకేం అనిపిస్తుంది ? ఇదంతా నిజమేనని మీకనిపిస్తే అది నిజమయ్యే తీరుతుంది. మీలో ఒక్క అనుమానం కూడా తలెత్తకుండా ఉంటే ఇది జరిగి తీరుతుంది. ఎందుకంటే సృష్టి ప్రధాన సూత్రమే "యద్భావం తద్భవతి" అంటే నీవెలా భావిస్తే అలానే జరుగుతుందని అర్థం. ఒక వేళ మీకిదంతా అయ్యే పనేనా.... అని అనిపిస్తే అది జరగదని తెలుసుకోండి.

ధ్యానంలో కూర్చుని ఈ విషయాలను తలుచుకుని, ఈ విషయాల పట్ల మీ అభిప్రాయాలు, నమ్మకాలు ఎలా ఉన్నాయో నిజాయితీగా చెక్ చేసుకోండి. ఒకవేళ ఈ విషయాల పట్ల అభ్యంతరాలు గనక వస్తే అవి ఈ కింది విధంగా ఉండే అవకాశం ఉంది.

1. ఇది ఎలా సాధ్యం ?!

2. నేను వంద రూపాయలు ఒకరికి ఇస్తే నాకు లక్ష రూపాయలు ఎలా వస్తాయి ?! ఎవరు తెచ్చి ఇస్తారు ?!

3. ఈ విధంగా వంద రూపాయలతో ప్రారంభించి నెల తిరగకుండానే వేయి కోట్లు పొందడం సంభవమా ?!

4. ఎంతో ప్రతిభావంతులైన వ్యాపారులు ఎందరో ఎన్నెన్నో కష్టాలు పడి చిన్న చిన్న లాభాలు పొందుతుంటారు. కోట్లకు కోట్లు పెట్టుబడి పెట్టి వ్యాపారం చేసినా వంద కోట్ల ఆస్తిని కూడబెట్టుకోడానికి ఎంతో శ్రమ పడుతుంటారు. ఏ పని చేయకుండా కేవలం ఓ వంద రూపాయలతో వేయి కోట్లు

ఎలా సాధ్యం ?!

5. పెద్ద పెద్ద వాళ్ళే ఇప్పటి వరకు వంద కోట్ల రూపాయలను కలిగి లేరు.

6. అసలు ఇదంతా ఎలా జరుగుతుంది ?!

7. ఇలా చేసి ఎవరైనా వేయి కోట్లను పొందారా ?!

8. ఆధ్యాత్మిక శాస్త్రాల్లో ఏమేమో వ్రాస్తుంటారు. అవి అన్నీ జరిగే పనులు కావు. ఇలా అయితే భూమి మీద ప్రతీ ఒక్కడు వేయి కోట్లకు అధిపతులై పోతారు. ఇంత డబ్బు ఎక్కడి నుండి వస్తుంది ?! ఎవరు ఏ రకంగా ఎవరెవరికి తెచ్చిస్తారు ?! ఏమో నాకైతే ఏ మాత్రం నమ్మబుద్ధి కావటం లేదు. ఆశగానే ఉంది అయినా అనుమానం పుడుతూ ఉంది.

ఇలా ఎన్నో రకాలుగా మీకు సందేహాలు వస్తాయి. ఆత్మ విజ్ఞాన పుస్తకాలను మొత్తం చదివి బాగా అవగాహన చేసుకోండి. వాటిలోని సూత్రాలను ఆచరిస్తూ, వాటిలో తెలియజేయబడిన సాధనలను చేయండి. మీ సరి కాని అభిప్రాయాలను, నమ్మకాలను క్లియర్ చేసుకోండి. ఆ తర్వాత ఈ కార్యక్రమం మొదలు పెట్టండి, మీరు ఖచ్చితంగా వేయి కోట్లకు అధిపతులు అయి తీరుతారు. ప్రయోగం చేయాలి సఫలమైతే ఐశ్వర్యం ! సఫలం కాలేదా అనుభవం వస్తుంది !

గుర్తుంచుకోండి - ఈ వేయి కోట్ల కార్యక్రమం మీకు సక్సెస్ కాలేదంటే అది మీ లోపమే ! ముందు మీలో ఉన్న లోపాలన్నీ క్లియర్ చేసుకోండి ఆ తర్వాత ఈ పని ప్రారంభించండి. లేదా వదిలేయండి.

ఎందుకంటే..... ప్రతి ఒక్కరికి వారి, వారి స్వంత బ్యాలన్స్ షీట్‌లు ఉంటాయి. ఈ బ్యాలన్స్ షీట్ ప్రకారం ఎవరికి వారు తమవైన చెల్లింపులు, స్వయం కట్టడులు, శాసనాలు, ఒప్పందాలు అనేవి ఉంటాయి. ఈ బ్యాలన్స్ షీట్ అనేది ఎంత క్లియర్‌గా ఉంటే అంతగా ఈ విషయం సక్సెస్ అవుతుంది. ఒక వేళ బ్యాలన్స్ షీట్ పూర్తిగా క్లియర్‌గా ఉంటే సూత్రం వెంటనే అప్లై అయి ఫలితాలు రావడం ప్రారంభం అవుతాయి.

ఒక వేళ మీ బ్యాలన్స్ షీట్‌లో చెల్లింపులు, స్వయం కట్టడులు, శాసనాలు, ఒప్పందాలు గనక ఏవైనా ఉంటే కూడా మీరు 100 రూపాయలతో ప్రారంభించినప్పుడు ఫలితాలు వెంటనే రావడం మొదలవుతాయి కాని - మీ బ్యాలన్స్ షీట్‌లో ఉన్న వాటికి చెల్లింపులు జరుగుతూ ఉంటాయి కాబట్టి అవి మీకు కనపడవు.

ఎలా అంటే.....

.....మీకు ఓ లక్ష రూపాయల అప్పు ఉంది అనుకోండి. ఇప్పుడు మీరు ఒక స్వంత ఇల్లు కట్టుకుందామనుకుంటున్నారు అని అనుకోండి. ఇప్పుడు మొదట ఏం అవుతుంది ? మీ అప్పు తీరిందాకా మీరు సంపాదించింది ఇంటి కోసం కూడబెట్ట లేరు కదా ? మొత్తం మీ అప్పు తీరిన తర్వాతే మీ సంపాదనలో నుండి మీరు కూడబెట్ట గలుగుతారు కదా ! అప్పుడు మాత్రమే అవి మీ కంటికి కనబడతాయి. ఆ తర్వాత అవి అలా పెరుగుతూ పోతూనే ఉంటాయి. సరిగ్గా ఇదే విధంగా మీరు 100 రూపాయలతో ఇవ్వడం ప్రారంభించినపుడు మొదట మీ బ్యాలన్స్ షీట్‌లో ఉన్న చెల్లింపులు, స్వయం కట్టడులు, శాసనాలు, ఒప్పందాలు క్లియర్ కావడం మొదలవుతాయి, ఇవి పూర్తిగా క్లియర్ అయిన తర్వాతే మీకు ఫలితాలు - Returns కనపడడం ప్రారంభం అవుతాయి. క్లియర్ కాక ముందు కూడా ఫలితాలు - Returns అనేవి వస్తూ ఉంటాయి కానీ అవి మీ క్లియరెన్స్‌లకే సరిపోతాయి. కనపడవు. విషయం అర్థం అయిందనుకుంటాను.

ఇది కాస్త ఉన్నత అవగాహనకు సంబంధించిన విషయం. ఇంత క్లియర్‌గా వివరించిన తర్వాత కూడా అర్థం కాలేదనుకోండి..... ఎవరూ ఏమీ చేయలేరు.

ఈ విషయాలను బాగా ఒంట బట్టించుకున్న తర్వాతే పని మొదలు పెడితే బాగుంటుంది. లేదా వదిలేయండి.

మీరు 100 రూపాయలు ఇచ్చి పని ప్రారంభించిన తర్వాత గానీ మీ బ్యాలన్స్ షీట్‌లోని వ్యవహారం బయట పడదు.

మీరు 100 రూపాయలు ఇచ్చిన తర్వాత ఏమీ ఫలితాలు - Returns కనపడలేదు అనుకోండి, అప్పుడు ఏదో నా పాస్ట్ బ్యాలన్స్ లేక నా పాత బాకి ఏదో క్లియర్ అయిందని అర్థం చేసుకుని, మళ్ళీ ఇంకో 100 రూపాయలు ఇవ్వాలి. ఇలా ఇస్తూనే పోవాలి.

ఇలా ఎంత కాలం ఇవ్వాలి ? అని అంటే మీ బ్యాలన్స్ షీట్ పూర్తిగా క్లియర్ అయ్యేంత వరకు ఇవ్వాలి. ఆ.... అదెప్పుడు పూర్తవుతుందో అని అంటే.... ఇవ్వకండి. మానేయండి. 100% విశ్వాసం ఉండి, అవగాహన ఉండి, ఆత్మ విజ్ఞాన సూత్రాలను ప్రయోగాత్మకంగా ఆచరించి, ఫలితాలు రాబట్టి, ఆనందించి తమ అనుభవ విజ్ఞానం పెంపొందించుకోవాలనే ధీశాలులకు మాత్రమే నేనీ సూత్రాన్ని సూచిస్తున్నాను అని గమనించ గలరు. అంతే కానీ అనుమానాలతో సతమతమయ్యే సన్నాసులకు కాదని మనవి చేసుకుంటున్నాను. ఇష్టం ఉంటే చేయండి, లేక పోతే లేదు. "ఒకటి ఇస్తే వేయి వస్తాయి" అనే ఆత్మ విజ్ఞాన సూత్రాన్ని ఈ విధంగా, డబ్బులకు సంబంధించిన కోణంలోకి మార్చి వివరించాను. వ్యాపారంగా చేస్తే దెబ్బ తింటారు. నిస్వార్థంగా చేయండి. చేసి పూర్తిగా, శాశ్వతంగా మర్చిపోండి.

ఈ విషయాలను బలంగా నమ్ముతూ ఆచరించి చూద్దాం అని అనుకునే వారు, వంద రూపాయలతో మొదలు పెట్టండి, మీ బ్యాలన్స్ షీట్ క్లియర్‌గా ఉంటే అత్యంత త్వరలో మీరు వేయి కోట్లకు అధిపతులై పోతారు. ఒక వేళ మీ బ్యాలన్స్ షీట్ క్లియర్‌గా లేదనుకోండి, మీరు ఇస్తూ పోతూ ఉంటే ఏదో ఒక నాటికి మీ బ్యాలన్స్ షీట్ క్లియర్ అయి మీరు వేయి కోట్లకు అధిపతులవుతారు.

ఇది 100 రూపాయలతో అని ఏమీ లేదు. మీ వీలును బట్టి మీరు ఎంత డబ్బుతోనైనా మొదలు పెట్టవచ్చు. దయచేసి కమర్షియల్ దృక్పథంతో మొదలు పెట్టకండి. మీలోని కమర్షియల్ యావ పూర్తిగా చచ్చే వరకు ఫలితాలు రావు.

పరమాత్మ స్వరూపులందరూ ఒక్క విషయాన్నే నొక్కి వక్కాణించి చెప్పారు - "మీరెలా నమ్మితే అది అలా జరిగి తీరుతుందని" !

నమ్మకం !

నమ్మకం అనేది ఒక ఆలోచన. "మన ఆలోచనలే మన వాస్తవాలు అవుతాయి". మీరు ఏదైనా ఒక ఆలోచనను ఒప్పుకుంటే, అది నమ్మకంగా తయారవుతుంది. అలా తయారైన నమ్మకం ప్రకారమే విషయం జరుగుతుంది. మన శరీరం + జీవితం అంతా కూడా మన నమ్మకాల పైనే ఆధారపడి ఉంటుంది. మనం ఏది నమ్మితే అది జరిగి తీరుతుంది.

ఒక ఆలోచనను మీరు అంగీకరిస్తే అప్పుడది నమ్మకంగా మారిపోతుంది. దాన్ని అలాగే నమ్ముతూ ఉంటే అది జరుగుతుంది.

ఆలోచనను ఒప్పుకోవడం ద్వారా, అనుమతించడం ద్వారా, సులభంగా, వెంటనే, అది భౌతిక రూపం ధరిస్తుంది.

నమ్మకం అంటే అంగీకరించిన, అనుమతించిన ఆలోచన. అంటే ఆలోచనను అనుమతించడం ద్వారా దాన్ని వెంటనే, సులభంగా భౌతికంగా మార్చవచ్చు.

మీరు దేన్ని నమ్మితే అదే జరుగుతుంది ! మీరు దేన్ని నమ్ముతారో దానిగానే పరిణమిస్తారు ! ఒకవేళ కాలేదంటే, మీరు పూర్తిగా నమ్మలేదనే అర్థం.

Believe it ! Become it !

ఉదాహరణకు...

మిమ్మల్ని మీరు ఐశ్వర్యవంతులని నమ్మితే మీరు ఐశ్వర్యవంతులు అయి తీరుతారు.

మిమ్మల్ని మీరు ఆరోగ్యవంతులుగా నమ్మితే పటిష్ఠమైన, చెక్కుచెదరని, ఆరోగ్యాన్ని పొందుతారు.

మిమ్మల్ని మీరు విజేతలుగా నమ్మితే మీరు విజేతలుగానే వర్ధిల్లుతారు.

మిమ్మల్ని మీరు అందగాళ్ళుగా నమ్మితే అందగాళ్ళుగానే శోభిస్తారు.

మిమ్మల్ని మీరు విజ్ఞాన వంతులని నమ్మితే విజ్ఞానంతో విరాజిల్లుతారు.

మీకేం కావాలో అది ఉన్నట్టుగా నమ్మండి !

మీరు సన్నగా ఉంటే మంచి ఫిజిక్‌తో ఉన్నట్టు నమ్మండి, అప్పుడు దృఢాకాయులుగానే అవుతారు.

మీకు బట్ట తల ఉంటే మీకు దట్టమైన జుట్టుంది అని నమ్మండి, అప్పుడు మీరు దట్టమైన, చక్కటి, దృఢమైన జుట్టును పొంది తీరుతారు.

మీకు పొట్ట ఎత్తుగా ఉంటే "అది పోయింది", ఇక మళ్ళీ తిరిగి రాదని నమ్మండి.

మిమ్మల్ని మీరు అదృష్టవంతులుగా నమ్మండి, అప్పుడు మీరు అదృష్టవంతులుగానే తయారయి అన్ని అదృష్టాలను పొందుతూనే ఉంటారు.

మిమ్మల్ని మహా సౌభాగ్యవంతులుగానే నమ్మండి, అప్పుడు మీరు మహా సౌభాగ్యవంతులై తీరుతారు.

మిమ్మల్ని మీరు మహా నాయకులుగా నమ్మండి, మీరు మహా నాయకులై తీరుతారు.

మిమ్మల్ని మీరు మార్గదర్శులుగా నమ్మండి, అప్పుడు మీరు అందరి ఆయురారోగ్య ఐశ్వర్య విజ్ఞానానంద సౌభాగ్య మోక్షాలకు మార్గదర్శకత్వం వహిస్తూ మార్గదర్శక మహాత్ములై పోతారు.

ఏది మీరు నమ్ముతారో అదే జరుగుతుంది !

మిమ్మల్ని మీరు ఎలా నమ్ముతారో అలాగే తయారవుతారు !

Believe it ! Become it !

ఒక అత్యంత ముఖ్యమైన విషయం : నమ్మకం ఎప్పుడూ వర్తమానానికి సంబంధించినదిగా ఉండాలి. భవిష్యత్తులో జరుగుతుందని ఉండకూడదు. ఎందుకంటే మనలో ఉన్న "మూల చైతన్య శక్తి" మనం ఏం చెబితే అది తు.చ. తప్పకుండా చేస్తుంది. మీరు ఒకవేళ మీ నమ్మకాలను భవిష్యత్‌లో జరుగుతుంది అని అనుకుంటే అది అలానే భవిష్యత్‌లో మీకు అందకుండా, జరగకుండా ఉంటుంది. రేపు అనేది ఎప్పుడు రాదు. రేపు అనేది ఈ రోజుగానే, ఈ క్షణంగానే వస్తుంది. భవిష్యత్ కాలానికి సంబంధించిన నమ్మకాలు మనం కావాలి అని అనుకుంటున్న వాటిని భవిష్యత్‌లోనే ఉంచి ఎప్పటికీ మనకు దక్కకుండా చేస్తాయి. కంగారు పడకండి, ఆత్మ విజ్ఞానం లేని వాళ్ళు అమాయకంగా భవిష్యత్తుకు సంబంధించిన నమ్మకాలను పెట్టుకున్నా, బేషరతు ప్రేమతో, అంతులేని కరుణతో మూల చైతన్యం, మన నమ్మకాల్ని అర్థం చేసుకుని, వాటిలో ఏవైనా లోపాలు గనక ఉంటే, ఆ లోపాలను సవరించి, మన కోరికలను, భౌతికంగా సంభవింపజేసి మన అనుభవంలోకి తెస్తుంది. అయితే.... మీకు నేను చెబుతున్నాను కాబట్టి.....

నమ్మకాలను లేక విశ్వాసాలను వర్తమానానికి సంబంధించినవిగా ఉండేలా చూసుకోండి లేదా ఆల్‌రెడి అవి జరిగిపోయినట్టు చూడండి, భావించండి. అప్పుడు అవి సంభవం అయి తీరుతాయి.

ఉదాహరణకు - "నేను అత్యంత త్వరలో ఐశ్వర్యవంతుడిని అవుతాను" అనే నమ్మకం భవిష్యత్ కాలానికి సంబంధించినది. ఈ భవిష్యత్ నమ్మకం మిమ్మల్ని "అత్యంత త్వరలో", "అత్యంత త్వరలో" అంటూ ఊరిస్తూనే ఉంటుంది కానీ మిమ్మల్ని ఎప్పటికీ ఐశ్వర్యవంతులుగా చేయదు. అత్యంత త్వరలో అని అంటే "ఇప్పుడు కాదు" అని తిరస్కరించడమే ! "నేను రేపు ఐశ్వర్యవంతుడిగా లేక ఐశ్వర్యవంతురాలిగా మారుతాను" అని అంటే ఇప్పుడును, అంటే వర్తమానాన్ని తిరస్కరించడమే అవుతుంది. రేపు అనేది ఏనాటికీ రాదు కాబట్టి మీరెప్పటికీ ఐశ్వర్యవంతులుగా మారకుండానే ఉండి పోవాల్సి వస్తుంది.

మీరు నిజంగా ఐశ్వర్యవంతులుగా మారాలి అని అనుకుంటే ఇలా నమ్మడం మొదలు పెట్టండి :

"నేను ఐశ్వర్యవంతుడిని లేక నేను ఐశ్వర్యవంతురాలిని" !

ఈ నమ్మకం ఇప్పుడు, ఇక్కడ పూర్తి వర్తమానంలో ఉంది. ఈ నమ్మకం మిమ్మల్ని, నిజంగా ఐశ్వర్యవంతులుగా మార్చేస్తుంది... మీలో ఎలాంటి వ్యతికేకతలు లేకపోతే ! ఒక వేళ వ్యతిరేకతలుంటే క్రమం తప్పని సాధన వలన వ్యతిరేకతలన్నీ పూర్తిగా క్లాయర్ అయి పోతాయి.

కొన్ని సరైన నమ్మకాలు ఈ కింద ఇస్తున్నాను వీటిలోంచి మీకు కావల్సినవి తీసుకుని నమ్మడం ప్రారంభించండి :

నేను మహా ఐశ్వర్యవంతుడిని లేక మహా ఐశ్వర్యవంతురాలిని !

నేను మహా ఆరోగ్యవంతుడిని లేక మహా ఆరోగ్యవంతురాలిని !

నేను మహా అదృష్టవంతుడిని లేక మహా అదృష్టవంతురాలిని !

నేను మహా సౌభాగ్యవంతుడిని లేక మహా సౌభాగ్యవంతురాలిని !

నేను గొప్ప అందగాడిని !

నేను గొప్ప అందగత్తెను !

నేను కోరుకున్న వాటిని పొందే భాగ్యం నాకుంది !

నేను కోరుకున్న సంతానాన్ని పొందే భాగ్యం నాకుంది !

నేను విజేతను !

నేను గొప్ప సింగర్‌ను !

నేను గొప్ప డాన్సర్‌ను !

నేను గొప్ప నటుడిని !

నేను గొప్ప ఆటగాడిని !

నాకు చక్కని రూపం ఉంది ! నాకు ఆకర్షణీయమైన ఫిజిక్ ఉంది !

నేను గొప్ప బలవంతుడిని ! నేను గొప్ప బలవంతురాలిని !

ఇలా మీరేం అవ్వాలనుకుంటున్నారో దాన్ని ఒక వాక్యంగా వర్తమాన కాలంలో రూపొందించుకుని బలంగా, నిరంతరం నమ్ముతూ ఉండండి. అప్పుడు మీ నమ్మకం ఏదైనా సరే ఫలించియే తీరుతుంది.

నమ్మడం లేక విశ్వసించడం ఎలా అని అంటే.....

నేను మహా ఐశ్వర్యవంతుడిని/ఐశ్వర్యవంతురాలిని అని పూర్తిగా, నిజంగా ఒప్పుకున్నాను !

నేను మహా ఆరోగ్యవంతుడిని/ఆరోగ్యవంతురాలిని అని పూర్తిగా, నిజంగా ఒప్పుకున్నాను !

నేను మహా అదృష్టవంతుడిని/అదృష్టవంతురాలిని అని పూర్తిగా, నిజంగా ఒప్పుకున్నాను !

నేను మహా సౌభాగ్యవంతుడిని/సౌభాగ్యవంతురాలిని అని పూర్తిగా, నిజంగా ఒప్పుకున్నాను !

నేను గొప్ప అందగాడిని అని పూర్తిగా, నిజంగా ఒప్పుకున్నాను !

నేను గొప్ప అందగత్తెను అని పూర్తిగా, నిజంగా ఒప్పుకున్నాను !

దేహం యొక్క అందం ఎంత ముఖ్యమో అంత కంటే ముఖ్యం అందమైన మంచి గుణాలను పెంపొందించుకోవడం. ఇది ఇంకా చాలా ముఖ్యం !

నేను కోరుకున్న వాటిని పొందే భాగ్యం నాకుంది అని పూర్తిగా, నిజంగా ఒప్పుకున్నాను !

- ఇలా మీరు దేనినైతే కావాలనుకుంటున్నారో దాన్ని పదే పదే మనసులో అనుకుంటూ ఉంటూంటే కొంత కాలానికి అది నమ్మకంగా మారిపోతుంది. అప్పుడు అది వెంటనే సంభవిస్తుంది. అనుకోవడమే అనుమతించడం లేదా ఒప్పుకోవడం !

ఒక విషయాన్ని సంపూర్ణంగా, 100%గా ఒప్పుకోవడమే, నమ్మడం లేక విశ్వసించడం అని అంటే !

నమ్మండి, 100%గా, నిజంగా నమ్మండి.
మంచి విషయాలే కదా ! నమ్మండి, 100%గా ఒప్పుకోండి,
పూర్తి పాజిటివ్‌గా ఉంటూ ఆచరించండి ఇది జరిగియే తీరుతుంది. గతి తప్పని ప్రాప్తి ఇది. జరగలేదంటే.. అది మీ లోపమే ! మీరు పూర్తిగా నమ్మలేదనే అర్థం.

గుణం(స్వభావం), అభిప్రాయం, నమ్మకం :

అనంత మూల చైతన్య శక్తి ఎన్నో రూపాలుగా, ఎన్నో రకాలుగా సృష్టిలో ప్రకటం అవుతూ ఉంటుంది. వాటిలో "ఆలోచన" అనేది అత్యంత ప్రధానమైనది, అన్నింటికి మూలమైనది. ఆలోచన ద్వారానే అన్నీ సృష్టించబడ్డాయి, సృష్టించబడతాయి. సూక్ష్మ రూపంలో ఉన్న ఆలోచనయే భౌతిక రూపం తీసుకుని భౌతిక పదార్థాలుగా, భౌతిక సంఘటనలుగా, భౌతిక పరిస్థితులుగా ఏర్పడుతుంది. ఆలోచనే గుణంగా(స్వభావం), నమ్మకంగా(విశ్వాసం), అభిప్రాయంగా, ఏర్పడుతుంది. మన గుణాలే(స్వభావాలే), నమ్మకాలే(విశ్వాసాలే), అభిప్రాయాలే మన శరీరంలోని + జీవితంలోని సర్వ, సకల, సమస్త పరిస్థితులను నియంత్రిస్తూ ఉంటాయి. వీటి ప్రకారంగానే మన శరీరం + జీవితం ఉంటుంది. "ఇవి" ఎలా ఉంటే, మన శరీరం + జీవితం అలా ఉంటాయి. ఆలోచనలు గుణాలుగా(స్వభావాలు), నమ్మకాలుగా(విశ్వాసాలు), అభిప్రాయాలుగా ఎలా ఏర్పడతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం :

గుణం లేక స్వభావం :

సృష్టి ఆలోచనా కేంద్రంలో నుండి ఆలోచన మనకు అందుతుంది. అలా వచ్చిన ఆలోచనను అలాగే కొనసాగిస్తే, అదే పనిగా దాన్ని విస్తరిస్తూ ఉంటే అప్పుడు అది ఒక గుణంగా ఏర్పడుతుంది.

తదేకంగా చేసిన ఆలోచనయే గుణంగా మారుతుంది!

ఉదాహరణకు మీకు అందరికీ సహాయం చేసే ఆలోచన వచ్చింది అని అనుకోండి, అప్పుడు మీరు దానిని అలాగే కొనసాగిస్తూ ఉంటే, నిరంతరం అదే పనిగా దానిని ఆలోచిస్తూ ఉంటే అప్పుడు అది ఒక "సహాయం చేసే గుణంగా" మీలో ఏర్పడి పోతుంది. ఇలా ఏర్పడిన గుణం మీకు ఎల్లప్పుడూ అందరికీ సహాయం చేసే ఆలోచనలను పంపిస్తూనే ఉంటుంది. అప్పుడు మీరు అందరికీ సహాయం చేస్తూ ఉంటారు. "మీరు చేసింది మీకు వేయి రెట్లుగా" తిరిగి వస్తుందనే సృష్టి నియమం ప్రకారం, మీకు అందరూ సహాయం చేస్తూ ఉంటారు.

మీకు మోసం చేయాలనే ఆలోచన వచ్చింది అని అనుకోండి, దాన్ని మీరు స్వీకరించి అదే పనిగా కొనసాగిస్తూ ఉంటే అప్పుడు మీలో "మోసం చేసే గుణం" ఏర్పడి పోతుంది. అప్పుడు ఇతరులను మోసం చేస్తూ, మీరు కూడా మోసపోతూ ఉంటారు.

మనం ఎలాంటి గుణాలను కలిగి ఉంటామో సరిగ్గా అలాంటి పరిస్థితులనే ఆకర్షించి అనుభవిస్తూ ఉంటాం. కాబట్టి ఆలోచనలను కొనసాగించే ముందు ఎరుకతో ఆలోచన యొక్క స్వభావాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకుని కొనసాగించాలి. అజ్ఞానంతో తెలియక చేసిన తప్పుడు ఆలోచనల ఫలితాలైన తప్పుడు గుణాలను, సరి అయిన ఆలోచనలను స్వీకరించి, ఎల్లప్పుడూ కొనసాగిస్తూ ఉంటే అప్పుడు, తప్పుడు గుణాలు అంతరించి పోయి మంచి గుణాలు ఏర్పడతాయి.

మనం సరి అయిన గుణాలను కలిగి ఉంటే అవి సరి అయిన పరిస్థితులను ఆకర్షిస్తాయి. సరి కాని గుణాలు సరి కాని పరిస్థితులను ఆకర్షిస్తాయి. అందుకే ఎల్లప్పుడూ పాజిటివ్ ఆలోచనలు చేసి, పాజిటివ్ గుణాలను ఏర్పరచుకోవాలి. పాజిటివ్ గుణాలంటే, సద్గుణాలు. మీరు సద్గుణాలను కలిగి ఉన్నప్పుడు మీకు అన్నీ ఆనందాలే !

అభిప్రాయం :

వచ్చిన ఆలోచనను నిర్వచిస్తే అది అభిప్రాయంగా మారుతుంది. ఉదాహరణకు చపాతిలోకి ఏ కూర అయితే బాగుంటుంది ? అనే ఆలోచనను మీరు స్వీకరించి, "చపాతిలోకి దొండకాయ వేపుడైతే బాగుంటుంది" అనే నిర్వచనాన్ని ఇచ్చేశారనుకోండి, అప్పుడు అది ఒక అభిప్రాయంగా ఏర్పడి పోతుంది. ఇలా ఏర్పడిన అభిప్రాయాలకు అనుగుణంగానే మీ ఆలోచనా విధానం సాగుతుంటుంది. మీ ఆలోచనా విధానానికి అనుగుణంగానే మీ జీవితం కొనసాగుతుంది. కాబట్టి సరి అయిన అభిప్రాయాలు ఏర్పరచుకోవాలి. మూర్ఖత్వంతో పనికిరాని అభిప్రాయాలు ఏర్పరచుకుంటే పనికి రాకుండా పోతారు.

నమ్మకం లేక విశ్వాసం :

వచ్చిన ఆలోచనను మీరు ఒప్పుకుంటే అప్పుడది నమ్మకంగా మారుతుంది. ఆలోచనను అంగీకరిస్తే అది నమ్మకంగా తయారవుతుంది. ఆలోచనను "సరి" అని మీరు అంటే అది నమ్మకమై పోతుంది. మన నమ్మకాల ప్రకారమే మన శరీరం + జీవితంలోని పరిస్థితులు ఉంటాయి.

గుణం, అభిప్రాయం అనేవి మన శరీరం + జీవితం పైన ప్రభావాన్ని చూపెడతాయి "నమ్మకం" అనేది చాలా బలమైన ప్రభావం చూపెడుతుంది. నమ్మకం చాలా శక్తివంతమైనది. మీరు గాలిలో తేలగలను అని నమ్మారంటే మీరు సూపర్ మ్యాన్‌లా గాలిలో ఎగిరి పోవచ్చు. నేను నీళ్ళ మీద నడవగలను అని మీరు నమ్మారంటే మీరు హాయిగా నీళ్ళ మీద నడవచ్చు.

మీరు దేనిని నమ్మితే అది అవుతుంది. మిమ్మల్ని మీరు దైవంగా నమ్మితే దైవమే అయి తీరుతారు. నమ్మకం చాలా శక్తివంతమైనది. కాబట్టి సరి అయిన నమ్మకాలను ఏర్పరచుకోవాలి.

మీరు కలిగి ఉన్న గుణాలను, అభిప్రాయాలను, నమ్మకాలను సరి చేసుకుంటే మీరు "వేయి కోట్లకు అధిపతులు" కావడమే కాదు, దేనినంటే దాన్ని పొందగలుగుతారు.

✪ మీరు ఆరోగ్యవంతులుగా మరియు ఐశ్వర్యవంతులుగా అవ్వాలని అనుకుంటే సరైన మత రహిత అత్యున్నత ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అందించండంలో ముఖ్య పాత్రను పోషించండి. క్లాసులు చెప్పడం కాదు. క్లాసులు చెప్తే బతుకులు బండల పాలవుతాయి. ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టర్ చేసే సత్య ప్రచారానికి మీరు ఏదో ఒక రకంగా, నిస్వార్థంగా సహాయాన్ని అందించాలి ✪

"మీకేం కావాలో అదివ్వండి, అప్పుడు దానినే మీరు వేయిరెట్లుగా పొందుతారు" అనే సృష్టి సూత్రం ప్రకారం మీకు ప్రేమ కావాలంటే అందరి పట్ల ప్రేమను ప్రకటిస్తూ ఉండండి, ప్రేమగా ప్రవర్తించండి. మీకు సహాయం కావాలంటే మీరు ఇతరులకు సహాయం చేయడం మొదలు పెట్టండి. ముందు మీరు ఇవ్వనిదే ఏదీ మీకు రాదని తెలుసుకోండి.

✪❂ ఏది ఇస్తే అది వస్తుంది కానీ, సరైన మత రహిత అత్యున్నత ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అందిస్తే మాత్రం మీకు ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలు అన్నీ వస్తాయి. ✪❂ (క్లాసులు చెప్పకండి)

ఇవ్వడమే పొందడం ! ఇవ్వడమంటే సంపాదించుకోవడమే !

ఏ మనిషి అయినా సరే "ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్యాలను" అనుభవిస్తూ ఉన్నాడంటే అది, ఆ మనిషి గతంలోనో లేక గత జన్మలలోనో చేసుకున్న సత్కర్మ ఫలితం తప్ప మరొకటి కాదన్న సత్యాన్ని తెలుసుకోవాలి. భగవదనుగ్రహం, దైవ కృప ఇలాంటివి ఏవీ ఉండవు. నీ నా అనే భేదం లేకుండా దైవం అందరి మీదా సదా ఆశీర్వాద అనుగ్రహాలు కురిపిస్తూనే ఉంటుంది. మన సత్ గుణాల చేత మనం చేసిన సత్కర్మల వలన ఆ యొక్క ఆశీర్వాద అనుగ్రహాలను పొందగలుగుతాం. ఎంత చేస్తే అంత పొందుతాం. దానం చేస్తే సత్కర్మ ఫలం(పుణ్యం) వస్తుంది అని అంటారు. దానం అని అంటారు. వాస్తవానికి దానం అని అనకూడదు. "సేవ చేసే అవకాశం" అని అనాలి. "ఇవ్వడమే ధన్యం, పుచ్చుకోవడం కన్నా" అని అంటారు రాంపా మాస్టర్ గారు !

గుర్తుంచుకోండి సత్కర్మ ఫలం(పుణ్యం) అనేది ఎక్కడి నుండో రాదు. సత్కర్మల వలన మాత్రమే సత్కర్మ ఫలం(పుణ్యం) అనేది వస్తుంది. సత్ గుణాల పర్యవసానమే పుణ్యం. వెలుగు, దీపం యొక్క పర్యవసానం. పుణ్యం, సత్ గుణాల పర్యవసానం. వెలుగుకు మూలం దీపం. పుణ్యానికి మూలం సత్ గుణాలు. దీపం ఉండడం వల్లనే వెలుగు ఉంటుంది. పుణ్యం అంటే మరేమిటో కాదు, సత్ గుణాలే(సత్ కర్మలే) పుణ్యం ! మరి సత్ గుణాలెలా వస్తాయి అని అంటే ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో ఆచరించడం వలన మరియు ధ్యాన సాధన ద్వారా వస్తాయి.

సరైన న్యూ ఏజ్ ఆధ్యాత్మిక పుస్తకాలు బాగా చదివి, అవగాహన చేసుకోండి, అప్పుడు మీలో ఆటొమెటిక్‌గా సత్ గుణాలు ఏర్పడి పోతాయి. ఇక అప్పుడు మీ జీవితంలో అన్నీ ఆనందాలే !

చాలా మంది పుణ్యం అంటే ఏమిటో అనుకుంటున్నారు. అది చేస్తే పుణ్యం వస్తుందనీ, ఇది చేస్తే పుణ్యం వస్తుందనీ ఏవో మత కార్యకలాపాలు చేస్తూ ఉంటారు. మత కార్యకలాపాల వలన పుణ్యం రానే రాదు. మతానికి సంబంధించిన కర్మ కాండల వలన పుణ్యం రానే రాదు. అది అసంభవం, అసాధ్యం!

పుణ్యం అంటే సద్గుణాల పరిమళం. పుణ్యం అంటే సత్కర్మల యొక్క ప్రతిఫలం & ప్రతిస్పందన !

మనం కలిగి ఉన్న గుణాల లేక భావాల యొక్క ఆధారంగానే మన శరీరంలో + జీవితంలో పరిస్థితులు ఏర్పడుతూ ఉంటాయి. మనం కలిగి ఉన్న గుణాల యొక్క ప్రతిబింబాలనే మనం మన శరీరంలో మరియు జీవితంలో అనుభవిస్తూ ఉంటాము. సద్భావనతో ఎవరికైనా పనికి వచ్చే సహాయం చేసినప్పుడు మీలో ఒక "సద్గుణం" ఏర్పడుతుంది. అలా ఏర్పడిన సద్గుణం యొక్క ప్రభావం వలన మీ శరీరంలో మరియు జీవితంలో ఆనందకరమైన పరిస్థితులు ఏర్పడతాయి. మీరు సత్కార్యాలు

చేస్తూ పోతూ ఉంటే మీలో సద్గుణాలు పెరుగుతూ ఉంటాయి. అవి గొప్ప శుభ + లాభకరమైన పరిస్థితులను ఆకర్షిస్తూ ఉంటాయి. గుర్తుంచుకోండి పుణ్యం అని అంటే "సద్గుణాలు" అని ! అంతే కాని మతాధికారులు చెప్పే, చేయించే అర్థం కాని మత పరమైన కర్మ కాండల వలన కానీ లేక కార్య కలాపాల వలన కాని పుణ్యం రాదు గాక రానే రాదు. మత పరమైన కర్మ కాండల వలన మరియు కార్య కలాపాల వలన డబ్బు + శక్తి + సమయం వృథా అవుతాయే తప్ప మరో ప్రయోజనం లేనే లేదు.

సద్భావనతో, ఏమీ ఆశించకుండా చేసి, పూర్తిగా శాశ్వతంగా మర్చిపోండి. సత్కార్యాలు చేయండి. సాటి మనుషులకు ఉపయోగపడే సహాయ కార్యక్రమాలు చేయండి. కానీ ఏమీ ఆశించకుండా.... అప్పుడు గ్యారంటీగా వస్తుంది పుణ్యం !

చాలా మంది అసలు విషయాలు తెలియక మతాధికారులు చెప్పినట్టు భగవంతుని ప్రీతి కోసం అని ఏమేమో చేస్తూ ఉంటారు. భగవంతుని ప్రీతి కోసం ఏమిటి ? ఆయనను కాకా పట్టడమా ?! భగవంతుడు ఎప్పుడూ ప్రీతితోనే ఉంటాడు. గుడిలోని హుండీలో డబ్బులు వేయడం, బంగారు నగలు సమర్పించడం, దేవతలకు వస్త్రాలు పెట్టడం, గుళ్ళు గోపురాలు కట్టించడం ఇవన్నీ చేస్తే భగవంతుడు ఉబ్బిపోయి వీరికి ఏదో చేస్తాడనీ మతాధికారులు చెప్పడం, అమాయక ప్రజలు నమ్మడం, వాళ్ళు చెప్పినవి ఆచరించడం. ఈ కార్యక్రమాల వలన భగవంతుడు ప్రసన్నం అవడం సంగతి పక్కన పెడితే మతాధికారులు మాత్రం ప్రసన్నం అయిపోతారు. కాక మరేం చేస్తారు. భగవంతుని పేరు చెప్పి వీళ్ళ పబ్బం కదా గడుపుకునేది.

భగవంతుడికి డబ్బులకు కరవు లేదు, బంగారు నగల అవసరం లేదు. వస్త్రాల అవసరం అంతకన్నా లేదు. గుళ్ళు గోపురాలు భగవంతుడికి అయితే అవసరం లేదు. వాటి అవసరం మతాధికారులకు ఉంటుంది. ప్రతి మనిషిలోనూ ఆ యొక్క పరమాత్ముడు ఉన్నాడు. మనుషులకు సహాయం చేయండి, భగవంతుడు అప్పుడు మీ పట్ల ప్రసన్నం అవుతాడు. ఆయనకు గుళ్ళు గోపురాలు కాదు, అనాథ శరణాలయాలు నిర్మించండి, వృద్ధాశ్రమాలు నిర్మించండి, ఆసుపత్రులు నిర్మించండి, పేద విద్యార్థుల కోసం విద్యాలయాలు నిర్మించండి, మూగ చెవిటి గుడ్డి వారికి మరియు వికలాంగులకు సంక్షేమ గృహాలు నిర్మించండి. కనీస వసతి సౌకర్యాలు లేని గ్రామాల్లో అవసరమైన వసతి సౌకర్యాలను ఏర్పరచండి, గ్రంథాలయాలు నిర్మించండి, మహిళా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టండి..... మరియు "**అహం బ్రహ్మాస్మి అంటే నేనే దైవం**" అనే పరమ సత్యాన్ని సాధన ద్వారా అనుభవపూర్వకంగా తెలుసు కోవడానికి మరియు సాధన చేసుకోవడానికి ధ్యాన కేంద్రాలు

నిర్మించండి కానీ బోధనలు చేయకండి. ఒక సద్గురు చేత బోధనలు చేయించండి. ఏవైనా ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేయండి అప్పుడు మీకు పుణ్యం వస్తుంది పైగా భగవంతుడు కూడా మీ పట్ల ఆనందాన్ని ప్రకటిస్తాడు. ఆయన మన పట్ల ఎల్లప్పుడూ ఆనందాన్ని ప్రకటిస్తూనే ఉంటాడు, కాకపోతే ఇలాంటి సత్కార్యాలు చేసినప్పుడు ఇంకా ఎక్కువగా మీ పట్ల ఆనందాన్ని ప్రకటిస్తాడు. భగవంతుడు సృష్టి సర్వస్వంలోనూ ఉన్నాడు. ఆయనను ప్రత్యేకంగా ఒక విగ్రహంలోనో, ఒక మందిరంలోనో, ఒక ఫోటోలో మాత్రమే ఉన్నాడు అని అనుకోవడం శుద్ధ అజ్ఞానం ! భగవంతుడు అంతటిలోనూ, అందరిలోనూ ఉన్నాడు. ఆయన సర్వ వ్యాపి మరియు సర్వంతర్యామి కూడా ! భగవంతుడికి మందిరాలు అవసరం లేదు. ఇప్పటికే చాలానే మందిరాలు ఉన్నాయి అవి చాలు. మన మనసునే మందిరంగా నిర్మించాలి. అయినా శ్రీ కృష్ణ పరమాత్ముడు ఉత్తర గీతలో చాలా స్పష్టంగా, కుండ బద్దలు కొట్టినట్టుగా ప్రకటించాడు కదా ! దేహమే దేవాలయం అని ! అంటే ప్రజలందరూ నడిచే దేవాలయాలన్నమాటే కదా ! ఆ తర్వాత జీవుడే దేవుడు అని అన్నాడు, అంటే మనుషులందరూ సాక్షాత్తు దేవుళ్ళే అని కదా అర్థం. దేవాధిదేవుడైన శ్రీ కృష్ణ పరమాత్ముడే స్వయంగా, ఇంత స్పష్టంగా ఆదేశించినప్పుడు మనం ఏం చేస్తున్నాం ?!

ప్రాణం ఉన్న దేవాలయాలను వదిలేసి, రాళ్ళతో దేవాలయాలను నిర్మించడానికి ఉత్సాహం చూపెడుతున్నాం. నడిచే సాక్షాత్ దైవ స్వరూపాలను విస్మరించి చలనం లేని విగ్రహాల సేవలో నిమగ్నమై ఉన్నాం. నేను దేవాలయాలను కానీ, దైవ విగ్రహాలను కానీ అవమానించటం లేదు, తప్పు పట్టటం లేదు. దయచేసి గ్రహించ గలరు. ప్రస్తుతం భూమి పైన ఉన్న దేవాలయాలకు + దైవ విగ్రహాలకు నా ప్రేమ పూర్వక వందనం. నేను మనవి చేసుకునేది ఏమిటంటే, దేవాలయాల మరియు దేవుళ్ళ పేరు చెప్పి మతాధికారులు ప్రజలను భయపెడుతూ వారిని అసలు సత్యానికి దూరంగా ఉంచుతున్న విషయం గురించే నేను ప్రస్తావిస్తున్నాను.

నాలుగు వేద మహా వాక్యాల సారం "నేనే దైవం" ! సకల వేద, శాస్త్ర సారమైన భగవద్గీతలో మరియు ఉత్తర గీతలో శ్రీ కృష్ణ పరమాత్ముడు ఎన్నో శ్లోకాల్లో చాలా స్పష్టంగా తెలియ జేసాడు "అందరూ దేవుళ్ళేనని, అందరిలోనూ పరమాత్ముడు ఉన్నాడనీ, నీ లోపల ఉన్న పరమాత్ముడిని తెలుసుకోడానికి యోగ సాధన చేయమని ఆదేశించాడు కదా " మరి ఈ విషయాలు తప్ప మతాధికారులు మిగతావన్నీ చెబుతూ ఉంటారు. అసలు విషయం ప్రజలకు ఎందుకు చెప్పటం లేదు ? అని అంటే అసలు రహస్యం ప్రజలకు తెలిస్తే ఇక ప్రజలు వీళ్ళ గుప్పిట్లో ఉండరు కదా ! ప్రతీ ఒక్కరు ధ్యాన సాధన చేసి తమ లోపల ఉన్న పరమాత్మను అనుభవ పూర్వకంగా తెలుసుకుని మోక్షం పొందుతారు. ఇలా జరిగితే మరి ఈ మతాధికారుల దుకాణాలు మూత పడతాయి కదా ! అందుకే వాళ్ళు ఆ శాస్త్రంలో అది ఉంది, ఈ శాస్త్రంలో ఇది ఉంది, అని ఏవేవో చెబుతూ ప్రజలను అంధాకారంలోనే ఉంచేస్తున్నారు. మతాధికారులు ప్రజలకు అసలు విషయాలను తెలియ జేయకుండా దాచిపెట్టి, అనవసరమైన విషయాలను స్వార్థ పూరితంగా బోధిస్తూ, ప్రజలను భయపెడుతూ తమ గుప్పిట్లో బంధించి ఉంచారు.

మతం(దేవుడి) పేరుతో ఈ భూమి

పైన ఎన్నెన్ని సార్లు రక్తపాతాలు

జరిగాయో, జరుగుతూ ఉన్నాయో అందరికీ

తెలుసు! మత రహిత,

కుల రహిత నవీన సమ సమాజ

నిర్మాణ ధ్యేయమే మనందరి

జీవిత ఏకైక లక్ష్యం కావాలి.

అందరూ దేవుళ్ళే ! అంతా దైవమే ! మనమే దైవం, మన లోపలే పరమాత్ముడు ఉన్నాడు. ఈ సత్యాలను ఉత్తర గీతలో **శ్రీ కృష్ణ పరమాత్ముడు** ఈ కింది శ్లోకాల్లో చాలా సుస్పష్టంగా తెలియ జేసాడు. దయచేసి శ్రద్ధగా చదివి అవగాహన చేసుకోండి. ఈ సత్యాలను అందరికీ తెలియ జేయండి. కేవలం తెలియచేయాలి. మీరు బోధించకూడదు. గురువు మాత్రమే బోధించాలి.

శ్లో ॥ దేహోదేవాలయః ప్రోక్తో జీవోదేవ స్సనాతనః ।
త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోఽహం భావేన పూజయేత్ ॥

- ఉత్తర గీత - 4 : 27

వివరణ : దేహమే దేవాలయము, జీవుడే దేవుడు. ఆ జీవుడే నీవు. కాబట్టి మూర్ఖత్వాన్ని వదిలి జ్ఞానంతో "నేనే దైవం" అనే భావనతో పూజించ వలెను. పూజ అంటే గౌరవించడం, ఆరాధించడం, ప్రేమను ప్రకటించడం అని అర్థం. అంటే దైవమే నీవు అని తెలుసుకుని నిన్ను నీవు గౌరవించు కోవాలి, ఆరాధించుకోవాలి, ప్రేమించుకోవాలి అప్పుడే అందరి పట్ల, సర్వం పట్ల నీవు గౌరవ, ఆరాధన, ప్రేమ భావాలను ప్రకటించి నీవు ఆనందంగా ఉండగలగడమే కాకుండా అందరి ఆనందానికీ కారణం అవుతావు అని గూఢార్థం.

పూజ అంటే అర్థం "గౌరవం" అని అంతే ! మరింకేమీ కాదు !

శ్లో ॥ బహిర్భ్రామ్యతియఃకశ్చి త్త్యక్త్వాదేహస్థ మీశ్వరమ్ ।
స్వగృహే పాయసంత్యక్త్వా భిక్షా మటతిదుర్మతిః ॥

- ఉత్తర గీత - 4 : 28

అర్థం : దేహంలో ఉన్న పరమాత్మను వదిలి వేసి, పట్టించుకోకుండా బయట దేవుడున్నాడని భ్రమించి, దేవుడి కోసం బయట వెతికే వారు స్వంత ఇంటిలో ఉన్న పాయసాన్ని వదిలిపెట్టి, బయట భిక్షాన్నం కొరకు తిరిగే భిక్షగాళ్ళలాంటి వారు, అని అర్థం.

భగవంతుడి ప్రతిరూపాలైన ప్రజలకు సేవ చేయకుండా, భగవంతుడికేదో చేద్దామనే ఆలోచన పిల్లకాయ తనం ! అందరి అంతరంగాలే ఆయన కొలువై ఉన్న మందిరాలు. మన లోపల మందిరంలో విరాజిల్లుతూ ఉన్న భగవంతుడిని పట్టించుకోకుండా, లోపలి మందిరాన్ని కానకుండా బయట ఎన్ని మందిరాలు నిర్మించినా ప్రయోజనం శూన్యం.

ఒక సారి నిజంగా ఆలోచించండి, మనం ఆ పరమాత్ముడికి ఏం సమర్పించుకున్నా అది ఆయన ఇచ్చిందే కదా ! ఆయన ఇచ్చిన దానిని ఆయనకే తిరిగి ఇవ్వడమనేది ఎంత హాస్యాస్పదమో ఆలోచించండి. మీ పిల్లలు మీ జేబులో నుండే డబ్బులు తీసి మళ్ళీ మీకే తిరిగి ఇస్తూ ఏదో పొడిచేసినట్టు ఫీలవుతే మీకెలా ఉంటుంది ? మీరు ఏమీ అనలేక మౌనంగా ఉంటారు. అదే... మీ పిల్లలు వాళ్ళ స్వయం కృషితో ఏదో ఒక మంచి పని చేసి, ఏదో ఒకటి సంపాదించి మీకు చూపెడితే అప్పుడు మీరు సంతోషిస్తారు. అవునా... కాదా ? అయితే, భగవంతుడు మాత్రం మన నుండి ఏమీ కోరడు. ఆయన కోరుకునేది మనం ఆనందంగా ఉండాలని ! మన ఆనందం కోసం ఆయన ఎల్ల వేళలా కృషి చేస్తూనే ఉంటాడు. మనల్ని ఒక్క క్షణం కూడా వదలి పెట్టకుండా, మనల్ని సంరక్షిస్తూనే ఉంటాడు. మనకు ఆ భగవంతుడు తనను తాను సంపూర్ణంగా, సమగ్రంగా ఏనాడో సమర్పించుకున్నాడు. మనం ఆయనను గుర్తించాలి. కేవలం ఆయన ఆశీర్వాద అనుగ్రహాలను, వరాలను, రక్షణలను, అనుమతించాలి. నిజానికి అనుమతించడం కూడా, ఆ భగవంతుడి ప్రేరణ మరియు సహాయ సహకార సమన్వయాల వల్లనే జరుగుతుంది.

ఎవరి దైవత్వాన్ని వారు అనుభవ పూర్వకంగా తెలుసుకోవడం అని అంటే దైవాన్ని తెలుసుకోవడమే ! దైవాన్ని తెలుసుకోవడం అంటే దైవంగా పరిణమించడమే ! మన దైవత్వాన్ని మనం అనుభవ పూర్వకంగా తెలుసుకుని తీరాలి మిత్రులారా ! మన దైవత్వాన్ని మనం తెలుసుకునేందు కోసమే ఈ నిస్వార్థ సేవా సాధన !

నిస్వార్థ సేవ అందరూ చేయలేరు. చేసినా మర్చిపోలేరు, నిస్వార్థంగా చేసి మర్చిపో గలిగే మంచి వారి కోసం ఇదంతా చెప్తున్నాను.

ప్రియ మిత్రులారా ! ~~ఈ~~ నిజమైన ఆధ్యాత్మిక విజ్ఞానం తెలుసుకోండి. ఇది అందరికీ చేరవేయండి. కేవలం తెలియ చేయండి. క్లాసులు, బోధనలు చేయకండి. ఎన్నో జన్మలుగా మీరు మతాధికారుల చేత మోసపోతూ ఉన్నారు. జన్మ చక్రంలోనే ఇరుక్కుని ఉన్నారు. మేలుకోండి.

దయచేసి ఒక సారి ప్రశాంతంగా ఆలోచించండి. భగవద్గీతలో కాని, ఉత్తర గీతలో కాని శ్రీ కృష్ణ పరమాత్ముడు కేవలం ఆత్మ విజ్ఞానం గురించి మరియు యోగ సాధన గురించి మాత్రమే చెప్పాడు కాని, మూఢ మత కార్యకలాపాల గురించి చెప్ప లేదు.

సేవనే సహాయం అని అంటారు. సేవ అని అంటే దానం అని కూడా అర్థం. కేవలం మన కోసం, మన కుటుంబం కోసం మాత్రమే కాకుండా అందరి గురించీ ఆలోచించాలి. మనకు సరిపడా ఉంచుకున్న తర్వాత మిగితాది దానం చేయాలి. దానం వలన మీ అంతరంగం పరిశుద్ధం అవుతుంది. అంతరంగం పరిశుద్ధం అవుతే శరీరం + జీవితం పరిశుద్ధం అవుతాయి. పరిశుద్ధమైన అంతరంగంలో మోక్షం ప్రకటం అవుతుంది. కాబట్టి నిరంతరం దానాలు చేస్తూ ఉండాలి. అందరినీ ప్రోత్సహిస్తూ ఉండాలి. అయితే దానాల్లో చాలా రకాలున్నాయి. ఎక్కువ ఫలితాలను ఇచ్చే దానమే చేయాలి. పరమోత్తమ దానం వల్లనే కదా మనల్ని మనం ఉద్ధరించుకునేది. మనం బాగుపడేది.

అన్ని దానాలలో కెల్లా అన్న దానం గొప్పది.

అన్న దానం కన్నా రక్త దానం గొప్పది.

రక్త దానం కన్నా అవయవ దానం గొప్పది.

అవయవ దానం కన్నా ప్రాణ దానం గొప్పది.

ప్రాణ దానం కన్నా ఆత్మ విజ్ఞాన దానం గొప్పది.

ఆత్మ విజ్ఞాన దానమే అన్ని దానాలలో కెల్లా ఉత్కృష్టమైనది ! ఉత్తమోత్తమమైనది ! ఉన్నతోన్నతమైనది ! అత్యుత్తమమైనది ! అత్యున్నతమైనది ! సర్వోత్తమమైనది ! సర్వోన్నతమైనది ! పరమ పవిత్రమైనది ! పరమోత్తమమైనది ! పరమోన్నతమైనది !

అన్నింటి కంటే ఆత్మ విజ్ఞాన దానం ఏ విధంగా గొప్పది ?.....

....."మానవుడు" అని అంటే మూడు పరిధులను కలిగి ఉన్న ఈ భూ గ్రహం పైన మానవ శరీరం ధరించి ఉన్న "దైవం" అని అర్థం ! దైవమే మానవ శరీరం ధరించి, తన ఆత్మ శక్తిని అనేకానేకమైన కోణాల్లో, అనేకానేకమైన రకాలుగా, విధాలుగా ప్రయోగించి, తన ఆత్మ శక్తి పట్ల అవగాహనను పెంచుకోడానికి ఈ భూమి పైకి వచ్చింది. ఈ క్రమంలో ఎన్నెన్నో విభిన్నమైన జన్మలను ఎత్తుతూ అనుభవ జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉంటుంది. అయితే సాక్షాత్తు దైవమే అయి ఉన్న ఆత్మ భౌతిక శరీరంలోకి ప్రవేశించగానే తనను తాను మరచి పోతుంది. ఈ విధంగా తమను తాము మరచిపోయిన దైవాలే మానవులందరు కూడా ! మరచిన తమ దివ్యత్వాన్ని పొందడం కంటే మరేదీ కూడా గొప్పది కాదు. మీరు ఏ సహాయం చేసినా అది తాత్కాలికమే !

మళ్ళీ ఏదో ఒక కష్టమో, నష్టమో ఏదో ఒక దానికి గురవుతూనే ఉంటారు. ప్రాణం పోయినా మళ్ళీ జన్మించి మళ్ళీ కష్టాలపాలవుతూనే ఉంటారు. ఆత్మ విజ్ఞాన అవగాహన లేకుండా చూస్తే మరణం చాలా పెద్ద విషయం లాగా కనపడుతుంది. ఆత్మ విజ్ఞాన అవగాహనతో చూస్తే "మరణం" అనేది కేవలం ఒక "మార్పు" మాత్రమే ! మనం ఏ విధంగానైతే ప్రతి రోజూ దుస్తులను మారుస్తూ ఉంటామో, సరిగ్గా అదే విధంగా ఆత్మ కూడా ఒక శరీరాన్ని వదిలేసి ఇంకొక శరీరాన్ని ధరిస్తూ ఉంటుంది. ఇది చాలా సహజమైన సత్యం ! కాబట్టి మీరు ఒకరికి ప్రాణ దానం చేసినా, వారు ఎల్లప్పుడూ అదే శరీరంలో ఉండరు కదా ! ప్రాణ దానం అంటే నిజానికి ఏమిటి ? శరీరంలో ఉన్న ఆత్మ, శరీరాన్ని ప్రమాద వశాత్తు వదిలి పోకుండా చేయటం. దీనినే ప్రాణ దానం అని అంటారు. ఇది చాలా గొప్పదే ! అయితే దాని వలన జరిగిదేమిటి ? ఇంకొంత కాలం పాటు ఆ యొక్క ఆత్మ ఆ శరీరంలోనే ఉండ గలుగుతుంది. కాని ఎప్పుడో ఒకప్పుడు తప్పని సరిగా, ఆ యొక్క ఆత్మ విభిన్నమైన అనుభవ జ్ఞానం కోసం ఆ యొక్క శరీరాన్ని వదిలి తీరాల్సిందే ! ఆ విధంగా శరీరాన్ని వదిలి మళ్ళీ జన్మించి, మళ్ళీ మరణించి..... ఈ రకంగా జన్మ చక్రంలో పడి తిరుగుతూ ఉండ వలసిందే ! ఎప్పుడైతే ఆత్మ తన సహజ తత్వమైన దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటుందో అప్పుడు ఆ ఆత్మకు ఈ జన్మ చక్రం నుండి విముక్తి లభిస్తుంది. దానితో ఆ ఆత్మ దివ్య లోకాలకు వెళ్ళి పోతుంది. అక్కడికి వెళ్ళిన తర్వాత విషయం అక్కడి ప్రకారంగా ఉంటుంది, ముందైతే అక్కడికి వెళ్ళాలి కదా ! **కాబట్టి ఎవరికైనా తమ నిజతత్వమైన దైవత్వం గురించి తెలియజేసి వారిని తమ దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకునే దిశలో ముందుకు తీసుకు వెళ్తే అది నిశ్చయంగా అన్నింటి కంటే పరమోత్తమ సహాయం అవుతుంది.**

✪ మీరు చేసే ఏ సహాయం కూడా మానవుడిని జన్మ చక్రంలో నుండి కర్మ చక్రంలో నుండి బయట పడవేయలేదు. కేవలం ఆత్మ విజ్ఞాన + ధ్యాన దానమే మానవుడిని మళ్ళీ, మళ్ళీ జన్మించే ప్రయాస నుండి తప్పించి శాశ్వతమైన బ్రహ్మానంద ప్రాప్తిని కలుగ జేస్తుంది. కాబట్టే సరైన మతరహిత అత్యున్నత ఆత్మ విజ్ఞాన దానమే నిజంగా, ఖచ్చితంగా అన్నింటి కంటే పరమోన్నతమైనది. ఈ కారణం వల్లనే అందరికీ దివ్య జ్ఞానాన్ని అందించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

మీరు ఏ పని చేసినా సరే చివరికి ఈ పని మాత్రం చేసి తీరవలసిందే. ఎప్పటికైనా చేసి తీరాల్సిందే కాబట్టి ఆ పనేదో ఇప్పుడే మొదలు పెట్టేస్తే ఓ పని అయిపోతుంది కదా ! కాబట్టి నా ప్రియ మిత్రులారా ! మీ సర్వ కష్టాల్లో నుండి, మీరు తక్షణమే బయట పడాలని అనుకుంటే ఈ క్షణమే సేవ చేయడం ప్రారంభించండి. శ్రేయస్కరమైన పనులు ఎప్పుడు కూడా తక్షణమే మొదలు పెట్టాలి. కాళ్ళు చేతులు ఆడుతున్నప్పుడే, పరిస్థితులు సరిగా ఉన్నప్పుడే సేవ చేయడం మొదలు పెడితే మిమ్మల్ని మీరు రక్షించుకున్న వారవుతారు. కర్మ పండినప్పుడు తప్పని సరిగా చేయాల్సి వస్తుందనుకోండి అది వేరే విషయం ! పరిస్థితి అంత వరకు రాక ముందే మన పట్ల మనం మేలుకుని సేవ చేయడం ప్రారంభిస్తే ఎంతో శ్రేయస్కరం !

అకర్మ వీగనిజమ్ + ధ్యాన + ఆత్మ విజ్ఞాన ప్రచారం చేసే సంస్థలకు స్థిర, చరాస్థులను ఇవ్వగలిగినంత ఇస్తే అంతకు మించిన దానం(సేవ) మరొకటి లేదు. అకర్మ వీగనిజమ్ + ధ్యాన + ఆత్మ విజ్ఞాన ప్రచారం చేసే సంస్థలు ఎన్నో ఉన్నాయి. వాటిలో మీకు దేనికి ఇవ్వాలనిపిస్తే దానికివ్వండి.

మీ శరీరం + జీవితంలోని సమస్యలు త్వరగా, శాశ్వతంగా పోవాలంటే దానం(సేవ) అత్యంత ప్రధానమైన మార్గం. ఎంత వీలైతే అంత నిస్వార్థ దానం (సేవ) చేయండి. "ఇవ్వండి, ఇస్తేనే పుచ్చుకునేందుకు అర్హులవుతారు".

✪✪✪ మీరు ఇవ్వకుండా ఉంటే మీకు ఏదీ రాదు. ప్రస్తుతం మీరు ఏమైనా కలిగి ఉన్నారంటే, అది ఒకప్పుడు మీరు ఇచ్చి ఉంటేనే ఇప్పుడు కలిగి ఉన్నారని అర్థం చేసుకోండి. ఒక వేళ ఇవ్వకుండా మీరు ఉంటే, మీ చుట్టూ ఒక అడ్డు గోడను మీరు నిర్మించుకునే ఉన్నట్టు అర్థం. దాని వల్ల ఎవరైనా మీకు ఏదైనా ఇవ్వాలన్నా ఇవ్వలేరు, మీరు దాన్ని తీసుకోలేరు. ఇవ్వకుండా మీరు ఉన్నప్పుడు, ఇచ్చే గుణం మీకు లేనప్పుడు మీరేం చేసినా సరే, మీకు ఏదీ కూడా దక్కదు. అది అసంభవం. ఇవ్వడం పొందడం ఒక్కటే అని గుర్తుంచుకోండి, ఇచ్చేందుకు మీరు చేస్తున్న శ్రమ పొందేందుకేనన్న ఎరుకను కలిగి ఉండండి. ఇస్తూ పోతూ ఉంటే వస్తూనే ఉంటాయి. ఒకటిస్తే కనీసం వేయి రెట్లు పొందుతాం.

✪ మీ దగ్గర ఏం ఉంటే అది ఇవ్వండి. మీకేం కావాలో దానిని పొందే అర్హత అప్పుడొస్తుంది మీకు. అంతకు ముందు

మాత్రం రాదు.

✪ ఇవ్వడమంటే తీసుకోవడమేనని అర్థం చేసుకోండి. ఇది పరమ సత్యం ! ఇచ్చే ఆలోచనలు చేయలేని వారే, పొందే ఆలోచనలు చేయలేరు.

✪ మీకు ఇచ్చేందుకు సమయం లేకపోతే, పొందేందుకూ సమయం ఉండదు.

✪ ఇచ్చే మార్గమే పొందే మార్గం. ఇచ్చి మర్చిపోవాలి.

✪ ఇవ్వని వారికే, ఇవ్వలేని వారికే, పొందలేము అని అనిపిస్తుంది.

✪ ఇచ్చేందుకు పరిశ్రమ చేయకపోతే, పొందే ద్వారాలు తెరుచుకోవు.

బంగారం, నగలు, వజ్రాలు ఇవి మీకు ఎలాంటి శ్రేయస్సును అందించవు. ప్రాక్టికల్‌గా చేసి తెలుసుకోండి. ఇరవై వేల రూపాయల విలువ చేసే బంగారం గొలుసులను రెండింటిని, మీ మెడలో ఒక వారం ధరించండి. మీలో ఏం మార్పు వచ్చిందో గమనించండి. వారం తర్వాత ఆ రెండు గొలుసులలో ఒక దానిని అమ్మేసి ఎవరికైనా నిస్వార్థంగా, సహాయం చేయండి. అప్పుడు చూడండి, మీ లోపల మార్పును. ఒక సరి అయిన

సహాయం మీ జీవితాన్ని మార్చేస్తుంది.

డబ్బులు, బంగారం, భూములు, ఆస్తులు ఉండి కూడా సేవ(దానం) చేయక పోతే మీ జన్మ వృథా అని అనడంలో అతిశయోక్తి లేనే లేదు.

ఏ క్షణంలో ఎవరు, ఎప్పుడు, ఎలా చస్తారో..... తెలియదు ! పోయేటప్పుడు మీ వెంట మీరేమీ తీసుకుపోలేరు. అవకాశం ఉన్నప్పుడే, మీకున్న దాంట్లో, మీకు వీలైనంతగా నిస్వార్థ సేవ చేయండి. అప్పుడు మీకు కనీసం వచ్చే జన్మ అయినా మంచి ఉన్నత జన్మ దొరుకుతుంది.

✪ ఇచ్చేందుకు మీరు చేస్తున్న పరిశ్రమయే, పొందేందుకూ సహాయ సహకార సమన్వయాలను అందించి మీకు కావాల్సింది, కావాల్సిన రీతిలో, మీరు అనుకున్న దాని కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా మీకు అందిస్తుంది.

✪ ఇచ్చేందుకు అడ్డం పడేదే, పొందేందుకూ అడ్డం పడుతుంది.

✪ ఇచ్చేందుకు అడ్డంకులను తొలగించుకుంటే, పొందేందుకూ అడ్డంకులను తొలగించుకున్నట్టే.

✪ ఇవ్వడానికి భయపడే వారు, పొందేందుకూ భయపడతారు.

✪ ఇచ్చేందుకు ఎన్ని షరతులు పెడితే, పొందేందుకూ అన్ని షరతులు వర్తిస్తాయి.

✪ ఇవ్వాలి, ఇస్తూనే పోవాలి. ఎంత ఇస్తే అంతకు వేల రెట్లు పొందుతారు.

✪ గుర్తుంచుకోండి బేషరతుగా ఇవ్వాలి, ఏ ఫలితాన్ని ఆశించకుండా ఇవ్వాలి, అప్పుడే అది నిజమైన దానం(సేవ).

✪ ఇవ్వడం అని అంటే సంపాదించు కోవడం అని అర్థం. "నీళ్ళు" అని అన్నా "జలం" అని అన్నా ఒకటే కదా ! అదే విధంగా "ఇవ్వడం" అని అన్నా "సంపాదించడం" అని అన్నా ఒకటే ! "ఇవ్వడం" యొక్క పర్యాయ పదమే "సంపాదించడం" !

నిస్వార్థ దానం & సేవ గురించి, దాని యొక్క మహత్యం గురించి గ్రాండ్ మాస్టర్స్ ఇలా చెప్తారు.....

✪ ఇవ్వండి ! మీరిచ్చింది వేయింతలై మీకు తిరిగి వస్తుంది - రాంపా

✪ మీరేం ఇస్తే అంతకు వేయి రెట్లు మీరు తిరిగి పొందుతారు - విశ్వ నియమం

✪ రాంపా అంటాడు - "మీకున్న దానిలో నుండి 10% ఇవ్వండి. దీని వలన మీరెంతో అభివృద్ధి చెందుతారు అని చెప్తాడు. మీరు సంపాదిస్తున్న దానిలో నుండి లేక మీకు వస్తూ ఉన్న దానిలో నుండి మీరు 10% ఇస్తూనే పోవాలి అప్పుడు అంతకు వేయి రెట్లు తిరిగి పొందుతారు" అని చెప్తాడు.

✪ లిండా గుడ్‌మ్యాన్ ఇలా అంటుంది - "మీరు సంపాదిస్తున్న దానిలో నుండి లేక మీకు వస్తున్న దానిలో నుండి 50% ఇచ్చేయండి. అంతకు వేల రెట్లు మీరు తిరిగి పొందుతారు" అని.

✪ మిఖైల్ నైమి ఇలా ప్రకటిస్తాడు - "ఇవ్వండి, అంతా ఇచ్చేయండి ! అంతా ఇచ్చిన వాడికి అంతా ఉంటుంది" అని.

✪ మీరు ఇచ్చింది ఎన్ని రెట్లై తిరిగి వస్తుందనేది మీ భావం పైన ఆధారపడి ఉంటుంది. మీరు అవగాహనతో, ప్రేమగా, శ్రద్ధతో, నిస్వార్థంగా ఇచ్చినప్పుడు మీరు చేసిన సహాయం "కోటి" రెట్లై మీకు అందుతుంది. ఇక్కడే చాలా మంది కన్‌ఫ్యూజ్ అవుతుంటారు. నిస్వార్థంగా ఇవ్వమంటున్నారు, మళ్ళీ అది "కోటి" రెట్లై తిరిగి వస్తుందంటున్నారు. నేను ఇచ్చేది నాకు "కోటి" రెట్లై తిరిగి వస్తుందనే భావం కలిగి ఉండి ఇచ్చినప్పుడు అది "నిస్వార్థ సేవ" ఎలా అవుతుంది ? అది "స్వార్థం" కాదా ? అనే ప్రశ్న ఉదయిస్తుంది.

స్వార్థంలో రెండు రకాలు ఉన్నాయి. అవి:

1. స్వార్థం: మీరు ఒకరికి ఏదైనా సహాయం చేసి తిరిగి వారి నుండే ప్రతిఫలం ఆశిస్తే అది స్వార్థం అవుతుంది. అంటే మీరు "ఫలానా రామా రావు గారికి" సహాయం చేశారు, చేసిన తర్వాత పర్టిక్యులర్‌గా ఆ యొక్క "ఫలానా రామా రావు గారి నుండే" ప్రతిఫలం ఆశిస్తే అప్పుడు అది స్వార్థం అవుతుంది. అప్పుడది కమర్షియల్ ఆక్టివిటి అవుతుంది. అది వ్యాపారం కిందికి వస్తుంది.

2. స్వ - అర్థం: "కళ్ళు మూసుకుని ఉన్నప్పుడు మరియు కళ్ళు తెరచి ఉన్నప్పుడు కనపడేదంతా సృష్టియే, సృష్టిలోని ప్రతి భాగమూ సృష్టియే" - ఈ సృష్టి సూత్ర భావంతో మీరు సహాయం చేస్తే, అప్పుడు మీరు వ్యక్తులకు చేసే సహాయం సృష్టికి చెందుతుంది. ఎందుకంటే అన్నింటితో పాటు వ్యక్తులు కూడా సృష్టిలోని భాగాలే కనుక, భాగాలు అని అంటే సాక్షాత్తు సృష్టియే

కాబట్టి, మీరు ఇతరులకు చేసే సహాయం సృష్టికి చెందుతుంది. నేను ఇతరులకు కాదు సాక్షాత్ సృష్టికే సేవ చేస్తున్నాను అనే సృష్టి భావనతో సహాయం చేస్తారు. ఇక్కడ మీరు ఎవరికైతే సహాయం చేస్తారో వారి నుండి ఏ ప్రతిఫలం ఆశించరు. నేను సృష్టికి ఇస్తున్నాను కాబట్టి సృష్టి నాకిస్తుంది అనే భావనలో ఉంటారు కాబట్టి ఇలా సృష్టి భావనతో సహాయం చేయడం అనేది స్వార్థం కాదు.

✪✪✪ "ఇతరులకు సహాయం చేయడం అంటే మీకు మీరే సహాయం చేసుకుంటున్నారని గ్రహించండి" అనే సృష్టి ఏకత్వ సూత్రం ప్రకారం మీరు ఇతరులకు చేసే సహాయం మీకు మీరే చేసుకున్నట్టు అవుతుంది. మిమ్మల్ని మీరు అభివృద్ధి చెందించుకోడానికి స్వయంగా సృష్టియే మీకు అవకాశం కల్పిస్తూ ఉంది. ఇతరులకు సహాయం చేస్తున్నప్పుడు "**నన్ను నేను అభివృద్ధి చేసుకోవడానికి నాకు ఇది ఒక సువర్ణ అవకాశం. నాకు సహాయం చేసే అవకాశం ఇస్తున్నందుకు మీకు ధన్యవాదాలు" అని మీరు చక్కటి కృతజ్ఞతా భావంతో ఇతరులకు సహాయం చేయడం అనేది స్వార్థం కాదు. "స్వ - అర్థం" అవుతుంది.** "స్వ" అంటే "స్వయం", "స్వయం" అంటే ఆత్మ లేక ఉనికి. "అర్థం" అంటే ఇక్కడ అభివృద్ధి, శ్రేయస్కరం అనే అర్థాలు వస్తాయి. "స్వ - అర్థం" అని అంటే ఆత్మాభివృద్ధి, ఆత్మ శ్రేయస్కరం అనే అర్థాలు వస్తాయి. మీ ఆత్మాభివృద్ధికి, ఆత్మ శ్రేయస్కరానికి మీరు ఇతరులకు సహాయం చేస్తున్నారు. అంటే మీకు మీరే సహాయం చేసుకుంటున్నారు ఇదే భగవద్గీతలో శ్రీ కృష్ణ పరమాత్ముడు మానవులందరికి చెప్పిన "ఉద్ధరేదాత్మానాత్మానం" - అంటే, ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి అని దీని అర్థం. "ఎవరైతే, ఎవరికి వారు సహాయం చేసుకుంటారో దైవం వారికి సహాయం చేస్తుంది" అనే సూత్రం కూడా ఇక్కడ అప్లై అవుతుంది.

✪✪✪ ఈ విధంగా మీరు ఇతరులకు చేసిన సహాయం "కోటి" రెట్లై మీకు అందుతుంది. **ఇది నా స్వానుభవం !**

✪✪✪ "ధైర్యే సాహసే లక్ష్మి" అనే సూత్రం కూడా ఇక్కడ అప్లై అవుతుంది. ఈ సూత్రం యొక్క అర్థం ఏమిటంటే ధైర్యంతో సాహసం చేస్తే లక్ష్మి మాత్రమే వస్తుంది మరొకటి కాదు అని అర్థం ! నాకు సృష్టి ద్వారా అందుతుంది అనే ధైర్యంతో సహాయం చేయండి. తప్పక పొందుతారు, కానీ ఏమీ ఆశించ కుండా ఇచ్చి మర్చిపోవాలి. మర్చిపోలేకపోతే చేయకూడదు !

✪✪✪ మీరు చేసే సహాయాలను బట్టి మీకు ఎన్ని రెట్లు తిరిగి వస్తుంది అనేది నిర్ణయించబడుతుంది. భౌతిక పరమైన సహాయాలు తక్కువ రెట్లుగా తిరిగి వస్తాయి. ఆధ్యాత్మిక సహాయాలు లక్షల రెట్లుగా తిరిగి వస్తాయి. **ఆధ్యాత్మిక సహాయాలు అని అంటే మత పరమైనవి కావు అని, దయచేసి చాలా స్పష్టంగా గుర్తుంచుకోండి !** ఎక్కడైతే మత పరమైన కర్మ కాండలు, మూఢ ఆచార వ్యవహారాలు ఉంటాయో అక్కడ నిజమైన ఆధ్యాత్మికత ఉండదు.

ఆధ్యాత్మికత ఏదో ఒక మతానికి సంబంధించినది కాదు. ఆధ్యాత్మికత యావత్ సృష్టికి సంబంధించినది. మీరు సులభంగా, మెరుపు వేగంతో అభివృద్ధి చెందే ఒక మహా దివ్య సూత్రం చెప్తాను. అది ఎంతటి మహోత్తరమైనదీ అని అంటే సాధారణ బుర్రలకు అందనంత గొప్ప విషయం.

ఈ విషయం గురించి కొంత మంది ఇలా అంటుంటారు - ఇలా ఎవరికి పడితే వాళ్ళకిస్తే, ఇంట్రెస్ట్ లేని వారికిస్తే, అనర్హులకిస్తే అది "అపాత్రాదానం" కాదా ?! అని అడుగుతారు. ఇది ఒక కోణంలో నిజమే ! అందుకే అంటున్నాను కదా నిజమైన శ్రద్ధాసక్తులు గలవారికి మాత్రమే ఇవ్వండి.

అయితే సర్వోన్నతమైన, సర్వ కోణమయమైన ఇంకొక మహా సృష్టి సూత్రం గురించి జీసస్ క్రైస్ట్ ఇలా చెప్తాడు - "మీరు విత్తనాలు చల్లుతూ వెళ్ళండి. అవి నేల మీద పడ్డాయా, రాళ్ళ మీద పడ్డాయా, వాటిని పక్షులెత్తుకుని వెళ్తున్నాయా అని చూడకండి. మీరు విత్తనాలు చల్లుతూ వెళ్ళండి అంతే ! అవి ఎక్కడ పడ్డా మీకు జరిగే శ్రేయస్కరం మీకు జరుగుతుంది" అని. క్రీస్తు పరమాత్ముడు చెప్పిన ఈ మహా సృష్టి సూత్రం యొక్క వివరణ ఏమిటంటే - మీరు ఆత్మ విజ్ఞానాన్ని పంచుతూ వెళ్ళండి. మీరు చల్లే ఆత్మ విజ్ఞాన విత్తనాలు ఎక్కడ పడినా అవి మొలకెత్తియే తీరుతాయి. వాటిని మొలకెత్తకుండా ఉంచే శక్తి యావత్ సృష్టి లోనే లేదు. ఒకరికి, ఒక పుస్తకం ఇచ్చారు, ఆ వ్యక్తి తీసుకున్నాడు అంతే ! బీజం పడిపోయింది లోపల ! మీరు కేవలం బీజం వేయాలి అంతే, మిగతా పని ఆ వ్యక్తి యొక్క పూర్ణాత్మ, గైడింగ్ మాస్టర్స్, మూల చైతన్యం చూసుకుంటారు.

నిస్వార్థంగా పంచుతూ వెళ్ళండి. "పంచబడింది పెంచబడుతుంది" ! లోపల పిసినారి గుణం పెట్టుకుని, దానికి అర్హత, అనర్హత అనే

ముసుగు వేయద్దు. మీరు ఇస్తే గానీ పొందలేరు.

ఒకవేళ మీరు చేసిన లేక చేయబోతున్న సేవ(దానం) పట్ల మీకు ఏవైనా అనుమానాలు కలిగితే మీరు చేసిన లేక చేయబోతున్న సేవ(దానం) ద్వారా, శ్రేయస్కరం జరగాలని కోరుకోండి. ఆ తర్వాత మీరు చేసిన లేక చేయబోతున్న సేవ(దానం) పట్ల "సత్యం ప్రేమ ఎరుక సరైన అవగాహన"లను ప్రకటించండి. అప్పుడు మీరు చేసిన లేక చేయబోతున్న సేవ(దానం) యొక్క ఫలితాలు తక్షణమే మీకు - ఆత్మ పరంగా, మానసికంగా, భౌతికంగా మరియు అన్ని రకాలుగా అంది తీరుతాయి. మీరు చేసిన లేక చేయాలనుకుంటున్న సేవ(దానం) పట్ల, మీరు "సత్యం ప్రేమ ఎరుక సరైన అవగాహన"లను ప్రకటించినప్పుడు - మీరు దివ్యమైన సేవనే(దానాన్నే) చేసిన వారు అవుతారు. మీ సేవ(దానం), అపాత్రా దానం కానీ గుడ్డి దానం కానీ కాలేదు. మీ సేవ(దానం) కేవలం దివ్యమైనది మాత్రమే అయి, మీకు అన్ని రకాలుగా దివ్యమైన ఫలితాలను, తక్షణమే అందిస్తుంది.

మీరు వ్యాపారస్తులైతే అనూహ్యమైన లాభాలు వస్తాయి. మీరు ఉద్యోగస్తులైతే ఏదో విధంగా మీరు పొందుతారు. ఒక వేళ మీరు ఏ వృత్తి ఉద్యోగ వ్యాపారం చేయకుండా కేవలం సత్య ప్రచారం చేసే వారైతే, ఎవరో ఒకరు మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి మీకు డబ్బు ఇంకా ఇతర అన్ని సహాయ సహకార సమన్వయాలను అందిస్తారు.

ఒక వ్యక్తి నిస్వార్థంగా ఇవ్వడానికి సిద్ధ పడ్డాడు అని అంటే అతడు సృష్టి నుండి పొందడానికి సిద్ధ పడ్డట్టే !

ప్రస్తుతానికి మీ దగ్గర పంచడానికి నిజంగా, వాస్తవంగా ఏమీ లేకపోతే ధ్యానంలో కూర్చుని ప్రపంచంలో డబ్బు లేక బాధ పడుతున్న వారిని, బాధలు పడుతున్న వారిని తలుచుకుని వారికి మీ యొక్క "ఆత్మనిధిని + ఆత్మశక్తిని" రిలీజ్ చేయండి. గాఢంగా రిలీజ్ చేయండి. ఈ విధంగా నిజంగా చేస్తే మీరు తక్షణమే ఆరోగ్య ఐశ్వర్యాలలో మునిగి తేలుతారు. మీకు ఆరోగ్య ఐశ్వర్యాలు

రాలేదంటే - మీరు సరిగా, నిజంగా రిలీజ్ చేయలేదనేది స్పష్టం. అయ్యే వరకు చేయాలి.

నాకే లేదు ఇతరులకు ఎక్కడ నుండి రిలీజ్ చేయగలుగుతాను అని మీరు అనుకునే అవకాశం ఉంది. మీరు ఇంత వరకు ఎవరికీ ఏమీ ఇవ్వనందుకే మీకు అలా అనిపిస్తూ ఉంది. ఎందుకంటే ఇవ్వడమే పొందడం ! ఇస్తేనే పొందగలుగుతారు. నాకేదైనా వస్తే అప్పుడు ఇవ్వగలుగుతాను అని మీరు అనుకుంటారు. ఇది తప్పు. మీరేదైనా ఇస్తేనే పొందగలుగుతారు ఇది నిజం. ఇవ్వడానికి మీ దగ్గర అనంతమైన ఐశ్వర్యం + శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. మీ లోపల నిక్షిప్తమై ఉన్న అనంతమైన ఆత్మనిధి + శక్తి సామర్థ్యాలు మీకు అందుబాటులోకి రావాలంటే ముందు మీరు ఇతరులకు పంచాలి. అలా పంచితే మీకు ఎన్నో రెట్లుగా తిరిగి వస్తుంది. నిజానికి తిరిగి రావడం అంటూ ఏమీ ఉండదు. మీ లోనే ఉద్భవిస్తుంది. మీలోనే ఉన్నవి మీ అందుబాటులోకి వస్తాయి అంతే ! మీరు ఇతరులకు పంచి ఇచ్చినప్పుడే వాటిని మీరు అనుభవించగలుగుతారు. ఈ క్షణమే ధ్యానంలో కూర్చుని పంచివేయండి. మీ అనంతమైన ఆత్మశక్తిని + ఆత్మనిధిని ఇతరుల(మీ) కోసం రిలీజ్ చేసేయండి. మీరు నిజంగా రిలీజ్ చేసినప్పుడు మీకు 100% గ్యారంటీగా ఫలితాలు వస్తాయి. రాలేదంటే మీరు సరిగా, నిజంగా రిలీజ్ చేయలేదనేది సుస్పష్టం !

"మీలో ఉన్న అనంతమైన ఆత్మ నిధిని + ఆత్మశక్తిని మీ అందుబాటులోకి తెచ్చుకునే ఏకైక మార్గమే - పంచే మార్గం" ! ఇతరులకు రిలీజ్ చేయడమంటే మీకు మీరు రిలీజ్ చేసుకోవడమేనని గ్రహించండి. సృష్టి అంతా ఒకటే కాబట్టి ఒకరికొకరు సహాయం చేసుకోవాలి, సహకార సమన్వయాలతో అందరూ కలిసి మెలసి జీవించాలి అనే ఉద్దేశంతోనే ఈ నియమం ఉంది.

కొంత మంది గ్రేట్ మాస్టర్లు సర్వ ప్రయోజనం కోసం గొప్ప, గొప్ప స్పిరిచ్యువల్ ప్రాజెక్ట్‌లు చేస్తుంటారు. మీరు ధ్యానంలో కూర్చుని ఆ మాస్టర్స్ యొక్క ప్రాజెక్ట్‌లను తలుచుకుని, వారి ప్రాజెక్ట్‌లు తక్షణమే భౌతికంగా నెరవేరడానికి అవసరమయ్యే "ఆత్మ నిధిని + ఆత్మశక్తిని" సంపూర్ణంగా రిలీజ్ చేస్తున్నాను అని గాఢంగా రిలీజ్ చేయండి. మీరు నిజంగా రిలీజ్ చేసిన తక్షణమే మీ జీవితం ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలతో విరాజిల్లుతుంది.

☸ ప్రధానంగా మీరు చేయాల్సింది ఈ విధంగా మీరు రిలీజ్ చేయడమూ, అందరి చేతా రిలీజ్ చేయించడం మరియు ఆత్మ విజ్ఞాన పుస్తకాలు కొని సరైన వారికి మాత్రమే పంచడం. మీరు పంచలేక పోతే ఎవరి చేతనైనా పంచి పెట్టించండి. ధ్యాన ప్రోగ్రాంలకు సహాయం చేయండి. పుస్తకాలు, పాంఫ్లెట్స్, బ్రోచర్స్

ప్రింట్ చేయించి పంచండి.

☸ మీరు క్లాసులు మాత్రం చెప్పకండి. ఒక సద్గురువు, ఒక ఆత్మ సాక్షత్కారం పొందిన గురువు ప్రోగ్రామ్‌లకు మాత్రమే పని చేయండి, ఆయనకు మాత్రమే సహాయాలు చేయండి. ఎవరు పడితే వారు క్లాసులు చెప్తుంటారు. వాళ్ళకు ఏ రకంగా సహకరించినా సరే మీ గతి దుర్గతే ! జాగ్రత్త !!

నేనే దైవం...నీవే దైవం...అంతా దైవమే...అందరూ దైవమే! అనే పరమ సత్యాన్ని ఎలుగెత్తి చాటండి ! ఈ పరమ సత్య ప్రచార కార్యక్రమంలో విశేషంగా పాల్గొనండి మిత్రులారా!

మీకు నచ్చిన ఏదైనా సత్య మార్గ సంస్థకు విశేషంగా విరాళాలు ఇవ్వండి. సత్య మార్గంలో ఉన్న వారికి సహాయం చేయండి.

ఇవ్వండి ! ఇస్తేనే పొందుతారు !

ఇవ్వడమే పొందడం !

మీరు ఎవరికైనా డబ్బులను నిస్వార్థంగా ఇస్తూ ఉన్నప్పుడు మరియు ఖర్చు చేస్తూ ఉన్నప్పుడు ఈ విధంగా అనుకోవాలి.... .....“నేను మహా ఐశ్వర్యవంతురాలిని లేక నేను మహా ఐశ్వర్యవంతుడిని, నా దగ్గర చాలా చాలా డబ్బులున్నాయి” అని అనుకోవాలి.

ఈ విధంగా మీరు అనుకుని, డబ్బులను నిస్వార్థంగా ఇస్తూ ఉంటే మరియు ఖర్చు చేస్తూ ఉంటే, మీరు ఎంతైతే

ఇస్తూ ఉన్నారో మరియు ఎంతైతే ఖర్చు చేస్తూ ఉన్నారో అంతకు ఎన్నో రెట్లుగా డబ్బులు మీకు తక్షణమే, రాచ మార్గంలో అందుతూనే ఉంటాయి. ఇది పరమ సత్యం !!! ఈ పరమ సత్యాన్ని ఊరికే అలా, సరళంగా ఒప్పుకుని చూడండి, ఎన్ని పరమాద్భుతాలు జరుగుతాయో !!!

☸ఒక వేళ జరగలేదంటే 100% గ్యారంటీగా మీలో బయటికి కనపడని లోపాలు ఉన్నాయి అనేది కన్‌ఫర్మ్. సాధన చేసుకుని మీ లోపాలను క్లియర్ చేసుకోండి. లేదా ఈ విషయాన్ని, ఈ పనిని వదిలేయండి.

సత్య మార్గానికి పూర్తిగా అంకితం అయితే మరి జీవించేదెలా ? !

సత్యమే జీవం. సత్యమే జీవ శక్తి. సత్యమే ప్రాణ శక్తి. ప్రచారం అని అంటే నీవు దేనినైతే "ఆలోచనలలో కలిగి ఉన్నావో, దేనినైతే మాట్లాడుతూ ఉన్నావో, దేనినైతే నిజ జీవితంలో ఆచరిస్తున్నావో దానిని అందరికీ తెలియ జేయడం". త్రికరణ శుద్ధిగా ఆచరిస్తూ ఉన్న దానిని అందరికీ తెలియ జేయడమే "ప్రచారం" !

ఆచరించేది "ఆచారం", దానిని అందరికీ తెలియ జేసినప్పుడు అది "ప్రచారం" అవుతుంది. నీవు సత్యాన్ని ఆచరిస్తూ, దానిని అందరికీ తెలియ జేసినప్పుడు అది "సత్య ప్రచారం" అవుతుంది.

సత్యం అంటే ఏమిటి ? అని అంటే - సత్యం అంటే "ఉన్న విషయం" ! "ఉన్నదేదో అది" ! "ఏదైతే ఉందో అది" ! ఈ సృష్టి ఉంది ఇది సత్యం ! మీరు ఉన్నారు ఇది ఒక సత్యం ! ఇప్పుడు మీరు ఇది చదువుతున్నారు ఇదీ ఒక సత్యమే ! ఈ విధంగా సత్యాలు ఎన్నో ఉంటాయి. అయితే

అంతిమ సత్యం మాత్రం ఒకటే ఉంటుంది. ఆ అంతిమ సత్యాన్నే - పరమ సత్యం అని అంటారు.

పరమ సత్యం అంటే ఏమిటి ?

నేనే దైవం..... నీవే దైవం.....

అంతా దైవమే.... అందరూ దైవమే !....

.....అనేదే పరమ సత్యం !

సత్య మార్గానికి పూర్తిగా అంకితం అవడం అని అంటే సత్యాన్ని నీవు త్రికరణ శుద్ధిగా ఆచరిస్తూ ఉన్నావన్నమాట ! ఎప్పుడైతే త్రికరణ శుద్ధిగా నీవు సత్యాన్ని ఆచరిస్తూ ఉన్నావో, అప్పుడు జీవించడం ఎలా ? అనే ప్రశ్నయే పుట్టదు. ఎందుకంటే సత్యాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించడం అని అంటే నీవు పుష్కలంగా జీవాన్ని కలిగి ఉన్నావని అర్థం. ఎందుకంటే సత్యమే జీవ శక్తి కాబట్టి. జీవ శక్తిని ఆచరించే వ్యక్తికి జీవించడం ఎలా ? అనే సందేహం ఎలా వస్తుంది ?! మీరు నిజంగా, సత్య ప్రచారానికి అంకితం అయిన తక్షణం మీ జీవితం సుస్థిరం అవుతుంది. సత్యాచారం చేస్తూ ఉన్నా కూడా మీ జీవితం ఇంకా సుస్థిరం కాలేదు అని అంటే దాని అర్థం - "మీరింకా సత్య మార్గానికి సంపూర్ణంగా అంకితం కాలేదనేది సుస్పష్టం " !

అనాదిగా పరమ గురువులు ఈ భూమిపైన సత్య ప్రచారం చేస్తూ వస్తూ ఉన్నారు, మరి వాళ్ళెలా జీవించారు ?!

పరమ గురువుల చరిత్రలు చదివి అవగాహన చేసుకుంటే ఈ విషయం అర్థం అవుతుంది.

ఎంతో ప్రాచీన కాలం నుండి, ఎందరెందరో మహాత్ములు తమ జీవితాలను పూర్తిగా సత్య ప్రచారానికి అంకితం చేసుకున్నారు. వాళ్ళు జీవించడమే కాకుండా తమ దివ్య బోధనలతో ఎన్నెన్నో జీవితాలను ఉద్ధరించారు, ఉద్ధరిస్తూనే ఉన్నారు. సత్య ప్రచారం చేయడానికి తనను తాను, నిజంగా, 100% అంకితం చేసుకున్న వ్యక్తికి ఈ ప్రశ్నయే పుట్టదు. జీవించడం ఎలా అన్న సందేహమే రాదు. పూర్తి శాతంలో నుండి నిర్ణయం జరగనప్పుడే ఈ ప్రశ్న పుడుతుంది.

ఒక ప్రధానమైన సృష్టి సూత్రం ఇలా ప్రకటిస్తోంది....

"ఎవరైతే సత్య మార్గానికి పూర్తిగా తమను తాము అంకితం చేసుకుంటారో వారికి కావలిసినవన్నీ సృష్టి నుండి, వాటంతట అవే, వారికి అందుతాయి" ! ఈ సూత్రాన్ని 100% ఒప్పుకుని(విశ్వసించి) రంగంలోకి డైరెక్ట్‌గా దిగాల్సిందే. ఈ సూత్రాన్ని ఒప్పుకోని వారికే ఈ ప్రశ్న పుడుతుంది.

ఈ ప్రశ్నను జయించ గలిగినపుడే సత్య ప్రచారానికి అంకితం కాగలుగుతారు.

తమ జీవితం గురించి ఆందోళన చెందేవారు దైవత్వాన్ని ఎలా పొందగలుగుతారు ?! దైవత్వం పొందడం అంటే ఏమనుకుంటున్నారు ?!

స్వతంత్రంగా జీవించలేని మీరు మృత్యువును జయించి, సృష్టి కేంద్రంతో అనుసంధానం చెంది బ్రహ్మానుభవాన్ని(దైవత్వం) ఎలా పొందగలుగుతారు ?!

ఇతరులనెలా ఉద్ధరించ గలుగుతారు ?!

ఉద్ధరించడమంటే - సరైన మతరహిత అత్యున్నత ఆత్మ విజ్ఞానం మరియు అత్యున్నత ధ్యాన సాధనలను తెలియ చేయడం !

తమ జీవితం పట్ల అభద్రతా భావాన్ని పూర్తిగా తొలగించుకున్నప్పుడే, ఆ వ్యక్తి సత్యమార్గానికి పూర్తిగా అంకితం కాగలుగుతాడు. కేవలం పైన తెలిపిన సూత్రాన్ని 100% ఒప్పుకుని రంగంలోకి దిగాల్సిందే ! వేరే దారి లేదు ! ఇంతకన్నా గ్యారంటి ఎవరిస్తారు ?! మీకు మీరే గ్యారంటి కావాలి, అలా అయినప్పుడే ఇది సాధ్యం ! స్వయంగా ఆచరించి చూస్తేనే తెలుస్తుంది. ఆచరించి చూడాలి మరి !

ఒక వ్యక్తి 100% తనను తాను సత్య మార్గానికి అంకితం చేసుకున్నప్పుడు ఆ మొత్తం వంశమే ఉద్ధరించబడుతుంది. ఎంతో పుణ్యం చేసుకున్న వంశానికో, కుటుంబానికో ఈ మహా భాగ్యం దక్కుతుంది.

ఒక వ్యక్తి 100% తనను తాను సత్య మార్గానికి అంకితం చేసుకోవడం అంటే మాటలు కాదు. ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రత్యేకంగా ఎన్నుకోబడిన ఉన్నత ఆత్మలకే ఇది సాధ్యం. అయితే తలుచుకుంటే ఎవరైనా చేయగలుగుతారు, కానీ తలుచుకుని ఆచరణలోకి దిగడంలోనే ఉంది అసలు వ్యవహారం.

అయితే సత్య మార్గానికి అంకితమైన వారు అహంభావంతో ఉండరాదు. ఆత్మ విశ్వాసంతో ధైర్యంగా ధీమాగా ఉండాలి. ఈ భూమి పైకి రక రకాల కారణాలతో, రక రకాల ఆత్మలు వస్తాయి. తమ తమ కార్యక్రమాలను తాము చేసుకుంటూ ఉంటాయి. అయితే ఎవరైనా, తమ జన్మ పరంపరను వేగంగా పూర్తి చేసుకుని, అన్ని కష్టాల్లో నుండి బయటపడి త్వరగా పరిపూర్ణతను సిద్ధించుకోవాలనుకున్న వారు, ప్రస్తుతం ఈ భూమి పైన ఉన్న వారిలో ఎవరినైనా ఒక గురువును ఆశ్రయించి వారి మార్గదర్శకత్వంలో సత్య మార్గానికి పూర్తిగా అంకితం అయితే, వారు ఈ జన్మనే చివరి జన్మగా చేసుకుని విముక్తిని పొందవచ్చు. మళ్ళీ మళ్ళీ జన్మించే ప్రయాసను తప్పించుకుని, దివ్యత్వాన్ని పొంది దివ్య లోకాలకు దివ్యులుగా వెళ్ళాలి అనుకునే వారు, 100% సత్య మార్గానికి అంకితం కావాల్సివస్తుంది, తప్పని సరి !

లేదా ఎన్ని జన్మలైనా సరే, అది వారి వారి ఇష్టం. అయితే ఎప్పటికైనా, ఎన్ని జన్మలకైనా ఈ నిర్ణయానికి మాత్రం వచ్చి తీరాల్సిందే, ఒక సత్యగురువు దగ్గర 100% సత్య మార్గానికి అంకితమై సాధన చేసుకుంటూ సత్య ప్రచారం చేసి సత్యాన్ని పొందాల్సిందే ! క్లాసులు మాత్రం చెప్పకూడదు.

సత్యాన్ని పొందడానికి చేసే సాధనలో సత్య ప్రచారం

ప్రధానమైనది ! అనివార్యమైనది !!

సత్య ప్రచారం చేయకుండా ఉంటే దైవత్వం ఏ నాటికి పొందలేరు !

సత్య ప్రచారం అంటే సత్య గురువుకు సహాయం చేయడం !

క్లాసులు చెప్పడం కానే కాదు !

ఆత్మ సాక్షాత్కారం నిజంగా జరిగినప్పుడు బోధన చేయాలి !

అంత వరకు కేవలం పని చేయాలి !

మీరు సాధన చేస్తూ ఇతరులకు ఈ సాధనను తెలియజేస్తూ ఉండాలి. అత్యంత శీఘ్రంగా, ఊహలకందనంత మెరుపు వేగంతో మీరు బాగుపడాలంటే సత్య మార్గంలో పని చేయడం తప్పని సరి ! మీరు ఒంటరిగా సాధన చేస్తే, మీ అభివృద్ధి చాలా, చాలా, చాలా మెల్లగా సాగుతుంది. సాధన + పని చేస్తేనే మెరుపు వేగంతో ఫలితాలు వస్తాయి. పని చేయకుండా మూలకు కూర్చుని ఒంటరిగా సాధన చేస్తుంటే దైవత్వం రావడం అనేది చాలా, చాలా, చాలా కష్టం ! మీరు ఇతరులకు కనీసం ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన మెటీరియల్ అయినా ఇవ్వాలి. ఇలా ఇవ్వడం కూడా దివ్య కార్యమే !

సత్యం అంటేనే సురక్ష ! సత్య మార్గానికి అంకితం అయిన వారికి సాక్షాత్తు ఆ సత్యమే రక్షగా ఉంటుంది. అయితే ఈ విషయాన్ని నమ్మి(ఒప్పుకుని) సత్య మార్గానికి అంకితం కావడంలోనే ఉంది అసలు వ్యవహారమంతా ! అసలు రంగు బయట పడేది ఇక్కడే ! సత్తా తెలిసేది ఇక్కడే !

మీరు మీ దైవత్వాన్ని కోరుకుంటే అన్నీ వస్తాయి. మీకు ఏమేం కావాలో అన్నీ వస్తాయి. ఆరోగ్యం, అందం, ఐశ్వర్యం, శాంతి, సంతృప్తి, ఆనందాలు శాశ్వతంగా మీ స్వంతం అవుతాయి.

ఇదే విషయాన్ని పరమ గురువు శ్రీ జీసస్ క్రైస్ట్ చెప్తాడు. Seek ye the kingdom of God and his righteousness first , and then all else will be added unto you - (The Holy Bible , Matthew 6 : 31-34) అని అంటే " మొట్ట మొదట మీ లోపల ఉన్న దైవ సామ్రాజ్యాన్ని + దేవుడి యొక్క దివ్య ధర్మాన్ని కోరుకుని వాటిని పొందడానికి పూర్ణంగా కృషి చేయండి, అప్పుడు మీకు కావలిసినవన్నీ, వాటంతట అవే మీకు అందుతాయి" అని అర్థం !

- పవిత్ర గ్రంథము బైబిల్ - మత్తయి - 6 : 31 - 34

క్రీస్తు పరమాత్ముడు చెప్పిన ఈ సృష్టి సూత్రం యొక్క వివరణ ఏమిటంటే...

"ఈ భూమి పైన మానవులు మొట్ట మొదట కోరుకోదగినదీ, పొందదగినదీ ఏదైనా ఉందంటే అది కేవలం తమ లోపల ఉన్న దైవ సామ్రాజ్యం + ఆ దేవుడి యొక్క దివ్య ధర్మం మాత్రమే ! దీనిని 100% కోరుకుని, దీనిని పొందడానికి, 100% తమను తాము అంకితం చేసుకోవడాన్నే సత్య మార్గానికి అంకితం కావడం అని అంటారు. ఈ సత్య మార్గంలో ఉన్న వారినే సత్య సాధకులు అని అంటారు.

ఈ విధంగా సత్య సాధన చేస్తూ, సత్య ప్రచారానికి 100% అంకితం అయిన వారికి ఏమేం కావాలో - అంటే ఆరోగ్యం, ఆయుష్షు, ఐశ్వర్యం, విజయం, శాంతి, సంతృప్తి, ఆనందం, ఉత్సవం మరియు మోక్షం మొదలైనవన్నీ కూడా వాటంతట అవే వచ్చి సత్య మార్గంలో ఉన్న వారికి అందుతాయి".

గ్రహించండి ! "వాటంతట అవే వచ్చి వారికి అందుతాయి", మీరేమీ చేయనక్కరలేదు. కేవలం, సత్య సాధనకు + సత్య ఆచారానికి 100% అంకితం కావడమే మీరు చేయాల్సింది. చాలా సింపుల్‌గా అనిపిస్తుంది కేవలం 100% అంకితమైతే చాలా అని ! ఆచరణలోకి దిగినప్పుడు తెలుస్తుంది అది ఎంత కష్టమో ! పట్ట పగలే చుక్కలు కనపడతాయి.ఎవరైతే ఈ విధంగా చేయగలుగుతారో వారు ఖచ్చితంగా పైన తెలిపినవన్నీ పొందుతారు. పొందలేదంటే వాళ్ళలో ఏవో లోపాలు ఉన్నట్టే !

అనాదిగా వస్తున్న సృష్టి నియమం ఇది. ఈ సృష్టి నియమాన్నే జీసస్ చెప్పాడు, ఇంకా అనేకానేక మాస్టర్స్ అందరూ, ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఈ విషయాన్ని స్పష్ట పరిచారు.

గతి తప్పని విశ్వ నియమం ఇది ! పరమ సత్యం ఇది ! అనాదిగా జరుగుతూ వస్తూ ఉంది ! ఇప్పుడు జరుగుతూనే ఉంది ! ఎప్పటికీ జరుగుతూనే ఉంటుంది ! పరమ గురువు జీసస్ క్రైస్ట్ చెప్పిన సూత్రం కదా !

స్వయంగా జీసస్ పరమాత్ముడే తన బోధనల గురించి ఇలా ప్రకటించాడు :

"ఆకాశం(స్వర్గం) మరియు భూమి అంతరించిపోయినా,

నా వాక్కులు మాత్రం అంతరించిపోవు" !

- పవిత్ర గ్రంథము బైబిల్ - మత్తయి - 24 : 35

విషయాన్ని గ్రహించండి, అన్నీ అంతరించిపోయినా సరే, నా వాక్కులు మాత్రం అంతరించిపోకుండా శాశ్వతంగా అలానే ఉంటాయి. ఎవరైతే నా వాక్కుల యొక్క పరమార్థాన్ని గ్రహించి వాటిని నిజ జీవితంలో యథాతథంగా ఆచరిస్తారో వారికి నేను ప్రకటించినవన్నీ అంది తీరుతాయి అని ఎంతో స్పష్టంగా చెప్పాడు కదా, జీసస్ క్రైస్ట్ ! ఇంతకన్నా గ్యారంటి

ఏం ఉంటుంది చెప్పండి ?!

ఈ విధంగా క్రీస్తు పరమాత్ముడు హామీ ఇచ్చినట్టే ఈ కింది విధంగా భగవద్గీతలో శ్రీ కృష్ణ పరమాత్ముడు కూడా అభయమిచ్చాడు ఎప్పుడో !

శ్లో॥ అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్

- భగవద్గీత - 9 : 22

వివరణ : ఎవరైతే కేవలం నన్ను మాత్రమే అంటే పరమ సత్యాన్ని మాత్రమే ధ్యానించుచూ, నన్ను(పరమ సత్యాన్ని) పొందడానికి సంపూర్ణంగా, సమగ్రంగా తమను తాము అంకితం చేసుకుంటారో వారి యొక్క పూర్తి బాధ్యతను నేను వహిస్తాను. వారి యోగక్షేమాలన్నీ నేను చూసుకుంటాను. వారికి కావలిసినవన్నీ స్వయంగా నేనే సమకూరుస్తాను. అయితే ఈ వాగ్దానం కేవలం 100% నన్ను(పరమ సత్యాన్ని) మాత్రమే పొందడానికి అంకితం అయి ఉన్నారో, ఎవరైతే సత్య ప్రచారానికి, సత్య సేవకు అంకితం అయి ఉన్నారో వారికి మాత్రమే వర్తిస్తుంది.

ఇతర ఏ పనులు చేయకుండా, అనుక్షణం, నిరంతరం, నన్ను(పరమ సత్యం) మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారో వారికి మాత్రమే నా ఈ వాగ్దానం వర్తిస్తుంది. ఇతర ఏ భౌతిక లక్ష్యాలు లేకుండా, ఇతర ఏ ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలు మొదలైన ఏ భౌతిక కార్యకలాపాలు చేయకుండా, కేవలం నన్ను(పరమ సత్యాన్ని) మాత్రమే పొందడానికి సాధన చేస్తున్నారో, కేవలం నా(పరమ సత్య) ప్రచారానికి మాత్రమే అంకితం అయ్యారో వారి కోరికలన్నింటినీ నేను నెరవేరుస్తాను. వారి అవసరాలన్నీ నేను ఖచ్చితంగా తీరుస్తాను అని శ్రీ కృష్ణ పరమాత్ముడు 100% గ్యారంటి ఇస్తున్నాడు. ఎంతటి కరుణ !!! దేవుళ్ళు ఎంత గ్యారంటీ ఇచ్చినా ఆచరించడానికి సత్తా సరిపోదు ఎదగని ఆత్మలకు !

అయితే మరి, అందరూ ఈ విధంగా 100% సత్య మార్గానికి అంకితం కాలేరు కదా ! మరి వారి మాటేమిటి ? ఆ యొక్క పరమాత్ముడు వారిని పట్టించుకోడా ? అనే సందేహాలు కలిగే అవకాశం ఉంది. కంగారుపడాల్సిన అవసరం లేదు. ఆ దైవం అందరినీ పట్టించుకుంటుంది. ఎవరు ఏ పని చేసినా, చేస్తున్నా "లోపల" లక్ష్యం మాత్రం పరమ సత్యమై ఉండాలి. మీరేపనైనా చేయండి. చదువు, ఉద్యోగం, వృత్తి, వ్యాపారం, గృహిణిగా బాధ్యతలు నిర్వహించడం మొదలైనవి ఏవైనా చేయండి మీ లోపల లక్ష్యం కేవలం, పరమ సత్యమే అయి ఉన్నప్పుడు ఈ "వాగ్దానం" తప్పని సరిగా వర్తిస్తుంది.

అయితే పూర్తిగా, 100% సత్య సాధనకు + సత్య గురువు ఆధ్వర్యంలో సత్య ప్రచారానికి అంకితం (క్లాసులు చెప్పకుండా ఉన్న వారికి) అయిన వారికి ఇంకా, ఇంకా, ఎక్కువగా, అనంతంగా

వర్తిస్తుంది.

చూశారా ! సత్యమార్గం మనకు ఏమేం కావాలో వాటన్నింటినీ అందిస్తుంది. మీరు స్టూడెంట్ అయితే మీ చదువును మీరు కొనసాగిస్తూనే దైవత్వాన్ని కోరుకుంటూ ఉండాలి, మీరు ఉద్యోగి లేక వ్యాపారస్తుడైతే మీ పనులు మీరు చక్కబెట్టుకుంటూనే దైవత్వం మీద దృష్టి పెట్టాలి, మీరు గృహిణి అయితే మీ బాధ్యతలు మీరు నిర్వర్తించుకుంటూ దైవత్వమే మీ లక్ష్యంగా ఉండాలి. మీరు ఎవరైనా సరే మీ బాధ్యతలు మీరు నిర్వహిస్తూ దైవత్వమే మీ ఏకైక లక్ష్యంగా ఉండాలి.

దైవత్వం మీ లక్ష్యంగా పెట్టుకుని ఉన్నప్పుడు మీరు చేసే పనులు "సరి" అవుతాయి. దైవత్వం మీ లక్ష్యం కానప్పుడు మీరు చేసే మంచి పనులైనా సరే కర్మ శేషాన్ని అంటగడతాయి. అంతకు అంతా చెల్లించాల్సి వస్తుంది.

✪✪దైవత్వమే మన లక్ష్యం అయినప్పుడు సృష్టి యొక్క ఆశీర్వాద అనుగ్రహాలు ఎల్లప్పుడూ మన పైన వర్షిస్తూనే ఉంటాయి. ఎవరి గురించి వాళ్ళు తెలుసుకోవడం, ఎవరి నిజ తత్వాన్ని వాళ్ళు అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలనుకోవడం అనేది సృష్టి యొక్క ప్రాథమిక మరియు ప్రధానమైన నియమం. ఎప్పుడైతే మనం ఈ నియమాన్ని అనుసరిస్తామో మనకు కావాల్సినవన్నీ మనల్ని అనుసరించి వస్తాయి. ✪✪

దైవత్వమే మన లక్ష్యం అయినపుడు మనకు కావాల్సిన వాటికి, మనం కోరుకుంటున్న వాటికి మనం లక్ష్యం అవుతాము.

లక్ష్యానికి మనం ప్రాధాన్యతనిస్తే, లక్ష్యం మనకు ప్రాధాన్యతనిస్తుంది. లక్ష్యాన్ని మనం లక్ష్యపెడితే, లక్ష్యం మనల్ని లక్ష్య పెడుతుంది. లక్ష్యాన్ని సిద్ధించుకోడానికి మనం ప్రయత్నిస్తుంటే, లక్ష్యం మనకు సిద్ధించడానికి ప్రయత్నిస్తుంది.

చాలా ఇంపార్టెంట్ విషయం

మీరు నిస్వార్థ దానం & సేవ చేయడం మొదలు పెట్టగానే... మీలో ఉన్న లోపాలు బయట పడటం ప్రారంభిస్తాయి. ఎరుకతో వాటిని అర్థం చేసుకుంటూ మీరు సేవను కొనసాగిస్తూ ఉంటే, అవి ఆటొమెటిక్‌గా క్లియర్ అయిపోతూ ఉంటాయి. గుర్తుంచుకోండి, సేవ చేయడం అని అంటే "మిమ్మల్ని మీరు సరి చేసుకోవడం"! ఈ విషయం తెలియక కొంత మంది

అయోమయానికి గురవుతుంటారు. మేము చేసేది సేవ కదా.... మాకు అడ్డంకులు ఎందుకు వస్తున్నాయి ?! అని ఆశ్చర్యపోతూ బాధ పడుతూ ఉంటారు. సేవకు అడ్డంకులు రాకూడదు కదా ! అని వాపోతూ ఉంటారు. ఇలాంటి వారు గ్రహించాల్సిన విషయం ఏమిటంటే... "మీలో సేవకు వ్యతిరేకమైన భావాలున్నాయని తెలుసుకోవడం" ! లోపల సేవకు వ్యతిరేకమైన భావాలున్నప్పుడే, సేవకు ఆటంకాలు వస్తూ ఉంటాయి. సేవకు వ్యతిరేకమైన భావాలను తొలగించుకోవడం ఎలా అని అంటే - "నాకు సేవ వలన అంతా శ్రేయస్కరమే జరుగుతుంది, సేవ అంటే నాకు పూర్తిగా ఇష్టం" అని పదే పదే అనుకోవాలి. ఈ సూత్రాన్ని బాగా సాధన చేయాలి. అప్పుడు అంతా క్లియర్ అయిపోతుంది. అన్నీ క్లియర్ అయిపోతాయి పూర్తిగా, సురక్షితంగా.... !

మీలోని సేవకు వ్యతిరేకంగా ఉన్న భావాలను సాధన ద్వారా క్లియర్ చేసుకుంటూ ముందుకు సాగాలి లేకపోతే..... ఒకవేళ మీరు సేవ చేయడం మానివేస్తే మీ యొక్క అభివృద్ధి ఆగిపోతుంది. ఈ జన్మలో కాకపోతే ఏ జన్మకైనా మిమ్మల్ని మీరు క్లియర్ చేసుకునియే తీరాలి. తప్పదు. మీరేం చేసినా సేవ చేయనిదే మీరు క్లియర్ కాలేరు. ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొందలేరు. మరి సేవలో లేని వారు బాగానే ఉన్నారు కదండీ... అని అడిగితే, ..."వారి లైఫ్ లైన్లు ఇంకా అయిపోలేదని అర్థం". ఏదో ఒక నాటికి వారి లైఫ్ లైన్లు కూడా అయిపోతాయి, అప్పుడు వారు కూడా ఇప్పుడు మీరున్న స్థితిలోకి వచ్చి తీరుతారు. కాబట్టి సేవ చేయని వారి గురించి ఆలోచించడం మానేసి, మీ సంగతి మీరు చూసుకుంటే బాగు పడతారు.

శారీరక సేవ కాని, బుద్ధి సేవ కాని, ఆర్థిక సేవ కాని... మీకు ఏది వీలైతే అది చేయాలి. మూడు వీలైతే మూడు చేయాలి. ఏ రెండైనా వీలైతే ఆ రెండు చేయాలి. ఏ ఒక్కటో వీలైతే ఆ ఒక్కటి చేయాలి. మీరు నిస్వార్థ సేవ చేయడం మొదలు పెట్టగానే లోపాలు బయట పడతాయన్నమాట.... కాబట్టి సేవ చేయకుండా ఉంటే సరి... అని అతి తెలివి ఆలోచనలు చేయకూడదు. ఇలా అతి తెలివి చూపెడితే సృష్టి చక్కటి గుణపాఠం చెబుతుంది. కాబట్టి చివరికి అసలు సిసలు విషయం ఏమిటంటే... దీపం ఉండగానే ఇల్లు చక్క పెట్టుకోండి. చేతులు కాలక ముందే ఆకులు పట్టుకోండి. **O.K. !**

All The Very Best !

❖ ❖ ❖

3. MAB నవ రత్నాలలో మూడవ రత్నం అకర్మ వీగనిజమ్

- మోక్షానికి మొదటి అడుగు

అకర్మ :

అకర్మ అంటే ఎటువంటి కర్మను కలిగించనిది. ఇవ్వనిది. న్యూట్రల్ అన్నమాట. ఇటువంటి న్యూట్రల్ కర్మలే ఆనగా అకర్మలే మోక్షానికి దారి తీస్తాయి.

వీగనిజమ్ :

వీగనిజం అంటే జంతువులకు సంబంధించినది ఏదైనా సరే వాడకపోవటం. ఆహారంగా కానీ అవసరాలకు కానీ జంతువులను, వాటి నుండి ఉత్పత్తి చేయబడినవి వాడకపోవటమే వీగనిజం.

మాంసాహారం, చేపలు, గుడ్లు, తేనె, పాలు మరియు పాల ఉత్పత్తులు(పెరుగు, వెన్న, నెయ్యి, జున్ను, చీస్, వీటన్నింటితో తయారు చేసిన బిస్కెట్లు, చాక్లెట్లు, ఐస్ క్రీంలు, కేకులు మొదలైనవి) ఆహారంగా తీసుకోకపోవటం. పట్టు, ముత్యాలు, ఫర్, లెదర్, వుల్ మొదలైన జంతువుల నుండి తయారు చేసినటువంటి ఏ వస్తువులను వాడకపోవటం; జంతువుల పై ప్రయోగాలు చేసినటువంటి ఏ వస్తువులను వాడకపోవటం; జంతువులను హింసించేటువంటి దేనినైన చేయకపోవటం జంతువుల హక్కులకై పోరాడటం; జంతువులను రక్షించుకోవటం ద్వారా మనల్ని మనం, మన భూమినీ రక్షించుకున్న వారమవుతామని గ్రహించటం.

అకర్మ వీగనిజమ్ :

కర్మ లేని వీగనిజం నే అకర్మ వీగనిజం (అకర్మ శాఖాహారం) అని అంటారు. భౌతికంగా మరియు ఆధ్యాత్మికంగా కూడా ఇదే శుద్ధ శాఖాహారము, స్వచ్ఛమైన నిజమైన, అసలైన శాఖాహారము. సత్య శాఖాహారము.

ప్రశ్న : ఆహారం అకర్మగా ఎలా అవుతుంది ? అసలు అకర్మ ఆహారం అంటే ఏమిటి ?

జవాబు : ప్రకృతి పరంగా కేటాయించబడిన ఆహారమే అకర్మ ఆహారం (అకర్మ ఫుడ్స్). దీనినే ప్రాణాహారం అని కూడా అంటారు. ఏ ప్రాణి అయినా తనకు ప్రకృతి ద్వారా కేటాయించబడిన సహజ ఆహారాన్ని తీసుకున్నప్పుడు ఆ ప్రాణికి ఎటువంటి కర్మ చుట్టుకోదు. పుణ్యం, పాపం రెండూ రావు. న్యూట్రల్ గా ఉంటుంది. పులి జింకను చంపి తినడం ద్వారా పులికి ఎటువంటి కర్మ అంటుకోదు. పిల్లి ఎలుకను చంపి తినడం వలన దానికీ ఏ కర్మ అంటుకోదు. ఆవు గడ్డి తినడం వలన ఏ కర్మ అంటుకోదు. అదే విధంగా మనిషి తనకు ప్రకృతి ద్వారా కేటాయించబడిన శుద్ధ శాఖాహారాన్ని అనగా కేవలం వృక్షాలనుండి , మొక్కలనుండి వచ్చిన ఆహారం అనగా plant foods ని మాత్రమే తినడం వలన మనిషికి కూడా ఎటువంటి కర్మ అంటుకోదు. ఇదే అకర్మ ఆహారం. ఇటువంటి అకర్మ ఆహారాన్ని తినడం ద్వారా మనిషికి అప్రయత్నంగానే తన మోక్షం, అనగా తన దైవత్వం వైపు మొదటి అడుగు పడిపోతుంది. ఇది సహజ ప్రక్రియ. ప్రకృతి మన ఆత్మాభివృద్ధికి సహకరించడానికి మనకు కల్పించిన ఒక వెసులుబాటు.

ఇంత గొప్ప అదృష్టాన్ని మనిషి స్వయంగా, ప్రయత్నపూర్వకంగా, తన తెలివితేటలను బాగా ఉపయోగించుకుని మరీ పాడుచేస్తున్నాడు. తనకు అసహజమైన ఆహారం, అనగా ప్రకృతి ద్వారా కేటాయించబడని ఆహారం, అనగా జంతువుల నుండి వచ్చిన ఆహారాన్ని అనగా విషాహారాన్ని, అనగా కర్మ పూరితమైన ఆహారాన్ని ఎంతో శ్రద్ధతో చంపి, వండి, లొట్టలు వేసుకుంటూ తిని శరీరాన్ని అనారోగ్యమయంగా, జీవితాన్ని దుష్కర్మ మయంగా మరియు ఆత్మను భ్రష్టుపట్టించి, చక్కగా తనలోనే ఉన్న తన దైవత్వానికి దూరం అయిపోతున్నాడు మానవుడు. ఎంత చిన్నదైనా లేదా ఎంత పెద్ద ప్రయాణమైన మొదలయ్యేది మొదటి అడుగు తోనే కదా. గమ్యాన్ని చేరుకోవడానికి మొదటి అడుగు వేయాల్సిందే కదా. ఇంతటి ముఖ్యమైన మోక్షానికి / దైవత్వానికి మొదటి అడుగు అయిన అకర్మ ఆహారాన్ని వదిలేసి మనిషి విషాహారం వైపు మొగ్గు చూపటంతో తన దైవత్వానికి కూడా దూరమైపోయాడు. అసలు నా లోనే దైవం ఉంది, నేనే దైవం అనే సత్యం తన ఎరుకలో అనగా గుర్తుకు కూడా రానంత దూరం అయిపోయాడు.

అకర్మ ఆహారం గురించి సవివరంగా తెలుసుకుందాం...

ఆహారంలో ప్రధానంగా రెండే రెండు రకాలు అవి :

జు. ప్రాణాహారం

ఔ. విషాహారం

ప్రాణాహారమంటే ప్రకృతిలో ఉన్న రక రకాల ప్రాణులకు సహజ సిద్ధంగా ప్రకృతి ద్వారా కేటాయించబడిన ఆహారమే ప్రాణాహారం. ఉదాహరణకు క్రూర మృగాలకు మాంసాహారమే ప్రాణాహారం. పశువులకు గడ్డి ప్రాణాహారం. మానవులకు శాఖాహారమే ప్రాణాహారం. ప్రకృతి పరంగా

కేటాయించబడనిదే విషాహారం.

ప్రకృతి ఏర్పరచిన సహజ సిద్ధమైన ఆహార చక్రం(Food Cycle)లో రకరకాల ప్రాణులకు తమ ప్రాణాలను నిలుపుకోడానికి రక రకాల ఆహారాలు కేటాయించబడ్డాయి. అన్ని ప్రాణులు ప్రకృతి పరంగా తమకు సంక్రమించిన, లభించిన, కేటాయించబడిన ఆహారాలు మాత్రమే తీసుకుంటున్నాయి. తీసుకుంటాయి కూడా ! అన్ని ప్రాణులు చక్కగా 100% ప్రకృతి ఏర్పరచిన ఆహార చక్ర నియమాలను అనుసరిస్తున్నాయి, ఒక్క మనిషి తప్ప !

మీరు ప్రాక్టికల్‌గా చూడండి, పులికి మీరు గడ్డి పెట్టండి తినదు, ఆకలితో చావనైనా చస్తుంది కానీ తినదు, తినలేదు. ఎందుకంటే గడ్డి పులికి ఆహారం కాదు. ఆవుకు మాంసం పెట్టి చూడండి, ఆవు చస్తుంది కానీ మాంసం తినదు, తినలేదు. ప్రకృతి పరంగా సహజంగా అవి తమకు కేటాయించబడని ఆహారాన్ని జంతువులు తినవు, తినలేవు. వాటి సిస్టమ్ అంతే ! మనిషిని చూడండి, మనిషి గడ్డి తింటాడు, గడ్డిని తినే ఆవును తింటాడు, ఆవును తినే పులిని కూడా తినేస్తాడు. మనిషి ఒక్కడే ప్రకృతి నియమాలను ఉల్లంఘించాడు. మనిషి చేస్తున్న ఈ ఒక్క తప్పిదానికి యావత్ భూమండలం మరియు సమస్త ప్రాణులు అన్నీ కలిసి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తూ ఉంది. ఈ ఘోరాన్ని తక్షణమే ఆపాలి.ఇది మనందరి తక్షణ కర్తవ్యం.

ప్రశ్న : అసలు మనుష్యులు అకర్మ వీగన్స్ (అకర్మ శాఖాహారి) గా ఎందుకు ఉండాలి?
జవాబు : ఏదైనా ఒక పనిని పదే పదే ఆలోచించటం లేదా పదే పదే చెయడంతో అది ఆ మనిషి యొక్క గుణం గా మారుతుంది. అది గుణం గా మారడం వలన మరింత ఎక్కువగా దాన్ని చేస్తాడు, అప్పుడు అది ఆ వ్యక్తి యొక్క స్వభావం గా మారుతుంది.

1) ఇలా స్వభావంగా మారింది చెడు గుణమైతే, నెగెటివ్ గుణమైతే, దైవత్వానికి వ్యతిరేకమైనదైతే, అహానికి సంబంధించినది అయితే దాన్ని సాధన ద్వారా సరిచేసుకోవాల్సిందే...తప్పదు, సరి చేసుకోనిదే సృష్టి ఒప్పుకోదు... వదిలిపెట్టదు. దుష్కర్మల వలన నరకం అనుభవించకుండా, అవగాహనతో కర్మలను తీసివేసుకోవాలి మరియు మోక్షం పొందాలి అని అనుకుంటే మా వెబ్ సైట్ www.missionahambrahmasmi.org నుండి "సద్గురు తారా విశాల్ మార్గదర్శి" పుస్తకాన్ని మరియు ఆడియో బుక్ ని డౌన్లోడ్ చేసుకుని చదవండి లేదా ఆడియో బుక్ వినండి. అందులోని విషయాలను ఆచరించండి. మిమల్ని మీరు సరిచేసుకోండి. రక్షించుకోండి...

2) స్వభావంగా మారింది మంచి గుణమైతే, పాజిటివ్ గుణమైతే, దైవత్వానికి సంబంధించిన దైవ గుణమైతే అది ఆ వ్యక్తి యొక్క సహజ స్వభావం అయినందువలన అది అకర్మగా అవుతుంది. అనగా ఆ వ్యక్తి ఆ ఫలానా గుణానికి సంబంధించిన పనులు చేయటం వలన ఎటువంటి కర్మ అంటుకోదు. పాపం, పుణ్యం రెండు న్యూట్రల్ అయి అకర్మగా అవుతుంది. ఇటువంటి అకర్మలే

మోక్షానికి దారి తీస్తాయి. మనం ఏ పని చేసినా మనకు పుణ్యం లేదా పాపం ఇలా ఏదో ఒక కర్మ అంటుకుంటూనే ఉంటుంది. కనీసం మనం ప్రతీ రోజు, ప్రతీ పూట తీసుకునే ఆహారమైనా మనకు ఎటువంటి కర్మ అంటగట్టకుండా చూసుకోవడం మన విజ్ఞత కు నిదర్శనం. తల్లి గర్భంలో మొదటి కణం తయారైనప్పటి నుండి దేహం చనిపోయే వరకు ఏదో ఒక రకంగా మనం ఆహారం తీసుకుంటూనే ఉంటాం. అలా మన శరీరానికి ఆహారం అందించటం అనేది మన సహజ స్వభావమైపోయింది. ఇలా సహజ స్వభావం గా మారిన ఆహారం తీసుకోవడం ఆనేది అకర్మ గా ఉంటే, అదే మన మోక్షానికి మొదటి అడుగు అవుతుంది.

❖ ❖ ❖

మనిషి అకర్మ శాఖాహారమే ఎందుకు తీసుకోవాలంటే...

1. ప్రతీ వాహనం తయారు చేసే ముందు దాని యొక్క ఇంధనాన్ని నిర్ణయించుకుంటారు. ఇదే విధంగా ఆత్మ ఈ దేహం అనే దివ్య వాహనాన్ని ధరించి తగిన అనుభవాలు పొందాలంటే ఈ దేహం ఎన్నో రకాలైన వసతి సౌకర్యాలను కలిగి ఉండాలి. ఉన్నతమైన ప్రకంపనలు కలిగి ఉండాలి. కాబట్టి దీనికి అకర్మ శాఖాహారమైతేనే సరి, అని అకర్మ శాఖాహార ఇంధన వాహనంగా ఈ దేహం తయారయింది. అకర్మ శాఖాహారాన్ని బేస్ చేసుకుని తయారయింది కాబట్టి అకర్మ శాఖాహారమే వాడాలి. ఇతర ఏ ఆహార ఇంధనమైనా దీనికి ప్రమాదం. ఇది పూర్తిగా ఆధ్యాత్మిక శాస్త్ర పరమైన సాంకేతిక కారణం.

2. ఆత్మ, మూల చైతన్యం ద్వారా లేక ఏదైనా ఒక పూర్ణాత్మ ద్వారా సృష్టించబడినపుడు అది ముందు మినరల్ కింగ్‌డమ్ (Mineral Kingdom) లోనికి ప్రవేశిస్తుంది. నీరు, మట్టి, ఇసుక, రాళ్ళు, ఖనిజాలు భూమి పైన ఉన్న రక రకాల పదార్థాలుగా ఉంటుంది. రెండవ దశలో ఆత్మ వృక్ష ప్రపంచం(Plant Kingdom)లోనికి ప్రవేశిస్తుంది. రక రకాల గడ్డిగా, మొక్కలుగా, చెట్లుగా, వృక్షాలుగా జన్మలు తీసుకుంటుంది. మూడవ దశలో ఆత్మ జంతు ప్రపంచం (Animal Kingdom)లోనికి ప్రవేశిస్తుంది. ఇక తరువాత దశయే మానవ ప్రపంచం (Human Kingdom). ఈ మానవ ప్రపంచంలో నుండే దైవ ప్రపంచం (Divine Kingdom) లోనికి వెళ్ళగలుగుతాం.

జంతు ప్రపంచం లోనికి ప్రవేశించిన ఆత్మ రకరకాల జన్మలు ధరించి పరిపక్వత చెందుతూ చివరగా మానవ జన్మ ధరించే ముందు, మానవులను అధ్యయనం చేసి మానవుల పట్ల తమకున్న అపోహలు తొలగించుకుని మానవ జన్మ తీసుకునేందుకు తమను తాము సిద్ధం చేసుకుంటున్న దశలో, మానవుడికి దగ్గరగా మసలుకునేందుకు వీలుగా ఉన్న జంతువులుగా జన్మ తీసుకుంటాయి. ఉదాహరణకు గుఱ్ఱం, గాడిద, కుక్క , ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ళు మొదలైనవి. మనిషికి దగ్గరగా పుట్టింది మనిషిని, మనిషి జన్మను అధ్యయనం చేసి తమకున్న అపోహలను, భయాలను పోగొట్టు కోడానికే. వాస్తవానికి భూమి మీద ఉన్న ప్రాణికోటికి మనిషి ఒక "పెద్ద దిక్కు" లాంటివాడు. అలాంటి వాడు ఊహించలేని క్రూరత్వంతో నిలువునా కోసి వండుకుని తినే సరికి ఆ యొక్క ఆత్మలు విపరీతమైన భయాందోళనలకు గురి అవుతున్నాయి. వాటి శవాలని తినడం, వాటి గుడ్లను / పిల్లల్ని చంపడం, వాటి పసి బిడ్డలు తాగాల్సిన పాలును వాటి నోరు కట్టి / కడుపు కొట్టి దోచుకోవడం, వాటి కష్టార్జితాన్ని (తేనే) దోచుకోవడం, వాటిని హింసించి చంపి పట్టు వస్త్రాలు కట్టుకోవడం, బ్రతికుండగానే వాటి చర్మాన్ని వలచి లెదర్ వస్తువులు చేసి వాడుకోవడం, రక్తం కారేలా వాటి బొచ్చుని కత్తిరించి వూల్ తయారు చేయడం, సౌందర్యం కోసం వాటిని హింసించడం, సరదాల

కోసం వాటిని బంధించడం, వేధించటం ఇంకా ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా ఎన్నోన్నో విధాలుగా మనిషి జంతువుల పట్ల చేస్తున్న దారుణాన్ని, హింసను, వంచనను, మోసాన్ని, అవమానాన్ని అవి తట్టుకోలేక పోతున్నాయి. మనిషి అంటే, మనిషి జన్మ అంటే అత్యంత భయం ఏర్పడి మళ్ళీ జన్మ తీసుకోడానికి సాహసించవు. అలాగే ఉండి పోతాయి జన్మ తీసుకోకుండా. జన్మ చక్ర సిద్ధాంతం ప్రకారం వెనక్కి వెళ్ళడం అంటూ ఉండదు. ఆగిపోతే ఎక్కడ ఉన్నారో అక్కడే ఆగిపోతారు అంతే కాని వెనక్కి వెళ్ళరు, ఎలాగైతే మీరు పదవ తరగతి వరకు చదివారని అనుకోండి, కొంత కాలం చదువు మానేసారు. మళ్ళీ మీరు చదువు మొదలు పెడితే పదకొండవ తరగతి లేదా ఇంటర్ మొదటి సంవత్సరం నుండి మొదలు పెట్టాలి, మొదలు పెడతారు. ఈ జన్మ చక్ర సిద్ధాంతంలో కూడా ఇంతే. పురోగతికి సహకరించి మార్గదర్శకత్వం వహించాల్సిన "పెద్ద దిక్కు", కంచే చేను మేస్తున్నట్టుగా, రక్షించాల్సిన వాడే భక్షిస్తూ ఉంటే ఏం చేయాలో అర్థం కానీ ఆ ఆత్మలు సూక్ష్మ లోకాల(Astral Worlds)లో అలా ఆగిపోయి, stuck అయి ఉంటాయి. వెనక్కి వెళ్ళలేక, ముందుకి వెళ్ళాల్సి ఉన్నా ముందుకి వెళ్ళలేక విపరీతమైన క్షోభను అనుభవిస్తూ ఉంటాయి ఈ ఆత్మలు.

తమ ఆత్మాభివృద్ధికి విఘాతం కలిగినందుకు భయంకర వ్యథను అనుభవిస్తూ ఉంటాయి. మనిషి పట్ల, మనిషి జన్మ పట్ల ఏర్పడిన భయం తొలగి పోయేంత వరకు ఆ ఆత్మలకు అభివృద్ధి జరగదు. తాము చేయని తప్పుకు అవి బలైపోకూడదని ప్రకృతి వీటికి ఒక వెసులుబాటు కల్పిస్తుంది, తమ ఆత్మాభివృద్ధి ఆగిపోయి నందుకు తాము అనుభవిస్తున్న క్షోభ, వ్యథ, బాధలు ఏవైతే ఉన్నాయో వాటిని, వీటికి మూల కారకులైన మనుషులకు ట్రాన్స్‌ఫర్ చేసి బ్యాలెన్స్ చేస్తుంది. పట్టుకుని పెంచిన వాడి దగ్గర్నుండి, కోసిన వాడు, అమ్మిన వాడు, సరఫరా చేసిన వాడు, వండిన వాడు, తిన్న వాడు అందరూ ఈ క్షోభను, వ్యథను, బాధను పంచుకున్న వారవుతారు. ఎవరి పాత్ర ఎంతెంత ఉందో అంతంత పొందుతారు. మానవులకు ఉన్న రోగాలలో అధిక శాతం మాంసాహారం వల్ల వచ్చినవే.

3. కూరగాయలు, ఆకు కూరలు మొదలైన శాకాహారానికి సంబంధించిన వాటికి కూడా జీవం ఉంటుంది కదా, అని ప్రశ్నిస్తారు. నిజమే వాటికి జీవం ఉంటుంది. అయితే ఇక్కడ మీరు తెలుసుకోవాల్సిన ఒక అత్యంత ముఖ్య విషయం ఉంది. సృష్టి అంటేనే జీవం. సృష్టిలో జీవం లేనివి లేనే లేవు. మీ కంటికి ప్రాణం లేని వాటిలా కనిపించే వాటికి కూడా జీవం ఉంటుంది. జీవం లేనివి ఉనికిలో ఉండవు. శాఖాహారానికి జీవం ఉంటుంది. మన జీవం నిలపడానికి ఉద్దేశించబడిన దాంట్లో జీవం ఉండకపోతే ఎలా ?! జీవాన్ని నిలిపే ఆహారానికి జీవం తప్పని సరిగా ఉండి తీరాలి. ఇదే కారణంగా శాఖాహారంలో జీవం ఉంటుంది. ఆ యొక్క శాఖాహారంలో ఉన్న జీవం మన జీవాన్ని నిలపడానికే ఉద్దేశించ బడింది. ప్రకృతి మనకు కేటాయించిన ఆహారం అది. శాఖాహారం, మనిషి ఆహారం కోసమే సృష్టించబడింది కనుక దాని యొక్క మొత్తం జీవ నిర్మాణంలో ఈ ప్రణాళిక

నిక్షిప్తమై ఉంటుంది. మనిషి అకర్మ శాఖాహారం తీసుకోవడం సరి. దీనిలో హింస లేదు. రక్త పాతం లేదు. భయానకం లేదు. క్రూరత్వం లేదు. పెనుగులాట లేదు. విల విలా కొట్టుకోవడం అనేది లేదు. వేట లేదు. రాక్షసత్వం లేదు. శాఖాహారంలో ఇవన్నీ లేవు. ఉండవు, ఉండలేవు కదా. మరి మాంసాహారంలో పైవన్నీ ఉంటాయి. ఇంతటి దారుణాలతో, ఘోరాలతో కూడిన ఆహారం ఆహారమేనా ?! ఆహారం అంటే మీ ప్రాణం నిలుపుకోవడానికి కదా మీరు తినేది. మీ ప్రాణం నిలుపుకోవడానికి ఇతర జీవాత్మల ప్రాణం తీయడం సబబేనా ?! సమంజసమేనా ?!

శాఖాహారంలో జీవం లేదా ? మరి వాటిని కోయడం ఎంత వరకు సబబు ? అని అడిగే వారు ఒక ప్రాక్టికల్ ప్రయోగం చేసి చూడండి. కొన్ని ఆకు కూరలు లేదా కూరగాయలు ఏవైనా తీసుకువచ్చి మీ ఇంటి ముందు పెట్టండి. వాటితో అనండి మేం మిమ్మల్ని తినాలని అనుకుంటున్నాం అని, అవి ఏ బదులు ఇవ్వకుండా మౌనంగా, ప్రశాంతంగా ఉంటాయి. అదే మీరు కోడినో, మేకనో తెచ్చి దానిని స్వేచ్ఛగా వదిలి అడిగి చూడండి. కత్తి చూపెట్టి ప్రశ్నించి చూడండి, నిజంగా ఏం జరుగుతుంది ? అవి పారిపోతాయి. అప్పుడు మీరు అంటారు, వాటికి ప్రాణం ఉంది కదా అందుకే అవి పారిపోతాయి అని అంటారు, వదిలితే పారిపోక పోతే ఏం చేస్తాయి మరి ? అని ఎదురు ప్రశ్నిస్తారు... మేము కూడా సరిగ్గా అదే అంటున్నాం, వాటికి కూడా ప్రాణం ఉంది. వాటికి కూడా జీవితం ఉంది. వాటికి తమ ఇష్టాయిష్టాలను ప్రకటించే సామర్థ్యం ఉంది. వాటికి చావాలని లేదు. పైగా అవి మీ ఆహారం కాదు. అవి కేవలం "మృగాలకు" మాత్రమే ఆహారం. కానీ మీరు మనుషులు కదా !! జంతువును కోసేటపుడు మీరు దాన్ని హత్య చేస్తున్నారని దానికి తెలుసు, అయినా నిస్సహాయంగా అలా ఉండిపోతుంది. మీరు మత్తు మందు ఇచ్చినా సరే ఆ మత్తు కేవలం ఉపరితలంలో మాత్రమే పని చేస్తుంది. ఓ జంతువును మీరు చంపుతున్నప్పుడు, మరణ భయంతో దాని శరీరంలో అనేకానేక విష రసాయనాలు విడుదల అవుతూ ఉంటాయి. దానికి చావు ఒక్క సారిగా సులభంగా రాదు. మీరు జంతువును చంపే సమయంలో చావు భయంతో అది అల్లాడి పోతూ ఉంటుంది. మీకు లాగే దానికి కూడా బ్రతకాలని ఉంటుంది. మీరేమో దాన్ని నరుకుతూ ఉంటారు. అది ప్రాణ భయంతో గిల గిల లాడుతూ ఉంటుంది. భయంకరమైన సంఘర్షణ అనుభవిస్తుంది, ఈ సంఘర్షణలో చాలా విషాలు విడుదల అవుతాయి, అవి ఆ జంతు శరీరంలో అలాగే ఉండి పోతాయి. మీ చేతిలో హత్యకు గురి అవుతున్న జంతువు కోపంతో, ఆవేశంతో, క్రోధంతో ఉంటుంది. తీవ్ర ఆవేదనను, భయోద్రేకాలను కలిగి ఉంటుంది. ఆ జంతువు యొక్క మృత్యువు మీ రూపంలో దాని ఎదురుగా నిలబడి ఉంటుంది. దాని పోరాటం అది చేస్తుంది. చివరికి చస్తుంది. అప్పుడు మీరు, ఆ యొక్క మృత కళేబరాన్ని లొట్టలు వేసుకుంటూ తింటారు. మీరు తినేది క్షోభను, వ్యథను, బాధను, శవాన్ని అని తెలుసుకోండి.

4. పతంజలి మాంసం తినకూడదని అంటే మాంసం తినటం హింస అయినందువలన ఆయన

అలా చెప్పటం లేదు. **మాంసం తినడం ఆత్మహత్య లాంటిది.** కాబట్టి అలా చెబుతున్నాడు. అహింసకులుగా ఉండటం అంటే నిస్వార్థంగా ఉండటం అని పతంజలి అంటాడు. అహింసకులుగా ఉండటం వల్ల ఎవరికో మేలు చేయడం కాదు. నీకు నువ్వే మేలు చేసుకుంటావు. నీవు ఏం చేస్తే అదే నీకు తిరిగి వస్తుంది అనే సత్యాన్ని అనుసరించి నీవు జంతువులను చంపి తినడం అనే చర్య యొక్క ఫలితంగా నీవు కూడా చంపబడతావు అని అర్థం చేసుకో. ***మాంస భక్షణ వల్ల ఆత్మనాశనం కలుగుతుంది కనుక చెబుతున్నాడు. శాఖాహారిగా ఉండటంలో నువ్వు మరెవరిపైనో దయ తలచడం లేదు. నిన్ను నీవు జాగ్రత్తగా చూచుకోవటం అది" ! - ఓషో మహాత్ముడు***

5. భూమిపై ప్రాణులన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. మనిషితో సహా ప్రాణులన్నీ ఒక ప్యాకేజ్‌లా ఉంటాయి. అన్నీ తమ ఆత్మాభివృద్ధి కోసమే ఈ భూమి పైకి వచ్చాయి. ప్రతీ ఒక్క ప్రాణి మనుగడ మిగతా ప్రాణికోటి అంతటితో ముడిపడి ఉంటుంది. ప్రాణికోటిలోని ఏ ప్రాణి అయినా సరే ప్రాముఖ్యం కలదే. ఆత్మ పరిణామ క్రమంలో అన్ని ప్రాణులు తమ తమ కార్యక్రమాలను ప్రకృతి నియమాలకు అనుగుణంగా నిర్వర్తించుకుంటూ ఆత్మాభివృద్ధిని చెందించుకుంటూ ఉంటాయి. ఈ పరిణామ క్రమం అంతా ఒక చెయిన్ సిస్టమ్ లాగా ఉంటుంది. వీటిలో ఏ ఒక్క ప్రాణిజాతి యొక్క ఆత్మాభివృద్ధి కుంటు పడినా ఆ ప్రభావం మిగతా ప్రాణికోటి మీద పడుతుంది. ఎలా అంటే, శరీరంలో ఏ ఒక్క భాగం దెబ్బతిన్నా మిగతా శరీరం అంతా ఆ ప్రభావానికి లోనవుతుంది. మిగతా శరీరమంతా దెబ్బ తిన్న భాగానికి శక్తిని, పోషణను అందించవలసి వస్తుంది. ప్రాణికోటిలో మానవుడి దుశ్చర్యల వలన ఎంతో జంతుజాలం అనవసరంగా హరించి వేయబడుతోంది. మనిషి చేతుల్లో దారుణ హత్యలకు గురైన జంతుజాలం యొక్క ఆత్మాభివృద్ధి కుంటు పడుతుంది. దీనితో మొత్తం భూమిపై ఉన్న ప్రాణికోటి అభివృద్ధి అంతా కుంటు పడుతుంది. మొత్తం భూమిపై ఉన్న సమస్త ప్రాణికోటిలో మానవుడు ఒక్కడే ప్రకృతి నియమాలను ఉల్లంఘిస్తూ ఎంతో వినాశనానికి కారణం అవుతున్నాడు. ప్రకృతికి సంరక్షకుడిగా వ్యవహరించ వలసిన మానవుడు ప్రకృతిని నాశనం చేస్తున్నాడు, తన మూర్ఖత్వం వలన, అజ్ఞానం వలన ! తన ఆహారం కోసం, తన సరదాల కోసం, ఇతర అనవసర సౌకర్యాల కోసం జంతువులను చంపి వాడుకోవడం మానవుడు తక్షణం ఆపివేయాలి.

6. మాంసాహారం అంటే నెగెటివ్. మాంసాహారం తినటం వలన మనిషిలో నెగెటివ్ గుణాలు పెరుగుతాయి. బలపడతాయి. మరి మన గుణాలే మన వాస్తవాలు. మనం ఎలాంటి గుణాలను కలిగి ఉంటామో మన శరీరం + జీవితం అలాగే ఉంటుంది, నెగెటివ్‌గా !

7. మాంసాహారం తినటం వలన శరీర వ్యవస్థ మొద్దు బారుతుంది. ఆత్మ పరిణామ క్రమంలో ఉన్నత స్థాయి పొందడానికి అవసరమైన ఉన్నత ఆధ్యాత్మిక ప్రకంపనలను స్వీకరించే సూక్ష్మనాడీ వ్యవస్థ చాలా సున్నితంగా ఉంటుంది. ఇది మాంసాహారం తినటం వలన మొద్దు బారిపోయి పని చెయ్యదు. దీని వలన ఆత్మాభివృద్ధి ఆగిపోతుంది. ఎంతో నష్టానికి గురి కావలసి వస్తుంది.

8. మనిషి భౌతికంగానే కాదు, మానసికంగా కూడా విషాహారాన్ని విసర్జించాలి. అసూయతో కూడిన ఆలోచనలు, దగాతో, కుట్రతో కూడిన ఆలోచనలు, స్వార్థపూరిత ఆలోచనలు, మోసపూరిత ఆలోచనలు, ఇతరులకు హాని చేసే ఆలోచనలు, ఇతరులకు కష్టం, నష్టం, బాధ కలిగించే ఆలోచనలు, దురుద్దేశాలు, దురభిప్రాయాలు, కన్నంగితనం, మానసిక వ్యభిచారం మొదలైనవి అన్నీ "మానసిక విషాహారాలే". భౌతికంగా చేయలేని పనులను మానసికంగా చేస్తూ తృప్తి పడుతూ ఉంటారు. ఇది సరికాదు. ప్రవర్తనలోనూ, మానసికంగానూ పరిశుద్ధంగా ఉండాలి. స్వచ్ఛంగా ఉండాలి. మానసిక స్వచ్ఛతే మీ శరీరంలో + జీవితంలో శాంతిని, ఆరోగ్య ఐశ్వర్యాలను తెస్తుంది, ప్రవర్తన కాదు. మానసిక పరిశుద్ధత అంటే భావ పరిశుద్ధత అని అర్థం. భావ(గుణ) పరిశుద్ధతే భవ(పరిస్థితి) పరిశుద్ధత, కాబట్టి మానసికంగా ప్రేమ పూర్వకమైన ఆలోచనలు, నిర్మాణాత్మకమైన ఆలోచనలు, సహాయ సహకార సమన్వయ భరితమైన ఆలోచనలు, శాంతి పూర్వకమైన ఆలోచనలు, అభివృద్ధికి సంబంధించిన ఆలోచనలను కలిగి ఉండాలి. ఇలాంటి ఆలోచనలే చేయాలి. క్రమం తప్పకుండా సాధన చేస్తే ఈ స్థితిని పొందడం పెద్ద విషయం ఏమీ కాదు. ఈ స్థితిని పొందడం అకర్మ శాకాహారులకు మాత్రమే సాధ్యం.

మనిషి ప్రవర్తనలోనూ, భావంలోనూ అకర్మ శాఖాహారిగా, ప్రాణాహారిగా ఉండాలి. సరియైన ఆలోచనలే ప్రాణాహారం, సరికాని ఆలోచనలే విషాహారం. ఎందుకంటే ఆలోచన అనేది సూక్ష్మమైన ఆహారం, ఆహారం అంటే శక్తి. మరి ఎలాంటి శక్తులను మనం కలిగి ఉంటామో వాటినే మనం అనుభవించాల్సి వస్తుంది.

9. మనిషి కేవలం భౌతికంగా, మానసికంగా ప్రాణాహారిగా మారితే సరిపోదు. ఆధ్యాత్మిక తలంలో కూడా ప్రాణాహారిగా మారాలి. ఆధ్యాత్మికంగా కూడా విషాహారాలు ఉంటాయి. అవి :

1. మా మార్గమే గొప్పది మిగతావి అన్నీ తప్పు, నీఛమైనవి.
2. మా సంస్థే గొప్పది.
3. మీ మార్గంలో లేక మీ సంస్థలో లేనందువలన మిగతా వారిని తుచ్ఛులుగా పరిగణించటం.
4. మీ సంస్థలో నుండి వెళ్ళిపోయిన వారిని దోషులుగా, నేరస్తులుగా చూడటం.

ఇవి అన్నీ కూడా విషాహారాలే. వీటిని తక్షణమే వర్జించాలి.

10. విషాహారాలు మూడు రకాలు అవి : 1. భౌతికం 2. మానసికం 3. ఆధ్యాత్మికం. ఈ మూడు తలాల్లో మనిషి ఈ విషాహారాలను తక్షణమే శాశ్వతంగా వదిలేసి ప్రాణాహారిగా మారాలి. అందరూ ప్రాణాహారులుగా మారేందుకు పరిశ్రమించాలి. సరి అయిన ఆహారం తీసుకుంటే సరి అయిన శక్తి వస్తుంది. సరి అయిన శక్తి వస్తే మన శరీరం + జీవితం సరిగా ఉంటుంది.

11. అకర్మ శాకాహారిగా ఉండడంలో ఇంకో విషయం కూడా ఉంది. అదేమిటంటే ఇతరులను మానసికంగా వేధించడం కూడా మాంసాహారమే. ఇతరుల "మెదడు" తినడం సరి కాదు. జంతువులను తినడం మానేసినపుడు ఇతరులను తినడం(వేధించడం) కూడా మానేయాలి. మన మాటలతో, చేష్టలతో

ఇతరులను హింసించడం అనేది కూడా మాంసాహారమే. ఇలా చేయటం తక్షణం మానివేయాలి.

మీ కన్నా చిన్న వాళ్ళను, మీ అధికారం కింద ఉన్న వాళ్ళను మీరు అకారణంగా హింసించ కూడదు. పెద్దరికం మరియు అధికారం అనేవి అంధులను చేసే అవకాశం ఉంది. బలుపు, మదం పెరిగే అవకాశం ఉంది. నేను చాలా మంది శాఖాహారులను చూసాను. వారు పూర్తి స్థాయి శాఖాహారులే అయినా... వారి కంటే చిన్న వాళ్ళను మరియు వారి కింద ఉన్న వాళ్ళను వేపుకు తింటారు. ఇది జంతువులను తినడం కన్నా ఎక్కువ నేరం. ఎందుకంటే మనిషి, జంతువు కంటే అధిక చైతన్యం కలవాడు కాబట్టి! ముఖ్యంగా పిల్లలు ఈ విషయంలో బలి అవుతూ ఉంటారు. పెద్ద వాళ్ళు క్రమశిక్షణ అనే ముసుగులో పిల్లలను రాచి రంపాన పెడుతూ ఉంటారు. మీ మేలు కోసమే అని అంటూ నరక యాతన పెడుతూ ఉంటారు. ఇది ఎంత మాత్రమూ సరికాదు.

12. అకర్మ వీగన్లుగా మారండి. అందరినీ అకర్మ వీగన్లుగా మార్చండి. మీరు అనుభవించాల్సిన కర్మలు ఈ అకర్మ వీగన్ ప్రచారం ద్వారా త్వరగా, సులభంగా వదిలించుకోవచ్చు. మహాగొప్ప మేలు జరుగుతుంది మీకు. మీ జీవితం దివ్యమవుతుంది.

13. అకర్మ శాకాహారులుగా ఉండడం అంటే అహింసకులుగా ఉండడం, అంటే నిస్వార్థంగా ఉండడం. ఈ నిస్వార్థతయే మీ శరీర ఆరోగ్యాన్ని, మీ జీవితంలో ఆనంద ఐశ్వర్యాలను సృష్టిస్తుంది.

14. గుడ్డు మాంసాహారం కాదు అని అంటూ ఉంటారు. వాస్తవానికి గుడ్డు మాంసాహారమే. గుడ్డులో నుండి పుట్టి పెరిగిన కోడి మాంసాహారం అయినప్పుడు మరి కోడి యొక్క ఉత్పత్తి బీజమైన గుడ్డు శాఖాహారం ఎలా అవుతుంది ?! కోళ్ళ ఉత్పత్తికి కాదని, వీటిని తినవచ్చని చెప్పి కేవలం తినేందుకే కోళ్ళ ఫారాలలో గుడ్లను ఉత్పత్తి చేసి అమ్ముతుంటారు. ఇవి కూడా తినకూడదు.

15. మాంసాహారం వలన బలం వస్తుందనే అపోహ చాలా మందిలో ఉంది. మాంసాహారం ఏ రకంగా చూసినా బలాన్ని ఇవ్వదు పైగా అనారోగ్యకరం. గమనించి చూడండి, ప్రకృతిలో శాఖాహార జంతువులే బలంగా ఉంటాయి. ఉదాహరణకు ఏనుగు. ఇంటర్‌నెట్‌లో వెతకండి వీగన్ బాడి బిల్డర్లు, వీగన్ అథ్లెట్లు ఎంతెంతో మంది ఉంటారు.

అకర్మ శాఖాహారిగా ఉండటం అంటే యాంత్రికంగా కాదు. ఏదో ఒక శాకాహార కులంలో పుట్టినందువల్ల, యాదృచ్ఛికంగా శాఖాహారిగా ఉండడం వలన ఏమీ ప్రయోజనం ఉండదు. మీరు శాఖాహారిగా ఎందుకు ఉన్నారో, ఉండాలో మీకు స్పష్టంగా తెలిసి ఉండాలి. అవగాహన కలిగి ఉండాలి. స్మృతి పూర్వకంగా మీరు అకర్మ శాఖాహారిగా ఉండాలి. అప్పుడే ప్రయోజనం, అభివృద్ధి.

16. మీరు ఏ జంతు మాంసం తింటే మీకు ఆ లక్షణాలు వస్తాయి. ఆహారం స్వభావాన్ని మారుస్తుంది.

ఆత్మ పరిణామ క్రమంలో జంతు దశను పూర్తి చేసుకుని, మానవులుగా ఎదిగిన మీరు, జంతువుల్లా జంతు మాంసాలను తింటుంటే, మీలో జంతు లక్షణాలు మళ్ళీ మొదలై, మానవులుగా మీ ఆత్మ పరిణామ క్రమం ఆగిపోతుంది. మీ అభివృద్ధి ఆగిపోతుంది. మీరు అప్పుడు మానవ రూపంలో ఉన్న జంతువులా అవుతారు. జంతు దశను పూర్తి చేసుకుని మనిషిగా జన్మించినా... మాంసాహారం వలన, జంతు దశలోనే ఉంటారు, రూపం మనిషిదే కానీ గుణాలు జంతువు గుణాలు ఉంటాయి. రిజిడ్‌నెస్, క్రూరత్వం, సంకుచితత్వం, కోపం, కొట్లాడే గుణం వగైరాలు.

17. మాంసాహారం వలన నెగెటివ్ శక్తులకు మీరు ఒక ఆశ్రయంగా మారుతారు. నెగెటివ్ శక్తులు ఉండగలిగేది మాంసాహారులలోనే. మీరు మాంసాహారం మానేయాలి అని అనుకున్నప్పుడు మీలో ఒక కల్లోలం చెలరేగుతుంది. అది వాస్తవానికి మీది కాదు. మీలో ఉన్న నెగెటివ్ గుణాలది. ఎందుకంటే మీరు మాంసాహారం మానేస్తే అవి మీలో ఉండలేవు. అందుకే వాటిలో తీవ్రమైన అలజడి కలిగి మిమ్మల్ని శాకాహారులుగా మారనివ్వకుండా అడ్డుకుంటాయి. వాస్తవానికి మాంసాహారం కోరుకునేది, తినేది, అనుభవించేది మీలో నెగెటివ్ గుణాలే !

18. 2018వ సం॥ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజూ 5600 కోట్లకు పైగా జంతువులు చంపబడుతున్నాయి. ప్రతీ క్షణం 177,575 కి పైగా జంతువులు దారుణంగా చాలా ఘోరంగా చంపబడుతున్నాయి. ఐక్యరాజ్య సమితి 2018 నివేదిక ప్రకారం మాంసాహార ఉత్పత్తి వల్ల ఏర్పడే కాలుష్యం, ప్రపంచ వాహన కాలుష్యంతో సమానం. వాహన ఇంధనాలకు మనకు వేరే ప్రత్యామ్నాయాలు లేవు. కానీ మాంసాహారానికి ప్రత్యామ్నాయం శాఖాహారం ఉంది. అసలు నిజానికి ప్రకృతి పరంగా మానవ జాతికి శాఖాహారమే కేటాయించ బడింది. మాంసాహారం అనేది మనుషులకు సంబంధించినది కానే కాదు. మనుషులు మాంసాహారం తినడం వలన నేడు, మొత్తం మానవ జాతికి మరియు లోకానికే ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుతం ప్రతి ఆరుగురికి ఒకరు ఆహార కొరతతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం మాంసాహార ఉత్పత్తి. ప్రతీ ఒక్కరూ పూర్తి స్థాయి శాఖాహారులుగా మారితే, ప్రపంచ జనాభాకు సరిపోయేంత ఆహార ధాన్యాన్ని సులభంగా ఉత్పత్తి చేయవచ్చు. 600 కిలోల మాంసాన్ని ఉత్పత్తి చేసే వనరులతో 4,500 మందికి మాంసాహారాన్ని ఇవ్వగలిగితే, అవే వనరులతో శాఖాహారాన్ని ఉత్పత్తి చేస్తే 54,000 మందికి శాఖాహారం లభిస్తుంది. మనుషులందరూ పూర్తి స్థాయి శాఖాహారులుగా మారితే, ఈ భూమి పైన ఆకలి చావులు ఉండవు. కాలుష్యం అనేది ఉండదు, ఎందుకంటే ఈ భూగ్రహాన్ని నీరు ఆక్రమించగా మిగిలిన భూ భాగంలో 34% పంట భూమిని కేవలం జంతువులను పెంచడానికి(ఉరిఖీలి రీశిళిబీది కోసం) వాడుతున్నారు. దీని వలన కరువు సంభవిస్తోంది, ఇంకా.. చెట్లు తరిగి జంతువులను పెంచడానికి(ఉరిఖీలి రీశిళిబీది కోసం) వాడుతున్నారు. దీని వలన కరువు సంభవిస్తోంది, ఇంకా.. చెట్లు తరిగి పోవడమే కాకుండా, భయంకరమైన కాలుష్యం పెరుగుతూ ఉంది. ఇది రోజు రోజుకీ తీవ్రంగా పెరుగుతూనే ఉంది తప్ప ఆగడం లేదు. ఇది ఎంత మహా ప్రమాదమో అందరూ

అవగాహన చేసుకుని తీరాలి. అందరూ ఈ క్షణమే పూర్తి స్థాయి అకర్మ శాకాహారులుగా (అకర్మ వీగన్స్ - జూదిబిజీళీబి జలివీబిదీరీ) మారి తీరాలి.

మానవులంతా మేలుకొని పూర్తి స్థాయి అకర్మ శాఖాహారులుగా మారకపోతే, మానవ జాతికి నాశనం తప్పదు. టెర్రరిజమ్ సమస్య కన్నా పెద్ద సమస్య, ఈ మాంసాహార సమస్య ! ప్రజ మరియు ఏశ్రీ వారి నివేదిక ప్రకారం 1968 నుండి 2003 వరకు ఆహార కొరత కారణంగా రోజుకు 23,468 మంది చనిపోతే, టెర్రరిజమ్ కారణంగా రోజుకు 45 మంది మాత్రమే చనిపోయారు అని అంటే ఈ మాంసాహార సమస్య ఎంత తీవ్రమైనదో గ్రహించండి.

19. ప్రస్తుతం భూమిని కబళించాలని ప్రయత్నిస్తున్న మహమ్మారి పేరే - జెనెటికల్లి మోడిఫైడ్ ఫుడ్. వినడానికి చాలా నీరి-తీరిగా అనిపిస్తుంది. కాని ఇది ఎంత ప్రమాదకరమైనదో తెలుసుకోవాలంటే మీరు ఇంటర్‌నెట్‌ను ఆశ్రయించాల్సిందే. సహజ విత్తనాలను ప్రయోగ శాలల్లో రక రకాల మార్పులకు గురిచేసి, వాటిలో జంతువుల ఈశ్రీజులు కలిపి కొత్త విత్తనాలను సృష్టిస్తున్నారు. ఇవి మనుషుల ఆరోగ్యాన్ని తీవ్రస్థాయిలో దెబ్బ తీయడమే కాకుండా భూ గ్రహానికి కూడా మహా ప్రమాదంగా పరిణమిస్తున్నాయి.

ఈ ప్రయోగాల వలన ప్రకృతి పరంగా మనుషులకు లభించిన శాకాహారం మొత్తం మాంసాహారం కిందికి మారిపోతుంది. దీనితో మానవ శారీరక నిర్మాణ వ్యవస్థ కోలుకోలేని రీతిలో దెబ్బ తింటుంది.. ఎందుకంటే " ప్రకృతి పరంగా మనుష్యులకు శాఖాహారం మాత్రమే సరైన ఆహారం (ఇంధనం) " కాబట్టి ! ఎప్పుడైతే శరీరానికి ప్రకృతి సహజమైన ఇంధనం(ఆహారం) లభించదో అప్పుడు శరీరం ఎల్లప్పుడూ రోగ గ్రస్తంగానే ఉండిపోవడమే కాక జన్మ జన్మల కర్మ చుట్టుకుంటుంది.

ప్రతీ దానిలో ఏదో ఒకటి జంతువులది కలుపుతున్నారు. మార్కెట్లో దొరికే వాటి పైన వెజిటేరియన్ సింబల్ ఉన్నా సరే, దానిలో ఏమేం ఉన్నాయో పరిశీలించి, పరిశోధించి కొనాలి, వాడాలి. వీగన్ ప్రొడక్ట్స్ (Vegan Products) అంటే... జంతువుల మాంసం, కొవ్వు మొదలైన జంతు పదార్థాలు ఏవీ కూడా వాడకుండా తయారు చేసిన వాటిని వీగన్ ప్రొడక్ట్స్ అని అంటారు.

ఇంటర్‌నెట్‌లో Vegan Products & Organic Products ఏమేం ఉన్నాయో చెక్ చేసి, ఒక లిస్ట్ తయారు చేసి, కన్‌ఫర్మ్ చేసుకుని ప్రింట్ తీసి దగ్గర పెట్టుకుంటే అప్పుడు, మనం ఇబ్బంది లేకుండా వస్తువులను కొని వాడుకోవచ్చు. దయచేసి పూర్తి స్థాయి శాఖాహారులుగా అనగా అకర్మ వీగన్లుగా మారండి. అకర్మ శాఖాహారం కేవలం ఆరోగ్య పరంగా సరైనది మాత్రమే కాదు.. ఆర్థికంగా, వాతావరణ పరంగా మరియు ఆధ్యాత్మికంగా ఎంతో లాభకరమైనది, శుభకరమైనది, సురక్షితమైనది మరియు అభివృద్ధి కరమైనది. చక్కటి ఆరోగ్యం కోసం, జీవితకాలాన్ని పెంచుకోవడం కోసం అకర్మ వీగన్స్ గా మారండి.

మీరు, మాంసాహారం పూర్తిగా మానివేయకుండా, పర్యావరణ రక్షణ కోసం మీరేం చేసినా

వృథా ! తినే ఆహారం స్వభావాన్ని నిర్మిస్తుంది. మాంసాహారం వలన, మానవ స్వభావం జంతు స్వభావంగా మారుతుంది.అప్పుడు మాంసాహారులకు ఏ నాటికీ ముక్తి దొరకదు.. ఏ దేవుడు కూడా వారిని రక్షించలేడు. దేవుడికి శక్తి లేక కాదు. సాక్షాత్తు దేవుడు పెట్టిన నియమాలను దేవుడు ఉల్లంఘించడు కదా ! ఏ దేవుడికైనా రక్తంతో అభిషేకం చేస్తారా ? జలంతో చేస్తారా ? తిరుపతిలో, అమర్ నాథ్‌లో, బద్రినాథ్‌లో అలా చేయగలరా, చేస్తారా ? చేయరు కదా ! ఎందుకు చేయరు ? అది మహా పాపం అని తెలుసు కాబట్టే చేయరు. మరి పాపమైన మాంసం తింటే దేవుని యొక్క క్షమ దొరుకుతుందా ? ! ఎవరైనా పూర్తి స్థాయి శాఖాహారులుగా(అకర్మ వీగన్లుగా) మారడం అంటే వాళ్ళని వారు & భూమిని రక్షించుకున్నట్టే అవుతుంది.

✪ 20. నేటి మాంసాహారులే రేపటి అకర్మ శాఖాహార ప్రచారకులు అవుతారు ! ✪

భూమిని, జంతుకోటిని, వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మానవులందరిది. మానవులు అనబడే ప్రతి ఒక్కరు ఇందుకోసమై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉద్యమించండి. ఉద్యమింప చేయండి.

చక్కటి ఆరోగ్యం కోసం,

జీవిత కాలాన్ని పెంచుకోవడం కోసం

పూర్తి స్థాయి శాఖాహారులుగా మారండి

అకర్మ వీగన్లుగా మారండి !

❖ ❖ ❖

శాకాహార పట్టిక (100 g)

పదార్థం	ప్రోటీన్స్	కార్బోహైడ్రేట్స్	డయటరి ఫైబర్	కొవ్వు	ఎనర్జీ
పప్పు దినుసులు	6.0 - 28.2	14 - 60.9	5 - 25	0.4 - 5.6	86 - 372
గోధుమ పిండి	10	76	2.7	1	364
బియ్యం	7	80	1.3	0.7	365
సోయా బీన్స్	36	30	9	20	446
కూరగాయలు	0.2 - 27	1.4 - 63	1.1 - 16.3	0.2 - 9.6	10 - 365

మాంసాహార పట్టిక (100 g)

పదార్థం	ప్రోటీన్స్	కార్బోహైడ్రేట్స్	డయటరి ఫైబర్	కొవ్వు	ఎనర్జీ
మేక మాంసం	21.4	- NIL -	- NIL -	3.6	109
చికెన్	6 - 14	- NIL -	- NIL -	3.6 - 18	109
గుడ్డు	13.3	- NIL -	- NIL -	11	155
బీఫ్ మాంసపు కండ	14	- NIL -	- NIL -	15 - 30	332
పంది మాంసపు కండ	20	- NIL -	- NIL -	6.3	185

* పైన తెలిపిన విలువలు యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (USDA) వారు విడుదల చేసినవి.

✪✪✪ "మనం నిత్యం తీసుకునే ఆహారం నుండి "గుడ్డు మరియు మాంసాహారాన్ని (Animal Foods)" తొలగించడం ద్వారా ఎన్నో హానికరమైన మరియు విష పూరితమైన పదార్థాలను తగ్గించుకో గలుగుతాము. అన్ని రకాల క్యాన్సర్లు, గుండెకు సంబంధించిన మరియు రక్త నాళాలకు సంబంధించిన వ్యాధులు, ఇంకా ఇతర ఆరోగ్యాన్ని క్షీణింపచేసే రోగాలను ఎన్నింటినో రాకుండా, ముందు జాగ్రత్తగా, నివారణ చర్యలు తీసుకోడానికి పెద్దగా శ్రమించనవసరం లేదు. కేవలం శాఖాహారులుగా మారడం ద్వారా పైన పేర్కొన్న వ్యాధులు చాలా వరకు రాకుండా ముందుగానే నివారించవచ్చు. గుండె జబ్బులు, క్యాన్సర్, స్ట్రోక్స్, మధుమేహం, ఓస్టియోపోరోసిస్,

ఊబకాయం, ఇంకా ఇతర వ్యాధులు అన్నీ కూడా మాంసాహారానికి మరియు డైరి ఉత్పత్తులకు సంబంధించి ఉన్నాయి."

- డాక్టర్ టి. కోలిన్ క్యాంప్ బెల్ - న్యూట్రీషనల్ రీసెర్చర్, కార్నెల్ యూనివర్సిటి

"వ్యాధుల వ్యాప్తి మరియు నివారణ" అనే అంశంపై శాస్త్రీయ మరియు వైద్య దృక్పథంతో పరిశోధన చేసే విభాగానికి "డైరెక్టర్"

- వీరి పరిశోధన చరిత్రలో సుదీర్ఘమైనదిగా పేరు పొందింది.

- www.peta.org వారి సౌజన్యంతో...

❖ ❖ ❖

నో మందు, నో సిగరెట్, నో పాన్

మందు, సిగరెట్ ఏమీ కాదు, ధ్యానులు వాటికి బానిసలు కారు, ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వాళ్ళు తాగితే ఏమీ కాదు అనే భావన కొంత మంది న్యూ ఏజ్ స్పిరిచ్చువాలిటీని అనుసరించే వాళ్ళలో ఉంది. నాకు కూడా ఒక సందర్భంలో, ఒక సభలో కలిసినప్పుడు, గురువుగా చెలామణి అవుతున్న ఒక దొంగ గురువు చెప్పాడు. నేను కూడా నిజమేనేమో అనుకుని మందు, సిగరెట్ విషయంలో పట్టింపు లేకుండా ఉండేవాడిని. వీగన్ ఆహారం గురించి చెప్పినంత దృఢంగా వీటి గురించి చెప్పక పోయే వాడిని. కానీ నాకు 2012లో ఓకరోజు ధ్యానంలో క్రిస్టల్ క్లియర్‌గా ఎక్స్‌పీరియన్స్ వచ్చింది. మందు, సిగరెట్ వలన ఎలా నష్టం జరుగుతుంది అని !

మందు, సిగరెట్‌లు విస్మృతిని పెంచుతాయి. అసలే మానవుడు, ఆల్‌రెడి విస్మృతిలోనే ఉంటాడు. ఇంకా ఇవి తాగితే మత్తు డబుల్ అవుతుంది. తాను దూర సందులేదు, మెడకో డోలు అన్నట్టుగా అవుతుంది పరిస్థితి...బాగా విస్మృతి పెరగడం వలన నెగెటివ్‌లు లోపలికి దూరుతాయి. ఇక నెగెటివ్‌లు తమకు ఇష్టం వచ్చినట్టుగా ఆడిస్తూ సత్య మార్గానికి దూరం చేస్తాయి. క్యాన్సరే కాదు ఏ రోగమైనా సృష్టిస్తాయి. నిజానికి మందు, సిగరెట్ల వలన మరీ పెద్ద ప్రమాదం ఏమీ ఉండక పోవచ్చు కానీ, వాటి వలన లోపలికి దూరే నెగెటివ్‌లే నాశనం చేస్తాయి.

మందు, సిగరెట్, గుట్కా, జర్దా పాన్, తంబాకు, మొదలైనవి ఎంత ఖరీదైనవి అయినా నాశనం చేస్తాయి. కాబట్టి వాటిని తక్షణమే, పూర్తిగా, శాశ్వతంగా వదిలేయండి.

❖ ❖ ❖

నీవు ఏమి ఇస్తే / చేస్తే నీకు అదే వేయింతలుగా తిరిగి వస్తుంది !

– ఇది ఒక విశ్వ సూత్రం .

"As you sow ; so shall you reap ."

నీవు ఏ విత్తనాలనైతే వేస్తావో, ఆ పంటనే నీవు అనుభవిస్తావు.

అందరికి ఈ విషయాలు తెలుసు, వింటారు, సందర్భం వచ్చినపుడు అందరికి చెప్తారు కూడా ... కానీ ఆహారం విషయంలో వారికీ కూడా ఇది వర్తిస్తుంది అనే విషయాన్ని విస్మరిస్తారు, గుర్తున్నా దాని గురించి ఆలోచించరు, ఎందుకంటే ఆలోచిస్తే ... అది అర్థమౌతుంది, అవగాహన కలుగుతుంది, మానవత్వం ఉన్న ఏ మనిషైనా ఇక ఈ హింస కు కారణం కావడానికి ఇష్టపడడు.అప్పుడు ఖచ్చితంగా మారిపోతారు. మరి మారడం ఇష్టం లేదు కనుక ఆహారం విషయం లో ఈ సత్యాలను వినరు, చదవరు, తెలుసుకోరు, చర్చించరు. Ignorance is bliss అంటే అజ్ఞానమే ఆనందం అనే విధంగా ఉంటారు కొందరు.

✪✪✪ మిఖైల్ నైమీ అనే మాస్టర్ మాంసాహారం గురించి ఇలా చెప్తాడు - చచ్చిన దానిని తినడం అంటే చావుకి ఆహారం కావడమే. ఇతరులను బాధించి బ్రతకటం అంటే బాధకి ఆహారం కావడమే. వారు చీల్చిన ప్రతి శరీరాన్ని ఎప్పటికైనా తప్పని సరిగా వారి శరీరం తోనే సరిచేయాలని, సరిదిద్దాలని, వారు నాశనం చేసిన ప్రతి ఎముకను వారి ఎముకతోనే మళ్ళీ నిర్మించాలనీ, చిందించిన ప్రతి రక్తపు బొట్టుని వారి రక్తంతోనే తిరిగి నింపాలని సృష్టి నియమం ! ✪✪✪

కేవలం మాంసం తినకుండా పశు ఉత్పత్తులు వాడే వారందరు కూడా పరోక్ష మాంసాహారులే ! గుడ్లు, పాలు,పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, జున్ను, తేనే, లెదర్, సిల్క్, వూల్, ముత్యాలు మొదలైన పశు ఉత్పత్తులు వాడే వారందరూ మాంసాహారులే ! కాకపోతే ప్రత్యక్షంగా కాకుండా, పరోక్షంగా...!

ఒక సాటి ప్రాణిని చంపి తినడం అంటే మీకు వాటి ప్రాణాల మీదా, వాటి జీవితాల మీదా ఏమాత్రం కనికరం లేదని అర్థం. ప్రాణం విలువ, జీవితం విలువ తెలిసిన వారెవ్వరూ ఈ పని చేయలేరు. నిర్దాక్షిణ్యంగా వాటి ప్రాణాలను, జీవితాలను బలి తీసుకునే మీ క్రూర గుణాలు పూర్తిగా పోనంత వరకు మీ జీవితాలను కూడా మీరు బలి చేసుకోవాల్సి వస్తుంది. ఈ క్రూర గుణాలను మీరు మార్చుకునేంత వరకు మీరు మీ ప్రాణాలను, జీవితాలను బలి చేసుకోవాల్సిందే ! అవి ఎన్ని జన్మలైనా పట్టనీ గాక ! ఏ గుణాలతో మీరు ఎలా ప్రవర్తిస్తున్నారో, ఆ ప్రవర్తనల యొక్క ఫలితాలను

అవే గుణాలు ఆకర్షిస్తాయి. ఆ ప్రాణులు అనుభవించిన క్షోభ, వ్యథ మీరూ అనుభవించాల్సి ఉంటుంది. మీ గుణాలు మార్చుకుంటే అనుభవించాల్సిన అవసరం ఉండదు. మీ క్రూర గుణాలను మార్పు చెందించేందుకే అనుభవించాల్సి ఉంటుంది. ఇది కేవలం శిక్షణ, శిక్ష కాదు !

ఏ గుణాలు మీలో ఉన్నందున మీరు జిహ్వ చాపల్యాన్ని జయించలేకపోతున్నారో- టీ, కాఫీ, పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, జున్ను, స్వీట్స్, ఐస్-క్రీమ్స్ మొదలైనవి మీరు మరియు మీ పిల్లలు ఎంజాయ్ చేయడానికి మూగ జీవులపై హింసలను, అత్యాచారాలను, దారుణాలు, అనుమతిస్తున్నారో, అసలు వాటి జీవితాలు జీవితాలే కావు, అవి పుట్టిందే మీకోసం బలి కావడానికి అని భావిస్తున్నారో.... ఆ గుణాలే మీ జీవితాలలోకి కూడా హింసను, అత్యాచారాన్ని, దారుణాలను వేయింతలుగా ఆకర్షిస్తాయి. మీ జీవితాలకు కూడా విలువలేదు, అసలు ఎందుకు బ్రతుకుతున్నాను అని అనిపించే పరిస్థితులు మీకు ఎదురవుతాయి. మీరు ప్రత్యక్షంగా.... పరోక్షంగా వీటికి మీరు కారణమౌతున్నారనే విషయం మీ ఎరుకలో లేకపోవడం తో ఆ బాధలు/ కర్మలు మీ జీవితంలో ఎదురవ్వగానే అయ్యో... ఏంటి ఈ దారుణం, నాకే ఎందుకు ఇలా జరుగుతుంది... నేను ఎవరికి ఏ హాని చేయలేదే ... చీమకి కూడా హాని చేయలేదే మరి నాకెందుకు ఇలా జరిగింది అని బాధపడతారు.

పాలు మరియు పాల ఉత్పత్తులు వాడడంలో ఎటువంటి హింస లేదు అని మీరు అనుకుంటారు అందుకే నాన్ - వెజ్ తినని వారు కూడా పాలు మరియు పాల ఉత్పత్తులను వాడుతారు. డైరీ ఇండస్ట్రీస్ లో జరిగే దాన్ని కొందరు పశు ప్రేమికులు వారి ప్రాణాలకు తెగించి సీక్రెట్ గా వీడియోలు తీసారు. ఖళితిఊతిలీలి లో ఒకే ఒక్క సరి వాటిని చూడండి... చాలు... మీ హృదయం పిండేసినట్లు అవుతుంది, మీరు పూర్తిగా కూడా చూడలేరు, చూసి తట్టుకోలేరు. ఆలా ఉంటుంది ఆ ముగా జీవుల పరిస్థితి.

పుట్టగానే ఆవును లేదా గేదెను దాని బిడ్డ నుండి దూరం చేస్తారు. పుట్టింది ఆడ దూడ అయితే దాన్ని బ్రతకనిస్తారు. ఎందుకంటే అవి పెద్దవై పాలు ఇస్తాయి కదా. మగ దూడలతో డైరీ ఇండస్ట్రీస్ కి పని లేదు కాబట్టి అవి పుట్టగానే వాటిని కబేళాలకు పంపించేస్తారు. లేత బీఫ్ కి డిమాండ్ ఎక్కువ కదా... బిడ్డ పుట్టినప్పటి నుండి తల్లికి మొదటి కొద్దీ రోజులు వచ్చే పాలు చాలా బలవర్ధకం అని, వాటిని తప్పకుండా పసి బిడ్డలకి తాగించాలని, ఆ పాలల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి, బిడ్డల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఆ పాలు బిడ్డలకు అమృతం అని మనకు మన పెద్దలు చెప్తారు, ఊజ లల్లో అడ్వర్టైస్మెంట్స్. కూడా వస్తుంటాయి. ఇది అక్షరాలా నిజం. ఇదే నిజం పాడి కోసం వాడుతున్న జంతువులకు కూడా వర్తిస్తుంది అని గ్రహించండి. వాటి బిడ్డలకు చెందాల్సిన ఆ అమృతాన్ని మీరు జున్ను అని తినేస్తున్నారు. అది వాటి బిడ్డలకు అమృతం, మీకు ఆరోగ్యపరంగా, ఆధ్యాత్మికంగా విషం అని గ్రహించండి.

తల్లి ఆవు / గేదె రొమ్ములకు పాలు పితికే మెషిన్ లు పెట్టేసారు. అవి నిర్దాక్షిన్యంగా పాలు పితుకుతూనే ఉంటాయి. ఆ మెషిన్ ల వల్ల వాటి రొమ్ములకు పుండ్లు అవుతాయి. పాలతో పాటుగా ఇప్పుడు మీరందరు వాడే ప్యాకెట్ పాలల్లో ఆ అసహాయ జీవుల చీము, రక్తము కూడా ఖచ్చితంగా ఉంటాయి. ఎంతో మంది ఆ పాలను టెస్ట్ చేయించి ఆ రిపోర్టను న్యూస్ పేపెర్సుల్లో టీవీ న్యూస్సుల్లో కూడా తెలియచేసారు. ఇక పాలల్లో కల్తీల గురించి,ఆ పాడి జంతువులకు ఇస్తున్న ఇంజెక్షన్స్ తో జరిగే హార్మోనల్ ఇంబాలెన్సెస్ సంగతైతే మీకు తెలిసినవే కదా...

మీకు అడ్వార్టైస్మెంట్ లలో అందమైన, ఆరోగ్యకరమైన ఆవు, ఎంతో ఆనందంగా పాలు ఇస్తున్నట్లు, మనందరినీ తన పాలు తాగమని చెప్తున్నట్లు చూపిస్తారు అదే నిజం అని మీరు అనుకుంటారు. అది నిజం కాదు. డైరీ ఇండస్ట్రీస్ వారి వ్యాపారంలో లాభాల కోసం మీ అందరిని మోసం చేయడం కోసం సృష్టించిన భ్రమలే ఆ అడ్వర్టైస్మెంట్స్. ఆ భ్రమలల్లో నుండి బైట పడండి. నిజాలు తెలుసుకోండి. కర్మ విముక్తులు కండి....

పాలు ఆరోగ్యానికి చాల మంచిది అని, ఎముకులు బలంగా ఉండాలంటే, కాల్షియమ్ కోసం పాలు ఖచ్చితంగా తాగాలి అని మీరు అమాయకంగా, మీ ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించే మీ పిల్లలకు గ్లాసులు గ్లాసులు పాలు బలవంతముగా తాగిస్తారు. మీ పిల్లల ఆరోగ్యంకోసం, శ్రేయస్కరం కోసం వారి గొప్ప జీవితం కోసం మీరు ఆలా చేస్తారు... కానీ మీకు తెలియదు మీరు చాలా పే...ద్ద భ్రమలో ఉన్నారు అని... వాస్తవాలను తెలుసుకోండి... మీ పిల్లలను, మీ కుటుంబాన్ని, మిమ్మల్ని మీరు కాపాడుకోండి. ఆవు పాలు లేదా గేదె పాలల్లో కాల్షియమ్ ఉంటుంది. కానీ అది మనుష్యులకు ఉపయోగపడే కాల్షియమ్ కాదు. ఆ పాలల్లో కాల్షియమ్ వలన ఎముకులు పొడి వారి పోయి, పెళుసుగా తయారై, విరిగిపోతాయి. ఆస్టియోపొరోసిస్ ఇంకా మరెన్నో రోగాలకు దారి తీస్తుంది. మీరే ఆలోచించండి... చిన్నప్పటి నుండి పాలు వాడుతున్న వారికి మరి కీళ్ల నొప్పులు,మోకాళ్ళు అరిగిపోవడం మొదలైనవి ఎందుకు జరుగుతున్నాయి ?

❋ ❋ ❋

మనుష్యుల పాలు మనిషి బిడ్డల కోసం... జంతువుల పాలు జంతువుల బిడ్డల కోసం అని గ్రహించండి. ప్రకృతి పరంగా పిల్లలకు యెంత కాలం పాలు అవసరమో అంత కాలం తల్లికి పాలు వస్తాయి. పిల్లలకు పాల అవసరం తీరిపోగానే, తల్లికి పాలు ఆగిపోతాయి. ఇది సహజం ... ప్రకృతిలో ఏ ప్రాణి కూడా జీవితాంతం పాలు తాగదు ... ఒక్క మనిషి తప్ప ! మనిషికి జంతువుల పాలు తాగాల్సిన అవసరమే లేదు గాక లేనే లేదు...

ఇక అవి పాలు ఇవ్వలేని స్థితికి రాగానే వాటిని కబేళాలకు అమ్మేస్తారు. బ్రతికుండగానే ఎంతో నిర్దాక్షిన్యంగా వాటి చర్మాన్ని వలుస్తారు... లెదర్ కొరకు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా ఎన్నో దారుణాలు... ఎన్ని పుస్తకాలు వ్రాసిన సరిపోదు.

మీరు వీటిని ప్రత్యక్షంగా చేయకపోయినా , పరోక్షంగా ఇవన్నీ మీ అవసరాలు తీర్చడానికే జరుగుతున్నాయి అనేది మీరు ఒప్పుకుని తీరాల్సిన సత్యం.

ఈ దారుణాలలో మీ భాగం పెద్దదే... ఇది సత్యం. మీ భాగం ఎంతుంటే అంత శాతం కర్మ మీకు చుట్టుకుంటుంది. మీరు మారిపోయి ఈ దారుణాలను ఆపకపోతే ఎన్ని జన్మలెత్తైనా సరే ఆ కర్మను తీర్చాల్సిందే... తప్పదు.

మీరు ఒకసారి చెక్ చేసుకోండి... ఆ పాడి జంతువులు అనుభవిస్తున్నవి మీ జీవితాలల్లో మీకు కనిపించడం లేదా ....? వాటిలో మీ భాగం ఎంత ఉంటే అంతకు వేయింతలు ఆ కర్మలు మీ జీవితాన్ని ఆక్రమించి మిమ్మల్ని చిత్రవధ చేయటం లేదా....? కుటుంబాలలో ఎడబాటు, ప్రేమ... ఆప్యాయత లోపించడం,నమ్మి మోసపోవడం, హింసకు గురి కావడం, అవమానాలకు గురికావడం, జీవితానికి ఒక విలువ అంటూ లేకపోవడం, జీవితం పట్ల అయిష్టత, జీవిత సారం కోల్పోవడం, అనుకున్న విధంగా జీవించలేకపోవడం, అనారోగ్యాలు, హార్మోన్ల ఇంబాలెన్సెస్ , మనశాంతి లేకపోవడం, జీవితం పట్ల అభద్రత భావం, చావును దగ్గరగా చూడడం, ప్రమాదాలకు గురికావడం, మీ చర్మం వలవబడుతుందేమో అన్నంత కష్టం ఇలా ఇంకా ఎన్నో...చివరికి చావు కూడా ప్రశాంతంగా రాకపోవడం ....! ఇవన్నీ మీకు ఎందుకు జరుగుతున్నాయి? మీవి కానివి ఏవి మీకు రావు కదా...! అంటే మీరు ఇతరులకు ఇచ్చారన్నమాట. మీరు ఇచ్చింది మీకు వేయింతలై తిరిగి వస్తుంది అన్న మాట. ఇక చాలు... మేలుకోండి...!

గుర్తుంచుకోండి... నాన్ -వెజ్, గుడ్లు, చేపలు, పాలు ఇవే కావు, జంతువుల నుండి మనం ఏమి ఆశించద్దు. వాటితో పాటు మనం ఈ భూమి పై జీవించాలి, ప్రేమను పంచుకోవాలి, అవి వాటి ఆత్మాభివృద్ధి కోసం పుట్టాయి, మన కోసం పుట్టలేదు అని గ్రహించాలి. తేనేటీగలు వాటికీ ఆహారం దొరకనప్పుడు జీవనాధారం కోసం, వాటి బిడ్డలకు ఆహారం, పోషణ కోసం ఎంతో కష్టపడి దాచుకున్న తేనెని మీరు దోచుకుంటారు, ప్రతిఫలంగా దోచుకోబడతారు. పట్టు పురుగులు... అవి

తరువాతి దశ లోకి పరివర్తితం అవ్వడానికి ఎంతో ఆశతో కట్టుకున్న గూడుని తీసుకోవడం కోసం వాటిని బ్రతికుండగానే మరిగే నీటిలో వేసి చంపితే మరి అదే కర్మ వేయింతలుగా తిరిగి వచ్చినపుడు ఏంటి మీ పరిస్థితి. అప్పుడు పట్టు వస్త్రాలు శోభ అని అనిపిస్తుందా లేక క్షోభ అని అనిపిస్తుందా...?!!! లెదర్ కోసం జంతువులను చంపడం, వూల్ కోసం గొర్రెలను,ఈకల కోసం పక్షులను, ఫర్ కోసం అందమైన జంతువును, అలంకరణ కోసం అడవి జంతువుల శవాలని, కొమ్ములను మొదలైనవిఎంపకం కోసం పక్షులను, చేపలను బంధించడం, సరదాల కోసం సర్కస్ లు జూ పార్క్ లు మొదలైనవి ఇంకా ఇలా ఎన్నో.... మరెన్నో రకాలుగా మనుష్యులు జంతువుల జీవితాలు జీవితాలే కాదు అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు, వీటన్నిటి పర్యవసానం ఏంటో ఈ పాటికి మీకు అర్థమయ్యే ఉంటుంది. మనం ఎలా ఉంటే మన జీవితాలు అలాగే ఉంటాయి, మన జీవితాలు ఎలా ఉంటే మన కుటుంబం అలాగే ఉంటుంది, మన కుటుంబం ఎలా ఉంటే మన సమాజం , మన దేశం, మన భూమి అలాగే ఉంటుంది అని అర్థం చేసుకోండి.

కుటుంబంలో, సమాజంలో, దేశంలో, భూమిపై ఏదైనా సరిగా లేదు అని అంటే దానిలో మన పాత్ర కూడా ఉంది అని గ్రహించి మనల్ని మనం సరి చేసుకోవడం మన భాద్యత.

అకర్మ వీగన్ గా మారడం జంతువుల కోసం, భూమి కోసం అనేది రెండవ కారణం. మొదటి కారణం - మీ ఆరోగ్యం, మీ ఆత్మాభివృద్ధి ...! ముందు మీరు బాగు పడండి తరువాత అందరిని, అన్నింటిని బాగు చేయటానికై పూనుకోండి.

✪ జీసస్ మరియు ఒరిజినల్ అరమాయిక్ క్రిష్టియన్స్ శుద్ధ శాఖాహారులు అని నిరూపించే ఎన్నో అధారాలు ఉన్నాయి. ఈ క్రింది వెబ్ సైట్స్ లో ఈ విషయానికి సంబంధించిన విషయాలు ఉన్నాయి. ✪

1) https://ivu.org/history/christian/christ_veg.html
2) https://hippocratesinst.org/early-christian-vegetarian-comunities
3) https://www.biblicaltraining.org/library/ebionites

✪ ఇస్లాం మతంలో మాంసం తినాలన్న నిర్బంధమేమీ లేదు ✪

ఇస్లాం మతంలో మాంసం తినాలన్న నిర్బంధమేమీ లేదు. (సాక్షి దిన పత్రిక, తేది : 21 జూన్ 2008 సౌజన్యంతో. ఎస్.ఎం. మలిక్ గారు, ఖురాన్ అనువాదకులు, సాక్షి దిన పత్రికలో "ఇస్లాం - సందేహం" అనే శీర్షికను నిర్వహిస్తున్నారు.) ఒక ముస్లిం సోదరుడు అడిగిన ప్రశ్నకు మలిక్ గారు ఇచ్చిన సమాధానమే ఇది.

ప్రశ్న : మాది చాలా సంప్రదాయ కుటుంబం. ప్రవక్త సూచనలు తు.చ. తప్పకుండా పాటిస్తాము. నాకు గోమాంసం తినడం ఇష్టం ఉండదు. కానీ మా పెద్దలు ఇది ప్రవక్త ఆజ్ఞ అని ప్రతి ముస్లిం రమజాన్, బక్రీద్ వంటి పర్వ దినాల్లో దీనిని తప్పకుండా తినాలని బలవంతంగా తినిపిస్తారు. నిజంగా ఇది ప్రవక్త ఆజ్ఞేనా ?

- జావెద్ పాషా, హైదరాబాద్.

జవాబు : ముస్లిములలో పేరుకుపోయిన ఇటువంటి అప నమ్మకాల కారణంగానే ముస్లిమేతర సోదరుల్లో అనేక అపోహలు, అపార్థాలు చోటు చేసుకున్నాయి. ముస్లిములు గోమాంసం తినాలన్న ప్రవక్త (స) ఆదేశమేదీ లేదు. రమజాన్, బక్రీద్ వంటి పండుగల్లో తినాలన్న నిర్బంధం అంతకన్నా లేదు. మీకు ఇష్టం లేకపోతే మీరు జీవితాంతం తినకుండా గడిపే స్వేచ్ఛ మీకుంది. నిజానికి గోమాంసమే కాదు. మరే మాంసమయినా తినాలన్న నిర్బంధమూ లేదు. మీరు శాఖాహారిగా ఉంటూ నిజమయిన ముస్లిమ్ జీవితం గడిపే అవకాశం ఉంది.

❖ ❖ ❖

దేవుళ్ళు బలి అడగరు !

దైవం అంటే ఏమిటి ?

మానవులకు, సర్వ జీవ కోటికి మాతా, పిత... దైవం.

దేవతను తల్లి అంటారు. దేవుడిని తండ్రి అని అంటారు.

మరి తల్లిదండ్రులు ఎక్కడైనా తమ సంతానాన్ని బలి కోరుతారా ??!!

ఉదాహరణకు మీరు మీ పిల్లల బలి కోరుతారా ??!!

ఉదాహరణకు అని నేను అన్నందుకే నా మీద కోపం వస్తుంది. కేవలం ఉదాహరణ మాత్రం ! సాధారణ మానవులే తమ పిల్లల సంక్షేమాన్ని కోరుతారు. అలాంటిది దేవతలు లేక దేవుళ్ళు తమ పిల్లలైన జంతువులను బలి కోరుతారా ?!?!

కొత్త ఇళ్ళు లేక భవనాలు నిర్మించి అందులో నివసించబోయే ముందు బలులు ఇస్తుంటారు. నూతన గృహం అంటే ఏమిటి ? మన జీవితానికి ఆధారం, ఆశ్రయం. అలాంటి గృహ ప్రవేశానికి ముందు బలి ఇవ్వడం అని అంటే ఒక ప్రాణిని హత్య చేస్తున్నట్టే. బలి పేరిట హత్య చేయబడిన ఆ ప్రాణి యొక్క "ఉసురు" ఆ ఇంటికి లేదా భవనానికి లేదా ఆ కాంప్లెక్స్‌కు చుట్టుకుంటుంది. ఇక ఆ ఇంటి యజమానులు మరియు ఆ ఇంట్లో నివాసం ఉండబోయే వారు ఆ కర్మను అనుభవించాలి. ఇంట్లో ఉన్న వాళ్ళు అకర్మ శాఖాహారులైతే ఏమీ కాదు.

దుకాణాలు లేక ఫ్యాక్టరీలు లేక సినిమా హాళ్ళు లేక ఇతర నిర్మాణాలు చేసి ప్రారంభానికి ముందు "బలి" ఇస్తుంటారు. ఇది ఎంత అసమంజసం ! ఒక ప్రాణి నిండు జీవితాన్ని "బలి" ఇవ్వడం అనేది "హత్యా గుణాన్ని" ప్రకటిస్తుంది. కనికరం లేని గుణాన్ని, దయ లేని గుణాన్ని, జంతుకోటి జీవితాలు అసలు జీవితాలే కాదనే నిర్లక్ష్యపు గుణాన్ని ప్రకటిస్తుంది, బలులు ఇచ్చేవారు, అందుకు సహకరించిన వారు తాము కలిగి ఉన్న గుణాలచే, తాము కూడా బలి అవుతారు. అంతకంతా అనుభవిస్తారు. మనం మనుషులం, రాక్షసులం కాదు. మనది మానవ జాతి, రాక్షస జాతి కాదు.

పండుగ రోజుల్లో అమ్మవారి పేరు చెప్పి బలులు ఇస్తుంటారు. అసలు బలి అడిగితే, ఆమె

అమ్మ ఎలా అవుతుంది ? అమ్మ అంటే అర్థం ఏమిటి ? "అమ్మ" అనే పదానికి అర్థం తెలిసిన వాళ్ళేనా ఈ పని చేసేది. అమ్మ తన పిల్లలైన జంతువుల బలి కోరుతుందా ??!!

అమ్మ అలా కోరనే కోరదు. అమ్మ వారి పేరు మీద జరుగుతున్న పూర్తి స్థాయి అజ్ఞానపు రాక్షస చర్య - బలి.

మీకు మంచి జరగాలంటే బలులు కాదు ఇవ్వాల్సింది. మీకు మంచి జరగాలని కోరుకుంటూ, ప్రాణాలు తీయకూడదు. ఇది మంచి ఎలా అవుతుంది ??!!

మీకు మంచి జరగాలంటే, మంచి చేయాలి. అన్నదానం చేయండి, వస్త్రదానం చేయండి, ధన దానం చేయండి లేదా ఇతర సహాయ సహకారాలు చేయండి. అవసరాలు ఉన్న వాళ్ళకు ఈ భూమి మీద కొరత లేదు. వాళ్ళ అవసరాలు తీర్చి వాళ్ళ జీవితాలు నిలబెట్టండి.

మీరు ఏం చేస్తే అది మీకు వేయి రెట్లుగా తిరిగి వస్తుంది. మీరు బలి ఇస్తే, మీరు కూడా బలి కావాల్సి వస్తుంది.

❖ ❖ ❖

జంతువుల/ పక్షుల స్వేచ్ఛను హరిస్తే మన స్వేచ్ఛ కూడా పోతుంది

ప్రియ మిత్రులారా ! చాలా మంది జంతువులను ముఖ్యంగా పక్షులను పంజరాల్లో బంధించి ఉంచుతారు. ఇది చాలా ప్రమాదకరం, ఎందుకంటే...

ఒక విశ్వ సూత్రం ఇలా చెబుతుంది, "మనం ఏ గుణాలనైతే కలిగి ఉంటామో సరిగ్గా రీబిళీలి శిళి రీబిళీలి అవే పరిస్థితులను మనం అనుభవిస్తాం" అని.

స్వేచ్ఛగా విహరించే ఒక పక్షిని వల వేసి పట్టి, దాని రెక్కలు కత్తిరించి లేదా ఈకలు పీకి వాటిని పంజరాల్లో బంధించి ఉంచుతారు. ఆ పంజరం మహా అంటే ఒక అడుగో లేక రెండడుగుల వ్యాసం కలిగి ఉంటుంది. ఇది ఎంత దారుణమో ఒకసారి ఆలోచించండి. వాటిని బంధించడంలో ఎందుకు మనకు అంత ఆసక్తి ? వాటిని బంధించి ఆనందించడం అనేది "శాడిజం" ! ఎవరైతే పంజరాల్లో పక్షులను పెంచుతున్నారో వారిని కూడా ఒక చిన్న గదిలో బంధిస్తే ఎలా ఉంటుంది ? వాస్తవానికి ఇదే జరుగుతుంది.

పంజరాల్లో పక్షులను, ఇతర జంతువులను పట్టి బంధించి వాటి స్వేచ్ఛను హరించే వారు తమ నిజ జీవితంలో స్వేచ్ఛను కోల్పోతారు. తమ జీవితం పైన సాధికారతను కోల్పోతారు. ఎందుకంటే "మీరు ఏం చేస్తారో మీకూ అదే జరుగుతుంది" అనేది విశ్వ సూత్రం. ఇంకా సరిగ్గా చెప్పాలంటే "మీరేం చేస్తారో అంతకు వెయ్యి రెట్లు అనుభవిస్తారు" అనేది కరెక్ట్ !

పక్షులకు భూమిపైన ఒక ప్రత్యేకత ఉంది. పక్షిజాతి మాత్రమే ఎగరగలదు. వినీలాకాశంలో, చెట్లల్లో, కొండల్లో, కోనల్లో, అడవుల్లో, తోటల్లో అక్కడా ఇక్కడా అని లేకుండా, ఎక్కడంటే అక్కడ స్వేచ్ఛగా విహారం చేసే అవకాశం పక్షికి మాత్రమే ఉంది.

అంతటి స్వేచ్ఛను అనుభవించే అధికారాన్ని, హక్కును, సామర్థ్యాన్ని పుట్టుకతోనే సహజంగా తెచ్చుకున్న పక్షిని ఒక చిన్న పంజరంలో వేసి బంధించి వాటిని పెంచడం అనేది మా హాబి అని చెప్పడం ఎంత వరకు సమంజసం ??? మనం మనుషులం. మనకు జీవితం ఉన్నట్టే వాటికి కూడా జీవితం ఉంది. ఏ "గుణం" ద్వారా, ఏ "అవగాహన" ద్వారా, ఏ "జ్ఞానం" ద్వారా, ఏ "నిర్ణయం" ద్వారానైతే మనం పక్షుల జీవితాలను లెక్క చేయటం లేదో, వాటి జీవితాలను అసలు జీవితాలే కాదు అన్నట్టు చూస్తామో, అదే "గుణం" మన పట్ల కూడా వర్తించి మన జీవితంలోని స్వేచ్ఛను కోల్పోతాం, సాధికారతను కోల్పోతాం.

చాలా చిన్న, చిన్న గాజు కుండీలలో చేపలను పెంచుతూ ఉంటారు ఇది కూడా సబబు కాదు. మీ ఇంటి అలంకరణ కోసం మీరు ఇతర జీవాలను బంధించి వాడుకుంటే, మీరు కూడా మీ జీవితంలో

బంధించబడి అలంకరణ వస్తువుగా మారుతారు చేపల్లాగే ! చేపలను బంధించి అలంకరించడం "శోభ" అని మీరు అనుకుంటారు, అయితే అది మీకు "క్షోభను" ఇస్తుంది. " అక్వేరియాలు శోభ కాదు క్షోభ" ! దయచేసి ఆ చేపల గురించి, వాటి జీవితం గురించి ఆలోచించండి. అవి ఎంతో బాధ పడుతూ ఉంటాయి. ఎంతో క్షోభను అనుభవిస్తూ ఉంటాయి. ఎంతగానో దుఃఖిస్తూ ఉంటాయి. ఆ "కర్మ" అంతా మీకు చుట్టుకుంటుంది. అంతకు అంతా మీరు అనుభవిస్తారు. ఇంకా రక రకాల పెంపుడుజంతువులను పెంపకం అనే పేరుతో బంధించి ఉంచుతారు. ఇది ఎంత మాత్రమూ సరికాదు. కుక్కలు, పిల్లులు మొదలైన వాటిని పెంచవచ్చు. అయితే వాటిని మీ పిల్లల లాగా చూసుకోగలిగితేనే పెంచండి లేక పోతే లేదు. ఎట్టిగా పెంచవద్దు. మీకు వీలు కాదంటే పెంచాల్సిన అవసరం ఏముంది ? మీకు వీలు లేదు, ఓపిక లేదు అని అంటే ఎందుకు మరి పెంచడం ?

చిలుకలను పంజరంలో బంధించి ఉంచినందుకే "సీతమ్మ" వారికి అశోక వనంలో బంది కావాల్సి వచ్చింది అనే కథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది. రావణుడు సీతమ్మను బంధించడానికి ఎన్నో ఇతర దివ్య కారణాలు ఉన్నాయనుకోండి, అయితే ఈ కారణం కూడా ఒకటిగా చెబుతారు. అంతటి సీతా మహా సాధ్వియే తన జీవితంలో స్వేచ్ఛ, సాధికారతలు కోల్పోయిందంటే ఇక మామూలు మనుషుల సంగతి చెప్పడానికేముంది ! ఎట్టి పరిస్థితులలోనూ ఏ జీవులను బంధించి ఉంచరాదు. మన రాక్షసానందానికి "పెంపకం" అనే పేరు పెట్టి పక్షుల, జంతువుల జీవితాలను హరించి వేయడం మనకే ప్రమాదం. చాలా ప్రమాదం. మనకు ఏ గుణాలు, ఏ భావాలైతే ఉంటాయో వాటినే మనం అనుభవించాలి అనే విషయాన్ని మరువద్దు. పక్షులకు, జంతువులకు స్వేచ్ఛను ఇవ్వాలి, అసలు మనం ఎవరం వాటికి స్వేచ్ఛనివ్వడానికి ?! అని ఆలోచించండి. వాటి స్వేచ్ఛకు మనం భంగం కలిగించరాదు. "మీకు ఏమి కావాలని మీరు కోరుకుంటే అదే చేయండి" అని ఒక విశ్వ సూత్రం చెబుతుంది. స్వేచ్ఛ కావాలంటే స్వేచ్ఛనివ్వండి, బంది కావాలంటే బంధించండి. అయితే గుర్తుంచుకోండి "మీరు ఏం చేస్తారో అది అంతకు వేయి రెట్లుగా పొందుతారు" !!

మీ ఇంట్లో ఏవైనా పక్షులు గానీ, చేపలు గానీ ఉంటే వాటికి స్వేచ్ఛనివ్వండి. పక్షులను ఊరవతలకి తీసుకుపోయి వదిలేయండి, చేపలయితే శుభ్రమైన జలాశయాల్లో వదిలేయండి. ఇతర ఏవైనా జంతువులు పెంపకం లేదా హాబి అనే ముసుగులో బంధించబడి ఉంటే గనక వాటికి స్వేచ్ఛను అందించండి. ఇది ఎంత త్వరగా చేస్తే అంత మంచిది. ఇతర ప్రాణుల పట్ల కనికరం లేని వారు అదే గుణం చేత తమ జీవితంలో నరకయాతనను అనుభవిస్తారు. మరి విషయం తెలియక తప్పు జరిగి పోయింది ఎలా అంటే, కంగారు పడాల్సిన అవసరమేమి లేదు. కేవలం మీ అవగాహన సరిపోతుంది.

ఆ "అవగాహన" వచ్చిందంటే చాలు మీరు "కర్మ" అనుభవించాల్సిన అవసరం లేనే లేదు. "అసలు ఏ కర్మలు కూడా ఎవరూ అనుభవించాల్సిన అవసరం లేదు

గాక లేనే లేదు" అంతా అవగాహన కోసమే ✪

మరి వాటిని వేరే వాళ్ళు పట్టుకుంటారేమో అని అంటే, అది మీకు అనవసరం, వాళ్ళు పట్టుకుంటే వాళ్ళ కర్మను వాళ్ళే అనుభవిస్తారు, మీకెందుకు ! ముందు మీ సంగతి చూసుకోండి. ఈ సత్యాలను అందరికీ చెప్పండి, పక్షుల, చేపల, జంతువుల స్వేచ్ఛ కోసం ఉద్యమించండి. దీని వలన మీకెంతో స్వేచ్ఛ, సాధికారత లభిస్తాయి. మీకెంతో శ్రేయస్కరం జరుగుతుంది. మీ కర్మలు పోతాయి. కర్మ ప్రక్షాళనకు "సేవ" అత్యున్నతమైన, అత్యుత్తమమైన మార్గం. పరమ పవిత్రమైన మార్గం. మనం హృదయం గల మనుషులం. ఆలోచించి అవగాహనతో ప్రవర్తిద్దాం, మనుషులమైన మనం మనుషులు గానే జీవిద్దాం ! అందరికీ అవగాహన వచ్చు గాక ! సర్వులకు స్వేచ్ఛ, సాధికారతలు లభించు గాక !

ఈ విషయాలన్ని తెలియజేసి నేను మిమ్మల్ని భయ పెట్టడం లేదు... సత్యాన్ని తెలియ చేస్తున్నాను. " సత్యం విముక్తం చేస్తుంది ". సత్యాన్ని తెలుసుకుంటే ముందుగా మిమ్మల్ని మీరు, ఆ తర్వాత మీ కుటుంబాన్ని, జంతువులను, భూమిని రక్షించుకున్న వారవుతారు. అందుకై నా వంతు భాధ్యతగా నేను మీకు ఈ విషయాలను తెలియ చేస్తున్నాను. నేను చెప్పాను అని మీరు గుడ్డిగా నమ్మాల్సిన అవసరం లేదు. మీరు స్వయంగా రీసెర్చ్ చేయండి. నిజాన్ని తెలుసుకోండి. మీకు సత్యం అర్థం అయిన నాడు నాలాగా లేదా నాకన్నా ఎక్కువగా మీరు అకర్మ వీగనిజం ని ప్రచారం చేస్తారు.

సత్య ప్రాప్తి రస్తూ.!

❖ ❖ ❖

అకర్మ వీగనిజం గురించి సద్గురు తారా విశాల్ గారు మరియు సద్గురు దేవి సహస్రా తారా విశాల్ గారు వారి వర్క్ షాప్స్‌లలో తెలియజేసి, ప్రజలను చైతన్యపరుస్తూ ఉన్న చాలా సందర్భాలలో, చాలా మంది మమ్మల్ని ఇలా అడిగే వారు- " ఇదంతా విని మేము చెలించిపోయాము, ఈ క్షణమే అకర్మ వీగన్స్ గా మారాలని నిర్ణయించుకున్నాము... కానీ ఆ జంతు పదార్థాలన్నీ అందరి ఆహారంలో ప్రధాన అంశంగా మారిపోయాయి. కాబట్టి వాటికి ప్రత్యామ్నాయం చూపండి " - అని కోరేవారు .

" సద్గురు తారా విశాల్ " గారు జంతువుల నుండి వచ్చే వాటికీ ప్రత్యామ్నాయం ప్రజలకు అందించే భాద్యత ఎవరు తీసుకుంటారు అని తన శిష్యులను అడిగినప్పుడు, తన శిష్యులలో ఒకరైన " సత్యనారాయణ" గారు ముందుకొచ్చారు." సత్యనారాయణ" గారిని గురువుగారు " సనా " అని ప్రేమగా పిలిచేవారు. ఆలా 2014 లో మొదలైంది " సనా వీగన్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ ". ఇది కమర్షియల్ ఫ్యాక్టరీ గా బిజినెస్ కోసం ఏర్పడిన ఫ్యాక్టరీ కాదు. ఇది లోక కళ్యాణమే లక్ష్యంగా, సద్గురు తారా విశాల్ గారి ఆశయంగా ఉద్భవించిన ఫ్యాక్టరీ. ఇది లోక కళ్యాణం కోసం పని చేస్తున్న ఫ్యాక్టరీ. ప్రపంచ ప్రజలందరినీ అకర్మ వీగన్స్ గా మార్చేందుకు ప్రచారం చేయడం మరియు ప్రపంచ ప్రజలందరికి ఆరోగ్యకరమైన, రుచికరమైన, ఎటువంటి రసాయనాలు కలపని, స్వచ్ఛమైన అకర్మ ఆహారాన్ని సమంజసమైన ధరలకే ప్రజలందరికి అందుబాటులోకి తేవడమే " సనా వీగన్ ప్రొడక్ట్స్ " లక్ష్యం.

అధిక వివరాల కోసం ఈ పుస్తకంలో ఉన్న ఆఖరి పేజీలో ఉన్న సనా వీగన్ పాంప్లెట్ లో నంబర్లను సంప్రదించండి.

లోక కళ్యాణం జరుగుగాక ...!!!

సృష్టి కళ్యాణం జరుగుగాక ...!!!

- TEAM MAB

\\

4. M A B నవ రత్నాలలో

నాలుగవ రత్నం - స్వాధ్యాయం

స్వాధ్యాయం అంటే భజనలు, ఉపన్యాసాలు కాదు. "స్వ - అధ్యయనం", "స్వయానికి" సంబంధించిన అధ్యయనం. "స్వయం" అంటే ఆత్మ లేక ఉనికి. అధ్యయనం అంటే శ్రద్ధగా చదివి గ్రహించడం. "స్వాధ్యాయం" అంటే "ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదవడం", వాటిని జీర్ణించుకోవడం.

"జ్ఞానాగ్ని సర్వ కర్మాణి భస్మసాత్ కురుతే" (4 : 37) గీతా సూత్రం ! అంటే ఆత్మ విజ్ఞానం అనే అగ్ని చేత మాత్రమే సర్వ కర్మలు బూడిద అయిపోతాయని చక్కగా, స్పష్టంగా శ్రీకృష్ణుడు చెప్పాడు. మరి ఆత్మ విజ్ఞానం ఎలా వస్తుంది అంటే "నవ రత్నాలను ఆచరించడం" ద్వారా వస్తుంది. గొప్ప ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల(Spiritual Scientists/Cosmic Scientists) యొక్క పుస్తకాలు చదివితే, జీర్ణించుకుంటే అన్ని "కర్మలు" శీఘ్రమే దగ్ధం ! ఇది పరమ సత్యం ! కర్మ అంటే అవగాహన లేకపోవడం, ఆత్మ విజ్ఞానం లేకపోవడం. సరైన ఉన్నత న్యూ ఏజ్ పుస్తకాలు మాత్రమే చదవండి. ఎందుకంటే వీటిలో "సత్యం" సూటిగా, ఏ మర్మము, ఏ దాపరికం లేకుండా directగా చెప్పబడింది. సులువుగా అర్థం అవుతుంది !

జీవితంలో ఆరోగ్య ఐశ్వర్య ఆనందాలు కేవలం ఆత్మ విజ్ఞానం వల్లనే వస్తాయి. ఈ ఆత్మ విజ్ఞానం పుస్తకాల ద్వారా సులభంగా వస్తుంది. మహాత్ములు తమ జీవితమంతా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, ఎంతెంతగానో పరిశ్రమ చేసి, తమ అనుభవ సారాన్ని అంతా పుస్తక రూపంలో మనకు అందిస్తారు. అరటి పండు వలిచి చేతిలో పెట్టినట్టుగా ! ఈ ఆత్మ విజ్ఞాన పుస్తకాలను తెలుగులోనికి అనువాదం చేసిన + చేస్తున్న మహానుభావులెందరో ఉన్నారు. వీరందరికీ యావత్ తెలుగు జాతి తరపున M A B హృదయపూర్వక ధన్యవాదాలు అర్పిస్తోంది.

సరైన మతరహిత అత్యున్నత ఆధ్యాత్మిక పుస్తకాలు చదవకపోతే మీ జన్మ వృథా ! ఎన్ని కోటానుకోట్ల జన్మలకైనా బాగుపడరు. కొంతమంది కేవలం చదువుతారు. వాటిలోని విషయాలను బాగా చర్చిస్తారు. కానీ వాటిని పాటించరు, నిజంగా ఆచరించరు. ఇలా చేయకూడదు. ఆచరించనప్పుడు చదివి ఏం ప్రయోజనం ?! చదవని వారికంటే, చదివి కూడా ఆచరించని వారే ఎక్కువ నష్టపోతారు. ఎందుకంటే ఆత్మ విజ్ఞానం తెలుసుకున్న తర్వాత కూడా తప్పులు చేస్తే కోటి కోట్ల జన్మలకైనా మర్చిపోని విధంగా "సృష్టి" బలమైన గుణపాఠం చెప్తుంది.

బంగారం, నగలు, వజ్రాలు ఇవి మీకు ఎలాంటి శ్రేయస్సును అందించవు. ఒక్క పుస్తకంలో ఉన్న ఆత్మ విజ్ఞానానికి మీరు వెల కట్టలేరు. కాబట్టి అనవసరమైన నగా, నట్రా ఇతర డాంభికమైన వస్తువులను కొనడం ఆపి ఆ డబ్బులతో దయచేసి ఈ పుస్తకాలను కొని చదవండి. మీకెంతో మేలు జరుగుతుంది.

ప్రాక్టికల్‌గా చేసి తెలుసుకోండి. పది వేల రూపాయల ఒక బంగారం గొలుసు మీ మెడలో ఒక వారం ధరించండి. మీలో ఏం మార్పు వచ్చిందో గమనించండి. ఒక రెండొందల రూపాయలు పెట్టి ఒక పుస్తకం కొని చదివి అర్థం చేసుకుని చూడండి, అప్పుడు గమనించండి మీలో మార్పును. ఒక పుస్తకం మీ జీవితాన్ని మారుస్తుంది.

దయచేసి సరైన గురువుల పుస్తకాలను కొనండి, చదవండి, చదవించండి ! వందల, వేల సంవత్సరాలు మహాత్ములు సాధన చేసి పొందిన అనుభవ విజ్ఞానాన్ని ఒక పుస్తకం మీకు ఒక్క రోజులో అందిస్తుంది. ఎంతో మంది మహాత్ములు, మహా సాధన ద్వారా తమ "స్వయానికి" అధిపతులై, ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలై(Cosmic Scientists) కరుణా వశాన తమ యొక్క "మహా అమూల్యమైన అనుభవాలను, బోధనలను & దివ్య సూత్రాలను" గ్రంథస్థం చేశారు. ఆ దివ్య సూత్రాలను నిజ జీవితంలో నిజంగా ఆచరించడానికి - ఆ యొక్క ఆత్మ విజ్ఞాన పుస్తకాలను చదవడమే "స్వాధ్యాయం" అంటే !

సత్ గ్రంథాల పారాయణం ఎందుకు చేయాలి ?

సత్ గ్రంథాలు అంటే ఆత్మ విజ్ఞానానికి మరియు ఆత్మ విజ్ఞాన శాస్త్రజ్ఞుల జీవితాలకు సంబంధించిన గ్రంథాలు(పుస్తకాలు). ఇలాంటి పుస్తకాలను పారాయణం చేస్తే మంచి జరుగుతుంది అని చెప్తారు. అయితే ఇక్కడ విషయాన్ని లోతుగా అర్థం చేసుకోవాలి. పారాయణం లేక పఠనం లేక చదవడం అంటే ఊరికే అలా మొదటి నుండి చివరిదాక ముద్రించి ఉన్న అక్షరాలను చదవడం కాదు. అందులో ఉన్న విజ్ఞానాన్ని గ్రహించి నిజ జీవితంలో ఆచరించడం ద్వారానే మంచి జరుగుతుంది. ఊరికే ఎన్ని సార్లు పారాయణం చేసినా ఎలాంటి ఫలితం ఉండదు. చాలా మంది ఇక్కడే పొరపాటు పడుతుంటారు. చదవడం వచ్చు కదా అని అలా చదివి పారేసి, హమ్మయ్య 11సార్లు పారాయణం చేసాను అని అనుకుంటూ ఉంటారు. ఇలా గాలికి ఎన్ని సార్లు చదివినా ఫలితం ఏమీ ఉండదు.

పెద్దలు మనల్ని పారాయణం ఎందుకు చేయమని చెప్తారంటే, ఆ గ్రంథాలలోని సత్యాలు మనలోకి ఇంకి పోవాలని, ఆ విధంగా ఇంకి పోయిన సత్యాలను మనం త్రికరణ శుద్ధిగా అంటే మనసులోనూ, వాక్కులోనూ, ప్రవర్తనలోనూ ఆచరించాలని పారాయణం చేయమని చెప్తారు. పారాయణం యొక్క ఏకైక ఉద్దేశం ఇదే ! ఊరికే చదివి పుస్తకం పక్కన పెట్టేస్తే ....వృథా !

మంచి పుస్తకాలలోని విషయాలు గ్రహించి, వాటిని నిత్య జీవితంలో "సరిగా" ఆచరించినప్పుడే మంచి అభివృద్ధి జరుగుతుంది. లేకపోతే లేదు.

భగవద్గీత పారాయణ గ్రంథం కాదు, ఆచరణీయ గ్రంథం

అసలు భగవద్గీతే కాదు ఏ ఆధ్యాత్మిక గ్రంథాలైన కేవలం పారాయణ గ్రంథాలు కాదు ఆచరణీయ గ్రంథాలు.

వాస్తవానికి పారాయణం ఎందుకు చేయమని చెప్తారు ? అందులోని విషయాలను గ్రహించి ఆచరించడానికే కదా, కానీ సుమారుగా అందరూ ఈ అసలు విషయాన్ని మర్చిపోయి కేవలం ముద్రించి ఉన్న అక్షరాలను చదివి, హమ్మయ్య నేను పారాయణం చేసేసాను. నాకెంతో పుణ్యం వచ్చింది అనే భ్రమలో ఉంటారు.

ఇప్పుడు మీరు చదువుతున్న ఈ పుస్తకం, నేను 13+ సంవత్సరాలు ఎంతో మహా పరిశ్రమ చేసి, ఎన్నెన్నో కష్టాలు పడి, నరకం అనుభవించి, 6 లేక 7 సార్లు మృత్యుముఖంలోకి వెళ్ళివచ్చి, ఎన్నెన్నో అవమానాలను, నిందలను, కువిమర్శలను, అపవాదులను, హేళనలను భరించి, నా ఆత్మ యొక్క వేలాది సంవత్సరాల అనుభవ అవగాహనా సారాన్ని మీకు ఈ పుస్తకం ద్వారా అందిస్తున్నాను. మీరు దీన్ని సింపుల్‌గా ఒక రోజులో చదివేస్తారు. మీ ఊహలకందనంత డెవలప్‌మెంట్ మీకు జరుగుతుంది.

సరిగా అర్థం చేసుకోండి.

ఊరికే చదవడం కాదు - "సరైన" ఆచరణయే అభివృద్ధి చేస్తుంది, రక్షిస్తుంది !

భగవద్గీత పైన చాలా సరికాని అభిప్రాయాలు ఉన్నాయి !

జనాలలో భగవద్గీత పైన చాలా సరికాని అభిప్రాయాలు ఉన్నాయి. అది ఇంట్లో ఉంటే శుభం. దానికి మొక్కితే చాలు. శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు కానీ మనకు కాదు కదా అనుకుని వారిద్దరికీ కలిపి ఓ దండం పెట్టి కూర్చుంటే ఏమీ ఒరగదు.

కృష్ణార్జునులు అంటే నరనారాయణులు. కృష్ణుడు ఆత్మ సామ్రాజ్యానికి అధిపతి, అర్జునుడు నరులకు ప్రతినిధి. శ్రీకృష్ణుడు కేవలం అర్జునుడికి ఒక్కడికే చెప్పలేదు గీత ! అర్జునుడి ద్వారా సమస్త నరులకు తెలియజేసాడు. భగవద్గీత చెప్పి అందులోని విషయాలను ఆచరించమని, సాధన చేయమని శాసించాడు.

శ్రీకృష్ణుడు గీతలో అక్కడక్కడా నన్ను పూజించు, "నన్ను" స్మరించు అని అంటే దానర్థం ఏమిటనుకున్నారు ? "నన్ను" అని అంటే కేవలం నెమలి పింఛం ధరించిన ఆ యొక్క రూపాన్ని అని ఉద్దేశించి కాదక్కడ అర్థం "నా యొక్క అనంత తత్వాన్ని, శాశ్వతత్వాన్ని గుర్తించి గౌరవించు, స్మరించు. నేను నీ లోనూ, అందరిలోనూ ఉన్నాను. నీ లోపల ఉన్న "నన్ను" అనేదాన్ని గుర్తించు, "నా" అనంత తత్వాన్ని దర్శించు, అప్పుడు నీవు నేను ఒకటే అని తెలుస్తుంది అని అర్థం. శ్రీకృష్ణుడు "నేను" అని అంటున్నాడంటే సర్వత్రా వ్యాపించి ఉన్న ఆయన అనంత తత్వాన్ని ఉద్దేశించి అంటున్నాడని తెలుసుకోండి.

శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పిన గీతా సారాంశం ఏమిటంటే "నేనే అంతా... అంతా నేనే" ! ధ్యానయోగ సాధన చేసి మీరు కూడా "నా" (ఆత్మ) స్థితిని పొందండి అని చెప్పాడు.

"తస్మాత్ యోగీ భవార్జున" అని అన్నాడు శ్రీకృష్ణుడు. అంటే ధ్యానయోగివికా, అర్జునా ! అని అర్థం. శ్రీకృష్ణుడు భగవద్గీతలో ధ్యానయోగమే చేయమని చెప్పాడు కానీ, పారాయణం, సంకీర్తనలు చేయమని చెప్పలేదు. "యోగివి కా" అన్నాడు, కానీ భజనలు, సంకీర్తనలు చేయమని చెప్పలేదు !

భగవద్గీతలోని విషయాలను తెలుసుకుని సాధన చేయాలి కానీ కేవలం ఆ శ్లోకాలను చదువుతూ కూర్చుంటే ఏమి జరగదు. అందులోని విషయాలు ఆచరించడానికే ఉన్నాయి. అభ్యాసం చేయడానికే ఉన్నాయి కాని, ఊరికే అలా వల్లె వేయడానికి కాదని గ్రహించండి.

భగవద్గీత కేవలం పారాయణ గ్రంథం కాదు, అది ఆచరణీయ గ్రంథం !

✪✪✪ "నీళ్ళు త్రాగితే దాహం తీరును" అనే వాక్యాన్ని చదువుతూ కూర్చుంటే దాహం తీరుతుందా లేక నీళ్ళు త్రాగితే దాహం తీరుతుందా ? నీళ్ళు త్రాగితే దాహం తీరును అని మీరు కోటి సార్లు పారాయణం చేసినా లేక సంకీర్తన చేసినా దాహం తీరదు కదా ! ఒక సారి చదివి విషయం తెలుసుకుని నీళ్ళు తాగాలి కదా ! ఇదే విధంగా భగవద్గీతను ఒకసారి చదివి అందులోని విషయాలను ఆచరిస్తూ ఉంటే, శ్రీకృష్ణ పరమాత్మ చేయమని చెప్పినట్టుగా ధ్యానయోగ సాధన చేస్తూ ఉంటే పుణ్యం వస్తుంది, కర్మలు పోతాయి. ముక్తి వస్తుంది. ఆచరించకుండా, సాధన చేయకుండా కేవలం భగవద్గీత శ్లోకాలను బట్టీ పట్టినంత మాత్రాన ఏమి జరగదు, ఒరగదు అని తెలుసుకోండి.

శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో మరియు ఉత్తరగీతలో చెప్పిన వాటి సారం అంతా "నీవే దైవం" అంటే, "నేనే దైవం" అని ! కాబట్టి ఇక పారాయణం చేసింది చాలు, "నేనే దైవం"అని మీ దైవత్వాన్ని పొందడానికి సాధన(ఆచరణ) మొదలు పెట్టండి.

పుణ్యం అంటే ఏమిటి ? పాపం అంటే ఏమిటి ?

పుణ్యం : సరైన మతరహిత అత్యున్నత ఆత్మ విజ్ఞానంతో కూడిన అవగాహనా శక్తినే పుణ్యం అని అంటారు. ఆత్మ విజ్ఞాన అవగాహనతో జీవించే వ్యక్తిని పుణ్యవంతుడు అని అంటారు. ఆత్మ విజ్ఞాన సత్యాలను త్రికరణ శుద్ధిగా ఆచరించే వ్యక్తినే పుణ్యవంతుడు అని అంటారు. ఆత్మ విజ్ఞాన అవగాహనతో చేసే పనులను సత్కర్మలు అని అంటారు, ఆ యొక్క సత్కర్మల ఫలితాన్నే పుణ్యం అని అంటారు. సదవగాహనయే పుణ్యం. సత్ప్రవర్తనల ఫలితాలే పుణ్యం. అంతే కాని పనికిమాలిన

మత పరమైన కర్మకాండలు చేస్తే పుణ్యం రాదు, టైమ్ పాస్ అవతుంది !

పాపం: ఆత్మ విజ్ఞానం లేక పోవడమే పాపం. అజ్ఞానమే పాపం(కర్మ). అజ్ఞానంతో చేసిన లేక చేస్తున్న పనుల యొక్క ఫలితాలే పాపాలు. దుర్గుణాలే పాపాలు. పాపాన్ని కర్మ అని కూడా అంటారు. పాపాలను కర్మలు అని అంటారు.

ఆత్మ విజ్ఞానం అంటే పుణ్యం!
అజ్ఞానం అంటే పాపం(కర్మ) !

మరి పాపం పోవాలి అంటే పుణ్యం రావాలి. పుణ్యం రావాలంటే ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసించాలి, ఆచరించాలి, సాధన చేయాలి ఇదే విషయాన్ని శ్రీకృష్ణ పరమాత్ముడు గీతలో చెప్పాడు కదా, ఈ క్రింది విధంగా...

శ్లో॥ అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి - గీత - 4 : 36

అర్థం: నీవు పాపాత్ములలోకెల్లా పాపాత్ముడవైనప్పటికీ దివ్య జ్ఞానం అనే ఓడ చేత మాత్రమే పాప సముద్రమును సురక్షితంగా దాటగలవు.

కాబట్టి విశేషమైన ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ఆచరణ + నిరంతర ధ్యాన సాధన తక్షణమే ప్రారంభించాలి, ఇంకా అందరికీ ప్రేరణనివ్వాలి.

5. MAB నవ రత్నాలలో ఆయిదవ రత్నం - ధ్యాన సాధన

ధ్యానం అంటే ఎరుక !

✪✪✪ 1. గురువు చెప్పింది చేయడమే ధ్యానం. గురువు ఏది చెబితే అది.

✪ 2. ధ్యానం అంటే ఆధ్యాత్మిక శాస్త్రాన్ని అభ్యసిస్తూ, ఆ యొక్క సూత్రాలను ఆచరించడమే.

✪ 3. నీ నిజ తత్వమే, నీవై జీవించడమే ధ్యానం.

✪ 4. ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అంతరంలో అనుభవం పొందే సాధనా విశేషమే ధ్యానం.

✪ 5. ధ్యానం అంటే ప్రక్షాళణా ప్రకియ.

✪ 6. ధ్యానం అంటే సాధన, సాధన అంటే పరివర్తన, పరివర్తన అంటే అభివృద్ధి.

✪ 7. ధ్యానం అంటే ఏదో మొక్కుబడిగా రోజూ కాసేపు ఓ అరగంటో, గంటో సాధన చేసి, ఆ తర్వాత మడిచి మూలకు పెట్టేసేది కాదు ! ధ్యానం అంటే ఎరుక, శాశ్వతమైన ఎరుకతో జీవించడమే ధ్యానం !

✪ 8. ధ్యానం అంటే నీలో నీవు అంతర్గత సమతుల్యతను సాధించడమే.

✪ 9. ధ్యానం అంటే నీతో నీవు శృతిని పొందడమే.

✪ 10. మీతో మీరు ఉండడమే ధ్యానం.

✪ 11. మీరు మీరుగా ఉండడమే ధ్యానం.

✪ 12. ధ్యానం అంటే ఏకత్వం.

✪ 13. మీ పట్ల మీరు ఎరుకను కలిగి ఉండడమే ధ్యానం !

✪ 14. మీ పట్ల మీరు మేలుకోవడమే ధ్యానం !

✪ 15. ధ్యానం అంటే అవగాహన.

✪ 16. ధ్యానం అంటే విడుదల.

✪ 17. ధ్యానం అంటే విముక్తి.

✪ 18. ధ్యానం అంటే మోక్షం లేక దైవత్వం లేక జ్ఞానోదయం.

✪✪✪ 19. ధ్యానం అంటే సేవ. ఆధ్యాత్మిక సేవయే ధ్యానం. అన్ని ధ్యాన పద్ధతుల్లో కెల్లా సర్వోత్తమమైనది " నిస్వార్థ సేవా ధ్యానం" ! సేవ చేయడం అంటే ధ్యానం చేయడమే ! సత్య సూత్రాల ఆచరణ కూడా ధ్యానమే !

✪✪✪ 20. MAB నవ రత్నాలను ఆచరించడమే అసలు సిసలైన, సంపూర్ణ సమగ్ర పరమోన్నత ధ్యానం.

ధ్యానం అంటే ఎరుక !

అధమ స్థాయి ధ్యానాలు, మధ్యమ స్థాయి ధ్యానాలు చాలానే ఉన్నాయి. ఉన్నత స్థాయి ధ్యానాలు ఉన్నాయి. "పరమోన్నత స్థాయి ధ్యానాలు" కూడా ఉన్నాయి. చేస్తే కేవలం పరమోన్నత స్థాయి ధ్యానాలు మాత్రమే చేయాలి. అప్పుడే కదా మహా గొప్పగా, దివ్యంగా అభివృద్ధి జరిగేది !

నేను ఈ పుస్తకంలో చెప్పిన ధ్యానాలు, ఓషో గారి "డైనమిక్ మెడిటేషన్", రామ్‌తా పద్ధతులు, సేత్ మెడిటేషన్ టెక్నిక్స్ ఇంకా ఇతర పద్ధతులు చాలానే ఉన్నాయి. ఇవన్నీ "పరమోత్తమ, పరమోన్నత స్థాయి ధ్యానాలు" ! అధమ స్థాయి ధ్యానాల కంటే, ఇవి ఎన్నో కోట్ల రెట్లు శక్తి వంతమైనవి ! అధమ స్థాయి ధ్యానాలు చేసి అధోగతి పాలు కాకుండా పరమోన్నత స్థాయి ధ్యానాలు చేసి పరమోన్నత స్థితులను ప్రాప్తించుకోండి.

ఆధ్యాత్మికతలో బాగుపడే అవకాశం ఎంత ఉందో దారి తప్పి నష్టపోవడానికి కూడా అంతే అవకాశం ఉంది. సరైన గురువు దొరికితే ఆయనను మీరు సరిగా అనుసరిస్తే మీరు గ్యారంటీగా బాగుపడతారు. దొంగ గురువు దొరికాడా... మీ గతి అధోగతే ! ఇంతకు ముందు పేజీలలో "గురుస్మృతి" అనే టాపిక్‌లో చెప్పాను సరైన సత్య గురువును ఎలా వెతికి పట్టుకోవాలో... !

6. M A B నవ రత్నాలలో ఆరవ రత్నం - సత్సంగం

సత్సంగం అంటే కథలు చెప్పుకోవడం, భజనలు, కీర్తనలు, పాటలు, రాగాలు, తాళాలు, తప్పెట్లు, తబలా మృదంగ వాద్యాలు కాదు. "సత్సంగం" అంటే "సత్యంతో సంగమం", సత్య గురువుతో సంగమం ! సత్య మార్గంతో సంగమం ! సత్య సంస్థతో సంగమం ! ఎవరైతే సత్య మార్గంలో ఉన్నారో ఆ యొక్క సత్య సాధకులతో సంగమం, అంటే ధ్యాన సాధకులతో క్రమం తప్పకుండా సమావేశమవుతూ పరస్పరం అనుభవాలు పంచు కోవడం. దీని వలన సాధకులకు ఎన్నో సందేహాలు తీరిపోతాయి. ఈ సత్సంగం వలన ఎంతో ప్రేరణ కలుగుతుంది. అమితోత్సాహం ఉద్భవించి, చెక్కు చెదరని దృఢమైన పట్టుదల ఏర్పడుతుంది. అవగాహన చాలా బాగా పెరుగుతుంది. త్వరగా అభివృద్ధి చెందుతారు. నిజమైన సాధకులకు ఈ సత్సంగం అనేది తప్పని సరి.

మీరు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే, మీరు శాశ్వత రీతిలో.... ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలి అని అనుకుంటే, ఆత్మ విజ్ఞానులతోనే కలిసి ఉండాలి.

మీ కుటుంబ సభ్యులు ఈ జన్మలో మాత్రమే ఉంటారు.
కుటుంబ బంధాలు కర్మ బంధాలు. కర్మలు చెల్లించుకోడానికి
ఏర్పడినవే కుటుంబ బంధాలు.
ఒకరికి ఒకరు ఋణం తీర్చుకునేవే కుటుంబ బంధాలు.
ఈ కుటుంబ బంధాలు అశాశ్వతమైనవి.
కుటుంబం మంచిగా ఉంటే ఫరవాలేదు, నిలుపుకోవాలి.
ఆత్మ విజ్ఞాన పూర్వక సంబంధాలే శాశ్వతంగా
విరాజిల్లుతాయి. కాబట్టి ఆత్మ విజ్ఞానులతోనే సంబంధాలను
కలిగి ఉండాలి. ముందు ఆత్మ విజ్ఞాన సంబంధాలకే
ప్రాధాన్యతనివ్వాలి, ఆ తర్వాతే కుటుంబ బంధాలను
పట్టించుకోవాలి. సరైన ఆత్మ విజ్ఞాన సంబంధాల విషయంలో
హానికరమైన కుటుంబ బంధాలను వదిలేయాల్సిన అవసరం వస్తే
ఏ మాత్రం సందేహం లేకుండా, హానికరమైనవి అయితే, ఆ యొక్క
హానికరమైన కుటుంబ బంధాలను తక్షణమే, పూర్తిగా,
శాశ్వతంగా వదిలేయాలి. ఏమీ కాదు.
అంతా శ్రేయస్కరమే జరుగుతుంది. ఇది సత్యం.

7. MAB నవ రత్నాలలో ఏడవ రత్నం ఆచరణ

ఆచరణయే మిమ్మల్ని రక్షిస్తుంది. ఆచరణ ద్వారానే బాగుపడతారు. ఆచరణ అంటేనే అభివృద్ధి. ఆత్మ విజ్ఞాన గ్రంథాలను చదివి వాటిలోని సూత్రాలను యథాతథంగా ఆచరించడం అనేది తప్పని సరి. సరి కాని గుణాలు(స్వభావాలు), నమ్మకాలు ఈ ఆధ్యాత్మిక సూత్రాల ఆచరణ ద్వారా మాత్రమే మారుతాయి. గుణాలు(భావాలు), నమ్మకాలు మారినపుడు మాత్రమే శరీరంలో సంపూర్ణ ఆరోగ్యం వస్తుంది, జీవితం ఆనంద ఐశ్వర్య ఉత్సవాలతో నిండిపోతుంది. చివరిగా మోక్షం వస్తుంది.

ఈ ఆధ్యాత్మిక సూత్రాల ఆచరణ మీ అభివృద్ధిని ఎంతో వేగవంతం చేస్తుంది, మీకు ఒక సురక్షా కవచంలా పని చేస్తుంది. మీరు ఎంత జ్ఞానం కలిగి ఉన్నా అది ఎందుకూ పనికి రాదు. ఆచరించినపుడే ఆ విజ్ఞానం మీకు ఉపయోగపడుతుంది. మిమ్మల్ని బాగు చేస్తుంది. ఆచరణ మాత్రమే మిమ్మల్ని మీ కష్ట నష్టాల నుండి, రోగాల నుండి, దారిద్ర్యం నుండి, బంధాల నుండి, బంధనాల నుండి విముక్తిని ప్రసాదిస్తుంది. ఆధ్యాత్మిక సూత్రాల ఆచరణ ఎంతో ప్రాముఖ్యమైనది మరియు మహా శ్రేయస్కరమైనది. ఇది తప్పని సరి.

✪✪✪ నిజ జీవితంలో ఆధ్యాత్మిక సూత్రాల ఆచరణ లేనిదే మీరు అణువంతకూడా బాగుపడరు. కాబట్టి అసలు విషయాన్ని గ్రహించి ఆధ్యాత్మిక సూత్రాలను ఎలా ఆచరించాలో గురువుని అడిగి తెలుసుకుని, ఆచరించి ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్యాలతో విరాజిల్లండి. మోక్షాన్ని పొందండి. అందరూ పొందేందుకు కృషి చేయండి.

✪✪✪ ఏవైనా మీరు ఆచరించే ముందు, బాగా ఆలోచించి, నిపుణులను, అనుభవజ్ఞులను సంప్రదించి, మీకు, మీ కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల రక్షణలు ఏర్పాటు చేసుకుని మహా జాగ్రత్తలతో స్వంత భాధ్యతతో సరిగా ఆచరించాలి. లేకపోతే లేదు !

ఎవరో ఒక సరైన మత రహిత సత్య గురువును వెతికి పట్టుకోండి. ఆయన దగ్గర స్థానం సంపాదించుకోండి. ఆయన దగ్గరే స్థిర పడండి. మీరు ఈ పుస్తకం మొత్తం చదివితే సరైన సత్యగురువు ఎలా ఉంటాడో, ఆయనను లేక ఆమెను ఎలా పట్టుకోవాలో అర్థమవుతుంది.

8. MAB నవ రత్నాలలో ఎనిమిదవ రత్నం - పరిశోధన

ఆధ్యాత్మిక సూత్రాలను ఆచరిస్తూ అవి ఎలా పని చేస్తున్నాయి, ఎప్పుడెప్పుడు, ఏ ఏ సందర్భాలలో, ఎలాంటి పరిస్థితులలో, ఏ విధమైన ఫలితాలను ఇస్తున్నాయి అని మీరు గమనిస్తూ ఉంటే, విశ్లేషించుకుంటూ ఉంటే అప్పుడు మీరు స్థిరమైన అనుభవ విజ్ఞానం కలిగిన వారవుతారు. అప్పుడు ఎవ్వరు కూడా మిమ్మల్ని తికమక పెట్టలేరు. తప్పుదారి పట్టించలేరు. మీరు పరిశోధనలో ఉన్నప్పుడు ఎంతో గొప్ప ఫలితాలను సునాయాసంగా పొందే మార్గాలను ఎన్నింటినో మీరు కనుక్కుంటారు. మరెన్నో సులభమైన, సరళమైన, సురక్షితమైన, శీఘ్ర ఫలితాలను ఇచ్చే మార్గాలను దర్శిస్తారు. మీరు దర్శించిన వాటిని, కనుక్కున్న వాటిని ఇతరులకు అందించి వారికెంతో మేలు చేయవచ్చు. ఇప్పుడు మనం అనుసరిస్తున్న మార్గాలన్నీ ఒకప్పుడు ఎందరో మాస్టర్లు ఎంతో పరిశ్రమ చేసి మనకు అందించినవే. మరి ఆ మహానుభావులు పరిశోధన చేసి ఈ విజ్ఞానాన్ని మనకు అందించక పోతే మన పరిస్థితి ఏమై ఉండేదో ఆలోచించండి. మన గతి దుర్గతి పాలు కాకుండా సద్గతి పొందే వీలును కల్పించిన ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలను, ప్రేమను ప్రకటించి, మనం కూడా పరిశోధన చేసి మనకు, సర్వమానవాళికి ఎంతో శ్రేయస్కరాన్ని కలుగజేయవచ్చు.

పరిశోధన ద్వారా బహుముఖ ప్రజ్ఞ ప్రాప్తిస్తుంది. మహా పటిష్ఠమైన రీతిలో అభివృద్ధి జరుగుతుంది. పరిశోధన వల్ల మాత్రమే మీరు "గ్రాండ్ మాస్టర్స్" కాగలుగుతారు. పరిశోధన చేయండి. అందరి చేతా పరిశోధన చేయించండి.

✪✪✪ ఏవైనా మీరు పరిశోధించే ముందు, బాగా ఆలోచించి, నిపుణులను, అనుభవజ్ఞులను సంప్రదించి, మీకు, మీ కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల రక్షణలు ఏర్పాటు చేసుకుని మహా జాగ్రత్తలతో స్వంత భాధ్యతతో సరిగా పరిశోధించాలి. లేకపోతే లేదు !

❖ ❖ ❖

మీరు ఎల్లప్పుడూ మంచి మాత్రమే చేయండి. ఉదాహరణకు,
మీ కూతురు ఎవరినో ప్రేమించింది, ఆయనను పెళ్ళి చేసుకుంది.
ఈ విషయం మీకు ఇష్టం లేకపోతే మౌనంగా ఉండాలి.
వారిని అలా వదిలేయాలి. ఈ విషయంలో మీరు మీ అమ్మాయిని, అల్లుడిని
ఇబ్బందులకు గురిచేసారు అని అనుకోండి. మీరు ఎన్ని ఇబ్బందులకు గురిచేసారో
అన్ని రకాలుగా మీరు ఇబ్బందులకు గురవడమే కాకుండా... మీరు ఎవరికైతే ఎన్ని రకాల
ఇబ్బందులను ఇచ్చారో... వారికి మీరు అన్ని రకాల ఆనందాలను ఇవ్వాల్సి ఉంటుంది.
ఇది సృష్టి న్యాయం. దీని నుండి ఎవరూ తప్పించుకోలేరు. ప్రేమ వివాహాల విషయంలో
గొడవలు చేసే తల్లిదండ్రులు అంతకంతా అనుభవించాల్సి ఉంటుంది.
గుర్తుంచుకోండి. కేవలం తల్లిదండ్రులే కాదు, ఎవరెవరు ఎంతెంత పాల్గొంటారో అంతంత
వారు కర్మను అనుభవించాల్సి ఉంటుంది. 20 సంవత్సరాలు పెంచి పెద్ద చేసాం. కేవలం 20
రోజుల ప్రేమలో పడి మమ్మల్ని వదిలి వెళ్ళడం ఎంత వరకు న్యాయం... అని ప్రశ్నించడానికి
లేదు. వారు మీకు జన్మించే ముందే ఒప్పందం చేసుకుని పుడతారు. నేను ఇలా చేస్తాను అని,
దానికి మీరు కూడా సమ్మతిస్తారు. మీకు, మీ సంతానానికి మధ్య అన్ని ఒప్పందాలు పూర్తయిన
తర్వాతనే వారు మీకు పుడతారు. తీరా వారు పుట్టి వారి జన్మ ప్రణాళిక ప్రకారం వారు
చేస్తున్నప్పుడు, దాన్ని మీరు అడ్డుకుంటే, మీరు ఒప్పందాన్ని ఉల్లంఘించినట్టు అవుతుంది.
దాంతో మీకు తగిన గుణపాఠం నేర్పించ బడుతుంది. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ఎలా ఉంటుందో
మీకు చక్కగా నేర్పించ బడుతుంది. మీరు పూర్తిగా నేర్చుకునేంత వరకు...
అవి ఎన్ని జన్మలైనా సరే... మిమ్మల్ని సృష్టి వదలదు.

కేవలం అమ్మాయి విషయమే కాదు, ఏ విషయమైనా సరే,
మీరు ఎవరెవరికి చెడు చేసారో, వారందరికీ మీ వలన
మంచి జరగాలి. మీ చేత మంచి చేయించకుండా
మిమ్మల్ని వదిలి పెట్టదు సృష్టి !

౨. M A B నవ రత్నాలలో తొమ్మిదవ రత్నం -సత్య ప్రచారం

కేవలం జ్ఞానోదయం పొందిన వారు మాత్రమే చేయాలి.
ఒక సద్గురువు మాత్రమే చేయాలి.
ఆత్మ సాక్షాత్కారం పొందిన గురువు మాత్రమే చేయాలి.
జీవన్ముక్తుడు, మోక్షం పొందిన మోక్ష గురువు మాత్రమే చేయాలి.
ఎవరు పడితే వారు క్లాసులు చెప్పకూడదు.
మహా భయంకరమైన కర్మకు బలవుతారు.
సద్గురు స్థితి పొందనిదే ప్రచారం పేరుతో క్లాసులు చెప్తే మహా భయంకరమైన పాపం తగులుతుంది.

సత్య ప్రచారమంటే - ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టర్ సత్య ప్రచారం చేస్తుంటే, మీరు ఆయనకు అసిస్టెంట్లుగా ఉండాలి. మీరు క్లాసులు చెప్పితే ఘోర కర్మకు బలైపోతారు. నాశనమైపోతారు.

ఎవరో చెప్పారని మీరు ప్రచారం పేరుతో క్లాసులు చెప్తే మీకు 100% నరకం గ్యారంటి !

నిజమైన సత్య గురువులు కేవలం ఆచరణ చేయమని మాత్రమే చెప్తారు.

బలంగా సమర్పించుకోండి. . . .

నేను సత్య ప్రచారం చేయమని అంటున్నానంటే - దాని అసలైన, నిజమైన అర్థం ఏమిటంటే - సత్య ప్రచారం చేసే ఒక సత్య గురువుకు మీరు అసిస్టెంట్లుగా ఉండాలి అంతే ! ప్రచారం అంటే ఇంతే !

ప్రచారం పేరుతో మీరు క్లాసులు చెప్పడం, బోధనలు చేయడం, సందు సందుకో ధ్యాన కేంద్రం తెరిచి అందులో క్లాసులు నిర్వహించడం లాంటి ఘోరాతిఘోర తప్పిదాలు చేయకూడదు. ఇలా చేస్తే చాలా ఘోర దారుణ భయంకర కర్మకు బలైపోతారు.

మీరు నిజంగా ఆత్మ సాక్షాత్కారం పొందారా ? మీరు సత్యంగా ఎన్‌లైటెన్డ్ మాస్టర్ అయితే, మీరు చేయవచ్చు. కానీ ఆత్మ సాక్షాత్కారం పొందకుండా ఎవరో చెప్పమన్నారని మీరు క్లాసు చెప్పడానికి పూనుకుంటే, మీకు 100% నరకం గ్యారంటి !

ఒక సత్యమైన ఎన్‌లైటెన్డ్ మాస్టర్‌కు అసిస్టెంట్లుగా ఉండండి. ఆయన ఏ పని చెప్తే ఆ పని చేయండి. ప్రచారమంటే ఇంతే !

క్లాసులు చెప్పడం, బోధనలు చేయడం & బెల్టు షాపులు తెరిచినట్టు ధ్యాన కేంద్రాలు తెరవకండి ! ఇవి కాకుండా మీరు గురువుకు తన్, మన్ & ధన్‌సే సంపూర్ణంగా, సమగ్రంగా, శాశ్వతంగా మిమ్మల్ని మీరు సమర్పించుకోండి ... మీకు అవసరమైతే ! ఇష్టమైతే !

బలంగా గుర్తుంచుకోండి...
నేను సత్య ప్రచారం చేయమని
అంటున్నానంటే - దాని అసలైన,
నిజమైన అర్థం ఏమిటంటే -
సత్య ప్రచారం చేసే ఒక
సత్య గురువుకు మీరు అసిస్టెంట్లుగా
ఉండాలి అంతే! ప్రచారం అంటే ఇంతే!
మీరు క్లాసులు చెప్పడం,
ధ్యాన కేంద్రాలు తెరిచి నిర్వహించడం
కానే కాదు!

నవ రత్నాలలో గురు స్మృతి తర్వాత మహా మహత్వ పూర్ణమైనది అకర్మ వీగనిజమ్, ధ్యాన, ఆత్మ విజ్ఞాన ప్రచారం. దీనినే సత్య ప్రచారం అని అంటారు. కర్మ అంటే అవగాహన లేని స్థితి. మీరు ఎంతో కర్మను కలిగి ఉంటారు. జన్మ జన్మల కర్మను కొండంత పోగు చేసుకొని ఉంటారు. వీటిని అన్నింటిని ఒక్క పెట్టున అమాంతంగా, సులభంగా తీసివేసుకునే శక్తి సామర్థ్యాలను ఇస్తుంది "సత్య ప్రచారం". ఒకానొక విశ్వ సూత్రం - "నీవు ఒకరికి చేస్తే నీకు మరొకరు చేస్తారు". ఈ సూత్రం ప్రకారం మీరు మీ కింద వాళ్ళకి విముక్తి మార్గాలను అందిస్తూ ఉంటే మీ కర్మలు, బంధనాలు, ముడులు, మరకలు అన్నీ ఆటోమెటిక్‌గా తొలగిపోతూ ఉంటాయి. మీ లోపలి గాయాలన్ని నయం అయిపోతూ ఉంటాయి. ఎందుకంటే "మీరు ఇతరులకు ఏది చేస్తారో అంతకు వేయి రెట్లుగా మీకు కూడా అదే జరుగుతుంది" - ఈ విశ్వ సూత్రం ప్రకారం మీరు ఎంతో వేగంగా మీ కర్మ ప్రక్షాళన ముగించుకోవచ్చు.

మీరు ఒక్కరే ఒంటరిగా సాధన చేస్తే మీ అభివృద్ధి ఎడ్ల బండిలా మెల్లగా సాగుతుంది, అదే మీరు సత్య ప్రచారం చేస్తే అప్పుడు మీ అభివృద్ధి ఒక సూపర్ రాకెట్‌లా దూసుకుపోతుంది. ఎంతెంత సత్య ప్రచారం చేస్తుంటే అంతంతగా మీరు అభివృద్ధి చెందుతుంటారు.

మళ్ళీ వివరిస్తున్నాను, "మీరు ఏం చేస్తారో అది కేవలం వేయి కాదు లక్ష రెట్లుగా మీకు తిరిగి వస్తుంది". మీరు ఏం ఇస్తే అది మీకు లక్ష రెట్లుగా పరిణమిస్తుంది. మీరు ఇచ్చింది మీ కోసం లక్ష రెట్లై విస్తరిస్తుంది. మీరు మీ ఇంట్లో ఒంటరిగా సాధన చేసుకుంటే మీ అభివృద్ధి ఎగుడు దిగుడు దారుల్లో ఎడ్ల బండి మీద పోతూ ఉన్నట్టుగా ఉంటుంది. మీరు గనక ప్రచారంలోకి దిగితే మీ అభివృద్ధి అన్ని కోణాలలో సంపూర్ణంగా సమగ్రంగా సూపర్ రాకెట్ స్పీడ్‌తో జరుగుతుంది. ప్రచారం వలన మీరు అత్యంత సులభంగా, సరళంగా, శీఘ్రంగా "ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్యాలను తనివితీరా అనుభవించి చివరికి దైవత్వాన్ని" పొందుతారు.

ఎందుకంటే ఇవ్వడమే పొందడం ! మీరు ఇస్తూ ఉన్నారంటే పొందడానికి ద్వారాలు తెరుస్తున్నారన్న మాటే ! ఇచ్చే గుణమే తీసుకునే మార్గాలను ఏర్పరచి, మనకి కావాల్సిన వాటిని మనకు అందిస్తుంది. మీ దగ్గర ఏం ఉంటే, అది ఇస్తూ పోండి. మీకు ఏం కావాలో అది వస్తూ ఉంటుంది. ఇవ్వడమే తీసుకోవడం. మీరు ఇవ్వకుండా ఉంటే మీరు ఏమీ పొందలేరు. ఎవ్వరైనా మీకు ఏదైనా చేయాలంటే కూడా ఏమీ చేయలేరు, ఎంత ప్రయత్నించినా వారు ఇవ్వలేరు, మీరు పొందలేరు. కాబట్టి విషయాన్ని సరిగ్గా గ్రహించి ఇస్తూ పోండి. ఇచ్చినప్పుడే మీకు తీసుకునే శక్తి సామర్థ్యాలు వస్తాయి. ఏదైతే మిమ్మల్ని ఇవ్వకుండా ఆపుతుందో, అదే మిమ్మల్ని పొందకుండా చేస్తుంది. మిఖైల్ నైమీ అనే గొప్ప మాస్టర్ ఇలా చెప్తాడు. "ఇవ్వండి, అంతా ఇవ్వండి, అంతా ఇచ్చిన వాడికి అంతా ఉంటుంది, నిర్భయంగా ఇవ్వండి, నిస్సందేహంగా పొందండి" అని ! డాక్టర్ ట్యూస్‌డే లోబ్‌సాంగ్ రాంపా

అనే యోగీశ్వరుడు ఇలా అంటాడు. "అర్పించండి మీరు ప్రేమతో అర్పించింది మీకు వేయి రెట్లుగా తిరిగి వస్తుంది, మీరు ఈ భూమిని వదిలి వెళ్ళేటపుడు మీ వెంట ఆరిపోయిన అగ్గిపుల్లను కూడా తీసుకు వెళ్ళలేరు, ఏం చేసుకుంటారు ? ఇవ్వండి, ఇచ్చిన దానికి వేయి రెట్లుగా పొంది మిమ్మల్ని మీరు వేగంగా అభివృద్ధి చేసుకోండి" అని చెప్తాడు. "ఒక ఆశీర్వాదం ఇవ్వండి వేయి ఆశీర్వాదాలు వస్తాయి. ఒక సహాయం చేయండి, వేయి సహాయాలు వస్తాయి, ఇవ్వండి, మీరెంత ఇస్తే అంతకు వేయి రెట్లుగా పొందుతారు" ! శ్రద్ధ, సమర్పణ, అంకిత భావం, ఆత్మ విజ్ఞాన అవగాహనతో, ఎరుకతో, ఆనందంగా చేసింది వేయి లేక లక్ష లేక కోటి లేక కోట్ల రెట్లుగా పరిణమిస్తుంది. మీరు చేసేటప్పుడు కలిగి ఉన్న భావాన్ని బట్టి ఫలితం వస్తుంది.

✪ సత్య ప్రచారం చేయడం అంటే సత్యాన్ని పొందడమే ! ✪

✪ సత్య ప్రచారం చేసి సత్యాన్ని పొందండి ! ✪

సత్య ప్రచారానికి పూర్తిగా అంకితం అయితే మరి జీవించేదెలా ?!

అనాదిగా పరమ గురువులు ఈ భూమి పైన సత్య ప్రచారం చేస్తూ వస్తూ ఉన్నారు, మరి వాళ్ళెలా జీవించారు ?!

పరమ గురువుల చరిత్రలు చదివి అవగాహన చేసుకుంటే ఈ విషయం అర్థం అవుతుంది.

ఎంతో ప్రాచీన కాలం నుండి, ఎందరెందరో మహాత్ములు తమ జీవితాలను పూర్తిగా సత్య ప్రచారానికి అంకితం చేసుకున్నారు. వాళ్ళు జీవించడమే కాకుండా తమ దివ్య బోధనలతో ఎన్నెన్నో జీవితాలను ఉద్ధరించారు.

✪✪✪ సత్య ప్రచారం చేయడానికి తనను తాను, నిజంగా, 100% అంకితం చేసుకున్న వ్యక్తికి ఈ ప్రశ్నయే పుట్టదు. జీవించడం ఎలా అన్న సందేహమే రాదు. పూర్తి శాతంలో నుండి నిర్ణయం జరగనప్పుడే ఈ ప్రశ్న పుడుతుంది.

ఒక ప్రధానమైన విశ్వ సూత్రం ఇలా ప్రకటిస్తోంది....

✪✪✪ "ఎవరైతే సత్య ప్రచారానికి పూర్తిగా తమను తాము అంకితం చేసుకుంటారో వారికి కావలిసినవన్నీ సృష్టి నుండి, వాటంతట అవే, వారికి అందుతాయి" ! అందలేదంటే అది మీ లోపమే ! ఈ సూత్రాన్ని 100% ఒప్పుకుని(విశ్వసించి) రంగంలోకి డైరెక్ట్‌గా దిగాల్సిందే. ఈ సూత్రాన్ని ఒప్పుకోని వారికే ఈ ప్రశ్న పుడుతుంది.

ఈ ప్రశ్నను జయించ గలిగినపుడే సత్య ప్రచారానికి 100% అంకితం కాగలుగుతారు.

✪✪✪ తమ జీవితం గురించి ఆందోళన చెందేవారు దైవత్వాన్ని / జ్ఞానోదయాన్ని ఎలా పొందగలుగుతారు ?! దైవత్వం పొందడం అంటే ఏమనుకుంటున్నారు ?!

✪✪✪ స్వతంత్రంగా జీవించలేని మీరు మృత్యువును జయించి, సృష్టి కేంద్రంతో అనుసంధానం చెంది బ్రహ్మానుభవాన్ని (దైవత్వం/మోక్షం) ఏ విధంగా, ఎలా పొందగలుగుతారు ?! ఇతరులనెలా ఉద్ధరించగలుగుతారు ?!

తమ జీవితం పట్ల అభద్రతా భావాన్ని పూర్తిగా తొలగించుకున్నప్పుడే, ఆ వ్యక్తి సత్య ప్రచారానికి పూర్తిగా అంకితం కాగలుగుతాడు. కేవలం పైన తెలిపిన సూత్రాన్ని 100% ఒప్పుకుని రంగంలోకి దిగాల్సిందే ! వేరే దారి లేదు ! ✪ ఇంతకన్నా గ్యారంటి ఎవరిస్తారు ?! మీకు మీరే గ్యారంటి కావాలి ✪ అలా అయినప్పుడే ఇది సాధ్యం ! స్వయంగా ఆచరించి చూస్తేనే తెలుస్తుంది. ఆచరించి చూడాలి మరి !

✪✪✪ ఒక వ్యక్తి 100% తనను తాను సత్య ప్రచారానికి అంకితం చేసుకున్నప్పుడు ఆ మొత్తం వంశమే ఉద్ధరించబడుతుంది. ఎంతో పుణ్యం చేసుకున్న వంశానికో, కుటుంబానికో ఈ మహా భాగ్యం దక్కుతుంది.

ఒక వ్యక్తి 100% తనను తాను సత్య ప్రచారానికి అంకితం చేసుకోవడం అంటే మాటలు కాదు. ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రత్యేకంగా ఎన్నుకోబడిన ఉన్నత ఆత్మలకే ఇది సాధ్యం. అయితే తలుచుకుంటే ఎవరైనా చేయగలుగుతారు, కానీ తలుచుకుని ఆచరణలోకి దిగడంలోనే ఉంది అసలు వ్యవహారం.

ఎవరైనా, తమ జన్మ పరంపరను వేగంగా పూర్తి చేసుకుని, అన్ని కష్టాల్లో నుండి బయట పడి త్వరగా పరిపూర్ణతను సిద్ధించు కోవాలనుకున్న వారు, ప్రస్తుతం ఈ భూమి పైన ఉన్న వారిలో ఎవరినైనా ఒక గురువును ఆశ్రయించి వారి మార్గదర్శకత్వంలో సత్య ప్రచారానికి పూర్తిగా అంకితం అయితే, వారు ఈ జన్మనే చివరి జన్మగా చేసుకుని విముక్తిని పొందవచ్చు. మళ్ళీ మళ్ళీ జన్మించే ప్రయాసను తప్పించుకుని, దివ్యత్వాన్ని పొంది దివ్య లోకాలకు దివ్యులుగా వెళ్ళాలి అనుకునే వారు, 100% సత్య ప్రచారానికి అంకితం కావాల్సివస్తుంది, తప్పని సరి !

లేదా ఎన్ని జన్మలైనా సరే, అది వారి వారి ఇష్టం. అయితే ఎప్పటికైనా, ఎన్ని జన్మలకైనా ఈ నిర్ణయానికి మాత్రం వచ్చి తీరాల్సిందే, సత్య ప్రచారం చేసి సత్యాన్ని పొందాల్సిందే.

✪✪✪ సత్యాన్ని పొందడానికి చేసే సాధనలో సత్య ప్రచారం ప్రధానమైనది. అనివార్యమైనది. సత్య ప్రచారం చేయకుండా ఉంటే దైవత్వం ఏనాటికి పొందలేరు ! కానీ జ్ఞానోదయం కానిదే క్లాసులు చెప్పకూడదు. కేవలం గురువులకు అసిస్టెంట్లుగా ఉండాలి.

మీరు సాధన చేస్తూ ఇతరులకు ఈ సాధనను తెలియజేస్తూ ఉండాలి. అత్యంత శీఘ్రంగా, ఊహలకందనంత మెరుపు వేగంతో మీరు బాగుపడాలంటే ప్రచారం తప్పని సరి ! మీరు ఒంటరిగా సాధన చేస్తే, మీ అభివృద్ధి చాలా, చాలా, చాలా మెల్లగా సాగుతుంది. సాధన + ప్రచారం చేస్తేనే మెరుపు వేగంతో ఫలితాలు వస్తాయి. ప్రచారం చేయకుండా మూలకు కూర్చుని ఒంటరిగా సాధన చేస్తుంటే దైవత్వం రావడం అనేది చాలా, చాలా, చాలా కష్టం ! మీరు ఇతరులకు చెప్పలేక పోతే కనీసం ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలనైనా ఇవ్వాలి. మీ దగ్గర వేరే మెటీరియల్ లేకపోతే ఈ "సద్గురు తారా విశాల్ మార్గదర్శి" ఇచ్చినా సరే ! ఇలా ఇవ్వడం కూడా ప్రచారమే ! మహా ప్రచారం !

✪✪✪ సత్యం అంటేనే సురక్ష ! సత్య ప్రచారానికి అంకితం అయిన వారికి సాక్షాత్తు ఆ సత్యమే రక్షగా ఉంటుంది. అయితే ఈ విషయాన్ని నమ్మి(ఒప్పుకుని) సత్య ప్రచారానికి అంకితం కావడంలోనే ఉంది అసలు వ్యవహారమంతా ! మీరు మీ దైవత్వాన్ని కోరుకుని అందుకు అంకితమైతే అన్నీ వస్తాయి. మీకు ఏమేం కావాలో అన్నీ వస్తాయి. ఆరోగ్యం, అందం, ఐశ్వర్యం, శాంతి, సంతృప్తి, ఆనందాలు శాశ్వతంగా మీ స్వంతం అవుతాయి.

ఇదే విషయాన్ని పరమ గురువు శ్రీ జీసస్ క్రైస్ట్ చెప్తాడు.

But seek ye first the kingdom of God,

and His righteousness; and all these things shall be

added unto you. - The Holy Bible - Matthew 6 : 31 - 34

"మొట్ట మొదట మీ లోపల ఉన్న దైవ సామ్రాజ్యాన్ని + దేవుడి యొక్క దివ్య ధర్మాన్ని కోరుకుని వాటిని పొందడానికి పూర్ణంగా కృషి చేయండి, అప్పుడు మీకు కావలిసినవన్నీ, వాటంతట అవే మీకు అందుతాయి" అని అర్థం !

క్రీస్తు పరమాత్ముడు చెప్పిన ఈ విశ్వ సూత్రం యొక్క వివరణ ఏమిటంటే....

ఈ భూమి పైన మానవులు మొట్ట మొదట కోరుకోదగినదీ, పొందదగినదీ ఏదైనా ఉందంటే అది కేవలం తమ లోపల ఉన్న దైవ సామ్రాజ్యం + ఆ దేవుడి యొక్క దివ్య ధర్మం మాత్రమే ! దీనిని 100% కోరుకుని, దీనిని పొందడానికి 100% తమను తాము అంకితం చేసుకోవడాన్నే సత్య మార్గం అని అంటారు. ఈ సత్య మార్గంలో ఉన్న వారినే సత్య సాధకులు అని అంటారు.

ఈ విధంగా సత్య సాధన చేస్తూ, సత్య ప్రచారానికి 100% అంకితం అయిన వారికి ఏమేం కావాలో - అంటే ఆరోగ్యం, ఆయుష్షు, ఐశ్వర్యం, విజయం, శాంతి, సంతృప్తి, ఆనందం, ఉత్సవం మరియు మోక్షం మొదలైనవన్నీ కూడా వాటంతట అవే వచ్చి సత్య మార్గంలో ఉన్న వారికి అందుతాయి".

గ్రహించండి ! "వాటంతట అవే వచ్చి వారికి అందుతాయి", మీరేమీ చేయనక్కర లేదు. కేవలం, సత్య సాధనకు + సత్య ప్రచారానికి 100% అంకితం కావడమే మీరు చేయాల్సింది. ఎవరైతే ఈ విధంగా చేయగలుగుతారో వారు ఖచ్చితంగా పైన తెలిపినవన్నీ పొందుతారు. అనాదిగా వస్తున్న విశ్వ నియమం ఇది. ఈ విశ్వ నియమాన్నే జీసస్ చెప్పాడు, ఇంకా అనేకానేక మాస్టర్స్ అందరూ, ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఈ విషయాన్ని స్పష్ట పరిచారు. గతి తప్పని విశ్వ నియమం ఇది ! పరమ సత్యం ఇది ! అనాదిగా జరుగుతూ వస్తూ ఉంది ! ఇప్పుడు జరుగుతూనే ఉంది ! ఎప్పటికీ జరుగుతూనే ఉంటుంది ! పరమ సూత్రం కదా !

స్వయంగా జీసస్ పరమాత్ముడే తన బోధనల గురించి ఇలా ప్రకటించాడు :

"ఆకాశం(స్వర్గం) మరియు భూమి అంతరించి పోయినా,

నా వాక్కులు మాత్రం అంతరించిపోవు" !

- పవిత్ర గ్రంథం బైబిల్ - మత్తయి - 24 : 35

విషయాన్ని గ్రహించండి, అన్నీ అంతరించిపోయినా సరే, నా వాక్కులు మాత్రం అంతరించిపోకుండా శాశ్వతంగా అలానే ఉంటాయి. ఎవరైతే నా వాక్కుల యొక్క పరమార్థాన్ని గ్రహించి వాటిని నిజ జీవితంలో యథాతథంగా ఆచరిస్తారో వారికి నేను ప్రకటించినవన్నీ అందితీరుతాయి అని ఎంతో స్పష్టంగా చెప్పాడు కదా, జీసస్ క్రైస్ట్ ! ఇంతకన్నా గ్యారంటి ఏం ఉంటుంది చెప్పండి ?!

ఈ విధంగా క్రీస్తు పరమాత్ముడు హామీ ఇచ్చినట్టే ఈ కింది విధంగా భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు కూడా అభయమిచ్చాడు.

శ్లో ॥ అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్
- గీత - 9 : 22

వివరణ : ఎవరైతే కేవలం నన్ను మాత్రమే అంటే పరమ సత్యాన్ని మాత్రమే ధ్యానించుచూ, నన్ను(పరమ సత్యాన్ని) పొందడానికి సంపూర్ణంగా, సమగ్రంగా తమను తాము అంకితం చేసుకుంటారో వారి యొక్క పూర్తి బాధ్యతను నేను వహిస్తాను. వారి యోగ క్షేమాలన్నీ నేను చూసుకుంటాను. వారికి కావలిసినవన్నీ స్వయంగా నేనే సమకూరుస్తాను. అయితే ఈ వాగ్దానం కేవలం, ఎవరైతే 100% నన్ను(పరమ సత్యాన్ని) మాత్రమే పొందడానికి అంకితం అయి ఉన్నారో, ఎవరైతే సత్య ప్రచారానికి, సత్య సేవకు అంకితం అయి ఉన్నారో వారికి మాత్రమే వర్తిస్తుంది.

ఇతర ఏ పనులు చేయకుండా, అనుక్షణం, నిరంతరం, నన్ను(పరమ సత్యం) మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారో వారికి మాత్రమే నా ఈ వాగ్దానం వర్తిస్తుంది. ఇతర ఏ భౌతిక లక్ష్యాలు లేకుండా, ఇతర ఏ ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలు మొదలైన ఏ భౌతిక కార్యకలాపాలు చేయకుండా, కేవలం నన్ను(పరమ సత్యాన్ని) మాత్రమే పొందడానికి సాధన చేస్తున్నారో, కేవలం నా(పరమ సత్య) ప్రచారానికి మాత్రమే అంకితం అయ్యారో వారి కోరికలన్నింటినీ నేను నెరవేరుస్తాను. వారి అవసరాలన్నీ నేను ఖచ్చితంగా తీరుస్తాను అని శ్రీకృష్ణ పరమాత్ముడు 100% గ్యారంటి ఇస్తున్నాడు. ఎంతటి కరుణ !!!

అయితే మరి, అందరూ ఈ విధంగా 100% సత్య మార్గానికి అంకితం కాలేరు కదా ! మరి వారి మాటేమిటి ? ఆ యొక్క పరమాత్ముడు వారిని పట్టించుకోడా ? అనే సందేహాలు కలిగే అవకాశం ఉంది. కంగారు పడాల్సిన అవసరం లేదు. ఆ దైవం అందరినీ పట్టించుకుంటుంది. ఎవరు ఏ పని చేసినా, చేస్తున్నా "లోపల" లక్ష్యం మాత్రం పరమ సత్యమై ఉండాలి. మీరేపనైనా చేయండి. చదువు, ఉద్యోగం, వృత్తి, వ్యాపారం, గృహిణిగా బాధ్యతలు నిర్వహించడం మొదలైనవి ఏవైనా చేయండి మీ లోపల లక్ష్యం కేవలం, పరమ సత్యమే అయి ఉన్నప్పుడు ఈ "వాగ్దానం" తప్పని సరిగా వర్తిస్తుంది.

✪✪✪ అయితే పూర్తిగా, 100% సత్య సాధనకు + సత్య ప్రచారానికి అంకితం అయిన వారికి ఇంకా, ఇంకా ఎక్కువగా, అనంతంగా వర్తిస్తుంది.

చూశారా ! సత్యమార్గం మనకు ఏమేం కావాలో వాటన్నింటినీ అందిస్తుంది. మీరు స్టూడెంట్ అయితే మీ చదువును మీరు కొనసాగిస్తూనే దైవత్వాన్ని కోరుకుంటూ ఉండాలి, మీరు ఉద్యోగి లేక వ్యాపారస్థుడైతే మీ పనులు మీరు చక్కబెట్టుకుంటూనే దైవత్వం మీద దృష్టి పెట్టాలి, మీరు గృహిణి అయితే మీ బాధ్యతలు మీరు నిర్వర్తించుకుంటూ దైవత్వమే మీ లక్ష్యంగా ఉండాలి. మీరు ఎవరైనా సరే మీ బాధ్యతలు మీరు నిర్వహిస్తూ దైవత్వమే మీ ఏకైక లక్ష్యంగా ఉండాలి.

✪✪✪ దైవత్వం మీ లక్ష్యంగా పెట్టుకుని ఉన్నప్పుడు మీరు చేసే పనులు "సరి" అవుతాయి. దైవత్వం మీ లక్ష్యం కానప్పుడు మీరు చేసే మంచి పనులైనా సరే కర్మ శేషాన్ని అంటగడతాయి. అంతకు అంతా చెల్లించాల్సి వస్తుంది.

దైవత్వమే మన లక్ష్యం అయినప్పుడు సృష్టి యొక్క ఆశీర్వాద అనుగ్రహాలు ఎల్లప్పుడూ మన పైన వర్షిస్తూనే ఉంటాయి. ఎవరి గురించి వాళ్ళు తెలుసుకోవడం, ఎవరి నిజ తత్వాన్ని వాళ్ళు అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలనుకోవడం అనేది సృష్టి యొక్క ప్రాథమిక మరియు ప్రధానమైన నియమం. ఎప్పుడైతే మనం ఈ నియమాన్ని అనుసరిస్తామో మనకు కావాల్సినవన్నీ మనల్ని అనుసరించి వస్తాయి.

✪✪✪ దైవత్వమే మన లక్ష్యం అయినపుడు మనకు కావాల్సిన వాటికి, మనం కోరుకుంటున్న వాటికి మనం లక్ష్యం అవుతాము.

లక్ష్యానికి మనం ప్రాధాన్యతనిస్తే,

లక్ష్యం మనకు ప్రాధాన్యతనిస్తుంది.

లక్ష్యాన్ని మనం లక్ష్య పెడితె, లక్ష్యం మనల్ని లక్ష్య పెడుతుంది.

లక్ష్యాన్ని సిద్ధించుకోడానికి మనం ప్రయత్నిస్తుంటే,

లక్ష్యం మనకు సిద్ధించడానికి ప్రయత్నిస్తుంది.

కోరుకున్న లక్ష్యాన్ని సిద్ధించుకోవడానికి

సులభ సాధనమేమిటంటే,

ఆ లక్ష్యానికి 100% అంకితం కావడమే !

ధ్యానంలో కూడా సత్య ప్రచారం చేయవచ్చు

"మనమందరం అంతరంలో,
అందరితో, అంతటితో అనుసంధానింపబడి ఉంటాం" !

- విశ్వ సూత్రం.

ధ్యానంలో కూర్చుని, కళ్ళు మూసుకుని నుదుటి మధ్య భాగంలో మీ దృష్టిని కేంద్రీకరించి పై సూత్రాన్ని స్మృతిలోకి తెచ్చుకుని ఈ కింది విధంగా చేయాలి.

నేను కలిగి ఉన్న అవగాహనను నిస్వార్థంగా, సర్వ ప్రయోజనం కోసం సృష్టి మొత్తానికి పంచుతున్నాను. ప్రసారం చేస్తున్నాను. నేను ఎన్నో బాధలుపడి ఈ అవగాహనను పొందాను. నాలాగా ఇతరులు బాధలు పడకుండా వారికి నా అవగాహనను పంచుతున్నాను. నా అవగాహన అందరికీ అందుగాక ! అని అనుకుంటూ మీరు కలిగి ఉన్న అవగాహనను పంచుతున్నట్టుగా గాఢంగా భావించాలి. మీకు ఉన్న అవగాహన ఈ సృష్టిలో ఎంతో మందికి ఏదో ఒక విధంగా పనికి వచ్చి తీరుతుంది. ఈ విధంగా మీ అవగాహనను మీరు పంచినపుడు అది వారికి చేరి, వారు తమ తమ కష్టాలలో నుండి బయట పడతారు. "పంచబడినది పెంచబడుతుంది" అనే విశ్వ సూత్రం ప్రకారం మీరు ఎన్నో వేల రెట్లుగా శ్రేయస్కరాన్ని పొందుతారు. ఊహకు అందనంత లాభం జరుగుతుంది. ఎంతగానో ఆత్మ శక్తి వృద్ధి చెంది, అసంభవమైన కార్యాలను సైతం సుసంభవ కార్యాలుగా మార్చగలుగుతారు. అనూహ్యమైన విజయాలను అత్యంత శీఘ్రంగా పొందగలుగుతారు.

భౌతికంగా, మానసికంగా, ఆర్థికంగా, ఆత్మ పరంగా మీకు ఎంతో మేలు జరుగుతుంది. వీలైనప్పుడల్లా మీరు ఈ విధంగా చేసి మీకు మరియు సృష్టి మొత్తానికి ఎంతో అభివృద్ధిని కలుగజేయవచ్చు. మహా దివ్యమైన విధానం ఇది. మహా అద్భుతమైన ఫలితాలను మీకు అందిస్తుంది. ఆత్మ పూర్వకంగా, నిజంగా చేయాలి. 100% పూర్తి చైతన్య స్పృహతో చేయాలి. మహా మేలు జరుగుతుంది.

కాబట్టి ప్రియ మిత్రులారా ! దయచేసి సత్య ప్రచారంలో విశేషంగా పాల్గొనండి, అందరినీ పాల్గొనేలా చేయండి మీరు ఎంజాయ్ చెయ్యండి, అందరికీ ఎంజాయ్‌మెంట్‌ను పంచండి, **"పంచబడింది పెంచబడుతుంది" !** భూమి అంతా ఒక్కటే కుటుంబం. అంతా మనవాళ్ళే. అందరికీ ఆనందాన్ని అందించే బాధ్యత మనందరిదీ... ఆనందంగా ఉందాం, ఆనందాన్ని పంచుదాం, ఉత్సవం చేసుకుందాం, ఉత్సవాన్ని పంచుదాం !

సర్వ ప్రయోజనం కోసం జీవించే జీవితమే జీవితం !

సర్వ ప్రయోజనంలో స్వ ప్రయోజనం ఉంటుంది కానీ

స్వ ప్రయోజనంలో సర్వ ప్రయోజనం ఉండదు.

కాబట్టి ప్రియ మిత్రులారా ! సర్వ ప్రయోజనానికై

జీవిద్దాం, భూమిపై స్వర్గాన్ని స్థాపిద్దాం.

ఈ భూమి ఆల్‌రెడీ

ఒక స్వర్గమే... నిజానికి !

ఉన్న స్వర్గాన్ని గుర్తిద్దాం, ఉన్న స్వర్గాన్ని గుర్తించి అందరిచేతా గుర్తింప చేద్దాం... ఇదే భూమిపై స్వర్గాన్ని స్థాపించడమంటే...!

MISSION AHAM BRAHMASMI - HEAVEN ON EARTH !

We are Creators ! Let us Create and Celebrate !!

కష్టాలు చాలా బాధ పెడతాయి, నరకం చూపెడతాయి... కరక్టే కానీ... కష్టాల వలన కనపడని ఒక గొప్ప లాభం కూడా ఉంది ! కష్టాలు మీ బలహీనతలను బలాలుగా మారుస్తాయి. కష్టాలు మీ సర్కిల్‌ను ఫిల్టర్ చేస్తాయి. మీ కుటుంబ సభ్యులలో, బంధు వర్గంలో, స్నేహితులలో టోటల్‌గా మీ సర్కిల్‌ను ఫిల్టర్ చేసి రాళ్ళను ఒక వైపు రత్నాలను ఒక వైపు చేసేస్తాయి. అందరి రంగు బయట పడుతుంది. దానితో మీకు రాళ్ళ భారం తగ్గిపోయి, రత్నాల మెరుపులు మిగులుతాయి.

- సద్గురు తారా విశాల్

పార్ట్ - 15

సాధకుల ప్రశ్నలు

నా సమాధానాలు

ప్రశ్న మరియు సమాధానం అనేవి
ఒకే దాని రెండు చివరలు. ఒక వైపు ప్రశ్న ఉంటే,
మరో వైపు సమాధానం ఉంటుంది. ఒక వైపు సమస్య
ఉంటే మరో వైపు పరిష్కారం ఉంటుంది.

జవాబు లేని ప్రశ్న ఉండదు.
పరిష్కారం లేని సమస్య ఉండదు.

ప్రతీ ప్రశ్నకు సమాధానం ఇవ్వబడుతుంది.
ప్రతీ సమస్య పరిష్కరించ బడుతుంది.

సాధకుల ప్రశ్నలు - నా సమాధానాలు

❶ **ప్రశ్న :** నమస్కారం గురూజీ ! అంధకారంలో, అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న నాకు మీరు కొత్త వెలుగును, కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ఇప్పుడు జీవితం ఉత్సాహంగా ఉంది. నన్ను నేను తెలుసుకోవాలి అనే లక్ష్యం ఏర్పడింది. నన్ను నేను తెలుసుకుని సర్వ ప్రయోజనానికి పాటు పడాలని ఉంది. అందుకే సాధన తీవ్రంగా క్రమం తప్పకుండా చేస్తున్నాను. మంచి అభివృద్ధి వేగంగా జరుగుతుంది అనే విషయం స్పష్టంగా నాకు తెలుస్తోంది. అయితే ఇంత మంచిగా మీ మార్గదర్శకత్వంలో కొనసాగిపోతూ ఉన్న నా సాధనా జీవితంలో ఒక విషయం నన్ను బాగా వేధిస్తుంది. అదేమిటంటే మా కుటుంబం వాళ్ళు, బంధు మిత్రులు, ఇంకా కొంత మంది ఎవరు కూడా నా సాధన పట్ల సదభిప్రాయం వ్యక్త పరచటం లేదు. వాళ్ళు నన్ను ఆపటం లేదు, వ్యతిరేకించటం లేదు కానీ చులకనగా చూస్తున్నారు. విమర్శిస్తున్నారు. నా సాధన గురించి చర్చిస్తున్నారు. ఇదే నన్ను బాగా కలత చెందిస్తుంది. దీని వలన నా సాధనలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇది నేను భరించలేను. ఒక స్త్రీగా పుట్టిన తర్వాత ఏమేం బాధ్యతలు ఉంటాయో అన్ని తీర్చుకున్నాను. వయసు 50 దాటింది. ఇంత వరకు కోల్పోయిన జీవితం చాలు. ఇక పైన జీవితాన్ని కోల్పోదల్చుకోలేదు. దయచేసి నాకు తక్షణ నివారణోపాయాన్ని సూచించండి.

- హైదరాబాద్.

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : తక్షణ నివారణ అంటే ఎల్లప్పుడూ, "అవగాహనయే" ! అవగాహన సమస్యను తక్షణమే నివారిస్తుంది.

"మన శరీరం + జీవితం, మన అంతరంగం యొక్క యథాతథ ప్రతిబింబం". ఈ సూత్రాన్నే నీవు అర్థం చేసుకోవాలి. నీ చుట్టూ ఏర్పడుతున్న పరిస్థితులు నీవు ఆకర్షిస్తున్నవే. నీ అంతరంగంలోని భావాలకు అనుగుణంగానే వ్యక్తులు నీ పట్ల ప్రవర్తిస్తూ ఉంటారు. వారందరూ నీ సాధన పట్ల సదభిప్రాయం కలిగి లేక పోవడం, నిన్ను చులకన చేయడం, నిన్ను విమర్శించడం అనే విషయాలను నీవే ఆకర్షిస్తున్నావు. నీ లోపల ఇలాంటి భావాలను కలిగి ఉన్నావు. నీ పరిస్థితులకు నీవే కారణం,

ఇతరులను నిందించరాదు. వారు కేవలం నీ భావనలకు అనుగుణంగా ప్రతిస్పందిస్తారంతే ! ప్రతిబింబిస్తారంతే ! ఒక వేళ నీ అంతరంగంలో ఇలాంటి భావాలు లేవు అనుకుందాం, అయినా వారు అలా ప్రవర్తిస్తూ ఉంటే అప్పుడు నీపై ఆ ప్రభావం పడదు. కానీ నీపై ఇక్కడ తీవ్ర ప్రభావం పడుతూ ఉందంటే మరి ఏమిటీ దాని అర్థం ? నీవు ఆ భావాలను కలిగి ఉన్నావనేది స్పష్టమౌతోంది కదా ! కాబట్టి నీ పరిస్థితులకు నీవే సృష్టికర్తవని ఒప్పుకుని, ఆ విషయాన్ని గ్రహించాలి. సాధన చేయి, లోపలికి వెళ్ళి ఆ మూలాలను శాశ్వతంగా తీసివేయి. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే ధ్యాన సాధనను తెలియ జేసాను. అయినా నీవు ఆల్‌రెడి సాధన చేస్తున్నాను అని అంటున్నావు కాబట్టి సులభంగా తీసివేయగలుగుతావు.

మన పరిస్థితులకు మనమే సృష్టికర్తలం అని మనం అంగీకరించగానే సమస్య 99% సమసి పోతుంది. మిగతా ఒక శాతం అంతరంలో అవగాహన చెందగానే పోతుంది. మన వాస్తవాలను మనమే సృష్టించుకుంటాం. ఏ దేవుడో లేక ఏ అదృశ్య శక్తులో మనల్ని నియంత్రిస్తూ ఉండవు. ఏ గ్రహ, నక్షత్ర, రాశులో మనల్ని శాసిస్తూ ఉండవు. మనం మనకున్న అనుభవ జ్ఞానంతో, మనకు గల గుణాలకు అనుగుణంగా ప్రవర్తిస్తూ ఉంటాం.

"నీ వాస్తవాలకు నీవే సృష్టికర్తవు" అనే సూత్రం చాలా మందికి చాలా ఇబ్బందిని కలిగిస్తుంది. ఎందుకంటే సరి కాని ప్రవర్తనలకు, తప్పులకు, నష్టాలకు అన్నింటికి నేనే కారణం అని ఒప్పుకోవడానికి చాలా ధైర్యం, అవగాహన ఉండాలి. ఈ సూత్రం ఒప్పుకోకుండా ఉంటే అప్పుడు జాతకం పైనో, ఏ దేవుడి పైనో, ఏ దయ్యం పైనో లేక ఏ నక్షత్రాల పైనో, ఏ రాశుల పైనో, ఏ గ్రహాల పైనో వేసి తప్పించుకోవచ్చు. కానీ ఈ సూత్రం నిన్ను అలా తప్పించుకోనివ్వదు. సత్యం ఇదే కాబట్టి నీ ప్రవర్తనలకు, నీ పరిస్థితులకు నీదే బాధ్యత కాబట్టి నీ బాధ్యత నీవు తీసుకో అని చెబుతుంది. గుర్తుంచుకో "100% మన వాస్తవాలకు మనమే సృష్టికర్తలం" !

మన వాస్తవాలకు మనమే సృష్టికర్తలం కాబట్టి ఈ విషయాన్ని మనం అంగీకరించి గ్రహించినప్పుడు మాత్రమే మన సమస్యలను శాశ్వతంగా తీసివేసే శక్తి, సామర్థ్యాలు వస్తాయి. అప్పుడు మాత్రమే ఆ సమస్య మూలాలు మన ముందుకు వస్తాయి. మన ఎరుకలోకి సమస్య యొక్క మూలాలు రాగానే అవి సరి చేయబడతాయి. లేదా తక్షణమే అంతరించి పోతాయి శాశ్వతంగా.

ఇక విషయాన్ని రెండో కోణంలో నుండి చూస్తే, అసలు ఎవరైనా సరే నీ పట్ల ఎందుకు సదభిప్రాయాన్ని కలిగి ఉండాలి ? ఎవరైనా నిన్ను ఎందుకు అర్థం చేసుకోవాలి ? అసలు నీవు వాళ్ళను అర్థం చేసుకున్నావా ? నీకు వాళ్ళ పట్ల సదభిప్రాయం ఉందా ? వాళ్ళను నీవు అర్థం చేసుకుని ఉంటే, సదభిప్రాయం కలిగి ఉంటే అసలు ఈ సమస్యనే ఉత్పన్నమయ్యేది కాదు. వాళ్ళు నీ సాధన పట్ల

సదభిప్రాయం కలిగి ఉంటే కలిగి ఉంటారు, లేక పోతే లేదు. నిన్ను అర్థం చేసుకుంటే చేసుకుంటారు, లేక పోతే లేదు. వాళ్ళకు ఆ స్వాతంత్ర్యం ఉంది. అది వారి ఇష్టం. వారిని నీ పట్ల సదభిప్రాయాన్ని ప్రకటించమని బలవంతం చేయడానికి నీకు అధికారం లేదు. నిన్ను అర్థం చేసుకోమని ఒత్తిడి చేయడం సరికాదని తెలుసుకుని, ముందు నీవే వాళ్ళని అర్థం చేసుకోవాలి.

ఉదాహరణకు శ్రీకృష్ణ పరమాత్ముడిని విమర్శించే వాళ్ళు ఎంత మంది లేరు ? స్త్రీ లోలుడనీ, జల్సా పురుషుడని ఆ పరమాత్ముడినే నిందిస్తారు. నిజానికి ఆయన, జీవితంలో జీవించే విధానాలలోకెల్లా "దివ్య విధానాన్ని" ఆచరించాడు. దివ్య జీవితాన్ని జీవించి చూపాడు. అది అర్థం కాని ఛాందస బుర్రలు ఆయనను విమర్శిస్తూ ఉంటాయి. జీసస్ క్రైస్ట్‌ను విమర్శించే వాళ్ళు ఎంత మంది లేరు ?! మహావీరుడిని విమర్శిస్తారు.

మీరు స్వయంగా అనుభవ పూర్వకంగా తెలుసుకోకుండా వేరే వాళ్ళ మాటలు విని సద్గురు పైన సరి కాని అభిప్రాయాలకు రావడం అనేది నాశనానికి దారి తీస్తుంది. మీకు చెప్పే వారు మీకు ఎంత కావాల్సిన వారైనా సరే, ఒక సద్గురు గురించి సరి కాని విషయాలను చెప్తున్నారంటే వారు వ్యక్తిత్వం లేని వారని అర్థం. కాబట్టి అలాంటి వ్యక్తులు చెప్తున్న తప్పుడు విషయాలను విని, సద్గురు పైన తప్పుడు అభిప్రాయాలను ఏర్పరచుకుంటే నాశనమే జరుగుతుంది.

అంతెందుకు, ఒకప్పుడు నన్ను కూడా కొంత మంది విమర్శించేవారని నీకు తెలుసా ? నా కుటుంబ సభ్యులలో కొంత మంది నా కాన్సెప్ట్‌నే అర్థం చేసుకోలేదు. ఇక నా బంధు మిత్రుల విషయానికి వస్తే వారు కూడా అర్థం చేసుకోలేదు. విమర్శలే తప్ప, హేళనలే తప్ప ఒక్కరు కూడా అభినందించలేదు. కొన్ని లక్షల మంది నన్ను మెచ్చుకుంటుంటే, నన్ను కొనియాడుతుంటే, నన్ను, నా నిస్వార్థ సేవను చూసి ముగ్ధులై ప్రేరణ పొందుతుంటే, నా బంధు మిత్రులు మాత్రం నా పట్ల చులకన భావాన్నే అప్పుడు కలిగి ఉండేవారు. అయినా నేను ఏమీ బాధ పడ లేదు ! నా పట్ల వారు ఎలాంటి భావాలను కలిగి ఉన్నారు అనేది, నా లోపల ఉన్న నమ్మకాన్ని బట్టి ఉంటుంది. ''నన్ను ఎవరూ అర్థం చేసుకోరు, నాకు ఎవరూ సపోర్ట్ చేయరు'' అనే నమ్మకం కలిగి ఉంటే, మనల్ని ఎవరూ అర్థం చేసుకోకుండా, మనకు ఇబ్బందులను కలిగిస్తూ ఉంటారు. "నన్ను అందరూ అర్థం చేసుకుంటారు, నాకు ఫుల్ సపోర్ట్ ఉంది" అని నిరంతరం అనుకుంటూ ఉంటే అప్పుడు మనల్ని అందరూ అర్థం చేసుకుని సమర్థిస్తారు, సహాయ సహకార సమన్వయాలను అందిస్తారు. ''నేను నాలో ఉన్న సరికాని నమ్మకాన్ని, సరి చేసుకున్నాను... అంతే... అందరూ నన్ను పూర్తిగా అర్థం చేసుకుని, నాకు ఫుల్ సపోర్ట్ ఇస్తున్నారు. ఇప్పుడు అంతా, అందరూ నాకు పూర్తిగా అనుకూలంగా ఉన్నారు".

నా లోపల నిరంతరం సత్య కాంక్ష రగులుతూ ఉండేది. నేను ఎందుకు పుట్టాను ? చచ్చిన తర్వాత ఎక్కడికి వెళ్తాను ? అసలు ఎందుకు నా జీవితంలో, నాకు ఇష్టం లేని సంఘటనలు జరుగుతున్నాయి ? తలరాత అనేది ఉంటుందా ? అసలు నేనెవరిని ? అనే రకరకాల ఆలోచనలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుండేవి. నాకు కేవలం ఈ విషయాల పైన మాత్రమే పరిశోధన చేయాలనిపించేది. ఇలాంటి విషయాల గురించి తెలుసుకోవాలి అని అనిపించేది. చాలా సంవత్సరాలు రహస్యంగా పరిశోధన చేసాను. ఇక, ఒక దశ వచ్చింది. అప్పుడు నన్ను నేను కంట్రోల్ చేసుకోలేక పోయాను. 100% పూర్తిగా పరిశోధనకు అంకితం అయ్యాను.

ఒకప్పుడు, నా బంధు మిత్రులకు నా విషయం ఒక ఇష్యూగా ఉండేది. నేను ఒక ఉద్యోగమో, వ్యాపారమో చేసుకుంటూ వారిలాగా సెటిల్ కావాలని కోరుకునే వారు, నాకేమో భిన్నమైన లక్ష్యాలు ఉండేవి. నేను వేరు, నా ఆలోచనా విధానం వేరు. వాళ్ళు నన్ను మొదట్లో అపార్థం చేసుకున్నారు. ఇంట్రెస్ట్ లేని పని ఎలా చేయగలుగుతాను ? నాకు ఇంట్రెస్ట్ ఉన్న ఈ ఆధ్యాత్మిక రంగంలో చూడండి, ఇక్కడ శ్రమ కాదు మహా పరిశ్రమ చేస్తున్నాను. నన్నూ నా పరిశ్రమను చూసి చాలా మంది ఎందుకండీ అంత కష్టపడతారు అని ఆశ్చర్యపోతుంటారు. నాకేమో అస్సలు శ్రమ అనిపించదు. ఆనందంగా ఉంటుంది. నా బంధు మిత్రులు అందరూ మంచి వాళ్ళే, అయితే వాళ్ళకు నా విషయం జీర్ణం కాక బాధ పడేవారు. అందుకే నన్ను విమర్శించేవారు. ఏ ఒక్కరికీ నా కాన్సెప్ట్ ఏమిటో ప్రాక్టికల్‌గా తెలుసుకోవాలనిపించలేదు. కేవలం విమర్శలే ! వాళ్ళు నన్ను విమర్శిస్తున్నప్పుడు, నాకేనాడు బాధ కలుగలేదు. వారికి నచ్చినట్టుగా నేను చేయటం లేదు కాబట్టి వారికి కోపం. ఒక్కొక్కరి జీవితం ఒక్కో రకంగా ఉంటుంది, ఎవరి జీవన విధానం వారిదే అని సమాధాన పడలేకపోయారు ! వారికి నచ్చినట్టుగా నేను జీవించటం, వారిని మెప్పించటం అనేది మూర్ఖత్వం. అందుకే నా మానాన నేను నా పరిశోధనకే నా జీవితాన్ని ఆనందంగా అంకితం చేసుకున్నాను.

ఇది ఇలా జరుగుతూ ఉంటుంది. జీసస్ పట్ల కూడా ఆయన దగ్గరి వాళ్ళు కొంత మంది ఇలానే ప్రవర్తించారు. జీసస్ పెద్ద పెద్ద సత్యాలు చెబుతుంటే వాళ్ళకు మింగుడు పడలేదు. అహం అడ్డం వచ్చింది. అరే, ఇతడు మా ముందు పిల్లవాడు, మాకే ఏవో చెబుతున్నాడని ఫీలయ్యారు.

✪✪✪ చరిత్రలో చాలా మంది "మాస్టర్స్‌ని" వాళ్ళ కుటుంబం వాళ్ళు , బంధు మిత్రులు, తెలిసినవారు ఎవరు కూడా "గురువుగా" గుర్తించలేదు, లక్ష్యపెట్టలేదు. పెరటి మొక్క వైద్యానికి పనికి రాదు అనే సామెత ఉండనే ఉంది కదా ! భౌతిక దేహపరంగా "మాస్టర్స్" చిన్న వారైనప్పటికీ ఆత్మ పరంగా పెద్ద వారనే విషయాన్ని వాళ్ళు గ్రహించలేక పోయారు. భౌతిక శరీరం యొక్క వయసును బట్టి చూడటం అనేది అజ్ఞానులు చేసే పని.

మనల్ని విమర్శించే వారిని, వారి మానాన వారిని వదిలేసి మన మానాన మనం ఉండాలి. "అత్యంత త్వరలోనే అందరికీ నేను అర్థం అయి తీరుతాను" అని బలంగా నమ్మాను, అందరికీ నా పైన సదభిప్రాయం వచ్చింది, ఎందుకంటే నేను అందరి పట్ల సదభిప్రాయాన్ని కలిగి ఉన్నాను కదా ! ముందు, మనం మన పట్ల సదభిప్రాయాన్ని, సదవగాహనను కలిగి ఉంటే అంతా, అందరూ మన పట్ల సదవగాహనతో సదభిప్రాయానికి వచ్చేస్తారు. నేను చేసే పని "సరి" అయినదని నాకు తెలుసు. ఇప్పటి వరకు నా వల్ల ఎంతో మందికి మంచి జరిగింది, జరుగుతూనే ఉంటుంది కూడా !

నేను, ఈ భూమండలానికి & సర్వ ప్రాణికోటికీ శ్రేయస్కరంగా పరిణమించాలని నిర్ణయించుకున్నాను. ఆ విధంగానే పరిణమించాను. లోక కల్యాణం, విశ్వ కల్యాణం & సృష్టి కల్యాణంలో మహా పాత్ర పోషించాలని నిర్ణయించుకున్నాను.

మనల్ని, మన లక్ష్యాలను, మన పనులను కొంత మంది విమర్శించే అవకాశం ఉంది. వారి విమర్శలను మనం పట్టించుకోకూడదు. వారికి ప్రేమను ప్రకటించి మన పని మనం చేసుకోవడమే ఉత్తమం, శ్రేయస్కరం ! ఇది కార్య సాధకుల ప్రప్రథమ లక్షణం !

ఇక విషయాన్ని **మూడవ** కోణంలో నుండి చూస్తే, ఏ ఫీల్డ్‌కు సంబంధించిన వారు ఆ ఫీల్డ్ వారినే గుర్తిస్తారు, గౌరవిస్తారు. ఇంకో రంగానికి సంబంధించిన వారిని పట్టించుకోరు. ఎందుకంటే వారికి ఆ రంగం అంటే ఇంట్రెస్ట్ ఉండదు కాబట్టి. తమ ఫీల్డ్‌కు సంబంధించని వారి గొప్ప తనాన్ని గుర్తించి, గౌరవించాలంటే చాలా అవగాహన ఉండాలి.

ఉదాహరణకు నీకు ఆసక్తి లేని రంగాలలో ఎందరో గొప్ప వాళ్ళున్నారు. వారి పట్ల నీ అభిప్రాయాలు ఎలా ఉన్నాయో ఒక సారి చెక్ చేసుకో, చాలా మామూలుగా ఉంటాయి. అసలు చాలా మందిని నీవు గుర్తుపట్ట లేవు కూడా ! మనల్ని విమర్శించే వారు, వారికి నచ్చిన విధంగా మనం జీవించటం లేదనుకో, మనల్ని విమర్శిస్తారు. ఎవరి జీవన శైలి వారిదేనని గౌరవించే అవగాహన కొంతమంది ఎదిగిన వారికి మాత్రమే ఉంటుంది. మనతో ఏ సంబంధమూ లేని వారు కూడా మనల్ని విమర్శిస్తూ ఉంటారు. ఇది వాళ్ళ అహంకారానికి, వాళ్ళ బలుపుకు, వాళ్ళ అజ్ఞానానికి ఘనమైన చిహ్నం.

ఎవరి విమర్శలు వారికే ఎదురవుతాయి. విమర్శలు అంటే జడ్జ్‌మెంట్లు. వారు మన పట్ల చేసే ప్రతీ విమర్శను వారే ఎదుర్కొంటారు. అనుభవిస్తారు. కాబట్టి వారి పట్ల ప్రేమను కలిగి ఉంటూ, వారిని ఏ మాత్రమూ పట్టించుకోకుండా మన అభివృద్ధి పైన

మనం దృష్టిని కేంద్రీకరించడం మంచిది.

ఇక విషయం **నాలుగో** కోణంలో నుంచి చూస్తే, విమర్శించడానికి అజ్ఞానం మూల కారణం. అహం దెబ్బతిని ఉక్రోశంతో విమర్శిస్తారు. మన అభివృద్ధిని గమనించి జెలసీతో విమర్శిస్తారు. వాళ్ళ జెలసీని, వాళ్ళ అహాన్ని వాళ్ళే అనుభవించనీ మనకెందుకు చెప్పు ?!

ఇక విషయం **అయిదవ** కోణంలో నుండి చూస్తే, పనీ పాటా లేక, తిన్నది అరగక బలుపుతో విమర్శిస్తారు. ఎటూ పొద్దు పోక ఏం చేయాలో పాలుపోక విమర్శిస్తూ ఉంటారు. ఇలాంటి వారందరికీ **పొద్దు "పోయే"** సమయం ఎలాగూ వస్తుంది కదా !

ఇలాంటి శుంఠలను అస్సలు పట్టించుకోకూడదు. సింహాలు ఎప్పుడైనా కుక్కలను పట్టించుకుంటాయా ? నీవే చెప్పు ! విమర్శించే వారికి అవగాహన కలుగుగాక !

❖ ❖ ❖

❷ **ప్రశ్న :** గురుదేవులకు నమస్కారం ! నేను ఒక పెద్ద లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాను. దానికే నా జీవితాన్ని అంకితం చేసుకున్నాను. నా లక్ష్యమే నా జీవితం. గత ఏడు సంవత్సరాలుగా సంపూర్ణంగా లక్ష్యానికి అంకితమై పని చేస్తున్నాను. ఫైనల్ పాయింట్ వచ్చేసింది. అయితే, సడన్‌గా.. కొద్ది రోజుల నుండి పరిస్థితులు విచిత్రంగా కనిపిస్తూ ఉన్నాయి. లక్ష్య సిద్ధికి ఏ మాత్రం సంబంధం లేనట్టుగా కనపడుతున్నాయి. ఏమీ అర్థం కావడం లేదు. అంతా అయోమయంగా ఉంది...

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : కంగారు పడాల్సిన పని లేదు మిత్రమా... కంగ్రాట్స్ ! నిజంగానే నీకు లక్ష్యం సిద్ధించ బోతోంది. పరిస్థితులకు లక్ష్య సిద్ధికి సంబంధం లేనట్టుగా బయటికి కనపడుతుంది కాని అంతరంలో క్లియర్ అయ్యేవి క్లియర్ అవుతూ ఉంటాయి. సెట్ అయ్యేవి సెట్ అవుతూ ఉంటాయి. ఇప్పుడే ఈ పరిస్థితుల్లోనే, సరిగ్గా ఈ సమయంలోనే నీవు విశ్వాసంతో ఉండాలి. ధైర్యంగా ఉండాలి. ధీమాగా ఉండాలి. నీవు చేసిన శ్రమ ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా కానే కాదు. ఇది సత్యం. లక్ష్య సిద్ధికై నీవు ధార పోసిన ప్రతీ బిందువంత శ్రమ, సాగరమంత ఫలితంగా మారి నిన్ను ఆదుకుంటుంది. నీకు ఆసరాగా నిలుస్తుంది. నీకు అండగా మారుతుంది. నీకు సురక్షా కవచంగా నిలుస్తుంది. నీకు, పోషకమై నిన్ను పోషిస్తూ ఉంటుంది. నీకు సదా సర్వదా సహాయ సహకార సమన్వయాలను అందిస్తూనే ఉంటుంది. నీకు సర్వామోదాలను, సర్వానుకూలాలను సృష్టించి ఇస్తూనే ఉంటుంది.

బాగా గుర్తుంచుకో... ఈ సృష్టికి నీవు అత్యవసరమైన వాడివి. నీవే కాదు ప్రతీ ఒక్కరూ సృష్టికి అత్యంత అవసరమైన వారే ! సృష్టి ఎవరినీ కూడా అలక్ష్యం చేయదు. మనలో ఉండి, అనుక్షణం మనల్ని ఉత్తేజితం చేస్తూ ముందుకు ఉరికిస్తూనే ఉంటుంది. సర్వ వేళలా మనల్ని కాపాడుతూనే ఉంటుంది. సర్వ అనుగ్రహాలను, ఆశీర్వాదాలను, వరాలను కురిపిస్తూనే ఉంటుంది. సదా కటాక్షిస్తూనే ఉంటుంది. సర్వదా మన పట్ల ప్రసన్నంగానే ఉంటుంది. ఈ సృష్టి... మన సృష్టి... ఎంతో ప్రియమైనది ! ఎంతో అందమైనది ! ఎంతో మంచిది ! మనం కావాలనుకున్నదానిని ఇవ్వడమే సృష్టికి ఉన్న ఏకైక పని ! సృష్టికి ప్రేమను ప్రకటిస్తూ ఉండు. సృష్టి పట్ల విశ్వాసాన్ని కలిగి ఉండు.

ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని దానికి అంకితమై పని చేస్తూ ఉన్నప్పుడు, ఒక్కో సారి పూర్తి సంబంధం ఉన్న పరిస్థితులు ఎదురవుతుంటాయి, ఒక్కో సారి సంబంధం లేని పరిస్థితులు కనబడుతుంటాయి. సంబంధం ఉన్న పరిస్థితులలో నుండి హాయిగానే వెళ్ళిపోతాం. సంబంధం లేని పరిస్థితులలో నుండి ఎలా వెళ్ళాలో అర్థం కాదు. ఎక్కడికి దారి తీస్తాయోనని భయమవుతూ ఉంటుంది. అసలు మన లక్ష్యం ఏమిటి ? ఈ పరిస్థితులు ఏమిటి ? ఏం జరుగుతూ ఉంది ? అని అనిపిస్తూ ఉంటుంది. సరిగ్గా ఇలాంటి సమయాల్లోనే మనం పూర్తి పాజిటివ్‌గా ఉండాలి. ఎంతగా ఆలోచించినా దారి కనపడదు. ఇక్కడే మనం పూర్తి విశ్వాసంతో ధైర్యంగా ధీమాగా ఉండాలి. అంతరంలో మనం మన లక్ష్యానికి దగ్గర అవుతూనే ఉంటాం. లక్ష్యం మన దగ్గరకు వస్తూనే ఉంటుంది. ఒక్కో సారి విషయాలు మనకు అర్థం కావు అంతే ! పరిస్థితులు మన లక్ష్యానికి ఏ మాత్రం పొంతన లేకుండా కనిపిస్తూ ఉన్నప్పుడే పూర్తిగా, నిజంగా, మహా విశ్వాసంతో ధైర్యంగా ధీమాగా ఉండాలి, అప్పుడే అద్భుతాలు సంభవిస్తాయి. పరిస్థితులు లక్ష్యానికి సంబంధం లేకుండా ఉన్నప్పుడు, నెగెటివ్‌గా ఉన్నప్పుడే మనం పూర్తి పాజిటివ్‌గా ఉండాలి. సహనంతో ఉండాలి. విశ్వాసంతో ఉండాలి. ధైర్యంగా ఉండాలి. ధీమాగా ఉండాలి. ఇలా ఉంటే నిజంగా అద్భుత రీతుల్లో ఫలితాలు మనల్ని ఆనందాల్లో ముంచేస్తాయి.

ఎలాంటి ఆశకి ఆస్కారం లేనప్పుడే, ఎలాంటి మార్గం కనపడనప్పుడే, సహాయం చేసే వారు ఎవరూ కనపడనప్పుడే, ఏ కోణంలోనూ ఏ విధంగానూ పరిస్థితులు అంచనాలకు అందనప్పుడే... ఇప్పుడే, ఇక్కడే, ఈ సమయాల్లోనే పూర్తి విశ్వాసంతో పనులను ఆపకుండా చేసిన వారే విజేతలవుతారు. ఇలాంటి వారి వల్లనే ప్రపంచంలో గొప్ప గొప్ప సంభవాలు జరిగాయి, జరుగుతున్నాయి, జరుగుతాయి.

Most of the great things in the world have been accomplished by people who have been doing them with **invincible faith**; when there seemed to be no hope at all.

All The Very Best !

❖ ❖ ❖

❸ **ప్రశ్న :** మీరు చెప్పిన దానిని ఒప్పుకోకుండా ఈ ధ్యానాన్ని చేయకపోతే ?!

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చెప్పడం వరకే నా వంతు. మీరు ఒప్పుకుంటారా, లేదా అన్నది మీ మీదనే ఆధారపడి ఉంది. అది మీ ఇష్టం. ధ్యానం చేయకపోతే ఏమీ జరగదు !

❖ ❖ ❖

❹ **ప్రశ్న :** గర్భిణి స్త్రీలు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయాలి. గర్భిణి స్త్రీలు తప్పకుండా ధ్యానం చేయాలి. వీళ్ళు ధ్యానం చేయడం వలన ఎంతో మేలు జరుగుతుంది, లోపల ఉన్న వాళ్ళకు, తల్లికి ! గర్భం ధరించి ఉన్న దశలో దేహం అనేకానేక మార్పులకు లోనవుతుంది. ఈ మార్పులన్నింటిని చక్కగా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు వస్తాయి. ధ్యానం చేయడం వలన లోపల ఉన్న శిశువు యొక్క ఎదుగుదల సంపూర్ణంగా, సమగ్రంగా మరియు పటిష్ఠంగా జరుగుతుంది .

క్రమం తప్పని ధ్యాన సాధన వలన తల్లికి, శిశువుకి ఏవైనా లోపాలు గనక ఉంటే అవి సరి చేయబడతాయి. ధ్యానంలో పొందిన శక్తి వలన ప్రసవం సులభంగా, సరళంగా, సురక్షితంగా మరియు సహజంగా, ఆనందంగా జరుగుతుంది. కేవలం గర్భిణిగా ఉన్నప్పుడే కాకుండా ప్రసవం తర్వాత కూడా ధ్యానం చేయడం వలన స్త్రీ త్వరగా రికవర్ అయి మామూలు స్థితికి వస్తుంది. నాకు తెలిసిన కుటుంబంలో జరిగిన ఒక యథార్థ సంఘటనను ఈ క్రింద చదవండి.

ఒకాయన భార్యకు నెలలు నిండి డెలివరీ డేట్ దాటి పోయినా డెలివరి కాక పోయే సరికి

వాళ్ళలో చిన్న పాటి ఆందోళన కలిగింది. అన్ని చెకప్‌లు చేశారు. కండీషన్ అంతా నార్మల్‌గా ఉంది. ఏం చేయాలో అర్థం కాక వాళ్ళు రక రకాల పనులు చేస్తున్నారు. ఈ విధంగా రోజులు గడిచి పోతున్నాయి. ఒక రోజు నాకు ధ్యానంలో గర్భంలో ఉన్న ఆత్మ నాకీ విధంగా చెప్పింది "నాకు భూమి పైకి రావడానికి భయం వేస్తుంది. ఎందుకంటే భూమి పైకి రాగానే మాయలో పడి నా లక్ష్యాన్ని నేను మరిచిపోతానేమోననే భయంతో నేను బయటికి రావడానికి జంకుతూ ఉన్నాను. ఇలాగే నా గత జన్మలలో జరిగింది. ఈ సారి అలా పొరపాటు జరగకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను. అందుకే జన్మ తీసుకోడానికి వెనకా ముందు అవుతున్నాను. దయచేసి మీరు నన్ను ఈ జన్మలో సత్య మార్గంలోనే కొనసాగేలా చూస్తానని అభయమిస్తేనే జన్మ తీసుకుంటాను" అని చెప్పింది. అప్పుడు నేను ఆ స్త్రీ కడుపు పైన నా రెండు చేతులను పెట్టి ధ్యానం చేసాను. అప్పుడు ధ్యానంలో లోపల ఉన్న ఆత్మతో మాట్లాడి, అభయం ఇచ్చాను. అప్పటికే పది నెలలు కూడా నిండి పోయాయి. ఇది జరిగిన తర్వాత కొద్ది రోజులలో, లోపల ఉన్న ఆత్మ స్థిమిత పడి, కుదురుకుని 2005 మార్చి 26వ తేది రాత్రి 1 : 30 నిమిషాలకు అమ్మాయిగా జన్మించింది. ఆ పాప పుట్టిన మూడవ రోజు నుండే ధ్యాన ముద్రలో ఉంది.

ఇప్పుడు నిత్యం ధ్యాన సాధనల, ఆత్మ విజ్ఞాన బోధనల, అనుభవాల చర్చల మధ్య ఆనందంగా పెరుగుతూ ఉంది.

2007లో నేను నా టీమ్‌తో కలిసి భారత దేశ పాద యాత్ర (K2K) చేస్తూ సత్య ప్రచారం చేశాను. అప్పుడు మాతో పాటు పాపను కూడా తీసుకెళ్ళాం. అప్పుడు హ్యాపి వయసు 2 సం॥ల 3 నెలలే. హ్యాపి పేరెంట్స్ హైదరాబాద్‌లోనే ఉండి పోయారు ఇక్కడి పనులు చూసుకోడానికి. ఇంత చిన్న పిల్ల, తల్లిదండ్రులను వదిలి ఎలా ఉంటుంది అని అందరూ అనుకున్నారు. ఎందుకు ఉండదండీ, హ్యాపి పుట్టిందే సత్య ప్రచారం కోసం కదా ! హాయిగా మాతో వచ్చింది. కన్యాకుమారి నుండి ఉత్తరాంచల్‌లోని ద్రోణగిరి పర్వతాల (హిమాలయాల దగ్గరలో ద్రోణగిరి పర్వతాలు ఉంటాయి) వరకు జరిగిన సత్య ప్రచారంలో మాతో పాటు హ్యాపి కూడా పాల్గొన్నది. మాతో పాంప్లెట్స్ పంచింది. ట్రెక్కింగ్ చేసింది. కొండలు, లోయలు ఎక్కి, దిగింది.

హ్యాపి అరేబియా సముద్రం అలల్లో ఆడుకుంది. బీచ్‌లో అందరం కలిసి చాలా ఎంజాయ్ చేసాం. మాతో పాటు ఎన్నెన్నో రాష్ట్రాలు, ఎన్నెన్నో ఊళ్ళు తిరిగింది, తిరుగుతూనే ఉంటుంది కూడా. సత్య ప్రచారం చేయాలి కదా మరి ! తనకి నా ఆశీర్వాదం, మార్గదర్శకత్వం ఎప్పుడూ ఉంటుంది. కానీ తుది నిర్ణయం మాత్రం తనదే కదా. పెరిగి పెద్దయ్యాక సత్య మార్గంలోకి వస్తుందా లేక ఈ జన్మ కూడా వృథా చేసుకుంటుందా అనేది.. చూడాలి ?!

❖ ❖ ❖

❺ **ప్రశ్న :** బాలింతలు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ప్రతి ప్రసవం ఒక పునర్జన్మ లాంటిది స్త్రీకి. ఒక కొత్త దేహానికి కావలిసినవన్నీ తల్లి తన శరీరంలో నుండి ఇస్తుంది. ఈ విధంగా తొమ్మిది నెలలు తన దేహంలో మరో దేహం తయారు అయ్యేందుకు తన సర్వస్వాన్ని పణంగా పెట్టి సమర్పించుకుంటుంది. ప్రసవించిన తర్వాత కూడా పుట్టిన శిశువు యొక్క పోషణ తానే చూడాల్సి వస్తుంది.

వీటన్నింటి యొక్క నిర్వహణకు అదనంగా ఎంతో శక్తి అవసరం అవుతుంది. ధ్యానం చేయడం వలన అపారమైన శక్తిని పొంది తల్లి త్వరగా రికవర్ కావడమే కాకుండా, శిశువుకి కూడా శక్తి వంతమైన పోషణను అందివ్వ గలుగుతుంది. పాలు సరిగా రాని వాళ్ళకు పాలు సమృద్ధిగా వస్తాయి. శిశువును ఒడిలో పెట్టుకుని తల్లి ధ్యానం చేయడం వలన ఇద్దరికీ శక్తి అందుతుంది, ఎంతో శ్రేయస్కరం జరుగుతుంది.

❖ ❖ ❖

❻ **ప్రశ్న :** భర్త చనిపోయిన వారు, భార్య చనిపోయిన వారు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం :తప్పని సరిగా చేయాలి. జీవిత భాగస్వామిని కోల్పోయి బాధలో ఉంటారు. ఈ దశలో నిస్పృహ, నిరాశ, జీవితం పట్ల నిరాసక్తతలు కమ్ముకుంటాయి. ధ్యానం చేయడం వలన వీరు త్వరగా సాధారణ స్థితిలోకి వచ్చేస్తారు. ఈ దశలో ధ్యానం వీరిని ఎంతగానో ఆదుకుంటుంది.

❖ ❖ ❖

❼ **ప్రశ్న :** చిన్న పిల్లలు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : క్రమం తప్పకుండా ధ్యానం చేస్తూ ఉంటే పిల్లలు ఆరోగ్యంగా, చలాకీగా తయారవుతారు. పిల్లల చేత తప్పని సరిగా ధ్యానం చేయించాలి. మీరు కోల్పోయింది మీ పిల్లలు కోల్పోకుండా చూడండి.

★"భయాలు" మరియు "ఫోబియాలు" సహజంగా, శాశ్వతంగా తొలగిపోతాయి పిల్లలు మహాధైర్యవంతులుగా, సాహసవంతులుగా తయారవుతారు. తెలివి, ప్రతిభలు అభివృద్ధి చెందుతాయి.

★ "మొండి ప్రవర్తనలు" పోతాయి. కలుపుగోలు తనం వస్తుంది. లోపాలన్నీ తొలగి పోవడం మొదలు పెడతాయి.

★ పిల్లల్లో ఎంతో సృజనాత్మకత(Creativity) మరియు ఎన్నో గుప్త శక్తులు(Hidden Potentialities) దాగి ఉంటాయి. ధ్యానం ద్వారా ఇవన్నీ బయట పడతాయి. అద్భుతమైన జ్ఞాపక శక్తి వస్తుంది.

★ చక్కటి ఏకాగ్రత వస్తుంది. శ్రద్ధగా, హాయిగా చదువుకో గలుగుతారు. "టాలెంట్" చాలా అధికం అవుతుంది.

★ చదివి గుర్తు పెట్టుకున్న దానిలో నుండి అవసరమైన విషయాన్ని అవసరం వచ్చినప్పుడు చక్కగా చెప్పగలుగుతారు, వ్రాయ గలుగుతారు. ఈ "సామర్థ్యం" పరీక్షలలో బాగా ఉపయోగపడుతుంది.

★ పరీక్షల భయం(Examination Phobia) పోతుంది. సరదాగా, Coolగా పరీక్షలు రాస్తారు. ఏ టెన్షన్ ఉండదు ఇక పరీక్షలంటే !

★ Quality & Quantity maintain అవుతుంది. పరీక్షలలో ఏ జవాబు "ఎంత" వ్రాయాలో "అంతే" వ్రాసి దానిని చక్కటి "క్వాలిటితో" నింపేస్తారు. ఈ కాలంలో పిల్లలకు తప్పని సరిగా ఉండాల్సిన "సామర్థ్యం" ఇది.

★ ఒకే విషయాన్ని ఒకే కోణంలో కాకుండా ఎన్నో కోణాల్లో నుండి విశ్లేషించుకుని అర్థం చేసుకునే సామర్థ్యం వస్తుంది. అర్థం చేసుకున్న విషయాన్ని రక, రకాల కోణాల్లో వివరించగలుగుతారు.

★ ఎంతో అవగాహన పెరుగుతుంది. దీనితో సామాజిక స్పృహ పెరిగి చక్కటి బాధ్యతాయుతమైన "గొప్ప ప్రపంచ పౌరులుగా" తయారవుతారు... ఈ విధంగా ఎన్నో లాభాలు ఉన్నాయి.

❖ ❖ ❖

❽ ప్రశ్న : పెళ్ళి కాని యువతీ యువకులు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు. పెళ్ళి కాని యువతీ యువకులు ధ్యానం చేయడం వలన కర్మ ప్రక్షాళన జరిగి ఉత్తమమైన భాగస్వామి దొరుకుతారు. దీని వలన జీవితం ఆనందంగా గడిచి పోతుంది.

❖ ❖ ❖

❾ ప్రశ్న : ఉపాధ్యాయులు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు. తను నేర్చుకోవడం వేరే, ఇతరులకు నేర్పడం వేరే ! ఒక వ్యక్తి తను నేర్చుకోడానికి అవసరమయ్యే శక్తి, సామర్థ్యాలకన్నా ఎక్కువ శక్తి సామర్థ్యాలు అవసరం అవుతాయి ఇతరులకు నేర్పించేటపుడు ! ఎంతో సహనం, తెలివి తేటలు, ప్రతిభ అవసరమవుతాయి. ముఖ్యంగా సబ్జెక్ట్ యొక్క వ్యక్తీకరణ ఎంతగానో అవసరం. అసలు దీని మీదనే మొత్తం ఉపాధ్యాయులు ఆధారపడి ఉన్నారు. వ్యక్తీకరణ సరిగా చేయలేని వారు ఉపాధ్యాయ పదవికే అనర్హులు. ధ్యానం చేయడం వలన చక్కటి ఆకర్షణీయమైన, సారవంతమైన వ్యక్తీకరణ చేయగలుగుతారు. ఇంకా జ్ఞాపక శక్తి, ఒక విషయాన్ని అనేకానేక కోణాలలో వివరించి చెప్పగలిగే సామర్థ్యం వస్తుంది. విద్యార్థులకు చక్కగా అర్థం చేయించగలిగే నైపుణ్యం వస్తుంది. మానసిక పరమైన, బుద్ధి పరమైన కోణాలలోనే కాకుండా శారీరక పరంగా కూడా శక్తి వంతులవుతారు.

❖ ❖ ❖

❶❿ ప్రశ్న : ధ్యానం చేస్తే చెడు వ్యసనాలు పోతాయా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చెడు వ్యసనాలు, మంచి వ్యసనాలు అంటూ ప్రత్యేకంగా ఏవీ ఉండవు. అసలు వ్యసనం అంటేనే సరి కానిది. ఏదైతే అదుపు తప్పుతుందో దానినే వ్యసనం అంటారు. ఏదైతే అదుపు తప్పి మనల్ని ఆటాడిస్తుందో, మనకు హానికారకం అవుతుందో దానినే వ్యసనం అని అంటారు.

క్రమం తప్పని ధ్యాన సాధన వలన వ్యసనాలు పూర్తిగా, శాశ్వతంగా పోతాయి. అయితే గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే, ఏ వ్యక్తి అయితే వ్యసనాల బారిన పడి ఉన్నాడో, ఆ వ్యక్తి, పూనికతో నిర్ణయం తీసుకోవాలి. మొత్తం క్లియర్ అయ్యే వరకు సాధన ఆపకూడదు. నిజానికి ఒక్క వ్యసనాలే కాదు, ధ్యానం ద్వారా దేనినైనా క్లియర్ చేసుకోవచ్చు. ధ్యానం వలన సాధించలేనిది అంటూ ఏదీ లేదు !

❖ ❖ ❖

❶❶ ప్రశ్న : గురూపదేశం లేక ఇనిసియేషన్ లాంటివి అవసరమా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : గురూపదేశం లేక ఇనిసియేషన్ అంటే ధ్యాన సాధనా విధానాన్ని గురువు ద్వారా తెలుసుకుని ఆ తర్వాత వెళ్ళిపోయి ధ్యాన సాధన కొనసాగించవచ్చా, అని అడుగుతున్నారని మీ ప్రశ్నను బట్టి నాకర్థం అయింది.

ధ్యాన విధానాన్ని డైరెక్ట్‌గా గురువు ద్వారా తెలుసుకోవచ్చు లేదా ఏదైనా పుస్తకంలో లేదా పత్రికల్లాంటి వాటిని చదవడం ద్వారా తెలుసుకుని చేయవచ్చు లేదా ఎవరైనా సాధకుల ద్వారా కూడా తెలుసుకుని సాధన చేసుకోవచ్చు. ధ్యాన విధానం తెలుసుకోడానికి గురూపదేశం లేక ఇనిసియేషన్ అవసరం లేదు. వీలైతే తీసుకోవచ్చు లేకపోతే లేదు. కానీ, ధ్యాన సాధనకు గురు మార్గదర్శకత్వం అనేది తప్పని సరి ! అనివార్యం ! గురువును క్రమం తప్పకుండా కలుస్తూ వారి మార్గదర్శకత్వంలో సాధన కొనసాగిస్తేనే శ్రేయస్కరం !

❖ ❖ ❖

12 ప్రశ్న : ప్రత్యేకంగా ధ్యాన కేంద్రానికి వెళ్ళి మాత్రమే సాధన చేసుకోవాలా ? అసలు ధ్యాన సాధన ఎక్కడెక్కడ చేసుకోవచ్చు ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : వీలైతే ధ్యాన కేంద్రంలో సాధన చేసుకోవడమే ఉత్తమం. ఎందుకంటే ధ్యాన కేంద్రంలో ఎప్పుడూ నిరంతరంగా ధ్యాన సాధన జరుగుతూ ఉంటుంది. దీని వలన అక్కడి వైబ్రేషన్స్ ఉన్నతంగా, శక్తివంతంగా ఉంటాయి. దీని వలన మీకు ధ్యానం సులభంగా, త్వరగా, చక్కగా కుదురుతుంది. ఇదే కాకుండా అక్కడెంతో మంది ధ్యానం చేస్తూ ఉంటారు. వాళ్ళల్లో సీనియర్స్ ఎంతో మంది ఉంటారు. అప్పుడప్పుడు గురువు కూడా ఉండే అవకాశం ఉంది. గురువు ఒక మహా జ్వాల లాంటి వాడు. సీనియర్స్ అందరూ ఎండిన కట్టెల లాంటి వారు. ఆ మహా జ్వాలలో ఎండిన కట్టెలు భగ భగమని మండుతూ ఉంటాయి. సాధన ప్రారంభంలో ఉన్న వారు పచ్చి కట్టెల లాంటివారు, వీళ్ళు గనక వాళ్ళతో కూడి ధ్యాన సాధన చేసినట్టైతే సులభంగా వీరి కర్మలు కూడా దగ్ధమై పోతాయి. సామూహిక సాధనలో ఎన్నెన్నో లాభాలు ఉన్నాయి.

ఒక వేళ రెగ్యులర్‌గా వెళ్ళడం వీలు కాకపోతే, వీలైనప్పుడల్లా వెళ్ళి కేంద్రంలో సాధన చేసుకోవాలి. ఇక ధ్యాన సాధనకు ఒక సమయం, సందర్భం అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవండీ ! సర్వ కాల, సర్వావస్థల యందు, సర్వ వేళల యందు, సర్వ ప్రదేశాల్లో ధ్యాన సాధన చేసుకోవచ్చు. మీకు ఎక్కడ సౌకర్యంగా అనిపిస్తే అక్కడ, ఎప్పుడు వీలైతే అప్పుడు ! స్మశానాల్లో ధ్యానం చేసుకున్న మహానుభావులు ఎంతో మంది ఉన్నారు. బస్సులో, కారులో, రైలులో, విమానంలో, ఓడలో, ఇంట్లో, బయట, అడవిలో ఇలా ఎక్కడైనా చేసుకోవచ్చు.

ధ్యానం అంటే మీ నిజ తత్వమైన దైవత్వం పట్ల ఎరుకను కలిగి ఉండటమే ! నేనే దైవం అనే నిరంతర ఎరుకను కలిగి ఉండటమే ధ్యానం ! 365 రోజులు, 24 గంటలు ఈ ఎరుకనే కలిగి ఉండాలి. మీరు స్నానం చేస్తున్నా, బ్రష్ చేస్తున్నా, వంట చేస్తున్నా, ఏదైనా పని చేస్తున్నా, సెక్స్‌లో పాల్గొంటున్నా, ఏం చేస్తున్నా సరే ఈ ఎరుకను కలిగి ఉండాలి.

❖ ❖ ❖

13 ప్రశ్న : ధ్యాన సాధన ఎంత సేపు చేయాలి ? ఒక రోజులో ఎన్ని సార్లు చేయవచ్చు ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ధ్యానం అంటే అరగంటో, గంటో సాధన చేసి, తర్వాత మడిచి మూలకు పెట్టేది కాదు. **"ధ్యానం అంటే నేనే దైవం అనే ఎరుక" !** సదా, సర్వదా ఈ ఎరుకను మీరు, మీ దైవత్వం పునః ప్రాప్తించుకునే వరకు కొనసాగించాలి.

మీ, మీ పనులు చేసుకుంటూ ఎరుకను కలిగి ఉండటం ప్రాక్టీస్ చేస్తూ ఉంటారు. వీలు చిక్కినప్పుడు ఒక దగ్గర స్థిరంగా కూర్చుని సాధన చేస్తారు. ఇలా రోజులో ఎన్ని సార్లు వీలైతే అన్ని సార్లు చేసుకోవచ్చు.

ఒకే సిటింగ్‌లో గంట, రెండు, మూడు, నాలుగు, పది గంటలైనా సాధన చేసుకోవచ్చు. ఒకే సిటింగ్‌లో ఎంత ఎక్కువ సేపు ఉంటే అంత మంచిది. ఎంత ఎక్కువ చేస్తే అంత ఎక్కువగా, అంత త్వరగా లాభాలు వస్తాయి.

ధ్యానం అంటేనే శ్రేయస్కరం ! ధ్యానం అంటేనే సురక్ష ! ధ్యానం అంటేనే అభివృద్ధి ! ఎంత చేస్తే అంత శ్రేయస్కరం జరుగుతుంది, ఎంత చేస్తే అంతగా సురక్షితమౌతారు, ఎంత చేస్తే అంత అభివృద్ధి చెందుతారు ! అయితే గురు మార్గదర్శకత్వంలో సాధన చేయడం అనేది అనివార్యం !

❖ ❖ ❖

14 ప్రశ్న : ధ్యాన సాధన ఎక్కువగా చేస్తే వైరాగ్యం వచ్చి ఏదోలా అయిపోతారట నిజమేనా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మీ దృష్టిలో వైరాగ్యం అంటే ఏమిటో నాకర్థం అయింది. ఇల్లు, పెళ్ళాం పిల్లలు, బంధు మిత్రులను, వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలను, ఆస్తులను మొదలైన వాటన్నింటినీ వదిలేసి కాషాయాలు ధరించి, ఎటో అడవుల్లోకి పోయి.....! బహుశా మీ దృష్టిలో వైరాగ్యం అంటే ఇదనుకుంటా !

వాస్తవాలు తెలుసుకోండి...

రాగం అంటే బంధం, బంధనం !

వైరాగ్యం అంటే బంధాల్లోంచి, బంధనాల్లోంచి ముక్తుడవటం ! ఇల్లు, కుటుంబం, భార్యా పిల్లలు, బంధు మిత్రులు, ఆస్తులు అన్నీ కలిగి ఉన్నా, వాటితోనే ఉంటూ వాటి చేత బంధింపబడకుండా ఉండటం. దేనికి కూడా బానిస కాకుండా ఉండటం. దేని చేతిలోనూ కీలుబొమ్మ లాగా అవకుండా ఉండటం. అన్నింటికీ అధిపతియై ఉండటం. నీళ్ళలోనే ఉన్నా తామరాకులా అంటీ అంటకుండా ఉండటం.

అన్నింటిని కలిగి ఉంటూ, అన్నింటిని అనుభవిస్తూ వేటి చేత బంధింపబడకుండా స్వేచ్ఛా, సాధికారతలతో విరాజిల్లడమే వైరాగ్యం ! అన్ని వదిలేసి ఏకాంతంగా అడవుల్లోకి పోవడం అనేది ఎక్కడో, ఏ కొద్ది మంది విషయంలోనో అలా జరుగుతుంది. అది అందరూ చేయలేరు. అలా చేయడం మామూలు విషయం కాదు. నిజంగా, సహజంగా అన్నింటి మీద విసుగొచ్చి అలా ఏకాంతంగా గడపడానికి వెళ్ళడమనేది వేరే విషయం. లోతైన ఆధ్యాత్మిక అవగాహన లేకపోతే ఇలాంటి విషయాలు అర్థం కావు.

అసలు సూటిగా మీకర్థమయ్యేలా ఒక్క ముక్కలో చెప్పాలంటే, వైరాగ్యం అనగా కర్మ లేకుండా ఉండటం ! హాయిగా, ఆనందంగా ఉండటం !

❖ ❖ ❖

15 ప్రశ్న : ధ్యాన సాధన ఎక్కువగా చేస్తే కొంపదీసి అటునుండి అటే సమాధిలోకి పోము కదా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : కొంప తీయకుండా పోయినా, కొంపదీసి పోయినా సమాధిలోకి పోవడం అనేది మహా, మహా అనంతమైన, సౌభాగ్యమైన విషయం ! నిజానికి సమాధి స్థితే సాఫల్యం కదా ! ధ్యానం చేసేది సమాధి స్థితి పొందడానికే. ధ్యానం యొక్క పరమ లక్ష్యమే సమాధి. ఈ సమాధి స్థితిని పొందేందుకే మనం భూమి పైన జన్మిస్తాం.

అసలు సమాధి అంటే ఏం అనుకుంటున్నారు మీరు ? ఎక్కడెక్కడో ఏవేవో చదివి, ఏవేవో విని అనవసరమైన తప్పుడు భావనలు కలిగి ఉన్నారు మీరు. నిజంగా సమాధి గురించి తెలిస్తే ఇలాంటి ప్రశ్న వేయరు.

సాఫల్యం, దైవత్వం, మోక్షం, నిర్వాణం, సమాధి, బ్రహ్మానుభూతి, ఏకత్వం, నిజతత్వం, ఆత్మ సాక్షాత్కారం, సత్య సాక్షాత్కారం మొదలైన పదాలన్నీ ఒకే అర్థాన్నిస్తాయి.

సమాధి స్థితి అంటే దైవత్వ స్థితి !

సమాధి స్థితి అంటే మన నిజ తత్వ స్థితి !

సమాధి స్థితి అంటే, మీకు మీ పట్ల మరియు యావత్ సృష్టి పట్ల

ఉన్న అనేకానేక సందేహాలన్నీ పూర్తిగా నివృత్తి అయిన స్థితి !

ఎరుకతో ఆత్మ కేంద్రంలో విరాజిల్లే స్థితి !

బ్రహ్మానంద స్థితి !

సమాధిలోకి పోయిన వారు తిరిగిరారనీ, సమాధి అంటే ఏదేదో అనుకోవడం వల్ల మీకు రక రకాల భయాలు పట్టుకున్నట్టున్నాయి. మీరు అనుకునేవి ఏవీ నిజం కావు.

సమాధిలోకి వెళ్ళడం అంటే ఎరుకతో ఆత్మ కేంద్రంలోకి వెళ్ళడం. సృష్టి కేంద్రంతో అనుసంధానం చెందడం. సృష్టి ఏకత్వాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకోవడం. సమాధిలోకి వెళ్ళిన వారు దివ్యులుగా తిరిగి వస్తారు. వారే లోకకల్యాణానికి కారకులవుతారు. అందరికీ శ్రేయస్కరం అవుతారు. తాము దివ్యత్వంతో విరాజిల్లుతూ అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొందే మార్గం చూపుతారు. మీరన్నట్టు కొంపదీసి సమాధిలోకి గనక పోతే అంత కంటే మహా భాగ్యం ఏముంటుంది చెప్పండి ?! ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు దయచేసి బాగా చదవండి. అర్థం చేసుకుని అవగాహన పెంచుకోండి.

❖ ❖ ❖

16 ప్రశ్న : ధ్యాన సాధన చేసే వారి ఆహార నియమాల గురించి తెలియజేయగలరు.

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : పూర్తి స్థాయి అకర్మ శాకాహారం (అకర్మ వీగన్).

గుడ్డు శాకాహారమూ కాదు, బలమూ కాదు. గుడ్డు, గుడ్డుకు సంబంధించిన ఏ వస్తువు కూడా తినకూడదు. పశు ఉత్పత్తులు ఏవీ వాడకూడదు.

కేవలం అకర్మ శాకాహారం మాత్రమే తీసుకోవాలి. ఆకలి వేసినప్పుడు, ఆకలికి కొంచెం తక్కువ తీసుకుంటే సరిపోతుంది.

❖ ❖ ❖

17 ప్రశ్న : కొంత కాలం క్రితం కొన్ని రోజులు సాధన చేసి ఆపివేసిన వారు మళ్ళీ ధ్యాన సాధన మొదలు పెట్టవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మొదలు పెట్టవచ్చు. మనం స్టవ్ మీద బియ్యం పెట్టినప్పుడు, పూర్తిగా ఉడికి బియ్యం అన్నంగా మారేదాకా ఉంచాలి కదా ! మధ్య మధ్యలో పూర్తిగా ఉడకక ముందే దించేస్తూ ఉంటే అన్నం ఎప్పటికీ తయారు కాదు. ఇదే విధంగా మనం "సాఫల్యం" పొందే వరకు ధ్యాన సాధన కొనసాగిస్తూనే ఉండాలి. మధ్య మధ్యలో ఆటంకాలు వచ్చి సాధన ఆగిపోతూ ఉంటుంది. ఫర్వాలేదు పట్టుదలతో చేస్తుంటే, ఎప్పుడో ఒకప్పుడు ట్రాక్‌లోకి వస్తారు.

❖ ❖ ❖

18 ప్రశ్న : ధ్యాన సాధన అర్ధాంతరంగా ఆపివేస్తే ఏం జరుగుతుంది ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఏమీ జరగదు !

❖ ❖ ❖

19 ప్రశ్న : మధ్య మధ్యలో ఆపి మొదలు పెడుతూ, మళ్ళీ ఆపివేస్తూ, మళ్ళీ మొదలు పెడుతూ... ఈ విధంగా చేస్తే ఏమైనా అవుతుందా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఏమీ కాదు !

❖ ❖ ❖

20 ప్రశ్న : ధ్యాన సాధన కోసం పులి చర్మం, జింక చర్మం, ప్రత్యేకమైన రంగు వస్త్రాలు ఇలాంటివి ఏమైనా అవసరమా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : అస్సలు అవసరం లేదు. వాటికీ ధ్యానానికి ఏ సంబంధమూ లేదు !

❖ ❖ ❖

21 ప్రశ్న : ధ్యాన సాధన చేసే వారు బొట్లు, నామాలు, పూసల దండలు, రంగు రాళ్ళ ఉంగరాలు, రుద్రాక్షలు, తాయెత్తులు మొదలైనవి ఏమైనా ధరించాలా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : అవసరం లేదు గాక లేనే లేదు. ఒక వేళ మీకు ఇష్టమైతే మీరు డెకరేషన్ చేసుకోవచ్చు ! అంతే కానీ వాటికి ధ్యానం ద్వారా కలిగే అభివృద్ధికి ఎలాంటి సంబంధమూ లేదు.

22 ప్రశ్న : ఏ మతం వారైనా, ఏ కులం వారైనా ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ధ్యానం విశ్వ జనీనమైనది, సార్వ జనీనమైనది. జాతి, మత, కుల, లింగ భేదం లేకుండా ఎవరైనా ధ్యానం చేయవచ్చు. స్త్రీలు, పురుషులు, చిన్న వాళ్ళు, వృద్ధులు అందరు, అందరూ... ధ్యానం చేయవచ్చు.

❖ ❖ ❖

23 ప్రశ్న : చర్చీలకు, మసీదులకు వెళ్ళే వారు ధ్యాన సాధన చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు !

❖ ❖ ❖

24 ప్రశ్న : ధ్యానం గురించి ఇతరులకు చెప్పవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చెప్పాలి ! పంచబడింది పెంచబడుతుంది ! మీరు ఇతరులకు చెప్తే మీకు ఎంతో శ్రేయస్కరం కలుగుతుంది ! ధ్యాన ప్రచారం వల్లనే మీరు అత్యంత త్వరగా బాగు పడతారు. ధ్యానం చేయడం కన్నా ధ్యాన ప్రచారం చేయడం చేత ఎక్కువ లాభాలను పొందవచ్చు. సత్య ప్రచారం యొక్క ఆవశ్యకతల గురించి, దాని యొక్క మహిమ గురించీ ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే వివరించాను ఒక సారి చదవండి.

❖ ❖ ❖

25 ప్రశ్న : ధ్యాన గురువులం కావాలంటే ఏం చేయాలి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ముందు ధ్యాన శిష్యులుగా మారాలి !

❖ ❖ ❖

26 ప్రశ్న : మా ఇంట్లో వాళ్ళు ఒప్పుకోవటం లేదు, మా ఆయన ఒప్పుకోవటం లేదు, మా ఆవిడ ఒప్పుకోవటం లేదు, మా బంధు మిత్రులు వద్దంటున్నారు కానీ నాకు ధ్యాన సాధన చేయాలని ఉంది. ఎలా ? (చాలా చాలా మంది అడిగారు)

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మీకు నిజంగా చేయాలని ఉంటే అసలు ఈ ప్రశ్నయే పుట్టదు. సగం - సగం అనిపించినపుడే ఇలాంటి ప్రశ్నలు పుడతాయి. మీ గుండెల మీద చేయి వేసుకుని నిజాయితిగా చెప్పండి ! మీరు చేసే ఇతర పనులన్నింటికి అందరి అనుమతి తీసుకుంటున్నారా ? మీరు చేసే ప్రతీ పని అందరికి నచ్చేలా చేస్తున్నారా ? కొన్ని పనులు మఫ్టీలో

ఉంటాయి కదా ! అవి కూడా అందరికి చెప్పి, వారిని ఒప్పించి మరీ ఆ మఫ్టీ కార్యక్రమాలు చేస్తున్నారా !? నిజంగా, 100% మీరు చేయాలనుకుంటే, మీరు చేయగలుగుతారు. ముందు మీరు పూర్తిగా సమాధాన పడాలి. మీకు మీరు సమాధానం చెప్పుకోగలిగినప్పుడు, ప్రపంచానికంతా సమాధానం చెప్పగలుగుతారు. అయినా మీరు చేసేది ఏమైనా దొంగతనమా ? దోపిడా ? హత్యనా ? ఏమిటి మీరు చేయాలనుకునేది ? సర్వ శ్రేయస్కరమైన ధ్యానమే కదా ! మనసుంటే మార్గముంటుంది. మనస్సే మార్గం !

❖ ❖ ❖

27 ప్రశ్న : ఏం ధ్యానమో ఏమో ? అంతా విచిత్రంగా ఉంది ! ఏం చేయాలో అర్థం కావటం లేదు, ఏం చేయాలి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఒకానొక విశ్వ సూత్రం ఇలా చెప్తుంది....

"ఒక విషయం అనవసరం అయినప్పుడు అర్థం కాదు,

అవసరం అయినప్పుడు ఆ విషయం అర్థమై తీరుతుంది" !

- రిచర్డ్ బాక్

కాబట్టి, ప్రస్తుతం మీకు అవసరంగా లేనట్టుంది, అందుకే ధ్యానం విచిత్రంగా, అర్థం కాకుండా ఉంది మీకు, ఫర్వాలేదు ! మీకు అవసరం అయినప్పుడు అదే అర్థం అవుతుందిలెండి ! అప్పటి వరకు మీకు ఏం చేయాలనిపిస్తే అది చేయండి.

❖ ❖ ❖

28 ప్రశ్న : ఇప్పుడు మేం చాలా బిజీగా ఉన్నాం. రిటైర్ అయిన తర్వాత ఖాళీగా ఉంటాం కదా, అప్పుడు ధ్యానం చేసుకోవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఎప్పుడైనా చేసుకోవచ్చు. అది మీ ఇష్టం. ఈ జన్మ కాకపోతే వచ్చే జన్మలలో ఎప్పుడైనా మొదలు పెట్టవచ్చు. ఇంతకంటే ఏం చెప్పగలను ?

❖ ❖ ❖

29 ప్రశ్న : ఒక చక్కని వ్యక్తిగా ఉండాలంటే ఏం చేయాలి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : గురు మార్గదర్శకత్వంలో మతరహితమైన అత్యున్నతమైన ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసిస్తూ, క్రమం తప్పని ధ్యాన సాధన చేస్తూ ... గురువు పట్ల నిజాయితీగా, నిబద్ధతతో, అజేయమైన విశ్వాసంతో ఉంటే ఆటొమెటిక్‌గా చక్కని వ్యక్తిగా తయారవుతాడు. గురువు కేవలం డైరెక్షన్ చేస్తాడు, ఆ సూచనలను బట్టి సాధకుడు తనను తాను తీర్చిదిద్దుకోవాలి. మాయలు, మంత్రాలతో చేయడం ఉండదు ! తనను తాను నిర్మించుకోవాలి !

❖ ❖ ❖

30 ప్రశ్న : గుండె నొప్పి ఉన్న వాళ్ళు, B.P., షుగర్ ఉన్న వాళ్ళు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : అసలు వాళ్ళే కదండీ ధ్యానం చేయాల్సింది, నిజానికి మహా ఆధ్యాత్మిక మహాత్ములు బి.పి. & షుగర్ అనేవి నిజానికి లేవు, వాటిని కేవలం కొందరు స్వార్థపరులు సృష్టించారు. డబ్బుల కోసం జనాలను మాయ చేస్తున్నారు అని అంటారు. ధ్యానం వలన అనారోగ్యాలు తొలగి పోతాయని ప్రచీన కాలం నుండీ నేటి వరకు ఋజువు అవుతూనే ఉంది కదా !

❖ ❖ ❖

31 ప్రశ్న : ఇంకొకరి బదులు నేను ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు. అయితే ఇతరులు చేయలేని పరిస్థితిలో ఉన్నప్పుడు మాత్రమే చేయాలి. ఎందుకంటే "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి" అనేది ఒక ముఖ్యమైన విశ్వ సూత్రం. కాబట్టి ప్రత్యేక పరిస్థితులలో తప్ప అలా చేయకూడదు.

❖ ❖ ❖

32 ప్రశ్న : ధ్యానం చేసే వాళ్ళ వయస్సు తగ్గి, యవ్వనంగా కనబడతారట నిజమేనా ?!

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నిజమే.

❖ ❖ ❖

33 ప్రశ్న : ధ్యానం చేసే వాళ్ళ ఆయుష్షు పెరుగుతుందట నిజమేనా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నిజమే. ఈ విషయాన్ని శ్రీకృష్ణ

పరమాత్ముడే ఈ విధంగా చెప్పాడు. ఆయుష్షు ఏమిటి ? భౌతిక అమరత్వమే పొందవచ్చు. చిరంజీవిగా మారవచ్చు.

శ్లో ॥ గచ్ఛన్తిష్ఠన్యధాకాలం వాయుస్వీకరణంపరం ।

సర్వకాలం ప్రయోగేన సహస్రాయుర్భవేన్నరః ॥

- ఉత్తర గీత - 1 : 13

అర్థం : నడుస్తున్నా, తిరుగుతున్నా, నిలుచున్నా, పగలైనా, రాత్రైనా అన్ని కాలాలలో నియమం చేతగాని, అనియమం చేతగానీ, అధికంగా వాయుధారణము అంటే ధ్యానం చేయు మానవుడు వేయి సంవత్సరాల ఆయుర్దాయము కలవాడు అవుతాడు అని అర్థం.

ప్రస్తుతం ఇప్పుడు భూమి మీద వందల, వేల సంవత్సరాలుగా ఒకే భౌతిక శరీరంలో ఉంటున్న వాళ్ళు ఎందరో ఉన్నారు. విశేషమైన ఆత్మ విజ్ఞాన అభ్యాసం మరియు ధ్యాన సాధన చేస్తూ ఉంటే, ఇలాంటి విషయాలు తెలుస్తాయి. అంతే కానీ ఊరికే పొద్దు పోని కుతూహలంతో అడిగితే ఇలాంటి విషయాలు ఎవరూ చెప్పరు. చెప్పినా అర్థం కావు. ఈ విషయం అయినా అర్థమైందా ?

❖ ❖ ❖

34 ప్రశ్న : ధ్యానం చేస్తే పూర్వ జన్మలు కనబడతాయట నిజమేనా ?!

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : కనబడతాయి.

❖ ❖ ❖

35 ప్రశ్న : ధ్యానం ద్వారా దేవుళ్ళతో మాట్లాడవచ్చు అని అంటారు, నిజమేనా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మాట్లాడవచ్చు.

❖ ❖ ❖

36 ప్రశ్న : ధ్యానంలో ఎన్నో హీలింగ్స్, ఆపరేషన్స్ జరుగుతాయట, నిజమేనా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : అవును, జరుగుతాయి.

❖ ❖ ❖

37 ప్రశ్న : ధ్యానంలో వేరే లోకాలు చూడవచ్చా ? ధ్యానంలో వేరే లోకాలకు వెళ్ళి రావచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చూడవచ్చు. సూక్ష్మ శరీరం (Astral Body) తో వేరే లోకాలకు వెళ్ళి రావచ్చు.

❖ ❖ ❖

38 ప్రశ్న : పుట్టటం, చావటం మధ్యలో నేర్చుకోవటాలు, ఎన్నో జన్మలు చివరిగా మోక్షం ఇదంతా అవసరమా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చాలా గొప్ప ప్రశ్న. ఇలాంటి గొప్ప ప్రశ్నకు స్వయంగా మీరే నడుం బిగించి, పరిశోధన చేసి జవాబు తెలుసుకుంటే బాగుంటుంది. అది అందరికీ తెలిపితే ఇంకా బాగుంటుంది.

❖ ❖ ❖

39 ప్రశ్న : ఒక్కోసారి అన్నీ నిజమే అనిపిస్తుంది. మళ్ళీ వెంటనే ఇదంతా నిజమేనా అనిపిస్తుంది ఏం చేయాలి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మీకు ఏం చేయాలని అనిపిస్తే అది చేయండి. ఒక వేళ నిజం అనేది ఉంటే అది నిలకడ మీద తేలుతుంది కదా !

❖ ❖ ❖

40 ప్రశ్న : నేరస్తులు, జైళ్ళలో ఉన్న వాళ్ళు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నిజానికి ధ్యానం అందరి కంటే వీళ్ళకే అత్యవసరం. వీరు ధ్యానం చేయడం ద్వారా సమూలంగా పరివర్తన చెందుతారు. వీళ్ళ చేత ధ్యానం చేయించాలి. జైళ్ళు అంటే "పరివర్తనా శాలలు". మరి పరివర్తన అనేది ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ధ్యాన సాధన ద్వారా మాత్రమే సాధ్యం. నిజానికి జైళ్ళలో ఉన్న వారికి ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ధ్యాన సాధన అందరి కంటే అత్యంత అవశ్యకం ! తప్పని సరి !

❖ ❖ ❖

41 ప్రశ్న : ఈ ప్రపంచాన్ని మార్చలేమా, ధ్యానం ద్వారా ఇది సాధ్యమేనా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ముందు మనం మారాలి. మనతో కూడి ఉన్నదే ప్రపంచం. మనం ఒక్కొక్కరం మారుతూ ఉంటే ప్రపంచం ఆటొమెటిక్‌గా మారిపోతుంది.

ధ్యానం అంటేనే మార్పు(పరివర్తన). మార్పు అంటే అభివృద్ధి. ముందు మనల్ని మనం మార్చుకుని ఇతరులకు ప్రేరణనివ్వాలి. ఈ విధంగా అందరూ చేస్తే అందరూ మారుతారు. ఈ పరివర్తన అనేది కేవలం ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ధ్యానం ద్వారా మాత్రమే సాధ్యం !

❖ ❖ ❖

42 ప్రశ్న : ధ్యానం ద్వారా "పేదవాడికి రొట్టె" దొరుకుతుందా ? ఉపాధి లేని వారికి ఉపాధి దొరుకుతుందా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : విప్లవ పుస్తకాలు బాగా చదువుతారేమో, విప్లవ సినిమాలు బాగా చూస్తారేమో.. అందుకే ఇలాంటి ప్రశ్న వేసారు. అంతరిక్ష శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తూ చంద్రుడి మీద అడుగు పెట్టారు. వాళ్ళను వెళ్ళి ఈ ప్రశ్న అడగండి. చంద్రుని మీద మనిషి అడుగు పెడితే బడుగు వర్గాలకు ఒరిగేది ఏమిటి ?అని ! ఇలాంటి ప్రశ్నలు వేయడం ఒక ఫ్యాషన్ అయిపోయింది. మీ జీవితంలో మీరు ఇప్పటి వరకు పేదల కోసం ఎంత శ్రమించారు ? ఏమేం చేసారు ? ప్రశ్నించడం కాదు. చేతలలో చేయాలి. ఇది అతి తెలివి ప్రశ్న. ఆత్మ విజ్ఞానం + ధ్యానం ద్వారా మనుషుల్లో ఉన్న స్వార్థం మటుమాయం అయిపోతుంది. అప్పుడు ప్రతి ఒక్కరు ఇంకొకరిని ఆదుకుంటారు. ప్రపంచంలోని పేదరికానికి కారణం మనుషుల్లోని స్వార్థమే, దురాశయే ! కొంత మంది తమ అవసరాలకు మించి ఎన్నో రెట్లుగా ధనాన్ని, ఆస్తులను కలిగి ఉన్నారు. పక్క వాడికి పైసా విదల్చని స్వార్థంతో, దురాశతో బతుకుతూ ఉంటారు. ఇలాంటి వారికి ఆత్మ విజ్ఞానం + ధ్యానం నేర్పిస్తే వీళ్ళు మళ్ళీ మనుషులుగా తయారవుతారు. ఈ విధంగా మానవత్వంతో కూడిన వారై అందరూ అందరిని ఆదుకుంటారు. మీరు ఈవిధంగా ప్రశ్నించడం మానేసి పేదలకు ఏదైనా చేయండి. వారి కోసం మీ జీవితాన్ని అంకితం చేసుకోండి. పేదల ఆశాజ్యోతిగా మారండి. బడుగు వర్గాలకు బలంగా మారండి. మీ ఆస్తులన్నీ పేదలకు పంచండి.

❖ ❖ ❖

43 ప్రశ్న : శారీరక వికలాంగులు, మానసిక వికలాంగులు, రోగులు, గుడ్డి వాళ్ళు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు. చేయాలి. వీళ్ళు ధ్యానం చేస్తే ఎంతెంతో లాభం జరుగుతుంది. వీరికి ధ్యానం చెప్పిన వారికి, వారి చేత ధ్యానం చేయించిన వారికి అనూహ్యమైన శ్రేయస్కరాలు సంభవిస్తాయి.

❖ ❖ ❖

44 ప్రశ్న : గృహిణులు, ఉద్యోగం చేసే మహిళలు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, వృత్తి చేసుకునేవారు, కళాకారులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు, కాలేజ్ విద్యార్థులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు, సైంటిస్ట్‌లు, ఫీల్డ్ పైన ఉండే వారు, సైనికులు, పోలీసులు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు. క్రమం తప్పని సాధన చేస్తూ ఉంటే ఎవరెవరు ఏ ఏ రంగాలలో ఉన్నారో వారు, వారు ఆయా రంగాలలో అద్భుతమైన ప్రగతిని

సాధిస్తారు.

❖ ❖ ❖

45 ప్రశ్న : ఆత్మ విజ్ఞాన అభ్యాసం మరియు ధ్యాన సాధన చేస్తున్నాం. చాలా బాగుంది. ఇది ఎంతో మహత్వ పూర్ణమైనది. ఇది మాకు ఎంతగానో ఉపయోగపడింది. మా యొక్క ఎన్నెన్నో సమస్యలు పరిష్కారం అయ్యాయి. మేమైతే మా సాధన క్రమం తప్పకుండా చేస్తున్నాము. మేము చాలా ఆనందంగా ఉన్నాము. ఇతరులకు మేము చెప్పవచ్చా ? ఇంకా మేము ఇప్పుడేం చేయాలి ?- చాలా, చాలా, చాలా మంది అడిగారు.

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మీరు బాగు పడ్డారు, ఆనందంగా ఉన్నారు కదా ! దేని ద్వారా బాగు పడ్డారో దానిని అందరికీ పంచండి. "పంచబడింది పెంచబడుతుంది". సత్య ప్రచారం బాగా, విస్తారంగా చేయండి. ఇతరుల చేత విశేషంగా సత్య ప్రచారం చేయించండి. అప్పుడు మీకు ఇంకా, ఇంకా ఎంతో లాభం జరుగుతుంది. సత్య ప్రచారం గురించి ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే వివరించాను ఒక సారి చదవండి. ---మీరు జ్ఞానోదయం పొందితే సత్య ప్రచారం చేయవచ్చు. లేకపోతే ఎవరైనా గరువులు చేస్తూ ఉంటే వారికి అసిస్టెంట్లుగా పని చేయండి, అంతే కానీ జ్ఞానోదయం కానిదే క్లాసులు చెప్పడాలు, బోధనలు మొదలైనవి అస్సలు చేయకూడదు.. సద్గురు స్థితి పొందనిదే బోధన చేస్తే నరకం గ్యారంటి.. *జాగ్రత్త !*

సత్య ప్రచారమంటే - ఒక సత్యగురువుకు కేవలం అసిస్టెంట్లుగా ఉండాలి, ఆయన ఏం చెప్తే అది చేయాలి. అంతే క్లాసులు చెప్పకూడదు. సందుకొకటి, గొందుకొకటి ధ్యాన కేంద్రం తెరవ కూడదు.

❖ ❖ ❖

46 ప్రశ్న : వాస్తు దోషాలు, జాతక దోషాలు, కుజ దోషాలు, గ్రహ దోషాలు ఉంటాయా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఉండవు. అవేవీ లేవు. అన్ని దోషాలకు మూల దోషం అజ్ఞానమే. ఆత్మ విజ్ఞానం లేక పోవడమే అసలు సిసలు దోషం. ఈ దోషం ఉన్నప్పుడు ఏ దోషాలైనా వర్తిస్తాయి. జీవితాన్ని అష్ట కష్టాల పాలు చేస్తాయి. అజ్ఞాన దోషం లేనప్పుడు, ఆత్మ విజ్ఞానంతో విరాజిల్లుతున్నప్పుడు ఆ దివ్య ప్రభావంతో సర్వ - సర్వ, సకల - సకల, సమస్త దోషాలు తక్షణమే, సంపూర్ణంగా, శాశ్వతంగా అంతరించిపోతాయి.

❖ ❖ ❖

47 ప్రశ్న : చనిపోయిన మా పెద్దలకు కర్మ కాండలు చేయడం మర్చిపోయాను, నాకేమైనా జరుగుతుందా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఏమీ జరగదు. చనిపోయిన వారు సూక్ష్మ లోకాలలో ఉంటారు. వారి కర్మలను బట్టి తగిన గర్భం, తగిన సమయం రాగానే మళ్ళీ జన్మిస్తారు. వారికి మీరు చేసే కర్మ కాండల వలన ఏమీ ప్రయోజనం జరగదు. వారి పేరు మీద ఏవైనా సత్కార్యాలు చేస్తే, చేస్తున్న మీకు సత్కర్మల ఫలితం దక్కుతుంది కానీ వారికేమి జరగదు, ఒరగదు !

ఏం చేసినా భౌతిక దేహం ఉన్నంత వరకే చేయాలి, మరణించక ముందే ఏం చేసినా ! మరణించిన తర్వాత ఎవరి దారి వారిదే ! అందుకే మాస్టర్స్ నెత్తి నోరు కొట్టుకుని చెప్తుంటారు. ఏ క్షణంలో మరణిస్తారో తెలియదు కాబట్టి త్వరపడండి సత్కార్యాలు చేయండి, ఆత్మ విజ్ఞానం సంపాదించుకోండి, ధ్యానం చేసి జన్మ రాహిత్య పదవిని పొందండి అని !

కాబట్టి మిత్రమా ! దేహంతో ఉన్నంత వరకే ఏదైనా ! దేహాన్ని విడిచిన నీ పూర్వీకులు మీ వంశంలోనో లేక ఎక్కడో మళ్ళీ పుడతారు, తమ జీవితాన్ని జీవిస్తారు. మీరు ఏదో చేసి వారికి ఉత్తమ గతులను ప్రాప్తింపచేయాలని ప్రయత్నించడం అవివేకం, అజ్ఞానం ! ఎవరూ ఎవరికి ఏమీ చేయలేరు, ఎవరిని వారే ఉద్ధరించుకోవాలని భగవద్గీతలో శ్రీకృష్ణుడు తెలియజేసాడు కదా ! చదవలేదా ?

మరణించిన మీ పూర్వీకులు గుర్తుకొచ్చినప్పుడు వారి పట్ల ప్రేమను ప్రకటించు దీని వలన నీకు, ఎక్కడ ఉన్నా వారికీ శాంతి లభిస్తుంది. ఇదొక్కటే మరణించిన వారికి ఏమైనా చేయగలిగేదీ అంటే !

❖ ❖ ❖

48 ప్రశ్న : నదులలో, తీర్థాలలో స్నానం చేస్తే పుణ్యం వస్తుందా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం :

శ్లో ॥ నాస్తి ధ్యానసమం తీర్థం నాస్తి ధ్యానసమం తపః ।

నాస్తి ధ్యానసమో యజ్ఞస్తస్మాద్ధ్యానం సమాచరేత్ ॥

- శ్రీ గురు గీతా (పేజ్ నెం. 209), శ్రీ వ్యాసాశ్రమము, ఏర్పేడు.

వివరణ : ధ్యానంతో సమానమైన తీర్థము, తపము, యజ్ఞము లేదు, కాబట్టి అన్నింటికన్నా గొప్పదైన ధ్యాన సాధన మాత్రమే చేయవలెను. తీర్థాలనీ, యజ్ఞాలనీ, అవి ఇవీ అంటూ, అటూ ఇటూ తిరుగుతూ అనవసరంగా వృథా ప్రయాస పడకుండా ధ్యాన యోగ సాధన చేయాలి.

ఎన్ని వివరణలిచ్చినా, ఎన్ని ఆధారాలు చూపెట్టినా ధ్యానం వైపు కన్నెత్తి చూడరు కొంత మంది.

ఈ "సద్గురు తారా విశాల్ మార్గదర్శి"లోనే పుణ్యం గురించి వివరించాను ఒక సారి చదివి పుణ్యం అంటే ఏమిటో తెలుసుకో !

నీళ్ళలో స్నానం చేస్తే పుణ్యం వస్తే, మోక్షం వస్తే ఇన్ని సాధనలు ఎందుకు ? అసలు భగవద్గీత ఎందుకు ? శ్రీకృష్ణుడు చెప్పిన విజ్ఞానం ఎందుకు ? ఇన్ని రకాల సాధనలు ఎందుకు ? భగవద్గీతలో శ్రీకృష్ణుడు ధ్యానయోగం చేసి ధ్యాన యోగులు కండి అని చెప్పాడు. నదుల్లో, తీర్థాల్లో మునగమని చెప్పలేదు.

ధ్యానయోగం చేసి ఆత్మ విజ్ఞానాన్ని సంపాదించి ఆత్మ సాక్షాత్కారం పొందమని చెప్పాడు. సర్వ శాస్త్ర సారమైన, సకల వేద స్వరూపమైన, అత్యుత్తమమైన, అత్యున్నతమైన, పరమ పావనమైనదే కదా భగవద్గీత ! మరి అందులో శ్రీకృష్ణుడు ఏం చెప్పాడో అది చేయాలి కానీ, మీకు తోచినట్టు కాదు కదా ! నదుల్లో స్నానం చేస్తే, తీర్థాల్లో స్నానం చేస్తే ఒళ్ళు శుభ్రం అవుతుంది ఇంకా ఈత వచ్చినా రావచ్చు అంతే కాని పుణ్యం అనేది అణువంత కూడా రాదు.

❖ ❖ ❖

49 ప్రశ్న : కలియుగంలో సంకీర్తన వల్ల మోక్షం వస్తుందట నిజమేనా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఫ్రీగా సమాధానాలు చెప్తున్నాను కదా అని భలే ప్రశ్నలు అడుగుతున్నారు కదయ్యా ! అడిగే వాడికి చెప్పే వాడు లోకువ అంటే ఇదేనేమో ! విష్ణు పురాణంలో సంకీర్తన వల్ల మోక్షం వస్తుందనే విషయం ఉంది. కొన్ని పేజీల తర్వాత దైవత్వ సాధన చేసి పరమాత్మతో అభేదాన్ని పొందాలనే విషయం కూడా ఉంది. మరి, ఆ విషయం అడగటం లేదు ఎందుకు ? సంకీర్తన సులువుగా ఉంటుంది కాబట్టి సంకీర్తన బాగా ఫేమస్ అయింది. సంకీర్తన ప్రారంభం, సాధన అంతిమం. మొట్ట మొదట డైరెక్ట్‌గా సాధన గురించి చెబితే అర్థం కాదని ముందు సంకీర్తన, భజన, పూజలతో బోధన ప్రారంభం అవుతుంది. ముందు సహస్ర నామాలు చదవమని చెప్తారు. ఆ తర్వాత 108 నామాలు చదవమని చెప్తారు. ఆ తర్వాత 54 నామాలు చదవమని చెప్తారు. ఆ తర్వాత గాయత్రీ మంత్రం, ఆ తర్వాత 10 అక్షరాలలోపు నామాలను జపించమని చెప్తారు. ఆ తర్వాత ఏకాక్షరమైన "ఓంకారాన్ని" జపించమని చెప్తారు. ఆ తర్వాత ధ్యాన సాధన ప్రారంభం అవుతుంది. ఇలా క్రమక్రమంగా మనసులో ఏకాగ్రతను సృష్టించడానికే ఇవన్నీ ఉన్నాయి. అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు "తస్మాద్యోగీ భవార్జున" (6 - 46) అంటే అర్జునా యోగివి(ధ్యానివి) కా ! అని చెప్పాడు. యోగాన్ని(ధ్యానాన్ని) మించినది మరేదీ లేదు అని అదే శ్లోకంలో చెప్పాడు.

అసలు విషయాన్ని గ్రహించలేని నీలాంటి వాళ్ళు సంకీర్తనతో మోక్షం వస్తుందని పొరబడుతుంటారు. ఒక వేళ సంకీర్తనతోనే మోక్షం వస్తుందంటే పతంజలి యోగశాస్త్రం బూటకం అన్నమాటే కదా మీ దృష్టిలో ! భగవద్గీతలో, ఉత్తరగీతలో మోక్షం ఎలా పొందాలి అనే విషయాలను గురించి శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పిన విషయాలు కూడా అసత్యాలనే కదా మీ దృష్టిలో !

శ్రీకృష్ణ పరమాత్ముడు కురుక్షేత్రంలో చెప్పిన పూర్వ గీత(భగవద్గీత)లో కాని, కురుక్షేత్ర యుద్ధం అయిపోయి పాండవులు రాజ్యం చేస్తున్న కాలంలో చెప్పిన ఉత్తరగీతలో కాని ఆయన ఎక్కడా ఈ విషయం చెప్పలేదు. అక్కడక్కడా నన్ను పూజించమని, భజించమని చెప్పినా వాటి గూఢార్థం వేరే. ప్రధానంగా "యోగులు కండి" అని నొక్కి వక్కాణించాడు.

ధ్యాన యోగాన్ని చేయండి అని మాత్రమే చెప్పాడు. సాధన చేసి ఆత్మ విజ్ఞానాన్ని పొంది ఆత్మ సాక్షాత్కారం(మోక్షం) పొందమని చెప్పాడు.

పరమ గురువుల బోధనలు, ఎన్నో శాస్త్రాలు, ఎన్నో సత్యాలు ధ్యాన యోగమే ముక్తి మార్గం అని తెలియజేస్తున్నాయి కదా ! చదవాలి, అన్నీ చదివి తెలుసుకోవాలి. అది ఏ యుగమైనా ముక్తి మార్గం ఒక్కటే, అదే ధ్యానయోగం ! సంకీర్తన వలన మోక్షం రాదు. కేవలం రిలాక్స్ అవుతారు.

50 ప్రశ్న : చనిపోయాక ఏం జరుగుతుంది ? స్వర్గం - నరకం ఉంటాయా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మతాధికారులు చెప్పే స్వర్గ - నరకాలు ఉండవు. అవి లేవు. స్వర్గ - నరకాలు భూమి మీదే ఉంటాయి. స్వర్గ - నరకాలను రెండింటినీ భూమి మీదే అనుభవించాల్సి ఉంటుంది. ఈ విషయం విష్ణు పురాణంలో కూడా స్పష్ట పరుచబడింది.

మైత్రేయుడికి పరాశరుడు **విష్ణు పురాణం** బోధించే సమయంలో, ఒకానొక సందర్భంలో ఇలా చెప్తాడు.....

"మైత్రేయా ! లోచూపుతో ఆలోచించి చూస్తే ఈ స్వర్గమూ నరకమూ అన్నవి ఇహలోకంలోనే తప్ప వేరేలేవని అనిపిస్తుంది. హృదయము ఒక ఆనందానుభవానికి స్పందించడమే స్వర్గం. హృదయానికి దుఃఖం వాటిల్లడమే నరకం". (పేజ్ నం. 92)

- విష్ణు పురాణం - తెలుగు అనువాదం : శ్రీ ఏల్చూరి మురళీధరరావు,

ప్రకాశకులు : బాలసరస్వతీ బుక్‌డిపో వారి సౌజన్యంతో
సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : టాగూరు పబ్లిషింగ్ హౌస్,
ఫోన్ నం. 040 - 2756 8329 / 6636 8330.

మనిషి చచ్చిపోయిన తర్వాత, బ్రతికి ఉన్నప్పుడు ఆ మనిషి చేసిన పనులను బట్టి నరకానికో లేక స్వర్గానికో వెళ్ళడం అంటూ ఉండదు. ఒక మనిషి అతడెంత దుర్మార్గుడైనా, ఎంత మంచి వాడైనా భూమికి సంబంధించిన సూక్ష్మ లోకాలకే వెళ్తారు. ఈ సత్యం మీకు జీర్ణం కావట్లేదు కదా ! అలా ఎలా అవుతుంది ? తప్పు చేసిన వాడు తప్పని సరిగా శిక్ష అనుభవించి తరాల్సిందే కదా ! మంచి చేసిన వాడు, తప్పు చేసిన వాడు చచ్చాక ఇద్దరూ సూక్ష్మ లోకాలకే వెళితే, ఇక మంచితనానికి విలువ ఏముంది ? ఇలా రక రకాల ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి కదా !

భూమికి పైన లేక చుట్టూ ఏడు సూక్ష్మలోకాలు ఉంటాయి. వీటిని ఇంగ్లీష్‌లో Astral Worlds అని అంటారు. మనిషి చనిపోయిన తర్వాత అతడికి ఉన్న పరిణతిని బట్టి అతడు ఈ ఏడు లోకాల్లో ఏదో ఒక లోకానికి వెళతాడు సూక్ష్మ శరీరంతో ! మనిషి యొక్క భౌతిక శరీరాన్ని మరియు సూక్ష్మ శరీరాన్ని కలుపుతూ తెలుపు రంగులో మెరిసే ఒక తీగ ఉంటుంది, ఎలాగైతే పుట్టినపుడు తల్లికి బిడ్డకు మధ్య పేగు ఎలా ఉంటుందో అలా. దీనిని "సిల్వర్ కార్డ్" అని అంటారు. దీనిని ఏ పేరుతోనైనా పిలుచుకోవచ్చు అది వేరే విషయం. ఈ సిల్వర్ కార్డ్ బంధం తెగిపోవడమే మరణం. ఈ విధంగా భౌతిక దేహాన్ని విడిచి ఆ వ్యక్తి తన సూక్ష్మ శరీరంతో ఏదో ఒక సూక్ష్మ లోకానికి చేరుకుంటాడు. అక్కడికి చేరుకోగానే ఆ వ్యక్తికి ప్రప్రథమంగా తను ఏ జన్మనైతే పూర్తి చేసుకుని వచ్చాడో ఆ జన్మను అతని ముందు ఒక సినిమా లాగా ప్రదర్శిస్తారు అక్కడి సూక్ష్మలోక మాస్టర్స్. అది ఎంత క్లియర్‌గా ఉంటుందీ అని అంటే జీవితంలోని ఏ చిన్న అంశం కూడా తప్పి పోకుండా ప్రతీది, అత్యంత స్పష్టమైన కోణాలలో చూపించబడుతుంది.

అక్కడ, అప్పుడు అతనికి సరి అయిన స్మృతి ఇవ్వబడుతుంది. తను చేసిన తప్పులు, ఒప్పులు ఎవ్వరూ వివరించి చెప్పాల్సిన అవసరం ఉండదు. అతనికి అత్యంత స్పష్టంగా అన్ని విషయాలు అర్థం అవుతూ ఉంటాయి. తను చేసిన తప్పులు క్రిస్టల్ క్లియర్‌గా అతనికి కనబడుతున్నప్పుడు ఆ వ్యక్తి పడే బాధ వర్ణణాతీతం ! ఇదే మొదటి నరకం !

ఈ విధంగా తన జన్మను పూర్తిగా చూసిన తర్వాత ఆ వ్యక్తికి కావాల్సినంత సమయాన్నిస్తారు అక్కడి మాస్టర్స్. తను చేసిన తప్పుల గురించి ఆలోచిస్తూ, వాటిని సరి చేసుకోవడం ఎలా ? అనే విషయాన్ని పూర్తిగా ఆ వ్యక్తికే వదిలేస్తారు. తను చేసిన తప్పులను ఎలా ? ఎప్పుడు ? ఎక్కడ ? సరిదిద్దుకోవాలి అనే అంశాలను ఆ వ్యక్తి ఆలోచించి నిర్ణయాలు తీసుకునే వరకు సూక్ష్మ లోకాలలోనే ఉంటాడు. అది ఎంత సమయమైనా సరే ! అసలు అక్కడ సమయం అనేది ఉండదు. భూమిపైనున్న సమయంతో పోలిస్తే కొన్ని నెలలు, కొన్ని సంవత్సరాలు, కొన్ని వందల సంవత్సరాలు, కొన్ని వేల

సంవత్సరాలు ఇలా ఎంత సమయమైనా ఆ వ్యక్తి అక్కడ ఉండవచ్చు. కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే మళ్ళీ జన్మించిన వ్యక్తులు నాకు తెలుసు. ఒక వ్యక్తి 35 వేల సంవత్సరాల్లో కేవలం ఏడు సార్లు మాత్రమే జన్మ తీసుకున్నాడని తన అనుభవాన్ని ఒక పుస్తకంలో వ్రాయగా చదివాను. సూక్ష్మ లోకాలలో శిక్షలు, బాధలు, ఇబ్బందులు ఏవీ ఉండవు. హాయిగా ఉండవచ్చు. ఎవరూ ఏమీ అనరు. ఇలా ఆ వ్యక్తి ఆ సూక్ష్మ లోకాలలో తగినంత విశ్రాంతి తీసుకుని మళ్ళీ జన్మించడానికి సమాయత్తమౌతాడు. అప్పుడు అక్కడ ఉన్న సూక్ష్మలోక మాస్టర్స్‌ను సంప్రదించి ఏ దేశంలో, ఏ మతంలో, ఏ కులంలో, ఏ కుటుంబంలో, కుటుంబంలో ఎన్నోవాడిగా, స్త్రీగానా లేక పురుషుడిగానా, శరీరం రూపు, రంగు, ఎత్తు, శరీరంలో ఏదైనా అంగ వైకల్యమా లేదా ఏవైనా రోగాలతోనా ఇలా తనను తాను సరిదిద్దుకునేందుకు అవసరమైన వాటిని పెట్టుకుని ఎంత కాలం ఆ జన్మలో ఉండాలో ఆయుష్షును కూడా నిర్ణయించుకుని తగిన గర్భం దొరకగానే జన్మిస్తాడు.

ఈ విధంగా జన్మించడమే రెండవ నరకం. అసలు నరకం. తన దుర్గుణాల పర్యవసానాన్ని తనే అనుభవిస్తూ ఉంటాడు, ఇదే నరకం అంటే. ఎవరికి వారే తమ అజ్ఞానం చేత శిక్షలు విధించుకుని ఈ భూమి పైనే వాటిని అనుభవిస్తూ ఉంటారు. ఇదే నరకం అంటే !

సరిగ్గా సూటిగా చెప్పాలంటే.....

మీ దుర్గుణాలను అనుభవించడమే నరకం !

మీ సద్గుణాలను అనుభవించడమే స్వర్గం !

స్వర్గ - నరకాలను రెండింటినీ భూమి మీదే అనుభవించాల్సి ఉంటుంది. ఆత్మ విజ్ఞానం లేక పోవడమే దుర్గుణం. ఆత్మ విజ్ఞానం ద్వారా మాత్రమే సద్గుణాలు అలవడతాయి. చనిపోయిన తర్వాత మనిషి సూక్ష్మ లోకాలలో కేవలం విశ్రాంతి తీసుకుంటాడు. భూమి మీద పుట్టిన ఏ మనిషికైనా ఇలాగే జరుగుతుంది. ఈ విషయాలను వివరంగా తెలుసుకోవాలనుకునే వారు రాంపా మాస్టర్ గారి "You Forever" ! Peter Richelieu గారి A SOUL'S JOURNEY అనే పుస్తకాలు చదవాలి.

❖ ❖ ❖

51 **ప్రశ్న :** ఈ పత్రిక చింప కూడదు, దీనిని వెయ్యి కాపీలు ప్రింట్ చేయించి పంచండి అని కొన్ని పాంప్లెట్స్ వస్తుంటాయి. వీటి గురించి చెప్పండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మనకు న్యూస్ పేపర్లలోనూ, లేదా ఏదో విధంగా కొన్ని రకాల పాంప్లెట్స్ వస్తాయి. దానిలో ఈ విధంగా ఉంటుంది :

"ఈ పత్రికను చింపవద్దు, చదివి వేరే వారికివ్వాలి లేదా మీకు వీలైనన్ని కాపీలు ముద్రించి పంచాలి. ఫలానా ఆయనకు ఫలానా దేవత లేక దేవుడు కనిపించి చెప్పాడు. ఆయన రెండువేల కాపీలు పంచాడు ఆయనకు కోటి రూపాయల లాటరి తగిలింది. ఇదే పత్రికను వేరొకాయన చింపేశాడు, ఆయన కుటుంబంలోని వారు చనిపోయారు..." అని ఏవేవో పనికి మాలిన విషయాలతో ఉంటాయి.

ఇది శుద్ధ అబద్ధం. పూర్తి స్థాయి అజ్ఞానపు చర్య. ఈ పత్రికలలోని విషయాలకు కొంత మంది అమాయకులు భయపడి ఇలా చేస్తూ ఉంటారు. ఇది ఎవరు, ఎప్పుడు ఎలా మొదలు పెట్టారో తెలియదు కానీ, ఇలాంటి పత్రికలు చాలా మందిని భయపెడుతూ ఉంటాయి.

భయపడ వద్దు. ఏమీ జరగదు. పత్రికలు ముద్రించి పంచితే లాభం జరుగుతుంది, అయితే అందులో మంచి విషయాలు ఉండాలి. పనికి మాలిన విషయాలు ఉన్న పత్రిక పంచితే మంచి కాదు, చెడు జరుగుతుంది.

"మనం ఏం చేస్తే అదే మనకు జరుగుతుంది" - ఇది విశ్వ సూత్రం. పనికి రాని విషయాలను ముద్రించి వాటిని పంచి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే వారికి చెడు మాత్రమే జరుగుతుంది. అసలు ఆ పత్రికలను ఒక సారి చదవండి, అందులో ఏ వివరాలు ఉండవు, పేర్లు ఉండవు, అడ్రస్ ఉండదు, పూర్తిగా మూఢమైన విషయాలు ఉంటాయి. ఒక్కటి కూడా పనికి వచ్చే విషయం ఉండదు. మూఢ నమ్మకాలు తప్ప అందులో ఏవీ ఉండవు. దీని వల్ల ఎవరికీ లాభం ఉండదు. అనవసరమైన శ్రమ, డబ్బు వృథా ! సరైన ఆత్మ విజ్ఞానం లేక పోవడం వలన ఇలా జరుగుతుంది.

కంగారు పడాల్సిన పని లేదు. భయపడాల్సిన అవసరం లేదు. ఒక వేళ మీరు ఇలాంటి పత్రికలు చదివి భయపడి పంచి ఉంటే ఇక మీదట అలా చేయకండి, లేదా మీరు ఇలాంటి పత్రికను చదివి భయపడి ముద్రించి పంచాలనే ఆలోచనలో ఉంటే వెంటనే విరమించుకోండి. ఏమీ జరగదు.

ఇలాంటి పత్రికలు మీ చేతికి వచ్చినపుడు వాటితో పిల్లలకు విమానాలు, ఇతర ఆడుకునే వస్తువులుగా మార్చి ఇవ్వండి. ఇప్పుడు ఎలాగు వర్షాకాలమే కాబట్టి కాగితపు పడవలు చేసిస్తే పిల్లలు నీళ్ళలో ఆడుకుంటారు. లేదా మీ ఇంట్లో చెత్తను ఊడ్చి ఇలాంటి పత్రికలో వేసి చెత్త కుండిలో వేస్తే సరి - రెండు రకాల చెత్తలను శుభ్రం చేసినట్టవుతుంది. **భయ పడకండి ఏమీ జరగదు !** ఈ

మధ్య ఈ రకమైన smsలు కూడా మొదలయ్యాయి. వీటిని స్పాట్‌లో డిలీట్ చేసిపారేయండి. ఏమీ కాదు.

All The Very Best !!

❖ ❖ ❖

52 ప్రశ్న :

a) మీరు దైవాన్ని చూశారా సార్ ?

b) దైవాన్ని మాకు కూడా చూపిస్తారా ?

c) దేవుడు ఉన్నాడని అనుకుంటున్నాను, మీరు ఏమంటారు ?

d) దేవుడు లేడని అనుకుంటున్నాను, మీరు ఏమంటారు ?

(చాలా మంది అడిగారు)

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : a) నేనే దైవం అని తెలుసుకున్నాను. అందరూ దైవాలేనని, అంతా దైవమేనని తెలుసుకున్నాను. నన్ను ఈ ప్రశ్న అడిగే మీరు కూడా దైవాలేనని నాకు తెలుసు.

b) దైవం అంటే సినిమా కాదు చూపించడానికి. ఎవరూ, ఎవరికీ చూపించలేరు దైవాన్ని ! ఎవరికి వారే తెలుసుకోవాలి. దైవాన్ని ఎలా తెలుసుకోవాలి అనే విషయాలను తెలియజేయగలుగుతాం. అంతే ! ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని ఓ సారి చదవండి, అర్థం చేసుకోండి. దైవం అంటే చూసే వస్తువు కాదు. దైవం అంటే అంతటా ప్రకటం అవుతూ ఉన్న "ఉనికి - Existence" ! దైవాన్ని కేవలం అనుభూతి ద్వారా, అనుభవించడం ద్వారా మాత్రమే తెలుసుకోగలుగుతాం. దైవాన్ని అనుభవం ద్వారా తెలుసుకునే విద్యనే, విధానాన్నే, పద్ధతినే "ధ్యానం" అని అంటారు.

దైవం చూసే వస్తువైతే ఈ పాటికి సినిమా హాళ్ళలో "దైవం అనే సినిమా" హౌస్ ఫుల్ కలెక్షన్‌లతో నడుస్తూ ఉండేది. ఆ సినిమాను చూస్తూ అందరూ హాయిగా మోక్షాన్ని పొందుతూ ఉండే వాళ్ళు !

c) దేవుడు ఉన్నాడని మీరు అనుకుంటున్నారు. సరే ! ఇంతకూ "దైవం" అని అంటే మీ దృష్టిలో

ఉన్న అర్థం ఏమిటో ? "దైవం" అంటే మీ యొక్క నిర్వచనం ఏమిటో ? ఈ విషయాలు నాకు స్పష్టంగా తెలియనిదే సమాధానం ఎలా ఇవ్వగలుగుతాను ? ఒక్కొక్కరి దృష్టిలో దైవం అనే పదానికి ఒక్కో రకమైన నిర్వచనాలు ఉంటాయి. అసలు సిసలు అర్థం వాస్తవానికి ఒక్కటే ఉంటుంది.

దైవం ఉన్నాడని కేవలం అనుకుంటున్నారు అంతే ! పరిశోధించి అనుభవపూర్వకంగా తెలుసుకున్నారా ? పుస్తకాల్లో చదివి, ఆధ్యాత్మిక ప్రవచనాలు విని దైవం ఉన్నాడని గుడ్డిగా నమ్ముతున్నారా ? మీకు స్వానుభవం లేనిదే దైవం ఉన్నాడు అని అనుకుంటే సరి పోతుందా ? స్వయంగా అనుభవం పొందాల్సిన అవసరం లేదా ?

మీకు నిజంగా దైవాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలని ఉంటే ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని బాగా చదివి అర్థం చేసుకోండి. ఇందులో తెలియజేసిన విషయాలను యథాతథంగా ఆచరించండి. సాధన చెయ్యండి. దైవాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకునే కార్యంలో నిమగ్నమైపోండి. ఇక, ఇలాంటి ఇంటర్వ్యూలను చేయడం మానండి.

d) దేవుడు అంటే మీ దృష్టిలో ఉన్న అర్థం, నిర్వచనం ఏమిటో ? ముందు దైవం అని అంటే మీరేమని అనుకుంటున్నారో స్పష్టంగా నాకు వివరించండి. అప్పుడు సమాధానం చెప్తాను. ఒక సారి ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మొత్తం చదవండి.

❖ ❖ ❖

53 ప్రశ్న : సార్ ! ఆధ్యాత్మికత గురించి ఎప్పుడూ గంభీరంగా చెప్తారు. ఈ ఒక్క సారి ఆధ్యాత్మికత అంటే సరదాగా, చమత్కారంగా చెప్పండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : అజ్ఞానంతో దిమ్మ తిరిగి బ్లాక్ అయిపోయి ఉన్న మైండ్‌ను దేనితో కొడితే ఓపెన్ అవుతుందో దాన్నే ఆధ్యాత్మికత అని అంటారు.

❖ ❖ ❖

54 ప్రశ్న : ఎంతో మంది మాస్టర్స్, మీరు కూడా - మీ సమస్యలను మీరు తలుచుకుంటే తక్షణమే తీసేయవచ్చు అని అంటుంటారు. మరి మేం తీసేయ్యాలని తలుచుకుంటున్నాం కానీ జరగటం లేదు, ఎందుకని సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : జరగలేదని అంటే 100%గా తలుచుకోలేదనే

అర్థం ! సుస్పష్టం ! దానికి మరే రుజువులు, సాక్ష్యాలు అవసరం లేదు. ఏదో సగం, సగం తలుచుకుంటూ దాన్ని పూర్తి శాతంగా భావిస్తున్నారు. అందుకే అవి పోవడం లేదు. మీరు ఏ క్షణమైతే పూర్తి శాతం తలుచుకుంటారో ఆ క్షణమే మీరు క్లియర్ చేయాలనుకున్నది క్లియర్ అయిపోతుంది.

ఆధ్యాత్మిక శాస్త్ర విషయాలు గణిత శాస్త్రీయంగా, నిక్కచ్చిగా పని చేస్తాయి కన్నలారా ! తేడా మీలోనే ఉంటుంది. ఆధ్యాత్మిక సూత్రాల్లో ఉండదు. డాన్స్ రాక స్టేజ్ బాగా లేదు అని అనవద్దు.

❖ ❖ ❖

55 ప్రశ్న : సార్ మీరెలాంటి గురువు ? మీ శిష్యులం కావాలంటే ఏం చేయాలి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నేను సద్గురువుని. I am an Enlightened Master, I am a walk-in Master. I am a Non-religious New Age Spiritual Master & Leader ! నేను నా జీవితాన్ని ఉత్సవంగా జీవిస్తూ, అందరూ నాలాగే తమ జీవితాలను ఉత్సవంగా జీవించాలని ఆకాంక్షించే వాడిని. జీవితాన్ని ఎలా ఉత్సవంగా జీవించాలో బోధించే వాడిని.

జనాల్లో ఒక పూర్తి స్థాయి తప్పుడు అభిప్రాయం ఏర్పడిపోయి ఉంది. అదేమిటంటే ఆధ్యాత్మిక గురువులు ఎంత పేదగా, ఎంత నిరాడంబరంగా కనిపిస్తే అంత గొప్ప అన్నట్టు. ఆధ్యాత్మిక గురువు చాలా సీదా సాదాగా కనిపిస్తూ, జీవిస్తూ ఉండాలి. గడ్డం, లుంగి లేదా పంచ కట్టుకుని ఒక శాలువానో లేక కండువానో భుజం మీద వేసుకుని వీలైనంత నిరాడంబరంగా కనిపిస్తూ ఉండాలి. లేదా కాషాయాలు ధరించి ఏవేవో డెకరేషన్‌లు చేసుకుని వీలైనంత గంభీరంగా కనిపించాలి. ఈ టైపు తప్పుడు భావాలు ప్రజల్లో ఏర్పడి పోయి ఉన్నాయి. ఆధ్యాత్మికత అంటేనే నిరాడంబరత అని భావించే వారే ఎక్కువ మంది ఉన్నారు. ఇది ఎంత మాత్రమూ సరి కాని భావన. ఆధ్యాత్మికతకూ నిరాడంబరతకూ ఏ సంబంధమూ లేదు. నిరాడంబరంగా జీవిస్తేనే ఆధ్యాత్మికత అని అనేది సరి కాని అభిప్రాయం. ఈ రకంగా ఆధ్యాత్మిక శాస్త్రం పైన, ఆధ్యాత్మిక సాధన పైన మరియు ఆధ్యాత్మిక జీవితం పైన, జనాల్లో ఏర్పడి పోయి ఉన్న తప్పుడు భావనలను తీసి వేసి వాస్తవాలను తెలియజేసేందుకు ఉద్యుక్తమైన గురువుని.

ఫలానా విధంగా జీవిస్తేనే, ఫలానా పర్టిక్యులర్ వేషంలో ఉంటేనే ఆధ్యాత్మిక గురువు అని అంటే అంత కంటే చోద్యం మరొకటి ఉండదేమో ! నిజమైన ఆధ్యాత్మిక వేత్తకు నియమ నిబంధనలు

ఏవీ ఉండవు, ఇలా ఉండాలి అలా ఉండాలి అని ! ఆధ్యాత్మిక వేత్తలకు తెలుసు ఎలా ఉండాలో ! నేను వాస్తవ ఆధ్యాత్మిక వేత్తను ! నవీన యుగ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తను !

ఇక నా శిష్యులుగా కావాలి అని అనుకునే వారు నన్ను నూటికి నూరు శాతం యథాతథంగా నన్ను అంగీకరించాలి. నన్ను 100%గా ఒప్పుకున్న వారిని మాత్రమే నేను శిష్యులుగా అంగీకరిస్తాను. నా శిష్యులు కావాలి అని అనుకునే వాళ్ళు పూర్తి తెల్ల కాగితంలా నా దగ్గరికి రావాలి. నన్ను పూర్తిగా విశ్వసించాలి. నన్ను పూర్తిగా ప్రేమించాలి. అప్పుడు మాత్రమే శిష్యులుగా ఒప్పుకుంటాను. నన్ను ఒప్పుకోని వారిని నేనెలా ఒప్పుకుంటాను ?! నా శిష్యులుగా ఉండాలనుకుంటే నన్ను పూర్తిగా ఒప్పుకుని తీరాలి. నన్ను ఒప్పుకోని పక్షంలో నా దగ్గరికి రావల్సిన అవసరం ఏమిటి ?

కేవలం నన్ను మాత్రమే 100%గా ఒప్పుకుంటేనే, నేను శిష్యులుగా అంగీకరించి శిక్షణ ఇస్తాను. ఏ మాత్రం వేరే ఇతర Conceptలు కలిగి ఉన్నా నా దగ్గర పని జరగదు. అన్నీ వదిలెయ్యాలి. అప్పుడే ఏమైనా జరిగేది. అంతకు ముందు మాత్రం కాదు.

ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శి లోని, నవ రత్నాలు అనే అధ్యాయంలో "గురు స్మృతి" అనే టాపిక్ ఉంది. ఓ సారి చదివి బాగా అవగాహన చేసుకోండి. అప్పుడు మీ సందేహాలన్నీ తీరిపోతాయి. అర్థం అయిందా !

❖ ❖ ❖

56 ప్రశ్న : నమస్కారం సార్ ! మేము సత్య మార్గంలోకి వచ్చి ఆరేళ్ళయింది. ఈ ఆరేళ్ళలో కొన్ని సమస్యలు క్లియర్ అయ్యాయి. కొన్ని కాలేదు. ఇంకా మేము బాధలు అనుభవిస్తూనే ఉన్నాం. ఇలా సత్య మార్గంలో ఉన్న వాళ్ళు కూడా బాధలు అనుభవిస్తుంటే భౌతికంగా బ్రతుకుతున్న వారికి, సత్య మార్గంలో ఉన్న వాళ్ళకి తేడా ఏముంది. సత్య మార్గంలోకి ప్రవేశిస్తే సమస్యలు సమసి పోతాయని అంటారు కదా ! మరి మా పరిస్థితి ఇలా ఉందేంటి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : సత్య మార్గంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే అన్ని సమస్యలు క్లియర్ చేసుకుని ఆనందంగా సత్య ప్రచారం చేస్తున్న వాళ్ళు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారెవరూ కనపడ లేదా మీకు ?! మీరు సత్య మార్గంలోకి వచ్చి ఆరేళ్ళయింది అని అంటున్నారు. మీరు నిజంగా సత్య మార్గంలోకి వస్తే ఆ క్షణంలోనే సమస్యలన్నీ సమసి పోతాయి. మీ శరీరాలు వచ్చి ఆరేళ్ళయింది. కానీ మీ ఆత్మలు ఇంకా రాలేదు సత్య మార్గంలోకి ! కేవలం శారీరక పరంగా, భౌతిక పరంగా ఫలానా తేది నాడు మేము సత్య మార్గంలోకి వచ్చాము అని అనడం సరి కాదు.

మీరు మీ ఆత్మ పూర్వకంగా సత్య మార్గంలో ప్రవేశించాలి. మీరు మీ ఆత్మ పూర్వకంగా సత్య మార్గంలోకి ప్రవేశించలేదు అని అనడానికి ప్రస్తుతం మీరు ప్రశ్నించిన విధానమే నిదర్శనం. ఇక మరే నిరూపణలు అవసరం లేదు. నిజంగా, ఆత్మ పూర్వకంగా సత్య మార్గంలోకి ప్రవేశంచిన వారు అసలు ఇలాంటి ప్రశ్నలే వేయరు. మీరు వేసిన ప్రశ్నయే, మీరు సత్య మార్గంలోకి ఆత్మ పూర్వకంగా ప్రవేశించలేదని ప్రకటిస్తోంది, మీ బండారం బయటపెడుతోంది. సత్య మార్గంలోకి ఎప్పుడు వచ్చారన్నది కాదు ముఖ్యం, మీ అంతరంలో ఎంత పరివర్తన జరిగింది, మీ అవగాహన ఎంతగా పెరిగింది అనేది ముఖ్యం. అసలు సత్య మార్గంలోకి ప్రవేశించడం అంటే మీరేమనుకుంటున్నారో ?! ఏదో ఒక సత్య మార్గ సంస్థలో సభ్యులుగా చేరి, ఎవరో ఒక గురువును కలిసి ఆయనకు ఓ నమస్కారం పెట్టి, అప్పుడప్పుడో లేక రెగ్యులర్‌గానో ఆయన క్లాస్‌లకు వెళ్తూ అక్కడ జరిగే ప్రోగ్రామ్స్‌లో విరివిగా పాల్గొంటూ ఉండడం అనేది సత్య మార్గంలో ప్రవేశించడం కాదు. ఆత్మ విజ్ఞాన సూత్రాలను యథాతథంగా మీ నిజ జీవితంలో ఎప్పుడైతే ఆచరించడం మొదలు పెడతారో అప్పుడు మాత్రమే మీరు సత్య మార్గంలోకి ప్రవేశించినట్టు అవుతుంది. ఎన్నెన్ని సూత్రాలను, మీరు ఎంతెంతగా అచరిస్తూ ఉంటారో అంతంతగా మీరు సత్య మార్గంలోకి ప్రవేశించినట్టు లెక్క ! మీ అంతరంలో పరివర్తన ఎప్పుడు ప్రారంభం అవుతుందో అప్పుడు మాత్రమే మీరు సత్య మార్గంలోకి ప్రవేశించినట్టు అర్థం.

గుర్తుంచుకోండి - ఆత్మ విజ్ఞాన సూత్రాలను "సత్యాలు" అని అంటారు. ఈ సత్యాలను నిజ జీవితంలో యథాతథంగా ఆచరించడాన్ని ప్రారంభిస్తే దాన్ని"సత్య మార్గంలోకి ప్రవేశించడం" అని అంటారు. ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో యథాతథంగా ఆచరించే వాళ్ళను "సత్య మార్గంలో ఉన్న వాళ్ళు" అని అంటారు.

ఉదాహరణకు "నీ వాస్తవానికి నీవే సృష్టికర్తవు" ఇది ఒక సత్య సూత్రం. దీన్ని మీరు ఎల్ల వేళలా ఆచరించాలి. ఏం జరిగినా, ఏమైనా సరే, సర్వ కాల సర్వావస్థలలో ఈ సూత్రాన్ని ఆచరించాలి. ఏం జరిగినా ఎవరి పైనా నింద మోపకుండా, ఇది నా సృష్టియే అని అనుకుంటూ ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల పై వేయకుండా జరిగిన దానికి లేక జరుగుతున్న దానికి మీరే సంపూర్ణ బాధ్యత వహించాలి. మీరు ఈ సూత్రాన్ని 24 గంటలూ ఆచరిస్తూ ఉంటే అత్యంత శీఘ్రంగా మీ సమస్యలన్నీ క్లియర్ అయిపోతాయి. కానీ మీరు ఆచరించగలరా ? ఈ విధంగా ఎన్నో సత్య సూత్రాలున్నాయి.

అయితే జీవితంలో ఆచరించడం అని అంటే మరి ఏ జీవితంలో ? ఎందుకంటే జీవితానికి ఎన్నో కోణాలు ఉంటాయి.....

సంపాదనా జీవితం,

వైవాహిక జీవితం,

కుటుంబ సభ్యులతో కూడిన జీవితం,

బంధువులతో వ్యవహరించే జీవితం,

మిత్రులతో గడిపే జీవితం,

సమాజంలోని వ్యక్తులతో ప్రవర్తించే జీవితం,

తన కంటే పెద్ద వాళ్ళతో వ్యవహరించే జీవితం,

తన కంటే చిన్న వాళ్ళతో వ్యవహరించే జీవితం,

ఆఫీస్‌లోని వ్యక్తులతో ప్రవర్తించే జీవితం,

ఆ యొక్క ఆఫీస్‌లోని పై వారితో ప్రవర్తించే జీవితం,

ఆఫీస్‌లో తన తోటి వాళ్ళతో ప్రవర్తించే జీవితం,

ఆఫీస్‌లో తన కంటే చిన్న వారితో ప్రవర్తించే జీవితం,

మీరు విద్యార్థులైతే మీ విద్యా జీవితం,

మీరు వ్యాపారస్తులైతే మీ వ్యాపార లావాదేవీల్లో వ్యవహరించే జీవితం.....

ఇలా ఎన్నో కోణాల్లో విస్తరించి ఉంటుంది జీవితం.

ఫైనల్‌గా మీతో మీరు వ్యవహరించే జీవితం! అదే వ్యక్తిగత జీవితం !!

ఈ విధంగా ఎన్నో కోణాల్లో విస్తరించి ఉంటుంది జీవితం. కొంత మంది కొన్ని కోణాల్లో "సత్యాలను" ఆచరించ గలుగుతారు కానీ, మరి కొన్ని కోణాల్లో ఆచరించలేరు. కొంత మంది అయితే ఒక్క కోణంలో కూడా పూర్తిగా ఆచరించలేరు. ఇలాంటి వారు ఏదో ఒక సత్య మార్గ సంస్థలో సభ్యులుగా చెలామణి అవుతూ ఆ సంస్థ యొక్క కార్యకలాపాల్లో విరివిగా పాల్గొంటూ ఉంటారు. ఇలాంటి వారిని ఎంతో మందిని నేను చూశాను. జీవితంలోని కోణాల్లో అందులో కొంచెం, ఇందులో కొంచెం, అందులో సగం, ఇందులో సగం, దాంట్లో కొంత, దీంట్లో కొంత "సత్యాలను" ఆచరిస్తూ ఉంటారు. మరి కొంత మంది అయితే ఏ రెండో, మూడో ఆచరిస్తూ ఎంతో ఫీల్ అయిపోతూ ఉంటారు. మీరు దీంట్లో ఏ కోవకు చెందుతారో !

సత్య మార్గంలోకి వచ్చి అరేళ్ళు అయింది అంటున్నారు. ఎన్ని సూత్రాలను మీరు, మీ జీవితంలోని ఎన్ని కోణాల్లో, ఎంత మేరకు ఆచరించారు ? ఊరికే ఏదో ఒక సంస్థలో చేరి మెడలో మెంబర్‌షిప్ కార్డ్ వేలాడ దీసుకుంటే సరి పోతుందా ? క్లాస్‌లకు వెళ్తూ, క్లాస్ అయిపోయిన తర్వాత అక్కడికి

వచ్చిన వాళ్ళతో బాతాఖాని వేసుకుని ఏదో సాధించేసినట్టు ఫీలయి పోయి ఇంటికి వెళ్ళి సత్య మార్గంలోకి ఎప్పుడు జాయిన్ అయ్యానా అని తేది చూసుకుని రోజులు, నెలలు, సంవత్సరాలు లెక్క కడుతూ... హమ్మయ్య ఆరేళ్ళు అయింది అని అనుకుని మళ్ళీ అంతలోనే ఆశ్చర్యపోయి ఏమీ... ఆరేళ్ళయినా నా సమస్యలు ఇంకా పోలేదేమిటబ్బా అని వాపోతూ, వాళ్ళతో వీళ్ళతో పోల్చుకుంటూ నెగెటివ్ థింకింగ్ చేస్తూ స్వయం నాశనం మరియు సమయం నాశనం చేస్తూ గడపడమేనా "ఆరేళ్ళ సత్య సాధకులు" చేసే పని ??? సాధన అవసరం లేదా ? ఆచరణ అవసరం లేదా ? ఆరేళ్ళలో మీరు సాధించిన ప్రగతి ఇదేనా ? ఆరేళ్ళ సీనియారిటి పెట్టుకుని ఇలాంటి ప్రశ్నలా వేసేది ?

బోధ అంటే ఎరుక + అవగాహన అని అర్థం. బోధ లేనందుకే బాధ వస్తుంది. బాధ పడుతున్నప్పుడు సంఘర్షణ జనిస్తుంది. ఆ సంఘర్షణలో నుండి ఎరుక + అవగాహన ఉదయిస్తాయి. అలా ఉదయించిన ఎరుక + అవగాహన ఆ యొక్క బాధను తక్షణమే తీసివేయడమే కాకుండా మళ్ళీ అది రాకుండా శాశ్వతంగా సురక్షా కవచంగా నిలుస్తుంది. బాధలు ఉన్నాయంటే బోధలు లేవు అని అర్థం. అంటే ఆత్మ విజ్ఞానం లేదని అర్థం. కాబట్టి బాధలు పోగొట్టు కోవాలంటే ఆత్మ విజ్ఞానం పొందాలని అర్థం చేసుకుని అందుకై సాధన చేయాలి.

మీరు సత్య మార్గంలోకి వచ్చి ఆరేళ్ళయినా మీ బాధలు పోలేదంటే ఇంకా మీరు ఎదగలేదని అర్థం చేసుకుని ఎదిగే ప్రయత్నం చేయండి. ఆత్మ విజ్ఞాన పుస్తకాలు బాగా చదవండి. ఆత్మ విజ్ఞాన సూత్రాలను యథాతథంగా నిజ జీవితంలో ఆచరించండి. బాగా సాధన చేయండి. సత్యసేవలో విశేషంగా పాల్గొనండి. సత్య ప్రచార కార్య క్రమాలలో బాగా పని చేయండి. క్లాసులు చెప్పడం కాదు. ధ్యాన కేంద్రాలు తెరవడం కాదు. గురువుల దగ్గర నిజాయితీగా పనిచేయండి.

మానేస్తాడా ? అసలు ఆధ్యాత్మిక మార్గం అంటే మీరు ఏం అనుకుంటున్నారు ?? మీ లాంటి వాళ్ళు చేయబట్టి ఆధ్యాత్మికత పైన జనాలకు చులకన భావం ఏర్పడి పోయింది. తెలిసి అన్నారో, తెలియక అన్నారో నాకర్థం కావటం లేదు. సరే.... ఏది ఏమైనా మీకు వాస్తవం తెలియ జేయాలి కాబట్టి తెలియ జేస్తున్నాను. నాన్ వెజ్‌తో పోలిస్తే సిగరెట్, మందు అనేవి చాలా సాధారణమైనవి. సాధారణ వ్యక్తి తన చేతిలో సిగరెట్, మందు ఉన్నాయి అనే పేద్ద భ్రమలో ఉంటాడు. కనపడడానికి అవి అతని చేతిలోనే ఉన్నా, వాస్తవానికి అతడే వాటి చేతిలో బందీగా, బానిసగా ఉంటాడు. సిగరెట్‌కి, మందుకి బానిసలుగా మారిన వ్యక్తుల యొక్క లోపల ఉన్న బలహీనతలకు ఈ సిగరెట్, మందు ఒక సాకు. వీరి చేత సిగరెట్, మందు బలవంతంగా మానిపిస్తే అవి వేరే కోణంలో, వేరే రూపం తీసుకుని ప్రకటం అవుతాయి. విషయం తెలియని మీరు అవి వేరే, ఇవి వేరే అని అనుకుంటారు. అసలు మూల కారణం లోపల ఉంటుంది. దాన్ని తీసివేస్తే గానీ అందులో నుండి శాశ్వతంగా బయట పడరు. వీటికి బానిసగా మారిన వ్యక్తి తనకై తాను, స్వయం పూనికతో నిర్ణయం తీసుకుని విషయాలు

తెలుసుకుని, ధ్యానం చేసి ఆ బలహీనతల్లోంచి తనను తాను బయట పడేసుకోవాలి. సిగరెట్, మందు అనే కాదు మనిషి దేనికీ బానిసగా మారకూడదు. సిగరెట్, మందు అలవాటు లేనంత మాత్రాన ఆయనేదో శ్రీరాముడు అనుకోవద్దు. సిగరెట్, మందు కాదు కదా అసలు టీ, కాఫీ కూడా తాగని వ్యక్తులు ఇంట్లో భార్యా పిల్లలకు "నరకం" చూపిస్తారు. ఇలాంటి నరకాసురులను నేను ఎంతో మందిని చూశాను. సిగరెట్, మందు అలవాటు ఉండి భార్యా పిల్లలను ఎంతో ప్రేమగా, బాధ్యతగా చూసుకునే వాళ్ళను ఎంతో మందిని చూశాను. సిగరెట్, మందు వలన ఎన్నో సంసారాలు నాశనం అవుతున్నాయి. అయితే అసలు కారణాలు వేరే ! సిగరెట్, మందు అందుబాటులో ఉన్నాయి కాబట్టి వాటిని నెపంగా చేసుకుంటున్నారు, అవి లేకపోతే వేరే ఇతర ఏదో ఒకటి వెతుక్కుంటారు. వారి లోపల ఉన్న కారణాలకు ఏదో ఒక సాకు కావాలి. ఆధ్యాత్మిక విజ్ఞానం లేని వాళ్ళకి ఇలాంటి విషయాలు అర్థం కావు. సిగరెట్, మందు అలవాటు ఉన్న వాళ్ళలో ఎంతో మంది చాలా గొప్ప, గొప్ప వాళ్ళు ఉన్నారు, వీరు అన్ని రంగాలలోనూ ఉన్నారు. సిగరెట్, మందు అలవాటు లేని వాళ్ళలో ఎందుకూ పనికి రాకుండా, భూమికి భారంలా అనిపించే వాళ్ళు ఎంతో మంది ఉన్నారు. సిగరెట్, మందు వలన క్యాన్సర్ మరియు ఇతర అనారోగ్యాలు వస్తాయని, వస్తున్నాయని అంటున్నారు. సరే ! సిగరెట్, మందు అలవాటు లేని వాళ్ళంతా ఆరోగ్యంగా ఉన్నారా ??? సిగరెట్, మందుకే కాదు మనిషి అసలు దేనికీ కూడా బానిస కాకూడదు. మేము కేవలం టీ మాత్రమే తాగుతాము కాఫీ తాగలేము అని కొంత మంది అంటే, మరి కొందరు మేము కాఫీ మాత్రమే తాగుతాము టీ తాగలేము అని అంటారు. ఇలాంటి వాళ్ళకు టైమ్‌కు టీ కానీ లేక కాఫీ కానీ అందకపోతే, వీళ్ళు ఎలా అల్లాడి పోతారంటే అచ్చం సిగరెట్, మందు అలవాటు ఉన్న వాళ్ళు వాటి కోసం ఎలా విలా విలా కొట్టుకుంటారో అలాగే ! సిగరెట్, మందు అలవాటును, టీ కాఫీలతో పోలుస్తున్నానేంటా అని ఆశ్చర్యపోకండి. నేను ఇక్కడ బానిసత్వం గురించి ప్రస్తావిస్తున్నాను. బానిసత్వం బానిసత్వమే ! అది టీయా, కాఫీయా, సిగరెటా, మందా అని కాదు. ఏదైతేనేం ? బానిసత్వమా కాదా ? అన్నదే అసలు పాయింటు. సిగరెట్, మందు అలవాటే కాదు, నేను టీ కాఫీ అలవాట్లనే ఒప్పుకోను. అసలు ఏ అలవాట్లను ఒప్పుకోను. **దేని చేతిలో బంటీలు కాకండి.** మనిషి ఎల్లప్పుడూ సర్వతంత్ర స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఉండాలి. దేనికీ ఎప్పుడూ బానిస కాకూడదు, అది ఏ అలవాటైనా సరే. సౌత్ వాళ్ళు నార్త్ ఫుడ్ తీసుకోలేరు. నార్త్ వాళ్ళు సౌత్ ఫుడ్ తీసుకోలేరు. ఇలా ఉండ కూడదు. ఆల్ రౌండర్‌గా ఉండాలి.

అజ్ఞానులైన మీకు ఏది తప్పో, ఏది ఒప్పో తెలియదు. కాబట్టి ముందు మీరు అవగాహన తెచ్చుకోండి, ఆ తర్వాత మీ పెద్దబ్బాయి సంగతి చూసుకోవచ్చు. సిగరెట్, మందు అనేవి హాని చేస్తాయి, అయితే వీటి కన్నా నాన్ వెజ్ చాలా, చాలా భయంకరమైనది. ఎంతో అపాయకరమైనది. దాని గురించి ఆలోచించరు కానీ... సిగరెట్, మందు వెనకాల పడతారు. సిగరెట్ ఇంకా ఇతర ఏ పొగాకు పదార్థాలైనా హానికరమే. మందు అనేది మనిషిని మత్తుకు బానిసను చేస్తుంది. కాబట్టి ఈ రెండిటినీ తక్షణమే పూర్తిగా, శాశ్వతంగా వదిలేయాలి. అయితే ఈ రెండింటికన్నా నాన్‌వెజ్ చాలా డేంజర్, **దాని ఎఫెక్టు చాలా ఘోరంగా, భయంకరంగా జన్మ జన్మలు ఉంటుంది.**

నాన్ వెజ్ వలన "ఆత్మ నాశనం" జరుగుతుంది.

ప్రపంచ ప్రసిద్ధ డాక్టర్లు పరిశోధించి చెబుతున్నారు - మాంసాహారం వలన మరియు డేరి ప్రొడక్ట్స్(పాల ఉత్పత్తులు) వలన ప్రాణాంతకమైన ఎన్నో వ్యాధులు వస్తాయని. డాక్టర్లు చెప్పినా మీరు వినకపోతే ఎలా ? మీ జీవితాల పైన మీకెంత నిర్లక్ష్యం ఉందో మీ మాంసాహార అలవాటు నిరూపిస్తూ ఉంది....

మేము ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నాము, మా పెద్దబ్బాయిని ఆధ్యాత్మిక మార్గంలోకి తీసుకు వచ్చాక తీరిగ్గా ఎప్పుడో ఆయన చేత నాన్ వెజ్ మానిపిస్తామని అంటున్నారు. అసలు ఇంతకి ఆధ్యాత్మికత అంటే మీరేమనుకుంటున్నారో ఏమో ! పూర్తి స్థాయి నిస్వార్థ సేవా భావంతో అకర్మ శాకాహారిగా మారి తన "స్వయం" గురించి తెలుసుకోవాలని నిజంగా సిద్ధ పడి, అందుకై అన్వేషణ ప్రారంభించినప్పుడు మాత్రమే ఆధ్యాత్మికంలోకి ఎంట్రెన్స్ లభిస్తుంది. ఏదో చెప్పాం కదా అని కాదు. పూర్తి స్థాయి నిస్వార్థ సేవ అంటే ఏమిటో స్పష్టంగా తెలిసి ఉండాలి. తెలిసి ఉండడమే కాదు. సేవకు సిద్ధ పడాలి, చేయాలి. అకర్మ శాకాహారిగా ఎందుకు ఉండాలో క్లియర్‌గా తెలిసి ఉండాలి. ఆ తర్వాత తన "స్వయం" గురించి తెలుసుకోవడంలో పూర్తి శ్రద్ధ కనబరుస్తూ, ఇక ఆ యొక్క అన్వేషణకే జీవితంలో ప్రధాన ప్రాధాన్యతను ఇస్తూ ఉన్నప్పుడే ఆధ్యాత్మికంలోకి ఎంట్రెన్స్ లభిస్తుంది. ఇదీ ఆధ్యాత్మికతలో ఉండడం అంటే !

ఏదో ఒక ఆధ్యాత్మిక సంస్థలో సభ్యులుగా చేరి, అందులో జరిగే కార్యక్రమాలకు వెళ్తూ, అక్కడ ఉన్న గురువును దర్శించుకుంటూ మీ సోదిలో మీరు ఉండడం కాదు ఆధ్యాత్మికత అంటే ! ముందు మీరు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని పూర్తిగా చదివి అవగాహన చేసుకోండి. మీరు ఆధ్యాత్మిక మార్గం అంటే ఏమిటో ముందు తెలుసుకోండి. మేము ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నాము అనే భ్రమలో నుండి బయటికి రండి. మీరు ఆధ్యాత్మికంలో కాదు కదా దాని దరిదాపులలో కూడా లేరు. మొదట మీరు ఆధ్యాత్మికం అంటే ఏమిటో సరిగ్గా తెలుసుకున్న తర్వాత కూడా వచ్చే ధైర్యం ఉంటే రండి. ఆ తర్వాత మీ పెద్దబ్బాయి సంగతి చూడండి. నాన్ వెజ్ ఎంత డేంజరో తెలుసు కోవాలంటే ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే ఉన్న "నవ రత్నాలలోని మూడవదైన సరైన ఆహారం"ను చదవండి. విషయాన్ని బాగా అర్థం చేసుకుని, మీ పెద్దబ్బాయికి అర్థం చేయించి అతని చేత అర్జంటుగా నాన్ వెజ్ మాన్పించండి.

సత్య మార్గంలో ఉన్న వాళ్ళు బాధలు పడుతూంటే, సత్య మార్గంలో లేని వాళ్ళు బాధలు పడుతూంటే ఇక వీళ్ళిద్దరికీ తేడా ఏమిటి అని అంటే సత్య మార్గంలో ఉన్న వారు బాధలు అనుభవిస్తూ, బాధలను బోధలుగా మార్చుకుంటూ వాటిని తొలగించు కుంటూ ఉంటారు. ఏదో ఒకనాటికి వీరి బాధలు అంతం అయి తీరుతాయి, 100% గ్యారంటి ! కానీ సత్య మార్గంలో లేని భౌతిక పరమైన వారు బాధలు పడటమే తప్ప వాటికి అంతం అనేది ఉండదు. ఇది ఎంత పెద్ద తేడానో గమనించండి.

కొంత మంది అతి తెలివి ప్రదర్శిస్తూ ఉంటారు. వీరు రక రకాల సంస్థలకు వెళుతూ ప్రతీ దానిలో ఉన్న కొన్ని విషయాలను తీసుకుంటూ వాటిని ప్రోగు చేసుకుంటూ అటూ ఇటూ తిరుగుతుంటారు, కేవలం టైమ్ పాస్ చేస్తూ ఉంటారు. ఇలా రీసెర్చ్ చేయడం మంచిదే అయినా రీసెర్చ్ ముసుగులో కాలయాపన సరి కాదు. ఉన్నతమైన ఆత్మ విజ్ఞానం ఎక్కడ ఉందో ఆ సంస్థను లేక ఆ గురువును సాధ్యమైనంత త్వరగా వెతికి పట్టుకుని 100%గా అంకితం అయి సాధన ప్రారంభించాలి. బాగా ఉన్నప్పుడు ఇలాంటి విషయాలు ఎక్కువ అనుకోండి. చేతులు కాలక ముందే ఆకులు పట్టుకోమని చెప్తున్నాను.

❖ ❖ ❖

57 ప్రశ్న : గురువు గారికి నమస్కారం ! మా ఫ్యామిలి అంతా ఆధ్యాత్మిక మార్గంలోనే ఉన్నాం. మా పెద్దబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. సిగరెట్, మందు లాంటి బ్యాడ్ హ్యాబిట్స్ ఏవీ లేవు. అయినా ఇతనొక్కడే ఆధ్యాత్మిక మార్గంలోకి రావటం లేదు. బహుశా నాన్ వెజ్ మానేయాల్సి వస్తుంది అనేమో ! అదేం పెద్ద విషయం కాదు, పర్వా లేదు. నీకెప్పుడు ఇష్టం అయితే అప్పుడే మానేయమని మేము చెప్తున్నా వినటం లేదు. మా పెద్దబ్బాయిని ఆధ్యాత్మిక మార్గంలోకి తీసుకు రావాలంటే ఏం చేయాలి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మీ పెద్దబ్బాయి సంగతి పక్కన పెట్టండి. ముందు మీరు ఆధ్యాత్మిక మార్గంలోకి రండి. ఆ తర్వాత మీ పెద్దబ్బాయి విషయం చూద్దాం ! సిగరెట్, మందేమో బ్యాడ్ హ్యాబిట్స్ - నాన్ వెజ్ పెద్ద విషయం కాదా ?! ఇదా మీ యొక్క ఆధ్యాత్మిక అవగాహన ?! మీరు ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారా ??!!

ఆధాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత ఆయనకు ఎప్పుడు ఇష్టం అయితే అప్పుడు నాన్ వెజ్

సిగరెట్ మరియు మందుల వలన అంతరంగంలో విస్మృతి కలుగుతుంది లేదా పెరుగుతుంది. ఈ విస్మృతి వలన మనిషి తనలోకి ఏ ఏ నెగెటివ్ గుణాలను ఆకర్షిస్తున్నాడో అతడికే తెలియదు. విస్మృతిలో ఉన్న అతడిలోకి నెగెటివ్ గుణాలు వచ్చి చేరుతాయి. తనలోకి నెగెటివ్ గుణాలు వచ్చాయి అన్న విషయమే అతడికి తెలియదు. ఇక అతడిలో ఉన్న ఆ నెగెటివ్ గుణాలు రోగాలను, సమస్యలను ఇంకా ఇతర బాధలను ఆకర్షిస్తూ ఉంటాయి. సిగరెట్ మరియు మందుల వలన వ్యాధులు రావడం లేదు.. సిగరెట్ మరియు మందుల వలన కలిగే లేదా పెరిగే విస్మృతి వలన నెగెటివ్ గుణాలు లోపలికి వస్తాయి. ఈ నెగెటివ్ గుణాల వలన వ్యాధులు మరియు ఇతర అనేకానేక సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. అయితే - సిగరెట్, మందులు ఇన్‌డైరెక్ట్‌గా నెగెటివ్ గుణాలను ఆకర్షిస్తే, నాన్ వెజ్ ఫుడ్ తినడం అనేది డైరెక్ట్‌గా నెగెటివ్ గుణాలను ఆకర్షిస్తుంది. కాబట్టి ప్రతీ ఒక్కరూ సిగరెట్, మందు మరియు నాన్ వెజ్‌లను & డేరి ప్రొడక్ట్స్‌ను తక్షణమే పూర్తిగా, శాశ్వతంగా మానివేయాలి లేదా నాశనం తప్పదు. ఇది ఆధ్యాత్మిక పరమైన సాంకేతిక కారణం.

అకర్మ వీగన్లుగా మారనిదే వాస్తవమైన ఆధ్యాత్మిక ప్రవేశం దొరకదు. మాంసాహారులు & డేరి ప్రొడక్ట్స్ వాడే వాళ్ళు నిజమైన ఆధ్యాత్మికులు కానే కారు. సత్యమైన ఆధ్యాత్మికులు మాంసాహారం ఏదీ ముట్టుకోరు, ఎలాంటి డేరి ప్రొడక్ట్స్ వాడరు. లెదర్ వాడరు. తేనె కూడా వాడరు. టోటల్‌గా జంతు ఉత్పత్తులను వేటినీ వాడరు.

❖ ❖ ❖

58 ప్రశ్న : సార్ ! జనాల్లో పెద్ద పెద్ద స్వాములుగా, పీఠాధిపతులుగా, మఠాధిపతులుగా చెలామణి అయ్యే వాళ్ళు ఆధ్యాత్మికంగా ఏ స్థాయికి చెందిన వారు ? అసలు ఎవరినైనా సరే ఆధ్యాత్మికంగా ఏ స్థాయిలో ఉన్న వారో ఎలా తెలుసుకోవాలి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మీరు అడిగిన ప్రశ్నకు సమాధానం శ్రీకృష్ణ పరమాత్ముడు ఉత్తర గీతలోని ఎన్నో శ్లోకాలలో, పర్టిక్యులర్‌గా 3వ అధ్యాయంలోని 8వ శ్లోకంలో, 4వ ఆధ్యాయంలోని 55వ శ్లోకంలో మరియు భగవద్గీతలోని ఎన్నో శ్లోకాలలో, పర్టిక్యులర్‌గా 6వ ఆధ్యాయంలోని 46వ శ్లోకంలో ఎంతో స్పష్టంగా కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పాడు. ఈ సత్యాలను నేను ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే వివరించాను. చదివి అర్థం చేసుకోండి.

శ్రీ కృష్ణ పరమాత్మ భగవద్గీతలో మరియు ఉత్తర గీతలో చెప్పిన ప్రకారంగా ఇప్పటి కాలానికి చెందిన భాషలో చెప్తే ఈ కింది విధంగా ఉంటుంది.

పూజల గురించి చెప్తూ ఉన్నారంటే వాళ్ళు ప్రైమరి స్కూలు గురువులు అంటే

పసి దశలో ఉన్న వారని అర్థం.

స్తోత్రాల గురించి చెప్తూ ఉన్నారంటే వాళ్ళు హై స్కూలు గురువులు అంటే బాల్య దశలో ఉన్న వారని అర్థం.

జపాలు, నోములు, వ్రతాలు, యజ్ఞాలు, యాగాలు, హోమాలు వగైరాల గురించి చెప్తున్నారంటే వాళ్ళు కాలేజ్ లెవల్‌లో ఉన్న వారని అర్థం.

పూజలు, స్తోత్రాలు, జపాలు, నోములు, వ్రతాలు, యజ్ఞాలు, యాగాలు, హోమాలు, మంత్రాలు, తంత్రాలు, తాయెత్తులు, గుళ్ళు గోపురాలు, తీర్థాలు, క్షేత్రాలు, భజనలు, సంకీర్తనలు వగైరాలు అన్నీ తక్షణమే వదిలేయి. "నీవే దైవం ! అది అనుభవ పూర్వకంగా తెలుసుకోడానికి ధ్యానం చేయి" అని చెప్పే వారు యూనివర్సిటి స్థాయిలో ఉన్న వారు అంటే పరమోన్నతమైన వారు అని అర్థం. వాళ్ళు ఏం బోధిస్తున్నారో దాన్ని బట్టి స్పష్టంగా చెప్పేయవచ్చు వారు ఏ స్థాయిలో ఉన్నారో !

ప్రజలు అమాయకులు ! వారికి విషయాలు తెలియవు. దీన్ని ఆసరాగా చేసుకుని మతాధికారులు ఆడే ఆటలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా ప్రజలు కళ్ళు తెరవాలి. అన్ని శాస్త్రాల్లో, వేదాల్లో "నీవే దైవం" అని ఉంది. అది తెలుసుకోవడానికి శ్రీకృష్ణ భగవానుడు ధ్యానయోగం చేయమని చెప్పాడు. మరి వీళ్ళేంటి ఇది తప్ప అన్నీ చెప్తున్నారు అని ఆలోచించాలి. ఇలా ఆలోచించి ఆ సోది మాయల్లో నుండి బయట పడాలి.

దైవాలే మీరు ! దైవాలే అందరూ ! దైవమే అంతా ! ఈ సత్యాలు అందరికీ తెలియ జేయాలి.

గుర్తుంచుకోండి - మీరే దైవం అని చెప్పి మీ దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా ఎలా తెలుసుకోవాలో చెప్పే వారే, మీ దైవత్వం గురించి బోధించే వారే అసలు సిసలు గురువులు. ఇలాంటి వారినే ఆశ్రయించాలి. వారి మార్గదర్శకత్వంలోనే సాధన చేయాలి.

❖ ❖ ❖

59 ప్రశ్న : నమస్కారం సార్ ! ఇంట్లో ఎవరైనా చనిపోతే ఆ తర్వాత ఏమేమో చేస్తారు. ఏవేవో ఆచారాలు పాటిస్తారు. అవన్నీ అవసరమా ? వీటి వలన చనిపోయిన వాళ్ళకు ఏం లాభం జరుగుతుంది ? ఇవన్నీ చేయక పోతే బతికి ఉన్న వాళ్ళకేమైనా జరుగుతుందా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : అవేవి అవసరం లేదు. అవి చేస్తే చనిపోయిన వారికి ఒరిగేదేమీ ఉండదు. చేయకపోతే బతికి ఉన్న వారికి ఏమీ జరగదు. అవన్నీ సరైన ఆత్మ విజ్ఞానం లేక పోవడం వలన ఉన్న వ్యర్థ కార్యక్రమాలు.

ధ్యానం చేస్తే చనిపోయిన వారికి, బతికి ఉన్న వారికి ఇద్దరికీ లాభం జరుగుతుంది. ధ్యానంలో చనిపోయిన వారు కనపడి మాట్లాడే అవకాశం ఉంది. అప్పుడు వారినే అడిగి తెలుసుకోవచ్చు చనిపోయిన తర్వాత ఏం జరుగుతుందో !

ఎవరైనా చనిపోయినప్పుడు ధ్యానంలో కూర్చుని చనిపోయిన వారిని తలుచుకుని హృదయ పూర్వకంగా వారికి ప్రేమను ప్రకటించండి. మీకు వీలైనంత సేపు ధ్యానం చేయండి. వారికీ, మీకు ఎంతో శ్రేయస్కరం జరుగుతుంది.

❖ ❖ ❖

60 ప్రశ్న : గురు దేవులకు నమస్కారం ! కొంత మంది కర్మను నమ్ముతారు, మరి కొంత మంది నమ్మరు. ఏది కరెక్ట్ సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఏదీ కరెక్ట్ కాదు. రెండూ తప్పే ! ఎందుకంటే, కర్మ అనేది నమ్మే విషయమో లేక నమ్మకపోవడానికి సంబంధించిన విషయమో కాదు. అది తెలుసుకోవలసిన విషయం. కేవలం ఒక ''కర్మ''యే కాదు, ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన ఏ విషయమైనా స్వయంగా తెలుసుకోవలసిన విషయమే !

ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే ''కర్మ'' గురించి వివరంగా తెలియజేసాను, చదివి అవగాహన పెంచుకోండి.

❖ ❖ ❖

61 ప్రశ్న : సమాజంలో మోసపూరిత గురువులెందుకు ఉంటున్నారు ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మోసపోయే వారుంటున్నారు గనుక.

''పరస్పరం సారూప్యం గలవి, ఒకదానిని మరొకటి ఆకర్షించుకుంటాయి''.

- విశ్వ సూత్రం

మనం ఒకరి చేతిలో మోసపోయాము అని అంటే, ఆధ్యాత్మిక పరంగా ఈ కింది కారణాలుంటాయి :

1. మనలో మోస గుణం ఉంటేనే, మనం ఒకరి చేతిలో మోసపోతాము. ఇది నిజం. అయితే ఇది ఒప్పుకోడానికి చాలా కష్టమౌతుంది. ఎవరికైనా మంచి జరిగితే, నీ మంచే నీకు మంచి చేసింది, నీ మంచే నిన్ను కాపాడింది అని అంటారు. మరి మోసపోతే, నీ మోసపు గుణమే నిన్ను మోసపోయేలా చేసింది, అని మాత్రం అనరు. అంటే ఒప్పుకోరని అనరు. అన్నా అనకపోయినా, ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, ఇది మాత్రం సత్యం. మనలో మోసం చేసే గుణం ఉంటేనే, మనం మోసపోతాం. ఇది మొదటి కారణం.

2. గతంలో ఇది వరకు ఎవరినైనా మోసం చేసి ఉండడం. గతం అంటే, ఈ జన్మలోది కావచ్చు, పోయిన జన్మలలో ఏదైనా కావచ్చు. మనం ఏది ఇస్తే అది వేయి రెట్లుగా తిరిగి వస్తుందనేది - ఒక విశ్వ సూత్రం. ఇది రెండవ కారణం. మనం గత జన్మలో మోసం చేస్తే అది ఈ జన్మలో రావడం అనేది ఎంత వరకు కరెక్ట్ ? ఇది తప్పు, అని వాదించే వాళ్ళు కొంత మంది ఉన్నారు. అసలు సత్యాలు తెలియక పోవడం వలన, ఇలాంటి భావనలతో ఉంటారు. ఇలాంటి వారు తెలుసుకోవాల్సిన సత్యం ఏమిటంటే.... ఒక జన్మ చాలించి మరో జన్మ తీసుకోవడం అంటే ఏమిటంటే, డ్రెస్ చేంజ్ చేసుకోవడం లాంటిది. మనం రోజూ డ్రెస్ చేంజ్ చేస్తాం కదా... సరిగ్గా అలాగే అన్నమాట ! ఇప్పుడు ఉదాహరణకు, మీరు వైట్ డ్రెస్ వేసుకుని బ్యాంకులో లోన్ తీసుకున్నారు, ఆ తర్వాత ఆ లోన్ తీర్చకుండా మీ పనిలో మీరున్నారు. బ్యాంకు వాళ్ళు వచ్చి మిమ్మల్ని నిలదీస్తే, అప్పుడు అనగలుగుతారా, ఆ లోన్ అప్పుడెప్పుడో గతంలో తీసుకున్నాను, ఆ రోజు వైట్ డ్రెస్ వేసుకున్నాను, ఈ రోజు వేరే డ్రెస్ వేసుకున్నాను. గతంలో చేసిన దానికి ఇప్పుడు వచ్చి చెల్లించమనడం న్యాయం కాదని అంటే ఎలా ఉంటుంది ? బ్యాంకు వాళ్ళు ఊరుకుంటారా ?! అంతెందుకు మీకే ఎవరో అన్యాయం చేసారని అనుకోండి, మీరు వెళ్ళి నిలదీస్తే, అప్పుడెప్పుడో జరిగిన దానికి, గతంలో జరిగిన దానికి ఇప్పుడు వచ్చి న్యాయం అడగటంలో న్యాయం లేదని వాళ్ళు అంటే మీకు ఎలా ఉంటుంది ?మనం మోసపోయినప్పుడు ఆ బాధ ఏమిటో తెలిసి వస్తుంది. అప్పుడు మనం ఇతరులను మోసం చేయము. మనలో నీతి, నిజాయితీలను ఏర్పర్చేందుకే మోసపోయే పరిస్థితులు వస్తాయి.

ఆత్మ ఒక జన్మ తీసుకున్న తర్వాత, కొన్ని అనుభవాలు పొందిన తర్వాత, ఇక ఈ శరీరంతో పొందిన అనుభవాలు చాలు, అని నిర్ణయించుకుని, శరీరాన్ని వదిలేస్తుంది. ఈ మరణించడం అనేది ఏ రకంగానైనా ఉండచ్చు. సహజం కావచ్చు, ఆక్సిడెంట్ కావచ్చు, హత్య కావచ్చు మరేదైనా కావచ్చు. ఇలా మరణించిన ఆత్మ మరో కొత్త శరీరం తీసుకుని జన్మిస్తుంది. శరీరం కొత్తదే కాని, శరీరాన్ని ధరించిన ఆత్మ పాతదే ! ఏ ఏ గుణాలతో, ఎలాంటి అభిప్రాయాలతో, ఎంత అవగాహనతో పోయిన జన్మలో ఉందో, కొత్త జన్మలో కూడా అవే గుణాలు, అభిప్రాయాలు, అవగాహనలు ఉంటాయి.

పోయిన జన్మలో ఏ ఏ గుణాలతో అభిప్రాయాలతో అవగాహనలతో, ఏ ఏ పనులు చేసిందో - అవే గుణాలతో అభిప్రాయాలతో అవగాహనలతో అలాంటి పరిస్థితులనే ఈ కొత్త జన్మలో ఆకర్షిస్తుంది. చెడువైతే చెడువి, మంచివైతే మంచివి. అయితే ఆత్మ విజ్ఞాన అభ్యాసంతో మరియు ధ్యాన సాధనతో చెడువన్నీ మార్చుకోవచ్చు. చెడు పరిస్థితులను ఆకర్షించక ముందే మార్చుకుని, బయట పడవచ్చు. అయితే ఇందుకు ఆత్మ విజ్ఞానం మరియు ధ్యాన సాధన తప్పని సరి.

3. ఎవరినైనా "జడ్జ్" చేసి ఉండటం. అంటే, ఎవరైనా మోసపోయినప్పుడు, ముందు జాగ్రత్త పడాలి, ఎవరిని పడితే వాళ్ళను గుడ్డిగా నమ్మేయడమేనా... అంటూ హేళన చేస్తూ విమర్శించినందుకు మీకూ అలాంటి పరిస్థితులే వస్తాయి. అప్పుడు మీకు తెలిసి వస్తుంది.

జడ్జ్ చేసిన వారికి, తాము చేసిన జడ్జ్‌మెంట్లు గుర్తుండవు. అవి తిరిగి పరిస్థితుల రూపంలో వచ్చినా గుర్తించలేరు. తాము చేసిన జడ్జ్ మెంట్లను గుర్తించాలంటే, తప్పును ఒప్పుకునే ధైర్యం మరియు ఎంతో అవగాహన ఉండాలి.

4. కొంత మందికి మోసపోయే పరిస్థితి ఎందుకు వస్తుందంటే, "ఎదిరించే గుణాన్ని" ఏర్పరచుకోడానికి. తమకు అన్యాయం జరగకుండా ఎరుకతో ప్రవర్తించడానికి తద్వారా సురక్షితమైన జీవితాన్ని జీవించడానికి, పాఠాలు నేర్పించడానికి ఇలాంటి పరిస్థితులు వస్తాయి.

ఈ జడ్జ్‌మెంట్ గురించి ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే వివరించాను. బాగా చదివి అవగాహన చేసుకుంటే జడ్జ్‌మెంట్ల నుండి బయట పడవచ్చు.

జాగ్రత్త, నోటికి ఏం వస్తే అది మాట్లాడకండి, మనసులో కూడా అహంకారంతో విమర్శించకండి, మీ మాటలే, మీ విమర్శలే మీకు పరిస్థితుల రూపంలో వచ్చి గుణ పాఠాలు నేర్పిస్తాయి.

❖ ❖ ❖

62 ప్రశ్న : ఆత్మ అంటే ఏమిటి సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఆత్మ అంటే మీరే ! చెప్పడానికి వీలుకాని, చూపించలేని, వివరించడానికి సాధ్యం కానిది. కేవలం ఆత్మ విజ్ఞాన అవగావనతో మరియు ధ్యాన సాధనతో అనుభవ పూర్వకంగా మాత్రమే తెలుసుకోగలిగింది - ఆత్మ !

ఆత్మ గురించి ప్రశ్నలు వేయడం మాని, సాధన ప్రారంభించండి. తెలుస్తుంది.

❖ ❖ ❖

63 ప్రశ్న : లోకమంతా చెడ్డ వాళ్ళతో నిండి పోయి ఉందేమి సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : లోకం మంచిదే, లోకులూ మంచి వాళ్ళే ! నీ చెడ్డ నమ్మకాలను, అభిప్రాయాలను, అవగాహనలను మంచిగా మార్చుకుని చూడు. అప్పుడు నీకు లోకమంతా, లోకులంతా మంచిగా అనుభవంలోకి వస్తారు. ఇది సత్యం.

❖ ❖ ❖

64 ప్రశ్న : జీవితం అంటే ఏమిటి సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మాటల్లో కుదించి చెప్పడం కష్టం. కాని కొంత వరకు వివరించే ప్రయత్నం చేస్తాను.

జీవి యొక్క మూవ్‌మెంట్. జీవి యొక్క అనుభవాల సేకరణ. జీవి యొక్క ప్రయాణం. జీవి యొక్క విస్తరణ. జీవి అంటే నీవు. జీవి కలిగి ఉండేదే జీవితం. జీవి వేరే, జీవితం వేరే కాదు. ఉదాహరణకు, దీపం వేరే, వెలుగు వేరే కాదు కదా ! దీపమే వెలుగు కదా. వెలుగు అనేది దీపంలో నుండే ఉద్భవిస్తుంది కదా. అలాగే జీవిలో నుండే జీవితం ఉద్భవిస్తుంది. దీపం పటిష్టంగా ఉండి, ఒత్తి మంచిగా ఉండి మరియు నూనె నాణ్యమైనది కలిగి ఉంటే, అప్పుడు మంచి వెలుగును ఇస్తుంది. దీపం ఎంత పెద్దదిగా ఉంటే అంత వెలుగును ఇస్తుంది. దీపం యొక్క నాణ్యత పైన వెలుగు ఆధారపడి ఉంటుంది. దీపం ఎంత పెద్దగా, ఎంత నాణ్యతను కలిగి ఉంటుందో, అలాంటి వెలుగునే, అంత వెలుగునే ఇవ్వగలుగుతుంది. సరిగ్గా ఇదే విధంగా జీవి ఎంత ఆత్మ విజ్ఞాన అవగాహన కలిగి ఉంటాడో, ఎంతైతే ధ్యాన సాధన చేస్తూ ఉంటాడో అంత నాణ్యమైన జీవితాన్ని కలిగి ఉంటాడు. ఎందుకంటే జీవిలోంచే ఉద్భవిస్తుంది కదా జీవితం ! జీవి యొక్క అనుభవం మరియు అవగాహనలను బట్టి ఉంటుంది జీవితం.

జీవితం తెల్ల కాగితం లాంటిది, దాని పైన నీవు ఏం రాస్తావో అదే నీ జీవితం అవుతుంది. జీవితానికి పర్టిక్యులర్‌గా ఇదీ అంటూ నిర్వచనం ఏమీ లేదు. నీవు ఏ విధంగా నిర్వచించినా ఆనందంగా స్వీకరిస్తుంది జీవితం. అందుకే, అందరూ తమకు తోచినట్టుగా నిర్వచించ గలుగుతున్నారు.

నిజానికి, జీవితం ఎంతో మహత్వపూర్ణమైనది. జీవితం ఎంతో అందమైనది. జీవితం రంగుల మయం. జీవితం ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాల మయం. జీవితమెంతో కరుణాపూరితమైనది. మనం కోరుకున్న విధంగా మారుతూ, మనల్ని అనుక్షణం కాపాడుతూ, మనల్ని అభివృద్ధి పథంలో కొనసాగేలా చూస్తూ ఉంటుంది. జీవితమెంతో ప్రేమ మయం. జీవితం పరమోన్నతమైనదీ, పరమోత్తమమైనది కూడా ! కాబట్టి జీవితం పట్ల గౌరవం, ప్రేమ, ఆనందం, ధన్యవాద భావనలను కలిగి ఉండాలి ఎప్పటికీ ! ప్రతీ ఒక్కరి జీవితానికీ పరమార్థం ఉంటుంది.

జీవితం అంటే కేవలం ఈ ఒక్క జన్మకు మాత్రమే సంబంధించినది కాదు. నీవు ఆత్మగా సృష్టించబడినప్పటి నుండీ ఇప్పటి వరకు నీవు ఎన్ని జన్మలెత్తావో వాటన్నింటి సారమే జీవితం. ఇంకా ఎత్తబోయే జన్మలే నీ జీవితం. కేవలం ఈ లోకంలో, ఈ శరీరంతో మాత్రమే కాకుండా, ఎన్నో శరీరాలతో, ఎన్నెన్నో లోకాలలో, ఎన్నో విశ్వాలలో నీవు జీవిస్తూ ఉన్నావు, వాటిన్నింటినీ కలిపితే... అదీ నీ జీవితం.

జీవి యొక్క అనంతమైన ప్రయాణమే జీవితం. జీవి యొక్క అనంతమైన ప్రయాణంలో ఒక్కో మజిలీయే, ఒక్కో జన్మ !

జీవి కోసమే జీవితం కానీ, జీవితం కోసం జీవి కాదు !

జీవి కోసం ఎలా అంటే అలా మారిపోతుంది జీవితం !

వాస్తవంగా జీవితం ఎంతో దివ్యమైనది !

మన జీవితాన్ని ఎలా అంటే అలా మలుచుకోగల శక్తి సామర్థ్యాలు, స్వేచ్ఛా సాధికారతలు అన్నీ మనకు ఉన్నాయి. మన శరీరాన్ని + జీవితాన్ని మనకు కావల్సిన విధంగా ఎలా మార్చుకోవాలో తెలియజేసేదే ఆత్మ విజ్ఞానం.

❖ ❖ ❖

❻❺ ప్రశ్న : ఎంతో మహాత్ములూ, మంచి వారైన మీ మీద కూడా అప్పుడప్పుడూ అనుమానాలు మరియు కోపం వస్తూ ఉంటుంది. ఇవన్నీ మీ విశాల పరిధిని జీర్ణం చేసుకోలేని నా యొక్క సంకుచిత భావాలేనని నాకు తెలుసు. వీటిని క్లియర్ చేసుకుని నేను బాగుపడటం ఎలా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : పేపర్ మీద మీ

అనుమానాలను, కోపం వచ్చిన సందర్భాలను రాసుకోండి. ఆ తర్వాత ధ్యానంలో కూర్చుని ఒక్కో దాన్ని గుర్తు చేసుకుని దీని మూలం ఏమిటి ? అని ప్రశ్నించుకోండి. ఆ ప్రశ్న పైనే మీ ఎరుకను ఫోకస్ చేసి ఉంచండి. ప్రేమగా ఎరుకతో సాక్షిగా నిరీక్షించండి. మీ ఫోకస్‌ను అలానే ఉంచాలి. ఇలా చేస్తూన్నప్పుడు, ఆ మూలం ఏమిటో బయట పడి శాశ్వతంగా క్లియర్ అయిపోతుంది. క్లియర్ అయింది అనడానికి ఋజువు ఏమిటంటే క్లియర్ అయిన విషయం పైన మీకు అనుమానం కానీ, కోపం కానీ ఇక రాదు. అదే నిదర్శనం. మొత్తం క్లియర్ అయ్యే వరకు చేస్తూనే ఉండాలి.

❖ ❖ ❖

66 ప్రశ్న : అందరూ మిమ్మల్ని ఎంతో గాఢంగా విశ్వసిస్తున్నారు. మరి నేను ఎందుకు మిమ్మల్ని విశ్వసించలేక పోతున్నాను ? అసలు మిమ్మల్ని ఎందుకు విశ్వసించాలి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : విశ్వసించకు. నన్ను విశ్వసించమని నేను నిన్ను, అడిగానా ? నీవు, నన్ను విశ్వసించవలసిన అవసరం ఏముంది ? నీకు గురువు అవసరం లేదు కాబట్టి నన్ను విశ్వసించలేకపోతున్నావు. నీకు, నీ మీద నమ్మకం లేదు. నీవు బాగా నెగెటివిటీని కలిగి ఉన్నావు. నీకు అతి తెలివి ఉంది అందుకే నన్ను విశ్వసించలేకపోతున్నావు. ఎవరైతే తమను తాము విశ్వసించగలుగుతారో వారు గురువును కూడా విశ్వసించ గలుగుతారు. తమను తాము నమ్మని వారికే ఈ సమస్య వస్తుంది. మీ మీద మీకున్న అనుమానాలే నా పట్ల కూడా కలుగుతాయి. కానీ మీరు అది గుర్తించరు. మీకు ఆ విషయం తెలియదు. మీ పైన మీకు ఉన్న అనుమానాలే, నా పట్ల కూడా కలుగుతున్నాయి అన్న సంగతి మీకు తెలియనే తెలియదు. కాబట్టి మిమ్మల్ని మీరు సరి అని అనుకుంటారు. ముందు, ఈ సత్యాన్ని తెలుసుకోండి - నా పట్ల కలిగే అనుమానాలన్నీ కూడా మీవే ! మీ పట్ల మీరు కలిగి ఉన్న అనుమానాలు నా పైన ప్రసరిస్తూ, ఆ విషయం తెలుసుకోకుండా ఉన్నారు. మీ పట్ల మీకున్న అనుమానాలను తొలగించుకుని, మిమ్మల్ని మీరు పూర్తిగా విశ్వసించుకోండి. ఆ తర్వాత నన్ను విశ్వసించే దగ్గరికి వద్దాం.

నా మార్గంలోకి రావలనుకున్న వారు, నా శిష్యరికం చేయాలనుకునే వారు నన్ను విశ్వసించాల్సిన అవసరం ఉంది కదా ! లేకపోతే నా దగ్గరికి రావాల్సిన అవసరం ఏం ఉంది ? నా దగ్గరికి రాకు !

నన్ను విశ్వసించకు !

నన్ను విశ్వసించే వారిని అడుగు, వారు ఎందుకు నన్ను విశ్వసిస్తున్నారో ?!

❖ ❖ ❖

67 ప్రశ్న: నెగెటివ్ ఆలోచనలతో, చాలా ఇబ్బంది పడుతున్నాను. ఏదైనా జరుగుతుందేమోనన్న భయంతో టెన్షన్ పడుతున్నాను. చాలా నరక ప్రాయంగా ఉంది సార్.

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఇది చాలా మంది ఎదుర్కొనే సమస్య. మీకు భయం వేసినప్పుడల్లా, మీకు ఏదైనా నెగెటివ్ ఆలోచన వచ్చి టెన్షన్‌కు గురి చేసినప్పుడల్లా... ఈ విధంగా సాధన చేయండి.

సృష్టి సర్వస్వానికి మూలమూ, ఆధారమూ అయిన ఆ యొక్క మూల చైతన్యమే నాలో ఉంది. ఆ మూల చైతన్యమే నేను, ఆ దైవమే నేను. నేనే దైవం.... నేనే దైవం... అని అనుకుంటూ దైవత్వ సాధన చేయండి. మహాద్భుతంగా అన్ని భయాలు శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి.

❖ ❖ ❖

68 ప్రశ్న : తన పూర్వ జన్మలోని ప్రియురాలు, ఈ జన్మలో తన కూతురిగా జన్మించింది అని ఒకాయన తన అనుభవం చెప్పగా విన్నాను. ఇది చాలా విడ్డూరంగా ఉంది. ఇలా జరిగే అవకాశం ఉందా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : లోతైన ఆత్మ విజ్ఞాన అవగాహన లేనప్పుడు విడ్డూరంగానే ఉంటుంది. ఒక కోణంలో జీవితం అనేది ఒక సినిమా లాంటిది. ఒక్కో జన్మలో ఒక్కో పాత్ర ధరిస్తాము. అందరూ ఇంతే. అనుభవ విజ్ఞానం కోసం ఆత్మ రక రకాలైన పాత్రలను ధరిస్తుంది. ఏ జన్మ పాత్ర ఆ జన్మకే పరిమితం అవుతుంది. ఒక్కోసారి అనుభవం అనేది పూర్తి కానప్పుడు మరు జన్మలలోకి ఆ పాత్ర విస్తరిస్తుంది. ఉదాహరణకు, ఒక సినిమాలో హీరో హీరోయిన్లుగా వేసిన వాళ్ళు మరో సినిమాలో అన్నా చెల్లెళ్ళుగా, తల్లీ కొడుకులుగా పాత్రలు ధరించడం మనం ఎన్నో సినిమాల్లో చూస్తూనే ఉన్నాం. నటులు కేవలం అప్పుడు ధరించబోయే పాత్రను మాత్రమే పట్టించుకుంటారు. అదే విధంగా ఆత్మ కూడా. అనుభవ జ్ఞాన సేకరణ కోసం ఆత్మ తనకు నచ్చిన, అవసరం అనుకున్న ఏ పాత్రనైనా ధరిస్తుంది. ఇందులో చోద్యం ఏమీ లేదు. ఆత్మ విజ్ఞాన అభ్యాసం చేస్తూ మరియు ధ్యాన సాధన చేస్తూ ఉంటే ఇలాంటి విడ్డూరాలు కలగవు. అర్థమైందా.

❖ ❖ ❖

69 ప్రశ్న : మీరు మమ్మల్ని పట్టించుకోనట్టుగానే ఉంటారు. పరిశీలనగా చూస్తే పట్టించుకున్నట్టుగానే అనుభవం అవుతుంది. కాస్త అయోమయంగా ఉంది సార్....

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : గురువు ఎప్పుడూ తన శిష్యులను పట్టించుకుంటూనే ఉంటాడు. నేనూ అంతే. మీరు నన్ను పట్టించుకున్నప్పుడు, నేను మిమ్మల్ని పట్టించుకున్నట్టు తెలుస్తుంది. మీరు నన్ను మరిచి పోయినప్పుడు, నేను పట్టించుకోవటం లేదని అనుకుంటారు. మీకు నేను గుర్తుకు వచ్చినప్పుడు నేను మిమ్మల్ని పట్టించుకున్నట్లు తెలుస్తుంది. ఇదంతా మీ ఆటనే..... నా ప్రియమైన శిష్యులారా ....! అయినా పట్టించుకోవడం అంటే ఏమిటి మీ దృష్టిలో ? ఎప్పుడూ ఒడిలో కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పాలా.... లేక 24 గంటలూ నా వెంట తిప్పాలా... లేక కౌగిలించుకుని ముద్దాడుతూ ఉండాలా...?! ఇంతకీ పట్టించుకోవడం అంటే మీ దృష్టిలో ఏమిటో ?! కాస్త అయోమయంగా ఉంది శిష్యులారా.....

❖ ❖ ❖

70 ప్రశ్న : ప్రియ గురుదేవా..... నేను మిమ్మల్ని ఎల్లప్పుడూ ప్రేమిస్తూనే ఉన్నాను. మీరు నన్ను ప్రేమిస్తున్నారా ? నా ప్రేమ మీకు తెలుస్తూ ఉందా, లేదా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నిజమైన ప్రేమ ఇలా ప్రశ్నలు అడగదు. ఊరికే అలా ప్రేమిస్తూ ఉంటుంది అంతే. వాస్తవమైన ప్రేమలో సందేహాలు ఉండవు. నీ ప్రేమ నాకు తెలిస్తేనే ప్రేమిస్తావా ? లేకపోతే ప్రేమించవా ? అసలైన ప్రేమలో షరతులు ఉండవు. ప్రేమ బేషరతుగానే ఉంటుంది. నీ ప్రేమలో సందేహాలున్నాయి మరియు షరతులు కూడా ఉన్నాయి. కాబట్టి ముందు నిజమైన ప్రేమ అంటే ఏమిటో తెలుసుకో.

❖ ❖ ❖

71 ప్రశ్న : మొన్నామధ్య జరిగిన క్లాస్‌లో రాణి మేడమ్ మీకు పాదాభి వందనం చేసిందట. అది చూసి మరొకామె పాదాభి వందనాలు అవసరమా, ఇలా దూరం నుండే గురువుకు ప్రేమను ప్రకటిస్తే సరిపోదా అని అడిగిందట. నిజమైన ప్రేమకు దగ్గర దూరం ఏవీ ఉండవు అని కూడా అన్నదట. ఆ సమయంలో మేము బయట ఉన్నాము. అప్పుడు మీరేదో చెప్పారట.... ఏం చెప్పారు సార్ ?- సిద్ధు

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : శిష్యులు గురువులకు పాదాభి వందనాలు

చేయటం అనేది సహజం. నేను పాదాభి వందనాలను అనుమతిస్తానా, అనుమతించనా అనే ప్రశ్నయే లేదు. నా పట్ల ఎవరికైనా గౌరవం ఉదయించి, ప్రేమతో, విశ్వాసంతో పాదాభి వందనం చేస్తే నేను కాదనను. అలా అని అందరిని చేయమనను. చేయాలనుకున్న వాళ్ళు చేస్తారు. అంతే. చేయని వారు చేయరు. అయితే ఇక్కడ విషయం ఏమిటంటే, పాదాభి వందనం చేయటంతో అహంకారం నశిస్తుంది. అందుకే పాదాభి వందనాలు. పాదాభి వందనం చేసినప్పుడు ఆటొమెటిక్‌గా గురువు ఆశీర్వదిస్తాడు, గురువు ఆశీర్వాదం ఎంతో మహత్వపూర్ణమైనది. శిష్యులకెంతో లాభదాయకమైనది. పాదాభి వందనంలో నిజమైన గౌరవం, ప్రేమ, విశ్వాసం ఉండాలి, అప్పుడే అది ఫలిస్తుంది. లేకపోతే వృథా కదా. తన పక్కనున్నామె నాకు పాద నమస్కారం చేసే సరికి, ఈవిడకి భయమేసింది నేను కూడా మొక్కాలేమోనని. అందుకే అలా ప్రశ్నించింది. దూరం నుండే నమస్కారం చేసి తన అహంకారాన్ని కాపాడుకుంది. అక్కడ ఎంతో మంది ఉన్నారు. ఎవరికీ భయం కలుగ లేదు. ఈవిడ యొక్క భయాన్ని స్పష్టంగా నేను గమనించాను. క్లాస్ అయిపోయిన తర్వాత అందరూ వెళ్ళే వరకు ఉండి ఆమె నా దగ్గరికి వచ్చి తన సమస్య చెప్పుకుంది. తను ఎవరినో ఇష్టపడుతుందట, అతను ఈమెను పట్టించుకోవటం లేదట. ఈమె అతడిని గాఢంగా ప్రేమిస్తూ ఉందట. తనకు ఎలాగైనా దగ్గరవ్వాలి, ఎలా ? అని నన్ను అడిగింది. అప్పుడు నేను "నిజమైన ప్రేమకు దగ్గర దూరం ఏవీ ఉండవు, అని నీవు ఇందాకే చెప్పావు కదమ్మా, ఇలా దూరం నుండే ప్రేమిస్తూ ఉంటే సరిపోతుందేమో, దగ్గర కావటం అవసరమా ? అని అడిగాను. దానితో ఆమెకు మాట రాక మౌనం అయింది. నన్ను గౌరవించి నాకు పాదాభి వందనం చేసే నా శిష్యురాలికి, నాకు, ఇక్కడున్న వాళ్ళందరికీ జ్ఞాన బోధన చేసిన నీవు ఇలా అడగటం ఎంత వరకు సమంజసం ? అని అడిగాను. విషయం తన దాకా వచ్చే సరికి కాస్త తెలిసి వచ్చింది. తర్వాత ఆమె సమస్యకు తగిన సాధనలను సూచించాను, వెళ్ళి పోయింది.

❖ ❖ ❖

72 ప్రశ్న : నేను సత్య మార్గంలోకి రాక ముందు, రక రకాల దేవుళ్ళకు ఏమేమో మొక్కుకున్నాను, ఇప్పుడు ఆత్మ విజ్ఞాన అవగాహన వచ్చిన తర్వాత అవన్నీ అర్థం లేనివి అని తెలుసుకున్నాను. కాని అవి గుర్తుకు వచ్చినప్పుడు మాత్రం భయం వేస్తుంది. మొక్కులు తీర్చక పోతే ఏమైనా అవుతుందా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఏమీ కాదు ! కూల్‌గా ఉండు. ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మొత్తం చదువు. ఆ తర్వాత....

క్షమ ప్రేమ ఎరుక సరైన పూర్తి అవగాహన

- ఈ సూత్రాన్ని సాధన చేస్తే అన్నీ క్లియర్ అయిపోతాయి.

❖ ❖ ❖

73 ప్రశ్న : ఆత్మ విజ్ఞాన అవగాహనతో మరియు ధ్యాన సాధనతో అన్ని అనారోగ్యాలు పోతాయి అని అంటున్నారు కదా, మరి మేము హాస్పిటల్‌కు వెళ్ళాలా వద్దా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఆత్మ విజ్ఞాన అవగాహనతో మరియు ధ్యాన సాధనతో అన్ని అనారోగ్యాలు పోతాయి అనే విషయం నిజమే ! అయితే ఈ నిజం అందరికీ వర్తించదు. మీ లోపల మందులు వాడి ట్రీట్‌మెంట్ తీసుకుంటేనే రోగాలు తగ్గుతాయి అనే నమ్మకాలు బలంగా ఉంటాయి. దానితో మందులు వాడితే కాని మీ రోగాలు తగ్గవు. ఎవరైతే ఈ నమ్మకాలను పూర్తిగా మార్చుకోగలుగుతారో వారికి ఇది ఖచ్చితంగా వర్తిస్తుంది. చిన్నప్పటి నుండీ చీదినా, తుమ్మినా, దగ్గినా, అవసరం ఉన్నా లేకపోయినా మందులు వాడి వాడి మీ లోపల మందులు వాడితే తప్ప ఏదీ తగ్గదు అని మీరు, ఫిక్స్ అయిపోయి ఉంటారు. కాబట్టి మీకు మందులు వాడితే తప్ప ఉపశమనం లభించదు. మందులు వాడుతూ హాస్పిటల్‌లో చనిపోతే ఎవరూ ఏమీ అనరు. కాని ఎవరైనా సత్య సాధకులు మందులు వాడకుండా రోగాలను తగ్గించుకునే ప్రయత్నం చేస్తూ ఉంటే మాత్రం విమర్శిస్తారు. ప్రాణాలతో చెలగాటం అని నిందిస్తారు. మందులు వాడిన ప్రతీ వారికి రోగాలు తగ్గి పోతున్నాయా ? హాస్పిటల్స్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నారా ? లేదే, అయినా సరే జనాలకు అదో తృప్తి.

అయితే మందులకు, మెడికల్ ట్రీట్‌మెంట్‌కు నేను వ్యతిరేకిని కాను. అవసరం అయినప్పుడు మందులు మరియు మెడికల్ ట్రీట్‌మెంట్ తప్పక తీసుకోవాలి.

ఆధ్యాత్మిక శాస్త్రం ప్రకారం, రోగాలు రోగాలు కావు. అపరిశుద్ధమైన భావాలే రోగాలుగా శరీరంలో ప్రకటం అవుతాయి. మెడికల్ ట్రీట్‌మెంట్ అనేది భౌతిక పరమైనది. సమస్య యొక్క మూలం లోపల ఉంటుంది. మెడికల్ ట్రీట్‌మెంట్ అనేది కేవలం ఈ జన్మకే, ఈ శరీరానికే పరిమితమై ఉంటుంది. స్పిరిచ్యువల్ ట్రీట్‌మెంట్ అనేది శరీరానికి, జన్మకు అతీతంగా వెళ్ళి ఆత్మ క్షేత్రంలో పని చేస్తుంది. అప్పుడు అది సంపూర్ణ సమగ్ర శాశ్వత చికిత్స అవుతుంది. కేవలం భౌతిక పరమైన ట్రీట్‌మెంట్ తీసుకుంటే అది ఈ జన్మలో తగ్గినట్టు అనిపించినా, దాని మూలం సరి కాకపోతే మరు జన్మలోకి కూడా వస్తుంది. దాని మూలం సరి అయ్యే వరకు ఎన్ని జన్మలైనా సరే వస్తూనే ఉంటుంది. కాబట్టే స్పిరిచ్యువల్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. నమ్మకాల వ్యవస్థను పూర్తిగా సరి చేసుకోని వారు మందులు వాడుతూ సాధన చేసుకుంటేనే మంచిది. వెనకా ముందూ చూడకుండా సాధన చేస్తూ మందులు వాడకం మానివేస్తే, దాని ప్రభావాన్ని అనుకూలంగా మార్చుకునే శక్తి ఉండాలి. అయితే తలుచుకుంటే ఎవరైనా మందులు పూర్తిగా మానివేసి ఆత్మ విజ్ఞాన అవగాహన ద్వారా మరియు ధ్యాన సాధనల ద్వారా పూర్తి ఆరోగ్యాన్ని పొందవచ్చు. అది వారి సంకల్పాన్ని బట్టి ఉంటుంది. వారి

పట్టుదల మరియు విశ్వాసాన్ని బట్టి ఉంటుంది. అందరూ దైవాలే ! దైవం తలుచుకుంటే కానిదేముంటుంది ? కాకపోతే మీ దైవత్వాన్ని మీరు ఎంత మేరకు వాడుకోగలుగుతారు.... అనే దాని పైన విషయం ఆధారపడి ఉంటుంది. 2005 చివరిలో నా పైన నేను కొన్ని ప్రయోగాలు చేసుకున్న తర్వాత... నన్ను నేను ప్రక్షాళన చేసుకునేటప్పుడు... 100 రోజులలో ఆల్‌మోస్ట్ మృత్యుముఖంలోకి వెళ్ళి వచ్చినంత పనైంది. ఆ దశలో నన్ను చూసిన వారెవ్వరూ నేను బతుకుతాను అని అనుకోలేదు. చాలా ఘోరమైన, దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాను. రీసెర్చ్‌లో భాగంగా ఏవేవో పెట్టుకున్నాను. వాటన్నింటినీ క్లియర్ చేసుకునే సరికి చుక్కలు కనపడ్డాయి. ఏ మందులూ వాడలేదు. ఒక్క టాబ్లెట్ కూడా వేసుకోలేదు. పూర్తిగా సాధన ద్వారానే నన్ను నేను బాగు చేసుకున్నాను. క్లీనింగ్ ప్రాసెస్ అయిపోయాక కేవలం 21 రోజుల్లో తిరిగి కోలుకున్నాను. మళ్ళీ నార్మల్‌గా అయిపోయాను. నేను నార్మల్‌గా అవడం చూసిన వారికి మతి పోయినంత పనైంది. ఆ సంఘటన ద్వారా ఆత్మ శక్తికి నేను ఒక నిదర్శనంగా నిలిచాను. జయహో ఆత్మ శక్తి ! కాబట్టి మీ శక్తి సామర్థ్యాలను ఒకటికి రెండు సార్లు అంచనా వేసుకుని, సాధన ప్రారంభించాలి. రోగాలు తగ్గక పోతే నా మీదో లేక ధ్యానం మీదో నింద వేయకుండా స్వయం బాధ్యతతో సాధన చేయగలిగితే చేయండి లేకపోతే లేదు. ఈ విషయంలో అంతిమ నిర్ణయం మీదే. ఏది చేసినా మీకు మంచి జరుగుగాక !

❖ ❖ ❖

74 ప్రశ్న : నాకు అప్పుడే తెల్ల వెంట్రుకలు 80% వచ్చాయి. వెంట్రుకలు చాలా ఊడిపోయాయి. బట్టతల కూడా ప్రారంభమైంది. మళ్ళీ నాకు నల్ల వెంట్రుకలు వస్తాయా ? ఇది సాధ్యమేనా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం :దట్టమైన, దృఢమైన, మృదువైన, నిగ నిగలాడే పొడవైన నల్లని వెంట్రుకలు మీకు శాశ్వతంగా వచ్చి తీరుతాయి. నిజంగా ఇది, సులభంగా, సరళంగా సుసాధ్యమే !

స్త్రీ పురుషులు, వయసుతో పని లేకుండా ఎవరికైనా ఇది సంభవమే !

ముందు మీరు, దట్టమైన, దృఢమైన, మృదువైన, నిగ నిగలాడే పొడవైన నల్లని వెంట్రుకలకు వ్యతిరేకంగా ఉన్నారు అని తెలుసుకోండి, ఈ విషయాన్ని ఒప్పుకోండి. ఆ తర్వాత ఈ కింది సాధన చేయండి. దట్టమైన, దృఢమైన, మృదువైన, నిగ నిగలాడే పొడవైన నల్లని వెంట్రుకలను శాశ్వతంగా పొంది ఆనందించండి. మీరు ఈ జన్మ చాలించేంత వరకు మీకు దట్టమైన, దృఢమైన, మృదువైన, నిగ నిగలాడే పొడవైన నల్లని వెంట్రుకలు ఉంటాయి.

క్షమ ప్రేమ ఎరుక దివ్య అవగాహన

ఈ సూత్రాన్ని సాధన చేస్తే మీరు ఖచ్చితంగా అనుకున్న దాని కంటే ఎంతో మెరుగైన ఫలితాన్ని పొందియే తీరుతారు. గతి తప్పని ప్రాప్తిని అందిస్తుంది ఈ మహా దివ్య సూత్రం. చాలా మందికి జరిగింది. మీకు జరగక పోతే అది మీ లోపమే !

ఆల్ ద వెరి బెస్ట్ !

❖ ❖ ❖

75 ప్రశ్న : నేను దాదాపు ఆరేళ్ళు 'ఆనాపానసతి' ధ్యానం చేసాను. ఈ ధ్యానం ద్వారా కొన్ని లాభాలు కలిగిన మాట నిజమే. అయినా, నా పరిస్థితిలో పెద్దగా చెప్పుకోదగ్గ మార్పేమీ కనపడలేదు. మొదటి సారి మీరు, మీ దైవత్వ సాధన గురించి చెప్పినప్పుడు నేను ఒక్క సారిగా ఒప్పుకోలేక పోయాను. నాకు ఆనాపానసతి ధ్యానమే హాయిగా అన్పించింది. అయితే ఒకప్పుడు ఆనాపానసతి ధ్యానాన్ని విశేషంగా, ఆల్‌మోస్ట్ భారతదేశమంతటా ప్రచారం చేసిన మీరే దాన్ని పూర్తిగా వదిలేసి, ఇప్పుడు ఈ ధ్యానం గురించి చెప్పడంలో నాకు అర్థం కాని పరమార్థం ఏదో ఉందనిపించింది. అందుకే నన్ను నేను బాగా సెల్ఫ్ కౌన్సిలింగ్ చేసుకుని మారి, మీ యొక్క దైవత్వ సాధన చేసాను. ఆశ్చర్యకరంగా, మీ దైవత్వ సాధన చేసిన మొదటి రోజే, ఎంతో మార్పును, నేను స్పష్టంగా గమనించ గలిగాను. వాస్తవంగా చెప్పాలంటే ఆనాపానసతి ద్వారా ఆరేళ్ళుగా పొందని ఫలితాన్ని ఒకే ఒక సిటింగ్‌లో మీ దైవత్వ సాధన ద్వారా పొంద గలగడం ఆశ్చర్యంగా, అద్భుతంగా ఉంది. నేనే కాదు నా లాంటి వాళ్ళు చాలా, చాలా మంది ఉన్నారు. ఆరేళ్ళు = ఒక సిటింగ్ ! ఇంత తేడా ఎలా ?! దయచేసి వివరించ గలరు.

- చాలా, చాలా, చాలా, చాలా, చాలా, చాలా, చాలా, చాలా మంది అడిగారు

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఆనాపానసతి ఒక చాలా చిన్న ధ్యాన పద్ధతి. ఇది ఫలితాలను చాలా, చాలా నిదానంగా ఇస్తుంది. మార్పు అనేది ఈ ధ్యానం ద్వారా ఎంతో మెల్లి మెల్లిగా అవుతుంది. ఒకప్పుడు నేనూ దీన్ని చాలా గొప్ప ధ్యానంగా పరిగణించాను. చెప్పాను కూడా. కాని లోతుగా పరిశోధిస్తే దీని సంగతి బయట పడింది. అప్పుడు నేను చాలా షాక్‌కు గురి అయ్యాను. చాలా, చాలా నిదానంగా ఫలితాలను ఇచ్చే ఈ ఆనాపానసతి ధ్యాన పద్ధతిని, నేను చాలా గొప్ప శక్తివంతమైనదని మరియు శీఘ్రవంతంగా ఫలితాలనిస్తుందని ప్రచారం చేసి తప్పు

చేసానా అని బాధ పడ్డాను. మౌనంగా కొన్ని నెలలు అలా ఉండి పోయాను. ఒక రోజు "ఏదో ఒకటి చేసావు కదా, అనవసరంగా బాధ పడకు అని నా దైవత్వంలో నుండి మెసేజ్ వచ్చింది". దాంతో నేను కుదుట పడ్డాను. అయినా ఏం చేయాలో పాలుపోక అలా ఉండి పోయాను. అప్పటికే నేను ప్రపంచంలో ప్రచారంలో ఉన్న ప్రధానమైన ధ్యాన పద్ధతుల మీద ఒక సారి పరిశోధన చేసాను. మళ్ళీ మరోసారి పరిశోధించాలి అని, మళ్ళీ రీసెర్చ్ మొదలు పెట్టాను. అలా చేస్తూ, చేస్తూ..... ఆధ్యాత్మిక సూత్రాలను ఆచరిస్తూ రక రకాలుగా ప్రయోగాలు, పరిశోధనలు చేస్తూ ఉన్న దశలో ఒక రోజు నాకు "అల్ట్రా కాన్షియస్" నుండి, మెసేజ్‌లు రావడం మొదలైంది. వాటిని స్వీకరిస్తూ, అర్థం చేసుకుని ఆచరిస్తూ పరిశోధించసాగాను. ఫలితాలను పరిశీలిస్తూ, రక రకాలుగా ప్రయోగాలు చేస్తూ సాధనల మీద సాధికారత సంపాదించ సాగాను. **అప్పుడు నా లక్ష్యం ఒక్కటే, ఈ సారి నేను ప్రపంచానికి పరిచయం చేయబోయే ధ్యాన పద్ధతి నిజంగా అత్యంత శక్తి వంతమైనది, అత్యంత శీఘ్రంగా ఫలితాలను ఇచ్చేది, సంపూర్ణమైనది, సమగ్రమైనది, పరమోన్నతమైనదీ అయి ఉండాలి అని ! అలా మూడు సంవత్సరాలు విశేషమైన పరిశోధనలు & ప్రయోగాలు చేసాను.** పరమాత్మ స్వరూపులు రాసిన గ్రంథాలను దేశ విదేశాల నుండి తెప్పించుకుని చదువుతూ, సాధన చేస్తూ నా జీవితాన్నే పణంగా పెట్టి ప్రయోగాలు చేసాను. ఈ మూడు సంవత్సరాల్లో నేను ఒక సంవత్సరమైతే అసలు బయటకే రాలేదు. మిగిలిన రెండు సంవత్సరాల్లో పుస్తకాల కోసం మరియు ఇతర అత్యవసర పనుల కోసం చాలా తక్కువ సార్లు బయటికి వచ్చాను. నా శిష్యులు చాలా మంది ఈ మూడు సంవత్సరాల్లో, ఈ ప్రయోగాల్లో పూర్తి అంకితభావంతో పాల్గొన్నారు. మూడు సంవత్సరాల పరిశోధనలో నేను తెలుసుకున్న విషయం ఏమిటంటే, నేను భూమి మీదకు వచ్చిందే, కొన్ని వినూత్నమైన, పరమోన్నతమైన ధ్యాన సాధనలను పరిచయం చేయడానికి మరియు పరమోన్నతమైన ఆత్మ విజ్ఞానాన్ని అందించడానికి. నేను నిరంతరంగా ధ్యాన సాధనలో ఉండే సరికి నా జన్మ యొక్క పరమ లక్ష్యం పూర్తిగా బయట పడింది. నా జన్మ యొక్క మహా కారణాన్ని, దివ్యోద్దేశాన్నీ పూర్తిగా తెలుసుకున్న నేను - మూల చైతన్యం అందించే పరమోత్తమ, పరమోన్నత ఆత్మ విజ్ఞానాన్ని మరియు పరమోత్తమ, పరమోన్నత ధ్యాన సాధనలను, మూల చైతన్యం నుండి డౌన్‌లోడ్ చేసుకుని ప్రాక్టికల్‌గా నా పైన ప్రయోగించుకుని, ఫలితాలను పరిశీలించి, నిర్ధారించుకుని, అప్పుడు ప్రపంచానికి ప్రకటించాను. ప్రస్తుతం ప్రపంచంలో ప్రచారంలో ఉన్న ధ్యాన సాధనలలో చాలా రకాలైనవి ఉన్నాయి. వాటిలో కొన్ని సూపర్ లెవెల్‌కు అంటే పరమోత్తమ స్థాయికి సంబంధించినవైతే మరికొన్ని మధ్యమ స్థాయికి చెందినవి, ఇంకొన్ని కింది స్థాయి లేదా ప్రాథమిక స్థాయికి సంబంధించినవి. ఇలా ప్రాథమిక స్థాయికి లేదా బేసిక్ లెవెల్‌కు సంబంధించినదే ఈ ఆనాపానసతి ధ్యానం.

ఈ ధ్యాన పద్ధతి, సహజమైన శ్వాసను గమనించమని చెప్తుంది. సహజమైన శ్వాసను గమనించినప్పుడు, మనసు శూన్యం అవుతుందని, అప్పుడు విశ్వమయ ప్రాణశక్తి లోపలికి ప్రవహిస్తుంది..... దానితో సాధకుడికి దివ్యత్వం ప్రాప్తిస్తుంది, అని చెప్తుంది ఈ ధ్యాన పద్ధతి. ఇదంతా బాగానే ఉంది....

కాని ఇందులో ప్రధానమైన రెండు సమస్యలు ఉన్నాయి.

ఒకటి : సహజ శ్వాస

రెండు : మనసు శూన్యం కావడం

మొదటి సమస్య, సహజ శ్వాస యొక్క వివరణ : అజ్ఞానపు భావాలను ఎన్నో కలిగి ఉన్న మానవుడికి, సహజమైన శ్వాస క్రమం ఏనాడో తప్పిపోయింది. ఎందుకంటే.....

భావాన్ని బట్టి శ్వాస - శ్వాసను బట్టి భావం !

మీరు శ్వాసించే పద్ధతి, మీ భావాన్ని బట్టి మారుతూ ఉంటుంది. మీలోని భావావేశాలు మీ శ్వాస క్రియ పైన ప్రభావాన్ని చూపెడతాయి. మీరు ఆందోళనతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు కోపంగా ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు నిరాశతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు కామోద్రేకంతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీ రతీ కార్యం అయిపోయిన తర్వాత ఒక రకంగా, మీరు ప్రేమతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు ప్రశాంతంగా ఉన్నప్పుడు మరో రకంగా.... ఇలా మీ భావాన్ని బట్టి, మీ శ్వాస మారుతూ ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే శ్వాస మరియు భావం రెండూ ఒకేదాని చివరలు. ఈ రెండూ కలిసి ఉంటాయి. ఒక దానిలో మార్పు వస్తే రెండవది కూడా మారుతుంది. శ్వాసలో మార్పు తీసుకు వస్తే భావంలో మార్పు వస్తుంది. భావాన్ని మారిస్తే శ్వాస మారుతుంది. అనేకానేక జన్మలలో మీరు పోగు చేసుకుని ఉన్న "సరికాని భావాలు" ఎన్నో మీ లోపల ఉంటాయి. ఇవన్నీ కూడా మిమ్మల్ని శ్వాసను "మూలం" నుండి తీసుకోనీకుండా అడ్డం పడుతూ ఉంటాయి. ఈ సరికాని భావాలే మీ శరీరంలో రోగాలుగా, జబ్బులుగా మరియు జీవితంలో కష్ట నష్టాలుగా ప్రకటం అవుతూ ఉంటాయి. ఇవి మీలో పాతుకుపోయి ఉంటాయి. మీరు మీ లోపల అనేకానేక భావాలను అణిచి ఉంచారు. అవి అన్నీ మీ సరైన శ్వాస క్రియకు అవరోధం కలిగిస్తూ ఉంటాయి. మీ శ్వాస లోతుగా లేకుండా పైపైనే ఉంటుంది. ఇలా పైపైన తీసుకునే శ్వాస మీ లోపల ఉన్న సరికాని భావాలను అలానే ఉంచేస్తుంది. ఇలా పైపైన తీసుకునే శ్వాసనే ''సహజ శ్వాస''గా, ఆనాపానసతి సాధకులు పరిగణిస్తారు. ఇక్కడే జరిగిపోతూ ఉంది, ఓ పేద్ద తప్పు. పైపైన శ్వాస తీసుకుంటూ ఉంటే లోపల ఉన్న సరికాని భావాలు విడుదల కావు. మీ లోపల

అణిచి పెట్టబడి ఉన్న సరికాని భావాలు మీ శ్వాస క్రియను ఒక క్రమ పద్ధతిలో ఉండేలా నియంత్రిస్తాయి. ఈ క్రమాన్ని ఆనాపానసతి సాధకులు ''సహజ శ్వాస'' అని అనుకుంటూ ఉంటారు. ఈ రకంగా ఆ సరికాని భావాలు తమ ఉనికిని కాపాడుకుంటూ తమకు అనుగుణమైన పరిస్థితులను ఆకర్షిస్తూ ఉంటాయి. ఆ పరిస్థితుల వలన మీకు ఎన్నో కష్టనష్టాలు వస్తూ ఉంటాయి.

లోపల ఉన్న సరికాని భావాలను వదిలించుకోవాలంటే, లోపల ఒక పెద్ద అల్లకల్లోలాన్ని సృష్టించియే తీరాలి. ఒక మహా గందరగోళాన్ని పుట్టించాలి. మీ శ్వాసలో తీవ్రమైన మార్పును చేసి తీరాలి. మీ శ్వాసను లోతుగా, వేగంగా మార్చాలి. ఎప్పుడైతే మీ శ్వాస క్రియలో మార్పు జరిగిందో ఆ క్షణమే మీ లోపల ఉన్న సరికాని భావాలు నిర్జీవమవుతాయి. మీ లోపల ఉన్న సరికాని భావాల పైన ఈ ''సడెన్ మార్పు'' అనేది, ఒక మహా ప్రభంజనంలా వీచి వాటిని చెల్లాచెదురు చేసి, మూలాలతో సహా శాశ్వతంగా పెకిలించి వేస్తుంది. మీరు వదిలే నిశ్వాసల ద్వారా మరియు మీ శరీరంలోని సంవేదనల ద్వారా, రక రకాలుగా లోపల ఉన్న సరికాని భావాలన్నీ విడుదలై వెళ్ళి పోతూ ఉంటాయి. ఆత్మ విజ్ఞాన పూరితం కాని భావాలే మన శరీరంలోని మరియు జీవితంలోని అన్ని కష్ట నష్టాలకు మూల కారణాలు. వీటిని వదిలి వేస్తే కాని మనం బాగుపడం. అయితే ఈ సరికాని భావాల పట్ల ద్వేషంతో రగిలి పోవద్దు. వాటి పట్ల నిరసన, నిందా భావనలను ప్రకటించడం మానివేయాలి. కేవలం సాధన చేస్తూ ఉండాలి. వాటి పట్ల మౌనంగా, ప్రేమతో ఎరుకతో సాక్షిగా ఉండాలి. అప్పుడు మీలో ఉన్న సరికాని భావాలన్నీ వాటంతట అవే పోతాయి.

రెండు, మనసు శూన్యం కావడం యొక్క వివరణ : ఆనాపానసతి ధ్యానాన్ని ఎన్నో ఏళ్ళుగా సాధన చేస్తూ, ఆ ధ్యాన ప్రచారానికే జీవితాన్ని అంకితం చేసుకున్న సీనియర్ సాధకులు ఎంతో మంది, మనసు శూన్యం కావడం లేదని నాతో చాలా సార్లు చర్చించారు. ఇది చాలా పెద్ద సమస్య. ఆనాపానసతి ధ్యానం ద్వారా మనసు శూన్యం అవడం అనేది నిజం. అయితే చాలా, చాలా కష్టం. మనసు శూన్యం కావడం లేదన్న విషయం ఆల్‌మోస్ట్ ఆనాపానసతి సాధకులందరికీ తెలుసు. వేలాది జన్మలుగా "సరికాని భావాలను ఎన్నింటినో కలిగి ఉన్న మానవులు, వాటిని దాటి ఆలోచనా రహిత స్థితికి చేరుకోవడం అనేది చాలా క్లిష్టమైన ప్రక్రియ". ఈ ఆనాపానసతి ధ్యాన పద్ధతి ద్వారా మనసును శూన్యం చేయడం, చాలా కష్టం మరియు చాలా నిదానం కాబట్టే ఫలితాలు చాలా మెల్లిగా వస్తాయి. ఈ సశాస్త్రీయ కారణాల వల్లనే, నీకు మొదటి సిటింగ్‌లో అంత తేడా కనపడింది. నీకే కాదు ఎవరికైనా ఈ అభివృద్ధి కనపడుతుంది. అయితే గుడ్డిగా సాధన చేయకుండా, విషయాలను అవగాహన చేసుకుని సాధన చేస్తే, అప్పుడు అభివృద్ధి శీఘ్రంగా జరగడమే కాకుండా దాన్ని స్పష్టంగా గుర్తించవచ్చు.

ఆనాపానసతి చాలా చాలా చాలా ఓల్డ్ టెక్నిక్. ఇప్పుడు ఈ న్యూ ఏజ్‌లో దానికన్నా లక్షల రెట్లు, కోట్ల రెట్లు శక్తివంతమైన ధ్యాన పద్ధతులు ఎన్నో వచ్చాయి. నేను ఈ

సద్గురు తారా విశాల్ మార్గదర్శిలో తెలియజేసినవి దాని కన్నా కోట్ల రెట్లు శక్తివంతమైనవి. ఈ అల్ట్రా మాడర్న్, హై టెక్ న్యూ ఏజ్‌లో ఆనాపానసతి ధ్యాన పద్ధతిని గౌరవంగా, ప్రేమగా వదిలేయాలి. దాని పని అయిపోయింది.

ఇప్పుడు నేను ఆనాపానసతి ధ్యాన పద్ధతి గురించి చెప్పిన వివరణలు చదివి, ఆనాపానసతి ధ్యాన పద్ధతిని చులకన చేయరాదు. ఆనాపానసతి వలన కొన్ని ఉపయోగాలున్నాయి. దీని వలన మోక్షం మాత్రం రాదు, జ్ఞానోదయం అస్సలు జరగదు. ఇది చాలా నిదానం, చాలా చాలా చాలా చాలా చిన్న మార్గం, అది వేరే విషయం.

నేను చెప్పే సాధనలు, సేత్ టెక్నిక్స్ మరియు రామ్తా పద్ధతులు ఇంకా ఇతర కొన్ని సాధనలు, పరమోత్తమ స్థాయికి చెందిన సాధనలు. పరమ ప్రాప్తానికి ఎల్లప్పుడూ పరమోత్తమ సాధనలే చేయాలి కదా.

❖ ❖ ❖

76 ప్రశ్న : మీరు ఎక్కువగా విదేశి మాస్టర్స్ గురించి చెప్తారెందుకు ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : విదేశీయులు కనిపెట్టిన వాటిని ఎన్నింటినో జీవన సౌకర్యాలుగా వాడుకుంటున్నప్పుడు రాని ప్రశ్న ఇప్పుడెందుకు వచ్చింది ? చివరికి నీ జీవితమే విదేశీయులు కనిపెట్టి అభివృద్ధి చేసిన కంప్యూటర్ ఫీల్డ్ పైన ఆధారపడి ఉంది కదా ! అప్పుడు కలగని స్వదేశీ అభిమానం ఇప్పుడెక్కడి నుండి పుట్టుకొచ్చిందో ?! ముందు మీ ఇంట్లో నుండి, శరీరం పైనుండి మరియు జీవితంలో నుండి విదేశీయులు కనిపెట్టిన వాటిని అన్నింటినీ పూర్తిగా తీసివేసి, ప్రశ్నిస్తే బాగుంటుంది. అప్పుడు చూపెట్టండి మీ దేశాభిమానం. మన భారత దేశం చాలా గొప్పది. దేశాభిమానం ఉండాలి, అయితే దురభిమానం ఉండకూడదు. మూర్ఖ, మూఢ అభిమానం ఉండకూడదు. మంచి ఎక్కడున్నా స్వీకరించాలి.

నీది చాలా తప్పుడు అభిప్రాయం. నేను పరమోత్తమస్థాయి బోధనలను చేసిన ప్రతీ మాస్టర్ గురించి చెప్తాను. కృష్ణ పరమాత్మ భారతదేశంలోనే కదా జన్మించింది. ఆయన గురించే నేను ఎక్కువగా చెప్తాను. సత్య ప్రచారం చేసే మాకు భూమి అంతా ఒక్కటే. మేము యావత్ భూ మండలాన్ని ఒకటిగానే చూస్తాము. మిమ్మల్ని కూడా అలాగే చూడమని, అర్థం చేసుకోమని చెప్తున్నాము. దేశ విదేశ, జాతి, మత, కుల, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఎదిగి, అందరూ ఒక్కటే అనే సత్యాన్నే అవగాహన చేసుకోమని చెప్తున్నాం. సత్య మార్గంలోకి రావాలని చూస్తున్న మీరు, మొట్టమొదట ఈ జాతి, మత, కుల, ప్రాంతీయ, దేశ విదేశ భావనల నుండి తప్పని సరిగా బయట పడాలి. లేకపోతే మీరు అణువంత కూడా బాగు పడరు. కాబట్టి దయచేసి అవగాహన పెంచుకుని ఎదగండి.

❖ ❖ ❖

77 ప్రశ్న : సార్ మీరు నార్త్ ఇండియనా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఇవేం ప్రశ్నలయ్యా ? ప్రశ్న అడిగితే మీ అభివృద్ధికి సంబంధించినదైనా అయి ఉండాలి లేదా అందరి శ్రేయస్కరానికి సంబంధించినదైనా అయి ఉండాలి. అయినా అడిగావు కాబట్టి ఈ సారికి చెప్తున్నాను, నేను ఇండియన్‌ను, తెలుగు వాడిని. మరోసారి ఇలాంటి పనికిరాని ప్రశ్నలు వేయవద్దని నీ లాంటి వారందరికి నిక్కచ్చిగా చెప్తున్నాను.

❖ ❖ ❖

78 ప్రశ్న : సార్ మతాలను ఎవరు సృష్టించారు ? దేవుడేనా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మతాలను మనుషులే సృష్టించారు. నిజమైన దేవుడికి, మతానికి ఏ సంబంధమూ లేదు, ఉండదు కూడా ! అయితే మత బోధనల్లో చాలా సత్యాలున్నాయి కానీ మత పెద్దలు ఎవరూ కూడా ఆ యొక్క అసలు సత్యాలను బోధించరు. పనికిరాని మూఢాచారాలను, మూర్ఖమైన విషయాలనే బోధిస్తారు. మతం మానవ జాతిని చీల్చి వేసిన, వేస్తున్న ఒక భయంకర రాకాసి. దాని మాయలో నుండి తక్షణమే బయట పడాలి. మనం మానవులం. మనది మానవ జాతి. మనది మానవ కులం. మానవులంతా ఒక్కటే. ఇదే పరమ సత్యం. ఈ పరమ సత్యాన్నే మనం ఎలుగెత్తి చాటాలి. భూ మండలంలో ఈ పరమ సత్యాన్ని స్థాపించి తీరాలి. అప్పుడే లోక కల్యాణం జరుగుతుంది. ఇది మనందరి ఏకైక లక్ష్యం కావాలి. ఇందుకోసం మీరు ఉద్యమించండి, అందరినీ ఉద్యమింప చేయండి.

❖ ❖ ❖

79 ప్రశ్న : మత పెద్దలందరూ దేవుడు ఒక్కడేనని చెప్తారు. మరి, ఎందుకు ప్రతి మతం వారు వేరే మతం వారిని ద్వేషిస్తూ ఉంటారు సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఇదే మతంలోని మూఢత్వం. మూర్ఖత్వం. ఇందులో నుండి బయట పడినప్పుడే నిజమైన ఆత్మాభివృద్ధి కలుగుతుంది. మోక్షం ప్రాప్తిస్తుంది.

❖ ❖ ❖

80 ప్రశ్న : ఎంతో పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వారు కూడా జాతి, మత, కుల పట్టింపుల్లో ఉంటారు ఎందుకు సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : పెద్ద పెద్ద చదువులంటే ఏమిటి మీ దృష్టిలో ? అవి బతుకు దెరువును దొరకబుచ్చుకోడానికి మాత్రమే ఉపయోగ పడతాయి. అంతే తప్ప వ్యక్తిత్వ వికాసానికి చెందినవి కావు. అందుకే ఎడ్యుకేటెడ్స్ అనబడే వాళ్ళు అలా మూఢంగా ఉంటారు. పెద్ద పెద్ద చదువులు చదివిన వారందరూ వ్యక్తిత్వ పరంగా వికాసం చెంది ఉంటే, ప్రపంచంలో ఇన్ని ఘోరపరిస్థితులు ఎందుకు ఉంటాయి. ఏ మాత్రమూ చదువుకోని వారై ఉండి కూడా వ్యక్తిత్వంగా

మంచి గొప్ప స్థాయిలో ఉన్న వారెందరో ఉన్నారు. పెద్ద పెద్ద చదువులు చదివిన వారందరూ వ్యక్తిత్వ పరంగా ఎదిగిన వారు కారు అనే నిజాన్ని అర్థం చేసుకో. అయితే ఎడ్యుకేటెడ్స్‌లో ఎదిగిన వారు కూడా ఉంటారు.

❖ ❖ ❖

81 ప్రశ్న : సార్ నిజంగా మీరు చెప్పేవన్నీ సత్యాలేనా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : సరిగా అర్థం చేసుకుని, అవగాహనతో ఆచరించి చూడు నీకే తెలుస్తుంది. ఏదైనా సరే గుడ్డిగా నమ్మకూడదు కదా. ఆచరించకుండా ఉంటే నిజం ఏ నాటికి తెలియదు. కాబట్టి ఆచరించి అయినా చూడు లేదా ఇలాంటి ప్రశ్నలు వేయడం మానేసి, ఈ విషయాలను వదిలేసి నీ పనేదో నీవు చేసుకో.

❖ ❖ ❖

82 ప్రశ్న : సార్ మీరెంతో గొప్ప వారు. పరమాత్మ స్వరూపులు. మేము కూడా మీ అంత గొప్ప వాళ్ళం కావాలంటే ఏం చేయాలి సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలో నేను చెప్పిన విషయాలను సరిగా అర్థం చేసుకుని, అవగాహనతో సాధన చేస్తూ క్రమ క్రమంగా, జీవితాన్ని పూర్తిగా సత్య సాధనకు మరియు సత్య ప్రచారానికి అంకితం చేసుకుంటే ఏదో ఓ నాటికి మీరు కూడా గొప్ప వారవుతారు. నిజానికి మీరు ఇప్పుడు ఉన్నది ఉన్నట్టుగా పరమాత్మ స్వరూపులే. కాకపోతే ఆ విషయాన్ని మరిచి పోయారు. అంతే. మీరందరూ మీ పరమాత్మ తత్వాన్ని అనుభవ పూర్వకంగా, అతి త్వరలోనే తెలుసుకుందురు గాక !

❖ ❖ ❖

83 ప్రశ్న : సార్ మీ లాంటి అవతార పురుషులు, యుగపురుషులు అవతరించి మానవులకు ముక్తి మార్గం చూపకపోతే.... పరిస్థితి ఊహించడానికే భయంగా ఉంది.

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : సృష్టిలో ఎవరూ కూడా నిర్లక్ష్యం చేయబడరు. ప్రతీ ఒక్కరినీ పట్టించుకుంటుంది సృష్టి. సృష్టి యొక్క దృష్టిలో అందరూ సమానమే. అందరినీ ఎంతో ప్రేమిస్తూ, అనుక్షణం రక్షిస్తూ, అడిగిన వాటిని అన్నింటినీ అందిస్తూ, మన కోరికల్లో ఏవైనా మనకు హాని కలిగించేవి ఉంటే వాటిని సవరించి, మనకు ఎల్లప్పుడూ శ్రేయస్కరాన్ని అందిస్తూనే ఉంటుంది, ఈ సృష్టి. కాబట్టి సృష్టి పట్ల ఎల్లప్పుడూ ప్రేమ, ఆనందం, గౌరవం, ధన్యవాద భావాలనే కలిగి ఉండాలి. అయితే మీ అవగాహన అభినందించ దగింది.

❖ ❖ ❖

84 ప్రశ్న : ఈ సర్వ సృష్టిని సృష్టించిన సృష్టికర్త ఎక్కడుంటాడు సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మీలోనే ఉంటాడు. ప్రతీ దానిలో, ప్రతీ ఒక్కరిలో ఉంటాడు. ఆయనే మీరు, మీరే ఆయన. ఈ విషయాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకోండి అనే కదా నేను చెప్తున్నది.

❖ ❖ ❖

85 ప్రశ్న : న్యూ ఎనర్జి గురించి చెప్పండి సార్....

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : భూ మండలంలోకి న్యూ ఎనర్జి రావడం ప్రారంభమై రెండు దశాబ్దాలు దాటింది. ఇది ఒక సరికొత్త, వినూత్న అడ్వాన్స్‌డ్ ఎనర్జి. ఇది మానవుల స్థాయిని ఒక్క సారిగా పెంచేస్తుంది. ఎవరైనా సరే ప్రశాంతంగా ధ్యానంలో కూర్చుని, "నేను న్యూ ఎనర్జిని అనుమతించాను" అని అనుకుంటూ ఉంటే, వెంటనే వారిలోకి న్యూ ఎనర్జి ప్రవేశిస్తుంది. చాలా సింపుల్. నేను ఈ విషయాలను ఏ వెబ్‌సైట్‌లో నుండో తెలుగులోకి అనువదించి చెప్పటం లేదు. స్వ అనుభవంలో నుండి చెప్తున్నాను. న్యూ ఎనర్జి గురించి తెలియజేసే వెబ్‌సైట్లు ఇంటర్‌నెట్‌లో చాలా ఉన్నాయి. వాటిని చదివి, తెలుగులోకి అనువదించుకుని కొంత మంది నానా హంగామా చేస్తున్నారు. (అందరూ కాదు కొంత మంది) అయితే ఈ న్యూ ఎనర్జి పిచ్చగాళ్ళకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. సేత్ టెక్నిక్స్, రామ్తా బోధనలన్నీ న్యూ ఏజ్ & న్యూ ఎనర్జీకి సంబంధించిన గొప్ప సత్యాలే, న్యూ ఎనర్జిలో అద్భుతంగా పనిచేసే విషయాలే. నేను చెప్పేవైతే న్యూ ఏజ్ & న్యూ ఎనర్జికి సంబంధించినవే కాకుండా సూపర్ సుప్రీమ్ లెవెల్‌కు సంబంధించినవి. ఇంగ్లీష్ పుస్తకాలను చదివి లేదా ఇంటర్‌నెట్‌లో తెలుసుకుని తెలుగు అనువాదాలు చేసిన వారు గొప్ప వారే, కాదనటం లేదు, కాని వారు స్వయంగా ఎన్‌లైటెన్డ్ కాదు అని చెప్తున్నాను. నేను స్వయంగా ఎన్‌లైటెన్‌మెంట్‌ను పొంది, ఈ సత్యాలను ప్రకటిస్తున్నాను. మా లాంటి ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్‌కు, ఇంగ్లీష్ పుస్తకాలను చదివి, ఇంటర్‌నెట్‌లో తెలుసుకుని చెప్పే వారికి చాలా, చాలా, చాలా తేడా ఉంటుందని తెలుసుకోవాలి. స్వయంగా దైవత్వాన్ని పొంది, స్వంత అనుభవంతో, స్వంత అవగాహనతో, స్వంత బోధనలు చేసే మా లాంటి వారికి, వేరే ఎవరి బోధనలనో చెప్పే వారికి, భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉంటుంది అని తెలుసుకోవాలి. నేను

చెప్పే సాధనలు ఏవి చేసినా, న్యూ ఎనర్జి మీలోకి ప్రవేశిస్తుంది. న్యూ ఎనర్జి గురించి మీకు తెలిసినా, తెలియక పోయినా. నేను చెప్పే సాధనలు చేస్తే మీరు మోస్ట్ అడ్వాన్స్‌డ్ సూపర్ సుప్రీమ్ లెవెల్‌లోకి చేరుకుంటారు.

❖ ❖ ❖

86 ప్రశ్న : సార్ మీ గురువు ఎవరు ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఈ భూమి పైన నాకు ఎవరూ గురువు లేరు. ఎవరైనా ఉంటే ఈ సృష్టియే నా గురువు. నాకు నేనే గురువు. ఈ జన్మలో ఏ గురువు వద్దా నేను విద్యను అభ్యసించ లేదు. చాలా మంది యొక్క సబ్జెక్ట్ పైన రీసెర్చ్ చేసాను. ఈ రీసెర్చ్ చేసే క్రమంలో కొన్ని సంస్థలలో కొంత కాలం ఉన్నాను. నేను బోధించేదంతా నా పూర్వ జన్మలలో మరియు ఈ జన్మలో నేను సంపాదించిన అనుభవ విజ్ఞానమే. నేను చేసిన నా యొక్క పరిశోధనల మరియు సాధనల ఫలితమే నా సబ్జెక్ట్. ఏవో కొన్ని ఉదాహరణలు తప్ప ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోని బోధన అంతా నా స్వంతం. నాకు గురువులు ఉన్నారు కానీ, వారు ఈ భూమి అనబడే గ్రహం ఉద్భవించినప్పటి నుండి నేటి వరకు ఈ భూమి పైకి రాలేదు. ఇకపై రారు కూడా... !

87 ప్రశ్న : ఎంతో మంది మీ మార్గాన్ని అనుసరిస్తూ ఉన్నారు. కాని మీ కుటుంబ సభ్యులెవరూ కనపడరేంటి సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్ విషయంలో ఇది చాలా కామన్. మా కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు మరియు తెలిసిన వాళ్ళు అందరూ మమ్మల్ని సాధారణ స్థితిలో చూసి ఉంటారు. వాళ్ళతో, వాళ్ళలో ఒకరిగా ఉంటూనే మేము ఒక రోజు హఠాత్తుగా ఎన్‌లైటెన్డ్ అవుతాము. ఒక్క సారిగా జరిగిన ఈ పెనుమార్పును వారు జీర్ణించుకోలేరు. నిన్నటి వరకు మాలో ఒకడైన వీడు, సడెన్‌గా ఏవో సత్యాలు చెప్తున్నాడు అని ఫీలైపోతారు. అహం దెబ్బ తిని దూరంగా ఉంటారు. ఒకవేళ ఎక్కడైనా అనుకోకుండా కలిసినా ఈ టాపిక్ తీయరు. అహంభావంతో మమ్మల్ని గురువులుగా అంగీకరించలేరు. కాబట్టే మా లాంటి ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్ యొక్క కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు మరియు తెలిసిన వాళ్ళు మా దగ్గర ఉండరు. ఎవరో కొంత మంది అర్థం చేసుకున్న వాళ్ళు ఉంటారు. నా కుటుంబ సభ్యులను, బంధువులను, మిత్రులను మరియు తెలిసిన వాళ్ళను సౌభాగ్యవంతులని అనుకుంటూ ఉంటారు. కాని కాదు. ఎవరైతే మమ్మల్ని గురువులుగా గుర్తించి, గురువుగా అంగీకరిస్తారో వాళ్ళే నిజమైన సౌభాగ్యవంతులు. ఇంకా, ఓ రకంగా చెప్పాలంటే మా లాంటి ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్‌కు కుటుంబ సభ్యులుగా, బంధువులుగా, మిత్రులుగా మరియు తెలిసిన వాళ్ళ లాగా పుట్టక పోవడమే మంచిదేమోనని అనిపిస్తుంది. ఎందుకంటే అప్పుడు వాళ్ళు కూడా మా బోధనలను స్వీకరించి మీ లాగా సత్య మార్గంలోకి వచ్చి తరించే అవకాశం ఉంటుంది కదా.

88 ప్రశ్న : సార్ ! మీరు ఇంతకు ముందు ఎన్నో సార్లు ఈ భూమి పైకి సత్య ప్రచారం కోసం వచ్చారనీ, వచ్చినప్పుడల్లా ఒక పేరుతో వ్యవహరింప బడ్డారనీ, మీవి ఎన్నో అవతారాలు ఉన్నాయనీ, ఇప్పుడు ఉన్న ఈ "తారా విశాల్" అనే అవతారం చాలా గొప్ప విశిష్టతలను కలిగి ఉన్నదనీ మేము ధ్యానంలో స్పష్టంగా తెలుసుకున్నాము. మీ గురించి ఇంకా ఏమైనా చెప్పండి సార్....

- సీనియర్ MAB మెంబర్స్

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : బాగానే తెలుసుకున్నారు కదా. ఇంకేం కావాలి. కూడబలుక్కుని సాధన చేసారా ? లేక విడి విడిగా సాధన చేసి, కూడబలుక్కుని అడుగుతున్నారా ? చాలా విషయాలనే తెలుసుకున్నారు. మీకు తెలిసినవి కరక్టే కాని, ఇంకా చాలా విషయాలు ఉన్నాయి, అవి తర్వాత చెప్తాను.

❖ ❖ ❖

89 ప్రశ్న : సార్ ! మన "ధ్యాన యోగం మరియు సేవా సాధన" పుస్తకాల గురించి నాకు ధ్యానంలో ఒక అనుభవం వచ్చింది సార్. "ఈ రెండు పుస్తకాలు సృష్టిలోకెల్లా గొప్పవని కొంత మంది మాస్టర్స్ ఆ పుస్తకాలను పట్టుకుని చెప్తున్నారు". ఇది గొప్ప దివ్యమైన అనుభవం. నాకు చాలా ఆనందం వేసింది. అయితే మన MAB టీమ్‌లో నాకంటే సీనియర్లు ఎంతో మంది ఉండగా ఈ ఎక్స్‌పీరియన్స్ నాకే ఎందుకు వచ్చింది సార్ ? - సిద్ధు

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఎక్స్‌పీరియన్స్‌లు రాకపోతే రాలేదని ఏడుస్తారు. వస్తే నాకే ఎందుకు వచ్చిందనీ ఆశ్చర్య పోతారు. ఏమిట్రా మీరు..... ఏదో ఒక అర్హత నీకు ఉంటేనే కదా, మాస్టర్స్ నీకు ఆ యొక్క పరమ దివ్యమైన అనుభవాన్ని ఇచ్చారు. ప్రేమతో వారికి ధన్యవాదాలు తెలుపుకుని ఆనందించక, హైరానా పడిపోతావేంటిరా నాయనా !

❖ ❖ ❖

90 ప్రశ్న : గురు దేవా ! 27 జులై 2010 నాడు, నేను మా ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్ళాను. ఆ రోజు ఆ యొక్క దివ్య సమావేశానికి అందరూ హాజరయ్యారు, నేనే... మిస్ అయ్యాను. అయితే ఆ సమావేశంలో ఒకాయన చాలా విషయాలు మాట్లాడాడనీ... అందులో ఒక విషయాన్ని మీరు చాలా గొప్ప విషయంగా పరిగణించారని విన్నాను. మీరు అంతగా ప్రశంసించిన విషయం ఏమిటి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : సరైన లేక మంచి విషయాన్ని ప్రకటించడం లేక మంచి విషయాన్ని వ్యక్తీకరించడం లేక మంచి విషయాన్ని తెలియ జేయడం మరియు చెడు విషయాన్ని ప్రకటించక పోవడం. ఇదే ఆ యొక్క గొప్ప విషయం.

"ధన్యవాదాలను, ప్రశంసలను, ప్రేమను, ఇష్టాన్ని, ఆనందాన్ని, సరైన అవసరాన్ని, ఏదైనా మంచి విషయాన్ని ప్రకటించియే తీరాలి" అని ఆయన అన్నాడు. చెడు విషయాలను ప్రకటించక పోవడం మంచిది, మంచి విషయాలను మాత్రం ప్రకటించియే తీరాలి, దీని వలన ఎంతో లాభం చేకూరుతుంది, అని అన్నాడు. మనకు మన గురువు యొక్క అవసరం ఉంది. ఆయన లేనిదే మనకు జీవితం లేదు, మోక్షమూ లేదు.... కాబట్టి మనం మన యొక్క అవసరాన్ని ఇప్పుడు ప్రకటించియే తీరాలి అని అక్కడున్న వాళ్ళతో చెప్పాడు. అలా ఎందుకు చెప్పాడు, ఆ సందర్భం, ఆ సమయం అంతా ఇక్కడ వివరించి చెప్పడం కుదరదు. అది ఒక దివ్య రహస్యం. నీకు సమయం వచ్చినప్పుడు ముఖాముఖిగా చెప్తాను. అయితే ఆ దివ్య సమావేశంలో ఆయన చెప్పిన గొప్ప సత్యాలు ఇవి :

1. "ధన్యవాదాలను, ప్రశంసలను, ప్రేమను, ఇష్టాన్ని, ఆనందాన్ని, సరైన అవసరాన్ని, ఏదైనా మంచి విషయాన్ని ప్రకటించియే తీరాలి".

2. చెడు విషయాలను ప్రకటించక పోవడం మంచిది, మంచి విషయాలను మాత్రం ప్రకటించియే తీరాలి, దీని వలన ఎంతో లాభం చేకూరుతుంది.

ఈ రెండూ కూడా చాలా గొప్ప సత్యాలు. ఆయన యొక్క అవగాహన అభినందించ దగినది. మీరు అందరూ ఈ సత్యాలను అవగాహన చేసుకుని, నిజ జీవితంలో ఆచరించండి. వీటిని ఆచరిస్తే చాలా లాభాలను పొందుతారు.

అత్యధిక శాతం జనాలు, చెడును ఎక్కువగా మరియు తరచుగా ప్రకటిస్తూ ఉంటారు. ఉదాహరణకు కోపం రాగానే... తిట్ల పురాణం ఎత్తుకుంటారు కాని, ఆనందం కలగితే మాత్రం ఆనంద పురాణం ఎత్తుకోరు. పనికిరాని కువిమర్శలు, కోపాలు, వగైరా చండాలాన్ని అంతా బాగానే ప్రకటిస్తారు. సొల్లు సోంబేరి విషయాలు వ్యక్తీకరిస్తూనే ఉంటారు. ఒక వ్యక్తి ద్వారా 100 సార్లు సహాయం పొంది కూడా మౌనంగా ఉంటారు. ఆ 100 సార్లు సహాయం చేసిన వ్యక్తి 101వ సారి అనివార్య కారణాల వలన సహాయం చేయలేకపోతే... ఇక అంతే... ఇంతకు ముందు పొందిన 100 సహాయాలు గాలికి కొట్టుకు పోతాయి. 101వ సారి సహాయం చేయనందుకు ఆ వ్యక్తిని వీలైనంతగా తిట్టుకుంటారు. ఇలా ఎప్పుడూ చేయకూడదు. చాలా నష్ట పోతారు ఇలా చేస్తే. ఇది పాజిటివ్‌నెస్‌ను గుర్తుంచుకోలేని గుణం. ఇతరుల పాజిటివ్‌నెస్‌ను గుర్తుంచుకోని వ్యక్తికి, తన పాజిటివ్‌నెస్ కూడా గుర్తుకు ఉండదు. దీని వలన చాలా నష్టపోతాడు. కాబట్టి ఎప్పుడైనా సరే, జరిగిన లాభాన్ని, జరుగుతున్న మరియు జరగబోయే లాభాన్ని.... అంటే పాజిటివ్ అంశాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. సాధారణంగా

అందరూ ప్రభుత్వాన్ని విమర్శిస్తారు. కోర్టులను, ఎలక్ట్రిసిటి డిపార్ట్‌మెంట్‌ను, రైల్వేస్‌ను, ఆర్.టి.సి.ని, ఇంకా ఇతర ప్రభుత్వ విభాగాలను విమర్శిస్తూ ఉంటారు. కాని వాటి వలన పొందిన లాభాలకు ఒక్క సారైనా ధన్యవాదాలు తెలిపారా లేక మనసులోనైనా చెప్పుకున్నారా ?! ఒక సారి నిజంగా మిమ్మల్ని మీరు ఈ ప్రశ్న వేసుకుని, నిజాయితీగా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పుకోండి.

చెడు లేక నెగెటివ్ విషయాలను ప్రకటించ వద్దు అని అంటే, ఒక వ్యక్తిలో ఏవైనా లోపాలు ఉంటే అవి కూడా చెప్పకూడదా ? అనే సందేహం మీకీ పాటికి వచ్చి ఉండాలి. ఒక వ్యక్తిలోని లోపాలను సరైన విధంగా, అవగాహనతో అర్థమయ్యే విధంగా తప్పక చెప్పాలి. సరైన విధానంలో అవగాహనతో అర్థమయ్యే విధంగా లోపాల గురించి చెప్పడం అనేది నెగెటివ్ కిందికి రాదు, అలా చెప్పడం అనేది ఆ వ్యక్తిని అభివృద్ధి చెందించే పాజిటివ్ ప్రక్రియ కిందికి వస్తుంది. అయితే గుర్తుంచుకోండి, దీన్ని అడ్డం పెట్టుకుని ఆ వ్యక్తి యొక్క లోపాలను ఎత్తి చూపి అవమానిస్తే అది జడ్జ్‌మెంట్ అవుతుంది. అంతకు అంతా అనుభవించాల్సి వస్తుంది జాగ్రత్త !

హృదయ పూర్వకంగా ధన్యవాదాలను, ప్రశంసలను, ప్రేమను, ఇష్టాన్ని, ఆనందాన్ని, సరైన అవసరాన్ని, ఏవైనా మంచి విషయాలను ప్రకటిస్తూ ఉండండి. అనూహ్యమైన లాభాలను పొందుతూ ఉంటారు. ఇది "శ్రేయస్కర సాధన" !

❖ ❖ ❖

91 ప్రశ్న : గురుదేవా ! నేను విలేకరిగా జీవితాన్ని ప్రారంభించబోతున్నాను, ఆశీర్వదించండి.

- ఆనంద్

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చాలా బాధ్యతాయుతమైన పనిని నెత్తికెత్తుకున్నావు. చాలా ఎరుకతో, అవగాహనతో ప్రవర్తించు. నీ సరైన చర్య వలన ఎంత ప్రయోజనం జరుగుతుందో, నీ ఒక్క సరి కాని చర్య వలన అంతే నష్టం జరుగుతుంది. "కుక్క మనిషిని కరిస్తే అది వార్త కాదు, మనిషి కుక్కను కరిస్తే అది వార్త" అని ఎవరన్నారో తెలియదు కాని, ఈ భావన చాలా తప్పు. వార్తలనేవి ప్రయోజనకరంగా ఉండాలే తప్ప, పనికిరాని సొల్లు విషయాలతో కూడుకుని ఉండకూడదు. వార్త అనేది ఒక ప్రయోజనాన్ని కలిగించాలి. వార్త అనేది అభివృద్ధి కారకమై ఉండాలి. వార్త అనేది వికాస కారకం కావాలి. వార్త అనేది చైతన్య స్ఫూర్తిని రగిలించాలి. వార్త అనేది కేవలం నెగెటివ్ అనేది మాత్రమే కాదు. వార్త పాజిటివ్ అంశం కూడా. కేవలం కష్ట నష్టాలను, లోపాలను,

ప్రమాదాల పైనే ఎక్కువగా ఫోకస్ చేయకుండా, సమాజంలోని మంచిని ఎక్కువగా తెలియజేస్తూ ఉండు. నిరంతరం ఏదో ఒక వార్త అనేది జనాలకు చేరవేయాలి అనే ఆలోచన మాని, సరైన వార్తలను ప్రజా సంక్షేమార్థమై సేకరించి, సమాజాభివృద్ధికి నీ తోడ్పాటును అందించు.

❖ ❖ ❖

92 ప్రశ్న : స్వధర్మం అంటే ఏమిటి సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ''స్వయం'' యొక్క ధర్మమే ''స్వధర్మం''. ఈ యొక్క స్వధర్మం పైన జనాల్లో చాలా రకాలైన తప్పుడు అభిప్రాయాలు మరియు నమ్మకాలు ఉన్నాయి. స్వధర్మాన్ని పాటించమని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. ఆయన చెప్పిన కోణం వేరు - స్వామీజీలు, బాబాలు, మత గురువులు, ఆ గురువులు, ఈ గురువులు, ఫలానా గురువులు, పండితులు, భాషా వేత్తలు, సంస్కృత వైయాకరణులు, పూజారులు, పురోహితులు మరియు సాధారణ జనాలు అనుకుని ఆచరించేది వేరు ! పూర్తిగా వేరు !! వీళ్ళందరూ ''స్వధర్మం'' అని అంటే - స్వజాతి ధర్మం, స్వంత కులం, స్వంత మతం, స్వంత వర్గం, స్వంత సమూహం, స్వంత తెగ, స్వంత ప్రాంతం, స్వంత దేశం, స్వంత కుటుంబం ఇలా స్వంతదైన ప్రతీ భౌతికమైన దానికీ ఆపాదించుకున్నారు, అలానే ఆచరిస్తున్నారు. కృష్ణ పరమాత్ముడు చెప్పిన భావం ఒకటి, వీళ్ళు అనుకునేది మరొకటి ! ధ్యానయోగ సాధన యొక్క అనుభవపూర్వక విజ్ఞానం లేకపోవడం వలన ఇలా తప్పుగా అనుకుంటున్నారు.

స్వయం అని అంటే ఆత్మ ! ఆత్మ యొక్క ధర్మమే స్వధర్మం ! నీవు భౌతిక శరీరానివి కావు, ఆత్మవు కాబట్టి ఆత్మ యొక్క ధర్మాన్ని పాటించు అర్జునా... అని అర్జునుడితో పాటు నరులందరినీ ఆదేశించాడు దేవాధిదేవుడు. ఆత్మ యొక్క ధర్మమే పరమ ధర్మం. ఆ యొక్క పరమ ధర్మాన్ని పాటించిన వారు పరమ ప్రాప్తమే పొందుతారు. కాబట్టి అర్జునా సంశయించకు, అధైర్య పడకు, వ్యాకులతను వీడి... లే.. యుద్ధం చేయి... చంపేది ఎవరు ? చచ్చేది ఎవరు ? అంతా ఆత్మ మయం... ఆత్మవైన నీవు ఆత్మ విజ్ఞానం తెలుసుకో... నీ యొక్క స్వధర్మాన్ని అంటే ఆత్మ ధర్మాన్ని పాటించు అని చెప్పాడు కృష్ణ భగవానుడు ! అర్జునా... భౌతిక దృష్టితో చూస్తే, నీ ఎదురుగా ఉన్నవారు అంతా నీ జాతి వారుగా, నీ కులం వారిగా, నీ మతం వారిగా, నీ కుటుంబం వారిగా, నీ బంధువులుగా, నీ మిత్రులుగా, నీ ప్రాంతం వారిగా, నీ దేశం వారిగా, నీ భాష వారిగా కనిపిస్తున్నారు. అందుకే నీవు.... అయ్యో అంతా నా వాళ్ళే కదా... వీళ్ళతో యుద్ధం ఎలా చేయను ? అని వ్యాకుల పడుతున్నావు, దిగులు చెందుతున్నావు. నీవు కేవలం ఈ శరీరానికి సంబంధించిన, భౌతిక పరమైన అజ్ఞాన పూరితమైన దృష్టితో చూస్తున్నావు, కాబట్టే వాళ్ళంతా నీకు అలా కనపడుతున్నారు.. నీకు అలా అనిపిస్తూ ఉంది.. ఇది సరి కాదు. నీవు మరియు వాళ్ళందరూ ఆత్మలు... ఇది సత్యం ! ఆత్మ స్వరూపుడవైన నీవు, నీ

యొక్క "స్వయం" అయిన "ఆత్మ" యొక్క దృష్టితో చూడు, నీ వ్యాకులత అంతా పోతుంది. నీ సందేహాలన్నీ తీరిపోతాయి. నీవు "స్వయంభువు" అయిన ఆత్మ స్వరూపుడవు ! (స్వయంభువు అని అంటే తనంతట తానుగా జనించినది అని అర్థం. తనకు తానే మూల కారణమైనది అని అర్థం. స్వయం అయినది ఎల్లప్పుడూ స్వయం పోషకమే అవుతుంది.. స్వయంభువు అంటే అర్థం ఇంకా చాలా ఉంది, ఇక్కడ ఇంత చాలు) ఆత్మ విజ్ఞానం లేకపోవటం చేత అజ్ఞానంతో బాధ పడుతున్నావు, ఆత్మ విజ్ఞానం తెలుసుకో.. అజ్ఞానాన్ని పటాపంచలు చేయి అర్జునా... అని కదా శ్రీకృష్ణ దేవుడు చెప్పింది ! అర్జునా.. ఆత్మ స్వరూపుడైన నేను నీలోనూ ఉన్నాను, అందరిలోనూ మరియు అంతటా ఉన్నాను. నేను ఎవరో నాకు తెలుసు. కాని నీవు ఎవరో నీకు తెలియదు. నిజమైన నీవు, ఎవరో నీకు తెలుసుకోవాలని ఉంటే... "తస్మాత్ యోగీభవ అర్జునా" అంటే యోగివి కా అర్జునా... అనే కదా పరమాత్ముడు చెప్పింది. కురుక్షేత్ర యుద్ధానికి ముందు చెప్పిన భగవద్గీతలో మరియు కురుక్షేత్ర యుద్ధం అయిపోయి పాండవులు రాజ్యం చేస్తున్నప్పుడు చెప్పిన ఉత్తరగీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పినదంతా ఆత్మ విజ్ఞానమే ! కేవలం ఆత్మ విజ్ఞానమే ! ఆత్మ విజ్ఞాన అవగాహన ద్వారా ఆత్మ సాక్షాత్కారం జరుగుతుంది.

ఆత్మ స్వరూపులమైన మనం ఆత్మ సాక్షాత్కార సాధనకు అంకితం కావడమే స్వధర్మం కాని మరొకటి కానే కాదు, గాక కాదు !

స్వధర్మాన్ని పాటించండి అని అంటే, ఆత్మ యొక్క ధర్మాన్ని పాటించండి అని అర్థం ! ఆత్మ ధర్మాన్ని ఎలా పాటించడం ? అని అంటే, ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకుంటే ఆత్మ యొక్క ధర్మాన్ని పాటించడానికి వీలవుతుంది. ఆత్మ విజ్ఞానం ప్రధానంగా ఏం చెబుతుంది ? అని అంటే, ...నీవే దైవమని అనుభవ పూర్వకంగా తెలుసుకో... అని చెబుతుంది. తన దైవత్వాన్ని తాను అనుభవ పూర్వకంగా తెలుసుకోవడమే - స్వధర్మాన్ని పాటించడం అంటే ! అకర్మ శాకాహార + ధ్యాన + ఆత్మ విజ్ఞాన ప్రచారం అంటే సత్య ప్రచారం చేయడమే అసలు సిసలు స్వధర్మం అని అంటే !

❖ ❖ ❖

93 ప్రశ్న : పరమోత్తమ గ్రంథాలైన భగవద్గీత మరియు ఉత్తరగీతలను చదివి అర్థం చేసుకోవడానికి, సంస్కృత భాష నేర్చుకుందామనుకుంటున్నాను.....

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఇంగ్లీష్ భాష రావాలంటే ఇంగ్లండ్‌లో పుట్టాలి. గొప్ప క్రికెటర్ కావాలంటే క్రికెట్ స్టేడియంలో పుట్టాలి. పార్లమెంట్ మెంబర్ కావాలంటే పార్లమెంట్ ఆవరణలో పుట్టాలి. ప్రధాన మంత్రి కావాలంటే పార్లమెంట్‌లోనే పుట్టాలి. ఈత రావాలంటే నీళ్ళల్లో పుట్టాలి... అని అంటే ఎలా ఉంటుందో... ఇప్పుడు నీవు వేసిన ప్రశ్న కూడా అలానే ఉంది. సాధారణ గ్రంథాలను చదవడానికి నీవు చెప్పే టెక్నిక్ పనికి వస్తుందేమో కాని ఇక్కడ మాత్రం పనికి

రాదు. సంస్కృతం వచ్చిన వారెందరో ఆ గ్రంథాల్లోని శ్లోకాలకు తెలుగులో అర్థాలు వ్రాసి పెట్టారు. వడ్డించిన విస్తరిని కాదని సొంతంగా వండుకోవడం అవసరమా ?! అసలు ముఖ్య విషయం : భగవద్గీత, ఉత్తరగీత లేక ఇతర ఏవైనా ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన గ్రంథాలను చదవడానికి కావాల్సింది భాష కాదు, వ్యాకరణం అసలే కాదు, పాండిత్యం ససేమిరా కానే కాదు ! ఆత్మ విజ్ఞాన గ్రంథాలను అర్థం చేసుకోవడానికి కావాల్సింది ధ్యానయోగ సాధన ! ధ్యానయోగ సాధన యొక్క ప్రాక్టికల్ అనుభవం కావాలి ఆత్మ విజ్ఞాన గ్రంథాలను అర్థం చేసుకోవడానికి ! వాటిని అర్థం చేసుకోవడానికి గురువు యొక్క మార్గదర్శకత్వం అవసరం ! అర్థమైందా ? సొంత పెత్తనాలు చేసి తప్పు దారిలో నడవకండి. సాధన చేయండి. గురువును ఆశ్రయించండి. బాగు పడతారు.

❖ ❖ ❖

94 ప్రశ్న : పెద్ద వాళ్ళను గౌరవించాలి అని అంటారు... ఈ విషయం సరిగా అర్థం కావడం లేదు. దయచేసి వివరించండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : పెద్ద వాళ్ళు అని అంటే దేనిలో పెద్ద వాళ్ళు ? వయసులోనా ? వయసుకేం ? అలవోకగా అది అలా పెరిగి పోతూనే ఉంటుంది. అవగాహన ఉండద్దూ ? అడవిలో చెట్లు కూడా పెరుగుతాయి. వాటి వయసు కూడా బాగానే ఉంటుంది. తల వెంట్రుకలు నెరిసినంత మాత్రాన, 60/70/80/90/100/110 సంవత్సరాల వయసు ఉన్నంత మాత్రాన పెద్ద వాళ్ళు అని అనుకోకూడదు. లోకంలో అందరూ పెద్ద వాళ్ళు అనగానే వయసు పరంగా చూస్తారు, కాని ఇది తప్పు. పెద్దరికం అని అంటే అనుభవ పూర్వక అవగాహన ! శరీరం వయసు చిన్నగా ఉన్నా సరే... అవగాహన పెద్దగా ఉన్న వారే పెద్ద వారు. 60/70/80/90/100/110 సం॥ల వయసు ఉండి సంకుచిత మనస్తత్వం మరియు పనికిరాని గుణాలను కలిగి ఉంటే వారు, పెద్ద వారు ఎలా అవుతారు ?!?!?!

మంచి మనస్తత్వం, మంచి గుణాలు మరియు అనుభవ పూర్వక అవగాహన ఉన్న వారు వయసులో చిన్న వారైనా.... నిజానికి వీరే పెద్ద వారు, వీరిని తప్పని సరిగా గౌరవించాలి. వీరితో సంబంధాలను చక్కగా ఏర్పరచుకుని, వాటిని సరిగా మెయింటేన్ చేయాలి.

❖ ❖ ❖

95 ప్రశ్న : నమస్తే సార్ ! చాలా కాలంగా చక్కగా సాధన చేసుకుంటున్నాను. ఆధ్యాత్మికంగా ఎదుగుతున్న కొద్దీ చాలా అద్భుతంగా ఉంది. సరైన ఆధ్యాత్మిక అవగాహన లేని జనాలను చూస్తుంటే... వారిపై జాలి కలుగుతుంది. ఎవరి కర్మలకు వారే బాధ్యులు కాబట్టి ఎరుకతో సాక్షిగా ఉంటూ నా పనిలో నేనుంటున్నాను. సార్... నేను ఆధ్యాత్మికంగా ఎదగాలనుకుంటున్నాను. ఈ జన్మలోనే మోక్షాన్ని సాధించాలనుకుంటున్నాను. నా కుటుంబ సభ్యులు నా సాధనకు అడ్డం పడుతున్నారు. బంధు మిత్రులు కూడా ఇబ్బంది పెడుతున్నారు. చాలా బాధగా ఉంది. ఇప్పుడు నేనేం చేయాలి ? కుటుంబాన్ని, బంధు మిత్రులను వదిలేయాలా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : వదిలేయాల్సింది నీలోని అడ్డంకులను ! బయట ఉన్న వ్యక్తులను కాదు ! నీకు అడ్డం పడుతున్నది నీ కుటుంబ సభ్యులు మరియు నీ యొక్క బంధు మిత్రులు కాదు. వారు కేవలం నీ అంతరంలో ఉన్న గుణాలకు తగ్గట్టుగా నీతో ప్రవర్తిస్తున్నారు. అంతే ! నీవు నీ గత జన్మలలో మోక్ష సాధన చేసుకుంటున్న వారికి సహకరించలేదు. పైగా వారిని ఆటంక పరచావు. కాబట్టే ఇప్పుడు నీవు ఈ జన్మలో ఆటంకాలను ఎదుర్కొంటున్నావు. నీవు నీలోని మోక్ష సాధనకు ఆటంకాలను ఏర్పరచే గుణాలను తొలగించుకోకుండా, పరివర్తన చెందకుండా అందరినీ వదిలేసి హిమాలయాల్లోకి పోయినా నీకు అడ్డంకులు ఎదురవుతూనే ఉంటాయి. నీవు స్థలాన్ని, వ్యక్తులను మార్చినంత మాత్రాన పరిస్థితులు మారవు. నీ లోపల పరివర్తన జరగాలి, అప్పుడు నీవు స్థలాన్ని, వ్యక్తులను మార్చినా, మార్చక పోయినా ఫలితం ఉంటుంది. లోపల విషయాలు మారితేనే బయట విషయాలు మారుతాయి. లోపలి విషయాలను మార్చకుండా కేవలం బయట మార్చినంత మాత్రాన పరిస్థితుల్లో మార్పు ఏమీ రాదు. స్కూలు మార్చినంత మాత్రాన సిలబస్ మారదు కదా ! హైదరాబాద్‌లోని పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నాను అని సికందరాబాద్‌లో పరీక్షలు రాద్దామనుకుంటే... తేడా ఏముంటుంది ? స్థలం మారుతుంది, ఇన్విజిలేటర్లు మారుతారు కాని, సిలబస్ అదే ఉంటుంది, క్వశ్చన్ పేపర్ అదే ఉంటుంది కదా ! నీవు నీ లోపల గుణాలను మార్చుకోకుండా ఎక్కడికి వెళ్ళినా అదే పరిస్థితి ఎదురవుతుంది. చివరికి చచ్చినా మళ్ళీ పుట్టి తీరాల్సి వస్తుంది. గుణాలను మార్చుకుని తీరాల్సి వస్తుంది. తప్పదు. ఇప్పుడు విషయం అర్థమైందా ?

నీవు నీ గత జన్మలలో మోక్ష సాధన చేసుకుంటున్న వారికి సహకరించకుండా వారిని ఆటంక పరిచినందుకు, నీవు ఈ జన్మలో వాటిని అనుభవించాల్సిన అవసరం లేదు. కేవలం నీవు విషయాలను తెలుసుకుని పరివర్తన చెందితే చాలు ! పరివర్తన చెందడం ఎలా అంటే... ఈ సద్గురు తారా

విశాల్ మార్గదర్శిలో తెలియ జేసిన దైవత్వ సాధన చేస్తే ఆటొమెటిక్‌గా పరివర్తన జరిగిపోతుంది.

మోక్ష మార్గంలో సాధన చేసుకుంటూ పోతే ఆటొమెటిక్‌గా అడ్డంకులన్నీ తొలగిపోతాయి. అవి కుటుంబ సభ్యుల రూపంలో ఉన్నా, ఆర్థిక ఇబ్బందుల రూపంలో ఉన్నా, మరే రూపంలో ఉన్నా సరే... అన్నీ క్లియర్ అయితీరుతాయి. ఇది సత్యం.

అడ్డంకులు బయట నుండి రావటం లేదు, నీ లోపల నుండే వస్తున్నాయి అని గ్రహిస్తే 99% క్లియర్ అయినట్టే ! మిగిలిన ఒక్క శాతం సాధన ద్వారా ఆటొమెటిక్‌గా తొలగిపోతుంది.

మోక్ష సాధనలో భాగంగా అందరినీ వదిలేయాలా ? అని అడిగే పరిస్థితి రాదు. నీకు ఆ పరిపక్వత వస్తే ఆటొమెటిక్‌గా వాళ్ళ అడ్డంకి తొలగిపోతుంది లేదా నీవే వారిని చాలా సింపుల్‌గా వదిలి వేస్తావు. ఇదంతా సులభంగా, సరళంగా, ఊరికే అలా... జరిగిపోతుంది అంతే !

మాయలో ఉన్నప్పుడు అనవసరమైనవి అన్నీ చాలా అవసరమైనవిగా కనిపిస్తాయి. మాయ తొలగినప్పుడు నిజంగా ఏవి అవసరం, ఏవి అవసరం కాదు అనే సంగతి చాలా స్పష్టంగా తెలుస్తుంది. విషయం క్లియర్‌గా అర్థం అయి అవగాహన వచ్చినప్పుడు ఏ పని అయినా సులభంగా జరిగిపోతుంది కదా !

సరైన ఆధ్యాత్మిక స్పృహ లేని వారంతా భ్రమల్లో బతుకుతూ ఉంటారు. ఎందుకు ఉద్యోగం చేస్తున్నారో... ఎందుకు మిగతావన్నీ చేస్తూ ఉన్నారో... వారికి తెలియదు. వారు చెప్పే కారణాలు చాలా హాస్యాస్పదంగా ఉంటాయి. ఏ క్షణంలోనైనా చచ్చే అవకాశం ఉంది. చావు వచ్చి చచ్చినప్పుడు ఏం జరుగుతుంది ? ఆ తర్వాత పరిస్థితి ఏమిటి అని ఆలోచించరు. ఇది చాలా ఘోరమైన అజ్ఞానం ! దీన్ని తొలగించుకుని తీరాలి !

నీకు వాల్మీకి కథ తెలిసే ఉంటుంది. అయినా ఓ సారి గుర్తు చేస్తాను. కిరాతకుడైన ఒక బోయ వాడు, ఎన్నో క్రూరమైన పనులను మరియు అధర్మమైన పనులను చేస్తూ తనను + తన కుటుంబాన్ని పోషించుకునే వాడు. దారి కాచి బాటసారులను దోచుకుంటూ ఉండేవాడు. క్రూరంగా జంతువులను, పక్షులను వేటాడేవాడు. ఒక రోజు అదే విధంగా బాటసారులను దోచుకుందామనే ఉద్దేశంతో ఒక చోట వేచి ఉన్నప్పుడు, దేవర్షి నారదుడు ఆ మార్గం గుండా రావడం జరుగుతుంది. నారదుడిని కూడా దోచుకుందామని ప్రయత్నం చేయబోతాడు కాని, నారదుడి యొక్క తేజస్సుకు లోబడి ఏమీ చేయలేక పోతాడు. అప్పుడు నారదుడు అతడిని "నీవు ఇన్ని పాపపు పనులను ఎందుకు చేస్తున్నావు ? నీవు ఇప్పటికే ఎంతో పాపాన్ని కూడగట్టుకున్నావు. ఇకనైనా మానకపోతే చాలా చాలా ఘోరమైన పరిస్థితిని ఎదుర్కొంటావు... అంటూ జ్ఞాన బోధ చేస్తాడు. అప్పుడు ఆ బోయ వాడు, ఏం చేయాలి మరి నా కుటుంబాన్ని పోషించుకోవడానికి చేస్తున్నాను అని అంటాడు. అప్పుడు నారదుడు, నీ

కుంటుంబ సబ్యుల కోసం ఇన్ని పాపాలు చేసావు కదా, మరి నీ ఇంటికి వెళ్ళి నీ కుటుంబ సభ్యులకు విషయం చెప్పి, నీ పాపాలను ఎంత మంది, ఎన్నెన్ని తీసుకుంటారో అడుగు అని చెప్తాడు. ఆ బోయ వాడు ఇంటికి వెళ్ళి విషయాలను వివరించి తన పాపాలను ఎవరెవరు ఎన్నెన్ని తీసుకుంటారు ? అని అడుగుతాడు. అప్పుడు అతడి కుటుంబ సభ్యులు నీ పాపాలను మేము తీసుకోము అని చెప్తారు. అప్పుడు అతడికి తెలిసి వస్తుంది. నేను వీరి కోసం ఎంతో కష్టపడి, ఎన్నో ఘోరాలను చేసి వీళ్ళందరిని పోషిస్తూ ఉంటే... వీళ్ళు ఇలా అంటారా... అతడికి జ్ఞానం కలుగుతుంది. వెంటనే అందరినీ వదిలేసి నారదుడి దగ్గరికి వెళ్తాడు. అప్పుడు దేవర్షి నారదుడు చెప్పిన సాధన చేసి బ్రహ్మర్షి అవుతాడు. అతడే వాల్మీకిగా పేరుపొందాడు. ఆ బోయ వాడే వాల్మీకి ! రామాయణాన్ని వ్రాసిన బ్రహ్మర్షి వాల్మీకి ! పరమాత్ముడైన శ్రీరాముని పరమ పావన చరిత్ర గ్రంథస్థం చేసి లోకానికి అందించిన మహానుభావుడు. మహాత్ముడు. వాల్మీకి చరిత్ర ఎందరికో ఆదర్శం. ఈ కథ విని రాముడికి ఒక సారి, వాల్మీకికి ఒక సారి నమస్కరించి కూర్చుంటే ప్రయోజనం ఉండదు. పుణ్యం రాదు గాక రానే రాదు. ఈ దివ్య కథ నుండి ప్రేరణ పొంది, పరమాత్ముడైన శ్రీరాముడికి, బ్రహ్మర్షి వాల్మీకి, దేవర్షి నారదుడికి నమస్కరించి మోక్ష సాధన ప్రారంభిస్తే, ఆపకుండా చేస్తూ ఉంటే అప్పుడు రావడం ప్రారంభిస్తుంది పుణ్యం ! చివరకు ప్రాప్తిస్తుంది మోక్షం ! అర్థమైందా ???

వాస్తవ సత్య సూత్రం ''ఎవరికి వారే'' ! ఇదే పరమ సత్యం ! ఎవరిని వారే చూసుకోవాలి. కుటుంబ సభ్యులు మరియు బంధు మిత్రులు అందరూ కూడా కేవలం నీతో పాటుగా వారి వారి స్వంత అభివృద్ధి కోసం జన్మించిన వారు మాత్రమే ! నీ కోసం వాళ్ళంతా పుట్టలేదు. వారి కోసం నీవు పుట్టలేదు. ఎవరి ఆత్మాభివృద్ధిని వారే చేసుకోవాలి. ఈ భూమి ఒక స్కూల్ లాంటిది. నీ కుటుంబం ఒక క్లాస్ లాంటిది. నీ కుటుంబ సభ్యులందరూ నీ క్లాస్‌మేట్లు ! నీ క్లాస్‌మేట్లకు నీవు సహకరించడం నీ ధర్మం, అయితే వారు ఫెయిల్ అవుతే నీవు కూడా ఫెయిల్ అవుతావా ? నీ క్లాస్‌మేట్ల కోసం నీవు ఫెయిల్ కావడం మూర్ఖత్వం కదా ! వారికి చెప్పి చూడాలి, వింటే సరి, లేదా నీ దారి నీవు చూసుకోవాలి. లేకపోతే నీ గతి అధోగతే ! అమ్మో వదిలి వేయడం సాధ్యమా ? ఇది ఎలా చేయగలం ? అని నీకు అనిపించింది అని అంటే, నీకు ఇంకా పరిపక్వత రాలేదని అర్థం చేసుకుని మోక్షాన్ని పక్కకు పెట్టి మౌనంగా నీ కుటుంబం కోసం బతుకు. ఒక వేళ ఇది కరక్టే అని అనిపిస్తే నీకు పరిపక్వత వచ్చిందని అర్థం. పరిపక్వత వచ్చిన వాళ్ళకు విషయం అర్థమై పోతుంది. సింపుల్‌గా ఆ పని చేసేస్తారు. తమ మోక్ష మార్గంలోని అడ్డంకులను తొలగించేసుకుంటారు.

ప్రతీ తల్లిదండ్రులు తమ కోసం పిల్లలను కంటారు. తమ ఆనందం కోసం కంటారు. తమ కోరికలను, వ్యామోహాలను తీర్చుకోవడానికి కంటారు. కేవలం పిల్లల కోసం పిల్లలను కనరు. ఇది చాలా పెద్ద విషయం. ఇది అర్థమైతే జ్ఞానం వచ్చినట్టే ! తల్లిదండ్రులు తమ అవసరాల కోసం పిల్లలను కని పెంచి పెద్ద చేసి... ఈ పని అంతా కేవలం మీ కోసమే చేసాము అన్నట్టుగా ఫోజు కొడతారు. పిల్లలు ఏమైనా ఫోన్ చేసి చెప్పారా మమ్మల్ని కనమని ? కనకండి. ఎవరు కనమన్నారు ?

తల్లిదండ్రులు కనకుండా ఉంటే వారేమీ వెంటపడరు. మమ్మల్ని కనండి అని వారేమైనా తల్లిదండ్రుల వెంట పడతారా ? ***ఒక సారి వాస్తవంగా ఆలోచించండి. తల్లిదండ్రులే పిల్లలను కంటూ ఉంటారు. కనడం తప్పు కాదు. కాని సత్యాన్ని గుర్తించకపోతే తప్పు. మా కోసమే పిల్లలను కన్నాము అని తల్లిదండ్రులు అంటే అది సరి ! కాని, పిల్లల కోసమే పిల్లలను కన్నాము అని అంటే అది తప్పు. ఇది అందరు తల్లిదండ్రులు అర్థం చేసుకుని తీరాల్సిన సత్యం. లేకపోతే ఆత్మాభివృద్ధి ఆగిపోతుంది.***

నీవు ఇప్పుడు ఈ జన్మలో ఈ బంధాలను జయించకపోతే వచ్చే జన్మలోనైనా వీటిని జయించి తీరాల్సిందే ! ఏ నాటికైనా తప్పదు !

కొంత మంది ఆధ్యాత్మిక మార్గానికి అంటే సత్య మార్గానికి అంకితమైన వారిని అపార్థం చేసుకుంటారు. గొప్ప గొప్ప మహాత్ములను కూడా అపార్థం చేసుకుంటూ ఉంటారు. తన తల్లిదండ్రులను, భార్యా పిల్లలను వదిలేసి లోకాన్ని ఉద్ధరించడానికి బయలుదేరాడండి మొనగాడు అంటూ విమర్శిస్తారు. ఇక్కడే మీరందరూ సత్యాన్ని సరిగా అర్థం చేసుకోవాలి. మీరందరూ కేవలం మీ కుటుంబ సభ్యులను మాత్రమే "మీ కుటుంబం అని అనుకుంటారు". మహాత్ములు లోకంలో ఉన్న వారినందరినీ తమ కుటుంబ సభ్యులుగా భావిస్తారు. లోకాన్ని తమ ఇంటిగానూ, లోకులందరినీ తమ కుటుంబ సభ్యులుగానూ భావిస్తారు. కాబట్టే లోకోద్ధారణకు అంకితమైతారు. ఈ అసలు విషయాన్ని అర్థం చేసుకోలేని అజ్ఞానులు తమ కుటుంబాలను వదిలేసారు, వీరిదేం గొప్ప అంటూ వాగుతుంటారు. మహాత్ములు కూడా అందరిలాగే నా ఇల్లూ, నా పెళ్ళాం, నా పిల్లలు అంటూ ఇంట్లోనే పడి ఉంటే ఈ రోజు మనకు ఇన్ని సౌకర్యాలు ఉండి ఉండేవి కావు. ఈనాడు ఇంత అభివృద్ధి ఉండేది కాదు. వాల్మీకి కూడా అందరి లాగానే నా కుటుంబ సభ్యులు అని అనుకుని ఉంటే ఈ రోజు మనందరికీ పరమ పావనమైన రామాయణం అందుబాటులో ఉండేది కాదు కదా ! ఇంకా ఇలాంటి ఉదాహరణలు ఎన్నెన్నో ! కాబట్టి సత్యాన్ని తెలుసుకుని సత్య మార్గంలోకి రావాలనుకునే వారు, తప్పని సరిగా బంధాలను తెంచుకునియే తీరాలి.

ఉన్నతంగా ఆత్మ పరిణితిచెంది ఉన్న వారికి సంసారం చేసుకుంటూ ఉన్న వాళ్ళు వెర్రి వాళ్ళ లాగా కనిపిస్తారు. ఆధ్యాత్మికతకు 100% అంకితమైపోయిన వారిని చూసి సంసారులు పిచ్చి వాళ్ళనుకుంటారు. ఒకరినొకరు చూసి నవ్వుకుంటారు. అయితే ఈ సంసారులందరూ ఏదో ఒక జన్మలో ఆధ్యాత్మికతలోకి వచ్చి తీరుతారు. పిందె కాయ కాదా, కాయ పండు కాదా ?

నీ మీద ఎవరైనా ఆధారపడి ఉంటే వారిని చూసుకుంటూనే నీవు సాధన చేసుకోవచ్చు. వారిని నీవు సరిగా చూసుకుంటున్నా సరే... నిన్ను, నీ సత్య మార్గాన్ని అర్థం చేసుకోకుండా నీకు ఆటంకాలు కలిగిస్తూ ఉంటే... వారికి విషయాలను అర్థం చేయించడానికి ప్రయత్నించు. ఎంతకీ వినటంలేదు

అని అంటే... అప్పుడు వారిని వదిలేసి నీ దారి నీవు చూసుకోవడంలో సందేహించకు !

అజ్ఞానులు కలిగించే అవరోధాలను సాధన ద్వారా మరియు ఆత్మ విజ్ఞాన అవగాహన ద్వారా అధిగమించి ముందుకు సాగాలి. విజయీభవ !

❖ ❖ ❖

96 ప్రశ్న : నాకు చాలా పెద్ద కర్మ ఉందని, నేను అధిగమించాల్సిన అడ్డంకులు చాలానే ఉన్నాయని నాకు ధ్యానంలో కనపడింది సార్ ! భయంగా ఉంది...

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : అస్సలు భయపడాల్సిన పని లేనే లేదు. సత్యం చెబుతున్నాను. కూల్ ! అసలు విషయం తెలియనప్పుడు భయం కలగడం సహజం. కానీ వాస్తవానికి పైలోకాల మాస్టర్స్ మరియు సృష్టి నీ పైన చూపెడుతున్న కరుణకు నిదర్శనమే నీకు ధ్యానంలో వచ్చిన అనుభవం. బాగా గుర్తుంచుకో... నీకు ధ్యానంలో కాని, నిద్రలో కాని ఏవైనా లోపాలు కనపడ్డాయంటే... దాని అర్థం... అవి వెళ్ళిపోతున్నాయని. నీలో ఉన్న దుష్కర్మ ఫలితాలు లేక అపరిశుద్ధ భావాలు లేక చెడు గుణాలు అవి ఏవైనా సరే... అవి వెళ్ళిపోయే ముందే కనపడతాయి. అవి కనపడ్డాయంటే అవి అతి త్వరలో పూర్తిగా అంతరించి పోవడం ఖాయం అని అర్థం. నీకే కాదు ఎవరికైనా ఇది వర్తిస్తుంది. కొన్ని కనిపించిన తక్షణమే అంతరించిపోతే, మరికొన్ని అతి త్వరలో అంతరించి పోతాయి. నీ లోపాలు నీ ఎరుకలోకి వచ్చాయి అని అంటే వాటి పట్ల నీకు సరైన అవగాహన వచ్చిందనే అర్థం. నీ లోపల అడ్డంకులు నీకు కనపడ్డాయంటే నీలో తగిన పరివర్తన సంభవించిందని అర్థం. నీకు నీ యొక్క బలహీనతలు లేక మరేవైనా నెగెటివ్‌లు కనపడ్డాయంటే దాని అర్థం అవి పూర్తిగా, శాశ్వతంగా నీలో నుండి తొలగి పోతున్నాయి అని అర్థం. ఇది సత్యం. ఎందుకంటే ఏదైనా కర్మ కాని మరేదైనా కాని, అది నీ లోపల ఉందంటే దానికి కారణం, అది నీ లోపల ఉందన్న విషయం నీకు తెలియక పోవడమే ! అవి ఎప్పుడైతే నీ ఎరుకలోకి వస్తాయో ఆ క్షణమే అవి అంతరించి పోవడం మొదలవుతుంది. నీ యొక్క ఎరుకయే వాటిని తొలగించే దివ్య ఔషధం. నీ యొక్క ఎరుక నీ నెగెటివ్‌ల పైన పడింది అని అంటే చాలు, ఇక వాటి పని అయిపోయినట్టే ! భయపడకు. ధైర్యంగా ధీమాగా ఉండు. నీ లోపల ఉన్న వాటిని సృష్టి నీకెందుకు చూపించింది అని అంటే, వాటిని తీసివేయడానికే కాని, నిన్ను భయపెట్టడానికి కాదు అని అర్థం చేసుకో ! విశ్వాసంతో ఉండు. కూల్‌గా సాధన కొనసాగించు. నీకే కాదు ఎవరికైనా సరే, నెగెటివ్‌లు కనపడ్డాయి అని అంటే అవి ఆ క్షణమే అంతరిస్తాయి లేదా కొన్ని గంటలలో పూర్తిగా, శాశ్వతంగా అంతరించి పోతాయి. ఇది పరమ సత్యం ! కాబట్టి పూర్తి విశ్వాసంతో ధైర్యంగా ధీమాగా ఉండు. నీ లోపాలన్నీ క్లియర్ అయితీరుతాయి. నిజంగా దైవత్వాన్ని పొందిన సద్గురువుగా నేను ప్రకటిస్తున్న పరమ సత్యం ఇది !

❖ ❖ ❖

97 ప్రశ్న : నేను చాలా బాధల్లో ఉన్నాను సార్... ఎప్పటికైనా నా బాధలు తీరుతాయా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : తీరుతాయి. తప్పకుండా తీరుతాయి. ఖచ్చితంగా తీరుతాయి. అకర్మ శాకాహారిగా (Akarma vegan)ఉంటూ క్రమం తప్పని ధ్యాన సాధన చేసుకుంటూ, ఆత్మ విజ్ఞాన అభ్యాసం చేస్తూ... ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో ఆచరిస్తున్న వారికి ఖచ్చితంగా విముక్తి లభిస్తుంది. లభించి తీరుతుంది. జ్ఞానోదయం పొందిన గురువుగా ఇది నేను ఇస్తున్న అభయం ! వాగ్దానం ! మీరు సత్యానికి పూర్తిగా అంకితమై ఉండండి.

అత్యంత ప్రధానమైన విషయాలను గుర్తుంచుకోండి. మీలో ఉన్న చెడు గుణాలే మీ శరీరంలో అనారోగ్యాలుగా మరియు మీ జీవితంలో కష్టనష్టాలుగా వస్తూ ఉంటాయి. మీరు కలిగి ఉన్న గుణాలనే మీరు అనుభవిస్తున్నారు. చెడు గుణాల ఫలితాలను బాధలుగా, మంచి గుణాల ఫలితాలను ఆనందాలుగా అనుభవిస్తున్నారు. మీలో ఉన్న గుణాలకు అనుగుణంగానే మీ పరిస్థితులు ఉంటాయి. అవి ఎంత పెద్దవైనా సరే, చిన్నవైనా సరే... అవి కేవలం మీ గుణాల యొక్క ప్రతిబింబాలే ! మీ లోపల ఉన్న గుణాలే మీ జీవితం.

మీ లోపల ఉన్న గుణాలు మీరు తెచ్చి పెట్టుకున్నవే ! అవి మీ చేతిలో కీలుబొమ్మలు. మీరే వాటిని పోషిస్తూ ఉన్నది. వాటికి జీవం మీరే ! మీరు కావాలనుకున్నప్పుడు వాటిని తీసివేసే పూర్తి అధికారం, హక్కు, శక్తి సామర్థ్యాలు మీకు ఇప్పుడు ఈ క్షణంలోనే సంపూర్ణంగా ఉన్నాయి. ఇప్పుడు మీరు ఉన్నది ఉన్నట్టుగానే మీ చెడు గుణాలను తీసివేసుకో గలరు.

మీలో ఉన్న చెడు గుణాలను లేక లోపాలను తీసివేసుకోవడానికి అడ్డంకి ఏముంది ? మీ సామ్రాజ్యానికి మీరే మహారాజు లేక మహారాణి కదా ! మీరు నిజంగా నిర్ణయించుకోవాలే కాని చాలా సులభం. మీరు బలంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకే ఒక్కటి - మిమ్మల్ని మీరు బాగు చేసుకోవాలి అని అనుకుంటే సృష్టి యావత్తు మీకు సహాయ సహకార సమన్వయాలను అందించి, రక్షణగా నిలుస్తుంది. అనుగ్రహిస్తుంది. ఆశీర్వదిస్తుంది. ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శి మొత్తం చదివి సరిగా అర్థం చేసుకుని అప్పుడు ప్రారంభించండి సాధన ! విజయీభవ !! దిగ్విజయీభవ !!!

❖ ❖ ❖

98 ప్రశ్న : ధ్యానంలో వచ్చే అనుభవాలలో కొన్ని నిజం అవుతున్నాయి. మరి కొన్ని తప్పుడు అనుభవాలు వస్తున్నాయి. ధ్యానం అంటే సత్యం కదా.. మరి ఇలా ఎందుకు జరుగుతుంది సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ధ్యానం సత్యమే ! మీలోనే తప్పుడు గుణాలు ఉన్నాయి. ధ్యానంలో వచ్చే అనుభవాలు మన గుణాల పైన ఆధారపడి ఉంటాయి. మీలో

కొన్ని సరి అయిన గుణాలు ఉన్నాయి. మరి కొన్ని తప్పుడు గుణాలు ఉన్నాయి. కాబట్టే మీకు తప్పుడు అనుభవాలు వస్తున్నాయి. ధ్యానం కరెక్ట్‌గానే ఉంటుంది. మీరే తప్పుగా ఉన్నారు. ఇది గుర్తించండి.

ఉదాహరణకు, మీరు ఏవో రంగు కళ్ళద్దాలు పెట్టుకుని ఒక వస్తువు కొని ఇంటికి వచ్చారు. తీరా ఇంటికి వచ్చాక చూస్తే అది వేరే రంగులో ఉంది. అప్పుడు మీరు ఆ వస్తువును తిడితే లాభం ఏం ఉంటుంది ? మీరు కొనేటప్పుడు ఆ వస్తువు ఏ రంగులో ఉందో ఇప్పుడు అదే రంగులో ఉంది. కానీ మీరే మారారు. మీ చూసే చూపు మారింది. దాన్ని కొనేటప్పుడు మీరు ఏవో రంగు గల కళ్ళద్దాలలో నుండి దాన్ని చూసారు. మీకున్న రంగు అద్దాల ప్రకారంగా అది కనపడింది. అది మిమ్మల్ని ఏమీ మోసం చేయలేదు. మీరే సరిగా లేరు. మీకున్న రంగు అద్దాలను తీసి దాని యొక్క వాస్తవమైన రంగును చూడాల్సింది. కాని మీరు ఆ పని చేయలేదు. మీ సోదిలో మీరున్నారు. అందుకే అలా జరిగింది. ఇప్పటికైనా మీకున్న రంగు అద్దాలను తీయకపోతే వాస్తవాలు ఏవీ కనపడవు. విషయం అర్థమైందా ?

మీకు వస్తున్న తప్పుడు అనుభవాలను పరిశీలించండి. పరిశోధించండి. నాలో ఏం తప్పుడు గుణాలుంటే, ఇలాంటి తప్పుడు అనుభవాలు వస్తున్నాయి అని ధ్యానంలోనే ప్రశ్నించండి. మీరు ఇలా చేస్తూ ఉంటే ఖచ్చితమైన ఫలితాలు వచ్చి తీరుతాయి. మాస్టర్స్ మీకు సహాయం చేస్తారు. నిజానికి మీకు తప్పుడు అనుభవాలను చూపించేది మాస్టర్సే ! మీలోని లోపాలను మీకు తెలియజేసి మిమ్మల్ని పరిశుద్ధం చేయడానికే వాళ్ళు అలాంటి పనులు చేస్తారు. దీని వలన మీరు అభివృద్ధి చెంది ఎన్నో లాభాలను, ఆనందాలను పొందుతారు.

❖ ❖ ❖

99 ప్రశ్న : చనిపోయిన తర్వాత ఏమవుతుంది సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మీరు దేహం కాదు. మీరు దేహాన్ని ధరించిన వారు. మీ యొక్క ఈ జన్మ డిజైన్ పూర్తి అయిపోయి మీరు ఇష్టానుసారంగా మీరు నిర్ణయించుకున్న సమయానికే మీరు డిసైడ్ చేసుకున్న రీతిలోనే మీరు మీ యొక్క దేహాన్ని వదిలేస్తారు. అది ప్రమాదమే కావచ్చు మరేదైనా కావచ్చు ! అది మీలో ఉన్న వాటిని బట్టే నిర్ణయం అవుతుంది. మీరు దేహం విడిచాక మీ భౌతిక శరీరంలో నుండి మీ యొక్క సూక్ష్మ శరీరం బయటికి వస్తుంది. సూక్ష్మ శరీరంతో ఉన్న మీకు మరియు మీ యొక్క భౌతిక శరీరానికి కనెక్షన్ తెగిపోతుంది - ఇదే మరణం అని అంటే ! మీకు అసలు ఏమీ ఆత్మ విజ్ఞానం లేకపోతే మరణించిన తర్వాత మీరు చాలా బాధలను ఎదుర్కునే అవకాశం ఉంది. విషయాలు ఏవీ మీకు తెలియవు కాబట్టి మీరు భయపడతారు. మీకు మార్గదర్శకత్వం వహించడానికి ఇద్దరు మాస్టర్స్ వస్తారు. వారిని చూసి మీరు భయపడి పారిపోతారు.

ఎందుకంటే మీరు బతికి ఉన్నప్పుడు మీ మతంలో ఏమేమో చెబుతారు. నిజానికి మరణించిన తర్వాత జరిగేది వేరే ! దానితో మీరు ఆశ్చర్యపోతూ భయపడతారు. మీకు మీ మతంలో చెప్పిన విషయాలు ఏవీ జరగవు. మీరు గనుక హిందువైతే, ఏ యమదూతలూ రారు, ఏ నరకమూ ఉండదు. ఏ యముడు ఉండదు. చిత్రగుప్తుడు అసలే ఉండడు. సల సల కాగే నూనెలు, మంటలు, శిక్షలు ఏవీ ఉండవు. నిజానికి సృష్టిలో నరకం అనేదే లేదు. అది కేవలం మానవులను మంచి మార్గంలో నడిపించడానికి సృష్టించ బడింది. నిజమైన నరకం భూమి మీదే ఉంటుంది. స్వర్గం కూడా భూమి పైనే ఉంటుంది. మరణించిన తర్వాత మీరు సూక్ష్మ లోకాలకు వెళ్తారు. అక్కడ మీకు, మీరు పూర్తి చేసి వచ్చిన జీవితం యొక్క పూర్తి చిత్రాన్ని సినిమాలాగా చూపెడతారు. దాన్ని చూసినప్పుడు మీరు ఏం తప్పులు, ఏం ఒప్పులు చేసారో మీకే అర్థం అవుతుంది. ఆ తర్వాత మిమ్మల్ని విశ్రాంతి కోసమై అలా వదిలేస్తారు. అక్కడ అన్ని సౌకర్యాలు ఉంటాయి. మీరు మీ ఇష్టం వచ్చినంత కాలం ఉండవచ్చు. హాయిగా ఉండవచ్చు. ఎవరూ ఏమీ అనరు. సూక్ష్మ లోకాలలో కూడా మీరు అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి. మీకు విసుగు వచ్చి మళ్ళీ జన్మ తీసుకోవాలని మీరు అనుకున్నప్పుడు, మీకు మాస్టర్స్ యొక్క సహాయం లభిస్తుంది. మీ యొక్క బ్యాలెన్స్ షీట్ ప్రకారం మీరు ఎక్కడ, ఎలా జన్మించాలో ఎంపికలు ఇవ్వబడతాయి.

వాటిల్లో నుండి మీరు, మీ అవగాహన ప్రకారంగా జన్మను డిజైన్ చేసుకుంటారు. ఆ తర్వాత మిమ్మల్ని మాస్టర్స్ తగిన సమయం సందర్భం చూసి మీరు ఎంచుకున్న గర్భంలో ప్రవేశించేందుకు మీకు సహాయం చేస్తారు. ఆ విధంగా మీరు మళ్ళీ ఈ భూమి పైనే జన్మిస్తారు. మీ యొక్క బ్యాలెన్స్ షీట్ ప్రకారం నరకం మరియు స్వర్గం ఈ భూమి పైనే అనుభవిస్తారు. మళ్ళీ చనిపోతారు.. మళ్ళీ అదే తంతు.. మళ్ళీ పుడతారు.. ఈ విధంగా జరుగుతూనే ఉంటుంది "మీరు మీ దైవత్వాన్ని పొందే వరకు" ! మీరు మీ దైవత్వాన్ని పొందిన తర్వాత అప్పుడు మీరు ఈ భూమి పైన జన్మ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. అప్పుడు మీరు మీ అర్హతకు తగిన ఉన్నత లోకాలలో జన్మ తీసుకుని అక్కడ ఆత్మాభివృద్ధి గావించుకుంటూ ఉంటారు. ఈ విధంగా ఆత్మాభివృద్ధి అనేది అనంతంగా అలా సాగిపోతూనే ఉంటుంది. ఈ విషయాలు మా మతంలో లేవే.. మా మత పెద్దలు మాకు చెప్పలేదే.. అని ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. మత గ్రంథాల్లో సత్యాలు ఉన్నాయి. అయితే వాటిలో బాగా అసత్యాలు వచ్చి చేరాయి. మీరు బతికి ఉన్నప్పుడు "నిజమైన, సరియైన ఆత్మ విజ్ఞానాన్ని" నేర్చుకోకపోతే, మరణించిన తర్వాత ఒక్కోసారి చాలా ప్రమాదాలను ఎదుర్కోవాల్సి రావచ్చు. మత గ్రంథాలు ఇలా చెబుతాయి - "మీరు మరణించిన తర్వాత మీరు చేసిన పాపాల ప్రకారం మీకు శిక్షలు విధించ బడతాయి. ఆ శిక్షలన్నీ పూర్తయిన తర్వాత మీకు స్వర్గ ప్రాప్తి లభిస్తుంది లేదా మరొకటి ఏదో జరుగుతుంది" అంటూ... ఇంకా రకరకాల విషయాలు చెబుతాయి. నిజానికి అసలు సిసలు సత్యం ఏమిటంటే - ఈ భూమి పైన మనుషులు అనబడే వారు ఎవరు మరణించినా సరే,

అందరికీ ఒకేలా జరుగుతుంది. ఉన్న సత్యం ఒకటే మరి ! అందుకే జ్ఞానోదయం పొందిన మాస్టర్స్ చెబుతారు "అంతా ఒకటేనని" ! సరే విషయానికి వస్తే.. ఎవరు మరణించినా సరే, వారి సూక్ష్మ శరీరం బయటికి వచ్చి కనెక్షన్ తెగిపోతుంది. ఆ తర్వాత ఆ వ్యక్తికి గనుక సరైన ఆత్మ విజ్ఞానం లేకపోతే.. అప్పుడు అతడు తాను బతికి ఉన్నప్పుడు నమ్మిన మత బోధనలను గుర్తుకు తెచ్చుకుంటాడు. తాను చనిపోయాక యమదూతలు వస్తారు, నరకానికి తీసుకెళ్తారు, అక్కడ సీన్ అంతా ఊహించుకుంటాడు. తన తప్పులను చిత్రగుప్తుడు చెబుతున్నట్టు, అవి విని యముడు శిక్షలు వేస్తున్నట్టు, అవి తను అనుభవిస్తున్నట్టు ఊహించుకుంటాడు, తన ఊహల్లో తాను బంధింపబడి తనను తాను శిక్షించుకుంటాడు. తను చేసిన తప్పులకు ఎంత కాలం శిక్ష అనుభవిస్తే సరిపోతుందని భావిస్తాడో అంత కాలం ఆ భ్రమల్లో శిక్షలు అనుభవిస్తాడు. తను చేసిన పాపాలకు తగినంతగా శిక్షించబడ్డాను, "నేను క్లియర్ అయిపోయానని" అతడు భావించినప్పుడు నరకం నుండి విడుదల పొందినట్టుగా ఫీల్ అవుతాడు. అప్పుడు అతడి ఊహా నరకంలో నుండి బయటికి వస్తాడు. ఇప్పుడు అతడికి తెలుసు నేను స్వర్గానికి అర్హత సంపాదించానని.. కాబట్టి స్వర్గదూతల కోసం వెతుకుతాడు. అతడు మరణించినప్పుడు అతడిని సూక్ష్మ లోకాలకు తీసుకు వెళ్దామని వచ్చిన మాస్టర్స్ ఇతడికి కనపడతారు. నిజానికి ఇలాంటి వాళ్ళందరూ మాస్టర్స్ యొక్క అబ్జర్వేషన్‌లోనే ఉంటారు. అంతరిక్షంలో ఓ చోటులో వీళ్ళు వేలాడుతూ, తేలుతూ తమకు తాము సృష్టించుకున్న ఊహా నరకాల్లో బాధలు పడుతూ ఉంటారు. వీళ్ళు ఎప్పుడు తమ భ్రాంతిలో నుండి బయటకు వస్తే అప్పుడు వారిని స్వర్గాలుగా పిలవబడే సూక్ష్మ లోకాలకు తీసుకు వెళ్దామని మాస్టర్స్ రెడీగా ఉంటారు. ఏదో ఒక సమయంలో వాళ్ళు తమ "ఊహా నరక భ్రాంతి"లో నుండి బయటికి వస్తారు. అప్పుడు వారిని తీసుకువెళ్ళి వారికి తగిన సూక్ష్మ లోకంలో వదిలి పెడతారు. ఆ లోక పర్యవేక్షకులు వీరిని గైడ్ చేస్తూ వీరికి తగిన సహాయ సహకారాలను అందిస్తూ ఉంటారు.

ఈ విధంగా వాళ్ళు సూక్ష్మ లోకాలలో ఉంటారు. అక్కడ ఒక నెల ఉండవచ్చు లేక ఒక సంవత్సరం ఉండవచ్చు లేక వంద సం॥లు ఉండవచ్చు లేక వేయి సం॥లు ఉండవచ్చు ! ఈ విధంగా అక్కడ ఉన్న వారు, వారికి ఇష్టం ఉన్నంత సమయం ఉండి, జన్మను తీసుకోవాలి అని అనుకున్నప్పుడు మళ్ళీ భూమి పైన జన్మిస్తారు. నిజమైన నరకం మరియు నిజమైన స్వర్గం భూమి పైనే అనుభవిస్తారు.

మంచి కర్మల(పనుల) యొక్క ఫలితంగా ఆరోగ్య ఐశ్వర్య విజయానందాలను అనుభవిస్తారు.

చెడు కర్మల(పనుల) యొక్క ఫలితంగా అనారోగ్యాలను, కష్టనష్టాలను అనుభవిస్తారు.

ఈ రెండింటినీ భూమి పైనే అనుభవిస్తారు. ఇదే సత్యం ! ఎవరికైనా ఇక్కడ నేను చెప్పిన సత్యాలే వర్తిస్తాయి. ఎందుకంటే ఉన్నది ఒక్కటే సత్యం కాబట్టి !

❖ ❖ ❖

100 ప్రశ్న : సత్య మార్గానికి అంకితమైన వారు పెళ్ళి చేసుకోవాలా ? వద్దా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఇక్కడ విషయం పెళ్ళి కాదు, "బంధనం" ! నీవు పెళ్ళి చేసుకుంటావా.. లేదా.. అనేది ప్రశ్న కాదు. నీవు బంధనంలో ఉంటున్నావా లేదా అనేదే ముఖ్యం. పెళ్ళి కానంత మాత్రాన.. బంధనంలో లేము అని అనుకోవడం పొరపాటు. ఒక ఉదాహరణ చెబుతాను - ఒక వ్యక్తికి పెళ్ళి కాలేదు. కానీ అతడికి కొంత మంది స్త్రీలతో సంబంధాలు ఉండేవి. అతడికి తన కుటుంబ సభ్యులతో కూడా విపరీతమైన వ్యామోహ బంధుత్వాలు ఉండేవి. అతడికి పెళ్ళి కాలేదు. కాని అతడు తన సంబంధాలలో ఎంతగా కూరుకుపోయి ఉండే వాడంటే... అతడి కంటే పెళ్ళి అయి పిల్లలు ఉన్న సంసారియే నయం అనేలా ! నిజంగా అతడి కంటే సంసారులే నయం. మరి అతడికి పెళ్ళి కాలేదు.. కాబట్టి విషయం ఏమిటంటే, నీవు బంధ విముక్తుడవై ఉన్నావా.. లేదా.. అన్నదే అసలు విషయం. అయితే ఇక్కడ పెళ్ళిలో ఒక ప్రమాదం ఉంది, కర్మ కాలి భాగస్వామి సత్య మార్గానికి వ్యతిరేకంగా ఉన్నవారు దొరికారో... సంసారమూ ఉండదు.. సత్య మార్గమూ ఉండదు. రెంటికి చెడ్డ రేవడిలా అవుతుంది పరిస్థితి.

స్త్రీకి అయినా పురుషుడికి అయినా ఒక జీవిత భాగస్వామి అవసరం. సత్య మార్గంలో జీవిత భాగస్వామి అవసరం లేని వారు కొందరు ఉంటారు. కాని చాలా అరుదుగా ఉంటారు. చాలా అరుదుగా ఉండే వారి విషయం ప్రస్తుతం అప్రస్తుతం ! సరే విషయానికి వస్తే... ఒక జీవిత భాగస్వామి అవసరం. వయసులో ఉన్నప్పుడు ఏమీ తెలియదు. 40 సం॥ల వయసు దాటినప్పుడు.. తెలుస్తుంది.. ఒక తోడు.. ఒక ఓదార్పు.. ఒక సాంత్వన.. ఎంత అవసరమో.. తీరా వయసు అయిపోయాక ఒక తోడును వెతుక్కోవడం చాలా కష్టం. ఒక ప్రేమ.. ఒక ఆప్యాయత.. ఒక ధైర్యం.. ఒక ధీమా.. ఇవన్నీ జీవిత భాగస్వామి నుండే దొరుకుతాయి. భాగస్వామి కేవలం సెక్స్‌కు మాత్రమే సంబంధించిన వ్యక్తి కాదు అని గ్రహించాలి. సెక్స్ కాకుండా ఇంకా అనేకం ఉంటాయి, చాలా చాలా ఉంటాయి. అవి లేకపోతే జీవితంలో చాలా ఆనందాలు కోల్పోయినట్టే !

సత్య మార్గంలో ఉన్న స్త్రీకి అయినా పురుషుడికి అయినా జీవిత భాగస్వామి అవసరం. అయితే వారు కూడా సత్య మార్గంలో ఉన్న వారే అయిఉండాలి.. తప్పని సరిగా !

సత్య మార్గానికి అంకితమైన సాధకులకు, స్త్రీలకైనా పురుషులకైనా భాగస్వామి అవసరం. తప్పని సరి. అయితే ఆ భాగస్వామి కూడా తప్పని సరిగా సత్య మార్గానికి అంకితమై ఉన్న వారే కావాలి లేదా జన్మ వృథా అయిపోతుంది, జీవితం వృథా అయిపోతుంది.

కాబట్టి సత్య మార్గంలో ఉన్న వారు విధిగా, తప్పని సరిగా ఒక భాగస్వామిని వెతుక్కుని తీరాలి. ఎందుకంటే....

మీరు సత్య మార్గంలో ఉన్నారు. క్రమం తప్పకుండా సాధన చేస్తుంటారు. జన్మ జన్మల కర్మలు క్లియర్ అయిపోతుంటాయి. కర్మ భారాలు దిగిపోయి తేలికైన మీకు, అప్పుడు సహజంగా దివ్య

కామ ప్రేరణలు కలుగుతాయి. అప్పుడు మీకు ఒక భాగస్వామి అవసరం. వాటిని సరైన రీతిలో ఆస్వాదించడానికి మీకు ఒక భాగస్వామి అవసరం. వాటిని అణిచివేయ కూడదు. అది ప్రకృతి శక్తి. దాన్ని మీరు అణిచివేస్తే అది వికటించి చాలా ఇబ్బందులకు గురి చేస్తుంది. అవగాహన లేని చాలా మంది గురువులు అణిచివేయమని చెబుతారు. వారి మాటలు నమ్మి సాధకులు అణిచి వేస్తారు, విపరీతమైన ఇబ్బందులకు గురవుతారు. సాధన సరిగా సాగదు. జన్మ వృథా అయిపోతుంది. కామ ప్రేరణలను అణిచి ఉంచిన మీరు ఎప్పుడైనా పేలిపోయే ఒక డైనమైట్‌లా ఉంటారు. మైండ్ పొల్యూషన్ అయిపోతుంది. మీరు ఎన్నో ఇబ్బందులకు గురవుతూ ఉంటారు. మీరు ఉన్న సత్యమార్గ సంస్థ యొక్క కార్యకలాపాలను సరిగా నిర్వహించలేరు. మీరు డిస్టర్బ్ అవుతూ ఇతరులను కూడా డిస్టర్బ్ చేస్తుంటారు. అంతా గందరగోళంగా అయిపోతుంది. కాబట్టి ఒక సరైన జీవిత భాగస్వామిని ఎంచుకోండి. సత్య మార్గంలో ఉన్న వారు, సత్య మార్గంలో ఉన్న వారినే జీవిత భాగస్వామిగా ఎంచుకుంటే హాయిగా ఉంటుంది. అంతా సఫలం అవుతుంది.

ధ్యానంలో కూర్చుని - "నా దివ్యత్వంలో నుండి, నేను, ప్రేమగా బాధ్యతగా పరమోత్తమ జీవిత భాగస్వామిని ఆహ్వానించాను" అని అనుకుంటూ ధ్యానం చేయాలి. అప్పుడు మీకు సూట్ అయ్యే సరైన భాగస్వామి దొరుకుతారు. అప్పుడు అంతా హ్యాపియే కదా ! ఆల్ ద వెరీ బెస్ట్ !!

❖ ❖ ❖

101 **ప్రశ్న :** భావ దారిద్ర్యం....

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : యద్భావం తద్భవతి ఇది సృష్టి మూల సూత్రం. దీని అర్థం ఏమిటంటే.. నీ భావం ఎలా ఉంటే నీ భవం(పరిస్థితి) అలా ఉంటుంది అని !

దారిద్ర్యం యొక్క మూలం దురాశ. దురాశ అని అంటే.. నీ శక్తిని, నీ సంపదను నీకు దక్కనీయకుండా దాచిపెట్టే గుణాన్ని దురాశ అని అంటారు. దురాశను కలిగి ఉన్నవారు దారిద్ర్యాన్ని అనుభవిస్తూ ఉంటారు. దారిద్ర్యానికి వేరే కారణాలు కూడా ఉన్నాయి, అయితే ఇక్కడ టాపిక్ ప్రకారంగా ఉందాం.

భావ దారిద్ర్యం అంటే, భావంలో నెగెటివిటీని కలిగి ఉండడం. భావంలో నెగెటివిటీని కలిగి ఉన్నప్పుడు, భవం(పరిస్థితి) కూడా నెగెటివ్‌గానే ఉంటుంది. కాబట్టి భావ దారిద్ర్యాన్ని తప్పని సరిగా వదిలించుకుని తీరాలి.

ధ్యానంలో కూర్చుని - " నేను నా భావ దారిద్ర్యాన్ని రిలీజ్ చేసాను" అని అనుకుంటూ ధ్యానం చేస్తే ఆటొమెటిక్‌గా అది రిలీజ్ అయిపోతుంది.

❖ ❖ ❖

102 ప్రశ్న : మనకు ఎదురయ్యే అడ్డంకులను ఎలా అధిగమించాలో మరియు మన సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో చెప్పండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : పరమ రహస్యం చెబుతున్నాను... ''నీకు ఎదురయ్యే అడ్డంకులు లేదా సమస్యలు నీలో నుండే ఉద్భవిస్తాయి, అవి ఎంత చిన్నవైనా.. ఎంత పెద్దవైనా.. ఎంత ప్రమాదకరమైనవైనా సరే.. అవి నీలో నుండే ఉద్భవిస్తాయి'' ! ఈ రహస్యం చాలా అరుదుగా లభించే గుప్త జ్ఞాన గ్రంథాల్లో మాత్రమే కనపడుతుంది. దీన్ని నేను నిగూఢ గ్రంథాల్లో చదివాను మరియు స్వయంగా ధ్యానంలో అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. ఇది ఎంతో నిగూఢమైన రహస్యం. సాధారణంగా ఇది అందరికీ చెప్పరు. అర్హత లేని వారికి, అవగాహన లేని వారికి చెబితే విలువ తెలియకుండా పోతుందని చెప్పరు. మరి, నేను ఎందుకు చెబుతున్నానంటే.. ఈ గ్రంథం చదివిన వారికి ఈ పరమ రహస్యం తెలియాలని, అభివృద్ధి చెందాలని చెబుతున్నాను. ఈ రహస్యాన్ని అర్థం చేసుకోవడంతో ఉద్భవించిన శక్తి సామర్థ్యాలతో తమ తమ సమస్యలను పరిష్కరించుకోవాలని.. వారు బాగు పడాలనే ఆకాంక్షతో చెబుతున్నాను. ''నీకు ఎదురయ్యే సమస్యలు నీలో నుండే ఉద్భవిస్తాయి'' ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఇదేమిటి ?! నాలో నుండి నాకే ఆటంకాలా...?! పరిపక్వత లేని వారికి ఇది అర్థం కాదు. ఎవరికి అర్థం అయినా కాకపోయినా ఇది మాత్రం సత్యం. ''నీకు ఎదురయ్యే సమస్యలకు నీవే సృష్టికర్తవు'' ...ఈ సత్యం వినగానే... చాలా మంది, హే... భగవంతుడా... ఏమిటీ వింత ?! అంటూ విస్తుపోతూ ఉంటారు. కాని నిజం ఇదే ! నీకు ఎదురయ్యే సమస్యలకు సృష్టికర్తవు నీవే, వేరే ఎవరూ కాదు ! అంతరంలో కాని లేక బాహ్యంలో కాని నీకు ఇతరులు సమస్యలను సృష్టించినట్టు కనపడినా, నిజానికి, మూలంలో... నీవే నీ సమస్యకు సృష్టికర్తవు...! అధిగమించాల్సిన అడ్డంకులన్నీ మనలోనే ఉంటాయి. అందుకే మాస్టర్స్ చెబుతారు... ఎక్కడికి పారిపోతారు ? మీలోనే ఉంటుంది విషయమంతా... అని ! ఇప్పుడు మీకు ఇంత పెద్ద పరమ రహస్యం తెలిసింది కాబట్టి... మీకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు మీరు ఏం చేయాలంటే.... సమస్యను ఉద్దేశించి ఇలా అనండి - ''ఓ నా సమస్యా.. నీ యొక్క సృష్టికర్తను నేనే... నిన్ను క్లియర్ చేసే శక్తి సామర్థ్యాలు నాకు పూర్తిగా ఉన్నాయి"... అని అంటూ... మీ సమస్యకు మూలం మీరుగా భావిస్తూ... ''నేను దైవాన్ని''.. ''నేను దైవాన్ని'' అని అనుకుంటూ ఉండండి. మీరు ఈ విధంగా చేసినప్పుడు... ఏ సత్యం, ప్రేమ, ఎరుక మరియు సరైన అవగాహనలు లేనందువలన ఆ సమస్య వచ్చిందో ఆ సత్యం, ప్రేమ, ఎరుక మరియు సరైన అవగాహనలు మీలో ఉదయిస్తాయి. అప్పుడు ఆ సమస్య ఆటొమెటిక్‌గా, శాశ్వతంగా క్లియర్ అయిపోతుంది.

గుర్తుంచుకోండి.. ఈ పరమ రహస్యం యొక్క కిటుకును జాగ్రత్తగా అర్థం చేసుకోండి.. మీరు మీ యొక్క సమస్యను ఉద్దేశించి అనాలి.. ప్రేమగా, విశ్వాసంతో, ధైర్యంగా, ధీమాగా అనాలి.. ''నేను దైవాన్ని''... ''నేను దైవాన్ని''...! మీరు ఏ మాత్రమూ భయపడవద్దు, డీలా పడవద్దు. నిరాశా నిస్పృహలకు లోను కావద్దు.

నా సమస్యకు నేనే కారణం కదా... నేనే సృష్టికర్తను కదా... సృష్టికర్త ఎక్కడైనా తన యొక్క సృష్టిని చూసి భయపడతాడా.. అని ధైర్యం తెచ్చుకోవాలి. ఈ జ్ఞానం లేని వారందరూ తమ సమస్యలను పరిష్కరించుకోలేక ఓడిపోతారు. ఎందుకంటే వారు, తమకూ తమ సమస్యకు ఎలాంటి సంబంధం లేదు.. అది ఎక్కడి నుండో వచ్చింది అని భావిస్తూ ఉంటారు. దీని వలన సమస్య నీకు ఒక చిక్కుముడిగా అయిపోతుంది. ఏదైనా, ఎవరైనా తన సృష్టికర్త యొక్క మాట మాత్రమే వింటారు. ఎందుకంటే సృష్టికర్తకు తన సృష్టిని ఎలాగైనా మార్చే అధికారం+హక్కు ఉంటాయి కాబట్టి ! నీ సమస్య యొక్క సృష్టికర్తవు నీవే అయినా.. నాకు వచ్చిన సమస్యకు నాకు సంబంధం లేదు అని నీవు అనడంతో, నీ సమస్య నీకు లొంగదు. నీకేం అధికారం ఉందని నీవు నాకు చెబుతున్నావు.. అంటూ.. నీ మాట వినకుండా నిన్ను వేధిస్తుంది. కాని.. ఒక వేళ.. నీవు గనుక... నా సమస్యకు నేనే కారణం అని ఒప్పుకున్నట్టైతే.. అప్పుడు నీకు ఆ యొక్క సమస్యను క్లియర్ చేసే పూర్తి అధికారం+హక్కు+శక్తి సామర్థ్యాలు వస్తాయి.. ఎందుకంటే.. నీవే కదా దాని యొక్క సృష్టికర్తవు ! సమస్య యొక్క సృష్టికర్తను నేనే.. అని నీవు ఒప్పుకోగానే.. నీ సమస్య నీకు లొంగి పోతుంది. ఎందుకంటే నీవు దాని యొక్క సృష్టికర్తవు కదా ! ఎందుకంటే.. సృష్టికర్తకు మాత్రమే తన సృష్టిని ఏమైనా చేసే హక్కు అధికారం, శక్తి సామర్థ్యాలు ఉంటాయి, మరియు స్వేచ్ఛ కూడా ఉంటుంది. ఇది సరిగా అర్థం చేసుకోవాలి.

ప్రతీ వ్యక్తి యొక్క దేహంలో ఒక బ్రహ్మాండం దాగుందని ఉత్తర గీతలో శ్రీకృష్ణ పరమాత్మ చెప్తాడు. మీరు మీలోని అడ్డంకులను అధిగమిస్తూ ఆత్మ పరిణామ క్రమంలో ముందుకు సాగాలి. ఇది ఎవరికైనా వర్తించే సత్యం.

మీరు మీ సమస్యల పట్ల ద్వేషంతో ఉండరాదు. ఎందుకంటే అవి మీలోని భాగాలే.. కాకపోతే మీ యొక్క ఎరుక ప్రసరింపబడని భాగాలు. అవి మీ యొక్క ప్రేమ మరియు ఎరుకల కోసం తపిస్తూ ఉంటాయి. మీ నుంచి అవి అందగానే.. అవి వెంటనే, శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి.

❖ ❖ ❖

103 ప్రశ్న : బౌద్ధ మతస్థులు ఆత్మ లేదని అంటారు, మరి పునర్జన్మలను విశ్వసిస్తారు. దీని గురించి చెప్పండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఈ గందరగోళం ఎక్కడి నుండి వచ్చిందంటే.. భాషను పట్టుకుని వేలాడడం వలన ! పదాల యొక్క అర్థాలను పట్టుకుని ఊగులాడడం వలన ఈ సమస్య వచ్చింది. ఆత్మ అంటే ఒక్కో మాస్టర్ ఒక్కో నిర్వచనం ఇచ్చాడు. ఎంత ఎన్ని రకాలుగా నిర్వచించినా.. ఏది కూడా తప్పు కాదు. ఎవరి అనుభవం వారిది. బౌద్ధుల విషయానికి వస్తే ఆత్మ లేదని అంటారు నిజమే.. అయితే పునర్జన్మ ఉందని ఒప్పుకుంటారు కదా.. మరి ఏది తిరిగి జన్మిస్తుంది ? అదే ఆత్మ లేక ప్రాణి లేక ఏదో ఒకటి ! ఒక మతం వాడు దానిని ఆత్మ అంటే, ఇంకో మతం వాడు దాన్ని ఇంకేదో అంటాడు. కాబట్టి బౌద్ధ మతస్థులు ఆత్మ లేదు అని అంటే వచ్చే నష్టం

ఏమీ లేదు కాని, ఈ విషయమై కొట్టుకుంటేనే నష్టం జరుగుతుంది. భగవంతుడు లేడు అని బోధించే మతాలు కొన్ని ఉన్నాయి. భగవంతుడు ఉన్నాడని బోధించే మతాలు కొన్ని ఉన్నాయి. నిజానికి భగవంతుడు ఉన్నాడంటే ఉన్నాడు, లేడంటే లేడు ! వాస్తవానికి సృష్టి సర్వస్వమంతా భగవంతుడే ! భగవంతుడికి ఒక రూపం నామం అంటూ ఏవీ లేవు ! సృష్టియే భగవంతుడు. సృష్టిలోని ప్రతీ కణంలోనూ ఆ భగవంతుడు ఉన్నాడు. ఆ భగవంతుడినే ''పరమ సత్యం'' అని కూడా అంటారు. ఇంకా ''అంతిమ సత్యం'' అని కూడా అంటారు. ''సత్యం'', ''దైవం'' అని కూడా అంటారు. ఇంతకు నీవు అనేది ఏమిటంటే.. ఆత్మ లేదు అని అంటే - తిరిగి జన్మించేది ఏది ? అని కదా నీవు అడిగేది..! సరే.. విషయం ఏమిటంటే.. తిరిగి జన్మించే దానిని బౌద్ధులు ''ప్రాణి'' అని అంటారు. హిందువులు దానినే ఆత్మ అని అంటారు. అర్థమైందా ! హైందవ మతంలో ఆత్మ అని అంటే ఇంకా చాలా అర్థాలున్నాయి. ఆత్మ అంటే చాలా మంది మాస్టర్స్ చాలా రకాలైన నిర్వచనాలను ఇచ్చారు. ఎవరి అవగాహన వారిదే ! ప్రస్తుతం నీకు ఇంత సమాచారం చాలు. ఒక్క విషయం గుర్తుంచుకో.. జ్ఞానోదయం పొందిన ప్రతీ ఒక్కరిదీ ఒక్కో రీతి ఉంటుంది. ఒక్కో మాస్టర్ ఒక్కో రకంగా సత్యాన్ని పొందుతాడు. తాను పొందిన అనుభవాలనే ఆయన చెప్తాడు. తన యొక్క స్వయం అవగాహన పూర్వక సత్యాలనే ఆయన బోధిస్తాడు. ఒక మాస్టర్ చెప్పింది, వేరొక మాస్టర్ చెప్పిన దానికి విరుద్ధంగా అనిపించవచ్చు. కాని, రెండూ ఒకటే ! రెండూ సత్యాలే ! రెండింటిలో ఏదో ఒకటే సత్యం కావాలి కదా.. అని అంటే.. రెండే కాదు.. మరెన్నైనా సత్యాలు అవుతాయి. ఎందుకంటే సత్యాన్ని పొందడానికి చాలా మార్గాలున్నాయి మరి !

❖ ❖ ❖

104 **ప్రశ్న :** నేను గత జన్మలో ఫలానా అని తెలిసింది. అయితే ఈ విషయమై పూర్తి స్పష్టత రాలేదు. ఏం చేయమంటారు సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మౌనంగా ధ్యానం చేసుకోమంటాను. మీరందరూ.. సాధకులు ప్రతీ ఒక్కరూ కూడా బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. మీరు ఫలానా అని ఎవరైనా చెబితే సాక్షిగా వినండి. అది నిజం కావచ్చు. అబద్ధమూ కావచ్చు. మీకై మీరు ధ్యానంలో పూర్తి స్పష్టత పొందే వరకు ఈ గత జన్మల గురించి ఏ నిర్ణయానికీ రాకూడదు. గత జన్మల యొక్క స్మృతుల పైన మీ రక్షణ కొరకై, ప్రకృతి ముసుగు వేస్తుంది. మీకు తగిన అవగాహన లేకుండా, మీరు మీ యొక్క గత జన్మలు తెలుసుకుంటే చాలా ఇబ్బందికి గురవుతారు. ఒక్కోసారి హాని జరిగే అవకాశం కూడా ఉంది. ఒక్కో సారి ధ్యానంలో కాని లేక నిద్రలో కాని సాధకులకు, గత జన్మల యొక్క చిన్న చిత్రాలు కనపడటం కాని లేదా కొన్ని విషయాలు తెలియడం కాని జరుగుతుంది. ఇది మాస్టర్స్ స్వయంగా చేస్తారు. సాధన చేసే సాధకుడి యొక్క అవసరాన్ని బట్టి, ఎంత తెలియజేయాలో అంతే తెలియజేస్తారు. మీరు అరిచి గోల చేసినా, ఏడ్చినా వారు పట్టించుకోరు. ఈ విషయంలో మాస్టర్స్ చాలా స్ట్రిక్ట్‌గా వ్యవహరిస్తారు. వారు అలా ఉండడం అనేది సాధకుల శ్రేయస్కరం కోసమే ! మీకు పూర్తి స్పష్టత రానిదే, మీ యొక్క గత జన్మల గురించి మీరు స్థిరమైన అభిప్రాయానికి రాకూడదు. ఒక వేళ మీ అభిప్రాయం తప్పైతే హాని జరుగుతుంది. కొన్ని

చీకటి శక్తులు మీలోని అవ లక్షణాలను ఆసరాగా చేసుకుని ఇలాంటి 'సినిమాలు' చూపెడుతూ ఉంటాయి. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని మీరు గుడ్డిగా నమ్మేస్తే.. ఆ చీకటి శక్తులు మిమ్మల్ని ఆ తప్పుడు నమ్మకాల్లో నడిపిస్తూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటాయి. మీరెంతో నష్టపోతారు. కాబట్టి అనవసరంగా తొందరపడి ఒక నిర్ణయానికి రాకూడదు. మీరెంతో గొప్ప వారని తెలిసినా సరే.. మౌనంగా ఉండాలి. సాక్షిగా ఉండాలి. ధ్యాన సాధన క్రమం తప్పకుండా చేస్తూ ఉంటే, మీ దివ్య నేత్రం ఏదో ఒక నాటికి పూర్తిగా ఉత్తేజితం అవుతుంది. అప్పుడు మీకే అన్ని విషయాలు చాలా స్పష్టంగా తెలుస్తాయి. మీ గత జన్మలను చూసుకుని, వాటి యొక్క సారాన్ని మీ అభివృద్ధికి ఉపయోగించుకునే సామర్థ్యం మీలో ఉదయించిన నాడు, ప్రకృతి మీ గత జన్మలను మీకు చూపెడుతుంది. మీ గత జన్మలను చూసి కూడా మీరు సమత్వంలో ఉండగలిగితే, మీ గతం యొక్క ప్రభావం వర్తమాన జీవితానికి హాని చేయకపోతే అప్పుడు.. ఆ స్థితిలోకి మీరు వస్తే.. అప్పుడు మీకు మీ గత జన్మలు అన్నీ పూర్తిగా, స్పష్టంగా మీ స్మృతిలోకి వస్తాయి. బాగా సాధన చేయండి.

❖ ❖ ❖

105 **ప్రశ్న :** వాకిన్స్, మీడియమ్స్ మరియు ఛానల్స్ గురించి చెప్పండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ప్రస్తుతం భూమి పైన లేని ఒక పరిణతి చెందిన మాస్టర్, ఈ భూమి పైకి వచ్చి తన వంతుగా ఏదో అభివృద్ధి చేద్దామని అనుకున్నప్పుడు, ఆయన అందరి లాగా జన్మించడానికి ఇష్టపడడు. తొమ్మిది నెలలు గర్భంలో ఉండి, ఆ తర్వాత పుట్టి పెరిగి.. ఇలా ఈ తంతు అంతా పరిణతి చెందిన మాస్టర్స్‌కు అవసరం లేదు. అందుకే వారికి డైరెక్ట్‌గా ఎదిగిన శరీరం కావాలి. అందుకే భూమి పైకి రావాలనుకుంటున్న మాస్టర్ తన కార్యక్రమాలకు సరిపోయే శరీరం కోసం వెతుక్కుంటాడు, ఆ శరీరధారిని సంప్రదిస్తాడు. నీవు గనుక నాకు నీ యొక్క శరీరాన్ని ఇస్తే నీకు ఈ విధమైన లాభం ఉంటుందని చెప్తాడు. వారిద్దరి మధ్య ఒప్పందం కుదిరితే ఆ శరీరధారి ఆ మాస్టర్‌కు తన శరీరాన్ని ఇచ్చేసి వెళ్ళిపోతాడు. ఇదంతా చాలా రహస్యంగా జరిగిపోతుంది. శరీరం ఇచ్చిన వాడికి, తీసుకున్న మాస్టర్‌కు తప్ప ఇంకెవరికీ తెలియదు. అనుకున్న రోజు అనుకున్న సమయానికి ఆ శరీరధారి తన శరీరాన్ని విడిచి, ఆ మాస్టర్‌కు అప్పచెప్పి సూక్ష్మ లోకాలకు వెళ్ళి పోతాడు. ఆ మాస్టర్ ఆ శరీరంలో ప్రవేశించి తన పనులను చేసుకుంటూ ఉంటాడు. అందరూ ఆ మాస్టర్‌ను ఆ యొక్క పాత వ్యక్తే అనుకుంటూ ఉంటారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు చివరికి జీవిత భాగస్వామికి కూడా తెలియదు, ఆ మాస్టర్ స్వయంగా వెల్లడిస్తే తప్ప ! ఆ మాస్టర్ తన పనులన్నీ అయిపోయాక ఆ శరీరాన్ని విడిచేసి వెళ్ళిపోతాడు. ఈ విధంగా తన శరీరాన్ని ఇచ్చినందుకు ఆ శరీరధారికి తగినంత లాభం జరుగుతుంది. ఇలా ఒక సాధారణ శరీరంలోకి ఒక మాస్టర్ ప్రవేశించడాన్నే ''వాకిన్'' అని అంటారు. అలాంటి వాళ్ళను వాకిన్ మాస్టర్స్ అని అంటారు. ''మీడియం'' అంటే, పై లోకాల నుండి పరిణతి చెందిన మాస్టర్స్, ప్రత్యేకంగా ఎంచుకున్న వ్యక్తుల ద్వారా మాట్లాడటం. ఈ ప్రక్రియలో మాస్టర్స్ వచ్చి శరీరాన్ని తీసుకోరు. పైనుండే వారు, అప్పుడప్పుడు కొంత సేపు శరీరాన్ని వాడుకుంటారు. ఆ శరీరధారిని శరీరంలోనే కాసేపు అలా పక్కకు ఉంచి, తమ

సందేశాలను వినిపిస్తూ ఉంటారు. ఇలా శరీరాన్ని కాసేపు మాస్టర్స్‌కు ఇచ్చే వారిని ''మీడియం'' లేదా "ఛానల్" అని అంటారు.

మంచి మాస్టర్స్ శరీరాల కోసం వెతుక్కున్నట్టే, చీకటి శక్తులు కూడా శరీరాల కోసం వెతుకుతూ ఉంటాయి. చెడు గుణాలు చీకటి శక్తులకు ద్వారాలు. కాబట్టి ధ్యాన సాధన చేసి మిమ్మల్ని మీరు తప్పని సరిగా పరిశుద్ధులుగా చేసుకోవాలి. లేకపోతే చీకటి శక్తుల స్వార్థానికి బలయ్యే అవకాశం ఉంది.

❖ ❖ ❖

106 ప్రశ్న : *సరెండర్ గురించి చెప్పండి సార్ !*

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : గురువు చెప్పింది సరిగా, శద్ధగా విని, దానిని యథాతథంగా పూర్తి విశ్వాసంతో, ఆనందంగా ఆచరిస్తూ ఉండడమే సరెండర్ అని అంటే ! గురుదేవా.. ఇక ఈ క్షణం నుండి నన్ను నేను మీకు, నా ఆత్మపూర్వకంగా సమర్పించుకుంటున్నాను, నా పైన సర్వ హక్కులు, అధికారాలు మీవే.. మీరేం చెప్తే అదే నాకు శాసనం అని గురువుకు.. మిమ్మల్ని మీరు పూర్తిగా సమర్పించుకోవడమే సరెండర్ అని అంటే ! ఒక సరియైన సద్గురువుకు మాత్రమే సరెండర్ కావాలి. ఇంకెవరికీ సరెండర్ కాకూడదు. ఏ దేవుళ్ళకైనా, లేదా ఏ దేవతలకైనా సరే సరెండర్ కాకూడదు. దేవా నీవే దిక్కు.. నీవే సర్వస్వం.. అని ఏ దేవుడికీ దేవతకీ సరెండర్ కాకూడదు. కొందరు దేవుళ్ళు దేవతలు అనబడే వారు, దేవుళ్ళుగా దేవతలుగా చెలామణి అయ్యే వారు ఆత్మలను అంటే, సరైన ఆత్మ విజ్ఞానం లేని మనుషుల యొక్క ఆత్మలను స్వాధీనం చేసుకుని వాడుకుంటూ ఉంటారు. వీరి జీవసారాన్ని మొత్తం పీల్చేస్తూ ఉంటారు. ఇలాంటి వారికి సరెండర్ అయితే జన్మలు జన్మలు పీక్కు తింటూనే ఉంటారు. మీకు సరైన ఆత్మ విజ్ఞానం లేనప్పుడు ఎవరు ఏది చెబితే అది నమ్మేస్తారు. ఫలానా దగ్గర, ఫలానా గుడిలో మహిమలు జరుగుతున్నాయని అంటే.. పోలోమని పరుగెత్తుతారు. కనపడ్డ రాయికి, చెట్టుకి, పుట్టకి, దేనికి పడితే దానికి మొక్కి నీవే దిక్కు అని ప్రార్థిస్తుంటారు. ఇది ఎంత మాత్రమూ సరికాదు. కొంత మంది దేవుళ్ళ లాగా, దేవతల లాగా.. కొన్ని చీకటి శక్తులు రాజ్యమేలుతున్నాయి. సరైన ఆత్మ విజ్ఞానం లేని మనుషుల జీవితాలతో ఆ శక్తులు ఆటలాడుకుంటున్నాయి. దేవుళ్ళుగా దేవతలుగా చెలామణి అయ్యే చీకటి శక్తుల గురించి నేను ధ్యానంలో తెలుసుకున్నాను. వారు బయట ఏ విధంగా చెలామణి అవుతున్నారో, లోపల ఏం చేస్తూ ఉన్నారో తెలుసుకుని ఆశ్చర్యపోయాను. ఈ సత్యాలు ఎవరికి వారే ధ్యానంలో తెలుసుకుంటే మంచిది. నిజానికి ప్రతీ వ్యక్తిలో అసలు సిసలు దైవం ఉంది లేక ఉన్నాడు. నీలోనే దైవాన్ని ఉంచుకుని, బాహ్యంలో దేవుళ్ళకి, దేవతలకీ బానిసలుగా మారడం మంచిది కాదు. ఆత్మ పరిణామ క్రమంలో ఇది చాలా పెద్ద దెబ్బ ! భక్తి పేరుతో ఒక దేవుడికి లేదా దేవుళ్ళకి నిన్ను నీవు అర్పించుకోవడం అన్నది చాలా మూర్ఖత్వం. ఇది ఎంత మాత్రమూ సరికాని పని. ఆ దేవుళ్ళు కాని దేవతలు కాని మీకు చెప్పరు. కేవలం మిమ్మల్ని వాడుకుంటూ ఉంటారు. వారికి మీరు కావాలి.

మీకు ఆ సంగతి తెలియదు. వారిని ఆరాధిస్తూ, పూజలు చేస్తూ, వారికి మొక్కుబడులు చెల్లిస్తూ మీ జీవ సారాన్ని వారికి ధారపోస్తూ ఉంటారు. మీరు ఏం కోల్పోతున్నారో.. ఎంత కోల్పోతున్నారో.. మీకు తెలిస్తే.. మీరు దిగ్భ్రాంతికి గురవుతారు. మీరే దైవం అని చెప్పని వారు ఎవరైనా సరే.. దేవుళ్ళు కారు, దేవతలు కారు అని తెలుసుకోండి. మీ దైవత్వాన్ని ఎలా పొందాలో బోధించని వాడు అసలు గురువే కాదు. దొంగ గురువుల నుండి, దొంగ దేవుళ్ళ నుండి, దొంగ దేవతల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోవాలి.

కాపాడుకోవడం ఎలా..? అని అంటే సరైన ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకుని, ఆ యొక్క ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో ఆచరిస్తూ, క్రమం తప్పని ధ్యాన సాధన చేస్తూ ఉంటే.. మిమ్మల్ని మీరు రక్షించుకున్న వారవుతారు. బాగా బలంగా గుర్తుంచుకోండి, ఒక సరి అయిన సద్గురువుకు మాత్రమే సరెండర్ కావాలి. వేరే ఎవరికీ సరెండర్ కాకూడదు. నీవే దైవం.. నీ వాస్తవాలకు నీవే బాధ్యుడివి.. నీ మోక్షాన్ని నీవే పొందాలి.. అది నేను ఇవ్వలేను, కాని ఎలా పొందాలో చెప్తాను, ఆ సాధనలు నేర్పిస్తాను, అయితే సాధన చేయాల్సింది నీవే.. అని స్పష్టంగా చెప్పేవాడే అసలు సిసలు సద్గురువు. పూజలు, స్తోత్రాలు, జపాలు, యజ్ఞ యాగాలు, హోమాలు, నోములు, వ్రతాలు, ఆరాధనలు, భజనలు, సంకీర్తనలు, మతపరమైన కార్యక్రమాలు చేయించే వారు సరి అయిన ఆధ్యాత్మిక సద్గురువులు కాదు... ఇలాంటి వారిని మీరు గనుక ఆశ్రయించి ఉంటే తక్షణమే వారికి ప్రేమను ప్రకటించి వారి దగ్గరి నుండి బయట పడండి. ఇలాంటి వారు తాము మునగడమే కాకుండా మిమ్మల్ని కూడా ముంచేస్తారు. వారికే ఏమీ తెలియదు, మీకేం చెబుతారు... మత కార్యకలాపాలు చేసేవారు, చేయించే వారు నిజమైన సద్గురువులు కారు... ఎందుకంటే శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలోనూ మరియు ఉత్తరగీతలోనూ - పూజలు, స్తోత్రాలు, జపాలు, యజ్ఞ యాగాలు, హోమాలు, నోములు, వ్రతాలు, ఆరాధనలు, భజనలు, సంకీర్తనలు మొదలైనవన్నీ చాలా చాలా చిన్న విషయాలు, చివరికి వేదాలు కూడా త్రిగుణాలతో కూడుకుని ఉన్నవి, వీటన్నింటినీ వదిలేయి.. "తస్మాత్ యోగీభవ అర్జునా.." అని ఆదేశించాడు. అందరికంటే అధికుడు యోగి కాబట్టి నీవు యోగివి కా.. అర్జునా అని ఆ పరమాత్ముడు కుండ బద్దలు కొట్టినట్టు చెప్పాడు. భగవద్గీతలో కాని, ఉత్తరగీతలో కాని శ్రీకృష్ణ పరమాత్మ ధ్యానయోగ సాధనకే ప్రాధాన్యతనిచ్చాడు, ధ్యానయోగ సాధనే చేయమన్నాడు. మిగతా కర్మకాండలను ఏవీ చేయమనలేదు. నికార్సైన ఆత్మ విజ్ఞానాన్ని కలిగి ఉన్న పరమోత్తమ గ్రంథం భగవద్గీత ! ఆ యొక్క భగవద్గీతను బోధిస్తూ కూడా అందులో చెప్పిన యోగ సాధన చేయించకుండా.. పూజలు చేయించే గురువులు నిజంగా ఎలాంటి వారు ?! వాటిని వినే వారూ అంతే !! ఏ ఒక్కడికీ సందేహం రావటం లేదు.. భగవద్గీతలో ఇవేమీ లేవు కదా.. కేవలం ఆత్మ విజ్ఞానం మరియు యోగ సాధన మాత్రమే ఉంది కదా.. మరి వాటి మాటేమిటి ? అని అడగటం లేదు.. వారు చెప్పటం లేదు.. ! రోజుల తరబడి భగవద్గీత పైన ప్రోగ్రాంలు జరుగుతుంటాయి, ఇక ఆ గురువు.. చక్కగా మొదలు పెడతాడు.. చెబుతూనే ఉంటాడు... రోజుల తరబడి.. వినేవాళ్ళు హాయిగా వింటూనే ఉంటారు.. సాధన ఏమీ లేదు కదా.. బాగానే ఉంటుంది.. కాలక్షేపం కూడా అవుతుంది. కలియుగంలో సంకీర్తన ద్వారా మోక్షం వస్తుందని విష్ణు పురాణంలో ఒక చోట ఉంది. ఆ తర్వాత నీలో ఉన్న

దైవానికి నీకు ఉన్న భేదాన్ని తొలగించుకో, దైవంతో ఏకత్వం సాధించు అని కూడా ఉంది.

ఆ గురువులను నిజమైన యోగ సాధన చేయించమనండి.. "అహం బ్రహ్మాస్మి" సాధన చేయించమనండి... ఎలా చేయిస్తారు ? వారికే రాదు. రోజుల తరబడి సోది చెప్పమంటే మాత్రం ఇరగదీస్తారు.. ప్రజలు అమాయకులు. ముఖ్యంగా భారతీయులు ఆధ్యాత్మికత విషయంలో ఎంతో అమాయకులు. చాలా మంచి వారు. భారతీయ ప్రజలకు ఆధ్యాత్మికత అంటే ఎంతో శ్రద్ధ.. అందుకే వారు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుదామని రకరకాలైన గురువుల దగ్గరికి వెళ్తుంటారు. ఆ గురువులు వీరికి పనికిరాని విషయాలను చెప్పి వాటిలో బంధిస్తారు. ఆత్మ పరిణామ క్రమానికి ఏ మాత్రం సంబంధం లేని పనులను చేయిస్తూ ఆ గురువులు తమ ''మత దుకాణాలను'' కాపాడుకుంటూ ఉంటారు. భక్తులు వీరి ''గిరాకీలు''! ఎవరి మార్కెట్‌ను వారు డెవలప్ చేసుకుంటూ, రక్షించుకుంటూ ఉంటారు. ప్రజల్లో ఎరుక కలగాలి. నిజమైన ఆధ్యాత్మిక స్పృహ ఉద్భవించాలి. ఎవరైతే నిజమైన, సరియైన ఆధ్యాత్మిక స్పృహను పొందుతారో.. వారు.. మిగతా వారికి ఆ విజ్ఞానం అందించి తీరాలి. విషయం కేవలం మతగురువులకు మాత్రమే పరిమితమై పోలేదు, దేవుళ్ళకు మరియు దేవతలుగా చెలామణి అవుతున్న వారి దాకా విస్తరించి ఉంది. మీరు ఎవరికి కూడా మిమ్మల్ని మీరు అప్పగించుకోవద్దు. ఒక నిజమైన సద్గురువుకు మాత్రమే.. అది కూడా మీకు నిజంగా విశ్వాసం కుదిరిన తర్వాతే ఆ పని చేయాలి. ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శి మొత్తం చదవండి. బాగా అర్థం చేసుకోండి. నిజమైన గురువు ఎలా ఉంటాడు, ఏం బోధిస్తాడు అనే విషయాలు అనేకం వివరించాను, ఇప్పుడు మీకు తెలుసు.. నిజమైన సద్గురువు ఎలా ఉంటాడో.. ఏం చెప్తాడో.. అలాంటి గురువును వెతికి పట్టుకోండి, మీకు గురువుకు మధ్య ప్రేమ ఉదయించాలి. విశ్వాసం ఉద్భవించాలి. మీకు గురువు మీద గురి కుదరాలి.. అప్పుడు మీరు గురువుకు సరెండర్ కావాలి. నిజమైన గురువుకు మీరు సరెండర్ అయితే ఆయన మిమ్మల్ని ఏమీ చేసుకోడు, ఎందుకంటే.. ఆయనకు తెలుసు.. ఒకరి మీద అనవసర పెత్తనం చేస్తే ఏం జరుగుతుందో ఆయనకు చక్కగా తెలిసి ఉంటుంది. కాబట్టి సాధ్యమైనంతగా మీకు స్వేచ్ఛను ఇస్తూ బోధిస్తూ ఉంటాడు.

గుర్తుంచుకోండి, నిజమైన గురువు మిమ్మల్ని అంత తేలికగా ఒప్పుకోడు, మీకు తన మీద చాలా అనుమానాలను కలుగజేస్తాడు. మీ అహం పైన చాలా దెబ్బలు కొడతాడు. మీరు గిల గిల కొట్టుకుంటారు. మిమ్మల్ని కొడితే మీకేమీ కాదు, కాని మీ అహం పైన కొడితే మీరు విల విల లాడుతారు. ఈ విషయం నిజమైన గురువుకు బాగా తెలుసు.. కాబట్టి ఆయన ఎప్పుడు, ఎక్కడ ఎలా మిమ్మల్ని కొట్టాలో అక్కడ కొడుతుంటాడు. మిమ్మల్ని సరి చేస్తుంటాడు. రాయి అయిన మిమ్మల్ని చెక్కుతుంటాడు. దైవంగా మలుస్తుంటాడు. అలాంటి దైవశిల్పి కోసం వెతకండి. ఆయనకు మిమ్మల్ని మీరు సమర్పించుకోండి - దైవంగా పరిణమించండి.

❖ ❖ ❖

107 **ప్రశ్న :** ఆర్థిక మాంద్యం.. ఇంధనం అయిపోవడం.. ఎలక్ట్రిసిటి పొదుపు.. వీటి గురించి కొంచెం ఏమైనా చెప్పండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఆధ్యాత్మిక శాస్త్ర పరంగా ఈ భూమి పైన దేనికీ ఎప్పుడూ కొరత రానే రాదు. మనుషులకు ప్రకృతి పాఠాలు చెప్పే క్రమంలో సహజంగా దేనికైనా కొరత వస్తుందే తప్ప.. మరో విధంగా రానే రాదు. ఒక ప్రాంతంలో వర్షాలు పడటం లేదని అంటే.. దానికి ఆధ్యాత్మిక శాస్త్ర పరంగా కారణం ఈ రకంగా ఉంటుంది - ఆ ప్రాంత ప్రజలలో అధిక శాతం హింసా గుణాలను కలిగి ఉండి, క్రూర స్వభావం మరియు పగ ప్రతీకారాలతో రగిలి పోతూ ఉంటే ఆ ప్రాంతంలో వర్షాలు పడవు. పైగా ఆ ప్రాంతం కరవు కాటకాలతో తల్లడిల్లుతుంది అని చెబుతుంది - ఇది ఆధ్యాత్మిక పరమైన కారణం. తుపానులు, భూకంపాలు ఇతర వైపరీత్యాలు అన్నీ కూడా మనుషుల యొక్క నెగెటివ్ ప్రకంపనల వల్లనే తప్ప మరో కారణం కాదు. మనుషులు పరస్పర అవగాహన, శాంతి, సహనం, పరస్పర సహాయ సహకార సమన్వయం, పరోపకారం, నిస్వార్థ లోక సేవ మొదలైన సద్గుణాలను కలిగి ఉంటే.. ఈ భూస్వర్గం పైన దేనికీ, ఎప్పుడు కూడా కొరత రానే రాదు. మన గుణాలను బట్టి మన భూమి మనతో ప్రవర్తిస్తుంది. ఈ సత్యం అవగాహనకు వస్తే చాలా మంచి జరుగుతుంది. ప్రపంచ రాజకీయ నాయకులు + వ్యాపారులు కలిసి చాలా రకాలైన కృత్రిమ కొరతలను సృష్టించి ప్రజలను పీడిస్తూ ఉంటారు. వీరికి అసలు విషయం తెలియదు - వీరు అంతకంతా చెల్లించాల్సి వస్తుందని !

❖ ❖ ❖

108 **ప్రశ్న :** చనిపోయిన వారికి తాము చనిపోయినట్టుగా తెలియదని అంటారు.. దీని గురించి చెప్పండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : సరైన ఆధ్యాత్మిక విజ్ఞానం లేకుండా, జీవించి ఉండగా ఏ మాత్రం ధ్యాన సాధన చేయని వ్యక్తులకు చాలా మందికి తాము చనిపోయిన సంగతి తెలియదు. ఎందుకంటే వారు భౌతిక శరీరాన్ని వదిలేసిన తర్వాత కూడా, తాము జీవించియే ఉన్నామనే భ్రమలో ఉంటారు. చనిపోయిన తర్వాత వారు సూక్ష్మ శరీరంతో ఉంటారు. ఆ సూక్ష్మ శరీరం అచ్చం వారి భౌతిక శరీరంతో ఎలా ఉండే వారో.. సరిగ్గా అలాగే ఉంటుంది. వారికి ఏ మాత్రం నిజమైన ఆధ్యాత్మిక విజ్ఞానం ఉండదు కాబట్టి వారికి చనిపోయిన తర్వాత ఏం జరుగుతుందో తెలియదు. ఒక వేళ వారు జన్మలు లేవు అని చెప్పే మతాలకు చెందిన వారైతే చనిపోయిన తర్వాత దీర్ఘ నిద్రలోకి వెళ్తారు. కొన్ని వేల సం॥లు పడుకుని తిరిగి లేచి జన్మిస్తారు. ఎందుకంటే.. వారి మతంలో జన్మలు ఉండవు అని బోధిస్తారు కాబట్టి వారు దీర్ఘమైన భ్రమలోకి వెళ్ళిపోతారు. మాస్టర్లు ఎవరైనా వారిని మేల్కొల్పడానికి ప్రయత్నించినా వారు లేవరు. ఎందుకంటే మరణం తర్వాత మరేమీ లేదని వారు చాలా బలంగా నమ్ముతారు కాబట్టి.. వారు లేవరు. ఏవో దుష్ట శక్తులు వచ్చి మమ్మల్ని ప్రలోభాలకు గురి చేయాలని చూస్తున్నాయని వారు ఇంకా నిద్రలోకి జారుకుంటారు. తమను పాపులుగా

అనుకుని వారిని వారు, నరకంలో బాధలు పడుతున్నట్టుగా ఊహించుకుంటారు. ఆ విధంగా దీర్ఘ నిద్రలో కొన్ని వేల సం॥లు మరియు ఊహా నరకంలో చాలా కాలం బాధలు అనుభవించి ఎప్పటికో ఆ యొక్క భ్రాంతుల్లో నుండి బయట పడతారు. కర్మకు బందీలై ఉంటారు కాబట్టి తిరిగి జన్మిస్తారు.

జీవించి ఉన్నప్పుడు పూర్తిగా భౌతిక జీవితానికే ప్రాధాన్యతనిచ్చి, ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పూర్తిగా అలక్ష్యం చేస్తే వారికి మరణం తర్వాత చాలా చెడు జరుగుతుంది. ఎందుకంటే వారు పూర్తిగా అజ్ఞానంలో ఉంటారు కాబట్టి.. వారిని ఏ చీకటి శక్తులైనా వశపర్చుకోవచ్చు లేదా వారి స్వంత భ్రమల్లో వారు పడి వేల సం॥లు అలా ఉండి పోవచ్చు. మరణం తర్వాత జీవితమే లేదు అని అనుకునే వారు లక్షల సం॥లు అలా నిద్రలోనే ఉండిపోవచ్చు. ఆధ్యాత్మిక విజ్ఞానం లేని వ్యక్తులకు విపరీతమైన భయాలు ఉంటాయి. అందుకే వారు మరణించిన తర్వాత, వారు ఈ నిజాన్ని ఒప్పుకోలేరు. ఎందుకంటే వారికి వారు బతికి ఉన్నట్టుగానే కనపడుతుంటారు. ఈ భూమిని పోలిన ఒక సూక్ష్మ లోకం ఉంటుంది. అది నూటికి నూరు శాతం ఈ భూమి లాగే ఉంటుంది. అన్నీ ఇక్కడ ఉన్నట్టే ఉంటాయి. ప్రతీ ఒక్కటి.. చెట్టు.. వీధులు.. బంగ్లాలు అన్నీ జిరాక్స్ కాపీల్లా ఉంటాయి. అజ్ఞాని అయిన ఆ వ్యక్తికి అది ఏ లోకమో తెలియదు. ఆ సూక్ష్మ లోకాన్ని భూమియే అనుకుంటూ ఉంటాడు. ఇక్కడ బతికి ఉన్నప్పుడు చేసే పనులనే అక్కడ కూడా చేస్తూ ఉంటాడు. తన భ్రమల ప్రపంచాన్ని సృష్టించుకుంటాడు, వ్యక్తులను సృష్టించుకుంటాడు, ఆ భ్రాంతులలోనే బతుకుతూ ఉంటాడు. కొన్ని వందల సం॥లు అయినా వేల సం॥లు అయినా ఆ వ్యక్తికి తాను మరణించాను, ఇది భూలోకం కాదు అనే విషయం తెలియక పోయినా ఆశ్చర్యపడాల్సిన పనేమీ లేదు. భూమి పైన బతికి ఉండగా ఆధ్యాత్మికతను నిర్లక్ష్యం చేసినట్టే అక్కడ కూడా ఎవరైనా చెప్పడానికి వస్తే నిరాకరిస్తాడు. ఇలాంటి వాళ్ళను మాస్టర్లు ఎలాగోలా దారికి తెస్తారు. కాబట్టి జీవించి ఉండగానే ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పొందితే అది మరణం తర్వాత ఎంతో ఉపయోగకరమవుతుంది. ఆ తర్వాత జన్మ చాలా మంచి జన్మ అవుతుంది.

❖ ❖ ❖

109 **ప్రశ్న :** మాటలకు(శబ్దాలకు), రూపానికి అస్సలు ప్రాధాన్యత ఇవ్వవద్దు, గురువే అవసరం లేదు, అందరూ అందరికీ మిత్రులే... ఈ కాన్సెప్ట్ గురించి చెప్పండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఇక్కడ.. ''మాటలకు(శబ్దాలకు)'', అని అంటే - భాషకు, వ్యాకరణానికి మరియు భాషా పాండిత్యానికి ప్రాధాన్యత ఇవ్వకూడదు, వాటికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు అని అర్థం. అవతలి వారు ఏం చెబుతున్నారో నీకు ''సరిగా'' అర్థమైతే చాలు. నీవు ఏం చెబుతున్నావో, అవతలి వారికి అర్థం అయితే సరిపోతుంది. అంతే కాని, ప్రతీ మాట(శబ్దం) వ్యాకరణ తేజస్సుతో ఛందస్సుతో విరాజిల్లాలి, ప్రతీ మాట(శబ్దం) శృతి లయలలో ఊగుతూ ఉండాలి అని పట్టుపట్టడం మూర్ఖత్వం. సత్య మార్గంలో భాషా పాండిత్యం, వ్యాకరణం, శృతి లయ మొదలైనవి అవసరం లేవు. ఇక్కడ కేవలం, నీ మాటలు అవతలి వాడికి, అవతలి వాడి మాటలు నీకు అర్థమైతే సరిపోతుంది. కాబట్టే సత్య మార్గంలో "మాటలకు(శబ్దాలకు)" ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు అని అంటారు. అంతే కాని - మొత్తానికి మొత్తం మాటలే(శబ్దాలే) అవసరం

లేదని అంటే... అది ''అజ్ఞానం''. జ్ఞానోదయం పొందిన గురువులందరూ ఏమీ మాట్లాడకుండా ఉండి ఉంటే.. సత్య మార్గం గురించి.. సత్య ప్రాప్తి గురించి ఎవరికీ ఏమీ తెలియకుండా ఉండేది. జ్ఞానోదయం పొందిన పరమాత్ములు మాట్లాడారు కాబట్టే.. చెప్పారు కాబట్టే.. ఈ రోజున సత్య మార్గం గురించి అందరికీ తెలిసింది. సత్యాన్ని పొందిన సత్య స్వరూపుల యొక్క మాటలు - సత్యాన్ని పొందడానికి బాటలు ! ఆ బాటల వెంట వెళ్ళనిదే నీకు సత్యం ప్రాప్తించదు.. దారి తప్పి పోతావు. మాటలు(శబ్దాలు) అవసరం లేదు అని అనడంలో మరో కోణం ఏమిటంటే.. సొల్లు కబుర్లు అవసరం లేదు అని అర్థం. సాధకులలో సోదెమ్మలు మరియు సోదెగాళ్ళు ఉంటారు. ఆ పుస్తకంలో ఏముంది.. ఈ పుస్తకంలో ఏముంది.. ఆ మాస్టర్ ఏం చెప్పాడు.. అంటూ పనికిరాని సొల్లు ముచ్చట్లతో కాలాన్ని వృథా చేస్తారు. సాధన చేయరు. సాధన గురించి చర్చిస్తూ ఉంటారు, కాని సాధన చేయరు. ఆత్మ విజ్ఞాన సమావేశాలు నిర్వహిస్తూ ఉంటారు, కాని ఆచరణ ఉండదు. ఇలాంటి సొల్లు సోంబేరి గత్తెలను/గాళ్ళను దృష్టిలో ఉంచుకుని మాటలు(శబ్దాలు) అవసరం లేదు అని అంటారు. సత్య మార్గంలో సోది సొల్లు కబుర్లు అస్సలు ఉండకూడదు. సరియైన మాటలు(శబ్దాలు) మాత్రమే ఉండాలి. సాధన ఎక్కువ మాటలు(శబ్దాలు) తక్కువ ఉంటే అభివృద్ధి చక్కగా సాగుతూ ఉంటుంది. ఆచరణయే ముఖ్యం అని చెప్పడానికి మాటలు(శబ్దాలు) అవసరం లేదు అని అన్నారు తప్ప... మొత్తానికే అవసరం లేదు అని కాదు అర్థం ! మొత్తానికే అవసరం లేదని అంటే, సృష్టి, మనిషి నిర్మాణంలో నాలుక, పళ్ళు, స్వర పేటిక మొదలైన అంశాలను జోడించి ఉండేది కాదు. సృష్టికి తెలుసు... ఏది అవసరమో.. ఏది అనవసరమో ! కాబట్టి అనవసరమైన ఆధ్యాత్మిక ఫోజులు కొట్టకుండా విషయాన్ని సరిగా అర్థం చేసుకుంటే బాగుపడతారు. ఉదాహరణకు ఒక వ్యక్తి నీ దగ్గరికి ధ్యానం నేర్చుకోడానికి వస్తాడు.. అప్పుడు నీవు కేవలం సైగలతో చెప్తావా..?! అతడిలో ఎన్నో సందేహాలు ఉంటాయి.. వాటన్నింటినీ సైగలతో తీరుస్తావా..!? మాటలు(శబ్దాలు) అస్సలు అవసరం లేదు అని భావించి, ఆ కాన్సెప్ట్‌ను ప్రచారం చేసే వాళ్ళు ఎలా చేస్తున్నారు..?! మాటలతోనే(శబ్దాలతోనే) కదా ! ఇది ఎంత ఆశ్చర్యం !!!!! మాటలు(శబ్దాలు) అవసరం లేదని అంటే అందరూ మూగ వాళ్ళ స్కూలుకు వెళ్ళి మూగ భాష నేర్చుకోవాలి. అప్పుడు ప్రపంచం అంతా సైగలు.. అంతా కేవలం మౌనం... మౌనమే నీ భాష ఓ మూగ మనసా... అంటూ మనసులో పాడుకుంటూ బయట సైగలు చేస్తూ ఉండాలి. అప్పుడు ఈ ప్రపంచం ఒక మౌన లోకంగా మారుతుంది, మూగ లోకంగా మారుతుంది.. సౌండ్ పొల్యూషన్ ఉండదు. అందరూ సైగలతో కాలం గడిపేయవచ్చు. అప్పుడు ''సైగల శాస్త్రం'' పుడుతుంది. సైగలకు వ్యాకరణం, ఛందస్సు వగైరాలు పుడతాయి. అప్పుడు స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులలాగా, స్పోకెన్ సైగల్ కోర్సులు మొదలవుతాయి. ద సైన్స్ ఆఫ్ సైగల్‌కు మాంఛి.. డిమాండ్ ఏర్పడుతుంది. అందులో డాక్టరేట్‌లు మొదలైనవి ప్రారంభమవుతాయి. మౌన యూనివర్సిటీలు ఏర్పడతాయి. మౌన మార్తాండ, మౌన ప్రవీణ, మౌన రత్న మొదలైన బిరుదులు ఇవ్వడం మొదలవుతుంది. చివరికి ''మౌనేశ్వరుడు & మౌనేశ్వరి '' అనే దేవుళ్ళు ఏర్పడి, వారికి

గుడి కడతారు. అప్పుడు అయ్యప్ప మాల లాగా "మౌన మాల" వేసుకుంటారు. ఇలా చెప్పుకుంటూ పోతే అంతే లేదు కదా ! నీకు విషయం సరిగా అర్థం అయిందనుకుంటాను.

సరి అయిన మాటలు(శబ్దాలు) అవసరం. సరి కాని మాటలు(శబ్దాలు) అవసరం లేదు.

మౌన కాన్సెప్ట్‌ను ప్రచారం చేసే మౌనులను,
మాట్లాడకుండా, శబ్దాలను ఉపయోగించ కుండా,
వారి మౌన కాన్సెప్ట్‌ను ప్రచారం చేసుకోమని చెప్పు.

మౌనం ద్వారానే దైవత్వం లేక జ్ఞానోదయాన్ని పొందవచ్చు అనేది కూడా నిజం కాదు. మోక్ష సాధనలో మౌనం ఉపయోగపడుతుంది. నీవు అనవసరంగా మాట్లాడకుండా ఉంటే, అప్పుడు నీ శక్తి వృథా కాకుండా ఉంటుంది. సాధ్యమైనంతగా నీవు మౌనంగా ఉంటుంటే, అప్పుడు నీకు, ఆలోచనలను అరికట్టడానికి వీలవుతుంది. ఆలోచనలు లేకుండా ఉంటే.. నీకు ఎరుక బాగా స్థిరం అవుతుంది. నీవు ఎరుకలో ఉండడానికి మౌనం ఒక సాధనంగా, పనిముట్టుగా ఉపయోగ పడుతుంది. అంతే ! అంతరంలో మౌనం అనేది సహజ సిద్ధంగా ఏర్పడాలి కానీ, బలవంతంగా మౌనాన్ని పాటిస్తూ అంతరంలో గందరగోళంగా ఉంటే ఏం లాభం ? నీవు మౌనంగా ఉంటూ నీ అవసరాలను సైగలతో చెప్తూ ఉంటే అది కూడా ఒక రకమైన మాట్లాడడమే అవుతుంది. నీవు రాసి చూపెట్టినా అది కూడా ఒక కోణంలో మాట్లాడడమే అవుతుంది. ఎందుకంటే, నీవు సైగలు చేసినా లేక రాసి చూపించినా.. నీ లోపల ఆ భావాలు మరియు ఆ భావాలకు సంబంధించిన మాటలు ఉత్పన్నమై తీరుతాయి. నీవు కేవలం నోటి ద్వారా శబ్దాన్ని బయటకు రానివ్వడం లేదు అంతే ! కాని నీవు లోపల మాట్లాడుతూనే ఉన్నావు. లోపల శబ్దాన్ని అణిచిపెడుతూ ఉన్నావు. ఇది ఏ రకం మౌనం ? ఈ అనవసర మౌన వ్రతం కంటే.. అవసరమైనప్పుడు, అవసరమైనంతగా మాట్లాడడమే ఎంతో శ్రేయస్కరం ! ఉత్తమం ! విజ్ఞత ! దైవత్వ సాధనలో మౌనం ఉపయోగపడుతుంది కాని, మౌనమే దైవత్వం కాదు ! మౌనంగా ఉంటే దైవత్వం అనుభవంలోకి వస్తుందని అంటే, ఇక ఈ ధ్యాన సాధనలు ఎందుకు ?! మౌనంగా ఉంటూ ఏమీ మాట్లాడకుండా ఉంటే జ్ఞానోదయం సంభవిస్తుందంటే.. ప్రపంచంలోని మూగ వాళ్ళందరికీ మోక్షం వచ్చేస్తుంది. అప్పుడు అందరూ మూగవారిగా పుట్టాలా ? కాదు కదా ! మై డియర్ మిత్రమా... విషయాన్ని ఇప్పటికైనా అర్థం చేసుకో... మాటలు(శబ్దాలు) అవసరమే... మౌనం కూడా అవసరమే ! ఏది ఎప్పుడు వాడాలో, దాన్ని అప్పుడు వాడితే బాగుంటుంది.

ఇక రూపం యొక్క విషయానికి వస్తే... ఒక రూపం అంటూ ప్రత్యేకంగా లేని పరమ సత్యాన్ని ప్రాప్తించుకోవడానికి రూపం ఒక అడ్డంకిగా అవుతుందని, రూపానికి ప్రాధాన్యతను ఇవ్వకండి అని అంటారు. అంతే !

కేవలం మోక్ష సాధనలో మాత్రమే రూపానికి ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరం లేదు. మోక్ష

సాధనను మినహాయిస్తే రూపానికి ప్రాధాన్యం ఉంది. రూపానికి ఏ ప్రాధాన్యం లేనిదే ''రూపం లేనిది'' రూపం ధరించదు. మిడి మిడి జ్ఞానంతో రూపానికి ప్రాధాన్యత లేదు, ధ్యానంలో కనపడే మాస్టర్స్‌కు రూపాలు ఉండవు, ఎదిగిన సాధకులకు వారు ఒక జ్యోతిలాగా లేక కాంతిలాగా లేక వెలుగులాగా లేక వెలుగుతున్న నక్షత్రంలాగా కనపడతారు అని అనుకోవడం, చెప్పడం ఒక భ్రమ ! ధ్యానంలో మాస్టర్స్ ఒక రూపంలో కనపడితే, ఆ సాధకులను తక్కువ పరిణతి చెందినవారుగా భావించడం అజ్ఞానం. ధ్యానంలో మాస్టర్స్ కాంతి నక్షత్రం లాగా కనపడితే, ఆ సాధకులను ఎక్కువ పరిణతి చెందిన వారుగా పరిగణించడం కూడా అజ్ఞానమే. కాంతి లోకాల్లో ఉండే కొంత మంది మాస్టర్స్‌కు కేవలం కాంతి రూపం ఉంటుంది. మిగతా లోకాల్లో, మిగతా విశ్వాల్లో, మిగతా డైమన్షన్స్‌లలో రూపాలు ఉంటాయి. రకరకాల రూపాలు ఉంటాయి. ఎన్నెన్నో రకాల రూపాలుంటాయి. అనేకానేకమైన రూపాలుంటాయి. సృష్టి అంతా.. ప్రత్యేకంగా ఒక రూపం అంటూ లేని రూపంలో ఉంది. సృష్టికి ఒక క్రమం అంటూ కనిపించని క్రమం ఉంది. జ్యోతి కూడా ఒక రూపమే ! కాంతి కూడా ఒక రూపమే ! వెలుగుకు, ప్రకాశానికి తమవైన రూపాలున్నాయి. ఏ ఏ రూపాల్లో ఆ మాస్టర్స్ ఉంటారో, వారు ఆయా రూపాల్లోనే కనిపిస్తారు. మానవాకారం ఒక భూలోకానికే పరిమితమైనది అని అనుకోవడం ఆధ్యాత్మిక మూర్ఖత్వం. ఎంతో ఉన్నతోన్నతమైన ఉత్తమోత్తమ లోకాల్లో కూడా రూపాలతోనే అక్కడి మాస్టర్స్ ఉంటారు. అక్కడి కొన్ని ఉన్నత ఉత్తమ తలాలలో ఇలాంటి మానవ రూపం లాంటిదే ఉంటుంది. నిజానికి అక్కడి రూపాలకు నకలు.. ఇక్కడి మానవ రూపాలు. ఇవన్నీ నేను ఎవరో చెప్పగా విన్నవి కాదు, ఎక్కడో చదివినవి కాదు. ఇంటర్‌నెట్‌లో చూసి చెప్పేవి కాదు. నేను స్వయంగా రకరకాల లోకాలకు, రకరకాల విశ్వాలకు, ఇతర డైమన్షన్‌లకు వెళ్ళి వారిని స్వయంగా కలిసి మాట్లాడిన, స్పష్టమైన అనుభవపూర్వక విజ్ఞానంతో ప్రకటిస్తున్నాను. అక్కడ కూడా మాటలుంటాయి. రూపాలుంటాయి.

మాట(శబ్దం) అంటే ధ్వని అని అర్థం. ధ్వని అంటే నాదం అని అర్థం. సృష్టికి మూలం ఓంకార నాదమేనని భారతీయ ఆధ్యాత్మిక శాస్త్ర గ్రంథాల్లో ఉంటుంది కదా ! సృష్టికి మూలమైనదే శబ్దమైనప్పుడు.. శబ్దం పనికిరానిది ఎలా అవుతుంది ? ప్రాధాన్యత లేనిది ఎలా అవుతుంది. భూమి పైన ఉన్న మానవులకు మోక్ష సాధన ఒక రకంగా ఉంటుంది. ఇక్కడ భూమి పైన పొందిన మోక్షమే అంతిమం కాదు. కొన్ని ఉన్నత ఉత్తమ లోకాలున్నాయి. అక్కడ మోక్షం పొందిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఆ లోకాల్లో ప్రారంభకులు అంటే అందరి కంటే చిన్న వాళ్ళు కూడా.. ఇక్కడ భూమి పైన మోక్షం పొందిన వారే అయి ఉంటారు ! ఇక్కడ భూమి పైన మోక్షం పొంది, దివ్య లోకాలకు వెళితే, అక్కడ కూడా సాధనలు ఉంటాయి. అక్కడ కూడా నేర్చుకునే అంశాలుంటాయి. సృష్టి అనంతం !

ఇక్కడ భూమి అనే లోకంలో మోక్ష సాధనకు మౌనం ఉపయోగపడుతుంది కాని, మౌనమే

మోక్షం కాదు.

ఇక్కడ భూమి అనే లోకంలో మోక్ష సాధనలో రూపానికి ప్రాధాన్యత ఇవ్వకూడదు, ఎందుకంటే, మోక్షం అనేది ఒక ''అనుభవం'' ! దైవత్వం లేక జ్ఞానోదయం లేక నిర్వాణం లేక మహా పరి నిర్వాణం లేక తావో.. అనేది ఒక ''అనుభవం'' ! అనుభవానికి ఒక రూపం ఉండదు. మాట ఉండదు. అది కేవలం దివ్య అనుభవం ! మాటల్లో, రూపాల్లో చిక్కుకుంటే అనుభవానికి అడ్డంకి అని మాటలకు, రూపాలకు ప్రాధాన్యతను ఇవ్వకండి అని అంటారు.

బాగా గుర్తుంచుకోండి, కేవలం మోక్ష సాధనలో మాత్రమే మాటలకు, రూపానికి ప్రాధాన్యం ఉండదు. మోక్షం వచ్చిన తర్వాత మళ్ళీ యథావిధిగా మాటలకు, రూపానికి ప్రాధాన్యత ఉంటుంది.

మిడి మిడి జ్ఞానంతో మౌనంగా ఉండమని ఉపన్యాసాలు ఇవ్వద్దు ! మిడి మిడి జ్ఞానంతో, రూపంలో ఉంటూ రూపానికి ప్రాధాన్యత లేదు అని అనవద్దు.

ఎప్పుడు దేనికి ప్రాధాన్యతను ఇవ్వాలో తెలుసుకుంటే మంచిది కదా !

ఇక - గురువు అవసరం లేదు అని అంటే అది అజ్ఞానమే తప్ప మరొకటి కాదు. ''ఎవరికి ఎవరూ గురువులు కాదు, ఎవరికి వారే గురువులు'' అనేది ఒకే ఒక కోణంలో మాత్రమే సత్యం. అందరూ కేవలం మైత్రీ పూర్వకమైన గురువులే అంటే, ఇది కూడా ఒక కోణంలోనే సత్యం. వెనుకటికి గురువులకు శిష్యులకు మధ్య చాలా అంతరం ఉండేది. కొంత మంది యొక్క ప్రమేయం వలన, గురు పరంపరలో చాలా అనవసర నియమాలు, నిబంధనలు వచ్చి చేరాయి. వీటి వలన గురువుకు శిష్యులకు మధ్య పెద్ద అగాధం ఏర్పడింది. ఇది సత్య మార్గానికి మంచిది కాదు. అందుకే, న్యూ ఏజ్‌లో(నవీన యుగంలో) ఆ యొక్క అగాధాన్ని పూడ్చి, గురువుకు శిష్యులకు మధ్యన ఉన్న సంబంధాన్ని పునరుద్ధరించి, సత్య సాధనలను సులభం సరళం చేయాలని మాస్టర్స్ నిర్ణయించుకున్నారు. కాబట్టే.. ఈ కాలంలో... నవీన యుగ గురువులు ఫ్రెండ్లీగా ఉంటారు. అంతే తప్ప, ''గురువు అవసరం లేదు, ఎవరికి వారే గురువులు'' అని అనడం అజ్ఞానం. గురువు లేకుండా మోక్షం సంగతి పక్కకు పెట్టండి, కనీసం ''చాయ్'' కూడా పెట్టడం రాదు. తెలిసిన వాడు గురువు. తెలుసుకుంటున్న వాడు శిష్యుడు. అంతే ! నేర్పిస్తున్న వాడు గురువు, నేర్చుకుంటున్న వాడు శిష్యుడు ! నేర్పిస్తున్న వాడికి నేర్పించే వాళ్ళుంటారు ! ఇలా ఈ పరంపర అనంతంగా ఉంటుంది.

ఒక గురువును ఒప్పుకోవాలంటే, అహం అడ్డం వస్తుంది. ఒక గురువు మార్గదర్శకత్వంలో సాధన అనేది అహానికి చాలా ఇబ్బంది కలిగిస్తుంది. గురువు అనే వెలుగుతో, అహం అనే చీకటికి చాలా ఇబ్బంది కలుగుతూ ఉంటుంది. ఒక గురువును ఒప్పుకుని ఆయనకు సరెండర్ కావాలంటే, మామూలు విషయం కాదు. అలా చేసిన వారు 99% సాధించినట్టే ! గుర్తుంచుకోండి - గురువుకు

సరెండర్ అయి, ఆయన మార్గదర్శకత్వంలో సాధన చేసిన వారికే మోక్షం ప్రాప్తిస్తుంది. న్యూ ఏజ్‌కు అయినా, న్యూ ఎనర్జి కాన్సెప్ట్‌కైనా, మైత్రేయ సంఘాలకైనా... ఇదే సత్యం. ఇది శాశ్వత సత్యం.

అడ్రస్ తెలియకుండా పక్క ఊరికెళ్ళ లేరు... గురువు లేకుండా మోక్షం సాధిస్తామని అనడం ఎంత మూర్ఖత్వం !?!?!?!?!?!?!?!?!?!?!

గురువు అవసరం లేదు అని అనే వాళ్ళు ఎందుకు అలా అంటున్నారో, నాకు తెలియదు (నాకు తెలుసుకోవాల్సిన అవసరం కూడా లేదు) కాని, అది కరెక్ట్ అని దాన్ని ఒప్పుకునే వాళ్ళు ఎందుకు ఒప్పుకుంటున్నారో మాత్రం నాకు తెలుసు ! తమ దివ్యత్వాన్ని ఈ జన్మలో అనుభవపూర్వకంగా పొందే ఉద్దేశం లేని వాళ్ళే.. వారంతా ! అవును నీవు నిజంగా మోక్షానికి సిద్ధ పడితే, నీవు గురువును అంగీకరించియే తీరాలి. దైవత్వ ప్రాప్తికి 100 మెట్లు ఉంటే, 99 మెట్ల వరకు గురువు అవసరం ఉంటుంది. చివరి మెట్టులో గురువు అవసరం లేదు. చివరి మెట్టులో గురువు అడ్డం అవుతాడు. 99 మెట్ల వరకు గురువు నిచ్చెన లాంటి వాడు, తెరిచి ఉన్న ద్వారం వంటి వాడు కాని, చివరి మెట్టులో నిచ్చెనయే అడ్డం అవుతుంది. అయితే ఇది కేవలం చివరి మెట్టులో మాత్రమే ! 99 మెట్లు మాత్రం గురువు లేనిదే ఎక్కలేవు !

చివరి మెట్టులో గురువు అవసరం లేదు కదా అని.. అసలు మొదటి మెట్టు నుండే గురువు అవసరం లేదు అని అనడం ఎలా ఉంటుందంటే.... ''పుట్టిన వాడు ఎలాగూ, ఎప్పటికైనా చావక తప్పదు కదా అని అనుకుని, పుట్టగానే చచ్చిపోతే సరి'' అని అనుకోవడమంత మూర్ఖంగా ఉంటుంది.

''ఎవరికి వారే గురువులు'' - ఈ కాన్సెప్ట్‌ను ఒప్పుకుని ఆనందించే వాళ్ళంతా తమ అహాలను జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. వారి అహాలకు ఇది చాలా హాయిని గొలిపే విషయం. తమ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ... అప్పుడప్పుడు కొన్ని ప్రోగ్రాంలు నిర్వహించి, అప్పుడప్పుడు కొన్ని క్లాసులకు హాజరయ్యి.. మేమంతా సత్య మార్గంలోనే ఉన్నాము, మా వల్లనే ఈ భూమి ఉద్ధరించ బడుతోంది. మేము పొందాల్సింది ఏమీ లేదు. మేమంతా పొందియే ఉన్నాము. అనే భ్రమల్లో ఉంటూ తమ అహాలను తాము జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు.

ఇలా ఎవరికి వారే గురువులుగా ఫీలవుతూ ఉన్న వాళ్ళలో...

...కొంత మంది ఇంగ్లీష్ పుస్తకాలను అనువదించి ఆ సబ్జెక్ట్ అంతా తామే కనిపెట్టినంత ఫీలింగ్‌లో ఉంటున్నారు. కొంత మంది ఇంటర్‌నెట్‌లోని సమాచారాన్ని తెలుగులోకి అనువదించి, ఆ విజ్ఞానమంతా

మాకు తెలుసు అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. ఎవరికి వారే గురువులు అనే భ్రమలో ఉంటూ సత్య ప్రాప్తికి దూరంలోనే ఆగిపోతున్నారు...

...ఈ మధ్య న్యూ ఎనర్జి కాన్సెప్ట్‌ను, ఇంటర్‌నెట్‌లో నుండి చదివి, దాన్ని మొత్తం ఔపోసన పట్టిన విధంగా కొందరు ప్రవర్తిస్తున్నారు...

ఇంగ్లీష్ పుస్తకాలను అనువాదం చేయడం, గొప్ప పనే ! ఇంటర్‌నెట్‌లో చూసి అనువదించి తెలుగు ప్రజలకు అందించడం గొప్ప పనే ! అయితే స్వయం ఎన్‌లైటెన్డ్ కాదు అనే విషయం గుర్తుంచుకుంటే మంచిది.

తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్నట్టుగా... ప్రపంచంలో ఒకటే ధ్యానం ఉందని అనుకోవడం, దాన్ని ప్రచారం చేయడం సరి కాదు ! మీకు అది నచ్చిందని చెప్పండి. మాకు ఇది బాగుందని చెప్పండి. అంతే కాని, ఇది ఒక్కటే ధ్యానం అని అనడం ఎంత మాత్రం సరి కాదు.

2007 చివరిలో ఒకావిడ నా దగ్గరికి వచ్చింది. గురువు అవసరం లేదు, ఎవరికి వారే గురువు అని అనుకునే మైత్రేయ సంఘాల్లో నుండి వచ్చింది. ఎందుకు వచ్చిందో తెలియదు, కాని వచ్చింది. సరే.. నేను ఏమీ అనలేదు. ఎందుకు వచ్చావమ్మా అని అడిగాను. మీ సబ్జెక్ట్ ఏమిటో తెలుసుకుందామని వచ్చాను సార్.. అని చెప్పింది. అలా అప్పుడప్పుడు కొన్ని సార్లు నా దగ్గరికి వచ్చి కాస్తంత సబ్జెక్ తెలుసుకుంది. తర్వాత రావడం మానేసింది. మళ్ళీ 2009 చివరిలో నా దగ్గరికి వచ్చింది. అప్పుడు 2007లో ఆమె వచ్చినప్పుడు నా దగ్గర ఉన్న వాళ్ళే, 2009లో కూడా ఉన్నారు. ఆమె వారితో మాట్లాడింది. ఈ రెండు సం॥లలో వారు ఎంతగా డెవలప్ అయి ఉన్నారు అనేది, ప్రాక్టికల్‌గా చూసింది. ఆమె 2007లో ఎలా ఉందో, 2009లోనూ అలానే ఉంది. కాని నా శిష్యులు మాత్రం ఈ రెండు సం॥లలో ఎంతో ప్రాక్టికల్‌గా అభివృద్ధిని సాధించారు. ఈ సత్యం ఆమెను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆమె ఈ రెండు సం॥లలో ఎక్కడికీ వెళ్ళలేదట, ఎవరికి వారే గురువులు కదా అని అనుకుంటూ.. ఇంట్లోనే సాధన చేసుకుంటూ ఉందట. గురువు మార్గదర్శకత్వం లేకుండా, తనకు తానే గురువునని భ్రమిస్తూ గుడ్డిగా సాధన చేసుకుంటూ ఉన్నదట. ఆమె ఈ రెండేళ్ళలో కాని, అంతకు ముందు కాని తెలుసుకున్నది చాలా తక్కువ ! ఆమెకు జ్ఞానోదయం అయింది. నేను ఎంత భ్రమలో ఉన్నాను సార్, గురువు అవసరం లేదు, ఎవరికి వారే గురువులు అని చెప్తుంటే, నిజమేనని అనుకున్నాను. ఇప్పుడు మీ దగ్గరికి వచ్చిన తర్వాత అసలు విషయం తెలిసింది. సత్య సాధనకు ఒక గురువు అవసరం అని తెలిసి వచ్చింది. సత్య సాధనలో గురువు అవసరాన్ని గుర్తించాను. ఈ రెండేళ్ళలో నా తోటి వారు ఎంతో ఎత్తుకి ఎదిగారు. నేను ఎక్కడున్న దాన్ని అక్కడే ఉండిపోయాను. ఎంత కోల్పోయానో అర్థమవుతూ ఉంటే, బాధగా ఉంది. నేను నా అహంతో గురువు అవసరం లేదు, ఏదో అప్పుడప్పుడు వచ్చి కలిసి వెళ్తుంటే సరి పోతుంది అని అనుకున్నాను.. పుస్తకాలు చదువుతూ,

ఇంట్లోనే సాధన చేసుకుంటూ ఉంటే సరిపోతుంది అని అనుకున్నాను. ఇప్పుడు ప్రాక్టికల్‌గా తెలుసుకున్నాను. గురువు లేనిదే ఏమీ లేదు, ఏమీ రాదు అని గ్రహించాను... అంటూ నాకు పాదాభివందనం చేస్తూ కన్నీళ్ళు పెట్టుకుంది. ఆ తర్వాత విషయాలను తెలుసుకుంటూ సాధన చేస్తూ మంచి అభివృద్ధిని సాధించింది. తన అభివృద్ధి స్వయంగా తనకే తెలుస్తోంది. నిజమైన అభివృద్ధి కలిగినప్పుడు నీకు తెలిసియే తీరుతుంది. ఆత్మాభివృద్ధి కలుగుతూ ఉన్నప్పుడు, కలిగే ఆనందం, సంతృప్తి చాలా క్లియర్‌గా తెలిసిపోతాయి.

ఇలాంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయి. పూర్వపు రోజుల్లో గురువుకు శిష్యులకు మధ్య చాలా అంతరం ఉండేది. ఇప్పుడు అసలు గురువే అవసరం లేదు అని కొంత మంది భావిస్తున్నారు. పూర్వం జరిగింది "అతి"యే.. ఇప్పుడు జరుగుతున్నదీ "అతి"యే..! అతి సర్వత్రా వర్జయేత్ కదా !

గురువు అవసరం లేదు అని భావించడంలోని నిజమైన కోణం ఏమిటంటే, అహం ! అవును ఇది పచ్చి నిజం ! కేవలం అహం ఆడుతున్న నాటకం ! ఈ కాన్సెప్ట్‌కు అహం ఎన్ని వివరణలైనా ఇవ్వ గలదు. వాదించ గలదు. కాని వాస్తవంగా నిజాయితీగా తవ్వి చూస్తే బయట పడేది - అహం !

నీకు నీవే గురువు - ఇది నిజమే. అయితే ఒక కోణంలోనే అది వాస్తవం. నీకు నీవే గురువువి అనేది చాలా లోతైన సత్యం. కాని నీకు తెలియని విషయాలను తెలియజేసే వాడు నీకు అవసరం. సత్య ప్రస్థానం అనేది, అడ్రస్ తెలియకున్నా సరే.. దూరపు బంధువుల ఇంటికి పెళ్ళి పత్రిక ఇచ్చి రావడానికి బయలుదేరినట్టు.. బయలుదేరడం అని అనుకుంటున్నారా ఏమిటి ?!?!?

నిజంగా అసలు సత్యం తెలిసిన వాడు ఇలా మాట్లాడడు. సత్య సాధనలో గురువు దగ్గర ఉండవలసిన అవసరం లేదు కాని, గురువు యొక్క మార్గదర్శకత్వం తప్పని సరి అవసరం. దైవత్వ ప్రాప్తికి గురువు తప్పని సరి ! ఇది అర్థం చేసుకోకుండా.. గురువు అవసరం లేదు అనే భ్రమల్లో ఉన్న వారికి తక్షణమే అవగాహన వచ్చుగాక ! తమకు తామే అంతా గురువులం.. మాస్టర్లం.. అనే భ్రాంతిలో ఉన్న వారికి ఈ క్షణమే క్రాంతి వచ్చుగాక !

గురువు అవసరం లేదు అనే భావనకు మూలం అహమేనని అర్థం చేసుకోండి. వాస్తవం చేదుగా ఉన్నా.. వాస్తవం కదా..!

ఒక్క సారి ఆలోచించండి.. యథార్థంగా విశ్లేషించండి... మీకు రాని విద్యను దేనినైనా ఎవరినీ అడగకుండా నేర్చుకోండి. ఎంత కష్టమో అర్థమవుతుంది. భౌతిక విద్యలు కంటికి కనపడతాయి.. కాబట్టి కష్టాలు పడైనా నేర్చుకునే అవకాశాలు కొన్ని ఉన్నాయి. కాని సత్య సాధనలో కంటికి కనపడనివే అన్నీ ఉంటాయి. నీకు తెలియని అతీతమైన విషయాలే ఉంటాయి. వాటిని ఎలా తెలుసుకుని అధిగమిస్తావు ?! ఉన్న పళంగా చైనా భాషను పుస్తకాలను ఆధారంగా చేసుకుని నేర్చుకునే ప్రయత్నం చేయండి. ఎవరినీ అడగకండి. ఎందుకంటే గురువు అవసరం లేదు కదా.. చుక్కలు కనపడతాయి. కేవలం ఒక భౌతికమైన భాషకే పరిస్థితి ఇలా ఉంటే... పరమ ప్రాప్తం సంగతి ఏమిటి ?!

మోక్షం అంటే ఏమిటి ? లేక దైవత్వ ప్రాప్తి అంటే ఏమిటి ?! లేక జ్ఞానోదయం అని అంటే ఏమిటి ?! అనే విషయం పట్ల కొంచెం వాస్తవమైన సమాచారం మరియు కొద్ది పాటి అవగాహన ఉన్నా సరే... ఇలా మాట్లాడరు.

దైవత్వ ప్రాప్తి గురించి కొంచెం నిజమైన సమాచారం, వాస్తవమైన అవగాహన ఏ కొద్దిగా ఉన్నా సరే... గురువు అవసరం ఏమిటో... ప్రాక్టికల్‌గా తెలుస్తుంది.

జ్ఞానోదయం పట్ల ఏ మాత్రమూ అవగాహన లేదు అని అనడానికి, నికార్సైన ఋజువే - ''గురవు అవసరం లేదు, నీకు నీవే గురువువి'' అని అనడం.

ధ్యానంలో రకరకాల ఎక్స్‌పీరియన్స్‌లు వస్తూండే సరికి ఏమేమో అవుతూ ఉంటారు. రకరకాల మాస్టర్స్ కనపడే సరికి ఏదేదో అనుకుంటూ ఉంటారు. స్కూళ్ళను మంత్రులు అప్పుడప్పుడు సందర్శిస్తుంటారు. పిల్లలతో కాసేపు కబుర్లు చెప్పి వెళ్తారు. అంత మాత్రాన.. నాకు మినిస్టర్ తెలుసు.. మేము కూడా మినిస్టర్లమే కాబట్టి, మా దగ్గరికి మినిస్టర్లు వచ్చి వెళ్ళారు. మనది మినిస్టర్ల స్కూలు. మనది మినిస్టర్ల సంఘం. మన స్కూల్లో అందరూ... అంటే, పిల్లలు, టీచర్లు, అటెండర్లు... అందరూ మినిస్టర్లే అని భావించడం ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో... గురువు అవసరం లేదు అనేదీ ఇలానే ఉంది.

పిల్లలతో మంత్రులు మాట్లాడేటప్పుడు, ఎంకరేజింగ్‌గా మాట్లాడుతారు. పిల్లలు మంత్రిగారిని.. సార్ మీ లాగే మేము కూడా మినిస్టర్లమేనా సార్... అని అడిగితే, అప్పుడు ఆ మంత్రులు... '' అవును, మీరు కేవలం మంత్రులే కాదు ప్రధాన మంత్రులు'' అని కూడా చెప్తారు. అప్పుడు ఆ పిల్లలు ఓహో... మేము ప్రధాన మంత్రులమంటా... అరెరె...

మనది ప్రధాన మంత్రుల సొసైటి. మనది ప్రధాన మంత్రుల స్కూలు... ఆహాహా... ఒహోహో.... అంటూ కేరింతలు కొట్టడం ఎలా ఉంటుందో... గురువు అవసరం లేదు అనేది ఇలానే ఉంది.

తెలుసుకోండి. ఆధ్యాత్మిక సాధనలో గురువు తప్పని సరి అవసరం. అహంకారంతో గురువు అవసరం లేదు అని భావించినంత కాలం... సత్యం ప్రాప్తించదు. గురువు అవసరం లేదు అనే మాట అహానికి చాలా హాయిని కలిగిస్తుంది. సమ్మగా ఉంటుంది. అబ్బ...! ఎంత కరెక్ట్ అని అనిపిస్తుంది. కాని జరిగే మోసాన్ని గుర్తించండి. ఎవరికి వారే గురువులైనా సరే... దైవత్వ ప్రాప్తికి గురువు అవసరం. తప్పని సరి.

❖ ❖ ❖

110 **ప్రశ్న :** కొంత మంది న్యూ ఎనర్జి కాన్సెప్ట్ అని చెబుతూ నాన్ వెజ్ తింటున్నారు. మరి కొందరు, నిజమైన ఆధ్యాత్మికతలో ఒక పరిధి అంటూ ఉండదు. మీరు ఇంకా శాకాహారం అనే పరిధిలోనే బంధింపబడి ఉంటున్నారు. మీరింకా ఎదగాలి అంటూ... నాన్ వెజ్ తింటున్నారు. శాకాహారులమైన మమ్మల్ని చాలా తక్కువగా... ఎప్పటికి ఎదుగుతారురా మీరు అన్నట్టు చూస్తున్నారు... చాలా అయోమయంగా ఉంది సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత కూడా తమలోని ''తమో గుణాన్ని'' వదులుకోలేక అతి తెలివితో చెబుతున్న సాకులు అవి. వీటినే వెధవ తెలివి తేటలు అని అంటారు.

న్యూ ఎనర్జి కాన్సెప్ట్ నిజంగా అర్థం అయిన వాడు చక్కని అకర్మ శాకాహారిగా మారిపోతాడు.

ఇంటర్‌నెట్ అనే దాన్ని ఉపయోగించుకుని అభివృద్ధి చెందవచ్చు లేదా నాశనం కావచ్చు. ప్రస్తుతం ఈ న్యూ ఎనర్జి పిచ్చ గాళ్ళకు జరుగుతుంది నాశనమే. ఇంటర్‌నెట్‌లో ఏవేవో చదివి, వాటిని తమకిష్టం వచ్చినట్టుగా అర్థాలు మార్చుకుని, తమ యొక్క ''తమో గుణానికి'' ఆధ్యాత్మికత అనే ముసుగు వేసుకుని, ఆత్మ వంచన చేసుకుంటున్న మూర్ఖులు వీరు. న్యూ ఎనర్జి కాన్సెప్ట్‌ను అడ్డం పెట్టుకుని ఈ అజ్ఞానులు నాన్ వెజ్ తింటున్నారు. న్యూ ఎనర్జి సూత్రాలను పాటిస్తూ, ప్రేమతో తింటే ఏదైనా ''సరి'' అవుతుంది అని చెబుతూ వీరు నాన్ వెజ్ తింటున్నారు. ఇది కేవలం వారిలో అణిచిపెట్టుకుని ఉన్న మాంసాహార యావ తప్ప మరొకటి కాదు. న్యూ ఎనర్జి సూత్రాలను పాటిస్తూ, ప్రేమతో విషాలను తినమనండి.. వీరి కాన్సెప్ట్ ప్రకారం సరి అవుతాయి కదా ! తాగమనండి విషాలను.. అప్పుడు వీరి కాన్సెప్ట్‌లన్నీ గాలికి కొట్టుకు పోతాయి. ''తమో గుణ'' ప్రధానంగా ఉన్న ''తామసులు'' వీరు. పొరపాటున ''తాపసులు'' అయిపోయారు. లోపల ఉన్న ''తమో గుణం''

వీరిని నిలవనీయడం లేదు. నాన్ వెజ్ తినాలి. ఎలా ?? ''తాపసులం'' అయిపోతిమి. లోపలున్న ''తామసి'' అల్లాడుతున్నాడు. అర్జెంటుగా వాడిని శాంత పర్చాలి. వీరికి వరంలాగా న్యూ ఎనర్జి కాన్సెప్ట్ ఇంటర్‌నెట్‌లో దొరికింది. ఇంకేం.. ఆ కాన్సెప్ట్‌ను తమకు అనుగుణంగా మార్చుకుని చక్కగా నాన్ వెజ్ తినేస్తూ ఉన్నారు. ''తాపసులుగా'' చెలామణి అవుతున్న, ఈ ''తామసులను'' అలా వదిలేయండి. ఈ ''తామసులు'' ఏ నాటికో ఒక నాటికి, ఏదో ఓ జన్మలో ''సత్వ గుణ ప్రధానులుగా'' అవుతారు. సత్య మార్గంలోకి వస్తారు.

ఆధ్యాత్మికతకు ఒక పరిధి అంటూ ఉండదు అనే వాళ్ళు కూడా ''తమో గుణం'' యొక్క ఆధీనంలో ఉన్న వారే ! వీరు, పొరపాటున ఆధ్యాత్మికతలోకి వచ్చిన వారు. లేదా మరేదో కారణం చేత ఆధ్యాత్మికతలోకి లాగబడిన వారు. అంతే కాని సహజంగా ఆత్మ పరిణామ క్రమంలో అన్ని భౌతిక దశలను పూర్తి చేసుకుని, ఇక తమ దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుందామని వచ్చిన వారు కాదు. ఇవి ఇంకా పరిపక్వత చెందని ఆత్మలు. వీటికి ఇప్పుడు ఎంత చెప్పినా అర్థం కాదు. వీరు ఆధ్యాత్మిక ముసుగులో ఉండి నాన్ వెజ్ తినడం, దాన్ని సమర్థించడం, ప్రచారం చేయడం ఎలా ఉందంటే - రాకెట్‌ను కేవలం అంతరిక్ష యాత్రలకు మాత్రమే పరిమితం చేయడం సరికాదు, అలా చేస్తే రాకెట్‌ను ఒక పరిధిలో బంధించినట్టు అవుతుంది. కాబట్టి ఇప్పటి నుండి మనం రాకెట్‌ను మన కాలని సందుల్లో తిప్పుకుందాం. ప్రజలకు, రాకెట్ యొక్క మరొక ఉపయోగాన్ని తెలియజేసి వారిని ఉద్ధరిద్దాం అని అంటే ఎలా ఉంటుందో... ఈ మూర్ఖులు చెప్పేది అలానే ఉంది.

న్యూ ఎనర్జి అయినా మరే ఎనర్జి అయినా... పరిధి ఉన్నా... పరిధి లేక పోయినా... ఎల్లప్పుడూ ఒకే ఒక సూత్రం - అకర్మ శాకాహారమే - అకర్మ వీగనిజమే ఆధ్యాత్మికతకు ప్రవేశ ద్వారం !

❖ ❖ ❖

111 **ప్రశ్న :** శరీరానికి మరియు జీవితానికి ఉన్న సంబంధం గురించి చెప్పండి సార్ ! ప్రధానంగా ఏ ఏ సూత్రాలను తెలుసుకుని ఆచరిస్తే, ఈ భూలోకంలో శాంతి సౌభాగ్యానందాలు వెల్లివిరుస్తాయి ? దయచేసి తెలియజేయండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ప్రస్తుతం భూమి పైన నెలకొని ఉన్న సరి కాని పరిస్థితులన్నింటి యొక్క మూల కారణం ఒకే ఒక్కటి... అది నిజమైన ఆధ్యాత్మిక శాస్త్ర అవగాహన లేక పోవటం. మనుషుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్న పరిస్థితులకూ, సమాజంలోని అవకతవకలకూ, లోకంలోని సంఘర్షణలకూ, లోకంలో సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలకు... ప్రతీ ఒక్క దానికి ఒకే ఒక్క కారణం... నిజమైన ఆధ్యాత్మిక శాస్త్ర అవగాహన లేక పోవటం. ఒక్క మాటలో చెప్పాలంటే... ప్రతీ ఒక్క సరి కాని పరిస్థితికి మూల కారణం... నిజమైన ఆధ్యాత్మిక శాస్త్ర అవగాహన లేక పోవటమే.

నిజమైన ఆధ్యాత్మిక శాస్త్రం అని ఎందుకు అనాల్సి వస్తుందీ అని అంటే... ఆధ్యాత్మికతకు మతం అనే ముద్ర వేశారు. మత పరమైనది వాస్తవమైన ఆధ్యాత్మిక శాస్త్ర అవగాహన కాదు. ఎందుకంటే ఇంతకు ముందే చెప్పాను, మతాలన్నీ ఆధ్యాత్మిక శాస్త్రంలో ఒక భాగం మాత్రమేనని. మతానికి ఆధ్యాత్మిక శాస్త్రానికి ఎలాంటి సంబంధం లేదు. అనంతమైన ఆధ్యాత్మిక శాస్త్రంలో మతాలనేవి చిన్న చిన్న ఇసుక రేణువుల్లాంటివి. ఆధ్యాత్మిక శాస్త్రం యావత్ సృష్టికి సంబంధించినది. ఈ భూమి ఒక లోకం. ఇలాంటి కోటాను కోట్ల లోకాలను కలిపితే ఒక విశ్వం. గ్రహించండి, ఒక విశ్వంలో కోటాను కోట్ల లోకాలుంటాయి. ఇలా కోటాను కోట్ల లోకాలను కలిగి ఉన్న విశ్వాలు, ఈ అనంత సృష్టిలో లెక్క లేనన్ని ఉన్నాయి. ప్లెడీస్ అనే అడ్వాన్స్‌డ్ నక్షత్ర రాశికి చెందిన ప్లెడియన్స్ అని అనబడే వాళ్ళు... తమకున్న పరిజ్ఞానంతో సృష్టిలో ఎన్ని విశ్వాలున్నాయో లెక్కించే పనిని ప్రారంభించారు. వారు తేల్చి చెప్పినది ఏమంటే.. ఒకటి(1) పక్కన 52 సున్నాలు పెడితే ఎంత పెద్ద నంబర్ అవుతుందో అన్ని విశ్వాలను ప్రస్తుతానికి లెక్కించామనీ ఇంకా లెక్క కొనసాగుతూ ఉందనీ.. భూమి పైన ధ్యానం చేసే మాస్టర్స్‌కు, ధ్యానంలో మెసేజెస్ రూపంలో ఈ విశేషాలను తెలియజేసారు. ఒకటి పక్కన యాభై రెండు సున్నాలను పెడితే...

10000000000000000000000000000000000000000000000000000 ఇది ఎంత పెద్ద నంబరో చూడండి. ప్రస్తుతం సృష్టిలో ప్లెడియన్స్ చేత లెక్కించ బడిన సంఖ్య ఇది. ఇన్ని విశ్వాలను వారు కనుగొన్నారు. ఇన్ని విశ్వాలలోని ప్రతీ ఒక్క విశ్వంలో కోటాను కోట్ల లోకాలున్నాయి. ఇన్ని విశ్వాలలోని లోకాలలో ఆల్‌మోస్ట్ అన్ని లోకాలలో ప్రాణులున్నాయని, జీవితం మరియు మనకు లాగే వ్యవస్థలున్నాయనీ వారు తెలుసుకున్నారు. మన భూమి పైన ఉన్న వ్యవస్థల కంటే అభివృద్ధి చెందిన వ్యవస్థలను కలిగిన లోకాలు, సృష్టిలో ట్రిలియన్ల కొద్దీ ఉన్నాయనీ తెలుసుకున్నారు. (ట్రిలియన్ అంటే - 1 000 000 000 000) ప్లెడియన్స్ గురించి తెలుసుకోవాలి అని అనుకుంటే ఇంటర్‌నెట్‌లో pleiadians అని టైప్ చేసి search చేయండి. pleiadians గురించి తెలియజేసే ఎన్నో సైట్లు ఉన్నాయి, ఎన్నో పుస్తకాలున్నాయి.

10000000000000000000000000000000000000000000000000000 కంటే ఎక్కువ విశ్వాలు ఈ అనంత సృష్టిలో ఉన్నాయి. ఒక్కో విశ్వంలో కోటాను కోట్ల లోకాలున్నాయి. మన భూలోకం ఉన్న, మన విశ్వం గురించి, రామ్తా అనే గ్రేట్ గ్రాండ్ మాస్టర్ ఇలా చెప్తాడు - "మీ భూమి ఒక చిన్న విశ్వంలో ఉంది. మీ విశ్వంలో పది లక్షల కోట్ల సూర్యుళ్ళు ఉన్నారు. ప్రతీ సూర్యుడికీ తనదైన సౌర కుటుంబం ఉంది. సౌర కుటుంబం అంటే... ప్రతీ సూర్యుడి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ ఉన్న గ్రహాలు ఉన్నాయి. ఈ గ్రహాల్లో జీవం(జీవితం) ఉంది" అని రామ్తా మాస్టర్ తెలియజేసాడు. (రామ్తా గురించి తెలుసుకోవాలంటే www.ramtha.com అనే వెబ్‌సైట్‌ను సందర్శించండి). ఒక చిన్న విశ్వంలోనే పది లక్షల కోట్ల సూర్యుళ్ళు ఉంటే, ప్రతీ సూర్యుడి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్న కోటాను కోట్ల గ్రహాలుంటే, వాటన్నింటిలో జీవం(జీవితం) ఉంటే... పెద్ద విశ్వాలలో ఎంత మంది సూర్యుళ్ళు ఉంటారు ?! ఆ సూర్యుళ్ళకు ఎన్నెన్ని గ్రహాలు ఉంటాయి !? 10^{52} విశ్వాలలో

ఎన్ని సౌర కుటుంబాలు ఉంటాయి ?! మొత్తం ఎన్ని గ్రహాలు(లోకాలు) ఉంటాయి ?!... సుమారుగా అన్ని లోకాలలో జీవం(జీవితం) ఉంది అని ఉన్నత తలాలకు చెందిన మాస్టర్స్ చెప్తున్నారు ! ఇదంతా ఆధ్యాత్మిక శాస్త్రం యొక్క మొదటి పేజీ మాత్రమే ! ఇప్పుడు చెప్పండి.. ఆధ్యాత్మిక శాస్త్రానికి మతానికి ఏమైనా సంబంధం కనపడుతోందా ??

మరి ఇతర గ్రహాల్లో కూడా జీవం ఉంటే, ఇప్పటి వరకు మన శాస్త్రజ్ఞులు ఎందుకు కనుక్కోలేక పోయారు అని మీకు సహజంగానే సందేహం వస్తుంది. దీనికి సమాధానం ఏమిటంటే - ప్రతీ గ్రహానికి, ప్రతీ లోకానికి, ప్రతీ విశ్వానికి ప్రత్యేకమైన ద్వారాలు ఉంటాయి. ఒక్కో గ్రహానికి ఒక్కో విధమైన ''వైబ్రేషనల్ ఫ్రీక్వెన్సీ'' ఉంటుంది. మీరు ఏదైనా గ్రహానికి వెళ్ళినప్పుడు, అక్కడ, మీరు ఆ గ్రహానికి సంబంధించిన ''వైబ్రేషనల్ ఫ్రీక్వెన్సీ''లోకి మారితే అప్పుడు ఆ గ్రహం యొక్క వాస్తవ దృశ్యాలు మీకు కనిపిస్తాయి. లేదా.. ఆ గ్రహం నిర్మానుష్యంగా.. ఏమీ లేనట్టుగానే కనపడుతుంది. ఉదాహరణకు, ఇప్పుడు.. మీరు ఉన్న ప్రదేశంలోనే ఎన్నో తలాలు ఉన్నాయి. మీ చుట్టూ ఎన్నో తరంగాలు అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాయి. భౌతిక కళ్ళకు కనపడని ప్రసారాలు ఎన్నెన్నో మీ పక్కనుండి, మీ ముందు నుండి జరుగుతూనే ఉన్నాయి. కాని మీకు కనపడవు. ఎందుకంటే, వాటిని మీరు ట్యూన్ చేయలేక పోతున్నారు కాబట్టి అవి మీకు వినబడవు, కనపడవు. ఇప్పుడు.. మీరున్న ప్రదేశంలో ఒక రేడియోను ఆన్(On) చేయండి, వెంటనే రేడియో కార్యక్రమాలను వినగలుగుతారు. మళ్ళీ రేడియోలో ఎన్నో స్టేషన్లు ఉంటాయి. ఒక్కో స్టేషన్‌కు ఒక్కో విధమైన ట్యూనింగ్ ఉంటుంది. ఒక వేళ మీరు టెలివిజన్ ఆన్ చేస్తే ఎన్నో కార్యక్రమాలను చూడవచ్చు. ఒక్కో చానల్‌కు ఒక్కో ట్యూనింగ్ ఉంటుంది. ఇప్పుడు మీరున్న ప్రదేశంలోనే మొబైల్ ఫోన్‌ను ఆన్ చేసినప్పుడు మీరు ఇతరులతో మాట్లాడవచ్చు. ఇప్పుడు మీరున్న ప్రదేశంలో ఒక వైర్‌లెస్ సెట్‌ను ఆన్ చేస్తే, ఆ వైర్‌లెస్ సెట్ యొక్క సామర్థ్యాన్ని బట్టి ఎక్కడికైనా మాట్లాడవచ్చు. ఇప్పుడు మీరున్న ప్రదేశంలోనే, మీరు ఒక సాటిలైట్ ఫోన్‌ను ఆన్(On) చేస్తే మీరు ఎక్కడికైనా మాట్లాడవచ్చు.

మీరు రేడియోను, టెలివిజన్‌ను, మొబైల్ ఫోన్‌ను, వైర్‌లెస్ సెట్‌ను, సాటిలైట్ ఫోన్‌ను ఆన్ చేయకపోతే.. మీకేమీ వినపడదు, కనపడదు. ఎందుకంటే మీ యొక్క భౌతిక కళ్ళు ఆ తరంగాలను ట్యూన్ చేసుకుని చూడలేవు. మీ యొక్క భౌతిక చెవులు ఆ తరంగాలను ట్యూన్ చేసుకుని వినలేవు. అదే మీ దగ్గర ఒక పరికరం ఉన్నప్పుడు, ఆ పరికరం వేటినైతే ట్యూన్ చేయగలుగుతుందో వాటిని మీరు వినగలుగుతారు మరియు చూడగలుగుతారు. ఇదే విధంగా మన శరీరాలను, మనం ప్రయాణిస్తున్న వాహనాన్ని మరియు మన వెంట ఉన్న ఇతర వస్తువులను.. ఆ గ్రహం యొక్క ట్యూనింగ్‌కు అనుసంధానం చేసినప్పుడు మనకు ఆ గ్రహం యొక్క వాస్తవ దృశ్యం కనపడుతుంది. మనం ఆ గ్రహంలోనికి ప్రవేశించ గలుగుతాము. అక్కడి వారితో సంభాషించ గలుగుతాము. అక్కడి విషయాలను విశేషాలను తెలుసుకోగలుగుతాము. అయితే, ఈ సంగతులన్నీ ఆధ్యాత్మిక

శాస్త్రంలో పరిశోధన చేస్తేనే తెలుస్తాయి. మరి, మన శాస్త్రజ్ఞులేమో ఆధ్యాత్మిక శాస్త్రాన్ని అనుమతించ కుండా, దానిని పట్టించుకోకుండా తమదైన భౌతిక దృష్టితో పరిశోధనలు చేస్తున్నారు. అందుకే వారికి ఇతర గ్రహాల మీద ఏమీ కనపడటం లేదు. ఎలాగైతే ఇప్పుడు మీరున్న ప్రదేశంలో ఏ పరికరాలను ఆన్ చేయకుండా మీరున్నప్పుడు, మీకేమీ వినపడదో, కనపడదో, ఇదే విధంగా వారికి ఏమీ తెలియటం లేదు. శాస్త్రజ్ఞుల దగ్గర పరికరాలున్నాయి కాని, వారికి తెలియని విషయం ఏమిటంటే, ఇతర గ్రహాలను ఎలా కాంటాక్ట్ చేయాలో తెలియకపోవటం. ఇతర గ్రహవాసులను, ఇతర లోకవాసులను, ఇతర విశ్వాల వాళ్ళను ఎలా కాంటాక్ట్ చేయాలి అనే విషయాలు అన్నీ ఆధ్యాత్మిక శాస్త్రంలో ఉంటాయి. మరి, మన శాస్త్రజ్ఞులేమో ఆధ్యాత్మిక శాస్త్రాన్ని ఒప్పుకోవటం లేదు. అందుకే చాలా గొప్ప సృష్టి రహస్యాలను ఆవిష్కరించే ఆవకాశం ఉన్నా... వాటిని ఆవిష్కరించలేక పోతున్నారు. ఇప్పుడు శాస్త్రజ్ఞులు, మతాధికారులు మరియు నాస్తికులు... అందరూ... ఆధ్యాత్మిక శాస్త్రాన్ని ఒప్పుకునే పరిస్థితులు ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక శాస్త్ర సత్యాలు బహిరంగంగా ప్రకటమై సశాస్త్రీయంగా నిరూపితం అవుతాయి.

సరే, విషయానికి వస్తే... ఇలా సృష్టి గురించి వివరిస్తూ, మన భూమి, భూమి పైన మన గురించి, మన జీవితం గురించి తెలియజేయడం ప్రారంభిస్తుంది ఆధ్యాత్మిక శాస్త్రం. ఇప్పటికైనా అర్థం అయిందనుకుంటాను మీకు.. ఆధ్యాత్మిక శాస్త్రం అని అంటే సృష్టి శాస్త్రం (Cosmic Science) అని ! మన భూమి పైన ఎన్నో మతాలున్నాయి. ప్రతీ మతం, జీవితం గురించి, సృష్టి గురించి తనవైన సిద్ధాంతాలను కలిగి ఉంటుంది. ఒక మతం చెప్పింది, ఇంకో మతం వ్యతిరేకిస్తుంది. ప్రతీ మతం తన సిద్ధాంతాలే కరెక్ట్ అని భావిస్తుంది. ఒకే సత్యం గురించి ఇన్ని విభిన్నమైన, పరస్పర వ్యతిరేకమైన సిద్ధాంతాలు ఎలా ఉండ గలుగుతాయి ? ఉదాహరణకు, మానవ శరీరం గురించి ప్రస్తావిస్తే.. భూమి మీదున్న శరీరాలన్నీ ఒకే ధర్మాన్ని కలిగి ఉంటాయి. ప్రతీ శరీరం శ్వాస తీసుకుంటేనే జీవించ గలుగుతుంది. ఏ శరీరానికైనా అంటే, అది ఏ మతానికి చెందినదైనా, ఏ కులానికి చెందినదైనా, ఏ వర్గానికి చెందినదైనా, ఏ సంప్రదాయానికి సంబంధించినదైనా.. ఏ శరీరానికైనా దాహం వేస్తే మంచి నీళ్ళు తాగితే దాహం తీరుతుంది. ఆకలి వేసినప్పుడు ఆహారం తీసుకుంటే ఆకలి తీరుతుంది, శక్తి వస్తుంది. ప్రతీ శరీరం యొక్క ఫంక్షనింగ్ ఒకేలా ఉంటుంది. ఇది సత్యం. దీన్ని ఏ మతం వారైనా ఒప్పుకుని తీరాల్సిందే.. మా మతం యొక్క శరీరాలు ప్రత్యేకంగా ఉంటాయి, మా శరీరాల ఫంక్షనింగ్ వేరే, మా శరీర ధర్మాలు వేరే అని ఎవరూ.. ఏ మత పెద్దలూ చెప్పలేరు. భౌగోళిక పరిసర ప్రాంతాలను అనుసరించి ఏవైనా కొన్ని మార్పులుంటాయి కానీ, ప్రధానంగా ప్రతీ శరీరానికి ఒకే రకమైన ధర్మాలు ఉంటాయి. ఇది సత్యం. ఇది ఎదురు లేని, తిరుగు లేని వాస్తవం. ఇది ఎవరూ కాదనలేని, తిరస్కరించ లేని నిజం. ఈ విధంగా దేనికి సంబంధించినదైనా సత్యం ఒకటే ఉంటుంది.. కాబట్టే దానిని సత్యం అని అంటారు. ఉదాహరణకు, ఇంకో సత్యాన్ని తీసుకుంటే.. భూమి గుండ్రంగా ఉంది అని కనుక్కున్నారు. ఇప్పుడు ఏ మతం వాడైనా భూమి త్రికోణాకారంలో ఉంటుందని చెప్పలేడు.

చెబితే ఏం జరుగుతుందో తెలుసు... కాబట్టి చెప్పడు. ఈ విధంగా అసలు సిసలు నిజం ఒకటే ఉంటుంది. వాస్తవం ఒకటే ఉంటుంది. ఉన్న సత్యాన్ని మనం యథాతథంగా అంగీకరిస్తే, అభివృద్ధి చెందుతాము. బాగు పడతాము. మతాల్లో సత్యాలున్నాయి, కాని మరుగున పడి ఉన్నాయి. వాటిలోని అసలు నిజాలను వెలికి తీయాలంటే చాలా కష్టం.

సరే.. విషయానికి వస్తే... మన భూమి పైన ఎన్నో మతాలున్నాయి. ప్రతీ మతం, జీవితం గురించి, సృష్టి గురించి తనవైన సిద్ధాంతాలను కలిగి ఉంటుంది. ఒక మతం చెప్పింది, ఇంకో మతం వ్యతిరేకిస్తుంది. ప్రతీ మతం తన సిద్ధాంతాలే కరెక్ట్ అని భావిస్తుంది. ఒకే సత్యం గురించి ఇన్ని విభిన్నమైన, పరస్పర వ్యతిరేకమైన సిద్ధాంతాలు ఎలా ఉండ గలుగుతాయి ? ఏదో ఒకటే నిజం కావాలి కదా ! అన్నీ నిజాలే ఎలా అవుతాయి ? ఉదాహరణకు, మానవ శరీరానికి నవ రంధ్రాలున్నాయి. ఒక్కో రంధ్రానికి ఒక్కో పని ఉంది. ఆహారం నోటి ద్వారా మాత్రమే తీసుకోవాలి. మిగిలిన ఎనిమిది రంధ్రాల ద్వారా మనిషి ఆహారం తీసుకోలేడు. వాటికి వేరే పనులు ఉన్నాయి. ఏ రంధ్రానికి కేటాయించిన పని ఆ రంధ్రం చేసుకుంటుంది. ఇప్పుడు ఈ సత్యాలను "మతాలు" వ్యతిరేకించ లేవు. భూమి పైన ఉన్న మతాల్లోకెల్లా మా మతమే గొప్పది. మా మతం వారు ఆహారాన్ని కేవలం నోటి ద్వారా మాత్రమే కాదు, మిగిలిన 8 రంధ్రాల్లో నుండి కూడా తీసుకోగలరు.. అని చెప్పలేరు. ఎందుకంటే అలా చెబితే చేసి చూపించాలి కాబట్టి చెప్పటం లేదు, ఈ విషయంలో అన్ని మతాల వారికి ఏకాభిప్రాయం ఉంది. మరి.. సృష్టి సిద్ధాంతాల దగ్గరికి వచ్చే సరికి ఎందుకు వ్యతిరేకతలు వస్తున్నాయి ? జీవన విధానాల దగ్గరికి వచ్చే సరికి ఎందుకు వ్యతిరేకతలు వస్తున్నాయి ? జీవితం దగ్గరికి వచ్చే సరికి ఎందుకు వ్యతిరేకతలు వస్తున్నాయి ? మా మతంలో ఇది ఉంది. అది లేదు. మా మతంలో ఇది కరెక్ట్. మా మతం ప్రకారం ఇది తప్పు. మా మతం ప్రకారం దైవం అంటే ఇది అని ఒకరు చెబితే... ఇంకోడు ఇంకో రకంగా చెబుతాడు. ఎవరి దేవుళ్ళు వారికున్నారు. ప్రతీ మతం వారు తమ దేవుడే అసలు దేవుడు అని అనుకుంటూ ఉంటారు. ఇంతకు ఎవరి దేవుడు కరెక్ట్ ? మా మతం ప్రకారం దేవుడు సృష్టిని ఇలా చేశాడు అని ఒకడు... మా మతం ప్రకారం సృష్టి ఇలా జరిగిందని ఇంకొకడు... అందరూ తమదే కరెక్ట్ అని అనుకుంటూ ఉంటారు. మిగతావి తప్పు అని అంటూ ఉంటారు. ఇలా ఎవరికి వారు అనుకుంటూ ఉంటే... ఇంతకు అసలు సత్యం ఏమిటి ?

ఒకే మనిషి గురించి, ఒకే జీవితం గురించి ఎన్నో రకాలైన పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలు ఎలా ఉండ గలుగుతాయి ?! ***శరీర ధర్మాలు ఒకటే అయినప్పుడు, జీవిత ధర్మాలు వేరు ఎలా అవుతాయి*** ?!?! ఓపెన్ మైండ్‌తో ఒక సారి ఆలోచించండి... వాస్తవ దృక్పథంతో ఈ విషయం గురించి లోతుగా ఆలోచిస్తే ఒక విషయం స్పష్టం అవుతుంది.. అదేమిటంటే - మతాలు ప్రతిపాదిస్తున్న విషయాలలో పూర్తి సత్యం లేదు అని !

ప్రియ మిత్రులారా...

అసలు సిసలు సత్యాన్ని తెలుసుకుని, దాన్ని ఒప్పుకుని జీవిస్తే తక్షణమే ప్రపంచం అంతా శాంతి నెలకొంటుంది.

శరీర ధర్మాలు ఒకటే అయినప్పుడు, జీవిత ధర్మాలు కూడా ఒకటే అవుతాయి. ఎందుకంటే, శరీరానికీ జీవితానికీ పూర్తి స్థాయి సంబంధం ఉంది. జీవితానికి విస్తృతార్థం వేరేగా ఉన్నా, ప్రస్తుతం ఈ భూగ్రహానికి సంబంధించినదిగా జీవితాన్ని గనుక తీసుకుంటే, జీవితం అనేది పూర్తిగా శరీరానికి సంబంధించినది మాత్రమే అయి ఉంటుంది. శరీరమే జీవితం ! అవును, శరీరం లేకుండా జీవితాన్ని ఊహించ గలరా ?! మీరు ఈ భూమి పైన జీవితాన్ని జీవించాలంటే, మీకు తప్పని సరిగా ఒక శరీరం అనేది అవసరం. మీరు, మీ శరీరం కాకపోయినా, మీ భూలోక జీవితం అనేది పూర్తిగా శరీరం పైన ఆధారపడి ఉంది. శరీరం లేక పోతే జీవితమే లేదు. కాబట్టే శరీరమే జీవితం ! శరీరం ద్వారానే మీరు జీవితాన్ని జీవించ గలుగుతారు. శరీరం మరియు జీవితం వేరు, వేరు కావు. ఈ రెండూ ఒకటే ! శరీరం దీపం అయితే, జీవితం వెలుగు ! ఏ విధంగానైతే దీపం లేకుండా వెలుగు ఉండదో, సరిగ్గా అదే విధంగా శరీరం లేనిదే జీవితం ఉండదు. శరీరం యొక్క విస్తరణయే జీవితం. జీవితం యొక్క ప్రతీ కోణం తనదైన రీతిలో శరీరం పైన ప్రభావం చూపెడుతుంది. మీరు జీవితాన్ని వదిలేయాలి అని అంటే, శరీరాన్ని వదిలేయాలి. ఇక్కడ.. చూడండి.. జీవితాన్ని వదిలేయాలి అని అంటే మీరు తప్పని సరిగా శరీరాన్ని వదిలేసితీరాలి. శరీరాన్ని వదిలేయకుండా, జీవితాన్ని మాత్రమే వదిలేయాలి అని అనుకుంటే అది సాధ్యమవుతుందా !? శరీరాన్ని వదిలేయకుండా జీవితాన్ని వదిలించుకునే ప్రయత్నం చేసి చూడండి. అది అసంభవం. దీపం, వెలుగు రెండూ వేరు వేరు పదాలయినా, ఆ రెండింటి యొక్క మూలం ఒక్కటే, అవి ఒకటి లేనిదే మరొకటి ఉండవు, ఎందుకంటే.. ఆ రెండూ ఒక్కటే ! ఈ విధంగానే శరీరం, జీవితం రెండూ వేరు వేరు పదాలయినా, ఆ రెండింటి యొక్క మూలం ఒక్కటే, అవి ఒకటి లేనిదే మరొకటి ఉండవు, ఎందుకంటే.. ఆ రెండూ ఒక్కటే కాబట్టి ! ఇప్పుడు మీకు అసలు విషయం అర్థమైంది కదా !

ఈ భూమి పైన సృష్టి నియమాలు అందరికీ ఒకే రకంగా వర్తిస్తాయి. వారు భూమి పైనున్న మనుషులా కాదా అన్నదే పాయింట్ ! వారు భూమి పైనున్న మనుషులే అయితే సృష్టి నియమాలు అందరికీ ఒకే లాగా వర్తిస్తాయి.

భూమి పైనున్న మతాల వయసు ఎంత ఉంది ? భూమి యొక్క వయసుతో పోల్చుకుంటే, అన్నీ పసి కందులే ! బౌద్ధ మతం పుట్టక ముందు భూమి ఉంది, భూమి పైన మనుషులు ఉన్నారు, జీవితం ఉంది, వ్యవస్థ ఉంది. జైన మతం పుట్టక ముందు భూమి ఉంది, భూమి పైన మనుషులు ఉన్నారు, జీవితం ఉంది, వ్యవస్థ ఉంది. యూదు మతం పుట్టక ముందు భూమి ఉంది, భూమి పైన మనుషులు ఉన్నారు, జీవితం ఉంది, వ్యవస్థ ఉంది. క్రిస్టియన్ మతం పుట్టక ముందు భూమి ఉంది, భూమి పైన మనుషులు ఉన్నారు, జీవితం ఉంది, వ్యవస్థ ఉంది. ఇస్లాం మతం పుట్టక ముందు భూమి ఉంది, భూమి పైన మనుషులు ఉన్నారు, జీవితం ఉంది, వ్యవస్థ ఉంది. ఈ మతాలన్నింటిలోకెల్లా అత్యంత పురాతనమైనది హిందూ మతమే ! అయినా హిందూ మతం అనేది పుట్టక ముందు

భూమి ఉంది, భూమి పైన మనుషులు ఉన్నారు, జీవితం ఉంది, వ్యవస్థ ఉంది.

నిజానికి హిందూ మతం అనేదే లేదు. పూర్వ కాలపు భారత దేశంలో చాలా రకాల మతాలుండేవి. వైష్ణవులు, శైవులు, గాణపత్యులు, శాక్తేయులు మొదలగు అనేక మతాలు ఉండేవి. వీరిలో వీరికి ఎప్పుడూ యుద్ధాలు జరుగుతూ ఉండేవి. ఈ మతాలన్నింటినీ ఏకం చేసేందుకు ఎందరో మహానుభావులు కృషి చేసారు. వీరి కృషి ఫలితంగా ఈ మతాలన్నీ ఏకమైపోయాయి. (అయినప్పటికీ వీరిలో వీరికి ఒక కోణంలో అంతర్యుద్ధం జరుగుతూనే ఉంటుంది). అయితే, అప్పటికి కూడా ప్రత్యేకంగా హిందూయిజమ్ లేక హిందూత్వం లేక హిందూ వాదం అనేవి పెద్దగా లేవు. అత్యంత ప్రాచీన కాలం నుండి కూడా భారత దేశంలో ఆధ్యాత్మికత అనేది పరిఢవిల్లుతూనే ఉంది. బయట నుండి ఫ్రెంచ్ వారు, డచ్ వారు, ముఖ్యంగా మొఘలులు మరియు ఇంగ్లీష్ వారు భారత దేశాన్ని ఆక్రమించుకుని వందల సం॥లు పాలించారు. ఆ దశలలో ఇస్లాం మతం మరియు క్రిస్టయన్ మతాల యొక్క వ్యాప్తి చాలా బలంగా, బలవంతంగా జరిగింది. బలవంతంగా మత మార్పిళ్ళు కొన్ని వందల సం॥ల పాటు జరిగాయి. వాస్తవంగా, ప్రస్తుతం భారత దేశంలో ఉన్న ముస్లిములు మరియు క్రిస్టియనులలో అత్యధిక శాతం ఒకప్పటి హిందువులే ! ఇప్పుడున్న వారిలో ఏ కొంచెం శాతమో ఉండి ఉంటారు అప్పటి పాలకులతో వచ్చిన అసలు ముస్లిములు మరియు క్రిస్టియన్లు. డబ్బుల ఆశ చూపించి, పదవుల ఆశ చూపించి, భయపెట్టి, బెదిరించి బలవంతంగా మత మార్పిళ్ళు చేసారు ముస్లిములు మరియు క్రిస్టియన్లు. ఈ విధంగా దేశమంతా విదేశీ మతాలు ప్రబలి పోతూ ఉండే సరికి, ఆ యొక్క పరిస్థితుల్లో నుండి, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడానికి ఉద్భవించింది హిందూ మతం. తప్పనిసరి పరిస్థితులలో భారత దేశం ఒక మతానికి జన్మనివ్వ వలసి వచ్చింది. లేకపోతే వేలాది సం॥లుగా రక్షింపబడుతూ వస్తున్న ఆధ్యాత్మిక విజ్ఞానం మరియు భారత దేశం కలిగి ఉన్న ప్రత్యేకమైన సంస్కృతీ సాంప్రదాయాలు ఈ రోజున ఏమై ఉండేవో...! భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞానం పూర్తిగా సరి అయినది. అయితే, ఇక్కడ కూడా కొందరు అజ్ఞానులు స్వార్థంతో, ఎన్నో తప్పుడు విషయాలను ఎన్నింటినో జోడించారు. సత్యాలను ప్రజలకు అర్థం కాకుండా నర్మగర్భంగా, నిగూఢంగా ఉంచేశారు. పైవి కిందికి, కిందివి పైకి మార్చేశారు. అయితే, వీరు ఎంత చేసినా భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞానం మాత్రం అధిక కోణాల్లో సత్య పూరితంగానే ఉంది.

సరే... ఏది ఏమైనా భూమి యొక్క వయసుతో పోల్చుకుంటే, మతాలన్నీ పురిటి బిడ్డలే ! ఈ మతాలేవీ లేనప్పుడు కూడా భూమి ఉంది, భూమి పైన మనుషులు ఉన్నారు, జీవితం ఉంది, వ్యవస్థ ఉంది. మరి అప్పుడు ఎలా నడిచింది ? మా దేవుళ్ళే లేకపోతే ఈ లోకమే లేదు అని చెప్పే మతాలే నిన్న గాక మొన్న పుట్టాయి. నిన్న మొన్న పుట్టిన మతాలు.. మేము లేకపోతే, మా మతం లేకపోతే, మా దేవుడు లేకపోతే ఈ లోకమే లేదు అని చెప్పడం ఎంత హాస్యాస్పదం !!

ఈ మతాలేవీ లేనప్పుడు, ఈ పవిత్ర గ్రంథాలేవీ లేనప్పుడు, ఈ మతాధికారుల

మార్గనిర్దేశకత్వం లేనప్పుడు, ఈ మందిరాలు, క్షేత్రాలు, పుణ్య స్థలాలేవీ లేనప్పుడు - ఈ భూమి, ఇక్కడి ప్రజలు, వీరి జీవితాలు, వ్యవస్థ మొదలైనవన్నీ ఎలా నడిచాయి ? అని ఒక్క సారి నిజంగా, లోతుగా ఆలోచించండి. విశ్లేషించండి. మీకే అర్థమవుతుంది.. ఈ మతాలు చెప్పే వాటిలో ఎన్ని అసత్యాలున్నాయో...! తెలుసుకోండి, గ్రహించండి, ఈ భూమి పైన ఉన్న మనుషులు అంతా ఒక్కటే ! అందరికీ ఒకే రకమైన సృష్టి న్యాయాలు మరియు నియమాలు వర్తిస్తున్నాయి. జనాలు అజ్ఞానంతో గుర్తించటం లేదు. అందరికీ ఒకే రకమైన శరీరాలు అంటే - రూపులో, రంగులో, ఎత్తులో, ఏవైనా ఇతర స్వల్ప తేడాలున్నా శరీర ధర్మాలు మాత్రం ఒక్కటే ! ఈ తేడాలన్నీ భౌగోళిక పరిసర ప్రాంతాలకు అనుగుణంగా మరియు వైవిధ్యత కోసం ఏర్పడినవి. ఈ తేడాలు కేవలం బాహ్యాపరమైనవే తప్ప, అంతరంగికంగా అన్నీ శరీరాలు ఒక్కటే ! ***ఎప్పుడైతే భూమి పైనున్న శరీరాలన్నీ ఒకే ధర్మానికి చెందినవని ఋజువైందో, అప్పుడే శరీరానికి మరో కోణమైన జీవితానికి కూడా ఒకే ధర్మమని ఋజువైనట్టే !***

మీకు విషయం అర్థమైందా ?

భూమి పైనున్న ఏ శరీరానికి చెందిన వాడైనా, కళ్ళతోనే చూస్తాడు. చెవులతోనే వింటాడు. నోటి ద్వారానే ఆహారం తీసుకుంటాడు. ప్రతీ ఒక్కడికి గుండె ఉంటుంది. ఆ గుండె కొట్టుకుంటుంది. రక్తాన్ని పంప్ చేస్తుంది. ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు, నరాలు, పేగులు మొదలైనవన్నీ అందరికీ ఉంటాయి. ఒకేలాగా పని చేస్తాయి. ఒక మతం వాడికి గుండె కొట్టుకుంటే బతుకుతాడు, ఇంకో మతం వాడికి గుండె ఆగితే బతుకుతాడు అని లేదు కదా.. ఒక మతం వాడికి కిడ్నీలు ఏం పని చేస్తాయో, వేరే మతస్థులకు కూడా కిడ్నీలు అవే పని చేస్తాయి. ఒక మతం వాడికి మర్మావయవం ద్వారా మూత్రం వస్తే, ఇంకో మతం వాడికి మూత్రం రాకుండా అత్తరు వస్తుందా ? మా మతం అన్ని మతాల కంటే పవిత్రమైనది, అందరికి మూత్రం వస్తే, మా మతం వారికి మాత్రం మూత్రం రాదు, ఔషధం బయటకు వస్తుంది అని ఏ మతం వాడైనా చెప్పగలుగుతాడా ? లేదే ! ఎందుకు చెప్పలేరు ?... అందరి శరీర ధర్మం ఒకటే కాబట్టి చెప్పలేరు ! ఎప్పుడైతే శరీర ధర్మం ఒకటవుతుందో, అప్పుడు జీవిత ధర్మం కూడా ఒకటే అవుతుంది. ఎందుకంటే శరీరమే జీవితం కాబట్టి ! శరీరానికి ఒక ధర్మం జీవితానికి ఒక ధర్మం అంటూ ప్రత్యేకంగా ఉండవు. శరీరం మరియు జీవితం రెండూ ఒక్కటే అయినప్పుడు, ఈ రెండింటికి వేరు వేరు ధర్మాలు ఎలా ఉంటాయి ?!

మా మతం ప్రకారం జీవిత ధర్మాలు ఇవి అంటూ ప్రతీ వాడు ఒక ప్రత్యేకమైన విశ్వాసాలను రూపొందించుకున్నాడు. వీటిలో కొన్ని నిజమైనవి ఉన్నా, అత్యధిక శాతం అసత్యపూరితమైనవే ! అందుకే మతాల మధ్య ఇంతటి సంఘర్షణ ! తెలుసుకోండి, భూమి పైన మనుషులు అని అనబడే వారందరికీ ఒకే రకమైన సృష్టి నియమాలు వర్తిస్తాయి. మా మతంలో ఇలా లేదు, మా మత పెద్దలు ఇవి చెప్పలేదు, మా పుస్తకాల్లో ఇవి రాసి లేవు, మా గురువులు ఇవి చెప్పలేదు.. అంటూ తప్పించుకోవడానికి లేదు. మీరు సృష్టి నిమయాల నుండి తప్పించుకోలేరు. అది అసంభవం. మహా

అంటే ఈ జన్మలో ఎస్కేప్ అవుతారేమో.. సృష్టి చాలా నిదానంగా ఎదురు చూస్తుంది. చాలా ప్రశాంతంగా మీ దారులన్నీ మీ చేతే మూయిస్తూ సత్యం వైపు తీసుకు వస్తుంది. మీ చేత సత్యాన్ని గ్రహించేలా చేస్తుంది. ఈ విషయమై ఎవరికీ మినహాయింపు లేదు.

మూఢ విశ్వాసాల్లో నుండి బయట పడండి, అసలు సత్యాలను తెలుసుకోండి. నేను చెప్పిన విషయాలను ప్రాక్టికల్‌గా ఆలోచించండి.. మీకే తెలుస్తుంది.. ఈ విషయాలన్నీ సత్యాలేనని ! మనుషులు కేవలం అజ్ఞానంతో వేరయ్యారు. అజ్ఞానంతో చీలిపోయారు. ఈ చీలికలను మతాలు పెంచి పోషిస్తున్నాయి. మనందరం అసలు సత్యాలను గ్రహించి, అందరికీ ఈ సత్యాలను తెలియజేసి, తిరిగి మానవులందరినీ ఒకటి చేయాలి. మానవ జాతి ఐకమత్యం వర్ధిల్లాలి !

రెండు, అసలు సిసలు సత్యాలను తెలుసుకుని, వాటిని ఆచరిస్తూ, జీవిస్తే తక్షణమే ప్రపంచం అంతా శాంతి నెలకొంటుంది.

ఎలా ? అని అంటే... నిజమైన ఆధ్యాత్మిక శాస్త్రంలోని రెండే రెండు, అవును కేవలం రెండు సత్యాలను తెలుసుకుని, నిజంగా ఆచరిస్తూ జీవిస్తే... యావత్ భూమండలం అంతా క్షణాల్లో ప్రశాంతమై పోతుంది. కేవలం రెండు ఆధ్యాత్మిక సత్యాలను తెలుసుకుని, వాటి ప్రకారంగా మనుషులు జీవిస్తే భూమి అంతా శాంతిమయం అవుతుందని అంటే... మొత్తం ఆధ్యాత్మిక శాస్త్రాన్ని అభ్యసిస్తూ, అందులోని సూత్రాలను యథాతథంగా ఆచరిస్తే భూమి స్వర్గం కాక మరేం అవుతుంది ?!?!?!?!?! ఇంతకీ ఆ రెండు మహా సత్యాలు ఏవంటే...

1. మనిషి కేవలం శరీరం కాదు, శరీరాన్ని ధరించిన వాడు. మరణం కేవలం శరీరానికి మాత్రమే సంభవిస్తుంది. ఆత్మకు కాదు. ఆత్మ ఎన్నటికీ నాశనం కానిది మరియు అమరమైనది. ఆత్మ తన పరిణామ క్రమంలో ఎన్నో జన్మలను తీసుకుంటుంది. ఒక్కో జన్మలో ఒక్కో ప్రాంతంలో జన్మ తీసుకుంటుంది. స్త్రీగా, పురుషుడిగా, పేద వాడిగా, ధనికుడిగా ఇలా అన్ని రకాలుగా జన్మలు తీసుకుంటుంది. ఈ జన్మలో ఒక మతంలో పుట్టిన వాడు వచ్చే జన్మలో ఏ మతంలోనైనా పుట్టవచ్చు. ఈ జన్మలో ఒక కులంలో పుట్టిన వాడు వచ్చే జన్మలో ఏ కులంలోనైనా పుట్టవచ్చు. ఈ జన్మలో ఒక జాతిలో జన్మించిన వాడు వచ్చే జన్మలో ఏ జాతిలోనైనా జన్మించవచ్చు. ఈ రకంగా ఆత్మ ఎన్నో రకరకాలైన జన్మలను తీసుకుని, అపారమైన అనుభవ జ్ఞానాన్ని సంపాదించుకుని, చివరికి తనలో ఉన్న దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుని మోక్షం పొంది దివ్య లోకాలకు వెళ్ళిపోతుంది. భూమి మీద ఉన్న ప్రతీ మనిషికీ ఈ సత్యం వర్తిస్తుంది. వారు ఏ మతం వారైనా.. ఏ దేశం వారైనా.. ఏ కులం వారైనా.. వారు నాస్తికులైనా.. వారు ఎవరైనా సరే.. మనిషా కాదా.. అన్నదే పాయింట్.. మనిషి అయితే ఇదే సత్యం వర్తిస్తుంది. - ఇప్పుడు ఈ సత్యాన్ని అర్థం చేసుకున్న వారు, ఎంత శాంతియుతంగా జీవిస్తారో ఊహించండి. అందరూ అందరినీ గౌరవిస్తారు. జాతి, మత, కుల, ప్రాంత, దేశ భేదాలన్నీ విభిన్నమైన అనుభవ జ్ఞాన సంపాదన కోసమే తప్ప మరొకందుకు కాదు అని గుర్తిస్తారు.

అప్పుడు సమ సమాజ స్థాపన జరిగిపోతుంది. అందరూ ఎంతో ప్రశాంతంగా ఉంటారు.

ఏ రకమైన మత యుద్ధాలు ఉండవు. ఏ రకమైన మూఢ విశ్వాసాలు ఉండవు. మానవ జాతి అభివృద్ధికి ఏ రకమైన అడ్డంకులు ఉండవు. మీకు తెలుసా... ప్రపంచంలో మతం పేరిట జరిగినన్ని మారణహోమాలు, అకృత్యాలు, దారుణాలు, ఘోరాలు.. ఇతర దేని పేరిటా జరగలేదు. అన్ని యుద్ధాలు ఆగిపోయాయి. కాని మతాల యుద్ధాలే ఆగకుండా జరుగుతూనే ఉన్నాయి. ప్రపంచంలో మతం అంత "సెన్సిటివ్" విషయం మరొకటి లేదు. మతం ముందు ఆటం బాంబు చాలా చిన్న విషయం.

2. "ఇవ్వడమే పొందడం" ! ఈ మహా సత్యం యొక్క అర్థం ఏమిటంటే... నీవు చేస్తున్నది నీవే తిరిగి పొందుతావు అని. నీవు ఏం చేస్తే అదే నీకు ఎన్నో రెట్లై తిరిగి వస్తుంది అని అర్థం. మంచి చేస్తే మంచి మాత్రమే జరుగుతుంది. చెడు చేస్తే చెడు జరుగుతుంది. నీవు ఏం చేస్తే, అదే నీకు జరుగుతుంది. నీవు చేసిన చెడైనా, మంచి అయినా.. ఏదైనా.. నిన్ను వెతుక్కుంటూ వచ్చి నిన్ను చేరుకుంటుంది. ఎన్ని జన్మలైనా నీ చెడు నీకే వస్తుంది. ఎన్ని జన్మలైనా నీ మంచి నీకే వస్తుంది. నీవు ఏమి ఇస్తున్నావో అది పొంది తీరుతావు అని అర్థం. నీవు ఏ గుణంతో.. ఏమైతే చేస్తున్నావో.. అవే గుణాలతో నీవు చేసిన పనుల యొక్క ఫలితాలను ఆకర్షిస్తావు. ఇవ్వడం పొందడం ఎలా అవుతుంది ? అని అంటే.. ఆహారం తీసుకోవడం అని అంటే శక్తిని తీసుకోవడమే కదా ! ఆహారం తీసుకున్న తర్వాత అది కాసేపటికి జీర్ణమై నీకు తగిన శక్తి వస్తుందా లేదా ? ఆహారం తీసుకోవడం అని అంటే శక్తిని పొందడమే కదా అని అర్థం. ఇదే విధంగా ఇవ్వడం అనేది పొందడం అవుతుంది. సృష్టి ఈ నియమాన్ని ఇలాగే పెట్టింది మరి ! ఇప్పుడు ఈ సత్యాన్ని అర్థం చేసుకున్న వారు ఎవరైనా చెడు పనులు చేస్తారా ? చేయరు, చేయలేరు. ఎందుకంటే, చేసిన చెడు ఎన్ని జన్మలకైనా వెంటాడుతూ తనకే వచ్చి చేరుతుంది అని అర్థం చేసుకున్న వాడి వలన చెడు జరగదు. అసంభవం. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్న ప్రజలందరూ కేవలం మంచి మాత్రమే చేస్తూ, మంచిని పొందుతూ ఉంటారు. ప్రజలంతా మంచి పనులను మాత్రమే చేస్తున్నప్పుడు, అందరూ మంచిగా మాత్రమే ఉన్నప్పుడు.. ఈ భూమి స్వర్గం కాక మరేమవుతుంది ?!?!?!?!?!

పెద్ద వింత ఏమిటి అని అంటే.. ఈ రెండు మహా సత్యాలు ప్రతీ మతంలోనూ ఉన్నాయి. కొన్ని మతాల్లో అక్కడక్కడా, నిగూఢంగా ఉంటే, మరి కొన్ని మతాల్లో డైరెక్టుగా, స్పష్టంగా ఉన్నాయి. ఈ రెండు మహా సత్యాలు ప్రజలకు అర్థం అయితే తక్షణమే ప్రపంచం శాంతిమయం అవుతుంది, ఆనందమయం అవుతుంది.

ఒకప్పుడు మతం, కోపర్నికస్ సిద్ధాంతాన్ని మరియు గెలీలియోను వ్యతిరేకించింది. చివరికి ఏం జరిగింది ? సత్యమే గెలిచింది - సత్యమేవ జయతే కదా ! మతాలు మరియు నాస్తికులు ఒప్పుకోకపోయినంత మాత్రాన సత్యం - సత్యం కాకుండా పోదు కదా !

పూర్వం అన్ని మత గ్రంథాల్లో మనం పైన చెప్పుకున్న రెండు మహా సత్యాలు చాలా క్లియర్‌గా,

ఎంతో వివరంగా ఉండేవి. కాల క్రమంలో కొందరు స్వార్థపరమైన అజ్ఞానుల వలన మత గ్రంథాల్లో నుండి అధిక శాతం సత్యాలు మాయం అయ్యాయి. ఉన్న కొన్ని సత్యాలను అర్థం కాకుండా నిగూఢంగా ఉండేలా చేశారు. మరి కొన్ని సత్యాలను ముక్కలు ముక్కలుగా విడగొట్టారు. ఎన్ని నీళ్ళు కలిపారంటే.. పాలు కనపడకుండా పోయేంతగా నీళ్ళు కలిపి పారేశారు...! ఇదంతా ఎందుకు చేశారంటే.. ప్రజలను అదుపులో పెట్టుకోవడానికి ఇలా చేశారు. అసలు సత్యాలు ప్రజలకు తెలిస్తే, అప్పుడు ప్రజలు వీరి చేతుల్లో ఉండరు కదా.. అందుకే ఇలా అసలు సత్యాలను మాయం చేశారు. ఏ విషయాలు ఉంటే ప్రజలు అయోమయ పరిస్థితుల్లో ఉంటారో.. ఏ విషయాలను జోడిస్తే, ప్రజలు భయపడతూ బతుకుతారో.. ఏ విషయాలను కలిపితే ప్రజలు వీరిని శరణు వేడుతారో ఆ విషయాలను బాగా కలిపారు.

ఏ మతం వారైనా.. నాస్తికులైనా.. మరి ఎవరైనా సరే.. ధ్యానం చేస్తే... నిజంగా ఇక్కడ నేను చెప్పిన విషయాలు అసలు సత్యాలని అనుభవ పూర్వకంగా తెలుస్తుంది. క్రిస్టల్ క్లియర్‌గా అర్థం అవుతుంది. ఇది నిజమా.. కాదా.. అనే డైలమా ఎంత మాత్రమూ ఉండదు. మీకు ఎంత స్పష్టత వస్తుందంటే.. ప్రపంచానికి మీరు ఎలుగెత్తి చాటగలరు. ఏ తడబాటు మీకు ఉండదు. మీకు ధ్యానంలో తెలిసిన విషయాలు నిజంగా నిజాలేనని చాలా చాలా ఘనంగా అర్థం అవుతుంది.

ఇటువంటి మహా సత్యాలను తెలుసుకుని, వాటిని నిజ జీవితంలో ఆచరిస్తే మనుషుల జీవితాల్లో ఆనందాలే ఆనందాలు కదా ! అప్పుడు భూమి స్వర్గమే కదా ! నేను ఇందాక పైన తెలియజేసిన రెండు మహా సత్యాలు, ప్రాక్టికల్ సత్యాలు. మీరు రెగ్యులర్‌గా ధ్యానం చేస్తూ, ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసిస్తూ ఉంటే.. కొన్ని రోజుల్లోనే మీకు అసలు వాస్తవాలన్నీ తెలిసిపోతాయి.

జన్మలు పునర్జన్మలు సత్యాలేననీ ఎన్నో సార్లు నిరూపించ బడింది. సాక్ష్యాలతో సహా నిర్ధారితమైంది. విచిత్రం ఏమిటంటే, అసలు జన్మలే లేవు అని అనుకునే క్రిస్టియన్ డాక్టర్ల చేతనే నిరూపించ బడింది. త్వరలోనే "జన్మలు - పునర్జన్మలు" అనే సత్యం పూర్తిగా వెలుగులోకి వస్తుంది. ప్రపంచంలోని ప్రతీ ఒక్కరూ ఈ సత్యాన్ని ఒప్పుకుని తీరాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. ఇప్పుడు భూమి గుండ్రంగా లేదని ఏ మతం వాళ్ళనైనా చెప్పమనండి.. చెప్ప గలుగుతారా ? చెప్పలేరు కదా.. ఎందుకంటే, భూమి గుండ్రంగా ఉందని నిరూపితమైంది. ఇదే విధంగా జన్మలు - పునర్జన్మలు అనే సత్యం కూడా ఎంతో సాలిడ్‌గా నిరూపితమై తీరుతుంది. ఈ ఒక్క సత్యమే కాకుండా.. ఆధ్యాత్మిక శాస్త్ర సత్యాలన్నీ నిరూపించ బడతాయి. వాస్తవానికి సత్యానికి ఏ నిరూపణా అవసరం లేదు, కాని తెలియనప్పుడు సత్యం - సత్యంగా ప్రకటమై తీరాలి. తప్పదు. ఇది అత్యంత త్వరలోనే జరిగి తీరుతుంది. దీని కోసమై మా వంతు కృషి మేము, మా శక్తివంచన లేకుండా చేస్తున్నాము.

❖ ❖ ❖

112 ప్రశ్న : జ్ఞానోదయం పొందిన ప్రతీ వారు, బోధిస్తారా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : జ్ఞానోదయం పొందిన ప్రతీ ఒక్కరు బోధించరు. ముక్తులవడం వేరు, ముక్తులవడం ఎలా ? అని బోధించడం వేరు. ఈ రెండింటికీ చాలా తేడా ఉంది. చాలా మంది ముక్తి పొంది, తమకు తోచిన విధంగా ''సేవ'' చేసి వెళ్ళిపోతారు. వీరి గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. కొంత మందైతే చాలా గుప్తంగా వెళ్ళిపోతారు. కనీసం ఇంట్లో వాళ్ళకు కూడా తెలియదు. జీవిత భాగస్వామికి కూడా తెలియదు. ఇలాంటి వారు తమ గత జన్మలలో బాగా ''సత్య సేవ'' చేసి ఉంటారు. ముక్తి సాధనలో చివరిలోకి వచ్చి ఉంటారు. తమ గత జన్మలలో చేసిన ''సత్య సేవ'' యొక్క ఫలితంగా ఈ జన్మలో వారికి అన్నీ అమరి ఉంటాయి. గుప్తంగా సాధన చేసుకుంటూ కర్మ శేషం లేకుండా చేసుకుంటారు. ఏదో ఒక క్షణంలో ముక్తం అయి మౌనంగా వెళ్ళిపోతారు. కొంత మంది ముక్తి పొందిన వారు బోధించడానికి పూనుకుంటారు. అయితే బోధించడంలో కొంత మంది మాత్రమే సఫలం అవుతారు. అందరూ బోధించలేరు. నేర్చుకోవడం వేరే, నేర్పించడం వేరే ! ముక్తులవడం వేరే, ముక్తమవడం ఎలా ? అని బోధించడం వేరే ! ఈ రెండింటికీ భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉంది.

ఒక సాధారణ మనిషికి, ఒక జ్ఞానోదయం పొందిన వ్యక్తికి ఎంత తేడా ఉంటుందో..., అంత తేడా ఒక జ్ఞానోదయం పొందిన వ్యక్తికి, జ్ఞానోదయం పొంది జ్ఞానోదయం పొందడం ఎలా ? అని నేర్పిస్తున్న వ్యక్తికి ఉంటుంది.

జ్ఞానోదయం పొంది ఒక సద్గురువుగా మారడానికి చాలా జన్మల పరిశ్రమ అవసరం అవుతుంది. గురువు అని అంటే మోక్ష మార్గ ద్వారం వరకూ తీసుకెళ్ళే వాడు అని అర్థం. గురువు మిమ్మల్ని సరాసరి మోక్ష మార్గ ద్వారం ముందుకు తీసుకెళ్ళి నిలబెడతాడు. అయితే, ఆ మోక్ష ద్వారంలోకి మాత్రం మీరే స్వయంగా అడుగు వేయాల్సి ఉంటుంది. ఆ ఒక్క అడుగు మీ యొక్క స్వయం శక్తితో వేయాల్సి ఉంటుంది. చివరి ఆ ఒక్క అడుగు వేయడానికి కొంత మంది చాలా జన్మలు తీసుకుంటారు. 99 మెట్ల వరకూ వచ్చి చివరి 100వ మెట్టును అధిరోహించడానికి కొందరు తక్కువ సమయం తీసుకుంటే, మరి కొందరు చాలా సమయం తీసుకుంటారు. ఈ సమయం అనేది ఎంతైనా ఉండవచ్చు.

గురువు సరాసరి మిమ్మల్ని మోక్ష ద్వారం దగ్గరికి తీసుకెళ్ళి నిలబెడతాడు అని అంటే.. మీరు ఈ విషయాన్ని సరిగా అర్థం చేసుకోవాలి. మిమ్మల్ని మీరు పూర్తిగా గురువుకి... తన్ మన్ ధన్‌సే సంపూర్ణంగా సమర్పించుకున్నప్పుడు... ఆయన చెప్పినవన్నీ యథాతథంగా ఆచరిస్తున్నప్పుడు... అప్పుడు మాత్రమే మిమ్మల్ని గురువు మోక్ష ద్వారం దగ్గరికి తీసుకెళ్ళ గలుగుతాడు. ఇది సరిగా అర్థం చేసుకోవాల్సిన విషయం.

ఉదాహరణకు, మీకు ఏది వచ్చో అది ఇతరులకు నేర్పించి చూడండి. మీకు తెలుస్తుంది.

మీకు టైప్ వస్తే టైప్ నేర్పించండి. మీకు వంట వస్తే వంట నేర్పించండి. మీకు ఏదైనా భాష వస్తే దాన్ని నేర్పించండి. మీకు ఏది వచ్చో అది నేర్పిస్తూ ఉండండి. ఒకరిద్దరికి కాదు, వీలైనంత మందికి అలా నేర్పిస్తూ ఉండండి. అప్పుడు మీకు తెలుస్తుంది.. నేర్పించడం అంటే ఏమిటి అని ! భౌతిక పరమైనవి నేర్పించడం తేలికే... చాలా తేలిక ! అవును ఎందుకంటే.... మీరు నేర్పేవి ఏవైనా వాటికి భౌతిక పరమైన రూపాలు ఉంటాయి. వాటికి భౌతికమైన ఉనికి ఉంటుంది. ఉదాహరణకు, మీరు, ఎవరికైనా సంగీతం నేర్పించాలంటే.. దానిని వినిపించవచ్చు. నాట్యం నేర్పించాలంటే నాట్యం చేసి చూపించవచ్చు. చిత్రకళ నేర్పించాలన్నా చిత్రాలు వేసి చూపించవచ్చు. మీరు భౌతిక పరమైన అంశాన్ని దేనిని తీసుకున్నా దానికి, భౌతికమైన ఉనికి ఉంటుంది. భౌతికపరమైన ఉనికి ఉన్నప్పుడు ఏ సమస్యా ఉండదు. ఇక్కడ... ఆధ్యాత్మికత దగ్గరికి వచ్చేసరికి విషయం పూర్తిగా వేరుగా ఉంటుంది. ఇక్కడ విషయాలు భౌతికమైనవి కావు, పూర్తిగా ఆధ్యాత్మికమైనవి. ఇక్కడ "స్వయం పరిశోధన + స్వయం అనుభవా"లకే ప్రాధాన్యత ఉంటుంది. ఇక్కడి విషయాలు కంటికి కనిపించవు, వినిపించవు. మీరు విషయాలను అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు, గురువు ఇలా చెబుతాడు మీకు - "నేనే దైవం" అనే ఎరుకలో ఉండండి అని. ఈ విషయానికి భౌతికపరమైన రూపం కాని, వినికిడి కాని, ఋజువు కాని ఏమీ ఉండదు. నేను ఎరుకలో ఉంటున్నాను చూడు, అదిగో వాళ్ళు ఎరుకలో ఉంటున్నారు చూడు.. ఇదిగో ఇలా ఎరుకలో ఉండాలి అంటూ చూపించలేం. విషయాన్ని ఇక్కడ అర్థం చేసుకోవాలి. అంతే. సాధన చేస్తూ ఉంటే అతడికే అనుభవంలోకి వస్తూ ఉంటుంది.. ఎరుక అంటే ఏమిటి ? అని.

❖ ❖ ❖

ఒక వ్యక్తి జ్ఞానోదయం పొందినంత మాత్రాన అతడు ఇతరులకు బోధించలేడు. ముక్తి మార్గాన్ని బోధించడం అనేది ఒక మహా దివ్య కళ ! అది అందరి వల్లా కాదు. అర్థం చేసుకోండి, జ్ఞానోదయం పొందిన ప్రతీ వ్యక్తి గురువు కాలేడు.

113 **ప్రశ్న :** మీ బోధనలను వీలైనంతగా ఆచరిస్తున్నాము. సాధన చేస్తున్నాము. అయినా శరీరంలోని+జీవితంలోని కొన్ని పరిస్థితులు మారడం లేదు. చాలా మారాయి, చాలా సాధించాము... అయితే కొన్ని పరిస్థితులు మాత్రం మారలేదు. మా వల్లనే.. ఎక్కడో లోపం జరుగుతోంది... అదేమిటి సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : శభాష్ ! చక్కగా గుర్తించారు. నింద నా పైనో, సాధన పైనో, సృష్టి పైనో వేయకుండా... అసలు సిసలు లోపం ఎక్కడ ఉందో... ఆ యొక్క మూలాన్ని గుర్తించారు. మీరు మీ లోపాన్ని అధిగమించ గలరు అని అనడానికి... ఇదే సూచన !

తెలుసుకోండి, మనకు తెలిసిన "మనం" వేరే ! మనకు తెలియని "మనం" వేరే ! ఈ విషయాన్ని సరిగా అర్థం చేసుకోండి. మనం మన సరి అయిన గుణాలనే మన ఎరుకలో ఉంచుకుంటాం. ఉదాహరణకు, నేను ఎంత మంచి వాడిని/దాన్ని, నేను అది, నేను ఇది, నేను అప్పుడు ఇంత మంచి చేసాను... ఇలా ఎన్నో మంచి సర్టిఫికేట్లు మనకు మనం ఇచ్చేసుకుంటాం. ఎందుకంటే మన యూనివర్సిటికి మనమే అధికారులం కదా !

మీలోని లోపాలకు ఏదో ఒక సమర్థనను జోడిస్తారు. నేను అలా ఎందుకు ప్రవర్తిస్తున్నాను అని అంటే.... ఒక పెద్ద దీర్ఘం తీస్తూ... ఒక కారణం చెబుతారు. అది కేవలం మీ యొక్క పుండుపైన వేసే ఒక అందమైన ప్లాస్టర్ మాత్రమే ! మీలో లోపం ఉంది అనే విషయం మిమ్మల్ని బాధకు గురి చేస్తుంది. మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. అందుకే మీరు ఆ లోపానికి చక్కని చిక్కని ముసుగు వేసిపారేస్తారు. అప్పుడప్పుడు మీకే గనుక మీ లోపం ఎరుకలోకి వస్తే, ఏదో ఒక కారణంతో మిమ్మల్ని మీరు సముదాయించుకుంటారు. ఎవరైనా మీ లోపం ఎత్తి చూపినప్పుడు.. ఆ విషయం మాకు తెలుసండీ.. ఇంతకీ నేనలా చేయడానికి ఒక కారణం ఉంది... అది మీకు అర్థం కాదు.. అని ఒక పేద్ద విజ్ఞానిలా ఫోజు కొడతారు లేదా ఏదో ఒక రకంగా సమర్థించుకుంటారు. ఖతం ! ఇక ఆ లోపం అంతటితో సేఫ్ ! ఇలా ఎందుకు మీరు, మీ లోపాలను సమర్థించుకుంటారు ?!? అని అంటే.. ఇక్కడ మీరు అసలు సిసలు విషయం తెలుసుకోవాలి. మిమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేసే సత్యం ఏమిటంటే - మీ లోపాన్ని మీరు సమర్థించటం లేదు... మీ లోపమే తనను తాను సమర్థించుకుంటుంది. ఎందుకంటే అది మిమ్మల్ని ఆక్రమించుకుని ఉంది కాబట్టి !!!

మీరు స్వతంత్రులు కాదు. మీరు మీ లోపాల చేతిలో కీలుబొమ్మలు. బానిసలు. ఈ బానిసత్వం ఈ నాటిది కాదు. ఎన్నెన్నో జన్మల నుండి కొనసాగుతూ వస్తూ ఉంది. మీ రిమోట్ మీ చేతిలో లేదు. అయితే ఈ విషయం మీకు తెలియదు. మీ లోపాలు అంటే, మీలోని సరి కాని గుణాలు వాటికి ఇష్టం వచ్చినట్టు మిమ్మల్ని ఆడిస్తూ తమను తాము రక్షించుకుంటూ, పోషించుకుంటూ ఉంటాయి. దొంగలు ఊరు పంచుకున్నట్టు అవి మిమ్మల్ని పంచుకుంటాయి. కొంత సేపు ఒక రకమైనవి, మరి కొంత సేపు మరొక రకమైనవి... ఇలా అవి మీ మీద పెత్తనం చెలాయిస్తూ తమ మనుగడను సాగిస్తూ

ఉంటాయి. ఈ విషయం మీకు తెలియదు. ఎందుకంటే ఇలా జరగడం అనే విషయం ఇప్పుడు మొదలు కాలేదు.. అది ఎప్పుడు మొదలైందంటే.. అసలు ఆ విషయమే మీరు మరిచిపోయారు. మీరు అనుకుంటారు నేను బాగానే ఉన్నాను కదా ! నేను బానిసనా ?! ....ఈ సత్యం జీర్ణం కావడానికి ఏ మందూ లేదు. కేవలం మీ అంతట మీరు, అనుభవ పూర్వకంగా తెలుసుకుంటే తప్ప అది జీర్ణం కాలేదు.

మీలోని లోపాలు ఏమిటి అని మీకు పర్టిక్యులర్‌గా తెలియకపోయినా కంగారు పడాల్సిన అవసరమేమీ లేదు. ఎందుకంటే, మీ అంతరాత్మలో అన్ని విషయాలు అంటే, మీరు ఆత్మ పరిణామ క్రమం ప్రారంభించినప్పటి నుండి, ఇప్పటి వరకు, ప్రతీ ఒక్క విషయం విడవకుండా నిక్షిప్తమై ఉంటుంది. ప్రతీ ఒక్కటి ! కాబట్టి మీ యొక్క కాన్షియస్ మైండ్‌కు అంటే, మీ భౌతిక స్పృహకు మీ లోపాలు ఏమిటి అని పర్టిక్యులర్‌గా తెలియాల్సిన అవసరం ఏమీ లేదు. కాబట్టి, ''నాలో ఉన్న నెగెటివ్‌లను నేను పూర్తిగా రిలీజ్ చేసాను'' అని అనుకుంటూ ఉండాలి. క్రమం తప్పకుండా దైవత్వ సాధన చేస్తూ ఉండాలి. 24 గంటలూ ఎరుకలో ఉండాలి. 24 గంటలంటే, పడుకున్నప్పుడు ఎలా కుదురుతుంది ? అని ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. మీరు మెలుకువగా ఉన్నప్పుడు ఎరుకలో ఉండటానికి చేసే సాధన అంతా ఆటొమెటిక్‌గా నిద్రలో కూడా అప్లై అవుతుంది. మీరు ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకండి. అంతా మీ యొక్క లైఫ్ డిజైన్ ప్రకారమే జరుగుతుందని తెలుసుకోండి. మీరు ఆత్మ విశ్వాసంతో క్రమం తప్పని సాధన చేస్తూ ఉంటే ఖచ్చితంగా మీరు మీ లోపాలన్నింటినీ వదిలించుకోగలుగుతారు. ఇది నిజం. కొన్ని పరిస్థితులు మారడం లేదని అంటున్నారు కదా... ఈ విషయానికి సంబంధించి మీరొక సత్యాన్ని తెలుసుకోవాలి.

అదేమిటంటే, మీలో ఉన్న ఆ యొక్క మారని పరిస్థితులు ఏవైతే ఉన్నాయో, వాటిని మార్చడానికి కావాల్సిన ఎరుక ఇప్పుడే మీలో జనించింది. చాలా విషయాలు మారుతున్నాయి, కాని ఇవి మాత్రం మారటం లేదేంటి ? అని మీలో మీరు ప్రశ్నించుకున్నారో అప్పుడే, ఆ క్షణమే, వాటి యొక్క మొదటి పునాది రాయిని లాగేసారు. మీ ఎరుకను అలాగే కొనసాగిస్తే పునాదులు అన్నీ పెకిలించివేయ బడతాయి.

మీరు గుర్తుంచుకోవాల్సిన అత్యంత ముఖ్య విషయం ఏమిటంటే, మీకు తెలిసి ఉన్న మీరు, వేరే ! మీకు తెలియని మీరు వేరే ! మీకు తెలియని ''మీరులో'' ఈ మారని పరిస్థితుల యొక్క మూలాలు ఉంటాయి. మీరు ఈ విధంగా అనుకోవాలి - ''నాకు తెలియకుండా నాలోనే ఉంటూ ఉన్న నా యొక్క నెగెటివ్‌లను పూర్తిగా రిలీజ్ చేసాను. ఏ నెగెటివ్ కూడా ఇక నాలో ఉండకూడదు. పరమాణువంతైనా ఉండడానికి వీలులేదు. మొత్తానికి మొత్తం అన్ని నెగెటివ్‌లను పూర్తిగా రిలీజ్ చేసేసాను''. అని బలంగా భావించండి. ఆ తర్వాత మీరు సాధనను చేస్తూనే ఉండండి. ఆత్మ విశ్వాసాన్ని ఎప్పుడూ కోల్పోకూడదు. విశ్వాసంతో ధైర్యంగా ధీమాగా ఉండాలి. నిర్భయంగా ఉండాలి.

విశ్వాసంతో ధైర్యంగా ధీమాగా ఉన్నప్పుడు అన్ని విజయాలు మీ వెన్నంటే ఉంటాయి. విశ్వాసంతో ధైర్యంగా ధీమాగా ఉన్నప్పుడు మీకు అన్ని శ్రేయస్కరాలు మాత్రమే జరుగుతాయి. ఇలా ఉన్నప్పుడు మీకు శుభాలు, లాభాలు మాత్రమే జరుగుతాయి. కాలం కలిసి వస్తుంది. అదృష్టం మీలోనే ఉంటుంది. మీరు తెలుసుకోవాల్సింది ఒక్కటే... మీలోనే మీకు తెలియని ''మీరు'' ఉన్నారని ! ఈ తెలియని ''మీలో'' నెగెటివ్ గుణాలు దాక్కుని ఉంటాయి. వీటి గురించి మీకే మాత్రం తెలియక పోవడంతో మీరు ఆశ్చర్యపోతూ ఉంటారు.

మీరు సాధన చేసేటప్పుడు, ఈ విధంగా అనుకోండి - ''నా సంపూర్ణ చైతన్యంతో నేను ఈ సాధన చేస్తున్నాను'' అని అనుకోవాలి. అప్పుడు మీలో తెలియకుండా ఉన్న నెగెటివ్‌లన్నింటి మీదా ప్రభావం పడుతుంది. అప్పుడు అవి మిమ్మల్ని పూర్తిగా, శాశ్వతంగా వదిలి వెళ్ళిపోతాయి. గుర్తుంచుకోండి, విశ్వాసం ధైర్యం ధీమా...! ఆనందంగా ఉండండి. ఆహ్లాదకరంగా ఉండండి. ప్రయత్నపూర్వకంగా ఉండాలి. అప్పుడు మీకు జరిగే శుభ లాభాలను చూసి మీరు ఆశ్చర్యపోతూనే ఉంటారు.

❖ ❖ ❖

114 **ప్రశ్న** : నేను ఎక్కడెక్కడో ఇరుక్కుని ఉన్నట్టుగా ధ్యానంలో కనపడింది. నేను బయటపడగలనా సార్ ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఈ క్షణమే ! అవును. ఖచ్చితంగా బయట పడగలవు. నీకు తెలిసినవి, తెలియనివి ఏవైనా సరే నిన్ను బంధించి ఉంచుతున్నాయని అంటే, అవి నీవు ఒప్పుకున్నందు వలన మాత్రమే అవి నిన్ను బంధించి ఉంచగలుగుతున్నాయని నీవు అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు, నీవు ఒకప్పుడు వేయి సంవత్సరాల ఒప్పందం చేసుకుని దేనిలోనో ఇరుక్కున్నావు. అయితే నీవు కుదుర్చుకున్న ఒప్పందాన్ని నీవు ఎప్పుడైనా సరే.. నీవు రద్దు చేసుకోవచ్చు. ఈ విషయంలో ఎవరూ మిమ్మల్ని నిర్బంధించడానికి లేదు. ప్రశ్నించడానికి లేదు. కేవలం మిమ్మల్ని ఒప్పించాలని చూస్తారు అంతే. కేవలం మీ ఒప్పుకోలు కోసం మాత్రమే ప్రయత్నాలు జరుగుతాయే తప్ప... ఈ సృష్టి మొత్తంలో ఎవరు కూడా, ఏ శక్తి కూడా మిమ్మల్ని బెదిరించలేదు. ఎంత పెద్ద శక్తి అయినా మిమ్మల్ని లొంగదీయలేదు. మీరు ఏ శక్తి ముందు మోకరిల్లవలసిన అవసరం లేదు. సృష్టి ప్రధాన నియమం ప్రకారం మీరు సర్వ తంత్ర స్వతంత్రులు. మిమ్మల్ని బంధించడానికి ఎవరికీ అధికారం లేనే లేదు. మీరు దేవుళ్ళుగా అనుకుంటున్న వారికి కూడా లేదు. ఎవరికీ మీ పైన పెత్తనం చెలాయించడానికి అధికారం లేదు. ఏ ఒప్పందమైనా, ఏ శాసనమైనా మిమ్మల్ని బంధించి ఉంచలేదు. సృష్టి కర్త మీలోనే ఉన్నాడు. సాక్షాత్తు దైవాన్ని మీరు కలిగి ఉన్నారు. అసలు మీరే దైవం కదా ! మిమ్మల్ని మీరు సాధారణ మానవులుగా తలుస్తూ ఉంటే, మీ పైన ఎన్నెన్నో దాడులు జరిగే అవకాశం ఉంది, మిమ్మల్ని బంధనాల్లో, ఒప్పందాల్లో ఇరికించే అవకాశం ఉంది. ఇంకా ఏ ఘోరమైనా

జరిగే అవకాశం ఉంది. ఒక వేళ మిమ్మల్ని మీరు దైవాలుగా గుర్తిస్తే, మిమ్మల్ని మీరు దైవాలుగా ఒప్పుకుంటే, దైవత్వ సాధన చేస్తూ ఉంటే.. మీరు దైవమే అవుతారు. దైవాన్ని బంధించగల, ఇరికించగల ఏ శక్తి ఈ సృష్టిలోనే లేదు. మీరు నిజంగా దైవాలు. నేను దైవాన్ని... అవును... నిజంగా నేను దైవాన్ని... అని ఒప్పుకుంటూ ఉండండి. మీ దైవత్వాన్ని మీరు ప్రేమిస్తూ ఉండండి. నిరంతరం నేను దైవమే... అనే ఎరుకలో ఉండండి. ఈ విధంగా మీరు చేస్తూ ఉంటే, మీ యొక్క సర్వ ఒప్పందాలు, శాసనాలు, కట్టుబాట్లు, నియమాలు మొదలైనవన్నీ ఆటొమెటిక్‌గా క్లియర్ అయిపోతాయి. మీరు మీ స్వయంగా ఒప్పందం చేసినా సరే, దాన్ని ఎప్పుడైనా, ఏ క్షణమైనా మీరు ఉపసంహారం చేసుకోవచ్చు. కోటి సంవత్సరాలకు ఒప్పందం చేసుకుని మీరు ఇరుక్కున్నా, ఆ ఒప్పందం చేసుకున్న అయిదు నిమిషాలకే దాన్ని పూర్తిగా రద్దు చేసుకోవచ్చు. ఈ విషయంలో ఏ శక్తులూ మిమ్మల్ని ఏమీ చేయలేవు. మీరు ఒప్పుకోకుంటే, మిమ్మల్ని ఒప్పించడానికి ప్రయత్నం చేస్తాయే తప్ప.. మిమ్మల్ని కట్టడి చేయలేవు. బంధనాలు, ఒప్పందాలు, శాసనాలు, కట్టుబాట్లు మొదలైనవన్నీ ''భ్రమలు''! అవును కేవలం భ్రమలు మాత్రమే ! మీరు క్రమం తప్పని దైవత్వ సాధన చేస్తూ ఉండండి. అన్నీ వాటంతట అవే క్లియర్ అయిపోతాయి. విశ్వాసంతో ధైర్యంగా ధీమాగా ఉండాలి. ఎందుకంటే దైవమే మీరు కదా !

గుర్తుంచుకోండి, ఎవరైనా, ఏ శక్తులైనా మిమ్మల్ని ఏమైనా చేస్తున్నాయి లేదా చేయగలుగుతున్నాయని అంటే దాని అర్థం... మీరు అజ్ఞానంలో ఉన్నారనే.. అంటే మిమ్మల్ని మీరు దైవంగా భావించటం లేదనే అర్థం !

క్రమం తప్పని దైవత్వ సాధన పూర్తి విశ్వాసంతో చేయండి, మీరు నిజంగా సర్వ సకల సమస్త బంధనాలలో నుండి, ఒప్పందాలలో నుండి మరియు ఇంకా ఏవైనా ఉంటే వాటి నుండి కూడా పూర్తిగా శాశ్వతంగా విముక్తులవుతారు. ఇది సత్యం. బిగ్విజయీభవ !

❖ ❖ ❖

115 ప్రశ్న : వివాహం గురించి చెప్పండి.....

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : యుక్త వయసు రాగానే మగ పిల్లవాడికైనా, ఆడ పిల్లకైనా భాగస్వామి అవసరం. ఇది ప్రకృతి ఏర్పరిచిన నియమం. దీన్ని మానవులు ఉల్లంఘిస్తున్నారు. కారణాలేవైతే ఏం ? ఈ యొక్క ప్రకృతి నియమాన్ని మానవులు ఉల్లంఘిస్తున్నారు. అందుకే యువత పెడత్రోవ పడుతోంది. అధిక శాతం సమాజ పెద్దలు మరియు తల్లిదండ్రులు యువతను, తమకు తెలియకుండా తామె పెడత్రోవ పట్టించి, మళ్ళీ వాళ్ళే యువత గురించి బాధపడుతున్నారు. సమాజ పెద్దలు మరియు తల్లిదండ్రులు యువతను పెడత్రోవ పట్టించడం అని అంటే - ''భాగస్వామి విషయంలో అనవసరమైన పట్టింపులకు పోయి తాత్సారం చేస్తున్నారు అని అర్థం''. చదువుల పేరుతో, సెటిల్‌మెంట్ పేరుతో, కెరీర్ పేరుతో యవ్వనాన్ని అంతా అణిచివేస్తున్నారు.

సగం వయసు అయిపోయాక... ఎప్పుడో పెళ్ళి ! ఈ లోపు జరగాల్సిన అనర్థాలు జరిగిపోతున్నాయి.

ప్రకృతి పరంగా ఆడవాళ్ళకు మగవాళ్ళ తోడు, మగవాళ్ళకు ఆడవాళ్ళ తోడు అవసరం. ఒకరి తోడు ఒకరికి ఎంతో అవసరం. తోడు అనగానే కేవలం సెక్స్ మాత్రమే అని అనుకుంటే శుద్ధమైన పొరపాటు. ఒకరి నుంచి ఒకరికి దొరికే ఎన్నో బహుమతుల్లో సెక్స్ ఒకటి. అంతే ! ఒక భాగస్వామి ఉంటే, బాధ్యత తెలిసి వస్తుంది. ఒక తోడు దొరుకుతుంది. భాగస్వామి దగ్గర మాత్రమే పొందగలిగే ఒక ఆసరా దొరుకుతుంది. భాగస్వామి యొక్క సామీప్యత, తెలియనివి ఎన్నో తెలిసి వచ్చేలా చేస్తుంది. భాగస్వామి యొక్క సహచర్యం వలన ఎంతో అవగాహన వస్తుంది. ఎవరూ నేర్పించలేని విషయాలు కేవలం భాగస్వామితో ఉండడం వలన నేర్చుకోగలుగుతారు. బాధ్యత వస్తుంది. ఎన్నో సంగతులు అర్థం అవుతాయి. మొత్తానికి మొత్తం చెప్పాలంటే ఎంతో అభివృద్ధి చెందుతారు.

యుక్త వయసులో ప్రకృతి పరమైన మార్పులు జరిగినప్పుడు ప్రధానంగా అవసరం అయ్యేది సెక్స్ ! ఇది ఎంతో అత్యవసరమైనది మరియు ఆవశ్యకరమైనదే కాకుండా తప్పని సరి ! వయసు వచ్చిన వాళ్ళు ప్రకృతి పరమైన ఈ శక్తిని నిలువరించలేక, విధిలేక, గత్యంతరం లేక, తప్పని సరి పరిస్థితుల్లో, తమపై తమ ఆధీనతను కోల్పోయి పెడత్రోవ పడుతున్నారు. యువత అలాంటి పరిస్థితులలో చిక్కుకోవడానికి కారణం సమాజం లేక తల్లిదండ్రులు పెడుతున్న అనవసరమైన నిబంధనలే/పట్టింపులే మూలం ! ఉదాహరణకు - పిల్ల వాడు కడుపులో పడ్డప్పటినుండి, వాడు పుట్టి పెరిగి పెద్దయ్యే దాకా అయిన ఖర్చు, వాడి చదువులకు అయిన ఖర్చు, వాడి ఆటపాటలకైన ఖర్చు, వాడి సరదాలకు సినిమాలకు షికార్లకు అయిన ఖర్చు.. మొదలైనవన్నీ కట్న కానుకల రూపంలో వసూలు చేద్దామనుకునే తల్లిదండ్రుల వలన పెళ్ళిళ్ళు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయి, కొంత మందికైతే జరగటం లేదు కూడా !

మరో కారణం ఏమిటంటే, అనవసరమైన ఆడంబరాలకు పోవడం. పెళ్ళి ఘనంగా చేయకపోతే అందరూ ఏమనుకుంటారో...? అని పడరాని పాట్లు పడి పెళ్ళి చేసి, ఆ తర్వాత బాధ పడటం అనేది ఎంత వరకు సమంజసమో... ఆలోచించుకోవాలి. పనికిరాని ఆచారాలను పాటించడం.. అంటే, ఉదాహరణకు బంధువులకు బట్టలు పెట్టడం లేదా ఇతర నగా నట్రా కొనివ్వడం వగైరాలు. ఉంటే ఎంతైనా పెట్టుకోవచ్చు, కొనివ్వచ్చు కాని లేనప్పుడు అప్పులు చేసి ఇవన్నీ చేయడం సరికాదు కదా ! బంధువులు అర్థం చేసుకోవాలి. అవగాహనతో మసలుకోవాలి.

సంసారం యొక్క సెటప్ భారీగా ఊహించుకోవడం ఒక ప్రధాన కారణం. ఉన్నంతలో సంసారం చేసుకుంటూ, ఆ తర్వాత దాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. ఎంత అంటే అంతగా అభివృద్ధి సాధించవచ్చు. కాని స్వంత ఇల్లు ఉంటేనే, మంచాలు, బీరువాలు, డైనింగ్ టేబుల్, సోఫాలు వగైరాలు.. నగలు, వాహనాలు మైదలైనవి అన్నీ ఏర్పరచుకుని ఆ తర్వాత పెళ్ళి అని అంటే... ఇది కొందరికి సాధ్యమవుతుంది, మరి కొందరికి సాధ్యం కాకపోవచ్చు.

పెళ్ళి చేసి చేతులు దులుపుకుందామనుకునే మనస్తత్వం. ప్రస్తుత సమాజంలో ఆడపిల్ల గుదిబండ లాంటిది కదా ! అందుకే అందరూ పెళ్ళి చేసి భారం దించుకుందామని అనుకుంటారు. అందుకే బాగా స్థిరపడిన అబ్బాయిని వెతుకుతారు. ఎందుకంటే పెళ్ళి చేసిన తర్వాత ఈ బరువును అతడు మోయాలి కాబట్టి.. పర్మినెంట్ సంపాదన ఉన్న వ్యక్తిని వెతుకుతూ ఉంటారు. పెళ్ళి చేసుకున్న తర్వాత తప్పని సరిగా వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళే నిలబడాలి, వారి బతుకు వారే బతకాలి అని అనుకోవడం ఎంత మాత్రమూ సరికాదు. ఎందుకు సరి కాదు అని అంటే....

ఉదాహరణకు, అమ్మాయికి కట్న కానుకలు ఇవ్వలేక పెళ్ళి బాగా లేట్ అయింది అనుకోండి, 30 సం॥లకు పెళ్ళి అయిందనుకోండి, మరి.. ఇప్పుడు, ఆ అమ్మాయిని ఆ తల్లిదండ్రులు ఇన్ని సంవత్సరాలు పోషించారు కదా ! ప్రయోజకుడు అయ్యేంత వరకు అబ్బాయిని పోషిస్తారు కదా ! ఆ పోషించేదేదో పెళ్ళి చేసి పోషిస్తే ఏమవుతుంది ?!

ఉదాహరణకు, అమ్మాయికి వయసు 18 సం॥లు, అబ్బాయికి వయసు 21 సం॥లు రాగానే తగిన సంబంధం చూసి పెళ్ళి చేసి, ఆ తర్వాత వారి సంరక్షణను ఇరు వర్గాల వారు తీసుకుని, వారికి తగిన సూచనలు ఇస్తూ, వారికి స్వతంత్రంగా జీవించగలిగే స్థితి వచ్చే వరకు వారిని పోషిస్తే ఏమవుతుంది ?! ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగక పోవడం అనేది ఎంత చేటు చేస్తుందో అర్థం చేసుకోండి. తప్పని సరిగా అబ్బాయి సంపాదించాల్సిన అవసరం ఏముంది ? తప్పని సరిగా అమ్మాయి కట్నకానుకలను తేవాల్సిన రూలు ఏముంది ?! కట్నాలు చట్ట ప్రకారం నేరం కదా ! ఈ కట్నకానుకల పనికిరాని సంప్రదాయం పూర్తిగా నశించిపోవాలి. ఇందుకు ప్రతి ఒక్కరూ ఆచరణలోకి దిగాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు యుక్త వయసు రాగానే ఒకరికొకరు నచ్చే విధమైన సంబంధం చూసి పెళ్ళి చేసి, వారు తమకాళ్ళ మీద తాము నిలబడే వరకు వారిని పోషించాలి. పెళ్ళి అయ్యే సమయానికి ఒకవేళ ఇద్దరూ విద్యార్థులైతే కానివ్వండి. తప్పేంటి ?! పెళ్ళి చేసుకుని, ఆనందంగా కాపురం చేసుకుంటూ, హాయిగా చదువుకుంటారు. చదువుకు పెళ్ళి అడ్డం ఏ మాత్రమూ కాదు, పైగా ఎంతో సహకరిస్తుంది.

కొంత మంది, అతి తెలివిమంతులు ఇలా అంటారు "మేము మా అబ్బాయికి కట్నం లేకుండా చేసుకుంటామండీ... కానీ మా అమ్మాయిని ఊరికే ఎవరు చేసుకుంటారు మరి ? మా అమ్మాయిని ఎవరైనా ఊరికే చేసుకోమనండి, అప్పుడు మేము కూడా ఏమీ తీసుకోకుండా చేసుకుంటాం" అని అంటారు. ప్రతీ ఒక్కరూ ఇలానే అంటారు. ఎవరైనా ఒకరు ముందుకు వచ్చి ఆచరించి చూపాలి కదా ! మీ అమ్మాయిని కట్నం లేకుండా ఎవరూ పెళ్ళి చేసుకోకపోయినా ఫర్వాలేదు. మీ అబ్బాయికి కట్నం తీసుకోకుండా పెళ్ళి చేయండి. మీరు చేసిన ఈ మంచి కార్యానికి ఎంతో స్పందన లభిస్తుంది. ఎంతో మంది ప్రేరణ పొందుతారు. ఎంతో మంది మార్పుకు మీరు కారణం అవుతారు. ఎవరో ఒకరు ముందడుగు వేయాలి కదా ! ఆ ముందడుగు వేసేది మీరే ఎందుకు కాకూడదు !?

వయసు వచ్చిన ఆడపిల్లలు, మగపిల్లలు ఏం ఆలోచిస్తున్నారో.... ఏం చేయడానికి ప్రయత్నిస్తున్నారో.. ఏం చేస్తూ ఉన్నారో... తల్లిదండ్రులకు నిజంగా తెలిస్తే గుండె ఆగినంత పనవుతుంది.

సమాజ పెద్దలారా... తల్లిదండ్రులారా...

దయచేసి యువతీ యువకుల అమూల్యమైన యవ్వనాన్ని మరియు జీవితాన్ని వృథా చేయకండి. సరైన వయసులో అంటే యుక్తవయసులో మీ పిల్లలకు భాగస్వామిని అందించండి. ఇలా చేస్తే యువత యొక్క 90% రుగ్మతలు తొలగిపోతాయి.

కట్నకానుకలు అనేవి పూర్తిగా శాశ్వతంగా నశించిపోవాలి. వాటి ప్రసక్తి చరిత్ర పుస్తకాల్లో తప్ప బయట ఎక్కడా వినపడకూడదు.

పెళ్ళి ఖర్చు ఇరు వర్గాల వారు సగం సగం భరించాలి. ఆ తర్వాత ఆ దంపతులకు స్వతంత్రంగా జీవించే స్థితి వచ్చే వరకు, వారిద్దరిని ఇరు వర్గాల వారు పోషించాలి.

పెళ్ళయ్యే నాటికే స్వతంత్రులైతే ఇక ఏ బాధా ఉండదు కదా !

పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళు చేసుకోండి ! అయితే ఇక్కడ పెద్దలు బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... అబ్బాయికి మరియు అమ్మాయికి ఇద్దరికి పరస్పరం ఒకరికొకరు నచ్చాలి. అప్పుడే ఆ సంబంధం ఖాయం చేసుకోవాలి.

ప్రేమ వివాహాలూ చేసుకోండి !

కుల, మత, జాతి, భాష, ప్రాంత, దేశ భేద భావాలు లేకుండా మరియు కట్నకానుకల ప్రసక్తి లేకుండా ఆదర్శ వివాహాలు చేసుకుని, ప్రపంచమంతా ఒక్కటే అనే ఐక్యతా భావాన్ని స్థాపించండి.

మానవ జాతి ఐక్యత వర్ధిల్లాలి !

❖ ❖ ❖

116 ప్రశ్న : మీ దగ్గర ఉన్న వాళ్ళలో కొంత మంది వెళ్ళిపోయారు. కొంత మంది ఉన్నారు. కొత్త వాళ్ళు వస్తూనే ఉన్నారు. వచ్చే వారు ఉంటున్నారు... ఇదంతా .. కాని మీ దగ్గరి నుండి వెళ్ళిపోయిన వాళ్ళ సంగతేంటి సార్ ? ఏ నెగెటివ్ గుణాలు ఉన్నందు వలన వాళ్ళు మీకు దూరం అయ్యారు ? మీకు దూరం కాకూడదంటే ఏం చేయాలి ? ఎలా ఉండాలి ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నా దగ్గరి నుండి వెళ్ళిపోయిన వారి గురించి ఏం చెప్పాలి ? నా దగ్గర్నుంచి వెళ్ళిపోయిన వారు చెడ్డవాళ్ళు కాదు. వారు నెగెటివ్ గుణాల వలన నాకు దూరం కాలేదు. వారు మంచి వారు. నా దగ్గర నుండి వెళ్ళిపోయిన వారందరూ ప్రతీ ఒక్కరూ మంచి వారే ! నిస్సందేహంగా మంచివారు ! వారి కోణంలో వాళ్ళు మంచి వాళ్ళు !

ఈ సూత్రాన్ని అర్థం చేసుకోండి !

వాళ్ళు నా దగ్గరి నుండి వెళ్ళిపోవడానికి అత్యంత ముఖ్య ప్రధాన కారణం వాళ్ళకు నాకు ట్యూనింగ్ కాలేదు, కుదరలేదు. మ్యాచ్ కాలేదు. అంతే ! వాళ్ళ కోణంలో వాళ్ళు మంచి, నా కోణంలో నేను మంచి ! అంతే !

స్వభావాలు/గుణాలు వేరైనప్పుడు జీవితాలు వేరవుతాయి.

లక్ష్యాలు వేరైనప్పుడు... దారులు వేరు అవుతాయి.

దారులు వేరైనప్పుడు గమ్యం వేరవుతుంది.

గమ్యం వేరు అయినప్పుడు... వ్యక్తులు వేరు అవుతారు !

నేను నా లక్ష్యం దిశగా సాగుతున్నాను. వారికేదో వేరే లక్ష్యం ఉంది. దారి ఒక్కటిగా ఉన్నంత వరకు నాతో ఉన్నారు. దారులు వేరైనప్పుడు, వారూ వేరు అయిపోయారు. అంతే. నా లక్ష్యం చాలా పెద్దది. చాలా దూరం ప్రయాణించాలి. ఎన్నెన్నో శిఖరాలను అధిరోహించాలి. నా అంత ఓపిక, అవసరం వాళ్ళకు ఉండొద్దూ.. ?

వారి లక్ష్యం వేరే అయి ఉన్నందు వలన, వారి స్టేజ్ రాగానే దిగిపోయారు. నా దివ్య రథంలోకి ఎక్కేవాళ్ళు ఎక్కుతూనే ఉన్నారు, ఉంటారు కూడా ... నాది పుష్పక విమానం, సరైన వారికి ఎంత మందికైనా చోటుంటుంది !

నాతో ఉందామని ట్రై చేసారు. కుదరలేదు వెళ్ళిపోయారు. ఎవరి ఫ్రీక్వెన్సి వారిది. వారి ఫ్రీక్వెన్సి, నా ఫ్రీక్వెన్సి మ్యాచ్ కాలేదు. అంతే, వేరై పోయారు. నేనేదో నేర్చుకున్నాను, వాళ్ళేదో నేర్చుకున్నారు. ఖతం ! ఎవరి దారి వారిదే ! ఇందులో ఆశ్చర్యం ఏముంది ?

నేను మీకు నచ్చి, మీరు నా దగ్గర ఉంటే మీకు ఆనందంగా, రక్షణగా ఉంటుందని కేవలం "మీకోసం మాత్రమే" మీరు నా దగ్గరుంటే... నాతో ఎక్కువ కాలం ఉండలేరు.

కేవలం నా నుండి లాభం పొందుదామని, నన్ను వాడుకుందామని చూసిన వారెవ్వరూ నాతో ఉండలేరు. అలా చూసిన వారందరూ పూర్తిగా, శాశ్వతంగా కట్ అయిపోయారు.

నేను మీకు నచ్చి, మీరు నా దగ్గర ఉంటే మీకు ఆనందంగా, రక్షణగా ఉంటుందని భావించి, "మీ కోసం మీరు + నా కోసం కూడా" మీరు నా దగ్గర ఉంటే, అప్పుడు ఉండగలుగుతారు.

నా నుండి, కేవలం మీరు మాత్రమే లాభపడదామని చూస్తే నాతో ఉండలేరు. మీ లాభం + నా లాభం, ఉభయుల లాభం గురించి నిజాయితీగా ఆలోచించి, ఆ విధంగా ప్రవర్తిస్తేనే నాతో ఉండగలుగుతారు. నా ఫ్రీక్వెన్సి మీ ఫ్రీక్వెన్సి మ్యాచ్ కావాలి. ఇద్దరికీ ట్యూనింగ్ కుదరాలి.

నా లక్ష్యం, మీ లక్ష్యం ఒక్కటే అయినప్పుడు నా దగ్గర ఉండగలుగుతారు. నాతో పాటు ప్రయాణించ గలిగే శక్తి సామర్థ్యాలు మీకున్నప్పుడు.. మీరు నాతో ఉంటారు.

❖ ❖ ❖

117 ప్రశ్న : మొన్న జరిగిన పార్టిలో నేను లేను, మీరే నన్ను పని మీద పంపించారు. పార్టీలో మన వాళ్ళకు మీరు చాలా విషయాలు చెప్పారట కదా.. అవేమిటి సార్ ?

- హర్ష

సద్గురు తారా విశాల్ గారి సమాధానం :

✪ ఏదైనా జరగగానే అసలే నా అదృష్టం బాగా లేదు, అని అనకూడదు.

✪ కొన్ని విషయాలు రెండుగా ఉంటాయి. ఒకటి ఇన్నర్, రెండు ఔటర్. అంటే లోపల ఒకలా ఉంటుంది, బయట ఒకలాగా ఉంటుంది. బయట ఉన్న భావం యొక్క మూలాన్ని చెక్ చేసుకోవాలి. ఉదాహరణకు "నేను బాగానే ఉన్నాను" అనే భావన ఉందనుకో, దాని మూలం కూడా అలాగే ఉండాలి. కాని ఒక్కోసారి లోపల వేరుగా ఉంటుంది. ఇలా లోపల ఒకటి బయట మరొకటి ఉంటే ఫలితాలు తప్పుడుగా వస్తాయి. అందుకే ప్రతీ విషయాన్ని చెక్ చేసుకోవాలి. ఉదాహరణకు జడ్జ్‌మెంట్లు. బయట మనకు తెలిసి కొన్ని మనకు తెలియకుండా మనమే లోపల జడ్జ్‌మెంట్లు చేస్తాం. బయటేమో నేను జడ్జ్‌మెంట్లు చేయలేదు అని అనిపిస్తుంది. కాని లోపల జడ్జ్‌మెంట్ చేసేస్తాం. ఒక వ్యక్తి పట్ల బయట భావం సరిగానే ఉన్నట్టు అనిపిస్తుంది. కాని లోపల సరిగా ఉండదు. బయట గిల్టి కాన్షియస్ అంటే అపరాధ భావం లేనట్టే ఉంటుంది. కాని లోపల ఉంటుంది, ఇది చాలా ప్రమాదకరం. కాబట్టి ప్రతీ విషయాన్ని లోపల, బయట చెక్ చేసుకోవాలి.

✪ *అందరూ గురువు అంటే శాంత మూర్తిగా ఉండాలి అని అనుకుంటూ*

ఉంటారు. ఇది సరి కాదు. గురువుకి కోపం వస్తుంది. గురువుకి ఆవేశం వస్తుంది. గురువు కూడా పడుస్తాడు. ఒక జ్ఞానోదయం పొందిన వ్యక్తి జడపదార్థంలా ఉండడు. అందరి కంటే సున్నితంగా ఉంటాడు. స్పందనా శీలతను ఎక్కువగా కలిగి ఉంటాడు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండే గురువులు సినిమాలలో, టివి సీరియల్స్‌లో మాత్రమే కనిపిస్తారు. నిజ జీవితంలో గురువు ఎలాగైనా ఉంటాడు. అసలు గురువు ఇలా ఉండాలి అని అనుకోవడమే మూర్ఖత్వం. గురువు ఇలా ఉండాలి అనే భావనలో నుండి బయట పడండి. గురువు ఎలా ఉంటే అలా ఆయనను అంగీకరించండి.

మీరు గురువుకు అనుగుణంగా మారాలి. అహంకారం చేత గురువు ఇలా ఉండాలి, అలా ఉండాలి అని ఆలోచిస్తూ ఉంటారు.

ఇది ఎంత మాత్రమూ సరి కాదు.

✪ కొంత మంది బాగా చదువుకుంటారు, మంచిగా అనిపించే కుటుంబం ఉంటుంది, అందంగా ఉంటారు, అన్నీ బాగానే ఉంటాయి కాని వీరికి పెళ్ళి కాదు, జాబ్ రాదు. ఇలాంటి వారు తమ లైఫ్ లైన్లు అయిపోయాయి అని గ్రహించి తమను తాము పూర్తిగా సత్య మార్గానికి అంకితం చేసుకోవాలి. సత్య గురువు దగ్గర ఉంటూ జీవితాన్ని గడపాలి. వీరికి వేరే మార్గం ఉండదు.

✪ నేను ఆంధ్ర ప్రదేశ్‌లో ఉంటాను కాని అన్నం పడదు. నేను అస్సాంలో ఉంటాను నాకు టీ పడదు. ఇలా కొంత మందికి సమస్యలు ఉంటాయి. మీరు ఉంటున్న ప్రదేశంలోనివి మీకు పడటం లేదు అని అంటే అది మీ కర్మ. ఉదాహరణకు మీరు హిమాలయాలకు దగ్గరి ప్రాంతంలో ఉండాల్సి వచ్చిందనుకోండి. తప్పించుకోవడానికి ఏ మార్గం లేదు. మీరు తప్పని సరిగా ఆ చలి ప్రదేశంలో ఉండాల్సి వచ్చింది. అప్పుడు మీరు గుర్తించాల్సిన విషయం ఏమిటంటే అది మీ కర్మ అని. ధ్యానంలో కూర్చుని - నేను ఎందుకు ఈ బాధలు పడవలసి వస్తుంది ? - అని ప్రశ్నించుకుని సాధన చేస్తూ ఉంటే ఆ కర్మలు క్లియర్ అయిపోతాయి.

✪ దుర్గుణాలకు లొంగకుండా ఉండడమే, నిజమైన స్వేచ్ఛ సాధికారత.

✪ సోమరి తనం విశ్వాసంగా కనిపిస్తుంది. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. సాధన చేయలేక సోమరిగా ఉంటూ ఆ... అంతా మంచిగానే జరుగుతుందిలే అని పడుకుని ఇది నా

విశ్వాసం అనే భ్రమలో ఉండకూడదు.

✪ చాలా మంది ఫిలాసఫి మరియు ఆధ్యాత్మిక శాస్త్రాన్ని ఒకటిగా భావిస్తారు. కాని ఈ రెండు వేరు, వేరు. పూర్తిగా వేరు. ఫిలాసఫర్స్ వేరే, ఆధ్యాత్మిక వేత్తలు వేరే. ఫిలాసఫర్స్‌లో వేదాంత ధోరణి ఉంటుంది, అత్యంత తక్కువగా ఆధ్యాత్మికత ఉంటుంది. భౌతిక పరమైన విషయాలకు తమ అనుభవాలను జోడించి వేదాంత ధోరణిలో చెబుతుండే వారిని ఫిలాసఫర్స్ అని అంటారు. వీరిలో ఆధ్యాత్మికత చాలా తక్కువగా ఉంటుంది. ఆధ్యాత్మిక వేత్తలు ఎలా ఉంటారంటే... ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని బాగా చదివి అర్థం చేసుకోండి. అప్పుడు మీకే అర్థం అవుతుంది.

✪ న్యూ ఏజ్ స్పిరిచ్యువల్ పుస్తకాలలో అక్కడక్కడా... మీరు సూపర్ కాన్షియస్‌కు నేర్పిస్తున్నారు, మీ వల్లనే సూపర్ కాన్షియస్ విస్తృతం అవుతూ ఉంటుంది... అనే విషయాలు ఉంటాయి. ఇవి చదివి కొంత మంది గమ్మత్తుగా ప్రవర్తిస్తుంటారు, ఎటో వెళ్ళిపోతారు. నేనే సృష్టిని నడిపిస్తున్నాను అనే ఫీలింగ్‌లో ఉంటారు... న్యూ ఏజ్ పుస్తకాలలోని విషయాలన్నీ సత్యాలే అయితే ఆ సత్యాలను నీవు అనుభవ పూర్వకంగా తెలుసుకోవడానికే ఉన్నాయి కాని, ఊరికే చదివి అహంకారంగా ప్రవర్తించడానికి కాదు. అర్థమైందా ?

✪ ఒకటే యోగాన్ని భక్తి యోగం, జ్ఞాన యోగం, కర్మ యోగం, రాజ యోగం అని విభజించాడు శ్రీకృష్ణ పరమాత్ముడు. వాస్తవానికి ఈ నాలుగు యోగాలు ఒకటే. భక్తి అంటే నిజ స్వరూపంతో ఏకత్వం అని అర్థం. అంటే దైవత్వంతో ఏకం అవడం. నేనే దైవం అని భావించడమే భక్తి యోగం. జ్ఞాన యోగం అంటే, నీవు సాధన చేసుకుంటూ ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసించాలి. కర్మ యోగం అంటే, నీవు సాధన చేస్తూ, ఆత్మ విజ్ఞాన అభ్యాసం చేస్తూ సరైన పనులను చేస్తూ ఉండాలి. రాజ యోగం అని అంటే అన్నింటి కన్నా ఉత్తమమైన సాధన చేయాలి. యోగాలు అంటే సాధనలు, ఇవి చాలా ఉన్నాయి. యోగాలన్నింటికి రాజు లాంటి సాధనను రాజ యోగం అని అంటారు. రాజ యోగం అంటే దైవత్వ సాధన. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే వివరించాను. యోగాలు నాలుగు వీటిలో ఏది శ్రేష్ఠమైనది... అనే కబుర్లు ఆపివేసి ఈ నాలుగు ఒకటే అని గ్రహించి సాధన ప్రారంభించాలి. ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మొత్తం బాగా చదివి అవగాహన చేసుకోండి అన్ని విషయాలు మీకే అర్థం అవుతాయి.

✪ సరైన మతరహిత అత్యున్నత ఆత్మ విజ్ఞాన పుస్తకాలను పదే పదే చదవాలి. సాధన క్రమం తప్పకుండా చేయాలి. వాటిలోని విజ్ఞానాన్ని సరిగా నిజ జీవితంలో ఆచరించాలి. ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో సరిగా ఆచరించిన వారు ఎవరైనా తప్పకుండా అభివృద్ధి చెంది తీరుతారు. క్రమం తప్పని సాధన చేయడం వలన మీరు గ్యారంటీగా బాగుపడతారు. ఇది సత్యం. ఎల్లప్పుడూ పాజిటివ్‌గా, విశ్వాసంతో ఉండాలి.

✪ ఒక వ్యక్తి సత్య మార్గానికి అంకితమై కూడా చనిపోయాడు, ఎందుకు ? అని అడిగారు... సత్య మార్గానికి అంకితం కావడంతోనే అతడి ఎన్నెన్నో కర్మలు క్లియర్ అయిపోయాయి. అతడి లైఫ్ డిజైన్ ప్రకారం అతడు ఇంత వరకే జీవించాలి అని డిసైడ్ చేసుకుని ఉంటాడు. లేదా అతడి లైఫ్‌ను ఎక్స్‌టెండ్ చేసుకోలేకపోయి ఉంటాడు. ఇందులో ఆశ్చర్యం ఏం ఉంది ?!

✪ అనుకున్న పని అనుకున్నట్టుగా, సులభంగా, సరళంగా, హాయిగా, ఆనందంగా జరిగి, దాని యొక్క పర్యవసానం కూడా ఆనందంగా ఉంటే అదే నిజమైన సక్సెస్ అని నా అభిప్రాయం.

✪ ఆత్మ విజ్ఞాన అవగాహన ద్వారా క్రమం తప్పని ధ్యాన సాధన ద్వారా అనుకున్న పని అనుకున్నట్టుగా, సులభంగా, సరళంగా, హాయిగా, ఆనందంగా జరగడమే కాకుండా, దాని యొక్క పర్యవసానం కూడా ఆనందంగా ఉంటుంది. ఇది పరమ సత్యం.

✪ ✪ ✪ ✪

దుఃఖం, బాధలు, దైన్య హీన పరిస్థితులు, దారిద్ర్య పరిస్థితులు, అవమానకర పరిస్థితులు, అపజయాలు, దౌర్భాగ్యకర పరిస్థితులు అన్నీ కూడా ఆత్మ పరిణామం సరైన రీతిలో సాగనప్పుడు సంభవిస్తాయి. ఆత్మ పరిణామం యొక్క వేగం పెరిగినప్పుడు అన్నీ ఆనందాలే ఉంటాయి. కాబట్టి ఎల్లప్పుడూ ఆత్మ విజ్ఞాన అభ్యాసాన్ని మరియు నిరంతర ధ్యాన సాధనను చేస్తూ ఉండాలి. వీలైనంతగా సత్య ప్రచారం కూడా చేస్తూ ఉండాలి. వీటి వలన ఆత్మ పరిణామ క్రమం యొక్క వేగం పెరుగుతుంది.

మీరు ఏ సమస్య నుండైనా లేక ఏ అనారోగ్యం నుండైనా లేక ఎవరి నుండైనా విముక్తం కావాలనుకుంటే, దానికి లేక వారికి ప్రేమను ప్రకంటించండి. అప్పుడు అది ఎంతటిదైనా తొలగిపోతుంది. ఎంతటి వారి నుండైనా మీకు విముక్తి లభిస్తుంది. ప్రేమను ప్రకటించి యుద్ధాలను ఆపవచ్చు. ప్రేమ వల్లనే "సృష్టి" నిలబడి ఉందన్న సత్యాన్ని తెలుసుకోండి.

మీరు దేని నుండి విముక్తం కావాలనుకుంటున్నారో లేక ఎవరి నుండి విడుదల కావాలనుకుంటున్నారో దానిని లేక వారిని ఉద్దేశించి.... ప్రేమ ప్రేమ ప్రేమ అని అనుకుంటూ ఉండండి. ఇలా చేస్తే మీ వైపు నుండి దానికి లేక వారికి ప్రేమ ప్రసరించి దాన్నుండి లేక వారి నుండి విముక్తమవుతారు.

ఇంకోక ఆశ్చర్యకరమైన సత్యం ఏమిటంటే....
మీరు దేన్ని కావాలనుకుంటున్నారో దాన్ని ప్రేమించండి, అది మీకు దక్కుతుంది. మీకు ఎవరు కావాలో వారిని ప్రేమించండి, వారు మీకు దక్కుతారు.

ప్రేమ విడుదల చేస్తుంది, కలుపుతుంది.
మీరేం కావాలనుకుంటే అది చేసేస్తుంది ప్రేమ !
అందుకే అది ప్రేమ !

మీ దైవత్వం మిమ్మల్ని ఎల్లప్పుడూ రక్షిస్తూనే ఉంటుంది. మీ దైవత్వాన్ని నమ్ముకుని మీరు ఏ సాహసమైనా చేయవచ్చు.(మరీ మెండిగా, గుడ్డిగా ఏదో చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదు. ప్రమాదాలను తెచ్చుకోమని కాదు, ఇది ఒక ఎంకరేజ్‌మెంట్ మాత్రమే) మీ దైవత్వాన్ని నమ్మి మీరు ఎంతకైనా, దేనికైనా తెగించవచ్చు. మీ దైవత్వం, మిమ్మల్ని ఏ నాటికీ వదిలి పెట్టదు గాక, వదిలి పెట్టదు. మీరు మీ దైవత్వం నుండి దూరంగా పారిపోదామని ప్రయత్నించినా... అది అసంభవం. ఎందుకంటే మీరు, మీ దైవత్వం వేరే కాదు కాబట్టి. మీరు ఏం చేసినా, మీరు ఎలా ఉన్నా... మీ దైవత్వం, మీ పైన వరాల వర్షం కురిపిస్తూనే ఉంటుంది. మీరు ఎలా ఉన్నా సరే, మీ దైవత్వం యొక్క సంపూర్ణ సమగ్ర రక్షణ మీకు సదా ఉంటూనే ఉంటుంది.. జయహో.. దైవత్వం !

పార్ట్ - 16

జన్మలు, పునర్జన్మలు అనేవి నిజ సత్య వాస్తవాలు

ఇప్పటి మీ వెనుక కొన్ని వేల, లక్షల, కోట్ల జన్మల చరిత్ర ఉంది. ఇంకా మీరు అనంతంగా జన్మలను ఎత్తుతూనే ఉన్నారు. ఏ నాటికీ నశించని శాశ్వతులే మీరు. మీరు ఎత్తిన జన్మలన్నింటిలోకీ ఉత్తమమైనది ప్రస్తుతపు జన్మయే అని తెలుసుకోండి. ప్రతీ జన్మ ఒక మెట్టు లాంటిది. ఆత్మ పరిణామ క్రమంలో అనంతమైన మెట్లున్నాయి. ఈ మెట్లు ఎప్పటికీ అంతం కావు... అలా ఉంటూనే ఉంటాయి.

అత్యంత త్వరలో ఈ భూమి పైన, జన్మలు - పునర్జన్మలు అనే సత్యం అందరికీ తెలుస్తుంది.

జన్మలు, పునర్జన్మలు అనేవి నిజ సత్య వాస్తవాలు

ఈ భూమి మీద ఉన్న ప్రతీ మానవుడికీ జన్మలు, పునర్జన్మలు ఉంటాయి. ఇది పరమ సత్యం. అతడు లేక ఆమె - ఏ దేశానికి చెందిన వారైనా, ఏ ప్రాంతానికి చెందిన వారైనా, ఏ జాతికి చెందిన వారైనా, ఏ తెగ వారైనా, ఏ మతం వారైనా, ఏ కులం వారైనా, ఏ సంస్కృతికి చెందిన వారైనా, ఏ సాంప్రదాయం వారైనా, ఏ సంస్థ వారైనా, ఏ మార్గం వారైనా, ఏ సిద్ధాంతం వారైనా, ఏ ధర్మం వారైనా, ఆడవారైనా, మగవారైనా, అటూఇటూ కాని వారైనా, టెస్ట్‌ట్యూబ్ బేబీలైనా, క్లోనింగ్ ద్వారా జన్మించిన వారైనా, మరే ఇతర పద్ధతుల ద్వారా జన్మించిన వారైనా, ఆకాశంలోంచి ఊడిపడ్డా....., వారు ఎవరైనా సరే..... .....మనుషులా కాదా అన్నదే అసలు విషయం. మానవ రూపంలో ఉన్నారా లేదా అన్నదే అసలు పాయింట్. మానవ శరీరం ధరించి ఉన్నారా లేదా అన్నదే ముఖ్యమైన అంశం. ఈ భూమి పైన జీవిస్తున్నారా లేదా అన్నదే ప్రధానం. మనిషి రూపంలో ఉండి, మనిషి శరీరాన్ని ధరించి, ఈ భూమి పైన ఉంటున్న వారు ఎవరైనా సరే..... వారందరికీ జన్మలు, పునర్జన్మలు ఉంటాయి. ఉండి తీరుతాయి. వారికి తెలిసినా తెలియక పోయినా, ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా, ఇది మాత్రం.... నికార్సైన, అసలు సిసలైన...

.....నిజ సత్య వాస్తవం.

ఈ భూమి పైన జన్మించిన ప్రతీ మాస్టర్.... అంటే ప్రస్తుతం దేవుళ్ళుగా మరియు దేవదూతలుగా ఆరాధించ బడుతున్న ప్రతీ మాస్టర్ ఈ పరమ సత్యాన్ని ప్రకటించాడు. ప్రతీ ఒక్కరికి జన్మ పరంపర ఉంటుందనీ, ఈ జన్మలు, పునర్జన్మలు అనేవి ఆత్మ పరిణామ క్రమంలో ఒక సహజ భాగం అని ఎంతో ఘనంగా ప్రకటించారు. అయితే కాలక్రమంలో ఈ పరమ సత్యాలను, మాస్టర్ల యొక్క బోధనల్లో నుండి మతాధికారులు తొలగించారు. కేవలం జన్మల విషయాలనే కాకుండా ఇంకా చాలా సత్యాలను తొలగించారు. ఏ సత్యాలైతే తమ యొక్క "మత పెద్దరికానికి" అడ్డు వస్తున్నాయో వాటన్నింటినీ తొలగించారు. తమకు అనుకూలమైనవి వ్రాసుకున్నారు. జన్మలు, పునర్జన్మలు ఉంటాయనే జన్మ పరంపర సత్యాన్ని, భారత దేశంలోని హిందూ మతం మాత్రం చాలా భద్రంగా కాపాడింది. వేలాది సంవత్సరాల నుండి ఆధ్యాత్మిక సత్యాలను ఎన్నింటినో భారత దేశంలోని వారు కాపాడుతూ ఉన్నారు. హిందూ మతం కాకుండా ఇంకా ఇతర మతాలు కొన్ని ఈ జన్మ పరంపర సత్యాన్ని ఒప్పుకుంటాయి. మరికొన్ని మతాల వారికి ఈ "జన్మలు, పునర్జన్మలు" అనే సత్యం తెలియదు. ఎందుకంటే వారి మత గ్రంథాల్లో ఈ సత్యాలు లేవు గనుక ! కాబట్టి వారు ఈ జన్మ సిద్ధాంతాన్ని ఒప్పుకోరు. అయితే వారు ఒప్పుకోనంత మాత్రాన, సత్యం - సత్యం కాకుండా పోదు కదా ! ఒకప్పుడు "సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని" చర్చి ఒప్పుకోలేదు. ''కోపర్నికస్'' తర్వాత ఈ సత్యాన్ని మళ్ళీ వెలుగులోకి తీసుకువచ్చిన ''గెలీలియో''ను జైల్లో బంధించింది. మత గ్రంథాల్లో ఉన్న ''భూ కేంద్ర సిద్ధాంతాన్ని'' సమర్థించమని ఒత్తిడి తెచ్చింది. ఆ మహానుభావుడు ఆ యొక్క అబద్ధాన్ని అంగీకరించలేదు. ఫలితంగా అతడు జైల్లోనే ఉండాల్సి వచ్చింది. మూఢ మతాధికారులు ఒప్పుకోనంత మాత్రాన సత్యం అసత్యం కాలేదు కదా ! సూర్య కేంద్ర సిద్ధాంతమే సత్యమని ఈనాడు శాస్త్రీయంగా ఋజువైంది కదా ! ఈ విధంగానే ఈ జన్మలు, పునర్జన్మలు అనే సత్యం కూడా శాస్త్రీయంగా, అత్యంత త్వరలోనే ఋజువై తీరుతుంది. ఇప్పటికే ఈ విషయాన్ని ఎంతో మంది డాక్టర్లు, ప్రొఫెసర్లు మరియు ఇతర శాస్త్రీయ నిపుణులు పరిశోధనలు చేసి, ధృవీకరించి, ఆధారాలతో సహా ప్రకటిస్తున్నా, చాలా మందికి ఈ జన్మల విషయం పట్ల ఇంకా అనుమానంగానే ఉంది. ఈ అనుమానాలను మతాధికారులు తీసివేయవచ్చు. కాని వారు చేయరు. ఎందుకంటే వారికీ అనుమానమే! కొంత మంది హిందూ మతం వాళ్ళైతే మరీ విచిత్రంగా ప్రవర్తిస్తారు. ఎందుకంటే.. హిందూ మతానికి పునాది వంటిది ''భగవద్గీత'', ఇది జగమెరిగిన సత్యమే ! శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో "జన్మలు, పునర్జన్మలు" అనే సత్యం గురించి చక్కగా, స్పష్టంగా వివరించాడు. సుమారుగా హిందువులందరూ భగవద్గీతను మరియు దానిని బోధించిన శ్రీకృష్ణ పరమాత్మను ఆరాధిస్తారు. పూజిస్తారు. ఇంకా ఏమేమో చేస్తారు. కానీ... జన్మలు, పునర్జన్మలు అనే విషయం దగ్గరకు వచ్చే సరికి, నిజంగా జన్మలున్నాయా ? అని అనుమానిస్తారు. వీళ్ళు గుళ్ళకు వెళ్తారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలు చేస్తారు. శ్రీకృష్ణుడిని పరమాత్ముడనీ, దేవాధిదేవుడనీ ఒప్పుకుంటారు. అన్నీ చేస్తారు.... కానీ శ్రీకృష్ణుడు చెప్పిన విషయాలను మాత్రం

నమ్మరు. ఎంతటి ఆత్మ వంచన ! ఆత్మ వంచన వలన ఆత్మ నాశనం అవుతుంది కదా ! ఆత్మ నాశనం అంటే అన్ని రకాలుగా అభివృద్ధి ఆగిపోతుందన్న మాట ! ఎంత ప్రమాదం ! ఇలాంటి ఆత్మ వంచకులు బాగుపడేది సత్యాలను ఒప్పుకున్నప్పుడు మాత్రమే ! హిందూ మతంలో జన్మ సిద్ధాంత సత్యాన్ని ఒప్పుకునే వాళ్ళు కూడా ఉన్నారు. నేనిక్కడ ఒప్పుకోని వారి గురించి ప్రస్తావిస్తున్నాను.

ప్రస్తుతం భూమి పైనున్న మనుషుల జీవితాల్ని అతలాకుతలం చేస్తున్న మహమ్మారి మతమే ! మతం వలన జరుగుతున్న నష్టం మరి దేని వలనా జరగటం లేదని అంటే అతిశయోక్తి కాదు. సత్యానికి మానవులకు మధ్య ఉన్న అగాధమే మతం. ఈ మతమనే అగాధాన్ని దాటాలి, అప్పుడే మనిషి సత్యాన్ని పొందుతాడు. అది ఏ మతమైనా మతం, మతమే ! పళ్ళూడ గొట్టుకోడానికి ఏ రాయి అయితే ఏం ? అన్నట్టు.... ఆత్మ అభివృద్ధిని అడ్డుకోడానికి ఏ మతమైతే ఏం ! అన్నీ అంతే.

మత పెద్దలందరూ అసలు సిసలు ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకుంటే, ఈ భూమి పైన శాంతి నెలకొంటుంది. మత పెద్దలు తెలుసుకోక పోయినా, కనీసం.... ప్రజలైనా ఈ విషయాలను తెలుసుకుంటే చాలు. అసలు సిసలు ఆత్మ విజ్ఞానం అంటే ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలో నేను తెలియజేసినది మరియు ఇందులోనే నేను కొంత మంది మాస్టర్ల పేర్లను తెలియజేసాను, వారు రాసిన పుస్తకాలలోనిది, నిజమైన నికార్సైన ఆత్మ విజ్ఞానం. మతం బోధిస్తున్న తప్పుడు బోధనల వలన, మనుషుల యొక్క వ్యక్తిత్వం తప్పుగా మారిపోతుంది. దాని వలన అతడు తప్పుగా ప్రవర్తిస్తూ ఉంటాడు. ఈ విధమైన తప్పుడు ప్రవర్తనల వలన ఎన్నెన్నో అరాచకాలు మొదలవుతాయి. ఈ రకంగా ప్రపంచమంతా అల్లకల్లోలం అయిపోతుంది. మనిషన్న ప్రతీవాడు తప్పని సరిగా బాధ్యతగా, ప్రతీ ఒక్కరూ కూడా ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకుని తీరవలసిందే ! ఏ ఒక్కరికీ మినహాయింపులేదు. మతరహిత అత్యున్నత ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకుని సరిగా అర్థం చేసుకుని దాన్ని సరిగా ఆచరణలో పెట్టే వ్యక్తి యొక్క వ్యక్తిత్వం సరైనది అవుతుంది. అప్పుడు అతడి ప్రవర్తన సరైనది అవుతుంది. కాబట్టి ఆటొమెటిక్‌గా భూమి పైన శాంతి నెలకొంటుంది. ఇప్పుడు ఇదే జరగబోతోంది ఈ భూమి మీద ! అత్యంత త్వరలోనే ఈ భూమి సంపూర్ణ, సమగ్ర శాశ్వత ఆధ్యాత్మిక గ్రహంగా మారబోతోంది. ఆ లోక కల్యాణ కార్యం మొదలైపోయింది. అందులో ఒకానొక భాగమే ఈ పుస్తకాన్ని మీరు చదవడం !

మూల చైతన్యం నుండి ఉద్భవించిన ఆత్మ, ముందు ఖనిజాలుగా జన్మ తీసుకుంటుంది. ఖనిజ ప్రపంచంలో పరిపక్వత సాధించిన తర్వాత మొక్కలుగా, గడ్డిగా, చెట్లుగా, వృక్షాలుగా..... ఇంకా ఇలా వృక్ష సంబంధిత జన్మలు తీసుకుంటుంది. ఈ వృక్ష ప్రపంచంలో పరిపక్వతను పొందిన తర్వాత జంతువులుగా జన్మ తీసుకుంటుంది. రక రకాల జంతువులుగా జన్మలు ఎత్తి ఈ యొక్క జంతు ప్రపంచంలో కూడా పరిణతి చెంది మనిషిగా జన్మిస్తుంది. మనిషిగా

జన్మించిన ఆత్మ తన నిజ తత్వం తెలుసుకుంటే, అప్పుడు మోక్షం లభిస్తుంది.

మనిషిగా జన్మించిన ఆత్మ, పరిణతి చెందడానికి, రక రకాల జన్మలను తీసుకుంటుంది. స్త్రీగా, పురుషుడిగా, రాజుగా, పేదగా, పతివ్రతగా, వేశ్యగా, మోసగాడిగా, దొంగగా, మంచివాడిగా.....

ఒక జన్మ లేదా కొన్ని జన్మలు ఒక మతంలో, మరి కొన్ని జన్మలు ఇంకో మతంలో,

ఒక్కో జన్మలో ఒక్కో జాతిలో లేదా కొన్ని జన్మలు ఒక జాతిలో, ఆ తర్వాత మరో జాతిలో,

ఒక జన్మ లేదా కొన్ని జన్మలు ఒక కులంలో, ఆ తర్వాత మరో కులంలో,

ఒక జన్మ లేదా కొన్ని జన్మలు ఒక తెగలో, ఆ తర్వాత మరో తెగలో,

ఒక జన్మ లేదా కొన్ని జన్మలు కొన్ని సాంప్రదాయాల్లో, ఆ తర్వాత ఇతర సాంప్రదాయాల్లో.....

ఇలా రకరకాల, ఎన్నో రకాల, దాదాపు అన్ని రకాల జన్మలను ఎత్తుతుంది ఆత్మ ! ఆత్మ అంటే ఇప్పుడు, ఇది చదువుతున్న మీరే ! మీరందరూ కూడా ఈ విధంగా జన్మించిన వాళ్ళే, ఇంకా రక రకాల జన్మలు తీసుకోబోతున్న వాళ్ళే ! ఆత్మ కేవలం ఒక విశ్వంలోనే కాకుండా రక రకాల విశ్వాలలో రక రకాల లోకాలలో వివిధ శరీరాలతో ఏక కాలంలో జన్మ తీసుకుంటుంది. ప్రస్తుతం మీరు కూడా ఎన్నో విశ్వాలలోని ఎన్నో లోకాలలో ఎన్నో శరీరాలతో ఉన్నారు. కొన్ని స్త్రీ శరీరాలైతే మరికొన్ని పురుష శరీరాలు. కొన్ని మీకు తెలిసిన మానవ శరీరాలైతే మరికొన్ని మీ ఊహలకందని ఆకృతితో ప్రకృతితో ఉన్న శరీరాలు. ఈ విధంగా ఆత్మ రక రకాల విశ్వాలలోని రక రకాల లోకాలలో రక రకాల శరీరాలతో, ఏక కాలంలో పరిణతి చెందుతూ ఉంటుంది. ఇక భూమి పైనున్న జన్మల విషయానికి వస్తే.... అంటే ఇప్పుడు ఇది చదువుతున్న మీరు ఎన్నో విశ్వాలలోని ఎన్నో లోకాలలో ఎన్నో శరీరాలతో ఉన్నా..... ఈ భూమి పైన ఉన్న మీ విషయానికి వస్తే..... అంటే ఈ భూమి పైన ఇప్పుడు ఉన్న వారందరూ, చనిపోయిన వారందరూ మరియు పుట్టబోతున్న వారందరూ.... వీరందరికీ.... జన్మలు ఉంటాయి. ఇది త్వరలోనే నిరూపితం కాబోతున్న పరమ సత్యం. వీరందరూ విధిగా జన్మలు తీసుకుని పరిణతి చెంది మోక్షం పొందాల్సిందే !

అందరూ అన్ని రకాలుగా పుడతారనీ, అంటే.... అన్ని జాతుల్లోనూ, అన్ని మతాల్లోనూ, అన్ని దేశాల్లోనూ, అన్ని తెగల్లోనూ, అన్ని కులాల్లోనూ, స్త్రీగా, పురుషుడిగా జన్మించి తీరుతారనీ, ఇది సహజమనీ, ఆత్మ పరిణామ క్రమంలో ఇది తప్పదనీ, ఇది సత్యమనీ అందరూ తెలుసుకుంటే.... ఈ భూమి పైనున్న మనుషుల జీవితాల్లో శాంతి నెలకొంటుంది. జీవితాలకు భద్రత ఏర్పడుతుంది. ఆనందోత్సవాలతో మనుషులంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారు. మానవ జాతి ఎంతో అభివృద్ధి చెందుతుంది. కనీ వినీ ఎరుగని ఆవిష్కరణలు జరుగుతాయి. ఊహలకందని టెక్నాలజి

అందుబాటులోకి వస్తుంది. ఎంతో కాలంగా మానవులకు అర్థం కాని విషయాలన్నో క్లియర్ అవుతాయి. ఎంతో కాలంగా మానవులకు అంతు చిక్కని చిక్కుముడులెన్నో విడిపోతాయి. ఎంతో కాలంగా మానవులకు తెలియని ఎన్నో రహస్యాలు బట్టబయలవుతాయి. కేవలం ఈ భూమి పైనే కాకుండా, ఎన్నో విశ్వాలలోని ఎన్నో లోకాలలో ప్రాణులున్నారనీ, అక్కడ కూడా జీవితం, సమాజం మొదలైనవి ఉన్నాయనీ తెలుసుకున్న మానవుడు, ముందు గ్లోబల్ సిటిజెన్‌గా మారి ఆ తర్వాత కాస్మిక్ సిటిజెన్‌గా మారుతాడు. ఆత్మ విజ్ఞానాన్ని తెలుసుకున్న మానవుడు, "నేను ఏం ఇస్తే లేక ఏం చేస్తే అది వేయింతలై తిరిగి నాకే వస్తుందన్న" పరమ సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటాడు. ఈ జన్మలో రాకపోతే వచ్చే జన్మలోనైనా "నేను ఏం చేసానో అది అలానే వేయింతలై నాకే తిరిగి వస్తుందనే" వాస్తవాన్ని తెలుసుకున్న వ్యక్తి, అప్పుడు అతడు ఇతరుల గురించి చెడుగా ఆలోచించలేడు. ఇతరుల పట్ల చెడుగా ప్రవర్తించలేడు. ఎందుకంటే, ఆ వ్యక్తి ఏది ఎలా ఇస్తే లేక ఏది ఎలా చేస్తే అది అలానే అతనికే తిరిగి వస్తుంటే, ఎన్ని జన్మలైనా విడవకుండా వెంట పడుతుంటే.... అప్పుడు అతడు చెడు ఎలా చేస్తాడు ? అది అసంభవం. నేను చేసింది నాకే తిరిగి వస్తుందనే పరమ సత్యాన్ని అవగాహన చేసుకున్న మనిషి ఖచ్చితంగా మంచి మాత్రమే చేసి తీరుతాడు. ఈ విధంగా, అందరూ మంచి మాత్రమే చేస్తూ, మంచిగా ఉన్నప్పుడు లోకం ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే ఎంతో మధురంగా ఉంది. ఒళ్ళు పులకరించి పోతుంది. ఆత్మ విజ్ఞాన అవగాహన ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది.

లోకంలోని అత్యధికులు ఆత్మ విజ్ఞానులవుతే అప్పుడు లోక కల్యాణం అవుతుంది. లోక కల్యాణం సృష్టి కల్యాణానికి దారి తీస్తుంది. కాబట్టే ప్రతీ ఒక్కరూ ఆత్మ విజ్ఞానం తెలుసుకోవడం మాత్రమే కాకుండా విధిగా ఆత్మ విజ్ఞాన ప్రచారం చేసి తీరాలి. ఎవరు పడితే వాళ్ళు క్లాసులు చెప్పడం కాదు. సత్యగురువు దగ్గర నిజాయితీగా పనిచేయాలి. అప్పుడే లోక కల్యాణం, విశ్వ కల్యాణం & సృష్టి కల్యాణం !

మనమందరం సృష్టి కల్యాణానికై మనల్ని మనం నిజంగా పూర్తిగా, శాశ్వతంగా, అజేయంగా అంకితం చేసుకుందాం ఇప్పుడే, ఈ క్షణమే !

ఇంటర్‌నెట్‌లో ఈ "జన్మలు, పునర్జన్మలు" అనే విషయం గురించి నిజమైన ఆధారాలతో కూడిన వెబ్ సైట్లు ఎన్నో ఉన్నాయి. ఎంతో మంది మాస్టర్లు ఎంతో పరిశోధన చేసి ఆ యొక్క రీసెర్చ్ రిపోర్ట్స్ ఇంటర్‌నెట్‌లో ఉంచారు. దయచేసి ప్రతి ఒక్కరూ "జన్మలు, పునర్జన్మలు" అనే సత్యాన్ని తెలుసుకుని తీరాలి. అందరికీ చెప్పాలి.

డాక్టర్ బ్రియాన్ వీస్ గారి రీసెర్చ్ రిపోర్ట్ అయిన Many Lives Many Masters, డాక్టర్ ఇయాన్ స్టీవెన్‌సన్ గారి రీసెర్చ్ రిపోర్ట్ అయిన Twenty Cases Suggestive of Reincarnation మరియు వాల్టర్ సెమ్‌కివ్ గారి రీసెర్చ్ రిపోర్ట్ అయిన Born Again అనే పుస్తకాలను చదివితే, వాస్తవాలను తెలుసుకుని మీరు ఆశ్చర్యపోతారు. ఇవే కాక జన్మల గురించి ఎన్నెన్నో పుస్తకాలు ఉన్నాయి. ఇంటర్‌నెట్‌లో past lives లేదా scientific evidences of past lives అని టైప్ చేసి search చేస్తే ఎన్నో వెబ్ సైట్లు మీకు కనపడతాయి. **అప్పుడు వాటిని చదివి మీరెంతో అభివృద్ధి చెందవచ్చు. ఆ వివరాలను ఇతరులకు తెలియజేసి వారి అభివృద్ధికి కారణమవచ్చు. ఇతరులకు ఇలాంటి ఆత్మ విజ్ఞాన విషయాలను తెలియజేస్తే మీలో మీకు తెలిసినవి మరియు తెలియకుండా ఉన్న నెగెటివ్‌లు తక్షణమే పూర్తిగా, శాశ్వతంగా క్లియర్ అయిపోయి, మీరు కోరుకుంటున్నవి మీకు రాచ మార్గంలో మరియు సాధికారికంగా మీకు దక్కుతాయి.**

ఆఁ.. ఇప్పుడు గడిచి పోతుంది కదా.. అని మీరు గడిపేస్తారు. సత్యగురువును వెతుక్కుని ఆయన లేక ఆమె దగ్గర శిష్యరికం సంపాదించి గురువు మార్గదర్శకత్వంలో ఆధ్యాత్మిక అభివృద్ధి సాధించాలి. ఈ శరీరంతో, ఈ జన్మలో మోక్షం పొందాలి. మీరు ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తే ఆ తర్వాత మీ బాధలు వర్ణణాతీతం ! మీరు నిర్లక్ష్యంగా గడిపే ప్రతీ క్షణానికి మీరు ప్రతిఫలం మీ కన్నీళ్ళతో చెల్లించుకోవాల్సివస్తుంది. వెంటనే సత్య గురువు వేటలో పడండి. వెతుక్కోండి. శరణు వేడండి. ఎలాగోలా శిష్యరికం పొందండి. గురువు దగ్గర నిస్వార్థంగా, నిజాయితీగా, విశ్వాసంగా, స్థిరంగా ఉండండి. మీ జీవిత పరమార్థాన్ని సాధించుకోండి.

మీరు చేసిన తప్పులను మీరే సరిదిద్దుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న కష్టాలన్నీ ఒకప్పుడు మీరు చేసిన పనులకు ప్రతిఫలంగా, మీరే వాటిని ఆకర్షించుకుని, అనుభవిస్తూ వాటిని సరి చేస్తున్నారు. గుర్తుంచుకోండి, మనం దేన్ని చెడగొడితే తిరిగి దాన్ని మనమే బాగు చేయాలి. మనం నాశనం చేస్తే , తిరిగి మనమే నిర్మించాలి. మనం చెడు చేస్తే , తిరిగి మనం మంచి చేసియే తీరాలి.

మీరు ప్రస్తుతం సరి చేస్తున్నవన్నీ ఒకప్పుడు మీరు చెడగొట్టినవే !

అయితే... ఈ విషయాలు... సద్గురువులకు వర్తించవు.

పార్ట్ - 17

మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్

Multi Dimensional Existence

ఈ అనంత సృష్టిలో లెక్క లేనన్ని విశ్వాలున్నాయి, వాటిలో కోటాను కోట్ల లోకాలున్నాయి. వాటిలో అత్యధిక శాతం లోకాలలో జీవులు ఉన్నారు. మన భూమి కంటే అడ్వాన్స్‌డ్ లోకాలు చాలా చాలా ఉన్నాయి. కొన్ని లోకాలు ఎంత అడ్వాన్స్ అంటే, అక్కడి సమయం ప్రకారం మన ఈ భూమి పైన కొన్ని కోట్ల సంవత్సరాలు వారికి లెక్కలోకి రావు. అత్యంత త్వరలోనే ఇతర విశ్వాల నుండి ఇతర లోకాల నుండి రాకపోకలు మొదలవుతాయి. మానవ జాతి అనూహ్యమైన ప్రగతి పథంలోకి దూసుకు పోతుంది.

మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్

Multi Dimensional Existence

మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్ - Multi Dimensional Existence అంటే, వివిధ లోకాలలో, తలాలలో, ఏక కాలంలో కొనసాగుతూ ఉన్న మన **బహుముఖ ఉనికి** లేదా **బహుతల ఉనికి** అని అర్థం.

మనమందరం కూడా, వేరే ఇతర విశ్వాలలోని వివిధ లోకాలలో, రక రకాల శరీరాలను తీసుకుని పరిణామం చెందుతూ ఉంటాం. ఆత్మ విజ్ఞానం లేని వారికి, ధ్యాన సాధన చేయని వారికి భూమి పైనున్న ఈ యొక్క భౌతిక శరీరం ఒక్కటే అని అనుకుంటారు. అందుకే వారిని జ్ఞానం లేని వారు అని అనాల్సి వస్తుంది. నీ నా అనే భేదం లేకుండా అందరూ, ఎన్నో విశ్వాలలోని వివిధ లోకాలలో రక రకాల శరీరాలను ధరించి పరిణామ క్రమంలో ముందుకు సాగుతూ ఉంటారు. ఇందులో కొన్ని ఈ భూమి పైనే ఉండవచ్చు కూడా ! మనం లోతైన ఆధ్యాత్మిక అవగాహన ఏర్పరచుకుంటూ, బాగా ధ్యాన సాధన చేస్తూ ఉంటే మన మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్ అనుభవంలోకి వస్తూ ఉంటుంది. ఈ మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్ అనుభవాల ద్వారా మనకు చాలా లాభాలు జరుగుతాయి. ఒక్కో దగ్గర, ఒక్కో శరీరంతో వివిధ రకాలైన అనుభవాలు పొందుతూ ఉంటాం. మనం ఏ శరీరంలోనుండైతే సాధన చేస్తూ మన యొక్క మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్ యొక్క అనుభవాలను పొందుతూ ఉంటామో, ఆ శరీరం కలిగి ఉన్న జీవితాభివృద్ధికి లేదా ఆ శరీరాన్ని + ఆ జీవితాన్ని మన ఇష్టం వచ్చినట్టుగా మలుచుకోవాలనుకున్నప్పుడు, మనకు ఈ మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్ అనుభవ విజ్ఞానం ఎన్నో రకాలుగా సహాయ సహకార సమన్వయాలను అందిస్తుంది. ఆత్మ విజ్ఞానం లేకపోయినా ఒక శరీరం

నుండి ఇంకో శరీరానికి విజ్ఞాన ప్రసారం జరుగుతూనే ఉంటుంది. ఆత్మ విజ్ఞానం మరియు ధ్యాన సాధన ఉంటే, చాలా చాలా అద్భుతమైన అభివృద్ధి చెందవచ్చు.

జ్ఞానోదయం అంటే, దైవత్వం తిరిగి ప్రాప్తించినప్పుడు, ఈ మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్ అనుభవంలోకి వస్తుంది. అంతకు ముందు కూడా వస్తూ ఉంటుంది కాని, కొద్ది కొద్దిగా వస్తూ ఉంటుంది.

పార్ట్ - 18

స్త్రీ

పురుష శరీరంలో ఏ దివ్యాత్మ అయితే ఉందో... స్త్రీ శరీరంలో ఉన్నది కూడా అలాంటి దివ్యాత్మయే ! స్త్రీ పురుషులు ఇరువురూ సమానమే ! స్త్రీకి జరిగిన అన్యాయం ఇక చాలు. ఈ క్షణం నుండి ఈ భూమి పైనున్న ప్రతీ స్త్రీ , పురుషుడితో సరి సమానంగా గౌరవింపబడి తీరాలి. స్త్రీ ద్వారా ఎన్నెన్నో ఆనందాలను, ఎన్నో సౌకర్యాలను మరెన్నో సహాయాలను పొందుతున్న పురుషుడు, స్త్రీని సంపూర్ణమైన ప్రేమతో గౌరవించియే తీరాలి. ఈ భూమి పైన ప్రతీ స్త్రీకి సంపూర్ణమైన స్వేచ్ఛ సాధికారతలు ఉండి తీరాలి. ఇంట్లో, సమాజంలో, ప్రభుత్వంలో... ఇంకా ఇతర అన్ని రంగాలలో స్త్రీ యొక్క సహాయ సహకార సమన్వయాలు తనకు అత్యవసరం అని పురుషుడు గుర్తించాలి. అన్నింటిలోనూ స్త్రీ పురుషులు సరి సమానం అనే ప్రేమ వ్యవస్థను, మనం ఇప్పుడు ఏర్పరచియే తీరాలి. ఇది అందరి యొక్క తప్పనిసరి కర్తవ్యం.

స్త్రీ

స్త్రీ స్త్రీయే ! పురుషుడు పురుషుడే ! స్త్రీ ప్రత్యేకమైనది కాదు, పురుషుడు ప్రత్యేకమైన వాడు కాదు. ఎవరి ప్రత్యేకత వారిదే !

ఆత్మ తన యొక్క పరిణామ క్రమంలో, కొన్ని జన్మలు స్త్రీ శరీరంలోనూ మరి కొన్ని జన్మలు పురుష శరీరంలోనూ తీసుకుంటుంది. ఆత్మకు లింగం ఉండదు. ఆత్మ దివ్యం అంతే. ఆత్మ ఆడ కాదు, మగ కాదు. ఆత్మ దివ్యమైనది. ఆత్మ స్త్రీ శరీరాన్ని ధరించి జన్మిస్తే స్త్రీ అంటారు, పురుష శరీరాన్ని ధరించి జన్మిస్తే పురుషుడు అంటారు. స్త్రీ గొప్ప కాదు, పురుషుడు గొప్ప కాదు. ఇరువురూ సరి సమానమే. ఎవరి గొప్ప తనం వారిదే. అందరూ తెలుసుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఒక స్త్రీ, స్త్రీ కాదు, స్త్రీ శరీరాన్ని ధరించిన ఒకానొక ఆత్మ అని తెలుసుకోవాలి. ఒక పురుషుడు, పురుషుడు కాదు, పురుష శరీరాన్ని ధరించిన ఒకానొక ఆత్మ అని తెలుసుకోవాలి.

అయితే, ఈ భూమి మీద చాలా కాలం నుండి జరుగుతున్న దారుణాల్లో అత్యంత ప్రధానమైనది ఏమిటంటే, స్త్రీని ఒక మనిషిగా కాకుండా ఒక వస్తువుగా చూడటం. ఆ వస్తువును తనకు నచ్చినట్టుగా మగవాడు వాడుకోవడం. స్త్రీల పట్ల జరిగిన, జరుగుతున్న అన్యాయాల మరియు అక్రమాల గురించి నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు, మీకు తెలుసు. ఇది ఎంత మాత్రమూ సరి కాదు గాక కానే కాదు. మగ వాళ్ళకు ఆత్మ విజ్ఞాన అవగాహన రానంత వరకు వారు స్త్రీ పట్ల పూర్తి ధర్మ బద్ధంగా వ్యవహరించ లేరు. ఎందుకంటే స్త్రీ పట్ల దారుణంగా ప్రవర్తిస్తున్న మగవాళ్ళు, తాము చేసిన దారుణాలను తిరిగి తాము అనుభవించాల్సి వస్తుందని తెలియదు. స్త్రీలను బాగా హింసించిన మగవాళ్ళు ఒక్కోసారి స్త్రీలుగా జన్మించి, గత జన్మలలో తాము స్త్రీల పట్ల ఎలాంటి దారుణాలు చేసారో వాటన్నింటినీ ఈ జన్మలో అనుభవించాల్సి వస్తుందని తెలియదు. అందుకే ఆత్మ విజ్ఞానం లేని మగవారు స్త్రీల పట్ల అన్యాయంగా, దారుణంగా

ప్రవర్తిస్తారు. ఆత్మ విజ్ఞాన అవగాహన ఉన్న వ్యక్తి స్త్రీల పట్ల ధర్మ బద్ధంగా నడుచుకుంటాడు. ఆత్మ విజ్ఞాన అవగాహన ఉన్న వ్యక్తి స్త్రీ పట్ల అన్యాయంగా, దారుణంగా ప్రవర్తించలేడు. అది అసంభవం. స్త్రీ ఆత్మ విజ్ఞాన అవగాహన కలిగి ఉంటే బాధలు పడాల్సిన అవసరం ఉండదు. స్త్రీ పురుషులు ఇరువురూ ఆత్మ విజ్ఞాన అవగాహన కలిగి ఉంటే అప్పుడు జీవితమే ఒక స్వర్గం అవుతుంది. ఈ భూమి స్వర్గంగా మారిపోతుంది.

స్త్రీలు తమ పట్ల జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు రకరకాలుగా ప్రయత్నిస్తూ సఫలం అవుతున్నారు. అయితే గుర్తుంచుకోవాల్సిన అత్యంత ప్రధానమైన విషయం ఏమిటంటే మగవారితో పోరాడి, పోరాడి స్త్రీ, తన స్త్రీ తత్వాన్ని పోగొట్టుకోకూడదు. స్త్రీ స్త్రీగానే ఉండి మగవాడి అహంకారం మీద విజయం సాధించాలి. స్త్రీ తన స్వేచ్ఛా స్వాతంత్రాల కోసం, సాధికారత కోసం, సమానత కోసం, గౌరవం కోసం తన యొక్క స్త్రీ తత్వాన్ని పోగొట్టుకుని విజయం సాధిస్తే అది అపజయం కిందికే వస్తుంది. ఎందుకంటే స్త్రీ, స్త్రీగా లేనప్పుడు ఆ వచ్చిన విజయాన్ని ఎవరు అనుభవిస్తారు ?! మగవాడి అహంకారంతో పోరాడుతున్న స్త్రీ, తన స్త్రీ తత్వం యొక్క గౌరవ మర్యాదల కోసం, న్యాయం కోసం పోరాడుతూ ఉంది. స్త్రీ తత్వమే స్త్రీలో నశించినప్పుడు పోరాటం ఎందుకు, దేని కోసం ?!

స్త్రీకి అన్నింటిలోనూ సరిసమానమైన మరియు సుస్థిరమైన స్థానాన్ని కల్పించడంలో ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా, నిజాయితీగా కృషి చేసి తీరాలి.

అందరూ గ్రహించాల్సిన సత్యం ఏమిటంటే, స్త్రీ మరియు పురుషుడు ఇద్దరూ సరి సమానమే ! ఇద్దరిలో ఎవరికి అన్యాయం జరిగినా ప్రకృతిలోని శృతి దెబ్బ తింటుంది. సృష్టి క్రమానికి అవరోధం ఏర్పడుతుంది. ప్రతి ఒక్కరు స్త్రీలుగా, పురుషులుగా జన్మిస్తారు కాబట్టి పరస్పరం గౌరవం, మర్యాద, ప్రేమ, అవగాహనలను కలిగి ఉండాలి. మాతృస్వామ్య వ్యవస్థ వద్దు, పితృస్వామ్య వ్యవస్థ వద్దు, స్త్రీ పురుషులు ఇరువురూ సరి సమానమనే సరైన వ్యవస్థ కావాలి. ఇప్పుడు ఈ భూమి మీద అత్యంత త్వరలోనే ఈ ప్రేమ వ్యవస్థ ఆవిర్భవిస్తుంది. ఇది పరమ సత్యం.

❖ ❖ ❖

పార్ట్ - 19

ప్రేమే సర్వస్వం

సృష్టి అంతా ప్రేమ వల్లనే విచ్ఛిన్నం కాకుండా ఉంది అని చెప్తాడు పరమాత్ముడు రామ్తా !

కోటాను కోట్ల కోట్ల విశ్వాలను, లోకాలను కలిగి ఉన్న ఈ అనంత సృష్టిని నిలబెడుతున్నది... ప్రేమ అని అంటే.... ప్రేమ ఎంత శక్తివంతమైనదో ఒకసారి ఆలోచించండి.

దైవం దైవంగా ఉందంటే దానికి మూల కారణం ప్రేమయే !

ఆధ్యాత్మిక శాస్త్ర పరంగా మానవుడి అన్ని మానసిక + శారీరక + జీవిత సమస్యలకు ఏకైక మూల కారణం ఆత్మ విజ్ఞానం లేక పోవడం !

According to the Spiritual Science , the only root cause for all the psychological + health(physical) + life problems of humans, is Lack of Self Wisdom !

మీరు చదివిన చదువో, మీ ప్రతిభా పాటవాలో, మీ తెలివి తేటలో, మీ టాలెంటో, మీ డిగ్రీలో, మీ పట్టాలో, మీ మెడల్సో, మీ పాండిత్యమో, మీ అవార్డులో, మీ బిరుదులో, మీరు చేసే ఉద్యోగమో, మీ వృత్తియో, మీ వ్యాపారమో, మీ స్థిర చరాస్తులో, మీ జీవిత భాగస్వామియో, మీ తల్లో, మీ తండ్రో, మీ సంతానమో, మీ కుటుంబ సభ్యులో, మీ బంధు మిత్రులో, ఆస్థిపరుల అండదండలో, మీ బ్యాంక్ బ్యాలన్స్‌లో, మీ ఫిక్స్‌డ్ డిపాజిట్లో, మీ పెట్టుబడులో, మీ వంశమో, మీ జాతో, మీ మతమో, మీ కులమో, మీ గోత్రమో, మీ ఆచార వ్యవహారాలో, మీ సంప్రదాయ సంస్కారాలో, మీ సంస్కృతో ఇవేవి కూడా ఇంకా మరేవైనా కూడా ఇతర వేరేవి ఏవీ కూడా మీకు.....

.....జీవితాన్ని ఇవ్వవు ! రక్షణ నివ్వవు !

ఆరోగ్య ఐశ్వర్యాలను ఇవ్వవు !

శ్రేయస్కరాలను మరియు ఆనందాలను ఇవ్వవు !

ఆశ్చర్యం వేస్తుందా !!! నమ్మబుద్ధి కావట్లేదా ??? వింతగా ఉందా !?!

ఈ విషయాలను చదివినపుడు మీకెంత నమ్మబుద్ధి కాకపోతే మీకంత ఆత్మ విజ్ఞానం తక్కువగా ఉన్నట్టు ! మీ కెంత ఇబ్బంది కలిగితే మీకంత అవగాహన తక్కువగా ఉన్నట్టు ! మీకెంత కోపం వస్తే అంత అనుభవం లేనట్టు ! మీ మీకెంత ఉబ్బసం, ఆయాసం కలిగితే మీకంత అజ్ఞానం ఉన్నట్టు ! మీకెంత ఆవేశం, భయం కలిగితే మీకంత మూర్ఖత్వం, జడత్వం ఉన్నట్టు ! ఓ సారి మిమ్మల్ని మీరు చెక్ చేసుకోండి. ఇలా ఏమీ జరగ కుండా... మీరు ఆనందంతో ఆశ్చర్యపోతే మీరు అవగాహనా పరులే ! మీకు అసలు విషయం అర్థం అయినట్టే ! మీరు విజేతలే !!

నిజం అప్పుడప్పుడు నిష్ఠూరంగానే ఉంటుంది మరి !

కాని ఏం చేస్తాం ? సత్యం చెప్పక తప్పదు కదా !

మీకు సర్వ కాల సర్వావస్థలలోనూ, సర్వ సకల సమస్త శుభ లాభాలను ఇచ్చేది - ఈ సర్వసృష్టిని పాలించే, పోషించే మీ లోపల ఉన్న ఆ "మూల చైతన్యం - Ultra Consciousness" లేక దైవం - God or All That Is లేక మరేదైనా అనండి "ఆ యొక్క మహా మూల చైతన్యమే" మీకు అన్నీ ఇస్తుంది. అంటే ఆ "మహా మూల చైతన్యం" పట్ల మీరెలాంటి భావాన్ని కలిగి ఉన్నారో అన్న విషయం పైననే మొత్తం అంతా ఆధారపడి ఉంది.

ఆ "మహా మూల చైతన్యమే" ! ఇంకా మరేమిటో కాదు మరియు వేరెవరో కాదు మీకు జీవితాన్ని ఇచ్చేది, ఆరోగ్య ఐశ్వర్యాలను ఇచ్చేది, శ్రేయస్కరాలను ఆనందాలను ఇచ్చేది, రక్షణనిచ్చేది, సర్వ సకల సమస్త శుభ లాభాలను ఇచ్చేది ! ఈ సర్వసృష్టిని పాలించే, పోషించే ఆ "మహా మూల చైతన్యం" పట్ల మీరెలాంటి భావాన్ని కలిగి ఉన్నారన్న దాని పైన మీ జీవితం, శ్రేయస్కరం, ఆనందం, రక్షణ, సర్వ సకల సమస్త శుభ లాభాలు మొదలైనవన్నీ ఆధారపడి ఉంటాయి.

మీరు ఆ "మహా మూల చైతన్యం" పట్ల సరైన అభిప్రాయం లేక సరైన భావం కలిగి ఉంటే అప్పుడు మీరు "మహా మూల చైతన్యంతో" సరైన సంబంధం కలిగి ఉన్నట్టు లెక్క ! మీరు కలిగి ఉన్న ఆ యొక్క "సరైన సంబంధమే" మీకు జీవితాన్ని + ఆరోగ్య ఐశ్వర్యాలను + రక్షణ + సర్వ సకల సమస్త శుభ లాభాలను ఇస్తుంది. మీరు మూల చైతన్యంతో "సరైన సంబంధం" ఎంత కలిగి ఉంటే అంత "మేలు" మీకు జరుగుతుంది. ఎంతైతే "సంబంధం సరిగా లేదో" అంతగా మీకు కష్ట నష్టాలు ఉంటాయి.

మీరు మహా మూల చైతన్యంతో కలిగి ఉన్న "సంబంధం" పైన మీ జన్మ ఆధారపడి ఉంటుంది. మీరు మహా మూల చైతన్యంతో కలిగి ఉన్న "సంబంధం" - మీ జీవిత భాగస్వామి నుండి, మీ తల్లిదండ్రుల నుండి, మీ సంతానం నుండి, మీ కుటుంబ సభ్యుల నుండి, మీ బంధు మిత్రుల నుండి, మీ చదువు పైన, మీ వృత్తి ఉద్యోగ వ్యాపారాల ద్వారా, మరియు మీ సంపాదన పట్ల మరియు మీ యొక్క ప్రతి దాని పట్లా ప్రతి ఫలిస్తూ ఉంటుంది - అది సరిగా ఉంటే సరిగా, చెడుగా ఉంటే చెడుగా !

మహా మూల చైతన్యంతో మీకు ఉన్న సంబంధం మీ ఆత్మ విజ్ఞానం పైన ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే మీకు ఆత్మ విజ్ఞానం లేనప్పుడు అసలు "మూల చైతన్యం" అనేది ఒకటి ఉందని తెలియనే తెలియదు కదా ! ఒక వేళ "మహా మూల చైతన్యం" అనేది ఒకటి ఉందని తెలిసినా

అది మీ లోపలే మీరుగా మీరే అయి ఉందని తెలియక పోతే విషయం చాలా ఘోరంగా అఘోరిస్తుంది. ప్రస్తుతం భూమి పైన నెలకొని ఉన్న పరిస్థితులు చాలా వరకు ఇలా అఘోరించినవే కదా !

మీ లోపల ఉన్న మహా మూల చైతన్యమే మీరు ! మీరే మహా మూల చైతన్యం ! మీ ప్రతీది మూల చైతన్యంతో కలిగి ఉన్న సంబంధం పైన ఆధారపడి ఉంటుంది అని అంటే, మీతో మీరు కలిగి ఉన్న సంబంధం పైన అన్ని విషయాలు ఆధారపడి ఉంటాయని అర్థం ! అంటే మీ పట్ల మీరు ఎలాంటి భావం కలిగి ఉంటే అలాంటి పరిస్థితులు మీ జీవితంలో ఉంటాయి. అంటే "యద్భావం తద్భవతి" అన్నమాట !

మొత్తానికి ఒకే ఒక అసలు విషయం ఏమిటంటే "మీ పట్ల మీరు కలిగి ఉన్న భావాల యొక్క ప్రతిబింబాలే మీ శరీరంలోని మరియు మీ జీవితంలోని పరిస్థితులు" !

కాబట్టి మీరు మీ పట్ల సరైన, మంచి భావాలు కలిగి ఉన్నప్పుడే మీ శరీరం మరియు మీ జీవితంలోని పరిస్థితులు బాగా ఉంటాయి. కాబట్టి మీరు సరైన, మంచి గుణాలను తప్పని సరిగా కలిగి ఉండాలి.

ప్రేమే సర్వస్వం !

ఈ కాన్సెప్ట్‌ను గనక మీరు సరిగ్గా, సూటిగా, లోతుగా అర్థం చేసుకుంటే అసలు విషయం మీకు అవగాహనలోకి వచ్చినట్టే !

మీ పట్ల మీకు ఉన్న ప్రేమే ఆరోగ్యంగా, ఐశ్వర్యంగా, శ్రేయస్కరాలుగా, ఆనందాలుగా, విజయాలుగా, శుభ లాభాలుగా ప్రకటమవుతూ ఉంటుంది. ప్రేమే సర్వస్వం ! మీ పట్ల మీకు ఉన్న ప్రేమే అన్ని శుభ లాభాలుగా మీ శరీరంలో + మీ జీవితంలో ప్రకటమవుతూ ఉంది. మీ పట్ల మీకు ఉన్న ద్వేషం మీ శరీరంలో + మీ జీవితంలో అనారోగ్యాలుగా, కష్ట నష్టాలుగా ప్రకటం అవుతూ ఉంది.

కాబట్టి మిమ్మల్ని మీరు ప్రేమించు కోవడం అనేది అత్యంత ఆవశ్యకం ! ఈ సత్యాన్ని మీరు గ్రహించియే తీరాలి ! అవగాహన చేసుకునియే తీరాలి ! మీ పట్ల మీరు ప్రేమను కలిగి ఉండాలంటే

మొట్ట మొదట మీరు అకర్మ శాకాహారులుగా(Akarma vegans) మారాలి. అకర్మ శాకాహారులుగా(Akarma vegans) మారడం అంటే ఏదో గుడ్డిగా శాకాహారులుగా మారడం కాదు. లేక ఏదో ఒక శాకాహార కులంలో పుట్టినందు వలన యాంత్రికంగా శాకాహారులుగా ఉండటం కాదు. శాకాహారులుగా ఎందుకు ఉండాలో అవగాహన కలిగి ఉండాలి. ఆ తర్వాత మాత్రమే మీ పట్ల మీరు ప్రేమను ప్రకటించుకోగలుగుతారు, అప్పుడు మాత్రమే అది వర్కవుటు అవుతుంది. ఎందుకంటే ప్రేమను కలిగి ఉన్న వారు గుడ్డు కాని, మాంసాహారం కాని, జంతువుల నుండి వచ్చిన ఏదైనా కానీ(పాల,పెరుగు, వెన్న, నెయ్యి, జున్ను, మొదలైన పాల ఉత్పత్తులు, తేనె, పట్టు,వూల్, లెదర్ మొదలైనవి) తినలేరు, వాడలేరు. అసంభవం... తమను తాము ప్రేమ మూర్తులుగా చెప్పుకుంటూ వ్యవహరిస్తున్న వారు ఎంతో మంది మాంసాహారులను చూసినప్పుడు నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది.

✪✪ అత్యంత ముఖ్య విషయం ✪✪

ప్రేమగా ఉండాలి అని అంటే ఎలాంటి ప్రేమ ? మనల్ని ప్రేమించే వారిని మనం ప్రేమిస్తాం. ఇది సరే ! కాని మనల్ని ద్వేషించే వారిని కూడా మనం ప్రేమతో ఆశీర్వదించ గలగాలి. మనల్ని అకారణంగా నిందించే వారిని కూడా మనం ప్రేమతో ఆశీర్వదించ గలగాలి. మనకు హాని, నష్టం చేసిన వారిని కూడా మనం ప్రేమతో ఆశీర్వదించ గలగాలి. మన గురించి దుష్ప్రచారం చేసిన, చేస్తున్న వారిని కూడా మనం ప్రేమతో ఆశీర్వదించ గలగాలి. ఇక్కడ ఆశీర్వదించడం అంటే వారి దగ్గరికి పోయి, వారి నెత్తి మీద చేయి పెట్టి ఆశీర్వదించమని కాదు, మీ మనసులో వారిని తలుచుకుని అణుమాత్రమైనా కోపం కాని, ద్వేషం కాని తలెత్తకుండా చూసుకుంటూ వారికి మంచి జరగాలి అని ప్రేమగా ఆశీర్వదించాలి. మన పట్ల ఎవరు ఎలాంటి భావాలు కలిగి ఉన్నా సరే ! మనం మాత్రం అందరి పట్లా ప్రేమను కలిగి ఉండాలి.

గుర్తుంచుకోండి.....

మన పట్ల సరైన భావం కలిగి లేని వారి పట్ల కూడా మనం ప్రేమను ప్రకటించ కలిగినప్పుడే..... అదే నిజమైన ప్రేమ ! మనకు ఏదో మేలు చేసిన, చేస్తున్న వారి పట్ల మనం చూపించేది ప్రేమ కాదు. దాన్ని "ధన్యవాద భావం" అని అంటారు. ప్రేమ అంటే ఏమీ ఆశించనిదీ, బేషరతుగా ప్రకటించేదీ అయిన దివ్య భావం !

మీకు పడని వారిని, మీకు నచ్చని వారిని, మీకు హాని చేసిన వారిని, మిమ్మల్ని మోసం చేసిన వారిని, మిమ్మల్ని ఏడిపించిన వారిని, మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారిని, మిమ్మల్ని అవమానించిన వారిని, మిమ్మల్ని నిందించిన వారిని, మిమ్మల్ని దూషించిన వారిని, మీకు నష్టం కలిగించిన వారిని,

మిమ్మల్ని వాడుకుని మిమ్మల్నే బూతులు తిట్టిన వారిని, మీ మీద జులుం చేసిన వారిని, మీ మీద అధికారం చెలాయించి మిమ్మల్ని బానిసలుగా చేసి మీతో ఆడుకున్న వారిని, మీ నిస్సహాయతను ఆసరగా చేసుకుని మిమ్మల్ని పీడించిన వారిని... ఇలాంటి వారిని గుర్తు చేసుకుని... వారిని పూర్తిగా క్షమించి, మీకు మంచి జరుగు గాక అని వారిని ప్రేమగా ఆశీర్వదించండి. ఇదే నిజమైన ప్రేమ ! ఇలాంటి వారిని మీరు నిజంగా, పూర్తిగా క్షమించి, ప్రేమతో ఆశీర్వదించ గలిగినప్పుడే మీది నిజమైన ప్రేమ అవుతుంది. నేను చెప్పేది ఈ ప్రేమ గురించే ! క్షమించడం అనేది మానసికంగానే చేయాలి. భౌతికంగా వారిని కలవకూడదు. వారిని దూరంగానే ఉంచాలి కానీ మనసులో క్షమించేయాలి.

ఇలా చేసి చూడండి అద్భుతాలు జరిగి తీరుతాయి మీ శరీరంలో మరియు మీ జీవితంలో ! ఆశ్చర్య పోతారు మీరు ఆ యొక్క ఫలితాలను చూసి ! మీకున్న సర్వ, సకల, సమస్త సమస్యలన్నీ కూడా..... అవి ఇవీ అని కాకుండా, ఏవైనా సరే అన్ని సమస్యలు విచిత్రంగా పరిష్కారం అవుతాయి. మెరుపులు మెరుస్తాయి మీ శరీరంలో + జీవితంలో. దివ్య వెలుగులతో నిండి పోతుంది మీ శరీరం + జీవితం !

ఈ విధంగా చేసిన తర్వాత..... ఇప్పుడు..... మాత్రమే మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటే అది ఫలిస్తుంది.

మిమ్మల్ని మీరు గాఢంగా ప్రేమించుకోండి ! అప్పుడు సర్వ శుభాలు మీకు సంప్రాప్తిస్తాయి !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంతగా మీరు ఆరోగ్యంగా, ఐశ్వర్యంగా ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంతగా మీరు గొప్ప వారవుతారు, అంత ఉన్నతంగా మీరు పరిణమిస్తారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత గొప్ప విజేతలవుతారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత అత్యున్నతమైన శ్రేయస్కరాలు మీ స్వంతం అవుతాయి !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత మహాత్ములు అవుతారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంతంతగా మీరు కోరుకున్నవి మీకు దక్కుతూ ఉంటాయి. మీరు కోరుకున్న వారు మీకు దక్కుతారు.

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత స్వచ్ఛంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత స్వేచ్ఛగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత సాధికారతతో విరాజిల్లుతారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత భుక్తిమయంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత యుక్తిమయంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత శక్తిమయంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత రక్తిమయంగా మీరు ఉంటారు !

మిమ్మల్ని మీరు ఎంతగా ప్రేమించుకుంటే అంత ముక్తిమయంగా మీరు ఉంటారు !

ఫైనల్‌గా అసలు విషయం ఏమిటంటే....

ప్రేమే సర్వస్వం !

మిమ్మల్ని మీరు ఎలా ప్రేమించుకోవాలో ధ్యాన సాధనలు అనే పార్ట్‌లోని **M A B** ప్రేమ ధ్యానంలో వివరించాను.

❖ ❖ ❖

నిజానికి మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటూనే ఉన్నారు. మీరు జీవించి ఉన్నారు అని అంటే అది కేవలం ప్రేమ వల్లనే ! ప్రాణానికి ప్రాణం పోస్తుంది ప్రేమ ! జీవానికి జీవం పోస్తుంది ప్రేమ !

మీ విస్మృతిని పూర్తిగా తొలగించడానికి ప్రస్తుతం ఉన్న ప్రేమ సరిపోదు. మీలోని "నేను"ను ప్రగాఢంగా ప్రేమించండి అని చెప్తారు రామ్‌తా & సేత్ మాస్టర్స్ !

మీలోని "నేను"ను మీరు ఎంతగా ప్రేమిస్తే అంతగా మీ దైవత్వం మీకు అందుబాటులోకి వస్తుంది. మీ లోని ఆ "నేను"యే దైవం !

ప్రేమలో ఎంత ఆనందం ఉందో ప్రేమిస్తేనే తెలుస్తుంది. ప్రేమ ఎంత మధురాతి మధురంగా ఉంటుంది అని అంటే... చెప్పడానికి మాటలు దొరకవు. కేవలం అనుభవించాల్సిందే ! ప్రేమించలేని మరియు ప్రేమింపబడని జీవితం వృథా ! ప్రేమ వల్లనే జీవితం సాఫల్యం చెందుతుంది. అందుకే ప్రేమించండి, ప్రేమింపబడండి. ప్రేమలో ఉన్న దివ్యానందాన్ని బాగా ఎంజాయ్ చేయండి. మీరు ప్రేమిస్తూ ఉంటే మీ ఆత్మ వికసిస్తుంది. అభివృద్ధి చెందుతుంది. మీరు ఎంతెంత ప్రేమను కలిగి ఉంటే, అంతంతగా ఆత్మ యొక్క దివ్యశక్తులు మీకు అందుబాటులోకి వస్తూ ఉంటాయి.

పార్ట్ - 20

లవ్

&

లవ్ మ్యారేజ్

మీరు కోరుకుంటున్న వారిని పూర్తిగా ఇష్టపడండి,
బాగా ప్రేమించండి ఇదే అన్నింటి కన్నా పెద్ద సాధన.
మీరు పూర్తిగా ఇష్టపడిన వారు, మీరు ప్రేమించిన వారు మీకు
దక్కియే తీరుతారు.

ప్రేమ విఫలం అవటం అంటూ ఉండదు.
విఫలం అయిందీ అని అంటే అక్కడ మీదే ఏదో
లోపం ఉందని అర్థం.

మీరు పూర్తిగా ఇష్టపడి, ప్రేమించి, కావాలి అని
అనుకున్నప్పుడు వారు మీకు దక్కియే తీరుతారు.
ఒక వేళ దక్కలేదు అని అంటే మీరు పూర్తి స్థాయిలో
ప్రయత్నించ లేదనే అర్థం. వారు అడ్డం పడ్డారు, వారు ఒప్పుకోలేదు
అని ఇతరుల మీద నింద వేయవద్దు, మీరు పూర్తిగా ఒప్పుకుంటే
అందరూ ఒప్పుకుంటారు. ఇదే సత్యం. ఎవరైనా ఒప్పుకోలేదు అని
అంటే మీరు పూర్తిగా ఒప్పుకోలేదనే అర్థం. ముందు మీరు పూర్తిగా
ఒప్పుకోండి, అప్పుడు ప్రపంచం అంతా ఒప్పుకుంటుంది. ఇతరుల
మీద నింద వేయకండి. ఎవరికీ సంబంధం ఉండదు.
అంతా మీ రిఫ్లెక్షనే !

గుర్తుంచుకోండి, పూర్తిగా ఇష్టపడటం, ప్రేమించటం,
కావాలి అని అనుకోవడం కన్నా మించిన సాధన లేదు.
మీరు కోరుకున్న వారు మీకు దక్కియే తీరుతారు.
ప్రేమ మహిమ అనంతం !

ప్రేమ..... ఇది కేవలం రెండు అక్షరాల పదం కాదు. సృష్టికి మూలాధారమైన అనంత శక్తియే ప్రేమ !

ప్రేమ యొక్క శక్తిని ప్రత్యక్షంగా అనుభవం పొందిన వాడిని నేను !

ప్రేమ అనేది సత్యం ! ప్రేమ అంటే స్వచ్ఛం, అభివృద్ధి, శక్తివంతం, ఉల్లాసం, ఉత్సాహం, ఉత్తేజమ్, మహోజ్వలమ్... పరమానందం !

ప్రేమ లేని జీవితం ఊహించలేం ! ప్రేమ లేని జీవితం, అసలు జీవితమే కాదు ! ప్రేమించాలి, అప్పుడే ప్రేమించబడతాం ! చాలా చాలా చాలా ప్రేమించాలి, బాగా ప్రేమించాలి....అప్పుడే చాలా చాలా చాలా... బాగా ప్రేమించబడతాం !

ముందు ప్రేమను ఇవ్వాలి, అప్పుడే ప్రేమను పొందుతాం !

ముందు మనతో మనం ప్రేమగా ఉండాలి. మనల్ని మనం బాగా ప్రేమించుకోవాలి. మనల్ని మనం ఎలా ప్రేమించుకోవాలో ఈ గ్రంథంలోనే, ధ్యాన సాధనలు అనే పార్ట్‌లో, "ప్రేమ ధ్యానం"లో వివరించాను. బాగా చదివి అర్థం చేసుకోండి. సాధన చేయండి.

మిమ్మల్ని మీరు ప్రేమించుకున్నా, అది ఇతరులను ప్రేమించినట్టే ! మీరు ఇతరులను ప్రేమించినా, అది మిమ్మల్ని మీరు ప్రేమించుకున్నట్టే ! బాగా గుర్తుంచుకోండి - మీరు మీ పట్ల ప్రేమ, కరుణ, మైత్రి, ప్రసన్నం, కటాక్షం, అర్థం చేసుకోవడం లాంటి భావాలను కలిగి ఉంటే, వాటిని మీరు ఇతరుల పట్ల కూడా చూపెడతారు. ఒక వేళ మీరు ఇతరుల పట్ల ప్రేమ, కరుణ, మైత్రి, ప్రసన్నం, కటాక్షం, అర్థం చేసుకోవడం... మొదలైన భావాలను చూపెడితే వాటిని మీ పట్ల మీరు చూపెట్టుకున్నట్టే !

ప్రేమ అంటే ఏ ప్రేమ ?! టీవిల్లో, సినిమాల్లో, కథల్లో, నవలల్లో, జనాల్లో, సమాజంలో, మరియు న్యూస్ పేపర్‌లలో వాడే, ఉండే ప్రేమ కాదు. అది వేరే.....

.....అది ప్రేమ అని పిలువబడుతున్న, వ్యవహరింపబడుతున్న వ్యామోహం ! ఉన్మాదం ! ''అమ్మాయి పైన ఆసిడ్ పోసిన ప్రేమోన్మాది'' అని పేపర్లో రాస్తుంటారు. పెద్ద పెద్ద మేధావులుగా పరిగణించబడుతున్న వారు కూడా ఈ విషయం పైన వ్యాసాలు రాసి ఆందోళనలకు దిగుతుంటారు. **ప్రేమ వేరే ! ఉన్మాదం వేరే !** ప్రేమిస్తే ఉన్మాదం ఉండదు. శాశ్వతంగా పోతుంది. వ్యామోహంలో నుండి పుడుతుంది ఉన్మాదం. ఏదైనా ఒక దాని పైన అపసవ్యంగా ఇష్టాన్ని పెంచుకోవడం ప్రారంభిస్తే అది వ్యామోహం అవుతుంది. వ్యామోహం ముదిరితే ఉన్మాదం అవుతుంది. కాబట్టి ప్రేమోన్మాది అని అనకుండా "వ్యామోహ ఉన్మాది" అని అనాలి. ఇది సరి.

ప్రేమిస్తే ఆసిడ్ పోయలేరు... చంపలేరు...! ఎవరైనా, ఎవరి పైన అయినా ఆసిడ్ పోసారు లేక చంపారు అని అంటే అప్పుడు, అక్కడ ప్రేమ లేదనే అర్థం. ఇక, మరో సాక్ష్యం అవసరం లేదు. ప్రేమ వలన కీడు జరగనే జరగదు. హాని అసలే జరగదు. ప్రేమ వలన కేవలం మంచి మాత్రమే జరుగుతుంది. సూర్యుడి వలన చీకటి రావడం ఎంత అసంభవమో..... ప్రేమ వలన హాని జరగడం అంతే అసంభవం !

అసలు సిసలు ప్రేమ అంటే....

మూల చైతన్యం, అవగాహన, శాంతి,

ప్రతిఫలాన్ని ఆశించక పోవటం, ఇవ్వడం,

ఆశీర్వాదం, అనుగ్రహం, శృతి, లయ,

ప్రసన్నం, కటాక్షం, శక్తి, దివ్యం,

అమృతం, సద్భావన, చైతన్యం,

జీవ శక్తి, సృష్టికి మూలాధారం,

పరమానందం, షరతులు లేనిది, హద్దులు లేనిది,

శ్రేయస్కరం, విజ్ఞానం, విశ్వాసం, విజయం,

సర్వ ప్రయోజన భావం, సత్యం,

అనంతం, అమరత్వం, ఏకత్వం !

అర్థమైందా.....?! .....చేసుకోండి...!!

అర్థం చేసుకుని తీరాలి మరి.....!!!

మన ప్రాణానికి కావాల్సిన అసలు సిసలు ఇంధనం... ప్రేమ ! ప్రేమ ప్రాణానికి ప్రాణం పోస్తుంది. జీవం ఇస్తుంది. పోషణను ఇస్తుంది. రక్షణను ఇస్తుంది. శక్తిని ఇస్తుంది. ఇంకా చాలా చాలా చేస్తుంది.

ప్రతీ ఒక్కరూ తమను తాము బాగా ప్రేమించుకోవాలి. ఇతరులను ప్రేమించాలి, ప్రేమిస్తూ ఉండాలి.

ఈ భూమి పైన ఉన్న ఘోర పరిస్థితులన్నీ తొలగిపోవాలి అని అంటే ప్రేమ వల్లనే అది సాధ్యం అవుతుంది. అందరూ ప్రేమించాలి, ప్రేమ ప్రచారం చేయాలి.

ప్రతీ ఒక్కరూ.... అంతటినీ, అందరినీ ప్రేమిస్తూ ఉండాలి. మీ శరీరాన్ని, జీవితాన్ని మరియు మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటూ ఉండాలి.

మీ వస్తువులను అన్నింటినీ ప్రేమించండి. మీరు నడిచే రోడ్డును ప్రేమించండి. మీ కాళ్ళ కింద మట్టిని ప్రేమించండి. మీరు తినే వాటిని, తాగే వాటిని అన్నింటినీ ప్రేమించండి. మీరు వాడే ప్రతీ ఒక్కదాన్నీ ప్రేమించండి. బాగా ప్రేమించండి. ప్రేమిస్తూనే ఉండండి.

వయసు వచ్చిన వారు లేదా స్త్రీ పురుషులు ఒకరినొకరు ప్రేమించుకోవడం అనేది ప్రేమలోని ఒకానొక కోణం. నిజానికి ప్రేమ అంతా ఒక్కటే, కాకపోతే, అంతటి పట్ల మరియు అందరి పట్లా కలిగి ఉన్న ప్రేమలో లేని, ఒక పరమానంద భరితమైన దివ్య విశేషాన్ని తన ప్రియుడి(భర్త) పట్ల లేక ప్రియురాలి(భార్య) పట్ల కలిగి ఉంటారు. ఇది పరమ దివ్యమైనది. ఇది బ్రహ్మానంద భరితమైనది.

మనం మన యొక్క ప్రతీ సంబంధంలోనూ తప్పని సరిగా ప్రేమను కలిగి ఉండాలి. ఇది తప్పని సరి. ప్రేమ లేని ఏ సంబంధమైనా అది శ్రేయస్కరం కాదు. ప్రేమతో కలిగి ఉన్న సంబంధాలే మనకు మేలు చేస్తాయి. కాబట్టి మనం మన యొక్క సంబంధాలను ప్రేమతో కలిగి ఉండాలి. ముఖ్యంగా జీవిత భాగస్వామి పట్ల అయితే ఇది తప్పని సరి. మనం, మన జీవిత భాగస్వామి పట్ల అనంతమైన ప్రేమను కలిగి ఉండాలి. మానవులకు గల అన్ని సంబంధాలలో వివాహ సంబంధం అనేది అత్యంత ప్రాముఖ్యత కలిగినది. నిజానికి పెద్దలు కుదిర్చిన వివాహం మరియు ప్రేమ వివాహం అంటూ వేరు వేరుగా చూడకూడదు. పెద్దలు కుదిర్చినదైనా లేక వారికై వారు చేసుకున్న వివాహం అయినా అందులో ప్రేమ లేకపోతే ఆ వివాహం అర్థం లేనిదే అవుతుంది, సరైన ఫలితాలను ఇవ్వదు. వివాహ బంధంలో ప్రేమ లేకపోతే అప్పుడు ఆ వివాహం, అందమైన జీవితాన్ని దుర్భరం చేస్తుంది. కాబట్టి వివాహ విషయంలో చూడాల్సింది జాతకం, కులం, గోత్రం, మతం, సంపాదన మరియు ఇంకా ఇతర విషయాలు కావు. వివాహ విషయంలో అన్నింటి కంటే ముందు చూడాల్సింది ప్రేమ ! వివాహం చేసుకునే వాళ్ళిద్దరూ ఒకరి పట్ల ఒకరు ప్రేమగా ఉండ గలుగుతారా లేదా... అన్నదే అసలు సిసలు పాయింట్ ! ఆ తర్వాతే మిగతావి ! వివాహం చేసుకునే వారు ఒకరి పట్ల ఒకరు ప్రేమను కలిగి ఉంటే, అప్పుడు వారికి కావాల్సినవి అన్నీ ఆటొమెటిక్‌గా సమకూరుతాయి. ప్రేమ కడుపు నింపదు అనేది భ్రమ. ప్రేమ కడుపే కాదు,

కావాల్సినవి అన్నీ ఇస్తుంది. సృష్టి సర్వస్వమంతా ప్రేమ వల్లనే నడిపించ బడుతుంది. ప్రేమించుకున్నారు సరే, మరి ఉపాధి మాట ఏమిటి ? అని అడుగుతారు. కాని నిజం ఏమిటంటే, ప్రేమయే ఉపాధి ! అవును ప్రేమ ఉపాధిని అందిస్తుంది. మీరు ప్రేమలో ఉండండి, అన్నింటినీ ప్రేమయే చూసుకుంటుంది. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే, మీరు నిజమైన ప్రేమను కలిగి ఉండాలి. మీరు ఏదో కలిగి ఉండి మాకు ఏమీ జరగటం లేదు అని ప్రేమను నిందించ వద్దు. మీరు ఈ గ్రంథం అంతా చదివి అర్థం చేసుకుంటే, మీకు నిజమైన ప్రేమ అంటే ఏమిటో తెలుస్తుంది. మీరు ప్రేమను కలిగి ఉంటే, అన్నీ మీకు అందుతాయి. ఇది సత్యం. కాబట్టి వివాహం చేసుకునే వారు ముందు చూడాల్సింది ఒకరి పట్ల ఒకరికి ఉన్న ప్రేమ. అంతే కాని మిగతావి ఏవో కావు. ముందు ప్రేమ సంగతి తేల్చాలి. ఆ తర్వాతే ఏవైనా... కాని ప్రస్తుత సమాజంలో ప్రేమ ప్రసక్తే లేదు. ప్రేమను తప్ప మిగతావన్నీ చూస్తున్నారు. ఇప్పుడు ఈ భూమి పైనున్న జంటలలో ఎన్ని జంటలు ప్రేమ పూర్వకంగా ఆనందంగా ఉంటున్నాయి అనే విషయం గురించి ఆలోచించండి. అత్యధిక శాతం ఏదో ఒక విషయం కోసం రాజీ పడుతూ ఉన్న జంటలే కాపురాన్ని ఈడుస్తున్నాయి. ప్రేమ పూర్వకంగా, ఆనందంగా ఉన్న జంటలు మీకు చాలా అరుదుగా కనబడతాయి. మామూలు జంటలకు ఈ ప్రేమ జంటలు వింతగా కనపడతాయి.

స్త్రీ పురుషుల మధ్యలో తప్పని సరిగా ప్రేమ ఉండాలి. వారు ఒకరినొకరు ప్రేమించుకోవాలి. అయితే ఇక్కడ తెలుసుకోవాల్సిన అత్యంత ముఖ్య విషయం ఏమిటంటే, ప్రేమకు ఉన్న కోణాలలో కామం కూడా ఒకటి. ఆశ్చర్యంగా ఉందా ?! అవును ప్రేమలో నుండే కామం పుడుతుంది. కాబట్టే గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు ''కామోస్మి... అంటే నేను కామము అయి ఉన్నాను(7-11)'' అని ప్రకటించాడు. సాక్షాత్తు భగవంతుడే నేను కామాన్ని అని ప్రకటించినప్పుడు కామం అనేది దివ్యమైనదే అని తేలిపోయింది కదా. ప్రేమతో కూడిన కామము, దివ్య కామము. ప్రేమ లేని కామము వ్యామోహ కామము, ఇది సరి కాదు. చాలా మంది ఏమనుకుంటారంటే, ప్రేమ వేరే కామము వేరే అని అనుకుంటారు. ఈ రెండూ వేరు కాదు. ప్రేమలోని ఒకానొక కోణం కామం. ఒక పురుషుడు ఒక స్త్రీని ప్రేమించినప్పుడు, ఆటొమెటిక్‌గా ఆమెను కామిస్తాడు. కామించ కూడదు, కేవలం ప్రేమించు అని అంటే అది కుదరని పని. ప్రేమికులు, ప్రేమ పేరు చెప్పి సెక్స్ మెదలు పెడతారు, అసలు సెక్స్ కోసమే ప్రేమ అనే నాటకం ఆడుతారు అని, కొంత మంది అంటూ ఉంటారు. ఇక్కడ గ్రహించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే, కామం అనేది ప్రేమలో ఒక కోణం, అంతే తప్ప అది వేరు కాదు. ప్రేమించిన వారు కామించకుండా ఎలా ఉంటారు ?!

ఒక స్త్రీకి అయినా, పురుషుడికి అయినా కామ వాంఛ అనేది సహజం. కామ వాంఛ అనేది ప్రకృతి పరమైనది. ఆకలి వేసినప్పుడు ఆహారం తీసుకుంటాము. సెక్స్ కోరిక కూడా అలాంటిదేనని అర్థం చేసుకోవాలి. సెక్స్ సహజమైనదే కాకుండా దివ్యమైనది అని కూడా తెలుసుకోవాలి. ఈ భూమి పైన సృష్టి సెక్స్ ద్వారానే ముందుకు కొనసాగుతుంది అనే మహా సత్యాన్ని సదా సర్వదా గుర్తుంచుకోవాలి.

ఈ భూమి పైన ఉన్న అసమానతలను తొలగించాలంటే ప్రేమ వివాహాలు జరగాలి. ప్రేమను కలిగి ఉన్న జంటలు సమాజానికి శ్రేయస్కరాన్ని కలుగ జేస్తాయి కాబట్టి, ప్రేమ వివాహాలు జరిగి తీరాలి. కుల నిర్మూలన, మత మహమ్మారి నిర్మూలన ఈ ప్రేమ వివాహాల వల్లనే జరుగుతుంది. కాబట్టే ప్రభుత్వం ఇలాంటి కులాంతర వివాహాలకు పారితోషికాన్ని ప్రకటించింది. ఇది నిజంగా అభినందించదగిన విషయం. చాలా గొప్ప విషయం.

ప్రేమ వివాహం చేసుకోవాలనుకునే ప్రేమికులను, కొంత మంది అడ్డుకుంటూ ఉంటారు. పెద్దల గురించి ఆలోచించండి అని. ఇది కరక్టే ! కాని ఇక్కడ గ్రహించాల్సిన ఒక ముఖ్య విషయం ఏమిటంటే, ప్రతీ ఆత్మ స్వతంత్రమైనది. తన లైఫ్ డిజైన్ ప్రకారం తాను జీవిస్తుంది. మీకు నచ్చిన విధంగా జీవించాలి అని నిర్బంధించడం అనేది ఆత్మ శాస్త్రం ప్రకారం సరి కాదు. పెద్దలే పిల్లల గురించి ఆలోచించాలి. ఇది ఆకర్షణ, ఇది ప్రేమ కాదు... అంటూ ప్రేమికుల వెంట పడి నస పెట్టవద్దు. వయసులో ఉన్న వారికి ఒకరి పట్ల ఒకరికి ఆకర్షణ కలగకపోతే ఏం కలుగుతుంది ?! ఆ యొక్క ఆకర్షణలో నుండే ప్రేమ జనిస్తుంది. పిల్లల యొక్క ఆకర్షణను పెద్దలు ఆమోదించి వారికి సరైన మార్గదర్శకత్వం వహిస్తే వారు మంచి ప్రేమికులు అవుతారు. లోకంలో ప్రేమ వివాహాలు విఫలం కావటం లేదు. లోకులు వాటిని విఫలం చేస్తున్నారు. ప్రేమికులకు ఎవరూ సపోర్ట్ చేయరు. దాని వలన, ఊహించని పరిస్థితులను ఎదుర్కోలేక నిస్సహాయులైన ప్రేమ జంట విడిపోతున్నారు. పెద్దలు, సమాజం వారిని ఆదరిస్తే ఖచ్చితంగా ప్రేమ వివాహాలు సూపర్ సక్సెస్ అవుతాయి. పెద్దలు కుదిర్చి చేసిన వివాహాలకు వారు పూర్తి సపోర్ట్‌గా ఉంటారు. కాబట్టే అవి మనుగడలో ఉండగలుగుతున్నాయి. అయినా పెద్దలు కుదిర్చిన వివాహాలలో విఫలం అయిన వాటిని లెక్కలోకి తీసుకుంటే, ప్రేమ వివాహాల వైఫల్యాలు తక్కువే ఉండవచ్చు. కోర్టులలో విడాకుల కేసులను, వరకట్న కేసులను, ఇంకా ఇతరమైనవి లెక్క గడితే, వాటిలో ప్రేమ వివాహాలు ఎన్ని ఉంటాయి ? పెద్దలు కుదిర్చి చేస్తున్న సంబంధాలు ఒక్కటి కూడా విఫలం కాకుండా ఉంటున్నాయా ? పెద్దలు కుదిర్చి చేసిన వివాహాలలో ఏవో కొన్ని తప్ప అధిక శాతం విఫలమే, కాకపోతే సపోర్ట్‌తో అలా నడుస్తూ ఉంటాయి అంతే. కొన్ని సినిమాలను, రికార్డుల కోసం ప్రేక్షకులు లేక పోయినా థియేటర్స్‌లో నడిపిస్తుంటారే... అలా... !

పిల్లలు పెద్దల గురించి కాదు, పెద్దలే పిల్లల గురించి ఆలోచించాలి. ఎందుకంటే కాపురం చేసేది పిల్లలు. జీవితాన్ని జీవించేది పిల్లలు. ఇంత కాలం పెంచి పెద్ద చేసాం అందుకు మీరు మాకు ఇచ్చే ప్రతిఫలం ఇదేనా ? అని ప్రశ్నించడం సరికాదు. ఎందుకంటే పిల్లలను ఎందుకు కన్నారు ? పిల్లలేమీ ఫోన్ చేసి చెప్పలేదు కదా... మీ కోసం మీరు పిల్లలను కన్నారు. మీ సంతోషం కోసం పెంచారు పెద్దచేసారు. ఇది తల్లిదండ్రులుగా మీ కనీస బాధ్యత. ఇందులో స్పెషల్ మెహర్బాని ఏం ఉంది !?!? జన్మనిచ్చిన మీరు పెంచి పెద్ద చేసియే తీరాలి. తల్లిదండ్రులకు సంతానం లేకపోతే ఆ లోటు దేనితోనూ పూడ్చలేం. తల్లిదండ్రులకు పిల్లలు ఎంతో ఆనందాన్ని ఇస్తారు. వారి ముద్దు ముచ్చట తీరుస్తారు.

అయితే పెద్దయ్యాక వారి జీవితాన్ని వారు జీవించే స్వేచ్ఛను వారికి ఇచ్చి తీరాలి. మేము కన్నాము కదా అని వారి జీవితాలను శాసించే అధికారం ఏ తల్లిదండ్రులకూ లేదు, ఉండదు. మేజర్ అయిన ప్రతీవారు తమకు ఇష్టం వచ్చినట్టుగా జీవించవచ్చని చట్టమే ఉంది కదా. అవగాహన లేని పిల్లలు ప్రేమ పేరుతో జీవితాలను పాడు చేసుకుంటుంటే వారించి, వారిని రక్షించాలి. అయితే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే, అవగాహన లేని మైనర్‌లకు అవగాహన కల్పించాలి. వారికి కౌన్సిలింగ్ చేయాలి. విషయాలను వివరించాలి. అవగాహన ఉన్న మేజర్‌లకు మాత్రం స్వేచ్ఛను ఇచ్చియే తీరాలి. చాలా మంది అమ్మాయిలు నాతో ఇలా అన్నారు.... మా నాన్న నాకు అడిగినవన్నీ కొనిచ్చాడు ఒక భర్తను తప్ప... నేను దేనిని ఇష్ట పడితే దాన్ని నాకు ఇచ్చాడు, కానీ నేను ఇష్టపడని జీవిత భాగస్వామికి నన్ను ఇచ్చి పెళ్ళి చేసాడు. మిగతావన్నీ ఇచ్చినా ఇవ్వకపోయినా పెద్దగా ఏమీ జరిగేది కాదు, అడ్జస్ట్ అయ్యే దాన్ని, కానీ జీవిత భాగస్వామితో ఎలా అడ్జస్ట్ కావాలి సార్ ? అంటూ ఏడ్చారు. వీరు కోల్పోయిన వీరి జీవితాన్ని వీరికి, ఎవరు తిరిగి తెచ్చిస్తారు ?

విఫలం అయిన ప్రేమ వివాహాన్ని గురించి పేపర్లలో వేసేస్తారు, టీవీల్లో తెగ చూపించేస్తారు. విఫలం అయిన ప్రేమ వివాహాలకు లభించినంత ప్రచారం, సక్సెస్ అయిన ప్రేమ వివాహాలకు లభించదు.

ఒక ప్రేమ వివాహం విఫలం అయితే, ఆ యొక్క వైఫల్యం ఆ ఇద్దరికి మాత్రమే సంబంధించినది కాదు. ఆ ఇద్దరి తల్లిదండ్రులకు సంబంధించినది. అది మొత్తం సమాజానికి సంబంధించినది.

పిల్లలు ప్రేమ వివాహం చేసుకుంటే, మా పరువు పోతుందని పెద్దలు అనవసర హైరానా పడిపోతుంటారు. ఇద్దరు మేజర్‌లు తమ ఇష్ట ప్రకారం వివాహం చేసుకుంటే ఇందులో పరువు పోయే అంశం ఏం ఉంది ? స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆలోచించి, తమకు నచ్చిన భాగస్వామిని ఎన్నుకోవడం తప్పా ?

విఫలమైన ప్రేమ వివాహాలను ఉదాహరణగా తీసుకుని, వారికి చూడండి ఎలా జరిగిందో అని భయపెడుతుంటారు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. ఎవరి ప్రేమ వివాహం అయినా విఫలం అయితే, వారు ఆ యొక్క పాఠాలను నేర్చుకునే అంశాలను తమ జీవిత ప్రణాళికలో పొందు పర్చుకుని జన్మించారని తెలుసుకోవాలి. ఒకవేళ వారు వివాహ విషయంలో విఫలం కాకపోతే, మరో విషయంలోనైనా సరే ఆ యొక్క పాఠాలను నేర్చుకునియే తీరాలి. పెద్దలు ఈ ప్రేమ వివాహాల విషయంలో చాలా అవగాహనతో ఆలోచించాల్సిన అవసరం ఎంతో ఉంది. పిల్లల జీవితాలు, తమ జీవితాలు కావు అనే సత్యాన్ని పెద్దలు గ్రహించి తీరాలి. కన్నంత మాత్రాన పిల్లల జీవితాలతో ఇష్టం వచ్చినట్టు ఆడుకునే హక్కు పెద్దలకు లేదు.

మీరు మమ్మల్ని కాదని పోతే మేమంతా ఆత్మహత్య చేసుకుని చస్తాం అని బెదిరిస్తుంటారు కొంత మంది పెద్దలు. ఇది చాలా దారుణం. ఇది ఘోరమైన బ్లాక్ మెయిల్. పిల్లలను పెంచి పెద్ద చేయడానికి మేము ఎంతో కష్టపడ్డాం అని అంటే, అది మీ బాధ్యత. పిల్లలను కని పెంచి పెద్ద చేసి వారికి స్వేచ్ఛనివ్వాలి.

తల్లిదండ్రుల చేతులలో చిక్కుకుని ఉన్న పిల్లలు ఎంత నరకం అనుభవిస్తుంటారో నాకు తెలుసు. ఎంతో మంది పిల్లలు నా దగ్గరికి ఏడుస్తూ వస్తారు. తల్లిదండ్రుల చేతుల్లో వారు పడుతున్న కష్టాలను వింటుంటే, గుండె తరుక్కుపోతుంది. మీ కోసం మేము అది చేసాము, ఇది చేసాము అని అంటున్నారు సార్... మమ్మల్ని ఎవరు కనమన్నారు ? మాకు ఎవరు చేయమన్నారు ? అని ఏడుస్తారు..

ఆధ్యాత్మిక శాస్త్ర ప్రకారం, పిల్లలను కనాలి పెంచి పెద్ద చేయాలి అంతే. వారికి సరైన విద్యను అందించాలి. వారి జీవితాన్ని వారికి నచ్చిన విధంగానే జీవించనివ్వాలి. వారి జీవిత భాగస్వామిని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛ వారికివ్వాలి. ఇప్పుడు ఈ జన్మలో మీరు మీ పిల్లల జీవితాలను కబ్జా చేస్తే దానికి ప్రతిఫలంగా మీ రాబోయే జన్మలను మీరు కోల్పోవాల్సి వస్తుంది. ఇది సత్యం.

ఈ ప్రేమ వివాహాల విషయంలో ''పరువు హత్యలు'' చాలా దారుణమైనవి. ఒక సారి ఆలోచించండి, ఇద్దరు ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరి పెద్దలలో ఒకరు తమ పరువు పోయిందని, ఈ ఇద్దరినీ చంపి హంతకులుగా మారితే, అప్పుడు ఆ వంశం యొక్క పరువు పోయినట్టు కాదా ?!?!?

జీవితం అంటే జీవం కలిగినది అని అర్థం. జీవితంలో స్వేచ్ఛ లోపించినప్పుడు, అది జీవాన్ని కోల్పోతుంది. ఇది చాలా దారుణం. పిల్లల జీవితాలను హరించే పెద్దలు, పెద్దలు కాదు. అందరూ ఆత్మ విజ్ఞాన సత్యాలను అవగాహన చేసుకుని, పిల్లలకు స్వేచ్ఛనివ్వాలి.

జీవితాన్ని స్వేచ్ఛగా జీవించాలి. తమకు నచ్చిన విధంగా జీవించాలి. అప్పుడే జీవితం సాఫల్యం పొందుతుంది. ఈ స్వేచ్ఛ విషయంలో, ఒకామె నన్ను అడిగింది... వాళ్ళింటి దగ్గర ఒకాయనకు ఏడుగురు భార్యలు ఉన్నారట, ఇది ఎంత వరకు కరెక్ట్ అని అడిగింది. అప్పుడు నేను, వాళ్ళందరూ ఎలా ఉంటారు అని అడిగాను. వాళ్ళందరూ బాగానే ఉంటారు. కలిసి మెలిసి ఉంటారు అని చెప్పింది. మరి ఇక్కడ సమస్య ఏం ఉంది అని నేను ప్రశ్నించాను. ఏడుగురిని వివాహం చేసుకున్న వ్యక్తి బాగానే ఉన్నాడు, అతని భార్యలు బాగానే ఉన్నారు, వారి పిల్లలు బాగానే ఉన్నారు. అందరూ కలిసి మెలిసి ఆనందంగా ఉన్నారు... వారిని చూస్తూ ఉండే.. ఈమెకు ఏం ఇబ్బంది ? అది వారి ఇష్టం. అందరూ కలిసి ఆనందంగా ఉంటున్నారు అని అన్నప్పుడు ఆయన ఏడు మందిని చేసుకుంటే ఏం ? ఏడు వందల మందిని చేసుకుంటే ఏం ? అది ఆయన ఇష్టం. ఆయనను చేసుకునే వారి ఇష్టం. అందరికీ ఇలా ఉండదు. కొంత మందికి ప్రత్యేకమైన లైఫ్ డిజైన్‌లు ఉంటాయి. అలాంటి వారికి మాత్రమే ఇలా జరుగుతుంది.

వివాహ విషయంలో మోసం లేకుండా ఉందా లేదా అన్నదే పాయింట్. వారందరికీ ఆమోదం ఉన్నదా లేదా అన్నదే అసలు పాయింట్.

మన దేశంలోనే, మిజోరం రాష్ట్రంలో, బక్త్ వాంగ్ అనే ఊరులో ''జయోనా చెనా'' అనే ఆయన ఇల్లు ఎక్కడా అని అంటే ఎవరైనా చూపిస్తారు. ఈయనకు 39 భార్యలు. కొడుకులు, కూతుళ్ళు కలిసి 94 మంది. 33 మంది మనవలు. మొత్తం 181 మంది. అందరూ ఒకే దగ్గర కలిసి మెలిసి ఆనందంగా ఉంటారు. ఈయనకు ఇప్పుడు(2011లో) 66 ఏళ్ళు. ఈయన ఏమంటారంటే - "ప్రపంచంలోనే పెద్ద కుటుంబం ఉన్నందుకు చాలా గర్వంగా ఉంది. వీలైతే ఇంకా పెళ్ళిళ్ళు చేసుకుని కుటుంబాన్ని మరింత విస్తరిస్తా" అని అంటారు. ఈ వార్త ఈనాడు దిన పత్రికలో, తేది: 14 ఏప్రిల్ 2011, Hyderabad సిటి స్పెషల్, 13వ పేజిలో, మొత్తం కుటుంబం మరియు వారి ఇల్లుతో సహా కలర్ ఫోటొతో ప్రచురితం అయింది.

మన పురాణాల్లో కూడా ఎక్కువ పెళ్ళిళ్ళు చేసుకోవడం అనేది సంప్రదాయంగా మనకు కనిపిస్తుంది. ఇప్పటికీ జరుగుతూ ఉన్నాయి. సరే... ఏది ఏమైనా వివాహ విషయంలో మోసం లేకుండా ఉండాలి. మోసంతో ఒక్కరిని వివాహం చేసుకున్నా అది తప్పే కదా ! అంగీకారంతో ఎంత మందిని చేసుకున్నా అది సరియే కదా ! ఎందుకంటే... చేసుకునే వాడికి మరియు చేసుకునే స్త్రీలకు ఏ అభ్యంతరం లేనప్పుడు, వారందరికీ ఆనందంగా ఉన్నప్పుడు మనకెందుకండీ ?!

జీవితం యొక్క విలువను గుర్తించ గలిగినప్పుడు మాత్రమే, జీవితానికి స్వేచ్ఛను ఇవ్వగలుగుతాము. జీవితం యొక్క విలువను గుర్తించాలి అని అంటే, అది కేవలం ఆత్మ విజ్ఞాన అవగాహనతో మాత్రమే సాధ్యం అవుతుంది. సంప్రదాయాలు, సంస్కారాలు, సంస్కృతులు అనేవి, మనుషుల ద్వారా ఏర్పడినవి. మనుషుల కోసం అవి కానీ, వాటి కోసం మనుషులు కాదు అనే సత్యాన్ని గ్రహించాలి. జీవితానికి స్వేచ్ఛను ఇవ్వనివి ఏవైనా సరే, అవి పనికి రానివేనని గ్రహించాలి.

పశ్చిమ దేశాలలో సమాజ పరమైన స్వేచ్ఛ ఉంది కాని వారికి ఆధ్యాత్మిక పరమైన స్వేచ్ఛ లేదు. అక్కడ ప్రజలు ఎవరు ఎవరినైనా వివాహం చేసుకోవచ్చు. వారికి నచ్చిన విధంగా జీవించవచ్చు. వారిని ఎవరూ ఏమీ అనరు. కానీ, వారికి ఆధ్యాత్మిక స్వేచ్ఛ శూన్యం. ఏదో ఒక మతాన్ని వారు అనుసరించియే తీరాలి. ఆధ్యాత్మికత విషయంలో వారికి ఏ మాత్రం స్వేచ్ఛ లేదు. అసలు ఒక రకంగా చెప్పాలంటే వారికి ఆధ్యాత్మికత గురించి పూర్తిగా తెలియదు. కేవలం మత సంబంధమైన విషయాలు మాత్రమే వారికి తెలుసు. తూర్పు దేశాలలో ముఖ్యంగా భారత దేశంలో అంతులేని ఆధ్యాత్మిక స్వేచ్ఛ ఉంది కాని, సమాజ పరమైన స్వేచ్ఛ లేదు. ఇంత రాకెట్ యుగంలో కూడా ఇక్కడ కుల, మతాల పట్టింపులున్నాయి. ప్రేమ వివాహాలు పరువు తక్కువగా చూడబడతాయి. జీవితాన్ని నచ్చిన విధంగా జీవించడానికి జనాలు భయపడుతూనే ఉన్నారు. ఇలా ఉంటే అభివృద్ధి అనేది సమగ్రంగా జరగదు. ప్రజలకు సమాజ పరంగా మరియు ఆధ్యాత్మిక పరంగా పూర్తి స్వేచ్ఛ ఉండాలి. అప్పుడే అభివృద్ధి నిజంగా మరియు సమగ్రంగా జరుగుతుంది. ప్రజలకు సమాజ పరంగా మరియు ఆధ్యాత్మిక పరంగా స్వేచ్ఛ కలగాలి అని అంటే, ముందు ఆత్మ విజ్ఞాన అవగాహన ఉండి తీరాలి.

ఉదాహరణకు... పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్న ఒక జంట ఉంది. సంప్రదాయాల ప్రకారం, ఆచారాల ప్రకారం, సంస్కృతుల ప్రకారం వీరి వివాహం జరిగింది. అయితే వారికి సఖ్యత లేదు. వారు ఒకరి పట్ల ఒకరు ప్రేమను కలిగి లేరు. వారు నిత్యం కీచులాడుకుంటూ ఉన్నారు. ఇది కరెక్టా ?

ఇంకొక జంట ఉంది. వీరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. వివాహం చేసుకోలేదు. కానీ, కలిసి సహజీవనం చేస్తున్నారు. అయితే వీరు చాలా ఆనందంగా ఉంటున్నారు. వీరు కరెక్టా ? ఎవరైనా ఇద్దరు వివాహం చేసుకోకుండా సహజీవనం చేయవచ్చని మొన్నీ మధ్యనే సుప్రీం కోర్టు ఒక తీర్పును ఇచ్చింది కూడా.

వివాహం యొక్క ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, ఇద్దరూ కలిసి మెలిసి ఆనందంగా జీవించాలి అనేది. అంతే కాని మీరెట్లాగైనా బతకండి. సంప్రదాయ ప్రకారంగా వివాహం చేసుకోవాలి అని అంటే అది మూర్ఖత్వం కాక మరేమిటి ?

నిత్యం కొట్లాడుకునే జంటల వలన లోకానికి కీడు జరుగుతుంది. ఆనందంగా ఉన్న జంటల వలన లోక కల్యాణం జరుగుతుంది. ఈ సత్యాన్ని సదా గుర్తుంచుకోవాలి.

ఒక ప్రముఖుడు తన వయసులో సగం వయసు కూడా లేని ఒక అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. వారిద్దరూ ఒకరినొకరు ఇష్టపడి, ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. వారిద్దరూ ఆనందంగా ఉన్నారు. ఇంకొక దగ్గర ఒకావిడ తన కన్నా చాలా తక్కువ వయసు ఉన్న ఒక అబ్బాయిని వివాహం చేసుకుంది. వీరిది కూడా ప్రేమ వివాహమే. వారిద్దరు కూడా ఆనందంగా ఉన్నారు. మనం చూడవలసింది, వివాహం చేసుకునే వారు మేజర్‌లా కాదా.. వారికి తమ నిర్ణయం పట్ల అవగాహన ఉందా లేదా అనే విషయాన్ని మాత్రమే. వారికి తమ నిర్ణయాల పట్ల అవగాహన ఉండి, వారు మేజర్‌లు అయినప్పుడు వారికి నచ్చినట్టుగా వారిని జీవించనివ్వాలి. వారి జీవితం వారి ఇష్టం.

కొంత మంది 60 దాటిన తర్వాత కూడా వివాహం చేసుకున్నారు. అది వారి ఇష్టం. వివాహం అంటే కలిసి ఆనందంగా జీవించడం అని కదా అర్థం. వారికి నచ్చిన విధంగా జీవించడంలోనే ఆనందం ఉంటుంది. వారి ఆనందాన్ని అడ్డుకోవడానికి మరెవరికీ స్వేచ్ఛ లేదు.

జీవితంలో స్వేచ్ఛ ఉన్నప్పుడే జీవితం వికసిస్తుంది. జీవితానికి పరమార్థం లభిస్తుంది. ఎవరికి నచ్చిన విధంగా వారు జీవించ గలిగిన సమాజమే అభివృద్ధి చెందుతుంది. అయితే ఆ సమాజంలో ఆత్మ విజ్ఞానం అనేది తప్పని సరిగా ఉండి తీరాలి. ఆత్మ విజ్ఞాన అవగాహన లేకుండా ఉంటే, అప్పుడు స్వేచ్ఛ అనేది తప్పుడు మార్గం పట్టే అవకాశం ఉంది.

కులాంతర వివాహాలను ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నప్పుడు, ప్రేమ వివాహాలు చట్ట ప్రకారంగా కరెక్ట్ అయినప్పుడు - ప్రేమ వివాహాలు సరైనవే అని కదా అర్థం.

పెద్దలు ఈ ప్రేమ వివాహాల విషయంలో అవగాహన పెంచుకోవాలి. తమ ఇష్టాలను బలవంతంగా పిల్లల పైన రుద్ది వారి జీవితాలను బలి చేయకూడదు. పిల్లల జీవితాలను వారికి నచ్చిన విధంగా జీవించనివ్వాలి. వారిని నేర్చుకోనివ్వాలి. వారిని ఎదగనివ్వాలి. అయ్యో అలాంటి నిర్ణయం తీసుకున్నావేంటీ... అని దీర్ఘాలు తీస్తూ వారిని అవమాన పరచవద్దు. వారి నిర్ణయాన్ని గౌరవించండి. మీ జనరేషన్ వేరే, పిల్లల జనరేషన్ వేరే. ఈ సత్యాన్ని సదా గుర్తుంచుకోవాలి.

పిల్లలకు, పెద్దలుగా మీ వంతు సహకారం మీరు అందించండి. వారు స్వతంత్రంగా ఎదిగేందుకు తోడ్పడండి.
అంతే కాని మీ మూసలో ఇరికించే ప్రయత్నం చేయకండి.

పిల్లలు, పిల్లలు కారు, వారు స్వతంత్ర ఆత్మలు అనే విషయాన్ని గ్రహించండి.

పిల్లల జీవితాలు మీ జీవితాలు కావు. వారి జీవితాలను వారినే జీవించనివ్వండి. వారికి మీరు సరైన విద్యను అందించండి. అప్పుడు వారికి అవగాహన వచ్చి తమ జీవితానికి సంబంధించి సరైన నిర్ణయాలే తీసుకుంటారు. పిల్లలు తీసుకున్న నిర్ణయాలలో కొన్ని పెద్దలకు జీర్ణం కావు. కాని తప్పదు. జీర్ణం చేసుకుని తీరాలి. ఎందుకంటే, మీ కాలం వేరు, మీ పరిస్థితులు వేరు, మీ అవగాహన వేరు, మీ దృక్పథం వేరు - పిల్లలది వేరు. పూర్తిగా వేరు.

పిల్లలకు సరైన ఆత్మ విజ్ఞానాన్ని అందించండి. అప్పుడు పిల్లలు నిజంగా, సమగ్రంగా ఎదుగుతారు. ఎదిగిన వారి వల్లనే లోక కల్యాణం జరుగుతుంది.

ఒక వేళ - మీకు కావాల్సిన విధంగా మీ పిల్లలు ఉండాలి అని అనుకుంటే, అప్పుడు ఆ విధమైన లైఫ్ డిజైన్ ఉన్న పిల్లల కోసం ధ్యానం చేయండి. వారిని మాత్రమే కోరుకోండి. అప్పుడు మీరు కోరుకునే విధంగా జీవించే పిల్లలు పుడతారు. అప్పుడు మీరు + మీ పిల్లలు ఆనందంగా ఉండవచ్చు. ఈ గ్రంథంలోనే కోరుకున్న ఉత్తమ సంతానాన్ని పొందడం ఎలా ? అనే విషయాన్ని వివరించాను. చదివి సాధన చేయండి. కోరుకున్న ఉత్తమ సంతానాన్ని పొందండి. అందరికీ శుభం + లాభం జరుగు గాక !

అందరికీ ఆత్మాభివృద్ధి జరుగు గాక!

పిల్లలందరికీ ఈ క్షణమే పూర్తి స్వేచ్ఛ వచ్చుగాక!

ఎవరికి నచ్చిన విధంగా వారు జీవించెదరు గాక!

ప్రేమ వర్ధిల్లాలి! ప్రేమ వివాహాలు వర్ధిల్లాలి!

❖ ❖ ❖

కోరుకుంటున్న వారిని పొందడం ఎలా ? వారితో జీవించడం ఎలా ?

సృష్టిలో అత్యంత మధురమైనది, దివ్యమైనది ప్రేమయే ! స్త్రీ పురుషులు ప్రేమించుకోవడం అనేది ఒక మహా దివ్య సంభవం. వివాహం అంటూ జరిగితే అది కేవలం ప్రేమ వివాహమే జరగాలి. స్త్రీ పురుషులు ప్రేమించుకుంటుంటే సృష్టి పులకరించి ఆశీర్వదిస్తుంది. ప్రస్తుతం ప్రేమను విస్మరించి ఇతర విషయాల మీద దృష్టి పెడుతున్నారు. అసలు జన్మ ఎత్తిందే అన్ని ఆనందాలను పొందడానికి. అన్ని ఆనందాలలోకెల్లా ప్రేమ ద్వారా వచ్చే ఆనందం ఎంతో దివ్యమైనది. దీని వలన ఆత్మ వికసిస్తుంది. అభివృద్ధి చెందుతుంది. సాఫల్యం పొందుతుంది.

ప్రేమ లేని జీవితం వృథా ! ప్రతీ ఒక్కరూ ప్రేమించాలి, ప్రేమింప బడాలి. ముఖ్యంగా మీరు మగవారైతే మీకు ప్రేయసి లేకపోతే మీ జీవితం వృథా ! మీరు ఆడవారైతే మీకు ప్రియుడు లేకపోతే మీ జీవితం వృథా ! పెళ్ళి అయిన వారు, వారి జీవిత భాగస్వామిని ప్రియులుగా చేసుకోవాలి.

ప్రేమ లేని భార్యాభర్తలకు జన్మించేది సాధారణ ఆత్మలే ! ప్రస్తుతం లోకంలో ఉన్న అత్యధిక శాతం జంటలు - కుటుంబానికి, కులానికి, సమాజానికి భయపడి బతుకుతున్న జంటలే ! ఇలాంటి జంటలకు పరిణతి చెందని ఆత్మలే జన్మిస్తాయి.

గుర్తుంచుకోండి, మీరు ఒప్పుకుంటే అందరూ ఒప్పుకుంటారు. ఎవరైనా ఒప్పుకోలేదని అంటే, మీలోపల మీరే ఒప్పుకోవటం లేదని అర్థం చేసుకుని, సాధన చేయాలి. అంతే కానీ ఇతరుల మీద నింద వేయవద్దు.

ప్రస్తుతపు సమాజంలో జీవితం యొక్క విలువను ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు. కానీ ఇది సరిపోదు. జీవితానికి పూర్తి స్వేచ్ఛనివ్వగలిగినప్పుడే అది మెరుగైన సమాజం అవుతుంది. కేవలం బిల్డింగులు పెద్ద పెద్దగా ఉండి, ఖరీదైన కార్లు, కంప్యూటర్లు ఉన్నంత మాత్రాన దాన్ని మెరుగైన సమాజం అని అనరు. జీవితానికి స్వేచ్ఛ లేనప్పుడు ఎన్ని ఉన్నా ఏమీ లేనట్టే !

ముఖ్యంగా స్వేచ్ఛ అనేది వివాహ విషయంలో అత్యవసరం మరియు తప్పని సరి.

వివాహం అనేది ప్రేమ మూలంగా జరగాలి. ప్రేమయే వివాహానికి పునాది కావాలి. కానీ ప్రస్తుతం జరుగుతున్నది ఏమిటి ? కులం వివాహానికి మూలమైంది. ఇది చాలా చాలా విచారించ దగిన విషయం. కులాన్ని బేస్ చేసుకుని వివాహాన్ని నిర్ణయించడం అనేది సరికాదు. ఎందుకంటే, కులం అనేది మానవులను చీలుస్తుంది. చీలిన మానవ సమాజం అభివృద్ధి సాధించదు.

వివాహానికి ప్రేమయే పునాది కావాలి.

వివాహానికి ఇష్టమే మూలం కావాలి.

వివాహానికి జాతి మతం కులం వర్గం అనేవి అడ్డం రాకూడదు. మానవులా కాదా ? అన్నదే కావాలి. వారిద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారా లేదా ? అన్నదే పాయింటు. చేసుకునే వారికి లేని అభ్యంతరం ఇతరులకు ఎందుకు ? ఇష్టపడుతున్న ఇద్దరిని అనుమతించడమే మెరుగైన సమాజం యొక్క లక్షణం. ఇదే ఉన్నతమైన సంస్కృతి. ప్రేమించుకుంటున్న వారిని పోత్సహించని సమాజం మంచిది కాదు. ఇలాంటి సమాజం రోగ గ్రస్తమైనది. ఇలాంటి సమాజం, పరిణామ క్రమానికి ఆటంకం.

ప్రేమ వివాహాలు విఫలం అవుతాయి అనే ఒక అపవాదు ఉంది. ఇది అబద్ధం. ప్రేమ వివాహాలు విఫలం కావు. సమాజం, ప్రేమ వివాహాలను విఫలం చేస్తుంది. ప్రేమించుకున్న వారిని సమాజం ఆదరిస్తే ప్రేమ వివాహాలు అత్యధిక శాతం సఫలం అవుతాయి. పెద్దలు కుదిర్చిన వివాహాలు ఎంత వరకు సక్సెస్ అవుతున్నాయి ? కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు అందరూ కలిసి ఒత్తిడి చేసి, నయాన భయాన ఒప్పించి, అడ్జస్ట్ కావాలి అని బెదిరించి, బలవంతంగా కాపురం చేయిస్తుంటారు. ఇది జగమెరిగిన సత్యం. బెదిరింపులతో బలవంతంగా కాపురం చేయించడం అనేది ఎంత మాత్రం సరికాని పని. పెద్దలు కుదిర్చిన పది జంటలను, ప్రేమించుకున్న పది జంటలను తీసుకుని అందరికీ సరి సమానంగా సపోర్ట్ ఇస్తే ప్రేమించి పెళ్ళి చేసుకున్న జంటలే ఆనందంగా ఉంటాయి. కులాన్ని,

మతాన్ని బేస్ చేసుకుని ఒకరినొకరు వివాహం చేసుకోవడం అనేది వికాస పరిధిలోకి రాదు. ఒక ప్రేమ వివాహం విఫలం అయితే, అరిచి గోల పెడతారు. చూశారా... ప్రేమ వివాహాలు ఎలా విఫలం అవుతున్నాయో అని భయపెడతారు. ఎవరిదో వివాహం సక్సెస్ కాలేదని ఇతరులను భయపెట్టడం న్యాయం కాదు, ధర్మం కాదు. ఒకతను టూ వీలర్ కొనాలి అని అనుకుంటే, అతడికి వద్దు, టూ వీలర్ కొనకు, దాని మీద ప్రయాణం చేయకు, మంచిది కాదు. ఇప్పటి వరకు టూ వీలర్ పైన ప్రయాణించే వాళ్ళు చాలా మంది చనిపోయారు, కాబట్టి వద్దు అని అంటున్నారా ?! కారు కొనే వాళ్ళను కారు ఆక్సిడెంట్ల గురించి చెప్పి ఆపుతున్నారా ? రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని రైలులో ప్రయాణం చేయడం ఆపుతున్నారా ? విమాన ప్రమాదాలు జరుగుతున్నాయని విమానంలో ప్రయాణాలు చేయటం లేదా ? పుట్టిన ప్రతీ వారు ఎప్పుడో ఒకప్పుడు, ఎలాగోలా చస్తున్నారు కాబట్టి పుట్టించడం ఆపుతున్నారా ? వారికి జరిగిందని మనకు జరుగుతుందా ? అయినా జరిగేది ఉంటే జరగక మానదు అని ప్రయాణం చేస్తున్నారు. మరి ఇదే అవగాహన ప్రేమ వివాహాల పట్ల ఎందుకు చూపటం లేదు. వారిది విఫలం అయిందని మీది విఫలం అవుతుందా...? కాదులే... ఒక వేళ జరిగేది ఉంటే జరగక మానదు అనే ధోరణి ఈ ప్రేమ వివాహాల పట్ల ఎందుకు కనబర్చటం లేదు ?! వాహన ప్రమాదాలతో పోలిస్తే వివాహ ప్రమాదాలు చాలా తక్కువ ! అయినా సరే, ఒక్క ప్రేమ వివాహం విఫలమైతే ఆ ఒక్క దాన్ని తరతరాలుగా చెప్పి భయపెడతారు. పెద్దలు కుదిర్చి సాంప్రదాయ బద్దంగా చేసిన పెళ్ళిళ్ళు ఎన్ని విఫలం కావటం లేదు ? భారి కట్న కానుకలు ఇచ్చిన తర్వాత కూడా, అమ్మాయిని కాల్చి చంపిన ఉదంతాలు ఎన్ని ఉన్నాయో ? మరి, ఇలాంటప్పుడు పెద్దలు కుదిర్చిన సంబంధం అయితే ఇలాగే అవుతుందని ఎందుకు అనటం లేదు ?

ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ప్రేమించుకుంటే, పెద్దలు అంగీకరించకుండా వెలి వేసినప్పుడు, వారిని నానా రకాల కష్టాలకు గురి చేసినప్పుడు, వారికి దిక్కు లేనప్పుడు, వారు తీవ్రమైన బాధలకు గురయ్యి వారి మధ్యనున్న సంబంధం చెడిపోయి వారి వివాహం విఫలం అవుతుంది. ప్రస్తుతం సమాజంలో జరిగేది ఇదే.

పెద్దలు కుదిర్చి చేసిన పెళ్ళిలలో కూడా చాలా మంది మగవాళ్ళు/ఆడవాళ్లు వారి భార్య/భర్త తరపు పెద్దలకు, బంధు మిత్రులకు భయపడి కాపురం చేస్తుంటారు. వీరి మధ్య ఎలాంటి ప్రేమ ఉండదు. కేవలం బతకాలి కాబట్టి అలా సంసారాలను ఈడుస్తూ ఉంటారు. ఇలాంటి వారికి జన్మించే సంతానం ఎలా ఉంటుంది ? వీరి లానే ఉంటుంది కదా ! ఇలాంటి ఆత్మలతో మానవ జాతి పరిణామం చెందడం కష్టం.

సమాజంలో ప్రేమ వివాహాలు విఫలం కావటం లేదు, సమాజం వాటిని బలవంతంగా విఫలం చేస్తుంది. పెద్దలు కుదిర్చిన వివాహాలే విఫలం అవుతున్నాయి, కాకపోతే బయటికి కనపడవు. ఎందుకంటే అవి కుల పెద్దల అండ దండలతో నడుస్తుంటాయి.

వివాహం అనేది జీవితాన్ని నిర్ణయిస్తుంది. ఇంత గొప్ప విషయం అనేదాని యొక్క మూలం ప్రేమ కాకపోతే అది కలుషితమైపోతుంది. దాని ఫలాలు కూడా కలుషితమైనవిగానే వస్తాయి. వివాహానికి జాతి మతం కులం వర్గం అనే వాటిని లెక్కలోకి తీసుకోకూడదు. ఇంకా వేటిని కూడా లెక్కలోకి తీసుకోకూడదు. వివాహం చేసుకోవాలనుకునే స్త్రీ పురుషులు ఇరువురూ ఒకరినొకరు ఇష్ట పడుతున్నారా లేదా అన్నదే అసలు సిసలైన ఏకైక పాయింట్. ఇద్దరూ ఒకరినొకరు ఇష్ట పడుతున్నారు అని అంటే చాలు, ఇక వేరే వాటికి అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇద్దరి మధ్యలో ప్రేమ ఉన్నప్పుడు వారి జీవితానికి వారి యొక్క ప్రేమయే ఉపాధి అవుతుంది. వారి ప్రేమయే వారిని పోషిస్తుంది. వారి ప్రేమయే వారికి అన్నీ సమకూరుస్తుంది. వారి ప్రేమయే వారికి అన్ని ఆనందాలను అందిస్తుంది. అర్థం కాలేదా... మీకు వివరంగా చెప్తాను.

ఇద్దరి మధ్య ఇష్టం, ప్రేమ ఉన్నప్పుడు... వారిని వారు పోషించుకునే అవకాశాలు వారికి అంది వస్తాయి. ఆ వచ్చిన అవకాశాలను వారు సద్వినియోగం చేసుకుని హాయిగా జీవిస్తారు. "ఇష్టం మరియు ప్రేమ అనేవి మహా దివ్య శక్తులు". ఈ రెండు శక్తులను కలిగి ఉన్న వారు ఏదైనా సాధించగలరు. ఒకరిపట్ల ఒకరు "ఇష్టం ప్రేమ" అనే మహా దివ్య శక్తులను ప్రయోగించుకుంటూ ఉన్నప్పుడు... ఇద్దరి జీవితాలు అదృష్టవంతం అవుతాయి, విజయవంతం అవుతాయి, మహా సౌభాగ్యవంతం అవుతాయి, ఐశ్వర్యవంతం అవుతాయి. ఈ "ఇష్టం మరియు ప్రేమ" అనే శక్తుల గురించి తెలియకపోవడం వలన ఆ శక్తుల యొక్క ప్రభావాలను మానవులు ఉపయోగించుకోలేక పోతున్నారు. ఒకరినొకరు ఇష్టపడి వివాహం చేసుకునేందుకు సిద్ధపడిన సమయంలో వారికి ఏ జీవనోపాధి లేకపోయినా సరే, వారి ప్రేమయే వారిని బ్రతికిస్తుంది. జీవింప చేస్తుంది. అన్నీ అందిస్తుంది. ప్రేమ కూడు పెట్టదు అనే మాట అజ్ఞాన పూరితమైనది. సృష్టి సర్వస్వాన్ని నిలబెడుతున్నది ప్రేమే !

ఇద్దరికి ఒకరి పట్ల ఒకరికి పూర్తి ఇష్టం ప్రేమ ఉంటే చాలు. వారికి అన్నీ సమకూరుతాయి. అన్ని సహాయ సహకారాలు అందుతాయి. ఒక వేళ వారికి అందటం లేదు అని అంటే వారు ఒకరి పట్ల ఒకరు పూర్తి స్థాయిలో ఇష్టం ప్రేమను కలిగి లేరు అనియే అర్థం. ఎప్పుడైతే ఒకరి పట్ల ఒకరు పూర్తి స్థాయిలో ఇష్టం ప్రేమను కలిగి ఉంటారో అప్పుడు వారికి అన్ని సమకూరుతాయి. ఇది సత్యం.

ప్రేమ అనేది ఆస్తులు, అంతస్తులు, ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువు, అర్హతలు, టాలెంట్‌లు, చూస్తే వచ్చేది కాదు. అలా చూసి ప్రేమిద్దాం అని అనుకుంటే అది నిజమైన ప్రేమ కాదు. ప్రేమ అనేది ఒక హఠాత్ పరిణామం. అది అలా జరిగిపోతుంది. ఒకే ఒక్క క్షణంలో పుట్టేస్తుంది. అంతే. ఎందుకు పుడుతుంది ? ఎలా పుడుతుంది ? ఎప్పుడు పుడుతుంది ? అనే ప్రశ్నలకు సమాధానాలు ఉండవు. ప్రేమ హఠాత్తుగానే పుడుతుంది. ఆ వ్యక్తిని చూసిన మొదటి క్షణంలోనే పుట్టవచ్చు లేదా కొంత కాలానికి పుట్టవచ్చు కాని ప్రేమ అనేది హఠాత్తుగానే సంభవిస్తుంది. ఈ నవలల్లో, టీవి సీరియల్స్‌లలో మరియు సినిమాలలో ప్రేమ గురించి చూపించే వాటిలో అత్యధిక శాతం అసత్యాలు. నిజమైన ప్రేమను హృదయంలో ఆవిష్కరించ గలం. పుస్తకంలో కానీ, టీవి తెరపై కానీ, సినిమా తెరపైన కానీ ఇంకా వేరే ఎక్కడా ఆవిష్కరించడానికి కుదరదు. ప్రేమను జీవితంలోనే ఆవిష్కరించ గలం.

ఇరవై అయిదు సంవత్సరాలు పెంచి పోషించిన వారిని, ఇరవై అయిదు రోజుల్లో పూర్తిగా మరిచిపోయి, వారిని పూర్తిగా వదులుకోడానికి సిద్ధమయ్యేలా చేస్తుంది ప్రేమ... అని అంటే, ప్రేమ ఎంత శక్తివంతమైనదో అర్థం చేసుకోవాలి.

చూసీ చూడగానే ఐ లవ్ యు చెప్పడమేనా...? అని అంటారు... అవును. ప్రేమ యొక్క ఫోర్స్ అలాగే ఉంటుంది మరి ! ఒక సంవత్సరం పాటు చూసి, పరిశీలించి, పరిశోధించి చెప్పేది ప్రేమ కాదు. అది వేరే ! ఏ వ్యక్తిని చూస్తే మీలో ఒక మెరుపు మెరుస్తుందో అదే నిజమైన ప్రేమ ! ఇక మీరు ఆ ప్రేమను పెంచుకుంటూ పోవాలి.

ప్రేమ గుడ్డిది అని అంటారు. ఇది సరిగా అర్థం చేసుకోవాల్సిన విషయం. ప్రేమ గుడ్డిది కాదు. ప్రేమ కాంతిమయం. వయసును, అర్హతలను, ఆస్తులను, అంతస్తులను, చదువును, జాతి

మత కుల వర్గాలను, ఇంకా ఇలాంటి వాటిని వేటినీ పట్టించుకోదు, చూడదు. చూడగలదు కానీ చూస్తే అది ప్రేమ కాదు, అందుకే చూడదు. ఇలా దేన్నీ పట్టించుకోదు, దేన్నీ చూడదు కాబట్టే ప్రేమ అంటే ఏమిటో తెలియని మనుషులకు ప్రేమ గుడ్డిది అని అనిపిస్తుంది. ప్రేమ గుడ్డిది కాదు, బేషరతుగా ఉండేది. ప్రేమ చూడగలిగి ఉన్నా సరే చూడనిది, పట్టింపులు లేనిది. వేటి కోసమైతే అందరూ కొట్టుకు చస్తున్నారో, వేటి కోసమైతే బతుకులు ఈడుస్తున్నారో వాటిని వేటినీ... ప్రేమ చూడకపోవటం మరియు పట్టించుకోక పోవడం అనేది ప్రేమంటే తెలియని వారికి ఆశ్చర్యం కలిగించియే తీరుతుంది మరి !

ప్రేమలో ఉన్న వారిని చూస్తే ఎంత ఆనందం కలుగుతుందో...! ప్రేమికుల పైన సృష్టి యొక్క ప్రత్యేక ఆశీర్వాదం ఉంటుంది. ప్రేమలో ఉన్నప్పుడు చెప్పలేని ఆనందం ఉంటుంది, ఎంతో హాయిగా ఉంటుంది. ఎంతో ఉల్లాసం, ఎంతో ఉత్సాహం ఉంటుంది. జీవితంలో జీవశక్తి తొణికిసలాడుతూ ఉంటుంది. గంటల తరబడి మాట్లాడుకోవడం, ఒకరి కోసం ఒకరు ఏమేమో చేసుకోవడం, టూ వీలర్ పైన గట్టిగా హత్తుకుని కూర్చుని పోవటం, ఇంకా రకరకాల గమ్మత్తైన పనులు చేయటం..... ఇవన్నీ ప్రేమికులు కావాలనుకుని చేయరు. అవి అలా జరిగిపోతాయి. వారు ప్రేమలో లేనప్పుడు అసలు మేము ఇలా చేయగలము అని కలలో కూడా ఊహించని పనులు, ప్రేమలో పడ్డాక తమకు తెలియకుండా తామే చేసేస్తూ ఉంటారు. ప్రేమ ఎలాంటి వారిచేత అయినా, ఎలాంటి పనులైనా చేయిస్తుంది. అదే మరి ప్రేమంటే !

మీరు కోరుకుంటున్న వారు, మీరు ప్రేమించిన వారిని పొందడం ఎలా ? గొడవలు లేకుండా కూల్‌గా పొందడం ఎలా ? అని అంటే ఈ కింద చెప్పిన విషయాలను బాగా అర్థం చేసుకుని బాగా సాధన చేయండి. అప్పుడు ఎలాంటి గొడవలు లేకుండా మీరు కోరుకున్న వారు మీకు దక్కుతారు. దేశాధ్యక్షులు అడ్డంగా ఉన్నా సరే... అన్నీ సింపుల్‌గా క్లియర్ అయిపోయి, మీరు కోరుకుంటున్న వారు మీకు అఫీషియల్‌గా పర్మినెంట్‌గా హ్యాపిగా కూల్‌గా సేఫ్‌గా దక్కుతారు. ఇది నిజం.

విషయాలను సరిగా అర్థం చేసుకుని బాగా సాధన చేస్తూ ఉండాలి. మీరు సాధన చేస్తూ ఉన్నప్పుడు సహజమైన పరిస్థితులు వాటంతట అవే వస్తాయి అని గుర్తుంచుకోండి. మీ ప్రమేయం ఏమీ లేకుండానే, మీరు కోరుకుంటున్న వారితో మీ వివాహం యొక్క పరిస్థితులు ఆటొమెటిక్‌గా వస్తాయి అని గుర్తుంచుకోండి. మీరు సాధన చేస్తూ ఉంటే చాలు, మీరు ఎవరితో అయితే కలిసి జీవించాలి అని అనుకుంటున్నారో వారి దగ్గరికి వెళ్ళే పరిస్థితులు వాటంతట అవే వస్తాయి అని

గట్టిగా గుర్తుంచుకోండి. మీ ప్రమేయం ఏమీ లేకుండానే ఆ పరిస్థితులు వచ్చేస్తాయి. అప్పుడు మీరు ఆ పరిస్థితులను అంగీకరిస్తే చాలు, పని అయిపోతుంది. మీకు ఎలాంటి వారు అడ్డం ఉన్నా సరే, ఎలాంటి విచిత్రమైన అడ్డంకులు ఉన్నా సరే, ఎలాంటి పెద్ద పెద్ద అడ్డంకులు ఉన్నా సరే, మీరు ఎవరికీ చెప్పుకోలేని అడ్డంకులు ఉన్నా సరే, అసలు ఇవి ఏ నాటికైనా క్లియర్ అవుతాయా... అనిపించేంతటి అడ్డంకులు ఉన్నా సరే, ఇంకా ఏం ఉన్నా సరే.... అన్నీ అత్యంత శీఘ్రంగా, సులభంగా, సరళంగా, సురక్షితంగా, పూర్తిగా, శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి. ఇది సత్యం.

మీరు సాధన పూర్తి విశ్వాసంతో చేయాలి. అవుతుందో కాదో, ఎప్పుడు అవుతుందో ఏమో... అని సందేహపడుతూ, ఆత్రపడుతూ చేయకూడదు. సాధన పట్ల పూర్తి విశ్వాసంతో ఉండాలి. ధైర్యంగా ధీమాగా ఉండాలి. సహనంతో ఉండాలి. పని పూర్తి అయ్యే వరకు సాధన చేస్తూనే ఉండాలి. మీ సాధన ఫలించియే తీరుతుంది. ఇది నిజం.

ప్రేమికులు బలంగా గుర్తు పెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే - పెద్దలు మీ ప్రేమ వివాహాన్ని అంగీకరించరు. మీ వివాహంతో రెండు కుటుంబాలు బాగా డిస్టర్బ్ అవుతాయి, చాలా గొడవలు జరుగుతాయి. కాబట్టి మీరు మీ కుటుంబాలను కాదని వివాహం చేసుకుందామనుకుంటే, ఒకటికి 1,000 సార్లు అన్ని కోణాలలో సర్వ పరిణామాలను, ఊహించండి, విశ్లేషించండి, ఆలోచించండి.

ఇక తప్పదు మేము బతక లేము అని అనుకుంటే... మీ ఇష్టం !

కుటుంబాలను కాదని వివాహం చేసుకోవడం చాలా పెద్ద విషయం. వివాహం చేసుకోగానే సరిపోదు కదా ! దాన్ని నిలబెట్టుకోవాలి. కొన్ని జంటలు కర్మ వశాత్తు విడిపోతాయి, అయితే వాళ్ళు - ఒకవేళ పెద్దలు కుదిర్చిన సంబంధమైనా సరే విడిపోతారు. ఏది ఏమైనా వాళ్ళు విడిపోతారు. వాళ్ళ లైఫ్ డిజైన్‌లో విడిపోయే అంశం ఉంటే ఎలాగైనా విడిపోతారు. పెద్దలు చేసిన వివాహాలు ఎన్ని విఫలం కావడం లేదు ?!?!

ఎన్నో ప్రేమజంటలు ఆత్మహత్యలు చేసుకోవడం వలన, వాళ్ళు చావకుండా ఉండాలనే సదుద్దేశంతో ఈ మెడిటేషన్ కనిపెట్టాను.

ఈ మెడిటేషన్ వలన కొన్ని జంటలు సక్సెస్ అయ్యాయి !

ఈ మెడిటేషన్ పద్ధతిని సాధన చేసిన ప్రప్రథమ ప్రేమికుడు ఒకడు నా శిష్యుడే ! వాడు ఒక వర్ధమాన తెలుగు సినీ నటుడు. ఒక వైపు ఉద్యోగం చేసుకుంటూ సినిమాలలో ట్రై చేస్తున్నాడు. చిన్న చిన్న అవకాశాలు దొరుకుతున్నాయి. భవిష్యత్తులో గొప్ప నటుడు కావాలని ఆశీర్వాదం ! వాడు ఈ పద్ధతిని సాధన చేసి కులాంతర ప్రేమ వివాహం చేసుకుని గ్రాండ్ సక్సెస్ అయ్యాడు. వాడి లవ్ మ్యారేజ్ అరెంజ్‌డ్ మ్యారేజ్ కంటే బాగా జరిగింది. రెండు కుటుంబాలు ఆశ్చర్యకరంగా వీరి వివాహాన్ని చేసాయి.

మీరు ట్రై చేసి చూడండి. గుడ్‌లక్ !

లవ్ మ్యారేజ్ మెడిటేషన్

మీరు ప్రేమించిన వారు మీకు దక్కాలంటే ఈ కింద ఇచ్చిన 2 సూత్రాలను సాధన చేయండి, మీరు కోరుకున్న వారు మీకు కచ్చితంగా దక్కుతారు. ఇది సత్యం. నిజం. వాస్తవం.

ఇది పాజిటివ్ ఎంకరేజ్‌మెంట్ మ్రాతమే ! జయాపజయాలు
మీ ఆత్మ ఆశీర్వాదం & మీ లైఫ్ డిజైన్ ప్రకారం & మీ కృషి ప్రకారం ఉంటాయి.

మీరు ప్రశాంతంగా కూర్చుని, కళ్ళు రెండూ మూసుకుని, సూత్రాన్ని మీలోపల అనుకోవాలి. ఇక ఆ సూత్రాన్నే పదే పదే అనుకోవాలి. ఇలా సూత్రాన్ని పదే పదే అనుకోవడమే సాధన. ఇలా పని పూర్తి అయ్యే వరకు చేస్తూనే ఉండాలి. ఒక్కో సూత్రాన్ని ఒక రోజులో వీలైనంత సేపు చేయాలి. ఎంత ఎక్కువ సేపు చేస్తే అంత మంచిది. మీరు కూర్చుని సాధన చేసిన తర్వాత... మీరు ఏ పని చేస్తూ ఉన్నా లోపల సూత్రాన్ని అనుకుంటూనే ఉండాలి. ఈ సాధన ఎంత పవర్ ఫుల్ అంటే, ఒకే ఒక రోజులో కూడా మీకు ఫలితాన్ని ఇచ్చే అవకాశం పూర్తిగా ఉంది. ఒక్క రోజులో సక్సెస్ అవ్వచ్చు. ఒక వేళ కాకపోతే అయ్యే వరకు చేయండి. మీరు కావాలనుకుంటున్న వారి కోసం ఆ మాత్రం చేయలేరా ?

అంతా హ్యాపీగా జరగాలి. పరిస్థితులు వాటంతట అవే రావాలి. మీరు కోరుకుంటున్న వారు మీకు దక్కాలి. వారితో హాయిగా ఆనందంగా జీవించాలి. ఇవన్నీ జరగాలి అని అంటే సాధన చేయాలి కదా... చేయండి.... పక్కా సక్సెస్ అవుతారు. ఆల్ ద వెరి బెస్ట్ !

లవ్ మ్యారేజ్ సాధన యొక్క 2 సూత్రాలు

1. నేనంటే నాకు పూర్తి ఇష్టం ప్రేమ ఆనందం గౌరవం.

2. నువ్వంటే నాకు పూర్తి ఇష్టం ప్రేమ ఆనందం గౌరవం.

ఈ సూత్రాలు ఎలా పని చేస్తాయి అని అంటే.....

మొదటి సూత్రం యొక్క వివరణ :

1. నేనంటే నాకు పూర్తి ఇష్టం ప్రేమ ఆనందం గౌరవం :- "ఇష్టం, ప్రేమ, ఆనందం మరియు గౌరవం" అనేవి మహా దివ్య శక్తులు.

మీ పట్ల మీకు పూర్తి ఇష్టం ఉన్నప్పుడు మీకు కష్టాలు ఉండవు. మీ పట్ల మీకు ప్రేమ ఉంటే అన్నీ ఆనందాలే ! మీ పట్ల మీరు ఆనందంగా ఉంటే, సృష్టి మొత్తంలో నుండి కేవలం మీకు ఆనందాలే అందుతాయి. మీ పట్ల మీరు గౌరవ భావాన్ని కలిగి ఉన్నప్పుడు మీ సర్వ బంధనాలు క్లియర్ అయిపోతాయి.

ఇష్టం, ప్రేమ, ఆనందం, గౌరవం అనే మహా దివ్య శక్తులు మీ ఊహలకు అందనన్ని పనులు చేస్తాయి. అసాధ్యాలను సుసాధ్యాలుగా చేస్తాయి. అసంభవాలను సుసంభవాలుగా చేస్తాయి. సర్వ-సర్వ, సకల-సకల, సమస్త అడ్డంకులను క్లియర్ చేసేస్తాయి.

అవి ఎంత పెద్ద అడ్డంకులైనా సరే, అవి ఎంత క్లిష్టమైనవైనా సరే, అవి ఎలాంటివైనా సరే... అన్నీ తక్షణమే, పూర్తిగా, శాశ్వతంగా, సురక్షితంగా క్లియర్ అయిపోతాయి.

ఈ సూత్రం యొక్క ప్రభావం మరియు మహిమ గురించి చెప్పాలంటే కోట్ల పేజీలు ఉన్న గ్రంథం కూడా సరిపోదు.

మీరు వేటి పట్లనైతే ఇష్టం కలిగి ఉంటారో అవి మీ దగ్గర ఉంటాయి. ప్రస్తుతం మీరు కలిగి ఉన్నవన్నీ మీరు ఇష్టపడుతున్నవే ! మీరు మీ లోపల తెలియకుండా నెగెటివ్‌లను ఇష్టపడినప్పుడు మీ జీవితంలో బాధలు ఉంటాయి. మీరు మీ పట్ల ఇష్టాన్ని కలిగి ఉన్నప్పుడు, మీలో ఉన్న నెగెటివ్‌లన్నీ వెంటనే పూర్తిగా సురక్షితంగా క్లియర్ అయిపోతాయి.

ఇష్టం అనేది మీ కోరికను లేదా సంకల్పాన్ని లేదా లక్ష్యాన్ని భౌతికంగా సంభవం చేసే మహా దివ్య శక్తి ! ఇష్టం అనేది ఆలోచనా రూపంలో ఉన్న వాటిని భౌతిక రూపంలోకి మార్చే శక్తి.

కోరిక, సంకల్పం, లక్ష్యం ఇవన్నీ ఒక్కటే !

కోరిక అనేది ఆలోచనా రూపంలో వస్తుంది. మీరు దాన్ని ఇష్టపడినప్పుడు, అది వెంటనే భౌతికంగా సంభవం అవుతుంది. ఇష్టం అనేది ఆలోచనా రూపంలో ఉన్న వాటిని భౌతిక రూపంలోకి మార్చే శక్తి. మీరు దేనినైనా లేక ఎవరినైనా సరే ఇష్టపడినప్పుడు.. మీ మధ్యలో ఉన్న అడ్డంకులన్నీ మొత్తానికి మొత్తం పూర్తిగా శాశ్వతంగా సురక్షితంగా క్లియర్ అయిపోతాయి. గుర్తుంచుకోండి, అడ్డంకి ఉందంటే అక్కడ ఇష్టం లేనట్టే ! ఇష్టం ఉన్నచోట కష్టం(అడ్డంకి) ఉండదు.

ప్రేమ యొక్క శక్తి గురించి ఏమని చెప్పాలి ?! ఈ అనంత సృష్టిని నిలబెడుతున్నది ప్రేమయే ! ఇంత కన్నా ఏం చెప్పగలం...! మీ పట్ల మీరు ప్రేమను కలిగి ఉంటే, మీరు ఈ సృష్టిలో సాధించలేనిది అంటూ ఏదీ ఉండదు. సర్వ సృష్టి మీకు పూర్తిగా రక్షణగా ఉంటుంది, సంపూర్ణమైన సమగ్రమైన సహాయ సహకార సమన్వయాలను అందిస్తుంది. మీ పట్ల మీరు ప్రేమను కలిగి ఉంటే, సృష్టిలోని ప్రతీ అణువు, ప్రతీ పరమాణువు కూడా మీకు పూర్తి

సహాయం చేస్తుంది. ప్రతీ ఒక్కటీ మీకు అండగా ఉంటుంది. చలనం ఉన్నవి, చలనం లేనివి ప్రతీ ఒక్కటీ మీకు పూర్తిగా బేషరతుగా సహాయం చేస్తాయి. ప్రేమ వలన మీ శత్రువులు అందరూ మీకు మిత్రులుగా మారిపోతారు. వారే మీకు అండగా ఉండి సహాయం చేస్తారు. ప్రేమ యొక్క శక్తి వలన అడ్డంకులే ద్వారాలుగా మారుతాయి. నెగెటివ్‌లన్నీ పాజిటివ్‌లుగా మారుతాయి.

ప్రేమ అన్నింటినీ క్లియర్ చేసేసి మీకు మహా సక్సెస్‌ను అందిస్తుంది. ఎక్కడ ప్రేమ ఉంటుందో అక్కడ కేవలం మహా విజయమే ఉంటుంది.

ఆనందం మరియు గౌరవం అనే దివ్య శక్తులు మీలో ఉన్న అవకతవకలను అన్నింటినీ సరి చేస్తాయి. మీకై మీరే విధించుకున్న శిక్షలన్నింటినీ తక్షణమే తీసివేస్తాయి. మీలోపల ఏ ఒక్క నెగెటివ్ అంశాన్ని కూడా ఉండనివ్వవు. అణువంత నెగెటివిటీని అయినా ఉండనివ్వవు. ఈ ఆనందం మరియు గౌరవం అనే మహా దివ్య శక్తులు మిమ్మల్ని పూర్తి పాజిటివ్‌గా మరియు పూర్తి దివ్యంగా మార్చేస్తాయి. మీరు కోరుకుంటున్న వాటిని భౌతికంగా మీకు అందిస్తాయి. అద్భుతాలు చేస్తాయి. ఇష్టం ప్రేమ ఆనందం గౌరవం అనేవి మహాద్భుత శక్తులు.

రెండవ సూత్రం యొక్క వివరణ :

2. నువ్వంటే నాకు పూర్తి ఇష్టం ప్రేమ ఆనందం గౌరవం :- ఈ సూత్రాన్ని మీ లోపల, మీరు కోరుకుంటున్న వారిని ఉద్దేశించి చేయాలి. వారిని ఊహించు కుంటూ, వారిని ఉద్దేశిస్తూ డైరెక్ట్‌గా వారితోనే అంటున్నట్టుగా అనాలి.

ఈ సూత్రం వలన మీ ఇద్దరి మధ్య ఉన్న ఆటంకాలు అన్నీ తక్షణమే పూర్తిగా శాశ్వతంగా సురక్షితంగా క్లియర్ అయిపోతాయి. మీ ఇద్దరికీ ఒకరంటే ఒకరికి పూర్తి ఇష్టం ప్రేమ ఆనందం గౌరవం ఏర్పడతాయి. మీ కలయికను ఈ సర్వ సృష్టిలోని ఏ శక్తి ఆపలేదు. ఈ సృష్టి మొత్తం మీకు రక్షణగా ఉండి, మీకు సర్వ సహాయ సహకార సమన్వయాలను అందిస్తూ మిమ్మల్ని కలుపుతుంది. మిమ్మల్ని ఆశీర్వదిస్తుంది. మిమ్మల్ని అనుగ్రహిస్తుంది.

మీ పైన వరాల వర్షం కురిపిస్తుంది. మీరిద్దరూ కలిసి ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా హాయిగా ఫుల్‌గా ఎంజాయ్ చేయవచ్చు. మీ జీవితం కలర్ ఫుల్‌గా అవుతుంది. మీరు ఎంజాయ్‌మెంట్‌లో కొత్త కోణాలను కూడా ఆవిష్కరిస్తారు.

ఈ రెండవ సూత్రం వలన మీ మధ్య ఎలాంటి ఆటంకాలు ఉన్నా సరే అవి క్లియర్ అయిపోతాయి. అవి విశ్వం లెవెల్‌లో ఉన్నా లేక అంతకన్నా పెద్ద లెవెల్‌లో ఉన్నా, లేక ఇంకెంత పెద్ద లెవెల్‌లో ఉన్నా సరే అన్నీ తక్షణమే పూర్తిగా క్లియర్ అయిపోతాయి.

పూర్తి విశ్వాసంతో ఈ సాధన చేయండి మీరు కోరుకుంటున్న వారు మీకు దక్కుతారు. కచ్చితంగా దక్కి తీరుతారు. మీరు వారితో కలిసి హాయిగా జీవిస్తారు. ఇది సత్యం.

మీరు ఈ సాధన చేసిన తర్వాత అప్పుడప్పుడు ఈ కింది సత్యాలను కూడా మీలోపల మీరు పదే పదే అనుకోవాలి.

❖ నా వాస్తవాలకు నేనే సృష్టికర్తను.

❖ ఎవరి ఇష్టం వారిదే, అందరూ దైవాలే.

❖ మా విషయం చాలా మంచిది, చాలా గొప్పది, చాలా దివ్యమైనది.

❖ మా కలయికకు పరమార్థం ఉంది.

ఒకరి పట్ల ఒకరు పూర్తి విశ్వాసంతో ఉండడం చాలా అవసరం. తప్పని సరి.

మీరు పూర్తి విశ్వాసంతో ఈ సాధన చేయాలి. నిజంగా సూపర్ ఫలితాలను ఇస్తుంది ఈ సాధన. బయట మీ యొక్క పరిస్థితులను చూసి భయపడవద్దు. బయట పరిస్థితులు ఎలా ఉన్నా సరే, మీరు ధైర్యంగా పూర్తి విశ్వాసంతో సాధన చేయండి. మీ కోసం లేనివి కూడా సృష్టించి ఇస్తుంది మీకు ఈ సృష్టి !

మీరు ధైర్యం విశ్వాసం కోల్పోవద్దు. ఫలితం అంతా మీ యొక్క ధైర్యం పైన మరియు విశ్వాసం పైననే ఆధారపడి ఉంటుంది. ఎలాంటి పరిస్థితులైనా సరే మారుతాయి. మీకు అవసరమైతే, మీ సహాయం కోసం, మీ రక్షణ కోసం లేని

చట్టాలు కూడా పుడతాయి.

బయట చూడటానికి మీకు ఎంతో మంది ఎన్నో రకాలుగా అడ్డం పడుతున్నట్టుగా కనిపిస్తుంది. కానీ అసలు సత్యం ఏమిటంటే, మీలోపల ఉన్న అడ్డంకులే బయట వ్యక్తుల రూపంలో మరియు పరిస్థితుల రూపంలో వస్తూ ఉంటాయి. బయట ఏవీ ఉండవు. అడ్డంకులన్నీ మీ లోపలి నుండే బయటకు ప్రకటం అవుతూ ఉంటాయి. మీ లోపల అడ్డంకులు ఉంటే, పెద్ద పెద్ద వాళ్ళు అవసరం లేదు. మీకు సంబంధం లేని ఒక మామూలు కుక్క చాలు మిమ్మల్ని అడ్డుకోడానికి ! ఒక పిల్లి లేదా ఒక పక్షి లేదా ఒక వస్తువు కూడా అడ్డం పడుతుంది. మీలో అడ్డంకులు ఉంటే మీకు సంబంధం లేని వారు కూడా అడ్డం పడుతారు. మీలో ఎంత పెద్ద అడ్డంకులు ఉంటే అంత పెద్దవారు అడ్డం పడుతారు.

మీ లోపల క్లియర్‌గా ఉంటే మీకు సంబంధం లేని వారు కూడా మీకు సహాయం చేస్తారు. మీరు అనాథ అయినా, మీ చేతిలో పైసా లేకపోయినా, మీ పరిస్థితి ఎంత ఘోరంగా ఉన్నా సరే... మీలోపల క్లియర్‌గా ఉంటే అన్ని సహాయాలు మీకు లభిస్తాయి. మీరెంత చిన్న స్థితిలో ఉన్నా సరే, మీ ముందు ఎంత పెద్ద లెవెల్‌లో అడ్డంకులు ఉన్నా సరే, అవన్నీ పూర్తిగా శాశ్వతంగా సురక్షితంగా క్లియర్ అయిపోతాయి. మీరు మామూలు ఉద్యోగి అయినా సరే, మీరు కోరుకుంటున్న వ్యక్తి ప్రెసిడెంట్ సంతానం అయినా సరే, మీరు కోరుకుంటున్న వారు మీకు దక్కుతారు. అడ్డంకులు వచ్చేవి మీలో నుండే అని మీరు తెలుసుకుంటే చాలు. బయట వ్యక్తులను పరిస్థితులను నిందించ కూడదు. ఎవరైనా అడ్డం పడుతూ ఉన్నప్పుడు... మీరు గ్రహించాల్సింది, నాలో అడ్డంకులు ఉన్నాయి అని..! మీరు విశ్వాసంతో ఈ రెండు సూత్రాలను సాధన చేస్తూ ఉంటే చాలు, అన్నీ వెంటనే పూర్తిగా శాశ్వతంగా సురక్షితంగా క్లియర్ అయిపోతాయి. మీరు ధైర్యంగా ఉండాలి. పూర్తి విశ్వాసంతో ఉండాలి.

పరిస్థితులు మీకు అనుకూలంగా లేనప్పుడే మీరు ధైర్యంగా ఉండాలి, పాజిటివ్‌గా ఉండాలి. అప్పుడే తెలుస్తుంది... మీ ప్రేమ నిజమైనదా కాదా అని ! కబుర్లు చెప్పుకునేంత వరకే అయితే అది నిజమైన ప్రేమ కాదు. మీరు విడిగా ఉన్నప్పుడు, మీరు కలుసుకోవడం

కుదరనప్పుడు, మీకు ఎలాంటి కమ్యునికేషన్ లేనప్పుడు, మీ పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నప్పుడే మీరు పాజిటివ్‌గా ఉండాలి.

మీరు మీ పట్ల మరియు మీ ప్రేమ పట్ల ఎట్టి పరిస్థితులలోనూ ధైర్యం కోల్పోకూడదు. పూర్తి విశ్వాసంతో ఉండాలి. ధీమాగా ఉండాలి. మీరెంత బిందాస్‌గా ఉంటే మీరు అంత త్వరగా సక్సెస్ అవుతారు.

అడ్డంకులు మీలో నుండే వస్తున్నాయి కాబట్టి, వాటిని తక్షణమే తీసివేసుకోగల శక్తి మీకుంది. నమ్మండి. మీలోపలివే కదా... బయట ఎక్కడో క్లియర్ చేయాలంటే కష్టం కానీ, మీలోపల ఉన్న వాటిని క్లియర్ చేయడం అనేది మీ చేతిలోని పని కదా... ఈ రెండు సూత్రాలను సాధన చేయండి. అన్నీ వెంటనే క్లియర్ అయిపోతాయి. ఇది సత్యం. నమ్మండి.

All The Super Best !

ప్రేమ వర్ధిల్లాలి !

ప్రేమ వివాహాలు వర్ధిల్లాలి !

ప్రేమికులు వర్ధిల్లాలి !

మీరు బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఎవరూ మిమ్మల్ని శాసించటం లేదు. ఏ దేవుళ్ళు, ఏ దేవతలు, ఏ శక్తులు, మీ పూర్ణాత్మ, మీ ప్రజ్ఞాత్మ, స్పిరిట్, లోకం, విశ్వం, సృష్టి, మూల చైతన్యం, వారు వీరు... ఎవరూ కూడా, అదీ ఇదీ... ఏదీ కూడా మిమ్మల్ని ఏమీ చేయటం లేదు. ఎవరికి కూడా, దేనికి కూడా మీ పైన నియంత్రణ లేదు. ఎవరూ మిమ్మల్ని శాసించలేరు, శాసించటం లేదు. ఏదీ మిమ్మల్ని శాసించలేదు, శాసించటం లేదు. మీరు ఇప్పుడు ఉన్నది ఉన్నట్టుగానే సర్వ స్వతంత్రులు. మీ స్వేచ్ఛ కోసం, మీరు, ఎవరినీ వేడుకోవాల్సిన అవసరం లేదు. మిమ్మల్ని శాసించే హక్కు, అధికారం ఈ సర్వ సృష్టిలో ఎవరికీ లేదు, దేనికీ లేదు. మీకు మీరే సర్వాధికారి. మీరు ఎవరినైనా కోరుకుంటున్నప్పుడు, వారు ఇంకా మీకు దక్కలేదంటే దానర్థం మీరు పూర్తిగా వారిని ఇష్ట పడటం లేదు మరియు ప్రేమించటం లేదనే ! మీరు ఎంత ఇష్ట పడితే, ప్రేమిస్తే అంత వారు, మీ వారుగా ఉంటారు. మీరెంత అయిష్టత కలిగి ఉంటే, అంత దూరంగా వారు ఉంటారు.

మీరు కోరుకున్న వారిని లేదా దానిని మీరు పొందాలంటే, మీరు దాన్ని పూర్తిగా ఇష్టపడి, ప్రేమిస్తే... వారిని లేదా దానిని మీరు పొందకుండా, ఈ సృష్టిలోని ఏ శక్తి కూడా మీకు అడ్డం పడలేదు. అసలు మీతో ఎవరికీ సంబంధం ఉండదు. మీ యొక్క అయిష్టతను ఆధారంగా చేసుకునే ఎవరైనా అడ్డం పడతారు లేక ఏదైనా అడ్డం పడుతుంది.

ఆరోగ్యం, ఐశ్వర్యం మరియు కోరుకున్న వారు, మీకు ఇంకా దక్కలేదు అని అంటే, మీరు వారిని లేక దానిని పూర్తి స్థాయిలో ఇష్టపడటం లేదు, ప్రేమించటం లేదు అని అర్థం. మీకు కావాల్సిన దానిని, మీరు పూర్తిగా ఇష్టపడండి, ప్రేమించండి అది మీకు కచ్చితంగా దక్కితీరుతుంది. గతి తప్పని ప్రాప్తి ఇది. మీరు కోరుకునే వారిని పూర్తిగా ఇష్టపడండి, ప్రేమించండి, వారు మీకు కచ్చితంగా దక్కితీరుతారు. గతి తప్పని ప్రాప్తి ఇది.

గుర్తుంచుకోండి, మీ ఇష్టాలను కాదనడానికి ఈ సృష్టిలో ఎవరికీ హక్కు, అధికారం లేదు. మీరు దేనిని ఇష్టపడితే దాన్ని మీరు కలిగి ఉంటారు. మీరు దేన్ని ఇష్టపడకపోతే దాన్ని మీరు కలిగి ఉండరు. అంతే. మీ అయిష్టతే మీకు అడ్డంకులు సృష్టిస్తుంది. మీ ఇష్టమే వారిని లేక దానిని మీకు అందిస్తుంది.

మీరు దేనినైనా పొందడానికి లేదా వదిలించుకోడానికి పూర్తి స్వేచ్ఛను కలిగి ఉన్నారు. ఏదైతే మీకు కావాలో దాన్ని పూర్తిగా ఇష్టపడండి, ప్రేమించండి... అంతే అది మీదవుతుంది. ఏదైతే మీకు వద్దో "ఇది నాకు వద్దు" అని అనుకోండి అది మీకు దూరం అయిపోతుంది.

మీరు ఎవరినైతే కోరుకుంటున్నారో వారిని పొందే పూర్తి స్వేచ్ఛ మీకుంది. మీరు ఎవరినైతే కోరుకుంటున్నారో వారిని పూర్తిగా ఇష్టపడండి, ప్రేమించండి... అంతే వారు మీ స్వంతం అయి తీరుతారు.

మీరు ఎవరి నుండైతే దూరం కావాలనుకుంటున్నారో వారికి వీడ్కోలు చెప్పండి. మీ మనసులో వారిని తలుచుకుని, "ఇక మీ యొక్క అవసరం నా జీవితంలో లేదు, ఇక చాలు, మీకు నా ప్రేమ పూర్వక వీడ్కోలు" అని పదే పదే అనుకోండి. అంతే. వారు మీ జీవితంలో నుండి తొలగిపోతారు.

మీ జీవితానికి అధిపతులు మీరే ! మీ జీవితానికి సర్వాధికారులు మీరే ! మీ శరీరానికి సర్వాధిపతులు మీరే !

బాగా గుర్తుంచుకోండి - మీరు ఏమేం కలిగి ఉన్నారో వాటిని ఇష్టపడుతున్నారు అని అర్థం. మీరు వేటినైతే కలిగి లేరో వాటిని ఇష్టపడటం లేదని అర్థం.

మీకు చాలా బాధలున్నాయి అని అంటే, మీరు బాధలను ఇష్టపడుతున్నారని అర్థం. మీకు ఎప్పుడూ అపజయాలే ఎదురవుతున్నాయంటే, మీరు అపజయాలనే ఇష్టపడుతున్నారనే అర్థం. మీరు పేదవారైతే, మీకు పేదరికం అంటే ఇష్టం అని అర్థం. కాబట్టి మీరు వేటిని వదిలించుకోదలుచుకున్నారో వాటికి ప్రేమగా వీడ్కోలు చెప్పేయండి. కావాలనుకున్న వాటిని పూర్తిగా ఇష్టపడండి, ప్రేమించండి.

మీకేం కావాలో వాటిని పూర్తిగా ఇష్టపడండి, ప్రేమించండి. అవి దక్కేవరకు సాధన చేయాలి. పూర్తి విశ్వాసంతో, పట్టుదలతో, ధైర్యంగా సాధన చేయాలి. మీ సాధనలు ఫలించియే తీరుతాయి. గుర్తుంచుకోండి - మీ సాధనలను ఫలవంతం చేయడానికి సర్వసృష్టి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. మీదే ఆలస్యం...

All The Super Best !

❖ ❖ ❖

పార్ట్ - 21

దివ్య కామం

దివ్య కామానందం

కామం(sex) ఒక పురుషార్థం.

కామం(sex) పరమార్థవంతమైనది.

కామం(sex) పరమ పవిత్రమైనది.

కామం(sex) చాలా మంచిది.

కామం(sex) చాలా గొప్పది.

కామం(sex) చాలా దివ్యమైనది.

కామం(sex) చాలా శ్రేయస్కరమైనది.

కామం(sex) చాలా శుభకరమైనది.

కామం(sex) చాలా లాభకరమైనది.

కామం(sex) చాలా అభివృద్ధి కారకమైనది.

కామం(sex) పరమానందభరితమైనది.

కామం(sex) ఆరోగ్య ప్రసాదిని.

కామం(sex) శక్తి ప్రసాదిని.

కామం(sex) ప్రేమ యొక్క మరో రూపం.

ఇప్పుడు ఇది చదువుతున్న మీ యొక్క పుట్టుకకు మూల కారణం కామమే(sex). కామ కార్యమే లేకపోతే మీరు పుట్టి ఉండేవారే కాదు. ఈ సృష్టి నశించి పోకుండా ముందుకు నడుస్తూ ఉంది అని అంటే... అది కేవలం కామం(sex) వల్లనే !

పరమ పవిత్రమైన కామం(sex) పైన ప్రస్తుతం జనాల్లో చాలా అపోహలు ఉన్నాయి. చాలా అపార్థాలు ఉన్నాయి. ఈ భూమి పైన అత్యంత ప్రధానమైనవి రెండు బాగా అపార్థం చేసుకోబడ్డాయి. ఒకటి దైవం. రెండు కామం(sex).

ఏ రెండింటిని అపార్థం చేసుకుంటే మానవ జాతి వికసించదో, అభివృద్ధి చెందదో, పరిణామ క్రమంలో ముందుకు కొనసాగదో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

ఏ రెండింటిని అపార్థం చేసుకుంటే మానవ జాతి నాశనం వైపు ఆగకుండా పరుగులు తీస్తుందో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

ఏ రెండింటిని సరిగా అర్థం చేసుకుంటే మానవ జాతి నాశనం కాకుండా తనని తాను కాపాడుకోగలుగుతుందో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

ఏ రెండింటిని సరిగా అర్థం చేసుకుంటే మానవ జాతి పరిణామ క్రమంలో ముందుకు దూసుకు పోతుందో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

ఏ రెండింటిని సరిగా అర్థం చేసుకుంటే మానవ జాతి వికసిస్తుందో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

ఏ రెండింటిని సరిగా అర్థం చేసుకుంటే మానవ జాతి సాఫల్యాన్ని పొందుతుందో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

ఏ రెండింటిని సరిగా అర్థం చేసుకుంటే మానవ జాతి పరమార్థాన్ని సాధిస్తుందో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

ఏ రెండింటిని సరిగా అర్థం చేసుకుంటే ఈ భూమి పైన శాంతి మరియు ఆనందోత్సవాలు వెల్లివిరుస్తాయో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

ఏ రెండింటిని సరిగా అర్థం చేసుకుంటే ఈ భూమి సస్యశ్యామలం అవుతుందో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

ఏ రెండింటిని సరిగా అర్థం చేసుకుంటే ఈ భూమి స్వర్గంగా మారిపోతుందో... ఆ రెండే - దైవం మరియు కామం(sex).

కామధ్యాన సాధన
SEX MEDITATION

ఎంతో మంచిది, ఎంతో గొప్పది, ఎంతో దివ్యమైనది మరియు పరమార్థవంతమైనది అయిన కామాన్ని(sex) అజ్ఞానం చేత మానవులు సరిగా ఆస్వాదించలేక జీవిత పరమార్థాన్ని మరియు జీవితంలో పరమానందాన్ని కోల్పోతున్నారు.

ఈ కింది సూత్రాలను సాధన చేస్తే 100 సంవత్సరాల వయసులో కూడా స్త్రీ పురుషులు ఇరువురూ మహాద్భుతంగా.. కామాన్ని ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఉధృతంగా, పూర్తి తమకంగా, తమకు ఇష్టం వచ్చినంత సేపు, ఇష్టం వచ్చినన్ని సార్లు హాయిగా ఆస్వాదించవచ్చు. ఎంజాయ్ చేయవచ్చు.

1. కామం చాలా మంచిది, దివ్యమైనది, పరమార్థవంతమైనది.

2. కామం వలన శక్తిసామర్థ్యాలు పెరుగుతాయి.

3. కామం అంటే నాకు పూర్తి ఇష్టం ప్రేమ ఆనందం గౌరవం అత్యవసరం.

ఈ 3 సూత్రాలను ఒక దాని తర్వాత ఒకటి సాధన చేయాలి. ఒక్కో సూత్రాన్ని మీకు ఎంత సేపు వీలైతే అంత సేపు సాధన చేసుకోవచ్చు. 24 గంటలలో ఎప్పుడైనా సరే సాధన చేసుకోవచ్చు. జీవితంలో సెక్స్ కోరికలు తీరక బాధలు పడుతున్న వారందరికీ ఈ సాధన వలన వారికి సరైన మార్గంలో వారి సెక్స్ కోరికలు సురక్షితంగా తీరుతాయి.

ఈ సాధన చేసిన వారు ఎవరైనా సరే కామాన్ని పూర్తి స్థాయిలో ఎంజాయ్ చేయగలుగుతారు. స్త్రీ పురుషులు ఇరువురూ ఈ సాధన చేయవచ్చు. మీరు ఏ వయసు వారైనా సరే... ఈ సాధన చేస్తే, మీకున్న సర్వ సమస్యలు పూర్తిగా, సురక్షితంగా, శాశ్వతంగా, వెంటనే తొలగిపోతాయి. మీకు కామ సిద్ధి కలుగుతుంది.

అవి ఎలాంటి సెక్స్ సమస్యలైనా సరే, అవి ఏ స్థాయిలో ఉన్నా సరే, ఈ సాధన వలన పూర్తిగా, సురక్షితంగా, శాశ్వతంగా, వెంటనే తొలగిపోతాయి.

కామం(sex) వలన శక్తి పోవటం అంటూ జరగదు. ఇది నిజం కాదు. వాస్తవానికి కామం(sex) అంటేనే ఆనందం+శక్తి ! మీరు ఎంత సేపు, ఎన్ని సార్లు సెక్స్‌లో పాల్గొంటే అంత శక్తిని పొందుతారు. సెక్స్ వలన శక్తి పోతుంది అనే సరికాని నమ్మకం వలన శక్తి పోవటం జరుగుతుంది. అంతే తప్ప నిజానికి సెక్స్ చేయటం వలన శక్తిని కోల్పోవటం అంటూ జరగదు. మనం దేనిని ఎలా నమ్ముతామో, అది అలానే జరుగుతుంది.

మానవులకు సెక్స్ గురించి చాలా తప్పుడు బోధనలు జరిగాయి. అవి అలానే కొనసాగుతున్నాయి. అయితే ఆనందించ వలసిన విషయం ఏమిటంటే, ఇప్పుడిప్పుడే కాస్త... సెక్స్ పట్ల సరైన భావాలు ప్రజలలో ఏర్పడుతున్నాయి. ఇది చాలా అభినందించ దగిన మార్పు.

వేదాలలో మరియు శాస్త్రాలలో కామం గురించి దివ్యమైన ప్రస్థావనలు ఉన్నాయి, అయితే వాటిలో అత్యధిక శాతం సత్యాలను దాచి పెట్టారు. ఇది కేవలం అజ్ఞానపు చర్యే తప్ప మరొకటి కాదు. కామం పట్ల సరైన జ్ఞానాన్ని పొందాలి, అప్పుడే జీవితం వికసిస్తుంది. ఆత్మ పరిణామ క్రమంలో అభివృద్ధి చెందుతుంది. ప్రగతి పథంలో ముందుకు సాగుతుంది.

కామం(sex) అనేది ఒకానొక పరమ సత్యం. కామం(sex) ప్రేమ యొక్క మరో కోణం. కామం(sex) ప్రేమ యొక్క మరో రూపం. కామం(sex) ఆనందం యొక్క మరో రూపం. కామం(sex) అనేది మహా మూల చైతన్య శక్తి.

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

దైవమే కామము - కామమే దైవము

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

భగవద్గీతలో 7వ అధ్యాయంలోని 11వ శ్లోకంలో స్వయంగా దేవాధిదేవుడైన శ్రీకృష్ణ పరమాత్ముడే "కామో-స్మి" అంటే "కామము అయి ఉన్నాను" అని ప్రకటించాడు. సాక్షాత్తు భగవంతుడే "నేనే కామము" అని చెప్పినప్పుడు కామము పట్ల ఎంత దివ్య భావనను కలిగి ఉండాలి ?!?!

కామం(Sex) అనగానే సుమారుగా అందరికీ చాలా దురభిప్రాయాలు ఉన్నాయి. వాస్తవానికి కామం దివ్యమైనది, పరమ పవిత్రమైనది. కామం అంటే సృష్టి కార్యం. కామం అంటే దైవమే కదా !

✪ సృష్టి కార్యాన్ని పెట్టిన సృష్టికర్తకు ఏది మంచో ఏది చెడో తెలీదా ?! కామం చెడ్డదైతే కామం ద్వారా పుట్టిన వాళ్ళందరూ చెడ్డ వాళ్ళే ! కామం తప్పు అయితే, పాపమైతే భూమి నిండా ఉన్న వాళ్ళు అందరూ తప్పుడు వాళ్ళే, పాపులే అన్నమాటే కదా ! కాబట్టి కామం పట్ల సరైన భావాన్ని ఏర్పర్చుకుని జీవితాన్ని సరి చేసుకుందాం !

❶ **ప్రశ్న :** గురుదేవులకు పాదాభి వందనాలు. నా వయసు 28 సం॥లు. ఆరు నెలల క్రితం వివాహం అయింది. నేను మా వారు ఇద్దరమూ ఉద్యోగస్థులమే. మాది జాయింట్ ఫ్యామిలి. మాకు కేటాయించబడిన గదిలో దేవుళ్ళ ఫోటోలు ఉన్నాయి. ఆ గది తప్ప మరో సౌకర్యం లేదు మాకు. సెక్స్ చేసుకునేటప్పుడు ఇబ్బందిగా ఫీల్ అవుతున్నాను ..... దేవుళ్ళ ఫోటోలు ఉన్న గదిలో తప్పు చేస్తున్నానా అని. ఆ ఫోటోలు తీయడానికి మా ఇంట్లో ఒప్పుకోరు. నాకేం చేయాలో అర్థం కావటం లేదు. ఇక నా రెండవ సమస్య ఏమిటంటే, మేమిద్దరం ఉద్యోగస్థులం కావడంతో సెక్స్‌ను ఆనందించడానికి అస్సలు వీలు కావటం లేదు. నేను ఇంటికి వచ్చినప్పుడు ఆయన డ్యూటీకి వెళ్తారు. ఆయన ఇంట్లో ఉంటే నేను ఆఫీసులో ఉంటాను. ఇంకా ఆయనకు అప్పుడప్పుడు టూర్లు పడుతుంటాయి. పండగలప్పుడు వీలు చిక్కుతుంది. పండగల రోజుల్లో సెక్స్ చేసుకోవచ్చా ? అది ఏమైనా తప్పా ? అని నేను భయపడుతున్నాను. మా వారేమో ఏం కాదు అని అంటారు. పెళ్ళి అయి ఆరు నెలలు గడిచినా ఇప్పటికీ నిజమైన సెక్స్ సుఖం నేనూ పొందలేదు, మా వారికీ అందించలేదు. .....ఎంతగానో సెక్స్‌ను ఆనందించాలని ఉన్నా.....ఈ సమస్యలు నన్ను వెంటాడి వేధిస్తున్నాయి. .....దీని ప్రభావం వలన డల్‌గా, డిస్టర్బ్‌డ్‌గా ఉంటూ ఆఫీసులో సరిగా పని చేయలేక పోతున్నాను. మ్యానేజ్‌మెంట్ నుండి వార్నింగులు కూడా వచ్చాయి. భయంగా ఉంది.....

చావు ఆలోచనలు వస్తున్నాయి. దయచేసి నా సమస్యలకు పరిష్కారం సూచిస్తారని ప్రార్థిస్తూ ...(ఇలాంటి సందేహాలు అనేకం చాలా చాలా చాలా మంది స్త్రీ పురుషులు, ఎంతో బాధతో అడిగారు. మరి కొంత మంది మరణ భయంతో అడిగారు. వారందరూ ఈ సత్యాలను చదివి బాగా అవగాహన చేసుకోవాలి)

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : అమ్మా... ఇంత మాత్రానికే చావు గురించి ఆలోచించడం సరి కాదు. నీ జీవితానికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. అమెరికాలో M S చేసిన నీ యొక్క సుధీర్ఘమైన ప్రశ్నలతో కూడిన ఉత్తరం చదివిన తరువాత, నీ తల్లిదండ్రులు ఎలాంటి సరి కాని జ్ఞానంతో నిన్ను పెంచారో అర్థం అవుతూనే ఉంది. నీ పరిస్థితే ఇలా ఉంటే ఇక మామూలు వాళ్ళ పరిస్థితి ఏమిటో కదా ?!

దేవుడు కేవలం ఫోటోలకు మాత్రమే పరిమితమై ఉంటాడా ! ఫోటోలు తీసినంత మాత్రాన నీ గదిలో దేవుడు లేకుండా పోతాడా ! సమస్య ఫోటోలలో కాదు నీలో ఉంది. సృష్టి కార్యాన్ని(సెక్స్) పెట్టిన దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు కానీ తప్పు పట్టడు. నిరభ్యంతరంగా, నిస్సందేహంగా, హాయిగా, తనివి తీరా ఆనందించి, నీ భర్తను ఆనందపరుచు.

గదిలోని దేవుడిని బయటకు తీయగలుగుతావు గాని మదిలోని దేవుడిని తీయగలుగుతావా ? అసలు దైవమే నీవు కదా ! సెక్స్ అనేది నాలుగు పురుషార్థాలలో ఒకటి. సెక్స్ అనేది పరమ పవిత్రమైన కార్యక్రమం. కాబట్టి అనవసరమైన అపోహలు తొలగించుకుని ఆనందించు.

ఇక పండగరోజులలో సెక్స్ చేసుకోకూడదని ఎందుకు అనుకుంటున్నావు ?

✪✪✪ జీవితమే ఒక పండగ. జీవితం మొత్తమూ పవిత్రమే ! జీవితంలోని కొన్ని రోజులు పవిత్రం, కొన్ని రోజులు అపవిత్రం అంటూ ఉండవు. అంతా పవిత్రమే. అన్ని రోజులు పవిత్రమైనవే. జీవితంలోని అన్ని రోజులు పండగ రోజులే, దండగ రోజులు ఉండవు. చతుర్విధ పురుషార్థాలైన "ధర్మార్థ కామ మోక్షాలలో" ఒకటి అయిన కామాన్ని (సెక్స్‌ను) ఆనందించడానికి అన్ని సమయాలు అనుకూలమే. అనుకూలంగా ఉండాల్సింది నీవు ఇంకా నీ భాగస్వామి. మీరిద్దరూ అనుకూలంగా ఉంటే పవిత్ర కార్యాన్ని చేయడానికి ఏం అడ్డంకి ? హాయిగా ఎంజాయ్ చెయ్యండి. అనవసరమైన మూఢ నమ్మకాలతో భయాలతో జీవితాన్ని నాశనం చేసుకోకుండా నీ భర్తకు సహకరించు. అతడిని ఆనందింపచేయి, నీవు కూడా ఆనందించు.✪✪✪

❖ ❖ ❖

దైవమే కామము - కామమే దైవము

✪ ✳ ☆ ✯ ☆ ✡ ★ ✪ ☆ ✯ ✪

భగవద్గీతలో 7వ అధ్యాయంలోని 11వ శ్లోకంలో స్వయంగా సాక్షాత్ దేవాధిదేవుడైన శ్రీకృష్ణ పరమాత్ముడే "కామో-స్మి" అంటే "కామము అయి ఉన్నాను" అని ప్రకటించాడు. సాక్షాత్తు భగవంతుడే "నేనే కామము" అని చెప్పినప్పుడు కామము పట్ల ఎంత దివ్య భావనను కలిగి ఉండాలి ?!?!

కామం(Sex) అనగానే సుమారుగా అందరికీ చాలా దురభిప్రాయాలున్నాయి. వాస్తవానికి కామం దివ్యమైనది, పరమ పవిత్రమైనది. కామం అంటే సృష్టి కార్యం. కామం అంటే దైవమే కదా !

✪ సృష్టి కార్యాన్ని పెట్టిన సృష్టికర్తకు ఏది మంచో ఏది చెడో తెలీదా ?! కామం చెడ్డదైతే కామం ద్వారా పుట్టిన వాళ్ళందరూ చెడ్డ వాళ్ళే ! కామం తప్పు అయితే, పాపమైతే భూమి నిండా ఉన్న వాళ్ళు అందరూ తప్పుడు వాళ్ళే ! అందరూ పాపులే ! ✪

ప్రియ మిత్రమా ! కామం ప్రాథమిక జీవశక్తి ! ప్రకృతి శక్తి ! భూమి పైన ప్రాణికోటి మనుగడకు మూలమే కామం. ఈ కామ కార్యం ద్వారానే సృష్టి అంతరించిపోకుండా ముందుకు కొనసాగుతూ ఉంది.

దైవమే కామము - కామమే దైవము అనే సత్యాన్ని మీకు తెలియ చేయడంలో నా వాస్తవ ఉద్దేశాన్ని తెలుసుకోండి. కామము అనేది మహా పాపము, రతీ కార్యం చేస్తే దేవుడు శిక్షిస్తాడు, నరకంలో పడవేస్తాడు అని ఎన్నెన్నో రకాలుగా కామం పైన ఘోరమైన దురభిప్రాయాలున్నాయి. దీని వలన ప్రపంచంలో కోటానుకోట్ల మంది, తమ జీవితంలోని అత్యంత విలువైనది, ముఖ్యమైనదీ కోల్పోతూ ఉన్నారు. ఇలా జరగటం వలన జన్మ చక్రంలోనే బలంగా ఇరుక్కు పోతున్నారు. ఇది ఆత్మ పరిణామ క్రమానికి చాలా పెద్ద అడ్డంకి. ఆత్మోద్ధారణా కార్యక్రమంలో భాగంగా కామం పట్ల ఉన్న దురభిప్రాయాలను, దురవగాహనలను పోగొట్టి, కామం యొక్క వాస్తవ సత్యాలను ప్రజలకు అందజేసి, వారి ఆత్మ కల్యాణం కోసమే నేను ఈ దివ్య కామ విషయాలను చెప్తున్నానే తప్ప దైవాన్ని కేవలం కామం అని తెలియ చేయడం నా ఉద్దేశం కాదు అని మీరు గ్రహించి తీరాలి. మీరు గ్రహిస్తారని నాకు తెలుసు.

కామమే దైవము - దైవమే కామము అని నేను ఉన్న సత్యాన్నే తెలియజేసాను తప్ప ఇది కొత్తది కాదని తెలుసుకోగలరు.

కామమే దైవము - దైవమే కామము అని అంటే, ఇక అదే పనిగా కామంతోనే జీవించమని చెప్పటం లేదు. కామం తప్పు కాదు, దివ్యం అని మాత్రమే తెలియజేస్తున్నాను.

కామం తప్పు, కామం పాపం అనే భావనలతో రతీ కార్యంలో పాల్గొంటే, జన్మించబోయే ఆత్మ భ్రష్టు పట్టిపోతుంది. కామం దుష్టమైనది అనే భావన ఎంతో కీడు కలుగజేస్తుంది కాబట్టి తెలియజేస్తున్నాను. సుమారుగా అందరూ కామం అంటే ఎంతో ఉత్సుకత కలిగిన వాళ్ళే ! కానీ బయటికి మాట్లాడటానికి మాత్రం భయం. లోపల ఒకటి, బయట ఒకటి పెట్టుకుని మాట్లాడడం సరికాదు. కాబట్టి ఉన్న విషయాన్ని అంగీకరించి, అజ్ఞానంలో నుండి బయట పడమని మనవి చేస్తున్నాను.

కామం అంటే సంయోగం ! రెండు ఆత్మల కలయిక ! రెండు హృదయాల కలయిక ! రెండు శక్తుల కలయిక ! ఆత్మ పరిణామ క్రమంలో భాగంగా ఆత్మ దేహాన్ని ధరించి రక రకాలుగా జన్మ తీసుకుంటూ, అనుభవాన్ని గడిస్తూ "సాఫల్యం" వైపుగా సాగుతూ ఉంటుంది. జన్మ పరిణామ క్రమంలో చివరికి వచ్చినప్పుడు ఆధ్యాత్మిక మార్గంలోకి వస్తుంది. ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి ఎదగడానికి ఈ కామం ఉపయోగపడుతుంది. "కామి కాని వాడు మోక్షగామి కాడు" అన్న ప్రకారంగా ఉపయోగపడుతుంది. ఎన్ని రకాలుగా, ఎంతగా ఉపయోగపడితే, దీనిని నాలుగు పురుషార్థాలలో ఒకటిగా చేర్చి ఉంటారు?! 64 కళలలో కామ కళ కూడా ఉంది. నేటి ఆధునిక శాస్త్రజ్ఞులు కూడా పరిశోధించి ఇదే విషయాన్ని చెప్తున్నారు. కామం మనిషికి అత్యవసరమని, దాని వలన ఎన్నో లాభాలు ఉన్నాయని, ఎన్నో రుగ్మతలను పోగొట్టి జీవితాన్ని ఆనందమయం చేస్తుందని రకరకాల ఆధునిక పరిశోధనలు అన్నీ చెప్తున్నాయి. ఎన్నో ప్రభుత్వాలు కూడా సెక్స్ విజ్ఞానాన్ని ప్రచారం చేస్తున్నాయి. మన ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అత్యంత ప్రధాన సమస్యలలో ఈ కామం ఒకటి. ఇలాంటి పరిస్థితి, ఒక రకంగా మానవ జాతి దౌర్భాగ్యం. కామం అంటే అందరికీ ఆసక్తే - కానీ బయట పడరు! మహా గుప్తులు !

✪ తమ పుట్టుకకి మూలమైన "కామం" అనబడే "సృష్టి కార్యం" గురించి తెలుసుకోకుండా మానవుడు ఇతర పనికిరాని అనేక విషయాల పైన పరిశోధన చేస్తున్నాడు. అమూల్యమైన కాలాన్ని, ఎంతో సంపదను దుర్వినియోగం చేస్తున్నాడు.

కామం నుండే మనిషి పుడుతున్నాడు. భౌతిక సుఖాలలో సెక్స్ సుఖం ఉత్కృష్టమైనది. మనిషికి బ్రతకడానికి గాలి, నీరు, తిండి, గూడు, నీడ, నిద్ర ఎలా అవసరమో అలాగే సెక్స్ కూడా అంతే అత్యవసరం. మనిషికి ప్రాథమికంగా అత్యవసరమైన వాటిలో సెక్స్ ప్రధానమైనది. మానవజాతికి

ఉన్న అత్యధిక రుగ్మతలకు మూల కారణం సెక్స్ ఆనందం లోపించడమే. ఒక స్త్రీకి గానీ, పురుషుడికి గానీ సరి అయిన విధంగా వారికి సంతృప్తి కలిగే విధంగా సెక్స్‌ను అందిస్తే వారు మానసికంగా శారీరకంగా ఎంతో ప్రశాంతతను, ఆనందాన్ని పొందుతారు. ప్రశాంతంగా ఆనందంగా ఉన్న వ్యక్తి సమాజానికి, దేశానికి, లోకానికి హితంగానే ఉంటాడు, అలాంటి వ్యక్తి బహు శ్రేయస్కరంగానే పరిణమిస్తాడు.

సెక్స్ అనేది ఒక సహజమైన విషయం. అతడికి ఆకలి అయ్యింది, అతడికి నిద్ర వచ్చింది అనే విషయాలు ఎంత సాధారణమైనవో అతడికి లేక ఆమెకు సెక్స్ కోరిక కలిగింది అనే విషయం కూడా అంతే సాధారణమైనది. సెక్స్ అనేది ప్రకృతి పరమైన విషయం. సహజమైన విషయం. ఇందులో సిగ్గు పడాల్సిన విషయం కానీ, దాచి పెట్టాల్సిన అవసరం గానీ ఏముంది నిజానికి ?!

✪✪✪ ఏ కార్యం ద్వారానైతే మీరు పుడుతున్నారో, ఏ కార్యం ద్వారా మిమ్మల్ని పుట్టించిన వారు పుట్టారో, ఏ కార్యం ద్వారా అందరూ పుడుతున్నారో, మనిషి మనుగడకు ఏ కామం మూలాధారమో దాని గురించి సిగ్గు పడడం అనేది - నిజంగా సిగ్గు పడాల్సిన విషయం.

కామాన్ని అర్థం చేసుకోక పోవడం అత్యంత శోచనీయమైన విషయం. మానవుడు ముందు అవగాహన చేసుకోవాల్సిన విషయాలు ఏమైనా ఉన్నాయి అని అంటే అందులో ప్రప్రథమమైనది కామమే, తన జన్మ కార్యమే !

ఆధ్యాత్మిక విజ్ఞాన ప్రపంచానికి రాజధాని భారతదేశం. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రాచీన కాలం నుండి విరాజిల్లుతూ ఉంది భారతదేశం. ఎందరో పరమ గురువులు ఈ దివ్య భూమిపై అవతరించి మానవులు సులభంగా "సాఫల్యాన్ని" పొందే మార్గం చూపారు. మానవుడు "సాఫల్యం" పొందాలంటే అతడు పొంది తీరవలసినవి నాలుగు పురుషార్థాలు, అవి : 1. ధర్మం 2. అర్థం 3. కామం 4. మోక్షం అని ఏనాడో ప్రకటించారు ఆ పరమ గురువులందరూ. ఈ విషయం జగమెరిగిన సత్యం. శాస్త్రాలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి.

పురుషార్థాల గురించి వాత్స్యాయన మహాత్ముడు ఇలా చెప్పాడు.

శ్లో॥ భవంతి చాత్రశ్లోకాః, ఏవమర్థం చ కామంచ ధర్మంచోపాచన్నరః
ఇహముత్ర చ నిశ్శల్య మత్యంతం సుఖమశ్ను తే - (2 : 48)

అంటే మానవులందరూ అర్థ, కామ, ధర్మాలను మూడింటినీ విధిగా సేవించాలి. దివ్య భావనతో, జాగ్రత్తగా, శ్రద్ధగా వీటిని సేవించడం వలన ఇహంలోనూ, పరంలోనూ కూడా ఉత్తమ సుఖ సంతోషాలు

ప్రాప్తిస్తాయి.

శ్లో॥ కింస్యాత్పరత్రేత్యాశంకా కార్యేయస్మిన్నజాయతే,
న చార్థఘ్నం సుఖం చేతి శిష్టాస్తత్ర వ్యవస్థితాః - (2 : 49)

శ్లో॥ త్రివర్గ సాధకం యత్స్యాద్ద్వయోర్వై కస్య వా
పునః, కార్యం తదపి కుర్వీత న త్వేకార్థం ద్విబాధకం. - (2 : 50)

- వాత్స్యాయన కామసూత్రాలు - రెంటాల గోపాలకృష్ణ,
ప్రకాశకులు : నవసాహితి బుక్ హౌస్, ఫోన్ : 0866 - 243 2885

అంటే - ధర్మార్థ కామాలకు భంగం వాటిల్లే పనులు ఏవైనా సరే చేయకూడదు. ధర్మార్థ కామాలకు భంగం వాటిల్లని, అనుకూలమైన పనులే ఎల్లప్పుడూ చేయాలి. చరిత్ర తెలిసిన వారూ, శిష్టులూ ఇలాగే చేస్తారు.

త్రివర్ణాలైన ధర్మార్థ కామాలు మూడింటికి కానీ, లేక ఈ మూడింటిలో ఏ రెండింటికైనా కానీ, లేదా ఏ ఒక్క దానికైనా సరే సాధనంగా ఉండే పని ఏదైతే ఉంటుందో అదే పని మాత్రమే అందరూ చేయాలి. అంతే కానీ పురుషార్థాలకు సాధకం కాని పని ఎన్నడూ చేయరాదు. ధర్మార్థ కామాల్లో దేనికైనా వ్యతిరేకం అయినా లేక బాధించే ఒకే పురుషార్థాన్ని ఎన్నడూ సేవించకూడదు.

మొత్తానికి మొత్తంగా వాత్స్యాయన మహానుభావుడు ప్రకటించిన విషయం ఏమిటంటే మొత్తం నాలుగు పురుషార్థాలను సేవించాలి. దేన్నీ కూడా నిర్లక్ష్యం చేయరాదు అని !

✪ మానవుడి సాఫల్య యాత్రా రథానికి నాలుగు చక్రాలు, ఈ నాలుగు పురుషార్థాలు. నాలుగు చక్రాలు సరిగా ఉంటేనే యాత్ర సరిగా సాగుతుంది. చివరకి సార్థకత లభిస్తుంది. ఇందులో ఏది లోపించినా జన్మ సార్థకం కాదు.

ఈ పరమ పవిత్రమైన సెక్స్ అనే పురుషార్థం ప్రస్తుతం ఎలా రూపు దాల్చి ఉందీ అంటే వర్ణించడానికి భాషలు సరిపోవేమో అని అనిపిస్తుంది. కామ శాస్త్రము అనే సృష్టి శాస్త్రం, పాప శాస్త్రంగా ఎలా రూపు దాల్చింది ?!

ఈ సెక్స్ అనబడే పురుషార్థం ప్రస్తుతం ఎలా చెలామణి అవుతుందంటే, ఒక బరువు దించుకునే కార్యక్రమంగా, గుడ్డెద్దు చేనులో పడినట్టుగా !

✪ మానవ జన్మ ఎత్తిందే మోక్షం కోసం ✪

✪ మోక్షం అంటే విముక్తి అని అర్థం. జాగృతి అని అర్థం. దైవమే అయి ఉన్నవాడు దైవంలో,

దైవంలా తిరిగి మేల్కోవడం అని అర్థం. తన నిజ తత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవడం అని అర్థం. ముక్తి మూడు స్థాయిలలో మూడు రకాలుగా ఉంటుంది. భౌతికం, మానసికం మరియు ఆధ్యాత్మికం ఈ మూడు స్థాయిలలో అన్ని బంధనాలలో నుండి బయట పడటమే విముక్తి లేదా మోక్షం.

కామం అంటే ఏదైనా ఒక కోరిక అని అర్థం : అది ఏదైనా సరే, కోరికను కామం అని అంటారు. ఉదాహరణకు కీర్తి కాముకుడు అంటే కీర్తిని కోరేవాడని అర్థం. కీర్తిని కోరడమంటే "కీర్తి అనే అమ్మాయిని కాదు", కీర్తి అంటే fame. తను ఫేమస్ కావాలని కోరుకునేవాడు. ఇలా భౌతిక పరమైన అన్ని కోరికలలో పరాకాష్ఠ కామం అనే కోరిక. మానవుడికి ఎన్నో కామనలు(కోరికలు) ఉంటాయి. వీటన్నింటినీ తీర్చుకుంటేనే అతడు వాటి నుండి విముక్తుడవుతాడు. ముక్తుడవటమంటే తీర్చుకోవడమే. తీర్చుకోవడం అంటేనే వాటి నుండి విడుదల కావడం. భౌతిక పరమైన అన్ని కోరికల నుండి ఎలాగోలా విడుదల అయినా ఈ సెక్స్ అనే విషయం దగ్గర మాత్రం చిక్కుకుపోతున్నాడు మనిషి. ఈ సెక్స్ పట్ల సరి అయిన అవగాహన లేక మనిషి ఇక్కడ ఆగిపోతున్నాడు. ఇక్కడ, ఈ సెక్స్ అనే విషయం దగ్గర గనక మనిషి క్లియర్ అయితే తర్వాత డైరెక్ట్‌గా మోక్షమే ! అందుకే "కామి గాని వాడు మోక్షగామి కాడు" అని అన్నారు. సరిగ్గా మానవుడు ఈ పాయింట్ దగ్గర stuck అయి ఉన్నాడు. ఈ కామం అనే పురుషార్థాన్ని పొందడానికి ప్రధాన అడ్డంకి ధర్మం లోపించడమే, ఆత్మ విజ్ఞానం లోపించడమే. ఆత్మ విజ్ఞానం మనిషికి అవగాహనని ఇస్తుంది. అవగాహన మనిషికి ద్వారాలు తెరుస్తుంది. మనిషికి కావాల్సినవన్నీ అందిస్తుంది. ప్రతి ఒక్కరు ఈ కామం అనే పురుషార్థాన్ని అవగాహన చేసుకుని అందులో నుండి బయట పడాలి. అప్పుడే మోక్షం.

ఈ కామం అనేది ఒక మూసి ఉన్న పిడికిలి లాంటిది ! అందులో ఏమీ లేదు. తెరిస్తే శూన్యమే !! కానీ మూసి ఉండే సరికి దానికి చెప్పలేనంత ఆకర్షణ. ఈ ఆకర్షణ అంతా తెలియనందుకే. ఆకర్షణ యొక్క మూలం ఉంది "అందుబాటులో లేకపోవడం" అనే దానిలో ! ఒక్కసారి అది "సరి అయిన దారిలో అందుబాటులోకి" వస్తే దాని ఆకర్షణ అంతా తగ్గిపోతుంది. ఆ విషయం ఇక సాధారణం అయిపోతుంది. రాచ మార్గం మూసినందుకే, గేట్లు మూసినందుకే గోడలు దూకుతున్నారు. గేట్లు తెరిచి ఉంటే ఎవరు కూడా గోడలు దూకమన్నా దూకరు. మహాత్ముడు ఖలీల్ జిబ్రాన్ ఇలా అంటాడు. "అసలు ఈ చెడంటే ఏమిటి ? తన ఆకలి దప్పికలో హింసించబడిన మంచి కాదా ?" అని !

కామం అనే పురుషార్థాన్ని సరిగా అవగాహన చేసుకోలేక పోవటం వలన మానవాళి ఎంతగానో తీవ్రమైన నష్టానికి గురి అవుతూ ఉంది. ఇక ఈ నష్టాన్ని ఆపి వేయాలి ! ఇక చాలు ! నష్ట పోయింది చాలు మన భవిష్యత్ తరాలకు సరి అయిన, ఆరోగ్యకరమైన, అందమైన భవిష్యత్తును అందించాల్సిన కనీస బాధ్యత మనందరిదీ !

మానవ జన్మకు మూలం కామం. అందుకే అది పురుషార్థం అయింది. కాబట్టి మానవుడు తన ఉనికి మూలమైన దానిని సరి చేసుకుంటే అన్నీ బాగుపడిపోతాయి. ఆత్మ విజ్ఞానం + ధ్యానం ద్వారా మాత్రమే మూలం సరి అవుతుంది.

✪✪✪ మానవుడు జన్మనెత్తింది చతుర్విధ పురుషార్థాలైన "ధర్మార్థ కామ మోక్షాలను" సాధించటానికే. ఈ నాలుగింటిని పొందడానికి మిగతావన్నీ మాధ్యమాలు. అంతిమ లక్ష్యం ఈ నాలుగు పురుషార్థాలే ! ఉదాహరణకు చదువు, వృత్తి, ఉద్యోగం, వ్యాపారం, కళలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయ సంస్కారాలు, సంస్కృతీ అన్ని కూడా మానవుడి కోసమే ఉన్నాయి, వీటి కోసం మానవుడు కాదు. ఈ సత్యాన్ని మనం గుర్తు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

చదువు కోసం, ఉద్యోగం కోసం, వృత్తి వ్యాపారాల కోసం ఇతర కార్యక్రమాల కోసం ఆత్మ మానవ దేహం ధరించలేదు. మానవ జన్మ లక్ష్యం చతుర్విధ పురుషార్థాలను సాధించి "సాఫల్యం" పొందడమే. ఈ "సాఫల్యం" పొందడం కోసం మధ్యలో వీటిని ఉపయోగించుకోవాలి కానీ ఇవే లక్ష్యాలు కాదు. కానీ ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది అంటే...

"సాఫల్యం" ఊసే లేదు. పుట్టినప్పటి నుండి యాంత్రిక జీవన పోరాటం. 30 ఏళ్ళు నిండేదాకా చదువులే సరిపోతున్నాయి. చదువులయ్యాక సెటిల్‌మెంట్ ప్రయత్నాలు ఆ తర్వాత పెళ్ళి ప్రయత్నాలు, ఎప్పటికో పెళ్ళి. దాదాపుగా జీవితంలో మూడొంతులు దాటిన తరువాత పెళ్ళి. అంతకు ముందు ఎవరికీ చేసుకునే ధైర్యం రావట్లేదు. ఎందుకంటే, ఎలా బ్రతుకుతాం ? సెటిల్‌మెంట్ ఏది ? అని భయపడుతూ ఉన్నారు. ఇది నిజమే కానీ యవ్వనంలోకి అడుగు పెట్టిన తర్వాత, యుక్త వయస్సు వచ్చిన తర్వాత మానవుడికి కామం అత్యవసరం. కామం ఒక ఆహారం. శరీర పోషణకు భౌతిక పరమైన ఆహారాలు ఎంత ముఖ్యమో కామాహారం కూడా అంతే ముఖ్యం. శరీరానికి భౌతిక ఆహారం శక్తి సామర్థ్యాలను ఇచ్చినట్టే కామం కూడా మనిషికి శక్తి సామర్థ్యాలను ఇచ్చి మనిషి పురోగతికి ఎంతగానో తోడ్పడుతుంది. ఇది జగమెరిగిన సత్యం ! ఆహారం అంటే కేవలం ఇడ్లి, వడ, బిర్యానియే కాదమ్మా, ఆహారం అంటే శక్తి. ఈ శక్తి ఎన్నో రూపాలలో, ఎన్నో రకాలుగా ఉంటుంది. ఆలోచన కూడా ఒక ఆహారం. మీకు ఏదైనా ఉత్తేజకరమైన ఆలోచన రాగానే మీకు ఉత్సాహం కలుగుతుంది. ఆలోచన అనే శక్తి ద్వారానే సృష్టిలో అన్ని కార్యాలు సంభవిస్తున్నాయి. మీరు ఏదో ఒక వినోద ప్రదర్శనకు వెళ్తారు.

అక్కడ హాయిగా నవ్వుతారు, ఎంజాయ్ చేస్తారు, దాని ద్వారా ఎంతో శక్తి వస్తుంది. అదే విధంగా కామం ద్వారా కూడా శక్తి వస్తుంది. మనిషికి ఆహారం ఎన్నో రకాలుగా ఉంటుంది. వాటిలో రెండింటి గురించి తెలుసుకుందాం ఒకటి అన్నం, రొట్టె, పలావు లాంటివి, రెండు కామాహారం. ఈ రెండు ఆహారాలు మనిషికి అత్యంత అవసరం, అందుకే కామం యొక్క దివ్య శక్తిని గుర్తించి ప్రాచీన కాలంలోనే భారతదేశంలో "కామ విజ్ఞాన శాస్త్రం" ఆవిర్భవించింది. దీనికై ఎందరెందరో మహానుభావులు కృషి చేసారు. ప్రధానంగా వారిలో చెప్పుకోదగిన మహానుభావుడు "వాత్స్యాయనుడు". కామం పురుషార్థం, కామం దివ్య శక్తిని అందిస్తుంది.

✪✪ వాత్స్యాయనుడి హెచ్చరిక ! ✪✪

"శరీరస్థితి హేతుత్వాదాహార సధర్మాణో హి కామాః"

- వాత్స్యాయన కామ సూత్రాలు - 2 - 45

ఈ సూత్రం యొక్క వివరణ ఏమిటంటే, లైగింక జీవితం సరైన సమయంలో ప్రారంభమై, సాఫీగా సాగక పోతే అనారోగ్యం తప్పదని వాత్స్యాయనుడు హెచ్చరిక చేశాడు. శరీరానికి తిండి ఎంత అవసరమో కామం(సెక్స్) కూడా అంతే అవసరం అని ప్రకటించాడు. నిత్యం ఆహారం తీసుకుంటున్నట్టే, కామాన్ని కూడా సేవించి తీరాలి అని చెప్పాడు. ప్రకృతి పరమైన, సహజ కామ కోరికలను అణుచుకుంటే పిచ్చి, మతి భ్రమణం మొదలైన వ్యాధులు వస్తాయని తెలియజేసాడు.

✪✪✪ యవ్వనంలోకి వచ్చిన యువతీ యువకులు పడే బాధలు వర్ణనాతీతం. అత్యంత దుర్భరం. ఎంత వ్యథను, క్షోభను, భాధను, దుఃఖాన్ని, నరకాన్ని అనుభవిస్తూ ఉంటారో తలచుకుంటేనే హృదయం కకావికలం అయిపోతుంది. ఎవరికీ చెప్పుకోలేక, కోరికలు తీరే మార్గం లేక, ప్రకృతి సహజ సిద్ధమైన కామాన్ని ఏమీ చేయలేక, తప్పనిసరై బలవంతంగా అణిచివేస్తూ

(Suppress) భయంకరమైన చిత్రవధను అనుభవిస్తూ ఉంటారు. ఈ అణచివేతలు అనేకానేక మానసిక రుగ్మతలకు దారి తీస్తాయి. ఈ మానసిక రుగ్మతలకు, జాడ్యాలకు, ఉద్రిక్తలకు, అల్లకల్లోలాలకు, అనారోగ్యాలకు, అశాంతులకు, నిరాశా, నిస్పృహకు, అసంతృప్తులకు దారి తీస్తాయి. ప్రస్తుతం నీ(మీ) పరిస్థితి అదే కదా !

✪✪✪ మానవ చైతన్యం పట్ల సరి అయిన అవగాహన లేక కోరికలను అణిచి వేయండి అని కొందరు అంటూంటారు. అంటే గోటితో పోయే దాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవడమే. అణిచివేయడం అంటే అక్రమంగా వృద్ధి చేయడమే. శీలతను అణిచినప్పుడే అది అశ్లీలతగా మారుతుంది. "అశ్లీలతకు మూలం అణిచివేతనే" ! ప్రపంచ శ్రేయస్సు కోరే వారంతా కలిసి ఏదైనా "సరైన" శాశ్వత పరిష్కారం కనిపెట్టాలి. ప్రజలు, ముఖ్యంగా యువత ఈ "అక్రమ కామం" బారిన పడకుండా కాపాడాలి. ✪ నాకు తెలిసీ, "ఆత్మ విజ్ఞానం" ఒక్కటే మనిషిని ఈ ఉపద్రవం బారి నుండి రక్షిస్తుంది. " సరైన మతరహిత అత్యున్నత ఆత్మ విజ్ఞానం" ఒక్కటే ఈ భూమిపై నుండి "అశ్లీలతను" శాశ్వతంగా తీసివేస్తుంది.

✪ దయచేసి గ్రహించండి ! కామం ప్రకృతి శక్తి !! ప్రకృతి

శక్తిని మానవులు ఎలా నిలువరించ గలుగుతారు ?! ప్రకృతిని ఇప్పటి వరకు ఎదిరించ గలిగారా ఎవరైనా ? ప్రకృతి శక్తిని అవగాహన చేసుకోవాలి. అవగాహన ద్వారా మాత్రమే సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది.

✪ కామం జీవిత అవసరం ! కామమే జీవితం కాదు ! కామం జీవితంలో ఒక అత్యంత అవసరమైన ముఖ్య భాగం అంతే ! ఈ కామం అనే పురుషార్థం గురించి మనం శ్రద్ధతో, విశాలమైన దృక్పథంతో, విజ్ఞాన పరమైన కోణంలో ఆలోచించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కామం అంటే సృష్టి కార్యం ! ఒక ఆత్మ(అంశాత్మ) తనను తాను పరిపూర్ణం చెందించుకోవడం కోసం భూమి పైకి రావాలంటే తప్పని సరిగా భౌతిక దేహాన్ని ధరించవలసి ఉంటుంది. ఒక అంశాత్మ పూర్ణాత్మగా మారడానికి సహకరించే దివ్య ఉపకరణమే భౌతిక దేహం. భూమి మీదకు రావడానికి సిద్ధంగా ఉన్న ఒక ఆత్మ కోసం భౌతిక దేహాన్ని తయారు చేయడమే, సెక్స్ చేయడమంటే. ఇంతటి పరమ పవిత్రమైన దివ్య కార్యక్రమానికి పూనుకోవడమే రతిలో పాల్గొనడం. ఒక అంశాత్మ యొక్క పరిణామ క్రమంలో సహకరించే మహా కార్యమే రతీ కార్యం. ఒక స్త్రీ, ఒక పురుషుడు సంయోగం చెందడం అంటే ఒక అంశాత్మ యొక్క అభివృద్ధికి తోడ్పడడమే ! సృష్టి కార్యంలో తమ వంతు పాత్ర తాము నిర్వహించడమే ! ఒక ఆత్మను భూమి పైకి ఆహ్వానించే దివ్య కార్యక్రమమే సంభోగ కార్యక్రమం.

స్త్రీ, పురుషులు ఎలాంటి "భావంతో" సంయోగం చెందుతారో అలాంటి ఆత్మలే వారి వైపు ఆకర్షించబడతాయి. ఎందుకంటే "యద్భావం తద్భవతి" కదా ! ఇక్కడ మరొక విశ్వ సూత్రం కూడా పని చేస్తుంది అదేమిటంటే,"పరస్పరం సారూప్యం గలవి ఆకర్షించబడతాయి - Like Attracts Like", ఈ సూత్రాన్ని రిచర్డ్ బాక్ అనే మహాత్ముడు "Illusions" అనే పుస్తకంలో చెబుతాడు. సంయోగంలో పాల్గొనే స్త్రీ, పురుషులు ఎలాంటి భావం కలిగి ఉంటే అలాంటి భావాలు కలిగిన ఆత్మలు వారి వైపు ఆకర్షించబడి జన్మ తీసుకుంటాయి. ఉన్నతమైన భావాలను కలిగి పవిత్రమైన భావంతో సంయోగం చెందితే "ఉన్నతమైన పవిత్ర ఆత్మలే" జన్మిస్తాయి. ఇందుకు ఉదాహరణగా ఒక కథ ప్రాచుర్యంలో ఉంది.

మహా భారత కథకు మూల స్తంభం లాంటి వాడైన భీష్ముని తండ్రి గారైన శంతనుడి రెండవ భార్య, దాశ రాజు కుమార్తె సత్యవతి. ఈమెకు చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడు అనే ఇద్దరు కొడుకులు. శంతనుడి మరణం తర్వాత కొంత కాలానికి చిత్రాంగదుడు కూడా మరణిస్తాడు. తన తమ్ముడైన విచిత్ర వీర్యుడికి అంబిక, అంబాలిక అనే కన్యలను తెచ్చి వివాహం జరిపిస్తాడు భీష్ముడు. అంబను కూడా తెస్తాడు కానీ ఆమె అంతకు ముందే వేరే వ్యక్తిని ప్రేమించినందున తిరిగి పంపించేస్తాడు. విచిత్ర వీర్యుడు సంతానం కలుగక ముందే మరణిస్తాడు. ఆ పరిస్థితులలో కురు వంశానికి వారసులు లేకుండా పోతారు. భీష్ముని సవతి తల్లి అయిన సత్యవతి భీష్ముడిని పెళ్ళి చేసుకోమని కోరుతుంది. అయితే ప్రతిజ్ఞా బద్ధుడైన భీష్ముడు సవతి తల్లి కోరికను సవినయంగా తిరస్కరించి, వంశం కొనసాగేందుకు ఉపాయాన్ని సూచిస్తాడు. భీష్ముడి సూచనతో సత్యవతి తనకూ పరాశరుల వారికి సద్యోగర్భమున జన్మించిన వ్యాసుడిని తలుచుకుంటుంది. వ్యాసుడు వచ్చి తల్లి కోరిక మేరకు తన సోదరుడు - విచిత్ర వీర్యుని భార్యలైన అంబికకు, అంబాలికకూ ఆపద్ధర్మాన్ని అనుసరించి గర్భదానం చేస్తాడు.

ఈ గర్భదానం చేసే సమయంలో అంటే సంయోగ సమయంలో అంబిక భయంతో కళ్ళు మూసుకుందట ! అందుకే ఆమెకు ధృతరాష్ట్రుడు అంధుడిగా జన్మించాడట. ఇక అంబాలిక భయంతో పాలిపోయి సంయోగంలో పాల్గొన్నదట, అందుకే ఆమెకు పాలిపోయిన వర్ణంతో పాండు రాజు జన్మించాడట. ఇదీ కథ ! ఈ పురాణ గాథ వలన మనం నేర్చుకోవాల్సిన విషయం ఏమిటంటే సంయోగం సరి అయిన భావంతో చేయాలని మరి సరైన భావంతో సంయోగం చెందాలంటే సంయోగ కార్యమైన కామం(Sex) పైన సరి అయిన భావం

కలిగి ఉండాలని ఈ పురాణ గాథ మనకు బోధిస్తుంది.

✪ వ్యాసుడితోనే ఎందుకు గర్భదానం చేయించడం అని అంటే, వ్యాసుడు మహా "ఆత్మ విజ్ఞాని". ఆత్మ విజ్ఞానులతో సంయోగం చెందితే ఎంతో ఆత్మాభివృద్ధి, ఎన్నో లాభాలు కలుగుతాయి. ప్రాణ శక్తి పెరుగుతుంది. శక్తుల బ్యాలెన్స్ జరుగుతుంది. సంయోగం ద్వారా మాత్రమే ఉత్తేజితం అయ్యే "ఆధ్యాత్మిక సూక్ష్మ నాడీ వ్యవస్థ" ఉత్తేజితమై ఉన్నత స్థాయి ఆధ్యాత్మిక ప్రకంపనలను స్వీకరించే స్థితి వస్తుంది. ఎన్నో రుగ్మతలు తొలగి పోతాయి. ఆత్మ విజ్ఞాని ఎంతో పవిత్రంగా ఉంటాడు కాబట్టి వారితో సంయోగం వలన ఎన్నో కర్మలు తొలగి పోతాయి. ఆత్మ విజ్ఞాని సంయోగంలో సార్థకత లభిస్తుంది. ఉన్నత ఆత్మలు సంతానంగా లభిస్తారు. అయితే అంబిక, అంబాలిక లాగా చేయకుండా "దివ్య భావనతో" సంయోగం చెందితేనే ఫలితాలు ఇంకా బాగా వస్తాయి.

✪ ఒక స్త్రీ ఆత్మ విజ్ఞాని అయినపుడు, పురుషుడు సాధారణ స్థాయిలో ఉన్నవాడైతే పురుషుడికి లాభం జరుగుతుంది. పురుషుడు ఆత్మ విజ్ఞాని అయినపుడు, స్త్రీ సాధారణ స్థాయిలో ఉంటే స్త్రీకి లాభం జరుగుతుంది. ✪ జాగ్రత్త !!! రతీ కార్యక్రమం అంటే శక్తుల ట్రాన్స్‌ఫర్ జరుగుతుంది. సరి అయిన భాగస్వామిని ఎంచుకోకపోతే "వ్యర్థ శక్తులు" ప్రవేశించే అవకాశం ఉంది.

స్త్రీ, పురుషులు ఇరువురు ఆత్మ విజ్ఞానులు అయితే ఆ కలయిక దివ్యంగా ఉంటుంది. ఎంతో శ్రేయస్కరం జరుగుతుంది.

ఎవరైనా దంపతులు కామ కార్యం పైన పవిత్ర భావం కలిగి, మహోన్నత ఆత్మ విజ్ఞాన అవగాహనతో, సంపూర్ణమైన ఇష్టం ప్రేమతో సంయోగంలో పాల్గొంటే అత్యుత్తమమైన, కోరుకున్న సంతానాన్ని పొందవచ్చు. స్త్రీ, పురుషులు ఇరువురు ఒకరినొకరు పూర్తిగా ఇష్టపడాలి, ప్రేమించాలి. ఆత్మ విజ్ఞానం ద్వారా కలిగిన అవగాహనతో, దివ్య భావనతో సంయోగం చెందాలి అప్పుడు ఉన్నతమైన, పవిత్రమైన

సంతానాన్ని, కోరుకున్న సంతానాన్ని మాత్రమే వారు పొందుతారు.

అత్యుత్తమ సంతానానికై స్త్రీ, పురుషులిరువురికి కామం అనే పురుషార్థం పట్ల అపరాధ భావన ఉండకూడదు. ఇది తప్పు. ఇది తప్పు. ఇది కేవలం శారీరక వాంఛ, ఏదో రెండు నిమిషాలు కళ్ళు మూసుకుంటే ఒక పని అయిపోతుంది, అనే చులకన భావంతో ఉండరాదు.

పరమ పవిత్రమైన, అత్యుత్తమమైన, అత్యున్నతమైన మహా ఆత్మలను సంతానంగా పొందాలి అంటే కామం దివ్యం అనే భావన కలిగి ఉండాలి. పరస్పరం గౌరవ, ప్రేమ, ఇష్టాలను కలిగి ఉండాలి. ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆనందంగా పవిత్ర భావనతో సంయోగం(Sex)లో పాల్గొనాలి. ఇక అప్పుడు మహా గొప్ప సంతానాన్ని మీరు కోరుకున్న విధంగా పొందుతారు.

సరి అయిన విధంగా, సరి అయిన భాగస్వామితో సంభోగిస్తే చక్కటి ఆరోగ్యం ప్రాప్తిస్తుంది. ఇరువురి శక్తి క్షేత్రాలు తేజోవంతం అవుతాయి. ప్రాణ శక్తి ప్రవృద్ధం అవుతుంది.

దేహంలో కొన్ని అత్యంత సూక్ష్మ నాడులు ఉంటాయి. ఈ సూక్ష్మ ఆధ్యాత్మిక నాడీ వ్యవస్థ సంయోగం ద్వారా ఉత్తేజితం అవుతుంది. అప్పుడు ఉన్నతమైన, ఉత్తమమైన ఆధ్యాత్మిక ప్రకంపనలను పొందే శక్తి సామర్థ్యాలు పెంపొందుతాయి. కామం దివ్య తలాలకు వారధి ! అయితే సరి అయిన రీతిలో, సరి అయిన భాగస్వామితో మాత్రమే !

ఇక నీ భర్త యొక్క శీఘ్ర స్ఖలన సమస్య దగ్గరికి వస్తే, దాని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఏ మాత్రమూ లేదు. ఆదర బాదరగా చేయడం వల్ల, టెన్షన్‌ల వల్ల, ఆతృత వల్ల శీఘ్ర స్ఖలనం జరుగుతుంది. అంతే ! దీనిని తక్షణమే సరి చేసుకోవచ్చు భయపడకండి.

✪✪✪ కామానికి సంబంధించి పూర్తి స్థాయి తప్పుడు సమాచారం, ప్రస్తుతం సమాజంలో ప్రచారమై ఉంది. అందులో ఒకటి "పురుషుడికి త్వరగా అయిపోతుంది" అనేది

ప్రధానమైనది. ఇది తప్పు. వాస్తవానికి సాక్షాత్ మూల చైతన్య స్వరూపుడైన మానవుడు అనంతమైన కామ శక్తిని కలిగి ఉంటాడు. ఉధృతంగా, పూర్తి తమకంగా, ఉత్సాహంగా, ఉత్తేజంగా, ఉల్లాసంగా, తనివి తీరా ఎంత సేపు అతను చేయాలనుకుంటే అంత సేపు చేయగల సత్తా, శక్తి సామర్థ్యాలు ప్రతీ పురుషుడికీ ఉంటాయి. నాకు ఉన్నాయి అని ఒప్పుకుని, నాకున్నాయి అని భావిస్తే అవి వెంటనే అందుబాటులోకి వచ్చేస్తాయి. ఆత్మ విజ్ఞానం లేక పోవటం వలన ఇవి అజ్ఞానం చేత కప్పబడి ఉంటాయి.

శీఘ్ర స్ఖలన సమస్యకు + అంగ స్తంభన సమస్యకూ ఆధ్యాత్మిక శాస్త్ర పరమైన కారణాలు కొన్ని ఈ విధంగా ఉంటాయి.

1. మీరిద్దరూ సెక్స్‌కు, సెక్స్ వలన వచ్చే ఆనందానికి వ్యతిరేకంగా ఉన్నారు. ముందు ఈ సత్యాన్ని మీరు గ్రహించి తీరాలి. మనం దేనికైనా దూరం అయి బాధ పడుతున్నామంటే, మన లోపల దాని పట్ల వ్యతిరేకతను కలిగి ఉన్నట్టే అని అర్థం. మన లోపల మనం దేనినైతే వ్యతిరేకిస్తూ ఉంటామో అది మనకు దక్కదు. మనం దేనినైతే ఇష్టపడుతున్నామో అది మనం పొందుతాం. మనం ఇష్టపడే దాన్ని మనం కలిగి ఉంటాం. మీరిద్దరూ సెక్స్ ఆనందం లేక బాధపడుతున్నారు అని అంటే మీ అంతరంలో మీరిద్దరూ సెక్స్ ఆనందాన్ని వ్యతిరేకిస్తున్నారనేది స్పష్టం ! మీరు పడుతున్న బాధయే దానికి నిదర్శనం. నిరూపణ ! రుజువు ! సాలిడ్ సాక్ష్యం !

మన లోపాన్ని మనం స్వయంగా గుర్తించినప్పుడే అది అంతరించి పోతుంది - ఇది ఒక సూత్రం. కాబట్టి మీ లోపాన్ని మీరు అంగీకరించండి. ధ్యానంలో కూర్చుని " నేను సెక్స్ ఆనందానికి వ్యతిరేకంగా ఉన్నాను " అని ఒప్పుకోండి. సెక్స్ ఆనందం దూరం అవటం వల్ల నేను పడుతున్న బాధయే అందుకు నిదర్శనం. తెలియక, అజ్ఞానంతో సెక్స్ ఆనందానికి వ్యతిరేకమైన భావాలను కలిగి ఉన్నాను. ఇప్పుడు నేను నా లోపాన్ని గుర్తించాను అని విశ్లేషించుకుంటూ, మీ లోపాన్ని గ్రహించండి. నా పరిస్థితికి నేనే కారణం, ఈ పరిస్థితిని నేనే సృష్టించుకున్నాను కాబట్టి దీన్ని తక్షణమే తీసివేసే శక్తి + అధికారం నాకున్నాయి, అంటూ అవగాహన చెందుతూ ఉండండి. మీరు ఇలా చేస్తున్నప్పుడు మీ లోపల దాగి ఉన్న సెక్స్ ఆనందానికి వ్యతిరేకంగా ఉన్న భావనలు ఏదో ఒక రూపంలో కనపడతాయి. అప్పుడు ఏం కనిపించినా సరే ప్రేమగా, ఎరుకతో సాక్షిగా ఆ కనపడుతున్న దాన్ని దర్శించండి. ఎలాంటి ప్రతిక్రియ చేయకుండా, దాన్ని సాక్షిగా చూస్తూ ఉండండి. అంతే ! అది తక్షణమే శాశ్వతంగా క్లియర్ అయిపోతుంది. ఈ విషయం మీకు స్పష్టంగా తెలిసి పోతుంది. లోపల సమస్య క్లియర్ అయిపోగానే దాని ప్రభావం బయట మీకు వెంటనే కనపడడం ప్రారంభం అవుతుంది. ఆటోమెటిక్‌గా మీకు పరిస్థితులు పూర్తిగా అనుకూలించటం. మీకు బలమైన, శక్తివంతమైన పూర్తి స్థాయి సెక్స్ కోరికలు కలగటం. మీరు సెక్స్ ఆనందాన్ని హాయిగా, సురక్షితంగా, తనివి తీరా అనుభవించేందుకు అవసరమైన శక్తి + సామర్థ్యాలు

మరియు అవగాహన మీలో ఉత్తేజితం కావడం. మీరు సెక్స్ ఆనందాన్ని ఎంజాయ్ చేస్తూ జీవితంలో జీవించడం అనేది జరుగుతూ ఉంటుంది. మీరెంత కాలం అంటే అంత కాలం, మీరు పూర్తిగా సంతృప్తి చెందే వరకు, కావాలనుకుంటే జీవితాంతం కూడా సెక్స్‌ను ఎంజాయ్ చేయవచ్చు.

సెక్స్‌ను ఎంజాయ్ చేయడానికి మీరు, మీ లోపల అనుకూలంగా ఉండాలి. అంతే ! దీనికి వయసుతో సంబంధం లేదు. నిజానికి ఎంత పెద్ద వయసు అయితే అంత అవగాహన ఎక్కువగా ఉంటుంది కాబట్టి , మీరు మరింత ఎక్కువగా ఎంజాయ్ చేయవచ్చు. వయసు పెరుగుతున్న కొద్దీ శక్తి సామర్థ్యాలు తరిగి పోతాయనేది అసత్యం ! మీరు వందేళ్ళ వయసులోనైనా సరే మీరు సెక్స్ ఆనందానికి 100% అనుకూలంగా ఉంటే పాతికేళ్ళ వయసులో ఉన్న వారి కంటే ఉధృతంగా సెక్స్ చేయవచ్చు ! ఎంజాయ్ చేయవచ్చు !

సెక్స్ పట్ల సరి కాని విషయాలు మీ లోపల ఫీడ్ అయి ఉండటం వల్లనే ఈ బాధలన్నీ ! ముందు రాబోయే పేజీలలో సాధన గురించి ఇంకా బాగా వివరించాను. అయితే ముందు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని పూర్తిగా చదివి అర్థం చేసుకోండి.

2. సెక్స్ అవసరం అని అనుకోక పోవటం.

3. సెక్స్ పట్ల సరి అయిన భావన లేక పోవటం.

4. సెక్స్ పట్ల తప్పుడు సమాచారాన్ని ఫీడ్ చేసుకుని ఉండటం.

5. పురుష జాతి అహంకారం వలన స్త్రీల పట్ల చులకన భావం కలిగి ఉండటం. దీని వలన పురుషుడికి శీఘ్ర స్ఖలనం అయి, స్త్రీని సంతృప్తి పరచలేక తల దించుకోవాల్సి వస్తుంది. ఈ విధంగా పురుష జాతి అహంకారం నశిస్తుంది. నేను మగాడిని. నేను గొప్ప అనే మదం మరిగి ఆవిరై పోతుంది. అందుకే స్త్రీల పట్ల దివ్య భావనను కలిగి ఉండాలి. స్త్రీ పురుషులు ఇరువురూ సమానమే !

6. జడ్జ్‌మెంట్ ఒక కారణం. ఎవరినైనా హేళన చేయడం. ఈ జడ్జ్‌మెంట్ గురించి ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే వివరించాను ఒక సారి చదవండి.

7. ఈ జన్మలోనో, గత జన్మలలోనో తెలిసో తెలియకో సెక్స్‌కు సంబంధించి ఏవైనా సరి కాని పనులు చేసినప్పుడు, ఆ తర్వాత బాధ పడుతూ, "ఇక ఎప్పుడూ సెక్స్ చేయకూడదురా నాయనా" అనే నిర్ణయాలు తీవ్రస్థాయిలో తీసుకుని ఉండటం.

8. అపరాధ భావనలను మోస్తూ ఉండటం.

ఈ విషయాలన్నింటినీ బాగా అవగాహన చేసుకున్న తర్వాత అంగ స్తంభన + శీఘ్ర స్ఖలన సమస్యలకు ఈ కింది సాధన చేయండి. అయితే సాధన చేసే ముందు మీరు, మీ సెక్స్ ఆనందానికి

వ్యతిరేకంగా ఉన్నారని గ్రహించి ఒప్పుకోండి. సెక్స్ విషయంలో మిమ్మల్ని మీరు క్షమించు కోలేదని గ్రహించి ఒప్పుకోండి. మీ పట్ల మీకు ప్రేమ ఎరుక అవగాహనలు లేవని గుర్తించండి. ఇప్పుడు ఈ కింది సాధన చేయండి.

ప్రశాంతంగా కూర్చుని, కళ్ళు మూసుకుని, దృష్టిని మీ నుదుటి మధ్య భాగంలో శాంతంగా నిలిపి, మీ లోపల భావనాత్మకంగా అనుకుంటూ ఈ కింది సూత్రాన్ని సాధన చేయండి. సమస్య పూర్తిగా క్లియర్ అయ్యే వరకు సాధన చేస్తూనే ఉండాలి.

క్షమ ప్రేమ ఎరుక సరైన పూర్తి అవగాహన

ఏమీ దిగులు చెందకండి. మానసిక ఆందోళన అనేది ఉంటుంది. నేను కాదనను. కానీ మీరు ప్రయత్నం చేత ప్రశాంతమవ్వాలి. మీరెంత రిలాక్స్ అవుతే అంత శక్తిని పుంజుకుంటారు. మంచి ఉత్తేజ కరమైన పుస్తకాలు చదవండి. పాజిటివ్‌గా ఆలోచించండి. మీకు ఆనందాలను ఇచ్చే పనులను చేయండి. సాధ్యమైనంతగా ఆనందంగా ఉండండి. సురక్షితంగా ఫీలవ్వండి. ఏవైనా పెండింగ్ పనులుంటే వాటిని క్యిర్ చేసేయండి. మీ మనసులో ఎలాంటి భారం లేకుండా చేసుకోండి. ప్రేరణనిచ్చే మంచి సినిమాలు చూడండి. ఎటైనా అందమైన ప్రదేశాలకు వెళ్ళండి. ఉల్లాసంగా గడపండి. ఏవైనా ఆటలు ఆడండి. పేకాట కాదు. ఏవైనా గేమ్స్ ఆడండి. మొత్తానికి మిమ్మల్ని మీరు ప్రశాంత పరుచుకోండి. తపన, ఆత్రాలను మీ మనసులో నుండి పూర్తిగా తీసేయండి. నిశ్చింతగా ఉండండి. బాగా ధ్యాన సాధన చెయ్యండి. మిమ్మల్ని ఇబ్బంది పెట్టే మనుషులను కలవకండి. మీకు నచ్చని వాతావరణంలో ఉండకండి. మనసుకు నచ్చిన అకర్మ వీగన్ ఆహారాన్ని తినండి బాగా అలసి పోయేలా డాన్స్ చేయండి. ఈత కొట్టండి. దైవాలే మీరు. సాధన చెయ్యండి. కామ సిద్ధి ప్రాప్తిస్తుంది. అనంతమైన శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్న సాక్షాత్ మూల చైతన్య స్వరూపులే మీరు ! దిగులు పడకండి. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మొత్తం బాగా చదివి అవగాహన చేసుకోండి. చక్కగా ఇందులోని సూత్రాలను యథాతథంగా ఆచరించండి. 100% గ్యారంటీగా ప్రోత్సహిస్తున్నాను. విశ్వాసంతో ఉండండి. మీరు గనక శ్రద్ధతో సాధన చేస్తే అత్యంత త్వరలోనే మీ ఒరిజనల్ శక్తి సామర్థ్యాలను ఉత్తేజితం చేసుకుని "కామం" అనే పురాషార్థాన్ని సంప్రాప్తించుకుంటారు. "దివ్య కామాన్ని రతీ మన్మథులై తనివి తీరా ఆస్వాదించండి" !

రతీ మన్మథ భవ !

నీకూ, నీ భర్తకు మీ తల్లిదండ్రుల వలన సరి అయిన జ్ఞానం అందలేదు. అందుకే మీరు ఇలా బాధ పడుతున్నారు. ఏం చేస్తాం, అలా ఉంటారు తల్లిదండ్రులు కొంత మంది ! కనీసం మీరైనా మీ పిల్లలకు మతరహిత అత్యున్నతమైన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అందించి వారిని సరిగ్గా పెంచండి. ఆత్మ విజ్ఞానం లేని జీవితం జీవితమే కాదు. మీ పిల్లలకు నేర్పాలంటే మరి నీవు, నీ భర్త నేర్చుకోవాలి

కదా ముందు. కాబట్టి జరిగిన ఆలస్యం జరిగి పోయింది. ఇకనైనా ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసించడం మొదలు పెట్టండి. అందరికి పంచండి. ఆల్ ద బెస్ట్ !

❖ ❖ ❖

❷ **ప్రశ్న :** గురువు గారికి నమస్కారం. నాకు మెన్సెస్ టైమ్‌లో విపరీతంగా కడుపు నొప్పి రావడం, తలనొప్పి, నడుమునొప్పి రావడంతో పాటు ఆ సమయంలో డల్‌గా ఉంటుంది. ఇక నా రెండవ సమస్య ఏమిటంటే మాకు సంతానం లేదు అన్ని రకాల టెస్ట్‌లు చేయించాము. చాలా ఖర్చు పెట్టాము. చాలా రకాలుగా ప్రయత్నించాం. ఎక్కడా ఫలితం దక్కలేదు. రిపోర్ట్స్‌లలో ఇద్దరి కండీషన్ బాగానే ఉంది అయినా పిల్లలు కలగడం లేదు. దయచేసి మా సమస్యలకు పరిష్కారం చూపించగలరని ప్రార్థన.

- సికందరాబాద్

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఆత్మ పరిణామ క్రమంలో, ఆత్మ పరిపూర్ణత్వం సాధించడానికి కొన్ని జన్మలు స్త్రీగా, కొన్ని జన్మలు పురుషునిగా జన్మలు తీసుకుంటుంది. ఆత్మకు సెక్స్(లింగం) అనేది ఉండదు. ఆత్మ న్యూట్రల్‌గా ఉంటుంది. శరీరానికి మాత్రమే లింగభేదం ఉంటుంది. స్త్రీ శరీరమని, పురుష శరీరమని.

ఒక ఆత్మ స్త్రీగా జన్మ తీసుకోవడానికి ఎన్నెన్నో కారణాలు ఉంటాయి. ముఖ్యంగా సహనం, అణుకువ, ఒద్దిక, పొందిక, సర్దుకుపోయే తత్వం, సేవా తత్వం, ప్రేమానురాగాలను పంచి ఇచ్చే తత్వం, త్యాగం, మాతృత్వం మొదలైన గుణాలను అలవర్చుకునేందుకు స్త్రీగా జన్మ తీసుకోవడం జరుగుతుంది.

సహజంగా ఎక్కడో కొన్ని ఉన్నతమైన సమాజాలలో లేక ఉన్నతమైన కుటుంబాలలో తప్ప స్త్రీకి స్వేచ్ఛా సాధికారతలు ఉండవు. ఇది జగమెరిగిన సత్యమే.

ఎన్నో కట్టుబాట్ల మధ్య స్త్రీ జీవితం నిర్బంధంలో కొనసాగుతుంది, అన్నింటికి సర్దుకుపోవాల్సి వస్తుంది. పెద్దగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని స్త్రీ జన్మ అంటే స్త్రీలందరికీ ఒక కోణంలో అయిష్టతగానే ఉంటుంది. ఈ కారణంగానే స్త్రీ జన్మ తీసుకున్న చాలామంది స్త్రీలు, తమ "స్త్రీత్వాన్ని తమ అంతరంలో" సంపూర్ణంగా సమగ్రంగా స్వీకరించలేకపోతూ ఉంటారు. ఈ తిరస్కార ధోరణియే మెన్సెస్ టైమ్‌లో వచ్చే బాధలకు కారణమవుతుంది. ఇదిగాక ఇంకా కొన్ని కారణాలు ఉంటాయి. ధ్యాన సాధన - 3 లో మిగతా వివరాలుంటాయి, ఓ సారి చదువు. స్త్రీ శరీరంలో ఉంటూ స్త్రీత్వాన్నితిరస్కరిస్తూ ఉంటే ఒక సంఘర్షణ జనించియే తీరుతుంది. ఈ సంఘర్షణనే బాధ అనే

పేరుతో నీవు అనుభవిస్తున్నావు. ప్రకృతి పరంగా ఋతుక్రమం అనేది స్త్రీ శరీరానికి స్త్రీత్వాన్నిస్తుంది. ఒక బాలిక శరీరం, ఒక స్త్రీ శరీరంగా మార్పు చెందే ప్రకృతి పరమైన సహజమైన ప్రక్రియయే ఈ ఋతుక్రమము. స్త్రీ శరీరం క్షేత్రం లాంటిది. పురుషుని నుండి బీజాన్ని స్వీకరించి ఫలదీకరణం చెందించి ఫలాన్ని అందిస్తుంది, అంటే పునరుత్పత్తి చేస్తూ సృష్టిముందుకు కొనసాగడానికి ఉపయోగపడుతుంది. ఋతుక్రమం అనే ప్రక్రియనే, స్త్రీ శరీరాన్ని క్షేత్రంగా మారుస్తుంది. అప్పుడే ఆ యొక్క క్షేత్రానికి అంటే స్త్రీ శరీరానికి ఇంకో శరీరాన్ని పునరుత్పత్తి చేసే సామర్థ్యం వస్తుంది.

లోపల స్త్రీత్వాన్ని "తిరస్కరిస్తూ" ఉన్నప్పుడు శరీరానికి స్త్రీత్వాన్నిస్తున్న "ఋతుక్రమ ప్రక్రియను అడ్డుకున్నట్టే" అవుతుంది. మరి ఇదేమో ప్రకృతి పరమైన సహజమైన విషయం. ప్రకృతికి అడ్డుపడుతున్నందుకే ఆ బాధలు వస్తున్నాయి. ఇక రెండవ విషయం ఏమిటంటే స్త్రీత్వాన్ని స్వీకరించలేని నీవు, మాతృత్వాన్ని ఎలా స్వీకరించగలుగుతావు ? ప్రీతితో నీ స్త్రీత్వాన్ని నీవు స్వీకరించగలిగినపుడే నీకు మాతృత్వం సిద్ధిస్తుంది. నీవు తల్లివి కావాలనుకుంటే ముందు స్త్రీగా మారాలి కదా. స్త్రీ శరీరంతో జన్మ తీసుకున్నంత మాత్రాన అందరూ పరిపూర్ణమైన స్త్రీలు అయిపోలేరు. అవగాహనతో స్త్రీ జన్మ పట్ల ఇష్టం, ప్రేమను, సంతృప్తిని, ఆనందాన్ని ప్రకటించాలి. స్త్రీ జన్మలో ఉన్న "బాధలను" ఆత్మ విజ్ఞాన దృష్టితో గనుక చూస్తే "బాధలు బోధలుగా" దర్శనమిస్తాయి. కాబట్టి సంకుచిత భావాలతో అనవసరంగా స్త్రీ జన్మ పట్ల అయిష్టతను ప్రకటించడం మానివేయి. లేకపోతే పరిపూర్ణంగా స్త్రీత్వాన్ని సిద్ధించుకునేంత వరకు మళ్ళీ మళ్ళీ ఎన్నో సార్లు స్త్రీగా జన్మించాల్సి వస్తుంది.

✪ స్త్రీల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్న పురుషులందరు స్త్రీలుగా జన్మించాల్సి వస్తుంది. స్త్రీల పట్ల చులకన భావం కలిగి వున్న పురుషులందరు స్త్రీల పైన ఆధారపడి జీవించే జన్మలు ఎత్తాల్సి వస్తుంది. ఆత్మ విజ్ఞానాన్ని పెంచుకొని ఈ జన్మనే చివరి జన్మగా చేసుకొని సాఫల్యాన్ని పొందు.

స్త్రీ, పురుషులు ఇరువురూ సమానమే !

అత్యంత త్వరలో స్త్రీ, పురుషులు ఇరువురు సరి సమానంగా ఉండబోయే వ్యవస్థ వచ్చి తీరుతుంది !

ఈ విషయాలన్నింటిని అవగాహన చేసుకొని ధ్యానంలో కూర్చొని "నేను నా యొక్క స్త్రీత్వాన్ని ప్రేమతో సంపూర్ణంగా స్వీకరించాను" అని సాధన చేయి. పూర్తి చైతన్య స్పృహతో స్వీకరించు. ఈ విధంగా కొన్ని రోజులు చేసి చూడు. దీని ద్వారా నీ సమస్యలు పూర్తిగా పరిష్కారం కాకపోతే అప్పుడు పార్ట్ - 25లోని ధ్యాన సాధన - 17ను సాధన చేయి, అప్పుడు ఖచ్చితంగా మీ సమస్యలు

పరిష్కారం అయి తీరుతాయి. టెస్ట్‌లలో ఇద్దరి కండీషన్ బాగానే ఉందని అంటున్నారు. అయినా పిల్లలు కలగటం లేదంటే, దీనిలో ఇంకో విషయం కూడా ఉంది. ఇలాంటి కారణాలు మెడికల్ టెస్ట్‌లలో బయట పడవు. కొంత మందికి లోపల మాతృత్వం అంటే అయిష్టత ఉంటుంది. మాతృత్వం పట్ల రక రకాల అపోహలుంటాయి. డెలివరీ సమయంలో వచ్చే నొప్పులు భరించలేనేమో అనే భయం కూడా గర్భధారణను ఆపుతుంది. ప్రసవం అనేది నూటికి నూరు శాతం ప్రకృతి సహజ సిద్ధమైన కార్యక్రమం. స్వయంగా సృష్టే పూనుకుని చేయించే కార్యక్రమం. వాస్తవానికి "ప్రసవ వేదన" అనేది ఉండదు. నిజానికి "ప్రసవానందం" అనేదే ఉంటుంది. అయితే "విషయాలు" తెలియక పోవటం వలన స్త్రీ తన అంతరంలో, తనకు తెలియకుండా తానే ఈ సృష్టి యొక్క సహజ కార్యక్రమం అయిన ప్రసవాన్ని(పునరుత్పత్తిని) అడ్డుకుంటుంది. సృష్టే స్వయంగా చేయిస్తున్న సృష్టి పరిణామ క్రమాన్ని నిరోధిస్తుంది. స్వయం సాక్షాత్తు సృష్టే పూనుకుని తన పరిణామ క్రమాన్ని కొనసాగిస్తున్నప్పుడు, ఆ యొక్క కార్యక్రమాన్ని స్త్రీ తన అంతరంలో అడ్డుకుంటున్నందు వల్లనే ప్రసవ సమయంలో "వేదన" అనేది జనిస్తుంది. ఈ కారణం చేతనే స్త్రీలు ప్రసవించేటప్పుడు "నొప్పులు" అనుభవిస్తున్నారు. చాలా అరుదుగా కొంత మంది స్త్రీలకు డెలివరి సింపుల్‌గా అయిపోతుంది. ప్రసవ వేదన వెనుక అంతరంగం యొక్క వికాసం & నమ్మకాల వ్యవస్థలు కూడా కారణం అయి ఉంటాయి. ఆత్మ విజ్ఞాన అవగాహనతో అత్యున్నత ధ్యానం చేసి "ప్రసవం" అనేది సృష్టి యొక్క సహజమైన దివ్య కార్యక్రమం అని గ్రహించి, ఆ యొక్క సృష్టి కార్యక్రమమైన "ప్రసవాన్ని(పునరుత్పత్తిని)" ఆనందంగా అంగీకరిస్తే , సంతోషంతో సమ్మతిస్తే(అంగీకరిస్తే) అప్పుడు - "ప్రసవ వేదన" ఉండదు. "ప్రసవానందం" మాత్రమే ఉంటుంది. ఇది చెప్పడం సులభమే కానీ... ఆచరించే వారి మీద విషయం ఆధారపడి ఉంటుంది.

ప్రసవం అనేది సృష్టి స్వయంగా చేస్తున్న కార్యక్రమం. మనం మాధ్యమాలం మాత్రమే, ఈ సత్యాన్ని అవగాహన చేసుకుని, ఆత్మ విజ్ఞానాన్ని అభ్యసించి, ధ్యాన సాధన చేసి అంతరంలో, సంపూర్ణంగా "ప్రసవం అనే పునరుత్పత్తి" కార్యక్రమాన్ని ఆనందంగా అంగీకరిస్తే - స్త్రీలు అప్పుడు "ప్రసవానందాలను" పొందుతారు. "సిజేరియన్లు" అనేవి అప్పుడు ఉండవు. అన్నీ సహజమైన డెలివరీలే ఉంటాయి. "డెలివరి పెయిన్స్" స్థానంలో "డెలివరి ఎంజాయిమెంట్" వస్తుంది.

నిశితంగా నీ లోపల కారణాలను పరిశోధించి కనుక్కో , గత జన్మలలో చాలా ఎక్కువ సంతానాన్ని కలిగి ఉండి భరించలేని విసుగుతో "ఛీ ఏం సంతానంరా నాయనా - పిల్లలు లేకపోతే ఎంత హాయిగా ఉంటుందోనని" బలమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఇలాంటి నిర్ణయం ఒక్కటి చాలు ఈ జన్మలో నీకు సంతానం కలుగకుండా చేయడానికి. అమ్మో పిల్లలా, వాళ్ళను పెంచాలి, పెద్ద చేయాలి, చాలా రిస్క్ అనే భావనలు కూడా ఉంటాయి. ఇలా ఏ ఒక్క కారణమైనా చాలు గర్భం రాకుండా చేయడానికి. భార్యా భర్తలు ఇద్దరూ సాధన చేయండి. ఆత్మ విజ్ఞాన పుస్తకాలను చదివి అవగాహనను పెంచుకోండి. మీరు కోరుకున్న పరమోత్తమ సంతానాన్ని 100% గ్యారంటీగా పొంది

తీరుతారు.

All The Very Best !

❖ ❖ ❖

❸ **ప్రశ్న :** గురుదేవులకు నమస్కారం ! నేను మా వారు ఇద్దరమూ ధ్యానులమే ! మీ బోధనల వలన మా జీవితాల్లోని అయోమయం తొలగి పోయింది. చక్కగా కుదురు కున్నాము. హాయిగా జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నాము. ఈ దశలో అనుకోకుండా జరిగిన ఒక సంఘటనతో చాలా ఆందోళన చెందుతున్నాము. మొన్నీ మధ్యనే "ముఖ రతి" గురించి తెలిసింది. అప్పుడప్పుడూ ఇలా చేస్తూ ఉన్నాను. రీసెంట్‌గా చేసినప్పుడు మా వారికి స్ఖలనం జరిగి పోయింది. నేను వీర్యం మొత్తం మింగేసాను. ఈ సంఘటన జరిగినప్పుడు ఇద్దరం ఎంజాయ్ చేసినా... దీని పర్యవనాలు తెలియక భయం వేస్తోంది. దీని వలన గర్భం ఏమైనా వస్తుందా ? మా సాధనకు ఏదైనా అంతరాయం కలుగుతుందా ? మరేదైనా హాని జరుగుతుందా ? చాలా భయపడుతున్నాము. దయచేసి మా సమస్యకు పరిష్కారం తెలియ జేయగలరు.

- హైదరాబాద్

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఏమీ జరగదు ! అసలిది సమస్యే కాదు. సమస్యే లేనప్పుడు పరిష్కారం ఏం చెప్పాలి ?! రతి జరిపే అనేకానేక పద్ధతుల్లో ఇది కూడా ఒకటి. ఇది చాలా సాధారణ విషయం. చాలా మంది ఇలా చేస్తూ ఉంటారు. అవగాహనతో కూడిన రతీ కార్యక్రమాల వలన ఎంతో మేలు జరుగుతుంది. మీ ఇద్దరిలో ఎవరికీ ఏ హాని జరగదు. గర్భం కేవలం అండం విడుదల అయ్యే సమయాల్లో రతిలో పాల్గొని యోనిలో వీర్యాన్ని స్ఖలించినప్పుడే వస్తుంది. "ముఖ రతిలో" పురుషుడి వీర్యాన్ని మింగడం వలన గర్భం రానే రాదు. పకృతి పరంగా అలా వీలు లేదు. మీరు రతిలో అవలంబించే పద్ధతులకు ధ్యాన సాధనకు ఎలాంటి సంబంధం లేదు. మీకు ఇష్టం వచ్చినట్టుగా మీరు ఎంజాయ్ చేసుకోవచ్చు.

''ముఖ రతి''లో పాల్గొనాలనుకునే స్త్రీ పురుషులు చాలా ఖచ్చితమైన శుభ్రతను మరియు చక్కటి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలి, తప్పని సరి !

❖ ❖ ❖

❹ **ప్రశ్న :** నమస్కారం సార్ ! సెక్స్ చేసుకునేటప్పుడు మా వారు బూతులు ఉపయోగిస్తారు. ఆ సమయంలో మాత్రమే అలా ఉపయోగిస్తారు, అప్పుడు నాకూ బాగానే ఉంటుంది కానీ అయిపోయిన తర్వాత నేనేంటి బూతులను ఎంజాయ్ చేయడం ఏమిటీ.... అని భయమేస్తుంది. మామూలు సమయంలో చిన్న బూతు మాట వినిపించినా ఇబ్బందిగా అనిపిస్తుంది. కాని సెక్స్‌లో మాత్రం మా వారు ఎన్ని బూతులు వాడినా చాలా బాగుంటుంది. ఇదేంటి..... మా సాధనకు ఇది ఎలాంటి అంతరాయం కలిగిస్తుందోనని చాలా ఘర్షణను అనుభవిస్తున్నాము.....

- చాలా చాలా చాలా మంది స్త్రీలు అడిగారు.

నమస్తే సార్ ! రతీ కార్యంలో నా నుండి అప్రయత్నంగా బూతు మాటలు వచ్చేస్తున్నాయి. నా భార్య కూడా ఎంజాయ్ చేస్తోంది. కాని ఇది మంచిదేనా... దీని వలన మా సాధనకు ఏవైనా అవాంతరాలు వస్తాయేమోనని భయం వేస్తోంది.

- చాలా చాలా చాలా చాలా మంది పురుషులు అడిగారు.

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చిన్నప్పటి నుండి చెడ్డ మాటలు మాట్లాడ వద్దు అని వింటూ పెరిగి పెద్దైన తర్వాత బూతులు విన్నా, బూతులు మాట్లాడినా ఇలాంటి ఘర్షణ ఉదయించడం పెద్ద విశేషమేమీ కాదు. "బూతు మీద "బూతు అభిప్రాయం" పెట్టుకున్నందుకే మీరందరూ ఇంత ఘర్షణను అనుభవిస్తున్నారు". దీనిని మీరు సరిగా అర్థం చేసుకోవాలి. కేవలం బూతును మామూలు బూతులాగే చూస్తే అసలు ఏమీ లేదు, కానీ బూతును, బూతు అభిప్రాయంతో చూస్తేనే అది ఏదోలా కనబడుతుంది. రతీ కార్యంలో ఇలా జరగటం సహజం. ఎవరికైనా జరగపోయినా సహజమే ! ఇలా ఎంతో మందికి జరుగుతుంది, వారు బయటికి చెప్పరు. మీరు నాతో చెప్పుకున్నారు. ఇది తప్పు కాదు ఒప్పు కాదు. ఎవరి ఇష్టం వారిది. దీనికీ మీ సాధనకు ఎలాంటి సంబంధం లేదు. మీరు హాయిగా ఎంజాయ్ చేయండి. అయితే ఒక్క విషయం బూతులు కేవలం "అక్కడి" వరకే పరిమితం చేసుకుంటే బాగుంటుందని నా సూచన.

ఈ విషయంలో దయచేసి మీరు అపరాధ భావనను మోయకండి. ఇది మీకున్న సంకుచిత అభిప్రాయాల వలన ఏర్పడిన ఘర్షణ. ఇందులో ఏమీ లేదు. ఆత్మ విజ్ఞాన అవగాహనా లోపం వలన ఇలాంటి పరిస్థితి. అందుకే అవగాహన పెంచుకోండి.

❖ ❖ ❖

❺ **ప్రశ్న :** గురు దేవులకు పాదాభి వందనాలు ! నాకు పెళ్ళై రెండేళ్ళయింది. మొదటి సారి రక్తం రాలేదు. సెక్స్‌లో నా భార్య శరీరాన్ని అప్పచెప్పి ఒక బొమ్మలా.... అలా పడి ఉంటుంది. పోనీ నాతో సెక్స్ ఇష్టం లేదా అని అడిగితే అలాంటిదేం లేదు అని చెప్తుంది. నాకేమో ఆమె కూడా పూర్తిగా ఆక్టివ్ పార్ట్ తీసుకుంటే బాగుంటుందని, ఆ విధంగా సెక్స్ ఎంజాయ్ చేయాలని నాకు చాలా పెద్ద కోరిక. కాని నా భార్య ఒక వస్తువులా పడి ఉంటుంది. నేను ఎంత ప్రాధేయపడినా, ఎన్ని రకాలుగా ప్రయత్నించినా నా భార్య నాకు సహకరించటం లేదు. ఇష్టం లేక పోతేనే ఇలా సహకరించరు కదా, నాకు అర్థమైంది. ఇష్టం లేని వాళ్ళతో కాపురం ఎలా చేయగలుగుతాం ? నాకు నా భార్యతో సెక్స్ చేయడం కన్నా హస్త ప్రయోగం మంచిది అనిపిస్తోంది. విడాకులిద్దామని అనుకుంటున్నాను. నా జీవితంలో ఆనందం లేకుండా పోయింది. నాకు అన్నీ ఉన్నాయి. కాని అసలు సిసలైన సెక్స్ ఆనందమే లేదు. ఇక నేను బతికి ఏం లాభం ? నాకేం చేయాలో అర్థం కావటం లేదు సార్.....

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నీది చాలా పెద్ద కోరికేమీ కాదు, అది చాలా సహజం. నీది ఎంత భయంకరమైన పరిస్థితో అర్థమైంది. నీ పరిస్థితికి సులభమైన, సరళమైన పరిష్కారం ఉంది. విడాకుల ఆలోచన తక్షణమే మానుకో. నీ భార్య యొక్క తప్పేమీ లేదు. నీ ఈ పరిస్థితికి సమాజంలో ఉన్న తప్పుడు అభిప్రాయాలే మూల కారణం. సెక్స్ తప్పు, తప్పు అని పుట్టినప్పటి నుండి నూరి పోస్తారు. సెక్స్ పైన ఎన్నెన్నో తప్పుడు అభిప్రాయాలను కలుగజేస్తారు. శోభనం రోజున మొదటి కలయికలో తప్పని సరిగా రక్తం రావాలనేది ఒక పెద్ద భ్రమ. చిన్న వయసు వాళ్ళలో అది కూడా కొంత మందికి మాత్రమే ఇలా జరుగుతుంది. మొదటి కలయికలో కన్నెపొర చిరిగినా కూడా రక్తం తప్పని సరిగా రావాలని రూలేం లేదు. ఇలాంటివన్నీ మూర్ఖ మూఢ విషయాలు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించానని చెప్పావు, నీ అవగాహన ఇదా ?! మొదటి కలయికలో రక్తం రాలేదనే అనుమానం కలిగి ఉన్న నీవు, సెక్స్‌లో ఆమె ఓపెన్‌గా పాల్గొంటే నీవు భరించ గలవా ? ఇంత ఓపెన్‌గా పాల్గొంటున్న ఈమెకు ఎంత "ఎక్స్‌పీరియెన్స్" ఉందోనని అనుమానంతో ఉన్న పళంగా చచ్చిపోతావు కదా ! నీ లాంటి మగవాళ్ళు ఉండబట్టే, ఆడవాళ్ళు అలా అయిపోయారు.

నిజానికి సెక్స్ అనేది ప్రకృతి కార్యం. దివ్య కార్యం. ఈ సహజ సిద్ధమైన దివ్య కార్యక్రమంలో స్త్రీలైన పురుషులైనా అప్రయత్నంగానే స్పందిస్తారు. ప్రారంభమయ్యాక తెలియకుండానే పాల్గొంటారు. అయితే అజ్ఞానపు విషయాలతో స్త్రీలను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు, పెడుతున్నారు కావున, స్త్రీలు రతీ కార్యంలో తమ పాత్రను ఉపసంహరించుకున్నారు. ముదనష్టపు అనుమానాలతో ఆడవాళ్ళను వేధించ కుండా ఉంటే, "విషయాలను" అర్థం చేసుకుని, అవగాహనతో ప్రవర్తిస్తే వారు కూడా రతీ కార్యంలో చక్కగా తమ వంతు పాత్రను తాము నిర్వహిస్తారు. స్త్రీ పురుషులు ఇరువురూ పాల్గొన్నప్పుడే అది నిజమైన రతీ కార్యం అవుతుంది, అప్పుడే అది సరైన సంయోగం. స్త్రీలను ఓపెన్ చేయాల్సిన బాధ్యత పురుషులదే, ఎందుకంటే మూసిన వారే తెరవాలి, కాబట్టి ముందు నీవు వికాసం చెందు, ఆ తర్వాత నీ భార్యకు విషయాలను అర్థం చేయించు. ఆమె పట్ల పవిత్ర భావనలను ఏర్పరచుకో. ఈ

సద్గురు తారా విశాల్ మార్గదర్శిని ఇద్దరూ పూర్తిగా చదవండి. అర్థం చేసుకోండి. అప్పుడు అంతా సరి అయిపోతుంది. హాయిగా ఎంజాయ్ చేయండి. ఆల్ ది బెస్ట్ ! గుర్తుంచుకోండి, స్త్రీలైనా పురుషులైనా ఎవరైనా సరే, రతీ కార్యంలో ఉత్సాహంగా పాల్గొన్నప్పుడే వారికి ఏ లోపం లేదని అర్థం. ఈ విషయం రతీ కార్యానికి మాత్రమే సంబంధించినది.

❖ ❖ ❖

❻ **ప్రశ్న :** గురువు గారికి నమస్కారం ! నా సమస్య ఎలా చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ఎన్నో సంవత్సరాలుగా ఈ నరకం అనుభవించీ అనుభవించీ ఇక తట్టుకోలేక అడుగుతున్నాను. మా ఆయన సుమారు 10 సంవత్సరాల నుండి సెక్స్ చేయడం లేదు. ఆయనకు పురుషత్వం పోయింది. 10 ఏళ్ళ నుండీ ఏమీ లేదు. నాకు సెక్స్ సుఖం అందించలేకపోయినా కనీసం ప్రశాంతంగా కూడా ఉండనివ్వడు. మహా ఘోరం. నరకం చూసాను. మనిషితో వేగలేక నరకం చూస్తూ ఉంటే నాకు సెక్స్ సుఖం కూడా కరువై పోయింది నాకు అదో నరకం. కమర్షియల్ మెంటాలిటీతో చంపేస్తాడు. ఏ పని చేయడు. ఎంత సేపు ఇంట్లో కూర్చుని అందరి మీద పెత్తనం చెలాయిస్తాడు. ఈయన వల్ల నేను ఎన్నో అవమానాలకు గురయ్యాను. ఆయనకు బహుశా నా మీద ఏమైనా డౌటు ఉందేమో.. అందుకే ఎవరైనా కొత్త మగవాళ్ళు కలవగానే "బావ" అని పిలిచి వాళ్ళను నాకు అన్నయ్యనో తమ్ముడినో చేసేస్తాడు. ఊరిలోని వారందరినీ బావ అనే పిలుస్తాడు. నాకెప్పుడూ అతడి వల్ల సుఖం లేదు. ఇక నా వల్ల కాదు. నేను వేరే ఎవరి ద్వారా నైనా సెక్స్ సుఖం పొందుదామనుకుంటున్నాను. ఆయనకు మగతనం రాదని అర్థమైంది. మాట మాటకు మగాడిని మగాడిని, అంటూ ఉంటాడు. ఆయన ఏం మగాడో అర్థం కాదు, అలా ఎందుకు అంటాడో అర్థం కాదు. మగతనం లేని వాళ్ళకు క్రూరత్వం మరియు నీచ గుణాలు పెరుగుతాయా ? నేను ఎవరినైనా వెతుక్కుని వాళ్ళ ద్వారా సెక్స్ సుఖం పొందకపోతే ఇక నా జన్మ వేస్ట్... నేను భరించలేను. కానీ నేను ఇలా చేయడం ఎంత వరకు కరెక్ట్ ? కానీ చేయకుండా ఉండలేని పరిస్థితి. చేసే తీరుతాను. ఇది తప్పా అని భయమేస్తోంది... నాకేదైనా ఉపాయం చెప్పండి సార్ !

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నీ పరిస్థితి అర్థమైంది. నీ భర్త ఎలాంటి వాడో అలాంటి గుణాలను లేదా కర్మను నీవు కలిగి ఉన్నావు లేకపోతే నీకు అలాంటి వాడు భర్తగా ఎందుకు లభిస్తాడు ? నీవు మరీ అమాయకురాలివేమీ కాదు. నీ భర్తకు పురుషత్వం లేదు దాని కారణంగా నీకు సెక్స్ సుఖం అందడం లేదు అంత వరకు సరే... కానీ మిగతా విషయాలన్నీ కేవలం నీ కోణంలో నుండి మాత్రమే నీవు చెప్పావు. అవతల వ్యక్తి కోణంలో నీవెలాంటి దానివో కదా ! ఇక నీవు వేరే వ్యక్తి ద్వారా సెక్స్ సుఖం పొందాలని అనుకుంటూ ఉంటే... అది తప్పా ఒప్పా అని నన్ను అడగడం దేనికి అది

ఏమిటో తెలియనంత అమాయకురాలివా ? నా నుండి కన్‌ఫర్మేషన్ తీసుకుని నా మీద వేయడానికా.. గురువు గారు చెప్పారు అని... ! ఏది మంచో, ఏది చెడో నీకు తెలుసు. కేవలం నా కన్‌ఫర్మేషన్ కోసమే అడిగావు. నీకు వేరే వ్యక్తితో ప్రొసీడ్ అవ్వాలని ఉంది, డిసైడ్ అయ్యావు. దానికి నా తరపు నుండి ఏదో క్లారిటి కావాలి, ఆఁ.. ఏమీ కాదు.. అంటూ నేనేదో ఆధ్యాత్మిక కోణంలో నుండి నిన్ను ఊరడించాలి... నీవు చేసేది కరక్టే.. అని నేను నీకు సర్టిఫికెట్ ఇవ్వాలి... అప్పుడు నీవు హ్యాపీగా ప్రొసీడ్ అవుతావు... గురువుగారే చెప్పారు అనే ఒక లైసెన్స్ కోసమే నీవు నన్ను అడుగుతున్నావు.. కానీ నీకు తెలియక కాదు, నీ పరిస్థితి చాలా బాధాకరమైనది... కానీ నేనేమీ చేయలేను... నీ పరిస్థితికి నీ కర్మయే కారణం... ధ్యాన సాధన చేసుకుని కర్మ క్లియర్ చేసుకో... సవ్యమైన మార్గంలో ఆనందం వస్తుంది. ఇంతకంటే నేనేం చెప్పలేను. గుడ్‌లక్ !

❼ **ప్రశ్న :** స్వయం సంతృప్తి పొందే స్త్రీలు, హస్త ప్రయోగం చేసుకునే పురుషులు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు. భౌతిక ఆనందాలలోకెల్లా ఉత్కృష్టమైనది సంభోగానందం. ఇది దివ్యం ! మన అందరి పుట్టుకకు మూలం ! నాలుగు పురుషార్థాలలో ఒకటి ! ఇటువంటి సంభోగానందం కొరవడడం అంటే చాలా బాధాకరం. ప్రకృతి సహజ సిద్ధమైన కామాన్ని ఏమీ చేయలేక, భాగస్వామి దొరకని స్థితిలో స్వయం సంతృప్తి, హస్త ప్రయోగం లాంటి వాటితో తృప్తి పడుతుంటారు. ఈ విధమైన పరిస్థితి కర్మ(అజ్ఞానం) వల్లనే వస్తుంది.

ఆత్మ విజ్ఞానం + ధ్యాన సాధన ద్వారా కర్మ(అజ్ఞానం) తొలగిపోయి వారికి సరైన రీతిలో, సరైన భాగస్వాములు దొరుకుతారు. అప్పుడు స్వయం సంతృప్తి, హస్త ప్రయోగం అవసరం ఉండదు కదా !

❖ ❖ ❖

❽ **ప్రశ్న :** కొజ్జా వాళ్ళు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు.

❖ ❖ ❖

❾ **ప్రశ్న :** స్వలింగ సంపర్కం చేసుకునే స్త్రీలు, పురుషులు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు.

❖ ❖ ❖

10 ప్రశ్న : ధ్యానం ద్వారా సెక్స్ సామర్థ్యం పెరుగుతుందా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నిస్సందేహంగా పెరుగుతుంది. అమోఘంగా పెరుగుతుంది. అద్భుతంగా పెరిగి, శాశ్వతంగా ఉంటుంది. కామ సిద్ధి కలుగుతుంది. ఆల్ ద బెస్ట్ !

నిజానికి కొత్తగా పెరగడం అంటూ ఏమీ ఉండదండీ ! అందరూ అనంతమైన కామ శక్తి సామర్థ్యాలను సహజంగానే కలిగి ఉంటారు. ఆత్మ విజ్ఞానం + ధ్యానం ద్వారా ఈ అనంత కామ శక్తి సామర్థ్యాలు అందుబాటులోకి వస్తాయి. అంతే !

❖ ❖ ❖

11 ప్రశ్న : ఒక స్త్రీ తన భర్తకు, పిల్లలకు తెలియకుండా, ఒక పురుషుడు తన భార్యకు, పిల్లలకు తెలియకుండా, పెళ్ళి కాని యువతీ యువకులు తల్లిదండ్రులకు తెలియకుండా వేరే వారితో శారీరక సంబంధాలను కలిగి ఉంటారు, వాటిని కొనసాగిస్తూ ఉంటారు. ఇలాంటి వారు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఎవరైనా చేయవచ్చు. ఆత్మ విజ్ఞాన పుస్తకాలు బాగా చదవండి.

❖ ❖ ❖

12 ప్రశ్న : వరసకాని వారితో అంటే ప్రస్తుత సమాజ ప్రకారంగా ఎవరితో అయితే సెక్స్ నిషిద్ధమో అలాంటి వారితో శారీరక సంబంధాలను కలిగి ఉన్నవారు ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ధ్యానం ఎవరైనా చేయవచ్చు. ఆత్మ విజ్ఞాన పుస్తకాలు బాగా చదవండి.

❖ ❖ ❖

13 ప్రశ్న : నేను ధ్యానం చేస్తూ ఉన్నాను, నేను ధ్యానం నేర్పిన వారితో నాకు శారీరక సంబంధం ఏర్పడింది, మేం ధ్యానం చేయవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : చేయవచ్చు. ఆత్మ విజ్ఞాన పుస్తకాలు బాగా చదవండి.

❖ ❖ ❖

❶❹ ప్రశ్న : ధ్యాన ప్రచారం చేసే వారు సెక్స్‌లో పాల్గొనవచ్చా ?

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : నిస్సందేహంగా పాల్గొనవచ్చు.

❖ ❖ ❖

ఆధ్యాత్మికతకు సెక్స్‌కు ఎలాంటి వ్యతిరేకత లేదు. కామశాస్త్రం అనేది పూర్తిగా ఆధ్యాత్మికమైనది. ఎందుకంటే కామ కార్యం ద్వారా ఒక ఆత్మ భూమి పైకి వస్తుంది. ఎన్నో సూక్ష్మ నాడులు ఉత్తేజితం అవుతాయి. ఆత్మాభివృద్ధి జరుగుతుంది. కామ కార్యం అనేది సృష్టి కార్యం. కామ కార్యం సృష్టి కార్యం కాబట్టే కామం ఆధ్యాత్మికమైనది.

ఆధ్యాత్మికతకు ఐశ్వర్యానికి కూడా ఎలాంటి వ్యతిరేకత లేదు. ఆధ్యాత్మికత నిరాడంబరమైనది కాదు. నిరాడంబరత అనేది ఒక ఎంపిక. ఒకరి ఇష్టం అంతే.

ఆధ్యాత్మికత అంటే నిరాడంబరత అనే అభిప్రాయాన్ని పూర్తిగా మార్చుకోండి.

ధ్యాన సాధనలు ఎన్నో రకాలైనవి ఉన్నాయి. సెక్స్ కూడా ఒక రకమైన ధ్యాన సాధనయే !

ధ్యాన సాధనతో ఏమేం జరుగుతాయో సెక్స్ ద్వారా కూడా వాటిలోనివి కొన్ని జరుగుతాయి.

ఆకర్షణ, సెక్స్ మరియు ప్రేమ ఈ మూడింటికి అంతర్ సంబంధం ఉంది.

మీరు ఏ సెక్స్ ద్వారానైతే పుట్టారో దాన్ని అసహ్యించుకుంటే,
మీ జన్మ కారణాన్ని అసహ్యించుకుంటున్నారన్నమాటే !
మీ జన్మను మీరు అసహ్యించు కుంటున్నారంటే,
మిమ్మల్ని మీరు అసహ్యించు కుంటున్నారన్నట్టే !
మీ మీద మీకు అసహ్యకరమైన భావన ఉన్నప్పుడు మీ
జీవితంలో కష్టాలే ఉంటాయి. మీ ఆత్మాభివృద్ధి ఆగిపోతుంది.

కామ కార్యం మీ జన్మ కార్యం.
కామం దివ్యమైనది.
దేని ద్వారా మనం అందరం పుడుతున్నామో అది
చాలా మంచిది.
చాలా గొప్పది.
చాలా దివ్యమైనది.

పార్ట్ - 22

ధ్యానం ద్వారా ఆరోగ్యం ఎలా వస్తుంది అనే విషయానికి సంబంధించిన సైంటిఫిక్ రిసర్చ్ రిపోర్ట్స్ యొక్క వివరాలు

ధ్యానం పైన ప్రపంచంలో జరిగే వివిధ శాస్త్రీయ పరిశోధనలను
ప్రచురించి ప్రజలకు మహోపకారం చేస్తున్న పత్రికలన్నింటికీ
ముఖ్యంగా ఈనాడు, సాక్షి దిన పత్రికలకు **M A B**
హృదయపూర్వక ధన్యవాదాలను అర్పిస్తోంది.

1 - ధ్యానంతో ఎయిడ్స్‌కు చెక్

- సాక్షి దిన పత్రిక, పేజ్ నం. 20,
తేది : 27 జూలై 2008 సౌజన్యంతో.....

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులలో వ్యాధి తీవ్రతను ధ్యానం తగ్గిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎయిడ్స్‌ను కలిగించే వైరస్‌లు రోగి ఒత్తిడి సమయంలో మరింత విజృంభిస్తాయని వాటిని అరికట్టాలంటే మానసికంగా ప్రశాంతంగా ఉండటమే మార్గమని చెబుతున్నారు. లాస్ ఏంజిల్స్‌లోని ఒక సెమినార్‌లో 48 మంది హెచ్ఐవీ పాజిటివ్ రోగులకు ఎనిమిది వారాలపాటు ధ్యానం చేయించినపుడు వారిలో సీడీ4టీ కణాల సంఖ్య ఏమాత్రం తగ్గలేదని రుజువైందని చెప్పారు. అంతేకాక వ్యాధిని నిరోధించడానికి అత్యంత చవకైన మార్గం ధ్యానమేనని, ఇది మనలో రోగనిరోధక శక్తిని పెంపొదిస్తుందని సూచిస్తున్నారు. రోగ నిరోధక శక్తిని పెంచే సీడీ4టీ(లింఫోసైట్లు) కణాలను రోగ నిరోధక శక్తి తగ్గినపుడు వ్యాధికారక వైరస్‌లు మెల్లగా తినివేయడంతో వ్యాధి మరింతగా పెరుగుతుంది. అంతే కాక ఒత్తిడికి లోనైన సమయంలో సీడీ4టీ కణాలు తగ్గిపోయే చర్య మరింత వేగవంతమవుతుంది. ఒక మాటలో చెప్పాలంటే ఒత్తిడి వల్ల వ్యాధి తీవ్రత పెరుగుతుంది. ఈ ఒత్తిడిని తగ్గించడానికి ధ్యానం సులువైన మార్గమని ఇప్పటికే రుజువైనందున వైరస్ ప్రభావాన్ని తగ్గించడానికి ధ్యానాన్ని ఆశ్రయించడం మేలని కసిన్ సెంటర్ ఫర్ సైకోన్యూరో ఇమ్యునాలజీ పరిశోధకులు డేవిడ్ క్రిస్‌వెల్ చెబుతున్నారు.

❖ ❖ ❖

ఇంటర్‌నెట్‌లో ఓపికగా వెతికితే ఆధ్యాత్మిక సాధనల ద్వారా పెద్ద పెద్ద ప్రాణాంతక వ్యాధులను తగ్గించుకున్న వారి వివరాలు ఎన్నో ఉంటాయి. పెద్ద పెద్ద డాక్టర్లు ఇక ఏమీ చేయలేం అని చేతులు ఎత్తేసిన కేసులు కూడా ఆధ్యాత్మిక సాధనల ద్వారా నయమైన సంఘటనల వివరాలు ఎన్నో ఉన్నాయి. వెతకండి. చదవండి. అర్థం చేసుకుని ప్రేరణ పొందండి. ధైర్యాన్ని పొందండి. నయం చేసుకోండి.

2 - రోజూ ఓ గంట ధ్యానం చేయండి...

- ఈనాడు ఆదివారం బుక్, పేజ్ నం. 9 & 10

తేది : 7 సెప్టెంబర్ 2008, ధ్యానానందం / ధ్యాన వైద్యం సౌజన్యంతో....

✪✪✪ 'రోజూ ఓ గంట ధ్యానం చేయండి'... ఈ మాట ఏ బాబాలో, గురూజీలో చెబితే ఆశ్చర్యం లేదు. క్యాన్సర్, ఎయిడ్స్, హృద్రోగం లాంటి ప్రాణాంతక సమస్యలతో బాధపడుతున్న రోగులకు చేయి తిరిగిన వైద్య నిపుణుల సిఫార్సిది. అలాగని వాళ్ళకు ధ్యానమంటే ప్రత్యేకమైన అభిమానమేం లేదు. అంతర్జాతీయ పరిశోధకులు ధ్యానంలోని గొప్పదనాన్ని రూఢిగా చెబుతుంటే వాళ్ళు మాత్రం ఏం చేస్తారు. ఏడాదీ రెండేళ్ళు కాదు. ముప్పై ఏళ్ళ పరిశోధన ఫలితమిది.

✪✪✪ ఒత్తిడికి ధ్యానాన్ని మించిన మందు లేదు అని ఒప్పేసుకుంటారు 'డిస్ట్రక్టివ్ ఎమోషన్స్' రచయిత డానియెల్ గోల్‌మాన్. భావోద్వేగాలు ఆరోగ్య వ్యవస్థ మీదా ప్రభావం చూపుతాయి. కోపమైతే మహా శత్రువు. కోపంతో ఊగిపోతున్నప్పుడు గుండెకు రక్తాన్ని పంప్ చేసే సామర్థ్యం తగ్గుతుందట. దీంతో హృద్రోగ సమస్యలు పుట్టుకొస్తాయి. మెదడులోని స్వయం నియంత్రిత నాడీ వ్యవస్థలో ఉన్న కొన్ని భాగాల్ని చైతన్యపరచడం ద్వారా ధ్యానం... మన నియంత్రణలో లేని రక్తపోటు, జీర్ణక్రియ వంటి చర్యలపై సానుకూల ప్రభావం చూపుతుంది.

✪✪✪ ధ్యానంలో ఉన్నప్పుడు ఒత్తిడికి, చికాకులకు, భయ ద్వేషాలకు కారణమైన మెదడులోని నాడులు మగతలోకి జారిపోతాయి. ఒత్తిడిని తగ్గించడమొక్కటేనా, అవసరమైతే ధ్యానం మెదడుకు పాఠాలు చెబుతుంది. దాని పని తీరునూ మార్చేస్తుంది. బ్రెయిన్ ఇమేజింగ్ లాంటి ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాక, ధ్యానంలో ఉన్నప్పుడు మెదడులో ఏం జరుగుతుందో తెలుసుకోవడం చాలా సులభమైపోయింది. కొత్త, కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

✪✪✪ వంద మంది ఖైదీలకు విపస్సన ధ్యానం నేర్పిస్తే..... అందులో సగానికిపైగా కొత్త జీవితం ప్రారంభించినట్టు ఆధారాలున్నాయి. ధ్యానం మనిషిలో ప్రేమను, దయాగుణాన్ని కూడా పెంపొందిస్తుంది. సాధకుల మెదళ్ళలోని 'లింబిక్ సిస్టమ్' మిగతా వారిలో కంటే చురుగ్గా ఉంటుంది. ప్రేమ, సహనం తదితర ఆదేశాలు ఈ భాగం నుంచే వెళ్తాయి. ధ్యానం ప్రొస్టేట్ క్యాన్సర్ తీవ్రతనూ తగ్గిస్తుందని అమెరికన్ యూరాలాజికల్ అసోసియేషన్ ప్రకటించింది.

✪✪✪ మిగతావారితో పోలిస్తే, రోజు ఓ గంట ధ్యానం చేస్తున్న వారికి రోగ నిరోధక శక్తి చాలా ఎక్కువట. రక్తపోటు నియంత్రణలోకి రావడమన్నది ఓ సమస్యే కాదు. శృంగార జీవితంలో వయాగ్రా అవసరమే ఉండదు. ధ్యానాన్ని ప్రారంభించిన కొద్ది వారాల్లోనే ఎయిడ్స్ రోగుల్లోనూ రోగ నిరోధక శక్తి పెరిగినట్టు పరిశోధనలు చెబుతున్నాయి.

❖ ❖ ❖

3 - హృదయ శాంతి

ఈనాడు దిన పత్రిక(సుఖీభవ),

తేది : సెప్టెంబరు 23, 2008 సౌజన్యంతో...

నానాటికి 'గుండెపోటు' మన భారతీయుల పాలిట మరణ శాసనంగా పరిణమిస్తోంది. కేవలం గుండె జబ్బుల కారణంగానే ఎంతో మంది జీవితాలు అర్ధాంతరంగా ముగిసి పోతున్నాయి. అందుకే వైద్యపరంగా, సామాజికంగా దీని నివారణపైనే దృష్టి పెడుతూ న్యూఢిల్లీ సమీపంలోని బ్రహ్మకుమారీల 'ఓం శాంతి రిట్రీట్'లో ఈ సంవత్సరం(2008 సంవత్సరం), సెప్టెంబర్ 19 నుంచి 21 వరకూ ప్రపంచ సదస్సు జరిగింది. దేశ విదేశాలకు చెందిన ప్రముఖ హృద్రోగ నిపుణులు ఎంతో మంది పాల్గొన్న ఈ సదస్సును 'భారత రత్న' డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం ప్రారంభించారు. గుండె జబ్బుల విషయంలో హైబీపీ, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి శారీరక ముప్పులతో పాటు మానసిక ఒత్తిడినీ విస్మరించటానికి వీల్లేదంటూ... ధ్యానం వంటి విశ్రాంతి సాధన కూడా ముఖ్యమని ఈ సదస్సు నొక్కి చెప్పటం విశేషం. 'వరల్డ్ హార్ట్ డే' సందర్భంగా దీనిపై 'సుఖీభవ' అందిస్తున్న సవివర కథనాలు..... ఈ వారం ప్రత్యేకం !

సహృదయ చింతన

– ఈనాడు దిన పత్రిక(సుఖీభవ),

తేది : సెప్టెంబరు 23, 2008 సౌజన్యంతో...

✪✪✪ మన దేశంలో.. 1960లలో కేవలం ఒకే ఒక్క శాతం ఉన్న గుండె జబ్బులు ఇప్పుడు దాదాపు 15 శాతానికి చేరుకున్నాయి. పాశ్చాత్య యువత కంటే గుండెపోటు సంబంధిత ముప్పులు మన యువతీ యువకుల్లో పది రెట్లు ఎక్కువగా కనబడుతున్నాయి. మన జన్యువులు, వీటికి తోడు హైబీపీ, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్.. వీటన్నింటికీ తోడు ఇప్పుడు తీవ్రమైన 'మానసిక సంక్షోభం' కూడా యువ హృదయాలను నలిపేస్తోందని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. తీవ్రమైన ఒత్తిడి, కోపం, నిరాశ, శత్రుత్వం, ఉద్రేకం.. ఇవన్నీ గుండెను పీల్చి పిప్పి చేసేవే. అందుకే దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిష్ఠాత్మక రక్షణ పరిశోధన సంస్థ.. డీఆర్‌డీఓ, దాని అనుబంధంగా పనిచేసే 'డిఫెన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజియాలజీ అండ్ అల్లైడ్ సైన్సెస్' సంస్థలు... మౌంట్ అబూలో బ్రహ్మకుమారీలు నిర్వహించే 'గ్లోబల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్'తో కలిసి ఓ సంయుక్త అధ్యయనం నిర్వహించాయి. దేశవ్యాప్తంగా మరెన్నో ప్రతిష్ఠాత్మక సంస్థలు, కార్డియాలజిస్టుల సహకారంతో వీరు దాదాపు పదేళ్ళ పాటు 518 మంది గుండె జబ్బు బాధితులపై అధ్యయనం కొనసాగించారు. ✪✪✪ వీరి అధ్యయనం ప్రధానంగా త్రివిధ మార్గంలో సాగింది.

✪ 1. వీరందరికీ రోజూ పీచు ఎక్కువగా ఉండే సంప్రదాయ భారతీయ శాకాహారం, పండ్లు, కూరలు, మొలకలు ఆహారంగా ఇచ్చారు. ✪ 2. రోజూ గంటకు తగ్గకుండా రెండు పూట్లా తేలిక పాటి నడక వంటి వ్యాయామాలు చేయించారు. ఈ రెంటితో పాటు ముఖ్యంగా... ✪ 3. ధ్యానం ద్వారా వీరిలో మానసిక ఒత్తిడిని తగ్గిస్తూ సానుకూల విశ్రాంత భావనలు కలిగించేందుకు ప్రత్యేక కృషి చేశారు. వైద్యం, క్రమం తప్పకుండా పరీక్షలతో పాటు యోగా, ధ్యానానికీ ప్రాధాన్యం ఇచ్చారు.

✪ అధ్యయనం ఆరంభించిన కొద్ది రోజుల్లోనే వీరందరికీ సత్ఫలితాలు కనబడటం ఆరంభమైంది. బాధలు తగ్గుముఖం పట్టాయి. కొద్ది వారాల్లోనే మందుల మోతాదు తగ్గించాల్సి వచ్చింది. వ్యాయామ సామర్థ్యం బాగా పెరిగింది. ఆర్నెల్లలో వీరిలో కొందరు ఈత కూడా కొట్టగలిగారు. ఒంట్లో చెడ్డ కొలెస్ట్రాల్, ఒత్తిడి హార్మోన్లు బాగా తగ్గాయి. మానసిక విశ్రాంతిని తెలిపే మెదడులోని ఆల్ఫా తరంగాలు చురుకందుకున్నాయి.

✪ అనంతరం తిరిగి వీరందరికీ యాంజియోగ్రామ్ పరీక్షలు చేయగా..... ఈ త్రివిధ మార్గం అనుసరించిన వారికి రక్తనాళాల్లో పూడికలు తగ్గినట్టు వెల్లడవగా..... ఈ మార్గం అనుసరించని వారికి పూడికలు కొద్దిగా పెరిగినట్టు తేలింది. అందుకే ఆరోగ్యకరమైన హృదయాల కోసం... ఈ త్రివిధ మార్గం అనుసరణీయమని పరిశోధకులు డా॥ సతీష్ గుప్తా(మౌంట్ అబూ), డా॥ సెల్వ మూర్తి(డీఆర్‌డీఓ) వివరించారు. అసలు గుండె జబ్బులు మొదలైన తర్వాత కాదు... రాక ముందే నివారణ దిశగా... ✪ ఈ త్రివిధ మార్గాన్ని అనుసరించాలని, వైద్యులు కూడా దీన్ని విస్తృతంగా ప్రచారంలోకి తేవాలని డా॥ అబ్దుల్ కలాం విజ్ఞప్తి చేశారు. - ఈనాడు దిన పత్రిక.

❖ ❖ ❖

లూయి ఎల్. హే (Louise L. Hay) అనే లేడి అమెరికన్ మాస్టర్ యొక్క మర్మావయవం దగ్గర క్యాన్సర్ అయితే హాస్పిటల్‌లో జాయిన్ చేసి ఆపరేషన్ తప్పదని డాక్టర్లు నిర్ణయించారు. అయితే ఆపరేషన్ అవసరం లేకుండానే నేను నయం చేసుకుంటాను నాకు కొంచెం సమయం కావాలి అని డాక్టర్లను అడిగింది. డాక్టర్లు కుదరదు పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంది. ఆలస్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం అని అన్నారు. కానీ లూయి బాగా వాదించింది. చాలా వాదనలు జరిగాక సరే ఒక్క నెల రోజులు టైమ్ ఇస్తాం. ఆ తర్వాత బలవంతంగానైనా సరే ఆపరేషన్ చేస్తాం అని చెప్పారు. లూయి సరే.. అని సాధన చేసింది. నెల రోజుల తర్వాత డాక్టర్లు వచ్చి టెస్ట్‌లు చేసారు. అన్ని రిపోర్టులు చూస్తే క్యాన్సర్ లేదు. తగ్గి పోయింది. డాక్టర్లు ఆశ్చర్యపోయి ఏం చేయాలో అర్థం కాక వ్యాధి లేదు కనుక డిశ్చార్జ్ చేసి పంపించారు. ఇది మెడికల్ చరిత్రలో సమాధానం దొరకని అద్భుతం ! ఇంటర్ నెట్‌లో లూయి ఎల్. హే గురించి సమాచారం ఉంది. ఆమె పుస్తకాలు కూడా దొరుకుతాయి. ఆమె పుస్తకాలు చాలా గొప్పవి. తప్పకుండా చదవాలి.

4. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన హృదయం

✪ డా॥ అబ్దుల్ కలాం, మాజీ రాష్ట్రపతి

– ఈనాడు దిన పత్రిక(సుఖీభవ),

తేది : సెప్టెంబరు 23, 2008 సౌజన్యంతో...

మన ముందున్న లక్ష్యం ఒక్కటే ! మన దేశంలో ప్రతి ఒక్కరి హృదయమూ ఆరోగ్యకరంగా ఉండాలి. మన సమాజంలో... ప్రతి ఇంట్లో, ప్రతి ఊళ్ళో 'గుండెపోటు నిర్మూలనా కార్యక్రమం' ఉద్ధృతంగా అమలవ్వాలి. గత పదేళ్ళుగా నేను హృద్రోగ నిపుణులకు సంబంధించిన ఎన్నో సమావేశాల్లో పాల్గొన్నాను. ఎన్నో సదస్సుల్లో మాట్లాడాను. నా స్నేహితుల్లో ఎక్కువ మంది కార్డియాలజిస్టులు కావటం వల్లనేమో... నేను గుండె జబ్బులపై లోతుగా దృష్టి పెట్టే అవకాశం లభించింది. వాస్తవానికి మనం స్టెంట్‌ల మీద, రకరకాల హృద్రోగ చికిత్సల మీద ఎంతో కృషి చేస్తున్నాం. ఎన్నో ఆధునిక పరికరాలు, విధానాలు అందుబాటులోకి తెస్తున్నాం. అయినా ఇవేవి కూడా ఒకసారి గుండెపోటుతో దెబ్బతిన్న గుండెను మళ్ళీ తిరిగి పూర్వ ఆరోగ్యస్థితికి తీస్కెళ్ళ లేకపోతున్నాయి. మనం మందుల తయారీ మీద వెచ్చిస్తున్నంత ధనం వ్యాధుల నివారణ మీద పెట్టటం లేదు. మరో వైపు పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, మానసిక ఒత్తిడి వంటి వాటివల్ల వాతావరణం చాలా వేగంగా దిగజారిపోతోంది. అందుకే ఇప్పుడు మనందరం అసలు 'గుండెపోటు నిర్మూలన' మీదే దృష్టి పెట్టాలి. ఆరోగ్యమంటే కేవలం జబ్బుల్లేకపోవటమే కాదు. శారీరకంగా, మానసికంగా, సామాజికంగా పూర్తి స్వస్థతతో ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉన్నట్టు. దీన్ని దృష్టిలో ఉంచుకునే కొన్నేళ్ళుగా ప్రతిష్ఠాత్మక డీఆర్‌డీఓ విభాగాలు, మౌంట్ అబూలోని బ్రహ్మ కుమారీల 'గ్లోబల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్'తో కలిసి ఎన్నో అధ్యయనాలు, ప్రయోగాలను నిర్వహిస్తున్నాయి. వీటిని నేను చాలా సన్నిహితంగా పర్యవేక్షిస్తున్నాను. గుండె జబ్బుల నివారణలోనూ, జబ్బులు తగ్గిపోవటంలోనూ ✪'త్రివిధ మార్గం' బాగా ఉపకరిస్తోందని ఈ అధ్యయనాల్లో తేలింది.

✪ త్రివిధ మార్గం :

✪ 1. అనునిత్యం పీచు ఎక్కువగా ఉండే శాకాహారం తీసుకోవటం.

✪ 2. రోజూ 30 - 40 నిమిషాల పాటు నడకలాంటి తేలికపాటి వ్యాయామం.

✪ 3. నిత్యం కొద్ది సేపు ధ్యానం.

ఈ 3 పాటించిన వారి హృదయాలు ఆరోగ్యంగా ఉంటున్నాయని ఈ అధ్యయనాల్లో తేలింది. కాబట్టి సమాజంలోని ప్రతి ఒక్కరిలో ఈ చైతన్యం రావటం అవసరం. ఇవి గుండె జబ్బుతో బాధ పడుతున్న వృద్ధులకు కూడా ఎంతో ఉపకరిస్తున్న మార్గాలు. వీటిని ప్రతి ఒక్కరం మనస్ఫూర్తిగా ఆచరిద్దాం... కలసి రండి... !

❖ ❖ ❖

5. మేల్కొంటేనే నిశ్చింత

- ప్రొ॥ నవీన్ సి. నందా, డైరెక్టర్ హార్ట్ స్టేషన్ / ఎకో ల్యాబొరేటరీస్,
యూనివర్సిటీ ఆఫ్ అలబామా, బర్మింగ్‌హామ్

– ఈనాడు దిన పత్రిక(సుఖీభవ),
తేది : సెప్టెంబరు 23, 2008 సౌజన్యంతో...

✪✪✪ పాశ్చాత్య దేశాలన్నీ సాధ్యమైనంత శాకాహారం తింటూ... ధ్యానం చేస్తూ మన బాట పడుతుంటే... మనం మాత్రం పాశ్చాత్య ధోరణులను అనుకరిస్తూ అనారోగ్యాన్ని పెంచుకోవటం సరికాదని నొక్కి చెబుతున్నారు ప్రొ॥ నవీన్ సి. నందా. హృద్రోగ నిపుణుడిగా అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించిన ఆయన ఎప్పుడో 1960లలోనే మన దేశంలో యువకుల్లో గుండె జబ్బులు పెరుగు తున్నాయని అధ్యయన పూర్వకంగా నిగ్గుతేల్చారు. గుండెపోట్ల నుంచి బయట పడేందుకు ఆయన అందిస్తున్న వివరాలు...

మన ఆసియా దేశస్థుల్లో గుండె జబ్బులు ఎక్కువగా ఉండటానికి ఏదో ఒకటే కారణం అనుకోవటం తప్పు. ముందుగా జన్యుపరమైన కారణాలు చెప్పుకోవాలి. 40 ఏళ్ళ క్రితమే 25-30 ఏళ్ళ యువకుల్లో గుండెపోటు మరణాలు మన దగ్గర ఉన్నాయి. దీనిపై నేను 1960లలోనే అధ్యయనాలు చేసి ప్రఖ్యాత మెడికల్ జర్నల్స్‌లో కూడా ప్రచురించాను. ఇక తరుచుగా కనిపించే అంశం - మధుమేహం, దీన్ని నివారించు కోవాలంటే మనం బిడ్డ పుట్టిన దగ్గరి నుంచే చక్కటి జీవనశైలి అలవరచటం, జీవన శైలిలో మంచి మార్పు తేవటం చాలా అవసరం. మనందరికీ స్వీట్లు, పూరీలు, సమోసాలు, జిలేబీలు, కచోరీలు, హల్వాలు, కోవాలు... బాగా ఇష్టం. ఇవన్నీ బాగా తగ్గించుకోవాలి. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. మన దేశంలో చాలా మంది తాము తినేది శాకాహారమే అంటుంటారు గానీ కొవ్వు చాలా ఎక్కువగా తింటుంటారు పాలు, పాల పదార్థాలను మనం శాకాహారంగానే భావిస్తుంటాంగానీ ఇవి కూడా జంతు కొవ్వు కిందకే వస్తాయి. వీటిని బాగా తగ్గించాలి. కొబ్బరి బాగా తగ్గించాలి. శాకాహారాన్ని 'నిజమైన అర్థం'లో తీసుకోవాలి... శాకం అంటే కూరగాయలు, పండ్లు. వాటినే ఎక్కువగా తినాలి. ఇక వాడిన నూనెనే మళ్ళీ మళ్ళీ వాడటం అస్సలు సరికాదు. ఇలాంటి

సమస్యలన్నీ 1960లలో కూడా ఉన్నాయిగానీ ఇంత తీవ్రంగా లేవు. అందుకే ఇప్పుడు మనం మరింత జాగ్రత్తగా ఉండాలి.

ఇప్పుడు మానసిక ఒత్తిడి చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నప్పుడూ, ప్రతికూల భావాల్లో కూరుకు పోయినప్పుడూ మనలో ఎంతో 'సింపాథటిక్ ఓవర్‌డ్రైవ్' పెరిగి.... అడ్రినలిన్ అనే ఒత్తిడి హార్మోను ఎంతో ఎక్కువగా తయారవుతుంది. దానివల్ల గుండె పంపింగ్ పెరిగిపోతుంది. అది మంచిది కాదు. ఇవన్నీ కూడా మన శరీర, ముఖ్యంగా గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలే. ***అందుకే మానసిక విశ్రాంతి కోసం ✪ ధ్యానం వంటివి చెయ్యటం చాలా అవసరం. వీటిని జీవితంలో ఎప్పుడో... ప 30 - 40 ఏళ్ళు వచ్చిన తర్వాత మొదలు పెట్టటం కాదు... చిన్నతనం నుంచే ఆరంభించటం ముఖ్యం. పెద్ద వయస్సులో చెయ్యటం వల్ల ప్రభావం అస్సలు ఉండదని చెప్పలేంగాని పరిమితంగానే ఉంటుంది. చిన్నతనం నుంచీ... జీవితాంతం చెయ్యాల్సిన పని ఇది. ✪ ఒకసారి కొలెస్ట్రాల్ పెరిగిన తర్వాత.. తగ్గించుకోవటం వల్ల జరిగే మేలు కొంతే. అదే చిన్నతనం నుంచీ మనం జాగ్రత్తలు తీసుకుంటే అసలు పెరగకుండానే చూసుకోవచ్చు కదా. అప్పుడే మనం విజయం సాధిస్తాం.***

✪ పాశ్చాత్య ప్రజలు ఇప్పుడు మన బాటలోకే వస్తున్నారు. సాధ్యమైనంత శాకాహారమే తీసుకుంటున్నారు. ఎరువులు, కృత్రిమ రసాయనాలు లేని ఆర్గానిక్ ఆహారం తింటున్నారు. నిజానికి పాశ్చాత్య ప్రజలకు అన్నీ సమృద్ధిగానే ఉన్నాయి. మనకంటే వాళ్ళకు ఆహార లభ్యత చాలా ఎక్కువ. రకరకాల పదార్థాలు చాలా ఎక్కువగా దొరుకు తున్నాయి, అదీ చాలా తక్కువ డబ్బుకే. అన్నీ ఉన్నా కూడా వాళ్ళు చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. ఎంతో మందికి చిన్నతనంలోనే మధుమేహం, ఊబకాయం వంటివి వస్తుండటంతో చాలా జాగ్రత్త పడుతున్నారు. తమ వయస్సు వాళ్ళు, తమకంటే చిన్నవాళ్ళు తమ కళ్ళ ముందే గుండె జబ్బులతో చనిపోతుంటే ఎంతో ఆందోళనతో తమ జీవనశైలిని మార్చుకుంటున్నారు. మన భారతీయులు పట్టించుకోవటం లేదు గానీ పిల్లలకు చిన్నతనం నుంచీ డాన్స్, నాట్యం, వ్యాయామ తరగతుల వంటివి అలవాటు చెయ్యాలి. డాన్స్ ఎంతో మంచి శారీరక వ్యాయామం.

✪ మనతో పోలిస్తే పాశ్చాత్య దేశాల్లో మానసిక ఒత్తిడి చాలా ఎక్కువ. కీలక పరిశోధనలన్నీ వాళ్ళే చేస్తుంటారు... చాలా కష్టపడి రేయింబవళ్ళు పని చేస్తుంటారు... ప్రతి అవకాశాన్నీ వినియోగించు కోవాలనీ, జీవితంలో ఇంకా ఇంకా పైపైకి ఎదగాలనీ విపరీతంగా మథన పడుతుంటారు. ఇప్పుడిప్పుడే ఇవన్నీ మన దగ్గరా కనబడుతున్నాయి. అందుకే మనమూ ధ్యానాన్ని ఆశ్రయించాలి.

ఎవరికైనా మధుమేహం, రక్తపోటు రెండూ ఉంటే... రెంటికీ సమర్థ చికిత్స తీసుకోవాలి. కానీ చాలా మంది మధుమేహాన్నో, లేక బీపీనో... ఏదో ఒకదాన్నే పట్టుకుని... దాని మీదే శ్రద్ధ పెడుతున్నారు. కొందరు బీపీకే మందులు తీసుకుంటూ మధుమేహాన్ని పట్టించుకోరు. అది సరికాదు. బీపీ, మధుమేహం, కొలెస్ట్రాల్, బరువు, ఒత్తిడి... ఇలా అన్నింటినీ తగ్గించుకోవాలి.

మన దేశంలో పల్లెల్లో ఇప్పటికీ గుండెజబ్బులు తక్కువేగాని వారు పట్టణాలకు వస్తూనే వాళ్ళ జీవనశైలిలో మార్పులు వస్తున్నాయి, గుండె పోటు రిస్కూ పెరుగుతోంది. మానసిక ఒత్తిడి, నిరాశా ధోరణి, అహంభావం, అహంకారం, ఈర్ష్య... ఇవన్నీ మన మీదకు వచ్చిపడుతున్న కొత్త రిస్కులు.

✪✪✪ *అందుకే ఇప్పుడు వైద్యులు కూడా రోగులను ధ్యానం తరగతులకు పంపించటం, వారి మానసిక అంశాల గురించి పట్టించు కోవటం అవసరం. చాలా మంది వైద్యులకు ఇది తెలుసుగానీ... సమయం లేక వీటిని రోగులతో చర్చించటం లేదు. ఈ ధోరణి మార్చుకోవాలి.*

❖ ❖ ❖

మీ శరీరాన్ని మరియు జీవితాన్ని చాలా సులభంగా
మీకు ఇష్టం వచ్చినట్టుగా మార్చుకోవచ్చు. ఇది సత్యం.
దీన్ని నమ్మండి. మీరు బలంగా నమ్ముతూ ఉంటే, అత్యంత
త్వరలోనే మీకు మీ శరీరాన్ని మరియు మీ జీవితాన్ని
ఎలా అంటే అలా మార్చుకునే శక్తి సామర్థ్యాలు వస్తాయి.
మీరు నమ్ముతూ ఉండాలి. నమ్ముతూనే ఉండాలి.

పార్ట్ - 23

ధ్యాన లాభాలు

మీరు, మీలోని దైవత్వాన్ని నమ్ముకుని ఉంటే, సృష్టిలో మీరు సాధించలేనిది అంటూ ఏదీ ఉండదు.

మీలో ఉన్న మీ దైవత్వానికి అన్నీ సుసంభవమేనని నమ్మండి.

మీకోసం మీ దైవత్వం ఏం చేయమన్నా చేస్తుందని నమ్మండి. ఇది నిజం.

1. క్రమం తప్పకుండా ధ్యాన సాధన చేస్తే కలిగే లాభాలు... కొన్ని !

✪ ఎవరెవరికి ఏ, ఏ సమస్యలు ఉన్నాయో వాటి మీద పని చేస్తుంది, పరిష్కరిస్తుంది ధ్యానం.

✪ శాంతి, సంతృప్తి మరియు ఆనందం కలుగుతాయి.

✪✪✪ Internetలో ఓపికగా వెతికితే తలనొప్పి నుండి క్యాన్సర్, ఎయిడ్స్ వరకు ఏ మందులు వాడకుండా, పైసా ఖర్చు లేకుండా కేవలం ధ్యాన సాధన ద్వారా పూర్తిగా జబ్బులను నయం చేసుకున్న వారి అనుభవాలు ఎన్నెన్నో కనిపిస్తాయి. ఏవైనా సందేహాలుంటే వారిని సంప్రదించి నిజా నిజాలు తెలుసుకుని, సాధన చేసి మీరు కూడా మీకు కావలిసిన ఫలితాలను పొందవచ్చు. మేము హాస్పిటల్‌కు వెళ్ళద్దు అని, ట్రీట్‌మెంట్ తీసుకోవద్దు అని, మందులు వాడద్దు అని చెప్పటం లేదు. మీరు హాస్పిటల్‌కు వెళ్ళడం, ట్రీట్‌మెంట్ తీసుకోవడం, మందులు వాడడం అనే విషయాలు, పూర్తిగా మీ పరిస్థితుల పైన మీకు ఉన్న అవగాహన పైన మరియు మీ పట్ల మీకున్న స్వంత బాధ్యత పైన ఆధారపడి ఉంటాయి. మేము హాస్పిటల్స్‌కు, ట్రీట్‌మెంట్‌కు, మందులకు వ్యతిరేకం కాదని మనవి చేస్తున్నాం. మేము కేవలం ఆధ్యాత్మిక విజ్ఞానం ద్వారా మరియు ధ్యానం ద్వారా ఆరోగ్యాన్ని పొందే విషయాలను తెలియ జేస్తున్నాం. గ్రహించ గలరని విజ్ఞప్తి.

✪❂✪❂✪❂

✪ ఆరోగ్యం వస్తుంది. వ్యాధి నిరోధక శక్తి అద్భుతంగా పెరుగుతుంది.

✪ Interviewలను సమర్థవంతంగా, coolగా ఎదుర్కొనే capacity వస్తుంది.

✪ Stage Fear పోతుంది. ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్స్ పోతుంది.

✪ పరీక్షలను, ప్రాక్టికల్స్‌ను, ఏవైనా ఇంకా ఇతర డెమాన్‌స్ట్రేషన్స్‌ను coolగా, బాగా deal చేసే caliber వస్తుంది.

✪ డిప్రెషన్, స్ట్రెస్, స్ట్రెయిన్, నెర్వస్‌నెస్, ప్రెజర్, టెన్షన్, ఆంగ్జయిటి, ఎమోషనల్ ఇమ్‌బాలన్స్ మొదలైనవి సులభంగా, పూర్తిగా, శాశ్వతంగా తొలగిపోతాయి.

✪ నెగెటివ్ ఆలోచనలు రానే రావు. నెగెటివిటీ మొత్తం తొలగిపోతుంది. చక్కటి పాజిటివ్ నేచర్ డెవలప్ అవుతుంది. ఆలోచనలపై సంపూర్ణమైన, సమగ్రమైన అదుపు లభిస్తుంది.

✪ విద్యార్థులకు అద్భుతమైన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, తెలివి, ప్రతిభలు అభివృద్ధి చెందుతాయి.

✪ మానసిక ఆందోళనలు, ఒత్తిడులు తొలగి, సంపూర్ణమైన మనశ్శాంతి లభిస్తుంది. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు, ఆత్మ విశ్వాసం పెంపొందుతాయి. చెక్కు చెదరని గుండె ధైర్యం వస్తుంది.

✪ అనుకున్న లక్ష్యాన్ని సులభంగా, శీఘ్రంగా సాధించే శక్తి సామర్థ్యాలు వస్తాయి.

✪ నిత్య జీవితంలో ఎదురయ్యే అన్ని రకాల సమస్యలను పరిష్కరించే వివేకం ప్రాప్తిస్తుంది. అన్ని రకాల ఫోబియాలు పోతాయి.

✪ సెక్స్ సమస్యలు తొలగిపోతాయి. సెక్స్ సామర్థ్యం పెరుగుతుంది."కామ సిద్ధి" కలుగుతుంది.

✪ ఎవరెవరు, ఏ, ఏ రంగాలలో ఉన్నారో వారు ఆయా రంగాలలో అద్భుతమైన ప్రగతిని సాధిస్తారు.

✪ దివ్యచక్షువు ఉత్తేజితమౌతుంది, మనకు అనేక జన్మలున్నాయని తెలుస్తుంది. సృష్టిలో కోటాను కోట్ల లోకాలు ఉన్నాయని తెలుస్తుంది.

✪ నేను దేహం కాదు ఆత్మను లేక ఉనికిని అని తెలుస్తుంది, సకల ప్రాణికోటితో మిత్రత్వం ఏర్పడుతుంది. మరణ భయం తొలగిపోతుంది. ఆయుష్షు పెరుగుతుంది.

✪ "సర్వం సమానమే", "అందరిదీ ఒక్కటే", "అంతా ఒక్కటే", అన్న పరమ సత్యాలు అవగాహనలోకి

వస్తాయి.

✪ ఆటోమెటిక్‌గా ఓల్డ్ ఎనర్జీలు అన్నీ రిలీజ్ అయిపోయి న్యూ ఎనర్జీలు Establish అవుతాయి. ధ్యానం Regular గా చేస్తూ ఉంటే ఎనర్జీలు అన్నీ ఎప్పటికప్పుడు ఆటోమెటిక్‌గా Update అవుతూ ఉంటాయి. ఎనర్జీల గురించి ఏమీ తెలియక పోయినా సరే !

✪ సకల - సకల, సర్వ - సర్వ, సమస్త కర్మలు వాటి బంధనాలు అవి ఎంతటివైనా సరే సునాయాసంగా శాశ్వతంగా దగ్ధమై పోతాయి. నిజానికి కర్మ అనేది లేనే లేదు అని తెలుస్తుంది.

✪ బుద్ధికుశలత, చక్కని నిర్ణయ శక్తి, స్థిరత్వం, ఆత్మ విశ్వాసం, సమయస్ఫూర్తి, విచక్షణా జ్ఞానం, అవగాహనా శక్తి సామర్థ్యాలు, ఆత్మవిజ్ఞానం మరియు దైవత్వం సంప్రాప్తిస్తాయి.

❖ ❖ ❖

౭. నా జీవితంలో నేను చూసిన, నాకు తెలియజేయబడిన కొన్ని ధ్యాన లాభాలు

✪ సంతానం లేని వారు కోరుకున్న ఉత్తమ సంతానాన్ని పొందడం.

✪ చాలా మంది తమ పేదరికం నుండి బయట పడటం.

✪ కొంత మంది ఐశ్వర్యవంతులుగా మారడం.

✪ జీవనోపాధి లేని వారికి జీవనోపాధి లభించడం.

✪కొంత మందికి అవాంఛిత రోమాలు, ముఖంపై మొటిమలు, కురుపులు తగ్గిపోవడం.

✪ కొంత మందికి ముఖంపై, శరీరంపై ముడతలు తొలగిపోయి శరీరం కాంతివంతంగా, మృదువుగా, యవ్వనంగా తయారు కావడం.

✪కొంత మందికి వృద్ధాప్య ఛాయలు, లక్షణాలు పూర్తిగా తొలగి యవ్వనంగా, శక్తివంతంగా తయారుకావడం.

✪కళ్ళకు సంబంధించిన సమస్యలు తొలగిపోవడం. సైట్ ప్రాబ్లం క్లియర్ అయిపోయి కళ్ళద్దాలు వాడుతున్న వారికి ఇక కళ్ళద్దాల అవసరం శాశ్వతంగా తీరిపోవడం.

✪జుట్టు రాలే సమస్య నుండి బయట పడటం. చుండ్రు సమస్య పూర్తిగా తొలగిపోవడం. బట్టతల సమస్య నుండి పూర్తిగా బయట పడి జుట్టు నల్లగా, వత్తుగా, మృదువుగా, ఆకర్షణీయంగా, ఆరోగ్యంగా, బలంగా తయారు కావడం.

✪తలపైన, గడ్డం, మీసాలు, ఛాతిపైన తెల్లవెంట్రుకలు పూర్తిగా తొలగి పోయి నల్ల వెంట్రుకలు రావడం.

✪ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో అద్భుతమైన ఫలితాలను పొందడం.

✪లావుగా(ఒబెసిటి లేక ఊబకాయం) ఉన్నవారికి సరైన ఫిజిక్ రావడం.

✪పొట్ట ఉన్న వారికి, పొట్ట పోవడం.

✪సన్నగా ఉన్న వారు సరి అయినంత బరువు పెరిగి చక్కటి ఫిజిక్‌ను పొందడం.

✪ కొంత మందికి శరీరం పైభాగం బాగానే ఉంటుంది. తొడలు, పిక్కలు సన్నగా ఉంటాయి. ఇలాంటి వారికి వాళ్ళ కాళ్ళు తగినంత లావుగా, బలంగా తయారు కావడం.

✪ముఖం మీద, శరీరం మీద ఉన్న మచ్చలు పోవడం.

✪పొట్టిగా ఉన్నవారు ఎత్తు పెరగడం.

✪కఫం, ఇంకా ఇతర గొంతు సమస్యలు పూర్తిగా క్లియర్ కావడం.

✪దంతాల, చిగుళ్ళ, దవడల అన్ని రకాల సమస్యలు తొలగి పోవడం. గార పట్టిన పళ్ళు, పసుపు రంగుతో ఉన్న పళ్ళు పూర్తిగా క్లీన్ అయి, బలంగా, తెల్లగా మెరిసి పోవటం. నోటి దుర్వాసనా సమస్యలు తొలగిపోవడం.

✪రక రకాల స్త్రీ పురుషుల సెక్స్ సమస్యలు పరిష్కారం కావడం.

✪సెక్స్ సుఖాన్ని సంపూర్ణంగా అనుభవించలేక బాధపడుతున్న స్త్రీ పురుషులు ధ్యాన సాధన మొదలు పెట్టిన తర్వాత సంపూర్ణంగా సెక్స్‌ను ఎంజాయ్ చేస్తున్నామని, భావప్రాప్తిని పొందుతున్నామని తెలియజేసారు.

✪వైద్య శాస్త్రానికి అందని విచిత్రమైన ఆరోగ్య సమస్యలు కొన్ని క్లియర్ కావడం.

✪ఒక సారి 2004 ప్రారంభంలో జరిగిన సంఘటన : నేను, నా టీమ్‌తో ఉభయ గోదావరి జిల్లాలలో మరియు విశాఖ పట్నంలో కొన్ని క్లాసులు నిర్వహించడానికి వెళ్ళాను. ఒక పది రోజులలో సుమారు 10 నుండి 15 క్లాస్‌లు నిర్వహించి తిరిగి హైదరాబాద్ వచ్చేశాము. ఈ క్రమంలో మేము ఎన్నో బ్రోచర్స్ పంచాము. మేము టూర్ నుండి తిరిగి వచ్చిన తర్వాత సుమారు రెండు నెలల తర్వాత వైజాగ్ నుండి ఎవరో ఒక వ్యక్తి ఫోన్ చేశాడు.(బ్రోచర్

పైన మా అడ్రస్, ఫోన్ నంబర్లు ఉంటాయి) నా టీమ్ మెంబర్లలో ఒకరు ఆయన ఫోన్ రిసీవ్ చేసుకున్నారు. అప్పుడు ఆయన చెప్పిన విషయాలు ఇవి :

"ఆయన ఒక ప్రైవేట్ కంపెనీలో ఒక చిన్న ఉద్యోగి. ఆయన ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణిస్తూ ఉండటంతో వైద్య పరీక్షలు చేయించారు. ఆయనకు బ్లడ్ క్యాన్సర్ ఉందని తేలింది. కొద్ది నెలల్లోనే ఆయన ఆరోగ్యం చాలా దెబ్బతిని ఏమీ పని చేయలేని స్థితికి వచ్చాడు. దాంతో కంపెని వాళ్ళు ఉద్యోగ్యంలో నుండి తీసేసారు. ఆయన కుటుంబం అంతా ఈయన మీదే ఆధారపడి బ్రతుకుతుంది. ఉద్యోగం పోవడం, పేదరికం, పైగా బ్లడ్ క్యాన్సర్ - ఎంతో దయనీయమైన పరిస్థితి. డాక్టర్లు చెప్పారట, ఇంకా కొంత కాలం మాత్రమే జీవిస్తాడు అని. ఇక ఆయన చేసేదేమి లేక చావు కోసం ఎదురుచూస్తూ ఉన్న తరుణంలో మా బ్రోచర్ ఆయన చేతికి అందింది. అందులో వివరించిన సాధన చదివి, ఎలాగు చావ బోతున్నాను ఈ ఒక్క ప్రయత్నం చేసి చూస్తాను అని చదివి సాధన చేశాడు అద్భుతం జరిగింది. రెండు నెలల్లో పూర్తిగా కోలుకున్నాడు. తిరిగి టెస్ట్‌లు చేయిస్తే బ్లడ్ క్యాన్సర్ లేదు అని వచ్చింది. ఆయన తిరిగి ఉద్యోగంలో చేరాడు. మా బ్రోచర్‌ను ఫ్రేమ్ కట్టించుకుని ఇంట్లో పెట్టుకుని ఆనందంతో ఫోన్ చేశాడు".

నా టీమ్ మెంబర్ వచ్చి నాకీ విషయం చెప్పాడు. నేను మా వాడిని అడిగాను, ఆయన పేరు, అడ్రస్ తీసుకున్నావా అని. ఆయన మళ్ళీ ఫోన్ చేస్తానని చెప్పాడు సార్ అని అన్నాడు. ఆ తర్వాత మళ్ళీ ఆయన ఫోన్ చేయలేదు. ఆయన పూర్తి వివరాలు మాకు అందించి ఉంటే ఎంతో మందికి ఆయన విషయం గొప్ప ప్రేరణను ఇచ్చి ఉండేది. ఇలా మాకు చాలా, చాలా మంది చేస్తుంటారు మాకు ఫలానా లాభం జరిగిందని, వివరాలు మాత్రం అందించరు. కేవలం మీకు ధన్యవాదాలు చెప్పేందుకే ఫోన్ చేశాం అని చెప్తారు. మాకు ధన్యవాదాలు చెప్పి మా బ్రోచర్ ఫ్రేమ్ కట్టించుకుంటే ఏం లాభం ? మీరు పొందింది ఇతరులకు పంచడమే "మాకు ధన్యవాదాలు చెప్పడం అంటే" ! మీకు జరిగిన శ్రేయస్కరం అందరికీ అందించాలి. ఒక వేళ మీరు ఇలా చేయలేని పక్షంలో మాకైనా మీ వివరాలు తెలియజేస్తే, మీ వివరాలతో అందరికీ ప్రేరణను మేం అందిస్తాం. మాకు మీ వివరాలు కావాలి. దానితో అందరికీ ప్రేరణ ఇవ్వగలుగుతాం. దయచేసి అర్థం చేసుకోండి. మీలో ఎవరికైనా ఏదైనా విశేషమైన లాభం జరిగితే పూర్తి వివరాలతో మాకు తెలియజేయండి. అది ఎంతో మందికి ఉపయోగ పడుతుంది. మీకు జరిగిన లాభం అందరికీ జరగాలి కదా

! ఆధారాలు ఉంటే జనాలకు చక్కని నమ్మకం కుదురుతుంది. దయచేసి మీరు ఆ వైజాగ్ ఆయన లాగా చేయకండి. మీకు మంచి జరిగితే దాని ప్రేరణతో ఎంతో మందికి మంచి జరిగే అవకాశం ఉంది. లాభం పొంది కూడా గుప్తంగా ఉండడం సరి కాదు. ఆలోచించండి.

దయచేసి అందరికి మంచి చేయండి.

పంచబడింది పెంచబడుతుంది.

కానీ తనకు మాలిన ధర్మం పనికి రాదు.

❖ ❖ ❖

పార్ట్ - 24

సాధారణ సందేహాలు

I. సాధారణ సందేహాలు

ధ్యానం ఎప్పుడైనా, ఎక్కడైనా చేసుకోవచ్చు. మీకు వీలైనంత సేపు, ఒక రోజులో మీకు వీలైనన్ని సార్లు చేసుకోవచ్చు.

ధ్యానంలో ఉన్నప్పుడు.....

అపారంగా, ధారాళంగా కాస్మిక్ ఎనర్జీని పొందుతాం. కాస్మిక్ ఎనర్జీ మనలోకి ప్రవహించినపుడు, ప్రవహిస్తూ ఉన్నప్పుడు ఈ క్రింది విధంగా జరుగుతాయి. ఇవన్నీ జరిగితే జరుగుతాయి లేక పోతే లేదు. ఒక వేళ ఈ కింది వాటిలో అన్నీ కానీ, లేక ఒకటో, రెండో లేక కొన్ని కానీ జరిగితే మీరు కంగారు పడకుండా ముందు జాగ్రత్తగా తెలియజేస్తున్నాను :

1. మనకు తెలియకుండా మనం ముందుకు వంగుతాం. శరీరం ఏదైనా ఒక పక్కకు వంచబడి అలానే కాసేపు నొక్కబడి లేదా వంచబడి ఉంటుంది.

2. శరీరం తనంతట తానుగా ఊగుతుంది. వెనకకు, ముందుకు లేదా ఏ విధంగానైనా కదులుతుంది. కంగారు పడాల్సిన పని లేదు. ఆటోమెటిక్‌గా వచ్చే కదలికలను ఆపవద్దు. ఒక్కోసారి శరీరంలో ఎక్క డైనా బలంగా నొక్కినట్టు అనిపిస్తుంది. కలుపుకుని ఉన్న చేతులు విడిపోతాయి. కళ్ళు వాటంతట అవే తెరుచుకుంటాయి, మూసుకుంటాయి. అప్రయత్నంగా కాళ్ళు, చేతులు రక రకాలుగా కదులుతాయి. తల వెనుకకు, ముందుకు, పక్కలకు వంచబడుతుంది, అలానే కాసేపు నొక్కబడి లేదా వంచబడి ఉంటుంది.

3. తల భారంగా అవుతుంది. లేదా కొంత మందికి తల తిరిగినట్టు, కడుపులో తిప్పినట్టై, వాంతులు అవుతున్న ఫీలింగ్ వస్తుంది. కంగారు పడవద్దు. ఒక వేళ వాంతులైతే కానివ్వండి. ప్రక్షాళన జరిగింది అని తెలుసుకోండి.

4. చేతులు లేదా శరీరంలోని ఏదైనా ఒక భాగం బిగుసుకు పోయినట్టు అనిపిస్తుంది.

5. శరీరంలోని ఏదైనా ఒక భాగం పెద్దగా, బరువుగా అయినట్టు తెలుస్తుంది లేదా తేలికగా అయినట్టు అనిపిస్తుంది.

6. ఒక్కోసారి శరీరం లేనట్టు అనిపిస్తూ ఉంటుంది లేదా శరీరంలోని ఏదైనా ఒక భాగం లేనట్టు అనిపిస్తుంది.

7. శరీరంలో ఎక్కడైనా గానీ తిమ్మిరి పట్టినట్టుగా అనిపిస్తుంది.

8. శరీరం ఉయ్యాల ఊగినట్టు అనిపిస్తుంది.

9. శరీరంలో ఎక్కడైనా దురద గానీ, మంట గానీ పెట్టవచ్చు.

10. శరీరంలో ఎక్కడైనా గానీ చిన్న సూది పెట్టి గుచ్చినట్టు అనిపిస్తుంది.

11. శరీరంలో ఏ ప్రదేశంలోనైనా గానీ జర జర పాకినట్టు, జలదరింపుగా అనిపిస్తుంది.

12. శరీరంలోని ఏవైనా భాగాలు, లేదా ఎక్కడైనా సరే కండరాలు అదురుతాయి.

13. నుదిటి మధ్య భాగంలో, బొట్టు పెట్టుకునే భాగంలో అంటే "థర్డ్ ఐ" భాగంలో సన్నని నొప్పి, దురద లేదా నొక్కినట్టుగా లేదా గుండ్రంగా తిరిగినట్టు లేదా కదలికలు మొదలైనవి కలుగుతాయి. మూడో కన్ను అంటే థర్డ్ ఐ ఉత్తేజితం అయ్యేటప్పుడు ఇలా జరుగుతుంది.

14. శరీరంలో ఎవైనా పగిలినట్టు, విరిగినట్టు, పేలినట్టు శబ్దాలు వినిపించే అవకాశం ఉంది. మీరు ధ్యానంలో ఉన్నప్పుడు, ఒక్కో సారి మీ లోంచి రక రకాల శబ్దాలు, చిత్ర విచిత్రమైన అరుపులు, ఊళలు, జంతువులను పోలిన శబ్దాలు మొదలైనవి వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి శబ్దాలు వాటంతట అవే అలా వచ్చినప్పుడు వాటిని ఆపకుండా రానివ్వాలి. అవి లోపలి నుండి వస్తూన్నప్పుడు ఎరుకతో సాక్షిగా ఉండాలి. ఇలా శబ్దాలు వచ్చినప్పుడు కంగారు పడకుండా "లోపలి చెత్త క్లియర్ అవుతూందని" తెలుసుకుని కూల్‌గా ఉండాలి. సాధనలో ఇది మామూలే !

ఇవి అన్నీ ఏవి జరిగినా, జరగకపోయినా ధ్యానం ఆపవద్దు. ధ్యానంలో ఇవి భాగాలు. ఇవి సహజం. మధ్యలో ధ్యానం ఆపకూడదు. జరిగితే జరుగుతాయి లేకపోతే లేదు. ధ్యానంలో అంతా శ్రేయస్కరమే జరుగుతుంది. ఇంకా చాలా జరుగుతాయి.

15. ధ్యాన సాధన చేసుకునే వారు సెక్స్‌లో పాల్గొనవచ్చా అని సాధారణంగా చాలా, చాలా, చాలా మంది అడుగుతూ ఉంటారు. నిరభ్యంతరంగా, హాయిగా సెక్స్‌లో పాల్గొనవచ్చు. సెక్స్ అంటే సృష్టి కార్యం ! పరమ పవిత్రమైన కార్యం. సృష్టి కార్యం(సెక్స్) పెట్టిన సృష్టికర్తకు మనకన్నా ఎక్కువే తెలిసి ఉంటుంది కదా ! ఆ యొక్క "మూల చైతన్యానికి" తెలుసు ఏది తప్పో, ఏది ఒప్పో ! సెక్స్ తప్పు కాదు. అది తప్పు అయితే "సృష్టి" సెక్స్ ద్వారానే కొనసాగే విధంగా సృష్టికర్త ఎందుకు పెడతాడు. సెక్స్ దివ్యమైనది. అయితే తిమ్మిని బమ్మిగా చేసే మనిషి, దేనినైనా అవలీలగా ఆనవాలు లేకుండా వక్రీకరించే మనిషి పవిత్రమైన కామాన్ని(సెక్స్) కూడా భ్రష్టు పట్టించాడు. సెక్స్ తప్పు

అయితే, భూమి పైన మనుషులు అనబడే వాళ్ళంతా తప్పే ! తప్పుడు కార్యంలో నుండి పుట్టిన తప్పుడు మనుషులు. జంతు, జీవజాలం అంతా తప్పే !

ఎందుకంటే ఎవరైనా సెక్స్ ద్వారానే పుట్టాలి కదా ! వర్షం పడ్డప్పుడు రాలే వడగళ్ళ లాగా ఎవరు కూడా ఆకాశం లోంచి ఊడి పడరు కదా !

కాబట్టి మిత్రులారా ! అనవసరంగా కంగారు పడకండి. సెక్స్ తప్పు కాదు. దాని పట్ల మన దృక్పథం తప్పు. దాని పట్ల మన అవగాహన తప్పు. అన్నీ సృష్టిలో సరిగానే ఉంటాయి. ఏదైనా మనం చూసే దృష్టిని బట్టి ఉంటుంది. హాయిగా ఎంజాయ్ చేయండి. "కామి కాని వాడు మోక్షగామి కాలేడన్న" పెద్దల సూక్తి ఉండనే ఉంది. "కామం(Sex) నాలుగు పురుషార్థాలలో ఒకటి". చక్కగా శృంగార జీవితాన్ని అనుభవించండి. కామం(Sex) దివ్యం అన్న భావనతో ఆనందించండి. దిల్ సే....!

16. సినిమాలు తదితర ఎంజాయ్‌మెంట్స్ చేయవచ్చా అని అడుగుతూ ఉంటారు. మజా, మజాగా ఎంజాయ్ చేయండి. జీవితంలో జీవించండి. దిల్ సే, దిల్ సే ఎంజాయ్ చేయండి.

17. చక్కగా చదువుకోండి, వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు చేసుకోండి. పెళ్ళి చేసుకోండి, పిల్లల్ని కనండి, కుటుంబాలతో కలిసి ఉండండి, ప్రేమించుకోండి, బాగా ఆస్తులు సంపాదించుకోండి. మనిషి ఎప్పుడూ భౌతికంగా, ఆధ్యాత్మికంగా సుసంపన్నంగా ఉండాలి.

18. ధ్యానంలో కలిగే నొప్పులకు మందులు వాడవచ్చా అని అడుగుతూ ఉంటారు. అవసరం లేదు. ఎంత మాత్రం అవసరం లేదు. నాడీ మండల శరీరం ప్రక్షాళన జరుగుతూ ఉంటే ఈ నొప్పులు సహజంగా వస్తాయి. అది ఏమంత పెద్ద విషయం కాదు. వాటిని పట్టించుకోకూడదు. ప్రక్షాళన ముగిసిన వెంటనే తగ్గిపోతాయి.

19. మాకు కొన్ని రకాల ధ్యానాలు తెలుసు. పొద్దున ఒకటి, మధ్యాహ్నం ఒకటి, సాయంత్రం ఒకటి, రాత్రి పడుకునే ముందు మరొకటి ఈ విధంగా సాధన చేయవచ్చా ? అని అడుగుతుంటారు. ఎంత మాత్రము సరి కాదు. చేయనే చేయకూడదు. దేన్నో ఒక దాన్ని మాత్రమే ఎంచుకోవాలి. ఒక దాన్ని మాత్రమే సాధన చేయాలి. చాలా రకాల సాధనలు, సాధన చేస్తే ప్రమాదం ! పది రకాల పద్ధతులు చేస్తే ఏదో ఒకటి "క్లిక్" కాకపోతుందా, ఏదో ఒకటి work out కాక పోతుందా, అని కొంత మంది "అతి తెలివి" ప్రదర్శిస్తూ ఉంటారు. ఏదో ఒకటి కాదు అన్నీ "క్లిక్" అయి, అన్నీ work out అయి ఎటూ గాకుండా పోతారు. Too many cooks spoil the soup అన్నట్టు అవుతుంది. ఒక వేళ ఈ విధంగా ఎవరైనా చేస్తూ ఉంటే తక్షణమే ఆపేసి ఏదో ఒక దాన్ని సాధన చేస్తే జరిగిన నష్టం త్వరగా లాభంగా మారుతుంది. రికవర్ కావచ్చు. కంగారు పడాల్సిన పని లేదు. ఎన్నో రకాల

సాధనలు ఉన్నాయి. వాటిలో మీకు ఏది సూట్ అవుతుందో చూసుకోండి. ఒక దాని తర్వాత ఒక దాన్ని చేస్తూ పోవాలి. ఒక దాన్ని పరీక్షించిన తర్వాత ఒక దానిని పరీక్షించాలి. ఒకటి తర్వాత ఒకటి. అంతే కానీ అన్నీ ఒకే సారి చేయ కూడదు. చివరికి ఏదో ఒక దాన్ని ఎంచుకోవాలి. ధ్యాన పద్ధతుల్లో పరస్పరం విరుద్ధమైనవి, పరస్పరం సారూప్యం గలవి ఉంటాయి. పరస్పరం సారూప్యం గలవి కలిపి సాధన చేస్తే ఏమీ కాదు, పరస్పరం విరుద్ధమైనవి మాత్రం కలిపి సాధన చేయ కూడదు. సాధనా పద్ధతులను ఎంచుకునే ముందు నిపుణులను సంప్రదిస్తే మంచిది.

20. ధ్యాన శాస్త్రం - The Science of Meditation, ఆధ్యాత్మిక శాస్త్రం - Cosmic Science అంటే ఆషామాషీ కాదు. వీటితో పరాచికాలు ఆడవద్దు. నిజమైన ఆసక్తి ఉంటే ఆచరించండి, సాధన చేయండి. లేక పోతే లేదు. వీటితో "ఆటలు" ఆడవద్దు, దయచేసి ! వీటితో పరాచికాలు ఆడితే రాత్రి కాదు, పగలే చుక్కలు కనపడతాయి ! అది కూడా టెలిస్కోప్ లేకుండా !

21. ధ్యానం చేసేవారు ఎక్సర్‌సైజులు చేసుకోవచ్చు. జాగింగ్, రన్నింగ్, స్పోర్ట్స్, వాకింగ్, స్విమ్మింగ్ అన్నీ చేసుకోవచ్చు.

22. ధ్యానం చేసే వారు "యోగాసనాలు" వేసుకోవచ్చు. "యోగాసనాలు" శరీరానికి సంబంధించినవి, యోగము అంటే ధ్యానం ఆత్మకు సంబంధించినది.

23. స్నానం చేయాలా, కొత్త బట్టలు వేసుకోవాలా అని అడుగుతూ ఉంటారు. స్నానానికి, కొత్త బట్టలకి, ధ్యానానికి ఏ సంబంధమూ లేదు. అది మీ వీలును బట్టి మీరు చూసుకోండి.

24. స్త్రీలు పీరియడ్స్ టైమ్‌లో కూడా ధ్యాన సాధన చేసుకోవచ్చు. చేయాలి కూడా, ఆ సమయంలో వారికి ధ్యానం అవసరం.

25. కింద ఏదైనా వస్త్రం లేదా ఏదైనా ఒకటి వేయకపోతే ధ్యానం చేసిన శక్తి అంతా భూమి లాగేసుకుంటుంది, అనే ఒక తప్పుడు భావన ఉంది చాలా మందిలో. భూమి గనక శక్తిని లాగేస్తే ఈ భూమ్మీద ఒక్కడు కూడా మిగలడు. అందరూ spotలో మఠాష్ అవుతారు. భూమి శక్తిని ఇస్తుంది. మన శరీరం పంచ భూతాలతో నిర్మింపబడి ఉంది. అందులో 'భూ'తత్వం ప్రధానమైంది. మనం ఈ భూమిపైనే పుట్టాం. ఈ భూమి పైనే జీవిస్తాం. మన జీవితానికి, జీవానికి, ఉనికికి ఆధారం భూమి. మనకు ఆశ్రయం ఇస్తుంది భూమి. చివరికి చస్తే కూడా ఎంతో ఆదరంగా తన హృదయంలో దాచుకుంటుంది మన "శవాలను" భూమి. ఇంకా సాధారణ బుర్రలకు అందనంత మహా దివ్య సేవలను అందిస్తుంది మన భూమి. ఇలాంటి "అనంత శక్తిమయి" అయిన భూమి పైన, "శక్తిని లాగివేసుకుంటుంది" అనే అపవాదు వేయడం ధర్మం కాదు. భూమి ఏమి అనుకోదు, ఏమీ చేయదు కానీ ఆ భావన సరి కాదు. ఎవడో వెనకటికి ఆడలేక "మద్దెల దరువు" బాగా లేదు అన్నాడట. సరి

అయిన ధ్యానం, సరి అయిన పద్ధతిలో చేయకుండా ఒక గంట సేపు ఏదో అనుకుని ఏదో చేసి, లేచి చూస్కుని ఓహో నేనింకా బాగా కాలేదు అంటే భూమి నా శక్తి లాగేసుకుంటుంది కాబోలు అని, తన లోపాన్ని అనంత దివ్య శక్తిమయి అయిన భూమి పైన రుద్దడం సరి కాదు. కాబట్టి మిత్రులారా క్రింద ఏం వేసుకుంటారో, వేసుకోరో అది మీ సౌకర్యం. దానికి ధ్యానానికి, ధ్యాన శక్తికి ఎలాంటి సంబంధం లేదు నిజానికి ప్రకృతిలో అంటే అడవుల్లో ధ్యానం చాలా శక్తి వంతంగా ఉంటుంది.

అత్యంత ముఖ్య గమనిక : స్థలాల్లో పాజిటివ్, నెగెటివ్ రెండు రకాల స్థలాలు ఉంటాయి. ఆ స్థలం ఖాళీగా ఓపెన్‌గా ఉండవచ్చు లేదా అక్కడ ఇల్లో ఇంకేదైనా కట్టడం ఉండవచ్చు, నెగెటివ్ స్థలంలో మీరు కింద ఏం వేసుకున్నా వేసుకోకపోయినా.. సరే.. అక్కడ మీరు ధ్యానం చేస్తే మీకు హాని జరుగుతుంది. కాబట్టి ధ్యానం చేసే ముందు ఆ స్థలం మంచిదా కాదా చెక్ చేసుకోవాలి. కళ్ళుమూసుకుని కూర్చుని, మీ దైవత్వాన్ని అడగండి ఈ స్థలం మంచిదేనా, కాదా అని.. సమాధానం కోసం కాసేపు అలాగే ఎదురు చూడండి. ఆ తర్వాత మీకు ఏది సంతృప్తికరంగా అనిపిస్తే అది చేయండి.

❀❀❀

2. ధ్యానం మొదలు పెట్టిన కొన్ని రోజుల తర్వాత

మన నిత్య జీవితంలోని కొన్ని విషయాలలో మరియు అలవాట్లలో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. అంటే fluctuations అన్నమాట. జరగకపోతే ఫర్వాలేదు. కానీ జరిగితే మీరు ఆందోళన చెందకుండా ఉండటానికి ముందు జాగ్రత్తగా చెప్తున్నాను.

1. దాహం ఎక్కువగా వేస్తుంది. ఒక్కోసారి అసలు వేయదు.

2. ధ్యానం చేస్తూ ఉన్నప్పుడు ప్రాణమయ కోశంలో ప్రక్షాళన ప్రారంభం అవుతుంది కాబట్టి ఆకలి ఎక్కువగా వేయవచ్చు. మీరు రోజు తినే దానికన్నా ఎక్కువగా తినే పరిస్థితి రావచ్చు. ఫర్వాలేదు హాయిగా తినండి. ఎందుకంటే ప్రాణమయ కోశం యొక్క ప్రభావం అన్నమయ కోశం పైన పడుతుంది కాబట్టి తినాలి.

3. ఒక్కోసారి ఆకలి మందగించవచ్చు. ఆకలి లేనపుడు తినవద్దు.

4. సాధారణంగా మీరు నిద్రపోయే సమయం కన్నా ఎక్కువ సమయం పడుకోవాల్సి వస్తుంది. అంటే నిద్రా సమయం పెరుగుతుంది. హాయిగా పడుకోండి.

5. ఒక్కోసారి నిద్రా సమయం తగ్గుతుంది. పర్వాలేదు. మీకు నచ్చిన పని ఏదైనా చేసుకోండి.

6. జన్మ, జన్మల నుండి అచేతనంలో అణిగి ఉన్న భావాలు బయటికి పోతూ ఉంటాయి, exhaust అవుతూ ఉంటాయి, అయితే అవి బయటకి పోయే ముందు మనల్ని కమ్ముకుంటాయి. కాబట్టి అప్పటి వరకు లేని విసుగు, చికాకు, కోపం, అసహనం, నిరాశ, నిస్పృహ, ఏదో తెలియని బాధ, దుఃఖం లాంటి వాటిని ఎదుర్కోవాల్సి వస్తుంది. భరించాలి. తప్పదు. వాటిని సాక్షిగా చూడాలి, అప్పుడు అవి శాశ్వతంగా తొలగి పోతాయి. అవి లోపల ఎప్పటి నుండో అణిగి ఉంటున్నాయి. బయటికి పోయే దారి లేక ఉక్కిరి బిక్కిరి అవుతూ మనకు ఊపిరి ఆడకుండా చేస్తూ ఉంటాయి. అజ్ఞానమే వాటికి అడ్డు గోడలు, మూసిన తలుపులు ! ధ్యానంలో, సాధనలో అడ్డు తొలగిపోతుంది, తలుపులు తెరుచుకుంటాయి. పోతూ ఉంటాయి. జన్మ, జన్మల భారం దిగి పోతూ ఉంటుంది. ఒక్కోసారి బాగా ఏడవాలనిపిస్తుంది. ఆడ, మగ తేడా లేదు. ఏడవండి. తనివి తీరా ఏడ్చి భారాన్ని దింపుకోండి. అణిచి పెట్టడం ప్రమాదం.

7. సాధన ఆపకుండా చేస్తే భారం అంతా దిగిపోయి మన జీవితంలో "జీవం" నిండుకుంటుంది. "జీవశక్తి"తో మన జీవితం తొణికిసలాడుతుంది, విరాజిల్లుతుంది.

8. ఒక్కోసారి అశాంతిగా ఉంటుంది. కారణం తెలియదు. డిప్రెషన్ కమ్ముకుంటుంది. ఈ స్థితిలో అలాగే ఉండకూడదు. ధ్యానం చేయాలి. ధ్యానం చేసినా పోకపోతే, ఎవరైనా సీనియర్లను వెళ్ళి కలవాలి. ఎంత సీనియర్ అయితే అంత మంచిది. వారితో కాసేపు గడపాలి. సీనియర్ మాస్టర్ల యొక్క "వైబ్రేషన్స్" మీకు ఎంతో సహాయం చేస్తాయి. మీరు మళ్ళీ కుదురుకుంటారు, కుదుట పడతారు.

9. ***అత్యంత ముఖ్య విషయం :*** ధ్యాన సాధన చేసేవారు నిరంతరంగా సీనియర్ మాస్టర్లకు టచ్‌లో ఉండాలి. ఎప్పటికప్పుడు సందేహాలు తీర్చుకుంటూ update అవుతూ ఉండాలి. గురువు చెప్పింది చెప్పినట్టు చేయాలి. సొంత పెత్తనాలు చేయ కూడదు.

❀❀❀

నేను ఇక ఏ కష్టాలను, ఏ సమస్యలను అనుభవించాల్సిన
అవసరం లేదు, అని పదే పదే అనుకోండి,
దీని వలన మీ దైవత్వం యొక్క శక్తి మీకు ప్రసరించి,
మీ కష్టాల మరియు సమస్యల మూలాలు పూర్తిగా తొలగిపోతాయి.

వీలైనప్పుడల్లా దివ్య భావనతో సెక్స్‌లో పాల్గొంటూ ఉండాలి. దీని వలన శారీరక, మానసిక ఆరోగ్యం ప్రాప్తిస్తుంది. అందరూ అనుకుంటున్నట్టుగా సెక్స్ చేస్తే శక్తి పోయి నీరసం రావడం అనేది ఒక నమ్మకం మాత్రమే. ఇది నిజం కాదు. సెక్స్ అనేది ఆత్మకు మరియు శరీరానికి రీచార్జ్ లాంటిది. మీరెంత సెక్స్ చేస్తే అంత చార్జ్ అవుతూ ఉంటారు. ఒక రహస్య ఆధ్యాత్మిక సూత్రం ప్రకారం... "శరీరం యొక్క అసలు సిసలు సరైన ఉపయోగం సెక్స్ చేయడమే" ! సెక్స్ వలన ఆత్మ వికసిస్తుంది, అభివృద్ధి చెందుతుంది, సాఫల్యం పొందుతుంది. అందరూ అనుకుంటున్నట్టుగా సెక్స్ అనేది తుచ్ఛమైన శారీరక వాంఛ కాదు. ఆత్మ యొక్క దివ్య అవసరమే సెక్స్ ! సెక్స్ చాలా మంచిది. చాలా గొప్పది. చాలా దివ్యమైనది. సెక్స్‌ను దివ్య భావనతో ఎంజాయ్ చేయండి.

ఈ విషయం నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బయటికి ఎంతో హుందాగా, సెక్స్ అనే పదం ఎప్పుడూ వినని నట్టు, సెక్స్ అంటే ఏమిటో తెలియనట్టుగా, సెక్స్ అసలు అవసరమే లేనట్టుగా ప్రవర్తించే స్త్రీ పురుషులను చాలా మందిని చూసాను. కానీ గుప్తంగా వాళ్ళు చేసే వీర విహారాలు కూడా నాకు తెలుసు ! కానీ ఈ విషయం ఏ ఒక్కరికైనా పనికి వస్తుందని చెప్తున్నాను. ఒక్కరైనా అమాయకులు ఉండకపోరా ?!

ఆధ్యాత్మిక సాధనలలో చాలా చిన్నవి, మధ్య రకానివి, ఉత్తమ సాధనలు ఉంటాయి. అయితే కర్మవశాత్తు ఒక్కోసారి చిన్న చిన్న ధ్యానాలు పరిచయం అవుతాయి. ఇక వాటికే అతుక్కుపోయి మేం చేసే ధ్యానాలే గొప్ప అని ఫీలవుతూ వాటిలోనే పడి ఉండకూడదు. ఓపెన్ మైండెడ్‌గా ఉంటూ ఆధ్యాత్మిక సాధనల పైన పరిశోధన చేస్తూ ఉండాలి. అత్యున్నతమైన, పరమోన్నతమైన సాధనలను కనుక్కుని వాటిని సాధన చేస్తూ ఉండాలి. లేకపోతే జన్మ వృథా అయిపోతుంది.

3. ధ్యానంలో కూర్చోగానే ఇలా జరుగుతుంది

కొత్త, కొత్తగా ధ్యానం మొదలు పెట్టిన వాళ్ళు ధ్యానంలో కూర్చోగానే అప్పటి వరకు గుర్తు రాని పనులన్నీ ఒక్కసారిగా గుర్తుకు రావడం మొదలు పెడతాయి. గ్యాస్ ఆఫ్ చేసానో లేదో, తలుపు వేసానో లేదో, అలారం సెట్ చేసుకున్నానో లేదో, ఫలానా వారికి ఫోన్ చేయాలి అంటూ రక రకాల పనులు గుర్తుకు వస్తాయి. లేక, లేక ధ్యానంలో కూర్చున్నాం, కూర్చుని కూర్చోక ముందే ఇవన్నీ ఎమిట్రా నాయనా..... అని మీరు డిస్టర్బెన్స్‌కు గురవుతారు. దాంతో ధ్యానం సరిగ్గా చేయలేరు. ఇలాంటప్పుడు ధ్యానంలో నుండి లేవండి, మీకు ఏమేం గుర్తుకు వచ్చాయో ఆ పనులన్నీ చేయండి, మళ్ళీ కూర్చోండి. మళ్ళీ ఏవైనా గుర్తుకు వస్తాయి, ఫర్వాలేదు అన్ని క్లియర్ చేసుకుని, మీరు పూర్తిగా సమాధానపడిన తర్వాతే ధ్యాన సాధన మొదలు పెట్టండి, క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉంటే అంతా సరి అయిపోతుంది.

❀❀❀

మీరు కలిగి ఉన్న ఆత్మ పరిణితిని బట్టి మీకు గురువు దొరుకుతాడు. మీకే ఏమీ తెలియదు. ఏవో 10 పుస్తకాలు చదివి ఓ 20/30 అనుభవాలు రాగానే మీరు క్లాసులు చెప్పడం ఎంత పెద్ద తప్పో మీకు తెలుసా ? ఆత్మ సాక్షత్కారం కలగనిదే ధ్యాన కేంద్రాలు ఓపెన్ చేసి నిర్వహించడం, క్లాసులు చెప్పడం మిమ్మల్ని చీకట్లోకి తీసుకెళ్తుంది. మీరు మొత్తం చీకట్లో మునిగిపోయి దారి తప్పే వరకు ఆ విషయం తెలియదు. నిజ జ్ఞానోదయం జరగనిదే క్లాసులు చెప్పడం, ధ్యాన కేంద్రాలు ఓపెన్ చేసి నిర్వహించడం వలన కొన్ని వేల జన్మలు దారి తప్పి చీకట్లో మగ్గిపోవడం తప్ప మరేమీ ఉండదు.

4. ధ్యానం ఒక్కోసారి కుదురుతుంది, ఒక్కోసారి కుదరనట్టు అనిపిస్తుంది

ఒక్కోసారి ధ్యానంలో సమయం ఎలా గడిచి పోయిందో తెలియదు. అయిదు నిమిషాలే అయినట్టు అనిపిస్తుంది కానీ గంట అయిపోయి ఉంటుంది. మీకు నమ్మ శక్యం కాదు. ఒక్కో సారి నిమిషం ఒక యుగంలా గడుస్తుంది. ఒక్కో సారి చికాకుగా, ధ్యానం అసలు చేసినట్టే అనిపించదు. ఒక్కో సారి ధ్యానంలో కూర్చున్నంత సేపు ఏదో అయోమయ స్థితిలో ఉన్నట్టు ఉంటుంది. ఒక్కోసారి అశాంతిగా, భారంగా అనిపిస్తూ ఉంటుంది. దీనితో మీరు ఏం అనుకుంటారంటే ప్రశాంతంగా, హాయిగా ఉన్నప్పుడు మాత్రమే ధ్యానం చక్కగా జరిగిందని అలా కాని నాడు ధ్యాన సాధన సరిగా జరగలేదని మీరు భావిస్తారు.

అలా కాదు, వాస్తవం ఏమిటంటే మీరు కళ్ళు మూసుకుని ధ్యానం మొదలు పెట్టినప్పటి నుండి మళ్ళీ కళ్ళు తెరిచేదాకా ఉన్న సమయం అంతా సాధనయే. ఒక్కోసారి ఒక్కోలా అవుతుంది. లోపల ప్రక్షాళన జరుగుతున్నప్పుడు ఏమేమో జరుగుతాయి. అదంతా అభివృద్ధియే, శ్రేయస్కరమే ! కేవలం ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రమే సాధన చక్కగా కుదిరింది అని భావించరాదు. ధ్యాన సాధనలో ఎన్నెన్నో దశలు ఉంటాయి, మీ లోపల ఎంతెంతో ప్రక్షాళన జరగవలసి ఉంటుంది. మీ అంతరంగం అనేక మార్పులకు గురవుతూ ఉంటుంది. ఈ క్రమంలో రక రకాల స్థితులను మీరు అనుభవించాల్సి వస్తుంది.

మీరు కళ్ళు మూసుకుని ధ్యానం మొదలు పెట్టి మళ్ళీ సాధన ముగించి, మీరు కళ్ళు తెరిచే వరకు అంతా సాధనయే. ప్రతి క్షణం సాధన కిందే లెక్కించబడుతుంది. ఒక్కోసారి ఒక్కో స్థితి అంతే ! అంతా అభివృద్ధియే ! అంతా శ్రేయస్కరమే !

పేకాట, జూదం, గ్యాంబ్లింగ్, రేసులు, తాగుడు, మత్తు పదార్థాలు వాడడం, డ్రగ్స్, వ్యభిచారం మొదలైనవి జీవితాన్ని నాశనం చేస్తాయి. అయితే వీటి వలన జరిగే నష్టం మహా అంటే 1 నుండి 10/20 జన్మలు ఉంటుందేమో కానీ - ఆత్మ సాక్షత్కారం జరగనిదే క్లాసులు చెప్పడం, ధ్యానకేంద్రాలు తెరిచి నిర్వహించడం అనేది కొన్ని వేల జన్మలను వృథా చేస్తుంది.

5. ధ్యాన అనుభవాలు అర్థం అయితే అవుతాయి, లేకపోతే లేదు

ధ్యానంలో రక రకాల అనుభవాలు వస్తాయి. ఏవైనా దృశ్యాలు కనబడతాయి, ఏవైనా శబ్దాలు వినబడతాయి, సుగంధ వాసనలు, దుర్గంధ వాసనలు వస్తాయి, ఎవరో స్పర్శించినట్టు అనిపిస్తుంది, లోపల ఏదో పగిలినట్టు లేదా విరిగినట్టు శబ్దాలు వినిపిస్తాయి.

ధ్యానంలో వచ్చే అనుభవాలు అర్థం అయితే అవుతాయి లేక పోతే లేదు. అంతే ! ధ్యాన అనుభవాలు అన్నీ శ్రేయస్కరమే ! అవి ఎలా కనిపించినా, వినిపించినా అంతా లాభమే జరుగుతుంది.

అనవసరంగా ధ్యాన అనుభవాలను విశ్లేషించి బుర్ర పాడు చేసుకోవద్దు. కొంత మంది అయితే సీనియర్ల ప్రాణాలు తోడేస్తారు. ఇలా చేయకూడదు. మీ అభివృద్ధి ఆగిపోతుంది ఇలా చేస్తే. కాబట్టి అంతా శ్రేయస్కరమే అని భావిస్తూ సాధన కొనసాగించాలి.

ధ్యాన అనుభవాలు అర్థం అయితే, అవుతాయి లేక పోతే లేదు, వాటి సారాంశం మీ ఆత్మ గ్రహించి వేస్తుంది. ఆ అనుభవ సారాంశానికి అనుగుణంగా మీ జీవితంలో అభివృద్ధి జరుగుతుంది. ఆ అనుభవం మీ ఫిజికల్ కాన్షియస్‌కు అర్థం కాక పోవచ్చు, అనవసరంగా కంగారుపడి ఇతరులను ఇబ్బందికి గురి చెయ్యకుండా సాధన చేస్తూ ఉండాలి.

ధ్యానంలో వచ్చిన, వస్తూ ఉన్న మంచి అనుభవాలను పూర్తిగా నమ్మి తీరాలి, అప్పుడే అవి మీకు అందుతాయి !

ధ్యానంలో రకరకాలుగా, మంచి మంచి అనుభవాలు వస్తాయి. వాటిని మీరు నిజంగా, పూర్తిగా నమ్మి తీరాలి. ఉదాహరణకు మీకు ఐశ్వర్యం సిద్ధించిందని అనుభవం వచ్చిందనుకోండి, అప్పుడు మీరు దాన్ని నమ్మియే తీరాలి. అప్పుడు మీ పరిస్థితి ఎలా ఉన్నా సరే ! ఆ.... అనుభవం అయితే వచ్చింది కానీ, నిజంగా నాకు ఐశ్వర్యం వస్తుందా ?? అని అనుకోకూడదు. ధ్యానంలో మీకు మంచి జరిగినట్టు కనిపించింది అని అంటే, అది జరిగితీరుతుంది, మీరు నమ్మండి అని అర్థం. చాలా మంది ధ్యానంలో వచ్చిన, వస్తూ ఉన్న మంచి అనుభవాలను నమ్మక పోవడంతో వారికి జరగాల్సిన మంచి జరగకుండా పోతూ ఉంది. మీ కోరికలు నెరవేరినట్టుగా ధ్యానంలో అనుభవం వస్తే, ఆ అనుభవం పట్ల పూర్తి విశ్వాసంతో ఆనందంగా ఉండండి. అప్పుడు అది ఖచ్చితంగా జరిగియే తీరుతుంది. గతి తప్పకుండా, నిజంగా ప్రాప్తిస్తుంది. ఇది పరమ సత్యం !

మీకు వచ్చిన, మంచి ధ్యాన అనుభవాలను నమ్మడం అని అంటే వాటిని మీరు భౌతికంగా అనుమతిస్తున్నట్టే అని అర్థం చేసుకోండి. నాకు ధ్యానంలో కనపడినట్టుగా జరుగుతుంది, జరిగితీరుతుంది అని అనుకుంటూ ఉండండి. అప్పుడు అది జరిగియే తీరుతుంది. మీ కోరికలు అన్ని తక్షణమే నెరవేరు గాక !

❖ ❖ ❖

6. ధ్యానంలో అనుభవాలు వస్తే వస్తాయి లేకపోతే లేదు

ధ్యానంలో కొంత మందికి ఎక్కువగా అనుభవాలు వస్తుంటాయి. కొంత మందికి తక్కువ, ఇంకొంత మందికి అప్పుడప్పుడు, మరి కొంత మందికి అస్సలు రావు. ఇది ఇంతే ! అనుభవాలు వస్తే వస్తాయి. లేకపోతే లేదు. అంతే ! అనుభవాలు వచ్చినంత మాత్రాన గొప్ప అని, రాకపోయినంత మాత్రాన తక్కువ అని భావించరాదు. ధ్యానం చేస్తున్నప్పుడు అభివృద్ధి అనేది రక రకాల దశలలో జరుగుతుంది. ఒక్కోసారి అనుభవాలు వస్తాయి, ఒక్కో సారి రావు. ఒక్కో రకంగా, ఒక్కొక్కరికి ఒక్కో విధంగా !

కొంత మంది సాధక మూర్ఖులకు అనుభవాల పిచ్చి ఉంటుంది. ఇది మంచిది కాదు. అనుభవాలు రావాలని కోరుకోవడం మంచిదే కానీ పిచ్చి ఉండ కూడదు. సహజంగా అనుభవాలు అనేవి ఒక రకమైన ఉత్సాహాన్నిస్తాయి. అయితే అనుభవాలు వస్తేనే ధ్యానం లేకపోతే లేదు అనే భావన సరి కాదు. జరగాల్సింది పరివర్తన. కావాల్సింది అవగాహన.

కొంత మందికి ఎప్పుడో ఒక అనుభవం వస్తుంటుంది, ఇలాంటి వారికి గొప్ప అవగాహన ఉండడం నేను చూశాను. గొప్ప అనుభవాలు + గొప్ప అవగాహన ఉన్న వారిని చాలా తక్కువ మందిని చూశాను.

❖ ❖ ❖

నేను, ఆత్మ సాక్షాత్కారం జరగనిదే క్లాసులు చెప్ప కూడదు, ధ్యాన కేంద్రాలు ఓపెన్ చేసి నిర్వహించకూడదు అని చెప్తున్నప్పుడు - ఎవరైతే అలా చేస్తున్నారో వారు నమ్మరు, ఈ సత్యాలను ఒప్పుకోరు. వాళ్ళలో వాళ్ళు చర్చించుకుంటారు, వాళ్ళ గురువును అడుగుతారు. సార్ మీరేమో మాతో ప్రచారం చేయమని చెప్తారు కదా.. మరి ఈ తారా విశాల్ ఏంటి ఇలా అంటున్నాడు అని అడుగుతారు, అప్పుడు ఆ గురువు ...ఆఁ.. వాడి మాటలేం పట్టించుకోకండి వాడికేం తెలుసు అని అంటాడు... అప్పుడు అలా చేస్తున్న వాళ్ళు రిలాక్స్ అయిపోయి యథావిధిగా తమ కార్యక్రమాలను కొనసాగిస్తారు. ఇది జరుగుతూ వస్తూ ఉంది. నాకు తెలుసు.

సత్యమేవ జయతే !

7. ధ్యాన సాధన ఎందుకు భారంగా, కష్టంగా, విసుగ్గా అనిపిస్తుంది ?

మనకు సంబంధించిన ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ? "ప్రతి ఒక్కరిలో బాగుపడటం ఇష్టం లేని గుణం ఎంతో కొంత ఉంటుంది". పరమాత్మ స్వరూపుడు డాక్టర్ ట్యూస్‌డె లోబ్‌సాంగ్ రాంపా ఇలా చెప్తాడు - "ఈ భూమి మీద ఉండడానికి ఎంతో కొంత లేక చిన్న చిన్నవి ఒకటో, రెండో అవలక్షణాలు ఉండి తీరాలి లేకపోతే వారు భూమి పైన ఉండే అనుమతి ఉండదు" అని. ఏదో ఒక అవలక్షణం చిన్నదైనా లేకపోతే వారు భూమి నుండి పంపివేయబడతారు. ఎందుకంటే భూమి ఒక పాఠశాల, ఒక ప్రయోగశాల, ఒక శిక్షణా కేంద్రం. ఇక్కడ ఉండాలంటే కారణం ఉండాలి. నేర్చుకునే కారణమో లేక నేర్పే కారణమో ఏదో ఒకటి ఉండాలి అని చెప్తాడు, రాంపా ! రాంపా మాస్టర్ గారి YOU FOREVER అనే ఇంగ్లీషు గ్రంథం చదివితే ఇలాంటి వివరాలు చాలా తెలుస్తాయి. పెద్ద బుక్ షాపుల్లో ఈ పుస్తకం దొరుకుతుంది. దయచేసి చదవండి, చదివించండి. చాలా చాలా విషయాలు తెలుస్తాయి.

ప్రతీ జన్మలోనూ కొన్ని కొన్ని గుణాలను(స్వభావాలను), నమ్మకాలను మార్చుకుంటూ వస్తాము. ఈ క్రమంలో ఏ ఏ గుణాలనైతే మార్చుకోవాలి అని నిర్ణయించుకున్నామో సరిగ్గా వాటికి వ్యతిరేకమైన పరిస్థితులను ఎదుర్కొంటూ ఉంటాం. ఉదాహరణకు, పిసినారి గుణాన్ని మార్చు కోవడానికి వచ్చిన వాళ్ళకు అన్ని సహాయాలు ఉచితంగా చేసే పరిస్థితులు వస్తూ ఉంటాయి. ఒంటరిగా బ్రతకడం నేర్చుకోవాలని వచ్చిన వాళ్ళకు ఎప్పుడూ ఒంటరితనమే ఎదురవుతూ ఉంటుంది. ఎవరిపైనా ఆధారపడి జీవించ కూడదు, స్వతంత్రంగా జీవించాలి అనే విషయాన్ని నేర్చుకోడానికి వచ్చిన వాళ్ళకు ఎవ్వరూ సహాయం చేయరు. ఎందుకంటే వాళ్ళు స్వతంత్రంగా జీవించడం నేర్చుకోవాలి కదా ! ఇక ఇప్పుడు అసలు విషయంలోకి వద్దాం. ప్రతి ఒక్కరిలోనూ ఎంతో కొంత "బాగుపడటం ఇష్టం లేని గుణం" ఉంటుంది. ఈ గుణం అనేది ఒక ఎనర్జి(శక్తి). దీని ప్రధాన తత్వమే బాగుపడటానికి వ్యతిరేకం. మనల్ని మనం బాగు చేసుకుందామని ప్రయత్నించినప్పుడల్లా ఇది అడ్డం పడుతుంది. మనలో ఉన్న ఏ సరికాని గుణాన్ని సరిచేయడానికి పూనుకున్నా ఇది అడ్డంకులను సృష్టిస్తూ ఉంటుంది.

ఈ విషయం తెలియని వాళ్ళు ఏ జాతక దోషాలో, ఏ గ్రహ, నక్షత్ర, రాశులో అడ్డం పడుతున్నాయి అని అనుకుంటారు. ఏ దేవుడో ఆగ్రహించాడు లేదా ఏ దయ్యమో ఏదో చేసింది అని అపోహ పడి ఏవేవో చేస్తూ ఉంటారు. నిజానికి అడ్డంకులను సృష్టించుకునేది మనకు మనమే. మన లోపల ఉన్న గుణాలే అడ్డంకులను సృష్టిస్తూ ఉంటాయి. ఈ విషయాలన్ని సదా ఎరుకలో ఉంచుకోవాలి. సాధన అంటే పరివర్తన. పరివర్తన అంటే అభివృద్ధి. అంటే సూటిగా చెప్పాలంటే సాధన అంటే అభివృద్ధియే అనగా బాగుపడటమే. మనం సాధనకు పూనుకోగానే మనలోని "బాగుపడటం ఇష్టంలేని గుణం" మనల్ని కమ్ముకుంటుంది. మనం సాధన చేయడం మొదలు పెట్టగానే దానికి భారంగా, కష్టంగా, విసుగుగా ఉంటుంది. ఈ భావాలతో మనం ఏకమై మనకే ఇవన్నీ కలుగుతున్నాయని అనుకుంటూ ఉంటాం. సాధన చేస్తున్నప్పుడు ఇలాంటి భావనలు కలగగానే, మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి సాధన అంటే అభివృద్ధి కదా, సాధన చేస్తే నేను బాగుపడతాను కదా మరి ఇలా అనిపిస్తుందేంటి అని అనుకోండి. అప్పుడు మీకు వెంటనే గుర్తుకు వచ్చేస్తుంది. మనలోని "బాగుపడటం ఇష్టంలేని గుణం" ఈ భావాలను రిలీజ్ చేస్తుందని మనకు అర్థం అయిపోతుంది. అప్పుడు తక్షణమే ఇలాంటి నెగెటివ్ భావాలతో ఏకం కాకుండా, వాటిని పట్టించుకోకుండా ఉంటే మన సాధన సులభం, సరళం, శీఘ్రం సఫలం అయిపోతుంది.

సాధనకు వ్యతిరేకమైన ఆలోచనలతో ఏకం కావద్దు.

❖ ❖ ❖

ఆధ్యాత్మికతకు సెక్స్‌కు ఎలాంటి వ్యతిరేకత లేదు. కామశాస్త్రం అనేది పూర్తిగా ఆధ్యాత్మికమైనది. ఎందుకంటే కామ కార్యం ద్వారా ఒక ఆత్మ భూమి పైకి వస్తుంది. ఎన్నో సూక్ష్మ నాడులు ఉత్తేజితం అవుతాయి. ఆత్మాభివృద్ధి జరుగుతుంది. కామ కార్యం అనేది సృష్టి కార్యం. కామ కార్యం సృష్టి కార్యం కాబట్టే కామం ఆధ్యాత్మికమైనది.

ఆధ్యాత్మికతకు ఐశ్వర్యానికి కూడా ఎలాంటి వ్యతిరేకత లేదు. ఆధ్యాత్మికత నిరాడంబరమైనది కాదు. నిరాడంబరత అనేది ఒక ఎంపిక. ఒకరి ఇష్టం అంతే.

ఆధ్యాత్మికత అంటే నిరాడంబరత అనే అభిప్రాయాన్ని పూర్తిగా మార్చుకోండి.

మీరు ఎవరితో ఎలా ప్రవర్తించినా - ప్రేమగా, మంచిగా, కఠినంగా, మోసపూరితంగా, దౌర్జన్యంగా..... మీరు ఎలా ప్రవర్తించినా సరే ఆ ప్రవర్తన యొక్క ప్రభావం మీ అంతరంలో ఉన్న మీ దైవత్వం పైన పడుతుంది. ఎలాంటి ప్రభావం పడితే మీకు అలాంటి పరిస్థితులను మీ దైవత్వం మీ జీవితంలో సృష్టిస్తుంది. అందుకే, మంచిగా, సరిగా ప్రవర్తించమని ఆధ్యాత్మిక శాస్త్రం చెప్తుంది.

మీరు చేసిందే మీకు వస్తుందంటే ఇలాగే వస్తుంది !

ఆధ్యాత్మికత అంటే సరిగా అర్థం కావడానికి ఎన్నెన్నో జన్మలు పడుతుంది. ఎన్నో వేల జన్మల అన్వేషణ తర్వాత ఒక సత్య గురువు దొరుకుతాడు. ఆ సత్య గురువు దొరికిన తర్వాత ఆయన దగ్గర స్థానం దొరకడం చాలా కష్టం అవుతుంది. ఎన్నో సార్లు దగ్గరై దూరమై ఏదో ఒక జన్మలో గురువు దగ్గర స్థానం సుస్థిరమై చివరి వరకు ఉండగలుగుతారు. ఆ విధంగా ఎన్నో జన్మలు గడిచిన తర్వాత ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. ఆత్మ సాక్షత్కారం కలిగిన తర్వాత కూడా ఒక సద్గురువు దగ్గర ఎన్నో జన్మలు పని చేస్తే కానీ క్లాసులు చెప్పే అర్హత & ధ్యాన కేంద్రం ఓపెన్ చేసి నిర్వహించే అర్హత రాదు.

పార్ట్ - 25

డైనమిక్స్

మానవుడు నిర్ణయించుకోవాలి. ఒక తీవ్రమైన, స్థిరమైన, దృఢమైన, తిరుగులేని, ఎదురులేని నిర్ణయం తీసుకోవాలి. నేను తక్షణమే జాగృతం కావాలి అనే నిర్ణయం తీసుకుని తీరాలి. తప్పదు, ఇది నిర్ణయాత్మకమైన సమయం. ఇది నవీన దివ్యకాంతి ప్రేమ యుగం యొక్క ఆరంభ సమయం. యావత్ భూ మండల చరిత్రలోనే సువర్ణాక్షరాలతో నమోదు చేయదగ్గ సమయం. భూమి యొక్క విశేష ప్రక్షాళనా సమయం.

మానవ దేహాన్ని ధరించిన దైవమే మానవుడు. ఈ భూమి పైకి పరిశోధన కోసం, అనుభవ జ్ఞానం కోసం వచ్చిన సాక్షాత్ పరమాత్మ స్వరూపుడే మానవుడు. అయితే మానవ వేషం వేసి తనను తాను మరిచిపోయాడు. ఈ భూమి పైన ఉన్న ప్రతి ఒక్కరు ఆ యొక్క మహా మూల చైతన్యమే(Ultra Consciousness) ! అనుకున్నంత మాత్రాన అనుకున్నవి పొంది అనుభవించగల మహా శక్తి సంపన్నుడు మానవుడు. అసాధ్యం అనే పదానికి అర్థం తెలియని వాడు మానవుడు. మహా మహిమాన్వితమైన శక్తి సామర్థ్యాలను కలిగి ఉన్నవాడే మానవుడు.

నేడు ఎలా ఉన్నాడు ?! అయోమయంలో, ఉద్రిక్తతతో, భయంతో, అభద్రతా భావంతో, దారిద్ర్యంతో, కష్టాలతో, నష్టాలతో, దుఃఖాలతో, బాధలతో, కన్నీళ్ళతో, అశాంతితో, అనారోగ్యాలతో అతలాకుతలం అయిపోతున్నాడు. అల్లాడి పోతున్నాడు. తల్లడిల్లి పోతున్నాడు.

ఇక చాలు !

ఈ దుర్భర పరిస్థితులు ఇక చాలు ! ఈ అయోమయం ఇక చాలు ! ఈ దారిద్ర్యం, అనారోగ్యం ఇక చాలు ! ఈ కష్టాలు, కన్నీళ్ళు ఇక చాలు ! ఈ అశాంతి, అభద్రతా భావం ఇక చాలు ! ఈ "ఆట" ఇకచాలు ! ఈ నిద్ర ఇక చాలు ! ఈ విస్మృతి ఇక చాలు ! ఇక చాలు !

ఈ విస్మృతి ఇక చాలు !

నా పరిశోధన పూర్తి అయిపోయింది. ఇక నేను పొందవలసిన అనుభవాలు ఏవీ లేవు. ఇక నేను "జాగృతం" కావడం ఒకటే మిగిలి ఉంది. నేను "మేల్కోవాలి", దైవమే అయి ఉన్న నేను దైవంలో దైవంలా మేల్కోవాలి. ఈ క్షణమే మేల్కోవాలి.

నేను ఈ క్షణమే మేల్కోవడం శ్రేయస్కరం, అత్యవసరం ! నేను మేలుకుని తీరాలి. సుదీర్ఘమైన విస్మృతిని అనుభవించాను. ద్వంద్వాలను పూర్తిగా అనుభవించాను. పూర్ణం చెందాను, పరిణతి సాధించాను. ఇక ఏమీ మిగల లేదు, నేను మేలుకోవడం ఒక్కటి తప్ప ! అన్ని ఒప్పందాలు అయిపోయాయి. అన్ని చెల్లింపులు అయిపోయాయి. శిక్షణలు పొందడాలు అన్ని అయిపోయాయి. ఇక నేను మేలుకోవాలి. ఈ క్షణమే నేను మేలుకోవాలి. ఇది Final !

నేను ఈ క్షణం మేలుకోవడమే శ్రేయస్కరం, అత్యవసరం !

శ్రేయస్కరం ! అత్యవసరం !!

ఈ నిర్ణయమే మానవుడు తీసుకోవాలి, తీసుకుని తీరాలి. అందరి చేతా ఈ నిర్ణయం తీసుకునేలా ప్రేరణను ఇవ్వాలి.

✪✪✪ అయితే "మేలుకోవాలి" అనే నిర్ణయం తీసుకునే ముందు తాను "విస్మృతిలో" ఉన్నాడని మనిషి గుర్తించాలి. కళ్ళు తెరిచి ఉన్నంత మాత్రాన, తింటూ, తిరుగుతూ, చదువుతూ, పెళ్ళి, సెక్స్, సంతానం, ఉద్యోగం, వ్యాపారం మొదలైనవి చేస్తున్నంత మాత్రాన మేలుకుని ఉన్నానని భ్రమించరాదు. వాస్తవానికి ఇవి అన్ని కూడా "విస్మృతిలోనే" జరుగుతూ ఉంటాయి.

✪ వాస్తవానికి మనిషి ఎప్పుడూ "విస్మృతిలోనే" ఉంటాడు. "స్మృతి" ఏనాడో కోల్పోయాడు. కోల్పోయిన స్మృతిని పొందాలంటే ముందు తాను "స్మృతి"లో లేడు అన్న విషయాన్ని గ్రహించాలి, అప్పుడే అది సుసాధ్యం అవుతుంది. సులభం, సరళం, శీఘ్రం అవుతుంది. సఫలం అవుతుంది.

స్మారకం, స్పృహ, స్మృతి, జాగృతి, మేలుకోవడం, ఎరుక అనే పదాలన్నీ కూడా ఒకే అర్థాన్నిస్తాయి. మీరు ఎల్లప్పుడూ విస్మృతిలోనే ఉంటారనే విషయాన్ని తెలుసుకోడానికి మీరు, ఒక విషయం ప్రాక్టికల్‌గా చేసి చూడాలి.

సెకన్ల ముల్లు ఉన్న ఒక చేతి గడియారాన్ని తీసుకోండి. లేదా డిజిటల్ వాచ్ తీసుకున్నా సరే. ఇప్పుడు మీరు చేయాల్సిన పని ఏమిటంటే సరిగ్గా ఒక్క నిమిషం "ఎరుక"లో ఉండడం. సెకన్ల ముల్లునే చూస్తూ ఒక నిమిషం పాటు "ఎరుకలో" ఉండండి. ఏమీ ఆలోచించకుండా కేవలం ఆ ముల్లును మాత్రమే చూస్తూ, స్మృతి పూర్వకంగా ఆ ముల్లుతో మాత్రమే కదులుతూ, ఏ ఆలోచన లేకుండా ఒక్క నిమిషం ఉండండి. అప్పుడు మీకు తెలుస్తుంది. మీరెంత విస్మృతిలో ఉన్నారో ! 60 సెకన్లలో 60 సార్లు స్మృతి కోల్పోతారు మీరు. సెకన్ల ముల్లునే ఎందుకు చూడాలి అని అంటే ఒక నిమిషం అయింది అని తెలియడం కోసం. మీరు గనక ఒక నిమిషం పాటు స్మృతి కోల్పోకుండా ఉంటే అది చాలా గొప్ప విషయం.

గడియారం కాకపోతే ఇంకొక ప్రయోగం చేసి చూడండి. కళ్ళు రెండు మూసుకుని శ్వాసను గమనించండి. ముక్కు రంధ్రాల దగ్గర మీ ఎరుకను పెట్టండి. శ్వాస వస్తూ ఉంది, శ్వాస పోతూ ఉంది అంతే ! కేవలం శ్వాసను ఎరుకతో గమనించండి. ఒకే ఒక్క నిమిషం పాటు ఎరుకతో శ్వాసించండి. అప్పుడు తెలుస్తుంది మీకు ! మీరెంతో విస్మృతిలో ఉన్నారని. క్షణాలలో ఎరుక పోతూ ఉంటుంది. రెండు, మూడు క్షణాలు కూడా ఎరుక స్థిరంగా ఉండదు. ఆలోచన వస్తుంది, దాని వెంటపడి మీరు వెళ్ళి పోతారు. ఎంతసేపు ఆలోచనా రహిత స్థితి - "no thought state"లో ఉండగలుగుతారో చూడండి. స్మృతిలో ఉంటే ఆలోచనలు రావు, స్మృతిలో ఉన్నప్పుడు ఆలోచనలు పూర్తిగా అదుపులో ఉంటాయి, రమ్మన్న ఆలోచన మాత్రమే వస్తుంది, పొమ్మనగానే వెళ్ళి పోతుంది. అనుకున్న ఆలోచనను, అనుకున్నంత సేపు ఆలోచించగలరా మీరు ? ఎరుకతో శ్వాసిస్తే ఆటోమెటిక్‌గా "ఆలోచనా రహిత స్థితి" వస్తుంది. కానీ ఎరుకతో ఒక నిమిషంపాటు పూర్తిగా శ్వాసించ గలరా ? చేసి చూడండి ! మీ గురించి మీరు తెలుసుకోండి.

✪ కేవలం స్మృతిలో లేనందుకే శరీరంలో + జీవితంలో అన్ని కష్ట నష్టాలు ఉండగలుగుతున్నాయి, మనగలుగుతున్నాయి. ఈ విస్మృతే వాటికి ఆశ్రయం, పోషణ. విస్మృతే వాటికి రక్షణ. ఈ విస్మృతే ప్రధాన మరియు ఏకైక మూల కారణం. ఈ విస్మృతిని గనక స్మృతిలోకి మారిస్తే అంతా ఆనందమే, అంతా ఆరోగ్యమే, అంతా ఐశ్వర్యమే ! అంతా దివ్యమే !

"All problems are illusions of the mind" అని గ్రాండ్ మాస్టర్ **Eckhart Tolle** అంటాడు. దీని అర్థం ఏమిటంటే "సమస్యలన్నీ కూడా మనసు యొక్క భ్రాంతులే" అని. ఈ భ్రాంతి పోవాలి, దాని స్థానంలో క్రాంతి రావాలి.

భ్రమలలో, కలల్లో స్పృహ లేకుండా ఉన్నాడు మానవుడు. కేవలం జాగృతం అయినంత మాత్రాన అన్ని సమస్యలు కరిగి పోతాయి. ఎలాగైతే మీరు కల కంటున్నప్పుడు, మీ వెంట ఒక పులి పడింది, మీరు పరిగెత్తుతున్నారు, ప్రాణ భయంతో హడలి పోయి ఉంటారు, మీరు కలలో ఉన్నారు, అయినా మీ భౌతిక శరీరం ఆ ఒత్తిడిని అంతా అనుభవిస్తూ ఉంటుంది. హఠాత్తుగా మీరు మేలుకుంటారు. వెంటనే కల కరిగి పోతుంది. పులి మాయం అవుతుంది. అప్పుడు మీరు నిట్టూరుస్తారు. హమ్మయ్య అది కేవలం కలేనా అని ! కల అయినా సరే ఆ ఒత్తిడిని మీరు ప్రత్యక్షంగా అనుభవించారా లేదా ? పులి మీ వెంట పడ్డప్పుడు ఎందుకు మీరు పరిగెత్తారు ? అక్కడే నిలబడి ఉండవచ్చు కదా ? మన సమస్యలన్నీ కలలోని పులి లాంటివి. మనం మేలుకోగానే మాయం అయిపోతాయి. ఇది కేవలం కలే అన్న స్మృతి మీకు గనక అప్పుడు ఉంటే వెంటనే మేలుకుంటారు. ఒక వేళ స్మృతిని మీరు సాధిస్తే అసలు కలయే రాదు. అంటే ఏ కష్టాలు రాలేవు, శాశ్వతంగా !

మీ విస్మృతిలో ఉన్న చైతన్యం కంటున్న కలలే లేక భ్రమలే మీరు మీ శరీరంలో + జీవితంలో అనుభవిస్తున్న సమస్త కష్టాలు ! మన విస్మృతే, మన అన్ని కష్ట నష్టాలకు అనుమతి. మన అనుమతి లేనిదే మన శరీరంలో గానీ, జీవితంలో గానీ ఏదీ సంభవించదు. మరి సంభవిస్తున్నవన్నీ మేం కోరుకోలేదే అని మీరు అంటారు. ఎవరైనా కష్టాలను, రోగాలను కోరుకుంటారా అని అడుగుతారు మీరు. చక్కటి ప్రశ్న. వేసి తీరవలసిన ప్రశ్న. నేను అదే అంటున్నాను ఎవరైనా "స్మృతిలో" ఉంటే కష్టాలను రోగాలను అనుమతిస్తారా అని, "స్మృతిలో" లేనందువల్లనే విచక్షణా జ్ఞానం కోల్పోయి, ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితులలో ఏది మంచో, ఏది చెడో, ఏది కష్టమో, ఏది రోగమో, ఏది ఏదో తెలియక అపస్మారకంలో మీరు ఏవేవో కోరుకుంటూ ఉంటారు. వాటిని కలిగి ఉంటారు, అనుభవిస్తూ ఉంటారు.

ఈ విషయం మీకు ప్రాక్టికల్‌గా తెలియాలి అంటే ఒకసారి కళ్ళు మూసుకుని కూర్చోండి. మీ ఆలోచనలను గమనించండి. జాగ్రత్త !

ఆలోచించమని చెప్పడం లేదు. ఆలోచనలను ఎరుకతో, సాక్షిగా గమనించమని చెప్తున్నాను. చూడండి. పరిశీలించి, మీ ఆలోచనలను అలా చూస్తూ ఉండండి. ఎలాంటి ఆలోచనలు వస్తూ ఉన్నాయో గమనిస్తూ ఉండండి. వస్తున్న ప్రతి ఆలోచన పట్ల ఎరుకతో ఉండండి. ఈ విధంగా ఒక అరగంట మీ ఆలోచనలను మీరు గమనించండి.

అప్పుడు విషయాలు మీకే అర్థం అవుతాయి. ఎంతటి గందరగోళ ఆలోచనలను మీరు కలిగి ఉన్నారో మీకు తెలుస్తుంది. మీ గురించి మీరే తెలుసుకోకపోతే ఎలా ?! తెలుసుకుని తీరాలి మరి !

"మన ఆలోచనలే(గుణాలే) మన వాస్తవాలు" ! ఆలోచనయే(గుణమే) పరిస్థితిగా మారుతుంది. ఆలోచన బీజం, పరిస్థితి ఫలం. పై నుండి ఏ దేవుడో లేక ఏ అదృశ్య శక్తులో మన వాస్తవాలను సృష్టిస్తూ కూర్చోరు. ఎవరి వాస్తవాలను వాళ్ళే సృష్టించుకుంటూ ఉంటారు. తమ, తమ ఆలోచనల ద్వారా !

"యద్భావం తద్భవతి" అంటే అర్థం ఇదే ! "యామతిఃసా గతిర్భవేత్" అంటే అర్థం ఇదే ! "ఎవరి వాస్తవాలకు వాళ్ళే సృష్టికర్తలు" అన్నదే అసలైన పరమ సత్యం అని సేత్ పరమాత్ముడు చెప్తాడు.

మన ఆలోచనలే మన వాస్తవాలు.

మన గుణాలను(స్వభావాలను) బట్టి మన ఆలోచనలు.

ప్రియ మిత్రులారా !

✪✪✪ మేల్కోండి ! మీ పట్ల మీరు మేల్కోండి. స్మృతిని సాధించండి. ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ పోతే చాలా సమయం పడుతుంది. ఎన్ని సమస్యలని పరిష్కరిస్తారు. అన్నింటికి మూల కారణం "విస్మృతి" కేవలం దీనిని కొడితే అన్ని సమస్యలు కరిగి పోతాయి.

ఉదాహరణకు, మీకు ఆర్థిక సమస్యలున్నాయి లేక అనారోగ్య సమస్యలు, జీవిత సమస్యలు, సెక్స్ సమస్యలు, ఉద్యోగ వ్యాపార సమస్యలు, పెళ్ళి సమస్య, సంతాన సమస్య ఇలా ఎన్నెన్నో రకాల సమస్యలు ఉంటాయి. వీటి మూల కారణాలు లోపల ఉంటాయి. మరి లోపల వున్న విస్మృతే వీటికి ఆధారం అయి ఉంది. ఒక్కో సమస్యను తీసేస్తూ పోతూ ఉంటే కొత్తవి వచ్చి చేరే అవకాశం ఉంది. ఎందుకంటే సమస్య యొక్క మూలం సమస్యలో లేదు, సమస్య యొక్క మూలం సమస్య కాదు, సమస్య యొక్క మూలం మీ విస్మృతిలో ఉంది. విస్మృతిని స్మృతిగా మార్చినపుడే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. లేకపోతే సమస్యలు వస్తూనే ఉంటాయి. ఒకటి కాగానే ఒకటి. ఒకదాని తర్వాత ఇంకొకటి. మీరు విస్మృతిలో ఉన్నంత కాలమూ సమస్యలు వస్తూనే ఉంటాయి. అవి అనంతంగా తయారవుతూనే ఉంటాయి.

మన శరీరంలోని + జీవితంలోని సమస్త కష్టాలకు, బాధలకు మూలకారణం మన సరికాని గుణాలు(దుర్గుణాలు). మరి మనం సరికాని గుణాలను ఎందుకు కలిగి ఉన్నామంటే, "విస్మృతియే" కారణం. విస్మృతిలో ఉన్నందుకే, లోపల ఉన్నవి సరి అయినవో లేక సరి కానివో తెలియక వాటిని అనుభవిస్తున్నాము. మన చైతన్యం మన స్మృతిలోకి వచ్చిన మరుక్షణం అంతా సరి చేయబడుతుంది.

అంతా దివ్యం అవుతుంది. దివ్యులే అయి ఉన్న మనకు మళ్ళీ మన నిజ తత్వమైన దివ్యత్వం పునః ప్రాప్తిస్తుంది.

✪✪✪ "మనం తీసుకునే నిర్ణయమే మన జీవితాన్ని నిర్ణయిస్తుంది" అని గ్యారి జుకవ్ అనే మహాత్ముడు చెప్తాడు. ఇది ఒక విశ్వ సూత్రం. మనం "మేల్కోవాలి" అనే ఒక నిర్ణయం, మన జీవిత సర్వస్వాన్ని మార్చి వేస్తుంది. మన నిర్ణయమే మన లక్ష్యంతో మనల్ని అనుసంధానం చేస్తుంది. మన నిర్ణయమే అన్నింటిని సమన్వయం చేసి సానుకూలం చేస్తుంది. మన లక్ష్యం సిద్ధించేలా చేస్తుంది.

దైవమే అయి ఉన్న మనం దైవంలో దైవంలా మేల్కోవాలి. ఈ నిర్ణయమే మన నిజ తత్వాన్ని మనకు అందిస్తుంది. అయితే తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే సంపూర్ణంగా, సమగ్రంగా ఆచరణలో పెట్టాలి. నిర్ణయానికి పూర్తిగా అంకితం కావాలి.

మనం కోరుకోవలసినది ఏదైనా ఉందీ అంటే అది ఒక దైవత్వం మాత్రమే ! ఈ సృష్టిలో నేర్పించే విషయం గానీ, నేర్చుకునే విషయం గానీ ఏదైనా ఉందీ అంటే అది దైవత్వం మాత్రమే.

✪✪✪నేనే మూల చైతన్యం(దైవం) అని అనడం అంటే, మన నిజ తత్వమైన మూల చైతన్యాన్ని(దైవత్వాన్ని) అనుమతించడమే ! అనుమతించడమంటే ఏకత్వాన్ని ఒప్పుకోవడమే ! ఏకత్వాన్ని ఒప్పుకోవడమంటే మూల చైతన్యంగా(దైవంగా) అయిపోవడమే ! నేనే మూల చైతన్యం(దైవం) అని అనడం అంటే, మూల చైతన్యంగా అవడమే !

సృష్టి అంతా ఒక్కటే ! మూడు పరిధులకు సంబంధించిన వాస్తవాలను (Three Dimensional Realities) మాత్రమే చూడగల మన కళ్ళకు సృష్టి అంతా వేరు, వేరుగా కనపడుతుంది. 3D ఫ్రీక్వెన్సీని దాటి ఉన్న వాస్తవాలు మన భూమి పైనే ఎన్నెన్నో ఉన్నాయి. ఉదాహరణకు, సెల్‌ఫోన్ తరంగాలను మన భౌతిక కళ్ళతో చూడగలుగుతామా ? సూక్ష్మ తరంగాల ద్వారా టీవి ప్రోగ్రామ్స్ టెలికాస్ట్ అవుతున్నాయి, టీవి స్క్రీన్ మీద ప్రోగ్రామ్స్‌ను అయితే చూడగలుగుతున్నాం కానీ తరంగాలను చూడగలుగుతున్నామా ? వైర్‌లెస్ ట్రాన్స్‌మిషన్స్ ఎన్నో జరుగుతున్నాయి, వాటన్నింటిని చూడగలుగుతున్నామా, రిమోట్ కంట్రోల్ ఆదేశాలు కనబడుతున్నాయా ? ఎన్నో సూక్ష్మ జీవులున్నాయి, అవి అన్నీ కనబడుతున్నాయా ? అందరూ నిత్యం ఆలోచనలు చేస్తుంటారు, ఇప్పటి వరకు వీటిని ఎవరైనా భౌతిక కళ్ళతో దర్శించారా ?

అసలు అన్నింటి కన్నా ముఖ్యమైనది మనిషి ప్రాణం ! దీనిని ఇప్పటి వరకు ఏ ల్యాబ్‌లోనైనా చూడగలిగారా ?!

మరి ఇవన్నీలేవా ?! వాటి యొక్క పనులు జరగడం లేదా ?! వాటి ఉనికితో సమస్త కార్యాలు జరుగుతున్నాయి కదా !

కేవలం, భౌతిక కళ్ళకు కనబడిన దానిని మాత్రమే వాస్తవం అంటే, మరి పైన చెప్పినవన్నీ కనపడవు కదా ! మరి అవి అన్నీ అవాస్తవాలేనా ?! ఏవో కొన్ని భౌతిక శాస్త్ర వివరణలు చదివి వాటిని మాత్రమే పట్టుకుని వేలాడుతుంటే ఉన్నతమైన సత్యాలు ఎప్పటికి అర్థం అవుతాయి ??!! ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న భౌతిక శాస్త్రాలలో ఉన్న విషయాలు తప్పు అని అనటం లేదు. అంతకన్నా ఉన్నతోన్నతమైన విజ్ఞానం ఉంది అని తెలియజేసుకుంటున్నాను. మనుషులు ఓపెన్ మైండ్‌తో ఆధ్యాత్మిక శాస్త్ర విషయాలను స్వీకరించి పరిశోధనకు పూనుకుంటే వేలాది సంవత్సరాలుగా మానవ జాతికి అర్థం కాకుండా ఉన్న విషయాలు ఎన్నెన్నో స్పష్టంగా బయట పడతాయి.

ప్రస్తుతం భూమి పైనున్న ల్యాబ్‌లలో పరిశోధన చేస్తున్న శాస్త్రజ్ఞులు మానవాళి శ్రేయస్సుకై ఎంతగానో శ్రమిస్తున్నారు. ఇది నిస్సందేహంగా అభినందించదగిన విషయమే ! కానీ, వారి పరిశోధనలకు ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని జోడిస్తే అనూహ్యమైన సృష్టి రహస్యాలు ఎన్నో బహిర్గతమవుతాయి. తద్వారా కేవలం మానవులకే కాకుండా, భూమి పైన ఉన్న సర్వ ప్రాణికోటికి, యావత్ భూమండలానికి ఎంతెంతో శ్రేయస్కరాన్ని కలుగజేసి, భూమి పైన ప్రేమ పూర్వకమైన, శాంతిమయమైన, ఆనందోత్సవాలను శాశ్వతంగా విరాజిల్లుతూ ఉండేలా చేయవచ్చు.

అంతా ఒక్కటే !

అందరి మూలం ఒక్కటే !

సర్వం సమానమే !

ఉన్నది ఒక్కటే ! బాహ్యంలో వేరుగా కనిపిస్తున్నవన్నీ కూడా అంతరంలో ఒక్కటే ! ఉన్నది ఏకత్వమే ! ఆ ఏకత్వంలోని భాగాలే అన్ని కూడా ! దైవత్వ సాధన చేస్తుంటే క్రమ క్రమంగా ఏకత్వానికి దగ్గరవుతాం. చివరికి ఒక రోజున సృష్టి ఏకత్వం అనుభవంలోకి వస్తుంది.

సైంటిస్ట్‌లు ఈ క్రింది విధంగా తెలియజేస్తున్నారు.

✪✪✪

❖ ❖ ❖

సృష్టి కేంద్రంతో ఏకమై లేకపోవడంతోనే అన్ని కష్టాలు ! సృష్టి మూలంతో భిన్నంగా ఉంటున్నంత కాలం ఈ కష్ట నష్టాలు తప్పవు. సృష్టి కేంద్రంతో ఏకత్వాన్ని కోరుకోకుండా, ఏవేవో కోరుకుంటారు. సృష్టి కేంద్రంతో ఏకత్వం అంటే మీ దైవత్వాన్ని మీరు పొందడం.

ఉదాహరణకు మీరు ఉద్యోగం కోరుకుంటారు, బాగానే ఉంది. కేవలం ఉద్యోగం వచ్చినంత మాత్రాన సమస్యలు పోవు. అలా ఉద్యోగం వలన సమస్యలు పోయి ఉంటే, ప్రపంచంలో ఎంతో మంది ఉద్యోగులు ఉన్నారు మరి వారంతా ఆనందంగా ఉండాలి, ఉన్నారా ? డబ్బులు కోరుకుంటారు అయితే డబ్బు అన్ని సమస్యలను తీర్చలేదు. బాగా డబ్బులు ఉన్న వాళ్ళు కూడా బాధ పడుతూ ఉంటారు. ఆరోగ్యం కోరుకుంటారు, కేవలం శరీరం బాగుంటే సరిపోతుందా ? శరీరం దృఢంగా, ఒంగోలు ఎద్దుల్లా ఉన్న వారెందరో ఉన్నారు ప్రపంచంలో, మరి వాళ్ళందరూ ఆనందంగా ఉన్నారా ? అందంగా ఉన్నవాళ్ళు ఆనందంగా ఉన్నారా ? పరిశీలించండి, పరిశోధించండి. శాంతి, సంతృప్తి, ఆనందాలతో ఎవరు ఉన్నారో కనిపెట్టండి.

శాంతి, సంతృప్తి, ఆనందాలు లేని జీవితం జీవితమేనా ?! ఈ మూడు జీవితంలో లేకపోతే మీరు ఇంకా వేటి కోసం జీవిస్తున్నట్టు ?!?మీరేం చేసినా, ఎన్నెన్ని జన్మలు ఎత్తినా చివరికి, మీరు కానీయండి ఎవ్వరైనా సరే ఇక్కడికి రావాల్సిందే ! ఈ సత్య మార్గంలోకి వచ్చి తీరవలసిందే ! ఎవరి దైవత్వాన్ని(నిజ తత్వాన్ని) వారు పొంది తీరవలసిందే. మీ నిజ తత్వమైన మీ దైవత్వాన్ని పొందనందుకే ఇన్ని కష్టాలను అనుభవిస్తున్నారు.

మీరు మీ దైవత్వాన్ని కోరుకుంటే అన్నీ వస్తాయి. మీకు ఏమేం కావాలో అన్నీ వస్తాయి. ఆరోగ్యం, అందం, ఐశ్వర్యం, శాంతి, సంతృప్తి, ఆనందాలు శాశ్వతంగా మీ స్వంతం అవుతాయి.

❖ ❖ ❖

ఇదే విషయాన్ని పరమ గురువు జీసస్ క్రైస్ట్ ఈ విధంగా చెప్తాడు.

But seek ye first the kingdom of God,
and His righteousness;
and all these things shall be added unto you.

- The Holy Bible, Matthew 6 : 31 - 34

అంటే..... "మొట్ట మొదట మీ లోపల ఉన్న దైవ సామ్రాజ్యాన్ని + దేవుడి యొక్క దివ్య ధర్మాన్ని కోరుకుని వాటిని పొందడానికి పూర్ణంగా కృషి చేయండి, అప్పుడు మీకు కావలిసినవన్నీ, వాటంతట అవే మీకు అందుతాయి" !

- పవిత్ర గ్రంథము బైబిల్ - మత్తయి - 6 : 31 - 34

క్రీస్తు పరమాత్ముడు చెప్పిన ఈ విశ్వ సూత్రం యొక్క గూఢార్థం ఏమిటంటే...

ఈ భూమి పైన మానవులు మొట్ట మొదట కోరుకోదగినదీ, పొందదగినదీ ఏదైనా ఉందంటే అది కేవలం తమ లోపల ఉన్న దైవ సామ్రాజ్యం + ఆ దేవుడి యొక్క దివ్య ధర్మం మాత్రమే ! దీనిని **100%** కోరుకుని, దీనిని పొందడానికి, **100%** తమను తాము అంకితం చేసుకోవడాన్నే సత్య మార్గం అని అంటారు ! ఈ సత్య మార్గంలో ఉన్న వారినే సత్య సాధకులు అని అంటారు.

ఈ విధంగా సత్య సాధన చేస్తూ, సత్య ప్రచారానికి **100%** అంకితం అయిన వారికి ఏమేం కావాలో - అంటే ఆరోగ్యం, ఆయుష్షు, ఐశ్వర్యం, విజయం, శాంతి, సంతృప్తి, ఆనందం, ఉత్సవం మరియు మోక్షం మొదలైనవన్నీ కూడాను వాటంతట అవే వచ్చి సత్య మార్గంలో ఉన్న వారికి అందుతాయి.

గ్రహించండి ! "వాటంతట అవే వచ్చి వారికి అందుతాయి", మీరేమీ చేయ నక్కరలేదు. కేవలం, సత్య సాధనకు + సత్య ప్రచారానికి **100%** అంకితం కావడమే మీరు చేయాల్సింది. ఎవరైతే ఈ విధంగా చేయగలుగుతారో వారు ఖచ్చితంగా పైన తెలిపినవన్నీ పొందుతారు.

అనాదిగా వస్తున్న విశ్వ నియమం ఇది. ఈ విశ్వ నియమాన్నే జీసస్ చెప్పాడు, ఇంకా అనేకానేక మాస్టర్స్ అందరూ, ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఈ విషయాన్ని స్పష్ట పరిచారు.

గతి తప్పని విశ్వ నియమం ఇది ! పరమ సత్యం ఇది ! అనాదిగా జరుగుతూ వస్తూ ఉంది ! ఇప్పుడు జరుగుతూనే ఉంది ! ఎప్పటికీ జరుగుతూనే ఉంటుంది ! పరమ గురువు జీసస్ క్రైస్ట్ చెప్పిన సూత్రం కదా !

స్వయంగా జీసస్ పరమాత్ముడే తన బోధనల గురించి ఇలా ప్రకటించాడు :

"ఆకాశం(స్వర్గం) మరియు భూమి అంతరించిపోయినా, నా వాక్కులు మాత్రం అంతరించిపోవు" ! – పవిత్ర గ్రంథము బైబిల్ – మత్తయి - 24 : 35

విషయాన్ని గ్రహించండి, అన్నీ అంతరించిపోయినా సరే, నా వాక్కులు మాత్రం అంతరించిపోకుండా శాశ్వతంగా అలానే ఉంటాయి. ఎవరైతే నా వాక్కుల యొక్క పరమార్థాన్ని గ్రహించి వాటిని నిజ జీవితంలో యథాతథంగా ఆచరిస్తారో వారికి నేను ప్రకటించినవన్నీ అందితీరుతాయి అని ఎంతో స్పష్టంగా చెప్పాడు కదా, జీసస్ క్రైస్ట్ ! ఇంతకన్నా గ్యారంటి ఏం ఉంటుంది చెప్పండి ?!

ఈ విధంగా క్రీస్తు పరమాత్ముడు హామీ ఇచ్చినట్టే ఈ క్రింది విధంగా భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు కూడా అభయమిచ్చాడు.

శ్లో ॥ అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్

- గీత - 9 : 22

వివరణ : ఎవరైతే కేవలం నన్ను మాత్రమే అంటే పరమ సత్యాన్ని మాత్రమే ధ్యానించుచూ, నన్ను(పరమ సత్యాన్ని) పొందడానికి సంపూర్ణంగా, సమగ్రంగా తమను తాము అంకితం చేసుకుంటారో వారి యొక్క పూర్తి బాధ్యతను నేను వహిస్తాను. వారి యోగక్షేమాలన్నీ నేను చూసుకుంటాను. వారికి కావలిసినవన్నీ స్వయంగా నేనే సమకూరుస్తాను. అయితే ఈ వాగ్దానం కేవలం 100% నన్ను(పరమ సత్యాన్ని) మాత్రమే పొందడానికి అంకితం అయి ఉన్నారో, ఎవరైతే సత్య ఆచారానికి, సత్య సేవకు అంకితం అయి ఉన్నారో వారికి మాత్రమే వర్తిస్తుంది. ఇతర ఏ పనులు చేయకుండా, అనుక్షణం, నిరంతరం, నన్ను(పరమ సత్యం) మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారో వారికి మాత్రమే నా ఈ వాగ్దానం వర్తిస్తుంది. ఇతర ఏ భౌతిక లక్ష్యాలు లేకుండా, ఇతర ఏ ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలు మొదలైన ఏ భౌతిక కార్యకలాపాలు చేయకుండా, కేవలం నన్ను(పరమ సత్యాన్ని) మాత్రమే పొందడానికి సాధన చేస్తున్నారో, కేవలం నా(పరమ సత్య) ఆచారానికి మాత్రమే అంకితం అయ్యారో వారి కోరికలన్నింటినీ నేను నెరవేరుస్తాను. వారి అవసరాలన్నీ నేను ఖచ్చితంగా తీరుస్తాను అని శ్రీకృష్ణ పరమాత్ముడు 100% గ్యారంటి ఇస్తున్నాడు. ఎంతటి కరుణ !!!

అయితే మరి, అందరూ ఈ విధంగా 100% సత్య మార్గానికి అంకితం కాలేరు కదా ! మరి వారి మాటేమిటి ? ఆ యొక్క పరమాత్ముడు వారిని పట్టించుకోడా ? అనే సందేహాలు కలిగే అవకాశం ఉంది. కంగారు పడాల్సిన అవసరం లేదు. ఆ పరమ సత్యం(దైవం) అందరినీ పట్టించుకుంటుంది. ఎవరు ఏ పని చేసినా, చేస్తున్నా "లోపల" లక్ష్యం మాత్రం పరమ సత్యమై ఉండాలి. మీరు ఏ పనైనా చేయండి. చదువు, ఉద్యోగం, వృత్తి, వ్యాపారం, గృహిణిగా బాధ్యతలు

నిర్వహించడం మొదలైనవి ఏవైనా చేయండి మీ లోపల లక్ష్యం కేవలం, పరమ సత్యమే అయి ఉన్నప్పుడు ఈ "వాగ్దానం" తప్పని సరిగా వర్తిస్తుంది.

అయితే పూర్తిగా, 100% సత్య సాధనకు + సత్య ప్రచారానికి అంకితం అయిన వారికి ఇంకా, ఇంకా ఎక్కువగా, అనంతంగా వర్తిస్తుంది.

చూశారా ! సత్యమార్గం మనకు ఏం కావాలో అది అందిస్తుంది. మీరు స్టూడెంట్ అయితే మీ చదువును మీరు కొనసాగిస్తూనే దైవత్వాన్ని కోరుకుంటూ ఉండాలి, మీరు ఉద్యోగి లేక వ్యాపారస్తుడైతే మీ పనులు మీరు చక్కబెట్టుకుంటూనే దైవత్వం మీద దృష్టి పెట్టాలి, మీరు గృహిణి అయితే మీ బాధ్యతలు మీరు నిర్వర్తించుకుంటూ దైవత్వమే మీ లక్ష్యంగా ఉండాలి. మీరు ఎవరైనా సరే మీ బాధ్యతలు మీరు నిర్వహిస్తూ దైవత్వమే మీ ఏకైక లక్ష్యంగా ఉండాలి.

✪✪✪ దైవత్వం మీ లక్ష్యంగా పెట్టుకుని ఉన్నప్పుడు మీరు చేసే పనులు "సరి" అవుతాయి. దైవత్వం మీ లక్ష్యం కానప్పుడు మీరు చేసే మంచి పనులైనా సరే కర్మ శేషాన్ని అంటగడతాయి. అంతకు అంతా చెల్లించాల్సి వస్తుంది.

✪✪✪ దైవత్వమే మన లక్ష్యం అయినప్పుడు సృష్టి యొక్క ఆశీర్వాద అనుగ్రహాలు ఎల్లప్పుడూ మన పైన వర్షిస్తూనే ఉంటాయి. ఎవరి గురించి వాళ్ళు తెలుసుకోవడం, ఎవరి నిజ తత్వాన్ని వాళ్ళు అనుభవ పూర్వకంగా తెలుసుకోవడం అనేది సృష్టి యొక్క ప్రాథమిక మరియు ప్రధానమైన నియమం. ఎప్పుడైతే మనం ఈ నియమాన్ని అనుసరిస్తామో మనకు కావాల్సినవన్ని మనల్ని అనుసరించి వస్తాయి.

✪✪✪ దైవత్వమే మన లక్ష్యం అయినపుడు మనకు కావాల్సిన వాటికి, మనం కోరుకుంటున్న వాటికి మనం లక్ష్యం అవుతాము. లక్ష్యానికి మనం ప్రాధాన్యతనిస్తే, లక్ష్యం మనకు ప్రాధాన్యతనిస్తుంది. లక్ష్యాన్ని మనం లక్ష్యపెడితె, లక్ష్యం మనల్ని లక్ష్య పెడుతుంది. లక్ష్యాన్ని సిద్ధించుకోడానికి మనం ప్రయత్నిస్తుంటే, లక్ష్యం మనకు సిద్ధించడానికి ప్రయత్నిస్తుంది.

కోరుకున్న లక్ష్యాన్ని సిద్ధించుకోవడానికి సులభ సాధనమేమిటంటే, ఆ లక్ష్యానికి 100% అంకితం కావడమే !

ఎవరేం చేసినా, ఎక్కడెక్కడ జన్మలెత్తినా, ఏ ఏ మతాలలో జన్మ తీసుకున్నా చివరికి అందరూ ఈ సత్యమార్గంలోకి వచ్చి తీరవలసిందే ! ఆత్మ పరిణామ క్రమంలో అందరూ విధిగా తమను తాము తెలుసుకుని తీరవలసిందే. మీకై మీరు రాకపోతే రప్పించబడతారు. గ్రాండ్ మాస్టర్స్ అంటారు, " చిన్నగా తట్టినప్పుడు వినండి " అని ! చిన్నగా తట్టినప్పుడు వినడమంటే ఇలా సత్యమార్గానికి సంబంధించిన పుస్తకమో, పత్రికనో, పాంప్లెటో మీ చేతికి వచ్చినప్పుడు దాన్ని గుర్తించి, విషయాలను అవగాహన చేసుకుని సత్య మార్గంలోకి మీ అంతట మీరు రావాలని అర్థం. లేకపోతే ఆటోమెటిక్‌గా

వస్తారు. మాది అనుభవ జ్ఞానం. అసలు మన గురించి మనం తెలుసుకోవడమే కదా, దానినే సత్య మార్గం అని అంటారు. మీరు ఇప్పుడు ఇది చదువుతున్నారూ అంటే ఇది "చిన్నగా తట్టడమే" ! లోకంలో ఎన్నో సత్య మార్గ సంస్థలు ఉన్నాయి. మీకు నచ్చిన దాన్ని ఎంచుకోండి.

చాలా మంది దైవత్వ సాధనలో "దైవాలం అవుదామని" ప్రయత్నిస్తూ ఉంటారు. ఇక్కడే దారి తప్పుతారు. ఆల్‌రెడీ మీరు దైవమే అయి ఉన్నారు. అయితే, ఆ విషయం కేవలం మర్చిపోయి ఉన్నారు. విస్మృతిలో ఉన్నారు. దైవమే మీరు అన్న స్మృతి లేదు మీకు, కేవలం మీరు గుర్తు చేసుకోవాలి అంతే కానీ దైవంగా తయారు కావాలి అని ప్రయత్నించకూడదు.

జగద్గురువు రామ్‌తా అంటాడు "మానవ జాతి విమోచనానికి తమ దివ్యత్వ స్మరణయే ఏకైక మార్గం" అని !

"మహా మూల చైతన్యమే మీరు" అని అంటాడు సేత్ పరమాత్ముడు !

"మీరే మహా మూల చైతన్యం" అని నేను అంటున్నాను !

మనం ఆల్‌రెడీ దైవాలమే. కేవలం ఆ విషయం గుర్తు చేసుకోవాలి. వేదాలు చెబుతున్నాయి మనమే దైవాలమని, గ్రాండ్ మాస్టర్స్ అందరూ చెప్పారు అందరూ దైవాలే అని, పరమాత్ముడు శ్రీ జీసస్ క్రైస్ట్ కూడా చెప్పాడు అందరూ దైవాలే అని, అయినా మనం ఏం చేస్తున్నాం ?!?!

ఎరుకతో నిరంతరం ఉండాలి. అయితే ఈ ఎరుక దైవంగా మారడానికి కాదు అని స్థిరంగా గుర్తుంచుకోవాలి. దైవమే అయి ఉన్న మీరు దైవంగా ఎలా మారుతారు ?! ఉదాహరణకు మీరు హైదరాబాద్‌లో ఉన్నారు, హైదరాబాద్ నుండి మీరు హైదరాబాద్‌కు వెళ్ళాలని ప్రయత్నిస్తుంటే ఎలా ఉంటుంది ? హైదరాబాద్‌లో ఉన్న మీరు హైదరాబాద్‌లోనే ఉన్నారు అని గుర్తించాలి, నేను ఉన్నది హైదరాబాదే అని గ్రహించాలి. ఇదే విధంగా దైవమే అయి ఉన్న మీరు మీ దైవత్వాన్ని మీరు గుర్తించాలి, గ్రహించాలి. ఎలా అంటే...

వెరీ సింపుల్ !

గడిచిపోయిన మీ ఆనందదాయకమైన బాల్యాన్ని గుర్తు చేసుకున్నంత సులభంగా, మరిచిపోయిన మీ పాత మిత్రుడి ఫోన్ నంబర్ గుర్తు చేసుకున్నంత సులువుగా, సరళంగా మరచిపోయిన మీ దైవత్వాన్ని మీరు గుర్తు చేసుకోవచ్చు. మీ దైవత్వం పట్ల విస్మృతిలో ఉన్న మీరు, స్మృతిలోకి చాలా ఈజీగా రావచ్చు.

నిరంతర ఎరుకను కలిగి ఉండాలి. మీరు బ్రష్ చేస్తున్నా, స్నానం చేస్తున్నా, అన్నం తింటున్నా, సెక్స్ చేస్తున్నా, మీరు ఏం చేస్తున్నా ఎరుకను కలిగి ఉండాలి. మామూలుగా మీ పనులు మీరు చేసుకుంటూ స్మృతిని కలిగి ఉండాలి. మరిచిపోతుంటారు, ఫర్వాలేదు. బాధ పడకూడదు. బాధ అనేది సాధనలో అడ్డంకి అవుతుంది. మరిచిపోయారు OK అంతే, గుర్తుకు వచ్చినందుకు ఆనందించి మళ్ళీ ఎరుకను కొనసాగించాలి.

ఈ "నిరంతర స్మృతితో" అంతరంగం అంతా పరిశుద్ధం అవుతూ ఉంటుంది. విస్మృతిలో ఉన్న చైతన్యం అంతా కదలడం మొదలవుతుంది. ప్రక్షాళనా కార్యక్రమం సజావుగా సాగుతూ ఉంటుంది. విస్మృతిలో దాగి ఉన్న "సరి కాని గుణాలన్నీ" బయట పడుతూ ఉంటాయి. సరి అయ్యేవి సరి అవుతుంటాయి. అంతరించి పోయేవి అంతరించి పోతూ ఉంటాయి. అంతా ఆటోమెటిక్‌గా జరిగి పోతూ ఉంటుంది.

అయితే మీరు చేయాల్సిన అత్యంత ముఖ్యమైన పని "ఎరుకలో" ఉండడం. ఈ "ఎరుకను" మీరు సాధిస్తే అన్నీ సాధించినట్టే. ఎరుకను సాధించడమే మీ లక్ష్యం కావాలి. ఎరుకయే మీ జీవితం కావాలి. ఎరుక లేకనే అన్ని సమస్యలు. ఎరుక వస్తే అన్నీ ఆనందాలే !

సదా, సర్వదా ఈ ఎరుకలో ఉండాలి. మీరు ఏం చేస్తున్నా, ఎరుక - ఎరుక అంతే ! మీరు ఎంతెంతగా ఎరుకలో ఉండడం జరుగుతుందో అంతంతగా మీ ప్రక్షాళన జరుగుతుంది. మీ ఎరుక సంపూర్ణమైన రోజున, ఆ క్షణాన మూల చైతన్యమే(దైవమే) నేను అని, మిమ్మల్ని మీరు తెలుసుకుంటారు. ఎరుకయే దైవత్వం ! దైవత్వమే ఎరుక ! ఎరుకయే మీ నిజతత్వం ! మీ నిజతత్వమే మూల చైతన్యం !

✪ లోపల ప్రక్షాళన జరుగుతున్న కొద్ది బయట మీ శరీరంలోని + జీవితంలోని పరిస్థితులు బాగవడం మీరు గమనించవచ్చు. అన్నింటికీ, సమస్త సమస్యలకు ఒకే ఒక పరిష్కారం దైవత్వ సాధన.

✪✪✪ అనుక్షణం ఎరుకతో ఉండాలి. మిమ్మల్ని మీరు మూల చైతన్యంగా భావిస్తూ, ఇతరులను, అందరినీ, అంతటిని మూల చైతన్యంగా భావిస్తూ ఉండాలి. నిరంతరం ఇదే ఎరుకతో,

సర్వదా ఇవే భావనలతో, అనుక్షణం ఇదే అవగాహనతో మీరు ఉండాలి.

✪✪✪ దిగ్భ్రాంతికరమైన ఫలితాలనిచ్చే దైవత్వ సాధన మిమ్మల్ని ఆశ్చర్యానందాలకు గురి చేసి విస్మయాన్ని కలిగిస్తుంది. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని బాగా శ్రద్ధగా చదవండి. చాలా సార్లు చదవండి. సరిగా అర్థం చేసుకోండి. ఇందులోని విషయాల పట్ల సరి అయిన అవగాహనను పెంచుకోండి. అన్నింటి కంటే ముందు, నా పట్ల ప్రేమను కలిగి ఉండండి. నన్ను పూర్తిగా విశ్వసించండి. పూర్తి విశ్వాసంతో ఈ సాధన చేస్తే అమోఘమైన ఫలితాలను తక్షణమే అందించి మిమ్మల్ని విభ్రాంతికి గురి చేస్తుంది. అత్యంత శక్తి వంతమైన ఈ సాధనల వల్ల మీరు సాధించలేనిది ఏదీ లేదంటే అతిశయోక్తి కాదు.

ఈ సాధనలో "స్మృతి మరియు అవగాహన" ప్రధానం. నిజానికి దివ్యత్వాన్ని మనం సహజంగానే కలిగి ఉంటాం. అజ్ఞానం వలన అది లోపల కప్పబడి ఉంటుంది. క్రమం తప్పని సాధన, దానిని కప్పి ఉంచిన అజ్ఞాన పొరలను శాశ్వతంగా తీసివేస్తుంది, దివ్యత్వాన్ని ప్రకటం అయ్యేలా చేస్తుంది దాంతో లోపల భావాలన్నీ సరి చేయబడతాయి. నెగెటివ్ భావాలన్నీ తొలగించబడతాయి. సంపూర్ణంగా, సమగ్రంగా ప్రక్షాళన జరిగి అంతరంగం పరిశుద్ధం అవుతుంది. స్వచ్ఛంగా అవుతుంది. అప్పుడు మీరు సర్వ - సర్వ, సకల - సకల, సమస్త బంధనాల నుండి, సకల సమస్యల నుండి శాశ్వతంగా విముక్తులవుతారు. పూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో, సాధికారతలతో విలసిల్లుతారు. మీ జీవితం ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్యాలతో, ఉల్లాసంగా, ఉత్సాహంగా, శక్తి వంతంగా, ఉత్సవ భరితంగా, దివ్యంగా శాశ్వతంగా విరాజిల్లుతుంది.

వేలాది జన్మలలో అజ్ఞానంతో పోగు చేసుకున్న రక రకాల సరికాని భావాలు "లోపల" ఉంటాయి. ఆత్మ పరిణామ క్రమంలో సంపూర్ణత్వం పొందడంలో భాగంగా ఇదంతా జరుగుతుంది. ఈ లోపల ఉన్న భావాలే మీ శరీరాన్ని + జీవితాన్ని నియంత్రిస్తూ ఉంటాయి. మీ యొక్క అన్ని శారీరక అనారోగ్యాలకు, మీ అన్ని శారీరక + మానసిక లోపాలకు, మీ అన్ని జీవిత సమస్యలకు, అన్ని పరిస్థితులకు ఈ సరికాని భావాలే కారణం. తీసేసే వాటిని తీసేసి, సరి చేసే వాటిని సరి చేస్తేనే మీ శరీరం + జీవితం మారుతుంది. ఎందుకంటే భావాలే అసలు సిసలు మూలాలు. మరి లోపలి మూలాలకు అనుగుణంగానే బాహ్యంలో ఉంటుంది కదా !

విశ్వ సూత్రం - "మన అంతరంగంలోని భావాల యొక్క యథాతథ ప్రతిబింబమే మన శరీరం + జీవితం" ! దీనినే సంస్కృతంలో "యద్భావం తద్భవతి" అని అంటారు. అంటే నీ భావం ఎలా ఉంటే నీ భవం(పరిస్థితి) అలా ఉంటుందని అర్థం. మూలం ఎక్కడ ఉందో అక్కడ, మూలాన్ని మార్చాలి. మూలాన్ని

మారిస్తేనే కదా ప్రతిబింబం మారేది. మూలం లోపల ఉంటుంది.

చాలా మందికి అనుకున్న పనులు అనుకున్నంత సులభంగా, వేగంగా జరగవు. ఎంతో శ్రమించి, ఎంతో డబ్బు ఖర్చుచేసి, ఏమేమో చేస్తే కానీ వాళ్ళ పనులు జరగవు. ప్రతీ పనిలో అడ్డంకులు, ప్రతీ పనికి ఇబ్బందులు ఎదురవుతూ ముప్పుతిప్పలు పెడుతూ ఉంటాయి. పని మొదలు పెట్టనంత వరకు బాగానే ఉంటాయి పరిస్థితులు, పని మొదలు పెట్టగానే అప్పటి వరకు సహాయం చేస్తామన్న వాళ్ళు దూరం కావడం లేక వాళ్ళే ఏవో ఇబ్బందుల్లో ఇరుక్కోవడం, వ్యక్తులు, పరిస్థితులు పూర్తిగా వ్యతిరేకంగా మారడం జరుగుతూ ఉంటుంది. దీనితో వాళ్ళు ఏమనుకుంటూ ఉంటారంటే, ఏంటో మన రాత ఇంతే అని డిసైడ్ అయిపోతారు. దేవుడిని నమ్మేవాళ్ళు దేవుడి దయలేదేమో అని అనుకుంటూ ఏవేవో చేస్తుంటారు. నాస్తికులకు ఏమీ అర్థం కాక లాజిక్‌తో భౌతిక కారణాలను ఏవో కొన్నింటిని కనుక్కుని తమను తాము సముదాయించుకుంటూ ఉంటారు.

వాస్తవానికి అసలు విషయం ఏమిటంటే లోపల, "అబ్బో పనులు జరగాలంటే చాలా కష్టం, ఎంతో కష్టపడితే కానీ పనులు జరగవు, పనులు జరగాలంటే మామూలు విషయం కాదు" అనే "సరికాని భావనలు" ఉంటాయి. ఈ భావనలే పని మొదలు పెట్టగానే చుక్కలు చూపెడుతూ ఉంటాయి. అన్ని అడ్డంకులను, ఇబ్బందులను ఆకర్షించి ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తూ ఉంటాయి.

ప్రేమతో కూడిన మీ ఎరుక + సాక్షి తత్వం లోపల అంతరంగంలో ఉన్న "సరి కాని భావనలను" అన్నింటిని తీసివేస్తుంది. దాంతో ఆశ్చర్యకరంగా పనులన్నీ సులభంగా, సరళంగా, వేగంగా అనుకున్న వెంటనే పనులు పూర్తి అయి మిమ్మల్ని ఆనందానికి గురి చేస్తాయి.

వాస్తవానికి బాహ్య జీవితం యొక్క అసలు సిసలు మూలం అంతరంలో ఉంటుంది ! అంతర్ జీవితమే నిజమైన, వాస్తవమైన జీవితం ! బాహ్య జీవితానికి మూలమే అంతర్ జీవితం ! అంతర్ ప్రపంచం(జీవితం) యొక్క యథాతథ ప్రతిబింబమే బాహ్య జీవితం !

ఉదాహరణకు సినిమా థియేటర్‌లో "తెర" లాంటిది బాహ్య జీవితం. తెర మీద సినిమా ప్రదర్శితం అవుతూ ఉంటుంది. కానీ దాని మూలం ప్రొజెక్టర్‌లో ఉంటుంది. ప్రొజెక్టర్ ఆపేస్తే తెర మీద సినిమా ఆగిపోతుంది. సినిమాను ఏమైనా మార్పు చేయాలంటే తెర మీద ఏమీ చేయలేం కదా.. తెర మీద ఏం చేయగలుగుతాం ?! ఎలా చేయగలుగుతాం ?! మనం, మార్పు ఏదైనా చేయాలంటే లోపలికి వెళ్ళాలి. ప్రొజెక్టర్ రూమ్‌లోకి వెళ్ళి ప్రొజెక్టర్ ఓపెన్ చేసి దానిలో ఉన్న ఫిల్మ్ రీలును సరిచేస్తే, లేక మారిస్తే అప్పుడు తెరమీద సినిమా ఆటోమెటిక్‌గా సరి అయిపోతుంది లేక

మారిపోతుంది కదా ! ఇదే విధంగా ఉంటుంది మన పరిస్థితి కూడా.

మన మెదడు ప్రొజెక్టర్ లాంటిదైతే, మన భావాలు ఫిల్మ్ రీలు లాంటివి. మన భావాలు అనే ఫిల్మ్ రీలు ఎలా ఉందో అలా మన మెదడు అనే ప్రొజెక్టర్, జీవితం అనే సినిమాను అలాగే బాహ్యంలో ప్రదర్శిస్తూ ఉంటుంది. అన్నింటికీ మూలం భావాలు. భావం సరి అయితేనే భవం(పరిస్థితి) సరి అవుతుంది. ఫిల్మ్ రీలును సరి చేస్తే తెరమీద సినిమా సరి అయినట్టు !

సృష్టిలో కోటానుకోట్ల జీవితాలు ఉంటాయి. మన అవగాహనను బట్టి, మన ఇష్టాన్ని, మన అవసరాన్ని బట్టి జీవితాలను ఎంచుకోవచ్చు. జీవితం అవకాశాల మయం కాదు, ఎంపికల మయం !

Life is full of Choices, not Chances !

బాహ్య జీవితం అనే తెర మీద ప్రదర్శితం అవుతున్న పరిస్థితులు నచ్చక పోతే లోపలికి వెళ్ళి ప్రొజెక్టర్ అనే మెదడులోని ఫిల్మ్ రీలు అనే భావాలు మార్చేయండి. భావాలు, కోటాను కోట్ల రకాలుగా ఉంటాయి. అందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయం, ఆనందం, ఉత్సవం, ఎంజాయ్‌మెంట్ ఇలా ఎన్నెన్నో ఉంటాయి. వాటిలో మీకు కావాల్సినవి "ఎన్నుకుని" లోడ్ చేసుకుంటే సరి పోతుంది. అవి అన్నీ కావాలంటే సింపుల్‌గా మీ నిజతత్వాన్ని మీరు పొందితే సరి ! మీ నిజతత్వాన్ని మీరు పొందినప్పుడు, మీరు శాశ్వత రీతిలో ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్యాలు ఇంకా మీ ఊహలకందని బ్రహ్మానందాన్ని పొందుతారు.

మరి లోపలికి వెళ్ళి మార్చడం ఎలా అంటే, ఈ గ్రంథంలో నేను వివరించిన సాధనలు చేయడమే. సాధన చేస్తే చాలు - అప్పుడు మీకేం కావాలో మీ అంతర్ ప్రపంచానికి అర్థం అవుతుంది. ఆ ప్రకారంగానే అన్ని సరికాని భావాలను(గుణాలను) తీసివేస్తుంది. దానితో అంతా దివ్యం అవుతుంది. మీ కోరికలన్నీ తీరుతాయి. వెరీ వెరి సింపుల్ !

విషయాలు తెలియక పోవడంతో మనం మన పైన, మన అంతర్ ప్రపంచం పైన ఎన్నెన్నో సరికాని అభిప్రాయాలు పెట్టుకుని ఉంటాం. మన శరీరం + జీవితం యొక్క సమస్త బాధలకు ఇదే మూల కారణం. కాబట్టి అన్నింటికంటే ముందు మనం, మన పైన మరియు మన అంతర్ ప్రపంచం పైన ఉన్న మన అభిప్రాయాలను, నమ్మకాలను, ఉద్దేశాలను "సరి" అయిన విధంగా మార్చుకుని అప్పుడు పని మొదలు పెడితేనే సఫలం అవుతాం.

మన అంతర్ ప్రపంచం యొక్క కేంద్రంలో మనం మూల చైతన్యానికి కనెక్ట్ అయి ఉంటాం. ఆ విధంగా మనమే మూల చైతన్యం అయి ఉన్నాం. మూల చైతన్య శక్తిని + లోపలి సిస్టమ్‌ను కలిపి అంతర్ ప్రపంచం అంటారు.

అంతర్ ప్రపంచం ఎప్పుడు కూడా, ఎట్టి పరిస్థితుల్లో కూడా మీరు చేయమన్నా కూడా ద్రోహం చేయదు, హాని చేయదు ! అంతర్ ప్రపంచం మనకెల్లప్పుడూ శ్రేయస్కరాన్ని మాత్రమే చేస్తుంది గుర్తుంచుకోండి ! అంతర్ ప్రపంచం ఉన్నదే మన సేవ కోసం ! మనం ఏం కావాలంటే అది, ఎలా కావాలంటే అలా, ఎప్పుడంటే అప్పుడు తక్షణమే అన్నీ సమకూర్చడానికే అంతర్ ప్రపంచం ఉంది ! అంతర్ ప్రపంచం అనంతమైన శక్తి కలిగి ఉంది. మనం చేసే సాధనకు అంతర్ ప్రపంచం పూర్తిగా సహాయ సహకార సమన్వయాలను అందిస్తుంది. సాధన అత్యంత శీఘ్రంగా ఫలించేలా చేస్తుంది.

"శ్రద్ధా పూర్వకమైన అంకిత వైఖరి ఉన్నప్పుడు ఫలితాలు తక్షణమే అనుసరిస్తాయి. ఒక్క క్షణం కోసం అయినా అంకిత వైఖరి కుదిరిందంటే ఎన్నో జన్మల సంచితం(కర్మ) సురక్షితంగా కరిగి పోతుంది. శ్రద్ధా భావంతో నువ్వు గతం నుండి పూర్తిగా ముక్తుడవై పోతావు". నీ పట్ల నీవు పూర్తి స్థాయిలో శ్రద్ధను కలిగి ఉండడం అని అంటే, నీ పట్ల నీవు పూర్తి స్థాయిలో ఎరుకను కలిగి ఉండడం అని అర్థం. నీ పైన నీవు శ్రద్ధ వహిస్తున్నావంటే, నీ పట్ల నీకు ప్రగాఢమైన ప్రేమ ఉందని అర్థం.

ఎవరైతే తమ పట్ల తాము శ్రద్ధను కలిగి ఉంటారో వారి సాధన తక్షణమే ఫలిస్తుంది. కాబట్టి పూర్తి విశ్వాసంతో, శ్రద్ధతో సాధన చేయండి.

మన పట్ల, మన దేహం పట్ల, మన జీవితం పట్ల, మన సృష్టి పట్ల, మన సాధన పట్ల మనం శ్రద్ధ సమర్పణ అంకిత భావం గనక కలిగి ఉంటే సాధన తక్షణమే ఫలిస్తుంది. అయితే, మనం సాధన చేసేటప్పుడు, సదా ప్రేమతో సహనంగా ఉండాలి. ఆనందంగా ఆహ్లాదకరంగా ఉండాలి. "డీలా" పడకూడదు. వాస్తవానికి డీలా పడటం అంటే ఏమిటో మీకు తెలుసా ?! డీలా పడటం అంటే అయిష్టతతో ఏకమై, అయిష్టతను ప్రకటించడం, లోపల ఉన్న అయిష్టతే బయటికి "డీలా తనంగా" ప్రకటం అవుతుంది. "బాగు పడటం ఇష్టం లేని గుణమే" విసుగును కలుగజేస్తుంది. సాధన పట్ల అనుమానాలను, అభ్యంతరాలను ప్రకటించి సాధనకు అడ్డంకులను సృష్టిస్తుంది.

కాబట్టి ఎరుకతో ఉండాలి. నెగెటివ్ ఆలోచనలతో ఏకం కాకూడదు. నెగెటివ్ ఆలోచనలకు స్పందించకుండా సాక్షిగా ఉండాలి.

గుర్తుంచుకోండి, ఈ విశ్వ సూత్రాన్ని - "శ్రద్ధ, సమర్పణ, అంకిత వైఖరిని" వెన్నంటే ఫలితాలు ఉంటాయి. తక్షణమే ఫలితాలు సిద్ధిస్తాయి. ఒక వేళ మీకు ఫలితాలు వెంట, వెంటనే రావటం లేదంటే "శ్రద్ధ, సమర్పణ, అంకిత వైఖరి" కుదర లేదనే అర్థం. సూర్యుడు వస్తే వెలుగును ఎవరూ దాచలేరు, అలాగే మీకు శ్రద్ధ, సమర్పణ, అంకిత వైఖరి కుదిరితే ఫలితాలను ఎవరూ ఆపలేరు. కాబట్టి దీక్షగా సాధన చెయ్యండి. సార్, నేను బాగానే సాధన చేస్తున్నానండీ, అదేమిటో గానీ ఫలితాలు రావటం లేదండీ అని అనకూడదు. సూత్రం సరిగానే ఉంటుంది. లోపం మీ లోపలే ఉంటుంది.

నేను బాగానే నేర్చుకుంటున్నాను. అదేంటో స్విమ్మింగ్ పూల్ సరిగా లేదు అంటే ఎలా ఉంటుందో ఇది అలానే ఉంటుంది. స్విమ్మింగ్ పూల్ బాగానే ఉంటుంది, నీళ్ళు బాగానే ఉంటాయి, నేర్పే వాడు బాగానే ఉంటాడు. బాగు కావాల్సింది మీరే ! నాట్యం రాక మద్దెల దరువు బాగా లేదు అని అనవద్దు. పట్టుదలతో సరిగా చేస్తే ఖచ్చితంగా సూత్రం పని చేస్తుంది.

✪ మిమ్మల్ని గురించి మీరేం అనుకుంటున్నారు ?! ఇప్పటి మీ వెనుక కొన్ని వేల జన్మల చరిత్ర ఉంది. కొన్ని వేల / లక్షల / కోట్ల జన్మల సమాహారమే మీరు !

ముందు మీ గురించి మీరు తెలుసుకోండి. ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదివి విషయాలు గ్రహిస్తే అప్పుడు అన్నీ అర్థం అవుతాయి. పుస్తకాలు చదవటం తప్పనిసరి. చాలా మంది పుస్తకాలు చదవకుండా గుడ్డిగా సాధన చేస్తూ ఉంటారు. ఇది సరి కాదు. చదవటం రాకపోతే చదివించుకుని వినాలి. విషయాలను అడిగి తెలుసుకోవాలి. లేకపోతే సాధన ఎడ్ల బండిలా మెల్లగా సాగుతుంది. ధ్యాన సాధన అంటే ఏమిటో కాదు, "ఆధ్యాత్మిక సత్యాలను అంతరంలో అనుభూతి చెందే ప్రక్రియనే" ! సాధన త్వరగా సిద్ధించాలి అంటే పుస్తకాలు చదవటం తప్పని సరి. అవగాహన పెంచుకోవడం అనివార్యం.

✪✪✪ పనికిరాని వస్తువులను ఎంతో డబ్బు పెట్టి ఎన్నింటినో కొంటుంటారు. కానీ ఓ వందా లేక రెండొందలు పెట్టి పుస్తకం కొనరు చాలా మంది. పుస్తకాలే మిమ్మల్ని రక్షిస్తాయి. బంగారాలు, వజ్రాలు మీకు ఎలాంటి శ్రేయస్కరాన్ని కలిగించవు. విజ్ఞానమే రక్షిస్తుంది. పుస్తకాలను కొని చదవండి, అవే మీ నిజమైన ఆస్తి. పుస్తకాల విలువను గ్రహించిన వారికి ఎంతో శ్రేయస్కరం జరుగుతుంది. పుస్తకాల విలువను గ్రహించడమంటే "మహా సౌభాగ్యాలను" గ్రహించినట్టే.

అనేకానేక జన్మలు కవరింగులు(ముసుగులు) వేస్తూ, యాంత్రికంగా భౌతిక జీవితం జీవిస్తూ "జడంగా", "కఠినంగా" అయిపోయి ఉన్నారు మీరు. క్రమం తప్పని సాధన వలన శ్రద్ధ, సమర్పణ, అంకిత భావాలు మీలో ఉత్తేజితమై మిమ్మల్ని సున్నితంగా, సులభంగా, సరళంగా చేస్తాయి.

విషయం తెలియక మీరు, మీ పరిస్థితులకు ఇతరులు కారణం అని అనుకుంటూ ఉంటారు. దేవుడిని నమ్మే వాళ్ళు దేవుడి పైన, దేవుడిని నమ్మని వాళ్ళు మరొకరి పైన నిందలు మోపుతూ ఉంటారు. మన అన్ని పరిస్థితులకు మనమే కారణం. ఇదే అసలు సిసలు పరమ సత్యం. "ఈ సత్యం" మీకు అర్థం అయినప్పుడే, ఈ సత్యాన్ని గ్రహించి మీరు ఒప్పుకున్నప్పుడే, ఈ సత్యాన్ని

యథాతథంగా అంగీకరించినప్పుడే మీ శరీరంలోని + జీవితంలోని పరిస్థితులను సమూలంగా మార్చే శక్తి సామర్థ్యాలు మీకు వస్తాయి. అప్పుడే మీకు అవి అందుబాటులోకి వస్తాయి. అప్పుడు మీరెలా కావాలంటే అలా, మీరు కోరుకున్న విధంగా మీ శరీరాన్ని + జీవితాన్ని మలుచుకోవచ్చు.

పరమాత్మ స్వరూపులైన సేత్, రామ్తా మరియు అనేకానేక మంది మాస్టర్స్ ఇలా అంటారు. "మీ నమ్మకాల వ్యవస్థ, మీ అభిప్రాయాల వ్యవస్థ, మీ ఆలోచనా విధానాలే మీ పరిస్థితులకు మూల కారణాలు. ద్వంద్వాలలో ఇరుక్కుని మిమ్మల్ని మీరే శిక్షించుకుంటూ ఉంటారు" అని !

✪✪✪ అపరాధ భావనలు(Guilty) అంటే దోషిత్వ భావనలు లేక నేర భావనలు లేక పాప భావనలు. ఈ అపరాధ భావనలే మీ చేత కర్మలను అనుభవింప చేస్తూ ఉంటాయి. వాస్తవానికి ఏ కర్మ ఎవరూ అనుభవించాల్సిన అవసరం లేనే లేదు. అయినా జీవితం దుర్భరంగా ఎందుకుంటుందంటే ఈ "అపరాధ భావనలు"(Guilty) మోస్తూ ఉండటమే అందుకు కారణం.

"అయ్యో నేను వారికి అలా చేసాను" అని పశ్చాత్తాప పడటం సరైనదే, "అయ్యో నేను వారికి నష్టం కలిగించాను, బాధను, ఇబ్బంది కలిగించాను ఇక మళ్ళీ ఎప్పుడూ ఇలా ప్రవర్తించను"అనే విశ్లేషణ, నిర్ణయం మంచిదే. అలాగే తీసుకోవాలి కూడా ! ఇంత వరకైతే OK కానీ, ✪ "వారికి అలా చేసాను కాబట్టి నాకూ అది జరగ వలసిందేనని" భావించడమే పాపం ! పాపం అంటే ఇదే ! ఆశ్చర్యంగా ఉందా ! సత్యాలు ఆశ్చర్యాలను కలిగిస్తాయి మరి ! వాస్తవానికి ఏ పాపాలు, ఎవరూ అనుభవించాల్సిన అవసరమే లేదు. కానీ లోపల ఉన్న అహం, మదం ఇలా ఆలోచింపచేస్తాయి. "మనం వారికి అలా నష్టం కలిగించాం కాబట్టి మనం కూడా నష్టపోదాం" అని నిర్ణయం తీసుకునేలా చేసి వాటిని ఆకర్షింప చేసి అనుభవింప చేస్తాయి.

విశ్వాసం + ప్రేమతో చేస్తున్న మీ సాధన, మీ అపరాధ భావనలను మొత్తం ఒకే సారి శాశ్వతంగా తీసేస్తుంది. జరిగిందంతా దివ్యమే, చేసిందంతా దివ్యమే ! కాబట్టి గతం గతః అంతా పవిత్రమే, ఇక ఏ శిక్షలు, కర్మలు అనుభవించాల్సిన పని లేదు, అవసరం లేదు, అనే "అవగాహనను" కల్పించి మిమ్మల్ని అపరాధ భావనల నుండి శీఘ్రంగా, శాశ్వతంగా విముక్తులను చేస్తుంది ధ్యాన సాధన.

జీవితంలో కష్ట నష్టాలు తప్పు - ఒప్పు, మంచి - చెడు అనే ద్వంద్వాలలో ఇరుక్కున్నందుకే వస్తాయి. దీని వలన ఇది మంచి, ఇది చెడు అని మనకి మనమే శిక్షలు వేసుకుని నష్టపోతుంటాం. వాస్తవానికి మంచి లేదు, చెడు లేదు అంతా దివ్యమేనని గ్రహించాలి. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పాడు కదా, "శుభాశుభపరిత్యాగీ" (12 : 17) అని ! శుభం లేదు, అశుభం లేదు వీటిని వదిలేయి. ఉన్నది అంతా దివ్యమే, అని అర్థం. ధ్యాన సాధన ద్వంద్వాలలో నుండి మిమ్మల్ని శీఘ్రంగా, సురక్షితంగా, శాశ్వతంగా బయట పడేస్తుంది.

ఇంకొక కోణంలో అపరాధ భావన అంటే ప్రతీకార భావన. కన్నుకు కన్ను, పన్నుకు పన్ను అనేదే ప్రతీకార భావన "వారికి నేను ఏం చేసానో నేనూ అదే అనుభవించాలి" అనేది ప్యూర్‌గా ప్రతీకార భావన. "ప్రతీకారం అనేది మనం ప్రయాణించే పడవకు రంధ్రం చేయడం లాంటిది, జీవిత నౌక మునిగిపోతుంది". ఎప్పుడైనా సరే ప్రతీకారం తీర్చుకోకూడదు. ప్రతీకారం చేయడం అంటే మళ్ళీ మీరు ప్రతీకారాన్ని అనుమతించడమే. మీలో ప్రతీకార గుణం పూర్తిగా నశించేంత వరకు మీకు ఇబ్బందులు, ప్రమాదాలు తప్పవు. మీరు ఎక్కడ ఉన్నా, ఏం చేస్తూ ఉన్నా మీ లోపలే ప్రతిష్ఠితమై ఉన్న "మీ ప్రతీకార గుణం" మీకు ఇబ్బందులను, ప్రమాదాలను సృష్టిస్తూనే ఉంటుంది. మీకు జరిగిన "దానికి" మీరు ప్రతీకారం తీర్చుకోవడమంటే మీకు జరిగిన "దానిని" పెంచుకోవడమే అవుతుంది. అపకారికి ఉపకారం చేయలేక పోయినా కనీసం అపకారం చేయకుండా ఉంటే మిమ్మల్ని మీరు రక్షించుకున్న వారౌతారు. ఇలా అయితే అవతలి వాళ్ళు ఏం చేసినా సహిస్తూ పోతే, ఇక దానికి అంతం ఉండదు అని మీరు అనుకునే అవకాశం ఉంది. అలా కాదు. మీ లోపల ప్రతీకార గుణాన్ని తీసివేసేందుకే మీపై "ప్రతీకార దాడులు" జరుగుతూ ఉంటాయి. ఎప్పుడైతే మీ లోపల ఉన్న ప్రతీకార గుణాన్ని మీరు పూర్తిగా తొలగించుకుంటారో అప్పుడు మీకు ఏ ఇబ్బందులు, ప్రమాదాలు ఎదురు రావు. రానే రావు. కాబట్టి ప్రియ మిత్రులారా ఎట్టి పరిస్థితుల్లో కూడా ప్రతీకారం పనికి రాదు. ప్రతీకారం అంటే "గొడవలకు ఆహ్వానం" అని అర్థం చేసుకోండి.

ధ్యాన సాధన, మీ మొత్తం నమ్మకాల వ్యవస్థను, అభిప్రాయాల వ్యవస్థను, ఆలోచనా విధానాన్ని సరి చేస్తుంది. లోపల ఎన్నయితే సరి కాని భావాలు ఉంటాయో వాటన్నింటినీ సరి చేస్తుంది. తీసేసే వాటిని తీసేస్తుంది.

ధ్యాన సాధన మీలో ప్రేమను సృష్టిస్తుంది. వాస్తవానికి మీ పట్ల మీకు ప్రేమ లేనందువల్లనే ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం లేకుండా పోయాయి. ప్రేమ యావత్ సృష్టికి మూలాధారం. మీ పట్ల మీరు ప్రేమను కలిగి ఉంటే ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం ఆటోమెటిక్‌గా వస్తాయి. ప్రేమ అన్నింటినీ సమన్వయం చేస్తుంది. శృతి చేస్తుంది. మీ లోపల ఉన్న శక్తులన్నింటినీ ఉత్తేజితం చేసి, బ్యాలెన్స్ చేసి మీకు అందుబాటులో ఉంచుతుంది. ప్రేమ రక్షణనిస్తుంది, పోషణనిస్తుంది. శక్తిని అందించి ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంచుతుంది. ప్రేమ అమరం. ప్రేమ మీలో ఏకత్వాన్ని సృష్టిస్తుంది. ప్రేమ మీ నిజ తత్వంతో మిమ్మల్ని కలుపుతుంది. ఇంకా చాలా, మన ఊహలకు అందనంత చేస్తుంది. మీ పట్ల మీరు ప్రేమతో ఉంటూ ధ్యాన సాధన చేయాలి.

మనో వికారాలే శారీరక వికారాలు, శారీరక వికారాలే జీవిత వికారాలు ! మనో సకారాలే శారీరక సకారాలు, శారీరక సకారాలే జీవిత సకారాలు ! ఇక్కడ వికారాలు అంటే ఆత్మ విజ్ఞానం లేక పోవటం చేత ఉన్న సమస్యలు అని అర్థం. ఇక్కడ సకారాలు అంటే ఆత్మ విజ్ఞానం ఉండటం

చేత ఉన్న ఆనందాలు అని అర్థం. సాధారణంగా అందరూ మానసిక సమస్యలు వేరే, శారీరక సమస్యలు వేరే, జీవితంలోని సమస్యలు వేరే అని అనుకుంటూ ఉంటారు. వాస్తవానికి ఇవన్నీ ఒకటే ! సాధన వలన వికారాలన్నీ కూడా సకారాలుగా మారిపోతాయి.

దేహం పట్ల, జీవితం పట్ల మనం కలిగి ఉన్న అయిష్ట భావనలు, నిరసన భావనలు, క్రోధ భావనలు, మనకు మనమే పెట్టుకున్న శాపాలు, మనపై మనం విధించుకున్నకట్టడులు, ఆవేశంతో మనం తీసుకున్న నిర్ణయాలు మొదలైనవన్నీ మన శరీరాన్ని + జీవితాన్ని బంధించి ఉంచి ఎన్నో బాధలకు గురి చేస్తుంటాయి.

ధ్యాన సాధన యొక్క ప్రభావం వలన మొత్తం ఇవన్నీ కూడా రిలీజ్ అయిపోయి విముక్తాత్మ తేజాలై ప్రకాశిస్తాము. మన శరీరం సహజంగా కలిగి ఉన్న అద్భుతమైన, పటిష్ఠమైన రోగ నిరోధక శక్తిని తిరిగి పొంది సంపూర్ణ ఆరోగ్యాన్ని శాశ్వతంగా కలిగి ఉంటుంది. అప్పుడు శరీరాన్ని ఎలా కావాలంటే అలా తయారు చేసుకోవచ్చు.

ధ్యాన సాధన మనకు, మన నిజ తత్వానికి మధ్యలో అడ్డం ఉన్న వాటన్నింటినీ తీసి వేసి మన నిజ తత్వమైన దివ్యత్వాన్ని తిరిగి పొందేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. మన దైవత్వం తిరిగి పొందుతాం దివ్య సాధన వలన. సర్వామోదాలు, సర్వానుకూలాలు, సర్వ సమన్వయాలు, సర్వ సహాయ సహకారాలు సిద్ధిస్తాయి.

ధ్యాన సాధన, మనం గతంలో అంటే ఈ జన్మలోనూ, గత జన్మలలోనూ వ్యక్తం చేసిన మరణ భావనలను తీసివేస్తుంది. ఏదో చిన్న ప్రాబ్లం వస్తుంది. మనం నెత్తి, నోరు కొట్టుకుంటూ ఛీ ఏం బతుకు ఇది, చావైనా రాక పోయే, దీనికన్నా చావే నయం, ఏం బతుకో ఏమో అనే భావనలను ప్రకటిస్తూ ఉంటాం. అది మామూలుగా కూడా కాదు. చాలా తీవ్రతతో ప్రకటిస్తూ ఉంటాం. ముదనష్టపు బతుకు, దరిద్రపు బతుకు, ఎంతో మంది చస్తున్నారు. నాకెప్పుడు వచ్చి చస్తుందో చావు ! అంటూ "వినాశకర ధోరణితో" నెగెటివ్ ప్రకటనలు చేస్తాం. ఆ... అంత అదృష్టం మనకెక్కడిది ? మనదంతా దరిద్రమే, మన రాతలో అసలు సక్సెస్ అనే పదం ఉందా ? మన బతుకుల్లోకి ఆనందం ఎందుకొస్తుంది ? అంటూ సవాలక్ష రకాలుగా నెగెటివ్ ప్రకటనలు తీవ్రాతి తీవ్రంగా చేస్తాం.

మరి, ఇవన్నీ ఏమవుతాయని అనుకుంటున్నారు ?! పదే పదే అనుకోవడం వలన, ఇక మన బతుకులింతే అని డిసైడ్ అయిపోవడం వలన ఈ నెగెటివ్ భావాలు లోపల స్థిరపడిపోతాయి. ఇక లోపల ఉండి ప్రమాదాలను, దరిద్రాలను, రోగాలను, అపజయాలను, దుఃఖాలను, దౌర్భాగ్యాలను ఆకర్షిస్తూ ఉంటాయి. వాటిని మనం అనుభవిస్తూ చావకుండా బతుకుతూ, చస్తూ ఉంటాం ! వీటన్నింటినీ మనం సృష్టించుకుని

దేవుడిని, లోకాన్ని, తల్లిదండ్రులను, సమాజాన్ని ఇతరులను నిందిస్తూ ఉంటాం.

ధ్యాన సాధన ఇలాంటి భావనలను మొత్తం కలిపి ఒకేసారి తీసివేస్తుంది. క్రమం తప్పని సాధన వలన, మీ జీవితం ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలతో విరాజిల్లుతుంది.

✪✪✪ ధ్యాన సాధన వలన మీ లోని ఓల్డ్ ఎనర్జీస్ అన్నీ ఆటోమెటిక్‌గా రిలీజ్ అయిపోయి న్యూ ఎనర్జీలు Establish అవుతాయి. ధ్యానం Regularగా చేస్తూ ఉంటే ఎనర్జీలు అన్నీ ఎప్పటికప్పుడు ఆటోమెటిక్‌గా Update అవుతూ ఉంటాయి, బ్యాలెన్స్ అవుతూ ఉంటాయి. ఎనర్జీల గురించి ఏమీ తెలియక పోయినా సరే !

✪✪✪ సాధన వలన మీ బంధాలన్నీ తొలగిపోయి, మీరు సంపూర్ణమైన, సమగ్రమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందుతారు.

✪✪✪ మీలో ఉన్న సర్వ లోపాలు సరి చేయబడతాయి. నిజానికి లోపాలు అనేవి లేవు అని తెలుస్తుంది. ఉన్న అన్ని లోపాలకు "మూల లోపం" ఒక్కటే అదే "విస్మృతి". అన్ని బలహీనతలు తక్షణమే తొలగి పోతాయి. మీ 12 ప్రోగుల దివ్య జన్యువు తిరిగి నిర్మించబడుతుంది. మీ 7 శరీరాలు శృతి చేయబడతాయి. మీ 12 చక్రాలు ఉత్తేజితమవుతాయి. మీ దివ్య శక్తి కేంద్రాలు జాగృతం అయి మీ అందుబాటులోకి వస్తాయి. మీ మూడో కన్ను - Third eye పూర్ణ జాగృతం అయి మీ స్వాధీనంలోకి వస్తుంది. మీ సూక్ష్మ శరీరంపై, మీ సూక్ష్మ శరీర ప్రయాణాలపై పూర్తి ఎరుకను, అదుపును మీరు సులభంగా పొందుతారు మీరు విడుదల అవుతారు. మీరు మేలుకుంటారు.

✪ మీ అవగాహనా స్థాయి మహోన్నతంగా అభివృద్ధి చెందుతుంది. మీ స్మృతి సురక్షితంగా జాగృతమవుతుంది. అన్ని విషయాలను తెలుసుకుంటారు. సర్వశక్తి సంపన్నులై సర్వజ్ఞులవుతారు. మహా పరి విముక్తిని పొందుతారు.

✪✪✪ కేవలం ధ్యాన సాధన మాత్రమే చేస్తూ కూర్చోకూడదు.

"***నవరత్నాలను***" ఆచరిస్తూ ఉండాలి. నవరత్నాలను ఆచరించమని ఇతరులకు ప్రేరణను ఇస్తూ ఉండాలి.

మీరు ధ్యాన సాధన నిరంతరంగా చేస్తూ ఉండటం వలన అప్పుడు మీ అంతశ్చైతన్యానికి అర్థం అవుతుంది. మీరు మీ నిజ తత్వానికి వ్యతిరేకంగా ఉన్న సరి కాని వాటినన్నింటినీ తీసి వేసి మీరు మీ నిజ తత్వాన్ని తిరిగి పొందాలని అనుకుంటున్నారని దానికి అర్థమై, ఇది జరిగేలా చేస్తుంది.

క్రమం తప్పకుండా ధ్యాన సాధన చేయాలి. ఫలితాలు ఎంత సేపట్లో వస్తాయి. ఎన్ని రోజుల్లో వస్తాయి అని లెక్కలు వేయకూడదు. ఇలా ఆత్రం చూపెడితే సాధన ఫలితాన్నివ్వదు. మీరు స్థిమిత పడేవరకు సాధన ఫలితాన్ని ఇవ్వదు. ఎంత సేపైనా సరే, ఎన్ని రోజులైనా సరే నేను బాగుపడాలి అనేదే నా దృఢ నిర్ణయం కాబట్టి నేను పూర్తిగా బాగుపడే వరకు చేస్తాను, అని తిరుగులేని నిర్ణయం తీసుకుని ప్రశాంతంగా, సహనంతో సాధన చేయాలి. సాధన మొదలు పెట్టగానే మీలో ఉన్న సరి కాని గుణాలలో అలజడి మొదలవుతుంది. అవే మీలో ఆత్రాన్ని సృష్టించి హడావుడి చేస్తాయి. ప్రతి ఒక్కరిలో "బాగుపడటం ఇష్టంలేని గుణం" ఉంటుంది. ఇదే తీవ్ర అభ్యంతరాలను ప్రకటిస్తూ సాధన ముందుకు సాగకుండా అడ్డుకుంటూ ఉంటుంది.

ఒకసారి ఆలోచించండి, సాధన అంటే పరివర్తన, పరివర్తన అంటే అభివృద్ధి. సాధన చేయడమంటే అభివృద్ధి చెందడమే. మరి అభివృద్ధి చెందడానికి అయిష్టత దేనికి ?! అసహనం దేనికి ?! విసుగు దేనికి ?! ఒక సారి ఆలోచించండి.

గుర్తుంచుకోండి సాధనయే సిద్ధి ! మీరు ఎంత సాధన చేస్తారో అంతే ఫలం సిద్ధిస్తుంది. చాలా మంది సాధన వేరు, సిద్ధి వేరు అని అనుకుంటూ ఉంటారు. కాదు, సాధన వేరే, సిద్ధి వేరే కానే కాదు. సాధన చేస్తూ ఉంటే వేరే ఎక్కడి నుండో సిద్ధి(ఫలం)

వస్తుంది అని అనుకోవడం శుద్ధ తప్పు. తెలుసుకోండి - సాధనయే సిద్ధి ! మీరు చేసిన సాధనయే సిద్ధిగా మారుతుంది. ఎంత సాధన చేస్తే అంత సిద్ధిస్తుంది. ఎక్కువే వస్తుంది గానీ తక్కువైతే రాదులెండి !

మీకు మరో కోణంలో నుండి చెబుతున్నాను, సాధనయే సిద్ధిగా రూపాంతరం చెందుతుంది. ఎలాగైతే పిండి రొట్టెగా మారుతుందో అలాగే ! ఇక్కడ పిండి, రొట్టె వేరు వేరు కాదు. పిండియే రొట్టెగా మారుతుంది కదా ! ఎంత పిండి ఉంటే అంత రొట్టె. అందుకే "పిండి కొద్ది రొట్టె" అన్నారు కదా ! అదే విధంగా సాధనయే సిద్ధిగా(ఫలితం) మారుతుంది. ఎంత ఎక్కువ ఫలితం కావాలంటే అంత ఎక్కువ సాధన చేయాలి మరి !

✪ తప్పదు, శ్రమించాలి, మహా పరిశ్రమ చేయాలి. మీ శరీరం + జీవితం బాగుపడాలంటే షార్ట్ కట్ అంటూ ఏమీ లేదు, శ్రమయే షార్ట్ కట్ ! శ్రమించక పోవడమే లాంగ్ కట్ !

మీరు సాధన చేస్తూ ఇతరులకు సాధనను తెలియజేస్తూ ఉండాలి. అత్యంత శీఘ్రంగా, ఊహలకందనంత మెరుపు వేగంతో మీరు బాగుపడాలంటే ప్రచారం తప్పని సరి ! మీరు ఒంటరిగా సాధన చేస్తే, మీ అభివృద్ధి చాలా మెల్లగా సాగుతుంది. సాధన + ప్రచారం చేస్తేనే మెరుపు వేగంతో ఫలితాలు వస్తాయి. ప్రచారం చేయకుండా మూలకు ఒంటరిగా కూర్చొని సాధన చేస్తుంటే దైవత్వం రావడం అనేది చాలా, చాలా, చాలా కష్టం !

ఎందుకంటే దైవత్వాన్ని పొందడంలో "ప్రచారం" అనేది ఒక అనివార్యమైన దశ. దయచేసి

అర్థం చేసుకోండి. దైవత్వం పొందడం అనేది ఒక పరీక్షగా అనుకుంటే ఈ పరీక్ష పాసై దైవత్వం అనే పట్టా పొందడానికి మొత్తం 9 సబ్జెక్ట్‌లు ఉంటాయి.

అవి - నవరత్నాలు :

1. గురు స్మృతి
2. సేవా సాధన
3. సరైన ఆహారం
4. స్వాధ్యాయం
5. ధ్యాన సాధన
6. సత్సంగం
7. ఆచరణ
8. పరిశోధన
9. సత్య ప్రచారం

ఈ తొమ్మిది సబ్జెక్ట్‌లలో పాస్ అయితేనే "ఎవరికైనా దైవత్వం అనే పట్టా" లభించేది. ఇందులో ఏ ఒక్కటి లోపించినా వీలు కాదు. ఈ తొమ్మిదింటినీ ఏక కాలంలో పూర్తి చేయవచ్చు. ఇవన్నీ ఒక దానితో ఒకటి ముడిపడి ఉంటాయి. మీరు మీ యొక్క చదువు, వృత్తి, ఉద్యోగం, వ్యాపారం లేక గృహిణిగా బాధ్యతలు నిర్వహిస్తూనే సులభంగా ఏక కాలంలో ఈ తొమ్మిదింటినీ(నవరత్నాలు) పూర్తి చేయవచ్చు. ఇదేమంత పెద్ద విషయం కాదు.

నిజంగా సత్య సాధన చేయాలని అనుకునే వారికి చాలా సింపుల్ ! ఏదో కొంచెం, కొంచెం, అటూ ఇటూ ఊగిసలాడుతున్న వారికి "అమ్మో" అని అనిపిస్తుంది. పూర్తిగా సిద్ధపడని వారికి ఇవి తొమ్మిది పర్వతాలలా అనిపిస్తాయి. 100% సత్య సాధనకు సిద్ధపడిన వారికి ఈ నవరత్నాలు దివ్య కాంతులను విరజిమ్ముతూ మార్గదర్శకత్వం వహిస్తాయి. ✪ నిజానికి మొదటిదైన "గురు స్మృతిని" సాధిస్తే మిగతావన్ని దానితో కలిసి వస్తాయి, అది ఇంజనైతే మిగతావన్నీ భోగీలు ! నవరత్నాల గురించి వివరంగా ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే తెలియజేసాను.

✪ మీరు ఇతరులకు చెప్పలేక పోతే కనీసం ఈ పుస్తకాన్ని అయినా ఇవ్వాలి. ఇలా ఇవ్వడం కూడా ప్రచారమే ! ఈ పుస్తకం కాక పోయినా ఆత్మ విజ్ఞానానికి సంబంధించిన ఏ పుస్తకమైనా సరే !

మీలో ఉన్న "బాగుపడటం ఇష్టంలేని గుణం" అంటుంది. "అబ్బా... ఏం సాధనో ఇది, ఇదంతా చేయాలా" అని, మీరేమో దానితో ఏకం అయిపోతారు.

సాధనకు వ్యతిరేకమైన భావనలతో ఏకం కాకూడదు. ఏ నెగెటివ్ భావనతోనూ ఏకం కావద్దు. నెగెటివ్ భావనను సాక్షిగా చూడాలి. దానితో ఏకం కాకూడదు. నెగెటివ్ భావాలతో ఏకం అవుతున్నందువల్లనే అన్ని నష్టాలు జరుగుతున్నాయి. ఎప్పుడైతే మనం నెగెటివ్ భావాలకు ఏ మాత్రం ప్రతిస్పందించకుండా వాటిని సాక్షిగా చూస్తామో అప్పుడవి శాశ్వతంగా అంతరించి పోతాయి.

సాధన చేసి పూర్తిగా నన్ను నేను బాగు చేసుకుంటాను. హాయిగా ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్యాలతో విరాజిల్లుతాను, మోక్షాన్ని పొందుతాను. ఇది ఒక పాజిటివ్ భావన. దీనితో ఎంత సేపు మీరు ఏకం అయి ఉంటారు ? ఒక సారి చెక్ చేసుకోండి.

ఈ పాజిటివ్ భావనను నిజం చేసుకుందామన్న కాసేపటికే ఇదంతా నిజంగా జరుగుతుందా ? జరిగినా చాలా కష్టంగా, ఎప్పటికో జరుగుతుంది. అని అనుకుంటూ ఇవ్వాళ, రేపు అంటూ వాయిదాలు వేయడమే సరిపోతుంది.

మిమ్మల్ని మీరు చెక్ చేసుకోండి, ఒకసారి నిశితమైన పరిశీలన చేసుకోండి. మీరు ఆశ్చర్యపోతారు. ఎందుకంటే అధిక శాతం మీరు ఎప్పుడూ నెగెటివ్ భావనలతో ఏకమై ఉంటారు.

గుర్తుంచుకోండి. ఈ విశ్వ సూత్రాన్ని - "మీరు ఏ భావంతో ఏకమై ఎక్కువ సమయం ఉంటారో ఆ భావమే పరిస్థితిగా మారుతుంది - ఆ భావంగానే మీరు పరిణమిస్తారు" !

"యద్భావం తద్భవతి" అంటే ఇదే !

ధ్యాన సాధనల వలన ఎంతో మందికి ఎన్నెన్నో రకాలుగా లాభాలు జరిగాయి. ఎంత మంది ముక్తిని పొందారో లెక్క లేదు. మీరు చేసి చూడండి. మీకు ఏ సమస్యలు ఉంటే వాటి మీద పని చేస్తుంది. ఎవరెవరికి ఏ ఏ సమస్యలు ఉంటే ఆయా సమస్యల పైన పని చేస్తుంది. పరిష్కరిస్తుంది సాధన. మీ కోసం మీరు చేయకపోతే ఎవరు చేస్తారు ?

కొంత మంది సమస్యలు ప్రత్యేకంగా ఉంటాయి. చేతబడులకు లేక బాణామతికి గురయ్యాం అని భావిస్తూ చాలా బాధ పడుతూ ఉంటారు. ఎవరో ఏదో మంత్ర ప్రయోగం చేసారని బాధ పడుతూ ఉంటారు. లేక ఏ దయ్యమో, పిశాచమో, భూతమో, దుష్ట గ్రహమో పట్టి పీడిస్తున్నాయని బాధ పడుతుంటారు. ఏవో దుష్ట శక్తులు తమను బాధపెడుతున్నాయని కృంగి పోతుంటారు. సాధారణంగా ఇలాంటి సమస్యలతో బాధ పడేవారు మంత్రగాళ్ళను ఆశ్రయిస్తారు. రక రకాల పూజలు, శాంతులు చేయిస్తారు. నిజానికి ఇలాంటివన్నీ ఫలితాలను ఇవ్వవు. దయచేసి మంత్రగాళ్ళ

దగ్గరకు వెళ్ళకండి. మంత్రగాళ్ళు ఏమీ చేయలేరు. పైగా అనవసరమైన ఇతర ఇబ్బందులకు గురి చేస్తారు. ఏ ప్రతి ఫలం ఆశించని సాధు, సత్పురుషులను ఆశ్రయించండి, వారు ఏదైనా మార్గం చూపే అవకాశం ఉంది. ఎవరైనా మాస్టర్లను కలవండి, ఫలితం ఉంటుంది.

చేతబడులు, బాణామతి, మంత్ర, తంత్ర, యంత్ర ప్రయోగం, దయ్యం, పిశాచం, భూతం, దుష్ట గ్రహం, దుష్ట శక్తి ఇలాంటివన్నీ ఉన్నాయా లేదా అన్నది ప్రశ్న కాదు. మీరు పడుతున్న బాధలకు వీటికి ఏ సంబంధం లేదు. మీ సమస్యల మూలం, ఈ ప్రశ్నకు లేదా ఈ ప్రశ్న యొక్క జవాబులో లేదు. ఇవన్నీ ఉంటే ఉంటాయి, లేకపోతే లేదు. ఒక వేళ ఉన్నాయని అనుకోండి - అప్పుడు ఏం జరుగుతుంది ? ఏం చేస్తే వీటి బారి నుండి బయట పడతామో అది చేయాలి కదా !

"మీ లోపల ఈ బాధలను ఆకర్షించే గుణాలు లేకపోతే ఈ సమస్యలే కాదు, అసలు ఏ సమస్యలు రావు" !

మన అంతరంలోనే ఉంటాయి అన్ని సమస్యల మూలాలు. లోపల ఉన్న వాటిని తీసివేస్తేనే గాని శాశ్వత పరిష్కారం లభించదు.

నేను చేతబడులు, బాణామతి ఇంకా పైన ఉదహరించిన అన్నింటి పైన సుధీర్ఘమైన రీసెర్చ్ చేసాను. నాది ప్రత్యక్ష అనుభవం ! స్వానుభవం ! ఇలాంటి పరిస్థితులు ఎన్నెన్నో ఎదుర్కొన్నాను. ఎందరెందరో మంత్రగాళ్ళను కలిసాను. ఎన్నెన్నో కేసులు పరిశీలించాను. అసాధారణమైన పరిశోధనలు చేసాను. ఎంతో స్పష్టమైన అనుభవం పొందాను. ఒక రకంగా చెప్పాలంటే వీటన్నింటిని పరిష్కరించడంలో "స్పెషలిస్ట్‌ను నేను, మాస్టర్‌ను నేను" ! నేనే కాదు ఏ కొంచెం ఆధ్యాత్మిక విజ్ఞానం ఉన్న వారు ఎవరైనా ఇలాంటి వాటిని చాలా సులభంగా పరిష్కరించ గలుగుతారు. ఇలాంటి ఎన్నో కేసులకు పరిష్కార మార్గం చూపించి, వారి సమస్యలు వారే పరిష్కరించుకునేందుకు మార్గదర్శకత్వం వహించాను. నేను ఏ సమస్యలను పరిష్కరించను, నిజమైన మాస్టర్ ఎవరూ కూడా పరిష్కరించరు. మీ సమస్యలను స్వయంగా పరిష్కరించుకునే శక్తి మీలో ఉంది అని తెలియజేసి వారిని మాస్టర్‌గా తయారు చేస్తారు. శాశ్వత రీతిలో స్వతంత్రంగా వారి సమస్యలకు వారే పరిష్కారం చేసుకునేలా చేస్తారు. నేనూ అదే చేస్తాను.

నేను సూచించే "ధ్యాన సాధనల" ద్వారానైతే ఎంతటి సమస్యలనైనా అత్యంత సులభంగా, శీఘ్రంగా, శాశ్వతంగా మొత్తం ఒకేసారి తీసి పారేయవచ్చు.

అందుకే స్వానుభవంతో చెప్తున్నాను, దయచేసి వినండి, మంత్రగాళ్ళ దగ్గరికి, క్షుద్ర పూజలు చేసే బాబాల దగ్గరికి, స్వామీజీల దగ్గరికి వెళ్ళకండి ! ఇలాంటి వారి వలన సమయం + శక్తి + డబ్బు వృథా అవుతాయే తప్ప ఏ ప్రయోజనం జరగదు. పైగా కొత్త ఇబ్బందుల పాలయ్యే అవకాశం

ఉంది. మీ సమస్యలను మీరే పరిష్కరించుకోగలుగుతారు. అత్యంత శక్తి స్వరూపులు మీరు. మీ గురించి మీకు తెలియక అలా ఉన్నారంతే !

కానీ గుర్తుంచుకోండి ఇలాంటి సమస్యలే కాదు, ఎంతటి సమస్యలైనా, ఎంతటి కర్మలైనా, అది ఏదైనా సరే ఆత్మ విజ్ఞాన అభ్యాసం మరియు ధ్యాన సాధన ద్వారా సులభంగా, శీఘ్రంగా, శాశ్వతంగా తొలగి పోతాయి.

ఎంతటి చేతబడులైనా సరే, ఎంతటి బాణామతులైనా సరే, ఎంతటి మంత్ర తంత్ర యంత్ర ప్రయోగాలైనా సరే, ఎంతటి భూత, పిశాచ, దయ్యాలైనా సరే, ఎంతటి దుష్టగ్రహ శక్తులైనా సరే, ఇవన్నీ మీ అజ్ఞానంలోనే, మీ విస్మృతిలోనే ఉన్నాయి అని స్పష్టంగా, దృఢంగా గుర్తుంచుకోండి. వీటన్నింటినీ ఒక్కసారిగా తీసి అవతల పారేసే శక్తి మీరు ఇప్పుడే కలిగి ఉన్నారు.

ఎవరినీ వేడుకోవాల్సిన పని లేదు ! మీ ఇంట్లో మీరు కూర్చొని నిరంతర ధ్యాన సాధన మొదలు పెట్టండి - ఎంతెంతటి సమస్యలైనా చాలా ఈజీగా, శాశ్వతంగా కరిగి పోతాయి. "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి", ఈ సత్యాన్నే శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో తెలియజేసాడు కదా ! మిమ్మలి మీరు ఉద్ధరించుకో గలుగుతారు.

గుర్తుంచుకోండి ప్రతి ఒక్కరిలో "బాగు పడటం ఇష్టం లేని గుణం" ఒకటి ఉంటుంది. అదే మిమ్మల్ని సాధన చేయకుండా రక రకాల సరికాని ఆలోచనలను పంపించి డిస్టర్బ్ చేస్తుంది. "సరికాని" ఆలోచనలతో ఎప్పుడు కూడా ఏకం కావద్దు. ఆలోచనలతో ఏకం కావడం అంటే వాటిని పరిస్థితులుగా సంభవించడానికి అనుమతించడమే ! కాబట్టి నెగెటివ్ ఆలోచనల పట్ల సాక్షిగా ఉండాలి, అప్పుడు అవి శాశ్వతంగా తొలగి పోతాయి.

✪✪✪ సర్వ - సర్వ, సకల - సకల, సమస్త సమస్యలకు, అన్ని తాళాలకూ ఒకే తాళం చెవి. మాస్టర్ 'కీ'లు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోని సాధనలు.

ఎలాంటి నియమ నిబంధనలు లేని సులభమైన, సరళమైన సాధనలు ఇవి. సర్వకాల సర్వావస్థల యందు సర్వవేళల యందు మీరు ఈ సాధనలు చేసుకోవచ్చు. స్త్రీ, పురుష భేదం లేకుండా, జాతి, మతం, కులం, వయస్సు అనే తేడాలు లేకుండా అందరూ ఈ సాధనలు చేసుకుని సాఫల్యాన్ని పొందవచ్చు.

365 రోజులు, 24 గంటలు ఎరుకను ప్రాక్టీస్ చేస్తూనే ఉండాలి. ఏం చేస్తున్నా "ఎరుకతో"

చేయండి. నిరంతరం అనుక్షణం "ఎరుకతో" ఉండండి. ఎరుక, ఎరుక అంతే ! సాధన చేయడం అంటే ఎరుకను కలిగి ఉండటం. స్మృతిని లోపలికి అంతరంలోకి, ఆత్మ కేంద్రంలోకి తీసుకెళ్ళటం. స్మృతితో, లోపల ఉన్న విస్మృతిని స్మృతిపూర్వకం చేసుకుంటూ ఆత్మ కేంద్రాన్ని చేరుకోవడం.

ఈ సాధనలో స్మృతితో పాటు అవగాహన ఉండాలి. అవును నిజమే, "నేనే మూల చైతన్యం" మరి ఇంకా అందరూ అనే స్మృతి మరియు మరిచిన నా నిజ తత్వమైన దివ్యత్వాన్ని నేను గుర్తు చేసుకుంటున్నాను అనే అవగాహన చాలా ముఖ్యం. స్మృతి + అవగాహన ఈ రెండింటితో సాధన చేయాలి. శ్రద్ధ, సమర్పణ, అంకిత భావంతో సాధన చేయాలి. అప్పుడు మాత్రమే మీ దైవత్వాన్ని సహజంగా తిరిగి పొందుతారు. విముక్తులవుతారు. మోక్షాన్ని ప్రాప్తించుకుంటారు. జ్ఞానోదయం అవుతుంది. మహా పరి నిర్వాణం పొందుతారు. ఇలా, దానిని ఎన్నో రకాలుగా చెప్పుకోవచ్చు.

ఎవరైనా సరే చాలా సులభంగా ధ్యాన సాధన చేయవచ్చు. చదువురాని వారికి అర్థం అయ్యేలా విషయం వివరించి వారితో సాధన చేయించవచ్చు.

✪✪✪ చాలా సులభంగా, సరళంగా, శీఘ్రంగా, సహజంగా, సురక్షితంగా మీ దైవత్వాన్ని మీరు తిరిగి పొంది తీరుతారు. ఒక శ్వాస దూరంలోనే ఉంది దైవత్వం అని చెప్తారు మాస్టర్లు. ఇది నిజమే. ఇది నా స్వానుభవం !

మీరేం చేసినా మీరు దైవాలే, మీరేం చేసినా మీ దైవత్వాన్ని కోల్పోవడం అంటూ ఉండదు. అది జరగని పని, మహా అంటే మీ దైవత్వాన్ని మీరు మరిచిపోగలుగుతారు అంతే ! ఇప్పుడు జరిగింది ఇదే ! ఉదాహరణకు మెగాస్టార్ చిరంజీవి గారు ఉన్నారు. ఆయన ఒక సినిమాలో "రిక్షావాడి" పాత్ర వేశారు. ఆ పాత్రలో ఎంతగా లీనం అయిపోయి నటించారంటే, షూటింగ్ అయిపోయాక తనెవరో మర్చిపోయారు అని అనుకోండి, అప్పుడు అందరూ సార్ మీరు "రిక్షా వాలా" కాదు మీరు ఒక "మెగాస్టార్" అని ఆయనకు మిగతా వాళ్ళు గుర్తు చేస్తుంటే, దానికి ఆయన సహకరిస్తే సులభంగా పని జరిగిపోతుంది. తనెవరో తనకు గుర్తుకు వస్తుంది. రిక్షా వదిలేసి తన కారులో వెళ్ళిపోతారు. శుభం !

మన పట్ల కూడా ఇదే జరిగింది. మన ప్రతి జన్మ ఒక సినిమా లాంటిది. ఇలా రక రకాల జన్మలలో రక రకాల పాత్రలు వేస్తూ అందులో లీనమై మనలను మనం మరిచిపోయాం అంతే ! వెరీ సింపుల్ ! ఏమీ జరగలేదు. ఏ ఉపద్రవం రాలేదు. ఏ ఘోరమూ జరగలేదు. కేవలం మనల్ని మనం మరిచిపోయాం. ఈ భూమి పైన ఇది జరుగుతూ ఉంటుంది. ఇది సహజం. ఇలా మరిచిపోయిన వారికి తమ దివ్యత్వాన్ని గుర్తు చేసేందుకు మహాత్ములు అవతరిస్తూ ఉంటారు. సత్య మార్గాన్ని

చూపెడుతూ ఉంటారు. ఆత్మ విజ్ఞాన ప్రచారం చేస్తూ ఉంటారు. అందులో భాగంగానే **M A B** తన వంతు పాత్ర తాను నిర్వహిస్తోంది. మరిచిన మీ దివ్యత్వాన్ని మీకు తిరిగి గుర్తు చేసే సౌభాగ్యం దక్కినందుకు ఆనందంగా, ప్రేమగా మీకు ధన్యవాదాలు సమర్పిస్తోంది.

మీకు సేవ చేసే అవకాశం రావడం మాకు మహా సౌభాగ్యం. మీకు సహకరించడం మా అదృష్టం. మీ దివ్యత్వ సాధనలో మేము మీకు ఉపయోగపడడం మాకెంతో ఆనంద దాయకం.

All The Very Best !

❖ ❖ ❖

పార్ట్ - 26

ధ్యాన సాధనలు

జీవన వృక్షానికి పచ్చ రంగు

ఎండిపోయి మోడు వారి పోయిన వృక్షాన్ని దాని వేర్లతో కలిపి ఉంచకుండా ఇంకా ఏం చేసినా అది జీవించదు. వేర్లకు కలపకుండా ఎన్ని నీళ్ళు పోసినా, ఎన్ని ఎరువులు వేసినా వృక్షం జీవించదు. సరిగ్గా ఇదే విధంగా మనం, మన లోపల ఉన్న మన "నిజ తత్వంతో" ఏకం కాకుండా ఉంటే ఎన్నటికీ మన కష్ట నష్టాలు తీరవు. మన జీవన వృక్షానికి "తల్లి వేరు + మంచి సారవంతమైన భూమి" లాంటిది మన లోపల ఉన్న "మన నిజ తత్వం". మన జీవన వృక్షం యొక్క అసలు సిసలు ప్రాణ, జీవ శక్తి మూలమే మన నిజ తత్వం.

జీవన వృక్షాన్ని, మూలంతో కలిపి జీవింపజేయకుండా, ప్రస్తుత ప్రపంచ మానవులలో 99% మంది తమ జీవన వృక్షాలకు "పచ్చ రంగు" వేసుకుని, ప్లాస్టిక్ ఆకులు, పూలతో తృప్తి పడుతూ ఉన్నారు !

ఒక వృక్షం తన "మూలంలో" నిలదొక్కుకుని, స్థిరంగా ఉన్నప్పుడు మాత్రమే అది బాగా ఏపుగా పెరుగుతుంది, శాఖోపశాఖలుగా విస్తరించ గలుగుతుంది. తన చల్లని నీడలో ఎంతో మందికి హాయిని, విశ్రాంతిని, ఆనందాన్ని కలిగిస్తుంది. తన మధురమైన, పుష్టికరమైన ఫలాలను ఇచ్చి జీవింప చేయగలుగుతుంది. తన పూల సువాసనతో సుఖాన్ని అందించగలుగుతుంది. తన కొమ్మలపై ఎన్నో పక్షులకు ఆశ్రయాన్ని ఇవ్వ గలుగుతుంది. ఇదే విధంగా మనం, మన నిజ తత్వంతో మన కనెక్షన్‌ను బలపరుచుకుంటే, మనం మన మూలాన్ని తెలుసుకుని, మన మూలంలో నిలదొక్కుకుని, స్థిరంగా ఉంటే మనం ఆనందంగా జీవించడమే కాకుండా, ఎంతో మంది జీవితాలకు ఆసరాగా, అండగా నిలబడ గలుగుతాము.

మన నిజ మూలంతో మనల్ని ఏకం చేసేవే అకర్మ వీగనిజం/అకర్మ శాకాహారం + ఆత్మ విజ్ఞాన అభ్యాసం + ధ్యాన సాధన + సత్య ఆచారం & గురువు దగ్గర పనిచేయడం !

సత్య సాధన + సత్య ప్రచారం & గురువు దగ్గర
పనిచేయడమనేది మీ నిజ తత్వాన్ని
మీ స్మృతిలోకి తెస్తుంది.

భౌతిక దేహం ధరించి భౌతిక ప్రపంచంలో జీవిస్తూ భౌతికతను జయించి ఆత్మను అందుకోవడం నిజంగా అద్భుతమైన విషయం. ఇది సాధించడానికే అందరూ ఈ భూమి పైకి వచ్చేది. ఆత్మ దృష్టిలో విలువైనవి ఇక్కడ నిరసించబడతాయి.

24 గంటల్లో కనీసం 2 గంటలు మీతో మీరుండాలి

మీరు మీ ఫ్రెండ్స్‌తో ఉంటారు, మీ కుటుంబంతో ఉంటారు, మీ బంధువులతో ఉంటారు, మీ వృత్తి ఉద్యోగ వ్యాపారాలతో ఉంటారు, మీ వాహనంతో ఉంటారు, మీ సెల్‌ఫోన్‌తో ఉంటారు, మీ కంప్యూటర్‌తో ఉంటారు, మీ టీవీతో ఉంటారు, మీ అన్నింటితో, అందరితో ఉంటారు - కేవలం "మీతో మీరు తప్ప" !

మీతో మీరెందుకు ఉండరంటే, మీరంటే మీకు భయం ! మిమ్మల్ని మీరు ఎదుర్కోలేరు ! మీ వాస్తవాల్ని మీరు అంగీకరించలేరు !

మీతో మీరు ఉండకుండా ఉంటున్నందుకే అన్ని కష్ట నష్టాలు వస్తున్నాయి. మీతో మీరు ఉండనందుకే మీరు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మీతో మీరు ఉండనందుకే మీ శరీరం + జీవితం మీ అదుపులో లేదు.

మీతో మీరు ఉండడమే ధ్యానం !

మీరు మీరుగా ఉండడమే ధ్యానం !

24 గంటల్లో కనీసం 2 గంటలు మీతో మీరుండి తీరాలి. మీరు మీరుగా ఉండాలి. ప్రస్తుతం ఉంటున్న "మీరు" మీరు కాదు ! అసలు "మీరేమిటో" మీకు తెలియదు. మీరు ఏదైతే కారో దానిగా ఉంటున్నారు. మీ జీవితాన్ని మీరు జీవించటం లేదు. మిమ్మల్ని మీరు కలిగి లేరు. మీరు కాని వారు మీలో మీరుగా ఉన్నారు, వారే మీ జీవితాన్ని శాసిస్తూ జీవిస్తున్నారు. మీకు అణువంతైనా అనుమానం రాకుండా మిమ్మల్ని దారి మళ్ళిస్తున్నారు. మిమ్మల్ని పనికిరాని పనులతో బిజీగా ఉంచుతున్నారు. మీరు చేసే ఎంజాయ్‌మెంట్లు మీకోసం కాదు. మీ లక్ష్యాలు మీవి కాదు. మేలుకోండి..... జాగ్రతమవ్వండి !

మీ పట్ల మీరు మేలుకోవడమే ధ్యానం !

మీ పట్ల మీరు ఎరుకను కలిగి ఉండడమే ధ్యానం !

మీతో మీరు గడపలేకపోతే ఎవరితోనూ మీరు గడపలేరు. మీతో మీరు ఆనందంగా ఉండలేకపోతే వేరెవరితోనూ ఆనందంగా ఉండలేరు. మీతో మీరు ఏకాంతంలో ఉత్సవం చేసుకోలేకపోతే వేరెవరితోనూ ఉత్సవంలో పాల్గొనలేరు. మీరు ప్రస్తుతం చేసుకునే పండుగలు, ఉత్సవాలు, ఎంజాయ్‌మెంట్లు అన్నీ పైపైనే జరుగుతున్నాయి. వేటిలోనూ నిజం లేదు. సారం లేదు. రసం లేదు. కేవలం పిప్పినే మీరు అనుభవిస్తున్నారు. ఏంట్రా నాయనా ఈ సోది ?!? అని మీకు బోర్‌కొట్టే అవకాశం ఉంది. తాత్కాలిక ఆరోగ్యం, సంపాదన ఉండి, "జరిగి పోతున్నప్పుడు" ఇలాంటి విషయాలు ఎక్కడం కొంచెం కష్టమే !

ఇప్పుడు రాబోయే ధ్యాన సాధనలు చేయండి.

మీ నిజ తత్వంలో మేలుకోండి. అందరికీ ప్రేరణనివ్వండి !

All The Very Best !

ధ్యానం చేసే ముందు మీకు వీలైతే.....

1. గదిని పూర్తిగా శుభ్రం చేయండి.
2. శబ్దాలు రాకుండా కిటికీలు, తలుపులు వేసుకోండి.
3. గదిని పూర్తిగా చీకటిగా చేసుకోండి.
4. ధ్యానానికి ప్రత్యేకించి తయారు చేయబడిన సంగీతం పెట్టుకోండి.
5. చక్కటి సువాసనలను ఇచ్చే అగరుబత్తీలను వెలిగించుకోండి.

మీకు వీలైతేనే చేసుకోండి. లేక పోతే లేదు.

పై వాటికి ధ్యాన ఫలితాలకు సంబంధం లేదు.

అవి కేవలం సాధన ప్రారంభ దశలో ఉన్నవారి

సౌకర్యం కోసం మాత్రమే. అంతే !

1. MAB వేగం సాధన

అనంత మహా సృష్టి నియమం లేదా మహా విశ్వ నియమం, శాసనం "యద్భావం తద్భవతి" !

యద్ చేష్టా తద్భవతి కాదు. ఫలితం చేష్టను లేక పనిని లేక కార్యాన్ని బట్టి ఉండదు, లోపల భావాన్ని బట్టి ఉంటుంది. ఈ మహా సత్య సూత్రం అర్థం చేసుకోలేక సాధారణ జనాలు, పండితులు, ఆధ్యాత్మిక వేత్తలు ఇబ్బంది పడుతుంటారు. మేము బాగానే చేసాము.. ఇలా ఎందుకైంది ?! మేము ఒకటి అనుకుంటే మరొకటి జరిగింది.. తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలుస్తాడు అనే సూక్తి ఈ అజ్ఞానంలో నుండే పుట్టింది. పునాదులను బట్టే భవనం ఉంటుంది కదా ! పునాది ఎలా ఉంటే, భవనం ఆ విధంగా కట్టడానికి వీలవుతుంది. ఒకవేళ మరో విధంగా కడితే అది తాత్కాలికమే ! పునాది లేని భవనం ఎంత సేపు ఉంటుంది ?

మనిషి దేహం & జీవితం అనే దివ్యభవనానికి పునాదులు "నమ్మకాలు" ! వీటినే విశ్వాసాలు, గుణాలు, అభిప్రాయాలు & భావాలు అని కూడా అంటారు. ఒక మనిషి లోపల ఉన్న నమ్మకాలే అతని విధి, జాతకం ఇంకా ఏమైనా అనండి ! ఆ మనిషి ఏం చేసినా సరే, చేసిన పనిని బట్టి ఫలితం ఉండదు. ఆ పని పట్ల ఆ మనిషికి ఉన్న నమ్మకాలను బట్టి ఫలితం ఉంటుంది. అందుకే యద్‌చేష్టా తద్భవతి అనకుండా యద్భావం తద్భవతి అని అన్నారు పరమాత్ములు. మీ ప్రతీది మీ నమ్మకాలను బట్టే ఉంటుంది. అనంత మహా దివ్య సృష్టి మన నమ్మకాలను ఎంతో గౌరవిస్తుంది. మామూలుగా కాదు, మానవ ఊహలకు అందనంత గొప్పగా మానవుల నమ్మకాలను గౌరవిస్తుంది, విలువను ఇస్తుంది. మీరేం నమ్మితే ఆ ప్రకారంగానే జరుగుతుంది. బయట పరిస్థితులు లోపల ఉన్న నమ్మకాలను యథాతథంగా ప్రతిబింబిస్తూ ఉంటాయి. నమ్మబుద్ధి కాదు... నేను ఇలాంటి కష్టాన్ని, నష్టాన్ని కలిగించే నమ్మకాన్ని కలిగి ఉన్నానా ?! అస్సలు నమ్మ బుద్ధి కాదు. మీకు ఏ రంగంలో అయితే, ఉద్యోగంలో, వ్యాపారంలో, కుటుంబంలో, ప్రేమ వ్యవహారంలో, మరే రంగంలోనైనా మీకు కష్టాలు, నష్టాలు, అపజయాలు, అవమానాలు ఎదురవుతున్నాయి

అని అంటే మీరు చేస్తున్న పనులకు మీ నమ్మకాలు వ్యతిరేకంగా ఉన్నాయనేది స్పష్టం !కష్టనష్టాలకు మరే ఇతర కారణాలు ఏవి ఉన్నా అత్యంత ప్రధాన మూల కారణాలు నమ్మకాలు మాత్రమే !

గ్రేట్ న్యూ ఏజ్ మాస్టర్ రిచర్డ్ బాక్ ... మీరు నమ్మితే నీటి మీద నడవచ్చు, గాలిలో ఎగర వచ్చు, గోడలలో నుండి అవతలికి వెళ్ళిపోవచ్చు. నమ్మండి అని అంటాడు.

ఈ నమ్మక వ్యవస్థ అనేది లైఫ్ డిజైన్‌కు అనుగుణంగా ఉంటుంది లేదా నమ్మకాల వ్యవస్థకు అనుగుణంగా లైఫ్ డిజైన్ ఉంటుంది. ఈ నమ్మక వ్యవస్థ అనేది ఆ మనిషికి ఉన్న ఆత్మ విజ్ఞానాన్ని బట్టి ఉంటుంది. ఎంత ఎక్కువ ఆత్మ విజ్ఞానం ఉంటే అంత ఉన్నతంగా ఈ నమ్మక వ్యవస్థ అనేది ఉంటుంది. **ఈ నమ్మక వ్యవస్థ అనేదాన్ని ఎప్పటికప్పుడు మన అవసరాలకు, అవగాహనకు అనుగుణంగా మార్చుకోవచ్చు.**

రాబోయే ముందు పేజీలలో ఉన్న మీ నమ్మక వ్యవస్థను పూర్తిగా, మహోన్నతంగా నిర్మించే సూత్రాన్ని సాధన చేయండి. ఆ తర్వాత ఏ సాధన అయినా చేయండి. దీన్ని ఎప్పుడు, ఎన్ని సార్లు చేస్తారు అనే నియమం ఏమీ లేదు. మీరేం చేస్తూ ఉన్నా నడుస్తూ ఉన్నా, భోజనం చేస్తూ ఉన్నా, బస్‌లో, ట్రెయిన్‌లో, విమానంలో, ఇంట్లో.. ఎక్కడైనా సరే, ఎన్నిసార్లు చేసుకుంటే అంత మంచిది. మీకు సంతృప్తి కలిగే వరకు చేయండి. కేవలం 6 రోజులు సరిపోతాయి. ఆ తర్వాత మీకు అవసరమైన సాధనను చేయండి.

సాధన యొక్క ఫలితాలు రావడానికి వారాలు, నెలలు, సంవత్సరాలు పట్టేటట్టయితే అది ఆధ్యాత్మికతే కాదు, ఈ సృష్టి కొనసాగుతూ ఉండేదే కాదు అని సేత్ పరమాత్ముడు అంటాడు. ఈ సర్వ సృష్టిని సృష్టించిన సర్వ సృష్టి కర్త మీలోనే ఉన్నాడు. ఆ దైవం మీరే.. మీకు కావలసిన దాన్ని నిమిషాలలో సృష్టించుకుని అనుభవించే సంపూర్ణ శక్తి సామర్థ్యాలు ఇప్పుడే మీలో సహజంగానే ఉన్నాయి మాస్టర్స్ ... అని రామ్‌తా పరమాత్ముడు ప్రకటిస్తాడు.

ఇంకా చాలా మంది మాస్టర్స్ కూడా మీకు కావలసింది ఏదైనా, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయం & ఆనందం ఏదైనా.. క్షణాలలో, నిమిషాలలో, గంటలలో మహా అయితే 6 రోజులలో పొందాలి లేదంటే మీలో ఏదో లోపం ఉంది. మీ నమ్మకాల వ్యవస్థను సరి చేసుకోండి అని అంటారు. లోపలి విషయాలే యథాతథంగా బయట ప్రతిబింబిస్తాయి. కేవలం లోపల మాత్రమే దృష్టిని కేంద్రీకరించాలి.

ఏ మాస్టర్ అయినా రోజులు అని మాత్రమే అన్నాడు, వారాలు, నెలలు, సంవత్సరాలు అనలేదు. రోజులు మాత్రమే అన్నారు. రోజులలో అంటే ఏమిటి ? 6 వరకు రోజులు అంటారు 6 దాటితే వారం అంటారు అందుకే నేను అంటున్నాను కేవలం 6 రోజులలో అని ! ఏ మాస్టర్ అయినా కేవలం రోజులలోనే మీకు కావలసింది మీరు పొందవచ్చు అని ఘనంగా ప్రకటిస్తారు. మరి మీరు అనుకున్నదాని కోసం మీరు సాధన చేస్తూ ఉంటే, అది వారాలు, నెలలు, సంత్సరాలు గడిచినా మీరు కోరుకుంటున్న దాన్ని మీరు ఇంకా పొందలేదంటే ఏమిటి దాని అర్థం ? ఖచ్చితంగా మీ నమ్మక వ్యవస్థలో ఏవో సరికానివి ఉన్నాయి. ఆఁ.. నా బతుక్కి అంత అదృష్టం కూడానా.. ఇది జరగదు, ఇది నాకు ప్రాప్తం లేదు... ఇలాంటివి ఎక్కడైనా జరుగుతాయా చోద్యం కాకపోతే... అది నాకు అవసరం లేదు, అది నాకు ఇష్టం లేదు... నా జాతకంలో లేదు.. ఇక నా బతుకింతే... ఇలా అడ్డదిడ్డంగాఎన్నైనా ఉండే అవకాశం ఉంది. వ్యతిరేకతలు లోపలే ఉంటాయి. బయట ఉండవు. మీరు బాహ్యంలో ఏం చేసినా ఏ ప్రయోజనం ఉండదు. బాహ్య కార్యకలాపకాలకు కొంత మేరకు మాత్రమే ఫలితం ఉంటుంది అసలు ఫలితం మాత్రం లోపల ఉన్న విషయాల మీదే ఆదారపడి ఉంటుంది. లోపల విషయం సరిగా ఉన్నప్పుడు బయట పని ఎలా చేసినా ఫలితం సరిగానే వస్తుంది. దీనినే అజ్ఞానంతో అదృష్టం, దైవకృప అని అంటుంటారు.

మీలోపలే ఉంటుంది వ్యతిరేకత & అనుకూలత ! ఇదే పరమ సత్యం ! మీ ఫోకస్ అంతా లోపలే పెట్టండి. అయితే మీరు మీ యొక్క వికాస పరిధిని పెంచుకునే తీరాలి. చాలా పుస్తకాలు చదవండి. ఆ విజ్ఞానం మీకెంతో, ఎంతో ఉపయోగపడుతుంది. జీవితాంతం సరైన అత్యున్నత ఆత్మ విజ్ఞాన పుస్తకాలు మాత్రమే చదువుతూ వికసిస్తూ ఉండాలి, వికాసం & విజ్ఞానం అనంతం !

కేవలం, కేవలం నమ్మక వ్యవస్థ పైనే మీ దృష్టిని కేంద్రీకరించండి. మీ నమ్మక వ్యవస్థను సరి చేసుకుంటే అంతా, అన్నీ సరి అవుతాయి. ఆయుష్షు, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయం, ఆనందం, సౌభాగ్యం.. మోక్షం అన్నింటికీ మూలం నమ్మక వ్యవస్థయే ! మీ నమ్మక వ్యవస్థను మీరు సరి చేసుకోకుండా, ఉన్నతంగా నిర్మించుకోకుండా మీరు ఏ పని చేసినా గాలిలో మేడలు కట్టడమే, నీటి మీద రాతలు రాయడమే అవుతుంది. ఎలాంటి ఫలితం ఉండదు.

సాధనా సూత్రం :

సాధనలు వెంటనే ఫలిస్తాయి

ఈ సూత్రాన్ని ముందు 6 రోజులు చేయండి. ఆ తర్వాత మీకు అవసరమైన సాధన చేయండి. మీ సాధన మీరు చేసుకుంటూ మధ్యమధ్యలో ఈ సూత్రాన్ని సాధన చేస్తూనే ఉండాలి.

ఈ సూత్రాన్ని మీరు మీ లోపల అనుకున్నా పరవాలేదు. బయటకు అనుకున్నా సరే...

ఈ మహా దివ్య సూత్రం మీ నమ్మకాల వ్యవస్థను మూలంలో నుండి సరి చేస్తుంది. వ్యతిరేకతలు ఏ రకమైనవైనా పూర్తిగా, శాఆశ్వతంగా తొలగిపోతాయి.

ముందు ఒకసారి ఈ పుస్తకాన్ని పూర్తిగా చదవండి.

నమ్మండి. సాధన చేయండి.. నిజంగానే సాధనలు వెంటనే ఫలిస్తాయి !

❖ ❖ ❖

2. MAB దైవత్వ సాధన

అహం బ్రహ్మాస్మి సాధన

✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎

మొదట : వేగవంతమైన శ్వాస లేక స్పీడ్ బ్రెత్

(పది నిమిషాలకు మించి చేయకూడదు)

(సాధకులకు కనీస వయసు 15 సం॥లు ఉండాలి)

ఆ తర్వాత వెంటనే : నేనే దైవం లేక నేను దైవాన్ని

(పై రెండింటిలో ఏది మీకు సౌకర్యంగా ఉంటే దాన్ని ఎంపిక చేసుకోండి.
కనీసం 30 నిమిషాలు లేదా ఆ పైన మీ వీలును
బట్టి ఎంత సమయమైనా సరే, సాధన చేసుకోవచ్చు)

✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎

మానవజాతి విముక్తికి(మోక్షానికి) తమ దివ్యత్వ స్మరణయే సులభ, సరళ, సురక్షిత, అత్యంత శీఘ్ర, ఖచ్చితమైన మరియు దివ్య మార్గం !

హెచ్చరిక

ఈ సాధనను మీరు ఖాళీ కడుపుతో చేయాలి. పొద్దున మీకు వీలైన సమయంలో నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, వదులుగా దుస్తులు ధరించి ఈ సాధన ప్రారంభించాలి. ఈ సాధనకు ముందు ఎలాంటి ఆహారం తీసుకోకూడదు. పళ్ళు, జ్యూస్, టీ, కాఫీ లాంటివి ఏవీ తీసుకోకూడదు. ఒకటి రెండు గుక్కల మంచి నీళ్ళు మాత్రమే తాగవచ్చు. అంతకు మించి తీసుకోకూడదు. వేగవంతమైన శ్వాస సాధన తర్వాత అరగంట తర్వాత మాత్రమే ఏదైనా ఆహారం తీసుకోవచ్చు. ఇవి చాలా ఖచ్చితమైన నియమాలు. ఈ నియమాలు పాటించలేక పోతే లేదా మీరు చేయలేని పరిస్థితుల్లో ఉన్నా, వేగవంతమైన శ్వాస - స్పీడ్ బ్రెత్ సాధన చేయకూడదు. నియమాలతో పరాచికాలు ఆడితే ప్రమాదం.

✪✪✪ మీరు రన్నింగ్ చేయగలిగే, డ్రైవింగ్ చేయగలిగే, స్విమ్మింగ్ చేయగలిగే, ఎక్సర్‌సైజ్ చేయగలిగే స్థితిలో ఉంటేనే చేయాలి. బలంగా, ఆరోగ్యంగా ఉంటేనే చేయాలి. బలహీనంగా ఉన్నా, ఏవైనా హెల్త్ ప్రాబ్లమ్స్ ఉన్నా చేయకూడదు.

సాధన అంటే ప్రక్షాళన. సాధన అంటే అభివృద్ధి. సాధన అంటే సిద్ధి ! సాధన అంటే లోపల సరిగా లేని భావాలను సరి చేయడం. వద్దు అనుకున్న భావాలను తీసివేసి, కావాలి అనుకున్న భావాలను ఏర్పర్చడం. సాధన అంటే నెగెటివ్ భావాలను క్లియర్ చేయడం. సాధన అంటే పాజిటివ్ & డివైన్ భావాలను స్థాపించడం. సాధన ద్వారా కోరుకునే వాటిని మనం, భౌతికంగా అనుభవించగలం.

సాధన అనేది చాలా సులభం సరళం తక్షణం అని గుర్తుంచుకోండి. మీరు దేనిని కావాలి అని అనుకుంటున్నారో దానికి సంబంధించిన సాధనను మీరు చేస్తే అవి వెంటనే మీకు భౌతికంగా దక్కుతాయి.

మీ భావాలలో మార్పు మరియు సాధన ద్వారా కావాల్సిన ఫలితాలను పొందడం అనేది చాలా సులభం సరళం సురక్షితం మరియు తక్షణం అని గుర్తుంచుకోండి. మీకు కావాల్సింది అది ఏదైనా సరే, దానిని పొందడానికి రోజుల సమయం మాత్రమే పడుతుంది. వారాలు, నెలలు, సంవత్సరాలు అని అంటే అవి ఆత్మ సాధనలే కావు. దానిని ఆధ్యాత్మికత అని అనరు.

మీలోపల మీకు కావాల్సింది పొందడానికి మీరే ఆలస్యం చేస్తూ ఉంటారు. ఇది గుర్తించండి. ఏ సాధన అయినా వెంటనే సిద్ధిస్తుంది. ఇది సత్యం.

"సాధనలు తక్షణమే ఫలిస్తాయి" అని ముందు, బలంగా నమ్మండి. బాగా సాధన చేయండి. సాధనలు చాలా ఆలస్యంగా ఫలిస్తాయి అనే మూఢనమ్మకం వల్లనే సాధనలు ఆలస్యంగా ఫలిస్తాయి. అంతే తప్ప, నిజానికి ఏ సాధన అయినా వెంటనే ఫలితాలను ఇస్తుంది. ఇది పరమ సత్యం.

సూచన

వేగవంతమైన శ్వాస - స్పీడ్ బ్రెత్ చేయలేని వాళ్ళు "నేనే దైవం" లేదా "నేను దైవాన్ని" సాధన చేసుకోవచ్చు. ఇది ఎక్కడైనా మీరు సాధన చేసుకోగలిగిన స్థితిలో ఉన్నప్పుడు, ఎంత సేపైనా, ఎప్పుడైనా చేసుకోవచ్చు.

వేగవంతమైన శ్వాస లేక స్పీడ్ బ్రెత్ సాధన చేయు విధానం

మీకు సాధ్యమైనంత నిఠారుగా నిలబడాలి. ఇప్పుడు శ్వాసను మీకు సాధ్యమైనంత వేగంగా తీసుకోవడం ప్రారంభించాలి. మీరు శ్వాసను సాధ్యమైనంత వేగంగా తీసుకుంటూ ఉన్నప్పుడు, ఆటొమెటిక్‌గా శ్వాసను వదలడం అనేది జరిగిపోతుంది. కాబట్టి మీరు శ్వాసను వేగంగా తీసుకుంటూ ఉండాలి. మీకు వీలైనంత వేగంగా మాత్రమే శ్వాసను తీసుకుంటూ ఉండాలి. శక్తికి మించి ప్రయాస పడకూడదు. మీకు వీలైనంత వేగంగా మాత్రమే అంటే, వెంట వెంటనే శ్వాసను తీసుకుంటూ ఉండాలి. కాసేపు కాగానే మీరు అలసిపోతారు. అప్పుడు అలాగే నిలబడి విశ్రాంతి తీసుకోండి. వేగంగా శ్వాస తీసుకునే శక్తి రాగానే మళ్ళీ వేగంగా శ్వాస తీసుకోవడం ప్రారంభించండి. వేగంగా శ్వాస తీసుకోలేనప్పుడు, ఆగండి. (కంటిన్యూయస్‌గా 10 నిమిషాలు చేసే స్థితి చాలా రోజులకు వస్తుంది) మళ్ళీ ప్రారంభించండి. ఈ విధంగా పది నిమిషాలు చేయండి..... ఆ తర్వాత.....వెంటనే..... →

→.....క్రింద కానీ, గోడకు ఆనుకుని కానీ, కుర్చీలో కానీ, సోఫాలో కానీ, మంచం పైన కానీ కూర్చోవచ్చు. ఎక్కడ మీకు సౌకర్యంగా ఉంటే అక్కడ, ఎలా మీకు అనుకూలంగా ఉంటే అలా కూర్చోవాలి. సౌకర్యంగా కూర్చోవాలి. మెడ, వెన్నెముక నిఠారుగా పెట్టి, శరీరాన్ని బిగపట్టి కూర్చోకూడదు. మీ శరీరం ఎంత అనుకూలిస్తే అంతగా, ఆ విధంగా కూర్చోండి. క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉంటే, ఆటోమెటిక్‌గా మెడ, వెన్నెముక నిఠారుగా అయిపోతాయి. శరీరాన్ని పూర్తిగా వదిలి వేయండి. రిలాక్స్‌గా శరీరాన్ని వదిలేయాలి. శరీరంలో ఏ భాగం కూడా బిగపట్టి ఉండరాదు. తర్వాత కళ్ళు రెండూ మూసుకుని, హాయిగా కూర్చోవాలి. మీరు పూర్తిగా సుఖంగా, సౌకర్యంగా, స్థిరంగా ఎక్కువ సేపు కూర్చునే విధంగా కూర్చోవాలి. ఆ తర్వాత..... →

✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪◎✪

→ ఏ దేవతా స్వరూపాన్ని కాని , ఏ విగ్రహాన్ని కాని, మరేదైనా రూపాన్ని కాని ఊహించరాదు. దేనిని కూడా ఊహించకూడదు. మరే ఇతర జపం కాని, స్మరణ కాని చేయకూడదు.

రెండు కళ్ళు మూసుకుని మీ నుదిటి వైపు చూడండి. మీ దృష్టి ఎక్కడైతే ఆటొమెటిక్‌గా స్థిరం అవుతుందో అదే "దివ్య కేంద్రం". దాని పైనే మీ దృష్టిని నిలిపి ఉంచి, ధీమాగా, భావనాత్మకంగా "నేనే దైవం లేదా నేను దైవాన్ని" అని గాఢంగా

లోపల అనుకుంటూ ఉండాలి. ఇదే దైవత్వ సాధన ! గుర్తుంచుకోండి - కళ్ళు మూసుకుని ఉన్న మీ దృష్టి మాత్రం, మీ యొక్క "దివ్య కేంద్రం" పైనే నిలిపి ఉంచాలి ఇలా చేస్తే ఫలితాలు మహాద్భుతంగా, అమోఘంగా, మహా దివ్యంగా, మహా గొప్పగా, తక్షణమే ఖచ్చితంగా వస్తాయి.

✪❂✪❂✪❂✪❂✪❂✪❂✪❂✪❂✪❂✪

"నేనే దైవం" అనే ఎరుకను అలా కొనసాగిస్తూ ఉండడమే "దైవత్వ సాధన". రిలాక్స్‌గా ధ్యానంలో కూర్చుని - "నేను దైవాన్ని" అని భావనాత్మకంగా, గాఢంగా, సంపూర్ణమైన అంగీకారంతో ఒప్పుకుంటూ ఉండాలి. ఇదే దైవత్వ సాధన.

✪❂✪❂✪❂✪❂✪❂✪❂✪❂✪❂✪❂✪❂✪

మనమే దైవాలమైనప్పుడు, మళ్ళీ ప్రత్యేకంగా ఈ సాధన ఎందుకు ?నిజమే ! మనం దైవాలమే ! అయితే, మనం మన యొక్క ఇచ్ఛా పూర్వకంగా మనకున్న సహజ దైవత్వాన్ని మనం మర్చిపోయాము. మనమే మర్చిపోయాము కాబట్టి తిరిగి మనంతట మనమే ఆహ్వానించాలి. మనంతట మనమే ఒప్పుకోవాలి. ఒప్పుకోవడం అన్నా, ఆహ్వానించడం అన్నా, నేను దైవాన్ని అనే ఎరుక కొనసాగించడం అని అన్నా, దైవత్వ సాధన చేయడం అన్నా ఒక్కటే !!

మనల్ని మనం ఎందుకు మర్చిపోయాము ? అనే కారణాలు మీరు మీ యొక్క దైవత్వాన్ని తిరిగి పొందాక అన్నీ వివరంగా, చక్కగా తెలుస్తాయి, అర్థం అవుతాయి. కాబట్టి, ముందు దైవత్వాన్ని పొందే సాధన చేస్తే మంచిది.

నేను దైవాన్ని... నేను దైవాన్ని... అని అనడం అంటే మీ దైవత్వాన్ని మీరు తిరిగి ఆహ్వానించడమే ! నేను దైవాన్ని అని మీరు అనుకోవడం అని అంటే మీ దైవత్వాన్ని మీరు అనుమతిస్తున్నట్టే, ఒప్పుకుంటున్నట్టే, మీ యొక్క సంసిద్ధతను ప్రకటించినట్టే !

గుర్తుంచుకోండి - మీరు కొత్తగా దైవాలుగా మారటం లేదు. మీరు దైవత్వాన్ని తయారు చేయటం లేదు. అది ఇప్పటికే ఉంది. మీలోనే ఉంది. కేవలం మీ పిలుపు కోసం, మీ ఒప్పుకోలు కోసం ఎదురు చూస్తూ ఉంది. దైవత్వం మన యొక్క "ఫ్రీ విల్"ను భంగపరచదు. కాబట్టే మనం ఒప్పుకున్నప్పుడే వస్తుంది.

దైవత్వ సాధనలో ఆత్రం పనికిరాదు. ఆందోళన అసలే పనికిరాదు. కంగారు పడకూడదు. ధీమాగా, విశ్వాసంతో సాధన చేయాలి. మిమ్మల్ని మీరు అహ్లాదకరంగా ఉంచుకుంటూ, మీ పట్ల మీరు ప్రేమగా ఉంటూ, ఆనందంగా సాధన చేయాలి.

మీలో ఆత్రం పోయినప్పుడు, మీలో భయాలు పోయినప్పుడు దైవత్వం సిద్ధిస్తుంది. సాధన చేస్తూ ఉంటే అన్నీ క్లియర్ అవుతాయి. కాబట్టి క్రమం తప్పని సాధన తప్పని సరిగా చేసి తీరాలి. దైవత్వం ఎక్కడి నుండో రావటం లేదు. మీలో నుండే వస్తుంది. ప్రస్తుతం మీలోనే ఉంది. మీకే ఎరుక లేదు. మీ శరీరంలో దైవత్వాన్ని మీరు పుట్టినప్పటి నుండీ మోస్తూనే ఉన్నారు. మీ శరీరం మీ దైవత్వ అనుభవాన్ని, దివ్య నేత్రం తెరుచుకునే అనుభవాన్ని మరియు కుండలినీ జాగరణ అనుభవాన్ని తట్టుకునే శక్తి సామర్థ్యాలను సహజంగానే కలిగి ఉంది.

దైవత్వ అనుభవం, దివ్య నేత్రం "సంపూర్ణంగా, పూర్తిగా, శాశ్వతంగా" ఉత్తేజితం అవడం మరియు కుండలినీ జాగృతం అన్నీ ఒకటే !

మీలో చాలా మందికి ఇలా విడి విడిగా చెబితే కాని అర్థం కాదు, అందుకే ఇలా చెబుతున్నాను.

బాగా స్పష్టంగా, బలంగా గుర్తుంచుకోండి - దైవత్వ అనుభవాన్ని, దివ్య నేత్రం ఉత్తేజితమవడాన్ని మరియు కుండలినీ జాగరణను చాలా సరళంగా, సురక్షితంగా తట్టుకుని నిలుపుకోగల పూర్ణ శక్తి సామర్థ్యాలు మీకు + మీ శరీరానికి

సహజంగానే ఉన్నాయి. మీ యొక్క అనవసరమైన భయాలే ఆపుతున్నాయి. విషయాలను అర్థం చేసుకుని, మీలోని భయాలకు ప్రేమ+ఎరుకను ప్రకటించండి. అప్పుడు ఆటొమెటిక్‌గా మీలోని భయాలన్నీ వాటంతట అవే తొలగి పోతాయి. అప్పుడు మీరు హాయిగా మీ దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా పొందవచ్చు.

మీ దివ్య నేత్రం పూర్తిగా, శాశ్వతంగా ఉత్తేజితం అయి మీ అదుపులో ఉండకపోవడానికి కారణాలు దాని పట్ల మీకున్న భయం మరియు అపోహలే !

మీ కుండలినీ ఇంకా జాగృతం కాకపోవడానికి కారణాలు దాని పట్ల మీకున్న భయాలే !

మీరు దైవత్వాన్ని ఇంకా అనుభవపూర్వకంగా తెలుసుకోకపోవడానికి గల కారణం - దైవత్వం అంటే మీకు గల భయం. అవును. ఇది నిజం. అందుకే మీరు ఆ అనుభవాన్ని మీ లోపల నిరోధిస్తున్నారు.

మీకు ఈ భయాలున్నాయని మీకే తెలియదు. మీరు గుర్తిస్తే గనుక, మీ భయాలను తలుచుకుని వాటికి హృదయపూర్వకంగా "ప్రేమ ఎరుక"లను ప్రకటించండి. మీ భయాలను ఉద్దేశించి... ప్రేమ ఎరుక... ప్రేమ ఎరుక... అంటూ మీ లోపల

అనుకోండి. అనుకోవడమంటే ప్రకటించడమే. అప్పుడు మీ భయాలన్నీ తొలగిపోతాయి. "నేనీ భయాలను జయించగలుగుతాను" అని ధైర్యంగా, విశ్వాసంతో మీకు మీరు చెప్పుకోండి. మీలో ఉన్న భయాలన్నీ పూర్తిగా, వెంటనే కరిగి మాయమైపోతాయి.

మీ భయాలను అసహ్యించుకోవద్దు. వాటిని నిందించ వద్దు. అయ్యో నాకు భయాలున్నాయి అని బాధ పడ వద్దు.

మీరు మీ భయాలను అర్థం చేసుకోండి. వాటిని తెలుసుకోండి. వాటిని అర్థం చేసుకోండి. వాటి పట్ల ప్రేమ ఎరుకలను ప్రకటించండి. అప్పుడు అవి సహజంగా వాటంతట అవే తొలగి పోతాయి. మీ భయాలన్నీ తొలగిపోయినప్పుడు మీకు ఎవరో చెప్పాల్సిన అవసరం ఏమీ ఉండదు. మీకే చాలా క్లియర్‌గా తెలుస్తుంది.

గుర్తుంచుకోండి - నేను దైవాన్ని అని అనుకోవడం అన్నా, దైవత్వాన్ని ఆహ్వానించడమన్నా, దైవత్వాన్ని ఒప్పుకోవడమన్నా, దైవంగా మిమ్మల్ని మీరు భావించుకోవడం అన్నా, దైవత్వ సాధన చేయడం అన్నా, నేనే దైవం అనే ఎరుకను కొనసాగించడం అన్నా... అన్నీ ఒకటే ! ఇవన్నీ ఒకటే !!

నేనే దైవం

- లేదా -

నేను దైవాన్ని

- లేదా -

నేనే మహా మూల చైతన్యం

- లేదా -

నేనే అల్ట్రా కాన్షియస్

- లేదా -

అహం బ్రహ్మాస్మి

- లేదా -

I am Ultra Consciousness

- or -

I am God

- or -

I am Divine

మీరు పై వాటిలో దేనినైనా ఎంచుకుని సాధన చేసుకోవచ్చు. అన్నీ ఒకటే.

నేను అని అంటే అహంకారం ధ్వనిస్తుందనుకుని పొరపడేరు. నేను కేవలం ఈ దేహానికి మాత్రమే సంబంధించిన వాడిని / దానిని, అనే దేహ భావనలో ఉంటే, నేను అనేది అహంకారం అవుతుంది. నేనే దైవం దైవమే నేను... అనే ఏకత్వ భావనలో ఉంటే అహంకారం శూన్యం అవుతుంది. అహంకారం అంటే "నేను దైవం నుండి వేరు" అనే భావన. అహం శూన్యం అవగానే లోపల సరైన, తగిన వాతావరణం ఏర్పడి నిజతత్వం / దైవత్వం / ఏకత్వం సిద్ధిస్తుంది.

✪✪✪ శ్లో ॥ అహంబ్రహ్మేతియోధ్యాయే దేకాగ్రమనసా సకృత్ ।
సర్వంతరతి పాపామ్నం కల్పకోటిశతైః కృతమ్ ॥
– ఉత్తరగీత 2:41

పరమార్థం: "నేను దైవాన్ని" అని శ్రద్ధతో ధ్యానం చేస్తే, కోటి కల్పాలలో చేసిన పాపం(కర్మ) మరియు కోటి కల్పాలలో కలిగి ఉన్న పాపం(అజ్ఞానం) అంతా కూడా పూర్తిగా, శాశ్వతంగా, సులభంగా, సరళంగా, తక్షణమే నిజంగా తొలగి పోతుంది.

కృత యుగం, త్రేతా యుగం, ద్వాపర యుగం, కలి యుగాలు నాలుగు కలిపితే ఒక మహా యుగం అవుతుంది. వేయి మహా యుగాలను కలిపితే ఒక కల్పం అవుతుంది.

ఒక మహా యుగం = 43, 20, 000 సంవత్సరాలు*.
వేయి మహా యుగాలు = ఒక కల్పం.
ఒక కల్పం అంటే...1000 X 43, 20, 000 = 4,32,00,00,000 సం॥లు

కోటి కల్పాలు అంటే....
1,00,00,000 X 4,32,00,00,000 = 43,20,00,00,00,00,00,000 సం॥లు

"నేను దైవాన్ని" అని శ్రద్ధతో, విశ్వాసంతో క్షణ కాలం ధ్యానం చేస్తే, 43,20,00,00,00,00,00,000 సంవత్సరాల(కోటి కల్పాల)లో చేసిన పాపం(కర్మ) మరియు కోటి కల్పాలలో కలిగి ఉన్న పాపం(అజ్ఞానం) అంతా కూడా పూర్తిగా, శాశ్వతంగా, సులభంగా, సరళంగా, సురక్షితంగా, తక్షణమే నిజంగా తొలగి పోతుంది అని అంటే ఈ యొక్క "నేను దైవాన్ని" లేక "నేనే దైవం" అనే దైవత్వ సాధన ఎంత శక్తివంతమైనదో గ్రహించండి.

* ఒక మహా యుగం యొక్క కాల ప్రమాణం 43,20,000 సంవత్సరాలు – తెలుగు అకాడెమి వారి "తెలుగు–తెలుగు నిఘంటువు" ఆధారంగా చెప్పడమైనది.

"But seek ye first the kingdom of God, and his righteousness; and all these things shall be added unto you." - The Holy Bible, Matthew 6 : 31 - 34

అంటే...

మొట్ట మొదట ఆ యొక్క దైవ సామ్రాజ్యాన్ని మరియు ఆ దైవం యొక్క దివ్య ధర్మాన్ని పొందాలనుకోండి, వాటిని సాధించడానికి అంకితం కండి - అప్పుడు మీకు కావలసినవన్నీ... అంటే, ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలన్నీ కూడా వాటంతట అవే మీలో ఉద్భవిస్తాయి అని అర్థం.

ఈ దైవత్వ సాధన చేయడం అని అంటే, దైవ సామ్రాజ్యాన్ని మరియు ఆ దైవం యొక్క దివ్య ధర్మాన్ని పొందడానికి సాధన చేస్తున్నట్టే ! ఈ దైవత్వ సాధన వలన ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలు "వాటంతట" అవే మనలో ఉద్భవిస్తాయి అని అంటే ఈ దైవత్వ సాధన ఎంత గొప్పదో, దాని మహాత్యం ఎంతటిదో గ్రహించండి.

మీరు వేగవంతమైన శ్వాస లేక స్పీడ్ బ్రెత్ సాధన చేసేటప్పుడు శ్వాస లోతుగా మరియు వేగవంతం అవుతుంది. అలా జరగాలి. అనేకానేక జన్మలలో మీరు పోగు చేసుకుని ఉన్న "సరికాని భావాలు" ఎన్నో మీ లోపల ఉంటాయి. ఇవన్నీ కూడా మిమ్మల్ని శ్వాసను "మూలం" నుండి తీసుకోనీకుండా అడ్డం పడుతూ ఉంటాయి. ఈ సరికాని భావాలే మీ శరీరంలో రోగాలుగా, జబ్బులుగా మరియు జీవితంలో కష్ట నష్టాలుగా ప్రకటం అవుతూ ఉంటాయి. ఇవి మీలో పాతుకుపోయి ఉంటాయి. వీటిని కూకటి వేళ్ళతో సహా శాశ్వతంగా పెకిలించి వేసే సులభ మార్గాలు కొన్ని ఉన్నాయి వాటిలో అత్యంత శక్తి వంతము, వేగ వంతము మరియు సురక్షితమూ అయిన మార్గం చెబుతున్నాను.

శ్వాసను బట్టి భావం - భావాన్ని బట్టి శ్వాస

మీరు శ్వాసించే పద్ధతి, మీ భావాన్ని బట్టి మారుతూ ఉంటుంది. మీలోని భావావేశాలు మీ శ్వాస క్రియ పైన ప్రభావాన్ని చూపెడతాయి. మీరు ఆందోళనతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు కోపంగా ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు నిరాశతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు కామోద్రేకంతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీ రతీ కార్యం అయిపోయిన తర్వాత ఒక రకంగా, మీరు ప్రేమతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు ప్రశాంతంగా ఉన్నప్పుడు మరో రకంగా.... ఇలా మీ భావాన్ని బట్టి, మీ శ్వాస మారుతూ ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే శ్వాస మరియు భావం రెండూ ఒకేదాని చివరలు. ఈ రెండూ కలిసి ఉంటాయి. ఒక దానిలో మార్పు వస్తే రెండవది కూడా మారుతుంది. **శ్వాసలో మార్పు తీసుకు వస్తే భావంలో మార్పు వస్తుంది. భావాన్ని మారిస్తే శ్వాస మారుతుంది.**

✪✪✪మీరు మీ లోపల అనేకానేక భావాలను అణిచి ఉంచారు. అవి అన్నీ మీ సరైన శ్వాస క్రియకు అవరోధం కలిగిస్తూ ఉంటాయి. మీ శ్వాస లోతుగా లేకుండా పైపైనే ఉంటుంది. ఇలా పైపైన తీసుకునే శ్వాస మీ లోపల ఉన్న సరికాని భావాలను అలానే ఉంచేస్తుంది. పైపైన శ్వాస తీసుకుంటూ ఉంటే లోపల ఉన్న సరికాని భావాలు విడుదల కావు. మీ లోపల అణిచి పెట్టబడి ఉన్న సరికాని భావాలు మీ శ్వాస క్రియను ఒక క్రమ పద్ధతిలో ఉండేలా నియంత్రిస్తాయి. ఈ రకంగా అవి తమ ఉనికిని కాపాడుకుంటూ తమకు అనుగుణమైన పరిస్థితులను ఆకర్షిస్తూ ఉంటాయి. ఆ పరిస్థితుల వలన మీరు ఎన్నో బాధలు పడాల్సి వస్తుంది.✪✪✪

లోపల ఉన్న సరికాని భావాలను వదిలించుకోవాలంటే, లోపల ఒక పెద్ద అల్లకల్లోలాన్ని సృష్టించియే తీరాలి. ఒక మహా గందరగోళాన్ని పుట్టించాలి. మీరు వేగవంతంగా శ్వాస తీసుకుంటున్నప్పుడు... మీ శ్వాసలో తీవ్రమైన మార్పు వస్తుంది. మీ శ్వాస లోతుగా, వేగంగా మారుతుంది. ఎప్పుడైతే మీ శ్వాస క్రియలో మార్పు జరిగిందో ఆ క్షణమే మీ లోపల ఉన్న సరికాని భావాలు నిర్జీవమవుతాయి. మీ లోపల ఉన్న సరికాని భావాల పైన, వేగంగా శ్వాస తీసుకోవడం ద్వారా వచ్చే **దివ్య శక్తి** ఒక మహా ప్రభంజనంలా వీచి వాటిని చెల్లాచెదురు చేసి, పెకిలించి వేస్తుంది. మీరు వదిలే నిశ్వాసల ద్వారా మరియు మీ శరీరంలోని సంవేదనల ద్వారా, రక రకాలుగా లోపల ఉన్న సరికాని భావాలన్నీ విడుదలై వెళ్ళి పోతూ ఉంటాయి. శ్వాస ఎంత వేగంగా, లోతుగా అయితే అంత కానివ్వండి. ఆపకండి. మీ వల్ల కాకపోతే ఆపండి. లేక పోతే లేదు. దాన్ని అలా కొనసాగనివ్వండి.

ఆత్మ విజ్ఞాన పూరితం కాని భావాలే మన శరీరంలోని మరియు జీవితంలోని అన్ని కష్ట నష్టాలకు మూల కారణాలు. వీటిని వదిలి వేస్తే కాని మనం బాగుపడం. అయితే ఈ సరికాని భావాల పట్ల ద్వేషంతో రగిలి పోవద్దు. వాటి పట్ల నిరసన, నిందా భావనలను ప్రకటించడం మానివేయాలి. కేవలం

సాధన చేస్తూ ఉండాలి. ప్రేమగా ఎరుకతో సాక్షిగా ఉండాలి. మీరు ఈ సాధన చేస్తూ ఉండండి. మీలో ఉన్న సరికాని భావాలన్నీ వాటంతట అవే పోతాయి.

నేనే దైవం అనే దివ్య భావన మీ ఊహలకు అందనన్ని కార్యాలను సంభవింప చేస్తుంది. సాధనలో మీరు పూర్తి స్థాయి ఎరుకతో, మీ సంపూర్ణ చైతన్యంతో మిమ్మల్ని మీరు దైవాలుగా ఒప్పుకోవాలి. గాఢంగా ఫీలవ్వాలి. నిజంగా అనుభూతి చెందాలి. మీ లోపల వ్యతిరేకతలెన్నో ఉంటాయి. ఆ వ్యతిరేకతల్లో నుండి మిమ్మల్ని మీరు దైవంగా అంగీకరించాలి... అంటే నా లోపల ఉన్న వ్యతిరేకతల్లో నుండి సంపూర్ణంగా నేనే దైవం అని అంగీకరిస్తున్నాను... అని అనుకోవాలి.

మీలో ప్రస్తుతం ఎన్నో వ్యతిరేకతలున్నాయి. అందుకే దైవమే అయి ఉన్న మీరు ఇలా ఉన్నారు. మీరు క్రమం తప్పని సాధన చేస్తూ ఉంటే ఒక నాటికి మీ వ్యతిరేకతలన్నీ క్లియర్ అయిపోయి మీరు దైవం అవుతారు.

వేలాది, లక్షలాది జన్మలుగా మీరు, మీలో "మీ దైవత్వాన్ని" కలిగియే ఉన్నారు. మీరెప్పుడూ మీ దైవత్వాన్ని కోల్పోలేదు. అది అసంభవం. మీరేం చేసినా మీ దైవత్వాన్ని కోల్పోలేరు. ఈ అనంత సృష్టిలోని ఏ శక్తి కూడా మీ నుండి మీ దైవత్వాన్ని దూరం చేయలేదు. మీరు ఒకప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ దైవాలే ! అందరూ దైవాలే ! అంతా దైవమే !

ఇక్కడ దైవం అని అంటే సర్వత్రా వ్యాపించి ఉన్న, పరమోన్నతమైన, అత్యున్నతమైన, అత్యుత్తమమైన, సర్వోన్నతమైన, సర్వాకార, నిరాకార, నిర్గుణ, సర్వగుణ పరబ్రహ్మను, ఆ ఉనికిని, బ్రహ్మాన్ని, పరమాత్మను, సర్వాత్మను, సర్వస్వంలో సర్వం అయిన, సృష్టి సర్వస్వమూ, అనంత సృష్టి కేంద్రమూ అయిన, "అన్ని" మూలాలకు "మూలం" అయిన ఆ యొక్క "మహా మూల చైతన్యం" - "Ultra Consciousness" అని అర్థం. ఇంకా దానిని ఎన్నెన్నో రకాలుగా అంటూ ఉంటారు. మీరు దానిని మరేమైనా అనండి - నేను ఇక్కడ "దైవం" అని అంటున్నాను.

దైవాలే అయి ఉన్న మీరు ఇంకా మీ దైవత్వాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకోలేదని అంటే కారణం ఏమిటని అనుకుంటున్నారు - కేవలం మీరు ఒప్పుకోక పోవడమే అందుకు గల ఏకైక కారణం ! మరి ఎందుకు మీ దైవత్వాన్ని మీరు ఒప్పుకోలేక పోతున్నారు ? అని ప్రశ్నిస్తే మిమ్మల్ని మీరు క్షమించుకోలేక పోవటం మరియు మీ పట్ల మీరు సంపూర్ణంగా ప్రేమను కలిగిలేక పోవటం. మరే ఇతర కారణాలైనా అన్నీ దీని తర్వాతే వస్తాయి.

1. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మిమ్మల్ని మీరు సంపూర్ణంగా క్షమించుకుని, మీ పట్ల మీరు సంపూర్ణమైన, సమగ్రమైన ప్రేమను కలిగి ఉన్నట్టేనని అర్థం.

2. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మిమ్మల్ని మీరు దైవత్వానికి సంపూర్ణంగా, సమగ్రంగా అర్హులమని ఒప్పుకున్నట్టే !

3. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ "కుండలిని శక్తి" పట్ల మీరు జాగృతం అయినట్టే మరియు మీ పట్ల మీ "కుండలిని శక్తి" జాగృతం అయినట్టే ! అంటే మీ "కుండలిని శక్తి" మీకు పూర్తి జాగృత స్థితిలో, పూర్తిగా, సమగ్రంగా అందుబాటులోకి వచ్చినట్టే !

4. "నేనే దైవంలేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ ఆత్మ యొక్క దివ్య శక్తులన్నింటినీ ఒప్పుకుంటున్నట్టే !

5. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీకు సహజంగానే ఉన్న ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను ఒప్పుకున్నట్టే !

6. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మిమ్మల్ని మీరు 100%గా, పూర్ణంగా వర్తమానంలో శాశ్వతంగా స్థితం చేసుకున్నట్టే !

7. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మిమ్మల్ని మీరు సంపూర్ణంగా, సమగ్రంగా పాజిటివ్‌గా ఒప్పుకున్నట్టే ! అంటే మీరు పూర్ణ స్థాయి పాజిటివ్‌నెస్‌ను కలిగి ఉన్నట్టే !

8. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు సంపూర్ణంగా, సమగ్రంగా అనుకూలంగా ఉన్నట్టే !

9. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు సంపూర్ణంగా, సమగ్రంగా ఆమోదాన్ని కలిగి ఉన్నట్టే !

10. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు సంపూర్ణంగా, సమగ్రంగా సహాయ సహకార సమన్వయాలను కలిగి ఉన్నట్టే !

11. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు సంపూర్ణంగా, సమగ్రంగా శృతిని కలిగి ఉన్నట్టే !

12. "నేనే దైవంలేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు సంపూర్ణమైన, సమగ్రమైన బ్యాలెన్స్‌ను కలిగి ఉన్నట్టే !

13. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు సంపూర్ణంగా, సమగ్రంగా శ్రద్ధ, సమర్పణ, అంకిత భావాలను కలిగి ఉన్నట్టే !

14. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు ప్రకటించుకున్న నిందా భావాలను, నిరసన భావాలను, అపరాధ భావాలను సంపూర్ణంగా, సమగ్రంగా, శాశ్వతంగా, సురక్షితంగా ఉపసంహారం చేసేసినట్టే !

15. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు సంపూర్ణంగా, సమగ్రంగా మీ నెగెటివ్ గతాన్ని శాశ్వతంగా వదిలేసినట్టే !

16. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు అందరిని సంపూర్ణంగా, సమగ్రంగా క్షమించినట్టే !

17. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మిమ్మల్ని మీరు సంపూర్ణంగా, సమగ్రంగా సత్య స్వరూపులుగా ఒప్పుకున్నట్టే !

18. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మిమ్మల్ని మీరు సంపూర్ణంగా, సమగ్రంగా ప్రేమ స్వరూపులుగా ఒప్పుకున్నట్టే !

19. "నేనే దైవంలేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు సంపూర్ణంగా, సమగ్రంగా మహా విశ్వాసాన్ని మరియు మహా ఎరుకను కలిగి ఉన్నట్టే !

20. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు సంపూర్ణంగా, సమగ్రంగా అవగాహనను కలిగి ఉన్నట్టే !

21. "నేనే దైవంలేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు సంపూర్ణంగా, సమగ్రంగా బాధ్యతను కలిగి ఉన్నట్టే !

22. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు సంపూర్ణంగా, సమగ్రంగా సాధికారతను కలిగి ఉన్నట్టే !

23. "నేనే దైవంలేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు సంపూర్ణంగా, సమగ్రంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కలిగి ఉన్నట్టే !

24. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ పట్ల మీరు సంపూర్ణంగా, సమగ్రంగా హక్కును + అధికారాన్ని కలిగి ఉన్నట్టే !

25. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు సంపూర్ణంగా, సమగ్రంగా, అనంతమైన సర్వ శక్తి సామర్థ్యాలను కలిగి ఉన్నట్టే !

26. "నేనే దైవంలేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు సంపూర్ణంగా, సమగ్రంగా, పూర్ణ ప్రేమతో మీ ఆత్మను స్వీకరించినట్టే !

27. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - ఆత్మ పరిణామ క్రమంలో భాగంగా మీరు అనేక జన్మలను ఎత్తుతూ, అజ్ఞానంతో మీ పట్ల మీరు ప్రకటించుకున్న ఆత్మ అయిష్టత, ఆత్మ తిరస్కారం, ఆత్మ ద్వేషం, ఆత్మ క్రోధం, ఆత్మ నాశన భావాలను తక్షణమే సంపూర్ణంగా, సమగ్రంగా, శాశ్వతంగా తీసివేసినట్టే !

28. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు మీ విస్మృతిని సంపూర్ణంగా, సమగ్రంగా తొలగించు కున్నట్టే !

29. "నేనే దైవంలేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు సంపూర్ణంగా, సమగ్రంగా, దైవాలుగా పరిణమించే సమయం వచ్చేసిందని, మీరు దైవాలుగా భౌతిక శరీరంలో మేలుకునే క్షణం వచ్చేసిందని అర్థం. భౌతిక శరీరంలో దైవంగా అయ్యారని అర్థం. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు దైవాలుగా అయి ఉన్నారనే అర్థం ! "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని అంటే దైవంగా అయిపోవడమే.

30. "నేనే దైవంలేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీతో మీరు ఏకమైనట్టే ! మీరు స్వచ్ఛమైనట్టే !

31. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - అందరిని మరియు అంతటిని దైవంగా ఒప్పుకున్నట్టే !

32. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - సర్వమూ దివ్యమే, సకలమూ దివ్యమే, సమస్తమూ దివ్యమే అని గ్రహించి అవగాహన చేసుకున్నట్టే !

33. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - సృష్టితో ఏకత్వాన్ని అంగీకరించినట్టే, ఏకం చెందినట్టే, ఏకం అయినట్టే !

34. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు మీ లోపల ఉన్న సరికాని వాటినన్నింటినీ పూర్తిగా, శాశ్వతంగా క్షణంలో తీసివేసే సత్యం, ప్రేమ, ఎరుక, అవగాహనలను కలిగి ఉన్నట్టే !

35. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు పరమ సత్యంగా పరిణమించినట్టే ! మీరు పరమ ప్రాప్తం పొందినట్టే !

36. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు మీ దివ్య శక్తులను ఎరుకతో, పూర్తిగా అందుబాటులోకి తెచ్చుకున్నట్టే !

37. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు మీ దివ్య దృష్టిని పూర్తిగా, శాశ్వతంగా అందుబాటులోకి తెచ్చుకున్నట్టే !

38. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీరు సహస్రార స్థితిలో విరాజిల్లుతూ ఉన్నట్టే !

39. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ యొక్క అన్ని శక్తి కేంద్రాలను అంటే చక్రాలను ఉత్తేజితం చేసుకున్నట్టే !

40. "నేనే దైవం లేక నేను దైవాన్ని" అని మిమ్మల్ని మీరు దైవంగా ఒప్పుకున్నారంటే దాని అర్థం - మీ అన్ని శరీరాలను ఉత్తేజితం చేసుకుని, వాటిని పూర్ణానుసంధానం చేసుకున్నట్టే !

ఈ సాధన చేస్తున్నప్పుడు సహనంతో ఉండాలి. సాధనలో కూర్చున్నప్పుడు ఏం వినపడితే దానిని వినాలి, ఏం కనబడితే దాన్ని చూడాలి. అంతర్ ప్రకృతిని ప్రవహించనివ్వాలి. లోపల ఎన్నెన్నో జరుగుతాయి, ఎలాంటి ప్రతిస్పందన చేయకూడదు. శబ్దాలు, మాటలు, నవ్వులు మొదలైనవి వినిపించే అవకాశం ఉంది. దృశ్యాలు ఏవైనా కనపడే అవకాశం ఉంది. ఏమీ కాదు, భయపడాల్సిన పని లేదు. అంతా శ్రేయస్కరంగా జరుగుతుంది. సాధనలో ఇవన్నీ మామూలే, మీరు మాత్రం ఎలాంటి ప్రతి స్పందన చేయకుండా సాక్షిగా ఉండాలి. ప్రేమభావంతో కూడిన ఎరుకతో సాక్షిగా ఉండాలి అంతే !

ధ్యానం ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎంత సేపు చేయాలి ?

"నేనే దైవం" సాధన మీకు ఎప్పుడు వీలైతే అప్పుడు, మీకు ఎక్కడ వీలైతే అక్కడ చేసుకోవచ్చు. దీనికి ప్రత్యేకమైన సమయం, స్థలం అంటూ ఏమీ లేదు. ధ్యానం అనేది ఒక అరగంటో లేక గంటో సాధన చేసి ఆ తర్వాత మడిచి మూలకు పెట్టేది కాదు. ధ్యానం అంటే ఎరుక. శాశ్వతమైన ఎరుకతో జీవించడమే ధ్యానం. ***వేగవంతమైన శ్వాస - స్పీడ్ బ్రెత్ సాధన మాత్రం రోజుకి ఒకసారి మాత్రమే ఈ కింద సూచించిన విధంగానే చేయాలి.***

15-18 ఏళ్ళ వారు **5** నిమిషాలు వేగవంతమైన శ్వాస - స్పీడ్ బ్రెత్ సాధన చేసి ఆ తర్వాత **20** నిమిషాలు "నేనే దైవం" సాధన చేయాలి.

18 ఏళ్ళు ఆ పైబడిన వాళ్ళు **10** నిమిషాలు వేగవంతమైన శ్వాస - స్పీడ్ బ్రెత్ సాధన చేసి ఆ తర్వాత కనీసం **30** నిమిషాలు "నేనే దైవం" సాధన చేయాలి. "నేనే దైవం" అనే దైవత్వ సాధన ఎక్కువ సేపు సాధన చేస్తే లాభమే తప్ప వేరే ఏమీ ప్రమాదం లేదు. కాబట్టి అనవసరమైన అపోహలు తొలగించుకుని మీ ఇష్టం వచ్చినంత సేపు, మీకు వీలైనంతగా, హాయిగా సాధన చేసుకోండి.

ధ్యానం మొత్తం జీవితానికి సంబంధించిన విషయం. ధ్యానం ఆత్మ పరిణామ క్రమానికి సంబంధించిన విషయం. ఆత్మ వికాసం జరిగితేనే జీవన వికాసం జరుగుతుంది మరి ఇది కేవలం ధ్యానం ద్వారానే సాధ్యం.

ధ్యాన సాధన అంటే పరివర్తన - పరివర్తన అంటే అభివృద్ధి. మరి అభివృద్ధి ఎంత సేపట్లో చెందాలనుకుంటున్నారు మీరు ? ఎంత ఎక్కువ సమయం సాధన చేస్తే అంత త్వరగా అభివృద్ధి చెందుతారు. ఆత్మ విజ్ఞాన పుస్తకాలను చదివి, అవగాహనతో సాధన చేస్తే సూపర్ ఫాస్ట్‌గా అభివృద్ధి చెందవచ్చు.

మీరు కొత్తగా ఇప్పుడు దైవాలుగా మారేందుకు చేసే ప్రయత్నం కాదిది. మీరు ఆల్‌రెడి దైవాలే ! దైవాలే అయి ఉన్న మీరు - మిమ్మల్ని మీరు మరిచి పోయారు అంతే ! కేవలం మీరు, మీ సహజమైన దైవత్వాన్ని గుర్తు చేసుకోవాలి అంతే ! మీరేం చేస్తూ ఉన్నా, సర్వకాల సర్వావస్థలలోనూ "నేనే దైవం" అనే స్మృతిని మీరు కలిగి ఉండాలి. సదా, సర్వదా "నేనే దైవం" అనే ఎరుకను మీరు కలిగి ఉండాలి. **24** గంటలూ "నేనే దైవం" అనే ఎరుకలోనే మీరు జీవించే స్థితికి రావాలి. "నేనే దైవం" అనే మీ ఎరుకయే మీ యొక్క సర్వ - సర్వ, సకల - సకల, సమస్త కర్మలన్నింటిని దగ్ధం

చేసేస్తుంది. మీ యొక్క అన్ని రకాల సమస్యలను, బాధలను, కష్ట నష్టాలను, అనారోగ్యాలను, ఇబ్బందులను, దు:ఖాలను, ఇంకా ఇతర అన్నింటిని శాశ్వతంగా తొలగిస్తుంది. "నేనే దైవం" అనే ఎరుక మీ పట్ల మీకు ప్రేమను, ఎరుకను, అవగాహనను కలిగించి మిమ్మల్ని సర్వ - సర్వ, సకల - సకల, సమస్త బంధనాల్లో నుండి శాశ్వతంగా విముక్తం చేసేస్తుంది. "నేనే దైవం" అనే ఎరుకను కలిగి ఉండటం అని అంటే "నేనే దైవం" అని ఒప్పుకోవటమే ! "నేనే దైవం" అని ఒప్పుకోవటం అంటే "దైవంగా పరిణమించటమే" !

"మనం పదే, పదే దేనినైతే నొక్కి చెబుతామో, మన అంతర్ ప్రపంచం లేక మూల చైతన్యం అది సంభవించేలా చేస్తుంది" - సృష్టి మూల సిద్ధాంతం, కాబట్టి మనం పైన తెలుపబడిన దైవత్వ సాధన ద్వారా మనం పదే, పదే "నేనే దైవం"... "నేనే దైవం" అని అనుకుంటూ ఉంటే, మన లోపల ఉన్న "మూల చైతన్యం(దైవం)" మనల్ని దైవాలుగా మార్చేస్తుంది. నిజంగా, సులభంగా, సరళంగా, శీఘ్రంగా, సురక్షితంగా, తక్షణమే మనకు దివ్యత్వాన్ని అందిస్తుంది.

నేనే దైవం అని మీరు సాధన చేస్తున్నప్పుడు, మీ అంతరంలో దాని ప్రభావం, తక్షణమే పడుతూ ఉంటుంది. చాలా గొప్పగా ఆ యొక్క ప్రభావం మీ అంతరంగాన్ని తక్షణమే స్వచ్ఛం చేస్తుంది. కాబట్టే 24 గంటలూ నేనే దైవం అనే ఎరుకలో ఉంటూ అన్ని పనులూ చేసుకుంటూ ఉండాలి. మీరు ఏ పని చేస్తూ ఉన్నా సరే... కాలకృత్యాలు తీర్చుకుంటున్నప్పుడు, సెక్స్‌లో ఉన్నప్పుడు, మీరేం చేస్తూ ఉన్నా సరే నేనే దైవం అనే ఎరుకలో ఉండే ప్రయత్నం చేయాలి. ప్రారంభంలో ఇది చాలా కష్టంగా ఉంటుంది. మీరు తరచూ మరిచి పోతుంటారు, ఫర్వాలేదు, గుర్తుకు వచ్చినప్పుడు మళ్ళీ

మొదలు పెట్టండి. అయ్యో మర్చిపోయానే అని బాధ పడకూడదు. గుర్తుకు రాగానే, గుర్తుకు వచ్చినందుకు ఆనందిస్తూ నేనే దైవం అనే ఎరుకలో ఉండాలి. ఇది మీకు చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా మేలును మరియు అనేకానేక శ్రేయస్కరాలను అందిస్తూనే ఉంటుంది.

ఈ దివ్య సాధన చేస్తూ మీ లోపలికి వెళ్తున్నప్పుడు మీ అంతరంలో పాతుకుపోయి ఉన్న నెగెటివ్‌లన్నీ ఆటోమెటిక్‌గా పైకి తేలుతాయి. మీ లోపల చైతన్యంలో పూడుకుని ఉన్న నెగెటివ్‌లన్నీ ఆటోమెటిక్‌గా బయట పడి పూర్తిగా, శాశ్వతంగా వెళ్ళి పోతాయి. క్రమం తప్పకుండా మీరు సాధన చేస్తుంటే ఏ నెగెటివ్ దాగి ఉండలేదు. అన్నీ వాటంతట అవే బయట పడతాయి. అవి బయట పడినప్పుడు కూడా మీరు మీ సాధన చేస్తూనే ఉండాలి. అవి క్లియర్ అయిపోతుంటాయి. మళ్ళీ సాధన కొనసాగిస్తూనే ఉండాలి.

✪✪✪ దైవత్వ సాధనలో ఉన్న దివ్య భావాన్ని యథాతథంగా, గాఢంగా ఫీలవ్వాలి. మీరు నిజంగానే దైవం అని ఫీల్ అవ్వాలి. మహా గాఢంగా, నిజంగా ఫీల్ అవ్వాలి. గుర్తుంచుకోండి - ఈ ఫీల్ అవ్వటంలోనే సాధనా ఫలితం అంతా ఆధారపడి ఉంది. మీరు ఎంత గాఢంగా, నిజంగా ఫీల్ అవుతారు అనే దాని పైననే మొత్తం ఆధారపడి ఉంది. మీరు ఎంత ఎమోషనల్‌గా ఫీల్ అయితే అంత మంచిది. సాధన అంటే ఫీల్ అవటమే ! ఫీల్ అవటం అంటే భావించటం అని అర్థం. భావించటం అంటే సంభవించేలా చేయటం అని అర్థం. మీరేది భావిస్తారో అది సంభవించి తీరుతుంది. "యద్భావం తద్భవతి" కదా ! ఒక వేళ మీకు ఎలా ఫీల్ అవ్వాలో తెలియటం లేదంటే కంగారు పడకండి. ఈ సాధనను మీరు క్రమం తప్పకుండా చేస్తూంటే ఫీలింగ్స్ ఆటోమెటిక్‌గా వచ్చేస్తాయి. ✪✪✪

మీ లోపల ఉన్న నెగెటివ్ నమ్మకాలు, అభిప్రాయాలు, గుణాలు మరియు నెగెటివ్ ఆలోచనా విధానాలు, ఇవే మన శరీరం + జీవితంలోని సర్వ సకల సమస్త కష్ట నష్టాలకు, బంధనాలకు, అనారోగ్యాలకు, భయాలకు, ఒత్తిడులకు, బాధలకు, దుఃఖాలకు, పేదరికానికి, అపజయాలకు మూల కారణాలు. సాధన చేసే ముందు మీరు వీటిని పూర్తిగా, నిజంగా వదిలి వేసేందుకు సిద్ధ పడాలి. కేవలం మీరు నిజంగా సిద్ధ పడాలి. కేవలం మీరు నిజంగా సిద్ధపడితే చాలు. వాటిని మీలో నుండి పూర్తిగా, శాశ్వతంగా తీసివేసే పని "మూల చైతన్యం" చూసుకుంటుంది.

ఈ దైవత్వ సాధనను ఎంత సేపు వీలైతే అంత సేపు సాధన చేయండి. అనేకానేక జన్మలలో ఎంతో చెత్తను పోగు చేసుకుని ఉంటారు. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న అన్ని రకాల కష్ట నష్టాలకు, అన్ని రకాల అనారోగ్యాలకు ఆ చెత్తే కారణం. క్రమం తప్పకుండా సాధన చేస్తుంటే అంతా సులభంగా, సరళంగా, తక్షణమే క్లియర్ అయిపోతుంది.

మీ జీవితాన్ని మీరు అనుకుంటున్న దాని కంటే గొప్పగా ఎంజాయ్ చేయాలనుకుంటే సాధన చేయాలి, ఎవరి కోసం మరి ?!

కాళ్ళు చేతులు ఆడుతున్నప్పుడు, సమయం ఉన్నప్పుడు, వసతి సౌకర్యాలు ఉన్నప్పుడు సాధన చేసుకుంటే మిమ్మల్ని మీరు రక్షించుకున్న వారవుతారు. కర్మ ముంచుకొచ్చి ఏదైనా జరిగి మూడితే... అప్పుడు చింతిస్తే ఏం లాభం ? దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క బెట్టుకోండి.

"నేనే దైవం" సాధన వీలైన వాళ్ళు గంట లేదా రెండు గంటలు లేదా మూడు గంటల చొప్పున రోజూ సాధన చేసుకోవచ్చు. ఇలా రోజుకు 3 గంటల చొప్పున క్రమం తప్పకుండా, వరుసగా 50 రోజులు సాధన చేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి. రోజుకు 3 గంటల చొప్పున క్రమం తప్పకుండా, వరుసగా 100 రోజులు సాధన చేస్తే అమోఘమైన, అద్భుతమైన ఫలితాలు వస్తాయి. వేగవంతమైన శ్వాస - స్పీడ్ బ్రెత్ సాధన మాత్రం రోజుకి ఒకసారి కేవలం పది నిమిషాలు సాధన చేస్తే చాలు.

జన్మలు, జన్మలు వృథా చేస్తారు. ఓ 100 రోజులు సాధన

చేసి శరీరాలను, జీవితాలను బాగు చేసుకుంటే పోయేదేముంది ?!

కళ్ళు మూసుకుని ఉన్న మీరు మీ నుదుటి మధ్య భాగంలో మీ దృష్టిని నిలిపి నేనే దైవాన్ని అనే భావాన్ని గాఢంగా, ఎరుకతో అనుభూతి చెందాలి. నిజంగా ఫీలవ్వాలి. నేనే దైవం అన్న భావాన్ని 100%గా అనుమతిస్తూ, ప్రగాఢంగా అనుభవించాలి. యాంత్రికత అస్సలు పనికి రాదు ! ఎంత ఎక్కువ సమయం సాధన చేస్తే అంత మంచిది. ఫలితాలు త్వరగా రావాలని కోరుకుంటున్న వారు ఎక్కువ సమయం సాధన చేయాలి మరి !

ఇంకా ఈ దైవత్వ సాధన వలన ఏం జరుగుతుందంటే ?

ఈ దైవత్వ సాధన మీ పట్ల మీకు ఉన్న అపరాధ భావనలను శాశ్వతంగా, పూర్తిగా తీసివేస్తుంది. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న అనారోగ్యాలన్నింటికి మరియు కష్ట నష్టాలన్నింటికి మీ పట్ల మీకు

ఉన్న అపరాధ భావనలే మూల కారణం. అపరాధ భావన(Guilty) అంటే నేర భావన అంటే పాపం అనే భావన. ఇదే, ఈ భావనయే మిమ్మల్ని మీరు నేరస్తులుగా, పాపులుగా భావింపజేసి - మీ చేత, మీకే శిక్షలు విధించుకునేలా చేస్తుంది. ఈ అపరాధ భావనలు పూర్తిగా అంతరించి పోయేంత వరకు మీ కష్టాలు తొలగిపోవు. మీరే సాధన చేసినా అది ఫలించదు. కాబట్టి ఈ అపరాధ భావనలను ముందు తీసివేస్తుంది. ఈ దివ్య సాధన వలన మీ పట్ల మీకు "శ్రద్ధ సమర్పణ అంకిత" భావాలు ఏర్పడుతాయి. దీని వలన మీరు చేస్తున్న సాధన సులభంగా, వెంటనే సిద్ధిస్తుంది. మీరు ఎక్కడెక్కడ ఇరుక్కుని ఉన్నారో, ఎక్కడెక్కడ బంధింపబడి ఉన్నారో మీకు తెలియనే తెలియదు. అన్ని బంధనాలలో నుండి వెంటనే ముక్తిని కలుగజేస్తుంది. మీరు చేసే సాధన మీకు చెందేలా చేస్తుంది. కాలము దూరము - Time and Space అనే భావనలను అధిగమించి అనుకున్నది క్షణాలలో పొందగలిగే సానుకూల "అంతర్ వాతావరణాన్ని" + "బాహ్య వాతావరణాన్ని" సృష్టిస్తుంది. గతం నుండి సంపూర్ణంగా, సమగ్రంగా, శాశ్వతంగా విడుదల చేస్తుంది.

"శ్రద్ధాపూర్వకమైన అంకిత వైఖరి ఉన్నప్పుడు ఫలితాలు తక్షణమే అనుసరిస్తాయి. ఒక్క క్షణం కోసం అయినా అంకిత వైఖరి కుదిరిందంటే ఎన్నో జన్మల సంచితం(కర్మ) సురక్షితంగా కరిగి పోతుంది. శ్రద్ధా భావంతో నువ్వు గతం నుండి పూర్తిగా విముక్తుడవైపోతావు". ఈ దివ్య సాధన మిమ్మల్ని మీ గతం నుండి ఒక్క సారిగా విముక్తం చేసేసి మిమ్మల్ని వర్తమానంలో ఉంచి, మిమ్మల్ని సృష్టి కేంద్రంతో అనుసంధానం చేస్తుంది. ఇది ఎలా జరుగుతుందంటే సృష్టి ఎల్లప్పుడూ వర్తమానంలో ప్రకటం అయి ఉంటుంది కాబట్టి ! మీరు వర్తమానంలో ఉన్నప్పుడు సృష్టి కేంద్రం నుండి మీకు సర్వ అవగాహన, సకల శక్తి యుక్తులు మీకు ప్రసారం అవుతూ ఉంటాయి. సాధారణంగా మీరెప్పుడూ వర్తమానంలో ఉండరు. కంటిన్యూయస్‌గా, ఎడతెగని ఎరుకలో(వర్తమానంలో), మీరు గనక 48 నిమిషాలు ఉంటే మీకు జ్ఞానోదయం(దివ్యత్వం) సంప్రాప్తించ కుండా ఈ సృష్టిలో ఎవ్వరూ మిమ్మల్ని ఆపలేరు అని మహావీరుడు ప్రకటించాడు. ఈ సాధన మిమ్మల్ని వర్తమానంలోకి తెచ్చి, మిమ్మల్ని వర్తమానంలో ఉంచేస్తుంది.

ఈ దైవత్వ సాధన మీ యొక్క సరి కాని నమ్మకాల వ్యవస్థను - Belief System ను మొత్తం ఒక్క సారిగా సరి చేస్తుంది. మీలో ఎన్నో నెగెటివ్ నమ్మకాలు, నెగెటివ్ అభిప్రాయాలు, నెగెటివ్ గుణాలు, నెగెటివ్ ఆలోచనా విధానాలు ఉంటాయి. వీటన్నింటిని కలిపి నమ్మకాల వ్యవస్థ - Belief System అని అనవచ్చు, అన్నీ ఒకే కోవలోకి వస్తాయి. ఇవి మీ శరీరాన్ని + మీ జీవితాన్ని అష్ట కష్టాల పాలు చేసి మిమ్మల్ని నరక యాతనకు గురి చేస్తుంటాయి. ఇవి మిమ్మల్ని ఎప్పుడూ బాగు పడనీయవు. వీటన్నింటిని వాటి మూలాలతో సహా తక్షణమే శాశ్వతంగా ఈ సాధన తీసివేస్తుంది. మీలో ఉన్న సర్వ సకల సమస్త నెగెటివ్‌లన్నింటిని, మీకే తెలియకుండా మీ లోపల ఉంటూ మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న మీ లోపాలను ఈ దైవత్వ సాధన పూర్తిగా, తక్షణమే, శాశ్వతంగా తీసివేస్తుంది. మిమ్మల్ని శాశ్వత రీతిలో అభివృద్ధి పథంలో ఉంచేస్తుంది.ఈ దైవత్వ సాధన వలన ఆయుష్షును, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని పొంది, మీ అన్ని కోరికలను తీర్చుకుని, అన్ని విజయాలను సాధించి, సకల సౌభాగ్యాలను ప్రాప్తించుకుంటారు.

ఈ దైవత్వ సాధన మీలో తిష్ఠ వేసుకుని ఉన్న ఆత్మ ద్వేషం (Self Hatred), ఆత్మ క్రోధం(Self Wrath), ఆత్మ అయిష్టత(Self Dislike), ఆత్మ నాశనం(Self Destruction), ఆత్మ తిరస్కృతులను(Self Rejection), ఇంకా సరి కాని వాటిని అన్నింటిని ఒకేసారి తక్షణమే పూర్తిగా, శాశ్వతంగా తీసివేసి మీలోని అనంతమైన ఆత్మ ప్రేమను, ఏకత్వాన్ని పునః ప్రతిష్ఠింపజేస్తుంది. మీకు తెలియకుండా, మీలో ఉన్న ఆత్మ ద్వేషం, క్రోధం, అయిష్టత, నాశనం, తిరస్కారాలే అన్ని రోగాలకు, అన్ని సమస్యలకు, అన్ని బంధనాలకు, అన్ని అపజయాలకు మూల కారణాలు. వీటికి మూలం ఆత్మ విజ్ఞానం లేకపోవడం.

ఈ దైవత్వ సాధన మీలో ఉన్న అయోమయాన్ని, మీలో ఉన్న జడత్వాన్ని తీసివేస్తుంది. మీకు కొరుకుడు పడకుండా మిమ్మల్ని వేధిస్తున్న సమస్యలన్నింటిని శాశ్వతంగా పరిష్కరించేస్తుంది. మిమ్మల్ని ప్రక్షాళన చేసి స్వచ్ఛం చేసేస్తుంది. మీరు సంపూర్ణమైన, మహా పటిష్ఠమైన, శాశ్వతమైన ఆరోగ్యంతో విరాజిల్లేలా చేస్తుంది. "నేను బాగున్నాను అనే భావనయే ఆరోగ్యం అంటే" ! ఈ సాధన నేను బాగుండడమే కాదు దివ్యంగా ఉన్నాను అనే భావనను కలుగజేసి మీ భౌతిక దేహాన్ని దివ్య దేహంగా మారుస్తుంది. ఈ దివ్య సాధన వలన మీలో ఆత్మానందం జనిస్తుంది. ఆత్మానందం మీలో ఒక్కసారి జాగృతం అయిందంటే అది బ్రహ్మానందానికి అంటే మోక్షానికి దారి తీస్తుంది. ఇక మీ శరీరంలో, జీవితంలో ఏ సమస్యలు ఉండవు. ఎన్నటికీ రాలేవు. ఆనందం అనేది జీవశక్తికి జీవం. ఆనందం అనేది అన్ని కష్ట నష్టాల నుండి మిమ్మల్ని సర్వదా రక్షించే ఒక దివ్య రక్షా కవచం.

ఈ దైవత్వ సాధన మీ దేహానికి ఉన్న దివ్య శక్తి సామర్థ్యాలను ఉత్తేజితం చేస్తుంది. ఎలాంటి భౌతిక ఆహారం తీసుకోక పోయినా కొన్ని వేల సంవత్సరాలు నిత్య నూతనంగా, యవ్వనంగా, శక్తివంతంగా మనుగడ సాగించే విధమైన శక్తి సామర్థ్యాలను కలిగి ఉంటుంది మీ భౌతిక దేహం. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుంటూ, ఎలా అంటే అలా మారిపోగల సర్వ సౌకర్యాలు, సౌలభ్యాలు కలిగి ఉన్నది మీ భౌతిక శరీరం. ఎల్లప్పుడూ అజ్ఞానంతో నెగెటివ్ భావాలను రిలీజ్ చేస్తూ ఉన్నందున, మాంసాహారంతో కలుషితం చేసినందున ఎంతో దివ్యమైనది, అమరమైనదీ అయిన మీ దేహం ఓ మాంసపు ముద్దలా తయారైంది. మీరు మీ దేహాన్ని నిజంగా నయం చేయాలనుకుంటే ఈ సాధన చెయ్యండి. మీ దేహం మళ్ళీ తన పూర్వ దివ్య అమర వైభవాన్ని సంతరించుకుంటుంది.

ఈ దివ్య సాధన వలన మీ యొక్క సహజ దివ్య రోగ నిరోధక వ్యవస్థ ఉత్తేజితం అవుతుంది. ఎంతో పటిష్ఠమైన రోగ నిరోధక వ్యవస్థను మీ అజ్ఞానంతో మీరే చిన్నాభిన్నం చేస్తున్నారు. అసలు రోగం అంటే ఏమిటో తెలుసా మీకు ?! తలనొప్పి నుండి క్యాన్సర్, ఎయిడ్స్ వరకు ఉన్న రోగాలు అంటే ఏమిటో తెలుసా మీకు ?! ఆత్మ విజ్ఞాన పూరితం కాని స్వభావాలే, నమ్మకాలే రోగాలుగా భౌతిక శరీరంలో ప్రకటం అవుతాయి. ఆత్మ విజ్ఞాన పూరితం కాని ఆలోచనా విధానాలే శరీరంలోని+జీవితంలోని అన్ని కష్ట నష్టాలకు మూల కారణాలు. సూటిగా చెప్పాలంటే ఆత్మ విజ్ఞానం లేక పోవటమే సర్వ, సకల, సమస్త కష్ట నష్టాలకు మూలం. అజ్ఞానమే అన్ని రోగాలకు మరియు బాధలకు మూలం. ఈ దైవత్వ సాధన వలన మీకున్న అనారోగ్యాలన్నీ శాశ్వతంగా తొలగి పోతాయి.

ఈ సాధన వలన మీరు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉండడమే కాకుండా, మీలో సహజంగానే ఉన్న మహా పటిష్ఠమైన రోగ నిరోధక శక్తి శాశ్వత రీతిలో ఉత్తేజితమవుతుంది.

ఈ దైవత్వ సాధన మీలో దాగి ఉన్న ఆయురారోగ్య ఐశ్వర్యాలను ఉత్తేజితం చేసి మీ చేత అనుభవింప చేస్తుంది. అకాల మరణం బారిన పడకుండా కాపాడుతుంది. మీకై మీరు పెట్టుకున్న మరణ శాసనాలను, శాపాలను, భావాలను తీసి వేస్తుంది. కర్మ వశాత్ అనుభవించాల్సిన మరణాన్ని తీసి వేస్తుంది. ప్రాణ గండాలను తీసి వేసి, అవి రాకుండా చేస్తుంది.

ఈ దివ్య సాధన గొప్ప జీవితాన్ని , మహా విజయాలను, ఉన్నతమైన సత్కారాలను, ఉత్తమమైన సన్మానాలను, గొప్ప గౌరవ మర్యాదలను, ఘనమైన పేరు ప్రతిష్ఠలను, చెల్లుబాటయ్యే చాలా గొప్ప పలుకుబడిని, అపారమైన సంపదలను, అద్భుతమైన ఆనందాలను, మహోత్సవాలను మీ చేత అనుభవింప చేస్తుంది.

ఈ దివ్య సాధన మిమ్మల్ని సర్వదా సంరక్షిస్తూ , మిమ్మల్ని పూర్తిగా మీకు అనుకూలంగా మార్చేస్తుంది. అంతటిని + అన్నింటినీ + అందరినీ మీకు పూర్తి అనుకూలంగా మారుస్తూ, మీ చేత సదా, సర్వదా మహా విజయాలను అనుభవింప చేస్తూ, మిమ్మల్ని శాశ్వతంగా మహా విజేతలుగానే ఉంచేస్తుంది. మీ లక్ష్యాలు, మీ కోరికలు, మీ ఆశయాలు, మీ ఆశలు అన్నీ అనుకున్నవి అనుకున్నట్టుగా, అత్యంత సులభంగా, సరళంగా, శీఘ్రంగా, ఆశ్చర్యకరంగా, శ్రేయస్కరంగా నెరవేరుతూ ఉంటాయి.

ఈ దైవత్వ సాధన వలన మీ ఆత్మ శక్తులు అన్నీ ఉత్తేజితమై మీ అందుబాటులోకి వస్తాయి. ఈ దైవత్వ సాధన మీరు మీ మూల చైతన్యం పట్ల ఏర్పరుచుకున్న సరి కాని అభిప్రాయాలను, నమ్మకాలను మొత్తం ఒకే సారి తీసి వేసి అనంతమైన మూల చైతన్య శక్తితో మిమ్మల్ని శాశ్వతంగా అనుసంధానం చేస్తుంది. ఈ దైవత్వ సాధన వలన మీరు, మీ యొక్క అనంత మూల చైతన్య శక్తిని సంపూర్ణంగా వినియోగించుకునే అవగాహన, శక్తి సామర్థ్యాలను పొందుతారు నిజంగా, శాశ్వతంగా ! ఈ దైవత్వ సాధన వలన నేనే అనంత మూల చైతన్యం అనే ఎరుక సిద్ధించి, ఏకత్వాన్ని పొంది సాక్షాత్ మూల చైతన్య స్వరూపులుగానే పరిణమిస్తారు.

ఈ దైవత్వ సాధన వలన అనంతమైన దివ్య శక్తులు మీలో ఉద్భవిస్తాయి. మీరు ఆరాధించే దేవుళ్ళు అనబడే వారు ఏమేం చేసారో, చేయగలుగుతారో అవన్నీ మీరూ చేయగలుగుతారు. సాక్షాత్తు దైవాలే కదా మీరు ! మీరే దైవాలు !

ఈ దివ్య సాధనను గాఢంగా, భావనాత్మకంగా మీ లోపల చేయాలి. అలా ప్రశాంతంగా, ధీమాగా కూర్చుని ఇక లోపల జరిగే వాటిని ఎరుకతో, సాక్షిగా చూస్తుండాలి. ఏ ఎరుక, ఏ అవగాహన, ఏ కంట్రోలింగ్ కెపాసిటి అయితే ఆ యొక్క అనంత దివ్య శక్తులను పొందడానికి అవసరమో అవన్నీ లోపల రెడీమేడ్‌గా ఉంటాయి. మనం అనుమతించినంత మాత్రాన అవి మన అందుబాటులోకి

రావడం మొదలు పెడతాయి. మన లోపల ఉన్న మన మూల చైతన్యం, లోపల అవసరమైన అన్ని రకాల మార్పులను, సెట్టింగ్స్‌ను, క్లియరెన్స్‌లను చేసి అనంత దివ్య శక్తులను మనకు సులభంగా, సురక్షితంగా, శీఘ్రంగా, పూర్తిగా అందుబాటులోకి తెచ్చి ఉంచుతుంది. ఇక అప్పుడు మనం వాటిని అవసరమైనప్పుడల్లా వాడుకుంటూ మనకు + సృష్టికి ఎంతో శ్రేయస్కరాన్ని కలుగజేయవచ్చు. ప్రతి ఒక్కరు తాము సహజంగా కలిగి ఉన్న అనంత దివ్య శక్తులను పొంది తీరాలి ! అందరికీ ప్రేరణను ఇవ్వాలి !

ఆధ్యాత్మిక పుస్తకాలుగా చెలామణి అయ్యే అనేకానేక పుస్తకాల్లో చాలా వరకు సరి అయినవి లేవు. వాటిలో చాలా మటుకు మూఢ మతాధికారుల పచ్చి స్వార్థ పూరిత కల్పనలే ఉన్నాయి తప్ప అసలు విషయం లేదు, అవి జనాలను ఎల్లప్పటికీ బందీలుగానే ఉంచే మహా భయంకర బోధనా ఉచ్చులతో కూడుకుని ఉన్నవి. ఇక కథల్లో, నవలల్లో, సినిమాల్లో శక్తులను పొందాలంటే ఏమేమో రాస్తారు, చూపిస్తారు. వాళ్ళది వ్యాపారం కదా ! వ్యాపారం కోసం ఏమేమో చేయాల్సి వస్తుంది. వాళ్ళు రాసినవి, చూపించిన విషయాలను వదిలేయండి. ఇక్కడ నేను చెప్పిన సాధనను పూర్తి శ్రద్ధతో, సమర్పణతో అవగాహనతో చేస్తే అనంత దివ్య శక్తులను పొందవచ్చు ! ఆత్మ విజ్ఞానాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని, ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో యథాతథంగా ఆచరిస్తూ ఉంటే, సాధన చేస్తూ ఉంటే మీరు మీ యొక్క అనంత దివ్య శక్తులను ఖచ్చితంగా పొంది తీరుతారు. ఇది సత్యం !

మీకు అనంత దివ్య శక్తుల గురించి చాలా తప్పుడు బోధనలు జరిగాయి. పూర్తిగా నూటికి నూరు శాతం తప్పుడు సమాచారం మానవులకు అందించబడింది. సాక్షాత్తు మూల చైతన్య స్వరూపుడైన మానవుడు అశక్తతతో, నిస్సహాయంగా, దీనంగా ఉండడానికి కారణం ఆత్మ విజ్ఞాన లోపమే ! మీరు "దివ్యులు" కారు అన్న బోధనలను మొత్తానికి మొత్తం మూట కట్టి ఒకేసారి విసిరి పారెయ్యండి. మీరు "అశక్తులు" అన్న మూర్ఖపు బోధనలను ఆత్మ విజ్ఞానాగ్నిలో దగ్ధం చేసేయండి. మీరు కేవలం మనుషులు, దేవుడెక్కడో ఉంటాడు ఆయన దయ మీదనే మీ బ్రతుకు ఆధారపడి ఉంది అనే అజ్ఞానపు బోధనలను ధ్యానాగ్నిలో భస్మం చెయ్యండి. తెలుసుకోండి మీరే దైవాలు ! అహం బ్రహ్మాస్మి ! సాక్షాత్ మూల చైతన్యమే మీరు ! మీ సహజ, నిజ తత్వమే మూల చైతన్యం !

సాధన పూర్తి కాగానే మళ్ళీ విస్మృతిలో పడి పోవద్దు. నిరంతరం ఎరుకను ప్రాక్టీస్ చేయాలి. ఇలా నిరంతరంగా ఎరుకలో ఉండేందుకే ఈ సాధన. కూర్చొని చేసే సాధన గ్రౌండ్‌లో కారు నేర్చు కోవటం లాంటిది. మీరు గ్రౌండ్‌లో ఎందుకు నేర్చుకుంటున్నారు ? బయట నడపడానికే కదా ! ఇలాగే కుర్చీలో కూర్చొని చేసే సాధన నిత్య జీవితంలో, నిరంతరంగా ఎరుకలో ఉండేందుకేనని గ్రహించాలి. అయితే ప్రారంభ దశలో కూర్చొని చేసే సాధన మీకు గ్రౌండ్ లాంటిది అవుతుంది.

మీరు బాగా అడ్వాన్స్‌డ్ స్థాయికి వెళ్ళినప్పుడు ఇదే సాధన మీకు గ్యారేజ్‌లా అవుతుంది. అప్పుడు మీరు కూర్చొని మిమ్మల్ని మీరు రిపేర్ చేసుకోవచ్చు. సాధన కూర్చొని చేయాలి, నిత్య జీవితంలో కూడా సాధనలో ఉండాలి. సాధనే జీవితమై పోవాలి. సాధన అంటే ఎరుకతో ఉండటమే కదా !

హాయిగా ధ్యానంలో కూర్చోండి. 100% చైతన్య స్పృహతో, ఎరుకతో ఉండాలి. సాక్షిగా ఉండాలి. సాక్షిగా ఉండటం అంటే ఎలాంటి ప్రతిస్పందనను చేయక పోవటం. అయితే ఎరుకతో ఉన్నప్పుడే సాక్షితత్వం వస్తుంది. ఎరుకతో ఉన్నప్పుడు మాత్రమే మీరు సాక్షిగా ఉండగలుగుతారు. మీలో ఉన్న ఆందోళనలు మీవి కావు అని గుర్తించండి, కాసేపు అన్ని మర్చిపోండి. ప్రశాంతంగా ఉండండి. ఆహ్లాదకరంగా ఉండండి. సాధన పట్ల ప్రేమను కలిగి ఉండండి.

లోపల ఏదైనా కనబడవచ్చు, ఏదైనా వినబడవచ్చు, ఏదో జరుగుతున్నట్టు అనిపించవచ్చు. మీరు ప్రమాదంలో ఉన్నట్టు అనిపించవచ్చు లేదా మీరు పడిపోతున్నట్టు అనిపించవచ్చు లేదా వాహనాలు కనపడవచ్చు లేదా ట్రాఫిక్ కనపడవచ్చు లేదా వింత ఆకారాలు కనపడవచ్చు - ఏం కనపడినా, ఏం వినపడినా మీరు మాత్రం ఎరుకతో, సాక్షిగా, ప్రతి స్పందించకుండా ఉండాలి. ఎలాంటి ప్రతిక్రియ చేయకూడదు. కేవలం అలా, జరిగే దానిని చూస్తూ ఉండాలి. ప్రేమగా ఎరుకతో సాక్షిగా జరిగే వాటిని గమనిస్తూ ఉండాలి.

మీ సాధనను మీరు చేస్తూనే ఉండాలి.

ఎల్లప్పుడూ నేనే దైవం అనే ఎరుకను కలిగి ఉండాలి. ఎల్లప్పుడూ వర్తమానంలో ఉండాలి. ఈ క్షణంలోనే ఉండాలి. అవసరమైనప్పుడు అవసరమైనంత మేరకు మాత్రమే గతంలోకి, భవిష్యత్తులోకి వెళ్ళి, మళ్ళీ వెంటనే వర్తమానంలోకి రావాలి. ఈ క్షణం, ఈ శ్వాసలో ఉండాలి. మీరు వర్తమానంలో ఉన్నప్పుడు సృష్టి కేంద్రంతో అనుసంధానింపబడి ఉంటారు. ఈ విధంగా ప్రేమగా, ఎరుకతో సాక్షిగా వర్తమానంలో ఉంటూ ఉండండి - చాలు, ఎప్పుడో మీరు ఊహించని క్షణంలో అప్రయత్నంగా "మీ నిజతత్వమైన దివ్యత్వంలో" మేలుకుంటారు. ఇదంతా ఒక్క క్షణంలోనే జరిగి పోతుంది.

దైవత్వం కోసం ఆందోళన వద్దు

మీరు బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, మీ నిజతత్వమైన దైవత్వం గురించి ఆందోళన చెందవద్దు. ఎప్పుడైనా సరే మీకు ఈ ఆందోళన కలిగిందీ అని అంటే ఎరుకతో ఆ యొక్క ఆందోళనను సాక్షిగా గమనించండి. అది మీ అహం విడుదల చేస్తున్న ఆందోళన ! మిమ్మల్ని తప్పుదారి పట్టించడానికి వస్తున్న ఆందోళన. మీరు ఎరుకతో లేకపోతే మీరు దానితో ఏకమై ఏదేదో చేసేస్తారు. చూసే వారికి, మీకు నిజంగానే అది మంచి పని లాగా అనిపిస్తుంది.

ఎందుకంటే దైవత్వం కోసం ఆరాటం కదా ! కరెక్టే అని అనిపిస్తుంది. వాస్తవానికి అది కరెక్ట్ కాదు. ఎందుకంటే నిజానికి మీరు దివ్యులే కదా ! దివ్యులే అయి ఉన్న మీకు దివ్యత్వం గురించిన ఆందోళన ఎందుకు ? ఉదాహరణకు మీరు స్త్రీ అనుకోండి, మీ స్త్రీత్వం గురించి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం ఉందా ?! ఒక వేళ మీరు పురుషుడే అని అనుకోండి, అప్పుడు మీరు మీ పురుషత్వం గురించి ఆందోళన పడవల్సిన అవసరం ఏముంది ?! మీ సహజ తత్వం గురించి ఆందోళన పడాల్సిన అవసరమే లేదు కదా ! ఇలాగే "దివ్యత్వం" అనేది మీ నిజ తత్వం ! "దివ్యత్వం" మీ సహజ తత్వం ! మీరేం చేసినా మీ దివ్యత్వాన్ని పోగొట్టుకోలేరు, అది అసంభవం ! కాబట్టి మీ దివ్యత్వం గురించి ఆందోళన చెందవద్దు, ఆందోళన యొక్క మూలాన్ని కనుక్కోండి. భారతీయులే అయి ఉన్న మిమ్మల్ని మళ్ళీ భారతీయులుగా మారండి అంటే వెనకా ముందు చూడకుండా భారతీయులు కావడం ఎలా ? అని ఆందోళన చెందుతూ భారతీయులుగా మారడానికి ఏమేమో చేస్తే, ఎలా ఉంటుంది ? మీరు కొత్తగా భారతీయులుగా మారాల్సిన అవసరం లేదు, మీరు ఆల్‌రెడీ జన్మతహా భారతీయులేనని గుర్తిస్తే సరిపోతుంది కదా ! ఇదే విధంగా, మీరు కొత్తగా దివ్యులుగా మారాల్సిన అవసరం లేదు, కేవలం మీరు ఆల్‌రెడీ దివ్యులేనని గుర్తిస్తే సరిపోతుంది.

సాధన చేస్తూ ఉన్నప్పుడు, ఏవైనా అనుభవాలు వచ్చినప్పుడు ఎలాంటి ప్రతిస్పందన చేయకుండా జరిగేవన్నీ శ్రేయస్కరాలే అని గ్రహించి సాక్షిగా ఉండాలి. అంతే ! ప్రేమగా ఉండండి. ఎరుకతో ఉండండి. సాక్షిగా ఉండండి. వర్తమానంలో ఉండండి - చాలు ! ఇలా మీరు ఉంటున్నప్పుడు ఏదో ఒక క్షణంలో దైవమే అయి ఉన్న మీరు దైవంలో దైవంలా మేలుకుంటారు. ఒకే క్షణంలో మీ చైతన్యం తన నిజ తత్వాన్ని సింపుల్‌గా గ్రహిస్తుంది. తనను తాను తిరిగి గుర్తు చేసుకుంటుంది. విస్మృతి స్మృతిగా మారుతుంది, అంతే !

ప్రియ మిత్రులారా ! ఈ విధమైన సాధనలో ఉండండి. అత్యంత సహజంగా, ఖచ్చితంగా, శీఘ్రంగా మీ నిజ తత్వమైన దివ్యత్వాన్ని మీరు పునఃప్రాప్తించుకుంటారు.

సాధన చెయ్యండి !

అనంత దివ్య శక్తి స్వరూపులుగా విరాజిల్లండి !!

మీరు కొత్తగా ఇప్పుడు దైవాలుగా మారేందుకు చేసే ప్రయత్నం కాదిది. మీరు ఆల్‌రెడి దైవాలే ! దైవాలే అయి ఉన్న మీరు - మిమ్మల్ని మీరు మరిచి పోయారు అంతే ! కేవలం మీరు, మీ సహజమైన దైవత్వాన్ని గుర్తు చేసుకోవాలి అంతే ! మీరేం చేస్తూ ఉన్నా, సర్వకాల సర్వావస్థలలోనూ "నేనే దైవం" అనే స్మృతిని మీరు కలిగి ఉండాలి. సదా, సర్వదా "నేనే దైవం" అనే ఎరుకను మీరు కలిగి ఉండాలి. 24 గంటలూ "నేనే దైవం" అనే ఎరుకలోనే మీరు జీవించే స్థితికి రావాలి. "నేనే దైవం" అనే మీ ఎరుకయే మీ యొక్క సర్వ - సర్వ, సకల - సకల, సమస్త కర్మలన్నింటిని దగ్ధం చేసేస్తుంది. మీ యొక్క అన్ని రకాల సమస్యలను, బాధలను, కష్ట నష్టాలను, అనారోగ్యాలను, ఇబ్బందులను, దు:ఖాలను, ఇంకా ఇతర అన్నింటిని శాశ్వతంగా తొలగిస్తుంది. "నేనే దైవం" అనే ఎరుక మీ పట్ల మీకు ప్రేమను, ఎరుకను, అవగాహనను కలిగించి మిమ్మల్ని సర్వ - సర్వ, సకల - సకల, సమస్త బంధనాల్లో నుండి శాశ్వతంగా విముక్తం చేసేస్తుంది. "నేనే దైవం" అనే ఎరుకను కలిగి ఉండటం అని అంటే "నేనే దైవం" అని ఒప్పుకోవటమే ! "నేనే దైవం" అని ఒప్పుకోవటం అంటే "దైవంగా పరిణమించటమే" !

నేనే దైవం అని మీరు సాధన చేస్తూ ఉన్నప్పుడు.... మీ సహజ తత్వమైన దైవత్వాన్ని మీరు తిరిగి పొందబోతున్నప్పుడు ఏ వాతావరణం అయితే ఏర్పడాలో అది ఆటొమెటిగ్గా ఏర్పడి పోతుంది.

ప్రియ మిత్రులారా ! ఈ విధమైన సాధనలో ఉండండి. అత్యంత సహజంగా, సులభంగా, ఖచ్చితంగా, శీఘ్రంగా, సురక్షితంగా మీ నిజ తత్వమైన దివ్యత్వాన్ని మీరు పునఃప్రాప్తించుకుంటారు.

❖ ❖ *All The Very Best !* ❖ ❖

మనం సరిగా స్పష్టంగా గట్టిగా కోరుకుంటే చాలు. మిగతా పని అంతా మన దైవత్వమే చూసుకుంటుంది. మన దైవత్వ శక్తి స్వభావం ఏమిటంటే, మన కోరిక పూర్తిగా నెరవేరేంత వరకు పని చేస్తూనే ఉంటుంది. మన కోరికను నెరవేర్చియే తీరుతుంది. అనుక్షణం విస్తరిస్తూ ఉన్న ఈ సృష్టి యొక్క ఆధార సూత్రం ఇదే ! - సేత్

సక్సెస్ అనేది రెండు రకాలుగా ఉంటుంది అని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను.

1. భౌతిక పరమైన సక్సెస్

2. ఆధ్యాత్మిక పరమైన సక్సెస్

ఎంతో ధనవంతులు, ఆరోగ్యవంతులు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వాళ్ళు, వరుస విజయాలతో దూసుకు పోతున్న వాళ్ళు, పెద్ద పెద్ద అవార్డులు రివార్డులు అందుకుని ఘన సన్మానాలను అందుకున్న, అందుకుంటున్న వాళ్ళు ఇంకా మొదలైన వాళ్ళను ఎవ్వరినీ మాస్టర్స్ ఇప్పటి వరకూ ప్రశంసించలేదు. నేనేనాడూ ఊహించని వ్యక్తులను ధ్యానంలో చూపించి వాళ్ళను ప్రశంసించారు.

ప్రపంచంలో దిగ్గజాలుగా వెలుగొందుతున్న వాళ్ళను మాస్టర్స్ చాలా సింపుల్‌గా పక్కకు పెట్టేసారు !

3. M A B ప్రేమ ధ్యానం

సాధనా దివ్య సూత్రాలు :

1 - దేహం ⇨

నా దేహం - దివ్య శక్తి సంపన్నమ్, మహా మూల చైతన్యం,
అమరం అందం నిత్య యవ్వనమ్ !
ప్రేమానందమ్ విశ్వాసమ్,
ఉల్లాసమ్ ఉత్సాహం, ఉత్తేజమ్ మహోజ్వలం !!

2 - జీవితం ⇨

నా జీవితం - దివ్యం అమరం పరమార్థమ్,
మహా ఐశ్వర్యవంతం, మహా దివ్య స్వర్గం !
ప్రేమానందమ్ విశ్వాసమ్,
ఉల్లాసమ్ ఉత్సాహం, ఉత్తేజమ్ మహోజ్వలం !!

3 - ఆత్మ ⇨

నేను - దివ్యం అమరం పరమోన్నతమ్,
పరిశుద్ధమ్ పరమోత్తమమ్ !
ప్రేమానందమ్ విశ్వాసమ్,
ఉల్లాసమ్ ఉత్సాహం, ఉత్తేజమ్ మహోజ్వలం !!

✪ ✪ ✪ **మొదటి సూత్రం** దేహానికి సంబంధించినది. ఇక్కడ దేహం అని

అంటే... మొత్తం శరీరం మరియు దాని యొక్క బయటి+లోపలి భాగాలు అని అర్థం. అంటే తల వెంట్రుకలు, మీసం వెంట్రుకలు, గడ్డం వెంట్రుకలు, శరీరం పైనున్న వెంట్రుకలు, గోళ్ళు, చర్మం, కళ్ళు, పెదవులు, దంతాలు, చిగుళ్ళు, నాలుక, గొంతు, చెవులు, ముక్కు, గుండె, కాలేయం, ఊపిరి తిత్తులు, కిడ్నీలు, మర్మ అవయవాలు, పేగులు, నరాలు, ఎముకలు, కీళ్ళు, కడుపు, వీపు, వెన్నెముక, నడుము, మెడ, ఛాతి, భుజాలు, చేతులు, అరచేతులు, తొడలు, కాళ్ళు, పాదాలు మొదలైనవన్నీ... మరియు శరీరానికి సంబంధించిన కణాలు, అణువులు, పరమాణువులకు... ఇలా సర్వ-సర్వ, సకల-సకల, సమస్త దేహ వ్యవస్థకు + మొత్తం దేహానికి సంబంధించినది ఈ 1 వ మహా దివ్య సూత్రం.

ఈ సూత్రాన్ని సాధన చేసేటప్పుడు, కళ్ళు మూసుకుని మొత్తం దేహాన్ని ఉద్దేశించి, ఈ సూత్రాన్ని లోపల భావనాత్మకంగా అనుకుంటూ ఉండాలి.

బాగా గుర్తుంచుకోండి, సూత్రాన్ని సాధన చేసేటప్పుడు, కేవలం దేహం పైనే మీ ధ్యాస ఉండాలి. దేహాన్ని ఉద్దేశిస్తూనే మీ సాధన కొనసాగాలి. అప్పుడప్పుడు మర్చిపోతూ ఉంటారు, ఫర్వా లేదు. గుర్తుకు రాగానే మీ ధ్యాసను మళ్ళీ దేహం పైన ఫోకస్ చేయాలి. క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉంటే శ్రద్ధ సమర్పణ అంకిత భావాలు వాటంతట అవే శాశ్వత రీతిలో ఏర్పడతాయి. అప్పుడు దేహ సర్వస్వమంతా స్వచ్ఛం అవుతుంది, అంటే పరిపూర్ణ పటిష్ఠమైన శాశ్వత ఆరోగ్యం తక్షణమే సిద్ధిస్తుంది. అందమైన రూపంతో దేహం మహా శక్తివంతంగా తయారవుతుంది.

✪ ✪ ✪ **రెండవ సూత్రం** జీవితానికి సంబంధించినది. జీవితం అని అంటే కేవలం ఈ ఒక్క జన్మకు సంబంధించినదే కాదు, ఎన్నెన్ని లోకాలలో, ఎన్నెన్ని తలాలలో, ఎన్నెన్ని విశ్వాలలో మీ శరీరాలు ఉన్నాయో వాటన్నింటికీ సంబంధించినది మరియు ఇప్పటి వరకు మీరు

ఎత్తిన జన్మలన్నింటికీ ఇంకా మీరు ఎత్తబోయే జన్మలన్నీ కలిపితే జీవితం.

రెండవ సూత్రం సాధన చేసేటప్పుడు జీవితాన్ని ఉద్దేశించి సాధన చేయాలి. అప్పుడు మీ యొక్క జీవిత సర్వస్వమంతా పరమ స్వచ్ఛం అవుతుంది. పరమ పవిత్రమవుతుంది. పరమానందమయవుతుంది. విజయానందాలతో విరాజిల్లుతుంది. మీ జీవితం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుంది. సులభంగా, సరళంగా, శ్రేయస్కరంగా, సురక్షితంగా, మహా ఐశ్వర్యవంతంగా, మహా దివ్య స్వర్గంగా శోభిల్లుతుంది. మీ ఆత్మ పరిణామ క్రమం వేగవంతమవుతుంది.

✪ ✪ ✪ **మూడవ సూత్రం** ఆత్మకు అంటే... "మీకు" అంటే... మీ నిజతత్వానికి సంబంధించినది. దీని వలన మీరు పరిశుద్ధం, పరమ పవిత్రం అవుతారు, దానితో మీ సహజమైన దైవత్వాన్ని మీరు తిరిగి పొందుతారు. మీ ఆత్మ యొక్క సర్వ దివ్య శక్తులను పొందుతారు.

గుర్తుంచుకోండి, మూడవ సూత్ర సాధన చేసేటప్పుడు, మీ నిజతత్వం పైనే మీ ధ్యాస ఉండాలి. మీ నిజ తత్వం అంటే మీ దైవత్వం అని అర్థం.

ధ్యానం చేసే విధానం

క్రింద కానీ, గోడకు ఆనుకుని కానీ, కుర్చీలో కానీ, సోఫాలో కానీ, మంచం పైన కానీ కూర్చోవచ్చు. ఎక్కడ మీకు సౌకర్యంగా ఉంటే అక్కడ, ఎలా మీకు అనుకూలంగా ఉంటే అలా కూర్చోవాలి. సౌకర్యంగా కూర్చోవాలి. మెడ, వెన్నెముక నిఠారుగా పెట్టి, శరీరాన్ని బిగపట్టి కూర్చోకూడదు. మీ శరీరం ఎంత అనుకూలిస్తే అంతగా, ఆ విధంగా కూర్చోండి. క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉంటే, ఆటోమెటిక్‌గా మెడ, వెన్నెముక నిఠారుగా అయిపోతాయి. శరీరాన్ని పూర్తిగా వదిలి వేయండి. రిలాక్స్‌గా శరీరాన్ని వదిలేయాలి. శరీరంలో ఏ భాగం కూడా బిగపట్టి ఉండరాదు. తర్వాత, కళ్ళు రెండూ మూసుకుని, హాయిగా ఎక్కువ సేపు స్థిరంగా ఉండేలా కూర్చోవాలి.

ఇక్కడ "నేను" అని అంటే దైవం అయిన "మీరే" అని అర్థం, మరొకటి కాదు. ఈ మూడు దివ్య సూత్రాలను ఒక్కోదాన్ని లోపల, మనసులో, గాఢంగా అనుకోవాలి. ఎంత సేపు వీలైతే అంత సేపు అనుకుంటూ ఉండాలి. ఒకదాని తర్వాత ఒకటి చేయాలి. అనేకానేక జన్మలలో ఎంతో చెత్తను పోగు చేసుకుని ఉంటారు. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న అన్ని రకాల కష్ట నష్టాలకు, అన్ని రకాల

అనారోగ్యాలకు ఆ చెత్తే కారణం. క్రమం తప్పకుండా సాధన చేస్తుంటే అంతా సులభంగా, సరళంగా, శీఘ్రంగా క్లియర్ అయిపోతుంది.

మీరు జీవితాన్ని మీరు అనుకుంటున్న దాని కంటే గొప్పగా ఎంజాయ్ చేయాలనుకుంటే సాధన చేయాలి, ఎవరి కోసం మరి ?!

కాళ్ళు చేతులు ఆడుతున్నప్పుడు, సమయం ఉన్నప్పుడు, వసతి సౌకర్యాలు ఉన్నప్పుడు సాధన చేసుకుంటే మిమ్మల్ని మీరు రక్షించుకున్న వారవుతారు. కర్మ ముంచుకొచ్చి ఏదైనా జరిగి మూడితే.... అప్పుడు చింతిస్తే ఏం లాభం ? దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క బెట్టుకోండి.

వీలైన వాళ్ళు ఒక్కో సూత్రాన్ని ఒక్కో గంట చొప్పున రోజు 3 గంటలు కూడా సాధన చేసుకోవచ్చు. ఇలా రోజుకు 3 గంటల చొప్పున క్రమం తప్ప కుండా, వరుసగా 50 రోజులు సాధన చేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి. రోజుకు 3 గంటల చొప్పున క్రమం తప్ప కుండా, వరుసగా 100 రోజులు సాధన చేస్తే అమోఘమైన, అద్భుతమైన ఫలితాలు వస్తాయి.

జన్మలు, జన్మలు వృథా చేస్తారు. ఓ 100 రోజులు సాధన చేసి

శరీరాలను + జీవితాలను బాగు చేసుకుంటే పోయేదేముంది ?!

ఈ దివ్య సూత్రాల భావాలను 100%గా అనుమతిస్తూ, ప్రగాఢంగా అనుభవించాలి. యాంత్రికత అస్సలు పనికి రాదు ! ఒక్కో సూత్రాన్ని ఎంత ఎక్కువ సమయం సాధన చేస్తే అంత మంచిది. ఒక్కో సూత్రాన్ని ఒక గంట లేదా ఒక రోజు కూడా సాధన చేయవచ్చు. ఫలితాలు త్వరగా రావాలని కోరుకుంటున్న వారు ఎక్కువ సమయం సాధన చేయాలి మరి !

"మనం పదే, పదే దేనినైతే నొక్కి చెబుతామో, మన అంతర్ ప్రపంచం లేక మన లోపల ఉన్న దివ్యత్వం లేక మూల చైతన్యం అది సంభవించేలా చేస్తుంది" - సృష్టి సిద్ధాంతం. కాబట్టి మనం పైన తెలుపబడిన సూత్రాలను పదే పదే గాఢంగా అనుకోవడం ద్వారా మన అంతశ్చైతన్యం సులభంగా, శీఘ్రంగా మనకు ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను + అనంతమైన దివ్య శక్తులను మనకు అందిస్తుంది.

ఈ దివ్య సూత్రాలను సాధన చేస్తూ మీ లోపలికి వెళ్తున్నప్పుడు మీ అంతరంలో పాతుకుపోయి ఉన్న నెగెటివ్‌లన్నీ ఆటోమెటిక్‌గా పైకి తేలుతాయి. మీ లోపల చైతన్యంలో పూడుకుని ఉన్న నెగెటివ్‌లన్నీ ఆటోమెటిక్‌గా బయట పడి పూర్తిగా, శాశ్వతంగా వెళ్ళి పోతాయి. క్రమం తప్పకుండా మీరు సాధన చేస్తుంటే ఏ నెగెటివ్ దాగి ఉండలేదు. అన్నీ వాటంతట అవే బయట పడతాయి. అవి బయట పడినప్పుడు కూడా మీరు మీ సాధన చేస్తూనే ఉండాలి. అవి క్లియర్ అయిపోతుంటాయి. మళ్ళీ సాధన కొనసాగిస్తూనే ఉండాలి.

సాధనా సూత్రాలలో ఉన్న భావాలను యథాతథంగా, గాఢంగా ఫీలవ్వాలి. మీ పట్ల మీకు ఆ సూత్రాలలోని భావాలు ఉన్నట్టుగా నిజంగానే ఫీల్ అవ్వాలి. మహా గాఢంగా, నిజంగా ఫీల్ అవ్వాలి. గుర్తుంచుకోండి - ఈ ఫీల్ అవ్వటంలోనే సాధనా ఫలితం అంతా ఆధారపడి ఉంది. మీరు ఎంత గాఢంగా, నిజంగా ఫీల్ అవుతారు అనే దాని పైననే మొత్తం ఆధారపడి ఉంది. మీరు ఎంత ఎమోషనల్‌గా ఫీల్ అయితే అంత మంచిది. సాధన అంటే ఫీల్ అవటమే. ఫీల్ అవటం అంటే భావించటం అని అర్థం. భావించటం అంటే సంభవించేలా చేయటం అని అర్థం. మీరేది భావిస్తారో అది సంభవించి తీరుతుంది. "యద్భావం తద్భవతి" కదా ! ఒక వేళ మీకు ఎలా ఫీల్ అవ్వాలో తెలియటం లేదంటే కంగారు పడకండి. ఈ సాధనా సూత్రాలను మీరు పదే పదే గాఢంగా అనుకుంటూ సాధన చేస్తూంటే ఫీలింగ్స్ ఆటోమెటిక్‌గా వచ్చేస్తాయి.

1. మొదటి సూత్రం - మీ దేహానికి ఉన్న దివ్య శక్తి సామర్థ్యాలను ఉత్తేజితం చేస్తుంది. ఎలాంటి భౌతిక ఆహారం తీసుకోక పోయినా కొన్ని వేల సంవత్సరాలు నిత్య నూతనంగా, నిత్య యవ్వనంగా, అందంగా, శక్తివంతంగా మనుగడ సాగించే విధమైన శక్తి సామర్థ్యాలను కలిగి ఉంటుంది మీ భౌతిక దేహం. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుంటూ, ఎలా అంటే అలా మారిపోగల సర్వ సౌకర్యాలు, సౌలభ్యాలు కలిగి ఉన్నది మీ భౌతిక శరీరం. ఎల్లప్పుడూ అజ్ఞానంతో నెగెటివ్ భావాలను రిలీజ్ చేస్తూ ఉన్నందున, మాంసాహారంతో కలుషితం చేసినందున ఎంతో దివ్యమైనది అయిన మీ దేహం ఓ మాంసపు ముద్దలా తయారైంది. మీరు మీ దేహాన్ని నిజంగా నయం చేయాలనుకుంటే ఈ సూత్రాన్ని సాధన చెయ్యండి. మీ దేహం మళ్ళీ తన పూర్వ దివ్య వైభవాన్ని సంతరించుకుంటుంది.

మొదటి సూత్రం - వలన మీ యొక్క సహజ దివ్య రోగ నిరోధక వ్యవస్థ ఉత్తేజితం అవుతుంది. ఎంతో పటిష్ఠమైన రోగ నిరోధక వ్యవస్థను మీ అజ్ఞానంతో మీరే చిన్నాభిన్నం చేస్తున్నారు. అసలు రోగం అంటే ఏమిటో తెలుసా మీకు ?! తలనొప్పి నుండి క్యాన్సర్, ఎయిడ్స్ వరకు ఉన్న రోగాలు అంటే ఏమిటో తెలుసా మీకు ?! ఆత్మ విజ్ఞాన పూరితం కాని స్వభావాలే, నమ్మకాలే రోగాలుగా భౌతిక శరీరంలో ప్రకటం అవుతాయి. ఆత్మ విజ్ఞాన పూరితం కాని ఆలోచనా విధానాలే శరీరంలోని + జీవితంలోని అన్ని కష్ట నష్టాలకు మూలకారణాలు. సూటిగా చెప్పాలంటే ఆత్మ విజ్ఞానం లేక పోవటమే సర్వ, సకల, సమస్త కష్ట నష్టాలకు మూలం. అజ్ఞానమే అన్ని రోగాలకు మరియు బాధలకు మూలం.

మొదటి సూత్రం - వలన మీకున్న అనారోగ్యాలన్నీ శాశ్వతంగా తొలగి పోతాయి. ఈ సూత్రం వలన మీరు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉండడమే కాకుండా, మీలో సహజంగానే ఉన్న మహా పటిష్ఠమైన రోగ నిరోధక శక్తి శాశ్వత రీతిలో ఉత్తేజితం అవుతుంది.

2. రెండవ సూత్రం - మీలో దాగి ఉన్న ఆయురారోగ్య ఐశ్వరాలను ఉత్తేజితం చేసి మీచేత అనుభవింప చేస్తుంది. అకాల మరణం బారిన పడకుండా కాపాడుతుంది. మీకై మీరు పెట్టుకున్న మరణ శాసనాలను, శాపాలను, భావాలను తీసి వేస్తుంది. కర్మ వశాత్ అనుభవించాల్సిన మరణాన్ని తీసి వేస్తుంది. ప్రాణ గండాలను తీసి వేసి, అవి రాకుండా చేస్తుంది.

రెండవ సూత్రం - గొప్ప జీవితాన్ని, మహా సంచలన విజయాలను, ఉన్నతమైన సత్కారాలను, ఉత్తమమైన సన్మానాలను, గొప్ప గౌరవ మర్యాదలను, ఘనమైన పేరు ప్రతిష్ఠలను, చాలా గొప్ప పలుకుబడిని, అపారమైన సంపదలను, అద్భుతమైన ఆనందాలను, మహోత్సవాలను మీ చేత అనుభవింప చేస్తుంది. ఈ సూత్రం ద్వారా మీ లైఫ్ ఎక్సలెంట్ లైఫ్ అవుతుంది. మీ లైఫ్ డివైన్ లైఫ్ అవుతుంది.

రెండవ సూత్రం – మిమ్మల్ని సర్వదా సంరక్షిస్తూ, మిమ్మల్ని పూర్తిగా మీకు అనుకూలంగా మార్చేస్తుంది. అంతటిని + అన్నింటినీ + అందరినీ మీకు పూర్తి అనుకూలంగా మారుస్తూ, మీ చేత సదా, సర్వదా మహా విజయాలను అనుభవింప చేస్తూ, మిమ్మల్ని శాశ్వతంగా మహా విజేతలుగానే ఉంచేస్తుంది. మీ లక్ష్యాలు, మీ కోరికలు, మీ ఆశయాలు, మీ ఆశలు అన్నీ అనుకున్నవి అనుకున్నట్టుగా, అత్యంత సులభంగా, సరళంగా, శీఘ్రంగా, ఆశ్చర్యకరంగా, శ్రేయస్కరంగా నేరవేరుతూ ఉంటాయి. జీవితానికి పరమార్థం ప్రాప్తిస్థుంది.

3. మూడవ సూత్రం – వలన మీ ఆత్మ శక్తులు అన్నీ ఉత్తేజితమై మీ అందుబాటులోకి వస్తాయి. ఈ సాధన మీరు మీ మూల చైతన్యం పట్ల ఏర్పరుచుకున్న సరి కాని అభిప్రాయాలను, నమ్మకాలను మొత్తం ఒకే సారి తీసి వేసి అనంతమైన మూల చైతన్య శక్తితో మిమ్మల్ని శాశ్వతంగా అనుసంధానం చేస్తుంది. ఈ సూత్రం వలన మీరు, మీ యొక్క అనంత మూల చైతన్య శక్తిని సంపూర్ణంగా, సమగ్రంగా వినియోగించుకునే అవగాహన, శక్తి సామర్థ్యాలను శాశ్వతంగా పొందుతారు. ఈ సూత్రం వలన నేనే అనంత మూల చైతన్యం అనే ఎరుక సిద్ధించి, ఏకత్వాన్ని పొంది సాక్షాత్ మూల చైతన్య స్వరూపులుగానే పరిణమిస్తారు.

మూడవ సూత్రం – వలన అనంతమైన దివ్య శక్తులు మీలో ఉద్భవిస్తాయి. మీరు ఆరాధించే దేవుళ్ళు అనబడే వారు ఏమేం చేసారో, చేయగలుగుతారో అవన్నీ మీరూ చేయ గలుగుతారు. సాక్షాత్తు దైవాలే కదా మీరు !

ఈ 3 దివ్య సూత్రాలను గాఢంగా, భావనాత్మకంగా మీ లోపల అనుకోవాలి. అలా ప్రశాంతంగా, ధీమాగా కూర్చుని ఇక లోపల జరిగే వాటిని ఎరుకతో, సాక్షిగా చూస్తుండాలి. ఏ ఎరుక, ఏ అవగాహన, ఏ కంట్రోలింగ్ కెపాసిటి అయితే ఆ యొక్క అనంత దివ్య శక్తులను పొందడానికి అవసరమో అవన్నీ లోపల రెడీమేడ్‌గా ఉంటాయి. మనం అనుమతించినంత మాత్రాన అవి మన అందుబాటులోకి రావడం మొదలు పెడతాయి. మన లోపల ఉన్న మన మూల చైతన్యం లోపల అవసరమైన అన్ని రకాల మార్పులను, సెట్టింగ్స్‌ను, క్లియరెన్స్‌లను చేసి అనంత దివ్య శక్తులను మనకు సులభంగా, సురక్షితంగా, తక్షణమే, పూర్తిగా అందుబాటులోకి తెచ్చి ఉంచుతుంది. కుండలినీ జాగృతమవుతుంది. ఇక అప్పుడు మనం అవసరమైనప్పుడల్లా వాటిని వాడుకుంటూ మనకు + సృష్టికి ఎంతో శ్రేయస్కరాన్ని కలుగజేయవచ్చు. ప్రతి ఒక్కరు తాము సహజంగా కలిగి ఉన్న అనంత దివ్య శక్తులను పొంది తీరాలి ! అందరికీ ప్రేరణను ఇవ్వాలి !

ఆధ్యాత్మిక పుస్తకాలుగా చెలామణి అయ్యే అనేకానేక పుస్తకాల్లో చాలా వరకు సరి అయినవి లేవు. వాటిలో చాలా మటుకు మూఢ మతాధికారుల పచ్చి స్వార్థ పూరిత కల్పనలే ఉన్నాయి తప్ప అసలు విషయం లేదు, అవి జనాలను ఎల్లప్పటికీ బందీలుగానే ఉంచే మహా భయంకర బోధనా

ఉచ్చులతో కూడుకుని ఉన్నవి. ఇక కథల్లో, నవలల్లో, సినిమాల్లో శక్తులను పొందాలంటే ఏమేమో రాస్తారు, చూపిస్తారు. వాళ్ళది వ్యాపారం కదా ! వ్యాపారం కోసం ఏమేమో చేయాల్సి వస్తుంది, వాళ్ళను అని మాత్రం ప్రయోజనం ఏమిటి ? ఇక్కడ నేను చెప్పిన సాధనను పూర్తి శ్రద్ధతో, అవగాహనతో చేస్తే అనంత దివ్య శక్తులను పొందవచ్చు ! ఆత్మ విజ్ఞానాన్ని పూర్తిగా, లోతుగా అవగాహన చేసుకుని అందులోని సూత్రాలను ఆచరిస్తూ సాధన చేస్తే మీరు మీ యొక్క అనంత దివ్య శక్తులను ఖచ్చితంగా పొంది తీరుతారు. ఇది సత్యం !

మీకు అనంత దివ్య శక్తుల గురించి చాలా తప్పుడు బోధనలు జరిగాయి. పూర్తిగా నూటికి నూరు శాతం తప్పుడు సమాచారం మానవులకు అందించబడింది. సాక్షాత్తు మూల చైతన్య స్వరూపుడైన మానవుడు అశక్తతతో, నిస్సహాయంగా, దీనంగా ఉండడానికి కారణం ఆత్మ విజ్ఞాన లోపమే ! మీరు "దివ్యులు" కారు అన్న బోధనలను మొత్తానికి మొత్తం మూట కట్టి ఒకేసారి విసిరి పారెయ్యండి. మీరు "అశక్తులు" అన్న మూర్ఖపు బోధనలను ఆత్మ విజ్ఞానాగ్నిలో దగ్ధం చేసేయండి. మీరు కేవలం మనుషులు, దేవుడెక్కడో ఉంటాడు ఆయన దయ మీదనే మీ బ్రతుకు ఆధారపడి ఉంది అనే అజ్ఞానపు బోధనలను ధ్యానాగ్నిలో భస్మం చెయ్యండి. తెలుసుకోండి మీరే దైవాలు ! అహం బ్రహ్మాస్మి ! సాక్షాత్ మూల చైతన్యమే మీరు ! మీ సహజ, నిజ తత్వమే మూల చైతన్యం !

సాధన చెయ్యండి !

అనంత దివ్య శక్తి స్వరూపులుగా విరాజిల్లండి !!

All The Very Best !

4. 18 పాయింట్ల సాధన

దైనందిన జీవితంలో వేధిస్తున్న సమస్యల నుండి ఎలా బయట పడాలి ? లేదా ఏదైనా సమస్యతో మనం పీడించ బడుతున్నప్పుడు చేయాల్సిన సాధన.

క్రింద కానీ, గోడకు ఆనుకుని కానీ, కుర్చీలో కానీ, సోఫాలో కానీ, మంచం పైన కానీ కూర్చోవచ్చు. ఎక్కడ మీకు సౌకర్యంగా ఉంటే అక్కడ, ఎలా మీకు అనుకూలంగా ఉంటే అలా కూర్చోవాలి. సౌకర్యంగా కూర్చోవాలి. మెడ, వెన్నెముక నిఠారుగా పెట్టి, శరీరాన్ని బిగపట్టి కూర్చోకూడదు. మీ శరీరం ఎంత అనుకూలిస్తే అంతగా, ఆ విధంగా కూర్చోండి. క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉంటే, ఆటోమెటిక్‌గా మెడ, వెన్నెముక నిఠారుగా అయిపోతాయి. శరీరాన్ని పూర్తిగా వదిలి వేయండి. రిలాక్స్‌గా శరీరాన్ని వదిలేయాలి. శరీరంలో ఏ భాగం కూడా బిగపట్టి ఉండరాదు. తర్వాత కళ్ళు రెండూ మూసుకుని, హాయిగా కూర్చోవాలి. మీరు పూర్తిగా సుఖంగా, సౌకర్యంగా, స్థిరంగా ఎక్కువ సేపు కూర్చునే విధంగా కూర్చోవాలి.

మొదట : ఎరుకతో ఉండండి.

రెండు : సమస్య నాదే అని ఒప్పుకోవాలి, సమస్య నుండి ఎస్కేప్ కావద్దు.

నిజమైన గురువులందరూ చెప్పే మాట ఇదే ! "సమస్యను స్వీకరించాలి, సమస్య నుండి ఎస్కేప్ కాకూడదు" అని !

పరమ గురువుల బోధనలు కొన్ని నిగూఢ అర్థాలను కలిగి ఉంటాయి. పైన చెప్పబడిన విషయాన్ని బట్టి మనకు ఏం అర్థమవుతుందంటే "సమస్యను స్వీకరించాలి" అని - అంటే లేని సమస్యను స్వీకరించమని కాదిక్కడ అర్థం. స్వీకరించడం అంటే ఒప్పుకోమని అర్థం. ఆల్‌రెడి సమస్య నీ లోపలే ఉంది. సమస్య నీ లోపలి నుండే ప్రకటమవుతూ ఉంది. నీ లోపలే ఉన్న నీ సమస్యను ఎలా స్వీకరిస్తావు ? ఆల్‌రెడి అది నీ లోపల ప్రకటం అవుతూనే ఉంది కదా ! "సమస్యను స్వీకరించండి" అని అంటే ఈ "సమస్యకు" మూల కారణం నేనే, ఈ సమస్యను సృష్టించుకున్నది నేనే అని ఒప్పుకోవడం ! "సమస్య నుండి ఎస్కేప్ కావద్దు" అని అంటే సమస్యను నాదే అని ఒప్పుకోకుండా పెండింగ్ పెట్టి పెంచుకోవద్దు అని అర్థం ! మీ సమస్యలకు మీరే మూల కారణం అని ఒప్పుకోకపోతే, సమస్యలను పెండింగ్ పెట్టడం, అంటే పెంచుకోవడమేనని గ్రహించండి.

కాబట్టి ఏ సమస్య వచ్చినా ఇది నేనే సృష్టించుకున్నాను, దీనికి మూల కారణం నేనే అని ఒప్పుకోవాలి. ఆ తర్వాత దాని మూల కారణాన్ని కనుక్కుని క్లియర్ చేసుకోవాలి. సమస్యను ఒప్పుకోకుండా, ఈ సమస్య నాది కాదంటూ తిరస్కరిస్తూ ఉండడమే సమస్య నుండి ఎస్కేప్ కావడం. మీరు మీ సమస్య నుండి ఎస్కేప్ అయితే అది పెండింగ్ పెట్టడం అవుతుంది. పెండింగ్‌కు గురయిన సమస్యలు పెరిగి పెద్దవి అవుతాయి. కాబట్టి సమస్య మూల కారణం నా లోపలే ఉంది అని ఒప్పుకుని క్లియర్ చేసుకోవాలి.

వచ్చిన ప్రతీ సమస్య మనది కాదు

అని అంటారు కొందరు !

ప్రతీ సమస్యా నాదేనా ? ఇలా అనుకుంటూ ప్రతీ సమస్యను ఒప్పు కోవాలా ? ఇలా అయితే వీటికి అంతం ఎన్నడు ? అని ప్రశ్నిస్తారు కొంత మంది. అజ్ఞానంతో చాలా బాధలు అనుభవించి ఒక రకమైన నిరాశతో, కోపంతో ఇలా ప్రశ్నిస్తారు.

అయితే..... సరే ! మీరు తిరస్కరించండి. మీరు తిరస్కరించినంత మాత్రాన అది వెళ్ళి పోయిందనుకోండి అది మీది కాదని అర్థం ! ఎన్ని సార్లు తిరస్కరించినా అది మీ వెంట పడుతుందంటే అది మీదేనని అర్థం ! ఇలా చేసి సమస్య మీదో కాదో స్పష్టంగా తెలుసుకోవచ్చు. సమస్యను మీరే సృష్టించుకున్నారని ఒప్పుకోవాలి, దానికి మీరే మూల కారణమని గ్రహించాలి.

మూడు: నా వాస్తవానికి నేనే సృష్టికర్తను, నా బాధ్యత పూర్తిగా నాదే !

నిజమేమంటే మీ సమస్యను మీరే సృష్టించుకున్నారు. దాని ద్వారా మీ అవగాహనా పరిధిని విస్తరించుకోడానికి మీ సమస్యను మీరే పెట్టుకుని వచ్చారు. మీ శక్తి మీద మీకు ఎంత నమ్మకం ఉంటే మీరే స్వయంగా సమస్యను పెట్టుకోగలుగుతారో ఒకసారి ఆలోచించండి. నేను తీసేయాలని అనుకున్నప్పుడు దీనిని నేను తీసేసుకోగలుగుతాను అని మీకు ఖచ్చితంగా తెలుసు కాబట్టే సమస్యను మీరు అనుభవించి అధ్యయనం చేయడానికి పెట్టుకుని వచ్చారు. నా సమస్యకు నేనే సృష్టికర్తను కాబట్టి దీన్ని నేను ఇప్పుడు తీసేయగలుగుతాను, అని లోపల గాఢంగా అనుకోవాలి. ఈ సత్యం మీ లోపలికి దిగిపోవాలి. మీలో అది కలిసి పోవాలి, కరిగి పోవాలి. ఆ సత్యమే మీరై పోవాలి. అది ఎంత సేపట్లో సాధిస్తారు. ఎన్ని రోజుల్లో సాధిస్తారు అనే విషయం మీ మీదనే ఆధారపడి ఉంది.

ఎప్పుడైతే ఈ సత్యం మీలో పూర్తిగా ఇంకి పోయిందో కంగారు పడాల్సిన అవసరం లేదు. ఆ సత్యం మీలో ఒక సహజ భాగం అయిందా లేదా అన్న సంగతి మీకే చాలా స్పష్టంగా తెలుస్తుంది. దాహంగా ఉన్నప్పుడు మంచి నీళ్ళు త్రాగితే, దాహం తీరింది, అని ఎంత స్పష్టంగా తెలుస్తుందో

అంత కన్నా స్పష్టంగా తెలుస్తుంది ఆ విషయం. ఈ సత్యం మీలో ఎంతెంతగా ఇంకుతూ ఉంటే అంతంతగా మీ శరీరం + జీవితం, మీ ఆధీనంలోకి వస్తూ ఉంటుంది.

నా వాస్తవాలకు నేనే సృష్టికర్తను అని సంపూర్ణంగా, 100% చైతన్య స్పృహతో ఒప్పుకున్నప్పుడు మాత్రమే మీ శరీరంలోని, జీవితంలోని సమస్యలను క్షణంలో పూర్తిగా తీసివేసే శక్తి + అధికారం వస్తుంది. గుర్తుంచుకోండి, కేవలం సృష్టించిన సృష్టికర్తకు మాత్రమే వాటిని తక్షణమే, శాశ్వతంగా తీసివేసే శక్తి + అధికారం ఉంటుంది.

"మనది కానిదేది మన దగ్గరకు రాదు,

మనది కానిది మన దగ్గర ఉండదు". - ఇది ఒక విశ్వ సూత్రం !

మన మీద ఒక పువ్వు పడ్డా అది మనదే ! ఒక రాయి పడ్డా, అదీ మనదే ! మన విజయాలకు, మన అపజయాలకు మనమే ఏకైక కారణం ! మన అవమానాలకు, మన సత్కారాలకు మనం మాత్రమే కారణం ! మన దరిద్రానికి, మన ఐశ్వర్యానికి కేవలం మనమే కారణం ! మన అనారోగ్యానికి, మన ఆరోగ్యానికి మనమే కారణం ! మన పరిస్థితులన్నింటికి మనమే ఏకైక మూల కారణం !

మీకు చెడు జరిగినా, మంచి జరిగినా దానికి మీరే పూర్తి కారణం. ఇతరులను ఎప్పుడూ, పొరపాటున కూడా బాధ్యులుగా అనుకోకండి.

మీ లక్ష రూపాయలు పోతే, అయ్యో "నాకే" ఈ కష్టం ఎందుకు వచ్చింది ? అందరూ బాగానే ఉన్నారు, "ఈ నష్టం నాకే జరగాలా" ?! అంటూ ఏడ్చి, గందరగోళం సృష్టిస్తారు. మీరు ఏడ్చిందే కాక మీ చుట్టు పక్కల వాళ్ళను కూడా ఇబ్బంది పెడతారు. సరే...

ఉన్నట్టుండి, మీకు ఓ లక్ష రూపాయలు దొరికాయి అనుకోండి, అప్పుడు, మరి, మీరు ఇలానే ఏడుస్తారా ? ఈ లక్ష రూపాయలు "నాకే" ఎందుకు దొరకాలి ? లోకంలో ఎంతో మంది డబ్బులు లేక బాధ పడుతున్నారు, వాళ్ళలో ఎవరికైనా దొరికి ఉంటే, ఎంత బాగుండేది, అంటూ వాపోతారా ? నిజాయితీగా చెప్పండి !

బాధ రాగానే "నాకే" ఎందుకు వచ్చింది అని అనడం, సంతోషం రాగానే "నాదే" అని అనడం సరి కాదు. ఇక్కడే, సరిగ్గా ఇలాంటి క్షణంలోనే జీవితం యొక్క క్రమం దెబ్బ తింటుంది. కోల్పోతుంది. ఇలాంటి జీవన విధానం, జీవితాన్ని పాడు చేస్తుంది. ఇది చాలా అపాయకరం. ఇలా ఆలోచించడం, అనుకోవడం తక్షణమే మాని వేయాలి.

నా వాస్తవానికి నేనే సృష్టికర్తను, నా బాధ్యత పూర్తిగా నాదే ! అనే ఈ పరమ సత్యం సదా మీ అణువణువులో శోభాయమానంగా ప్రకాశిస్తుండాలి.

నీ కర్మకు నీవే బాధ్యుడివి ! ఎవరి కర్మ వారే అనుభవించాలి ! ఎవరి వాస్తవాలకు వాళ్ళే సృష్టి కర్తలు ! అనే పరమ సత్యాలను ఎప్పుడో, ఎందరో "మాస్టర్స్", పరమ స్పష్టంగా ప్రకటించేశారు. కాబట్టి సర్వదా ఎరుకలో ఉండండి.

నాలుగు : మీ గుణమే(స్వభావమే) మీ సమస్య !

ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న సమస్య "మీ గుణమే" ! మీ లోపల ఉన్న ఏదో సరి కాని గుణమే బాహ్యంలో సమస్యగా ప్రకటం అవుతూ ఉంది. ఈ విషయాన్ని గ్రహించండి. మీరు బాధ పడుతున్నది మీ సరి కాని గుణం వల్ల కానీ, సమస్య వల్ల కాదు. మీ సరి కాని గుణం యొక్క పర్యవసానమే "సమస్య". మీ సరి కాని గుణం యొక్క యథాతథ ప్రతిబింబమే మీరు అనుభవిస్తున్న సమస్య.

మిమ్మల్ని పూర్తిగా కమ్ముకొని ఆలోచించనీయకుండా చేస్తూ విచక్షణను కోల్పోయేలా చేస్తుంది మీ గుణం. ఎరుకతో ఉండండి లేదా అది మిమ్మల్ని లోబర్చుకుంటుంది. మీ గుణమే మీ సమస్య అని మీరు గ్రహించగలిగితే 99% సమస్య మీ అదుపులోకి వచ్చినట్టే !

అయిదు : ప్రతీ సమస్యా ఏదో ఒక ఎరుకను, అవగాహనను ఇవ్వడానికే వస్తుందనీ, ఆ ఎరుకను, ఆ అవగాహనను స్వీకరించడానికి సిద్ధపడాలి.

సమస్య నుండి బయట పడాలి అని అనుకున్నప్పుడు, ముందు సమస్య అంటే ఏమిటో తెలుసుకోవాలి.

నిజానికి సమస్య అంటే సమస్య కాదు. ప్రతీ సమస్య ఒక బహుమతిని ఇస్తుంది. సమస్య సంఘర్షణను సృష్టిస్తుంది. ఈ సంఘర్షణయే "బహుమతిని" ఇస్తుంది. "బహుమతి" అంటే - బహు అనగా అనేకం, మతి అంటే మన మతి. సమస్య మన మతికి ఉన్న బహు కోణాలను తెరుస్తుంది. అప్పుడు మనకు బహు కోణాలలో విషయాలను అవగాహన చేసుకునే శక్తి సామర్థ్యాలు వస్తాయి. దీనితో మన ఎనర్జి లెవెల్స్ పెరుగుతాయి. ఇదే సమస్య మనకు ఇచ్చే "బహుమతి". బహు(అనేక) కోణాలలో విషయాలను అవగాహన చేసుకోగలిగే "మతియే" - బహుమతి. ప్రతీ సమస్య ఒక గురువు. ప్రతీ సమస్య ఏదో ఒకటి మనం గ్రహించేలా చేసి మన "అవగాహనను" పెంచడానికి వస్తుంది. అది శరీరంలోని సమస్య అయినా సరే, జీవితంలోని సమస్య అయినా సరే ! సమస్య యొక్క మూల కారణాన్ని తెలుసుకోవడం, దాన్ని అర్థం చేసుకోవడంతోనే, దానితో మనకు విముక్తి లభిస్తుంది.

సమస్య, సమస్యే కాదు ! సమస్య వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉంటుంది ఎప్పుడూ ! వెళ్ళి పోయేదే సమస్య !

అసలు సమస్య ఏమిటంటే, సమస్యను అర్థం చేసుకోలేక పోవడమే అసలు సమస్య ! సమస్య నుండి ఎస్కేప్ కావాలని ప్రయత్నిస్తూ ఉండడమే అసలు సమస్య ! సమస్యతో బాధ పడుతూ కూడా సమస్య వైపు చూసే ధైర్యం లేక అసలు సమస్యే లేదు అన్నట్టుగా ఉంటూ, తనను తాను మోసం చేసుకుంటూ ఉండడమే అసలు సమస్య ! సమస్యను పట్టించు కోకుండా పెండింగ్ పెట్టడమే అసలు సమస్య. నా సమస్యను ఎవరో వచ్చి తీరుస్తారు అని ఎదురు చూడడం అసలు సిసలు సమస్య ! సమస్యను అర్థం చేసుకోకుండా ఉన్నప్పుడు, సమస్య సమస్యగానే ఉంటుంది, ఇబ్బంది పెడుతుంది. అర్థం కానిది ఏదైనా ఇబ్బంది పెడుతుంది కదా మరి !

ఎప్పుడైతే సమస్య అర్థం అవుతుందో, తక్షణమే సమస్య సామరస్యంగా మారుతుంది, ఈ విధంగా జరగడంతోనే మనకు ఆ సమస్య నుండి ఆటోమెటిక్‌గా విముక్తి లభిస్తుంది.

సమస్యను సమస్యగా చూడకండి. సమస్య పట్ల ప్రేమను ప్రకటించండి. కళ్ళు రెండు మూసుకుని మిమ్మల్ని వేధిస్తున్న సమస్యను ప్రేమతో పిలవండి. "నీ నుండి నేనేం గ్రహించాలి" అని ప్రీతితో అడగండి. అడిగి అలాగే నిరీక్షించండి ! వస్తున్న ఆలోచనలను ఎరుకతో, సాక్షిగా చూస్తూ ఉండండి. సమస్య పట్ల ప్రేమను ప్రకటిస్తూ ఉండండి. సహనంతో ఉండండి. ఏ మాత్రం విసుగును, ద్వేషాన్ని ప్రకటించవద్దు.

ఆరు: పరిష్కారం లేని సమస్య అంటూ ఉండదు.

సమస్య, పరిష్కారం ఒకే దాని రెండు చివరలు. సమస్యలోనే పరిష్కారం యొక్క చిరునామా ఉంటుంది. "వాస్తవానికి ముందు పరిష్కారం ఉంటుంది. ఆ పరిష్కారంలో నుండి సమస్య పుడుతుంది". వాస్తవానికి సమస్య యొక్క ఉత్పత్తి స్థానం పరిష్కారమే ! పరిష్కారంలో నుండే సమస్య పుడుతుంది. - **విశ్వ సూత్రం**

"జవాబు లేని ప్రశ్న అంటూ ఉండదు, నిజానికి జవాబులో నుండే ప్రశ్న పుడుతుంది, ప్రశ్న యొక్క ఉత్పత్తి స్థానం జవాబే". - విశ్వ సూత్రం

ఉదాహరణకు, స్వామి వివేకానంద గారికి వారి తల్లిదండ్రులు పెట్టిన పేరు ఏమిటి ? ఇక్కడ చూడండి.. ఈ ప్రశ్నయే జవాబు యొక్క చిరునామాను తెలియజేస్తోంది. స్వామి వివేకానంద గారికి, వారి తల్లిదండ్రులు పెట్టిన పేరు ఒకటి ఉందనీ, అది వారి జీవిత చరిత్ర చదివితే తెలుస్తుందనీ సూచిస్తోంది ఈ ప్రశ్న !

ముందు ఇక్కడ జవాబు ఉంది ఆ తర్వాతే ప్రశ్న ఉద్భవించగలిగింది. ఒకవేళ స్వామి వివేకానంద గారికి వారి తల్లిదండ్రులు అసలు ఏ పేరు పెట్టలేదని అనుకోండి, అప్పుడు ఈ ప్రశ్నయే పుట్టదు కదా ! (స్వామి వివేకానంద గారికి వారి తల్లిదండ్రులు పెట్టిన పేరు ''నరేంద్రనాథ్ దత్తా''.) ఇదే విధంగా ముందు పరిష్కారం ఒకటి ఉంటుంది, ఆ తర్వాతే, ఆ పరిష్కారంలో నుండే సమస్య పుడుతుంది.

ఏడు: ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న సమస్యను ఇతరులు అనుభవించడానికి మీరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో లేక తెలిసో, తెలియకో కారణం అయి ఉంటారు. ఈ విషయాన్ని అంగీకరించాలి. ఇది అత్యంత ప్రధానమైన కారణం !

ఎనిమిది : ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న సమస్యను వేరెవరో అనుభవిస్తున్నప్పుడు వారిని హేళన చేయడమో లేక నిందించడమో లేక వారి పరిస్థితులను అర్థం చేసుకోకుండా వారిని వేధించి ఉంటారు. జడ్జ్‌మెంట్(తీర్పు లేక విమర్శ లేక నింద) చేసి ఉంటారు. ఈ విషయాన్ని ఒప్పుకోవాలి.

తొమ్మిది : మనం మోయలేని బరువు మన మీద మోపబడదు.

ఈ విశ్వ సూత్రం మీ సమస్యను మీరు పరిష్కరించగలిగే శక్తి, సామర్థ్యాలను పుష్కలంగా కలిగి ఉన్నారు అని చెబుతోంది. కాబట్టి ఏ సమస్య గురించి అయినా మనం కంగారు పడాల్సిన అవసరం లేదు.

పది: సమస్య మన శక్తి సామర్థ్యాలను వెలికి తీయడానికే వస్తుంది.

మనకు సమస్యలు ఎందుకు వస్తాయి ? అని అంటే సమస్యలు మనలోని శక్తి సామర్థ్యాలను బయటికి తీసి, మనకు ఎల్లప్పుడూ వాటిని అందుబాటులో ఉండేలా చేసేందుకే వస్తాయి.

మనలో అనంతమైన శక్తి సామర్థ్యాలు, తెలివి తేటలు, ప్రతిభ మొదలైనవన్నీ దాగి ఉన్నాయి. వాటిని ఉత్తేజితం చేసి మనకు అందుబాటులోకి తెచ్చుకుని ఉంచుకునేందుకే, మనం సమస్యలను ఆహ్వానిస్తూ ఉంటాం.

సమస్య యొక్క తీవ్రతను బట్టి మన శక్తి సామర్థ్యాలు బయట పడుతుంటాయి. ఎంత పెద్ద సమస్య అయితే అంత !

బాగా గుర్తుంచుకోండి, మీ సమస్యలను మీరే నిర్ణయించుకుని జన్మించారు. వాటిని పరిష్కరించుకోవాల్సింది మీరే. మీ సమస్యలను ఎవరూ తీర్చలేరు. మీకు కేవలం సహాయాలు, సూచనలు లభిస్తాయి. కానీ మొదట అడుగు వేయాల్సింది మీరే, మీ ప్రతి సమస్యకు పరిష్కారం

మీలోనే ఉంది. మీ అన్ని సమస్యలను పరిష్కరించాల్సింది, పరిష్కరించ గలిగేది మీరే, ఎవరి కోసమో ఎదురు చూడకండి !

పదకొండు : సమస్యను సమస్యగా చూడకండి, దానిని ఒక ఛాలెంజ్‌గా చూడండి.

గ్రాండ్ మాస్టర్స్ ఇలా అంటారు - "సమస్యను సమస్యగా చూడకండి, దానిని ఒక సవాలుగా స్వీకరించండి అని. ఎప్పుడైతే మీరు సమస్యను ఒక ఛాలెంజ్‌గా తీసుకుంటారో అప్పుడు మాత్రమే ఆ సమస్య పరిష్కరించబడడానికి కావల్సిన అవగాహన, శక్తి సామర్థ్యాలు మీ అంతరంలోంచి బయటికి వచ్చి మీలో స్మృతి పూర్వకంగా కలిసి పోతాయి. దానితో మీరు ఆటొమెటిక్‌గా ఆ సమస్యను పరిష్కరించ గలుగుతారు".

పన్నెండు : మీరు అనుభవించే బాధలను, మీరు నిజంగా క్లియర్ చేసుకోవాలని మీ లోపల, మీరు అనుకోవడం లేదు - దీనిని గ్రహించాలి.

మీరు ఏ, ఏ సమస్యలతో బాధ పడుతున్నారో వాటిని ఒక సారి ప్రశాంతంగా, స్పష్టంగా గుర్తు చేసుకోండి. మీరు అనుభవించే ఆ బాధలన్నీ ఎందుకున్నాయో మీకు తెలిస్తే ఆశ్చర్యపోతారు మీరు.

అవగాహన లేని వాళ్ళైతే ఒప్పుకోరు. కాని సత్యం, సత్యమే కదా ! ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా సత్యం - సత్యమే !

బాధలను అనుభవించడం వేరు, బాధలను క్లియర్ చేసుకుందాం అని అందుకు సిద్ధపడి శ్రమించడం వేరు !

మీ లోపలి విషయాలు మీకు తెలియకపోవడం చేతనే మీరు బాధలను అనుభవిస్తున్నారు. మీరు ధ్యానంలో కూర్చుని "నేను నా బాధలను తక్షణమే క్లియర్ చేసుకోవాలని అనుకోవటం లేదా ?! ఇది నిజమేనా" ?! అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకుని, సమాధానం కోసం నిరీక్షించండి. ఒక సిటింగ్‌లోనో లేక రెండు, మూడు సిటింగ్‌లలోనో మీకు ఖచ్చితంగా సమాధానం వచ్చి తీరుతుంది. ఆశ్చర్యపోతారు మీరు. బహుశా అవి ఈ కింది విధంగా ఉండే అవకాశం ఉంది. యథాతథంగా లేకపోయినా సారాంశం ఇలాగే ఉంటుంది.

"ఆ... ఉండనీ ఈ సమస్య ఇలాగే" !

"అయినా దీనిని ఇప్పుడే క్లియర్ చేయాల్సిన అవసరం ఏముంది" ?

"నా సమస్యలు ఎన్నటికీ క్లియర్ కావు" !

"సమస్యలు ఉంటే ఉండనీ, అవే ఎప్పుడో పోతాయి" !

"సమస్యలు పోతే పోతాయి లేకపోతే లేదు" !

"నేను ఇలాగే సమస్యలతో సతమతమవుతూ, బాధల్లో బతకాలి" !

"జీవితం అన్నాక సమస్యలుంటాయి, లేకపోతే ఎలా" ?!

"ఏదో... బతకడానికి అప్పుడప్పుడు కొంచెం, కొంచెం డబ్బులు, సౌకర్యాలు ఉంటే చాలు" !

ఈ విధంగా రక రకాలుగా లోపల భావాలు ఉంటాయి. ఈ విషయాన్ని మీరు గ్రహిస్తే చాలు. ఎందుకంటే సమస్యలు ఉండడం సమస్య కాదు, సమస్యను క్లియర్ చేసుకోవాలి అని అనుకోక పోవడం అసలు సిసలు సమస్య !

దయచేసి గ్రహించండి - మీరు మీ సమస్యలను క్లియర్ చేసుకోవాలి అని నిర్ణయించుకునే ముందు "సమస్యలను క్లియర్ చేసుకునే ఉద్దేశం నాకు లేదు, అందుకే సమస్యలు ఉన్నాయి" అని మీరు గుర్తించాలి, ఇది తప్పని సరి ! ఎందుకంటే, సమస్యలు మన అనుమతి లేనిదే మనలో ఉండలేవు. మన సమర్థనతోనే సమస్యలు మనలో ఉండగలుగుతున్నాయి. మనకు నిజంగా సమస్యలు క్లియర్ చేసుకునే ఉద్దేశం లేనందుకే అవి మనలో ఉంటూ మనల్ని వేధించగలుగుతున్నాయి, అని ఈ సత్యాలను మీరు ఒప్పుకుని, గ్రహించగలిగితే అప్పుడు క్షణాలలో, అవును నిజంగా నిజం ! కేవలం కొన్ని క్షణాలలో ఎలాంటి సమస్యనైనా శాశ్వతంగా క్లియర్ చేసేయవచ్చు.

ప్రియ మిత్రులారా ! మనం అత్యంత శక్తివంతులం. మనం వద్దు అనుకున్న సమస్యను క్షణంలో తీసివేసే అపారమైన శక్తి సామర్థ్యాలను మనం ఇప్పుడే కలిగి ఉన్నాం. కావాలనుకున్న దానిని తక్షణమే పొందగలిగే సర్వ శక్తి సామర్థ్యాలను కూడా మనమందరం ఇప్పుడే, రెడిమేడ్‌గా కలిగి ఉన్నాం. మన గురించి మనకు తెలియక అనవసరమైన బాధలు పడుతున్నాం. క్రమం తప్పని సాధన ద్వారా సులభంగా మన శక్తి సామర్థ్యాలను మన అందుబాటులోకి మనం తెచ్చుకోగలుగుతాం. ఇది సత్యం.

పదమూడు : జరుగుతున్న మోసాన్ని గుర్తించండి, ఆలోచనల ప్రవాహంలో కొట్టుకు పోకండి. వర్తమానంలో ఉండండి.

మీ ప్రతీ ఆలోచన యొక్క మూలాన్ని గుర్తించండి, దాని ఉత్పత్తి స్థానాన్ని కనిపెట్టండి. "మన ఆలోచనలే మన వాస్తవాలు" అనే విశ్వ సూత్రం ప్రకారం మన ఆలోచనలే మన జీవితంలో పరిస్థితులుగా సంభవిస్తూ ఉంటాయి. అయితే ఇక్కడ మనం కరెక్ట్‌గా, లోతుగా

విషయాన్ని తెలుసుకోవాలి. ఆలోచన అనేది పరిస్థితిగా మారడం అనేది సత్యమే, కానీ పరిస్థితిగా మారినపుడు ఆలోచన యొక్క మూలం, ఉత్పత్తి స్థానం ఏదైతే ఉందో దాని ప్రకారమే జరుగుతుంది.

మన ఆలోచనలే మన వాస్తవాలు కాదు

మన గుణాలే మన వాస్తవాలు.

మన ఆలోచనలే వాస్తవాలను సృష్టిస్తాయి. అయితే ఇక్కడ గుణం గురించి తెలుసుకుందాం. గుణం అంటే ఆలోచన యొక్క మూలం, ఉత్పత్తి స్థానం. గుణం ఒక రకంగా ఉంటుంది, ఆలోచన పూర్తిగా వేరే రకంగా ఉంటుంది. కానీ ఫలితం అంటే పరిస్థితి మాత్రం గుణానికి అనుగుణంగానే, అచ్చం గుణం లాగానే ఉంటుంది.

ప్రతి ఆలోచన యొక్క మూలాన్ని దర్శించండి. ఆలోచనల యొక్క ఉత్పత్తి స్థానాలను కనిపెట్టండి. మీ విస్మృతి, ఆలోచన అనే ముసుగు వేసుకుంటుంది. ముఖ్యంగా మీ అవసరాలకు సంబంధించిన "ఆలోచనా ముసుగులను" వేసుకుంటుంది, మీరేమో వాటిని పరిశీలించడంలో నిమగ్నులవుతారు. వాటితో మమేకమైపోతారు. జీవిత అవసరాలకు సంబంధించిన ఆలోచనలు కదా, అని మీరు ఆ ఆలోచనలతో కొనసాగుతూ ఉంటారు. ఏ విస్మృతి లేక ఏవైతే మీ జీవిత అవసరాలు తీరకుండా అడ్డం పడుతున్నాయో, అవే ఆ యొక్క ఆలోచనా ముసుగులను ధరిస్తాయి. "మన ఆలోచనలే మన వాస్తవాలు" ఈ విశ్వ సూత్ర ప్రకారం ఆలోచనే వాస్తవంగా మారుతుంది అనేది సత్యమే, అయితే నిజానికి జరిగేది వేరే. ఆలోచన ఒక రకంగా ఉంటుంది, ఆలోచన యొక్క ఉత్పత్తి స్థానమూ, మూలమూ అయిన గుణం మరొక రకంగా ఉంటుంది. ఆలోచనను బట్టి గుణాన్ని గుర్తించడం చాలా, చాలా కష్టం. మీరు ఎంత ప్రయత్నించినా, మీరెంతగా విశ్లేషించినా ఆలోచన యొక్క అసలు స్వరూపాన్ని బాహ్యంలో గుర్తించడం అసాధ్యం. ఆలోచన యొక్క అసలు సిసలు స్వరూపాన్ని అంతరంలో మాత్రమే యథాతథంగా గుర్తించగలం. కాబట్టి మనం గుర్తు పెట్టుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆలోచన వాస్తవంగా మారదు. ఆలోచన యొక్క మూలం ఏదైతే ఉందో అది వాస్తవంగా మారుతుంది. ఆలోచన యొక్క ఉత్పత్తి స్థానం ఏదైతే ఉందో అది మాత్రమే పరిస్థితిగా మారుతుంది. కాబట్టి మీ ఆలోచన యొక్క మూలం, ఉత్పత్తి స్థానం సరి కానిదైతే సరి కాని ఫలితం అంటే విఫలం అనేది పరిస్థితిగా మారుతుంది. మళ్ళీ మీరు మీ జీవిత అవసరాల గురించి ఆలోచించడం మొదలు పెడతారు, మళ్ళీ విఫలం అవుతారు. మీ పరిస్థితి అలాగే ఉంటుంది. మీ పరిస్థితులలో

ఏ మార్పు ఉండదు. మీరేమో ఆలోచనలలో మునిగి పోతారు. జీవిత అవసరాలు మిమ్మల్ని వేధిస్తూ ఉంటాయి, ఆలోచించకుండా ఉండలేని విధంగా మిమ్మల్ని కట్టడి చేస్తాయి. మీరు ఆ ప్రవాహంలో పడి కొట్టుకు పోతారు. ఈ విధంగా ఉంటే మీరు ఏ నాటికి ఒడ్డుకు రాలేరు. ఒడ్డున పడడానికి ఒకే ఒక మార్గం, అది మీ ప్రతి ఆలోచన యొక్క , మీ ప్రతి కోరిక యొక్క మూలాన్ని, ఉత్పత్తి స్థానాన్ని కనిపెట్టడమే. కాబట్టి మంచి ఆలోచనైనా, చెడు ఆలోచనైనా ముందు దాని ఉత్పత్తి స్థానాన్ని గుర్తించాలి. ఆలోచన యొక్క అసలు సిసలు మూలాన్ని గుర్తించాలి. చెడు ఆలోచనలు ఎలాగూ తమ స్వరూపాన్ని బయటపెడుతూ ఉంటాయి కాబట్టి వీటి పట్ల ప్రత్యేకమైన ఎరుకను కనబర్చాల్సిన అవసరం లేదు. మీ ఎరుక, మీ యొక్క ఫోకస్ అంతా కూడా మంచి ఆలోచనల పైననే ఉండాలి. జరుగుతున్న మోసాన్ని గుర్తించాలి. మీ ప్రతి ఆలోచన యొక్క మూలాన్ని కనిపెట్టండి. ఒక వేళ దాని యొక్క మూలం సరి అయినదే అయితే అది బలపడి ఫలిస్తుంది. ఒక వేళ దాని మూలం సరికానిదైతే అది క్లియర్ అవుతుంది.

పద్మాలుగు: మీ సమస్యలను మీరు అంతరంలో అడ్వాంటేజస్‌గా అనుకుంటున్నారు.

మనం శరీరాలం కాము, శరీరాలను ధరించిన ఆత్మ స్వరూపులం. అత్యంత శక్తివంతులం. మరి మన లోపల సమస్యలు ఎందుకున్నాయి ?

ఒక ప్రధానమైన విశ్వ సూత్రం ఇలా చెప్తోంది - "మన అనుమతి లేనిదే మన లోపల సమస్యలు ఉండలేవు" !

ఇది ఎంతో విస్మయాన్ని కలిగించే విషయం. మన అనుమతితో, మన సమర్థనతో మనల్ని వేధించే సమస్యలు మన లోపల ఉంటున్నాయి !

మరి మనం ఎందుకు సమర్థిస్తున్నాం ? ఎందుకు అనుమతించి, ఆశ్రయమిచ్చి వాటి చేత బాధపడుతున్నాం ? అంటే...

✪ మన లోపల అంతరంలో మన సమస్యలను, మనం సమస్యలుగా అనుకోవటం లేదు, వాటిని అడ్వాంటేజస్‌గా అనుకుంటూ ఉంటాం. వాటి వలన ఏదో లాభాన్ని, ఏదో సుఖాన్ని మనం అనుభవిస్తూ ఉంటాం. అందుకే మనం వాటిని వదులుకోవటం లేదు. ఇది సత్యం !

దిగ్భ్రాంతిని కలిగించే ఈ సత్యాన్ని అవగాహన చేసుకుంటే, మీరు మీ సమస్యలన్నింటి నుండి బయట పడినట్టే.

మీకు ఉన్న సమస్యల వలన మీరు ఏం అడ్వాంటేజ్ ఆశిస్తున్నారో కనిపెట్టండి. మీ సమస్యల నుండి ఏం లాభాలను, ఏ సుఖాలను పొందుతున్నారో తెలుసుకోండి. అప్పుడు ఆ సరి కాని

అడ్వాంటేజ్‌లు, సుఖాలు బయట పడతాయి. అప్పుడు ఆ సరి కాని అడ్వాంటేజ్‌లను, సుఖాలను మీరు తక్షణమే పూర్తిగా, నిజంగా వదిలేసాను అని భావించండి. వాటిని వదిలించే బాధ్యత మీలో ఉన్న మీ దైవత్వం తీసుకుని వాటిని శాశ్వతంగా తీసివేస్తుంది. దీనితో అన్ని సమస్యలు శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి.

పదిహేను : మీ పరిస్థితులు వ్యతిరేకంగా లేవు, మీరే పరిస్థితులకు వ్యతిరేకంగా ఉన్నారు.

ఈ సత్యాన్ని తక్షణమే గుర్తించండి. మీ పనులకు వ్యతిరేకమైన పరిస్థితులు ఎదురైనప్పుడు బయట కారణాలు వెతకకండి. మీరు చేసే పనులకు మీరు ఎంత అనుకూలంగా ఉంటే అంత అనుకూల పరిస్థితులు వస్తాయి, ఎంత వ్యతిరేకంగా ఉంటే అంత వ్యతిరేక పరిస్థితులు వస్తాయి.

మీ పరిస్థితులు, మీకు వ్యతిరేకంగా లేవు !

మీరే మీ పరిస్థితులకు వ్యతిరేకంగా ఉన్నారు !

ఈ విషయాన్ని మీరు గ్రహిస్తే మీ సమస్యలు క్లియర్ అయిపోయి, మీ పని లేక కోరిక లేక లక్ష్యం నెరవేరినట్టే ! మన పూర్తి చైతన్యంతో మనల్ని మనం సంపూర్ణంగా అంగీకరించి, మనం చేస్తున్న పనికి మనం పూర్తిగా, అనుకూలంగా మారాలి. మన పనిని మనమే 100%గా నెరవేరడానికి సమ్మతించాలి. అప్పుడు ఆ పని సులభంగా, వెంటనే సఫలం అవుతుంది.

"నేను నా ఉనికి మూలంలో నుండి నా లక్ష్యం సులభంగా, వెంటనే నెరవేరడానికి 100% సమ్మతించాను" - అని గాఢంగా భావించండి. "నా లక్ష్యం నిజానికి నెరవేరియే ఉంది, ఆల్‌రెడి నెరవేరి ఉన్న నా లక్ష్యాన్ని నేను 100% అనుమతించాను" అని గాఢంగా భావించండి.

అవి ఎలాంటి పరిస్థితులైనా సరే, తక్షణమే మీకు పూర్తి అనుకూలంగా మారి పోతాయి. ఆటొమెటిక్‌గా మీరు విజయాన్ని పొందుతారు.

పదహారు : "నేను తెలుసుకోవాల్సిందంతా తెలుసుకునే ఉన్నాను. ఏ ఎరుకను, ఏ అవగాహనను పొందితే తక్షణమే నా సమస్యలన్నీ క్లియర్ అయిపోతాయో, ఆ ఎరుకను + అవగాహనను నేను ఇప్పుడే కలిగి ఉన్నానని నాకు తెలుసు" - అని గాఢంగా భావించండి.

పదిహేడు : నా సమస్యలన్నింటినీ నేను తక్షణమే క్లియర్ చేసుకోగలుగుతాను - I can clear all my problems right now - అని గాఢంగా భావించండి.

పద్దెనిమిది : మీ అంతరంలో మీరు సమస్య యొక్క సరి అయిన పరిష్కారాన్ని అనుమతించాలి.

సమస్య యొక్క మూలం మీ లోపలే ఉంది అని గ్రహించండి. అలాగే పరిష్కారం కూడా మీ లోపలే ఉంది అని తెలుసుకోండి. ప్రతి సమస్య తనదైన, సహజమైన, సరియైన పరిష్కారాన్ని కలిగి ఉంటుంది. దానిని అనుమతించండి. అంతే కాని మీకు తోచినట్టుగా కాదు.

సాధారణంగా చాలా మంది ఏం చేస్తుంటారంటే సమస్య యొక్క సహజమైన, సరి అయిన పరిష్కారాన్ని అనుమతించరు. వారు కోరుకున్న రీతిలోనే పరిష్కారాన్ని ఆశిస్తూ ఉంటారు. మీ సమస్యలు పరిష్కారం కాకుండా ఉంటున్నందుకు ఇది కూడా ఒక కారణం. ఉదాహరణకు 2 × 2 = ? అనే ప్రశ్నకు జవాబు, 5 రావాలని మీరు ప్రయత్నిస్తున్నారని అనుకోండి, ఎలా ఉంటుంది పరిస్థితి ? ఎప్పటికైనా జవాబు దొరుకుతుందా ?... 2 × 2 = ? అనే ప్రశ్నకు సహజమైన, సరి అయిన జవాబు 4 . దీనిని మీరు అనుమతించాలి.

మీ సమస్యకు పరిష్కారం ఒకటి ఉంటుంది. మీరు మరేదో పరిష్కారాన్ని ఆశిస్తూ ఉంటారు. ఇది సరి కాదు. కాబట్టి సమస్య యొక్క సహజమైన, సరి అయిన పరిష్కారాన్ని అనుమతించండి.

ఇప్పుడు....

✪✪✪ ప్రశాంతంగా కళ్ళు మూసుకుని కూర్చున్న తర్వాత ఇలా అనుకోవాలి "నా సమస్య యొక్క సరియైన, తక్షణ పరిష్కారాన్ని అనుమతించాను" అని గాఢంగా అనుకోవాలి. ఇప్పుడు ప్రేమగా, ఎరుకతో సాక్షిగా వస్తున్న ఆలోచనలను గమనిస్తూ ఉండాలి. ప్రేమ ఎరుక సాక్షి అంతే ! ఈ భావాలతో ఉండాలి. మీ లోపల అచేతనంలో లేక సుషుప్తంలో ఉన్న మూల కారణం మీ ముందుకు వస్తుంది. అప్పుడు కూడా ఎలాంటి ప్రతి స్పందనను ఇవ్వకుండా ప్రేమతో, ఎరుకతో సాక్షిగా ఉండాలి. అంతే, ఆ మూలం సరి చేయబడుతుంది. లేదా క్లియర్ అవుతుంది. చిత్రంగా మీరు ఆ సమస్య నుండి బయట పడతారు.

ఈ సాధన చేస్తున్నప్పుడు సహనంతో ఉండాలి. ఒక సిటింగ్‌లో కాకపోతే సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు చేస్తూనే ఉండాలి. ఎప్పుడో అది జరుగుతుంది. కానీ జరుగుతుంది, జరిగి తీరుతుంది ఖచ్చితంగా ! సాధనలో కూర్చున్నప్పుడు ఏం వినపడితే దానిని వినాలి, ఏం కనబడితే దాన్ని చూడాలి. అంతర్ ప్రకృతిని ప్రవహించనివ్వాలి. లోపల ఎన్నెన్నో జరుగుతాయి, ఎలాంటి ప్రతి స్పందన చేయకూడదు. శబ్దాలు, మాటలు, నవ్వులు మొదలైనవి వినిపించే అవకాశం ఉంది. దృశ్యాలు ఏవైనా కనపడే అవకాశం ఉంది. ఏమీ కాదు, భయపడాల్సిన పని లేదు. అంతా శ్రేయస్కరంగా జరుగుతుంది. సాధనలో ఇవన్నీ మామూలే, మీరు మాత్రం ఎలాంటి ప్రతి స్పందన చేయకుండా సాక్షిగా ఉండాలి. ప్రేమ ఎరుక సాక్షి అంతే ! ఈ ప్రేమ ఎరుక సాక్షి భావనలే ఆ మూలాన్ని తీసేస్తాయి, సరి చేస్తాయి. ఇది సహజంగా జరిగే సృష్టి విధి విధానం అంతే ! **మీ ఎరుక నెగెటివ్(లోపం లేక సమస్య) పైన ప్రసరిస్తే అది శాశ్వతంగా క్లియర్ అవుతుంది. ఒక వేళ మీ ఎరుక పాజిటివ్ గుణాలపై ప్రసరిస్తే అవి బలపడతాయి.**

ఆ సమస్య యొక్క మూలం లోపల, విస్మృతిలో ఉంటుంది. కేవలం మీ ఎరుకలో లేనందుకే అది అక్కడ ఉంది. ప్రేమతో, ఎరుకతో ఎలాంటి ప్రతి స్పందన చేయకుండా సాక్షిగా ఆ సమస్య మూలాన్ని చూసిన వెంటనే మీ "ఎరుక" దానిపై ప్రసరిస్తుంది. మీ ఎరుకయే ఆ సమస్య మూలాన్ని తీసి వేస్తుంది. మీ ఎరుకయే ఆ గాయాన్ని మాన్చివేసే దివ్య ఔషధం. అయితే అది ఎదురుపడే వరకు సహనంతో ఉండాలి. విసుగును, కోపాన్ని ప్రకటించవద్దు. మీరెంత సహనంతో ప్రశాంతంగా ఉంటే ఆ సమస్య అంత త్వరగా పరిష్కారం అవుతుంది. ప్రేమ ఎరుక సాక్షి అని మనసులో అనుకుంటూ ఉండండి, ఆ భావాలను కలిగి ఉండండి. చాలు, మిగతా పని అంతా ఆటోమెటిక్‌గా అయిపోతుంది.

ఈ విధంగా కళ్ళు మూసుకుని సమస్య పట్ల ప్రేమ ప్రకటిస్తూ ఓపికగా నిరీక్షిస్తూ ఉంటే ! ఆ క్షణం వస్తుంది. ఠక్కున మీకు సమస్య యొక్క మూల కారణం ఏమిటో తెలుస్తుంది. చాలా క్లియర్‌గా తెలుస్తుంది. సమస్య యొక్క మూల కారణం తెలియడంతో, సమస్య అర్థం అవుతుంది. మీలో ఒక వికాసం జరుగుతుంది. ఒక అవగాహన సంభవిస్తుంది. మీకు ఎంత విశ్రాంతిగా అనిపిస్తుందంటే, మీరు ఆశ్చర్యపోతారు. లోపల పరివర్తనం జరిగింది. పరిష్కారం లభించింది. సమస్య నుండి మీరు విముక్తం అయినట్టు మీకు అత్యంత స్పష్టంగా తెలుస్తుంది. మీరు మెల్లగా కళ్ళు తెరుస్తారు. ఎప్పుడో ఈ పని చేసి ఉంటే బాగుండేది అని అనుకుంటారు.

గుర్తుంచుకోండి, సమస్య యొక్క మూలాన్ని తెలుసుకుని, దాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా మాత్రమే విముక్తి లభిస్తుంది. సమస్య యొక్క మూలం "లోపల, అంతరంగం(inner)లో" ఉంటుంది. అంతరంగం అంటే మీరు కళ్ళు మూసుకున్నప్పుడు ఏదైతే ఉంటుందో అదే అంతరంగం. కళ్ళు తెరిస్తే "బయట", కళ్ళు మూస్తే "లోపల" ! ✪ ✪ ✪

తగిన పరిపక్వత లేనప్పుడు భయం కలగడం సహజం ! వికాసం కలిగినప్పుడు ధైర్యం ఆటొమెటిక్‌గా ఉద్భవిస్తుంది ! ఆ వికాసం, ఆ ఎదుగుదల, ఆ అవగాహన, ఆ పరిణితి, ఆ వివేకం కోసమే ఇన్ని తిప్పలు !

5. పాజిటివ్ సాధన

ఎప్పుడు వీలైతే అప్పుడు ఏదో ఒక పాజిటివ్ వాక్యాన్ని భావనాత్మకంగా అనుకుంటూనే ఉండాలి. ముందు ఆత్మ విజ్ఞాన పుస్తకాలను బాగా చదివి అవగాహన చేసుకోండి. అప్పుడు వచ్చిన అవగాహనతో మీకు అవసరమైన ఏదో ఒక పాజిటివ్ వాక్యాన్ని తయారు చేసుకుని దానిలోని భావనను ఫీల్ అవుతూ ఉండండి.

మీరు ఖాళీగా ఉన్నప్పుడు, ప్రయాణాలు చేస్తున్నప్పుడు, మీకెప్పుడు వీలైతే అప్పుడు ఈ సాధన చేసుకోవచ్చు. చాలా అద్భుతమైన ఫలితాలను ఇస్తుంది ఈ సాధన.

All The Very Best !

✪ ✪ ✪

నిరంతరం పాజిటివ్‌గా ఆలోచించడం అనేది మహా గొప్ప అచీవ్‌మెంట్ !
నిరంతర పాజిటివ్ దృక్పథం అనేది నిజంగా మహా గొప్ప దివ్య స్థితి !

6. ధ్యాన సాధన - 5 విధానం

✪✪✪

మీరు ఎంత తీవ్రతతో, ఎంత గాఢంగా ప్రకటిస్తే అంత త్వరగా ఆపద తొలగి పోతుంది. అది ఎంత పెద్దదైనా సరే ! అది ఎలాంటిదైనా సరే ఖచ్చితంగా తొలగి పోతుంది.

అయితే.... ఆపదలు రాక ముందే జాగ్రత్త పడటం ఎలాగంటే.... నిత్యం క్రమం తప్పకుండా ధ్యాన సాధన చేస్తూ, ఆత్మ విజ్ఞాన సూత్రాలను ఆచరిస్తూ మరియు వీలైనంత ఎక్కువగా నిస్వార్థ "సేవ" చేస్తూ ఉండాలి.

All The Very Best !

7. ధ్యాన సాధన

భయం

భయం గురించి తెలుసుకుంటే మీరు ఆశ్చర్యపోతారు. భయం గురించి పూర్తిగా తెలుసుకుంటే, భయంకరంగా నవ్వుతారు. మీ చుట్టూ ఉన్నవారు భయపడేలా !

భయాలు 7 రకాలుగా ఉంటాయి అవి :

1. భయం - సురక్ష

2. భయం - తెలియని తనం

3. భయం - మనం ఏర్పరచుకున్న అభిప్రాయం

4. భయం - మన గత జన్మలలోనో లేక ఈ జన్మలోనో మనకు జరిగిన ప్రమాదాల వలన ఏర్పడేది.

5. భయం - జడ్జ్‌మెంట్ లేక గత కర్మల వలన ఏర్పడింది.

6. భయం అని అంటే, మీలోని నెగెటివ్ కోరిక యొక్క ప్రభావం.

7. వాస్తవానికి భయం అనేది ఒకటే ఉంటుంది. అదే ప్రాణ భయం. ఇదే ఎన్నో రకాలుగా ప్రకటం అవుతూ ఉంటుంది. అన్ని రకాల భయాలు కేవలం ప్రాణ భయానికి సంబంధించినవే ! ఒక్క మొదటి రకం తప్ప !

మొదటి రకమైన భయం సురక్షా పూర్వకమైనది. ఇది జీవితాన్ని రక్షిస్తుంది. ఇది మన "రక్షక్" అన్న మాట !

జన్మ తీసుకునే ముందు ప్రతీ ఆత్మ ఒక నిర్దిష్ట సమయాన్ని జీవిత కాలంగా నిర్ణయించుకుని వస్తుంది. దీనినే మనం ఆయుష్షు అని అంటాం. తను ఏమేం పాఠాలు నేర్చుకోవాలని ఎంపిక చేసుకుందో వాటిని నేర్చు కోడానికి ఎంత సమయం పడుతుందో "నిపుణులను" సంప్రదించి,

" నేను ఇంత కాలం జీవించాలి" అని నిర్ణయించుకుంటుంది. తను నేర్చు కోవాలనుకున్న పాఠాలన్నీ నేర్చుకునే వరకు "జన్మ అర్థాంతరంగా" ముగిసి పోకుండా ఉండేందుకు "ఒక ఎరుకను", ఆత్మ పెట్టుకుని వస్తుంది. దీనిని భయం అని అనుకుంటారు తెలియని వాళ్ళు. వాస్తవానికి ఇది భయం కాని భయం. భయం రూపంలో ఉన్న "జాగ్రత్త లేక అప్రమత్తత".

ఎందుకు అంటే, మీకు భయం లేకపోతే అనవసర సాహసాలు చేసి ప్రాణాలు పోగొట్టుకుంటారు. భయం లేనపుడు ఈ పని చేయాలా, వద్దా అని ఆలోచించడం అనేది ఉండదు. ఏదో చేసేస్తారు, ఆ తర్వాత మీ విగత శరీరం ప్రక్కన మీరు నిలబడి ఉంటారు... ఆత్మగా ! సూక్ష్మ శరీరం (Astral Body) తో ! కాబట్టి ఈ భయం అవసరమైనది. ఇది జీవితానికి సురక్షా చక్రంగా పనిచేస్తుంది. దీనితో సమస్య లేదు. ఇది ఉండి తీరవలసిందే ! ఈ భయం అనేది మనల్ని ఎప్పుడూ అప్రమత్తంగా ఉంచుతూ శరీరాన్ని, మనల్ని కాపాడుతుంది. కాబట్టి ఈ సురక్షా పూర్వకమైన భయానికి ధన్యవాదాలను, ప్రేమను ప్రకటిద్దాం ! నిజానికిది భయం కాదు సురక్ష లేక జాగ్రత్త లేక అప్రమత్తత !

రెండవ రకమైనది "తెలియని తనం వలన ఏర్పడే భయం" ! అనుభవం లేక పోవడం వలన ఏర్పడే భయం ! అంటే ఉదాహరణకు మీరు కాలేజీలో మొదటి సారి అడుగు పెడుతున్నప్పుడు కలుగుతుంది, మొదటి ఉద్యోగంలో చేరుతున్న మొదటి రోజు కలుగుతుంది. ఏదైనా కొత్త పని చేస్తున్నప్పుడు కలుగుతుంది ఈ భయం. "అనుభవం" రావడంతోనే ఈ "భయం" ఆటోమెటిక్‌గా పోతుంది. దీనితో కూడా ఎలాంటి ప్రాబ్లమ్ లేదు కాబట్టి దీనికి ప్రేమను ప్రకటిద్దాం.

మూడవ రకమైన "భయం" ఏమిటంటే, మనకై మనమే సృష్టించుకునే "భయం" !

ఉదాహరణకు పిక్నిక్‌కు వెళ్ళినపుడు ఎవరో నదిలో మునిగి చనిపోతూ ఉన్న దృశ్యం చూసినపుడు, మనకు తెలియకుండానే నది పట్లా, నీళ్ళ పట్లా ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటాం. ఇలా ఎవరికో ఏదో జరగడం చూసి, లేదా వినడం వలన, లేదా చదవడం వలన మనకై మనం ఏర్పరుచుకున్నది మూడవ రకమైన "భయం" !

నాలుగవ రకమైన భయం స్వయంగా మనకు కలిగినది. ఈ జన్మలోనో, గత జన్మలోనో ఏవైనా సంఘటనల వలన ఏర్పడేది.

అయిదవ రకమైన భయం ఎవరైనా భయపడే వాళ్ళను చూసి ఎగతాళి చేసినప్పుడు లేక ఏవైనా సరి కాని పనులు చేసి ఇతరులను భయపెట్టినప్పుడు ఏర్పడుతుంది. దీనిని కూడా తీసి వేయవచ్చు.

ఈ మూడవ రకం, నాలుగవ రకం మరియు అయిదవ రకమైన భయాలు తమంతట తాము పోవు. రెండవ రకమైన భయం తనంతట తాను పోతుంది. అనుభవం రాగానే పోతుంది. కానీ ఈ

మూడవ రకమైన భయాలను, నాలుగవ రకమైన భయాలను మరియు అయిదవ రకమైన భయాలను మనం ప్రయత్న పూర్వకంగా తీసివేసుకోవాలి. సెల్ఫ్ కౌన్సిలింగ్ నిర్వహించుకుని, సెల్ఫ్ బూస్టింగ్ ఇచ్చుకుని మనమే వీటిని తీసివేసుకోవాలి. ఇదేమంత పెద్ద విషయం కాదు.

ఇలాంటి భయాలను తీసివేయటం ఎలా ?

కళ్ళు రెండూ మూసుకుని హాయిగా కూర్చోండి. ఏ "భయాన్ని" తీసివేయాలి అని అనుకుంటున్నారో దానిని ప్రశాంతంగా, ప్రేమతో పిలవండి. స్థిరంగా కూర్చోండి. మీకు ఏమీ కాదు. మీకు రక్షగా సాక్షాత్తు సర్వస్వమే మిమ్మల్ని ఆవరించి ఉంటుంది. ఎంతో మంది "పరమాత్మ స్వరూపులైనటువంటి మాస్టర్స్" మీ చుట్టూ అదృశ్య రూపాలలో ఉంటారు. తమ ఆశీర్వాద, అనుగ్రహాలను, దీవెనలను, గైడెన్స్‌ను ఇస్తూ ఉంటారు. మీరు సంపూర్ణ సురక్షా వలయంలో ఉంటారు.

మీ భయాలను సూటిగా పిలవండి, ప్రశాంతంగా, ప్రేమగా ! ఇప్పుడు ఆ భయం పట్ల "ప్రేమను ప్రకటించండి". పూర్తి ఎరుకతో సాక్షిగా ఉండండి.

ఆ భయాన్ని ఉద్దేశిస్తూ, దాన్ని పూర్తిగా గుర్తు చేసుకుంటూ ప్రేమగా, ఎరుకతో సాక్షితత్వాన్ని ప్రకటిస్తూ ఉండాలి.

"ప్రేమ, ఎరుక, సాక్షి" అంతే !

మిమ్మల్ని వేధిస్తున్న భయం యొక్క మూలం బయట పడేవరకు సహనంతో, ప్రశాంతంగా, ఎరుకతో సాక్షిగా ఉండాలి. క్రమం తప్పని సాధన మీరు ఈ విధంగా చేస్తూ ఉంటే, ఎప్పుడో ఒకప్పుడు ఆ భయానికి మూల కారణం ఏదైతే ఉందో అది బయట పడి మీ ముందుకు వస్తుంది. అప్పుడు మీరు ఏ మాత్రం స్పందించకుండా, ఎలాంటి ప్రతి క్రియ చేయకుండా పూర్తి ఎరుకతో సాక్షిగా దాన్ని చూడాలి. అప్పుడది ఆటొమెటిక్‌గా క్లియర్ అయిపోతుంది.

బాగా గుర్తుంచుకోండి - ప్రేమ భావనతో, సంపూర్ణమైన ఎరుకతో సాక్షిగా ఉండాలి. ఏదైతే మీకు కనబడుతుందో దాన్ని ఊరికే అలా చూడాలి. మానసికంగా ఎలాంటి ప్రతి క్రియను చేయకూడదు. అక్కడ, అప్పుడు ఏమైనా కనపడని, మీకు ఏమీ కాదు. అనవసరంగా భయపడి మీరు ఏదో చేయడానికి ప్రయత్నిస్తే అది మళ్ళీ దాక్కుంటుంది. గ్రహించండి, దాని పట్ల ప్రేమ భావన, ఎరుక, సాక్షిత్వం లేకుండా ఉన్నందుకే అది మీ లోపలే ఉన్నా, మీకు ఎదురు పడడం లేదు. మీరు ఎప్పుడైతే ప్రేమగా ఎరుకతో సాక్షి భావన కలిగి ఉంటారో సరిగ్గా అప్పుడే అది మీ ముందు ప్రత్యక్షం అవుతుంది.

వాస్తవానికి అది అక్కడే ఉంటుంది. ప్రేమగా, ఎరుకతో, సాక్షిత్వం లేనందుకే అది కనపడకుండా ఉంటుంది. ఎప్పుడైతే మీరు ఎలాంటి ప్రతిస్పందన చేయకుండా ప్రేమగా, ఎరుకతో, సాక్షిగా ఉంటారో, అప్పుడు మీరు ఆశ్చర్యపోయే విధంగా ఆ భయం సులభంగా, సరళంగా, శీఘ్రంగా, శాశ్వతంగా మాయం అవుతుంది.

ఆ భయం పోయిందో లేదోనని మీకు ఎవరూ నచ్చచెప్పాల్సిన అవసరం ఉండదు. సుస్పష్టంగా, ఎంతో ఘనంగా మీకే తెలుస్తుంది, "ఇక ఇప్పుడు నాకు ఆ భయం లేదు" అని !

ప్రియ మిత్రులారా ! భయాలను సూటిగా ఎదుర్కోవాలి ! వాటి ముసుగులు తొలగించాలి ! ఈ విశ్వంలో మనం దేనికి భయపడాల్సిన అవసరం లేదు !

✪ మనమే దేవుళ్ళం ! మనకెందుకు భయం ?! ✪

6వ రకమైన భయం - మీలో ఉన్న నెగెటివ్ కోరిక యొక్క ప్రభావం వలన మీకు భయం కలుగుతుంది. ఉదాహరణకు, మీకు ఆక్సిడెంట్ అవుతుందేమోనని భయం కలుగుతూ ఉందంటే - మీలోపల మీకు తెలియకుండా మీరే, మీకు ఆక్సిడెంట్ జరగాలని కోరుకుంటున్నారని దాని అర్థం. మీకు ఏదైనా ఆపద వస్తుందేమోనని మీకు భయం కలుగుతుందంటే... మీలోపల మీరు, మీకు ఆపద రావాలని కోరుకుంటున్నారని అర్థం. మీకు నష్టం వస్తుందేమోనని మీకు భయం వేస్తుందంటే... మీరు లోపల మీకు నష్టం కలగాలని కోరుకుంటున్నారని అర్థం. ఈ విధంగా మీకు ఎలాంటి భయం వేస్తుంటే, మీ లోపల మీరు అలాంటి కోరికను కోరుకుంటున్నారు అని అర్థం చేసుకోండి. ఈ భయాలను తీసివేయడం ఎలా :- మీకు ఏ భయం కలుగుతుందో ఒక సారి చెక్ చేసుకోండి, ఆ తర్వాత "నేను ఇది జరగాలని కోరుకోవటం లేదు, నేను దీన్ని అనుమతించను, నేను దీన్ని క్యాన్సల్ చేసాను, నేను దైవాన్ని, నేను మంచి వాడిని లేక దానిని, నాకేం కాదు" అని పదే పదే అనుకోండి. ఆ భయం యొక్క మూలమైన నెగెటివ్ కోరిక వెంటనే, పూర్తిగా, శాశ్వతంగా, సురక్షితంగా మీలో నుండి వెళ్ళిపోతుంది. మీలోని నెగెటివ్ కోరిక వెళ్ళిపోయినప్పుడు, దాని ప్రభావమైన భయం కూడా వెళ్ళి పోతుంది. గుర్తుంచుకోండి, భయం అనే దానికి ఒక ఉనికి లేదు. భయం అనేది నెగెటివ్ కోరిక యొక్క ప్రభావం లేదా ప్రకంపన లేదా ప్రతిబింబం ! భయానికి మూలం నెగెటివ్ కోరిక ! కాబట్టి భయానితో పోరాడటం వృథా ! భయం యొక్క మూలమైన నెగెటివ్ కోరికను క్యాన్సల్ చేసేస్తే దానితో పాటు దాని ప్రభావమైన భయం కూడా తొలగి పోతుంది.

భయం అనేది మీలో ఉన్న నెగెటివ్ కోరిక యొక్క ప్రభావం లేదా ప్రకంపన లేదా ప్రతిబింబం.

Fear is nothing but the reflection of your "negative wish". - Seth

ఈ భయం అనే దానికి ఒక ఉనికి అంటూ లేదని తెలుసుకోండి. ఉదాహరణకు, మీకు దగ్గరలో ఒక చెడిన పదార్థం ఉందనుకోండి. అప్పుడు ఆ చెడిన పదార్థం నుండి మీకు చెడు వాసన వస్తూ ఉంటుంది. ఈ చెడు పదార్థం యొక్క ప్రభావమే చెడు వాసన. ఇప్పుడు మీరు ఆ చెడు వాసనను తొలగించాలంటే, ఆ చెడు వాసనతో ఎలా పోరాడుతారు ? ఆ చెడు వాసనతో మీరెంత పోరాటం చేసినా దాన్ని మీరు తీసివేయలేరు. అది మీకు దొరకదు. మీకు లొంగదు. ఎందుకంటే, ఆ చెడు వాసనకు ఒక ఉనికి అంటూ లేదు కాబట్టి మీరు దాన్ని ఏమీ చేయలేరు. మీరు చెడు వాసనను తీసి వేయాలంటే, దానికి మూలమైన చెడు పదార్థాన్ని తీసివేయాలి. అప్పుడు ఆ చెడు పదార్థంతో పాటు, దాని ప్రభావమైన చెడు వాసన కూడా తొలగిపోతుంది. సరిగ్గా ఇలాగే... మీరు భయాన్ని తీసి వేయాలి అని అనుకుంటే, దాని మూలమైన నెగెటివ్ కోరికను తీసేస్తే అప్పుడు దాని ప్రభావమైన భయం కూడా తొలగిపోతుంది. భయం అనేది నెగెటివ్ కోరిక యొక్క ప్రతిబింబం. కాబట్టి ప్రతిబింబం యొక్క మూలాన్ని తీసేస్తే ప్రతిబింబం కూడా మాయం అవుతుంది.

ఏడవ రకమైన భయం కేవలం నిరంతర ఆత్మ విజ్ఞాన అభ్యాసం + క్రమం తప్పని విశేషమైన ధ్యాన సాధన ద్వారా మాత్రమే తొలగి పోతుంది.

అవి ఏ రకాలైన భయాలైనా సరే - ఈ క్రింది సూత్రాన్ని సాధన చేయండి అత్యంత శీఘ్రంగా, సురక్షితంగా తొలగి పోతాయి.

"నేను ఈ భయాలను జయించాను" !

All The Very Best !

దేవుడి కోసం చేస్తున్నాము అని బాంబులు పెట్టి ప్రజలను చంపే వాళ్ళు కూడా తమను తాము ధర్మాత్ములుగానే ఫీలవుతారు. లేకపోతే వాళ్ళు ఆ పనులు చేయలేరు. ఎవరైనా సరే.. నేను చేసేది సరి అని అనుకున్నప్పుడే ఏదైనా చేయగలుతారు. ఇప్పటి వరకు ప్రపంచంలో జరిగిన ఘోరాలన్నీ కూడా "మంచి" అనే ముసుగు వేసుకునే జరిగాయి. హిట్లర్ కూడా నేను చేసేది మంచే అనుకున్నాడు. అమెరికా కూడా మేము మంచే చేస్తున్నాం అనుకుని రెండు ఆటం బాంబులను జపాన్ మీద వేసింది. ప్రతీ దుర్మార్గం కూడా మంచి ముసుగు వేసుకుంటే కానీ జరగదు. మంచి అనేది ఎంత శక్తి వంతమైనదంటే.. నేను మంచి వాడిని, నేను చేసేది సరి అని అనుకోగానే ఆ పని చేయగలుగుతారు. నేను చేసేది చెడు అని అనుకుంటే ఎవరు కూడా చెడు చేయలేరు. జరిగేది మంచి పేరుతో చెడా ? లేక మంచి పేరుతో అసలైన మంచియేనా ? అనేది ఆత్మ విజ్ఞానులు మాత్రమే సరిగ్గా చెప్పగలుగుతారు.

8. ధ్యాన సాధన

ప్రేమ ఎరుక సాక్షి ధ్యానం

Love Awareness Witness Meditation

[LAW Meditation]

ధ్యానం చేసే విధానం

ముందు పేజీలలో వివరించిన విధంగా ధ్యానంలో కూర్చోండి.

హాయిగా ధ్యానంలో కూర్చోండి. 100% చైతన్య స్పృహతో, ఎరుకతో ఉండాలి. సాక్షిగా ఉండాలి. సాక్షిగా ఉండటం అంటే ఎలాంటి ప్రతిస్పందనను చేయక పోవటం. అయితే ఎరుకతో ఉన్నప్పుడే సాక్షి తత్వం వస్తుంది. ఎరుకతో ఉన్నప్పుడు మాత్రమే మీరు సాక్షిగా ఉండగలుగుతారు.

మీలో ఉన్న ఆందోళనలు మీవి కావు అని గుర్తించండి, కాసేపు అన్ని మర్చిపోండి. ప్రశాంతంగా ఉండండి. ఆహ్లాదకరంగా ఉండండి. సాధన పట్ల ప్రేమను కలిగి ఉండండి.

ఇప్పుడు మీ ఆలోచనలను గమనించండి. సహజంగా వాటంతట అవే వస్తున్న ఆలోచనలను గమనించండి. జాగ్రత్త !!! నేను ఆలోచించమని చెప్పటం లేదు. మీ ప్రమేయం ఏమీ లేకుండా వాటంతట అవే, అప్రయత్నంగా వస్తున్న ఆలోచనలను గమనించండి.

ప్రతి ఆలోచన యొక్క మూలాన్ని దర్శించండి. ఆలోచనల యొక్క ఉత్పత్తి స్థానాలను కనిపెట్టండి. మీ విస్మృతి, ఆలోచన అనే ముసుగు వేసుకుంటుంది. ముఖ్యంగా మీ అవసరాలకు సంబంధించిన "ఆలోచనా ముసుగులను" వేసుకుంటుంది, మీరేమో వాటిని పరిశీలించడంలో నిమగ్నులవుతారు. వాటితో మమేకమైపోతారు. జీవిత అవసరాలకు సంబంధించిన ఆలోచనలు కదా, అని మీరు ఆ ఆలోచనలతో కొనసాగుతూ ఉంటారు. ఏ విస్మృతి లేక ఏవైతే మీ జీవిత అవసరాలు తీరకుండా అడ్డం పడుతున్నాయో, అవే ఆ యొక్క ఆలోచనా ముసుగులను ధరిస్తాయి. "మన ఆలోచనలే మన వాస్తవాలు" ఈ విశ్వ సూత్ర ప్రకారం ఆలోచనే వాస్తవంగా మారుతుంది అనేది సత్యమే, అయితే నిజానికి జరిగేది వేరే. ఆలోచన ఒక రకంగా ఉంటుంది, ఆలోచన యొక్క ఉత్పత్తి స్థానమూ, మూలమూ అయిన గుణం, నమ్మకం మరొక రకంగా ఉంటుంది. ఆలోచనను బట్టి గుణాన్ని గుర్తించడం చాలా, చాలా కష్టం. మీరు ఎంత ప్రయత్నించినా, మీరెంతగా విశ్లేషించినా ఆలోచన యొక్క అసలు స్వరూపాన్ని బాహ్యంలో గుర్తించడం అసాధ్యం. ఆలోచన యొక్క అసలు సిసలు స్వరూపాన్ని అంతరంలో

మాత్రమే యథాతథంగా గుర్తించగలం. కాబట్టి మనం గుర్తుపెట్టుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆలోచన వాస్తవంగా మారదు. ఆలోచన యొక్క మూలం ఏదైతే ఉందో అది వాస్తవంగా మారుతుంది. ఆలోచన యొక్క ఉత్పత్తి స్థానం ఏదైతే ఉందో అది మాత్రమే పరిస్థితిగా మారుతుంది. కాబట్టి మీ ఆలోచన యొక్క మూలం, ఉత్పత్తి స్థానం సరికానిదైతే సరికాని ఫలితం అంటే విఫలం అనేది పరిస్థితిగా మారుతుంది. మీరు మీ జీవిత అవసరాల గురించి ఆలోచించడం మొదలు పెడతారు, మళ్ళీ విఫలం అవుతారు. మీ పరిస్థితి అలాగే ఉంటుంది. మీ పరిస్థితులలో ఏ మార్పు ఉండదు. మీరేమో ఆలోచనలలో మునిగిపోతారు. జీవిత అవసరాలు మిమ్మల్ని వేధిస్తూ ఉంటాయి, ఆలోచించకుండా ఉండలేని విధంగా మిమ్మల్ని కట్టడి చేస్తాయి. మీరు ఆ ప్రవాహంలో పడి కొట్టుకుపోతారు. ఈ విధంగా ఉంటే మీరు ఏ నాటికి ఒడ్డుకు రాలేరు. ఒడ్డున పడడానికి ఒకే ఒక మార్గం, అది మీ ప్రతి ఆలోచన యొక్క, మీ ప్రతి కోరిక యొక్క మూలాన్ని, ఉత్పత్తి స్థానాన్ని కనిపెట్టడమే. కాబట్టి మంచి ఆలోచనైనా, చెడు ఆలోచనైనా ముందు దాని ఉత్పత్తి స్థానాన్ని గుర్తించాలి. ఆలోచన యొక్క అసలు సిసలు మూలాన్ని గుర్తించాలి. చెడు ఆలోచనలు ఎలాగూ తమ స్వరూపాన్ని బయటపెడుతూ ఉంటాయి కాబట్టి వీటి పట్ల ప్రత్యేకమైన ఎరుకను కనబర్చాల్సిన అవసరం లేదు. మీ ఎరుక, మీ యొక్క ఫోకస్ అంతా కూడా మంచి ఆలోచనల పైననే ఉండాలి. జరుగుతున్న మోసాన్ని గుర్తించాలి. మీ ప్రతి ఆలోచన యొక్క మూలాన్ని కనిపెట్టండి. ఒక వేళ దాని యొక్క మూలం సరి అయినదే అయితే అది బలపడి ఫలిస్తుంది. ఒక వేళ దాని మూలం సరికానిదైతే అది క్లియర్ అవుతుంది.

ఎరుకతో, సాక్షిగా మీ ఆలోచనలను గమనించడం మొదలు పెట్టండి. అవి ఎలాంటి ఆలోచనలైనా సరే ! మంచివి, చెడ్డవి, వ్యర్థమైనవి, భయంకరమైనవి, జుగుప్సాకరమైనవి, ఆహ్లాదకరమైనవి, ఆనందకరమైనవి, గొప్పవి అవి ఎలాంటి ఆలోచనలైనా సరే, అవి ప్రాథమికంగా ఆలోచనలే ! కాబట్టి ఏ ఆలోచనకూ ప్రతి స్పందించకుండా ఎరుకతో, సాక్షిగా ఉండండి అది ఎలాంటి ఆలోచనైనా సరే, మీరు మాత్రం ఎరుకతో, సాక్షిగా ఉండాలి. నాలుగు రోడ్ల కూడలిలో ఒక విగ్రహం ఎలా ఉంటుందో అలా ఉండాలి. తన చుట్టూ ఎన్నో సంఘటనలు జరుగుతూ ఉన్నా, ఏం జరుగుతూ ఉన్నా, ఎన్ని వందల వాహనాలు వస్తూ పోతూ ఉన్నా ఆ విగ్రహం దేనిని పట్టించుకోకుండా ఎలా సాక్షిగా ఉంటుందో - అలా ఉండాలి.

లోపల ఏదైనా కనబడవచ్చు, ఏదైనా వినబడవచ్చు, ఏదో జరుగుతున్నట్టు అనిపించవచ్చు. మీరు ప్రమాదంలో ఉన్నట్టు అనిపించవచ్చు లేదా మీరు పడిపోతున్నట్టు అనిపించవచ్చు లేదా వాహనాలు కనపడవచ్చు లేదా ట్రాఫిక్ కనపడవచ్చు లేదా వింత ఆకారాలు కనపడవచ్చు - ఏం కనపడినా, ఏం వినపడినా మీరు మాత్రం ఎరుకతో, సాక్షిగా, ప్రతి స్పందించకుండా ఉండాలి. ఎలాంటి ప్రతిక్రియ చేయకూడదు. కేవలం అలా, జరిగే దానిని చూస్తూ ఉండాలి. ప్రేమగా ఎరుకతో సాక్షిగా జరిగే వాటిని గమనిస్తూ ఉండాలి.

మీకు ఇష్టం లేని ఆలోచనలు వస్తే సింపుల్‌గా కట్ చేయండి, మీకు నచ్చిన విధంగా డైవర్ట్ చేసుకోండి. మీకు నచ్చిన ఆలోచనలను చేసుకోండి.

ప్రేమ ఎరుక సాక్షి - అంతే !

ఎరుకతో ఉండాలి. ఎరుకతో శ్వాసించాలి. ఆలోచనలతో మమేకం కాకూడదు. వాటిని వేరుగా చూడాలి. సాక్షిగా చూడాలి. ఏ మాత్రం కలుగచేసుకోకూడదు. ఎలాంటి ఆలోచన అయినా సరే, మహా మంచిదైనా, మహా చెడ్డదైనా, ఎలాంటి ఆలోచన అయినా అది ప్రాథమికంగా ఆలోచనే, కాబట్టి ఆలోచన బాగుంటే ఓ. కె. లేదా సింపుల్‌గా కట్ చేయండి.

అది ఏ ఆలోచననైనా ప్రతి స్పందించకుండా ఉండాలి. దాన్ని కేవలం ఆలోచనగానే చూడాలి. మంచి, చెడు, గొప్ప, నీచ అనే తీర్పులు ఇవ్వకుండా, వాటికి ఎలాంటి లేబుల్స్ వేయకుండా కేవలం, అలా సాక్షిగా చూస్తూ ఉండాలి ఎరుకతో ! ఆలోచనను ఏ మాత్రం అంటుకున్నా అది మనల్ని తీసుకుపోయి ఎక్కడో వదిలిపెడుతుంది. ఊరించే, కవ్వించే, గిలిగింతలు పెట్టే ఆలోచనలు వస్తాయి. అప్పుడే ఏడిపించే ఆలోచనలు వస్తాయి. రానీయండి ఫర్వాలేదు. కంగారు పడాల్సిన అవసరం ఏ మాత్రమూ లేదు. అవి ఎలాంటి ఆలోచనలైనా సరే అనాసక్తంగా చూడండి. ఊరికే అలా ఏ మాత్రమూ ఆసక్తి ప్రదర్శించకుండా చూడండి. కేవలం చూడాలి అంతే ! ఆటోమెటిక్‌గా, ఆశ్చర్యకరంగా ఆలోచనలు అన్నీ సమసి పోతాయి.

ఎందుకంటే ఆలోచనకు స్వంత శక్తి ఉండదు. అది ఊరికే వస్తుంది. ప్రాణం లేకుండా, నిర్జీవంగా ఉంటుంది. ఆలోచన ఊరికే అలా వస్తుంది. మనం పట్టించుకోకపోతే, మనం ఆసక్తిని చూపకపోతే, మనం ప్రతిస్పందించకపోతే, మనం అంటుకోకుండా ఉంటే, మనం సాక్షిగా ఉంటే చాలు ఆశ్చర్యకరంగా, నమ్మలేని విధంగా, గమ్మత్తుగా, సులభంగా ఆలోచనలు సమసి పోతాయి. ఇదే పని మనం క్రమం తప్పకుండా చేస్తే ఆలోచనలు సమసి పోవడమే కాకుండా వాటి మూలాలను, అవును నిజంగా నిజం ! మన అంతరాంతరాల్లో ఉన్న వాటి మూలాలతో సహా పెకిలించి వేయబడి శాశ్వతంగా, సహజంగా సమసిపోయి, ప్రక్షాళన జరిగి "అంతరంగం" పరిశుద్ధం అవుతుంది.

సాక్షిగా ఉండటం అంటే ఆలోచనకు శక్తిని ఇవ్వకుండా ఉండటం. మనం వాటి పట్ల ఎలాంటి ఆసక్తిని చూపెట్టినా, ఏ విధంగా ప్రతిస్పందించినా మనల్ని అంటుకుని మన శక్తిని తీసుకుని పరిస్థితులుగా, వాస్తవాలుగా మారి మనల్నే ఆడిస్తాయి. గుర్తుంచుకోండి. ఆలోచనలు వస్తాయి. మనం వాటికి సృష్టికర్తలం కాదు. కేవలం వస్తాయి. ఆలోచనా సర్వస్వం నుండి వస్తూ ఉంటాయి. మనం వాటిని కేవలం రిసీవ్ చేసుకుంటాం. సృష్టించం. గుర్తుంచుకోండి.

We are not the creators of our thoughts,

we are just receivers... that's all !

అసలు సమస్య అంతా ఇక్కడే మొదలవుతుంది. మనం మన ఆలోచనలకు సృష్టికర్తలం అని అనుకుంటాం. అలాంటి భావనతోనే దాదాపుగా అందరూ ఉంటారు. నేను నా ఆలోచనలకు సృష్టికర్తను అని అనుకుంటూ ఉన్నప్పుడు ఒక చెడ్డ ఆలోచన, జుగుప్సాకరమైన, అసహ్యకరమైన, భయంకరమైన ఆలోచన రాగానే "ఛీ" ఇలాంటి ఆలోచనను చేస్తున్నాను, నాకు ఇలాంటి ఆలోచన వచ్చిందేమిటి అని బాధపడుతూ దానిని తుడిచి వేయడానికి రక రకాల పనులను చేస్తాము. కానీ అలాంటి పనులతో ఆ ఆలోచనలు సమసిపోవు పైగా శక్తిని పుంజుకుని ఇంకా ఇంకా వేధిస్తాయి. వేధిస్తూనే ఉంటాయి, దీనికంతా ఒకటే కారణం, ఆ యొక్క ఆలోచనలకు నేనే సృష్టికర్తను అని అనుకోవడమే ! ప్రియ మిత్రులారా, ప్రశాంతంగా ఉండండి. ఎలాంటి ఆలోచనలకైనా మనం సృష్టికర్తలం కానే కాదు. కాబట్టి relaaax ! cooool !

కేవలం ఆలోచనలను "సాక్షి"గా చూస్తూ ఉండాలి. ఈ విధంగా ఆలోచనల పట్ల సాక్షిగా ఉండాలి. జాగ్రత్త !! ఆలోచనలతో కొనసాగడం వేరు, ఆలోచనల పట్ల ఎరుకతో సాక్షిగా ఉండటం వేరు. ఎరుకతో సాక్షిగా ఆలోచనలను చూస్తూ ఉంటే ఆటోమెటిక్‌గా ఆలోచనల యొక్క మూలాలు అయిన గుణాలు బయట పడతాయి. ఆలోచనల పట్ల ఎరుకతో సాక్షిగా ఉండడం వలన ఆలోచన యొక్క అసలు సిసలు ఉత్పత్తి స్థానం బయట పడుతుంది. మూలం బయట పడుతుంది, అది శాశ్వతంగా సరి చేయబడుతుంది.

సాధనలో కూర్చున్నప్పుడు ఏం వినపడితే దానిని వినాలి, ఏం కనబడితే దాన్ని చూడాలి. అంతర్ ప్రకృతిని ప్రవహించనివ్వాలి. లోపల ఎన్నెన్నో జరుగుతాయి, ఎలాంటి ప్రతి స్పందన చేయకూడదు. శబ్దాలు, మాటలు, నవ్వులు మొదలైనవి వినిపించే అవకాశం ఉంది. దృశ్యాలు ఏవైనా కనపడే అవకాశం ఉంది. ఏమీ కాదు, భయపడాల్సిన పని లేదు. అంతా శ్రేయస్కరంగా జరుగుతుంది. సాధనలో ఇవన్నీ మామూలే, మీరు మాత్రం ఎలాంటి ప్రతి స్పందన చేయకుండా సాక్షిగా ఉండాలి. ప్రేమ ఎరుక సాక్షి అంతే ! ఈ ప్రేమ ఎరుక సాక్షి భావనలే ఆ మూలాన్ని తీసేస్తాయి, సరి చేస్తాయి. ఇది సహజంగా జరిగే సృష్టి విధి విధానం అంతే !

మీ ఎరుక నెగెటివ్(లోపం లేక సమస్య) పైన ప్రసరిస్తే అది శాశ్వతంగా క్లియర్ అవుతుంది. ఒక వేళ మీ ఎరుక పాజిటివ్ గుణాలపై ప్రసరిస్తే అవి బలపడతాయి.

ఆ సమస్య యొక్క మూలం లోపల, విస్మృతిలో ఉంటుంది. కేవలం మీ ఎరుకలో లేనందుకే అది అక్కడ ఉంది. ప్రేమతో, ఎరుకతో ఎలాంటి ప్రతి స్పందన చేయకుండా సాక్షిగా ఆ సమస్య మూలాన్ని చూసిన వెంటనే మీ "ఎరుక" దానిపై ప్రసరిస్తుంది. మీ ఎరుకయే ఆ సమస్య మూలాన్ని తీసి వేస్తుంది. మీ ఎరుకయే ఆ గాయాన్ని మాన్చి వేసే దివ్య ఔషధం.

✪✪✪ గుర్తుంచుకోండి, సమస్య యొక్క మూలాన్ని తెలుసుకుని, దాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా మాత్రమే విముక్తి లభిస్తుంది. సమస్య యొక్క మూలం "లోపల, అంతరంగం (inner) లో" ఉంటుంది. అంతరంగం అంటే మీరు కళ్ళు మూసుకున్నప్పుడు ఏదైతే ఉంటుందో అదే అంతరంగం. కళ్ళు తెరిస్తే "బయట", కళ్ళు మూస్తే "లోపల" !

✪✪✪ ఈ విధంగా ఎల్లప్పుడూ ప్రేమగా ఎరుకతో సాక్షి తత్వాన్ని కలిగి ఉండాలి. ఎల్లప్పుడూ వర్తమానంలో ఉండాలి. ఈ క్షణంలోనే ఉండాలి. అవసరమైనప్పుడు అవసరమైనంత మాత్రమే గతంలోకి, భవిష్యత్తులోకి వెళ్ళి, మళ్ళీ వెంటనే వర్తమానంలోకి రావాలి. ఈ క్షణం, ఈ శ్వాసలో ఉండాలి. మీరు వర్తమానంలో ఉన్నప్పుడు సృష్టి కేంద్రంతో అనుసంధానింపబడి ఉంటారు. ఈ విధంగా ప్రేమగా, ఎరుకతో సాక్షిగా వర్తమానంలో ఉంటూ ఉండండి - చాలు ఎప్పుడో మీరు ఊహించని క్షణంలో అప్రయత్నంగా "మీ నిజతత్వమైన దివ్యత్వంలో" మేలుకుంటారు. ఇదంతా ఒక్క క్షణంలోనే జరిగి పోతుంది.

మీరు బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, మీ నిజతత్వమైన దైవత్వం గురించి ఆందోళన చెందవద్దు. ఎప్పుడైనా సరే మీకు ఈ ఆందోళన కలిగిందీ అని అంటే ఎరుకతో ఆ యొక్క ఆందోళనను సాక్షిగా గమనించండి. అది మీ అహం విడుదల చేస్తున్న ఆందోళన ! మిమ్మల్ని తప్పుదారి పట్టించడానికి వస్తున్న ఆందోళన. మీరు ఎరుకతో లేకపోతే మీరు దానితో ఏకమై ఏదేదో చేసేస్తారు. చూసే వారికి, మీకు నిజంగానే అది మంచి పని లాగా అనిపిస్తుంది. ఎందుకంటే దైవత్వం కోసం ఆరాటం కదా ! కరెక్టే అని అనిపిస్తుంది. వాస్తవానికి అది కరెక్ట్ కాదు. ఎందుకంటే నిజానికి మీరు దివ్యులే కదా ! దివ్యులే అయి ఉన్న మీకు దివ్యత్వం గురించిన ఆందోళన ఎందుకు ? ఉదాహరణకు మీరు స్త్రీ అనుకోండి, మీ స్త్రీత్వం గురించి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం ఉందా ?! ఒక వేళ మీరు పురుషుడే అని అనుకోండి, అప్పుడు మీరు మీ పురుషత్వం గురించి ఆందోళన పడవల్సిన అవసరం ఏముంది ?! మీ సహజ తత్వం గురించి ఆందోళన పడాల్సిన అవసరమే లేదు కదా ! ఇలాగే "దివ్యత్వం" అనేది మీ నిజ తత్వం ! "దివ్యత్వం" మీ సహజ తత్వం ! మీరేం చేసినా మీ దివ్యత్వాన్ని పోగొట్టుకోలేరు, అది అసంభవం ! కాబట్టి మీ దివ్యత్వం గురించి ఆందోళన చెందవద్దు, ఆందోళన యొక్క మూలాన్ని కనుక్కోండి. భారతీయులే అయి ఉన్న మిమ్మల్ని మళ్ళీ భారతీయులుగా మారండి అంటే వెనకా ముందు చూడకుండా భారతీయులు కావడం ఎలా ? అని ఆందోళన చెందుతూ భారతీయులుగా మారడానికి ఏమేమో చేస్తే, ఎలా ఉంటుంది ? మీరు కొత్తగా భారతీయులుగా మారాల్సిన అవసరం లేదు, మీరు ఆల్‌రెడీ జన్మతహా భారతీయులేనని గుర్తిస్తే సరిపోతుంది కదా ! ఇదే విధంగా, మీరు కొత్తగా దివ్యులుగా మారాల్సిన అవసరం లేదు, కేవలం మీరు ఆల్‌రెడీ దివ్యులేనని గుర్తిస్తే సరిపోతుంది.

కానీ దేనికైనా సరే కావాల్సింది సరైన అవగాహన, విశ్వాసం, పట్టుదల, దైవత్వం పట్ల నిజమైన పూర్తి శ్రద్ధ సమర్పణ అంకిత భావాలు. శ్రమించాలి.

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

మనం ఎల్లప్పుడూ రెండు చెక్‌పోస్ట్‌లను కలిగి ఉండాలి

✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪✪

1. వస్తున్న ప్రతి ఆలోచనను గమనించండి. ఇప్పుడు, ఇక్కడ ఇది నాకు అవసరమా ? అని ఆ యొక్క ఆలోచనను పరిశీలించండి. 99% ఆలోచనలు పనికిరానివే అయి ఉంటాయి. మీరేం చేస్తున్నారో అప్పుడు, అక్కడ అవసరం లేని ఆలోచననైతే దానిని ఎరుకతో సాక్షిగా గమనించండి. అంతే అది సమసి పోతుంది.

2. ఒక వేళ అవసరం అయితే ఎంత వరకు అవసరమో అంత వరకే ఆలోచించి మళ్ళీ ఎరుకతో వర్తమానంలోకి వచ్చేయండి.

ప్రతి ఆలోచన పట్ల ఎరుకతో ఉండండి. అవసరమైన ఆలోచనను అవసరమైనంత వరకే ఆలోచించడం వలన మీ అభివృద్ధి చాలా వేగంగా జరుగుతుంది. ఎంతో శక్తిని వృథా కాకుండా కాపాడుకో గలుగుతారు.

మీరు కళ్ళు మూసుకుని ప్రశాంతంగా, ధీమాగా, ఎరుకతో కూర్చోవాలి అంతే ! బిగుసుకుపోయి ఉన్న మీరు రిలీజ్ కావాలి, మిమ్మల్ని మీరు అలా వదిలేయండి. ధ్యానాన్ని 100% అనుమతిస్తున్నాను అని అనుకోండి. ధ్యానంలో జరిగే ప్రక్షాళనను 100% అనుమతిస్తున్నాను అని అనుకోండి, అనుమతించండి. ధ్యానంలో కూర్చోగానే మీ నిజ కేంద్రంతో ఆటొమెటిక్‌గా మీరు ట్యూన్ అవుతుంటారు. కేవలం ఆ యొక్క ట్యూనింగ్‌ను 100% అనుమతించండి. అంతే !

మీరు నిజంగా, 100% మిమ్మల్ని మీరు, మీ నిజ కేంద్రంతో జరిగే ట్యూనింగ్‌ను అనుమతిస్తే కేవలం ఒకే ఒక గంటలోపే, అన్నీ క్లియర్ అయిపోయి "మోక్షాన్ని" పొందుతారు.

ఆశ్చర్యంగా ఉందా ! పరమ సత్యం, పరమ ఆశ్చర్యకరంగానే ఉంటుంది మరి !

ధ్యానంలో జరిగే ప్రక్షాళనా కార్యక్రమం యొక్క వేగం నూటికి నూరు శాతం, కేవలం మీ మీదనే ఆధారపడి ఉంది. ధ్యానంలో జరిగే క్లియరెన్స్‌లను, సెటింగ్స్‌ను, పునః సమైక్యతలను(Reunion or Reunite), శ్రేయస్కరాలను, లాభాలను మొదలైన వాటినన్నింటినీ అడ్డుకునేది "మీరేనని" గ్రహించండి.

మీకు మీరే అడ్డుగా ఉన్నారు. ఈ విషయాన్ని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ధ్యానంలో కలిగే లాభాలను అడ్డుకునేది మీరే. కేవలం మీ అడ్డు మీరు తొలగించుకోవాలి. మరి ఎలా మీ అడ్డు మీరు తొలగించుకోవడం అని అంటే...

...ధ్యానంలో కూర్చుని ఉన్న మీరు - 100% నన్ను నేను క్లియర్ చేసుకోవాలని అనుకుంటున్నాను. ధ్యానంలో జరిగే క్లియరెన్స్‌లను, సెటింగ్స్‌ను, పునః సమైక్యతలను(Reunion or Reunite), శ్రేయస్కరాలను, లాభాలను మొదలైన వాటినన్నింటిని 100%గా అనుమతించాను అని భావనాత్మకంగా, గాఢంగా అనుకుని, ప్రేమతో, ప్రశాంతంగా, ధీమాగా, ఎరుకతో, సాక్షిగా ఉండాలి.

ఎలాంటి ప్రతిస్పందన చేయకుండా జరిగేవన్నీ శ్రేయస్కరాలే అని గ్రహించి సాక్షిగా ఉండాలి. అంతే ! ఇలా చేస్తే మీ అడ్డు మీరు తొలగించుకున్న వారౌతారు.

ప్రేమగా ఉండండి. ఎరుకతో ఉండండి.

సాక్షిగా ఉండండి. వర్తమానంలో ఉండండి - చాలు !

ఇలా మీరు ఉంటున్నప్పుడు ఏదో ఒక క్షణంలో దైవమే అయి ఉన్న మీరు దైవంలో దైవంలా మేలుకుంటారు. ఒకే క్షణంలో మీ చైతన్యం తన నిజ తత్వాన్ని సింపుల్‌గా గ్రహిస్తుంది. తనను తాను తిరిగి గుర్తు చేసుకుంటుంది. విస్మృతి స్మృతిగా మారుతుంది, అంతే !

ప్రేమ, ఎరుక, సాక్షిత్వం మరియు వర్తమానంలో ఉండడం అనేవి ఒకదానికొకటి ముడిపడి ఉంటాయి. మీరు ప్రేమగా ఉన్నప్పుడు ఎరుక ప్రవృద్ధమవుతుంది. ఎరుకలో ఉన్నప్పుడు సాక్షిత్వం వస్తుంది. ఈ విధంగా ఉన్నప్పుడు మీరు ఆటొమెటిక్‌గా వర్తమానంలో ఉంటారు.

ప్రియ మిత్రులారా ! ఈ విధమైన సాధనలో ఉండండి. అత్యంత సహజంగా, ఖచ్చితంగా, శీఘ్రంగా మీ నిజ తత్వమైన దివ్యత్వాన్ని మీరు పునఃప్రాప్తించుకుంటారు. ఇది చెప్పినంత సులువు కాదు, కానీ అసాధ్యం ఏమీ కాదు !

All The Very Best !

❖ ❖ ❖

మీకు నచ్చని పరిస్థితులను, మీకు వద్దు అనిపించే సంఘటనలను లేదా అనుభవాలను మీరు "నాకివి వద్దు" అని అనుకోగానే తక్షణమే అవి మీ జీవితంలో నుండి వెళ్ళిపోతాయి. నాకివి వద్దు అని అనుకోగానే మీ వరకు రాకుండానే అవి తక్షణమే వెళ్ళిపోతాయి. మీకేవి నచ్చటంలేదో వాటిని తలుచుకుని, ఇవి నాకు అవసరం లేదు, నేను వీటిని క్యాన్సల్ చేసాను, ఇవి నాకు వద్దు అని అనుకోండి. అంతే. అవి క్యాన్సల్ అయిపోతాయి. మెడకు ఉరితాడు చుట్టుకుని వేలాడుతూ ఉన్నప్పుడు కూడా చావును, ఆ క్షణంలో కూడా క్యాన్సల్ చేసుకోవచ్చని రామ్తా మాస్టర్ చెప్తాడు, సేత్ మాస్టర్ కూడా చెప్తాడు, ఎవరైనా ఇదే చెప్తారు, ఉన్న సత్యం ఇదే కాబట్టి !

ఆత్మ పరిణామ క్రమంలో మీరు ఎదగాలి, పరిణితి చెందాలి అని అంటే చెడు ఆలోచనలు చేయకూడదు. చెడు పనులు చేయకూడదు. గీతలో శ్రీకృష్ణుడు, ఇంకా ఇతర పుస్తకాలలో రామ్‌తా & సేత్ కూడా చెప్తారు... ద్వందాలలో ఇరుక్కోకండి అని... మంచి లేదు చెడు లేదు శుభాశుభ పరిత్యాగీ అని అంటారు. వాళ్ళు ఆత్మ స్థితిలో ఉండి ఆ విషయాలను చెప్తారు. మీరు కూడా ఆత్మ స్థితిలో విరాజిల్లుతూ ఉంటే అవి మీకు అప్లై అవుతాయి. అంతే కానీ మీరు చేసే ప్రతీ పనిని సమర్థించుకోవడానికి అవి పని చేయవు. మంచి లేదు చెడు లేదు అనుకుంటూ మీరు చేస్తున్న తింగరి పనులకు మీకు తెలియని మహోన్నత విశ్వనియమాలు అప్లై అయి మీ బెండు సరి చేయబడుతుంది... జాగ్రత్త !

౨. ధ్యాన సాధన

ఏదైనా ఆపద లేక హాని లేక నష్టం మొదలైనవి జరుగుతాయేమోనని భయం వేస్తున్నప్పుడు చేయాల్సిన సాధన.

ముందు పేజీల్లో వివరించిన విధంగా ధ్యానంలో కూర్చోండి.

క్షమ ప్రేమ ఎరుక దివ్య అవగాహన

ఈ మహా దివ్య సూత్రంలో ఉన్న భావాలను, మీ పట్ల మీరు నిజంగా ప్రకటించుకోండి. మిమ్మల్ని మీరే ఉద్దేశించుకుంటూ క్షమ ప్రేమ ఎరుక దివ్య అవగాహన అని అనుకుంటూ ఉండడమే, మీ పట్ల మీరు ప్రకటించుకోవడం అంటే !

మహా అద్భుతమైన ఫలితాలను తక్షణమే పొందవచ్చు ఈ మహా దివ్య సాధన వలన.

✪ ✪ ✪

చెడు వ్యసనాలంటే కేవలం తాగుడు, వ్యభిచారం, జూదం మొదలైనవే కాదు ఆధ్యాత్మికంగా కూడా చెడు వ్యసనాలు ఉంటాయి. నిజ జ్ఞానోదయం జరిగి ఆత్మ సాక్షాత్కార అనుభవంతో సద్గురు స్థితి రాక ముందే బోధనలు చేయడం, క్లాసులు చెప్పడం ధ్యాన కేంద్రాలు ఓపెన్ చేసి నిర్వహించడం అనేవి మహా చెడు వ్యసనాలు. వీటి వలన ఎన్నో జన్మలు దారి తప్పిపోతారు.

10. ధ్యాన సాధన

క్షమ ప్రేమ ఆనందం ఉల్లాసం ఉత్సాహం

ఈ సాధన ద్వారా క్యాన్సర్, ఎయిడ్స్, క్షయ లాంటి పెద్ద పెద్ద వ్యాధుల నుండి నిజంగా, శాశ్వతంగా, పూర్తిగా బయట పడవచ్చు. నేను ఈ విషయాలను పూర్తిగా ఆధ్యాత్మిక కోణంలో నుండి చెప్తున్నాను అని గ్రహించగలరు. రామ్‌తా & సేత్ మరియు ఇంకా ఎందరో మాస్టర్స్ ఎలాంటి వ్యాధినైనా నిమిషాలలో పూర్తిగా, శాశ్వతంగా నయం చేసుకోవచ్చునని చెప్తారు.

తీవ్రమైన ద్వేషం మరియు క్రోధం లాంటి నెగెటివ్ భావాలు బాగా అణిచి పెట్టబడి ఉన్నప్పుడు అవి క్యాన్సర్‌గా శరీరంలో ప్రకటం అవుతాయని మాస్టర్స్ చెప్తారు.

ఎయిడ్స్ లేక ఇతర ఏ వ్యాధులైనా... జీవితం పట్ల నిరాసక్తత, నిరాశ, మరణాభిలాష మొదలైన నెగెటివ్ భావాలు లోపల ఉన్నప్పుడు వస్తాయి. - సేత్ & ఇతర మాస్టర్లు !

మీ పట్ల మీరు, క్షమ ప్రేమ ఆనందం ఉల్లాసం ఉత్సాహం అనే దివ్య భావనలను బలంగా ప్రకటించుకున్నప్పుడు, నిజంగా, పూర్తిగా స్వస్థత పొందడాన్ని మిమ్మల్ని మీరే, ఆశ్చర్యానందాలతో గమనించుకోవచ్చు.

✪ ✪ ✪

ఉగ్రవాదులు కేవలం భౌతిక ప్రపంచంలోనే కాదు ఆధ్యాత్మికంలో కూడా ఉంటారు. భౌతికంలోని ఉగ్రవాదులు చేసే నష్టం త్వరగానే రికవర్ అవుతుంది. ఉదాహరణకు ఆటం బాంబుల దాడికి గురైన హిరోషిమా, నాగసాకి నగరాలు కొంత కాలానికి మళ్ళీ జీవం పుంజుకుని ఇప్పుడు కళ కళలాడుతున్నాయి. కానీ తప్పుడు ఆధ్యాత్మిక దాడులకు గురైన ఈ భూలోకం & మానవ జాతి కొన్ని లక్షల ఏళ్ళుగా చీకట్లో, బానిసత్వంలోనే మగ్గుతూనే ఉంది. ఇప్పుడిప్పుడు విముక్తి పవనాలు వీస్తూ స్వేచ్ఛా కాంతులు ప్రసరిస్తున్నాయి.

II. ధ్యాన సాధన

అన్ని రకాలుగా దెబ్బతిని, కృంగిపోయి, కష్టాల్లో కూరుకుపోయి ఉన్న వారు చేయాల్సిన సాధన.

నేను బాగున్నాను, ఆనందంగా ఉన్నాను !

లేదా

I am Fine, Happy !

నేను బాగాలేను అనే ఒక్క భావన చాలు మనిషి శరీరాన్ని + జీవితాన్ని నరక ప్రాయం చేయడానికి. నేను ఆనందంగా లేను, అనే భావనయే ఎన్నో కష్టాలను ఆకర్షిస్తుంది. ఆశ్చర్యకరమైన ఈ నిజాలు సాధారణ జనాలకు నమ్మబుద్ధి కాదు. కాని ఇదే సత్యం. ఈ సాధన సిన్సియర్‌గా చేసి చూడండి. మహాద్భుత ఫలితాలతో నిర్ఘాంతపోతారు మీరు. ఇది తథ్యం.

మీరు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా సరే, ఈ సాధన చేయాలి. మీరు తెలుసుకోవలసిన సత్యం ఏమిటంటే, అన్ని రకాలుగా దెబ్బతిని, కృంగిపోయి, కష్టాల్లో కూరుకుపోయి ఉన్న పరిస్థితుల్లో నుండి తక్షణమే బయట పడడానికి ఈ సాధన. మీరు బాగానే ఆనందంగా ఉంటే ఈ సాధన ఎందుకు ? దాహం వేసినప్పుడే కదా.... మంచి నీళ్ళు తాగాల్సింది.....! కష్టాలలో ఉన్నప్పుడు, నేను బాగున్నాను, ఆనందంగా ఉన్నాను అని అనుకోవడం చాలా కష్టం, కానీ అలా అనుకోగల అనంత అజేయ అమర అద్భుత శక్తి అదృష్టవశాత్తు మనందరికీ ఉంది.

❖ ❖ ❖

బాగా పాపులర్ అయినది సరైనది కావాలనే రూలేమీ లేదు. పాపులారిటి లేనిది సరైనది కాదు అనే నియమం కూడా లేదు !

12. దర్పణ సాధన

ఈ సాధన మహా మహా శక్తి వంతమైనదీ మరియు చాలా చాలా కష్టమైనది. నిజంగా ఇది చేయడం చాలా చాలా కష్టం. కానీ ఇది చేస్తే మాత్రం నిజంగా, చాలా అద్భుతమైన ఫలితాలు వెంటనే రావడం మొదలు పెడతాయి. ఎలాంటి సమస్య అయినా, ఎంత పెద్దది అయినా సరే, ఆశ్చర్యకరంగా, సరళంగా, మహాద్భుతంగా, శాశ్వతంగా, పరిష్కరించ బడుతుంది.

కానీ చేయడం చాలా కష్టం ! చేయగలిగిన వారికి చెబుతున్నాను.

1. మొదటి సత్యం : ప్రస్తుతం నీవు అనుభవిస్తున్న మంచి & చెడులకు నీవే కారణం. ఒకప్పుడు చేసిన చెడునే నీవు ఇప్పుడు కష్టనష్టాలుగా, అనారోగ్యాలుగా అనుభవిస్తున్నావు. ఒకప్పుడు చేసిన మంచినే ఇప్పుడు నీవు ఆరోగ్యంగా, విజయానందాలుగా అనుభవిస్తున్నావు. ఇది తిరుగులేని సత్యం.

2. రెండవ సత్యం : నీలో ఉన్న మంచి & చెడు, ఈ రెండూ కూడా నీకు, నిత్యం ఇతరుల ప్రవర్తనల ద్వారా, మాటల ద్వారా అందుతూ ఉంటాయి. నిన్ను దర్పణం కూడా సరిగా ప్రతిబింబించలేదు, దర్పణంలో కంటే స్పష్టంగా మనలోని "గుణాలను" మనం ఇతరులలో చూసుకోవచ్చు. నీ పట్ల ఇతరులు అంటున్న మాటలు మరియు ప్రవర్తనలు 100% నీ గుణాలే ! ఇది పరమ సత్యం ! తిరుగులేని సత్యం !! ఎదురులేని సత్యం !!! కాదనలేని, తిరస్కరించలేని నగ్న సత్యం !!!!

తెలుసుకోండి, మనం కలిగి ఉన్న గుణాలు మరియు మనం నేర్చుకోవాల్సిన అంశాలు మన ఆరోగ్యాన్ని మరియు జీవితంలోని కష్ట సుఖాలను నిర్ణయిస్తుంటాయి. ఇదే అసలు సిసలు పరమ సత్యం ! నిజంగా ఇదే ఏకైక సత్యం !! రాత, అదృష్టం అంటూ ఏవీ ఉండవు !!!

ఈ రెండు సత్యాలను మీరు నిజంగా, పూర్తిగా ఒప్పుకుంటేనే సాధన ఫలితాలను ఇస్తుంది. లేకపోతే ప్రయోజనం శూన్యం. ఈ సత్యాలను ఒప్పుకోవాలంటే చాలా అవగాహన ఉండాలి. ఎంతో ఎదిగి ఉన్న వాళ్ళకే ఇది సాధ్యం.

అదెలా కుదురుతుంది ? నా అన్నింటికీ నేనే కారణం అని అంటే ఎలా ? నా మంచికి నేనే కారణం అని అంటే ఒప్పుకుంటాను కాని, నా చెడుకు మాత్రం నేను కారణం కాదు. నా చెడుకు కారణం ఈ లోకం, తల్లిదండ్రులు, దేవుడు, బంధుమిత్రులు, సమాజం ఇంకా చాలా కారణాలున్నాయి నా చెడుకు ! నా చెడుకు నేను కారణం కాదు, ఇందుకు నేను ఒప్పుకోను.... అని అనుకుంటే, ...సరే ! ఈ సాధన చేయకండి. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయండి.

మీరు నిజంగా ఒప్పుకుంటేనే, ఇప్పుడు ఈ కింది విధంగా సాధన చేయండి.

సాధనా విధానం

ప్రతీ రోజు, మీకు వీలైన సమయంలో, మీకు వీలైన ప్రదేశంలో ప్రశాంతంగా కూర్చోండి. మిమ్మల్ని ఎవరెవరు ఏ ఏ రకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారో గుర్తుకు తెచ్చుకుంటూ ఉండండి. ఆ వ్యక్తులు మరియు ఆ ఇబ్బందులు ఒక్కొక్కటిగా గుర్తుకు వస్తున్నప్పుడు..... దీనికి నేనే కారణం, వాళ్ళు కాదు... లేక ఆయన కాదు..... లేక ఆమె కాదు ! దీనికి నిజంగా, పూర్తిగా నేనే కారణం ! ఆ ఇబ్బందులను ఆకర్షిస్తున్నది నేనే ! నా ఇబ్బందులకు నేనే కారణం ! అని నిజంగా ఒప్పుకోండి.....

.....ఆ తర్వాత నేను దైవాన్ని లేక నేనే దైవం అనే దైవత్వ సాధనను ప్రారంభించండి. మీకు ఎంత నమ్మశక్యం కానిదైనా సరే.... మీ ఇబ్బందులకు మీరే కారణం అని గుర్తుంచుకోండి. కొన్ని విషయాలైతే మీకు అసలు ఎంతకూ నమ్మబుద్ధి కాదు... సాక్షాత్తు ఆ భగవంతుడే దిగి వచ్చినా నమ్మబుద్ధి కాని విషయాలు కొన్ని ఉంటాయి. ఇలా అస్సలు నమ్మబుద్ధి కాని వాటినే ముందు ఒప్పేసుకోవాలి. లేదా ఇవి చాలా చెడును చేస్తాయి. మీ వాస్తవాలకు మీరే సృష్టి కర్తలు ఇదే పరమ సత్యం ! కాబట్టి మౌనంగా పరమ సత్యాన్ని ఒప్పుకుని తీరాలి. .....నా ఇబ్బందులకు నేనే కారణం అని ఒప్పుకుంటూ.... నా ఇబ్బందులకు మూల కారణాలు నా లోనే ఉన్నాయి..... వాటి పైన నా దైవత్వాన్ని ప్రసరిస్తున్నాను..... నేను దైవాన్ని లేక నేనే దైవం..... అని లోపల అనుకుంటూ మీ ఇబ్బందుల యొక్క మూలకారణాలపైన మీ దైవత్వాన్ని ప్రసరింపజేస్తూ ఉండాలి.

దైవత్వాన్ని ప్రసరింప చేయడం ఎలా ? అని కంగారు పడకండి. నేను దైవాన్ని లేక నేనే దైవం అని మీరు అనుకుంటూ ఉంటే చాలు, మీ దైవత్వాన్ని మీరు ప్రసరింప చేస్తున్నట్టే.... ఇబ్బందుల యొక్క మూలకారణాలను శాశ్వతంగా క్లియర్ చేస్తున్నట్టేనని అర్థం చేసుకోండి.

కొన్ని విషయాలను ఎంతకూ ఒప్పుకోబుద్ధి కాదు. వీటికి నేను ఎలా కారణం అవుతాను ? అని అనిపిస్తుంది. ఏ కోణంలో నుండి విశ్లేషించినా, మీరు ఎన్ని రకాలుగా ఆలోచించినా, ఏం చేసినా మీ తప్పేమీ కనపడదు. మీరెంతో పుణ్యాత్ములుగా మీకు అనిపిస్తారు. గుర్తుంచుకోండి, సృష్టి యొక్క నియమం - మీ మంచికి+మీ చెడుకు, ఈ రెండింటికీ మీరు మాత్రమే మూల కారణం ! మరెవరూ కాదు గాక, కానే కాదు ! మీరు గతంలో ఇతరులకు ఇచ్చినవే ఇప్పుడు మీకు వస్తూ ఉంటాయి. మీరు వేసిన పంటనే మీరు ఇప్పుడు తింటూ ఉంటారు. పండ్లు మరియు పూల పంటలు వచ్చినప్పుడు బాగానే ఉంటుంది, కాని మీరు వేసిన ముళ్ళ పంట వచ్చినప్పుడే..... ప్రాణం విల విల లాడుతుంది. చాలా బాధగా, చాలా నొప్పిగా.... చాలా ఘోరంగా..... చాలా దారుణంగా అనిపిస్తుంది. నిజంగా ఆ యొక్క బాధ వర్ణణాతీతం ! ఈ జన్మలోనో లేక గత జన్మలలోనో మీరు వేసిన పంట మీకే తిరిగి వస్తూ ఉంటుంది. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. ఉండదు. చాలా ఖచ్చితంగా పని చేస్తుంది ఈ నియమం ! మీరు నిజాయితీగా సాధన చేస్తుంటే, మీకు, మీ యొక్క గతం కనపడుతుంది కూడా ! నిజం !! ఆ విధంగా గతం కనపడినప్పుడు మీకు చాలా క్లియర్‌గా అర్థం అవుతుంది. మీరు ఏం చేస్తే ఇప్పుడు ఏం అనుభవిస్తున్నారు.... అనే విషయం స్పష్టంగా అర్థం అవుతుంది.

మీకు మంచి చేస్తున్న వాళ్ళంతా, సహకరిస్తున్న వాళ్ళంతా... మీలోని మంచిని ప్రతిబింబిస్తున్నారు అని తెలుసుకోండి.

మీకు, ఇబ్బందులను కలుగ జేస్తున్న వాళ్ళంతా మీలోని చెడును ప్రతిబింబిస్తున్నారని గ్రహించండి.

మీకు ఇబ్బందులను కలుగ జేస్తున్న వాళ్ళ నుండి తప్పించుకుందామని చూస్తే... వ్యక్తులు మారుతారేమో కాని, విషయం మారదు. గుర్తుంచుకోండి. మరీ తీవ్రంగా మీరు సత్యాన్ని ఒప్పుకోకుండా వ్యక్తులను మారుస్తూ ఉంటే లేక తప్పించుకుంటూ ఉంటే... చివరికి మీలోని చెడు, మీ శరీరంలో రోగాలుగా ప్రకటం అవుతుంది. అప్పుడు ఎలా తప్పించుకుంటారు ? మీ శరీరం నుండి మీరెలా తప్పించుకుంటారు ? ఒకవేళ మీరు బలవంతంగా మరణించినా అంటే, శరీరాన్ని వదిలేస్తే ఆ యొక్క చెడు ఏదైతే ఉందో, అది... ఆత్మలైన మీ వెంటే వస్తుంది. మీరు ఏ లోకానికి పోయినా, మీరేం చేసినా ఆ చెడు మీ వెంటే ఉంటుంది. మీరు అవగాహన తెచ్చుకునే వరకు లేదా సత్యాన్ని ఒప్పుకుని సాధన చేసి తొలగించుకునేంత వరకు మీ చెడు మీలోనే ఉంటుంది.

నా ఇబ్బందులకు మూలకారణాలు నాలోనే ఉన్నాయి, వాటి పైన నా దైవత్వాన్ని ప్రసరిస్తున్నాను.... అనే ఎరుకతో..... నేను దైవాన్ని లేక నేనే దైవం అనుకుంటూ ఉండాలి. ఇలా సాధన చేస్తూ ఉండండి. ఆశ్చర్యకరంగా, అద్భుతంగా, సురక్షితంగా, సులభంగా, సరళంగా, అత్యంత శీఘ్రంగా, పూర్తిగా మరియు శాశ్వతంగా మీ అన్ని రకాల ఇబ్బందులు నిజంగా తొలగి పోతాయి. ఇది వాస్తవం ! ఈ సాధనను అర్థం చేసుకుని, సాధన చేసిన వాళ్ళు నిజంగా చాలా గొప్ప వాళ్ళవుతారు.

మన మంచి గుణాలు మనకు ఆరోగ్య విజయానందాలను ఇస్తే, మన చెడు గుణాలు మనకు బాధలను, ఇబ్బందులను కలుగ జేస్తాయి.

అయితే మన ఎరుకలో అన్నీ మంచి గుణాలే ఉంటాయి. మన యొక్క చెడు గుణాలు మాత్రం లోపల దాక్కుని ఉంటాయి. ఎందుకంటే మనల్ని మనం పుణ్యాత్ములుగా ఊహించుకుంటూ ఉంటాం కదా ! నిజానికి మనం దైవాలమే...! కాని మన "లోపల" "నేను దైవాన్ని" అనే వాస్తవ భావన ఉండదు. అందుకే దైవాలమైన మనకు ఇన్ని బాధలు ! మనలో చెడు గుణాలున్నాయి, అవే మనకు కష్టనష్టాలను కలుగ జేస్తున్నాయి అని ఒప్పుకోవాలంటే చాలా పెద్ద అవగాహన కావాలి.

మన కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఇంకా మనకు నిత్య జీవితంలో తారస పడే వ్యక్తులు అందరూ కూడా మనలోని గుణాలకు తగ్గట్టుగానే మనతో ప్రవర్తిస్తూ ఉంటారు. మనలోని మంచి గుణాలకు తగ్గట్టుగా మనతో మంచిగా ప్రవర్తించే వారితో ఏ సమస్యా లేదు. కాని మనతో చెడుగా ప్రవర్తించే వారితోనే వస్తుంది అసలు చిక్కు !

మనతో ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తున్నారు లేక ఇబ్బంది పెడుతున్నారు లేక అడ్డం పడుతున్నారు లేక పెత్తనం చెలాయిస్తున్నారు లేక లేని పోని అభాండాలు వేస్తున్నారు లేక నష్టపరుస్తున్నారు లేక వెంటాడుతూ వేధిస్తున్నారు లేక ఇంకా ఏదో నెగెటివ్‌గా ప్రవర్తిస్తున్నారు అని అంటే దాని అర్థం ఏమిటి అనుకున్నారు ? ఎంతో కరుణా పూరితమైన సృష్టి ఇతర వ్యక్తుల యొక్క ప్రవర్తనల ద్వారా మరియు మాటల ద్వారా ఎందుకు మనల్ని కష్ట పెడుతుంది ? అని అంటే.... ఇలా చేయటం వెనుక ఉన్న "సృష్టి యొక్క ఉద్దేశం.... మనలో మార్పు తీసుకు రావాలని" !

ఇతరులు మన పట్ల నెగెటివ్‌గా మాట్లాడినప్పుడు మరియు నెగెటివ్‌గా ప్రవర్తించినప్పుడు ఆ బాధ ఏమిటో మనకు తెలిసి వస్తుంది. మనం ఆ బాధ పడ్డాము కాబట్టి ఇతరులను ఆ విధంగా బాధించ వద్దనే ఒక నిర్ణయం మనలో ఉద్భవించాలి. దృఢంగా పెరిగి పెద్దదవాలి. ఆ నిర్ణయంలో నుండే "మంచి గుణం" పుడుతుంది. ఎప్పుడైతే మనలో మంచి గుణం పుడుతుందో అప్పుడే దానికి సంబంధించిన బాధలు, తక్షణమే మన నుండి శాశ్వతంగా తొలగి పోతాయి. నిర్ణయం అనేది ఒక ఆలోచన, మంచి ఆలోచనలో నుండి మంచి నిర్ణయం పుడితే, చెడు ఆలోచనలో నుండి

చెడు నిర్ణయం పుడుతుంది. మంచి నిర్ణయంలో నుండి మంచి గుణం తయారవుతే, చెడు నిర్ణయంలో నుండి చెడు గుణం తయారవుతుంది. మన గుణాలను బట్టే మన జీవితంలోని మరియు శరీరంలోని పరిస్థితులు ఉంటాయి.

సృష్టి యొక్క ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకోకుండా అజ్ఞానంతో జనాలు తమ బాధలను పెంచుకుంటూ ఉంటారు. తను పడిన బాధను వేరొకరికి ఇవ్వద్దు అనే ఆలోచన లేకుండా మూర్ఖంగా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇది చాలా శోచనీయమైన మరియు దారుణమైన విషయం.

1. ప్రతీ అత్తా ఒకప్పుడు కోడలే కదా ! తను కోడలుగా ఉన్నప్పుడు పడిన బాధలను మర్చిపోయి లేక కసితో గుర్తుంచుకుని, తాను అత్తగా మారినప్పుడు తన కోడల్ని రాచి రంపాన పెడుతుంది. ఈ కోడలూ రేపు అత్త అయ్యాక సేమ్ అదే రిపీట్ చేస్తుంది.

2. తల్లిదండ్రులు, తాము పిల్లలుగా ఉన్నప్పుడు.... తమ తల్లిదండ్రుల చేత ఎన్ని బాధలు పడ్డారో మరిచిపోయి లేక కసితో గుర్తుంచుకుని తమ పిల్లలను వేధిస్తారు. ఈ పిల్లలూ రేపు తల్లిదండ్రులయ్యాక సేమ్ టు సేమ్ రిపీట్ !

3. ఆల్‌మోస్ట్ ఆడపిల్ల పెళ్లి చేసే తల్లిదండ్రులందరూ, అల్లుడికి కట్నకానుకలు ఇచ్చుకోలేక చస్తుంటారు. ఇన్ని బాధలు పడిన తర్వాత కూడా తమ కొడుకుకు పిల్లను చేసుకునేటప్పుడు, వీరిని తమ కూతురి యొక్క అత్తగారింటి వాళ్ళు ఏ విధంగా పీడించారో, సరిగ్గా అదే విధంగా, ఇంకా చెప్పాలంటే కాస్త ఎక్కువగానే పీడించుకు తింటారు.

4. ర్యాగింగ్‌కు గురయిన విద్యార్థులు, సీనియర్స్ అయ్యాక వాళ్ళు కూడా ర్యాగింగ్ చేస్తారు.

ఇలా తమకు జరిగిన నష్టం, తాము పడిన బాధలు వేరొకరు పడకూడదని ఆలోచించనే ఆలోచించరు.... ఆశ్చర్యం ! ప్రతీకారంతో రగిలిపోతూ ఆ... అప్పుడు మేం పడలేదా ?? అని కసి కసిగా ప్రవర్తిస్తుంటారు. ఈ యొక్క ప్రతీకార గుణం వలన తమ జీవితానికి ఎంత నష్టం కలుగుతుందనే విషయం కనుక వారికి తెలుస్తే..... గుండె ఆగి చచ్చినంత పనవుతుంది....

.....ఉదాహరణకు ఒక యథార్థ సంఘటన చెప్తాను.

ఒక అమ్మాయి తన అత్త గారి వేధింపులు భరించలేక చాలా చాలా బాధ పడుతోంది. ఒకరి ద్వారా నా దగ్గరికి వచ్చింది. ఆమె విషయాలు తెలుసుకున్న తర్వాత ఆమెకు ''ఇన్నోవేటివ్ మెథడ్'' అనే పద్ధతి ద్వారా ఆధ్యాత్మిక చికిత్స చేసాను. ఈ ''ఇన్నోవేటివ్ మెథడ్'' అనేది, 2005లో నేను స్వయంగా కనిపెట్టిన పద్ధతి. కొంత మంది దీనిని రిగ్రెషన్‌తో పోలిస్తే మరి కొంత మంది హిప్నటిజంతో పోల్చారు. కాని ఇది ఆ రెండింటికీ ఏ మాత్రమూ సంబంధం లేనిది. ఇది ఒక వినూత్నమైన ఆధ్యాత్మిక ప్రక్రియ. ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక విశేషం. ఒక సూపర్ మెథడ్. ఈ పద్ధతి ద్వారా నేను, నా దగ్గరకు ఈ విషయమై వచ్చిన వ్యక్తిని, తన గత జన్మలలోకి, సమస్య యొక్క మూలం ఉన్న

జన్మలోకి తీసుకు వెళ్తాను. ఇంకా తన పూర్ణాత్మతో ఇంకా ఇతర మాస్టర్స్‌తో మాట్లాడిస్తాను. వాళ్ళే స్వయంగా మాట్లాడుతారు. ఇతర లోకాలకు ప్రయాణిస్తారు, చూస్తారు. భూమి పైన దేవుళ్ళుగా చెలామణి అవుతున్న వారిని కూడా కలిసి మాట్లాడతారు. మరణించిన తర్వాత వాస్తవంగా ఏం జరుగుతుంది ? ప్రస్తుతం భూమి పైన ఉన్న మతపరమైన విశ్వాసాలలో ఎంత అసత్యం ఉందో, ఇంకా మానవ సమాజాలలో చెలామణి అవుతూ ఉన్న సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలలో ఎంత సత్యం ఉందో ఎంత లేదో... అన్న విషయాలను డైరెక్ట్‌గా చూసి తెలుసుకుంటారు. ఇంకా ఇలా చాలా ఉన్నాయి. అయితే దీనికి అందరూ ట్యూన్ కారు. ఎవరు అవుతారు, ఎవరు కారు అనే సంగతి చేసే వరకు తెలియదు. ట్యూన్ అవుతారా కారా... అనే విషయం వారి బ్యాలెన్స్ షీట్‌ను బట్టి ఉంటుంది. సరే... ఇక విషయంలోకి వస్తే, నా దగ్గరకు వచ్చిన అమ్మాయికి ఈ ''ఇన్నోవేటివ్ మెథడ్'' 2006లోనో లేక 2008లోనో సరిగా గుర్తులేదు, మొత్తానికి ఏదో ఒక సం॥లో చేసాను.

ఆ అమ్మాయి కాపురం ఆల్‌మోస్ట్ విడాకుల దశకు వచ్చింది, చాలా ఇబ్బందుల్లో ఉంది... అప్పుడు ఆ అమ్మాయి. నేను ఆమెకు మెథడ్ స్టార్ట్ చేసాను. త్వరగానే ట్యూన్ అయింది. ఆమె స్వయంగా చూసి తెలుసుకున్న విభ్రాంతికరమైన సత్యం ఏమిటీ అంటే... సరిగ్గా వంద సంవత్సరాల క్రితం, తన గత జన్మలో, ఈ అమ్మాయి అత్తగా ఉంది. ఈమె యొక్క ఈ జన్మలోని అత్త, ఈ అమ్మాయికి, తన గత జన్మలో కోడలుగా ఉంది.

విషయం మరోసారి వివరిస్తాను. ఈ జన్మలో ఈ అమ్మాయి యొక్క అత్త, తన గత జన్మలో కోడలుగా ఉంది. ఈ జన్మలో ఈ అమ్మాయి కోడలు అయితే, గత జన్మలోని ఈమె కోడలు... ఈ జన్మలో ఈమెకు అత్తగా వచ్చింది. అర్థం అయిందనుకుంటాను.

ఈ అమ్మాయి తన గత జన్మలో తన కోడల్ని వేధించింది. ఆ యొక్క వేధింపులే ఈ జన్మలో ఈమెకు వచ్చాయి. చూశారా... వంద సంవత్సరాల తర్వాత కూడా తను చేసిన చెడు ఈ అమ్మాయిని ఎలా వెంటాడుతుందో ! ఆశ్చర్యంగా ఉందా ? వంద సం॥లు + ఒక జన్మ ఏమిటండీ ?! వేలాది సం॥లు + జన్మ జన్మలు వెంటాడుతాయి మన చెడు పనులు. మన మంచి కూడా మనకు వస్తుంది. తన కష్టాలకు తనే కారణం అని తెలుసుకున్న ఈ అమ్మాయికి అవగాహన ఉదయించింది, దానితో ఆమె కర్మ క్లియర్ అయింది. ప్రాక్టికల్‌గా, బయట ఈమె కాపురం కుదుట పడింది. ఒకటి రెండు రోజుల్లోనే ఈమెకు రిజల్ట్ వచ్చింది. ఇతర కొన్ని సమస్యలేవో క్లియర్ అయ్యాయని చెప్పింది. చాలా థాంక్స్ సార్ అంటూ ఆనందంగా నాకు ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయింది. ఈ ఇన్నోవేటివ్ మెథడ్ ద్వారా ఎంతో మంది, ఎన్నో అద్భుతమైన విషయాలను, మరెన్నో సత్యాలను స్వయంగా తెలుసుకున్నారు. చాలా ఫాస్ట్‌గా రిజల్ట్స్ పొంది... చాలా లాభ పడ్డారు !

ఈ అమ్మాయి ఒక మాస్టర్‌ను చాలా చాలా విశ్వసిస్తుంది. ప్రస్తుతం ఆయన భూమి పైన లేరు. ఇన్నోవేటివ్ మెథడ్‌లో ఈ అమ్మాయి ఆ మాస్టర్‌ను కలిసింది. అప్పుడు ఆమె నా గురించి ఆయనను అడిగి తెలుసుకుని ఆశ్చర్యపోయింది. ఆయన ఈమెకు ఇలా చెప్పారు.... "ఈ మాస్టర్ చాలా గొప్పవాడు, నేను కేవలం పూజలు, భజనలు, సంకీర్తనలు, యజ్ఞాలు, యాగాలు, హోమాలు మొదలైన చిన్న చిన్నవే చేయిస్తుంటాను మరియు చెబుతూ ఉంటాను. ధ్యానం గురించి చెప్పే శక్తిగాని, ధ్యాన ప్రచారం చేసే శక్తి కాని నాకు లేదు. ఈ మాస్టర్ చాలా శక్తివంతుడు కాబట్టే ధ్యాన ప్రచారం చేస్తూ అందరికీ ధ్యానం నేర్పించ గలుగుతున్నాడు, నీవు ఈయన బోధనలను అనుసరిస్తే ఖచ్చితంగా బాగుపడతావు" అని చెప్పారంటూ... ఈ సంగతులన్నీ ఈ అమ్మాయే నాకు చెబుతూ ఉంది. మెథడ్ అయిపోయిన తర్వాత ఆనందంతో వాళ్ళమ్మకు చెప్పుకుంది... మమ్మీ.. మెథడ్‌లో స్వామి కలిసాడు, మాట్లాడాడు అంటూ ఇంకా ఏవో సంగతులు వాళ్ళ అమ్మకు చెప్పింది. ఇది ఒక యథార్థ ఉదాహరణ ! సరే.... ఇక విషయానికి వస్తే....

...ఈ ఇన్నోవేటివ్ మెథడ్ ద్వారా అసలు విషయం తెలియనంత వరకు, ఆ అమ్మాయి ఏం అనుకుంటోంది...? ...నా కష్టాలకు నేను కారణం కాదు అని అనుకుంటూ ఉంది. తీరా స్వయంగా చూసి తెలుసుకున్న తర్వాత నా కష్టాలకు కారణం నేనే అని గ్రహించింది. ఇదే సత్యం అందరికీ వర్తిస్తుంది.

ఎప్పుడో, ఎక్కడో, ఈ జన్మలోనో లేక ఏదో ఒక జన్మలో చెడు చేస్తారు. మర్చిపోతారు. అది తిరిగి వచ్చేసరికి మర్చిపోతారు. అయ్యో నాకు ఇలా జరిగింది ఏమిటీ ?! అంటూ వీర లెవల్లో ఆశ్చర్యపోతూ బాధ పడతారు. అయితే మీకు ఒక సందేహం వచ్చి ఉంటుంది. ఎందుకు రాదు ? చెప్పేది మీ చెడుకు మీరే కారణం అని కదా ! మీ చెడుకు మీరు కారణం కాదు, కేవలం మీ మంచికి మాత్రమే మీరు కారణం అని అంటే, ''అయితే O.K...." అంటూ ముందుకు సాగిపోతారు. కాని ఇక్కడ మీ మంచి + చెడుకు మీరే, కేవలం మీరు మాత్రమే కారణం అని అనగానే, సహజంగానే చాలా మందికి వచ్చేస్తుంది డౌటు !

నేను ఎంత పుణ్య మూర్తిని, ఎంత పవిత్ర మూర్తిని, ఎంత మంచి మనిషిని.... అరెరె.... నాలో చెడు గుణాలు దాక్కుని ఉన్నాయా ?! అవే నా కష్టాలకు కారణమా !? నేను గతంలో చెడు చేసానా !?! అదే ఇప్పుడు నన్ను బాధలు పడేలా చేస్తుందా !!?? ఈ జన్మలోని చెడు అప్లై అయింది అంటే ఒప్పుకోవచ్చు కానీ.... వేల సం॥ల క్రితం, ఏదో జన్మలో చేసింది ఇప్పుడు రావడం ఏమిటి ? అని రకరకాల సందేహాలు వస్తాయి. ఏ జన్మలోది ఆ జన్మలోనే ఎందుకు క్లియర్ కాదు ? అనే ప్రశ్న కూడా పుడుతుంది. సరైన ఉన్నత ఆధ్యాత్మిక అవగాహన లేనప్పుడు సవాలక్ష సందేహాలు పుడుతుంటాయి అయితే ఇవి అజ్ఞానంలో నుండి పుడుతుంటాయి. దాన్ని మీరు, మీ తెలివి తేటలనుకుంటారు. ఇదే సమస్య ! దాన్ని మీరు, మీ అజ్ఞానంగా గుర్తిస్తే పరిష్కారం అవుతుంది.

ఏ జన్మలోనిది ఆ జన్మలోనే ఎందుకు క్లియర్ కాదు, అప్పుడెప్పుడో చేసింది ఇప్పుడెలా వస్తుంది ?

ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకునే ముందు ఒక విషయాన్ని ప్రస్థావించుకుందాం. ఉదాహరణకు, ఒక వ్యక్తి.... ఒక గొప్ప... పేద్ద.... విజయాన్ని సాధించాడు అని అనుకుందాం. అప్పుడు అతనికి "నాయనా నీ ఈ మహా విజయానికి కారణం నీవే.... 4 వందల జన్మల క్రితం అంటే సుమారు 5 లక్షల సం॥ల క్రితం నీవు చేసిన మంచి పని యొక్క ఫలితమే నీకు ఈ రోజు, ఇంతటి మహా భాగ్యాన్ని అందించింది" అని చెబితే, ఆ వ్యక్తికి ఎంతో హాయిగా, సమ్మగా ఉంటుంది. ఏ ప్రశ్నా ఉదయించదు. అదేంటండి ? మరీ అన్ని సం॥ల క్రితం చేసిన మంచి ఇప్పుడెలా వస్తుందండీ అని అడగడు. ఆనందంతో ఆశ్చర్యపోతూ.... అవునా... ఓహో అలా కూడా జరుగుతుందా.. అని నోరు తెరుస్తాడు. ఆ తెరిచిన నోరు వృథా కాకుండా అతగాడి సంబంధీకులు ఎవరో ఒకరు ఆ నోట్లో స్వీటు పెడతారు, తర్వాత వారూ పెట్టుకుంటారు. కొన్ని రోజుల తర్వాత విజయం సాధించిన మన వీర విజయుడికి ఏదో ఒక చిన్న రోగం వచ్చిందనుకోండి. అప్పుడు అతడికి ఈ రోగానికి నీవే కారణం, వంద సం॥ల క్రితం, నీ గత జన్మలో చేసిన చెడు యొక్క ఫలితమే ఇప్పుడు నీవు రోగంగా అనుభవిస్తున్నావు... అని చెబితే... వెంటనే, అలా ఎలా ?! ఎప్పుడో వంద సం॥ల క్రితం... అది కూడా పోయిన జన్మలో... అసలు ఈ జన్మలు అనేవి నిజంగా ఉంటాయా.... అంటూ ప్రశ్నల పరంపర మొదలవుతుంది. నా మంచికి మాత్రం నేనే కారణం, కాని నా చెడుకు మాత్రం నేను కాదు అనేటటువంటి, టక్కు టమార విద్యలు ఆధ్యాత్మికంలో పనికి రావు. సత్యాన్ని ఒప్పుకుని తీరాల్సిందే ! వేరే మార్గం లేనే లేదు !!

ఏ జన్మలోనిది ఆ జన్మలోనే ఎందుకు క్లియర్ కాదు, అప్పుడెప్పుడో చేసింది ఇప్పుడెలా వస్తుంది ?

ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటంటే....

''మీరు మోయలేని బరువు మీ మీద వేయబడదు'' అనేది ఒక సృష్టి నియమం.

ఆత్మ విజ్ఞానం లేని వ్యక్తి ఎన్ని చెడు పనులు చేస్తాడంటే, వాటి ఫలితాలన్నింటినీ ఒకే జన్మలో మోయలేనంతగా ! సృష్టి నియమం ప్రకారం మిగిలిన ఫలితాలు వచ్చే జన్మకు ట్రాన్స్‌ఫర్ అవుతాయి. ఇలా జన్మ జన్మకు అవి కొండవీటి చాంతాడంత పెరిగి పోతూనే ఉంటాయి. ఏదో జన్మలో చేసింది, దాని నంబర్ వచ్చే సరికి కొన్ని వేల సంవత్సరాలు గడిచి ఉంటాయి. అప్పుడేం గుర్తుంటుంది ?! ఎన్ని సంవత్సరాలైనా ఆ ఫలితాలు మాత్రం తంచనుగా వస్తూనే ఉంటాయి. ఎవరివి వారికే సూటిగా, సరిగ్గా, ఖచ్చితంగా వస్తాయి. జిమ్మా రావుది జిమ్మా రావుకే వస్తుంది. గుమ్మా రావుది గుమ్మా రావుకే వస్తుంది. అటుది ఇటు, ఇటుది అటు కాదు. పరమాణువంత పొరపాటు కూడా కాదు. ఏదైనా

ఒక ప్రమాదంలో కొంత మంది ప్రయాణీకులు చనిపోవడం, కొంత మంది బతికి బయట పడడం మనకు అప్పుడప్పుడు తెలుస్తూనే ఉంటుంది. పక్క పక్కనే ఉన్న ఇద్దరిలో ఒకడు పోతాడు, ఒకడు ఉంటాడు. దీన్ని బట్టే అర్థం చేసుకోవాలి, సృష్టి నియమాలు ఎంత ఖచ్చితంగా పని చేస్తాయో !

అయితే చేసిన చెడు పనులకు, అవి ఎంతటి ఘోరాతిఘోరమైనవి అయినా, ఎంతటి పరమ దారుణమైనవి అయినా.... ఎలాంటి శిక్షలు అనుభవించాల్సిన అవసరం లేదు, అవును నిజం... లేనే లేదు. కేవలం సరైన అవగాహన తెచ్చుకుంటే సరిపోతుంది. ఎన్ని కోట్ల... కోట్ల జన్మల పాప కర్మలకైనా మనలో ఉన్న ''దైవత్వం'' నుండి ప్రసరించే ఒకే ఒక్క క్షణ కాలపు ''దివ్య కిరణ ప్రభావం చేత అవన్నీ సులభంగా, సరళంగా, సురక్షితంగా, శాశ్వతంగా, నిజంగా తొలగిపోతాయి''.

మీరే దైవం అనే సత్యాన్ని మీరు గ్రహించడానికి ఏ బాధలు, ఏ ఘోరాలు, ఏ దారుణాలు మొదలైనవి వేటినైనా సరే, మీరు అనుభవించాల్సిన అవసరం లేదు. ఇప్పటి మీ స్థితి ''ఎలా'' ఉన్నా సరే, ...''నేను దైవాన్ని'' అని అనుకుంటూ మీ దైవత్వాన్ని స్మృతిలోకి తెచ్చుకుంటూ ఉండండి చాలు ! అంతా అన్నీ క్లియర్ అయిపోతాయి. నిజం !

మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేసే వ్యక్తుల ద్వారా మరియు మిమ్మల్ని బాధిస్తున్న రోగాల ద్వారా.... సృష్టి, మీలో పరివర్తనను తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తుంది. దీన్ని అర్థం చేసుకుని పరివర్తనకు మీరు సిద్ధమైతే చాలు, మీలో పరివర్తనను ఆటొమెటిక్‌గా సృష్టియే తీసుకు వస్తుంది !

ఫైనల్‌గా మీరు గ్రహించాల్సిన విషయం ఏమిటంటే....

మిమ్మల్ని ఇతరులు ఎవరైనా సరే ఇబ్బంది పెడుతున్నారు అని అంటే, దాని అర్థం.... మీరు అలా చేయకూడదు అని ! ఈ పరమ సత్యాన్ని గ్రహిస్తే ఎంతో గొప్పవైన ఫలితాలను పొందుతూనే ఉంటారు.

''నేను దైవాన్ని'' అనే సాధన మీరు చేస్తూ ఉంటే చాలు,
మీకు ఏ ఆపద, ఏ ఇబ్బంది, ఏ కష్టనష్టాలు, ఏ రోగాలు,
ఏ నొప్పులు, ఏ అవమానాలు, ఏ నెగెటివ్‌లు కూడా రానే రావు.
మీరు సదా సర్వదా ఆనందంగా ఉంటారు.

All The Very Best & Good Luck !

✪ ✪ ✪

13. రిలీజింగ్ మెడిటేషన్

శరీరంలో మరియు జీవితంలో ఉన్న బాధలకు ''మూలాలు'' ''లోపల'' ఉంటాయి.

శరీరంలో అనారోగ్యాలు మరియు జీవితంలో కష్టనష్టాలు, అవమానాలు, పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, అపజయాలు, నిందలు, అస్థిరత్వం, అభద్రత, దారిద్ర్యం మొదలైన వాటి వలన "బాధలు" కలుగుతాయి.

మీ జీవితంలో బాధలు ఎక్కువగా ఉన్నాయంటే, మీరు మీ లోపల బాధలను ఇష్టపడే గుణాలను కలిగి ఉన్నారనే అర్థం. ఇవి మీ ''లోపలి'' నుండి పూర్తిగా తొలగిపోనంత వరకు మీకు బాధలు తప్పవు. వీటిని రిలీజ్ చేసినప్పుడే మీకు వీటి నుండి విముక్తి దొరుకుతుంది.

ప్రశాంతంగా కూర్చుని.... మీ శరీరంలోని మరియు జీవితంలోని బాధలను తలుచుకుని... "బాధలను ఇష్టపడే గుణాలు నా లోపల ఉన్నాయి. వీటిని నేనే పట్టుకుని ఉన్నాను - అవి నన్ను పట్టుకుని లేవు... కాబట్టి వీటిని వదిలేయాల్సింది నేనే..." అని అర్థం చేసుకోవాలి. ఇప్పుడు మీరు... ప్రశాంతంగా కూర్చుని, రెండు కళ్ళు మూసుకుని,

నాలో ఉన్న బాధలను ఇష్టపడే గుణాలన్నింటినీ

నేను పూర్తిగా రిలీజ్ చేసాను, రిలీజ్ రిలీజ్....

.....అని మీలోపల పదే పదే అనుకుంటూ ఉండడమే... రిలీజింగ్ మెడిటేషన్ !

మీరు ఈ సూత్రాన్ని పదే పదే మీలోపల అనుకుంటూ ఉంటే చాలు, ఆటొమెటిక్‌గా వాటిని మీ లోపల ఉన్న మీ ''దైవత్వం'' పూర్తిగా రిలీజ్ చేసేస్తుంది.

ఈ సాధన యొక్క మహిమ ద్వారా చాలా ఆశ్చర్యకరమైన విధంగా మీరు మీ యొక్క సర్వ అనారోగ్యాల నుండి సమస్త కష్టనష్టాల నుండి నిజంగా, పూర్తిగా బయట పడతారు. ఇది సత్యం.

✪ ✪ ✪

సత్య మార్గంలో స్థిరం కావాలంటే చాలా వికాసం, చాలా ధైర్యం కావాలి.

14. కాంతి ప్రేమ ఆనందం సాధన

కాంతి ఎంతటి క్లిష్ట కార్యాలనైనా సులభంగా సంభవం చేసేస్తుంది. కాంతి ఎంతటి అవరోధాలనైనా సరళంగా క్లియర్ చేస్తుంది. ఆరోగ్య ఐశ్వర్య విజయానందాలను కలిగించే శక్తులకు కాంతి ఒక ప్రధాన మూలం. కాంతి ఇంకా ఎన్నింటినో సంభవింప జేస్తుంది. ప్రేమ గురించి, ప్రేమ యొక్క శక్తి గురించి ఇంతకు ముందు పేజీలలో వివరించాను. అలాగే ఆనందం గురించి, ఆనందం యొక్క శక్తి గురించి కూడా ఇంతకు ముందే వివరించాను. ఆ విషయాలను గుర్తుకు తెచ్చుకోండి.

కాంతిలో సమాచారం ఉంటుంది. కాంతిలో అవగాహన ఉంటుంది. కాంతిలో పరివర్తించే శక్తి ఉంటుంది. కాంతిలో విజ్ఞానం ఉంటుంది. కాంతి సురక్షా పూర్వకమైనది. కాంతి శక్తులకు అసాధ్యమైనది లేనే లేదు. కాంతిని ఉపయోగించి మహా మహా కార్యాలను సైతం అవలీలగా సంభవింప చేయవచ్చు. కాంతికి ప్రేమను ఆనందాన్ని జోడిస్తే... వివరించడానికి పదాలు దొరకడం లేదు. అసంభవాలు అంటూ ఏవీ ఉండవు అని మాత్రం చెప్పవచ్చు ! ఇది సత్యం !

కాంతి ప్రేమ ఆనందం

ప్రశాంతంగా కూర్చుని మీ పట్ల మీరు, **కాంతి ప్రేమ ఆనందాలను** ప్రకటించుకుంటూ ఉండండి. మీకు ఎవరితో ఇబ్బందులు ఏర్పడితే వారిని తలుచుకుని, వారి పట్ల **కాంతి ప్రేమ ఆనందాలను** ప్రకటించండి. ఎలా అంటే... మీరు ఎవరికైతే **కాంతి ప్రేమ ఆనందాలను** ప్రకటించాలనుకుంటున్నారో... వారిని తలుచుకుంటూ... **కాంతి ప్రేమ ఆనందం** అని అనుకుంటూ ఉండడమే... వారి పట్ల **కాంతి ప్రేమ ఆనందాలను** ప్రకటించడం అని అంటే ! మీకు ఇబ్బంది కలిగిస్తున్న పరిస్థితుల పట్ల మరియు వ్యక్తుల పట్ల **కాంతి ప్రేమ ఆనందాలను** ప్రకటించండి. అద్భుత రీతిలో అమోఘమైన ఫలితాలు వస్తాయి. ఆరోగ్య ఐశ్వర్య విజయానందాలను పొందడానికి ఈ సాధన మహా మంచి మార్గం.

వ్యక్తుల మధ్య సంబంధాలను మరియు పరిస్థితులను బాగు చేసి అహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించడంలో ఈ సాధనకు మరేదీ సాటి లేదు అని అంటే అతిశయోక్తి కాదు.

విడిపోయిన కుటుంబాలను కలుపుతుంది. విడిపోయిన భార్యాభర్తలను కలుపుతుంది. విడిపోయిన అన్నదమ్ములను కలుపుతుంది. విడిపోయిన స్నేహితులను కలుపుతుంది. విడిపోయిన ప్రాంతాలను కలుపుతుంది. దేశాల మధ్యన ఐక్యతను తెస్తుంది. అసమానతలను మాయం చేస్తుంది. చాలా మంది సామూహికంగా కలిసి సాధన చేస్తే ఈ కాంతి సాధన వలన యుద్ధాలను కూడా ఆపవచ్చు. ఈ భూమి పైన ప్రశాంతతను నెలకొల్పవచ్చు. ఇది నిజం.

జీవనోపాధి లేని వారికి జీవనోపాధిని కలిగిస్తుంది ఈ సాధన. స్వేచ్ఛా సాధికారతలను లేని వారికి స్వేచ్ఛా సాధికారతలను ప్రసాదిస్తుంది ఈ సాధన. ఆరోగ్య ఐశ్వర్య విజయానందాలను అందించడంలో ఈ సాధన మహా గొప్ప పాత్ర వహిస్తుంది. మీరు ఏ పనైనా చేయబోయే ముందు ఆ పనికి సంబంధించిన వ్యక్తులకు మరియు పరిస్థితులకు కాంతి ప్రేమ ఆనందాలను ప్రకటించిన తర్వాత ఆ పని చేస్తే, ఆ పని తప్పక విజయవంతం అవుతుంది.

రకరకాల సమస్యల పైన ఈ కాంతి సాధనను ప్రయోగించి ఫలితాలను రాబట్టుకోవచ్చు. ప్రయత్నించండి. గ్యారంటీగా సఫలీకృతులు అవుతారు.

✪ ✪ ✪

15. దివ్య నేత్ర ఉత్తేజిత సాధన

Third Eye Activation Meditation

మూడో కన్ను, దివ్య నేత్రం, దివ్య చక్షువు, దివ్య దృష్టి, దివ్య కేంద్రం, జ్ఞాన దృష్టి, జ్ఞాన నేత్రం, జ్ఞాన చక్షువు, అంతర్ నేత్రం, అంతర్ చక్షువు, అంతర్ దృష్టి, మనో నేత్రం, మనో చక్షువు, మనో దృష్టి, లో నేత్రం, లో చక్షువు, లో దృష్టి, త్రినేత్రం, థర్డ్ ఐ, డివైన్ ఐ, క్లైయర్‌వాయన్స్, పిట్యూటరి గ్రంథి(గ్లాండ్) - ఇవన్నీ ఒక్కటే !

మనిషి అన్న ప్రతి వాడికి ఇది ఉంటుంది. విశేషమైన ఆత్మ విజ్ఞాన అభ్యాసం + నిరంతర ధ్యాన సాధన ద్వారా ఈ మూడో కన్నును ఎవరైనా ఉత్తేజితం చేసుకోవచ్చు. మన భౌతిక కళ్ళకు కనపడని సర్వ విషయాలు దీనితో మనం దర్శించవచ్చు. మూడో కన్నుతో మనం సృష్టిలోని అన్ని విషయాలను తెలుసుకోవచ్చు.

వీర బ్రహ్మేంద్ర స్వామి, నోస్ట్రడామస్, కీరో మొదలైన మహా యోగీశ్వరులు అందరూ ఈ మూడో కన్ను ద్వారానే భవిష్యత్తును దర్శించి మానవాళికి కాలజ్ఞానాన్ని అందజేసారు. థర్డ్ ఐ మాస్టర్స్ ఎంతో మంది ఉన్నారు.

చిన్న పిల్లలకు సహజంగానే ఈ మూడో కన్ను ఉత్తేజితమై ఉంటుంది. నాలుగు సంవత్సరాల వయసు నుండి మెల్లి మెల్లిగా మూసుకుపోతూ ఏడవ సంవత్సరానికల్లా ఆల్‌మోస్ట్ మూసుకుపోతుంది. తర్వాత ఎప్పుడైనా ఓపెన్ చేసుకోవచ్చు, అది వేరే విషయం. అలా కాకుండా చిన్నప్పటి నుండే మనం, చిన్న పిల్లలకు ఆత్మ విజ్ఞానం నేర్పిస్తూ, వారిచే ధ్యాన సాధన చేయిస్తూ ఉంటే ఆ దివ్య నేత్రం చక్కగా ఉత్తేజితమై వికసిస్తుంది. అప్పుడు వారు గ్రేట్ గ్రాండ్ మాస్టర్స్‌గా తయారై తమకు, తమ కుటుంబానికి మరియు లోకానికి ఎంతో శ్రేయస్కరంగా పరిణమిస్తారు.

మూడో కన్ను - ఇది నిజంగా కన్నులా ఉండదు. ఇది కన్ను కూడా కాదు. ఇది దివ్య కేంద్రం. దీని ద్వారా అన్ని సత్యాలను దర్శించవచ్చు కాబట్టి అలా అంటారు.

ఈ మూడో కన్ను మనిషి అనబడే ప్రతీవాడికీ ఉంటుంది. వాడు ఏ మతం వాడైనా, ఏ దేశం వాడైనా, ఎవరైనా సరే.. మానవుడా కాదా.. అన్నదే పాయింట్ !

మూడో కన్ను - సృష్టి మనకు ఇచ్చిన మహా అద్భుతమైన దివ్య వరం. ఒక మహా గొప్ప శక్తి. దీని యొక్క ఉపయోగాలు అనంతం. ఈ దివ్య నేత్రాన్ని ఉత్తేజితం చేసుకునే శక్తి సామర్థ్యాలు ప్రతీ ఒక్కరూ సహజంగానే కలిగి ఉంటారు అని అనడానికి నిదర్శనం - "ప్రతీ ఒక్కరూ దాన్ని కలిగి ఉండడమే" ! మీరు దాన్ని కలిగి ఉన్నారు అని అంటే దాన్ని ఉత్తేజితం చేసుకోగలుగుతారు అనే అర్థం.

ఈ దివ్య నేత్రం ఉత్తేజితం అయితేనే మానవుడికి పూర్తి నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధికారతలు వస్తాయి. ఇది ఉత్తేజితం కాకుండా కలిగి ఉన్నవి నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధికారతలు కావు. ఈ దివ్య కేంద్రం ఉత్తేజితం కాని వ్యక్తి అనేక రకాలుగా బంధనాల్లో ఉంటాడు. మీరు ఏ రకమైన స్వేచ్ఛనైనా చూపండి, దాని మూలం ఏదో ఒక దాని బంధంలో ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే - సూర్యుడు లేనిదే వెలుగు ఎలా ఉండదో.. దివ్య నేత్రం ఉత్తేజితం కానిదే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధికారతలు ఉండవు గాక ఉండవు ! ఈ దివ్య నేత్రం ఉత్తేజితం కాని వ్యక్తులకు నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధికారతల గురించి ఎంత చెప్పినా అర్థం కాదు. ఇది ఉత్తేజితం అయితే తప్ప తెలుసుకోలేరు.. కాబట్టి ఆసక్తి కలిగిన వారు దీన్ని ఉత్తేజితం చేసుకుని అన్ని రకాలుగా అభివృద్ధి చెందవచ్చు. మీకు శుభం + లాభం జరుగు గాక !

దివ్య నేత్రం ఉత్తేజితమైతే మీ గత జన్మలన్నీ చూసుకోవచ్చు. ఏది సత్యం ఏది అసత్యం అన్న విషయాలను స్పష్టంగా తెలుసుకోవచ్చు. దీనిని ఉపయోగించుకుని ఎన్నో రకాలుగా, ఎంతెంతో అభివృద్ధిని సాధించవచ్చు. ప్రస్తుతం భూమి పైన ఎన్ని రకాలుగా అసత్యాలు చెలామణి అవుతున్నాయో తెలుసుకోవచ్చు. మాస్టర్స్‌తో సంభాషించవచ్చు. ఇంకెన్నో దివ్య విశేషాలను దర్శించవచ్చు. ఇలా.. ఎన్నెన్నో శుభాలు+లాభాలు దీని వలన !

సాధనా విధానం :

ప్రశాంతంగా కూర్చోండి. కళ్ళు మూసుకోండి.

కళ్ళు మూసుకుని ఉన్న మీరు, మీ యొక్క నుదుటి భాగంలో, మీ దృష్టిని ప్రసరింప చేయండి. కళ్ళు మూసుకుని ఉన్న మీరు, మీ యొక్క దృష్టిని మీ నుదుటి భాగంలో అలా తిప్పుతూ ఉంటే.. మీ దృష్టి ఒక దగ్గర ఆటొమెటిక్‌గా స్థిరం అవుతుంది. మీకు చాలా స్పష్టంగా తెలుస్తుంది. అలా.. ఆటొమెటిక్‌గా ఎక్కడైతే మీ దృష్టి ఆగిపోయిందో లేక స్థిరం అయిందో.. అదే.. దివ్య నేత్రం లేక దివ్య కేంద్రం. దివ్య కేంద్రం యొక్క ప్రత్యేకత ఏమిటంటే మీ దృష్టిని అంటే.. మీ ఎరుకను తనంతట తానుగా ఆకర్షిస్తుంది. మీరు కేవలం కళ్ళు మూసుకుని, మీ దృష్టిని మీ నుదిటిలో.. తిప్పుతూ ఉండండి.. పరిశీలనగా మీ దృష్టిని అలా తిప్పుతూ ఉన్నప్పుడు.. ఒక దగ్గర ఆటొమెటిక్‌గా మీ దృష్టి స్థితం అవుతుంది.. అదే.. కరెక్ట్ పాయింట్.. అదే మీ దివ్య కేంద్రం లేక దివ్య నేత్రం.

ఎక్కడైతే మీ ఎరుక(దృష్టి) స్థితమైందో.. అక్కడే మీ ఎరుకను కేంద్రీకరించండి. అలా మీ ఎరుకను కేంద్రీకరించి ఉంచండి.

మీ దివ్య కేంద్రం(మూడో కన్ను) పైన ఎరుకను కేంద్రీకరించి ఉంచడమే, దానిని ఉత్తేజితం(ఓపెన్) చేసే అత్యుత్తమ, సురక్షాపూర్వకమైన, మహా శక్తివంతమైన, అత్యంత శీఘ్రమైన మరియు సశాస్త్రీయమైన పద్ధతి.

దివ్య కేంద్రాన్ని(మూడో కన్ను) ఉత్తేజితం చేసే పద్ధతులు చాలానే.. చెలామణిలో ఉన్నాయి. అయితే ఈ పద్ధతి అన్నింటిలోకెల్లా సురక్షితమైనది మరియు సరియైనది.

ఎందుకంటే.. మీ దివ్య నేత్రం ఉత్తేజితమైతే మీకు మీ యొక్క వాస్తవాలన్నీ కనపడతాయి. మీ గత జన్మలన్నీ కనపడతాయి. మీ యొక్క మంచి మీకు కనపడినప్పుడు మీకు బాగానే ఉంటుంది కానీ, మీ యొక్క లోపాలు మరియు మీ లోపల ఉన్న నెగెటివ్‌లు కనపడినప్పుడు.. వాటిని చూసి తట్టుకుని, జీర్ణించుకునే శక్తి మీకు ఉండాలి. మీ చైతన్యం, మీ యొక్క నెగెటివ్ గతాన్ని మరియు మీ యొక్క నెగెటివ్ గుణాలను చూసి నిభాయించుకుని, అర్థం చేసుకునేంతగా అభివృద్ధి చెంది ఉండాలి. ఒకవేళ మీ చైతన్యం ఈ విధంగా అభివృద్ధి చెందకుండా గనుక, మీ మూడో కన్ను తెరుచుకుంటే.. ఆ యొక్క వాస్తవాలను చూసి జీర్ణం చేసుకోలేక మీరు చాలా చాలా అవస్థలు పడాల్సి వస్తుంది, మీరు చాలా చాలా బాధలు పడాల్సి వస్తుంది. ఒక గురువు దగ్గర ఇలా జరిగింది.. ఒకామె చైతన్యం, ఆమె యొక్క నెగెటివ్ గతాన్ని మరియు నెగెటివ్ గుణాలను చూసి తట్టుకుని జీర్ణం చేసుకునేంత స్థితికి రాకముందే ఆమె వేరే ఒక సరికాని పద్ధతిలో తన గత జన్మ చూసుకుంది. ఆ గత జన్మలో ఆమె ఒక వేశ్య.. తాను గత జన్మలో వేశ్యగా ఎలా జీవించింది.. అన్నీ వివరంగా, స్పష్టంగా, మొత్తం తన గత జన్మను అంతా క్లియర్‌గా చూసుకుంది. ఈ జన్మలో ఆమె ఒక చక్కటి ఇల్లాలు. కానీ గత జన్మలో ఆమె ఒక వేశ్య..! ఈ భయంకర నిజాన్ని ఆమె భరించలేక పోయింది. తను చూసింది కాదనలేని సత్యం. ఎందుకంటే ఎవరి వాస్తవాన్ని వారు చూసుకున్నప్పుడు వారికి చాలా స్పష్టంగా తెలిసి పోతుంది తాము తెలుసుకుంది వాస్తవమేనని ! వారి యొక్క ప్రస్తుత వర్తమానంలో వారు ఆ సత్యాన్ని అంగీకరించలేక పోతున్నా.. అది నిజమేనని వారికి క్లియర్‌గా తెలుస్తుంది. సత్యాన్ని భరించలేక.. దాన్ని తిరస్కరించలేక చాలా బాధలు పడాల్సి వస్తుంది.

అదే.. ఇక్కడ నేను చెప్పిన పద్ధతిలో గనుక మీరు సాధన చేస్తే.. అప్పుడు మీ చైతన్యం అభివృద్ధి చెందుతుంది. నిజాలను చూసి అర్థం చేసుకుని, సులభంగా, సురక్షితంగా జీర్ణం చేసుకునే శక్తి సామర్థ్యాలు వస్తాయి. అప్పుడు మీరు, మీ యొక్క ఏ నిజాన్ని తెలుసుకున్నా మీకేమీ అనిపించదు.. ఓహో.. అలాగా.. అని దాని యొక్క సారంశాన్ని గ్రహించి ముందుకు సాగుతారు. అభివృద్ధి చెందుతారు. ఆనందిస్తారు. ఎందుకంటే మీ నెగెటివ్‌లను తెలుసుకోవడం అని అంటే, వాటిని తొలగించుకోవడం.

మీలో నుండి నెగెటివ్‌లను తొలగించడం అని అంటే ఏమిటి దాని అర్థం ? అభివృద్ధి చెందడమే కదా.. బాగు పడటమే కదా ! అజ్ఞానంతో ఉన్నప్పుడు నిజాలను భరించే శక్తి ఉండదు. అజ్ఞానం అంటే అసత్యం.. నిజం అంటే సత్యం. అందుకే అజ్ఞానంతో ఉన్నప్పుడు నిజాలను అంటే సత్యాలను తెలుసుకోలేరు. సత్యాన్ని భరించే శక్తి కేవలం సత్యమే ఇస్తుంది. దివ్య నేత్రం అంటే సత్య కేంద్రం ! అవును ఇది సత్య కేంద్రం !

దీని ద్వారా కేవలం సత్యమే దర్శనం అవుతుంది. ఎవరికైనా తప్పుడు అనుభవం వచ్చిందీ అని అంటే అది ప్యూర్ థర్డ్ ఐ ఎక్స్‌పీరియన్స్ కాదన్న మాట ! వారిలో ఉన్న తప్పుడు గుణాలకు ప్రదర్శింప బడుతున్న తప్పుడు ఎక్స్‌పీరియన్స్ ! గుర్తుంచుకోండి, మీకు వచ్చిన ఎక్స్‌పీరియన్స్ నిజమైతే అది థర్డ్ ఐ ఎక్స్‌పీరియన్స్. ఒక వేళ మీకు వచ్చిన ఎక్స్‌పీరియన్స్ తప్పు అయితే, అది తప్పుడు గుణం చూసిన తప్పుడు ఎక్స్‌పీరియన్స్ అని అర్థం.

కాబట్టి ధ్యానంలో తప్పుడు అనుభవాలు వస్తున్నాయి.. అని ధ్యానాన్ని నిందించ కూడదు. మీకు తప్పుడు ఎక్స్‌పీరియన్స్‌లు వస్తున్నాయంటే.. మీలో తప్పుడు గుణాలు ఉన్నాయనే అర్థం.

ఈ విషయాలన్నీ అర్థం చేసుకుని మీరు దివ్య నేత్ర ఉత్తేజిత సాధనను ప్రారంభించండి. ఇప్పుడు మీరు ప్రశాంతంగా ధ్యానంలో కూర్చుని ఉన్నారు..

ఇంతకు ముందు వివరించినట్టుగా.. కళ్ళు మూసుకుని ఉన్న మీ యొక్క దృష్టిని మీ నుదిటి మధ్యలో.. అది ఎక్కడైతే ఆటొమెటిక్‌గా ఆగుతుందో.. అక్కడే నిలిపి ఉంచండి. ఆ స్థలంలోనే నిలిపి ఉంచండి. అదే మీ దివ్య నేత్రం.

ఇప్పుడు.. మీరు మీ దివ్య నేత్రాన్ని ఉద్దేశించి.. ''ప్రేమ ఎరుక ఆనందం''.. ''ప్రేమ ఎరుక ఆనందం''.. ''ప్రేమ ఎరుక ఆనందం''.. అని మీ లోపల అనుకుంటూ ఉండండి. ''ప్రేమ ఎరుక ఆనందం'' అని మీ లోపల అనుకుంటూ ఉండడమంటే ఏమిటనుకున్నారు..? మీ ఆత్మ పూర్వకంగా మీరు మీ దివ్య నేత్రానికి, మీ యొక్క దివ్య ప్రేమను ప్రకటిస్తూ(ప్రసారం), పూర్తి ఎరుకను మరియు ఆనందాన్ని మీ దివ్య నేత్రం పైన కేంద్రీకరించడం అని అర్థం. మీరు ''ప్రేమ ఎరుక ఆనందం'' అంటూ ఉంటే ''మీ యొక్క మొత్తం చైతన్యం అంతా మీ దివ్య నేత్రం పైన కేంద్రీకరించ బడుతుంది''...!

మీ దివ్య నేత్రం పైన మీ దృష్టిని కేంద్రీకరించి ఉంచి, మీ దివ్య నేత్రాన్ని ఉద్దేశించి ''ప్రేమ ఎరుక ఆనందాలను'' ప్రకటిస్తూ ఉండాలి. మీ దివ్య నేత్రం పైన మీరు, ''ప్రేమ ఎరుక ఆనందాలను'' ప్రకటిస్తూ ఉండడమంటే.. మీ ఆత్మ ప్రేమను మరియు పూర్తి ఎరుకను.. ఆనంద శక్తిని మీ దివ్య నేత్రానికి అందించడమే.....!

ఈ విధంగా చేస్తూ ఉన్నప్పుడు.. మీకు సత్యాలను చూసి, తెలుసుకుని సునాయసంగా జీర్ణం చేసుకునే శక్తి సామర్థ్యాలు వస్తూ ఉంటాయి. ఎంతెంతగా మీ శక్తి సామర్థ్యాలు పెరుగుతూ ఉంటాయో అంతంతగా మీ దివ్య నేత్రం ఉత్తేజితం అవుతూ ఉంటుంది. ఎంతెంతగా మీ దివ్య నేత్రం ఉత్తేజితం అవుతూ ఉంటుందో.. అంతంతగా మీకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధికారతలు సిద్ధిస్తూ ఉంటాయి, అంతంతగా మీరు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతూ ఉంటారు.

మీరు ఎంతెంతగా సాధన చేస్తూ ఉంటారో.. అంతంతగా మీరు శక్తివంతులవుతూ ఉంటారు. ఈ సాధన యొక్క మరొక గొప్ప ఫలం ఏమిటంటే.. మీలో నీతి, నిజాయితీ, నిబద్ధతలు ఉదయిస్తాయి. అంటే మీలో ఉన్న నెగెటివ్ గుణాలన్నీ వాటంతట అవే తొలగిపోతాయి అని అర్థం. మీలో ఎంతెంతగా నీతి, నిజాయితీ, నిబద్ధతలు పెరుగుతూ ఉంటాయో అంతంతగా మీకు సత్యాలు దర్శనమిస్తూ ఉంటాయి. ఎంతెంతగా అయితే మీరు సత్యాలను తెలుసుకుంటూ ఉంటారో.. అంతంతగా మీరు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతూ ఉంటారు. దివ్య నేత్రం ఉత్తేజితం అవుతూ ఉంటే ఇంకా ఎన్నెన్నో శుభాలు మరియు లాభాలు జరుగుతూనే ఉంటాయి. అవన్నీ ఇక్కడ వివరంగా చెబితే మీరు అనవసరంగా టెంప్ట్ అయిపోయి ఏదేదో అయిపోతారు. కాబట్టి ముందు మీరు సాధన ప్రారంభించండి. క్రమం తప్పని సాధన చేస్తూ ఉంటే అన్ని విషయాలు మీకే తెలుస్తూ ఉంటాయి.

బాగా గుర్తుంచుకోండి, మీ దివ్య నేత్రం పైన మీ దృష్టిని నిలిపి ఉంచి, మీ దివ్య నేత్రానికి ''ప్రేమ ఎరుక ఆనందాలను'' ప్రకటిస్తూ(ప్రసారం) ఉండాలి. ''ప్రేమ ఎరుక ఆనందాలను''... అలా నిరంతరంగా ప్రకటిస్తూనే ఉండాలి. ప్రతీ రోజూ కనీసం ఒక గంట సేపు ఈ సాధన చేస్తే మంచిది. ఇంకా ఎక్కువ సేపు చేస్తే శుభాలు మరియు లాభాలే తప్ప నష్టాలేవీ లేవు.. కాబట్టి మీ ఇంట్రెస్ట్.. మీ ఓపిక..!

మీ ఆలోచనలే మీ వాస్తవాలు.. అనే సత్యాన్ని మీరు చదివే ఉంటారు కదా..! దాని మర్మం ఏమిటి అనుకున్నారు..? మీ ఆలోచనలను ఈ సత్య కేంద్రం పైన కేంద్రీకరిస్తే అవి వాస్తవాలుగా మారుతాయి. మీకు తెలియకుండా మీరు నిత్యం చేసే పని ఇదే !

మూడో కన్ను అని అంటే సంకల్పాలను వాస్తవాలుగా మార్చే కేంద్రం. మీరు ఈ కేంద్రంలో ఆలోచించినదేదైనా సరే.. వాస్తవంగా మారుతుంది. మీరు ఆలోచించేది మంచి అయినా లేక చెడు అయినా ఏదైనా సరే అది జరుగుతుంది. ఇతరులకు హానికారకమైనది మాత్రం జరగదు. మీకు సంబంధించినది ఏదైనా జరుగుతుంది. ఊరికే అదీ ఇదీ కోరడం ఎందుకు.. డైరెక్ట్‌గా దైవత్వాన్నే కోరుకోండి అని నేను, ఈ దివ్య నేత్రం పైన మీ దృష్టిని నిలిపి, దైవత్వ సాధన చేయమని చెబుతాను. ఇది ఆలోచనలను, సంకల్పాలను వాస్తవాలుగా మార్పు చెందించే కేంద్రం. ఈ మూడో కన్నులో అనంతమైన శక్తి ఉంటుంది. ఇది శక్తి కేంద్రం. ఇక్కడ కేంద్రీకరించిన ఆలోచన, సంకల్పం, కోరిక ఏదైనా జరుగుతుంది. మీరు ఈ కేంద్రం పైన మీ దృష్టిని నిలిపి ఉంచినప్పుడు ఏవైనా నెగెటివ్

ఆలోచనలు వస్తే ఎలా...??? అందుకే మీకు ఈ ''ప్రేమ ఎరుక ఆనందం'' అనే సురక్షా సూత్రాన్ని ఇచ్చాను. మీరు మీ దివ్య నేత్రం పైన మీ దృష్టిని ఫోకస్ చేసి, నిరంతరం.. గ్యాప్ లేకుండా.. ''ప్రేమ ఎరుక ఆనందం''.. ''ప్రేమ ఎరుక ఆనందం''.. అంటూ ''ప్రేమ ఎరుక ఆనందాలను'' ప్రకటిస్తూ ఉంటే.. ఒక వైపు మీ దివ్య నేత్రం ఉత్తేజితం అవుతూ ఉంటుంది మరో వైపు మీకు ఎలాంటి నెగెటివ్ ఆలోచనలు రాకుండా సురక్షితంగా ఉంటుంది. సేఫ్‌గా సాధన సాగుతూ ఉంటుంది.

మీరు మీ దృష్టిని ఈ దివ్య నేత్రం పైన నిలిపి ఉంచి, ''ప్రేమ ఎరుక ఆనందాలను'' ప్రకటిస్తూ ఉంటే చివరికి ఒకరోజు మీకు ''దైవత్వం'' కూడా ప్రాప్తిస్తుంది. ఎందుకంటే ఈ కేంద్రం యొక్క చివరి ఫలమే దైవత్వం ! మీరు దైవత్వ సాధన చేసినా సరే.. ఈ సాధన చేసినా సరే.. అయితే దైవత్వ సాధనయే నిస్సందేహంగా గొప్పది.

మీరు ఈ సాధనను సరిగా చేయాలి. ఏం కనపడతాయో.. నేను దొంగనో లేక నేను ఏవరో.. ఏమిటో.. అని ఆందోళన చెందుతూ ఉంటే సాధన సరిగా సాగదు. మీకు తగిన అవగాహన వచ్చే వరకు మీ దివ్య నేత్రం తెరుచుకోదు. అది ప్రకృతి మీ రక్షణ కొరకు చేసిన ఏర్పాటు. మీకు వాస్తవాలను చూసి సులభంగా జీర్ణం చేసుకోగల శక్తి సామర్థ్యాలు వచ్చేదాక.. మీ థర్డ్ ఐ ఓపెన్ కాదు. కాబట్టి ప్రశాంతంగా సాధన చేయండి లేదా వదిలేయండి.స్టేజ్ బాగానే ఉంది, గజ్జెలు బాగానే ఉన్నాయి, సౌండ్ మరియు ఇతర ఎఫెక్ట్‌లన్నీ బాగానే ఉన్నాయి.. నాట్యం చేయాల్సింది మీరు ! మీకు నాట్యం రాక అది బాగాలేదు.. ఇది బాగాలేదు.. అంటూ వంకలు పెట్టవద్దు.. అర్థమైందా..! మీ థర్డ్ ఐ ఓపెన్ కాలేదు అని అంటే.. మీకు పరిపక్వత రాలేదు అని అర్థం. సుస్పష్టం. మరో ఆలోచన లేదు, మరో మాట లేదు. అదే నిదర్శనం. అదే ఋజువు. మీకు ఇంకా తగిన అవగాహన, శక్తి సామర్థ్యాలు రాలేదు అని అనడానికి మీ థర్డ్ ఐ ఆక్టివేట్ కాకపోవడం అనేదే సాక్ష్యం.. మరొకటి అవసరం లేదు. కాబట్టి సాధన మీద నిందలు వేయకుండా.. సరిగా సాధన చేయండి.

అదేంటోనండీ.. నేను గత ఆరేళ్ళుగా సాధన చేస్తూ ఉన్నా ఇంకా నా థర్డ్ ఐ ఓపెన్ కాలేదు ఏమిటో.. గురువు గారు ఏం చెప్పారో.. నేను ఏం చేస్తున్నానో.. అంతా ఆ పరమాత్ముడికే తెలియాలి.. అంటూ దీర్ఘాలు తీస్తూ.. నిష్ఠూరాలాడవద్దు ! గత ఆరేళ్ళుగా సాధన చేస్తూ ఉన్నా తరగనంత చెత్తను కలిగి ఉన్నావని అర్థం చేసుకోవాలి. నీ అంతరంలో నీవు సత్యాన్ని చూసేందుకు ఇష్టపడటం లేదని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే నీవు సిద్ధ పడితే మొదటి సిటింగ్‌లోనే.. ఒక గంటలోనే మీ దివ్య నేత్రం పూర్తిగా ఉత్తేజితం అయిపోతుంది. నిజం చెప్పాలంటే అది ఉత్తేజితం అయ్యే ఉంటుంది. మీ అజ్ఞానం అనే పొర అడ్డుగా ఉంటుంది అంతే ! ఎప్పుడైతే మీరు, మీ దివ్య నేత్రానికి ''ప్రేమ ఎరుక ఆనందాలను'' ప్రకటిస్తారో అప్పుడు మీ అజ్ఞానపు పొర అడ్డుతొలగుతుంది. మీకు అవగాహన, శక్తి సామర్థ్యాలు వస్తాయి.. అప్పుడు తేజోమయమైన మీ దివ్య నేత్రం మీకు పూర్తిగా, శాశ్వతంగా అందుబాటులోకి వస్తుంది !

మీరు నిజంగా సిద్ధమవుతే ఒక గంట.. ఒక సిటింగ్‌లో ఆక్టివేట్ అయిపోతుంది. 90% సిద్ధమవుతే ఒక రోజు, 50% సిద్ధమవుతే ఒక నెల పడుతుంది. మొత్తానికే మీరు సిద్ధమవకపోతే ఎన్ని జన్మలైనా పడుతుంది. ఈ దివ్య నేత్రాన్ని సశాస్త్రీయంగా ఓపెన్ చేసుకోవడమే మంచిది. సరికాని మార్గాలలో ప్రయత్నించడం మంచిది కాదు.

థర్డ్ ఐ ఆక్టివేషన్ మెథడ్‌లలో ఇది నిశ్చయంగా అత్యంత శీఘ్రమైన, పరమ శక్తివంతమైన, సురక్షితమైన మరియు పరమోత్తమ మార్గం ! గుడ్ లక్ !!

దివ్య నేత్రం యొక్క మరికొన్ని మహా.. పరమాద్భుత ఫలాలు ఏవంటే...

ఈ మూడో కన్నును ఆజ్ఞా చక్రం అని అంటారు. ప్రాచీన కాలపు భారతీయ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలు ఎంతో పరిశీలించి, పరిశోధించి, అనుభవ పూర్వక విజ్ఞానంతో పేర్లు పెట్టారు. నిజంగా వారు చాలా గొప్ప వారు. అసలు, నిజానికి ఇక్కడ మనం గుర్తు చేసుకోవాల్సిన అత్యంత ముఖ్య విషయం ఒకటి ఉంది, అదేమిటంటే - ఈ భూమి పైన సుమారుగా అన్ని ప్రాంతాల్లోనూ ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. అయితే భారత దేశం మాత్రం ఆధ్యాత్మికతకు మరియు ఆధ్యాత్మిక సాధనలకు ముఖ్య కేంద్రం. సూటిగా చెప్పాలంటే ఆధ్యాత్మిక ప్రపంచానికి రాజధాని భారత దేశం ! ప్రపంచంలో ఎక్కడ ఆధ్యాత్మికత నశించినా.. భారత దేశంలో మాత్రం శాశ్వతంగా విరాజిల్లుతూనే ఉంటుంది. ఆధ్యాత్మిక విజ్ఞానం నశించి పోకుండా వేలాది సంవత్సరాలుగా భారతీయులు ఆధ్యాత్మిక సంపదను కాపాడుకుంటూ వస్తున్నారు. నిజంగా ఆ మహాత్ములందరికీ మరియు పరమ పవిత్ర భారత దేశానికి హృదయ పూర్వక ప్రేమానందమ్ ధన్యవాదమ్ !

సరే, విషయానికి వస్తే... మూడో కన్నును ఆజ్ఞా చక్రం అని అంటారు. ఎందుకంటే ఇది మన శరీరాన్ని + జీవితాన్ని పరిపాలిస్తూ ఉంటుంది కాబట్టి ! ఆజ్ఞా చక్రం అంటే మన యొక్క అన్నింటినీ ఆజ్ఞాపిస్తుందన్న మాట ! అది ఏది చెబితే అదే శాసనం ! అది ఎలా చెబితే అలా జరగాల్సిందే ! ఆధ్యాత్మిక విజ్ఞానం లేని వారు మరియు సాధన ద్వారా దీనిపై ఆధిపత్యం సంపాదించని వారు... దీనికి బానిసలు... శరీరానికి + జీవితానికి బానిసలు ! వీరి చేతిలో ఏమీ ఉండదు.. అందుకే.. అంతా ''పై వాడి దయ'' అని అంటూ ఉంటారు. నిజానికి మనకు మనమే యజమానులం ! మన శరీరానికి మనమే అధిపతులం ! మన జీవితానికి మనమే రారాజులం ! అయితే..... ఆజ్ఞా చక్రం పైన

అదుపు లేక పోవడంతో సార్వభౌములమైన మనం బానిసలుగా పడి ఉంటున్నాం.. ఇది ఎంత విభ్రాంతికరమైన నిజం...?!?! తన రాజ్యంలోనే రాజు.. బానిసగా ఉండటం.. ఎంత విచిత్రం ! ఒకటి కాదు రెండు కాదు వేలాది జన్మలుగా.. ఇంకా చెప్పాలంటే లక్షలాది జన్మలుగా.. వాస్తవం చెప్పాలంటే కోట్లాది జన్మలుగా తన సామ్రాజ్యంలోనే తాను బందీగా.. బానిసగా ఉండటం ఎంత ఆశ్చర్యం !!! ఎందుకు ఇలా అని అంటే.. ఆధ్యాత్మిక స్పృహ లేక పోవటం మరియు ఆజ్ఞా చక్రం పైన ఆధిపత్యం రాక పోవడం ! ఆజ్ఞా చక్రం పైన మనకు పూర్తి ఆధిపత్యం వస్తే కలిగే శుభాలు + లాభాలు ఏవి ?

ఆజ్ఞా చక్రం పైన మనకు ఆధిపత్యం వస్తే...

పరిపూర్ణమైన పటిష్ఠమైన శాశ్వత ఆరోగ్యాన్ని పొందవచ్చు.

దివ్య నేత్రం అని అంటే, ''సంకల్ప శక్తి కేంద్రం", దీని పైన ఆధిపత్యం పొందిన వారి యొక్క సంకల్పాలకు తిరుగు ఉండదు.

మీలోని అన్ని నెగెటివ్‌లు క్లియర్ అయిపోతాయి.

మీలోని నీతి, నిజాయితి, నిబద్ధత, నిగ్రహాలు పెంపొందుతాయి.

మీలో సత్యం ప్రేమ ఎరుక సరైన అవగాహనలు ఉదయిస్తాయి.

మీరు ఎవరికీ చెప్పుకోలేని మీ కోరికలు నెరవేరుతాయి.

మీరు ఎవరితోనూ పంచుకోలేని మీ సమస్యలు పరిష్కారం అవుతాయి.

మీ యొక్క భౌతిక శరీరం పైన పూర్తి ఆధిపత్యం వస్తుంది. శాశ్వత నిత్య యవ్వనం సంప్రాప్తిస్తుంది. మీ శరీరానికి చక్కటి ఫిజిక్ వస్తుంది, దృఢంగా తయారవుతుంది. మీరు ఏం చెబితే, మీ శరీరం అది వింటుంది. మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటుంది మీ శరీరం. అప్పుడు మీరు, మీ యొక్క భౌతిక శరీరాన్ని నిత్య యవ్వనంగా, శక్తి వంతంగా ఉంచుకుంటూ.. మీ ఇష్టం వచ్చినంత కాలం ఈ భూమి పైన ఉండవచ్చు. కావాలంటే సశరీరంగా పైలోకాలకు అధిరోహణం కూడా చేయవచ్చు. మరణించడం కంటే అధిరోహణమే సులభం అని అంటాడు పరమ గురువు రామ్‌తా.

❖ ❖ ❖

16. స్వేచ్ఛా సాధన

క్షమ ప్రేమ కరుణ కటాక్షం

మనం ఏ విషయంలోనైనా బందీలుగా ఉన్నాము అని అంటే దానికి మూల కారణం మన పట్ల మనకు క్షమ ప్రేమ కరుణ కటాక్ష భావనలు లేవనే గ్రహించాలి. మన ఆర్థిక ఇబ్బందులకు, ఆరోగ్య సమస్యలకు, లవ్ మ్యాటర్స్‌కు, కావాలనుకున్న వారితో కావలిసిన విధంగా జీవించలేకపోవటానికి ఇంకా ఏ సమస్యలకైనా ఈ సాధన తక్షణమే పని చేసి మీ కోరికలను నెరవేరుస్తుంది. మీరు కోరుకున్నవి మీకు దక్కేలా చేస్తుంది. మీకు స్వేచ్ఛ, ఆనందాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలు, శుభాలు, లాభాలు, శ్రేయస్కరాలు మొదలైనవన్నీ అందిస్తుంది.

మీరు ఈ సాధనను శ్రద్ధతో మరియు పూర్తి విశ్వాసంతో చేయండి. నిజంగా తక్షణమే అద్భుతాలు జరుగుతాయి. మీరు తెలుసుకోవాల్సింది ఒకటే సత్యం - అదేమిటంటే, మీరు మీ పట్ల క్షమ ప్రేమ కరుణ కటాక్ష భావనలు లేనందుకే మీకు స్వేచ్ఛ లేదు అని మీరు తెలుసుకోవాలి. స్వేచ్ఛ లేనప్పుడు ఆనందం కూడా ఉండదు.

ఇతరులు ఎవరూ మిమ్మల్ని ఆపటం లేదు, బయట కారణాలు ఏవీ కూడా మీరు కోరుకున్నవి మీకు దక్కకుండా చేయటం లేదు అని గ్రహించండి. మీ పట్ల మీకు క్షమ ప్రేమ కరుణ కటాక్ష భావనలు లేక మిమ్మల్ని మీరే బాధించుకుంటున్నారు అని గ్రహించండి. ఎవరో మిమ్మల్ని క్షమించి, మీ పట్ల ప్రేమతో, కరుణతో మిమ్మల్ని కటాక్షిస్తారు అనే భ్రమలో నుండి తక్షణమే బయట పడండి. మీ పట్ల మీరు క్షమ ప్రేమ కరుణ కటాక్ష భావనలను ప్రకటించుకోండి. అప్పుడు అందరూ మీ పట్ల క్షమ ప్రేమ కరుణ కటాక్షాలతో వ్యవహరిస్తారు. సృష్టి అంతా మీకు అనుకూలంగా ఉంటుంది.

❖ ❖ ❖

17. ధైర్య సాధన

భయానికి విరుగుడు ధైర్యమే !

భయపడే పరిస్థితులు ఎందుకు వస్తాయి అని అంటే, భయపడకుండా ఉండడానికే !

మనకు భయం కలుగుతుందీ అని అంటే ప్రధానంగా దానికి రెండు కారణాలు ఉంటాయి. అవి :

1. మనం చేసే పని పట్ల మనకు నెగెటివ్ భావనలు ఉన్నప్పుడు మనకు భయం కలుగుతుంది. అంటే, నేను చేసేది తప్పు, ఇది సరి కాదు, ఇది నేరం అనే భావనలు ఉన్నప్పుడు మనకు భయం కలుగుతుంది.

2. మనకు ఏదైనా హాని జరుగుతుందేమోనని భయం కలుగుతుందీ అని అంటే, మన లోపల మనం మనకు తెలియకుండా, మనకు హాని జరగాలని కోరుకుంటున్నాం అని గ్రహించాలి. మనకు మనమే హాని జరగాలని కోరుకున్నప్పుడే, మనకు ఏదైనా హాని జరుగుతుందేమోనని భయం వేస్తుంది.

మనకు భయం వేస్తున్నప్పుడే మనం ధైర్యంగా ఉండాలి. ఏ సమస్యా లేనప్పుడు మీరు ఉండేది ధైర్యంగా కాదు. దాన్ని ధైర్యం అనరు. మీరు ధైర్యాన్ని కలిగి ఉండాల్సింది, మీకు సమస్య ఎదురైనప్పుడే. ఎప్పుడైతే మీకు సమస్య ఎదురవుతుందో, మీకు భయం కలగుతుందో అప్పుడే.... సరిగ్గా అప్పుడే మీరు ధైర్యంగా ఉండాలి. భయానికి ధైర్యమే విరుగుడు. చీకటికి కాంతి విరుగుడు. కాంతి రాగానే చీకటి ఎలాగైతే తొలగిపోతుందో అలాగే మీరు ధైర్యంగా ఉండడం ప్రారంభించగానే భయం ఆవిరి అయిపోతుంది.

మీరు ధైర్యంగా ఉండడం ప్రారంభించగానే - మీరు చేసే పని పట్ల మీకున్న వ్యతిరేక భావనలు తొలగిపోతాయి. మీలో ఉన్న హాని జరగాలి అనే కోరికలు కూడా మాయమై పోతాయి. గుర్తుంచుకోండి, హాని జరగాలని కోరుకున్నది మీరే కదా... హాని జరగాలి అంటే జరిగే అవకాశం ఉన్నప్పుడు, హాని జరగవద్దు అని అనుకుంటే జరగదు అని తెలుసుకోండి.

ఎప్పుడు భయం కలిగినా, వెంటనే ధైర్యంగా ఉండడాన్ని ప్రారంభించండి. బాగా గుర్తుంచుకోండి, భయానికి విరుగుడు ధైర్యమే ! ధైర్యంగా ఉంటేనే భయం మాయమైపోతుంది. మీరు భయపడుతూ ఉంటే, మీకు అపజయం మరియు నష్టం జరిగే అవకాశం ఉంది. కాబట్టి భయం కలగగానే ధైర్యంగా ఉండడం ప్రారంభించండి.

మీకు భయం వేసినప్పుడు ఈ కింది సూత్రాన్ని సాధన చేయండి :

నేను దైవాన్ని నాకంతా మంచే జరుగుతూ ఉంది.

పూర్తి విశ్వాసంతో ధైర్యంగా ధీమాగా ఈ సాధన చేయాలి. మీరు, పైన చెప్పిన సూత్రాన్ని మీ లోపల అనుకుంటూ ఉండాలి. పదే పదే అనుకుంటూ ఉండాలి. ఇలా అనుకుంటూనే ఉండాలి. ఆపకుండా అనుకుంటూనే ఉండాలి. అప్పుడు మీలో ఉన్న నెగెటివ్‌లన్నీ వాటంతట అవే ఆవిరి అయిపోతాయి. చాలా సులభంగా, సరళంగా, సురక్షితంగా, నిజంగా, పూర్తిగా, శాశ్వతంగా మాయమైపోతాయి అవి ఎంతటివైనా సరే ! ఇది సత్యం !!

ఈ సాధన ద్వారా మీలో ఉన్న నెగెటివ్‌లన్నీ కూడా తొలగిపోయి, మీకు ఎల్లప్పుడూ మంచి మాత్రమే జరుగుతుంది. *All The Very Best !*

❖ ❖ ❖

మీరు భయపడుతున్నవి, మీరు అనుమానిస్తున్నవి, మీరు కోరుకుంటున్నవి మీ జీవితంలోకి ప్రవేశిస్తాయి. (ప్రతీ భయం & ప్రతీ అనుమానం కాదు)

భయం గురించి ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే వివరించాను. అది చదివి సాధన చేసి భయాలను తీసివేసుకోండి.

ఇలా అవుతే ఏమవుతుంది ? అలా జరిగితే ఏమవుతుంది ? అంటూ ఊరికే అనుమానాలను వ్యక్తం చేయకండి. మీకు అవసరమైన వాటి పట్లనే ప్రశ్నించుకోవాలి. అనవసరమైన అనుమానాలు మీలో ఎప్పుడైనా తలెత్తితే, ఇది నాకు అవసరం లేదు, కాన్సల్ క్యాన్సల్ క్యాన్సల్ అని అనుకోవాలి. అప్పుడు అవి క్యాన్సల్ అయిపోతాయి.

18. తొలి ప్రాధాన్యత సాధన

కేవలం మీరు మీ దైవత్వానికి తొలి ప్రాధాన్యతను ఇవ్వండి. ఇస్తే...

...మీలోని దైవత్వానికి తొలి ప్రాధాన్యతను ఇస్తే - మీ చిత్త భ్రాంతులు, మాయమవుతాయి, మీ కష్టాలు, కడగండ్లూ మాయమవుతాయి. దైన్య పరిస్థితులు తొలగి పోతాయి, బాధలు, దుఃఖాలు అంతరించిపోతాయి, మిమ్మల్ని వేధించే గత స్మృతులు మాయమవుతాయి, మనో వ్యాకులతలు తొలగి పోతాయి, శారీరక రుగ్మతలు తొలగి పోతాయి, అన్ని అనారోగ్యాలు తొలగిపోతాయి, ఆర్థిక ఇబ్బందులు తొలగి పోతాయి, జీవితంలోని అస్థిరత్వం తొలగి పోతుంది, జీవితంలోని ఒడిదుడుకులు తొలగి పోతాయి, అపసవ్యమైన వ్యామోహాలు ఆటొమెటిక్‌గా అంతరించి పోతాయి. విస్మృతిలో గుప్తంగా దాక్కుని ఉన్న సరికాని గుణాలు, స్వభావాలు, నమ్మకాలు, అభిప్రాయాలు, కోరికలు, లక్ష్యాలు వాటంతట అవే తొలగిపోతాయి. ప్రమాదాలు మీ వరకు రాకుండానే అంతరించి పోతాయి. సర్వ సకల సమస్త నెగెటివిటీలు తొలగి పోతాయి.

మీ దైవత్వానికి మాత్రమే తొలి ప్రాధాన్యతను ఇస్తే - కేవలం దివ్య గుణాలు, నమ్మకాలు, స్వభావాలు, అభిప్రాయాలు ఏర్పడతాయి. సంపూర్ణ, సమగ్ర రక్షణలు అపరిమితంగా, శాశ్వతంగా లభిస్తాయి. ఈ యావత్ సృష్టిలోనే ఏ శక్తులూ కూడా మిమ్మల్ని ఏమీ చేయలేని అజేయమైన అమర అనంత రక్షణ ఉద్భవిస్తుంది. మీ సరైన కోరికలన్నీ నెరవేరితీరుతాయి. చివరికి మీ దైవత్వాన్ని మీరు అనుభవ పూర్వకంగా తెలుసుకుని శాశ్వతంగా నిలుపుకుంటారు, దివ్యశక్తులు ప్రాప్తిస్తాయి !

మీ దైవత్వానికి మాత్రమే తొలి ప్రాధాన్యతను ఇవ్వండి !

తొలి ప్రాధాన్యత సాధన

by

Ramta & M A B

నా దైవత్వమే నా తొలి ప్రాధ్యాన్యత !

"నా దైవత్వమే నా తొలి ప్రాధాన్యత" ! ఈ సూత్రాన్ని సాధన చేయండి. రిలాక్స్‌గా కూర్చుని లేదా పడుకుని కూడా ఈ సాధన చేయవచ్చు. మీకెప్పుడు వీలైతే అప్పుడు, మీకెక్కడ వీలైతే అక్కడ ఈ సాధన చేసుకోవచ్చు. సమయం సందర్భం అంటూ ఏమీ లేదు. రతిలోనూ హారతిలోనూ 24 గంటలూ ఈ సాధన చేసుకోవచ్చు. రాత్రింబవళ్ళు ఈ సాధన చేసి చూడండి, మీలో ఉన్న నెగెటివిటి అంతా కూడా సంపూర్ణంగా, శాశ్వతంగా ఆటొమెటిక్‌గా తొలగిపోతుంది.

ఈ దివ్య సూత్రాన్ని పదే పదే అనుకోండి. ఎన్ని సార్లు, ఎంత సేపు అనుకుంటారు అనేది మీ ఓపిక, మీ అవసరం. ఎంత ఎక్కువ చేస్తే అంత మంచిది కదా ! మీరు ఈ దివ్య సూత్రాన్ని లోపల అనుకున్నా సరే లేదా బయటికి అనుకున్నా సరే.. మీకెలా సౌకర్యంగా ఉంటే అలా చేయండి. ఈ సాధన చేసిన తర్వాత ఏ సాధన అయినా వెంటనే ఫలిస్తుంది. దేవతలలో విఘ్నేశ్వరుడు ఎలాగో, సాధనలలో ఈ సాధన అలాంటిది. ఏ పనైనా చేయబోయే ముందు ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఎలాగైతే విఘ్నేశ్వరుడి ఆశీర్వాదం, అండ తీసుకుంటారో అలాగ.. ఏ సాధనైనా త్వరగా ఫలించాలంటే ఈ దివ్య సాధన చేయాలి.

✪ ✪ ✪

19. పరమోన్నత అవగాహన సాధన

సృష్టిలో ఏదైనా కోరుకోదగినది ఉంది అని అంటే, అది "అవగాహన" మాత్రమే, అని అంటాడు మిఖాయిల్ నైమి అనే మహాత్ముడు. ఈయన వ్రాసిన మహాద్భుతమైన "మిర్దాద్" అనే పుస్తకంలో ఈ విషయం ఉంది. ఈ మిర్దాద్ పుస్తకాన్ని ఓషో మహాత్ముడు ఎంతగానో ప్రశంసిస్తాడు, తనకు అత్యంత ఇష్టమైన పుస్తకం ఇది అని అంటాడు.

ఎందుకంటే - ఏ మాస్టర్ అయినా రకరకాలుగా చెప్పేది ఒకే విషయాన్ని ! మనమంతా ఈ భూమి పైకి అవగాహన పొందడానికి వచ్చాము. అనుభవాల ద్వారా అవగాహన వస్తుంది. చదవడం ద్వారా, వినడం ద్వారా, తెలుసుకోవడం ద్వారా జ్ఞానం వస్తుంది. అనుభవాల ద్వారా జ్ఞానం విజ్ఞానమై "ప్రజ్ఞ"గా మారుతుంది.

ఈ ప్రజ్ఞను పెంపొందించుకోవడానికే మనమిదంతా చేస్తున్నది !

మన అంతరంలో మనం వికసించడానికి, విచ్చుకోవడానికి, విస్తరించడానికి, వ్యాప్తి చెందడానికి సిద్ధంగా ఉండాలి. అయితే మనం అలా నిజంగా ఉండం. ఆ సత్యం మనకు బాహ్యంలో మనకు తెలియదు ! బయటకు మనమెంతో విశాల దృక్పథంతో ఉన్నట్టుగా ఫీలవుతుంటాం. కానీ అంతరంలో, మనం బయట అనుకున్నంత సువిశాలంగా ఉండం ! చాలా సంకుచితంగా ఉంటాం ! ఇది చిత్రమైన సత్యం !

మనం మన అంతరాన్ని "పరమోన్నత అవగాహనను" స్వీకరించడానికి వికసింప చేస్తే, తెరిస్తే, ఓపెన్ చేస్తే, విశాలం చేస్తే, విస్తారం చేస్తే, బాగా విస్తరించి వ్యాప్తి చెందడానికి అనుమతిస్తే... మనలో "పరమోన్నత అవగాహన" అనే "దివ్య సహస్ర దల స్వర్ణ కమలం" పూర్తిగా విచ్చుకుంటుంది. అది వికసిస్తే, విచ్చుకుంటే ఏం జరుగుతుంది ? అనే విషయాలు చెప్తే నమ్మశక్యంగా ఉండవు. ఎన్నో సత్యాలలో ఒక్క సత్యం మాత్రం చెప్తాను. సర్వ-సర్వ, సకల-సకల, సమస్త కష్టాలు మంత్రం

వేసినట్టుగా పూర్తిగా, శాశ్వతంగా మాయమైపోతాయి. పూర్తి ఎరుకతో మీ భౌతిక దేహంలో "దివ్యత్వాన్ని లేక నిర్వికల్ప సమాధిని" అనుభవిస్తారు.

ఇది జరిగితే కానీ అర్థం కాదు ! ఇంకా చాలా చాలా జరుగుతాయి.

ప్రశాంతంగా స్థిరంగా కూర్చుని లేదా పడుకుని

ఈ క్రింది సూత్రాన్ని సాధన చేయండి.

నా ఉనికి మూలంలో నుండి పరమోన్నత అవగాహనను అనుమతిస్తున్నాను

ఈ సాధనకు ఒక పర్టిక్యులర్ సమయం అంటూ ఏమీ లేదు. మీకు వీలైనప్పుడల్లా చేసుకోవచ్చు. మీరెంత సేపంటే అంత సేపు చేసుకోవచ్చు.

All The Very Best !

✪ ✪ ✪

20. ఇష్టం సాధన

ఈ ధ్యానం మీకు వీలైనప్పుడు, ఎప్పుడైనా చేసుకోవచ్చు. ఈ క్రింద ఇచ్చిన మూడు సూత్రాలను ఒక దాని తర్వాత ఒకటి సాధన చేయండి.

1. నా దివ్య దేహం అంటే నాకు పూర్తి ఇష్టం, ప్రేమ, ఎరుక, ఆనందం గౌరవం !

2. నా దివ్య జీవితం అంటే నాకు పూర్తి ఇష్టం, ప్రేమ, ఎరుక, ఆనందం, గౌరవం !

3. నేను దైవాన్ని, నేనంటే నాకు పూర్తి ఇష్టం, ప్రేమ, ఎరుక, ఆనందం, గౌరవం !

మొదటి సూత్రం మీ దేహాన్ని సంపూర్ణంగా, సమగ్రంగా బాగు చేస్తుంది. మహా పటిష్ఠమైన ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఎంతటి దీర్ఘ కాలిక జగ మొండి వ్యాధులైనా క్లియర్ అవుతాయి. ఈ సూత్ర సాధన వలన నయం కాని వ్యాధి అనేది లేనే లేదని అంటే అతిశయోక్తి కాదు.

రెండవ సూత్ర సాధన వలన మీ జీవితంలోని సర్వ, సకల, సమస్త కష్టాలు, బాధలు, అపజయాలు, ప్రాణ గండాలు, ఆపదలు, ప్రమాదాలు, బంధనాలు, ఆర్థిక సమస్యలు, అస్థిరత, అభద్రతలు పూర్తిగా, శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి.

మీ జీవితం మహా దివ్య వైభవంతో, దివ్య స్వర్గంలా విరాజిల్లుతుంది. శోభిల్లుతుంది. మీరు కోరుకున్న విధంగానే, ఇంకా అంత కంటే ఎక్కువ మంచిగానే ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఉత్తేజకరంగా మీ జీవితం కొనసాగుతుంది. మీ జీవితానికి పరమార్థం ప్రాప్తిస్తుంది.

మూడవ సూత్ర సాధన వలన సర్వ, సకల, సమస్త దృశ్య, అదృశ్య కష్టాలు క్లియర్ అయి మీ దైవత్వం మీకు పునః ప్రాప్తమవుతుంది.

ఈ మూడు సూత్రాలు ఒక దాని తర్వాత ఒకటి చేయాలి.

ఉదాహరణకు ప్రొద్దున ఒకటి, మధ్యాహ్నం ఒకటి, రాత్రి ఒకటి చేయాలి. లేదా ఒక్కో సూత్రాన్ని ఒక్కో రోజు చేయవచ్చు. ఒక రోజంతా ఒకే సూత్రం, మళ్ళీ ఇంకో రోజంతా ఇంకో సూత్రం చేయవచ్చు. లేదా మొదటి సూత్రాన్ని కంటిన్యూయస్‌గా ఒక వారం అంతా చేసి, ఆ తర్వాత రెండవ సూత్రాన్ని రెండవ వారం అంతా చేసి, మూడవ సూత్రాన్ని మూడవ వారం అంతా చేయవచ్చు. ఒక్కో సూత్రాన్ని ఒక్కో నెల కూడా చేసుకోవచ్చు.

✪ ✪ ✪

21. న్యూ బిలీఫ్ సిస్టమ్

New Belief System

ఏ భవన నిర్మాణానికైనా దాన్ని నిర్మించే ముందు, ప్లాన్ వేసి, గీసి ఒక బ్లూ ప్రింట్ తయారు చేస్తారు. ఇక ఆ బ్లూ ప్రింట్‌ను ఆధారం చేసుకుని ఆ యొక్క భవన నిర్మాణం జరుగుతుంది. బ్లూ ప్రింట్ అంటే స్కెలిటన్ అన్నమాట ! మన మానవ భౌతిక దేహం ఎలా డిజైన్ చేయాలో సృష్టికర్తలు బాగా ఆలోచించి, ఎన్నెన్నో ప్రయోగాలు చేసారు, ఆ తర్వాత ప్రస్తుతం ఉన్న మానవ భౌతిక దేహం రూపొందింది. ఇప్పుడున్న మన భౌతిక దేహానికి ప్లాన్+పునాది+బ్లూప్రింట్ లాంటిది "స్కెలిటన్" ! ఈ స్కెలిటన్ ఎలా ఉంటుందో దేహం అలాగే తయారవుతుంది. ఏమైనా మార్పు చేయాలంటే, స్కెలిటన్‌లో మార్పు చేయాలి. పైన చేస్తే కుదరదు. ఉదాహరణకు, సినిమా హాల్లో తెర మీద బొమ్మలను మార్చాలంటే తెర మీద ఏం చేయడానికి లేదు కదా ! తెర మీద బొమ్మలు ఎక్కడి నుండైతే వస్తున్నాయో.. అక్కడికి వెళ్ళి, తెర మీదికి బొమ్మలను ప్రసారం చేసే ప్రొజెక్టర్‌ను తెరిచి అందులోని ఫిల్మ్‌ను మారిస్తే అప్పుడు తెర మీద బొమ్మలు మారుతాయి. సరిగ్గా ఇదే విధంగా మన జీవితం+దేహం అనే దివ్యభవనానికి ప్లాన్+పునాది+బ్లూప్రింట్ లాంటిది "నమ్మకాల వ్యవస్థ" Belief System !

మన నమ్మకాల వ్యవస్థ ఎలా ఉంటుందో సరిగ్గా అలాగే మన దేహం & జీవితం ఉంటాయి ! మన నమ్మకాల వ్యవస్థలో ఏమేం పొందు పరచబడి ఉంటాయో అవన్నీ మన భౌతిక దేహంలో మరియు జీవితంలో As it isగా ప్రతిఫలిస్తూ ఉంటాయి.

అభిప్రాయం, నమ్మకం, విశ్వాసం, గుణం & భావం ఇవన్నీ ఒక్కటే ! అందుకే ప్రాచీన భారతీయ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలు ప్రకటించారు ఎప్పుడో.... "యద్భావం తద్భవతి" అని మరియు "యా మతిః సా గతిర్భవేత్" అని !

అంటే - మన భావం(నమ్మకం) ఎలా ఉంటే మన భవం(పరిస్థితి) అలా ఉంటుంది అని అర్థం. మన మతి ఎలా ఉంటే మన గతి అలా ఉంటుంది అని అర్థం !

ప్రతీ ఆత్మ జన్మ తీసుకునే ముందు, తన కర్మ యొక్క బ్యాలెన్స్ షీట్ ప్రకారం తను తీసుకోబోయే జన్మలో ఏ ఏ అంశాలను క్లియర్ చేసుకోవాలి, ఏఏ అంశాలను నేర్చుకోవాలి అని ఆత్మ విజ్ఞులను సంప్రదించి నిర్ణయం తీసుకుంటుంది. ఆ ఆత్మ యొక్క గత రికార్డ్‌ను, పరిణితిని, వికాసాన్ని అంటే టోటల్‌గా బ్యాలన్స్ షీట్ ప్రకారం ఆ యొక్క ఆత్మ యొక్క లైఫ్ డిజైన్ చేయబడుతుంది. నిపుణులు కేవలం సూచిస్తారు. అంతా జన్మ తీసుకోబోయే ఆత్మ యొక్క నిర్ణయమే ఫైనల్ ! ఫుల్ ఫ్రీ విల్ ఉంటుంది !

కొత్త జన్మ తీసుకోబోయే ఆత్మ తన యొక్క పరిపక్వతను బట్టి జన్మను డిజైన్ చేసుకుంటుంది. ఆ కొత్త జన్మలో క్లియర్ చేసుకోవాల్సిన మరియు నేర్చుకోవాల్సిన అంశాల ప్రకారం తయారైన కొత్త లైఫ్ డిజైన్‌కు సరిపోయే "నమ్మకాల వ్యవస్థ" రూపొందుతుంది. ఏ ఏ నమ్మకాలను ఎంతెంత పెట్టుకోవాలి అనే నిర్ణయాలు జరిగిన తర్వాత తయారు చేయబడిన "నమ్మకాల వ్యవస్థ"ను బేస్ చేసుకుని రూపొందించిన ప్రణాళిక "ప్రాణమయకోశం"లో[Etheric Body] కూడా పొందుపరుచబడుతుంది. అప్పటివరకు ఆ ఆత్మ యొక్క పరిణితి పరిధిలో నమ్మకాల వ్యవస్థ తయారవుతుంది. ఆ కొత్త జన్మకు అనుగుణంగా డిజైన్ చేయబడిన "నమ్మకాల వ్యవస్థ"ను స్వీకరించి ఆ ఆత్మ జన్మిస్తుంది. జన్మించిన తర్వాత ఆ జన్మకు సంబంధించిన నమ్మకాల వ్యవస్థనే ఒక కోణంలో జాతకం, విధి అని అనవచ్చు. ఆ నమ్మకాల వ్యవస్థలో ఏమేం ఉన్నాయో ఆ ప్రకారంగా ఆ ఆత్మ యొక్క దేహంలో మరియు జీవితంలో పరిస్థితులు సంభవిస్తూ ఉంటాయి. జన్మ తీసుకున్న ఆ వ్యక్తిలో ఉన్న దైవం - మహా మూల చైతన్యం, ఆ వ్యక్తిలో ఉన్న నమ్మకాల వ్యవస్థకు అనుగుణమైన పరిస్థితులను దేహంలో మరియు జీవితంలో సృష్టిస్తూ ఉంటుంది.

గ్రేట్ గ్రాండ్ మాస్టర్స్ అయిన రామ్‌తా & సేత్ పరమాత్ములు ఏం చెప్తారంటే - జన్మ తీసుకోక ముందు ఏర్పరచుకున్న "నమ్మకాల వ్యవస్థ"ను ప్రస్తుత అవగాహనకు, అవసరాలకు, ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు అని చెప్తారు. ఇది చాలా సులభం, సరళం & తక్షణం అని ఘంఠాపథంగా ప్రకటిస్తారు !

నమ్మకాల వ్యవస్థను మార్చుకుని ఒక బిచ్చగాడు అమెరికా ప్రెసిడెంట్ కాచ్చు అని సేత్ చెప్తాడు. ఎంతటి జగ మొండి భయంకరమైన వ్యాధులైనా, క్యాన్సర్, ఎయిడ్స్ ఇంకా ఏవైనా సరే, సింపుల్‌గా నమ్మకాలను మార్చుకోవడం ద్వారా కొద్ది నిమిషాలలోనే పూర్తిగా, శాశ్వతంగా నయం చేసుకుని సంపూర్ణ, సమగ్ర ఆరోగ్యంతో విరాజిల్లవచ్చు అని రామ్‌తా అంటాడు. మనం, మన నమ్మకాల వ్యవస్థను మార్చుకోవడం ద్వారా ఏమేం పొందవచ్చో, ఏమేం సాధించవచ్చో అనే దిగ్భ్రాంతికరమైన సత్యాలను సేత్ & రామ్‌తా ఇంకా చాలా చాలా కోణాలలో వివరిస్తారు.

మనలో ఉన్న మహా మూల చైతన్యం మన నమ్మకాలకు అనుగుణంగా దేహంలో & జీవితంలో పరిస్థితులను సృష్టిస్తుంది. మనమేమీ చేయనక్కరలేదు. కేవలం నమ్మకాన్ని మార్చుకుంటే చాలు. పరిస్థితి ఆటొమెటిక్‌గా నమ్మకానికి అనుగుణంగా సృష్టించ బడుతుంది. ఉదాహరణకు - ఒక పెద్ద లైట్.. ఒక పెద్ద ట్యూబ్‌లైట్ ఉందనుకోండి. ఆ ట్యూబ్‌లైట్‌లో నుండి తెల్లని కాంతి వస్తూ ఉంటుంది. ఆ ట్యూబ్‌లైట్ మన దేహం అనుకోండి. ఆ కాంతి మన జీవితంలోని పరిస్థితులు అనుకోండి. మనకు కావాల్సిన రంగులో కాంతి కావాలంటే మనం కేవలం, మనకు కావాల్సిన రంగు పేపర్‌ను ట్యూబ్‌లైట్ మీద పెడితే ఆటొమెటిక్‌గా ఆ రంగు కాంతి ప్రసరిస్తుంది కదా ! మీరు కొత్తగా కాంతిని సృష్టించనవసరం లేదు. కాంతి ఆల్‌రెడి సృష్టించబడి ఉంది. అది తెల్ల రంగులో ప్రసారం అవుతూనే ఉంది. అంటే దానర్థం ఏమిటనుకున్నారు ? తెల్ల రంగును ఎలా అంటే అలా మార్చుకోవచ్చు కదా,

మీరు ఏ రంగును కలిపితే అది ఆ రంగు అయిపోతుంది. అంటే మీకిష్టం వచ్చిన విధంగా మీ దేహాన్ని & మీ జీవితాన్ని మీకు నచ్చిన విధంగా, కావాలనుకున్న విధంగా తీర్చిదిద్దుకోవచ్చు, నిర్మించుకోవచ్చు అని అర్థం. మీరు చేయాల్సింది కేవలం మీకు కావాల్సిన రంగు పేపర్‌ను ఆ ట్యూబ్‌లైట్ మీద పెట్టడమే, అంతే... ఆ పేపర్ ఏ కలర్‌లో అయితే ఉందో ఆ కలర్ కాంతి ప్రసరిస్తుంది కదా ! ఇక్కడ మీ దేహం ట్యూబ్‌లైట్ అనుకుంటే, మీ నమ్మకం అనేది కలర్ పేపర్ అన్నమాట ! ట్యూబ్‌లైట్‌ను వెలిగించే విద్యుత్ శక్తి మీ దైవత్వం ! దైవత్వం అనేది ట్యూబ్‌లైట్ అనే దేహం ద్వారా తెల్లని కాంతి అనే పరిస్థితులను ప్రసరిస్తూ ఉంటుంది. ఆ తెల్లని కాంతిని మనకు కావాల్సినన్ని రంగులలో ప్రసరింప చేసుకోవచ్చు ఎన్ని కలర్ పేపర్లు పెడితే అన్ని కలర్ల కాంతి ప్రసరిస్తుంది. పెద్దగా, పొడుగ్గా ఉన్న ట్యూబ్‌లైట్‌కు ఒక చోట గ్రీన్ కలర్, ఒక చోట పింక్ కలర్ ఒక చోట బ్లూ కలర్, మరో చోట ఎల్లో కలర్... ఇలా మనకు కావాల్సిన రంగులను ఎంపిక చేసుకుని ఆ రంగు పేపర్లను ఆ ట్యూబ్‌లైట్ మీద పెడితే సరిపోతుంది. రంగు పేపర్‌ను ట్యూబ్‌లైట్ మీద పెట్టిన మరుక్షణం కాంతి యొక్క రంగు ఎలాగైతే మారుతుందో అలాగే మన నమ్మకం మారిన మరుక్షణమే పరిస్థితి మారపోతుంది ! సింపుల్ !

మన అంతరంలో ఉన్న దైవత్వం ఎన్నో రకాలైన పరిస్థితులుగా సంభవించాలని ఉవ్విల్లూరుతూ ఉంటుంది. అందుకే మనకు కోరికలను, ఆశయాలను, లక్ష్యాలను కలిగిస్తుంది. ప్రేరేపిస్తుంది. వేటినైతే మనం స్వీకరించి అనుమతిస్తామో ఆ విధంగానే ఆ మహా మూల చైతన్యం తక్షణమే పరిణమిస్తుంది. మన ఊహలకందనంత ప్రగాఢంగా మనలను ప్రేమిస్తుంది మన దైవత్వం ! కేవలం మన కోరికలను నెరవేర్చడానికే ఉంది మన దైవత్వం ! మనం కోరికలు కోరుకుని వాటిని సంభవింపచేసుకుని అనుభవాలను పొంది పరిణామం చెందుతుంటే ఆ మహా మూల చైతన్యం ఎంతగానో సంబరపడిపోతుంది, ఆల్‌రెడి నిత్య సంబరంలోనే ఉంటుంది అది ఇంకా హెచ్చుతుంది. మీ ఆనందమే ఆ మహా మూలచైతన్యానికి కావాలి ! మీ కోసం, మీ ఆనందం కోసం ఏమైనా చేస్తుంది మహా మూల చైతన్యం ! మన జీవితాన్ని మార్చుకోవాలంటే, ముందు మనం మన మూలాలను మార్చుకోవాలి. మన స్థితి గతుల యొక్క మూలాలు మన నమ్మకాలలో ఉంటాయి. మనకున్న నమ్మకాలకు మన స్వభావం+గుణం+అభిప్రాయం+వికాసం+పరిణితి, లక్ష్యం/ఆశయం & ఆత్మ పరిణామం మొదలైనవి లింకై ఉంటాయి.

జన్మ తీసుకోక ముందు, మీకున్న అవగాహన వేరే, ఇప్పుడు ఇది చదువుతున్నప్పుడు మీకు ఉన్న అవగాహన వేరే ! ఎంతగానో మార్పు, అభివృద్ధి, వికాసం చెంది ఉంటారు, అప్పటికీ ఇప్పటికీ. ఖచ్చితంగా మన స్థితి గతులను మార్చుకోవాలనిపిస్తుంది. మెరుగు పర్చుకోవాలనిపిస్తుంది. ఇలా అనిపించడానికి కారణం మీ ఎదుగుదలయే, మీ వికాసమే ! మీ యొక్క వికాసమే మిమ్మల్ని మీ జీవన పరిస్థితులను మార్చుకోమని ప్రేరేపిస్తూ ఉంటుంది. ఎందుకంటే సృష్టిలో అనుక్షణం పరిణామం చెందడమే ఉంటుంది. ప్రగతి, వికాసం చెందడమే ఉంటుంది. ఇది అనంతం ! ఇప్పుడు మీరు కోరుకుంటున్న ప్రగతి అది సాధించిన తర్వాత, దాన్ని ఆస్వాదించిన తర్వాత మళ్ళీ ఇంకో వికాసం, ప్రగతి, మార్పు మిమ్మల్ని ఆకర్షిస్తూ ప్రేరేపిస్తూ ఉంటుంది. ఇది అనంతం !

ఆత్మ ప్రపంచంలో (సర్వ సృష్టికర్త అయిన మహా మూల చైతన్యం యొక్క పరిపాలనా వ్యవస్థలో) మానవుని నమ్మకాల వ్యవస్థకు ఎంత ప్రాధాన్యత ఉంటుందంటే... మీ ఊహలకు అందనంత, మీరు ఊహించలేనంత, మీరు నమ్మలేనంత ప్రాధాన్యం, ప్రాముఖ్యత ఉంటుంది. మీ నమ్మకాలకు అనుగుణంగా యావత్ సృష్టి స్పందిస్తూ ఉంటుంది. గుండ్రంగా ఉన్న భూమిని మీరు గనుక బల్ల పరుపుగా ఉందని నమ్మితే, మీ ఒక్కరి కోసం సృష్టి భూమిని బల్లపరుపుగా చేసేస్తుంది అనే మహా దిగ్భ్రాంతికరమైన విషయాన్ని రామ్‌తా పరమాత్ముడు ఒక సందర్భంలో చెప్తాడు. మిగతా అందరికీ భూమి గుండ్రంగానే ఉంటుంది. బల్లపరుపుగా ఉందని నమ్మిన వారికి మాత్రమే భూమి బల్లపరుపుగా అయిపోతుంది. ఇది మహా విభ్రాంతికరమైన సత్యం ! మనిషి నమ్మకాలను సృష్టి అంతగా గౌరవిస్తుంది. మనిషి నమ్మకం వమ్ము కావడానికి ససేమిరా ఒప్పుకోదు సృష్టి ! ఈ విషయం మీకు నమ్మబుద్ధి కాదు ! మరి ఎవరు పడితే వారు, ఎలా అంటే అలా నమ్ముకుంటూ పోతే ఎలా ? అనే సందేహం పుడుతుంది. అసత్యాన్ని సత్యం అని నమ్మితే అది సత్యమవుతే. ఇక సత్యానికి విలువ ఏమిటి ? అనిపిస్తుంది. సృష్టిలో అందరూ, అంతా నిరంతర పరిణామం చెందుతూనే ఉంటారు. అసత్యాలను సత్యాలుగా భ్రమించి మూఢ నమ్మకాలలో ఉన్న వాళ్ళంతా పరిణామం చెంది అసలు సత్యాలను తెలుసకుని తీరుతారు, కాస్త వెనకా ముందు ! అయితే ఈ వెనకా ముందు అనేది ఒక 100 లేదా 1,000 లేదా లక్ష లేదా కొటి సంవత్సరాలు లేదా జన్మలు కూడా అయి ఉండవచ్చు. ప్రస్తుతం నేను ఈ ఆత్మ విజ్ఞానాన్ని మీకు చెప్తున్నది మీలోని సరికాని న్మకాలను మీరు సరి చేసుకోవడానికే కదా ! మీరు ఇది చదివేసి ఓహో... అనుకుంటారు కానీ ఆచరణలో పెట్టి మీ నమ్మకాల వ్యవస్థను మార్చుకుని ఆత్మ పరిణామ క్రమంలో ప్రగతిని సాధించాలి కదా ! ఈ విజ్ఞానం దొరకడమే గగనం, దొరికిన తర్వాత చదవడం ఒక పేద్ద పని, ఏడుపుగొట్టు, పనికిమాలిన టీవి సీరియళ్ళను సంవత్సరాల తరబడి చూసే ఓపిక ఉంటుంది కానీ, ఈ పుస్తకం చదివే ఓపిక, తీరిక మీకు ఉండకపోవచ్చు కదా ! సరే ఏదోలా తిప్పలు పడి చదివినా సరిగా, పూర్తిగా అర్థం కాదు. అర్థమైనంత మేరకు ఆచరించి సాధించే పట్టుదలను మీరు ప్రదర్శించాలని అనుకోక పోవచ్చు. ఒక సారి మిమ్మల్ని మీరు నిజాయితీగా ఆత్మ పరిశీలన చేసుకోండి. మీరు ఎంత వరకు ఆధ్యాత్మికంగా వికాసం చెందాలని నిర్ణయించుకుని దానికి కట్టుబడి ఉన్నారు ?!

సరే విషయానికి వస్తే... మన నమ్మకాలను సంపూర్ణంగా, సమగ్రంగా, మహోన్నతంగా గౌరవిస్తుంది సృష్టి ! సర్వ సృష్టికర్త మనయందే ఉన్నాడు. మన నమ్మకాలను అనుసరించి మన దేహంలో మరియు మన జీవితంలో పరిస్థితులను సృష్టిస్తూ ఉంటాడు సృష్టికర్త ! మన యొక్క ఆత్మ విజ్ఞానం ఎంతగా పెరుగుతుంటే అంతగా మన నమ్మకాలలో మార్పులు జరుగుతూ ఉంటాయి. మతంలో, కులంలో ఇరుక్కుని ఉండి మీరు ఎన్ని కోట్ల పుస్తకాలు చదివినా, యుగాలు సాధన చేసినా దండగ ! నేను చాలా చాలా మందిని చూసాను చాలా హైలెవెల్ స్పిరిచ్యువల్ మాటలు మాట్లాడతారు. ఆల్ మోస్ట్ ఒక గౌతమ బుద్ధుడు, ఒక వర్ధమాన మహావీరుడు, ఒక జీసస్‌క్రైస్ట్, ఒక ఓషో, ఒక జొరాస్టర్, ఒక సేత్ మొదలైన వారందరినీ మించిన మాటలు మాట్లాడతారు, కానీ కులంలో ఇరుక్కుని ఉంటారు. ఇలాంటి

బూటకం చేసే వాళ్ళు ఏనాటికీ బాగు పడరు. కాబట్టి మీరు సత్యమైన ఆధ్యాత్మికతలో ఎదగాలనుకుంటే, ముందు మత భావనల నుండి, కుల భావనల నుండి నిజంగా, పూర్తిగా, శాశ్వతంగా బయట పడండి. మతాలు, కులాలు మానవుల అజ్ఞానంలో నుండి పుట్టాయి. మీరు ఉంటున్న రాష్ట్రం దాటితే మీ కులం అవతల వారికి తెలియక పోవచ్చు. మీ దేశం దాటితే అసలు కులం అంటే ఏమిటి అని అడిగినా అడుగుతారు. ఈ భూలోకం అవతల ఉన్న లోకాలలో మీ మతాల గురించి ఎవ్వరికీ తెలియదు. ప్రస్తుతం మన భూమి ఉంటున్న సౌరకుటుంబం ఉన్న పాలపుంత అనే గెలాక్సీలో పది లక్షల కోట్ల సూర్యుళ్ళు ఉన్నారని రామ్‌తా పరమాత్ముడు చెప్తాడు. ఆ పది లక్షల కోట్ల సూర్యుళ్ళకు తమవైన సౌర కుటుంబాలు ఉంటాయి, వాటిలో అత్యధిక శాతం లోకాలలో జీవం, జీవనం ఉందని గ్రేట్ గ్రాండ్ మాస్టర్స్ చెప్తారు. అసలు ఈ మిల్కీ వే గెలాక్సీలోనే కొంచెం అవతలకు వెళ్తే ఈ భూలోకాన్నే గుర్తు పట్టరు. గుర్తు పట్టని లోకంలో ఉన్న మతంలో ఉన్న కులాన్ని గురించి తాపత్రయపడడం అనేది చాలా చిక్కటి మూఢత్వం. గాఢమైన మూర్ఖత్వం. నిఖార్సైన అజ్ఞానం. ఈ మిల్కీ వే గెలాక్సి అవతల, ఒకటి(1) పక్కన యాభై రెండు(52) సున్నాలు(0) పెడితే ఎంత పెద్ద నంబర్ అవుతుందో అన్ని విశ్వాలున్నాయి ఇంకా మా లెక్క కొనసాగుతూనే ఉండని ప్లియేడియన్స్ చెప్తారు. కొంచెం అవతలకు వెళ్తే ఈ గెలాక్సీనే గుర్తు పట్టరు, అందులో మీ లోకం ఎంత ? మీ లోకంలో మీ మతం ఎంత ? మీ మతంలో మీ కులం ఎంత ? కేవలం పుస్తకాలు చదివినంత మాత్రాన సరిపోదు. సత్యాలను గ్రహించి ఆత్మలోకి దింపుకోవాలి. అప్పుడే ప్రయోజనం.

మీరు మత భావనలలో మరియు కుల భావనలలో ఉన్నంత కాలం మీరు చీకట్లో ఉన్నట్టే మీరేం చేసినా మీ ఆత్మ పరిణామక్రమం ఒక్కటంటే ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. మీ జీవితంలో ఆధ్యాత్మికతకు అత్యధిక ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను ఇవ్వాలి. అప్పుడే మీ జన్మ ఎంతో కొంత ధన్యమౌతుంది లేదా వృథా ! మీరు ఇప్పుడు వృథా చేస్తే ఆ తర్వాత మీరు అనుభవించే బాధలు మీరు ఊహించలేరు ! మా లాంటి గురువులు ఎందుకు చెప్తారో మీకర్థం కాదు. విస్మృతి ద్వారా అజ్ఞానం, అజ్ఞానంలో నుండి మదం, మదంలో నుండి బలుపు మిమ్మల్ని కమ్మేస్తాయి. విచిత్రం ఏమిటంటే, అవి మిమ్మల్ని కమ్ముకున్నాయని కూడా మీకు తెలియదు. అవన్నీ కలిసి మిమ్మల్ని ఫక్తు భౌతికతలో ముంచేసి పారేస్తాయి. తినడం, పడుకోవడం, పడుకునే ముందు సంభోగించడం, మీ సామ్రాజ్యాలకు వారసులను కనడం, మీ మహోన్నత వంశాభివృద్ధికై రాత్రింబవళ్ళు మహా పరిశ్రమమ చేయడం, వృద్ధులవడం ఆ తర్వాత ఓ రోజు చనిపోవడం... మళ్ళీ వెంటనే ఎక్కడో ఓ చోట పుట్టడం, ఎందుకంటే లోకంలో 24 గంటలలో ప్రతీ నిమిషంలో, ప్రతీ క్షణంలో ఎందరో సృష్టి కార్యంలో నిమగ్నమై ఉంటారు కదా.. గర్భాలకేం కొరత లేదు. పునరపి జననం, పునరపి మరణం...!!! అంతులేని జన్మ చక్రంలో పడి తిరుగుతూ ఉన్నా ఆత్మ సత్యాల మీదకు ధ్యాస మళ్ళదని అంటే భౌతిక మాయ ఎంత విచిత్రం ?! భౌతికంలో ఉండి అజ్ఞానంలో అఘోరించే అధముల కంటే ఆధ్యాత్మికతలో ఉన్నామని అనుకుంటూ భ్రమలలో పడి చస్తూ ఉన్నవారే ప్రపంచంలో ఎక్కువ ఉన్నారు. ఇది ఆశ్చర్యం !

ఆధ్యాత్మికతలో ఎదగాలనుకునే వారిని "అహం" ఎంత తెలివిగా, అందంగా, ఏ మాత్రం అనుమానం రాకుండా మోసం చేస్తుందంటే... మాటల్లో చెప్పలేం !!

చదువు రాని వారు ప్రవచనాలు విని భ్రమలలో మునిగి ఉంటారు. ఇక చదువు వచ్చిన వారు వీలైనన్ని పుస్తకాలు బాగా చదివి అందులోని విషయాలను బాగా గుర్తుంచుకుని.... సోంబేరి+సొల్లు+సోది చర్చలు మొదలు పెడతారు. అందులో అణువంత కూడా అనుభవ పూర్వక జ్ఞానం ఉండదు. కేవలం ఎవరో వ్రాసింది చదివి దాన్ని తమ ప్రజ్ఞగా ఫీలై పోతూ ఉంటారు. అహం చేతిలో చక్కగా మోసపోతూ ఉంటారు. ఒకే ఒక్క సత్య సూత్రాన్ని నిజంగా, సరిగా ఆచరించి పొందిన అనుభవ పూర్వక విజ్ఞానం ముందు, కోటి పుస్తకాలను చదివి గుర్తుంచుకున్న పర్వతాలంత పుస్తక జ్ఞానం + పాండిత్యం దండగ - దండగలకే పండగ !!

మీరెన్ని పుస్తకాలు చదివారు అన్నది కానే కాదు పాయింట్... మీరెంత అనుభవ పూర్వక విజ్ఞానం కలిగి ఉన్నారు అనేదే కదా అసలు సిసలు ముఖ్య విషయం !

ఇక విషయానికి వస్తే - మనలో ఉన్న నమ్మకాలు మన దేహాలను + జీవితాలను పరిపాలిస్తుంటాయి. కేవలం నమ్మకాలను మార్చుకున్నంత మాత్రాన మన దేహం + జీవితం మారిపోతుంది. అనారోగ్యం స్థానంలో సంపూర్ణ ఆరోగ్యం, పేదరికం స్థానంలో ఐశ్వర్యం, అపజయాల స్థానంలో విజయాలు, నిరాశ నిస్పృహల స్థానంలో ఉల్లాస ఉత్సాహాలు, నిస్తేజం స్థానంలో మహోత్తేజం, మినుకు మినుకు మంటున్న జీవన కాంతి స్థానంలో దివ్య మహోజ్వల వెలుగులు దివ్య కాంతులు మహా వైభవంగా విరాజిల్లుతూ శోభిల్లుతాయి !

మీరు మీ యొక్క నమ్మకాలను మార్చుకోవడానికి సిద్ధపడినప్పుడు మీరు చేయాల్సిన మొట్టమొదటి పని ఏమిటంటే - మీకు ఏమేం ఉన్నాయి, ఏమేం లేవు అనే విషయాలను క్లియర్ విడి విడిగా ఒక లిస్ట్ వ్రాసుకోండి. మీకు ఆల్ రెడి ఏమేం ఉన్నాయో వాటి సంగతి వదిలేయండి. వాటికి హృదయపూర్వక ధన్యవాదాలను అర్పించుకుని వాటిని అలా పక్కన పెట్టండి. ఇక మీకు ఏమేం

కావాలో వాటి లిస్ట్ తీసుకుని ఆ లిస్ట్ పెద్దగానే ఉండే అవకాశం ఉంది. వాటిని అవసరం ప్రకారం ఒక క్రమంలో వ్రాయండి. ముందు ఏది అవసరం ? 1, 2, 3, 4,.... ఇలా వరుస క్రమంలో వ్రాసుకున్న తర్వాత ఇక సాధన మొదలు పెట్టండి.

మీకు ఏమేం లేవో మీరు వాటికి వ్యతిరేకమైన నమ్మకాలను కలిగి ఉన్నట్టు అర్థం. ఇది చాలా బాగా లోతుగా బలంగా అర్థం చేసుకోండి.

న్యూ బిలీఫ్ సిస్టమ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సాధన చేసే ముందు మీరు చేయాల్సిన కంపల్సరి పని ఒకటి ఉంది. ఎక్కడైనా ఇల్లు కట్టే ముందు స్థలాన్ని శుభ్రం చేస్తారు, ఆ తర్వాత... ఒక వేళ నేల చాలా గట్టిగా ఉంటే, పునాదులు తీసే ముందు ఇంటి ప్లాన్ ప్రకారం పునాదులు తీయాల్సిన చోట్లలో ముగ్గు పోస్తారు. ఆ తర్వాత ఓ రెండు రోజులు అక్కడ నీటితో బాగా తడుపుతారు, రెండు రోజులు బాగా తడిపిన తర్వాత నేల బాగా మెత్తబడిపోతుంది. ఇక ఆ మెత్తటి నేలలో చాలా ఈజీగా పునాదులు త్రవ్వేస్తారు. సరిగ్గా ఇదే విధంగా మీరు చేయాలి.

న్యూ బిలీఫ్ సిస్టమ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సాధనలలో రెండు రకాలు ఉంటాయి. అవి :

1. న్యూ బిలీఫ్ సిస్టమ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సాధన

2. బ్లూ ప్రింట్ చేంజ్ సాధన

1వ సాధనలో మీరు ఒక్కొక్క నమ్మకాన్ని మార్చుకుంటూ వెళ్తారు. ఈ సాధనలో ఒక్కోసారి ఏం జరుగుతుందంటే - మీరు ఒక నమ్మకాన్ని క్లియర్ చేసుకునే సాధన చేస్తూ ఉన్నప్పుడు ఆ నమ్మకానికి సంబంధించిన మిగతా నమ్మకాలు కూడా క్లియర్ అయిపోతాయి. అది ఒకటి కావచ్చు లేదా రెండు. మూడు, పది, వంద ఎన్నైనా కాచ్చు. ఇలా మీరు ఆల్ రెడి నిర్మించబడి ఉన్న మీ జీవిత భవనంలో మీ ప్రస్తుత అవవగాహనా అవసరాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకుంటూ వెళ్తారు. ముందు ఏదో ఒక మూల నుండి మొదలు పెట్టి క్రమ క్రమంగా మార్చుకుంటూ వెళ్తారు. చిన్నగా అనిపించిన రూంలను పెద్దగా చేసుకుంటారు, మీ కోరికలకు అనుగుణంగా అన్ని హంగులను అమర్చుకుంటారు. ఆ నమ్మకాలు మీలో ఎప్పుడో ఏ జన్మలోనో ఏర్పడి ఉంటాయి. ఆ నమ్మకాలు మీలో ఉన్నాయని మీకు కూడా తెలియదు. ఇది 1వ సాధన !

ఇక 2వ సాధన, బ్లూ ప్రింట్ చేంజ్ సాధన ! ఇది ఎలాంటిదంటే - మీ జీవిత భవనాన్ని కొద్ది కొద్దిగా కాకుండా మొత్తం పునాదులతో సహా తీసేసి మళ్ళీ ఫ్రెష్‌గా కొత్త ప్లాన్‌తో పూర్తిగా నూతన, నవీన భవనాన్ని నిర్మించే సాధన ఇది. పాత జీవిత భవనాన్ని మొత్తం పునాదులతో సహా పెకిలించి వేసి, స్థలాన్నంతా బాగా శుభ్రం చేసి అత్యున్నతమైన భవన ప్రణాళికను వేసుకుని దాని ఆధారంగా సరికొత్త జీవిత భవనాన్ని నిర్మించుకోవడమే ఈ బ్లూ ప్రింట్ చేంజ్ సాధన !

ఈ 2వ సాధన చాలా అడ్వాన్స్‌డ్ & హైలెవెల్ సాధన ! దీనికి చాలా ఆత్మ పరిణితి ఉండాలి. చాలా ఆత్మ వికాసం ఉండాలి. బాగా ఎదిగిన ఉన్నత ఆత్మలు

మాత్రమే దీన్ని చేయగలుగుతాయి. వినడానికి ఇది ఒక కోణంలో భయాన్ని కలిగించినా ఇది పూర్తిగా సురక్షితమైన సాధన. మొత్తం పాత జీవిత భవనాన్ని పునాదులతో సహా తీసేసి కొత్త జీవిత భవనాన్ని నిర్మించడం అనేది కలవర పాటును కలిగించినా ఈ సాధన వలన కీడు జరగదు. మీ అజ్ఞానంతో మీకు మీరు హాని చేసకుంటారే తప్ప ఈ సాధన వలన హాని జరగదు గాక జరగదు. ఉదాహరణకు ఏదైనా వాహనం ఉంటే ఆ వాహనం మీకు కీడు ఎలా చేస్తుంది ? మీరు సరిగా వినియోగించుకుంటే గమ్యానికి చేర్చుతుంది. సరిగా నడపకపోతే మీరు ఇబ్బందికి గురయ్యే అవకాశం ఉంది. ఇందులో తప్పు వాహనాన్ని నడిపే వారైన మీదే కాని వాహనానిది కాదు కదా ! ఇలాగే సాధన సరిగా చేస్తే సరైన సిద్ధి ప్రాప్తిస్తుంది. సరిగా చేయకుండా ఉంటే ఫలితాలు ఏమీ రాక పోవచ్చు.

ఈ బ్లూ ప్రింట్ సాధనను ఈ పుస్తకంలో నేను తెలియ చేయడం లేదు. త్వరలో వచ్చే నా పుస్తకాలలో బ్లూ ప్రింట్ సాధన ఉంటుంది. ఇది చాలా మంది చేస్తూనే ఉంటారు. తమ జీవితాలను పూర్తిగా మార్చుకుంటూనే ఉంటారు. ఈ పుస్తకంలో కేవలం మొదటిదైన న్యూ బిలీఫ్ సిస్టమ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సాధన మాత్రమే తెలియ చేస్తున్నాను. మీరు బ్లూ ప్రింట్ సాధన వరకు వెళ్ళాలంటే ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలో ఉన్న విజ్ఞానం కంటే కాస్త ఎక్కువగానే వికాసం కలిగి ఉండాలి.

న్యూ బిలీఫ్ సిస్టమ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సాధన

ప్రప్రథమంగా మీరు గుర్తించి బాగా అవగాహన చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే - మీకు ఏమేం లేవో మీరు వాటి పట్ల వ్యతిరేకమైన సరి కాని నమ్మకాలను కలిగి ఉన్నారు. ఈ సత్యాన్ని మీరు మీ ఆత్మలోకి దింపుకోవాలి. ఇంకా వేరే కన్‌ఫర్మేషన్ అవసరం లేనే లేదు. మీకు అది లేదంటే దానికి వ్యతిరేకమైన నమ్మకాలను మీరు కలిగి ఉన్నట్టే !

ఉదాహరణకు మీరు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారంటే, దానర్థం - మీ లోపల డబ్బులకు, జీవితానికి సంబంధించిన తప్పుడు నమ్మకాలున్నాయి అనేది క్లియర్ కట్ సత్యం !

ఉదాహరణకు మీకు అనారోగ్యాలున్నాయంటే, దానర్థం - మీ లోపల దేహానికి, ఆరోగ్యానికి, జీవితానికి సంబంధించిన తప్పుడు నమ్మకాలు ఉన్నాయి అనేది నిర్ధారిత సత్యం !

ఇలా మీరు ఏ ఏ ఇబ్బందులకు గురవుతూ, వేటికైతే దూరమవుతూ ఉన్నారో.. వేటినైతే కలిగి లేరో... వాటి పట్ల మీ నమ్మకాలు సరిగా లేవనేది సత్యం ! ఈ విషయాన్ని బాగా లోతుగా, విస్తారంగా అవగాహన చేసుకోండి...

ఇప్పుడు, మీరు న్యూ బిలీఫ్ సిస్టమ్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్ చేసుకునే ముందు బాగా లోతుగా, సరిగా అర్థం చేసుకోవాల్సిన తప్పని సరి విషయాలు కొన్ని ఉన్నాయి.

1. ఆల్‌రెడి మీలో జన్మ జన్మల నుండి పాతుకు పోయి ఉన్న సరికాని నమ్మకాలను తీసివేయడం చాలాసులభం, సరళం& తక్షణం ! ఈ సత్యాన్ని ఈ క్షణమే ఆత్మపూర్వకంగా ఒప్పుకోండి.

2. కొత్త నమ్మకాలను కొత్తగా ఎస్టాబ్లిష్ చేయాలంటే ముందు పాత నమ్మకాలను తీసేయాల్సిన అవసరం లేనేలేదు. భౌతికంగా మనం ఏం చేస్తామంటే, మన ఇంట్లోకి కొత్త వస్తువులను తెచ్చి పెట్టే ముందు ఇంట్లో ఉన్న పాత వస్తువులను తీసేసి ఖాళీని సృష్టించి ఆ తర్వాత ఆ ఖాళి స్థలంలో కొత్త వస్తువులను తెచ్చి పెడతాం. ఇది భౌతికంలో..... ఆధ్యాత్మికంలో ఇలా ఉండదు, మీరు పాత నమ్మకాలను తీసేయాలనుకుని వాటి స్థానంలో కొత్త నమ్మకాలను ఎస్టాబ్లిష్ చేసుకోవాలనుకున్నప్పుడు, మీరు డైరెక్ట్‌గా కొత్త నమ్మకాన్ని ఎస్టాబ్లిష్ చేసుకుంటూ ఉంటే ఆటొమెటిక్‌గా కొత్త నమ్మకానికి వ్యతిరేకంగా ఉన్న సరికాని పాత నమ్మకాలు వాటంతట అవే పూర్తిగా, శాశ్వతంగా, సింపుల్‌గా తొలగి పోతాయి ! మీరు ఫోకస్ చేయాల్సింది కొత్త నమ్మకాల మీద !

3. మనకు వచ్చే ప్రతీ పరిస్థితి మనకు ఏదో ఒకటి నేర్పించడానికే వస్తుంది. మనం అది నేర్చుకోగానే ఆ పరిస్థితి పూర్తిగా, శాశ్వతంగా, ఆశ్చర్యకరంగా వెళ్ళిపోతుంది. మనలో ఆల్‌రెడి పాతుకు పోయి ఉన్న పాత నమ్మకాలు మనకు ఏవో నేర్పించడానికే ఆత్మ స్థాయిలో మనం ఏర్పరచుకుని ఉంటాం. ఆ నేర్చుకునేదేదో పూర్తయే వరకు మనకు, మన నమ్మకాలను మార్చుకోవాలని అనిపించదు. ఒక వేళ మీకు మీ నమ్మకాలను మార్చుకోవాలి అని అనిపించింది అని అంటే, ఆ పాత సరికాని నమ్మకాల వలన మీరు నేర్చుకోవడం అయిపోయిందనేది సత్యం ! మీ కర్మ క్లియర్ అయిందనేది స్పష్టం ! మీ దరిద్రం యొక్క కర్మ క్లియర్ అయితేనే సాధన చేసి మిమ్మల్ని మీరు మార్చుకోవాలనిపిస్తుంది ఇంకా మీరు దరిద్రాలను అనుభవించేది ఉంటే మీకు మార్చుకోవాలనిపించదు.

4. మనకు కొత్త మంచి జీవిత అనుభవాలను పొందే అర్హత కలిగినప్పుడే మనల్ని మనం మార్చుకోవాలనిపిస్తుంది. కర్మ కమ్మేసి ఉన్నంత కాలం మార్చుకో బుద్ధి కాదు. కర్మ క్లియర్ అయినప్పుడే మార్పు గురించి, మారడం గురించి, సాధన గురించి ఆలోచించి వాటిని వెంటనే ఆచరణలో పెడతాం.

సాధారణంగా అత్యధిక శాతం మంది బాధ పడేది 1. డబ్బు, 2. అనారోగ్యం, 3. సెక్స్, 4. భద్రత అనే ఈ 4 సమస్యలతో బాధ పడుతూ ఉంటారు. నేను 13 సంత్సరాలుగా చేసిన వర్క్‌షాప్‌లకు కొన్ని లక్షల మంది అటెండ్ అయి ఉంటారు. అందులో కొన్ని వేల మంది నన్ను పర్సనల్‌గా కలిసి వారి సమస్యలను చెప్పుకున్నారు. వారంతా చెప్పుకున్న సమస్యలన్నీ కూడా ఈ 4 సమస్యలే ! ఎవరో కొంత మంది మాత్రం మిగతా సమస్యలను చెప్పుకున్నారు, కానీ అత్యధిక శాతం ఈ 4 సమస్యలనే చెప్పుకున్నారు.

ముందుగా డబ్బు సమస్యకు సంబంధించిన సమస్యను పూర్తిగా, శాశ్వతంగా క్లియర్ చేసుకునే సాధన గురించి తెలుసుకుందాం ! ఇది అందరికీ చాలా ఆసక్తి కరమైన విషయం కదా ! కాబట్టి మొట్ట మొదట దీని గురించి తెలుసుకుంటేనే మనశ్శాంతి లభిస్తుంది. మిగతావన్నింటినీ తర్వాత తెలుసుకోవచ్చు ! డబ్బు గురించి తెలుసుకుంటే చాలు, మిగతా వాటి గురించి తెలుసుకోకపోయినా ఫరవాలేదు అని గ్యారంటీగా చాలా మంది అనుకుంటారు, చాలా ఆత్రంగా ముందు ఇది చదివేస్తారు.

వీలు చేసుకుని, ప్రశాంతంగా కూర్చుని లేదా పడుకుని ఈ క్రింది సూత్రాన్ని సాధన చేయాలి.

నమ్మకాలను మార్చుకోవడం సులభం, సరళం తక్షణం

పై సూత్రాన్ని ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎంతసేపైనా, ఎన్ని సార్లు అయినా సాధన చేయవచ్చు. ఇంట్లో, బయట, సినిమా హాల్లో, హోటల్లో తింటున్నప్పుడు, ప్రయాణంలో ఉన్నప్పుడు ఎప్పుడు గుర్తుకు వస్తే అప్పుడు చేసుకోవచ్చు. దీన్ని బాగా దీక్షగా, పూర్తి శ్రద్ధతో కనీసం ఒక వారం చేయండి. ఒక వారంలోపే మీ పాత సరికాని నమ్మకాలను సింపుల్‌గా పూర్తిగా, శాశ్వతంగా తీసివేసే శక్తి సామర్థ్యాలు మీలో ఉద్భవిస్తాయి.

మీరు సాధన చేసిన తర్వాత నెగెటివ్ ఆలోచనలు చేయకుండా ఉండాలి. మీరు గంట సేపు చేసిన సాధన వలన మీలో కలిగిన శక్తి 5 నిమిషాల నెగెటివ్ థింకింగ్‌తో ఆవిరయిపోతుంది. చాలా మంది చేసే తప్పు ఇదే ! సాధన చేస్తారు, చేసి సంపాదించుకున్నదాన్ని అనుమానాలతో, సందేహాలతో, అపనమ్మకాలతో, నెగెటివ్‌గా ఆలోచించి పోగొట్టుకుంటారు. మీరు ఈ నియమాన్ని ఖచ్చితంగా పాటించకపోతే ఎంత సాధన చేసినా వృథాయే !! దండగ !!

నేను ఈ క్రింద చెప్తున్న విషయాలను మీరు బాగా సరిగా అవగగాహన చేసుకోవాలి. కేవలం డబ్బు వెనకాలే పడకూడదు. డబ్బు చాలా అవసరం కానీ డబ్బే సర్వస్వం కాదు. డబ్బు అత్యవసరం కానీ డబ్బే జీవితం కాదు కదా ! కాబట్టి డబ్బు మీద యావను తగ్గించుకోండి. డబ్బు మీద పిచ్చిని తగ్గించుకోండి. డబ్బు మీద యావ, పిచ్చి, అత్యాశ మొదలైనవి మీకు ఐశ్వర్యం ప్రాప్తించకుండా అడ్డుకుంటాయి. డబ్బును గాఢంగా ఇష్ట పడండి, ప్రేమించండి, విశ్వసించండి. కానీ డబ్బే సర్వస్వం అనే వ్యామోహంలో ఉండకండి. వ్యామోహం వేరే ప్రేమ వేరే !

✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪

ఆరోగ్యం లేని ఐశ్వర్యం వ్యర్థం !

సరైన ఉన్నత ఆత్మ విజ్ఞాన అవగాహన లేని ఐశ్వర్యం ప్రమాదం !!

✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪

ఆరోగ్యమే మహా భాగ్యం ! మీరు ఐశ్వర్యం కోరుకునేది ఎందుకు ? ఎంజాయ్ చేయడానికే కదా... మీకెంత ఐశ్వర్యం ఉన్నా సరే ఆరోగ్యం లేక పోతే దండగ ! కాకపోతే ఖరీదైన హాస్పిటల్స్‌లో ట్రీట్‌మెంట్ చేయించుకోవచ్చు. తిరిగే కారు బెంజి.. తాగేది గంజి అన్నట్టుగా ఉంటుంది పరిస్థితి. చాలా మంది ధనవంతులు సరిగా తృప్తిగా కడుపునింగా తినలేరు ఈ విషయం తెలుసా మీకు ? రక రకాల రోగాలకు రక రకాల పత్యాలు పాటిస్తూ వజ్రాలు పొదిగిన బంగారు పాత్రలో గంజి తాగి బతికే ధనవంతులెంతో మంది.. !

అసలు ఆరోగ్యం లేనిదే ఏం ఉన్నా లేనట్టే ! అందమైన భార్య ఉన్నా, పేద్ద స్వంత ఇల్లు ఉన్నా, కార్లు, పొలాలు, అధికారం, పలుకుబడి, కుటుంబం, బంధువులు, మిత్రులు, సంతానం మొదలైనవి ఎన్ని ఉన్నా ఏం చేసుకోవడానికి ?! పూర్తి ఆరోగ్యం అనేది ఉంటే దేన్ని అయినా ఎలాగోలా ఎంజాయ్ చేయవచ్చు, సాధించవచ్చు. మతాలు చెప్పే నరకాలు నిజంగా లేనే లేవు కానీ ఆరోగ్యం లేని జీవితం మాత్రం నరకమే ! ఆరోగ్యం ఉంటే ఏదైనా సాధించవచ్చు. జీవితం సాఫీగా సాగాలంటే ప్రప్రథమంగా అత్యంత ఆవశ్యకమైనది ఆరోగ్యమే ! ఆరోగ్యం తర్వాతే ఏదైనా... ఆరోగ్యమే జీవితంలో సర్వ ఆనందాలను ఇస్తుంది. జీవితానికి జీవం ఆరోగ్యమే ! జీవితానికి ప్రాణం ఆరోగ్యమే ! జీవితం యొక్క దైవం ఆరోగ్యమే ! జీవితానికి పునాది + ఆధారం + ఆలంబన ఆరోగ్యమే ! జీవితానికి అర్థం, పరమార్థం కల్పించేది ఆరోగ్యమే.. ఆరోగ్యమే... ఆరోగ్యమే... ఆరోగ్యమే జీవన మాధుర్యం.. ఆరోగ్యమే జీవిత ఆనందం.... ఆరోగ్యమే జీవిత సర్వస్వం !!!

ఈ సాధన చేసే ముందు - మీరు డబ్బు పట్లా, మీ జీవితం పట్లా చాలా సరికాని నమ్మకాలను కలిగి ఉన్నారని చాలా స్పష్టంగా గ్రహించాలి, గుర్తుంచుకోవాలి.

వీలు చేసుకుని, ప్రశాంతంగా కూర్చుని లేదా పడుకుని ఈ క్రింది సూత్రాన్ని సాధన చేయాలి.

✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪

ఆరోగ్య ఐశ్వర్యాలు చాలా మంచివి, దివ్యమైనవి అత్యవసరమైనవి

✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪

మీరు ఈ సూత్రాన్ని మీలోపల అనుకున్నా, బయటకు అనుకున్నా ఫరవాలేదు. మీకు ఎలా సౌకర్యంగా ఉంటే అలా సాధన చేయండి. సమయం, సందర్భం ఏమీ లేదు, ఎప్పుడైనా ఎక్కడైనా సరే చేయవచ్చు ! ఎంత సేపైనా, ఎన్ని సార్లు అయినా చేయవచ్చు. ఎంత ఎక్కువ చేస్తే అంత మంచిది కదా ! కనీసం ఒక నెల లేదా రెండు నెలలు లేదా 3 నెలలు చేయండి. ఎందుకంటే మధ్య మధ్యలో మీరు మిస్ అవతూ ఉంటారు, రెగ్యులర్‌గా చేయలేరు. నెల రోజుల సాధన సరిపోతుంది, ఒక వేళ మీరు రెగ్యులర్‌గా చేయలేకపోతే, మీ శ్రద్ధను బట్టి మీ సాటిస్‌ఫాక్షన్‌ను బట్టి మీరే నిర్ణయించుకోండి ఎన్ని రోజులు చేయాలో.. వాస్తవానికి ఒక నెల సరిపోతుంది.

పై సూత్ర సాధన మీలో ఉన్న సకల-సకల, సర్వ-సర్వ, సమస్త, దృశ్య, అదృశ్య, జగమొండి, రహస్య, గుప్త, నిగూఢ మహా కఠిన, మహా జఠిల ఆరోగ్య& ఐశ్వర్య వ్యతిరేకతలన్నింటినీ పూర్తిగా, శాశ్వతంగా, శీఘ్రంగా, సురక్షితంగా తీసేస్తుంది. ఆరోగ్య ఐశ్వర్య సిద్ధి మీకు ప్రాప్తమవుతుంది. లోపల తెలియకుండా ఉన్న ఆరోగ్య & ఐశ్వర్య వ్యతిరేకతలు మీకు నరకం చూపెడుతూ ఉంటాయి. ఏం చేయాలో అర్థం కాక మీరు తీవ్ర అయో మయంలో ఉంటారు. పై సూత్రాన్ని ఒక నెల రోజులు సాధన చేసిన తర్వాత మీరు ఈ క్రింది ఐశ్వర్య సూత్రాన్ని సాధన చేయండి. నెల రోజులలో ఫలితాలు కనపడి తీరాలి. లేదా ఏదో లోపం మీలోనే ఉందని గ్రహించి ఇంకా పట్టుదలతో పూర్తి శ్రద్ధతో, మహా విశ్వాసంతో మరొక నెల చేయాలి. పై సూత్రమే ఆల్‌మోస్ట్ 99.9% మీకు ఆరోగ్యాన్ని + ఐశ్వర్యాన్ని ప్రాప్తింప చేస్తుంది. అయినా సరే మీరు చేయాలనుకుంటే ఈ క్రింద ఇచ్చిన సూత్రాన్ని సాధన చేయండి.

✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪

నేను మహా ఆరోగ్యాన్ని ఐశ్వర్యాన్ని కలిగియే ఉన్నాను

✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪

ఈ పుస్తకంలో ఉన్న ఏ సూత్రానికైనా ఒకటే పద్ధతి !

నేను ఆల్‌రెడి కలిగియే ఉన్నాను అనే భావన మీలో ఏర్పడిందంటే మీలో ఉన్న దైవత్వం మీ భావనకు అనుగుణంగా మీకు సంపూర్ణ సమగ్ర ఆరోగ్యాన్ని, మహా ఐశ్వర్యాన్ని కల్పిస్తుంది, ప్రాప్తింప చేస్తుంది. ఈ సాధన ద్వారా మీరు మీలో మహా ఆరోగ్యాన్ని, మహా ఐశ్వర్యాన్ని పొందే సర్వ అర్హతలు ఉద్భవిస్తాయి. మీ హృదయం ఆరోగ్యం + ఐశ్వర్యం కోసం తెరుచుకుంటుంది, ఆహ్వానించి అనుమతిస్తుంది. ఈ సూత్ర సాధన ద్వారా మీ అంతరంలో + బాహ్యంలో ఆరోగ్యానికి + ఐశ్వర్యానికి కావాల్సిన వాతావరణం, ఏర్పాట్లు ఆటొమెటిక్‌గా ఏర్పడతాయి.

ఈ సాధన ఎన్ని రోజులు చేయాలి అని అంటే, దానికి సమాధానం లేదు. మీరు ఐశ్వర్యవంతులయ్యే వరకు చేయండి. బోర్ కొడితే వదిలేయండి. మీ అవసరం, మీ ఇష్టం !

మీరు ఈ సూత్రాన్ని మీలోపల అనుకున్నా, బయటకు అనుకున్నా ఫరవాలేదు. మీకు ఎలా సౌకర్యంగా ఉంటే అలా సాధన చేయండి. సమయం, సందర్భం ఏమీ లేదు, ఎప్పుడైనా ఎక్కడైనా సరే చేయవచ్చు ! ఎంత సేపైనా ఎన్ని సార్లు అయినా చేయవచ్చు. ఎంత ఎక్కువ చేస్తే అంత మంచిది కదా !

కేవలం ఈ సూత్రాన్ని సాధన చేసినంత మాత్రాన పూర్తి ఆరోగ్యం నిజంగా వచ్చేస్తుందా ?! నిజంగా ఐశ్వర్యవంతులైపోతారా ?! అనే ప్రశ్న మీలో పుట్టిందంటే ఆ ప్రశ్న మీలోని దరిద్రంలో నుండి వస్తుందని అర్థం చేసుకోవాలి. మీరు ఈ సాధన చేస్తే మీ ఒడిలో ఆకాశం నుండి సంపద ఊడి పడదు. ఏమో పడవచ్చు కూడా.. అలా జరిగే అవకాశం కూడా ఉంది, అది వేరే విషయం ! ఈ సూత్ర సాధన వలన మీలో ఆరోగ్యం ఆటొమెటిక్‌గా ఉద్భవిస్తుంది. ఆటొమెటిక్‌గా ఐశ్వర్యాన్ని పొందే అర్హత ఉద్భవిస్తుంది ! అప్పుడు మీకు ఐశ్వర్యం ప్రాప్తించే అవకాశాలు ఏదో ఒక రకంగా మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి. అప్పుడు మీరు ఆ అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటారు. అంతే - ఐశ్వర్య వంతులైపోతారు. ముందు మీరు ప్రశ్నించడం ఆపేసి సాధన మీద ఫోకస్ చేయండి !

ఈ విధంగా మీకు ఏం కావాలో నిర్ణయించుకుని, దానికి సంబంధించిన సూత్రాన్ని రూపొందించుకుని ఆ సూత్రాన్ని సాధన చేస్తే ఆటొమెటిక్‌గా లోపల ఉన్న సరికాని నమ్మకాలు పూర్తిగా, శాశ్వతంగా క్లియర్ అయిపోయి సరైన కొత్త నమ్మకాలు ఎస్టాబ్లిష్ అవుతాయి ఆ మరుక్షణమే మీ జీవిత పరిస్థితులు కూడా మారి పోతాయి.

అత్యంత బలంగా గుర్తుంచుకోవాల్సిన విషయం - సూత్రం ఎప్పుడు కూడా మీకు కావాల్సింది ఆల్‌రెడి మీరు పొందినట్టుగానే రూపొందించుకోవాలి. ఉదాహరణకు : నేను ఐశ్వర్యవంతుడను అవుతాను అని ఉండ కూడదు. ఈ సూత్రం భవిష్యత్‌లో ఉంది. దీని వలప మీలో కాన్ఫిడెన్స్ పెరుగుతుందే కానీ.. ఐశ్వర్యం సిద్ధించదు. కాబట్టి ఆల్‌రెడి జరిగినట్టుగా సూత్రాన్ని తయారు చేసుకోవాలి. అంటే - "నేను మహా ఐశ్వర్యవంతుడిని" ! "నేను మహా ఆరోగ్యవంతుడిని" ! "నేను మహా సౌభాగ్యవంతుడిని" ! " నేను మహా బలవంతుడిని" ! ఇలా, ఈ విధంగా ఉండాలి సూత్రాలు.

మీకు కావాల్సిన దానికి అనుగుణమైన సూత్రాన్ని తయారు చేసుకుని సాధన చేస్తే మీ లోపల ఉన్న అన్ని వ్యతిరేకతలు తొలగి పోయి మీకు కావాల్సినవి మీకు దక్కుతాయి, మీరు పొందుతారు. సాధన చేసేటప్పుడు ఆ తర్వాత 100% విశ్వాసాన్ని కలిగి ఉండాలి లేకపోతే ఫలితాలు రావు. ఆధ్యాత్మికత పట్ల సాధనల పట్ల పూర్తి నిజమైన విశ్వాసం మీకుండాలి లేకపోతే సాధనలు చేయకండి ఈ పుస్తకం మూసేసి పక్కన పెట్టేయండి. మీకు నచ్చిన పనేదో మీరుచేసుకోండి. మీకు మంచి జరుగు గాక !

22. ధన్యవాద సాధన

లేక

అష్టలక్ష్మి సాధన

ఇది సర్వ సాధనలకు జీవం లాంటిది. "కృతజ్ఞత" లేక "ధన్యవాద భావం" అనేది ఒక ఆధ్యాత్మిక మహా దివ్య శక్తి. ఎక్కడ పూర్తి శాశ్వత ధన్యవాద భావం ఉంటుందో అక్కడ అష్టలక్ష్ములు కొలువై ఉంటారు. అష్టలక్ష్ములను ఆకర్షించి శాశ్వతంగా నిలుపుకోవడానికి ఇది మహా సూపర్, హైపర్, సుప్రీమ్ సాధన ! ఇది సాక్షాత్తు అష్ట లక్ష్మి నాథుడైన శ్రీ మహా విష్ణువు చెప్పిన సాధన ! ఎక్కడ, ఎప్పుడు, ఎవరికి చెప్పారు అనే విషయాలు అడగకండి. అది మహా దైవ రహస్యం ! కొన్ని విషయాలు అలా రహస్యంగా ఉండాలి అంతే !

ఈ పుస్తకంలో నేను తెలియ చేసిన సాధనలన్నింటి కంటే ఈ సాధనకు ఎక్కువ పాపులారిటి గ్యారంటీగా వస్తుంది. ఎందుకు ? అని అమాయకంగా అడగకండి. "అష్ట లక్ష్మి" సాధన కదా !!!

సరే... ఇక విషయానికి వస్తే - సర్వ సకల సమస్త శ్రేయస్కరాలను ఆకర్షించే మహా దివ్య శక్తినే "ధన్యవాద భావం" లేక "కృతజ్ఞత" అని అంటారు. ఈ ధన్యవాద భావాన్ని సంపూర్ణంగా, శాశ్వతంగా కలిగి ఉన్న వారి వైపు సర్వ శ్రేయస్కరాలు ఆటొమెటిక్‌గా ఆకర్షించబడుతూనే ఉంటాయి. ఇది అన్ని శ్రేయస్కరాలను, శుభ లాభాలను ఆకర్షించే డివైన్ మాగ్నెట్ !

మహా మూల చైతన్య ఆధ్యాత్మిక సూత్రం/నియమం ఏమిటంటే : -

మీరు కంప్లయింట్లు చేస్తూ ఉంటే, మీరు కంప్లయింట్లు చేసే విషయాలు పెరుగుతూనే ఉంటాయి. ఉదాహరణకు 10 ఉంటే 20 అవుతాయి. అలా పెరుగుతూనే ఉంటాయి.

మీరు కంప్లయింట్లు చేయకుండా మీరు కలిగి ఉన్న వాటి యొక్క అడ్వాంటేజెస్‌ను గ్రహించి, గుర్తించి వాటిని మీకు ఇచ్చినందుకు మీలో ఉన్న సృష్టికర్తకు ధన్యవాదాలు చెప్పుకుంటూ ఉండాలి. ఎల్లప్పుడూ కృతజ్ఞతను కలిగి ఉండాలి. కృతజ్ఞతయే మీ శ్రేయస్కరాలను, శుభ లాభాలను పట్టి ఉంచే దివ్య శక్తి... ఎప్పుడైతే మీలో కృతజ్ఞతా భావం నశిస్తుందో వెంటనే మీ నుండి శ్రేయస్కరాలు, శుభ లాభాలు క్రమక్రమంగా విడిపోవడం ప్రారంభమవుతుంది. చివరికి అష్ట దరిద్రాలు కమ్మేస్తాయి.

మీకు ఎవరు ఏ రకంగా, ఎలాంటి సహాయం చేసినా వారి పట్ల ఋణపడి ఉండకూడదు. కానీ వారి పట్ల కృతజ్ఞతను మాత్రం తప్పకుండా కలిగి ఉండాలి. వారి పట్ల మంచి భావాలు, అభిప్రాయాలను కలిగి ఉండాలి.

అవసరమైనప్పుడు మీరు చేయగలిగిన సహాయం తప్పకుండా చేయాలి. ఋణం అనేది కానే కాదు. కేవలం మంచి మనసుతో, ధన్యవాద భావంతో తిరిగి సహాయం చేయాలి. "అపకారికి ఉపకారం" చేయమనే ధర్మ సూక్తి మీకు తెలిసే ఉంటుంది. అపకారం చేసిన వాడికే ఉపకారం చేయాలంటే, మరి ఉపకారం చేసిన వారికి ఏం చేయాలి ? !

ఎవరో కొందరు తప్పించి, సాధారణంగా సుమారుగా అందరు కూడా కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండరు. తమకు మేలు చేసిన వారి పట్ల కృతజ్ఞత లేకపోవడం అనేది దరిద్రాన్ని సృష్టిస్తుంది. ఎన్నెన్నో పొందుతూ ఉంటారు. పొందిన వాటికీ, పొందే వాటికీ కృతజ్ఞతలు తెలుపరు కానీ చిన్న తేడా వస్తే మాత్రం గందరగోళం చేస్తారు. ఉదాహరణకు ఆర్.టి.సి. బస్సుల వలన, సిటీ బస్సుల వలన అందరూ ఎప్పుడో ఒకప్పుడు ఏదో రకంగా లాభం పొందియే ఉంటారు. ఎప్పుడైనా ఆర్.టి.సి. వాళ్ళకు ధన్యవాదాలు చెప్తారా ? కరెంటు లేనిదే బతుకు లేని విధంగా తయారైంది ప్రస్తుతం, ఎప్పుడైనా కరెంటు డిపార్ట్‌మెంట్ వాళ్ళకు ధన్యవాదాలు చెప్తారా ? ఎప్పుడూ విమర్శలే తప్ప ప్రశంసలు ఉండవు. తల్లి దండ్రులు, పిల్లల వలన ఎంతో లాభపడతారు, కానీ కృతజ్ఞత చూపరు. పిల్లలకు తల్లిదండ్రులు జీవితాన్నిస్తారు. కానీ పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోరు. భార్యలు భర్తలకెంతో చేస్తారు. కానీ భర్తలు భార్యలను పట్టించుకోరు. భర్తలు భార్యలకు జీవితాన్నిస్తారు. కానీ భార్యలు భర్తలను లక్ష్య పెట్టరు. ఈ విధంగా సుమారుగా అందరూ ఎవరి వల్లనో, ఏదో ఒక రకంగా లాభం పొందుతూనే ఉంటారు కానీ ధన్యవాద భావం కలిగి ఉండరు. దీని వలన అష్టకష్టాలు వస్తూ ఉంటాయి. ఇవి ఏం చేసినా పోవు. అష్టకష్టాలను పూర్తిగా, శాశ్వతంగా మాయం చేసేవి "అష్టలక్ష్ములు" మాత్రమే ! కృతజ్ఞత ఉంటేనే అష్టలక్ష్ములు వస్తారు. లేకపోతే అష్ట దరిద్రాలు వస్తాయి.

అంత ఎందుకు ? 100% ఉచితంగా పంచిన నా పుస్తకాలు చదివి సాధన చేసుకుని వేలాది మంది బాగు పడ్డారు. ఈ విషయాలు వర్క్‌షాప్‌లలో కలిసినప్పుడు చెప్పారు. ఇంగ్లీష్‌లో ఉన్న మహోన్నత ఆత్మ విజ్ఞాన పుస్తకాలను తెలుగులోకి అనువాదం చేసే వాళ్ళు ఉన్నారు. వారికి ఎవరైనా కృతజ్ఞత చెప్తారా ? వారు కష్టపడి వ్రాసినవి చదివి బాగు పడతారు కానీ వారి శ్రమను గుర్తించరు. కృతజ్ఞత లేకుండా ఇలా ఉంటే శ్రేయస్కరం ఎలా ?! ఏ విధంగా జరుగుతుంది ?! కన్న తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత లేక పోతే కష్టాలు వస్తాయి, కానీ సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపుడైన గురువు పట్ల కృతజ్ఞత లేకపోతే నరకం అనుభవిస్తారు(నిజానికి నరకం లేదు కానీ నరక బాధలను గ్యారంటీగా అనుభవిస్తారు). మీరు పొందుతున్న ప్రతీ విషయానికీ మీరు ధన్యవాదాలు అర్పించుకోవాలి. నిజంగా, పూర్తిగా, శాశ్వతంగా ఎల్లప్పుడూ కృతజ్ఞతను కలిగి ఉండాలి.

అపకారికి ఉపకారం చేయుము అనే ధర్మ సూక్తి అందరికీ తెలుసు. అపకారికి

ఉపకారం చేయపోయినా ఫరవాలేదు కానీ, ఉపకారం చేసిన వారికి అపకారం చేయకండి.

ఋణం అనేది ఎక్కడా, ఏమీ ఉండదు. ఎవరూ ఎవరికీ ఋణపడి ఉండరు. ఎవరు చెల్లించుకోవాల్సినవి వారికి ఉంటాయి. ఆ చెల్లింపులు మీరు ఎవరికో దేనికో చెల్లించుకోవాలి. అలా జరుగుతున్నప్పుడు ఎప్పుడు ఋణపడ్డాడో అని అంటారు.

కానీ గుర్తుంచుకోండి మీరు పొందిన మంచికి బదులుగా మంచి చేసి తీరాలి. గల్లా పట్టుకుని, మెడలు వంచి, ముక్కు పిండి వసూలు చేస్తుంది విశ్వం ! ఈ భూమి ఒక హోటల్ లాంటిది. ఇక్కడ మీరేం కోరినా సమకూర్చబడతాయి, కానీ మీరు పొందిన వాటికి బిల్లు చెల్లించాలి లేకపోతే విశ్వం బెండు తీస్తుంది. మీరు చేసిన చెడును మళ్ళీ మీరే సరి చేయాలి. మీరు పొందిన వాటికి ప్రతిగా మీరు చెల్లించాలి. రామ్‌తా & సేత్ మాటలు పట్టుకుని అద్వైతం ! అంతా ఒకటే ! సాక్షాత్తు నేనే దైవం, నేను ఒకరికి చేసేదేమిటి ? నన్ను అడిగేదెవరు ? అని విర్రవీగితే నీవు దైవం అయినప్పుడు ఈ సత్యం, ఈ న్యాయం అందరికీ వర్తించి - దైవ న్యాయం అమలు పరిచి విశ్వం దెబ్బలను కొడుతుంది. విశ్వం కొట్టే ప్రతీ దెబ్బకూ మీ దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అవుతూ ఉంటుంది. మీలో సరైన పూర్తి అవగాహన ఉదయించగానే దెబ్బలు ఆగిపోతాయి. ఇది శిక్ష కానే కాదు, శిక్షణ ! సేత్ & రామ్‌తా బోధనలలో ఇలాంటి విషయాలు ఉండవు. వారు డైరెక్టుగా అత్యున్నత విషయాలను బోధిస్తారు. వారి బోధనలు మీకు అప్లై కావాలంటే మీరు అంతగా ఎదిగి ఉండాలి. కేవలం చదవడం వచ్చినంత మాత్రాన, ముద్రించి ఉన్న అక్షరాలు ఉన్న పుస్తకాన్ని కొనుక్కుని ఓ సారి చదివేయగానే మీరేదో అయిపోరు. సేత్ & రామ్‌తా బోధనలు పరమ సత్యాలు. అయితే వాటి లెవెల్‌కు మీరు ఎదిగి వికాసం చెంది ఉండాలి కదా !

కాబట్టి - కృతజ్ఞతా పూర్వకంగా జీవించండం మొదలు పెట్టండి ఈ క్షణం నుండే, మీ దేహానికి, మీ జీవితానికి, మీ ఉనికి మూలానికి, మీ తల్లిదండ్రులకు, మీ కుటుంబానికి, మీ జీవిత భాగస్వామికి, మీ సంతానానికి, మీ బంధు మిత్రులకు, మీ కాలనీకి, మీ కాలని ప్రజలకు, మీ ఊరికి, మీ ఊరి వాళ్ళకు, మీ రాష్ట్రానికి, మీ దేశానికి, మీ దేశ ప్రభుత్వానికి, మీరుంటున్న లోకానికి, మీరున్న విశ్వానికి, పంచ భూతాలకు, సకల సృష్టికి హృదయ పూర్వక ధన్యవాదాలను అర్పించుకుంటూ ఉండండి !

అష్టలక్ష్మి సాధనా విధానం

కూర్చుని లేదా పడుకుని మీకు ఉన్న మంచి వాటిని ఒక్కొటిగా గుర్తు చేసుకుంటూ వాటికి ధన్యవాదాలు చెప్పుకుంటూ వెళ్ళండి. ప్రతీ చిన్న మంచి విషయానికి ధన్యవాదాలు అర్పించుకోండి. కాలు నొప్పిగా ఉంటే కాలు ఉన్నందుకు ధన్యవాదాలు చెపుకోండి, మెడలో గొలుసు లేదని బాధపడకుండా మెడ ఉన్నందుకు ధన్యవాదాలు తెలుపుకోండి, మెడలో నెక్లెస్ లేదని ఏడవకుండా మెడకు ఉరితాడు లేనందుకు ధన్యవాదాలు చెప్పుకోండి. చేతులకు బంగారు గాజులు, బ్రేస్‌లెట్‌లు లేవని కంప్లంట్లు చేయకుండా, చేతులకు బేడీలు లేనందుకు ఆనందించి ధన్యవాదాలు తెలుపుకోండి. కారు లేదని ఏడవకుండా, కాళ్ళు ఉన్నందుకు ధన్యవాదాలు తెలుపుకోండి. మీరు పరిశీలించి చూస్తే ఎన్నెన్నో మంచి విషయాలు మీకు ఉంటాయి కానీ ఏడుపుగొట్టు మనస్తత్వంతో మీరు వాటిని గుర్తించరు. మీరు, మీకున్న వాటిని గుర్తించి ఆనందంతో, సంతృప్తిగా ధన్యవాదాలు చెప్పుకుంటూ కృతజ్ఞతా పూర్వకంగా జీవిస్తూ ఉంటే మీరు ధన్యవాదాలు చెప్పుకోవాల్సిన అంశాలు పెరుగుతూ ఉంటాయి, 10 వంద అవుతాయి. వంద, 1,000 అవుతాయి. వెయ్యి లక్ష అవుతాయి. లక్ష కోట్లు అవుతాయి. మీరు ఆనందంతో ధన్యవాదాలు అర్పించాల్సిన విషయాలకు అంతే ఉండదు. ఎందుకంటే కృతజ్ఞత ఎక్కడ ఉంటే అక్కడ శ్రీ మహా విష్ణువు ఉంటాడు. ఆయన ఉన్న చోట అష్ట లక్ష్ములు ఉంటారు. ఎందుకంటే త్రిమూర్తులలో విష్ణువు పాలకుడు, పోషకుడు కాబట్టి ! పాలించే, పోషించే తత్వం, శక్తి కృతజ్ఞత వల్లనే వస్తాయి. శ్రీ మహా విష్ణువు కూడా ఈ అనంత సృష్టికి నిరంతరం కృతజ్ఞతలు తెలుపుకుంటూనే ఉంటాడు. ఒకానొక సందర్భంలో దేవతలు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ సబ్జెక్ట్ చెప్పాడు శ్రీమహా విష్ణువు ! పార్వతీ దేవికి శివుడు ఎలా పతి అయ్యాడో మాకు అర్థమైంది, సరస్వతీ దేవికి బ్రహ్మ ఎలా నాథుడయ్యాడో మాకు తెలుసు కానీ... నీవు ఒక్కడివే అష్టలక్ష్ములకు పతివి ఎలా అయ్యావు స్వామీ అని అడిగితే అప్పుడు చెప్పాడు దేవదేవుడు - కృతజ్ఞత నాలో అనంతంగా ఉంది కాబట్టి అష్టలక్ష్ములు నాకు స్వంతమయ్యారు. ఎక్కడ సరైన, నిజమైన శాశ్వత కృతజ్ఞత ఉంటుందో అక్కడ నా అష్టలక్ష్ములు నివసిస్తారు అని ప్రకటించాడు దేవాధిదేవుడు.

వీలు చేసుకుని, గుర్తుంచుకుని మీరు సదా, సర్వదా కృతజ్ఞతా భావంలోనే జీవిస్తూ

ఉండాలి. ఇది ఓ అర గంట చేసి మడిచి మూలకు పెట్టేది కాదు. కృతజ్ఞతయే మీ జీవిత విధానమైపోవాలి.

ప్రత్యేకంగా, కూర్చుని లేదా పడుకుని

మీలో ఉన్న మహా మూల చైతన్యానికి

హృదయ పూర్వక ప్రేమానందమ్ ధన్యవాదమ్

అనే పై సూత్రాన్ని, మీకు ఓపిక, సమయం ఉన్నంత సేపు చెప్పుకోండి. మీరు కృతజ్ఞతతో జీవించడం ప్రారంభిస్తే మీ దేహంలో & మీ జీవితంలో అద్భుతాలు జరగడం ప్రారంభం అవుతాయి. మీరు వాడే వస్తువులకు, మీ దేహంలోని అణువణుకూ ధన్యవాదాలను అర్పించుకోండి. మీ జీవిత సర్వస్వానికీ ధన్యవాదాలు అర్పించుకోండి. మీరు పొందిన ప్రతీ దానికి, మీరు కలిగి ఉన్న ప్రతీ దానికి ప్రతీ రోజూ గుర్తుకు వచ్చినప్పుడల్లా ధన్యవాదాలను అర్పించుకోండి. మీలో కృతజ్ఞత ఉదయిస్తే, కృతజ్ఞత తనతో పాటు సౌభాగ్యాలను కూడా వెంట పెట్టుకుని వస్తుంది.

మీరు ఎల్లప్పుడూ బాగుండాలని కోరుకుంటే.... ఎల్లప్పుడూ, సదా సర్వదా కృతజ్ఞతను కలిగి ఉండండి. మీలోని మంచిని & లోకంలోని మంచిని అత్యంత బలంగా, అజేయంగా, అమరంగా విశ్వసిస్తూ ఉండండి. జీవితంలో మీకు ప్రతీ క్షణం మంచి మాత్రమే జరుగుతుందనే విశ్వాసంతో ఉండండి ! మీ విశ్వాసాలకు తగినట్టుగా మీ లోపల - మీ గుణాలలో, మీ భావాలలో, మీ నమ్మకాలలో, మీ అభిప్రాయాలలో తగిన మార్పులు వాటంతట అవే జరిగిపోతాయి !

23. అద్భుత సాధన

ప్రశాంతంగా కూర్చుని లేదా పడుకుని ఈ సాధన చేయాలి. మీకెప్పుడు వీలైతే అప్పుడు, ఎక్కడ వీలైతే అక్కడ ఈ సాధన మీరెంత సేపు చేసుకోగలిగితే అంత సేపు చేయవచ్చు. ఎన్ని సార్లు చేయాలనిపిస్తే అన్ని సార్లు చేయవచ్చు.

నేను అద్భుతం - నా దేహం అద్భుతం - నా జీవితం అద్భుతం !

పై సూత్రాన్ని సాధన చేయండి, మీరు లోపల అనుకున్నా ఫరవాలేదు. బయటకు అనుకున్నా ఫరవాలేదు..

ఈ సాధన వలన ఏం జరుగుతుందో నేను చెప్పను, ఆసక్తి ఉంటే సాధన చేసి మీరే నాకు తెలియ చేయండి.

మీకు జరిగిన, జరుగుతున్న అతి చిన్న మంచి విషయాల పట్ల కూడా నిరంతరం కృతజ్ఞతను కలిగి ఉండాలి. కృతజ్ఞత కలిగి ఉన్న హృదయం అద్భుతాలను ఆకర్షిస్తుంది. కృతజ్ఞతా పూర్వక హృదయం అద్భుతాలకు నిలయం !

24. దివ్య అద్భుత సాధన

ప్రశాంతంగా కూర్చుని లేదా పడుకుని ఈ సాధన చేయాలి. మీకెప్పుడు వీలైతే అప్పుడు, ఎక్కడ వీలైతే అక్కడ ఈ సాధన మీరెంత సేపు చేసుకోగలిగితే అంత సేపు చేయవచ్చు. ఎన్ని సార్లు చేయాలనిపిస్తే అన్ని సార్లు చేయవచ్చు.

నా దేహంలో & నా జీవితంలో దివ్యాద్భుతాలు జరగడానికి నేను పూర్తిగా అనుమతించాను,

నేను సిద్ధం !

పై సూత్రాన్ని సాధన చేయండి, మీరు లోపల అనుకున్నా ఫరవాలేదు. బయటకు అనుకున్నా ఫరవాలేదు.. ఈ సాధన వలన ఏం జరుగుతుందో నేను చెప్పను, ఆసక్తి ఉంటే సాధన చేసి మీరే నాకు తెలియ చేయండి.

మీకు సత్యం పూర్తిగా, సరిగా తెలియనప్పుడు మీ అభిప్రాయాలు వేరేగా ఉంటాయి. మీకు తెలిసే సత్యాలకనుగుణంగా మీ అభిప్రాయాలు మారుతూ ఉంటాయి. మీ అభిప్రాయాలకనుగుణంగా మీ నమ్మకాలు మారుతూ ఉంటాయి. మీ నమ్మకాలకనుగుణంగా మీ జీవితం మారుతూ ఉంటుంది.

25. దివ్య శక్తుల సాధన

ప్రశాంతంగా కూర్చుని లేదా పడుకుని ఈ సాధన చేయాలి. మీకెప్పుడు వీలైతే అప్పుడు, ఎక్కడ వీలైతే అక్కడ ఈ సాధన మీరెంత సేపు చేసుకోగలిగితే అంత సేపు చేయవచ్చు. ఎన్ని సార్లు చేయాలనిపిస్తే అన్ని సార్లు చేయవచ్చు.

నేను దైవాన్ని నాకు దివ్య శక్తులున్నాయి !

పై సూత్రాన్ని సాధన చేయండి, మీరు లోపల అనుకున్నా ఫరవాలేదు. బయటకు అనుకున్నా ఫరవాలేదు.. ఈ సాధన వలన ఏం జరుగుతుందో నేను చెప్పను, ఆసక్తి ఉంటే సాధన చేసి మీరే నాకు తెలియ చేయండి.

మీ శక్తికి మించిన సమస్య మీకు కేటాయించ బడదు.

మీరు కోరినా సరే, మీరు మోయలేని బరువు మీ పైన మోపబడదు.

మీరు పరిష్కరించుకోగలిగిన సమస్యలే మీకు సాంక్షన్ అవుతాయి.

మీరు, మీ శక్తికి మించిన సమస్యలను కలిగి లేరు, అన్న సత్యాన్ని తెలుసుకోండి. తాళం చెవి లేకుండా తాళం తయారు చేయరు. పరిష్కారం లేకుండా సమస్య సృష్టింపబడదు !

మనకు పూర్తి ఎరుక & పూర్తి అవగాహన వచ్చే వరకు, మనం ఒకే బాధను పదే పదే అనుభవిస్తూ ఉంటాం. మనం నేర్చుకోవడం కంప్లీట్ కాగానే చిత్రాతి విచిత్రంగా ఆ బాధ పూర్తిగా, శాశ్వతంగా దానంతట అదే క్లియర్ అయిపోతుంది. గమనించండి. దానంతట అదే మన నుండి పూర్తిగా, శాశ్వతంగా వేరవుతుంది, పారిపోతుంది.

మనం బాధలలో ఉన్నప్పుడు మనం చేసే సాధనలు పని చేస్తున్నాయా లేదా ? అనే డౌటు వస్తుంది. వాస్తవానికి అవి పనిచేస్తూనే ఉంటాయి. బాధలో ఉన్న మనం ప్రగతిని దర్శించలేక అలా అనుకుంటూ ఉంటాం. సాధన అనేది మహా దివ్యాగ్ని !

తన మహా ప్రభంజన దివ్య జ్వాలలతో మన కష్టాలను పూర్తిగా, శాశ్వతంగా దగ్ధం చేసి పారేస్తుంది !

దెబ్బతిని కూడా నేర్చుకోని వారు, మూర్ఖులు.
ఒకసారికే తెలుసుకునే వారు, తెలివిగల వారు.
ఇతరులను చూసి దెబ్బ తినకుండానే నేర్చుకునే వారు,
వివేకవంతులు.

ఏదైనా సరే, దెబ్బతిని నేర్చుకోవాల్సిన అవసరం లేనే లేదు.
దెబ్బతినకుండానే నేర్చుకునే అవకాశం పూర్తిగా ఉంది.
ఎప్పుడూ కూడా, దేనిలోనైనా సరే, దెబ్బతిన కుండా
విజయం పొందాలంటే, ఈ కింది సూత్రాన్ని సాధన చేయండి.
ప్రశాంతంగా కళ్ళు మూసుకుని కూర్చుని
ఈ కింది సూత్రాన్ని మీలోపల పదే పదే అనుకోండి.
"నేను దెబ్బతినకుండానే నేర్చుకుంటున్నాను"...
ఈ సాధన ద్వారా మీకు రాబోయే పరిస్థితుల యొక్క అవగాహన,
మీలో ముందే ఏర్పడుతుంది. దానితో మీరు, మీ పరిస్థితులను
చక్కగా డీల్ చేయగలుగుతారు మరియు
సక్సెస్‌ను పొంది ఎంజాయ్ చేస్తారు.

నిజంగా, పూర్తి నిజాయితీగా మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. దేని కోసం మీ ఆరాటం ? దేని కోసం మీ పోరాటం, ఉబలాటం ? దేని కోసం మీ జీవితం ? ఎందుకు జీవిస్తున్నారు మీరు ? 60 / 70 / 80 / 90 / 100 / 120 సంవత్సరాలు బతికి చావడానికా ? చనిపోయాక ఏం జరుగుతుంది ? మళ్ళీ పుడతారు. మళ్ళీ బతుకుతారు, మళ్ళీ చస్తారు. పునరపి జననం, పునరపి మరణం ! ఇలా ఎన్ని లక్షల సార్లు ? గురువును అన్వేషించి సత్యమార్గానికి అంకితమై జీవితాన్ని ధన్యం చేసుకోండి ! ఇంత కంటే ఏం చెప్పగలను !

26. స్వతంత్ర సాధన

ప్రశాంతంగా కూర్చుని లేదా పడుకుని ఈ సాధన చేయాలి. మీకెప్పుడు వీలైతే అప్పుడు, ఎక్కడ వీలైతే అక్కడ ఈ సాధన మీరెంత సేపు చేసుకోగలిగితే అంత సేపు చేయవచ్చు. ఎన్ని సార్లు చేయాలనిపిస్తే అన్ని సార్లు చేయవచ్చు.

ఆరోగ్యం ఐశ్వర్యం నా ఆత్మ హక్కు !

పై సూత్రాన్ని సాధన చేయండి, మీరు లోపల అనుకున్నా ఫరవాలేదు. బయటకు అనుకున్నా ఫరవాలేదు.. ఈ సాధన వలన ఏం జరుగుతుందో నేను చెప్పను, ఆసక్తి ఉంటే సాధన చేసి మీరే నాకు తెలియ చేయండి.

27. మంచి సాధన

ప్రశాంతంగా కూర్చుని లేదా పడుకుని ఈ సాధన చేయాలి. మీకెప్పుడు వీలైతే అప్పుడు, ఎక్కడ వీలైతే అక్కడ ఈ సాధన మీరెంత సేపు చేసుకోగలిగితే అంత సేపు చేయవచ్చు. ఎన్ని సార్లు చేయాలనిపిస్తే అన్ని సార్లు చేయవచ్చు.

నేను మహా మంచి వాడిని

లేక

నేను మహా మంచిదాన్ని

మీరు ఎన్ని డిగ్రీలు చేసారన్నది విషయమే కాదు. ఆధ్యాత్మికతలో మీరెంత చదివి ఉన్నా మీ పాండిత్యం ఎందుకూ పనికి రానే రాదు. దండగ ! ఆ భారాన్ని దింపేసుకుంటే తప్ప అడుగు ముందుకు పడదు. కాలేజ్ & యూనివర్సిటి చదువులు మీకు భౌతిక పరమైన విషయాలను తెలియ చేస్తాయి. ఆధ్యాత్మికతకు స్కూల్ చదువు సరిపోతుంది. 10వ తరగతి చదువుతో మీరు మీ దైవత్వం పొందవచ్చు.

మీ టీచర్లు, మీ కుటుంబం, మీ బంధువులు, మీ పూజారులు, మీ పండితులు, మీ స్వామీజీలు, మీ మత గ్రంథాలు... అంతా కలిసి రకరకాలుగా మీలో ఎన్నో అపరాధ భావనలను పాతేస్తారు. మీలో ఉన్న అపరాధ భావనలు మీలో, మీపై మీకు చెడు భావనలను నాటుతాయి. అవి మీ దేహాన్ని & మీ జీవితాన్ని అల్లకల్లోలాలకు గురి చేస్తుంటాయి. మీకు మీలో & లోకంలో మంచి పైన నమ్మకం లేకుండా అవుతారు. ఇది ఎంతో బాధాకరమైన విషయం. దీని వలన మీ కోరికలు నెరవేరకుండా బాధ పడుతూ ఉంటారు. మీ పైన మీకు చెడు భావన ఉన్నప్పుడు మీ దైవ శక్తి మీకు పని చేయదు. అనంత దైవాన్ని మీలో కలిగి ఉండి కూడా మీరు జీవశ్చవం లాగా బతుకును ఈడుస్తూ ఉంటారు.

వాస్తవానికి మీరు మంచితనం అనే గొప్ప దివ్య లక్షణంతో జన్మించారు. ఒకవేళ మీరు జన్మించకుండా వాకిన్ అయితే గొప్ప దివ్యమైన మంచితనాన్ని సహజంగానే కలిగి ఉంటారు. ఈ విశ్వంలో మీ మంచి తనాన్ని గుర్తించే అంతరాత్మతో జన్మించారు.

కష్టాలు, నష్టాలు, అనారోగ్యాలు మొదలైనవి రావడం మంచిదే అని మీరు అనుకుంటే - అప్పుడు మీరు మరిన్ని కషనష్టాలను, ఎన్నో అనారోగ్యాలను ఆహ్వానించినట్టే ! మీకేదైనా చెడు జరిగితే దాన్ని మంచిగా భావించకండి. చెడును సింపుల్‌గా చెడుగానే చూడండి. నాకు చెడు జరిగింది కానీ అందులో నుండి నేను మంచిని గ్రహించాను అనుకోవాలి.

ప్రపంచంలో ఉన్న ఏ మతమైనా మనుషులు అధములని, పాపులనీ భగవదనుగ్రహం కోసం ఏమేమో చేయాలని బోధిస్తాయి. మతాలు మానవులలో తీవ్రమైన అపరాధ భావనను సృష్టించాయి, సృష్టిస్తూ ఉన్నాయి. వర్తమానంలో మిమ్మల్ని మీరు పాపి అనుకోకుంటే మీరు నాశనం కాలేరు. మీ అపరాధ భావన చేతనే మీరు నాశనం కాబడతారు. ఒకవేళ మీరు చెడ్డవారైనప్పటికీ, "నేను చెడ్డవాడిని కాబట్టి నేను నాశనం అవుతాను" అనే నమ్మకం వల్లనే మీరు నాశనం అవుతారు కానీ చెడ్డతనం వలన కాదు. చెడును పూర్తిగా, శాశ్వతంగా నిర్మూలించవచ్చు. చెడుకు ఉనికి లేదు. చెడుకు స్థిరత్వం ఉండదు. చంచలమైనది. చెడును పూర్తిగా మార్చేసి మంచిగా మార్చుకోవచ్చు. ఈ శక్తి సామర్థ్యాలు సహజంగానే మీలో ఉన్నాయి.

మీ అపజయాలకు, కష్టనష్టాలకు, అనారోగ్యాలకు & అశాంతులకు కారణం మిమ్మల్ని మీరు చెడ్డవారని అనుకోవడం, మీలో చెడు ఉందని మీలోని చెడుని విశ్వసించడమే ! మీలో ఒకవేళ చెడు ఉంటే దాన్ని గుర్తించి దాన్ని మార్చేసి మంచిగా మార్చుకుంటే మీ కష్టాలన్నీ పోయి, మీ కలలన్నీ త్వరగా నెరవేరతాయి. మీలోని మంచిని విశ్వసించండి.

సాధారణంగా చెడు పై నమ్మకం లేకుండా కేవలం మంచి పై మాత్రమే ఉండే నమ్మకం మీకు అసాధ్యంగా అనిపించవచ్చు. కానీ ఈ నమ్మకం అనేది మీ భౌతిక & ఆధ్యాత్మిక జీవితాలలో ప్రధానమైన నమ్మకం. దీనిని మీ బుద్ధి వ్యతిరేకించవచ్చు, మీ బాహ్య ఇంద్రియాలు ఇది అసత్యం అని చెబుతూ ఉండవచ్చు. అయినప్పటికీ చెడుపై నమ్మకం లేకుండా కేవలం మంచి పై ఉండే నమ్మకం ఖచ్చితంగా వాస్తవం అవుతుంది.

మీ నమ్మకాలే మీ భావాలను సృష్టిస్తాయి. మీ భావాలు మీ వాస్తవాలను సృష్టిస్తాయి. మీ నమ్మకాల చేత మీరు సృష్టించుకుంటున్న మీ భావాలు చైతన్య స్థితిలో ఉన్న ఆలోచనల కన్నా చాలా ముఖ్యమైనవి, సహజమైనవి కూడా ! కనుక చైతన్యపు ఆలోచనల కన్నా భావాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. ఈ రెండూ సమాంతరంగా వెళ్తూ ఉన్నప్పటికీ మీ చైతన్య స్థితిలో ఉన్న ఆలోచనలు వేరే ఏ మార్గాన్ని అనుసరించకుండా మీ భావాలనే గుర్తిస్తాయి.

సమస్య కూడా ఒక కోణంలో ఒక రకమైన చికిత్సే. భౌతిక వాస్తవాలను సృష్టించడానికి చేసే ప్రయత్నంలో ఈ సమస్యలు ప్రస్తుతం మీకు అవసరం కూడా ! మీరు ఇతర లోకాలకు వెళ్ళే ముందే మీ పరిధిలోని పాఠాలను మీరు నేర్చుకుని తీరాలి. దీని వలన ఇతర లోకాల జ్ఞానం మీరు పొందగలుగుతారు.

మీ జీవితాలలోనికి అతి స్వల్పమైన ప్రమాదాలనైనా సరే మీ ఆలోచనలతో ఆహ్వానిస్తే మీరు పెద్ద పొరపాటు చేసినట్టే ! ఎందుకంటే ఆ సమయంలో ప్రమాదం జరగడం అనేది ప్రకృతికి ఒక మినహాయింపు కాదు, ఒక నియమం. కారణం లేకున్నా కూడా మీలోని అణువులు, పరమాణువులు ప్రమాదం సంభవించేలా మీ చైతన్యాన్ని ప్రేరేపిస్తాయి. మీరు సంపూర్ణంగా ప్రమాదాలకు సంబంధించిన ఆలోచనలను విశ్వసిస్తే ఈ ప్రకృతి కూడా మీ ఆలోచనలను అనుసంధానంగా అంగీకరించడం జరుగుతుంది. అందువల్లనే కరవుకాటకాలు, భూకంపాలు మొదలైన భీభత్సాలు సంభవిస్తూ ఉంటాయి.

సాధారణంగా చెడు పై నమ్మకం లేకుండా మంచి పై మాత్రమే ఉండే నమ్మకం మీకు అసాధ్యంగా అనిపించవచ్చు. కానీ ఈ నమ్మకం అనేది మీ భౌతిక & ఆధ్యాత్మిక జీవితాలలో ప్రధానమైన నమ్మకం. దీనిని మీ బుద్ధి వ్యతిరేకించవచ్చు, మీ బాహ్య ఇంద్రియాలు ఇది అసత్యం అని చెబుతూ ఉండవచ్చు. అయినప్పటికీ చెడుపై నమ్మకం లేకుండా కేవలం మంచి పై ఉండే నమ్మకం ఖచ్చితంగా వాస్తవం అవుతుంది.

న్యూస్ పేపర్లలో & టీవీలలో చూస్తే ఈ లోకం నరకం అనిపించడం గ్యారంటీ ! చెడు గురించి వ్రాసినంతగా, చెడును చూపించినంత ఎక్కువగా మంచి గురించి వ్రాయరు, మంచిని చూపించరు !

కానీ లోకంలో మంచి ఉంది. లోకంలో మంచి ఉందని విశ్వసించండి. ఎక్కువగా న్యూస్ పేపర్లు & టీవీలు చూడకండని మాస్టర్స్ చెప్తారు. సినిమాలు, సీరియల్స్ మొదలైనవన్నీ మానవ చైతన్యాన్ని చాలా చెడుగా ప్రభావితం చేస్తాయి. మంచిని నమ్మడం మొదలు పెట్టండి, అప్పుడు మీకు జీవితాంతం, కేవలం మంచి మాత్రమే తారస పడుతుంది !

నేను వివరించిన సాధనలు అన్నీ ఒక్కటే !

ఒకే మహా సాధనను మీ సౌకర్యం కోసం, మీ సౌలభ్యం కోసం, మీకు అర్థం అవడం కోసం భాగాలుగా చేసి వివరించాల్సి వచ్చింది. నిజానికి అవి అన్నీ ఒకటే ! అయితే మొదటి భాగం ప్రధానమైనది. మొదటి ధ్యానాన్ని సాధన చేస్తూ అవసరం అయినప్పుడు 2వదో లేక 3వదో లేక 4వదో లేక 5వదో లేక 6వదో లేక 7వదో లేక 8వదో లేక 9వదో లేక 10వదో 11వదో లేక 12వదో లేక 13వదో 14వదో 15వదో లేక 16వదో లేక 17వదో లేక 18వదో లేక 19వదో 20వదో లేక 21వదో లేక 22వదో లేక 23వదో లేక 24వదో లేక 25వదో లేక 26వదో లేక 27వదో చేయాలి. ఆ పని అయిపోగానే మళ్ళీ మొదటి సాధన యథాప్రకారంగా కొనసాగిస్తూనే ఉండాలి.

అయితే ప్రధానంగా రెండే రెండు కాంబినేషన్‌లు ఉన్నాయి ఇందులో ఏదో ఒకదాన్ని ఎంచుకుంటే మొత్తం అన్ని సాధనలు కవర్ అవుతాయి.

మొదటి కాంబినేషన్ : మొదటిదైన వేగం సాధన, దైవత్వ సాధన & ప్రేమ ధ్యానం
రెండవ కాంబినేషన్ : మొదటిదైన వేగం సాధన, దైవత్వ సాధన & 20వ ఇష్టం సాధన

పై రెండు కాంబినేషన్‌లలో ఏదో ఒకటి ఎంచుకోండి. మొత్తం సాధనలన్నీ కవర్ అవుతాయి. అయితే - అప్పుడప్పుడు మధ్యలో 19వ దైన "పరమోన్నత అవగాహన సాధన" చేస్తూ ఉండండి. 22వదైన అష్టలక్ష్మి సాధనలో నిరంతరం ఉండాలి. మీరు ఇలా నిష్ఠగా, పూర్తి విశ్వాసంతో క్రమం తప్పకుండా చేసి చూడండి, ఏం జరుగుతుందో ! మహా అద్భుతాలకు గురవుతారు !!!

All The Very Best !

✪ ✪ ✪

మహా ముఖ్య విషయం

ఇంతకు ముందు పేజీలలో నేను చెప్పిన ధ్యాన సాధనలలో ఉన్న సూత్రాలలో ఉన్న దివ్య పదాల యొక్క దివ్య భావ శక్తులు, డైరెక్ట్‌గా మీ మొత్తం చైతన్యం పైన, అంటే - చేతనం, అచేతనం, సుషుప్తం & మీ మల్టి డైమెన్షనల్ ఉనికి కేంద్రంలో సూటిగా ఒక్క ముక్కలో చెప్పాలంటే - "మీ మొత్తం" పైన మహా ప్రగాఢమైన, సురక్షితమైన మరియు తక్షణమైన దివ్య ప్రభావం చూపెడతాయి. ఈ సత్యాన్ని మీరు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪

జ్ఞానాన్ని తెలుసుకోవడం ద్వారానే మీ శక్తి సామర్థ్యాలు మీకు పూర్తిగా ఉత్తేజితమై, పూర్తిగా అందుబాటులోకి వస్తాయి.
జ్ఞానమే ఉత్తేజితం చేసి అందుబాటులోకి తెస్తుంది. ఉదాహరణకు, మీరు దైవాలు అని చదివి లేదా విని తెలుసుకుని, పూర్తిగా ఒప్పుకున్నారు, అంతే. ఈ తెలుసుకుని, ఒప్పుకోవడం ద్వారానే మీలోపల దైవత్వం మీకు అందుబాటులోకి వస్తుంది.

మీరు సహజంగానే ఆరోగ్యవంతులు మరియు ఐశ్వర్యవంతులు - ఇది ఒక సత్యం. ఇప్పుడు ఈ సత్యాన్ని లేదా ఈ జ్ఞానాన్ని మీరు తెలుసుకుని, ఓహో... నేను సహజంగానే ఆరోగ్యవంతుడిని, ఐశ్వర్యవంతుడిని అన్నమాట... సరే నా ఆరోగ్యాన్ని మరియు ఐశ్వర్యాన్ని నేను అనుమతించాను... అని అనుకుంటే చాలు మీలో ఆరోగ్యం మరియు ఐశ్వర్యం సిద్ధిస్తుంది.

మీలో ఉన్న సర్వ శక్తి సామర్థ్యాలు, మీకు అవి ఉన్నాయి అని తెలుసుకోవడం ద్వారా అవి పూర్తిగా ఉత్తేజితమై, మీకు పూర్తిగా అందుబాటులోకి వచ్చేస్తాయి.

- రామ్‌తా

✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪ ✪

మంచి పుస్తకాలు ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. మంచి పుస్తకాలు దగ్గర ఉంటే దేవుడు ఉన్నట్టే ! మీ పరిస్థితులు బాగా లేనప్పుడు మంచి పుస్తకాలను చదవితే మీ పరిస్థితిని తక్షణమే బాగు చేసుకునే శక్తి సామర్థ్యాలు ఉత్తేజితమవుతాయి.

సత్య మార్గానికి అంకితమైన జీవితమే అర్థాన్ని & పరమార్థాన్ని పొందుతుంది. కేవలం తినడం, పెరగడం, పెళ్ళి, పిల్లలు మొదలైన వాటి కోసం ఏ ఆత్మ కూడా జన్మను తీసుకోదు ! సత్య మార్గానికి అంకితమై జీవించడమే అసలు సిసలు జీవితం. జీవించి ఉన్న సత్య గురువు కోసం అన్వేషించండి. మీకు సూట్ అయ్యే గురువు తప్పకుండా దొరుకుతాడు లేక దొరుకుతుంది. మీకు తృప్తిని, విశ్వాసాన్ని కలిగింప చేసే గురువు ఎక్కడో ఉండి తీరుతాడు/తీరుతుంది. ముందు మీరు అన్వేషణ ప్రారంభించండి. మీకు గురువు దొరికాక ఆయన దగ్గర లేక ఆమె దగ్గర స్థానం సంపాదించుకోండి. సెటిల్ అయిపోండి. స్థానం అంటే శిష్యరికం. పదవి, హోదా, అధికారం కానే కాదు. ఒళ్ళు దగ్గర పెట్టుకుని నిస్వార్థంగా, నిజాయితీగా, నిరహంకారంగా, విశ్వాసంగా అంకిత భావంతో గురువు దగ్గర సెటిలయిపోండి. దగ్గర అంటే కేవలం దగ్గర అని కాదు. మీకు వీలైనప్పుడు గురువును కలుస్తూ ఆయన మార్గదర్శకత్వంలో నడవండి అని అర్థం ! గురువు లేని జీవితం ఆత్మ లేని శరీరం లాంటిది !

పార్ట్ - 27

కుండలినీ జాగరణ

I. కుండలినీ జాగరణ

కుండలినీ శక్తిని జాగృతం చేసే

పూర్తి అవగాహన ఉంటేనే చేయాలి!

అనంత మూల చైతన్య శక్తియే కుండలినీ శక్తి!

బ్రహ్మానంద శక్తియే కుండలినీ శక్తి!

ప్రతీ ఒక్కరిలో ఈ కుండలినీ శక్తి ఉంటుంది!

సాక్షాత్ మీరే మూల చైతన్య స్వరూపులు. మీలో అనంత మూల చైతన్య శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. "అనంతం" అని అంటే ఎన్నటికీ తరగనిది, కరగనిదీ మరియు ఎల్లప్పుడూ అభివృద్ధి చెందేది అని అర్థం. మరి, మీలో ఉన్న అనంతమైన శక్తి సామర్థ్యాలను మీరు అందుబాటులోకి తెచ్చుకోవడానికి ఏమిటి అడ్డంకి ?! మీరు "అవసరం అని భావిస్తేనే" మీ శక్తి సామర్థ్యాలు ఉత్తేజితమై, ప్రవృద్ధమై మీకు అందుబాటులోకి వస్తూ ఉంటాయి. మీలో "అనంతమైన శక్తి మడుగు" ఉంది. నాకైతే ఇది అలలు లేని ఒక పేద్ద సముద్రంలా కనబడింది. కుండలినీ అనుభవాలు ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటాయి అందులో ఏవైనా కొన్ని ఒకే రకంగా ఉండే అవకాశం ఉంది. ఈ యొక్క "శక్తి మడుగునే" "కుండలినీ శక్తి" అని అంటారు. నిజానికి ఇది మూల చైతన్య శక్తి ! దీనికి రక రకాల పేర్లున్నాయి. ఇది మూలాధార చక్రానికి దగ్గరలో ఉంటుంది. మీ నిజ తత్వం లేక ఆత్మ మరియు శరీరాల కలయిక స్థానంలో, ఆ యొక్క సంగమపు ప్రదేశంలో కుండలిని అని పిలువబడే శక్తి ఉంటుంది. దాన్ని మీరు ఏ రకంగానైనా పిలుచుకోండి, ఆ శక్తి ఆత్మ మరియు శరీరాల సంధిలో ఉంటుంది. ఇది వెన్నెముకకు సమాంతరంగా ఉన్న సూక్ష్మ శరీరపు నాడుల్లోంచి నిట్ట నిలువుగా పైకి ప్రవహిస్తూ, అన్ని చక్రాలను ఉత్తేజితం చేసుకుంటూ సహస్రారాన్ని చేరుకుంటుంది. ఇలా జరగడంతో ఆ వ్యక్తి తన నిజ తత్వాన్ని గ్రహిస్తాడు. దివ్యుడై పోతాడు. ఇది నిట్ట నిలువుగా పైకి లేస్తుంది కాబట్టి దీన్ని సర్పమని అంటుంటారు. కానీ నిజానికి ఇది సర్పం కాదు. ఇది "అనంత మూల చైతన్య శక్తి". అంతే ! భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలో అక్కడక్కడా దీనిని సర్పంగా వర్ణించారు. ఇది చదివి సాధన చేసిన వారికి ఆ మూల చైతన్య శక్తి వారి భావానికి అనుగుణంగా అలా కనపడుతుందంతే. భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలోని సర్ప వర్ణనలు చదవని వారెందరో ఈ "కుండలినీ శక్తిని"

జాగృతం చేసుకున్నారు. వారికి కేవలం మూల చైతన్య శక్తి మాత్రమే అనుభూతి అయింది. ఆ శక్తిని వారు అనుభవించారు, పొంది నిలుపుకున్నారు. గుర్తుంచుకోండి. తెలుసుకోండి, గ్రహించండి "కుండలినీ శక్తి" అనేది వాస్తవానికి "అనంత మూల చైతన్య శక్తి" అని ! అది అనంత ఆత్మ శక్తి. అంతే !

తనలో అనంత మూల చైతన్య శక్తిని కలిగి ఉన్న మానవుడు దేని గురించీ ఆలోచించాల్సిన మరియు దిగులు చెందాల్సిన అవసరమే లేదు కదా !

మీలో ఉన్న "శక్తి మడుగు" వినియోగం లేక పోవడంతో నిశ్చలంగా, నిరుపయోగంగా, తటస్థంగా ఉంది. మడుగు ప్రవహించకుండా ఉంటే అది పరిశుద్ధంగా ఉండదు. మడుగులోని నీరు ప్రవహిస్తేనే పరిశుద్ధంగా, స్వచ్ఛంగా ఉంటుంది. ఈ విషయం మీకూ తెలుసు కదా ! మన "శక్తి మడుగును" ప్రవహింప చేయాలి. అప్పుడే అది ఉత్తేజితమై, ప్రవృద్ధమవుతూ ఉంటుంది. మనం దానిని ఎంతెంతగా వినియోగించు కుంటామో అది అంతంతగా అభివృద్ధి చెందుతూ మన అందుబాటులోకి వస్తూ ఉంటుంది.

ఈ కుండలిని శక్తిని "అందుబాటులోకి" తెచ్చుకోవడానికి ఎన్నో సాధనలు ఉన్నాయి. వాటిలో అత్యంత సులభమైనదీ, సర్వులు ఆచరించగలిగే **సాధనా విధానమే ఆధ్యాత్మిక సేవ !** మీరు ఆత్మ విజ్ఞానాన్ని విస్తారంగా, అపారంగా, విశేషంగా పంచుతూ పోతుంటే "సర్వ అవగాహన" మీకు సులభంగా, శీఘ్రంగా సిద్ధించి ఆటొమెటిక్‌గా మీ కుండలిని శక్తి మీ అందుబాటులోకి వచ్చేస్తుంది. ఇది ఎలా జరుగుతుందంటే, "పంచబడింది పెంచబడుతుంది" అనే సూత్రం ప్రకారం మీరు పంచిన ఆధ్యాత్మిక విజ్ఞానం లక్షల రెట్లై మీలో శక్తి సామర్థ్యాలుగా + అవగాహనగా ఉదయిస్తుంది. మీరు ఆ అవగాహనతో సాధన చేస్తూ ఉంటారు. ఆ సమయంలో ఎప్పుడో ఇది మీ అందుబాటులోకి వచ్చేస్తుంది. కుండలినీ శక్తి జాగృతానికి సంబంధించిన కఠిన విషయాలను ఎన్నో చదివిన మీకు ఈ విషయం ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉంటే, అందులో పెద్ద ఆశ్చర్యమేమీ లేదు.

✪✪✪ అనంత మూల చైతన్య శక్తి యొక్క మూల సూత్రం ఒకటి ఇలా ప్రకటిస్తోంది... "శక్తి వినియోగమే, శక్తి యొక్క పాలన, పోషణ మరియు అభివృద్ధి" అని !

మన కనుబొమ్మల మధ్యలో కొంచెం లోపల "మూడో కన్ను లేక దివ్య నేత్రం లేక దివ్య కేంద్రం లేక దివ్య ద్వారం ఉంటుంది. దీనినే ఇప్పటి వాళ్ళు పిట్యూటరి గ్రంథిగా" వ్యవహరిస్తున్నారు. దీన్నే మరి కొంత మంది పీనియల్ గ్రంథి అంటున్నారు. భారత ఆధ్యాత్మికులు దీన్ని ఆజ్ఞా చక్రం అని అంటారు. కుండలిని శక్తి మనకు అవసరం అని మనం భావించినప్పుడు ఇది నిట్ట నిలువుగా పైకి లేచి అన్ని చక్రాలను ఉత్తేజితం చేసుకుంటూ "దివ్య కేంద్రాన్ని" చేరుతుంది. కలుస్తుంది. అప్పుడు మనం "దివ్యులమై విరాజిల్లుతాం" !

ఈ కుండలినీ శక్తిని అందుబాటులోకి తెచ్చుకున్న వారినే దేవుళ్ళు అని అంటారు. తెచ్చుకోని వారిని మానవులు అని అంటారు. ఈ శక్తిని అందరూ కలిగి ఉన్నప్పుడు ఎందుకు దీన్ని అందుబాటులోకి, వినియోగంలోకి తెచ్చుకోలేక పోతున్నారు ? అని అంటే...

ఈ శక్తి ఉందని తెలియక పోవడం ఒక కారణం అయితే, ఇది అవసరం అని అనుకోక పోవటం రెండవ కారణం. అంతే ! మరే కారణాలు లేవు !

✪✪✪ అందరూ కుండలినీ శక్తిని జాగృతం చేసే ప్రయత్నంలో పడుతుంటారు. ఇక్కడే, మొదటి అడుగులోనే దారి తప్పి పోతుంటారు. శక్తిని జాగృతం చేయటం ఏమిటి ? జాగృతమై, సక్రియమై, సచేతనమై, చైతన్యవంతంగా విరాజిల్లుతూ ఉన్న దానినే "శక్తి" అని అంటారు. శక్తిని కాదు జాగృతం చేయాల్సింది - మనల్ని మనం జాగృతం చేసుకోవాలి. అది జాగృతం అయ్యే ఉంది. మనమే నిద్రలో ఉన్నాం. ఈ శక్తి పట్ల మనమే మేలుకోవాలి. అప్పుడు అది మన అందుబాటులోకి వస్తుంది.

వాస్తవానికి జాగృతం కావాల్సింది మీరు. ఈ అసలు విషయాన్ని తెలుసుకోకుండా మీరు ఏమేమో చేస్తూ ఉంటే ఏనాటికీ సఫలం కాలేరు. లోపం మీ లోపల ఉంచుకుని దాన్ని గుర్తించకుండా ఉంటే ఎలా ?

కుండలినీ జాగరణ !

ఈ పదమే, ఈ మాటయే సరి కాదు. కుండలినీ శక్తిని జాగృతం చేద్దాం అని అనుకుంటే అప్పుడు వేసే మొట్ట మొదటి అడుగే పూర్తి స్థాయిలో, 100% తప్పు దిశలో పడుతుంది. ఆ తప్పు దిశలో బయలుదేరిన మీకు ఏనాటికీ గమ్యం దొరకదు. మీరు నిద్రలో ఉన్నారు. అది మెలుకువగానే ఉంది. ఎన్నో జన్మల నుండి, మీరు అంశాత్మగా మీ పరిణామ క్రమాన్ని ప్రారంభించిన దగ్గర్నుండీ అది ఎదురు చూస్తూనే ఉంది. ఏ నాటికైనా మీరు మేలుకోక పోతారా, తనను మీరు అనుమతించక పోతారా అని ఎంతో సహనంతో, ప్రేమగా అలా మీ పిలుపు కోసం పడిగాపులు కాస్తూనే ఉంది. మీరు కామాన్ని ఆనందించిన ప్రతీసారి దాని రుచి చూస్తూనే ఉన్నారు ఒక్క క్షణం కోసమైనా ! స్త్రీ, పురుషులు సెక్స్ చివరలో పొందే "భావప్రాప్తి" అని దేనినైతే అంటారో అది ఈ శక్తిలోని ఒక అతి చిన్న తుంపర వల్లనే కలుగుతుంది. సెక్స్ మీరు ఎంతసేపు చేసినా చివరలో కలిగే ఆ యొక్క "దివ్యానుభూతిని" పొందక పోతే మీరు సంతృప్తి చెందలేరు కదా ! కేవలం ఒకే ఒక్క క్షణం లభించే ఆ యొక్క "ఆనందం(భావప్రాప్తి)" అనేది ఆ యొక్క కుండలినీ అనబడే "బ్రహ్మానంద శక్తి" యొక్క, ఒక అతి చిన్న కదలిక మాత్రమే ! ఆ... ఒక్క క్షణంలో కలిగే ఆ అనుభూతిని ఏమని వర్ణిస్తారు. ఆ

యొక్క ఆనంద తన్మయత్వాన్ని అనుభవించాలే తప్ప మాటలలో వివరించడానికి కానీ, అర్థం చేసుకోవడానికి కానీ సాధ్యమవుతుందా ?! కామం ద్వారా ఆ యొక్క "బ్రహ్మానంద శక్తిని" ఒక్క క్షణం కోసం అనుభవిస్తాం. ధ్యానం(యోగం) ద్వారా దానిని శాశ్వతంగా పొందుతాం. కామం ద్వారా ఆ "బ్రహ్మానంద శక్తిని" రుచి చూస్తాం కాబట్టే, కామాన్ని నాలుగు పురుషార్థాలలో ఒకటిగా చేర్చారు. "కామిగాని వాడు మోక్షగామి కాలేడు" అన్న సూక్తి ఇందులో నుండే పుట్టింది.

మీరు నిజంగా, 100% చైతన్య స్పృహతో కుండలినీ శక్తిని అందుబాటులోకి తెచ్చుకోవాలి, అది నాకు "అత్యవసరం" అని, నిజంగా భావించగానే మీ శ్వాస వేగం ఒక్క సారిగా పెరిగి పోతుంది. వేగవంతమైన మీ శ్వాస కుండలినిని తాకుతుంది. మీ యొక్క గాఢమైన శ్వాస, తీవ్రమైన శ్వాస కుండలినీ శక్తిని తాకినపుడు మీరు అప్పుడప్పుడు "కామ భావంతో" ప్రేరేపించబడే అవకాశం ఉంది. ఎందుకంటే మీ పుట్టుకకు మూలమే కామం. వేలాది జన్మలుగా మీరు కామం ద్వారానే పుడుతున్నారు మరియు కామాన్ని అనుభవిస్తూనే ఉన్నారు. మీకు మీ గురించి కానీ, మీ కుండలినీ శక్తి గురించి కానీ ఏమీ తెలియదు. వేలాది జన్మలుగా మీ శరీరానికి కేవలం కామానుభవం మాత్రమే తెలిసి ఉండడం వలన ఇలా జరుగుతుంది. ఈ కారణం చేతనే చాలా మంది సాధకులకు(వారు స్త్రీలైనా, పురుషులైనా), వారి కామ కేంద్రం అప్పుడప్పుడు ప్రేరేపితమవుతుంది. అది ఎంత సడన్‌గా జరుగుతుందంటే, మీకు ఆశ్చర్యం వేస్తుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా కామ వాంఛ ఉద్భవిస్తుంది. ఇది సహజం. ఇలా జరిగినప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదు. నిందా భావం అసలే పనికి రాదు. అవగాహన లేని అజ్ఞానులే ఇలా జరిగినప్పుడు "అయ్యో ఏమిటి ఇలా జరిగింది" అని కంగారు పడతారు. ఇది ఎప్పుడూ ఇలా జరగదు. ఎప్పుడైనా జరగవచ్చు. అప్పుడప్పుడూ జరగవచ్చు. తరుచుగా జరగవచ్చు. ఇది సహజం. ఈ కామం దివ్యమైనదనీ, నాలుగు పురుషార్థాలలో ఒకటని, అందులో తప్పేమీ లేదని మేము పదే పదే చెబుతూ ఉండాలా ? అప్పుడే మీరు కుదుటపడతారా ? ఇలాంటి అజ్ఞానపు స్థితిలో నుండి ముందు బయట పడండి. ఇలాంటి స్థాయిలోనే మీరింకా ఉంటే "అది" సరి కాదు. పురుషార్థమైన దివ్య కామం గురించి ముదనష్టపు చెత్తను పోగు చేసుకుని ఉన్న వాళ్ళు తక్షణమే ఆ చెత్తనంతా వదిలించుకోవాలి. గ్రహించండి, కామం ఒక పురుషార్థం ! కామం పరమ పవిత్రమైనది ! కామం దివ్యమైనది ! ✪✪✪ భగవద్గీతలో 7వ అధ్యాయంలోని 11వ శ్లోకంలో స్వయంగా దేవాధిదేవుడైన శ్రీకృష్ణ పరమాత్ముడే, "కామోఽస్మి" అంటే "కామము అయి ఉన్నాను" అని ప్రకటించాడు. సాక్షాత్తు భగవంతుడే "నేనే కామము" అని చెప్పినప్పుడు కామము పట్ల ఎంత దివ్య భావనను కలిగి ఉండాలి ?!?! కుండలినీ శక్తి సాధనలో అప్పుడప్పుడు మీ కామ కేంద్రం ప్రేరేపితమవుతుంది. తీవ్రంగా, మీరు ఇక భరించలేని స్థాయిలో కామ కోరిక కలిగినపుడు దాన్ని ఎరుకతో సాక్షిగా చూడండి. అప్పుడు అది నిదానిస్తుంది, మీరు మళ్ళీ సాధనను కొనసాగించవచ్చు. ఎంతకూ నిదానించటం లేదంటే, మీరు సాధనను కొనసాగించ లేకపోతున్నారంటే సాధనలోంచి లేవండి. అప్పటికీ నిదానించక పోతే, మీకు భాగస్వామి అందుబాటులో ఉంటే దివ్య భావనతో కామ

కార్యంలో పాల్గొనండి. ఆ తర్వాత మళ్ళీ వీలు చూసుకుని సాధన మొదలు పెట్టండి. ఇది ఎప్పుడూ జరగదు. ఒక వేళ జరిగితే ముందు జాగ్రత్తగా చెప్తున్నాను. చాలా ఎక్కువ మందికి ఇలాంటి అనుభవాలే గుర్జీఫ్ సమక్షంలో కలిగాయని, అతని దగ్గరకు వెళ్ళీ వెళ్ళగానే చాలా మంది స్త్రీలకు కామ కేంద్రాలు ఉత్తేజితమై, రెచ్చగొట్ట బడ్డాయని దీని వల్ల అందరూ గుర్జీఫ్‌ను అపార్థం చేసుకున్నారనీ గుర్జీఫ్ చరిత్ర ద్వారా తెలుస్తోంది. గుర్జీఫ్ ఒక పరమాత్మ స్వరూపుడు. ఒక సద్గురువు. గుర్జీఫ్‌ను అపార్థం చేసుకున్నట్టే ఓషో పరమాత్ముడిని కూడా జనాలు అపార్థం చేసుకున్నారు. ఎవరైతే కుండలినీ శక్తిని అందుబాటులోకి తెచ్చుకుని ఉంటారో వారి చుట్టూ ఉన్న ప్రకంపనలు, వారి సమీపంలోకి వెళ్ళిన వారి యొక్క కుండలినిపై ప్రభావం చూపిస్తాయి. కుండలినీ శక్తి, కామ కేంద్రానికి దగ్గరలో ఉంటుంది కాబట్టి, కుండలిని అందుబాటులోకి తెచ్చుకుని ఉన్న వారి ప్రకంపనలు మీ కామ కేంద్రాన్ని సహజంగానే తాకుతాయి, ప్రేరేపిస్తాయి. ఉన్నతమైన ఆధ్యాత్మిక అవగాహన ఉన్నప్పుడు ఇలాంటి విషయాలు అర్థం అవుతాయి. కాబట్టి ఈ సాధనలో కామ ప్రేరేపణలు సహజం అని తెలుసుకుని, దివ్య భావనలతో సాధనను కొనసాగించాలి. ఈ సాధనలో మీరు ఎలా ప్రేరేపించబడినా వాటన్నింటినీ ఎరుకతో, సాక్షిగా గమనిస్తూ ముందుకు సాగాలి.

తెలుసుకోండి కుండలినీ అనేది "బ్రహ్మానంద శక్తి" అని !

మీరు ఎప్పుడైతే ఆ "బ్రహ్మానంద శక్తిని" "అవసరం" అని భావిస్తారో అది "కేవలం ఒకే క్షణంలో" పైకి లేచి మన తలలో ఉన్న "దివ్య కేంద్రాన్ని" చేరుకుంటుంది. అప్పుడు మహా దివ్య ప్రకంపనలు కలుగుతాయి. శరీరం అంతా ఒక మహా జలదరింపుకు లోనవుతుంది. శరీరంలో భూకంపం వచ్చినట్టు అనిపిస్తుంది. ఒక రకమైన విస్మయానికి గురవుతాం. ఒక విధమైన తన్మయత్వాన్ని అనుభవిస్తాం. ఆ అనుభవం గురించి మాటలలో చెప్పడం అసాధ్యం. సూటిగా చెప్పాలంటే బ్రహ్మానందాన్ని అనుభవిస్తాం, దాన్ని అలాగే నిలుపుకుంటాం.

ప్రతీ ఒక్కరూ ఆ యొక్క "బ్రహ్మానంద శక్తిని" అనుభవించి, నిలుపుకోగల సర్వ శక్తి సామర్థ్యాలను, అవగాహనను రెడిమేడ్‌గా కలిగియే ఉంటారు. ఆ యొక్క "దివ్యానంద శక్తిని" అందుబాటులోకి తెచ్చుకోవడం అనేది మీ యొక్క ప్రాథమిక హక్కు + అధికారం అని తెలుసుకోండి. మీరు ఎవరైనా, మీరు ఏ స్థితిలో ఉన్నా, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా, మీరు వికలాంగులైనా, అనారోగ్యంతో ఉన్నా, మీరు ఎలా ఉన్నా ఆ శక్తిని మీరు ఇప్పుడు కలిగియే ఉన్నారు. దాన్ని సులభంగా, సరళంగా, సురక్షితంగా అందుబాటులోకి తెచ్చుకోగలుగుతారు.

ఆ యొక్క "బ్రహ్మానంద శక్తిని" అందుబాటులోకి తెచ్చుకోవడం అనేది సంపూర్ణ, సమగ్ర, మహా సురక్షామయమైన వలయంలోనే జరిగిపోతుంది. కుండలినీ విషయంలో ఎవరికైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా ఏదైనా సమస్య కలిగిందీ అని అంటే అది కుండలినీ వల్ల కాదు - అది వారు కుండలినీ పట్ల ఏర్పరుచుకున్న సరి కాని నమ్మకాల వలన, సరి కాని అభిప్రాయాల వలన, సరి కాని జ్ఞానం వలన మాత్రమే అని తెలుసుకోండి.

ఆ "బ్రహ్మానంద శక్తి" పట్ల ప్రేమను ప్రకటించండి. విశ్వాసాన్ని ప్రకటించండి. సదభిప్రాయాన్ని, సదుద్దేశాన్ని, సదవగాహనను కలిగి ఉండండి. సంపూర్ణ సమగ్ర సురక్షా భావాన్ని కలిగి ఉండండి.

మీ నమ్మకాల వ్యవస్థను, మీ అభిప్రాయాల వ్యవస్థను, మీ ఆలోచనా విధానాన్ని సరి చేసుకోండి. కుండలినీ గురించి ఎక్కువగా చదవడం, వినడం, చర్చించడం చేయకండి. ఇంత మాత్రం చాలు ! ఇప్పుడు సాధన మొదలు పెట్టండి. కుండలినీ గురించి ఆలోచిస్తే కేవలం పాజిటివ్‌గా మాత్రం ఆలోచించండి. దాని పట్ల ఆనందాన్ని, మైత్రిని ప్రకటిస్తూ సాధన కొనసాగించండి.

కుండలినీ శక్తిగా పిలువబడే అనంత మూల చైతన్య శక్తిని మనం అందుబాటులోకి తెచ్చుకోవాలంటే ముందు దాని పట్ల మనకు ఉన్న సరి కాని అభిప్రాయాలను, సరి కాని నమ్మకాలను తీసి వేసుకోవాలి. ఈ శక్తి ఉన్నదే మన వినియోగం కోసం అని తెలుసుకోవాలి. దీన్ని అందుబాటులోకి తెచ్చుకోవడం మన జన్మ హక్కు అని తెలుసుకోవాలి. వాస్తవానికి అది మనకు అందుబాటులోనే ఉంది, మనమే దానికి అందుబాటులో లేము అన్న విషయాన్ని గ్రహించాలి. ఈ శక్తిని అందుబాటులోకి తెచ్చుకోవడం అనేది ఎంతో సులభం, సరళం, తక్షణం, సురక్షితం అని తెలుసుకోవాలి. ఈ శక్తిని అనుభవించి, అందుబాటులోకి తెచ్చుకునే సర్వ, సకల, సమస్త శక్తి సామర్థ్యాలు, అవగాహన మొదలైనవన్నీ మీ దేహం + మీరు సహజంగానే, ఇప్పుడు మీరు ఉన్నదున్నట్టుగానే కలిగి ఉన్నారని తెలుసుకోవాలి.

ఇది, ఇప్పుడు చదువుతున్న మీరు(ఎప్పుడు చదువుతూ ఉన్నా సరే) ఈ శక్తిని హాయిగా, ఆనందంగా అనుభూతి చెంది పూర్తిగా అందుబాటులోకి తెచ్చుకునే సర్వ అవగాహనా శక్తి సామర్థ్యాలు మీ దేహం + మీరు స్వతః సిద్ధంగానే కలిగి ఉన్నారని తెలుసుకోవాలి.

ఈ శక్తిని మీరు అందుబాటులోకి తెచ్చుకోవడం "అవసరం" అని భావించిన తక్షణం, స్వయంగా ఈ యొక్క "అనంత మూల చైతన్య శక్తియే మీకు తనను అనుభవించి, నిలుపుకునే సర్వ శక్తి సామర్థ్యాలను + అవగాహనను మీలో కల్పిస్తూ, తనను తాను ప్రేమగా, ఇష్టంగా మీకు సమర్పణం చేసుకుంటుందని తెలుసుకోవాలి.

ఈ శక్తిని గురించిన "సరి కాని విషయాలను" అన్నింటినీ తక్షణమే విసర్జించండి. ఎలా అంటే ఇక్కడ నేను చెప్తున్న "సరి అయిన విషయాలను" తక్షణమే, సంపూర్ణంగా ఒప్పుకోండి. ఈ సత్యాలను స్వీకరించిన మరుక్షణం మీలో ఉన్న "సరి కానివి అన్నీ" శాశ్వతంగా తొలగి పోతాయి.

ఇంత కాలం ఈ "అనంత మూల చైతన్య శక్తి" మీలో ఉన్నా అది మీకు అందుబాటులో లేక పోవడానికి కారణం దాన్ని మీరు "అవసరంగా" భావించక పోవడమే ! మీరు ఎప్పుడైతే దాన్ని

"అవసరం" అని భావిస్తారో అప్పుడు దాన్ని అనుభవించి అందుబాటులోకి తెచ్చుకునే "సర్వ విషయాలు" మీలో ఉత్తేజితమై మీ శక్తిని మీకు సురక్షితంగా అందుబాటులోకి తెచ్చి ఉంచుతాయి.

మీకు ఈ శక్తిని అందుబాటులోకి తెచ్చుకునే విషయాల పైన, అనుమానాలు, భయాలు కలుగుతున్నాయంటే అది కేవలం మీ "అజ్ఞానమేనని" తెలుసుకోండి. మీరు ఒక విషయాన్ని ఎప్పుడైతే అంగీకరించరో అప్పుడే అనుమానం అనేది పుడుతుంది. మరి, ఎందుకు అంగీకరించరు అని అంటే, మీకు అది "అవసరం" అని అనిపించక పోవటమే ! అవసరం అయినప్పుడు మీరు అంగీకరిస్తారు, అది తక్షణమే సంభవం అవుతుంది. ఈ శక్తిని అందుబాటులోకి తెచ్చుకోవడానికి మీలో ఏవైనా భయాలు కలుగుతూ ఉంటే, వాటితో ఏకం కాకండి. ఆ భయాలు మీ లోపల ఎవరు కలుగజేస్తున్నారో గమనించండి.

మీరే మీ లోపల ఈ "అనంత మూల చైతన్య శక్తిని" అనుభవంలోకి, అందుబాటులోకి తెచ్చుకోవడం అనవసరం అని భావిస్తున్నారు. ఎక్కడో భయపడుతున్నారు. ధ్యానంలో కూర్చుని ఇలా అనుకోండి - "అనంత మూల చైతన్య శక్తిని అందుబాటులోకి తెచ్చుకుంటే నేను సాక్షాత్తు దేవుడినే అవుతాను కదా, అనంత దివ్య శక్తులు నాకు వస్తాయి కదా, అప్పుడు దివ్యానందంతో దివ్య జీవితాన్ని జీవిస్తాను కదా, మూడో కన్నుతో సృష్టిలోని సర్వ విషయాలను తెలుసుకుంటూ దివ్య జ్ఞాన సంపన్నుడిని అవుతాను కదా, ఎందుకు నేను వ్యతిరేకిస్తున్నాను, ఎందుకు నేను భయపడుతున్నాను ? నేను ఎందుకు వ్యతిరేకిస్తున్నానో, నేను ఎందుకు భయపడుతున్నానో నాకు తెలియాలి, నేను తెలుసు కోవడానికి సిద్ధంగా ఉన్నాను" అని గాఢంగా అనుకోండి. ఎరుకతో, సాక్షిగా ఉండండి.

ప్రశాంతంగా కళ్ళు మూసుకుని కూర్చున్న తర్వాత ఇలా అనుకోవాలి "నా సమస్య యొక్క సరియైన, తక్షణ పరిష్కారాన్ని అనుమతించాను" అని గాఢంగా అనుకోవాలి. ఇప్పుడు ప్రేమగా, ఎరుకతో సాక్షిగా వస్తున్న ఆలోచనలను గమనిస్తూ ఉండాలి. ప్రేమ ఎరుక సాక్షి అంతే ! ఈ భావాలతో ఉండాలి. మీ లోపల అచేతనంలో లేక సుషుప్తంలో ఉన్న మూల కారణం మీ ముందుకు వస్తుంది. అప్పుడు కూడా ఎలాంటి ప్రతి స్పందనను ఇవ్వకుండా ప్రేమతో, ఎరుకతో సాక్షిగా ఉండాలి. అంతే, ఆ మూలం సరి చేయబడుతుంది. లేదా క్లియర్ అవుతుంది. చిత్రంగా మీరు ఆ సమస్య నుండి బయట పడతారు.

ఈ సాధన చేస్తున్నప్పుడు సహనంతో ఉండాలి. ఒక సిటింగ్‌లో కాకపోతే సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు చేస్తూనే ఉండాలి. ఎప్పుడో అది జరుగుతుంది. కానీ జరుగుతుంది, జరిగి తీరుతుంది ఖచ్చితంగా !

సాధనలో కూర్చున్నప్పుడు ఏం వినపడితే దానిని వినాలి, ఏం కనబడితే దాన్ని చూడాలి. అంతర్ ప్రకృతిని ప్రవహించనివ్వాలి. లోపల ఎన్నెన్నో జరుగుతాయి, ఎలాంటి ప్రతి స్పందన చేయకూడదు. శబ్దాలు, మాటలు, నవ్వులు మొదలైనవి వినిపించే అవకాశం ఉంది. దృశ్యాలు ఏవైనా కనపడే అవకాశం ఉంది. ఏమీ కాదు, భయపడాల్సిన పని లేదు. అంతా శ్రేయస్కరంగా జరుగుతుంది. సాధనలో ఇవన్నీ మామూలే, మీరు మాత్రం ఎలాంటి ప్రతి స్పందన చేయకుండా సాక్షిగా ఉండాలి. ప్రేమ ఎరుక సాక్షి అంతే ! ఈ ప్రేమ ఎరుక సాక్షి భావనలే ఆ మూలాన్ని తీసేస్తాయి, సరి చేస్తాయి. ఇది సహజంగా జరిగే సృష్టి విధి విధానం అంతే ! మీ ఎరుక నెగెటివ్(లోపం లేక సమస్య) పైన ప్రసరిస్తే అది శాశ్వతంగా క్లియర్ అవుతుంది. ఒక వేళ మీ ఎరుక పాజిటివ్ గుణాలపై ప్రసరిస్తే అవి బలపడతాయి.

ఆ సమస్య యొక్క మూలం లోపల, విస్మృతిలో ఉంటుంది. కేవలం మీ ఎరుకలో లేనందుకే అది అక్కడ ఉంది. ప్రేమతో, ఎరుకతో ఎలాంటి ప్రతి స్పందన చేయకుండా సాక్షిగా ఆ సమస్య మూలాన్ని చూసిన వెంటనే మీ "ఎరుక" దానిపై ప్రసరిస్తుంది. మీ ఎరుకయే ఆ సమస్య మూలాన్ని తీసి వేస్తుంది. మీ ఎరుకయే ఆ గాయాన్ని మాన్చివేసే దివ్య ఔషధం. అయితే అది ఎదురుపడే వరకు సహనంతో ఉండాలి. విసుగును, కోపాన్ని ప్రకటించవద్దు. మీరెంత సహనంతో ప్రశాంతంగా ఉంటే ఆ సమస్య అంత త్వరగా పరిష్కారం అవుతుంది. ప్రేమ ఎరుక సాక్షి అని మనసులో అనుకుంటూ ఉండండి, ఆ భావాలను కలిగి ఉండండి. చాలు, మిగతా పని అంతా ఆటోమెటిక్‌గా అయిపోతుంది.

ఈ విధంగా కళ్ళు మూసుకుని సమస్య పట్ల ప్రేమను ప్రకటిస్తూ ఓపికగా నిరీక్షిస్తూ ఉంటే, ఆ క్షణం వస్తుంది. ఠక్కున మీకు సమస్య యొక్క మూల కారణం ఏమిటో తెలుస్తుంది. చాలా క్లియర్‌గా తెలుస్తుంది. సమస్య యొక్క మూల కారణం తెలియడంతో, సమస్య అర్థం అవుతుంది. మీలో ఒక వికాసం జరుగుతుంది. ఒక అవగాహన సంభవిస్తుంది. మీకు ఎంత విశ్రాంతిగా అనిపిస్తుందంటే, మీరు ఆశ్చర్యపోతారు. లోపల పరివర్తనం జరిగింది. పరిష్కారం లభించింది. సమస్య నుండి మీరు విముక్తం అయినట్టు మీకు అత్యంత స్పష్టంగా తెలుస్తుంది. మీరు మెల్లగా కళ్ళు తెరుస్తారు.

గుర్తుంచుకోండి, సమస్య యొక్క మూలాన్ని తెలుసుకుని, దాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా మాత్రమే విముక్తి లభిస్తుంది. సమస్య యొక్క మూలం "లోపల, అంతరంగంలో(inner)" ఉంటుంది. అంతరంగం అంటే మీరు కళ్ళు మూసుకున్నప్పుడు ఏదైతే ఉంటుందో అదే అంతరంగం. కళ్ళు తెరిస్తే "బయట", కళ్ళు మూస్తే "లోపల" !

కుండలినీ శక్తి అనబడే బ్రహ్మానంద శక్తిని/మహా మూల చైతన్య శక్తిని అందుబాటులోకి తెచ్చుకునే సాధనా విధానం

క్రింద కానీ, గోడకు ఆనుకుని కానీ, కుర్చీలో కానీ, సోఫాలో కానీ, మంచం పైన కానీ కూర్చోవచ్చు. ఎక్కడ మీకు సౌకర్యంగా ఉంటే అక్కడ, ఎలా మీకు అనుకూలంగా ఉంటే అలా కూర్చోవాలి. సౌకర్యంగా కూర్చోవాలి. మెడ, వెన్నెముక నిఠారుగా పెట్టి, శరీరాన్ని బిగపట్టి కూర్చోకూడదు. మీ శరీరం ఎంత అనుకూలిస్తే అంతగా, ఆ విధంగా కూర్చోండి. క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉంటే, ఆటోమెటిక్‌గా మెడ, వెన్నెముక నిఠారుగా అయిపోతాయి. శరీరాన్ని పూర్తిగా వదిలి వేయండి. రిలాక్స్‌గా శరీరాన్ని వదిలేయాలి. శరీరంలో ఏ భాగం కూడా బిగపట్టి ఉండరాదు. తర్వాత కళ్ళు రెండూ మూసుకుని, హాయిగా కూర్చోవాలి. మీరు పూర్తిగా సుఖంగా, సౌకర్యంగా, స్థిరంగా ఎక్కువ సేపు కూర్చునే విధంగా కూర్చోవాలి.

ఏ దేవతా స్వరూపాన్ని ఊహించరాదు. ఏ జపం, స్మరణ చేయకూడదు. మూల చైతన్యం లేక నిజ తత్వం అలా ఉంటుంది లేక ఇలా ఉంటుంది అనే ఊహలు, ఆలోచనలు చేయకూడదు. ఏ నిర్వచనానికి, ఏ ఊహకు, ఏ ఆలోచనకు, ఏ తర్కానికి, ఏ అభిప్రాయానికి, ఏ నమ్మకాలకు దేనికీ... దేనికి కూడా అందనిది... అన్నిటికీ అతీతమైనదీ "అనంత మూల చైతన్య శక్తి(కుండలినీ శక్తి)" అని ఎంతో స్పష్టంగా మాస్టర్స్ అందరూ చెప్పారు. అయినా 99% మంది జనాలు "ఈ శక్తి" పట్ల ఏదో ఒక అభిప్రాయాన్ని కలిగి ఉంటారు."ఈ శక్తిని" పొందడానికి "అంతిమ మరియు ప్రథమ అడ్డంకి, దాని పట్ల మీకు ఉన్న అభిప్రాయమే" ! ఎప్పటి వరకైతే "అనంత మూల చైతన్య శక్తి(కుండలినీ శక్తి) పట్ల మీకు ఉన్న అభిప్రాయాలు, నమ్మకాలు" తీసివేయరో అప్పటి వరకు ఆ శక్తి అందుబాటులోకి రాదు గాక, రానే రాదు ! కాబట్టి ప్రియ శక్తి సాధకులారా ! "అనంత మూల చైతన్య శక్తి(కుండలినీ శక్తి)" పట్ల మీకు ఉన్న "అభిప్రాయాలను", "నమ్మకాలను" తీసి వేయండి. ఈ శక్తి గురించి ఏమీ ఆలోచించకుండా, దాని పట్ల ఎలాంటి ఊహలు, అభిప్రాయాలు పెట్టుకోకుండా, ఊరికే అలా ఉండాలి !

"అనంత మూల చైతన్య శక్తి(కుండలినీ శక్తి)", అది ఉంది. నా అభిప్రాయాల శక్తి కాదు. నా నమ్మకాల శక్తి కాదు. ఏదైతే "మూలానికి మూలమో ఆ అనంత మహా మూల చైతన్య శక్తి(కుండలినీ శక్తి)", ఏదైతే సర్వ సృష్టికి మూలాధారమో ఆ పరమ శక్తి, ఏదైతే ఒరిజనల్‌గా నా నిజ శక్తియో దానిని మాత్రమే నేను తిరిగి పొందాలి. అంతే కానీ నా అహం

లేక అజ్ఞానపు అభిప్రాయాల ప్రకారం కాదు. నా అజ్ఞానపు నమ్మకాల ప్రకారం కాదు అని స్థిరంగా అనుకోవాలి.

ఈ సాధన ఖాళీ కడుపుతో చేయాలి. మీకు వీలైనంత పొద్దున్నే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, వదులు దుస్తులు ధరించి సాధన ప్రారంభించాలి.

రెండు కళ్ళు మూసుకుని మీ దృష్టిని నుదిటి మధ్యలో ప్రశాంతంగా నిలిపి ధీమాగా, భావనాత్మకంగా ఇలా అనుకోవాలి. ఒక సూత్రం తర్వాత మరొకటి సాధన చేయాలి. ఒక్కో సూత్రం కనీసం 30 నిమిషాలు చేయాలి మొదటి సూత్రానికి రెండవ సూత్రానికి ఎంత గ్యాప్ ఇస్తారు అనేది మీ స్థితి పైనే ఆధార పడి ఉంటుంది. పావు గంట, అర గంట లేక గంట లేక ప్రొద్దున ఒకటి సాయంత్రం ఒకటి చేసుకోవచ్చు. ఈ సాధన ఆత్మ విజ్ఞాన విషయాల పట్ల బాగా అవగాహన ఉన్న వారు, గురు మార్గదర్శకత్వంలో చేస్తే మంచిది. కుండలినీ జాగృత సాధనలు చాలా ఉన్నాయి. అనేకమైన సాధనలలో ఇది ఒకటి !

❂ 1. సులభం, సరళం, సురక్షితం !

❂ 2. నా కుండలిని జాగృతమయ్యే ఉంది !

మహా గమనిక

కుండలినీ శక్తి సర్పం లాగానో లేక పాములాగానో ఉండదు. అది మన ఆత్మ దివ్య శక్తి, బ్రహ్మానంద శక్తి, మహా మూల చైతన్య శక్తి !

ఎవరు ఎప్పుడు మొదలు పెట్టారో తెలియదు కానీ కుండలినీ అనగానే సర్పం బొమ్మ వేయడం, అనుకోవడం పరిపాటయింది.

కుండలినీ శక్తికి సర్ప ఆకృతికి & సర్పానికి ఎలాంటి సంబంధం లేనే లేదు.

ఎవరికి సర్పం లాగా అనుభవం అయి దాన్ని చూసారో నాకైతే తెలియదు. నేను కుండలినీ శక్తిని ధ్యానంలో "అలలు లేని ఒక పేద్ద సముద్రం"లాగా చూసాను !

కుండలినీ శక్తికి, ఆత్మకు లేనట్టుగానే, ఒక ప్రత్యేక రూపం ఏమీ లేదు. అది ఒక మహా దివ్య శక్తి ! అంతే !

మీరు ఇంతకు ముందు కుండలినీ గురించి విని, చదివి ఉన్న చెత్తనంతా పూర్తిగా తీసేసుకోండి.

కుండలినీ చాలా దివ్యంగా, ప్రశాంతంగా, సురక్షితంగా జాగృతమై అనుభవంలోకి వస్తుంది. ఇదే సత్యం !

మీరు కళ్ళు మూసుకుని ప్రశాంతంగా, ధీమాగా, ఎరుకతో కూర్చోవాలి అంతే ! బిగుసుకుపోయి ఉన్న మీరు రిలీజ్ కావాలి, మిమ్మల్ని మీరు అలా వదిలేయండి. ధ్యానాన్ని 100% అనుమతించాను అని అనుకోండి. ధ్యానంలో జరిగే "అనంత మూల చైతన్య శక్తి(కుండలినీ శక్తి)" ప్రవాహాన్ని 100% అనుమతించాను అని అనుకోండి, అనుమతించండి. ధ్యానంలో కూర్చోగానే మీ నిజ శక్తి కేంద్రంతో ఆటొమెటిక్‌గా మీరు ట్యూన్ అవుతుంటారు. కేవలం ఆ యొక్క ట్యూనింగ్‌ను 100% అనుమతించండి. అంతే !

✪✪✪ మీరు నిజంగా, 100% మిమ్మల్ని మీరు, మీ నిజ కేంద్రంతో జరిగే ట్యూనింగ్‌ను అనుమతిస్తే కేవలం ఒకే ఒక క్షణంలో అన్నీ క్లియర్ అయిపోయి "అనంత మూల చైతన్య శక్తిని(కుండలినీ శక్తి)" శాశ్వతంగా అందుబాటులోకి తెచ్చుకుంటారు. నిజానికి కుండలినీ శక్తి మూలధారం దగ్గర నుండి బయలుదేరి మన మూడో కన్నును (దివ్య నేత్రాన్ని) చేరుకోవడానికి ఒకే ఒక క్షణం పడుతుంది. అంతే ! దాన్ని 100%గా మీరు అనుమతించడానికే సమయం పడుతుంది. ఈ సమయం ఎంతైనా ఉండవచ్చు. ఒక నిమిషం, ఒక గంట, ఒక రోజు, ఒక సంవత్సరం, ఒక జన్మ కూడా పట్టవచ్చు. సమయం మీ పైనే ఆధారపడి ఉంది. కానీ ఎప్పుడైతే మీరు పూర్ణంగా అనుమతిస్తారో అప్పుడు కేవలం ఒకే ఒక క్షణంలో కుండలినీ శక్తి తన గమ్య స్థానమైన దివ్య నేత్రాన్ని చేరుకుంటుంది.

ఆశ్చర్యంగా ఉందా ! పరమ సత్యం, పరమ ఆశ్చర్యకరంగానే ఉంటుంది మరి !

ధ్యానంలో జరిగే ప్రక్షాళనా కార్యక్రమం యొక్క వేగం నూటికి నూరు శాతం, కేవలం మీ మీదనే ఆధారపడి ఉంది. ధ్యానంలో జరిగే క్లియరెన్స్‌లను, సెటింగ్స్‌ను, పునః సమైక్యతలను(Reunion or Reunite), శ్రేయస్కరాలను, లాభాలను మొదలైన వాటినన్నింటినీ అడ్డుకునేది "మీరేనని" గ్రహించండి.

మీకు మీరే అడ్డుగా ఉన్నారు. ఈ విషయాన్ని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ధ్యానంలో కలిగే లాభాలను అడ్డుకునేది మీరే. కేవలం మీ అడ్డు మీరు తొలగించు కోవాలి. మరి... ఎలా మీ అడ్డు మీరు తొలగించుకోవడం అని అంటే...

...ధ్యానంలో కూర్చుని ఉన్న మీరు - 100% నన్ను నేను క్లియర్ చేసుకోవాలని అనుకుంటున్నాను. ధ్యానంలో జరిగే క్లియరెన్స్‌లను, సెటింగ్స్‌ను, పునః సమైక్యతలను(Reunion or Reunite), శ్రేయస్కరాలను, లాభాలను మొదలైన వాటినన్నింటిని 100%గా అనుమతించాను అని భావనాత్మకంగా, గాఢంగా అనుకుని... ప్రేమతో, ప్రశాంతంగా, ధీమాగా, ఎరుకతో, సాక్షిగా ఉండాలి.

ఎలాంటి ప్రతిస్పందన చేయకుండా జరిగేవన్నీ శ్రేయస్కరాలే అని గ్రహించి సాక్షిగా ఉండాలి. అంతే ! ఇలా చేస్తే మీ అడ్డు మీరు తొలగించుకున్న వారౌతారు.

ప్రేమగా ఉండండి. ఎరుకతో ఉండండి. సాక్షిగా ఉండండి.

ఇలా క్రమం తప్పని సాధన చేస్తూన్నప్పుడు ఎప్పుడో కుండలినీ అని పిలువబడే ఆ బ్రహ్మానంద శక్తి, ఆ యొక్క అనంత మూల చైతన్య శక్తిని మీరు సులభంగా, సరళంగా, సురక్షితంగా, సఫలవంతంగా అనుభవించి అందుబాటులోకి తెచ్చుకోగలుగుతారు. అప్పుడు మీరు సాక్షాత్ మూల చైతన్య స్వరూపులై శాశ్వతంగా విరాజిల్లుతారు !

ఈ సాధన వలన ఏం జరుగుతుందంటే...

మొదటి సూత్రం వలన "అనంత మూల చైతన్య శక్తి(కుండలినీ శక్తి)" పట్ల మీకున్న సరి కాని నమ్మకాలు, అభిప్రాయాలు అన్నీ తొలగిపోయి మొత్తానికి మొత్తం ప్రక్షాళన జరుగుతుంది. శక్తిని సులభంగా, సరళంగా, సురక్షితంగా అందుబాటులోకి తెచ్చుకునే "పూర్తి స్థాయి వ్యవస్థ" మీలో ఏర్పడుతుంది.

రెండవ సూత్రం వలన "అనంత మూల చైతన్య శక్తికీ(కుండలినీ శక్తి) మీకు చక్కటి, సరి అయిన, సురక్షా పూర్వకమైన అనుసంధానం జరిగి, అది మీ అనుభవంలోకి వచ్చి, అందుబాటులోకి రావడానికి అవసరమయ్యే అన్ని రకాల సెట్టింగ్స్, క్లియరెన్స్‌లు జరిగిపోతాయి. ఆ శక్తిని అందుబాటులోకి తెచ్చుకుని, శాశ్వతంగా నిలుపుకోగలిగే శక్తి సామర్థ్యాలు, అవగాహన మీలో నిర్మితమై ఆ యొక్క "అనంత మూల చైతన్య శక్తి (కుండలినీ శక్తి)" మీకు పూర్తి స్థాయిలో, శాశ్వతంగా మీ అందుబాటులో, మీ అదుపు ఆజ్ఞలలో ఉంటుంది. ఇలా ఒక్క సారి అందుబాటులోకి వచ్చిన ఆ శక్తిని మీరు అనంతంగా, అపారంగా, విస్తారంగా వినియోగించుకుని మీకూ + సృష్టికి సర్వ శ్రేయస్కరాలను కలుగజేయవచ్చు.

ఆ శక్తి ఎన్నటికీ, తరగని, కరగని అనంతానంత శక్తి !

ఈ సాధన చేసేటప్పుడు ఏమేం జరుగుతాయి ?

మీ శ్వాస వేగం అవుతుంది. తీవ్రం అవుతుంది. మీ శరీరం అప్రయత్నంగా రక రకాలైన భంగిమలు తీసుకుంటుంది. దేనినీ ఆపవద్దు. జరుగుతున్న వాటన్నింటినీ ఎరుకతో సాక్షిగా చూస్తూ ఉండండి. శ్వాస వేగం పెంచండి. శ్వాసను తీవ్రం చేయండి. గాఢంగా, వేగవంతమైన, తీవ్రమైన శ్వాసను తీసుకుంటూ దానిని ఎరుకతో, సాక్షిగా గమనిస్తూ ఉండండి.

కూర్చుని ఉన్న మీరు ఆటోమేటిక్‌గా నిలబడాల్సి వస్తే నిలబడండి. మీ శరీరం గంతులు వేస్తే వేయనివ్వండి. మీ ప్రమేయం లేకుండా అరుపులు వస్తే రానివ్వండి. శరీరం ఊగితే ఊగనివ్వండి. అంతా శ్రేయస్కరంగానే జరుగుతుంది. ఈ విధంగా మీరు ఉండగలిగినంత సేపు ఉండండి. ఆ తర్వాత ఒక 10 నిమిషాలు ప్రశాంతంగా పడుకోండి. ఆ తర్వాత మీ పనులు మీరు చేసుకోండి.

✪✪✪ చాలా మంది మాస్టర్స్ కుండలినీ శక్తిని జాగృతం చేయాలంటారు. దీని అర్థం ఏమిటంటే... మీరు కుండలినీ పట్ల జాగృతం కండి, అని చెప్పడం. కుండలినీ జాగృతానికి ఎన్నో ఇతర గొప్ప సాధనలు ఉన్నాయి.

ఇంతకు ముందు పేజీలలో నేను చెప్పిన స్పీడ్ బ్రెత్ మరియు దైవత్వ సాధన కలిపి చేస్తే కుండలిని జాగృతం అయితీరుతుంది. ఇది సూపర్ పద్ధతి. మహా మహా అద్భుతమైన పద్ధతి ఇది.

All The Very Best !

పార్ట్ - 28

దైవత్వ ప్రాప్తి యొక్క కీలక రహస్యం

విచిత్రం ఏమిటంటే - మనమే మన దైవత్వాన్ని కావాల్సుకుని మర్చిపోయాం. మనం ఒరిజినల్‌గా ఆధ్యాత్మిక జీవులం. భౌతిక దేహాన్ని ధరించి భౌతిక అనుభవాలను పొందుతున్న ఆధ్యాత్మిక జీవులం. మనం ఏమేం అనుభవాలను పొందాలనుకున్నామో అవన్నీ పొందుతూ ఇక దైవంలో మేలుకోవాలి అని అనుకున్నప్పుడు ఇలాంటి ఆధ్యాత్మిక పుస్తకాలు చదవడం జరుగుతుంది. ఎవరైనా ఒక సత్య గురువు గురించి తెలుస్తుంది, ఆయన దగ్గర శిష్యరికం తీసుకోవాలనిపిస్తుంది, పూర్తిగా సత్య మార్గానికి అంకితవ్వాలనిపిస్తుంది. ఇవన్నీ కూడా ఆత్మ ఇచ్చే జాగృత సంకేతాలుగా అర్థం చేసుకుని ఆచరణలో పెడితే బాగుంటుంది. సులభంగా పని జరిగిపోతుంది. భౌతిక మాయలో పడి నిర్లక్ష్యం చేస్తే నరకం కనపడుతుంది.

సాక్షాత్తు మనమే దైవం అయినప్పుడు, మళ్ళీ మనం, మన యొక్క దైవత్వం కోసం సాధన ఎందుకు చేయాలి ?!?

సాక్షాత్తు దైవమే అయిన మనం, ఈ భూమండలం పైకి ''మానవుడి''గా జన్మించి, మన యొక్క ఆత్మ శక్తులను రకరకాలుగా ప్రయోగించి, అర్థం చేసుకుని, అనుభవ విజ్ఞానాన్ని విస్తరింప చేసుకోవడానికి వచ్చాము. గుర్తుంచుకోండి, తెలుసుకోండి, దయచేసి గ్రహించండి... సాక్షాత్తు దైవం అయిన మనం, ''మానవులు''గా జన్మించాం.. అంటే ఒరిజినల్‌గా మనం దైవమే ! మన ఆత్మ శక్తుల యొక్క అభివృద్ధి కోసం, మనల్ని మనం మరిచిపోయి, మానవులుగా జన్మించాం. మనకై మనమే దైవత్వాన్ని మరిచిపోయాం కాబట్టి, మనకై మనమే తిరిగి గుర్తుచేసుకోవాల్సి ఉంటుంది. ఇది నియమం. ఇప్పుడు విషయం అర్థమైంది కదా !

❖ ❖ ❖

మనమే దైవం అన్న సంగతి, మనం మర్చిపోయి చాలా కాలం అయింది. మానవులుగా మనం అపారమైన అనుభవ విజ్ఞానాన్ని పొందాం. ఇక మనం మేలుకోవాల్సిన సమయం వచ్చేసింది. ఇక ఇప్పుడు మనం మేలుకునియే తీరాలి. మనం మేలుకోవడం అనేది మన చేతుల్లోనే ఉంది.

❖ ❖ ❖

చాలా చాలా జన్మలు అయ్యే సరికి, ఇన్ని జన్మలుగా.. మిమ్మల్ని మీరు కేవలం శరీరాలుగానే భావిస్తున్నందుకు, మీరు దైవం కాదు అనే మరుపులో ఉన్నారు. అది కేవలం భ్రాంతి మాత్రమే ! నేనే దైవం అని మీరు ఒప్పుకున్నప్పుడు, మీ దైవత్వం మీకు పూర్తిగా అనుభవంలోకి వస్తుంది. అంతే. నిజంగా చాలా సింపుల్ ! ఆశ్చర్యంగా ఉందా ? మీ ఆశ్చర్యం అంతా ఎందుకంటే.. మతాధికారులు, మతగ్రంథాలు మరియు స్వామీజీలు, బాబాలు మొదలైన వారంతా దైవత్వాన్ని(మోక్షాన్ని) చాలా చాలా సాగదీసి, జఠిలం మరియు కఠినం చేసేశారు. దాదాపు అసంభవం చేసిపారేశారు. అవన్నీ విన్న మీరు, చదివిన మీరు... నేను ఇంత సింపుల్ అని చెప్తుంటే, మీరు ఆశ్చర్యపోవడంలో.. ఆశ్చర్యం ఏముంది ?!

దైవత్వాన్ని ప్రాప్తించుకునేందుకు లేదా తిరిగి గుర్తు చేసుకునేందుకు, అత్యంత ముఖ్యమైన, ప్రధానమైన కీలక రహస్యం :

మీరు లోపల "ఏకం"గా లేరు - ఇదే ఆ "కీలక రహస్యం"!

మానవులుగా చాలా జన్మలను తీసుకుని, రకరకాలైన ప్రయోగాలను చేసి ఉన్నారు మీరు. ఈ ప్రయోగాలను చేసేటప్పుడు మీరు అనేకానేకమైన మంచి - చెడు పాత్రలను ధరించారు. మంచి పాత్రలను ధరించి అనుభవం సంపాదించిన విషయం ఫర్వాలేదు కాని, చెడు పాత్రలను ధరించి అనుభవం సంపాదించినందు వలన మీలో చీలికలు ఏర్పడ్డాయి. మీ చైతన్యంలో ఉన్న ఈ చీలికల వలన మీ లోపల ఏకత్వం లేదు. మీరు ఏకంగా లేరు. అందుకే మీరు, నేనే దైవం అని అనుకోగానే మీకు దైవత్వం ప్రాప్తించటం లేదు. మొత్తం లోపల ఏకంగా ఉంటే, మీరు ఒక్కసారి నేనే దైవం అని ఒప్పుకుంటే సరిపోతుంది. ఇది చాలా కీలకమైన రహస్యం. దీనిని అవగాహన చేసుకుంటే.. మీలో ఏకత్వం ఏర్పడుతుంది. మీరు క్రమం తప్పని దైవత్వ సాధన చేస్తూ ఉంటే.. క్రమంగా మీలోని చీలికలన్నీ తొలగిపోయి, మీ చైతన్యం ఏకం అవుతుంది. క్రమం తప్పని సాధన తప్పని సరి. మరో రహస్యం ఏమిటంటే.. మీ చైతన్యంలో చీలికలున్నాయి అన్న సంగతిని గనుక మీరు సరిగా అర్థం చేసుకుంటే, మీలోకి ఈ విషయం దిగితే, అప్పుడు ఒక అద్భుతం జరుగుతుంది. నా చైతన్యంలో చీలికలున్నాయా.. అనే విషయాన్ని మీరు గ్రహించినప్పుడు.. మీ "ఎరుక" మీలోని చీలికలన్నింటి పైనా ప్రసరిస్తుంది. ఇది ఆటొమెటిక్‌గా జరుగుతుంది. మీరు విషయాన్ని గ్రహించడమే, ఎరుకను ప్రసరించడం. మీ ఎరుక, మీలోని చీలికలపైన ప్రసరించినప్పుడు, ఆటొమెటిక్‌గా మీలోని చీలికలు పోయి, మీ చైతన్యం ఏకం అవుతుంది. అప్పుడు మీరు సంపూర్ణ చైతన్యంతో మీ యొక్క దైవత్వాన్ని మీరు ఒప్పుకోగానే.. మీకు దైవత్వం పునః ప్రాప్తిస్తుంది.

మీలో ఎన్ని చీలికలు పర్వడినా... వాటన్నింటిని తీసివేసుకోగల శక్తి సామర్థ్యాలు పూర్తిగా మీకున్నాయి. లోతు అంతా తెలుసుకునే... మీరు దిగారు.

మీ లోపల చీలికలున్నాయన్న సంగతే మీకు తెలియదు. మీరు ఏకంగా లేరన్న విషయం మీకు తెలియదు. మీరు సాధన చేస్తూ... నేనే దైవం అని మీ దైవత్వాన్ని మీరు ఒప్పుకోగానే, మీ చైతన్యంలోని కొంత భాగం ఒప్పుకుంటుంది. మిగతా భాగాలు తిరస్కరిస్తూ ఉంటాయి. ఈ తిరస్కరణ గురించి మీకు గ్రహింపు లేదు. మీరు చేస్తూ ఉంటారు. మీకు తెలియకుండా మీ లోపల తిరస్కరణ జరుగుతూ ఉంటుంది.

ఒక వైపు మీరు దైవత్వాన్ని ఒప్పుకుంటూ ఉంటారు. మరో వైపు దాన్ని తిరస్కరిస్తూ ఉంటారు.

మీ లోపల ఉన్న సరికాని గుణాలే తిరస్కరించేది. దైవత్వం అంటే ఏవో తెలియని భయాలు, అపోహలు ఉండటం వలన ఆ గుణాలు తిరస్కరిస్తూ ఉంటాయి. మీ గుణాలు మీ చైతన్యంలో భాగాలు, అంటే - మీరే ! సరిగా అర్థం చేసుకోండి, మీ గుణాలు అని అంటే, మీరే అని అర్థం. మీలోని భాగాలు అంటే మీరే అని కదా అర్థం. ఉదాహరణకు, మీ కుడి చేతితో, మీరు దైవత్వాన్ని అనుమతిస్తున్నారు. ఎడమ చేతితో తిరస్కరిస్తున్నారు. తిరస్కరిస్తుంది ఎడమ చేయే అయినా, దాన్ని కంట్రోలర్ మీరే కదా ! రెండు చేతులకు కంట్రోలర్ మీరే కదా ! మీకు పూర్తిగా విషయాలు తెలియవు. కొంచెం మాత్రమే తెలుసు. అందుకే దైవత్వం ప్రాప్తించేటప్పుడు ఏం జరుగుతుందోనన్న భయం వలన మీకు తెలియకుండా మీరే తిరస్కరిస్తూ ఉంటారు. ఎక్కెడెక్కడో.. ఏవేవో చదివి ఉంటారు, విని ఉంటారు.. ఆ యొక్క సరికాని విషయాలు మీలో ఉన్నాయి. అవి మిమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తుంటాయి. వాస్తవానికి అసలు విషయం ఏమిటంటే, నిజానికి మీరు భయపడరు. మీలోని గుణాలు భయపడతాయి, ఆ భయ ప్రకంపనలు మీకు ప్రసరిస్తాయి. అసలు సంగతి తెలియని మీరు, ఆ భయాలు మీకే కలుగుతున్నాయని భ్రమించి, ఆ భయ ప్రకంపనలను అనుమతిస్తారు. దానితో మీలో తిరస్కారం జనిస్తుంది, దానితో మీ దైవత్వ ప్రాప్తి ఆగిపోతుంది. ఒక వైపు ఎంతో ఇష్టంగా దైవత్వాన్ని అనుమతిస్తున్నారు. మరో వైపు దైవత్వం ఎక్కడ సిద్ధిస్తుందోనని భయపడుతూ... దైవత్వాన్ని ప్రకటం కానివ్వకుండా మీరే ఆపేస్తున్నారు. ఇది మీకు తెలియకుండా జరుగుతోంది. మీరు ఒక ముఖ్య విషయాన్ని సదా గుర్తుంచుకోవాలి... అది ఏమిటంటే.....

..... మీలో ఎక్కడో ఒక భాగం మార్పుకు అంగీకరించటం లేదు, అన్న సంగతిని మీరు దృష్టిలో ఉంచుకుని, మీలోని మార్పుకు అంగీకరించని భాగాన్ని కూడా కలుపుకుని.. నేను మార్పును అనుమతించాను.. అని అనుకోండి.

మరింత బాగా వివరిస్తాను :

మీలో ఒక భాగం మార్పును అంగీకరించటం లేదు. జడంగా ఉంది. ఆ భాగం మీలోనే ఉంది.. కానీ వేరుగా ఉంది. మీరు సాధన చేసేటప్పుడు, మీ సాధన యొక్క ఫలితం మీకు దక్కకుండా అది అడ్డుకుంటూ ఉంది. ఈ సంగతి మీకు తెలియదు. మీరు సాధన చేస్తూ ఉంటారు. పెద్దగా మార్పేమీ కనపడకపోయే సరికి, నిరాశకు గురవుతారు. నా సాధనలో లోపం ఎక్కడ ఉంది ? అని వెతుకుతూ ఉంటారు. లోపం లోపలే ఉందన్న విషయం తెలియని మీరు బయట వెదికి భంగ పడతారు. చాలా డిస్టర్బెన్స్‌కు గురవుతారు. సాధన చేయబుద్ధి కాదు. అయోమయంలో అలా ఉంటారు. ఇదంతా ఎందుకు జరుగుతుంది అని అంటే... మీకు అసలు విషయం తెలియక పోవడం వలన !

అర్థం చేసుకోండి... మీ ఎరుకలో ఉన్న మీరు, మీరు కాదు. మీకు తెలిసిన మీరు, మీరు కాదు. మీ అసలు మీరు మీ లోపల ఉన్నారు. మీ లోపల మీకు తెలియని గుణాలు మీ పరిస్థితులను ఆకర్షిస్తున్నాయి. మీ లోపల మీకు తెలియని గుణాలు మీ సాధన యొక్క ఫలితాలను నిర్ధారిస్తున్నాయి. మీ లోపల మీకు తెలియని గుణాలు మీ జీవితాన్ని నడిపిస్తున్నాయి. మీరు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోండి. మీలో మార్పుకు అంగీకరించని భాగాలను అసహ్యించుకోకండి. వాటిని ఉద్దేశించి.. ''ప్రేమ ఎరుక ఆనందం'' అని అంటూ ఉండండి. మీలోని జడపూరితమైన గుణాలకు మీరు ''ప్రేమ ఎరుక ఆనందాలను'' ప్రకటించినప్పుడు, అవి వెంటనే పూర్తిగా కరిగిపోతాయి. శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి. ''ప్రేమ ఎరుక ఆనందాలు'' అనేవి సృష్టి యొక్క పరమాద్భుతమైన శక్తులు. వీటి యొక్క ప్రయోగం పరమశక్తివంతమైనది. ఈ పరమ శక్తుల యొక్క ప్రభావానికి ఏదైనా క్లియర్ కావాల్సిందే.. మారాల్సిందే.. తక్షణ ప్రభావం చూపెట్టడం వీటి యొక్క ప్రత్యేకత ! మీరు మీ లోపల ప్రేమ ఎరుక ఆనందం అని అనుకుంటూ ఉన్నప్పుడు, మీలో ప్రేమ ఎరుక ఆనందాలు ఉద్భవిస్తూ ఉంటాయి. మీలోకి ప్రేమ ఎరుక ఆనందాలు ప్రసరించడం మొదలు పెడతాయి. అప్పుడు వాటి ప్రభావంతో తక్షణమే మీ సరికాని గుణాలు సరి అవుతాయి, అప్పుడు వెంటనే మీ పరిస్థితులు మారుతాయి.

మిమ్మల్ని మీరు కించ పరుచుకోకండి. మిమ్మల్ని మీరు నిందించుకోకండి. దైవత్వ ప్రాప్తికి కావాల్సింది.. మీ ఎరుక అంతే కాని, మిమ్మల్ని మీరు కించ పరుచుకోవడం, నిందించుకోవడం, బాధ పెట్టుకోవడం కాదు. మిమ్మల్ని మీరు గౌరవించుకోండి. ప్రస్తుతం మీకు ఎంత అయోమయంగా ఉన్నా.. మీ జీవితం సరి అయిన విధంగా, అభివృద్ధి పథంలోనే ముందుకు సాగుతుందని తెలుసుకోండి. మీకు ఎరుక లేనందువలన మీకు అయోమయంగా అనిపిస్తుందంతే ! మీరు నిబ్బరంగా ఉండండి. నిశ్చింతగా ఉండండి. కేవలం.. మీరు, మీ పట్ల ప్రేమ ఎరుక ఆనందాలతో లేనందువల్లనే మీకు, అన్ని రకాల ఆందోళనలు, అన్ని రకాల సమస్యలు ఉంటున్నాయని గ్రహించండి. మీ శరీరంలో మరియు మీ జీవితంలో ఉన్న అవకతవకలన్నీ మరియు నెగెటివ్‌లన్నీ మీరు ప్రేమ ఎరుక ఆనందాలతో ఉన్నంత మాత్రాన ఆటొమెటిక్‌గా సరిచేయబడతాయి. క్లియర్ అవుతాయి. అవి ఎంత ఎంత ఎంత ఎంత పెద్దవైనా... ఎంత ఎంత ఎంత జడమైనవైనా సరే...! ఇది నిజం.

మీరు నేను చెబుతున్న విషయాలను సరిగా అర్థం చేసుకోండి. నిజంగా ఆచరించండి. ఆచరణలోనే ఉంది అసలు కీలకమంతా...! మీరు ఈ సత్యాల పట్ల ఎరుకను పెంపొందించుకోండి. ఈ సత్యాలు మీలోకి పూర్తిగా దింపుకోండి. మీ అణువణువులో ఈ సత్యాలు ప్రకాశిస్తూ ఉండాలి. ఇది చాలా సులభం, సరళం, శీఘ్రం.

మీరు సాక్షాత్తు దైవాలు ఈ విషయాన్ని స్థిరంగా గుర్తుంచుకోండి. మీ లోపాలు ఏమేమి ఉన్నాయో గుర్తించండి. ఎలా అని అంటే.. నేను నాలోని లోపాలకు "ప్రేమ ఎరుక ఆనందాలను" ప్రకటిస్తున్నాను... అని అనుకుంటూ... మీలోని లోపాలకు ప్రేమ ఎరుక ఆనందాలను ప్రకటిస్తూ ఉండండి. అప్పుడు ఆటొమెటిక్‌గా మీ లోని జడమైన గుణాలన్నీ(లోపాలు) పైకి తేలి పూర్తిగా శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి. కొన్ని మీ గుర్తింపులోకి గ్రహింపులోకి వస్తాయి, మరికొన్ని రాకుండానే క్లియర్ అయిపోతాయి.

దైవత్వాన్ని పొందేటప్పుడు చాలా హాయిగా ఉంటుంది. దైవత్వం ఎంతో సురక్షితంగా ప్రకటం అవుతుంది. ప్రకటం అయ్యేది దైవత్వమండీ..! మరేదో కాదు భయపడడానికి ! దైవం మీలో ప్రకటం అయినప్పుడు ఎంత సురక్షితంగా పని జరుగుతుందో ఆలోచించండి. దైవత్వానికి మరో పేరు ఉంది.. అది.. ''బ్రహ్మానందం'' ! బ్రహ్మానందం అని అంటే పరమానందం అని అర్థం. అంటే, అంత కంటే గొప్పదైన ఆనందం కాని, సురక్ష కాని మరొకటి లేదు అని అర్థం. దైవత్వానికి మరో పేరు ఉంది.. అది.. ''మోక్షం'' ! మోక్షం అంటే విముక్తి లేక విడుదల అని అర్థం. వేటి నుండి విడుదల ? అని అంటే, అన్ని దుఃఖాల నుండి విడుదల అని అర్థం. అన్ని దరిద్రాల నుండి విడుదల అని అర్థం. అన్ని భయాల నుండి విడుదల అని అర్థం. అన్ని నెగెటివ్‌ల నుండి విడుదల అని అర్థం. అన్ని భ్రమల నుండి విడుదల అని అర్థం. అన్ని రకాల బానిసత్వాల నుండి విడుదల అని అర్థం. అన్ని రకాల బంధనాల నుండి విడుదల అని అర్థం. అన్ని రకాల పరిమితుల నుండి విడుదల అని అర్థం. అన్ని రకాల నిస్సహాయతల నుండి విడుదల అని అర్థం. అన్ని రకాల అశక్తతల నుండి విడుదల అని అర్థం.

దైవత్వ ప్రాప్తి చాలా సులభంగా, సరళంగా, హాయిగా, ఆనందంగా, సురక్షితంగా జరుగుతుంది. ఈ విషయాలను మీకు మీరు పదే పదే చెప్పుకోండి. మిమ్మల్ని మీరు సముదాయించుకోండి. మీకు మీరు నచ్చచెప్పుకోండి. మీ భయాలన్నీ పూర్తిగా తొలగిపోయే వరకు ఈ విషయాలను స్మరించండి. మీ దైవత్వానికి ప్రేమను ప్రకటించండి. నేను నా దైవత్వాన్ని ప్రేమిస్తున్నాను అని అనుకుంటూ ఉండండి. దైవత్వం ప్రాప్తిస్తే మేము ఎలా అవుతాము ? అని ఆందోళన చెందకండి. మీరు బాగు పడతారు. మీరు అన్ని రకాలుగా సురక్షితంగా, పరమానందంగా ఉంటారు. దైవత్వం ప్రాప్తిస్తే మీరు, తిరిగి దైవమే అవుతారు. దైవం అంటే ఏమిటో ఆలోచించండి. ఎవరికి ఏ బాధ వచ్చినా, ఏం జరిగినా... అందరూ వేడుకునేది దైవాన్నే కదా ! అందరినీ రక్షించే దైవం అనే స్థితిలోకి మీరు మారినప్పుడు, శాశ్వతమైన అభయస్థితిలోకి మీరు వచ్చినప్పుడు... ఇందులో భయపడాల్సిన పని ఏముంది ?! మీ సరికాని గుణాలే మిమ్మల్ని భయపెడుతున్నాయి. ఆత్మ విజ్ఞాన పుస్తకాలను బాగా చదవండి. వీలైనంతగా ఆధ్యాత్మిక వాతావరణంలో ఉండండి. అప్పుడు మీ యొక్క సరికాని గుణాలు వాటంతట అవే తొలగి పోతాయి.

"నా దైవత్వమంటే నాకు పూర్తి ఇష్టం ప్రేమ ఎరుక ఆనందం గౌరవం" !

.....అని పదే పదే అనుకోండి. ఈ సూత్రాన్ని బాగా సాధన చేయండి.

'' మీరు, ఈ సాధన చేస్తూ ఉండండి, అప్పుడు మీలోని నెగెటివ్‌లన్నీ వాటంతట అవే పూర్తిగా, శాశ్వతంగా తొలగి పోతాయి. మీరు, మీ దైవత్వాన్ని ప్రాప్తించుకోవడానికి సాధన చేస్తూ ఉన్నప్పుడు, మీలో అన్ని క్లియరెన్స్‌లు మరియు అన్ని సరైన సెటింగ్‌లు ఆటోమెటిక్‌గా జరిగిపోతూ ఉంటాయి. మీరు, క్రమం తప్పని సాధన చేస్తూ ఉంటే, మీకు కావల్సినవన్నీ వాటంతట అవే మీకు అందుతూ ఉంటాయి. ఉదాహరణకు, మీకు ఆరోగ్యం కావాలి.. మీరు పూర్తి ఆరోగ్యంగా మారుతారు. మీకు ఆర్థిక ఇబ్బందులున్నాయి.. మీరు ఐశ్వర్యవంతులవుతారు. మీకు స్వేచ్ఛ సాధికారతలు కావాలి.. వచ్చేస్తాయి. మీ ఫలానా లక్ష్యం నెరవేరాలి.. నెరవేరుతుంది. ఇలా మీకు కావాల్సిన సరి అయినవీ అన్నీ మీకు వాటంతట అవే అందుతూ ఉంటాయి. మీకు ఎల్లప్పుడూ మార్గదర్శకత్వం అందుతూనే ఉంటుంది. మీరు ఎప్పుడూ రక్షింపబడుతూనే ఉంటారు. మీకు ఎల్లప్పుడూ శుభాలు + లాభాలు జరుగుతూనే ఉంటాయి. మీరు మహా అదృష్టవంతులవుతారు. మీకు కాలం+పరిస్థితులు +వ్యక్తులు +వాతావరణం+ఇంకా ఇతర అవసరమైనవన్నీ కలిసి వస్తూ ఉంటాయి. మీకు మహా విజయాలు దక్కుతూ ఉంటాయి. మీకు ఎప్పుడైనా, ఏ పరిస్థితుల్లో అయినా కేవలం శ్రేయస్కరాలు మాత్రమే జరుగుతూ ఉంటాయి. మీ వలన ఇతరులకు, లోకానికి మేలు మాత్రమే జరుగుతుంది. మీ వలన అందరికి మంచి మాత్రమే జరుగుతుంది..... మీరు మాత్రం క్రమం తప్పని సాధన చేస్తూ ఉండండి''.

మరో రహస్యం :

ఇప్పుడు కాలం మారింది. యుగం మారింది. కలియుగం అయిపోయింది. చాలా కాలంగా భూమి సృష్టి జీవన స్రవంతిలో లేదు. పక్కకు తప్పించ బడింది. అందుకే ఈ భూమి పైన ఉన్న వాళ్ళకు వేరే లోకాల గురించి తెలియదు. వేరే లోకాల్లో మనుషుల కంటే ఎంతో ఉన్నతమైన అభివృద్ధి పథంలో ఉన్నవాళ్ళు ఉన్నారని అసలే తెలియదు. సృష్టి మూల చైతన్యం ఇప్పుడు మళ్ళీ భూమిని సృష్టి జీవన స్రవంతిలోకి ప్రవేశ పెడుతోంది. ఈ ప్రక్రియ 1980లలో ప్రారంభమైంది. 2000లో వేగవంతమైంది. 2012 చివరికల్లా పూర్తయిపోయింది. భూమికి ఉన్న బంధనాలు తొలగించ బడ్డాయి. నూతనమైన మరియు ఎంతో అడ్వాన్స్‌డ్ ఎనర్జీలు భూమి అంతా నిండుతున్నాయి. కొత్త కాంతి శక్తులు భూమి పైన ప్రసరిస్తున్నాయి. ప్రేమ శక్తులు భూమి అంతా వ్యాపిస్తున్నాయి.

భూమి పైన కొత్త నియమాలు అమలవుతాయి. కొత్త సూత్రాలు ఉద్భవిస్తాయి. నవీన విజ్ఞానం అందుబాటులోకి వచ్చేస్తుంది. ***ఈ " సద్గురు తారా విశాల్ మార్గదర్శియే" అందుకు ప్రమాణం, నిదర్శనం, నాగ్ధానం, ఋజువు మరియు సాక్ష్యం !*** మెరుపు వేగంతో అభివృద్ధి జరుగుతుంది. వేరే గ్రహాలలోని వారితో సంబంధాలు ఏర్పడతాయి. గ్రహాంతరవాసుల పైన ఉన్న అపోహలు తొలగిపోతాయి. ఇతర గ్రహాలకు రాకపోకలు మొదలవుతాయి. ఇతర విశ్వాలతో సంబంధాలు మొదలవుతాయి. ఆధ్యాత్మికంగా, విజ్ఞాన పరంగా భూమి పైన ఎంతో అభివృద్ధి జరుగుతుంది. మానవులంతా ఏకం అవుతారు. అంతటా ఆనందోత్సవాలు వెల్లివిరుస్తాయి. అందరూ అకర్మ శాకాహారులైపోతారు(Akarma Vegans). అందరికి ఆధ్యాత్మిక స్మృతి వస్తుంది. ప్రధానమైన ఒకే ఒక కుదుపులో ఇదంతా జరిగిపోతుంది. మెరుపు మార్పులు సంభవిస్తాయి. ప్రస్తుతం ఈ భూమి పైన ప్రసరిస్తున్న దివ్య శక్తుల ప్రభావం వలన సాధన ఎంతో సులభం, సరళం మరియు తక్షణం అవుతుంది. ఇంతకు ముందు ఎన్నో యుగాలు సాధన చేస్తే కాని సిద్ధించని విషయాలు, ఇప్పుడు కొన్ని రోజులలోనే సిద్ధిస్తాయి.

మీలో ఉన్న నమ్మకాల వలన ఆధ్యాత్మిక
సాధనలు ఫలితాలను ఇవ్వడానికి చాలా కష్టం
చేయాల్సి వస్తుంది. సంవత్సరాల కఠోర శ్రమ
ఉంటేనే కానీ ఫలితాలు రావనే నమ్మకం
వలన మీకు పరమోన్నత ఆత్మ విజ్ఞానం
అర్థం కావడం లేదు కానీ... ఫలితాలు
రావవడానికి కఠిన శ్రమ, నెలలు,
సంవత్సరాల కాలం గనుక అవసరమైతే అది
ఆధ్యాత్మికతయే కాదు సృష్టి కొనసాగేదే కాదు
- ఏ సాధన యొక్క ఫలితాలైనా కేవలం
రోజులలోనే వస్తాయి ఇదే పరమ సత్యం !
ఈ అనంత సృష్టి ఈ పరమ నియమ
ఆధారంగానే ఉనికిలో ఉండి అనంతంగా,
అమరంగా కొనసాగుతూ ఉంది !

- సేత్ & రామ్‌తా

పార్ట్ - 29

10% మినహాయింపు ద్వారా పూర్తి మినహాయింపు దొరుకుతుంది

10% మినహాయింపు ద్వారా పూర్తి మినహాయింపు దొరుకుతుంది

మీరేం చేస్తే అదే మీకు తిరిగి వస్తుంది - అనే నియమం ప్రకారం మీరు చేసినవే మీరు అనుభవిస్తూ ఉంటారు. మీరు మోసం చేస్తే మీరు మోసపోతారు, మీరు హింసిస్తే మీరు హింసించ బడతారు... ఈ విధంగా మీరేం చేస్తే వాటిని మీరు అనుభవించి తీరాలి. అయితే ఈ నియమం 90 శాతానికి మాత్రమే వర్తిస్తుంది. మిగతా పది శాతం మినహాయింపు ఉంటుంది. అంటే మీరెన్ని దారుణాలు చేసినా, ప్రపంచంలోకెల్లా ఘోరమైన పాపాలు చేసినా సరే... మీరు వాటిని అనుభవించాల్సిన అవసరం లేనే లేదు. సృష్టి మీకు పూర్తి మినహాయింపును ఇస్తుంది. మీరు ప్రపంచంలోకెల్లా దారుణమైన దోషి అయినా సరే మీకు పూర్తి మినహాయింపు లభిస్తుంది. మీరు ఈ నియమాన్ని ఒప్పుకుని, నేను పూర్తి మినహాయింపును కలిగి ఉన్నాను అని సాధన చేస్తే మీ కర్మలన్నీ వెంటనే సులభంగా, సరళంగా, శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి. ఇది పరమ సత్యం.

మీరు కేవలం ఈ సత్యాన్ని ఎలాంటి సందేహాలు లేకుండా ఒప్పుకోండి. అంతే, ఇది మీకు నిజంగా పూర్తి మినహాయింపును ఇస్తుంది. అజ్ఞానంలో మీరు తెలియక చేసినవన్నీ కూడా, అవి ఎంత ఘోరమైనవి అయినా సరే, తక్షణమే మీకు పూర్తి మినహాయింపు దొరుకుతుంది. మీరు తర్కించకుండా ఈ పరమ సత్యాన్ని ఒప్పుకోవాలి. ఇది చాలా గొప్పగా, చాలా శక్తివంతంగా మరియు తక్షణమే పని చేస్తుంది.

సాధనా విధానం

మీరు రిలాక్స్‌గా కూర్చుని, ప్రశాంతంగా ఇలా అనుకోండి - **"నాలో ఏ ఎరుక & ఏ అవగాహన ఉంటే నాకు కష్టాలు రావో ఆ ఎరుకను & ఆ అవగాహనను నేను పూర్తిగా అనుమతిస్తున్నాను, నేను పూర్తి శాతం మినహాయింపును కలిగియే ఉన్నాను"** - అని అనుకుంటూ ఉండండి. ఇలా మీరు అనుకుంటూ ఉండడమే సాధన చేయడం. మీరు ఈ సాధన చేస్తున్నప్పుడు మీకు ఏం కనపడితే దాన్ని చూడండి, ఏం వినపడితే దాన్ని వినండి మళ్ళీ మామూలుగా మీ సాధన మీరు చేస్తూనే ఉండండి. ఒక సిటింగ్‌లో కనీసం అరగంట అయినా చేయాలి. ఇలా మీ అంతరంగం పూర్తిగా ప్రక్షాళన అయ్యేంత వరకు చేయాలి. కొంత మందికి ఒక సిటింగ్‌లోనే క్లియర్ అయిపోతుంది. మరి కొంత మందికి కొన్ని సిటింగ్‌లు అవసరం పడవచ్చు. కాని అత్యంత తక్కువ సిటింగ్‌లలోనే పూర్తిగా క్లియర్ అయిపోతుంది. ఇది సత్యం.

ఈ సాధన గురించి శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో 4వ అధ్యాయంలోని 36 శ్లోకంలో ప్రకటించాడు.

❖ ❖ ❖

❖ ❖ ❖

శ్లో॥ అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి - భగవద్గీత - 4 : 36

వివరణ: ఒక వేళ నీవు పాపాత్ములందరికంటే కూడా ఎక్కువ పాపాలు చేసిన వాడవు అయినా సరే, ఆ పాపాలన్నింటినీ కూడా నీవు ఆత్మ విజ్ఞాన అవగాహన ద్వారా సులభంగా, నిజంగా, తప్పకుండా దాటివేయగలవు.

ఇక్కడ ఆత్మ విజ్ఞాన అవగాహన అంటే "పూర్తి శాతం మినహాయింపు దొరుకుతుంది" అనే సత్యాన్ని తెలుసుకుని ఉండటం. ఈ సత్యాన్ని ఒప్పుకుంటే నిజంగా పూర్తి శాతం మినహాయింపు దొరుకుతుంది. మీ కర్మలన్నీ క్లియర్ అయిపోయి మీరు ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలతో విరాజిల్లుతారు. ఇది పరమ సత్యం.

❖ ❖ ❖

పార్ట్ - 30

ఆనందమయ జీవితం కోసం...

ఆనందంగా ఉంటూ ఉంటే అదృష్టం
మీ వెంటే ఉంటుంది.
అదృష్టం వరిస్తే మీరు ఆనందంగా
ఉంటారు కదా !
మీరు ఆనందంగా ఉన్నప్పుడు,
మీ యొక్క ఆనంద శక్తి ఆదృష్టాన్ని
ఆకర్షిస్తుంది.

"నేను చాలా గొప్పగా అభివృద్ధి చెందుతూనే ఉన్నాను"
అనే భావనను మీరు ఎల్లప్పుడూ కలిగి ఉండాలి.
ఈ భావన యొక్క మహాశక్తి వలన మీరు దేనినంటే,
దానిని పొందుతారు. ఇది పరమ సత్యం.

1. ఆనందమయ జీవితం కోసం తప్పని సరిగా చేయవలసినవి

1. సంపూర్ణ శాశ్వత అకర్మ శాకాహారులుగా ఉండటం. అకర్మ శాకాహారులుగా ఎందుకు ఉంటున్నారో పూర్తి వివరంగా తెలుసుకోవటం. ఏదో ఒక శాకాహార కులంలో పుట్టాము కాబట్టి శాకాహారులుగా ఉండటం కాదు, శాకాహారులుగా ఉండాల్సిన అవసరం ఏమిటి ? ఆవశ్యకత ఏమిటి ? అనే విషయాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి. స్మృతి పూర్వకంగా శాకాహారులుగా ఉండి తీరాలి. లేకపోతే వృథా ! తప్పనిసరిగా పూర్తిగా, శాశ్వతంగా అకర్మ వీగన్లుగా మారితీరాలి.

2. ఆత్మ విజ్ఞాన శాస్త్ర అభ్యాసం క్రమం తప్పకుండా చేస్తూ ఉండాలి. అందులోని సూత్రాలను నిజ జీవితంలో, అవగాహనతో నిజంగా ఆచరిస్తూ ఉండాలి.

3. నిత్య ధ్యాన సాధన చేస్తూ ఉండాలి.

4. మంచి చేస్తే మంచి మాత్రమే జరుగుతుంది అనే విశ్వ సూత్రాన్ని సదా గుర్తుంచుకుని, కేవలం మంచి పనులు మాత్రమే చేస్తూ ఉండాలి. ఇతరులకు వీలైనంతగా, వీలైనన్ని రకాలుగా, నిస్వార్థంగా సహాయం చేస్తూ ఉండండి. మనం ఏం చేస్తే అదే మనకు వేయింతలుగా తిరిగి వస్తుందనే విశ్వ సూత్రాన్ని సదా సర్వదా స్మరణలో ఉంచుకుని, కేవలం మంచి పనులనే చేస్తూ ఉండాలి. ఎందుకంటే మనకు మంచి మాత్రమే జరగాలి కాబట్టి !

5. సత్య ప్రచార సంస్థలకు వీలైనంతగా, విశేషంగా విరాళాలను ఇవ్వండి. మీరు ఇవ్వలేక పోతే, విరాళాలను ఇప్పించండి. విరాళాలను సేకరించి ఇవ్వండి. సాఫల్యం పొందండి.

6. అకర్మ శాకాహార + ధ్యాన + ఆత్మ విజ్ఞాన ప్రచారం అంటే, "సత్య ప్రచారం" చేయండి.

7. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని మళ్ళీ మళ్ళీ చదవండి. మీరు దైవత్వం పొందే వరకు చదువుతూనే ఉండండి. చదివిన ప్రతీసారి మీకు కొత్త అవగాహన కలుగుతుంది. మీరు ప్రతీసారి అభివృద్ధి చెందుతూ ఉంటారు. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోని ప్రతీ విషయమూ దివ్యమైనదే !మిమ్మల్ని రక్షించేదే ! సమయ సందర్భాన్ని బట్టి ఇందులో తెలియజేసిన విషయాలను సరిగా అర్థం చేసుకుని, అవగాహనతో, స్వయం బాధ్యతతో, పూర్ణ విశ్వాసంతో ఆచరిస్తూ ఉండండి. **మీ జీవితం పరమానందమయం అవుతుంది. ఇది సత్యం.**

మన మస్తిష్కాన్ని పూర్తి సామర్థ్యంతో
వినియోగించుకోగలిగితే, మన శరీరాన్ని
ఓ క్షణంలో ఎలా కావాలంటే అలా
మార్చుకోవచ్చు. కొత్త అంగాలను క్షణంలో
నిర్మించుకోవచ్చు. ఎలాంటి వ్యాధులనైనా
క్షణంలో నయం చేసుకుని పూర్తి ఆరోగ్యాన్ని
పొందవచ్చు. ఈ శక్తి సామర్థ్యాలు మనందరికీ
ఇప్పుడు ఉన్నదున్నట్టుగానే, సహజంగానే
ఉన్నాయని **రామ్‌తా పరమాత్ముడు** చెప్తాడు.

2. ఆనందమయ జీవితం కోసం

అసలు ఏ మాత్రమూ చేయకూడనివి

1. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ విమర్శించ కూడదు. విమర్శించడం అని అంటే జడ్జ్‌మెంట్ ! ఒక్క జడ్జ్‌మెంట్ జీవితాన్ని తలకిందులుగా చేసేస్తుంది. ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలోనే జడ్జ్‌మెంట్ గురించి వివరించాను చదివి బాగా అర్థం చేసుకోండి.

మీకు సంబంధం లేని విషయాలెన్నో జరుగుతూ ఉంటాయి. దయచేసి విమర్శించకండి. జడ్జ్‌మెంట్ పవర్ మీకు తెలియదు. ఒకే ఒక్క జడ్జ్‌మెంట్ మీ జీవితాన్ని అతలాకుతలం చేసేస్తుంది. ఓ సారి మీ జీవితంలోని పరిస్థితులను పరిశీలించి చూడండి. అందులో మీరు చేసిన కర్మలు సగం ఉంటే, మిగతా సగం జడ్జ్‌మెంట్లే ఉంటాయి.

2. అవకాశం దొరికింది కదా అని, అడ్వాంటేజ్ తీసుకోకండి, అది ఏ విషయంలోనైనా సరే, ఎవరి విషయంలోనైనా సరే ! మీ కంటే బలహీనులపై దౌర్జన్యం చేయకండి.

3. జాతి, మత, కుల, వర్గ, ప్రాంతీయ భేద భావాలను చూపకండి.

4. ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసర పెత్తనం చెలాయించకండి.

5. ఎవరినీ కబ్జా చేయాలని చూడకండి. ఇతరుల అభివృద్ధికి అడ్డం పడకండి.

6. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ, ఏ రకంగానూ మోసం చేయకండి. అది ఎంత చిన్నదైనా సరే ! ఎవరినీ ఏ రకంగానూ నష్ట పరచకండి. పుకార్లు పుట్టించకండి. పుకార్లను వ్యాప్తి చేయకండి. నిజానిజాలు తెలియనిదే మాట్లాడకండి, ఏ నిర్ణయమూ తీసుకోకండి.

7. ఎట్టి పరిస్థితుల్లోనూ మాంసాహారం తీసుకోకండి. గుడ్డు కూడా ! మాంసాహారం తీసుకోకుండా ఉండడమే కాదు, ఎవరికీ తినిపించకండి. డేరి ప్రొదక్ట్స్ కూడా వాడ కూడదు. అస్సలు ఏ మాత్రమూ ఎంకరేజ్ చేయకూడదు.

8. ఎవరినీ స్వార్థం కోసం వాడుకోకండి. అబద్ధాలు, చాడీలు చెప్పకండి.

9. మానసికంగా , శారీరకంగా ఎవరినీ హింసించకండి.

10. సత్య ప్రచార సంస్థలను, సత్య ప్రచారకులను ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే చులకన చేయకండి. అవమాన పరచకండి. మీకు నచ్చకపోతే వదిలేయండి, అంతే కాని, విమర్శిస్తూ వారినేదో చేద్దామనుకుంటే మీరే చెడి పోతారు... గ్యారంటీగా !

11. ఎవరి చెడు కోరుకోకండి. ఎవరికీ చెడు చేయకండి.

12. మీ బాధలకు, మీ కష్ట నష్టాలకు, మీ అపజయాలకు వేరే ఎవరినీ బాధ్యులుగా చేయకండి, నిందించకండి.

13. ఫాల్స్ ప్రిస్టేజ్ మెయింటేన్ చేయకండి.

14. ఎవరి గురించైనా సరే, నెగెటివ్ ప్రచారం చేయకండి, అందులో పాల్గొన కండి. ఎవరైనా చేస్తూ ఉంటే ఎంకరేజ్ చేయకండి.

15. ఇతరుల జీవితాల్లో అనవసర జోక్యం చేసుకోకండి. ఇతరుల ప్రైవసీని దెబ్బతీయకండి.

16. ఇతరుల రహస్యాలను లీక్ చేయకండి.

17. ఎవరినీ తక్కువగా అంచనా వేయకండి.

18. నోటిని అదుపులో ఉంచుకోండి. "నోరు మంచిదైతే, ఊరు మంచిది అవుతుంది" అనే సూక్తిని గుర్తుంచుకోండి.

19. ఎట్టి పరిస్థితుల్లోనూ... ప్రతీకారం చేయకండి. ప్రతీకారం అంటే మీ నాశనాన్ని మీరే ఖాయం చేసుకుంటున్నట్టు అని అర్థం చేసుకోండి. ప్రతీకారం చేయకుండా ఉంటే మిమ్మల్ని మీరు రక్షించుకున్న వారవుతారు.

20. ఏవో కారణాల వలన మీరు ఎవరితోనైనా విడిపోతే, వారి గురించి నెగెటివ్‌గా చెప్పకండి. మౌనంగా ఉండండి.

21. మిమ్మల్ని మీరు శపించుకోకండి. వేరే ఎవరికీ శాపాలు పెట్టకండి.

22. ఎవరికైనా సహాయం చేస్తే చేయండి. లేకపోతే లేదు. అంతే కాని, సహాయం చేసిన తర్వాత... దాన్ని అడ్డం పెట్టుకుని వేధించకండి. సర్వ నాశనమైపోతారు.

పార్ట్ - 31

ఎక్స్ట్రా & స్పెషల్ ఇన్ఫర్మేషన్

ఈ సృష్టిలో అన్నీ... ఆలోచించగలిగేవన్నీ,
ఊహకు అందేవన్నీ.... అన్నీ సృష్టించబడి
రెడీగా ఉంటాయి. అందుకే దీన్ని సృష్టి అని అంటారు.

సృష్టించి రెడిమేడ్‌గా ఉన్నవాటి గురించే మనకు
ఆలోచనలు వస్తాయి. మనకు ఒక ఆలోచన
వచ్చింది అని అంటే, అది రెడీగా ఉందని అర్థం.
ఇలా రెడీగా ఉన్న వాటిని మన ఆలోచనల ద్వారా
అనుమతిస్తాం. అప్పుడు అది మన వాస్తవం అవుతుంది.
ఈ విధంగా మనకు కావాల్సినదాన్ని మన ఆలోచనల
ద్వారా ఎంచుకుని, దాన్ని జీవితంలోకి ఆకర్షించి,
అనుభవిస్తున్నాం కాబట్టే
"మన వాస్తవాలకు మనమే సృష్టికర్తలం" అవుతున్నాం.

1. పరమ సత్యం

ఆధ్యాత్మిక సత్యాలు అన్నీ అర్థం అయినట్టే అవుతాయి, కానీ ఎరుకతో ఉండాలి. మీ సమస్య ఇంకా తొలగి పోలేదు అని అంటే, ఇంకా ఏదో మీరు గ్రహించాల్సి ఉంది అని అర్థం.

మనిషి యొక్క సర్వ - సర్వ, సకల - సకల, సమస్త సమస్యలకు ఒకే ఒక కారణం, అది.... ఆధ్యాత్మిక అవగాహన లేకపోవడం. అంతే !

మనలో ఉన్న భావాలే(గుణాలే), ఇతరులలో ప్రతిబింబిస్తాయి అనేది పరమ సత్యం. మనలో ఉన్న భావాలకు(గుణాలకు) అనుగుణంగానే మనతో, ఇతరులు ప్రవర్తిస్తారు అనేది పరమ సత్యం. ప్రత్యక్షంగానైనా సరే, పరోక్షంగానైనా సరే మన గురించి అంటున్న మాటలు, ప్రవర్తనలు అన్నీ కూడా మనలోని భావాలకు(గుణాలకు) ప్రతిబింబాలే !

ఇది ఎంత ఆశ్చర్యకరంగా ఉంటుందీ అని అంటే, మనం ఏ మాత్రం నమ్మలేనంతగా ఉంటుంది. ఎవరైనా మన గురించి చెడుగా మాట్లాడుతున్నారు, చెడుగా ప్రవర్తిస్తున్నారు అని అంటే, అది 100% మనదే ! మన రిఫ్లక్షనే ! ఇది సత్యం !

మనకు జరుగుతున్నవన్నీ మన లోపల ఉన్న భావాలకు(గుణాలకు) అనుగుణంగానే జరుగుతున్నాయి.

మనకు జరిగే చెడు, మనకు జరిగే మంచి అన్నీ కూడా మన లోపల ఉన్న భావాలకు(గుణాలకు) తగ్గట్టుగానే జరుగుతున్నాయి. ఇది పరమ సత్యం !

మనకు జరిగే మంచి మనదే అని ఎవరైనా ఒప్పుకుంటారు, కానీ చెడుకు మూలం నా లోపల ఉందా ?! అని ఒప్పుకోరు. ఇది అంత తొందరగా జీర్ణం కాని విషయం. చాలా ఇబ్బందిని కలిగిస్తుంది. కానీ, ఇది సత్యం.

మనకు తెలిసిన మనం వేరే, మనకు తెలియని మనం వేరే ! మన శరీరంలో ఉన్న పరిస్థితులు మనం ఏమిటో చెబుతుంటాయి. మన జీవితంలో ఉన్న పరిస్థితులు మనం ఏమిటో చెబుతుంటాయి.

మీ జీవితంలో మీకు ఏమేం ఉంటాయో వాటన్నింటిని మీరు ఇష్టపడుతున్నారు లేక అనుమతిస్తున్నారు లేక వాటిని నేర్చుకుంటున్నారు అని అర్థం.

ఉదాహరణకు :

మీకు ఆరోగ్యం సరిగా లేదు అని అంటే, మీ లోపల ఏవో సరి కాని గుణాలు ఉన్నాయని అర్థం. మీకు ఐశ్వర్యం లేదు అని అంటే, మీరు లోపల ఐశ్వర్యాన్ని వ్యతిరేకిస్తున్నారు అని అర్థం.

మీకు అవమానాలు జరుగుతున్నాయి అని అంటే, ''మనుషులు నన్ను అర్థం చేసుకోరు, నన్ను అవమానిస్తారు" అని మీ లోపల మీరు అనుకుంటూ ఉన్నారనే అర్థం. మీకు అపజయాలు ఎదురవుతున్నాయి అని అంటే, ఆ యొక్క అపజయాలను మీరే అనుమతిస్తున్నారు అని అర్థం. విజయాలకు మీరు వ్యతిరేకంగా ఉన్నప్పుడే, మీకు అపజయాలు కలుగుతూ ఉంటాయి. మీకు ఇబ్బందులు కలుగుతున్నాయి అని అంటే, ఆ ఇబ్బందులకు మూలం మీ లోపలే ఉంది అని తెలుసుకోవాలి.

అందరూ బోల్తా కొట్టేది ఎక్కడ అంటే, ఇక్కడే ! అవగాహన అస్సలు లేని వారైతే, తమ ఇబ్బందులకు ఇతరులు కారణం అని అనుకుంటారు. కొంచెం అవగాహన ఉన్న వారు కొంత వరకే ఒప్పుకుంటారు. కానీ, మొత్తానికి మొత్తం, మన అన్నింటికీ, **''మన వాస్తవాలకు మనమే సృష్టికర్తలం'' ! ఇదే అసలు సిసలు పరమ సత్యం !**

నిజంగా మన లోపల ఉన్న సరి కాని భావాలు ఎంత ఆశ్చర్యకరంగా ఉంటాయి అని అంటే, మనకు నమ్మబుద్ధి కాదు. కానీ, లోపలకు వెళ్ళి చూస్తే అవి నిజంగానే ఉంటాయి. లోపలకు వెళ్ళి చూడటం అంటే, ధ్యానం చేయడం అని అర్థం. మీరు ధ్యానం చేయడం మొదలు పెట్టగానే మీ లోపలికి మీరు ప్రయాణం చేస్తున్నట్టు. మీరు ఎంత సేపు ధ్యానంలో ఉంటారో అంతగా మీరు, మీ లోపలికి వెళ్తుంటారు.

మీ లోపలికి మీరు వెళ్ళడం అని అంటే, మీ ఎరుకను ప్రసరించడం అని అర్థం. మీ ఎరుక ఎంతెంతగా ప్రసరిస్తుందో, అంతంతగా మీ అంతరంగం స్వచ్ఛం అవుతూ ఉంటుంది. కేవలం ఎరుక లేనందుకే లోపల సమస్యలు ఉండ గలుగుతున్నాయి. ఎరుక ప్రసరించగానే అవి శాశ్వతంగా మాయమైపోతాయి. మీ ఎరుకయే మీ సమస్యలకు పరిష్కారం. ఈ సత్యాన్ని బాగా గుర్తుంచుకోండి.

సాధన అనేది క్రమం తప్పకుండా చేస్తూ ఉన్నప్పుడు, అది ఎంత పెద్ద సమస్య అయినా సరే ఖచ్చితంగా పరిష్కారం అయి తీరుతుంది. సాధనకు లొంగని సమస్య అంటూ లేనే లేదు. సాధన అంటే పరిష్కారాన్ని అనుమతించడమే. సాధన అంటే పరిష్కారమే ! మీ సాధన మీద పూర్తి విశ్వాసం ఉంచండి.

లోపల ఉన్న సరికాని విషయాలు క్లియర్ అవుతూ ఉన్నప్పుడు, మనకు మానసికంగా రక రకాల స్థితులు వస్తాయి. ఒక సారి డల్‌గా, ఒక సారి నీరసంగా, ఒక సారి ఆందోళనగా, ఒక సారి విసుగుగా, ఒక సారి కోపంగా, ఒక సారి నిరాశగా, ఒక సారి అపనమ్మకంగా, ఒక సారి అయోమయంగా, ఒక సారి అసలు నేను చేసే సాధన ఫలితాలను ఇస్తుందా అని సందేహంగా, మరో సారి ఉల్లాసంగా, ఉత్సాహంగా, విశ్వాసంగా ఉంటుంది. ఇలా రక రకాలుగా మన మానసిక స్థితి మారుతూ ఉంటుంది. మన మానసిక స్థితి నెగెటివ్‌గా ఉన్నప్పుడు నేను దైవాన్ని, నేను దైవాన్ని అని అనుకుంటూ ఉండాలి. పాజిటివ్‌గా ఉన్నప్పుడు అదే స్థితిని కంటిన్యూ చేయాలి.

బాగా గుర్తుంచుకోండి, డల్‌గా ఉన్నప్పుడు నెగెటివ్ ఆలోచనలు వస్తాయి. జాగ్రత్తగా ఉండాలి. నెగెటివ్ ఆలోచనలు రాగానే వెంటనే గుర్తించి, పాజిటివ్‌గా ఆలోచించడం మొదలు పెట్టాలి లేదా నేను దైవాన్ని నేను దైవాన్ని అని అనుకోవాలి.

మనకు ఇబ్బందులు ప్రధానంగా రెండు రకాలుగా వస్తాయి. అవి :

1. శరీరంలో రోగాలుగా 2. బయట వ్యక్తుల ద్వారా

1. శరీరంలో రోగాలుగా మనల్ని వేధిస్తున్న సమస్యలు మనకు ఏవో నేర్పించడానికై ఉంటాయి. వీటి నుండి నేను ఏం నేర్చుకోవాలి... అని ప్రశ్నిస్తూ ధ్యానం చేస్తూ ఉంటే అవి క్లియర్ అయిపోతాయి.

2. వ్యక్తుల ద్వారా వస్తున్న సమస్యలు కూడా మనకు అవగాహన కల్పించడానికే వస్తూ ఉంటాయి.

వ్యక్తుల ద్వారా వస్తున్న సమస్యలను క్లియర్ చేసే విధానం :

ఒక వ్యక్తి లేక వ్యక్తుల ద్వారా నీకు ఏ ఇబ్బంది అయితే కలుగుతూ ఉందో, సరిగ్గా అలాంటి ఇబ్బందినే ఈ జన్మలోనో లేక గత జన్మలలోనో, నీవు ఇతరులకు కలుగజేసావు. నీవు ఇతరులకు ఇచ్చిన ఇబ్బందియే ఇప్పుడు నీకు తిరిగి వచ్చింది. నీవు ఈ పరమ సత్యాన్ని ఒప్పుకోవాలి. ఎంత నమ్మబుద్ధి కాకపోయినా ఇదే పరమ సత్యం, నీవు ఒప్పుకునియే తీరాలి లేదా సమస్య క్లియర్ కావడానికి చాలా సమయం తీసుకుంటుంది. మనకు అనిపిస్తుంది... నేను అలాంటి దానినా ?! నేను అలాంటి వాడినా ?! నేను ఎంత మంచి దానిని ?! నేను ఎంత మంచి వాడిని ?! నేను ఇలా చేసి ఉంటానా ?! ఛీ ఛీ నేను చాలా గొప్ప దానిని... నేను చాలా గొప్ప వాడిని... అనిపిస్తుంది. నీవు గతంలో ఇతురులకు కలుగజేసిన ఇబ్బందియే ఇప్పుడు నీకు వచ్చింది అని అంటే నీకు అస్సలు నమ్మబుద్ధి కాదు. కొన్ని విషయాలు నమ్మగలవు కానీ, కొన్ని విషయాలైతే అస్సలు నమ్మబుద్ధి కాదు. సాక్షాత్తు భగవంతుడే దిగి వచ్చినా నమ్మబుద్ధి కాదు. అస్సలు ఒప్పుకోబుద్ధి కాదు.

నీలో ఉన్న నెగెటివ్, నిన్ను సత్యాన్ని ఒప్పుకోనీయకుండా అడ్డం పడుతూ ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించి, నీలో ఉన్న నెగెటివ్ నీ ముందు, ఒక ఈక లాంటిది అని గుర్తు తెచ్చుకుని, నీవు సాధన ఆపకుండా చేస్తే నీలో ఉన్న నెగెటివ్‌లన్నీ పూర్తిగా క్లియర్ అయిపోతాయి. నీ వాస్తవానికి నీవే సృష్టికర్తవు అనే సత్యాన్ని ఎప్పటికీ మరువ కూడదు. ఈ సత్యం గుర్తుంటే, సాధన సంపూర్ణంగా మెరుపు వేగంతో ఫలితాలను ఇస్తుంది.

ఎంతగా ఆలోచించినా అస్సలు ఒప్పుకోబుద్ధి కాదు. ఏ మాత్రము నమ్మబుద్ధి కాదు. కానీ, అసలు సత్యం ఇదే.... "ప్రస్తుతం నీవు అనుభవిస్తున్న పరిస్థితి ద్వారా ఏదో నీవు తప్పని సరిగా నేర్చుకోవాలి మరియు ఇదే పరిస్థితిని నీవు గతంలో ఇతరులకు కలుగజేసావు"....ఇదే అసలు సిసలు సత్యం.

"మనలో ఉన్న గుణాలే ఇతర వ్యక్తులలో ప్రతిబింబిస్తూ ఉంటాయి". మన మంచి గుణాల యొక్క ప్రభావంతో వ్యక్తులు మనతో మంచిగా ప్రవర్తిస్తుంటారు. మన లోని చెడు గుణాల యొక్క ప్రభావంతో వ్యక్తులు మన పట్ల చెడుగా ప్రవర్తిస్తుంటారు. మనలో ఎంత మంచి ఉంటే అంత మంచిగా, మనలో ఎంత చెడు ఉంటే అంత చెడుగా మన పట్ల ప్రవర్తిస్తూ ఉంటారు.

ఇతర వ్యక్తులు మన పట్ల ప్రవర్తించే ప్రవర్తనలు, మనతో అనే మాటలు, మన వెనుక మన గురించి మాట్లాడుకునే మాటలు, మన వెనుక మన పట్ల చేసే ప్రవర్తనలు... అన్నీ కూడా మన గుణాల యొక్క ప్రతిబింబాలే !

ఇది పరమ సత్యం !!

ఎవరైనా నీ పట్ల చెడుగా ప్రవర్తిస్తూ ఉంటే, నీవు గ్రహించాల్సింది ఏమిటంటే - నేను ఇలా ఇతరులతో ప్రవర్తించను... అని ! నీకు ఇతరులు కలిగిస్తున్న ''ఇబ్బంది'' నీలో ఉన్న ''ఇతరులకు ఇబ్బంది కలిగించే గుణాన్ని'' తీసివేస్తుంది. సృష్టి, నీకు ఇబ్బందిని కలిగించడం పట్ల ఉన్న ఏకైక లక్ష్యం ఇదే ! నీకు ఇబ్బందులు కలిగించడం ద్వారా సృష్టి నీకు నేర్పాలనుకుంటున్నది ఇదే ! నీలో ఉన్న ''ఇతరులకు ఇబ్బంది కలిగించే గుణాన్ని'' తీసివేయాలి అని అంటే, నీకు ఇబ్బందిని కలిగిస్తేనే నీకు తెలిసి వస్తుంది. అప్పుడు నీవు ఒక దృఢమైన నిర్ణయాన్ని తీసుకుంటావు... ఇక మీదట నేను ఇలా ఇతరులకు ఇబ్బందిని కలిగించను అని ! అంతే... అప్పుడు నీకున్న ఇబ్బంది క్షణాల్లో మాయం అయిపోతుంది.

ఒక వేళ నీవు - నీకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై ప్రతీకారం తీర్చుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటే... నీ ఇబ్బందులు పెరుగుతూ ఉంటాయి కానీ, తరగవు.

ఇతరులు నీకు కలిగిస్తున్న ఇబ్బందులను విశ్లేషించుకో... వాటి వలన నీవు ఎలా బాధ పడుతున్నావో అవగాహన చేసుకో... ''నేను పడుతున్న ఈ బాధలు, నా వలన ఇతరులు పడకూడదు'' అని గట్టిగా నిర్ణయం తీసుకో... అంతే, నీ బాధలు నిజంగా మాయం అవుతాయి.

సృష్టి నీకు ఇబ్బందులను ఎందుకు కలుగజేస్తుంది అని అంటే - నీవు ఇతరులకు ఇబ్బందులను కలుగజేసే గుణాలను కలిగి ఉన్నావు, కాబట్టి వాటిని వదిలేయి, అవి మంచివి కావు అని చెప్పడమే సృష్టి యొక్క ప్రధాన ఉద్దేశం.

ఈ జన్మలోనో లేక గత జన్మలలోనో నీవు ఇతరులకు కలుగజేసిన ఇబ్బందులను మాత్రమే నీకు, సృష్టి కలుగజేస్తుంది. నీవు చేయని చెడును నీ దగ్గరికి రానివ్వదు. నీవు చేసిన చెడులో చాలా కొద్ది భాగాన్నే నీ వద్దకు తీసుకువస్తుంది. ఆ కొద్ది భాగంతో నీకు బుద్ధి వస్తే సరి... లేదా డోసు కొంచెం పెంచుతుంది. నీలో మార్పు వచ్చే వరకు నిన్ను వదిలి పెట్టదు... సృష్టి ! నిన్ను సరి చేసియే తీరుతుంది.

గతంలో నీవు వేసిన పంటనే ఇప్పుడు నీవు తింటున్నావు అని అర్థం చేసుకో. నీవు ఇతరులకు కలుగజేసిన కష్టాలే ఇప్పుడు నీకు తిరిగి వస్తున్నాయి అని గ్రహించు. అప్పుడే అవి నీలో నుండి మాయమవుతాయి.

నీకు ఇతరుల వలన వస్తున్న ఇబ్బందులను చూసి చాలా ఆశ్చర్యం కలిగే అవకాశం ఉంది. నాలో ఇలాంటి గుణాలు ఉన్నాయా... అని ! ఇక్కడ నీవు గ్రహించాల్సింది ఏమిటంటే నీకు ఇతరులను ఇబ్బందులకు గురిచేసే గుణం లేక పోయినా నీకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. అది ఎలా అంటే - ''నేను మంచి వాడిని కాదు, నా గురించి ఇతరులకు సరైన అభిప్రాయం లేదు, కాబట్టి నాకు ఇతరుల వలన ఇబ్బందులు వస్తాయి'' అనే నమ్మకం నీలో ఉన్నా నీకు ఇతరుల వలన ఇబ్బందులు

వస్తాయి. "లోకులు మంచి వాళ్ళు కాదు, వాళ్ళ వలన నాకు ఎలాగైనా ఇబ్బందులు కలుగుతాయి" అనే అభిప్రాయం ఉన్నా నీకు ఇబ్బందులు కలుగుతూ ఉంటాయి.

ఏం రోజులు ఇవి ? పాడు కాలం, పాడు మనుషులు... వ్యవస్థ కుళ్ళి పోయింది. ఇంకేం మంచి జరుగుతుంది ? అనే అభిప్రాయాలు ఉన్నా నీకు ఇబ్బందులు కలుగుతూనే ఉంటాయి.

ఇక్కడ నీవు గ్రహించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే, లోకం, లోకులు, కాలం అనేవి మంచివి కావు, చెడువి కావు. నీవు ఎలా అనుకుంటే అలా అవి అవుతాయి. యద్భావం తద్భవతి ! లోకాన్ని నీవు మంచిగా భావిస్తే, నీకు లోకం మంచిగా అనుభవంలోకి వస్తుంది. లోకులను నీవు మంచి వాళ్ళుగా భావిస్తే, లోకులు నీకు మంచి వాళ్ళుగా అనుభవంలోకి వస్తారు. కాలాన్ని నీకు మంచిగా భావిస్తే కాలం నీకు కలిసి వస్తూనే ఉంటుంది. కాలాన్ని చెడుదనీ, కాలసర్పం అనీ రక రకాలైన సరి కాని భావాలతో పోలుస్తూ ఉంటారు. ఇది సరి కానే కాదు. కాలం అంతా మంచిదే ! కాలం పట్ల నీ భావం మంచిది కాదు. ఇది గ్రహించాలి. మనం జీవితంలో అనుభవిస్తున్నవి మన నమ్మకాలే !

గుణాలు, నమ్మకాలు, అభిప్రాయాలు మరియు ఆలోచనా విధానం
ఇవన్నీ ఒక్కటే ! నీవు ఎలాంటి గుణాలను కలిగి ఉన్నావో నీకు అలాంటి పరిస్థితులు
ఎదురవుతూ ఉంటాయి.

నీవు కలిగి ఉన్న వాటినే నీవు అనుభవిస్తూ ఉంటావు. నీవు ఏం అనుభవిస్తున్నావో...
సరిగ్గా అలాంటి గుణాలనే నీవు కలిగి ఉన్నావు.

ఇక్కడ ఇంకొక విషయం నీవు గ్రహించాలి. నీ కోరిక లేక లక్ష్యానికి అనుగుణంగా కూడా నీకు ఇబ్బందులు వస్తూ ఉంటాయి. నీవు గతంలో చేసి ఉండకపోవచ్చు, నీలో ఆ గుణం లేక పోవచ్చు, కానీ... నీవు కలిగి ఉన్న కోరిక(లక్ష్యం) ప్రకారం కూడా నీకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. నీవు కలిగి ఉన్న కోరిక, నీకు నెరవేరే ముందు, తనకు వ్యతిరేకంగా ఉన్న వాటిని నీలో నుండి తొలగించి, తనకు పూర్తిగా నిన్ను అనుకూలంగా చేసుకుని, అప్పుడు ఆ కోరిక నీ జీవితంలో సంభవిస్తుంది. ఈ క్రమంలో నీలో ఉన్న

వ్యతిరేకతలను తొలగించే కార్యక్రమం జరుగుతున్నప్పుడు ఇబ్బంది గానే ఉంటుంది కదా ! రాయి ఎన్నో ఉలి+సుత్తి దెబ్బలు(చెక్కుడులు) తింటే కానీ, విగ్రహంగా మారదు. ఒక బండ రాయి ఒక అందమైన శిల్పంగా మారాలి అని అంటే, చెక్కించుకోడానికి సిద్ధ పడాలి మరి !

నీకు ఇబ్బందులు రావడానికి ఇంకొక కారణం కూడా ఉంది. అదేమిటంటే, నీవు ఇతరుల నుండి సానుభూతి మరియు ఓదార్పును ఆశిస్తున్నావంటే నీకు ఇబ్బందులు రావడం ఖాయం. ఎందుకంటే... సానుభూతి మరియు ఓదార్పు ఎప్పుడు అవసరం అవుతుంది ? ఎవరైతే ఇబ్బందుల్లో ఉన్నారో వారికే సానుభూతి మరియు ఓదార్పు అవసరం అవుతుంది. ఆనందంగా ఉన్న వారికి సానుభూతి మరియు ఓదార్పు ఎందుకు ? నీవు గతంలో ఇతరులకు ఇబ్బందిని కలిగించి ఉండకపోవచ్చు, నీలో సరికాని నమ్మకాలు, గుణాలు లేకపోవచ్చు, నీలో ఇబ్బందులకు గురిచేసే కోరికలు లేకపోవచ్చు కానీ, నీవు సానుభూతిని మరియు ఓదార్పును కోరుకుంటే చాలు, నీకు ఇబ్బందులు వచ్చేస్తాయి.

ఈ సానుభూతి మరియు ఓదార్పు కాకుండా ఇబ్బందులకు మరో కారణం కూడా ఉంది. అదేమిటంటే - పొగడ్త ! అవును, పొగడ్త కోసం కూడా ఇబ్బందులను నీకు తెలియకుండా నీవు ఆకర్షిస్తూ ఉంటావు. "నీవు కాబట్టి ఈ పరిస్థితులను ఈదుకొస్తున్నావు, వేరే వాళ్ళ వలన కాదు, నీవు కాబట్టి... నెగ్గుకొస్తున్నావు, నీవు చాలా

గ్రేట్... నీవు ఎదుర్కొన్న పరిస్థితులు సామాన్యమా... ఏమైనా నీవు కాబట్టి ఆ పరిస్థితులకు తట్టుకొని నిలబడ గలిగావు..." లాంటి పొగడ్తలను లోపల నీకు తెలియకుండానే నీవు కోరుకుంటూ ఉంటావు. ఈ పొగడ్తలను ఆశించే గుణం ఇబ్బందులను ఆకర్షిస్తూ ఉంటుంది. నీవు ఆశ్చర్యంతో ఇదేంటబ్బా నాకు ఇబ్బందులు ఎందుకు వస్తున్నాయి, అని అనుకుంటూ వాటిని ఎదుర్కొంటూ ఉంటావు. ఇతరుల నుండి పొగడ్తలు రాగానే నీవు పడుతున్న ఇబ్బందులను మర్చిపోతావు. రిచార్జ్ అవుతావు. మళ్ళీ పొగడ్తలను ఆశిస్తావు. మళ్ళీ ఇబ్బందులను ఆకర్షిస్తావు. ఇది ఇలా జరుగుతూనే ఉంటుంది. నీవు అసలు విషయం గ్రహించేంత వరకు.

ఒక్కో సారి ఫోజులు కొట్టడానికి ప్రయత్నించి కూడా ఇబ్బందులను ఆకర్షిస్తావు. ఒక్కో సారి పొద్దు పోక కూడా ఇబ్బందులను ఆకర్షిస్తావు. కాబట్టి ఎరుకతో అవగాహనతో ఉంటే ఇబ్బందులు రావు. విషయాలను తెలుసుకుని, అర్థం చేసుకుని మసలుకుంటే హాయిగా జీవించవచ్చు.

ఏది ఏమైనా... మన ఇబ్బందులకు మూలాలు మన లోపలే ఉంటాయి. ఇతరులు కేవలం ప్రతిబింబాలు. మన లోపల ఏం ఉంటే దానికి అనుగుణంగా వారు ప్రవర్తిస్తూ ఉంటారు. ఇతరులను నిందించినంత కాలం, నీ ఇబ్బందులు తొలగిపోవు. నా ఇబ్బందులకు నేనే కారణం అని నీవు ఎప్పుడైతే గ్రహిస్తావో, ఆ క్షణమే అవి నీ అదుపులోకి వస్తాయి. నీ గుణాలు నీ బానిసలు, నీ గుణాలకు నీవే అధిపతివి. నీ గుణాలకు నీవే రాజువు. నీ గుణాలకు నీవే యజమానివి. నీ గుణాలకు నీవే సృష్టికర్తవు. నీ గుణాలు నీవు చెప్పినట్టే వింటాయి. ఉండమంటే ఉంటాయి. వెళ్ళమంటే వెళ్ళిపోతాయి. నీ చెడు గుణాలను నీవు గుర్తించి, నేను నా యొక్క ఫలానా చెడు గుణాలను వదిలేసాను, ఇక ఇప్పటి నుండి నాలో కేవలం మంచి గుణాలు మాత్రమే ఉండాలి అని గట్టిగా అనుకో. అంతే, ఆ చెడు గుణాలు వెళ్ళిపోతాయి. మంచి ఆలోచనలను మాత్రమే ఆలోచించు. బాగా ఎరుకతో ఉండాలి. ఏ మాత్రం నెగెటివ్ ఆలోచనలు వచ్చినా వెంటనే వాటిని ఆపేయాలి. నాకు ఇప్పుడు వచ్చిన ఈ నెగెటివ్ ఆలోచనల యొక్క మూలం ఏమిటి అని ప్రశ్నించుకుని ధ్యానంలో కూర్చోవాలి. ఒక వేళ సమయం లేకపోతే నా యొక్క ఈ నెగెటివ్ ఆలోచనలను నేను క్యాన్సల్ చేస్తున్నాను అని కొన్ని సార్లు అనుకో. వెంటనే మంచి ఆలోచనలు చేయాలి. ఆనందకరమైన సన్నివేశాలను గుర్తుచేసుకో. ఎరుకతో ఉండాలి. నీ దైవత్వం పట్ల పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉండాలి. నీ దైవత్వాన్ని పూర్తిగా విశ్వసించు. నీ దైవత్వం నీకు ఎల్లప్పుడూ మంచి మాత్రమే చేస్తుందని తెలుసుకో. నీ దైవత్వం నిన్ను ఎల్లప్పుడూ రక్షిస్తూనే ఉందని తెలుసుకో. నీ దైవత్వానికి ప్రేమను + ధన్యవాదాలను ప్రకటించు. నీ దైవత్వం పట్ల పూర్తి విశ్వాసంతో

ఉండు. నీ దైవత్వం నీకు అండగా ఉండగా నీకేం భయం లేదు. ఈ సర్వ సృష్టిలో నీకు హాని తలపెట్టే ఏ శక్తీ లేదు. నీ దైవత్వం ఎంత గొప్పదో, ఎంత శక్తి వంతమైనదో నీకు ఇప్పుడు అర్థం కాదు. నీ దైవత్వం పట్ల పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉండు. చాలు. అన్ని క్లియర్ అయిపోతాయి.

నీ ప్రతీ సమస్యకు నీవే మూల కారణం అని గ్రహించి, నిన్ను నీవు సరిదిద్దుకో. ఇతరులలో మార్పు కలగాలని నీవు కోరుకుంటున్నావంటే, నీకు అసలు సత్యం అర్థం కాలేదని నీవు తెలుసుకో. నీలో మార్పు రావాలని కోరుకో. నీవు మారు.

నీవు మారితే ఇతరులు మారుతారు.

నీవు మారితే లోకం మారుతుంది.

నీవు మారితే లోకులు మారుతారు.

నీవు మారితే అంతా మారుతుంది.

నీవు మారితే అందరూ మారుతారు.

మార్పు జరగాల్సింది నీలో.

నేను మారాను అని గట్టిగా, పదే పదే అనుకో మారిపోతావు. మారితీరుతావు. అప్పుడు అన్ని పరిస్థితులు నీకు పూర్తి అనుకూలంగా మారిపోతాయి. అప్పుడు అందరూ నీకు పూర్తి అనుకూలంగా మారిపోతారు. ఇదే పరమ సత్యం. ఈ పరమ సత్యాన్ని అర్థం చేసుకుంటే నీవు సమస్త సమస్యల నుండి విముక్తం అయినట్టే !

ఎవరైనా నీ పట్ల మంచిగా ప్రవర్తిస్తూ ఉంటే, నీవు గ్రహించాల్సింది ఏమిటంటే - నేను ఇలాగే ఇతరులతో మంచిగా ప్రవర్తిస్తాను... అని !

నేను ఇతరులతో మంచిగా ప్రవర్తిస్తాను అని నిర్ణయించుకుని, నీవు ఇతరులతో మంచిగా ప్రవర్తిస్తూ ఉంటే, అప్పుడు నీకు మంచి మాత్రమే జరుగుతూ ఉంటుంది. మంచి చేస్తే మంచి మాత్రమే వస్తుంది అని నీవు గ్రహించాలి. గట్టిగా నమ్మాలి. నీ నమ్మకం ప్రకారమే నీకు కేవలం మంచి మాత్రమే జరుగుతూ ఉంటుంది.

మంచిగా ఉండు, మంచిని పొందు.

మంచి చేయి, మంచిని అనుభవించు.

మనం కలిగి ఉన్న భావాలనే మనం అనుభవిస్తాం కాబట్టి, అన్నీ మంచి భావాలనే కలిగి ఉండాలి. సాత్విక గుణాలనే కలిగి ఉండాలి. ప్రేమ, ఎరుక, ఆనందం, ఉల్లాసం, ఉత్సాహం, ఉత్సవం, ఉత్తేజం, శాంతి, ప్రసన్నం, కటాక్షం, కరుణ, సదవగాహన, సదభిప్రాయం, నీతి, నిజాయితి, నిబద్ధత, అర్థం చేసుకునే గుణం, దానగుణం, మైత్రి, శ్రేయస్కరం, శుభం, లాభం, నిర్మాణాత్మకత, శ్రమ, నిస్వార్థం, ఆశావహ దృక్పథం, పట్టుదల, విశ్వాసం, ధైర్యం, ధీమా, ఐశ్వర్యం, కల్యాణం, దివ్యం మొదలైన భావాలను నిత్యం స్మరిస్తూ ఉండాలి. ఇలాంటి భావాలనే కలిగి ఉండాలి.

మనకు కలల రూపంలో కానీ, ధ్యానంలో వచ్చే అనుభవాల ద్వారా కానీ, మనలో ఉన్న అడ్డంకులు, మనకు కనపడతాయి. అవి ఎలాంటి అడ్డంకులు కనబడినా సరే, కంగారు పడకుండా ధైర్యంగా ఉండాలి. అడ్డంకులు ఉన్నది నీలోనే కాబట్టి, వాటిని నీవు తక్షణమే తీసివేసుకోగలుగుతావు, అని గుర్తు చేసుకుని ధీమాగా ఉండాలి. నాలో ఉన్న ఈ అడ్డంకులను నేను రిలీజ్ చేసాను... రిలీజ్ రిలీజ్ రిలీజ్ అని అనుకుంటూ ఉంటే అవి శాశ్వతంగా, సురక్షితంగా మాయమైపోతాయి.

నేను పరిస్థితుల ముందు అశక్తుడను కాను, నేను నా సమస్యలను తక్షణమే క్లియర్ చేసుకోగలుగుతాను అని బలంగా అనుకోవాలి. ఇలా అనుకోగానే మనలో ఉన్న దైవత్వం నుండి అనంతమైన శక్తి సామర్థ్యాలు ఉత్తేజితమై మనకు అందుబాటులోకి వస్తాయి. ఎంత పెద్ద సమస్య అయినా సరే... దాన్ని క్లియర్ చేసుకోగల సర్వ సమర్థతలను, శక్తియుక్తులను మనం రెడిమేడ్‌గా ఇప్పుడు కలిగియే ఉన్నాం. ఈ సత్యాన్ని సదా గుర్తుంచుకోవాలి.

నేను చేయగలను, నేను చేయగలను, నేను చేయగలను అని పదే పదే అనుకుంటూ ఉంటే చేయగలం. నేను సాధించగలను, నేను పొందగలను, నేను విజేతను అని అనుకుంటూ ఉండాలి. నేను అదృష్టవంతుడిని లేక నేను అదృష్టవంతురాలిని అని అనుకుంటూ ఉండాలి. నాకు అన్నీ కలిసి వస్తాయి. అంతా, అందరూ నాకు అనుకూలంగానే ఉన్నారు అని అనుకుంటూ ఉండాలి. బలంగా నమ్మాలి. మన నమ్మకాలే మన వాస్తవాలు అని గుర్తుంచుకోవాలి. మనం వేటిని నమ్మితే వాటినే మనం పరిస్థితులుగా అనుభవిస్తాం.

గుణాలు, నమ్మకాలు, అభిప్రాయాలు, ఆలోచనా విధానం మరియు నమ్మకాల వ్యవస్థ ఇవన్నీ ఒక్కటే !

మనలో మార్పు రావడం అని అంటే, మన గుణాలలో మార్పు రావడమే ! మన గుణాలు మారితే మనం మారినట్టే !

మంచి ఆలోచనలతో మనల్ని మనం చాలా సులువుగా మార్చుకోవచ్చు. మార్పు అనేది చాలా సులభం, సరళం, సురక్షితం మరియు తక్షణం అని తెలుసుకోండి.

మీకు ఏదైనా భయం వేస్తూ ఉంటే, మీలో ఉన్న గుణమేదో నెగెటివిటిని కలిగి ఉన్నది అని అర్థం. దాని ద్వారా మీకు భయం కలుగుతూ ఉంది. అప్పుడు మీరు నేను దైవాన్ని నేను దైవాన్ని నాకే హాని జరగదు, నాకు భయాన్ని కలిగించే గుణాన్ని నేను రిలీజ్ చేసాను. రిలీజ్ రిలీజ్ రిలీజ్ అని అనుకుంటూ ఉంటే అది తక్షణమే రిలీజ్ అయిపోతుంది. అప్పుడు మీరు సురక్షిత భావంతో రిలాక్స్ అవుతారు.

మనలో మార్పు అనేది ఎంతో సులువు అని మీరు తెలుసుకోవాలి. చెడు గుణాలు ఎప్పుడు మారుతాయో అని కంగారు పడకండి. ఎంత బలమైన గుణాలైనా, ఉక్కు లాంటి గుణాలైనా మారుతాయి. రిలీజ్ చేస్తే వెళ్ళిపోతాయి. అవి మనల్ని పట్టుకుని ఉండవు. మనమే వాటిని పట్టుకుని ఉంటామని గ్రహించాలి. ఎవరైతే పట్టుకున్నారో వారు వదిలేస్తే అవి వెళ్ళిపోతాయి కదా !

మీరు ఏ పని చేస్తున్నా సరే, ఎరుకతో, విశ్వాసంతో ఉండండి. మీకు ఎప్పుడు భయం కలిగితే అప్పుడు, వెంటనే ఈ భయం యొక్క అసలు సిసలు మూలాన్ని నేను రిలీజ్ చేసాను. రిలీజ్ రిలీజ్ అని

అనుకోగానే అది రిలీజ్ అయిపోతుంది. మీరు ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఇలా చేయవచ్చు. ప్రత్యేకంగా ధ్యానంలోనే కూర్చోవాల్సిన అవసరం లేదు. ధ్యానంలో కూర్చునే వీలుంటే కూర్చోండి. వీలు లేకపోతే పైన నేను చెప్పినట్టు చేయండి. క్లియర్ అయిపోతుంది.

మన పట్ల సృష్టి ఎంతో కరుణా పూరితంగా ఉంటుంది. మనం చేసిన చెడులో కొంచెమే, మనల్ని సరిచేసేందుకు ఎంత తక్కువ వీలైతే అంత తక్కువ చెడును మాత్రమే మనకు కలుగజేసి మనలో పరివర్తన తీసుకువస్తుంది. మనం చేసిన చెడులో అత్యంత తక్కువ శాతం మాత్రమే మనం రుచి చూస్తాం. దానికే అల్లాడి పోతాం.

ఎవరి స్వేచ్ఛను హరించకండి. మీరు పెద్దవాళ్ళు అయితే, మీకు అధికారం ఉంటే చాలా జాగ్రత్తగా ఉండండి. ఎందుకంటే, పెద్దరికం ఉన్నప్పుడు, అధికారం ఉన్నప్పుడు మీతో తప్పులు జరిగే అవకాశాలు చాలా ఉంటాయి. మీ కింద ఉన్నవాళ్ళ స్వేచ్ఛను ఏ విధంగానూ ఆటంక పరచకండి. అవసరమైతే సరి అయిన సూచనలను మాత్రమే ఇవ్వండి. అంతే కానీ, మీ అభిప్రాయాలకు వాళ్ళ జీవితాలను బలి చేయకండి. వారి చదువు, ప్రేమ, పెళ్ళి, వృత్తి, ఉద్యోగం, వ్యాపారం మొదలైన విషయాలలో అవసరమైనంత మేరకే జోక్యం చేసుకోండి. మీ ఐడియాలతో వాళ్ళ జీవితాలను, మీరు జీవించవద్దు.

మీరు మీ పెద్దరికంతో, అధికారంతో మీ కింద ఉన్నవాళ్ళ జీవితాలను, శాసిస్తే, తర్వాత వృద్ధాప్యంలో లేక వచ్చే జన్మలో మీరు మీ జీవితాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. జాగ్రత్త. ఈ భూమి పైకి ఎవరి జీవితాన్ని వారు జీవించడానికి వస్తారు. కానీ, కన్నాము కదా అని, తల్లిదండ్రులు లేక పెద్దవారు పిల్లల జీవితాలను తమ గౌరవ మర్యాదల కోసం బలి చేసేస్తారు. ఇది చాలా దారుణం. మీరు మీ పిల్లల జీవితాలతో ఆడుకోవద్దు. మీ పిల్లలు మీ ద్వారా వచ్చారే కాని, మీ సొత్తు కాదు. మీ ఆస్తి కాదు. వారు స్వతంత్ర ఆత్మలు. వారి జీవితం పట్ల వారి ఆశయాలు వారికుంటాయి. అవి ఎంత వెరైటీగా ఉన్నా సరే, మీకు ఇబ్బందికరంగా ఉన్నా సరే, జీవించేది వారు కదా మీరు వారికి స్వేచ్ఛను ఇచ్చియే తీరాలి. లేదా మీరు స్వేచ్ఛను కోల్పోతారు.

పెద్దరికంతో మరియు అధికారంతో ఉండడం ఎంత ప్రమాదకరమో మీకు తెలిస్తే మీరు చాలా జాగ్రత్తగా ఉంటారు.

ఇతరుల జీవితాలను శాసిస్తే మీ జీవితం శాసించబడుతుంది, గుర్తుంచుకోండి. లోకం ఏమనుకుంటుంది, సమాజంలో నేను తల ఎత్తుకుని తిరగలేను, మీ కోసం ఇంత చేస్తే మీరు మాకు ఇచ్చేది ఇదా... అని పిల్లలను వేధించుకు తింటారు. మీరు పిల్లలకు చేసింది అంతా వారి జీవితం కబ్జా చేయడానికేనా ?! మీకు అది చేసాం, మీకు ఇది చేసాం అని రాచి రంపాన పెట్టడానికేనా ? మీరు వారిని కన్నది, పెంచి పెద్ద చేసింది. మీ పరువు పోవడానికి మీరు ఏమైనా చక్రవర్తులా... లేక

సార్వభౌములా ? మీ పిల్లల జీవితం+ఆనందం ముందు మీ పరువు మర్యాదలు లెక్కలోకి రావు. చరిత్రలో చక్రవర్తుల పిల్లలే తల్లిదండ్రులను కాదని వారి జీవితాలను వారు జీవించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. మీ అహం కోసం, మీ పిల్లల జీవితాలను బలి చేయకండి. మీ పిల్లలకు ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉంది. వారికి స్వతంత్రమైన జీవితం ఉంది. అది వారి జీవితం. వారి జీవితం వారి ఇష్ట ప్రకారంగానే కొనసాగాలి. వారి జీవితాన్ని మీరు జీవించవద్దు. వారు తీసుకున్న నిర్ణయాన్ని మీరు అనుమతించాల్సిందే ! ఇలా అయితే ఎలా ? అని కంగారు పడకండి. ఆధ్యాత్మిక శాస్త్ర ప్రకారం ఎవరి జీవితాన్ని వారే జీవించాలి అనేది ప్రధాన నియమం. అప్పుడే ఆ ఆత్మ వికసిస్తుంది. మీకు అనిపిస్తుంది, పిల్లలకు ఏం తెలుసు అని. కాదు, పిల్లలకు చాలా తెలుసు. శరీరం చిన్నదే కాని, లోపల ఉన్న ఆత్మ పెద్దది. ఈ జన్మలో ఏదో సాధించాలి అని జన్మించింది. ఆ ఆత్మ యొక్క పరిణామ క్రమానికి అడ్డుపడకూడదు. మీ పిల్లలు, మీ పిల్లలు కాదు అనే సత్యాన్ని గ్రహించండి. వారు సర్వ స్వతంత్ర ఆత్మలు. ఆత్మ ప్రణాళికకు అడ్డం పడితే, మీ అభివృద్ధి ఆగిపోతుంది. అప్పుడు కానీ, తెలిసి రాదు.

ఆధ్యాత్మిక శాస్త్ర ప్రకారం - మీకు జన్మించిన సంతానం పైన మీకు ఎలాంటి హక్కు ఉండదు. కేవలం మీరు వారి శరీరాలకు మాత్రమే జన్మనిచ్చారు. కానీ, వారి ఆత్మ సర్వతంత్ర స్వతంత్రమైనది. వారి జీవితాలను శాసించే అధికారం మీకు లేదు. మీకు సంతానంగా జన్మించడం ద్వారా, మీరు తల్లిదండ్రులుగా పరిణతిని పొందే అవకాశాన్ని వారే మీకు ఇచ్చారు. వారి పైన మీరేమి మెహర్బాని చేయలేదు. మీరు కాకపోతే వారికి కోట్ల కొద్ది తల్లిదండ్రులు ఉంటారు రెడీగా !

దయచేసి బాగా గుర్తుంచుకోండి, మీరేం చేస్తారో అదే మీకు వేయిరెట్లుగా తిరిగి వస్తుంది. మీకు పెద్దరికం ఉంది కదా అని, అధికారం ఉంది కదా అని పిల్లల జీవితాలను మీకు ఇష్టం వచ్చినట్టుగా జీవించాలని కట్టడి చేస్తే... మీరు మీ జీవితాన్ని కోల్పోతారు. దయచేసి గ్రహించండి, సమాజం కోసం మీ పిల్లల జీవితాలను బలి చేయకండి. సమాజంలోని వారు ఎవరూ ఏమీ అనుకోరు. మీరే అనవసరంగా, మీ అహంకారంతో బాధ పడుతూ ఉంటారు. ఓపెన్ మైండ్‌తో ఆలోచించండి. ఎవరి జీవితం వారిదే. ఎవరి స్వేచ్ఛ వారిదే. సమాజంలోని కట్టుబాట్లు మరియు నియమాలు జీవితానికి ఆనందాన్ని కలిగించాలి కానీ, జీవితాన్ని బంధించకూడదు. మన కోసం నియమాలు ఉన్నాయి కానీ, నియమాల కోసం మనం కాదు. ఈ సత్యాన్ని గ్రహించండి.

ప్రస్తుతం ఈ భూమి పైన జరుగుతున్న సరి కాని పనులలో తల్లిదండ్రుల పెత్తనం అనేది ప్రధానమైనది. జరుగుతున్న పెద్ద పొరపాటు ఏమిటంటే, తల్లిదండ్రులు తమ జీవితాలను, తమ పిల్లల జీవితాల ద్వారా జీవించే ప్రయత్నం చేస్తుంటారు. ఇది చాలా దారుణం. వారి జీవితాలలో వారు సాధించలేనిది, వారు పొందనిది తమ పిల్లల జీవితాల ద్వారా తీర్చుకుందామని ప్రయత్నం చేస్తుంటారు. ఇది ఘోరం. తను డాక్టర్ కాలేక పోయాడు, తనకు డాక్టర్ కావాలనే తీవ్రమైన తపన

ఉంది, తన కోరికను తన సంతానం ద్వారా తీర్చుకునే ప్రయత్నంలో భాగంగా, చిన్నప్పటి నుండే నీవు డాక్టర్ కావాలి, మా పేరు నిలబెట్టాలి, అంటూ వారికి బాగా నూరిపోస్తారు. నిర్బంధిస్తారు. పిల్లలు నిస్సహాయులు. ఏమీ చేయలేక తల్లిదండ్రులు చెప్పినట్టు చేస్తారు. కానీ, తమ అంతరంలో జన్మ పట్ల తీవ్రమైన అసంతృప్తితో ఉంటారు. వారి జన్మను వారు కోల్పోతారు. తమ తీరని కోరికలను తమ పిల్లల ద్వారా తీర్చుకోవాలని చూడటం, చాలా దారుణం. ఇది ఎంత మాత్రమూ సరికాదు. పిల్లలను కనగానే సరిపోదు. వారికి నిజమైన పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలి. ప్రతీ ఆత్మకు ఒక విధమైన జన్మ ప్రణాళిక ఉంటుంది. ఆ ప్రణాళిక విజయవంతం కాకపోతే ఆ ఆత్మ మళ్ళీ జన్మించాల్సి వస్తుంది. ఇలా ఆత్మ పరిణామ క్రమాన్ని అడ్డుకునే వారి వలన మొత్తం లోకం యొక్క పరిణామ క్రమమే దెబ్బ తింటుంది. కాబట్టి అవగాహనతో వ్యవహరించండి. మీ పిల్లల జీవితాలను, వారినే జీవించనివ్వండి. వారి జీవితాలకు, వారి నిర్ణయాలకు విలువనివ్వండి. అవి ఎలాంటివైనా సరే(హానికరమైనవి, ప్రమాదకరమైనవి తప్ప) !

తల్లిదండ్రులంటే నిజమైన అర్థం ఏమిటంటే, తమ జన్మ ప్రణాళికను నెరవేర్చుకుందామని జన్మించిన ఆత్మకు అన్ని విధాల సహకరించటం, పెంచడం మరియు పోషించడం. తమకు జన్మించిన ఆత్మకు, తన యొక్క జన్మ ప్రణాళికను నెరవేర్చుకోడానికి అవసరమైన సహాయ సహకార సమన్వయాలను, అండ దండలను, రక్షణను మొదలైన వాటిని అందించే వారే నిజమైన మరియు సంపూర్ణమైన తల్లిదండ్రులు. అంతే కానీ, కేవలం కనగానే తల్లిదండ్రులు అయిపోరు.

తల్లిదండ్రులుగా మారాలి అని నిర్ణయించుకున్న స్త్రీ పురుషులు గుర్తుంచుకోవాల్సిన అత్యంత ముఖ్య అంశం ఏమిటంటే - తాము జన్మనివ్వబోయే సంతానానికి పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇస్తాము, మాకు జన్మించే ఆత్మ యొక్క జన్మ ప్రణాళిక నెరవేర్చడానికి మేము పూర్తిగా సహకరిస్తాము అని మీరు సృష్టికి వాగ్దానం చేసినప్పుడే మీకు సంతానం అనుగ్రహించ బడుతుంది. మీరు ఈ వాగ్దానం మీకు తెలియకుండా అంటే, మీ బాహ్య స్మృతికి తెలియకుండా మీ అంతరంలో చేస్తారు లేదా మీరు జన్మ తీసుకోక ముందే, మీ సంతానం విషయంలో వాగ్దానం చేసి మరీ జన్మిస్తారు. ఇలా సృష్టికి చేసిన వాగ్దానాన్ని మీరు భంగపరిస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ఒక సారి ఆలోచించండి...!

గుర్తుంచుకోండి, ఎవరి జీవితం వారిదే ! మీ సంతానం ఏదో చదువుతానంటారు, మీకర్థం కానిదేదో చేస్తానంటారు చెయ్యనివ్వండి. సమాజానికి ప్రమాదకరం కాని దానిని దేనినైనా అనుమతించాలి. మీ సంతానం ఎవరినో ప్రేమిస్తారు, ఉదాహరణకు : మీ అబ్బాయి తన కంటే వయసులో పెద్దామెను ప్రేమిస్తాడు లేదా విధవరాలిని ప్రేమిస్తాడు లేదా పిల్లలున్న విధవరాలిని ప్రేమిస్తాడు లేదా వేరే మతం అమ్మాయిని ప్రేమిస్తాడు లేదా వేరే కులం అమ్మాయిని ప్రేమిస్తాడు లేదా విదేశీయురాలిని ప్రేమిస్తాడు లేదా తన కంటే వయసులో చాలా చిన్న అమ్మాయిని ప్రేమిస్తాడు.... ఆనందంగా అనుమతించండి. ఇందులో ఏ నిర్ణయమైనా ఆత్మ యొక్క ప్రయోగమే ! ఆ యొక్క ఆత్మ ఆ విధంగా జీవించి అనుభవ విజ్ఞానాన్ని పొందాలనుకుంటుంది. దీని వలన సమాజానికి ఏ ప్రమాదమూ లేదు. ఇది సువిశాల దృక్పథంతో ఆలోచించి అవగాహన చేసుకోవాల్సిన విషయం. ఇందులో పరువు మర్యాదల ప్రసక్తే లేదు. ఈడు జోడు, కులం, గోత్రం మొదలైనవన్నీ చూసుకుని ఒక జన్మలో ప్రేమిస్తారు, పెళ్ళి చేసుకుంటారు. ఆ తర్వాత మరో విధంగా చూసుకుని ప్రేమించి పెళ్ళి చేసుకుంటారు. ఒక్కో జన్మలో ఒక్కో విధంగా ఉంటుంది. అర్థం చేసుకోండి లేదా చేయించ బడుతుంది.

మీ అమ్మాయి ఎవరినో ప్రేమిస్తుంది. వేరే కులం, వేరే మతం, వేరే దేశం, తన కంటే చిన్న వాడిని ప్రేమించ వచ్చు లేక తన వయసుకు రెట్టింపు ఉన్న వాడిని ప్రేమించ వచ్చు లేక ఆల్‌రెడి పెళ్ళి అయిన వాడిని ప్రేమించవచ్చు లేక పెళ్ళి అయి పిల్లలున్న వాడిని ప్రేమించవచ్చు లేక ఈడు జోడు ఉన్నవాడిని ప్రేమించవచ్చు లేక ఇంకే రకమైన వాడినైనా ప్రేమించవచ్చు.... ఆనందంగా అనుమతించండి. ఇక్కడ ఈడు జోడు అనేవి ప్రధానం కాదు. ప్రేమ ఉందా లేదా అన్నదే ప్రధానం. ప్రేమ ఉంటే ఈడు జోడు వాటంతట అవే సెట్ అవుతాయి. గ్రహించండి. ఇది ఆ ఆత్మ యొక్క జన్మ ప్రణాళికగా గుర్తించి, అర్థం చేసుకుని ఆ ఆత్మ యొక్క పరిణామ క్రమానికి మీ వంతు తోడ్పాటును అందించడమే మీకు పరువు + మర్యాద మరియు మీ యొక్క తప్పని సరి బాధ్యత !

గుర్తుంచుకోండి, మీరు ఆ ఆత్మకు, ఒక శరీరాన్ని మాత్రమే ఇచ్చారు. ఆ ఆత్మ ఇంతకు ముందు ఎన్నెన్నో జన్మలను ఎత్తింది. మరింత పరిణతి చెందడానికి మళ్ళీ జన్మను తీసుకుంది. దీని వలన సమాజానికి ఏ ప్రమాదం లేదు. ఇది ఒక ఆత్మ యొక్క ప్రయోగం. ఒక విభిన్న కోణంలో నుండి జీవితాన్ని అనుభవించి తన అనుభవ విజ్ఞానాన్ని పెంచుకోడానికి

ఒక స్వతంత్ర ఆత్మ తీసుకున్న నిర్ణయం. దీనికి వ్యతిరేకించడానికి ఎవరికీ హక్కు లేదు. సాక్షాత్తు సృష్టియే కల్పించిన విధి విధానం ఇది ! మౌనంగా సహకరించాల్సిందే ! సృష్టిని ధిక్కరించ గలమా ?!?!

ఆధ్యాత్మిక కోణంలో నుండి నేను చెప్పాను. మీకు నచ్చక పోతే ఈ విషయాలను వదిలేసి మీకు ఇష్టం వచ్చినట్టుగా చేసే హక్కు కూడా మీకుంది. ఎవరి ఆత్మ నిర్ణయం ప్రకారం వారికి ఎలా జరిగేది ఉంటే అలా జరుగుతుంది. మరీ ఇంత ఆధ్యాత్మికంగా ఉండాలంటే కష్టమండీ అని మీరు అనవచ్చు. అది నిజమే, నేను చెప్పాల్సింది నేను చెప్పాను. తప్పని సరిగా మీరు పాటించ వలసిన రూల్ ఏమీలేదు.

2. అకర్మ శాకాహారం ఎందుకు తీసుకోవాలంటే...

ముందుగా... సాక్షి దిన పత్రికకు హృదయ పూర్వక ప్రేమ ధన్యవాదాలు

సాక్షి దిన పత్రిక, తేది: జూన్ 5 2011, ఆదివారం ఫన్ డే బుక్, 14వ పేజిలో ప్రచురితమైన లోక కల్యాణ కారకమైన సత్యాలు :

1. శాకాహారంలో కొవ్వు తక్కువగా ఉంటుంది. కూరగాయల్లో, ధాన్యాల్లో లభ్యమయ్యే కొవ్వు శరీరానికి అవసరమైన స్థాయిలోనే ఉంటుంది. శాకాహారులకు మాంసాహారులకంటే గుండె జబ్బులు 24 శాతం తక్కువ. మధుమేహం ఉన్నవాళ్ళు మాంసాహారం తింటే గుండెకు 50 శాతం రిస్కు పెరుగుతుందని హార్వర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధించి చెప్పింది.

2. శాకాహారంతో క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది. వండిన మాంసాహారంలో హెటిరో సైక్లిక్ అమైన్స్, పోలీసైక్లిక్ అరోమాటిక్ హైడ్రోకార్బన్స్ ఉంటాయి. ఇవి క్యాన్సర్ రిస్కును పెంచుతాయి. మాంసాహారంలోని కొవ్వు పదార్థాల వల్ల హార్మోన్ల ఉత్పత్తి బాగా పెరుగుతుంది. అది హార్మోన్ సంబంధిత (బ్రెస్ట్, ప్రొస్టేట్) క్యాన్సర్లకు దారి తీస్తుంది. ఫైబర్ లేక పోవడం మాంసాహారంలో పెద్ద మైనస్. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చాక శాకాహారానికి మారడం వల్ల తనకు జరిగిన మేలు గురించి రూత్ హైడ్రిచ్ 'రేస్ ఆఫ్ లైఫ్' అనే పుస్తకంలో రాశారు.

3. మాంసాహారుల కంటే శాకాహారులు స్లిమ్‌గా ఉంటారట ! వీరిలో స్థూలకాయం 0-6 శాతానికి మించదు. ఒబెసిటీని తగ్గించుకోవడానికి రెండే మార్గాలున్నాయి. అందులో ఒకటి శాకాహారం.

4. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధనలో శాకాహారంతో ముసలితనం ఆలస్యమవుతుందని వెల్లడైంది. అందులోని పీచు పదార్థాలు జీర్ణక్రియ బాగా జరిగేలా చేయడం వల్ల శరీరంలో టాక్సిన్లు త్వరగా బయటకు పోతాయి. మొక్కల ద్వారా పెరిగే ఆహారంలో ఫైటో న్యూట్రియంట్లు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ రోగ నిరోధక శక్తిని బాగా పెంచుతాయి. దాంతో వయసు ప్రభావం త్వరగా కనిపించదు.

5. జంతువుల్లో ఉండే కొన్ని హానికర పదార్థాలు మనలోని మేలుచేసే బ్యాక్టీరియాను కూడా చంపుతాయి.

6. ఐక్యరాజ్య సమితి 2006 నివేదిక ప్రకారం మాంసాహార ఉత్పత్తి వల్ల ఏర్పడే కాలుష్యం ప్రపంచ వాహన కాలుష్యంతో సమానం. పదిమంది ఒక్క రోజు తినే మాంసాహారం ఉత్పత్తి చేసే భూమిలో అంతే సమయంలో ఆ పదిమందికీ పదిహేను రోజుల ఆహారం ఉత్పత్తి చేయొచ్చు. అంటే శాకాహారం మనకే కాదు, ప్రకృతికీ మేలన్నమాట !

7. మనిషి శరీర నిర్మాణం శాకాహారం తీసుకోవడానికి మాత్రమే అనువైనది. సమతలంగా ఉండే మనిషి పళ్ళు మాంసం నమలడం కంటే ధాన్యం, కూరగాయలు నమలడానికే ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. మనిషి చేతులు, మొక్కలు, పళ్ళ సేకరణకు మాత్రమే అనువుగా సృష్టించబడ్డాయి. అంటే ఆయుధం లేకుండా మనం మాంసం సేకరించలేం. సృష్టిలో మాంసాహారులైన పులి, సింహం వంటి వాటికి మాత్రమే వాటి ముందరి కాళ్ళు అలా సృష్టించబడ్డాయి. మనిషి లాలాజలంలో స్రవించే అల్ఫా అమిలేజ్ కార్బోహైడ్రేట్లనుచక్కగా జీర్ణం చేసుకోవడానికి ఉపయోగ పడుతుంది. ఇది మాంసాహార జీవుల్లో ఉండదు.

8. ప్రపంచంలో ఆహార కొరత కారణంగా రోజుకు 40 వేల మంది చనిపోతున్నారు. దీనికి ప్రధాన కారణం మాంసాహార ఉత్పత్తి. ప్రతి ఒక్కరూ శాకాహారం తీసుకుంటే ప్రపంచ జనాభాకు సరిపోయేటంత ఆహార ధాన్యాన్ని సులువుగా ఉత్పత్తి చేయవచ్చు.

3. మీ విస్మృతియే మీ దైవత్వానికి సాక్ష్యం

ఈ సృష్టిలో రెండే రెండు విషయాలుంటాయి. 1. స్మృతి(దైవత్వం) 2. విస్మృతి(నేను దైవం కాదు అనే భావన).

దైవం, పరిశోధన కోసం, తనకు తానుగా విస్మృతిలోకి వెళ్తుంది. తిరిగి స్మృతిలోకి రాగలిగే శక్తి సామర్థ్యాలు ఉన్నప్పుడే విస్మృతి అంగీకరించ బడుతుంది. మీరు విస్మృతిలో ఉన్నారు అని అంటే, మీ విస్మృతియే తిరిగి మీరు స్మృతిలోకి రాగలిగే మీ యొక్క శక్యతను సూచిస్తుంది. మీ మేలుకొలుపుకు సాక్ష్యం మీ విస్మృతియే ! విస్మృతియే మీ శక్తి సామర్థ్యాలకు ఋజువు.

బాగా గుర్తుంచుకోండి, తెలుసుకోండి, మీరు విస్మృతిలో ఉన్నారు అని అంటే, మీరు స్మృతిలోకి రాగలుగుతారు అనే అర్థం. మీరు స్మృతిలో ఉండి విస్మృతిని అంగీకరించారు. కావాలనుకున్నప్పుడు విస్మృతిని వదిలించుకోగల శక్తి సామర్థ్యాలు ఉన్నప్పుడే, విస్మృతి అంగీకరించ బడుతుంది. మీరు ఏ పరిశోధన కోసం అయితే విస్మృతిని అంగీకరించారో ఆ పరిశోధన పూర్తి కాగానే ఆటొమెటిక్‌గా, సురక్షితంగా మీరు మేల్కొంటారు. మీరు గుర్తించాల్సింది ఏమిటంటే, ఏ పరిశోధనను మీరు పెట్టుకున్నారు, ఎంత కాలం విస్మృతిలో ఉండాలని నిర్ణయించుకున్నారు ? అనే పశ్నకు సమాధానాన్ని మీ అంతరంలో నుండి రాబట్టాలి. అప్పుడు మీరు త్వరగా ఆ పని పూర్తి చేసేస్తే, ఆ మరుక్షణమే మీరు దైవంలో దైవంలా మేల్కొంటారు.

బాగా గుర్తుంచుకోండి, మీ విస్మృతియే మీ యొక్క మేలుకొలుపుశక్తికి సజీవ సాక్ష్యం. మీ విస్మృతియే మీ యొక్క ''స్మృతిశక్తిసామర్థ్యాలకు'' ప్రతీక ! ఋజువు !

❖ ❖ ❖

మీరు ఎప్పుడు కూడా ఒంటరి వారు కారు. మీ వెంట కోట్లాది మంది మాస్టర్స్ ఉంటారు. ఇంకా చెప్పాలంటే, యావత్ సృష్టియే మీకు అండగా ఉంది, ఈ సత్యాన్ని సదా స్మరణలో ఉంచుకోవాలి. మీలో ఉన్న మూల చైతన్యం మిమ్మల్ని సదా కాపాడుతూనే ఉంటుంది. మిమ్మల్ని అనుక్షణం కంటికి రెప్పలా రక్షిస్తూనే ఉంటుంది. మీరు ఈ సత్యాలను ఒప్పుకోవాలి. ఈ సత్యాలను సదా స్మరిస్తూనే ఉండాలి.

4. పూర్తి విశ్వాసంతో & మహా ఎరుకతో ఉండాలి

మీరు ధ్యానం చేస్తూ ఉన్నప్పుడు కానీ లేక మీరు నిద్ర పోతున్నప్పుడు కానీ మీకు కొన్ని అనుభవాలు వస్తాయి. మంచి వాటిని అలా ఉంచండి. ఇప్పుడు మనం కొన్ని ప్రత్యేకమైన అనుభవాల గురించి తెలుసుకుందాం. కొన్ని అనుభవాలలో ఇలా జరుగుతుంది :

ఎందరో నిన్ను తిట్టారు, శపించారు అవన్నీ క్యాన్సల్ చేయాలా ? లేక నీకు అవి జరిగేలా చేయాలా ? అని వినపడుతుంది.

నీవు ఎంతో మంది జీవితాలను పాడుచేసావు, ఇప్పుడు నీ జీవితం ప్రమాదంలో ఉంది, ప్రమాదాన్ని అలాగే ఉంచాలా లేక తీసేయాలా ?

చాలా మంది మీ పైన దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు కనపడుతుంది.

మీరు చాలా పెద్ద ప్రమాదంలో ఉన్నట్టుగా కనపడుతుంది.

మీకు చాలా పెద్ద హాని జరగబోతున్నట్టుగా కనపడుతుంది.

మీరు ప్రమాదం అంచులలో వేలాడుతున్నట్టుగా కనపడుతుంది.

ఇలా రకరకాలుగా కనపడవచ్చు, వినపడవచ్చు. పైన చెప్పినవి జరగవచ్చు లేక జరగకపోవచ్చు. ఒక వేళ జరిగితే ఏం చేయాలో.. ముందు జాగ్రత్తతో చెబుతున్నాను.

ఇలాంటివి జరిగినప్పుడు ఏం చేయాలి అని అంటే... ముందు ధైర్యం తెచ్చుకోండి. ధైర్యంగా ఉండండి. ఆ తర్వాత....

బాగా ఎరుకతో ఉండండి. వెంటనే స్పందించండి. వద్దు నాకే హాని జరగవద్దు, నాకు ఏ ప్రమాదం జరగకూడదు, నాకు ఏ నష్టం రాకూడదు. నేను ఎలాంటి కష్టాన్ని అనుమతించను. నేను ఏ ప్రమాదాన్ని అనుమతించను. ఏ హానిని అనుమతించను. లేదు, లేదు, నాకొద్దు, నేను ఎలాంటి నష్టాన్ని అనుమతించను. నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని, అని పదే పదే అనుకోండి. అంతే అది తక్షణమే, పూర్తిగా, శాశ్వతంగా, సురక్షితంగా తొలగిపోతుంది. ఇది పరమ సత్యం.

ఒక వేళ, ఆ అనుభవం వచ్చినప్పుడు మీరు వెంటనే స్పందించలేకపోతే, ఆ తర్వాత జరిగినదంతా గుర్తుకు వస్తే, అప్పుడు కూడా మీరు భయపడాల్సిన పనేమీ లేదు. కంగారు పడకండి. ఏమీ కాదు. మీ దైవత్వం ఎల్లప్పుడూ మీకు అండగానే ఉంటుంది. మీరు సంపూర్ణ సమగ్ర శాశ్వత సురక్షా వలయంలోనే ఎల్లప్పుడూ ఉంటారు. మీకు ఏమీ కాదు. మీరు అనుభవంలో ప్రమాదాన్ని అనుమతించినట్టు వచ్చినా ఏమీ కాదు భయపడకండి. మీ దైవత్వం మీకు రక్షగా ఉంటుంది. ఎందరో మాస్టర్స్ మీకు రక్షణగా ఉంటారు. ఏమీ కాదు. ముందు మీరు ప్రశాంతంగా కూర్చుని. ఒక సారి మీకు వచ్చిన అనుభవాన్ని ప్రశాంతంగా గుర్తు చేసుకుని, ఇలా జరగడం నేను అనుమతించను, నేను అనుమతించను, నేను అనుమతించను, నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని అని అనుకుంటూ దైవత్వ సాధన చేస్తే అది పూర్తిగా శాశ్వతంగా సురక్షితంగా క్లియర్ అయిపోతుంది. ఇది సత్యం. ఇది నిజం. ఇది వాస్తవం.

మనకు జరుగబోయే ప్రమాదాలను తీసివేయడానికే సృష్టి మనకు చూపెడుతుంది. ఒక అడ్డంకి మనకు కనపడిందీ అని అంటే అది పోయే సమయం వస్తేనే కనపడుతుంది.

ఒక్కో సారి ఇలా కూడా జరుగుతుంది : ఏవైనా వికృత ఆకారాల లాంటివి మీలో నుండి వెళ్ళిపోయేటప్పుడు మిమ్మల్ని బెదిరిస్తాయి. అవి క్లియర్ అయిపోయి వెళ్ళిపోయే ముందు, ఒక్కోసారి ఊరికే అలా బెదిరిస్తాయి. ఉదాహరణకు - నీవు నన్ను వదిలించుకోలేవు, నీవు నన్ను ఏమీ చేయలేవు, నీవు ఎన్నటికీ బాగుపడవు, నీవు ఎవరి కోసం ఇదంతా చేస్తున్నావో వారు నిన్ను మోసం చేస్తారు, నీ ధ్యానం నన్ను ఏమీ చేయలేదు, ఏ శక్తీ నన్ను ఏమీ చేయలేదు... అని ఏవేవో వాగుతాయి. ఇవన్నీ ఉట్టి మాటలే అని గుర్తుంచుకోవాలి. అవి చెడు శక్తులు, వాటి తత్వమే అంత అని గుర్తుంచుకోవాలి. అవి వెళ్ళిపోయే ముందు ఏం చేయాలో తెలియక ఊరికే అలా బెదిరిస్తాయి. ఎలాగూ తాము వెళ్తున్నాము లేక చనిపోతున్నాము వీరిని ఏమీ చేయలేము, కాబట్టి మేము చచ్చే ముందు కనీసం వీరిని భయపెడదాము అని అలా బెదిరిస్తాయి. ఆ చెడు శక్తులు ఎన్ని రకాలుగా బెదిరించినా మీరు చాలా తేలికగా తీసుకోండి. పూర్తి విశ్వాసంతో ఉండాలి. ధైర్యంగా ధీమాగా ఉండాలి.

నేను ఎలాంటి కష్టనష్టాలను అనుమతించను, నేను ఎలాంటి ఇబ్బందులను అనుమతించను, నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని అని అనుకుంటూ ఉండండి. చాలు, అన్నీ ఆటొమెటిక్‌గా, పూర్తిగా, నిజంగా, సురక్షితంగా క్లియర్ అయిపోతాయి.

అసలు ఏ చెడు అయినా జరగాలని రూలేం లేదు అని తెలుసుకోండి.

ఎలాంటి కష్టనష్టాలను, ఎలాంటి ఇబ్బందులను, ఎలాంటి ప్రమాదాలను, ఎలాంటి హానిని, ఎలాంటి అవమానాలను, ఎలాంటి మోసాలను, ఎలాంటి అపజయాలను, ఎలాంటి చెడును అయినా సరే.... చివరికి మరణం అయినా సరే... జరగాలని రూలేం లేదు అని తెలుసుకోండి. మీరు అనుమతించకపోతే ఈ సృష్టిలోని ఏ శక్తీ కూడా మీకు అపకారం తలపెట్టలేదు అని గట్టిగా గుర్తుంచుకోండి. సృష్టి సర్వస్వంలోనూ మీ అంగీకారం లేకుండా మీకు హాని చేసే శక్తి లేనే లేదు అని గుర్తుంచుకోండి. మంచి అయినా, చెడు అయినా, ఏదైనా సరే మీరు అనుమతిస్తేనే మీకు జరుగుతుంది అని గుర్తుంచుకోండి. ఒక వేళ పొరపాటున అంగీకరిస్తే కూడా వెంటనే దాన్ని క్యాన్సల్ చేయవచ్చు. నేనేదో పొరపాటున అంగీకరించాను, ఇప్పుడు నేను దాన్ని క్యాన్సల్ చేస్తున్నాను, క్యాన్సల్, క్యాన్సల్, క్యాన్సల్, క్యాన్సల్.... నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని, అని అనుకుంటూ ఉంటే అది ఖచ్చితంగా, నిజంగా, పూర్తిగా, శాశ్వతంగా, సురక్షితంగా క్లియర్ అయిపోతుంది. కాబట్టి మీరు భయపడాల్సిన పనేమీ లేదు. ముందు మీరు ప్రశాంతం అయితే అన్ని విషయాలను సులువుగా డీల్ చేయవచ్చు. ఇప్పటి వరకు జరిగినవి, ఇప్పుడు జరుగుతున్నవి, జరగబోయేవి అన్నీ కూడా మీ అనుమతితో మాత్రమే జరిగాయి, జరుగుతున్నాయి, జరగబోతాయి. కాబట్టి మీరు ధైర్యంగా ఉండండి. తెలియక పొరపాటున చెడు జరగాలని కోరుకుంటే చెడు జరిగే అవకాశం ఉన్నప్పుడు, చెడు వద్దు అని కోరుకుంటే, చెడు జరగనే జరగదు అని తెలుసుకోండి.

పరమాత్ముడు రామ్తా ఇలా అంటాడు "మీరు తెలిసీ తెలియక ఎంతటి పెద్ద ప్రమాదాన్ని పొరపాటున అనుమతించినా, అది జరగబోయే చివరి క్షణంలో కూడా దాన్ని జరగకుండా సురక్షితంగా ఆపవచ్చు, మీ చేతిలోనే మొత్తం కంట్రోలింగ్ పవర్ ఉంది అని సదా గుర్తుంచుకోండి".

కాబట్టి మీకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందని అనిపించినా వెంటనే...

.....ఇలా అనుకోండి.... "ఇక నేను ఎలాంటి చెడును అనుమతించను, నాలో చెడును ఆకర్షిస్తున్న దానిని నేను రిలీజ్ చేసాను, నాకు ఎలాంటి చెడు జరగదు, నేను దైవాన్ని, నేను దైవాన్ని" అని అనుకుంటూ ఉండండి. ఇలా చేస్తే మీకు ఏ అపకారం జరగదు గాక జరగదు.

❖ ❖ ❖

లోకం యొక్క కట్టుబాట్లు, నియమాలు, సంప్రదాయాలు, సంస్కారాలు, ఆచారాలు మరియు సంస్కృతి మొదలైనవన్నీ కూడా మనిషిచే రూపొందించ బడ్డాయి. ఇవన్నీ కేవలం మనిషి యొక్క స్వేచ్ఛ కోసం మరియు ఆనందం కోసం మాత్రమే ఉండాలి. స్వేచ్ఛ ఉన్నచోట ఆనందం ఉంటుంది మరియు అభివృద్ధి తప్పని సరిగా జరుగుతూ ఉంటుంది. అయితే ఇవన్నీ ఎప్పటికప్పుడు కాలానుగుణంగా మారుతూ ఉంటాయి. ఇందులో కొన్ని స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఇవన్నీ ఎప్పుడైతే మనిషి యొక్క స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నాయో అప్పుడు వాటిని వదిలేయాల్సిన సమయం వచ్చిందని గ్రహించి వాటిని వదిలేయాలి.

లోకం యొక్క కట్టుబాట్లు, నియమాలు, సంప్రదాయాలు, సంస్కారాలు, ఆచారాలు మరియు సంస్కృతి మొదలైనవన్నీ కూడా మనిషి కోసం కానీ, మనిషే వీటి కోసం కాదు !

5. మరి కొన్ని సాధనలు

నేను ఇంతకు ముందు చెప్పిన సాధనలు, ఇప్పుడు చెప్పబోయే సాధనలు అన్నీ ఒకే కోవకు చెందినవి. పరస్పరం సారూప్యం కలిగినవి. నిజానికి ఇవన్నీ ఒకే మహా సాధన లోనివే !

నమ్మకాలు, గుణాలు, భావాలు, భావనలు, అభిప్రాయాలు, ఆలోచనా విధానాలు మొదలైనవన్నీ ఒక్కటే ! ఇక్కడ, ఇప్పుడు మనం వీటిలో నమ్మకం అనే దాన్ని వాడుదాం.

మనలో ఎలాంటి నమ్మకాలు ఉంటే, అలా మన శరీరంలోని మరియు జీవితంలోని పరిస్థితులు ఉంటాయి - సృష్టి సూత్రం.

ఉదాహరణకు :

మీ పిల్లల నుండి మీకు ఇబ్బందులు ఎదురవుతూ ఉంటే, మీరు తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే - "పిల్లలు మంచి వాళ్ళు కాదు, పిల్లలు తల్లిదండ్రులను అర్థం చేసుకోకుండా వేధిస్తూ ఉంటారు" అనే నమ్మకాన్ని మీలో కలిగి ఉన్నారు అని మీరు అర్థం చేసుకోవాలి. ఇలాంటి నమ్మకాన్ని కలిగి ఉన్నప్పుడే పిల్లల నుండి తల్లిదండ్రులు ఇబ్బందులను ఎదుర్కొంటూ ఉంటారు. అంతే కానీ, రాత గీత అంటూ ఏవీ ఉండవు. ఇప్పుడు మీరు "నా సంతానం చాలా చాలా మంచిది" అనే భావాన్ని పదే పదే స్మరిస్తూ ఉండండి. పదే పదే అనుకుంటూ ఉండండి. ప్రస్తుతం మీ పరిస్థితులు ఎంత ఘోరంగా ఉన్నా సరే, మీరు పూర్తి విశ్వాసంతో సాధన చేస్తూ ఉండండి. వెంటనే మీ నమ్మకాన్ని అనుసరించి మీ పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. మీ పిల్లలకు, మీకు ఎంతో మంచి సంబంధాలు ఏర్పడతాయి. సమస్యలన్నీ పూర్తిగా, నిజంగా, శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి. ఇది నిజం. చేసి చూడండి. మీకే తెలుస్తుంది.

మీ తల్లిదండ్రులు మిమ్మల్ని అర్థం చేసుకోకుండా, మీకు సహకరించటం లేదు, మీకు స్వేచ్ఛనివ్వటం లేదు అని అంటే - "తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లలను అర్థం చేసుకోరు, వారిని వేధిస్తూ ఉంటారు" అనే నమ్మకాన్ని మీరు కలిగి ఉన్నారని అర్థం చేసుకోవాలి. ఇప్పుడు మీరు - "నా తల్లిదండ్రులు చాలా చాలా మంచి వాళ్ళు, నాకు పూర్తిగా అనుకూలంగా ఉన్నారు" అని పదే పదే అనుకుంటూ ఉండండి. పూర్తి విశ్వాసంతో సాధన చేయండి. మీ

పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నా సరే, ఈ సాధన చేయండి. మీరు నిజంగా సాధన చేస్తే ఆశ్చర్యకరంగా మీ పరిస్థితులు మారుతాయి. మీ తల్లిదండ్రులు మీ నిర్ణయాలను గౌరవిస్తారు. అవి ఎలాంటి నిర్ణయాలైనా సరే ఒప్పుకుంటారు, మీకు పూర్తిగా సహాయ సహకార సమన్వయాలను అందిస్తారు. తమ యొక్క పూర్తి అండ దండలను అందిస్తారు. తమ వలన ఎన్ని రకాలుగా వీలైతే అన్ని రకాలుగా సహాయాలు చేస్తారు. ఇంకా చెప్పాలంటే వీలు కానివి, వీలు చేసుకుని మరీ సహాయం చేస్తారు. ఇది సత్యం. పూర్తి విశ్వాసంతో సాధన చేయండి. మీకే తెలుస్తుంది.

ఎవరి వలన మీకు ఇబ్బంది వస్తుంటే వారికి ముందు మీరు ప్రేమను ప్రకటించండి. తర్వాత "వారు చాలా చాలా మంచి వారు, నాకు పూర్తి అనుకూలంగా ఉన్నారు" అని పదే పదే అనుకుంటూ సాధన చేయండి. అంతే వారు మీకు నిజంగా పూర్తిగా అనుకూలంగా మారిపోతారు. ఇది వాస్తవం.

మీ అత్తమామలతో మీకు ఇబ్బందిగా ఉంటే - మీరు "నా అత్తమామలు మంచి వాళ్ళు కాదు" అనే నమ్మకాన్ని కలిగి ఉన్నారని గ్రహించి.... ఇప్పుడు మీరు "నా అత్తమామలు చాలా చాలా మంచి వాళ్ళు, వాళ్ళు నాకు పూర్తిగా అనుకూలంగా ఉన్నారు" అని సాధన చేస్తే వెంటనే ఫలితం కనిపిస్తుంది. పూర్తి విశ్వాసంతో సాధన చేయాలి.

మీ బంధువుల నుండి మీకు ఇబ్బందులు కలుగుతూ ఉంటే - "బంధువులు మంచి వాళ్ళు కాదు, వేధించుకు తింటారు" అనే నమ్మకం మీలో ఉందని తెలుసుకుని... ఇప్పుడు మీరు "నా బంధువులందరూ మంచి వాళ్ళే, నాకు పూర్తిగా అనుకూలంగా ఉన్నారు" అని సాధన చేస్తే మీ బంధువులందరితో మీకు చాలా చాలా మంచి సంబంధాలు ఏర్పడి, మీ బంధువుల వలన మీకు మంచి మాత్రమే జరుగుతూ ఉంటుంది.

మీ మిత్రుల నుండి మీకు ఇబ్బందులు కలుగుతూ ఉంటే - "మిత్రులు మంచి వాళ్ళు కాదు, వీళ్ళ వలన ఇబ్బందులే వస్తాయి" అనే నమ్మకాన్ని మీరు కలిగి ఉన్నారని తెలుసుకుని... ఇప్పుడు మీరు "నా మిత్రులందరూ చాలా చాలా మంచి వాళ్ళు, నాకు పూర్తిగా అనుకూలంగా ఉన్నారు" అని సాధన చేస్తే మీ మిత్రులతో మీకు చాలా చాలా మంచి సంబంధాలు ఏర్పడి, మీ మిత్రుల వలన మీకు అన్నీ శుభాలే, లాభాలే జరుగుతూ ఉంటాయి.

"అందరూ మంచి వాళ్ళే" అని సాధన చేయండి. అందరూ మీకు పూర్తి అనుకూలంగానే ప్రవర్తిస్తారు.

ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, పోలీసులు, డాక్టర్లు, లాయర్లు, జడ్జీలు, ప్రజలు, వ్యాపారులు, విదేశీయులు, ఇతర మతస్థులు, మీడియా.... ఇలా ఎవరి నుండి మీకు సమస్య ఉంటే, వారి పట్ల మీరు సరికాని నమ్మకాన్ని పెట్టుకున్నారని అర్థం చేసుకోవాలి. వారు చాలా చాలా మంచి వారు, నాకు పూర్తిగా అనుకూలంగా ఉన్నారు అని సాధన చేస్తే అంతా మీకు మంచే జరుగుతుంది. అంతా అందరూ బాగానే ఉంటారు. మన నమ్మకాలను అనుసరించి మనకు పరిస్థితులు ఎదురవుతుంటాయి.

" నా దేహానికి, నా జీవితానికి పరమార్థం ఉంది " !

ఇది చాలా గొప్ప అద్భుతమైన సాధన. ఈ సూత్రాన్ని సాధన చేస్తే మీ దేహం సంపూర్ణమైన, సమగ్రమైన ఆరోగ్యాన్ని సంతరించుకుంటుంది. ప్రస్తుతం మీరు ప్రాణం పోయే పరిస్థితిలో ఉన్నా సరే... ప్రస్తుతం మీ దేహం ఎంత ఘోరమైన స్థితిలో ఉండనీ గాక... మీ దేహంలో ఎలాంటి భయంకరమైన రోగాలు, వ్యాధులు, జబ్బులు ఉండనీ గాక... అన్నీ సురక్షితంగా వెంటనే శాశ్వతంగా క్లియర్ అయిపోతాయి. మీ దేహం పూర్తి ఆరోగ్యాన్ని పొందుతుంది. మీ దేహం చెక్కు చెదరని మహా పటిష్ఠమైన ఆరోగ్యాన్ని పొందుతుంది. మీ దేహం మహా శక్తివంతం అవుతుంది. మీ జీవితం ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్యాలతో విరాజిల్లుతూ పరమార్థాన్ని పొందుతుంది.

నేను ఎందుకూ పనికి రాని వాడిని(దానిని), నా జీవితానికి అర్థం లేదు, ఏదో అలా బతికేస్తున్నాను... అసలు నా జీవితం ఒక జీవితమేనా ? పాడు జీవితం, వెధవ జీవితం, ఛీ.. నాదీ ఒక జీవితమేనా...? ఏం జీవితమో ఏమో... ...ఇలా రకరకాల నెగెటివ్ భావనలు ఉన్నందుకే జీవితం అల్లకల్లోలంగా ఉంటుంది. మీ జీవితానికి ఏ అర్థమూ లేదు అని భావిస్తున్నందుకే, మీ శరీరంలో రోగాలు, జీవితంలో బాధలు ఉన్నాయి. మీరు కేవలం మీ జీవితం పట్లనే కాకుండా, మీ శరీరం పట్ల కూడా నెగెటివ్ భావనలను కలిగి ఉంటారు. ఈ విధంగా మీరు, మీ శరీరం పట్ల మరియు జీవితం పట్ల నెగెటివ్ భావనలను కలిగి ఉన్నందుకే,

మీ శరీరం మరియు జీవితం రెండూ కూడా బాధలతో నిండి ఉన్నాయి. ఈ సత్యాన్ని మీరు గ్రహించాలి. ఎప్పుడైతే మీరు నా శరీరానికి, జీవితానికి పరమార్థం ఉంది అని భావిస్తారో.. అప్పుడు వెంటనే మొత్తానికి మొత్తం ఒకే సారి ప్రక్షాళన జరిగి మీకు పైన చెప్పిన శుభలాభాలు జరుగుతాయి.

మీరు అనుకున్న పని మొదలు పెట్టిన తర్వాత, ఏవైనా అడ్డంకులు వస్తే, అవి మీ లోపలి నుండే వస్తున్నాయి అని గ్రహించి.... "నేను చేసే పనికి నేను పూర్తిగా OK''.... అని బాగా సాధన చేయాలి.

మీరు అనుకున్న పనికి ఎవరైనా అడ్డం పడుతూ ఉంటే, వారిని తలుచుకుని, వారికి నిజంగా హృదయ పూర్వకంగా ప్రేమను ప్రకటించి, "వారు చాలా మంచి వారు, నాకు ఫుల్ సపోర్ట్‌గా ఉన్నారు" అని సాధన చేయాలి. అప్పుడు వారు మీకు పూర్తిగా సపోర్ట్ చేస్తారు. అది ఏ విషయమైనా సరే ! ఇది నిజం !

గుర్తుంచుకోండి, మీలోని నమ్మకాలు ఎలా ఉంటే మీకు అలాంటి పరిస్థితులు ఎదురవుతాయి. ఈ సత్యాన్ని సదా ఎరుకలో ఉంచుకుని, అడ్డంకులు ఎదురైనప్పుడు, ఇవి నావే అని గ్రహించి, వాటిని క్లియర్ చేసుకుంటూ ముందుకు కొనసాగితే విజయం మీదే అవుతుంది.

ఇంకొక ముఖ్య విషయం : ''నాలో ఉన్న అపజయాలను ఆకర్షించే గుణాలను రిలీజ్ చేసాను, రిలీజ్ రిలీజ్...." అంటూ సాధన చేయాలి. ఆ తర్వాత ''నేను విజయాన్ని మాత్రమే అనుమతించాను'' అని అనుకుంటూ ఉండాలి.

ఎప్పుడూ విశ్వాసం కోల్పోవద్దు. ఎల్లప్పుడూ పూర్తి పాజిటివ్‌గానే ఉండాలి. మీరు పూర్తి పాజిటివ్‌గా, పూర్తి విశ్వాసంతో ఉంటే మీరు దేనినైనా సాధించ గలరు. మీ పరిస్థితులు మీకు అనుకూలంగా లేనప్పుడే, భయపడకుండా అప్పుడే మీరు పూర్తి విశ్వాసాన్ని మరియు పూర్తి పాజిటివ్‌నెస్‌ను కలిగి ఉండాలి. అప్పుడు అన్ని పరిస్థితులు మరియు అందరూ మీకు పూర్తి అనుకూలంగా మారి మీకు విజయాన్ని అందిస్తారు.

6. ఏదైనా పని చేసే ముందు....

మీరు ఏదైనా పని చేసే ముందు, ఆ పని ఏదైనా కానీయండి, ఉద్యోగం రావాలి అనే కోరిక కావచ్చు, నా వ్యాపారం సక్సెస్ కావాలి అనేది కావచ్చు, పెళ్ళి కావచ్చు, ప్రేమ వ్యవహారం కావచ్చు, స్వంత ఇల్లు కావచ్చు లేదా మరేదైనా కావచ్చు... అది ఏదైనా కానీయండి, అది మొదలు పెట్టే ముందు మీరు ఏం చేయాలంటే....

ముందు మీరు చేసే పని పట్ల మీరే "పూర్తి అనుకూలంగా" ఉండాలి. మీరు చేసే పనిని తలుచుకుని..... "నేను చేసే ఈ పని చాలా మంచిది, చాలా గొప్పది, దీనికి అందరూ ఫుల్ సపోర్ట్‌గా ఉన్నారు" అని సాధన చేయాలి.

మీరు చేసే పనిని ఎవరైనా తప్పు పడుతున్నారు అని అంటే దాని వలన మీరు గ్రహించాల్సినవి రెండు విషయాలు ఉంటాయి. అవి :

1. మీరు చేసే పని పట్ల మీకే సరి అయిన అభిప్రాయం లేనప్పుడు, మీ పనిని ఎవరైనా సరే వ్యతిరేకించే అవకాశం ఉంది. ఇలాంటప్పుడు - "మీరు చేసే పని పట్ల మీరు మంచి అభిప్రాయాన్ని ఏర్పర్చుకోవాలి" అనే విషయాన్ని మీరు తెలుసుకుని, మీరు చేసే పని పట్ల మీరు మంచి అభిప్రాయాన్ని ఏర్పర్చుకోవాలి.

2. ఎవరు విమర్శించినా, వ్యతిరేకించినా పట్టించుకోకుండా ముందుకు సాగాలి అని అర్థం చేసుకుని ముందుకు సాగాలి.

ఎవరైనా మీకు దూరమైనప్పుడు చాలా బాధ కలుగుతుంది, జీవితం అయోమయంగా అనిపిస్తుంది. కొంత కాలం గడిచాక వాళ్ళు మీకు దూరమై మీకెంత మేలు చేసారో అర్థమైనప్పుడు మీరు సృష్టికి ధన్యవాదాలు చెప్పకుండా ఉండలేరు.

7. గతాన్ని పూర్తిగా వదిలేయాలి

వాస్తవానికి మనల్ని గతం బంధించదు, బంధించలేదు. గతం మృతమైనది, అది మనలను ఎలా బంధిస్తుంది ?! అయితే, మనమే గతాన్ని మోస్తూ ఉంటాం. మనమే గతాన్ని పట్టుకుని వేలాడుతూ ఉంటాం. దీని వలన మనం, మన గతం చేత శాసించ బడుతూ ఉంటాం. మన వర్తమానంలో మనం, మన గతం చేతిలో కీలుబొమ్మల్లాగా అయి ఉంటాం. మనం కొత్త పరిస్థితులను సృష్టించుకుని ఆనందంగా జీవించుదాం అని అనుకుంటూ, ప్రయత్నిస్తూ ఉంటాం. కొన్ని సార్లు విఫలం అవుతూ ఉంటాం. కారణం ఏమిటంటే, గతమే ! గతం పట్ల మనం కలిగి ఉన్న బాధ లేక అసంతృప్తి మనల్ని ఫెయిల్ చేస్తాయి.

మనిషి తను గతంలో అనుభవించిన ఆనందకరమైన పరిస్థితులను పెద్దగా తలుచుకోడు. కానీ తనకు గతంలో ఎదురైన బాధాకరమైన వాటిని మాత్రం పదే పదే తలుచుకుంటూ ఉంటాడు. దీని వలన ఆ గతంలోని బాధలే మళ్ళీ మళ్ళీ రిపీట్ అవుతూ ఉంటాయి. ఒక వేళ గతంలోని బాధలను కాకుండా, కేవలం ఆనందాలను మాత్రమే స్మరిస్తూ ఉంటే అప్పుడు ఆటొమెటిక్‌గా ఆనందకరమైన పరిస్థితులే వస్తూ ఉంటాయి.

ఆత్మలమైన మనం ప్రతీ జన్మలోనూ ఎన్నెన్నో పాఠాలను నేర్చుకుంటూ ఉంటాం. వాటిలో ఆనందం, బాధ మొదలైనవి ఎన్నో రకాలుగా ఉంటాయి. ఆనందకరమైన అనుభవాలతో ఏ సమస్యా లేదు కానీ, బాధాకరమైన అనుభవాలతోనే కొన్ని సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ఒక బాధాకరమైన అనుభవంలో నుండి మనం ప్రయాణించినప్పుడు, ఆ అనుభవం అయిపోయిన తర్వాత కూడా ఆ బాధ యొక్క ప్రభావం మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. దాన్ని మనం వదిలించుకునేంత వరకు దాని ప్రభావం వలన మన వర్తమానం డిస్టర్బెన్స్‌కు గురవుతూనే ఉంటుంది.

మనకు జరిగిన నష్టం మనల్ని పదే పదే పొడుస్తూ ఉంటుంది. చాలా చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఈ ఇబ్బంది వలన మనం బాధ పడుతూ ఉంటాం. ఇలా బాధలో ఉన్న మనం వర్తమానంలో సరిగా ఉండలేం. అప్పుడు మనం ఎన్నో కొత్త అవకాశాలను కోల్పోతూ ఉంటాం. కాబట్టి మనం మన గతాన్ని పూర్తిగా వదిలేసినప్పుడే, మనం పూర్తి స్వేచ్ఛను పొందుతాం. కావాల్సిన కొత్త పరిస్థితులను సృష్టించుకుని ఆనందంగా జీవించగలుగుతాం.

ఇక్కడ నేను గతం అని ప్రస్తావించేది, "బాధా కరమైన గతం" గురించి అని మీరు గుర్తించండి. బాధాకరమైన గతాన్ని మోస్తూ ఉండడం వలన మనం బాధలను అనుభవిస్తూ ఉంటాం అనే విషయాన్ని మీరు అర్థం చేసుకుని తీరాలి.....కాబట్టే మనం మన గతాన్ని పూర్తిగా వదిలేయాలి.

మనం అనుభవించిన అనుభవ విజ్ఞానం అంతా మన అంతరంగంలో "వివేకం"గా శాశ్వతరీతిలో రికార్డ్ అయి ఉంటుంది. కాబట్టి మనకు గతం యొక్క అనవసరమైన జ్ఞాపకాలతో పనిలేదు. సారం గ్రహించి నిలుపుకున్నాం, ఇక పిప్పితో పనిలేదు. దాన్ని పడేయాల్సిందే.

మనం, మన యొక్క బాధాకరమైన గతాన్ని ఎందుకు వదిలివేయలేక పోతున్నాం ? అని అంటే... అది మనకు బాధను మిగిల్చింది గనుక. బాధాకరమైన అనుభవం బాధను మిగల్చక ఏం మిగిలుస్తుంది !? అని మీరు అంటే...

ఇప్పుడు ఇక్కడ మనం గుర్తు చేసుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు :

1. మనం రక రకాల అనుభవాల కోసం జన్మలను తీసుకుంటూ ఉంటాం.

2. మనం తీసుకునే జన్మలలోని అనుభవాలు ఏ విధంగానైనా ఉండవచ్చు.

3. అనుభవం ఏ విధంగా ఉన్నా అది మన ఆత్మాభివృద్ధి కొరకే ! ప్రతీ అనుభవం ఆత్మ పరిణామ క్రమాన్ని వేగవంతం చేస్తుందే తప్ప కీడు చేయదు. ఆ అనుభవం ఎంత బాధాకరంగానైనా ఉండనీ గాక దాని వలన ఆత్మకు అభివృద్ధి మాత్రమే జరుగుతుంది.

4. మనకు ఎదురైన ప్రతీ అనుభవాన్ని మనమే ఆహ్వానించాం అన్న సంగతి మరువకూడదు. బాధాకరమైన అనుభవాలు కూడా మన ఆహ్వానం ఉంటేనే వస్తాయి. బాహ్య స్మృతిలో మీకు తెలియదు. కానీ, అంతరంగంలో ఉన్న ఆహ్వానాల మేరకే మనకు అనుభవాలు వస్తూ ఉంటాయి.

బాధాకరమైన అనుభవాలు ఏ రకంగా అభివృద్ధిని కలుగజేస్తాయి ? అని మీకు ప్రస్తుతం సందేహం రావచ్చు... మీకు ఆత్మ విజ్ఞాన అవగాహన పెరుగుతూ ఉంటే అప్పుడు ఈ సందేహం ఆటొమెటిక్‌గా తీరిపోతుంది.

బాధాకరమైన అనుభవాలు ఆత్మాభివృద్ధిని కలిగిస్తాయి అని అంటే, ఇక అభివృద్ధి కోసం బాధాకరమైన అనుభవాలను కోరుకోవాలి అని నేను చెప్పటం లేదని మీరు గ్రహించాలి. అలాగే ఆత్మాభివృద్ధి కోసం బాధాకరమైన అనుభవాలు అవసరం అని కూడా నేను చెప్పటం లేదు. జరిగి పోయిన బాధాకరమైన అనుభవాల ప్రభావం నుండి ఎలా బయట పడాలి ? అనే విషయం గురించి వివరిస్తున్నాను అని అవగాహన చేసుకోండి. అర్థమైందా.....?

మనకై మనమే కల్పించుకున్న అనుభవాలు కాబట్టి వాటి వలన మనకు మంచే జరిగింది అని భావించాలి. అప్పుడు నిజంగా వాటి వలన మనకు మంచి జరుగుతుంది. ఆశ్చర్యంగా ఉందా !? అవును, ఇది నిజం. మనం, మనకు జరిగిన నష్టాలను తలుచుకుని వాటి వలన నాకు మంచే జరిగింది అని అనుకుంటే, నిజంగా.. వాటి వలన మనకు జరిగిన నష్టం లాభంగా మారుతుంది. ఇది సత్యం. జరిగినదంతా నాకు మంచినే కలుగజేసింది అని అనుకోవడం వలన మీరు మీ యొక్క బాధకరమైన గతం యొక్క ప్రభావం నుండి బయట పడతారు. అప్పుడు మీరు గతాన్ని పూర్తిగా వదిలివేసిన వారవుతారు. గతాన్ని పూర్తిగా వదిలేసిన మీరు ఇప్పుడు, మీకు కావాల్సిన కొత్త పరిస్థితులను సృష్టించుకుని హాయిగా ఎంజాయ్ చేయవచ్చు.

గతాన్ని పూర్తిగా సురక్షితంగా వదిలించుకునే సూత్రం :

''నేనంతా మంచే చేసాను, నాకంతా మంచే జరిగింది''

మీరు పై సూత్రాన్ని పదే పదే అనుకుంటూ ఉంటే ఆ సూత్రం యొక్క ప్రభావం మీ అంతరంగంలోకి దిగుతుంది. అప్పుడు మీకు గతంలో జరిగిన నష్టాలన్నీ లాభాలుగా మారుతాయి. దాని వలన మీరు ఎంతగానో శక్తివంతులవుతారు, ఎంతో అభివృద్ధి చెందుతారు.

ఈ సూత్రాన్ని కూర్చుని సాధన చేయవచ్చు లేదా మీరేం చేస్తూ ఉన్నా ఈ సూత్రాన్ని లోపల అనుకుంటూ ఉండవచ్చు. మీకు ఎలా వీలైతే అలా చేసుకోండి. కాకపోతే కాస్త శ్రద్ధతో విశ్వాసంతో చేస్తే బాగుంటుంది.

మీకు జరిగిన నష్టాలు గుర్తుకు రాగానే... వాటి వలన నాకు ఎలా మంచి జరిగింది, ఇంకా వాటి వలన ఎలా మంచి జరుగుతుంది ? అని అనిపిస్తుంది. అంతా మంచే జరిగింది అని ఒప్పుకోబుద్ధి కాదు. మీలోని బాధ ఎదురు ప్రశ్నిస్తుంది. ఇక్కడే మీరు అవగాహనతో ఉండాలి. ఎరుకతో ఉండాలి. బలంగా ఒప్పుకోవాలి. నేనంతా మంచే చేసాను, నాకంతా మంచే జరిగింది అని ఒప్పుకోవాలి. ఒప్పుకుంటే నిజంగానే మంచి జరుగితీరుతుంది. మీరు ఒప్పుకోండి. ఎంత ఇబ్బందిగా అనిపించినా ఒప్పుకోండి.

బాధాకరమైన గతం మనల్ని ఎందుకు వదిలిపోదు లేక దాన్ని మనం ఎందుకు వదిలేయలేము అని అంటే... దాన్ని తలుచుకుని బాధ పడుతూ ఉండడమే దానికి కారణం. మనం దాన్ని తలుచుకుని బాధ పడుతూ ఉన్నంత కాలం అది మనల్ని వదలదు, దాన్ని మనం వదలలేము. దానికి మనకు ఉన్న లింకు బాధయే. ఎప్పుడైతే మనం జరిగిన దాన్ని "మంచే జరిగింది" అని స్వీకరిస్తామో అప్పుడు దానికి మనకు ఉన్న లింకు తెగిపోతుంది. అప్పుడు మనం దాన్ని వదిలేయ గలుగుతాం. గుర్తుంచుకోండి, మీకు జరిగిన ఏ బాధాకరమైన సంఘటన యొక్క ప్రభావాన్ని అయినా "నాకు మంచే జరిగింది" అనే భావనతో మంచిగా మార్చుకుని లాభపడవచ్చు.

మిమ్మల్ని బాధ పెట్టే ఏ జ్ఞాపకాన్ని అయినా మీరు వదిలేయాలి అని అనుకుంటే, ఆ జ్ఞాపకాన్ని తలుచుకుని "దీని వలన నాకు మంచే జరిగింది" అని అనుకోండి. అప్పుడు మీ నుండి ఆ బాధ ఆటొమెటిక్‌గా పూర్తిగా వేరై పోతుంది. శాశ్వతంగా మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతుంది. అది ఎంత పెద్ద బాధ అయినా సరే దాన్ని మీరు ఈ సూత్రం ద్వారా చాలా సులభంగా సరళంగా సురక్షితంగా వదిలేయ గలరు.

నేనంతా మంచే చేసాను, నాకంతా మంచే జరిగింది.... అనే భావన మీకు చెప్పలేనంత మంచిని చేస్తుంది. మీ నష్టాలన్నింటినీ లాభాలుగా మారుస్తుంది. మీ బాధలన్నింటినీ పూర్తిగా శాశ్వతంగా సురక్షితంగా తీసివేస్తుంది. కొన్నింటిని ఒప్పుకోగలుగుతాము కానీ అన్నింటినీ అంటే ఒప్పుకోలేము అని అనిపిస్తుంది. ఎందుకంటే దాని ప్రభావం అలా ఉంటుంది. అయితే, ఏదో ఒకనాటికి, మీరు దాన్ని మంచిగా స్వీకరించే శక్తి మీకు వస్తుంది. అప్పటి వరకు మీరు దాన్ని వదిలించుకోలేరు. కాబట్టి జరిగినది ఎంత ఘోరమైనా సరే దాన్ని మీరు మంచిగా ఒప్పుకునియే తీరాలి. కొన్నింటిని ఒప్పుకోడానికి కాస్త సమయం పట్టవచ్చు. కాని ఏ నాటికైనా ఒప్పుకుని తీరాలి. అప్పుడే దాన్ని మనం వదిలేయ గలుగుతాం. మనకు దేనినైనా ఒప్పుకునే శక్తి ఉంది అని తెలుసుకోండి. నిజంగానే మీరు ఎప్పుడూ చెడు చేయనే లేదు, మీ వలన మీకు, అందరికీ మంచి మాత్రమే జరిగింది. మీకంతా మంచే జరిగింది, మీరంతా మంచే చేసారు. ఇక మీదట కూడా మీ వలన మంచే జరుగుతుంది. మీకు సదా మంచే జరుగుతూ ఉంటుంది.

ఏ పనిలోనైనా విఫలం అవుతూ ఉంటే.... ఈ కింది సాధన చేయండి.

క్షమ ప్రేమ ఎరుక ఫుల్ సపోర్ట్

అని మీలో మీరే పదే పదే అనుకుంటూ ఉండండి. మన పట్ల మనకు క్షమ ప్రేమ ఎరుక లేనందుకే మనకు అపజయం కలుగుతుంది. మన సపోర్ట్ మనకు లేనందుకే మనం విఫలం అవుతూ ఉంటాం. మన సపోర్ట్ మనకు లేనప్పుడు ఇతరులు ఎవరు మనకు సపోర్ట్ చేస్తారు ? కాబట్టి ముందు మన సపోర్ట్ మనకు ఉండాలి. ఈ సాధన చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా చాలా పరమాద్భుతమైన ఫలితాలను తక్షణమే ఇస్తుంది.

ఈ సాధన కూర్చుని చేయాలి. ఆ తర్వాత మీరు ఏ పని చేస్తున్నా సరే ఈ సాధన చేయవచ్చు.

హృదయ పూర్వక ప్రేమ ఆనందం ధన్యవాదం

ఈ సూత్రాన్ని మీరు, మీ నిజతత్వాన్ని(దైవత్వాన్ని) ఉద్దేశించి చేయాలి. మీకు అన్ని సమకూరుస్తూ ఉన్నది మీ నిజతత్వమే కాబట్టి, తప్పని సరిగా మీరు, మీ నిజతత్వానికి హృదయ పూర్వకంగా ప్రేమను ఆనందాన్ని ధన్యవాదాన్ని ప్రకటించియే తీరాలి... ఇది మీ కనీస ధర్మం. మీకు శుభలాభాలు జరుగుతూ ఉన్న తర్వాత కూడా మీరు ప్రేమానందాలను మరియు ధన్యవాదాన్ని ప్రకటించక పోవడం అనేది సరికాదు. మీరు మీ నిజతత్వానికి హృదయ పూర్వకంగా ప్రేమానందాలను మరియు ధన్యవాదాన్ని ప్రకటించక పోవడం వలన మీ అభివృద్ధి ఆగిపోతుంది.

మీరు గనుక మీ నిజతత్వానికి హృదయ పూర్వకంగా ప్రేమానందాలను మరియు ధన్యవాదాన్ని ప్రకటిస్తూ ఉంటే... మీలోని నెగెటివ్ అంశాలన్నీ పూర్తిగా మాయం అవుతాయి. మీకున్న శక్తిసామర్థ్యాలు మరియు పాజిటివ్ అంశాలన్నీ చాలా చాలా చాలా అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. ఇది ఒక పరమాద్భుత సత్యం.

8.గురు స్మృతి సాధన

విశ్వాసం ప్రేమ ఆనందం

ఇది మీరు, మీ గురువు పట్ల చేయాల్సిన సాధన. ఆధ్యాత్మిక జీవితంలో గురువు లేనిదే ఏమీ జరగదు. గురువు లేనిదే మీ ఆత్మాభివృద్ధి అణువంతైనా జరగదు. గురువు లేనిదే మీకు మోక్షం రాదు. గురువు లేకుండా ఆధ్యాత్మిక ప్రయాణం చేయడం అనేది మూర్ఖత్వానికి పరాకాష్ఠ ! మితిమీరిన అహానికి ఋజువు !

మీ ఆధ్యాత్మిక ప్రయాణం సరిగా సాగాలంటే మీకు గురువు తప్పని సరి, ఈ సత్యాన్ని గుర్తించండి. మీరు ఆధ్యాత్మిక మార్గంలో(సత్య మార్గం) కొనసాగాలంటే, గురువు అత్యవసరం, ఈ నిజాన్ని గుర్తించండి. మీ ఆత్మాభివృద్ధి జరగాలంటే, మీకు గురువు ఉండి తీరాల్సిందే, ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోండి.

మీ సర్వాభివృద్ధికి గురువు అత్యవసరం అయినప్పుడు, మరి... మీరు ఆయన పట్ల పూర్తి విశ్వాసాన్ని, ప్రేమను మరియు ఆనంద భావాన్ని కలిగి ఉండాలి. ఈ మూడు భావాలు మీకు, మీ గురువు పట్ల ఉంటేనే మీరు రక్షింప బడతారు, అభివృద్ధి చెందుతారు. కళ్ళు మూసుకుని, మీ గురువును ఊహించుకుని, ఆయనను ఉద్దేశిస్తూ.... "విశ్వాసం ప్రేమ ఆనందం" అని మీ లోపల అనుకుంటూ ఉండడమే సాధన. ఈ సాధన చేయండి పరమాద్భుతాలు జరిగి తీరుతాయి. గతి తప్పని ప్రాప్తి ఇది.

సాధకులందరికీ ఇది తప్పని సరి అయిన సాధన !

8. అవగాహన

మనం అవగాహన కోసమే జన్మలు తీసుకుంటాము. మన యొక్క శక్తియుక్తులన్నీ మన అవగాహన వల్లనే ఏర్పడ్డాయి. అవగాహన వల్లనే మనం అభివృద్ధి చెందుతాము. అవగాహన వల్లనే సర్వమూ సుసాధ్యం అవుతుంది.

ప్రతీ పరిస్థితి మనకు ఏదో ఒకటి నేర్పించడానికి వస్తుంది. అదేమిటో నేర్చుకుంటే అది మనల్ని వదిలి వెళ్ళి పోతుంది. - సృష్టి సూత్రం.

ప్రస్తుతం మనం అనుభవిస్తున్న బాధలన్నీ కూడా మనకు ఏదో ఒకటి నేర్పించడానికే ఉన్నాయి అని గ్రహించాలి. ఎప్పుడైతే మనం నేర్చుకుంటామో అంటే, అవగాహన చేసుకుంటామో అప్పుడే దాన్నుండి మనం బయట పడతాం.

మన కోరికలు కూడా మనకు అవగాహన లేనందుకే తీరవు. మనకు మన కోరిక ఇంకా తీరలేదు అని అంటే దానికి సంబంధించిన అవగాహన ఏదో ఇంకా మనం పొందాల్సి ఉందని అర్థం.

మనం ప్రస్తుతం పడుతున్న బాధలను వదిలించుకోవాలన్నా అవగాహన చెందాలి. కొరుకుంటున్నవి పొందాలని అన్నా అవగాహన కావాలి. అవగాహన అనేది మహా దివ్య శక్తి ! దీని కోసమే ఆత్మలమైన మనం జన్మలు ఎత్తుతూ ఉంటాం.

మనకు ఎంత అవగాహనను అయినా పొందే శక్తి ఉంది. ఈ సత్యాన్ని బాగా గుర్తుంచుకోవాలి. పదే పదే స్మరించాలి.

ఇప్పుడు మీరు ప్రశాంతంగా కూర్చుని, మీరు పడుతున్న బాధలను తలుచుకుని, "వీటి పట్ల నాకు పూర్తి అవగాహన ఉంది" అని అనుకుంటూ ఉండాలి. ఇలా మీకు ఎంత సేపు వీలైతే అంత సేపు చేయండి. అప్పుడు మీలో అవగాహనా శక్తి ఉత్తేజితమై మీ బాధలన్నీ తొలగిపోతాయి. ప్రస్తుతం పడుతున్న బాధలే కాకుండా, భవిష్యత్తులో రాబోయేవి కూడా పూర్తిగా శాశ్వతంగా సురక్షితంగా తొలగిపోతాయి.

మీరు కోరుకుంటున్నవి పొందాలన్నా ఈ సాధన చేయండి. మీరు ఏం కోరుకుంటున్నారో దాన్ని తలుచుకోండి, అది ఏదైనా సరే, మీ కోరికను తలుచుకోండి, ఇప్పుడు మీ కోరికను తలుచుకుంటూ "ఇది నేను ఈ క్షణమే పొందడానికి కావాల్సిన పూర్తి అవగాహన నాకు ఉంది" అని అనుకుంటూ ఉండాలి. అంతే. ఆశ్చర్యకరంగా మీ కోరిక నెరవేరుతుంది. చాలా సులభంగా సరళంగా సురక్షితంగా నెరవేరుతుంది. ఇది సత్యం.

మీరు ఎప్పుడైనా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, అవగాహన లేనందుకే సమస్యలు వస్తాయి. అవగాహన రాగానే సమస్యలు వెళ్ళిపోతాయి. అవగాహన లేకపోవడమే సమస్య. అవగాహనయే పరిష్కారం. అని బాగా గుర్తుంచుకోండి.

నేను సాధన చేస్తూ ఉన్నాను, అయినా ఇంకా నా సమస్య పోలేదు, నా కోరిక తీరలేదు అని అంటే, ఇంకా మీకు తగిన అవగాహన రాలేదు అని అర్థం. కాబట్టి సమస్య పరిష్కారం అయ్యే వరకు, మీ కోరిక తీరే వరకు సాధన ఆపకూడదు.

గుర్తుంచుకోండి, మీకు "పూర్తి అవగాహన" రాగానే మీ సమస్య పరిష్కారం అయి తీరుతుంది, మీ కోరిక నెరవేరుతుంది. ఇది పరమ సత్యం. కాబట్టి పని అయ్యే వరకు సాధన చేస్తూనే ఉండాలి.

అవగాహన సర్వకార్యాలను సుసంభవం చేస్తుంది. అది ఎంతటి కార్యమైనా, ఎంత పెద్ద సమస్య అయినా, ఎంత పెద్ద కోరిక అయినా సరే అవగాహన వలన సుసాధ్యం అవుతుంది. కాబట్టి అవగాహనను పెంచుకోండి. అకర్మ శాకాహారం + ధ్యానం + ఆత్మ విజ్ఞాన పుస్తకాలు చదవడం ద్వారా ఆత్మ విజ్ఞానాన్ని పెంచుకోవడం మరియు సేవ ద్వారా అవగాహన అనంతంగా పెంచుకోవచ్చు. మనకు కావాల్సినవి పొందుకుంటూ పరమానందంలో తేలియాడవచ్చు.

మీకు ఈ క్షణమే మహా మహా అవగాహన వచ్చు గాక !

❖ ❖ ❖

సరైన అత్యున్నత ఆధ్యాత్మిక విజ్ఞాన అవగాహన వలన మనకు పరిస్థితులను తట్టుకుని అధిగమించే శక్తి సామర్థ్యాలు వస్తాయి. పరిణామ క్రమంలో ముందుకు వెళ్ళగలుగుతాం. కాబట్టి సరైన ఆధ్యాత్మిక విజ్ఞాన అవగాహనను పెంచుకోవడం అనేది అత్యంత అవసరం ! ఒక సరైన గురువును పట్టుకుంటే చాలు, ఆయనను వదలకుండా సరిగ్గా, నిజాయితీగా, విశ్వాసంగా ఆయనను అనుసరిస్తే చాలు ఆటొమెటిక్‌గా అభివృద్ధి జరిగి తీరుతుంది.

9. దివ్య శక్తులు

ప్రేమ, ఆనందం, పరోపకారం, అవగాహన, ఇతరులను అర్థం చేసుకునే గుణం, అందరి శ్రేయస్సును కోరుకునే గుణం, అకర్మ శాకాహారిగా ఉండడం, నిరంతరం ధ్యానం చేయడం, ఆత్మ విజ్ఞాన అభ్యాసం చేస్తూ ఉండడం, అందరికీ వీలైనంతగా మంచిని చేస్తూ ఉండడం, మీతో మీరు మంచిగా ఉండడం, మీ పట్ల మీరు ప్రేమగా ఉండడం, కరుణ, ప్రసన్నత, క్షమా గుణం, తప్పులను ఎంచక పోవటం, నాతో పాటు అంతా అందరూ దైవాలే అనే భావన కలిగి ఉండటం, ఎరుక మొదలైనవన్నీ దివ్య శక్తులే ! ఈ దివ్య శక్తులన్నింటినీ మనం సహజంగానే కలిగి ఉంటాం. ఇంకా ఇవే కాకుండా మరెన్నో దివ్య శక్తులను కూడా కలిగియే ఉంటాం. నిరంతర ధ్యాన సాధన ద్వారా ఈ దివ్య శక్తులన్నీ మనకు పూర్తిగా శాశ్వతంగా సురక్షితంగా అందుబాటులోకి వస్తాయి.

మనం ఎల్లప్పుడూ ప్రేమ ఎరుక ఆనందాలతోనే ఉండాలి. ఇలా ఉంటున్న మనకు అంతా మంచే జరుగుతూ ఉంటుంది. మన వలన ఇతరులకు కూడా మంచే జరుగుతుంది.

ఆలోచనలలో కూడా మనం ఇతరులకు చెడు కోరుకోకూడదు. ఇతరుల మంచి గురించి ఆలోచించ లేకపోతే కనీసం చెడుగా మాత్రం ఆలోచించ కూడదు. ఇతరుల గురించి చెడు ఆలోచిస్తే, కొంత కాలానికి మన ద్వారా రిలీజ్ అయిన ఆ చెడు ఆలోచనలు మనకే తిరిగి వస్తాయి. అప్పుడు మనకు వాటి వలన చాలా ఇబ్బంది కలుగుతుంది. కాబట్టి ఎల్లప్పుడూ మంచి ఆలోచనలనే చేయాలి. నాకు మంచి జరగాలి, అందరికీ మంచి జరగాలి అని అనుకుంటూ ఉండాలి.

మీకు ఎవరి వలన ఇబ్బంది కలుగుతుందో వారిని తలుచుకుని, వారు మంచి వారు, వారికి మంచి జరగాలి అని ప్రేమతో ఆశీర్వదించండి. అప్పుడు ఆశ్చర్యకరంగా మీకు వారి నుండి ఇబ్బందులు కలగడం ఆగిపోయి, వాటి స్థానంలో సహాయాలు రావడం ప్రారంభం అవుతాయి. ఇది నిజం. చేసి చూడండి. మీకే తెలుస్తుంది.

❖ ❖ ❖

9 నెలలు గర్భం ధరించి బిడ్డను కన్న తర్వాత పుట్టిన శిశువు ప్రాణం లేకుండా ఉంటే ఎలా ఉంటుందో సరిగ్గా అలాగే - సరైన సత్య గురువు లేని జీవితం ఉంటుంది. జన్మించగానే పుట్టామా.. పెరిగామా... అన్నది విషయం కానే కాదు.. మీరు ఎప్పటివరకైతే సత్యగురువును అన్వేషించి ఆయన దగ్గర స్థానం పొందరో, సత్య మార్గానికి అంకితం కారో అప్పటి వరకు మీరు బతికి ఉన్నా... లేనట్టే !

10. మీరు చేయ వలసినవి చేస్తే, మీకు రావలిసినవి వస్తాయి.

మీరు చేయ వలిసినవి చేస్తే, మీకు రావాల్సినవి ఆటొమెటిక్‌గా వస్తాయి. ఇది పరమ సత్యం.

మీరు ఎదుర్కొంటున్న సమస్య నుండి బయట పడడానికి ఏదో ఒకటి చేయాల్సి ఉంటుంది. అది ఏమిటి అని ధ్యానంలో కూర్చుని ప్రశ్నించుకోండి. మీకు స్పష్టంగా సమాధానం వస్తుంది. అప్పుడు అది చేయండి. అంతే. పరిష్కారం దానంతట అదే వస్తుంది.

మీ కోరిక తీరడానికి ఏదో మీరు చేయాల్సి ఉంటుంది, మీరు కోరుకున్న విధంగా జీవించడానికి మీరు ఏదో చేయాల్సి ఉంటుంది, మీరు కోరుకున్న వారిని పొందడానికి మీరు ఏదో చేయాల్సి ఉంటుంది.... అది ఏమిటో ధ్యానంలో కూర్చుని తెలుసుకోండి. అది చేయండి. మీరు కోరుకుంటున్నవి అవే మీ వద్దకు వస్తాయి. ఇది వాస్తవం.

మనం కోరుకుంటున్న వాటిని మనం పొందడానికి తప్పని సరిగా మనం చేయాల్సినవి కొన్ని ఉంటాయి. వాటిని గుర్తించి అవి చేయాలి. మనం చేయాల్సినవి చేసినప్పుడే, మనకు రావాల్సినవి వస్తాయి. ఈ సత్యాన్ని సదా స్మరణలో ఉంచుకోవాలి.

మనం మూల చైతన్య స్వరూపులం. మనం ఏదైనా సాధించవచ్చు. మనం అనంత శక్తి సామర్థ్యాలను కలిగి ఉన్నాం. మనం కోరుకుంటున్న దానిని దేనినైనా మనం పొందగలం అన్న సత్యాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

అది ఏదైనా సరే మనం సాధించియే తీరుతాం. ఇది పరమ సత్యం. మీరు చేయాల్సినవి చేయండి, అప్పుడు ఆటొమెటిక్‌గా మీకు రావాల్సినవి వాటంతటే అవే మీకు వస్తాయి. ఆల్ ద వెరి బెస్ట్ !

మీరు సత్య ప్రచారం(అకర్మ శాకాహార(అకర్మ వీగన్) + ధ్యాన + ఆత్మ విజ్ఞాన ప్రచారం) చేస్తే మాత్రం అన్నీ వస్తాయి. ఇది పరమ సత్యం.

మీరు సత్య ప్రచారం చేయడం వలన యావత్ భూమికే కాదు, సృష్టికంతటికీ చాలా చాలా చాలా చాలా చాలా... మాటల్లో చెప్పలేనంత మేలు జరుగుతుంది. అభివృద్ధి జరుగుతుంది. సత్య ప్రచారం వలన అంతటికీ + అందరికీ చెప్పలేనంత శ్రేయస్కరం జరుగుతుంది. కాబట్టి మీకు కావాల్సిన వాటికంటే ఎక్కువగానే మీకు దక్కుతాయి.

సత్య ప్రచారం అనేది చూడడానికి సింపుల్‌గానే కనపడుతుంది. కానీ సత్య ప్రచారం అనేది ఎంత శక్తివంతమైనదో తెలియజేయటానికి మాటలు సరిపోవు. కేవలం అవగాహన చెందాల్సిందే ! ఉదాహరణకు, శ్రీకృష్ణ పరమాత్ముడు, జీసస్ క్రైస్ట్ చేసినది ఏమిటి ? సత్య ప్రచారం కాకపోతే !! వారు పరమాత్ములు అయినా సరే వారు, సత్య ప్రచారం చేసారు. కృష్ణుడు కానీ, జీసస్ కానీ చెప్పిన విషయాలు ఏమిటి ? వారి బోధనల సారాంశం ఏమిటంటే, "మీరు దైవాలు, మీ దైవత్వాన్ని మీరు పొందండి" అని ! సాక్షాత్తు పరమాత్ములైన వారే సత్య ప్రచారం చేసారు అని అంటే, సత్య ప్రచారం ఎంత మహిమాన్వితమైనదో ఒక సారి అర్థం చేసుకోండి. వారు, మీరు స్కూల్‌కు వెళ్ళండి, మీరు కాలేజ్‌కు వెళ్ళండి, మీరు వ్యాపారం చేయండి, మీరు ఉద్యోగం చేయండి.... అనే విషయాలను ఏమైనా చెప్పారా ? వారే కాదు ఈ భూమి పైన అవతరించిన ఏ మాస్టర్ అలా చెప్పలేదు. వారు చెప్పేది ఎప్పుడూ దైవత్వం గురించే. మీ దైవత్వాన్ని మీరు పొందండి. మీ దైవత్వాన్ని మీరు పొందడానికే మీరు జన్మించారు. మీరు మీ దైవత్వాన్ని పొంది, ఇతరులు తమ దైవత్వం పొందడానికి సహాయం చేయండి అని చెప్పారు. దీన్నే సత్య ప్రచారం అని అంటారు. మీరు గనుక సత్య ప్రచారం చేస్తే మీ సమస్త సమస్యలన్నీ పూర్తిగా ఈ క్షణమే సులభంగా సరళంగా సురక్షితంగా తొలగిపోతాయి. మీరు కోరుకుంటున్న వాటి కంటే ఎక్కువే మీకు దక్కుతాయి. మీకు దైవత్వం కూడా లభిస్తుంది. ఈ సృష్టిలో సత్య ప్రచారాన్ని మించిన కార్యం ఏదీ లేదు. కాబట్టి మీరు సత్య ప్రచారం చేస్తే మీరు అన్నీ చేసినట్టే అవుతుంది. మీరైనా మరెవరైనా చేయాల్సింది సత్య ప్రచారమే, కాబట్టి సత్య ప్రచారం చేయండి, మీకు కావాల్సినవి మీరు హాయిగా పొందండి. ఈ పరమ సత్యాన్ని మీరు నిజంగా పూర్తిగా విశ్వసించండి.

మానవులు ఎదుర్కొనే సమస్యలకు నిజమైన పరిష్కారం కేవలం ఆత్మ విజ్ఞానం ద్వారా మాత్రమే లభిస్తుంది. భౌతిక పరమైన పరిష్కారాలు తాత్కాలికమే. భౌతిక పరంగా మీరు ఒక సమస్యను పరిష్కరిస్తే అది అప్పటికి మీకు పరిష్కారం అయినట్టు కనిపించినా అది మళ్ళీ తిరిగి వస్తుంది. మరో రూపంలో వస్తుంది. ఈ జన్మ కాకపోతే మరో జన్మలో వస్తుంది. జన్మ జన్మలకు వస్తూనే ఉంటుంది. ఎందుకంటే దానికి కావాల్సిన సరైన అవగాహన రాలేదు కాబట్టి అది రిపీట్ అవుతూనే ఉంటుంది. ఆత్మ విజ్ఞాన అవగాహనయే ఏ సమస్యకైనా నిజమైన, సురక్షితమైన మరియు శాశ్వతమైన పరిష్కారం.

సమస్యలకు మనం భౌతికంగా కారణాలు వెతకటం మానేయాలి. బయట కారణాలు ఏవీ ఉండవు. కనిపించడానికి బయట కారణాలు కనపడతాయి కానీ, నిజానికి అసలు మూలం లోపల ఉంటుంది. లోపల ఉన్న సమస్య యొక్క మూల కారణాన్ని ఆత్మ విజ్ఞాన అవగాహనయే తీసివేస్తుంది. కాబట్టి అన్ని సమస్యల పరిష్కారానికి ఆత్మ విజ్ఞానం ఒక్కటే శరణ్యం. మానవుల సమస్యలన్నింటినీ పరిష్కరించ గలిగే ఆత్మ విజ్ఞానాన్ని అంటే, సత్య ప్రచారాన్ని మీరు చేసినప్పుడు, మానవులు మీరు అందించిన దివ్య విజ్ఞానం ద్వారా తమ తమ సమస్యల నుండి తక్షణమే విముక్తులవుతారు.

ఆనందిస్తారు. ఇలా మానవులకు ఆనందాన్ని అందించిన మీకు పరమానందమే కదా లభించేది. ఎంతో మందికి మేలు చేస్తున్న మీకు మేలు మాత్రమే కదా జరిగేది. ఎంతో మందికి మీరు అందించిన విజ్ఞానం ద్వారా వారి సమస్యలు తీరుతాయి. వారి కోరికలు తీరుతాయి. వారు తమ నిజ తత్వమైన దైవత్వాన్ని పొందుతారు. ఇంత గొప్ప పని చేస్తున్నందుకు మీకు కూడా మీ సమస్యలన్నీ తీరిపోతాయి. మీ కోరికలన్నీ తీరుతాయి. మీరు పరమానందంలో ఉంటారు. ఇలా పరమానందంలో ఉంటున్న మీరు ఇంకా ఎక్కువ సత్య ప్రచారం చేయగలుగుతారు. అప్పుడు ఇంకా ఎక్కువ లాభాలు మీకు జరుగుతూనే ఉంటాయి. అభివృద్ధికి అంతం ఉండదు. మీరు సత్య ప్రచారం చేస్తూ ఉంటే, మీ అభివృద్ధి జరుగుతూనే ఉంటుంది. ఆత్మ పరిణామ క్రమంలో మీరు ఎంతగానో అభివృద్ధి చెందుతూనే ఉంటారు. సృష్టిలో అభివృద్ధి అనేది నిరంతరంగా, అనంతంగా సాగే ప్రక్రియ. దీనికి అంతం అంటూ ఉండనే ఉండదు. శాశ్వతరీతిలో ఇది ఇలా సాగిపోతూనే ఉంటుంది. సత్య ప్రచారం చేయడం అని అంటే, సర్వ శ్రేయస్కరాలను, సకల ఆనందాలను, సమస్త సౌభాగ్యాలను పొందడమే !

✪✪✪

సరైన సత్య గురువును వెతికి పట్టుకుంటే జీవిత పరమార్థం దక్కినట్టే ! మీరేం చేసినా సత్య గురువు అన్వేషణ చేయకుండా ఉంటే వృథా ! సత్య మార్గానికి సంపూర్ణంగా, శాశ్వతంగా అంకితమైన జీవితమే అసలు జీవితం !

II. సత్య ప్రచార మహిమ

ప్రశ్న : అసలు సిసలు సత్య ప్రచారం, సత్యంగా సత్య ప్రచారం అంటే ఏమిటి ?

జవాబు : జ్ఞానోదయం పొందనిదే ఎవరు కూడా క్లాసులు చెప్పకూడదు. ధ్యాన కేంద్రాలు ఓపెన్ చేయకూడదు. ధ్యాన కేంద్రాలు అసలే నిర్వహించకూడదు.

జ్ఞానోదయం జరగనిదే క్లాసులు చెప్పినా, ధ్యాన కేంద్రాలు నిర్వహించినా నరకం కోటి% గ్యారంటి. జాగ్రత్త ! గురువులకు అసిస్టెంట్లుగా పని చేయాలి కానీ బోధించకూడదు. ధ్యాన కేంద్రాలలో సేవ చేయాలి కానీ ఓపెన్ చేసి నిర్వహించకూడదు.

సత్యమార్గంలోకి రావడం అన్నా లేక సత్యప్రచారం చేయటం అన్నా ఒక్కటే !

సత్యమార్గ మహిమ అన్నా లేక సత్యప్రచార మహిమ అన్నా ఒక్కటే !

ఆధ్యాత్మిక సత్యాలను నీవు ఆచరిస్తూ ఉండాలి. నీవు ఆచరిస్తూ ఉండటమే ప్రచారం అవుతుంది. సద్గురు తారా విశాల్ మార్గదర్శి గ్రంథంలో తెలియ జేయబడిన సత్యాలను మరియు సాధనలను క్రమం తప్పకుండా, త్రికరణ శుద్ధిగా నీవు ఆచరిస్తూ ఉండాలి. నీవు సత్యాలను ఆచరించడమే సత్యప్రచారం అవుతుంది. సత్యాచారమే సత్యప్రచారం.

సత్యాచారమే సత్యప్రచారం అవుతుంది తప్ప మరొకటి కానే కాదు. ఈ విషయాన్ని చాలా బలంగా గుర్తుంచుకోండి.

సద్గురు తారా విశాల్ మార్గదర్శిలో తెలియజేయబడిన సత్యాలను మరియు సాధనలను మీరు ఆచరిస్తూ ఉంటే, మీ దేహంలో మరియు మీ జీవితంలో చాలా మంచి మంచి మార్పులు వస్తాయి. మీకు జరుగుతున్న మంచిని చూసి ఎవరైనా వారికై వారే అడిగినప్పుడు మీరు ఆచరిస్తున్న వాటి గురించి చెప్పాలి. వారికి మార్గదర్శి గ్రంథం గురించి చెప్పి దాన్ని చదవమని చెప్పండి. ప్రచారం పేరుతో వెంట పడి దేబరించవద్దు. ఇబ్బంది పెట్టవద్దు.

సరైన ఆత్మ విజ్ఞాన పుస్తకాల పేర్లు చెప్పండి, వాటిని చదవమని చెప్పండి. మీకు వీలైతే, వారు సిన్సియర్ వాళ్ళు అయితే బుక్స్ కొనివ్వండి. ఇది మాత్రమే సరైన ప్రచారం అవుతుంది. ఈ విధంగా మీరు నేను చెప్పినట్టుగా చేస్తూ ఉంటే .....

1. సత్యాచారం(సత్య ప్రచారం) చేయడం అని అంటే, మీరు సమస్యలను సులభంగా, సరళంగా, సురక్షితంగా మరియు తక్షణమే పరిష్కరించడం అని అర్థం.

2. సత్యాచారం(సత్య ప్రచారం) చేయడం అని అంటే, మీ కోరికలను మీరు నెరవేర్చుకోవడం అని అర్థం.

3. సత్యాచారం(సత్య ప్రచారం) చేయడం అని అంటే, మీరు మీ యొక్క ఆత్మ పరిణామ క్రమాన్ని వేగవంతం చేస్తున్నట్టే !

4. సత్యాచారం(సత్య ప్రచారం) చేయడం అని అంటే, మీరు అన్ని రకాలుగా, అన్ని కోణాలలో అభివృద్ధి చెందుతున్నట్టే !

5. సత్యాచారం(సత్య ప్రచారం) చేయడం అని అంటే, అసంభవాలను సుసంభవాలుగా చేయడమే !

6. సత్యాచారం(సత్య ప్రచారం) చేయడం అని అంటే, అసాధ్యాలను సుసాధ్యాలుగా చేయడమే !

7. సత్యాచారం(సత్య ప్రచారం) చేయడం అని అంటే, మీరు పరమాత్మురాలిగా లేక పరమాత్ముడిగా కావడమే !

8. సత్యాచారాన్ని(సత్య ప్రచారాన్ని) మించిన సాధన లేనే లేదు.

9. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తేనే మోక్షం లేక దైవత్వం వస్తుంది.

10. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీకు సృష్టి యావత్తూ సంపూర్ణంగా సహకరిస్తుంది.

11. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీకు సృష్టిలోని సర్వ-సర్వ, సకల-సకల, సమస్త శక్తులు అండగా ఉంటాయి.

12. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీకు ప్రకృతి అంతా తోడుగా, నీడగా, అండగా ఉంటుంది.

13. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, అంతా నీకు పూర్తి అనుకూలంగానే ఉంటుంది.

14. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే అందరూ నీకు పూర్తిగా అనుకూలంగానే ఉంటారు. అందరూ నీకు పూర్తిగా సహాయ సహకార సమన్వయాలను అందిస్తారు.

15. సత్యాచారం(సత్య ప్రచారం) చేసే వారికి సృష్టిలోని సర్వస్వమూ పూర్తి అనుకూలంగా మారిపోతుంది.

16. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, పంచ భూతాలు నీకు సంపూర్ణమైన సమగ్రమైన రక్షణను మరియు అండ దండలను అందిస్తాయి.

17. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, సృష్టిలోని ప్రతీ అణువు, ప్రతీ పరమాణువు మీకు పూర్తి అనుకూలంగా అయి, మీకు పూర్తి సహాయాలు చేస్తాయి.

18. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే ఖనిజ ప్రపంచం, వృక్ష ప్రపంచం, జంతు ప్రపంచాల నుండి మీకు సంపూర్ణ మద్దతు లభిస్తుంది.

19. ఈ భూమి పైన సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తున్న మీకు, ఈ భూమి మీకు అనంతమైన ప్రేమతో మీకు సంపూర్ణంగా సమగ్రంగా సహాయ సహకార సమన్వయాలను అందిస్తుంది. అన్ని రకాల రక్షణలను అందిస్తుంది.

20. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, ''మీకు మీరు" సంపూర్ణంగా సమగ్రంగా ఎరుకలోకి వస్తారు.

21. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, ''మీకు మీరు'' పూర్తి అనుకూలంగా మారిపోతారు.

22. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, సృష్టిలోని మాస్టర్లందరి పూర్ణ మద్దతు మీకు ఉంటుంది.

23. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీకు చిన్న సమస్యల దగ్గరి నుండి బ్రహ్మాండానికి సంబంధించిన సమస్యలన్నీ సులభంగా సరళంగా సురక్షితంగా పూర్తిగా శాశ్వతంగా తక్షణమే పరిష్కారం అయిపోతాయి.

24. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీ శత్రువులు కూడా మీకు మిత్రులైపోతారు. మీకు పూర్తి అనుకూలంగా మారిపోతారు.

25. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీకు ఇబ్బందులు కలిగించే వాళ్ళు మీకు సహాయాలు చేయడం మొదలు పెడతారు.

26. సత్యాచారం(సత్య ప్రచారం) వలన ఆత్మ మూలాలు సమూలంగా మారిపోతాయి. కాబట్టి మీకు కావలిసినది ఏదైనా సరే సులభంగా ఆనందంగా తక్షణమే సురక్షితంగా దక్కుతుంది.

27. సత్యాచారం(సత్య ప్రచారం) యొక్క మహిమతో మీకు ఎన్నెన్నో దివ్య శక్తులు లభిస్తాయి. వాటి వలన మీరు మీ దేహాన్ని మరియు మీ జీవితాన్ని ఎలా అంటే అలా మార్చుకోవచ్చు.

28. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీకు సంపూర్ణమైన సమగ్రమైన పటిష్ఠమైన చెక్కు చెదరని

మహా ఆరోగ్యం ప్రాప్తిస్తుంది.

29. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీకు సంపూర్ణ ఆయుష్షు ప్రాప్తమవుతుంది. అమర విద్య సాధన చేస్తే భౌతిక దేహంతో అమరత్వం కూడా సిద్ధిస్తుంది సులభంగా, సరళంగా !

30. సత్యాచారం(సత్య ప్రచారం) చేయడం అంటే, శాశ్వత రీతిలో మహా అదృష్టవంతులవడమే !

31. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీరు అంతటికీ+అందరికీ సరిగా అర్థం అవుతారు. మిమ్మల్ని అందరూ అర్థం చేసుకుంటారు. మీ గొప్ప తనం అందరికీ అర్థం అవుతుంది. మీ దివ్యత్వం అందరూ గుర్తిస్తారు. మీతో వైరం మానుకుంటారు. మీకు కావాల్సిన విధంగా మారిపోయి మీకు సంపూర్ణంగా సహకరిస్తారు.

32. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు చేసింది, చేసేది ఏదైనా సరే దివ్యమైన గుర్తింపునే పొందుతుంది. అందరికీ ఆమోదం అవుతుంది. అందరూ హర్షిస్తారు.

33. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీ జీవితం ఎందరికో ఆదర్శప్రాయం అవుతుంది.

34. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీకు ఎల్లప్పుడూ విజయమే లభిస్తుంది.

35. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీకు అభినందనలు, సన్మాన సత్కారాలు జరుగుతూనే ఉంటాయి.

36. సత్యాచారం(సత్య ప్రచారం) చేస్తుంటే, మీరెంతో గొప్ప వారవుతారు, మీరు మహాత్ములవుతారు, మీరు పరమాత్ములవుతారు.

37. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు పరమానందాన్ని పొందుతారు. అందరి పరమానందానికి కారణం అవుతారు.

38. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు జడ్జిమెంట్ల నుండి సంపూర్ణంగా, సమగ్రంగా, శాశ్వతంగా రక్షించ బడతారు.

39. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీకు సర్వస్వంతో మరియు సర్వులతో మైత్రి ఏర్పడుతుంది.

40. సత్యాచారం(సత్య ప్రచారం) వలన ఈ లోకంలోనివే కాకుండా మీకు సర్వ సృష్టిలోని అన్ని ప్రాణుల, జీవుల, జాతులతో ఉన్న వైరం తొలగిపోయి, మైత్రి భావం ఏర్పడి, మీ మార్గం నుండి పూర్తిగా అడ్డం తప్పుకుంటాయి.

41. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు గతంలో చేసినవన్నీ సరి అవుతాయి. మీరు చేసినవన్నీ మీకు పూర్తిగా అనుకూలించి, ఇప్పుడు ఈ వర్తమానంలో మీరేం కోరుకుంటున్నారో అందుకు సహకరిస్తాయి.

42. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు కోరుకుంటున్న వారు మీకు దక్కుతారు.

43. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు కోరుకుంటున్నవి మీకు దక్కుతాయి.

44. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు మహా విజేతలవుతారు.

45. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు మహా ఆత్మ విజ్ఞానులవుతారు.

46. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు స్వచ్ఛం అవుతారు. పరిశుద్ధం అవుతారు. పరమోన్నతం అవుతారు. పరమోత్తమం అవుతారు.

47. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు సత్య స్వరూపులుగానే పరిణమిస్తారు.

48. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు మహా ఐశ్వర్యవంతులవుతారు.

49. సత్యాచారం(సత్య ప్రచారం) వలన మీరు అనంత దివ్య శక్తి స్వరూపులుగా విరాజిల్లుతారు.

50. సత్యాచారం(సత్య ప్రచారం) మహిమ వలన మీరు మీ నిజ తత్వాన్ని గ్రహించి, మూల చైతన్య స్వరూపులై శోభిల్లుతారు. సత్య ప్రచార మహిమ వలన మీకు తక్షణమే సర్వావగాహన సిద్ధిస్తుంది.

చాలా బలంగా గుర్తుంచుకోండి...

ఆచారమే ప్రచారం !

Teaching is the best way of learning. నేర్చుకోవడానికి బోధించడమే ఉత్తమమైన మార్గం – అని ఈ ఇంగ్లీష్ వాక్యం యొక్క అర్థం. అయితే, ఇది కేవలం భౌతిక జీవితంలో,

భౌతిక విషయాలకు మాత్రమే పనికి వస్తుంది. ఈ సూత్రం భౌతిక జీవితానికి ప్రాణం పోస్తుంది. ఆధాత్మిక జీవితంలో మాత్రం ప్రాణం తీస్తుంది.

మీరు ఒక సద్గురువు కానిదే బోధించకూడదు. జ్ఞానోదయం పొందిన తర్వాత ఎన్నెన్నో జన్మలు మీరు ఒక సద్గురువు దగ్గర శిష్యరికం చేస్తే ఎప్పటికో మీకు బోధించే అర్హత వస్తుంది. అప్పుడు మాత్రమే బోధించాలి. అంతకు ముందు బోధిస్తే జడ్జ్‌మెంట్ అప్లై అయి భయంకరమైన కర్మను అనుభవించాల్సి వస్తుంది.

సద్గురు స్థితి పొందక ముందే క్లాస్ చెప్పడం అంటే మీరు కర్మలను ఆహ్వానిస్తూ ఉన్నట్టే. సద్గురువు స్థితికి రాకముందే కౌన్సెలింగ్ చేయడం అని అంటే ఎదుటి వారి కర్మలను మీరు స్వీకరిస్తూ ఉన్నట్టే. సద్గురువు కాని వారు ఏ ఇంట్లో అయితే క్లాస్ చెబుతారో ఆ ఇంటి వారికి పెద్ద

కర్మ చుట్టుకుంటుంది. సద్గురువు కాని వారు బోధించడానికి ఎవరెవరైతే క్లాస్ అరెంజ్‌మెంట్స్ చేస్తారో వారందరికీ పెద్ద కర్మ చుట్టుకుంటుంది. సద్గురువు స్థితిని పొందని వారు కౌన్సెలింగులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసిన వారికి పెద్ద కర్మ చుట్టుకుంటుంది. సద్గురువు స్థితిని పొందని వారు ఏ ఇంట్లో అయితే కౌన్సెలింగ్ చేస్తారో ఆ ఇంటికి మరియు ఆ ఇంటి వారికి పెద్ద కర్మ చుట్టుకుంటుంది. సద్గురువు స్థితిని పొందని వారు క్లాసులు మరియు కౌన్సెలింగులు నిర్వహించడానికి ఎవరెవరు సహాయం చేస్తారో వారందరికి పెద్ద కర్మ చుట్టుకుంటుంది. డబ్బులు సహాయం చేసినా లేక మాట సహాయం చేసినా లేక మరే రకమైన సహాయం చేసినా పెద్ద కర్మ చుట్టుకోవడం ఖాయం. జాగ్రత్త !

సద్గురువు స్థితిని పొందని వారు ధ్యాన కేంద్రం తెరిచి నిర్వహిస్తూ ఉంటే, వారికి చాలా పెద్ద కర్మ చుట్టుకుంటుంది. ఎందుకంటే ఒక ధ్యాన కేంద్రం ఓపెన్ చేసి నడిపించాలంటే కనీసం జ్ఞానోదయం అయి వుండాలి. ఇక దాన్ని నిరవధికంగా నడిపించాలంటే సద్గురువు స్థితిని తప్పక పొంది ఉండాలి. ఒకవేళ ఏ సరికాని గురువు మాటలనో పట్టుకుని మీరు ఓపెన్ చేసినా దాన్ని ధ్యాన కేంద్రంగా పరిగణించకుండా కేవలం సాధకుల సమావేశ మందిరంగా మాత్రమే పరిగణించాలి. తక్షణమే దాని పేరు మార్చి సాధకుల సమావేశ మందిరం అని పేరు పెట్టాలి. అందులో క్లాసులు మరియు కౌన్సెలింగులు జరగకుండా చూడాలి. క్లాస్ చెప్పడం మరియు కౌన్సెలింగ్ చేయడం అంటే ఆపరేషన్ చేయడం లాంటిది. అందరూ పేషంట్లే అయినప్పుడు, అక్కడ ఒక క్వాలిఫైడ్ డాక్టరే లేనప్పుడు, ఎవరు ఎవరికి వైద్యం చేస్తారు ?! ఒక పెషంట్ ఇంకో పేషంట్‌కు వైద్యం చేస్తాడా ?!

వీలైనప్పుడల్లా సాధకులు కలుసుకుని తమ తమ సాధక బాధల గురించి చర్చించుకుని కాసేపు సేద తీరి, కాసేపు సాధన చేసుకుని, సద్గురువులు సూచించిన సద్గ్రంథ పఠనం కాసేపు చేసుకుని ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళాలి. అంతే, అక్కడ జరగాల్సింది. అంత కంటే ఎక్కువ జరిగాయో... జరగాల్సిన శాస్తి జరిగి తీరుతుంది.

చాలా బలంగా గుర్తుంచుకోండి...

సత్యాచారమే సత్యప్రచారం !

చాలా బలంగా గుర్తుంచుకోండి...

ఆచారమే ప్రచారం !

దైవత్వం పొందిన ఒక సత్యగురువు ఎప్పుడూ సాధకులను ఆచరణ మాత్రమే చేయమని చెబుతాడు. మీరు ఆచరిస్తూ ఉండండి అప్పుడు ఆటోమేటిక్‌గా ప్రచారం దానంతట అదే జరిగి పోతుందని చెబుతాడు. మీరు ప్రచారం చేస్తూ ఉండండి అదే ఆచారం అవుతుందని చెప్పేవాడు నిఖార్సైన అజ్ఞాని మరియు దొంగ గురువు అని తెలుసుకోండి.

ప్రచారం చేయండి అదే ఆచారం అవుతుందని చెప్పేవాడు తాను నాశనం అవడమే కాకుండా అందరినీ నాశనం చేసేవాడని గుర్తుంచుకోండి.

ఎందుకంటే, ప్రచారం అనేది ఆచారం యొక్క ఫలితం. ఆచారం అనేది విత్తనమైతే ప్రచారం అనేది ఫలం. విత్తనం వేసినప్పుడు మాత్రమే ఫలం వస్తుంది కదా. ***ఆచరించకుండా ప్రచారం చేయడం అనేది విత్తనమే వేయకుండా ఫలం కోసం ప్రయత్నించడం లాంటిది.*** ఆహారం తీసుకుంటే శక్తి వస్తుంది. శక్తి కలగడం అనేది ఆహారం తీసుకోవడం ద్వారా ఉద్భవించే ఫలితం. మీకు శక్తి కావాలి అని అంటే మీరు ఆహారం తీసుకోండి, ఆ తర్వాత శక్తి దానంతట అదే వస్తుంది కదా. ఆహారమే శక్తిగా మారుతుంది కానీ శక్తి అనేది ఎక్కడి నుండో ఊడి పడటం లేదు కదా. ఆహారమే శక్తి. ఊరికే ప్రచారం చేయడం అనేది ఆహారం తీసుకోకుండా శక్తి కోసం ప్రయత్నించినట్టుగా ఉంటుంది.

మీరు మౌనంగా ఆచరించండి అప్పుడు సత్యం దానంతట అదే

తనను తాను ప్రచారం చేసుకుంటుంది.

❖ ❖ ❖

ఆచారమే నిజమైన ప్రచారం అనే సత్యం తెలియని గురువులు అమాయక జనాల చేత తమ సంస్థ యొక్క కాన్సెప్ట్‌లను వ్యాపార దృక్పథంతో ప్రచారం చేయిస్తూ కమర్షియల్‌గా లాభం పొందుతున్నారు. మేము ధ్యాన ప్రచారం చేసి జనాలకు మేలు చేస్తున్నాము అనే భ్రమలో ప్రచారం చేసే వారున్నారు. కానీ వారికి తెలియదు వాస్తవానికి జరుగుతున్నది ఏమిటో...? ప్రజలు ఇకనైనా మేలుకోవాలి.

ఆత్మ అని చెబుతున్నప్పుడు నేను ఆత్మ అనే దానిని అనుభవించానా అని తనను తాను ప్రశ్నించుకోవాలి. ఆచరించి అనుభవ జ్ఞానం లేనిదే నేను ఎలా ప్రచారం చేస్తాను ? అని నిజాయితిగా తనను తాను విమర్శించుకుని సత్యాన్ని గ్రహించాలి. అనుభవ జ్ఞానం లేనిదే ప్రచారం చేయకూడదు అని అంటున్నాను. అనుభవ జ్ఞానం లేనిదే, మీకు జ్ఞానోదయం జరగనిదే బోధించకూడదు అనే నియమాన్ని గుర్తు చేస్తున్నాను. జ్ఞానోదయం మీకు అయితే మీరు బోధించవచ్చు.

పార్ట్ - 32

ఆనాపానసతి ధ్యాన సాధన చేస్తే పిచ్చిపడుతుంది... చచ్చిపోతారు

- ఓషో

ఆనాపానసతి ధ్యాన సాధన చేస్తే పిచ్చిపడుతుంది... ఆ తర్వాత చచ్చిపోతారు - ఓషో

ప్రశ్న) నేను దాదాపు ఆరేళ్ళు 'ఆనాపానసతి' ధ్యానం చేసాను. ఈ ధ్యానం ద్వారా కొన్ని లాభాలు కలిగిన మాట నిజమే. అయినా, నా పరిస్థితిలో పెద్దగా చెప్పుకోదగ్గ మార్పేమీ కనపడలేదు. మొదటి సారి మీరు, మీ MAB దైవత్వ సాధన గురించి చెప్పినప్పుడు నేను ఒక్క సారిగా ఒప్పుకోలేక పోయాను. నాకు ఆనాపానసతి ధ్యానమే హాయిగా అన్పించింది. అయితే, ఒకప్పుడు ఆనాపానసతి ధ్యానాన్ని విశేషంగా, ఆల్‌మోస్ట్ భారతదేశమంతటా ప్రచారం చేసిన మీరే దాన్ని పూర్తిగా, శాశ్వతంగా వదిలేసి, ఇప్పుడు దైవత్వ సాధన గురించి చెప్పడంలో నాకు అర్థం కాని పరమార్థం ఏదో ఉందనిపించింది. అందుకే నన్ను నేను బాగా సెల్ఫ్ కౌన్సిలింగ్ చేసుకుని మారి, మీ యొక్క MAB దైవత్వ సాధన చేసాను. ఆశ్చర్యకరంగా, మీ MAB దైవత్వ సాధన చేసిన మొదటి రోజే, ఎంతో మార్పును, నేను స్పష్టంగా గమనించ గలిగాను. వాస్తవంగా చెప్పాలంటే ఆనాపానసతి ద్వారా ఆరేళ్ళుగా పొందని ఫలితాన్ని ఒకే ఒక సిటింగ్‌లో మీ MAB దైవత్వ సాధన ద్వారా పొంద గలగడం ఆశ్చర్యంగా, అద్భుతంగా ఉంది. నేనే కాదు నా లాంటి వాళ్ళు చాలా, చాలా, చాలా మంది ఉన్నారు. ఆరేళ్ళు = ఒక సిటింగ్ ! ఇంత తేడా ఎలా ?! దయచేసి వివరించ గలరు.

- దేశవ్యాప్తంగా చాలా, చాలా, చాలా, చాలా, చాలా, చాలా, చాలా, చాలా మంది అడిగారు.

సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ఆనాపానసతి అసమగ్రమైన ఒక పాత పద్ధతి. దీని యొక్క పరిధి చాలా చిన్నది. ఇది ఫలితాలను చాలా, చాలా చాలా నిదానంగా మరియు అతి తక్కువ మోతాదులో ఇస్తుంది. మార్పు అనేది ఈ ధ్యానం ద్వారా ఎంతో మెల్లి మెల్లిగా అవుతుంది.

ప్రస్తుతం ఇప్పుడు బయట ప్రచారంలో ఉన్న ఆనాపానసతి ధ్యానం అసంపూర్ణమైనది. నిజానికి అది ఒక మెట్టు మాత్రమే, గమ్యం మాత్రం కానే కాదు. అసలైన దశకు చేరుకోవడానికి ఈ ఆనాపానసతి ధ్యానం అనేది ఒక ఉపకరణం మాత్రమే, అంతే. అయినా ఇప్పుడిది పాతబడి పోయింది. ఈ న్యూఏజ్‌లో దీని అవసరం లేనే లేదు. ఆనాపానసతి కంటే కోట్ల రెట్లు శక్తివంతమైన ధ్యానాలు ఎన్నో ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

ఒకప్పుడు నేనూ దీన్ని చాలా గొప్ప ధ్యానంగా పరిగణించాను, చెప్పాను కూడా. కాని లోతుగా పరిశోధిస్తే అసలు సత్యం తెలిసింది.

అప్పుడు నేను చాలా షాక్‌కు గురి అయ్యాను. చాలా, చాలా నిదానంగా మరియు అసంపూర్ణమైన ఫలితాలను ఇచ్చే ఈ ఆనాపానసతి ధ్యాన పద్ధతిని, నేను చాలా గొప్ప శక్తివంతమైనదని మరియు శీఘ్రవంతంగా ఫలితాలను ఇస్తుందని ప్రచారం చేసి తప్పు చేసానా అని బాధ పడ్డాను. ఆనాపానసతి ధ్యానం అనేది మొదటి మెట్టు మాత్రమే. అసలైన రెండవ భాగానికి లేక దశ కోసం ఆనాపానసతి నిన్ను సిద్ధం చేస్తుంది, అంతే. నీవు కేవలం శ్వాసను మాత్రమే గమనించుకుంటూ కూర్చుంటే మాత్రమే సరిపోదు. ఈ ఆనాపానసతి ధ్యానాన్ని ప్రచారం చేసేవారు కేవలం శ్వాసను గమనిస్తే చాలు అని అంటారు. **నేను మార్గదర్శి మొదటి భాగంలో ఈ ఆనాపానసతి గురించి తెలియజేసాను కానీ పూర్తిగా తెలియజేయలేదు.**

కేవలం శ్వాసను గమనిస్తూ ఉన్నంత మాత్రాన జ్ఞానోదయం (నిర్వాణం) కలగదు. ఇలా చేయటంవలన కొన్ని బాధల నుండి ముక్తి కలుగుతుందే తప్ప మోక్షం కానీ లేక జ్ఞానోదయం కానీ జరగదు.

ఈ ఆనాపానసతి ధ్యానం వలన కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, ఆ ప్రయోజనాలు చాలా చిన్నవి మరియు పరిమితమైనవి.

ఈ ఆనాపానసతి ధ్యానాన్ని ప్రచారం చేసేవారిలో కొందరు ప్రపంచంలో ఉన్న మిగతా ధ్యానాలు అన్నీ తప్పు కేవలం ఇదొక్కటే కరెక్ట్, కాబట్టి ఈ ఆనాపానసతి ధ్యానాన్ని మాత్రమే చేయండి అని చెబుతారు. ఇంకా కొన్ని మిగతా సంస్థలు కూడా మా ధ్యానమే గొప్పది అని చెబుతాయి. ఇలా ఎవరికి వారు తమదే గొప్ప అని అనుకోవడం చిత్రం ! మా ధ్యానమే కరెక్ట్ అని మొండిగా వాదించే వారిని అలా ప్రేమగా వదిలేయాలి. నిజం అనేది నిలకడ మీద తేలుతుంది. సత్యమేవ జయతే !

చాలా చిన్నది, అసంపూర్ణమైనది, అసమగ్రమైనది మరియు పాతబడిపోయిన ఆనాపానసతి ధ్యానాన్ని ప్రచారం చేసి ఎంత తప్పు చేసాను అని బాధతో మౌనంగా కొన్ని నెలలు అలా ఉండి పోయాను. ...*"నీ ఖర్మ కొద్దీ నీవు ఆ యొక్క ఆనాపానసతి ధ్యానాన్ని ప్రచారం చేసావు, అది సరైనది కాదు. అందుకే నిన్ను దానిలో నుండి బయటకు తీసుకు వచ్చాం. సరే, జరిగినదేదో జరిగిపోయింది. అనవసరంగా బాధ పడకు అని "దైవం"లో నుండి మెసేజ్ వచ్చింది".* దాంతో నేను కుదుట పడ్డాను. అయినా ఏం చేయాలో పాలుపోక అలా ఉండి పోయాను. అప్పటికే నేను ప్రపంచంలో ప్రచారంలో ఉన్న ప్రధానమైన ధ్యాన పద్ధతుల మీద ఒక సారి పరిశోధన చేసాను. మళ్ళీ మరోసారి పరిశోధించాలి అని, మళ్ళీ రీసెర్చ్ మొదలు పెట్టాను. అలా చేస్తూ, చేస్తూ..... ఆధ్యాత్మిక సూత్రాలను ఆచరిస్తూ రక రకాలుగా ప్రయోగాలు, పరిశోధనలు చేస్తూ ఉన్న దశలో ఒక రోజు నాకు ''అల్ట్రా కాన్షియస్'' నుండి, మెసేజ్‌లు రావడం మొదలైంది. ఆ మెసేజ్‌ల యొక్క సారాంశం :-

ఆనాపానసతి ధ్యానం చేస్తూ గమ్యానికి చేరుకోవడం అంటే.. కాలినడక ప్రయాణం లాంటిది. ప్రస్తుతం ఈ దివ్య స్వర్ణకాంతి అమర యుగంలో రాకెట్ లాంటి & బిమ్ షిప్ లాంటి & స్పేస్ షిప్ లాంటి ధ్యాన సాధనలు ఉన్నాయి.

ఆనాపానసతి ధ్యానం చాలా, చాలా, చాలా, చాలా, చాలా చిన్నది, అసంపూర్ణమైనది, అసమగ్రమైనది మరియు పాతబడిపోయినది... దానికో నమస్కారం పెట్టి దాన్ని ప్రేమగా పూర్తిగా శాశ్వతంగా వదిలేయాలి - అంతే ! మరో మార్గం లేదు బాగు పడాలంటే !

నాకు "అల్ట్రా కాన్షియస్" నుండి వస్తూ ఉన్న మెసేజెస్‌ను స్వీకరిస్తూ, అర్థం చేసుకుంటూ ఆచరిస్తూ.. పరిశోధించసాగాను. ఫలితాలను పరిశీలిస్తూ, రక రకాలుగా ప్రయోగాలు చేస్తూ సాధనల మీద సాధికారత సంపాదించ సాగాను. అప్పుడు నా లక్ష్యం ఒక్కటే, ఈ సారి నేను ప్రపంచానికి పరిచయం చేయబోయే ధ్యాన పద్ధతి నిజంగా అత్యంత శక్తి వంతమైనది, అత్యంత శీఘ్రంగా ఫలితాలను ఇచ్చేది, సంపూర్ణమైనది, సమగ్రమైనది, పరమోన్నతమైనదీ అయి ఉండాలి అని ! అలా మూడు సంవత్సరాలు విశేషమైన పరిశోధనలు & ప్రయోగాలు చేసాను. పరమాత్మ స్వరూపులు రాసిన గ్రంథాలను దేశ విదేశాల నుండి తెప్పించుకుని చదువుతూ, సాధన చేస్తూ నా జీవితాన్నే పణంగా పెట్టి ప్రయోగాలు చేసాను. ఈ మూడు సంవత్సరాల్లో నేను ఒక సంవత్సరమైతే అసలు బయటకే రాలేదు. మిగిలిన రెండు సంవత్సరాల్లో పుస్తకాల కోసం మరియు ఇతర అత్యవసర పనుల కోసం చాలా తక్కువ సార్లు బయటికి వచ్చాను. నా శిష్యులు చాలా మంది ఈ మూడు సంవత్సరాల్లో, ఈ ప్రయోగాల్లో పూర్తి అంకితభావంతో పాల్గొన్నారు. మూడు సంవత్సరాల పరిశోధనలో నేను తెలుసుకున్న విషయం ఏమిటంటే, నేను భూమి మీదకు వచ్చిందే, కొన్ని వినూత్నమైన, పరమోన్నతమైన ధ్యాన సాధనలను పరిచయం చేయడానికి మరియు పరమోన్నతమైన ఆత్మ విజ్ఞానాన్ని అందించడానికి. నేను నిరంతరంగా ధ్యాన సాధనలో ఉండే సరికి నా జన్మ యొక్క పరమ లక్ష్యం పూర్తిగా బయటపడింది. నా జన్మ యొక్క మహా కారణాన్ని, దివ్యోద్దేశాన్నీ పూర్తిగా తెలుసుకున్న నేను - మూల చైతన్యం అందించే పరమోత్తమ, పరమోన్నత ఆత్మ విజ్ఞానాన్ని మరియు పరమోత్తమ, పరమోన్నత ధ్యాన సాధనలను, మూల చైతన్యం నుండి డౌన్‌లోడ్ చేసుకుని ప్రాక్టికల్‌గా నా పైన ప్రయోగించి, ఫలితాలను పరిశీలించి, నిర్ధారించుకుని, అప్పుడు ప్రపంచానికి ప్రకటించాను.

ప్రస్తుతం ప్రపంచంలో ప్రచారంలో ఉన్న ధ్యాన సాధనలలో చాలా రకాలైనవి ఉన్నాయి. వాటిలో కొన్ని సూపర్ లెవెల్‌కు అంటే పరమోత్తమ స్థాయికి సంబంధించినవైతే మరికొన్ని మధ్యమ స్థాయికి చెందినవి, ఇంకొన్ని కింది స్థాయి లేదా ప్రాథమిక స్థాయికి సంబంధించినవి. ఇలా చాలా చాలా చిన్న స్థాయికి సంబంధించినదే ఈ ఆనాపానసతి. నర్సరి లాంటి ఆనాపానసతి ధ్యానాన్ని తక్షణమే వదిలేసి పి. హెచ్‌డి. ధ్యానాలను చేయాలి.

ఈ ధ్యాన పద్ధతి, సహజమైన శ్వాసను గమనించమని చెప్తుంది. సహజమైన శ్వాసను గమనించినప్పుడు, మనసు శూన్యం అవుతుందని, అప్పుడు విశ్వమయ ప్రాణశక్తి లోపలికి ప్రవహిస్తుంది..... దానితో సాధకుడికి బుద్ధత్వం ప్రాప్తిస్తుంది, అని చెప్తుంది ఈ ధ్యాన పద్ధతి. ఇది నిజం కాదు.

ఇందులో ప్రధానమైన రెండు సమస్యలు ఉన్నాయి.

ఒకటి : సహజ శ్వాస

రెండు : మనసు శూన్యం కావడం

మొదటి సమస్య, సహజ శ్వాస యొక్క వివరణ : అజ్ఞానపు భావాలను ఎన్నో కలిగి ఉన్న మానవుడికి, సహజమైన శ్వాస క్రమం ఏనాడో తప్పిపోయింది. ఎందుకంటే.....

భూమి అనబడే ఈ మూడు పరిధుల లోకంలోకి అనుభవ జ్ఞాన సేకరణకోసం వచ్చిన ఆత్మలు సుమారుగా ఒక కోటి 5 లక్షల సంవత్సరాల నుండి ఒక కోటి 50 లక్షల సంవత్సరాలకు పైగానే అవుతుందని రామ్‌తా మరి ఇంకొంత మంది మాస్టర్స్ చెప్తారు. ముఖ్యంగా గత 3 లక్షల సంవత్సరాల క్రితం భూమి పైన జరిగిన సంఘటనలు పూర్తిగా మానవ జాతి చరిత్రను మార్చి వేసాయి. 12 పోగుల జన్యువును 2 పోగులుగా మార్చడం ఇంకా అనేకానేక దారుణాలు జరిగాయి.. వీటి ఫలితం వలన అత్యంత అధమ స్థాయికి మానవ జాతి పడిపోయింది.

భావాన్ని బట్టి శ్వాస - శ్వాసను బట్టి భావం !

మీరు శ్వాసించే పద్ధతి, మీ భావాన్ని బట్టి మారుతూ ఉంటుంది. మీలోని భావావేశాలు మీ శ్వాస క్రియ పైన ప్రభావాన్ని చూపెడతాయి. మీరు ఆందోళనతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు కోపంగా ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు నిరాశతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు కామోద్రేకంతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీ రతీ కార్యం అయిపోయిన తర్వాత ఒక రకంగా, మీరు ప్రేమతో ఉన్నప్పుడు ఒక రకంగా, మీరు ప్రశాంతంగా ఉన్నప్పుడు మరో రకంగా.... ఇలా మీ భావాన్ని బట్టి, మీ శ్వాస మారుతూ ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే శ్వాస మరియు భావం రెండూ ఒకేదాని చివరలు. ఈ రెండూ కలిసి ఉంటాయి. ఒక దానిలో మార్పు వస్తే రెండవది కూడా మారుతుంది. శ్వాసలో మార్పు తీసుకు వస్తే భావంలో మార్పు వస్తుంది. భావాన్ని మారిస్తే శ్వాస మారుతుంది. అనేకానేక జన్మలలో మీరు పోగు చేసుకుని ఉన్న "సరికాని భావాలు" ఎన్నో మీ లోపల ఉంటాయి. ఇవన్నీ కూడా మిమ్మల్ని శ్వాసను "మూలం" నుండి తీసుకోనీయకుండా అడ్డం పడుతూ ఉంటాయి. ఈ సరికాని భావాలే మీ శరీరంలో రోగాలుగా,

జబ్బులుగా మరియు జీవితంలో కష్ట నష్టాలుగా ప్రకటం అవుతూ ఉంటాయి. ఇవి మీలో పాతుకుపోయి ఉంటాయి. మీరు మీ లోపల అనేకానేక భావాలను అణిచి ఉంచారు. అవి అన్నీ మీ సరైన శ్వాస క్రియకు అవరోధం కలిగిస్తూ ఉంటాయి. మీ శ్వాస లోతుగా లేకుండా పైపైనే ఉంటుంది. ఇలా పైపైన తీసుకునే శ్వాస మీ లోపల ఉన్న సరికాని భావాలను అలానే ఉంచేస్తుంది. ఇలా పైపైన తీసుకునే శ్వాసనే ''సహజ శ్వాస''గా, ఆనాపానసతి సాధకులు పరిగణిస్తారు. ఇక్కడే జరిగిపోతూ ఉంది, ఓ పేద్ద తప్పు. పైపైన శ్వాస తీసుకుంటూ ఉంటే లోపల ఉన్న సరికాని భావాలు విడుదల కావు. మీ లోపల అణిచి పెట్టబడి ఉన్న సరికాని భావాలు మీ శ్వాస క్రియను ఒక క్రమ పద్ధతిలో ఉండేలా నియంత్రిస్తాయి. ఈ క్రమాన్ని ఆనాపానసతి సాధకులు ''సహజ శ్వాస'' అని అనుకుంటూ ఉంటారు. ఈ రకంగా ఆ సరికాని భావాలు తమ ఉనికిని కాపాడుకుంటూ తమకు అనుగుణమైన పరిస్థితులను ఆకర్షిస్తూ ఉంటాయి. ఆ పరిస్థితుల వలన మీకు ఎన్నో కష్టనష్టాలు వస్తూ ఉంటాయి.

సహజమైన శ్వాసను గమనించడం అనేది కొన్ని రకాలుగా మేలు చేస్తుంది. అయితే దీన్ని(ఆనాపానసతి) అప్పుడప్పుడు అవసరమైనప్పుడు మాత్రమే వాడాలి. ఇదే పరమం, ఇదే అల్టిమేట్ అని చెప్పే వారికి జ్ఞానోదయం తక్షణమే కులుగుగాక ! బావిలోని కప్పలాంటి వారు. ఒక చిన్న బావిలో ఉండే కప్పకు తను ఉండే బావి మాత్రమే ప్రపంచం అనుకున్నట్టు ఆనాపానసతి ప్రచారం చేసే వారు కూడా తమ ధ్యానమే గొప్పది అని అనుకుంటూ ఉంటారు, జనాలకు చెబుతూ ఉంటారు. ఒకానొక కాలంలో నేను కూడా కొంత కాలం ఆ బావిలోనే ఉన్నాను. నా పరిపక్వత, వికాసం యొక్క పుణ్యంతో ఆ బావిలో నుండి బయట పడ్డాను.

లోపల ఉన్న సరికాని భావాలను వదిలించుకోవాలంటే, లోపల ఒక పెద్ద అల్లకల్లోలాన్ని సృష్టించియే తీరాలి. ఒక మహా గందరగోళాన్ని పుట్టించాలి. మీ శ్వాసలో తీవ్రమైన మార్పును చేసి తీరాలి. మీ శ్వాసను లోతుగా, వేగంగా మార్చాలి. ఎప్పుడైతే మీ శ్వాస క్రియలో మార్పు జరిగిందో ఆ క్షణమే మీ లోపల ఉన్న సరికాని భావాలు నిర్జీవమవుతాయి. మీ లోపల ఉన్న సరికాని భావాల పైన ఈ ''సడన్ మార్పు'' అనేది, ఒక మహా ప్రభంజనంలా వీచి వాటిని చెల్లాచెదురు చేసి, మూలాలతో సహా శాశ్వతంగా పెకిలించి వేస్తుంది. మీరు

వదిలే నిశ్వాసల ద్వారా మరియు మీ శరీరంలోని సంవేదనల ద్వారా, రక రకాలుగా లోపల ఉన్న సరికాని భావాలన్నీ విడుదలై వెళ్ళి పోతూ ఉంటాయి. ఆత్మ విజ్ఞాన పూరితం కాని భావాలే మన శరీరంలోని మరియు జీవితంలోని అన్ని కష్ట నష్టాలకు మూల కారణాలు. వీటిని వదిలి వేస్తే కాని మనం బాగుపడం. అయితే ఈ సరికాని భావాల పట్ల ద్వేషంతో రగిలి పోవద్దు. వాటి పట్ల నిరసన, నిందా భావనలను ప్రకటించడం మానివేయాలి. కేవలం సాధన చేస్తూ ఉండాలి. వాటి పట్ల మౌనంగా, ప్రేమతో ఎరుకతో సాక్షిగా ఉండాలి. అప్పుడు మీలో ఉన్న సరికాని భావాలన్నీ వాటంతట అవే పోతాయి.

రెండవది, మనసు శూన్యం కావడం యొక్క వివరణ : ఆనాపానసతి ధ్యానాన్ని ఎన్నో ఏళ్ళుగా సాధన చేస్తూ, ఆ ధ్యాన ప్రచారానికే జీవితాన్ని అంకితం చేసుకున్న గ్రాండ్ మాస్టర్లు, సీనియర్ మాస్టర్లు మరియు సీనియర్ సాధకులు ఎంతో మంది, మనసు శూన్యం కావడం లేదని నాతో చాలా సార్లు చర్చించారు. ఇది చాలా పెద్ద సమస్య. ఆనాపానసతి ధ్యానం ద్వారా మనసు శూన్యం అవడం అనేది నిజం. అయితే చాలా, చాలా కష్టం. మనసు శూన్యం కావడం లేదన్న విషయం ఆల్‌మోస్ట్ ఆనాపానసతి సాధకులందరికీ తెలుసు. లక్షలాది జన్మలుగా "సరికాని భావాలను ఎన్నింటినో కలిగి ఉన్న మానవులు, వాటిని దాటి ఆలోచనా రహిత స్థితికి చేరుకోవడం అనేది చాలా క్లిష్టమైన ప్రక్రియ". ఈ ఆనాపానసతి ధ్యాన పద్ధతి ద్వారా మనసును శూన్యం చేయడం, చాలా కష్టం మరియు చాలా నిదానం కాబట్టే ఫలితాలు చాలా మెల్లిగా వస్తాయి. ఈ సశాస్త్రీయ కారణాల వల్లనే, నీకు మొదటి సిటింగ్‌లో అంత తేడా కనపడింది. నీకే కాదు ఎవరికైనా ఈ అభివృద్ధి కనపడుతుంది. అయితే గుడ్డిగా సాధన చేయకుండా, విషయాలను అవగాహన చేసుకుని సాధన చేస్తే, అప్పుడు అభివృద్ధి శీఘ్రంగా జరగడమే కాకుండా దాన్ని స్పష్టంగా గుర్తించవచ్చు.

కొన్ని సంత్సరాల క్రితం విమానాలు ఎక్కాలంటే ఒక మెట్లతో కూడి ఉన్న ఒక వాహనం ఉండేది. విమానం యొక్క డోర్ తెరిచిపెట్టి ఈ మెట్లను తీసుకెళ్ళి సరిగ్గా విమానం తలుపుకు అటాచ్ చేసేవారు, అప్పుడు ప్రయాణీకులు ఆ మెట్ల ఎక్కి విమానంలోకి ఎక్కే వారు. ప్రయాణీకులు విమానంలోకి ఎక్కిన తర్వాత ఆమెట్ల వాహనాన్ని ఎయర్‌పోర్ట్‌లో ఓ పక్కన నిలిపి ఉంచే వారు, మళ్ళీ ఇంకొక

విమానం వస్తే మళ్ళీ ఆ మెట్ల వాహనాన్ని ఉపయోగించి ప్రయాణీకులను విమానంలోకి ఎక్కించి మళ్ళా దాన్ని తీసి పక్కన పెట్టే వారు. ఇక్కడ మీరు గమనించాల్సింది మెట్లు కాదు ముఖ్యం.. గమ్యానికి చేర్చేది "విమానం".. అని ! ఆనాపానసతి కూడా సరిగ్గా ఈ మెట్ల లాంటిదే.. ఆనాపానసతితో మొదలు పెట్టి.. దాన్ని సాధనంగా చేసుకుని అసలైన దానిలోకి చేరుకోవాలి.. అప్పుడు అది గమ్యానికి చేరుస్తుంది. ఆనాపానసతి కేవలం మెట్ల లాంటిది చివరి మెట్టు మీదికి ఎక్కి అక్కడ విమానం లేక మీరు అక్కడే ఆగిపోతారు. అది ఒక జన్మ అయినా కానీ లేక వంద, వేయి, లక్ష, కోటి జన్మలైనా సరే ఎదుగు బొదుగూ లేకుండా అక్కడే అటూ ఇటూ కాకుండా స్టక్ అయి ఉంటారు. ఒకసారి ఆలోచించండి మీరు మెట్లు ఎక్కిన తర్వాత అక్కడ విమానం లేకపోతే ఏమిటి మీ పరిస్థితి ? మీరు మెట్లు ఎక్కిన తర్వాత విమానం ఎక్కాలి.. విమానంలోకి ఎక్కి గమ్యం చేరడానికి మీరు మెట్లు ఎక్కుతున్నారు కానీ కేవలం సరదా కోసం కాదు కదా ? గమ్యానికి చేర్చే విమానం లేని మెట్ల లాంటి ఆనాపానసతిని వదిలి వేయండి. విమానంలోకి(గమ్యం) చేర్చే మెట్లు ఎక్కండి.

సుమారుగా 10 నుండి 20 సంస్థలు ఆనాపానసతిని ప్రచారం చేస్తున్నాయి. చేసే వారికి కూడా తెలియదు ఆనాపానసతి విమానంలోకి చేర్చ లేని కేవలం మెట్లు మాత్రమేనని ! తెలిస్తే చేయరు కదా ! వారికి ఏదో ఒక జన్మలో తెలుస్తుంది. ఎందుకంటే మెట్ల మీద ఎన్ని జన్మలు గడుపుతారు ? ఏదో ఒక జన్మలో బోర్ కొట్టి దిగుతారు. సరైన దారి వెతుకుతారు.

ఆత్మ తన యొక్క పరిణామ క్రమంలో భాగంగా భౌతిక దేహాన్ని ధరిస్తుంది. భౌతిక దేహంతో జన్మ తీసుకున్న ఆత్మ తనదైన జీవితాన్ని జీవిస్తూ పరిణామం చెందుతూ ఉంటుంది. ఆత్మ యొక్క పరిణామ దశలో ముఖ్యంగా ఈ యొక్క భూమి పైన భౌతిక దేహం ధరించి ఉన్న ఆత్మకు ఒక రాత్రి మరియు ఒక పగలు అనేవి ఉంటాయి. పగలంతా రకరకాల కార్యక్రమాలు చేస్తూ అనుభవాలు గడిస్తూ ఉంటుంది. ఇక రాత్రి వేళలో నిద్రపోతుంది. నిద్ర అనేది ఆత్మ పరిణామ క్రమంలో చాలా ముఖ్యమైన విషయం. నిజానికి నిద్ర అనేది నిద్ర కాదు. నిద్ర అనేది - ఆత్మ కొన్ని ప్రత్యేక కోణాలలో పరిణామం చెందడానికి ఉపయోగపడే ఒక యోగదశ. పగలు మేలుకుని ఉన్నప్పుడు సాధ్యం కానివి ఎన్నో నిద్రలో సంభవం అవుతాయి. మెలుకువతో ఉన్నప్పుడు ఆత్మ 50% కోణాలలో అభివృద్ధి చెందుతుంది. నిద్రలో మిగతా 50% అభివృద్ధి చెందుతుంది. ఈ రెండు కలిస్తేనే 100% అవుతుంది. ఈ రెండింటిలో ఏది లోపించినా ఆత్మ పరిణామ క్రమం పైన దెబ్బపడుతుంది. ఆత్మ అభివృద్ధి ఆగిపోతుంది. కంటి నిండా కునుకు అనేది ఒక పెద్ద వరం. హాయిగా నిద్రపోవడం అనేది అదృష్టం. ఎంతో సుకర్మ ఉంటే తప్ప ఒక మనిషి హాయిగా నిద్రపోలేడు. ఆధ్యాత్మిక సాధనలు ఎన్నో లాభాలను మనిషికి కలుగజేస్తాయి. వాటిలో ప్రధానమైనది నిద్ర. సుఖవంతమైన నిద్ర అనేది భౌతిక దేహానికి మరియు ఆత్మకు ఎంతో అవసరం. అవసరమైనంత నిద్ర లభించనప్పుడు భౌతిక దేహం మరియు ఆత్మ రెండూ నష్టపోతాయి. సరిపోయేంత సుఖవంతమైన నిద్ర అనేది అత్యంత అవసరమైనది మరియు శ్రేయస్కరమైనది. ఈ ఆనాపానసతి ధ్యాన సాధన నిద్రకు పూర్తిగా వ్యతిరేకమైనది. ఆనాపానసతి ధ్యాన సాధన చేసే వారు క్రమక్రమంగా నిద్రకు దూరం అవుతారు. వారి నుండి వారికి కావాల్సిన నిద్రను ఈ ఆనాపానసతి ధ్యానం వేరు చేస్తుంది. నిద్ర లోపించడంతో ఆందోళనకు గురైన వ్యక్తి సాధన ఇంకా ఎక్కువ చేస్తాడు. అప్పుడు ఇంకా ఎక్కువ నిద్ర దూరం అవుతుంది. ఆనాపానసతిని ఎక్కువగా సాధన చేసే వ్యక్తులకు నిద్ర దూరం అయినందు వలన మరియు ఆత్మ సహజ పరిణామ క్రమం ఆగిపోయినందు వలన చాలా రకాల సైడ్ ఎఫెక్ట్‌లు మొదలవుతాయి. వారికి నరాల బలహీనత కలిగినట్టుగా అనిపిస్తూ ఉంటుంది, చెమటలు పట్టడం, కాళ్ళు చేతులు వణకడం, గాబర గాబరగా ఉండడం, ఏదో తెలియని ఆందోళనతో ఉండడం, పదిమందిలో ఎక్కువ సేపు ఉండలేక పోవడం, ఇంటికే పరిమితమై పోవడం, ఏవో తెలియని భయాలు వెంటాడుతూ ఉండడం మొదలైన సమస్యలతో బాధపడుతూ ఉంటారు.

ఏవో తెలియని భయాలు వెంటాడుతూ ఉండడం మొదలైన సమస్యలతో బాధపడుతూ ఉంటారు. కొంత మంది కూర్చుని ఉన్నప్పుడు మాత్రమే కాకుండా మామూలుగా ఉన్నప్పుడు, ఏం చేస్తూ ఉన్నా శ్వాసను గమనించడం అలవాటు చేసుకుంటారు. ఈ విధంగా వారు సాధ్యమైనంత ఎక్కువగా ఆనాపానసతిని సాధన చేయడం వలన నిద్రకు దూరమై తద్వారా ఎన్నో ఆధ్యాత్మిక ప్రయోజనాలకు దూరమైపోతారు. ఈ సత్యాలు తెలియక మాలో ఏమైనా లోపం ఉందేమోనని ఇంకా సాధన చేస్తూ ఉంటారు, వారి యొక్క సమస్యలు ఇంకా ఎక్కువ తీవ్రం అవుతూ ఉంటాయి. వారు వారి యొక్క అన్ని సమస్యల నుండి బయట పడాలి అంటే ముందు, తక్షణమే ఆనాపానసతి ధ్యాన సాధనను ఆపేయాలి. పూర్తిగా, శాశ్వతంగా ఆపేయాలి. దాన్ని మర్చిపోవాలి. అప్పుడు మాత్రమే వారికి జరిగే నష్టం ఆగిపోతుంది. ఆనాపానసతి ధ్యాన సాధన పూర్తిగా, శాశ్వతంగా మానేసిన తర్వాత సరైన ధ్యాన సాధనలు చేస్తే, జరిగిన నష్టాలను రికవర్ చేసుకోవచ్చు. కేవలం ఆనాపానసతి ధ్యాన సాధనయే కాదు ఇలాంటివి కొన్ని తప్పుడు సాధనలు సమాజంలో ప్రచారంలో ఉన్నాయి. వారందరూ ఇదే సమస్యలతో బాధపడుతూ ఉన్నారు. తప్పుడు ధ్యానాలు చేస్తే తప్పుడు ఫలితాలే వస్తాయి కదా.

ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగిన వారు చాలా మంది, చాలా రకాల గురువులను ఫాలో అవుతూ ఉంటారు. **ఇది చాలా పెద్ద తప్పు. నిజానికి, వాస్తవానికి భర్త అయినా లేక గురువైనా ఒక్కరే ఉండాలి, కేవలం ఒక్కరే !** లోకంలో ఎన్నో సంస్థలున్నాయి. లోకంలో ఎంతో మంది గురువులు ఉన్నారు. లోకంలో ఎన్నో ధ్యానపద్ధతులు ఉన్నాయి. లోకంలో చాలా రకాలైన విజ్ఞానం ఉంది. మోక్షం లేక జ్ఞానోదయం పొందడానికి లోకంలో ఉన్న అన్ని సంస్థలను, అందరు గురువులను, అన్ని మార్గాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం లేదు.

నీవు కనపడిన ప్రతీ దారిలోకి వెళ్తూ ఉంటే నీవు గమ్యం చేరుకోలేవు. ఆ దారుల్లోనే దారి తప్పిపోతావు. చాలా మంది గురువుల గురించి తెలుసుకుని పరిశోధన చేయాలి. బాగా పరిశోధించి ఒక గురువును ఎంపిక చేసుకుని ఇక బుద్ధిగా ఆ మార్గాన్నే అనుసరిస్తూ ఉండాలి. మళ్ళీ చెబుతున్నాను భర్తైనా లేక గురువైనా ఒక్కరే ఉండాలి. ఒక్కో గురువుది ఒక్కో విధమైన శక్తి క్షేత్రం ఉంటుంది. మీరు ఎన్ని రకాల గురువులను ఫాలో అయితే అన్ని రకాల శక్తి క్షేత్రాలను ఢీ కొంటూ ఉంటారు.

ఎంత మంది గురువులను ఫాలో అయితే అన్ని రకాల శక్తి క్షేత్రాలను ఢీ కొంటూ ఉంటారు. ఎన్నో శక్తి క్షేత్రాలతో ఢీ కొట్టుకుంటున్న మీ చైతన్యం పాడైపోతుంది. కానీ మీకు లోపల జరిగే ఈ విషయం తెలియదు. కొంత మంది ఫోన్లు చేసి ఇలా చెబుతూ ఉంటారు... "మీ పుస్తకం బాగుందండీ, క్లాసులు చెప్పడానికి బాగా ఉపయోగ పడుతూ ఉంది" అని అంటారు. అంటే మీరు నా పుస్తకాన్ని తీసుకున్నది మీరు చదువుకోవడానికి కాదన్నమాట, మీరు నా పుస్తకాన్ని చదివి ఎవరికో బోధించడానికన్నమాట ! ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఇలా చాలా మంది ఉంటారు. ఇలాంటి వారికి ఆధ్యాత్మిక అభివృద్ధి జరగదు. ఆ పుస్తకాలు, ఈ పుస్తకాలు చదివి, అక్కడా ఇక్కడా విని, ఎవరి ద్వారానో విషయాలను తెలుసుకుని **క్లాసులు చెప్పేవారి గతి దుర్గతే !** చాలా బలంగా గుర్తుంచుకోండి, ఇలా చేసే వారి పట్ల కరుణతో చెబుతున్నాను. ఇలా చేయకండి. మీరు ఇలా చేస్తే ఎంత భయంకరమైన పాఠాలు నేర్చుకోవాల్సి వస్తుందో మీకు తెలియదు. మళ్ళీ ఏ జన్మలోనూ ఇలా చేయాలనే ఆలోచన కూడా రాకుండా గుణపాఠం చెబుతుంది విశ్వం. కాబట్టి జాగ్రత్త. మీలో బోధకుడిని చంపేయండి. మీరింకా సాధకులే కదా. సాధకులే కాలక్రమేణా బోధకులవుతారు. ముందు మీలోని బోధన అనే యావను పూర్తిగా శాశ్వతంగా తీసేయండి. పిందెను సహజంగా కాయ కానివ్వండి, కాయను సహజంగా పండు కానివ్వండి, పండులోని విత్తనాన్ని మొలకెత్తి మొక్క కానివ్వండి, మొక్కను చెట్టు కానివ్వండి, చెట్టును వృక్షంగా కానివ్వండి. అప్పటి వరకు సహనం పాటించండి. లేదా... బోధన అనే మాట వింటేనే నిలువెల్లా వణికిపోయి స్పృహ తప్పి పోయే విధంగా విశ్వం గుణపాఠం చెబుతుంది.

సద్గురు స్థితిని పొందకుండా బోధించడం అని అంటే జడ్జ్‌మెంట్ చేయడం. జడ్జ్ చేయడం అంటే, అవతలి వారి బాధలను స్వీకరించడం. సద్గురువుగా మారక ముందే ఎవరైతే బోధిస్తున్నారో వారికి ఏం జరుగుతుందంటే - వారి క్లాస్ ఎవరైతే వింటారో వారందరి కర్మలు వీరికి తగులుకుంటాయి. ఆ క్లాస్ అరెంజ్ చేసిన వారికి మరియు ఆ క్లాస్ నిర్వహణకు ఎవరెవరు ఎంతెంత సహకరిస్తారో వారందరికీ కర్మలు తగులుకుంటాయి. అజ్ఞానంలో, అమాయకత్వంతో అందరికీ మంచి చేస్తున్నాము కాబట్టి మాక్కూడా మంచే జరుగుతుంది అనే భ్రమలో పడి తాము నాశనం అవడమే కాకుండా అందరినీ నాశనం చేసే కార్యక్రమమే - సద్గురు స్థితిని పొందకుండా బోధన లేదా ప్రచారం చేసే కార్యక్రమం. ఇకనైనా మేలుకోండి.

ఆనాపానసతి ధ్యానం గురించి ఓషో ఇలా చెప్తాడు...

ఈ విషయం - "నిగూఢ రహస్యాలు" అనే పుస్తకంలో ఉంది. ఒరిజినల్‌గా హింది భాషలో Gahre Pani Paith అనే పేరుతో పబ్లిష్ అయింది. Sambhodhi Publications (Address : 17-1-40/A, ఈది బజార్, హైదరాబాద్. పిన్ - **500 023.** సెల్ నం. 90591 64976) వారు ఈ పుస్తకాన్ని "నిగూఢ రహస్యాలు" అనే పేరుతో తెలుగు భాషలో పబ్లిష్ చేసారు. ఈ పుస్తకం వెల : **160/-** ఈ పుస్తకం అన్ని ప్రముఖ బుక్ షాపుల్లో దొరుకుతుంది. ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువాదం చేసిన వారు Dr. N. సూర్యకుమారి గారు.

(ఈ నిగూఢ రహస్యాలు అనే పుస్తకాన్ని పబ్లిష్ చేసిన వారు మరియు అనువాదం చేసిన వారు కూడా ఆనాపానసతి సంఘాలకు సంబంధించిన వారేనని అనుకుంటున్నాను. ఖచ్చితంగా తెలియదు కానీ నాకు ఎవరో చెప్పారు. ఒక వేళ కాకపోతే క్షమించ గలరు.)

ఆనాపానసతి ధ్యానం గురించి ఓషో ఇలా చెప్తాడు (ఓషో - నిగూఢ రహస్యాలు, పేజ్ నం. 59 & 60) :

...శ్రీలంక నుండి ఒక బౌద్ధసన్యాసిని నా దగ్గరకు పంపారు. మూడు సంవత్సరాలుగా అతడు సరిగా నిద్రపోలేకపోయాడు. అతని చేతులు, పాదాలు ఎప్పుడూ వణుకుతూ ఉండేవి, సదా చెమట పడుతూ ఉండేది, అతను చాలా కలత చెందాడు...

ఒక్క అడుగు వేయాలన్నా భయపడ్డాడు – అతడిలో నమ్మకం పోయింది. అతడికి చాలా వరకు పిచ్చిపట్టినట్లు అయింది. విపరీతమైన మత్తు కలిగించేవి కూడా అతడు నిద్రపోవడానికి సహాయపడలేకపోయేవి, అవిశ్రాంతంగా పడుకోవడమే తప్ప, ఆంతరంగికంగా అతడు మేల్కొనే ఉండేవాడు.

బుద్ధుడి ఆనాపానసతి యోగం ఎప్పుడైనా అభ్యసించావా అని అడిగాను, ఎందుకంటే బౌద్ధసన్యాసికి ఆ అలవాటు తప్పనిసరి. చేసాను అన్నాడు, అలా అయితే నిద్రపోవాలన్న ఆలోచనని వదిలేయమన్నాను, ఎందుకంటే ఆనాపానసతి యోగం నిద్రని అసాధ్యం చేసే ఒక అభ్యాసం. కానీ అది అభ్యాసంలో తొలిమెట్టు మాత్రమే, ఒకసారి నిద్రపట్టడం అసాధ్యం అయినప్పుడు, వెంటనే తీసుకోవలసిన చర్య ఇంకొకటి ఉంటుంది. **మొదటి భాగాన్ని మాత్రమే చేస్తూ, ఆ చర్యలో రెండవ భాగానికి వెళ్ళకుండా ఉంటే నువ్వు నీరసిస్తావు; నీకు పిచ్చిపట్టవచ్చు లేదా నువ్వు చనిపోవచ్చు.**

లోపలి నుంచి ఒకసారి నిద్రని నాశనం చేస్తే, నీ చైతన్యపు గుణం ఎంతగా మారుతుందంటే అప్పుడు పురోగతి సాధ్యం అవుతుంది. ఆ అభ్యాసంలోని రెండవ భాగం గురించి తెలుసా ? అని ఆ బౌద్ధసన్యాసిని అడిగినప్పుడు, దాని గురించి తనకు ఎవరూ చెప్పలేదు అన్నాడు. ఏ పుస్తకంలోనూ రెండవభాగం గురించి చెప్పబడలేదు, మొదటిభాగం గురించి మాత్రమే వ్రాయడం అపాయకరం ఎందుకంటే దాన్ని ఆచరించేవాడు నిద్రపోలేడు. కొన్ని విషయాలను దాచి ఉంచడానికి కారణం, ఎవ్వరికీ అపకారం చేయకుండా ఉండాలనే. ఆధ్యాత్మిక శోధనలో అవసరం అయినవారికి మాత్రమే సహాయకారిగా ఉండడానికి అవి ఉద్దేశించబడ్డాయి.

– ఓషో

ప్రస్తుతం ఆనాపానసతి ధ్యానాన్ని మాత్రమే ప్రచారం చేస్తున్నవారు చాలా మంది ఉన్నారు. కేవలం మొదటి భాగాన్ని మాత్రమే ఎక్కువగా సాధన చేస్తే పిచ్చిపట్టవచ్చు లేదా చనిపోవచ్చు అని స్వయంగా ఓషో గారే చెప్పారు. అందుకే ప్రమాదకరమైన ఈ ఆనాపానసతి ధ్యానాన్ని నేను సజెస్ట్ చేయను. అపాయకరమైన ఆనాపానసతి ధ్యానాన్ని నేను ప్రజల సంక్షేమం కోసమే సజెస్ట్ చేయను. ఆనాపానసతి ధ్యానాన్ని పూర్తిగా వదిలేయమనే... నేను చెబుతాను. ఆనాపానసతి ధ్యానాన్ని సాధన చేస్తున్న వారికి తెలియదు వారు ఎంత ప్రమాదంలోకి కూరుకుపోతున్నారో....! కేవలం మొదటి భాగాన్ని ప్రచారం చేసేవారు ప్రమాదాన్ని ప్రచారం చేస్తున్నట్టే, ఈ విషయాన్ని అవగాహన చేసుకుని, ఆ ప్రచారాలను తక్షణమే ఆపేయాలి. లేదా అత్యంత భయంకరమైన బాధలకు గురవుతారు. ఓషో గారు చెప్పినదాన్ని అర్థం చేసుకుని ఇకనైనా ఆ యొక్క ఆనాపానసతి ధ్యాన సాధనను ఆపేస్తే బతికి పోతారు. అది చాలా ప్రమాదకరమైనది, పాతది మరియు ఔట్‌డేటెడ్ ధ్యానం. దాన్ని తక్షణమే పూర్తిగా, శాశ్వతంగా వదిలేయాలి. లేదా ఈ ఆనాపానసతి ధ్యానాన్ని ప్రచారం చేస్తున్న గురువుల దగ్గర ఈ ధ్యానం యొక్క రెండవ భాగానైనా తెలుసుకొని పూర్తి సాధన చేయండి. ఇలా చేయడం వలన మోక్షం పొందకపోయిన, కనీసం నష్టం జరగకుండా ఆపగలము. ఇప్పుడు చాలా అల్టిమేట్ ధ్యాన పద్ధతులు ఎన్నో ఉన్నాయి.

నేను చెప్పే సాధనలు, సేత్ టెక్నిక్స్, రామ్‌తా పద్ధతులు మరియు ఓషో మెడిటేషన్స్ ఇంకా ఇతర కొన్ని సాధనలు, పరమోత్తమ స్థాయికి చెందిన సాధనలు. పరమ ప్రాప్తానికి ఎల్లప్పుడూ పరమోత్తమ సాధనలే చేయాలి కదా.

❖ ❖ ❖

పార్ట్ - 33

కొన్ని ముఖ్య విషయాలు

జీవించి ఉన్న, సజీవంగా ఉన్న గురువును ఆశ్రయించాలి అంతే కానీ, ప్రస్తుతం జీవించి లేని వారి సమాధులను కానీ లేక వారి ఫోటోలను కానీ పెట్టుకుని వారిని గురువులుగా భావిస్తూ ఆధ్యాత్మికంగా ఎదగాలి అని అనుకోవడం అమాయకత్వం లేక అజ్ఞానం. సుమారు 500 జన్మలకు ఒకసారి ఆధ్యాత్మికతలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. ఇది కోల్పోతే మళ్ళీ 500 జన్మల వరకు ఆగాల్సిందే. ఈ లోపు ఈ 500 జన్మలలో అజ్ఞానం వలన చేయరాని పనులు చేస్తూ 5000 జన్మల కర్మలను మూటకట్టుకుంటారు. ఆ కర్మల నుండి బయట పడేదెప్పుడు... మోక్షం ఎప్పుడు... అందుకే తక్షణమే జీవించి ఉన్న గురువును వెతుక్కోండి. జీవించి ఉన్న గురువును ఎలా పొందాలో లోపల వివరించాను. చదవండి.

మీరు ఒక గురువు దగ్గర ఇంకా స్థితం కాలేదంటే మీ ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభం కాలేదని అర్థం. ఒకవేళ మీరు ఒక గురువును కలిగిలేకపోయినా మీరు ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నాను అని అనుకుంటూ ఉంటే మీరు పెద్ద భ్రమలో ఉన్నారని తెలుసుకోండి.

మీరు ఇంకా ఒక గురువును ఆశ్రయించ లేదు అని అంటే మీరు ఆధ్యాత్మికతలో లేనట్టే అని అర్థం.

మీరు ఒక గురువు కంటే ఎక్కువ మందిని అనుసరిస్తున్నారు అని అంటే మీరు ఆధ్యాత్మికతతో ఆటలు ఆడుతున్నారని అర్థం. మీకు తగిన శాస్తి జరిగి తీరుతుంది. తెలుసుకోండి..

భర్త అయినా గురువు అయినా ఒక్కరే ఉండాలి. కేవలం ఒక్కరే ! ఒకే ఒక గురువును ఎంచుకోండి కేవలం ఆయనను మాత్రమే నిజాయితీగా అనుసరించండి. గుర్తుంచుకోండి... గురువైనా భర్త అయినా ఒక్కరే ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉంటే వికటిస్తుంది.

సత్యం ఏమిటో తెలుసుకోవాలి, అసలు నేను ఎవరు ? అనే ప్రశ్నకు సరైన సమాధానం తెలుసుకోవాలి... మానవ జీవితానికి అర్థం ఏమిటి ? పరమార్థం ఏమిటి ? అసలు మానవ జీవితంలో కష్టాలు ఎందుకు వస్తున్నాయి ? కష్టాలు రాకుండా ఉండాలంటే ఏం చేయాలి ? మెదలైన ప్రశ్నలు మీలో ఉదయించినప్పుడు మీలో ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగిందని అర్థం. మీలో కలిగిన ఆధ్యాత్మిక అగ్ని నిజమైనదే గనుక అయితే మీరు ఒక గురువును వెతుక్కుంటారు, ఆయన దగ్గర సెటిల్ అయిపోతారు. ఇక ఆయన దగ్గర నిజాయితీగా, విశ్వాసంగా ఉండిపోతారు. ఇలా కాకుండా మీరు కనపడిన ప్రతీ గురువు దగ్గరికి తిరుగుతూ ఉన్నారంటే, మీరు టైమ్ పాస్ చేస్తున్నారనే అర్థం. ప్రతీ మానవుడికి సుమారు కొంచెం అటూఇటూగా 500 జన్మలకు ఒకసారి ఆధ్యాత్మికతలోకి ప్రవేశించే అవకాశం వస్తుంది. దాన్ని సద్వినియోగం చేసుకోకుండా దుర్వినియోగం చేసిన వారికి మళ్ళీ 500 జన్మలు లేదా ఓ రెండు, మూడు లక్షల సంవత్సరాల తర్వాత మళ్ళీ అవకాశం వస్తుంది. ఇంత అరుదుగా లభించే అవకాశాన్ని సంపూర్ణంగా వినియోగించుకోండి. తక్షణమే సత్యగురువును వెతుక్కోండి, ఆయన దగ్గరే స్థితమైపోండి.

గురువైనా భర్త అయినా ఒక్కరే ఉండాలి !

ఒకే ఒక సత్య గురువును వెతుక్కుని అక్కడే స్థితమైపోండి !

ముందు మీరు సంపూర్ణ సమగ్ర శాశ్వత అకర్మ శాకాహారిగా (Akarma vegan) మారి, క్రమం తప్పని ధ్యాన సాధన చేస్తూ, ఆత్మ విజ్ఞాన సూత్రాలను నిజ జీవితంలో ఆచరిస్తూ మరియు వీలైనంతగా సేవ చేస్తూ ఉన్నప్పుడు మాత్రమే... మీరు అకర్మ శాకాహార(Akarma Vegan) ప్రచారం చేయాలి. ధ్యాన ప్రచారం కానీ ఆత్మ విజ్ఞాన ప్రచారం కానీ చేయకూడదు. ధ్యానాన్ని మరియు ఆత్మ విజ్ఞానాన్ని ఆచరించాలి.

✪ మీరు నిజాయితీగా ధ్యానాన్ని మరియు ఆత్మ విజ్ఞానాన్ని ఆచరిస్తూ ఉంటే అదే అసలు సిసలు ప్రచారం అవుతుంది. ✪

✪ గుర్తుంచుకోండి, అకర్మ శాకాహారాన్ని మాత్రమే ప్రచారం చేయాలి. ధ్యానాన్ని మరియు ఆత్మ విజ్ఞానాన్ని ఆచరించాలి. ✪

కేవలం జ్ఞానోదయం(దైవత్వం) పొందిన సద్గురువు మాత్రమే ధ్యానాన్ని మరియు ఆత్మ విజ్ఞానాన్ని నేర్పించాలి, చెప్పాలి.

కేవలం ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టర్ మాత్రమే క్లాసులు చెప్పాలి. ఎన్‌లైటెన్‌మెంట్ కాని దొంగ చీకటి గురువే అమాయక జనాలను - మీరంతా ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్ ! పోండి.... ప్రచారాన్ని ఇరగదీయండి అని ఉసి గొల్పుతాడు. అలాంటి చీకటి గురువుల మాటలు నమ్మకండి.

ఒక దొంగ గురువే ఎవరితో పడితే వారితో ధ్యాన కేంద్రాలు ఓపెన్ చేయించి అందులో అమాయక ప్రజల చేత బోధనలు చేయించి ఇంకా మానవ జాతిని చీకట్లోనే బంధించి ఉంచే పనులు చేయిస్తాడు.

మెడికల్ షాపులో పని చేసిన అనుభవంతో ఒక వ్యక్తి హాస్పిటల్ ఓపెన్ చేసి వైద్యం చేయడానికి పూనుకోవడం ఎంత ప్రమాదకరమో.... అదే విధంగా నిజ ఆత్మ సాక్షాత్కారం జరగని వారు క్లాసులు చెప్పడం, ధ్యాన కేంద్రాలు తెరిచి నిర్వహించడం అనేది అంత కన్నా ప్రమాదకరం.

1. కొన్ని సత్యాలు

ఒక ధ్యాన కేంద్రాన్ని నడిపించాలంటే ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టర్‌కు మాత్రమే సాధ్యం అవుతుంది. జ్ఞానోదయం పొందిన లేక దైవత్వాన్ని ప్రాప్తించుకున్న వ్యక్తికి మాత్రమే ఒక ధ్యాన కేంద్రాన్ని నడిపించే అర్హత మరియు అధికారం ఉంటుంది. ఎవరు పడితే వారు నడిపించడానికి వీలు లేదు. అలా చేయకూడదు. 20 ఏళ్ళుగా మెడికల్ షాప్ నడిపించిన అనుభవం ఉందని, అన్ని మందుల గురించి తెలుసని – ఆ మెడికల్ షాప్ వ్యక్తి హాస్పిటల్ ఓపెన్ చేసి వైద్యం చేయడానికి పూనుకోకూడదు. మెడికల్ షాప్ అనుభవం 20 ఏళ్ళు ఉన్నా 40 ఏళ్ళు ఉన్నా అతడు ఒక క్వాలిఫైడ్ డాక్టర్ కాలేడు. అతడు వైద్యం చేయడానికి అనర్హుడు. అతడి వైద్యం వలన జనాల ప్రాణాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఒక క్లాస్ చెప్పడం అనేది నిజానికి ఒక ఓపెన్ హార్ట్ సర్జరి కంటే కూడా పెద్ద విషయం మరియు సున్నితమైన విషయం.

భౌతిక దేహానికి చేసే చికిత్సలో ఏదైనా పొరపాటు జరిగితే మహా అంటే ప్రాణం పోతుంది. మళ్ళీ ఆ ఆత్మ తిరిగి జన్మిస్తుంది, కొత్త దేహాన్ని పొందుతుంది. ఈ ప్రమాదం అనేది కేవలం ఒకే ఒక జన్మకు మాత్రమే పరిమితం అవుతుంది. కానీ ఒక క్లాస్ చెప్పడంలో పొరపాటు జరిగితే, అంటే – జ్ఞానోదయం కలగని వ్యక్తి క్లాస్ చెబుతున్నప్పుడు, ఏదైనా పొరపాటు జరిగితే (నిజానికి జ్ఞానోదయం కలగని వ్యక్తి క్లాస్ చెబుతున్నప్పుడు, చాలా పొరపాట్లు జరిగిపోతాయి.) అది కేవలం ఒక జన్మకు మాత్రమే పరిమితం అయిపోదు. ఆ తప్పుడు వ్యక్తి చెప్పిన, తప్పుడు క్లాస్ యొక్క ప్రభావం కొన్ని జన్మల వరకు ఉండే అవకాశం ఉంది. ఉదాహరణకు ఓ 10 జన్మల నుండి కొన్ని వేల జన్మల వరకు ఆ తప్పుడు క్లాస్ విన్న ఆత్మలు దారి తప్పే అవకాశం ఉంది. అన్ని ఆత్మలను దారి తప్పేలా చేసినందుకు ఈ క్లాస్ చెప్పిన వ్యక్తి కూడా లక్షల జన్మలు దారి తప్పిపోతాడు. ఎందుకంటే – "నీవు ఏం ఇస్తే అదే నీకు వేయి రెట్లై తిరిగి వస్తుంది" కదా !

కనపడిన ప్రతీ వ్యక్తిని ....“నీవు మాస్టర్‌వు, వెళ్ళు... ఫలానా ప్రాంతం బాధ్యతలు నీవే, నీవు ఎన్‌లైటెన్డ్ మాస్టర్‌వి, వెళ్ళు, వెళ్ళి ప్రచారాన్ని ఇరగదీయి” అని అమాయకులను ఆశీర్వదించి పంపే చీకటి గురువులు కొందరున్నారు.

అమాయక జనాలకు కూడా ఏమీ తెలియదు, చెప్పింది నమ్మి ప్రచారానికి బయలుదేరుతారు. మంచి చేస్తున్నాము అనే భ్రమలో తమకు తాము హాని చేసుకోవడమే కాకుండా మరెంతో మందికి హాని చేస్తూ... ఎంతో దుష్కర్మను మూట కట్టుకుంటూ ఉంటారు. ఇలా ఎడాపెడా ప్రచారం చేసేవారు కొన్ని వేల జన్మలు అనుభవించి ఆ కర్మను క్లియర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్ని ధ్యాన కేంద్రాలు ఓపెన్ చేస్తే అంత గొప్ప అనే ఫీలింగ్‌లో బెల్టుషాపులను తెరిచినట్టు, సందుకొకటి, గొందుకొకటి ధ్యానకేంద్రాలు తెరిపిస్తున్నారు చీకటి గురువులు. అమాయక జనం మేము భూమికి ఎంతో మంచి చేస్తున్నామనుకుని ఈ చీకటి గురువుల చేతుల్లో మోసపోతున్నారు.

భూమి అంతా మా ధ్యానం మాత్రమే ప్రచారం కావాలి. మాదే కరెక్ట్ మిగతావన్నీ తప్పు. ఈ భూమి మీద ఉన్న ప్రతీ ఒక్కరు మా ధ్యానమే చేయాలి అంటూ... అజ్ఞాన పూరితమైన విధానాలతో, మూర్ఖత్వంతో తప్పుడు ధ్యానాన్ని మరియు తప్పుడు కాన్సెప్ట్‌లను జనాల మీదకు వదిలి జనాలను మోక్ష మార్గం నుండి పూర్తిగా తప్పిస్తూ చీకటి శక్తులకు ఏజెంట్లుగా పని చేస్తున్న చీకటి గురువుల కాలం చెల్లింది. వారి పని అయిపోయింది. ఈ చీకటి గురువులు మరియు ఈ చీకటి గురువుల శిష్యులు – వీరంతా తాము చేసిన చెడుకు సమానంగా మంచిని చేసి తీరాల్సిందే.

ఆధ్యాత్మిక క్లాస్ అంటే హడావుడిగా కొందరిని పోగేసి కొన్ని పరిచయ వాక్యాలు చెప్పి, కాసేపు ధ్యానం చేయించి, కొందరి చేత అనుభవాలు చెప్పించి, అందరి చేతా చప్పట్లు కొట్టించడం కానే కాదు. కొంత మంది చీకటి గురువులు ఆధ్యాత్మిక ప్రచారాన్ని, ఎన్నికల ప్రచారం లాగా ఫక్తు రాజకీయ దృక్పథంతో, రాజకీయ ప్రచారం లాగా చేస్తున్నారు మరియు వారి శిష్యుల చేత చేయిస్తున్నారు. ఇలాంటి వారు చాలా భయంకరమైన దుష్కర్మను మూట కట్టుకుంటున్నారు.

ఏదో ఒక ధ్యానం చెప్పి ఇక ఇది చేస్తూ కూర్చోండి మీకు అన్నీ జరిగిపోతాయి అని చెప్పడం అంటే, జనాలను అంధాకారంలో ఉంచేయడమే అవుతుంది. ఏమీ తెలియని జనాలు నిజమే కాబోలు అని అనుకుని ఆ ధ్యానాన్ని చేస్తూ ఉంటారు. ఇక అనుభవాల విషయానికి వస్తే, అందరికీ వచ్చే అన్ని అనుభవాలన్నీ నిజాలు కావు. చీకటి శక్తులు ఎన్నో సినిమాలు చూపెడుతూ ఉంటాయి.

చాలా సంస్థల వారికి మా గురువే గొప్ప మరియు మా సంస్థయే గొప్ప సంస్థ మరియు మా సంస్థ యొక్క సభ్యుల వల్లనే ఈ భూమి రక్షించబడుతుంది – అనే అనుభవాలు వస్తూ ఉంటాయి.

మీరు కొన్ని సంస్థల వారిని కదిలిస్తే అనుభవాలను నెలల తరబడి చెబుతారు. ఇదంతా చీకటి శక్తులు ఆడించే నాటకం. ముఖ్యంగా చీకటి శక్తులకు ఏజెంట్లుగా పనిచేస్తున్న గురువుల దగ్గర ఉన్న శిష్యులందరూ చూసేవన్నీ చీకటి శక్తులు చూపిస్తున్న సినిమాలే ! ఆ చీకటి శక్తుల అనుభవాలను గొప్ప అనుభవాలుగా భ్రమించి ఆ యొక్క భ్రమలలోనే అలా తేలుపోతూ ఉంటారు. అత్యంత త్వరలోనే నిజమైన గురువులు ఎవరు ? నిజమైన సత్య సంస్థలు ఏవి ? అనే విషయాలు

లోకానికి ప్రకటం అవుతాయి. అసలు సిసలు సత్యగురువులు ఇప్పుడు బయటకు వచ్చారు. కొద్ది రోజుల్లోనే చీకటి గురువులు, చీకట్లోనే పూర్తిగా, శాశ్వతంగా కనుమరుగై పోతారు. చీకటి గురువులను ఆశ్రయించి ఉన్న అమాయక జనాలు అప్పుడు సత్యాన్ని తెలుసుకుని సత్యగురువులను ఆశ్రయించి మోక్షమార్గంలో ప్రయాణిస్తారు. ఇది జరగడం మొదలైంది.

1) MAB మెంబర్స్ ఎవరు కూడా, ఎక్కడ కూడా క్లాస్ అనేది చెప్పరు గాక చెప్పరు. ఎవరైనా క్లాస్(బోధన) చెబుతున్నారంటే, వారు MAB మెంబర్స్ కాదు అని తెలుసుకోండి.

2) MAB మెంబర్స్ కేవలం విషయాలను లేక సమాచారాన్ని తెలియజేస్తారు. వారికెంతో సబ్జెక్ట్ తెలిసి ఉన్నా వారు మాత్రం క్లాస్ అనేది చెప్పరు గాక చెప్పరు. చెబితే వారి అనుభవాలు మాత్రం చెప్పే అవకాశం ఉంది. బోధనలు, కౌన్సెలింగులు చేయరు.

3) MAB మెంబర్స్ ప్రచారం చేయరు గాక చేయరు.

4) ఎక్కడైనా ఏదైనా ఫంక్షన్ జరుగుతూ ఉంటే అక్కడికి వెళ్ళి తమ పాంఫ్లెట్లను లేక బ్రోచర్‌లను పంచడం లాంటి పనులు MAB మెంబర్స్ చేయరు. అలా చేయడం ఆ యొక్క ఫంక్షన్ చేసుకునే వాళ్ళను డిస్టర్బ్ చేసినట్టే అవుతుంది. వేరే సంస్థ వారి ప్రోగ్రామ్ జరుగుతూ ఉంటే అక్కడికి వెళ్ళి తమ పాంఫ్లెట్లను లేక బ్రోచర్‌లను పంచడం లాంటి పనులను MAB మెంబర్స్ చేయరు. ఎవరో ఏదో ఫంక్షన్ చేసుకుంటుంటే అక్కడికి వెళ్ళడం, ఏదో సంస్థ వారు ప్రోగ్రామ్ చేసుకుంటుంటే అక్కడికి వెళ్ళి తమ సంస్థ యొక్క పాంఫ్లెట్లను లేక బ్రోచర్‌లను పంచడం అనేది ఆధ్యాత్మిక ప్రచారం అనిపించుకోదు. అలా

చేయడం కమర్షియల్ వ్యవహారం కిందికే వస్తుంది. ఎందుకంటే, ఆధ్యాత్మికతకు తనదైన ఒక డిగ్నిటి ఉంది. దాని యొక్క హుందాతనం దెబ్బ తినకుండా ప్రచారం చేయాలి. ఎవరి ప్రోగ్రామ్‌కో వచ్చిన వారికి మీ పాంఫ్లెట్లు పంచడం కాదు, మీరు స్వంతంగా జనసమీకరణ చేసుకోండి, అప్పుడు పంచండి. ఇలా చేస్తే ఒక పద్ధతిగా ఉంటుంది.

5) ఎవరైనా ప్రచారం చేస్తున్నారంటే వారు MAB మెంబర్స్ కాదని అర్థం చేసుకోండి. ఎవరైనా క్లాస్ చెబుతున్నారంటే వారు MAB మెంబర్స్ కాదని తెలుసుకోండి. MAB మెంబర్స్ ఎవరి వెంటా పడరు అని గుర్తుంచుకోండి. ఒకవేళ పడితే వారు MAB మెంబర్ కారు అని గుర్తుపట్టండి. నిజమైన MAB మెంబర్స్ తమ పనిలో తాము ఉంటారు తప్ప ప్రచారం చేయరు, క్లాసులు చెప్పరు, కౌన్సెలింగులు చేయరు. అలా చేసే వారు MAB మెంబర్స్ కానే కారు అని తెలుసుకోండి.

"ఆచారమే ప్రచారం" !

"సత్యాచారమే సత్యప్రచారం" !

6) నీవు ఆచరిస్తూ ఉంటే ఆటొమెటిక్‌గా నీ దేహంలో మరియు నీ జీవితంలో మంచి మార్పులు సంభవిస్తూ ఉంటాయి. ఆ యొక్క మంచి మార్పులను చూసిన జనాలు అడుగుతారు కారణమేమిటని ? అప్పుడు నీవు

ఆచరిస్తున్న విషయాల గురించి చెప్పాలి. ఇదీ అసలు సిసలు నిజమైన ప్రచారం అని అంటే ! ఆచారమే ప్రచారం.

7) MABమెంబర్స్ ఆచరణ ద్వారా ప్రచారం చేస్తూ ఉంటారు. ఎవరూ అడగపోతే చెప్పరు. అడిగినప్పుడే చెబుతారు. **అలా అని ఎవరు ఎప్పుడెప్పుడు అడుగుతారా అని అదే పనిగా ఎదురు చూస్తూ ఉండరు.** తమ ఆచరణలలో తాము నిమగ్నమై ఉంటారు. ఎవరైనా అడిగినప్పుడు తాము చేస్తున్న ఆచరణల గురించి చెబుతారు. సద్గురు తారా విశాల్ మార్గదర్శి గ్రంథాన్ని పరిచయం చేస్తారు. ఆ తర్వాత మీకు శ్రద్ధ ఉంటే మా గురువు గారి వర్క్‌షాప్‌కు రండి అని చెబుతారు అంతే. ఇంతకు మించి ఎక్స్‌ట్రా వేషాలు వేయరు. బోధకుల అవతారం ఎత్తరు. క్లాసులు తీసుకోరు, కౌన్సెలింగులు చేయరు.

8) గుర్తుంచుకోండి MAB మెంబర్స్ ఆచరణ ద్వారా ప్రచారం చేస్తూ ఉంటారు. ఎందుకంటే, ఆచారమే నిజమైన ప్రచారం కాబట్టి !

9) MAB మెంబర్స్ ఎవరినీ డబ్బులు అడగరు అని తెలుసుకోండి. చందాలు వసూలు చేయరు అని కూడా తెలుసుకోండి.

10) అయితే, ఎవరైనా డొనేషన్ ఇవ్వాలనుకునే వారు, బేషరతుగా ఇస్తే ఇవ్వండి లేకపోతే లేదు. బేషరతుగా అంటే, ఎలాంటి కండీషన్లు పెట్టకుండా ఇవ్వడం అన్నమాట. ఏమీ ఆశించకుండా ఇచ్చి వెంటనే శాశ్వతంగా మర్చి పోవాలి.

11) ఒకవేళ డొనేషన్ ఇస్తే ఇచ్చి మర్చిపోండి. ఇచ్చి మర్చిపోయే దానినే "విరాళం"(డొనేషన్) అని అంటారు. మీరు ఈ డబ్బును దీనికి వాడండి, దానికి వాడండి అంటూ ఇవ్వకండి. మాకు ఎన్నో పనులు ఉంటాయి. పని చేసే వాళ్ళం మేము కాబట్టి ఎప్పుడు ఏది అవసరమో మాకు తెలుసు. నేను ఇప్పటి వరకు

ఎన్నో వేల పుస్తకాలను 100% ఉచితంగా పంచాను. పంచేటప్పుడు ఎవరు, ఏమిటి ? అంటూ నేనేమీ చూడలేదు. ఎవరు వస్తే వాళ్ళకు ఇచ్చాను. ఇచ్చిన తర్వాత వాళ్ళు దాన్ని చదువుతున్నారా లేదా ? ఏం చేస్తున్నారు ? అనే ఆరాలు నేనేమీ తీయలేదు. తీయను కూడా. ఇవ్వడం నా ధర్మం ఇచ్చాను అంతే. ఇక వాళ్ళు దాన్ని చదువుతారా లేదా... అనేది వారిష్టం. నేను పుస్తకాన్ని ఇచ్చిన తర్వాత వాళ్ళను పరిశీలిస్తూ, ఒకవేళ వాళ్ళు పుస్తకాలను చదవకపోతే నా పుస్తకం నాకివ్వండి అని నేను వెంటపడలేదు, పడను కూడా. నేను చేసిన సేవ నుండి నేను ఏమీ ఆశించను. మీరు సేవ చేస్తే నాలాగే మీరూ ఏమీ ఆశించకుండా చేయండి.

12) డొనేషన్లు ఇవ్వకండి – ఇస్తే ఎలాంటి ప్రతి ఫలం ఆశించ కుండా ఇచ్చి తక్షణమే పూర్తిగా, శాశ్వతంగా మర్చిపోండి.

✪13) డొనేషన్లు ఇవ్వాలి కానీ "ఇన్వెస్ట్‌మెంట్" చేయకండి.✪

14) ఇద్దరు మూర్ఖులు నాకు డొనేషన్ అంటూ ఇచ్చి.. ఆ డబ్బులను నేను వారి కళ్ళ ముందే సేవా కార్యక్రమాలకు ఖర్చు చేసాను. నా మీద ఇన్వెస్ట్ చేసాము అని తర్వాత అన్నారు. వాళ్ళు ఆ మాట ముందే అని ఉంటే నేను నా దరి దాపులలోకే రానిచ్చే వాడిని కాదు.

ఇవ్వడమే పొందడం, ఇస్తేనే పొందగలం

అందుకే నేను ఇస్తూ ఉంటాను.

ఇవ్వని వారు ఏమీ పొందలేరు.

ఇవ్వడం అనేది విత్తనం అయితే

పొందడం అనేది ఫలం.

విత్తనం వేయకుండా ఫలాన్ని

ఆశించడం మూర్ఖత్వం.

ప్రస్తుతం ఇవ్వగలిగిన స్థితిలో ఉండి కూడా

ఇవ్వని వారు ఏమీ లేని వారుగా

మిగిలిపోవడమే కాకుండా రాబోయే

జన్మలలో నిరుపేదలుగా పుట్టడం ఖాయం.

డొనేషన్ అంటూ ఇచ్చి ఇన్వెస్ట్‌మెంట్ చేసాము అని తిరిగి అడిగినా, తీసుకున్నా ఆ మోసపు గుణాలు పూర్తిగా కరిగి పోయే వరకు దరిద్రాన్ని అనుభవిస్తారు. అవి ఎన్ని జన్మలైనా పట్టనీ.. !

డొనేషన్ అంటే భిక్ష. మీరు భిక్ష ఇచ్చి, దాన్ని మళ్ళీ లాక్కోవడం అంటే ఎంత కర్మ మూటకట్టుకుంటున్నారో ఒక్క సారి ఆలోచించండి. మీరు చేసింది మీకు వెయ్యి రెట్లుగా తిరిగి వచ్చి తీరుతుంది. అంటే మీకు భిక్ష కూడా దొరకని దారిద్ర్యాన్ని మీరు సృష్టించుకున్నారు అని అర్థం.

ఆధ్యాత్మికత ఒక్కటే కానీ ఆధ్యాత్మిక మార్గాలు మాత్రం ఒక్కటి కావు.
ఆధ్యాత్మికత ఒక్కటే కానీ ఆధ్యాత్మిక గురువులు ఒక్కటి కారు.

15) మీకు ఒక ఉదాహరణ చెప్తాను – వర్ధమాన మహావీరుడు మరియు గౌతమ బుద్ధుడు ఇద్దరూ ఒకే కాలానికి చెందిన వారు. ఓ సారి, ఓ చోట, ఓ సత్రంలో ఇద్దరూ ఒకేసారి తమ తమ శిష్యబృందాలతో విడిది చేసారు. సత్రంలో ఓ పక్క మహావీరుడు మరో పక్క గౌతమ బుద్ధుడు ఉన్నాడు. తాను విడిది చేసిన సత్రంలోనే ఓ పక్కకు గౌతమ బుద్ధుడు ఉన్నాడని మహావీరుడికి తెలుసు. ఇదే విషయం గౌతమ బుద్ధుడికి కూడా తెలుసు. అయినా ఒకరినొకరు కలుసుకోలేదు. మాట్లాడుకోలేదు. విశ్రాంతి కోసం ఆగారు. విశ్రాంతి తీసుకోవడం అయిపోగానే ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. ఒక్కో గురువుది ఒక్కో మార్గం. ఎవరి మార్గం వారిదే. ప్రతీ గురువు తనదైన శైలిలో భిన్నమైన మార్గాన్ని కనిపెడతాడు. ఆ మార్గానికి తనవైన కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. ఆ మార్గానికి కొన్ని ప్రత్యేకమైన నియమనిబంధనలు ఉంటాయి.

16) కాబట్టి సాధకులు ఎవరో ఒక గురువును మాత్రమే అనుసరించాలి. అంతా ఒకటే కదా అని పది లేక ఇరవై మంది గురువులను ఫాలో అవుతే ఎటూ కాకుండా పోతారు. ఇలా చాలా మంది గురువులను ఫాలో అయ్యేవారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు, ప్రతీ గురువు ఏమనుకుంటాడంటే, ఆఁ.... ఆయన, నన్ను కాకుండా ఇంకా చాలా మందిని ఫాలో అవుతున్నాడు కదా ఎవరో ఒకరు చూసుకుంటారులే అని అనుకుంటాడు. గురువులంతా ఇలా అనుకునే సరికి, చివరికి ఆ సాధకుడిని పట్టించుకునే నాథుడు లేకుండా పోతాడు. ఆధ్యాత్మికతలో గురువు లేకుండా ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. గురువు లేకుండా అణువంత అభివృద్ధి కూడా జరగదు. మోక్షం అనేది ఇక మర్చిపోవాల్సిన విషయం,

ఎందుకంటే, గురువు లేకుండా మోక్షం అనేది అసంభవం.

17) నేను మళ్ళీ చెబుతున్నాను, దయచేసి బలంగా గుర్తుంచుకోండి, భర్త అయినా గురువు అయినా ఒక్కరే ఉండాలి. ఒకే ఒక గురువును పట్టుకోండి, ఇక చివరి వరకు ఆ గురువు వెంటే ఉండండి. అజ్ఞానంతో అంతా ఒక్కటే కదా అని పదిమంది గురువులను ఫాలో కాకండి. అది మీకే ప్రమాదం. ఒకవేళ మీరు ఫాలో అవుతున్న గురువు దగ్గర మీరు ఆశిస్తున్న సబ్జెక్ట్ లేదనుకోండి, తక్షణమే అతడిని వదిలేయండి, పూర్తిగా వదిలేయండి. సంకోచం లేకుండా శాశ్వతంగా వదిలేయండి. ఏమీ కాదు. మీరు ఆశిస్తున్న సబ్జెక్ట్ ఏ గురువు దగ్గర ఉందో ఆ గురువు దగ్గర ఉండిపోండి. నిజాయితీగా ఉండండి.

18) చాలా మంది ఇతర సంస్థల వారు నా వర్క్‌షాప్‌లకు వచ్చినప్పుడు నాకు చాలా ఆశ్చర్యం కలుగుతుంది. **రాకూడదని నేను అనటం లేదు. ఇతర సంస్థల నుండి వచ్చిన వారికి నా యొక్క హృదయపూర్వక శుభాకాంక్షలు.** కాకపోతే, ఇది చాలా వింతైన విషయం !

19) ఆల్‌రెడి పెళ్ళి అయి పిల్లలున్న వారు మళ్ళీ పెళ్ళి చూపులకు వచ్చినట్టుగా ఉంటుంది. మీరు ఆల్‌రెడి ఒక సంస్థలో ఉన్నారు, మీకు ఆల్‌రెడి ఒక గురువు ఉన్నాడు, మళ్ళీ మీరు నా దగ్గరికి ఎందుకు వస్తున్నట్టు ?! జ్ఞానం కోసం వచ్చామండి అని అంటారు. జ్ఞానం కోసం అయితే మీ గురువు దగ్గరికి వెళ్ళండి, జ్ఞానం కోసం మీ గురువును వదిలేసి ఇతర గురువుల దగ్గరకు వెళ్ళడం అనేది సరైన చర్య కానే కాదు. మీ గురువు ఉండగా ఆయన రాసిన పుస్తకాలు ఉండగా, ఆయన సిడీలు ఉండగా మళ్ళీ నేను మీకు ఎందుకు అవసరం అనిపించాను ?! దీన్ని బట్టి ఏం అర్థం అవుతుందంటే, మీరు ప్రస్తుతం ఉన్న సంస్థలో కూడా నిజాయితీగా ఉండటం లేదు అని. ఒకవేళ మీరు నిజాయితీ గల సాధకులే కనుక అయితే, మీరు ఇతర గురువుల దగ్గరకు వెళ్ళరు. అంటే

మీరు నా దగ్గరకు కూడా టైమ్‌పాస్ కోసమే వస్తున్నారన్నమాట. రేపు మీరు మరో గురువు దగ్గరకు వెళ్తారు. ఇలా మీరు ఎవరు కనపడితే వారి దగ్గరకు వెళ్తూ ఉంటారు. మీకు చక్కగా టైమ్‌పాస్ అవుతుంది. కానీ చివరికి ఇలాంటి వారికి జరిగేది ఏమిటో తెలుసా ?! కొన్ని వేల జన్మలు దారి తప్పిపోతారు. వీరు మళ్ళీ సరైన ట్రాక్‌లోకి రావాలంటే సుమారుగా కొన్ని వేల జన్మల కర్మ అనుభవిస్తేనే కానీ వీరికి మళ్ళీ ఒక సరైన మార్గం దొరకదు. కాబట్టి మీరు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి నిజాయితీగా ! నా దగ్గరికి రాకండి, ఎందుకంటే, నేను ఉన్నది నా శిష్యుల కోసం. ఇప్పటి వరకు ఏ సంస్థలోనూ చేరకుండా, ఏ గురువునూ ఫాలో కాకుండా ఉన్న వారి కోసమే నేను నా కార్యక్రమాలను చేస్తున్నాను. ఆల్‌రెడి ఏదో ఒక మార్గంలో ఉన్నవాళ్ళు అందులోనే ఉండండి. నా దగ్గరికి రాకండి, మీరు వచ్చినా మీకు జరిగే ప్రయోజనం మాత్రం శూన్యం.

...ఎందుకంటే, మీ లోపల మీ గురువు ప్రతిష్ఠితమై ఉంటాడు. నేను చెప్పేది మీరు, మీ లోపలికి అనుమతిస్తున్నాను అని మీరనుకుంటారు కానీ నేను చెప్పేది మీ లోపలికి దిగదు. దిగింది అని మీరనుకుంటారు కానీ దిగదు. ఎందుకంటే, గురువు వేరే, గురువు యొక్క విజ్ఞానం వేరే కాదు, రెండూ ఒక్కటే. గురువే గురువు యొక్క విజ్ఞానం. గురువు యొక్క ఆత్మానుభవ సారమే, గురువు యొక్క విజ్ఞానం. గురువే విజ్ఞాన రూపంలోకి మారుతాడు. మీరు నా విజ్ఞానాన్ని మీ లోపలికి అనుమతించడం అని అంటే, మీరు నన్ను మీ లోపలికి అనుమతించడం అన్నమాట. మీరు, మీ లోపల ఆల్‌రెడి ఒక గురువును కలిగి ఉన్నప్పుడు నేను(నా విజ్ఞానం) ప్రవేశించడం అసాధ్యమవుతుంది. ఒకవేళ మీరు నన్ను అనుమతించకుండా కేవలం నా విజ్ఞానాన్ని ఉపయోగించుకుందామని చూస్తే అది అసంభవం అవుతుంది, అది జరగని పని. మీరు ఆల్‌రెడి ఒక గురువును కలిగి ఉన్నప్పుడు, నా

బోధనలు మీకు పనిచేయవు. ఎందుకంటే మీరు ఆల్‌రెడి ఒక గురువును కలిగి ఉన్నారు కాబట్టి. నా బోధనలు పనిచేయాలంటే, మీరు ముందు మీ అంతరంగాన్ని పూర్తిగా శుద్ధి చేసుకోండి. మీ లోపల ఏ దేవత, ఏ దేవుడు, ఏ గురువు ఉండకూడదు. ఎవరైనా ఉంటే అందరినీ తీసేయండి... పూర్తిగా, శాశ్వతంగా తీసేయండి. మీ లోపల కేవలం మీ దైవత్వం మాత్రమే ఉండాలి. అప్పుడు నన్ను మీ గురువుగా ఒప్పుకోండి. "మీ దైవత్వంలో నుండి నన్ను మీ గురువుగా స్వీకరించండి". నా పట్ల పూర్తి నిజాయితీగా, అజేయమైన విశ్వాసంతో ఉండండి. అప్పుడు నా బోధనలు పనిచేస్తాయి. అంతకు ముందు మాత్రం పనిచేయవు. ఒకవేళ పనిచేసినా తాత్కాలికంగా మాత్రమే పనిచేస్తాయి. మీకు పూర్తిస్థాయి ఫలితాలు అందవు. గురువు యొక్క అభయం మీకు అందదు, గురువు యొక్క సురక్షా చక్రంలోకి మీరు రాలేరు.

20) మొత్తానికి నేను చెప్పేదేమిటంటే – మీరు ఆల్‌రెడి ఒక గురువును ఫాలో అవుతూ ఉంటే దయచేసి నా దగ్గరకి రాకండి. మీ గురువునే మీరు ఫాలో అవ్వండి. మీరు ఆల్‌రెడి ఒక సంస్థలో ఉంటే, ఆ సంస్థలోనే ఉండిపోండి, మీరు ఇంకా అందులో ఉండాలనుకుంటే. మీరు ఏ సంస్థలోనైతే ఉన్నారో ఆ సంస్థలో నిజాయితీగా ఉండండి. మీరు ఏ గురువునైతే ఫాలో అవుతూ ఉన్నారో దయచేసి ఆ గురువును మాత్రమే నిజాయితీగా ఫాలో అవ్వండి. ఒకవేళ మీరు గురువును & సంస్థను మార్చదలుచుకుంటే, ఒకటికి పదిసార్లు ఆలోచించుకోండి. చాలా కోణాల్లో ఆలోచించిన తర్వాత నిర్ణయం తీసుకోండి. ఎందుకంటే, మీరు గురువును మార్చుకోగానే మీ పాత మిత్రులు రకరకాలుగా మాట్లాడతారు. మీరు ఎన్నో విమర్శలకు గురయ్యే అవకాశం ఉంది. వాటన్నింటినీ మీరు తట్టుకుని నిలబడ గలను అని అనుకుంటే మీ గురువును మీరు మార్చుకోండి.

21) మీరు ప్రస్తుతం ఉన్న గురువు దగ్గరి నుండి మరియు సంస్థలో నుండి బయటికి వచ్చి కేవలం నన్ను మాత్రమే ఫాలో అవుదామని నిర్ణయించుకుంటే, మీ నిర్ణయం ప్రకారమే చేయండి. కానీ నా పట్ల నిజాయితీగా ఉండండి, అజేయమైన విశ్వాసంతో ఉండండి.

22) దయచేసి ఆధ్యాత్మికతను, సత్యమార్గాన్ని సీరియస్‌గా తీసుకోండి. మీరు సీరియస్‌గా తీసుకోనంత కాలం మీకు ఎలాంటి అభివృద్ధి జరగదు. సీరియస్ అని అంటే నా మాటను సరిగా అర్థం చేసుకోండి. విపరీత అర్థాలు తీయకుండా... సరిగా అర్థం చేసుకోండి. సీరియస్ అని అంటే నా ఉద్దేశంలో... "ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని చాలా బలంగా నిర్ణయించుకుని, ఏది ఏమైనా తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండడం" అని మాత్రమే. అంతే తప్ప జీవితంలో నుండి హాస్యాన్ని, ఉల్లాసాన్ని, చతురతను, నవ్వును, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని తీసేయమని కాదు. సత్యమార్గానికి పూర్తిగా అంకితం అవడం అనేది, మొత్తం మీ యొక్క జీవిత ప్రవాహాన్ని ఒక్కసారిగా మార్చేస్తుంది. ఒక గురువును మీరు ఎంచుకుంటున్నారు అని అంటే మీరు ఆ గురువు గారి ద్వారా మీ యొక్క జీవిత ప్రవాహాన్ని సరి చేసుకోవాలని అనుకుంటున్నారన్నమాట. మరి, మొత్తం జీవిత ప్రవాహాన్ని మార్చగలిగేంతటి విజ్ఞానం ఆ గురువు దగ్గర ఉందా ? అని మీరు చెక్ చేసుకోవాలి. జీవితం అని అంటే మీరనుకుంటున్నట్టు కాదు. జీవితానికి వివరణ సద్గురు తారా విశాల్ మార్గదర్శిలో చాలా చోట్ల ఇచ్చాను మరో సారి సద్గురు తారా విశాల్ మార్గదర్శి చదవండి. బాగా చదివి సరిగా అవగాహన చేసుకుని ఒక నిర్ణయానికి రండి. ఇక ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండండి. త్వరగా ఒక్కరిని మాత్రమే గురువుగా ఎంచుకోండి, ఒక్కరిని మాత్రమే. సత్యమార్గంలో(ఆధ్యాత్మిక మార్గంలో) కేవలం ఒకే ఒక గురువు మాత్రమే ఉండాలి. అప్పుడే మీరు నిజమైన అభివృద్ధిని స్వంతం చేసుకోగలుగుతారు. ఎన్నెన్నో శ్రేయస్కరాలను పొందగలుగుతారు. ఒకరికి మించి గురువులను మీరు ఫాలో అవుతూ ఉంటే, మీకెలాంటి అభివృద్ధి జరగదు, పైగా దిగజారి పోతారు. ఎలాంటి శ్రేయస్కరాలు

జరగవు పైగా నష్టపోతారు. అందుకే నేను ఇన్ని సార్లు చెబుతున్నాను గురువైనా భర్త అయినా ఒక్కరే ఉండాలని. నేను చెప్పేది చెప్పాను.. ఇక జనాల విజ్ఞతకే వదిలేస్తున్నాను.

ఎవరి గురువు వారికి ఉంటారు. ఎవరి గురువును వారు ఫాలో కావాలి. ఇదంతా ఎందుకు చేస్తున్నాను అని అంటే, ఎక్కడా ఒకచోట స్థిరంగా ఉండకుండా జ్ఞాన సేకరణ అనే నెపంతో ఊరికే అందరి దగ్గరికి తిరిగే గాలివాటం వాళ్ళు నుండి నన్ను నేను రక్షించుకోవడానికి. ఇలాంటి గాలివాటం వాళ్ళల్లో ఆడవారు & మగవారు కూడా ఉంటారు. వీరు చాలా మూర్ఖులు. ఇలాంటి వారు తాము నాశనం అవడమే కాకుండా ఇతరుల నాశనానికి కూడా కారణం అవుతారు. ఇలాంటి వారి బారి నుండి నిజమైన సాధకులను కాపాడడానికే నేను ఇదంతా చేస్తున్నాను.

23) Teaching is the best way of learning. నేర్చుకోవడానికి బోధించడమే ఉత్తమమైన మార్గం – అని ఈ ఇంగ్లీష్ వాక్యం యొక్క అర్థం. అయితే, ఇది కేవలం భౌతిక జీవితంలో, భౌతిక విషయాలకు మాత్రమే పనికి వస్తుంది. ఈ సూత్రం భౌతిక జీవితానికి ప్రాణం పోస్తుంది. ఆధ్యాత్మిక జీవితంలో మాత్రం ప్రాణం తీస్తుంది.

మీరు ఒక సద్గురువు కానిదే బోధించకూడదు. జ్ఞానోదయం పొందిన తర్వాత ఎన్నెన్నో జన్మలు మీరు ఒక సద్గురువు దగ్గర శిష్యరికం చేస్తే ఎప్పటికో మీకు బోధించే అర్హత వస్తుంది. అప్పుడు మాత్రమే బోధించాలి. అంతకు ముందు బోధిస్తే జడ్జ్‌మెంట్ అప్లై అయి భయంకరమైన కర్మను అనుభవించాల్సి వస్తుంది.

24) సద్గురువు స్థితిని పొందని వారు ధ్యాన కేంద్రం తెరిచి నిర్వహిస్తూ ఉంటే, వారికి చాలా పెద్ద కర్మ చుట్టుకుంటుంది. ఎందుకంటే ఒక ధ్యాన కేంద్రం ఓపెన్ చేసి నడిపించాలంటే కనీసం జ్ఞానోదయం అయి ఉండాలి. ఇక దాన్ని నిరవధికంగా నడిపించాలంటే సద్గురువు స్థితిని తప్పక పొంది ఉండాలి. ఒకవేళ ఏ మూర్ఖ గురువు మాటలనో పట్టుకుని మీరు ఓపెన్ చేసినా దాన్ని ధ్యాన కేంద్రంగా పరిగణించకుండా కేవలం సాధకుల సమావేశ మందిరంగా మాత్రమే పరిగణించాలి. తక్షణమే దాని పేరు మార్చి సాధకుల సమావేశ మందిరం అని పేరు పెట్టాలి. అందులో క్లాసులు మరియు కౌన్సెలింగులు జరగకుండా చూడాలి. క్లాస్ చెప్పడం మరియు కౌన్సెలింగ్ చేయడం అంటే ఆపరేషన్ చేయడం లాంటిది. అందరూ పేషంట్లే అయినప్పుడు, అక్కడ ఒక క్వాలిఫైడ్ డాక్టరే లేనప్పుడు, ఎవరు ఎవరికి వైద్యం చేస్తారు ?! ఒక పేషంట్ ఇంకో పేషంట్‌కు వైద్యం చేస్తాడా ?!

వీలైనప్పుడల్లా సాధకులు కలుసుకుని తమ తమ సాధక బాధల గురించి చర్చించుకుని కాసేపు సేద తీరి, కాసేపు సాధన చేసుకుని, సద్గురువులు సూచించిన సద్గ్రంథ పఠనం కాసేపు చేసుకుని ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళాలి. అంతే, అక్కడ జరగాల్సింది.

చాలా బలంగా గుర్తుంచుకోండి...

సత్యాచారమే సత్యప్రచారం !

25) చాలా బలంగా గుర్తుంచుకోండి...

ఆచారమే ప్రచారం !

దైవత్వం పొందిన ఒక సత్యగురువు ఎప్పుడూ సాధకులను ఆచరణ మాత్రమే చేయుమని చెబుతాడు. మీరు ఆచరిస్తూ ఉండండి అప్పుడు ఆటొమెటిక్‌గా ప్రచారం దానంతటే అదే జరిగి పోతుందని చెబుతాడు. మీరు ప్రచారం చేస్తూ ఉండండి అదే ఆచారం అవుతుందని చెప్పేవాడు నిఖార్సైన అజ్ఞాని మరియు సరైన గురువు కాదు అని తెలుసుకోండి.

26) ప్రచారం చేయండి అదే ఆచారం అవుతుందని చెప్పేవాడు తాను నాశనం అవడమే కాకుండా అందరినీ నాశనం చేసేవాడని గుర్తుంచుకోండి.

ఎందుకంటే, ప్రచారం అనేది ఆచారం యొక్క ఫలితం. ఆచారం అనేది విత్తనమైతే ప్రచారం అనేది ఫలం. విత్తనం వేసినప్పుడు మాత్రమే ఫలం వస్తుంది కదా. ***ఆచరించకుండా ప్రచారం చేయడం అనేది విత్తనమే వేయకుండా ఫలం కోసం ప్రయత్నించడం లాంటిది.*** ఆహారం తీసుకుంటే శక్తి వస్తుంది. శక్తి కలగడం అనేది ఆహారం తీసుకోవడం ద్వారా ఉద్భవించే ఫలితం.

మీకు శక్తి కావాలి అని అంటే మీరు ఆహారం తీసుకోండి, ఆ తర్వాత శక్తి దానంతట అదే వస్తుంది కదా. ఆహారమే శక్తిగా మారుతుంది కానీ శక్తి అనేది ఎక్కడి నుండో ఊడిపడటం లేదు కదా. ఆహరమే శక్తి. ఊరికే ప్రచారం చేయడం అనేది ఆహారం తీసుకోకుండా శక్తి కోసం ప్రయత్నించినట్టుగా ఉంటుంది.

మీరు మౌనంగా ఆచరించండి అప్పుడు సత్యం దానంతట అదే తనను తాను ప్రచారం చేసుకుంటుంది.

27) ఆచారమే నిజమైన ప్రచారం అనే సత్యం తెలియని గురువులు అమాయక జనాల చేత తమ సంస్థ యొక్క కాన్సెప్ట్‌లను వ్యాపార దృక్పథంతో ప్రచారం చేయిస్తూ కమర్షియల్‌గా లాభం పొందుతున్నారు. మేము ధ్యాన ప్రచారం చేసి జనాలకు మేలు చేస్తున్నాము అనే భ్రమలో ప్రచారం చేసే వారున్నారు. కానీ వారికి తెలియదు వాస్తవానికి జరుగుతున్నది ఏమిటో...? ప్రజలు ఇకనైనా మేలుకోవాలి. ఆత్మ అని చెబుతున్నప్పుడు నేను ఆత్మ అనే దానిని అనుభవించానా అని తనను తాను ప్రశ్నించుకోవాలి. ఆచరించి అనుభవ జ్ఞానం లేనిదే నేను ఎలా ప్రచారం చేస్తాను ? అని నిజాయితీగా తనను తాను విమర్శించుకుని సత్యాన్ని గ్రహించాలి. అనుభవ జ్ఞానం లేనిదే ప్రచారం చేయకూడదు అని అంటున్నాను. అనుభవ జ్ఞానం లేనిదే, మీకు జ్ఞానోదయం జరగనిదే బోధించకూడదు అనే నియమాన్ని గుర్తు చేస్తున్నాను. జ్ఞానోదయం మీకు అయితే మీరు బోధించ వచ్చు.

❖ ❖ ❖

2. కొన్ని సందేహాలు

1వ ప్రశ్న) మీడియం(medium), చానల్ (channel), చానెలింగ్ (channelling) మరియు వాకిన్(walk-in) అనే విషయాల గురించి వివరించండి సార్. మీరు, సహస్ర మేడమ్ వాకిన్ మాస్టర్స్ అని మాకు ధ్యానంలో తెలిసింది. మాకే కాదు బయటి వాళ్ళకు కూడా మీరిద్దరూ వాకిన్స్ అనే అనుభవాలు వస్తున్నాయి. వాస్తవంగా మీరిద్దరూ ఎవరు సార్...? వీలైతే మీ ఇద్దరి విషయం కూడా చెప్పండి.

1వ ప్రశ్నకు సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మీడియం (medium) **:** ఎవరైతే ప్రస్తుతం భౌతిక దేహంతో అందుబాటులో లేరో అంటే, వారు మీరున్న ప్రాంతంలో కాకుండా వేరే దగ్గర ఉన్నా లేక దేహాన్ని వదిలేసి ఉన్నా మీ తరపున వారిని (భౌతికంగా అందుబాటులో లేని వారిని) సంప్రదించి(contact) మీ గురించి వారికి చెప్పి, వారు చెప్పిన విషయాలను మీకు చెప్పే వారిని మీడియమ్(medium) అని అంటారు. అంటే మధ్యవర్తుల్లాగా అన్నమాట. మీరు ఒక ప్రశ్న అడుగుతారు. ఆ ప్రశ్నను మీడియమ్స్ ధ్యానంలో కూర్చుని భౌతికంగా లేని వారిని ఎవరినో సంప్రదించి సమాధానం తెలుసుకుని మీకు చెబుతారు. మీకు మరియు భౌతికంగా అందుబాటులో లేని వారికి మధ్యలో ఉంటూ ఇక్కడి సమాచారం అక్కడికి, అక్కడి సమాచారం ఇక్కడికి చేరవేసే వారినే మీడియమ్స్ అని అంటారు. ఈ విధానంలో తెలుసుకునే వారికి మరియు తెలియ జేసే వారికి మధ్యలో ఒక వ్యక్తి ఉంటాడు లేక ఉంటుంది. తెలుసుకునే వారికి మరియు తెలియజేసే వారికి ఈ విధానంలో ప్రత్యక్ష సంబంధం లేక అనుసంధానం ఉండదు. మధ్యలో ఒకరు ఉంటారు. అలా మధ్యలో ఉండే వారినే మీడియమ్ అని అంటారు. మీడియమ్స్ – బహువచనం.

చానల్(channel) : మీరున్న ప్రదేశంలో లేక లోకంలో లేక విశ్వంలో భౌతికంగా అందుబాటులో లేని వారు ఎవరైనా, మీరున్న ప్రదేశంలోని ఒక వ్యక్తి శరీరాన్ని ఉపయోగించుకుని తాను తెలియజేయాల్సింది తెలియజేస్తాడు. ఉదాహరణకు సేత్ అనే మహోన్నత లోకాత్మ అమెరికాలోని జేన్ రాబర్ట్స్ అనే మహిళ దేహం ద్వారా మహోన్నతమైన ఆత్మ విజ్ఞానాన్ని ఈ భూలోకానికి అందించాడు. ఈ ప్రక్రియను చానెలింగ్ అని అంటారు. ఎవరైతే ఈ చానెలింగ్‌కు ఉపయోగ పడతారో వారిని చానల్ అని అంటారు. ఉదాహరణకు జేన్ రాబర్ట్స్ ఒక చానల్ అన్నమాట. ఈ చానలింగ్ జరిగేటప్పుడు జేన్ రాబర్ట్స్ ఆ దేహంలో ఉండదు. ఒక వేళ ఉన్నా ఆమె ఆత్మను పూర్తిగా ఓ పక్కకు పెట్టి ఆమె దేహాన్ని ఉపయోగిస్తూ సేత్ పరమాత్ముడు తాను చెప్పదలుచుకున్నదాన్ని చెబుతాడు. ఇలా జరగటాన్ని చానలింగ్ అని అంటారు. ఈ చానలింగ్ ప్రక్రియలో తెలుసుకునే వారికి మరియు తెలియజేసే వారికి మధ్య ఎవరూ ఉండరు. ఇద్దరి మధ్య ప్రత్యక్ష సంబంధం లేదా అనుసంధానం ఉంటుంది.

వాకిన్ (walk-in) : ఈ వాకిన్ అనే ప్రక్రియ ఇంతకు ముందు తెలియజేసిన వాటికంటే పూర్తిగా భిన్నమైనది. ఎవరైనా ఒక మహోన్నత లోకాత్మ భూమి పైకి వచ్చి తన కార్యక్రమాలను చేయాలనుకున్నప్పుడు అందరిలాగా జన్మించదు. ఈ మహోన్నత లోకాత్మలు భూమి పైకి రావాలనుకున్నప్పుడు తగిన పరిస్థితుల కోసం ఎదురు చూస్తాయి. భూమి పైన జన్మ తీసుకోవాలనే ఆత్మలను పరిశీలిస్తాయి. తమకు అన్ని విధాల సరిపోయే అంశాలు ఉన్న ఆత్మను ఎంపిక చేసుకుని, ఆ ఆత్మను సంప్రదిస్తాయి. నీవు భూలోకం పైన జన్మించు, ఇంత కాలం జీవించు, ఫలానా సమయానికి నీవు నీ భౌతిక దేహాన్ని నాకు అప్పగించి నీవు ఈ భూలోకాన్ని వదిలి వెళ్ళిపో, ఇందుకోసం నీకు ప్రతిఫలంగా నీ కర్మలను క్లియర్ చేస్తాను....నీకు ఫలానా లాభాలు జరుగుతాయి అంటూ ఆ మహోన్నత ఆత్మ, సాధారణ ఆత్మకు చెబుతుంది.

ఈ సాధారణ ఆత్మకు ఈ విషయం కనుక నచ్చితే ఒప్పుకుంటుంది. మహోన్నత ఆత్మకు సాధారణ ఆత్మకు మధ్య ఒప్పందం కుదిరితే, ఆ సాధారణ ఆత్మ యొక్క కార్యాచరణలను అన్నింటినీ మహోన్నత ఆత్మ పర్యవేక్షిస్తుంది. ఎప్పుడు, ఎక్కడ, ఏ దేశంలో, ఏ ప్రాంతంలో, ఏ తల్లిదండ్రులకు, ఏ దేహంతో(పురుష లేక స్త్రీ), ఎన్నో సంతానంగా జన్మించాలి అనే విషయాలన్నింటినీ మహోన్నత ఆత్మే నిర్ణయిస్తుంది. మహోన్నత ఆత్మ నిర్ణయాల ప్రకారం సాధారణ ఆత్మ జన్మిస్తుంది. జన్మించినప్పటి నుండి మహోన్నత ఆత్మ పర్యవేక్షణలోనే ఆ సాధారణ ఆత్మ పెరుగుతూ ఉంటుంది. ఆ సాధారణ ఆత్మ ఏ కుటుంబంలో అయితే జన్మిస్తుందో ఆ కుటుంబం వారికి కానీ ఆ సాధారణ ఆత్మ తల్లిదండ్రులకు కానీ ఈ విషయాలు ఏవీ తెలియవు. అందరూ చాలా మామూలుగానే ఉంటారు. మధ్య మధ్యలో మహోన్నత ఆత్మ వచ్చి ఈ యొక్క సాధారణ ఆత్మ దేహంలో కొంచెం కొంచెం సమయం ఉంటూ ఆ సాధారణ ఆత్మ ఎలా తన కుటుంబ సభ్యులతో, బంధు మిత్రులతో వ్యవహరిస్తూ ఉంది అనే విషయాలను అవగాహన చేసుకుంటూ ఉంటుంది. ఇలా జరిగిపోతూ ఉన్నప్పుడు అనుకున్న సమయానికి ఆ సాధారణ ఆత్మ తన భౌతిక దేహాన్ని మహోన్నత ఆత్మకు అప్పగించి ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోతుంది. సాధారణ ఆత్మ దేహాన్ని ఖాళీ చేసిన తక్షణమే ఆ దేహంలోకి మహోన్నత ఆత్మ ప్రవేశించడం ద్వారా ఆ దేహాన్ని స్వంతం చేసుకుంటుంది. ఈ ఆత్మల మార్పిడి విషయం ఎవరికీ తెలియకుండా గుప్తంగా జరిగిపోతుంది. ఇంకా విచిత్రమేమిటి అని అంటే, మహోన్నత ఆత్మ కూడా భౌతిక దేహంలోకి ప్రవేశించిన తర్వాత తనను తాను మర్చిపోతుంది. ఆ క్షణం వరకు ఎవరైతే ఆ దేహంలో ఉండే వారో, వారిలాగే తాను కూడా ప్రవర్తించడం మొదలు పెడుతుంది. కాకపోతే ఉన్నత వికాస పూరిత ప్రవర్తన ఉంటుంది, మహోన్నత ఆత్మ కదా !

ఆ భౌతిక దేహం యొక్క పాత ఓనర్‌లాగా తనను తాను భావిస్తూ జీవితాన్ని కొనసాగిస్తూ ఉంటుంది. ఒప్పందం ప్రకారం ఆ దేహం యొక్క పాత ఓనర్ కర్మలను అనుభవించి క్లియర్ చేస్తుంది. ఇంకా ఇవే కాకుండా లోక కర్మలను కూడా అనుభవిస్తూ క్లియర్ చేస్తూ ఉంటుంది. ఈ విధంగా ఉంటూ ఉన్నప్పుడు మెల్లి మెల్లిగా తన నిజతత్వానికి సంబంధించిన జ్ఞాపకాలు ఉత్తేజితమవుతూ ఉంటాయి. ఇతరులకు వీరి గురించి అనుభవాలు వస్తూ ఉంటాయి. వాళ్ళు వచ్చి వీరు నిజానికి ఎవరో అనే విషయాన్ని తెలియజేస్తూ ఉంటారు. వీరికేమో ఆ పాత ఓనర్ స్మృతులు ఉంటాయి. నేను ఒక మామూలు మనిషిని కదా వీరందరు ఏమిటి నా గురించి ఇలా చెబుతున్నారు ?! అని ఈ మహోన్నత ఆత్మ విస్తూ పోతూ ఉంటుంది. ఇలా కొంత కాలం(నెలలు లేక సంవత్సరాలు) గడిచిన తర్వాత తనెవరు అనే విషయం ఈ మహోన్నత ఆత్మకు గుర్తుకు రావడం ప్రారంభమవుతుంది. ఒక శుభదినాన తన వృత్తాంతం అంతా స్పష్టంగా గుర్తుకు వస్తుంది. ఇక అప్పుడు మొదలవుతుంది అసలు సిసలు విజృంభణ. ఆ యొక్క మహోన్నత ఆత్మ తన కార్యాచరణను ప్రారంభించి తన పనిలో తాను మునిగి పోతుంది. ఈ విధంగా మహోన్నత లోకాల నుండి వచ్చి ఈ భూలోకం పైన జన్మించకుండా భౌతిక దేహాన్ని విశ్వ నియమాల ప్రకారం పొంది, ఆ యొక్క భౌతిక దేహాలలో జీవిస్తూ ఉన్న వారినే "వాకిన్స్" అని అంటారు. చాలా మంది మహాత్ములు కూడా ఈ వాకిన్ విధానంలో భూమి పైకి రావడానికి జంకుతారు. ఎందుకంటే ఈ విధానంలో చాలా అపాయాలు ఉన్నాయి. అన్నింటి కంటే పెద్దది ఏమిటంటే, తనెవరో తాను మర్చిపోయి, ఆ తర్వాత తనను తాను గుర్తుకు చేసుకోవడం. ఈ మధ్యలో ఆ యొక్క మహోన్నత ఆత్మ చాలా సంఘర్షణకు గురవుతుంది. చాలా బాధలు పడాల్సి వస్తుంది.

ఆ భౌతిక దేహం యొక్క పాత ఓనర్ కర్మలను అనుభవించి క్లియర్ చేయాల్సి ఉంటుంది. ఇంకా ఇవే కాకుండా లోక కర్మలను కూడా అనుభవించి క్లియర్ చేయాల్సి ఉంటుంది. ఈ కర్మలను క్లియర్ చేసేటప్పుడు భౌతికంగా, మానసికంగా చాలా నరకాన్ని అనుభవిస్తుంది మహోన్నత ఆత్మ. పైగా చీకటి శక్తుల దాడుల నుండి తనను తాను సంరక్షించుకుంటూ ఉండాలి. మహోన్నత ఆత్మకు సంరక్షణగా కోట్లాది మంది మాస్టర్స్‌తో పాటు సాక్షాత్తు సూపర్ కాన్షియస్ కూడా ఉంటుంది. అయితే ఈ పాత ఓనర్ కలిగి ఉన్న నమ్మకాల వ్యవస్థ వలన కొన్ని ప్రత్యేకమైన బాధలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ విధానంలో చాలా కష్టాలున్నాయి. లోక కల్యాణాన్ని ఆకాంక్షించి నరక బాధలను అనుభవించడానికి సిద్ధపడి ఈ భూమి పైకి రావాల్సి ఉంటుంది. ఇది ఎంతో సాహసంతో కూడుకుని ఉన్న విషయం. అందుకే చాలా మంది పరమాత్ములు వాకిన్స్‌గా భూమి పైకి రావాలంటే ఆలోచిస్తారు. మేము అన్నీ తెలుసుకునే వచ్చాము. లోతు తెలుసుకునే దిగాము. 2003వ సంవత్సరంలో నేను ఈ భౌతిక దేహంలోకి వచ్చాను. కొన్ని నెలలు అటూ ఇటూగా నా భార్య కూడా ప్రస్తుత భౌతిక దేహంలోకి వచ్చింది. మేము ఈ ఇద్దరినీ జన్మించక ముందే ఎంచుకున్నాము. మా పర్యవేక్షణలోనే వీరు పుట్టడం మరియు పెరగడం జరిగింది. మా పర్యవేక్షణలోనే వీరి(మా భౌతిక దేహాల పాత ఓనర్స్) పెళ్ళి జరిగింది. అంతా మా పర్యవేక్షణలోనే జరిగింది. అనుకున్న సమయానికి మా దేహాల పాత ఓనర్స్ వారి దేహాలను మాకిచ్చి వారు ఈ లోకం వదిలి వెళ్ళిపోయారు. మేము ఈ దేహంలోకి వచ్చిన తర్వాత చాలా సంవత్సరాలు నరకం అనుభవించాం. ఎంతో సంఘర్షణ తర్వాత మేము ఎవరిమో తెలుసుకున్నాము. అయితే మేము ఎవరమో మాకు పూర్తిగా తెలియక ముందే ఆటొమెటిక్‌గా మా కార్యాచరణ ప్రారంభించాం. ఇది అంతా మాస్టర్స్ పర్యవేక్షణలో జరిగింది.

2వ ప్రశ్న) తారా విశాల్ ఇంతకు ముందు మా సంస్థలో ఉన్నవాడే. ఆయన చెబుతున్న విషయాలలో మావి కూడా ఉన్నాయి అని కొంత మంది అంటూ ఉంటారు. అలా అన్న వారిని మేము చూసాము. ఇలా అన్నవారు పెద్దగా అవగాహన లేని వారిగానే కనిపించారు. వారి మాటలు, వారి ప్రవర్తన చాలా సంకుచితంగా, ఎదగని విధంగా ఉంది. కానీ అన్నీ తెలిసిన వారిలాగా మాట్లాడారు. వాళ్ళు ఎన్ని మాటలు మాట్లాడినా సత్యం అనేది ఎన్నటికీ దాగదు. దాన్నెవరూ దాచలేరు. ఇలా మాట్లాడిన వారి సంస్థలలోనే కాదు, మొత్తం ఈ భూమి పైనే " సద్గురు తారా విశాల్ మార్గదర్శి" లాంటి పుస్తకం లేదు అనేది సత్యం. గొప్ప గొప్ప పుస్తకాలు ఎన్నో ఉన్నాయి, కానీ మీరు చెప్పినంత స్పష్టంగా, వివరంగా, విషయాలు ఏ గ్రంథంలోనూ లేవు. ఏ పుస్తకం చదివినా ఎన్నో సందేహాలు మిగిలిపోతూనే ఉంటాయి. కేవలం మీ మార్గదర్శి చదివినప్పుడే అన్ని సందేహాలు తీరిపోయి, ఒక చక్కని స్పష్టత వస్తుంది. సబ్జెక్ట్ పైన సాధికారత వస్తుంది. మా మీద మాకు ఆత్మ విశ్వాసం కలుగుతుంది. ఇతర సంస్థలలోని పుస్తకాలలో గొప్పవి ఉన్నాయి, కానీ ఇంత వివరంగా లేవు కదా, మరి వాళ్ళెందుకు అలా....

2వ ప్రశ్నకు సద్గురు తారా విశాల్ గారి సమాధానం : ప్రశ్న మీరే అడిగారు. సమాధానం కూడా మీరే చెబుతున్నారు. కేవలం కన్‌ఫర్మేషన్ కోసమే మీరు నన్ను ఈ ప్రశ్న అడిగారు.. ***"ఇలా అన్నవారు పెద్దగా అవగాహన లేని వారిగానే కనిపించారు. వారి మాటలు, వారి ప్రవర్తన చాలా సంకుచితంగా, ఎదగని విధంగా ఉంది"...*** అని మీరే అంటున్నారు కదా... అదే సత్యం. నేను వాకిన్ మాస్టర్‌ను అన్న విషయం నాకు తెలియక, బతకడానికి ఏ ఉద్యోగమో, వ్యాపారమో చేద్దాము అనుకుని ఏదైనా చేయబోతే.....

....మాస్టర్స్ కనిపించి నీవు ఉద్యోగమో లేక వ్యాపారమో చేయడానికి ఈ భూమి పైకి రాలేదు. నీవు ఆధ్యాత్మిక లక్ష్యాల కోసం పని చేయాలి... అంటూ చెప్పేవారు. నాకు ఏమీ అర్థం కాక, నేను వారి మాటలు పట్టించుకునే వాడిని కాదు. నేను ఏ ఉద్యోగ లేక వ్యాపార ప్రయత్నాలు చేసినా అవి బెడిసి కొట్టేవి. అలా నేను చాలా ప్రయత్నాలు చేసాను. విసిగి వేసారి పోయాను. సాధారణ ప్రజల భాషలో దేవుళ్ళు, దేవతలు అనబడే వారినే మనం మాస్టర్స్ అని అంటాం. నా ప్రయత్నాలన్నీ విఫలమై నేను బాధపడుతూ ఉంటే ఈ మాస్టర్స్ కనిపించి బాధపడకు నీవు అసలు విషయాన్ని తెలుసుకో, ఆధ్యాత్మిక లక్ష్యం కోసం పనిచేయి అని చెప్పేవారు. ఎలా పనిచేయాలో, ఏం చేయాలో చెప్పేవారు కాదు. కేవలం ఆధ్యాత్మికమైన పని చేయి అనేవారు అంతే. నీవు ఆధ్యాత్మికమైన పని కాకుండా ఇంకా ఏం చేసినా సఫలం కాదు అని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేవారు. వారి మాటలు పక్కన పెట్టి నేను ప్రయత్నాలు చేసేవాడిని. వారు చెప్పినట్టే ఏ పని అయ్యేది కాదు. ఇలా కొన్ని సంవత్సరాలు నేను చేయని ప్రయత్నం లేదంటే అతిశయోక్తి కాదేమో. ఇక చివరికి విసుగు వచ్చి అసలు ఈ మాస్టర్స్ ఎవరు, వీరు నా వెంట ఎందుకు పడుతున్నారు ? ఆధ్యాత్మికమైన పని అంటే ఏమిటి ? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకుందామని నిశ్చయించుకున్నాను. మాస్టర్స్ కనపడినప్పుడు అడిగితే, వారు అన్నీ నీకే తెలుస్తాయి అని అనేవారు. పని చేయమంటారు. ఏ పని చేయాలి ? ఎలా చేయాలి ? అనేది మాత్రం చెప్పేవారు కాదు. అన్నీ నీకే తెలుస్తాయి అని మాత్రం అనేవారు. నాకు చాలా బాధ, కోపం కలిగేవి. చివరికి ఒక రోజు నేను, నా భార్యతో ఈ విషయాల గురించి చర్చించి భారత దేశంలో ఉన్న ప్రధానమైన సంస్థలకు వెళ్తూ ఉంటే ఎక్కడో ఒకచోట సమాధానం దొరకుతుంది కాబట్టి, దేశంలోని సంస్థలన్నీ తిరగాలి అని నిర్ణయం....

...తీసుకుని, దేశం అంతా తిరగడం ప్రారంభించాను. కొంత మంది స్వామీజీలు నాకు మాస్టర్స్ కనపడుతున్నారంటే నమ్మలేదు. మేము మా జీవితమంతా ఆశ్రమ జీవితంలోనే ఉన్నాం. ఇప్పటి వరకు మాకే కనపడలేదు. నీకు కనపడుతున్నారంటే మేము ఎలా నమ్మాలి ? అని అన్నారు. కొంత మంది బాబాలు నమ్మారు కానీ పరిష్కారం చూపలేక పోయారు. కొంత మంది స్వామీజీలకు నేను అడిగే విషయాలు అసలు ఏమీ అర్థం కాలేదు. ఇలా నేను నా ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడానికి మాత్రమే కొన్ని సంస్థల్లో కొంత కాలం ఉన్నాను. అక్కడ విషయం ఏమీ లేదు అని తెలియగానే అక్కడి నుండి మరో సంస్థకు వెళ్ళేవాడిని. ఇలా తిరిగి తిరిగి అలిసిపోయాను. చివరికి నాకే అన్ని విషయాలు అర్థం కాసాగాయి. ఎప్పుడైతే విషయాలు నాకు అర్థం కావడం మొదలు పెట్టాయో అప్పుడే నేను తిరగడం మానేసాను. నాకు ఎక్కడా సమాధానం దొరకలేదు. చిన్న చిన్న పరిష్కారాలు దొరికాయి, అంటే ఒక పది శాతం మాత్రమే పరిష్కారం దొరికింది కానీ పూర్తి స్థాయి పరిష్కారం మాత్రం నాకు ఎక్కడా దొరకలేదు. ఏ సంస్థలోనూ, ఏ స్వామీజి దగ్గర కానీ, ఏ బాబా దగ్గర కానీ నాకు పరిష్కారం దొరకలేదు. నేను రకరకాల సంస్థలలోకి వెళ్ళింది ఉద్యోగం కోసమో, వ్యాపారం కోసమో లేక పెళ్ళి కోసమో లేక పిల్లల కోసమో లేక మరేదైనా వ్యక్తిగత సమస్య కోసమో కాదు కదా. నేను వెళ్ళింది దేవుళ్ళు, దేవతలు అనబడే వారు నిత్యం నాకు కనపడి విసిగిస్తున్నారు, నన్ను ఏ పని చేయకుండా అడ్డుకుంటున్నారు. వీళ్ళ బారి నుండి నేను ఎలా బయట పడాలి ? అని తెలుసుకోవడానికి వెళ్ళాను. అంతే తప్ప సబ్జెక్ట్ కోసమో లేక సాధనల కోసమో లేక మరేదో ఆశించి వెళ్ళలేదు. నా విషయాలు విని స్వామీజీలకు మరియు బాబాలకు దిమ్మతిరిగి పోయేది. ఇలా కూడా జరుగుతుందా ? అని వారు ఆశ్చర్యపోయేవారు. మేము ఏమేమో చేస్తూ ఉన్నాం, మాకెవరూ....

.....కనపడటం లేదు. నీవు ఏమీ చేయకుండానే ఎంతో మంది మాస్టర్స్ నీకు కనపడుతున్నారు ? నీతో రెగ్యులర్‌గా టచ్‌లో ఉంటున్నారు, నీతో మాట్లాడుతున్నారు. మా గురించి, మా సంస్థ గురించి అడిగి మాకు కొన్ని పరిష్కార మార్గాలు సూచించమని మాస్టర్స్‌ను అడుగు, అని నన్నే అడిగేవారు. కొంత కాలం ఏకాంతంగా ఉన్నాను. తర్వాత నాకు తెలియకుండా నేనే ఆటొమెటిక్‌గా బోధించడం మొదలు పెట్టాను. ఎప్పుడైతే నాకు నా గురించి తెలియటం మొదలయ్యిందో అప్పటి నుండి నా కార్యాచరణ వేగవంతమైంది. వాకిన్స్ గురించి విన్నాను కానీ స్వయంగా నేనే ఒక వాకిన్ మాస్టర్‌ను అన్న సత్యం నాకు తెలియదు. నా భార్య కూడా వాకిన్ మాస్టరే అన్న సంగతి అసలే తెలియదు. మా దేహాల యొక్క పాత ఓనర్స్‌మే మేము అని అనుకున్నాము. నా గురించి నేను తెలుసుకుని, నేను నా స్వంతంగా సంస్థను ఏర్పాటు చేసుకుని నా కార్యక్రమాలు నేను చేసుకుంటూ ఉంటే కొంత మందికి ఇబ్బంది కలిగింది. మొన్నటి వరకు ఈయన మామూలుగానే ఉన్నాడు. ఇప్పుడేమో సడన్‌గా సద్గురువు అయ్యాడు.. ఎలా అయ్యాడు ? ఆఁ... అయినా మన సంస్థలో తిరిగే వాడు కదా... తారా విశాల్ మా సంస్థలో నుండి వెళ్ళిపోయి వేరు కుంపటి పెట్టుకున్నాడు అని రాజకీయ నాయకుల లాగా అనటం మొదలు పెట్టారు. ఇలా అనే వారి సంస్థల యొక్క గురువుల పరువు తీయకూడదని నేను ఏమీ బదులివ్వను. ఎందుకంటే నేను వారిని కలిసి నా సమస్య చెప్పినప్పుడు ఏ గురువు కూడా నాకు సరైన సమాధానం ఇవ్వలేదు. ధ్యానం చేయి అని మాత్రమే చెప్పారు. ధ్యానం చేయి అని నాకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఏముంది !? ధ్యానం చేస్తే అన్ని సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని నాకు తెలుసు. కానీ నేను ధ్యానం చేయాల్సిన అవసరం ఏమీ లేకుండానే నాకు మాస్టర్స్ అందరూ కనపడి విసిగిస్తుంటే ఏం చేయాలో అర్థం కాక నేను సతమతమవుతుంటే ఈ గురువులేమో నీవు ధ్యానం చేయి, ధ్యాన ప్రచారం చేయి అనేవారు.

వీసమెత్తు సబ్జెక్ట్ కూడా ఏ గురువూ చెప్పలేదు. పైగా నన్ను డిస్టర్బ్ చేసారు. నేను మహా దివ్య సింహాన్ని, నన్ను చూసి అభద్రతా భావానికి గురై భీతిల్లి, భయపడి అలా మాట్లాడుతారు. వాటిని పట్టించుకోకండి. అది, కేవలం అభద్రతా భావం వలన కలిగిన భయం యొక్క ప్రతిస్పందన అని తెలుసుకోండి. నన్ను సద్గురువుగా ఒప్పుకోలేని అహం వాళ్ళను ఇబ్బంది పెడుతుంది. ఆ ఇబ్బందిని తట్టుకోలేక ఏదో ఒకటి అని రిలాక్స్ అయిపోతారు. అహం బాగా దెబ్బతిన్న వాళ్ళే అలా మాట్లాడతారు. అహం దెబ్బతినని వాళ్ళు మామూలుగానే ఉంటారు. నేను చెప్పే సబ్జెక్ట్‌ను దాని యొక్క సత్యాన్ని చూడాలి. అంతే తప్ప అనవసరమైన ఆరాలు తీయడం వృథా అయిన పని కదా. కొంత మంది ఆధ్యాత్మిక వాదులుగా చెప్పుకుంటున్న వాళ్ళు మార్గదర్శి పుస్తకం చదువుతారు. సూటిగా బాగుంది అని ఒప్పుకోకుండా .."మా గురువు గారు చెప్పిన విషయాలు ఇందులో కూడా ఉన్నాయి చాలా ఆశ్చర్యంగా ఉందండీ"... అని అంటూ ఉంటారు. వీళ్ళు సత్యాన్ని ఒప్పుకోరు. మార్గదర్శి గొప్పతనాన్ని ఒప్పుకుంటే వాళ్ళ సంస్థ మరియు వాళ్ళ గురువు ఎక్కడ చిన్నవాళ్ళై పోతారోనని భయపడి అలా అంటూ ఉంటారు. నా గురించి నాకు తెలియక నేను అయోమయంలో ఉన్నప్పుడు చూసిన వాళ్ళు సడన్‌గా నన్ను సద్గురువుగా చూసే సరికి షాక్ తింటారు. ఓపెన్ మైండెడ్ వాళ్ళు ఒప్పుకుంటారు. రిజిడ్ మైండెడ్ వాళ్ళు బాధ పడతారు. ***ఆఁ.. అతను ఒకప్పుడు మా సంస్థలోని వాడే అని అనడం వెనుక ఉద్దేశం ఏమిటంటే, నా ఎదుగుదలని ఒప్పుకోలేక పోవటం. ఇతరుల గొప్ప తనాన్ని ఒప్పుకోలేని వాడు తన గొప్ప తనాన్ని కూడా తను ఒప్పుకోలేడు.*** నాలోని సద్గురువు మేల్కొన్న తర్వాత ఒక సారి మాస్టర్స్ కనిపించి మాట్లాడారు. అప్పుడు నేను అడిగాను, ఇంత కాలం అయోమయంలో నేను ఎందుకు ఉన్నాను ? అని అడిగాను. అప్పుడు మాస్టర్స్ ఇలా అన్నారు ...**"నీవు అయోమయంలో లేవు. మానవజాతి ఏ అయోమయంలో**

ఉందో ఆ అయోమయానికి పరిష్కారం కనుక్కునే పనిలో ఉన్నావు. ఈ భూగ్రహం మీదున్న మానవులందరూ ఒకానొక చోట సామూహిక మనస్తత్వంలో(Group Consciousness) కలిసి ఉంటారు. అంటే, చైతన్యంలోని ఒక పాయింటు దగ్గర ఈ మానవులు అందరూ అనుసంధానింపబడి(connect) ఉంటారు. ఆ సామూహిక మనస్తత్వం అనే దానిని నీవు ఎరుకతో అనుభవించావు. ఈ భూగ్రహం పైన ఉన్న మానవుల యొక్క మనస్తత్వాన్ని నీవు తెలుసుకున్నావు. అందరూ ఎలాంటి భ్రమలలో ఉన్నారు ? వారి భ్రమలను ఎలా తొలగించాలి ? అనే విషయాలను పరిశోధన చేసి కనుక్కున్నావు. అయితే, నీ ఈ బృహత్కార్యంలో ఎంతో మంది మహా మహా గ్రాండ్ మాస్టర్స్ మరియు సాక్షాత్తు సూపర్ కాన్షియస్ నీకు అండగా ఉన్నారు. కాకపోతే నీ వెనుక ఇంత మంది అండదండలు ఉన్నాయని నీకు తెలియదు. మేమంతా నిన్ను ప్రతి అడుగులోనూ రక్షిస్తూ, నీకు సరైన మార్గదర్శకత్వం వహిస్తూ నిన్ను నడిపిస్తున్నాము. నీవు ఎంతో అయోమయంతో ఉండి ఎన్నో రకాల సంస్థలకు తిరిగావు. అప్పుడే కదా... కేవలం సాధారణ జనాలు మాత్రమే కాదు పెద్ద పెద్ద ఆధ్యాత్మిక సంస్థలు అనబడేవి కూడా.. ఎంతో అయోమయంలో ఉన్నాయని నీకు తెలిసింది. *నీవు(తారా విశాల్) నీ యొక్క సహజత్వంతో అంటే, ఒక సద్గురువుగా నీవు అన్ని రకాల సంస్థలకు తిరిగితే నీకు సమస్య యొక్క నిజమైన రూపం తెలిసేది కాదు. నీవు నిజంగా ఏమీ తెలియని ఒక సాధారణ మానవుడిలాగా ఉండి, అప్పుడు నీవు రకరకాల సంస్థలకు వెళ్ళితే అప్పుడు నీకు సమస్య యొక్క నిజమైన రూపం తెలుస్తుంది. నీ యొక్క సమ్మతితోనే నీకు మేము మరుపును కలిగించాము. రోజులు గడుస్తున్నకొద్దీ నీ నిజతత్వంలో నీవు మేలుకుంటూ ఉంటావు. ఒక సద్గురువు అయి ఉండి ఒక సాధారణ మానవుడిగా బతకాలి అని అంటే అది ఒక పెద్ద సాహసం. అయితే, ఈ సాహసాన్ని నీవు ఇష్టపడే ఎంచుకున్నావు.* ***నీవు అనుభవిస్తున్న ఏ సమస్య అయినా సరే, అది నీది కాదని గుర్తుంచుకో...***

ఎందుకంటే నీవు ఈ భూగ్రహం పైకి ఒక సద్గురువు గానే వచ్చావు. నీతో పాటు సత్యమార్గ యోధులు చాలా మంది ఇప్పుడు ఈ భూగ్రహం పైన ఉన్నారు. అందరూ ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. అలారెడి నీవు ఒక సద్గురువువి కాబట్టి వ్యక్తిగతంగా నీకు సమస్యలేమీ ఉండవు. నీవు అనుభవించే ప్రతీ బాధ కూడా ప్రపంచానికి సంబంధించినదే. నీవు ప్రపంచ కర్మను క్లియర్ చేయడానికి, ప్రపంచ కర్మను అనుభవించడానికి సిద్ధపడ్డావు. ప్రపంచ కర్మను పంచుకున్నావు. నీతో బాటు నీ భార్య కూడా కొంచెం తీసుకున్నది. ఇలా మీరిద్దరూ మీ శరీరంలో మరియు మీ జీవితాలలో అనుభవించే సమస్యలు ఏవైతే ఉన్నాయో అవి మీవి కావు. అవి ఈ ప్రపంచ కర్మలో భాగాలు. మీ లాగే ప్రపంచ కర్మను పంచుకున్న వారు మరికొంత మంది ఉన్నారు. కాబట్టి మీరు ఎప్పుడు కూడా నిరాశ చెందవద్దు. మాకు ఈ బాధలేంటిరా నాయనా... అని అనిపిస్తుంది.

వాకిన్ మాస్టర్స్ అయిన మీరు సాధారణ మానవుల్లాగా కష్టాలు పడుతున్నప్పుడు మా స్థాయేంటి ? మాకీ కష్టాలేంటీ అని అన్పిస్తుంది....కానీ అవి మీవి కావనీ ఈ ప్రపంచ కర్మ అని గుర్తు తెచ్చుకుంటే మీరు ముందుకు పోగలుగుతారు. మీకు ప్రతీ క్షణం రక్షణ మరియు శక్తి ప్రసారం జరుగుతూనే ఉంటుంది. చాలా పెద్ద కార్యాన్ని ఎంచుకుని వచ్చావు. కాబట్టి నీ పని నీవు చేసుకోవాల్సిందే. నీ పనిలో భాగంగానే నీవు కొద్ది కాలం ఒక సాధారణ మానవుడిలాగా ఉండాల్సి వచ్చింది. అప్పుడే కదా నీకు ఈ సమాజంలో స్వామీజీలు, బాబాలు, గురువులు అనబడేవారు ఎంత జ్ఞానం కలిగి ఉన్నారో నీకు స్వయంగా స్పష్టంగా తెలిసింది. నీకు అన్ని విషయాల పట్ల అవగాహన కలిగించడానికే నిన్ను రకరకాల సంస్థలకు తిప్పాము. ఇప్పుడు ఇక నీవు ఏ సంస్థకు వెళ్ళాల్సిన అవసరం లేదు, నీవే ఒక సంస్థను స్థాపించు అని చెప్పారు. ఇంకా నేను ఏమేమో అడగబోతుంటే, అన్ని విషయాలు నీకు సరైన సమయంలో

తెలుస్తూనే ఉంటాయి. ధైర్యంగా, విశ్వాసంతో ముందుకు సాగు అని చెప్పి వెళ్ళిపోయారు. నేను సరే అని నేను సంస్థను స్థాపించాను. అలా నా సత్య ప్రస్థానం మొదలైంది. నేను మేలుకోక ముందు కొన్ని సంస్థలలో కొంత కొంత కాలం ఉన్నాను కాబట్టి, అప్పుడు నేను వారి సంస్థలో ఉన్నాను అనే విషయం గుర్తున్న వాళ్ళు ఇప్పుడు నన్ను గుర్తు పట్టి అలా అంటూ ఉంటారు. **నేను ఎవరి దగ్గరా శిష్యరికం చేయలేదు, నాకు ఈ భూమి పైన ఎవరు కూడా గురువులు లేరు.** నేను ఒక సాధారణ మానవుడిలాగే ఉంటే నన్ను ఎవరూ పట్టించుకునే వారు కాదు. ఇప్పుడు నాకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయి కాబట్టి ఎవరో కొంత మంది అలా అంటూ ఉంటారు. అలాంటి వారి మాటలు పట్టించుకోకండి. వారు 1000 చెబితే అందులో ఒకటి మాత్రమే నిజం ఉంటుంది. కాబట్టి అలాంటి వ్యక్తుల యొక్క మాటలను అస్సలు పట్టించుకోకుండా ఉండండి. ఉక్రోషంతో, అసూయతో, కుళ్ళుతో బాధ పడుతూ ఉన్న ఆ అల్పజీవులకు కూడా ఎప్పుడో జ్ఞానోదయమౌతుంది. అవుగాక !

ఒక మనిషి తన స్వంత ఇల్లు కట్టుకున్నాడు అనుకోండి. అప్పుడు ఎవరైనా, మా ఇంటిలో ఉన్నట్టే ఆయన ఇంటిలోనూ కిచెన్ రూం ఉంది, మా ఇంటిలో ఉన్నట్టే బెడ్‌రూం ఉంది. మా ఇంటికి ఉన్నట్టే కాంపౌండ్ వాల్ ఉంది అని అంటూ ఉంటే వారి మూర్ఖత్వానికి జాలి పడాల్సిందే తప్ప మనమేమీ చేయలేం. ఎందుకంటే ప్రపంచంలో ఎవరు ఎక్కడ ఇల్లు కట్టినా ఉండాల్సిన బేసిక్ విషయాలు కొన్ని ఉంటాయి. అవి అందరి ఇళ్ళల్లోనూ కామన్‌గా ఉంటాయి. ఈ విషయాలు తెలియని మూర్ఖులు ఏవేవో వాగుతూ ఉంటారు. వైజాగ్‌లో ఒక తమాషా విషయం జరిగిందని మనవాళ్ళు చెప్పారు. అదేమిటంటే, వైజాగ్‌లోని ఆశీలమెట్టలోని వేమన మందిరంలో మార్గదర్శి పుస్తకాలను 100%ఉచితంగా పంచుతూ ఉన్నప్పుడు అక్కడికి ఒకాయన వచ్చాడట, అప్పుడు

ఆయన అక్కడే నిలబడ్డ మనవాడితో ఇలా అన్నాడట... "ఆత్మ విజ్ఞానం, శాకాహారం మరియు ధ్యానం అనే మాటలు మా సంస్థకు చెందినవే, అంటే, ఈ పుస్తకంలోని విషయాలు కూడా చాలా మటుకు మావే అయి ఉంటాయి అని అన్నాడట"... ఇది జరిగిన తర్వాత ఎప్పుడో ఏదో సందర్భంలో హర్ష నాకీ విషయం చెప్పాడు. నాకెంత నవ్వు వచ్చిందంటే, ఆపుకోలేక పోయాను. కాసేపు అలా నవ్వుతూనే ఉన్నాను. ఆ మాటలు అన్నవాడు ఎవడో కానీ ఎంత అమాయకుడంటే... ఇక చెప్పడానికి ఏమీ లేదు. ఒక ఉదాహరణ మాత్రం ఇవ్వగలుగుతాను. ఒకడు మొదటి సారి తిరుపతికి వెళ్ళాడు. అక్కడికి వెళ్ళిన తర్వాత అక్కడి జనాలను, ఆ వైభవాన్ని చూసి ఇక్కడ ఏ దేవుడు ఉంటాడు అని అక్కడి వాళ్ళను అడిగాడు. అప్పుడు అక్కడి వారు ఇక్కడ "వెంకటేశ్వర స్వామి" ఉంటాడు అని చెప్పారు. అప్పుడు వాడు ...అరె ఇదైతే మా ఊరి సర్పంచ్ గారి పేరు, మా ఊరి సర్పంచ్ గారి పేరు మీద ఒక గుడి కట్టేసారన్న మాట.. అందుకే ఈ గుడి ఇంత బ్రహ్మాండంగా నడుస్తోంది. ఏమి జనం.. ఏమి జనం.. హన్నన్నా... ఇంతకీ మా సర్పంచ్ గారి పర్మీషన్ తీసుకున్నారో లేదో వెంటనే వెళ్ళి సర్పంచ్ గారికి ఈ విషయం చెప్పాలి అని వాడు అనుకున్నాడు. అదే విషయం అక్కడ తిరుపతి వాళ్ళకు కూడా చెప్పాడు. అప్పుడు ఆ తిరుపతి వాళ్ళు ఆ వ్యక్తిని ఎలా చూస్తారో... మీరు ఇలాంటి వ్యక్తులను అలానే చూడాలి. ఆధ్యాత్మిక ప్రపంచంలో ఆత్మవిజ్ఞానం, శాకాహారం మరియు ధ్యానం అనే పదాలు కేవలం ఆ సంస్థ వారికి మాత్రమే తెలుసు, ఆ సంస్థ వారే ఆ పదాలను సృష్టించి ప్రపంచానికి పరిచయం చేసారు.. అనే ఫీలింగులో ఉండి ఉంటాడు ఆ మాటలు అన్న వాడు. వాడికి ఆ తిరుపతి వెళ్ళిన వాడికి తేడా ఏమీ లేదు. అలాంటి తింగరి మాటలు పట్టించుకోకుండా మీ పనులేవో మీరు చేసుకోండి. నాకు పెద్దగా గుర్తింపు రాకముందు నాకు తెలిసిన వారు కూడా నన్ను తప్పించుకుని తిరిగే వారు. ఇప్పుడు రోజు రోజుకీ నాకు గుర్తింపు

పెరుగుతున్న కొద్దీ... తారా విశాల్ మా సంస్థలో ఉండే వాడు లేక తారా విశాల్ మాకు తెలుసు అంటూ... ఇలా ఏవేవో పాత పరిచయాల గురించి చెబుతూ ఉంటారు. మీరు ఇవేవి నమ్మకండి. మీరే కాదు ఎవరూ నమ్మకండి. వాటిల్లో నిజం ఒకటి ఉంటే అబద్ధాలు 1000 ఉంటాయి. నా గురించి చెడు చెబితే అస్సలు నమ్మకండి. ఎందుకంటే నేను నా హృదయపూర్వకంగా ప్రకటిస్తున్నాను నేను ఎవరికి కూడా ఎక్కడ కూడా చెడు అనేది చేయలేదు. నా వలన అందరికీ శ్రేయస్కరమే జరిగింది. కాబట్టి అసూయతో మాట్లాడే మాటలను పట్టించుకోకుండా మీ పనులు మీరు చేసుకోండి. " సింహం లేదా ఏనుగు వెళ్తూ ఉంటే కుక్కలు మొరుగుతాయి" అనే సామెత మీరెప్పుడూ వినలేదా ? మీరు నాతో ఇన్ని సంవత్సరాల నుండి ఉంటున్నారు కదా మీకు తెలియదా నేను ఏమిటి అని.. ఏదైనా సరే చెప్పుడు మాటలు విని ఒక నిర్ణయానికి రాకూడదు. స్వయంగా చూసి, పరిశీలించి స్వానుభవంతో ఒక నిర్ణయానికి రావాలి. నీవు స్వయంగా పరిశీలించి, అనుభవపూర్వకంగా తెలుసుకున్న తర్వాతే ఒక నిర్ణయానికి రావాలి. ఇతరుల గురించి తప్పుడు మాటలు ఎప్పుడు కూడా మాట్లాడకూడదు. ఎందుకంటే, ఒక వ్యక్తి గురించి అనవసరంగా, అసూయతో తప్పుడు మాటలు మాట్లాడుకుంటూ ఉంటే, ఆ మాట్లాడు కుంటున్న వ్యక్తులకు దరిద్రం సంక్రమిస్తుంది. ఇది ఒక విశ్వసూత్రం. కాబట్టి మీరు ఎప్పుడైనా సరే, ఎవరి గురించైనా సరే అనవసరంగా తప్పుడు మాటలు మాట్లాడకండి. మీరు ధ్యానం చేస్తే మీకే తెలుస్తుంది నేను చెప్పే విషయాలు ఎంత సత్యమో. కాబట్టి నా గురించి కానీ మన సంస్థ గురించి ఎవరైనా ఏమైనా వాగుతూ ఉంటే పట్టించుకోకండి. వారికి అవగాహన లేక అలా మాట్లాడుతూ ఉన్నారు అని మీరు అర్థం చేసుకుని మీ పని మీరు చేసుకోండి. ఇక మన మార్గదర్శి పుస్తకం దగ్గరకు వస్తే, ఇన్ని కోణాలలో ఇలాంటి వివరణలతో కూడుకుని ఉన్న పుస్తకం అయితే ఈ భూమి పైన లేదని స్వయంగా కాస్మిక్ గ్రాండ్ మాస్టర్సే ఆశ్చర్యంతో

కూడిన ప్రశంసలను అందించారు... ***ఒక తోటలో ఇన్ని అవగాహనలా...!!!*** (ఇక్కడ తోట అని అంటే " సద్గురు తారా విశాల్ మార్గదర్శి" అని అర్థం)...అంటూ..విస్మయంతో.. అబ్బుర పడుతూ.....ఆనందకరంగా..... అభినందిస్తూ !!! అది వారి ప్రేమ... వారి కరుణ ! సంభ్రమంతో కూడిన ప్రశంసాపూర్వకమైన ప్రోత్సాహాన్ని అందించారు. ఈ "సద్గురు తారా విశాల్ మార్గదర్శి" ఒక అపూర్వమైన అద్భుతమని నిర్ధారించారు. దీనికి మనం ఎరుకతో, సగర్వంగా ఆనందించాలి కానీ అహంకారం పెంచుకోకూడదు. ఇతరులు ఎంతో మంది ఎన్నెన్నో ఘనకార్యాలు చేస్తున్నారు. కేవలం మనం మాత్రమే కాదు కదా. ఎందుకంటే మనకు ఆ సబ్జెక్ట్ ఇచ్చింది "అల్ట్రా కాన్షియస్". ఈ సత్యాన్ని మనం సదా గుర్తుంచుకోవాలి.

మన మార్గం యొక్క ప్రత్యేకతలు మీరు తెలుసుకుంటే, మనం చేసే పనుల యొక్క విశిష్టతలను మీరు తెలుసుకుంటే మీకు ఉత్సాహం, ప్రోత్సాహం మరియు ఉత్తేజం కలుగుతాయి అని నేను మీకు ఈ విషయాల గురించి తెలియజేస్తూ ఉంటాను. ఈ విషయాలను తెలుసుకున్న మీరు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తారని చెబుతూ ఉంటాను. అంతే కాకుండా, ఈ విషయాలు చదివిన వారిలో ఎవరికైనా ప్రేరణ కలిగితే వారు కూడా ఏవైనా లోక కల్యాణ కార్యక్రమాలు చేస్తారని ఆకాంక్షతో ఇలాంటి విషయాలను చెబుతూ ఉంటాను. అంతే తప్ప, మన గురించి మనం గొప్పలు చెప్పుకునే ఉద్దేశంతో కాదు. మీరు, మేమేదో పొడిచేస్తున్నాము, మేము పోటుగాళ్ళం అని ఫీలవ్వకండి. ఈ పనులన్నీ మనం అల్ట్రా కాన్షియస్ కరుణ వలన చేస్తున్నామే తప్ప మరొకటి కాదు. నిజానికి అల్ట్రా కాన్షియస్ దృష్టిలో

చిన్నా గొప్ప తేడా లేనే లేదు, అన్ని సమానమే ! **అయితే కేవలం మన మార్గదర్శి మాత్రమే కాకుండా గొప్ప గొప్ప పుస్తకాలు మరెన్నో ఉన్నాయి.** కాకపోతే ఒకే దగ్గర ఇంత వివరాణత్మకంగా, ఇన్ని అవగాహనలతో ఏ పుస్తకంలోనూ విషయాలు లేవు. ఇలా ఎక్కడా ఒకే దగ్గర సబ్జెక్ట్ లేదనే కదా నేను ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శిని ఇంత పెద్దగా రాసింది.

3వ ప్రశ్న) సుమారుగా అందరు గురువులు(సంస్థలు) తమ గురించి విపరీతంగా ప్రచారం చేస్తూ ఉంటారు, చేయిస్తూ ఉంటారు. నిత్యం ఏదో ఒక రకమైన కార్యక్రమాలను చేస్తూ ఉంటారు. ఆ గురువుల యొక్క శిష్యులు దేశ దేశాలు తిరుగుతూ క్లాసులు చెబుతూ తమ గురువు గురించి మరియు తమ సంస్థ గురించి, తమ యొక్క సబ్జెక్ట్ గురించి విపరీతంగా ప్రచారం చేస్తూ ఉంటారు. ఎవరైనా ఒకరు ఒక్క సారి ఫోన్ చేస్తే వారికి వంద మంది, వంద సార్లు రెస్పాన్స్ ఇస్తారు "భాషా" లాగ...! ఫోన్ చేసిన వారి ఇంటికి పోలోమంటూ వెళ్ళి అక్కడే వారికి క్లాస్ చెప్పేసి వారిని తమ సంస్థలో చేర్చేసు కుంటారు. గురువులు కూడా జనాలకు బాగా అందుబాటులో ఉంటారు. ఆ సంస్థ యొక్క సభ్యులు అందరూ ప్రచారం చేస్తూ ఉంటారు. కొన్ని సంస్థల వారైతే ఎక్కడికి వెళ్ళినా... చివరికి చావుకు వెళ్ళినా సరే ప్రచారం చేస్తూ ఉంటారు. ఇంటా, బయటా, ఆఫీసులో, బస్సులో, ట్రెయిన్‌లో, విమానంలో, ఓడలో, పెళ్ళిలో, ఫంక్షన్‌లలో, దుకాణాల్లో, సందుల్లో, గొందుల్లో ఇలా ఎక్కడ పడితే అక్కడ ప్రచారం చేస్తూ ఉంటారు. సమయం ఉండదు, సందర్భం ఉండదు అయినా ప్రచారం అదర గొట్టేస్తూ ఉంటారు. వీరు కేవలం తాము మాత్రమే ప్రచారం చేయకుండా ఇతరులను కూడా ప్రచారం చేయమని ప్రోత్సహిస్తుంటారు. బాగా ప్రచారం చేసిన వారికి బిరుదులు కూడా ఇస్తుంటారు.

మీరు మాత్రం ఇవేమీ చేయరు, చేయనివ్వరు. ఇతరులనెవరినీ క్లాస్ చెప్పకుండా నిషేధించారు. మీరు ప్రచారం చేయరు, చేయనివ్వరు. మన వాళ్ళల్లో ఎవరైనా క్లాస్ చెప్పడానికి ప్రయత్నిస్తే వారిని శాశ్వతంగా బహిష్కరిస్తారు. ఎవరైనా ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తే వారిని తక్షణమే సంస్థలో నుండి శాశ్వతంగా వెళ్ళగొట్టేస్తారు. మీరూ ప్రచారం చేయకుండా, మెంబర్స్ కూడా క్లాసులు చెప్పకుండా, ప్రచారం అనేది లేకుండా ఎలా ? ఇలా ఎందుకు చేస్తున్నారు మీరు ? ఎందుకో మాకు తెలియాలి... తెలియాలి... తెలియాలి...

3వ ప్రశ్నకు సద్గురు తారా విశాల్ గారి సమాధానం : మన భారత పురాణాల్లో ఒక విషయం ఉన్నది. వెనకటికి ఋషులు యజ్ఞయాగాలు చేసేటప్పుడు వారితో పాటు వారి వెంట వారి భార్యలు కూడా ఉండే వారట. యజ్ఞగుండంలో మండుతున్న అగ్నిదేవుడికి ఆ రుషుల యొక్క భార్యలను చూసి వారిని అనుభవించాలనే కామకోరిక పుట్టిందట. అయితే వాళ్ళంతా రుషుల భార్యలు కావడంతో అగ్నికి ఏం చేయాలో అర్థం కాక అలా కామం చేత బాధపడుతూ ఉన్నాడట. అగ్నిదేవుని బాధను తెలుసుకున్న అగ్ని భార్య స్వాహా దేవి పతి బాధను పోగొట్టేందుకు ఒక ఉపాయం ఆలోచించి అమలు చేసిందట. అది ఏమిటంటే, ఒక్కో రోజు ఆమె ఒక్కో రుషి భార్యగా రూపం దాల్చి అగ్నిదేవుడితో సంభోగించి అతడి కోరికను తీరుస్తూ ఉండేదట. ఇలా అందరి రుషుల భార్యల యొక్క రూపాలను దాల్చగలిగింది కానీ చివరికి ఒక్క అరుంధతి రూపాన్ని మాత్రం దాల్చలేక పోయిందట. ఎంత ప్రయత్నం చేసినా అరుంధతి రూపం దాల్చలేక పోయేసరికి ఏం చేయాలో పాలుపోక అలా ఉండి పోయిందట. తర్వాత తెలిసిందట... అరుంధతి మహా పతివ్రత, ఆమె రూపం ధరించడం అనేది ఎవరికీ సాధ్యం కాని పని అని. అటువంటి మహా పతివ్రత అయిన అరుంధతి లాంటిది ఆధ్యాత్మికత... సత్యం చెప్పాలంటే అన్నింటి కంటే పరమోన్నతమైనది

ఆధ్యాత్మికత...

ఎంతో హుందాగా జరగాల్సిన సత్య ప్రచారాన్ని చాలా నీచ స్థాయిలో చేయించడం మొదలు పెట్టారు కొందరు దొంగ గురువులు. ఆధ్యాత్మికత అనేది అంగడిలోని సరుకు కాదు అమ్మడానికి. కానీ ప్రస్తుతం ఆధ్యాత్మికత అనేది అంగడిలోని సరుకు కంటే ఘోరం అయిపోయింది.

ప్రచారం అనే దానికి ఒక పద్ధతి, ఒక లెక్క అనేది ఉంది. ప్రచారం అని అంటే – నీవు ఒక గురువును అనుసరిస్తూ ఉన్నప్పుడు ఆ గురువు బోధించిన సత్యాలను మరియు సాధనలను నీవు ఆచరిస్తూ ఉండాలి. అంతే. నీవు ఆచరిస్తూ ఉండడమే ప్రచారం చేయడం. ఆచారమే ప్రచారం. నీవు ఆ బోధనలను మరియు సాధనలను యథాతథంగా ఆచరిస్తూ ఉన్నప్పుడు సహజంగా నీ యొక్క జీవితంలో మరియు నీ శరీరంలో మార్పులు జరుగుతాయి. అప్పుడు కచ్చితంగా నిన్ను జనాలు అడగటం మొదలు పెడతారు. నీలో ఇంత మంచి మార్పులు సంభవిస్తున్నాయి ఏమిటి సంగతి ? అని అడుగుతారు. వారికై వారు అడిగినప్పుడు మాత్రమే, బాగా గుర్తుంచుకోండి వారికై వారు అడిగినప్పుడు మాత్రమే, నీవు నీ గురువు గురించి చెప్పి నీ గురువు ఉంటున్న అడ్రస్ చెప్పి అక్కడికి వెళ్ళి తెలుసుకోమనాలి.నీకు వీలైతే నీవు తీసుకెళ్ళాలి. అంతే తప్ప నీవు క్లాసులు చెప్పకూడదు. నీవు బోధించకూడదు. నీవు బోధించడం అనేది, నీకు మరియు నీవు ఎవరికైతే బోధిస్తున్నావో వారికి అంటే, మీ ఇద్దరికీ అది చాలా ప్రమాదం. గుర్తుంచుకోండి చాలా ప్రమాదం. ఎలా ప్రమాదం ? అని అంటే – ఉదాహరణకు ఒక మెడికల్ షాపు అతను ఉన్నాడు. ఓ ఇరవై సంవత్సరాలుగా అతను ఆ షాపు నడిపిస్తున్నాడు. ఇప్పుడు అతనికి అన్ని మందుల గురించి తెలుసు. ఏ మందు ఏ జబ్బుకి వేసుకోవాలి అనే విషయాల గురించి తెలుసు. ఎందుకంటే ఇరవైసంవత్సరాల నుండి అతను మందులను అమ్ముతున్నాడు. తనకు ఇరవై

సంవత్సరాల అనుభవం ఉంది కదా అని అతను వైద్యం చేయడం మొదలు పెట్టాడనుకోండి ఎలా ఉంటుంది పరిస్థితి ? అతడికి ఎన్ని సంవత్సరాల అనుభవం ఉన్నా సరే అతడు కేవలం ఒక మెడికల్ షాపు నడుపుతున్న వ్యక్తి మాత్రమే అవుతాడే తప్ప వైద్యుడు కాలేడు. ఒక సర్టిఫైడ్ డాక్టర్ కాలేడు. అది అసంభవం. మెడికల్ రెప్రెజెంటేటివ్‌లు ఉంటారు. వీరు డాక్టర్ల దగ్గరికి మరియు మెడికల్ షాపులకు తిరుగుతూ తమ కంపెని తయారు చేసిన మందుల గురించి వివరిస్తూ మందులను అమ్ముతూ ఉంటారు. మీరెప్పుడైనా చూసారో లేదో మందుల గురించి డాక్టర్ల కంటే వీళ్ళే బాగా వివరిస్తారు. డాక్టర్లకే మందులను పరిచయం చేస్తూ ఉంటారు. ఇప్పుడు వీరు మాకు తెలుసు కదా అని వైద్యం చేయడం మొదలు పెట్టారనుకోండి ఎలా ఉంటుంది పరిస్థితి ? వీళ్ళకు మందుల గురించి ఎంత తెలిసినా వీరు సర్టిఫైడ్ డాక్టర్లు కాలేరు కదా. వైద్యం అనేది ఒక సర్టిఫైడ్ డాక్టర్ మాత్రమే చేయాలి. అది కూడా అతడికి తగిన అనుభవం వచ్చిన తర్వాత కానీ స్వంతంగా వైద్యం మొదలు పెట్టకూడదు. తగినంత అనుభవం వచ్చేంత వరకు సీనియర్ డాక్టర్ల దగ్గర పని చేయాలి. అనుభవాన్ని గడించాలి. అప్పుడు కదా వారు స్వంతంగా వైద్యం చేయగలిగే స్థితిలోకి వస్తారు. అంతే కానీ మందుల గురించి తెలియగానే వైద్యం చేయడం మొదలు పెడితే ...ఇతరుల ప్రాణాలతో చెలగాటం ఆడినట్టే కదా. సరిగ్గా ఇదే విధంగా నీకు జ్ఞానోదయం కాకుండా, నీకు గురుస్థితి అనేది ప్రాప్తించకుండా ఏవో కొన్ని విషయాలు తెలుసుకుని ప్రచారం అనే నెపంతో ఎడాపెడా క్లాసులు చెప్పడం మొదలు పెడితే ...ఇతరుల ఆత్మలతో, వారి యొక్క ఆత్మ పరిణామ క్రమంతో ఆటలాడినట్టు అవుతుంది. తప్పుడు వైద్యం చేస్తే ఒక జన్మకు మాత్రమే వర్తిస్తుంది. కానీ తప్పుడు ఆధ్యాత్మిక బోధన అనేది చాలా జన్మలకు వర్తిస్తుంది. మొత్తం ఆత్మ పరిణామ క్రమాన్ని దెబ్బతీస్తుంది. ఒక తప్పుడు బోధన అనేది కేవలం ఒక వ్యక్తి యొక్క పరిణామ క్రమాన్ని మాత్రమే కాదు, యావత్

భూగ్రహం పైన ఉన్న అందరి మీదా పడుతుంది. ప్రతీ ప్రాణి మీదా పడుతుంది. మొత్తానికి మొత్తం భూగ్రహం యొక్క పరిణామ క్రమానికే అడ్డంకిగా మారుతుంది.

వారికై వారు అడిగే వరకు చెప్పకుండా ఉంటే మరి ప్రచారం అనేది ఎలా జరుగుతుంది ? అనే సందేహం మీకు వస్తుంది. చెప్పాను కదా. నిజమైన ప్రచారం అని అంటే, ఆచారమేనని. ఆచారమే నిజమైన, సరి అయిన ప్రచారం. ఆధ్యాత్మిక శాస్త్ర నియమ నిబంధనల ప్రకారం అడిగిన వారికి మాత్రమే చెప్పాలి. ఎవరూ అడగకపోతే ఎలా అని అంటే, అడగకపోనీ నీకేంటి ? మరి అందరూ ఎలా బాగుపడతారు ? అని అంటే ...అందరూ బాగుపడతారు. వారి సమయం వచ్చినప్పుడు వారే బాగుపడతారు. నీ బాధ్యత అంతా నీ పైనే ఉండాలి. నీవు ఆధ్యాత్మికతను ఆచరిస్తూ ఉండు. అంతే. ఎవరైనా వారికై వారే అడిగినప్పుడు మాత్రమే వారికి కేవలం నీ గురువు గురించి మాత్రమే చెప్పాలి. నేను ఫలానా సాధనలను మరియు బోధనలను ఆచరిస్తున్నాను. నీకు నచ్చితే నీవు కూడా చేయవచ్చు అని గురువు దగ్గరికి పంపించాలి. అంతే కానీ నీవే ఒక గురువు అవతారం ఎత్తకూడదు. అడిగినప్పుడే చెప్పాలి అని అంటే, గోతి కాడి నక్కలాగా ఎవరు, ఎప్పుడు అడుగుతారా అని అదే పనిగా ఎదురుచూస్తూ ఉండకూడదు. ఆ అడిగిన వ్యక్తి యొక్క శ్రద్ధాసక్తులను పరిశీలించాలి. నిజంగానే అడుగుతున్నాడా లేక టైం పాస్ చేస్తున్నాడా ? అని పరిశీలించి అడిగే వ్యక్తి పైన నమ్మకం కుదిరితే అప్పుడు నీవు ఆచరిస్తూ ఉన్న వాటి గురించి చెప్పాలి. ఎడాపెడా ప్రచారం చేయడం అనేది పూర్తిగా అహం ఆడిస్తున్న నాటకం. ప్రచారం అని అంటే ఒకరికి చెప్పడం. తెలియని వారికి చెప్పడం అంటే, నీవు గురువుగా మారుతున్నావు. గురువు అని అంటే అధికుడు. నీవు అధికుడివి అయితే నీకు ఆధిక్యం వస్తుంది. ఆధిపత్యం చెలాయించడం అని అంటే అహానికి చాలా ఇష్టం.

ఆధిపత్యం అనేది అహానికి ఆహారం లాంటిది. అహానికి ఇంకా చాలా ఆహారాలు ఉన్నాయి. వాటిలో ప్రధానమైన ఆహారం "ఆధిపత్యం లేక పెద్దరికం" దీని వలన అహం సంతృప్తి చెందుతుంది. ఈ అహం తన సంతృప్తి కోసమే ప్రచారం చేయిస్తుంది. పైకి చూడడానికి మాత్రం అందరికీ ఆధ్యాత్మికతను పరిచయం చేస్తున్నాం. బోధిస్తున్నాం. జనాలకు మంచి చేస్తున్నాం అన్నట్టుగా కనపడుతుంది. కానీ లోపల మాత్రం అహం తనను తాను సంతృప్తి పరుచుకోవడానికి పడుతున్న ఆరాటమే ఈ ప్రచారం. నీవు సాధకుడి దశలో ఉన్నావు. నీవు బాగుపడి ఇతరులకు ఆదర్శంగా నిలువు. ముందు నీవు మౌనంగా సాధన చేయి. తమకై తాము అడిగిన వారికి నీ గురువు గురించి చెప్పు. నీకు వీలైతే అక్కడికి తీసుకెళ్ళు. ఫలానా పుస్తకాలను చదవమని చెప్పు. అంతే, ఇదే నిజమైన ప్రచారం అని అంటే. ఇలా చేయమంటే మీరెందుకు చేయలేరో ఒకసారి ఆలోచించండి. మీకు ఊపిరి ఆడదు. మన సాధనలు మనం మౌనంగా చేసుకుంటూ ఉంటే అందరికీ సత్యం ఎలా తెలుస్తుంది ? వాళ్ళెలా బాగుపడతారు ? అని మీకు లోకుల పట్ల ఎంతో చింత మొదలవుతుంది. సరే... లోకుల పట్ల మీకు అంత బాధ్యత ఉంటే, వాళ్ళను గురువు దగ్గరికి వెళ్ళమని చెప్పాలి మరియు పుస్తకాలు చదవమని చెప్పాలి అంతే కానీ మీరే గురువులై పోకూడదు కదా. "ఎవరికి వారే గురువు అనేది వారి వరకే పరిమితం". ఇతరులకు బోధించడానికి ఒక సద్గురువుకు మాత్రమే అధికారం ఉంటుంది.

మీలో ఉన్న అహం మిమ్మల్ని నిలువనీయదు. మీరు ఏ పుస్తకం చదివినా లేక ఎక్కడైనా ఏదైనా క్లాస్ విన్నా మీ కోసం మీరు వినరు. మీరు చదివిన వాటిలో నుండి మరియు విన్న వాటిలో నుండి ...ఈ పాయింటు ఫలానా వారికి చెప్పాలి, ఈ విషయం వీరికి చెప్పాలి, ఈ సూత్రం వారికి చెప్పాలి... అంటూ ఇలా ఇతరులకు చెప్పేదాని పైనే మీ ధ్యాస అంతా ఉంటుంది

తప్ప చదివిన వాటిని మరియు విన్న వాటిని గుర్తుంచుకుని, వీటన్నింటినీ నేను ఆచరించాలి అనే ధ్యాస మీకుండదు. ఇలా ఉంటున్న మీరు ఏ నాటికీ బాగుపడరు. ఈ విషయం నాకే వర్తిస్తుంది అని అనిపిస్తే మీరు సరైన దశలో ఉన్నట్టు. ఇది ఫలానా వారికి చెప్పాలి అని అనిపిస్తే మీరు దారి తప్పినట్టు... గుర్తుంచుకోండి. చదవడం మరియు వినడం అనేది ముందుగా మీకు వర్తించాలి. మీ పైనే ఫోకస్ ఉండాలి. మీరు బాగుపడి ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. ఇతరులకు బోధించాలి అనే తపన నుండి బయట పడండి. ఇతరులకు బోధించాలి అనేది అహంతో కూడిన దరిద్రపుగొట్టు ఆలోచన. మీరు ఒక సద్గురువు అయిన తర్వాత ఎలాగూ బోధించాల్సి వస్తుంది. అది వేరే విషయం. ముందైతే మీరు సద్గురువులు కావాలి కదా. సాధక దశలో ఉన్న మీరు చేయాల్సింది సాధన - బోధన కాదు. మీ సాధనలు ఫలించి మీరు దైవత్వం(మోక్షం) పొందిన తర్వాత మీరు ఎవరైనా ఒక సద్గురువును ఆశ్రయించి ఆయన దగ్గర పని చేస్తే ఎప్పుడో ఒకప్పుడు మీరు కూడా ఓ సద్గురువు అవుతారు. అప్పటి వరకు ఆగాలి. ఆత్రం పనికి రాదు. మీ అహం మీ చేత బోధనలు చేయించి అంటే, జడ్జిమెంట్లు చేయించి మీ కర్మలను పెంచుతుంది.

ఆధ్యాత్మిక ప్రచారం కానీ లేక ధ్యాన ప్రచారం కానీ లేక సత్య ప్రచారం కానీ ఎలా చేయాలంటే (జరగాలంటే) :

1) మీరు విన్నవి మరియు చదివినవి త్రికరణ శుద్ధిగా ఆచరిస్తూ ఉండాలి. ఈ ఆచరించడం అనేది నిజమైన ప్రచారం. ఆచారమే ప్రచారం.

2) మీరు ఆచరిస్తున్న విషయాలను ఇతరులకు తెలియ జేయాలనే తపనను మీరు కంట్రోల్ చేసుకోవాలి. ఒకవేళ నిజంగానే ఇతరులకు తెలియజేయాలి అని అనుకుంటే - ఎవరైతే నిజమైన శ్రద్ధాసక్తులతో వారికై

వారే అడుగుతారో వారికి మాత్రమే చెప్పాలి.

3) ఎక్కడైనా ఒక దగ్గర ఒక సమావేశం ఏర్పాటు చేసి, మీరు ఆచరిస్తున్న విషయాలను చెప్పి, మీకు కలిగిన లాభాలను చెప్పి, ఇంట్రెస్ట్ ఉన్న వారు ఎవరైనా వీటిని ఆచరించవచ్చు అని మాత్రం చెప్పి సమావేశాన్ని ముగించాలి. అంతే తప్ప మీరు స్వయంగా బోధనలను మరియు శిక్షణలను ఇవ్వకూడదు. జ్ఞానోదయం పొందిన ఒక సద్గురువు మాత్రమే బోధించాలి మరియు శిక్షణను ఇవ్వాలి. ఇతరులకు కేవలం పరిచయం చేసే అధికారం మాత్రమే ఉంటుంది.

4) నోరుంది కదా అని ఎడాపెడా క్లాసులు చెప్తే జడ్జిమెంట్ అనే కర్మ చుట్టుకుంటుంది. ఆ తర్వాత ఆధ్యాత్మిక శాస్త్ర నియమ నిబంధనలను ఉల్లంఘించినందుకు క్లాసులు చెప్పేవారికి మరియు వాటిని నిర్వహించిన వారికి మరియు నిర్వహణలో సహకరించిన వారికి అందరికీ భయంకరమైన కర్మ చుట్టుకుంటుంది.

5) ప్రచారం అనేది ఒక కాగడా లాంటిది. దాన్ని సరైన విధంగా ఉపయోగిస్తే దాని వెలుగులో మీరు ముందుకు వెళ్ళవచ్చు మరియు ఇతరులకు కూడా దారి చూపించవచ్చు. ఒకవేళ కాగడాను మీరు సరిగా ఉపయోగించకపోతే దాని మంటల్లో మీరు కాలిపోతారు మరియు ఇతరులు కూడా మాడి మసైపోతారు. జాగ్రత్త.

6) ఎవరో కొంత మంది దొంగ గురువులు చెప్పారని, మీరు ప్రచారానికి బయలు దేరడం అనేది చాలా ప్రమాదం.

7) మీరు కేవలం మీ అనుభవాలు చెప్పి గురువు గురించి పరిచయం చేసి, పుస్తకాలను చదవమని చెప్పి ఊరుకోవాలి.

8) మీరు దైవత్వం పొందినా సరే, బోధించే మరియు శిక్షణను ఇచ్చే అర్హత

రాదు. దైవత్వం పొందడం వేరే సద్గురువు స్థితిని పొందడం వేరే. ఒక మామూలు వ్యక్తికి మరియు దైవత్వం పొందిన వ్యక్తికి ఎంత తేడా ఉంటుందో, అంత కంటే ఎక్కువ తేడా ఒక దైవత్వం పొందిన వ్యక్తికీ మరియు ఒక సద్గురువుకు ఉంటుంది. దైవత్వం లేక ఆత్మసాక్షాత్కారం లేక జ్ఞానోదయం లేక మోక్షం పొందిన వ్యక్తి - ఒక సద్గురువు ముందు ఒక మామూలు మనిషి లాంటి వాడు. ఒక సద్గురువుకు మాత్రమే బోధించే అధికారం ఉంటుంది. ఒక సద్గురువుకు మాత్రమే శిక్షణను ఇచ్చే అధికారం ఉంటుంది. సద్గురువు కాకుండా ఇతరులు ఎవరు బోధించినా మరియు ధ్యాన శిక్షణలను ఇచ్చినా వారికి చాలా భయంకరమైన కర్మ చుట్టుకుంటుంది. మామూలు వారు కేవలం విషయాలను తెలియజేయాలి. అంతే. అంతకు మించి ఎక్కువ చేస్తే ఏం జరగాలో అది జరుగుతుంది. జాగ్రత్త.

9) మీరు సాధనలను చేసుకుంటూ ఉండడమే అన్నింటి కంటే ఉత్తమమైన ప్రచారం. ఈ భూగ్రహం మీద ఉన్న మానవులందరూ ఒకానొక చోట సామూహిక మనస్తత్వంలో(Group Consciousness) ను కలిసి ఉంటారు. అంటే, చైతన్యంలోని ఒక పాయింటు దగ్గర ఈ మానవులందరూ అనుసంధానింపబడి (connect) ఉంటారు. ఈ భూగ్రహం పైన ఎవరు ఎక్కడ ఎలాంటి ఆధ్యాత్మిక ప్రగతి సాధించినా సరే, అది సమస్త మానవాళికి అంది తీరుతుంది. కాబట్టి మీరు ఆధ్యాత్మిక శాస్త్రం యొక్క సూత్రాలను మరియు సాధనలను ఆచరిస్తూ ఉంటే మీలో కలిగే పరివర్తన అనేది అందరికీ వ్యాపిస్తుంది. అప్పుడు జనాలు తమకు తెలియకుండా తామే ఆధ్యాత్మికత వైపుకు ఆకర్షించ బడతారు. దైవం వారిని సరైన రీతిలో సరైన గురువుల దగ్గరికి పంపిస్తుంది. ఇదంతా ఆటొమెటిక్‌గా జరిగిపోతుంది.

10) ఆధ్యాత్మిక విజ్ఞానం అత్యంత గుప్తంగా ఉండకూడదు అలా అని అతి సులువుగా లభ్యం కాకూడదు. కాస్త పట్టువిడుపులతో కొంచెం కఠినం, కొంచెం

సరళంగా ఉండాలి. ఆత్మ విజ్ఞాన విషయాలు అనర్హులకు ఎప్పుడూ చెప్పకూడదు.

11) ఆధ్యాత్మిక ప్రచారానికి సంబంధించి చాలా కచ్చితమైన నియమ నిబంధనలు ఉన్నాయి. వాటిని సరిగ్గా, నిజంగా అనుసరించకపోతే భయంకరమైన కర్మలు చుట్టుకుంటాయి.

ఆధ్యాత్మిక ప్రచారానికి సంబంధించిన నియమ నిబంధనలు :

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం... ! ఇది ఒక మహా ఆధ్యాత్మిక సూత్రం. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో (4 – 39) చెప్పాడు. దీని అర్థాలు 3 :

ఒకటి : శ్రద్ధ కలిగి ఉన్న వారికి మాత్రమే జ్ఞానం అనేది లభిస్తుంది.

రెండు : శ్రద్ధ కలిగి ఉన్న వారికి మాత్రమే జ్ఞానాన్ని అందించాలి.

మూడు : జ్ఞానం అనేది లభించినా కూడా శ్రద్ధ కలిగి ఉన్న వారు మాత్రమే దాన్ని అర్థం చేసుకోగలుగుతారు మరియు ఆచరణలో పెట్టగలుగుతారు, దాని లాభాన్ని పొందగలుగుతారు.

కాబట్టి శ్రద్ధ కలిగి ఉన్న వారికి మాత్రమే జ్ఞానబోధను చేయాలి. అంతే కానీ ఎవరికి పడితవారికి జ్ఞానబోధ చేయకూడదు. జీసస్ క్రైస్ట్ కూడా అంటాడు... "పందుల ముందు ముత్యాలు చల్లకండి" అని... కాబట్టి నిజమైన శ్రద్ధ మరియు ఆసక్తి ఉన్న వారు వెతుక్కుంటూ వస్తారు.

సత్య ప్రచారానికి ఒక డిగ్నిటి ఉంది. దయచేసి దాన్ని మెయింటేన్ చేయండి. హుందాగా ప్రవర్తించండి. నిజంగా అవసరం ఉన్నవారిని ఎవరూ ఆపలేరు. అవసరం లేని వారికి మీరెంత చెప్పినా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది తప్ప ప్రయోజనం ఏమీ ఉండదు. పట్టి పట్టి పంగనామాలు పెడితే గోడ చాటుకు వెళ్ళి తుడుచు కుంటారు. మీ సాధనలో మీరు ఉండండి. ఎవరైనా వారికై వారు అడిగితే

మాత్రమే చెప్పండి లేకపోతే మౌనంగా మీ సాధనల్లో మీరు ఉండండి.

నేను సత్య ప్రచారం చేయమని చెప్పాను. సత్యప్రచారం చేస్తే కలిగే లాభాలను గురించి తెలియజేసాను. అయితే ఆ సత్యప్రచారం అనేది ఇప్పుడు ఇక్కడ ఈ పుస్తకంలో చెప్పినట్టుగా చేస్తేనే ఆ లాభాలు అనేవి అందుతాయి. అంతే కానీ ఎవరికి నచ్చినట్టు వారు చేస్తే లాభాల సంగతి అటుంచితే, ఎందుకూ పనికి రాకుండా పోతారు.

MAB మెంబెర్స్ నాకు తెలియకుండా ఎక్కడ కూడా చందాలు లేక విరాళాలు లేక డొనేషన్లు సేకరించకూడదు. ఎవరు పడితే వారిస్తే నేను స్వీకరించను. చిత్తశుద్ధితో నిజమైన సేవాభావంతో, నిస్వార్థంగా, స్వచ్ఛందంగా వారికై వారు ఇచ్చినప్పుడు మాత్రమే నేను స్వీకరిస్తాను. నేను నా జీవితంలో ఎవరినీ డొనేషన్లు ఇవ్వమని అడగలేదు. అడగను కూడా. ఎవ్వరైనా వారికై వారు ఏ షరతులు లేకుండా ఇచ్చినప్పుడే స్వీకరిస్తాను. డొనేషన్లు ఇచ్చిన వారికి నేను ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వను. ప్రేమ పూర్వకంగా అందరితో ఎలా ఉంటానో వారితో కూడా ప్రేమగా, ఉంటాను అంతే !

నేను అన్‌కండీషనల్‌గా నా విజ్ఞానం ఇస్తున్నాను. నాకిచ్చే వారు నాలానే అన్‌కండీషనల్‌గా ఇవ్వాలి అంతే. లేకపోతే లేదు. నా దైవం నాకిస్తుంది. కాబట్టి ఎవరు కూడా డొనేషన్లను సేకరించే ప్రయత్నం చేయకూడదు. ఒక్క రూపాయి కూడా అడిగి తీసుకోకూడదు. స్వచ్ఛందంగా వారికై వారు ఇచ్చినప్పుడు మాత్రమే స్వీకరించాలి. అయినా నన్ను కానీ సహస్ర మేడమ్‌ను కానీ అడిగిన తర్వాతే స్వీకరించాలి. చాలా ఎరుకతో జాగ్రత్తగా ఉండండి. నా దైవం నాకు కావాల్సిన వాటి కంటే ఎన్నో వేల రెట్లు ఎక్కువగా ఇస్తూ ఉంది. కాబట్టి మీరు అనవసరంగా కంగారు పడకండి. MABకి కావాల్సినవన్నీ వాటంతట అవే సమకూరుతూ ఉన్నాయి కదా. చిత్తశుద్ధితో నేను చెప్పినవి చెప్పినట్టుగా ఆచరించండి. మీరు బాగుపడతారు మరియు లోక కల్యాణం కూడా జరుగుతుంది. కేవలం ధ్యానం మాత్రమే చేస్తే చాలు అనే అజ్ఞానంలో నుండి బయట పడండి. కేవలం ఒక్క ధ్యానం చేస్తే చాలు ఇంకేం అక్కర లేదు అనే బోధనల్లో నుండి తక్షణమే బయట పడండి. మేలుకోండి. జాగృతమవ్వండి. కేవలం ధ్యానం ఒక్కటి మాత్రమే చాలు అనేది చాలా పెద్ద అజ్ఞానం.

10 కోట్ల పాంఫ్లెట్‌లు = ఒక మార్గదర్శి పుస్తకం

10 కోట్ల పాంఫ్లెట్‌లు పంచే బదులు ఒక మార్గదర్శి పుస్తకాన్ని నిజమైన శ్రద్ధ కలిగిన వారికి ఇవ్వండి. అత్యధిక ఫలితాలను పొందండి. లోక కల్యాణానికి మీరూ ఓ కారకులు కండి.

శరీరాన్ని మరియు జీవితాన్ని పూర్తిగా మన స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి మరియు ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద సౌభాగ్య మోక్షాలను పొందడానికి ఈ కింది తొమ్మిదింటినీ ఆచరించి తీరాలి. కేవలం ధ్యానం ఒక్కటే సరిపోదు. అర్థం చేసుకోండి.

1. గురుస్మృతి – అంటే, జీవించి ఉన్న గురువును ఆశ్రయించి ఆయన మార్గదర్శకత్వంలో జీవితాన్ని జీవించడం.

2. సేవా సాధన – అంటే, శారీరకంగా, బుద్ధిపరంగా, ఆర్థికంగా మీకెలా వీలైతే అలా తప్పని సరిగా సేవ చేయడం.

3. సరైన ఆహారం – అంటే, సంపూర్ణ అకర్మ శాకాహారిగా(అకర్మ వీగన్) మారటం.

4. స్వాధ్యాయం – అంటే, గురువు సూచించిన పుస్తకాలనే చదవటం.

5. ధ్యాన సాధన – అంటే, క్రమం తప్పని ధ్యాన సాధన చేయటం.

6. సత్సంగం – అంటే, తోటి సాధకులను కలిసి అనుభవాలను పంచుకోవటం. సత్సంగంలో బోధనలు ఉండకూడదు.

7. ఆచరణ – అంటే, గురువు చెప్పిన విషయాలను మరియు ఆధ్యాత్మిక సత్యాలను నిజ జీవితంలో ఆచరిస్తూ ఉండాలి.

8. పరిశోధన – అంటే, ఏదైనా ఒక ఆధ్యాత్మిక సూత్రాన్ని నిజ జీవితంలో ఆచరించి దాని ఫలితాలను పొందటం. ఇది గురు పర్యవేక్షణలో చేస్తే బాగుంటుంది.

9. సత్య ప్రచారం – అంటే, సత్య సూత్రాలను ఆచరిస్తూ మరియు మార్గదర్శి పుస్తకాలను పంచుతూ ఉండటం. బోధనలు చేయకూడదు. క్లాసులు చెప్పకూడదు. ధ్యాన కేంద్రాలు తెరవకూడదు. ఒక సత్యగురువు దగ్గర నిజాయితీగా, నిస్వార్థంగా, విశ్వాసంతో పనిచేయాలి. ఆయన ఏ పని చెప్తే ఆ పని చేయాలి. నిజమైన సత్య గురువు ఎవరితో పడితే వారితో క్లాసులు చెప్పించడు. ధ్యాన కేంద్రాలు తెరిపించడు.

ఆధ్యాత్మికత పేరుతో చిల్లర వేషాలు వేసి ఆధ్యాత్మికత పరువు తీయకండి.

నేను చెప్పిన విధంగా చేసి బాగుపడండి. మీ దరిద్రాలు మిమ్మల్ని నా మాటలను విననివ్వవు. కేవలం మీరు త్రికరణ శుద్ధిగా మీ సాధనలను మీరు ఆచరిస్తూ ఉండండి. మీకు వీలైనప్పుడు ఒక సద్గురు తారా విశాల్ మార్గదర్శిని కానీ లేక మీకు ఎన్ని పుస్తకాలు వీలైతే అన్ని సద్గురు తారా విశాల్ మార్గదర్శి పుస్తకాలను నిజమైన శ్రద్ధాసక్తులు గల వారికివ్వండి. అంతే. ఇంత కంటే పరమాద్భుతమైన ప్రచారం మరొకటి లేదు. ఇది పరమ సత్యం. ఇలా చేయండి. మీరెలాంటి పరిస్థితులలో ఉన్నా బాగు పడతారు. ఇది నిజం. నేను చెప్పేది సరిగా అర్థం చేసుకోండి. ఇక ఇప్పుడు తర్వాతి ప్రశ్నలోకి వెళ్దాం.

❖ ❖ ❖

4వ ప్రశ్న) మీరు ఇంతకు ముందు సిగరెట్ మరియు మందు విషయంలో మామూలుగానే ఉండే వారు, వాటిని పెద్దగా పట్టించుకునే వారు కాదు. కానీ ఇప్పుడు సిగరెట్, పోగాకు ఉత్పాదనలు, ఏవైనా మత్తును కలిగించే పదార్థాలు మరియు మందు ల గురించి చాలా కచ్చితంగా ఉంటున్నారు. చాలా అంటే చాలా కచ్చితంగా ఉంటున్నారు. పైన తెలిపిన వాటిల్లో ఏ ఒక్కదాన్ని, ఏ ఒక్కసారి ముట్టుకున్నా సరే... శాశ్వతంగా బహిష్కరిస్తున్నారు. ఇక మళ్ళీ వాళ్ళ ముఖం కూడా చూడటం లేదు. వీటి పట్ల ఇంత కఠినంగా ఎందుకు ఉంటున్నారు సార్ ?

4వ ప్రశ్నకు సద్గురు తారా విశాల్ గారి సమాధానం : సిగరెట్ మరియు మందుల గురించి నాకు సరైన ఇన్‌ఫర్మేషన్ లేనప్పుడు నేను వాటిని పెద్దగా పట్టించుకోలేదు. తాగే వారిని కూడా నేను ఏమీ అనలేదు. నా దేహం యొక్క పాత ఓనర్ కూడా సిగరెట్ మరియు మందు తాగే వాడు. నేను వాకిన్ అయిన తర్వాత ఆ అలవాటును నేను కూడా అప్రయత్నంగా కొంత కాలం కొనసాగించాను. వీటి వలన కేవలం ఆరోగ్యం పాడవుతుందేమో అని అనుకునే వాడిని. ఆరోగ్యం

అనేది మన చేతులలో ఉంది కదా, ధ్యానం చేస్తే అన్నీ క్లియర్ అవుతాయని నేను సిగరెట్ మరియు మందు విషయంలో ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా ఉండే వాడిని. అయితే ఒక రోజు నాకు ధ్యానంలో సిగరెట్ మరియు మందుల వలన ఏం జరుగుతుందో పూర్తి స్పష్టంగా తెలిసింది. చాలా వివరంగా జరుగుతున్నదంతా నేను చూసాను. సిగరెట్ మరియు మందులు అనేవి తీసుకోవటం వలన మనిషికి విస్మృతి పెరుగుతంది. ఆల్‌రెడి మనిషి విస్మృతిలోనే ఉంటాడు. ఆ ఉన్న విస్మృతి ఇంకాస్త పెరుగుతుంది. అతడు ఎంతెంతగా సిగరెట్ మరియు మందులను తీసుకుంటూ ఉంటాడో అంతంతగా అతడి విస్మృతి పెరుగుతూ పోతూ ఉంటుంది. అప్పుడు ఆ విస్మృతిని ఆసరగా చేసుకుని అతడిలోకి ఎన్నెన్నో నెగెటివ్‌లు ప్రవేశిస్తాయి. ఆ విధంగా అతడిలోకి వచ్చిన నెగెటివ్‌లు అంటే, చీకటి శక్తులు అతడిని రకరకాలుగా వాడుకుంటూ ఉంటాయి. ఈ చీకటి శక్తులు అతడికి కేవలం క్యాన్సర్ మాత్రమే కాదు ఏ రోగాలనైనా కలుగజేసే అవకాశం ఉంది. అతడిని ఆ యొక్క చీకటి శక్తులు ఎదగనీయకుండా ఆపేసి ఉంచుతాయి. దానితో అతడు అనేకమైన అనవసర కర్మలను అనుభవించాల్సి వస్తుంది. అందుకే ఎవరు కూడా సిగరెట్, పొగాకు ఉత్పాదనలు, మందు మరియు మత్తును కలిగించేవి ఏవైనా సరే వాడకూడదు. అవి చాలా ప్రమాదం. చాలా అంటే చాలా చాలా ప్రమాదం. ఈ విషయాలన్నీ ఎప్పుడైతే నాకు స్పష్టంగా తెలిసాయో ఆ మరుక్షణమే నేను వీటన్నింటినీ పూర్తిగా, శాశ్వతంగా నిషేధించాను. వీటిని మానేయలేక నా దగ్గర నుండి కొంత మంది వెళ్ళిపోయారు. పోయేవాళ్ళను నేను ఆపను. నా దగ్గర సరిగ్గా ఉండాలి. పూర్తి స్థాయిలో సరిగ్గా ఉండాలి. ఎవరైనా సరే సిగరెట్, పొగాకు ఉత్పాదనలు, మందు మరియు ఇతర మత్తు పదార్థాలను తీసుకోకుండా ఉండాలి. ఇంకా పూర్తి స్థాయి అకర్మ శాకాహారిగా ఉండాలి.

❖ ❖ ❖

5వ ప్రశ్న) మీరు బయటి వాళ్ళను ఎలాగూ కలవటం లేదు. మన మెంబర్స్‌ను కూడా కలవటం లేదు. కానీ పర్టిక్యులర్‌గా కొంత మంది మెంబర్స్ మాత్రం ఎల్లప్పుడూ మీకు టచ్‌లో ఉంటారు. 24 గంటలు, 365 రోజులు వారికి మీరు అందుబాటులో ఉంటారు. మీరు వారికి ఇస్తున్న అవకాశం మా అందరికీ ఎందుకు ఇవ్వటం లేదు ? వారిలో ఏ అర్హతలు ఉన్నాయి ? మేమేం చేస్తే, ఎలా మారితే, వారిలా మాక్కూడా మీరు అందుబాటులోకి వస్తారు ?

5వ ప్రశ్నకు సద్గురు తారా విశాల్ గారి సమాధానం :

ఎవరైతే నన్ను పూర్తిగా విశ్వసిస్తారో, ఎలాంటి పరిస్థితులలో అయినా సరే నా పైన విశ్వాసం కోల్పోకుండా ఉంటారో, కేవలం మాటలే కాదు చేతలలో కూడా విశ్వాసాన్ని చూపిస్తారో, నిజాయితీగా సిన్సియర్‌గా ఉంటారో, నా కోసం ఏం చేయడానికైనా సిద్ధపడి ఉండి అవసరం పడినప్పుడు నిజంగా చేస్తారో వారి పట్ల నేను కూడా అలానే ఉంటాను. ఇలాంటి వారికే నేను 24 గంటలు 365 రోజులు టచ్‌లో ఉంటాను.

నాలోని ఏవో అంశాలు మీకు నచ్చాయి. మొత్తానికి నాలో మీరు ఏవేవో గొప్ప గొప్ప క్వాలిటీలను చూసే నా దగ్గర శిష్యరికం చేయడానికి వచ్చారు. అవునా..... ఈ విషయాలన్నీ మీరే చెప్పారు కదా... సార్ మీలో ఈ క్వాలిటీలు చాలా గొప్పవి అంటూ... చెప్పారు కదా... O.K. మీరు నాలో గొప్ప గొప్ప క్వాలిటీలను చూసి నన్ను గురువుగా ఎంచుకున్నప్పుడు, నేను కూడా మీలో గొప్ప గొప్ప క్వాలిటీలను చూడాలి కదా. నా ద్వారా మీకు శ్రేయస్కరాలు జరుగుతున్నప్పుడు, మీ వలన కూడా నాకు శ్రేయస్కరాలు జరగాలి. కేవలం ఒక వైపు నుండి మాత్రమే అంటే కుదరదు. కేవలం మీరు నా నుండి మాత్రమే శ్రేయస్కరాలు ఆశిస్తూ, మీ వైపు నుండి ఏమీ లేకపోతే అది నన్ను వాడుకోవడమే

అవుతుంది. ఇది సరికాదు. నేను మీకు మంచి చేస్తాను. మీరు నాకు మంచి చేయండి. ఇలా రెండు వైపుల నుండి ప్రసారాలు సరిగా సాగుతూ ఉన్నప్పుడే సంబంధాలు చాలా కాలం వరకు మన్నుతాయి. లేదా అవి ఎప్పుడైనా తెగిపోతాయి. మాటలు ఎన్నో చెప్తారు. కానీ చేష్టల్లో మాత్రం ఏమీ ఉండదు. ఇలాంటి కోతలు కోసే వారిని నేను ఎలా దగ్గర ఉంచుకుంటాను ? నా వలన మీకు ఏమీ ప్రయోజనం జరగకపోతే మీరు నా దగ్గర ఉంటారా ? వెంటనే వేరే గురువును వెతుక్కోరా ? మీ వలన నాకు ఏ ప్రయోజనాలు జరగనప్పుడు, మీకు నేను 24 గంటలు 365 రోజులు ఎలా టచ్‌లో ఉంటాను ? కేవలం నన్ను వాడుకుని, నాకు ఏ మాత్రం ఉపయోగ పడకుండా ఉన్న వ్యక్తులందరినీ నేను వెళ్ళ గొట్టాను. ఇలాంటి స్వార్థపరులు చాలా మందే ఉండే వారు కానీ ఒక్కడి ఉదాహరణ మాత్రం చెబుతాను. ఒక వ్యక్తి చాలా దుర్భరమైన పరిస్థితులలో ఉన్నప్పుడు నా దగ్గరికి వచ్చాడు. అతడికి ఆశ్రయం ఇచ్చాను. భౌతికంగా మరియు ఆధ్యాత్మికంగా నా వలన చాలా సహాయాలను పొందాడు. కొన్ని నెలలకు కోలుకున్నాడు. ఆ తర్వాత ఏదో ఉద్యోగం చేసుకుంటూ నిలదొక్కుకున్నాడు. ఉద్యోగం వచ్చిన తర్వాత నా దగ్గరి నుండి బయటికి వెళ్ళి ఇల్లు తీసుకుని ఉన్నాడు. తన ఉద్యోగం తాను చేసుకుంటూ రెగ్యులర్‌గా నా దగ్గరికి వస్తూ ఉండే వాడు. నాకు చాలా దగ్గరయ్యాడు. దాదాపుగా అన్ని కార్య- క్రమాల్లో పాల్గొనే వాడు. తను చేయగలిగినంత చేసేవాడు. అయితే, ఆ వ్యక్తి మాటలైతే చాలా హైలెవెల్లో ఉండేవి. ప్రపంచాన్నంతా జయించి నా కాళ్ళ దగ్గర పెడతాడేమో అన్నట్టుగా ఉండేవి అతడి మాటలు. ఈ విధంగా కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఓ సారి మాస్టర్స్ నాకు ఓ పని చేయమని చెప్పారు. అది చాలా పెద్ద పని. అది నా మిషన్‌లో చాలా ముఖ్యమైన పని. చాలా పవిత్రమైన పని. దాని పైన ఎంతో మంది మాస్టర్స్ పని చేస్తున్నారు. ముఖ్యంగా రామ్తా పరమాత్ముడు

..... కూడా దాని పైన పని చేస్తున్నాడు. ఆ పని చేస్తూ ఉండగా క్లైమాక్స్‌లో ఊహించని విధంగా నాకు, నా భార్యకు ప్రమాదం జరిగింది. మేము ఇద్దరమూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాము. ఆ దశలో ఆ వ్యక్తి మమ్మల్ని వదిలేసి పారిపోయాడు. (మాకు ప్రాణాపాయం జరిగినా, మేము బతికి బయట పడ్డాము, ఆ పనిలో చివరికి మాకు విజయమే లభించింది. అయితే, అద్భుతం ఏమిటంటే - ఒక పని కోసం రంగంలోకి దిగితే మాకు రెండు పనుల్లో దిగ్విజయం లభించింది.) అంతా సద్దుమణిగాక, పరిస్థితులన్నీ చక్కబడ్డాక మళ్ళీ నా దగ్గరకు గురుదేవా... అంటూ వచ్చాడు. నేను అతడిని సున్నితంగా తిరస్కరించాను. అతడి పట్ల నాకు ఎలాంటి కోపం లేదు. అందుకే అతడిని ఏమీ అనలేదు. అనను కూడా. ఎందుకంటే తన ఒరిజినాలిటి ఏమిటో తను చూపెట్టాడు. అతను అలా ఉన్నాడు. దానికి అతనేమీ చేయలేడు. అతని దారి అతనిది, నా దారి నాది. ఆ వ్యక్తి మంచి వాడే, అయితే అక్కరకు రాని మంచి తనాన్ని నేనేం చేసుకోవాలి ?! "ఇలాంటి మంచి వాళ్ళు" మరి కొంత మంది ఉండే వాళ్ళు నా దగ్గర... అందరినీ వదిలించుకున్నాను. అయినా అలాంటి వ్యక్తులను నేను పెట్టుకోలేను. ఇలాంటి వారిని మీరు పెట్టుకుంటారా ? నాకు ఏ మాత్రమూ ఉపయోగపడకుండా, కేవలం నా బోధనలతో మరియులీశిక్షణలతో బాగుపడదామని అనుకునే వారికి బోధిస్తాను, శిక్షణలు ఇస్తాను, కానీ మిగతా సమయాల్లో వారికి అందుబాటులో ఉండను. ఎలాగూ కంటిన్యూయస్‌గా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను కదా. ఆ వర్క్‌షాప్‌లకు ఎవరైతే చిత్తశుద్ధితో వస్తారో, వారికి తప్పకుండా బోధిస్తాను, శిక్షణలు ఇస్తాను, అంతే. మిగతా సమయంలో వారికి నేను అందుబాటులో ఉండాల్సిన అవసరం లేదు కదా. నాకు ఏ మాత్రమూ ఉపయోగపడని వారికి నేను వర్క్‌షాప్‌లలో మాత్రమే అందుబాటులో ఉంటాను. వారికి జరగాల్సిన మంచి ఆ వర్క్‌షాప్‌లలో జరిగిపోతుంది. ఇక మిగతా సమాయాలలో నేను వారికి అందుబాటులో

..... ఉండాల్సిన అవసరం ఏముంది ? ఇప్పుడు, ఇది చదువుతున్న మీరే చెప్పండి – కేవలం మీ వలన సహాయం పొందుతూ, మీకు ఏ మాత్రమూ ఉపయోగపడని వారితో మీరు 24 గంటలు, 365 రోజులూ కనెక్షన్‌లో ఉంటారా ? ఈ ప్రశ్నకు నిజాయితీగా మీకు మీరే సమాధానం ఇచ్చుకోండి. సృష్టి ధర్మాలను తెలుసుకోండి – ఎప్పుడైనా సరే ఇవ్వడం మరియు తీసుకోవడం రెండూ ఉండాలి. అప్పుడే ఏ సంబంధమైనా సజావుగా సాగుతుంది. వారు ఎంత దగ్గరి వారైనా సరే, భార్యాభర్తలైనా సరే, ప్రేమికులైనా సరే, తల్లిదండ్రులు మరియు పిల్లలైనా సరే, స్నేహితులైనా సరే, బంధువులైనా సరే, ఎవరైనా సరే, అది ఎలాంటి సంబంధమైనా సరే, ఇవ్వడం మరియు పుచ్చుకోవడం అనేవి రెండూ జరుగుతూ ఉండాలి. ఇవ్వాలి మరియు తీసుకోవాలి, అప్పుడే ఆ సంబంధం చక్కగా వర్ధిల్లుతుంది. కేవలం సహాయాలు పొందడం మాత్రమే కాదు, సహాయాలు చేస్తూ ఉండాలి కూడా... అప్పుడే ఆ సంబంధం వలన ఇరువురికి శ్రేయస్కరం జరుగుతుంది. కేవలం తీసుకోవడమే తప్ప, ఇవ్వడం ఉండని పద్ధతి అనేది సంబంధాన్ని దెబ్బ తీస్తుంది. ఎవరికైనా విసుగు వస్తుంది. ఎవరైనా ఎంత కాలమని చేస్తారు ? ఎప్పుడో ఒకప్పుడు చిరాకు పుడుతుంది, దానితో ఆ సంబంధం తెగిపోవడం ప్రారంభం అవుతుంది. సహాయం చేసే వారు "ఏ ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయాలి". అయితే "సహాయం పొందిన వారు తప్పని సరిగా ఏదో ఒక రకంగా సహాయం చేసిన వారికి ప్రత్యుపకారం చేసి తీరాలి". "అపకారికి ఉపకారం" చేయమని మన ధర్మ శాస్త్రం చెబుతోంది. అపకారం చేసిన వాడికే ఉపకారం చేయాలి అని అంటే, ఇక ఉపకారం చేసిన వాడికి ఏం చేయాలి ?!! ఒకసారి ఆలోచించండి. మీరు సహాయం పొందిన వారికి ఏదో ఒక సహాయం చేసి తీరాలి. ఏమీ చేయలేని పక్షంలో కనీసం వారి పట్ల ధన్యవాద భావాన్ని కలిగి ఉంటూ, వారికి అవసరం అయినప్పుడు, మాట

..... సహాయమో లేక చేత సహాయమో చేసి తీరాలి. ఏ ప్రతిఫలం ఆశించ కుండా సహాయం చేయాలనే మాట నిజమే కానీ సహాయం పొందిన వాడు తప్పని సరిగా ఏదో ఒక రూపంలో తిరిగి సహాయం చేసి తీరాలి. సహాయం పొందిన వారు, సహాయం చేసిన వారి పట్ల కృతజ్ఞతా భావం తప్పని సరిగా కలిగి ఉండాలి. లేకపోతే పుట్టగతులు ఉండవు. సహాయం పొందిన వారి పట్ల ధన్యవాద భావం చూపించక పోవడం అనేది చాలా పెద్ద చెడు కర్మను సృష్టిస్తుంది. దాని పర్యవసానాలు చాలా ఘోరంగా ఉంటాయి. కాబట్టి ఇప్పటికైనా సరిగా ప్రవర్తించండి. సహాయం చేయండి. సహాయం పొందండి. ఏ ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయండి. సహాయం పొందిన తర్వాత, సహాయం చేసిన వారికి ఏదో ఒక రకంగా ఉపయోగ పడండి. ఈ ధర్మ సత్యాలను నిజ జీవితంలో ఆచరిస్తూ ఉన్న వారికి చాలా శ్రేయస్కరాలు జరుగుతూనే ఉంటాయి. కేవలం ధన్యవాద భావం కలిగి ఉంటే చాలదు. మనకు చేతనైనంతగా ఏదో ఒకటి చేయాలి. ముఖ్యంగా పంచ భూతాల పట్ల మరియు గురువు పట్ల తప్పనిసరిగా కృతజ్ఞత కలిగి ఉండాలి. ధన్యవాద భావం లేని వ్యక్తి బాగుపడటం అసంభవం.

నాతో 24 గంటలు మరియు 365 రోజులు కనెక్షన్‌లో ఉండాలని అంటే ఈ విధంగా చేయాలి :

1) నా లక్ష్యానికి ప్రప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలి ఎందుకంటే నా లక్ష్యం లోక కళ్యాణం కాబట్టి . మీ లక్ష్యాలన్నింటికీ తర్వాతి స్థానం ఇవ్వాలి. ఎందుకంటే మీ లక్ష్యాలు భౌతికం కాబట్టి . మీరు డబ్బులిచ్చినా, పని చేసినా ప్రతిఫలం ఏమీ ఆశించకూడదు.. గాక కూడదు ! ఎలాంటి ప్రాదాన్యత, లాభం ఆశించ కూడదు.

2) నాపట్ల అజేయమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలి. నన్ను అచంచలంగా విశ్వసించాలి.

3) కేవలం మాటలు మాత్రమే కాకుండా, చేతలలోకి కూడా దిగాలి.

4) నా పట్ల నిజాయితీగా సిన్సియర్‌గా ఉండాలి.

5) ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సరే నా వెంటే నిలబడే ధైర్యం ఉండాలి. నిజంగా అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు నిజంగా నా వెంటే ఉండాలి.

6) నా సంస్థ పట్ల, నా బోధనల పట్ల, నా శిక్షణల పట్ల అజేయమైన పరిపూర్ణమైన విశ్వాసాన్ని, మంచి అభిప్రాయాలను మరియు అత్యంత గౌరవాన్ని కలిగి ఉండాలి.

7) సీనియర్, జూనియర్ అనే భేదభావాలు చూపించ కుండా అందరితో ప్రేమగా కలిసి ఉండాలి.

8) అధికారం, పదవి లేక స్థానం కోసం ఆరాటపడకూడదు. అలాంటివి ఏవీ నా దగ్గర ఉండవు.

9) నేను ఏ పని చెబితే ఆ పని చేయాలి. నేను గురువుని, మీరు శిష్యులు. ఈ విషయాన్ని సదా గుర్తుంచుకోవాలి.

10) నాతో ఉంటే మీకు కచ్చితంగా మంచే జరుగుతుందన్న విశ్వాసం చాలా చాలా బలంగా ఉండాలి. నా కోసం, నా పని కోసం మీరు ఎవరినైనా ఎదిరించ గలగాలి. (మంచి పనుల కోసమే – కంగారు పడకండి.) ఏమైనా చేయగలగాలి, ప్రాణాలకు తెగించే సాహసం ఉండాలి.

పైన చెప్పిన 10 పాయింట్లను మరియు ఈ సద్గురు తారా విశాల్ మార్గదర్శి లోని "గురుస్మృతి" అనే టాపిక్‌లోని విషయాలను చదివి సరిగా అర్థం చేసుకుని, నిజంగా వాటిని ఆచరించే వారితో నేను ఎల్లప్పుడూ టచ్‌లోనే ఉంటాను. 24 గంటలు 365 రోజులు వారితో టచ్‌లో ఉంటాను. కేవలం ఈ భూగ్రహం పైననే కాకుండా, ఈ భూమి వదిలిన తర్వాత కూడా అలాంటి నిజమైన శిష్యులు నాతో కనెక్షన్‌ను కలిగియే ఉంటారు. ఈ క్వాలిటీలన్నీ తెచ్చుకుని అప్పుడు 24 గంటలు 365 రోజులు నాతో టచ్‌లో ఉండే విషయం

గురించి మాట్లాడండి. సరేనా.

వామ్మో... మీతో టచ్‌లో ఉండాలంటే ఇవన్నీ చేయాలా ? ఇవన్నీ సాధ్యమేనా ? అని అంటే, తక్షణమే నన్ను మర్చిపోయి మీ పనేదో మీరు చూసుకోండి. మీకు మంచి మాత్రమే జరుగు గాక !

❖ ❖ ❖

పార్ట్ - 34

సూచనలు

ఏమీ ఆశించ కుండా, ఇచ్చి వెంటనే పూర్తిగా, శాశ్వతంగా మర్చి పోవడం అనేది ఎంతో మహా గొప్ప సుగుణం. ఇది స్వర్గాన్ని గ్యారంటీగా ఇస్తుంది.

ఏదో మతలబుతో ఇచ్చి, తిరిగి అడిగితే, తిరిగి లాక్కుంటే, వేధిస్తే..... ....కోటి% నరకం గ్యారంటి !

గురువుల మీద ఇన్వెస్ట్ చేయకండి నరకాన్ని ఖాయం చేసుకోకండి.

ఏమీ ఆశించకుండా ఇచ్చి వెంటనే పూర్తిగా, శాశ్వతంగా మర్చిపోయినప్పుడే మీకు ఏదైనా మంచి జరుగుతుంది. ఇలా చేయలేనప్పుడు ఇవ్వకండి. ఇచ్చి అడిగి నరకాన్ని కొని తెచ్చుకోకండి. నేను చెప్పేవి "విశ్వ నియమాలు" ఆటలాడకండి. ఆడితే.. నరకం-నరకం అంటే ఏమిటో తెలుస్తుంది, కనపడుతుంది.

మీరు ఈ భూలోకంలోని బ్యాంకులలో దాచుకున్నది కేవలం ఈ జన్మకు మాత్రమే పనికి వస్తుంది. ఈ లోకం వదిలి వెళ్ళేటప్పుడు.. ఆరిపోయిన అగ్గిపుల్ల కూడా మీ వెంట రాదు అని చెప్తాడు రాంపా మాస్టర్. ఏమీ ఆశించకుండా ఏదో ఒకటి, మీరు ఇవ్వగలిగినది ఇవ్వండి ఇదంతా "విశ్వం బ్యాంకు"లో జమ అవుతుంది. మీరు ఏ విశ్వంలో ఉన్నా, ఏ లోకంలో ఉన్నా.. మీ నిధి మీకు గ్యారంటీగా అందుతుంది.

ఇవ్వడం అంటే పొందడమే ! ఇవ్వడం = పొందడం

మీరు ఏదో ఒక రకంగా నిస్వార్థ సేవ చేయనిదే మీరు క్లియర్ కారు. ఎవరినైనా సరే మెడలు వంచి చేయిస్తుంది విశ్వం. ఈ రోజు సేవకు అంకితమైన వారిలో చాలా మటుకు తమ తమ గత జన్మలలో ఎలాంటి సేవ చేయకుండా గడిపిన వారే ! వారి వంతు రాగానే తప్పదు. రేపు మీ వంతు కూడా వస్తుంది.

దౌర్జన్యం చేసేటప్పుడు ఏమీ తెలియదు.. ఏమవుతుంది ? నేను చేసేది తప్పు అయితే, మహా అయితే శిక్ష పడుతుందేమో... చూద్దాం పడని... అంటూ దౌర్జన్యం చేసేటప్పుడు అంటారు.. కొంతమంది... కాని వారు చేసింది వారికి 1,000 రెట్లు అయి తిరిగి వచ్చినప్పుడు తెలుస్తుంది. త్రీడిలో, ఫోర్ డీలో కనిపిస్తుంది నరకం.. అప్పుడు కేవలం ఏమీ చేయలేరు నరకాన్ని అనుభవించడం తప్ప.. మోసం, దౌర్జన్యం, అన్యాయం చేసి మర్చిపోతారు... వారు వేసిన ముళ్ళ పంట వారి భవిష్యత్తులో వచ్చినప్పుడు తెలుస్తుంది. ఇలాంటి సత్యాలు కేవలం చదివి అర్థం చేసుకోవడమే కాదు. నిజంగా ఆచరించాలి. లేదా నరకం తప్పదు. నరకం అంటే ఏమిటో కాదు చేసిన తప్పుడు పనుల ఫలితాలు తిరిగి 1,000 రెట్లుగా తిరిగి రావడమే నరకం ! చేసిన మంచి పనుల ఫలితాలు 1,000 రెట్లుగా తిరిగి వచ్చినప్పుడు అది స్వర్గం !

కుట్రలు, కుతంత్రాలు కేవలం రాజకీయాలలోనే కాదు, నిజానికి అంత కంటే ఎక్కువ ఆధ్యాత్మిక సంస్థలలో ఉంటాయి. ప్రాముఖ్యత కోసం, పదవి కోసం, అధికారం కోసం, ఏ విధంగానూ శ్రమించ లేని సోమరిపోతులు వాలిపోయి బతకడం కోసం, ఎన్నో రాజకీయాలు జరుగుతాయి సంస్థలలో...

కొంత మంది దొంగ గురువుల వలన మంచి గురువులకు కూడా చెడ్డ పేరు వస్తుంది. ఎవరో కొంత మంది చేస్తే అందరినీ అలాగే చూడటం సరికాదు. ప్రతీ రంగంలో దొంగలున్నారు. కుటుంబాలలో సాక్షత్తు తండ్రులే కూతుర్ని రేప్ చేసిన సంఘటనలను పేపర్లో అప్పుడప్పుడు చదువుతుంటాం అంత మాత్రాన తండ్రులందరూ అలాంటి వారే అని అనడం సరికాదు కదా... ప్రతీ రంగంలో మంచి వారున్నారు, చెడ్డ వారున్నారు. ఎవరు ఎవరో తెలుసుకుని మాట్లాడాలి, మసలుకోవాలి.

అందుకే ఎవరు ఎవరో తెలుసుకోకుండా నేను మిమ్మల్ని శిష్యులుగా, మీరు నన్ను గురువుగా అంగీకరించుకోవడం ప్రమాదం.

2+ ఏళ్ళు ఒకరినొకరం, పరస్పరం బాగా పరీక్షించుకున్న తర్వాత ఇరువురం ఒక నిర్ణయానికి వస్తే బాగుంటుంది. ఇద్దరం పూర్తిగా అన్ని కోణాలలో సంతృప్తి చెందితేనే.. డీల్ ! లేదా క్యాన్సల్.. ఇలా చేయడం మీకు శ్రేయస్కరం, నాక్కూడా....!

చూడటానికి బయటికి బాగానే కనపడతారు అందరూ... అది నటనా లేక నిజమా అని తేలాలి అంటే సమయం పడుతుంది కదా... నిలకడ మీద నిజాలు తేలుతాయి.

ఈ రోజులలోనే కాదు, ప్రాచీన కాలంలో కూడా మహాత్ములను కించపరిచే మూఢులు ఉండేవారు. శ్రీరాముడి కాలంలో ఒక వెధవ రాముడిని చులకన చేసి, సీతా దేవిని అనుమానించాడు. శ్రీ కృష్ణ పరమాత్మకు పిల్లనివ్వలేదు. రుక్మిణి దేవిని ఎత్తుకుని పారిపోవలసి వచ్చింది, యుద్ధం చేయవలసి వచ్చింది దేవ దేవుడికి. రాముడి కాలంలో, కృష్ణుడి కాలంలో దురాగతాలు చేసిన పాపులు ఇప్పటికీ ఇంకా ఈ లోకంలోనే అఘోరిస్తున్నారు. నరకాన్ని అనుభవిస్తున్నారు..

ఆ పాపాత్ములకు ముక్తి ఎప్పుడో... ?

మిత్రులారా !

దౌర్జన్యం, అన్యాయం, మోసం చేసేటప్పుడు కరెక్ట్‌గానే అనిపిస్తాయి. నేను చేసేది కరెక్ట్ అని అనుకున్నప్పుడే ఏ దుర్మార్గుడైనా దారుణం చేయగలుగుతాడు. గుర్తుంచుకోండి... మీరు ఏ విత్తనం నాటితే అదే పంట వస్తుంది. దురదృష్టం, అదృష్టం అంటే మరేమిటో కాదు. చెడు పనుల ఫలితాలే దురదృష్టం. మంచి పనుల ఫలితాలే అదృష్టం. బాగా బలంగా గుర్తుంచుకోండి మీరు చేసింది గ్యారంటీగా మీకు 1,000 రెట్లుగా తిరిగి వస్తుంది. ఇది గతి తప్పని ప్రాప్తి ! ఇది విశ్వ నియమం ! సృష్టి సూత్రం !

నా జీవితంలో ఇద్దరు సన్నాసులు నా బోధనలను తప్పుడుగా అర్థం చేసుకుని ఒకటి ఇస్తే 1,000 వస్తాయి అని నాకు డొనేషన్ అంటూ ఇచ్చి... తర్వాత మీ మీద ఇన్వెస్ట్ చేసాము మాకు వేయి రెట్లు ఇంకా రాలేదేంటి అని అడిగారు. నేను ఆశ్చర్యంతో అదేంటీ.. మీరిచ్చింది డొనేషన్ కదా.. అయినా నేను మిమ్మల్ని అడగలేదు కదా అని అంటే అదంతా మాకు తెలియదు.. మేము ఇచ్చాం మాకు 1,000 రెట్లు ఇంకా రాలేదు, ఆధ్యాత్మికత మీద మాకు నమ్మకం పోయింది అంటూ గొడవ చేసి, నా దగ్గరి నుండి పూర్తిగా, శాశ్వతంగా వెళ్ళిపోయారు. ఆ తర్వాత నిజంగానే వారు చేసిన మోసం వారికి 1,000 రెట్లుగావచ్చింది. ఇప్పుడు నిజమైన నరకం అనుభవిస్తున్నారు. వారికి ఆవగాహన కలుగుగాక !

మీరు ఏమిచ్చినా నిస్వార్థంగా, అస్సలు ఏమీ ఆశించకుండా ఇవ్వండి. ఇచ్చి వెంటనే పూర్తిగా, శాశ్వతంగా మర్చిపోండి. అప్పుడే మీకేదైనా మంచి జరుగుతుంది. నేను ఇచ్చాను నాకెప్పుడు 1,000 రెట్లు తిరిగి వస్తాయో అని గోతి కాడ నక్క లాగా కాచుకుని, ఎదురు చూస్తూ ఉండకూడదు. నేను ఇచ్చాను అన్న జ్ఞాపకమే మీకు రావాల్సిన, జరగాల్సిన మంచిని ఆపుతూ ఉంటుంది. కుడి చేయి చేసింది ఎడమ చేయికి తెలియకూడదు అని అంటారు. ఒక చోట ఒక గుడిలో ట్యూబ్ లైట్ ఎవరో ఇచ్చారు దాని మీద ఇచ్చిన వారి పేర్లు నల్ల రంగులో వ్రాసారు. సగం కాంతి వారి పేర్లలోని నల్ల రంగే ఆపుతుంది. ట్యూబ్‌లైట్ మీద కూడా పేర్లు వ్రాయించుకోవడం అనేది ఎలాంటిదో మీరే అంచనా వేయండి...

ఆత్మను అందుకోవడమే పరమార్థం !

ఆత్మ ప్రేమ కోసం జీవించడమే పరమార్థం !

ఆత్మ ప్రేమను మించినదేదీ లేదు !

ఆత్మ నిర్ణయం / ప్రణాళిక ప్రకారమే అంతా జరుగుతుంది !

ఆత్మ లెవెల్‌లో సింపుల్‌గా అనిపించినవి భౌతికంగా అతి దుర్భరం అనిపిస్తాయి !

ఆత్మ లెవెల్‌లో.. ఆత్మ చాలా సింపుల్‌గా నిర్ణయం తీసేసుకుంటుంది ఫలానా అనుభవం కావాలని... అయితే ఆ యొక్క ఆత్మ నిర్ణయం భౌతికంగా హాయిగానూ ఉండవచ్చు లేక అతి దుర్భరంగా ఉండవచ్చు !

భౌతికంగా ఎలా ఉన్నా ఆత్మ పట్టించుకోదు, ఆత్మకు కావాల్సింది అనుభవం !

ఆ అనుభవం కోసం ఏ నిర్ణయమైనా తీసుకుంటుంది !

అయితే ఆత్మ ఫలానా అనుభవం కావాలి అని నిర్ణయం తీసుకోవడం అనేది ఆ ఆత్మ యొక్క పరిణితిని బట్టి ఉంటుంది !

ఆ పరిణితి అనేది అనుభవాల వల్లనే కలుగుతుంది !

ఆత్మ అంటే మీరే ! ఆత్మ అయిన మీరు ఓ భౌతిక దేహాన్ని ధరించారు !

భౌతిక దేహంలో ఉండి తన యొక్క నిజస్థితిని అంటే...

ఆత్మ స్థితిని అందుకోవడమే పరమార్థం !

ఆత్మయే దైవం !

ఆత్మ అంటే మీరే !

మీరే దైవం !

ఎందుకు ఆత్మ భౌతిక దేహం ధరించి భౌతిక అనుభవాల కోసం ఆరాటపడుతుంది ?

ఆత్మ తన నిజ స్థితి ఆత్మ తత్వాన్ని లేక దైవత్వాన్ని పొందాలంటే ఒక భౌతిక దేహం అవసరం ! ఒక భౌతిక జీవితం అవసరం ! కొన్ని భౌతిక అనుభవాలు అవసరం !

ఆత్మ అయిన మీకు అసాధ్యం అనేది లేనే లేదు !

ఆత్మ సామ్రాజ్య ఆవరణలో అసంభవం అనేది లేనే లేదు ! ఆత్మ మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్ కలిగి ఉంటుంది !

భౌతిక దేహంలో ఉండి ఆత్మ యొక్క మల్టి డైమెన్షనల్ ఎగ్జిస్టెన్స్‌ను అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి !

భౌతిక స్థితిలో ఉన్నప్పుడు సహజంగానే భౌతికత పట్ల మనసు బలంగా లాగుతూ ఉంటుంది ! ఎంత సేపూ భౌతిక కోణంలో నుండే ప్రతీ దాని విశ్లేషణ జరుగుతుంది. భౌతిక కోణంలో నుండి జరిగే విశ్లేషణకు ఆత్మ వికాసానికి సంబంధం ఉండదు. భౌతిక పరంగా మంచి, విజయం & వైభవం ఓ రకంగా ఉంటాయి, ఆత్మ పరంగా ఒక రకంగా ఉంటాయి. 2011 నుండి 2012 వరకు చాలా కష్టపడి నేను, నా భార్య ఒక పని చేసాము. అది భౌతికంగా అట్టర్ ఫ్లాప్ అయింది. భౌతికంగా ఏ కోణంలో నుండి చూసినా, ఏ రకంగా చూసినా అది అట్టర్ ఫ్లాప్ ! చివరలో మాకు చిన్న ప్రమాదం జరిగింది. నా భార్యకు ఏమీ కాలేదు కానీ నాకు గాయాలయ్యాయి. నన్ను హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. వీల్ చెయిర్‌లో కూర్చో బెట్టి తీసుకెళ్తున్నారు. అప్పుడు నేను చాలా నీరసంగా ఉన్నాను. ఆల్ మోస్ట్ స్పృహ తప్పింది. కొంచెం మెలుకువగా ఉన్నాను. ఆ టైమ్‌లో నాకు ఒక ఎక్స్‌పీరియన్స్ వచ్చింది. కొంత మంది మాస్టర్స్ కనిపించి నన్ను అభినందిస్తూ మీ విజయానికి కంగ్రాట్స్ అంటూ అభినందించారు. నేను వెంటనే కళ్ళు తెరిచి మావాళ్ళకు చెప్పాను. అది ఏ రకంగా విజయమో నాకు అప్పుడు ఏమీ అర్థం కాలేదు. 2016లో పూర్తిగా అర్థం అయింది. విచిత్రం !

నేను నా సాధనా జీవితం ప్రారంభంలో ఒక వ్యక్తి నాలుగు వేల కోట్లు ఖర్చు చేసి ఒక ఇల్లు కట్టుకున్నాడని ఏదో పత్రికలో చదివి నేను ఆశ్చర్యపోయి ఒక్క ఇంటికే నాలుగు వేల కోట్లా ?! అంత డబ్బు నా దగ్గర ఉంటే నేను లోక కల్యాణ కరమైన కార్యక్రమాలు ఎన్నో చేసే వాడిని కదా అనుకుంటూ... ఆ వ్యక్తి ఎలా అంత డబ్బు సంపాదించాడా తెలుసుకుందామని ధ్యానం చేస్తుంటే కాసేపటికి ఒక పురుష కంఠం చాలా స్పష్టంగా.... ...."అక్కడ ఆత్మ జ్ఞానం ఏమీ లేదు"... అంటూ కాస్త నిరసనగా, పరుషంగా, హేళనగా వినిపించింది. నాలుగు వేల కోట్ల రూపాయలను కూడా గడ్డిపోచ కింద జమకట్టి నాకున్న ఆత్మ జ్ఞానమే గొప్ప అని చెప్పే సరికి నాకు దిమ్మ తిరిగి పోయింది. డబ్బుల గురించి ఆలోచించకూడదని నాకు అర్థమైంది, నేను చేయాల్సిన పనులు నేను చేస్తూ ఉంటే నాకు రావాల్సిన డబ్బులు నాకు సరళంగా, సురక్షితంగా అందుతూనే ఉంటాయని. ఇక అప్పటి నుండి నేను మళ్ళీ అలా చేయలేదు. కానీ చాలా ఆశ్చర్యం వేసింది - నాలుగు వేల కోట్లను మాస్టర్స్ పట్టించుకోలేదు !

వాటికి విలువ ఇవ్వలేదు !

భౌతిక ప్రపంచంలో మంచి, విజయం, గొప్పతనం & వైభవం ఓ రకంగా ఉంటాయి. ఆత్మ ప్రపంచంలో ఇవన్నీ వేరుగా ఉంటాయి. నేను విజయం, గొప్పతనం & వైభవం కోసం తపిస్తూ ఉంటే నాకు 2005లో ఒక సారి ధ్యానంలో ఓ అనుభవం వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన వ్యక్తి, వేల కోట్ల ఆస్తులను కలిగి ఉన్న వ్యక్తి, ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మహా ఘనమైన పలుకుబడి ఉన్న వ్యక్తి, కోట్లాది మంది ఫాలోవర్స్ ఉన్న వ్యక్తి, ఆయన గురించి చెప్పాలంటే ఒక పేజీ సరిపోదు ఒక పుస్తకమే వ్రాయాలి... అటువంటి వ్యక్తిని నాకు చూపించి మాస్టర్స్ నాతో ఇలా అన్నారు....

" ఈ వ్యక్తి భూమి మీదకు ఎందుకు వచ్చాడో ఆ పని చేయకుండా పనికిరాని పనులు చేస్తున్నాడు" నీవు ఇలా చేయకు అని హెచ్చరించారు.

ఇప్పటికీ నాకు చాలా ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది. ఆయనను నడిచే దైవంగా కొలుస్తూ ఉంటారు. వేల కోట్ల ఆస్తులు, ప్రపంచ ప్రముఖులు ఆయనను ఫాలో అవుతూ ఉంటారు, కోట్లాది మంది ఆయన సైగతో ఏం చేయడానికైనా సిద్ధం, ఇంకా ఎన్నెన్నో ఉన్నాయి అలాంటి వ్యక్తిని మాస్టర్స్ తిడుతున్నారు. .. ! ఇది ఎంత ఆలోచించినా అంతు పట్టని ఆశ్చర్యకరమైన విషయం !

తనకు అవసరం లేనిది, తనకు నచ్చనిది తప్పు అని భావించడం మూర్ఖత్వం, అజ్ఞానం & మూఢత్వం ! తనకు అవసరం లేకపోయినా, తనకు నచ్చకపోయినా సార్వజనీన దృష్టితో వీక్షించాలి. అంతే కానీ కేవలం తన మూస ధోరణితో ఆలోచిస్తే సత్యం అవగతం కాదు !

ఈ భూమి మీద సంబంధాలన్నీ అవసరాల మీద ఆధారపడి ఉంటాయి. అయితే ఆ అవసరాలు అనేవి సత్యపూరితంగా ఉండేలా చూసుకోవాలి. ఏ బంధమైనా, ఏ అనుబంధమైనా అది ఏదైనా కేవలం "అవసరం" మీదనే ఆధారపడి ఉంటుంది, ఆ అవసరానికి ఏదో ఒక పేరు పెట్టుకుంటారు. ఎన్ని ముసుగులు వేసినా అది "వాస్తవానికి మూలంలో అవసరమే" ! అయితే ఆ అవసరం అనేది సత్యపూరితంగా ఉండేలా చూసుకోవడం అనేది ఉన్నతాత్మలకు మాత్రమే సాధ్యపడుతుంది.

అవసరాలే అన్ని మానవ సంబంధాలను నియంత్రిస్తాయి !

మానవ సంబంధాలన్నీ అవసరాలకు అనుగుణంగానే పరివర్తితం అవుతూ పరిభ్రమిస్తూ వ్యవహరిస్తూ మనుగడలో ఉంటాయి !

మమత, అనురాగం, మమకారం, ఆప్యాయత, ఇష్టం, ప్రేమ మొదలైనవి ఆత్మ పరిణితిని బట్టి మారుతూ ఉంటాయి. ఇవి అందరికీ ఒకేలాగా ఉండవు.

ఏ బంధాలైనా, ఏ అనుబంధాలైనా కేవలం నేర్చుకోవడానికి మాత్రమే పరిమితమై ఉంటాయి. నేర్చుకోవడం పూర్తవగానే ఆటొమెటిక్‌గా విడిపోతారు, దూరమవుతారు. ఈ దూరం అవడంలో మరణం కూడా ఒక్కోసారి ఉంటుంది. విజ్ఞానం & వినోదం కోసమే ఎవరైనా ఈ భూమి మీదకు వస్తారు. నేర్చుకోవడం, నేర్చుకోవడం... మధ్య మధ్యలో రిలాక్స్ అవడం, ఆ రిలాక్స్ స్థితినే ఆనందంగా అనుకుంటూ ఉంటారు. వాస్తవమైన ఆనందం అరుదుగా ప్రాప్తిస్తూ ఉంటుంది.

ఆత్మను అందుకోవడమే పరమార్థం ! ఆత్మ స్థితిని ప్రాప్తించుకోవడమే పరమార్థం ! ఆత్మను ప్రాప్తింప చేసుకునే మార్గంలో కాకుండా కేవలం బతుకుతూ ఉండడమంటే అది కేవలం నరకాన్ని సృష్టించుకోవడమే అవుతుంది ! సత్య గురువును కలిగి లేని జీవితం ఆత్మ లేని దేహం లాంటిది ! సత్య గురువును అన్వేషించండి, ఆయనకు అంకితమై, ఆయన దగ్గర నిజాయితీగా, నిస్వార్థంగా స్థిరమవండి. అప్పుడే మీ జన్మకు అర్థం, పరమార్థం ప్రాప్తమవుతాయి !

ఇప్పుడే కాదు శ్రీరాముడి కంటే ముందు కాలం నుండి కూడా దొంగ గురువులు ఉన్నారు. సరైన సత్య గురువులు ఎల్లప్పుడూ ఉంటారు. సరికాని వారు ఉంటారు. ఒక అతి మామూలు చాకలి వాడు కదా శ్రీరామ చంద్ర ప్రభువు మీద, సీతా దేవి మీద నింద వేసి వారి కాపురంలో చిచ్చు పెట్టింది. అలా జరగడానికి, నిజానికి వేరే దివ్య దైవ కారణాలు ఏవో ఉన్నాయి, అయినా సరే ఆ మామూలు అజ్ఞానపు వెధవ నోటికెంత వస్తే అంత మాట్లాడటం అనేది సరి కానే కాదు ! ఆ తర్వాత వాడు ఎన్ని జన్మలు ఆ కర్మను అనుభవించాడో విశ్వానికే ఎరుక ! మీరు సరైన సత్య గురువును అన్వేషించి పట్టుకోండి. జన్మ చరితార్థం అయ్యేది, సఫలం అయ్యేది, ధన్యం అయ్యేది గురువును పొందాక మాత్రమే ! మీలో సరికాని విషయాలుంటే సరికాని గురువులే దొరుకుతారు. ఈ పుస్తకంలోనే వివరించాను కదా.... సరైన సత్య గురువును ఎలా గుర్తించాలో...! గురువు లేని జీవితం ఎడారి లాంటిది. గురువును కలిగి ఉన్న జీవితం స్వర్గం లాంటిది. మీ జీవితాన్ని మహా దివ్య స్వర్గంగా మార్చుకోవడంమనేది మీ చేతుల్లోనే ఉంది ! గుడ్ లక్ !

లోకంలో ఎంతో మంది మహానుభావులు లోక కల్యాణం కోసం పని చేస్తున్నారు. మీకు నచ్చిన వారి దగ్గర చేరి మీరు కూడా మీకు చేతనైనంత లోక కల్యాణ కార్యక్రమాలలో నిస్వార్థంగా పాల్గొని ఆత్మాభివృద్ధి చేసుకోండి ! గుర్తుంచుకోండి... మతరహిత గురువునే ఆశ్రయించాలి. లేదా మీరేనాటికీ అభివృద్ధి చెందరు.

మీలో ఉన్న అజ్ఞానం & విస్మృతి మిమ్మల్ని సత్య మార్గానికి అంకితం కానివ్వవు. మిమ్మల్ని భౌతిక మాయలోనే అణిచి పెట్టి ఉంచుతాయి. లక్షల / కోట్ల జన్మల నుండి చేసినవే చేస్తూ.. చీకటి శక్తులకు ఊడిగం చేస్తూ బతుకుతున్నారు. మీ ఆత్మ సామ్రాజ్యం పైన సార్వభౌమత్వాన్ని సాధించి సార్వభౌములుగా విరాజిల్లుతారా లేక ఇంకా బానిసలుగానే కొనసాగుతారా... అనేది మీ ఇష్టం !

పనికిరాని పనులు చేస్తూ ఆత్మ పరిణామ క్రమంలో ముందుకు సాగకుండా స్టక్ అయి విశ్వ పరిణామ క్రమానికి అడ్డం పడుతున్నవారు ఎంత కోల్పోతారో మీరు గ్రహించడం చాలా కష్టం ! మీరిప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించి సత్యమార్గానికి అంకితం కాకపోతే ఆ తర్వాత మీరు ఈ భూమి పైనే నరకం (నిజానికి నరకం అనేది లేదు) అనేది చూస్తారు, అనుభవిస్తారు !

ఆత్మ అయిన మీరు, మీ ఆత్మ స్థితిని అందుకోకుండా బతకడం అనేది ఎంత విడ్డూరం ! దైవం అయిన మీరు మీ దైవత్వాన్ని పొందకుండా, దైవాలుగా పరిణమించకుండా ఉండడం ఎంత విచిత్రం ! ఏం చేస్తున్నారు మీరు ! ఎందుకు బతుకుతున్నారు మీరు ?!

నాస్తికులు నాస్తికత్వంలో ఉండి నష్టపోతున్నారు. ఎప్పుడో ఒకప్పుడు వాళ్ళ నాస్తికత్వం నశిస్తుంది అది వేరే విషయం. ఆస్తికులు కూడా నష్టపోతున్నారు కాకపోతే వేరే రకంగా... నాస్తికులు దైవాన్ని ఒప్పుకోరు. ఆస్తికులు దైవాన్ని కేవలం నమ్ముతారు, తెలుసుకోరు. దైవం నమ్మేది కాదు, తెలుసుకునేది, అనుభవించి పొందేది ! కట్టడాలలో, పుస్తకాలలో వెతుకుతూ ఉంటారు మతంలో ఉండి, వ్యర్థ మత కార్యకలాపాలలో మునిగి తేలుతూ ఉంటారు. నాస్తికులు గుర్రమే ఎక్కరు. ఆస్తికులు కొయ్య గుర్రం ఎక్కి విపరీతంగా ఊగిపోతూ ఉంటారు. గుర్రం ఎక్కని వాడు, ఎక్కిన వాడిది ఒకే పరిస్థితి ! లోపల ఉన్న దైవాన్ని గుర్తించ కుండా బయట కట్టడాలలో, పుస్తకాలలో వెతకడం అనేది మహా పాపం అని ఉత్తర గీతలో శ్రీకృష్ణ పరామాత్మ చెప్పాడు కదా ! దేవాధి దేవుడు చెప్పింది మీరు పట్టించుకోరా ?!

ఆధ్యాత్మికతలోకి ప్రవేశించకుండా భౌతికతలో మునిగిపోయిన వాళ్ళ స్థితి మరియు సరైన ఆధ్యాత్మికతను లేక సరైన గురువును అనుసరించని వాళ్ళ స్థితి ఒకటే ! మత గ్రంథాలు చదవడం, కథలు వినడం, విన్న కథలే వింటూ ఉండడం, కేవలం కథలు విన్నంత మాత్రాన పుణ్యం వుస్తుందనే భ్రమలలో ఉండడం ! పుస్తకాలను చదివి అందులోని విషయాలను అనుభవ పూర్వకంగా తెలుసుకోకుండా కేవలం జ్ఞాపకం ఉంచుకుని వాటిని చర్చిస్తూ ఏదో ఒరగపెడుతున్న ఫీలింగ్‌లో ఉండడం పేద్ద అజ్ఞానం. చదివిన జ్ఞానం, విన్న జ్ఞానం పుణ్యం ఇవ్వదు ముక్తి అనేది అసలు ఇవ్వదు. తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకున్నప్పుడే సార్థకత ! కేవలం ఎవరో వ్రాసిన పుస్తకాలను చదివి, ఎవరో చెప్పింది విని అనుభవ జ్ఞానం లేకుండా ఉండడం అనేది అజ్ఞానం. శివుడి గురించి ఎంత కాలం చదువుతారు ?! కృష్ణుడి గురించి ఎంత కాలం భజనలు చేస్తారు ?! జీసస్ క్రైస్ట్ గురించి ఎంత కాలం ప్రార్థనలు చేస్తారు ?! వారిని దర్శించరా, మాట్లాడరా ?! ఎవరో చెప్పింది విని, వ్రాసింది చదివి ఓ అభిప్రాయానికి వచ్చేస్తే ఎలా ?! మీ స్వయం స్వంత అనుభవం అవసరం లేదా ?! సత్యం మీరు స్వయంగా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత లేదా ?! చీకటిలో ఎంత కాలం బతుకుతారు ?! కాంతిలోకి రారా...?!

జాతకాలను నమ్మడం, వాస్తును నమ్మడం అనేది మీ అజ్ఞానాన్ని తెలియ చేస్తుంది. జాతక దోషాలు, వాస్తు దోషాలు ఉండవు. అనవసరంగా వాటి కోసం డబ్బులను తగలేయకండి. ఆ డబ్బులతో ఏవైనా నిస్వార్థ సేవా కార్యక్రమాలను చేయండి. కర్మ క్లియర్ అవుతుంది కానీ జాతక దోష నివారణలకు డబ్బులను ఖర్చు పెట్టడం వలన ఏమీ జరగదు. వాస్తు దోష నివారణ కోసం కట్టుకున్న ఇల్లును కూల్చుకోవడం బాధాకరం. అసలు దోషాలే లేనప్పుడు నివారణలు ఎక్కడ ఉంటాయి ?! లేని గొలుసులను, లేని తాళాలను, లేని సుత్తులతో పగలగొట్టడం అది ! అంతా భ్రమ ! స్థల దోషాలు ఉంటాయి. స్థల దోష నివారణకు యాగాలు, హోమాలు, యజ్ఞాలు చేయాల్సిన అవసరం లేనే లేదు. స్థలంలో దోషం ఉందని తెలిస్తే అక్కడ ఆ స్థలంలో (అకర్మ వీగన్) అకర్మ శాకాహారంతో అన్న దానం చేయండి. మీకు సంతృప్తి కలిగే వరకు చేయండి. దోషం చిన్నగా ఉంటే ఒక్కసారి సరిపోతుంది లేదా దోషం పూర్తిగా నివారణ అయ్యే వరకు చేయండి. అన్న దానానికి మీ దగ్గర డబ్బులు లేకపోతే ఏదైనా ఒక మంచి ప్రదేశానికి వెళ్ళి అక్కడ సరైన మతరహిత అత్యున్నత ఆత్మ విజ్ఞానం బాగా అభ్యసించి, అత్యున్నత ధ్యాన సాధనలు చేయండి, అలా చేస్తూ పోతే ఏదో ఒక నాటికి గ్యారంటీగా స్థల దోషం పూర్తిగా, శ్వాతంగా క్లియర్ అయిపోతుంది. అనవసరంగా జాతకాలకు, వాస్తు సవరణలకు డబ్బులను ఖర్చు పెట్టి నష్టపోవద్దు ! అవన్నీ అజ్ఞానపు భ్రమలు!

సద్గురు ఆశీర్వాదం

మీకు, ఆయురారోగ్య ఐశ్వర్య విజయానంద
సౌభాగ్య మోక్షాలు సులభంగా, సరళంగా,
ఈ క్షణమే ప్రాప్తించు గాక !

తక్షణమే మీ అన్ని కోరికలు తీరుగాక,
మీకు ఆనందం ప్రాప్తించు గాక !
సదా మీకు శ్రేయస్కరం జరుగు గాక !
సర్వదా మీకు శుభం + లాభం జరుగు గాక !
మీకు ఎల్లప్పుడూ జయమగు గాక !
మీరు ఎల్లప్పుడూ సంరక్షించ బడెదరు గాక !

లోక కళ్యాణమస్తు !

సృష్టి కళ్యాణమస్తు !

-సద్గురు తారా విశాల్

సద్గురు తారా విశాల్ గారి ఇతర రచనలు:

గురు గీత

సంపూర్ణ గీత

To purchase the books, please visit amazon.in amazon

MAB ఆధ్వర్యంలో జరుగుతున్న ఇతర సేవా కార్యక్రమాలు :

ప్రాణాహారదానం

అంతకరణ శుద్ధి

అకర్మ నిగనిజం

For more details, please contact +91 800 800 3570